



శ్రీ అగ్ని మహాపురాణం

(వచనం)



వేదవ్యాస మహర్షి కృతం

శ్రీ అగ్ని మహాపురాణం

(వచనం)

వేదవ్యాస మహర్షికృతం

అనుసరణ

ఆవంచ సత్యనారాయణ

వెల రు. 500/-

విషయానుక్రమణిక

అధ్యాయము			పేజీ

అధ్యాయము			పేజీ

పురాణ పరిచయం

జయతిపరాశరసూనుః సత్యవతీ హృదయానందనో వ్యాసః
యస్యాస్య కమలకోశే వాఙ్మయ మమృతం జగత్ పిబతి *(వాయుపురాణం : 1-2)*

సత్యవతీ హృదయానందకరుడు, పరాశర మహాముని కుమారుడు, తన ముఖమనే కమలంలో సమస్త వాఙ్మయామృతాన్ని దాచుకొని ప్రపంచం చేత త్రాగిస్తున్నవాడు అయిన వ్యాసునికి నమస్కారము అని ఎవనిచేత రచింపబడిందో ఆవాయు పురాణం ఆ మహానుభావునికి నతమస్తకం అవుతుండగా

అచతుర్వదనో బ్రహ్మో ద్విబాహు రపరోహరిః
అఫాలలోచనః శంభుర్భగవాన్ బాదరాయణః *(మహాభారతం-ఆదిపర్వం)*

నాలుగు ముఖాలు లేని బ్రహ్మ, రెండు చేతులతో ఉన్న విష్ణువు, ఫాలభాగంలో కన్నులేని శివుడు బాదరాయణ వ్యాసుడని, తన జన్మకు కారణభూతుడైన కృష్ణ ద్వైపాయనునికి ప్రణతులర్పిస్తున్నది మహాభారతం.

అలాంటి వ్యాసమహాముని చేతిలో అష్టాదశ (18) పురాణాలు రూపుదాల్చాయని భారతీయుల విశ్వాసం. పురాణ శ్రవణం బహుకాలంగా ఈ దేశంలో సంప్రదాయమనే నదికి కాలువలు తీస్తున్నదే. అందుకే

యథా పాపాని పూయంతే గంగావారి విగాహనాత్
తథా పురాణ శ్రవణాద్ దురితానాం వినాశనమ్ *(వామనపురాణం - 95-86)*

గంగానదిలో స్నానం చేయటం చేత పాపాలు నశిస్తాయి. అలాగే పురాణ శ్రవణం చేత కష్టాలు దూరం అవుతాయి అని భారతీయుల నమ్మకం.

పురాణాల ప్రాముఖ్యత

భారతీయ సంస్కృతికి అవిచ్ఛిన్నంగా కొన్నివేల సంవత్సరాల నుంచి మూలాధారా లుగా నిలుస్తున్నవి వేదాలు. ఎన్ని విదేశీ దండయాత్రలు జరిగినా, ఎన్ని సాంస్కృతిక దౌష్ట్యాలు చోటు చేసుకొన్నా మన సనాతన ఆర్షసంస్కృతి ఈనాటికీ నిలిచి ఉన్నది అంటే అందుకు కారణం వేదాలేనని చెప్పుకోవాలి. ఈ వేదాల యెడల మనకు గల భక్తి గౌరవాల కారణంగానే మనం ఐహిక సుఖాలనే కాకుండా ఆముష్మిక ఉన్నతికి మార్గాలు వేసుకోగలుగుతున్నాము. వేదాల ద్వారానే మనం జీవితంలో తప్పకుండా ఆచరించవలసిన కర్తవ్యాలను, విధులను తెలుసుకొని ఆచరించ గలుగుతున్నాము. 'పుమాన్ పుమాంసం పరిపాతు విశ్వతః –అనే వేదమంత్రం ఒక మనిషి తన తోటిమనిషికి సహాయం చేసి దాని ద్వారా తన జన్మను సఫలం చేసుకోమని బోధిస్తున్నది. అలాగే "మిత్రస్యాహం చక్షుషా సర్వాణి భూతాని" అనే మంత్రం సమస్త ప్రాణులను మిత్రభావంతో చూడాలని నిర్దేశిస్తున్నది. 'కృణ్మో బ్రహ్మవో గృహే సంజ్ఞానాం పురుషేభ్యః' అనే మంత్రం – ఓ ప్రజ లారా మనమందరం కలసి మానవులలో సద్భావం కొరకు, సద్భావనకోసం దైవాన్ని ప్రార్థిద్దామనే కర్తవ్యాన్ని బోధిస్తున్నది. ఇలా మానవుడు తన జన్మను సార్థకం చేసుకోవడానికి వేదాలు సన్మార్గాన్ని ఉపదేశిస్తున్నాయి, కర్తవ్యాన్ని ప్రబోధిస్తున్నాయి. వేదాలలో చెప్పబడిన అంశాలు చాలా వరకు నిగూఢంగా ఉంటాయి. సామాన్యునికి కూడా అర్థం అయ్యే విధంగా ఉపదేశం చేయడానికి పురా ణాలు ఉద్భవించాయి. అందుకే ఋగ్యజుస్సామ అధర్వణ వేదాలనేవి నాలుగైతే, ఆ వేదాలతో సమానంగా 'పురాణం పంచమోవేదః' అని అయిదవ వేదంగా కీర్తించబడుతున్నది. భారతీయ సంస్కృతి యొక్క స్వరూప స్వభావాలను సమగ్రంగా తెలుసుకోవాలంటే పురాణ అధ్యయనం చాలా ముఖ్యం. పురాణాలు భారతీయ సంస్కృతికి కొలదండాలవంటివి. ఆ పురాణాల మీద ఆధారపడే, ఆధునిక భారతీయ సమాజం తన నీతి నియమాలను నిర్దేశించుకొంటున్నది. పురాణాల్లో లేని విషయాలు ఏమీలేవు. దేవతలు, ఋషుల వృత్తాంతాలు, సదాచారాలు, పదునాలుగు విద్యలు, మానవ కర్తవ్యాలు అన్నింటిని తనలో ఇముడ్చుకున్న ఈ పురాణ ప్రక్రియయే ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకొన్నది. అందుకే పురాణాలను గురించి కొంతైనా తెలుసుకొనటం ప్రతి భారతీయునికి అవశ్యకర్తవ్యం. భారతీయఇతిహాస దృష్టితో చూస్తే పురాణాలకు మహత్తరమైన స్థానం ఉన్నది. ప్రతి హిందువుకు పురాణ అధ్యయనం ఏదో విధంగా అనివార్యం అవుతున్నది. అందుకే భారతీ యులపై పురాణ సాహిత్యం నెరిపినంత గాఢ ప్రభావం మరి ఏ సాహిత్యం చూపలేకపోయింది.

పురాణం అంటే ఏమిటి?

'పురాణ' శబ్దం యొక్క వ్యుత్పత్తి పాణిని అష్టాధ్యాయిలోను, యాస్కుని నిరుక్తంలోను, పురాణాలలో కూడా కనిపిస్తుంది. పాణిని చెప్పిన ప్రకారం 'పురాభవమ్' (ప్రాచీనకాలంలో జరిగినది) అనే అర్థంలో 'సాయంచిరం పాహ్ణే ప్రగే అవ్యయే భ్యష్టచ్యేట్చ్యు లౌత్తుట్చ' (4–3–23) అనే సూత్రం ద్వారా 'పురా' శబ్దానికి 'టుచ్య్' ప్రత్యయంచేరి, తరువాత దానిపై 'తుట్ 'ఆగమంగా వచ్చినందువలన పురాతన శబ్దం ఏర్పడుతుంది. ఇంతేకాకుండా పాణిని రచించిన "పూర్వకాలైక

సర్వజరత్పురాణనవకేవలాః సమానాధి కరణేన" (2-1-49), "పురాప్రోక్తేషు బ్రాహ్మణ కల్పేషు" (4-3-105)అనే ఇంకో రెండు సూత్రాలలో పురాణశబ్దాన్ని ఉపయోగించాడు. యాస్కుని నిరుక్తం ప్రకారం 'పురాణం' పురానవం భవతి (3-4-19) అనే ఇంకో రెండుసూత్రాలలో పురాణ శబ్దాన్ని నిర్వచించాడు. అంటే ప్రాచీనమైనదైనా క్రొత్తదిగా ఉండేదానిని 'పురాణం' అంటారని భావం. వాయు పురాణంలో 'పురాఅనతి' అని పురాణానికి వ్యుత్పత్తి చెప్పబడింది. అంటే ప్రాచీన కాలంలో జీవించి ఉన్నదానిని పురాణం అంటారు అని బ్రహ్మాండపురాణం (1-1-1-173) 'పురా ఏతద్ అభూత్' అంటే ప్రాచీన కాలంలో ఈ విధంగా జరిగింది అనే దానిని తెలియజేసే శాస్త్రమే పురాణం అని వివరిస్తున్నది.

ఈ వ్యుత్పత్తులను పరిశీలిస్తే, పురాణం అనేది ప్రాచీన కాలానికి సంబంధించిందని తెలుస్తుంది. ఆర్యజాతి యొక్క వైదిక సాహిత్యానికి చెందిన జ్ఞానానికి, విజ్ఞానానికి అక్షయ నిధి పురాణం, ఇప్పటివరకు ప్రపంచంలో జ్ఞానులు, శాస్త్రవేత్తలు చెప్పిన విషయాలన్నీ పురాణాలలో ఉన్నాయని (కొందరి) భావన. మొత్తంమీద ప్రాచీన కాలంలో జరిగిన విషయాలను ఇప్పుడు జరుగుతున్న వానివలె ధర్మోపదేశకంగా తెలిపేవి పురాణాలు అని చెప్పవచ్చు.

పురాణాల పాత్ర ఏమిటి ?

పురాణం అంటేనే ప్రాచీనమైనదని అర్థం. సృష్టికి ప్రారంభంలో జ్ఞానరాశి సామాన్య శబ్దాల లోను, వాక్యాలలోను, చెప్పటానికి వీలుకాని సమయంలో పురాణాలను దేవతలు సేకరించారు. ఆ ప్రాచీన కాలపు ఆలోచనాధార, భావనాధార, జ్ఞానధారలు విస్తారంగా పురాణాలను కూర్చటంలో ప్రతిఫలించింది. దీనివలన వేదార్థాన్ని సరియైన పద్ధతిలో, సరిగా అవగాహన చేసుకొనే వీలు కలిగింది. అదే 'పురాణ ఉపబృంహకత' అని పిలువబడింది. ఈ విధంగా భారతీయ సంస్కృతి సనాతన ధర్మాలలోని తులలేని రత్నాలు పురాణాలలో పొదగబడ్డాయి. వానిని సూక్ష్మంగా, తులనాత్మ కంగా పరిశీలించి అవగాహన చేసుకొనకపోతే వేదార్థం సరియైన పద్ధతిలో అవగాహనకాదు. ఈ విశ్వంలో పరమాత్ముడు ఒకడే. అయితే ఆయా స్థలాలలో, ఆయా పురాణ ఖండాలలో వివిధ దేవ తల ఉపాసనను తెలిపిన కథలలో దేవతలు, ఋషులు, తపస్వులు, మునులు, విప్రులు, పర్వతాలు, సముద్రాలు, తీర్థాలు, వృక్షాలు, పశుపక్ష్యాదులు - అన్నీ ఆ విషయాన్ని ప్రతి పాదించేవిగానే పురా ణాల్లో చెప్పబడ్డాయి. అన్నీ కూడా పరమాత్ముని దివ్య చైతన్య స్ఫూర్తిని ఒకదానికి ఒకటి సహకారకంగా వివరించేవే.

ఈ విధంగా సమగ్ర జీవన విధానంలో సమగ్ర బ్రహ్మాండ విషయాలలో, భావనలో ఒకే ఒక పరమాత్ముని సాక్షాత్కారం చేసుకొనే విధానాన్నే పురాణాలు ప్రతిపాదించాయి. అందుకు అవసరమైనంత సమర్థవంతంగా రూపుదిద్దుకున్నాయి. ఈ విషయాలనే పురాణ విద్య అన్నారు. అది మహర్షులకు సర్వస్వంగా నిలిచింది. ఎన్ని రకాలైన దరిద్రాలకు భారతదేశం గురి అయినా, ఆ నిధే తరతరాలుగా ఈ దేశ సాంస్కృతిక వైభవాన్ని నిలబెట్టింది. ఇదే చరిత్రలో పురాణాలు నిర్వహించిన పాత్ర.

పురాణాలు - జయము అనే పేరు

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసంతతో జయ ముదీరయేత్

అని మహాభారతము చెప్పుతున్నది. అందుచేత మహాభారతానికి జయము అనే పేరు ఉన్నట్లు తెలుస్తున్నది. 'జ' అంటే సంస్కృత సంఖ్యా పరిగణనాన్ని బట్టి 8. 'య' అంటే 1 అనగా 81.

'అంకానాం వామతో గతిః' అనే నుడిని బట్టి ఇది 18 అవుతుంది. 18 పర్వాలు గలది, 18 అధ్యాయాల భగవద్గీత కలది, 18 రోజుల కురుక్షేత్ర సంగ్రామం గలది, యుద్ధంలో పాల్గొన్న 18 అక్షౌహిణుల సైన్యం గలది, మహాభారతం – అందుకే ఆ మహాగ్రంథం 'జయం'.

అలాగే పురాణాలకు కూడా 'జయము' అనే పేరున్నది. అసలు పవిత్రమైన హిందూ గ్రంథాలకు 'జయము' అనే పేరు ఉన్నట్లున్నది. చూడండి.

అష్టాదశ పురాణాని రామస్య చరిత్రం తథా
కార్ష్ణం వేదం పంచమం, యన్మహా భారతం విదుః
తథైవ విష్ణు ధర్మాశ్చ, శివధర్మాశ్చ శాశ్వతాః
జయేతి నామతేషాం, చ ప్రవదంతి మనీషిణః – *భవిష్యత్పురాణం.*

అని అష్టాదశ పురాణాలకు, రామాయణానికి, మహాభారతానికి, విష్ణుపురాణం, శివధర్మ పురాణం, శారీరక సూత్ర భాష్యాలకు జయం అనే పేరు ఉన్నదని తెలుస్తున్నది.

జయం జయత్యనేన సంసారమితి జయో గ్రంథః

ధర్మార్థ కామమోక్ష ప్రతిపాదకమై సంసార జయమునకు అనగా ఈ లోకము నందు విజయము పొందుటకు సాధకములైన గ్రంథాలను జయము అంటారని తెలుస్తున్నది.

పురాణాల ఆవిర్భావం

పురాణాలు ఎలా ఆవిర్భవించాయి అనే విషయాన్ని గురించి ప్రాచీన వాఙ్మయంలో అనేక విషయాలు చెప్పబడ్డాయి. పురాణాల ఆవిర్భావంలో రెండు ధారలు కన్పిస్తాయి. 1. వ్యాసునికి పూర్వపు సంప్రదాయం 2. వ్యాసోత్తర సంప్రదాయం. వ్యాసునికి ముందు 'పురాణం' అనే పదానికి లోకంలో బాగా ప్రచారంలో ఉండి, అవ్యవస్థితంగా ఇక్కడ అక్కడా చెల్లాచెదురుగా ఉన్న లోక వృత్తాత్మకమైన విద్య అని మాత్రమే అర్థం. దీనికి ప్రమాణంగా ప్రాచీన గ్రంథాలలో 'పురాణము' అని ఉన్నదేగానీ, పురాణ సంహిత అని లేక పోవడమే. అంటే దీనివలన ఏదీ గ్రంథంగా గాక విద్యావిశేషమనే దానిని భావించాలి.

పురాణాల తత్వాన్ని గురించి స్కాందపురాణంలోని రేవాఖండంలోను, పద్మ పురాణం (సృష్టిఖండం), మత్స్యపురాణంలోను 'కల్పాంతరంలో పురాణం ఒకటిగానే ఉండేదని, అది త్రివర్ణాలైన ధర్మ అర్థ కామాలకు సాధనంగా ఉండేదని, అది చాలా పెద్దగా శతకోటి శ్లోక విస్తారంగా ఉండేదని,

ఆ పురాణం దేవలోకంలో ఉండేదని, కాలాంతరంలో క్షీణబుద్ధులైన మానవులు దానిని గ్రహించ లేనందువలన, శ్రీమహావిష్ణువు మానవుల క్షేమం కోసం దానని నాలుగు లక్షల శ్లోకాలకు వ్యాసునిగా అవతరించి పరిమితం చేశాడని చెప్తున్నాయి. అందువలన మనుష్యలోకంలో పురాణాలు చతుర్లక్ష శ్లోకాలకు పరిమితం అయింది. ఆ చతుర్లక్ష శ్లోకాలనే 18 పురాణాలుగా వేదవ్యాసుడు చేశాడు. అవే ఈనాడు లభ్యం అవుతున్నాయని ఆ పురాణాలు ఘోషిస్తున్నాయి. కొందరు ఇది చతుర్లక్షాత్మకమైన ఒకే పురాణంగా ఉండేదని దానినే బ్రహ్మాండ పురాణమని పిలిచేవారని అదే 18 విభాగాలుగా చేయబడిందని తెలుపుతున్నారు. ఏదైనా ఈ 18 పురాణాలను వేదవ్యాసుడు రచించాడని ఈ యుగంలో భావించడం సరియైనదే.

ఒకానొక కాలంలో ఒకటే పురాణం ఉండేదా ?

పురాణ వాఙ్మయం విస్తృతంగా పెరిగి నాలుగు లక్షల శ్లోకాల పరిమితికి చేరిన నేడు ఈ విషయాన్ని నిర్ధారించటానికి అంతగా అవకాశంలేదుగానీ పండితులు అనేకులు 'ఆరంభంలో పద్దెనిమిది కాదని తెలుపుతున్నారు. మొదట శ్లోకాత్మకమైన పురాణం ఒకటే ఉన్నట్లు అది క్రమంగా వేదోపబృంహణం చేయటం అనే అంశం ఆధారంగా క్రమంగా పెరిగినట్లుగా, దాని గ్రంథసంఖ్య మొదట కొద్దిగా ఉండి తరువాత పెరుగుతూ పోయి, వేఱువేఱు కాలాలలో పెరిగిన కూర్పులు బయలు దేఱినట్లుగా చెప్పటానికి పురాణాలలోనే కొన్ని సూచనలు ఉన్నాయని తెలుపుతున్నారు.

జాక్సన్ అనే ఐరోపీయ పరిశోధకుడు "వైదికయుగం చివరి భాగం నుంచి క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం వరకు ఇతిహాసాలకు అనుబంధంగా పురాణం ఒకటి ఉండినట్లుగా అందులో సర్గము, ప్రతి సర్గము, వంశము, వంశాను చరితము, మన్వంతరమ అనేవి వర్గీకరింపబడినట్లు హిందువుల వ్రాతలవలననే తెలియవస్తున్నది. స్టీఫెన్‌కాలం వఱకు వేఱువేఱు మఠాలలో వ్రాయ బడుతూ వచ్చిన శాక్షన్ వృత్తాంతా (శాక్షన్ క్రానికల్)ల వంటివే ఈ పురాణాలు. నార్మనుల దండ యాత్ర తరువాత పరస్పర సంబంధంలేని భాగాలు ఆ వృత్తాంతంలో చేరిపోతూ వచ్చినట్లే హిందూ సామ్రాజ్య కేంద్ర ప్రభుత్వం అంతరించిన పిదప పండిత సమావేశాలు అంతకుపూర్వం కంటే కష్టతరమైనా అప్పటి నుంచి ఆయా పుణ్యక్షేత్రాలలోని పండితులు తమ దగ్గరగల శ్లోకాత్మకమైన మూలపురాణ ప్రతులలో అక్కడక్కడా మార్చటం, కొన్నిచోట్ల స్థానిక విషయాలను చేర్చి గ్రంథాన్ని పెంచడం సంభవించి ఉండాలి. మూల గ్రంథమైన ఆది పురాణం నుంచి ఈ విధంగా బ్రహ్మపురాణం ఒరిస్సాలోను, పద్మపురాణం పుష్కర క్షేత్రంలోను, అగ్నిపురాణం గయలోను, వరాహపురాణం మధురలోను, వామన పురాణం స్థానేశ్వరంలోను, కూర్మపురాణం వారణాసిలోను, మత్స్యపురాణం నర్మదా ప్రాంతంలోను పుట్టాయి" అని వ్రాశాడు.

మూలపురాణంలోని శ్లోకాలు ఎన్ని?

దేశకాలాలను బట్టి పురాణాలు చాలా మార్పులను పొందాయి. ఇప్పుడు స్పష్టంగా ఆ మూల పురాణ రూపాన్ని కనుక్కోలేకపోయినా కొన్ని ఆధారాలనుబట్టి ఒకపాటి నిర్ణయానికి రావచ్చు.

భవిష్యత్పురాణంలోని "సర్వాణ్యేవ పురాణాని సంజ్ఞేయాని నరర్షభద్వాదశైవ సహస్రాణి ప్రోక్తానాం మనీషిభిః" అనే శ్లోకంవలన పురాణాలు అన్నీ కలిపి మొదట 12,000 శ్లోకాలకు పరిమితమేనని తెలుస్తున్నది. అలాగే 'పునర్వృద్ధింగతా నీహ ఆఖ్యానైర్వివిధైర్నృప, యథాస్కాందంతథాభేదం భవిష్యం కురునందన" (ఓ రాజోత్తమా పురాణాలు అన్నీ కలిపి మొదట 12,000 గ్రంథంగా ఉండేది. కాలక్రమంలో అనేక వ్యాఖ్యానాలు చేరి అది వృద్ధి చెందింది అని చెప్తూ, ఇంకా స్కాందం శత సహస్రంతులోకానాం జ్ఞాతమేవహి, భవిష్యమేతదృషిణా లక్షార్ధ సంఖ్యయాకృతం' స్కాందం లక్షగ్రంథాల పరిమాణం భవిష్య పురాణం యాభైవేల గ్రంథంగా పెరిగిందని లోకులందరికీ తెలుసు అని తెలుపుతున్నది.

మొదటలో ఉన్న ఆది పురాణం పేరు ఏమిటి?

ఒక్క పురాణం నుంచి పెక్కు పురాణాలు పుట్టాయనటానికి విష్ణుపురాణమే ఒక దృష్టాంతము. విష్ణు పురాణం పురాణాలకే ఆదర్శమైనదని, పురాణాలలో పురాతనమైనదని పరిశోధకుల భావన. కానీ ఈ విష్ణుపురాణం కూడా స్వతంత్రం కాదు, ఒకప్పుడిది బ్రహ్మాండపురాణం అనే సర్వసమగ్ర పురాణం యొక్క భాగంగా ఉండేది. తరువాత కాలంలో దాని నుంచి చీలి, స్వతంత్ర పురాణం అయింది. 16వ శతాబ్దంవాడైన వెన్నెల కంటి సూరన విష్ణుపురాణాన్ని తెలుగులోకి అనువదించాడు. అందులో షష్ఠ్యంతాలైన తరువాత "అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా యొనర్పంబూనిన బ్రహ్మాండ పురాణంబు నందలి పరాశరసంహితయైన శ్రీవిష్ణుపురాణంబునకు కథాక్రమంబెట్టిదనిన' అని చెప్పాడు. ఇంతేకాక ప్రతి ఆశ్వాసం చివర గద్యలోను ఇలాగే వ్రాశాడు. దీనిని బట్టి 16వ శతాబ్దంలోని సంస్కృత విష్ణుపురాణ ప్రతిలో అది బ్రహ్మాండపురాణంలోని పరాశర సంహిత అనబడే భాగమని వ్రాసి ఉండాలని నిశ్చయంగా తెలుసుకొనవచ్చు. అయితే ఎందుకు ఈ విషయం ప్రస్తుత ముద్రిత సంస్కృత విష్ణు పురాణంలో చెప్పబడలేదంటే ఇది స్వతంత్ర పురాణం కాక ఒక మహాపురాణంలోని భాగం అంటే దాని గౌరవం తగ్గిపోతుందనే భయంవలన కావచ్చును. ఇటీవలి వారు సంస్కృత లిఖిత ప్రతులు వ్రాసుకొనే సమయంలో ఈ మాటను ఎత్తివేసి ఉండవచ్చు. అయితే కొన్నింటిలో మాత్రం పరాశర సంహిత అని ఉన్నది.

అయితే 11వ శతాబ్దంనాటి ఆల్‌బెరూనీ అనే పండితుడు భారతదేశం వచ్చి మన గ్రంథాలను కొంత పరిశీలించటం జరిగింది. ఆయన ఇచ్చిన పురాణాల పట్టికలో విష్ణుపురాణం, బ్రహ్మాండ పురాణాలు వేర్వేరుగా పేర్కొనబడ్డాయి. అందువలన పదకొండవ శతాబ్దానికి ముందే బ్రహ్మాండ పురాణం నుంచి విష్ణుపురాణం విడిపోయిందన్నమాట. భారతదేశంలో వైష్ణవమతం బాగా ప్రచారం లోకి వచ్చిన తరువాత విష్ణుపురాణం బ్రహ్మాండపురాణ భాగమని పేర్కొనడం ఆగిపోయి ఉండవచ్చు.

మొత్తంమీద మొదట బ్రహ్మాండమనే పురాణం ఒకటే ఉండేదని, అది అనేక సంహితలుగా ఉండేదని, విష్ణుపురాణం ఆ సంహితలలో ఒకటని చెప్పవచ్చు.

ఇక వాయుపురాణాన్ని పరిశీలించగా అందరు పండితులు వాయుపురాణాన్ని ప్రాచీన పురాణంగా అంగీకరిస్తున్నారు. ఇది హర్షచరిత్రంలోను, బాణుని కాదంబరిలోను పేర్కొనబడింది.

ప్రస్తుతం బ్రహ్మాండపురాణంగా ముద్రితం అయిన గ్రంథంలో దాదాపు రెండువంతులు అంటే పరశురామ సర్గ వృత్తాంతము, లలితోపాఖ్యానం తప్ప మిగిలిన భాగం 78 అధ్యాయాలు, శ్లోకాలతో సహా మారకుండా వాయుపురాణంలో యథాశ్లోకంగా ఉన్నాయి. కాబట్టి వాయుపురాణం అసలు వాయుపురాణం కాదని గయాక్షేత్రమాహాత్మ్యం కూడా కలిసి ఉన్న బ్రహ్మాండపురాణంలోని ఒక భాగమని భావించవచ్చు. అనగా బ్రహ్మాండపురాణంలోని వాయు సంహితను వాయు పురాణంగా పరివర్ధితం చేసి ఉండ వచ్చుని భావించటంలో ఎలాంటి అసంగతము ఉండదు. ఇందుకు బలంగా నారదపురాణంలోని ఒక కథలో దీనికి సూచన ఉన్నది. అందులో "నాలుగు పాదాలతోను బ్రహ్మాండ పురాణాన్ని వర్ణించి ఉన్నాను. ఇది పదునెనిమిదవది, అనుపమానమైనది. సారాతీతమైనది. బ్రహ్మాండ పురాణం నుండి పారాశర్యమహాముని దీనినే అందరికీ పదెనెనిమిది విధాలుగా చెప్పి ఉన్నాడు. ఆ మహాముని నావలన పురాణాలను విని, మననముచేసికొని ధర్మశీలురును, దీనానుగ్రహకరులైన మునులకు తెలియచెప్పి వానిని లోకమున వ్యాపింపచేసెను. (నారదపురాణం 100–29–35) అని చెప్పబడింది.

దీనినిబట్టి బ్రహ్మాండపురాణమే అన్ని పురాణాలకు మూలాధారమని ఒక పురాణ గాథ ఉన్నట్లు తెలుస్తున్నదిగదా. ఇంకొక ఆధారం మన భారతీయ హిందువులు క్రీ.శ. 5వ శతాబ్దానికంటే ముందే బలిద్వీపానికి వలసపోయారు. వెళ్లేటప్పుడు వారు తమతో తమ గ్రంథాలను కూడా కొన్నింటిని తీసుకొని వెళ్ళారు. అవి ఆ దేశ భాష అయిన 'కవి' భాషలోనికి అనువదించబడ్డాయి. ఆ గ్రంథాలలో సంస్కృతమూలాలతో సహా ఋగ్వజుస్సామఅధర్వవేదాలు, రామాయణ మహా భారతములు కూడా ఉన్నాయి. పురాణాలలో ఆ బలిద్వీపవాసులు ఒక్క బ్రహ్మాండాన్నే గానీ, మిగిలిన వాటిపేర్లను కూడా ఎరగరు. అంటే మిగిలిన వాటి పేర్లను కూడా తెలియనంతగా ఉన్నారంటే ఆనాటికి ఒక్క పురాణమే ఉండేదని భావించవచ్చుగదా. పైగా బలిద్వీపంలో ఒకతెగ శైవులు ఉన్నారు. వారు బ్రహ్మాండపురాణన్నే తమ పురాణంగా అంగీకరిస్తారు. అందువలన హిందువులు వలస పోయినప్పుడు ఒకటే పురాణం ఉండేదని భావించవచ్చు. అలాగే నేటి బ్రహ్మ పురా ణంలో చాలా భాగాలు మక్కికి మక్కి విష్ణుపురాణంలోని భాగాలే భాగవతంలోని కథలు అన్నీ విష్ణుపురాణాన్ని అనుసరించి వ్రాయబడినవే. అలాగే అనేక పురాణాలలో ఉన్న శ్రాద్ధకల్ప విషయాలు దాదాపు ఏకరీతిగా ఉన్నాయి. అందువలన మొత్తంమీద క్రీస్తుశకం మూడు నాలుగు శతాబ్దాల వరకు పురాణం అనే పేరుతో ఒకే గ్రంథం ఉండేదని, దానికే అప్పుడుకానీ, అటుతరువాత కానీ బ్రహ్మాండపురాణం అనే పేరుండేదని దానిలో పన్నెండు వేల శ్లోకాలకంటే ఎక్కువగా ఉండేవి కావని, ఆ పురాణంలోని భాగాలు క్రమంగా దాని నుంచే వేరుపడి ప్రత్యేక పురాణాలు అయినాయని, ఈ విధంగా తటిగి పోవటం వలన మూల పురాణం క్రమంగా సన్నగిల్లి, కేవలం పేరుకు మాత్రం మిగిలిందని, మూల పురాణ భాగాలన్నింటిలోకి గొప్పవి, మొట్టమొదట చీలిపోయినవి విష్ణు వాయు పురాణాలు కావచ్చునని, కొంతకాలం వరకు ఏయే భాగాలు ఏయే మూల గ్రంథ భాగాలో తెలుపబడుతూ ఉండేవని, కాని క్రమంగా మతము మీది అభిమానము ఎక్కువైన కొద్దీ గౌరవ భంగం అని తలచి కావచ్చు మూలగ్రంథపు పేరును జారవిడిచి స్వతంత్రాలైన ప్రత్యేక పురాణాలుగా వాటిని ప్రకటించడం మొదలైందని నిర్ణయించవచ్చు.

పురాణం లౌకిక శాస్త్రం. ఇది వేదం కంటే భిన్నమైనది. కానీ వేదానికి అనుకూల మైనట్టిది. ఇదే వేదోపబృంహణం. ఇది ఎప్పుడూ స్థిర రూపాన్ని కలిగి ఉండదు. ఇది కాలాన్ని అనుసరించి, పరివర్తన శీలకమైనట్టిది. కాల ప్రభావంచేత మార్పులను పొందుతుంటుంది. అందుకే తంత్రవార్తిక మనే గ్రంథం వేదం అకృత్రిమమైనదని, పురాణం కృత్రిమ మైనదని చెప్తున్నది. అందుకే నిరుక్తం 'పురాపినవం భవతి' పాతది అయినా కొత్తగానే ఉంటుంది అని చెప్పింది. అంటే కాలాంతరం ఉత్పన్నమయ్యే మార్పులను పురాణం తనలో లీనం చేసుకొంటుందని దీని భావం.

వేదాలు పురాణాలను గురించి ఏమి అంటున్నాయి ?

వైదిక కాలం నుంచి నేటివరకు వేదాలకు పురాణాలకు గల సంబంధం రక రకాలుగా వ్యక్తపరచబడింది. వేద పురాణాలు రెండూ ఒకరకంగా అవినాభావ సంబంధం గలవే, భారతీయ తత్త్వం ప్రకారం వేదాలు అపౌరుషేయాలు అంటే మానవులు ఎవరూ వాటిని వ్రాయలేదు. భగవంతుడు వాటిని రచించలేదు. అవి నిత్యాలు, అనాదులు అని భారతీయుల విశ్వాసం. ప్రాచీనులు శబ్దాన్ని ధ్వనిని వేరువేరుగా భావించారు. వేద ధ్వని నిత్యం (వాచా విరూప నిత్యయా – ఋగ్వేదం–8–75–6) అంటే ఉచ్చరించటం చేతనే అది వినపడుతుందని, కానీ వేదశబ్దం నిత్యమని, ఉచ్చరించక పోయినా అది నిలిచే ఉంటుందని వారి విశ్వాసం. ప్రళయ కాలంలో వేదశబ్ద రాశి అంతా భగవంతునిలో నిక్షిప్తం చేయబడుతుంది. సృష్టి జరిగే సమయంలో పరమేశ్వరుని ద్వారానే వేదపురాణాలు వెలువడ్డాయి. వేదాలలోని గూఢమైన అర్థాలను తపస్సుద్వారానే అవగాహన చేసుకొనే వీలుంటుంది. వేదాలు ఈ నిగూఢమైన అర్థాలను గురించే భగవద్గీతలో భగవంతుడు 'వేదాంతకృద్వేద విదేవ చాహమ్' (11–15) అని తెలిపాడు. ఈ విధంగా వేదాలలో నిక్షిప్తమైన గూఢార్థాలను గ్రహించటానికి సరళమైన భాష అవసరం. అందుకు పురాణాలు రామాయణ మహాభారతాలు రచింపబడ్డాయి. వేదాలు, పురాణాలు, రామాయణం, భారతం ఇవి అన్నీ కూడా ఒకే ఒక అఖండ ధర్మాన్ని ప్రతిపాదిస్తున్నాయి. ఈ విధంగా వేదాలలో భాగమైన ఉపనిషత్తులలోని నిగూఢతత్త్వం పురాణాలలో విపులంగా విశదంగా చెప్పబడింది.

నారదపురాణం, వేదాలకంటే పురాణాలకు ఉన్నత స్థానాన్ని కల్పిస్తున్నది. వేదాలు సమగ్రంగా పురాణాలలోనే ప్రతిష్ఠితాలుగా ఉన్నాయి అని ఇంకా ('న వేదే గ్రహ సంచారో నశుద్ధిః కాలబోధినీ' – (నారద పురాణం–2–24–19) అంటే వేదాలలో జ్యోతిష్యానికి సంబంధించిన గ్రహసంచారం, ఇతర వ్యావహారిక విషయాలు ఎక్కడా లేవు అంటుంది. ఒక ఉదాహరణను చూద్దాం. పురాణాలలో చంద్రగ్రహణ సమయంలో రాహువు చంద్రుడిని కబళిస్తాడని పురాణాలు చెప్తున్నాయి. కానీ ఆధునిక విజ్ఞాన శాస్త్రం చంద్రుడు భూమి యొక్క నీడ (ఛాయ)లోనికి ప్రవేశిస్తాడని చెప్తుంది. కాబట్టి పురాణంలో చెప్పబడింది అభూతకల్పన అని భావించటం జరుగుతుంది. చంద్రుడు భూమి యొక్క ఛాయలోనికి ప్రవేశించినప్పుడు ఆ ఛాయలో ఒక చేతన శక్తి ఉంటుందనేది అందరికీ తెలిసిన సత్యమే – ఆ చేతన శక్తే పూర్ణచంద్రుడిని కనపడకుండా చేసి కొంత సమయం పాటు చంద్రుడి తేజం కానరాకుండా చేస్తుంది. అందువలన అది ఆసురీశక్తిగా భావింపబడుతుంది.

దీనినే మనం రాహువు రాక్షస శక్తి అని అంటున్నాం. ప్రకృతిలో జరిగే అన్ని సంఘటనల లోను ఈ చేతన శక్తి యొక్క ప్రమేయం పైకి కనిపించకుండానే ఉంటుంది.

దేవీ భాగవతం 'శృతిస్మృతీ, ఉభేనేత్రం పురాణం హృదయం స్మృతమ్ ఏతత్త్రయోక్త ఏవ స్యాద్ధర్మోవా ఉ అన్యత్ర కుత్రచిత్' (11-1-21) అంటుంది. అనగా ధర్మ పురుషుడికి శృతులు, స్మృతులు రెండు కళ్ళైతే పురాణాలు హృదయం అవుతాయి. పురాణాలలో ఆరెం డింటిలో (శృతులు, స్మృతులలో) చెప్పిన ధర్మాలు ఉంటాయి. వేరే ఎక్కడా ఉండవు అంటుంది.

ఋగ్వేదంలో అనేక మంత్రాలలో పురాణ శబ్దం ఉపయోగించబడింది. (ఋగ్వేదం 3-5-4-9, 3-58-6, 10-130-6) కానీ ఆ సందర్భాలలో ఆ పురాణ శబ్దానికి అర్థం కేవలం 'ప్రాచీనమైన'ది అనేదే. అధర్వణ వేదంలో పురాణ శబ్దం రెండు స్థానాలలో ఉపయోగించబడింది. (ఋచః సామాని ఛందాంసి పురాణం యజుషాసహ, ఉచ్ఛిష్టజ్జజ్ఞిరే సర్వేదివి దేవా దివిశ్రితాః- 11-7-24, తమితిహాసశ్చపురాణంచ -15-6-11) దీనివలన అధర్వవేద కాలానికి పురాణాలు రూపాన్ని సంతరించుకొన్నాయని నిశ్చయంగా చెప్పవచ్చు. కాబట్టి పురాణం నిగమ ఆగమాలనే మూలంగా గ్రహించినదనే విషయం స్పష్టం. ఇప్పుడు మనం సనాతన ధర్మం అని పిలుస్తున్నది వ్యవహారతయా పురాణ ప్రధానమే. ఇందులో సందేహం లేదు. వైదిక వాఙ్మయంలో సంహితలు మాత్రమే కాకుండా బ్రాహ్మణకాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు కూడా భాగాలే - వీటిలో పురాణాలను స్పష్టంగా విపులంగా పేర్కొనటం జరిగింది. శతపథ బ్రాహ్మణం అనేది యజుర్వేదంలోని ఒక భాగం. అందులో పురాణం యొక్క పుట్టుకే విశేషమైన గాథగా చెప్పబడింది. (మధ్వా హృత యోహవా ఏ ఇతా దేవానాం యదనుశాసనాని విద్యావాకో వాక్యమితిహాస పురాణం గాథా నారా శంస్య (శ.బ్రా. 11-5-6-8) ఇక్కడ 'ఇతిహాస పురాణమ్' అనేవి కలిసిపోయిన రూపంలో ఒక సమస్త పదం ద్వారా నిర్దేశింపబడింది. అయితే అధర్వణ వేదంలోని గోపథ బ్రాహ్మణంలో (ఏవమిమే సర్వే వేదా నిర్మితాః ససంకల్పాః సరహస్యాః సబ్రహ్మణాః సోపనిషత్కాః సేతిహాసాః సాన్వాఖ్యానాః సపురాణాః (గో. బ్రా 1-2-10) అని పురాణము ఇతిహాసములను వేరువేరుగా పేర్కొని ఆరెండింటి విభిన్నతను తెలుపుతున్నది.

ఆరణ్యకాలు, ఉపనిషత్తులు బ్రాహ్మణక సాహిత్యం యొక్క అంతిమ స్వరూపాలు. బ్రాహ్మణక గ్రంథాల పరివర్థితరూపాలుగా ఆరణ్యకాలు, ఉపనిషత్తులు విలసిల్లుతున్నాయి. వీటిల్లో పురాణ ప్రసక్తి అనేక మార్లు కనిపిస్తుంది. తైత్తిరీయ ఆరణ్యకంలో పురాణ శబ్దం కనిపిస్తున్నది. అందులో 'పురాణాని' అనే బహువచన రూపము (బ్రహ్మ యజ్ఞ ప్రకరణేయద్ బ్రాహ్మణానీతిహాసాన్ పురాణాని కల్పాన్ గాథా నారాశంసీ భేదాహృతయో దేవానామ భవన్ (తై.ఆ. 2-9) అని కనిపిస్తుంది. దీనితో ముందు చెప్పబడిన 'ఆఖ్యానాల బహుత్వం తెలుస్తుంది. అలాగే బృహదారణ్య కోపనిషత్ పురాణాన్ని వేదంతో సమానంగా (అస్య మహతో భూతస్యనిశ్వసిత మేతద్ యద్ ఋగ్వేదో యజుర్వేదః సామవేదో అథర్వాఙ్గిరస ఇతిహాసః పురాణమ్' (బృ. ఉ.2-4-10) పరిగణిస్తున్నది. అంటే ఇతిహాస పురాణాలు మహాభూతేశ్వరుడైన పరమేశ్వరుని శ్వాస రూపాలని తెలుపుతున్నది. అలాగే ఛాందోగ్యోప

నిషత్తులో (అధర్వణ చతుర్థామితిహాసపురాణం పఞ్చమం వేదానాం వేదమ్ - ఛా.ఉ. 7-1-1) సనత్కుమారుని వద్ద బ్రహ్మ విద్యను నేర్చుకొనే సమయంలో నారదుడు తాను క్షుణ్ణంగా నేర్చుకొన్న విద్యలలో వేదాలతోపాటుగా ఇతిహాస పురాణాలను కూడా నేర్చుకొన్నానని స్పష్టంగా పేర్కొన్నాడు. ఇక్కడ ఉపయోగించిన పఞ్చమం అనే పదం పురాణాలను పంచమ వేదాలుగా భావించబడుతుండేదని చెప్పటానికి స్పష్టమైన ఉదాహరణ. పంచమ వేదమనే భావనలో స్థిరపడిన పురాణ విద్య వేదాలతో సమానంగా అతిప్రాచీన కాలం నుంచే భావించబడేదనే విషయం నిశ్చితం. అందువలన ఇతిహాస పురాణాలు పంచమ వేదాలుగా ప్రసిద్ధి చెందాయి.

పురాణాలు - వేదోప బృంహణము

పురాణాలన్నీ వేదాలకు ఉపబృంహకాలే. ఉపబృంహకం అంటే ఏమిటి ? ఏ విషయం వేదంలో సూచింపబడిందో లేక సంక్షేపంగా చెప్పబడిందో ఆ విషయాన్ని విస్తారంగా నిరూపణగా వివరించటమే ఉపబృంహకత. పురాణాలు వేదాల ప్రామాణికతలను అన్నిటికంటె ఎక్కువగా వివరిస్తున్నాయి. మహాభారతం కూడా ఇదే విషయాన్ని పురాణ రూపంలోని పూర్ణ చంద్రుడు శృతి (వేదం) అనే వెన్నెలను కాస్తాడు అని ధృవీకరిస్తున్నది. కూర్మ (1-2-19) వాయు (1-201) పద్మ (5-2-51-52) బ్రహ్మాండ (1-1-1-27) మొదలైన పురాణాలు ఇదే విషయాన్ని నొక్కి చెప్తున్నాయి. ఉపబృంహణ పదంలోని 'బృహి' లేక 'బృహ్' అనే ధాతువుకు వర్ధనము, పెంచు అని అర్థం. అంటే వేదంలోని మంత్రాల ద్వారా ప్రతిపాదించబడిన అర్థం, సిద్ధాంతం లేక కథానకాలను విస్తరించి, వాటిని పోషించ టమే పురాణాల ద్వారా చేయబడిన వర్ధనం. దీనివలన సమస్త పురాణాలు భారతాది ఇతిహాసాలు ఏదో ఒక రూపంలో వేదార్థాన్ని ఉపబృంహణం చేస్తున్నాయి అని తెలుస్తుంది.

వేదాలను అధ్యయనం చేసేవారు వానిని సాంగోపాంగంగా అర్థాన్ని కూడా తెలుసుకోవాలని మనువు చెప్పాడు. వాయుపురాణం నాలుగు వేదాలను, వాని అంగాలైన ఆరు శాస్త్రాలను, ఉపనిషత్తులను అధ్యయనం చేసిన వ్యక్తి అయినా, పురాణాలను కూడా అతడు క్షుణ్ణంగా అధ్యయనం చేస్తేనే విచక్షణుడు కాగలడుకానీ లేకపోతే ఆ వేదాధ్యయనం విచక్షణారహితం అవుతుందని ఘోషిస్తున్నది. ఉదాహరణకు ఉపనిషత్తులలో ఒకే బ్రహ్మ చేసిన ఆకాశం యొక్క సృష్టిని గురించి కేవలం అతి సంక్షేపంగా సంకేతంగా మాత్రం (తైత్తిరీయ ఉపనిషత్తు-2-1) ఉన్నది. ఇదే విషయం అగ్ని (ఛాందోగ్యోపనిషత్తు 6-23) నీరు (ఛాందోగ్యోపనిషత్తు 6-2-4)ల సృష్టి విషయంలో కూడా ఇలాగే సూచనగా ఉండగా, పురాణాలలో దీనినే విస్తరించి ఈ తత్త్వాల ఉత్పత్తి, నాశనముల వివరణ (వాయు 4-2) (బ్రహ్మ (2-3)) బ్రహ్మాండ 2-36) కూర్మ (1-2,4,7,8) పురాణాలలో సంపూర్తిగా ఇవ్వ బడింది. ఐతరేయ బ్రాహ్మణంలోను కఠోపనిషత్తులోను చెప్పబడిన హరిశ్చంద్ర నచికేత కథలు బ్రహ్మపురాణం (104వ 105వ అధ్యాయం) భారత సభాపర్వం (అధ్యాయం 12) అనుశాసన పర్వం (అధ్యాయం 91)లలో పర్యాప్త విస్తారంగా వివరించటం జరిగింది. ఋగ్వేదంలోని ఋచ వృత్తాంతం పురూరవ ఊర్వశీ వృత్తాంతాలు విష్ణుపురాణం (4-6-64)లో విపులంగా చెప్పబడ్డాయి.

పురాణాలలో వేదార్థ ఉప బృంహణం నాలుగు రకాలుగా జరిగింది.

1. వైదిక మంత్రాలలోని విశిష్ట పదాలకు అర్థాలు వివరించటం.
2. వైదిక మంత్రాలను వ్యాఖ్యానించటం
3. వైదిక ఆఖ్యానాల (కథల)ను విస్తరించటం
4. వైదిక ప్రతీకలను వ్యాఖ్యానించటం.

ఈ విధంగా పురాణాలు వేదార్థాన్ని అనేక విధాలుగా ఉపబృంహణం చేయటం జరుగుతున్నది. అందుకే గోస్వామి అనే పండితుడు పురాణ పదానికి 'పూరణాత్ పురాణమ్' అని వ్యుత్పత్తిని చెప్పటం చాలా సమంజసంగా ఉన్నది. వేదార్థాన్ని పూర్తి చేసేదే పురాణమని దీని అర్థం.

వ్యాసపరంపర

కృష్ణ ద్వైపాయనుడనే వ్యాస భగవానుడు పురాణ సంహితను కూర్చి పురాణాలను సువ్యవస్థిత రూపంలో ప్రతిష్ఠింప చేయటంలో పురాణ వికాసంలో కొత్తయుగం ప్రారంభం అయింది. పురాణాలలో చెప్పబడిన విషయాల ప్రకారం వ్యాసుడు విష్ణువు యొక్క అపరాంశ సంభూతుడు కాబట్టి ఆయనకు కృష్ణద్వైపాయనుడు అనే పేరు కూడా ఉన్నది. అయితే వాయుపురాణం వ్యాసుడిని బ్రహ్మ అవతారం అని చెప్తుంటే, కూర్మ పురాణం శివుని అవతారం అని ప్రకటిస్తున్నది. ద్వైపాయనుడు అనే పేరు ఆయన యమునానది యొక్క ఒక సైకత ద్వీపంలో పుట్టినందువలన ఏర్పడింది. కృష్ణుడు అనే పేరు ఆయన శరీరవర్ణం నల్లగా ఉన్నందువలన ఏర్పడింది. ఆయన తల్లి సత్యవతి, తండ్రి పరాశర మహాముని. ఆయన వేదాలను నాలుగు భాగాలుగా విభజించి వాటికి ఒక సువ్యస్థను ఏర్పాటు చేసిన వాడు. అందుకే ఆయనకు వేదవ్యాసుడని పేరు వచ్చింది. వేదవ్యాసుడు నాలుగు వేదాలను పైల, వైశంపాయన, జైమిని, సుమంతులనే నలుగురు శిష్యులకు బోధించాడు. వీళ్లు నలుగురు అనగా – పైలుడు ఋగ్వేదాన్ని, వైశంపాయనుడు యజుర్వేదాన్ని, జైమిని సామవేదాన్ని, సుమంతుడు అధర్వణ వేదాన్ని అభ్యసించి వేద పారంగతులైనారు. ఆయనకు అయిదవ శిష్యుడు కూడా ఉన్నాడు. అతడే సూతుడైన రోమహర్షణుడు. వేదవ్యాసుడు ఆ సూత రోమహర్షుణునికి ఇతిహాస పురాణాలను బోధించాడు. సూతుని పుత్రుడు సౌతి. పద్మ పురాణం ఈ సౌతి పేరు ఉగ్రశ్రవుడని చెప్తున్నది. ఈయనే నైమిశారణ్యంలో శౌనకాది మహామునులకు మహాభారతాన్ని వినిపించాడు. ధర్మానికి హాని కలిగినప్పుడు, మానవ క్షేమానికి వ్యాసుడు అవతారం ఎత్తుతాడని పలువురు ధర్మరక్షకుల విశ్వాసం.

మన పద్దెనిమిది పురాణాలను వ్యాసుడే వ్రాశాడు (కూర్చాడు) అని భారతీయుల విశ్వాసం. కొందరు పండితులు కొన్ని శాస్త్రీయ ప్రమాణాలను ఆధారంగా తీసుకొని ఈ పద్దెనిమిది పురాణాలను అనేకులు ఋషులు, మునులు కలసి రచించారని తెలుపుతున్నారు. మేధాతిధి అనే మనుధర్మశాస్త్ర వ్యాఖ్యానకర్త ఉద్దేశ్యంలో 'పురాణాని వ్యాసాది ప్రణీతాని' (మను–3–222) అన్నదానిలో ఆదిపదాన్ని అనుసరించి పురాణాలు కేవలం వ్యాసుడు మాత్రమే రచించినవి కాదని ఋషులు మునుల రచనా

భాగస్వామ్యం వాటిల్లో ఉన్నదని అభిప్రాయ పడ్డాడు. ఇలాగే మార్కండేయ పురాణంలో కూడా 'బహులాఃపరమర్షయః' అని చెప్పిన విషయం కూడా ఆలోచించవలసినదే. బ్రహ్మముఖం నుంచి పురాణం (ఇక్కడ ఏకవచనం – ప్రత్యేకంగా గమనించాలి) వెలువడింది. ఆ తరువాత ఎందరో బ్రహ్మర్షులు పురాణ సంహితను కూర్చారు. అంటే బ్రహ్మముఖం నుంచి పురాణం విద్యారూపంలో వెలువడగా తరువాత మహర్షులు పురాణాలన్నీ గ్రంథరూపంలో సమకూర్చారన్నమాట. కూర్మ పురాణం కూడా 'వ్యాసాద్యైః' అని వ్యాసుడు మొదలైనవారు అని చెప్తున్నది. అంటే వేదవ్యాసుడు రెండు సంహితలను సమకూర్చాడన్నమాట మొదటిది ఇతిహాస విషయకమైన జయసంహిత (ఇది మహాభారత సంహితకు మూలరూపం) రెండవది పురాణ విషయక పురాణ సంహిత. తరువాత ఆయన శిష్యుడైనరో(లో) మహర్షణుడు, ఆయన ముగ్గురు శిష్యులు – అకృతవ్రణ, సావర్ణి, శాంశ పాయనులు మొత్తం నాలుగు పురాణ సంహితలను విస్తరించగా మొత్తం పద్దెనిమిది పురాణాలుగా క్రమపరిణామం చెందాయి. ఇందులో మూల కృషి వేద వ్యాసునిదే. పురాణ సంహితలను పద్దె నిమిదిగా విస్తరింపచేయటం ఆయన కృషి ఫలితమే. అందువలనే వేదవ్యాసుడే పద్దెనిమిది పురాణాల కర్త అని చెప్ప బడుతున్నది. బ్రహ్మాండ పురాణంలో "బృహస్పతిశ్చ శుక్రశ్చ వ్యాసః సారస్వతస్తథా, వ్యాసాః శాస్త్ర ప్రణయన వేదవ్యాస ఇతి స్మృతః"అని చెప్పటం కూడా ఈ విషయాన్ని బలపరుస్తుంది.

వ్యాసుడు యజ్ఞకర్మల నిష్పాదనం కోసం నాలుగు సంహితలుగా విభజించినప్పుడే పురాణ సంహితను ఏర్పాటు చేశాడని చెప్పబడింది. దానిని నలుగురు విశిష్ట శిష్యులకు బోధించి, వారిచే వాటిని అధ్యయనం చేయించి ప్రచార బాధ్యతను నిర్దిష్ట పరిచాడు. రోమహర్షణుడు కూడా వ్యాసుడు తనతో చర్చించిన పురాణ సంహితపై ఆధారపడిన తన పురాణ సంహితను ఏర్పరచుకొని ఈ సంహితను తన ఆరుగురు శిష్యులకు బోధించాడు. ఈ శిష్యుల పేర్లు మనకు వాయుపురాణం నుంచి తెలుస్తున్నాయి. ప్రాచీనకాలంలో వ్యక్తుల పేర్లు, వారి స్వంత నామాలతో పాటు గోత్రకర్తల పేర్లు కూడా జోడింపబడి ఉండేవి. అందుకే ఈ ఆరుగురిపేర్లు వాయు పురాణంలో రెండు విధాలుగా కనిపిస్తున్నాయి. ఒకటి వారి వైయక్తిక నామం రెండవది గోత్రజనామం. ఈ క్రమం ఇలా ఉంటుంది.

కృష్ణద్వైపాయన వ్యాసుడు
(కలియుగంలో పురాణ సంహితను మొదటగా కూర్చిన మహర్షి)

రోమహర్షణ సూతుడు
(వ్యాసుని నుంచి పురాణ సంహిత మొదట గ్రహించిన ముని)

1. సుమతిఆత్రేయుడు 2. ఆకృతివ్రణకాశ్యప 3. అగ్నివర్చాభారద్వాజ

4. మిత్రాయువాశిష్ట 5. సోమదత్తసాకర్ణ 6. సుశర్మాశాంశపాయన


(విష్ణుపురాణం)

ఈ ఆరుగురు శిష్యులలో ముగ్గురు ఆకృతిర్రవణ కాశ్యపుడు, సోమదత్త సావర్ణి, సుశర్మాశాంశపాయనులు తాము మరల కొత్త పురాణ సంహితను తయారుచేసుకొన్నారు. ఈ విధంగా మొత్తం నాలుగు పురాణసంహితలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ నాలుగు సంహితలు వేరువేరుగా భావించకూడదు. అవి అన్నీ ఒక అర్థాన్ని లేక భావాన్ని తెలియ జేసేవే. కేవలం కొన్ని సందర్భాలలో పాఠాంతరాలు మాత్రమే కనిపిస్తాయి. ప్రస్తుతం లభ్యం అవుతున్న పురాణాలలో ఒక్క విష్ణుపురాణమే పరాశరమహాముని కృతంగా కనిపిస్తుంది. మిగిలిన అన్ని పురాణాలు వ్యాసుడు రచించినట్లే తెలుస్తున్నది. అయితే శ్రీకృష్ణ భగవానుడి మంగళ చరిత్రగల శ్రీమద్భాగవతం మాత్రం వ్యాసుని కుమారుడైన శుకమహర్షిచేత మొదటగా ప్రవచనం చేయబడింది. ఇదే పరంపరగా ఇప్పటి వరకు కొనసాగుతున్నది.

పురాణ సాహిత్య పరంపర వ్యాసుని పారివారిక పరంపర ఈ విధంగా ఉంటుంది.

వ్యాసం వశిష్ఠ నప్తారం శక్తేః పౌత్రమకల్మషం
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్

వ్యాసుడు వశిష్ఠునికి ప్రపౌత్రుడు, శక్తికి పౌత్రుడు, పరాశరుని పుత్రుడు, శుకునికి తండ్రి. అప్పుడు వారి వంశ క్రమం ఇది.



ఇది ఇప్పటి వ్యాసుని వంశక్రమం. వ్యాసుడు అనేది ఒక వ్యక్తిపేరు కాదు అది ఒక పదవి. ఈ విషయాన్ని దేవీభాగవతం స్పష్టంగా పేర్కొంది. అతడు ప్రతి ద్వాపర యుగములోను ప్రభవిస్తాడు. ప్రపంచ క్షేమంకోసం ఒక వేదాన్ని నాలుగు వేదాలుగా, ఒక పురాణ సంహితను 18 పురాణాలుగా (వ్యాసిస్తాడు) విభజిస్తాడు. వేదాలను విభజించిన కారణంగా ఆయన వేదవ్యాసుడు అని పిలువడతాడు.

పురాణాల సంఖ్య

అష్టాదశ సంఖ్య ప్రత్యేకత. ప్రాచీనకాలంలో భారతదేశంలో ముఖ్యంగా సంస్కృత వాఙ్మయంలో 18 సంఖ్యకు చాలా ప్రత్యేకత ఉన్నది. పద్దెనిమిది సంఖ్యను పవిత్రమైనదిగా భావించే వారు. అందుచేత కూడా దీనికి విస్తృత ప్రాచుర్యం వచ్చింది. పంచమ వేదంగా భావించే వ్యాస మహాభారతంలో ప్రధాన పర్వాల సంఖ్య 18. అందులో శ్రీ కృష్ణపరమాత్ముడు ప్రవచించిన

భగవద్గీతలో అధ్యాయాల సంఖ్య 18. పాండవ కౌరవ పక్షాల మొత్తం సైన్యం సంఖ్య 18 అక్షౌహిణులు. కురు పాండవ యుద్ధం జరిగిన రోజుల సంఖ్య 18. అలాగే మహాభాగవతంలోని శ్లోకాల సంఖ్య 18 వేలు. అలాగే మహాపురాణాల సంఖ్య 18. ఉపపురాణాల సంఖ్య 18. ఔపపురాణాల సంఖ్య 18. ఏయే పురాణాలు మహాపురాణాలు అనే దాంట్లో కొద్దిపాటి మతభేదం ఉన్నా పురాణాల సంఖ్య మాత్రం 18 అని ఏకగ్రీవంగా అందరూ అంగీకరించే విషయమే. ఈ 18 సంఖ్య ఏదో కారణం లేకుండా నిర్హేతుకంగా పెట్టింది కాదని అది సహేతుకమేనని సాభిప్రాయమని పండితుల భావన.

వ్యాసులు

అష్టాదశ పురాణాలను వ్యాసుడు రచించాడని చెప్పబడుతున్నది. వ్యాసుడు ఒక వ్యక్తి కాదు అనేకులని కొందరి అభిప్రాయం. కొందరు ఇంద్రుడు మొదలైన శబ్దాలలాగానే వ్యాస శబ్దం కూడా బిరుదవాచకం. కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలు నాలుగు కలసి ఒక మహాయుగం అని పిలువబడుతుంది. వీనిలో

యుగ గణనం

		దేవవర్షము	మానుషవర్షములు
1.	కృతయుగం	4800	17,28,000
2.	త్రేతాయుగం	3600	12,96,000
3.	ద్వాపరయుగం	2400	8,64,000
4.	కలియుగం	1200	4,32,000
	మొత్తం	**12,000**	**43,20,00**

ఈ మహాయుగాలలో ప్రతి ద్వాపరయుగాంతంలోను ఒక్కొక్క తపోనిధి వేద విభాగం, అష్టాదశ పురాణ రచనము, అష్టాదశ విద్యా వ్యాపనము చేసి 'వ్యాసుడు' అనే బిరుదు పొందుతాడు అని చెప్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న వైవస్వత మన్వంతరంలో ఇప్పటికి ఇరవై ఎనిమిది ద్వాపర యుగాలు గడచిపోయాయి. ఆయుగాలలో అవతారం దాల్చిన వ్యాసులు వీరు. 1. బ్రహ్మ 2. ప్రజాపతి (మనువు) 3. ఉశనుడు 4. బృహస్పతి 5. సలిత 6. మాత్యువు 7. ఇంద్రుడు 8. వశిష్ఠుడు 9. సారస్వతుడు 10. త్రిధాముడు 11. త్రివృషుడు 12. భరద్వాజుడు 13. అంతరిక్షుడు 14. ధర్ముడు 15. త్రయ్యారుణి 16. ధనంజయుడు 17. మేధాతిథి 18. వ్రతి 19. అత్రి 20. గౌతముడు 21. ఉత్తముడు (హర్యాత్మ) 22. వేనుడు (వాజిశ్రవుడు) 23. సోముడు (ఆముష్యాయణుడు) 24. తృణ బిందువు 25. భార్గవుడు 26. శక్తి 27. పరాశరుడు 28. కృష్ణ ద్వైపాయనుడు.

రాబోయే ద్వాపరయుగంలో అశ్వత్థామ వ్యాసుడు కాగలడు. పై 27 వ్యాసుల పేర్లలో కొన్ని పురాణాలలో తేడా కనిపిస్తున్నది. వ్యాసనామాలలో కూర్మపురాణంలో కూడా కొంత భేదం కనిపిస్తుంది. అవి కల్పభేదాన్ని బట్టి ఏర్పడినవేనని భావించాలి.

పురాణము, వ్యాసుడు, సూతుల స్థానం

పురాణ పరిశోధన చేసిన కొందరు విద్వాంసులు ప్రాచీన కాలంలో పురాణానికి సంబంధించిన రెండు విధాన పరంపరలు ఉండేవని భావిస్తున్నారు. 1. సూతపరంపర 2. వ్యాస పరంపర. ఈ రెండు విధాన పరంపరలను గురించి తెలుసుకొనేముందు సూతుడు ఎవరు ? వ్యాసుడు ఎవరు అనే విషయం మనం తెలుసుకోవటం అవసరం. మహాభారతంలోనూ పురాణాలలోను సూతుని వ్యక్తిత్వం ఒక ప్రహేళిక (చిక్కు ప్రశ్న) లాంటిది. సూతుడిని రోమహర్షణుడు లేక లోమ హర్షణు డంటారు. అంటే తన వాక్పటిమ చేత శ్రోతల రోమాలు నిక్కపొడుచుకొనేటట్లు చేసేవాడు అని దాని అర్థం. (లోమాని హర్షయాఞ్చక్రేశ్రోత్వంణాంయత్ సుభాషితైః, కర్మణా ప్రథితస్తేన లోకే ఉస్మిం ల్లోమహర్షణః (వా.పు 1-16) కూర్మపురాణం కూడా 'తస్యతే సర్వరోమాణి వచసా హర్షితాని యత్, ద్వైపాయనస్య భగవాంస్తతో వే రోమహర్షణః (కూ.పు. 1-1-4) అని చెప్తుండగా స్కాంద పురాణం ప్రభాసఖండంలో (1-6) పురాణంలో భగవంతుని విషయాలను గురించి వ్యాసుడు వివరిస్తున్నప్పుడు స్వయంగా సూతుని వెంద్రుకలే నిక్కపొడుచుకొనేవి కాబట్టి, ఆయనకు సూతుడనే పేరు వచ్చిందని తెలుపుతున్నది. కూర్మపురాణం ఈ రెండు జరుగుతాయి కాబట్టి ఆయనకు రోమహర్షణుడనే పేరు వచ్చిందని తెలుపుతున్నది. సూతుడు అంటే రథసారథి అని అర్థం. ప్రతిలోమ వివాహం వలన జన్మించినవాడని ఇంకొక అర్థం. ప్రతిలోమ వివాహం అంటే ఎక్కువ కులపు స్త్రీని తక్కువ కులానికి చెందిన పురుషుడు వివాహమాడటం. బ్రాహ్మణ స్త్రీకి క్షత్రియ పురుషుని యందు జన్మించిన వ్యక్తి సూతుడు అనబడతాడు. 'సూతులు' అనే ప్రతిలోమజాతి గౌతమ ధర్మ సూత్రాలలో పేర్కొనబడింది. అయితే పురాణాలలో వర్ణించిన సూతుడు ఈ రకం పుట్టుకగల వ్యక్తి కాదు. అంటే ఆయన ప్రతిలోమ జాతికి చెందినవాడు కాదు. బ్రాహ్మణ క్షత్రియ జాతుల కంటె భిన్నుడు. పౌరాణిక సూతుడు గొప్ప లేక తక్కువ స్థాయికి చెందిన మునిగా కనిపిస్తున్నాడు. అతడు అర్ధ దైవీశక్తి గల వ్యక్తిగా గౌరవింపబడతాడు.

వాయు, బ్రహ్మాండ, విష్ణుపురాణాలు – పితామహుడు బ్రహ్మచేస్తున్న యజ్ఞంలో సోమరసాన్ని తీసే రోజున విష్ణ్వంశతో సూతుడు అవతరించాడని చెప్తున్నాయి. కూర్మ పురాణం (1-1-6) కూడా ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నది. సూతులు రెండు రకాల వారు ఉన్నారు. ఒకరు సంకరజాతి వారు, రెండవరకం పురాణ ప్రవక్తలు. పురాణ ప్రవక్తలైన సూతులు బ్రాహ్మణ జాతికి చెందినవారు.

కూర్మ పురాణం ప్రారంభంలోనే (1-11-3-6) ఇతిహాస పురాణాల అధ్యయనం కోసం సూతుడు వ్యాసుని శిష్యరికం చేశాడని, స్వాయంభువ మనువు చేసిన యజ్ఞంలో 'సుత్యాహ దినం' నాడు ఈయన ఉత్పత్తి జరిగిందని చెప్పబడింది. ఇంతేకాకుండా అదే కూర్మపురాణంలో (1-13-12-17) వేన పుత్రుడు పృథువుచేత చేయబడిన పైతా మహయజ్ఞంలో స్వయంగా శ్రీమహావిష్ణువు పౌరాణిక సూతుడుగా సోమరసాన్ని ఆహుతి ఇచ్చే సమయంలో జన్మించాడని చెప్పబడింది. ఆహుతి ఇచ్చే సమయంలో దేవ గురువు బృహస్పతికి ఇవ్వవలసిన ఆహుతి దేవరాజైన ఇంద్రునికి, ఇంద్రునికి ఇవ్వవలసినది బృహస్పతికి ఇవ్వబడింది. ఈ ఆహుతి ఇచ్చే సమయంలో ఉచ్చరించిన మంత్రాలలో

వర్ణ విపర్యయం అంటే అక్షరాలు పలకటంలో తారుమారు జరిగింది. దీన్నే వర్ణసంకరం అంటారు. వర్ణము అంటే అక్షరము అని కూడా అర్థం ఉన్నది కదా. అంటే ధర్మ శాస్త్రాలలో బ్రాహ్మణ స్త్రీకి క్షత్రియ వీర్యం వలన పుట్టిన వ్యక్తి అని పిలువబడ్డాడు అనీ, అదేవిధంగా ఇక్కడ సూతునికి కూడా వర్ణ విపర్యయం జరిగింది. ఇతడికి కేవలం పురాణ ప్రవచనం చేసే అధికారం ఇవ్వబడింది. వేదాధ్యయనం చేసే అధికారం అయితే లేదు. వాయు పురాణం మొదలైన ఇతర పురాణాలలోలేని ఈ విశేషం ఒక్క కూర్మ పురాణంలోనే స్పష్టంగా సూతులకు వేదాధ్యయనాధికారం లేదని చెప్పబడింది.

సూతుల యొక్క వృత్తేమిటి ?

దేవతలు, మునులు, రాజుల వంశాల మీద దృష్టినిలిపి, వారిని సచేతనులుగా ఉంచటం అంటే సత్కార్యాలయెడ, ధర్మంపట్ల ప్రజలను అనురక్తులను చేసి సమాజాన్ని చైతన్యశీలంగా ఉంచటం. సూతులకు వృత్తి అని చెప్పబడుతున్నది. ఇందుకు వారికి ఆధారాలు ఏమిటంటే అప్పటి వరకు ఇతిహాస పురాణాలలో చెప్పబడిన ఆయా దేవతల, మునుల, రాజుల వంశాను చరిత్రలే. వీరు కాకుండా ఉన్న ఇంకొక సూతశాఖవారు క్షత్రియ ధర్మాన్ని అవలంబించటం లేకపోతే కనీసం రథాలను తోలి ఏనుగులు, గుఱ్ఱాలకు చికిత్స చేస్తూ తమ పొట్టపోసుకుంటారు.

దీనికి ఉదాహరణగా మనం మహాభారతంలో కర్ణుని పెంచిన తండ్రి యొక్క చరిత్రను తీసుకొనవచ్చు. ఆయా సందర్భాలలో తగినట్లుగా పురాణ ఇతిహాసాలలో సూతుల పుట్టుకతో పాటు మాగధుల (రాజాస్థానాల్లో రాజును స్తుతించటం రాజు రాకను తెలియజేయటం మొదలైన పనులు చేసేవారు) జన్మ వృత్తాంతం కూడా చెప్పబడింది. దాని ప్రకారం పృథువేనుడిని స్తుతించటానికి, ఈ సూతులే నియమింపబడ్డా రని చెప్పబడింది. సూతుల ఈ జన్మ వృత్తాంతం విష్ణుపురాణం, బ్రహ్మాండపురాణము, వాయు పురాణాలలో కాస్త విస్తృతంగానే కనిపిస్తున్నది.

మార్కండేయ పురాణంలోని ఆరవ అధ్యాయంలో శ్రీకృష్ణుని అన్న బలరాముడు ఒక సూతుని వధించగా అందువలన కలిగిన బ్రహ్మహత్యాపాతకానికి ప్రాయశ్చిత్తంగా బలరాముడు తీర్థ యాత్రలు చేసినట్లు చెప్పబడింది. దీనిని బట్టి కూడా పౌరాణిక సూతులు బ్రాహ్మణులని తెలుపుతున్నది. కూర్మ పురాణం కూడా (1-23-15) సూతుని నోటి ద్వారా స్వయంగా తన కులానికి చెందినవారు వేద వర్జితులని చెప్పినట్లుగా వివరిస్తున్నది. శౌనకాది మహామునులు సూతుని నుంచే పురాణ విద్యను గ్రహించారు. సూతుల దైవిక ఉత్పత్తిని ఎవరూ సరైందిగా స్వీకరించకపోయినా అతి ప్రాచీన కాలంలోనే ఎటువంటి కించపడకుండా బ్రాహ్మణులు సూతుని నుంచే గాథలు, ఆఖ్యానాలు మొదలుగా గల పురాణ విద్యను గ్రహించారనేది సత్యం. ఇదే పరంపరగా ఉపనిషత్తులలో కూడా మనకు కని పిస్తుంది. ఆయా ఉపనిషత్ గాథల్లో బ్రాహ్మణులు కేవలం క్షత్రియుల నుంచే కాదు శూద్రుల నుంచి కూడా ఎటువంటి శంక సంకోచాలు లేకుండా విద్యను గ్రహించే వారు అంటే జ్ఞాన ప్రాప్తిని పొందేవారన్నమాట. రైక్వ, జానశ్రుతి, సత్యకామ, జాబాలి ఇంకా ఇతరుల గురించి ఐతరేయము మొదలైన గ్రంథాలలోని గాథలు ఈ విషయాన్ని నిరూపిస్తాయి.

రెండు ప్రాచీన వాఙ్మయాల ప్రవాహాలు

అతి ప్రాచీన కాలం నుంచి మనకు బ్రహ్మ నుంచి ఆవిర్భవించిన వాఙ్మయ ప్రవాహాలు పరస్పర ఉపకారకాలుగా ఉండి, రెండు మార్గాలలో ప్రవహిస్తున్నాయి. వాటిలో మొదటిది వేద వాఙ్మయ ప్రవాహము. రెండవది పురాణవాఙ్మయ ప్రవాహము. వేదవాఙ్మయ ప్రవాహం కర్మ ప్రధానమైనది. పురాణవాఙ్మయ ప్రవాహం కర్తృ ప్రధానమైనది. మొదటిదైన వేద వాఙ్మయ ప్రవాహాన్ని మునులు స్వీకరించి ప్రచారం చేశారు. అందుచేత ఈ రెండు సమాన ప్రమాణ్యంగలవే. కృష్ణ ద్వైపాయన వ్యాసుడు ఒకటే వేదంగా ఉన్నదానిని నాలుగుగా విభజించాడు. అలాగే ఒకటే పురాణ సంహితను అష్టాదశ పురాణాలుగా విభజించాడు. విభజించినవాడు కాబట్టి ఆయన వ్యాసుడైనాడు. ఇది ఇంతకుముందే వివరించబడింది.

పురాణాలు ఏవి?

వ్యాసుడు రచించిన పద్దెనిమిది పురాణాలను తేలికగా గుర్తుంచుకొనటానికి పద్మపురాణంలో ఒక సూత్రం ఉన్నది. అది

'మ'ద్వయం 'భ'ద్వయం చైవ 'బ్ర'త్రయం 'వ' చతుష్టయం
'అ' 'నా' 'ప' 'లింగ' 'కూ' 'స్కా'ని పురాణాని పృథక్ పృథక్ *(దేవీ భాగవతం 1-3-21)*

అంటే ఆయా పురాణాల పేర్లను అనుసరించి 'మ'తో ప్రారంభమయ్యేవి రెండు – మత్స్య, మార్కండేయ పురాణాలు; 'భ' తో ప్రారంభయ్యేవి రెండు – భాగవత, భవిష్య పురాణాలు; 'బ్ర'తో ప్రారంభమయ్యేవి మూడు – బ్రహ్మ, బ్రహ్మవైవర్త, బ్రహ్మాండ పురాణాలు. 'వ'తో ప్రారంభమయ్యేవి నాలుగు – వరాహ, వామన, వాయు, విష్ణు పురాణాలు. 'అ' తో ప్రారంభమయ్యేది అగ్నిపురాణం, 'నా'తో ప్రారంభమయ్యేది నారదపురాణం, 'ప'తో ప్రారంభమయ్యేది పద్మపురాణం; లింగ – అంటే లింగపురాణం, 'కూ'తో ప్రారంభమయ్యేది కూర్మపురాణం, 'స్కా' తో ప్రారంభం అయ్యేది స్కాందపురాణం. భాగవతం అని చెప్పే దానిలో అది దేవీభాగవతమా లేక విష్ణు భాగవతమా అని పండితుల మధ్య విస్తృతమైన చర్చ జరిగింది. అలాగే వాయుపురాణం స్థానంలో కొందరు శివ పురాణాన్ని చేరుస్తున్నారు. ఎక్కువ మంది పండితులు విష్ణు భాగవతమే అష్టాదశ పురాణాలలో ఒకటని అలాగే వాయు పురాణాన్నే శివపురాణమని ఒకప్పుడు వ్యవహరించేవారని, అందుచేత వాయు పురాణమే అష్టాదశ పురాణాంతర్గతమని సమర్థిస్తున్నారు.

పురాణాల ప్రాచీనత

ఎందరో ఋషులు మహర్షుల ద్వారా ప్రచలితమైన సంస్కృత సాహిత్యం యొక్క వివిధ శాఖలను పరిశీలిస్తే వేదాలు, పురాణాలు భారతీయ సంస్కృతీ పరిరక్షక సహోదరులనే విషయం అవగతమౌతుంది. వేదకాలంనుంచే ఎందరో మహర్షులు తమ తమ విఖ్యాత గ్రంథాలలో పురాణాల యొక్క విశిష్టతను చాటుతూనే ఉన్నారు. పురాణాలలో చెప్పబడిన ఇహలౌకిక, పారలౌకిక అభ్యుదయ సాధక ఉపదేశాల బలం ఆధారంగానే హిందు సమాజం సృష్టి కాలం నుంచి నేటివరకు, అజరామరంగా విలసిల్లుతూ ఈ పవిత్ర భారతభూమిని సభ్యనాగరిక దేశాలలో అగ్రశ్రేణిలో నిలబడేటట్లు చేసింది.

పురాణ పరిచయం

పురాణాల ప్రాచీనతను నిరూపించాలంటే వేదకాలం నుంచి నేటి వరకు నిర్మితం అవుతున్న సంస్కృత సాహిత్యంలోని విశిష్ట గ్రంథాల ఆధారంగా నిరూపణ జరుగుతుంది.

అథర్వణ వేదం

ఋచః సామాని ఛందాంసి పురాణం యజుషాసహ
ఉచ్ఛిష్టా జ్జజ్ఞిరే సర్వేదివిదేవా దివిశ్రితాః – అని తెలుపుతున్నది.

(ఋగ్వేదము, సామవేదము, ఛందము, యజుర్వేదాలతోపాటు పురాణము దేవలోకంలో ఉండే నక్షత్రమండలం ఆ ఉచ్ఛిష్టము అనగా ప్రపంచాన్ని పాలించే పరమాత్మ నుంచే ఉద్భవించినవి). అంతేగాకుండా, అదే అథర్వణవేదం

యంత్ర స్కంభః ప్రజనయన్ పురాణం వ్యవర్తయత్
ఏకం తదంగం స్కంభస్య పురాణమను సంవిదుః – అంటున్నది.

(వ్యాసరూపంలో ఉద్భవించి సర్వరక్షకుడైన ఈశ్వరుడు గురుశిష్య పరంపరతో వ్యాపించిన పురాణాలను రచనా బద్ధం చేయగా, వేదం యొక్క ఒక ప్రధాన అంగమైన పురాణాలు పరమాత్మను తెలిపేవేనని గ్రహించవలెను)

ఇక ఋగ్వేదం 'సనాపురాణ మధ్యేరాత్ (ఇప్పుడు నేను సనాతన పురాణములను అధ్యయనము చేయుదును) అనియు

'పురాణమోకః సఖ్యం శివమ్ వామ్' (ఓ అశ్వినీ కుమారులారా! మీ ఇద్దరి స్థానము పురాణమే ఎందుకనగా పురాణాల ద్వారా మీ ఇద్దరి స్థానము తెలియగలదు. మీ ఇద్దరి సఖ్యముచేత ఎంతో శుభము కలుగగలదు) అంటుంది. ఇంకా శథపథ బ్రాహ్మణం "అథ నవమేऽహని కించిత్పు రాణమాచక్షేత్" (యజ్ఞము చేయునప్పుడు తొమ్మిదవ రోజున పురాణ పఠనము చేయవలెను. ఇతిహాస పురాణాలను ప్రతి దినము పఠనము చేయవలెను. ఇంకా ఇతిహాస పురాణాలను ప్రతి దినము ఎవరు పఠనము చేయుదురో అతడు దేవతలను తృప్తి పరచగలడు అని కూడా చెప్తున్నది. అంతేగాకుండా ఆదే శతపథ బ్రాహ్మణం 'ఈవిధంగా కల్పము, రహస్యము, బ్రాహ్మణము, ఉపనిషత్తు, ఇతిహాసము పురాణములతోనే వేదము నిర్మింపబడిన'దని చెప్తుంది. ఛాందోగ్యోపనిషత్తులో ఒక కథ ఉన్నది. ఆ కథ ప్రకారం దేవర్షియైన నారదుడు విద్యాధ్యయనం కోసం సనత్కుమారుని వద్దకు వెళ్ళగా, అప్పుడు సనత్కుమారుడు, నారదుని ఇంతకు ముందు ఇక్కడకు రావటానికి పూర్వం నీవు ఏమేమి చదివావని ప్రశ్నించాడట. అప్పుడు నారదుడు 'ఋగ్వేదం భగవోऽధ్యేమి యజుర్వేదం సామవేద మాథర్వాణం చతుర్థమితిహాస పురాణం పంచమం వేదానాం వేదమ్' (భగవంతుడా లేక పూజ్యుడా! నేను ఋగ్వేదమును, యజుర్వేదమును, సామవేదమును, అథర్వణ వేదమును ఇంకా ఐదవది వేదాలకు వేదమైన ఇతిహాస పురాణాలను అధ్యయనం చేశాను) అని తెలిపాడు. దీనిని బట్టి వేదాలతో సమాన స్థానము పురాణాలకు ఉన్నదని తెలుస్తున్నది.

మనకు ఒక సందేహం కలగవచ్చు. అసలు ఈ సృష్టి జరిగి ఎంతకాలం అయింది అని. ఈ ప్రశ్నకు జవాబుగా మనం పురాణాలనుంచే వివరణ పొందవచ్చు. ఎందుకంటే హిందువులు చేసే ప్రతి పని ఈ తత్త్వాన్ని తెలుసుకొనే ప్రారంభించడం జరుగుతుంది. హిందువులు ప్రతిరోజు తమ నిత్యనైమిత్తిక కామ్య కర్మలను అనుష్ఠించేటప్పుడు నియమాను సారం అద్యబ్రహ్మణోద్వితీయ పరార్ధే శ్వేత వరాహ కల్పే వైవస్వత మన్వంతరే అష్టావింశతమే కలిగయుగే ప్రథమ పాదే ...... (ఫలాని కర్మలేక పనిని) కరిష్యే' అని సంకల్పం పఠించి సృష్టి గణనను తెలుసుకొంటున్నాడు. దీని అర్థం బ్రహ్మయొక్క ఆయుష్షు 50 సంవత్సరాలు గడచిన తరువాత ద్వితీయ పరార్థ సమయంలో శ్వేత వరాహ కల్పంలోని వైవస్వతుడనే ఏడవ మనువు కాలంలో 18వదైన కలియుగ ప్రథమ భాగంలో ఫలానా ధర్మకార్యం నెరవేరుస్తున్నాను అనేదే. గణితశాస్త్రాన్ని అనుసరించి దీనిని లెక్కిస్తే సృష్టి ఆరంభం నుంచి విక్రమశకం 2015 వరకు (దీనికి 58 తీసివేయగా ఇంగ్లీషు సంవత్సరం వచ్చును. అనగా 1957 వరకు). మనుష్య సంవత్సరంలో ఒక వంద తొంభై ఏడుకోట్ల ఇరవై తొమ్మిది లక్షల నలభై తొమ్మిదివేల యాభై తొమ్మిది సంవత్సరాలు గడిచిపోయినాయి.

దీన్ని లెక్కగడదాము :

1. గత ఆరు మనువుల కాలం అంటే అమన్వంతర కాలం	=	184,03,20,000
2. గత ఆరు మన్వంతరాల సంధ్యాకాలం	=	1,20,96,000
3. ఏడవ మన్వంతరంలో గతించిన 27 చతుర్యుగాల కాలం	=	11,66,40,000
4. 28వ చతుర్యుగంలో గడచిన సంవత్సరాల కాలం	=	38,93,059
మొత్తం		**197,29,49,059**

ఇది క్రీ.శ. 1957 వ సంవత్సరం వరకు గణించిన గత సంవత్సరాలు. భారతీయ పురాణ పండితులను అనుసరించి ప్రస్తుత విజ్ఞానశాస్త్రజ్ఞులు 5, 6 వేల సంవత్సరాల కాలం నుంచి 30 కోట్ల సంవత్సరాల కాలం వరకు మాత్రమే అంచనాలు కడుతున్నారు. కానీ పురాణాలు, తెలిపిన సృష్టికాలం దాదాపు 200 కోట్ల సంవత్సరాల నాటి నుంచి గణిస్తు న్నాయి. ఆధునిక విజ్ఞానం ఇంకా విస్తరించి క్రమంగా ఇంకా ప్రాచీన చరిత్రవైపు పోగలిగితే పురాణాలు లెక్కగట్టిన ఈ కాలం వరకు చేరుకొనగలుగుతుంది.

పురాణల క్రమంలోని అర్థం

పద్దెనిమిది మహా పురాణాలను చెప్పేటప్పుడు ఇది ఇన్నవ పురాణమని, క్రమ సంఖ్యలు ఇవ్వబడ్డాయి. ఈ క్రమం అనుసరించవలసినదేనా అంటే, పురాణవేత్తలు అయిన పండితులు ఇది సాభిప్రాయమని, ఈ క్రమం చారిత్రక కారణాలవల్ల ఏర్పడింది కాదని, ఆయా పురాణాలలో ప్రతిపాదించబడిన, వర్ణించబడిన విషయాలను బట్టి ఏర్పడిందని తెలుపుతున్నారు. అష్టాదశ పురాణాలలోను ఎన్నో విషయాలు వివరించ బడ్డాయి. కానీ ఒక్కొక్క పురాణంలో ఒక్కొక్క విషయం ప్రముఖంగా, ప్రాధాన్యతతో వివరించబడ్డది. ప్రాధాన్యతను బట్టి పేర్లు ఏర్పడటం (ప్రాధాన్యేన వ్యపదేశాభవంతి) అనేది లోకరీతిగా ఉన్నదే.

పురాణ పరిచయం

పురాణాల ప్రధానమైన లక్ష్యం ఈ సృష్టిని గురించి వివరంగా తెలపటం. మూలతత్త్వం నుంచి సృష్టి ఎలా ప్రారంభం అయింది? అది ఏ విధంగా జరిగింది? ఏయే పరిణామాలను పొందింది? ప్రధాన వంశాలు ఎలా ఏర్పడ్డాయి. అందలి కీర్తివంతులు ఎలాంటి జీవితాలను గడిపి ఆ కీర్తిని సంపాదించారు? చివరకు తిరిగి ఈ సృష్టి మూల తత్త్వంలో ఎలా విలీనం అవు తుంది? ఇదే సృష్టి ప్రవాహధార విశ్వసర్గంతో ప్రారంభమై ప్రతి సర్గంతో అంతం అవుతున్నది అనే ఈ ఆద్యంతాల మధ్యన ఉన్నవే మన్వంతర వంశవంశాను చరితలు. అనే ధారాప్రవాహాలు. పురాణ పంచలక్షణాల వివరణ ఆంతర్యం ఇదే. ఈ పంచలక్షణ స్వారస్యము, సమన్వయము ఇదే. ఇలా సృష్టితత్త్వ ప్రతిపాదనం పురాణ తాత్పర్యం అయినందున పురాణ క్రమంలో ఔచిత్యం తేటతెల్లం అవుతుంది.

1. సృష్టిని గురించి అవగాహన చేసుకొనేటప్పుడు ఈ బ్రహ్మాండాన్ని ఎవరు సృష్టించారు అనే సందేహం కలగటం సహజం. సకలాతీతుడైన పరమాత్మ లేక పరబ్రహ్మ సృజించ చాడని తెలుస్తుంది. సృష్టిని బ్రహ్మ చేశాడని పురాణాలు చెపుతున్నాయి. 'తైత్తిరీయ సంహిత' 'బ్రహ్మ బ్రహ్మ భవత్ స్వయమ్' అంటే పరబ్రహ్మమే బ్రహ్మ అయినదని తెలుపుతున్నది. కాబట్టి సృష్టికర్త అయిన బ్రహ్మ గురించి తెలియచేసేది బ్రహ్మపురాణం.
2. సృష్టికార్యం నిర్వర్తించే బ్రహ్మ ఎలా జన్మించాడు అనేది తరువాత వచ్చే ప్రశ్న. ఈ ప్రశ్నకు జవాబు చెప్పేది పద్మపురాణం. పద్మం నుండి బ్రహ్మపుట్టాడు కనుక పద్మ పురాణం రెండవది.
3. సృష్టికి కారణభూతుడైన బ్రహ్మ పుట్టింది పద్మం నుంచి అయితే ఆ పద్మానికి మూలం ఏది? అది విష్ణువు నాభినుంచి పుట్టింది. అందులోనుంచే బ్రహ్మ ఉద్భవించి, తపస్సు చేసి సృష్టి చేశాడు. ఆ విష్ణుతత్త్వాన్ని ప్రతిపాదించేది విష్ణు పురాణం. కాబట్టి అది మూడవ పురాణం.
4. విష్ణువు వాసస్థానం ఏది? ఆయన శేషశయ్యపై పవళించి ఉంటాడు. ఆ శేషునికి ఆధారం వాయువు. ఆశేషశయ్యను నిరూపించేది వాయుపురాణం. అది నాల్గవ పురాణం.
5. శేషుడు క్షీరసాగరంలో ఉంటాడు. ఆ సముద్ర రహస్యాల్ని వివరించే పురాణం కనుక శ్రీమద్భాగవతం ఐదవ పురాణం.
6. విష్ణు భగవానుని నిరంతరం సేవిస్తూ తన మధురవీణాగానంతో కీర్తిస్తుండే నారదుని పేరనున్న నారదపురాణం – ఆరవ పురాణం.
7. ఈ సృష్టిచక్రాన్ని ఈ విధంగా తిప్పేదెవరు అనే ప్రశ్నకు చాలా సమాధానాలు ఉన్నా కానీ వానిలో 'దేవి' అన్న సమాధానం ఒకటి. ఆమెను గురించి తెలిపేది మార్కండేయపురాణం.
8. ఘటంలో ప్రాణంవలెనే బ్రహ్మాండంలో శక్తి ఉన్నది. ఆశక్తి అగ్ని రూపంలో ఉండి క్రియాశీలమైన వస్తువులకు మూలప్రేరణ ఇస్తూంటుంది అనేది ఒక అభిప్రాయం. దీనిని ప్రతిపాదించే అగ్ని పురాణం – ఎనిమిదవ పురాణం.
9. అగ్నితత్త్వం సూర్యునిపై ఆధారపడి ఉన్నది. అందువలన సూర్యుడే క్రియాశీల వస్తువులకు ప్రేరణ శక్తి. అందువలననే వేదం సూర్యుడే స్థావర జంగమ సృష్టికి ఆత్మ అని తెలుపుతున్నది.

ఈ విధంగా సృష్టికి ఉత్ప్రేరకం 'ఉత్పాదకుడైన సూర్యుడి మహిమ విశిష్టమైనది. ఆయన మహిమను ప్రతిపాదించేది భవిష్యపురాణం. తొమ్మిదవ పురాణం.

10. బ్రహ్మం నుంచే జగత్ సృష్టి జరుగుతున్నది. ఈ జగత్తంతా బ్రహ్మం యొక్క వివర్తం. వికారం– వివర్తం. ఈ రెండింటికి తేడా ఉన్నది. నిజంగా మారటం వికారం. నిజంగా మారకున్నా, మారినట్టు కనిపించడం వివర్తం. జగత్తు బ్రహ్మం వల్ల కలిగినదే. కానీ ఈ జగత్తు సత్యంకాదు. ఇది మాయికం. ఇది బ్రహ్మవైవర్తం. కనుక బ్రహ్మవైవర్తం అనే పేరుతోనే విశ్వానికి మూల కారణం బ్రహ్మమనీ, విశ్వం బ్రహ్మవివర్తమనీ తెలిపే బ్రహ్మవైవర్త పురాణం – పదవ పురాణం.

11. బ్రహ్మం నిర్గుణము. సగుణరూపంలో దానిని కనిపెట్టి, జీవుడు దానిని ఊహించాలి. అందుకు మార్గాన్ని సూచిస్తూ, సమాధానం ఇచ్చేవి మిగిలిన పురాణాలు. శివ విష్ణు రూపాలు బ్రహ్మం యొక్క సగుణ రూపాలుగా ప్రసిద్ధి చెందినవి. ఇందులో శివుని గురించి చెప్పేది లింగపురాణం – పదకొండవ పురాణం.

12. బ్రహ్మం యొక్క సగుణరూపంగా ప్రసిద్ధి చెందిన రూపాలలో శివుడుగల వివిధ తీర్థ క్షేత్రాలను, వ్రతాలను తెలిపేది స్కాందపురాణం – పన్నెండవ పురాణం.

13. బ్రహ్మంయొక్క సగుణ రూపంగా ప్రసిద్ధి చెందిన రూపం విష్ణు రూపం. ఆయన అవతారాలు ధరించి, భూమిపైకి దిగివచ్చి భక్తుల కష్టాలు తొలగించి వారికి ముక్తి పొందే ఉపాయాలను కూడా ఉపదేశిస్తాడు. అవతార ప్రయోజనం కేవలం రాక్షస సంహారమే కాకుండా జీవునికి సంసార జంబాలం నుంచి విముక్తిని కలిగించి ఆనందమయ ముక్తి పొందే విధానం కూడా నేర్పటం భగవానుడు మర్త్యరూపం ధరించడంలోని ప్రయోజనం అని భాగవతం తెలుపుతున్నది. కనుక అవతార రూపధారుడైన విష్ణుమూర్తి అవతారాలను తెలియజేసే వరాహపురాణం – పదమూడవ పురాణం.

14. అలాగే విష్ణువు యొక్క వామనామావతార వృత్తాంతాన్ని తెలిపే వామన పురాణం పధ్నాలుగవ పురాణం.

15. విష్ణువు యొక్క కూర్మావతార వృత్తాంతాన్ని తెలిపే కూర్మపురాణం పదిహేనవ పురాణం.

16. శ్రీమహావిష్ణువు యొక్క మత్స్యావతార వృత్తాంతాన్ని తెలిపే మత్స్యపురాణం పదహారవ పురాణం.

17. జ్ఞానంవలన, ఉపాసన వలన జీవులకు కలిగే గతులూ, మరణానంతరం జీవుని స్థితి, అతడు ఏమి అవుతాడనే ప్రశ్నలకు జవాబులు గరుడ పురాణంలో లభ్యం అవుతాయి. అందువలన గరుడ పురాణం పదిహేడవ పురాణం.

18. జీవుని సమస్త గతులను గురించి విపులంగా చెప్పే బ్రహ్మాండపురాణం 18వ పురాణం.

హిందూ ధార్మికసారం జీవులు తమ కర్మఫలాన్ని అనసరించి ఈ బ్రహ్మాండంలో సుఖ దుఃఖాలను అనుసరిస్తూ తిరుగుతూ ఉంటారనేదే.

ఈ విధంగా సృష్టివిద్యకు సంబంధించిన విషయాలను వివరిస్తూ జ్ఞాన, కర్మలను తెలియ జేయటంలో అష్టాదశ మహాపురాణాలు దిశా నిర్దేశకాలుగా ఎంతో ఉపయోగకరమైనవిగా భావించబడుతున్నాయి. అందుకే వాని వరుసక్రమానికి కూడా సార్థకత ఉన్నదని మొదటే చెప్పబడింది.

పురాణ రచనా క్రమము

అష్టాదశ పురాణాలలో పద్మ పురాణాన్నే మొదట కృష్ణద్వైపాయన వ్యాసుడు రచిం చాడని, తరువాత సర్వ పురాణాలనుంచి సారాన్ని ఆకర్షించి భాగవతం రచించాడని పద్మ పురాణం తెలుపుతున్నది.

తత్ర పద్మ పురాణంతు, ప్రథమంచ ప్రణీతవాన్
తతో ఽన్యాని పురాణాని కృత్వా షోడశతు క్రమాత్
అష్టాదశం భాగవతం, సారమాకృష్య సర్వతః
కృతవాన్ భగవాన్ వ్యాసః శుక మధ్యాపయసత్స్వయమ్

(పద్మ పురాణాన్ని ముందుగా రచించి, తరువాత ఇంకొక పదహారు పురాణాలను క్రమంగా కూర్చాడని 18వదైన భాగవతాన్ని ఈ 17 పురాణాల యొక్క సారభూతంగా వ్యాసుడు కూర్చాడని తెలుస్తున్నది)

వ్యాసుడే శుకునికి భాగవతాన్ని స్వయంగా బోధించాడు.

పురాణ సంహిత

విష్ణు పురాణం, వ్యాసుడు పురాణాలను సమకూర్చిన విధానాన్ని తెలుపుతూ

ఆఖ్యానైశ్చాప్యుపాఖ్యానై, ర్గాథాభిః కల్ప శుద్ధిభిః
పురాణ సంహితాం చక్రే, పురాణార్థ విశారదః అని తెలుపుతున్నది.

ఆఖ్యానము, ఉపాఖ్యానము, గాథ, కల్ప శుద్ధులతో కూడిన రచనయే పురాణ సంహిత అని పురాణార్థ విశారదులు తెలుపుతున్నారు. అయితే ఈ ఆఖ్యాన, ఉపాఖ్యానా దులకు అర్థం ఏమిటి అనే సందేహం వస్తే,

స్వయం దృష్టార్థకథనం, ప్రాహురాఖ్యానం బుధాః
శ్రుత స్యార్థ కథనముపాఖ్యానం ప్రచక్షతే – అని వివరించబడింది.

అనగా పురాణకర్త స్వయంగా చూసి చెప్పినది ఆఖ్యానము. ఉదా : భారత కథ మొదలైనవి.
వేదము వలన విని చెప్పినది ఉపాఖ్యానము. ఉదా : హరిశ్చంద్ర కథ మొదలైనవి.
పితృగీతలు, పృథివీ గీతలు మొదలైనవి గాథలు –
శ్వేత వరాహము, నీలలోహితము మొదలైనవి కల్పాలు. నిర్ణయము కల్పశుద్ధి.
పురాణ శబ్దము మహాపురాణ పరంగా కూడా అన్ని పురాణాలలోను వాడబడింది.

పురాణ సంహితకు సహాయకాలు

వ్యాస మహర్షి ఆఖ్యాన, ఉపాఖ్యాన, గాథా, కల్పశుద్ధులు అనే నాలుగు ఉపకరణా లను తీసుకొని, తన పురాణాన్ని కూర్చాడు.

ఆఖ్యానైశ్చాప్యుపాఖ్యానైర్గాథాభిః కల్పశుద్ధిభిః
పురాణ సంహితాం చక్రే పురాణార్థ విశారదాః *(విష్ణు పు. 3-6-15)*

'స్వయం దృష్టార్థ కథనం ఆఖ్యానం' అనగా వక్త తాను స్వయంగా చూసి చెప్పిన విషయము అని అర్థం. దీనికి వ్యతిరేకార్థమే ఉపాఖ్యానము. వేరొకని ద్వారా పరంపరా గతంగా తాను వినిన విషయాన్ని వివరించటమే ఉపాఖ్యానము అని చెప్పుకొనవచ్చు. ఈ వివరణ ద్వారా రామ, నచికేత, యయాతి వృత్తాంతము మొదలైన కథలు పరంపరాగతముగా వచ్చునట్టివి. రామోపాఖ్యానం, నచికేతోపాఖ్యానం, యయాత్యుపాఖ్యానం పేర్లతో అవి ప్రచారంలో ఉన్నాయి. అందువలన ఇవి ఉపాఖ్యానాలు. అయితే కొందరు ఆయా వృత్తాంతాల పరిమాణాన్ని బట్టి విభజన చేస్తున్నారు వివరిస్తున్నారు. ఆకారంలో పెద్దవిగా అంటే దీర్ఘంగా ఉండే వృత్తాంతాలు ఆఖ్యానాలని, కొద్దిపాటి వృత్తాంతంగలవి లేక చిన్నకథ గలవి ఉపాఖ్యానాలని చెప్పబడుతున్నాయి. ఈ వివరణ ప్రకారం రామాయణం సుదీర్ఘమైన కథగలది కాబట్టి రామాఖ్యానం కాగా, రామకథలో భాగంగా ఉండి కొద్దిపాటి కథగల సుగ్రీవ వృత్తాంతం మొదలైనవి 'సుగ్రీవోపాఖ్యానం' అని చెప్పవచ్చు. దీనికి సమర్థనగా మహాభారతం తనను గురించి తాను 'ఇతిహాస'మని 'ఇతహాసోత్తమ'మని చెప్పుకొన్నా ఆఖ్యానమని కూడా (ఇదం కవివరైః సర్వైరాఖ్యాన ముపజీవ్యతే –ఆదిపర్వం) చెప్పుకొన్నది.

గాథ : ప్రాచీన సాహిత్యంలో వేద, బ్రాహ్మణ, ఉపనిషద్, పురాణాలలో అనేక ప్రాచీన స్తుతులు, గీతాలు వంటివి ఉన్నాయి. వీటి కర్త ఎవరో తెలియదు. ఇది చాలావరకు ఒక గొప్ప చక్రవర్తిని స్తుతిస్తూనో ఒక మహాదాత దాతృత్వాన్ని ప్రశంసించేవిగానో అసామాన్య శౌర్యవంతుని శౌర్యాన్ని ప్రస్తుతించేవిగానో ఉంటాయి. ఋగ్వేద సంహితలో ఇలాంటి గాథలను "నారాశంసి" అనే పేరుతో ఉన్నాయి. ఐతరేయ బ్రాహ్మణంలో కూడా అష్టమ పంచికలో ఇంద్రుని మహాభిషేక సందర్భంలో ప్రాచీన చక్రవర్తులైన రాజుల పట్టాభిషేక ములు, వానివలన వారు ఆర్జించిన యోగముల వివరణ చేయబడింది. ఆ సందర్భంలో అనేక ప్రాచీన గాథలు ఈ సందర్భంలో ఉద్ధరించబడ్డాయి. వీటిల్లో చాలా పురాణాల్లో ఈ గాథలు రాజుల వర్ణనలలోను, ముఖ్యంగా భాగవత నవమ స్కంధంలో ఉద్ధరించ బడ్డాయి. గృహ్యసూత్రాలు కూడా వివాహ సందర్భాలలో గాథలను పాడటం నిర్దేశిసు న్నాయి. అంటే గాథలు ఆయా రాజులకు సంబంధించి ప్రఖ్యాతమైనవే. ప్రజల నాల్కలపై అవి సజీవంగానే ఉన్నాయి. వాటిని వ్రాసిన వారెవరో తెలియదు. ఈ లోకప్రియమైన అజ్ఞాతకర్తృకమైన శ్లోకాలనే 'గాథ'లు అని పిలుస్తారు. వీటిని కూడా పురాణాలు సంహితల నిర్మాణంలో వ్యాసుడు సమకూర్చుకొని ఉపయోగించుకొన్నాడు. ఈ గాథలకు శ్లోకాలనే పేరు కూడా ఉన్నది. (తదప్యేతే శ్లోకా అభిగీతా (ఐతరేయ బ్రాహ్మణం – అధ్యాయం 39) ఐతరేయ బ్రాహ్మణంలోని 39వ అధ్యాయంలోగల గాథలే కొద్ది తేడాతో భాగవతం నవమ స్కంధంలో కనిపిస్తున్నాయి.

కల్పశుద్ధి : దీనికి బదులుగా కల్పజోక్తి అని బ్రహ్మాండ పురాణంలోను, కులకర్మభిః అని వాయు పురాణంలోను ఉన్నదని ఇంతకుముందు చెప్పబడింది. కల్పశుద్ధి అనే పదానికి చాల అర్థభేదాలు ఉన్నాయి. కల్పజోక్తి అనే పదానికి వివిధ కల్పాలలో పుట్టిన విషయములు లేక పదా ర్థాలు అని ఒక అర్థం అయితే శ్రీధరస్వామి కల్పశుద్ధి అంటే 'శ్రాద్ధకల్ప'మని చెప్పాడు. ఈ పదాన్ని గురించి పురాణాలు ఏమీ చెప్పడం లేదు. మరికొందరు పండితులు దీనికి ధర్మశాస్త్ర యుక్తంగా ఏవో

అర్థాలు చెప్పారు. కానీ దీనికి వివిధ కల్పాలలో జరిగిన విషయములు అనగా పంచలక్షణాలు అందలి అంశాలైన వంశమన్వంతరాలని చెప్పుకొన వచ్చు. అయితే ఇది ఇప్పటికీ ఏ పండితుడు నిర్ధారించని అంశం. ఇక్కడగల కల్పశుద్ధిభిః అనే పదానికి బ్రహ్మాండపురాణంలోని కల్పజోక్తిభిః అనీ, వాయు పురాణంలో 'కులకర్మభిః' అని పాఠాంతరాలున్నాయి.

ప్రాచీన వాఙ్మయంలో మనకు 'పురాణము' 'పురాణ సంహిత' అనే రెండు పదాలు వినిపిస్తాయి. ఇంతకుముందే పురాణం అనే పదానికి లోకంలో బాగా ప్రచారంలో ఉండి అవ్యవ స్థితంగా, ఇక్కడా అక్కడా చెల్లాచెదరుగా ఉన్న లోకవృత్తాత్మకమైన విషయంగల విద్య' అని తెలుసుకొన్నాం.

దీనినే అన్ని శాస్త్రాలు పురాణాలు వేదాల కంటే పురాణమే ముందు బ్రహ్మ నోటి నుండి వెలువడ్డాయని, తరువాత వేదాలు పుట్టాయని తెలుపుతున్నాయి.

పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణాకృతమ్
అనంతరంచ వక్త్రేభ్యో వేదాస్తస్య వినిర్గతాః – అని చెప్పింది ఇదే విషయాన్ని.

ఈ విధంగా పురాణాలు అవ్యవస్థిత రూపంలో చెల్లాచెదరుగా ఉండగా, వ్యాసుడు వాటికి ఒక వ్యవస్థను ఏర్పాటుచేశాడు. చెల్లాచెదురుగా ఉన్న ఆ విషయాలన్నింటినీ, గ్రంథరూపంలో క్రోడీకరించాడు. ఇదే పురాణ సంహిత. వ్యాసుడే పురాణ సంహితను రచించి రోమహర్షణ సూతునికి దానిని బోధించాడని, దానిని ప్రచారంలోకి తెచ్చే విధానం కూడా ఆయన సూతునికి తెలిపాడని తెలుపుతున్నారు.

పురాణ ప్రతిపాదిత విషయాలు

సామాన్య దృష్టితో చూచి పురాణాలలో ప్రతిపాదితమైన విషయాలను ఈ విధంగా సంగ్రహంగా భావించవచ్చు.

ఋషిదేశ మహావీర చరితాన్యవతారకాః
లాజావిధిర్వ్రతా, స్తీర్థానామ్నాం సాహస్ర మేవచ
ఋషి రాజ్ఞాం వంశసూచీ, యుగాస్సృష్టిశ్చ ద్వాదశ
సామాన్యతః పురాణేషు, విషయాః ప్రతిపాదితా.

ఋషులు, దేశాలు, మహావీరుల చరిత్రలు, అవతార కథలు, యజ్ఞాలు ఆచరింప వలసిన విధులు, వ్రతాలు, తీర్థాలు, ఋషుల రాజుల వంశాదికాలు, యుగాలు, సృష్టి క్రమము అనే పన్నెండు విషయాల వర్ణన సామాన్య దృష్టితో చూడగా పురాణాలలో ఉండాలని పెద్దలు తెలుపుతున్నారు.

పురాణవేత్తకు సర్వజ్ఞ బిరుదము

'సర్వజ్ఞుండను నామము శర్వునకె' అని శివుడు ఒక్కడే సర్వజ్ఞ పదానికి అర్హుడని పెద్దల వాక్యం కానీ, సర్వవిషయ సమన్వితమైన పురాణాలనుపుక్కిట పట్టినవాడు కూడా సర్వజ్ఞుడు కాగలడుగదా. అందుకే

యేత్వేతాని సమస్తాని పురాణానిచ జానతే
భారతంచ మహాబాహో; తే సర్వజ్ఞా మతానృణామ్

(మహాభారతము, అష్టాదశ పురాణాలను తెలుసుకొనినవాడు సర్వజ్ఞుడని అన వచ్చునని దీనివలన తెలుస్తున్నది)

యోవిద్యాచ్చతురో, వేదాన్, సాంగోపనిషదోద్విజః
నచేత్పురాణం సంవిద్యా, నైవ సస్యాద్విచక్షణః

(నాలుగే వేదాలు, ఉపనిషత్తులు, షడంగాలు తెలుసుకొన్నా బాగా పురాణాలను తెలుసుకొనకపోతే విచక్షణుడు కాదు అని బ్రహ్మాండపురాణం వ్యతిరేక మార్గంలో తెలుపుతున్నది)

పురాణము - ఆల్బెరూనీ

ఆల్బెరూని మధ్య ఆసియా ప్రాంతానికి చెందిన పారశీక భాషలో మహాపండితుడు. ఇతని కాలం పదకొండవ శతాబ్ది ఉత్తరార్థం. ఇతడు దాదాపుగా మన తెలుగుకవి నన్నయ భట్టుకు సమకాలికుడని చెప్పవచ్చు. భారతదేశం మీదకు గజనీ మహమ్మదు దండెత్తి వచ్చేటప్పుడు తన వెంట ఎందరో పండితులు, కవులను తీసుకొని వచ్చాడని చరిత్రకారులు చెపుతున్నారు. వారిలో ఒకడు అల్బెరూని. ఇతడు మంచి పండితుడు. అనేక విద్యలమీద ఆసక్తి ఉన్నవాడు. భారతదేశం వచ్చిన తరువాత అతడు ఇచ్చుట సంస్కృత పండితుల సహాయంతో మన దేశాన్ని గుఱించిన ఎన్నో విషయాలను తెలుసుకొన్నాడు. జ్యోతిషశాస్త్రం, దర్శనాలు ఇతనికి అభిమానపాత్రమైన విషయాలు. అందుకే ఆ రెండిటిల్లోను భారతీయ విజ్ఞానాన్ని మథించాడు. భారతదేశాన్ని గుఱించి అతడు రచించిన గ్రంథంలోని 12వ పరిచ్ఛేదంలో భారతీయుల ప్రాచీన సాహిత్యం గుఱించి విస్తృతంగా వివరించాడు. ఈ గ్రంథం రచనాకాలం క్రీ.శ. 1067 ప్రాంతం. ఆ సందర్భంలోనే అతడు అష్టాదశ పురాణాల పట్టికను ఇచ్చాడు. అయితే ఇతను రెండు రకాల పట్టికలను తన గ్రంథంలో ఇచ్చాడు. ఒక పట్టికను విష్ణుపురాణాన్ని అనుసరించి ఇచ్చాడు. దీని ప్రకారం ఇప్పుడు ఎక్కువగా వ్యాప్తిలో ఉన్న పురాణాల పేర్లు తెలిపే సూచికే ఇది అని చెప్పవచ్చు. రెండవ పట్టికలో ఇచ్చిన పేర్లలో కొన్ని ఉపపురాణాలు కూడా చేరాయి. ఈ రెండో పట్టిక ప్రకారం అతడు పేర్కొనిన 18 పురాణాలు ఇవి. 1. ఆదిపురాణం 2. మత్స్యపురాణం 3. కూర్మపురాణం 4. వరాహ పురాణం 5. నరసింహపురాణం 6. వామన పురాణం 7. వాయుపురాణం 8. నందీ పురాణం 9. స్కాంద పురాణం 10. ఆదిత్యపురాణం 11. సోమపురాణం 12. సాంబపురాణం 13. బ్రహ్మపురాణం 14. మార్కండేయపురాణం 15. తార్క్ష్య(గరుడ) పురాణం 16. విష్ణుపురాణం 17. బ్రహ్మాండపురాణం 18. భవిష్య పురాణం.

ఈ పట్టికను విశ్లేషణ చేస్తే

1. ఆల్బెరూనీ కాలానికే మహాపురాణ, ఉపపురాణాలు కలసి పోతూ ఉన్నాయి. ప్రజల దృష్టిలో వానికి అంతా తేడా లేదు.

2. ఉప పురాణాలు ఆరువరకు రచింపబడి ఉన్నాయి. అవి పురాణాలుగానే పరిగణింప బడుతున్నాయి. అవి 1. ఆదిపురాణం 2. నరసింహపురాణం 3. నందీపురాణం 4. ఆదిత్యపురాణం 5. సోమపురాణం 6. సాంబపురాణం.
3. ఆదిపురాణం వేరు. బ్రహ్మపురాణం వేరు. కొన్ని పురాణాలలో ఆది బ్రాహ్మ్యం అని బ్రహ్మ పురాణం చెప్పబడింది.
4. ప్రస్తుత కాలంలో సౌర పురాణం అనే పేరుతో సూర్యుని గురించి చెప్పే పురాణం ఆనాడు లేదని ఆనాడు ఆదిత్య పురాణం ఉన్నదని చెప్పవచ్చు. అది నేడు అనుప లభ్యం. కానీ దాని తెలుగు అనువాదం ఉన్నది. దానిని గురించి ఇంకా లోతుగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉన్నది.
5. నేటి కాలంలో సాంబపురాణం ఉన్నది. ఆదిత్యుని విషయంతో జోడింపబడిన చంద్రుని గురించి తెలిపే సోమపురాణం ఆనాడు ప్రచారంలో ఉండేది. ఇప్పుడు లేదు.

ఆల్బెరూనీ తాను ఈ అష్టాదశ పురాణాలలో కేవలం ఆదిత్య, మత్స్య, వాయు పురాణాలలోని కొన్ని అంశాలు మాత్రమే చదివినట్లుగా తెలుపుతున్నాడు. అతడు విష్ణు పురా ణము, విష్ణుధర్మోత్తరాల నుంచే భౌగోళిక సంబంధమైన అనేక అంశాల వివరాలను తన గ్రంథంలో ఇచ్చాడు. దీనివలన నాటికి ఈ రెండు పురాణాలు అత్యంత ప్రచారంలో ఉన్నట్లు గ్రహించవచ్చు. ఇలా ఆల్బెరూనీ పురాణాల నుంచి, వాటిని గుఱించి విలువైన సమాచారం అందచేశాడు.

బల్లాలసేనుని దానసాగరము - పురాణము

క్రీ.శ. 1169లో వంగదేశపు చివరి స్వతంత్ర పరిపాలకుడు, లక్ష్మణసేను (1160–1210)ని తండ్రి బల్లాలసేనుడు. బల్లాల సేనుడు హేమంతసేనుని పౌత్రుడు. విజయసేనుని కుమారుడు. బల్లాల సేనుని కుమారుడైన లక్ష్మణసేనుడు యుగకర్త. అతనిపేరుమీద లక్ష్మణ సంవత్సరము లేక లక్ష్మణ శకము అనే కాలగణన ప్రారంభం అయింది. ఇతని ఆస్థానంలోనే జయదేవుడు, గోవర్ధనాచార్యుడు మొదలైన విఖ్యాత సంస్కృత కవులు ఉండేవారు. బల్లాలసేనుడు 'సాగరము' అని చివర వచ్చే అయిదు విశిష్ట గ్రంథాలను రచించాడు. అవి 1. అద్భుత సాగరము 2. దాన సాగరము 3. ప్రతిష్ఠా సాగరము 4. ఆచార సాగరము 5. వ్రత సాగరము. ఇందులో అద్భుత సాగరం, దానసాగరాలు మాత్రమే ముద్రితం. దానసాగరంలో వ్రత సాగరం పేర్కొనబడింది. అద్భుత సాగరం క్రీ.శ. 1167లో ప్రారంభించబడి అతని కుమారుడైన లక్ష్మణసేనునిచేత పూర్తి చేయబడింది. దానసాగరం క్రీ.శ. 1169లో రచింపబడింది. బల్లాలసేనుని సాహిత్య జీవనం క్రీ.శ. 1155 నుండి 1180 వరకు అని చెప్పవచ్చు.

దానసాగరం ప్రారంభంలో బల్లాలసేనుడు పురాణ స్వరూపాన్ని వివరించాడు. ఈతడు తాను ఏయే పురాణాల నుంచి ఏయే విషయాలను సేకరించాడో కొన్నింటిని ఎందుకు వదలివేశాడో తెలిపిన విషయాలు చాలా ప్రామాణికమైనవి. ఆ రోజుల్లో ఇంత ప్రామాణిక ఆలోచన ఉన్నవారే చాలా అరుదని చెప్పవచ్చు.

దానసాగర పురాణము ధర్మశాస్త్ర గ్రంథాల నుంచి దాన విషయకమైన సర్వ విషయాలను సంగ్రహించి కూర్చిన గ్రంథం. ఆయన తన దానసాగరంలో బ్రహ్మ, వరాహ, ఆగ్నేయ, భవిష్య, మత్స్య, వామన, వాయు, మార్కండేయ, విష్ణు, శివ, స్కంద, పద్మ (అనే పురాణాలు), సాంబపురాణం, కాలికా పురాణం, నందిపురాణం, ఆదిత్య, నరసింహ, మార్కండేయ, విష్ణుధర్మోత్తర, విష్ణుధర్మాలనే ఉపపురాణాలు, గోపథ బ్రాహ్మణ, రామాయణం నుంచి మహాభారతం నుంచీ, మను, వశిష్ఠ సంవర్త మొదలైన స్మృతుల నుంచి ఉదాహరిం చాడు. పైన పేర్కొన్న 12 పురాణాలు తప్ప ఇతర పురాణాల నుంచి పేర్కొన లేదు. వాటి అప్రామాణ్య ప్రామాణ్యతల గురించి బల్లాల సేనుడు వెలిబుచ్చిన అభిప్రాయం చాలా విలువైనది. అతడు

భాగవతంచ పురాణం బ్రహ్మాండంచైవ నారదేయంచ
దానవిధి శూన్యమేతత్ త్రయమపి నిబద్ధమవధార్య"

(దానసాగరం – ఉపక్రమణిక 57)

అని భాగవతము, బ్రహ్మాండపురాణం, నారదీయ పురాణాలలో దాన సంబంధమైన విషయాలేమీ లేవు కాబట్టి వాటిని తాను స్పృశించలేదని చెప్పాడు. ఇలాగే ఇంకా మిగిలిన అనేక గ్రంథాల గురించి అతడు సహేతుకమైన కారణాలిచ్చాడు. మత్స్య పురాణంలో చెప్పబడిన మహాదానముల యొక్క సారమే లింగపురాణంలో కూడా చెప్పబడడం వల్ల దానిని ప్రమాణంగా తీసుకొనలేదని చెప్పాడు. భవిష్యత్పురాణంలో సప్తమితిథుల వరకు మాత్రమే సంగ్రహంగా చెప్పబడింది. పైగా పాఖండులైన బౌద్ధులు దానిని ఖండించడం చేతను, శివరహస్యము, విష్ణు రహస్యాలనేవి ప్రజలలో ప్రచారంలో ఉన్నా దాన విషయకమైన వృత్తాంతాలు వాటిల్లో సంగ్రహంగా ఉన్నందువల్లనూ ఇవి మౌలిక గ్రంథాలుగా బల్లాల సేనుడు గ్రహించలేదు. భవిష్యోత్తర పురాణంలో ఆచార వర్ణన మొదలైన విషయాలున్నా దీనిలో ప్రామాణికంగా తీసుకోదగిన ఆధారాలు లేవని అతని ఉద్దేశ్యం. స్కాందపురాణంలోని మూడు ఖండాలు – కాశీ, రేవా, అవంతీ ఖండాలు కేవలం కథల మీదనే ఆశ్రితాలు. గరుడ, బ్రహ్మ, ఆగ్నేయ పురాణాలు. ఇరవైమూడు వేల శ్లోకాలున్న విష్ణుపురాణం, ఆరు వేల శ్లోకాలున్న రెండో లింగపురాణంలో దీక్ష, ప్రతిష్ఠ, నాస్తికుల (పాఖండికుల) యుక్తులు, రత్నపరీక్ష, మిథ్యావంశానుచరితం, కోశ – వ్యాకరణాది విషయాలు ఉండడం, అసంగతమైన కథలతో ఉండడం, పరస్పరం విరోధం కలిగిన విషయాలుండడం, మన్మథుని గురించిన కథలు, భండ, ధూర్త, పాఖండ (బౌద్ధులు), లింగి (సన్యాసి, పాశుపత – పంచ రాత్రులకు చెందినవాడు) అనే విషయాల ద్వారా ప్రపంచానికి ఉపకారం చేయని విషయాలున్నందువల్ల ఈ పురాణ ఉప పురాణాలన్నీ నిరాకరించబడ్డాయి. దేవీ భాగవతం కూడా ఇందులోకి చేరుతుంది. ఇందుకు కారణం ఇది పురాణ ఉపపురాణాలలో చేర్చబడ లేదు. రెండవది దీనిలో నిందిత కర్మలైన మారణ, మోహనాది కర్మలు వివరించబడి నందువల్లనూ, పాఖండ, తంత్రశాస్త్ర విషయాలు చెప్పబడి వానిని అనుసరిస్తున్నందు వలన ఇది కూడా నిరాకరించబడింది. కాబట్టి ఈ గ్రంథాల నుంచి శ్లోకాలు ఉద్ధరింప బడలేదు.

పై విషయాలనుబట్టి బల్లాలసేనుని దానసాగరమనే గ్రంథం ద్వారా క్రీ.శ. 12వ శతాబ్దానికి చెందిన పురాణాల గురించి తెలుసుకొన కలిగిన విషయాలు.

1. మహాపురాణాలలో విష్ణు భాగవతమే పరిగణింపబడెడిది. దేవీ భాగవతము కాదు.
2. వాయుపురాణం, శివపురాణం రెండూ మహాపురాణాలలోనివిగా పరిగణింపబడేవి.
3. స్కాందపురాణంలోని సంహితాత్మక భాగంలోని శివరహస్య ఖండం కూడా స్కాందంగానే పరిగణింపబడేది. కానీ ఈ విషయం ఇంకా లోతుగా ఆలోచించ వలసి ఉన్నది.
4. బ్రహ్మ, ఆగ్నేయ, లింగ, విష్ణు పురాణాలు ఆ రోజులలో రెండు విధాలుగా లభ్యం అవుతుండేవి. 23 వేల శ్లోకాలుండే విష్ణుపురాణం, ఆరువేల శ్లోకాలుండే లింగపురాణం ఆ కాలంలో ప్రామాణికంగా తీసుకొనబడలేదు. కూర్మపురాణంలో చెప్పినట్లుగా (1-17-20) ఉప పురాణాలుగా స్కంద, వామన, బ్రహ్మాండ, నారదీయ పురాణాలు ఆరోజులలో ఉండేవి. ఇవే పేర్లతో మహా పురాణాలు ఉండేవి. దీనివల్ల చాలా పురాణాలే సంక్షేపరూపంలో ఉపపురాణాలుగా ఆ రోజుల్లో ఉండేవని నిర్ణయించవచ్చు. కానీ ఆయా మహాపురాణాల పేర్లతోనే ప్రచారంలో ఉండేవని చెప్పగలం.
5. ఆ రోజులలో ప్రజలు తంత్ర విధానాలను సమర్థించేవారు కాదు. అందువలననే దేవీ భాగవతం ప్రామాణికంగా తీసుకొనబడలేదు. ఇలాగే స్కాందంలోని కొన్ని భాగాలు కూడా వదలి వేయబడ్డాయి.
6. గరుడ పురాణాన్ని బల్లాలసేనుడు పైన చెప్పిన అనేక కారణాలవల్ల ప్రామాణికంగా తీసుకొనలేదు.

ఇలా బల్లాలసేనుని ఈ కథనం ద్వారా 12వ శతాబ్దికి చెందిన పురాణాలను గురించిన అనేక విషయాలను మనం గ్రహించుకొనవచ్చు.

పురాణ పరిచయం

వేలకొలది శ్లోకాలు, వందల కొలది వృత్తాంతాలు ఉన్న ఒక్కొక్క పురాణం ఒకే విభాగంగా ఉండటం కుదరనిపని. అందుకే ఇవి భాగ, ఖండ, అంశ, స్కంధ, పాద, పర్వ, సంహిత అధ్యాయాలనే విభాగాలుగా చేయడ్డాయి. దీని అర్థం అన్ని విభాగాలు ఒకే పురాణంలో ఉంటాయని కాదు. కొన్నింటిలో కొన్ని కొన్ని ఉండవచ్చు. అలాగే భాగ, అంశ, ఖండాలలో కూడా అనేక అధ్యాయాలు ఉండవచ్చు. ఆ విధంగా అన్ని పురాణాల లోను అధ్యాయాలనే విభాగం ఉంటుంది. కానీ భాగ, ఖండ, అంశాలు వేటికవి ప్రత్యేకంగా కొన్ని కొన్ని పురాణాల లోనే ఉంటాయి. ఇక్కడ ఏయే పురాణాలు ఏయే విభాగాలుగా చేయబడిందో కూడా తెలుపబడింది.

అష్టాదశ పురాణాల గురించి చాలా విషయాలు ఇంతకుముందే తెలియజేయ బడ్డవి కదా. ఇక ఇప్పుడు వానిలో చెప్పబడిన విషయాలను గురించి తెలుసుకొందాం.

1. బ్రహ్మపురాణం :

ఈ పురాణానికి 'ఆదిబ్రాహ్మ్యం' అనే పేరు కూడా వ్యాప్తిలో ఉన్నది. పురాణాలలో ఉండవలసినవిగా చెప్పబడే సమస్త విషయాలు ఇందులో ఉన్నాయి. సృష్టి వివరణ తరువాత సూర్య

వంశం, చంద్రవంశ రాజుల వృత్తాంతం అతి సంక్షిప్తంగా ఉన్నది. పార్వతీ వృత్తాంతం చాలా ఎక్కువగా దాదాపు పది (30 నుంచి40 వరకు) అధ్యాయాలలో వర్ణించబడింది. మార్కండేయాఖ్యానం తరువాత గౌతమీ, గంగ, కృత్తికా తీర్థం, చక్రతీర్థం, పుత్రతీర్థం, యమతీర్థం, ఆపస్తంబ తీర్థం మొదలైన అనేక ప్రాచీన తీర్థ విశేషాలు గౌతమీ మాహాత్మ్యంలో భాగంగా (అధ్యాయాలు 70 నుండి 175) వివరించబడ్డాయి. శ్రీకృష్ణ భగవానుడి చరిత్ర 180 నుంచి 212వ అధ్యాయం వరకు 326 అధ్యాయాలలో విస్తృతంగా వర్ణించబడింది. శ్రీకృష్ణునిచరిత్ర అంతా భాగవతం దశమ స్కంధంలో చెప్పినట్లే ఉన్నది. భేదం ఏమాత్రం లేదు. ఇంతేకాకుండా ఈ పురాణంలో జీవుడు మరణించిన తరువాత పొందే వివిధ అవస్థల వర్ణనకూడా అనేక అధ్యాయాలలో కన్పిస్తుంది. అయితే పురాణాలలో మనకు సహజంగా కనపబడే భూగోళ వర్ణన అంత ఎక్కువగా దీనిలో కని పించదు. కానీ ప్రస్తుత ఒరిస్సా రాష్ట్రంలో ఉన్న కోణాదిత్య (కోణార్క) అనే పేరుగల తీర్థ వివరణ దానికి సంబంధించిన సూర్య ఆరాధన గురించి వివరణ ఈ పురాణంలోని ప్రత్యేకత. సూర్యమహిమ, ఆయన ప్రసరించే శక్తిని గురించిన వివరణ ఆరు అధ్యాయాలలో ఉన్నది.

ఈ పురాణంలో దాదాపు పది అధ్యాయాలలో సాంఖ్యయోగ వివరణ చాలా విస్తృతంగా (234 నుండి 244) ఉన్నది. కరాళజనకుడు ప్రశ్నించటం వలన వశిష్ఠ మహర్షి చేత మహిమాన్మితమైన సాంఖ్యయోగ సిద్ధాంతాలు వివరించబడ్డాయి. ఇక్కడ గమనించ వలసిన ముఖ్య విషయం ఒకటి ఉన్నది. తరువాత కాలంలో ప్రచారంలోకి వచ్చిన సాంఖ్య యోగ విషయాలు అనేకం ఇందులో చెప్పబడిన ముఖ్య సాంఖ్య విషయా లతో విభేదిస్తున్నాయి. అంతకుపూర్వపు సాంఖ్యంలో తత్త్వాలు 25 అని చెప్పబడగా, ఇందులో మూర్ధస్థానీయంగా 26వ తత్త్వం యొక్క వివరణ ఉన్నది. పౌరాణిక సాంఖ్యంలో నిరీశ్వర వాదం ప్రతిపాదితంకాదు. ఇందులో జ్ఞానంతోపాటు భక్తికి కూడా విశిష్టమైన స్థానం ఇవ్వబడింది. ఈ పురాణంలోని ఇంకొక విశేషమేమంటే ఇందులోని కొన్ని అధ్యా యాలు వ్యాస మహాభారతంలోని పన్నెండవదైన శాంతిపర్వంలోని కొన్ని అధ్యాయాలతో అక్షరం అక్షరం ఏకీభవిస్తున్నవి. ధర్మమే పరమ పురుషార్థమని ఈ పురాణం ఉద్ఘోషిస్తున్నది.

ధర్మేమతిర్భవతు వః పురుషోత్తమానాం
సహ్యేక ఏవ పరలోకగతస్య బంధుః
అర్థాః స్త్రియశ్చ నిపుణైరపి సేవ్యమానా
నైవ ప్రభావ ముపయంతి న చ స్థిరత్వమ్ *(బ్ర.పు.255-35)*

పురుషోత్తములైన వారి కందరకు ధర్మమునందే బుద్ధి స్థిరమగుగాక. పరలోకము నకు పోయినప్పుడు అది ఒక్కటియే బంధువు కాగలదు. అర్థకామములను రెండింటిని ఎంత జాగ్రత్తగల వారుగా సేవించినను వానివలన లభించు ఫలము స్థిరములుకావు. అవి ఎట్టి సత్ఫలములను చూపలేవు.

ఇది రెండు భాగాలుగా చేయబడింది. 1. పూర్వభాగం, 2. ఉత్తర భాగం. రెండు భాగాలలోనూ కలిపి 245 అధ్యాయాలున్నాయి. నారదపురాణాన్ని అనుసరించి ఇందులో పదివేల శ్లోకాలు ఉండగా మత్స్యపురాణానుసారము 13,000 శ్లోకాలు ఉన్నాయి.

2. పద్మపురాణము

ఈ పురాణం విస్తృతిలో స్కాందపురాణానికి తరువాతదిగా ఉండి, మిగిలిన 16 పురాణాల కంటె పెద్దది. దీనిలోని శ్లోక సంఖ్య అర్థలక్ష (యాభైవేలు). అంటే లక్ష శ్లోకాల విస్తృతిగల మహాభారతంలో సగము, భాగవతానికి దాదాపు మూడురెట్లు పెద్దదైన పురాణం ఇది. ఈ పురాణం రెండు రకాలైన పాఠాలతో లభిస్తున్నది. వంగదేశ పాఠం ఒకటి. ఇది ఇప్పటికీ ముద్రితం కాలేదు. వ్రాతప్రతిగానే ఉన్నది. రెండవది ఆనందాశ్రమ పాఠ ప్రతి. ఇది ఆరుఖండాలు అనగా... 1) ఆది ఖండం, 2) భూమిఖండం, 3) బ్రహ్మఖండం, 4) పాతాళఖండం 5, సృష్టిఖండం, 6) ఉత్తరఖండం అనే ఆరు భాగాలుగా ముద్రితమైంది. ఇందులోని 125వ అధ్యాయంలోని శ్లో.48-49 శ్లోకాల ప్రకారం ఈ ఖండ విభజన అనంతర కాలంలో జరిగినట్లు తెలుస్తున్నది. మూలంలో ఐదు ఖండాలు మాత్రమే ఉన్నాయని అముద్రిత వంగప్రతిలో అదే రకమైన విభజన ఉన్నదని పురాణపండితులు తెలుపుతున్నారు. దీనికే

ప్రథమం సృష్టిఖండం హి భూమిఖండం ద్వితీయకమ్
తృతీయం స్వర్గఖండంచ పాతాలశ్చ చతుర్థకమ్
పంచమంచోత్తరంఖండం సర్వపాప ప్రణాశనమ్ – అని తెలుపుతున్నది.

1. సృష్టిఖండం : దీనిలో 82 అధ్యాయాలున్నాయి. ఇందులోని ప్రథమ అధ్యాయం వలన ఈ పురాణంలో 55,000 శ్లోకాలున్నాయని, ఈ పురాణం అయిదు పర్వాలతో విభజింపబడిందని తెలుస్తున్నది. అవి 1) పౌష్కర పర్వం – ఇందులో దేవతలు, మునులు, పితరులు, మనుష్యుల వంటి తొమ్మిది రకాల సృష్టిని గురించిన విపులవర్ణన ఉన్నది. 2) తీర్థపర్వం : ఇందులో పర్వత, ద్వీప, సప్తసాగర వర్ణన ఉన్నది. 3) తృతీయ పర్వం: దీనిలో ఎక్కువగా దక్షిణలను ఇచ్చే రాజుల వర్ణన ఉన్నది. 4) చతుర్థపర్వం : రాజుల వంశాను కీర్తనం ఉన్నది. 5) మోక్షపర్వం : మోక్షము దాని సాధన మార్గాల గురించిన వివరణ ఉన్నది. ఈ ఖండంలోనే సముద్రమథనం, పృథుజననం పుష్కర తీర్థవాసుల ధర్మవృత్తాంతం, వృత్రాసుర సంగ్రామం, వామనావతారము, మార్కండేయముని ఉత్పత్తి, కార్తికేయజననం, శ్రీరామచరిత్రం, తారకాసుర వధ మొదలైన వృత్తాంతాలు విస్తారంగా వర్ణింపబడ్డాయి.

2. భూమి ఖండం : ఈ ఖండం మొదట్లోనే శివశర్మ అనే పేరుగల బ్రాహ్మణుడు పితృ భక్తి చేత స్వర్గాన్ని పొందటం, పృథుమహారాజు పుట్టుక, చరిత్ర వర్ణనము, ఒక మాయా వేషధారి యొక్క బోధల ద్వారా జైన ధర్మ విషయాలు విని వేనుడు చెడుమార్గాన్ని ప్రవేశిం చడం, అప్పుడు సప్తర్షులవలన అతడి భుజమథనం జరిగి, పృథువు జన్మించడం, అనేక విధాలైన నైమిత్తిక, ఆభ్యాదాయక దానాల తరువాత, సతీసుకళ యొక్క పాతివ్రత్య సూచక కథలు చాలా విపులంగా వివరించబడ్డాయి. యయాతి, మాతలుల ఆధ్యాత్మిక విషయ సంవాదాలు, పాపపుణ్య ఫలవివరణలు, విష్ణుభక్తి ప్రశంస తెలుపబడ్డాయి. చ్యవన మహర్షి వృత్తాంతం సుదీర్ఘంగా తెలుపబడింది. పద్మ పురాణం ముఖ్యంగా విష్ణుభక్తికి ప్రతిపాదితము. కానీ ఇందులో ఇతర దేవీ, దేవతల యొక్క అనా దరభావ ప్రకటన లేదు. ఇందులో శివకేశవ అభేదత్వమే ప్రకటించబడింది. ఈ తత్త్వమే

శైవం చ వైష్ణవం లోకమేకరూపం నరోత్తమ
ద్వయోశ్చాప్యనంతరం నాస్తిఏకరూపం మహాత్మనోః
శివాయ విష్ణురూపాయ విష్ణవే శివరూపిణే
శివశ్చహృదయే విష్ణుః విష్ణోశ్చహృదయే శివః
ఏకమూర్తిస్త్రయోదేవాః బ్రహ్మవిష్ణు మహేశ్వరాః
త్రయాణామంతరంనాస్తి, గుణభేదాః ప్రకీర్తితా

అనే శ్లోకం ద్వారా తెలుపబడింది.

3. స్వర్గఖండం : ఈ ఖండంలో దేవ, గంధర్వ, అప్సర, యక్షాదిలోకాల విస్తృతవర్ణన వున్నది. ఈ ఖండంలోనే శకుంతలోపాఖ్యానం కూడా ఉన్నది. ఇది మహాభారతంలోని శకుంతలోపాఖ్యానంతో పూర్తిగా విభేదిస్తున్నది. కానీ కాళిదాసు అభిజ్ఞానశాకుంతల కథతో పూర్తిగా ఏకీభవిస్తున్నది. అందుకే కొందరు పండితులు కాళిదాసు అభిజ్ఞాన శాకుంతల కథేతిహాసం మహాభారతం నుంచి కాక ఈ పద్మపురాణం నుంచి గ్రహించాడని తెలుపు తున్నారు. విక్రమోర్వశీయం గురించి కూడా ఇలాంటి వాదమే ఉన్నది.

4. పాతాళఖండం : ఈ ఖండంలో నాగలోకం యొక్క విస్తృత వర్ణన ఉన్నది. ప్రసంగతః రావణ విషయం వచ్చినప్పుడు మొత్తం రామాయణకథ ఇందులో చెప్పబడింది. ఇందులోని ఇంకొక ప్రత్యేకత ఏమిటంటే కాళిదాసు తన రఘువంశంలో చెప్పిన రామకథతో ఇందలి వృత్తాంతం పూర్తిగా సరిపోలుతూ ఉన్నది. రావణవధానంతరం సీతాపరిత్యాగం, కుశలవ జననం, రామాశ్వమేధ వృత్తాంతాలు కూడా ఇందులో చెప్పబడ్డాయి. ఈ వృత్తాంతం అంతా భవభూతి రచించిన ఉత్తర రామచరిత కథావృత్తాంతంతో ఏకీభవిస్తున్నది. ఈ పురాణంలో వ్యాసుడు అష్టాదశ పురాణాలను రచించిన విషయం తెల్పి అందులో భాగవతపురాణం యొక్క మహిమ విస్తృతంగా వివరించబడింది.

5. ఉత్తర ఖండం : ఈ అయిదవదైన ఉత్తరఖండంలో వివిధ రకాలైన ఆఖ్యానాల సంక్షిప్త వర్ణనం ఉన్నది. ఈ ఖండంలోనే విష్ణుభక్తిని గురించిన ప్రశంస విస్తృతంగా కనిపిస్తుంది. దీనికి పరిశిష్ట అంశంగా 'క్రియాయోగసారం' అనే భాగం కూడా లభిస్తున్నది. ఇందులో వ్రతాలు, తీర్థసేవనం మొదలైన విషయాలతో శ్రీమహావిష్ణువు విశేషంగా ప్రసన్నుడై కోరికలు తీరుస్తాడని చెప్పబడింది.

పద్మపురాణం విష్ణుభక్తి ప్రతిపాదక పురాణాలలో ముందుగా నిలిచే గ్రంథం. భగవంతుని నామ గుణగానం ఎన్ని విధాలుగా చక్కగా చేయవచ్చునో, ఎన్ని పేర్లు అపరాధ యుక్తాలైనవో మొదలైన విషయాలకు సమాధానం చాలా ప్రామాణికంగా ఈ పురాణంలో లభిస్తాయి. అందువలననే తరువాతకాలంలో వచ్చిన వైష్ణవ సంప్రదాయక గ్రంథాలు ఈ పురాణాన్ని విశేషంగా స్తుతించి ప్రామాణికంగా స్వీకరించాయి. సాహిత్య దృష్టితో చూచినా ఈ పురాణ శైలి బహుసుందరంగా ఉంటుంది. సామాన్యంగా పురాణరచనలో అనుష్టుప్ఛందం విశేషంగా ఉపయోగపడుతుండగా ఇందులో అనుష్టుప్ ఛందమేగాక ఇతర దీర్ఘ ఛందాలు కూడా విశేషంగా ఉపయోగించబడ్డాయి. ఉదాహరణకు ఈ శ్లోకం చూడండి :

సంసారసాగరమతీ్వ గభీరపారం, దుఃఖోర్మిభిర్వివిధ మోహమయైస్తరంగైః
సంపూర్ణమస్తి నిజదోషగుణైస్తుప్రాప్తం, తస్మాత్ సముద్ధర జనార్దన మాంసుదీనం

ఇలాంటి చక్కని రచనా శైలితో ఉన్న పురాణం ఇది.

ఇందులో సృష్టి ఖండంలో 82 అధ్యాయాలు, భూ ఖండంలో 125 అధ్యాయాలు స్వర్గ ఖండంలో 39 అధ్యాయాలు, పాతాళ ఖండంలో 113 అధ్యాయాలు, చివరిదైన ఉత్తర ఖండంలో 282 అధ్యాయాలు ఉన్నాయి. మొత్తంమీద ఈ గ్రంథంలో 641 అధ్యాయాలలో 55,000 శ్లోకాలు ఉన్నాయి.

3. విష్ణుపురాణం :

దార్శనిక ప్రభావ దృష్టితో చూస్తే విష్ణుభాగవతం, ప్రథమ గ్రంథంగా నిలిస్తే, ద్వితీయ స్థానాన్ని విష్ణుపురాణం ఆక్రమిస్తుంది. వైష్ణవదర్శనానికి మూలాలంబనం విష్ణుపురాణమే. అందువలననే వైష్ణవ మత ప్రతిపాదకులు శ్రీమద్రామానుజులవారు తమ శ్రీభాష్యంలో దీనినే ప్రమాణంగా తీసుకొని, ఎన్నో సందర్భాలలో దీనిలోని భాగాలను ఉద్ధరించారు. పరిమాణంలో ఇది చిన్న పురాణమే. కానీ ప్రభావంలో మాత్రం చాలా గొప్ప గ్రంథం. దీనిలోని భాగాలను 'అంశాలు' అంటారు. దీనిలో ఆరంశాలు ఉన్నాయి. ఈ ఆరు అంశాలు 126 అధ్యాయా లుగా విభజించబడ్డాయి. విస్తృతిలో ఇది శ్రీమద్భాగ వతంలో మూడవవంతు మాత్రమే.

ఇందులోని ప్రథమ అంశంలో సృష్టివర్ణన ఉన్నది. (11వ అధ్యాయం నుంచి 20 వరకు) ద్వితీయ అంశంలో భూగోళం యొక్క సాంగోపాంగ వివరణ విస్తృతంగా ఉన్నది. తృతీయాంశంలో వివిధాశ్రమ సంబంధమైన కర్తవ్యాల విధులు చెప్పబడ్డాయి. ఈ అంశం లోనే మూడు అధ్యాయాలలో (4,5,6) వేదముల యొక్క వివిధ శాఖల విశిష్టమైన వర్ణనము ఉన్నది. ఇది వేదాధ్యయనం చేసేవారికి వేద విజ్ఞాన జిజ్ఞాసువులకు చాలా అవసర మైన విషయము. నాల్గవ అంశం ముఖ్యంగా ఐతిహాసిక లేక చారిత్రక విషయాలకు సంబంధించినది. ఇందులో చంద్రవంశానికి చెందిన యయాతి చరిత్ర చెప్పబడింది. యదు, తుర్వసు, ద్రుహ్యు, అను, పురులనే ఈ అయిదు ప్రసిద్ధ క్షత్రియ వంశాలను గురించిన విషయాల వర్ణన వివిధ అధ్యాయాలలో ఉన్నది. పంచమాంశం 37వ అధ్యాయంలో శ్రీకృష్ణ భగవానుని అలౌకిక చరిత్ర, వైష్ణవభక్తుల వృత్తాంతము ఉన్నది. ఈ అంశంలో భాగవతంలోని దశమ స్కంధంవలె శ్రీకృష్ణ చరిత్ర సంపూర్తిగా వర్ణించబడింది. కానీ ఈ చరిత్రలోని వృత్తాంతాలు సంగ్రహంగానే ఉన్నాయి. షష్ఠాంశంలో కేవలం ఆరు అధ్యాయాలు మాత్రమే ఉన్నాయి. ఇందులో ప్రళయము గురించి, భక్తి వివేచన గురించి వివరించబడి ఉన్నది.

సాహిత్యదృష్టితో చూస్తే విష్ణుపురాణం చాలా రామణీయకమైన గ్రంథం. వృత్తాంతాలను సరసంగా, సుందరంగా వివరించిన పురాణం ఇది. దీని నాల్గవ అంశంలో ప్రాచీన గద్యరూపాలకు విశిష్ట ఉదాహరణలు లభిస్తాయి. జ్ఞానంతోపాటు భక్తియొక్క సామంజస్యం ఈ పురాణంలో చాలా హృద్యంగా ప్రదర్శింపబడింది. ప్రధానంగా ఇది విష్ణుపారమ్యంగా రచింపబడిన పురాణం అయినా, ఇందులో సంప్రదాయక వైష్ణవేతర న్యూనత సుతరాము కనిపించదు. శ్రీకృష్ణ భగవానుడే స్వయంగా తాను శివుడు అభిన్నులమని శ్రీముఖునితో చెప్పిన ఈ విషయం ద్వారా తెలుస్తుంది.

యోऽహం సత్వం జగచ్చేదం సదేవాసుర రమానుషం
మత్తో నాన్య దశేషం యత్, తత్తంజ్ఞాతుమిహోర్వసి
అతిద్యామోహితాత్మానః పురుషాభిన్న దర్శినః
వదంతి భేదం పశ్యంతి, చావే యోరంతరంహర.

అంతేగాకుండా మనుష్యులు మాట్లాడాలి. ఆ మాట్లాడేది సుందరంగా ఉండాలని ఈ పురాణం తెలుపుతున్నది చూడండి.

హితం, మితం, ప్రియంకాలే వశ్యాత్మా యోऽభిభాషతే
సయాతి, లోకానాహ్లాదహేతు భూతాన్ నృపాక్షయాన్.

పురాణాల మిత్రసమ్మితంగా విషయాన్ని వివరిస్తుందనేది విష్ణుపురాణం ద్వారా ప్రతి అక్షరంలోనూ నిరూపించబడుతుంది.

ఇది రెండు భాగాలు. పూర్వభాగం, ఉత్తర భాగం అనేవే. ఇప్పుడు కేవలం పూర్వ భాగమే లభ్యం అవుతున్నది. ఈ పూర్వభాగం ఆరు అంశాలుగా విభజించబడింది. ప్రథమాంశంలో 22, ద్వితీయాంశంలో 16, తృతీయాంశంలో 28 చతుర్థాంశంలో 24 పంచమాంశంలో 38. షష్ఠ్యాంశలో 8 అధ్యాయాలు ఉన్నాయి. మొత్తం ఆరు అంశాలలోని 12 అధ్యాయాలలో 23 వేల శ్లోకాలు ఉండగా ఉత్తరభాగం లభ్యం కావటంలేదు. అయితే కొందరు విష్ణు ధర్మోత్తరమనే పురాణాన్ని విష్ణుపురాణ ఉత్తర భాగంగా భావిస్తున్నారు. విష్ణు ధరోత్తరాన్ని కలుపుకొంటే ఇంతకు ముందు చెప్పిన 23 వేల శ్లోక సంఖ్య సంపూర్ణం అవుతుంది.

5. వాయు పురాణం :

ఇది అన్ని పురాణాలలోకి చారిత్రకదృష్టితో చూస్తే ప్రాచీనమైన పురాణం. మహాకవి బాణభట్టు తన కాదంబరి గద్యకావ్యంలో 'పురాణేవాయు ప్రలపితమ్' అని దీనిని పేర్కొన్నాడు. అందువలన దీని రచనము బాణభట్టు కంటే చాలా పూర్వమే జరిగి ఉండాలని చెప్పవచ్చు. మిగిలిన వానితో పోలిస్తే ఇది పరిమాణంలో చిన్నదే. ఇందులో కేవలం 112 అధ్యాయాలున్నాయి. శ్లోకాల సంఖ్య దాదాపు పదకొండువేలు. ఈ పురాణం నాలుగు పాదాలుగా విభజించబడింది. వీటిని పాదాలు అంటున్నారు. అవి. 1) ప్రక్రియాపాదం, 2) అనుషంగపాదం, 3) ఉపోద్ఘాత పాదం, 4) ఉపసంహార పాదం అనేవి. దీని మొదటి ప్రక్రియాపాదంలో సృష్టిక్రమాన్ని గురించి చాలా విపులంగా అనేక అధ్యాయాలలో వర్ణించ బడింది. తరువాత చతురాశ్రమ విధానాల వివరణ ఉన్నది. ప్రాచీన భౌగోళిక విషయాల అధ్యయనం కోసం ఈ పురాణం చాలా ఉపయోగకరమైన గ్రంథం. ఇందులో జంబూ ద్వీపవర్ణన విస్తృతంగా ఉన్నది. అలాగే ఇతర ద్వీపాల విషయం కూడా చక్కని శైలిలో 6 అధ్యాయాలలో (34 నుంచి 39 వరకు) వివరించబడింది. ఖగోళవర్ణన కూడా ఈ పురా ణంలో విస్తృతంగా చేయబడింది. (50 నుంచి 53 అధ్యాయాలు) అనేక అధ్యాయాలలో యుగ, యజ్ఞ, ఋషి, తీర్థవర్ణనలు విస్తృతంగా లభ్యం అవుతున్నాయి. 60వ అధ్యాయంలో నాలుగు వేదాలలోని వివిధ శాఖల వివరణ విస్తృతంగా ఉన్నది. సాహిత్య దృష్టితో ఈ పురాణం విస్తృతంగా అధ్యయనం

చేయవలసిన అవసరం చాలా ఉన్నది. ప్రజాపతి వంశవర్ణన (అధ్యయం 61-65) కశ్యపీయ ప్రజ్ఞాసర్గ (66-69 అధ్యాయాలు), ఋషివంశ వర్ణన (70వ అధ్యాయం), ప్రాచీన బ్రాహ్మణ వంశాల చరిత్రను తెలుసుకొనటానికి ఈ వివరాలు చాలా వరకు ఉపయోగపడతాయి. శ్రాద్ధవర్ణన కూడా అనేక అధ్యాయాలలో ఉన్నది. 86వ అధ్యాయం87వ అధ్యాయం వరకు సంగీత విషయాలను గురించిన ప్రత్యేక వివరాలు ఉన్నాయి. 99వ అధ్యాయాల ప్రాచీన రాజుల చరిత్రను విస్తృతంగా వివరిం చింది. అందుచేత చారిత్రక దృష్టితో పరిశీలిస్తే ఇది చాలా ముఖ్యమైన పురాణం.

ఈ పురాణం యొక్క ముఖ్యవైశిష్ట్యం శివచరిత్రాన్ని విస్తృతంగా వర్ణించటం. కానీ ఇది సంప్రదాయిక దృష్టికోణంతో చూస్తే నిందార్హమైనదికాదు. చాలా అధ్యాయాలలో ఇందులో విష్ణువర్ణన కూడా ఉన్నది. విష్ణుమాహాత్మ్యము, ఆయన అవతారాల వర్ణన చాలా అధ్యాయాలలో కనిపిస్తుంది. పశుపతి ఆరాధనను తెలిపే పాశుపతయోగం ఈ పురాణంలో చాలా ప్రత్యేకంగా నిరూపించబడింది. అలాగే ఆ పాశుపతయోగ ప్రక్రియ చాలా విస్తృతంగా 11-15 అధ్యాయాలలో వివరించబడింది. ఈ విషయం ప్రాచీనయోగ శాస్త్ర అధ్యయనానికి చాలా అవసరమైనది. 24వ అధ్యాయంలో చెప్పబడిన శౌర్యస్తవం సాహిత్యదృష్టితో పరిశీలించటానికి చాలా ప్రభావవంతమైనది. 30వ అధ్యాయంలో దక్షప్రజాపతి చేసినట్లుగా చెప్పబడే శివస్తుతి చాలా సుందరమైన రచనగలది. ఇవి వేదంలోని రుద్రాధ్యాయస్తుతులకు పౌరాణికరూపాలుగా చెప్పవచ్చు, చూడండి :

నమఃపురాణప్రభవే, యుగస్య ప్రభవేనమః
చతుర్విధస్య సర్గస్య, ప్రభవేఽనంత చక్షుషే,
విద్యానాం ప్రభవేచైవ, విద్యానాం పతయేనమః
నమోవ్రతానాంపతయే, మంత్రాణాం పతయేనమః

దీని నాలుగు పాదాలలో మొదటిదైన ప్రక్రియా పాదంలో 1-6 అధ్యాయాలు, రెండవదైన ఉపోద్ఘాత పాదంలో 7-64 అధ్యాయాలు మూడవదైన అనుషంగ పాదంలో 65-99 అధ్యాయాలు నాల్గవదైన ఉపసంహార పాదంలో 100-112 అధ్యాయాలు వెరసి 112 అధ్యాయాలు ఉన్నాయి.

శివ పురాణమా, వాయు పురాణమా ? ఏది మహా పురాణం అనే మీమాంస పురాణ పండితులలో ఉన్నదన్న విషయం ఇంతకుముందే చెప్పబడింది గదా. ఇక్కడ ఆ రెండింటిని గురించి పరిశీలిద్దాం :

శివ పురాణం ఏడు సంహితలుగా విభజించబడింది. 1.విద్యేశ్వర సంహిత 2. రుద్ర సంహిత, 3. శతరుద్ర సంహిత 4. కోటి రుద్ర సంహిత 5. ఉమా సంహిత 6. కైలాస సంహిత 7. వాయవీయ సంహిత అనేవి ఆ ఏడు విభాగాలు. ఇందులో రెండవదైన రుద్ర సంహిత 1. సృష్టి ఖండం 2. సతీ ఖండం, 3. పార్వతీ ఖండం 4. కుమార ఖండం 5. యుద్ధ ఖండాలనే అయిదు ఖండాలుగా విభజించబడింది. అలాగే ఏడవదైన వాయవీయ సంహిత పూర్వార్ధ ఉత్తరార్థాలనే రెండు భాగాలుగా చేయబడింది. ఈ విధంగా మొదటిదైన విద్యేశ్వర సంహితలో 25 అధ్యాయాలు, రెండవదైన రుద్ర సంహితలో (20 + 43 + 55 + 20 + 19) 197 అధ్యాయాలు మూడవదైన శతరుద్ర సంహితలో 42, నాల్గవదైన కోటిరుద్ర సంహితలో 43, ఐదవదైన ఉమాసంహితలో

57 అధ్యాయాలు ఆరవదైన కైలాస సహింతలో 23, ఏడవదైన వాయవీయ సంహితలో (35 + 41 = 75) అధ్యాయాలు వెరసి 464 అధ్యాయాలు 24 వేలశ్లోకాలు ఉన్నాయి.

5. శ్రీమద్భాగవతం :

భాగవతం భక్తి శాస్త్ర సర్వస్వంగా పండితులు భావిస్తారు. వైష్ణవ ఆచార్యులు ప్రస్థానత్రయంతో పాటు భాగవతాన్ని కూడా తమ ఉపజీవ్య గ్రంథంగా భావిస్తారు. వైష్ణవంలో శాఖలైన వల్లభ సంప్రదాయం, చైతన్య సంప్రదాయ అనుయాయులపై భాగవత తత్త్వ ప్రభావం చాలా ఎక్కువ. భాగవతమునందలి తత్త్వ గూఢార్థాలను వివరించటానికి వివిధ వైష్ణవ సంప్రదాయ అనుయాయులు, తమతమ తత్త్వవాదాలను అనుసరించి దీనికి ప్రత్యేక వ్యాఖ్యానాలు రచించారు. రామానుజమతాను సారం సుదర్శనసూరి రచించిన శుకపక్షీయము, వీరరాఘవాచార్యుని భాగవతచంద్రచంద్రిక, మధ్వమతానుసారం విజయా ధ్వజుని పదరత్నావళి, నింబార్క మతానుసారం రచించిన శుకదేవా చార్యుని సిద్ధాంత ప్రదీపము, వల్లభమతానుసారం స్వయంగా వల్లభుడే రచించిన సుబోధిని ఇలాంటివి ఇంకా లెక్కకు మిక్కిలిగా అనేక వ్యాఖ్యానాలు ఉన్నాయి అంటే, భాగవతం యొక్క విశిష్టతను తెలుసు కొనవచ్చు. అద్వైతమతానుసారం శ్రీధరస్వామి రచించిన శ్రీధరీయవ్యాఖ్య విశేష ప్రచారంలో ఉన్న వ్యాఖ్య. ఆయా సంప్రదాయాల మౌలికమైన ఆధ్యాత్మిక కల్పనల ఆధారంగా నిలిచిన గ్రంథం, ఈ పద్దెనిమిదివేల శ్లోకాలు కలిగిన భగవంతుని స్వరూపమైన భాగవతం. వివిధ వైష్ణవ సంప్రదా యాలకు చెందినవారు తమ తమ సంప్రదాయాలకు అనుగుణంగా వ్యాఖ్యలు వ్రాసినా, భాగవతంలో అద్వైత తత్త్వానికి మాత్రమే సరిగా సమన్వయం అయ్యే ఘట్టాలు చాలా ఉన్నాయి. ఇందుకు కారణం భక్తికి అద్వైతానికీ వైరుధ్యం లేకపోవటమే. భాగవతంలో

అహమే వాసమేవాగ్రే, నాన్యద్యత్సరసత్పరమ్
పశ్చాదహం యదేతచ్చయోన, శిష్యేతసోఽస్మ్యహమ్ (2-9-32)

(సృష్టికి పూర్వం నేనే ఉన్నాను. అప్పుడు స్థూల ప్రపంచంగాని, తత్కారణంగానీ లేదు. తర్వాత ఆవిర్భవించిన ప్రపంచమూ నేనే. ప్రళయానంతరం మిగిలేదీ నేనే) – వంటి అద్వైత తత్త్వ ప్రతీకాలైన అనేక శ్లోకాలను ఉద్ధరించవచ్చు.

అద్వితీయ జ్ఞాన రూపమైన పరబ్రహ్మనే అనేక నామాలతో పిలుస్తూ ఉంటారు.

వ్రదన్తి తత్తత్వ విదస్తత్త్వం యద్ జ్ఞానమద్వయమ్
బ్రహ్మేతి పరమాత్మేతి భగవానితి శబ్దతే
జ్ఞానం విశుద్ధం పరమార్థమేకమనంతరం త్వ బహిర్బ్రహ్మసత్యం
ప్రత్యక్ ప్రశాన్తం భగవచ్ఛబ్ద సంజ్ఞం యద్యాసుదేవం క్వయోవదన్తి *(5-12-11)*

అని చెప్పబడింది. అలాంటి పరబ్రహ్మతత్త్వాన్ని కనుగొనటానికి ఉత్తమ సాధనంగా భక్తిని ఉపదేశించటం భాగవతం యొక్క వైశిష్ట్యము.

భాగవతంలోని భాగాలను స్కంధాలంటారు. మొత్తం భాగవతం 12 స్కంధాలుగా విభజించ బడింది. ఇందులో ప్రథమ స్కంధంలో 19, ద్వితీయ స్కంధంలో 10 తృతీయ స్కంధంలో 33,

చతుర్థ స్కంధంలో 31, పంచమ స్కంధంలో 26, షష్ఠ స్కంధంలో 19, అష్టమ స్కంధంలో 15, నవమ స్కంధంలో 24, దశమ స్కంధంలో 90, ఏకాదశ స్కంధంలో 31 ద్వాదశ స్కంధంలో 13 వెరసి 335 అధ్యాయాలున్నాయి. ఇందులోని మొత్తం శ్లోకాల సంఖ్య 18,000. పురాణాలను గురించి తెలుపుతూ భాగవతం పురాణానికి దశ లక్షణాలుండాలని నిర్దేశించింది. పురాణం పంచలక్షణం అని చెప్పిన నిర్వచనం ప్రకారం ఈ గ్రంథానికి పంచలక్షణాలే గాక తాను స్వయంగా పురాణ లక్షణాలుగా చెప్పిన దశ లక్షణాలు కూడా దీనికి సమన్వయిస్తాయి. భాగవత రచన క్రీ.శ. 6వ శతాబ్దానికి ముందే జరిగి ఉండాలి. ఇందులో దక్షిణ దేశంలోని నదులు, పర్వతాలు, తీర్థక్షేత్ర ప్రశంసలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ గ్రంథం ద్రవిడ దేశంలో విష్ణు భక్తి ఎక్కువగా ఉండగలదని చెప్తున్నది. ఆ కారణంచేత ఇందుకు దక్షిణ దేశంలో జన్మించిన ఆళ్వారు (వైష్ణవభక్తు)ల సూచనలు ఉండి ఉండవచ్చని భావించటం జరిగింది. ఈ పురాణం దక్షిణదేశంలో అందులోనూ ద్రవిడ దేశంలో రచింపబడి ఉంటుందని పురాణ విమర్శకుల అభిప్రాయం.

అయిదవ మహాపురాణమైన భాగవతం పరిగణనలోను విష్ణు భాగవతమే మహా పురాణమని దేవీ భాగవతం ఉప పురాణమని కొందరు భావిస్తుండగా శాక్తేయులు కాదు దేవీ భాగవతమే మహా పురాణమని వాదిస్తున్నారు. ఎవరి వాదాన్ని బలపరిచే ఉపపత్తులు వారికి ఉన్నాయి.

దేవీ భాగవతం కూడా పన్నెండు విభాగాలుగానే విభజించటం జరిగింది. ఒక్కొక్క విభాగం పేరు స్కంధం. ఇందులో వరుసగా 20, 12, 30, 25, 35, 31, 40, 24, 50, 13, 24, 24. అధ్యాయాలు వెరసి 328 అధ్యాయాలు ఉన్నాయి. ఈ పురాణంలోను శ్లోకాల సంఖ్య 18,000 లే.

6. నారదపురాణం :

నారదపురాణము, మహాపురాణ రూపమున ఉపపురాణ రూపమున కూడా లభ్యం అవుతున్నది. అందువలన ఈ రెండింటిని వేరు వేరుగా పేర్కొనటానికి కొందరు నారదీయపురాణము అని పిలుస్తున్నారు. హెచ్.హెచ్.విల్సన్ వంటి కొందరు పండితులు ఇది సాధారణ వైష్ణవ భక్తి గ్రంథమని, 16వ శతాబ్దంలో రచింపబడిందని తెలుపుతున్నా ఇది అంతగా పరిగణించవలసిన విషయం కాదు. 12వ శతాబ్దంవాడైన బల్లాల సేనుడు తన దానసాగరం అనే గ్రంథంలో ఈ పురాణంలోని శ్లోకాలను ఉద్ధరించాడు. 11వ శతాబ్దంవాడైన ఆల్బెరూని కూడా తన యాత్రా విశేషాల గ్రంథంలో దీనిని పేర్కొన్నాడు. అందువలన ఈ పురాణం ఈ యిరువురి కాలం కంటే ప్రాచీనమైనదని చెప్పవచ్చు. ఈ గ్రంథం పూర్వభాగంలోని 24–25 అధ్యాయాలలో వర్ణాశ్రమాచారాలు, 28వ అధ్యాయంలో శ్రాద్ధవిధి ప్రాయశ్చిత్తము మొదలైనవి వర్ణించబడ్డాయి. దీని తరువాత వ్యాకరణం, నిరుక్తం, జ్యోతిషం ఛందస్సు, మొదలైన వివిధ శాస్త్రాల విషయాలు వివిధ అధ్యాయాలలో వివరించ బడ్డాయి. అనేక అధ్యాయాలలో విష్ణువు, రాముడు, ఆంజనేయ, కృష్ణ, కాళి, మహేశ్వరుల మంత్రాల వివిధ విధులు నిరూపించబడ్డాయి. ఇందులో మోక్షం సాధించటానికి విష్ణు భక్తియే పరమసాధనంగా చెప్పబడింది. ఈ అంశాన్నే స్వీకరించి ద్వితీయ భాగంలో 7–37 అధ్యాయాలలో పరమవిష్ణుభక్తుడైన రుక్మాంగదమహారాజ చరిత్ర వర్ణింపబడింది.

ఐతిహాసిక దృష్టితో చూచినా ఈ పురాణానికి చాలా ప్రత్యేకత ఉన్నది. అష్టాదశ పురాణాలలో చెప్పబడిన విషయానుక్రమణిక పూర్వభాగంలోని 92 నుంచి 109 అధ్యాయాలలో ఇవ్వబడింది. అన్ని పురాణాలలోను చెప్పబడిన విషయాలను తెలుసు కొనటానికి ఈ అనుక్రమణిక చాలా ఎక్కువగా ఉపయోగపడుతుంది. దీని ఆధారంగా ప్రస్తుతం లభ్యం అవుతున్న పురాణాలమూల రూపము, ప్రక్షిప్త అంశాలను మనం తేలికగా తెలుసుకొనవచ్చు. దీనిలో విష్ణుభక్తికి ప్రాధాన్యత ఉన్నా ఈ పురాణంలో పురాణ పంచలక్షణాలు కూడా ఉన్నాయి. నారద పురాణం విష్ణు పారమ్యాన్ని బోధించే పురాణం మాత్రమే కాదు. పాంచరాత్ర విధాన వర్ణనం కూడా ఈ పురాణంలో కనిపిస్తుంది. ఇది అనేక వైష్ణవ ఆగమాలను పేర్కొంటున్నది. ఈ పురాణంలో బౌద్ధుల నింద చాలా ఎక్కువగా కనిపిస్తుంది. అలాగే వైష్ణవులకు ముఖ్యదినమైన ఏకాదశీ వ్రతమాహాత్మ్య వర్ణనం అతి విస్తృతంగా కనిపిస్తుంది. వైష్ణవ భక్తుడైన రుక్మాంగదుని ఉపాఖ్యానంలో తన రాజ్యంలోని 8 నుంచి 80 సంవత్సరాల వయస్సు ఉన్నవారివరకు ఏకాదశీ వ్రతం చేయాలని, అలా చేయని పక్షంలో వారు వధ్యులు-దండ్యులు ఔతారని ఆజ్ఞ ఇచ్చాడని ఈ పురాణం తెలుపుతున్నది.

ఈ పురాణం క్రీ.శ. 700-800 ల మధ్య రచింపబడి ఉండాలని పండితుల భావన. నారదపురాణం రెండు భాగాలుగా చేయబడింది. అవి పూర్వభాగం, ఉత్తర భాగాలుగా పిలువబడు తున్నాయి. వీటిలో పూర్వ భాగంలో నాలుగు పాదాలు ఉన్నాయి. ఈ నాలుగు పాదాలలోను ఉండగా, 125 అధ్యాయాలు ఉత్తర భాగంలో 82 అధ్యాయాలు మొత్తం 207 అధ్యాయాలుగా విభజించబడి ఉన్నది. దీనిలోని మొత్తం శ్లోకాల సంఖ్య 25,000 లు.

7. మార్కండేయ పురాణం :

మార్కండేయ మహామునిచేత చెప్పబడిన పురాణం కాబట్టి దీనికి మార్కండేయ పురాణమనే పేరువచ్చింది. విస్తృతిలో ఈ పురాణం చిన్నదేనని చెప్పాలి. ఈ పురాణం మొత్తాన్ని పర్గీటర్ ఆంగ్లంలోకి అనువాదం చేశాడు. దీనిలోని తొలి కొన్ని అధ్యాయాలు జర్మన్ భాషలోకి కూడా అనువదించబడ్డాయి. ఆ భాగంలో మరణానంతరం జీవుని స్థితి చెప్ప బడింది. పశ్చిమదేశీయ పండితుల అభిప్రాయం ప్రకారం ఈ పురాణం అతి ప్రాచీనమైనది. వారి దృష్టిలో ఇది చాలా ప్రజాదరణ గలది. అందరూ అవశ్యం అధ్యయనం చేయ దగింది. నిజానికి వారిభావన సరియైనదే. ప్రాచీనకాలానికి చెందిన ప్రసిద్ధ బ్రహ్మవాదిని మహర్షిణి మదాలస పవిత్ర చరిత్ర ఈ గ్రంథంలో బాగా విస్తరించి వివరించబడింది. మదాలస తన పుత్రుడైన అలర్కునికి చిన్నతనం నుంచే బ్రహ్మ జ్ఞానాన్ని ఉపదేశించి నందువలన అతడు మహారాజు అయిన తరువాత గూడా జ్ఞాన యోగకర్మ యోగాలను సమన్వయించి చూపించి పరిపాలన సాగించాడు. ఇందులో చెప్పబడిన దుర్గాసప్తశతి చాలా ప్రత్యేకత గలది. ఇందులో దేవీ భక్తులకు సర్వస్వరూపిణియైన దుర్గ యొక్క పవిత్ర చరిత్ర చాలా విస్తారంగా వర్ణించబడింది. దుర్గాసప్తశతి మహాకాళి-మహాలక్ష్మి-మహాసరస్వతీ రూపురాలైన దేవి యొక్క మాహాత్మ్యాన్ని ప్రతిపాదిస్తూ 136 అధ్యాయాలలో విస్తరించింది. మన్వంతర వర్ణనం కూడా విస్తృతంగా కలిగిన పురాణం ఇది. కొన్ని వైదిక కర్మల ద్వారా అభీష్టఫలాలను ఏ విధంగా పొందవచ్చునో కొన్ని ఉపాఖ్యానాల ద్వారా విశదీకరించబడింది. అనేక విషయాలు మార్కండేయ

పురాణం నుంచి దేవీ భాగవతంలోనికి స్వీకరింపబడ్డాయి. ఈ పురాణ రచనాకాలం క్రీ.శ. 400 –500 మధ్యకాలం అని పురాణ విమర్శకుల అభిప్రాయం.

మార్కండేయ పురాణంలో 136 అధ్యాయాలు ఉన్నాయి. దీని శ్లోక సంఖ్య 9,000లు కానీ ఇప్పుడు లభ్యమవుతున్న మార్కండేయ పురాణంలో కేవలం 6,900 శ్లోకాలు మాత్రమే ఉన్నాయి.

8. అగ్నిపురాణం :

అందులో చెప్పబడిన విషయాల వైచిత్ర్యంవల్ల అష్టాదశ పురాణాలలో అగ్ని పురాణానికి చాలా ప్రత్యేకత ఉన్నది. ప్రస్తుతం లభ్యం అవుతున్న అగ్నిపురాణంలో నారద పురాణం చెప్పిన విషయానుక్రమణిక యథాతథంగా ఉన్నది. కానీ నారదపురాణం 'ఇది ఈశానుకల్పంలో జరిగిన వృత్తాంతం' అని చెప్పిన విషయం మాత్రం లభ్యం కావటం లేదు. ఇందులోని రెండవ అధ్యాయంలో 'ప్రాప్తే కల్పేతువారాహే కూర్మరూపోఽ అభవద్ధరిః' అని చెప్పబడటం చేత ఇది వరాహకల్పవృత్తాంతం అని తెలుసుకొనవచ్చు. పైగా 'వసిష్ఠాయాఽ అనలో అబ్రవత్' అనగా వసిష్ఠునిచేత చెప్పబడిన అగ్నివృత్తాంతం కూడా లేదు. బ్రహ్మ మానసపుత్రుడైన మరీచిమహాముని ద్వాదశ వార్షిక సత్రయాగంలో అగ్నికి ధర్మానుష్ఠానాన్ని గురించి చేసిన ఉపదేశం మీద ఆధారపడి ఈ పురాణం ఆరంభం అవుతున్నది. స్కాంద పురాణంలోని శివరహస్య ఖండంలో ఈ పురాణం అగ్నిదేవుని మహాత్మ్య ప్రతిపాదనం ఈ పురాణ ప్రధాన లక్ష్యం అని పేర్కొంటున్నా, ఇలాంటి వృత్తాం తాలు అగ్ని పురాణంలో లేనేలేవు. ప్రస్తుతం అగ్ని పురాణమని, వహ్ని పురాణమని రెండు పురాణాలు లభ్యం అవుతున్నాయి. రెండింటిలో చెప్పబడిన విషయాలలోను కొంత ఐక్యత ఉన్నది. బల్లాలసేనుడు అగ్ని పురాణంలోనివిగా ఉద్ధరించిన కొన్ని శ్లోకాలు ప్రస్తుత అగ్ని పురాణంలో లభ్యం కావటం లేదు. అగ్ని పురాణంలోని చాలా విషయాలు, వహ్ని పురా ణంలో కూడా ఉన్నాయి.

దీని వక్త అగ్ని. శ్రోత వశిష్ఠుడు. ఇందులో ఈశానుకల్ప వృత్తాంతం ఉన్నది. ఆధునికులు అగ్ని పురాణాన్ని భారతీయుల సమస్త విజ్ఞానకోశం అంటున్నారు. దీనిని జాగ్రత్తగా పరిశీలిస్తే పురాణాల ముఖ్య ఉద్దేశ్యం భారతీయ విద్యలను జనసామాన్యం చేరువలోనికి తీసుకొనిరావటమే అనిపిస్తుంది. ఇందులోని 383 అధ్యాయాలలో అనేక విషయాలు వివరించటం ఆశ్చర్యం అనిపిస్తుంది. ఇందులో అవతారతత్త్వంతోపాటు రామాయణ మహాభారత హరివంశ కథలసారం ఇవ్వబడింది. అనేక విధాలైన దేవాలయాల నిర్మాణ కళను వివరించటంతోపాటు విగ్రహప్రతిష్ఠ పూజావిధానం మొదలైన వాటిని గురించి విస్తృతంగా వివరించబడింది. నాలుగు ఉపవేదాలు, వేదాంగాలు, తాత్త్విక, దార్శనిక విషయాలు మాత్రమే గాకుండా పశుచికిత్స, ధర్మశాస్త్ర, రాజనీతి, ఆయుర్వేదం మొదలైన శాస్త్రాల విషయాలు ప్రత్యేకంగా వివరించటం జరిగింది. చివరలో కావ్య సౌందర్య విషయాలతోపాటు అలంకార శాస్త్ర విషయాలు కూడా ఇందులో చెప్పబడ్డాయి. ఛందశ్శాస్త్రం 8 అధ్యాయాలలో వివరించబడింది. వ్యాకరణశాస్త్ర క్లుప్తీకరణ చాలా ప్రత్యే కంగా చెప్పబడింది, కౌమార వ్యాకరణం అనే పేరుతో ఒక చిన్న వ్యాకరణము, ఏకాక్షర కోశము, నామలింగానుశాసనము, యోగశాస్త్ర అంగాల వివేచనము అద్వైత వేదాంత సారము ఇందులో సమకూర్చబడ్డాయి. ఈ

విధంగా అగ్ని పురాణంలో భారతీయ సాహిత్యము, సంస్కృతులకు సంబంధించిన అన్ని విషయాలు సంక్షిప్త రూపంలో సంకలనం చేయ బడ్డాయి. అందువలననే 'ఆగ్నేయేహి పురాణేఽస్మిన్ సర్వావిద్యాః ప్రదర్శితాః" అని చెప్పబడింది. ఇందులో ఆయుర్వేదము, గాంధర్వవేదము, అర్థశాస్త్రంవంటి వేదాం గాలకు సంబంధించిన విషయాల వర్ణన ఉన్నది. ఇందులో పురాణ పంచలక్షణాలతోబాటు హిందూ సంస్కృతి, సాహిత్యాల అన్ని విషయాల వివరణ ఉన్నది.

బ్రహ్మజ్ఞానం తతఃపశ్చాత్ పురాణ శ్రవణే ఫలమ్
ఏతదాగ్నేయకం విప్ర పురాణం ప్రకీర్తితమ్.

ఈ పురాణ శ్రవణం లేక మననం ద్వారా బ్రహ్మజ్ఞానం లభిస్తుందనటంలో అతిశయోక్తి లేదు. ఈ పురాణ రచన క్రీ.శ. 7-11 శతాబ్దాల మధ్య జరిగి ఉండవచ్చు. దీని సంస్కరణ క్రీ.శ. 13వ శతాబ్దిలో జరిగి ఉండవచ్చు. అగ్ని పురాణంలో అనేక తాంత్రిక అనుష్టాన విధానాలు ప్రతిపాదించబడ్డాయి. వీనిలోని కొన్ని ప్రత్యేక అనుష్టానాలు ఈనాటికి వంగదేశంలో ప్రచారంలో ఉన్నాయి. అందువలన ఇది వంగ దేశంలో రచింపబడి ఉండాలని భావించబడుతున్నది.

అగ్ని పురాణంలో 383 అధ్యాయాలు ఉన్నాయి. అందులో నారద పురాణానుసారం 25,000 శ్లోకాలు, మత్స్యపురాణాను సారం 13,000 శ్లోకాలు ఉండాలి. కానీ వాస్తవంలో నేడు లభ్యం అవుతున్న అగ్నిపురాణంలో 12,000 శ్లోకాలు ఉన్నాయి.

9.భవిష్యపురాణం :

ఈ పురాణ విషయంలో పండితులలో ఉన్నంత గందరగోళం వేరు ఏ పురాణం విషయంలో కూడా లేదు. రాబోయేకాలంలో జరుగబోయే వృత్తాంతాలను వివరించదలచిన పురాణం కాబట్టి దీనికి ఈ పేరు వచ్చింది. ఇందువలన ఈ పేరును సార్థకం చేయ టానికి ఆయా కాలాలలో పండితులు రాబోయే చరిత్ర అంటూ అనేక అర్వాచీన విషయా లను చేర్చటం జరిగింది. తత్ఫలితంగా 'ఇంగ్రేజ' అనే పేరుతో ఇంగ్లీషువారు భారతదేశం రావటం కూడా చెప్పబడింది. జ్వాలాప్రసాద్‌మిశ్రా అనే పండితుడు తమ దగ్గర నాలుగు భవిష్య పురాణ లిఖిత ప్రతులున్నట్లు, ఒకదానితో మరొకదానికి అంతగా సంబంధం లేనట్లు తెలిపారట. ఇవి అన్నీ కలిపివేయగా ఏర్పడిన పురాణం ఈనాడు భవిష్యపురాణంగా ప్రచారంలో ఉన్నది. ఈ పురాణాన్ని నారద, అగ్ని, మత్స్య, వాయు పురాణాలు పేర్కొం టున్నవి. అందుచేత ఇది ప్రాచీన పురాణమేనని చెప్పటంలో ఏమాత్రం సందేహించవలసిన అవసరం లేదు. నారద పురాణాన్ని అనుసరించి ఇందులో అయిదు పర్వాలున్నాయి. ఈ పురాణంలో సూర్యోపాసన విస్తృతంగా వర్ణించబడింది. శ్రీకృష్ణుని పుత్రుడైన సాంబునికి కుష్ఠురోగం సంప్రాప్తించగా దాని నివారణకోసం గరుత్మంతుడు శాకద్వీపం నుంచి బ్రాహ్మణులను తీసుకొనిరాగా వారు సూర్యోపాసనా విధానంచేత ఆ వ్యాధిని నయం చేశారని ఈ పురాణం తెలుపుతున్నది. సూర్యోపాసన రహస్యాలు, కలియుగంలో ఆవిర్భవించిన అనేక రాజుల వంశవర్ణన కూడా ఈ పురాణంలో విస్తృతంగా ఉన్నది. ఆ రాజుల చరిత్రను అధ్యయనం చేయటానికి ఈ భాగ అధ్యయనం చాలా ముఖ్యం.

సృష్టి, స్థితి, లయలకు సంబంధించిన విషయాలు, ఆదిత్య చరిత్ర వర్ణన, పుస్తకములు వ్రాయుట లేక రచయితల లక్షణాలు, అన్ని సంస్కారాలు లేక కల్పాల వర్ణన, బ్రహ్మ, విష్ణు, శివుల మహిమ వర్ణన, ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే పురుషార్థాల చతుష్టయ వివరణ ఈ పురాణంలో ఉన్నది.

భవిష్య పురాణం ఐదు పర్వాలుగా విభజించబడింది. అవి 1. బ్రహ్మ పర్వం 2. వైష్ణవ పర్వం 3. శైవ పర్వం 4. సౌరపర్వం 5. ప్రతి సర్గ పర్వం – ఈ మొత్తం అయిదు పర్వాలలోను 605 అధ్యాయాలు ఉన్నాయి. నారద పురాణానుసారం 14 వేల శ్లోకాలు, మత్స్యపురాణానుసారం 14,500 శ్లోకాలు ఇందులో ఉన్నాయి.

10. బ్రహ్మవైవర్తపురాణం :

ఈ పురాణంలో పద్దెనిమిదివేల శ్లోకాలున్నాయి. అంటే భాగవతంతో సమాన విస్తృతి కలిగిన పురాణమన్నమాట. దీనిలో నాలుగు ఖండాలున్నాయి. 1) బ్రహ్మఖండం, 2) ప్రకృతి ఖండం, 3) గణేశఖండం, 4) కృష్ణజన్మఖండం. ఈ నాలుగు ఖండాలలోను కృష్ణజన్మఖండం పురాణంలో దాదాపు సగంకంటే పైభాగమే ఉన్నది. ఈ ఖండంలో 133 అధ్యాయాలున్నాయి. శ్రీ కృష్ణచరిత్రాన్ని విస్తృతంగా వర్ణించడం ఈ పురాణ ప్రధాన లక్ష్యం అనిపిస్తుంది. రాధ కృష్ణుని యొక్క శక్తి అని అందువలన రాధయొక్క వృత్తాంతం సాంగోపాంగంగా వర్ణించిన పురాణం ఇది. ఈ రాధావృత్తాంతం వల్లనే పలువురు పురాణ తత్త్వజ్ఞులు దీనిని చాలా ఆధునిక పురాణం అని భావిస్తున్నారు. కానీ వాస్తవానికి రాధ యొక్క కల్పన ప్రాచీనమైనదే. మహాకవి భాసుడు తన బాలచరిత్ర నాటకంలో శ్రీకృష్ణుని బాల్య క్రీడలు, రాధవర్ణన విస్తృతంగానే చేశాడనే విషయం మరువరాదు. భాసుడు క్రీ.శ. తృతీయ శతాబ్దంవాడు. అందువలన ఈ పురాణ రచనాకాలం మూడవ శతాబ్దానికి ముందే జరిగి ఉంటుందని భావించాలి. భాగవత దశమస్కంధంలోనూ ఈ పురాణంలో తప్ప వేరెక్కడా శ్రీకృష్ణచరిత్రం ఇంత విస్తృతంగా వర్ణించటం కనిపించదు.

1) బ్రహ్మఖండం : ఇందులో కేవలం ముప్పై అధ్యాయాలు మాత్రమే ఉన్నాయి. ఈ భాగంలో శ్రీకృష్ణుని ద్వారా జరిగిన జగత్సృష్టి వర్ణించబడింది. దీని 16వ అధ్యాయంలో ఆయుర్వేదశాస్త్ర విషయాలు చెప్పబడ్డాయి.

2) ప్రకృతి ఖండం : ఇందులో శ్రీకృష్ణుని ఆదేశానుసారం ప్రకృతి దుర్గ, లక్ష్మిసరస్వతి సావిత్రి, రాధల రూపంలో అప్పుడప్పుడు ఆవిర్భవించిన విషయాలు వర్ణించబడ్డాయి. ఈ ఖండంలో సావిత్రి, తులసిల కథలు విస్తృతంగా చెప్పబడ్డాయి.

3) గణేశఖండం : ఇందులో గణేశుని ఉత్పత్తి ఆయన చరిత్రలు వర్ణింపబడ్డాయి. గణేశుడు శ్రీకృష్ణుని అవతారమని ప్రతిపాదించబడింది.

వివృతం బ్రహ్మకార్త్స్న్యేన, కృష్ణేన యత్రశౌనక
బ్రహ్మవైవర్తకంతేన, ప్రవదంతి పురావిదః – *1-1-10*

కృష్ణుడు బ్రహ్మను వివరించటం చేత దీనిని బ్రహ్మ వైవర్తకమనే పేరు వచ్చిందని ఇందులో చెప్పబడింది. దీనికే బ్రహ్మ కైవర్త పురాణమని ఇంకొక పేరు ఉన్నది. ఈ పేరు ఎందుకు వచ్చిందో

అంత స్పష్టంగా తెలియటంలేదు. దాక్షిణాత్యులలో బ్రహ్మ కైవర్త మనే పేరే ఎక్కువ ప్రచారంలో ఉన్నది. నారదపురాణంలో ఉన్న ఈ పురాణ విషయాను క్రమణిక ప్రస్తుతం లభ్యం అవుతున్న బ్రహ్మవైవర్త పురాణంలో చెప్పబడిన విషయాలతో పూర్తిగా ఏకీభవిస్తున్నది. శ్రీకృష్ణ పారమ్యాన్ని ప్రతిపాదించటం చేత కృష్ణభక్తులైన వైష్ణవులు ఈ పురాణానికి చాలా ప్రాముఖ్యతనిస్తున్నారు. ముఖ్యంగా గౌడీయవైష్ణవులు ఈ పురాణంపై హెచ్చుగా ఆదరణ చూపిస్తారు.

4) కృష్ణజన్మఖండం : సృష్టి ప్రకరణంలో నారద బ్రహ్మల సంవాదం, నారద శివలోక గమనము, తరువాత జ్ఞానలాభము, సావర్ణి, నారదుల శ్రీకృష్ణమాహత్మ్య విషయక సంవాదము, ప్రకృతి అంశభూత కళల మాహాత్మ్యవర్ణనము గణేశ జన్మకథ, కార్తవీర్యచరిత్ర, పరశురామ గణేశ సంవాదము, శ్రీకృష్ణజననము, శ్రీకృష్ణుని వివిధ బాల్యలీలలు, కంసాది దుష్టుల హననము ద్వారకకు తిరిగివచ్చుట ఇందులో వర్ణింపబడ్డాయి.

బ్రహ్మవైవర్త పురాణం బ్రహ్మపారమ్యాన్ని బోధించే పురాణమని, అందుచేత ఇది రాజస పురాణాలలో చేరుతుందని అనేక పురాణాలలో చెప్పబడి ఉన్నది. మనకు లభ్యం అవుతున్న ఈ పురాణంలో శ్రీకృష్ణపారమ్యం చెప్పబడింది. అక్కడక్కడ బ్రహ్మనింద కూడా ఉన్నది. శ్రీకృష్ణుడే పరాత్పర బ్రహ్మ అనీ, ఆయన నివాసం గోలోకంలో అనీ, ఆయన భార్య రాధ అనీ, ప్రతిపాదించే బ్రహ్మవైవర్తం ప్రాచీన బ్రహ్మవైవర్తాన్ని వైష్ణవులు మార్చి వేయగా ఏర్పడినది. తంత్రశాస్త్రానికి సంబంధించిన విషయాలు పురాణాలలో తొమ్మిది, పదవ శతాబ్దాలలో ప్రవేశించాయి కాబట్టి, ఈ పురాణంలోని ప్రకృతి ఖండ, గణేశ ఖండాలలో తంత్రశాస్త్ర ప్రభావం అత్యధికంగా కనిపిస్తున్నందు వలన ఈనాడు లభ్యం అవుతున్న బ్రహ్మవైవర్తపురాణం తొమ్మిదవ శతాబ్దం కంటె ప్రాచీనం కాదని, రాధాకృష్ణ సంప్రదాయం వర్ణింపబడి ఉండటం చేత ఇది 15వ శతాబ్దం ప్రాంతానికి చెంది ఉండ వచ్చునని కొందరు పండితుల అభిప్రాయం.

ఈ పురాణంలో ముస్లిములను పేర్కొనటం జరిగింది. సంకర జాతులను వర్ణించే సందర్భంలో స్త్రీయందు మ్లేచ్ఛునివలన 'జోలా' జాతి పుట్టిందని తెలియజేయబడింది. "మ్లేచ్ఛాత్కువిందర కన్యాయాం జలా జాతిర్బభూవహ" (10-121) హిందీలోని 'జులాహా' (సాలెవాడు) వంగభాషలో 'జోలా' అయింది. అశ్వినీ కుమారుల వీర్యంవలన బ్రాహ్మణ కన్యయందు 'వైద్యుడు' పుట్టినాడని (10-123) తెలియజేయబడింది. ఈ ప్రసిద్ధి బెంగాల్‌లో ఉన్నది. అందుచేతనే బెంగాల్‌లో బ్రాహ్మణులలో 'వైద్యుల'ను తక్కువచూపు చూస్తారట. ఇందులో నేటికీ బెంగాల్ ప్రాంతంలో ప్రచారంలో వున్న ఆరాధనాపద్ధతులు, వివిధ దేవతా పూజా విధానాలు చెప్పబడినాయి. రాధా వల్లభ సంప్రదాయానికి బెంగాల్ ఆవాసము. అందుచేత వీనినన్నింటినీ పరిశీలిస్తే ప్రస్తుతం లభ్యం అవుతున్న బ్రహ్మవైవర్త పురాణం బెంగాల్ ప్రాంతంలో రచింపబడిందని, ఇది ప్రాచీన బ్రహ్మ వైవర్త పురాణం కంటే వేరైనదని పండితులు, పురాణ విమర్శకులు భావిస్తున్నారు.

బ్రహ్మవైవర్త పురాణం 1. పూర్వ భాగ 2. ఉత్తర భాగాలనే రెండు భాగాలుగా చేయబడింది. ఇందులో మొదటిదైన బ్రహ్మ ఖండంలో 30, రెండవదైన ప్రకృతి ఖండంలో 57 మూడవదైన

గణేశ ఖండంలో 46, నాల్గవదైన శ్రీకృష్ణ జన్మఖండం పూర్వ ఉత్తర భాగాలు కలిపి 133 అధ్యాయాలతో వెరసి 266 అధ్యాయాలు ఉన్నాయి. దీనిలో కూడా 18 వేల శ్లోకాలు ఉన్నాయి.

11. లింగపురాణం :

శివలింగచరిత్రం గురించి వివరించటం జరిగింది (లింగస్య చరిత్రోక్తత్వాత్ పురాణం లింగముచ్యతే) కాబట్టి దీనిపేరు లింగపురాణం అయిందని శివపురాణం పేర్కొంటున్నది. వివిధ పురాణాలలో లింగోద్భవం గురించి చెప్పిన విషయాలన్నీ ఇందులో ఉన్నాయి. ఈశానుకల్ప వృత్తాంత ప్రసంగం బ్రహ్మచేత చెప్పబడిందని ఈ పురాణంలో ఉన్నదని స్వయంగా లింగపురాణమే తెల్పు తున్నది. కానీ మత్స్య , నారద పురాణాలను అనుసరించి అగ్నికల్పంలోని కథావృత్తాంతం లింగ పురాణంలో చోటుచేసుకోవాలి. ఈశానుకల్ప వృత్తాంతాలు అగ్నిపురాణంలో ఉన్నాయి. ఇందులో శివకేశవుల వృత్తాంతాలు వర్ణింపబడినా, ఎక్కడా అన్యదేవతా నింద కనిపించదు.

లింగపురాణంలో శివలింగపూజా వర్ణన హృదయంగమంగా చెప్పబడింది. శివుని ద్వారా సృష్టి ఆవిర్భావం చెందిందని, శివుని 28 అవతారాల వృత్తాంతము, శివసంబంధమైన అనేక వ్రతాలు, తీర్థాలకు సంబంధించిన విశేషాలు ఇందులో ఉన్నాయి. ఇందులో శైవ దర్శనాలకు అనుకూలమైన పశు, పాశ అలాగే పశుపతి శబ్దాల వివేచనాత్మక వ్యాఖ్య కనిపిస్తుంది. లింగోపాసన యొక్క ఆవిర్భావము చాలా చక్కగా విశకరించబడింది. శివతత్త్వమీమాంస అధ్యేతలకు చాలా ఉపయోగకరమైనది ఈ పురాణం.

స్కాందపురాణంలోని రేవాఖండం, భాగవతం, మత్స్య నారదపురాణాలు, బ్రహ్మ వైవర్త పురాణానుసారం ఇది పురాణాలలో 11వ స్థానాన్ని ఆక్రమిస్తుంది. దీనిలో పదకొండు వేల శ్లోకా లున్నాయి. హలాయుధుడు తన ఒక గ్రంథంలో బ్రహలింగపురాణాన్ని ఒకదాని నుంచి ఒకవచనాన్ని ఉద్ధరించాడు. కానీ అలాంటి పురాణమేదీ లభించలేదు. ఇదికాకుండా వసిష్ఠ లింగపురాణం ఒకటి లభిస్తున్నది. ఈ పురాణంలో శివుడిని లింగరూపంలో ఆరాధించే విధానాలు చెప్పబడ్డాయి. ఇందులో శైవదర్శనానికి ముఖ్యంగా పాశుపత సిద్ధాంతానికి సంబంధించిన అనేక విషయాలు ప్రతిపాదించబడ్డాయి. అష్టమూర్తియైన శివునికి ఎనిమిది మూర్తులకూ ఎనిమిది వైదిక నామధేయాలు చెప్పబడ్డాయి. అవి : పృధ్వీమూర్తి – శర్వుడు; జలమూర్తి = భవుడు; అగ్నిమూర్తి = పశుపతి; వాయుమూర్తి = ఈశానుడు; ఆకాశమూర్తి = భీముడు; సూర్యమూర్తి = రుద్రుడు; సోమమూర్తి = మహా దేవుడు; యజమానమూర్తి = ఉగ్రుడు అనేవి. ప్రత్యేకమూర్తికి భార్యా, ఒక పుత్రుడు చెప్పబడ్డారు.

బౌద్ధధర్మ ప్రాబల్యం తగ్గి, బ్రాహ్మణధర్మం అభివృద్ధి పొందుతున్న సమయంలో ఈ పురాణం కొంత సంస్కారం జరిగినట్లు భావించటానికి అవకాశం ఉన్నది. అప్పుడు అగ్ని పురాణంలో చెప్పి నట్లు ఈశాన కల్పవృత్తాంతం ఇందులో చేరి ఉంటుందని భావించ టానికి అవకాశం ఉన్నది. ఈ లింగపురాణంలో అగ్నికల్ప వృత్తాంతం అని స్పష్టంగా లేకపోయినప్పటికీ, ఇందులో ప్రతిపాదించిన విషయాలతోపాటు అగ్నిమయ లింగ వివరణ కూడా ఉన్నందువలన అలా భావించవలసివస్తున్నది.

సంప్రదాయజ్ఞుల చేతివాటంతో ఇందులో కొన్ని ప్రక్షిప్తాలుగా చేరిన శ్లోకాలను తీసివేసినట్లైతే లింగపురాణ ప్రాచీన రూపం కంటికి కట్టకలదు. ఇందులో ఉండే వివిధ వృత్తాంతాలను విడివిడిగా మార్చి అరుణాచల మాహాత్మ్యం, పంచాక్షర మాహాత్మ్యం, రుద్రాక్ష మాహాత్మ్యం, రామసహస్రనామం వంటి విడి పుస్తకాలుగా కూర్చడం జరిగింది. అనేక బాహ్య ఆంతరంగిక ప్రమాణాలను బట్టి ఈ పురాణం అష్టమ నవమ శతాబ్దాలకు సంబంధించి ఉంటుందని విమర్శకుల అభిప్రాయం. దాన సాగరం అనే ఇంకొక స్మృతి గ్రంథాన్నిబట్టి ఆరువేల శ్లోకాలుగల ఇంకొక లింగ పురాణం ఉన్నట్లు తెలుస్తున్నది. ఇదే వసిష్ఠలింగ పురాణమేమో.

లింగ పురాణం 1. పూర్వభాగం 2. ఉత్తరభాగమనే రెండు విభాగాలుగా చేయ బడింది. అందులో పూర్వభాగంలో 108 అధ్యాయాలు, ఉత్తర భాగంలో 55 అధ్యాయాలు మొత్తం163 అధ్యాయాలు ఉన్నాయి. దీనిలోని మొత్తం శ్లోకాల సంఖ్య 11 వేలు.

12. వరాహ పురాణం :

విష్ణువు వరాహావతారాన్ని ధరించి భూదేవిని పాతాళలోకం నుంచి ఉద్ధరించిన వృత్తాంతం గల కథ ప్రధానంగా కలది కాబట్టి ఈ పురాణానికి వరాహ పురాణమనే పేరువచ్చింది. మత్స్య పురాణంలో చెప్పబడిన దానిని అనుసరించి ఈ పురాణంలో మానవ కల్పంలోని వృత్తాంతాన్ని పృథ్విసమక్షంలో విష్ణువుద్వారా మహావరాహమూర్తి యొక్క మాహాత్మ్యం వర్ణించబడింది, కాబట్టి ఇది వరాహపురాణం అయింది. దీనిలోని శ్లోకసంఖ్య 24,000. అధ్యాయాల సంఖ్య 218. ఉపలబ్ధం అవుతున్న వరాహ పురాణాన్ని అనుసరించి నారదపురాణంలో చెప్పబడినట్లు మానవకల్ప వృత్తాంతం కానీ, మహా వరాహమాహాత్మ్య ప్రతిపాదనము ఏమీ ఇందులో కనిపించటం లేదు. ఇది గౌడదేశ పాఠము, దాక్షిణాత్య పాఠము అని రెండు విభిన్న రూపాలలో లభ్యం అవుతున్నది. రెండింటికి అధ్యాయాల సంఖ్య, శ్లోక సంఖ్యలలో కూడా మార్పులు ఉన్నాయి. ప్రస్తుతం లభ్యం అవుతున్న వరాహ పురాణంలో పదకొండువేల శ్లోకాలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం గౌడదేశ పాఠమే ప్రచారంలో ఉన్నది. కానీ కలకత్తాలో అచ్చయిన ప్రతిలో కేవలం పదివేల ఏడువందల శ్లోకాలే ఉన్నాయి. అంటే ఇందులో చాలా భాగం ఇప్పటివరకు లభించలేదన్నమాట.

ఈ పురాణంలో విష్ణువుకు సంబంధించిన అనేక వ్రతాలు వివరించబడ్డాయి. ప్రస్తుతం లభ్యం అవుతున్న వరాహ పురాణం భవిష్యోత్తరపురాణం లాగా, అనేక పురాణాలనుంచి తీసుకొన్న విషయ సమాహారమేమో అనిపిస్తుంది. విష్ణు సంబంధమైన ద్వాదశీవ్రతమాహాత్మ్యం ఇందులో విస్తృతంగా చెప్పబడింది. పదకొండు నెలలలో ఉన్న పదకొండు ద్వాదశులకు పదకొండు విష్ణురూపాలతో సంబంధం ఉన్నట్లుగా చెప్పబడింది. ఇలా మార్గశిర శుక్ల ద్వాదశి–మత్స్యద్వాదశ, పుష్యద్వాదశి–కూర్మద్వాదశి, మాఘ ద్వాదశి, వరాహ ద్వాదశి, ఫాల్గుణ ద్వాదశి – నరసింహద్వాదశి, చైత్ర ద్వాదశి–వామన ద్వాదశి, వైశాఖ ద్వాదశి – పరశు రామద్వాదశి, జ్యేష్ఠ ద్వాదశి–రామద్వాదశి, ఆషాఢ ద్వాదశి–కృష్ణద్వాదశి– శ్రావణ ద్వాదశి–బుద్ధ ద్వాదశి, భాద్రపద ద్వాదశి–కల్కి ద్వాదశి, ఆశ్వయుజ ద్వాదశి–పద్మనాభ ద్వాదశి.

ఇందులో చెప్పబడిన బుద్ధద్వాదశిని పరిశీలిస్తే హిందూ సమాజం బుద్ధుని ఒక అవతారంగా స్వీకరించిన తరువాతనే ఈ పురాణరచన జరిగి ఉండవచ్చని భావించే అవకాశం ఉన్నది. ఆస్తికులు కొందరు వ్యాస మహాముని క్రాంతదర్శి కాబట్టి తనతర్వాత రాబోయే కాలంలో పుట్టబోయే బుద్ధుడిని పేర్కొని ఉంటాడని భావిస్తారు. ఇందులోని ఉత్తర భాగంలో పులస్త్య – కురురాజ సంవాదంలో చాలా విస్తరించి వివిధ వ్రతాలు, తీర్థాలు వాని మాహాత్మ్యాలు అనేక ధర్మ ప్రసంగ కథలు చెప్ప బడ్డాయి. వీటిలో ఎక్కువ భాగం విష్ణువ్రతాలే. అయితే వీటిలో రెండు విషయాలకు చాలా ప్రత్యేకత ఉన్నది. ఒకటి మధురా మాహాత్మ్యం. మధురకు సంబంధించిన అనేక తీర్థాల విస్తృత ప్రసంగం ఇందులో ఉన్నది. రెండవది నచికేతోపాఖ్యానము. ఇందులో యమ నచికేతుల కథలో ప్రసంగవశాత్తు స్వర్గనరకలోకాల విస్తృతవర్ణన ఉన్నది. కఠోపనిషత్తులో చెప్పిన కథతో ఈ కథ ఏకీభవిస్తున్నా, అందులో చెప్పిన ఆధ్యాత్మిక విషయాలు ఇందులో ఏమీ లేవు. నారద పురాణంలో చెప్పిన శ్లోక సంఖ్య ఇప్పుడు లభ్యం కావటం లేదు. శ్లోకాల్లో చాలా తక్కువే ఉన్నాయి. ఇది వరాహపురాణ పూర్వార్థం మాత్రమే అని భావించే అవకాశం ఉన్నది. నారదపురాణంలో పూర్వార్ధ ఉత్తరార్థాలనే రెండు ఖండాలు చెప్పబడ్డాయి. దీనిలోని చాలా భాగాలు వేరేపురాణాలుగా లభ్యం అవుతూ అయినా ఉండాలి లేకపోతే పూర్తిగా దొరకకుండా పోయి అయినా ఉండాలి. ఇంతకు మించి ఇప్పుడు నిర్ణయించి చెప్పే అవకాశం లేదు. లభ్యం అవుతున్న గౌడీయ, దాక్షిణాత్య పాఠాలు ఒక విషయంపైన ఉన్నవానిలో కూడా శ్లోకాలలో తేడా ఉండి వేరు వేరు గ్రంథాలుగాను, భిన్నకర్తృకాలుగానున్నట్లు తెలుస్తున్నది. జర్మనీలోని బెర్లిన్ గ్రంథాలయంలో ఉన్న రెండు ప్రతులను పరిశీలిస్తే ఈ విషయాలు స్పష్టం అవుతాయి. పదమూడవ శతాబ్దానికి చెందిన చతుర్వర్గ చింతామణి రచయిత హేమాద్రి వరాహ పురాణంలోని బుద్ధద్వాదశిని పేర్కొనడం, 12వ శతాబ్దికి చెందిన గౌడచక్రవర్తి బల్లాలసేనుడు వ్రాసిన దాన సాగరంలో దీని నుంచి అనేక శ్లోకాలను ఉద్ధరించటంచేత ఇది 10వ శతాబ్దానికి ముందు కాలానికి చెందినదిగా భావించవచ్చు.

ఇందులో చాతుర్మాస్య మాహాత్మ్యం, గీతామాహాత్మ్యం, వేంకటశైలమాహాత్మ్యం, విష్ణు మాహాత్మ్యం, అంబికా మాహాత్మ్యం మొదలైనవానిని అనేక విడి పుస్తకాలుగా చేయవచ్చు. రామాను జీయ వైష్ణవ మతానికి చెందిన అనేక విషయాలు ఇందులో చేర్చబడ్డాయి. నారాయణుడే ఆది దేవుడని స్థాపించటం, జ్ఞానవర్గ సముచ్చయం, శ్రాద్ధవర్జ్య పదార్థాలు, ద్వాదశి నాటి విష్ణు పూజా విధానం, వివిధ లోహాలతో భగవత్ ప్రతిమా నిర్మాణం, వాటి ప్రతిష్ఠ, పాంచరాత్రాగమ ప్రామాణ్యం మొదలైనవెన్నో రామానుజ సంప్రదాయం వారిచే యథాతథంగా గ్రహించబడ్డాయి. వరాహ పురాణంలో రెండు భాగాలు ఉన్నాయి. ఒకటి పూర్వ భాగం రెండు ఉత్తర భాగం మొత్తం రెండు భాగాలలోను 218 అధ్యాయాలు 24 వేల శ్లోకాలు ఉన్నాయి. ఇప్పుడు సంపూర్తిగా ఈ పురాణాం లభ్యం కావడం లేదు.

13. స్కాందపురాణం :

ఈ పురాణంలో, స్కందుడు అంటే కుమారస్వామి శైవతత్త్వాలను నిరూపణం చేశాడు కాబట్టి దీనికి స్కాందపురాణమనే పేరు వచ్చింది. పురాణాలు అన్నింటిలోకి అతిపెద్దదైన పురాణం

ఇది. దీనిలో శ్లోక సంఖ్య 81,000లు. అంటే ఇది భాగవతం కంటే అయిదు రెట్లు పెద్దది. లక్ష శ్లోకాలున్న మహాభారతం కంటే అయిదవ వంతు చిన్నదన్నమాట. ఈ పురాణంలో సంహితలు, వాటిలో ఖండాలు, వాటిలో మాహాత్మ్యాలు ఇలా అంతర విభాగాలున్నాయి. ఈ పురాణంలో ఒకటైన సూత సంహిత (అధ్యాయం 20-12) ప్రకారం దీనిలో ఆరు సంహితాలు ఉన్నాయి. అవి.

1) సనత్కుమార సంహిత -	36,000	శ్లోకాలు
2) సూతసంహిత -	6,000	శ్లోకాలు
3) శంకర సంహిత -	30,000	శ్లోకాలు
4) వైష్ణవ సంహిత -	5,000	శ్లోకాలు
5) బ్రాహ్మసంహిత -	3,000	శ్లోకాలు
6) సౌరసంహిత -	1,000	శ్లోకాలు
మొత్తం -	**81,000**	**శ్లోకాలు**

ఈ సంహితలలో చెప్పబడిన విషయాలను గురించి నారదపురాణం విస్తృతంగా తెలుపు తున్నది. స్కాందపురాణానికి మరొకరకంగా కూడా ఖండరూపంలో విభజన ఉన్నది.

1) మాహేశ్వర ఖండం -	174	అధ్యాయాలు
2) వైష్ణవ ఖండం -	153	అధ్యాయాలు
3) బ్రహ్మ ఖండం -	87	అధ్యాయాలు
4) కాశీఖండం -	100	అధ్యాయాలు
5) అవంతీ ఖండం -	367	అధ్యాయాలు
6) నాగరఖండం -	178	అధ్యాయాలు
7) ప్రభాసఖండం -	414	అధ్యాయాలు
మొత్తం	**1471**	**అధ్యాయాలు**

ఈ విధానం ప్రకారం 81,000 శ్లోకాలు ఉన్నాయి. అందువలన ఒక్కొక్క ఖండం దాదాపు పన్నెండువేల శ్లోకాల పరిమాణంతో ఉంటుందని భావించవచ్చు. అలాగే స్కాందపురాణంలోని శంకర సంహితలోగల హాలాస్య మాహాత్మ్యం, దీనిలో ఆరు సంహితలు 50 ఖండాలు ఉన్నాయని తెలుపుతున్నది. సంహితలలో సూత సంహిత శివోపాసన విషయంలో అద్వితీయమైనది. ఈ సంహితలో వైదిక, తాంత్రిక విధానాలు రెండింటిలోను శివారాధనను విస్తృతంగా వర్ణించింది. ఈ సంహితలోని ఈ విలక్షణత వలననే విజయనగర సామ్రాజ్యంలో మంత్రి సాయణుని సోదరుడు మాధవుడు దీనిచే ఆకర్షితుడై తాత్పర్యదీపిక అనే అతి ప్రామాణికము విస్తృతమైన వ్యాఖ్యానాన్ని రచించాడు. ఈ సూత సంహితలో ఆరు ఖండాలు ఉన్నాయి 1) మొదటిది శివమాహాత్మ్య ఖండం. ఇందులో 13 అధ్యాయాలలో శివమాహాత్మ్యం విశేషంగా ప్రతిపాదించడం జరిగింది. 2) రెండవది జ్ఞానయోగ ఖండం - దీనిలో 20 అధ్యాయాలున్నాయి. ఇందులో ఆచార ధర్మాలు వర్ణించిన

తరువాత హఠయోగ ప్రక్రియ సాంగోపాంగంగా వివేచించబడింది. 3) మూడవది ముక్తి ఖండం. దీనిలో 9 అధ్యాయా లున్నాయి. ముక్తి సాధన మార్గాలు వివరించబడ్డాయి. 4) నాల్గవది యజ్ఞ వైభవ ఖండం. ఇది అన్ని ఖండాలలోనికి పెద్దది. ఇది తిరిగి రెండు భాగాలు చేయబడింది. 1) పూర్వభాగం, 2) ఉత్తర భాగం. పూర్వ భాగంలో 47 అధ్యాయాలున్నాయి. వీనిలో అద్వైత వేదాంతం శైవభక్తితో జోడించి చాలా ప్రావీణ్యంతో ఆధ్యాత్మికతత్త్వ వివేచన చేయబడింది. దార్శనిక దృష్టితో చూస్తే ఈ ఖండం చాలా విలువగలది. తత్త్వవివేచన లోతుగా చేయటానికి అవ కాశం కల్పించేదిగా ఉంటుంది. దీని ఉత్తరభాగంలో రెండు గీతలు చేరి ఉన్నాయి. 1) బ్రహ్మ గీత, 2) ఇంకొకటి సూతగీత. బ్రహ్మగీతలో 12 అధ్యాయాలున్నాయి. రెండవదైన సూత గీతలో ఎనిమిది అధ్యాయాలున్నాయి. ఇవి కూడా ఆధ్యాత్మిక విషయశోభితాలు. ఆత్మ స్వరూప వివేచనము, దాని సాక్షాత్కార ఉపాయాలు చాలా చక్కగా ఇందులో ప్రతిపాదించబడ్డాయి. ఇందులో శివప్రసాదం వలననే సర్వకర్మ సమకూర గలవని ప్రతిపాదించబడింది.

శంకర సంహిత : ఇది కూడా అనేక ఖండాలుగా విభజించబడింది. ఇందులోని మొదటి ఖండమే శివరహస్య ఖండము. మొత్తం శంకర సంహితలో ఈ ఖండమే సగం వరకు ఉన్నది. ఈ శంకర ఖండంలో 13,000 శ్లోకాలు ఉన్నాయి. 7 కాండాలుగా విభజించ బడింది. ఆ ఏడుకాండలు : 1) సంభవకాండ, 2) ఆసురకాండ, 3) మాహేంద్రకాండ, 4) యుద్ధకాండ, 5) దేవకాండ, 6) దక్షకాండ, 7) ఉపదేశకాండ.

ఆరవ సంహిత సౌర సంహిత : ఇందులో శివ పూజా సంబంధమైన అనేక విషయాలు విపులంగా వర్ణించబడ్డాయి. మొదటిదైన సనత్కుమార సంహిత, ఇది షుమారు 20, 22 అధ్యాయాలుగల చిన్నసంహిత, ఇవి తప్ప మిగిలిన సంహితలు నేడు లభ్యంకావటం లేదు.

ఖండాత్మకమైన స్కాందపురాణం వివరాలు పరిశీలించగా.

1. మాహేశ్వరఖండం : ఈ ఖండంలో తిరిగి రెండు చిన్నఖండాలు ఉన్నాయి. 1) కేదార ఖండము, 2) కుమారికా ఖండం. ఈ రెండు ఖండాలలోను శివపార్వతుల అనేక విధాలైన చిత్రవిచిత్ర లీలలు సుందరంగా వర్ణించబడ్డాయి.

2. వైష్ణవ ఖండం : ఈ ఖండంలో భాగంగా ఉత్కళ ఖండం ఉన్నది. ఉత్కళ ఖండంలో ప్రస్తుత ఒరిస్సా రాష్ట్రంలోగల పూరీలోని జగన్నాథ మందిర విశేషాలు, పూజా విధానము, ప్రతిష్ఠ ఇంకా దానికి సంబంధించిన అనేక ఉపాఖ్యానాల వర్ణన ఉన్నది. ఇంద్రద్యుమ్న మహారాజు నారదుని ఉపదేశంతో జగన్నాథుడు ఉన్న స్థానాన్ని కనుక్కొన్న విశేషాలు, మొదలైన విషయాలు విస్తృతంగా ఈ ఖండంలో చెప్పబడ్డాయి. ఈ విధంగా పూరీ జగ న్నాథ క్షేత్ర ప్రాచీన చరిత్ర తెలుసుకొనటానికి ఈ ఖండం అత్యంత ఉపయోగకారి.

3. బ్రహ్మ ఖండం : ఇందులో రెండు ఖండాలున్నాయి. 1) బ్రహ్మారణ్య ఖండము, 2) బ్రహ్మోత్తర ఖండం. బ్రహ్మారణ్య ఖండంలో ధర్మారణ్యం అనే ప్రదేశం యొక్క మాహాత్మ్యం విశదంగా తెలుప

బడింది. అదే ఖండంలో ఉజ్జయినీ మహాకాళేశ్వరుని పూజా ప్రతిష్ఠానాదులు తెలుపబడ్డాయి. రెండవదైన బ్రహ్మోత్తర ఖండం 22 అధ్యాయాలుగా విభజించ బడింది. ఇందులో శివభక్తి, శివమాహాత్మ్యం, శివవ్రతం, రుద్రాక్ష, విభూతి మాహాత్మ్యం మొదలైన శివారాధనకు సంబంధించిన అనేక విషయాలున్నాయి. ఈ బ్రహ్మోత్తర ఖండం ఆంధ్రదేశంలో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. 17వ శతాబ్దంలో బ్రహ్మోత్తర ఖండం కూడా అష్టాదశ పురాణాలలో ఒకటిగా ప్రజలు భావించేవారని అయ్యలరాజు నారాయణా మాత్యుని హంసవింశతి ద్వారా తెలుస్తున్నది. దీనికి తెలుగులో అయిదు ప్రబంధశైలి అనువాదాలు, రెండు ద్విపద అనువాదాలు, మూడు వచన అనువాదాలు, ఒక్కొక్క మాహాత్మ్యం ఒక్కొక్క కావ్యంగా వచ్చాయంటే దీని ప్రభావం తెలుగునాట ఎంత ఉన్నదో గ్రహించవచ్చు.

4. కాశీఖండం : ఇందులో కాశీ క్షేత్ర మహిమ వర్ణించబడింది. కాశీలోని సమస్తదేవతలు, శివలింగాల ఆవిర్భావము, మాహాత్మ్యము విశేషంగా ఇందులో ప్రతిపాదింపబడ్డాయి. కాశీ యొక్క ప్రాచీన భూగోళ వివరాలు తెలుసుకోటానికి ఇది బహుళోపయోగకారి.

5. రేవా ఖండం : రేవానది అంటే నర్మదానది అని అర్థం. నర్మదానది ఉత్పత్తి దాని తీరంపైగల తీర్థ క్షేత్రాల విస్తృతవర్ణన ఇందులో ఉన్నది. సత్యనారాయణవ్రతం చేసుకొనే టప్పుడు చెప్పే కథ ఈ రేవాఖండంలోనే ఉన్నది.

6. అవంతీ ఖండం : అవంతీ నగరమే ఉజ్జయినీ నగరం. అక్కడ గల భిన్న భిన్న శివ లింగాల ఉత్పత్తి మాహాత్మ్యము ఈ ఖండంలో వివరించబడింది. ప్రాచీన అవంతీ దేశ ధార్మిక స్థితి యొక్క పూర్తి దిగ్దర్శనం ఈ ఖండంలో కనిపిస్తుంది.

7. తాపీ ఖండం : ఇందులో నర్మదకు ఉపనది అయిన తాపీనది ఒడ్డునగల నానా తీర్థక్షేత్ర వర్ణన ఉన్నది. నారద పురాణానుసారం దీని ఆరవ ఖండం పేరు నాగర ఖండం. ప్రస్తుతం లభి స్తున్న నాగర ఖండంలో మూడు భాగాలున్నాయి. 1.విశ్వకర్మ ఉపాఖ్యానం 2. విశ్వకర్మ వంశాఖ్యానం 3. హాటకేశ్వర మాహాత్మ్యం అనేవి అవి. ఈ మూడవ ఖండంలో నాగర బ్రాహ్మణుల ఉత్పత్తి చెప్పబడింది. భారతదేశీయ సామాజిక స్థితిని తెలుసుకొనటానికి ఈ ఖండం చాలా ముఖ్యమైనది.

8. ప్రభాసఖండం : ఇందులో ప్రభాస క్షేత్రవర్ణన చేయబడింది. ద్వారకానగర పరిసర ప్రాంతాలను గురించి తెలుసుకొనటానికి ఇది ఉపయోగపడుతుంది.

స్కాంద పురాణం ముఖ్యంగా శైవపురాణం. ఇందులో దేశంలోని అనేక మూలలలోగల తీర్థక్షేత్ర మాహాత్మ్యాల వర్ణన ఉన్నది. అలాగే ప్రాచీన భారతదేశ భౌగోళిక స్థితిని తెలుసుకొనటానికి ఇది ఉత్తమ ఆధార గ్రంథం. అందువలన వాటిని గురించిన అనేక అద్భుత గాథలు ఉపాఖ్యానాలు ఇందులో చోటు చేసుకున్నాయి. ఇందులో అనేక కథలు అనేక పర్యాయాలు అనేక స్థలాలలో భిన్న భిన్న రూపాలలో మరల మరల వస్తుంటాయి. ఇది అతి ప్రాచీనకాలంనాటి పురాణం అనే దాంట్లో సందేహం లేదు. ఎందుకంటే క్రీ.శ. 1000 నాటి వ్రాతప్రతి కలకత్తాలో లభ్యం అయింది. అదే ఆశ్చర్యం అనుకొంటే అంతకంటే వింతగా స్కాందపురాణం వ్రాతప్రతి నేపాలు రాజప్రాసాద

గ్రంథాలయంలో క్రీ.శ. 7వ శతాబ్దానికి చెందిన ప్రతి ఉన్నదని పండితులు తెలుపుతున్నారు. దీని మూలరూపం ఏమిటి ? అది ఎలా ఇంత బృహద్రూపాన్ని సంతరించుకొన్నది అనే విషయం భవిష్యత్తులో పురాణ పండితులు తేల్చాలి.

స్కాంద పురాణం ఏడు ఖండాలుగా విభజించబడింది. 1. మహేశ్వర ఖండం, 2. వైష్ణవ ఖండం 3. బ్రహ్మ ఖండం, 4. కాశీఖండం, 5. అవంతీ ఖండం 6. నాగర ఖండం 7. ప్రభాస ఖండము. ఒక్కొక్క ఖండం ఇంకా అనేక అవాంతర ఖండాలుగా కూడా విభజింపబడింది. ఇందులోని మాహేశ్వర ఖండంలో 174 అధ్యాయాలు వైష్ణవ ఖండంలో 156 బ్రహ్మ ఖండంలో 87 కాశీఖండంలో 100 అధ్యాయాలు అవంతీ ఖండంలో 387 నాగర ఖండంలో 279 అధ్యాయాలు ప్రభాస ఖండంలో 421 అధ్యాయాలు వెరసి 1671 అధ్యాయాలు ఉన్నాయి. నారద పురాణం ప్రకారం 81,000 శ్లోకాలు ఉండాలి. మత్స్య పురాణానుసారం 81,102 శ్లోకాలు ఉండాలి. స్కాందపురాణం ప్రస్తుతం సంహితాత్మకంగాను, ఖండాత్మకంగాను కూడా రెండు భిన్నభిన్న రచనలు లభ్యం అవుతున్నాయి.

14. వామన పురాణం :

మత్స్య పురాణంలో చెప్పిన ప్రకారం, బ్రహ్మ వామన అవతారాన్ని, మాహాత్మ్యాన్ని ఆధారంగా చేసుకొని, త్రివర్గాలకు సంబంధించిన విషయాలను వివరించిన పురాణం కాబట్టి దీనికి వామన పురాణం అని పేరు వచ్చింది. దీనిలోని శ్లోక సంఖ్య పదివేలు. ఇందులో 95 అధ్యాయాలున్నాయి. ఇది 1) పూర్వ, 2) ఉత్తర భాగాలుగా విభజించబడి ఉన్నది. ఉత్తర భాగానికే ఇంకొక పేరు బృహద్వామన పురాణం. ఇందులో నాలుగు సంహితలున్నాయి. 1) మాహేశ్వరీ సంహిత, 2) భాగవతీ సంహిత, 3) సౌర సంహిత, 4) గణేశ్వరీ సంహిత. ప్రతి సంహితలోను దాదాపు వేయి వేయి శ్లోకాలున్నాయి. మాహేశ్వరీ సంహితలో శ్రీకృష్ణ చరిత్రము ఆయన భక్తుల వృత్తాంతాలు ఉన్నాయి. భాగవతీ సంహితలో జగదాంబ పార్వతి యొక్క అవతార కథ ఉన్నది. సౌర సంహితలో సర్వసాక్షి సూర్య భగవానుని మాహాత్మ్యం వర్ణించబడింది. గణేశ్వరీ సంహితలో గణపతి యొక్క మాహాత్మ్యం వివరించి ఉన్నది. పులస్త్యుడు మొదటిసారిగా దీనిని నారద మహామునికి వివరించగా నారదుడు వ్యాసునికి చెప్పినట్లు, ఆయన రోమహర్షణ సూతునికి తెలుపగా ఆయన నైమిశారణ్యంలో ఋషులకు ఈ పురాణాన్ని వివరించినట్లు వక్తృశ్రోతృపరంపర తెలుపుతున్నది. వామన పురాణంలోని భిన్న విభిన్న కథలతోపాటు వామనావతార కథ విస్తృతంగా వర్ణించబడింది. ఇందులో శివ, శివమాహాత్మ్య, శివతీర్థ, శివశివా వివాహ, గణేశోత్పత్తి, కార్తికేయ జననం మొదలైన వృత్తాంతాలు కావ్యకళా దృష్టితో వర్ణించబడ్డాయి. అంతేగాకుండా అనేక తీర్థాలు, వనాలు, వాని మాహాత్మ్యం, సృష్టివర్ణన, ధర్మ నిరూపణం మొదలైనవి కూడా సుందరంగా వర్ణించబడ్డాయి.

ఇప్పుడు వామన పురాణ ఉత్తర ఖండం లభ్యం కావటం లేదు. కేవలం పూర్వ భాగం మాత్రమే లభిస్తున్నది. ఇందులో మొత్తం 95 అధ్యాయాలున్నాయి. అందువల్లనే దీనిని అసంపూర్ణ పురాణం అనవచ్చు. ప్రస్తుతం షుమారు ఆరు వేల శ్లోకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. ఇది

మొదట్లో వైష్ణవ పురాణమే అయినా కాలక్రమంలో శైవ ప్రభావం చేత దీనిలో శివచరిత్ర కూడా ప్రవేశపెట్టబడి ఉండవచ్చు. ఇది కురుక్షేత్రంలో వ్రాయబడి ఉంటుంది. ఈ పురాణంలో కాళిదాసు రచనలతో అనేకమైన సామ్యాలు ఉన్నాయి. ఇందులో శైవవైష్ణవ చరిత్రల అందమైన కలయిక కనబడుతుంది. ఈ పురాణం బహుశః క్రీ.శ. ఏడవ-పదవ శతాబ్దం మధ్యన రచింపబడి ఉంటుందని ఒక ఊహ. దీనిలో నుంచి అనేక ప్రత్యేక గ్రంథాలను వెలువరించవచ్చు. వాటిలో నరకచతుర్థీ కథ, గంగా మాహాత్మ్యం, గంగా మానసిక స్నానం, వారాహ మాహాత్మ్యం, వెంకటగిరి మాహాత్మ్యం మొదలైనవి కొన్ని మాత్రమే. దీని నాలుగు సంహితలలో మొత్తం 95 అధ్యాయాలుండగా ఇందులో మొత్తం పదివేల శ్లోకాలు ఉన్నాయి. ఇందులో రెండవదైన ఉత్తరభాగం ప్రస్తుతం లభ్యంకావటం లేదు.

15. కూర్మపురాణం :

కూర్మరూపుడైన జనార్దనుడు పాతాళలోకంలో ధర్మ, అర్థ, కామ మోక్షాలనే చతుర్విధ పురుషార్థ సాధన గురించి విష్ణు భక్తుడైన ఇంద్రద్యుమ్నునికి, ఇంద్రుడు మహర్షుల సమక్షంలో తెలుపుతూ చేసిన వివరణ అని ఈ పురాణం ద్వారా తెలుస్తున్నది. ఇందులో లక్ష్మీకల్పంలోని వృత్తాంతం కలదని తెలుపబడింది. దీనిలోని శ్లోకాల సంఖ్య 17 వేలు. కూర్మపురాణం రెండు భాగాలుగా ఉన్నది. పూర్వభాగం, ఉత్తర భాగం. పూర్వభాగంలో 53, ఉత్తర భాగంలో 46 మొత్తం 99 అధ్యాయాలున్న పురాణం ఇది. కూర్మపురాణం నాలుగు సంహితలుగా విభజించబడింది. 1) బ్రాహ్మీసంహిత, 2) భాగవతీసంహిత, 3) సౌరీసంహిత, 4) వైష్ణవీ సంహిత. ఈ బ్రాహ్మీ సంహిత తిరిగి పూర్వార్థం, ఉత్తరార్థాలుగా విభజించబడింది. ఇందులో పూర్వార్థంలో 53, ఉత్తరార్థంలో 46 వెరసి 99 అధ్యాయాలున్నాయి. ఈ బ్రాహ్మీ సంహితలో మొత్తం ఆరువేల శ్లోకాలు ఉన్నాయి. నారద పురాణాను సారం నాలుగు సంహితలలోను కలిపి 17 వేల శ్లోకాలు, మత్స్యపురాణానుసారం 18 వేల శ్లోకాలు ఉన్నట్లు తెలుస్తున్నది. తంత్రశాస్త్రానికి సంబంధించిన ఎన్నో విషయాలు ఇందులో ఉన్నాయి. అయితే ప్రస్తుతం లభ్యం అవుతున్న కూర్మపురాణంలో కేవలం ఆరువేల శ్లోకాలే ఉన్నాయి. అంటే దాదాపుగా మూడింట రెండువంతులు లభ్యం కాకుండా పోయిందన్నమాట. ఇందులో పురాణమంతటా శివుని ప్రాధాన్యమే చెప్పబడింది. అలాగే అనేక సందర్భాలలో బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు భేదంలేదని ప్రకటించబడింది. ఈ ముగ్గురు పరబ్రహ్మ యొక్క వివిధ రూపాలని చెప్ప బడింది. ఇందులో శక్తి పూజకు కూడా చాలా ప్రాధాన్యత ఉన్నది. శక్తి యొక్క సహస్ర నామ స్తోత్రం (1-12) దీనిలో ఉన్నది. విష్ణు శివులు లక్ష్మీ గౌరిల ప్రతిరూపాలని చెప్పబడింది. శివ పారమ్యం ఎంత ఎక్కువగా ప్రతిపాదించబడిందంటే విష్ణు స్వరూపుడైన శ్రీకృష్ణుడు శివుని ప్రసాదం చేతనే జాంబవతి యందు సాంబుడనే పుత్రుడిని పొందగలిగాడని విపులంగా తెలుపుతున్నది.

ఇందులోని పూర్వభాగంలోని సృష్టి ప్రకరణం తరువాత, పార్వతి తపస్సు, ఆమె సహస్రనామాలు వర్ణించబడ్డాయి. ఇక్కడే కాశీ ప్రయాగ క్షేత్రమాహాత్మ్యం తెలుపబడింది. ఉత్తర భాగంలో ఈశ్వర గీత, వ్యాసగీత అనే రెండు గీతలు ఉన్నాయి. ఈశ్వరగీతలో భగవద్గీతలో తెలిపిన విధానంలోనే ధ్యానయోగం ద్వారా శివసాక్షాత్కారం లభిస్తుందని చెప్పబడింది. వ్యాసగీతలో నాటి ఆశ్రమాల కర్తవ్యము, ఆచరింపవలసిన కర్మలు, వ్యాస మహర్షి ద్వారా బోధింపబడ్డాయి.

ప్రస్తుతం ఇందులోని నాలుగు సంహితాలలోను కేవలం బ్రాహ్మీ సంహిత మాత్రమే లభిస్తున్నది. మిగిలిన సంహితలు అలభ్యాలు.

దీనిలో తాంత్రిక గ్రంథాలలోని చాలా విషయాలు కలిసిపోయినట్లుగా తెలుస్తున్నది. నారద పురాణం ప్రకారం ఈ పురాణంలో చెప్పబడిన విషయాలు డామర, యామలాద తంత్ర గ్రంథాలలో ఉన్న విషయాలే. ఇందులో చాలా స్తోత్రాలు, మాహాత్మ్యాలు ప్రత్యేకంగా పరిగణన పొందుతున్నాయి. మహేశ్వరునికి శాంతి విద్యపై నాలుగు విధాలైన శక్తులున్నాయని, అందుచేతనే పరమేశ్వరుడు చతుర్వ్యూహుడనీ ఇందులో చెప్పబడింది. ఇది పాంచరాత్రాగమాల నుంచి గ్రహించిన పద్ధతి. వాస్తవంలో ఇది మొదట పాంచరాత్ర మతాన్ని ప్రతిపాదించే పురాణమని, కాలక్రమంలో పాశుపతులు దీనిలో పాశుపత ప్రక్రియను ప్రవేశపెట్టారని పండితుల అభిప్రాయం. ఈ పురాణం 5,6 శతాబ్దాలలో రచింపబడి ఉండాలి.

16. మత్స్యపురాణం :

ఇది కూడా విస్తృతపురాణాలలో ఒకటి. ఇందులో 290 అధ్యాయాలున్నాయి. మొత్తం 15 వేల శ్లోకాలు ఉన్నాయి. మత్స్యరూపంలోని శ్రీమహా విష్ణువు కల్పాదియందు శ్రుతి అర్థమును నరసింహ వర్ణన సందర్భంలో ఏడుకల్పాల విషయ వివరణ చేసినట్టిదే మత్స్యపురాణమని స్వయంగా ఇందులో చెప్పబడి ఉన్నది. ప్రారంభంలో మన్వంతరాల గురించి సంక్షిప్తమైన వివరణ చేసిన తరువాత పితృదేవగణాల వర్ణన విస్తృతంగా ఉన్నది. అనేక రకాల వ్రతాలను గురించిన సుందరమైన వర్ణన ఇందులో కనిపిస్తుంది. తీర్థాలలో శ్రేష్ఠమైన ప్రయాగక్షేత్ర భౌగోళిక వివరణ, మాహాత్మ్యము చాలా విపులంగా ఉన్నది. రాజవంశ వర్ణనలలో సోమవంశ వర్ణన చాలా విపులంగా ఉన్నది. పరమేశ్వరుని త్రిపురాసుర యుద్ధము సంహారము సవివరంగా విపులంగా చెప్పబడింది. తారకాసుర వధకూడా ఇందులో విస్తృతంగా చెప్పబడింది. మత్స్యావతార కథ ప్రధానంగా ఉండడంచేత దీనికి మత్స్యపురాణం అనే పేరు సార్థకం అవుతున్నది. కాశీ ప్రయాగక్షేత్రాలు, నర్మదా నదీ ప్రాంతంలో ఉన్న క్షేత్రాలను గురించిన విపుల వర్ణన ఉన్నది. ఋషివంశాల వర్ణనం, 25 అధ్యాయాలలో రాజధర్మ ప్రతిపాదనము వివిధ దేవతామూర్తుల ప్రతిమ, నిర్మాణాదుల విస్తృత వర్ణనం ఈ పురాణంలో ప్రధానంగా ప్రతిపాదించబడిన విశేషం.

మత్స్య పురాణంలోని 53వ అధ్యాయంలో అష్టాదశ పురాణాల యొక్క లక్షణాలు, దానిలో చెప్పబడిన అంశాలు, శ్లోక సంఖ్య మొదలైనవి విపులంగా తెలియజేయబడ్డాయి. ఇది మిగిలిన పురాణాల ప్రస్తుత స్థితిని ఊహించటానికి ప్రముఖంగా పనికివస్తున్నది. మత్స్యమూర్తి, మనువులకు ప్రళయ విషయాన్ని గురించిన సంభాషణ, మానసిక సృష్టి తర్వాత, మైథున సృష్టి ఆరంభం, బ్రహ్మ సరస్వతుల చరిత్ర, పృథు చరిత్ర, సూర్య సోమవంశ వర్ణనము యయాతి చరిత్ర, సప్త సంతానాల ప్రతిష్ఠ అనేక వ్రత విధానాలు, దానఫల ప్రతిపాదనము, వివిధ నదీ పర్వత వర్ణనము, శాకము మొదలైన ద్వీపాల వృత్తాంతము, యుగవివరణ తారకోపాఖ్యానం, దేవాసుర సంగ్రామ వర్ణనం, నర్మదా మాహాత్మ్యము, సావిత్ర్యుపాఖ్యానం, రాజవంశవర్ణనము, శమనజ్ఞానము, గృహ నిర్మాణం మొదలైన అనేక విషయాలు ఇందులో వర్ణించబడ్డాయి.

ప్రళయ కాలంలో అన్ని నదులూ నశించినా, నర్మదానది మాత్రం నశించదని చెపుతూ నర్మదా నదికి గంగ కంటె కూడా ఎక్కువ వైశిష్ట్యాన్ని అంగీకరించడం నర్మదా నదీతీరాన్ని అనుసరించి ఉన్న చిన్న చిన్న తీర్థాలను కూడా వర్ణించటం మొదలైన ఆధారా లను బట్టి ఈ పురాణం నర్మదా నదీ తీరంలో రచింపబడి ఉండవచ్చని ఊహించవచ్చును.

కాళిదాసుని విక్రమోర్వశీయంలో ఉన్న కథకు ఈ పురాణంలోని ఊర్వశీ ఉపాఖ్యా నానికి అత్యంత సామ్యం ఉండడంచేత ఇది కాళిదాసుకు అనంతరం రచింపబడి ఉంటుందని కొందరి ఊహ. నారద పురాణంలో చెప్పబడినట్లుగానే ఇందులోని, అధ్యాయ సంఖ్య శ్లోకసంఖ్య ఉన్నది. అందువలన పురాణ విమర్శకులందరూ దీని వాస్తవికతను ప్రామాణికతను, ఏకగ్రీవంగా అంగీకరి స్తున్నారు. ఇది 16వ పురాణం అయినా దేవీ భాగవతాన్ని అనుసరించి ఇది మొదటి పురాణం కావాలి. స్మృతిరఘునందనుడనే పండితుడు రచించిన 'వృషోత్సర్గతత్త్వం' అనే గ్రంథంలో 'స్వల్ప మత్స్య పురాణమనే చిన్న గ్రంథం ఒకటి పేర్కొనబడినా, అసలు దాని ఉనికే ఏమాత్రం నేడు తెలియటంలేదు.

ఈ పురాణం కొన్ని ప్రత్యేకలను కలిగి ఉన్నది. మొదటిది ఇందులో 53వ అధ్యాయంలో చెప్పిన అన్ని పురాణాల విషయానుక్రమణిక. దీనివలన అన్ని పురాణాల క్రమాను గత వికాసం తెలుసుకొనే అవకాశం కలుగుతుంది.

శ్రేష్ఠులైన ఋషిగణం యొక్క వంశ వర్ణనం ఇందులో ఇంకొక ప్రత్యేకత. భృగు, ఆంగీరస, అత్రి, విశ్వామిత్ర, కశ్యప, వసిష్ఠ పరాశర, అగస్త్యాది మహా ఋషుల వంశాల వర్ణన 195వ అధ్యాయం నుంచి 202వ అధ్యాయం వరకు చక్కగా చేయబడింది. ఇక మూడవది రాజ ధర్మాల విశిష్ట వివరణ. ఇది 215వ అధ్యాయం నుంచి 243 అధ్యాయం వరకు, దైవ, పురుషకార, సామ, దామ, దండ, భేద, దుర్గ, యాత్ర, సహాయసంపత్తి, తులాదానం వంటి వాని వివరణ, రాజనీతికి సంబంధించిన విశిష్టతలను నిరూపిస్తున్నది. ఈ రాజధర్మంలో ఒక భాగంగా శాంతిఖండాన్ని కూడా చేర్చడం అద్భుతమైన విషయం. (అధ్యాయం 228 నుంచి 238) ఇందులో విషయాలు చాలా నవీనంగా ఉంటాయి. నాల్గవ ప్రత్యేకత ఇందులో చెప్పబడిన ప్రతిమా లక్షణాలు. రకరకాల దేవతలు, దేవుళ్ల విగ్రహాల కొలతలు, తయారుచేయటం చెప్పబడింది. మన ప్రతిమాశాస్త్రం, శాస్త్రీయ పద్ధతులపై ఆధారపడి ఉన్నది. విభిన్న దేవ తల విగ్రహాలు కొలతల ప్రకారమే జరగాలి. వాటి ప్రతిష్ఠ, పీఠ నిర్మాణం కూడా ఒక విశిష్ఠ శైలిపై ఆధారపడి ఉంటుంది. ఈ విషయాలన్నింటి వివరణ ఈ పురాణం (257–270)లో చాలా ప్రామాణికంగా చెప్పబడింది. రాజు తన శత్రువుల మీద దండెత్తి పోయేటప్పుడు ఏ ఏ విషయాలపై దృష్టి కేంద్రీకరించాలి వంటి విషయాలు, రాజధర్మాలు మొదలైనవి విపులంగా వివరించబడ్డాయి.

మత్స్యపురాణం కేవలం అధ్యాయాలుగా మాత్రమే విభజించబడింది. ఇందులో 290 అధ్యాయాలున్నాయి. ఈ 290 అధ్యాయాలలో 14 వేల శ్లోకాలున్నాయి. కానీ నారద పురాణాను సారం ఇందులోని శ్లోకాల సంఖ్య 15 వేలు.

17. గరుడ పురాణము :

శ్రీమహావిష్ణువు గరుడ కల్పంలో గరుడుడు ఉద్భవించిన విషయ వివరణ చేస్తూ బ్రహ్మాండ ఆరంభం దగ్గర నుంచి గరుడునికి వివరించిన పురాణం కాబట్టి దీనికి గరుడ పురాణమనే పేరు వచ్చింది. ఇందులో 264 అధ్యాయాలు 18వేల శ్లోకాలు ఉన్నాయని నారదపురాణం తెలుపుతున్నది. ఇది రెండు ఖండాలుగా ఉన్న పురాణం. పూర్వఖండంలో లౌలిక ఉపయోగానికి అవసరమైన సమస్త విద్యల వివరణ విస్తృతంగా ఉన్నది. పురాణ ప్రారంభం లోనే విష్ణువు ఆయన అవతారాల మాహాత్మ్యం గురించి తెలియజేయబడింది. దీనిలోని ఒక అంశంతో అనేక రకాల రత్నాల పరీక్ష, అలాగే ముత్యము (69 అధ్యాయం) పద్మరాగం (70వ అధ్యాయం) మరకత, ఇంద్రనీల, వైడూర్య, పుష్పరాగ, కరకేతన, భీష్మరత్న, పులక, రుధిరాఖ్య రత్నాలు, స్ఫటికము, విద్రుమ పరీక్షలు (71 నుంచి 80 అధ్యాయాల వరకు) తెలుపబడ్డాయి. ఇందులో రాజనీతి (108-115 అధ్యాయాల వరకు) కూడా బాగా విస్తృతంగా వివరించబడింది. ఆయుర్వేదము యొక్క ఆవశ్యకత, రోగనిధానము, చికిత్సా విధానములను గురించి (15 నుండి 181 అధ్యాయాల వరకు) అనేక అధ్యాయాలలో వివరించబడింది. అనేక రకాల రోగాలను పోగొట్టటానికి ఔషధ విధానం (170-196వ అధ్యాయం వరకు) చెప్పబడింది. ఇది చాలా ప్రశంసనీయ విషయం. ఇంకొక అధ్యాయం (199) మనస్సును నిర్మలంగా ఉంచుకొనటానికి ఔషధాలను నిర్దేశించింది. ఆయుర్వేదాన్ని ప్రతిపాదించే ఈ 50 అధ్యాయాలు వేరు పుస్తకంగా ప్రకటించి, ఇతర ఆయుర్వేద గ్రంథాలలాగా దీనిని కూడా పరిశీలించవలసిన అవసరం ఉన్నది. ఛందశాస్త్ర విషయాలు (211-216) అధ్యాయాలు ఇందులో ఉన్నాయి. సాంఖ్య యోగాన్ని గురించి విపులంగా 14 (230 - 243) అధ్యాయాలలో వివరించబడింది. ఒక అధ్యాయం (242)లో గీతాసారాంశం ఉన్నది. ఈ విధంగా గరుడపురాణం ఈ పూర్వాంశం అగ్ని పురాణం వలెనే సమస్త విద్యలకు విజ్ఞాన కోశంగా చెప్పవచ్చును.

ఈ పురాణం యొక్క ఉత్తర ఖండానికి, 'ప్రేతకల్పం' అని పేరున్నది. ఇందులో 45 అధ్యాయాలున్నాయి. జీవి మరణించిన తరువాత మనుష్యునికి ఏ స్థితి కలుగుతుంది. అతడు ఏ యోని యందు తిరిగి పుట్టగలడు ఏఏ భోగాలను అనుభవిస్తాడు మొదలైన విషయాలు అక్కడక్కడా ఇతర పురాణాలలో ఉన్నా, ఈ పురాణంలో అత్యంత విస్తృతంగా సాంగోపాంగమైన వర్ణన ఉన్నది. ఇంత విస్తృతంగా వేరు పురాణాలలో లేదు. ఇందులో గర్భావస్థ, నరకము, యమ నగరమునకు మార్గము, ప్రేత గణముల వాసస్థానము ప్రేత యోని నుంచి ముక్తి, ప్రేతముల రూపము, మనుష్యుల ఆయుర్దాయము, యమలోక వివరణము, సపిండులైనందున చేయవలసిన విధులు, వృషోత్సర్గ విధానము మొదలైన విషయాలు ఆయా అధ్యాయాలలో విస్తృతంగా ఆసక్తికరంగా వివరించబడ్డాయి. ఒక వ్యక్తి మరణించినప్పుడు అశౌచకాలంలో ఈ ఉత్తరఖండం పురాణంగా చెప్పటం, దానిని ప్రేతబంధువులు వినటం సంప్రదాయంగా హిందువులలో ఉన్న విషయమే. ఈ ప్రేతకల్ప భాగం జర్మన్ భాషలోకి కూడా అనువదించబడింది.

నారదపురాణం, మత్స్యపురాణాలలో గరుడపురాణ విషయాలుగా చెప్పబడినవి. యథాతథంగా లభ్యం అవుతున్నాయి. ప్రస్తుతం లభ్యం అవుతున్న గరుడ పురాణంలో ఏడువేల శ్లోకాలు ఉన్నాయి.

లభ్యం అవుతున్న గరుడ పురాణంలో శ్లోకసంఖ్య తక్కువగా ఉన్నా, చెప్పబడిన విషయాలు మాత్రం కొరత లేదు. ఇందులోని భవిష్య రాజవంశాఖ్యానాన్ని చదివితే ఇది జనమేజయుని కాలంలో సంకలింపబడినట్లు తెలుస్తుంది. మత్స్య, విష్ణు పురాణాలలోని భవిష్యరాజ వంశాఖ్యాన వృత్తాంతాలలో ఆంధ్ర, గుప్త రాజవంశాలు పేర్కొనబడ్డాయి. కానీ ఇందులో ఆ వృత్తాంతాలు లోపించటంవలన, ఇది ఆ పురాణాలకంటే ప్రాచీనమని భావించటం సమంజసంగా ఉంటుంది.

శూద్రక మహారాజు కాలంలో బౌద్ధ హిందూ ధర్మాలు కలసిపోయాయి. ఆ సమ యంలో బౌద్ధమతము, బుద్ధుని ఆరాధన మనదేశంలో ఎక్కువగా ఉండేది. అందువలననే బుద్ధుడు విష్ణువు యొక్క 21వ అవతారంగా పేర్కొనబడ్డాడు. ఇందులో బుద్ధుని తండ్రి ఆయన వంశం (శుద్ధోధకో రాహులశ్చ సేనజత్ శూద్రకస్తథా) స్పష్టంగా చెప్పబడ్డాయి.

ఇందులోని వృత్తాంతం తార్క్ష్యకల్పం నాటిది అని చెప్పబడింది. తార్క్ష్యుడు గరుడుడే. అదే గరుడ కల్పవృత్తాంతం. ఇందులో గయామాహాత్మ్యం చాలా విపులంగా చెప్ప బడినందున గయ క్రీ.శ. 6,7 శతాబ్దాలలో విస్తృత ప్రచారంలోకి బౌద్ధమత పతనం తరువాత వచ్చినందున ఇది ఎనిమిదవ శతాబ్దం కాలంనాటి పురాణంగా భావించ వచ్చు. మిథిలా ప్రాంతంలో దీని రచన జరిగి ఉండవచ్చని భావించబడుతున్నది. దీని నుండి ప్రత్యేకంగా త్రివేణీస్తోత్రము, పంచపర్వ మాహాత్మ్యము, విష్ణు ధర్మోత్తరము, వేంకటగిరి మాహాత్మ్యము, శ్రీరంగనాథ మాహాత్మ్యము, సుందరపుర మాహాత్మ్యము మొదలైనవానిని ప్రత్యేక గ్రంథములుగా ఏర్పాటు చేయవచ్చును.

గరుడ పురాణం రెండు ఖండాలుగా విభజించబడింది. పూర్వ ఖండం, ఉత్తర ఖండం. దీనిలోని ఉత్తర ఖండానికే ప్రేత కల్పమనే ఇంకొక పేరు ఉన్నది. ఈ పురాణంలో పూర్వఖండంలో 240, ఉత్తర ఖండం (ప్రేత కల్పం)లో 78 అధ్యాయాలు మొత్తం 318 అధ్యాయాలు ఉన్నాయి. దీనిలో నారదపురాణానుసారం 19 వేల శ్లోకాలు మత్స్య పురాణాను సారం 18 వేల శ్లోకాలు ఉన్నాయి.

18. బ్రహ్మాండ పురాణము :

సమస్త బ్రహ్మాండాన్ని ఆధారంగా తీసుకొని బ్రహ్మచేత భవిష్యకల్పవృత్తాంతంగా చెప్పబడిన పురాణం కాబట్టి దీనిపేరు బ్రహ్మాండపురాణం అయ్యింది. ఇందులోని శ్లోక సంఖ్య 12,200 భువన కోశం లేక ఈ సకల చరాచర బ్రహ్మాండ వర్ణన అన్ని పురాణాలలోను ఉంటుంది. కానీ ఈ పురాణం ఈ బ్రహ్మాండం (విశ్వం) అంతటిని సాంగోపాంగంగా వరిస్తుంది. నారదపురాణాన్ని అనుసరించి దీనిలో 161 అధ్యాయాలు, 12,000 శ్లోకాలు ఉన్నాయి. ఇప్పుడు పురాణంలో ఉన్న విషయానుక్రమణి నారద పురాణంలో చెప్పబడిన విషయానుక్రమణికతో సరిపోతున్నది. కూర్మ పురాణం చెప్పిన పురాణపు పేర్లలో ఇది వాయవీయ బ్రహ్మాండపురాణం అని పేర్కొంటున్నది. ఈ విషయాన్ని అనుసరించి మన పురాణాలపై పరిశోధన చేసిన పాశ్చాత్య పురాణ పండితులు ఇది వాయు పురాణము యొక్క విస్తృత రూపమని, దీనికి మూలం వాయు పురాణమేనని భావించారు. కానీ ఇది సరియైన అభిప్రాయం కాదు. నారదపురాణాన్ని అనుసరించి వాయుదేవుడు వ్యాసునికి ఈ పురాణాన్ని బోధించాడని తెలుస్తున్నది. అందువలననే సరిగా ఇది వాయుప్రోక్త బ్రహ్మాండ పురాణమని చెప్పబడింది.

ఈ పురాణ ప్రథమ ఖండంలో విశ్వభూగోళ వర్ణన విస్తృతంగా చేయబడింది. జంబూద్వీపము, అందులోని పర్వత, నదీ నద వర్ణన అనే అధ్యాయాలలో '66-72 వరకు) చేయబడింది. భద్రాశ్వ, కేతుమాల, చంద్రద్వీప, కింపురుషవర్ష, కైలాస, శాల్మిల ద్వీప, కుశద్వీప, క్రౌంచద్వీప, శాకద్వీప, పుష్కరద్వీపము వంటి అనేక వర్షములు, దీపముల వర్ణన విభిన్న అధ్యాయాలలో, ఆకర్షణీయంగా సమగ్రంగా లభ్యం అవుతున్నది. ఈ పురాణపు తృతీయ పాదంలో భారతదేశంలోని ప్రసిద్ధులైన క్షత్రియ వంశ వివరణ చారిత్రక దృష్టితో చాలా విలువగల భాగము.

ఈ పురాణాన్ని గురించిన ఇంకొక ప్రత్యేకత ఏమంటే క్రీ.శ. 5వ శతాబ్దంలో బ్రాహ్మణులు ఈ పురాణాన్ని జ్వాలా(బలి)ద్వీపానికి తీసుకొనిపోయారు. అక్కడ ఇది ప్రాచీన జావాభాష అయిన 'కలిభాష'లోకి అనువదించబడింది. ఆ అనువాదం ఈ రోజుకు ఉపలబ్ధం అవుతున్నది. అందువలన ఈ పురాణం చాలా ప్రాచీన కాలానికి చెందినదిగా భావించవచ్చును. ఈ పురాణము యొక్క 16, 17, 18 అధ్యాయాలలోని భవిష్య కల్పవృత్తాంతం విస్తారంగా వర్ణితమైంది. ఈ రకమైన విస్తృత కల్పవర్ణనం మిగిలిన ఇతర పురాణాలలో లభించదు. అందువలన లభ్యం అవుతున్న బ్రహ్మాండపురాణ అస్తిత్వం, మౌలికత, మహాపురాణత్వాన్ని గురించి ఎటువంటి సందేహాలు పెట్టుకొనవలసిన అవసరం లేదు. బ్రహ్మాండపురాణం అష్టాదశ పురాణాలు అన్నింటిలోను ప్రాచీనతమమైనదని పురాణతత్త్వజ్ఞుల భావన. స్కాందపురాణంలాగానే దీనిలో కూడా అనేక మాహాత్మ్యాలు వర్ణింపబడ్డాయి.

దీని ప్రథమ ఖండంలో నదులు తీర్థాల వర్ణనతరువాత నక్షత్రమండలము యుగములు, మన్వంతరాల విపుల వివరణ ఉన్నది. విశ్వ విఖ్యాతులైన క్షత్రియ ప్రభువుల వంశ వర్ణనము చారిత్రకంగా విలువైనట్టిది. నారదపురాణ సూచికను అనుసరించి అధ్యాత్మ రామాయణము ఇందులోని భాగమే. కానీ ప్రస్తుతం ఉపలబ్ధం అవుతున్న బ్రహ్మాండ పురాణంలో అధ్యాత్మ రామాయణం లభ్యంకావటం లేదు. ఈ అధ్యాత్మరామాయణము శ్రీరామ చరిత్రను ఆధ్యాత్మికముగా వ్యాఖ్యానించిన గ్రంథము. దీనిని అనుసరించి రాముడు పురుషుడు. సీత ప్రకృతి. శ్రీరాముడు పరబ్రహ్మము, సీత ఆయన యొక్క అనిర్వచనీయమైన మాయ. ఈ ఇద్దరి లీలా విలాసమే ఈ సర్వప్రపంచము. బ్రహ్మ, మాయతో కూడా భారాన్ని తగ్గించడంకోసం పరబ్రహ్మమైన రాముని కోరగా ఆయన ఈ భూలోకములో శ్రీరామునిగా అవతరించి తన లీలలను విస్తారంగా ప్రదర్శించాడు.

బ్రహ్మాండ పురాణం నుంచి రామాయణకథ విడిపోయి అధ్యాత్మ రామాయణంగా ప్రసిద్ధి చెందిందని పండితుల విశ్వాసం. లేకపోతే రామాయణ కథ దాదాపు అన్ని ఇతర పురాణాలలోను ఉన్నదే. కానీ అధ్యాత్మ రామాయణంలో అది బాగా విస్తరించబడింది. నారదపురాణంలో చెప్పబడిన బ్రహ్మాండ పురాణ విషయానుక్రమణికలో రామాయణ ప్రసక్తి లేదు. చెప్పబడుతున్న శ్లోకాల సంఖ్య అధ్యాత్మ రామాయణము, లలితోపాఖ్యానము కలవనిదే పూర్తికాదు. ఈ రెండు విడి గ్రంథాలే గాక బ్రహ్మాండ పురాణం నుంచి ఇంకా గణేశ కవచం, తులసీకవచం హనుమత్కవచం, సిద్ధ లక్ష్మీ స్తోత్రం, సీతాస్తోత్రం, లలితా సహస్రనామస్తోత్రం, లలితోపాఖ్యానం, సరస్వతీస్తోత్రం వంటివి వేరుగా విడదీయవచ్చును.

ఈ పురాణంలో పరశురామచరిత్ర కూడా సవిస్తరంగా చెప్పబడింది. పరశు రామునితో దృఢ సంబంధం ఉండటం చేతను, సహ్యపర్వత గోదావరీ ప్రాంతాలను అధి కంగా వర్ణించటం చేతను, ఈ పురాణం ఆ ప్రాంతాలలో రచింపబడి ఉంటుందని, దీనిలోని కొన్నిభాగాలు ప్రాచీన మైనవని అందువలన ఇది క్రీ.పూ. 1,2 శతాబ్దాలలోనే రచితం అయి 600–900 సంవత్సరాలలో పరిపూర్ణం అయి ఉంటుందని పండితుల అభిప్రాయం.

మహా పురాణాలలో చివరి స్థానాన్ని ఆక్రమిస్తున్న బ్రహ్మాండ పురాణం వాయు పురాణంలాగానే నాలుగు పాదాలుగా విభజించటం జరిగింది. 1. ప్రక్రియాపాదము 2. అనుషంగ పాదము, 3. ఉపోద్ఘాత పాదము, 4. ఉపసంహార పాదము.

ఇందులో మొదటి రెండు పాదాలైన ప్రక్రియ, అనుషంగాలను పూర్వ భాగమని తరువాత తృతీయ పాదమైన అనుషంగ పాదాన్ని మధ్యభాగమని నాల్గవదైన ఉపసంహార పాదాన్ని ఉత్తర భాగమని పిలుస్తారు. వీనిలో మొత్తం 161 అధ్యాయాలు ఉన్నాయి. ఈ పురాణంలో నారద పురాణాను సారం 12 వేల శ్లోకాలు మత్స్య పురాణానుసారం 12 వేల రెండువందల శ్లోకాలు ఉన్నాయి.

పురాణాలలోని విషయ ఐక్యత

మొత్తం మీద పరిశీలించగా కొన్ని పురాణాలలో ఒక కథ విస్తృతంగా వర్ణించబడి ఉంటే ఇంకొక దాంట్లో అతి సంక్షిప్తంగా ఉండవచ్చు. కొన్ని ఉదాహరణలను పరిశీలిద్దాం. వాయు పురాణంలో గయామాహాత్మ్యం విస్తృతంగా 56 శ్లోకాలలో ఉంటే అగ్ని పురాణంలో సంక్షిప్తంగా 23 శ్లోకాలలోనే చెప్పబడింది. అలాగే మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామనావతార కథలు వాయుపురాణంలో అతి సంక్షేపంగా ఉన్నాయి.

రామాయణంలోని ఏడుకాండల కథ అగ్ని పురాణంలో ఏడు అధ్యాయాలలో చెప్పబడింది. కానీ గరుడపురాణంలో ఒక అధ్యాయంలోనే సరిపెట్టబడింది. అలాగే మహాభారతకథ అగ్ని పురాణంలో మూడు అధ్యాయాలలో ఉంటే గరుడ పురాణంలో ఒక అధ్యాయంలో ముగించబడింది. హరివంశం మొత్తం కేవలం 55 శ్లోకాలలో గరుడపురాణంలో ముగించబడింది.

ఆయుర్వేదాన్ని గురించి గరుడ పురాణంలో 57 శ్లోకాలలో ఉంటే అగ్ని పురాణంలో అది 200 శ్లోకాలుగా ఉన్నది. అగ్ని పురాణం, గరుడ పురాణం రెండింటిలోను కార్తికేయుని మొదలుకొని కాత్యాయనుడి వరకు వ్యాకరణ విషయాలు వచ్చాయి. కానీ పాణిని గురించిన ఊసేలేదు. అగ్ని పురాణంలో 'విద్య'కు సంబంధించిన విషయాలు చెప్పబడినను గరుడు నారద పురాణాలలో కనీసం దానిని పేర్కొనలేదు.

అదేవిధంగా గరుడపురాణంలో నాట్యశాస్త్రానికి సంబంధించిన చర్చ, ఆనందవర్ధనాచార్యుని ద్వారా చెప్పబడిన 'ధ్వని' యొక్క వికాసవర్ణన చక్కగా ఉన్నా, గరుడ పురాణంలో కనిపించదు. ఇలాంటివి అనేక భేదసాదృశ్యాలు పురాణాల గురించి చెప్పతగినవి ఎన్నో ఉన్నాయి.

వివిధ పురాణాల ఆది శ్రోత - వక్త

ఇక్కడ చెప్పబడినవి ఆయా పురాణాలను మొదటగా చెప్పిన వక్తలు వారి నుంచి మొదటిసారి విన్న శ్రోతలు, తరువాత ఒక్కొక్క పురాణానికి వక్తృ శ్రోతృపరంపర ఉండ వచ్చును.

సం.	పురాణం	ఏకల్పవృత్తాంతం	వక్తృశ్రోతలు
1.	బ్రహ్మ పురాణాన్ని	బ్రహ్మ కల్పంలో	బ్రహ్మ మరీచి మహామునికి బోధించాడు
2.	పద్మ పురాణాన్ని	పద్మ కల్పంలో	స్వయంభువుమనువు బ్రహ్మకు బోధించాడు
3.	విష్ణు పురాణాన్ని	వరాహ కల్పంలో	పరాశరుడు బ్రహ్మకు బోధించాడు
4.	శివ (వాయు) పురాణాన్ని	శ్వేత కల్పంలో	శివుడు వాయువుకు బోధించాడు
5.	భాగవత పురాణాన్ని	సారస్వత కల్పంలో	విష్ణువు బ్రహ్మకు బోధించాడు
6.	నారద పురాణాన్ని	బృహత్ కల్పంలో	పూర్వ భాగాన్ని - సనకాదులు నారదునికి బోధించారు. ఉత్తరభాగాన్ని - వశిష్ఠుడు మాంధాతకు బోధించాడు
7.	మార్కండేయ పురాణాన్ని	శ్వేత వారాహకల్పంలో	మార్కండేయుడు జైమినికి బోధించాడు
8.	అగ్ని పురాణాన్ని	ఈశాన కల్పంలో	అగ్నిదేవుడు వశిష్ఠునికి బోధించాడు
9.	భవిష్య పురాణాన్ని	అఘోర కల్పంలో	బ్రహ్మ మనువుకు బోధించాడు
10.	బ్రహ్మ వైవర్త పురాణాన్ని	రథంతర కల్పంలో	సావర్ణి నారదునికి బోధించాడు
11.	లింగ పురాణాన్ని	కల్పాంతకల్పంలో	పరమశివుడు నారదునికి బోధించాడు
12.	వరాహ పురాణాన్ని	మనుకల్పంలో	విష్ణువు పృథ్వికి బోధించాడు
13.	స్కాంద పురాణాన్ని	తత్పురుషకల్పంలో	స్కందుడు భూమికి బోధించాడు
14.	వామన పురాణాన్ని	కూర్మ కల్పంలో	బ్రహ్మ పులస్త్య మహామునికి బోధించాడు
15.	కూర్మ పురాణాన్ని	లక్ష్మీ కల్పంలో	విష్ణువు పులస్త్య మహామునికి బోధించాడు
16.	మత్స్య పురాణాన్ని	సప్త కల్పంలో	విష్ణువు మనువుకు బోధించాడు
17.	గరుడ పురాణాన్ని	గరుడ కల్పంలో	విష్ణువు మనువుకు బోధించాడు
18.	బ్రహ్మాండ పురాణాన్ని	భవిష్య కల్పంలో	బ్రహ్మ మనువుకు బోధించాడు

వివిధ పురాణాలలోని శ్లోక సంఖ్య

పురాణం పేరు	అగ్నిపురాణం ప్రకారం 272 అధ్యాయం	మత్స్యపురాణం ప్రకారం (53) అధ్యాయం	నారద పురాణం ప్రకారం	భాగవతం ప్రకారం (12 - 13)	దేవీభాగవతం ప్రకారం (1 - 3)
1. బ్రహ్మ పురాణం	25,000	13,000	10,000	10,000	10,000
2. పద్మ పురాణం		55,000	55,000	55,000	55,000
3. విష్ణు పురాణం	23,000	23,000	23,000	23,000	23,000
4. శివ పురాణం	14,000 (వాయు)	24,000 (వాయు)	24,000	24,000	24,6000 (వాయు)
5. భాగవతం	18,000	18,000	18,000	18,000	18,000
6. నారద పురాణం	25,000	25,000	25,000	25,000	25,000
7. మార్కండేయ పురాణం	9,000	9,000	9,000	6,000	6,000
8. అగ్ని పురాణం	12,000	16,000	15,000	15,400	16,000
9. భవిష్య పురాణం	14,000	14,500	14,000	14,5000	14,500
10. బ్రహ్మ వైవర్త పురాణం	18,000	18,000	18,000	18,000	18,000
11. లింగ పురాణం	11,000	11,000	11,000	11,000	11,000
12. వరాహ పురాణం	14,000	24,000	24,000	24,000	24,000
13. స్కాంధ పురాణం	84,000	81,000	81,000	81000	81,000
14. వామన పురాణం	10,000	10,000	10,000	10,000	10,000
15. కూర్మ పురాణం	8,000	18,000	17,000	17,000	17,000
16. మత్స్య పురాణం	13,000	14,000	15,000	14,000	14,000
17. గరుడ పురాణం	8,000	18,000	19,000	19,000	19,000
18. బ్రహ్మాండ పురాణం	12,000	12,200	12,000	12,000	12,000

జైన సాహిత్యంలో పురాణాలు

అతిప్రాచీన కాలంలోనే అంటే క్రీ.పూ. 600 సంవత్సరాల ప్రాంతంలోనే హిందూ మతం నుంచి వేరై విరోధ భావనలతో ఏర్పడిన మతం జైనం. అయినా హిందూ ధర్మం యొక్క బలమైన ప్రభావం వలన పెద్దగా హిందూమతంతో వేరుపడలేకపోయింది జైనం. కాబట్టి హిందువుల యొక్క వేద వేదాంగాలు అంటే వైదిక సాహిత్యం, పురాణ వాఙ్మయం మొదలైనవాటివలెనే జైనమతానుయాయులు కూడా తమవైన ధర్మ గ్రంథాలు, దర్శన గ్రంథాలు వంటి వానితోపాటు పురాణ సాహిత్యాన్ని కూడా ఏర్పాటు చేసుకొన్నారు. ఇతర ధర్మాలకు చెందిన గ్రంథాలపై హిందూ పురాణాల ప్రభావం ఎలా ఉన్నదో అలాగే జైన ధార్మిక వాఙ్మయంపైన హిందూ పురాణాల ప్రభావం ఎక్కువగానే ఉన్నది.

మధ్య యుగాలలో భారతీయ దర్శన శాస్త్రాలలో న్యాయగ్రంథాలను రచించినవారు జైనులు బౌద్ధులే. అయితే బౌద్ధ జైనులు వేదాలను ప్రామాణికంగా అంగీకరించనందువలన వారి దర్శనాలను

నాస్తిక దర్శనాలనటం మొదలైంది. ఆస్తిక దర్శనాలు న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, మీమాంసలనే ఆరని మనకు తెలిసినదే. అలాగే నాస్తిక దర్శనాలనే వేద ప్రామాణ్యాన్ని అంగీకరించని దర్శనాలు ఆరు భాగాలుగా ఉన్నాయి. అవి : చార్వాక దర్శన, జైనదర్శన, బౌద్ధ దర్శనాలు అనేవి. మళ్ళీ బౌద్ధ దర్శనాలు సంప్రదాయ భేదాలతో నాలుగు భాగాలుగా విభజించబడ్డాయి. అవి : 1. మాధ్యమిక, 2. యోగాచార, 3. సౌత్రాంతిక వైభాషికభాగాలు, ఎవరో తెలీదు కానీ ఈ నాలుగు విధాల బౌద్ధ సంప్రదాయాన్ని ముఖ్య లక్షణాలన్నింటినీ ఒక్క శ్లోకంలో ఎంత బాగా చెప్పాడో చూడండి.

ముఖ్యోమాధ్యమికో వివర్తమఖిలం శూన్యస్యమేనేజగత్
యోగాచారమతేతు సంతి మతయస్తానాం వివర్తో ఒ ఖిలః
అర్థోస్తి క్షణికస్త్వసావనుమితో బుద్ధ్యేతి సౌత్రాంతికః
ప్రత్యక్షం క్షణ భంగురంచ సకలంవై భాషికో భాషతే

నాస్తిక దర్శనాల చారిత్రక ప్రభావంచేత ఆస్తిక దర్శనాలు ఆరూ ప్రభావితమైనాయి. యథార్థానికి బౌద్ధ జైనాలు రెండూ విశాల హిందూజాతికి అంగాలే. హిందువులపై తమ ధర్మము, దర్శనాల ప్రభావం ఉన్నట్లుగానే జైనులపైగూడా వారి పురాణముల ప్రభావం ఉన్నది.

బ్రాహ్మణకపురాణాలలో అష్టాదశ పురాణాలు, ఉపపురాణాలు ఉన్నట్లుగానే జైన ధర్మంలో కూడా 24 పురాణాలు ఉన్నాయి. ఈ 24 పురాణ గ్రంథాలలో జైన ధర్మానికి చెందిన 24 మంది తీర్థంకరులైన మహాపురుషుల మాహాత్మ్యం చెప్పబడింది. అయితే బ్రాహ్మణ మతానికి చెందిన అష్టాదశ పురాణాలు పంచ లక్షణ సమన్వితాలు. కానీ జైన పురాణాలకు ఈ పంచలక్షణాలు ఉండవు. పైగా పురాతనం పురాణం 'స్యాత్తన్మహన్మహ దాశ్రయాత్' అని చెప్పటం చేత తమజిన ధర్మానికి చెందిన ప్రాచీన మహాపురుషుల కథా ప్రతిపాదకాత్మకాలుగా ఉంటాయి. జైనుల ఇరవై నాలుగు పురాణాలలోను వరుసగా 24 మంది జైనతీర్థంకరుల మాహాత్మ్య కథలు చెప్పబడి ఉంటాయి. ఈ పురాణాలలో

1. ఆదిపురాణం
2. అజితనాథపురాణం
3. సంభవనాథ పురాణం
4. అభినందపురాణం
5. సుమితనాథపురాణం
6. పద్మ ప్రభ పురాణం
7. సుపార్శ్వ పురాణం
8. చంద్రప్రభపురాణం
9. పుష్పదంత పురాణం
10. శీతలనాథ పురాణం
11. శ్రేయాంస పురాణం
12. వాసుపూజ్య పురాణం
13. విమలనాథ పురాణం
14. అనంతజీత పురాణం
15. ధర్మనాథ పురాణం
16. శాంతినాథ పురాణం
17. కుంథనాథ పురాణం
18. అమరనాథ పురాణం
19. మల్లినాథ పురాణం
20. ముని సువ్రత పురాణం

21. నేమినాథ పురాణం
22. అరిష్టనేమి పురాణం
23. పార్శ్వనాథ పురాణం
24. సమ్మతి పురాణం అనేవి.

ఈ ఇరవై నాలుగు జైన పురాణాలలో బాగా ప్రసిద్ధి గలవి ఆది పురాణం, పద్మప్రభ పురాణం, అరిష్టనేమి పురాణం (దీనికే ఇంకొక పేరు హరివంశపురాణం) ఉత్తరపురాణాలే. మళ్ళీ వీటిల్లో ఆదిపురాణం, ఉత్తర పురాణాలు అనే వాటికి విశేష ప్రభావం ఉన్నది.

ఆదిపురాణం

జినధర్మంలో మొదటి తీర్థంకరుడైన ఋషభదేవుని కథలు ఈ పురాణంలో వర్ణించబడ్డాయి. ఈ పురాణం ప్రకారము, జైన సంప్రదాయం ప్రకారం పరంపరగా వస్తున్న వినికిడిని అనుసరించి ఈ ఋషభ దేవుడు సర్వార్థ సిద్ధియోగంలో ఉత్తరాషాఢ నక్షత్రం ధనూరాశిలో ఉన్నప్పుడు చైత్రమాసం కృష్ణాష్టమీ రోజు ఇక్ష్వాకు వంశరాజు నాభి అతని భార్య మరుదేవి గర్భంలో, వినీత మనే నగరంలో జన్మించాడు. ఆయన చతుర్యుగాల సమాప్తి పర్యంతం అంటే ఎనభై నాలుగు లక్షల సంవత్సరాల పాటు జీవించి మోక్షప్రాప్తి చెందగలరని జైనమత సంప్రదాయం తెలుపుతున్నది. భాగవతంలో ఈ తీర్థంకరుని వర్ణన హృదయంగమంగా ఉంటుంది. భాగవతంలో కూడా ఈ తీర్థంకరుని తల్లిదండ్రుల పేర్లు మరుదేవి, నాభి అనే చెప్పబడింది. ఈయన భగవద్గుణ సంపన్నుడని భాగవతం వర్ణిస్తున్నది. ఈయన భార్యపేరు జయంతి అని, ఆమె ఇంద్రుని కుమార్తె అని, ఆమె ద్వారా ఆయనకు ధర్మాత్ములు, వేదజ్ఞులు, భాగవత ధర్మానుయాయులైన భర తుడు కుశావర్తుడు మొదలైన నూర్గురు పుత్రులు జన్మించారని అదే గ్రంథం వివరిస్తున్నది. భాగవతంలో చెప్పబడిన భగవంతుని అవతారాలలో ఎనిమిదవది ఈ ఋషభ దేవుని అవతారము.

ఈ పురాణంలో 47 పర్వాలు ఉన్నాయి. మహాభారతంలో గూడా గ్రంథాంతర విభాగాల పేరు పర్వాలే గదా. ఈ గ్రంథ రచయిత జనసేనుడు ఈ గ్రంథంలో సిద్ధసేనుడు, వాదీంద్ర చూడామణి, సమంత భద్రుడు, దేవముని మొదలైన వారి పేర్లను పేర్కొన్నాడు. ఇందువలన గ్రంథ రచనా కాలం సుగమం అయింది. రచయితకు వీరందరి సహాయం లభించినట్లు తెలుస్తున్నది. ఈ గ్రంథంలో సృష్టి తత్త్వ విచారణకు సంబంధించి వ్యక్తీక రించిన భావాలను పరిశీలిస్తే రచయిత రాబోయే కాలంలో ఆచార్య శంకరుల వారి అద్వైత మత సిద్ధాంత బ్రహ్మసంబంధ వాదాలను ఖండించటానికే చెప్పబడిందా అన్నట్లు ఉంటుంది.

ఉత్తర పురాణం

ఇది ఆది పురాణానికి ఉత్తర భాగం. ఆదిపురాణకర్త జిన సేనాచార్యుడు. అందులో 44 సర్గలు వ్రాసిన తరువాత పరమపదం చెందాడు. తరువాత 45వ సర్గ నుండి 47వ సర్గ వరకు వ్రాసి ముగించి చివరలో జినసేనుని చరిత్రను కూడా కలిపి రచించి జినసేనుని శిష్యుడైన గుణభద్రుడు ఆదిపురాణ ఉత్తర భాగాన్ని సమాప్తం చేశాడు. గ్రంథం చివరి భాగంలో సమస్త శాస్త్రాలకు సారభూతమైన ఈ పురాణం ధర్మపరులైన, శ్రేష్ఠులచేత శకం 820, పింగళ సంవత్సర

ఆశ్వయుజమాస శుక్ల పక్ష పంచమి బృహస్పతి వారంనాడు పూర్తిచేయబడ్డది అని పేర్కొనబడింది. ఈ కాలం విశ్వవిఖ్యాత కీర్తిశాలి, సర్వశత్రు వినాశకుడు అకాలవర్స చక్రవర్తి రాజ్యాధిరోహణం చేసిన సంవత్సరానికి సరిపోతుంది.

వస్తుతః ఉత్తర పురాణం జైనుల చతుర్వింశతి (ఇరవై నాలుగు) పురాణాలకు సారభూతమైన కోశం లాంటిది. ఇందులో అన్ని జైన పురాణాల సారము ఇమిడి ఉన్నది. ఇది 48వ పర్వంతో మొదలు అవుతుంది. రెండవ జైనతీర్థంకరుడు అజితనాథుని నుంచి 24వ తీర్థంకరుడైన మహావీర స్వామి వరకుగల అందరు తీర్థంకరుల చరిత్రలు ఇందులో ఉన్నాయి. ఆదిపురాణం ఉత్తర పురాణాలలో తీర్థంకరుల జీవిత చరిత్ర చిత్రణకు ముందుగా చక్రవర్తులు, రాజుల చరిత్రలు ఉన్నాయి. జైన పురాణాలను అనుసరించి పూర్వజన్మలో ఈ రాజులు, చక్రవర్తులే మరుజన్మలో తీర్థంకరులుగా జన్మనెత్తారు. ఈ రెండు పురాణాల తోను కలిపి ఇరవై నాలుగు మంది తీర్థంకరులు, పన్నెండు మంది చక్రవర్తులు, తొమ్మిది మంది వాసుదేవులు తొమ్మిది మంది శుక్లబలులు, తొమ్మిది మంది విష్ణుద్విసులు మొత్తం అరవై మూడు మంది మహాత్ముల చరిత్రలు వివరించబడ్డాయి. అందుకే దీనిని 'త్రిషష్ట్య వయవి' అని కూడా అంటారు.

బౌద్ధ సాహిత్యంలో పురాణాలు

బౌద్ధ పురాణాలనే త్రిపిటకాలంటారు. హిందూ ధర్మంలో పురాణాలకు ఎంత వైశిష్ట్యం ఉన్నదో బౌద్ధ ధర్మంలో త్రిపిటకాలకు అంతే విశిష్టత ఉన్నది. బుద్ధ భగవానుడు జ్ఞానోదయం కలిగి బుద్ధత్వాన్ని పొందిన తరువాత ఆయన మహాపరినిర్వాణం (స్వర్గా రోహణం) పొందేంతవరకు ఉన్న మధ్యకాలంలో ఆయన ఉపదేశించిన విషయాలు సమ స్తమూ సంగ్రహంగా త్రిపిటకాలలో సంకలించబడ్డాయి. త్రిపిటకాల (అంటే మూడు గంపలు)లో బోధిసత్త్వుడు అయిన బుద్ధ భగవానుని బోధనలు అన్నీ పొందుపరచబడి ఉన్నాయి.

1. సుత్త పిటకం,
2. వినయ పిటకం,
3. అభిధర్మ పిటకం

అనేవి ఆ మూడు బౌద్ధ పిటక గ్రంథాలు.

1. స్తుతపిటకం లేక సూత్ర సమూహము అనే మొదటి గ్రంథంలో బౌద్ధులు అనుసరించవలసిన ఉపదేశాలు సూత్ర రూపంలో సంగ్రహించబడ్డాయి.
2. వినయ పిటకం అనే రెండవ గ్రంథంలో సంక్షేమ విషయాలను తెలిపే బోధనలు సంకలిం చబడ్డాయి.
3. అభిధమ్మ పిటకం అనే మూడవ గ్రంథంలో నైతిక, మనోవైజ్ఞానిక ధర్మాలు విశ్లేషించ బడ్డాయి. ఇవి దార్శనికత ఆధారంగా శిలలపై చెక్కించబడిన, వాటి ఆధారంగా నిలిచి ఉన్నందుకు ఏమి కారణమో తెలియకుండా ఉన్నది.

తథాగత బుద్ధుని అనుయాయులైన విద్వాంసులు ఈ త్రిపిటకాలను సంపాదించి సంకలనం చేశారు. ఈ గ్రంథాల ఆధారంగానే బౌద్ధ ధర్మానికి చెందిన ధార్మిక, ఆధ్యాత్మిక, భౌతిక, తాత్త్విక విషయాలను, వానిని ఆచరించవలసిన విధానాలను గురించి తెలుసుకొనే వీలుకలుగుతున్నది. వీటి ద్వారా శీలము, సమాధి, బుద్ధి అనే మూడు గుణాలతో సుసంప న్నుడైన వ్యక్తి మాత్రమే ఈ భవసాగరబంధనాలనుంచి విముక్తుడు కాగలడని బుద్ధ భగవానుని ఉపదేశాల సారమని గ్రహించవచ్చు.

పురాణ పురుషుడు నారాయణుడు

అష్టాదశ పురాణాలు నారాయణుడైన శ్రీమహావిష్ణువు యొక్క శరీరముగనే భావింపబడింది. నారాయణుడు పురాణపురుషుడు అని భావించటం సమర్థనీయమే కదా. అందుచేత ఆ పురాణ పురుషుని అష్టాదశ పురాణ మూలమూర్తిగా భావించటం జరిగింది. ఈ విషయం పద్మపురాణం ఆదిఖండంలో చెప్పబడింది. విష్ణువు యొక్క వివిధ అవయవాలు వివిధ పురాణాలుగా భావించ బడ్డాయి. అప్పుడు మొత్తం అష్టాదశ పురాణాలు ఆయన స్వరూపమే అవుతుంది.

సీ. పాద్మము హృదయంబు బ్రాహ్మము మూర్ధంబు
మజ్జగారుడము వామనము త్వచము.
భాగవతము దొడల్ బ్రహ్మాండమస్థులు
మాత్స్యము మెదడు కౌర్మంబు వెన్ను
లైంగవారాహముల్ దక్షిణ వామ గు
ల్ఫంబులు నారదీయంబు నాభి
రోమముల్ స్కాందము వామ దక్షిణ భుజ
ద్వంద్వంబు శైవంబు వైష్ణవంబు

గీ. వామపాద మాగ్నేయంబు వామజాను
తలము బ్రహ్మవైవర్తంబు దక్షిణోరు
పర్వము భవిష్య మపసవ్య భావమొంది
నట్టి పదము మార్కండేయ మచ్యుతునకు.

(ఆంధ్రపద్మ పురాణం. ఆది ఖం. 828)

అని పద్మ పురాణం తెలుపుతున్నది. దీనిని అనుసరించి పురాణ పురుషుడైన నారాయణుని అవయవములతో వివిధ పురాణములు ఏకీభవిస్తాయి.

పటము (విష్ణు మూర్తి పటము)

1.	పద్మ పురాణము	-	హృదయము
2.	బ్రహ్మ పురాణము	-	శిరస్సు
3.	గరుడ పురాణము	-	మజ్జ
4.	వామన పురాణము	-	చర్మము
5.	భాగవత పురాణము	-	తొడలు
6.	బ్రహ్మాండ పురాణము	-	ఎముకలు
7.	మత్స్య పురాణము	-	మెదడు
8.	కూర్మ పురాణము	-	వెన్ను (పృష్ఠము)
9.	లింగపురాణము	-	కుడిచీలమండ
10.	వరాహ పురాణము	-	ఎడమ చీలమండ
11.	నారద పురాణము	-	బొడ్డు
12.	స్కాందపురాణము	-	వెంట్రుకలు
13.	శివపురాణము	-	ఎడమ భుజము
14.	విష్ణుపురాణము	-	కుడి భుజము
15.	అగ్ని పురాణము	-	ఎడమ పాదము
16.	మార్కండేయ పురాణము	-	కుడి పాదము
17.	బ్రహ్మవైవర్త పురాణం	-	ఎడమ మోకాలు
18.	భవిష్య పురాణం	-	కుడి మోకాలు.

పురాణ లక్షణాలు

ప్రపంచంలో ప్రతివస్తువుకు ధర్మాలు లేక లక్షణాలు అనేవి ఉంటాయి. అలాగే పురాణమంటే ఏమిటి అని చాలామందికి సందేహం కలుగుతుంటుంది. తేలికగా 'పురాణం పంచ లక్షణం' అని పెద్దలు చెప్తుంటారు. అంటే అయిదు లక్షణాలు గలది పురాణం అని ఆ అయిదు లక్షణాలేవి అంటే

సర్గశ్చ ప్రతి సర్గశ్చ వంశో మన్వంతరాణిచ
వంశాను చరితం చేతి పురాణం పంచ లక్షణమ్ ***(మత్స్యపు - 53 - 64)***

అంటే 1. సర్గము, 2. ప్రతి సర్గము 3. వంశం 4. మన్వంతరం 5. వంశాను చరితమనే అయిదు లక్షణాలుగలది పురాణము. ఈ శ్లోకం దాదాపు అన్ని పురాణాలలోను, సంస్కృత నిఘంటువు అమరకోశంలోను కనిపిస్తుంది. ఈ పంచలక్షణాలు సర్వేసర్వత్ర పరిగణింపబడే పరంపరాగత విషయంగా భావించవచ్చు. పురాణాలకు భాగవతం వంటి కొన్ని పురాణాలు దశ లక్షణాలను నిర్దేశిస్తున్నాయి. అయితే పంచలక్షణాలే ప్రాచీనమైనవిగా భావించబడుతున్నాయి.

ఈ అయిదు లక్షణాలు అన్ని పురాణలలోనూ కొంత సమన్యూనాధిక రూపంలో వర్ణించ బడినవే. కొన్నింటిలో ఒక లక్షణం గురించి అధికంగా, కొన్ని లక్షణాలు అల్పంగా చెప్పబడి ఉండ వచ్చు. కొన్ని పురాణాలలో ఒక విషయమే చాలా విస్తృతంగా వర్ణించిన సందర్భాలు ఉన్నాయి. ఉదాహరణకు మార్కండేయపురాణంలో కేవలం మన్వంతర విషయాన్ని గురించే విపుల వివరణ ఉండగా, భాగవతంలో వంశాను చరితం మాత్రమే ప్రధానం చేయబడింది. విష్ణుపురాణంలో సర్గ

అంటే సృష్టి విషయాన్ని గురించిన విపుల వర్ణన ఉన్నది. ఆయా పురాణాలలో ఒక విషయం యొక్క ఆధిక్యత ఇంకొక విషయం యొక్క న్యూనత కనిపిస్తుంది. అందువలన పురాణాలలోని రహస్యాలను తెలుసుకొనాలంటే అన్ని పురాణాల సవిమర్శనాత్మక అధ్యయనం అవసరం. అప్పుడు పురాణ రహస్యాల యథార్థ జ్ఞానం కలుగుతుంది.

1. **సర్గం :** ఈ సర్వ ప్రపంచము అందులోని నానా పదార్థాల ఉత్పత్తి అనగా సృష్టినే సర్గ అంటారు. సర్వానికి మూలమైన ప్రకృతిలో మూల గుణాలు క్షుబ్దం అయిపోయినప్పుడు మహతత్త్వం ఉద్భవిస్తుంది. ఈ మహత్తత్వం నుంచి సత్వరజస్తమోగుణాలనే మూడు గుణాలు అహంకారాలు అవుతాయి. ఈ త్రివిధాలైన అహంకారాల నుంచి పంచతన్మాత్రలు (భూతములు మాత్రం) ఇంద్రియాలు, అలాగే (పంచ)భూతాలు పుడతాయి. ఈ ఉత్పత్తి క్రమవిధానమే సర్గము అని పిలువబడుతుంది.

దీని ముఖ్య వర్ణన పురాణాల ద్వారానే లభ్యం అవుతున్నది. శ్రీమద్భాగవతంలో (12-7-11)

అవ్యాకృత గుణక్షోభాన్ మహతస్త్రివృతో౽హమ్
భూతమాత్రేంద్రియార్థానాం సంభవః సర్గ ఉచ్యతే

అని సర్గ యొక్క లక్షణం తెలుపబడింది.

అంటే ఈ జగత్తు అందలి నానా పదార్థాల ఉత్పత్తి లేక సృష్టి సర్గ అని చెప్పబడు తుంది. ఈ సృష్టిలో శాశ్వతుడు పరమాత్మయైన భగవంతుడు. ఆయనలో నిక్షిప్తంగా ఉండే ప్రకృతితత్త్వం యొక్క సత్త్వ, రజస్తమోగుణాల క్షోభ్యతచేత మహత్తత్త్వము జనించి దాని నుంచి అహంకార తత్త్వము, ఆ అహంకార తత్త్వం నుంచి పంచతన్మాత్రలు, ఏకా దశ ఇంద్రియాలు పంచమహా భూతాలు, వీనికి అధిష్ఠాతలైన దేవతల ఉత్పత్తిని లేక సృష్టిని సర్గ అంటారు.

2. ప్రతి సర్గము : సర్గం అనే పదానికి వ్యతిరేకమైనది ప్రతిసర్గం. అంటే సమస్త ప్రపంచం యొక్క ప్రళయం. విష్ణుపురాణంలో ప్రతి సర్గము అనే లక్షణానికి బదులుగా 'ప్రతి సంచరము' అని చెప్పబడింది. ఈ బ్రహ్మాండం స్వభావరీత్యానే ప్రళయకారి. ఈ ప్రళయం నాలుగు విధాలు. నైమిత్తికము ప్రాకృతికము, నిత్యము, ఆత్యంతికములనేవే ఆ నాలుగు.

3. వంశం : 'రాజ్ఞాం బ్రహ్మప్రసూతానాం వంశం స్త్రైకాలికో ౽న్వయః అంటుంది భాగవతం. అంటే బ్రహ్మ ద్వారా ఎందరు రాజులు సృష్టించబడ్డారో వారి యొక్క భూత, భవిష్యవర్తమాన కాలంలో గల సంతాన పరంపరను వంశము అని అంటారు. వాస్తవానికి పురాణాలలో రాజవంశాల వర్ణన మాత్రమే కాక ఋషులవంశాల వర్ణనకూడా చేయబడింది.

4. మన్వంతరం : పురాణాలలో చెప్పబడిన ప్రకారం ఈ పదానికి అర్థం విభిన్న కాలాలలో జరిగిన సంఘటనలకు గుర్తుగా ఉండే కాలగణనం. పురాణాలను అనుసరించి మొత్తం 14 మన్వంతరాలు ఉన్నాయి. ప్రతి మన్వంతరానికి ఒక అధిపతి ఉంటాడు. ఆయన ఒక మనువు. ఆ మనువు సహాయం వలననే పంచ పదార్థాలు ఇంకా అనేక విభజనలుగా ఉత్పత్తిని పొందుతాయి. దేవతలు, మను

పుత్రులు, ఇంద్రుడు, సప్తర్షులు, భగవంతుని యొక్క అవతారాలు అనే ఆరు విశేషాలతో కూడిన కాలాన్నే మన్వంతరం అని అంటారు.

5. వంశాను చరితము : 'వంశాను చరితం తేషాం వృత్తం వంశ ధరాశ్చయే' అంటుంది భాగవతం (12 -7-16). ఇంతకుముందు తెల్పినట్లుగా చక్రవర్తుల, ఋషుల వంశాలలో ఉత్పన్నం చెంది, ఆయా వంశాలకు మూల పురుషులైన రాజుల విశిష్ట వర్ణనమే వంశాను చరితం అనబడుతుంది. ఇందులోనే మనుష్య సంతతిగా వివిధ వంశాలలో జన్మించిన మహర్షులు రాజుల చరిత్ర కూడా చేర్చబడి ఉంటుంది. మహర్షుల చరిత్రలను తెలుపుతూ వివిధ రాజ వంశాల చరిత్రను కూడా ప్రత్యేకంగా పురాణాలు వివరించాయి.

కానీ ప్రాచీన రాజనీతి శాస్త్రాలలో 'పురాణం పంచ లక్షణమ్' అనే పంచ లక్షణాలకు ఒక కొత్త విశ్లేషణ కనిపిస్తుంది. ఇది ఇంతకుముందు చెప్పిన అయిదు లక్షణాలతో పూర్తిగా విభేదిస్తున్నది. కౌటిల్యుని అర్థశాస్త్రానికి చేసిన వ్యాఖ్య (1-5)లో జయమంగళుడు ఒక ప్రాచీన గ్రంథం నుంచి ఉద్ధరించిన.

సృష్టి - ప్రవృత్తి - సంహార - ధర్మ, మోక్ష ప్రయోజనమ్
బ్రహ్మభిర్వివిధైః ప్రోక్తం పురాణం పంచ లక్షణమ్

అనే శ్లోకం ద్వారా ఈ భేదం తెలుస్తున్నది. ఇందులో ముఖ్యంగా చెప్పుకొన వలసినది ధర్మ విషయం. మొదటి నుంచి 'ధర్మం' అనే అంశం పురాణాలకు అవిభాజ్య విషయం అనేది సర్వాంగీకారమైనదే. అంటే దీనిని బట్టి పురాణాలలో మూల భూతమైన విషయం ధార్మిక విషయాల సమాహారం. అందువలననే కాలం గడిచే కొద్దీ ధర్మ సంబంధ విషయాల వివరణలో సహకాలీన వృత్తాంతాలు, విషయాలు కూడా చోటుచేసుకొని విస్తృతి పొందాయి. ఆధునిక పురాణ విమర్శకులు కూడా అందరూ ఈ విషయాన్ని అంగీక రిస్తున్నారు.

పురాణ దశ లక్షణాలు :

పురాణాల పంచ లక్షణాలను సర్వేసర్వత్ర అంగీకరించినా కాలం గడిచేకొద్దీ ఈ పంచ లక్షణాలనే మరికొంత విస్తృత పరచి దశ లక్షణాలు కలిగినది మహాపురాణమని, కేవలం పంచ లక్షణాలున్నది పురాణమనే వాదం ఒకటి బయలుదేరింది. శ్రీమదాగ్భవతంలో రెండు స్థలాలలోను (2-10-1-7, 12-79) బ్రహ్మవైవర్త పురాణంలోను దశ లక్షణాలతో ఉండేది మహాపురాణమనే నిర్ణయం చేయబడింది. అలాగే కేవలం ఐదు లక్షణాలుగలది సామాన్య పురాణంగా పరిగణించ బడింది. భాగవతంలో రెండు స్థలాలలోను చెప్పిన దశ లక్షణాలలోను కొంత విభేదం ఉన్నా, మూలతః అవి ఒకటే. భాగవతంలోని ద్వాదశ స్కంధంలో చెప్పిన దశలక్షణాలు ఇవి :

1. సర్గ 2. విసర్గ 3. వృత్తి 4. రక్షణ 5. అంతరములు 6. వంశము 7. వంశాను చరితము 8. సంస్థా 9. హేతువు 10. అపాశ్రయము.

1. సర్గ : ఇంతకుముందు చెప్పిన సర్గ లక్షణానికి దీనికి భేదం ఏమీ లేదు.

2. విసర్గ : దీని అర్థం జీవుల సృష్టి. పరబ్రహ్మ యొక్క అనుమతితో సృష్టించగలిగిన శక్తిని పొందిన బ్రహ్మ మహత్తత్వము మొదలైన పూర్వ కర్మలను అనుసరించి మంచి చెడు వాసనల

ప్రాముఖ్యాన్ని అనుసరించి ఈ చరాచర శరీరాలతో ప్రత్యేక జీవులను సృష్టించిన విధాన వర్ణనమే విసర్గం అనబడుతుంది.

3. వృత్తి : జీవుల జీవన యాత్ర కోసం ఉద్దేశించిన సామాగ్రి అంటే చరముల కోసం అచర వస్తువుల సృష్టి వృత్తి. అంటే జీవులు జీవయాత్రను సాగించటం కోసం ఏవస్తువులను మనుష్యుడు ఉపయోగించుకొంటాడో అదే అతడి వృత్తి. అంటే మనుష్యుడు బ్రతకటానికి తినే బియ్యం, గోధుమలు మొదలైనవి వృత్తి క్రిందకే వస్తాయి. కొన్ని వృత్తులు అతడు తాను తన ఇచ్ఛ చేత ఏర్పరచుకొన్నవైతే మరికొన్ని జీవునికి ధర్మశాస్త్ర విధి ప్రకారం ఆచరించవలసినవి. కానీ ఏదైనా మానవ జీవనము, రక్షణ కోసం ఉద్దేశించినవే.

4. రక్షణ : ఇది భగవంతునికి సంబంధించినది. యుగయుగాలలోను భగవంతుడు పశు, పక్షి, మనుష్య, ఋషి, దేవుడు మొదలైన రూపాలుగా అవతారం ధరించి అనేక లీలలను ప్రదర్శిస్తాడు. ఈ అవతారాల ద్వారా వేదాలను, వేదధర్మాలను రక్షించి, వాటిని విరోధించే వారిని శిక్షిస్తాడు. సంహరిస్తాడు. అందువలన భగవంతుని అవతార లీలలు విశ్వ రక్షణకు జరిపినట్టివి. అందుకే ఇది రక్షణ అని చెప్పబడుతున్నది.

5. అంతరములు : ఇవే మన్వంతరములని పంచ లక్షణాలో చెప్పబడినట్టివి.

6. వంశము : వివిధ, రాజ, ఋషి వంశాల పుట్టుకను, వృద్ధిని వర్ణించేది.

7. వంశాను చరితము : రాజ, ఋషి వంశాల క్రమాన్ని తరతరాల చరిత్రను తెలిపేవి వంశాను చరితలు. ఇవి కూడా పంచ లక్షణములలో చెప్పిన ధర్మాలు కలవే.

8. సంస్థ : ప్రతి సర్గము అని పంచ లక్షణాలలో చెప్పిన దానికి దీనికి భేదం లేదు.

9. హేతువు : అంటే జీవుడు అనే అర్థాన్ని గ్రహించాలి ఇక్కడ. జీవుడు అవిద్య ద్వారా తాను చేసే, ఆచరించే పనులకు కర్త అవుతున్నాడు. ప్రపంచ సృష్టిలో జీవుడికి ఏం ప్రమేయం ఉందంటే, జీవుని అదృష్టం ద్వారా జరిగే కర్మల వలన సర్గం అంటే సృష్టి విసర్గం అంటే నాశనం జరుగుతున్నాయి. అందుకే ఈ సృష్టి ప్రళయాలకు కారణం లేక హేతువుగా జీవుడు పరిగణింపబడుతున్నాడు. అందువలన పురాణాలలో చెప్పబడిన ఈ విషయానికి సంబంధించిన విస్తృతినే హేతువు అంటున్నారు.

10. అపాశ్రయము : పరబ్రహ్మకే ఇంకొక పేరు. జీవునికి మూడు వృత్తులు లేక అవస్థలు ఉన్నాయి. జాగ్రదవస్థ స్వప్నము సుషుప్తి అనేవి ఆమూడు అవస్థలు. ఈ మూడు దశలలోను జీవునిలో చైతన్యం ఉంటుంది. ఈ చైతన్యమే విశ్వము, తేజస్సు, ప్రజ్ఞా అనేపేర్లతో పిలువబడుతుంది. ఈ మాయామయ వృత్తులలో సాక్షిరూపంగా ఎల్లప్పుడు జీవునిలో ఉండే మహాశక్తే అధిష్ఠాన రూపంలోని అపాశ్రయతత్త్వం. ఆ మహాశక్తే పర బ్రహ్మము లేక అపాశ్రయము అని పిలువబడుతుంది. జీవుని అన్నిస్థితులలోనూ ఈ అపాశ్రయశక్తి ఉంటుంది. ఆశక్తి నామరూపాత్మక పదార్థాలతోపాటుగా ఒకప్పుడు యుతంగా (ప్రత్యక్షంగా) మరొకప్పుడు అయుతంగా (అంటే కనిపించకుండా) ఉండవచ్చు. ఈ అపాశ్రయతత్వాన్ని వివరించటం పురాణం నిర్వర్తించవలసిన పదవ లక్షణము.

భాగవతం ద్వితీయ స్కంధంలో చెప్పిన దశ లక్షణాలు ఇవి.

1. సర్గ	2. ప్రతిసర్గ	3. స్థానం
4. పోషణం	5. ఊతయము	6. మన్వంతరమ్
7. ఈశానుకథ	8. నిరోధము	9. ముక్తి
10. ఆశ్రయము.		

పై వాని శబ్దార్థ, తత్త్వార్థాలను నిశితంగా పరిశీలిస్తే ఇంతకుముందు చెప్పిన – అంటే ద్వాదశ స్కంధంలోని దశలక్షణాలకు వీటికి పెద్దగా భేదం లేదు.

మొత్తం మీద పంచలక్షణాలైనా, దశ లక్షణాలైనా ఒకదాని కొకటి పరస్పర సంబంధం కలవి. ఒకటి రెండవ దానిలో ఐక్యం చెందేవే. పురాణ సాహిత్యం విస్తృతి చెందటంతో సమగ్ర లక్షణం కల్పించాలనే భావనతో పంచ లక్షణాలు దశ లక్షణాలుగా వికాసం చెందాయని భావించటం సముచితం.

పురాణ వర్గీకరణం

మొత్తం అష్టాదశ పురాణాలు రకరకాల వర్గీకరణ చేయబడ్డాయి. ఆవర్గీకరణ వివిధ పురాణాలలో చెప్పబడిన విషయ ప్రధానంగా ఉన్నది. కానీ ఇవి అంతగా శాస్త్రీయం కాదు.

మొదటి వర్గీకరణ పురాణాలు సత్త్వరజస్తమో పురాణాలని అవి ప్రతిపాదించే గుణాలను ఆధారం చేసుకొని మూడు రకాలుగా విభజించడ్డాయి. వీటిలో

1. విష్ణు, నారదీయ, భాగవత, గరుడ పద్మ వరాహపురాణాలు సత్త్వ గుణం కలవి (విష్ణువు యొక్క పారమ్య కారణమైన సాత్త్విక అంశాలు కలవి) కాబట్టి ఈ ఆరు సాత్త్విక పురాణాలు.
2. మత్స్య, కూర్మ, లింగ, శివస్కంద, అగ్నిపురాణాలు తామస గుణప్రధానం కలవి (పరమ శివుని సంహారక తామస అంశాన్ని అనుసరించి) కాబట్టి ఈ ఆరు తామస పురాణాలు.
3. బ్రహ్మ, బ్రహ్మాండ, బ్రహ్మ వైవర్త, మార్కండేయ, భవిష్య, వామన పురాణాలు రజోగుణ ప్రాధాన్యం కలవి. (బ్రహ్మ ప్రపంచ సృష్టిని చేయటానికి అవసరమైన రజో గుణం కలవి) కాబట్టి ఈ ఆరు రాజస పురాణాలు. వీటిల్లో మొదటి ఆరు విష్ణు పారమ్యాన్ని బోధించేవి అంటే వైష్ణవ మత ప్రతిపాదకాలు రెండవ ఆరు శక్తి శివుని పారమ్యాన్ని బోధించేవి అంటే శైవ, శాక్తేయ ప్రతిపాదకాలు. చివరి ఆరు బ్రహ్మకు ప్రాధాన్యత ఇవ్వబడినవి. బ్రహ్మపారమ్యాలు. అందుచేత అవి బ్రహ్మసంబంధాలు.

ఈ వర్గీకరణ ఇలాగే చేసినా మత్స్య, పద్మ గరుడ పురాణాలలో పురాణాలను పేర్కొనటంలో కొంత భేదాలు ఉన్నాయి. గరుడపురాణంలో, కూర్మపురాణం సాత్త్విక పురాణంగా చేర్చబడింది. గరుడపురాణం సాత్త్విక పురాణాలను తిరిగి మూడు భాగాలుగా సాత్త్విక ఉత్తమ (విష్ణు, భాగవత గరుడపురాణాలు) సాత్త్విక మధ్యమ – (వాయుపురాణం) సాత్త్విక అధమ (మత్స్యకూర్మ పురాణాలుగా)

పేర్కొంటున్నది. ఏదైనా ఈ రకమైన విభాగం ప్రాచీనమేకానీ, అంతశాస్త్రీయం కాదు. స్కాంద పురాణం, పురాణాలలో పది శివుడిని, నాల్గింటిలో బ్రహ్మను రెండింటిలో దేవి, రెండింటిలో విష్ణు ఉపాసన చెప్పబడిందని వర్గీకరించింది. దీని ప్రకారం. 1. శివప్రధానం–10 2. బ్రహ్మపారమ్యం–4 3.దేవీ పారమ్యం–2 4.విష్ణు పారమ్యం–2

ఇదే స్కాంద పురాణం శివరహస్య ఖండంలోని సంభవ కాండలో (2–30–38) ఇంకొక వర్గీకరణ కనిపిస్తుంది.

1. శైవ (శివ విషయక పురాణం) శివ, భవిష్య, మార్కండేయ, లింగ, వరాహ, స్కంధ, మత్స్య, కూర్మ వామన బ్రహ్మాండ	–	10
2. వైష్ణవ (విష్ణు విషయక పురాణాలు) విష్ణు, భాగవత, నారదగరుడ	–	4
3. బ్రహ్మ (బ్రహ్మ విషయక పురాణాలు) బ్రహ్మ, పద్మ	–	2
4. సవిత్రు (సూర్య విషయక పురాణాలు) బ్రహ్మ వైవర్త	–	1
5. ఆగ్నేయ (అగ్ని విషయక పురాణం) అగ్ని	–	1
		మొత్తం 18

ఆధునికులు కొందరు ఈ అష్టాదశ పురాణాలను వేరొక విధంగా వర్గీకరించారు.

1. విజ్ఞాన కోశీయ పురాణాలు – అగ్ని, గరుడ, నారద పురాణాలు
2. తీర్థ సంబంధ పురాణాలు – పద్మ, స్కంద, భవిష్య పురాణాలు
3. సాంప్రదాయిక విషయ పురాణాలు – లింగ, వామన, మార్కండేయ పురాణాలు
4. ఐతిహాసిక విషయ పురాణాలు – వాయు, బ్రహ్మాండపురాణాలు

ఈ సందర్భంలో వాయు, బ్రహ్మాండ మత్స్య విష్ణు పురాణాలు ఉన్న వాటిలో అతి ప్రాచీనాలని గుర్తుంచుకోవాలి. వీటిలో మొదటి రకానికి చెందినవానిలో విజ్ఞాన సర్వస్వం అంటే మానవ సమాజానికి ఉపయోగపడే సమస్త విద్యలు (ఆధ్యాత్మిక భౌతిక విద్యలు) అన్నింటి సారాంశం ఉన్నది. వీటిల్లో ప్రాచీన కాలంలో వర్తించిన విద్యలు సంక్షేపంగా, చక్కని విధానంలో తెలుపబడ్డాయి.

రెండవ రకానికి చెందిన వానిలో తీర్థాలు, వ్రతాలు, వాని మాహాత్మ్యాలు మొదలైనవి తెలియ జేయబడ్డాయి. పద్మ స్కాంద పురాణాలు ఈ కోవకు చెందినవి. వీటిని 'ప్రాధాన్యే వ్యపదేశా భవన్తి' అనే న్యాయంగా అర్థం చేసుకోవాలి.

మూడవ వర్గంలోకి, బ్రహ్మ, బ్రహ్మ వైవర్త, భాగవత పురాణాలు వస్తాయి. ప్రాచీన హైందవ సంప్రదాయిక విషయాలెన్నో వీనిలో ఉంటాయి. ఇవి రెండుసార్లు మార్పులను పొందాయని, దాని కేంద్రంగా ఉన్న భాగమే మూలభాగమని పండితుల నమ్మకం.

చతుర్థ విభాగంలో ఐతిహాసిక విషయాలు చెప్పబడిన పురాణాలు వస్తాయి. అంటే ఆయా

పురాణాలలో కలియుగ వంశరాజుల చరిత్రలను, చారిత్రక దృష్టితో చెప్పిన అంశాలు వీటిలో ఉంటాయి. వీటి ఆధారంగానే భారతదేశ చరిత్ర రచింపబడిందనే విషయాన్ని మనం విస్మరించ గూడదు. ఈ రకమైన పురాణాల్లో వాయు, బ్రహ్మాండ పురా ణాలు ఎక్కువగాను, విష్ణు, మార్కండేయ పురాణాలు కొంతవరకు ఉపయోగిస్తాయి.

ఏ విధంగా వర్గీకరణ చేసినా, అది పూర్తిగా సమర్థనీయంగా చేయటం కుదిరేది కాదు. ఒకే పురాణంలో అనేక విషయాలు కలగాపులగంగా ఉంటాయి గదా. కేవలం దానిని ఒక సూచనగా మాత్రమే గ్రహించాలి.

పురాణ సాహిత్యం - మరోవర్గీకరణ :

కాలక్రమేణా పురాణ సాహిత్యం వృద్ధి పొందిందని భావించటంలో ఎలాంటి అభిప్రాయ భేదము లేదు. అనంతర కాలంలో వివిధ స్థలాలలో దైవ తీర్థ క్షేత్ర ప్రశస్తిని ఇనుమడింపచేయటానికి అష్టాదశ పురాణాలను అనుకరిస్తూ కొన్ని పురాణఖండాలు రచింపబడ్డాయి. ఈ రచనలలో అష్టాదశ పురాణాలను అనుకరిస్తూ కొన్ని చోట్ల అందులోని తీర్థక్షేత్ర దైవ మాహాత్మ్యాలను పెంచి కొన్ని సందర్భాలలో హ్రస్వీకరించి, ఏవో కొన్ని కారణాలతో కొంతమార్చి పురాణాలు రచింపబడ్డాయి. వీటినే ఉప పురాణాలన్నారు. ఈ ఉప పురాణాలు కూడా పద్దెనిమిదని చెప్పి వాటికి ప్రామాణ్యతను కల్పించారు.

మహాపురాణాన్యేతానిహ్యష్టా దశమహామునే
తథాచోప పురాణాని మునిభ్యాం కథితానిచ *(వి.పు. 3-624)*

అని అష్టాదశ మహాపురాణ ఉప పురాణాలను మునులే రచించారని విష్ణుపురాణం తెలుపు తున్నది. అయితే మత్స్యపురాణం

అష్టాదశభ్యస్తుపృథక్ పురాణం తత్ర్యదృశ్యతే
విజానీధ్వంద్విజ శ్రేష్ఠాస్తథాతేభ్యో వినిర్గతమ్ (53-63)

అని ఈ అష్టాదశ మహాపురాణాలే కాక ఇంకా ఉన్న పురాణాలు వాటి నుండే ఆవిర్భవించాయి అని కూడా తెలుపుతున్నది. ఈ ఉపపురాణాల నుంచి వాటికి మూలాలైన అసలు పురాణాలను వేరుగా తెలియజేయటానికే అసలైన మూలపురాణాలకు 'మహా' అనే విశేషణం చేర్చి మహా పురాణా లంటున్నారు.

అయితే కొన్ని ఉపపురాణాలు కూడా తమ పేర్లకు ముందు 'మహా' చేర్చుకొని ఈ వర్గీకరణనంతా గజిబిజి చేశాయనేది అసలు విషయం. మహాపురాణాల ప్రామాణికతను శంకించ వలసినపనిలేదు. అయితే ఈ ఉపపురాణాల ప్రామాణికత ఎంతఅంటే (అన్యాశ్చ సంహితాః సర్వా మరీచిక పిలాదయః సర్వత్ర ధర్మకథనే తుల్యసామర్థ్యముచ్యతే) మహా పురాణాలకు ధర్మ విషయాలలో ఎంత ప్రామాణికత ఉన్నదో ఉపపురాణాలకు కూడా సమానమైన ప్రామాణ్యత ఉన్నదని చెప్పబడింది.

నిజానికి లభ్యమవుతున్న ఉపపురాణాలు, సంఖ్యలో కొంత ఎక్కువగానే ఉన్నా, వాటి సంఖ్య కూడా పద్దెనిమిదే – అష్టాదశ పురాణా నామేవ విదుర్బుధాః, ఏవంచో ఏ పురాణానామష్టాదశ ప్రకీర్తితాః (131–22) అని బ్రహ్మ వైవర్త పురాణం తెలుపుతున్నది. స్కాంద పురాణం కూడా పారాశరం భాగవతం క్రౌంచ మష్టాదశమ్ మతమ్ (స్కాంద – రేవాఖండం – 1 – 55) అని ఈ విషయాన్ని బలపరుస్తున్నది. ఉపపురాణాలు :

1. ఆదిపురాణం	2. నరసింహ పురాణం
3. స్కాంద పురాణం.	4. శివ ధర్మ పురాణం
5. దూర్వాస పురాణం	6. నారదీయ పురాణం
7. కపిల పురాణం	8. వామన పురాణం
9. ఔశసన పురాణం	10. బ్రహ్మాండ పురాణం
11. వరుణ పురాణం	12. కాళికా పురాణం
13. మాహేశ్వర పురాణం	14. శాంబపురాణం
15. సౌర పురాణము	16. పారాశర పురాణము
17. మారీచ పురాణము	18. భాస్కర పురాణం

ఈ పురాణాల వరుస ఎవరెవరు ఎవరికి చెప్పారనే విషయాన్ని కూర్మ పురాణం (పూ.అ. 1–17–20)

ఆద్యంసనత్కుమారోక్తం నారసింహ మధాపరమ్
తృతీయం స్కాందముద్దిష్టం కుమారేణచ భాషితమ్
చతుర్థం శివధర్మాఖ్యం సాక్షాన్నందీశ భాషితమ్
దూర్వాస సోక్త మాశ్చర్యం నారదీయమతః పరమ్
కపిలం వామనంచైవ తథైవోశన సేరితమ్
బ్రహ్మాండం వారుణం చాథ కాపిలాహ్వ యమేవచ
మాహేశ్వరం తథా శాంబం సౌరం సర్వార్థ సంచయమ్
పరాశరోక్తమపరం మారీచం భాస్కరాహ్వయమ్

అని ధృవీకరిస్తున్నది. పై సూచికను పరిశీలిస్తే స్కాందపురాణం, బ్రహ్మాండ పురాణం, వామన పురాణం, నారదపురాణం మహాపురాణాలలోను ఉన్నాయి. అలాగే భాగవతాలు దేవీ భాగవతం, విష్ణుభాగవతాలు ఈ సూచికలో లేకపోయినా ఏది మహాపురాణం అనే దానిలో కొంత అభిప్రాయ భేదం ఉన్నది. మహాపురాణాల జాపితాలో ఉన్నది శివపురాణమా వాయు పురాణమా అనేది కూడా సందిగ్ధాంశమే. చాలామంది పండితులు శివపురాణ దేవీ భాగవతాలు ఉపపురాణాలనే వాదాన్ని అంగీకరిస్తున్నారు కానీ ఈ ఉపపురాణాల జాబితాలో అసలు భాగవత ప్రస్తావనే లేదు.

అప్పుడు దేవీ భాగవతం ఏ శాఖ క్రిందకు రావాలి ? కానీ ఔప పురాణాలని ఉన్న ఒక శాఖలో భాగవతం ఉన్నది. అదే దేవీభాగవతం అయి ఉండాలి.

అష్టాదశ మహాపురాణాలు, అష్టాదశ ఉపపురాణాలు ఉన్నట్లే అష్టాదశ ఔపపురాణాలు ఉన్నాయి. బృహద్వివేకము అనే గ్రంథం వాటిని గురించి

ఆద్యం సనత్కు మారంచ నారదీయం బృహచ్చయత్
ఆదిత్యం భావనం ప్రోక్తం నందికేశ్వర మేవచ
కౌర్మ భాగవతం జ్ఞేయం వాసిష్ఠ భార్గవం తథా
ముద్గలం కల్కిదేవ్యైచ మహా భాగవతం తతః
బృహద్ధర్మం పరానన్దం వహ్నిం పశుపతిం తథా
హరివంశం తతోజ్ఞేతు మిదమౌపపురాణకమ్

అని చెప్పాడు. అప్పుడు అష్టాదశ ఔప పురాణాలు ఇవి :

1. సనత్కుమార	2. బృహన్నారదీయ
3. ఆదిత్య	4. సౌర (సూర్య)
5. నందికేశ్వర	6. కౌర్మ
7. భాగవత	8. వాసిష్ఠ
9. భార్గవ	10. ముద్గల
11. కల్కి	12. దేవీ
13. మహాభాగవత	14. బృహద్ధర్మ
15. పరానంద	16. వహ్ని
17. పశుపతి	18. హరివంశ పురాణాలు

ఈ జాబితాలోవి కూడా కొన్ని మహాపురాణాలలో ఉన్నాయి. కొన్ని ఉప పురాణాలలో ఉన్నాయి. భారతానికి ఖిలపర్వంగా చెప్పబడే హరివంశం ఇందులో పురాణస్థాయికి చేర్చబడింది. ధర్మ కల్పద్రుమం అనే గ్రంథంలో జ్ఞానానంద సరస్వతి ఇంకా పురాణాలు ఉన్నాయని తెలిపి ఆ పురాణాలను అయిదు విధాలుగా వర్గీకరించాడు.

1. మహాపురాణాలు	2. ఉపపురాణాలు
3. ఔపపురాణాలు	4. ఉపోప పురాణాలు
5. ఉపౌప పురాణాలు	

ఇలా రక రకాల అవాంతర భేదాలు పురాణాలలో ఉండగా వీనిని గుర్తించ కుండానే కొందరు ముఖ్యంగా మన తెలుగుకవులు కొంత గందరగోళానికి లోనైనారు. ఇది ఆధునిక కాలంలోనే

కాదు. ప్రాచీన కాలంలోనే జరిగింది. శ్రీనాథకవి సార్వభౌముడు మహాపురాణాలలోని స్కాందంలో భాగమైన కాశీఖండాన్ని తెలుగులోనికి అనువదించేటప్పుడు సప్తఖండాత్మక స్కాందమన్నాడు. గోదావరి ఖండంలోని భీమఖండాన్ని రచిస్తూ పంచాశత్ఖండ మండితస్కాందం అన్నాడు. మహా పురాణమైన స్కాందంలో ఉన్నవే ఏడు ఖండాలు. వాటిల్లో గోదావరీ ఖండం లేనేలేదు. పంచాశత్ఖండ మండితమైన స్కాందంలోను గోదావరి ఖండం ఒకటిగాలేదు. ద్రాక్షారామ భీమేశ్వరునికి ప్రసిద్ధి కల్పించటానికి సంస్కృత భీమఖండాన్ని శ్రీనాథుడే రచించాడని ఒక ప్రతీతి. యథార్థం భీమేశ్వరునికే ఎరుక.

ఇక పద్దెనిమిదవ శతాబ్దం ప్రథమ పాదానికి చెందిన హంసవింశతి కర్త అయ్యలరాజు నారాయణామాత్యుడు తన హంసవింశతిలో అష్టాదశ పురాణాలను తెలుపుతూ బ్రహ్మోత్తర ఖండం వాటిలో ఒకటి అని తెల్పాడు. నిజానికి సప్తఖండాత్మకమైన స్కాందపురాణంలో మూడవ ఖండమైన బ్రహ్మ ఖండంలో ఉత్తర భాగమే బ్రహ్మోత్తర ఖండం. ఇది తెలుగు దేశంలో విస్తృత ప్రచారం పొందిన స్కాందంలోని భాగం. ప్రాచీన కాలంలోనే దీనికి ఐదు పద్యానువాదాలు వచ్చాయంటే దాని ప్రసిద్ధి అర్థం చేసుకోవచ్చు. అందుకే అయ్యలరాజు నారాయణకవి పొరపాటు పడినట్లున్నాడు.

మహా పురాణాలలో అనేక విషయాలు కలగాపులగంగా ఉన్నాయి. ముఖ్యంగా శివ, విష్ణు, దేవీ, అగ్ని మొదలైన దైవతాల పారమ్యాన్ని తెలిపే విషయంలో ఏ పురాణమూ పూర్తిగా ఒక పక్షమే వహించదు. అసలు హిందూ ధర్మమే అందుకు వ్యతిరేకం గదా. కానీ కాలంగడిచే కొద్దీ ఈ పారమ్య భావం ఎక్కువై ఒక్కొక్క దైవపారమ్యంగా ప్రత్యేక పురాణాలే కనిపిస్తున్నాయి. అందు వలననే ఈ ఉపపురాణాలలో కూడా శైవ, వైష్ణవ, సౌర, శాక్తాది భేదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పండితులు పురాణ రచనా కాలాలను గురించి చాలా చర్చలు చేశారు. వారి చర్చల సారాంశం ఇవి అన్నీ ఒక కాలంలో రచిం చటం జరగలేదని మాత్రమే కాకుండా, ఒక పురాణంలోని వివిధ భాగాలు వివిధ కాలాలలో రచింపబడ్డాయనేదే. ఏదైనా ఉపపురాణౌప పురాణాదులలో చాలా వరకు క్రీ.శ. పదవ శతాబ్దానికి ముందు కాలంలోనే రచించటం జరిగిందనేది ఒక ఊహ. కొన్ని ఉప పురాణాలు. క్రీస్తుకు పూర్వమే పంచమ శతాబ్దంలోనే ఉన్నాయని మరికొన్ని క్రీ.శ. షష్ఠ శతాబ్దం ప్రాంతానికి చెందినవని మరి కొందరు పండితుల అభిప్రాయం. ఇలా పురాణ సాహిత్యం విస్తృతిని పొంది మహాపురాణ ఉపపురాణ ఔపపురాణ ఔపోప పురాణ భేదాలతో విలసిస్తూ వట వృక్షంలాగా విస్తరించి జాతి జీవనంలో నరనరాలా జీర్ణించుకొనిపోయింది. ఇది ఎంత విస్తృతమైనదో దానిని అధ్యయనం చేసినవారికే తప్ప ఇతరులకు ఊహైక గమ్యము.

పురాణాలకు కల్ప సంబంధం

ఇంతకుముందు ఏ పురాణం ఏ కల్పాలలో జరిగిన విషయాలను తెలుపుతున్నదో ఆయా పురాణాలలోని విషయాలను తెలిపేటప్పుడు తెలియజేయబడింది. ఇక్కడ ఆ వివరాలు పట్టికలో ఇవ్వబడ్డాయి చూడండి.

1.	బ్రహ్మపురాణం	బ్రహ్మకల్పం	10,000 శ్లోకాలు
2.	పద్మపురాణం	పద్మకల్పం	55,000 శ్లోకాలు
3.	విష్ణుపురాణం	వరాహ కల్పం	8,000 శ్లోకాలు
4.	శివ/వాయు పురాణం	శ్వేత కల్పం	24,000 శ్లోకాలు
5.	భాగవత పురాణం	సారస్వత కల్పం	18,000 శ్లోకాలు
6.	భవిష్య పురాణం	అఘోరకల్పం	31,000 శ్లోకాలు
7.	నారదపురాణం	బృహత్ కల్పం	25,000 శ్లోకాలు
8.	మార్కండేయ పురాణం	మధురకల్పం	9,000 శ్లోకాలు
9.	అగ్నిపురాణం	ఈశాన కల్పం	8,000 శ్లోకాలు
10.	బ్రహ్మవైవర్తపురాణం	రథంతర కల్పం	12,000 శ్లోకాలు
11.	లింగపురాణం	అగ్నికల్పం	11,000 శ్లోకాలు
12.	వామనపురాణం	కూర్మకల్పం	14,000 శ్లోకాలు
13.	స్కాందపురాణం	తత్పురుష కల్పం	1,00,000 శ్లోకాలు
14.	మత్స్యపురాణం	సత్యకల్పం	6,000 శ్లోకాలు
15.	కూర్మపురాణం	లక్ష్మీకల్పం	24,000 శ్లోకాలు
16.	వరాహపురాణం	మానవ కల్పం	24,000 శ్లోకాలు
17.	గరుడ పురాణం	గారుడ కల్పం	19,000 శ్లోకాలు
18.	బ్రహ్మాండపురాణం	భవిష్యకల్పం	12,000 శ్లోకాలు
		మొత్తం	**4,00,000 శ్లోకాలు**

ఇంతకుముందు చెప్పిన శ్లోక సంఖ్యపైన చూపిన శ్లోక సంఖ్యతో కొంత భేదించ వచ్చు. అది సంహితాభేదం మొదలైన కారణాల వలన కావచ్చునని విష్ణుచిత్తీయ వ్యాఖ్య తెల్పుతున్నది. అలాగే ఆయా పురాణాలలో తరువాత చొరబడిన ప్రక్షిప్తాలు, దొరకని భాగాలు వీటి అన్నింటి కారణాల చేత ఈ భేదం ఏర్పడి ఉండవచ్చు. కానీ వ్యాస ప్రోక్తమైన పద్దెనిమిది పురాణాలలోని మొత్తం శ్లోక సంఖ్య నాలుగు లక్షలని అన్ని పురాణాలు ముక్తకంఠంతో ఘోషిస్తున్నాయి.

మన్వంతరము

ఒక్కొక్క మన్వంతర కాలమున ఒక్కొక్క మనువు పాలన చేస్తాడు. ఈ మన్వంతరాలు 14. మొత్తం వానికి అధిపతులైన మనువులు 14 మంది. వారు 1. స్వాయంభువుడు 2. స్వారోచిషుడు 3. ఉత్తముడు 4. తామసుడు 5. రైవతుడు 6. చాక్షుషుడు–ఇక్కడి వరకు మన్వంతరములు గడిచి పోయినవి. ప్రస్తుతము ఏడవదైన వైవస్వతమన్వంతరము జరుగుతున్నందువలన 7. వైవస్వతుడు

(ఇతడు ఇప్పటి మనువు) 8. సావర్ణి 9. దక్ష సావర్ణి 10. బ్రహ్మసావర్ణి 11. ధర్మసావర్ణి 12. రుద్రసావర్ణి 13. దేవసావర్ణి 14. ఇంద్రసావర్ణి (వీరంతా రాబోయే మనువులు). వివిధ పురాణాల్లో ఈ మనువుల పేర్లతో కూడా కొన్ని భేదాలు కనిపిస్తున్నాయి. అది కల్పభేదముచేత కలిగినదని పురాణ పండితుల ఉద్దేశ్యము.

మన్వంతరాలు, కల్పాల స్వరూపం

చారిత్రక గణనంలో మన్వంతరం చాలా ముఖ్యమైనది. లేకపోతే సృష్టి నుంచి ప్రళయం వరకు సాగే ఈ మహత్తరమైన అంతులేని కాలంలో కనీసం కొండ గుర్తులుగానైనా ఏది ఎప్పుడు జరిగిందో గుర్తించడం ఎలా. అందుకే భాగవతం

మన్వంతరం మనుర్దేవా మనుపుత్రా సురేశ్వరః
ఋషయోఽ శాంవతారాశ్చ హరేః షడ్విధముచ్యతే

అనగా మనువు, మనుపుత్రులు, దేవతలు, ఋషులు, అంశావతారాల, ప్రసిద్ధ సంఘటనలు జరిగిన విషయాలు చెప్పినప్పుడు దానిని మన్వంతరం అంటారు.

స్వాయంభువమనువు యొక్క కాలం ఏ ఏ ఋషులు, మహర్షులు, రాజులు ఉన్నారు, స్వారోచిష మనువు కాలంలో ఆయనకు సహాయంగా ఉన్న మహాపురుషు లెవరు, ఉత్తమ మనువు కాలంలో ఏయే పురాణాల ప్రాముఖ్యత ఉన్నది, లేకపోతే రైవతక మనువు కాలంలో ఎటువంటి సంఘ నిర్మాణం ఉన్నది. ఇలాంటి విషయాలన్నింటని గురించి తెలుసుకొనటానికి పురాణాలలో తప్పితే వేరు ఆధారభూతమైనవి ఏమున్నాయి. అలాగే మన్వంతర జ్ఞానం లేకుండా ఏ రాజు యొక్క వంశము యొక్క సరియైన జ్ఞానము, అవగాహనలు అవసరము కదా. ఒక కల్పంలో పధ్నాలుగా మంది మనువులుంటారు. మనుష్యమానానికి కొద్ది ఎక్కువగా ఉండే 71 మహాయుగాలకు అంటే 30,85,71,428 సంవత్సరాల 6 నెలల 25 రోజుల 42 గడియల కాలాన్ని ఒక మన్వంతరం అంటారు. ఇలాంటి మన్వంతరాలు 14 అంటే 432 కోట్ల మనుష్య సంవత్సరాలు – బ్రహ్మదేవునికి ఒక పగలు. దీనికి 'ఉదయ కల్పం' అని పేరు. ఇందులో బ్రహ్మాదుల సృష్టి జరుగుతుంది. తిరిగి ఇంతేకాలం బ్రహ్మదేవునికి రాత్రి. దీనికి 'క్షయ కల్పము' అని పేరు. ఈ సమయంలో సంకర్షణ అగ్ని చేత భూర్భువస్సువర్మహర్లోకాలు దగ్ధం అవుతాయి. దీనిన నైమిత్తిక ప్రళయం అంటారు. ఉదయ కల్పం, క్షయకల్పం రెండూ కలిస్తే బ్రహ్మకు ఒక అహోరాత్రం అవుతుంది. దీనికే కల్పం అని పేరు. 360 కల్పాలు ఇలాంటివి బ్రహ్మదేవునికి ఒక సంవత్సరం. ఇలాంటి సంవత్సరాలు నూరు బ్రహ్మదేవునికి పరమ ఆయుర్దాయము. దీనికి ఒక మహా కల్పం అని పేరు. ఈ మహాకల్పం తరువాత వచ్చే ప్రళయాన్ని ప్రాకృతిక ప్రళయము అంటారు.

ఈ కల్పాలు అనంతం. కొన్ని పేర్లను మాత్రం తెలుసుకొందాం.

1. శ్వేత వరాహ 2. నీలలోహిత 3. వామదేవ 4. వథంతర 5. రౌరవ 6. ప్రాణ(దేవ) 7. బృహత్ 8. కందర్ప 9. సత్య 10. ఈశాన 11. ధాన (తమః) 12. సారస్వత 13. ఉదాన 14.

గరుడ 15. కలార్మ 16. నారసింహ 17. సమాధి 18. ఆగ్నేయ 19. విష్ణుజ 20. సౌర 21. సోమ 22. భావన 23. సుప్తమాలి 24. వైకుంఠ 25. అర్చిష 26. వల్మీక 27. వైరాజ 28. గేరీ 29. మాహేశ్వర 30. పితృ 31. మానవ 32. తత్పురుష 33. వైకుంఠ 34. లక్ష్మీ 35. సావిత్రీ 36. అఘోర 37. పద్మకల్పం మొదలైనవి. ఈ కల్పాలు అనంతాలు.

పురాణాలలో కథలలో తేడాలు ఎందుకుంటున్నాయి

వివిధ పురాణాలను పరిశీలిస్తే, కొన్ని కథలు ఒక పురాణంలో ఒక విధంగాను, ఇంకొక పురాణంలో ఇంకొక విధంగాను కనిపిస్తున్నాయి. మన పురాణాలపై అంతగా గురిలేనివారు పురాణాలకు ఐక్యతలేదని, పరస్పర విరుద్ధాలని అందుచేత అవి అప్రమాణాలని తీవ్రంగా నిందాపూర్వక విమర్శలు చేస్తున్నారు. ఇలాంటి వారికి వ్యాసుడు ఏకార్థాని పురాణాని వేదాశ్చైకార్థ సమ్మితాః అని మహాభారతంలో వివరించాడు. అలాగే

క్వచిత్క్వచిత్పురాణేషు, విరోధో యది దృశ్యతే
కల్పభేదాది భిస్తత్ర, వ్యవస్థాసద్భిరిష్యతే - *(పద్మ పురాణం)*

అని పద్మ పురాణంలో చెప్పబడింది. అనగా ప్రతికల్పంలోను సృష్టి జరుగుతుంది. ఈ జరిగే సృష్టిలో రాముడు, కృష్ణుడు మొదలైన అవతారాల, ఇతర మహాపురుషుల సృష్టి జరుగుతుంది. ఆ గాథలలో కల్పభేద ప్రయుక్తాలైన కొద్దిపాటి భేదాలు కలుగవచ్చును. అది దోషం కాదు. అలాంటి విషయాలను కూడా పురాణాలు వదలకుండా తెలియచేస్తాయి అని అర్థం. ఈ విషయం పద్మపురాణం పాతాళఖండంలో పూర్వకల్ప రామాయణ కథ సమయంలో తెలియజేయబడింది. అందువలననే ప్రతి పురాణంలోనూ, ఈ పురాణం ఈ కల్ప వృత్తాంతాన్ని తెలుపుతుంది అని వ్యాసుడు తెలుపుతున్నాడు.

చివరగా చెప్పాలంటే పురాణంలో స్పృశించని, స్పృశించకూడని విషయాలు ఏమీ ఉండవని చెప్పవచ్చు. ఎందుకంటే ఏ విషయమైనా పురాణ పంచలక్షణాలలోనికి అంతర్భవిస్తాయనటం సరియైనదే.

తొమ్మిది రకాల సృష్టులు, నాల్గువిధాల ప్రళయాలు, పద్నాలుగు మన్వంతరాల విశేషాలు, కాలగణనం, వ్రతదాన తీర్థ ధర్మశాస్త్ర విషయాలు, అశ్వ, రత్న, గజవాస్తు జ్యోతిస్సాముద్రిక శాస్త్రాలు, ఆయుర్వేద, ధనుర్వేదాలు, అనులేపన స్వేచ్ఛారూప ధారణాది బహువిచిత్ర విద్యలు, సప్తద్వీప బహునదీనద కులపర్వత సముద్రాది అనేక భౌగోళిక విషయాలు, లోకాంతర గ్రహాంతర బ్రహ్మాండాంతర విశేషాలు, తాంత్రిక విద్య, ఇక్ష్వాకు చంద్ర కలి వంశ వర్ణనలు, భగవత్తత్వం, భక్తకర్మజ్ఞాన వైరాగ్యా ధ్యాత్మిక విషయాలు. వివిధ దేవీ దేవతాతత్త్వస్తోత్ర పూజావతారాది వర్ణనలు, మహిమలు, నీతులు, ప్రపంచ రీతులు, ధర్మాలు, అలంకారం, వ్యాకరణం. ఈ విధంగా పురాణాలలో లేనిది లేదు. అవి విజ్ఞాన సర్వస్వాలు. కనుకనే

యో విద్యాచ్చతురోవేదాన్ సాంగోపనిషదో ద్విజః
న చేత్పురాణం సంవిద్యాన్నైవ సస్యాద్విచక్షణ ః *(వాయుపురాణం 1.1.180)*

(నాల్గు వేదాలు, ఆరు శాస్త్రాలు, అన్ని ఉపనిషత్తులు చదివినా పురాణం తెలియని వాడు విచక్షుణుడు కాడు" అని తెలుపుతున్నది)

ఇదే విషయాన్ని నారదపురాణం **'యాస్మిన్ జ్ఞాతే భవేద్‌జ్ఞాతం వాఙ్మయం స చరాచరమ్** (1.92.21) పురాణం తెలుసుకొంటే సమస్త వాఙ్మయం తెలుసుకొన్నట్టే అని తెలుపుతుంది.

అందుకే అలాంటి పురాణాలలోని విషయాల గురించి ఇక్కడ తెలుసుకొందాం.



శ్రీ అగ్ని మహాపురాణ విశేషాలు

ఉపోద్ఘాతము

పురాణ గణన క్రమములో అగ్ని పురాణము ఎనిమిదవది. ఈశాన కల్పము నందు జరిగిన వృత్తాంతమును తెలుపు పురాణమిది. అగ్నిచేత వశిష్ఠునికి వివరింపబడినట్లు ఉన్నందున ఈ పురాణము ఆగ్నేయమని చెప్పబడుచున్నది.

అథాతః సంప్రవక్ష్యామి తవాగ్నేయపురాణకం
ఈశాన కల్పవృత్తాంతం వసిష్ఠాయా అనలో అబ్రవీత్
తత్పంచదశ సాహస్రం నామ్నా చరిత మద్భుతమ్
పఠతాం శృణ్వతాం చైవ సర్వపాపహరం నృణాం

(అగ్ని పురాణమును ఈశాన కల్పంలో జరిగిన వృత్తాంతమును వశిష్ఠునికి అగ్నిదేవుడు ఉపదేశించాడు. అందులో పదిహేనువేల శ్లోకాలు ఉన్నాయి. అద్భుతమైన ఆ పురాణమును వినిన, చదివినవారికి సర్వపాపములు హరింపబడును) అని తెలుపుతున్నది. ప్రస్తుతం ఉపలబ్ధం అవుతున్న అగ్నిపురాణంలోని విషయానుక్రమణిక నారద పురాణంలో చెప్పిన విషయాలకు యథాతథంగా సరిపోతున్నది. కానీ ఈశాన కల్పవృత్తాంతం అని మాత్రం లేదు. కానీ అగ్ని పురాణంలోని రెండవ అధ్యాయంలో 'ప్రాప్తే కల్పేతు వారాహే కూర్మ రూపో అభవద్ధరిః' అని అనగా వారాహ కల్పవృత్తంలో అని చెప్పబడింది. బ్రహ్మయొక్క మానస పుత్రుడైన మరీచి మహర్షి ద్వాదశ సత్ర యాగాన్ని నిర్వహిస్తున్నప్పుడు అగ్ని తెల్పిన ధర్మానుష్ఠాన ఉపదేశముతో ఈ పురాణం ప్రారంభం అవుతున్నది.

అగ్నిపురాణ ప్రాముఖ్యత

పురాణ వాఙ్మయంలో అగ్నిపురాణ స్థానం చాలా విశిష్టమైనది. పురాణ వాఙ్మయం గరిష్ఠ స్థాయికి వికాసం చెంది విజ్ఞాన సర్వస్వాత్మకంగా పరిణమించిన కాలానికి చెందినట్టిది అగ్నిపురాణం.

అందుకనే దానిలో స్పృశించని విజ్ఞాన విషయాలు లేవు. అందుకే నిర్మా ణంలో అగ్నిపురాణం వాయు, బ్రహ్మాండ, విష్ణు, మత్స్య, భాగవతాలనుంచి కొంత విభేది స్తున్నది. ఇంకొక రకంగా చెప్పాలంటే ప్రాచీనానంతరకాలీన పురాణం ఇది. ఇదే కోవలోకి గరుడ, కూర్మ, లింగ, భవిష్య, స్కాంద పురాణాలుకూడా చేరుతాయి. ఇంతకు ముందు చెప్పిన ప్రాచీన పురాణాలలో ఒకే విషయాన్ని కొంత విస్తృతంగా వివరించటం కనిపిస్తుండగా, ఆ విధానం క్రమంగా తగ్గిపోయి ఈ అర్వాచీన పురాణాలలో అనేక విషయాలు సంక్షిప్తంగా వివరించటం కనిపిస్తుంది. ఆ విధంగా చూస్తే పురాణ వాఙ్మయ వికాసంలో అగ్నిపురాణాన్ని ఒక మైలురాయిగా చెప్పుకోవచ్చు. అందుకే అగ్నిపురాణంలో వివిధ విష్ణు అవతార ఘట్టాల కప్తీకరణం జరిగింది. ఈ అవతారాలన్నీ ఇందులో ఒక చిన్న అధ్యాయంలో తెలిపితే, బ్రహ్మాండ, వాయు, మత్స్య, విష్ణు పురాణాలలో ఒక్కొక్క అవతారం ఒక అధ్యాయాన్ని దాటిపోయింది. ప్రాచీన చరిత్రను తెలుసుకోటానికి వివిధ రాజవంశాల వర్ణనం చాలా అవసరమైన విషయం. అందువలననే ఆయా పురాణాలలో ఈ భాగం విస్తృతంగా కనిపిస్తుండగా, ఇందులో సంక్షిప్తంగా ఉన్నా ఏ విషయం వదలివేయటం జరగలేదు. అందువలననే ఇందులో అన్ని రాజ వంశాల చరిత్ర స్పృశించబడింది. ఈ విధంగా అధ్యయనం చేస్తే ప్రజలు ఆ కాలానికి చెందిన సామాజిక ప్రాముఖ్యతగల అంశాలపై ఎలా ఆసక్తి ప్రదర్శించారో, సాంస్కృతిక విషయాలను గమనించేవారో, వాటిని ధార్మిక, మతసంబంధమైన ఏ విధమైన దృష్టితో అవగాహన చేసుకొన్నారో తెలుసుకోవచ్చు. దీనిని ఆ కాలానికి చెందిన కళా, సాహిత్య, విజ్ఞానాలను ప్రతిబింబించే విజ్ఞాన సర్వస్వం అని భావించటం సమంజసం. అంతేగాకుండా ఆ కాలపు సాహిత్య, సాంస్కృతిక కృషి కేవలం పండితులవరకే పరిమితం కాకుండా సామాన్య ప్రజలవరకు చేరవేయవలసిన ఆవశ్యకతను గుర్తించి, అందులో కృతకృత్యత పొందిందని అగ్నిపురాణాన్ని భావించవచ్చు.

ఈ పురాణపు ముఖ్య ఉద్దేశ్యం ప్రాచీన భారతీయులకు సమస్త భారతీయ విద్యలను ఒక స్థాయి వరకు ప్రజాబాహుళ్యానికి పరిచయం చేయటమని అనిపిస్తుంది. ఈ పురాణంలో వాని అన్నింటి పరిచయం కనిపిస్తుంది. సంక్షేపంగా విష్ణు అవతారాలను గురించి తెలుపుతూ రామాయణ, మహాభారత కథలను ఒక మోస్తరు విస్తృతితో వివరించటం జరిగింది. మందిర నిర్మాణ కళను గురించి తెలుపుతూ దానితో పాటు ప్రతిష్ఠా విధానము, పూజావిధానం కూడా తెలియజేయ బడింది. జ్యోతిషశాస్త్ర, ధర్మశాస్త్ర, రాజనీతి, ఆయుర్వేద శాస్త్రాల వివరణ ఇందులో విపులంగా కనిపిస్తుంది : ఎనిమిది అధ్యాయాలలో ఈ పురాణంలో ఛందశ్శాస్త్రం వివరించబడింది. అలాగే అలంకార శాస్త్రం మార్మిక విధా నంలో వివేచించబడింది. వ్యాకరణంకూడా తగినన్ని అధ్యాయాలలో వివరించబడింది. అలాగే నిఘంటుశబ్దాలను కూడా తగినన్ని అధ్యాయాలలో వివరించటంచేత, దీని అధ్యయ నంచేత శబ్దజ్ఞానాన్ని వృద్ధిపరచుకొనవచ్చు. యోగానికి సంబంధించి యమ, నియమాది అష్ట విధానాల (అంగాల) వర్ణన సంక్షేపంగా ఈ పురాణంలో లభిస్తుంది. సమస్త అద్వైత వేదాంతం చాలా చక్కని పద్ధతిలో మహత్త్వపూరకంగా ఈ పురాణం వివరించటంలో కృతకృత్యం అయింది. ఒక అధ్యాయంలో గీతాసార సంగ్రహ వివరణ ఉన్నది. అలాగే యమగీత కూడా ఇందులో సంక్షిప్తీకరింపబడింది. 383వ అధ్యాయాలలో చెప్పబడిన అనేక విషయాల, శాస్త్రాల సమాహారం

ఆశ్చర్యం కలిగిస్తుంది. రామాయణ, మహాభారత, హరివంశ కథలసారం ఇందులో ఉన్నది. అలాగే అనేక విధాలైన మందిర నిర్మాణ కళా విశేషాలు, విగ్రహ ప్రతిష్ఠ, పూజా విధానాలు విస్తృతంగా ఇందులో చోటుచేసు కున్నాయి. నాలుగు ఉపవేదాలు, వేదాంగాలు, దార్శనిక విషయాల సారం దిక్ప్రదర్శనంగా ఉన్నది. అంతేగాకుండా పశుచికిత్స, ధర్మశాస్త్రం, రాజనీతి, ఆయుర్వేదం మొదలైన శాస్త్రాల సారం ఉన్నది. అంతేకాకుండా, కావ్యాల వర్గీకరణ, అలంకారశాస్త్ర విషయాలు '8' (ఎనిమిది) అధ్యాయాలలో ఛందశ్శాస్త్ర వివరణ ఉన్నది. వ్యాకరణ శాస్త్ర సంగ్రహం సుందరంగా కూర్చబడింది. కుమార వ్యాకరణం అనే పేరుతో చక్కని ప్రయోజనకరమైన వ్యాకరణము, ఏకాక్షర కోశం, నామలింగాను శాసనం, యోగశాస్త్ర విషయాలు, అద్వైత వేదాంతసారం కూడా ఈ పురాణంలో కనిపిస్తుంది.

అగ్నిపురాణం ప్రత్యేకంగా ఏ శాఖ వైపుకు మొగ్గుచూపే గ్రంథం కాదు. దీనిలో శైవ, వైష్ణవ, శాక్తపర విసయాలన్నీ ఉన్నాయి. ప్రస్తుతము ముద్రితమై ఉన్న అగ్నిపురాణం వివిధ కాలాలకు చెంది, వివిధ గ్రంథాల సారోద్ధారమని చెప్పవచ్చు. కాబట్టి నిబంధన (స్మృతి) గ్రంథాలలో అగ్ని పురాణంలోనివని ఆయా వ్యాఖ్యా కర్తలు ఉద్ధరించిన భాగాలు ప్రస్తుత అగ్నిపురాణంలో కన్పించటం లేదు. ప్రస్తుత అగ్నిపురాణం వైష్ణవానికి చెందిన పాంచ రాత్రీయ శాఖీయుల ద్వారా సంస్కరింపబడి వైష్ణవుల అర్చన, పూజాదికాలను వివరించే గ్రంథంగా మారి ఉన్నది. కాబట్టి ఈ పాఠంగల పురాణాన్ని ప్రాచీనమూ మౌలికమూ అని చెప్పలేము. ఇది సామాన్య జనోపయోగం కోసం అత్యంత ప్రౌఢ గ్రంథాల సారాంశాన్ని క్రోడీకరించిన రచన. జన సామాన్యానికి విద్య గరపటం కోసం రచింపబడి ఉండవచ్చును. స్కాంద పురాణ శివ రహస్య ఖండంలో, అగ్నిదేవుని మహిమను వర్ణించటం అగ్నిపురాణ లక్ష్యం అని చెప్పబడింది. ఈ లక్ష్యం ప్రస్తుతం ముద్రితంగా లభ్యం అవుతున్న అగ్ని పురాణంలో కనిపించదు.

అగ్ని పురాణంలో ఏం చెప్పబడింది

ఈ పురాణం వైష్ణవ పురాణమని చెప్పబడినా, శివారాధనకు కూడా సముచిత గౌరవాన్ని కలిగిస్తున్నది. లింగరూపంలో శివుని ఆరాధించాలని తెలుపుతూ అనేక విధాలైన తాంత్రిక పద్ధతులను శివారాధన విశేషాలను తెలుపుతున్నది. అందువలన ఈ పురాణం శైవ వైష్ణవ శాఖలు పూర్తిగా విడిపోయి ఈర్ష్యా, అసూయలు భక్తులలో పొటమరించని కాలంలోనే రచింపబడి ఉండాలి. అంతే కాకుండా వైష్ణవశాఖ శ్రీకృష్ణ, రాధలకు విశేష ప్రత్యేకత కలిగించిన కాలానికి ముందుగానే, కేవలం కృష్ణుని గోపబాలకునిగా శ్రీకృష్ణుని విష్ణువు అవతారంగా, బాలకృష్ణునిగా ఆరాధించిన కాలానికే రచింపబడి ఉండాలి. శ్రీకృష్ణుని ప్రియురాలు రాధ పేరు అయినా ఎక్కడా ఈ పురాణంలో కనిపించదు.

ఇక, భగవంతుడంటే ఎవరు? అనే ప్రశ్నకి ఇలా సమాధానం కనిపిస్తుంది అగ్ని పురాణంలో –

ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానామాగతిం గతిమ్ ।
వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి ॥

శ్రీ అగ్ని మహాపురాణ విశేషాలు

సృష్టి, స్థితి, ప్రళయాలు, ప్రాణుల జీవన–మరణాలు, విద్య–అవిద్యలను ఎఱిగిన వాడే భగవంతుడని భావం.

ఈ పురాణంలో అర్చావిధానాలైన అనేక కర్మకాండలు, హోమాలు, నివేదనలు, బలులు, మంత్రాలు, బీజాక్షరాలు, బీజాక్షరమంత్రాలు, అర్చామండలాలు, లేక ముగ్గులు, పవిత్రము అనే దర్భతో చేసిన ఉంగరం వంటి కూర్పు, యజ్ఞోపవీతం, దేవాలయాల స్థాపన, నిర్మాణం, ప్రతిష్ఠలు, ఇంకా హిందూధర్మ ఆరాధనా విశేషాలు అనేకం అధ్యా యాలు, అధ్యాయాలలో వివరింపబడ్డాయి. తాంత్రిక విధానాలలో, రూపాలలో దుర్గామాత ఆరాధన, లింగరూపంలో శివారాధన వివరించటమే కాకుండా, అనేక మంత్రాలు వానిని ఆరాధనలో ఉపయోగించటం, ఉచ్చారణా విధానాలు వివరించబడ్డాయి. ఇందులో వివరించబడిన తాంత్రిక విధానాలు, మంత్రోచ్చారణ, వాని ఉప యోగాల వివరణ ఒక క్రమ విధానం దీనిలో లోపించినట్లు అనిపిస్తుంది. ఇందులో వివరించిన ఈ విషయాలకు, శారదాతిలకము, మంత్రమహోదధి వంటి తాంత్రిక గ్రంథాలలో చెప్పబడిన విధానాలకు కొంత సాపత్యం కనిపిస్తుంది. కానీ అందులో ఉన్నవే ఇందులో ఉన్నవని చెప్పలేము.

ప్రారంభంలోనే ఉన్న భువనకోశవర్ణనగల అధ్యాయం ఇతర పురాణాలలో ఈ విషయం పై చెప్పబడిన వృత్తాంతాలతో ఏకీభవిస్తున్నా, వానిలో కంటె కొంత విపులంగా ఉన్నది. ఇందులో చెప్పబడిన తీర్థాలు, యాత్రా స్థలాలను గురించి సంక్షిప్తంగానూ, సంఖ్యలో తక్కువగాను ఉన్నా, నర్మదా నది శ్రీశైలాలను గురించి ప్రత్యేకంగా పేర్కొనటం గమనించవచ్చు ఉత్తర భారత దేశంలోని పర్వతాలు పేర్కొనబడలేదు. కాశీక్షేత్రం ఇందులో అవిముక్త క్షేత్రంగా పేర్కొనబడింది. ఇందుచేత కాశీవిశ్వేశ్వరుడుగా గాక అవిముక్తేశ్వరుడే ఆ క్షేత్ర ప్రధాన దైవతమా? అని సందేహం కలుగుతుంది. నిజానికి కొన్ని శతాబ్దాలపాటు ఈ అవిముక్తేశ్వరుడే కాశీలో ముఖ్య దైవతంగా వెలసిన విషయం విస్మరించలేనిది, కాశీ క్షేత్రం నేటివలెనే నాడు కూడా వరుణ, అసి నదుల మధ్యన ఉన్న ప్రదేశమే.

దీనిలో చెప్పబడిన పురాణగాథలు, తీర్థాలు చాలా సంక్షిప్తంగా ఉన్నాయి. గయా మాహాత్మ్యం కూడా అలాగే అతిసంక్షిప్తంగా ఉన్నది. అందుకే కొందరు ఇది ప్రక్షిప్త భాగం అని భావిస్తున్నారు. అంతేగాకుండా ఈ మాహాత్మ్యాన్ని వర్ణించిన తీరు మిగిలిన వానిని వర్ణించినట్లుగా లేదు. పైగా, ఇలాంటి విషయాల వివరణ చేయవలసిన పద్ధతిలో కూడా లేదు. దక్షిణాది ప్రతులలో అగ్నిపురాణ భాగంగా 'కావేరీ మాహాత్మ్యం' అనే గ్రంథం ప్రచారంలో ఉన్నదట. కానీ ఇది ఎప్పుడూ అగ్ని పురాణంలో భాగం అయినట్లుగా తెలియటంలేదు. నిజానికి ఈ కావేరీ మాహాత్మ్యం అనే గ్రంథం పరిమాణంలో ప్రస్తుతం లభ్యం అవుతున్న అగ్నిపురాణం అంత ఉన్నదట కానీ ఇది అగ్ని పురాణంలోని భాగం అని మెకంజీ వ్రాత ప్రతుల (ప్రథమ భాగం) వలన తెలుస్తున్నది.

తీర్థమాహాత్మ్యాలను గురించి తెలుపుతూ భారత ఉపఖండం వర్ణించబడింది. అలాగే, ప్రపంచం లోని ఇతర ప్రదేశాల వర్ణన కనిపిస్తుంది. అలాగే వాటి మధ్య దూరాలు, వాటి విస్తీర్ణాలు ఆ భాగాలకు క్రిందగల లోకాలు, పైనగల లోకాలు వివరింపబడ్డాయి. ఈ భాగాలను ఇతర పురా ణాలలో చెప్పబడిన వివరాలతో పరిశీలించవలసిన అవసరం ఉన్నది. ఇందులో సూర్యుని

సూర్యరథవర్ణన, మొదలైన విషయాలు ప్రత్యక్షరం విష్ణుపురాణంలోని ఈ భాగాలతో ఏకీభవిస్తున్నాయి. ఇతరవిషయాలలో విష్ణుపురాణానికి దీనికి పెద్దగా సాపత్యం కనిపించదు.

తరువాత సూర్యుడు, గ్రహాలను గురించి వివరిస్తూ, ఖగోళ, జ్యోతిష విషయాలను వివరించటం జరిగింది. ఆ సందర్భంలోనే మన్వంతరాల వివరాలు తెలియజేయబడ్డాయి. ఆ సందర్భంలోనే భారత ధర్మ విధానాలైన, వర్ణ, జన్మ, స్థాపన, వివాహం, మరణం, ధార్మిక విధులు, దేవతారాధన, వేదాంత విధానాలు, వివిధ వ్రతాలు, నిత్యనైమిత్తిక, ఆత్యయిక మత విధుల వివరణ ఉంటుంది. శారీరక ధర్మాలు, పవిత్ర విధుల వర్ణన కూడా ఉన్నది. తరువాత విభాగంలో రాజధర్మాలు, పట్టాభిషేక విధానం, వారి రాజకీయ, న్యాయవిధులు, నీతి అనగా రాజనీతి, ప్రభుత్వం మొదలైన విషయాలు తెలియజేయ బడ్డాయి. ఇందులో చెప్పబడిన రాజనీతికి సంబంధించిన కొన్ని అంశాలు దండి దశకుమార చరిత్రలో చెప్పబడిన అంశాలకు సరిగా సరిపోతున్నాయి. బహుశః ఈ రెండు గ్రంథాలు ఒకే మూలం నుండి విషయాలను గ్రహించి ఉండవచ్చు. ఈ వివరాలకు మూలం చాణక్యుని అర్థశాస్త్రం అయి ఉండే అవకాశం ఉన్నది. ఈ విషయాలు ఏమాత్రం విదేశీ విషయాలను పోలి ఉండనందున, ఈ భాగం భారతదేశం పైకి మహమ్మదీయుల దండ యాత్రలు జరగకముందు నాటి రచనే అని భావించవచ్చు. అంతేగాకుండా ఆయుధాల ఆకారాలు, పరిమాణాలు (సైజులు), విలువిద్య మొదలైన ఇందులో చెప్పబడిన విషయాలు దీనిని బలపరుస్తాయి. ఈ సందర్భంలో అనేక పదాలు ప్రాచీన, రాజరిక యుద్ధ సంబంధ పదాలతో నిండి ఉన్నది. ఇందులో తరువాత వివరింపబడిన న్యాయ, నేర విచారణకు సంబంధించిన విషయాలు అనేకం యాజ్ఞవల్క్యస్మృతికిగల మితాక్షరి వ్యాఖ్యానంతో ఏకీభవిస్తున్నాయి. అంటే ఇదిచాలాప్రాచీన కాలానికి చెందినది అని అనుకొనవచ్చు.

వేదాలను గురించి తెలిపిన భాగంలో అవి ఆర్షేయాలని, పరమ పవిత్రాలని తెలు పుతూ, హోమాలు పాపపరిహారాలు, ప్రాయశ్చిత్తాలను గురించి తెలుపుతున్నది. పురాణా లను గురించి తెలుపుతూ, వ్యాసుని నుంచి ఆరుగురు శిష్యులు పురాణాలను ఉపదేశం పొందారని, వారు సూత, లోమహర్షణ, సుమతి, మైత్రేయ, శాంశపాయన సావర్ణులని–ఈ ఆరుగురు అనేక పురాణాలకర్తలని అలాగే శాంశపాయనాదులు ఒక పురాణ సంహితను కూర్చారని తెలుపుతున్నది.

పురాణ అధ్యయనం తరువాత పఠిత చేయవలసిన దానాలను గురించి తెలుపుతున్నది. అలాగే వివిధ పురాణాలలోని శ్లోక సంఖ్యను కూడా వివరిస్తున్నది. ఈ భాగంలో ఇతర పురాణాలలో, అష్టాదశ పురాణాలను గురించి చెప్పబడిన విషయాలతో చాలా ఎక్కువగా విభేదిస్తున్నది. శివపురాణ ప్రసక్తి ఇందులో చెప్పబడలేదు. ఇందులో చెప్పబడిన వివిధ పురాణాల వక్త శ్రోతల విషయంలో కూడా ఇతర పురాణాలతో ఏకీభవించుటలేదు.

తరువాత సూర్య చంద్ర వంశ రాజుల వృత్తాంతాలు, వంశాలు వివరించబడ్డాయి. వీటిలో ముఖ్యంగా యదు, పురువంశ చక్రవర్తుల వివరాలు పాండవ, శ్రీకృష్ణుల వరకు తెలియజేయబడ్డాయి. ఈ విషయాలు ఇతర పురాణాలలోని విషయాలతో ఏకీభవిస్తున్నా, అనేక శ్లోకాలు కేవలం పేర్ల

పట్టీలతో నిండి ఉంటాయి. ఎక్కడో సకృత్తుగా కొన్ని గాథలు అతి సంక్షిప్తంగా మాత్రమే వివరించటం కనిపిస్తుంది. అవి కూడా అతి సాధారణ విషయాల తోనే ఉన్నాయి. శ్రీకృష్ణుడు ఆయన ప్రత్యేక విశిష్టత గురించి కొంత వివరణ ఉన్నా, అది పురాణరచనా కాలాన్ని నిర్ణయించటానికి ఉపయోగపడదు.

తరువాత వైద్యశాస్త్రం గురించిన వివరణ ఉన్నది. ధన్వంతరి నుంచి సుశ్రుతుని వరకుగల విషయాలు ఇందులో కనిపిస్తాయి. అలాగే చెప్పిన విషయాలలో పెద్దగా ప్రత్యేకత కనిపించకపోయినా, మంత్రాలతోను, తాంత్రిక విధానాలతోను వైద్యం చేయటాన్ని కొంత వరకు తెలుపుతున్నది. తరువాత భాగంలో తాంత్రిక విధానంలో శివుని, దేవిని ఆరాధించే విధానాల ప్రస్తావన ఉన్నది. ఈ విషయాలు ఈ వైష్ణవ పురాణంలో ఉండటం విరుద్ధమను కొన్నా, ఇవి తరువాతి వారు చేర్చినవని భావించే అవకాశం లేదు.

ఇందులో సాహిత్య శాస్త్రానికి సంబంధించిన ఛందో, అలంకార, వ్యాకరణ, రస, కావ్య శాస్త్రాలకు సంబంధించిన విషయ వివరణ ఉండటం అగ్నిపురాణ ప్రత్యేకత. ప్రథమ ఛందః కర్త పింగళుని విశిష్టత నిరూపించబడింది. అలాగే వ్యాకరణంలో పాణిని, కాత్యా యన విధానాలు వివరించబడ్డాయి. పాణిని సూత్రాలు ప్రామాణికంగా గ్రహించబడ్డాయి.

అగ్నిపురాణంలో కూర్మావతార వర్ణన ఈ రీతిగా ఉంది – దేవాసుర సంగ్రామం భయంకరంగా జరిగింది. దేవతలు ఓడిపోయారు. వారి సంపదలన్నీ పోయాయి. దీనికి కారణం దూర్వాసమహాముని శాపమే. బ్రహ్మాది దేవతలందఱు మహావిష్ణువును దర్శించారు. అసురుల్ని గెలిచే ఉపాయము అడిగారు. వెంటనే వారితో సంధిచేసికొమ్మని శ్రీమహావిష్ణువు వారికి సెలవిచ్చాడు. "మంథర పర్వతం కవ్వంగా, వాసుకి త్రాడుగ క్షీరసాగరం మథించాలి. అలాచేస్తే అమృతం బయటికొస్తుంది. అది అసురలకు అందరాదు. మీకే దక్కాలి. అందుకు నా సంపూర్ణ సహకారము ఉంటుంది" అన్నాడు దేవదేవుడు. అంగీకరించారు దేవతలు. క్షీరసాగరమథనం ఆరంభమైంది. అయితే ఒక అవాంతరమొచ్చి పడింది. మంథర పర్వతానికి ఆధారం లేదు. అందువల్ల మథనం చేసేటప్పుడు అది జారిపోతుంది. ఆ సమయంలో విష్ణు భగవానుడు కూర్మ రూపం ధరించాడు. పర్వతానికి ఆధారంగా నిలిచాడు. అవాంతరంతొలగింది. మెల్లిగా మథనం జరుగుతోంది. ముందుగా హాలాహలం బయటికి వచ్చింది. దాన్ని పరమశివుడు ఆనందంగా తీసికొన్నాడు. నీలకంఠుడు అయ్యాడు. ఆ తరువాత పారిజాతం, కౌస్తుభం, అప్సరసలు, లక్ష్మీదేవి వగైరాలు శ్రీమన్నారాయణ మూర్తికి దక్కాయి. ధన్వంతరి కమండలంతో బయటి కొచ్చాడు. అందులోనే ఉంది అమృతం. అసురులు కమండలం లాగేసుకొన్నారు. దేవతలకు సగమిచ్చారు. మిగిలిన సగభాగం తీసికొని వెళ్ళబోతున్నారు. అంతే, వైష్ణవమాయ చోటు చేసుకొన్నది. విష్ణువు మోహినీ రూపం దాల్చాడు. ఆ దివ్యసౌందర్యానికి అసురులు మోహవశులయ్యారు. "నీవు మాదానివై అమృతం పంచిపెట్టు" అని కోరారు. "అలాగే" అన్నాడు ఆయన. ముందుగా దేవతలకు ఒడ్డించాడు. అసురులకు మిగలదని రాహు–కేతువులకు అర్థమైంది. గుట్టు చప్పుడు కాకుండా ఆ ఇద్దఱు దేవతల వరుసలోకి వచ్చారు. అమృతమందింది. హాయిగా త్రాగారు. ఈ దృశ్యం జాగ్రత్తగా గమనించారు సూర్య–చంద్రులు.

లక్ష్మీపతికి ఫిర్యాదు చేశారు. రాహు–కేతువులకు శిక్ష తప్పలేదు. ఈ కారణంగా ఈ ఇద్దఱు సూర్య–చంద్రుల్ని తఱచు కబళిస్తుంటారు. దాన్నే సూర్య గ్రహణము, చంద్రగ్రహణము అంటాము. ఈ విధంగా కూర్మావతార వర్ణన సంక్షిప్తంగా ఉంది ఈ పురాణంలో.

రామాయణంలోని కొన్ని ఘట్టాలను పరిశీలించగా ..

వాలి వధ జరిగాక కిష్కింధాధి పతియైన సుగ్రీవుడు సీతాన్వేషణ విషయంలో పెద్దగ శ్రద్ధచూప లేదు. శాంతమూర్తి అయిన శ్రీరామచంద్రుడు సైతం కళ్ళెర్రజేశాడు. లక్ష్మణుని ద్వారా ఒక సందేశం పంపాడు సుగ్రీవునికి. ఆ సందేశము ఇలా ఉంది –

న చ సంకుచితః పంథా యేన వాలీ హతో గతః ।
సమయే తిష్ఠ సుగ్రీవ! మా వాలిపథమన్వగాః ॥

సుగ్రీవా! చెడుదారిపట్టి వాలి మరణించాడు. అలాంటి దారిలో నీవు నడవకు. సీతాన్వేషణ విషయంలో దృష్టిపెట్టు. అలా చేయకపోతే వాలికి పట్టినగతే నీకూ పడుతుందని భావము. దీన్ని సందేశమనడం కంటె హెచ్చరిక అంటేనే బాగుంటుందేమో?!

రామాయణంలోని మరో సన్నివేశం –

సీతను ఎత్తుకు రమ్మని మారీచుణ్ణి ఆదేశిస్తాడు రావణాసురుడు. అది రాజాజ్ఞ. తప్పక పాటించి తీరాలి. ఆ సమయంలో మారీచుని మనోగతము ఎంత ఆర్ద్రంగా ఉందో ఈ శ్లోకం చెబుతోంది–

రావణాదపి మర్తవ్యం మర్తవ్యం రాఘవాదపి ।
అవశ్యం యది మర్తవ్యం వరం రామాన్న రావణాత్ ॥

సీతను ఎత్తుకొని రాకపోతే రాజాజ్ఞ ఉల్లంఘన అవుతుంది. దీని సహించడు రావణుడు. తనని చంపేస్తాడు. సరే, అతని ఆజ్ఞను పరిపాలిద్దామంటే రాముని చేతిలో చావు తప్పదు. ముందు గొయ్యి, వెనుక నుయ్యి. మరణం ఎలాగూ తప్పదు. అలాంటప్పుడు రావణుని చేతిలో చావడం కన్నా రామబాణానికే గురికావడం శ్రేయస్కరమని భావం.

రామాయణంలోనిదే ఇంకో సన్నివేశం –

యుద్ధరంగంలో రావణుని సైన్యాలు అంతకంతకూ క్షీణించి మహాయోధు లందఱు మరణిం చారు. ఈ ప్రపంచంతో సంబంధంలేని కుంభకర్ణుడిని నిద్ర నుండి లేపాల్సిన పరిస్థితి వచ్చింది. అతి కష్టం మీద అతడిని నిద్రనుంచి లేపగలిగారు. యుద్ధం గుఱించి తెలిసి కొన్నాడు. సమరానికి కారణము అడిగాడు. సీతను ఎత్తుకుని రావడమే కారణమని తెలిసింది. అపుడు రావణాసురునితో ఇలా అంటాడు కుంభకర్ణుడు –

సీతాయా హరణం పాపం కృతం త్వం హి గురుర్యతః ।
అతో గచ్ఛామి యుద్ధాయ రామం హన్మి న సంశయః ॥

అన్నయ్యా! సీతను అపహరించి పాపం మూటకట్టుకున్నావు. నీవు చేసింది ముమ్మా టికీ తప్పే. అయినా నీవు నాకు పూజ్యుడవు. గనుక తప్పకుండా రణరంగానికి వెళ్తాను. రాముణ్ణి

సంహరిస్తాను అన్నాడు. మహోన్నతులైనా సరే, అక్రమాలకు పాల్పడ రాదని కుంభకర్ణుని ఉపదేశం ద్వారా హితవు పలుకుతోంది అగ్నిపురాణం. ఈ విధంగా అయిదవ అధ్యాయం మొదలుకొని పదకొండవ అధ్యాయం వఱకు శ్రీమద్రామాయణ వర్ణన ఉన్నది.

12, 13, 14 అధ్యాయాల్లో మహాభారత ప్రస్తావన దర్శనమిస్తుంది. మహాభారత సంగ్రామంలో మహావీరులందఱు వీరమరణం పొందారు. దుర్యోధన వర్గీయులు ముగ్గురు, పాండవ వర్గీయులు ఏడుగురు మాత్రమే మిగిలారని అగ్నిపురాణం చెబుతున్నది. –

కృతవర్మా కృపో ద్రౌణి స్త్రయో ముక్తాస్తతో రణాత్ ।
పాండవాః సాత్యకిః కృష్ణస్సప్త ముక్తా న చాపరే ॥

దుర్యోధనవర్గానికి సంబంధించి కృతవర్మ, కృపాచార్యుడు, అశ్వత్థామ అనే ముగ్గురు, పాండవ పక్షానికి సంబంధించి అయిదుగురు పాండవులు, కృష్ణుడు, సాత్యకి మిగిలారు అంటే రెండు పక్షాలకు సంబంధించి 10 మంది మాత్రమే రణరంగంలో బ్రతికారని భావం.

దేవాలయ నిర్మాణం పవిత్ర కార్యం. మనసులో కనీసము ఆ సంకల్పం కలిగినా నూరు జన్మల పాపాలు పటాపంచలు అవుతాయి. దేవాలయ నిర్మాతలు అభీష్ట లోకాలను చేరుకోగలరు. బ్రహ్మహత్య మొదలై మహాపాతకాలు దూరమవుతాయి. సకల తీర్థస్నాన ఫలం దక్కుతుంది. ఈ రీతిగా దేవాలయ నిర్మాణాన్ని ప్రేరేపిస్తున్నది ఈ పురాణం.

అగ్ని పురాణంలో కథలకు పెద్దగాచోటివ్వలేదు. కాని, సృష్టిలోని విద్యలు, పదార్థాల లక్షణాలు, వాటి పరీక్షా విధానం, స్వప్నాలు, శకునాలకు సంబంధించిన ఫలితాలు మొదలైన విషయాలెన్నో దర్శనమిస్తాయి. స్వప్నాలకు సంబంధించి పరిశీలిద్దాం. శుభ స్వప్నాలు, అశుభస్వప్నాలని స్వప్నాలు రెండు రకాలు.

స్వప్నకాలం		**ఫలించే సమయం**
తొలిజాము	-----	ఒక సంవత్సరం లోపు
రెండవ జాము	-----	ఆరు మాసాల్లోపు
మూడవ జాము	-----	మూణ్నెల్ల లోపు
నాలుగవ జాము	-----	15 రోజుల్లోపు

శుభ స్వప్నాలు : పర్వతం, మేడ, ఏనుగు, గుఱ్ఱం వీటిని ఎక్కడము, తెల్లని పూలు చూడటం, తెల్ల బట్టలు కట్టుకోవడం, శత్రునాశం, వాదం, జూదం, యుద్ధం వీటిలో గెలుపు, పాలు త్రాగడం, దేవతలు, రాజు, గురువు తనను అభినందించడం, రాజ పట్టాభిషేకం మొదలైనవి శుభ స్వప్నాలు. స్వప్నంచివర్లో రాజు, ఏనుగు, గుఱ్ఱం, బంగారు, ఆవు, ఎద్దు ఇవి కనిపిస్తే కుటుంబవృద్ధి. ఈ కారణంగా నాలుగవ జాములో ఇలాంటి శుభస్వప్నాలను చూసినపుడు వెంటనే నిద్రనుంచి లేవాలి. మళ్ళీ నిద్రపోతే ఆ స్వప్న ఫలితం దక్కదు.

అశుభ స్వప్నాలు : గుండుగీయించుకోవడం, నగ్నంగా ఉండటం, కుళ్లిన బట్టల్ని కట్టుకోవడం, పామును చంపడం, పంది, కుక్క, గాడిద, ఒంటెల నెక్కడం, పక్షిమాంసం తినడం, తల్లి గర్భంలో ప్రవేశించడం, చితి ప్రవేశం, దేవతలు, రాజు, గురువు వీరి కోపానికి గురికావడం, నదిలో కొట్టు కొని పోవడం, పేడనీళ్లతో స్నానం, వాంతులు, విరేచనాలు కావడం, దక్షిణ దిక్కుకు ప్రయాణం, ఇల్లు పడిపోవుట, పిశాచాల క్రీడ, ఓటమి, కాషాయ వస్త్రాలను ధరించడము మొదలైనవి. ఈ స్వప్న ఫలాలను నమ్మినవారు నమ్మవచ్చు.

నారద పురాణం 92వ అధ్యాయంలో చెప్పబడిన ప్రకారం అగ్ని పురాణంలోని విషయాను క్రమణిక ఇది :

ప్రశ్నపూర్వం పురాణ స్య కథా సర్వావతారజా
సృష్టి ప్రకరణం చాథ విష్ణు పూజాదికం తతః
అగ్నికార్యం తతః పశ్చాన్మంత్రము ద్రాది లక్షణమ్
సర్వదీక్షా విధానం చ అభిషేక నిరూపణమ్
లక్షణం మండలాదీనం కుశాపామార్జునంతతః
పవిత్రారోపణ విధిర్దేవాలయ విధిస్తథా
శాలగ్రామాది పూజా చ మూర్తి లక్షణమ్ పృథక్ పృథక్
న్యాసాదీనాం విధానం చ ప్రతిష్ఠా పూర్తకాతతః
వినాయకాది దీక్షాణాం విధిః జ్ఞేయస్తతః పరమ్
ప్రతిష్ఠా సర్వదేవానాం బ్రహ్మాండస్య నిరూపణమ్
గంగాది తీర్థమాహాత్మ్యం జంబ్వాది ద్వీప వర్ణనమ్
ఊర్ధ్వాధోలోక రచనా జ్యోతిశ్చక్ర నిరూపణమ్
జ్యౌతిషంచ తతః ప్రోక్తం శాస్త్రం యుద్ధ జయార్ణవమ్
షట్కర్మచతతః ప్రోక్తం మంత్ర యంత్రౌ షధీగణః
కుబ్జికాది సమర్చా చ షోఢా న్యాస విధిస్తథా
కోటి హోమ విధానంచ తదంతర నిరూపణమ్
బ్రహ్మచర్యాది ధర్మాశ్చ శ్రాద్ధ కల్ప విధిస్తతః
గృహయజ్ఞ స్తతః ప్రోక్తో వైదిక స్మార్త కర్మచ
ప్రాయశ్చిత్తాను కథనం తిథీనాంచ వ్రతాదికమ్
వారవ్రతాను కథనం నక్షత్ర వ్రత కీర్తనమ్
మాసికవ్రత నిర్దేశో దీపదాన విధిస్తథా
నవ వ్యూహార్చనం ప్రోక్తం నరకాణాం నిరూపణమ్
వ్రతానాంచాపి దానానాం నిరూపణ మిహోదితమ్

నాడీ చక్ర సముద్దేశః సంధ్యా విధిరనుత్తమః
గాయత్ర్యర్థస్య నిర్దేశో లింగస్తోత్రమ్ తతః పరమ్
రాజ్యాభిషేక మంత్రోక్తి ర్ధర్మ కృత్యంచ భూ భుజామ్
స్వప్నాధ్యాయస్తతః ప్రోక్తః శకునాది నిరూపణమ్
మండలాదిక నిర్దేశో రణదీక్షా విధిస్తతః
రామోక్తమీతి నిర్దేశో రత్నానాం లక్షణం తతః
ధనుర్విద్యా తతః ప్రోక్తా వ్యావహార ప్రదర్శనమ్
దేవాసుర విమర్దాఖ్యా హ్యాయుర్వేద నిరూపణమ్
గజాదీనాం చికిత్సాచ తేషాం శాంతిస్తతః పరమ్
గోనసాది చికిత్సాచ నానా పూజాస్తతః పరమ్
శాంత యశ్చాపి వివిధా శ్ఛందః శాస్త్ర మతః పరమ్
సాహిత్యంచ తతః పశ్చాదే కార్ణాది సమాహ్వయాః
సిద్ధశిష్టాను శిష్టశ్చ కోశః స్వర్గాది వర్గకే
ప్రళయానాం లక్షణం చ శారీరక నిరూపణమ్
వర్ణనం నరకాణాంచ యోగశాస్త్రమతః పరమ్
బ్రహ్మజ్ఞానం తతః పశ్చాత్ పురాణ శ్రవణే ఫలమ్
దాగ్నేయకం విప్ర ! పురాణం పరికీర్తితమ్

అగ్ని పురాణం ఈశానుకల్పవృత్తాంతాన్ని వివరిస్తుందని మత్స్య, స్కాంద పురాణా లలో ఉన్నా, ఈ పురాణంలోమాత్రం ఆ విషయం ఎక్కడాపేర్కొనబడలేదు. అయితే కూర్మావ తార కథనంలో ఆ వృత్తాంతం వారాహకల్పంలో జరిగిందనిచెప్పబడింది. (2-37) ఈ విధంగా వ్యత్యయం ఉండటం వలన ఈపురాణం అసలుఅగ్నిపురాణము అనగా ప్రాచీన అగ్నిపురాణం కాదనే వారు ఉన్నారు.

అగ్ని పురాణ శ్లోక సంఖ్య

ఇందులో మూడు వందల ఎనుబది మూడు అధ్యాయములు ఉన్నాయి. భాగవతం ఈ పురాణంలో మొత్తం ఇరవై అయిదు వేల నాలుగు వందల శ్లోకాలు ఉన్నాయని చెప్తున్నది. దేవీ భాగవతం దీనిలో ఇరవై ఆరువేల శ్లోకాలు ఉన్నాయని వక్కాణిస్తుండగా అగ్నిపురాణం స్వయంగా తనను గుఱించి పదిహేనువేల శ్లోకాలుగల గ్రంథమని చెప్పు కొన్నది. మత్స్యపురాణం పదహారువేల శ్లోకాలున్నాయని, నారదీయపురాణం పన్నెండువేల శ్లోకాలున్నాయని చెప్తున్నది. ఈ విధంగా దీని శ్లోక సంఖ్యను గురించి పురాణాలలోనే ఏకాభిప్రాయంలేదు. కానీ ప్రస్తుతము ముద్రితమై లభ్యమగు చున్న ఆనందాశ్రమ ప్రతియందు దాదాపు 11,457 శ్లోకములు మాత్రము గలవు. ఈ శ్లోక సంఖ్య నారదీయ పురాణంలో చెప్పబడిన సంఖ్యకు కొంతవరకు దగ్గరగా ఉన్నది. వాస్తవవానికి పంచలక్ష్మణ సమన్వితమైనదే పురాణమని చెప్పబడుచున్నను, ఈ పురాణమున పంచలక్షణములకు

ఏ మాత్రము సంబంధములేని భారతీయ విజ్ఞానమునకు సంబంధించిన అనేక విషయములు వివరింపబడినవి. వీటిలో శిక్ష, నిరుక్తము, ఛందస్సు, వ్యాకరణము, గాంధర్వము, శిల్పము, వాస్తువు, భారత, రామాయణాది ఇతిహాస కావ్యముల కథలును వివరింపబడినవి. ఈ పురాణము నందు మూడు వంతులకుపైగా, వీనికి సంబంధించిన విషయముల వివరణయే గలదు. దీనిని సమస్త భారతీయ విజ్ఞానసర్వస్వమని చెప్పినను అతిశయోక్తి కాదు. జన సామాన్యమునకు భారతీయ విద్యల, విజ్ఞానము యొక్క స్వరూప నిరూపణ చేయుట ఈ పురాణ ముఖ్య లక్ష్యమై ఉండవచ్చును. **ఆగ్నేయేహి పురాణేఽస్మిన్ సర్వాః విద్యాః ప్రదర్శితాః**- (అగ్ని 383-52) అని ప్రశస్తిగనిన పురాణ మిది. పౌరాణిక వర్గీకరణము ప్రకారము అగ్ని పురాణము తామస పురాణములలో చేరును. అనగా ఇది శివభక్తి పారమ్యమైన పురాణము.

ఇంకొక అగ్ని పురాణం

ప్రస్తుతము లభ్యమగుచున్న అగ్నిపురాణము అష్టాదశ పురాణకోటిలోని అగ్ని పురాణము కాదనియు వహ్ని పురాణమను పేరవ్రాత ప్రతులలోనే లభ్యములగుచున్న పురాణమనే మూలఅగ్ని పురాణముగా పురాణ పరిశోధనలో దిట్ట అయిన హజ్రా మహాశయుడు తెలుపుతున్నాడు. దీనికిని, ప్రస్తుతము ముద్రితమైన అగ్నిపురాణమునకును ఏమాత్రము సంబంధమేలేదు. వహ్ని పురాణము ప్రస్తుత అగ్నిపురాణమునకు మూలమని అది క్రీ.శ. 4వ శతాబ్దికి పూర్వమే రచింపబడినదని అందులోని విషయాలను గ్రహించి అనేక శాస్త్రీయ విషయములు సంగ్రహించి ప్రస్తుత అగ్ని పురాణము రచింపబడిందని ప్రఖ్యాత సంస్కృత విద్వాంసులు శ్రీ పి.రామచంద్రుడుగారి ఉద్దేశ్యము. ప్రధానమైన విద్యలను సర్వజనయోగ్యం చేయడం ఈ పురాణ ప్రధాన ధ్యేయం. భోజుని సరస్వతీ కంఠాభరణము ఈ పురాణమునందలి అలంకార విషయము ఆధారముగా రచింపబడినది అని విజ్ఞుల భావన.

అగ్నిపురాణం ప్రతిపాదించిన అనేక తాంత్రిక ఆచారములలో విశిష్టమైనవి కొన్ని ఈ నాటికి వంగదేశమున ప్రచారమున గలవు. అందుచే ఈ పురాణం ఆ దేశములోని పశ్చిమ ప్రాంతంలో రచింపబడినదై ఉండవలెను. ఈ పురాణమునకు చివర

నా స్మాత్ పరతరం భూమౌ విద్యతే వస్తు దుర్లభమ్
ఆగ్నే యేహిపురాణేఽస్మిన్ సర్వా విద్యా ప్రదర్శితాః

ఇందు చెప్పబడని విషయము ఈ భూమియందు దుర్లభము. ఈ ఆగ్నేయ పురాణము నందు సర్వవిద్యలు ప్రదర్శింపబడినవి అనుట యందు ఆవంతయు అతిశయోక్తి లేదు.

ప్రస్తుతం లభ్యం అవుతున్న అగ్నిపురాణం, కొందరు పండితుల వద్ద ఉన్న వహ్ని పురాణం రెండు గ్రంథాలలోను విషయానుక్రమణికలో కొంత సమానత ఉన్నది. బల్లాల సేనుడు తన దానసాగరంలో అగ్నిపురాణంలోనివని ఉదాహరించిన శ్లోకాలు ప్రస్తుత అగ్నిపురాణంలో లేవు.

అగ్ని, ఆగ్నేయ
మృషా వంశానుచారతైః కోశవ్యకరణాదిభిః
అసంగత కథా బంధ పరస్పర విరోధితః
త స్మీనకేత నాదీనాం భండ పాషండ లింగినామ్
లోక వంచ నమాలోక్యసర్వమేవా బధీరితమ్

అని చెప్పుటచే బల్లాలసేనుడు దీనిని ప్రామాణికముగా తీసుకొనలేదని చెప్పవచ్చును. ఇందులో దీక్షావిధి; రత్న పరీక్షణ, కోశ వ్యాకరణాది విషయములుగలవు. ఇవియే ఈ పురాణము యొక్క ప్రాచీనతకు ప్రతి బంధకములు ఈ విషయములను పరిశీలించినపుడు ఈ అగ్నిపురాణమే ప్రాచుర్యమునకు వచ్చి అసలు మూలరూపమైన అగ్ని పురాణము ఎందులకు మూలబడినదను అనుమానము రావచ్చును. ఈ పురాణమునందు చెప్పబడిన అనేక లౌకిక విషయములు ఉండుటయే ఈ పురాణము ప్రచుర ప్రచారము నందుటలోని రహస్యము. తంత్ర, ఆరాధన, గృహ సంబంధ విద్యలు ఇందు ఉండుటచే ఇది ఎంతో ప్రాచుర్యము పొంది పలువురిచేత పురాణముగా స్వీకరింపబడి, వహ్ని పురాణము అను ప్రాచీన పురాణము ప్రచారము నుండి తొలగిపోయి ఉండవచ్చును.

మూల అగ్నిపురాణమందు తాంత్రిక వ్యావహారిక విషయములు ప్రదానముగా ఉండుటచే దాని ప్రచారము క్రమముగా క్షీణించి కేవలము వ్రాతప్రతిగా మాత్రము అచ్చుటచ్చుట దొరుకుచున్నది. వహ్ని లేక అగ్ని పురాణము నుంచి ఉద్ధరించబడిన గ్రంథ భాగములు ప్రచారములోనున్న ప్రస్తుత అగ్నిపురాణము నందు దొరుకుట లేదు. కానీ ప్రాచీన వహ్ని పురాణమున మాత్రము గలవు. ఈ వహ్ని పురాణమందలి చాలా శ్లోకములు అగ్ని పురాణమునందును గలవు. అందుచే వహ్నిపురాణ మును గూర్చియు కొంత సందేహము కలుగవచ్చును. వహ్ని లేక అగ్ని పురాణముల లోనివని మత్స్య పురాణము (53 / 28-30), స్కాందపురాణ ప్రభాస ఖండము (2/47-48)లలో చెప్పబడిన విషయ ములు రెండింటి యందును (అగ్ని, వహ్ని పురాణములలో) లేవు. అందుచే పై మత్స్య, స్కాంద పురాణమున చెప్పబడిన అంశము కలిగిన వేరొక అగ్ని పురాణము ఉండి ఉండుటకు అవకాశముగలదు. ప్రస్తుత అగ్నిపురాణము నందు దాదాపు 12 వేలశ్లోకములు గలవు. వహ్ని పురాణమును అనుసరించుచు ప్రత్యేక విషయములను చేర్చుచు సాగించిన రూపము ఇదే కావచ్చును. వహ్నిపురాణము క్రీ.శ. నాలుగు, ఐదు శతాబ్దులలో రచింపబడి ఉండునని చెప్పవచ్చును. వహ్ని పురాణ సంకలనములందు మూడు విభాగములు కన్పించు చున్నవి. మొదటిది యజుర్వేదీయ అగ్న్యారాధక బ్రాహ్మణులు రచించినది, రెండవది అగ్ని ఉక్త, వహ్ని పురాణము మొదలైన పేర్లుతో చెప్పబడినవి. ఈ అన్ని పేర్లు ఏకార్థక వాచకములే అందువలన ఒక పురాణమునకే ఇవి వేరువేరు పేర్లు కావలయును. గరుడ, గారుడ తార్క్ష్య, వైనతేయ పురాణములు అనునవి గరుడ పురాణమునకు, విష్ణు, వైష్ణవ ములను పేర్లు విష్ణు పురాణమునకు ఇట్లే వేర్వేరు పేర్లుగలవు. కానీ వహ్ని పురాణ మును వేరొక వ్రాతప్రతి లభించుచున్నది. పురాణములను గుఱించి ప్రామాణిక పరిశోధన లనుచేసిన డా॥హజ్రా ఈవహ్నిపురాణమే అసలు(మూల)అగ్నిపురాణముగా నిర్ణయించిరి. దీనిని గుఱించివారు బరోడా జర్నల్ 5వ సంచిక యందు నాల్గవ అంకమున, 'అవర్ హెరిటేజ్' పత్రిక యొక్క ప్రథమ,

ద్వితీయ అంకములందు విస్తృతమైన చర్చగావించిరి. ఈ వహ్నిపురాణ వ్రాత ప్రతి శ్రీ హజ్రా వద్దగలదు. వారు ఉటంకించిన విషయముల ప్రకారము ప్రాచీన పండితులు అగ్ని పురాణము నుంచి ఉదాహరించిన విషయములు అన్నియు ఈ వహ్నిపురాణము నందు లభ్యమగుచున్నవని తెలిపిరి. స్వభావతః ఈ అగ్ని పురాణము అగ్ని-పాంచరాత్రుల ద్వారా సంస్కరించబడిన వైష్ణవపూజ ప్రాధాన్యతను వివరించు తంత్ర ప్రధానపురాణము. ఏ ప్రమాణములతో డా॥ హజ్రా వహ్ని పురాణ మును మూల అగ్నిపురాణముగా నిరూపించిరో అవి క్రింద వివరింపబడినవి.

మూల అగ్నిపురాణము వహ్ని పురాణమను పేరుతోనే ప్రచారము నందినది. ఇందు అగ్ని మహిమ విస్తారముగా వివరింపబడినది. స్కందపురాణము శివరహస్య ఖండమున ఈ విషయమే చెప్పబడినది. ఈ లక్షణము వహ్నిపురాణము నందు మాత్రమే కాన్పించుట చేత ఇదియే మూల అగ్నిపురాణమని భావించుట సమంజసము.

ప్రస్తుత అగ్ని పురాణమందు తాంత్రికపూజ, కర్మ కాండలు విస్తారముగా వివరింపబడినవి. ఈ కారణము చేతనే బల్లాలసేనుడు తన గ్రంథమున 'దానసాగరము'న దీనిని ప్రామాణికముగా తీసుకొనలేదు. ఆయన

తార్క్ష్య పురాణమపరం బ్రహ్మ మాగ్నేయ మేవచ
త్రయోవింశతి సాహస్రం పురాణమపి వైష్ణవమ్
షట్ సాహస్రమితి లింగం పురాణమపరం తథా
దీక్షా ప్రతిష్టా పాషండ ముక్తి రత్నపరీక్షణైః

వివిధ పురాణాలలో అగ్నిపురాణానికి అగ్ని, ఆగ్నేయ, అగ్ని ఉక్త, వహ్ని పురాణము మొదలైన పేర్లు చెప్పబడి ఉన్నాయి. ఈ అన్నిపేర్లు ఏకార్థక వాచకాలే. అందువలన ఒక పురాణానికే ఇవి వేరేవేరు పేర్లు అయి ఉండాలి. గరుడ, గారుడ, తార్క్ష్య, వైనతేయ, పురాణాలనేవి గరుడ పురాణానికి పేర్లు. ఇలాగే విష్ణువు, వైష్ణవా లనే పేర్లు విష్ణు పురాణానికి ఉన్నాయి. కానీ అగ్నిపురాణానికి వహ్నిపురాణమనే వేరొక వ్రాతప్రతి లభిస్తున్నది. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న అగ్ని పురాణానికి ఇది పూర్తి భిన్నంగా ఉన్నది.

అగ్ని పురాణం-వక్తృ శ్రోతృ పరంపర

మత్సపురాణంలో **వశిష్ఠా యాగ్ని నా ప్రోక్తమ్** (మత్య-53-80) అనటంచేత అగ్నిపురాణం అగ్నిచేత వశిష్ఠునికి బోధింపబడినట్టిది అని తెలుస్తున్నది. అగ్నిపురాణ అధ్యయనంలో అనేకులు వక్తృశ్రోతలు కనిపిస్తారు. వాస్తవానికి ప్రధానంగా ఇది అగ్ని వశిష్ఠునికి ఉపదేశించిన పురాణమైనా, ఇందులో చెప్పబడిన అనేక ప్రముఖ గ్రంథాలకు కర్తలు అయినందున ఆ మహానుభావులు ఉపదేశించినట్లుగానే చెప్పడం విశేషం. వీరు కేవలం వక్తలేకాని ముఖ్య వక్త అగ్నియే. అగ్నిని ప్రధానవక్తను చేయడంచేతనే ఈ పురాణానికి పురాణ స్థాయి కలిగినది. ఏయే వక్త, ఏయే విషయాలను వివరించాడో ఈ క్రింద చూపబడింది.

అగ్ని	–	విష్ణు అవతారములు, రామాయణ, మహాభారత, హరివంశ కథనము, పురాణ పంచలక్షణ విషయములు వివిధ శాఖలవారి కర్మకాండ, ప్రాయశ్చిత్తాలు, వ్రతాలు, స్తోత్రాలు, పట్టాభిషేక విధానము మొదలైనవి.
నారదుడు	–	విష్ణు అర్చన, తాంత్రిక విధానాలు.
హయగ్రీవుడు	–	దేవాలయ ప్రతిష్ఠ, కలశస్థాపన, వాసుదేవ విగ్రహ లక్షణాలు, విష్ణు అర్చన విధానాలు.
ఈశ్వరుడు	–	గణ, సూర్య, శివ, చండ, కపిల, ఆరాధనా విధానాలు. తాంత్రిక పద్ధతులు, చక్రార్చన, వివిధ చక్రాలు.
పుష్కరుడు	–	వర్ణాశ్రమ ధర్మాలు, నిత్యాచార విధి, పాప ప్రాయశ్చిత్త విధానాలు, వినాయకాభిషేకం మొదలైనవి.
భగవాన్	–	వివిధ విగ్రహాల లక్షణాలు
రాముడు	–	రాజనీతి.
సముద్రుడు	–	సాముద్రిక శాస్త్రము.
ధన్వంతరి	–	వైద్యకశాస్త్రము.
పాలకాప్యుడు	–	గజవైద్యము.
శాలిహోత్రుడు	–	అశ్వవైద్యము.
స్కందుడు	–	వ్యాకరణము.
కుమారుడు	–	వ్యాకరణము.
శ్రీకృష్ణుడు	–	భగవద్గీత.
యముడు	–	యమగీత.

ఈ విధంగా ఈ పురాణంలో వక్తృ శ్రోతృ పరంపర కనిపిస్తుంది.

సాధారణంగా ఇతర పురాణాలలో చెప్పబడిన విధంగా దీనిని శౌనకాది మహా మునులకు రోమహర్షణ సూతుడు వినిపించినట్లుగానే మొదలు పెట్టబడింది. సూతునికి వశిష్ఠుడు ఉపదేశించగా, వశిష్ఠునికి అగ్ని చెప్పినట్లుగా ఈ పురాణం ద్వారా మనకు తెలుస్తుంది. అందుకే దీనికి అగ్ని లేక ఆగ్నేయ పురాణమనే పేరువచ్చింది.

అగ్నిపురాణం-వర్గీకరణ

అగ్నియొక్క మాహాత్మ్య ప్రతిపాదనమే అగ్ని పురాణ లక్ష్యం అని స్కాందపురాణంలోని శివరహస్య ఖండంలో చెప్పినా, ఈ పురాణంలో అలాంటి వృత్తాంతం ఏమీ లేదు.

యత్ర దీశానకం కల్పం వృత్తాంత మధికృత్యచ
వసిష్ఠాయాగ్ని నాప్రోక్త మాగ్నేయం తత్ ప్రచక్షతే
తచ్చ షోడశ సాహస్రం సర్వ క్రతు ఫలప్రదం

(ఈశాన కల్పవృత్తాంతాన్ని వశిష్ఠునికి అగ్నిఉపదేశించిన సర్వ యజ్ఞ ఫలప్రదమైన పదహారు వేల శ్లోకాలుగలది ఈ పురాణం) అని మత్స్యపురాణం తెలుపుతున్నది.

పురాణముల వర్గీకరణ ప్రకారము అగ్ని పురాణము 'తామస పురాణము'ల విభాగము నందు చేర్చబడినది. తామస పురాణములు శివ భక్త్యాత్మకములు. అందుచే దీనిని శివ భక్త్యాత్మక పురాణ ముగా చెప్పవచ్చును.

అగ్ని, గరుడ, నారద పురాణాది పురాణములు కేవలం పురాణ పంచలక్షణములు, దశ లక్షణములకు పరిమితములుకావు. సామాన్యముగా ఏ పురాణమూ పంచ లక్షణములకు పరిమితమై ఉండదు. అగ్ని పురాణము ఇంకను విస్తరించినది. ప్రతిపాద్య విషయమును బట్టి అగ్నిపురాణము బహువిధ విషయ విస్తారకముగా ఉన్నదని చెప్పవచ్చును. నిఘంటు, వ్యాకరణ, ఛంద, అలంకార, జ్యోతిష, వైద్య, సాముద్రికాది శాస్త్రములతో ఆఖ్యానోపాఖ్యాన ములతో, తీర్థ, క్షేత్ర, శ్రాద్ధాది నానా విషయములు అగ్నిపురాణమున చెప్పబడినవి.

అగ్నిపురాణ విషయములను పరిశీలించిన భారతీయ (మానవ) విజ్ఞానము నందలి సర్వ విషయములును జన వ్యవహారము నందుగలవి, జనులకు తెలిసిన సర్వ విషయ ములు స్పష్టముగా విశదీకరింప బడినవి. ఈ దృష్టితో పరిశీలించిన అగ్నిపురాణము వాస్తవముగా విజ్ఞాన సర్వస్వమే కాక విజ్ఞానం కోశమే. విషయములను వివరించునపుడు అగ్ని పురాణము ప్రామాణికమైన సారాత్సార వివేచనపద్ధతిలో చేయబడినట్లు గ్రహించ గలము. ఈ విషయమే ఈ పురాణ ఆరంభంలో

విష్ణుః కాలాగ్ని రుద్రో౽హం విద్యాసారం వదామితే
విద్యాసారం పురాణం యత్సర్వ సర్వస్య కారణమ్ (అగ్ని 1-13)

అని ఇది సర్వవిద్యల సారమని చెప్పబడినది. ఒకానొక సందర్భమున ఈ పురాణము అగ్ని పురాణము విష్ణుస్వరూపమని చెప్పబడినది. దీని కర్త శ్రోత సాక్షాత్ జనార్దనుడే. అందుచేతనే ఈ పురాణము సర్వవేదమయము సర్వ విద్యామయమని

వేదేషు స పురాణేషు యజ్ఞ మూర్తిశ్చ శీయతే
ఆగ్నేయాఖ్యం పురాణం తు రూపం విష్ణో ర్మహత్తరమ్
తస్మాత్ పురాణ మాగ్నేయం సర్వవేద మయం మహత్
సర్వ విద్యామయం పుణ్యం సర్వజ్ఞాన మయం వరమ్ (అగ్ని 271-16-28)

అని చెప్పబడినది. ఈ విధముగా అగ్నిపురాణము తనను మహాపురాణములలో ఒకటిగా చెప్పు కొనుచున్నది. అందలి విషయ క్రమమును బట్టి కూడా అది నిశ్చితమైన విషయమే. కానీ పరిశోధనలు

దీని ప్రాచీనత విషయమున సందేహము వెలిబుచ్చి యున్నారు. కాన దీనిని మూల అగ్నిపురాణము గనుక వహ్ని పురాణముగను పరిగణింప లేదు.

అగ్ని, గరుడ, నారద పురాణములను విజ్ఞాన సర్వస్వాత్మక పురాణములని వేరొక విభాగము చేయవచ్చును. వీనియందు వర్ణ్యవిషయము కేవలము పురాణ పంచలక్షణములు నియమితమే కాక సమస్త విజ్ఞానమును క్రోడీకరించి రాశిపోసినవి. కావుననే ఇది తనను గుఱించి **'విద్యాసారం పురాణం యత్ సర్వం సర్వస్య కారణమ్'** అని చెప్పుకొనినది.

కావున దీనిని ప్రాచీనమైన మౌలిక పురాణమని చెప్పలేము. ఇది సామాన్య జనోప యోగము కొఱకు ప్రౌఢగ్రంథముల సారాంశమును క్రోడీకరించిన రచన. జన సామాన్యమునకు విద్యగ ఉపయోగకరముగ రచింపబడి ఉండును. అగ్ని పురాణము ప్రత్యేకముగా ఏ మతశాఖ వైపును మొగ్గు చూపు గ్రంథముకాదు. ఇందు శైవ, వైష్ణవ, శాక్తపరమైన అంగములు అన్నియు వివరింపబడినవి.

అగ్నిపురాణ రచనా కాలము - స్థలము

అగ్నిపురాణ రచనము ప్రత్యేకముగా ఒకే కాలమున జరిగినదని చెప్పలేము. ఇందలి అనేక శాస్త్ర విషయములు భిన్నభిన్న కాలములలో రచింపబడినవి. ఇందు చెప్పబడిన అలంకార శాస్త్ర విషయములను అనుసరించి ఇది దండి కావ్యాదర్శ రచన తరువాత రచింపబడినట్లు స్పష్టమగును. దండి క్రీ.శ. 7వ శతాబ్ది తరువాత జీవించినట్లు నిశ్చయింపవచ్చును. అందుచే అగ్నిపురాణ రచనా కాలము క్రీ.శ. 7వ శతాబ్ది తరువాత అని నిశ్చయింపవచ్చును. భోజుని సరస్వతీ కంఠాభరణ రచనా కాలమునకు ముందుగానే ఈ భాగము రచింపబడినదని చెప్పవచ్చును. భోజుని కాలము 11వ శతాబ్దము మధ్య భాగము కావున అగ్నిపురాణము వివిధ కాలములకు చెందిన వివిధ గ్రంథముల సారోద్ధార మని చెప్పవచ్చును. కావుననే నిబంధ గ్రంథములలో అగ్నిపురాణ మందలివని ఆయా వ్యాఖ్యాకర్తలు ఉద్ధరించిన భాగములు ప్రస్తుత అగ్నిపురాణమున కాన్పించుట లేదు. డా॥హజ్రా వద్దగల వహ్నిపురాణ వ్రాతప్రతియందు అనేక నిబంధకారులు ఉద్ధరించిన అగ్ని పురాణము నందలి భాగములు యథాతథముగా లభ్యములు అగుచున్నవి. కావుననే ఇదియే ప్రాచీన అగ్ని పురాణమని భావింపబడుచున్నది.

ప్రస్తుతము ముద్రింపబడి లభ్యమగుచున్న అగ్నిపురాణము 'పాంచ రాత్ర' శాఖీయుల ద్వారా సంస్కరింపబడి వైష్ణవుల అర్చన, పూజాదికములను వివరించే గ్రంథముగా మారియున్నది. కావున దీనిని ప్రాచీనమైన మౌలిక పురాణమని చెప్పలేము అని హజ్రా అభిప్రాయం. ప్రస్తుత అగ్ని పురాణము సామాన్య జనోపయోగము కొఱకు ప్రౌఢ గ్రంథముల సారాంశమును కూడా క్రోడీక రించిన రచన. జన సామాన్యమునకు విద్యగ ఉపయోగకరమై రచింపబడి ఉండును. కానీ ఈ రచనా కాలమును గుఱించిన భిన్నాభి ప్రాయములు గలవు. ప్రస్తుత అగ్ని పురాణము క్రీ.శ. 9వ శతాబ్దమునకు పూర్తి రూపము సంతరించు కొనినదని భావించ వచ్చును.

ప్రస్తుత పురాణం వలన, ప్రజాబాహుళ్యానికి ఉపయోగమైన విద్యల సంగ్రహమేనని గ్రహించవచ్చు. అందువలన మనం దీనిని ఆధునిక పరిభాషలో పౌరాణిక విజ్ఞాన సర్వస్వమని భావించటం సామంజస్యమే. దీని ముఖ్య ఉద్దేశ్యమే వివిధ విద్యలను సర్వులకు పరిచయం చేయటం ఈ ఉద్దేశ్యంతోటే పరిశీలిస్తే పుస్తకం అంతా కూడా ఒక విజ్ఞాన సర్వస్వంగానే భాసిస్తుంది. వివిధ శాస్త్రాలలోని ప్రౌఢ విషయాలను స్వీకరించి, యథార్థంగా ఆ శాస్త్ర గ్రంథాలసారంగా తాను పొందవలసిన స్థానాన్ని పొందగలిగింది. ధర్మశాస్త్ర విషయాలతో పాటు, విజ్ఞానసంబంధ విషయాలను కూడా చాలా మార్మిక దృష్టితో చేసిన పురాణకర్త విజయం సాధించాడు. ధర్మశాస్త్ర విషయాలే కాకుండా శాస్త్ర పరిజ్ఞానాన్ని దీనిద్వారా పొందే అవకాశం కూడా కల్పించబడింది. వాటి సంకలనం చాలా ఉపయోగ కరంగా చేయబడింది. ధర్మ శాస్త్రీయ విషయ వర్ణనలో ఆయుర్వేద, అశ్వాయుర్వేద, గజాయుర్వేద, వృక్షాయుర్వేద (283), గో చికిత్స, రత్నపరీక్ష (243), ధనుర్విద్య (249–292) వాస్తువిద్య (40వ అధ్యాయము, 93–94 అధ్యాయాలు 105–106 అధ్యాయం) ప్రతిమా లక్షణం (49–55 అధ్యాయం) రాజధర్మ, కావ్యవివేచన (337 అధ్యాయం 333–347 అధ్యాయం) మొదలైనవి అన్నీ ఉన్నాయి.

ఈ విషయ వివరణల ఆధారంగా ఈ పురాణ రచనా కాలాన్ని నిర్ణయించవచ్చు. ఇందులోని అలంకార విషయాలు భోజరాజు రచించిన సరస్వతీ కంఠాభరణానికి ముఖ్య ఆధార గ్రంథంగా ఉన్నది. అందువలన ఇది 11వ శతాబ్దికి ముందు గ్రంథం అయి ఉండాలి. అలాగే అగ్ని పురాణానికి ఈ విషయాలపై ముఖ్య ఆధార గ్రంథం దండి రచించిన కావ్యాదర్శం. అందువలన ఇది ఏడవ శతాబ్దికి తరువాత రచింపబడిన గ్రంథం అయి ఉండాలి. అందువలన ఈ పురాణ రచనా కాలం ఏడవ శతాబ్ధి కంటే ముందుదిగా భావించే అవకాశం లేదు. దీని రచనాకాలం నాల్గవ శతాబ్దానికంటే అర్వాచీనంగా నిర్ణయించటం కుదరదు. అందుచేత అగ్ని పురాణం 7వశతాబ్దం తరువాత, 11వ శతాబ్దం ముందుగా రచింపబడిన గ్రంథం అయి ఉండవచ్చు.

ఇందులో పేర్కొనబడిన అనేక తాంత్రిక అనుష్ఠానాల ఆచరణ, ఒక్క వంగదేశ ప్రాంతంలో మాత్రమే కనబడుతున్నది. అందువలన దీని ఉద్భవ స్థానం లేక రచనా ప్రదేశం వంగదేశ పశ్చిమ ప్రాంతం అని భావించటం సంగతమే.

అగ్నిపురాణంలో ప్రక్షిప్తాలుగా భావించబడుతున్న భాగాలు

అ) అగ్నిపురాణంలో మొదటినుంచి ఉన్న స్మృతి విషయాలను తెలిపే అధ్యాయాలు (ప్రాచీన మూలాల నుంచి ప్రక్షిప్తం చేసిన భాగాలు తప్ప)	తీర్థాలు, అంత్యక్రియలు వివిధ దేవతల ఆరాధన, వర్ణాశ్రమ ఆచారాలు, సాధారణ ఆచారాలు, ప్రాయశ్చిత్తాలు, అశౌచము గ్రహసంబంధబలులు, పాపాలు తపస్తుతి, నరకాలు, దానాలు రాజులు చేయవలసిన కర్మకాండ మొదలైనవి.	క్రీ.శ. 9వ శతాబ్దంలో

ఆ) ప్రక్షిప్తభాగాలు	ఆరాధన, స్నానవిధి, అగ్నికార్యము	
21-106 అధ్యాయాలు	ముద్రలతో అర్చనము, దేవాలయ	పైన చెప్పిన
263-272 అధ్యాయాలు	నిర్మాణము, విగ్రహప్రతిష్ఠలు.	అధ్యాయాలకు
317-326 అధ్యాయాలు	ఆవాహన విధానాలు,	తరువాత
ఇంకా కొన్ని అధ్యాయాలు	పుస్తకదానాలు, వాస్తు	కాలంలో చేర్చబడి
ఉన్నా గుర్తించటానికి	ఇతరములు	ఉండాలి.
వీలు కాకుండా ఉన్నాయి.		

(హిందూ ఆచార, కర్మకాండల పురాణ ఆధారాలు - ఆర్.సి. హజ్రా గ్రంథము)

దీని వలన అగ్ని పురాణం ఏడవ శతాబ్దం తరువాత వచ్చిన గ్రంథమనీ అలంకార శాస్త్రానికి సంబంధించిన భాగం నిశ్చితంగా క్రీ.శ. 900 తరువాతనే కూర్చబడిందనీ, బహుశా ఇది క్రీ.శ. 1050 తరువాతదయి ఉంటుందనీ చెప్పడానికి అవకాశం ఉంది.

మరొక ప్రధానమైన విషయం ఏమనగా-ప్రాచీన అలంకారికులలో ఒక్కడు కూడా అగ్ని పురాణం నుండి శ్లోకాలు ఉదాహరించలేదు. మమ్మటుడు విష్ణుపురాణం నుంచి శ్లోకాలు ఉదాహ రించాడు కాని అగ్నిపురాణం నుంచి ఉదాహరించలేదు. అగ్నిపురాణం అలంకార శాస్త్ర విషయాలలో ప్రామాణికం అని చెప్పిన మొట్ట మొదటి అలంకారికుడు క్రీ.శ. పధ్నాల్గవ శతాబ్దానికి చెందిన విశ్వనాథుడు. ధ్వన్యాలోకంలోను, లోచనంలోను భరతుని నాట్యశాస్త్రమే పరమప్రామాణిక గ్రంథంగా పేర్కొనబడింది. భామహుడు, దండీ కూడ దీనిని పరమ ప్రమాణంగా గ్రహించారు. అందుచేత అగ్నిపురాణం భరత, భామహ, దండి, ఆనంద వర్ధనుల తరువాతవచ్చిన గ్రంథమే కాని అంతకు పూర్వం ఉన్నది కాదు. బహుశా ఇది భోజునికంటె కూడ అర్వాచీనమైనది. ఈవిధంగా దీనిని అలంకార శాస్త్రానికి మూలగ్రంథంగా పరిగణించవలసిన పనిలేదు. కేవలం పురాణాలన్నీ వేదవ్యాస రచితాలే అనే విశ్వాసంగల మధ్యయుగానికి చెందిన రచయితలు మాత్రం పురాణం అనే పేరు పెట్టడంతో ఇది అలంకారశాస్త్రానికి సంబంధించిన అతి ప్రాచీన గ్రంథమని విశ్వసించారు.

అగ్నిపురాణం - అలంకార శాస్త్రం

నేడు మనకు లభ్యం అవుతున్న అలంకారశాస్త్ర గ్రంథాలలో అగ్నిపురాణం అతి ప్రాచీనమైనదనీ, తరువాత వచ్చిన గ్రంథాలన్నీ దీనినుండే విషయాలు గ్రహించి రచింప బడ్డాయనీ కొందరి అభిప్రాయం. కావ్య ప్రకాశ ఆదర్శంలో మహేశ్వరుడు -**'సుకుమారాన్ రాజకుమారాన్ స్వాదుకావ్య ప్రవృత్తిద్వారా గహనే శాస్త్రాన్తరే ప్రవర్త యితుమ్ అగ్ని పురాణాదు ద్ధృత్యకావ్య రసాస్వాద కారణమ్ అలంకార శాస్త్రం కారికాభిః సంక్షిప్య భరతమునిః ప్రణీతవాన్'** అని అన్నాడు. (సుకుమారమతులైన రాజకుమారులకు ముందుగా కావ్యాల విషయంలో అభిరుచి కలిగించి క్రమంగా దురవగాహమైన శాస్త్ర మధ్యంలో ప్రవేశింపచేయడం కోసం భరతముని అగ్నిపురాణం నుంచి గ్రహించిన కావ్య రసాస్వాద సాధనమైన అలంకారశాస్త్రాన్ని కారికలతో సంక్షిప్తం చేసి రచించాడు) అదే విధంగా విద్యాభూషణుని సాహిత్యకౌముదికి వాఖ్యానమైన కృష్ణానందినిలో కూడ-**'కావ్యరసాస్వాద నాయ**

వహ్నిపురాణాది దృష్టాం సాహిత్య ప్రక్రియాం భరతః సంక్షిప్తాభిః కారికాభిః నిబబన్ధ' ('భరతుడు కావ్యరసాన్ని ఆస్వాదించడం కోసమై వహ్నిపురాణాదులలో ఉన్న సాహిత్య ప్రక్రియను సంక్షిప్తములైన కారికలతో రచించాడు') అని చెప్పబడింది.

అగ్నిపురాణంలో ఉన్న 336-346 అధ్యాయాలలో అలంకార శాస్త్రానికి సంబంధించిన విషయాల చర్చ ఉన్నది. ఈ అధ్యాయాలలోని విషయాలు ఈ విధంగా ఉన్నాయి. 336వ అధ్యాయం కావ్యలక్షణం. సంస్కృత కావ్యాలు ప్రాకృత కావ్యాలు అని కావ్యాలు రెండు విధాలు. వీటిలోగూడ గద్యం, పద్యం, మిశ్రం అని మూడేసి విధాలు. కథ, ఆఖ్యాయిక, మహాకావ్యం అనే కావ్యభేదాలు విశదీకరించబడ్డాయి. 337వ అధ్యాయంలో పన్నెండు విధాలైన రూపకాలు, ఉపరూపకాలు, ప్రస్తావన, ఐదు అర్థ ప్రకృతులు, ఐదు సంధులు మొదలైన రూపకాలకు సంబంధించిన విషయాలు చెప్పబడ్డాయి. 338వ అధ్యాయంలో రసాలు, స్థాయిభావాలు, అనుభావాలు, వ్యభిచారిభావాలు, ఆలంబన-ఉద్దీపన విభావాలు, వివిధ నాయకులు వాళ్ల సహాయులు, నాయికాభేదాలు, నాయకుల ఎనిమిది లక్షణాలు, నాయికల పన్నెండు విభావాలు ప్రతిపాదింపబడ్డాయి. 339వ అధ్యాయంలో పాఞ్చాలి, గౌడి, వైదర్భి, లాటి అనే నాలుగురీతులు, భారతీ, సాత్త్వతీ, కైశికీ, ఆరభటీ అనే నాలుగు వృత్తులు విశదీకరింపబడ్డాయి. 340వ అధ్యాయంలో నృత్యానికి సంబంధించి శిరస్సు, హస్తాలు, పాదాలు అనే ప్రధానాంగాల కదలికలు, కనుబొమ్మలు మొదలైన ఇతరాంగాల చలనమూ వర్ణించబడ్డాయి. సాత్త్వికం, వాచికం, ఆంగికం, ఆహార్యం అనే చతుర్విధాభినయాల స్వరూపం 341వ అధ్యాయంలో వర్ణించబడింది. 342వ అధ్యాయంలో-యమక-అనుప్రాసాదులైన పది శబ్దాలంకారాలు, పదహారు ప్రహేళికా భేదాలు, గోమూత్రిక, సర్వతోభద్రం మొదలైన బంధాలు ప్రతిపాదింప బడ్డాయి. ఉపమా, రూపక, సహోక్త్యాదులైన అర్థాలంకారాలు, వాటి అవాంతరభేదాలు లక్షణ ప్రతిపాదన పూర్వకంగా 343వ అధ్యాయంలో విశదీకరింప బడ్డాయి. 344వ అధ్యాయంలో శబ్దార్థాలంకారాలు ప్రతిపాదించ బడినట్లు చెప్పినా దానిలో ఆక్షేప-సమాసోక్తి-పర్యాయోక్త్యాద్య లంకారాలు కూడ చర్చించబడ్డాయి. 345వ అధ్యాయంలో కావ్య గుణాలు 346వ అధ్యాయంలో కావ్యదోషాలు చెప్పబడ్డాయి. ఈ పదకొండు అధ్యాయాలలోని మొత్తం శ్లోకాల సంఖ్య 362.

అగ్నిపురాణం కాలాన్ని గూర్చి, ప్రధానంగా అలంకార శాస్త్రానికి సంబంధించిన అధ్యాయాల కాలాన్ని గూర్చి తెలుసుకొనవలసి ఉన్నది.

(అ) అగ్నిపురాణంలో ఏడు కాండలున్న రామాయణం, హరివంశం, పింగళ, పాలకాప్య, శాలిహోత్ర, ధన్వంతరి, సుశ్రుతుల నామధేయాలు పేర్కొనబడ్డాయి. 380వ అధ్యాయంలోని 58 శ్లోకాలలో భగవద్గీతలోని విషయం సంగ్రహించబడింది. పాణినీ యాష్టాధ్యాయిలోని అనేక విషయాలు కూడ ఈ పురాణంలో ఉన్నాయి.

అగ్ని పురాణంలోని 359-366 అధ్యాయాలు నిఘంటు రూపంలో ఉన్నాయి. ఈ భాగంలో అమరసింహుని నామలింగాను శాసనం చాలవరకు యథాతథంగా గ్రహించ బడింది. గీత, నామలింగాను శాసనం మొదలైన గ్రంథాలే అగ్నిపురాణంలోనుండి విషయం గ్రహించి ఉంటాయి

అనడానికి వీలులేదు. వాఙ్మయంలోని వివిధ శాఖలకు సంబంధించిన విషయాలను ఒక్కచోటచేర్చి జిజ్ఞాసువులకందజేయాలనే అభిప్రాయంతో ఈ పురాణంలో అమర కోశాదుల నుండి విషయాలు సంగ్రహించబడ్డాయి అని అనడమే యుక్తంగా ఉంటుంది. అమరసింహుడు క్రీ.శ. నాల్గవ శతాబ్దంలో ఉండేవాడని చాలమంది పండితుల అభిప్రాయం. అగ్నిపురాణం అమరకోశం నుండి విషయం సంగ్రహించింది అని అంగీకరించే పక్షంలో ఈ పురాణం ఆరు-ఏడుశతాబ్దాలకుపూర్వం ఉండడానికవకాశం లేదు.

(ఆ) 'భరతుడు ప్రచారంలోనికి తీసికొని రావడంచేత భారతీరీతికి ఆ పేరు వచ్చినది అని అగ్నిపురాణం చెపుతున్నది. 'భరతేన ప్రణీతత్వాద్భారతీ రీతిరుచ్యతే' (అ.పు. 339.6). బ్రహ్మయొక్క ఆజ్ఞ ప్రకారం తాను నాలుగు వృత్తులను ప్రచారంలోనికి తీసికొని వచ్చినట్లూ, భరతులనే నామాంతరంగలనటులు ప్రయోగించడంచేత 'భారతీ వృత్తి'కి ఆ పేరు వచ్చినదనీ భరతుడు అన్నాడు. దీనిని పట్టి అగ్ని పురాణకారుడు భరతనాట్య శాస్త్రం, కనీసం నాట్యశాస్త్రంలోని వృత్తులను ప్రతిపాదించే భాగం చూచి ఉంటాడని చెప్పడానికి అవకాశం ఉన్నది.

(ఇ) అగ్నిపురాణంలో నాట్యశాస్త్రం నుండి యథాతథంగా గ్రహించిన అనేక శ్లోకాలున్నాయి. చూ.నా.శా. 6.36 అ.పు.-338,12; నా.శా.6.39, అ.పు. 348, 7-9; నా.శా. 22.28-29; అ.పు.337, 11-12 నా.శా. 17, 63-65 అ.పు. 342. 15-17. 'ఈ పురాణంలో సమస్త విద్యలూ చెప్పబడ్డాయి; అవతారాలు, గీత, రామాయణం, భారతం, హరివంశం, ఆగమాలు, ఆశౌచం, ప్రాయశ్చిత్తం, రాజధర్మాలు, వ్యవహారం, వ్రతాలు మొదలైన ఎన్నో విషయాలూ ఉన్నాయి' అని అగ్ని పురాణంలోని చివరి అధ్యాయంలో చెప్పబడింది. దీనినిబట్టి ఇతర గ్రంథాలనుండి వలెనే నాట్యశాస్త్రం నుంచి కూడ అగ్నిపురాణంలోనికి విషయాలు గ్రహింపబడ్డాయని చెప్పాలి.

(ఈ) రూపకం, ఉత్ప్రేక్ష, విశేషోక్తి, విభావన, అపహ్నుతి, సమాధి అనే అలంకారాలకు కావ్యాదర్శంలో ఇచ్చిన లక్షణాలే అగ్నిపురాణంలో కూడా ఇవ్వబడ్డాయి. దానిలో ఉన్న అనేకవాక్యాలు, వాక్యాంశాలూకూడా ఈపురాణంలో కనబడుతున్నాయి. ఉదాహరణకి-కావ్యాదర్శంలోని 'పద్యం చతుష్పదీ తచ్చ వృత్తం జాతిరితి త్రిధా' (1.11) అనేది అగ్నిపురాణంలో (336.21) ఉంది. కావ్యాదర్శంలోని 'సా విద్యా నౌస్తితీర్షూణాం గమ్భీరం కావ్య సాగరమ్' అనేది అగ్నిపురాణంలో (336-23) ఉంది. ఇట్లే కావ్యాదర్శంలోని 1.15, 1.16 శ్లోకాలు అగ్ని పురాణంలో ఉన్నాయి, అందుచేత ఏడవ శతాబ్దానికి చెందిన దండి నుండియే అగ్ని పురాణం విషయాలు గ్రహించినది అని అంగీకరిస్తే ఇది ఏడవ శతాబ్దం తరువాతి రచనయే అని చెప్పాలి.

(ఉ) రూపక, ఆక్షేప, అప్రస్తుత ప్రశంసా, సమాసోక్తి, పర్యాయోక్తి అలంకారాలకు ప్రసిద్ధ అలంకారికుడు భామహుడు ఇచ్చిన లక్షణాలే అగ్ని పురాణంలో కనబడుతున్నాయి. (కా.అ.2.21,68; 3.29.8; 2.79-అగ్నిపురాణం 343.22; 344.15; 344.16; 344.18; 344.17) భామహుని కాలం 7వ శతాబ్ధనాకి తరువాతనే ధ్వని కారికలలో ప్రతిపాదింపబడి ధ్వన్యాలోకంలో సవిస్తరంగా సమర్థించబడిన ధ్వని సిద్ధాంతం అగ్ని పురాణానికి పరిచితం అన్నట్లు కనబడుతుంది. ధ్వనిని

పర్యాయోక్త, అపహ్నుతి, సమాసోక్తి, అప్రస్తుత ప్రశంసా, ఆక్షేపాలంకారాలలో ఏదో ఒకదానిలో అంతర్గతం చేయవచ్చునని అగ్నిపురాణంలో చెప్పబడింది.–'స ఆక్షేపో ధ్వనిః స్యాచ్చ ధ్వనినా వ్యజ్యతే యతః' (అ.పు. 344.14). 'ఏషామేకత మస్యైవ సమాఖ్యా ధ్వని రిత్యతః' (అ.పు. 344.18). దీనిని బట్టి అగ్నిపురాణానికి ధ్వని సిద్ధాంతం తెలిసినా అది దానిని అంగీకరించలేదని తెలుస్తూ న్నది. దీనిని అంతనీ పట్టి అగ్నిపురాణంలో ఉన్న అలంకారాలకు సంబంధించిన భాగం ధ్వన్యాలోకం కంటె అర్వాచీనమే కాని, చాల అర్వాచీనం కాదని తెలుస్తూన్నది. ధ్వన్యా లోకం తొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్ధంలో రచింప బడింది.

ధ్వన్యాలోకంలో ఉన్న 'అపారే కావ్య సంసారే' ఇత్యాది శ్లోకమూ, 'శృఙ్గారీ చేత్కవిః' ఇత్యాది శ్లోకమూ అగ్ని పురాణంలో (338.10,11) కూడఉన్నాయి. శృంగారం ఒక్కటే రసం, అది ఆనందాహంకారాభిమానరసం అనే భోజుని రససిద్ధాంతం సంక్షిప్తంగా, సరస్వతీ కంఠాభరణంలోని ఐదవ అధ్యాయంలో మొదటి నాలుగు శ్లోకాలలో ప్రతిపాదించబడింది. ఈ సిద్ధాంతం అగ్నిపురాణంలో సంక్షిప్తంగా ప్రతిపాదింపబడింది.

'అక్షరం పరమం బ్రహ్మ సనాతనమజం విభుమ్,
వేదాన్తేషు వదన్త్యేకం చైతన్యం జ్యోతిరీశ్వరమ్.
ఆనన్దః సహజస్తస్య వ్యజ్యతే స కదాచన,
వ్యక్తిస్సా తస్య చైతన్య చమత్కార రసాహ్వయా
ఆద్యస్తస్య వికారో యః సోఽహంకార ఇతి స్మృతః,
తతోఽభిమానస్తత్రేదం సమాప్తం భువనత్రయమ్.
అభిమానాద్రతిః సాచ పరిపోష ముపేయుషీ,
వ్యభిచార్యాది సామాన్యాచ్ఛృఙ్గార ఇతి గీయతే.
తద్భేదాః కామమితరే హాస్యాద్యా అప్యనే కశః' **(అ.పు. 338. 1–5)**

ఈ శ్లోకాల తరువాత ఏడు, ఎనిమిది, తొమ్మిది శ్లోకాలలో రసానికి సంబంధించిన ఇతర మతాలను స్పృశిస్తూ భరతుడు చెప్పిన ఎనిమిది లేదా తొమ్మిది రసాలను అగ్నిపురాణంలో పేర్కొనడం జరిగింది. భోజుని శృంగారప్రకాశంనుంచి అగ్నిపురాణం విషయం గ్రహించినదని చెప్పడమే అగ్ని పురాణంలో పాంచాలి, వైదర్భి, గౌడి, లాటి, అనే నాలుగు రీతులు ప్రతిపాదింప బడ్డాయి (338. 54; 339. 1–4). వీటి స్వరూపం శృంగార ప్రకాశలో భోజుడు చెప్పిన రీతులను అనుసరించి ఉంది. అందుచేత అనేక శాస్త్రాలలో చెప్పిన విషయాలను ఒకచోట క్రోడీకరించి ప్రతిపాదించడానికి ఉద్దిష్టమైన అగ్నిపురాణమే శృంగార ప్రకాశ నుండి విషయాలు సేకరించినదని చెప్పడమేయుక్తం. అలంకారశాస్త్రానికి సంబంధించిన విషయాలే కాకుండా ఇంకా ఎన్నో ఇతర శాస్త్రీయ విషయాలు అగ్నిపురాణం ఇతర గ్రంథాల నుండి గ్రహించింది. అగ్నిపురాణంలోని 252–257 అధ్యాయాలలో నారదస్మృతినుండి గ్రహించిన 30 శ్లోకాలు, ఇతర అధ్యాయాలలో యాజ్ఞవల్క్య స్మృతి నుండి గ్రహించిన 280 శ్లోకాలు ఉన్నాయి.

తెలుగులో అగ్నిపురాణాలు

తెలుగులో అగ్నిపురాణ అనువాదములు సంపూర్ణముగాగానీ సంక్షిప్తముగాగానీ రాలేదు. ఇందు కథాభాగములు ఉపాఖ్యానములుగానీ ప్రత్యేకముగా లేక కేవలము శాస్త్ర విషయముల వివరణ ఉండుటయే కారణము కావచ్చును.

అయినను అగ్నిపురాణ అనువాదమువంటిదే తెనుగున ఒక గ్రంథము వెలసినది. అది టేకుమళ్ల రంగశాయి రచించిన **'వాణీవిలాస వనమాలిక'** అనే గ్రంథము. ఈ రంగశాయి పుష్పగిరి తిమ్మనగారి సహపాఠి, ధర్మపురి నివాసి. ఇతడి గురువు రామభద్రయ్య. ఇతడు దక్షిణంలో తిరువళ్ళూరు ప్రాంతంలో ఉండేవాడు. రంగశాయి తిరువళ్ళూరు వీర రాఘవ స్వామిపై ఒక శతకం, కృష్ణరాజ దండకం అనే దండకం, జానకీ పరిణయం అనే యక్షగానం, ద్విపద భాగవతాన్ని రచించాడు. పోతన రచనను అనుకరించిన ఈ ద్విపద భాగవతం నేడు సంపూర్తిగా లభ్యం కావటంలేదు. కేవలం నాలుగు స్కంధాలు మాత్రం లభ్యం అవుతున్నాయి. ఈ గ్రంథాలన్నీ అముద్రితాలే. ఒక్క వాణీ విలాస వన మాలిక ముద్రితం అయింది. కవి 17వ శతాబ్దానికి చెందినవాడు.

తెలుగు సాహిత్యంలోనే వాణీవిలాస వనమాలిక కొంగ్రొత్త తరహాకు చెందిన రచన. వేద, పురాణ, స్మృతి, షడ్దర్శన, శిక్ష, వ్యాకరణం, నిరుక్తం, ఛందం, ఆయుర్వేదం, శిల్పం, గాంధర్వం మొదలైన సమస్త విజ్ఞానాన్ని క్రోడీకరించి 2,574 గద్య, పద్యములలో నాలుగు ఆశ్వాసములుగా చెప్పబడిన రచన ఇది. వేదశాఖ సూత్ర కల్పాంగ సంఖ్యానంతో ప్రారంభించి వాస్తు శాస్త్రము వఱకును వివరములు సేకరించి దండగా గుచ్చాడు. ఇది వనమాల అనే తరగతికి చెందిన గ్రంథ మని అన్ని ఋతువులకు చెందిన పుష్పములు వనమాలికలో ఉన్నట్లే ఇందు సర్వ విషయములుండ వలెనని చెప్పబడింది. ఈ వనమాల లక్షణమిది.

ఆజాను లంబినీ మాలా సర్వర్తు కుసుమోజ్జ్వలా
మధ్య స్థూల కదంబాఢ్యా వనమాలేతి కథ్యతే. (వీణీవిలాస వన మాలిక – పీఠిక)

కవి ఇట్టి గ్రంథమును వ్రాయుటలో కృతకృత్యు డైనాడని చెప్పవచ్చును. ఈ గ్రంథం రచనలో రంగశాయికి మహంకాళి వెంకటపతి అనే కవి సహాయము చేశాడట. సంస్కృత అగ్ని పురాణముతో ఈ గ్రంథమును తైపారువేసి పరిశోధించవలసిన అవసరము ఉన్నది. లభ్యము అగుచున్నంతవరకు కాక ఇంకనూ చాలా గ్రంథము ఉండి ఉండవచ్చునని పరిశోధకులు ఊహించుచున్నారు.

శ్రీరామ రాజనీతి – వెంకట పార్వతీశ కవులు. ఇది చిన్న గ్రంథము. పిఠాపురము యువరాజా వారి 13వ జన్మదిన సందర్భమున 1923లో వెంకట పార్వతీశ కవులచే రచింపబడినది ఈ గ్రంథము. ఇది యువరాజు గంగాధర రామారావుగారికి అంకితము చేయబడింది. 55 పేజీల ఈ కావ్యములో 147 పద్యము గలవు. అగ్నిపురాణమున ఇంద్రజిత్ సంహారార్థము ఏగుచున్న సౌమిత్రికి శ్రీరాముడు ఉపదేశించిన రాజనీతి ఈ కావ్యమునకు ఆధారము.

అగ్ని పురాణము - మహాత్మ్యము

ఇది సమస్త భారతీయ విజ్ఞాన సర్వస్వం అని చెప్పవచ్చు. జన సామాన్యానికి ఆయా కావ్య, శాస్త్ర విషయాలలోనిసారాన్ని సుగమంచేసి వారిని పురాణ ధర్మ బద్ధులుగా చేయటమే ఈ పురాణపు ముఖ్యోద్దేశ్యమనిపిస్తుంది. ఈ పురాణంలో పురాణ లక్షణాలకు సంబంధంలేని శిక్ష, నిరుక్తం, ఛందస్సు, వ్యాకరణం, జ్యోతిషం, గాంధర్వము, శిల్పము, వాస్తువు భారత, రామాయణ కథా సంగ్రహం మొదలైన అనేక విషయాలు వివరింపబడ్డాయి. పురాణంలో మూడు వంతులకు పైగా ఇలాంటి విషయ వివరణతోనే సరిపోయింది. శ్రీమహావిష్ణువు దశ అవతారాలను గుఱించి చెప్పేటప్పుడు రామాయణ, భారత గాథలు సంపూర్ణంగా విస్తృతంగా వివరించబడ్డాయి. దేవాలయ నిర్మాణానికి సంబంధించిన వాస్తువును గుఱించి తెలిపేటప్పుడు విగ్రహ ప్రతిష్ఠ, పూజా విధానం మొదలైన దేవాలయాలకు సంబంధించిన సమస్త విషయాలు వివరించబడ్డాయి. ఈ పురాణంలో జ్యోతిష, ధర్మశాస్త్ర, ఆయుర్వేద, గజవైద్య, పశువైద్య, రాజనీతి, రత్నపరీక్ష మొదలైన శాస్త్రాలను గుఱించిన దీర్ఘవివరణ ఇవ్వబడింది. ఇందులో చెప్పబడిన యోగశాస్త్ర విషయాలైన యమ నియమాది ఎనిమిది యోగ విశేషాలవివరణ ప్రామాణికంగానే చెప్పబడింది. అద్వైత వేదాంతసారం ఇందులో హృద్యంగా వర్ణింపబడింది. ఒక అధ్యాయంలో భగవద్గీతా సారం ఉన్నది.

అందువలననే ఈ పురాణం తనను గుఱించి ఒకానొక సందర్భంలో తాను విష్ణు స్వరూప మునని చెప్పుకొన్నది. ఇంకా

వేదేషు సపురాణేషు యజ్ఞమూర్తిశ్చ గీయతే
ఆగ్నేయాఖ్యం పురాణంతు రూపం విష్ణోర్మహత్తరం
ఆగ్యేయాఖ్య పురాణస్య కర్తా శ్రోతాజనార్దనః
తస్మాత్ పురాణమాగ్నేయం సర్వవేద మయం మహత్
సర్వవిద్యామయం పుణ్యం సర్వజ్ఞాన మయం వరమ్ (అగ్ని 272-16-28)

అని దీనికి కర్త శ్రోత జనార్దనుడేనని, ఇది విష్ణు రూపమైన పురాణమని ఇది సర్వ విద్యల మయమైనదని చెప్పుకొన్నది. ఈ పురాణము తనను తాను మహా పురాణాలలో ఒకటిగా చెప్పుకొన్నది. ఇందులో ఉన్న విషయ క్రమాన్ని బట్టి కూడా ఇది నిశ్చితమే.

దీని యందు వర్ణ్యవిషయం కేవలం పురాణ పంచ లక్షణాలకే పరిమితంగాక సమస్త విజ్ఞానాన్నీ క్రోడీకరించి రాశిపోసింది. కాబట్టే అగ్నిపురాణం **'విద్యా సారం పురాణం యత్ సర్వం సర్వస్య కారణమ్'** అని చెప్పుకొన్నది.

ముగింపు

అనేక ప్రత్యేక విశేషాలు ఇందులో ఉన్నాయి గనుకనే - **"ఆగ్నేయం పఠితం ధ్యాతం శుభం స్యాద్భుక్తి ముక్తిదమ్"** ఈ పురాణం చదివినా, స్మరించినా భుక్తి-ముక్తులు చేకూరుతాయి అని తెలుపుతున్నది.

శ్రీ అగ్ని మహాపురాణ విశేషాలు

మొత్తం మీద అగ్నిపురాణం భారతీయ సాహిత్యంలోనే చాలా ప్రత్యేకతగల గ్రంథం. అనేక ప్రామాణిక ప్రాచీన గ్రంథాల సారభూతమైన పురాణం.

ఈ విధంగా, భారతీయ సాహిత్యం, సంస్కృతులకు సంబంధించిన అన్ని విషయాల సంక్షిప్త సమాహారం ఈ అగ్నిపురాణంలో కనిపిస్తుంది. దీనిని అధ్యయనం చేయటంచేత ప్రాచీన భారతీయ విజ్ఞాన సమ్యక్ పరిచయం ఏర్పడుతుంది. అందుకే దీనిని భారతీయ విజ్ఞాన సర్వస్వంగా వర్ణిస్తున్నారు. కాబట్టే **'ఆగ్నేయేహి పురాణేస్మిన్ సర్వా విద్యాః ప్రదర్శితాః'** అని తనను గురించి పురాణం పలుకుతున్నది. పురాణ లక్షణాలైన విషయాలతో బాటు హిందూ సాహిత్య, సంస్కృతుల సర్వ విజ్ఞాన సారమును దీనిలో మనం దర్శించవచ్చును.

సంస్కృత అగ్నిపురాణాన్ని శ్రీ వేంకటేశ్వర ఆర్షభారతి ట్రస్టువారు తెలుగు లిపిలో ప్రతిశ్లోక తాత్పర్యంతో 1989లో రెండు సంపుటాలుగా ముద్రించారు. దీనికి విఖ్యాత పండిత పరిశోధకులు, సంస్కృత విద్వాంసులు శ్రీ పుల్లెల రామచంద్రుడు గారు ప్రతిశ్లోక తాత్పర్యాన్ని, ప్రత్యేక విషయ శోభిత ఉపోద్ఘాతాన్ని కూర్చారు. ఆ గ్రంథాన్ని రచనలో వాడుకొనడం జరిగింది. శ్రీ వేంకటేశ్వర ఆర్షభారతీ ట్రస్టు వారికి, శ్రీ పుల్లెల రామచంద్రుడు గారికి నమస్కారములు అర్పిస్తున్నాము. ఈ వచన పురాణం తెలుగువారి అభిమానం పొందాలని ఆకాంక్ష.

- ఆపంచ సత్యనారాయణ

ఓం గణేశాయ నమః
ఓం నమో భగవతే వాసుదేవాయ

శ్రీ అగ్ని మహాపురాణం

సూతునికి శౌనకాది మునుల ప్రశ్న


యం సరస్వతీం గౌరీం గణేశ స్కన్దమీశ్వరమ్
బ్రహ్మాణం వహ్ని మిన్ద్రాదీన్వాసుదేవం నమామ్యహమ్

శ్రీ మహాలక్ష్మికిని, సరస్వతికిని, పార్వతికిని, గణపతికిని, కుమారస్వామికిని, మహేశ్వరునకును, అగ్నిదేవునకును, ఇంద్రాదులకును, శ్రీమహావిష్ణువునకును నమస్కరించుచున్నాను.

నైమిశారణ్యము నందు హరిని ఉద్దేశించి యజ్ఞము చేయుచున్న శౌనకాది మహర్షులు తీర్థయాత్రా సందర్శనమున అచ్చటికి వచ్చిన సూతునితో ఇట్లు అనిరి.

"ఓ సూతుడా! నీవు మాకు పూజ్యుడవు (మాచేత పూజింపబడినావు). దేనిని తెలిసికొని నంత మాత్రముచే (మానవునకు) సర్వజ్ఞత్వము కలుగునో అట్టి సారములలో కెల్ల సారమైన దానిని మాకు చెప్పుము.

నారాయణం నమస్కృత్యనరంచైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్

శ్రీమన్నారాయణునికి, మనుష్యులలో ఉత్తముడైన నరునికి నమస్కరించి, సరస్వతీ దేవికి సన్నుతులు చేసి వ్యాసునికి వందనముచేసి జయము అను ఈ పురాణమును చెప్పుదును.

సూతుడు పలికెను – సృష్ట్యాదులను చేసిన ప్రభువును, భగవంతుడును అయిన శ్రీ మహావిష్ణువే సారములలో కెల్ల సారమైనవాడు, "నేనే ఆ పరబ్రహ్మ స్వరూపుడను" అని ఆ విష్ణువును గూర్చి తెలిసికొన్నచో సర్వజ్ఞత్వము కలుగును.

శబ్దములకు గోచరమగు సగుణబ్రహ్మయు, పరమగు నిర్గుణబ్రహ్మయు తెలుసుకొన వలసినవి. అధర్వ వేదమునకు సంబంధించిన ముండకోపనిషత్తు గూడ –"రెండు విద్యలు తెలిసికొనవలెను" అని చెప్పుచున్నది.

నేనును, శుకుడును, పైలుడు మొదలగువారును బదరిక ఆశ్రమమునకు వెళ్లి వ్యాసునికి నమస్కరించి ప్రశ్నింపగా అపుడు ఆతడు మాకు సారమును ఉపదేశించెను.

వ్యాసుడు పలికెను : నేను మునులతో కలిసివెళ్ళి, పరముకంటె పరమును, సార భూతము అగు బ్రహ్మను గూర్చి ప్రశ్నింపగా వసిష్ఠుడు ఏమని చెప్పెనో, ఓ! సూతా! నీవును శుకాదులును వినుడు.

వసిష్ఠుడు పలికెను : ఓ వ్యాసా! పూర్వము అగ్నిదేవుడు మునులకును, దేవతలకును, నాకును ఏ విధముగా చెప్పెనో ఆ విధముగ సర్వవ్యాప్తమగు, ద్వివిధమైన బ్రహ్మను గూర్చి చెప్పెదను వినుము.

బ్రహ్మవిద్య నాశనరహితమగు పరవిద్య. అందుచే తత్ప్రతిపాదకమగు ఆగ్నేయ పురాణము పరము. సర్వ దేవతలకును సుఖమును కలిగించు ఋగ్వేదాదికము అపర బ్రహ్మ. అపర బ్రహ్మను ప్రతిపాదించునది అగుటచే దానికి ఆ పేరు.

అగ్ని చెప్పిన పురాణము ఆగ్నేయ పురాణము. ఇది వేదముతో సమానమైనది. చదువు వారికిని, వినువారికిని భక్తిముక్తుల నొసగునది. కాలాగ్ని స్వరూపుడును, జ్యోతిః స్వరూపుడును, పరాత్పరమైన బ్రహ్మయు, జ్ఞాన కర్మలచే పూజింపబడువాడును అగు విష్ణుదేవుని మునిసమేతుడై (వసిష్ఠుడు) ప్రశ్నించెను.

వసిష్ఠుడు పలికెను : సకల విద్యల సారమగు ఏ బ్రహ్మను గూర్చి తెలిసికొని నరుడు సర్వజ్ఞత్వ మును పొందునో అట్టిదియు, సంసార సాగరమును దాటించుటలో నావయు, సర్వ శక్తమును అగు బ్రహ్మను గూర్చి చెప్పుము.

అగ్ని పలికెను : విష్ణువు నైన నేనే కాలాగ్ని రుద్రుడను. సర్వ స్వరూపమును, సర్వ కారణమును, అతి ప్రాచీనమును అగు విద్యాసారమును గూర్చి నీకు చెప్పెదను.

మత్స్య కూర్మాది రూపములను ధరించిన నేను సృష్టికిని, ప్రళయమునకును, వంశము లకును, మన్వంతరములకును, వంశానుచరితము మొదలగు దానికిని కారణమైన వాడను. (ముని ఋష్యాదుల వంశముల వర్ణనము వంశము. ప్రధాన రాజవంశముల వర్ణనము వంశాను చరితము)

పర, అపర అను ఈ రెండు విద్యలును విష్ణు స్వరూపములే. ఓ బ్రాహ్మణా! ఋగ్యజు స్సామా థర్వ వేదములును; శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, జ్యోతిషము, ఛందస్సు అను వేదాంగ ములు ఆరును; కోశము, మీమాంస, ధర్మశాస్త్రము, పురాణము, న్యాయ శాస్త్రము, ఆయుర్వేదము, సంగీతశాస్త్రము, ధనుర్వేదము, అర్థశాస్త్రము–ఇవన్నియు అపర విద్య. చూడ శక్యముకానిదియు, పట్టుకొన శక్యముకానిదియు, గోత్రముగాని, శాఖగాని లేనిదియు, నిత్యమును అగు బ్రహ్మను బోధించు విద్య పరవిద్య.

పూర్వము బ్రహ్మ దేవతలకు ఎట్లు చెప్పెనో, విష్ణువు నాకు ఎట్లు చెప్పెనో ఆ విధముగ మత్స్యాది రూపములను ధరించిన జగత్కారణ భూతుడగు విష్ణువును గూర్చి నీకు చెప్పెదను. (1)

మత్స్యావతార కథ

వశిష్ఠుడు పలికెను : మత్స్యాది రూపములను ధరించినవాడును, సృష్ట్యాదులకు కారణమైన వాడును అగు విష్ణువును గూర్చి చెప్పుము. పూర్వము విష్ణువు నుండి వినిన విధమున ఆగ్నేయ పురాణమును గూర్చియు, బ్రహ్మను గూర్చియు (లేదా ఆగ్నేయపురాణ రూపమగు వేదమును) చెప్పుము.

అగ్ని పలికెను : వశిష్ఠా ! విష్ణువు ధరించిన మత్స్యావతారమును గూర్చి చెప్పెదను వినుము. అవతారములు ధరించుట దుష్టనాశము కొరకును, శిష్టపాలనము కొరకును జరుగుచుండును కదా?

ఓ మునీ! గడచిన కల్పము చివర బ్రహ్మ నిద్రించుట అను నిమిత్తముచే ప్రళయమేర్పడెను. అపుడు భూలోకాదులన్నియు సముద్రములో మునిగిపోయినవి.

వైవస్వతమనువు భుక్తిముక్తులను అపేక్షించి తపస్సు చేసెను. ఒకనాడు ఆతడు కృతమాలానదిలో జలతర్పణము చేయుచుండగా ఆతని దోసిలిలోని జలములో ఒక చిన్న చేపపిల్ల కనబడెను.

ఆ రాజు దానిని నీటిలో పడవేయదలచుచుండగా అది ఆతనితో –"మహారాజా! నాకు ఈ జలములో మొసళ్ళు మొదలగు వాటి నుండి భయమున్నది. అందుచే నన్ను నీటిలో పడవేయకుము' ' అని పలికెను. అది విని ఆతడు దానిని కలశములో ఉంచెను.

ఆ మత్స్యము పెద్దదిగా అయి రాజుతో "నాకొక పెద్ద స్థానమును ఇమ్ము" అని పలికెను. రాజు ఆ మాట విని దానిని చేదలో ఉంచెను.

అచట పెద్దదై "ఓ! మను చక్రవర్తీ! నాకు విశాలమైన స్థానము నిమ్ము" అని రాజుతో అనెను. పిమ్మట దానిని రాజు సరస్సులో విడువగా అది ఆ సరస్సు ప్రమాణము వంటి ప్రమాణము గలదిగ పెరిగెను. "నాకు ఇంకను పెద్దదైన స్థానము ఇమ్ము" అని ఆ మత్స్యము పలుకగా దానిని అతడు సముద్రములోనికి విడచెను.

అది క్షణ మాత్రమున లక్ష యోజనముల ప్రమాణము గలదిగా పెరిగెను. అద్భుత మైన ఆ మత్స్యమును చూచి, మనువు ఆశ్చర్యము చెంది "నీ వెవరవు? నీవు నిజముగ విష్ణుమూర్తివే. నారాయణా! నీకు నమస్కారము. జనార్ధనా! మాయచేత నీవు నన్ను ఈ విధముగ ఏల మోహపెట్టు చున్నావు?" అని పలికెను.

మనువు ఈ విధముగా పలుకగా ఆ మత్స్యము "ఈ జగత్తును నిలుపుటకును, దుష్టులను నశింపజేయుటకును అవతరించినాను" అని ప్రజలను పాలించుటయందు (లేదా తనను రక్షించుటయందు) ఆసక్తిగల ఆతనితో అనెను –

ఇంకను ఆ మత్స్యము (నేటి నుండి) ఏడవ దినమున సముద్రము ఈ జగత్తును ముంచి వేయును. అపుడు నీ దగ్గరకు వచ్చిన నావలో బీజములు మొదలగువాటిని ఉంచుకొని, సప్తర్షి సమేతుడవై బ్రహ్మ నిద్రించు రాత్రి అంతయు సంచరింపగలవు. నేను నీ దగ్గరకు వచ్చినపుడు ఆ నావను పెద్ద సర్పముతో నా కొమ్మునకు కట్టివేయుము" అని పలికి మత్స్యము అంతర్ధానము చెందెను. మనువు ఆ కాలమునకై నిరీక్షించుచు ఉండెను. సముద్రము గట్టు దాటి పొంగగా రాజు అప్పుడు నావను ఎక్కెను.

ఒక కొమ్ముగల, పదివేల కోట్ల యోజనములుగల బంగారు మత్స్యము అచ్చటకు రాగా దాని కొమ్మునకు రాజు నావను కట్టెను. ఆ మత్స్యమును స్తోత్రములచే స్తుతించుచు, పాపములను తొలగించు **మత్స్యపురాణము**ను ఆ మత్స్యము చెప్పగా వినెను.

కేశవుడు బ్రహ్మ నుండి వేదములను అపహరించిన హయగ్రీవుడు అను దానవుని సంహరించి వేదమంత్రాదులను రక్షించెను. పిమ్మట వారాహకల్పము రాగా హరి కూర్మావతారము ధరించెను. (2)

కూర్మావతార కథ

అగ్ని పలికెను : పాపములను తొలగించు కూర్మావతారమును గూర్చి మొదట నేను ప్రతిజ్ఞ చేసిన విధమున చెప్పెదను. పూర్వము దేవాసుర యుద్ధములో దేవతలు దూర్వాసుని శాపముచే దైత్యుల చేతిలో ఓడిపోయిరి. అపుడు వారు (ఐశ్వర్య) లక్ష్మీరహితులై పోయిరి. క్షీరాబ్ధిపై ఉన్న విష్ణువును స్తుతించి "మమ్ములను అసురుల నుండి రక్షింపుము" అని వేడికొనిరి.

శ్రీ మహావిష్ణువు బ్రహ్మాది దేవతలతో "సురలారా! క్షీరాబ్ధిని మథించి అమృతమును, లక్ష్మిని సంపాదించుటకై అసురులతో సంధి చేసికొనుడు. పని పడినపుడు శత్రువులతో కూడ సంధి చేసికొనవలెను గదా! అమృతము మీకే దక్కునట్లును, దానవులకు దక్కకుండ ఉండునట్లును చేసెదను. మందర పర్వతమును కవ్వముగ చేసి, వాసుకిని కవ్వపుత్రాడుగా చేసి, నా సహాయముతో క్షీరాబ్ధిని మథింపుడు. మాంద్యము వలదు" అని అనెను.

విష్ణువు ఇట్లు పలుకగా దేవతలు దైత్యులతో ఒప్పందము చేసికొని క్షీరాబ్ధికివచ్చి మథింప ప్రారంభించిరి. వాసుకి తోకవైపు దేవతలుండిరి.

సర్పము విడచు నిట్టూర్పుల వేడికి బాధపడుచున్న దేవతలను హరి సేదదీర్చెను. సముద్రమును మథించుచుండగా ఆ పర్వతము క్రింద ఆధారమేదియు లేకపోవుటచే నీటిలో మునిగిపోయెను. విష్ణువు కూర్మరూపమును ధరించి మందర పర్వతమును నిలబెట్టెను. మథింపబడుచున్న క్షీరాబ్ధి నుండి హాలాహల విషము పుట్టెను.

శివుడు ఆ విషమును కంఠమునందు ధరించెను. అందుచే అతడు నీలకంఠుడు అయ్యెను. పిమ్మట వారుణీదేవియు (సురయు), పారిజాతము, కౌస్తుభము, గోవులు, అప్సరసలు పుట్టిరి. లక్ష్మీదేవి ఆవిర్భవించి విష్ణువును చేరినది. దేవతలందరును ఆమెను చూచుచు స్తోత్రము చేయుటచే శ్రీమంతులైరి.

పిమ్మట ఆయుర్వేదమును ప్రచారములోనికి తీసికొని వచ్చిన ధన్వంతరి రూపుడైన విష్ణువు అమృతపూర్ణమగు కమండలువునుచేత ధరించి ఆవిర్భవించెను.

జంభుడు మొదలగు దైత్యులు ఆతని చేతినుండి అమృతమును గ్రహించి, సగము దేవతలకు ఇచ్చి, వెళ్లిపోయిరి. పిమ్మట విష్ణువు స్త్రీ రూపమును ధరించెను.

మంచి సౌందర్యముగల ఆమెను చూచిన దైత్యులు మోహముచెంది, "ఓ వరాననా! మాకు భార్యవు కమ్ము; ఈ అమృతమును తీసికొని మాకు (త్రాగించుము) పంచిపెట్టుము" అని పలికిరి.

అట్లే అని పలికి హరి వారి చేతినుండి అమృతమును గ్రహించి దేవతలచే త్రాగించెను. రాహువు చంద్రరూపమును ధరించి అమృతము త్రాగుచుండగా సూర్య చంద్రులు ఆతనిని పట్టి చూపిరి.

అప్పుడు విష్ణువు రాహు శిరస్సును చక్రముచే ఖండించి వేరుచేసి దయతో దానికి మరణము లేకుండునట్లు చేసెను. రాహువు వరమును ఇచ్చు హరితో : "చంద్రసూర్యులు నాచే పట్టుబడుచుందురు. అది గ్రహణమగును. ఆ కాలమునందు ఇచ్చు దానము అక్షయము అగుగాక" అని పలికెను.

"అటులనే అగుగాక" అని విష్ణువు ఆతనితో పలికెను. పిమ్మట స్త్రీ రూపమును త్యజించి దేవతలతో కలిసియుండగా శివుడు "ఆ స్త్రీ రూపమును చూపుము" అని హరితో అనెను.

భగవంతుడైన శ్రీమహావిష్ణువు, రుద్రునకు స్త్రీ రూపమును చూపెను. శివుడు విష్ణుమాయచే మోహితుడై పార్వతిని విడచి ఆ స్త్రీని వెంబడించెను.

శివుడు ఉన్మత్తుడై, దిగంబరుడై ఆమె కేశపాశమును పట్టుకొనెను. ఆమె జుట్టు విడిపించుకొని వెళ్ళిపోయెను. ఇతడు ఆమె వెంట పరుగెత్తెను.

ఈశ్వరుని వీర్యము స్ఖలితమై భూమిపై పడిన చోటులలో నెల్ల బంగారు లింగముల క్షేత్రము అయ్యెను.

ఇది అంతయు మాయ అని గ్రహించి శివుడు స్వస్థచిత్తుడు ఆయెను. అపుడు విష్ణువు శివునితో : "రుద్రా! నీవు నా మాయను జయించితివి. ఈ లోకములో నీవు తప్ప మరెవ్వరును నా మాయను జయింపజాలరు" అని పలికెను.

అమృతమును పొందజాలని ఆ దైత్యులను దేవతలు యుద్ధములో జయించిరి. దేవతలు స్వర్గములో నివసించిరి. దైత్యులు పాతాళలోక నివాసులు అయిరి. ఈ దేవి విజయకథను పఠించువాడు స్వర్గమును పొందును అని పల్కెను. (3)

వరాహా, వామన, పరశురామావతార కథలు

అగ్ని దేవుడు ఇట్లు పలికెను : ఇప్పుడు పాపములను నశింపచేయు వరాహ అవతారమును గూర్చి చెప్పెదను. హిరణ్యాక్షుడు అనెడు రాక్షసరాజు ఉండెను. అతడు దేవతలను జయించి స్వర్గ లోకములో నివసించెను.

యజ్ఞ స్వరూపుడగు విష్ణువును దేవతలు అందరును వచ్చి స్తుతింపగా ఆ హరి వరాహరూపము ధరించి, లోకకంటకుడైన ఆ దానవుని దైత్యులకు కూడ ఆశ్చర్యకరము అగు విధమున సంహరించి, ధర్మమును దేవతలు మొదలగువారిని రక్షించి అంతర్ధానము చెందెను.

హిరణ్యాక్షుని సోదరుడైన హిరణ్యకశిపుడు దేవతల యజ్ఞభాగములను అపహరించి దేవతలందరి పైనను అధికారమును జరిపెను. విష్ణువు దేవతా సమేతుడై (వెళ్లి) నరసింహ రూపము దాల్చి ఆ హిరణ్యకశిపుని సంహరించెను. దేవతలచే స్తుతింపబడిన ఆ నరసింహుడు దేవతలను తమతమ స్థానములలో నిలిపెను. పూర్వము దేవాసుర యుద్ధమునందు బలి మొదలగు వారిచే సురలు పరాజితులై, స్వర్గమును కోల్పోయిరి. వారు అపుడు హరిని శరణువేడిరి. విష్ణువు దేవతలకు అభయము ఇచ్చి, అదితి కశ్యపులు తనను స్తుతింపగా అదితి యందు వామనుడుగ జన్మించెను. ఆ వామనుడు శోభాయుక్తముగ యజ్ఞము చేయుచున్న బలిచక్రవర్తి యజ్ఞమునకు వెళ్లి అచట రాజద్వారము నందు వేదమును పఠించెను.

బలి వేదములను పఠించుచున్న ఆ వామనుని చూచి, అతడు కోరువరముల నీయవలెనని నిశ్చయించుకొని, శుక్రాచార్యుడు నివారించుచున్నను, ఆతనితో – 'నీకేమి కావలెనో కోరుకొనుము; ఇచ్చెదను' అని పలికెను. వామనుడు బలితో 'మూడు అడుగుల నేలను ఇమ్ము; నా గురువునకు కావలెను' అనెను. బలి 'అట్లే ఇచ్చెదను' అని పలికెను.

దానజలము చేతిలో పడగానే వామనుడు అవామనుడు (పెద్ద శరీరము కలవాడు) ఆయెను. భూలోక, భువర్లోక, స్వర్లోకములను మూడుఅడుగులుగా గ్రహించి బలిని సుతలమునకు త్రొక్కి వేసెను. వామనరూపుడైన హరి ఆ లోకత్రయమును దేవేంద్రునకు ఇచ్చెను. దేవతాసహితుడు అగు ఇంద్రుడు హరిని స్తుతించి, త్రిభువనాధీశుడై సుఖముగా ఉండెను.

ఓ బ్రాహ్మణా! పరశురాముని అవతారమును గూర్చి చెప్పెదను వినుము. ఆ శ్రీమహావిష్ణువు, క్షత్రియులు ఉద్ధతులుగా ఉన్నారని తలచి, భూ భారమును హరించుటకై, దేవతలను, విప్రాదులను పాలింపనున్నవాడై, శాంతి నెలకొల్పుటకై, జమదగ్నినుండి రేణుకయందు సర్వశాస్త్ర విద్యాపారంగతు డైన భార్గవుడుగా (పరశురాముడుగా) అవతరించినాడు.

కార్తవీర్యుడు అను రాజు దత్తాత్రేయుని అనుగ్రహముచే వేయి బాహువులు కలవాడుగను, సకల భూమండలమునకును రాజుగను ఆయెను. ఆతడు వేటకు వెళ్లెను.

అరణ్యములో అలసిన, సేనాసమేతుడైన ఆ రాజును జమదగ్ని మహర్షి తన కుటీరమునకు ఆహ్వానించి కామధేనువు ప్రభావముచేత భోజనము పెట్టెను.

కార్తవీర్యార్జునుడు ఆ కామధేనువును తనకు ఇమ్మని కోరెను. జమదగ్ని ఇచ్చుటకు నిరాక రించెను. అపుడు ఆతడు దానిని అపహరించెను. పిదప పరశురాముడు యుద్ధములో పరశువుచే ఆతని శిరస్సు ఖండించి ధేనువుతో ఆశ్రమమునకు తిరిగి వెళ్లెను.

పరశురాముడు వనమునకు వెళ్ళియుండగా కార్తవీర్యుని పుత్రులు పూర్వవైరము వలన జమదగ్నిని చంపిరి. అంత తిరిగి వచ్చిన ప్రభావశాలియగు పరశురాముడు చంపబడిన తండ్రిని చూచి, తండ్రిని ఆ విధముగ చంపుటచే కోపించి, ఇరువది యొక్క పర్యాయములు పృథివిని క్షత్రియులు లేనిదానినిగాచేసి, కురుక్షేత్రమునందు ఐదుకుండల ములనుచేసి, వాటితో పితృ దేవత లను తృప్తిపరచి, భూమినంతను కశ్యపునకు దానముచేసి, మహేంద్ర పర్వతముపై నివసించెను. కూర్మ, వరాహ, నరసింహ, పరశురామ అవతార గాథలు విన్న మానవుడు స్వర్గమునకు వెళ్లును. (4)

రామాయణ కథ - బాల కాండము

అగ్ని పలికెను : దేనిని పఠించినచో భుక్తియు ముక్తియు లభించునో అట్టి రామాయణమును, నారదుడు వాల్మీకికి చెప్పిన విధమున చెప్పెదను.

నారదుడు పలికెను : విష్ణువు నాభియందలి పద్మము నుండి బ్రహ్మ పుట్టెను. మరీచి బ్రహ్మ కుమారుడు. మరీచికి కశ్యపుడును, ఆతనికి సూర్యుడును, సూర్యునకు వైవస్వత మనువును, ఆతనికి ఇక్ష్వాకువును పుట్టిరి. ఆతని వంశమునందు కకుత్థ్సుడు పుట్టెను. కకుత్థ్సునకు రఘువు, రఘువునకు అజుడు, అజునకు దశరథుడును పుట్టెను.

శ్రీమహావిష్ణువు రావణాదులను వధించుటకై తాను నాలుగు విధములుగా అయి దశరథ మహారాజు వలన కౌసల్య యందు రాముడుగను, కైకేయి యందు భరతుడుగను, సుమిత్ర యందు లక్ష్మణ, శత్రుఘ్నులుగను జనించెను. ఋష్యశృంగుని సాహాయముచే యజ్ఞమునందు లభించిన పాయసమును కౌసల్యాదులకు ఈయగా, వారు దానిని భుజింపగా, రామాదులు జనించిరి.

విశ్వామిత్రుడు కోరగా దశరథుడు యజ్ఞ విఘ్నములను తొలగించుటకై లక్ష్మణ సమే తుడైన రాముని విశ్వామిత్రునితో పంపెను. తాటకను సంహరించిన రాముడు, విశ్వా మిత్రుని నుండి అస్త్ర శస్త్రములను పొందెను. మానవాస్త్రముచే మారీచుని మూర్ఛితుని చేసి దూరముగా పడవేసెను. బలవంతుడైన ఆ రాముడు యజ్ఞమును పాడుచేయుచున్న సుబాహుని సేనా సహితముగా సంహ రించెను. సిద్ధాశ్రమమునందు నివసించినవాడై, విశ్వామిత్రాదులతో కలిసి, లక్ష్మణ సమేతుడై, జనకుని యజ్ఞమును, ధనస్సును చూచుటకై వెళ్ళెను. శతానందుడు విశ్వామిత్రుని ప్రభావమునుగూర్చి రామునకు చెప్పెను. ఆ యజ్ఞము నందు జనకుడు ముని సమేతుడైన రాముని పూజించెను.

రాముడు ధనస్సును ఎక్కుపెట్టి దానిని సునాయాసముగా విరచెను. జనకుడు వీర్యమే శుల్క ముగా కలదియు, అయోనిజయు అగు తన కన్యయైన సీతను రామునకు ఇచ్చెను. తండ్రి మొదలైన వారు వచ్చిన పిమ్మట రాముడు సీతను, లక్ష్మణుడు ఊర్మిళను, జనకుని తమ్ముడైన కుశధ్వజుని కుమార్తెలైన మాండవీ శ్రుతకీర్తులను భరత శత్రుఘ్నులును వివాహమాడిరి.

ఆ రాముడు జనకునిచే బాగుగా సత్కరింపబడినవాడై, వసిష్ఠాది సమేతుడై పరశు రాముని జయించి అయోధ్యకు వెళ్ళెను. భరతుడు శత్రుఘ్న సమేతుడై యుధాజిత్తు నగరమునకు వెళ్ళెను. (5)

అయోధ్యా కాండ

భరతుడు మేనమామ గృహమునకు వెళ్ళిన పిమ్మట రాముడు తండ్రి మొదలగువారిని భక్తితో సేవించెను. దశరథ మహారాజు రామునితో ఇట్లు అనెను–'రామా! వినుము' ...

'నీ గుణములందు ప్రేమచే ప్రజలు నిన్ను ఇంతకుపూర్వమే; మనసా రాజ్యాభిషిక్తుని చేసినారు. నేను రేపు ప్రాతఃకాలమున నీకు యౌవరాజ్యము ఇచ్చుచున్నాను, సీతా సహితుడవై ఈ రాత్రి నీవు వ్రతమును అవలంబింపుము'. వసిష్ఠుడు, సృష్టి, జయంతుడు, విజయుడు, సిద్ధార్థుడు, రాష్ట్రవర్ధనుడు, అశోకుడు, ధర్మపాలుడు, సుమంత్రుడు అను ఎనమండుగురు మంత్రులును రామునితో ఆ విధముగనే పలికిరి.

రాముడు తండ్రి మొదలైన వారి మాటలు విని, అట్లే చేసెదను అని చెప్పి, కౌసల్యకు కూడ తెలిపి, దేవతలను పూజించి, వ్రతము నవలంబించెను.

దశరథుడు –"రాముని పట్టాభిషేకమునకు కావలసిన సంభారములు అన్నియు సమకూర్చుడు' అని వసిష్ఠాదులతో చెప్పి కైకేయి వద్దకు వెళ్ళెను.

కైకేయికి సఖురాలగు మంథర అయోధ్యానగరమును అలంకరించుటను చూచి, రామునకు పట్టాభిషేకము జరుగనున్నదను విషయమును తెలిసికొని, దానిని కైకేయికి చెప్పెను.

ఒకప్పుడు ఆమె ఏదియో అపరాధము చేయగా రాముడు ఆమెను పాదములు పట్టి ఈడ్పించెను. ఆ వైరమును పురస్కరించుకొని ఆమె రాముని వనమునకు పంపవలెనని అనుకొనెను.

ఓ ! కైకేయీ ! లెమ్ము. రామునకు రాజ్యాభిషేకము అనగా నీకును, నాకును, నీ కుమారునకును మరణమే. ఇందులో సందేహము లేదు అని మంథర కైకను హెచ్చరించెను.

కైకేయి ఆ కుబ్జ పలికిన మాటలు విని ఒక ఆభరణమును బహూకరించి "నాకు భరతుడు ఎంతయో రాముడు కూడ అంతయే. కాని భరతునికి రాజ్యము లభించు ఉపాయమేదియు కాన రాకున్నది అని పలికెను. మంథర ఆ మాటలకు కోపించి ఆమె ఇచ్చిన హారమును గ్రహింపక కైకేయితో ఇట్లు అనెను.

"ఓ తెలివితక్కువదానా! భరతుని, నిన్ను, నన్ను కూడా రాముని నుండి రక్షించుము. రాముడు రాజు కాగలడు. అతని పిమ్మట అతని కుమారుడు రాజు కాగలడు. ఈ విధముగా భరతుడు రాజ వంశమును కోల్పోవును. పూర్వము దేవాసుర యుద్ధమునందు శంబరుడు దేవతలను సంహ రించెను. ఆ రాత్రి అచట నున్న నీ భర్తను నీవు విద్యా ప్రభావ ముచే రక్షించితివి. అపుడు ఆతడు రెండు వరములను ఇచ్చెను. ఇపుడు ఆ రెండు వరములను కోరుము. ఒక వరముచే, పదునాలుగు సంవత్సరములు రాముడు వనములో నివసింపవలెను అనియు, రెండవ వరముచే భరతునికి యౌవరాజ్య మీయవలెను అనియు కోరుము. అతడు దానిని ఈయగలడు" అని మంథర కైకేయికి దుర్బోధ చేసెను.

ఈ విధముగ ఆ కుబ్జచే ప్రోత్సహింపబడిన కైకేయి, అనర్థమును కూడా లాభకర మని భావించినదై "ఈ మంచి ఉపాయము దశరథునిచేత ఆ పని చేయించునా?" అని పలికి కోపగృహ మును ప్రవేశించి, మూర్ఛితురాలువలె భూమిపై పడియుండెను.

రాజు బ్రాహ్మణులను పూజించి, కోపించి ఉన్న కైకేయిని చూచి 'ఇట్లున్నావేమి? రోగముతో బాధపడుచున్నావా? భయపడినావా? నీకు ఏమి కావలెనో. చెప్పుము. అది చేసెదను. ఏ రాముడు లేకున్నచో ముహూర్త కాలమైనను జీవింపజాలనో ఆ రామునిపై ఒట్టు పెట్టుచున్నాను. ఓ సుందరీ! నీ కోరికను నెరవేర్చెదను.' అని పలికెను.

ఆమె 'ఓ రాజా! సత్యము పలుకుము. నీవు ఇచ్చుటకు అంగీకరించెద వేని సత్యమును పాలించుచు పూర్వము నాకు ఇచ్చిన రెండు వరములను నాకు ఇమ్ము. రాముడు పదునాలుగు సంవత్సరములు నియమవంతుడై వనము నందు నివసించుగాక. ఇప్పుడే ఈ సంభారములతో భరతుని రాజ్యాభిషిక్తుని చేయవలెను. ఈ వరముల నీయకున్నచో విషము త్రాగి మరణించెదను అని పలికెను.

ఆ మాటవిని, మూర్ఛితుడై, వజ్రముచే కొట్టబడినవానివలె దశరథుడు భూమిపై పడెను. అతడు ముహూర్త కాలమున స్మృతి చెంది కైకేయితో ......

"ఓ పాపాత్మురాలా! నీకు రాముడు ఏమి అపకారము చేసినాడు? నేనేమి చేసినాను? సకల ప్రపంచమునకును అప్రియమును ఆచరించుచు నీవు ఇట్లేల పలుకుచున్నావు? కాలరాత్రి వంటి భార్యవైన నీకు ప్రియమును చేసి నేను నిందితుడను అగుదును. భరతుడు ఇట్టివాడు కాడు. రాముడు అరణ్యమునకు వెళ్ళిన పిదప నేను మరణించగా నీవు విధవవై రాజ్యమును ఏలికొనుము అని పలికి,

సత్యపాశముచే బద్ధుడైన ఆతడు రాముని పిలచి "రామా! నేను కైకేయిచే వంచింప బడితిని. నన్ను బంధించి రాజ్యమేలుము. లేనిచో నీవు వనములో నివసింపవలెను. కైకేయీ కుమారుడైన భరతుడు రాజు అగును" అని పలికెను.

ఆ విధముగా దశరథుని మాటలు వినిన రాముడు తండ్రికిని, కైకేయికిని ప్రదక్షిణ నమస్కార ములు చేసి, కౌసల్యకు నమస్కరించి, ఓదార్చి, సీతాలక్ష్మణ సమేతుడై, బ్రాహ్మణుల కును, దీనులకును, అనాథులకును దానములు చేసి, సుమంత్రునితో కూడినవాడై, రథమును ఎక్కి శోకార్తులైన తల్లుల తోను, బ్రాహ్మణాదులతోను కూడి పట్టణము నుండి బయలువెడలెను. ఆ రాత్రి తమసాతీరమున నివసించి, పౌరులను విడచి వెళ్ళిపోయెను. ఆ పౌరులు ప్రాతఃకాలమున రామునిగానక తిరిగి అయోధ్యకు వెళ్ళిరి. మిక్కిలి దుఃఖితుడైన దశరథ మహారాజు ఏడ్చుచు కౌసల్యా గృహమునకు వెళ్ళెను. పౌరులును, స్త్రీలును, రాజస్త్రీలును ఏడ్చిరి.

నారచీరలను ధరించిన రాముడు రథమునెక్కి శృంగబేరమునకు వెళ్ళగా అచ్చట గుహుడు ఆతనిని పూజించెను. అచట రాముడు ఇంగుదీ వృక్షమూలమున నివసించెను.

లక్ష్మణుడును, గుహుడును ఆ రాత్రి అంతయు మేల్కొనియే ఉండిరి. పిదప, సీతారామ లక్ష్మణులు ప్రాతః కాలమున నావపై ప్రయాణించి జాహ్నవిని దాటి ప్రయాగ చేరిరి. అచ్చట భరద్వాజునికి నమస్కరించి చిత్రకూట పర్వతము చేరిరి. పిమ్మట వాస్తుపూజ చేసి, మన్దాకినీ నదీ తీరమున నివసించిరి. రాముడు సీతకు చిత్రకూట పర్వతమును చూపెను. అచ్చట ఒకనాడు ఒక కాకి గోళ్ళచే సీతను గీరగా కాకి నేత్రమును, రాముడు ఐషీకాస్త్రము ప్రయోగించి పోగొట్టెను. ఆ కాకి దేవతలను విడచి మరల రామునే శరణు జొచ్చినది.

రాముడు అరణ్యమునకు వెళ్ళిన ఆరవ దినమున దశరథుడు పూర్వము జరిగిన కథను చెప్పెను. "నేను కౌమార వయస్సులో ఉన్నప్పుడు సరయూనదీ, తీరమునందు కుంభమును నీటిలో ముంచి శబ్దము చేయుచున్న యజ్ఞదత్తుడనే పిల్లవానిని శబ్దవేధిని ఉపయోగించి చంపితిని. ఆతని తల్లిదండ్రులు చాల విలపించిరి. ఆతని తండ్రి 'మేము ఇరువురము పుత్ర శోకముతో మరణించు చున్నాము. నీవు కూడ పుత్రశోకముతో పుత్రుని స్మరించుచు మరణించెదవు" అని నన్ను శపించెను. కౌసల్యా! నాకు ఈ విధముగ మరణము రానున్నది." అని ఈ విధముగ కథనుచెప్పి "హా రామా!" అని అనుచు రాజు స్వర్గము పొందెను. ఆతడు శోకపీడితుడై నిద్రించినాడని తలచి కౌసల్య నిద్రించెను. ప్రాతఃకాలమున సూతమాగధ వందులు మేల్కొలుపుటకై వచ్చి శయనించి ఉన్న ఆతనిని మేల్కొలిపిరి. మరణించిన ఆతడు లేవలేదు. ఆతడు మరణించినాడని గ్రహించి కౌసల్య 'అయ్యో! చచ్చితిని' అనుచు ఏడ్చెను. పురుషులును స్త్రీలును ఏడ్వ మొదలిడిరి. వసిష్ఠాదులు మేనమామ ఇంటిలోనున్న శత్రుఘ్న సమేతుడైన భరతుని శీఘ్రముగా అయోధ్యకు రప్పించిరి.

శోకముతో నిండిన ఆ నగరినిచూచి, దుఃఖితుడై, భరతుడు "అపకీర్తి వచ్చి నెత్తిమీద పడినది కదా!" అని కైకేయిని నిందించెను. కౌసల్యను ప్రశంసించి, నూనె తొట్టెలో పెట్టిన తండ్రికి సరయూ నదీతీరమున సంస్కారము చేసెను. "రాజ్యము చేయుము" అని వశిష్ఠాదులు పలుకగా ఇట్లు అనెను.

రాముని తీసికొని వచ్చుటకు వెళ్లెదను. బలశాలియైన రాముడే అందరిచేత రాజుగా అంగీకరింపబడినవాడు, అని చెప్పి శృంగిబేరము వెళ్ళి, అచ్చటినుండి ప్రయాగ వెళ్ళి భరద్వాజుని విందు స్వీకరించి, భరద్వాజునికి నమస్కరించి, రామలక్ష్మణుల వద్దకు చేరెను. 'రామా! మన తండ్రిగారు స్వర్గస్థులైనారు. నీవు అయోధ్యలో రాజువగుము. నేను నీ ఆదేశమునకై ఎదురుచూచుచు వనమునకు వెళ్లెదను' అని పలికెను. రాముడు ఆ మాటలువిని తండ్రికి తర్పణములు చేసి, భరతునితో 'నీవు పాదుకలు తీసికొని వెళ్ళుము. సత్యపాలనమున కై జటలను నారచీరలను ధరించిన నేను రాజ్యము చేయుటకై రాను." అని రాముడు పలుకగా భరతుడు తిరిగి వెళ్ళి, అయోధ్యను విడచి, నంది గ్రామములో నివసించుచు, ఆ పాదుకలను పూజించుచు రాజ్యమును పాలించెను. (6)

అరణ్యకాండ

రాముడు వసిష్ఠునికి, తల్లులకు నమస్కరించి వారిని తిరిగి పంపివేసి చిత్ర కూటము నుండి బయలుదేరి దండకారణ్యము వైపు వెళ్ళుచు మార్గ మధ్యమున అత్రిమహా మునిని, ఆతని భార్యయైన

అనసూయను, శరభంగుని, సుతీక్ష్ణుని, అగస్త్యభ్రాతను, అగస్త్యుని చూచి నమస్కరించెను. అగస్త్యుని అనుగ్రహము వలన ధనస్సును, ఖడ్గమును పొంది, దండకారణ్యము చేరెను.

జనస్థానము నందు గోదావరీ తీరమున, పంచవటిలో నివసించెను. భయంకరు రాలు అయిన శూర్పణఖ వారిని భక్షించుటకై అచటికి వచ్చెను. మంచి రూపముగల రాముని చూచి కామ మోహితురాలై శూర్పణఖ

"నీవు ఎవరవు? ఎక్కడ నుండి వచ్చినావు? నేను నిన్ను కోరుకొనుచున్నాను. నాకు భర్తవు అగుము. ఈ ఇద్దరినీ భక్షించెదను. అని పలికి ఆమె సీతా లక్ష్మణులను భక్షించుటకు ఉద్యమించెను. అపుడు రాముడు ఆజ్ఞాపింపగా లక్ష్మణుడు ఆమె ముక్కు, చెవులు కోసివేసెను.

రక్తము స్రవించుచుండగా ఆమె వెళ్ళి సోదరుడైన ఖరునితో "ఖరుడా! ముక్కు లేని నేను మరణించెదను. కాని రాముని భార్య సీత, సోదరుడు లక్ష్మణుడు ఉన్నారు. నీవు వారి గోరువెచ్చని రక్తమును త్రాగించినచో జీవించెదను" అని చెప్పెను.

అట్లే చేసెదను అని పలికి ఖరుడు పదునాలుగు వేలమంది రాక్షసులను, దూషణ – త్రిశిరస్కులను తనతో తీసుకొని రామునితో యుద్ధము చేయుటకు వెళ్ళెను. రాముడు కూడ యుద్ధమునందు బాణములచే రాక్షసులను కొట్టి ఏనుగులు, గుఱ్ఱములు, రథములు, కాలిబంటులు అను నాలుగు అంగములు గల సైన్యమును, త్రిశిరస్కుని, భయంకరుడైన ఖరుని, యుద్ధము చేయుచున్న దూషణుని యమలోకమునకు పంపెను.

శూర్పణఖ లంకకు వెళ్ళి రావణుని ఎదుట నేలపైబడి, క్రుద్ధురాలై రావణునితో "నీవు రాజువు కావు. రక్షకుడవు కావు. ఖరాదులను చంపిన రాముని భార్యయైన సీతను అపహరించి భార్యను చేసి కొనుము. రామ లక్ష్మణుల రక్తము త్రాగిననే నేను జీవించెదను. అట్లు కానిచో జీవింపను" అని పలికెను.

ఆ మాటలు విని రావణుడు "అటులనే చేసెదను" అని పలికి, మారీచునితో "బంగారు చిత్ర వర్ణమైన మృగ రూపము ధరించి, రామ లక్ష్మణులను దూరముగా తీసికొని పోవు వాడవై, సీత ఎదుటకు వెళ్ళుము. నేను ఆమెను హరించెదను. ఇట్లు చేయకున్నచో నీకు మరణము తప్పదు" అని హెచ్చరించెను.

మారీచుడు (అనుకొనెను) "ధనుర్ధారియైన రాముడు సాక్షాత్తు మృత్యు దేవతయే. రావణుని చేతిలో నైనను మరణింపవలసినదే; రాముని చేతిలో నైనను మరణించ వలసినదే. మరణము తప్పనప్పుడు రాముని చేతిలో మరణము మంచిది. రావణుని చేతిలో కాదు" అని ఈ విధముగ తలచి, మృగ రూపము ధరించి మాటి మాటికిని సీత ఎదుట సంచరించెను.

సీతచే ప్రేరితుడైన రాముడు (కొంతదూరము దానిని వెంబడించి) బాణముచేత దానిని చంపెను. మరణించుచు ఆ మృగము హా సీతా! హా లక్ష్మణా! అని అరచెను.

పిమ్మట సీత ప్రేరేపింపగా లక్ష్మణుడు తనకిష్టము లేకున్నను రాముని వద్దకు వెళ్లెను. అంతట రావణుడు జటాయువును చంపి, సీతను హరించెను.

జటాయువుచే చీల్చబడిన శరీరముగల ఆతడు జానకిని అంకముపై కూర్చుండ బెట్టుకొని తీసికొనిపోయి, లంకచేరి, ఆమెను అశోకమను వనమున బందీగా ఉంచి ఇట్లు పలికెను. "ఓ సీతా ! నీవు నాకు ప్రముఖురాలైన భార్యవగుము." "ఓ రాక్షస స్త్రీలలారా! ఈమెను సంరక్షింపుడు' ' అని ఆదేశించెను. రాముడు మారీచుని చంపి, లక్ష్మణుని చూచి "లక్ష్మణా! అది మాయామృగము. నీవు కూడ వచ్చివేసినావు. అందుచే సీతను తప్పక అపహరించియుందురు." అని పలికెను. పిమ్మట ఆతనికి సీత ఆశ్రమమున కనబడలేదు.

రాముడు దుఃఖించుచు "సీతా నన్ను విడచి ఎక్కడికి పోతివి" అని పలుకుచు దుఃఖార్తుడై విలపించెను. లక్ష్మణునిచే ఊరడింపబడి జానకిని అన్వేషించెను.

జటాయువు రాముని చూచి "సీతను రావణుడు అపహరించెను" అని చెప్పి ప్రాణములు విడచెను. రాముడు ఆ జటాయువునకు అంత్యసంస్కారములు చేసెను. పిమ్మట కబంధుని సంహరించెను. అతడు శాప విముక్తుడై "సుగ్రీవుని వద్దకు వెళ్లుము" అని రామునితో పలికెను. (7)

కిష్కింధ కాండ

రాముడు పంపా సరస్సుచేరి దుఃఖించెను. పిమ్మట శబరి వద్దకు వెళ్లెను. పిమ్మట హనుమంతుడు సుగ్రీవుని వద్దకు తీసికొని పోగా ఆతనిని తన మిత్రునిగ చేసికొనెను అని నారదుడు పలికెను.

సుగ్రీవుడు చూచుచుండగా ఒక బాణముచేత ఏడు తాళ వృక్షములను ఛేదించి, దుందుభి శరీరమును పది యోజనముల దూరమున పడునట్లు విసరెను.

సుగ్రీవునికి సోదరుడును, వైరము చేయుటచే శత్రువును అగు వాలిని చంపి ఋశ్య మూకముపై ఉన్న ఆతనికి కిష్కింధను, వానర రాజ్యమును, రుమను, తారను ఇచ్చెను. తదనంతరము సుగ్రీవుడు "రామా! నీకు సీత లభించునట్లు చేసెదను అని పలికెను.

రాముడు ఆ మాటలు విని మాల్యవత్పర్వతముపై వర్షాకాలము నాలుగు మాసము లును గడపెను. కిష్కింధలో ఉన్న సుగ్రీవుడు మరల కనబడక పోగా, లక్ష్మణుడు సుగ్రీవుని వద్దకు పోయి "నీవు రాముని దగ్గరకు వెళ్లుము. వాలి రామునిచే నిహతుడై వెళ్లిన మార్గము ఇంకను మూసివేయబడలేదు. సుగ్రీవా! మాటమీద నిలబడుము. వాలి మార్గమును అనుసరించకుము." అని రాముడు చెప్పిన విధమున ఆతనితో చెప్పెను.

వానరాధిపతి అయిన సుగ్రీవుడు "కార్యాసక్తుడనైన నేను గడచిన కాలమును గుర్తించజాలక పోతిని" అని పలికి రాముని వద్దకు వెళ్లి నమస్కరించి "వానరుల నందరిని పిలిపించితిని. నీ అభిలాష ప్రకారము వారిని సీతాన్వేషణము నిమిత్తమై పంపగలను. వారు తూర్పు మొదలైన దిక్కులందు సీతను మాసము లోపున అన్వేషించవలెను. మాసము దాటినచో వారిని చంపెదను" అని చెప్పెను. ఈ విధముగా ఆజ్ఞాపింపబడిన వానరులు తూర్పు-పశ్చిమము, ఉత్తరము వైపు వెళ్లి అచట సీతను గానక రామ సుగ్రీవుల వద్దకు తిరిగి వచ్చిరి.

హనుమంతుడు రాముని అంగుళీయకమును తీసికొని, వానర సమేతుడై దక్షిణ దిక్కునందు సుప్రభ గుహ సమీపమున అన్వేషించెను.

మాసము దాటిన తరువాత కూడ వింధ్య పర్వతమునందు ఉండి సీతను చూడజాలక "మన మందరము వ్యర్థముగా మరణించబోవుచున్నాము. యుద్ధమునందు రావణునిచే చంపబడి, సీత నిమిత్తమై ప్రాణములు విడచిన ఆ జటాయువు ధన్యుడు కదా!" అని ఆ వానరులు అనుకొనిరి.

ఆ మాటలు విని సంపాతి వానరులను భక్షించుట మాని ఇట్లు పలికెను. ఆ జటా యువు నా సోదరుడు. నాతో కలిసి సూర్య మండలము వైపు ఎగిరెను. ఆతనిని నేను సూర్యుని వేడిమి నుండి రక్షించగా భూమిపై పడెను. ఆకాశముపై నున్న నా రెక్కలు కాలిపోయినవి. రాముని కథ వినుటచే నా రెక్కలు మరల మొలచినవి. ఓ వానరులారా! శత యోజన విస్తీర్ణమైన లవణ సముద్రమున, త్రికూట పర్వతముపై ఉన్న లంకా పట్టణమునందు అశోక వనములో ఉన్న జానకి నాకు కనబడు చున్నది. ఈ విషయము తెలిసికొని రామసుగ్రీవులకు తెలుపుడు. (8)

సుందరకాండ

హనుమంతుడును, అంగదాదులును సంపాతి మాటలు విని, సముద్రమును చూచి "ఈ సముద్రమును దాటి ఎవరు మనలను అందరిని జీవింపచేయగలరు?" అని అనుకొనిరి.

కపులు జీవించుటకును, రామ కార్యము సిద్ధించుటకును నూరుయోజనముల విస్తారము గల సముద్రమును హనుమంతుడు లంఘించెను.

సముద్రము నుండి పైకి లేచిన మైనాక పర్వతమునుచూచి, సింహికను చంపి, లంకనుచూచి, రాక్షసుల గృహములను కూడ చూచెను. అచట రావణుని ఇంటి అంతఃపురము నందును, కుంభ, కుంభకర్ణ, విభీషణ, ఇంద్రజిత్తుల గృహములందును, ఇతర రాక్షసుల గృహములందును, పానభూమి మొదలగు ప్రదేశములందును కూడ సీతను చూడజాలకపోయెను. అపుడు ఆ హనుమంతుడు చింతాక్రాంతుడై అశోకవనమునకు వెళ్ళి శింశుపా వృక్షమును ఎక్కి దాని క్రింద రాక్షస స్త్రీలచే రక్షింపబడుచున్న సీతను, "నా భార్యవు కమ్ము" అని పలుకుచున్న రావణుని, అందులకు నిరాకరించుచున్న సీతను, "రావణునికి భార్యవు అగుము" అని చెప్పుచున్న రాక్షస స్త్రీలను చూచెను.

రావణుడు వెళ్ళిపోయిన పిమ్మట హనుమంతుడు "దశరథుడు అనెడు రాజు ఉండెను. ఆతని శ్రేష్ఠులైన పుత్రులు రామలక్ష్మణులు అరణ్యమునకు వెళ్ళిరి. రాముని భార్యవైన సీతయగు నిన్ను, రావణుడు బలాత్కారమున అపహరించెను. సుగ్రీవుని మిత్రుడైన రాముడు నిన్ను అన్వేషించుచు, నన్ను పంపెను. ఆనవాలుతో కూడిన, రాముడు ఇచ్చిన ఉంగరమును గ్రహింపుము" అని చెప్పెను.

సీత వృక్షము మీద ఉన్న వానరుని చూచెను. ఆ ఉంగరమును తీసికొనెను. ఇంకను ఎదుట కూర్చొని ఉన్న ఆతనితో "రాముడు జీవించి ఉన్నచో నన్నేల తీసికొని వెళ్ళుటలేదు?" అని ప్రశ్నించెను. ఈ విధముగ శంకించుచున్న ఆమెతో హనుమంతుడు

“ఓ సీతాదేవీ! రామునికి నీ జాడ తెలియలేదు. ఇపుడు తెలిసికొని, సేనాసహితుడైన రావణుని సంహరించి నిన్ను తీసికొని వెళ్ళగలడు. ఓ దేవీ! విచారించకుము. ఆనవాలుతో కూడినది ఏదైన నాకు ఇమ్ము.” అని పలికెను. అపుడు సీత హనుమంతునకు మణిని ఇచ్చెను. “నన్ను రాముడు శీఘ్రముగా తీసికొని వెళ్ళిపోవునట్లు చేయుము” అని చెప్పెను. ఆతనికి కాకి కంటి కథను కూడ చెప్పి, “ఓ శోక వినాశకుడా! తిరిగి వెళ్ళుము” అని పలికెను.

హనుమంతుడు ఆ కథ విని, మణిని తీసికొని, ఇట్లు పలికెను. “ఓ శోభన స్వభా వముగల దేవీ! నీ భర్తరాగలడు. లేదా, నీకు తొందర ఉన్నచో నా వీపుపైన ఎక్కుము. ఇపుడే నీకు సుగ్రీవ సహితుడైన రాముని చూపించెదను. ఆ మాటలువిని సీత హనుమంతునితో– “రాముడే నన్ను తీసికొని వెళ్ళుగాక” అని పలికెను.

అపుడు హనుమంతుడు రావణుని చూచుటకై ఒక ఉపాయమును చేసెను. దంతములు నఖ ములు మొదలగు వాటితో ఉద్యానపాలకులను చంపి, ఆ ఉద్యానవనమును విరచెను. కింకరులను అందరు రాక్షసులను, ఏడుగురు మంత్రి కుమారులను, రావణుని పుత్రుడైన అక్షకుమారుని కూడ చంపెను. ఇంద్రజిత్తు నాగపాశముచే హనుమంతుని బంధించి రావణునికి చూపెను. “నీవు ఎవ్వడవు?” అని రావణుడు ప్రశ్నింపగా మారుతి రావణునితో ఇట్లు అనెను. “నేను రాముని దూతను. సీతను రామునకు ఇచ్చి వేయుము. ఇవ్వకున్నచో, లంకలో ఉన్న రాక్షసులతో గూడ, రామబాణములచే కొట్టబడి మరణింపగలవు. తప్పదు” రావణుడు హనుమంతుని చంపుటకు ఉద్యమించగా విభీషణుడు నివారించెను. హనుమంతుని తోకకు నిప్పు అంటింపచేసెను. ఆ హనుమంతుడు మండుచున్న తోకతో లంకను, రాక్షసులను కాల్చి, సీతనుచూచి నమస్కరించి, సముద్రముదాటి వచ్చి, ‘సీతను చూచితిని’ అని అంగదాదులతో చెప్పెను. అంగదాదులతో కలిసి, దధిముఖాదులను ఓడించి, మధువనములోని మధువును త్రాగెను. వారందరును రాముని వద్దకు వెళ్ళి “సీతను చూచితిమి” అని పలికిరి. రాముడు సంతసించి హనుమంతునితో

“నీవు సీతను ఎట్లు చూచితివి? ఆమె నాతో ఏమని చెప్పమన్నది? మన్మథాగ్నిలో పడి ఉన్న నన్ను సీతా కథామృతముచే తడుపుము” అని అనెను. ఈ విధముగా రామ కథను నారదుడు చెప్పుచు “రామా! సముద్రము లంఘించి, సీతను చూచి, లంకను కాల్చి వచ్చినాను. సీత ఇచ్చిన మణిని తీసికొనుము. ఆ రావణుని సంహరించి సీతను పొంద గలవు. దుఃఖింపకుము” అని హనుమంతుడు రామునితో పలికెను అని నారదుడు చెప్పెను.

అటు పిమ్మట రాముడు ఆ మణిని గ్రహించి, సీతావిరహముచే దుఃఖితుడై ఏడ్చెను. “మణిని చూడగనే సీతను చూచినట్లున్నది. నన్ను సీతవద్దకు తీసికొని వెళ్ళుము, ఆమెను విడచి జీవింపజాలను’ ’ అని పలికెను. సుగ్రీవాదులు ఓదార్చిరి. పిమ్మట వారందరు సముద్ర తీరముచేరిరి. రావణుని తమ్ముడైన విభీషణుడు “సీతను రామునకు ఇచ్చి వేయుము” అని రావణునకు ఉపదేశింపగా ఆ దురాత్ముడు ఆతనిని అవమానించెను. అందుచేత విభీషణుడు అసహాయుడై రాముని వద్దకు వెళ్ళెను.

రాముడు మిత్రుడైన విభీషణుని లంకా రాజ్యమునందు అభిషిక్తుని చేసెను. మార్గమిమ్మని సముద్రుని ప్రార్థింపగా అతడు ఇవ్వలేదు. అపుడు బాణములచే భేదించెను. సముద్రుడు రాముని వద్దకు వచ్చి "నాపై నలునిచే సేతువు కట్టించి లంకకు వెళ్ళుము. నన్ను లోతైన వానినిగా పూర్వము చేసినది నీవేకదా"! అని సముద్రుడు పలికెను. వృక్షములు, శైలములు మొదలైన వాటితో నలుడు కట్టిన సేతువుపై రాముడు వానరులతో సముద్రమును దాటి సువేల పర్వతముపై నిలిచి, లంకను చూచెను. (9)

యుద్ధ కాండము

అటుపై నారదుడు ఇట్లు చెప్పెను : రాముడు పంపగా అంగదుడు వెళ్ళి రావణునితో "వెంటనే సీతను రామునకు ఒప్పగించుము. కానిచో మరణింపగలవు." అని చెప్పెను.

యుద్ధమునకై ఉద్ధతులైన రాక్షసులుగల రావణుడు ఆతనిని చంపుటకు ప్రయత్నించెను. ఆతడు తిరిగివచ్చి "దశగ్రీవుడు యుద్ధమును మాత్రమే కోరుచున్నాడు" అని రామునితో చెప్పెను.

ఆ మాట విని రాముడు వానరసమేతుడై లంక చేరెను. హనుమంతుడు, మైందుడు, ద్వివిదుడు, జాంబవంతుడు, నలుడు, నీలుడు, తారుడు, అంగద, ధూమ్ర, సుషేణులు, కేసరి, గజ, పనస, వినత, రంభ, శరభ క్రథనులు, బలశాలియైన గవాక్షుడు, దధివక్త్ర, గవయ, గంధమాదనులు, తదితర వానరులును వెళ్లిరి. వీరితోడను, అసంఖ్యాకులగు ఇతర వానరులతోడను కూడిన సుగ్రీవుడు కూడ వెళ్ళెను.

వానర రాక్షసుల మధ్య సంకుల యుద్ధము కొనసాగెను. రాక్షసులు బాణములు, శక్తులు, గదలు మొదలగు వాటితో వానరులను కొట్టిరి. వానరులు, గోళ్ళు దంతములు, శిలలు మొదలగు వాటితో రాక్షసులను కొట్టిరి. ఏనుగులు, గుఱ్ఱములు, రథములు, కాలి బంటులు–ఈ రూపములో నున్న రాక్షసుల సైన్యము రామునిచేత అనాయాసముగా చంపబడెను.

హనుమంతుడు శత్రువైన ధూమ్రాక్షుని పర్వత శిఖరముతో చంపెను. నీలుడు యుద్ధము చేయుచున్న అకంపన ప్రహస్తులను చంపెను. గరుత్మంతుని దర్శనముచే ఇంద్రజిత్తు ప్రయోగించిన శరబంధము నుండి విముక్తులైన రామ లక్ష్మణులు బాణములతో రాక్షస సైన్యమును సంహరించిరి.

రణరంగమున రాముడు బాణములచే రావణుని జర్జర శరీరునిగా చేసెను. రావణుడు దుఃఖితుడై కుంభకర్ణుని మేల్కొలిపెను.

నిద్ర నుండి లేచిన కుంభకర్ణుడు వేయి కడవల మద్యము త్రాగి మహిషాది మాంసము భుజించి రావణునితో "నీవు సీతాహరణమను పాపకార్యము చేసితివి. అయినను నీవు నాకు అన్నవు కాన యుద్ధమునకు వెళ్లి వానర సహితుడైన రాముని సంహరించెదను అని పలికెను.

కుంభకర్ణుడీ విధముగ పలికి వానరులందరిని మర్దించెను. ఆతడు సుగ్రీవుని పట్టుకొనగా, సుగ్రీవుడు వాని చెవులను, ముక్కును కొరికివేసెను. చెవులు ముక్కులేని ఆతడు వానరులను భక్షిం

చెను. పిమ్మట రాముడు బాణములతో కుంభకర్ణుని బాహువులను, పాదములను ఛేదించి ఆతని శిరస్సు నేలపై పడవేసెను.

పిమ్మట రామ లక్ష్మణులును, వానరులును, విభీషణుడును కుంభ, నికుంభ, మకరాక్ష, మహోదర, మహాపార్శ్వ, మత్త, ఉన్మత్త, ప్రఘున, భాసకర్ణ, విరూపాక్ష, దేవాంతక, నరాంతక, త్రిశిరస్క, అతికాయు లను రాక్షసులను యుద్ధము చేయుచున్న ఇతర రాక్షసులను రామలక్ష్మణులు సంహరించిరి.

మాయతో యుద్ధముచేయుచు ఇంద్రజిత్తు రామాదులను వరలబ్ధములైన నాగ బాణ ములచే బంధించెను. హనుమంతుడు తాను తీసికొనివచ్చిన పర్వతముపై ఉన్న విశల్య అను ఓషధిచేత రామలక్ష్మణుల గాయములను మాన్పి ఆ పర్వతమును దానిచోట ఉంచెను.

నికుంభిలలో హోమాదికము చేయుచున్న ఆ ఇంద్రజిత్తును లక్ష్మణుడు బాణములతో సంహ రించెను. రావణుడు శోకసంతప్తుడై సీతను చంపుటకు ఉద్యమింపగా అవింధ్య అను అతని రాణి వారించెను. అంతట రావణుడు సేనాసమేతుడై రథమును ఎక్కి యుద్ధమునకై వెళ్ళెను.

ఇంద్రుడు పంపగా మాతలి వచ్చి రాముని రథారూఢుని చేసెను. రామరావణుల యుద్ధమునకు రామరావణ యుద్ధమే సాటి. రావణుడు వానరులను కొట్టగా, హనుమదాది వానరులు రావణుని కొట్టిరి. రాముడు మేఘమువలె ఆ రావణునిపై శస్త్రాస్త్రములను కురిపించెను. ఆతని ధ్వజమును ఛేదించి, రథమును భగ్నముచేసి గుఱ్ఱములను, సారథిని చంపి, ఆతని ధనస్సును, బాహువులను, శిరస్సులను ఛేదించెను. కాని ఆతని శిరస్సు మరల మరల మొలుచుచుండెను. అపుడు రాముడు బ్రహ్మాస్త్రముచే ఆతని హృదయమును భేదించి నేలపైకూల్చెను. రాక్షసులను అందరిని కూడ పరి మార్చెను. స్త్రీలు విహత భర్తృకలై ఏడ్చిరి.

రాముని ఆజ్ఞచే విభీషణుడు ఆ స్త్రీలను ఓదార్చెను. రాముని పూజించెను. రాముడు హనుమం తుని ద్వారా సీతను రప్పించి, అగ్ని ప్రవేశముచే శుద్ధురాలైన ఆమెను స్వీకరించెను. ఇంద్రాది దేవతలును, బ్రహ్మయు, దశరథుడును "నీవు రాక్షస సంహారివైన విష్ణువే" అని ఆతనిని స్తుతించిరి. రాముడు కోరగా ఇంద్రుడు అమృతము కురిపించి వానరులను పునరుజ్జీవితులను చేసెను. యుద్ధము చూచి ఆ దేవతలు రామునిచే పూజితులై, స్వర్గమునకు వెళ్ళిరి. రాముడు వానరులను గౌరవించి, లంకా రాజ్యమును విభీషణునకు ఇచ్చెను.

సీతాసమేతుడై పుష్పకమునెక్కి, సంతసించిన మనస్సు కలవాడైన శ్రీరాముడు సీతకు వనము లను, దుర్గమభూములను చూపుచు, వచ్చిన మార్గముననే అయోధ్య వైపు తిరిగి వెళ్లెను. భరద్వాజునకు నమస్కరించి అచట నుండి నంది గ్రామమునకు వెళ్లి, భరతునిచే నమస్కరింపబడినవాడై అయోధ్యకు వెళ్ళెను. వసిష్ఠాదులకు నమస్కరించి, కౌసల్యా, కైకేయి, సుమిత్రలకు కూడ నమస్కరించి, రాజ్యమును పొంది బ్రాహ్మణులను పూజించెను.

పిమ్మట అశ్వమేధ యాగముచే వాసుదేవుడైన తనను తానే ఆరాధించెను. సర్వదానములను ఇచ్చెను. ప్రజలను పుత్రులవలె పాలించెను. దుష్టులను నిగ్రహించుట యందు ఆసక్తుడై ధర్మకామాదు

లను పాలించెను. రాముడు రాజ్యమును పాలించిన కాలమున ప్రజలందరును తమ ధర్మములను పాలించుటయందు ఆసక్తులైరి. అకాల మరణము చెందినవాడెవ్వడును లేకుండెను.

ఉత్తర కాండము

నారదుడు ఇట్లు చెప్పెను. రాజ్యము చేయుచున్న రామునివద్దకు పూజనీయులైన అగస్త్యాదులు వెళ్లిరి. ఋషులు ఇట్లు పలికిరి–నీవు ఇంద్రజిత్తును సంహరించితివి. ఈ విధముగ విజయవంతుడవైన నీవు ధన్యుడవు.

బ్రహ్మకు పులస్త్యుడను కుమారుడు కలిగెను. ఆతని కుమారుడు విశ్రవసుడు. అతని భార్య కైకసి. ఆతని ప్రథమ భార్య పుష్పోద్భవ. పెద్దదైన పుష్పోద్భవకు కుబేరుడు పుత్రుడుగ జనించెను. కైకసికి ఇరువది బాహువులును, పది ముఖములునుగల రావణుడు పుట్టెను. ఆతడు బ్రహ్మ ఇచ్చిన వరములచే దేవతల నందరిని జయించెను. నిద్రాపరవశుడైన కుంభకర్ణుడును, ధార్మికుడైన విభీషణుడును పుట్టిరి. వారికి శూర్పణఖ సోదరి. రావణునకు మేఘనాధుడను కుమారుడు పుట్టెను. రావణుని కంటె అధిక బలవంతుడైన ఆతడు ఇంద్రుని జయించి ఇంద్రజిత్తను పేరుపొందెను. దేవతాదుల క్షేమమునకై నీవు లక్ష్మణునిచే ఆతనిని చంపించితివి.

ఆ అగస్త్యాదులగు బ్రాహ్మణులు ఈ విధముగ చెప్పి రామునిచే పూజితులై వెళ్లి పోయిరి. దేవతలచేత ప్రార్థింపబడిన రాముని ఆజ్ఞచే శత్రుఘ్నుడు లవణుడను రాక్షసుని సంహరించెను. పూర్వము మథుర అను పట్టణము ఒకటి ఉండెను. రామునిచే ఆజ్ఞాపింపబడిన భరతుడు తీక్ష్ణములైన బాణములచే మూడు కోట్ల శైలూష పుత్రులను సంహరించెను. సింధు తీరము నందు నివసించు దుష్ట గంధర్వుడైన శైలూషునికూడ చంపెను. పిమ్మట ఆ దేశములలో పుత్రులైన తక్షుని, పుష్కరుని పాలకులనుగాచేసి భరతుడు శత్రుఘ్న సమేతుడై వచ్చి రాముని సేవించెను. ఈ విధముగ మానవ రూపుడైన రాముడు దుష్టులను యుద్ధమున సంహరించి, శిష్టులను పాలించెను.

లోకాపవాదముచే విడువబడిన సీతకు వాల్మీక్యాశ్రమములో జనించిన కుశలవు లను, వారు చేసిన రామాయణ కథాశ్రవణమును బట్టి తెలిసికొని వాళ్ళను రాజ్యమునందు అభిషిక్తులను చేసెను. ఈ విధముగ రాముడు ఆ పరమాత్మనే నేను అను ధ్యానమునందు తత్పరుడై పదివేల సంవత్సరముల కాలము ధనస్సుచే లోకములను రక్షించుచు, అనేక యాగములు చేసి, దేవతలు కొనియాడ, పౌరులును, తమ్ములును వెంటరాగా స్వర్గమునకు వెళ్ళెను. సీతా పుత్రుడైన కుశుడు రాజ్యము పొందెను. అని అగ్ని పలికెను. వాల్మీకి నారదునినుండి విని రామాయణమును సవిస్తరముగ రచించెను. దీనిని వినువాడు స్వర్గమునకు వెళ్లును. (11)

శ్రీహరి వంశ వర్ణనము

అగ్ని పలికెను. హరివంశమును చెప్పెదను. విష్ణునాభికమలము నుండి బ్రహ్మ పుట్టెను. బ్రహ్మకు అత్రి, ఆతనికి సోముడు, ఆతనికి పురూరవుడు, ఆతనికి ఆయువు, ఆతనికి నహుషుడు,

ఆతనికి యయాతి పుట్టిరి. ఆతని నుండి దేవయాని యదువు, తుర్వసుడు అను కుమారులను, వృషపర్వుని కుమార్తెయైన శర్మిష్ఠ ద్రుహ్యు అనుపూరులు అనెడు కుమారులను కనిరి. యదువు కులమునందు యాదవులు పుట్టిరి. వాసుదేవుడు వారిలో ఉత్తముడు.

భూ భారమును తొలగించుటకై పూర్వజన్మలో హిరణ్యకశిపుని ఆరుగురు పుత్రులు దేవకి యందు వసుదేవుని వలన, విష్ణు ప్రేరితయైన యోగమాయ ప్రభావముచే పుట్టిరి. బలరాముడు దేవకికి సప్తమగర్భముగా ఆయెను. ఆతడు రోహిణి యందు సంక్రమింప చేయబడి రోహిణేయు డాయెను. పిమ్మట చతుర్భుజుడైన హరి శ్రావణ కృష్ణ పక్ష అష్టమి యందు అర్ధరాత్రమున జనించెను.

రెండు బాహువులుగల బాలుడుగా మారిన ఆ చతుర్భుజుని దేవకీ వసుదేవులు స్తుతించిరి. వసుదేవుడు కంసునికి భయపడి ఆ పిల్లవానిని తీసికొని వెళ్లి యశోద పక్కలో పరుండబెట్టి యశోద కుమార్తెను తీసికొనివచ్చి దేవకి పక్కలో పరుండ బెట్టెను. కంసుడు పిల్ల ఏడ్చిన ధ్వనివిని ఆ శిశువును శిలపై వేసి కొట్టెను.

దేవకి వారించినను "నీ అష్టమ గర్భము నాకు మృత్యు హేతువు" అని పలుకుచు అట్లు చేసెను. ఆకాశవాణిని విని ఆతడు దేవకి వివాహ సమయమున చెప్పిన ప్రకారము తనకు ఇచ్చిన శిశువులను అందరిని పూర్వము చంపివేసెను. క్రిందికి విసరివేయబడిన ఆ బాలిక ఆకాశముపైకి ఎగిరి కంసునితో ఇట్లు పలికెను. కంసా! నన్ను విసరివేసి ఏమి ప్రయోజనము? దేవతలకు సర్వ స్వము వంటివాడు ఒకడు భూభారమును తొలగించుటకై పుట్టినాడు. అతడు నిన్ను చంపివేయగలడు.

అని పలికి ఆమె అంతర్ధానము చెందినది. ఆమె పూర్వము శుంభాది రాక్షసులను సంహరించి దేవేంద్రునిచే "ఆర్యా! దుర్గా, వేదగర్భా, అంబికా, భద్రకాళీ, భద్రా, క్షేమ్యా క్షేమకరీ, నైకబాహుః అను పేర్లు గలవు" అని స్తుతింపబడినది. ఈ నామములను త్రిసంధ్యలందును చదువువాడు సమస్త కామములను పొందును.

కంసుడు ఆ బాలుని చంపుటకై పూతన మొదలగు వారిని పంపెను. కంసుని నుండి భయపడిన వాడువలె వసుదేవునిచే యశోదాపతియైన నందునికి రక్షణార్థమై ఈయ బడిన రామకృష్ణులు గోకులమునందు గోవులతోడను, గోపాలకులతోడను కలిసి సంచరించిరి. జగత్తునకు పాలకులైన వారు గోపాలులైరి. విసుగుచెందిన యశోదచేత రోటికి కట్టబడిన కృష్ణుడు జంటగా పెరిగిన రెండు అర్జున వృక్షముల మధ్యకు వెళ్ళగా అవి భగ్నమైనవి.

బృందావనమందున్న శ్రీకృష్ణుడు స్తన్యమును గ్రోలుచు పాదములను విసరి శకటా సురుని తల క్రింద చేసెను. తను చంపుటకై ఉద్యమించిన పూతనను స్తన్యమును త్రాగి చంపివేసెను. కాలియుని జయించి ఆతనిని యమునా హ్రదము నుండి వెడలగొట్టి సము ద్రము నందు నివసించు నట్లు చేసెను. స్తుతింపబడు ఆతడు గార్దభ రూపమున నున్న ధేనుకాసురుని బలముచే చంపి తాలవనమును క్షేమకరమైన దానినిగా చేసెను. వృషభ రూపమున నున్న అరిష్టాసురుని చంపి హయ రూపములో ఉన్న కేశిని సంహరించెను. శక్రోత్సవమును మాన్పి పర్వతపూజ చేయించెను.

పర్వతమును ఎత్తి దేవేంద్రుడు కురిపించిన వర్షమును నివారించెను. దేవేంద్రుడు శ్రీకృష్ణునికి నమస్కరించి తన కుమారుడైన అర్జునుని సమర్పించెను. కృష్ణుడు సంతసించి ఇంద్రోత్సవము చేయించెను.

కంసుడు పంపిన అక్రూరుడు స్తుతింపగా శ్రీకృష్ణుడు రథమును ఎక్కి మథురకు వెళ్ళెను. అతడు ఆ విధముగా వెళ్ళిపోవునపుడు అతనితో క్రీడించిన, అనురక్తులైన గోపికలు ఆతనిని చూచుచు నిలబడిపోయిరి. వస్త్రములను మధురలో అడుగగా, ఇవ్వని రజకుని చంపి వస్త్రములను గ్రహించెను. రామునితో కలిసి పుష్పమాలలు ధరించి మాలాకారునకు వరమిచ్చెను. అంగరాగమును ఇచ్చిన కుబ్జకు గూను పోవునట్లు చేసెను. రాజద్వారము నందున్న మదించిన కువలయాపీడమను గజమును సంహరించెను. రంగస్థలమును ప్రవేశించి, ఆసనములపై కూర్చున్న కంసాదులు చూచుచుండగా చాణూరమల్లునితో మల్లయుద్ధము చేసెను. బలరాముడు ముష్టికుడను మల్లునితో తలపడెను. వారిరువురు ఆ చాణూర ముష్టికులను మల్లులను, ఇతరులను చంపిరి.

శ్రీకృష్ణుడు మథురాపతియైన కంసునిచంపి ఆతని తండ్రిని రాజుగా చేసెను. కంసుని భార్యలైన అస్తి – ప్రాప్తి అను జరాసంధుని కుమార్తెలు, ప్రేరేపింపగా జరాసంధుడు మథురానగరమును ముట్టడించెను. యాదవులు సైన్యములతో అతనితో యుద్ధము చేసిరి. అతని నుంచి శ్రీకృష్ణుడు తప్పించుకొనెను.

అటు పిమ్మట రామకృష్ణులు మథురను విడచి గోమంతమునకు వచ్చిరి. యుద్ధమున జరా సంధుని జయించి, పౌండ్రక వాసుదేవుని కూడ జయించి, శ్రీకృష్ణుడు ద్వారకా నగరమును నిర్మించి అందు యాదవులతో నివసించెను. జనార్దనుడు, భూమి పుత్రుడైన నరకాసురుని చంపి, అతనిచే బంధింపబడిన దేవగంధర్వ యక్ష కన్యలను వివాహమాడెను. ఈ విధముగ ఆతడు కూడ పదహారు వేల మంది స్త్రీలను, రుక్మిణి మొదలగు ఎనమండు గురిని వివాహమాడెను.

నరకాసుర సంహారియైన ఆ హరి సత్యభామా సహితుడై గరుడారూఢుడై స్వర్గ లోకమునకు వెళ్ళి అచట ఇంద్రుని జయించి, మణిశైలమును, రెండు రత్నములను, పారిజాత వృక్షమును తీసికొని వచ్చి సత్యభామా గృహమున ఉంచెను.

సాందీపని నుండి శస్త్రాస్త్రములను అభ్యసించి, మరణించిన ఆతని కుమారుని మరల తీసికొని వచ్చి ఇచ్చెను. పంచజనుడను దైత్యుని సంహరించి యమునిచే పూజింప బడెను. కాలయవనుని సంహరించి ముచుకుందునిచే పూజింపబడెను. దేవకీవసుదేవులను, భక్తులను, విప్రులను పూజించెను.

బలభద్రునకు రేవతియందు నిశరుడు, ఉల్ముకుడు అను ఇరువురు కుమారులు కలిగిరి. కృష్ణునకు జాంబవతి యందు సాంబుడు పుట్టెను. ఇతర భార్యలయందు ఇంకను కొందరు పుత్రులు పుట్టిరి. రుక్మిణి యందు ప్రద్యుమ్నుడు పుట్టెను. ఆరవ దినమున ఆ శిశువును శంబరుడు బలా త్కారముగా అపహరించి సముద్రములో పారవేయగా ఒక మత్స్యము పట్టుకొని మ్రింగెను. ఆ మత్స్యమును ఒక జాలరి పట్టుకొనెను. దానిని శంబరునకు ఇచ్చెను. శంబరుడు మాయావతికి

ఇచ్చెను. మాయావతి మత్స్య గర్భములో నున్న తన పతిని చూచి ఆదరముతో పెంచెను. ఆతనితో ఇట్లనెను. "నేను నీ భార్యనైన రతిని. నీవు నా పతివైన మన్మథుడవు. శివుడు నీకు శరీరము లేకుండునట్లుచేసెను. నన్ను శంబరుడు హరించెను. నేను అతని భార్యను కాదు. నీవు మాయలు తెలిసిన వాడవుగాన ఈ శంబరుని సంహరించుము.

ఆ మాట విని ప్రద్యుమ్నుడు శంబరుని చంపి భార్యయైన మాయావతితో కూడ కృష్ణుని వద్దకు వెళ్ళగా రుక్మిణీ కృష్ణులు సంతసించిరి.

ప్రద్యుమ్నునకు ఉషాపతియు, ఉదార బుద్ధియగు అనిరుద్ధుడు పుట్టెను, శివ భక్తుడైన బలి పుత్రుడైన బాణుడుండెను. ఆతని కుమార్తె ఉష. ఆతని నగరము శోణితపురము. ఆతడు తపస్సుచే పరమ శివుని మెప్పించి శివునికి పుత్రుడు వంటివాడాయెను. సంతసించిన శివుడు 'ఓ బాణా! నీ మయూరధ్వజము ఎప్పుడు పడిపోవునో అప్పుడు నీకు యుద్ధము ప్రాప్తించగలదు' అని పలికెను.

గౌరి శివునితో క్రీడించుచుండగా చూచి ఉష భర్తను గూర్చి అభిలాష కలదాయెను. గౌరి ఆమెతో ఇట్లు అనెను. వైశాఖమాస ద్వాదశీ దివసమున నీకు స్వప్నము నందు కనబడు పురుషుడు నీకు భర్త కాగలడు". గౌరి మాటలువిని సంతసించిన ఉష గృహమునందు నిద్రించి ఆతనిని చూచెను. ఆతడు తనతో సంగము చేసినట్లు తెలిసికొని, చిత్రపటముపై అతని మూర్తిని చిత్రించి దాని సహాయముతో సఖియైన చిత్రలేఖ ద్వారా కృష్ణుని పౌత్రుడైన అనిరుద్ధుని ద్వారక నుండి తెప్పించు కొనెను. ఆ చిత్రలేఖ బాణాసురుని మంత్రియైన కుంభాండుని పుత్రిక. అనిరుద్ధుడు ఉషతో కూడ రమించెను.

రక్షకులు వెళ్లి బాణుని ధ్వజము పడిపోయినట్లు ఆతనికి తెలిపిరి. అనిరుద్ధునకు బాణునితో దారుణమైన యుద్ధము జరిగెను. కృష్ణుడు నారదుని నుండి ఈ విషయము తెలియగా, గరుడా రూఢుడై, ప్రద్యుమ్న బలరామ సమేతుడై వచ్చి శత్రువులను, మహేశ్వర జ్వరమును కూడ జయించెను.

పిమ్మట హరిశంకరుల మధ్య బాణములతో యుద్ధము జరిగెను. తార్క్ష్యుడు మొదలగు వారు నంది, వినాయక, స్కందాదులను జయించిరి.

విష్ణువు ప్రయోగించిన జృంభణాస్త్రముచే శంకరుడు ఆవులించుచు నిద్రపోయెను. అపుడు బాణుని బాహుసహస్రము ఛేదింపబడెను. రుద్రుడు బాణునకు అభయము ఇమ్మని విష్ణువును కోరెను.

విష్ణువు బాణుని రెండు బాహువులతో జీవింపచేసి, "నీవు ఈ బాణునకు అభయ మిచ్చి నావు గావున నేనును ఇచ్చుచున్నాను. మన ఇరువురికిని భేదము లేదు. భేదమును చూచు వాడు నరకమున పడును" అని శివునితో అనెను. విష్ణువు శివాదులచే పూజింపబడి, ఉషా అనిరుద్ధాదులతో కూడి ద్వారకకు వెళ్లి ఉగ్రసేనాది యాదవులతో కలిసి సుఖముగా ఉండెను.(12)

భారతాఖ్యానము

కృష్ణుని మాహాత్మ్యమునకు లక్షణమైన భారతము చెప్పెదను. విష్ణువు పాండవులను నిమిత్తముగ చేసికొని భూ భారమును హరించెను.

విష్ణువు నాభి కమలమునుండి బ్రహ్మ పుట్టెను. ఆతని పుత్రుడు అత్రి. అత్రికి చంద్రుడు, ఆతనికి బుధుడు, ఆతనికి ఐలుడు, ఆతనికి పురూరవుడు, ఆతనికి ఆయువు, ఆతనికి నహుషుడు, ఆతనికి యయాతి, ఆతనికి పూరువు పుట్టెను. ఆతని వంశమునందు భరతుడు, పిమ్మట కురువును పుట్టిరి. ఆతని వంశమునందు శంతనువు జన్మించెను. ఆతనికి గంగా పుత్రుడైన భీష్ముడు జనించెను. శంతనునకు సత్యవతియందు, భీష్ముని తమ్ములుగా చిత్రాంగద, విచిత్రులు పుట్టిరి.

శంతనుడు స్వర్గస్థుడైన పిమ్మట, భీష్ముడు బ్రహ్మచారిగనే ఉండి సోదరుల రాజ్యము పాలించెను. చిన్నవాడైన చిత్రాంగదుని, చిత్రాంగదుడు అనెడు గంధర్వుడు సంహరించెను. భీష్ముడు శత్రువులను జయించి కాశీరాజు కుమార్తెలైన అంబిక అంబాలికలను తీసికొనివచ్చి విచిత్రవీర్యుని భార్యలుగా చేసెను. విచిత్రవీర్యుడు రాజయక్ష్మ (క్షయ) అను వ్యాధిచే స్వర్గస్థుడయ్యెను.

సత్యవతి అనుమతిచే వ్యాసునివలన అంబికయందు రాజైన ధృతరాష్ట్రుడును అంబాలిక యందు పాండురాజును జనించిరి. ధృతరాష్ట్రుని వలన గాంధారి యందు దుర్యో ధనుడు మొదలగు నూర్గురు కుమారులు జనించిరి. పాండురాజు భార్యయైన కుంతి యందు యమధర్మరాజు వలన యుధిష్ఠిరుడును, వాయుదేవుని వలన భీముడును, దేవేంద్రుని వలన అర్జునుడును జనించెను. అశ్వినీ దేవతల వలన మాద్రియందు నకుల, సహదేవులు పుట్టిరి. శతశృంగ ఆశ్రమమునందు ఋషి శాపము పొందిన పాండురాజు, మాద్రీ సంగము చేయుటవలన మరణించెను. మాద్రి సతీ సహగమనముల ద్వారమున ఆతనిని అనుగమించెను. కుంతి అవివాహితయై ఉండగా జనించిన కర్ణుడు దుర్యోధనుని ఆశ్రయించెను.

దైవవశముచే కురుపాండవుల మధ్య వైరము ఏర్పడెను. దుష్టబుద్ధియైన దుర్యోధనుడు లక్క ఇంటిలో పాండవులను కాల్చెను. కాని తల్లితో కూడిన పంచపాండవులు కాలిపోయిన ఇంటి నుండి తప్పించుకొని వెళ్ళిపోయిరి.

పిమ్మట ఆ పాండవులు ఏకచక్ర నగరమునందు మునివేషధారులై ఒక బ్రాహ్మణుని ఇంట నివసించిరి. అచట వారు బకరాక్షసుని చంపిరి.

వారు ద్రౌపదీ స్వయంవర నిమిత్తమై పాంచాలదేశమునకు వెళ్లిరి. అచట వివిధ అలంకార భూషితయైన ద్రౌపదిని పాండవులు అయిదుగురును భార్యగా పొందిరి.

దుర్యోధనాదులచే గుర్తింపబడిన ఆ పాండవులు అర్ధరాజ్యమును పొందిరి. అర్జునుడు, అగ్నిదేవుని నుండి గాండీవమను దివ్యధనస్సును, ఉత్తమమైన రథమును, అక్షయమైన బాణములుగల అమ్ములపొదులను పొందెను. ద్రోణుని వలన బ్రహ్మాది అస్త్రములను పొందెను. కృష్ణుని యుద్ధ సమయమున సారథిగా పొందెను. వారందరును శస్త్రాస్త్రములందు సమర్థులైరి.

పాండు కుమారుడైన అర్జునుడు తన శరవర్షముచే, ఇంద్రుడు కురిపించిన వర్షమును అడ్డగించి, కృష్ణ సహాయముతో, ఖాండవ వనమునందు అగ్నిని సంతృప్తుని చేసెను. పాండవులు నలుదిక్కులను జయించిరి. యుధిష్ఠిరుడు రాజ్యము చేసెను. అధికమగు సువర్ణ దానముగల రాజసూయ యాగ మును చేసెను. దుర్యోధనుడు దీనినంతను సహింపలేకపోయెను.

సోదరుడైన దుఃశాసనుడును, ఐశ్వర్యము లభించిన కర్ణుడును, శకునియు చెప్పగా యుధిష్ఠిరుని ద్యూత(జూద)మునకై ఆహ్వానించి, ఆ ద్యూతశాలలో యుధిష్ఠిరుని మోసము చేసి నవ్వుచు, ఆతని రాజ్యమును హరించెను.

ద్యూతమునందు ఓడిపోయిన యుధిష్ఠిరుడు సోదరులతోడను, ద్రౌపదితోడను, ధౌమ్యునితోడను అరణ్యమునకు వెళ్లి ప్రతిజ్ఞచేసిన విధముగ అచట పంద్రెండు సంవత్స రములు గడపెను. అచట పూర్వమునందువలె, ప్రతిదివసమునందును, ఎనుబది ఎనిమిది వేల మంది బ్రాహ్మణులకు భోజనము పెట్టుచుండెను. పిమ్మట వారందరును విరాటుని చేరిరి. యుధిష్ఠిరుడు కంకుడనెడు బ్రాహ్మణుడుగను, భీముడు వలలుడను పేర వంటవాడుగను, అర్జునుడు బృహన్నలగను అయి ఇతరులకు తెలియకుండా ఉండునట్లు అచట నివసించిరి. నకుల, సహదేవులు వేరు పేర్లతో ఉండిరి. ద్రౌపదిని హరింప అభిలషించిన కీచకుని భీమసేనుడు రాత్రివేళ సంహరించెను. గోగ్రహణాదికమును చేయవచ్చిన కౌరవులను అర్జునుడు జయించెను. అప్పుడు ఆ కౌరవులు వారు పాండవులని గుర్తించిరి.

కృష్ణుని సోదరియైన సుభద్రకు అర్జునుని వలన అభిమన్యుడను కుమారుడు కలిగెను. విరాటుడు ఆతనికి తన కుమార్తెయైన ఉత్తరను ఇచ్చెను.

ధర్మరాజు యుద్ధమునకై ఏడు అక్షౌహిణుల సైన్యమును సన్నద్ధము చేసికొనెను. కృష్ణుడు అమర్ష పూర్ణుడును, పదకొండు అక్షౌహిణులకు అధిపతియు అగు దుర్యోధనుని వద్దకు దూతగా వెళ్లి "యుధిష్ఠిరునకు సగము రాజ్యము నిమ్ము. లేదా ఐదు గ్రామాలనైన ఇమ్ము. అట్లు కానిచో యుద్ధము చేయుము" అని చెప్పెను. ఆ మాటలు విని సుయోధనుడు శ్రీకృష్ణునితో సుయోధనుడు : "సూది మోపినంత నేలనైనను ఇవ్వను. యుద్ధము చేసెదను. యుద్ధమునకై సిద్ధముగా ఉన్నాను" అని పలికెను. అంత శ్రీకృష్ణుడు ఎదిరింప శక్యముకాని విశ్వరూపము చూపి, విదురునిచేత పూజింపబడినవాడై, యుధిష్ఠిరుని దగ్గరకు వెళ్లి, "ఆ సుయోధనునితో యుద్ధము చేయుము" అని చెప్పెను. (13)

కురు పాండవ యుద్ధము

యుధిష్ఠిరుని సేనయు, దుర్యోధనుని సేనయు కురుక్షేత్రమును చేరినవి. అర్జునుడు భీష్మద్రోణాదులను చూచి యుద్ధము చేయడని తెలిసికొని, భగవంతుడైన శ్రీకృష్ణుడు ఆతనితో భీష్మాదులను గూర్చి శోకింప పనిలేదు. శరీరములు నశించును గాని ఆత్మనశించదు. ఈ జీవాత్మ పరమాత్మయే. "నేనే పరబ్రహ్మను" అని తెలిసికొనుము. ప్రయత్నము సిద్ధించినను, సిద్ధింపకున్నను సమబుద్ధి కలవాడవై, యోగివై, రాజధర్మమును పాలించుము అని అనెను.

ఈ విధముగా కృష్ణుడు ఉపదేశించగా అర్జునుడు రథముపై నెక్కి, వాద్య శబ్దములు చేయుచు, యుద్ధము చేసెను. మొదట దుర్యోధన సైన్యమునకు భీష్ముడు సేనాపతి అయ్యెను. పాండవులకు శిఖండి సేనాపతి అయ్యెను. ఆ రెండు సైన్యములకును యుద్ధము జరిగెను. భీష్మునితో కూడిన

కౌరవులు యుద్ధమునందు పాండవులను కొట్టిరి. శిఖండి మొదలగు పాండవ పక్షీయులు యుద్ధమునందు కౌరవులను కొట్టిరి. కురుపాండవ సేనల మధ్య యుద్ధము, ఆకాశము నుండి చూచుచున్న దేవతలకు ప్రీతిని వృద్ధిపొందించుచు, దేవాసుర యుద్ధమువలె జరిగెను.

భీష్ముడు పది దివసములలో, అస్త్రములచే పాండవ సైన్యమును ధ్వంసము చేసెను. పదవ రోజున, అర్జునుడు వీరుడైన భీష్మునిపై బాణవర్షము కురిపించెను. ద్రుపదుడు ప్రేరేపించగా శిఖండి కూడ మేఘమువలె అస్త్రములను వర్షించెను. పరస్పరము ప్రయో గించిన అస్త్రజాలముచే ఏనుగులు, గుఱ్ఱములు, రథములు, కాలిబంటులు నేలపై కూలెను. స్వేచ్ఛామరణముగల భీష్ముడు తనతో ఎట్లు యుద్ధము చేయవలెనో పాండవులకు చెప్పి వసువులచేత ప్రేరితుడై, వసులోకమునకు తిరిగి వెళ్ళదలచి, శరశయ్యాగతుడై, విష్ణువును ధ్యానించుచు, స్తుతించుచు, ఉత్తరాయణమునకై వేచి యుండెను. దుర్యోధనుడు శోకార్తుడయ్యెను. అపుడు ద్రోణుడు సేనాధిపత్యము వహించెను. సంతసించిన పాండవ సైన్యమున ధృష్టద్యుమ్నుడు సేనాపతి అయ్యెను.

వారిరువురికిని యముని రాష్ట్రమును పెంచు యుద్ధము జరిగెను. ద్రోణుడను మహాసముద్రము నందు విరాట ద్రుపదాదులు మునిగిపోయిరి.

హస్త్యశ్వరథపదాతులుగల దుర్యోధన సేనకూడ పాండవ సేనాపతియైన ధృష్ట ద్యుమ్నుని చేత (చంపబడెను). ద్రోణుడు యుద్ధమునందు యమునివలె కన్పట్టెను. అశ్వత్థామ మరణించెను అనుమాటవిని ద్రోణుడు ఆయుధములను విసర్జించెను. ఎదిరింప శక్యము కాని ఆతడు సర్వక్షత్రి యులను సంహరించి ఐదవ దినమున ధృష్టద్యుమ్నునిచేత బాణములచే కొట్టబడి మరణించెను.

దుర్యోధనుడు శోకార్తుడయ్యెను. అపుడు కర్ణుడు సేనాపతి ఆయెను. అర్జునుడు పాండవుల సేనాపతి ఆయెను. వారిరువురును శస్త్రములతో ఒకరినొకరు కొట్టుకొనగా భయంకరమైన, దేవాసుర యుద్ధ తుల్యమగు యుద్ధము జరిగెను.

ఈ సంగ్రామమునందు కర్ణుడు బాణములతో శత్రువులను సంహరించెను. రెండవ రోజున కర్ణుని అర్జునుడు సంహరించెను.

శల్యుడు సేనాధిపత్యమును వహించి అర్ధదివసము యుద్ధముచేసెను. యుధిష్ఠిరుడు ఆతనిని సంహరించెను. సైన్యము నశించగా సుయోధనుడు భీమసేనునితో యుద్ధము చేసెను. చాలమంది సైనికులు మొదలగువారిని చంపి, అతడు భీమసేనుని మీదకు వెళ్ళెను. భీమసేనుడు గదతో యుద్ధము చేయుచున్న ఆతనిని ఆతని తమ్ములను పదునెనిమిదవ దివసమున పడగొట్టెను.

మహాబలశాలియైన అశ్వత్థామ, రాత్రియందు నిద్రించుచున్న పాండవులయొక్క అక్షౌహిణీ ప్రమాణముగల సేనను, ద్రౌపదీపుత్రులను, పాంచాలులను, ధృష్టద్యుమ్నుని చంపెను.

పిమ్మట అర్జునుడు పుత్రహీనురాలై విలపించుచున్న ద్రౌపదిని చూచి ఆమెను ఓదార్చుటకై, ఐషీకాస్త్రముచే అశ్వత్థామ శిరోమణిని గ్రహించెను.

శ్రీకృష్ణుడు అశ్వత్థామ అస్త్రముచే దహింపబడుచున్న ఉత్తరాగర్భమును రక్షించెను. పిమ్మట ఆ గర్భస్థ శిశువు పరీక్షిన్మహారాజు ఆయెను. ఆ యుద్ధము నుండి కృతవర్మ, కృపాచార్యులు, అశ్వత్థామ అను ఈ ముగ్గురు మాత్రమే ప్రాణములతో బయటపడిరి. పాండవ పక్షమున పంచ పాండవులు, సాత్యకి, కృష్ణుడు ఈ ఏడుగురు మాత్రమే మిగిలిరి. మరెవ్వరును మిగలలేదు.

యుధిష్ఠిరుడు దుఃఖార్తులైన స్త్రీలను ఓదార్చి, భీమాది సమేతుడై, మరణించిన వీరులందరికిని ప్రేత సంస్కారములను చేసి, వారికై ఉదక ధనాది దానములు చేసి, శంతను కుమారుడైన భీష్ముని నుండి శాంతిని కలిగించు సమస్త ధర్మములను, రాజ ధర్మములను, మోక్ష ధర్మములను, దాన ధర్మములను విని, రాజయ్యెను. శత్రుసంహారియైన ఆతడు అశ్వమేధ మాచరించి, బ్రాహ్మణులకు దానములు ఇచ్చెను.

ముసలము పుట్టి యాదవులు అందరును నశించిరను విషయమును అర్జునుని నుండి తెలిసికొని పరీక్షిత్తును రాజ్యాభిషిక్తునిచేసి, సోదరసహితుడై స్వర్గము చేరెను.(14)

పాండవ చరిత వర్ణనము

అగ్ని పలికెను : ఓ ద్విజుడా! యుధిష్ఠిరుడు రాజ్యము చేయుచుండగా, ధృత రాష్ట్రుడును, గాంధారియు, కుంతియు, అరణ్యమునకు వెళ్ళి ఒక ఆశ్రమము నుండి మరియొక ఆశ్రమమునకు సంచరించుచుండిరి.

విదురుడు దావాగ్నిచే దగ్ధుడై మృతిచెందెను. ఈ విధముగ మహావిష్ణువు పాండవులను నిమిత్తముగ చేసికొని, ధర్మ రక్షణము కొరకును, అధర్మ వినాశమునకును పూనుకొని దానవాదికమగు భూభారమును హరించెను. విప్రశాపమను వంకచే, ముసలముచే, భూ భారకరమగు యాదవ కులమును నశింపచేసెను.

శ్రీకృష్ణుడు వజ్రుని రాజ్యాభిషిక్తుని చేసి దేవతల ఆదేశముచే ప్రభాస క్షేత్రమునందు తన దేహమును పరిత్యజించి, ఇంద్రలోక బ్రహ్మలోకములందు స్వర్గవాసులచే పూజింపబడెను. బల రాముడు ఆదిశేషరూప ధారియై పాతాళ స్వర్గము చేరెను. వినాశరహితుడగు ఆ శ్రీహరి యోగులచే ధ్యానింపబడువాడు. అట్టి శ్రీకృష్ణుడు లేని ద్వారకను సముద్రము ముంచివేసెను.

అర్జునుడు యాదవులకు ప్రేత సంస్కారాదులు చేసి ఉదకధనాది దానములు చేసెను. అష్టా వక్రుని శాపముచే విష్ణుభార్యలుగా అయిన స్త్రీలను, మరల ఆతని శాపము చేతనే, కఱ్ఱలు ఆయుధ ములుగాగల గోపాలకులు అర్జునుని ఓడించి తీసికొనిపోయిరి. అర్జునుడు చాల శోకించెను. వ్యాసుడు ఆతనిని ఊరడించెను. కృష్ణుడు ఉన్నప్పుడే నా బలము అని అర్జునుడు గ్రహించెను. ఆతడు హస్తినాపురమునకువచ్చి, రాజ్యపాలకుడైన యుధిష్ఠిరునకు ఇది అంతయు చెప్పెను.

కృష్ణుడు ఈలోకమును విడచి వెళ్ళిపోయినతోడనే అర్జునుని అదే ధనస్సు, అవే అస్త్రములు, అదే రథము, అవే గుఱ్ఱములు, అవన్నియు శ్రోత్రియుడుకాని వానికి ఇచ్చిన దానమువలె

నష్టమైపోయెను. ధర్మరాజు ఆ వార్త విని, పరీక్షిత్తును రాజ్యపాలనకై నియో గించి, ఈ సంసారము అనిత్యము అను విషయము గ్రహించినవాడై, ద్రౌపదియు, సోదరులును వెంటరాగా, మహావిష్ణుని అష్టోత్తర శతనామములు జపించుచు మహాప్రస్థానమున బయలుదేరెను.

ఆ మహాప్రస్థానమునందు ద్రౌపది, సహదేవుడు, నకులుడు, అర్జునుడు, భీముడును పడిపోయిరి. రాజు శోకాతురుడు అయ్యెను. ఆతడు ఇంద్రుడు తీసికొని వచ్చిన రథమును అధిరోహించి, సోదర సహితుడై స్వర్గము చేరెను. అచట దుర్యోధనాదులను, వాసుదేవుని చూచి సంతసించెను. నీకు ఈ భారతకథను చెప్పితిని. దీనిని పఠించినవారు స్వర్గమునకు వెళ్లెదరు. (15)

బుద్ధ, కల్కి అవతార కథనము

అటు పిమ్మట అగ్ని ఈ విధముగా పలికెను. బుద్ధావతారమును గూర్చి చెప్పెదను. ఇది చదువువానికిని విను వానికిని గూడ మంచి ప్రయోజనమును చేకూర్చును. పూర్వము దేవాసుర యుద్ధము జరిగెను. ఆ యుద్ధమున పరాజితులైన దేవతలు "రక్షింపుము రక్షింపుము అని ప్రార్థించుచు పరమేశ్వరుని శరణు జొచ్చిరి. అపుడు మాయామోహ స్వరూపుడైన ఆ పరమేశ్వరుడు శుద్ధోదనుని కుమారుడుగా జనించి, దైత్యులకు మోహము కలిగించి, వారు వేదధర్మమును విడచునట్లు చేసెను. వారందరును బౌద్ధులైరి. ఆ పరమేశ్వరుడే అర్హతుడై, మిగిలిన వేద వర్జితులను అందరిని అర్హతులను చేసెను. ఈ విధముగ దైత్యులు వేద ధర్మాది వర్జితులైన పాషండులుగా అయిరి.

వారు నరకమును ఇచ్చు కర్మలు చేసిరి. వీరందరును అధముని నుండి కూడ ప్రతి గ్రహము చేయుదురు. కలియుగాంతమున సంకర మగుదురు. శీలరహితులైన దొంగలు అగుదురు. పదునైదు శాఖలు గల వాజసనేయ వేదము ప్రమాణము కాగలదు. ధర్మమను చొక్కా తొడిగికొనిన మ్లేచ్ఛులు, రాజులై, అధర్మమునందు ఆసక్తి కలవారై మనుష్యులను భక్షించగలరు. (పీడించగలరు)

విష్ణుయశుని కుమారుడును, యాజ్ఞవల్క్యుడు పురోహితుడుగా కలవాడును అగు కల్కి ఆయుధములలో మిక్కిలి నేర్పరియై, అస్త్రములను ధరించి మ్లేచ్ఛులను నశింపజేయును.

నాలుగు వర్ణములందు తగిన కట్టుబాట్లు చేయగలడు. ప్రజలను నాలుగు ఆశ్రమము లందును, సద్ధర్మ మార్గము నందును నిలుపగలడు. విష్ణువు కల్కిరూపమును విడచి స్వర్గమునకు వెళ్లును. పిమ్మట పూర్వమునందు వలె కృతయుగము ఏర్పడును.

ఓ మునీ! వర్ణాశ్రమములు తమతమ ధర్మములను ఆచరించును. ఈ విధముగా శ్రీమహావిష్ణువు అన్ని కల్పము లందును, అన్ని మన్వంతరములందును అనేకములైన అవతారములు ఎత్తుచుండును. గడచినవి, రానున్నవి అవతారములు ఎన్నియో లెక్కకు మించి ఉన్నవి. విష్ణు దశావతారములను పఠించినవాడును, వినినవాడును, పాపములు నశించి, సర్వకామములు పొంది, కులముతో కూడి స్వర్గము చేరును. విష్ణువు ఈ విధముగ ధర్మాధర్మ వ్యవస్థ చేయుచుండును. సృష్ట్యాదులకు కారణమైన ఆ హరి ఈ విధముగ అవతరించి మరల (స్వర్గమునకు) వెళ్ళిపోయెను. (16)

జగత్ సృష్టి వర్ణనము

అగ్ని పలికెను : ఇపుడు విష్ణువుయొక్క జగత్సృష్టి మొదలగు క్రీడను గూర్చి చెప్పెదను, వినుము. స్వర్గాదులను నిర్మించిన అతడే సృష్టికి ఆదియైనవాడు. ఆతడు గుణములు కలవాడు. నిర్గుణుడు కూడ.

ప్రారంభమున సద్రూపమైన బ్రహ్మయే అవ్యక్తావస్థలో ఉండెను. ఆకాశముగాని, రాత్రిగాని, పగలుకాని లేకుండెను. (ఆ బ్రహ్మ) ప్రకృతిని, పురుషుడైన విష్ణువును ప్రవేశించి క్షోభింపచేసెను.

సృష్టి సమయమున ఆ ప్రకృతి పురుషుల క్షోభవలన మహత్తత్త్వము జనించెను. దానినుండి అహంకారము జనించెను. ఇంద్రియాది వికారములకు కారణమైన అహంకారము తైజనము. పంచభూతములకు కారణమైనది తామసము. అహంకారము నుండి శబ్దతన్మాత్ర రూపమైన ఆకాశము, దాని నుండి స్పర్శతన్మాత్ర రూపమైన వాయువు, దాని నుండి రూపతన్మాత్ర రూపమైన అగ్ని, దాని నుండి రసతన్మాత్ర రూపమైన ఉదకము, దానినుండి గంధతన్మాత్ర రూపమైన పృథివియు జనించెను. ఇవన్నియు తామసా హంకారము నుండి జనించెను. పిదప (తైజసాహంకారము నుండి తైజసమైన ఇంద్రియములు పది వైకారిక దేవతలు, పదకొండవ ఇంద్రియమైన మనస్సు పుట్టినవి. పిమ్మట భగవంతుడైన బ్రహ్మ వివిధ ప్రజలను సృజింప దలచినవాడై ముందుగా జలమును సృజించెను. దానియందు తన వీర్యమును విడచెను. ఉదకమునకు నారములు అని పేరు. అవి నరుని వలన పుట్టెను కదా! పూర్వము నారములు అనగా ఉదకములు, నరునకు స్థాన మాయెను. అందుచే ఆతడు నారాయణుడని చెప్పబడెను. ఉదకములో ఉన్న ఆ వీర్యము బంగారు వర్ణముగల అండమాయెను. దాని యందు స్వయంభువైన బ్రహ్మ జనించెనని మేము వింటిమి.

భగవంతుడైన హిరణ్యగర్భుడు ఆ అండము నందు పదివత్సరముల కాలముండి, దానిని రెండు వ్రక్కలుగాచేసి ద్యులోకమును, భూలోకమును నిర్మించెను ఆ రెండు ప్రక్కల మధ్యయందు ఆకాశమును సృజించెను. ఉదకమునందు తేలుచున్న భూమిని, పది దిక్కులను సృజించెను. అచట కాలమును, మనస్సును, వాక్కును, కామమును, క్రోధమును మరియు రతిని నిర్మించెను. ప్రజాపతి ఈ రాబోవు సృష్టిని పైన చెప్పిన ఆకాశాదులతో సంబంధించిన దానినిగా చేయదలచి, ముందుగా వాటిని సృజించెను.

మెరుపులను, వజ్రమును (పిడుగును), మేఘములను, రక్తమును, ఇంద్ర ధనస్సును లేదా ఎట్టిని రంగుగల ఇంద్ర ధనుస్సులను, పక్షులను, పర్జన్యుని సృజించెను. పిదప యజ్ఞ సిద్ధికొరకై ముఖము నుండి ఋగ్యజుస్సామ వేదములను సృజించెను.

ఆ వేదములచే సాధ్యులను, దేవతలను ఉద్దేశించి యజ్ఞము చేసెను. అనేక విధము లగు భూతములను సృజించెను. భుజమునుండి సనత్కుమారుని, క్రోధము నుండి రుద్రుని సృజించెను. మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు అనువారిని సృజించెను. ఈ ఏడుగురును బ్రహ్మ మానసపుత్రులగు బ్రహ్మలని ప్రసిద్ధిచెందిరి. ఈ సప్త బ్రహ్మలును, రుద్రులును

ప్రజాసృష్టి చేసిరి. తన దేహమును రెండు భాగములుగాచేసి, ఒక భాగము పురుషుడుగాను, మరొక భాగము స్త్రీగాను అయి బ్రహ్మ ఆమెయందు ప్రజలను సృజించెను. (17)

స్వాయంభువ వంశ వర్ణనము

స్వాయంభువమనువు, ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అను కుమారులను తపఃశాలిని యగు శతరూప అను సుందరియగు కుమార్తెను జనింపచేసెను.

ఉత్తానపాదుని వలన సురుచియందు ఉత్తముడను పుత్రుడును, సునీతయందు ధ్రువుడను పుత్రుడును జనించిరి. ఓ మునీ! ధ్రువుడు, కీర్తి కొరకై, మూడువేల దివ్య వర్షముల పాటు తపస్సు చేసెను. ఆతని విషయమున సంతసించిన విష్ణువు, ఆతనికి సప్తర్షులకంటె ముందు స్థిరమైన స్థానమును ఇచ్చెను. ఆతని అభివృద్ధిని చూచి "ఈతని తపస్సుయొక్క ప్రభావము ఎంత గొప్పది! ఈతని శాస్త్రజ్ఞానము ఎంత అద్భుతమైనది! సప్తర్షులు కూడ ఈతని తమ ఎదుట నిలుపుకొని ఉన్నారు కదా!" అని ఉశనుడు ఒక శ్లోకమును (ప్రశంసా వాక్యమును) చదివెను.

ధ్రువునకు శిష్టి, భవ్యుడు, శంభువు అను కుమారులు జనించిరి. శిష్టికి సుచ్ఛాయవలన రిపువు, రిపుంజయుడు, రిప్రుడు, వృకలుడు, వృకతేజసుడు అను పుణ్యాత్ములైన కుమారులు జనించిరి. రిపువుకు బృహతి యందు చాక్షుషుడు, సర్వతేజసుడు అను పుత్రులు జనించిరి.

చాక్షుషుడు పుష్కరిణిలో, వీరణియందు మనువును జనింపచేసెను. మనువునకు, నడ్వలయందు ఊరుడు, పూరుడు, తపస్వి, సత్యవాక్కు, కవి, అగ్నిష్టుడు, అతిరాత్రుడు, సుద్యుమ్నుడు, అతిమన్యుకుడు అను పదిమంది సుతోత్తములు జనించిరి.

ఊరునివలన ఆగ్నేయ అను అతడి భార్య అంగుడు, సుమనసుడు, స్వాతి, క్రతువు, అంగిరసుడు, గయుడు అను కాంతిమంతులగు ఆరుగురు కుమారులను కనెను.

అంగునకు సునీథుని కుమార్తెయందు రేనుడను ఒక కుమారుడు జనించెను. పాపాసక్తుడై ప్రజారక్షణము చేయని ఆ వేనుని మునులు కుశములను ప్రయోగించి సంహరించిరి. పిమ్మట మునులు సంతానము కొరకై వేనుని కుడిచేతిని మథించగా దానినుండి పృథుచక్రవర్తి జనించెను.

మునులు అందరును ఆతనిని చూచి – "మహాతేజశ్శాలి అయిన ఇతడు ప్రజలను రంజింప చేయగలడు. గొప్ప కీర్తిని కూడ పొందగలడు" అని పలికిరి.

క్షత్రియుల పూర్వపురుషుడును, వైన్యుని కుమారుడును, తేజస్సుచే దహింపచేయు చున్నట్లు కనబడుచున్న వాడును అగు ఆ పృథువు ధనస్సును, కవచమును ధరించి ప్రజలు అందరిని రక్షించెను.

ఆ రాజు రాజసూయ యాగముచేసి అభిషేకము పొందినవారిలో మొదటివాడు. ఆతని నుండి పుట్టిన నేర్పరులైన వీరులైన సూతమాగధులు ఆతనిని స్తుతించిరి. ఆతడు ప్రజల జీవనమునకు ఉపయోగించు సస్యములను సంపాదించుటకై భూమిని పిదికెను.

దేవతలును, ముని గణములును, గంధర్వులును, అప్సరోగణములును, పితృ దేవతలును, దానవులును, సర్పములును, లతలును, పర్వతములును, జనులును ఆయా పాత్రలలో పిదుకగా భూమి వారివారికి కావలసిన క్షీరమును ఇచ్చెను. దానిచే వారందరును ప్రాణధారణము చేసిరి.

పృథుచక్రవర్తికి అంతర్ధి, పాలితుడు అను ధర్మవేత్తలైన ఇరువురు కుమారులు జనించిరి. శిఖండిని అంతర్ధి నుండి హవిర్ధానుడు అనెడు కుమారుని కనెను. అగ్ని పుత్రియగు ధిషణ హవిర్ధానుని వలన ప్రాచీనబర్హిస్సు, శుక్రుడు, గయుడు, కృష్ణుడు, వ్రజుడు, అజినుడు అను ఆరుగురు కుమారులను కనెను.

యజ్ఞము చేయుచున్నప్పుడు కుశలు, వాటి అగ్రములు తూర్పు వైపున కుండునట్లు భూమిపై పరవబడెను. అందుచే పూజ్యుడైన ఆ ప్రజాపతికి "ప్రాచీన బర్హిస్సు" అను పేరు వచ్చెను. సముద్రుని కుమార్తెయైన సవర్ణ ప్రాచీన బర్హిస్సు వలన పది మంది కుమారులను కనెను. వారందరికిని ప్రచేతసులనియే పేరు. వారందరును ధనుర్వేదమునందు పరిపూర్ణ ప్రజ్ఞ కలవారు.

ఒకే విధముగా ధర్మము నాచరించుచున్న వారందరును సముద్ర జలమున నివసించి పదివేల సంవత్సరములు గొప్ప తపస్సు చేసిరి. వారు విష్ణువు నుండి ప్రజాపతిత్వమును పొంది, సంతసించినవారై సముద్ర జలము నుండి లేచిరి. అపుడు భూమ్యాకాశములు వృక్షములచే వ్యాప్తములై యుండెను. వారు తమ ముఖము నుండి పుట్టిన అగ్ని వాయు వులచే ఆ వృక్షములను దహింపచేయ మొదలిడిరి. అపుడు రాజైన సోముడు ప్రజాపతుల దగ్గరికివెళ్లి–"కోపమును ఉపసంహరింపుడు, భవిష్యత్తును గూర్చి తెలిసిన నేను తపశ్శాలియగు కండుముని కుమార్తెయైన ప్రమ్లోచయందు ఉత్తమురాలగు మారీష అను కన్యను జనింపచేసితిని. ఆమెను మీకు ఇచ్చెదరు. ఆమె మీ వంశమును వృద్ధి పొందించు భార్యయగుగాక. ఆమెయందు పుట్టిన దక్షుడు ప్రజలను వృద్ధిపొందించును అని పల్కెను.

ప్రచేతసులు ఆమెను స్వీకరించిరి. ఆమెకు దక్షుడను కుమారుడు జనించెను. అతడు మనస్సుచే స్థావర జంగమములకు, ద్విపాత్తులను (మనుష్యులు మొదలగువారిని) చతు ష్పాత్తులను (నాలుగు కాళ్ళుగల పశ్వాదులను) సృజించి పిమ్మట స్త్రీలను సృజించెను. వారిలో పదిమంది యమధర్మరాజు నకును, పదముగ్గురిని కశ్యపునకును, సోమునకు ఇరువది యేడుగురిని, అరిష్టనేమికి నలుగురిని, బహుపుత్రునకు ఇద్దరిని, అంగిరసునకు ఇద్దరిని ఇచ్చెను. పూర్వము వారియందు మానస మైథున ముచే దేవతలును నాగాదులును జనించిరి.

యమధర్మరాజునకు తన పదిమంది భార్యలవలన కలిగిన సంతానమును గూర్చి చెప్పెదను. విశ్వకు విశ్వేదేవతలు, సాధ్యకు సాధ్యులు, మరుత్వలకు ఇద్దరు మరుత్వంతులు, వసువునకు వసువులు, భానువుకు భానులు, ముహూర్తకు ముహూర్తులు, లంబకు ఘోషుడు, యామికి నాగవీధి, మరుత్వతికి పృథివికి సంబంధించిన సకల వస్తుజాతము, సంకల్పకు సంకల్పులు జనించిరి. చంద్రునకు నక్షత్రముల వలన ఆపుడు, ధ్రువుడు, సోముడు, ధరుడు, అనిలుడు, అనలుడు, ప్రత్యూషుడు, ప్రభాసుడు అను ఎనమండుగురు వసువులును జనించిరి.

ఆపుని కుమారులు వైతండ్యుడు, శ్రముడు, శాంతుడు, ముని అనువారు. లోకాంతుడైన కాలుడు ధ్రువుని కుమారుడు. వర్చసుడు సోముని కుమారుడు. ద్రవిణుడు, హుత హవ్యవహుడు శిశిరుడు, ప్రాణుడు, రమణుడు అనువారు ధరునికి, మనోహరయందు కుమారులుగా జనించిరి. అనిలుని కుమారుడు పురోజవుడు. అనిలుని కుమారుడు అవిజ్ఞాతుడు. కుమారుడు అగ్నిపుత్రుడుగా శరస్థంభమునందు జనించెను. ఆతని తరువాత శాఖుడు, విశాఖుడు, నైగమేయుడును పుట్టిరి. కృత్తిక నుండి కార్తికేయుడును, యతియైన సనత్కుమారుడును పుట్టిరి.

వేలకొలది శిల్పములను చేయువాడును, దేవతల వడ్రంగియు, కాంతిమంతుడును అగు విశ్వకర్మ అను దేవలుడు ప్రత్యూషుని నుండి జనించెను. మనుష్యులు భూషణాది శిల్పములను జీవనాధారముగా చేసికొనుచుందురు.

సురభి తపస్సుచే పవిత్రీకృతురాలై, మహాదేవుని ప్రసాదముచే ఏకాదశ రుద్రులను కనెను. మేక పాదము వంటి ఒక పాదముగల అహిర్బుధ్న్యుడు, త్వష్టయను రుద్రుడు, బహురూపుడు, హరుడు, పరాజితుడుకాని త్ర్యంబకుడు, వృషాకపియు, కపర్ద (జటా) ధారియగు శంభువు, రైవతుడు, మృగవ్యాధుడు, సర్పుడు, పదకొండవవాడైన కపాలియు, చరాచర జగత్తును వ్యాపించిన కోట్లకొలది రుద్రులు జన్మించిరి. శ్రీమంతుడును, మహా యశఃశాలియు అగు విశ్వరూపుడు త్వష్ట కుమారుడు. (18)

కశ్యప వంశ వర్ణనము

ఓ మునీశ్వరుడా! ఇపుడు కశ్యపునకు ఆదిత్యాదుల యందు పుట్టిన సంతానమును గూర్చి చెప్పెదను. చాక్షుష మన్వంతరమునందు తుషిత దేవతలుగా ఉన్నవారే మరల వైవస్వత మన్వంతరము నందు–విష్ణువు, శక్రుడు, త్వష్ట, ధాత, ఆర్యముడు, పూష, వివస్వంతుడు, సవిత, మిత్రుడు, వరుణుడు, భగుడు, అంశువు అను ద్వాదశ ఆదిత్యులుగా అదితియందు కశ్యపునకు జనించిరి. అరిష్టనేమి భార్యలకు పదునారుగురు పుత్రులు జనించిరి.

విద్వాంసుడైన బహుపుత్రునకు నలుగురు విద్యుత్తులు (ఒక దేవయోనులు) కుమార్తెలుగా పుట్టిరి. కృశాశ్వుని శ్రేష్ఠమైన సుర ఆయుధములు ప్రత్యంగిరసుని వలన జనించినవి. ప్రతియుగము నందును, సూర్యుని ఉదయాస్తమయములవలె, వీరి ఉదయాస్తమన ములు (పుట్టుక, తిరోధానము) జరుగుచుండును.

దితికి కశ్యపుని వలన హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు అను కుమారులును, విప్రచిత్తి భార్యయైన సంహిక అను కుమార్తెయు జనించిరి. ఆమెకు రాహువు మొదలగు పుత్రులు పుట్టి సైంహికేయులని ప్రసిద్ధి పొందిరి.

హిరణ్యకశిపునకు ప్రసిద్ధమైన తేజస్సుగల అనుహ్రాదుడు, హ్రాదుడు, గొప్ప విష్ణుభక్తుడైన ప్రహ్లాదుడు, సంహ్రాదుడు అను నలుగురు పుత్రులు జనించిరి. హ్రాదుని పుత్రుడు హ్రదుడు,

ఆయుష్మంతుడు, శిబి, బాష్కలుడు అనువారు సంహ్రాదుని కుమారులు. ప్రహ్లాదుని కుమారుడు విరోచనుడు. విరోచనునకు బలి అను పుత్రుడు కలిగెను. బలికి నూర్గురు కుమారులు జనించిరి. వారిలో బాణుడు జ్యేష్ఠుడు.

పూర్వ కల్పమునందు బాణుడు ఉమాపతిని అనుగ్రహింపచేసికొని ఆతని నుండి ఆతని సమీపముననే విహరించుట అను వరమును పొందెను.

స్వర్భానువునకు సుప్రభ అను కన్యయు, పులోమునకు శచియు జనించిరి. ఉపదనువు కుమార్తె హయశిరస్సు, వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠ, పులోమకాలక అను ఇరువురును వైశ్వానరుని కుమార్తెలు. వారిద్దరును కశ్యపుని భార్యలు. వారికి కోట్ల కొలది పుత్రులు జనించిరి.

ప్రహ్రాదుని కులమునందు నాలుగు కోట్ల నివాతకవచులు పుట్టిరి. కశ్యపుని భార్యయైన తామ్రకు ఆరుగురు కుమారులును; కాకి, శ్యేని, భాసి, గృధ్రిక, శుచిగ్రీవ అను భార్యలకు కాకులు మొదలగునవి జనించినవి. తామ్రవలననే అశ్వములును, ఒంటెలును జనించినవి. వినతవలన అరుణుడును, ఆగరుడును పుట్టిరి. సురసనుండి వేయి సర్పములు పుట్టినవి. శేషుడు, వాసుకి, తక్షకుడు మొదలైన వేయిమంది కద్రువకు పుత్రులు. వీరందరును కోరలు కలిగినవారు. చాలకోపము కలవారు. భూమిపై నివసించువారు. జలములో వీరు రెక్కలు కలిగియుందురు. సురభి (కామధేనువు నందు) గోవులు, మహిష్యాదులును పుట్టెను. ఇరనుండి తృణాదులు పుట్టెను. ఆ కశ్యపముని వలననే ఖసయను అప్సరసయందు యక్షులు, రాక్షసులును, అరిష్టయందు గంధర్వులును జనించిరి. ఈ విధముగ కశ్యపుని నుండి చరాచరజగత్తు జనించినది. వీరి పుత్రాదులు అసం ఖ్యాకులు, ఒకప్పుడు దేవతలు దానవులను జయించిరి. ఈ విధముగా పుత్రులు నశించగా దితి ఇంద్రుని సంహరింపగల కుమారుడు కావలెనని కోరుచు కశ్యపుని అనుగ్రహింపచేసికొని అట్టివానిని పొందెను.

ఆమె పాదప్రక్షాళనము చేసికొనకుండగనే నిద్రించెను. ఇంద్రుడు ఆ అవకాశమును చూచుకొని ఆమె గర్భమును ఛేదించెను. వారు (గర్భ ఖండములు) గొప్ప తేజస్సుగల వారును, ఇంద్రునికి సహాయము చేయువారును అగు నలుబది తొమ్మండుగురు మరుత్తులు అను దేవతలుగా అయిరి (నవి).

హరియు, బ్రహ్మయు, పృథువును రాజ్యాభిషిక్తుని చేసి దీని నంతను ఆతనికి ఇచ్చిరి. ప్రభువైన హరి క్రమముగ ఇతరులకు ఆయా రాజ్యాధికారములను ఇచ్చెను.

బ్రాహ్మణులకును, ఓషధులకును చంద్రుడు రాజు. జలములకు వరుణుడు, రాజులకు వైశ్రవణుడు, సూర్యులకు విష్ణువు, వసువులకు అగ్ని, మరుత్తులకు ఇంద్రుడు, ప్రజాపతులకు దక్షుడు, దానవులకు ప్రహ్లాదుడు, పితృదేవతలకు యముడు, భూతాదులకు శివుడు, శైలములకు హిమవంతుడు, నదులకు సముద్రుడు, గంధర్వులకు చిత్రరథుడు, నాగులకు వాసుకి, సర్పములకు తక్షకుడు, పక్షులకు గరుత్మంతుడు, గజేంద్రములకు ఐరావతము, గోవులకు వృషభము, మృగములకు పులి, వనస్పతులకు ప్లక్షము, అశ్వములకు ఉచ్చైః శ్రవము ప్రభువులు. తూర్పున సుధన్వ, దక్షిణమున శంఖపదుడు, పశ్చిమమున కేతుమంతుడు, ఉత్తరమున హిరణ్య రోమకుడును పాలకులు. ఈ విధముగ అవాంతర సృష్టి (ప్రతి సర్గము) చెప్పబడినది. (19)

జగత్సర్గ వర్ణనము

మొదటిది మహత్తు యొక్క సృష్టి. అది బ్రహ్మ యొక్క సృష్టిగా తెలియదగినది. తన్మాత్రల సృష్టి రెండవది. అది భూతసర్గము (సృష్టి) అని చెప్పబడును. మూడవ సృష్టి వైకారికము. అదియే ఐంద్రియిక సృష్టి అని చెప్పబడుచున్నది. ఈ విధముగా బుద్ధి (మహత్తత్త్వము)తో ప్రారంభించిన సృష్టి ప్రాకృత సృష్టి. నాల్గవది ముఖ్య సర్గము. స్థావరములు ముఖ్యములని చెప్పబడుచున్నవి. తిర్యక్స్రోతస్సు అని చెప్పబడిన సృష్టికి "తైర్యగ్యోన్యము" (తిర్యగ్జంతువుల సృష్టి) అని పేరు. ఊర్ధ్వ స్రోతస్సుల సృష్టి ఆరవది అదియే దేవసర్గము. పిమ్మట అర్వా క్స్రోతసుల సృష్టి. అది ఏడవదైన మానుష సర్గము. ఎనిమిదవ సర్గము అనుగ్రహకరము. సాత్త్వికము, తామసము అని అది రెండు విధములు. ఈ చివరి ఐదును వైకృత సర్గములు. మొదటి మూడును కృతసర్గములు. ప్రాకృత సర్గములు మూడును, వైకృత సర్గములు ఐదును, తొమ్మిదవ దైన కౌమార సర్గము, బ్రహ్మ చేసిన తొమ్మిది సర్గములును జగత్తు యొక్క మూల కారణములు.

సృష్టి నిత్యము, నైమిత్తికము ప్రాకృతము అని రెండు విధములైనదిగా కొందరిచే చెప్పబడినది. అవాంతర ప్రళయముచే నిత్యము జరుగునది నిత్య సర్గము, అది దైనందిన సర్గము. ప్రతి దినము నందును జరుగు సర్గము గాన ఇది నిత్యము.

భృగువు మొదలైనవారు ఖ్యాతి మొదలగు దక్షకన్యలను వివాహమాడిరి. ఖ్యాతి భృగువువలన ధార, విధాత అను దేవతలను లక్ష్మిని కనెను. విష్ణుపత్నియైన ఈ లక్ష్మిని ఇంద్రుడు వృద్ధికొరకై స్తుతించెను. ధాతకు ప్రాణుడు, విధాతకు మృకండుడు అను పుత్రులు జనించిరి. మృకండునకు మార్కండేయుడును, ఆతనికి వేదశిరస్సు జనించిరి.

అంగిరసుని వలన స్మృతియందు సినీవాలి, కుహ, రాక, అనుమతి అను కుమార్తెలు పుట్టిరి. అనసూయ అత్రి వలన సోముని, దుర్వాసుని, యోగియైన దత్తాత్రేయుని కనెను.

పులస్త్యుని భార్యయైన ప్రీతికి దత్తోలియను కుమారుడు పుట్టెను. క్షమకు పులహుని వలన సమిష్ణువు, క్రముడు, పాదికుడు అను పుత్రులు జనించిరి.

క్రతువునకు సన్నతి యందు గొప్ప తేజస్సు గలవారును, బొటనవేలు కణుపు ప్రమాణము కలవారును అగు అరవై వేలమంది వాలఖిల్యులు పుట్టిరి.

వసిష్ఠుని వలన ఉర్జయందు రాజు, గాతుడు, ఊర్ధ్వబాహుడు, సవనుడు, అలఘుడు, శుక్రుడు, సుతపుడు అను ఏడుగురు ఋషులు జనించిరి. స్వాహా–అగ్నులకు పావకుడు, పవమానుడు, శుచి అను కుమారులు పుట్టిరి. అజుని నుండి అగ్నిష్వాత్తుడు, బర్హిషత్, అనగ్ని, సాగ్ని అనుకుమారులు జనించిరి.

పితృ దేవతలకు స్వధయందు మేన, వైధారిణి అను కుమార్తెలు పుట్టిరి. అధర్ముని భార్య హింస, వారిరువురికిని అనృతము పుట్టెను.

అధర్మ, హింసలకు నికృతి అను కన్యయు పుట్టినది. ఈ అనృతము నికృతియు మిథునమయ్యెను. వారివలన భయము, నరకము పుట్టెను. వారికి వరసగా మాయయు, వేదనయు భార్యలైరి. వారిలో మాయ భూతములను నశింపచేయు మృత్యువును కనెను. వేదన నరకమువలన దుఃఖమనే కుమారుని కనెను. మృత్యువునకు వ్యాధి, జర, శోకము, తృష్ణ, క్రోధము సంతానముగా జనించిరి. బ్రహ్మదేవుని నుంచి రోదించుచు (ఏడ్చుచు) పుట్టుటచే రుద్రుడను పేరుగల కుమారుడు పుట్టెను. ఆతనికే పితా మహుడు– భవుడు, శర్వుడు, ఈశానుడు, పశుపతి, భీముడు, ఉగ్రుడు, మహాదేవుడు అను పేర్లు పెట్టెను.

ఆతని భార్యయైన సతీదేవి దక్షునిపై కోపముచే దేహమును విడచి, హిమవంతుని కుమార్తెగా జనించి మరల ఆతని (రుద్రుని) భార్య ఆయెను.

స్వాయంభువాదులు నారదాదులచే ఋషులకు చెప్పబడినవియు, భుక్తి ముక్తి ప్రదములును అగు విష్ణ్వాదులకు చేయదగిన స్నానాది పూజలనుచేసి చరితార్థులైరి.(20)

సామాన్య దేవపూజా విధానము

నారదుడు ఇట్లు చెప్పెను. ఇప్పుడు విష్ణువు మొదలగు దేవతల సామాన్య పూజను, సర్వ ఫలములను ఇచ్చు మంత్రములను గూర్చి చెప్పెదను. సకల పరివార సమేతుడైన అచ్యుతునికి నమస్కరించి పూజించవలెను.

విష్ణు పూజాంగముగ ద్వారదక్షిణ భాగమున ధాతను, విధాతను, వామభాగమున గంగను, యమునను రెండు నిధులను, ద్వారలక్ష్మిని, వాస్తు పురుషుని, శక్తిని, కూర్మమును, అనంతుని, పృథివిని, ధర్మమును జ్ఞానమును, వైరాగ్యమును, ఐశ్వర్యమును, అధర్మా దులను, పద్మభావన చేసి దాని కందమును, నాళమును, పద్మకేసరములను పద్మవర్ణిక (మధ్య భాగము)ను, ఋగ్వే దాదులను, కృతయుగాదులను, సత్త్వాది గుణములను, సూర్యాది మండలములను పూజించవలెను. విమల, ఉత్కర్షిణీ, జ్ఞాన, క్రియా, యోగాది శక్తులను పూజించవలెను ప్రహ్వీ, సత్య, ఈశ, అనుగ్రహి, అమలమూర్తి అగు దుర్గ, గీర్దేవి, గణము, గణాధిపతి క్షేత్రము, క్షేత్రపాలుడు, వాసుదేవాదులు వీరిని కూడ పూజింపవలెను. హృదయమును శిరస్సును, కేశశిఖను, కవచమును, అస్త్రమును, శంఖమును, చక్రమును గదను, పద్మమును, శ్రీవత్సమును, కౌస్తుభమును, వనమాలను, లక్ష్మిని, పుష్టిని, గరుత్మంతుని, గురువును, ఇంద్రుని, అగ్నిని, యముని, రాక్షసుని, జలమును, వాయువును, కుబేరుని, ఈశ్వరుని, బ్రహ్మను, అస్త్రమును, వాహనమును, కుముదాదులను, విష్వక్సేనుని పూజిం పవలెను. పూజ మండలాదులలో ఈ విధముగా చేసినచో సిద్ధి లభించును.

ఇపుడు సామాన్య శివపూజ చెప్పబడుచున్నది. ప్రారంభమున నందిని పూజించవలెను. మహా కాలుని, గంగను, యమునను, గణాదులను, గీర్దేవిని, లక్ష్మిని, గురువును, వాస్తుపురుషుని, ఆధార శక్త్యాదులను, ధర్మాదులను పూజించవలెను.

వామ, జ్యేష్ఠ, రౌద్రి, కాలి, కలవికరిణి, బలవికరిణి, బలప్రమథని, సర్వభూత దమని, మనోన్మని అను తొమ్మండుగురు శక్తులను పూజింపవలెను.

"హాం, హూం, హాం శివమూర్తయే నమః" అను మంత్రముతో ఆయా అవయవములను, ముఖములను పూజించుచు శివుని పూజించవలెను. "హౌం శివాయ హౌం" అని శివుని, 'హాం' అను బీజాక్షరముతో గణమును (గణాధిపతిని) పూజింపవలెను. ఇంద్రుడు మొదలగువారిని, చండుని, హృదయము మొదలగు వాటిని క్రమముగ పూజించవలెను. ఇపుడు సూర్యార్చన మంత్ర ములు చెప్పబడుచున్నవి. ముందుగా దండిని పిదప పింగళుని పూజించవలెను. ఉచ్చైఃశ్రవస్సును, అరుణుని పూజించి ప్రభూతుని, విమలుని, సోముని, సంధ్యలను, వరసుఖుని, స్కందాదులను మధ్యయందు పూజింపవలెను.

దీప్తా, సూక్ష్మా, జయా, భద్రా, విభూతి, విమలా, అమోఘా విద్యుతా, సర్వతోముఖీ అను నవ శక్తులను పూజింపవలెను. "హం" "ఖం" "ఖం" అను బీజాక్షరములచే ఆర్కాసనమును "సోత్కా యనమః అని మూర్తిని "హాం హ్రీం సః సూర్యాయ నమః" అని సూర్యుని, "ఆం నమోహృదయాయ" అని హృదయమును పూజింపవలెను.

"ఓం అర్కాయ నమః అని శిరస్సును పూజించవలెను. అట్లే అగ్ని, ఈశ, అసుర, వాయువులను అధిష్టించియున్న సూర్యుని పూజింపవలెను."భూః" భువః స్వః జ్వాలిన్యై శిఖాయైనమః అని శిఖయు "హుం" అని కవచమును "భాం" అని నేత్రములను, హః, అని అర్కాస్త్రమును పూజించవలెను.

రాజ్ఞి అను సూర్యశక్తిని, దాని నుండి క్రటితమగు ఛాయా దేవిని పూజించవలెను. పిమ్మట సోమ, అంగారక, బుధ, గురు, శుక్ర, శని, రాహు కేతువులను తేజశ్చండిని పూజింపవలెను.

పిమ్మట సంక్షేపముగ పూజ చెప్పబడుచున్నది. ఆసనము, మూర్తులు, మూలము, హృదయాదులు, పరిచారకులు వీరి పూజ చేయవలెను. విష్ణ్వాసనమును పూజించవలెను. విష్ణువు యొక్క మూర్తిని పూజింపవలెను. "రాం శ్రీం శ్రీం శ్రీధరాయ హరయే నమః" అని మంత్రము. "హ్రీం" అనునది సర్వమూర్తులకును సంబంధించిన త్రైలోక్య మోహన మంత్రము. "క్లీం" హృషీ హేశాయనమః" "హూం విష్ణవేనమః" అను మంత్రములు ఉచ్చరించవలెను. అన్ని దీర్ఘ సర్వములచే హృదయా దికమును పూజించవలెను. ఈ పంచమ పూజ యుద్ధాదులలో జయము నిచ్చును.

చక్ర, గదా, శంఖ, ముసల, ఖడ్గ, శార్ఙ్గ, పాశ, అంకుశ, శ్రీవత్స, కౌస్తుభ వనమాలలను పూజించవలెను. "శ్రీం" అను బీజాక్షరముతో శ్రీదేవిని, మహాలక్ష్మిని, తార్క్ష్యుని, గురువును, ఇంద్రాదులను పూజించవలెను.

సరస్వతీ పూజయందు ఆసనమును, మూర్తిని పూజించవలెను. "రౌం హ్రీం దేవ్యై సరస్వత్యై నమః" అని మంత్రము. హృదయాదులను పూజించవలెను. లక్ష్మి, మేధ, కుల, తుష్టి, ప్రష్టి, గౌరి, ప్రభావతి, దుర్గ, గణము, గురువు క్షేత్రపాలుడు – వీరి నందరిని పూజించవలెను.

"గం గణపతయే నమః" "హ్రీం గౌర్యై నమః", "శ్రీం శ్రియై నమః", "హ్రీం త్వరితాయై నమః", "ఏం క్లీం సౌం త్రిపురాయై నమః" అని మంత్రములు. వీటికి ప్రారంభమున ప్రణవమును చేర్చి పేరాలోని మొదటి అక్షరమునకు బిందువు చేర్చవలెను. లేదా పూజాజపములందు అన్ని మంత్రములను "ఓం" కారముతో ప్రారంభింపవలెను.

ఈ మంత్రములతో నువ్వులు, నెయ్యి, మొదలైనవి హోమము చేసినచో ధర్మార్థ కామమోక్షములు లభించును. పూజా మంత్రములను పఠించువాడు భోగములనన్నియు అనుభవించి స్వర్గమునకు వెళ్ళును. (21)

స్నాన విధి

యాగపూజాది క్రియలు చేయుటకు ముందు చేయదగిన స్నానమును గూర్చి చెప్పెదను. నృసింహ మంత్రము ఉచ్చరించుచు మృత్తికను గ్రహించి, దానిని రెండు భాగములు చేసి ఒకదానిచే మల స్నానము చేయవలెను. మునిగి ఆచమనముచేసి, నృసింహ మంత్రముచే న్యాసముచేసి, రక్ష చేసికొని పిమ్మట ప్రాణాయామ పూర్వకముగా విధి స్నానము చేయవలెను.

అష్టాక్షర మంత్రమును జపించుచు, శ్రీ మహావిష్ణువును హృదయములో ధ్యానించుచు అరచేతిలో మట్టిని మూడు భాగములుగా చేసి ఉంచుకొని తరువాత నృసింహ మంత్రము జపించుచు దిగ్బంధము చేయవలెను. వాసుదేవ మంత్రమును జపించుచు సంకల్పించి తీర్థమును స్పృశించవలెను. వేదాది మంత్రములచే గాత్రమును తుడిచికొని మూర్తిలో నున్న దేవుని ఆరాధించి, స్మరించుచు, వస్త్రము ధరించి అఘమర్షణము చేయవలెను. (అఘమర్షణ మంత్రములను పఠించవలెను). మంత్రములచే విన్యాసము చేసి, చేతిలోనున్న జలము నిర్మార్జనము చేసి, నారాయణ మంత్రముతో ప్రాణాయామము చేసి, జలమును వాసనచూచి విడిచిపెట్టవలెను. హరిని ధ్యానించుచు అర్ఘ్యమునిచ్చి, ద్వాదశాక్షరిని జపించి, యోగపీఠము మొదట క్రమముగ ఇతర దేవతలకు కూడ తర్పణము చేయవలెను. మంత్రములకును దిక్పాలుర వరకు దేవతలకును, ఉపవిష్టుడై అంగన్యాసము చేసి, మంత్రోపసంహారము చేసి, యాగగృహమును ప్రవేశించవలెను. ఇతర పూజలలో ఇట్లే మూల మంత్రాదులచే స్నానము చేయవలెను. (22)

ఆదిమూర్త్యాది పూజా విధి

నారదుడు పలికెను : విప్రులారా! ఏపూజావిధిచే సర్వకార్య కామములును లభించునో దానిని చెప్పెదను. పాదప్రక్షాళనము చేసికొని ఆచమనము చేసి, మౌనము అవలంబించి, రక్ష చేసికొని, తూర్పుగా తిరిగి, స్వస్తిక ఆసనమునందు కాని, పద్మాసనమునందుగాని, మరొక ఆసనము నందు కాని కూర్చుండి, నాభి మధ్యలో ఉన్నదియు, ధూమ్రవర్ణము కలదియు, తీవ్ర వాయురూప మైనదియు అగు "యం" బీజమును ధ్యానించుచు శరీరము నుండి సకల కల్మషములను శోషింప చేయవలెను.

హృదయపద్మ మధ్యము నందున్న తేజో నిధియగు "క్షౌం" అను బీజమును స్మరించుచు, క్రిందికిని, పైకిని, అడ్డముగను ప్రసరించే జ్వాలలచే కల్మషమును దహించవలెను.

ఆకాశమునందు చంద్రుని ఆకారము వంటి ఆకారమును ధ్యానము చేయవలెను. దాని నుండి స్రవించుచున్నదియు, సుషుమ్నా నాడిద్వారా సమస్త నాడులందును వ్యాపించు చున్నదియు, హృదయ పద్మమును వ్యాపించుచున్నవియు అగు అమృత ధారలచేత తన దేహమును నింపవలెను.

శోధనము చేసి తత్త్వానాసనము చేయవలెను. పిమ్మట కరశుద్ధి కొరకు అస్త్ర వ్యాపక ముద్రలను చేయవలెను. కుడిచేతి అంగుష్ఠము నుండి కరతలము వరకు న్యాసము చేయవలెను. దేహమునందు పన్నెండు అక్షరముల మూలమంత్రముతో హృదయము, శిరస్సు, శిఖ, వర్మ, అస్త్రము, నేత్రములు, ఉదరము, శరీరము వెనుకభాగము, బాహువులు, ఊరువులు, మోకాళ్లు, పాదములు అను ద్వాదశాంగములపై న్యాసము చేయవలెను. ముద్రనిచ్చి విష్ణువును స్మరించి, అష్టోత్తర శత జపము చేసి పూజింపవలెను.

జల కుంభమును ఎడమ వైపునను, పూజా ద్రవ్యములను కుడి వైపునను ఉంచవలెను. అస్త్ర ముచే ప్రక్షాళనచేసి గంధ పుష్పాన్వితములైన అర్ఘ్యములను ఉంచవలెను. సర్వవ్యాప్తము, జ్యోతిః స్వరూపము అయిన చైతన్యములను "అస్త్రాయఫట్" అని అభి మంత్రించిన, ఉదరముచే యోగ బీజమునడిపి, హరిని ధ్యానించి, పూర్వాది యోగ పీఠమునందు ధర్మమును, వైరాగ్యమును, ఐశ్వర్యమును, ఆగ్నేయదిక్కు మొదలైన వాటిని, అధ ర్మము మొదలగు అంగములకు, పీఠమునందు కూర్మమును, అనంతుని, యముని, సూర్యాదుల మండలములను, విమల మొదలగు కేసర స్థానము నందున్న గ్రహణములను, కర్ణిక (ఈ పద్మము మధ్యనున్న దుద్దు యందున్న గ్రహణములను ముందు తన హృదయమునందు ధ్యానము చేసి పిమ్మట మండలముపై ఆవాహనము చేసి అర్చించ వలెను. వైష్ణవ విద్యానుసారముగా అర్ఘ్య, పాద్య, ఆచమన, మధుపర్క, స్నాన, వస్త్ర, యజ్ఞోపవీత, అలం కార, గంధ, పుష్ప, ధూప, దీప, నైవేద్యములను సమర్పింపవలెను. పూర్వాది దిక్కులందు అంగదేవతలను పూజించవలెను. తూర్పు-పడమర దిక్కులందు గరుత్మంతుని, కుడివైపున చక్రమును, గదను, ఎడమ వైపున శంఖమును, ధనస్సును ఉంచవలెను. దేవుని ఎడమవైపున అంబుల పొదులను, కుడివైపున ఖడ్గమును. ఎడమవైపున డాలును ఉంచవలెను. కుడివైపున అగ్రభాగమున పుష్టిని ఉంచవలెను.

వనమాలను, శ్రీవత్సమును, కౌస్తుభమును కూడ ఉంచవలెను. దిక్పాలకులను వెలుపల ఉంచవలెను. ఈ అంగదేవతలను అందరిని వారివారి మంత్రములచే పూజించవలెను. విష్ణుపూజ పూర్తియైన పిమ్మట అంగ దేవతలను వ్యస్త రూపముననను, సమస్త రూపముననను బీజాక్షర యుక్త మంత్రములతో పూజింపవలెను. జపించి, ప్రదక్షిణముచేసి, స్తుతించి, అర్ఘ్యమును సమర్పించి "నేనే బ్రహ్మను. నేనే హరిని"అని ధ్యానముచేసి హృదయ మునందు ఉంచుకొనవలెను. ఆవాహనము చేయునపుడు 'అగచ్ఛ' అనియు, ఉద్వాసనము చెప్పునపుడు 'క్షమస్వ' అనియు అనవలెను. ఈ విధముగా అష్టాక్షరాదులచే పూజచేసి ముక్తిని పొందును.

ఇంతవరకును ఏకమూర్త్యర్చనము చెప్పబడినది. ఇపుడు నవవ్యూహార్చనమును వినుము. అంగుష్ఠ ద్వయము నందును తర్జన్యాదులందును వాసుదేవుని, బలాదులను న్యాసము చేయవలెను. పిమ్మట శిరస్సు, లలాటము, ముఖము, హృదయము, నాభి, గుహ్యము, మోకాలు, పాదము వీటియందు న్యాసము చేసి మధ్యయందు పూర్వాది దిక్ పూజ చేయవలెను. ఏకపీఠముపై, క్రమముగ, నవవ్యూ హములను, నవ పీఠములను స్థాపించి వెనుకటివలెనే పూజించవలెను. నవాబ్జములందు నవ

మూర్తులను ఆవాహనము చేసి నవవ్యూహ పూజ వెనుకటివలెనే చేయవలెను. పద్మమధ్యమునందు వాటియందున్న దేవతలను, వాసుదేవుని పూజించవలెను. (23)

కుండ నిర్మాణ అగ్ని కార్యాది విధి

నారదు ఇట్లు పలికెను :

అన్ని కోరికలను తీర్చు అగ్ని కార్యమును చెప్పెదను. ఇరవైనాలుగు అంగుళముల చతురస్ర క్షేత్రమును సూత్రముతో కొలచి అంతటను సమముగా త్రవ్వవలెను. ఆ విధముగా త్రవ్వినదానికి రెండంగుళములు విడచి, మేఖలలు (ఒడ్డాణమువంటి కట్లు) చేయవలెను. సత్త్వము మొదలగు పేర్లుగల ఆ మేఖలలు పూర్వాభిముఖములుగాను, పండ్రెండు అంగుళములు ఎత్తు కలవిగ ఉండ వలెను. ఒకటి ఎనిమిది అంగుళముల విస్తారము కలది, రెండవది రెండు అంగుళముల విస్తారము కలది, మూడవది నాలుగు అంగుళముల విస్తారము కలది అయి ఉండవలెను.

పది అంగుళముల రమ్యమైన యోని ముందువైపు వరుసగా ఆరు, నాలుగు, రెండు అంగు ళములు ఎత్తు ఉండవలెను. పడమట నున్న దానిని క్రమముగా లోతుగా నుండునట్లు చేయవలెను. రావి ఆకు ఆకారములో ఉన్న దానిని కొద్దిగా కుండములోనికి చేర్చి నిర్మింపవలెను. దాని నాళము నాలుగు, ఐదు, పది అంగుళాల పొడవు ఉండవలెను. ఆ యోని యొక్క మూలము మూడు అంగుళములు, దాని అగ్రము ఆరు అంగుళములు ఉండవలెను. ఏకహస్తకుండ లక్షణము ద్విహస్త కుండాదుల విషయమున రెట్టింపు అగుచుండును.

ఒక మేఖల, మూడు మేఖలలు గల వర్తులాది కుండములను గూర్చి చెప్పెదను. కుండము యొక్క అర్ధమునందు సూత్రమును ఉంచగా కోణమునందు మిగిలిన ఆ సూత్రము లోని అర్ధమును దిక్కునందుంచి త్రిప్పినచో అది వర్తులమగును.

కుండార్ధమును మించిన కోణభాగార్ధమును బయట ఉత్తరభాగమున పెంచి పూర్వ పశ్చిమముల వైపు బైటకు చాపి మధ్యము నందు ఉంచి సూత్రము త్రిప్పినచో అర్ధచంద్రాకారమైన శుభకరమైన కుండము ఏర్పడును. పద్మాకారమైన వర్తుల కుండము నందు మేఖలయందు దళములు ఉండును.

హోమము చేయుటకై చేయి ప్రమాణము లేదా పండ్రెండు అంగుళముల ప్రమాణముగల సృక్కును చేయించవలెను. దాని మూలభాగము చతురస్రముగా ఏడు లేదా ఐదు అంగుళములు ఉండవలెను. దాని మధ్యయందు త్రిభాగమున అందమైన, వర్తులాకారమైన గర్తము (గొయ్యి) ఉండవలెను. అడ్డముగా, పైభాగమున సమముగా ఆ గర్తము నిర్మించి పైన అర్ధాంగుళ భాగమును శోధించవలెను. (చెక్కి నున్నగా చేయవలెను). నాల్గవవంతు అంగుళమును, మిగిలిన అర్ధములో అర్ధమును కూడ శోధించవలెను. మిగిలిన అర్ధముచే గర్తమునకు రమ్యమైన మేఖలను ఏర్పరుప వలెను. త్రిభాగవిస్తారము కలదియు, అంగుష్ఠమంత ఆయతమైనదియు అగు కంఠమును చేయ వలెను. దాని అగ్రమునందు నాలుగు లేదా ఐదు అంగుళముల ప్రమాణముగల ముఖము ఉండవలెను. దాని మధ్యము ఆరు అంగుళముల ప్రమాణము ఉండవలెను. దాని ఆయమము

కూడ అంతయేఉండి మధ్యమున పల్లమై అందముగా ఉండవలెను. దాని కంఠ దేశమునందు చిటికెన వ్రేలు ప్రవేశించునంత రంధ్రము ఉండవలెను. మిగిలిన కుండము (స్రుక్కు / ముఖము) అభిరుచిని అనుసరించి విచిత్రముగ చేయవలెను.

స్రువము దండముతో సహా చేయి పొడవు ఉండవలెను. కొంచెము పంకమునందు ఆవు పాదము దిగినలోతు ఎట్లుండునో ఆ విధముగా అందమైన, రెండు అంగుళముల వృత్తము చేయవలెను.

అగ్ని కుండమును అలికి, అంగుళము ప్రమాణము గల వజ్రనాసికా లేఖను గీయవలెను. అది ఉత్తరాగ్రమగు మొదటి రేఖ. దానిపై పూర్వాభిముఖములైన రెండు రేఖలు గీయవలెను. వాటి మధ్య దక్షిణాదిక్రమమున మూడు రేఖలు గీయవలెను.

మంత్రవేత్త ఈ విధముగా రేఖలు గీసి, ప్రణవ ముచ్చరించుచు, నీళ్ళు చల్లి, ఓం కారమును ఉచ్చరించుచు పీఠమును కల్పించి దానిపై మూర్తిమతియగు వైష్ణవీ శక్తిని అలంకరించి, విష్ణువును స్మరించుచు అగ్నిని ఉంచవలెను.

జానెడు పొడవుగల సమిధల నుంచి ఆ అగ్నిని ప్రజ్వలింపచేసి పూర్వాది దిక్కులందు దర్భలు మూడు విధములుగా(చుట్టూ) పరచి, వాటిపై పాత్రను, ఇధ్మమును వహ్నిని సమీపమున నుండునట్లు చేసి స్రుక్కును, స్రువమును భూమిపై ఉంచవలెను.

ఆజ్యస్థాలిని, చరుస్థాలిని, కుశాజ్యమును ప్రణీతచే ప్రోక్షించి, ప్రోక్షణిని గ్రహించి దానిని నీటితోనింపి, ఆ నీటిని పవిత్రముచే కప్పబడిన హస్తమునందు జారవిడచి, ప్రోక్షణీ పాత్రమును తూర్పుగా తీసికొని వెళ్ళి, దానిని అగ్నికి ఎదురుగా ఉంచి, దానిని ఉదకముచే మూడు సార్లు ప్రోక్షించి, ఎదుట నుంచి, ఉత్తరమున పుష్పములతో కూడిన ప్రణీతపై విష్ణువును ధ్యానించి ఆజ్యపాత్రను ఆజ్యముతో నింపి ఎదుట ఉంచి, తెగని చిగుళ్లుగల, గర్భములేని జానెడు పొడవైన రెండు కుశములను వెల్లకితల చేయబడిన హస్తములచే బొటన వ్రేలితోను అనామికతోను పట్టుకొని, వాటిని నేతిలో ఇటునటు త్రిప్పి నేతిని సంస్కరించవలెను.

వాటి ఆజ్యమును సంగ్రహించి, రెండు పర్యాయములు తీసి, మూడు పర్యాయ ములు క్రిందికి చిమ్మవలెను. వాటితో స్రుక్స్రువములను గ్రహించి, నీటిచే తడిపి, వెచ్చచేసి, దర్భలచేత తుడిచి, మరల కడిగి, వెచ్చచేసి, ఓంకారము నుచ్చరించుచు వాటిని క్రింద ఉంచి, సాధకుడు, పిమ్మట ఓంకారము ఉచ్చరించుచు, చివర "నమః" అని అనుచు పిమ్మట హోమము చేయవలెను.

గర్భాధానాది కర్మలను ఆ యా అంశముల వ్యవస్థ చక్కగా పాటించుచు, అంగములను అనుసరించి, నామాంతముగాగాని, సమావర్తాంతముగాని, అధికారాంతముగాని చేయవలెను. సాధకుడు అన్నింటను ఓంకారముతో ఉపచారము చేయవలెను. ధనలోభము చేయకుండగా అంగ హోమములు చేయవలెను. గర్భాధానము, పుంసవనము, సీమన్తోన్నయనము, జాతకర్మ నామ కరణము, అన్నప్రాశనము, చౌలము, వ్రతబంధము (ఉప నయనము), సమస్తమైన వేదవ్రతాలు (నాలుగు), స్నాతకము, వివాహము, అధికారకము అను సంస్కారములను వరుసగా చేయవలెను.

ప్రతికర్మ యందును హృదయాది క్రమముచే ధ్యానించి, ఒక్కొక్క కర్మను పూజించి, మరల ఎనిమిదేసి ఆహుతులను హోమము చేయవలెను. సాధకుడు వౌషట్ చివరగల మంత్రమును చక్కగా ప్లుతస్వరముతో ఉచ్చరించుచు స్రుక్కు మొదటి భాగముతో పూర్ణాహుతి ఇవ్వవలెను.

విష్ణువునకై వహ్నిని సంస్కరించి వైష్ణవమైన చరువును అర్పించవలెను. స్థండిలము మీద విష్ణువును పూజించి, మంత్రములను స్మరించుచు ఆశ్రయించవలెను. ఉత్తమమైన సాంగావరణమును ఆసనాది క్రమముచే గంధ పుష్పములతో పూజించి, దేవతాశ్రేష్ఠుడైన ఆ విష్ణువును ధ్యానించి, సమిధను ఉంచి, పిమ్మట ఆగ్నేయ ఈశాన్య దిక్కులందు ఆజ్యా ఘారములను, వాయవ్య నైరృతి దిక్కులందు ఆజ్య భాగములను క్రమానుసారముగా సమర్పించి, పిమ్మట దక్షిణోత్తర చక్షుర్హోమములు చేసి, పిమ్మట అర్చాక్రమానుసారముగా మధ్యయందు, సర్వ మంత్రములతోడను హోమము చేయవలెను. ఆజ్యముచేత మూర్తిని తృప్తి పరచవలెను. పదవ అంశము అంగహోమము చేయవలెను. ఆజ్యము మొదలైన వాటితో లేదా తిలలతో గూడిన సమిధలతో నూరు లేదా వేయి హోమములు చేయవలెను. హోమము అంతమునందుగల పూజను సమాప్తి చేసి ఉపవాసమున్న పవిత్రులైన శిష్యులను పిలిచి, తన ఎదుట ఉంచుకొని, ఆ పశువులను అస్త్రమంత్రముచే ప్రోక్షించవలెను.

శిష్యులను విద్యాకర్మ నిబంధనములచే తనలో కలుపుకొని, లింగ శరీరమును అనుసరించి ఉన్నదియు, లింగశరీరముతో కూడా పాలింపబడినదియు అగు చైతన్యమును ధ్యానమార్గమున సంప్రోక్షించి, వాయు బీజముచే శుష్కింప చేయవలెను. పిమ్మట బ్రహ్మాండమను పేరుగల ఈసృష్టి అంతయు అగ్ని బీజముచే కాల్చివేయబడి భస్మరాశివలె ఉన్నట్లుగా ధ్యానము చేయవలెను. ఆ భస్మము నీటితో ముంచెత్తవలెను. ప్రపంచమంతయు జలమయముగా ఉన్నట్లు స్మరించవలెను. పిమ్మట దానియందు పృథివీవికారమైనదియు, బీజమను పేరు గలదియు అగు శక్తిని ఉంచవలెను. సమస్తమైన తన్మాత్రలచే ఏర్పడినది, పృథివీ వికారము, శుభమైనదియు, అఖండము, దాని (శక్తి) నుండి పుట్టినది. తత్త్వ రూపమును అగు దాని ఆధారమును ధ్యానించవలెను. దాని మధ్యమందు ప్రణవరూపమైన పురుష మూర్తిని ధ్యానించవలెను. పిమ్మట, పూర్వము సంస్కరింపబడిన, తనలో నున్న లింగశరీరమును దానిమీదికి సంక్రమింప చేయవలెను. అది క్రమముగా విభక్తమైన ఇంద్రియ ములు, అవయవ స్థితికలదై వృద్ధిపొందినట్లు చింతించవలెను.

పిమ్మట అండము ఒక సంవత్సరముపాటు ఉండి బ్రద్దలైనట్లును అ ముక్కలు ద్యులోక పృథివీలోకములైనట్లును, వాటి మధ్య ప్రజాపతి జనించినట్లును ధ్యానించవలెను. మరల చూచి, ఆ శిశువును ప్రణవముచే, పూర్వము చెప్పినట్లుగా న్యాసములుచేసి మంత్రా త్మకమగు శరీరము కలవానిగా చేయవలెను. పిమ్మట శిరస్సుపై విష్ణు హస్తమునుంచి, వైష్ణవ మంత్రమును ధ్యానించ వలెను. ఈ విధముగా ధ్యాన యోగముతో ఒకటిగాని, అనేకము గాని జపించి, హస్తములను మొదళ్ళ యందు పట్టుకొని, మాంత్రికుడు నేత్ర మంత్రము చదువుచు అంచుతో (జాలుతో)కూడిన చినగ కుండా ఉన్న వస్త్రముచే ఆ శిష్యుల నేత్రములు బంధించవలెను. తత్త్వము నెరిగిన గురువు బాగుగా దేవదేవుని పూజించి, దోసిళ్లలో పుష్పములు ధరించియున్న ఆ శిష్యులను పూర్వాభి

ముఖులుగా కూర్చుండబెట్టవలెను. ఆ శిష్యులుకూడ గుర్వనుజ్ఞ పొంది, అచట పుష్పాంజలిని చల్లి హరిని పూజింపవలెను. పిమ్మట పుష్పాదులతో వాసుదేవార్చనముచేసి, తరువాత గురుపాదార్చనము చేసి సర్వ స్వమును గాని, దానిలో సగముగాని గురుదక్షిణగా ఇవ్వవలెను. గురువు శిష్యులకు బోధించవలెను. వారు నామములతో హరిని పూజించవలెను. శంఖచక్ర గదాధారియై, తర్జనితో జళిపించుచున్న ప్రభువైన విష్వక్సేనుని పూజించి మండలము నందున్న హరికి ఉద్వాసన చెప్పవలెను. విష్ణు నిర్మాల్యము నంతను విష్వక్సేనునకు సమర్పింపవలెను.

ప్రణీతలతో తనపై జలము చల్లుకొని, కుండములో ఉన్న అగ్నిని తనలో చేర్చికొని విష్వక్సేనుని విసర్జన చేయవలెను. ఈ విధముగ చేసినచో భోగములు అనుభవింప కోరిక గలవాడు సకల భోగములను పొందును. మోక్షేచ్ఛగలవాడు హరియందు లీనుడగును. (24)

వాసుదేవాది మంత్ర లక్షణము

నారదుడు పలికెను :

పూజ్యములైన వాసుదేవాది మంత్రముల లక్షణము చెప్పెదను. ఆదియందు "నమో భగవతే" అనుపదములో కలవి, అ, ఆ, అం, అః అను బీజాక్షరములతో కూడినవి ఓంకారము ఆది యందుకలవి, 'నమః' అనునది అంతమందు కలవి అయిన "వాసుదేవ" "సంకర్షణ" "ప్రద్యుమ్న" "అనిరుద్ధ" అను పదములచే "ఓం అ నమో భగవతే వాసుదేవాయ" "ఓం ఆ నమో భగవతే సంకర్షణాయ" "ఓం అం నమో భగవతే ప్రద్యు మ్నాయ" "ఓం అః నమో భగవతే అనిరుద్ధాయ" అను మంత్రములు ఏర్పడును. పిమ్మట "ఓం నమో నారాయణాయ" అను మంత్రము. "ఓం తత్సద్బ్రహ్మణే నమః" "ఓం నమో విష్ణవే నమః" "ఓం క్ష్రౌం ఓం నమో భగవతే నరసింహాయ నమః". "ఓం భూర్భగవతే వరాహాయ నమః" (ఇవి మంత్రములు). జపా పుష్పమువలె అరుణమైన రంగు పసుపువంటి రంగు నీల, శ్యామల, లోహిత వర్ణములు, మేఘ, అగ్ని, మధువుల వంటి రంగులు, పింగవర్ణము గల తొమ్మండుగురు నరాధిపులు వీటికి నాయకులు. తంత్రవేత్తలు విభజించిన విధముగ స్వర రూపములైన బీజాక్షరములకు ఆ యా మంత్రములందలి నామములను చివరచేర్చి హృదయాద్యంగములను కల్పించవలెను. వ్యంజనాది బీజాక్షరముల లక్షణము వేరుగా ఉండును.

"నమః" అనునది అంతమునందుగల మంత్రముల మధ్య దీర్ఘ స్వరములతో కూడి ఉన్న వ్యంజనములు అంగములనియు, హ్రస్వ స్వరములతో కూడినవి ఉపాంగములు అనియు చెప్పబడును. దీర్ఘ హ్రస్వములతో కూడినదియు, సాంగోపాంగ స్వరములతో కూడినదియు, విభజింపబడిన నామాక్షరముల అంతమునందు ఉన్నదియు అగు బీజా క్షరము ఉత్తమమైనది. హృదయాది కల్పనమునకు వ్యంజనముల క్రమమిది – తన నామము అంతము నందుగల అంగ నామములచే విభక్తములై స్వ బీజాక్షరముతో కూడిన, ఐదు మొదలు పండ్రెండు వరకును ఉన్న హృదయాదులను కల్పించి సిద్ధికి అనుగుణముగా ఉండునట్లు జపించవలెను. హృదయము, శిరస్సు, శిఖ, కవచము, నేత్రము, అస్త్రము అను ఈ ఆరును బీజముల అంగములు. హృదయము,

శిరస్సు, శిఖ, హస్తములు, నేత్రములు, ఉదరము, పృష్ఠభాగము, బాహువులు, ఊరువులు, మోకాళ్ళు, పిక్కలు, పాదములు ఈ పండ్రెండును మూలమునకు అంగములు. క్రమముగా వీటి అన్నింటిపై న్యాసము చేయవలెను.

"కం టం పం శం వైనతేయాయ నమః" "ఖం ఠం ఫం, షం గదానుజాయ నమః" "గం డం బం సం పుష్టి మన్త్రాయ నమః". "ఘం ఢం భం హం శ్రియై నమః" "వం శం మం క్షం పాఞ్చజన్యాయ నమః" "ఛం తం పం కౌస్తుభాయ నమః" "జం ఖం వం సుదర్శనాయ నమః" "సం వం దం చం లం శ్రీవత్సాయ నమః".

ఓం ధం వం వనమాలాయై నమః "మహానన్తాయ నమః" బీజరహితములైన పదములు గల మంత్రములకు పదములచేతనే అంగములను కల్పింపవలెను.

నామ సంయుక్తములును, జాత్యంతములును అగు పదములచే హృదయాది పంచకన్యాసమును చేయవలెను. ప్రణవము, పిమ్మట ఐదు హృదయాదులును చెప్పబడినవి. ముందుగా ప్రణవముచే హృదయమును, 'పరాయ' అని శిరస్సును, పేరుతో శిఖను, ఆత్మచేత కవచమును, నామాన్తముతో అస్త్రమును విన్యసించవలెను.

ఓంకారము ఆదియందుగల నామాత్మక పదమునకు చివర నమః చేర్చి నామాత్మక పదమును చతుర్థ్యంతము చేసి చెప్పవలెను. ఏక వ్యూహము మొదలు ఇరువదియారవ వ్యూహము వరకును ఇది సమానము. కనిష్ఠిక మొదలైన కరాగ్రములందు దేహముపై ప్రకృతిని అర్చించవలెను. పరమ పురుషాత్మయే పరుడు. ప్రకృత్యాత్మ ద్విరూపము. "ఓం పరాయాగ్న్యాత్మనే నమః" ఇది వ్యాపక మంత్రము. వసు, అర్క, అగ్నులు త్రివ్యూహాత్మక మూర్తులు. ఈ మూడింటిపై అగ్ని న్యాసముచేసి కరదేహములపై వ్యాపకమును విన్యసించి, అంగుళులయందును, సవ్యాపసవ్య హస్తములయందును, హృదయమునందును, మూర్తియందును, తుర్య రూపమగు త్రివ్యూహమైన తనువునందును వాయ్వ ర్కులను విన్యసించవలెను. వ్యాపకమైన ఋగ్వేదమును హస్తమునందును, అంగుళులపై యజుర్వేద మును, రెండు అరచేతులలో అధర్వమును శిరోహృదయ చరణములయందు సామ వేదమును పంచ వ్యూహమునందు ఆకాశమును విన్యసించి కరములందును, దేహమునందును అంగుళీ, శిరో, హృదయ, గుహ్య, పాదములందును వాయ్వాదికమును పూర్వము చెప్పినట్లు న్యసించవలెను.

వాయువు, అగ్ని, జలము, భూమి (ఆకాశము) వీటి సముదాయము పంచ వ్యూహము. మనస్సు, శ్రోత్రము, త్వక్కు, నేత్రము, జిహ్వా, ఘ్రాణము వీటి సముదాయము షడ్వ్యూ హము. వ్యాపకమైన మానసమును విన్యసించి పిమ్మట క్రమముగా అంగుష్ఠాదులందును, శిరస్సు, ముఖము, హృదయము, గుహ్య ప్రదేశము, పాదములు–వీటియందును న్యాసము చేయవలెను. ఇది "పరమా త్మక వ్యూహ న్యాసము". ఆది మూర్తి అగు జీవుడు సర్వవ్యా పకుడు. భూః, భువః, సువః, మహః, జనః, తపః, సత్యం అను ఈ ఏడింటిని ముందుగా కరమునందును, దేహము నందును అంగుష్ఠాది క్రమమున విన్యసించవలెను. ఏడవది తలములందు ఉండును. లోకేశుడైన దేవుడు దేహము నందు క్రమముగా శిరస్సు, లలాటము, ముఖము, హృదయము, గుహ్యము, పాదములు – వీటియందు ఉండును.

అగ్నిష్టోమము, ఉక్థము, షోడశి, వాజపేయము, అతిరాత్రము, ఆప్తోర్యామము అని యజ్ఞాత్మ సప్త రూపములు కలది. ధీ, అహంకారము, మనస్సు, శబ్దము, స్పర్శ, రూప, రసములు, గంధము, వ్యాపకమైన బుద్ధి వీటిని క్రమముగా కరమునందును, దేహమునందును విన్యసించవలెను. పాదములు, తలములు, శిరస్సు, లలాటము, ముఖము, హృదయము, నాభి, గుహ్య ప్రదేశము, పాదము వీటిపై విన్యసించవలెను. జీవుడు అష్టవ్యూహుడని చెప్పబడినాడు. జీవుడు, బుద్ధి, అహంకారము, మనస్సు, శబ్దము, గుణము, వాయువు, రూపము, రసము అని జీవుడు నవాత్మకుడు. అంగుష్ఠద్వయమునందు జీవుని, మిగిలిన వాటిని తర్జనిమొదలు వామప్రదేశిని వరకును విన్యసించవలెను. దేహముపై, శిరస్సు, లలాటము, ముఖము, హృదయము, నాభి, గుహ్యము, మోకాళ్ళు, పాదములు వీటిపై విన్యసించవలెను. దశాత్మకుడగు ఈ జీవుడు వ్యాపకుడుగా చెప్పబడుచున్నాడు. అంగుష్ఠద్వయమునందును, తర్జన్యాదులయందును, శిరో, లలాట, ముఖ, హృదయ, నాభి, గుహ్య, జాను, పాదములందును విన్యసించవలెను. మనః, శ్రోత్ర, చక్షుర్, జిహ్వా, ఘ్రాణ, వాక్, పాణి, పాద, పాయు, ఉపస్థ రూపమున ఏకాదశాత్మకుడగు ఈ జీవుని శ్రోత్రమునందును, అంగుష్ఠ ద్వయమునందును, తర్జని మొదలు ఎనిమిదింటియందును, మిగిలిన తలద్వయము నందును విన్యసించవలెను. మనస్సు వ్యాపకము. అట్లే దేహముపై క్రమముగా శిరో, లలాట, ముఖ, హృదయ, నాభి, గుహ్య, ఊరుద్వయ, జంఘా (పిక్కలు), గుల్ఫ (చీలమండలు), పాదములపై విన్యసించవలెను. విష్ణువు, మధుహరుడు, త్రివిక్రముడు, వామనుడు, శ్రీధరుడు, హృషీకేశుడు, పద్మనాభుడు, దామోదరుడు, కేశవుడు, నారాయణుడు, మాధవుడు, గోవిందుడు అని ద్వాదశాత్ముడు. వీటిలో విష్ణువును వ్యాపకునిగా విన్యసించి, మిగిలిన వారిని అంగుష్ఠాదులందును, తలాదులందును, పాదమునందును, జానువునందును, కటియందును, శిరస్సు, శిఖ, ఉరస్సు, కటి, ముఖము, జానువు, పాదము మొదలైనవాటి యందును విన్యసించవలెను. పంచవింశ వ్యూహములు కలవాడును, షడ్వింశ వ్యూహములు కలవాడును, ఎట్లనగా :

పురుష, ధీ, అహంకార, మనసు, చిత్త, శబ్ద, స్పర్శ, రస, రూప, గంధ, శ్రోత్ర, త్వక్, చక్షుర్, జిహ్వా, నాసికా, వాక్, పాణి, పాద, పాయు, ఉపస్థ, భూ, జల, తేజస్, వాయు, ఆకాశములు పంచవింశతి వ్యూహము. పురుషుని వ్యాపకునిగా విన్యసించి, పదింటిని అంగుష్ఠాదులందును, మిగిలిన వాటిని హస్త తలమునందును విన్యసించవలెను. పిమ్మట శిరస్సు, లలాటము, ముఖము, హృదయము, నాభి, గుహ్యము, ఊరువులు, జానువులు, పాదములు, దశేంద్రియములు, పాదములు, జానువులు, ఉపస్థ, హృదయము, శిరస్సు– వీటిపై క్రమముగా విన్యసించవలెను. షడ్వింశ వ్యూహము నందు పురుషాత్మకు ముందు పరరూపము ఉండును. మిగిలిన దంతయు వెనుక చెప్పినట్లే.

పండితుడు ఒక మండలముపై ప్రకృతిని ధ్యానించి పూజింపవలెను. పూర్వ, దక్షిణ, పశ్చిమ, ఉత్తర దిశలందు హృదయాదులను పూజింపవలెను. అగ్న్యాది కోణములందు అస్త్రమును, వైనతేయాదులను, దిక్పాలులను పూర్వమునందు వలెనే పూజింపవలెను. త్రి వ్యూహమునందు అగ్ని మధ్యమందు ఉండును. పూర్వాది దిక్కులందుదలములందు ఉన్న దేవతలతో కూడ రాజ్యాద్యలంకృతుడై కమల కర్ణికయందు నభోరూపుడగు, మానసాత్మ (అంతరాత్మ) ఉండును.

ఈ విధముగ సర్వ వ్యూహములతోను, గరుడాది పంచాంగముల తోను, ఇంద్రాదులతోను కూడిన విశ్వరూపుని లోకస్థితి నిమిత్తము, రాజ్యజయము కొరకును పూజింపవలెను. సమస్త కామములను పొందును. ఆకాశమునందు ఉన్న బీజమును స్మరించుచు విష్వక్సేనుని పేరుతో పూజించవలెను. (25)

ముద్రా లక్షణము

నారదుడు పలికెను :

దేవతాసాన్నిధ్యాదులను కలిగించు ముద్రల లక్షణమును చెప్పెదను. హృదయమునకు సమీపమున కట్టబడిన అంజలి మొదటి ముద్ర. రెండవది వందని. మూడవది హృదయానుగ. ఎడమచేతి పిడికిలిని బోటనవ్రేలు పైకి నిలచి ఉండునట్లును, (అంజలి) కుడిచేతి బోటన వ్రేలు వంచి బంధించినట్లును (వందని)ఉంచవలెను. అట్లే రెండు పిడికెళ్ళ అంగు ష్ఠములును పైకి నిలచి ఉంచవలెను (హృదయానుగ). ఈ మూడును వ్యూహమునందు సాధారణ ముద్రలు. వరుసగా కనిష్ఠిక మొదలైన వాటిని విడువగా ఏర్పడిన ఏనిమిది ముద్రలు అసాధారణములు.

ఈ ఎనిమిది ముద్రలను పూర్వము చెప్పిన బీజములు ఎనిమిదింటికిని క్రమముగా వినియోగించవలెను. కనిష్ఠిక వరకునున్న మూడు వ్రేళ్ళను అంగుష్ఠముచేతవంచి, పైకి ఉండునట్లును, సమ్ముఖముగాను చేసి నవమ బీజమునకు వినియోగించవలెను. వామ హస్తమును తిరగదీసి మెల్లగా పైకి వంచవలెను. అది వరాహముద్ర. అంగములకు వరుసగా ఈ చెప్పబోవు ఎనిమిది ముద్రలు ఉపయోగించవలెను. వామ ముష్టియందు ఒక్కొక్క వ్రేలిని ముడిచి చూపవలెను. పూర్వ ముద్రను వంచవలెను. దక్షిణ హస్తమునందు కూడ ఇట్లే చేయవలెను. వామ ముష్టియందలి అంగుష్ఠము నిలచి ఉండును. ఈ విధముగా చేసినచో ముద్రాసిద్ధి కలుగును. (26)

సర్వ విధి

నారదుడు పలికెను :

అన్ని ఫలములను ఇచ్చు దీక్షను చెప్పెదను. మండలమునందలి పద్మమునందు హరిని పూజించవలెను. దశమియందు సమస్తమైన యాగద్రవ్యములను సమకూర్చుకొని, అచట ఉంచి, 'ఫట్' అనునది అంతమునందుగల నారసింహ మంత్రముచేత, ఆవాలను నూరు పర్యాయములు అభిమంత్రించి, వాటిని నలుమూలల చల్లవలెను.

అచట సర్వాత్మికయు, ప్రాసాద రూపిణియు అగు శక్తిని నిలుపవలెను. సాధకుడు శుభమైన పాత్రయందు సమస్త ఓషధులను ఉంచి నూరు పర్యాయములు వాసుదేవ మంత్రముచే వికిరములను అభిమంత్రించవలెను. పంచగవ్యమును నారాయణాంతములైన ఐదు మూలమూర్తులచే సంపాదించుకొని, దానిచే ఆ భూమిని కుశాగ్రములతో సంప్రోక్షించి, వాసుదేవ మంత్రముచే చిమ్ముచు, వెల్లికిల ఉంచబడిన హస్తముతో మూడు పర్యాయములు విసిరివేయవలెను. తూర్పుగా తిరిగి విష్ణువును మనస్సులో ధ్యానించవలెను. వర్ధనితో కూడిన కుంభమునందు అంగసహితుడగు

విష్ణువును పూజింపవలెను. వర్ధనిని అస్త్రముచేతనే నూరు పర్యాయములు అభిమంత్రించి, భిన్నము కాని ధారతో తడుపుచు ఈశాన్యదిక్కు వరకును తీసికొని వెళ్ళవలెను. కలశమును వెనుకనుంచి తీసికొని వెళ్ళి వికిరములపై స్థాపించవలెను. వికిరములను దర్భలచేత పోగుచేసి కుంభేశుని కర్కరిని పూజించవలెను.

వస్త్రములతోడను పంచరత్నములతోడను కూడిన విష్ణువును స్థండిలముపై పూజించ వలెను. అగ్నియందు కూడ పూజించి, పూర్వమునందువలె మంత్రములను జపించి, పాత్రను కడిగి, మంచి సువాసన గల పద్మముచే లోపల తుడిచి, నేతితోను, గో క్షీరముతోను నింపి, వాసుదేవ మంత్రముతో దానివైపు చూచి, పిమ్మట సంకర్షణ మంత్రముతో, సంస్కృతమైన క్షీరములో నెయ్యి పూసిన తండుల ములను పోయవలెను. ప్రద్యుమ్న మంత్రముతో కలిపి గరిటచేత మెల్లగా ఎనపవలెను. ఉడికిన తరువాత, గురువు అనిరుద్ధ మంత్రముతో దింపవలెను. ఆ పాత్రను కడిగి, నారాయణ మంత్రముతో, భస్మము చేత పాత్రకు ఊర్ధ్వపుండ్రములు ఉంచవలెను. ఈ విధముగ ఆ చరువును చక్కగా సంస్కరించవలెను.

ఒక భాగము దేవునకు, రెండవ భాగము కలశమునకు సమర్పించి, మూడవ భాగ ముచే మూడు ఆహుతులు చేయవలెను. నాల్గవ భాగమును గురువు శిష్యులతో కూడ భుజించవలెను. క్షీరవృక్షము నుండి దంతకాష్ఠమును గ్రహించి, దానిని నారాయణ మంత్రముచే ఏడు సార్లు అభి మంత్రించి పవిత్రము చేసి, దానిని నమలి విడువవలెను. తన పాపము అంతయు ఈశాన్యాది అభిముఖముగా పడిపోయినట్లు భావనచేయవలెను. శుభమైన నరసింహ మంత్రముతో నూరుసార్లు హోమముచేసి, ఆచమనముచేసి, పూజా గృహము ప్రవేశించి, తూర్పున విష్ణువును స్థాపించి ప్రదక్షిణము చేయవలెను.

“భక్తవత్సలుడవైన ఓ దేవా! సంసార సముద్రమునందు మునిగియున్న పశువుల పాపములను తొలగించుటకు నీవు ఒక్కడవే శరణము. ఓ! దేవదేవా! ప్రాకృతములైన పాశబంధనములచే బద్ధులైన ఈ పశువులను, నీ అనుగ్రహము వలన విముక్తులను చేసెదను. అనుజ్ఞఇమ్ము” అని విష్ణువును ప్రార్థించవలెను.

విష్ణువునకు ఈవిధముగా విజ్ఞాపనచేసి, పిమ్మట పశువులను ప్రవేశించి, పూర్వము చెప్పినట్లు ధారణలచేతను, జ్వలనాదికముచేతను సంశోధనముచేసి, సంస్కరించి, మూర్తితో కలిపి, నేత్రములను బంధించి చూపవలెను. అచట పుష్పములతో నిండిన దోసిళ్ళను విసిరి, ఆపేర్లను చేర్చవలెను. అచట వెనుకటివలె క్రమముగా మంత్రరహితముగా అర్చన చేయవలెను. పుష్పము ఏ మూర్తిపై పడునో ఆ మూర్తి యొక్క పేరు అతనికి పెట్టవలెను. పాదాంగుష్ఠము మొదలు శిఖవరకు పొడవుగల ఆరు పేట్ల ఎట్టిటి దారమును కన్యచేత భేదింపచేసి, మరల దానిని మూడు పేటలుచేసి, దానిపై, ఏ ప్రకృతిలో విశ్వము లీనమగునో, దేనినుండి జనించునో అట్టి ప్రకృతిని వివిధ ప్రక్రియలతో భావన చేయవలెను. ఆ సూత్రముతో, ఎన్ని తత్త్వములున్నవో అన్ని ప్రాకృతిక పాశములను ముడివేసి, దానిని మూకుడులో అగ్నికుండ పార్శ్వమునందు ఉంచి, గురువు, ప్రకృతి మొదలు పృథివి వరకును ఉన్న ఆ తత్త్వములను సృష్టి క్రమానుసారము ధ్యానించుచు శిష్యుని శరీరముపై న్యాసము చేయవలెను.

వికృతుల క్రమము ప్రకారము నిఖిలమార్గమును పంచాంగములతో, తన్మాత్రాత్మకమగు మాయా సూత్రమైన పశువు శరీరము నందు ఉపసంహరించి, తత్త్వ చింతకులు అచట ఐదు, పది లేదా పంద్రెండు విధములచేత ఆ గ్రథితమైన సూత్రమును పర్వ భేదముచే ఇవ్వవలెను.

తన ఇచ్ఛననుసరించి, సూత్రమునందును, దేహమునందును – ప్రకృతి, లింగశక్తి కర్త, బుద్ధి, మనస్సు, తన్మాత్రలు, జ్ఞానేంద్రియము, కర్మేంద్రియములు, పంచభూతములు– వీటి అన్నింటిని, ద్వాదశాత్మను ధ్యానించవలెను. సృష్టి అనులోమవిలోమ క్రమములచే ఒక్కొక్క శతము హోమములు చేసి, పిమ్మట పూర్ణాహుతి ఇచ్చి, మూకుడులో సంపుటముగాచేసి, కుంభీశునకు నివేదనము చేయవలెను. ఈ విధముగ, శాస్త్రానుసారముగా అధివాసితముచేసి; భక్తుడైన శిష్యునికి దీక్ష ఇవ్వ వలెను. కరణి, కర్తరి, రజస్సులు. ఖటిక, ఇంకను ఉపయుక్తములైన వస్తువులు, వీటిని అన్నింటిని ఆతని ఎడమ ప్రక్క దగ్గరగా ఉంచి, మూలమంత్రముచే స్పృశించి, అధివాసితములు చేయవలెను. హరిని స్మరించుచు "నమో భూతేభ్యః" అని భూతబలిని కుశములపై ఇవ్వవలెను. పిదప వితానము (చాందినీ)చేత, ఘటముచేత, లడ్డులచేత మండలమును అలంకరించి, మండల ముపై విష్ణువును పూజింపవలెను. పిమ్మట అగ్నిని పూజించి పద్మాసనము కట్టి కూర్చున్న శిష్యు లను పిలచి వారికి దీక్ష ఇవ్వవలెను. విష్ణువును హస్తముచే ప్రోక్షించి, శిరస్సును స్పృశించి, క్రమముగా ప్రకృతి మొదలు వికృతుల వరకునుగల, అధిభూతాధి దైవతములతో కూడిన సృష్టినిగూర్చి మనస్సులో భావనచేసి మరల క్రమముగా ఉపసంహరించి, ఆ సృష్టి యంతయు తన్మాత్రలుగా అయి పోయినట్లును, జీవునితో సమానమైనట్లును భావన చేయవలెను. పిమ్మట గురువు కుంభేశుని ప్రార్థించి, సూత్రమును ప్రోగుచేసి, అగ్ని దగ్గరకు వచ్చి, దానిని అగ్ని పార్శ్వమునందు ఉంచి, సృష్టికి అధిపతియైన ఆ అగ్నిని మూల మంత్రముతో నూరు ఆహుతులతోను, పిమ్మట పూర్ణాహుతి తోను పూజించవలెను. మూలమంత్రముతో నూరుసార్లు అభిమంత్రించిన తెల్లని రజస్సుతో హృదయ తాడనము చేయవలెను, వియోగపద సంయుక్తములును, పాదాదీంద్రియ ఘటితములును, బీజ యుక్తములును అగు వాక్యములతో క్రమముగా పృథివ్యాది తత్త్వ విశ్లేషణముచేసి హోమము చేయవలెను.

పండితుడు అఖిలతత్త్వములకును నిలయమైన వహ్నియందును, వ్యాహృతుడగు హరియందును సమస్తమైన అర్చనామార్గము క్రమముగ ఉంచబడుచున్నట్లు స్మరింపవలెను. తాడనముచే విడదీసి, గ్రహించి, శమింపచేసి ప్రకృతిచే స్వీకరించి, పూర్వోక్తమైన అగ్ని యందు హోమము చేయవలెను.

గర్భాధానమును, జాతకర్మను, భోగమును, లయమును, ఆ అగ్నియందే ఎనిమిది హోమములు చేసి, పిమ్మట శుద్ధహోమము చేయవలెను. గురువు శుద్ధతత్త్వమును గ్రహించి, దానిని అవ్యాకృతము వరకును క్రమముగ పూర్ణాహుతిచే పరతత్త్వమునందు హోమము చేయవలెను. పండితుడు, జ్ఞానయోగముచేత ఆ పరమును పరమాత్మయందు విలీనముచేసి, బంధ విముక్తుడై జీవుడు శుద్ధము, జ్ఞానస్వరూపము, నిర్వికారము, పరమానంద రూపము అగు పరమాత్మయందు ఆనందము పొందు చున్నట్లు భావింపవలెను. పిమ్మట పూర్ణాహుతి ఇవ్వవలెను. ఈ విధముగా దీక్ష పూర్తియగును.

దీక్షా, హోమ, విలయములకు ఉపయుక్తములగు ప్రయోగ మంత్రములను చెప్పెదను. "ఓం యం భూతాని విశుద్ధం హుం ఫట్" అను మంత్రముచే తాడనమును, వియోజ నమును చేయవలెను. "ఓం యం భూతాన్యాపాతయే ఽ హమ్" అను మంత్రముచే ఆ దానము చేయవలెను. ప్రకృతితో యోజనముచేయు మంత్రమును వినుము. "ఓం యం భూతాని పుంశ్చాహో" అనునది ప్రయోజన మంత్రము.

హోమ మంత్రమును, పిమ్మట పూర్ణాహుతి మంత్రమును చెప్పెదను – "ఓం భూతాని సంహర స్వాహా" అనునది హోమ మంత్రము. "ఓం శ్రీం ఓం నమో భగవతే వాసుదేవాయ వౌషట్" అనునది పూర్ణాహుతి మంత్రము. పూర్ణాహుత్యనంతరము తత్త్వము నందు శిష్యుని సాధించవలెను. ఈ విధముగా బుధుడు క్రమముగ సర్వతత్త్వ సంశోధనము చేయవలెను. నమః అనునది అంతము నందుగల ఆయా తత్త్వముల బీజములతో తాడనాది పూర్వకముగా తత్త్వసంశోధనము చేయవలెను. "ఓం వాం కర్మేన్ద్రియాణి నమః" "ఓం దేం బుద్ధీన్ద్రియాణి నమః" ఇత్యాది విధమున చేయవలెను. తాడనాది ప్రయోగము 'యం' బీజముతో చేసినట్లే చేయవలెను. "ఓం సుగన్ధతన్మాత్రే వియుజ్ఞ్వ హుం ఫట్ ఓం సంపాహి స్వాహా" అనునది గంధ తన్మాత్రా వియోజన మంత్రము. "ఓం స్వం స్వం యజ్ఞ్వ ప్రకృత్యా" అనునది ప్రకృతి సంయోజన మంత్రము. "ఓం సుం హుం గన్ధ గూడ ఇట్లే చేయవలెను. "ఓం రస తన్మాత్రే" మొదలు "ఓం ఓం ప్రకృతౌ" అనునది దానివరకునున్న ఎనిమిదియు తత్త్రప్రయోగాలలో ఉపయోగించు మంత్రములు. ఇది ఏకమూర్తి విషయ మున సంపూర్ణముగ చెప్పబడిన దీక్షా విధానము. నవ వ్యూహాదికము నందు కూడ ప్రయోగము ఇట్లే అని చెప్పబడినది.

నరుడు ప్రకృతిని దహించి దానిని పరమ నిర్వాణమునందు చేర్చవలెను. నరుడు ప్రకృతిని అవికారుడగు ఈశ్వరునితో చేర్చవలెను. పిమ్మట భూతశుద్ధి చేసి బుద్ధ్యాఖ్యము లగు కర్మాంగములను, పిమ్మట తన్మాత్రలను, మనస్సును, జ్ఞానమును, అహంకారమును శోధించవలెను. అంతమునందు లింగాత్మశోధనము చేసి మరల ప్రకృతి శోధనము చేయవలెను. పరిశుద్ధుడును, ఈశ్వరధామమున నున్నవాడును, అన్ని భోగములను తన గోచరము చేసికొనినవాడును, ముక్తి యందు స్థితి సంపాదించిన వాడును అగు ప్రాకృత పురుషుని ధ్యానించుచు పూర్ణాహుతిని ఇవ్వవలెను. ఇది అధికారికి సంబంధించిన దీక్షా విధానము. మంత్రాంగములచే ఆరాధనచేసి తత్త్వముల సముదాయమును సమముగా ఉండు నట్లుచేసి ఈవిధముగ సక్రమముగా విశోధనముచేసి, అంతమునందు సర్వసిద్ధి సమన్వితుని ధ్యానించుచు పూర్ణాహుతి ఇవ్వవలెను. ఇది సాధకుడు చేయవలసిన దీక్షా పద్ధతి.

ద్రవ్యములను కూర్చుకొనుటకు సామర్థ్యము లేకపోయినచో లేదా తనకు శక్తి లేకపోయినచో, దేశికోత్తముడు పూర్వము చెప్పినట్లు సర్వోపకరణసహితుడగు దేవుని ఆరాధించి వెంటనే శిష్యునకు ద్వాదశియందు దీక్ష ఇవ్వవలెను. భక్తుడును, వినయవంతుడును, సమస్తమైన శారీర గుణములు కలవాడును అగు శిష్యుడు అధిక ధనవంతుడు కానిచో ఆతనికి స్థండిలాభ్యర్చన చేయించి దీక్ష ఇవ్వవలెను. గురువు, సమస్తమైన దైవ మార్గమునుగాని, ఆధ్యాత్మికముగా భావన చేయబడిన

భౌతిక మార్గమునుగాని, శిష్యుని దేహముపై ధ్యానించి, ముందుగా వాసుదేవాది దేవతలను, అగ్ని మొదలైనవారిని, క్రమ ముగ వారివారి మంత్రములతో ఎనిమిదేసి ఆహుతుల చేత తృప్తిపరచి, విసర్జనము చేయవలెను.

పిమ్మట సంహారక్రమమున హోమముచే శోధనము చేయవలెను. శిష్యుని దేహముపై కట్టిన కర్మరూప సూత్రములను విడిపించి, వాటిని ఒకచోట పోగుచేసి, తత్త్వ శోధనము చేయవలెను. ప్రాకృతికాగ్ని యందును, ఆధిదైవిక విష్ణువునందును లయము చేసి, అశుద్ధ లతో కూడిన తత్త్వమును పూర్ణాహుతిచే శుద్ధము చేయవలెను. ప్రాకృతిక గుణములను దహించి శిష్యుడు ప్రకృతిస్థుడైన పిమ్మట గురువు ఆతనిని విముక్తుని చేయవలెను; లేదా శిశువులను (శిష్యులను) అధికారము నందు నియుక్తులను చేయవలెను. లేదా గురువు భావస్థితుడై మరియొక శక్తి దీక్షయైన చేయవలెను. యతులుగాని, నిర్ధనులుగాని భక్తి పూర్వకముగ తన నాశ్రయించినపుడు స్థండిలముపై విష్ణువును పూజించి, శిష్యుని పార్శ్వము నందే కూర్చుండబెట్టవలెను. శిష్యుడు దేవతాభిముఖుడుగా ఉండగా గురువు ముఖమును అడ్డముగా త్రిప్పి కూర్చుండవలెను. స్వీయపర్వములతో వికల్పితమైన సకలా ధ్వమును శిష్యుని దేహముపై ధ్యానించి పిమ్మట ఆధిదైవిక పూజ చేయవలెను. ధ్యానయోగముచే చింతించి, వెనుక చెప్పిన విధమున తాడనాదికముచే క్రమముగ స్థండిలముపై నున్న హరియందు సకల తత్త్వ సంశోధనము చేయవలెను. పిమ్మట తాడనముచేత విడిపించి, తత్పరత్వముతో తనలో గ్రహించి, దేవునితో సంబంధింపచేసి, పరిశోధనముచేసి, దేవ స్వరూపమున గ్రహించి, శుద్ధ భావముతో తీసికొని వచ్చి, క్రమముగ సంధింపచేసి, ధ్యానయోగము నవలంబించి జ్ఞానముద్రతో శోధింపవలెను. సర్వతత్త్వములును శుద్ధములైన పిమ్మట ప్రధానుడగు ఈశ్వరుడు మాత్రము ఉండగా, శిష్యలను (పాశములను) దహించి నిర్వాసితులను చేయవలెను. ఈశ్వరస్థానమున వారిని నియుక్తులను చేయవలెను. లేదా దేశికోత్తముడు సాధకుని సిద్ధి మార్గమును పొందింపచేయవలెను.

అధికారముగల గృహస్థుడు ఈ విధముగ కర్మాచరణ విషయమున అలసత్వము లేనివాడై, రాగము క్షీణించు వరకును ఆత్మశోధనము చేసికొనుచు ఉండవలెను. తనకు ఉన్న రాగము క్షీణిం చినది అను విషయము గుర్తించి, పాపములు అన్నియు తొలగిన ఆతడు పుత్రునకుగాని, శిష్యునకు గాని అధికారము అప్పగించి, సంయమియై, మాయామయమగు పాశమును దహింపచేసికొని, సన్యాసము స్వీకరించి, ఆత్మచింతా పరాయణుడై, తన స్థితిని ఇతరులకు వ్యక్తముచేయక శరీర పాతమునకై (మరణమునకై) వేచి యుండవలెను. (27)

ఆచార్య అభిషేక విధానము

నారదుడు పలికెను :

శిష్యుడు ఆచార్యాభిషేకము ఎట్లు చేయవలెనో చెప్పెదను. దీనిచేత సాధకుడు సిద్ధిని పొందును. రోగి రోగవిముక్తుడగును. రాజు రాజ్యమును, స్త్రీ కుమారుని, పాపవినాశమును పొందును.

తూర్పున ప్రారంభించి మంచి రత్నములతో కూడిన మట్టి కుండలను మండప మధ్య భాగమున ఉంచవలెను. వాటిని సహస్రావర్తితములు లేదా శతావర్తితములు చేయవలెను. మండపము నందు

తూర్పు–ఈశాన్య దిక్కులందు పీఠముపై విష్ణువును ఉంచి, సాధకునికిని, శిష్యునికిని సకలీకరణము చేయవలెను. పిమ్మట గీతాదిపూర్వకముగా ఆచార్యునకు పూజచేసి అభిషేకము చేయవలెను. యోగ పీఠాదులను సమర్పింపవలెను. "నీవు నరులను అనుగ్రహింపవలెను" అని ప్రార్థించవలెను. గురువు కూడ శిష్యునకు నియమములు అన్నియు బోధించవలెను. ఈ విధముగా గురురక్షణ పొందిన శిష్యుడు అన్ని లాభములను సంపాదింపగలడు.(28)

సర్వతోభద్రమండల విధి

సాధకుడు దేవాలయాదులలో మంత్రసాధన చేయవలెను. తూర్పు గృహమునందు శుద్ధమైన భూమిపై, మండలమునందు ప్రభువైన హరిని స్థాపింపవలెను. చతురస్రముగ చేసిన క్షేత్రముమీద మండలాదులను వ్రాయవలెను. రెండు వందల ఏబదియారు (256) కోష్ఠములలో సర్వతోభద్ర మండలమును గీయవలెను. ముప్పదియారు కోణములతో పద్మము గీయవలెను. పీఠము పంక్తికి వెలుపల ఉండవలెను. దాని నుండి రెండింటిచేత వీధియు, రెండింటిచే దిక్కులలో ద్వారములును నిర్మించవలెను. వెనుక చెప్పిన పద్మ క్షేత్రమును వర్తులముగా త్రిప్పి, పద్మార్ధమునందు ద్వాదశ భాగము బైట త్రిప్పి, మిగిలిన క్షేత్రమును నాలుగుగా విభజించి, వర్తులముగా చేయవలెను. మొదటిది కర్ణిక యొక్క క్షేత్రము. రెండవది కేసరముల క్షేత్రము. మూడవది దళ సంధుల క్షేత్రము. నాల్గవది దళాగ్రముల క్షేత్రము. కోణస్థానముల నుండి, కోణములకు ఎదురుగా ఉన్న మధ్యభాగము వరకును దారము లాగి, కేసరముల అగ్రములందు ఉంచి దళముల సంధులను గుర్తింప వలెను. పిమ్మట దారమును క్రిందికి జార్చి, ఎనిమిది దళముల పద్మమును గీయవలెను. దళముల సంధుల మధ్యమునందు ఎంత ఎడము ఉండునో అంత ఎడమునందు అగ్ర భాగమున, దళాగ్రములను గీయవలెను. వాటి మధ్యమానమును వాటి పార్శ్వమునందు ఉంచి బాహ్య క్రమమున ఒక్కొక్క దళముపై రెండేసి కేసరములు గీయవలెను. ఇది పద్మముయొక్క సామాన్య లక్షణము. ఇపుడు ద్వాదశ కమల లక్షణము చెప్పబడుచున్నది. కర్ణిక యొక్క అర్ధమానమున తూర్పుదిక్కువైపు దారము ఉంచి క్రమముగా అన్ని వైపుల త్రిప్పవలెను. దాని పార్శ్వమునందు చేసిన భ్రమణముచే ఆరు కుండలుల చిహ్నములు, పండ్రెండు మత్స్యముల చిహ్నములు ఏర్పడును. వీటిచే ద్వాదశదళ కమలము ఏర్పడును.

పంచదళాదుల నిర్మాణమునకు కూడ ఈ విధముగనే మత్స్య చిహ్నములచే కమల ములు నిర్మించి ఆకాశరేఖకు బైటనున్న పీఠభాగమునందలి కోష్ఠములను తుడిచి వేయవలెను. పీఠభాగము యొక్క నాలుగు కోణములలో మూడేసి కోష్ఠకములను ఆ పీఠము యొక్క నాలుగు పాదాలుగా కల్పింపవలెను. నాలుగు దిక్కులందును మిగిలిన రెండేసి జోడులను, అనగా నాలుగు కోష్ఠకములను తుడిచివేయవలెను. అవి పీఠమునకు పాదాలుగా ఏర్పడును. పీఠము వెలుపల నాలుగు దిక్కులలో ఉన్న రెండు రెండు పంక్తులను తుడిచివేసి వీథి ఏర్పరుపవలెను. పిమ్మట నాలుగు దిక్కులందును నాలుగు ద్వారములు ఏర్పరుపవలెను. విద్వాంసుడు, ద్వారముల పార్శ్వభాగములందు ఎనిమిది శోభాస్థానము లను, వాటి పార్శ్వభాగములందు ఉపశోభాస్థానములను ఏర్పరుపవలెను. శోభలు

ఎన్నియో ఉపశోభలు కూడ అన్నియే ఉండును. ఉపశోభల సమీపమునందున్న స్థానములకు కోణములని పేరు. పిమ్మట నాలుగు దిక్కులందును మధ్యనున్న రెండేసి కోష్ఠములను, వాటి బాహ్య పంక్తిలోని, మధ్యకోష్ఠములను ద్వార నిర్మాణమునకై ఉపయోగించవలెను. వాటిని అన్నింటిని కలిపి తుడిచివేయగా నాలుగు ద్వారములు ఏర్పడును. ద్వారము యొక్క రెండు పార్శ్వములందలి క్షేత్రమునకు వెలుపల నున్న పంక్తి యందలి ఒక్కొక్క కోష్ఠమును, లోపలి పంక్తి యందలి మూడు మూడు కోష్ఠములను శోభా నిర్మాణార్థమై తుడిచి వేయవలెను. శోభాపార్శ్వ భాగమునందు ఇందులకు విపరీతముగ చేయుటచే అనగా క్షేత్రమునకు వెలుపల నున్న పంక్తియందలి మూడుమూడు కోష్ఠములను, లోపల నున్న పంక్తియందలి ఒక్కొక్క కోష్ఠమును తుడిచివేయగా ఉపశోభలు నిర్మింపబడును. పిమ్మట కోణమునకు లోపల, వెలుపల నున్న మూడు మూడు కోష్ఠముల భేదమును తుడిచివేసి ఒకటిగా చేసి చింతనము చేయవలెను.

ఇంతవరకును పదునారేసి కోష్ఠములతో ఏర్పడు రెండు వందల ఏబది ఆరు కోష్ఠములుగల మండలము వర్ణింపబడినది. ఇతర మండల నిర్మాణము కూడ ఈ విధముగనే చేయవచ్చును. పంద్రెండేసి కోష్ఠములచే నూటనలభై నాలుగు కోష్ఠకముల మండలము ఏర్పడును. దానిలో కూడ మధ్యనున్న ముప్పదియారు పదముల (కోష్ఠముల)చే కమలము ఏర్పడును. దీనిలో వీథి ఉండదు. ఒకపంక్తి పీఠమునకై ఏర్పరుపబడును. మిగిలిన రెండు పంక్తులచే, వెనుక పంద్రెండు అంగుళముల ప్రమాణముతో నుండును. రెండు హస్తముల ప్రమాణముగల మండలమునందు కమల స్థానము ఒక హస్తము వెడల్పు-పొడవులతో నుండును. ఈ విధముగా ప్రమాణమును పెంచుచు ద్వారాదులతో మండల నిర్మాణము చేయవలెను. రెండు హస్తముల ప్రమాణముగల పీఠరహితమగు చతురస్ర మండలమునందు చక్రాకార కమలమును నిర్మించవలెను. పద్మార్థము తొమ్మిది అంగు ళములు ఉండును. నాభి మూడు అంగుళములు. ఎనిమిది అంగుళముల ఆకులు, నాలుగు అంగుళముల నేమి ఏర్పరుపవలెను. క్షేత్రమును మూడు భాగములుగ విభజించి, మరల లోపలినుండి ఒక్కొక్క దానిని రెండేసి భాగములు చేయవలెను. లోపల నున్న ఐదు కోష్ఠములను తుడిచివేసి వాటిపై ఆకులు నిర్మింపవలెను. ఈ ఆకులు ఇందీవర దళాకారములో గాని, మాతులుంగ ఫలాకారములో గాని, కమలదళ ఆకారములో గాని ఉండవచ్చును. లేదా వాటి ఆకారమును తమ ఇచ్ఛ ప్రకారము చేయవచ్చును. ఆకుల సంధుల మధ్య దారముంచి, దానిని వెలుపల ఉన్న నేమి (చక్రాంతము) వరకు లాగి, నాలుగు వైపుల త్రిప్పవలెను. ఆకు యొక్క సంధియందు దారమును ఉంచి దాని మూల భాగమును త్రిప్పవలెను. ఆకు మధ్య స్థానమునందు దారముంచి ఆ మధ్య భాగము నలు వైపులకును సమముగా దారము త్రిప్పవలెను. ఈ విధముగా త్రిప్పగా మాతులుంగ ఆకారముగల ఆకులు ఏర్పడును.

పదునాలుగు హస్తముల క్షేత్రమును ఏడు భాగములుగ విభజించి, మరల రెండేసి భాగములుగ విభజింపవలెను. లేదా తూర్పు నుండి పశ్చిమము వరకును, ఉత్తరము నుండి దక్షిణము వరకును పదునైదేసి సమాన రేఖలు గీయవలెను. ఇట్లు చేయుటచే నూట తొంబది యారు కోష్ఠములు ఏర్పడును. వీటిలో మధ్యనున్న నాలుగు కోష్ఠములచే భద్రమండలము ఏర్పరుపవలెను. దాని

నాలుగు వైపుల వీధి కొరకై స్థానము విడువవలెను. మరల అన్ని దిక్కులందును కమలములు గీయవలెను. ఆ కమలముల నాల్గు వైపులందును వీథికొరకై ఒక్కొక్క కోష్ఠమును తుడిచి వేయవలెను. పిమ్మట, మధ్యనున్న రెండేసి కోష్ఠములను కంఠభాగముకొరకై తుడిచి వేయవలెను. పిమ్మట వెలుపల నున్న నాలుగేసి కోష్ఠములలో మూడు మూడు కోష్ఠములను తుడిచివేయవలెను. వెలుపలనున్న ఒక్కొక్క కోష్ఠమును కంఠస్థాన పార్శ్వమునందు మిగల్చవలెను. దానికి ద్వార శోభయని పేరు.

వెలుపల నున్న కోణములలో ఏడింటిని మినహాయించి లోపల నున్న మూడేసి కోష్ఠములను తుడిచి వేయవలెను. దానికి 'నవనాళము' లేదా "నవనాభ మండలము" అనిపేరు. దాని తొమ్మిది నాభులయందు, నవవ్యూహ రూపుడైన శ్రీహరిని పూజింపవలెను. ఇరువదియైదు వ్యూహముల మండలము విశ్వవ్యాపియైనది. ముప్పదిరెండు హస్తముల క్షేత్రమును, ముప్పది రెండుచేతనే సమముగా విభజింపవలెను. అనగా పైనుంచి క్రిందికి ముప్పదిమూడు రేఖలు గీసి, అడ్డముగా కూడ ముప్పదిమూడు రేఖలు గీయవలెను. ఈ విధముగ ఒక వెయ్యి ఇరువది నాలుగు కోష్ఠములు ఏర్పడును. వాటిలో మధ్య నున్న పదునారు కోష్ఠకములతో "భద్రమండలము"ను నిర్మింపవలెను. మరల నాలుగు ప్రక్కలనున్న ఒక్కొక్క పంక్తిని విడువవలెను. పిమ్మట ఎనిమిది దిక్కులందును పదునారు కోష్ఠకములచే ఎనిమిది భద్ర మండలములు ఏర్పరుపవలెను. దీనికి "భద్రాష్టకము" అని పేరు.

దాని తరువాత నున్న ఒక పంక్తి చెరిపివేసి మరల వెనుకటివలె పదునారు భద్ర మండలములు వ్రాయవలెను. పిమ్మట అన్ని ప్రక్కలను ఉన్న ఒక్కొక్క పంక్తి చెరిపివేసి ఒక్కొక్క దిక్కున మూడేసి చొప్పున పండ్రెండు ద్వారములు నిర్మింపవలెను. వెలుపల ఉన్న ఆరు కోష్ఠములు తుడిచివేసి మధ్య భాగముయొక్క పార్శ్వభాగములందలి నాలుగింటిని తుడిచివేయవలెను. మరల, శోభా నిర్మాణమునకై లోపల ఉన్న నాలుగు కోష్ఠములను, వెలుపల ఉన్న రెండు కోష్ఠములను తుడిచి వేయవలెను. పిమ్మట ఉప ద్వారములు ఏర్పడుటకై లోపల ఉన్న మూడు కోష్ఠములను, వెలుపల నున్న ఐదు కోష్ఠములను తుడిచి వేయ వలెను. పిమ్మట, వెనుక చెప్పిన విధమున శోభ నిర్మింపవలెను. కోణములలో వెలుపల ఉన్న ఏడు కోష్ఠములను, లోపల ఉన్న మూడు కోష్ఠములను తుడిచి వేయ వలెను. ఈవిధముగ ఏర్పడిన పంచవింశతి వ్యూహమండలము లోపలనున్న కమల కర్ణికపై పరమాత్మను పూజింపవలెను. మరల తూర్పు మొదలైన దిక్కులలో ఉన్న కమలములపై క్రమముగా వాసుదేవాదుల పూజ చేయవలెను. పిమ్మట తూర్పున ఉన్న కమలముపై భగవంతుడగు వరాహ మూర్తిని పూజించి క్రమముగా ఇరువది ఐదు వ్యూహముల పూజ చేయవలెను. ఇరువది యారవ తత్త్వమైన పరమాత్ముని పూజ సంపన్నమగు వరకును ఈ క్రమము జరుగవలెను. ఒకే మండలముపై అన్ని వ్యూహముల పూజను క్రమముగా చేయవలెనని ప్రచేతసుని మతము. కాని సత్యాచార్యుని మతము ప్రకారము మూర్తి భేదమును బట్టి పరమాత్ముని వ్యక్తిత్వమునందు భేదమేర్పడును గాన విభిన్నమూర్తుల పూజ వేరువేరుగా చేయవలెను.

నలుబది హస్తముల మండలమును అడ్డగీతలు గీసి క్రమముగా విభజింపవలెను. మొదట ఒక్కొక్క దానికి ఏడేసి భాగములు చేయవలెను. మరల ఒక్కొక్క దానిని మూడేసి భాగములుచేసి, వాటిని గూడ రెండేసి భాగములు చేయవలెను. ఈ విధముగ ఒక వెయ్యి ఏడువందల అరువది

నాలుగు(1764) కోష్ఠకములు ఏర్పడును. మధ్య నున్న పదునారు కోష్ఠకములతో కమలమును నిర్మింపవలెను. పార్శ్వభాగమున వీధి నిర్మించవలెను. పిమ్మట ఎనిమిది భద్రములు, వీథులు నిర్మింపవలెను. పిమ్మట పదునారు దళముల కమలమును వీధిని నిర్మింపవలెను. పిమ్మట క్రమముగ ఇరువది నాలుగు దళముల కమలము, వీథి, ముప్పది రెండు దళముల కమలము, వీథి, నలుబది దళముల కమలము, వీథి నిర్మింపవలెను. పిమ్మట మిగిలిన మూడు పంక్తులచే ద్వారములు, శోభలు, ఉపశోభలు నిర్మింపవలెను. సర్వదిశల మధ్య భాగమునందు ద్వార సిద్ధి కొరకై రెండు నాలుగు, ఆరు కోష్ఠకములు తుడిచివేయవలెను. దాని బాహ్య భాగము నందు శోభా–ఉపద్వారములు ఏర్పడుటకై ఐదు కోష్ఠములు, మూడు కోష్ఠములు తుడిచి వేయవలెను. ద్వారముల పార్శ్వములందు, లోపలి వైపున, క్రమముగ ఆరు కోష్ఠములు, నాలుగు కోష్ఠములు తుడిచివేయవలెను. మధ్యనున్న రెండు కోష్ఠములు కూడ తుడిచి వేయవలెను. ఈ విధముగ ఆరు ఉపశోభలు ఏర్పడును. ఒక్కొక్క దిక్కు నందు నాలుగేసి శోభలు, మూడేసి ద్వారములును ఉండును. కోణములలో ఒక్కొక్క పంక్తిలోని ఐదేసి కోష్ఠములు విడువవలెను. అవి కోణములగును. ఈ విధముగ చేయగా కావలసిన సుందరమైన మండలము ఏర్పడును. (29)

మండల విధి

నారదుడు చెప్పెను :

భద్ర మండలము మధ్య నున్న కమలమున అంగదేవతాసహిత బ్రహ్మను పూజింప వలెను. తూర్పున నున్న కమలమున పద్మనాభుని, ఆగ్నేయమున నున్న కమలమున ప్రకృతిని, దక్షిణమున నున్న కమలమున పురుషుని దక్షిణ భాగమున అగ్నిదేవతను, నైరృతి దిక్కున నిరృతిని, పశ్చిమ దిక్కున నున్న కమలమున వరుణుని, వాయవ్య దిక్కు నందున్న కమలమున వాయువును, ఉత్తర దిక్కునందున్న కమలమున ఆదిత్యుని, ఈశాన్య దిక్కునందున్న కమలమున ఋగ్వేద యజుర్వేదము లను పూజింపవలెను. రెండవ ఆవరణమునందు ఇంద్రాది దిక్పాలకులను, షోడశదళ కమలమున క్రమముగా సామవేద, అథర్వవేద, ఆకాశ, వాయు, తేజో, జల, పృథివీ, మనః, శ్రోత్ర, త్వక్, నేత్ర, రసనా, ఘ్రాణ, భూర్లోక, భువర్లోకములను పూజింపవలెను. పిమ్మట తృతీయావరణము నందలి, ఇరు వది నాలుగుదళముల కమలమున క్రమముగ మహర్లోక, జనలోక, తపోలోక, సత్యలోక, అగ్నిష్టోమ, అత్యగ్నిష్టోమ, ఉక్థ, షోడశీ, వాజపేయ, అతిరాత్ర, ఆప్తోర్యామ, వ్యష్టిమనో, వ్యష్టిబుద్ధి, వ్యష్ట్యహంకార, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ, జీవ, సమష్టిమనః, సమష్టిబుద్ధి (మహత్తత్వ), సమష్ట్యహంకార ప్రకృతులను పూజింపవలెను. వీటి అన్నింటి యొక్క స్వరూపము శబ్ద మాత్రమే. అనగా కేవలము వీటి పేరులు చెప్పి నమస్కరించిన చాలును; మూర్తులను ధ్యానింప అవసరము లేదు. ఇరువది యైదవ అధ్యాయములో చెప్పిన వాసు దేవాది మూర్తులను తొమ్మిదింటిని, దశవిధ ప్రాణ ములను, మనో, బుద్ధి, అహంకార, పాయు, ఉపస్థలను, శ్రోత్ర, త్వక్, నేత్ర, రసనా, ఘ్రాణ, వాక్, పాణి, పాదములను–ఈ ముప్పది రెండింటిని, ముప్పదిరెండు దళముల కమలమున అర్చన చేయవలెను. ఇవి నాల్గవ ఆవరణమునందలి దేవతలు. ఈ ఆవరణమున సాంగస పరివార దేవతా పూజ చేయవలెను.

పిమ్మట వెలుపలి ఆవరణమునందు పాయు-ఉపస్థల పూజచేసి, పండ్రెండు మాసాల అధిపతులను, పురుషోత్తముడు మొదలగు ఇరువదియారు తత్త్వములను పూజింప వలెను. మాసాధిపతుల పూజ చక్రాబ్జముపై క్రమముగా చేయవలెను. ఎనిమిది, లేదా ఆరు, లేదా ఐదు ప్రకృతులను అచటనే పూజింపవలెను. పిమ్మట మండలములపై వేరు వేరు రంగులుగల చూర్ణములు చల్లవలెను. ఎచట ఏ రంగుగల చూర్ణము చల్లవలెనో చెప్పెదను వినుము. కమలకర్ణిక రంగు పసుపు పచ్చగా ఉండవలెను. సమస్త రేఖలును సమప్రమాణము గలవై తెల్ల రంగులో నుండవలెను. రెండు హస్తముల మండలముల రేఖలు బొటన వ్రేలంత లావుగా ఉండవలెను. ఒక హస్తము మండలము నందలి రేఖలు బొటన వ్రేలి లావులో సగము లావు ఉండవలెను. రేఖలు తెల్లగా ఉండవలెను. పద్మములకు తెల్లరంగును, సంధులకు నలుపు లేదా నీలి రంగు వేయవలెను. కేసరములు ఎరుపు-పసుపురంగులో ఉండవలెను. కోణములందున్న కోష్ఠములను ఎఱ్ఱని రంగుగల చూర్ణముతో నింపవలెను. ఈ విధముగ యోగపీఠమును యథేష్టముగ అన్ని రంగులతోను అలంకరింపవలెను. వీథిని లతలతోడను, పత్రాదులతోడను అలంకరింపవలెను. పీఠ ద్వారమును తెల్లని రంగుగల చూర్ణముతోను, శోభాస్థానములను ఎఱ్ఱని చూర్ణములతోడను నింపవలెను. ఉపశోభలపై నీలిరంగు చూర్ణము చల్లవలెను. కోణముల శంఖములను తెల్లగా చిత్రింపవలెను. ఇది భద్రమండలముపై రంగులు ఉంచు విధానము. ఇతర మండలముపై గూడ ఈ విధముగనే అనేక విధములగు వర్ణములుగల చూర్ణములు చల్లవలెను. త్రికోణ మండలము తెలుపు-ఎరుపు-నలుపు రంగులతో అలంకరింపవలెను. ద్వి కోణమును ఎరుపు-పసుపు రంగులతో అలంకరింపవలెను. చక్రకమలము నందలి నాభి స్థానమును నలుపు రంగు చూర్ణముతో అలంకరింపవలెను.

చక్ర కమలము ఆకులకు పసుపు-ఎరుపు రంగులు వేయవలెను. చక్రము అంచును నీలము-ఎరుపు రంగులువేసి అలంకరింప వలెను. బైటనున్న రేఖలకు తెలుపు, శ్యామము, ఎరుపు, నలుపు, పసుపు రంగులు వేయవలెను. వరిపిండి మొదలగు వాటిని తెలుపు రంగునకు ఉపయోగించవచ్చును. కుసుంభ చూర్ణాదులు ఎరుపు రంగునకును, పసుపు పసుపు రంగునకును, మాడ్చిన బియ్యపు పిండి నల్లరంగునకును ఉపయోగించవచ్చు. శమీపత్రాదులచే శ్యామవర్ణము వేయవచ్చును. బీజ మంత్రములను ఒక లక్ష జపించుట చేతను, ఇతర మంత్రములను అక్షర లక్షలు జపించుటచేతను, విద్యలను ఒక లక్ష జపించుట చేతను, బుద్ధ విద్యలను పదివేలసార్లు జపము చేయుటచేతను స్తోత్రములనువేయి పర్యాయములు జపించుటచేతను, లేదా అన్ని మంత్రములను మొదట ఒక లక్ష జపించుట చేతను, మంత్రశుద్ధియు, ఆత్మశుద్ధియుకూడ కల్గును. రెండవ పర్యాయము ఒక లక్ష జపించుటచే మంత్రము క్షేత్రీకృతమగును (సాధకునకు దానిపై నిలకడ ఏర్పడును). బీజమంత్ర జపము మొదట ఎంతసంఖ్యలో చేయబడునో హోమము కూడ అంత సంఖ్య లోనే చేయవలెను. ఇతర మంత్రముల విషయమున హోమము జప సంఖ్యలో పదవవంతు చేయవలెను. మంత్ర పురశ్చరణము చేయ సంకల్పించినప్పుడు ఒక్కొక్క మాసము వ్రతము అవలంబింపవలెను. నేలపై మొదట ఎడమ కాలుంచవలెను. దానము పట్టగూడదు. ఈ రెండు రెట్లు-మూడు రెట్లు జపము చేసిననే మధ్యమ, ఉత్తమ శ్రేణికి చెందిన ఫలములు లభించును.

ఇపుడు మంత్రము వలన ఫలము సిద్ధించుటకై ఉపయోగించు మంత్ర ధ్యానమును చెప్పెదను. మంత్రము యొక్క స్థూల రూపము శబ్దము. ఇది దాని బాహ్యరూపము. మంత్రము యొక్క సూక్ష్మరూపము జ్యోతిర్మయమైనది. ఇదే దాని ఆంతర రూపము. ఇది కేవలము చింతనమునకు కూడ అతీతమైనది, మంత్రముయొక్క పరరూపము. వరాహ, నరసింహ, శక్తి మంత్రముల స్థూల రూపమునకే ప్రాధాన్యము. వాసుదేవుని రూపము చింతనరహితమని చెప్పబడినది.

ఇతర దేవతల చింతామయమగు ఆంతరిక రూపమే సర్వదా ముఖ్యమైనదిగ పరిగణింప బడుచున్నది. విరాట్టు యొక్క స్వరూపము స్థూలము. లింగమయ స్వరూపము సూక్ష్మము. ఈశ్వరుని రూపము చింతా రహితము. బీజ మంత్రము హృదయ కమలము నందు నివసించునది; అవినాశి; చిన్మయము; జ్యోతి స్వరూపము. జీవాత్మకము. దాని ఆకాశము కదంబ పుష్పముతో సమానము. ఈ విధముగ ధ్యానింపవలెను. కుండలో నుంచిన దీపము యొక్క కాంతి పైకి ప్రసరింప కుందునట్లు నిరుద్ధమై సంహత రూపమున ఒంటరిగా ఉన్నట్లు, మంత్రేశ్వరుడు హృదయమునందు ప్రకాశించు చుండును. అనేక రంధ్రములున్న కుంభములో ఉంచిన దీపము కాంతులు ఎన్ని రంధ్రములున్నవో అన్ని బైటకు ప్రసరించినట్లు జ్యోతిర్మయ బీజ మంత్రముల రశ్ములు నాడుల ద్వారా ప్రసరించుచు దేవాత్మక దేహముతో ప్రకాశించును. నాడులు హృదయము నుండి బయల్వెడలి నేత్రేంద్రియము వరకును ప్రసరించి ఉన్నవి. వాటిలో అగ్ని-సోమాత్మకములగు రెండు నాడులు నాసికాగ్ర భాగమునందుండును. మంత్రసాధకుడు ఉద్ఘాతయోగముచే శరీర వ్యాపియైయున్న ప్రాణ వాయువును చక్కగా జయించి జపధ్యానతత్పరుడై ఉన్నచో ఆతనికి మంత్ర ఫలము లభించును. పంచభూత తన్మాత్రల శుద్ధి చేసికొని యోగాభ్యాసము చేయు సాధకుడు కోరికలు కలవాడైనచో, అణిమాది సిద్ధులను పొందును. వైరాగ్యవంతుడైనచో, ఆ సిద్ధులనుదాటి, చిన్మయ స్వరూపముతో ఉండి, భూత మాత్రల నుండియు, ఇంద్రియములు అనెడు గ్రహములనుండియు సర్వదా విముక్తుడగును. (30)

కుశాపామార్జన విధానము

అగ్నిదేవుడు చెప్పెను : ఓ మునీ! ఇపుడు నేను ఆత్మ రక్షణను, ఇతరుల రక్షణను చేయు విధానమును చెప్పుచున్నాను. దీనికి 'మార్జనము' లేదా 'అపామార్జనము' అని పేరు. ఈ రక్ష చేసికొనుటచే మానవుడు దుఃఖములు తొలగి సుఖము పొందును. సచ్చిదా నంద స్వరూపుడును, పరమార్థ భూతుడును, సర్వాంతర్యామియు, మహాత్ముడును, నిరా కారుడును, సహస్రాకారములు ధరించినవాడును, సర్వ వ్యాపకుడును అగు పరమాత్మకు నమస్కరించుచున్నాను. కల్మష రహితుడును, పరమ శుద్ధుడును, నిత్యధ్యాన యోగ నిరతుడును అగు పరమాత్మకు నమస్క రించి రక్షా విషయమును చెప్పుచున్నాను. నా వాక్కు సత్యమగుగాక. భగవంతుడైన వరాహమూర్తికిని, నృసింహునకును, వామనునకును నమస్కరించి రక్షా విషయమును చెప్పెదను. నా వాక్యము సిద్ధించుగాక. భగవంతుడైన త్రివిక్రమునకును, శ్రీరామునకును, శ్రీమహావిష్ణువునకును, నరునకును నమస్కరించి నేను రక్షా విషయమును చెప్పుచున్నాను. అది సత్యమగుగాక.

ఓ వరాహస్వామీ! నృసింహేశ్వరా! త్రివిక్రమా! హయగ్రీవేశా! సర్వేశా! హృషీకేశా! నా సమస్త అశుభములను హరింపుము. ఎవ్వని చేతను ఓడింపరాని ఓ పరమేశ్వరా! అకుంఠిత శక్తిగల నీ చక్రావ్యాయుధములు నాలిగింటిచే సమస్త దుష్టుల సంహారము చేయుము. ఓ ప్రభూ! ఫలానావాని సంపూర్ణ పాపములను హరించి ఆతనికి పూర్తిగ కుశల క్షేమమును ప్రసాదించుము. పాపముల వలన కలుగు మృత్యు, బంధన, రోగ, పీడా, భయాదులను తొలగింపుము.

ఇతరుల వినాశమును కోరువారు చేసిన అభిచారిక ప్రయోగములను, వారిచ్చిన విషమిశ్రాన్న పానములను, వారు కల్పించిన మహారోగములను జరాజీర్ణములుగ చేసి వాటిని అన్నింటిని నశింప చేయుము. ఓం భగవంతుడైన వాసుదేవునకు నమస్కారము. ఖడ్గధారియైన కృష్ణునకు నమస్కారము. కమల నేత్రుడును, ఆదిచక్రధారియు అగు కేశవునకు నమస్కారము. పద్మముల కింజల్కములవలె పసుపు రంగుగల నిర్మల వస్త్రములు ధరించిన భగవంతుడైన పీతాంబరునకు నమస్కారము. ఘోర సంగ్రామములలో శత్రువుల కంఠములతో రాచుకొను చక్రమును ధరించిన చక్రపాణికి నమస్కారము. కోరపై లేవదీయ బడిన భూమిని ధరించినవాడును, వేదవిగ్రహుడును, శేషశయ్యపై శయనించువాడును అగు మహాయజ్ఞ వరాహమూర్తికి నమస్కారము. ఓ! దివ్య సింహమూర్తీ! నీ కేశాంతములు కరిగించిన బంగారమువలె ప్రకాశించుచున్నవి. నేత్రములు అగ్నివలె ప్రజ్వలించు చున్నవి. నీ నఖముల స్పర్శ వజ్రస్పర్శ కంటె గూడ ఎక్కువ తీక్ష్ణమైనది. నీకు నమస్కారము. చాల చిన్నశరీరము కలిగి, ఋగ్యజుఃసామ వేదములచే అలంకృతుడవైన కాశ్యపకుమారా! వామనా! నమస్కారము. పిమ్మట విరాడ్రూపము ధరించి భూమిని ఆక్రమించిన త్రివిక్రమునకు నమస్కారము.

ఓ వరాహమూర్తీ! సమస్త పాప ఫల రూపమున వచ్చిన సకల దుష్ట రోగములను అణచి వేయుము; అణచివేయుము. గొప్ప కోరలుగల మహావరాహా! పాపమువలన కలిగిన ఫలమును అణచివేయుము, అణచివేయుము. వికటమైన ముఖముగల నీ దంతాగ్రములు అగ్నివలె ప్రకాశించుచున్నవి. ఓ ఆర్తివినాశనా! ఆక్రమణముచేయు దుష్టుల వైపు చూడుము, నీ గర్జనముచే వారి నందరిని నశింపచేయుము, నశింపచేయుము. ఓ! వామనమూర్తీ! ఋగ్యజుఃసామ వేదముల గూఢతత్త్వములతో నిండిన వాక్కుతో ఈ ఆర్తుని సకల దుఃఖమును శమింపచేయుము గోవిందా! త్రిదోషముల వలన కలిగినదియు, సన్నిచిపాతము వలన కలిగినదియు, ఆగంతుకమును అగు ఐకాహిక జ్వరమును (రోజువిడిచి రోజు వచ్చు జ్వరము), ద్వ్యాహిక జ్వరమును (రెండు రోజులకు వచ్చునది), త్ర్యాహిక జ్వరమును, అత్యంతము భయంకరమగు చాతుర్థిక జ్వరమును (నాలుగు రోజులకొకసారి వచ్చునది) మానకుండా వచ్చు జ్వరమును శీఘ్రముగ శమింపచేయుము. దానివలన కలుగు బాధలను తొలగింపుము.

నేత్ర రోగమును, శిరోరోగమును, ఉదరరోగమును, శ్వాసావరోధమును, అతిశ్వాసమును, పరితాపమును, కంపనమును, గుద రోగమును, నాసికా రోగమును, పాద రోగమును, కుష్ఠరోగము లను, క్షయరోగమును, కామలాది రోగములను, అత్యంత దారుణమైన ప్రమేహమును, భగందర-అతిసారములను, ముఖ రోగమును, వల్గులీ రోగమును, అశ్మరీరోగమును, ఇతర మూత్రకృచ్ఛ

రోగములను, ఇతరములైన భయంకర రోగములను తొలగింపుము. వాత, పిత్త, కఫముల వలన కలిగిన రోగములును, సన్నిపాతము వలన కలిగిన రోగములును, ఆగంతుక రోగములును, లూతా–విస్ఫోటాది రోగములును భగవంతుడగు వాసుదేవుని నామ సంకీర్తన మాత్రముననే తొలగిపోవుగాక. ఆ రోగములన్నియు శ్రీమహావిష్ణునామ ఉచ్చారణ మాత్రముననే నశించి పోవుగాక. అవి అన్నియు శ్రీమహావిష్ణువు చక్రముచే కొట్టబడి తొలగిపోవుగాక. 'అచ్యుత', 'అనంత', 'గోవింద' అను నామములను ఉచ్చరించుట అనెడు ఔషధముచే సకల రోగములును నశించును. నేను చెప్పునది సత్యము : సత్యము.

స్థావరము, జంగమము, కృత్రిమము, దంతములందు పుట్టినది, నఖములందు పుట్టినది, ఆకాశమునందు పుట్టినది, సాలెపురుగు మొదలగు వాటి నుండి పుట్టినది, ఇంకను ఇతర విధములైన దుఃఖకరమగు విషమును భగవంతుడైన వాసుదేవుని స్మరణము నశింపచేయుగాక. బాలకృష్ణుని చరిత్రము యొక్క కీర్తనము గ్రహ, ప్రేతగ్రహ, డాకినీ పూతనాది గ్రహ, వినాయకగ్రహ, ముఖ మండికా, క్రూరరేవతీ, వృద్ధరేవతీ, వృద్ధికా నామ కోగ్రగ్రహ, మాతృగ్రహాదులగు బాలగ్రహములను నశింపచేయు గాక! భగవంతుడ వైన నరసింహా! నీ దృష్టి ప్రసారముచే బాలగ్రహములు, యువ గ్రహములు వృద్ధ గ్రహములు దగ్ధములు అయి పోవుగాక! జూలుతో భయంకరమైన ముఖము కలవాడును, లోకమునకు హితము చేకూర్చువాడును, మహా బలవంతుడును అగు భగవంతుడైన నృసింహుడు సమస్త బాలగ్రహములను నశింపచేయుగాక, ఓ నరసింహా! మహాసింహా! జ్వాలా మాలలచే నీ ముఖ మండలము ప్రకాశించుచున్నది. ఓ అగ్నిలోచనా! సర్వేశ్వరా! సమస్త గ్రహములను భక్షింపుము! భక్షించుము.

పరమాత్ముడైన జనార్దనుడు సర్వాత్మ స్వరూపుడు. ఓ వాసుదేవా! ఈ వ్యక్తియందు ఏ రోగములు న్నవో, ఏ మహోత్పాతములు ఉన్నవో, ఏ విషమున్నదో, ఏ మహాగ్రములు ఉన్నవో, క్రూర భూతములు ఉన్నవో, దారుణమైన గ్రహపీడలు ఉన్నవో వాటిని అన్నింటిని ఏదియో ఒక రూపము ధరించి నశింపచేయుము. దేవశ్రేష్ఠుడవైన అచ్యుతా! జ్వాలామాల లచే మిక్కిలి భయంకరమైన సుదర్శన చక్రమును ప్రయోగించి దుష్ట రోగములను అన్నింటిని నశింపచేయుము. తీవ్ర జ్వాలలచే ప్రకా శించుచు, మహాధ్వని చేయుచున్న సుదర్శన చక్రమా! సమస్త దుష్ట రాక్షసులను సంహరింపుము; సంహరింపుము. నీ ప్రభావముచే ఆ రాక్షసులందరును నశింతురుగాక. సర్వాత్మకుడగు నృసింహుడు, తన గర్జనముచే పూర్వ, పశ్చిమ, ఉత్తర, దక్షిణ దిశలందు రక్షించుగాక. అనేక రూపములను ధరించు భగవంతుడైన జనార్దనుడు స్వర్గలోక, భూలోక, అంతరిక్షములందును, ముందును, వెను కనురక్షించుగాక. దేవాసుర మనుష్య సహితమగు ఈ జగత్తు అంతయు భగవంతుడగు విష్ణువు యొక్క స్వరూపమే. ఈ సత్యము యొక్క ప్రభావముచే ఈతని దుష్ట రోగములు అన్నియు నశించుగాక.

"విష్ణువును స్మరించగానే సర్వ పాపములును వెంటనే తొలగిపోవును" అను సత్యము యొక్క ప్రభావముచే వీని దుష్టరోగములు అన్నియు శాంతించుగాక. "యజ్ఞేశ్వరుడైన విష్ణువు దేవతలచే ప్రశంసించ బడుచున్నాడు" అనెడు సత్యము యొక్క ప్రభావముచే నా మాటసత్యమగుగాక. శాంతి

కలుగుగాక. మంగళమగుగాక. ఈతని దుష్ట రోగములు నశించుగాక. భగవంతుడైన వాసుదేవుని శరీరము నుండి పుట్టిన కుశలచే నేను ఈతని రోగములను తొలగించితిని. నరనారాయణులు, గోవిందుడును వీనికి అపామార్జనము చేయుగాక. శ్రీహరి వచనము ప్రకారము ఈతని సంపూర్ణ దుఃఖములు శమించుగాక. సమస్త రోగాదులను నివారించుటకు అపామార్జన స్తోత్రము ప్రశస్తమైనది. నేను శ్రీహరిని. నేను నీ రోగములను నశింపచేసితిని. (31)

సంస్కార కథనము

అటు పిమ్మట అగ్ని దేవుడు ఇంకను ఇట్లు చెప్పెను : బుద్ధిమంతుడగు పురుషుడు నిర్వాణాది దీక్షలలో నలుబది ఎనిమిది సంస్కారములు చేసికొనవలెను. ఆ సంస్కారములను గూర్చి వినుము. వీటిచే మనుష్యుడు దేవతాతుల్యుడగును. (1) మొట్ట మొదట యోనిలో గర్భాధానము. పిమ్మట (2) పుంసవన సంస్కారము చేయవలెను పిమ్మట (3) సీమంతోన్నయనము (4) జాతకర్మ (5) నామకరణము (6) అన్నప్రాశనము (7) చూడాకర్మ (8) బ్రహ్మచర్యము (9) వైష్ణవి (10) పార్థి (11) భౌతికి (12) శ్రౌతికి అను నాలుగు బ్రహ్మచర్య వ్రతములు (13) గోదానము (14) సమావర్తనము (15) అష్టక (16) అన్వష్టక (17) పార్వణ శ్రాద్ధము (18) శ్రావణి (19) ఆగ్రహాయణి (20) చైత్రి (21) ఆశ్వయుజి అను ఏడు పాకయజ్ఞములు (22) ఆధానము (23) అగ్నిహోత్రము (24) దర్శము (25) పౌర్ణమాసము (26) చాతుర్మాస్యము (27) పశుబంధము (28) సౌత్రామణి అను ఏడు హవిర్యజ్ఞములు (29) యజ్ఞములలో శ్రేష్ఠమైనది అగు అగ్నిష్టోమము (30) అత్యగ్నిష్టోమము (31) ఉక్థ్యము (32) షోడశి (33) వాజపేయము (34) అతిరాత్రము (35) అప్తోర్యామము అను ఏడు సోమసంస్థలు (36) హిరణ్యాంఘ్రి (37) హిరణ్యాక్షము (38) హిరణ్యమిత్రము (39) హిరణ్యపాణి (40) హేమాక్షము (41) హేమాంగము (42) హేమసూత్రము (43) హిరణ్యాస్యము (44) హిరణ్యాంగము (45) హేమజిహ్వము (46) హిరణ్యవత్తు (47) అన్ని యజ్ఞములకును అధిపతియైన (48) అశ్వమేధము అను సహస్రేశ యజ్ఞములు, సర్వభూతదయ, క్షమ, ఋజుత్వము, శౌచము, అనాయాసము, మంగ ళము, అకార్పణ్యము, అస్పృహ అను ఎనిమిది గుణములు. ఈ సంస్కారములను చేయ వలెను. ఇష్ట దేవతామూల మంత్రమున నూరు ఆహుతులు ఇవ్వవలెను. సౌర, శాక్త, వైష్ణవ, శైవ దీక్షలలో అన్నింటియందును ఇవి సమానమే. ఈ సంస్కారములచే సంస్కృ తుడగు పురుషుడు భోగములను, మోక్షమును కూడ పొందును. సమస్త రోగములచే విముక్తుడై దేవతా పురుషుడువలె నుండును. మనుష్యునకు ఇష్ట దేవతామంత్ర జప-హోమ-పూజా-ధ్యానములచే అభీష్ట ప్రాప్తి కలుగును. (32)

పవిత్రారోపణ శ్రీధర నిత్య పూజా విధానము

అగ్నిదేవుడు పలికెను : మునీ ఇపుడు నేను పవిత్రారోపణమును గూర్చి చెప్పెదను. సంవత్సరము నందు ఒకమారు పవిత్రారోపణము చేసినచో, సంవత్సరము అంతయు శ్రీహరి పూజచేసిన ఫలమును ఇచ్చును. ఆషాఢ శుక్ల ఏకాదశి మొదలు కార్తీక శుక్ల ఏకాదశివరకు ఉన్న కాలమున పవిత్రారోపణము

చేయవలెను. ప్రతిపత్తు విడువవలెను. ప్రతిపత్తు అనగా పాడ్యమి తిథి ద్వితీయాది తిథులు క్రమముగ లక్ష్మ్యాది దేవతల తిథులు. ద్వితీయ లక్ష్మికి, తృతీయ గౌరికి, చతుర్థి గణేశునికి, పంచమి సరస్వతికి, షష్ఠి కుమార స్వామికి, సప్తమి సూర్యునకు, అష్టమి మాతృ దేవతలకు, నవమి దుర్గకు, దశమి నాగులకు, ఏకాదశి ఋషులకు, ద్వాదశి విష్ణువునకు, త్రయోదశి మన్మథునకు, చతుర్దశి శివునకు, పౌర్ణమి అమావాస్యలు బ్రహ్మకు సంబంధించినవి. ఏ ఉపాసకుడు ఏ దేవతలను ఉపాసించునో ఆతనికి ఆ దేవత యొక్క తిథి పవిత్రమైనది.

పవిత్రారోపణ విధి అందరు దేవతలకును సమానమే. మంత్రాదులు మాత్రమే ఆయా దేవతలకు వేరువేరుగా ఉండును. పవిత్రకమును నిర్మించుటకై బంగారము, వెండి, రాగి తీగలనుకానినూలు దారమునుగాని ఉపయోగింపవలెను.

బ్రాహ్మణ్య స్త్రీచేతితో వడికిన నూలు చాలశ్రేష్ఠమైనది. అది లభించనిచో ఏ దారము నైనను గ్రహించి, దానిని సంస్కరించి ఉపయోగింపవలెను. దారమును మూడు పేటలుచేసి, మరల దానిని మూడు పేటలుచేసి, దానితో పవిత్రకమును నిర్మింపవలెను. నూట ఎనిమిది మొదలు అధికములగు తంతువులతో నిర్మించిన పవిత్రకము ఉత్తమాది శ్రేణికి చెందినదిగ పరిగణింప బడుచున్నది. పవిత్రారోపణమునకు ముందు ఇష్టదేవతను గూర్చి ఈ విధముగ ప్రార్థింపవలెను. "ప్రభూ! క్రియా లోపమువలన కలిగిన దోషమును తొలగిం చుటకై నీవు ఏ సాధనమును చెప్పినావో దానినే నేను చేయుచున్నాను. ఎక్కడ ఏ పవిత్రకము ఆవశ్యకమో అక్కడ అట్టి పవిత్రకమునే అర్పించగలను. నీ కృపచే ఈ కార్యమునందు విఘ్న బాధలేవియు కలుగకుండుగాక. అవినాశియైన పరమేశ్వరా! నీకు జయమగుగాక.

ఈ విధముగ ప్రార్థించు పవిత్రకమును ఇష్టదేవతా మండలమునకు గాయత్రీ మంత్రముతో కట్టవలెను. "ఓం నమో నారాయణాయ విద్మహే, వాసుదేవాయ ధీమహి, తన్నో విష్ణుః ప్రచోదయాత్" అనునది ఇష్టదేవతయగు నారాయణుని గాయత్రీ మంత్రము. ఈ గాయత్రీ ఇష్టదేవతా నామాను సారముగ ఉండును. దేవప్రతిమలపై అర్పించుటకు అనేక విధములగు పవిత్రకములు ఉండును. విగ్రహము యొక్క నాభివరకు వచ్చునది ఒకటి; తొడలవరకు వచ్చునది మరి యొకటి; మోకాళ్ళ వరకు వచ్చునది మరియొకటి; పాదముల వరకు వ్రేలాడునది ఒకటి. చివరిదానికి వనమాల అనిపేరు. దానిని ఒక వెయ్యి ఎనిమిది దారములతో నిర్మింపవలెను. సాధారణ మాలను శక్త్యాను సారము నిర్మింపవలెను. లేదా అది పదునారు అంగుళములకంటె రెట్టింపు పెద్దదిగా ఉండవలెను. కర్ణికా, కేసర, దళాదులుగల యంత్ర, చక్రాది మండలములపై వేయు పవిత్రకముపై నుండి క్రింది వరకును కప్పునదిగా ఉండవలెను. ఒక చక్రము, ఒక కమలము ఉన్న మండలము పై ఆ మండలము ఎన్ని అంగుళములు ఉన్నదో అన్ని అంగుళముల పవిత్రకము అర్పింప వలెను. వేదిపై అర్పించు పవిత్రకము తన చేతి అంగుళములతో ముప్పది ఏడు అంగుళ ముల పొడవు ఉండవలెను.

ఆచార్యుని కొరకును, తల్లిదండ్రుల కొరకును, పుస్తకముపై ఉంచుట కొరకును నిర్మింపబడు పవిత్రకము నాభి ప్రదేశము వరకును వ్రేలాడవలెను. దీనికి పండ్రెండు ముడులు ఉండవలెను.

దానిపైనుంచి గంధము పూయవలెను. వనమాలయందు రెండేసి అంగుళముల దూరమున క్రమ ముగా నూట ఎనిమిది ముడులు వేయవలెను. లేదా కనిష్ఠ, మధ్యమ, ఉత్తమ పత్రకములపై క్రమ ముగా పంద్రెండు, ఇరువదినాలుగు, ముప్పది ఆరు ముడులు వేయవలెను. మంద, మధ్యమ, ఉత్తమ మాలార్థులగు పురుషులు అనామికా, మధ్యమా, అంగుష్ఠముల చేతనే పవిత్రకములను గ్రహింప వలెను. లేదా కనిష్ఠకాది నామ ధేయములుగల పవిత్రకములందు అన్నింటియందును పంద్రెండేసి ముడులే ఉండవలెను. (తంతువుల సంఖ్యను బట్టియు, పొడవునుబట్టియు ఈ కనిష్టికాది నామ ధేయములు ఏర్పడినవి). సూర్యునకు, కలశమునకు, అగ్నిమొదలగు వాటికినిగూడ యథా సంభవ ముగ భగవంతుడగు విష్ణువునకువలెనే పవిత్రకములను అర్పించుట ఉత్తమమని చెప్పబడినది. పీఠము కొరకు దాని పొడవును బట్టియు, కుండమునకు దాని మేఖల పర్యంతమును పొడవుగల పవిత్రకము ఉండవలెను. విష్ణు పార్షదులకు యథాశక్తిగ సూత్ర గ్రంథులను సమర్పింపవలెను. లేదా గ్రంథులు లేకుండ పదునేడు సూత్రములు సమర్పింపవలెను. భద్రుడను పార్షదునకు త్రిసూత్రము సమర్పింపవలెను.

పవిత్రకమును గోరోచనముతోను, అగురు కర్పూరములు కలిపిన పసుపుతోను, కుంకుమ రంగుతోను పూయవలెను. భక్తుడు ఏకాదశీ దివసమున స్నాన సంధ్యాదులు చేసి, పూజాగృహము ప్రవేశించి, భగవంతుడగు శ్రీహరిని పూజింపవలెను. విష్ణువు యొక్క సమస్త పరివారమునకును బలి సమర్పించి విష్ణువును పూజించవలెను. ద్వారముయొక్క అంతమునందు "క్షం క్షేత్ర పాలాయ నమః" అని చెప్పి క్షేత్రపాల పూజచేయవలెను. ద్వారము పైభాగమున "శ్రియై నమః" అని చెప్పుచు శ్రీదేవిని పూజించవలెను. ద్వారదక్షిణ (కుడి) దేశమున "ధాత్రే నమః" "గంగాయై నమః" అను మంత్రములు ఉచ్చరించుచు, ధాతను, గంగను పూజింపవలెను. ఎడమ వైపున "విధాత్రే నమః" "యమునాయై నమః" అని చెప్పుచు విధాతను, యమునను పూజింపవలెను. ఇదేవిధముగ ద్వారము యొక్క కుడి, ఎడమ ప్రదేశములందు క్రమముగ "శఙ్ఖ నిధయే నమః" "పద్మనిధయే నమః" అని చెప్పుచు శంఖపద్మ నిధులను పూజింపవలెను. (పిదప మండపము లోపల కుడి పాదము మణవను మూడు మార్లు కొట్టి విఘ్నములను పారద్రోలవలెను). పిమ్మట "సారఙ్గాయ నమః" అని అనుచు విఘ్న కారకములగు భూతములను పారద్రోలవలెను. (పిమ్మట "ఓం హాం వాస్త్వధిపతయే బ్రహ్మణే నమః" అను మంత్రమును ఉచ్చరించుచు బ్రహ్మయొక్క స్థానమున పుష్పము లుంచవలెను). పిదప ఆసనముపై కూర్చుండి భూతశుద్ధి చేయవలెను.

"ఓం హ్రూం హః ఫట్ హ్రూం గన్ధతన్మాత్రం సంహరామి నమః
ఓం హ్రూం హః ఫట్ హ్రూం రసతన్మాత్రం సంహరామి నమః
ఓం హ్రూం హః ఫట్ హ్రూం రూపతన్మాత్రం సంహరామి నమః
ఓం హ్రూం హః ఫట్ హ్రూం స్పర్శతన్మాత్రం సంహరామి నమః
ఓం హ్రూం హః ఫట్ హ్రూం శబ్దతన్మాత్రం సంహరామి నమః"

అను ఐదు ఉద్ఘాత వాక్యములను ఉచ్చరించుచు గంధ తన్మాత్ర స్వరూపమగు భూమం డలమును, వజ్రచిహ్నితము, సువర్ణమయము, చతురస్రము (నలుపలకలు గలది) పీఠమును,

ఇంద్రాది దేవతలను తన పాదములు మధ్య నున్నట్లు చూచుచు వాటి భావన చేయవలెను. ఈ విధముగ శుద్ధమగు గంధతన్మాత్రను రసతన్మాత్రయందు లీనము చేసి ఉపాసకుడు అదే క్రమమున రసతన్మాత్రను రూపతన్మాత్ర యందు లీనము చేయవలెను.

ఓం హ్రీం హః ఫట్ హ్రూం రస తన్మాత్రం సంహరామి నమః
ఓం హ్రీం హః ఫట్ హ్రూం రూప తన్మాత్రం సంహరామి నమః
ఓం హ్రీం హః ఫట్ హ్రూం స్పర్శ తన్మాత్రం సంహరామి నమః
ఓం హ్రీం హః ఫట్ హ్రూం శబ్ద తన్మాత్రం సంహరామి నమః

అను నాలుగు ఉద్ఘాత వాక్యములను ఉచ్చరించుచు మోకాళ్లు మొదలు నాభి వరకును ఉన్న శరీరభాగమును శ్వేతకములచే చిహ్నితమైన దానిగాను, శుక్ల వర్ణమైన దానినిగాను, అర్ధచంద్రా కారము కలదానిగాను చూడవలెను. ఈ జపీయ భాగమునకు వరుణుడు దేవత అని భావన చేయవలెను. పై నాలుగు ఉద్ఘాత వాక్యములను ఉచ్చరించుటచే రస తన్మాత్రము శుద్ధమగును. ఈ రసతన్మాత్రను రూపతన్మాత్రయందు లీనము చేయవలెను.

"ఓం హ్రూం హః ఫట్ హ్రూం శబ్దతన్మాత్రం సంహరామి నమః
ఓం హ్రూం హః ఫట్ హ్రూం స్పర్శతన్మాత్రం సంహరామి నమః
ఓం హ్రూం హః ఫట్ హ్రూం శబ్దతన్మాత్రం సంహరామి నమః

అను మూడు ఉద్ఘాత వాక్యములను ఉచ్చరించుచు నాభిమొదలు కంఠము వరకును ఉన్న భాగమునందు త్రికోణాకారాగ్ని మండలమును భావింపవలెను. దాని రంగు ఎరుపు. అది స్వస్తిక ఆకారముచే చిహ్నితమైనది. దాని అధి దేవత అగ్ని. ఈ విధముగా శుద్ధము చేయబడిన రూప తన్మాత్రను స్పర్శ తన్మాత్ర యందు లీనము చేయవలెను.

ఓం హ్రీం హః ఫట్ హ్రూం స్పర్శతన్మాత్రం సంహరామి నమః
ఓం హ్రీం హః ఫట్ హ్రూం శబ్ద తన్మాత్రం సంహరామి నమః

పిమ్మట **ఓం హ్రీం హః ఫట్ హ్రూం స్పర్శ తన్మాత్రం సంహరామి నమః**
ఓం హ్రీం హః ఫట్ హ్రూం శబ్ద తన్మాత్రం సంహరామి నమః

అను రెండు ఉద్ఘాత వాక్యములను ఉచ్చరించుచు కంఠము మొదలు నాసికా మధ్య వరకును ఉన్న భాగమునందు గోళాకార వాయుమండలమును భావన చేయవలెను. దాని రంగు ధూమమువలె నుండును. అది నిష్కలంక చంద్రునిచే చిహ్నితమైనది. స్పర్శ తన్మాత్రమును ధ్యానముచే శబ్దతన్మాత్ర యందు లీనము చేయవలెను. పిమ్మట "ఓం హ్రీం హః ఫట్ హ్రూం శబ్దతన్మాత్రం సంహరామి నమః" అను ఒక ఉద్ఘాత వాక్యమును ఉచ్చరించుచు శుద్ధ స్ఫటికముతో సమానమైన ఆకాశమును, నాసిక నుండి శిఖవరకును ఉన్న శరీర భాగముపై భావనచేయవలెను. ఆ శుద్ధాకాశమును (అహం కారమునందు) ఉపసంహరింపవలెను.

పిమ్మట శోషణాదుల ద్వారా దేహశుద్ధి చేసుకొనవలెను. పాదమునుంచి శిఖ వరకును దేహము 'యం' అను వాయు బీజముచే ఎండిపోయినట్లు భావన చేయవలెను. పిమ్మట 'రం' అను బీజము

ద్వారా అగ్నిని ప్రకటించి సమస్త శరీరము అగ్ని జ్వాలలచే దగ్ధమై భస్మమైనట్లు భావన చేయవలెను. పిమ్మట 'వం' బిందువును ఉచ్చరించుచు బ్రహ్మ రంధ్రము నుండి అమృత బిందువు ఆవిర్భవించినట్లు భావన చేయవలెను. దాని నుండి ప్రవహించిన అమృత ధారచే శరీరమునంతను ముంచెత్తి వేయవలెను. పిమ్మట 'లం' అను బీజమును ఉచ్చరించుచు ఆ భస్మము నుండి దివ్యదేహము ఆవిర్భవించినట్లు భావన చేయవలెను. ఈ విధముగ దివ్యదేహ భావనచేసి అంగన్యాస కరన్యాసములు చేయవలెను. పిమ్మట మానసయాగాను ష్ఠానము చేయవలెను. హృదయ కమలముపై అంగ దేవతా సహితుడగు మహావిష్ణువును నిలిపి, మానసిక పుష్పాద్యుప చారములు చేయుచు, మూల మంత్రములు ఉచ్చరించుచు పూజింపవలెను. ఆ భగవంతుడు భోగమోక్షముల నిచ్చువాడు. మానసిక పూజలను స్వీకరింపుమని భగవంతుని ఈ విధముగ ప్రార్థింపవలెను. "దేవా! దేవాధిదేవా! కేశవా! నీకు స్వాగతము. నా సమీపమున సన్నిహితుడవై నేను అర్పించు మానసికపూజను గైకొనుము." పీఠము మధ్యభాగమునందు, యోగపీఠమును ధరించు ఆధారశక్తియైన కూర్మమును, అనంతుని, పృథివిని పూజింపవలెను. ఆగ్నేయ కోణము మొదలగు నాలుగు కోణములందును క్రమముగ ధర్మ, జ్ఞాన, వైరాగ్య, ఐశ్వర్యములను పూజింపవలెను. తూర్పు మొదలగు ప్రధానదిక్కులందు అధర్మ, అజ్ఞాన, అవైరాగ్య, అనైశ్వర్యములను పూజింపవలెను. పీఠమధ్యము నందు సత్త్వాది గుణత్రయమును, కమలమును, మాయను, అవిద్యను, కాల తత్త్వమును, సూర్యాది మండలములను, పక్షిరాజైన గరుత్మంతుని పూజింప వలెను. పీఠము వాయవ్య కోణము నుండి ఈశాన్య కోణము వరకు గురుపంక్తిని పూజింపవలెను.

గణములు, సరస్వతి, నారదుడు, నలకూబరుడు, గురువు, గురుపాదుక, పరమ గురువు, ఆతని పాదుక వీటి పూజయే గురు పంక్తి పూజ. పూర్వ సిద్ధ, పరసిద్ధ శక్తులను కేసరములపై పూజింపవలెను. లక్ష్మి, సరస్వతి, ప్రీతి, కీర్తి, శాంతి, కాంతి, పుష్ట; తుష్టి, వీరు పూర్వ సిద్ధశక్తులు, పూర్వాది దిక్కులలో క్రమముగ ఈ శక్తుల పూజ చేయవలెను. ఇంద్రాది దిక్పాలకులనుగూడ వారి వారి దిక్కులందు పూజింపవలెను. వీరందరి మధ్యయందు శ్రీహరి విరాజిల్లుచుండును. ధృతి, శ్రీ, రతి, కాంత్యాదులు పరసిద్ధశక్తులు. మూల మంత్రముచే అచ్యుతుని స్థాపింపవలెను. పూజా ప్రారంభమున "ఓం అభిముఖో భవ" పూర్వ దిక్కున నా సమీపమున ఉండుము అని భగవంతుని ప్రార్థింపవలెను. ఈ విధముగ ప్రార్థించి స్థాపించిన పిమ్మట అర్ఘ్యపాద్యాదులను సమర్పించి, గంధాద్యుప చారముల ద్వారా మూల మంత్రముతో అచ్యుతుని పూజింపవలెను. "భీషయ భీషయ హృదయాయ నమః" "ఓం త్రాసయ త్రాసయ శిరసే నమః" "ఓం మర్దయ మర్దయ శిఖాయై నమః" 'ఓం రక్ష రక్ష నేత్ర త్రయాయ నమః' 'ఓం ప్రధ్వంసయ ప్రధ్వంసయ కవచాయ నమః" "ఓం హూం ఫట్ అస్త్రాయ నమః" ఈ విధముగ ఆగ్నేయాది విదిశల యందు క్రమముగా, మూల బీజములతో అంగముల పూజచేయవలెను. తూర్పు, దక్షిణము, పశ్చిమము, ఉత్తరము ఈ దిక్కు లందు మూర్త్యాత్మక ఆవరణముల పూజ చేయవలెను.

వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు అని నాలుగు మూర్తులు. ఆగ్నేయాది విదిశలయందు క్రమముగ శ్రీ, రతి, ధృతి, కాంతులను పూజింపవలెను. వీరు కూడ శ్రీహరి

మూర్తులే. అగ్న్యాది కోణములందు క్రమముగ శంఖ, చక్ర, గదా, పద్మములను పూజింపవలెను. తూర్పు మొదలైన దిక్కులందు శార్ఙ్గ, ముసల, ఖడ్గ, వనమాల లను పూజించవలెను. వాటి వెలుపల తూర్పు మొదలగు దిక్కులందు క్రమముగ ఇంద్ర, అగ్ని యమ, నిర్ృతి, వరుణ, వాయు, కుబేర, ఈశానులను పూజించి నైర్ృతి పశ్చిమ దిక్కుల మధ్య అనంతుని, తూర్పు–ఈశాన్య దిక్కుల మధ్య బ్రహ్మను పూజించవలెను. వీటి బైట వజ్రము మొదలగు అస్త్రమయ ఆవరణములను పూజించవలెను. వీటి బైట దిక్పాలకుల వాహన రూపములగు ఆవరణములను పూజింపవలెను. తూర్పు మొదలగు దిక్కులందు క్రమముగ ఐరావతమును, మేకను, దున్నపోతును, వానరుని, మత్స్యమును, మృగమును, చెవులపిల్లిని, వృషభమును, కూర్మమును, హంసను పూజింపవలెను. వీటి బయట పృశ్నిగర్భుడు, కుముదుడు మొదలగు ద్వారపాలును పూజింపవలెను. తూర్పు మొదలు ఉత్తరము వరకు, అన్ని దిక్కులందును ఇద్దరిద్దరు ద్వారపాలకులను పూజింపవలెను. పిమ్మట శ్రీహరికి నమస్కారము చేసి వెలుపల బలి అర్పింపవలెను. "ఓం విష్ణు పార్షదేభ్యో నమః" అను మంత్రమును ఉచ్చరించుచు విష్ణుపీఠముపై వారలకు బలి అర్పింపవలెను. ఈశానదిక్కునందు "ఓం విశ్వాయ విష్వక్సేనాయ నమః" అను మంత్రముచే విష్వక్సేన పూజ చేయవలెను. పిమ్మట దేవుని కుడిచేతికి రక్షా సూత్రము కట్టవలెను. ఆ సమయమున ఆ భగవంతునితో ఇట్లు చెప్పవలెను–"దేవా! ఒక సంవత్సరము పాటు నిరంతరము జరుగు మీ పూజయొక్క సంపూర్ణఫలము లభించుటకై జరుపనున్న పవిత్రా రోపణ కర్మకొరకై ఈ కౌతుక సూత్రమును ధరింపుము. ఓం నమః". పిమ్మట భగవంతుని సమీపమున ఉపవాసాది నియమములను అవలంబించి ఇట్లు చెప్పవలెను. "నేను నియమ పూర్వకముగ ఉపవాసాదులు చేసి ఇష్ట దేవతకు సంతోషము కలిగింపగలను. దేవేశ్వరా! నేను మొదలు వైశేషిక ఉత్సవ దివసము వరకును కామక్రోధాది దోషములేవియు నావద్దకు రాకుండుగాక". వ్రతమును స్వీకరించిన యజమానుడు ఉపవాసముచేయు సామర్థ్యము లేని పక్షమున నక్తవ్రతము (రాత్రి మాత్రమే భోజనము చేయుట) ఆచరించవలెను. హవనము చేసి భగవంతుని స్తోత్రము చేసిన పిమ్మట భగవంతుని ఉద్వాసన చెప్పవలెను. భగవంతుని నిత్య పూజ చేసినచో లక్ష్మి ప్రాప్తించును. భగవంతుని పూజించుటకై "ఓం హ్రీం శ్రీం శ్రీధరాయ త్రైలోక్య మోహనాయనమః" అనునది మంత్రము. (33)

అగ్నికార్య విధానము

అగ్ని దేవుడు పలికెను : సాధకుడు ఈ "ఓం హ్రీం శ్రీం శ్రీధరాయ త్రైలోక్య మోహ నాయ నమః" అను మంత్రము చదువుచు యాగమండపమును ప్రవేశింపవలెను. యజ్ఞ శాలను అలంకరింపవలెను. (ఈ క్రింది శ్లోకమును చదువుచు భగవంతునకు నమస్కారము చేయవలెను). "వేదములకును బ్రాహ్మణులకును హితమును చేయు, అవ్యయ స్వరూపుడగు శ్రీధరునకు నమస్కారము. ఋగ్యజుః సామాథర్వ వేదములు విష్ణు స్వరూపమైనవి. శబ్దము లన్నియు విష్ణు స్వరూపమే. అట్టి భగవంతుడైన విష్ణువునకు నమస్కారము." సాయం కాలమున సర్వతోభద్రము మొదలగు మండలముల రచన చేసి పూజాద్యుప యుక్తములగు ద్రవ్యము లను సమకూర్చు కొన వలెను. కాళ్లు చేతులు కడుగుకొనవలెను. ఆయా ద్రవ్యములను తగుస్థానములందు ఉంచి, చేతితో

అర్ఘ్యము గ్రహించి, ఆ జలముతో తన శిరముపై ప్రోక్షిం చుకొనవలెను. ద్వారాది ప్రదేశములందు నీళ్లు చల్లవలెను. ద్వారయాగ (ద్వారస్థ దేవతా పూజా ప్రారంభము చేయవలెను. మొదట తోరణాధి పతులను బాగుగా పూజింపవలెను. తూర్పుమొదలగు దిక్కులలో అశ్వత్థ, ఉదుమ్బర, వట, ప్లక్ష వృక్షములను పూజింపవలెను. ఇవి కాక, తూర్పున ఋగ్వేదమును, ఇంద్రుని, శోభనుని, దక్షిణమున యజుర్వేదమును, యముని, సుభద్రుని, పశ్చిమమున సామవేదమును, వరుణుని, సుధన్వుని, ఉత్తరమున అథర్వ వేదమును, సోముని, సుహోత్రుని పూజింపవలెను.

తోరణము (ద్వారము) లోపల పతాకలు కట్టి రెండేసి కలశములను స్థాపింపవలెను. కుముదము మొదలగు దిగ్గజములను పూజింపవలెను. ఒక్కొక్క గుమ్మము వద్దను ఇద్దరిద్దరు ద్వారపాలకులను, వారి నామ మంత్రములు చదువుచు పూజింపవలెను. తూర్పున పూర్ణ-పుష్కరులు, దక్షిణమున అనంద-నందనులు, పశ్చిమమున వీరసేన-సుషేణులు, ఉత్తర మున సంభవ-ప్రభవులు అను ద్వారపాలురను పూజింపవలెను. 'ఫట్' అను అస్త్ర మంత్ర మునుఉచ్చరించుచు (పుష్పములుచల్లి విఘ్నములను తొలగించి పిదప మండలములోనికి ప్రవేశించవలెను. భూతశుద్ధి, న్యాసము, ముద్రలుచేసి' శిఖకు ('వషట్'కు) చివర 'ఫట్' చేర్చి జపించుచు నాలుగు దిక్కులందును ఆవాలు చల్లవలెను. పిమ్మట వాసుదేవ మంత్రముతో గోమూత్రమును, సంకర్షణ మంత్రముతో గోమ యమును, ప్రద్యుమ్న మంత్రముతో గోదుగ్ధమును, అనిరుద్ధ మంత్రముతో పెరుగును, నారాయణ మంత్రముతో ఘృతమును గ్రహించి, వాటినన్నింటిని కలుపగా పంచగవ్య మేర్పడును. పంచ గవ్యమును ఒక పర్యాయము, రెండు పర్యాయములు లేదా మూడు పర్యాయములు వేరువేరుగ చేయవలెను. వీటిలో ఒకటి మండప ప్రోక్షణమునకు ఉపయోగింపవలెను. రెండవది తినుటకును, మూడ వది స్నానమునందును ఉపయోగింపవలెను. పది కలశలను స్థాపించి వాటిపై ఇంద్రాది లోక పాలురను పూజింపవలెను. పూజచేసి వారికి శ్రీహరి ఆజ్ఞను వినిపింపవలెను. "ఓ లోకపాలు లారా! శ్రీహరి ఆజ్ఞ ప్రకారము మీరు ఈ యజ్ఞమును రక్షించుటకై ఎల్లపుడును ఇచట నుండవలెను."

యాగద్రవ్యాదులను సంరక్షించుకొని వికిర ద్రవ్యములను (విఘ్న నివారణము కొరకై నాలుగు వైపులను చల్లు ఆవాలు మొదలగు వాటికి వికిరములని పేరు) చల్లవలెను. అస్త్రమూల మంత్రమును (అస్త్రాయఫట్) ఏడుసార్లు జపించుచు ఈ వికిరములను చల్లవలెను. మరల అదేవిధముగ అస్త్రమంత్రమును జపించుచు కుశనిర్మిత కూర్చమును తీసికొనవలెను. వాటిని ఈశానకోణమునందు ఉంచి వాటిపైన కలశములను వరనిని ఉంచవలెను. కలశముపై సాంగముగ శ్రీహరి పూజచేసి, వర్ధనిలో అస్త్రపూజ చేయవలెను. అచ్ఛిన్నమగు వర్ధనీ ధారచే యాగమండపమును ప్రదక్షిణ క్రమమున తడుపుచు కలశమును దానికి ఉపయుక్తమగు స్థానమున చేర్చి, ఆసనముపై ఉంచి, దాని పూజ చేయవలెను. కలశముశలో పంచరత్నములు ఉంచవలెను, దానిపై వస్త్రము చుట్టవలెను. దానిపై గంధాద్యుపచారములతో శ్రీహరిని పూజింపవలెను. వర్ధనిలో కూడ బంగారు ముక్క ఉంచవలెను. దానిపై అస్త్ర పూజచేసి, దాని ఎడమ భాగమున, సమీపము నందే వాస్తు లక్ష్మీ-భూ వినాయకులను పూజింపవలెను. సంక్రాంత్యాది కాలములందు ఈ విధముగనే శ్రీమహా విష్ణువు స్నానాభిషేకముల ఏర్పాటు చేయవలెను. మండపము యొక్క కోణములందును, దిక్కులందును ఎనిమిది కలశములను,

మధ్యయందు ఒక కలశమును, మొత్తము భద్రములు లేని తొమ్మిది కలశములు ఉంచి, వాటిలో పాద్యము, అర్ఘ్యము, ఆచమనీయము, పంచ గవ్యములు వేయవలెను. పూర్వాది కలశములలో పైన చెప్పిన వస్తువులను, అగ్ని కోణాదులందలి కలశములలో ఆ ద్రవ్యములతో పాటు పంచామృత యుక్త జలమును వేయవలెను, పెరుగు, పాలు, తేనె, వేడినీళ్ళు-ఇవి పాద్యాంగములు.

కమలములు, శ్యామాకము, దూర్వాదలములు, విష్ణుక్రాన్తోషధి అను నాలుగు వస్తువులతో కూడిన జలము పాద్యమని చెప్పబడును. అర్ఘ్యమునకు కూడ ఎనిమిది అంగములు చెప్పబడినవి. అర్ఘ్యము కొరకు యవలు, గంధము, ఫలములు, అక్షతలు, కుశలు, ఆవాలు, పుష్పములు, తిలలు సమకూర్చు కొనవలెను. జాతీ, లవంగ, కంకోలములతో కూడిన జలమును ఆచమనీయముగా ఇవ్వవలెను. ఇష్టదేవతలకు, మూలమంత్రము చదువుచు, పంచామృత స్నానము చేయించవలెను. మధ్య నున్న కలశము నుండి శుద్ధోదకమును గ్రహించి దేవుని శిరముపై చల్లవలెను. కలశము నుండి వచ్చు జలమును, కూర్చాగ్రమును స్పృశింపవలెను. పిమ్మట శుద్ధోదకముతో పాద్య, అర్ఘ్య, ఆచమనీయములు సమర్పింపవలెను. వస్త్రముచే దేవతామూర్తిని తుడిచి, వస్త్రధారణము చేయించి, సవస్త్రక ముగ మండలము మీదికి తీసికొని వెళ్లవలెను. అచట బాగుగా పూజచేసి, ప్రాణాయామ పూర్వకముగ కుండాదులలో హోమము చేయవలెను. (హవన విధానము) : రెండు చేతులు కడిగి కొని, అగ్నికుండమునందు గాని, వేదిపైగాని, మూడు పూర్వాగ్ర రేఖలు గీయవలెను. వాటిని దక్షిణమునుండి ప్రారంభించి, ఉత్తరము వైపు గీయవలెను. మరల వాటిపై మూడు ఉత్తరాగ్రరేఖలు గీయవలెను. (వీటిని కూడ కుడి నుండి ప్రారంభించి ఎడమకు గీయవలెను).

పిమ్మట అర్ఘ్య జలముతో ఈ రేఖలను కడిగి యోని ముద్ర చూపవలెను. అగ్నిని ఆత్మరూపముగా భావించుచు యోనియుక్తమగు కుండమునందు స్థాపింపవలెను. పిమ్మట దర్భ, స్రుక్, స్రువాదులతో కూడ పాత్రాసాదనము చేయవలెను. బాహు ప్రమాణముగల పరిధులు, ఇధ్మవ్రశ్చనము, ప్రణీతా పాత్రము, ప్రోక్షణీ పాత్రము, ఆటస్థాలి, ఆజ్యము, రెండు రెండు ప్రస్థముల బియ్యము; అధోముఖ ములుగా ఉన్న స్రుక్ స్రువములు. ప్రణీత యందును. ప్రోక్షణి యందును పూర్వాగ్రముగ కుశలు ఉంచవలెను. ప్రణీతను నీటితో నింపి, భగవద్ధ్యానముచేసి, దానిని అగ్నికి పశ్చిమమున, తన ఎదుట సమకూర్చిన ద్రవ్యముల మధ్య ఉంచవలెను. ప్రోక్షణిని నీటితో నింపి పూజానంతరము కుడివైపున ఉంచవలెను. చరువును అగ్నిపై ఉంచి ఉడికించవలెను. అగ్నికి దక్షిణమున బ్రహ్మను స్థాపింప వలెను. అగ్ని కుండమునకు లేదా వేదికి, నాలుగు ప్రక్కల, పూర్వాది దిక్కులందు బర్హిస్సు పరిచి పరిధులనుంచవలెను. పిమ్మట గర్భాధానాది సంస్కారముల ద్వారా అగ్నికి వైష్ణవీ కరణము చేయవలెను, గర్భాధానము, పుంసవనము, సీమంతోన్నయనము, జాతకర్మ, నామకరణము మొదలు సమావర్తనము వరకు ఉన్న సంస్కారములుచేసి ఒక్కొక్క కర్మకు ఎనిమిదేసి ఆహుతులను ఇవ్వవలెను. స్రువముతో కూడిన స్రుక్కుతో పూర్ణాహుతి ఇవ్వవలెను.

కుండము మధ్య, ఋతుస్నాతయగు లక్ష్మిని ధ్యానించి హోమము చేయవలెను. కుండములోపల ఉన్న లక్ష్మికి కుండలక్ష్మి అని పేరు. త్రిగుణాత్మికయగు ప్రకృతి ఈ లక్ష్మియే. ఈమెయే సకల

భూజములకును, సకల మంత్రములకును, విద్యలకును ఉత్పత్తి స్థానము. పరమాత్మ స్వరూపుడగు అగ్నిదేవుడు మోక్షమునకు కారణమైనవాడు; ముక్తిదాత. కుండలక్ష్మి శిరస్సు తూర్పుదిక్కు వైపునను, భుజములు ఈశాన-ఆగ్నేయ దిక్కుల వైపునను, కాళ్ళు వాయవ్య నైరృతి దిక్కుల వైపునకును ఉండును. కుండమే ఉదరము. కుండము నందలి యోని స్థానముయోని. మూడు మేఖలలు సత్త్వరజస్తమో గుణములు. ఈ విధముగ ధ్యానించి ముష్టి ముద్రతో పదునైదు సమిధలను హోమము చేయవలెను. పిదప వాయవ్య దిక్కునుండి ఆగ్నేయదిక్కు వరకును 'ఆధారములు' అనెడు రెండు ఆహుతులను ఇవ్వవలెను. ఇదేవిధమున ఆగ్నేయము నుండి ఈశాన్యము వరకు ఆజ్య భాగములను ఆహుతులు చేయవలెను. ఆజ్యస్థాలి నుండి ఉత్తర, దక్షిణ, మధ్య భాగముల నుండి ఆజ్యము గ్రహించి ద్వాదశాంతముతో, అనగా మూలమును పన్నెండు పర్యాయములు జపించి, అగ్నియందు, ఆ దిక్కులందే హోమము చేసి, అచటనే త్యాగము చేయవలెను. పిమ్మట "భూః స్వాహా" ఇత్యాది క్రమమున వ్యాహృతి హోమము చేయవలెను. కమల మధ్య భాగమున సంస్కార సంపన్నుడగు అగ్ని దేవుని ధ్యానింపవలెను. "ఈ ఏడు జిహ్వలతో కోట్లకొలది సూర్యుల ప్రకాశముతో ప్రకాశించును. ఆతని ముఖము చంద్రసదృశము. నేత్రములు సూర్యుని వలె దేదీప్య మానములుగ ఉన్నవి". ఈ విధముగ ధ్యానించి అగ్నిదేవునకు నూట ఎనిమిది ఆహుతులు సమర్పింపవలెను. లేదా మూల మంత్రముచే అందులో సగము సంఖ్యగల ఆహుతులను, మరి ఎనిమిది ఆహుతులను ఇవ్వవలెను. అంగములకు కూడ పదేసి ఆహుతులు ఇవ్వవలెను. (34)

పవిత్రాధివాసన విధి

అగ్నిదేవుడు చెప్పెను : సాంపాతాహుతిచేత పవిత్రలను తడిపి వాటి అధివాసము చేయవలెను. నృసింహ మంత్రమును జపించి, వాటిని అభిమంత్రించి, అస్త్రమంత్రముచే (అస్త్రాయ ఫట్) వాటిని సురక్షితములు చేయవలెను. పవిత్రలకు వస్త్రములు చుట్టి ఉండగనే పాత్రములో ఉంచి వాటిని అభిమంత్రించవలెను. బిల్వాది సంస్పృష్టమైన జలముతో, మంత్రోచ్చారణ పూర్వకముగ వాటిని ఒకటి రెండుసార్లు ప్రోక్షించవలెను. కుంభపాత్రము నందు పవిత్రలను ఉంచి, గురువు, వాటి రక్షణ నిమిత్తము, ఆ పాత్రను తూర్పున సంకర్షణ మంత్రముతో దంతచాష్ఠమును, ఉసిరికాయను, దక్షిణమున ప్రద్యుమ్న మంత్రముతో భస్మమును, తిలలను, పశ్చిమమున నారాయణ మంత్రముతో కుశోద కమును ఉంచవలెను. పిమ్మట ఆగ్నేయమునందు హృదయ మంత్రముతో కుంకుమమును, గోరోచనమును, ఈశాన్యదిక్కునందు శిరో మంత్రముతో ధూపమును, నైరృతి దిక్కునందు శిఖా మంత్రముతో దివ్యమూల పుష్పములను, వాయవ్యదిక్కునందు కవచమంత్రముతో చందన, జల, అక్షత, దధి, దూర్వలను దొన్నెలో ఉంచవలెను. మండపమును త్రిసూత్ర ముతో చుట్టి మరల అన్ని ప్రక్కల ఆవాలు చల్లవలెను.

ఏ క్రమమున దేవతల పూజ జరిగినదో ఆ క్రమముననే ఆ దేవతలకు, వారివారి మంత్రములను ఉచ్చరించుచు గంధపవిత్రములు అర్పింపవలెను. ఈ క్రమమునే పాటించుచు కుంభమున మహా విష్ణువును ఉద్దేశించి "ఓ దేవా! ఇది నీ తేజస్సు నుండియే పుట్టినది. సుందరమైనది. సర్వ పాప

వినాశకము. ఇది అన్ని మనోరథములను ఇచ్చునది. దీనిని నీకు సమర్పించుచున్నాను" అని పలుకుచు పవిత్రకమును సమర్పింపవలెను. ధూప దీపాదుల ద్వారా బాగుగా పూజచేసి మండప ద్వార సమీపమునకు వెళ్ళి, గంధ పుష్పాక్షతలతో గూడిన ఆ పవిత్రకమును తానుకూడ "ఇది విష్ణు తేజోరూపమైనది. మహా పాతకములను నశింపచేయునది. ధర్మార్థ కామముల సిద్ధికై దీనిని ధరించుచున్నాను" అని చెప్పుచు ధరింపవలెను. ఆసనముపై శ్రీహరి పరివారమునకును గురువు నకును పవిత్రమును ఈయవలెను. గంధపుష్పాక్షతాదులచే శ్రీహరిని పూజించి, గంధపుష్పాదులతో పూజించిన పవిత్రమును శ్రీహరికి సమర్పింపవలెను. ఆ సమయమున "విష్ణుతేజో భవమ్" ఇత్యాది మూలమంత్రమును పఠించవలెను. పిమ్మట అగ్న్యధిష్ఠాతగానున్న మహా విష్ణువునకు పవిత్రకము సమర్పించి ఇట్లు ప్రార్థింపవలెను.

కేశవా! నీవు, క్షీరసాగరమున శేషశయ్యపై శయనించి ఉన్నావు, నేను ప్రాతః కాలమున నీ పూజచేసెదను. నీవు ఇచట ఉపస్థితుడవు కమ్ము! పిమ్మట ఇంద్రాది దిక్పాలకులను, శ్రీ విష్ణు పార్షదులకును బలి సమర్పింపవలెను. పిమ్మట రోచనా, కర్పూర, కేసర, గంధా దులచే అలంకృతమై రెండు వస్త్రములు ఉంచిన జలపూర్ణ కలశమునకు మూల మంత్రముతో పూజ చేయవలెను. మండ పమునుండి బైటకు వచ్చి, తూర్పున అలికిన మండల త్రయమునందు వరుసగ పంచగవ్యము లను, చరువును, దంతకాష్ఠమును ఉంచవలెను. రాత్రి పురాణశ్రవణ-స్తోత్ర పాఠాదులతో జాగరణము చేయవలెను. పరులకు భృత్యులుగా ఉండువారు, బాలులు, స్త్రీలు, భోగిజనులు మొదలగు వారి గంధ పవిత్రములు తప్ప మిగిలిన వాటికి అప్పుడే అధివాసము చేయవలెను. (35)

విష్ణుపవిత్రారోపణ విధి

అగ్నిదేవుడు చెప్పెను : ప్రాతః కాలమున స్నానాదికముచేసి, ద్వారపాలుర పూజ చేసిన పిదప గుప్తస్థానము నందు ప్రవేశించి, వెనుక అధివాసితములైన పవిత్రకముల నుండి ఒక దానిని ప్రసాదముగా గ్రహింపవలెను. మిగిలిన వస్త్రములును, అలంకార ములును, గంధమును, నిర్మాల్య మును తొలగించి భగవంతునకు స్నానము చేయించి పూజ చేయవలయును. పంచామృత, కషాయ, గంధోదకములచే స్నానము చేయించి ముందుగనే సిద్ధము చేసికొని ఉంచుకొనిన వస్త్ర, గంధ, పుష్పములను దేవునకు సమర్పింప వలెను. నిత్యహోమము చేసిన విధముగ అగ్నిలో హోమముచేసి, భగవంతుని స్తుతించి, ప్రార్థించి భగవచ్చరణములపై శిరస్సు ఉంచవలెను. తన సమస్త కర్మలను భగవంతునకు సమర్పించి పిదప నైమిత్తిక పూజ చేయవలెను. ద్వారపాల, విష్ణు, కుంభ, వర్ధనులను ప్రార్థింప వలెను. "అతో దేవాః" ఇత్యాది మంత్రముచేగాని, మూలమంత్రముచేగాని కలశముపై శ్రీహరిని ఈ విధముగా ప్రార్థింపవలెను. "ఓ కృష్ణా! కృష్ణా! నీకు నమస్కారము. ఈ పవిత్రమును గ్రహింపుము. ఇది ఉపాసకుని పవిత్రునిగ చేసి సంవత్సరముపాటు చేయు పూజయొక్క సంపూర్ణ ఫలమును ఇచ్చును. పరమేశ్వరా! నేను చేసిన పాపములను నశింపచేసి నన్ను పరమ పవిత్రుని చేయుము. సురేశ్వరా! నీ కృపచే నేను పరిశుద్ధుడనగుదును". హృదయశిరోమంత్రములచే

పవిత్రమునకును, తనకును అభిషేకముచేసి విష్ణుకలశమును ప్రోక్షించిన పిమ్మట దేవుని దగ్గరకు వెళ్ళవలెను. దేవుని రక్షాబంధమును తొలగించి, పవిత్రమును సమర్పించి – "ప్రభో! నేను నిర్మించిన ఈ బ్రహ్మసూత్రమును స్వీకరింపుము. ఇది కర్మ పరిపూర్తి సాధనము. నాయందు ఏ విధమైన దోషములను ఉండని విధముగ ఈ పవిత్రారోపణ కర్మను సంపన్నము చేయుము" అని ప్రార్థింపవలెను.

ద్వారపాలురకును, యోగపీఠాసనమునకును, ముఖ్య గురువులకును పవిత్రకము సమర్పింప వలెను. వీటిలో కనిష్ఠ పవిత్రకమును (నాభివరకు వచ్చుదానిని) ద్వారపాలురకును, మధ్యను పవిత్రకమును (తొడలవరకువచ్చు దానిని) యోగ పీఠాసనమునకును, ఉత్తమ పవిత్రకమును (మోకాళ్ళ వరకు వచ్చుదానిని) గురువులకును ఇవ్వవలెను. "నమో విష్వక్సేనాయ" అను మంత్రము చదువుచు విష్వక్సేనునకు కూడ పవిత్రకము సమర్పింప వలెను. అగ్నిలో హోమముచేసి అగ్నిలో ఉన్న విశ్వాదిదేవతలకు పవిత్రకము అర్పింపవలెను. పూజానంతరము ప్రాయశ్చిత్తార్థమై మూలమంత్ర ముతో పూర్ణాహుతి చేయవలెను. అష్టోత్తర శతముతోగాని, ఐదు ఉపనిషన్మంత్రములతోగాని పూర్ణాహుతి ఇవ్వవలెను. అష్టోత్తర శతము లెక్కపెట్టుటకు, మణిమాలగాని, మందార పుష్పాదులుకాని ఉపయోగింపవలెను. చివర–"ఓ గరుడధ్వజా! నేను చేసిన ఈవార్షికపూజ సఫలమగుగాక. వనమాల నీ వక్ష స్థలమును ప్రకాశింపచేయుచున్నట్లే ఈ పవిత్రక తంతువులును, వీటి ద్వారా నేను చేసిన పూజలో తెలిసిగాని తెలియకగాని కలిగిన లోపములను, విధినిర్వహణములో విఘ్నముల వలన కలిగిన లోపములను, కర్మలోపములను తొలగించి, పూజ పూర్ణముగ సఫలమగునట్లు చేయుము" అని ప్రార్థించవలెను.

ఈవిధముగ ప్రార్థనా నమస్కారములు, అపరాధ క్షమాపణముచేసి, పవిత్రకమును శిరస్సుపై ఉంచవలెను. తగు విధముగ బలి ఇచ్చి, వైష్ణవ గురువును దక్షిణలచే సంతోషపెట్టవలెను. ఒక దినమునగాని, ఒక పక్షముపాటు గాని భోజనవస్త్రాదులను ఇచ్చి బ్రాహ్మణులను సంతోషపెట్టవలెను. స్నాన సమయమున పవిత్రమును తీసివేసి పూజింపవలెను. ఉత్సవ దివసమునందు వచ్చువారిని ఎవరిని కాదనక అందరికిని తప్పక అన్నదానముచేసి తాను కూడా భోజనము చేయవలెను. విసర్జన దివసమున పవిత్రకమును పూజించి – "ఓ పవిత్రకమా! నేను చేసిన ఈ వార్షికపూజ సుసంపన్నమగునట్లు చేసితివి. ఇపుడు నిన్ను విసర్జించుచున్నాను. నీవు విష్ణు లోకమునకు పొమ్ము' 'అని ప్రార్థింపవలెను. ఉత్తర–ఈశాన్యములమధ్య విష్వక్సేన పూజచేసి, ఆతని పవిత్రకములను పూజించి వాటిని బ్రాహ్మణులకు ఇచ్చివేయవలెను. ఆ పవిత్రకములో ఎన్ని తంతువులున్నవో అన్నివేల యుగముల కాలము ఉపాసకుడు విష్ణులోకములో నివసించును. పవిత్రారోపణము చేసిన సాధకుడు తనవెనుక నూరు తరములను ఉద్ధరించి, తనకు పూర్వము పదితరముల వారిని తరువాతి పది తరముల వారిని విష్ణు లోకమునకు చేర్చును. తాను కూడ ముక్తుడు అగును. (36)

సర్వదేవ పవిత్రారోపణ విధి

అగ్నిదేవుడు చెప్పెను : ఇపుడు సమస్త దేవతా పవిత్రారోపణ విధానమును సంక్షేపముగ చెప్పుచున్నాను. వినుము. పైన చెప్పిన లక్షణములుగల పవిత్రములనే దేవతలకు సమర్పింపవలెను.

వాటిలో "స్వరసము", "అనలగము" అని రెండు భేదములు ఉన్నవి. మొదట ఇష్టదేవతను ఈ క్రింద చెప్పిన విధముగ ఆహ్వానింపవలెను –"జగత్తునకు కారణమైన బ్రహ్మదేవా! పరివారసహితుడవై ఇచటకు రమ్ము. నేను నిన్ను ఆహ్వానించుచున్నాను. రేపు ప్రాతః కాలమునందు నీకు పవిత్రకము సమర్పింపగలను". మరునాడు మరల ఈ విధముగ ప్రార్థించుచు పవిత్రకములు సమర్పింపవలెను. "జగత్సృష్టి కర్తలైన విధాతా! నీకు నమస్కారము. ఈ పవిత్రకమును స్వీకరింపుము. నా పవిత్రత్వము కొరకై నీకు దీనిని సమర్పించుచున్నాను. ఇది సంవత్సరమంతయు జరుగు పూజాఫలమును ఇచ్చునది". "వేదవేత్తలను రక్షించు శివా! దేవా! నీకు నమస్కారము. ఈ పవిత్రకమును స్వీకరింపుము. దీనిచే మణులతో పగడములతో, మందార కుసుమాదులతో నీకు సంవత్స రము అంతయు చేయు పూజ దీనిచే సంపన్నమగుగాక". "ఓ పవిత్రకమా! నేను చేయు ఈ వార్షిక పూజను యథా విధిగ సుసంపన్నముచేసి, నీవు స్వర్గలోకమునకు పొమ్ము". సూర్యదేవా! నీకు నమస్కారము. ఈ పవిత్రకము స్వీకరింపుము. పవిత్రము చేయగలదను ఉద్దేశ్యముతో దీనిని నీకు సమర్పించుచున్నాను. ఇది ఒక సంవత్సరము జరుగు పూజకు ఫలము నివ్వగలదు". "గణేశా! నీకు నమస్కారము. ఈ పవిత్రకము స్వీకరింపుము. పవిత్రము చేయుటకై దీనిని ఇచ్చుచున్నాను. ఇది ఒక సంవత్సరము జరుగు పూజా ఫలము ఇచ్చును" "ఓ ! శక్తిదేవీ ! నీకు నమస్కారము. ఈ పవిత్రకము స్వీకరింపుము. పవిత్రము చేయునను ఉద్దేశ్యముతో దీనిని ఇచ్చుచున్నాను. ఇది ఒక సంవత్సరము జరుగు పూజా ఫలము ఇచ్చును."

"పవిత్రకము నందలి ఈ దారము నారాయణ–అనిరుద్ధమయము అయినది. ధన, ధాన్య, ఆయురారోగ్యములను ఇచ్చునది. దీనిని నీకు సమర్పించుచున్నాను. ఈ శ్రేష్ఠమైన దారము ప్రద్యుమ్న–సంకర్షణమయమైనది. విద్యా, సంతతి, సౌభాగ్యములను ఇచ్చును. దీనిని మీకు సమర్పించుచున్నాను. వాసుదేవమయమగు ఈ సూత్రము ధర్మ అర్థ కామ మోక్షములను ఇచ్చును. సంసార సాగరమును దాటుటకు ఇది ఉత్తమ సాధనము. దీనిని మీ పాదములపై సమర్పించు చున్నాను. విశ్వరూపమయమగు ఈ సూత్రము సర్వ కామములను సఫలము చేయును. సమస్త పాపములను నశింపచేయును. కడచిన తరములవారిని, రాబోవు తరములవారిని కూడ ఉద్ధరిం చును. దీనిని మీకు సమర్పించుచున్నాను. కనిష్ఠము, మధ్యమము, ఉత్తమము, పరమోత్తమము అని నాలుగు విధములగు పవిత్రకములను, మంత్రోచ్చారణ పూర్వకముగ క్రమానుసారముగ మునులు సమర్పించిరి." (37)

దేవాలయ నిర్మాణ ఫలము

అగ్ని దేవుడు చెప్పెను : మునీశ్వరా! వాసుదేవాదుల కొరకు దేవాలయమును చేయించుటచే కలుగు ఫలమును చెప్పుచున్నాను. దేవాలయములు కట్టవలెననియు, తటాకాదులు నిర్మింపవలెను అనియు కలిగిన శుభ సంకల్పము! అట్టి సంకల్పము కలవాని వేల కొలది జన్మల పాపములను నశింపచేయును. భావన చేతనైన దేవాలయ నిర్మాణము చేసినవాని అనేక జన్మల పాపములు తొలగిపోవును. ఎవరైన దేవమందిరాదులు కట్టుచున్నపుడు దానిని ఆమోదించినవారు కూడ సమస్త

పాపములు తొలగి విష్ణు లోకమును పొందుదురు. శ్రీమహావిష్ణువునకు ఆలయము నిర్మించినవారు భూతకాలము నందలి వేయి తరములవారిని, భవిష్యత్తులోని వేయి తరములవారిని విష్ణులోక నివాసార్హులనుగ చేయును. శ్రీకృష్ణుని ఆలయమును నిర్మించినవాని పితరులు వెంటనే నరకదుఃఖము నుండి విముక్తులై, దివ్యవస్త్రాభరణాదులు ధరించి ఆనందముతో విష్ణు లోకమున నివసింతురు. దేవాలయ నిర్మాణము బ్రహ్మహత్యాది పాపములను తొలగించును. యజ్ఞము చేయుటవలన కలుగని ఫలములు గూడ దేవాలయ నిర్మాణముచే కలుగును. దేవాలయ నిర్మాణము వలన సమస్త తీర్థములందును స్నానము చేసిన ఫలము కలుగును.

దేవతా బ్రాహ్మణాదుల రక్షణము నిమిత్తము రణభూమిలో ప్రాణత్యాగము చేసిన వీరునకు ఏ ఫలము లభించునో ఆ ఫలము దేవాలయ నిర్మాణము చేయువానికి లభించును. లోభముచే మట్టితో దేవాలయము కట్టించినవానికి గూడ స్వర్గముగాని దివ్యలోకముగాని లభించును. ఏకాయ తన దేవాలయము (ఒకే దేవతా విగ్రహమునకై ఒకగదిగల ఆలయము) నిర్మించినవాడు స్వర్గమును పొందును. త్ర్యాయతన దేవాలయమును నిర్మించినవాడు బ్రహ్మలోకములో నివసించును. పంచాయ తన దేవాలయమును నిర్మించినవాడు శివలోకమును చేరును. అష్టాయతన మందిరము నిర్మించిన వాడు శ్రీహరి సాన్నిధ్యము నందుండును. షోడశాయతన దేవాలయ నిర్మాణము చేసినవాడు భోగ మును, మోక్షమును కూడా పొందును. శ్రీహరి దేవాలయములలో కనిష్ఠము, మధ్యమము, శ్రేష్ఠము అను మూడు శ్రేణులున్నవి. వీటి నిర్మాణము వలన క్రమముగ స్వర్గలోక, విష్ణులోక, మోక్షములు ప్రాప్తించును. ధనవంతుడు శ్రేష్ఠ శ్రేణికి చెందిన విష్ణ్వాలయమును నిర్మించుటచే ఎట్టి ఫలితమును పొందునో ఆ ఫలితమునే కనిష్ఠ శ్రేణికి చెందిన దేవాలయమును నిర్మించిన నిర్ధనుడు పొందును. తాను సంపాదించిన ధనములో స్వల్ప ధనమును మాత్రమే వెచ్చించి దేవాలయమును నిర్మించినను భక్తుడు అధికమగు పుణ్యమును, భగవంతుని అనుగ్రహమును పొందును. ఒక లక్షగాని, ఒక వెయ్యిగాని, నూరు గాని, దానిలో సగముగాని ముద్రలను ఖర్చుచేసి విష్ణు మందిరమును నిర్మించు వ్యక్తి శ్రీ మహావిష్ణు లోకమును తప్పకచేరును.

బాల్యమునందు ఆటలు ఆడుచు మట్టితో విష్ణువు ఆలయమును నిర్మించినవారు కూడ విష్ణు లోకమును చేరుదురు. తీర్థములందు, పవిత్ర స్థానములందు, సిద్ధ క్షేత్రము లందు, ఆశ్రమములందు విష్ణ్వాలయము నిర్మించు వారికి ఇతర ప్రదేశములందు నిర్మించువారి కంటె మూడు రెట్లు ఎక్కువ ఫలము లభించును. విష్ణువు ఆలయమునకు వెల్లవేసిన వారును, దానిపై బంధూక పుష్పముల చిత్రములు వేసినవారును విష్ణు లోకమును పొందుదురు. కూలిపోయిన లేదా కూలిపోవుచున్న లేదా సగము కూలిపోయిన దేవాలయమును జీర్ణోద్ధారణము చేసినవానికి క్రొత్తదేవాలయము నిర్మించిన వానికంటె రెట్టింపు ఫలము లభించును. కూలిపోయిన విష్ణువు ఆలయమును మరల నిర్మించి రక్షించినవాడు సాక్షాత్ భగవత్స్వరూపుడు. భగవంతుని ఆలయమునందు ఇటుకలు ఎంత కాలము ఉండునో అంతవరకును, వాటిని నిర్మించినవాడు, తన కులముతో కూడ, విష్ణు లోకములో ఉండును. ఇహలోకమునందును, పరలోకమునందును కూడ ఆతడే పూజనీయుడు; ఆతడే పుణ్యవంతుడు.

శ్రీకృష్ణునకు ఆలయము కట్టించిన పుణ్యాత్ముడే పుట్టినవారిలో లెక్క. ఆతడే తన వంశమును రక్షించువాడు. విష్ణు, శివ, సూర్య, దేవ్యాదులకు ఆలయమును నిర్మించు వాడే ఈ లోకమునందు కీర్తి పొందును. ఎంతో శ్రమపడి సంపాదించిన ధనమును, శ్రీకృష్ణాలయమును నిర్మించుటకు వినియోగింపక, కేవలము దానిని రక్షించుచుండు మూర్ఖునకు దానివల్ల ఏమి ప్రయోజనము కలుగును? పితరులు, బ్రాహ్మణులు, దేవతలు – వీరికై తన ధనమును వినియోగించనివాని ధనము, బంధువులకు ఉపకరించని వాని ధనము వ్యర్థము. దానమునకుగాని, భోగమునకు గాని, ధర్మాచరణమునకుగాని, కీర్తికొరకు గాని ఉపకరించని ధనమునకు స్వామి అయి ఏమి ప్రయోజనము? అందుచే పూర్వ జన్మ అదృష్టముచేత గాని, పురుష ప్రయత్నముచేత గాని, మరి ఏ ఉపాయాంత రముచేత గాని లభించిన ధనమును ఉత్తమ బ్రాహ్మణులకు దానము చేయవలెను; స్థిర కీర్తి లభించుటకు ఉపయోగించవలెను. దాన కీర్త్యాదుల కంటె గూడ దేవాలయ నిర్మాణము ఉత్తమమైనది కాన బుద్ధిమంతుడు విష్ణాది దేవతలకు ఆలయములు కట్టించవలెను. భక్తి మంతుడు అగు పురుషుడు దేవాలయమును నిర్మించి, దానిలో దేవతా ప్రతిష్ఠ చేసినాడనగా, ఆతడు చరాచర రూపములగు ముల్లోకములకును భవనము నిర్మించినాడని అర్థము. భూత వర్తమాన భవిష్యత్కాలము లకు చెందిన, స్థూల–సూక్ష్మరూపము. తద్భిన్నము అయిన బ్రహ్మాది స్తంభాంతమగు ప్రపంచ మంతయు మహావిష్ణువు నుండియే జనించినది. దేవాది దేవుడును, సర్వవ్యాపకుడును, మహాత్ముడును అగు అట్టి విష్ణువునకు ఆలయమును నిర్మించినవాడు మరల ఈ సంసారమునందు జనింపడు. శివ, బ్రహ్మ, సూర్య, గణేశ, దుర్గా, లక్ష్మ్యాది దేవతలకు ఆలయమును నిర్మించినవారికి గూడ విష్ణ్వాలయమును నిర్మిం చినవారికి లభించు ఫలము లభించును. దేవతాప్రతిమను నిర్మింపచేసిన వారికి ఆలయ నిర్మాణము చేయించినవారికంటె గూడ అధిక ఫలము లభించును. దేవతా ప్రతిమా స్థాపన రూపమగు యజ్ఞము వలన లభించు ఫలము అనంతము. మట్టితో చేసిన ప్రతిమకంటె కఱ్ఱతో చేసిన ప్రతిమ ఉత్తమమైనది. దానికంటె ఇటుకలతో నిర్మించినది, దానికంటె ఱాయితో నిర్మించినది, దానికంటె సువర్ణాది లోహములతో నిర్మించినది శ్రేష్ఠమైనది, దేవాలయ ప్రారంభము చేసినంత మాత్రముననే ఏడు జన్మల పాపము నశించును. నిర్మించువాడు స్వర్గలోక ప్రాప్తికి అధికారియగును. అతడు నరకమునకు వెళ్ళడు. అంతే కాదు ఆతడు తన వంశములోని నూరు తరముల వారిని విష్ణులోకమునకు పంపును. యమధర్మరాజు తన దూతలతో, దేవాలయములు నిర్మించువారిని గూర్చి ఇట్లు చెప్పెను.

యమధర్మరాజు ఇట్లు చెప్పెను : "దేవ ప్రతిమానిర్మాణము చేసిన వారిని, దానికి పూజలు సలిపిన వారిని మీరు నరకమునకు తీసికొని రాకూడదు. దేవాలయాదులను నిర్మింపనివారిని మాత్రమే తీసికొని రావలెను. మీరందరు లోకములలో సంచరించుచు నా ఆజ్ఞను పాలింపుడు. ప్రపంచమునందలి ఏ ప్రాణియు మీ ఆజ్ఞను ధిక్కరింపజాలడు. జగత్పితయైన అనంతుని శరణు జొచ్చిన వారిని మాత్రము మీరు విడచివేయవలెను. వారికి ఈ లోకములో నివాసముండదు. భగవంతునిపై చిత్తము లగ్నముచేసి, భగవంతుని శరణుజొచ్చిన భగవద్భక్తులగు మహాత్ములను, సదా విష్ణుపూజ చేయువారిని మీరు విడిచి వేయవలెను. నిలచినపుడుగాని, నిద్రించినపుడు గాని,

నడచునపుడుగాని, అన్ని నేల లందును శ్రీకృష్ణ నామస్మరణము చేయువారి దరికిపోవలదు. నిత్య నైమిత్తిక కర్మల ద్వారా జనార్దనుని పూజ చేయువారి వైపు కన్నెత్తియైనను చూడవలదు. అట్టి భగవద్వ్రత శీలులు భగవంతునే చేరుదురు.

పుష్పములు, ధూపము, వస్త్రములు మొదలగు అలంకారములను సమర్పించి భగవంతుని పూజచేయువారి జాడలకు పోవలదు. వారు శ్రీకృష్ణుని చేరినవారు. దేవాలయ ములందు అలికి ముగ్గులు వేయువారి పుత్రులను, వంశీయులను కూడ విడచివేయవలెను. విష్ణ్వాలయమును నిర్మించినవారి వంశములో నూరు తరముల వరకును మీరు ఎవ్వరిని దుష్ట భావముతో చూడరాదు. కఱ్ఱతో గాని, మట్టితోగాని, ఊతితోగాని విష్ణువునకు ఆలయము కట్టించినవాడు సమస్త పాప నిర్ముక్తుడు అగును. ప్రతిదినము యజ్ఞములు చేసి భగవదారాధన చేయువానికి లభించు ఫలమే విష్ణ్వాలయము నిర్మించినవానికి గూడ కలుగును. విష్ణ్వాలయము కట్టించినవాడు తన వంశము నందలి వెనుకటి నూరుగురిని, రాబోవు నూరుగురిని విష్ణు లోకమునకు పంపును. మహావిష్ణువు సప్తలోక మయుడు. అట్టి విష్ణుమూర్తికి ఆలయము కట్టించువాడు తన వంశమును తరింపచేయును. తన వంశీయులకు అక్షయ పుణ్యలోక ప్రాప్తి కలుగునట్లు చేయును. తాను కూడ అక్షయ లోకములను పొందును. దేవాలయములోని ఇటుకల కట్టుబడి ఎన్ని సంవత్సరములు ఉండునో అన్ని వేల సంవత్సరములపాటు ఆ దేవాలయ నిర్మాత స్వర్గ లోకములో నుండును. భగవత్ప్రతిమ నిర్మించువాడు విష్ణులోకము చేరును. దానిని స్థాపించినవాడు భగవంతునిలో లీనమగును. దేవాలయము నిర్మించి దానిలో ప్రతిమా స్థాపన చేసిన వాడు సర్వదా విష్ణు లోకములో నివసించును."

అగ్నిదేవుడు పలికెను : యమధర్మరాజు ఇచ్చిన ఈ ఆజ్ఞ ప్రకారము, యమదూతలు విష్ణు స్థాపనాది పుణ్య కార్యములు చేసినవారిని యమలోకమునకు తీసికొని వెళ్ళరు. దేవాలయాది ప్రతిష్ఠాది విధానమును గూర్చి హయగ్రీవుడు బ్రహ్మతో వర్ణించి చెప్పెను.(38)

భూ పరిగ్రహ వర్ణనము

హయగ్రీవుడు చెప్పెను : బ్రహ్మా! ఇపుడు నేను విష్ణ్వాది దేవతా ప్రతిష్ఠను గూర్చి చెప్పెదను; సావధానముగ వినుము. ఈ విషయము నేను చెప్పిన పంచరాత్ర సప్త రాత్రములను ఋషులు మానవ లోకమునందు ప్రచారము చేసిరి. ఆది హయశీర్ష తంత్రము, త్రైలోక్య మోహనతంత్రము, వైభవ తంత్రము, పుష్కర తంత్రము, ప్రహ్లాద తంత్రము, గార్గ్య తంత్రము, గాలవ తంత్రము, నారదీయ తంత్రము, శ్రీ ప్రశ్న తంత్రము, శాండిల్య తంత్రము, ఈశ్వర తంత్రము, సత్య తంత్రము, శౌనక తంత్రము, వసిష్ఠోక్త జ్ఞాన సాగర తంత్రము, స్వాయంభువ తంత్రము, కాపిల తంత్రము. తార్క్ష్య (గారుడ) తంత్రము, నారాయణీయ తంత్రము, ఆత్రేయ తంత్రము, నారసింహ తంత్రము, ఆనంద తంత్రము, బౌధాయన తంత్రము, అష్టాంగ తంత్రము, విశ్వ తంత్రము అని అవి మొత్తము ఇరువదియైదు తంత్రములు.

ఈ తంత్రముల ప్రకారము – మధ్య దేశాదులలో జనించిన ద్విజుడు దేవతా విగ్రహముల ప్రతిష్ఠ చేయవలెను. కచ్ఛ దేశము, కావేరీతటవర్తి దేశము, కోంకణ దేశము, కామరూప, కళింగ,

కాంచీ, కాశ్మీర దేశములు వీటియందు పుట్టిన బ్రాహ్మణుడు దేవ ప్రతిష్ఠాదికము చేయరాదు. ఆకాశము, వాయువు, తేజస్సు, జలము, పృథివి అను మహాభూతములే పంచరాత్రములు. చేతనా శూన్యములై, అజ్ఞానాంధకారముచే కప్పబడినవి పంచరాత్రరహితములు, “నేను పాపవిముక్తుడనైన పరబ్రహ్మను, విష్ణువును” అను భావన కలవాడే దేశికుడు అగును. అతడు బాహ్య లక్షణములు వేషాదికము ఏవియు లేకున్నను తంత్రవేత్తయైన ఆచార్యుడుగా చెప్పబడినాడు.

దేవతా విగ్రహమును నగరాభిముఖముగ స్థాపింపవలెను; దేవతల పృష్ఠభాగము నగరము వైపు ఉండగూడదు. దేవాలయ నిర్మాణమును కురుక్షేత్రగయాది తీర్థ స్థానములందు గాని, నదీ సమీపమునందు గాని చేయవలెను. బ్రహ్మాలయమును నగర మధ్యము నందును, ఇంద్రాలయమును నగరమునకు తూర్పునను నిర్మించిన ఉత్తమమని చెప్పబడినది. అగ్నిదేవునకు, మాతృకలకును ఆగ్నేయ దిక్కునందును, భూతగణములకు, యమధర్మరాజునకును దక్షిణమునను, చండికా, పితృగణ, దైత్యాదులకు నైరృతి దిక్కునందును, వరుణునకు పశ్చిమమునందును, వాయుదేవునకు, నాగులకు వాయవ్య దిక్కునందును, యక్షులకు లేదా కుబేరునకు ఉత్తరమునందును చండీశ మహేశునకు ఈశాన్యమునందును ఆలయమును నిర్మింపవలెను. విష్ణ్వాలయము అన్ని దిక్కులందును నిర్మింప వచ్చును. బుద్ధిమంతుడెన్నడును, పూర్వము నుండియు ఉన్న దేవాలయమును చిన్నదిచేసి చిన్న దేవాలయమునుగాని, సమానమైనదానినిగాని, విశాలమైన దానినిగాని నిర్మింపరాదు. ఏదైన ఒక దేవాలయమునకు సమీపమున దేవాలయము నిర్మించునపుడు రెండు దేవాలయముల మొత్తము ఎత్తుకు రెట్టింపు సీమా ప్రదేశము విడచి నూతన దేవాలయమును నిర్మింపవలెను. విద్వాంసుడు రెండు దేవాలయములకును పీడ కలుగకుండునట్లు చూడవలెను.

భూమి శోధనానంతరము భూ పరిగ్రహము చేయవలెను. పిమ్మట ప్రాకారము సరిహద్దు వరకు మినుములు, పసుపు, పేలాలు, పెరుగు, సక్తువులు వీటితో భూతబలి ఇవ్వవలెను. అష్టాక్షర మంత్రము చదువుచు, “ఈ ప్రదేశము నందు నివసించు రాక్షస పిశాచాదులు ఇచటి నుండి తొలగిపోవుగాక, నేను ఇచట మహావిష్ణ్వాలయమును నిర్మింపనున్నాను”అని చెప్పుచు, ఎనిమిది దిక్కులందును సక్తువులు చల్లవలెను. భూమిని నాగలిచే దున్నించి, ఆవులను దానిపై నడిపింపవలెను. ఎనిమిది పరమాణువులు ఒక రథరేణువు. ఎనిమిది రథరేణువులు ఒక త్రసరేణువు. ఎనిమిది త్రసరేణువులు ఒక వాలాగ్రము. ఎనిమిది వాలాగ్రములు ఒక లిక్ష. ఎనిమిది లిక్షలు ఒక మూర. ఎనిమిది మూరలు ఒక యవమధ్యము. ఎనిమిదియవలు ఒకఅంగుళము. ఇరువదినాలుగు అంగుళములు ఒక కరము. ఇరువది యెనిమిది అంగుళములు ఒక పద్మహస్తము. (39)

అర్ఘ్య దాన శల్య కథనము

భగవంతుడైన హయగ్రీవుడు చెప్పెను : “ఓ బ్రహ్మదేవా! పూర్వము సమస్త ప్రాణులకును భయంకరమైన ఒక మహాభూతము ఉండెను. దానిని దేవతలు భూమిలో పాతిపెట్టిరి. దానికే వాస్తు పురుషుడని పేరు. అరువది నాలుగు పదముల క్షేత్రమునందు అర్ధకోణము నందున్న ఈశుని

ఘృతాక్షతలచే తృప్తి పరుపవలెను. ఒక పదమునందు ఉన్న పర్జన్యుని కమల జలములచేతను, రెండు పదములలో ఉన్న జయంతుని పతాక చేతను, రెండు కోష్ఠములందు ఉన్న ఇంద్రుని కూడ అదే విధముననను, రెండు పదములలో ఉన్న సూర్యుని, ఎఱ్ఱని అన్ని పదార్థముల చేతను, రెండు పదములపై ఉన్న సత్యుని వితానము (చాందనీ) చేతను, ఒక పదమునందున్న భృశుని ఘృతము చేతను, అగ్ని కోణమునందలి అర్ధకోణమునందున్న ఆకాశమును శాకునమను ఓషధి జిగురుచేతను, ఆ కోణము నందే రెండవ అర్ధపదము నందున్న అగ్ని దేవుని స్రుక్కుచేతను, ఒక పదమునందున్న పూషుని లాజలచేతను, రెండు పదములపై ఉన్న వితథుని స్వర్ణము చేతను, ఒక పదముపై ఉన్న గృహక్షతుని వెన్నచేతను, ఒక పదముపై ఉన్న యమధర్మరాజును మాంసాన్నము చేతను, రెండు పదములపై ఉన్న గంధర్వుని గంధముచేతను, ఒక పదముపై ఉన్న భృంగుని శాకున జిహ్వాఅను ఓషధిచేతను, అర్ధపదముపై ఉన్న మృగమును నీలిబట్ట చేతను, అర్ధకోష్ఠము నిమ్న భాగమునందున్న పితృగణమును పులగముచేతను, ఒక పదముపై నున్న ద్వారపాలకుని దంతకాష్ఠముచేతను, రెండు పదములపై ఉన్న సుగ్రీవుని యవలతో చేసిన పదార్థముచేతను తృప్తిపరుపవలెను.

రెండు పదములపై ఉన్న పుష్పదంతుని కుశతృణముల చేతను, రెండు పదములపై ఉన్న వరుణుని పద్మములచేతను, రెండు పదములపై ఉన్న అసురుని సురచేతను, ఒక పదముపై ఉన్న ఆదిశేషుని నేయి కలిపిన జలముచేతను, అర్ధ పదముపై ఉన్న పాపమును యవాన్నముచేతను, అర్ధపదముపై ఉన్న రోగమును గంజిచేతను, ఒక పదముపై ఉన్న నాగమును నాగ పుష్పముచేతను, రెండు పదములపై ఉన్న ముఖ్యుని భక్ష్య పదార్థముల చేతను, ఒక పదముపై ఉన్న భల్లాటుని పెసల అన్నముచేతను, ఒక పదముపై ఉన్న సోముని తేనెతో కూడిన పాయసము చేతను, రెండు పదములపై ఉన్న ఋషిని శాలూకము చేతను, ఒక పదముపై ఉన్న అదితిని లోపికచేతను, అర్ధపదముపై నున్న దితిని పూరీల చేతను తృప్తిపరుపవలెను. ఈశాన్య దిశయందున్న ఈశునికి క్రింద అర్ధపదముపై నున్న ఆవుని పాలచేతను, క్రింద అర్ధపదముపై నున్న ఆపవత్సుని దధిచేతను తృప్తిపరుపవలెను. తూర్పున నాలుగు కోష్ఠములపై ఉన్న మరీచిని లడ్డూలచే తృప్తి పరుపవలెను. బ్రహ్మకు పైనున్న కోణమందు అర్ధ పదముపై ఉన్న సావిత్రునకు రక్త పుష్పములు నివేదించవలెను. దాని క్రిందనున్న అర్ధకోణమునందున్న సవితకు కుశోదకములు ఈయవలెను. నాలుగు పదములపై ఉన్న వివస్వంతునకు రక్త చందనమును, నైరృతి దిక్కున ఉన్న కోణమునందలి అర్ధకోష్ఠము నందు ఉన్న సురాధిపతియైన ఇంద్రునకు పసుపు నీళ్ళతో అర్ఘ్యమును ఇవ్వవలెను. దాని అర్ధభాగమునందే కోణమునందలి కోష్ఠమునందున్న ఇంద్రజయునకు నెయ్యి అర్ఘ్యముగా ఇవ్వవలెను. చతుష్పదము నందలి మిత్రునకు గుణయుక్తమగు పాయసము సమర్పింపవలెను. వాయవ్య కోణమున అర్ధకోష్ఠ ముపై ఉన్న రుద్రునకు పక్వ మాంసమును ఇవ్వవలెను. దాని క్రింద అర్ధకోష్ఠమునందున్న యక్షునకు (రుద్రదాసునకు (ద్రాక్ష మొదలగు) ఆర్ద్ర ఫలములు ఇవ్వవలెను. చతుష్పదమునందున్న పర్వతమునకు మాంసాన్నమును, మాషమును బలి ఇవ్వవలెను. మధ్యలో ఉన్న నాలుగు కోష్ఠములందును బ్రహ్మకొరకై తిలతండులములు ఉంచవలెను. చరకిని మాంసఘృతముల చేతను, కుమారస్వామిని పులగముచేతను, రక్తముచేతను, విదారిని రక్త కమలములచేతను, కందర్పుని ఒక పలము అన్నము

చేతను, పూతనను ఫల పిత్తములచేతను, జంభకుని మాంసరక్తములచేతను, పాపరక్షసుని పిత్త, రక్త, అస్థులచేతను, పిలిపిత్సుని మాలికల చేతను, రక్తము చేతను తృప్తిపరుపవలెను. పిదప ఈశానాది దిక్పాలకులకు రక్త మాంసమును సమర్పింపవలెను. ఆయా వస్తువులు లభింపనపుడు అక్షతలు సమర్పింపవలెను. రాక్షస, మాతృకా, గణ, పిశాచ, పితృ, క్షేత్రపాలాదులకు కూడ ఇచ్ఛాను సారముగా బలిప్రదానము చేయవలెను.

వాస్తు, హోమ, బలిప్రదానాదులచే ఈ దేవతలకు తృప్తి కలిగించకుండ ప్రాసాదాది నిర్మాణము చేయరాదు. బ్రహ్మస్థానమున శ్రీహరి, లక్ష్మీ, గణదేవతలను పూజింపవలెను. పిమ్మట భూమిని, వాస్తుపురుషుని, వర్ధనీ (మూకుడు) యుక్త కలశములను పూజింపవలెను. కలశ మధ్యమున బ్రహ్మను దిక్పాలకులను పూజింపవలెను. స్వస్తి వాచనముచేసి, ప్రణమించి, పూర్ణాహుతి చేయవలెను. ఓ బ్రహ్మదేవా! పిమ్మట గృహస్వామి రంధ్రములుగల ఒక జలపాత్ర హస్తమున ధరించి విధి పూర్వకముగా దక్షిణావర్త మండలములు చేయుచు సూత్రమార్గమున జలధారను త్రిప్పవలెను. పిమ్మట వెనుకటివలె అదే మార్గమున ఏడు బీజములు నాటవలెను. అదే మార్గమున గొయ్యి త్రవ్వుట ప్రారంభింపవలెను. పిమ్మట మధ్యయందు ఒక హస్తము వెడల్పు, నాలుగు అంగుళములు లోతుగల గొయ్యి త్రవ్వవలెను. దానిని అలికి పూజాప్రారంభము చేయవలెను. అన్నింటి కంటెను ముందుగ నాలుగు భుజములు ధరించిన శ్రీ మహావిష్ణువును ధ్యానించి కలశతో అర్ఘ్య ప్రదానము చేయవలెను, పిదప జారీతో నీళ్లుపోసి ఆ గొయ్యి నింపి దానిలో తెల్లని పుష్పములు వేయవలెను. శ్రేష్ఠమైన ఆ దక్షిణావర్త గర్తమును విత్తనములతోడను, మట్టితోడను నింపవలెను. ఈ విధముగ అర్ఘ్య ప్రదాన కార్యము ముగించి, ఆచార్యునకు గోవస్త్రాది దానములు ఈయవలెను. జ్యోతిష్కుని, స్థపతినిగూడ యథోచితముగ సత్కరించి విష్ణుభక్తులను, సూర్యుని పూజింపవలెను. పిమ్మట భూమిని ప్రయత్న పూర్వకముగ, నీరు వచ్చునంతవరకును తవ్వవలెను. మనిషిలోతు క్రింద శల్యములున్నను గృహము నకు దోషములేదు. శల్యములున్నచో ఇంటి గోడ విరిగిపోవును. గృహపతికి సుఖము ఉండదు. తవ్వు చున్నపుడు ఏ జంతువుపేరు వినబడునో ఆ జంతువు శల్యమే అక్కడ నుండునని తెలియవలెను. (40)

శిలావిన్యాస విధి

హయగ్రీవుడు చెప్పెను : శిలాన్యాస రూపమగు పాద ప్రతిష్ఠను గూర్చి చెప్పెదను వినుము. మొదట మండపము నిర్మించి పిదప దానిపై నాలుగు కుండములు నిర్మింప వలెను. ఆ కుండములు క్రమముగ కుంభన్యాస, ఇష్టకాన్యాస, ద్వార, స్తంభములకు మంగళకరమైన ఆశ్రయములుగా ఉండును. కుండములోని నాలుగు వంతులలో మూడు వంతుల భాగము కంకర మొదలైన వాటితో నింపి, సమముచేసి, దానిపై వాస్తు దేవతా పూజచేయవలెను. పునాదిలో వేయు ఇటుకలు బాగుగా కాలినవై ఉండవలెను. వాటి పొడవు పండ్రెండు అంగుళములు, దళసరి పొడవులో మూడవ వంతు, అనగా నాలుగు అంగుళములు ఉండవలెను. ఱాళ్లతో దేవాలయమును నిర్మింప దలచిన పక్షమున ఇటుకలకు బదులు ఱాళ్లనే పునాదిలో వేయవలెను. ఒక్కొక్క ఱాయి హస్తము పొడవు ఉండవలెను. తొమ్మిది రాగికలశములుగాని, మట్టికలశములుగాని స్థాపింపవలెను. ఆ

కలశములను జలముతోను, సర్వౌషధులతోను, చందనము కలిపిన జలముతోను నింపవలెను. వాటిలో బంగారము, ధాన్యములు మొదలగునవి కూడవేసి, గంధాదులతో పూజించి, ఆ జలపూర్ణ కలశలతో "ఆపోహిష్ఠామ" ఇత్యాది ఋక్ త్రయమును, "శంనోదేవీ రభిష్టయ" ఇత్యాది మంత్రమును, "తరత్సమన్దీః" ఇత్యాది మంత్రమును, పాపమాన ఋక్కులను, 'ఉదుత్తమం వరుణ', 'కయానః", 'వరుణ స్యోత్తమ్భనమసి' ఇత్యాది మంత్రములను పఠించుచు, 'హంసః శుచిషత్" ఇత్యాది మంత్రమును, శ్రీ సూక్తమును కూడ పఠించుచు, అధిక సంఖ్యాకములగు శిలలను, ఇటుకలను తుడువవలెను. వాటిని పునా దిలో స్థాపించి, మండపములోపల, ఒక శయ్యపై, పూర్వమండలము నందు శ్రీ మహా విష్ణువును పూజింపవలెను. అరణిని మథించి పుట్టించిన అగ్నియందు ద్వాదశాక్షర మంత్రమును పఠించుచు, సమిధలను హోమము చేయవలెను.

ఆఘారము, ఆజ్యభాగమను ఆహుతులను ప్రణవముతో చేయవలెను. పిమ్మట అష్టాక్షర మంత్రముతో ఎనిమిది ఆహుతులిచ్చి "ఓం భూః స్వాహా" "ఓం భువః స్వాహా" "ఓం సువః స్వాహా" అని మూడు వ్యాహృతులతో క్రమముగా లోకేశ్వరుడైన అగ్నికిని, సోమగ్రహమునకును, శ్రీమహావిష్ణువునకును ఆహుతులు అర్పింపవలెను. పిమ్మట ప్రాయ శ్చిత్త హోమముచేసి, ప్రణవయుక్తమగు ద్వాదశాక్షరమంత్రముతో మినుములు, ఘృతము, తిలలు కలిపి పూర్ణాహుతి చేయవలెను. పిమ్మట ఆచార్యుడు పూర్వాభిముఖుడై, ఎనిమిది దిక్కులందు స్థాపించిన కలశములపై వేరువేరుగ పద్మాది దేవతలను స్థాపించి పూజింపవలెను. మధ్యయందు కూడ భూమి అలికి, ఒక శిలను కలశమును స్థాపింపవలెను. ఈ తొమ్మిది కలశములపై ఈ క్రింద చెప్పిన దేవతలను స్థాపింపవలెను. పద్మ, మహాపద్మ, మకర, కచ్ఛప, కుముద, ఆనంద, పద్మ శంఖములను ఎనిమిది కలశములపై స్థాపించి, పద్మినిని మధ్యనున్న కలశముపై స్థాపించవలెను.

ఈ కలశములను కదపగూడదు. వాటి సమీపమున తూర్పు నుండి ప్రారంభించి ఈశాన్యదిక్కు వరకును ఒక్కొక్క ఇటుక ఉంచవలెను. వాటిపై వాటి దేవతలైన విమల మొదలగు శక్తులను స్థాపింపవలెను. మధ్య అనుగ్రహ అను దేవతను స్థాపింపవలెను. పిమ్మట – "ముని శ్రేష్ఠుడైన అంగిరసుని పుత్రియైన ఓ ఇష్టకాదేవీ! నీ ఏ అవయవము కూడ విరుగలేదు, వికృతము కాలేదు. నీవు నీ సర్వాంగములతో పూర్ణమై యున్నావు. ఇపుడు నిన్ను నేను ప్రతిష్ఠించుచున్నాను అని" ప్రార్థింపవలెను. ఉత్తముడైన ఆచార్యుడు ఈ మంత్రముతో ఇష్టకా స్థాపనముచేసి, ఏకాగ్రచిత్తుడై మధ్యప్రదేశమునందు గర్భాదానము చేయవలెను. దాని విధి–ఒక కలశముపై శ్రీ మహావిష్ణువును, శ్రీ మహాలక్ష్మిని స్థాపించి వారి సమీపమున మట్టి, పుష్పములు, ధాతువులు, రత్నములు ఉంచవలెను. పిమ్మట పండ్రెండు అంగుళముల వైశాల్యము, నాలుగు అంగుళముల ఎత్తుగల, లోహాది నిర్మితమగు గర్భపాత్రలో అస్త్రపూజ చేయవలెను. పిమ్మట కమలాకారమగు తామ్రపాత్రలో పృథివిని పూజించి ఈ విధముగ ప్రార్థింపవలెను.

"సకల భూతముల అధీశ్వరివైన ఓ భూదేవీ! పర్వతాసనముపై విరాజిల్లుచు, సము ద్రములచే చుట్టబడియున్న నీవు ఏకాంతమునందు గర్భధారణము చేయుము. వసిష్ఠ కన్యవైన ఓ నందా!

వసువులతోడను, ప్రజలతోడను కూడియున్న నీవు నన్ను ఆనందింప చేయుము. భార్గవ పుత్రివైన ఓ జయా! నీవు ప్రజలకు విజయము నిచ్చుదానవు. నాకు కూడ విజయము నిమ్ము. అంగిరసుని పుత్రివైన ఓ పూర్ణా! నీవు నా కోరికలను తీర్పుము. కశ్యపమహర్షి పుత్రికవైన ఓ భద్రా! నీవు నాకు కల్యాణమైన బుద్ధినిమ్ము. సకల బీజములతోనిండి, సమస్త రత్నౌషధులతో సంపన్నమైన, సుందరియైన ఓ జయా దేవీ! వసిష్ఠ పుత్రికయైన ఓ నందాదేవీ! ఇచట ఆనందపూర్వకముగ రమింపుము. కశ్యపుని కన్యయైన ఓ భద్రా! నీవు ప్రజాపతికి పుత్రివి. నాలుగు దిక్కులందును వ్యాపించినదానవు. చాలగొప్పదానవు. సుందరివి, మనోహరమైన దానవు ఈ గృహమునందు రమింపుము. ఓ భార్గవీ దేవీ! నీవు చాల ఆశ్చర్యమయురాలవు. గంధమాల్యాదులతో పూజింపబడి ప్రకాశించుచున్నావు. జనులకు ఐశ్వర్య మునిచ్చు ఓ దేవీ! నీవీ గృహమునందు విహరింపుము. ఈదేశాధిపతికిని, నగరాధిపతికిని, గృహాధిపతికిని, దీనియందు నివసించు బాలాదులకును, మనుష్యాది ప్రాణులకును ఆనందము కలిగించుటకై పశ్వాదులను వృద్ధి పొందింపుము.” ఈ విధముగా ప్రార్థించి వాస్తు కుండమును గోమూత్రముతో తడుపవలెను.

ఈ విధి అంతయు పూర్తిచేసి కుండమునందు గర్భమును స్థాపింపవలెను. ఆ సమయమున ఆచార్యునకు గోవస్త్రాది దానమును, ఇతరులకు అన్నదానమును చేయవలెను. ఈ విధముగ గర్భపాత్రనుంచి, ఇటుకలను కూడ ఉంచి ఆ కుండమును నింపవలెను. పిమ్మట దేవాలయము ఎత్తును అనుసరించి ప్రధాన దేవతకు పీఠమును నిర్మింప వలెను. ఆలయము వైశాల్యములో సగము ఎంతయో అంత ఎత్తుగల పీఠము ఉత్తమ పీఠము. దానికంటె నాల్గవ వంతు ఎత్తు తగ్గినది మధ్యమ పీఠము. ఉత్తమ పీఠము ఎత్తులో సగముఎత్తు ఉన్నది కనిష్ఠ పీఠము. పీఠ బంధము చేసినపిమ్మట మరల వాస్తు పూజ చేయవలెను. కేవల పాదప్రతిష్ఠ చేయువాడుకూడ సకల పాపవిముక్తుడై దేవ లోకములో ఆనందమును అనుభవించును.

“నేను దేవాలయ నిర్మాణము చేసెదను” అని సంకల్పించిన వాని శారీరక పాపములు అన్నియు ఆ దివసముననే నశించిపోవును. యథాశాస్త్రముగా దేవాలయ నిర్మాణము చేయువాని మాట చెప్పవలెనా! ఎనిమిది ఇటుకలతో దేవాలయము నిర్మించిన వానికి కలుగు ఫలముకూడ వర్ణింప శక్యము కానిది. దీనినిబట్టి విశాలమైన దేవాలయములను నిర్మించిన వానికి కలుగు ఫలమును ఊహించు కొనవచ్చును.

గ్రామ మధ్యము నందుగాని, గ్రామమునకు తూర్పుగాగాని దేవాలయమును నిర్మించినచో దాని ద్వారము పశ్చిమమునకు ఉండవలెను. విదిక్కులందు నిర్మించినచో దాని ద్వారము గ్రామాభి ముఖ ముగ ఉండవలెను. గ్రామమునకు దక్షిణ, ఉత్తర, పశ్చిమ దిక్కులందు నిర్మించిన దేవాలయము ద్వారము తూర్పువైపు ఉండవలెను. (41)

ప్రాసాద లక్షణము

హయగ్రీవుడు పలికెను – ఇపుడు సర్వసాధారణమైన దేవాలయమును గూర్చి చెప్పెదను, వినుము. దేవాలయమును నిర్మింపదలచిన విద్వాంసుడు, నలుపలకలగా ఉన్న క్షేత్రమును పదునారు

భాగములుగా విభజింపవలెను. వాటిలో మధ్యనున్న నాలుగు భాగములతో ఆయముతోకూడిన గర్భమును నిశ్చయించి, మిగిలిన పండ్రెండు భాగము లను గోడల నిమిత్తము నిర్ణయించుకొనవలెను. పై పండ్రెండు భాగములలో నాలుగు భాగముల పొడవు ఎంత ఉండునో, గోడల ఎత్తు అంత ఉండవలెను, శిఖరము ఎత్తు గోడల ఎత్తునకు రెట్టింపు ఉంచవలెను. శిఖరము ఎత్తులో నాల్గవవంతు ఎత్తు దేవాలయ పరిక్రమ ఎత్తు ఉంచవలెను. రెండు పార్శ్వములందును ఉన్నమార్గము (ద్వారముల) కొలత ఈ కొలతను బట్టియే ఉండవలెను. ఆ ద్వారములు సమాన ప్రమాణములై ఉండవలెను. ఆలయము ఎదుటనున్న ప్రదేశము విస్తారము కూడ శిఖరముతో సమానముగా ఉండవలెను. అందముగా ఉండుటకై దాని విస్తారము శిఖముకంటె రెట్టింపు ఉండునట్లు కూడ చేయవచ్చును. ఆలయము ఎదుటనున్న సభా మండపము విస్తారము, గర్భ సూత్రము నకు రెట్టింపు ఉండవలెను. దేవాలయ పాద స్తంభముల పొడవు గోడపొడవుతో సమముగా ఉండవలెను, వాటికి మధ్య స్తంభములు అమర్చి అందముగా ఉండునట్లు చేయవలెను. ముఖమండప ప్రమాణము ఆలయ గర్భప్రమాణముతో సమముగా నుండవలెను. పిమ్మట ఎనుబది ఒక్క పదముల వాస్తు మండపమును ఆరంభింపవలెను.

మొదట ద్వారన్యాసము దగ్గరనున్న పదములలో ఉండు దేవతలను పూజింపవలెను. పిమ్మట ప్రాకార విన్యాసము దగ్గరనున్న దేవతలను, అంతమునందు పదములందు స్థాపింపబడిన ముప్పది ముగ్గురు దేవతలను పూజింపవలెను. ఇది ప్రాసాదముల సర్వసాధారణ లక్షణము. ఇపుడు ప్రతిమా మానానుసారముగ నిర్మించు ఇతర ప్రాసాదములను గూర్చి వినుము.

ప్రతిమ ఎంత పెద్దది ఉండునో, అంత పెద్ద అందమైన పిండి నిర్మింపవలెను. పిండిలో సగము ప్రమాణముగల గర్భమును నిర్మించి, గర్భమానానుసారముగ గోడలు పెట్టవలెను. గోడలఎత్తు వాటివెడల్పును అనుసరించి ఉండవలెను. విద్వాంసుడు శిఖరము ఎత్తు గోడ ఎత్తుకు రెట్టింపు ఉంచవలెను. శిఖరము ఎత్తులో నాల్గవవంతు ఎత్తున ఆలయ మునకు పరిక్రమ ఏర్పరుపవలెను. ఆలయము ముందున్న ముఖమండపము గూడ అదే ఎత్తుతో నిర్మింపవలెను. గర్భము ఎనిమిదవ వంతు ప్రమాణము ఉండునట్లు రథక ములు బైటకువచ్చు మార్గము నిర్మింపవలెను. లేదా పరిధి మూడవ భాగమును అనుసరించి రథకములను (చిన్ని రథములను) నిర్మింపవలెను. వాటి మూడవ వంతు ప్రమాణమున రథ నిర్గమద్వార మేర్పరుపవలెను. మూడు రథములపై సర్వదా మూడు వామములను స్థాపింపవలెను.

శిఖరము కొరకు నాలుగు సూత్ర పాతములు చేయవలెను. శుకనాసపై నుండి సూత్రము అడ్డముగా పడవేయవలెను. శిఖరము సగము భాగమున సింహ ప్రతిమను నిర్మింపవలెను. శుకనాసపై సూత్రము స్థిరముగా నుంచి దానిని మధ్య సంధివరకును తీసికొని వెళ్ళవలెను. రెండవ పార్శ్వము నందు గూడ ఈ విధముగానే సూత్రపాతము చేయవలెను. శుకనాసపై వేది నిర్మించి, దానిపై అమలసారమను పేరుగల, కంఠముతో కూడిన కలశము నిర్మింపవలెను. అది వికరాలముగ ఉండగూడదు. వేదిమానము ఉన్నంత వరకే కలశమును నిర్మింపవలెను. ఆలయద్వారము వెడల్పు

ఎంత ఉండునో దానికి రెట్టింపు ఎత్తు ఉండవలెను. ద్వారము చాల అందముగా శోభా సంపన్నముగా ఉండునట్లు నిర్మింపవలెను. ద్వారముల పైభాగమున సుందరములును, మంగళకరములును అగు వస్తువులతోపాటు రెండు ఉదుంబర శాఖలు నిర్మింపవలెను.

ద్వారము నాల్గవ భాగమున చందుడు, ప్రచండుడు, విష్వక్సేనుడు, వత్సదండుడు అను నాలుగు ద్వారపాలకుల మూర్తులను నిర్మింపవలెను. ఉదుంబరశాఖ సగభాగమున సుందరమగు లక్ష్మీ విగ్రహము నిర్మింపవలెను. ఆమె చేతిలో కమలముండవలెను. దిగ్గజ ములు కలశములతో ఆమెను స్నానము చేయించుచుండవలెను. ప్రాకారము ఎత్తు ఆల యము ఎత్తులో నాల్గవ వంతు ఉంచవలెను. ఆలయ గోపురము ఎత్తు ఆలయము ఎత్తు కంటె నాల్గవవంతు తక్కువ ఉండవలెను. దేవతా విగ్రహము అయిదు హస్తముల విగ్రహమైనచో దాని పీఠిక ఒక హస్తము ఉండవలెను.

విష్ణ్వాలయము ఎదుట ఒక గరుడ మండపము, భౌమాది ధామములను నిర్మింప వలెను. మహావిష్ణువు విగ్రహమునకు చుట్టు, ఎనిమిది వైపులందును విష్ణు ప్రతిమకంటె రెట్టింపు ప్రమాణముగల అవతారమూర్తులను నిర్మింపవలెను తూర్పున వరాహము, దక్షిణమున నృసింహ మూర్తి, పశ్చిమమున శ్రీధరుడు, ఉత్తరమున హయగ్రీవుడు, ఆగ్నేయమున పరశురాముడు, నైరృతి దిక్కునందు శ్రీరాముడు, వాయవ్యమున వామనుడు, ఈశాన్యమున వాసుదేవుడు–వీరి మూర్తులను నిర్మింపవలెను. ఆలయ నిర్మాణమును ఎనిమిది, పంద్రెండు మొదలగు సరిసంఖ్యల స్తంభములతో చేయవలెను. ద్వారము అష్టమాద్యంశలు తప్ప, కలుగు వేధచే దోష మేమియును ఉండదు. (42)

ప్రాసాద దేవతాస్థాపన భూతశాన్తి విధానము

అటు పిమ్మట హయగ్రీవుడు ఇట్లు చెప్పెను : బ్రహ్మదేవా! దేవాలయములో స్థాపింపదగిన దేవతలను గూర్చి చెప్పెదను వినుము. పంచాయతన దేవాలయమునందు, మధ్యనున్న ప్రధానాలయ మున వాసుదేవుని స్థాపింపవలెను. మిగిలిన నాలుగు ఆలయములలో ఆగ్నేయ ఆలయమునందు వామనుని, నైరృతాలయమునందు నరసింహుని, వాయవ్యాలయమునందు హయగ్రీవుని, ఈశాన్యాల యము నందు వరాహమూర్తిని స్థాపింపవలెను లేదా మధ్య యందు నారాయణుని స్థాపించినచో ఆగ్నేయమున దుర్గాదేవిని, నైరృతియందు సూర్యుని, వాయవ్యమున బ్రహ్మను, ఈశాన్యమున లింగరూపుడుగా శివుని స్థాపింపవలెను లేదా ఈశాన్యమున రుద్రమూర్తిని స్థాపింపవలెను. లేదా ఎనిమిది దిక్కు లందును ఎనిమిది ఆలయములను, మధ్యయందు ఒక ఆలయమును నిర్మించి, వాటిలో మధ్యనున్న ఆలయమునందు వాసుదేవుని స్థాపించి, తూర్పు మొదలగు దిక్కులందు పరశు రాముడు మొదలగు ముఖ్యమైన తొమ్మిది అవతారములను, ఇంద్రాది లోకపాలులను స్థాపింపవలెను. లేదా మొత్తము తొమ్మిది స్థానములందు ఐదు ప్రధాన ఆలయములను కట్టించి మధ్యాలయమునందు పురుషోత్తముని స్థాపింపవలెను.

తూర్పున లక్ష్మిని, కుబేరుని, దక్షిణమున మాతృకాగణము – కుమారస్వామి, గణపతి, శివులను, పశ్చిమమున సూర్యాది నవగ్రహములను, ఉత్తరమున మత్స్యాది దశావతారములను స్థాపింపవలెను.

అట్లే ఆగ్నేయమున చండీదేవిని, నైరృతి దిక్కున అంబికను, వాయవ్యమున సరస్వతిని, ఈశాన్యమున లక్ష్మిని స్థాపింపవలెను. మధ్యభాగమునందు వాసుదేవుని లేదా నారాయణుని స్థాపింపవలెను, లేదా పదమూడు గదులుగల దేవాలయ మధ్య భాగమునందు విశ్వరూపుడగు మహావిష్ణువును స్థాపింపవలెను. లేదా తూర్పు మొదలగు దిక్కులలో కేశవాది ద్వాదశ విగ్రములను స్థాపించి మిగిలిన గృహమునందు సాక్షాత్తు శ్రీహరిని స్థాపింపవలెను. భగవత్ప్రతిమను మట్టి, కఱ్ఱ, లోహము, రత్నములు, ఱాయి, చందనము, పుష్పము అను ఏడు వస్తువులతో నిర్మింపబడి ఏడు విధములుగ ఉండును. పుష్పములతో, మట్టితో, చందనముతో నిర్మించిన ప్రతిమను వెంటనే పూజింప వలెను. చాల సమయము ఉంచకూడదు. పూజింపబడిన ఈ ప్రతిమలు సమస్త కామము లను శీఘ్రముగ ఫలింపజేయును.

ఇప్పుడు శిలానిర్మిత ప్రతిమను గూర్చి చెప్పెదను. పర్వతమునుండి తీసికొని వచ్చిన ఱాయితో చేసిన ప్రతిమ ఉత్తమమైనది. పర్వతములు లేని పక్షమున భూమిలో లభించిన ఱాయిని ఉపయోగింపవచ్చును. బ్రాహ్మణాది వర్ణముల వారికి వరుసగ తెల్లని, ఎఱ్ఱని, పచ్చని, నల్లని ఱాళ్ళు ఉత్తమమైనవి. తగిన వర్ణముగల శిల లభించనిచో ఆ లోపమును తీర్చుటకై నరసింహ మంత్రముతో హోమము చేయవలెను. శిలపై తెల్లని రేఖ ఉన్నచో అది చాలా ఉత్తమమైనది. నల్లరేఖ ఉన్నచో నరసింహ హోమము చేసిన పిమ్మట అది ఉత్తమముగాను, కంచు ఘంటవంటి ధ్వని వచ్చుచు, భేదించినపుడు అగ్ని కణములు వచ్చు శిల "పుంలింగము", ఆ చిహ్నములు తక్కువగా ఉన్న శిల "స్త్రీ లింగము". ఈ రెండు చిహ్నములూ లేనిది "నపుంసక లింగము" ఏదైన మండలము వంటి గుర్తు ఉన్న శిల 'సగర్భ'; దానిని పరిత్యజింపవలెను.

ప్రతిమలను నిర్మించుటకై అడవిలోనికి వెళ్ళి వనయాగము ప్రారంభింపవలెను. అచట ఒక కుండము త్రవ్వి, దానిని అలికి, మండపముపై విష్ణుమూర్తిని పూజింపవలెను. విష్ణువునకు బలి సమర్పించి ప్రతిమా నిర్మాణకర్మయందు ఉపయోగించు టంకము మొద లగు శస్త్రములను పూజించ వలెను. హోమము చేసిన పిమ్మట బియ్యపు నీళ్ళతో అస్త్ర మంత్రమును (అస్త్రాయఫట్) ఉచ్చరించుచు ఆ శిలను తడుపవలెను. నరసింహ మంత్ర ముతో దానికి రక్షచేసి మూలమంత్రముతో (ఓం నమో నారాయణాయ) పూజచేయవలెను. పూర్ణాహుతి హోమము చేసిన పిమ్మట ఆచార్యుడు భూతములకు బలి సమర్పింప వలెను. అచట కనబడకుండ నివసించు జంతువులు, రాక్షసులు, యక్షులు, సిద్ధులు మొదలగు వారికి అందరకు పూజలు చేసి "కేశవుని ఆజ్ఞచే మేము ప్రతిమల కొరకై ఈ యాత్రపై వచ్చితిమి. శ్రీమహావిష్ణుని కార్యము మీ కార్యముకూడ అగును. అందుచే మేము ఇచ్చిన ఈ బలిచే తృప్తులై మీరు వెంటనే ఈ స్థానమును విడచి, కుశల పూర్వకముగ మరొక చోటికి వెళ్ళుడు" అని చెప్పుచు క్షమా ప్రార్థన చేయవలెను. ఈ విధముగ ప్రార్థింపబడిన వారందరును ప్రసన్నులై సుఖముగ ఆ స్థానమును విడచి మరొక ప్రదేశము నకు వెళ్ళి పోవుదురు. పిమ్మట శిల్పులతో కలసి యజ్ఞ చరువును భక్షించి రాత్రి నిద్రించు సమయమున స్వప్న మంత్రమును ఈ విధముగ జపించవలెను "సమస్త ప్రాణులకును వాసస్థానమైన వాడును, సర్వవ్యాపకుడును

సర్వస్రష్టయు, విశ్వరూపుడును, స్వప్నాధి పతియు అగు శ్రీహరికి నమస్కారము దేవా! దేవేశ్వరా! నేను నీ సమీపమున నిద్రించు చున్నాను. నా మనస్సులో ఏ కార్యములను సంకల్పించితినో వాటి విషయమున నాకు అంతయు తెలుపుము" ఇట్లు ప్రార్థించి "ఓం ఓం హ్రూం ఫట్ విష్ణవే స్వాహా" అను మంత్రమును జపించి నిద్రించగా శుభస్వప్నము వచ్చినచో శుభము కలుగును. చెడు స్వప్నము వచ్చినచో నరసింహ మంత్రముచే హోమము చేయగా శుభమే కలుగును. ఉదయమున లేచి, అస్త్రమంత్రముతో శిలపై అర్ఘ్యము ఈయవలెను. పిమ్మట అస్త్రపూజ చేయవలెను. గునపము, టంకము మొదలగు అస్త్రముల ముఖమును అతనికి చూపవలెను.

శిల్పి ఇంద్రియ నిగ్రహవంతుడై, టంకము చేతగైకొని ఆ శిలను చతురస్రముగా ఉండునట్లు చేయవలెను. పిమ్మట పిండిని చేయుటకై దానిని కొంచెము చిన్నది చేయవలెను. పిమ్మట ఆ శిలకు వస్త్రము చుట్టి, రథముపై ఉంచి, శిల్పశాలకు తీసికొని వచ్చి, మరల దానికి పూజ చేయవలెను. పిమ్మట ప్రతిమ నిర్మింపవలెను.

వాసుదేవాది ప్రతిమాలక్షణము

హయగ్రీవుడు చెప్పెను : ఇపుడు వాసుదేవాది ప్రతిమల లక్షణము చెప్పెదను వినుము. ఆలయమున పూర్వాభిముఖముగగాని, ఉత్తరాభి ముఖముగగాని, శిలనుంచి, దానికి పూజచేసి, శిల్పి, ఆ శిలకు మధ్య సూత్రముంచి దానిని తొమ్మిది భాగములు చేయవలెను. తొమ్మిదవ భాగమును గూడ పండ్రెండు భాగములుగ విభజించిన పిమ్మట ఒక్కొక్క భాగము ఆతని అంగుళముతో ఒక్క అంగుళము ఉండును. రెండు అంగుళములు "గోలకము" దీనికి "కాలనేత్ర" మని కూడ పేరు. పైన చెప్పిన తొమ్మిది భాగములలో ఒక భాగమును మూడు భాగములుగా విభజించి దానితో సీల మండలుగా చేయవలెను. ఒక భాగము మోకాలు కొరకు, మరొక భాగము కంఠము కొరకు నిశ్చ యించి ఉంచుకొనవలెను. ముకుటమునకు ఒక జానెడు, ముఖమునకు ఒక జానెడు, కంఠమునకు ఒక జానెడు, హృదయమునకై ఒకజానెడు ఉంచవలెను. నాభికిని, లింగమునకు మధ్య ఒక జానెడు దూరముండవలెను. తొడలు రెండుజానలు కాళ్ళు రెండు జానలు ఉండవలెను. ఇపుడు సూత్రముల కొలతలను వినుము– పాదములపై రెండు సూత్రములు, కాళ్ళపై రెండు సూత్రములు, మోకాళ్ళపై రెండు సూత్రములు రెండు తొడలపై రెండేసి సూత్రములు ఉపయోగింపవలెను. లింగముపై మరి రెండు సూత్రములు కటి ప్రదేశముపై నడుము నిర్మించుటకు మరి రెండు సూత్రములను ఉపయోగింపవలెను. నాభియందు కూడ రెండు సూత్రములు ఉపయోగింపవలెను. అట్లే హృదయమునందును, కంఠమునందును రెండు సూత్రములుంచవలెను. లలాటముపై మరి రెండు సూత్రములు, శిరస్సుపై మరి రెండు సూత్రములు ఉపయోగించవలెను. శిల్పి ముకుటముపై ఒక సూత్రముంచవలెను. పైన ఏడు సూత్రములు మాత్రమే ఉంచవలెను.

ఆరు సూత్రములను మూడు కక్షల అంతరముచే ఉంచవలెను. మరల మధ్య సూత్రమును విడిచివేసి కేవల సూత్రములను మాత్రమే ఉపయోగింపవలెను. లలాట, నాసికా, ముఖముల

విస్తారము నాలుగు అంగుళములు ఉండవలెను. కంఠవిస్తారము చెవుల విస్తారము కూడ నాలుగు అంగుళములే ఉండవలెను. రెండు ప్రక్కల చెక్కిళ్లు రెండేసి అంగుళముల వెడల్పు ఉండవలెను. బుగ్గకూడ రెండు అంగుళములు ఉండవలెను. పూర్తి విస్తారము ఆరు అంగుళములు ఉండవలెను. లలాట విస్తారము ఎనిమిది అంగుళములు ఉండవలెను. రెండు ప్రక్కల శంఖ ప్రదేశములు రెండేసి అంగుళముల విస్తారము కలిగి యుండి వాటిపై వెంద్రుకలు కూడ ఉండవలెను. చెవులకు నేత్రములకు మధ్య నాలుగు అంగుళముల వ్యవధానముండవలెను. చెవులు పృథుకములు రెండేసి అంగుళములు నిర్మింపవలెను. కనుబొమ్మలకు సమాన సూత్రముననున్న భాగమునకు "కర్ణ స్రోతస్సు" అని పేరు. గుచ్చిన (కుట్టిన) చెవులు ఆరు అంగుళములు, కుట్టనివి నాలుగు అంగుళములు ఉండవలెను. లేదా కుట్టిన చెవులైనను కుట్టని చెవులైనను, బుగ్గతో సమానముగ ఆరు అంగుళములు ఉండవలెను. గంధపాత్రము, ఆవర్తము, శష్కులి(చెవి రంధ్రము) కూడ నిర్మింపవలెను. క్రింది పెదవి ఒక అంగుళము, పై పెదవి అర అంగుళము ఉండవలెను. నేత్ర విస్తారము అరఅంగుళము, ముఖ విస్తారము నాలుగు అంగుళములు, ముఖము వెడల్పు ఒకటి న్నర అంగుళములు ఉండవలెను. ముక్కు ఎత్తు ఒక అంగుళము, పొడవు రెండు అంగుళములు ఉండవలెను. దాని ఆకారము కరవీర కుసుమమువలె ఉండవలెను. రెండు నేత్రముల మధ్య నాలుగు అంగుళముల అవకాశము ఉండ వలెను. రెండు అంగుళములు నేత్రముల పరిధిలోనికి రాగా ఇంకను రెండు అంగుళముల వ్యవ ధానము ఉండును. నేత్రములోని మూడవవంతు నల్లగ్రుడ్లు, ఐదవవంతు చిన్న నల్లగ్రుడ్డు ఉండ వలెను. నేత్ర విస్తారము రెండు అంగుళములు, ద్రోణి అరఅంగుళము ఉండవలెను. కనుబొమ్మల రేఖల ప్రమాణము కూడ అంతే ఉండవలెను. రెండు కనుబొమ్మలును ఒకే ప్రమాణములో ఉండవలెను. కనుబొమ్మల మధ్య రెండు అంగుళములు విస్తారము నాలుగు అంగుళములు ఉండవలెను.

కేశవాది మూర్తుల శిరస్సు మొత్తము తిరుగుడు ఇరువదిఆరు లేదా ముప్పది రెండు అంగుళ ములు ఉండవలెను. క్రింద కంఠము పది అంగుళములు, దాని తిరుగుడు ముప్పది అంగుళములు. క్రింది నుండి పైకి కంఠ విస్తారము ఎనిమిది అంగుళములు. కంఠమునకును, వక్షస్థలమునకును మధ్యనున్న అవకాశము కంఠముకంటె మూడు రెట్లు విస్తారముతో ఉండవలెను. స్కంభములు ఎనిమిదేసి అంగుళములు, అంసములు మూడేసి అంగుళములు ఉంచవలెను. బాహువులు మోచేయి వరకు పదునాలుగేసి అంగుళములు, ప్రబాహువులు (మోచేతి క్రింద) పదునారేసి అంగుళములు, బాహువుల వెడల్పు ఆరు అంగుళములు. ప్రబాహువుల వెడల్పు కూడ దీనితో సమానముగా ఉండవలెను. బాహుదండము తిరుగుడుపై నుండి తొమ్మిది కలలు లేదా పదునేడు అంగుళములు ఉండవలెను. బాహు మధ్యమున కూర్పరము (మోచేయి) ఉండును. కూర్పరము తిరుగుడు పదు నాలుగు అంగుళములు, ప్రబాహుమధ్యమున దాని విస్తారము పదునారు అంగుళములు, చేతి అగ్రభాగము విస్తారము పంద్రెండు అంగుళములు, దాని మధ్య అరచేతి విస్తారము ఆరు అంగుళ ములు అరచేయి వెడల్పు ఏడు అంగుళములు, మధ్యవ్రేలు పొడవు ఐదు అంగుళములు, తర్జనీ– అనామికల పొడవు దానికంటె అర అంగుళము తక్కువగా ఉండవలెను. కనిష్ఠికా–అంగుష్ఠముల పొడవు నాలుగు అంగుళములు, బొటన వ్రేలికి రెండు కణుపులు, మిగిలిన వాటికి మూడేసి

కణుపులు ఏర్పరింపవలెను. గోళ్ళ పొడవు ఒక కణుపు పొడవులో సగముండవలెను. వక్షస్థలమెంత ఉన్నదో పొట్ట అంతే ఉండవలెను. నాభి రంధ్రము ఒక అంగుళము ఉండవలెను. నాభి నుండి లింగము వరకు జానెడు దూరము ఉండవలెను.

ఉదరము తిరుగుడు నలుబది రెండు అంగుళములు. స్తనముల మధ్య భాగము జానెడు. స్తనాగ్రములు యవ ప్రమాణముతో ఉండవలెను. స్తనముల తిరుగుడు రెండు పదములు ఉండవలెను. వక్షస్థలము తిరుగుడు అరువది నాలుగు అంగుళములు, దాని క్రింద నాల్గువైపుల తిరుగుడు "కువేష్టనము" అని పేరు. నడుము తిరుగుడు ఏబది నాలుగు అంగుళములు. ఊరు మూలముల విస్తారము పంద్రెండేసి అంగుళములు దానిపైన మధ్యభాగ విస్తారము అధికముగా ఉండవలెను, మధ్యభాగము నుండి క్రిందికి విస్తారము క్రమముగ తగ్గవలెను. మోకాళ్ళ విస్తారము ఎనిమిది అంగుళములు. వాటికి క్రింది పిక్కవిస్తారము మూడు రెట్లు ఉండవలెను. పిక్క మధ్య భాగము విస్తారము ఏడు అంగుళములు ఉండ వలెను. దాని తిరుగుడు మూడు రెట్లుండవలెను. పిక్క అగ్ర భాగమున విస్తారము ఐదు అంగుళములు, దాని తిరుగుడు మూడు రెట్లు, పాదములు జానెడేసి పొడుగు ఉండవలెను. పాదముల ఎత్తు నాలుగు అంగుళములు మడమల ముందు భాగము కూడ నాలుగు అంగుళములు ఉండవలెను.

పాదముల విస్తారము ఆరు అంగుళములు, గుహ్యకము మూడు అంగుళములు, పంజా ఐదు అంగుళములు ఉండవలెను. పాదముల బొటనవ్రేలు వెడల్పుగా ఉండవలెను. మిగిలిన వ్రేళ్ళ మధ్య భాగవిస్తారము క్రమముగా మొదటి వ్రేలు ఎనిమిదవ భాగము తక్కువగా ఉండవలెను. బొటన వ్రేలు ఎత్తు ఒకటిన్నర అంగుళములు ఉండవలెను. దీని గోరు ప్రమాణమును మిగిలిన వ్రేళ్ళు ప్రమాణము కంటె రెట్టింపు ఉంచవలెను. రెండవ వ్రేలిగోరు విస్తారము అర అంగుళము, ఇతరమైన వ్రేళ్ళ గోరు విస్తారము క్రమముగా కొంచెము కొంచెము తగ్గించవలెను. అండకోశములు రెండును మూడేసి అంగుళముల పొడవు, లింగము నాలుగు అంగుళములు ఉండవలెను. దానిపై భాగము నాలుగు అంగుళ ములు ఉండవలెను. అండకోశముల పూర్తి తిరుగుడు ఆరేసి అంగు ళములు. ఇంతమాత్రమే కాక దేవతా ప్రతిమను సకల భూషణములతో అలంకరించవలెను. ఈ విధముగా సంక్షిప్తముగ లక్షణము చెప్పబడినది. ఇదేవిధముగ లోకములో కనబడు ఇతర లక్షణము లను కూడ దృష్టిలో ఉంచుకొని, ప్రతిమపై ఆ లక్షణములను నిర్మింపవలెను. పై కుడి చేతిలో చక్రము, క్రింది దానిలో పద్మము, పై ఎడమచేతిలో శంఖము క్రింది దానిలో గద ఉంచవలెను. ఇవి వాసుదేవ శ్రీకృష్ణుని చిహ్నములుగాన ఆ ప్రతిమయందు మాత్రమే ఉంచవలెను. భగవంతుని సమీపమున, హస్తమునందు కమలము ధరించిన లక్ష్మిని, వీణను ధరించియున్న పుష్టిదేవిని నిర్మించవలెను. ఈ ప్రతిమలఎత్తు భగవత్ప్రతిమ తొడల ఎత్తు ఉండవలెను. ప్రభామండలములో ఉన్న మాలాధర–విద్యాధరుల విగ్రహము కూడ స్థాపింపవలెను. ప్రభను ఏనుగు మొదలైన వాటితో అలంకరింపవలెను. భగవచ్చరణముల క్రింది భాగమును (పాద పీఠమును) పద్మాకారమున నిర్మింప వలెను. ఈ విధముగ దేవ ప్రతిమలకు పై చెప్పిన లక్షణములు ఉండునట్లు కూర్చవలెను. (44)

పిండికాది లక్షణము

హయగ్రీవుడు చెప్పెను : బ్రహ్మదేవా! ఇపుడు నేను పిండిక లక్షణము చెప్పెదను. పిండిక పొడవు ప్రతిమతో సమానముగ ఉండును. ఎత్తు మాత్రము ప్రతిమలో సగము ఉండును. పిండికకు అరువది నాలుగు కోష్ఠకములు ఏర్పరచి, క్రింది రెండు పంక్తులు విడచి, దానిపైనఉన్న కోష్ఠము నాలుగువైపుల, రెండు పార్శ్వములందును, లోపలినుండి తుడిచి వేయవలెను. అట్లే పై రెండుపంక్తులు విడచి దానిక్రిందనున్న కోష్ఠమును లోపలినుండి తుడిచివేయవలెను. ఈ విధముగ రెండు పార్శ్వము లందును చేయవలెను. రెండు పార్శ్వముల మధ్యనున్న రెండురెండు చతుష్కములను గూడ తుడిచి వేయవలెను. పిమ్మట దానిని నాలుగు భాగములుగా విభజించి పై రెండు పంక్తులను మేఖలగా గ్రహించి, దాని ప్రమాణములో సగము ప్రమాణము ఉండునట్లుగ దాని యందు గొయ్యి త్వవవలెను. రెండు పార్శ్వ భాగములందును సమానముగ ఒక్కొక్క భాగము విడచి బైట పదమును నాలి (తూము) నిర్మించుటకై విడువవలెను. దాని యందు తూము నిర్మింపవలెను. మూడు భాగములలోని ఒక భాగమునకుముందు నీరు ముందుకు పోవుటకై మార్గము ఉండవలెను.

వివిధాకారముగల ఈ పిండికకు "భద్ర" అని పేరు. లక్ష్మీదేవి ప్రతిమ ప్రమాణము ఎనిమిది జానలుండవలెను. ఇతరదేవుల ప్రతిమలుకూడ ఇట్లే ఉండవలెను. రెండు కను బొమ్మలును నాసిక కంటె ఒక యవ అధికముగా ఉండవలెను. నాసిక వాటి కంటె ఒక యవ తక్కువ ఉండవలెను. ముఖ గోలకము నేత్ర గోలకముకంటె పెద్దదిగా ఉండవలెను. అది ఎత్తుగాను, వంకరటింకరగాను ఉండకూడదు. నేత్రములు పెద్దవిగా మూడును పావు యవల ప్రమాణములో ఉండవలెను. ముఖము పొడవు ఒక కోణము నుండి మరియొక కోణమువరకు ఎంత ఉండునో సూత్రముతో కొలిచి కర్ణ పాశము అంత ఉండునట్లు చేయవలెను. దాని పొడవు పైన చెప్పిన సూత్రము కంటె కొంచెము ఎక్కువ పొడవే ఉండవలెను. రెండు స్కంధములు కొంచెము వంగి ఒక కళ తగ్గినట్లు చేయవలెను. కంఠము పొడవు ఒకటిన్నర కళల పొడవు ఉండవలెను. వెడల్పుకూడ అంతే ఉండవలెను. రెండు ఊరువుల విస్తారము కంఠముకంటె ఒకనేత్రము తక్కువ ఉండవలెను. మోకాళ్ల చిప్పలు, పిండలి, పాదములు, పీఠము, నితంబము, కటిభాగము మొదలగు వాటిని యథా యోగ్యముగ కల్పింపవలెను. చేతి వ్రేళ్లు పెద్దవిగా ఉండవలెను. పరస్పరావరుద్ధములు కాకూడదు. పెద్ద వ్రేలి కంటె చిన్న వ్రేళ్ళు ఏడవ వంతు తక్కువ ఉండవలెను. పిక్కలు, తొడలు, కటి వీటి పొడవు క్రమముగ ఒక్కొక్క నేత్రము తక్కువ ఉండవలెను.

శరీర మధ్య ప్రాంతము గుండ్రముగా ఉండవలెను. కుచములు దగ్గరగా బలిసి ఉండవలెను. స్తనములు జానెడు ఉండవలెను. కటి ప్రదేశము వాటికంటె ఒకటిన్నర కళలు పెద్దదిగా ఉండవలెను. మిగిలిన చిహ్నములన్నియు వెనుకటివలెనే. లక్ష్మికి కుడిచేతిలో కమలము, ఎడమచేతిలో బిల్వ ఫలము ఉండవలెను. చామరము ధరించిన స్త్రీలు ఆమె పార్శ్వములందు నిలిచి ఉండవలెను. పెద్ద ముక్కుగల గరుత్మంతుడు ఎదుట నిలిచి ఉండవలెను. ఇపుడు చక్రాంకిత (సాల గ్రామాది) మూర్తులను గూర్చి చెప్పెదను. (45)

శాలగ్రామ మూర్తి లక్షణము

హయగ్రీవుడు చెప్పెను : బ్రహ్మదేవా! సాలగ్రామాదులపై ఉండు హరిమూర్తులను గూర్చి చెప్పెదను. ఇది భోగ మోక్షములను ఇచ్చునది. ద్వారమునందు రెండు చక్రములతో నల్లని సాల గ్రామము వాసుదేవుడు. రెండు చక్రములున్న ఎఱ్ఱని సాలగ్రామము సంక ర్షణుడు. చిన్న చక్రము, అనేక రంధ్రములును ఉన్న నీలవర్ణ సాలగ్రామము ప్రద్యుమ్నుడు. కమల చిహ్నము, గోళాకారము, పచ్చని రంగు, మూడు రేఖలు ఉన్నది అనిరుద్ధుడు. నాభియందు ఉన్నతమై, పెద్ద రంధ్రములతో నల్లగా ఉండునది, నారాయణుడు. కమల – చక్ర చిహ్నములు, పృష్ఠభాగమున రంధ్రము, బిందువు ఉన్న సాలగ్రామము పరమేష్ఠి. స్థూలమైన చక్రము మధ్య గదవంటి రేఖ ఉన్న శ్యామ వర్ణమగు సాలగ్రామము విష్ణువు. స్థూలచక్రము ఐదు బిందువులు ఉన్న కపిల వర్ణ సాలగ్రామము నృసింహుడు. శక్తి అను అస్త్రము గుర్తు, విషమములైన రెండు చక్రములు, మూడు స్థూల రేఖలు ఉన్న ఇంద్రనీలమణి వంటి రంగుగల సాలగ్రామము వరాహము. ఎత్తైన పృష్ఠ భాగము, గోళాకారమైన సుడి ఉన్న శ్యామవర్ణ సాలగ్రామము కూర్మము. అంకుశ రేఖలు, బిందువులు ఉన్న నీలవర్ణ సాలగ్రామము హయగ్రీవుడు. ఒక చక్రము, ఒక కమలము, పుచ్ఛాకారమైన రేఖలు ఉన్న, మణివలె ప్రకాశించు శాలగ్రామము వైకుంఠుడు. మూడు బిందువులతో, కంచువలె తెల్లగానుండు, పెద్ద ఆకారముగల సాలగ్రామము మత్స్యము. వనమాల, ఐదురేఖలుగల గోలాకారమైన సాలగ్రామము శ్రీధరుడు. చాల చిన్నదై, బిందువులనుండి, గోళాకార మైన నీల సాలగ్రామము వామనము. కుడి ప్రక్క హార రేఖయు, ఎడమప్రక్క బిందువులు ఉన్న శ్యామవర్ణమగు సాలగ్రామము త్రివిక్రముడు. సర్ప శరీర చిహ్నము, అనేక మూర్తులు ఉండి, చాలరంగులతో ప్రకాశించు సాలగ్రామము అనంతుడు–ఆదిశేషుడు. మధ్య భాగమున చక్రము, క్రింద సూక్ష్మ బిందువు ఉన్న స్థూలమగు సాలగ్రామము దామోదరుడు. ఒక చక్రమున్న సాలగ్రామము సుదర్శనము, రెండు చక్రములున్నది లక్ష్మీ నారాయణుడు, మూడు చక్రములున్నది అచ్యుతుడు లేదా త్రివిక్రముడు, నాలుగు చక్రములున్నది జనార్ద నుడు, ఐదు చక్రములున్నది వాసుదేవుడు. ఆరు చక్రములున్నది ప్రద్యుమ్నుడు, ఏడు చక్రము లున్నది సంకర్షణుడు, ఎనిమిది చక్రములున్నది పురుషోత్తముడు, తొమ్మిది చక్రములున్నది నవవ్యూహము. పది చక్రములు ఉన్నది దశావతారమూర్తి పదకొండు చక్రములున్నది అనిర్ధుడు. పండ్రెండు చక్రములున్నది ద్వాదశాత్మ, అంతకంటె అధిక చక్రములున్నది అనంతుడు. (46)

శాలగ్రామ పూజా కథనము

హయగ్రీవుడు చెప్పెను : ఇపుడు చక్రాంకిత సాలగ్రామముల పూజావిధానమును చెప్పుచున్నాను. ఇది సిద్ధిప్రదమైనది. శ్రీహరి పూజ కామ్య, అకామ్య, కామ్యాకామ్య అని మూడు విధములు. మత్స్యాది పంచ విగ్రహముల పూజ కామ్యముగాని, ఉభయాత్మిక గాని కావచ్చును, వెనుక చెప్పిన చక్రములతో ప్రకాశించు వారాహ, వామన, నృసింహుల పూజను ముక్తి కొరకు చేయవలెను, ఇపుడు మూడు విధములైన సాలగ్రామ పూజను గూర్చి వినుము. వీటిలో నిష్ఫల పూజ ఉత్తమము ; సఫలపూజ కనిష్ఠము; మూర్తి పూజ మధ్యమము. చతురస్ర మండపముపై నున్న కమలమునందు

కర్తను, హర్తను పూజింపవలెను. ఈశాన్యమున విష్వక్సేనుని, ఆగ్నేయమున క్షేత్ర పాలుని పూజింప వలెను. పిమ్మట పూర్వాది దిక్కులందు ఋగ్వేదాది వేదచతుష్టయమును పూజించి, ఆధార శక్తిని, అనంతుని, పృథివిని, యోగపీఠమును పద్మమును, సూర్య మండలమును, చంద్రమండలమును, బ్రహ్మాత్మక వహ్ని మండలమును పూజించి, ద్వాద శాక్షరిచే ఆసనముపై శిలాస్థాపనముచేసి పూజింపవలెను. పిదప మూలమంత్రమును విభజించియు, సంపూర్ణ మంత్రముచేతను క్రమ పూర్వకముగా పూజింపవలెను. పిదప ప్రణవముచే పూజించి మూడుముద్రలు చూపవలెను. విష్వక్సేన, చక్ర, క్షేత్రపాలుల ముద్రలు చూపవలెను.

ఇంతవరకును చెప్పినది సాలగ్రామ మధ్యమపూజ. ఇపుడు నిష్ఫల పూజ చెప్పబడుచున్నది. వెనుకటి వలెనే షోడశదళ కమలముతో కూడిన మండలము చేయవలెను. దానిపై శంఖ, చక్ర, గదా, ఖడ్గములను, గురువు మొదలగువారిని వెనుక చెప్పినట్లుగనే పూజింపవలెను. పూర్వోత్తర దిశలయందు వరుసగా ధనుర్బాణములను పూజింపవలెను. ప్రణవముచే ఆసనము సమర్పించి, ద్వాదశాక్షరిచే శిలాన్యాసము చేయవలెను. ఇపుడు మూడవదైన కనిష్ఠ పూజను(సఫల పూజను) చెప్పుచున్నాను వినుము. అష్టదళ కమలముపై వెనుకటివలె గుర్వాదిపూజ చేయవలెను. పిదప అష్టాక్షరమంత్రముచే ఆసనము సమర్పించి, ఆ మంత్రముచేతను శిలను స్థాపించవలెను. (47)

చతుర్వింశతి మూర్తి స్తోత్రము

హయగ్రీవుడు చెప్పెను : బ్రహ్మదేవా! ఓంకార రూపుడగు కేశవుడు తన హస్తములో (క్రింది కుడిచెయ్యి, పై కుడిచెయ్యి, పై ఎడమచెయ్యి, క్రింద ఎడమచెయ్యి అనుక్రమమున అని ఒక మతము. పై కుడి చెయ్యి మొదలు క్రింద కుడి చెయ్యి వరకును అని మరొక మతము) పద్మ, శంఖ, చక్ర, గదలను ధరించి యుండును. నారాయణుడు అదే వరుసలో శంఖ, పద్మ, గదా, చక్రములను ధరించును. ప్రదక్షిణ పూర్వకముగా ఆ భగవంతుని పాదములకు నమస్కరించు చున్నాను. మాధవుడు గదా, చక్ర, శంఖ, పద్మములను ధరించును. నేను ఆతనికి నమస్కరించు చున్నాను. గోవిందుడు చక్ర, గదా, పద్మ, శంఖము లను ధరించును. బలశాలియై ఉండును. శ్రీ విష్ణువు గదా, పద్మ, శంఖ, చక్రములను ధరించును. ఆతడు మోక్షప్రదాత. మధుసూదనుడు శంఖ, చక్ర, పద్మ, గదలను ధరించును. నేను ఆతని ఎదుట భక్తితో వంగి నమస్కరించుచున్నాను. త్రివిక్రముడు పద్మ, గదా, చక్ర, శంఖములను ధరించును. వామనుడు శంఖ, చక్ర, గదా, పద్మములతో ప్రకాశించు చుండును. ఆతడు సర్వదా నన్ను రక్షించుగాక.

శ్రీధరుడు కమల, శంఖ, చక్ర, శార్ఙ్గ ధనస్సులను ధరించి యుండును. ఆతడు అందరికిని సద్గతి ఇచ్చువాడు. హృషీకేశుడు గదా, చక్ర, పద్మ, శంఖములను ధరించును. ఆతడు మనల నందరిని రక్షించుగాక. వరదాతయగు పద్మనాభుడు శంఖ, పద్మ, చక్ర, గదలను ధరించును. దామోదరుడు పద్మ, శంఖ, గదా, చక్రములు ధరించి విరాజిల్లుచు ఉండును. ఆతనికి నమస్కరించు చున్నాను. గదా, శంఖ, చక్ర, పద్మధారియైన వాసుదేవుడు సంపూర్ణ జగమును సృజించెను. గదా, శంఖ, పద్మ, చక్రములను ధరించిన సంకర్షణుడు మిమ్ములను అందరిని రక్షించుగాక.

యుద్ధ కుశలుడైన ప్రద్యుమ్నుడు చక్ర, శంఖ, గదా, పద్మములను ధరించును. అనిరుద్ధుడు చక్ర, గదా, శంఖ, పద్మములను ధరించిన అతడు మనలను రక్షించుగాక. సురేశ్వరుడైన పురుషోత్త ముడు చక్ర, కమల, శంఖ, గదలను ధరించును. అధోక్షజుడు పద్మ, గదా, శంఖ, చక్రములను ధరించును. ఆతడు మమ్ములను రక్షించుగాక. నృసింహుడు చక్ర, పద్మ, గదా, శంఖములను ధరించును. నేను ఆతనికి నమస్కరించుచున్నాను. గదా, పద్మ, చక్ర, శంఖములను ధరించు అచ్యుతుడు మమ్ములను రక్షించుగాక. శంఖ, గదా, చక్ర, పద్మములను ధరించు, బాలవటుడైన వామనుడు; పద్మ, చక్ర, శంఖ, గదలను ధరించు జనార్దనుడు; శంఖ, పద్మ, చక్ర, గదలను ధరించు, యజ్ఞస్వరూపుడైన శ్రీహరి; శంఖ, గదా, పద్మ, చక్రములను ధరించు కృష్ణుడు నాకు భోగములను, మోక్షమును ప్రసా దించుగాక.

వాసుదేవుడు ఆదిమూర్తి. వాసుదేవుని నుండి సంకర్షణుడు ఆవిర్భవించెను. సంకర్షణుని నుండి ప్రద్యుమ్నుడు, ప్రద్యుమ్నుని నుండి అనిరుద్ధుడు ఆవిర్భవించెను. వీరిలో ఒక్కొక్కరు క్రమముగ కేశవాది మూర్తి భేదమున మూడేసి రూపములలో ఆవిర్భవించిరి. (అనగా వాసుదేవుని నుండి కేశవ, నారాయణ, మాధవమూర్తులు; సంకర్షణుని నుండి గోవింద, విష్ణు, మధుసూదన మూర్తులు; ప్రద్యుమ్నుని నుండి త్రివిక్రమ, వామన, శ్రీధరమూర్తులు; అనిరుద్ధుని నుండి హృషీకేశ, పద్మనాభ, దామోదర మూర్తులు ఆవిర్భ వించినవి). ఇరువది నాలుగు మూర్తుల స్తోత్రముతో కూడిన ఈ ద్వాదశాక్షర స్తోత్రమును చదువువారును, వినువారును నిర్మలులై, సంపూర్ణ మనోరథములను పొందుదురు.

విశేషాంశము : ఈ స్తోత్రములో ఇరువది నాలుగు మూర్తుల స్వరూపమును వర్ణించు మొదటి పండ్రెండు శ్లోకములలోని మొదటి అక్షరములను కలిపి చదివినచో "ఓం నమో భగవతే వాసు దేవాయ" అను ద్వాదశాక్షరి ఏర్పడును. అందుచే దానికి "ద్వాదశాక్షరీ స్తోత్రము అనియు, "చతుర్వింశతిమూర్తి స్తోత్రము" అనియు పేర్లు. (48)

మత్స్యాది ప్రతిమా లక్షణము

హయగ్రీవుడు చెప్పెను : ఇపుడు మత్స్యాది దశావతార విగ్రహములను గూర్చి చెప్పెదను. మత్స్యావతార విగ్రహము మత్స్యాకారమునను, కూర్మావతార విగ్రహము కూర్మాకారమునను ఉండవలెను. భూమిని పైకి లేవనెత్తుచున్న వరాహావతార విగ్రహమును మనుష్యాకారమున నిర్మింపవలెను. కుడిచేతిలో గదా, చక్రములు, ఎడమచేతిలో శంఖ పద్మములు ఉండవలెను. లేదా పద్మమునకు బదులు ఎడమ ప్రక్క లక్ష్మీదేవి ఉండవలెను. లక్ష్మి ఆతని ఎడమ మోచేయి ఆనుకొని ఉండును. పృథివి, ఆదిశేషుడు చరణములను అనుసరించి ఉండవలెను. వరాహమూర్తి స్థాపించినవారికి రాజ్యము లభించును; అంత మున వారు, భవసాగరము దాటి మోక్షము పొందు దురు. నృసింహమూర్తి స్థాపించిన వారికి రాజ్యము లభించును; అంతమున వారు, భవసాగరము దాటి మోక్షము పొందుదురు. నృసింహమూర్తి ముఖము తెరచి ఉండును. తన ఎడమతొడపై హిరణ్య

కశిపుని అణచి ఉంచి వాని వక్షమును చీల్చుచుండును. ఆతని కంఠమున మాలయు హస్తములందు చక్ర, గదలుండును. వామనుని విగ్రహము ఛత్రముతోడను, దండముతోను ప్రకాశింప వలెను. నాలుగు భుజములుండవలెను. పరశురాముని చేతిలో ధనుర్బాణములు, ఖడ్గము, గండ్రగొడ్డలి ఉండవలెను. శ్రీరాముని విగ్రహము ధనుర్బాణ ఖడ్గ శంఖములతో ఒప్పారుచుండును. లేదా ఆతనికి రెండు భుజములు మాత్రమే ఉండవచ్చును. బలరాముడు గదను, నాగలిని ధరింపవలెను. లేదా ఆతనికి నాలుగు భుజములుండవచ్చును. ఆతని పై ఎడమచేతిలో నాగలి, క్రింది చేతిలో అందమైన శంఖము, పై కుడిచేతిలో ముసలము, క్రిందచేతిలో సుదర్శన చక్రము ఉండవలెను. బుద్ధుడు శాంత స్వరూపముతో, వరద – అభయ ముద్రలు ధరించి, ఉన్నతమైన పద్మాసనముపై కూర్చుండవలెను. తెల్లని శరీర వర్ణముతో, పొడవైన చెవులతో, అందమైన పీతవస్త్రముచే కప్పబడి యుండ వలెను. కల్కి ధనుస్తూణీరములను ధరించి, మ్లేచ్ఛులను సంహరించు బ్రాహ్మణుడు. లేదా ఆతని విగ్రహ మును గుఱ్ఱముపైఎక్కి నాలుగు చేతులలో ఖడ్గ, శంఖ, చక్ర, గదలను ధరించి ఉండవలెను.

ఇపుడు వాసుదేవాదులగు తొమ్మండుగురి మూర్తుల లక్షణము చెప్పెదను. వాసు దేవునకు పై కుడిచేతిలో చక్రముండుట ప్రధాన చిహ్నము. ఒక పార్శ్వమున బ్రహ్మ, మరొక పార్శ్వమున శివుడు సర్వదా ఉందురు. ఇతర విషయములన్నియు వెనుక చెప్పినట్లే. శంఖమునుగాని, వరద ముద్రనుగాని ధరించి యుండును. ద్విభుజుడు కావచ్చును, చతుర్భుజుడు కావచ్చును. బలరామునకు నాలుగు భుజములుండును. కుడిచేతులలో హల, ముసలములను, ఎడమ చేతులలో గదా, పద్మములను ధరించి ఉండును. ప్రద్యు మ్నుడు కుడిచేతులలో చక్ర, శంఖములను, ఎడమ చేతులలో ధనుర్బాణములను ధరించి యుండును. లేదా రెండు భుజములుండి ఒకచేతిలో గదను, రెండవ దానిలో ధనస్సును ధరించి యుండును. ఈ ఆయుధములను ప్రసన్నతా పూర్వకముగ ధరించి ఉండును. లేదా ఒక హస్తమున ధనస్సు, రెండవ హస్తమున బాణము ఉండును. అనిరుద్ధ, నారా యణుల విగ్రహములు చతుర్భుజములు. బ్రహ్మ హంసారూఢుడు. నాలుగు ముఖములు, ఎనిమిది భుజములు, విశాలమైన ఉదరమండలము, పొడవైన గడ్డము, శిరస్సుపై జటలు ఉండును. కుడిచేతులలో అక్షసూత్రమును, స్రువమును, ఎడమ చేతులలో కుండికను, ఆజ్యస్థాలిని ధరించి యుండును. ఎడమ ప్రక్క సరస్వతి, కుడి ప్రక్క సావిత్రి ఉండును. విష్ణువు గరుడారూఢుడై ఎనిమిది భుజములతో కుడిచేతులలో ఖడ్గ, గదా, బాణ, వరద ముద్రలను; ఎడమ చేతులలో ధనుష్, ఖేటక, చక్ర, శంఖములను ధరించి యుండును. లేదా ఆతని విగ్రహము చతుర్భుజము కూడ కావచ్చును. చతుర్భుజుడైన నృసింహుడు రెండు చేతులలో శంఖ చక్రములను ధరించి, రెండు చేతులలో హిరణ్యకశిపుని వక్షము చీల్చు చుండును.

వరాహమూర్తికి నాలుగు బాహువులుండును. ఆదిశేషుని చేతితో పట్టుకొనును. ఎడమచేతిలో భూదేవిని ధరించును. ఎడమ పార్శ్వమున లక్ష్మి ఉండును. లక్ష్మి ఉన్నపుడు భూమి ఆతని పాదములందు లగ్నమైనట్లు చేయవలెను. త్రైలోక్య మోహనమూర్తియైన శ్రీహరి గరుడారూఢుడు; ఎనిమిది భుజములు. కుడిచేతులలో చక్ర, శంఖ, ముసల అంకుశములను, ఎడమచేతులలో శంఖ, శార్ఙ్గ, గదా, పాశములును ఉండును. వామ భాగమున పద్మహస్తయైన లక్ష్మి ప్రతిమను,

దక్షిణ పార్శ్వమున సరస్వతి ప్రతిమను నిర్మింపవలెను. విశ్వరూపుని విగ్రహము ఇరువది చేతులతో ప్రకాశించుచుండును. కుడిచేతులలో చక్ర, ఖడ్గ, ముసల, అంకుశ, పట్టిశ, ముద్గర, పాశ, శక్తి, శూల, బాణములను; ఎడమచేతులలో శంఖ, శార్ఙ్గ, గదా, పాశ, తోమర, హల, పరశు, దండ, ఛురికా (బాకు), చర్మలను ధరించియుండును. కుడివైపున చతుర్భుజుడగు బ్రహ్మ, ఎడమ వైపు త్రినేత్రుడును ఉందురు. జలశాయి జలములో శయనించి ఉండును. ఈ మూర్తిని శేషశయ్యపై శయనించి ఉన్నట్లు చేయవలెను. లక్ష్మీదేవి ఒక పాదము ఒత్తుచుండును. విమల మొదలగు శక్తులు స్తుతించుచుండును. ఈ శ్రీహరి నాభికమలమున చతుర్భుజుడగు బ్రహ్మ ప్రకాశించు చుండును. హరిహర మూర్తి కుడిచేతులలో శూల, ఋష్టులును, ఎడమచేతులలో గదా చక్రములను ధరించి ఉండును. శరీరము కుడిభాగమున రుద్ర చిహ్నములు, ఎడమ భాగమున కేశవ చిహ్నములు ఉండును. దక్షిణ పార్శ్వమున పార్వతి, వామ పార్శ్వమున లక్ష్మి ఉందురు. హయగ్రీవుని నాలుగు చేతులలో శంఖ, చక్ర, గదా, వేదములు ఉండును. ఎడమపాదము ఆదిశేషుని మీదను, కుడిపాదము కచ్ఛపము వీపు పైనను ఉంచియుండును. దత్తాత్రేయునకు రెండు బాహువులు ఉండును. వామాంక మున లక్ష్మి ఉండును. భగవంతుని పార్షదుడైన విష్వక్సేనుడు నాలుగుచేతులలో చక్ర, గదా, హల, శంఖములను ధరించియుండును. (49)

దేవీప్రతిమా లక్షణము

హయగ్రీవుడు చెప్పెను : చండీదేవికి ఇరువది భుజములుండును. కుడిచేతులలో శూల, ఖడ్గ, శక్తి, చక్ర, పాశ, ఖేట, ఆయుధ, అభయ, డమరు శక్తులను; ఎడమచేతులలో నాగపాశ, ఖేటక, కుఠార, అంకుశ, పాశ, ఘంటా, ఆయుధ, గదా, దర్పణ, ముద్గరములను ధరించియుండును. చండీదేవి ప్రతిమకు పది భుజములుకూడ ఉండవచ్చును. ఆమె పాదముల క్రింద తల ఖండించిన మహిషముండును. ఆ తలతెగి వేరుగా ఉండవలెను. దాని కంఠము నుండి శూలము హస్తమందుగల పురుషుడు శస్త్రమును ఎత్తి మిక్కిలి కోపముతో ముఖమునుండి రక్తము కక్కుచుండును. వాని కంఠమునందు మాల, వెంద్రుకలు, ఎఱ్ఱగా ఉండును. దేవీవాహనమైన సింహము దాని రక్తమును ఆస్వాదించు చుండును. ఆ మహిషాసురుని కంఠమున పాశమొకటి గట్టిగా బిగించి యుండును. దేవి కుడికాలు సింహముపైనను, ఎడమకాలు క్రిందనున్న మహిషాసురుని పైనను ఉండును.

ఈ చండీదేవికి మూడు నేత్రములు ఉండును. ఈమె అనేక శస్త్రములను ధరించి శత్రువులను మర్దించునది. తొమ్మిది పద్మముల రూపమున ఉన్న పీఠముపై దుర్గాప్రతిమపై ఈమెను పూజింప వలెను. మొదటి కమలము తొమ్మిది దళములందును, మధ్యన ఉన్న కర్ణికయందును ఇంద్రాది దిక్పాలులను, నవతత్త్వాత్మికలగు శక్తులతో దుర్గాదేవిని పూజింప వలెను. దుర్గాదేవి ప్రతిమకు పదునెనిమిది భుజములుండును. కుడివైపున ఉన్న హస్తము లలో ముండ, ఖేటక, దర్పణ, తర్జనీ, ధనుష్, ధ్వజ, డమరు, చర్మ, పాశములను; వామ భాగమున ఉన్న హస్తములలో శక్తి, ముద్గర, శూల, వజ్ర, ఖడ్గ, కంకుశ, బాణ, చక్ర, శలాకలను ధరించి ఉండును. పదునారు భుజముల దుర్గా ప్రతిమకు కూడ డమరువు, తర్జని తప్ప ఈ ఆయుధములే ఉండును. రుద్రచండ, ప్రచండ,

చండోగ్ర, చండనాయిక, చండ, చండవతి, చండరూప, అతిచండిక అనువారు ఎనమండుగురు దుర్గలు. ఈ దుర్గలను తూర్పు మొదలు ఎనిమిది దిక్కులందును స్థాపించి పూజింపవలెను. ఉగ్రచండ అను తొమ్మిదవ దుర్గను మధ్య భాగమున స్థాపించి పూజింపవలెను. రుద్రచండ మొదలగు ఎనమండు గురు దుర్గల దేహకాంతి వరుసగ గోరోచనా సదృశముగను, అరుణముగను, నల్లగను, నీలముగను, తెల్లగను, ధూమ్రముగను, పచ్చగను, తెల్లగను ఉండును. వీరు అందరును సింహవాహనులై మహిషాసురుని కంఠము నుండి ఆవిర్భవించిన పురుషుడు శస్త్రధారియై యుండును. ఈ దుర్గాదేవులు వానిజుట్టు, తమ చేతులతో పట్టుకొని ఉందురు.

ఈ నవ దుర్గలును ఆలీఢమున ఉందురు. (కుడికాలు వెనుకకు తన్నిపెట్టి ఎడమకాలు ముందుకువంచి నిలబడుటకు ఆలీఢమనిపేరు). ఈ నవ దుర్గలను పూజించినచో పుత్ర పౌత్రాభి వృద్ధి కలుగును. చండికాది రూపములలో పూజింపబడునది గౌరియే. హస్తములలో కుండి, అక్షమాల, గద, అగ్ని ధరించినచో ఆమెకే "రంభ" అని పేరు. వనమునందు ఆమెకే "సిద్ధ" యని పేరు. సిద్ధావస్థలో ఆమెవద్ద అగ్ని ఉండదు. "లలిత" కూడ గౌరియే. ఆమె స్వరూపము ఇట్లుండును – ఒక ఎడమచేతిలో కంఠసహితమైన ముండము (భిన్న శిరస్సు), రెండవచేతిలో దర్పణము, క్రింది కుడిచేతిలో ఫలాంజలి, పై చేతిలో సౌభాగ్య ముద్ర ఉండును. లక్ష్మి కుడిచేతిలో కమలము, ఎడమచేతిలో మారేడు పండు ఉండును. సరస్వతి రెండు చేతులలో పుస్తకము, అక్షమాల ఉండును. మిగిలిన రెండు చేతులలో వీణ ఉండును. గంగాదేవి తెల్లని దేహచ్ఛాయతో మకరారూఢయై ఒక హస్తమున కల శమును, మరియొక హస్తమున కమలమును ధరించి యుండును. యమునాదేవి శ్యామ వర్ణ, రెండు హస్తములందును కలశములు ధరించి తాబేలుపై నిలచి యుండును. తుంబు రుని ప్రతిమ వీణా సహితముగ నుండవలెను. ఆతని శరీరకాంతి తెల్లగా నుండును. శంకరుడు శూలపాణియై, వృషభమును ఎక్కి మాతృకల ముందు వెళ్ళుచుండును. బ్రహ్మ పత్నియైన సావిత్రి గౌరవర్ణముగలది. నాలుగు ముఖములుండును. కుడి చేతులలో అక్షమాల, స్రుక్కు ఉండును. ఎడమ చేతులలో కుండము, అక్షపాత్ర ఉండును. వాహనము హంస. శంకరుని పత్నియగు పార్వతి వృషభారూఢయై కుడిచేతులలో ధనుర్బాణములను, ఎడమ చేతులలో చక్ర, ధనస్సులను ధరించి యుండును.

ఎఱ్ఱని కాంతిగల కౌమారీ శక్తి నెమలిపై ఎక్కి, రెండు చేతులందును శక్త్యాయుధములను ధరించి ఉండును. లక్ష్మి (వైష్ణవీ శక్తి) కుడిచేతులలో చక్ర, శంఖములను, ఎడమచేతులలో గదా కమలములను ధరించును. వారాహీశక్తి మహిషముపై ఎక్కి దండ, శంఖ, చక్ర, గదలను ధరించును. ఐంద్రీ శక్తి సహస్ర నేత్రములు గలది. ఐరావతముపై ఎక్కి వజ్రము ధరించి యుండును. చాముండ కండ్లు చెట్టు తొఱ్ఱలవలె లోతుగా ఉండును. శరీరము మాంస రహితమై అస్థి పంజరమువలె నుండును. నేత్రములు మూడు. మాంసహీనమగు శరీరమునందు అస్తులు మాత్రమే సారముగ మిగిలి యుండును. జుట్టు పైకి లేచి ఉండును. అణగి ఉండదు. ఏనుగు చర్మ మును ధరించును. ఎడమ చేతులలో కపాలము, పట్టిసము, కుడిచేతులలో శూలము, ఖడ్గము ఉండును. శవముపై ఎక్కి ఎముకల ఆభరణములు ధరించును.

వినాయకుని ఆకారము మనుష్యాకార సదృశముగా నుండును. పొట్ట చాల పెద్దది. ముఖము ఏనుగు ముఖము; తొండము చాల పొడవుగా నుండును. యజ్ఞోపవీతము ధరించి యుండును. ముఖము వెడల్పు ఏడు కళలు. తొండము పొడవు ముప్పది యారు అంగుళములు. నాడి (కంఠముపై నున్న ఎముక) విస్తారము పండ్రెండు కళలు, మెడ ఒకటిన్నర కళల ఎత్తు ఉండును. కంఠప్రదేశము విస్తారము ముప్పదియారు అంగుళములు. గుహ్య ప్రదేశము ఒకటిన్నర అంగుళములు. నాభి-ఊరువుల విస్తారము పండ్రెండు అంగుళములు. కాళ్లు, పాదాల ప్రమాణము కూడ ఇంతియే. కుడి చేతులలో తన దంతమును, పరశువును; ఎడమచేతులలో లడ్డు, నల్లకలువ ధరించి యుండును.

మయూర ఆరూఢుడై ఉన్న కుమారస్వామికి ఇరువైపుల సుముఖీ, బిడాలాక్షి అను మాతృకలును, శాఖ-విశాఖులను అనుజులును నిలచి యుందురు. రెండు హస్తములు, బాలరూపము, కుడిచేతిలో శక్తి, ఎడమ చేతిలో కోడి ఉండును. ముఖములు ఒకటి కాని, ఆరుకాని నిర్మింపవచ్చును. గ్రామములోని విగ్రహమునకు ఆరు లేదా పండ్రెండు హస్తము లుండవలెను. వనమునందు స్థాపించు విగ్రహమున మాత్రము రెండు భుజములే ఉండవలెను. ఆరు కుడి భుజములలో శక్తి బాణ, పాశ, ఖడ్గ, గదా, తర్జనీ ముద్రలును; ఎడమ చేతులలో నెమలి పింఛము, ధనస్సు, ఖేటము, పతాక, అభయముద్ర, కుక్కుటము ఉండవలెను. రుద్రచర్చిక గజచర్మమును ధరించి ఎడమ చేతిలో కపాలము, కర్తరి ధరించి, కుడి చేతిలో శూల, పాశములను ధరించి, ముఖమును, ఒక పాదమును ఎత్తి ఉండును. ఈ దేవి అష్ట భుజారూపమున గూడ పూజింపబడును.

ముండమాలను డమరువును ధరించినపుడు ఆమెయే 'రుద్రచాముండ' అని చెప్పబడును. ఆమె నాట్యముచేయును. అందుచే 'నాట్యేశ్వరి' అని కూడ ఈమెకు పేరు. ఈమె నాలుగు ముఖములతో ఆసనముపై కూర్చున్నప్పుడు "చతుర్ముఖీ మహాలక్ష్మీ" (మహాలక్ష్మి యొక్క తామసమూర్తి) అని చెప్పబడును. ఈమె తన చేతులలోనున్న నరులను గుఱ్ఱములను, దున్నలను, ఏనుగులను తినుచుండును. సిద్ధ చాముండకు పది భుజములు, మూడు నేత్రములు ఉండును. కుడి చేతులలో శస్త్రమును, ఖడ్గమును, మూడు డమరువులను ధరించును. ఎడమ చేతులలో ఘంట, ఖేటకము, మంచపు కోడు, త్రిశూలము, (డాలు) ధరించియుండును. సిద్ధ యోగీశ్వరీదేవి సంపూర్ణ సిద్ధినిచ్చును, ఈ దేవికి స్వరూపమైన మరియొక శక్తి యున్నది. ఈమె శరీరకాంతి ఎఱ్ఱగా నుండును. పాశాంకుశములను ధరించిన ఈమెకు 'భైరవి' అని పేరు. రూప విద్యాదేవికి పండ్రెండు భుజములుండును. ఈ దేవులందరును శ్మశానములో ఆవిర్భవింతురు. భయంకరముగ ఉందురు. ఈ ఎనమండుగురు దేవులకును (రుద్ర, చండ, అష్టభుజ లేదా రుద్ర చాముండ, సిద్ధయోగీశ్వరి భైరవి, రూపవిద్య) "అంబాష్టకము" అని పేరు. క్షమాదేవి చుట్టు ఆడ నక్కలుండును. వృద్ధ స్త్రీ రూపములోనున్న ఆమెకు రెండు హస్తములు ఉండును. నోరు తెరచి ఉండును, పండ్లు ఎత్తుగా ఉండును, మోకాళ్ళు, చేయి ఆనుకొని భూమిపై కూర్చుండును. ఈమె ఉపాసకులకు కల్యాణప్రదాయిని. యక్షిణులు కండ్లు తెరచుకొని (మూయకుండ చూచుచు) ఉందురు. అప్సరసలు సర్వదా సౌందర్యవతులు, వీళ్ళ కండ్లు పచ్చగా ఉండును.

నందీశ్వరునకు ఒక చేతిలో అక్షమాల, రెండవ చేతిలో త్రిశూలము ఉండును. మహాకాలుని చేతిలో కత్తి, రెండవ చేతిలో ఖండితమైన శిరస్సు, మూడవ చేతిలో శూలము, నాల్గవ చేతిలో ఖేదముండవలెను. కృశమైన శరీరముగల భృంగి నృత్యముద్రలో నుండును. ఈతని శిరస్సు కూష్మాండమువలె స్థూలమై బట్టతలయై ఉండును. వీరభద్రుడు మొదలగు గణములకు ఏనుగులు, గోవుల వంటి చెవులు, ముఖములు ఉండును. ఘంటాకర్ణునకు పదునెనిమిది భుజములు ఉండును. ఆతడు పాపములను, రోగములను నశింపచేయును. ఎడమ ప్రక్కన నున్న ఎనిమిది చేతులలో వజ్ర, ఖడ్గ, దండ, చక్ర, బాణ, ముసల, అంకుశ, ముద్గరములను, కుడిప్రక్కనున్న ఎనిమిది చేతులలో తర్జనీ, ఖేట, శక్తి, ముండ, పాశ, ధనుష్, ఘంటా, కుఠారములను ధరించును. మిగిలిన రెండు చేతులతో త్రిశూ లమును పట్టుకొని ఉండును. ఘంటామాలచే అలంకృతుడగు ఘంటాకర్ణుడు విస్ఫోట కమును నివారించును. (50)

సూర్యాది ప్రతిమా లక్షణము

హయగ్రీవుడు చెప్పెను : సూర్యుడు, ఏడు గుఱ్ఱములు కట్టిన, ఒకే చక్రముగల రథముపై రెండు పద్మములను హస్తములలో ధరించి ఉండును. ఆతని దక్షిణ పార్శ్వమున దండి సిరా బుడ్డి లేఖిని ధరించి యుండును. వామ పార్శ్వమున పింగళుడు దండమును ధరించి ద్వారము నందు ఉండును. వీరిరువురును సూర్యుని పార్షదులు. పార్శ్వములందు ఇద్దరు స్త్రీలు వాలవ్యజనమున ధరించి ఉందురు. రాణియైన (భార్యయైన) ఛాయాదేవి ప్రక్కనుండును. లేదా అశ్వముపైన కూర్చున్న ఒక్క సూర్యుని ప్రతిమ మాత్రమే కన్పించ వలెను. సమస్త దిక్పాలకులును వరద ముద్రతో, రెండేసి పద్మములు ధరించి, సాయుధులై దిక్కుల వరుసలో నుందురు.

పంద్రెండు దళముల కమలమును నిర్మింపవలెను. సూర్యుడు, అర్యమ మొదలగు ద్వాదశ సూర్యులను ఆ ద్వాదశ దళములపై స్థాపింపవలెను. ఈ స్థాపనము పశ్చిమ వాయవ్య దిక్కులతో ప్రారంభించి నైరృతి దిక్కువరకును ఉన్న దళములపై చేయవలెను. ఈ ఆదిత్య గణమునకు నాలుగేసి చేతులు, చేతులలో ముద్గర, శూల, చక్ర, కమలములు ఉండును. ఆగ్నేయమునుండి నైరృతివరకు, నైరృతినుండి వాయవ్యమువరకు, వాయవ్యము నుండి ఈశాన్యమువరకు, ఈశాన్యమునుండి ఆగ్నేయమువరకు ఉన్న దళములపై స్థాపింప వలెను.

వరుణుడు, సూర్యుడు, సహస్రాంశువు, ధాత, తపనుడు, సవిత, గభస్తికుడు, రవి, పర్జన్యుడు, త్వష్ట, మిత్రుడు, విష్ణువు అనువారు ద్వాదశాదిత్యులు. వీరు మేషాది ద్వాదశరాసులలో ఉందురు. వరుణాది ఆదిత్యులు క్రమముగ మార్గశీర్షము మొదలు (వృశ్చికము మొదలు) కార్తికమువరకు ఉన్న మాసములలో (తుల వరకు ఉన్న రాశులలో) ఉందురు. వీరి శరీరకాంతి క్రమముగ నలుపు, ఎరుపు, కొంచెము ఎరుపు, పసుపు, పాండువు, తెలుపు, కపిలము, పీతము, ఆకుపచ్చ, ధవళము, ధూమ్రము, నీలము రంగులలో నుండును. వీరి శక్తులు ద్వాదశదళ కమల కేసరాగ్రములందు ఉండును. వారి పేర్లు– ఇడ, సుషుమ్న, విశ్వార్చి, ఇందు, ప్రమర్దిని, ప్రహర్షిణి, మహాకాలి,

కపిల, ప్రబోధిని, నీలాంబర, వనాంతస్థ (ఘనాంతస్థ), అమృతాఖ్య. ఈ శక్తుల శరీర కాంతి గూడ వరుణాదుల శరీర కాంతి వలెనే ఉండును. ఈ శక్తులను కేసరాగ్ర భాగములపై స్థాపింపవలెను. సూర్యుని తేజస్సు ప్రచండముగా, విస్తృతముగా ఉండును. ఈతనికి రెండు భుజములుండును. కమలమును, ఖడ్గమును ధరించియుండును.

చంద్రుడు చేతులలో కుండిక – జపమాలలను ధరించును. కుజునకు చేతులలో శక్తి, అక్ష మాలయు, బుధునకు ధనస్సు, అక్షమాలయు, బృహస్పతికి కుండిక, అక్షమాల, శుక్రునకు కుండిక, అక్షమాల ఉండును. శని మువ్వలు కట్టిన సూత్రమును ధరించును. రాహువు అర్ధ చంద్రుని ధరించును. కేతువు చేతులలో ఖడ్గము, దీపము ఉండును. అనంతుడు, తక్షకుడు, కర్కోటకుడు, పద్ముడు, మహాపద్ముడు, శంఖుడు, కులికుడు మొదలగు ప్రముఖ నాగ గణములన్నియు సూత్రమును ధరించును. వీరందరును పడగల ఆకారముగల ముఖములతో, గొప్ప తేజఃపుంజముతో ప్రకాశించు చుందురు. ఇంద్రుడు వజ్రము ధరించి గజముపై ఎక్కియుండును. అగ్ని శక్తి హస్తుడై మేక మీద కూర్చుండును. యముడు దండము ధరించి మహిషాధిరూఢుడై ఉండును. ఖడ్గధారియైన నిరృతికి వాహనము మనిషి. వరుణుడు పాశహస్తుడై మకరముపై ఉండును. వజ్రధారియైన వాయు దేవునకు వాహనము లేడి. కుబేరుడు గద ధరించి గొఱ్ఱెపై ఉండును. జటాధారియైన ఈశానునకు వాహనము వృషభము.

లోకపాలులందరును ద్విభుజులు. విశ్వకర్మ చేతిలో అక్షసూత్రముండును. హనుమంతుని హస్తమునందు వజ్రాయుధము ఉండును. రెండు పాదములతో ఒక అసురుని అణగ ద్రొక్కి నిల బడును. కిన్నరులు వీణాధారులు, విద్యాధరులు మాలాధారులై ఆకాశమున విహరించుచుందురు. పిశాచముల శరీరములు అస్థిపంజరమాత్ర శేషములుగ ఉండును. భేతాళముల ముఖములు భయంకరముగ ఉండును. క్షేత్రపాలులు శూలములు ధరించి యుందురు. ప్రేతముల ఉదరములు పెద్దవిగ ఉండును. శరీరములు కృశించి యుండును. (51)

చతుష్షష్టి యోగిన్యాది లక్షణము

హయగ్రీవుడు చెప్పెను : ఇపుడు అరువది నాలుగు యోగినులను గూర్చి చెప్పెదను. వీరి స్థానము క్రమముగ తూర్పునుండి ఈశాన్య పర్యంతము ఉండును. యోగినుల పేర్లు : అక్షోభ్య, రూక్షకర్ణి, రాక్షసి, కృపణ, క్షయ, పింగాక్షి, అక్షయ, క్షేమ, ఇళ, నీలాలయ, లోల, అలక్త, బలాకేశి, లాలస, విమల, హుతాశ, విశాలాక్షీ, హుంకార, బడబాముఖి, మహాక్రూర, క్రోధన, భయంకరి, మహానన,సర్వజ్ఞ, తరల, తార, ఋగ్వేద, హయానన, సార, రుద్ర సంగ్రాహి, శబర, తాలజంఘిక, రక్తాక్షి, సుప్రసిద్ధ, విద్యుజ్జిహ్వ, కరంకిణి, మేఘనాద, ప్రచండ, ఉగ్ర, కాలకర్ణి, వరప్రద, చంద్ర, చంద్రావళి, ప్రపంచ, ప్రళయాంతిక, శిశువక్త్ర, పిశాచి, పిశితాశ, లోలుప, ధమని, తవని, రాగిణి, వికృతానన, వాయువేగ, బృహత్కుక్షి, వికృత, విశ్వరూపిక, యమజిహ్వ, జయంతి, దుర్జయ, జయంతిక, బిడాలి, రేవతి, పూతన, విజయాంతిక. ఈ యోగినులకు ఎనిమిది లేదా నాలుగు

చేతులు ఉండును. ఇచ్ఛానుసారముగ ఆయుధములను ధరించుచుందురు, ఉపాసకులకు సంపూర్ణ సిద్ధులను ప్రసాదింతురు. భైరవునకు పండ్రెండు చేతులుండును. దంతములు ఎత్తుగా ఉండును. శిరస్సుపై జటా, చంద్రులుండును. ఒక వైపున నున్న ఐదు చేతులతో ఖడ్గ, అంకుశ, కుఠార, బాణ, జగదభయప్రదాన ముద్రలును; రెండవ ప్రక్కనున్న ఐదు చేతులతో ధనుష్, త్రిశూల, ఖట్వాంగ (మంచము కోడు); పాశకార్ధ, వరముద్రలను ధరించి ఉండును. మిగిలిన రెండు చేతులలో గజచర్మ ఉండును. గజచర్మమే వస్త్రము. సర్వాలంకారములచే అలంకృతుడై ఉండును. మాతృకల మధ్య ప్రేతముపై కూర్చుండును. భైరవుని ప్రతిమ ఈ రూపమున నిర్మించి పూజించవలెను. భైరవునకు ఒక ముఖముండ వచ్చును. లేదా ఐదు ముఖములుండవచ్చును.

తూర్పు దిక్కు నుండి ఆగ్నేయము వరకు, విలోమ క్రమమున, అన్ని దిక్కులందును భైరవుని స్థాపించి క్రమముగ పూజింపవలెను. బీజమంత్రమును ఎనిమిది దీర్ఘస్వరములలో ఒక్కొక్క దానిచేత విడగొట్టి, అనుస్వార యుక్తముచేసి, ఆయా దిక్కునందున్న భైరవునితో కలిపి అన్నింటికి చివర 'నమః' చేర్చవలెను.

ఉదా : "ఓం హ్రాం భైరవాయ నమః – ప్రాచ్యామ్, ఓం హ్రీం భైరవాయ నమః – ఐశాన్యామ్; ఓం హ్రూం భైరవాయ నమః – ఉదీచ్యామ్; ఓం హ్రేం భైరవాయ నమః – వాయవ్యేమ్; ఓం హ్రైం భైరవాయ నమః – ప్రతీచ్యామ్, ఓం హ్రోం భైరవాయ నమః – నైరృత్యామ్; ఓం హ్రౌం భైరవాయ నమః – అవాచ్యామ్; ఓం హః భైరవాయ నమః – ఆగ్నేయ్యామ్" ఈ విధముగ మంత్రోచ్చారణ చేయుచు ఆయా దిక్కులలో భైరవ పూజ చేయవలెను. వీటిలో ఆరు బీజమంత్రములతో షడంగన్యాసము చేసి ఆ అంగముల పూజచేయవలెను. ధ్యానము ఈ విధముగ చేయవలెను. "భైరవుడు ఆగ్నేయ దళమునందు విరాజిల్లుచు, బంగారు నాలుకతోడను, నాద–బిందు, చంద్రుల తోడను, మాతృకాధి పత్యంగముతోడను ప్రకాశించుచున్నాడు. (అట్టి భైరవునకు నమస్కారము). వీరభద్రుడు వృషభారూఢుడు. మాతృకామండల మధ్యమున ఉండును. నాలుగు హస్తములు. గౌరికి రెండు హస్తములు మూడు నేత్రములు. ఒక హస్తమునందు శూలము, రెండవ దానిలో దర్పణము ఉండును. లలితాదేవి కమలముపై కూర్చుండును. నాలుగు భుజములలో త్రిశూలము, కమండలువు, కుండి, వరదాన ముద్ర ధరించి ఉండును. స్కందుని అనుసరించి ఉండు మాతృకా గణము చేతులలో దర్పణము, శలాక ఉండును. చండికకు పది భుజములు ఉండును. కుడి చేతులలో బాణ, ఖడ్గ, శూల, చక్ర, శక్తులను ధరించి ఉండును. వామ హస్తములలో నాగపాశ, చర్మ, అంకుశ, కుఠార, ధనుస్సులను ధరించును. సింహాధిరూఢయైన ఆ దేవి ఎదుట శూలముచే చంపబడిన మహిషాసురుని శవము పడియుండును. (52)

లింగాది లక్షణము

హయగ్రీవుడు చెప్పెను : బ్రహ్మదేవా! ఇపుడు నేను లింగాదుల లక్షణము చెప్పెదను వినుము. లింగము పొడవులో సగమును ఎనిమిది భాగములుచేసి, వాటిలో మూడు భాగములు విడచి,

మిగిలిన ఐదు భాగములతో చతురస్రమైన విష్కంభము నిర్మింపవలెను. మరల పొడవును ఆరు భాగములు చేసి వాటిని ఒకటి, రెండు, మూడు అను క్రమమున వేరుగా ఉంచవలెను. వీటిలో మొదటి భాగము బ్రహ్మదేవునిది; రెండవది విష్ణువునకు సంబంధించినది; మూడవది శివునిది. దీనికి "వర్ధమాన భాగము" అని పేరు. చతురస్ర మండపమున కోణ సూత్రార్ధ ప్రమాణము గ్రహించి, దానిలో అన్ని కోణముల మీదను గుర్తులు ఉంచవలెను. ఇట్లు చేయగా ఎనిమిది కోణ ముల వైష్ణవ భాగము సిద్ధించును. సందేహము లేదు. పిమ్మట పదునారు కోణములతోడను, ముప్పదియారు కోణములతోడను కూడిన దానిగా చేయవలెను.

పిమ్మట అరువది నాలుగు కోణములు ఉండునట్లు చేసి అచట ఒక గోళాకారరేఖ గీయవలెను. పిమ్మట శ్రేష్ఠుడైన ఆచార్యుడు లింగము శిరోభాగమును ఖండించవలెను. పిమ్మట లింగ విస్తారమును ఎనిమిది భాగములుగ విభజింపవలెను. పిమ్మట వాటిలో ఒక భాగము యొక్క నాల్గవ భాగమును విడువగా ఛత్రాకారమగు శిరస్సు ఏర్పడును. మూడు భాగములందును పొడవు వెడల్పులు సమా నముగా ఉండు లింగము సకల మనోభీష్టములను ఇచ్చును. దేవపూజిత లింగమునందు పొడవులోని నాలుగవ భాగముచే విష్కంభము ఏర్పడును. ఇపుడు అన్ని లింగముల లక్షణములను వినుము.

పండితుడు 16 అంగుళముల లింగమునకు మధ్య బ్రహ్మ రుద్ర భాగములకు సమీ పమున ఉన్న సూత్రము తీసికొని దానిని ఆరు భాగములుగ విభజింపవలెను. వైయమన సూత్రముల సహాయముతో నిశ్చయింపబడిన ఈ పరిమాణమునకు 'అంతరము' అని పేరు. అన్నింటి కంటె ఉత్తరమునందున్న లింగమును ఎనిమిది యవలు పెద్దదిగా ఉండునట్లు చేయవలెను. మిగిలిన లింగములను ఒక్కొక్క యవ తగ్గునట్లు చేయవలెను. పైన చెప్పిన లింగము క్రింది ప్రదేశమును మూడు భాగములుగ విభజించి పై భాగము నొకదానిని విడచివేయవలెను. మిగిలిన రెండు భాగములను ఎనిమిది భాగములుగ విభజించి పై మూడు భాగములను విడచివేయవలెను. ఐదవ భాగముపై భాగము నుండి తిరుగుచున్న ఒక దీర్ఘరేఖ గీయవలెను. ఒక భాగమును విడచి, మధ్య యందు ఆరెండు రేఖలను కలపవలెను. ఇది లింగముల సాధారణ లక్షణము. ఇపుడు పిండిక యొక్క సర్వసాధారణ లక్షణమును చెప్పెదను వినుము.

బ్రహ్మ భాగమునందు లింగము ఎత్తు తెలిసికొని, పండితుడు, బ్రహ్మ శిలాస్థాప నముచేసి, దానిపైననే ఉత్తమరీతిచే కర్మసంపాదనము చేయవలెను. పిండిక ఎత్తు తెలిసికొని దానిని విభజింపవలెను. రెండుభాగముల ఎత్తును పీఠముగా గ్రహింపవలెను. వెడల్పులో అది లింగముతో సమానముగనే ఉండవలెను. పీఠ మధ్యభాగమున గుంటచేసి దానిని మూడు భాగములుగ విభజింప వలెను. తన ప్రమాణము యొక్క సగము త్రిభాగముచే "బాహుళ్యమును" ఏర్పరుపవలెను. బాహు ళ్యము తృతీయ భాగముచే మేఖల నిర్మించి దానితో సమానముగ గుంట చేయవలెను. అది క్రమ ముగ పల్లముగ ఉండవలెను. మేఖల పదహారవ భాగమంత మేఖల నిర్మించి దాని కొలతను అనుసరించి పీఠము ఎత్తు ఏర్పరుపవలెను. దీనికి "వికరాంగము" అనిపేరు. శిలయొక్క ఒక భాగము భూమి లోనికి ఉండవలెను. ఒక భాగములో పిండిక నిర్మితము కావలెను. మూడు భాగ

ములతో కంఠము, ఒక భాగముతో పట్టిక నిర్మింపవలెను. రెండు భాగములపైన పట్టము నిర్మింప వలెను. ఒక భాగముచే శేషపట్టికలు నిర్మింపవలెను. కంఠము వరకు ఒక్కొక్క భాగము ప్రవేశించవలెను. పిమ్మట ఒక భాగముచే నిర్గమము (నీరుపోవు మార్గము) నిర్మింపవలెను. ఇది శేషపట్టిక వరకు ఉండవలెను. ప్రణాలము తృతీయ భాగముచే నిర్గమము ఏర్పడవలెను. మూడవ భాగము మొదటి వ్రేలిచివరి భాగమంత గుంట చేయవలెను. అది మూడవ భాగములో సగము విస్తారముండవలెను. ఆ గుంట ఉత్తరమువైపు ఉండ వలెను. ఇది పిండికా సహితమైన సాధారణ లింగము వర్ణనము. (53)

లింగమానముల లక్షణము

హయగ్రీవుడు చెప్పెను : బ్రహ్మదేవా! ఇపుడు నేను ఇతర లింగాదులను గూర్చి చెప్పెదను వినుము. లవణముతోను, ఘృతముతోను చేసిన శివలింగము బుద్ధిని వృద్ధి పొందించును. వస్త్రమయ లింగము ఐశ్వర్యదాయకము. అది తాత్కాలిక లింగము. మృత్తికతో నిర్మించిన లింగము పక్వము, అపక్వము అని రెండు విధములు. అపక్వము కంటె పక్వము శ్రేష్ఠము. దాని కంటె కఱ్ఱతో చేసిన లింగము అధిక పుణ్యదాయకము, పవిత్రము. దాని కంటె శిలాలింగము శ్రేష్ఠము. దాని కంటె ముత్యముల శివలింగము, దాని కంటె సువర్ణ లింగము ఉత్తమములు. వెండి, రాగి, ఇత్తడి, రత్న ములు, పాదరసము వీటితో నిర్మించిన శివలింగము భోగమోక్ష ప్రదము, శ్రేష్ఠము. రస లింగమును రత్నములలోగాని, సువర్ణాది లోహములలోగాని బంధించి స్థాపించవలెను. సిద్ధాదులచే స్థాపింపబడిన స్వయంభూలింగాదులకు కొలతలు మొదలగునవి చేయుట యుక్తముకాదు.

బాణ లింగ విషయమున కూడ (నర్మదోద్భవమునకు) ప్రమాణాది చింత ఉండకూడదు. అట్టి లింగములకై ఇచ్ఛానుసారముగ పీఠప్రాసాదాది నిర్మాణము చేయవచ్చును. సూర్యమండలస్థ శివలింగమును అద్దములో ప్రతిబింబింపజేసి పూజించవలెను. లింగముపై శివార్చన పరిపూర్ణము, సకల కామప్రదము. శివలింగము ఎత్తు హస్తము కంటె ఎక్కువ ఉండవలెను. కాష్ఠమయ శివ లింగముకూడ అంతయే ఉండవలెను. చల శివలింగ స్వరూప మును అంగుళమానానుసారమును, స్థిర లింగ స్వరూపమును ద్వార, గర్భ, హస్తమానముల అనుసారమును నిర్ణయింపవలెను. గృహ ములో పూజింపబడు చలలింగము ప్రమాణము ఒక అంగుళము మొదలు పదునైదు అంగుళముల వరకును ఉండవచ్చును.

ద్వార మానమునుబట్టి లింగము మూడు విధములగును. వీటిలో ఒక్కొక్క దానికి గర్భ మానమును బట్టి, తొమ్మిదేసి భేదములగును. హస్తమానముచే తొమ్మిది భేదములగును. వీటిని దేవాలయములలో పూజింపవలెను. ఈ విధముగ అన్నింటిని కలపగా ముప్పది యారు లింగములు. ఇది లింగముల జ్యేష్ఠ మానము. మధ్యమమాన, కనిష్ఠ మానముల చేత కూడ ముప్పదియారు, ముప్పదియారు శివలింగములగును. ఈ విధముగ అన్ని లింగములను కలుపగా నూట ఎనిమిది లింగములగును. ఒకటి మొదలు ఐదు అంగుళముల వరకు కనిష్ఠము (చిన్నది). ఆరు నుండి పది అంగుళముల వరకు చలలింగము మధ్యమము. పదకొండు నుండి పదునైదు అంగుళముల

వరకు చల శివలింగము జ్యేష్ఠము. చాల మూల్యముగల రత్నములతో నిర్మించిన లింగము ఆరు అంగుళములు, సాధారణ రత్న నిర్మితము తొమ్మిది అంగుళములు, సువర్ణ నిర్మితము పండ్రెండు అంగు ళములు, ఇతర పదార్థ నిర్మితము పదునైదు అంగుళములు ఉండవలెను.

లింగ శిలను పదునారు భాగములు చేసి పై నాలుగు భాగములలో ప్రక్కనున్న రెండు భాగములను తీసివేయవలెను. మరల ముప్పది రెండు భాగములు చేసి దాని రెండు కోణము లందును ఉండు పదునారు భాగములు తీసివేయవలెను. మరల దానిలో నాలుగు భాగములు కలుపగా కంఠము ఏర్పడును. అనగా ఇరువది భాగములు కంఠముగా ఏర్పడును. రెండు ప్రక్కలను ఉన్న పండ్రెండు భాగములను తీసివేయుటచే జ్యేష్ఠచల లింగము ఏర్పడును. ప్రాసాద (దేవాలయ)ము ఎత్తును పదునారు భాగములుగా విభజింపగా, నాలుగు, ఆరు, ఎనిమిది భాగముల ఎత్తుచే వరుసగా కనిష్ఠ, మధ్య, జ్యేష్ఠ ద్వారములు ఏర్పడును. ద్వారము ఎత్తులో నాల్గవవంతు తగ్గించగా అది లింగము ఎత్తు అగును. లింగ శిలాగర్భము ఎత్తులో సగము ఎత్తుగల శివలింగము కనిష్ఠము. పదునైదు భాగముల ఎత్తుగలది జ్యేష్ఠము. ఈ రెండింటి మధ్య ఏడుచోట్ల సూత్ర పాతము చేయవలెను. ఈ విధముగ తొమ్మిది సూత్రములగును. ఈ తొమ్మిది సూత్రములలో ఐదు సూత్రముల ప్రమాణము గల లింగము మధ్యమము, లింగముల ఎత్తు రెండేసి భాగముల తేడాతో ఉండును. ఈ విధముగ లింగముల పొడవు పెరగగా తొమ్మిది లింగములు నిర్మాణ మగును. హస్తప్రమాణముచే లింగమును నిర్మించినచో, మొదటి లింగము ప్రమాణము ఒక హస్తము రెండవ దాని ప్రమాణము మొదటి దాని కంటె ఒక హస్తము ఎక్కువ. ఈ విధముగ తొమ్మిది హస్తముల కొలత పూర్తి అగువరకు ఒక్కొక్క హస్తము పెంచుతూ పోవలెను. పైన చెప్పిన హీన, మధ్యమ, జ్యేష్ఠ లింగములలో ఒక్కొక్క దానికి మూడేసి భేదములు ఉండును.

బుద్ధిమంతుడు ఒక్కొక్క లింగమునందు విభాగ పూర్వకముగ మూడేసి లింగములు నిర్మింప చేయవలెను. ద్వారమానము, గర్భమానము, హస్తమానము అను ఈ మూడు దీర్ఘ మానానుసారము స్థిర లింగమును నిర్మింపవలెను. పై మూడు ప్రమాణములను అనుసరించి భగేశుడు, జవేశుడు, దేవేశుడు అని మూడు పేర్లు ఏర్పడును. విష్కంభ (విస్తార)మును బట్టి లింగమునకు నాలుగు రూపములు గుర్తింపవలెను. దైర్ఘ్య ప్రమాణా నుసారము ఏర్పడు, మూడు రూపములలో కావలసిన లింగమునకు శుభమగు ఆయాదిక ముండునట్లు చూచుకొనవలెను. ఈ మూడు విధముల లింగముల పొడవు నాలుగు లేదా ఎనిమిది హస్తములుండుట మంచిది. ఇవి వరుసగ త్రిగుణ స్వరూపములు. లింగము పొడవు ఎన్ని హస్తములు ఉన్నదో ఆ హస్తములను అంగుళముల లోనికి మార్చి, ఎనిమిది, ఏడు, ఐదు, మూడు సంఖ్యలచే విభజించవలెను. మిగిలిన దానిని బట్టి శుభాశుభ నిర్ణయము చేయవలెను.

ధ్వజాధ్యాయములలో ధ్వజ, సింహ, గజ, వృషభాయములు మంచివి. మిగిలిన నాల్గును చెడ్డవి. స్వర సంఖ్యచే అనగా ఏడుచేత భాగించినపుడు షడ్జ, గాంధార, పంచమ ములు (శేషము) శుభదాయకములు. భూతములచేత, అనగా ఐదుచేత భాగించినపుడు శేషము పృథివి అయిన

శుభము. అగ్నిచేత, అనగా మూడుచేత భాగించినపుడు, శేషము ఆహవనీయాగ్నియైన శుభము. లింగము పొడవును సగముచేసి, దానిని ఎనిమిదిచే భాగించగా శేషము ఏడు వచ్చినచో ఆ లింగము "ఆఢ్యము", ఐదు కంటె అధికము శేషమైనచో "అనాఢ్యము". ఆరు అంశల కంటె అధికము శేషమైనచో అది "దేవేజ్యము". మూడు అంశలకంటె అధికము శేషించినచో అది "అర్కతుల్యము". ఈ నాలుగు విధములగు లింగములును చతుష్కోణములుగ ఉండును. ఐదవది "వర్ధమాన లింగము", దీనికి వ్యాసము కంటె అనాహము అధికము. అనాహము వ్యాసముతో సమానముగ ఉండుట, దాని కంటె పెద్దదిగా ఉండుట అను దానినిబట్టి, ఈ లింగములలో రెండు భేదములు ఉండును. విశ్వకర్మ శాస్త్రానుసారము ఈ అన్నింటి భేదము అనేకములు చెప్పబడగలవు. స్థూలత్వాదులచే ఆఢ్యాది లింగములలో మరల మూడు భేదములుండును. వాటికి ఒక్కొక్క యవ చొప్పున పెంచగా మొత్తము ఎనిమిది విధముల లింగములు ఏర్పడును. హస్తమానమును బట్టి 'జిన' మను లింగమునకుగూడ మూడు భేదములగును. దానిని సర్వసమ లింగమున కలిపి వేయవలెను.

అనాఢ్యము, దేవార్చితము, అర్కతుల్యము అను లింగములకుగూడ ఐదేసి భేదము లగుటచే ఇరువదియైదు అగును. ఏక, జిన, భక్త భేదములచే డెబ్బదియైదు భేదములు అగును. అన్నియు కలుపగా పదునైదువేల, నాలుగు వందల శివలింగములగును. ఎనిమిది అంగుళముల విస్తారముగల లింగముకూడ ఏకాంగుళ మానము, హస్తమానము, గర్భ మానము అనుమానత్రయము ననుసరించి తొమ్మిది భేదములగును. వీటి నన్నింటిని కోణ, అర్ధ కోణములందున్న సూత్రములచే వీటి కోణములను విభజింపవలెనని ఒక్కొక్క విభాగము యొక్క విస్తారము, లింగ మధ్యభాగ విస్తార తుల్యముగ భావించి మధ్య, ఊర్ధ్వ, అధో విభాగములు ఏర్పరుపవలెను. మధ్యమ విభాగముపైన ఉన్న అష్ట కోణము లేదా షోడశకోణము అగు విభాగము శివుని అంశము. మూల భాగమునుండి జానువు పర్యంతముండు లింగ అధో భాగము బ్రహ్మయొక్క అంశము. జానువు నుండి నాభి వరకును ఉన్న లింగ మధ్యభాగము విష్ణువు యొక్క అంశము.

మూర్ధాంత భాగము భూతభాగేశ్వరునిది. వ్యక్త, అవ్యక్త లింగములు అన్నింటికిని ఇదే పద్ధతి. ఐదు లింగముల ఏర్పాటున్న శివలింగమునకు శిరోభాగమును గుండ్రముగ చేయవలెను. ఈ గోళాకారము ఛత్రమువలె నుండవచ్చును. కోడిగుడ్డువలె నుండవచ్చును, లేదా నవోదిత చంద్రునివలె ఉండవచ్చును. కామ్య భేదమును బట్టి నాలుగు విధములగు ఫల భేదములను చెప్పుచున్నాను. లింగము శిరోవిస్తారము ఎన్ని అంగుళములుండునో ఆ సంఖ్యను ఎనిమిదిచే భాగించవలెను. ఈ విధముగ శిరస్సును ఎనిమిది భాగములుగ విభజించి మొదటి నాలుగు భాగములను విస్తార ఔన్నత్యములను అనుసరించి గ్రహింపవలెను. ఒక భాగమును తీసివేయగా "పుండరీకము" అను లింగము, రెండు భాగములను తీసివేయగా, 'విశాలము' అను లింగము, మూడు భాగములను తీసివేయగా "శ్రీవత్సము" అను లింగము, నాలుగు భాగములను తీసివేయగా "శత్రుకారక లింగము" ఏర్పడును. అన్ని ప్రక్కలనుండియు శిరోభాగము సమముగనున్నది శ్రేష్ఠము. దేవపూజ్య లింగము నందు లింగశిరోభాగము కుక్కుటాండము(కోడిగ్రుడ్డు) వలె గోళాకారమున నుండవలెను.

చతుర్భాగాత్మక లింగమునందు పై రెండు భాగములను తొలగించగా "త్రపుష" మను లింగము ఏర్పడును. ఇది అనాఢ్యమను శివలింగముయొక్క శిరస్సుగా చెప్పబడుచున్నది. ఇపుడు అర్ధ చంద్రాకార శిరస్సు గూర్చి వినుము. శివలింగ ప్రాంతభాగమునందు ఒక అంశమును నాలుగు అంశములుగ చేసి ఒక అంశమును విడచినచో దానికి "అమృతాక్షరము" అని పేరు. రెండవ, మూడవ, నాల్గవ అంశములను తొలగింపగా క్రమముగ వాటికి "పూర్ణేందు" "బాలేందు" "కుముద' 'ములు అని పేర్లు. ఇవి క్రమముగ చతుర్ముఖ, త్రిముఖ, ఏక ముఖములు. ఈ మూడింటికి "ముఖ లింగము"లని కూడ పేర్లు. ఇపుడు ముఖలింగమును గూర్చి వినుము. పూజాభాగమును, మూర్తిపూజ, అగ్నిపూజ, పదపూజ అని మూడు విధములుగ కల్పించుకొనవలెను. వెనుకటివలె ద్వాదశాంశమును విడచి, ఆరు భాగములద్వారా ఆరు స్థానములను అభివ్యక్తము చేయ వలెను. శిరస్సు ఎత్తుగా నుండునట్లు, లలాట, నాసికా, ముఖ, చిబుక, కంఠములు స్పష్టముగ కనబడునట్లు చేయవలెను. నాలుగు అంశములచే రెండు భుజములను, నేత్రములను ఏర్పరుపవలెను. ప్రతిమా ప్రమాణానుసారము హస్తము ముకుళాకారముగ ఏర్పరచి, విస్తారములోని ఎనిమిదవ అంశముచే నాలుగు ముఖములను ఏర్పరుపవలెను. అన్ని ప్రక్కల నుండియు సమముగ ఉండవలెను. ఇంతవరకు చతుర్ముఖ లింగమును గూర్చి చెప్పితిని; ఇప్పుడు త్రిముఖ లింగమును గూర్చి చెప్పెదను వినుము.

చతుర్ముఖ లింగముకంటె త్రిముఖ లింగమునకు చెవులు, పాదములు అధికము. లలాటాదులను వెనుకటివలెనే ఏర్పరుపవలెను. నాలుగు అంశలతో రెండు భుజములను నిర్మింపవలెను. వాటి వెనుక భాగము దృఢముగా ఉండవలెను. విస్తారము యొక్క ఎని మిదవ అంశమునందు మూడు ముఖములును స్పష్టముగ కనబడవలెను. (ఏక ముఖ లింగము) : ఏక ముఖమును తూర్పు వైపున నిర్మింపవలెను. దాని నేత్రములు సౌమ్యముగా ఉండవలెను. దాని లలాట, నాసికా, ముఖ, కంఠములు పైకి ఉబికి ఉండవలెను. బాహు విస్తారములో ఐదవ అంశముచే పైన చెప్పిన అవయ వముల నిర్మాణము జరుగవలెను. దానిని బాహురహితముగ నిర్మింపవలెను. ఈ ఏకముఖ లింగము నందు విస్తారములో ఆరవ అంశమునందు ముఖ నిర్మాణము హితకరమని చెప్పబడినది. ముఖ యుక్తములగు అన్ని లింగముల శిరోభాగములును త్రపుషాకారములో గాని, కుక్కుటాండాకారములో గాని ఉండవలెను. (54)

పిండికా లక్షణము

హయగ్రీవుడు చెప్పెను : బ్రహ్మదేవా! నేను ఇపుడు ప్రతిమల పిండికల లక్షణమును చెప్పెదను. పిండిక పొడవు ప్రతిమ పొడవుతో సమానముగా ఉండవలెను; వెడల్పు దానిలో సగముండవలెను. దాని ఎత్తు ప్రతిమ ఎత్తులో సగముండవలెను. లేదా దాని విస్తారము పొడవులో తృతీయాంశము ఉండవలెను. దాని మూడవ వంతుచే మేఖల నిర్మింపవలెను. నీరు ప్రవహించుటకై ఉన్న గర్తము కొలత మేఖల కొలతతో సమానముగా ఉండవలెను. ఆ గర్తము ఉత్తరమువైపు కొంచెము పల్లముగా నుండవలెను. పిండిక విస్తారములో నాల్గవవంతుతో జలము బైటకు పోవుటకై ప్రణాలము (కాలువ) నిర్మించ వలెను. మూల భాగమున దాని విస్తారము మూలముతో సమముగా నుండవలెను. పైకి

పోయిన కొలది సగముండవలెను. ఆ జలమార్గము పిండికా విస్తారములో మూడవ వంతుగాని, సగముగాని ఉండవలెను. దాని పొడవు ప్రతిమ పొడవెంతయో అంతే ఉండవలెనని చెప్పబడినది. లేదా ప్రతిమ పొడవు పిండిక పొడవులో సగముండవలెను. ఈ విషయము బాగుగా అర్థముచేసికొని దానికి సూత్రపాతము చేయవలెను.

వెనుక చెప్పినట్లు, ప్రతిమ ఎత్తు షోడశభాగ సంఖ్యానుసారముగ చేయవలెను. ఎనిమిదవ భాగము క్రిందనున్న అర్థాంగముగా చేయవలెను. దీనిపైన ఉన్న మూడు భాగములు గ్రహించి కంఠమును నిర్మింపవలెను. మిగిలిన భాగములను ఒక్కొక్కదానిని ప్రతిష్ఠ, నిర్గమము, పట్టిక మొదలగువాటి రూపమున విభజింపవలెను. ఇది ప్రతిమా పిండికల సామాన్య లక్షణము. ప్రాసాద ద్వార దైర్ఘ్య విస్తారములను పట్టి ప్రతిమా గృహద్వారము ఉండవలెను. ప్రతిమల ప్రభలపై ఏనుగులు, సర్పములు మొదలగు వాటి మూర్తులను నిర్మింపవలెను. అన్ని దేవప్రతిమల ప్రమాణము విష్ణు ప్రతిమకు చెప్పిన ప్రమాణమువలె ఉండవలెను. దేవీప్రతిమల ప్రమాణము లక్ష్మీ ప్రతిమకు చెప్పిన విధముననే ఉండవలెను. (55)

దశ దిక్కృతి యాగ కథనము

హయగ్రీవుడు చెప్పెను : బ్రహ్మదేవా, ఇపుడు ఐదు ప్రతిష్ఠాంగములను చెప్పెదను. ప్రతిమ పురుషునికి ప్రతీకయైనచో పిండిక ప్రకృతికి ప్రతీకము. లేదా ప్రతిమ నారాయణ స్వరూపము, పిండిక లక్ష్మీ స్వరూపము. ఈ రెండింటి యోగమునే ప్రతిష్ఠ అందురు. అందుచే ఆయా ఫలములు కోరువారు ఆయా దేవతల ప్రతిష్ఠ చేయుదురు. ఆచార్యుడు దేవాలయము ఎదుట గర్భసూత్రము తొలగించి ఎనిమిది, లేదా పదునారు లేదా ఇరువది హస్తముల మండపము నిర్మింపవలెను. ఎనిమిది హస్తముల మండపము 'నిమ్నము', పదునారు హస్తములది 'మధ్యమము', ఇరువది హస్తములది 'ఉత్తమము'. మండపములో సగము భాగమును దేవతా స్నానమునకు, కలశ స్థాపన కొరకు, యాగమునకు సంబంధించిన ద్రవ్యములను ఉంచుటకును కేటాయించవలెను. మిగిలిన సగము మండపములో, లేదా మూడవవంతు మండపములో సుందరమైన వేది ఏర్పరుపవలెను. దానిని పెద్దపెద్ద కలశములతోడను, చిన్నచిన్న కలశములతోడను, చాందనీలు మొదలైన వాటి తోడను అలంకరింపవలెను. మండపములోపల పంచగవ్యములు చల్లి, శుద్ధిచేసి, అచట సామగ్రి అంతయు ఉంచవలెను. పిమ్మట ఆచార్యుడు వస్త్రమాలాద్యలంకృతుడై, విష్ణువును ధ్యానించి పూజింపవలెను.

ఉంగరములు మొదలగు ఆభరణములు ఇచ్చి, ప్రార్థించి, మూర్తిపాలకులగు విద్వాంసులను సత్కరించి, వారిని చతురస్రములు, అర్ధచంద్రాకారములు, గోళాకారములు లేదా పద్మ సదృశములు అగు కుండములపై కూర్చుండ పెట్టవలెను. పూర్వాది దిక్కుల తోరణములకు అశ్వత్థ, ఉదుంబర, వట, ప్లక్షదారువులను ఉపయోగింపవలెను. తూర్పు ద్వారమునకు 'సుశోభన' మని పేరు. దక్షిణ ద్వారము 'సుభద్రము', పశ్చిమద్వారము 'సుకర్మ', ఉత్తర ద్వారము 'సుహోత్రము'. ఆ తోరణ

స్తంభములన్నియు ఐదు హస్తముల ఎత్తు ఉండవలెను. వీటిని స్థాపించి "స్యోనా పృథివీనో" అనే మంత్రముచే పూజించవలెను. తోరణస్తంభముల మూల భాగములందు మంగళకరమైన చూత పల్లవ, యవాంకురము ఆది అంకరములు ఉన్న కలశములు స్థాపింపవలెను. తోరణ స్తంభముపైన సుదర్శన చక్రము స్థాపింపవలెను. నేర్పుగల విద్వాంసుడు ఐదు అడుగుల ఐదు హస్తముల ధ్వజము కూడ స్థాపింపవలెను. దీని వెడల్పు పదునారు అంగుళములు ఉండవలెను. ఓ సురశ్రేష్ఠా! ఆ ధ్వజ దండము ఏడు హస్తముల ఎత్తు ఉండవలెను. పూర్వాది దిశలందు ధ్వజములపై అరుణవర్ణము, అగ్ని (ధూమ్ర వర్ణము), కృష్ణ, శుక్ల, పీత, రక్త, శ్వేత వర్ణములు ఉండవలెను.

పూర్వాది దిక్కులలో ఉన్న ధ్వజములపై కుముద, కుముదాక్ష, పుండరీక, వామన, శంకుకర్ణ, సర్వనేత్ర, సుముఖ, సుప్రతిష్ఠితులను దేవతలను పూజింపవలెను. వీరందరును కోట్లకొలది సద్గుణ ములు కలవారు. ఎఱ్ఱని దొండపండువలె ఎఱ్ఱగా కాలిన నూట ఇరువది ఎనిమిది కలశములను నాలుగుశేర్ల నీళ్ళతో నింపి 'కాలదండ'మను యోగములేని సమయమున స్థాపింపవలెను. వీటి అన్నింటికి కంఠభాగమునందు వస్త్రములుకట్టి. వాటిలో సువర్ణము ఉంచి, తోరణముల వెలుపల ఉంచవలెను. వేదికి తూర్పు మొదలైన నాలుగు దిక్కు లందును, కోణములందును గూడ కలశములు స్థాపింపవలెను. మొదట నాలుగు కలశములను పూర్వాది దిక్కులు నాల్గింటియందు "ఆజిఘ్ర కలశమ్" ఇత్యాది మంత్రము చదువుచు స్థాపింపవలెను. ఆ కలశములపై, పూర్వాది దిక్కులందు దిక్పాలకులను ఆవాహనచేసి పూజింపవలెను. "ఐరావతముపై ఎక్కి, హస్తమున వజ్రము ధరించిన దేవరాజువైన ఇంద్రా! ఇతరదేవతలతో కూడ ఇచటికి రమ్ము; ఈ తూర్పు ద్వారమును రక్షింపుము; దేవతా సమేతుడవైన నీకు నమస్కారము" అని ప్రార్థించుచు ఇంద్రుని ఆవాహనచేసి, "త్రాతార మిన్ద్రమ్" ఇత్యాది మంత్రము పఠించుచు పూజింపవలెను. "మేషమునెక్కి, శక్తిని ధరించియున్న బలిశాలివైన ఓ అగ్నిదేవా! దేవతలతోకూడ వచ్చి, ఈ ఆగ్నేయ దిక్కును రక్షింపుము. నా పూజ గ్రహింపుము; నీకు నమస్కారము" అని ప్రార్థించుచు అగ్నిని ఆవాహనముచేసి "అగ్నిర్మూర్ధా" లేదా "అగ్నియే నమః" అను మంత్రముచే పూజింపవలెను. "మహిషారూఢుడవై దండము ధరించి యున్న మహాబలశాలియైన సూర్యపుత్రా! యమదేవా! నీవు వచ్చి దక్షిణద్వారమును రక్షింపుము; నీకు నమస్కారము" అని ప్రార్థించి యముని ఆవాహనముచేసి, "వైవస్వతం సంగమనమ్" ఇత్యాది మంత్రముచే పూజింపవలెను. "బలవాహన సంపన్నుడవైన, ఖడ్గధారియైన ఓ నిర్పతీ! రమ్ము. ఈ అర్ఘ్య పాద్యములను గ్రహింపుము; నైర్పతిదిక్కును రక్షించుము" అని ప్రార్థించి నిర్పతిని ఆవాహనము చేసి "ఏషతే నిర్పతే" ఇత్యాది మంత్రముచే అర్ఘ్యాది ఉపచారములనిచ్చి పూజింపవలెను. "మకరమును ఎక్కినవాడా! పాశధారీ! మహాబలశాలియైన ఓ వరుణదేవా! రమ్ము! పశ్చిమద్వారమును రక్షింపుము; నీకు నమస్కారము" అని ప్రార్థించుచు వరుణుని ఆవాహనముచేసి "ఉరుంహి రాజావరుణః" ఇత్యాది మంత్రములతో ఆచార్యుడు వరుణ దేవతకు అర్ఘ్యము సమర్పించి పూజింపవలెను.

ధ్వజము ధరించిన, మహాబలశాలివైన వాయుదేవా, నీ వాహనమునెక్కి, దేవతలతోను, మరు త్తులతోడనువచ్చి వాయవ్యదిక్కును రక్షించుము; నీకు నమస్కారము" అని ప్రార్థించుచు వాయువును ఆవాహనచేసి "వాత ఆవాతు" ఇత్యాది మంత్రముచేతగాని, "ఓం నమో వాయవే" అను

మంత్రముచేతగాని వాయుదేవుని పూజింపవలెను. "బల వాహన సంపన్నుడవు గదాధారివి అగు సోమా! నీవు వచ్చి ఉత్తరద్వారమును రక్షింపుము. కుబేర సహితుడవగు నీకు నమస్కారము" అని ప్రార్థించుచు సోముని ఆవాహనముచేసి, "సోమం రాజానమ్" ఇత్యాది మంత్రముచేతగాని, "సోమా యనమః" ఇత్యాది మంత్రము చేతగాని పూజింపవలెను. "వృషభారూఢుడవును, మహాబలశాలివి, శూలధారివి అగు ఈశానా! నీవు వచ్చి యజ్ఞ మండపము యొక్క ఈశాన్య దిక్కును రక్షింపుము, నీకు నమస్కారము" అని ప్రార్థించి, ఈశానుని ఆవాహనముచేసి "ఈశానమస్య" ఇత్యాది మంత్రముచేతగాని, "ఈశానాయనమః" అను మంత్రముచేతగాని పూజింపవలెను. "హస్తాగ్రము లందు స్రుక్, స్రువములను ధరించినవాడవును, హంసారూఢుడవును, జన్మ రహితుడవును అగు ఓ బ్రహ్మదేవా! ఊర్ధ్వదిక్కును రక్షించుము; నీకు నమస్కారము" అని ప్రార్థించి, బ్రహ్మదేవుని ఆవాహనముచేసి, "హిరణ్యగర్భః" ఇత్యాది మంత్రము చేతగాని "నమస్తే బ్రహ్మణే" ఇత్యాది మంత్రముచేతగాని పూజింపవలెను." "తాబేలు వీపుపై కూర్చున్నవాడా! నాగ గణముల అధిపతీ ! చక్రధారీ! అనంతా ! రమ్ము; అధర దిశను రక్షింపుము, అనంతేశ్వరా! నీకు నమ స్కారము" అని ప్రార్థించుచు అనంతుని ఆవాహనముచేసి "నమోస్తు సర్పేభ్యః" అను మంత్రముచేగాని, "అనన్తా యనమః" అను మంత్రము చేతగాని పూజింపవలెను. (56)

కుమ్భాధివాస విధి

హయగ్రీవుడు చెప్పెను : దేవతా ప్రతిష్ఠా పూజల కొరకై గ్రహించిన భూమిపై నారసింహ మంత్రము చదువుచు రాక్షసులను తొలగించు అక్షతలు, ఆవాలు, పంచ గవ్యములు చల్లవలెను. రత్నయుక్తమగు కలశపై అంగదేవతా సమేతుడగు శ్రీహరిని పూజింపవలెను. అస్త్ర మంత్రముతో నూట ఎనిమిది పాత్రలను పూజింపవలెను. అవిచ్ఛిన్న ధారతో వేదిని తడిపి, ధాన్యము చల్లవలెను. కలశమును ప్రదక్షిణా క్రమమున త్రిప్పి చిమ్మిన అన్నముపై ఉంచవలెను. కలశమునకు వస్త్రము చుట్టి దానిపై లక్ష్మీ నారాయణులను పూజింపవలెను. "యోగే యోగే" ఇత్యాది మంత్రము పఠించుచు మండలమున శయ్యను స్థాపింపవలెను. స్నానమండపమున కుశలపై శయ్య దానిపై పరుపు పరిచి, దిక్కుల యందును, విదిక్కుల యందును విద్యాధిపతులను (విష్ణువు యొక్క విభిన్న విగ్ర హములను) పూజింపవలెను. పూర్వాది దిక్కులందు క్రమముగ విష్ణు, మధుసూదన, త్రివిక్రమ, వామనులను, ఆగ్నేయాది విదిక్కులందు క్రమముగ శ్రీధర, హృషీకేశ, పద్మనాభ, దామోదరులను పూజింపవలెను. దామోదరుని ఈశాన్యమున పూజింపవలెను. పిమ్మట స్నాన మండపమున, ఈశాన్యమునందున్న వేదిపై ఉన్న నాలుగు కలశములలో స్నానము నకు ఉపయోగించు అన్ని ద్రవ్యములను ఉంచవలెను. ఆ కలశములను నాలుగు దిక్కులం దును ఉంచవలెను. భగవదభిషేకము నిమిత్తమై ఏర్పరచిన ఆ కలశములను చాల గౌరవ భావముతో ఉంచవలెను. తూర్పున నున్న కలశముపై వట, ఉదుంబర, అశ్వత్థ, చంపక, అశోక, బిల్వ, పలాశ, అర్జున, ప్లక్ష, కదంబ, వకుల, చూత పల్లవములను ఉంచవలెను. దక్షిణ దిక్కు నందున్న కలశములో కమల, రోచనా, దూర్వాదర్భ, జాతీపుష్ప, కుంద, చందన, రక్త చందన, సిద్ధార్థ, తగర తండులములను ఉంచవలెను. పశ్చిమ దిక్కునందున్న

కలశములో బంగారము, వెండి, సముద్రములోనికి ప్రవహించునది యొక్క రెండు తటములందలి మట్టి, విశేషముగ గంగామృత్తు, గోమయము, యవలు, వరిబియ్యము, తిలలు ఉంచవలెను.

ఉత్తర దిక్కునందున్న కలశములో విష్ణుపర్ణి, శాలపర్ణి, భృంగరాజము, శతావరి, సహదేవి, వచ, సైంహి, బల, వ్యాఘ్రి, లక్ష్మణ అను ఓషధులను ఉంచవలెను. ఈశాన్యము నందున్న మరొక కలశములో మాంగలిక వస్తువులను ఉంచవలెను. అగ్ని కోణమునందును రెండవ కలశలో ఏడు స్థానముల నుండి గ్రహింపబడిన మట్టిని, ఉంచవలెను. నైరృతి దిక్కునందున్న కలశములో గంగ ఇసుకను, గంగాజలమును ఉంచవలెను. వాయవ్య కోణమునందున్న మరొక కలశము నందు సూకర, వృషభ, గజముల దంతములచేతను, కొమ్ముల చేతను పెకలించిన మట్టిని, పద్మము మొదట్లోనున్న మట్టిని, ఇతర కలశమునందు దర్భల మొదట్లో ఉన్న మట్టిని ఉంచవలెను. మరొక కలశమునందు పర్వత మృత్తికతో కూడిన జలము ఉంచవలెను. మరొక కలశము నందు నాగకేసర పుష్ప కేసరములను ఉంచవలెను. మరొక కలశమునందు చందనము, అగరు, కర్పూరము కలిసిన ఉదకము నింపి, వైఢూర్య, విద్రుమ, ముక్తా, స్ఫటిక, వజ్రములను ఉంచవలెను.

వీటిని అన్నింటిని ఒక కలశములో ఉంచి, దానిపై ఇష్టదేవతను స్థాపింపవలెను. ఇతర కలశములయందు, నదులు, కొండ, కాలువలు, చెరువులు వీటి నీటితో కూడిన జలమును ఉంచ వలెను. ఎనుబది యొక్క పదముల వాస్తు మండపమునందు ఇతర కలశము లను స్థాపింపవలెను. ఈ కలశములను గంధోదకాదులతో నింపవలెను. వాటిని అన్నిటిని శ్రీ సూక్తముతో అభిమంత్రించ వలెను. ఒక పాత్రలో, అర్ఘ్యముకొరకై, ఆవాలు, గంధము, కుశాగ్రములు, అక్షతలు, ఫలములు, పుష్పములు ఉంచి తూర్పున ఉంచవలెను. కమలము లను, శ్యామాలతను, దూర్వాదలములను, విష్ణుక్రాంతను, కుశములను పాద్యముకొరకై దక్షిణమునందు ఉంచవలెను. మధుపర్కము పశ్చిమము నందు ఉంచవలెను. కక్కోల, లవంగ, జాతీఫలములను ఆచమనీయార్థమై ఉత్తరమునందు ఉంచ వలెను. దూర్వాక్షతలతో కూడిన ఒక పాత్రను నీరాజనమునకై ఆగ్నేయమునందు ఉంచవలెను. ఉద్వర్తన పాత్రను వాయవ్యమునందును, ఈశాన్యమున గంధపిష్ట పాత్రను ఉంచవలెను. కలశములో సూరా మాంసి, ఉసిరికాయ, సహదేవి, పసుపు మొదలైనవి వేయవలెను. నీరాజనము కొరకై అరువది ఎనిమిది దీపములు ఉంచవలెను. శంఖము, చక్రము, శ్రీవత్సము, వజ్రము, కమలములు మొదలైన వివిధ వర్ణములుగల పుష్పము సువర్ణాది పాత్రలలో సమకూర్చు కొనవలెను. (57)

స్నపనాది విధానం

హయగ్రీవుడు చెప్పెను : బ్రహ్మదేవా! ఆచార్యుడు ఈశాన్యమునందు ఒక హోమ కుండము నిర్మించి దానిలో వైష్ణవాగ్నిని స్థాపింపవలెను. గాయత్రీ మంత్రముతో నూట ఎనిమిది హోమములు చేసి, సంపాతవిధిచే కలశములను ప్రోక్షించవలెను. మూర్తి పాలకులగు విద్వాంసులతోడను, శిల్పుల తోడను కలిసి యజమానుడు వాద్యములతో, శిల్పశాలకు వెళ్ళవలెను. అచట "విష్ణవేశిపివిష్టాయ నమః" అను మంత్రముచ్చరించుచు, ఇష్టదేవతా ప్రతిమ కుడిచేతికి కౌతుక సూత్రము కట్టవలెను.

ఆ సమయమున ఆచార్యుని హస్తమునకు గూడ ఉన్నిదారము, ఆవాలు, పట్టు వస్త్రము వీటితో కౌతుకము కట్టవలెను. మండలముపై ఆ ప్రతిమను వస్త్రమునుచుట్టి స్థాపించి ఈ విధముగ స్తుతించవలెను. "విశ్వకర్మ నిర్మించిన, దేవేశ్వరియైన ఓ ప్రతిమా! నీకు నమస్కారము. సమస్త జగత్తును ప్రభావితము చేయు ఓ జగదంబా! నీకు మాటి మాటికి నమస్కరించుచున్నాను. ఈశ్వరీ! నేను నీపై నిరామయుడగు నారాయణుని పూజించుచున్నాను. నీ యందు శిల్పసంబంధ దోషము లేవియు లేకుండుగాక. నా విషయమున సర్వదా సమృద్ధి శాలినివిగా ఉండుము". ప్రతిమను ఈ విధముగ ప్రార్థించి దానిని స్నానాగారమునకు తీసికొని వెళ్ళవలెను.

శిల్పికి ద్రవ్యమును ఇచ్చి సంతోషపరచవలెను. గురువునకు గోదానము ఈయవలెను. "చిత్రందేవానామ్" ఇత్యాది మంత్రము పఠించుచు ప్రతిమ నేత్రములను తెరవవలెను. "అగ్నిర్జ్యోతిః" ఇత్యాది మంత్రముచే దృష్టిసంచారము చేయవలెను. ప్రతిమను భద్ర పీఠముపై నుంచి ఆచార్యుడు తెల్లని పుష్పములు, నెయ్యి, ఆవాలు, దూర్వలు, కుశలు దేవత శిరస్సుపై ఉంచవలెను. "మధువాతా" ఇత్యాది మంత్రముచే నేత్రములందు అంజనము ఉంచవలెను. ఆ సమయమున "హిరణ్యగర్భః", "ఇమంమేవరుణః" ఇత్యాది మంత్రములు పఠింపవలెను. ఘృతవతీ ఇత్యాది ఋక్కు పఠించుచు ఘృతము శరీరమునకు పూయవలెను. శనగపిండితో నలిచి "అతోదేవాః" ఇత్యాది మంత్రము పఠింపవలెను. "సప్తతే అగ్నే" ఇత్యాది మంత్రము పఠించి గర్భజలముతో ప్రతిమను కడగవలెను. "ధ్రువదాదివ" ఇత్యాది మంత్రముచే అనులేపనము, ఆపోహిష్ఠామ" ఇత్యాది మంత్రముచే అభిషేకము చేయవలెను. అభిషేకానంతరము నదీ-తీర్థ జలములచే స్నానము చేయించి, 'పావమానీ' ఋక్కు పఠించుచు రత్నస్పర్శగల ఉదకముతో స్నానము చేయించవలెను. "సముద్రం గచ్ఛస్వాహా" ఇత్యాది మంత్రమును చదువుచు తీర్థమృత్తికచేత, కలశ జలముచేతను స్నానము చేయించవలెను. "శంనో దేవీః" ఇత్యాది మంత్రము గాయత్రీ మంత్రము పఠించుచు వేడి నీళ్ళతో స్నానము చేయించవలెను. "హిరణ్యగర్భః" ఇత్యాది మంత్రములచే పంచవిధ మృత్తికలతో స్నానము చేయించవలెను. పిమ్మట "ఇమంమే గంగేయమునే" ఇత్యాది మంత్రముచే ఇసుక కలిపిన జలముచేతను, "తద్విష్ణోః పరమంపదమ్" అను మంత్రముతో పుట్టమట్టి కలిపిన ఉదకము చేతను, పూర్ణ ఘటముతో స్నానము చేయించవలెను. "యా ఓషధీః" ఇత్యాది మంత్రము చదువుచు ఓషధి మిశ్రజలము చేతను, యజ్ఞా యజ్ఞా" ఇత్యాది మంత్రము చదువుచు ఉసిరి మొదలగు కషాయ పదార్థములు కలిపిన జలముల చేతను, "పయః పృథివ్యామ్" ఇత్యాది మంత్రముతో పంచగవ్యముల చేతను, "యాః ఫలినీః" ఇత్యాది మంత్రముతో ఫలమిశ్రిత జలముల చేతను స్నానము చేయించవలెను. "విశ్వతశ్చక్షుః" ఇత్యాది మంత్రముతో ఉత్తరదిక్కుననున్న కలశము చేతను, "సోమం రాజానమ్" అను మంత్రముతో పూర్వదిక్కున ఉన్న కలశముచేతను "విష్ణోర రాటమసి" ఇత్యాది మంత్రముతో దక్షిణకలశముచేతను, "హంసః శుచిషత్" ఇత్యాది మంత్రముతో పశ్చిమముననున్న కలశము చేతను ఉద్వర్తన స్నానము చేయించవలెను.

"మూర్ధానందివో" ఇత్యాది మంత్రముతో ఉసిరికాయతో కూడిన జలముచేతను, "మానస్తోకే' ' ఇత్యాది మంత్రముతో జటామాంసికలసిన జలముచేతను, 'గన్ధద్వారామ్" ఇత్యాది మంత్రముతో

గంధమిశ్రిత జలముచేతను, "ఇదమాపః" ఇత్యాది మంత్రముతో ఎనుబది యొక్క పదముల వాస్తు మండపమునందు ఉంచిన కలశములచేతను స్నానము చేయించవలెను. స్నానానంతరము– "సమస్త లోకములను అనుగ్రహించు భగవంతుడవైన మహావిష్ణూ! రమ్ము, రమ్ము, ఈ యజ్ఞభాగమును గ్రహింపుము. మీకు నమస్కారము" అని ప్రార్థించుచు దేవేశ్వరుని ఆవాహనముచేసి, "ముఞ్చామిత్వా" ఇత్యాది మంత్రము చదువుచు విష్ణు విగ్రహ హస్తమునకు కట్టిన కౌతుక సూత్రమును, ఆచార్యుని చేతికి కట్టిన సూత్రమును కూడ విప్పివేయవలెను. పిమ్మట "హిరణ్మయేన" ఇత్యాది మంత్రముతో పాద్యము "అతో దేవాః" ఇత్యాది మంత్రముతో అర్ఘ్యము, "మధువాతాః" ఇత్యాది మంత్రముతో మధుపర్కము ఇచ్చి "మయిగృహ్ణామి" ఇత్యాది మంత్రముతో ఆచమనము చేయించవలెను. పిమ్మట విద్వాంసుడు "అక్షన్నమీమదన్త" ఇత్యాది మంత్రము చదువుచు శ్రీమహావిష్ణువు అవయవములపై దూర్వలు, అక్షతలు చల్లవలెను.

"కాండాత్" ఇత్యాది మంత్రముతో నిర్మంథనముచేసి, "గంధవతీ" ఇత్యాది మంత్రముతో గంధమును, "ఉన్నయామి" ఇత్యాది మంత్రముతో పుష్పమాలను, "ఇదం విష్ణుః" ఇత్యాది మంత్రముతో పవిత్రకమును అర్పింపవలెను. "బృహస్పతే" ఇత్యాది మంత్రముతో వస్త్ర ద్వయమును, "వేదాహ మేతమ్" ఇత్యాది మంత్రముతో ఉత్తరీయమును "మహావ్రతేన" ఇత్యాది మంత్రముతో పుష్పములను, ఓషధులను సమర్పింపవలెను. పిమ్మట "ధూరసి" అను మంత్రముతో ధూపము అర్పించి, 'విరాట్' సూక్తముతో అంజనమును, 'యజ్ఞన్తి' ఇత్యాది మంత్రముతో తిలకమును ఇవ్వవలెను. "దీర్ఘాయుష్ట్వాయ" అను మంత్రముతో పుష్పమాల సమర్పింపవలెను. 'ఇన్ద్రక్షత్రమభి' ఇత్యాది మంత్రముతో ఛత్రమును, 'విరాట్' మంత్రముతో అద్దమును, 'వికర్ణ' మంత్రముతో చామరమును, రథంతర మంత్రముతో అలంకారములను సమర్పింపవలెను. వాయుదేవతకు సంబంధించిన మంత్రములతో వింజామరను, "ముఞ్చామిత్వా" ఇత్యాది మంత్రముతో పుష్పములను సమర్పించి, ఓంకార ముతో కూడిన పురుషసూక్తముతో శ్రీ హరిని స్తుతింపవలెను. ఈ వస్తువులను అన్నింటిని పిండికాదులపైనను శివుడు మొదలగు దేవతలకును ఈ విధముగనే సమర్పింపవలెను. దేవతను పైకి ఎత్తునపుడు సౌపర్ణ సూక్తమును పఠింపవలెను. "ప్రభో లెమ్ము" అని పలుకుచు శ్రీ మహావిష్ణువును ఎత్తి శకుని సూక్తము పఠించుచు మండపమునందలి శయ్యమీదకు తీసికొని వెళ్ళవలెను. బ్రహ్మరథము మీదగాని, పల్లకీ మీదగాని తీసికొని వెళ్ళవలెను. "అతోదేవాః" అను సూక్తము పఠించుచు, "శ్రీశ్చతే లక్ష్మీశ్చ" అను మంత్రము పఠించుచు, ప్రతిమను, పిండికను శయ్యపై చేర్చవలెను. పిమ్మట మహా విష్ణువునకు నిష్కలీకరణ క్రియ చేయవలెను. సింహము, వృషభము, గజము, వ్యజనము, కలశము, పతాక, భేరి, దీపము–ఈ ఎనిమిదియు మంగళ సూచక వస్తువులు. వీటినన్నింటిని, అశ్వ సూక్తము పఠించుచు, భగవంతునకు చూపవలెను. 'త్రిపాత్' ఇత్యాది మంత్రము చదువుచు భగవంతుని చరణ ప్రాంతమునందు ఉఖ (ఒక విధమైన పాత్ర) దాని మూత, అంబిక (చిన్న బూర్లమూకుడు), దర్వి (గరిటె) పాత్ర, రోలు, రోకలి, శిల, చీపురు, భోజన పాత్ర, ఇతర గృహపాత్రలు ఉంచవలెను. తలవైపు వస్త్రములు, రత్నములు ఉంచిన కలశము ఉంచవలెను. ఆ కలశమును పటిక బెల్లము ముక్కలతో నింపవలెను. దానికి 'నిద్రా'అని పేరు. ఈ విధముగ భగవంతుని శయన విధానము చెప్పబడినది. (58)

అధివాసన విధానము

హయగ్రీవుడు చెప్పెను : శ్రీహరి సాన్నిధ్యము సంపాదించుటకు అధివాసనమని పేరు. "నేను సర్వజ్ఞుడు, సర్వవ్యాపియు అయిన పురుషోత్తముడను" అని భావన చేయుచు సాధకుడు ఓంకార వాచ్యుడగు పరమాత్మతో ఏకత్వమును చేయవలెను. పిమ్మట చైతన్యాభి మానియైన జీవుని వేరుచేసి, ఆత్మకును, ఆ జీవునకును ఏకత్వమును చేయవలెను. ఈ విధముగాచేసి, స్వాత్మరూపుడును, సర్వ వ్యాపియు అగు పరమేశ్వరునితో దానిని కలిపివేయవలెను. పిమ్మట ప్రాణవాయువు ద్వారా (లం బీజరూపయగు)పృథివిని అగ్ని బీజ (రం) చింతనముచే ఆవిర్భవించిన అగ్నియందు కాల్చివేయ వలెను. అనగా పృథివి అగ్నిలో లీనమైనదని భావన చేయవలెను. పిమ్మట అగ్నిని వాయువునందు, వాయువును ఆకాశము నందు లీనము చేయవలెను. అధిభూత, అధ్యాత్మ, అధిదైవ విభవములతో కూడిన సమస్త భూతములను తన్మాత్రలలో విలీనము చేసి, వీటినన్నింటిని క్రమముగ ఆకాశము నందు విలీనము చేయవలెను. ఆకాశమును మనస్సునందు, మనస్సును అహంకారమునందు, అహంకారమును మహత్తత్త్వమునందు, మహత్తత్త్వమును అవ్యాకృత ప్రకృతి యందును లీనము చేయవలెను.

అవ్యాకృతమును (ప్రకృతిని లేదా మాయను) జ్ఞాన స్వరూపుడగు పరమాత్మయందు విలీనము చేయవలెను. ఈ పరమాత్మయే వాసుదేవుడు. శబ్ద స్వరూపుడైన ఆ వాసుదేవుడు సృష్టి చేయవలెనని సంకల్పించి, అవ్యాకృత మాయాశ్రయముచే స్పర్శమను పేరుగల సంకర్షణుని ఆవిర్భవింప చేసెను. సంకర్షణుడు మాయను క్షుబ్ధముచేసి తేజోరూప ప్రద్యుమ్నుని సృజించెను. ప్రద్యుమ్నుడు రసరూపుడగు అనిరుద్ధుని, అనిరుద్ధుడు గంధ స్వరూపుడగు బ్రహ్మను సృజించెను. బ్రహ్మ మొట్టమొదట జలమును సృజించి, దానిలో పంచభూతములతో కూడిన బంగారు గ్రుడ్డును సృజించెను. ఆ అండమునందు జీవశక్తి సంచారమేర్పడెను. ఆత్మయందు లీనము చేయబడినట్లు మొదట చెప్పబడినది ఈ జీవ శక్తియే. జీవశక్తితో ప్రాణమునకు సంయోగమేర్పడినప్పుడు అది 'వృత్తి మతి' అని చెప్ప బడును. వ్యాహృతి సమేతుడగు జీవుడు ప్రాణములలో నుండి ఆధ్యాత్మిక పురుషుడని చెప్ప బడుచున్నాడు. వానినుండి ప్రాణయుక్తమగు బుద్ధి పుట్టినది. దీనికి ఎనిమిది వృత్తులు ఉండును. బుద్ధి నుండి అహంకారము, అహంకారము నుండి మనస్సు జనించినది. మనస్సు నుండి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు అనెడు సంకల్పాదియుక్తములగు ఐదు విషయములు ఉత్పన్నమైనవి.

వీటినుండి జ్ఞానశక్తిగల త్వక్, శ్రోత్ర, ఘ్రాణ, నేత్ర, జిహ్వలను ఐదు ఇంద్రియములు ఆవిర్భవిం చినవి. వీటికి జ్ఞానేంద్రియములని పేరు. పాద, పాయుపాణి, వాక్, ఉపస్థలు పంచ కర్మేంద్రి యములు. ఇప్పుడు పంచభూతముల పేర్లు వినుము, ఆకాశ, వాయు, తేజో, జల, పృథివులు పంచమహా భూతములు. అన్నింటికిని ఆధారమగు స్థూలశరీరము ఈ భూతముల నుండియే పుట్టుచున్నది. ఈ తత్త్వములకు వాచకములగు ఉత్తమ బీజాక్షరములను న్యాసము నిమిత్తమై చెప్పుచున్నాను. 'మం' అను బీజము జీవస్వరూపము (జీవతత్త్వ వాచకము) ఇది శరీరము అంతయు వ్యాపించియున్నదని భావనచేసి దీనిని సకల దేహవ్యాపకన్యాసము చేయవలెను. 'భం' అనునది

ప్రాణతత్త్వ బీజము, ఇది జీవోపాధియందున్నది. అందుచే దీనిని దానియందే న్యాసము చేయవలెను. బుద్ధితత్త్వ వాచకమగు 'బం' అను బీజమును, విద్వాంసుడు హృదయముపై న్యాసము చేయవలెను. అహంకార రూపమగు 'ఫం' అను బీజమును కూడ హృదయము నందే న్యాసము చేయ వలెను. సంకల్పకరణ భూతమనస్తత్త్వ రూపమగు 'పం' అను బీజమును గూడ హృదయము నందే న్యాసము చేయవలెను.

శబ్దతన్మాత్ర తత్త్వవాచకమగు న కారమును (నం) శిరస్సుపైనను, స్పర్శరూప ధ కారమును (ధం) ముఖ ప్రదేశమునందును, రూపతత్త్వ వాచకమగు ద కారమును (దం) నేత్ర ప్రాంతము నందును, రసతన్మాత్ర బోధక 'థ' కారమును (థం) వస్తి ప్రదేశ (మూత్రాశయ)మునందును, గంధ తన్మాత్ర స్వరూపమగు త కారమును (తం) పిక్కల యందును, ణ కారమును (ణం) శ్రోత్రములందును, ఢ కారమును (ఢం) త్వక్కుపై నను, డ కారమును (డం) నేత్రములందును, ఠ కారమును (ఠం) జిహ్వాయందును, ట కారమును (టం) నాసిక యందును, ఞ కారమును (ఞం) వాగింద్రియము నందును, పాణితత్త్వ రూపమగు ఝ కారమును (ఝం) హస్తములందును, జ కారమును (జం) పాదములందును, ఛ కారమును (ఛం) పాయువు నందును, చ కారము (చం) ఉపస్థ యందును, పృథ్వీతత్త్వ రూపమగు ఙ కారమును (ఙం) పాదములందును, ఘ కారము (ఘం) వస్తి యందును, తేజస్తత్త్వరూపమగు (గం)ను హృదయమునందును, వాయుతత్త్వ రూపమగు ఖ కారమును (ఖం) నాసికయందును న్యాసము చేయవలెను. క కారము (కం) ఆకాశ తత్త్వ రూపమైనది. విద్వాంసుడు దానిని ఎల్లప్పుడును శిరస్సుపై న్యాసము చేయవలెను.

హృదయ కమలమునందు సూర్యదేవతకు సంబంధించిన 'యం' బీజము న్యాసము చేసి, హృదయము నుండి బయలు వెడలిన డెబ్బది రెండువేల నాడులలో షోడశ కళాయుక్త సకార (సం) న్యాసము చేయవలెను. దాని మధ్య భాగము నందు బిందు స్వరూప వహ్ని మండలమును భావించవలెను. ఓ సురశ్రేష్ఠా! దానిపై ప్రణవసహిత 'హ' కార (హం)న్యాసము చేయవలెను. "ఓం ఆం నమః పరమేష్ఠ్యాత్మనే" ఓం ఆం నమః పురుషాత్మనే, ఓం వాం నమో నిత్యాత్మనే, ఓం నాం నమో విశ్వాత్మనే, ఓం వం నమః సర్వాత్మనే" అను నవి ఐదు శక్తులు. ప్రథమ శక్తిని స్నానము నందును, ఆసనకర్మయందు, ద్వితీయ శక్తిని, శయనమునందు, తృతీయ శక్తిని, యాన కర్మయందు చతుర్థ శక్తిని, అర్చనా కాలమునందు పంచమ శక్తిని వినియోగించవలెను. ఈ ఐదును ఉపనిషత్తులు. వీటి మధ్యయందు మంత్రమయుడగు శ్రీహరిని ధ్యానించి 'క్ష' కారము (క్షం)ను న్యాసము చేయవలెను.

ఏ మూర్తి స్థాపింపబడుచున్నదో ఆ మూర్తికి సంబంధించిన మూలమంత్రము న్యాసము చేయవలెను. (విష్ణు స్థాపన చేసినపుడు) "ఓం నమో భగవతే వాసుదేవాయ" అనునది మూలమంత్రము. ఈ మూలమంత్రముయొక్క ఒక్కొక్క అక్షరమును శిరస్సు, నాసిక, లలాటము, ముఖము, కంఠము, హృదయము, భుజములు, పిక్కలు, పాదములు వీటియందు క్రమముగ న్యాసము చేయవలెను. పిమ్మట శిరస్సుపై కేశవుని, ముఖముపై నారాయణుని, కంఠముపై మాధవుని,

భుజములపై గోవిందుని, హృదయముపై విష్ణువును, పృష్ఠభాగమున మధుసూదనుని, జఠరమున వామనుని, కటిపై త్రివిక్రముని, పిక్కలపై శ్రీధరుని, దక్షిణ భాగమున హృషీకేశుని, చీలమండలపై పద్మనాభుని, పాదములపై దామోదరుని న్యాసము చేసి, పిమ్మట హృదయాది షడంగన్యాసములు చేయవలెను. సత్పురుషులలో శ్రేష్ఠుడవైన బ్రహ్మదేవా! ఇది ఆదిమూర్తి విషయమున చెప్పిన సాధారణ న్యాసము.

లేదా ఏ దేవత ప్రతిష్ఠింపబడుచున్నదో దాని మూలమంత్రముచేతనే మూర్తి సజీవకరణ ప్రక్రియ జరుపవలెను. ఆ మూర్తి యొక్క పేరులోని మొదటి అక్షరము గ్రహించి, దానికి పండ్రెండు స్వరములను చేర్చి అంగకల్పన చేయవలెను. దేవేశ్వరా! విగ్రహముపై హృదయా ద్యంగ న్యాసము, ద్వాదశాక్షర మూలమంత్ర న్యాసము, తత్త్వ న్యాసము ఏ విధముగ చేయబడునో ఆ విధముగనే తన శరీరముమీద కూడ చేయవలెను. పిమ్మట చక్రాకారమగు పద్మమండలముపై మహావిష్ణువును గంధాదులచే పూజించవలెను. వెనుకటి వలెనే మహా విష్ణు శరీరమును, వస్త్రాలంకారాదులను, ఆసనమును ధ్యానించవలెను. పై భాగమున పండ్రెండు ఆకుల సుదర్శన చక్రమును ధ్యానించవలెను. ఆ చక్రమునకు మూడు నాభులు, రెండు నేములు (చక్రాంతములు), పండ్రెండు స్వరములు ఉండును. పిమ్మట విద్వాంసుడు పృష్ఠదేశమున ప్రకృత్యాదులను స్థాపింపవలెను. ఆకుల చివర పండ్రెండుగురు సూర్యులను పూజింపవలెను. పిమ్మట అచట పదునారు కళలతో కూడిన చంద్రుని ధ్యానించవలెను. చక్రనాభియందు మూడు వస్త్రములను ధ్యానించవలెను. పిమ్మట శ్రేష్ఠుడైన ఆచార్యుడు పద్మములోపల ద్వాదశదళ పద్మమును ధ్యానించవలెను.

ఆ పద్మముపైన పురుషశక్తిని ధ్యానించి, దానిని పూజించవలెను. పిమ్మట, దేశికుడు, ప్రతిమపై శ్రీహరి న్యాసముచేసి, ఆ శ్రీహరిని, ఇతర దేవతలను పూజింపవలెను. గంధపుష్పా ద్యుపచారములు సమర్పించి అంగావరణ సహితముగా ఇష్ట దేవతను బాగుగా పూజింపవలెను. ద్వాదశాక్షర మంత్రము లోని ఒక్కొక్క అక్షరమును బీజాక్షరముగచేసి దానితో కేశవాది భగవద్విగ్రహములను క్రమముగ పూజింపవలెను. పండ్రెండు ఆకులుగల మండలము మీద ఆ క్రమముగ లోక పాలాదులను పూజింపవలెను. పిమ్మట, ద్విజుడు, గంధ పుష్పాద్యుపచారములతో పురుషసూక్తమును పఠించుచు పురుష ప్రతిమలను, శ్రీ సూక్తము పఠించుచు పిండికలను పూజింపవలెను. పిమ్మట జననాదిక్రమ మున వైష్ణవాగ్నిని ఆవిర్భవింపచేయవలెను. విష్ణు దేవతకు సంబంధించిన మంత్రములతో అగ్నిలో హోమముచేసి, విద్వాంసుడు, శాంతిజలమును సిద్ధముచేసి దానిని ప్రతిమ శిరస్సుపై చల్లి, అగ్ని ప్రణయనము చేయవలెను. 'అగ్నిం దేదూతం' ఇత్యాది మంత్రముతో దక్షిణ కుండము నందును, 'అగ్నిమగ్నిమ్" ఇత్యాది మంత్రముతో పూర్వకుండము నందును 'అగ్నిమగ్నిం హవీమభిః' ఇత్యాది మంత్రముతో ఉత్తర కుండమునందును అగ్ని ప్రణయనము చేయవలెను. అగ్ని ప్రణయన సమయము నందు 'త్వమగ్నేద్యుభిః" ఇత్యాది మంత్రము పఠింపవలెను.

ఒక్కొక్క కుండములో ఓంకారోచ్చారణ పూర్వకముగ ఒక వెయ్యి ఎనిమిది చొప్పున పలాశ సమిధలను యవలు మొదలగు వాటిని హోమము చేయవలెను. వ్యాహృతి మంత్రముతో ఘృతమిశ్ర

తిలలను, మూలమంత్రముతో ఘృతమును హోమము చేయవలెను. పిమ్మట మధుర త్రయము (నెయ్యి, తేనె, పంచదార)తో శాంతిహోమము చేయవలెను. ద్వాదశాక్షర మంత్రముతో పాదనాభి, హృదయ, శిరస్సులను స్పృశింపవలెను. నెయ్యి, పెరుగు, పాలు, హోమముచేసి శిరస్సు స్పృశింప వలెను. పిమ్మట శిరో, నాభి, పాదములు స్పృశించి గంగా, యమునా, గోదావరి, సరస్వతీ నదులను ఆవాహనము చేయవలెను. విష్ణు గాయత్రితో అగ్నిని రగిల్చి, గాయత్రితో ఆ అగ్నిపై చరువును వండవలెను. గాయత్రీ మంత్రముతో హోమముచేసి, బలులు ఇచ్చి, పిమ్మట బ్రాహ్మణులకు భోజనము పెట్టవలెను. మాసాధిపతులైన ద్వాదశాదిత్యుల తుష్టికై ఆచార్యునకు బంగారము, గోవు దక్షిణగా ఈయవలెను. దిక్పాలకులకు బలి ఇచ్చి, వేదపాఠ-గీత కీర్తనాదులతో రాత్రి జాగరణము చేయవలెను. ఈ విధముగ అధివాసనము పూర్తి చేసినవానికి అన్ని ఫలములును లభించును. (59)

వాసుదేవ ప్రతిష్ఠా విధి

హయగ్రీవుడు చెప్పెను - బ్రహ్మదేవా! పిండికాస్థాపనము కొరకై, విద్వాంసుడు దేవాలయము లోని గర్భగృహమును ఏడు భాగములుగా విభజింపవలెను. ప్రతిమను బ్రహ్మాభాగము నందు స్థాపింపవలెను. దేవ, మనుష్య, పిశాచ భాగములందు ఎన్నడును స్థాపింపగూడదు. బ్రహ్మాభాగములో కొంతభాగము విడచి, దేవభాగమనుష్య భాగములలో కొన్ని భాగములు గ్రహించి, ఆ భూమిపై ప్రయత్నపూర్వకముగ పిండికను స్థాపింపవలెను. నపుంసక శిలపై రత్నన్యాసము చేయవలెను. నృసింహ మంత్రముతో హోమము చేసి, ఆ మంత్రముతోనే రత్నన్యాసము కూడ చేయవలెను. వ్రీహులు, రత్నములు, లోహము మొదలగు ధాతువులు, చందనము మొదలగు పదార్థములను పూర్వాది దిశలందును, మధ్యభాగము నందును ఉంచిన కుండములలో, తన అభిరుచిని అనుసరించి ఉంచవలెను. పిమ్మట ఇంద్రాది మంత్రములతో పూర్వాదిదిశలలో ఉన్న గుంటలను గుగ్గులముచే కప్పి, రత్నన్యాసవిధి పూర్తియైన పిదప గురుశలాకలతో కూడిన కుశసమూహముల చేతను, సహదేవమను ఓషధి చేతను ప్రతిమను బాగుగా రాయవలెను. బైటను, లోపలను తగు సంస్కార ములు చేసి పంచగవ్యములతో శుద్ధి చేయవలెను. పిమ్మట కుశోదకము, నదీజలము, తీర్థజలము ఆ ప్రతిమపై ప్రోక్షించవలెను.

హోమము కొరకు ఇసుకతో ఒకటిన్నర హస్తముల విస్తారముగల, చతురస్రము, సుందరము అగు వేదిని ఏర్పరుపవలెను. ఎనిమిది దిక్కులందును, యథా స్థానమున కలశములు ఉంచవలెను. ఆ పూర్వాది కలశలకు ఎనిమిది రంగులు వేయవలెను. పిమ్మట అగ్నిని వేదిపై స్థాపించి, కుశలతో సంస్కారముచేసి 'త్వమగ్నే ద్యుభిః' అను మంత్రముతోను, గాయత్రీ మంత్రముతోను సమిధలను హోమము చేయవలెను. అష్టాక్షర మంత్రముతో నూట ఎనిమిది ఆజ్యాహుతులుచేసి, పూర్ణాహుతి ఇవ్వవలెను. పిమ్మట నూరుపర్యాయములు మూలమంత్రము జపించి అభిమంత్రించిన శాంత్యుదక మును మామిడి చిగుళ్ళతో ఇష్టదేవత శిరస్సుపై చల్లవలెను. ఆ సమయమున "శ్రీశ్చలక్ష్మీశ్చ" ఇత్యాది మంత్రము పఠింపవలెను. "ఉత్తిష్ఠ బ్రహ్మణస్పతే" అను మంత్రముతో ప్రతిమను పైకి ఎత్తి, బ్రహ్మ రథముపైనుంచి, "తద్విష్ణోః" ఇత్యాది మంత్రము పఠించుచు దేవాలయమువైపు

తీసికొని వెళ్ళవలెను. అక్కడ శ్రీహరి ప్రతిమను పల్లకీపై ఎక్కించి నగరమునందు గీత-వాద్య వేదమంత్రాది ధ్వనులతో ఊరేగించి, తిరిగి దేవాలయ ద్వారమువద్దకు తీసికొని రావలెను.

పిమ్మట గురువు సువాసినీ స్త్రీల చేతను, బ్రాహ్మణుల చేతను, ఎనిమిది మంగళ కలశముల ఉదకముతో శ్రీహరికి స్నానముచేయించి, మూలమంత్రోచ్చారణ పూర్వకముగ గంధాద్యుపచారములు సమర్పించి పూజచేసి "అతో దేవాః" ఇత్యాది ఋక్కు చదువుచు వస్త్రాద్య ష్టాంగార్ఘ్యము ఇవ్వవలెను. పిమ్మట స్థిరలగ్నమున "దేవస్యత్వా" ఇత్యాది మంత్రము చదువుచు ఆ అర్చా విగ్రహమును ప్రతిష్ఠచేయవలెను. "సచ్చిదానంద స్వరూపా! త్రివిక్రమా! నీవు మూడు పాదములతో ముల్లోకములను ఆక్రమించితివి. నీకు నమస్కారము" అని ప్రార్థింపవలెను. ఈ విధముగ పండితుడు ప్రతిమను పిండిక మీద స్థాపించి, "ధ్రువాద్యాః" "విశ్వతశ్చక్షుః" ఇత్యాది మంత్రములు చదువుచు స్థిరము చేయవలెను. పంచగవ్యములతో స్నానము చేయించి, గంధోదకముతో ప్రతిమా ప్రక్షాళనముచేసి, సకలీకరణానంతరము శ్రీహరికి సాంగోపాంగ సాధారణపూజ చేయవలెను.

ఈ విధముగ ధ్యానించవలెను – "ఆకాశము శ్రీ మహావిష్ణువు యొక్క విగ్రహము; పృథివి ఆతని పీఠము (సింహాసనము)." పిమ్మట పరమాత్ముని శరీరము తైజస పరమా ణువులతో ఏర్పడినట్లు భావన చేయుచు ఇట్లు చెప్పవలెను. ఇరువదియైదు తత్త్వములలో వ్యాపించి యున్న జీవుని ఆవాహన చేయుచున్నాను. ఆ జీవుడు చైతన్య స్వరూపుడు. పరమానందరూపుడు; జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థా శూన్యుడు. దేహేంద్రియ, మనో, బుద్ధి, ప్రాణ, అహంకార రహితుడు. బ్రహ్మ మొదలు కీటకము వరకును ఉన్న సకలజగత్తు నందును, వ్యాపించి, అందరి హృదయములలో ఉన్నవాడు. పరమేశ్వరా! నీవే ఆ జీవ చైతన్యము. నీవు హృదయమునుండి ప్రతిమలో ప్రవేశించి స్థిరముగా నుండుము. ఈ ప్రతిమను సజీవము చేయుము. అన్ని దేహములందును అంగుష్ఠ మాత్ర పురుషుడు ఉన్నాడు. అతడు జ్యోతిః స్వరూపుడు; జ్ఞాన స్వరూపుడు; ఏకమాత్ర అద్వితీయ పరబ్రహ్మ." ఈ విధముగ ప్రతిమను సజీవముచేసి ప్రణవముతో భగవంతుని మేల్కొల్పవలెను. పిదప భగవంతుని హృదయము స్పృశించి పురుషసూక్తమును జపించవలెను. దీనికి సానిధ్యకరణ కర్మ" యని పేరు. భగవద్ధ్యానము చేయుచు ఈ రహస్య మంత్రమును పఠించవలెను.

"ప్రభూ! నీవు సకలదేవాధీశుడవు. సంతోష వైభవ స్వరూపుడవు. నీకు నమస్కారము. జ్ఞానవిజ్ఞానములు నీ స్వరూపము. త్రిగుణాతీతము. నీవు అంతర్యామివి; పరమాత్మవు. నాశ రహితుడగు పురాణ పురుషుడవు. నీకు నమస్కారము. మహావిష్ణూ! నీవు ఇచట సన్నిహితుడవు కమ్ము. నీ పరమతత్త్వము, జ్ఞానమయ శరీరము ఒక సంఘాతముగ ఏర్పడి ఈ అర్చా విగ్రహము నందు ఆవిర్భూతమగుగాక". ఈ విధముగ శ్రీహరి సాన్నిధ్య కరణము చేసి ఆతని ఎదుట బ్రహ్మాది పరివార దేవతలను స్థాపింపవలెను. శ్రీహరి దర్శనార్థమై వచ్చువారి యాత్రలను బట్టియు, వర్షాదులను బట్టియు శ్రీహరి అచట సన్నిహితుడై యున్నాడను విషయమును గ్రహింపవలెను. నమస్కరించి, స్తుతించి, స్తోత్రాదులు పఠించి, అష్టాక్షర్యాది మంత్రములు జపించుచు భగవంతుడు అచట సన్నిహితుడై ఉన్నాడని గ్రహింపవలెను.

పిమ్మట ఆచార్యుడు దేవాలయమునుండి బైటకు వచ్చి ద్వారమువద్ద నున్న చండ, ప్రచండులను ద్వారపాలకులకు పూజ చేయవలెను. మరల మండపములోనికి వెళ్ళి గరుత్మంతుని స్థాపింపవలెను. అన్ని దిక్కులందును ఆయా దిక్పాలకులను, ఇతర దేవతలను స్థాపించి, శంఖ చక్రాదులకు గూడ పూజ చేయవలెను. అందరు పార్షదులకును, భూతములకును బలి సమర్పింపవలెను. (యజమానుడు) ఆచార్యునకు గ్రామ, వస్త్ర, సువర్ణాదులను దక్షిణగా ఈయవలెను. యజ్ఞమునకు ఉపయోగించు ద్రవ్యములు కూడ ఆచార్యునకు ఈయవలెను. ఋత్విక్కులకు ఆచార్య దక్షిణలో సగము ఈయవలెను. పిమ్మట బ్రాహ్మణులకుగూడ దక్షిణ ఇచ్చి భోజనముపెట్టవలెను. అచటకు వచ్చు బ్రాహ్మణునెవ్వనిని అడ్డు పెట్టరాదు. అందరిని సత్కరించవలెను. పిమ్మట గురువు యజమానునకు ఫలము ఈయవలెను. భగవద్విగ్రహ ప్రతిష్ఠ చేసిన పుణ్యాత్ముడు తన వంశీయులు అందరిని తనతో పాటు శ్రీమహావిష్ణువు సమీపమునకు తీసికొనిపోవును. ఇది అందరు దేవతలకును సాధారణమైన విధానము. కాని ఆయా దేవతల మూలమంత్రములు మాత్రము వేరువేరుగ ఉండును. మిగిలిన కార్యములు అన్నియు సమానమే. (60)

ద్వారప్రతిష్ఠా ధ్వజారోహణాది విధి

హయగ్రీవుడు చెప్పెను : బ్రహ్మదేవా! ఇపుడు నేను అవభృథ స్నానమును గూర్చి చెప్పెదను. "విష్ణోర్నుకం వీర్యాణి" ఇత్యాది మంత్రముతో హోమము చేయవలెను. ఎనుబది ఒక్క పదముల వాస్తు మండపమునందు కలశస్థాపన చేసి వాటి ఉదకముతో శ్రీహరికి స్నానము చేయించవలెను. స్నానానంతరము గంధపుష్పాదులతో పూజించి, సమర్పించి, గురువును పూజించవలెను. ఇపుడు ద్వారప్రతిష్ఠను గూర్చి చెప్పెదను. గురువు ద్వారము క్రింద బంగారమును ఉంచవలెను. ఎనిమిది కలశములతో అచట రెండు ఉదుంబరశాఖలు ఉంచవలెను. వైదికమంత్రములు చదువుచు, గంధాద్యుపచారములతో పూజించి కుండము లందు స్థాపింపబడిన అగ్నిలో సమిధలు, ఆజ్యము, తిలలు మొదలగునవి హోమము చేయవలెను. పిమ్మట శయ్యాది దానముచేసి క్రింద ఆధారశక్తిని స్థాపింపవలెను. ఆ రెండు శాఖల క్రింద చండ-ప్రచండులను దేవతలను స్థాపించవలెను. ఉదుంబర శాఖల పైభాగమున దేవవృంద పూజితురాలగు లక్ష్మిని స్థాపించి శ్రీ సూక్తముతో యథోచితముగ పూజింపవలెను. పిమ్మట బ్రహ్మను పూజించి, ఆచార్యునకు శ్రీఫలము (నారికేళ ఫలము) మొదలగు దక్షిణలు ఈయవలెను. ప్రతిష్ఠితమగు ద్వారముపై ఆచార్యుడు శ్రీహరిని స్థాపింపవలెను. దేవాలయ ప్రతిష్ఠను "హృత్ప్రతిష్ఠా" ఇత్యాది మంత్రముతో చేయవలెను. దానిని గూర్చి వినుము. వేదికంటె ముందు, (లేదా వేదికి తూర్పుగా) శుకనాస ఎచట సమాప్త మగునో అచట, గర్భగృహ శిరోభాగము నందు బంగారు కలశను గాని, వెండి కలశనుగాని స్థాపింపవలెను. దానిలో ఎనిమిది విధములైన రత్నములు, ఓషధులు, ధాతువులు, బీజములు, సువర్ణము ఉంచవలెను. ఆ కలశము కంఠమునకు వస్త్రము చుట్టి దానిని నీటితో నింపి, దానిని మండలముపై అధివాసితము చేయవలెను. దానిలో చిగుళ్లు వేయవలెను. పిమ్మట నృసింహమంత్రముతో అగ్నియందు ఆజ్యధార పోయుచు హోమముచేసి నారాయణ తత్త్వముతో ప్రాణ న్యాసము చేయవలెను.

సురేశ్వరా! ఆ ప్రాసాద కలశమును విరాడ్రూపముగ భావింపవలెను. మొత్తము ప్రాసాదమును పురుషునిగా భావన చేయవలెను. క్రింద సువర్ణముంచి, సువర్ణకలశను స్థాపింపవలెను. గురువు మొదలైనవారికి దక్షిణలు ఇచ్చి బ్రాహ్మణులకు భోజనములు పెట్టవలెను. దానిపైన కంఠభాగము నందు దారముగాని మాలగాని చుట్టవలెను. దానిపైన కూడ 'విమలామలసార' అను పుష్పమాలను దేవాలయము నాల్గువైపుల కట్టవలెను. దానిపైన వృకలము, దానిపైన సుదర్శన చక్రము నిర్మింప వలెను. అచటనే వాసు దేవతా మూర్తి గ్రహగుప్తయని తెలుపవలెను. లేదా మొదట కలశమును, దానిపైన సుదర్శన చక్రమును ఏర్పాటు చేయవలెను. బ్రహ్మదేవా! వేదికి నలువైపుల ఎనమండ్రు విఘ్నేశ్వ రులను స్థాపించవలెను. లేదా నాలుగు దిక్కులందు నలుగురు విఘ్నేశ్వరులను స్థాపించ వలెను. ఇపుడు భూతాదినినాశ గరుడధ్వజారోపణ విధానము చెప్పెదను.

దేవాలయమును నిర్మించినవారు, ప్రాసాదబింబ ద్రవ్యములలో ఎన్ని పరమాణువు లున్నవో అన్నివేల సంవత్సరములు విష్ణు లోకములో నుందురు. పాపరహితుడవైన బ్రహ్మ దేవా! వాయువుచే కదల్చబడిన ధ్వజపటము కలశమును, వేదిని, ప్రాసాద బింబ కంఠమును ఎప్పుడు చుట్టుకొనునో అపుడు ప్రాసాదకర్తకు ధ్వజారోపణముకంటె కోటిరెట్లు అధికమగు ఫలము లభించునని తెలిసికొన వలెను. పతాక ప్రకృతి; దండము పురుషుడు; ప్రాసాదము వాసుదేవస్వరూపము. ప్రాసాదము భగవంతుని ధరించుచున్నదిగాన అదియే దానిలోని ధరణీతత్త్వము, దేవాలయమునందు ఏ శూన్యావ కాశమున్నదో అదియే ఆకాశ తత్త్వము. దానిలోని ప్రకాశమే అగ్నితత్త్వము. దానిలో కలుగు వాయుస్పర్శయే వాయుతత్త్వము.

పాషాణాదులలో నున్న జలము పార్థివజలము. దానిలో పృథివీగుణమగు గంధముండును. ప్రతిధ్వనిరూప శబ్దమే అచటి శబ్దము. స్పృశింపగా కనబడు కఠోరత్వాదికమే స్పర్శ. శుక్లాది వర్ణములు రూపము. ఆహ్లాదమును కలిగించు రసమే రసము. ధూపాది గంధమే గంధము. భేరి మొదలగు వాయిద్యములలో ప్రకటమగు నాదమే వాక్కు. అది వాగింద్రియము వంటిది. అందుచే వాగింద్రియము అచటనే ఉన్నదని భావించవలెను. నాసిక శుకనాస యందు ఉండును. దాని రథకములు భుజములు. శిఖరముపై అండా కారమున ఉన్నది శిరస్సు. కలశము కేశపాశము. ప్రాసాదకంఠ భాగము కంఠము. వేది భుజము. రెండు నాళికలు గుదోపస్థలు. సున్నము త్వక్కు. ద్వారము ముఖము. ప్రతిమయే దేవాలయ జీవాత్మ. పిండిక జీవశక్తి. దాని ఆకారము ప్రకృతి, నిశ్చలత దాని గర్భము. నారాయణుడు దాని అధిష్ఠాత. ఈ విధముగ మహావిష్ణువే దేవాలయ రూపమున నిలచియున్నాడు. శివుడు కాళ్లు; బ్రహ్మ స్కంధముపై ఉన్నాడు. ఊర్ధ్వ భాగమున సాక్షాత్తు విష్ణువే ఉండును. ఈ విధముగ ఉన్న ప్రాసాదమున ప్రతిష్ఠింపబడు ధ్వజమును గూర్చి వినుము. శస్త్రాది చిహ్నములతో కూడిన ధ్వజమును నిలబెట్టి దేవతలు దైత్యులను జయించిరి. అండముపై కలశము నుంచి, దానిపైన ధ్వజమును స్థాపింపవలెను. ధ్వజ మానము బింబమాన ములో సగముండవలెను. ధ్వజదండము పొడవులో మూడవ వంతుతో చక్రము నిర్మింపవలెను. ఆ చక్రమునందు ఎనిమిదికాని పండ్రెండు కాని ఆకులు ఉండవలెను. దాని మధ్య నృసింహుని మూర్తిగాని, గరుడుని మూర్తి గాని ఉండవలెను. ధ్వజదండము విరిగినదిగాని, రంధ్రాదులున్నది

గాని కాకూడదు. దండము పొడవు ప్రాసాదము వెడల్పుతో సమముగా నుండవలెను. లేదా దాని పొడవు శిఖరము యొక్క సగము భాగము లేదా మూడవ వంతు ఎంతఉండునో అంత ఉండవలెను. లేదా ద్వారము పొడవుకంటె రెట్టింపు పొడవు ఉండవలెను. ఆ ధ్వజ దండమును దేవాలయముపై ఈశాన్యమున గాని, వాయవ్యమున గాని స్థాపింపవలెను.

ధ్వజ వస్త్రము (పతాక) పట్టుగుడ్డ మొదలైన వాటితో విచిత్రవర్ణముగ నుండునట్లు చేయవలెను. లేదా ఒకే రంగు ఉండునట్లు చేయవలెను. దానికి ఘంట, చామరములు, చిరుగంటలు కట్టినచో అది సర్వపాప వినాశకమగును. దండాగ్రము నుండి నేలవరకు వ్రేలాడు వస్త్రమునకు "మహా ధ్వజము"అని పేరు. అది సంపూర్ణ మనోరథములను ఇచ్చును. దానికంటె నాల్గవవంతు చిన్నదైన దానిని పూజించినచో సర్వమనోరథము సిద్ధించును. ధ్వజములో సగము ప్రమాణముగల వస్త్రముతో నిర్మించినదానికి 'పతాక' అని పేరు. లేదా పతాకకు కొలత ఏదియు అవసరములేదు. ధ్వజవిస్తారము ఇరువది అంగుళములు ఉండవలెను. చక్ర, దండ, ధ్వజముల అధివాసనమును దేవతా మూర్తులకు వలె చేసి, స్రకలీ కరణముగూడ కావించి, మండప స్నానాది కార్యములుకూడ చేయవలెను. నేత్రో న్మీలనము తప్ప వెనుక చెప్పిన కార్యములన్నియు చేయవలెను. ఆచార్యుడు వీటినన్నింటిని శయ్యపై ఉంచి అధివాసము చేయవలెను.

పిమ్మట విద్వాంసుడు "సహస్రశీర్షా" ఇత్యాది సూక్తమును ధ్వజాంకిత చక్రముపై న్యాసముచేసి, సుదర్శన మంత్రమును, మనస్తత్త్వమును గూడ న్యాసము చేయవలెను. అది మనోరూపమున ఆ చక్రమున సజీవీకరణము. సురశ్రేష్ఠా! పండ్రెండు ఆకులపై (అదములపై) క్రమముగ కేశవాది మూర్తుల న్యాసము చేయవలెను. కమలముపై నృసింహుని గాని, విశ్వరూపుని గాని ఉంచవలెను. దండముపై జీవ సహితుడగు సూత్రాత్మను న్యాసము చేయవలెను. ధ్వజముపై, శ్రీహరి ధ్యానము చేయుచు, నిష్కల పరమాత్ముని స్థాపించవలెను. ఆతని బలాబలరూప వ్యాపకశక్తిని ధ్వజరూపమున ధ్యానింప వలెను. మండపముపై దానిని స్థాపించి, పూజించి, కుండములలో హోమము చేయవలెను. కల శములో బంగారు ఖండము, పంచరత్నములు ఉంచి, అస్త్రమంత్రముతో చక్రమును స్థాపింప వలెను. పిమ్మట సువర్ణ చక్రమును, క్రింద నున్న పాదరసములో ముంచి నేత్ర పటముతో కప్పవలెను. పిమ్మట చక్రము నుంచి, దాని మధ్యమున శ్రీహరిని స్మరింపవలెను.

"ఓం క్షౌం నృసింహాయ నమః" అను మంత్రముతో హరిని స్థాపించి పూజించవలెను. పిమ్మట యజమానుడు, బంధుసమేతుడై ధ్వజము తీసికొని దాని అగ్రభాగమును పెరుగుపాత్రలో ముంచ వలెను. "ఓం ఫట్" అను మంత్రముతో ధ్వజపూజ చేయవలెను. పిమ్మట ఆ పాత్రను తలపై పెట్టుకొని నారాయణ స్మరణ చేయుచు వాద్యధ్వనులతో, మంగళ పాఠములతో, పరిక్రమణము చేయవలెను. పిమ్మట అష్టాక్షర మంత్రముతో ధ్వజ దండమును స్థాపించవలెను. "ముఞ్చామి త్వా" ఇత్యాది సూక్తము చదువుచు ధ్వజములు విడువ (ఎగురవేయ) వలెను. ఆచార్యునకు పాత్ర, ధ్వజ, గజాదులు దానము చేయవలెను. ఇది ధ్వజారోపణ సాధారణవిధి. ఏ దేవతకు ఏ చిహ్నమో ఆ చిహ్నమే ఉన్న ధ్వజమును, ఆ దేవతా మంత్రముతో స్థిరముగ స్థాపింపవలెను. ధ్వజదానము చేసినవాడు స్వర్గమునకు వెళ్ళును; ఈ లోకమునందు బలవంతుడగు రాజగును. (61)

లక్ష్మీప్రతిష్ఠా విధి

హయగ్రీవుడు చెప్పెను : ఇపుడు సామూహిక రూపమున దేవతాది ప్రతిష్ఠను గూర్చి చెప్పెదను. మొదట లక్ష్మీ స్థాపనగూర్చియు, పిదప ఇతర దేవతా స్థాపన గూర్చియు చెప్పెదను. మండప, అభిషేకాదులు అన్నియు వెనుకటి అధ్యాయములలో చెప్పినట్లే చేయవలెను. పిమ్మట భద్రపీఠమును లక్ష్మిని స్థాపించి ఎనిమిది దిక్కులందును ఎనిమిది కలశములు స్థాపించవలెను. దేవీప్రతిమకు ఆజ్యము పూసి, మూలమంత్రము చదువుచు, పంచ గవ్యములతో స్నానము చేయించవలెను. "హిరణ్యవర్ణాం హరిణీమ్" ఇత్యాది మంత్రము చదువుచు నేత్రములను తెరువవలెను. "తాం మ ఆవహ" అను మంత్రము చదివి దేవికి తేనె, నెయ్యి, పంచదార సమర్పింపవలెను. 'అశ్వపూర్వామ్' ఇత్యాది మంత్రముతో తూర్పుననున్న కలశతో స్నానము చేయించవలెను.

"కాంసోస్మితామ్" ఇత్యాది మంత్రముతో దక్షిణ కలశజలముతోను, "చన్ద్రాం ప్రభాసామ్" ఇత్యాది మంత్రముతో పశ్చిమ కలశజలముతోను, "ఆదిత్యవర్ణే" ఇత్యాది మంత్రముతో ఉత్తర కలశ జలముతోను "ఉపైతు మాం" ఉత్యాది మంత్రముతో ఆగ్నేయ కలశజలముతోను, "క్షుత్పిపా సామలామ్" ఇత్యాది మంత్రముతో నైరృతి కలశజలముతోను, "గన్ధద్వారాం" ఇత్యాది మంత్రముతో వాయవ్య కోణ కలశజలముతోను, "మనసః కామమాకూతిమ్' ఇత్యాది మంత్రముతో ఈశాన్య కలశముల జలముతోను, లక్ష్మీదేవికి అభిషేకము చేయవలెను. "ఆపః సృజన్తు" ఇత్యాది మంత్రముతో ఎనుబదియొక్క కలశములతో శ్రీదేవి ప్రతిమకు స్నానము చేయించవలెను.

పిమ్మట "ఆర్ద్రాం పుష్కరిణీమ్" ఇత్యాది మంత్రముతో గంధమర్పించి, "ఆర్ద్రాం యః కరిణీమ్ ఇత్యాది మంత్రముతో పుష్పమాల సమర్పింపవలెను. పిమ్మట "తాం మ ఆవహ జాతవేదః" ఇత్యాది మంత్రముతోను, "ఆనన్దః" ఇత్యాది శ్లోకములతోను మిగిలిన ఉపచారములు అన్నియు సమర్పింప వలెను. "శ్రాయన్తీ" ఇత్యాది మంత్రము చదువుచు శయ్యపై పరుండపెట్టవలెను. శ్రీసూక్తము పఠించుచు సన్నిధీకరణముచేసి, లక్ష్మీబీజముతో (శ్రీం) చిచ్ఛక్తి విన్యాసముచేసి మరల పూజింప వలెను. పిదప శ్రీసూక్తముతో మండపముపై ఉన్న కుండములలో కమలములతోగాని, కరవీర పుష్పములతోగాని వెయ్యి లేదా వందహోమములు చేయవలెను.

గృహోపకరణాది సమస్త పూజా సామగ్రి మొదటి నుండియు శ్రీసూక్త మంత్రముతోడనే సమర్పింపవలెను. వెనుకటివలె ప్రాసాద మునకు సంస్కారము చేసి, లక్ష్మికి పిండికా నిర్మాణము చేయవలెను. పిమ్మట పిండికపై లక్ష్మిని ప్రతిష్ఠచేసి, శ్రీసూక్తముతో సన్నిధీకరణము చేయుచు వెనుకటివలె శ్రీసూక్తము నందలి ఒక్కొక్క ఋక్కును జపించవలెను. మూల మంత్రముచే చిచ్ఛక్తిని జాగృత మొనర్చి మరల సన్నిధీకరణము చేయవలెను.

పిమ్మట ఆచార్యునకు, బ్రహ్మకు, ఇతర ఋత్విక్కులకు, బ్రాహ్మణులకు భూ, సువర్ణ, వస్త్ర, గోదానాదులు చేయవలెను. ఈ విధముగ అందరి దేవులను స్థాపించినవాడు, రాజ్య స్వర్గాదులను పొందును. (62)

సుదర్శనచక్రాది ప్రతిష్ఠా కథనము

హయగ్రీవుడు చెప్పెను : గరుడ, సుదర్శన, బ్రహ్మ, నృసింహమూర్తుల ప్రతిష్ఠ కూడ, వారివారి మంత్రములతో, విష్ణుమూర్తిని స్థాపించిన విధముననే స్థాపింపవలెను. ఆ విధానమును వినుము. "ఓం సుదర్శన... సుదర్శన మహాచక్ర శాన్త దుష్ట భయంకర ఛిన్దిఛిన్ది విదారయవిదాయ,పరమన్త్రాన్ గ్రసగ్రస భక్షయభక్షయ భూతాన్ త్రాసయ త్రాసయహం ఫట్ సుదర్శనాయనమః, సుదర్శనాయ నమః" అను మంత్రముతో చక్రపూజ చేసిన వీరుడు యుద్ధమునందు శత్రువులను చీల్చివేయగలడు. "ఓం క్షౌం నరసింహ ఉగ్రరూప జ్వల జ్వల ప్రజ్వల ప్రజ్వల స్వాహా" అనునది నరసింహ మంత్రము. ఇపుడు నీకు పాతాళ నృసింహ మంత్రము ఉపదేశించుచున్నాను.

పాతాళ నృసింహ మంత్రం

ఓం క్షౌం నమో భగవతే నరసింహాయ, ప్రదీప్త సూర్యకోటి సమతేజసే వజ్రనఖదంష్ట్రాయుధాయ, స్ఫుటవికట వికీర్ణ కేసర సటాగ్ర ప్రక్షుభిత మహార్ణవామ్భోదుదున్దుభినిర్ఘోషాయ, సర్వమన్త్రోత్తారణాయ, ఏహ్యేహి భగవన్నరసింహ, పురుష, పరాపరబ్రహ్మ, సత్యేన స్ఫుర – స్ఫుర, విజృమ్భ విజృమ్భ, ఆక్రమ – ఆక్రమ, గర్జ – గర్జ, ముఞ్చ – ముఞ్చ, సింహనాదాన్, విదారయ – విదారయ, విద్రావయ – విద్రావయ, ఆవిశ – ఆవిశ, సర్వమన్త్ర రూపాణి సర్వనమన్త్ర జాతీశ్చ హన – హన, ఛిన్ద, సంక్షిప – సంక్షిప, సర – సర, (దర – దర) దారయ – దారయ, స్ఫుట –స్ఫుట, స్ఫోటయ–స్ఫోటయ, జ్వాలా మాలాసంఘాతమయ, సర్వతోనన్త జ్వాలావజ్రాశనిచక్రేణ సర్వపా తాలాన్ ఉత్సాదయ – ఉత్సాదయ, సర్వతో ఽనన్త జ్వాల వజ్రశరపఞ్జరేణ సర్వపాతాలాన్ పరివారయ – పరివారయ, సర్వపా తాలాసుర వాసినాం హృదయాన్యాకర్షయ ఆకర్షయ, శీఘ్రం దహ దహ, పచ – పచ, మథ – మథ, శోషయ, నికృన్తయ – నికృన్తయ, తావద్యావన్మే వశమాగతాః పాతాళేభ్యః (ఫట్ సరేభ్యః) ఫట్ అసురేభ్యః, ఫట్ మన్త్రరూపేభ్యః ఫట్, మన్త్రజాతిభ్యః, సంశయాన్మాం భగవన్నరసిం హరూప విష్ణో సర్వాపద్భ్యః సర్వమన్త్రరూపేభ్యో రక్ష రక్ష హుం ఫట్ నమో నమస్తే".

(ఇది పాతాళ నృసింహ మంత్రము. దీనిని ఈ విధముగ జపించగనే సత్ఫలము లభించును. శత్రువులను, నాకు అపకారము చేయు అసురులు మొదలగువారిని, పరులు ప్రయోగించిన మంత్రములను నశింపచేయుము అని దీని తాత్పర్యము. మధ్యనున్న 'హుం' 'ఫట్' అనువాటికి ప్రత్యేకముగ అర్థమేమియు ఉండదు. కాని ఉచ్చారణ మాత్రము చేతనే అవి నశింపచేయుట అను అర్థమును సూచించును. 'ఫట్' అనుదానికి మారకాస్త్రమని పేరు.)

భావము : "ప్రకాశించుచున్న కోటి సహస్ర సూర్యులతో సమానమైన తేజస్సు కలవాడును, వజ్రము వంటి నఖములు, కోరలు ఆయుధముగా కలవాడును, పైకి విడివడి లేచిన జూలుచేత క్షోభింప చేయబడిన మహాసముద్ర జలముచే ఏర్పడిన దుందుభి ధ్వని కలవాడును, సర్వమంత్ర ప్రయోగముల నుండి తరింప చేయువాడును అగు భగవంతుడైన నరసింహునకు నమస్కారము. భగవంతుడవైన నరసింహా! రమ్ము; రమ్ము. పురుషా! పరాపర బ్రహ్మరూపా! సత్యముచే ప్రకాశించుము, ప్రకాశించుము. విజృంభించుము, విజృంభించుము. ఆక్రమించుము, ఆక్రమించుము. గర్జించుము, గర్జించుము. సింహనాదము చేయుము, చేయుము. చీల్చుము, చీల్చుము. పారద్రోలుము, పారద్రోలుము. ఆవేశించుము, ఆవేశించుము. సర్వ మంత్ర రూపములను, మంత్రజాతులను చంపుము, చంపుము. భేదించుము, భేదించుము. సంక్షేపించుము, సంక్షేపించుము. నడుపుము, నడుపుము. చీల్చుము, చీల్చుము. బ్రద్దలుకొట్టుము, బ్రద్దలుకొట్టుము. జ్వాలామాలా సముదాయ స్వరూపా! అంతటను వ్యాపించిన అనంతమైన జ్వాలలయొక్కయు, వజ్రములయొక్కయు, అశనులయొక్కయు సముదాయముచే పాతాళములు అన్నింటిని నశింపచేయుము, నశింపచేయుము. అంతటను వ్యాపించిన, అనంతమైన జ్వాలలచేతను, వజ్రములచేతను, శరపంజరముచేతను పాతాళములు అన్నింటిని చుట్టుముట్టుము. సర్వపాతాళములందు నివసించు అసురుల హృదయములను లాగుము, లాగుము. శీఘ్రముగ కాల్చివేయుము, కాల్చివేయుము. వండుము, వండుము. మథించుము, మథించుము. ఎండచేయుము, ఎండచేయుము. వారందరును నాకు వశమగునంతవరకు ఖండించుము, ఖండించుము. "పాతాలేభ్యః ఫట్, అసురేభ్యః ఫట్, మన్త్రరూపేభ్యః ఫట్, మంత్రజాతిభ్యః ఫట్" భగవంతుడవైన, నరసింహ రూపములో నున్న ఓ విష్ణుః! నన్ను సందిగ్ధ స్థితి నుండియు, సర్వాపదల నుండియు, సర్వమంత్ర రూపములనుండియు రక్షింపుము, రక్షింపుము. "హుం", "ఫట్" నీకు నమస్కారము, నమస్కారము".

ఇది శ్రీహరిరూపిణియగు నృసింహవిద్య, సర్వార్థములను ఒసగునది. త్రైలోక్య మోహన శ్రీ విష్ణుమూర్తి ప్రతిష్ఠ త్రైలోక్య మోహనమంత్ర సమూహముతో చేయవలెను. ద్విభుజ విగ్రహమునకు ఎడమ చేతిలో గద, కుడి చేతిలో అభయముద్ర ఉండవలెను. చతుర్భుజరూపమైనచో పై కుడిచేతిలో చక్రము, పై ఎడమచేతిలో పాంచజన్యము ఉండ వలెను. ఈ విగ్రహముతో శ్రీపుష్టులను గాని, బలరామ-సుభద్రలను గాని స్థాపింపవలెను. శ్రీవిష్ణు, వామన, వైకుంఠ, హయగ్రీవ, అనిరుద్ధులను ప్రాసాదములోగాని, గృహములోగాని, మండపమునందుగాని స్థాపింపవలెను. మత్స్యాద్యవతాంములలో జల శయ్యపై స్థాపించి పరుండబెట్టవలెను. సంకర్షణ, విశ్వరూప, రుద్రమూర్తి లింగ, అర్ధనారీశ్వర, హరిహర, మాతృకాగణ, భైరవ, సూర్య, గ్రహ, వినాయకులను, ఇంద్రాదులచే సేవింపబడు గౌరిని, చిత్రజను, బలాబలవిద్యను కూడ ఈ విధముగనే స్థాపింపవలెను.

ఇపుడు నేను గ్రంథ ప్రతిష్టను దానిలేఖన విధానమును గూర్చి చెప్పెదను. ఆచార్యుడు స్వస్తిక మండలముపై శరయంత్రాసనము మీద నున్న లేఖ్యమును (వ్రాయదగిన దానిని), లిఖిత పుస్తకమును, విద్యను, శ్రీహరిని పూజించవలెను. పిదప యజమానుడు గురువును, విద్యను, శ్రీ మహావిష్ణువును, లేఖకుని పూజించవలెను. పిమ్మట పూర్వాభిముఖుడై పద్మినిని ధ్యానించి వెండి సిరాబుడ్డిలో నున్న

సిరాలో ముంచి బంగారు కలముతో ఐదు శ్లోక ములు దేవనాగరి లిపిలో వ్రాయవలెను. పిదప బ్రాహ్మణులకు యథాశక్తి భోజనము పెట్టి, దక్షిణ ఇవ్వవలెను, ఆచార్య, విద్యా, శ్రీ మహావిష్ణువులను పూజించి లేఖకుడు పురాణాదులను వ్రాయుట ప్రారంభింపవలెను. వెనుకటివలె మండలాదులపై ఈశాన్యము నందున్న అద్దము మీద పుస్తకము నుంచి, మొదట చెప్పినట్లుగనే కలశములచే తడపవలెను. పిదప యజమానుడు నేత్రములను తెరచి, ఆ పుస్తకమును శయ్యపై ఉంచవలెను. పిమ్మట దానిపై పురుష సూక్త వేదాదిన్యాసము చేయవలెను. ప్రాణప్రతిష్ఠా పూజా, చరుహోమములు చేసి, పూజించి, ఆచార్యుని దక్షిణాదులతో సత్కరించి బ్రాహ్మణ భోజనము ఏర్పరుపవలెను. అంత మున ఆ పుస్తకమును గృహము నందుగాని, దేవాలయము నందుగాని స్థాపించి పూజించవలెను. గ్రంథమును వస్త్రముతో ఆచ్ఛాదించి పాఠ ప్రారంభమునందును, అంతము నందును దానిని పూజించవలెను. పుస్తకమును చదువువాడు విశ్వశాంతి కలుగవలెనని సంకల్పించి ఒక అధ్యా యమును చదువవలెను. గురువు కుంభములోని జలముతో యజ మానుడు మొదలగువారికి అభిషేకము చేయించవలెను. బ్రాహ్మణునకు పుస్తకదానము చేసినచో అనంతఫలము లభించును. గోదాన, భూదాన, విద్యాదానము అను మూడు దానములకును అతిదానములని పేరు. పాలు పిదుకుట, విత్తనములు చల్లుట అను పనులు చేయగనే ఆ దానములు చేసినవాడు నరకము నుండి ఉద్ధరింపబడును. సిరాతో వ్రాసిన పత్రములను దానముచేసినచో విద్యా దానఫలము లభించును. ఆ పత్రములెన్ని ఉన్నవో, అక్షరములెన్ని ఉన్నవో అన్నివేల సంవత్సరములు దాత విష్ణులోకములో పూజింపబడును. పంచరాత్రము, పురాణములు, మహాభారతము దానముచేసినవాడు తన వంశములో ఇరువదియొక్క తరముల వారిని ఉద్ధరించి తాను పరమతత్త్వము నందు విలీనుడగును. (63)

కూపాది ప్రతిష్ఠా విధానము

హయగ్రీవుడు చెప్పెను : బ్రహ్మదేవా! ఇపుడు కూపములు, దిగుడుబావులు, చెరువులు ప్రతిష్ఠ చేయు విధిని చెప్పెదను; శ్రీహరియే జలరూపముచే దేవశ్రేష్ఠుడైన సోముడుగాను, వరుణుడుగాను ఆయెను. ప్రపంచ మంతయు అగ్నీష్టోమమయము. జలరూపుడైన నారా యణుడు దానికి కారణము. బంగారముతో లేదా వెండితో లేదా రత్నములతో వరుణుని ప్రతిమ చేయించవలెను. వరుణదేవునకు రెండు భుజములతో, హంసారూఢుడై, నదుల తోడను, కాలువలతోడను కూడియుండును. ఆతని కుడి చేతిలో అభయముద్రయు, ఎడమచేతిలో నాగపాశము ప్రకాశించుచుండును. యజ్ఞ మండప మధ్య భాగమున కుండముతో ప్రకాశించు వేదిక నిర్మించి దాని తోరణమున పూర్వ ద్వారమున కమండల సహితముగా వరుణ కలశము స్థాపింపవలెను, భద్రకమున (దక్షిణ ద్వారమున)ను, అర్ధచంద్రమునను (పశ్చిమ ద్వారమునను), స్వస్తికమునను (ఉత్తర ద్వారమునను) వరుణ కలశములు స్థాపించవలెను. కుండమునందు అగ్న్యాధానముచేసి పూర్ణాహుతి ఇవ్వవలెను.

"యే తే శతం వరుణ" ఇత్యాది మంత్రముతో స్నానపీఠముపై వరుణుని స్థాపింపవలెను. మూల మంత్రమును ఉచ్చరించుచు, ఆచార్యుడు,వరుణదేవతాప్రతిమకు ఘృతము పూయవలెను.

"శం నో దేవీ" ఇత్యాది మంత్రముతో ప్రక్షాళనముచేసి, "శుద్ధ వాలః", "సర్వశుద్ధవాలః" ఇత్యాది మంత్రములతో, పవిత్ర జలముచే స్నానము చేయించవలెను. పిమ్మట స్నాన పీఠమునకు పూర్వాది దిక్కులందు కలశములను స్థాపించవలెను. తూర్పున ఉన్న కలశమున సముద్రజలము, ఆగ్నేయమున ఉన్న కలశమున గంగాజలము, దక్షిణ కలశమున వర్షాజలము, నైరృతి కలశమున సెలయేరు నీరు, పశ్చిమ కలశమున నదీజలము, వాయవ్యకలశమున కొండకాలువ నీరు, ఉత్తర కలశమున కాలువల నీరు, ఈశాన్య కలశమున తీర్థజలములను ఉంచవలెను. ఈ వివిధ జలములు లభించనిచో నదీజలమే ఉంచవలెను. ఈ అన్ని కలశములను "యాసాం రాజా" ఇత్యాది మంత్రముచే అభి మంత్రించవలెను. విద్వాంసుడైన పురోహితుడు "సుమిత్రియా" ఇత్యాది మంత్రముతో మార్జన నిర్మంథనములు చేయవలెను. "చిత్రం దేవానామ్" "తచ్చక్షుర్దేవహితమ్" అను మంత్రములతో తేనె, నెయ్యి, పంచదార అను మధురత్రయముచే నేత్రములను తెరవవలెను. ఆ సువర్ణమయ వరుణ ప్రతిమపై జ్యోతిస్సును పూజించి ఆచార్యునకు గోదానము ఈయవలెను.

"సముద్ర జ్యేష్ఠాః" ఇత్యాది మంత్రముతో పూర్వ కలశ జలముచేతను, "సముద్రం గచ్ఛ" ఇత్యాది మంత్రముతో ఆగ్నేయ కలశస్థిత గంగా జలముచేతను, "సోమో ధేనుమ్" ఇత్యాది మంత్రముతో దక్షిణ కలశ స్థితి వర్షా జలముచేతను, "దేవీరాప", ఇత్యాది మంత్ర ముతో నైరృతి కలశ స్థిత నిర్ఝర జలముచేతను, "పఞ్చ నద్యః" ఇత్యాది మంత్రముతో పశ్చిమ కలశస్థిత నదీజలము చేతను, "ఉద్భిద్భ్యః" ఇత్యాది మంత్రముతో ఉత్తర కలశ స్థితోద్భిజ్జ జలముచేతను, పావమానీ ఋక్కులతో ఈశాన్య కలశ స్థిత తీర్థ జలముచేతను వరుణునకు అభిషేకము చేయవలెను. పిమ్మట యజమానుడు "ఆపోహిష్ఠా" మంత్రముతో పంచగవ్యము లచేతను, "హిరణ్య వర్ణామ్" ఇత్యాది మంత్రముతో స్వర్ణజలముచేతను, "ఆపో అస్మాన్" అను మంత్రముచే వర్షాజలముచేతను, వ్యాహృ తులతో కూపజలముచేతను, "ఆపో దేవీః" ఇత్యాది మంత్రముతో తడాగ జలముచేతను, తోరణము నందున్న వరుణ కలశ జలముచేతను వరుణునికి స్నానము చేయించవలెను. కొండ కాలువల జలము నింపిన ఎనుబది యొక్క కలశములలోని జలముచే "వరుణస్యోత్త మ్భనమసి" ఇత్యాది మంత్రము పఠించుచు స్నానము చేయించవలెను. "త్వంనో అగ్నే వరుణస్య" ఇత్యాది మంత్రముతో అర్ఘ్య ప్రదానము చేయవలెను. వ్యాహృతులను ఉచ్చరించుచు మధుపర్కమును, "బృహస్పతే అతి యదర్యో" ఇత్యాది మంత్రముతో, వస్త్రములను, "ఇమం మే వరుణ" ఇత్యాది మంత్రముతో పవిత్రకమును, ప్రణవ ముచ్చరించుచు, ఉత్తరీయమును సమర్పింపవలెను. వరుణసూక్తము పఠించుచు పుష్ప, చామర, దర్పణ, ఛత్ర, పతాకలను సమర్పింపవలెను. మూలమంత్రము చదువుచు, "ఉత్తిష్ఠ" అని పలికి లేవదీసి, ఆ రాత్రికి అధివాసము చేయించవలెను. "వరుణం వా" అను మంత్రముచే సన్నిధీకరణముచేసి వరుణ సూక్తముచే పూజింపవలెను. మూలమంత్రముచే సజీవీ కరణము చేసి చందనాదులతో పూజించవలెను. మండలమున వెనుక చెప్పిన విధమున అర్చన చేయవలెను. అగ్ని కుండమున సమిధలతో హోమము చేయవలెను. వైదిక మంత్రములతో గంగ మొదలగు నాలుగు గోవులను పిదుకవలెను. అన్ని దిక్కులందునుయవలతో వండిన చరువు ఉంచి హోమము చేయవలెను. చరువును వ్యాహృతుల చేతను, గాయత్రిచేతను లేదా మూలమంత్రము

చేతను అభిమంత్రించి సూర్య, ప్రజాపతి, దివ్, అంతకనిగ్రహ, పృథ్వీ, దేహధృతి, స్వధృతి, రతి, రమతీ, ఉగ్ర, భీమ, రౌద్ర, విష్ణు, వరుణ, ధాతా, రాయస్పోష, మహేంద్ర, అగ్ని, యమ, నిరృతి, వరుణ, వాయు, కుబేర, ఈశ, అనంత, బ్రహ్మ, వరుణ నామములను చతుర్థీ విభక్తి అంతములుగాగల పదములను చేసి పలుకుచు అంతమున "స్వాహా" చేర్చి బలి ఇవ్వవలెను. "ఇదం విష్ణుః", "తద్విప్రాసః" అను మంత్రములచే ఆహుతులను ఈయవలెను. "సోమో ధేనువు" ఇత్యాది మంత్రములతో ఆరు ఆహుతులు ఇచ్చి "ఇమం మే వరుణ" అను మంత్రముతో ఒక ఆహుతివ్వవలెను. 'ఆపో హిష్ఠా' ఇత్యాది మంత్రత్రయముతోను, "ఇమారుద్రా" ఇత్యాదిమంత్రముతోనుకూడ ఆహుతుల నీయవలెను.

పిమ్మట పది దిక్కులందును బలులు ఇచ్చి గంధ పుష్పాలతో పూజింపవలెను. ప్రతి మను ఎత్తి మండపము మీద స్థాపించి గంధ పుష్పాదులచేతను, సువర్ణ పుష్పాదుల చేతను పూజించవలెను. పిమ్మట శ్రేష్ఠుడైన ఆచార్యుడు ఎనిమిది దిక్కులందును రెండేసి జానల చెరువులను, ఇసుకతో ఎనిమిది వేదికలను నిర్మింపవలెను. "వరుణస్య" ఇత్యాది మంత్రము చదువుచు, ఘృతముతోను, యవలతో వండిన చరువుతోను వేరువేరుగ నూట ఎనిమిది హోమములు చేయవలెను. శాంతి జలము తీసికొనివచ్చి దానితో వరుణుని శిరస్సుపై అభిషేకముచేసి, సజీవీకరణము చేయవలెను. తన ధర్మపత్నియగు గౌరితో కూడిన వరుణుడు నదీ నదములతో పరివేష్ఠితుడై ఉన్నట్లు ధ్యానము చేయవలెను. ఓం వరుణాయ నమః అను మంత్రముతో పూజించి సాన్నిధ్యకరణము చేయవలెను. పిమ్మట వరుణ దేవుని లేవదీసి మంగళద్రవ్యములతో గజ పృష్ఠాదులపై ఎక్కించి ఊరేగించవలెను. పిమ్మట ఆ వరుణ మూర్తిని "అపో హి ష్ఠామ యో భువః" ఇత్యాది మంత్రము పఠించుచు మధుర త్రయయుక్తమగు కలశములో ఉంచి కలశసహితుడగు వరుణుని జలాశయ మధ్య భాగమునందు సురక్షిత రూపమున స్థాపింపవలెను.

పిమ్మట యజమానుడు స్నానముచేసి వరుణుని ధ్యానించవలెను. అనంతరము బ్రహ్మాండ సంజ్ఞకమగు సృష్టిని అగ్ని బీజముచే (రం) దహించి, దాని భస్మరాశిని ఉదకముచే ముంచెత్తినట్లు భావన చేయవలెను. జగమంతయు జలమయమైనది" అని భావనచేసి ఆ జలమునందు జలేశ్వరుడైన వరుణుని ధ్యానించవలెను. ఈ విధమున జల మధ్యభాగమున వరుణదేవతా ధ్యానముచేసి అచట యూపమును స్థాపించవలెను. యూపము చతుష్కోణముగగాని, అష్టకోణముగ గాని, గోలాకారముగ గాని ఉండుట మంచిది, పది మస్తముల పొడవు ఉండవలెను. దానిపై ఉపాస్యదేవతా చిహ్నములు ఉండవలెను. దానిని యజ్ఞమునకు ఉపయోగించు చెట్టుకట్టతో నిర్మింపవలెను. కూపమునకు అట్టి యూపమే ఉపయోగించును. దాని మూలభాగమున బంగారుఫలకము ఉంచవలెను. దిగుడు బావిలో పదునైదు హస్తముల యూపమును, పుష్కరిణిలో ఇరువది హస్తముల యూపమును, తటాకమున ఇరువదియైదు హస్తముల యూపము స్థాపింపవలెను. యజ్ఞ ప్రాంగణమున "యూప బ్రహ్మ" ఇత్యాది మంత్రముతో యూపమును స్థాపించి, దానికి వస్త్రములు చుట్టబెట్టి, పై భాగమున పతాక ఏర్పరుపవలెను. దానిని గంధాదులతో పూజించి, జగత్తు కొరకై శాంతికర్మ చేయవలెను. ఆచార్యునకు భూమి, గోవు, సువర్ణము, జలపాత్రము మొదలగునవి దక్షిణగ ఇవ్వవలెను. ఇతర బ్రాహ్మణులకు గూడ దక్షిణలు ఇచ్చి, వచ్చిన వారికి భోజనము పెట్టవలెను. "బ్రహ్మ మొదలు

తృణమువరకు లేదా కీటకము వరకు దప్పికొన్న వారికి అందరికిని ఈ తటాకములోనున్న జలముచే తృప్తి కలుగుగాక" అని పలుకుచు జలము విడిచిపెట్టి, జలాశయములో పంచగవ్యములు ఉంచ వలెను. పిమ్మట "ఆపో హిష్ఠామ" ఇత్యాది ఋక్త్రయము పఠించుచు, బ్రాహ్మణులు సమకూర్చిన శాంతి జలమును, పవిత్ర తీర్థజలమును ఉంచి, బ్రాహ్మణులకు గోవృషభాది దానము చేయవలెను. ఎట్టి అడ్డులు చెప్పకుండగ అందరికిని అన్నదానము చేయు ఏర్పాట్లు చేయవలెను. ఒక్క జలాశయ మును నిర్మించువాని పుణ్యము లక్ష అశ్వమేధయాగములు చేసిన వాని పుణ్యము కంటె వేయి రెట్లు అధికము. ఆతడు స్వర్గము చేరి విమానమునందు ఆనందించుచుండును. ఎన్నడును నరకము నకు వెళ్ళడు. జలాశయమునందు గోవులు మొదలగు పశువులు జలము త్రాగునుగాన దానిని నిర్మించినవాడు పాప వినిర్ముక్తుడగును. జలదానముచేసిన మానవుడు సకల దానములును చేసిన ఫలము పొంది స్వర్గమునకు వెళ్ళును. (64)

సభా గృహ స్థాపనము

హయగ్రీవుడు చెప్పెను : ఇపుడు సభాసదులను స్థాపించు విధానము చెప్పెదను. భూమి పరీక్షచేసి అచట వాస్తుపరీక్ష చేయవలెను. ఇచ్ఛానుసారముగ దేవసభా నిర్మాణము చేసి, ఇచ్ఛాను సారముగ దేవతా స్థాపన చేయవలెను. సభా నిర్మాణము నగర చతుష్పథము నందుగాని, గ్రామాదు లలో గాని చేయవలెను. జనశూన్య ప్రదేశములందు చేయరాదు. దేవసభా నిర్మాణము చేసినవాడు పాపరహితుడై తన వంశము నంతను ఉద్ధరించి స్వర్గము నందు ఆనందము అనుభవించును. రాజ సౌధము నిర్మించిన విధముగా శ్రీహరికి ఏడు అంతస్తుల దేవాలయమును నిర్మింపవలెను. ఇతర దేవతలకు కూడ అట్లే పూర్వాది దిక్కులందు ఏర్పడు ధ్వజాధ్యాయములలో వాటిలో విదిక్కుల ఆయమును విడువవలెను. నాలుగు, మూడు, రెండు లేదా ఒకటి శాలలుండు గృహము నిర్మింప వలెను. వ్యయము అధికముగనుండు పదముపై గృహము నిర్మింపరాదు. అచట నిర్మించిన గృహము నందు వ్యయము అధికముగ ఉండును. ఆయమధికముగ ఉన్న పీడకలుగదు. అందుచే ఆయ వ్యయములు సమభావములో ఉండునట్లు చూచుకొనవలెను. ఇంటి పొడవు వెడల్పులు ఎన్ని హస్తములుండునో వాటిని ఒకదానితో ఒకటి గుణింపగా వచ్చిన సంఖ్యకు "కరరాశి" అని పేరు. గర్గాచార్యుని జ్యోతిశ్శాస్త్రమునందు నిపుణుడగు ఆచార్యుడు దానిని ఎనిమిది రెట్లు చేయవలెను. దానిని ఏడుచేత భాగించగా వచ్చిన శేషము "వ్యయము". లేదా కర రాశిని ఏడుచేత గుణించి దానిని మరల ఎనిమిదిచేత భాగింపగా వచ్చిన శేషమును బట్టి ధ్వజాది ఆయములను కల్పించవలెను. ధ్వజము, ధూమ్రము, సింహము, శ్వానము, వృషభము, ఖరము, గజము, ధ్వాంక్షము అను ఎనిమిది ఆయములు పూర్వాది దిక్కులందు ఏర్పడును.

త్రిశాలాగృహమున కున్న అనేక భేదములలో మొదటి మూడును ఉత్తమమైనవి. వీటిని ఈశాన్యమునందు నిర్మింపరాదు. దక్షిణమున అన్యగృహములతో గూడిన ద్విశాలా గృహము సర్వదా శ్రేష్ఠము. దక్షిణమున అనేక శాలాగృహము, ఏకశాలాగృహము గూడ ఉత్తమము. నైరృతి దిక్కునందు ఏకశాలా గృహము శ్రేష్ఠము. ఏకశాలా గృహములో మొదటి రెండు భేదములును (ధ్రువము,

ధాన్యము అనునవి) ఉత్తమములు. మిగిలినవి, అనగా పంచమ, నవమ, దశమ, ఏకాదశ, త్రయోదశ, చతుర్దశ భేదములు భయ హేతువులు, చతుఃశాలా గృహము సర్వదా ఉత్తమము; సర్వ దోషరహితము. దేవతలకు ఒక అంతస్తు మొదలు, ఏడు అంతస్తులు ఉండునట్లు ఏర్పరు పవలెను. దానికి ద్వారవేధాది దోషములుగాని, ప్రాచీన వస్తువులుగాని ఉండకూడదు. దానిని మానవులకు చెప్పిన కర్మలు, ప్రతిష్ఠావిధానము అనుసరించి స్థాపించవలెను. గృహ ప్రవేశము చేయనున్న గృహస్థుడు, సోమరితనము లేనివాడై, ఉదయముననేలేచి, సర్వౌషధులు కలిపిన జలముతో స్నానముచేసి, పవిత్రుడై, దైవజ్ఞులైన బ్రాహ్మణులకు నమస్కరించి, వారికి మధుర పదార్థములు భుజింప చేసి, వారిచే స్వస్తి వాచనాదికము చేయించి, నడ్డిపై చేతులు పెట్టుకొని, పూర్ణ కలశాదులతో సుశోభితమగు తోరణములుగల గృహము ప్రవేశించవలెను. పిమ్మట ఏకాగ్ర చిత్తుడై గోవు ఎదుట చేతులు జోడించి, ఈ పుష్టికారక మంత్రములు పఠింపవలెను. "ఓం వసిష్ఠునిచే పాలింపబడిన ఓ నందా! ధనసంతానాదుల నొసగి నా ఆనందమును వృద్ధిపొందింపుము. ప్రజలకు విజయమును ఇచ్చు భార్గవ నందినియైన జయా! నన్ను ధనసంపదలతో ఆనం దింప చేయుము. అంగిరసుని పుత్రియైన ఓ పూర్ణా! నా మనోరథములను ఈడేర్పుము. నన్ను పరిపూర్ణకాముని చేయుము. కాశ్యపకుమారి యైన భద్రా! నా బుద్ధిని కల్యాణమయము చేయుము. అందరికిని ఆనందమునిచ్చు వసిష్ఠనందినియైన నందా! నీవు సమస్త బీజములతో, ఓషధులతో కూడి, సకల రత్నౌషధి పూర్ణురాలవై ఈ సుందర భవనమునందు ఆనందపూర్వకముగ నివసింపుము. కశ్యప ప్రజాపతిపుత్రివైన ఓ భద్రా! నీవు సర్వవిధముల సుందరమైనదానవు, మహత్త్వము కలదానవు. సౌభాగ్య శాలినివి. ఉత్తమ వ్రతమును పాలించుదానవు. నా ఇంటిలో ఆనందపూర్వకముగ నివసిం పుము. దేవీ! భార్గవీ! జయా! సర్వశ్రేష్ఠులైన ఆచార్యులు నిన్ను పూజించిరి. చందన పుష్ప మాలాలం కృతురాలవైన నీవు ప్రపంచమునందలి సకలైశ్వర్యములను ఇచ్చుదానవు. నా గృహమునందు ఆనంద పూర్వకముగ విహరింపుము. అంగిరసుని పుత్రివైన పూర్ణా! నీవు అవ్యక్త రూపిణివి. ఓ ఇష్టకాదేవీ! నీవు నాకు అభీష్ట వస్తువులను ఇమ్ము. నా ఇంటిలో ఉండుమని కోరుచున్నాను. నీవు దేశ ప్రభువును, గ్రామనగర ప్రభువులను, గృహ ప్రభువును అనుగ్రహించుదానవు. నా గృహమునందు జన, ధన, గజ, అశ్వ, గో, మహిష్యాది వృద్ధి కలుగునట్లు చేయుము. (65)

సాధారణ ప్రతిష్ఠా విధానము

హయగ్రీవుడు పలికెను - ఇప్పుడు దేవ సముదాయ ప్రతిష్ఠను గూర్చి చెప్పెదను. ఇది కూడ వాసుదేవ ప్రతిష్ఠవలెనే చేయవలెను. ఆదిత్య, వసు, రుద్ర, సాధ్య, విశ్వేదేవ, అశ్వినీ కుమార, ఋషి, ఇతర దేవగణములకు దేవసముదాయము అని పేరు. వీరి స్థాపనలో నున్న విశేషములు చెప్పెదను. ఆయా దేవతల పేర్లలోని మొదటి అక్షరము గ్రహించి దానికి స్వరములు చేర్చవలెను. దీర్ఘ స్వరములతో కూడిన ఆ బీజాక్షరములతో అంగన్యాసము చేయవలెను. ఆ ప్రథమాక్షరమునకు బిందువు చేర్చి బీజముగ గ్రహింపవలెను. ప్రణవ నమస్కారములు చేర్చవలెను. సమస్త దేవతలను మూల మంత్రముతోడనే పూజించి స్థాపింపవలెను. ఇవికాక, స్థాపనా విషయమున అవలంబింప

వలసిన నియమములను, వ్రతములను, కృచ్ఛ్రములను, మఠ, సేతు, గృహాదులను, మాసోపవాస, ద్వాదశీ వ్రతాదులను చెప్పెదను. ముందుగా శిలా, పూర్ణకుంభ, కాంస్య పాత్రలు తీసికొని వచ్చి ఉంచవలెను. పిమ్మట సాధకుడు బ్రహ్మ కూర్చ గైకొని "తద్విష్ణోః పరమం పదమ్" అను మంత్రముతో కపిలగోవుపాలతో యవచరువును వండవలెను. ఓంకారముతో దానిలో నేయిపోసి, గరిటెతో ఎనప వలెను. పిదప శ్రీవిష్ణు పూజచేసి హోమము చేయవలెను. వ్యాహృతి గాయత్రులతోకూడిన "తద్విప్రాసో" ఇత్యాది మంత్రముతో చరు హోమము చేయవలెను. "విశ్వతశ్చక్షుః" ఇత్యాది వైదిక మంత్రముతో భూమి, అగ్ని, సూర్య, ప్రజాపతి, అన్తరిక్ష, ద్యౌ, బ్రహ్మన్, పృథ్వీ, కుబేర, సోమ శబ్దములను చతుర్థ్యంతములు చేసి, వాటిని "స్వాహా" చేర్చి, ఆ దేవతలను ఉద్దేశించి ఆహుతులు ఈయవలెను. ఇంద్రాది దేవతలకు సంబంధించిన మంత్రములు చదువుచు ఆహుతులు ఇవ్వవలెను. చరు భాగము లను ఈ విధముగ హోమముచేసి ఆదర పూర్వకముగ దిక్ బలులు ఈయవలెను.

పిదప నూట ఎనిమిది పలాశ సమిధలను హోమముచేసి, పురుష సూక్తముతో ఆజ్య హోమము చేయవలెను, "ఇరావతీధేనుమతీ" అను మంత్రముతో తిలాష్టక హోమము చేసి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల పార్షదులకు, గ్రహములకు, లోకపాలులకు, మరల ఆహుతులు ఈయవలెను. పర్వతనదీ సముద్రములకు కూడ హోమములుచేసి, మహా వ్యాహృతులను ఉచ్చరించుచు, స్రువముతో మూడు పూర్ణాహుతులు ఈయవలెను. పితామహా! 'వౌషట్' చేర్చిన వైష్ణవ మంత్రముతో పంచ గవ్యములను, చరువును ప్రాశనము చేసి, ఆచార్యునకు సువర్ణయుక్త తిలపాత్రము, వస్త్రములు, అలంకృతమగు గోవు దక్షిణగా నీయవలెను. "భగవాన్ విష్ణుః ప్రీయతామ్" అని పలుకుచు వ్రత విసర్జనము చేయవలెను.

ఇపుడు మరియొక మాసోపవాసాది విధిని చెప్పుచున్నాను. ముందుగా యజ్ఞముచే శ్రీహరిని సంతుష్టుని చేయవలెను తిల, తండుల, నీవార, శ్యామాకములతో, శ్యామా కములకు బదులు యవలతో వండిన వైష్ణవ చరువును నేతితో కలిపి మూర్తి మంత్రముతో హోమము చేయవలెను. పిమ్మట మాసాధిపతులైన విష్ణ్వాది దేవతలను ఉద్దేశించి మరల హోమము చేయవలెను. "విష్ణోరరాట మసి"అనుమంత్రముతోకూడ పండ్రెండు హోమములు చేయవలెను. "ఇరావతీ" ఇత్యాది మంత్ర ముతో పండ్రెండు చరు హోమములు చేయవలెను. "తద్విప్రాసః" ఇత్యాది మంత్రముతో ఘృత హోమములు చేయవలెను. పిదప శేషహోమము చేసి మూడు పూర్ణాహుతులు ఇవ్వవలెను. "యుఞ్జతే" ఇత్యాద్యనువాకమును చదువుచు, ప్రణవముతో రావి ఆకుల విస్తరిలో వడ్డించుకొని చరువును భక్షించవలెను. పిమ్మట మాసాధి పతులను ఉద్దేశించి పండ్రెండుగురు బ్రాహ్మణులకు భోజనము పెట్టవలెను. ఆచార్యుడు వారిలో పదమూడవవాడుగా ఉండవలెను. వారికి మధుర జలపూర్ణములగు పదమూడు కలశముల, ఉత్తమమైన ఛత్రము, పాదుకలు, వస్త్రములు, సువర్ణము, మాలలు దానము చేయవలెను. వ్రతపూర్తికి అన్ని వస్తువులు పదమూడు చొప్పున చేయవలెను. "గోవులు ప్రసన్నములగు గాక, సంతోషముతో అవిగోచరించుగాక, అని పలుకుచు గో పథమును (గోవులు మేయుటకు స్థానము) విడచి పదిహస్తముల ఎత్తైనయూప స్తంభము పాతవలెను. గృహస్తుడు ఇంటిలో హోమాది కార్యములన్నియు యథాశాస్త్రముగ జరిపి, పూర్వోక్త విధి అనుసారము గృహములో ప్రవేశించవలెను.

అందరికిని, ఏ అడ్డులును లేకుండ అన్నదానము చేయవలెను. బ్రాహ్మణులకు యథాశక్తిగ దక్షిణలు ఈయవలెను. ఉద్యానమును నిర్మించువాడు చిరకాలము నందన ఉద్యానములో నివసించును. మఠ ప్రదానము చేయుటచే స్వర్గలోక ఇంద్ర లోకములు ప్రాప్తించును. ప్రపా(చలివెందలి) దానము చేసిన వాడు వరుణలోకము నందును, సేతు నిర్మాణము చేసినవాడు దేవలోకము నందును నివసించును. ఇటుకలతో సేతువు నిర్మించువాడు కూడ స్వర్గమును పొందును. గోపథమును నిర్మించువాడు గోలోకము పొందును. నియమములను వ్రతములను ఆచరించువాడు సాక్షాద్విష్ణు స్వరూపు డగును. కృచ్ఛ్ర వ్రతములు చేయువాడు సమస్త పాపములను నశింపచేసికొనును, గృహ దానము చేసినవాడు మహాప్రళయము వరకును స్వర్గములో నివసించును. గృహస్థుడు శివాదిదేవతల సముదాయ ప్రతిష్ఠ చేయవలెను.(66)

జీర్ణోద్ధార విధి

హయగ్రీవుడు చెప్పెను–ఇప్పుడు జీర్ణోద్ధార విధిని చెప్పెదను. ఆచార్యుడు మూర్తికి అలంకరించి స్నానము చేయించవలెను. అత్యంతము జీర్ణమైనది, అంగవిహీనము, భగ్నమైనది, శిలామాత్రా వశిష్టమైనది అగు ప్రతిమను పరిత్యజించవలెను. దీని స్థానము నందు వెనుకటివలెనే నవీనమైన స్థిరమూర్తిని స్థాపింపవలెను. ఆచార్యుడు భూతశుద్ధి ప్రకరణ ములో చెప్పినవిధమున, సంహారవిధిచే సకలతత్త్వముల సంహారము చేయవలెను. నృసింహ మంత్రముతో వేయి హోమములు చేసి మూర్తిని పెకిలించవలెను. దారుమయ మూర్తియైనచో అగ్నిచే దహింపచేయవలెను. శిలా నిర్మితమూర్తియైనచో జలములో విడువ వలెను. ధాతుమయమూర్తిగాని, రత్నమయమూర్తిగాని ఐనచో సముద్రములో అగాధ జలములో పడవేయవలెను. జీర్ణ ప్రతిమను వాహనముపై ఎక్కించి, వస్త్రాదులచే కప్పి, వాద్యములతో తీసికొనివెళ్ళి నీటిలోవిడువవలెను పిమ్మట ఆచార్యునకు దక్షిణ ఈయవలెను. ఆ దివసమునందే వెనుకటి ప్రతిమ దేనిచేత నిర్మింపబడినచో, ఎంత ప్రమాణముకలదో అదే ద్రవ్య ముతో, అంతే ప్రమాణముగల మూర్తిని స్థాపించవలెను. ఈ విధముగనే జీర్ణ కూప, వాపీ, తటాగాదుల ఉద్ధారము చేయుటచే గొప్ప ఫలము లభించును. (67)

దేవయాత్రోత్సవ విధానము

హయగ్రీవుడు పలికెను : ఇప్పుడు ఉత్సవవిధిని చెప్పెదను. ఉత్సవములేని దేవతా ప్రతిష్ఠ నిష్ఫలము. అందుచే దేవతా స్థాపనము చేసిన సంవత్సరము నందే ఏక రాత్రి ఉత్సవము లేదా అష్ట రాత్రోత్సవము చేయవలెను. అయన సమయమునందు గాని, విషువ సంక్రాంతి సమయమునందుగాని శయనోపవనమునందు లేదా దేవతా గృహము నందు లేదా కర్తకు అనుకూలముగా ఉన్న విధమున దేవుని నగరయాత్ర చేయించవలెను. ఆ సమయమున మంగళ అంకురారోపణము, నృత్యగీతాదులు, వాద్యములు ఏర్పాటు చేయవలెను. అంకురారోపణమునకు మూకుళ్ళు ఉత్తమమైనవి. యవ, శాలి, తిల, ముద్గ గోధూమ, శ్వేతసర్షప, కులత్థ, మాష, నిష్పావ ములు కడిగి చల్లవలెను. దీపములతో రాత్రి ఊరేగుచు ఇంద్రాది దిక్పాలులకు, కుముదాది

దిగ్గజములకు, సకల ప్రాణులకు పూర్వాది దిక్కులందు బలి ప్రదానము చేయవలెను. దేవతా విగ్రహమును మోయుచు దేవయాత్రను అనుసరించువారికి అడుగడుగునకు అశ్వమేధ యాగము చేసిన ఫలము లభించును. ఆచార్యుడు తొలుచటి దివసమున దేవాలయమునకు వచ్చి దేవునితో– "దేవశ్రేష్ఠా! రేపు నీ తీర్థ యాత్ర జరుపవలసి యున్నది. అందుకు అనుజ్ఞ ఇచ్చుటకై నీవు సర్వదా సమర్థుడవు అనగా అనుమతిని ఈయవలసినది అని నివేదించి ఉత్సవ కార్యము ప్రారం భింపవలెను. నాలుగు స్తంభములు గలదియు, అంకురములు ఉన్న ఘటముతో కూడి నదియు, అలంకరింపబడి నదియు అగు వేదిక దగ్గరకు వెళ్ళి దాని మధ్యభాగమున స్వస్తికము ప్రతిమను ఉంచి, తన కోరి కను వ్రాసి చిత్రములపై స్థాపించి అధివాసము చేయవలెను.

పిమ్మట విద్వాంసులైన వైష్ణవులతో కలిసి మూల మంత్రముతో ప్రతిమ అవ యవములకు నెయ్యిపూసి, రాత్రి అంతయు నేతిధారతో అభిషేకము చేయవలెను. దేవతకు అద్దము చూపించి, ఆరతి, గీతము, వాద్యములు మొదలగు వాటితో మంగళకృత్యములు నెరపి, వ్యజనము విసిరి, పూజించవలెను. పిదప దీప, గంధ, పుష్పాదులతో పూజించవలెను. పసుపు, కర్పూరము, కేసరములు, శ్వేతచందన చూర్ణము దేవతా ప్రతిమపైనను, భక్తుల శిరస్సులపైనను చల్లినచో సమస్త తీర్థముల ఫలము లభించును. ఆచార్యుడు యాత్రకొరకై ఏర్పరచిన దేవతామూర్తిని రథముపై ఉంచి, పూజించి, ఛత్ర, చామర, శంఖనాదాదులతో రాష్ట్రమును పాలించు నదీతటమునకు తీసికొని వెళ్ళవలెను. నదిలో స్నానము చేయించుటకు ముందు అచట వేదికను నిర్మించి, ఆమూర్తిని వాహనము నుండి దింపి, దానిని ఆ వేదికపై ఉంచవలెను, అచట చరువు వండి దానిని హోమము చేసిన పిదప పాయస హోమము చేయవలెను. వరుణ దేవతా మంత్రముతో సమస్త తీర్థముల ఆవాహనముచేసి "ఆపోహిష్ఠామ" ఇత్యాది మంత్రములతో వాటికి అర్ఘ్య ప్రదానముచేసి పూజించవలెను. దేవతామూర్తిని తీసికొని వెళ్ళి ఉదకమునందు అఘమర్షణ చేసి, బ్రాహ్మణ–మహాజనులకు స్నానము చేయవలెను. స్నానానంతరము మూర్తిని తీసికొని వచ్చి వేదికపై ఉంచవలెను. ఆ దివసమునందు అచట దేవతా పూజచేసి, దేవాలయము నకు తీసికొని వెళ్ళవలెను, ఆచార్యుడు అగ్నిలో ఉన్న దేవతకు పూజలు చేయవలెను. ఈ ఉత్సవము భోగ–మోక్ష ప్రదము.(68)

స్నపనోత్సవ విధానము

అగ్ని దేవుడు పలికెను : "బ్రహ్మదేవా! ఇపుడు నేను స్నానోత్సవమును గూర్చి సవిస్తరముగ చెప్పెదను. ప్రాసాదము ఎదుట మండపము క్రింద మండలముపై కలశములు ఉంచవలెను. ప్రారంభమునందు అన్ని కర్మలు చేయునపుడును శ్రీహరి ధ్యానము, పూజాహోమములు చేయవలెను. పూర్ణాహుతితోపాటు వెయ్యి లేక నూట ఎనిమిది హోమములు చేయవలెను. స్నాన ద్రవ్యములు తీసికొని వచ్చి కలశ విన్యాసము చేయవలెను. కంఠసూత్రయుక్త కుంభములను అధివాసనము చేసి మండల ముపై ఉంచవలెను.

చతురస్ర మండలము నిర్మించి దానిని పంద్రెండు రేఖలచే విభజించవలెను. ప్రక్క నున్న రేఖను తుడిచివేయవవలెను. ఈ విధముగ ఆ మండలముపై నాలుగు దిక్కులందును తొమ్మిదేసి

కోష్ఠకములు స్థాపించి వాటిని పూర్వాది క్రమమున వరిపిండి మొదలైన వాటితో నింపవలెను. పిమ్మట విద్వాంసుడు కుంభముద్రతో పూర్వాది దిక్కులందున్న నవకమునందు కలశలు ఉంచవలెను. పుండరీకాక్ష మంత్రముతో వాటిలో దర్భలు ఉంచవలెను. సర్వరత్నములును ఉంచి నుదకపూర్ణ కుంభమును మధ్య భాగమునందు ఉంచి మిగిలిన ఎనిమిది కుంభములలో క్రమముగ యవ, వ్రీహి, తిల, నీవార, శ్యామాక, కులత్థ, ముద్గ, శ్వేత సర్షపములు వేసి ఎనిమిది దిక్కులందును స్థాపింపవలెను. పూర్వదిక్కు నందున్న నవకమునందు మధ్య ఘృతపూర్ణకుంభము ఉంచవలెను. మిగిలిన ఎనిమిది కుంభములలో పలాశ, అశ్వత్థ, వట, బిల్వ, ఉదుంబర, ప్లక్ష, జంబూ, శమీ, కపిత్థ వృక్షముల బెరడు నుండి తీసిన రసము పోయవలెను. ఆగ్నేయమునందున్న నవకమునందు మధ్య మధుపూర్ణ ఘటము నుంచవలెను. మిగిలిన ఎనిమిది కుంభములలో గోశృంగ, పర్వత, గంగాజల, గజశాలా, తీర్థ, క్షేత్ర(పొలము), ఖల(కళ్ళము) ములమట్టి ఉంచవలెను.

దక్షిణమున నున్న నవకమున మధ్యయందు తైలపూర్ణ ఘటము స్థాపింపవలెను. మిగిలిన ఘటములలో నారంగ జంబీర, నింబ, ఖర్జూర, మృత్తికా, నారికేళ, పూగ, దాడిమ, పనస ఫలములు ఉంచవలెను. నైరృతిదిక్కున నవకమునందు మధ్య క్షీర పూర్ణ కుంభము ఉంచి మిగిలిన ఎనిమిదింటిలో కుంకుమ, నాగపుష్ప, చంపక, మాలతీ మల్లికా, పున్నాగ, కరవీర, కమల కుసుమములు ఉంచవలెను. పశ్చిమ నవక మధ్యమున నారికేళ జలపూర్ణ కలశముంచి, మిగిలిన ఎనిమిదింటిలో నదీ, సముద్ర, సరోవర, కూప, వర్షా, హిమ, నిర్ఝర, దేవనదుల జలములు ఉంచవలెను.

వాయవ్య నవకమునందు మధ్య కదళీ జలపూరిత కుంభముంచి, మిగిలిన ఎనిమిది కుంభములందును సహదేవీ కుమారీ, సింహీ, వ్యాఘ్రీ, అమృతా, విష్ణుపర్ణీ, దుర్వా, వచా అను దివ్యౌషధులను ఉంచవలెను. పూర్వాది సౌమ్య నవకమునందు మధ్య దధికలశము నుంచి, మిగిలిన కలశములందు పత్ర, ఏలా, త్వక్, కూట, బాలకచందన ద్వయలతా, కస్తూరీ, కృష్ణాగురు, సిద్ధ ద్రవ్యము లను ఉంచవలెను. ఈశాన్య నవక మధ్యమున శాంతి జలపూర్ణ కుంభముంచవలెను. మిగిలిన కలశములలో క్రమముగ చంద్ర, తార, రజత, లోహ, త్రపు, కాంస్య, సీసక, రత్నములను ఉంచవలెను. ప్రతిమకు ఘృతము పూసి, ఉద్వర్తనముచేసి, మూలమంత్రముతో స్నానము చేయించవలెను. మరల దానికి గంధాదులతో పూజచేయవలెను. అగ్నిలో హోమము చేసి పూర్ణాహుతి ఇవ్వవలెను. సకలభూతములకు బలిప్రదానముచేసి, బ్రాహ్మణునకు, దక్షిణా పూర్వకముగ భోజనము చేయించవలెను. దేవతలు, మునులు, అనేకులు రాజులు కూడ భగవద్విగ్రహమునకు అభిషేకము చేయుట చేతనే ఐశ్వర్యాదులను పొందిరి.

ఈ విధముగ ఒక వెయ్యి ఎనిమిది కలశములతో స్నాపనోత్సవము చేయవలెను. ఇట్లు చేయుటచే మానవుడు అన్ని కామములను పొందగలడు. యజ్ఞా అవభృథ స్నానము నందు కూడ పూర్ణ స్నాన సిద్ధి కలుగును. పార్వతీ లక్ష్మ్యాదుల వివాహాదులలో కూడ స్నపనోత్సవము చేయబడును. (69)

వృక్షాది ప్రతిష్ఠా విధానము

శ్రీ భగవంతుడు చెప్పెను : ఇపుడు భోగమోక్షముల నిచ్చు వృక్ష ప్రతిష్ఠనుగూర్చి చెప్పెదను. వృక్షములకు సర్వౌషధి జలములు పూసి, సుగంధ చూర్ణము చల్లి, మాలలచే అలంకరించి వస్త్రములు చుట్టబెట్టవలెను. అన్ని వృక్షములకు బంగారు సూదులతో కర్ణ వేధనముచేసి, సువర్ణమయ శలాకతో అంజన ముంచవలెను. వేదికపై ఏడు ఫలములుంచి, ఒక్కొక్క వృక్షమునకు అధివాసనముచేసి, కుంభము సమర్పించవలెను. పిదప ఇంద్రాది దిక్పాలకులను ఉద్దేశించి బలిప్రదానము చేయవలెను. వృక్షాధివాసన సమయమున, ఋగ్వేద మంత్రములతోగాని, యజుర్వేద మంత్రములతోగాని, సామవేద మంత్రములతో గాని, వరుణ దేవతాక మంత్రములతో గాని, మత్తభైరవ మంత్రములతో గాని హోమము చేయవలెను. శ్రేష్ఠుడైన బ్రాహ్మణుడు వృక్ష వేదికపైనున్న కలశములతో వృక్షముల కును, యజమానునకును స్నానము చేయించవలెను. యజమానుడు అలంకరించుకొని బ్రాహ్మణులకు గో, భూ, భూషణ, వస్త్రాదులు దక్షిణగా ఇచ్చి నాలుగు దివసములు క్షీర యుక్త భోజనము పెట్టవలెను. తిల, ఘృత, పలాశ సమిధలతో హోమము చేయించవలెను. అచార్యునకు రెట్టింపు దక్షిణ ఇవ్వవలెను. మండపాది నిర్మాణము వెనుకచెప్పిన విధముననే చేయవలెను. వృక్ష, ఉద్యానముల ప్రతిష్ఠ చేయుటచే పాపములు నశించి పరమసిద్ధి లభించును, ఇపుడు సూర్య, శివ, గణపతి, శక్తి, శ్రీహరి పరివారముల ప్రతిష్ఠా విధానమును వినుము. దీనిని మహేశ్వరుడు కుమారస్వామికి చెప్పెను.(70)

గణేశపూజావిధి

ఈశ్వరుడు పలికెను : విఘ్న వినాశమునకై గణపతిపూజను గూర్చి చెప్పెదను. ఇది సకలాభీష్టము లను ఇచ్చును. "గణంజయాయ స్వాహా హృదయాయనమః; ఏక దంష్ట్రాయ హుం ఫట్ శిరసే నమః, అచల కర్ణినే నమో నమః శిఖాయైనమః, గజవక్త్రాయ నమో, నమః కవచాయ నమః, మహోదరాయ చణ్డాయ నమః, నేత్రాభ్యాం నమః, సుదణ్డ హస్తాయ నమః అస్త్రాయ నమః"అని అంగన్యాసములు చేసికొనవలెను. ముఖ్య కమల మండలముపై దళములందు, క్రింది దళము లందును గణ, గురు, గురుపాదుకా, శక్తి, అనంత, ధర్మములను, పూజించి, కమలకర్ణిక మీద బీజమును పూజింపవలెను. తీవ్రా, జ్వాలినీ, నందా! భోగదా, కామరూపిణీ, ఉగ్రా, తేజోవతీ, సత్యా, విఘ్న నాశినీ అను తొమ్మిది పీఠశక్తులను పూజించవలెను. పిమ్మట చందన చూర్ణమును ఆసనముగ సమర్పించవలెను. "యం" అనునది శోషక వాయుబీజము, "రం" అగ్ని బీజము. "లం" పృథివీ బీజము, "వం" అమృతబీజము, "ఓం లమ్బోదరాయ విద్మహే మహోదరాయ ధీమహి, తన్నో దన్తః ప్రచోదయాత్" అనునది గణేశ గాయత్రీ మంత్రము, గణపతి, గణాధిప, గణేశ, గణనాయక, గణక్రీడ, వక్రతుండ, ఏకదంష్ట్ర, మహోదర, గజవక్త్ర, లంబోదర, వికట, విఘ్ననాశన, ధూమ్రవర్ణులను, మహేంద్ర దిక్పాలకులను గణపతి పూజ అంగముగ పూజించవలెను. (71)

స్నాన తర్పణాది విధి

పరమేశ్వరుడు చెప్పెను : స్కందా! ఇపుడు నిత్యనైమిత్తికాది స్నానమును గూర్చియు, సంధ్యను గూర్చియు, ప్రతిష్ఠా సహితపూజను గూర్చియు చెప్పెదను, కత్తితో (లేదా 'ఫట్' అను అస్త్రమంత్ర ముతో) ఎనిమిది అంగుళముల లోతు నుండి మట్టి త్రవ్వి, దానిని పూర్తిగా పైకి తీసికొని వచ్చి, ఆ మంత్రముతోడనే పూజించి, 'స్వాహా' మంత్రముతో ఆ మృత్తికను తటముపై ఉంచి, అస్త్ర మంత్రముచే శోధింపవలెను. 'వషట్' మంత్రముచే దానినుండి తృణాదికమును తొలగించి'హుమ్'అనుమంత్రముచే దానిని మూడు భాగములు చేయవలెను. మొదటి భాగపు మట్టిని జలసహితమైన దానిని నాభి నుండి పాదములవరకు అవయవములకు పూయవలెను. దానిని కడిగివేసి, అస్త్రమంత్రముచే అభిమంత్రితమగు రెండవ భాగమునందలి, కాంతిగల మట్టితో మిగిలిన శరీరము నంతయు పూసి, రెండు చేతులతో చెవులు, ముక్కు మొదలగు ఇంద్రియరంధ్రములను మూసికొని, ఊపిరి బిగపట్టి, మనస్సులో కాలాగ్ని తుల్యమగు తేజోమయ అస్త్రమును ధ్యానించుచు నీటిలో మునకలు వేసి స్నానము చేయవలెను. దీనికి మలస్నాన మని పేరు. ఈ స్నానముచేసిన పిదప నీటినుండి బైటకువచ్చి, సంధ్య చేసిన పిమ్మట విధిస్నానము చేయవలెను. హృదయ మంత్రముచే (నమః) అంకుశ ముద్రతో సరస్వత్యాది తీర్థములలో ఏదో ఒక తీర్థమును ఆకర్షించి, సంహారముద్రతో, దానిని తన సమీపమున ఉన్న జలాశయములో స్థాపింపవలెను. పిమ్మట మూడవ భాగము మట్టితీసి కొని నాభివరకు జలములో మునిగి, ఉత్తరాభి ముఖుడై, ఎడమచేతిలో దానిని మూడు భాగములు చేయవలెను. దక్షిణ భాగమునందున్న మట్టిని అంగన్యాస మంత్రములచే ఒక మారు అభిమంత్రించి, తూర్పున ఉన్న మట్టిని "అస్త్రాయ ఫట్" అని ఏడు పర్యాయములు జపించి అభిమంత్రించి, ఉత్తరభాగము మట్టిని "ఓం నమః శివాయ" అనుమంత్రము పది పర్యాయములు జపించి అభిమం త్రించవలెను. పిమ్మట ఈ మృత్తికల నుండి కొంచెము కొంచెము గ్రహించి "అస్త్రాయ హుం ఫట్" అనుచు అన్ని దిక్కులందును చిమ్మవలెను. పిమ్మట "ఓం నమః శివాయ" అను శివ మంత్రమును, "ఓం సోమాయ స్వాహా" అను సోమ మంత్రమును జపించుచు, నీటిలో తన భుజములు త్రిప్పి, దానిని శివతీర్థ స్వరూపము చేయవలెను; అంగన్యాస మంత్రములను జపించుచు దానిని శిరస్సు నుండి పాదములవరకు, మొత్తము శరీరముపై పూసికొనవలెను.

పిమ్మట అంగన్యాస మంత్రములను నాల్గింటిని చదువుచు కుడినుండి ప్రారంభించి ఎడమ వైపు వరకు హృదయము, శిరస్సు, శిఖ, రెండు భుజములు స్పృశించి, చెవులు, ముక్కు మొదలగు రంధ్రములు మూసికొని, సమ్ముకరణ ముద్రతో శివ, విష్ణు, గంగలను స్మరించుచు, నీటిలో మునగవలెను. షడంగన్యాస మంత్రములను ఉచ్చరించుచు (ఓం హృదయాయ నమః, శిరసే స్వాహా, శిఖాయై వషట్, కవచాయ హుమ్, నేత్ర త్రయాయ వౌషట్, అస్త్రాయ ఫట్) నీటిలో నిలచి, రెండు చేతులును కలిపి కుంభముద్రతో స్నానము చేయవలెను. స్నానానంతరము నీటినుండి బైటకు వచ్చి సంహారిణీ ముద్రతో తీర్థమును ఉపసంహరించవలెను. పిమ్మట యథావిధిగా పరి శుద్ధము, సంహితామంత్రములచే అభిమంత్రితము, నివృత్త్యాదులచే శోధితమగు భస్మముచే స్నానము

చేయవలెను. "ఓం అస్త్రాయ హుం ఫట్" అను మంత్రము ఉచ్చరించుచు శిరస్సునుండి పాదములవరకు భస్మముతో మలస్నానముచేసి పిదప, యథావిధిగ శుద్ధస్నానము చేయవలెను. ఈశాన, తత్పురుష, అఘోర, గుహ్యక (లేదా వామదేవ)సద్యోజాత మంత్రములతో క్రమముగ శిరస్సు, ముఖము, హృదయము, గుహ్యాంగము, శరీరమునందలి ఇతరావయవములు వీటిపై ఉంచవలెను. మూడు సంధ్యలందును, అర్ధరాత్రమునందును, వర్షాకాలమునకు పూర్వము, అనంతరము, నిద్రానంతరము, భోజనానంతరము, జలపానానంతరము ఇతరమైన ఆవశ్యక కార్యములు చేసిన పిమ్మట ఆగ్నేయస్నానము చేయవలెను. స్త్రీని, నపుంసకుని, శూద్రుని, పిల్లిని, శవమును, ఎలుకను స్పృశించినపుడు ఆగ్నేయస్నానము విధింపబడినది, చుళుకము నిండ పవిత్ర జలము పోసికొని త్రాగవలెను. ఇదియే ఆగ్నేయ స్నానము. సూర్య కిరణములు కనబడుచున్నపుడు ఆకాశము నుండి వర్షము కురియుచున్నచో, పూర్వా భిముఖుడై రెండు భుజములు పైకెత్తి ఈశాన మంత్రము ఉచ్చరించుచు, ఏడు అడుగులు నడిచి, ఆ వర్షాజలమునందు స్నానము చేయవలెను. ఇది "మాహేంద్రస్నానము", గో సముదాయము మధ్యనిలిచి, గోవులడెక్కలచే పైకి ఎగుర గొట్టబడిన ధూళిలో ఇష్టదేవతా మూలమంత్రము జపించుచు, లేదా కవచ మంత్రము (హుం) జపించుచు చేయు స్నానము "పావన స్నానము" సద్యోజాతాది మంత్రములను ఉచ్చరించు జలముతో చేయు స్నానము "మంత్రస్నానము". ఈ స్నానము వరుణదేవతా మంత్రములను, అగ్నిదేవతా మంత్రములను ఉచ్చరించుచుగూడ చేయవచ్చును. మనస్సులో మూలమంత్రము ఉచ్చరిం చుచు ప్రాణాయామము చేయుట "మానసిక స్నానము. ఈ స్నానము సర్వకర్మల యందును విధింపబడినది. విష్ణు దేవతాదులకు సంబంధించిన కార్యములలో ఆయా దేవతల మంత్రములతో ఈ స్నానము చేయవలెను.

కార్తికేయా! విభిన్న మంత్రములతో సంధ్యావిధినిగూర్చి చెప్పెదను. బాగుగా చూచి జలమును, మంత్ర పాఠ పూర్వకముగ బ్రహ్మతీర్థము ద్వారా పర్యాయములు గ్రహించవలెను. ఆచమన సమయమున ఆత్మతత్త్వ, విద్యాతత్త్వ, శివతత్త్వములకు 'నమః' సహిత 'స్వాహా' శబ్దమునుచేర్చి మంత్రము చదువవలెను. అనగా ఇచ్చట ఆత్మాతత్త్వాయ నమః స్వాహా; ఓం విద్యాతత్త్వాయనమః స్వాహా, ఓం శివతత్త్వాయనమః స్వాహా" అను మంత్రము లతో ఆచమనము చేయవలెను. పిదప ముఖము, నాసిక, నేత్రములు, కర్ణములు స్పృశించవలెను. ప్రాణాయామముచేసి, సఫలీకరణ క్రియను సంపన్నముచేసి స్థిరముగ కూర్చుండవలెను. పిమ్మట మంత్రసాధకుడు శివసంహితను మనస్సులోనే ఆవృత్తిచేసి, ఆచమనము, అంగన్యాసములుచేసి, ప్రాతఃకాలమునందు బ్రాహ్మీ సంధ్యను ఈ విధముగ ధ్యానించ వలెను. ప్రాతఃకాలమున సంధ్యాదేవి బ్రాహ్మీరూపమున ప్రత్యక్షమగును. హంసారూఢయై కమలాసనముపై కూర్చుండి యుండును. శరీరకాంతి ఎర్రగా ఉండును. ఆమెకు నాలుగు ముఖములు, నాలుగుచేతులు ఉండును. కుడి చేతులలో కమలము, స్ఫటికాక్ష మాల, ఎడమచేతులలో దండకమండలములు ప్రకాశించుచుండును. మధ్యాహ్న కాలమున సంధ్యను వైష్ణవీ శక్తి రూపమున ధ్యానించవలెను. ఆమె గరుత్మంతుని వీపు మీద పరచిన కమలాసనముపై కూర్చుండును. శరీరకాంతి తెల్లగా నుండును. వామహస్తముచే శంఖ చక్రములను, దక్షిణ హస్తములచే గదా, అభయముద్రలను

ధరించియుండును. సాయం కాలమున సంధ్యను రుద్రశక్తి రూపమున ధ్యానింపవలెను. త్రినేత్రయై శిరస్సుపై అర్ధచంద్ర ముకుటముతో విరాజిల్లుచున్న ఆమె వృషభ పీఠముపై కమలాసనమున కూర్చుండి ఉండును. కుడిచేతులలో త్రిశూల, రుద్రాక్ష మాలలతోను, ఎడమ చేతులలో అభయ ముద్రా, శక్తులతోను ప్రకాశించుచుండును. ఈ సంధ్యలు కర్మ సాక్షులు. సాధకుడు ఈ శక్తుల కాంతులు తనను అనుసరించియున్నట్లు భావన చేయవలెను. ఇవికాక మరొక సంధ్య నాల్గవది కూడ ఉన్నది. అది కేవలము జ్ఞానికి మాత్రమే. అర్ధరాత్రి ప్రారంభమున, దాని బోధాత్మక సాక్షాత్కారము కలుగును. ఈ మూడు సంధ్యలును క్రమముగ, హృదయ, బిందు, బ్రహ్మ రంధ్రములలో నుండును. నాల్గవ సంధ్యకు రూపముండదు. ఆ సంధ్య పరమ శివునిలో ప్రకాశించుచుండును. ఈమె శివునికంటె అతీతమగుటచే 'పరాసంధ్య' అని పేరు. తర్జనీ మూలము పితృతీర్థము. కనిష్ఠికా మూలము ప్రజాపతి తీర్థము. అంగుష్ఠ మూలము బ్రహ్మతీర్థము. హస్తాగ్ర భాగము దేవతా తీర్థము. కుడి అరచేయి అగ్ని తీర్థము. ఎడమ అరచెయ్యి సోమతీర్థము. అంగుళుల అన్ని పర్వములును, సంధులును ఋషితీర్థము. సంధ్య అనంతరము, శివమంత్రములచే జలాశయమును శివ స్వరూపము చేసి, "ఆపోహిష్ఠా" ఇత్యాది సంహితా మంత్రములతో, ఆ జలముతో మార్జనము చేసికొన వలెను. (ఎడమ చేతిలో తీర్థజలము పోసికొని కుడిచేతితో మంత్రపఠన పూర్వక ముగ శిరస్సుపై ఆనీరు చల్లుకొనుటకు మార్జనమనిపేరు).

పిమ్మట అఘమర్షణము చేయవలెను. కుడిచేతిలో బోధరూప శివమయమగు ఉదకము పోసి కొని, ముక్కు దగ్గరకు తీసికొనిపోయి, (వామ) ఇడానాడి ద్వారా శ్వాస పీల్చి లోపల నిలిపి, లోపలి నుండి నల్లని పాపపురుషుని (దక్షిణ) పింగళానాడి ద్వారా బైటకు తీసికొని వచ్చి ఆ జలమునందు స్థాపించవలెను. ఆ పాప పురుషునితో కూడిన జలమును, ఒక వజ్రమయ శిలను భావనచేసి, దానిపై పడవేసి చంపవలెను. దీనితో అఘమర్షణము సంపన్నమగును. పిమ్మట కుశ, పుష్ప, అక్షతలతో కూడిన జలముతో అర్ఘ్యాంజలి పట్టి దానిని "ఓం నమః శివాయ స్వాహా' ' అను మంత్రముతో శివునకు సమర్పించి యథాశక్తిగ గాయత్రీ మంత్రము జపింపవలెను.

ఇపుడు తర్పణ విధిని చెప్పెదను. దేవతలకు వారి నామ మంత్రములను ఉచ్చరిం చుచు, దేవతీర్థము ద్వారా తర్పణము చేయవలెను. "ఓం హూం శివాయ స్వాహా" అని చెప్పి శివునకు తర్పణము ఈయవలెను. ఇతర దేవతలకు కూడ ఈ విధముగనే వారివారి పేర్లకు "స్వాహా" చేర్చి తర్పణములు ఈయవలెను. "ఓం హాం హృదయాయ నమః; ఓం హీం శిరసే స్వాహా; ఓం హూం శిఖాయై వషట్; ఓం హైం కవచాయ హుం; ఓం హౌం నేత్ర త్రయాయ వౌషట్; ఓం హం అస్త్రాయ ఫట్" అను వాక్యములు ఉచ్చరించుచు క్రమముగ హృదయ, శిరః, శిఖా, కవచ, నేత్ర, అస్త్రన్యాసములు చేయవలెను. ఎనిమిది దేవగణములకు వారి పేర్ల చివర నమః అను పదము చేర్చి తర్పణము చేయవలెను. "ఓం హాం ఆదిత్యేభ్యో నమః; ఓం హాం వసుభ్యో నమః; ఓం హాం రుద్రేభ్యో నమః; ఓం హాం విశ్వేభ్యో దేవేభ్యో నమః; ఓం హాం మరుద్భ్యో నమః; ఓం హాం భృగుభ్యో నమః; ఓం హాం అంగిరోభ్యో నమః"–ఈ విధముగ చేయవలెను. పిమ్మట యజ్ఞోపవీతమును కంఠమునందు మాలవలె ధరించి (ఉపవీతి) ఋషితర్పణము చేయవలెను. "ఓం హాం అత్రయే

నమః; ఓం హాం వసిష్ఠాయ నమః; ఓం హాం పులస్త్యయే నమః; ఓం హాం క్రతవే నమః; ఓం హాం భరద్వాజాయ నమః; ఓం హాం విశ్వామిత్రాయ నమః; ఓం హాం ప్రచేతసే నమః; ఓం హాం మరీచయే నమః" అను మంత్రములు పఠించుచు అత్ర్యాది ఋషులకు ఋషి తీర్థముద్వారా తర్పణములు చేయవలెను. పిమ్మట ఈ క్రింది వాక్యములు చదువుచు, సనకాది మునులకు (రెండేసి అంజలులు ఇచ్చుచు) తర్పణము చేయవలెను–"ఓం షాం సనకాయ వషట్; ఓం హాం సనన్దనాయ వషట్; ఓం హాం సనాతనాయ వషట్; ఓం హాం సనత్కుమారాయ వషట్; ఓం హాం కపిలాయ వషట్; ఓం హాం పఞ్చశిఖాయ వషట్; ఓం హాం ఋభవే వషట్" అను వాక్యములు చదువుచు దగ్గరగా ఉంచిన చేతుల కనిష్ఠికామూల భాగముల నుండి జలాంజలి ఈయవలెను. "ఓం హాం సర్వేభ్యో భూతేభ్యో వషట్" అను మంత్రముచే వషడ్రూప భూతగణములకు తర్పణము చేయవలెను. పిమ్మట యజ్ఞోపవీతమును కుడిభుజముపై ఉండునట్లు వేసికొని ప్రాచీనావీతి రెండుగా మడిచిన కుశమూలాగ్రముల నుండి తిలసహిత జలమును మూడేసి పర్యాయములు దివ్య పితృ దేవతలకు అర్పించి తర్పణము చేయవలెను. "ఓం హాం కవ్యవాహనాయ స్వధా; ఓం హాం అనలాయ స్వధా; ఓం హాం సోమాయ స్వధా; ఓం హాం యమాయ స్వధా; ఓం హాం అర్యమ్ణే స్వధా; ఓం హాం అగ్ని ష్వాత్తేభ్యః స్వధా; ఓం హాం బర్హిషద్భ్యః స్వధా; ఓం హాం ఆజ్యపేభ్యః స్వధా" ఇత్యాది మంత్రములు ఉచ్చరించుచు విశిష్ట దేవతలకు వలెనే దివ్య పితృదేవతలకును తర్పణములు ఈయవలెను.

"ఓం హాం ఈశానాయ ప్రితే స్వధా" అని చెప్పి తండ్రికిని, ఓం హాం పితామహాయ స్వధా" అని చెప్పి పితామహునకును, "ఓం హాం శాన్త ప్రపితా మహాయస్వధా" అని చెప్పి ప్రపితామహు నకును తర్పణములు ఈయవలెను. సమస్త ప్రేత పితృదేవతలకును ఈ విధముగనే తర్పణము చేయవలెను. ఎట్లనగా–"ఓం హాం పితృభ్యః స్వధా; ఓం హాం పితామహేభ్యః స్వధా; ఓం హాం ప్రపితామహేభ్యః స్వధా; ఓం హాం వృద్ధ ప్రపితా మహేభ్యః స్వధా; ఓం హాం మాతృభ్యః స్వధా; ఓం హాం మాతామహేభ్యః స్వధా; ఓం హాం ప్రమాతా మహేభ్యః స్వధా; ఓం హాం వృద్ధమాతా మహేభ్యః స్వధా; ఓం హాం సర్వేభ్యః పితృభ్యః స్వధా; ఓం హాం సర్వేభ్యః జ్ఞాతిభ్యః స్వధా, ఓం హాం సర్వాచార్యేభ్యః స్వధా; ఓం హాం దిగ్భ్యః స్వధా; ఓం హాం దిక్పతిభ్యః స్వధా; ఓం హాం సిద్ధేభ్యః స్వధా; ఓం హాం మాతృభ్యః స్వధా; ఓం హాం గ్రహేభ్యః స్వధా; ఓం హాం రక్షోభ్యః స్వధా" – ఈ వాక్యములను ఉచ్చరించుచు క్రమముగ పితృ, పితామహ, ప్రపితామహ, వృద్ధ ప్రపితామహ, మాతృ, సర్వజ్ఞాతి, సర్వాచార్య, సర్వదిక్, దిక్పతి, సిద్ధ, మాతృకా, గ్రహ, రాక్షసులకు తర్పణములు ఈయవలెను. (72)

సూర్యపూజా విధానము

పరమేశ్వరుడు పలికెను : స్కందా! ఇపుడు అంగన్యాస కరన్యాసములతో సూర్య పూజా విధానమును చెప్పెదను. తేజోమయ సూర్యుడను నేనే" అని భావనచేసి అర్ఘ్య పూజనము చేయవలెను. ఎఱ్ఱటి చందనము కలిపిన జలమును లలాట సమీపమునకు తీసికొని వెళ్ళి దానితో అర్ఘ్య పాత్రమును

నింపవలెను. దానిని గంధాదులతో పూజించి సర్వాంగములచే రక్షావగుంఠనము చేయవలెను. పిమ్మట జలముతో పూజాసామగ్రిని ప్రోక్షించి, పూర్వాభిముఖుడై సూర్యుని పూజ చేయవలెను. "ఓం అం హృదయాయ నమః" ఇత్యాది విధమున స్వరబీజము మొదటచేర్చి శిరస్సు మొదలగు అన్ని అవయవముల న్యాసము చేయవలెను. పూజాగృహ ద్వారమునందు కుడివైపున దండిని, ఎడమ వైపున పింగళుని పూజింపవలెను. "గం గణపతయే నమః" అను మంత్రముతో ఈశాన్య మున గణేశుని పూజింపవలెను. ఆగ్నేయమున గురుపూజ చేయవలెను. పీఠ మధ్యమునందు కమలాకార ఆసనము భావనచేసి పూజింపవలెను. పీఠము యొక్క ఆగ్నేయాది కోణములలో క్రమముగ విమల, సార, ఆరాధ్య, పరమసుఖములను, మధ్యభాగమున ప్రభూత ఆసనమును పూజింపవలెను.

విమలాదులు నాల్గింటి రంగులు వరుసగ శ్వేత,రక్త, పీత, నీలములుండును. వాటి ఆకారము సింహముతో సమానముగ నుండును. వీటిని అన్నింటిని పూజించవలెను. పీఠముపై నున్న కమలములోపల "రాం దీప్తాయై నమః" అను మంత్రముచే దీప్తా శక్తిని, "రీం సూక్ష్మాయై నమః' ' అను మంత్రముతో సూక్ష్మాశక్తిని, "రూం జయాయై నమః" అను మంత్రముచే జయాశక్తిని, "రేం భద్రాయై నమః" అను మంత్రముచే భద్రాశక్తిని, "రైం విభూతయే నమః" అను మంత్రముచే విభూతి శక్తిని, "రోం విమలాయై నమః" అను మంత్రముచే విమలాశక్తిని, "రౌం అమోఘాయై నమః" అను మంత్రముచే అమోఘా శక్తిని, "రం విద్యుతాయై నమః" అను మంత్రముచే విద్యుతాశక్తిని పూర్వాది దిక్కులు ఎనిమిదింటి యందును పూజించి, "రః సర్వతోముఖ్యై నమః" అను మంత్రముచే మధ్య భాగమునందు, తొమ్మిదవ పీఠశక్తియైన సర్వతోముఖిని పూజించవలెను. పిమ్మట "ఓం బ్రహ్మ విష్ణు శివాత్మకాయ సౌరాయ యోగపీఠాత్మనే నమః" అను మంత్రముచే సూర్యదేవుని పీఠ మును పూజించవలెను. పిమ్మట 'ఖఖోల్కాయ నమః" అను షడక్షర మంత్రమునకు ప్రారంభమున 'ఓం హం ఖం' అను అక్షరములు చేర్చి తొమ్మిది అక్షరములుగల "ఓం హం ఖం ఖఖోల్కాయ నమః" అను మంత్రము ద్వారా సూర్య విగ్రహా ఆవాహనముచేసి సూర్యుని పూజ చేయవలెను. దోసిటిలో ఉన్న ఉదకమును లలాట సమీపమునకు తీసికొని వెళ్ళి రక్తవర్ణుడైన సూర్యుని ధ్యానించి, ఆ సూర్యుడు తన ఎదుట ఉన్నట్లు భావన చేయవలెను. పిదప "హ్రాం హ్రీం సః సూర్యాయ నమః" అని పలుకుచు సూర్యునకు అర్ఘ్య మీయవలెను. పిదప బింబముద్ర చూపుచు ఆవాహనాద్యుప చారములు సమర్పింపవలెను. పిదప సూర్యుని ప్రీతికొరకై గంధాదికము సమర్పింపవలెను. ఆగ్నే యము నందు "ఓం ఆం హృదయాయ నమః" అనుమంత్రముచే హృదయమును, నైరృతి దిక్కు నందు "ఓం భూః అర్కాయ శిరసే స్వాహా" అను మంత్రముచే శిరస్సును, వాయవ్యమున "ఓం భువః సురేశాయ శిఖాయై వషట్" అను మంత్రముచే శిఖను, ఈశాన్యమునందు "ఓం స్వః కవచాయ హుం" అను మంత్రముచే కవచమును, ఇష్ట దేవతకును ఉపాసకునకును మధ్య "ఓం హాం నేత్ర త్రయాయ వౌషట్" అను మంత్రముచే నేత్రమును, దేవతకు పశ్చిమ భాగము నందు" వః అస్త్రాయ ఫట్" అను మంత్రముచే అస్త్రమును పూజింపవలెను. పిమ్మట పూర్వాది దిశలందు ముద్రలను ప్రదర్శింపవలెను.

హృదయ, శిరః, శిఖా, కవచములకు పూర్వాది దిక్కులందు ధేను ముద్రను ప్రదర్శింపవలెను. నేత్రములకు గోశృంగ ముద్ర చూపవలెను. అస్త్రమునకు త్రాసనీ ముద్ర చూపవలెను. పిమ్మట గ్రహములకు నమస్కారము, పూజ చేయవలెను. "ఓం సోం సోమాయ నమః" అను మంత్రముతో తూర్పునందు చంద్రుని, "ఓం బుం బుధాయ నమః" అను మంత్రముతో దక్షిణమున బుధుని, "ఓం బృం బృహస్పతయే నమః" అను మంత్రముతో పశ్చిమమున బృహస్పతిని, "ఓం భం భార్గవాయ నమః" అను మంత్రముతో శుక్రుని పూజింపవలెను. ఈ విధముగ పూర్వాది దిశలందు చంద్రాది గ్రహములను పూజించి ఆగ్నేయాది విదిక్కులందు మిగిలిన గ్రహములను పూజింపవలెను. ఎట్లనగా - "భౌం భౌమాయ నమః" అను మంత్రముతో ఆగ్నేయమున కుజుని, "ఓం శం శనైశ్చ రాయ నమః" అను మంత్రముతో నైరృతి దిక్కునందు శనైశ్చరుని, "ఓం రాం రాహవే నమః" అను మంత్రముతో వాయువ్యమునందు రాహువును, "ఓం కేం కేతవే నమః" అను మంత్రముతో ఈశాన్యమునందు కేతువును గంధాద్యుపచారములతో పూజింపవలెను. ఖఖోల్కి (సూర్య భగ వానుని)తో పాటు ఈ అన్ని గ్రహములపూజ కూడ చేయవలెను. మూలమంత్రము జపించి, అర్ఘ్యపాత్రమునందు జలము గ్రహించి సూర్యునకు సమర్పించి, పిదప స్తుతించవలెను. ఈ విధముగ స్తుతి చేసిన పిదప అభిముఖముగ నిలబడి సూర్యునకు నమస్కరించి ఇట్లు ప్రార్థించవలెను. "ప్రభో! నా అపరాధములను, లోపములను క్షమిం పుము". పిమ్మట "అస్త్రాయ ఫట్" అను మంత్రముతో అణుసంహార సమాహరణము చేసి, "శివసూర్య" అని పలుకుచు సంహారిణీ ముద్ర ద్వారా సూర్యుని ఉపసంహృతమగు తేజస్సును తన హృదయ కమలములో నుంచి సూర్య నిర్మాల్య మును ఆతని పార్షదుడైన చండునకు సమర్పింపవలెను. ఈ విధముగ జగదీశ్వరుడగు సూర్యుని పూజచేసి, ధ్యాన హోమములు చేయుటచే సాధకుని మనోరథములు అన్నియు సిద్ధించును. (73)

శివ పూజా విధి

మహేశ్వరుడు చెప్పెను : స్కందా! ఇపుడు శివపూజా విధానమును చెప్పుచున్నాను. ఆచమనము చేసి ప్రణవ జపము చేయుచు సూర్యునకు అర్ఘ్యము ఈయవలెను. పిమ్మట పూజామండప ద్వారమును 'ఫట్' అను మంత్రము ఉచ్చరించుచు ఉదకముతో తడిపి, ప్రారంభమున 'హాం' బీజముతో నంది మొదలగు ద్వారపాలకులను పూజింపవలెను. ద్వారముపై ఉదుంబర వృక్షము స్థాపించి, లేదా భావన చేసి, దాని పై భాగముపై గణపతి, సరస్వతీ, లక్ష్మీదేవులను పూజించవలెను. దక్షిణ భాగమున నందిని, గంగను, వామ భాగమున మహాకాలుని, యమునను పూజింపవలెను. పిమ్మట దివ్యదృష్టి ప్రసరింపచేసి దివ్య విఘ్నములను తొలగించుకొనవలెను. వాటిని ఉద్దేశించి పుష్పములు విసరి, "ఆకాశ చారి విఘ్నములు అన్నియు తొలగిపోయినవి" అని భావన చేయవలెను. కుడిమడమతో మూడు పర్యాయ ములు భూమిపైకొట్టవలెను. అట్లు చేయుటచే భూతలముపై ఉన్న సర్వ విఘ్నములు తొలగినట్లు భావన చేయవలెను. పిమ్మట యజ్ఞమండపము యొక్క కడప దాటవలెను. ఎడమకొమ్మ పట్టుకొని లోపల ప్రవేశించి, ఉదుంబర వృక్షమున అస్త్రన్యాసము చేసి, మండప మధ్యమున పీఠాధార భూమిపై "ఓం హాం వాస్త్వధిపతయే బ్రహ్మణే నమః" అను మంత్రముతో వాస్తు దేవతా పూజ చేయవలెను.

నిరీక్ష ణాస్త్రములచే శుద్ధము చేయబడిన గడ్డుకములను చేతిలో గ్రహించి, భావన ద్వారా శివాజ్ఞగైకొని, సాధకుడు మౌనముగా గంగానదీ తటమునకు వెళ్లి, అచట తన శరీరమును పవిత్రము చేసికొని గాయత్రి మంత్రజపము చేయుచు వస్త్రముతో వడగట్టిన జలముతో జలాశయము నందు ఆ గడ్డుకములను నింపవలెను. లేదా హృదయ బీజమును (నమః) ఉచ్చరించుచు నింపవలెను. పూజకై కావలసిన గంధ, అక్షత, పుష్పాది సకల ద్రవ్యములను దగ్గర ఉంచుకొని, భూతశుద్ధి మొదలగు కర్మలు చేయవలెను. ఉత్తరాభి ముఖుడై, ఆరాధ్య దేవతకు కుడి ప్రక్క శరీరాంగములపై మాతృకాన్యాసము చేసి, సంహారముద్రతో అర్ఘ్యము కొరకై ఉదకము గ్రహించి మంత్రోచ్చారణ పూర్వకముగ శిరస్సుకు తగల్చి, దానిని దేవతకు సమర్పించుటకై దగ్గర ఉంచుకొనవలెను. పిమ్మట భోగ్యములగు కర్మల భోగమునకై కూర్మముద్రను ప్రదర్శించి ద్వాదశదళ హృదయ కమలమున తన ఆత్మను ధ్యానించవలెను.

పిమ్మట శరీరమునందు రంధ్రమును (శూన్యమును) భావించి, క్రమముగ పంచభూత శోధనము చేయవలెను. ముందుగ పాదముల అంగుష్ఠములను పై నుండియు, లోపలి నుండియు ఛిద్రమయ ముగ భావన చేయవలెను. పిదప కుండలినీ శక్తిని మూలా ధారమునుండి లేపి, హృదయ కమల ముతో చేర్చి, "హృదయ రంధ్రమునందున్న, అగ్ని తుల్యతేజఃశాలియగు 'హూం' బీజమునందు కుండలినీ శక్తి విరాజిల్లుచున్నది" అని భావన చేయవలెను. కుంభక ప్రాణాయామముచేసి, రేచకముచేసిన పిమ్మట, 'హుం ఫట్' అని ఉచ్చరించుచు క్రమముగ ఉత్తరోత్తర చక్రములను భేదనము చేయుచు, కుండలిని హృదయ, కంఠ, తాలు, భ్రూమధ్య, బ్రహ్మ రంధ్రములకు చేర్చి అచట స్థాపించవలెను. ఈ గ్రంథులను భేదించి, కుండలినితో, హృదయ కమలము నుండి బ్రహ్మ రంధ్రము నుండి వచ్చిన 'హూం' బీజరూపజీవుని అచటనే బ్రహ్మ రంధ్రమునందు లేదా సహస్రారము నందు స్థాపించవలెను. హృదయమునందున్న 'హూం' బీజముతో సంపుటీకరించిన జీవునిలో, పూరక ప్రాణాయామము ద్వారా చైతన్యము జాగృతము చేయబడును. శిఖకు పైన 'హూం' న్యాసముచేసి శుద్ధ బిందు రూప జీవుని భావించ వలెను. పిమ్మట కుంభకము చేసి ఏకమాత్ర చైతన్య రూపుడగు జీవుని శివునితో కలిపివేయవలెను.

ఈ విధముగ శివునిలో లీనుడైన సాధకుడు సబీజరేచక ప్రాణాయామముతో శరీరమునందలి భూతముల శోధనము చేయవలెను. శరీరమునందు పాదములనుండి బిందువు వరకునున్న అన్ని తత్త్వములను విలోమక్రమమున చింతన చేయవలెను. బిందు రూపజీవుని బింద్వంతము నందు లీనముచేసి పృథ్వీ వాయువులను ఒకదానిని మరొక దానిలో లీనము చేయవలెను. అగ్ని, జలములను కూడ ఒక దానిలో ఒకటి విలీనము చేయవలెను. ఈ విధముగ పరస్పర విరోధముగల రెండు భూతములను ఒకదానిలో ఒకటి లీనము చేయవలెను. ఆకాశమునకు దేనితోడను విరోధము లేదు. ఈ భూతశుద్ధికి సంబంధించిన విశేష వివరణము వినుము. భూమండల స్వరూపము చతుష్కోణ ఆకారము. దానిరంగు సువర్ణమువలె పచ్చగాఉండును. అది కఠినముగ నుండుటయే గాక వజ్ర చిహ్నముతోను, 'హాం' అను తన బీజముతోను కూడుకొని యున్నది. దీనిలో 'నివృత్తి' అను కళ ఉన్నది. (శరీరమున పాదములు మొదలు మోకాళ్ల వరకును భూ మండలమున్నది).

ఈవిధమున పాదములు మొదలు శిరస్సువరకు శరీరమునందు పంచ మహాభూతముల భావన చేయవలెను. ఈ విధముగ పంచగుణయుక్తములగు వాయు, భూ మండలముల చింతన చేయవలెను.

జల స్వరూపము అర్ధ చంద్రాకారము. అది ద్రవ స్వరూపము. చంద్ర మండలమయము. దాని వర్ణము ఉజ్జ్వలము. అది రెండు కమలములచే చిహ్నితము. 'ప్రీం' బీజముతో కూడినది. "ప్రతిష్ఠా" అను కళగలది. వామదేవ, తత్పురుష మంత్రములతో సంయుక్తమగు జలతత్త్వము నాలుగు గుణములతో కూడినది. దానిని ఈ విధముగ (మోకాళ్లు మొదలు పాదాలవరకు) చింతనము చేయుచు వహ్ని స్వరూపము నందు లీనముచేసి శోధన చేయవలెను. అగ్ని మండలము త్రి కోణా కారము. రంగు ఎరుపు. (అది నాభినుండి హృదయము వరకును ఉండును). అది స్వస్తిక చిహ్న యుక్తము. దాని యందు 'హూం' బీజము అంకితమై యుండును. అది విద్యాకళా స్వరూపమైనది. దాని మంత్రము అఘోరమంత్రము. ఇది మూడు గుణములతో కూడిన జలభూతము. ఈ విధముగ భావించి అగ్ని తత్త్వమును శోధించవలెను. వాయుమండలము షట్కోణాకారము (హృదయము మొదలు కనుబొమ్మల వరకును ఉండునది). అది ఆరు బిందువులచే చిహ్నితమైనది. రంగు నలుపు. 'హైం' బీజము తోడను, సద్యోజాత మంత్రముతోడను యుక్తమైయున్న అది కాంతి కళా స్వరూపమైనది. దానిలో రెండు గుణములు ఉన్నవి. అది పృథ్వీభూతము. ఈ విధముగ భావనచేసి వాయుతత్త్వమును శోధింపవలెను.

ఆకాశము వ్యోమాకారము! నాద బిందుమయము, గోలాకారము, బిందుశక్తి విభూషితము, శుద్ధ స్ఫటిక నిర్మలము. (శరీరమున భ్రూమధ్యము మొదలు బ్రహ్మ రంధ్రము వరకు ఆకాశ స్థానము). అది "హౌం ఫట్" అను బీజముతో కూడినది. శాంత్యతీత కళా మయము. ఒక్క గుణము కలది. పరమవిశుద్ధము. ఈ విధముగ చింతనముచేసి ఆకాశ తత్త్వమును శోధన చేయవలెను. పిమ్మట అమృత వర్షిమూల మంత్రముచే సర్వమును పరిపుష్టము చేయవలెను. పిమ్మట ఆధారశక్తిని, కూర్మమును అనంతుని పూజించవలెను. పిమ్మట పీఠముయొక్క ఆగ్నేయ పాదము (కోడు) నందు ధర్మమును, నైరృతి పాదమున జ్ఞానమును, వాయవ్యమున వైరాగ్యమును, ఈశాన్య పాదమున ఐశ్వర్యమును పూజించవలెను. పిమ్మట పీఠమునకు పూర్వాది దిశలందు క్రమముగ అధర్మ, అజ్ఞాన, అవైరాగ్య, అనైశ్వర్యములను పూజించవలెను. పీఠమధ్య భాగమున కమలమును పూజించ వలెను. ఈ విధముగ మనస్సులోనే పీఠముపై ఉన్న కమలఆసనమును ధ్యానించి దానిపై సచ్చిదా నందఘను డగు శివుని ఆవాహనము చేయవలెను. ఆ శివమూర్తి యందు శివస్వరూపాత్మను చూచి, ఆసనమును, పాదుకా ద్వయమును, తొమ్మిది పీఠ శక్తులను ధ్యానించవలెను. శక్తిమంత్రము చివర "వౌషట్" చేర్చి, దానిని ఉచ్చరించుచు పైనచెప్పిన ఆత్మమూర్తిని దివ్యామృతములో ముంచి, సకలీ కరణము చేయవలెను. హృదయము మొదలు హస్తముల వరకును ఉన్న అవయవములందును, కనిష్ఠిక మొదలు వ్రేళ్లయందును హృదయ మంత్ర (నమః) న్యాసమునకు సకలీకరణమని పేరు.

'హుంఫట్' అను మంత్రముచే ప్రాకారమును భావనచేసి, ఆత్మ రక్ష ఏర్పరచు కొనవలెను. దీని బైట, వెలుపల, క్రింద, మీద, భావన ద్వారా శక్తి జాలమును విస్తరింపచేయవలెను. పిమ్మట

మహాముద్రా ప్రదర్శనముచేసి, పూరక ప్రాణాయామముతో హృదయ కమలమునందున్న శివుని ధ్యానించి, ఆనందామృతమయ మకరందముతో (నిండిన) భావమయ పుష్పములతో శివునకు పాదముల నుండి శిరస్సు వరకును అంగపూజ చేయవలెను. శివ మంత్రములతో నాభికుండము నందున్న శివ స్వరూపాగ్నిని తృప్తుని చేయవలెను. ఆ శివానలమే లలాటమున బిందు రూపములో ఉన్నది; దాని విగ్రహము మంగళమయము (అని) భావన చేయవలెను. స్వర్ణ పాత్రముగాని, రజత పాత్రముగాని, తామ్రపాత్రముగాని అర్ఘ్యము నిమిత్తమై గ్రహించి దానిని అస్త్రబీజము (ఫట్) ఉచ్చరించుచు కడగవలెను. బిందు రూప శివుని నుండి అమృతము ఆవిర్భవించుచున్నట్లు భావనచేసి హృదయమంత్రము (నమః) ఉచ్చరించుచు, దానితో కలిసిన జలాక్షతాదులతో ఆ పాత్రను నింప వలెను. దానికి షడంగ పూజచేసి, దేవతా మూలమంత్రముచే అభిమంత్రించవలెను. అస్త్రమంత్రము (ఫట్)చే దాని రక్షచేసి, కవచబీజ (హుమ్) ముచే దానిని కప్పవలెను. ఈ విధముగ అష్టాంగార్ఘ్యము ఏర్పరచి, ధేనుముద్రచే దానికి అమృతీకరణము చేసి, ఆ జలమును అన్ని వైపులను చల్లవలెను. తన శిరస్సుపై కూడ చల్లుకొనవలెను. పూజా సామగ్రి మీద కూడ అస్త్రబీజమును ఉచ్చరించుచు చల్లవలెను. హృదయ బీజముతో అభిమంత్రించి, 'హుమ్' బీజకముచే (లేదా మత్స్య ముద్రచే) దానిని ఆచ్ఛాదించవలెను.

అమృత (ధేను) ముద్ర ప్రదర్శించి, తన ఆసనముపై పుష్పము ఉంచి, లలాటముపై తిలకము ధరించి, మూల మంత్రముతో దేవతకు పుష్పము అర్పించవలెను. సాధకుడు, స్నాన, దేవతాపూజా, హోమ, భోజన, యజ్ఞా అనుష్ఠాన, యోగ, సాధన, ఆవశ్యక జప సమయము లందు, స్థిరబుద్ధియై మౌనముగా ఉండవలెను, నాదపర్యంతము ప్రణవోచ్చారణము చేయుచు మంత్రశోధనము చేయ వలెను. ఉత్తమసంస్కారముక్తుడై దేవపూజా ప్రారంభము చేయవలెను. మూలగాయత్రిచేత గాని, రుద్ర గాయత్రిచేత గాని అర్ఘ్య పూజనము చేసి ఆ సామాన్యార్ఘ్యమును దేవతకు సమర్పించవలెను. బ్రహ్మపంచకము (పంచగవ్యములు, కుశోదకముతో చేసిన బ్రహ్మకూర్చము) సిద్ధముచేసికొని, శివలింగము నుండి పుష్ప నిర్మాల్యమును తీసివేసి, ఈశాన్యము నందు "చండాయనమః" అని చెప్పుచు చండునకు సమర్పించవలెను. బ్రహ్మపంచకముతో పిండికా శివలింగములకు స్నానము చేయించి, 'ఫట్' అని ఉచ్చరించుచు, మరల ఉదకముతో స్నానము చేయించవలెను. "నమో నమః" అని ఉచ్చరించుచు అర్ఘ్య పాత్ర గతజలముతో ఆ శివలింగమునకు అభిషేకము చేయవలెను. ఇది లింగశోధన విధానము.

ఆత్మ, ద్రవ్య, మంత్రలింగ శుద్ధులు చేసిన పిమ్మట సకల దేవతలను పూజించవలెను. వాయు వ్యమునందు, "ఓం హాం గణపతయే నమః" అని ఉచ్చరించుచు గణపతిని పూజించవలెను. ఈశాన్యమునందు "ఓం హాం గురుభ్యో న్నమః" అని చెప్పుచు గురు, పరమ గురు, పరాత్పర గురు, పరమేష్ఠి గురువులను, గురుపరంపరను పూజించవలెను. కూర్మ రూపమగు శిలపై ఉన్న అంకుర తుల్యమగు ఆధారశక్తిని పూజించి, బ్రహ్మశిలపై కూర్చున్న శివుని ఆసనమైన అనంతదేవుని "ఓం హాం అనన్తాయ నమః" అను మంత్రముతో పూజింపవలెను. శివుని సింహాసనముగా ఉన్న మంచమునకు నాలుగు కోళ్ళు ఉండును. వాటి ఆకారము సింహ ఆకారమున విచిత్రముగా

నుండును. ఈ సింహములు మండలా కారమున నిలచి ఎదుట ఉన్న దానిని పృష్ఠభాగమును చూచుచుండును. ఇవి సత్య, త్రేతా, ద్వాపర, కలియుగములకు ప్రతీకములు. పిమ్మట శివుని ఆసనపాదుకలను పూజించవలెను. పిమ్మట ఆగ్నేయాది విదిశలలో నున్న ధర్మ, జ్ఞాన, వైరాగ్య, ఐశ్వర్యములను పూజింపవలెను. వీటి రంగులు వరుసగ కర్పూర, కుంకుమ, సువర్ణ, కజ్జలము (కాటుక)లతో సమానముగ నుండును. వీటి నాలుగుకాళ్లకును పూజ చేసి ఆసనముపై నున్న అష్టదళ కమలము నందలి క్రింది దళములను, పై దళములను, మొత్తము కమలమును పూజించి, "ఓం హాం కర్ణికాయై నమః" అను మంత్రముతో కర్ణికా మధ్య భాగమును పూజించవలెను. ఆ కమలము యొక్క ఎనిమిది పూర్వాది దళములందును, మధ్య భాగము నందును తొమ్మండుగురు శక్తులను పూజించవలెను. ఆ శక్తులు హస్తములలో చామరములు ధరించియుందురు. వరద, అభయ ముద్రలు కూడ ఉండును. వామా, జ్యేష్ఠా, రౌద్రీ, కాళీ, కలవికారిణీ, బలవికారిణీ, బలప్రమథనీ, సర్వభూతదమనీ, మనోన్మనీ అను ఎనమండుగురు శక్తులను అష్టదలముల పైనను, మనోన్మనియను శక్తిని కమల కేసరములందును "హాం వామాయై నమః ఇత్యాది మంత్రములు ఉచ్చరించుచు పూజించవలెను. పిమ్మట పృథివ్యాద్యష్టమూర్తులను, విశుద్ధ విద్యా దేహమును భావించుచు పూజ చేయవలెను. శుద్ధ విద్యను, తత్త్వవ్యాపక ఆసనమున పూజించవలెను. ఆ సింహాసనముపై కర్పూరమువలె తెల్లగా ఉన్నవాడును, సర్వవ్యాపియు, ఐదు ముఖములు గలవాడును అగు మహాదేవుని ప్రతిష్ఠ చేయవలెను. ఆయనకు పది భుజములుండును. శిరస్సున అర్ధచంద్రుడు ఉండును. కుడి చేతులలో శక్తి, ఋష్టి, శూల, ఖట్వాంగ, వరద ముద్రలుండును. ఎడమ చేతులలో డమరు, బీజపూర, సర్ప, అక్షసూత్ర, నీలకమలములను ధరించి యుండును.

ఆసనముపై ఆసీనుడైయున్న శివుని దివ్యమూర్తి ముప్పది రెండు లక్షణములతో ప్రకాశించు చున్నదని చింతనము చేయుచు, శివ స్మరణము చేయుచు, "ఓం హాం హాం హాం శివమూర్తయే నమః" అను మంత్రము ఉచ్చరించుచు నమస్కారము చేయవలెను. బ్రహ్మాది కారణ త్యాగ పూర్వక ముగ మంత్రమును శివునియందు ప్రతిష్ఠితము చేయవలెను. లలాట మధ్య భాగమున చంద్రుడువలె ప్రకాశించుచున్న బిందురూప పరమశివుడు హృదయాదులగు ఆరు అంగములతో సంయుక్తుడై పుష్పాంజలిలోనికి దిగివచ్చినట్లు భావనచేసి ఆయనను పూజింపనున్న మూర్తియందు స్థాపించవలెను. పిమ్మట ఆవాహనీ ముద్రతో "ఓం హాం హౌం శివాయ నమః" అను మంత్రము ఉచ్చరించుచు, మూర్తిపై శివుని ఆవాహనము చేయవలెను. స్థాపనీముద్రచే స్థాపనముచేసి, సన్నిధాపనీ ముద్రతో సన్నిహితుని చేసి, సన్నిరోధనీముద్రతో ఆ మూర్తిపై కదలకుండునట్లు చేయవలెను. పిమ్మట "నిష్ఠురాయై కాలకల్యాయై ఫట్" అను మంత్రము ఉచ్చరించుచు ఖడ్గముద్రతో భయమును చూపుచు విఘ్నములను పారద్రోలవలెను. పిమ్మట లింగముద్రను చూపి నమస్కారము చేయవలెను. 'నమః' అని అవగుంఠనము చేయవలెను. ఇష్టదేవతను తన వైపునకు అభి ముఖముగ నున్నట్లు చేయుటయే ఆవాహనము. దేవతను అర్చా విగ్రహముపై కూర్చుం డబెట్టుట స్థాపనము "ప్రభూ! నేను నీవాడను" అని పలుకుచు భగవంతునితో అతి సన్నిహిత సంబంధము నేర్పరచుకొనుటయే సన్నిధాపనము". శివపూజకు సంబంధించిన కర్మకాండ అంతయు పూర్తి అగువరకు భగవత్సన్నిధానము ఉండునట్లు

చేయుట "నిరోధము". భక్తులు కాని వారికి శివతత్త్వము తెలియకుండునట్లు చేయుట అవగుంఠనము. పిమ్మట సకలీకరణముచేసి 'హృదయాయ నమః' ఇత్యాది మంత్రములతో హృదయాద్యంగములకు అంగులతో ఏకత్వమును స్థాపించుటయే 'అమృతీకరణము' చైతన్య శక్తి శంకరుని హృదయము. ఎనిమిది విధములైన ఐశ్వర్యము శిరస్సు, వశిత్వము శిఖ, అభే ద్యమగు తేజస్సు కవచము, దుస్సహమైన ప్రతాపమే సమస్త విఘ్నములను నివారించు అస్త్రము. హృదయముతో ప్రారంభించి "నమః, స్వధా, స్వాహా, వౌషట్ అనునవి ఉచ్చరించుచు పాద్యాదులను నివేదించవలెను. ఆరాధ్యదేవత యొక్క చరణారవిందములపై పాద్యమును, ముఖారవిందమున ఆచమనమును, అర్ఘ్య, దూర్వా, పుష్ప, అక్షతాదులను శిరస్సునను ఉంచవలెను. ఈ విధముగ పది సంస్కారములచే పరమేశ్వరుని సంస్కారము చేసి, గంధ పుష్పాది పంచఉపచారములతో యథావిధిగ పూజింపవలెను. మొదట దేవతా విగ్రహమునకు ఉదకముచే అభిషేకముచేసి, రాజికాలవణాదులతో ఉద్వర్తన మార్జనములు చేయవలెను. పిమ్మట అర్ఘ్య జలబిందువులు, పుష్పములు మొదలగు వాటితో అభిషేకము చేసి ఘటములో నున్న ఉదకముతో మెల్లమెల్లగ స్నానము చేయించవలెను.

పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార-వీటిని వరుసగ ఈశాన తత్పురుష, అఘోర, వామదేవ, సద్యోజాత మంత్రములతో అభిమంత్రించి, వాటితో అనేకమార్లు స్నానము చేయించవలెను. వాటిని కలిపి పంచామృతముచేసి, దానితో భగవంతునకు స్నానము చేయించవలెను. దీనివలన భోగ మోక్షములు లభించును. పైన చెప్పిన క్షీరము మొదలైన వాటిలో జలధూపములు కలిపి, మూలమంత్రముతో శివునకు అభిషేకము చేయవలెను. పిదప యవపిష్టముతో జిడ్డుపోవునట్లు చేసి శీతల జలముతో స్నానము చేయించవలెను. యథాశక్తిగ చందన, కేసరాది యుక్తమగు ఉదకముతో స్నానము చేయించి వస్త్రముతో విగ్రహమును బాగుగా తుడవవలెను. పిదప అర్ఘ్యము సమర్పింపవలెను. దేవతమీద హస్తము త్రిప్పగూడదు. శివలింగము తలపై ఎన్నడును పుష్పము లేకుండ ఉంచగూడదు. పిదప ఇతర ఉపచారములు సమర్పించి చందనాద్యనులేపనము చేయవలెను. శివమంత్రము జపించుచు పుష్పార్పణ చేసి పూజించవలెను. అస్త్ర మంత్రము (ఫట్)తో ధూప పాత్రను ప్రోక్షించి, శివమంత్రముతో ధూపముచే పూజించవలెను. అస్త్రమంత్రముచే పూజింపబడిన ఘంట మ్రోగించుచు గుగ్గులు ధూపము వేయవలెను. "శివాయ నమః" అను మంత్రమును ఉచ్చరించుచు అమృతమధురమగు జలముతో ఆచమనము సమర్పించవలెను. పిమ్మట హారతి ఇచ్చి ఆచమనము చేయించవలెను. నమస్కరించి, దేవత అనుమతి గైకొని భోగాంగముల పూజ చేయవలెను.

ఆగ్నేయమునందు చంద్రుడు ఉజ్జ్వలమైన హృదయమును, ఈశాన్యమునందు సువర్ణ సమాన కాంతిగల శిరస్సును, నైరృతియందు ఎఱ్ఱని రంగుగల శిఖను, వాయవ్యము నందు నల్లని రంగుగల కవచమును పూజింపవలెను. అగ్నివర్ణమగు నేత్రమును, కృష్ణ పింగళ వర్ణమగు అస్త్రమును పూజించి, కమలముపై చతుర్ముఖుడగు బ్రహ్మయు, చతుర్భుజుడగు విష్ణువు, ఇతరదేవతలును ఉన్నట్లు భావన చేసి వారి పూజచేయవలెను. పూర్వాది దిక్కులందు కోరలతో భయంకరములగు వజ్ర తుల్యాస్త్రములు పూజించవలెను. "ఓం హాం హూం శివాయ నమః" అను మంత్రముతో మూల స్థానమునందు

పూజ చేయవలెను. "ఓం హాం హృదయాయ నమః" "హీం శిరసే స్వాహా" అను మంత్రములతో హృదయ శిరస్సులను "హూం శిఖాయై వషట్" అను మంత్రముతోశిఖను 'హైం కవచాయ హుం' అను మంత్రముతో కవచమును "హః అస్త్రాయ ఫట్" అని అస్త్రమును పూజించవలెను. పిమ్మట పరివార సమేతుడగు ఈశ్వరునకు క్రమముగ పాద్య, ఆచమన, అర్ఘ్య, గంధ, పుష్ప, ధూప, దీప, నైవేద్య, ఆచమనీయ, కరోద్వర్తన, తాంబూల, ముఖవాస, దర్పణ ములను సమర్పిం చవలెను. పిమ్మట ఆ దేవాధిదేవుని శిరస్సుపై అక్షతలను, పవిత్ర కమును ఉంచి, హృదయముచే (నమః) అభిమంత్రితమగు మూల మంత్రమును నూట ఎనిమిది సార్లు జపించవలెను. పిమ్మట కవచము చుట్టినదియు, అస్త్రముచే రక్షితమును అగు అక్షత, కుశలను, పుష్పములను, సమర్పించి ఉద్భవమగు ముద్రతో శివుని, "ఓ ప్రభూ! గుహ్యాతి గుహ్యమును రక్షించుటకై, నేను చేసిన జపమును గ్రహింపుము, దానిచే నీవు ఉండగా, కృపచే నాకు సిద్ధి లభించుగాక" అని ప్రార్థించవలెను.

భోగేచ్ఛగల సాధకుడు పై శ్లోకము పఠించుచు, మూలమంత్రము ఉచ్చరించుచు కుడిచేతిలో అర్ఘ్యోదకము గ్రహించి, దానిని భగవంతుని వరముద్రతో కూడిన హస్తములో విడువవలెను. మరల ఈ విధముగ ప్రార్థించవలెను. "మహాదేవా! కల్యాణ స్వరూపుడవగు నీపాదములను శరణుజొచ్చినాను. నేను చేసిన శుభాశుభ కర్మల నన్నింటిని తొలగింపుము. "హూం క్షః శివుడే దాత. శివుడే భోక్త. శివుడే ఈ సకల ప్రపంచము, సర్వత్ర శివునకు జయమగుగాక. శివుడే నేను" ఈ రెండు శ్లోకములు చదువుచు చేసిన జపమును శివునకు సమర్పింపవలెను. పిమ్మట పూర్వము చేసిన శివమంత్రజపములో దశాంశము మరల జపించవలెను. (హోమపూర్తికి ఇది అవసరము) మరల అర్ఘ్యమిచ్చి భగవంతుని స్తుతించవలెను. పిమ్మట అష్టమూర్తియగు శివునకు ప్రదక్షిణము చేసి సాష్టాంగ ప్రణామము చేయ వలెను. నమస్కరించి శివధ్యానముచేసి, క్షేత్రము (పొలము) నందుగాని, అగ్న్యాదులందు గాని శివుని ఉద్దేశించి హోమ-పూజాదులు చేయవలెను. (74)

శివపూజాంగ హోమ విధి

మహేశ్వరుడు పలికెను : పూజానంతరము ఉపాసకుడు శరీరమును వస్త్రాదులతో ఆచ్ఛాదించు కొని, అర్ఘ్యపాత్రను చేత ధరించి, అగ్నిశాలలోనికి వెళ్లి దివ్య దృష్టిచే యజ్ఞమునకు ఆవశ్యకములగు సమస్త ఉపకరణములను సమకూర్చుకొనవలెను. ఉత్తరాభి ముఖుడై అగ్ని కుండమును చూచి కుశలతో దానిని ప్రోక్షించి మార్జనము చేయవలెను. తాడనము (మార్జనము) అస్త్ర మంత్రముతో (ఫట్) చేయవలెను. అభ్యుక్షణము కవచ మంత్రముతో (హుం) చేయవలెను. కవచ మంత్రముచే (హుం) దానికి అభిషేకము, శరమంత్రముచే (ఫట్) భూకుట్టనము చేయవలెను. సమ్మార్జనము, ఉపలేపనము, కలాత్మక రూపకల్పన త్రిసూత్రీపరిధానము, అర్చనము ఇవన్నియు కవచ మంత్రము తోడనే చేయవలెను. కుండమునకు ఉత్తరమున మూడు రేఖలు గీయవలెను. ఒక రేఖ పూర్వాభి ముఖమై పై నుండి క్రిందికివచ్చునట్లు గీయవలెను. రేఖలు కుశతోగాని, త్రిశూలముతోగాని గీయ వలెను. లేదా ఆ రేఖలు అన్నింటిని క్రిందుమీదుగా ఉన్నట్లుకూడ చేయవచ్చును.

అస్త్రమంత్రము (ఫట్) ను ఉచ్చరించి వజ్రీకరణముచేసి, 'నమః' ఉచ్చరించి కుశలచే చతుష్పథన్యాసము చేయవలెను. కవచమంత్రము (హుమ్)తో అక్షపాత్రను, హృదయమంత్ర (నమః)తో విష్టరమును స్థాపించవలెను. "వాగీశ్వర్యై నమః" "ఈశాయ నమః" అను మంత్రములు ఉచ్చరించి వాగీశ్వరిని, ఈశుని ఆవాహనచేసి పూజించవలెను. పిమ్మట మంచి స్థానము నుండి అగ్నిని, శుద్ధమైన పాత్రలో నుంచి తీసికొని వచ్చి, దానినుండి, "క్రవ్యాద మగ్నిం ప్రహిణోమి దూరమ్" ఇత్యాది మంత్రము పఠించుచు క్రవ్యాదాంశమైన అగ్ని కణమును తొలగించవలెను. పిమ్మట నిరీక్షణాదులచే శోధితమగు ఔదర్య, ఐన్దవ, భౌత, అగ్నిత్రయమును ఏకముచేసి "ఓం హూం వహ్ని చైతన్యాయ నమః" అను మంత్రము ఉచ్చరించి అగ్ని బీజముతో (రం) స్థాపించవలెను.

సంహితామంత్రముచే అభిమంత్రితమై, ధేనుముద్రా ప్రదర్శన పూర్వకముగ అమృతీకరణ క్రియచే సంస్కృతమై అస్త్రమంత్రముచే సురక్షితమై, కవచ మంత్రముచే అవగుంఠితమై, పూజింప బడిన అగ్నిని, అగ్నికుండముపై మూడు పర్యాయములు ప్రదక్షిణముగా త్రిప్పి, "ఇది శివుని బీజము" అని భావనచేసి, "వాగీశ్వర దేవునిచే ఈ బీజమును వాగీశ్వరీ గర్భమునందు స్థాపింపబడెను" అని ధ్యానముచేసి, మంత్రసాధకుడు మోకాళ్లు భూమిపైఆన్చి నమస్కార పూర్వకముగ ఆ అగ్నిని తన ఎదుట కుండమునందు స్థాపించవలెను. పిమ్మట ఏకుండమునందు బీజ రూపాగ్ని ధ్యానము చేయబడినదో దాని నాభి దేశమునందు కుశలచే పరిసంవహనము చేయవలెను, పరిధాన–సంభారము, శుద్ధి ఆచమనము, నమస్కారముచేసి గర్భాగ్నిని పూజించి, ఆగర్భజాగ్ని రక్షణము కొరకై అస్త్రమంత్రముచే, వాగీశ్వరీదేవి పాణిపల్లవము నందు కంకణము (రక్షా సూత్రము) కట్టినట్లు భావన చేయవలెను. సద్యోజాత మంత్రముతో, గర్భాధానము కొరకై, అగ్నిపూజనముచేసి, హృదయ మంత్రముతో మూడు ఆహుతులు ఇవ్వవలెను. మూడవ మాసమున జరుగు పుంసవన సంస్కార మును భావన చేసి, అది సిద్ధించుటకై వామదేవ మంత్రముతో అగ్నిని పూజించి "శిరసే స్వాహా" అని పలుకుచు, మూడు హోమములు చేయవలెను, పిమ్మట ఆ అగ్నిపై జలబిందువును చల్లవలెను. పిమ్మట ఆరవమాసమున జరుగు సీమంతోన్నయమును భావనచేసి అఘోర మంత్రముతో అగ్నిని పూజించి, "శాఖాయై వషట్" అని ఉచ్చరించుచు మూడుహోమములుచేసి, ఆ మంత్రముతోడనే ముఖాద్యంగకల్పన చేయవలెను. ముఖోద్ఘాటనమును ప్రకటీకరణమును చేయవలెను. పిమ్మట వెనుకటి వలెనే పదవ మాసమున జరుగు జాతకర్మ, నరకర్మలను భావించుచు తత్పురుష మంత్ర ముతో దర్భాదులతో అగ్నిని పూజించి, జ్వలింపచేసి, గర్భమలమును తొలగించుట కై స్నానము చేయించి, దేవి హస్తమునందు సువర్ణ బంధనము చేసినట్లు భావనచేసి, హృదయ మంత్రముతో పూజించవలెను. సూతకము వెంటనే నివర్తించుటకై అస్త్ర మంత్రముతో అభి మంత్రించిన జలముతో అభిషేకము చేయవలెను.

కుండమును, బైటనుండి, అస్త్రమంత్రము చదువుచు కుశలతో మార్జనము చేయవలెను. 'హుం' అని ఉచ్చరించుచు ఉదకముతో తడపవలెను. కుండము వెలుపల నున్న మేఖలలపై, అస్త్ర మంత్రముతో, ఉత్తర, దక్షిణ దిక్కులందు పూర్వాగ్రముగాను, పూర్వ పశ్చిమములందు ఉత్తరాగ్రము గాను కుశలు పరవవలెను. వాటిపై హృదయ మంత్రముతో పరిధివిష్టరము స్థాపింపవలెను.

పిమ్మట సద్యోజాతాది ముఖపంచకమునకు సంబంధించిన మంత్రములు చదువుచు, అస్త్రమంత్రము ఉచ్చరించుచు, నాలచ్ఛేదనము కొరకై, ఐదు సమిధల మూలములను ఆజ్యమునందు ముంచి హోమము చేయవలెను. పిమ్మట దూర్వా క్షతాదులతో బ్రహ్మ, శివ, విష్ణు, అనంతులను వారి నామములకు 'నమః'చేర్చుచు పూజించవలెను. కుండమునకు నాల్గు వైపులందును పరచిన ఎనిమిది ఆసనములపై పూర్వాది దిక్కులందు వరుసగ ఇంద్రాది దిక్పాలకులను ఆవాహనచేసి, స్థాపనచేసి, వారందరును అగ్నివైపు ముఖములతో కూర్చున్నట్లు భావన చేయుచు, వారి నామములకు 'నమః' చేర్చుచు పూజ చేయవలెను. "ఓ దేవతలారా! మీరందరును విఘ్నములను తొలగించి ఈ బాలకుని (అగ్నిని) సంరక్షించుడు" అను శివాజ్ఞను ఆ దేవతలకు వినిపించి, స్రుక్, స్రువములను ఊర్ధ్వ ముఖములుగ గ్రహించి వాటిని మూడేసి సార్లు అగ్నిపై వెచ్చచేయ వలెను. కుశమూల, మధ్య, అగ్రభాగములతో వాటిని స్పృశించుచు ఆ స్థానములందు క్రమముగ ఆత్మతత్త్వ, విద్యాతత్త్వ, శివ తత్త్వముల న్యాసము చేయవలెను. "ఓం హాం ఆత్మతత్త్వాయ నమః" "ఓం హ్రీం విద్యాతత్త్వాయ నమః" "ఓం హూం శివతత్త్వాయ నమః" అనునవి న్యాస మంత్రములు. పిమ్మట 'శక్త్యై నమః' "శివాయ నమః" అను మంత్రములతో స్రుక్ స్రువములపై శివశక్తి న్యాసము చేయవలెను. మూడు పేటల రక్షా సూత్రమును స్రుక్ స్రువముల కంఠభాగమునందు చుట్టబెట్టవలెను. పుష్పాదులతో వాటిని పూజించి కుడి ప్రక్కన ఉన్న కుశములపై ఉంచవలెను. గోఘృతము గ్రహించి దర్భనాదులచే దానిని పరిశుద్ధముచేసి, తాను బ్రహ్మ మయుడని భావన చేయుచు ఆ ఘృత పాత్రమును హృదయ మంత్రముతో అగ్నికుండముపై ఆగ్నేయమున త్రిప్పి, మరల నేను విష్ణుస్వరూపుడ నని భావన చేయుచు, ఘృతమును హృదయ మంత్రముతో అగ్ని కుండముపై ఆగ్నేయమున త్రిప్పి, మరల నేను విష్ణు స్వరూపుడనని భావన చేయుచు, ఘృతమును ఈశాన్యమునందు ఉంచి, కుశాగ్ర భాగముచే ఘృతము తీసి "శిరసే స్వాహా" "విష్ణవే స్వాహా" అను మంత్రములతో విష్ణువునకు ఆ ఘృత బిందువులను హోమము చేయవలెను. నేను రుద్రమయుడనని భావన చేయుచు, ఘృతమును కుండనాభి స్థానము నందు ఉంచి, దాని ఆప్లావనము చేయవలెను.

ప్రాదేశ (చాపిన బొటన వ్రేలు చివరి నుంచి చూపుడు వ్రేలు చివర వరకు ఉన్న పొడవు ప్రాదేశము) ప్రమాణముగల రెండు కుశలను అంగుష్ఠ, అనామికాంగుళులతో పట్టుకొని, వాటితో అస్త్రమంత్రో (ఫట్) చ్చారణము చేయుచు, నేతిని అగ్నివైపు కదప వలెను. హృదయ మంత్రము (నమః) ఉచ్చరించుచు, చేతిలోని దర్భను కాల్చి, దానిని 'ఫట్'తో అగ్నిచే పవిత్రము చేయవలెను. మండుతున్న కుశతో దానికి హారతిఇచ్చి, మరొక కుశతో దానిని కాల్చవలెను. మండిన కుశను అస్త్రమంత్రముతో అగ్నిలో పడవేయవలెను. పిమ్మట, ముడివేసిన, ప్రాదేశ ప్రమాణముగల కుశను చేతిలో ఉంచవలెను. ఘృతములో రెండు పక్షములు, ఇడాది నాడీత్రయము ఉన్నట్లు భావన చేయ వలెను. ఇడ మొదలగు మూడు భాగముల నుండి క్రమముగ స్రువముతో ఘృతము గ్రహించి హోమము చేయగా మిగిలిన ఘృతమును, వేరుగా ఉంచిన పాత్రలో ఉంచవలెను. ఇడాభాగము నుండి ఆజ్యము గ్రహించి "ఓం హాం అగ్నయే స్వాహా" అను మంత్రము ఉచ్చరించుచు హోమము చేసి, హుత శేషమును ఒక పాత్రలో ఉంచవలెను. పింగలా భాగము నుండి ఆజ్యము గ్రహించి

“ఓం హాం సోమాయ స్వాహా” అని ఉచ్చరించుచు హోమముచేసి, హుతశేషమును ఒక పాత్రలో ఉంచవలెను. సుషుమ్ణానాడీ భాగము నుండి ఆజ్యము గ్రహించి “ఓం హాం అగ్నీ షోమాభ్యాం స్వాహా” అని ఉచ్చరించుచు స్రువముతో హోమముచేసి, హుత శేషమును ఒక పాత్రలో ఉంచు కొనవలెను. పిమ్మట బాలకుడైన అగ్నియొక్క ముఖము నందున్న నేత్రత్రయ స్థానమున మూడు నేత్రముల ఉద్ఘాటనము చేయుటకై, ఘృతపూర్ణమగు స్రువముతో “ఓం హామగ్నయే స్విష్టకృతే స్వాహా” అను మంత్రమును ఉచ్చరించుచు నాల్గవ ఆహుతి ఇవ్వవలెను. “ఓం హాం హృదయాయ నమః” ఇత్యాద్యంగ మంత్రములు ఆరును ఉచ్చరించుచు ఆజ్యమును అభిమంత్రించి, ధేను ముద్రతో మేల్కొల్పవలెను. కవచ మంత్రముచే (హుం) ఆచ్ఛాదించి, శరమంత్రముచే ఘృత బిందూక్షేపణము చేసి, అభ్యుక్షణ శోధనములు చేయవలెను. శివస్వరూపుడగు అగ్ని యొక్క ఐదు ముఖములకు అభిఘార హోమము, అనుసంధాన హోమము, ముఖముల ఏకీకరణమునకై చేయు హోమమును చేయవలెను. “ఓం హాం సద్యోజాతాయ స్వాహా, క్షం హాం వామదేవాయ స్వాహా, ఓం హాం అఘోరాయ స్వాహా, ఓం మాం తత్పురుషాయ స్వాహా, ఓం హాం ఈశానాయ స్వాహా” అను ఐదు మంత్రములచే, ఐదు ముఖములకొరకు ఒక్కొక్క దానికి ఒక్కొక్క ఆజ్యాహుతిచేసి, ఆ ముఖములను అభిఘారము చేసిన ఆజ్యముతో ఆప్లావితము చేయవలెను. ఇది ముఖాభిఘార హోమము. పిమ్మట రెండేసి ముఖములకు ఒక ఆహుతి ఇవ్వవలెను. ఇది ముఖానుసంధాన హోమము. దానిని “ఓం హాం సద్యోజాత వామ దేవాభ్యాం స్వాహా, ఓం హాం వామదేవా ఘోరాభ్యాం స్వాహా, ఓం హాం అఘోర తత్పురుషా భ్యాం స్వాహా, ఓం హా తత్పురుషేశానాభ్యాం స్వాహా” అను మంత్రములతో చేయవలెను.

పిమ్మట కుండమునందు ఆగ్నేయము నుండి వాయవ్యము వరకును నైరృతి నుండి ఈశాన్యము వరకును, “ఓం హాం సద్యోజాత, వాసుదేవా ఘోర తత్పురుషేశానేభ్యః స్వాహా” అను మంత్రముతో అవిచ్ఛిన్నాజ్యధారా హోమము చేసి పంచముఖముల ఏకీకరణము చేయవలెను. ఈ విధముగ ఇష్టముఖమునందు అన్ని ముఖములును అంతర్భూతములగును. అందుచే ఒకే ముఖము అన్ని ముఖముల ఆకారమును ధరించును. కుండమునందు ఈశాన్యమున అగ్నిని పూజించి, అస్త్ర మంత్రముతో మూడు ఆహుతుల నిచ్చి, అగ్నికి నామకరణము చేయవలెను. ‘ఓ అగ్నిదేవా! నీవు అన్ని విధముల శివుడవు, మంగళప్రదుడవు. అందుచే నీ పేరు శివుడు” అని నామకరణముచేసి, పూజింపబడిన మాతా పితరులగు వాగీశ్వరీ వాగీశ్వరులను, నమస్కార పూర్వకముగ అగ్నియందు విసర్జించి, వారికొరకై విధి పూర్వకముగ పూర్ణాహుతి ఈయవలెను. మూలమంత్రము చివర ‘వౌషట్’చేర్చి శివశక్తులకు యథావిధిగ పూర్ణాహుతి ఈయవలెను. పిమ్మట అంగ, సేనాసమేతుడగు, పరమతేజఃశాలియైన శివుని హృదయ కమలమునందు ఆవాహనచేసి, వెనుకటివలెనే పూజించి ఆ శివుని ఆజ్ఞగైకొని ఆయనను పూర్తిగ తృప్తుని చేయవలెను.

యజ్ఞాగ్నికిని, శివునకును తనతో నాడీసంధానముచేసి, శక్త్యానుసారముగ మూల మంత్రముతో అంగసహితముగ దశాంశహోమము చేయవలెను. ఒక్కొక్క కర్ష ప్రమాణముగల ఘృత, క్షీర, మధులను, శుక్తి ప్రమాణముగల పెరుగును, చారెడు పాయసమును హోమము చేయవలెను.

లాజలు, సర్వ భక్ష్యములు పిడికిలి ప్రమాణమున గ్రహించి హోమము చేయవలెను. మూలములు మూడు ముక్కలు ఒక ఆహుతిగా ఈయవలెను. ఫలములు వాటి ప్రమాణము ఎంత ఉండునో అంతే చేయవలెను. అన్నము ప్రమాణము గ్రాసములో సగము. చిన్న (కిస్‌మిస్ వంటి) వాటిని పర్యాయమునకు ఐదేసి గ్రహించి హోమము చేయవలెను. చెరకు ఒక కణుపు గ్రహించవలెను. లతలు రెండేసి అంగుళములు ఉండవలెను. పుష్పపత్రముల ప్రమాణము వాటి ప్రమాణమును అనుసరించి ఉండవలెను. సమిధలు పది అంగుళముల పొడవు ఉండవలెను.

కర్పూర, చందన, కేసర, కస్తూరీ,యక్షకర్దమములు కలాయ ప్రమాణమున (శనగ గింజంత) ఉండవలెను. గుగ్గిలు రేగి గింజంత ఉండవలెను. కందములు ఎనిమిదవ వంతుతో ఒక ఆహుతి చేయవలెను. ఈ విధముగ ఆలోచించి, యథావిధిగ ఆహుతుల నీయవలెను. ఈ విధముగ ప్రణ వముతోను, బీజాక్షరములతోను హోమము సుసంపన్న మగునటుల చేయవలెను. పిమ్మట ఘృత ముతో నింపిన స్రుక్కుపైన అధోముఖమగు స్రువము ఉంచి, స్రుక్కునకు చివర పుష్పములు ఉంచ వలెను. రెండు చేతులతోడను ఆ రెండింటిని, శంఖముద్రతో పట్టుకొనవలెను. శరీరము పైభాగము ఉన్నతమగునట్లు చేసి లేచి పాదములు సమముగా ఉంచి నిలచి, స్రుక్స్రువముల మూల భాగములను నాభికి ఆన్చి, దృష్టిని స్థిరముగ నిలిపి, భావనచే బ్రహ్మాది కారణములను విడచుచు, సుషుమ్నా నాడీ మార్గమున బైటకు వచ్చి పైన నిలబడవలెను. స్రుక్స్రువముల మూల భాగములను నాభినుండి పైకిలేపి ఎడమ స్తనమువైపు తీసికొని రావలెను. శరీరముచేతను, మనస్సుచేతను ఆలస్యమును రూపముచేసి, వషట్ వరకును మూలమంత్రములు (ఓం నమః శివాయ వౌషట్) మెల్లగ చదువుచు ఆ ఘృతమును యవవలె సన్ననైన ధారతో హోమము చేయవలెను. పిదప, ఆచమన, చందన, తాంబూలాదులు సమర్పించి భక్తి భావముతో శివుని ఐశ్వర్యమునకు సాష్టాంగ వందనముచేసి మరల అగ్నిపూజ చేసి, 'ఓం హః అస్త్రాయ ఫట్" అని ఉచ్చరించుచు సంహారముద్రచే శంబరా హరణము చేసి, భగవంతుడా! నా అపరాధములను క్షమింపుము అని ఇష్టదేవతను ప్రార్థించి హృదయ మంత్రము ఉచ్చరించుచు పూరక ప్రాణాయామముచే, శ్రద్ధతో, తేజఃశాలులగు ఆ సంధు లను తన హృదయ కమలమునందు నిలుపవలెను. వండిన పదార్థములలోని అగ్రభాగము తీసి, కుండ సమీపమున అగ్ని కోణమునందు, రెండు మండలములు చేసి ఒక దానిలో అంతర్బలి ఈయవలెను. రెండవదానియందు బాహ్యబలి ఈయవలెను. ప్రథమ మండలమునందు, పూర్వ దిక్కున, "ఓం హాం రుద్రేభ్యః స్వాహా" అను మంత్రముతో రుద్రులకు బలి ఈయవలెను. దక్షిణమున "ఓం హాం మాతృభ్యః స్వాహా" అను మంత్రముతో మాతృ కలకును, పశ్చిమమున ఓం హాం గణేభ్యః స్వాహా, తేభ్యోయం బలిరస్తు అను మంత్రముతో గణములకును, ఉత్తరమున "ఓం హాం యక్షేభ్యః స్వాహా, తేభ్యోయం బలిరస్తు అను మంత్రముతో యక్షులకును, ఈశాన్యమునందు 'ఓం హాం గ్రహేభ్యః స్వాహా తేభ్యోయం బలిరస్తు' అని చెప్పి గ్రహములకును, ఆగ్నేయమున 'ఓం హాం అసురేభ్యః స్వాహా' తేభ్యోయం బలిరస్తు అని చెప్పి అసురులకును, నైరృతియందు 'ఓం మాం రక్షోభ్యః స్వాహా', తేభ్యోయం బలిరస్తు అని చెప్పి రాక్షసులకును, వాయవ్యము నందు 'ఓం మాం నాగేభ్యః స్వాహా', తేభ్యోయం బలిరస్తు అని నాగులకును, మండల మధ్యభాగమున ఓం హాం

నక్షత్రేభ్యః స్వాహాతేభ్యోయం బలిరస్తు అని చెప్పి నక్షత్రములకును బలి ఇవ్వవలెను. 'ఓం హాం రాశిభ్యః స్వాహా' తేభ్యోయం బలిరస్తు అని చెప్పి ఆగ్నేయమునందు రాశులకును, 'ఓం హాం విశ్వేభ్యో దేవేభ్యః స్వాహా' తేభ్యోయం బలిరస్తు అని చెప్పి నైరృతి యందు విశ్వేదేవతలకును, 'ఓం హాం క్షేత్రపాలాయ స్వాహా', తస్మా అయం బలిరస్తు అని చెప్పి పశ్చిమమునందు క్షేత్ర పాలునకును బలి ఈయవలెను. పిమ్మట రెండవ బాహ్య మండలమునందు, పూర్వాది దిక్కులందు, వరుసగ ఇంద్ర, అగ్ని, యమ, నిరృతి, వరుణ, వాయు, కుబేర, ఈశానులకు బలి సమర్పించవలెను. పిదప ఈశాన్యమునందు ఓం బ్రహ్మణే నమః స్వాహా అని చెప్పి బ్రహ్మకును, నైరృతియందు ఓం విష్ణవే నమః స్వాహా అని చెప్పి విష్ణువునకు బలి ఇవ్వవలెను. మండలము వెలుపల కాకాదులకు గూడ బలి అంతర, బాహ్యబలుల నిచ్చునపుడు ఉపయోగించిన మంత్రములను సంహారముద్రచే తనలో లీనము చేసికొనవలెను. (75)

చండపూజా విధి

ఈశ్వరుడు పలికెను : స్కందా! పిమ్మట శివ విగ్రహము దగ్గరకు వెళ్ళి 'పరమేశ్వరా! నేను చేసిన హోమ పూజాదులవలన కలిగిన పుణ్యమును గ్రహింపుము' అని ప్రార్థించి, స్థిరచిత్తుడై 'ఉద్భవ' ముద్ర చూపి, అర్ఘ్యజలముతో, 'నమః' చేర్చిన పూర్వోక్త మూల మంత్రము చదువుచు ఇష్టదేవతకు అర్ఘ్యము సమర్పింపవలెను. పిమ్మట వెనుకటి వలెనే పూజించి, స్తోత్రములతో స్తుతించి, నమస్కరించి, పరాఙ్ముఖుడై అర్ఘ్యమిచ్చి, "ప్రభో! నా అపరాధములను క్షమించుము" అని పలుకుచు నారాచముద్ర చూపి, "అస్త్రాయ ఫట్" అని ఉచ్చరించుచు సమస్త సంగ్రహములను తనలో ఉప సంహారము చేసికొని, శివలింగమును మూర్తి మంత్రములతో అభిమంత్రించవలెను. వేదికపై ఇష్ట దేవతాపూజ చేసి, మంత్రమును తనలో విలీనముచేసికొని పూర్వోక్తవిధమున చండుని పూజ చేయవలెను.

ఓం చండేశాయ నమః అని పూజ చేయవలెను. ఓం ధూలి చండేశ్వరాయ హూం ఫట్ స్వాహా" అనుచు ఆ విగ్రహముపై చండేశ్వరుని ఆవాహనము చేయవలెను. పిమ్మట అంగపూజ 'ఓం చణ్డ శిరసే హూం ఫట్' అని శిరస్సును, 'ఓం చణ్డశిఖాయై హూం ఫట్' అని శిఖను 'ఓం చణ్డాయుష్కవచాయ హూం ఫట్' అని కవచమును, 'ఓం చణాస్త్రాయ హూం ఫట్' అని అస్త్రమును పూజించవలెను. పిదప రుద్రాగ్ని నుండి జనించిన చండదేవతను 'చండదేవుడు హస్తములతో శూలమును, టంకమును ధరించి యుండును. నీలవర్ణము కలవాడు మూడవ హస్తమున అక్ష సూత్రమును, నాల్గవ హస్తమున కమండలమును ధరించి యుండును. అది టంకాకారము గలది, లేదా అర్ధచంద్రాకారము గలదిగా మండలమున ఉండును. నాలుగు ముఖములు కలవాడు" అని ధ్యానించి, పూజించి, యథాశక్తి జపము చేయవలెను. హోమ సామాగ్రి సమకూర్చుకొని జపములు దశాంశము హోమము చేయవలెను. భగవంతునకు సమర్పించిన గో, భూ, సువర్ణ, వస్త్ర, రత్నాదులు తప్ప మిగిలిన నిర్మాల్యము నంతను చండేశ్వరునకు సమర్పించవలెను.

సమయమున ఇట్లు చెప్పవలెను "ఓం చండేశ్వరా! శివుని ఆజ్ఞచే ఈ లేహ్యా చోషార్వ్యత్త మాన్నము, తాంబూలము, పుష్పములు, అనులేపనము మొదలగు నిర్మాల్య రూప భోజన మును నీకు సమర్పించుచున్నాను చండా! పూజకు సంబంధించిన ఈ కర్మకాండయు అంతను నేను నీ ఆజ్ఞచే నిర్వర్తించితిని. అజ్ఞానముచే కలిగిన న్యూనత్వాధి కత్వాది దోషములు తొలగి ఈ పూజాదికము పరిపూర్ణమగుగాక." ఈ విధముగ నివేదించి, ఆ దేవతలను స్మరించుచు, అర్ఘ్యము ఇచ్చి, సంహార మూర్తి మంత్రమును చదివి, సంహార ముద్ర భూములను అన్నింటిని తనలో ఉపసంహరించు కొనవలెను. నిర్మాల్యమును తోసివేసిన ప్రదేశమును గోమయజలముతో అలికి, అర్ఘ్యాదుల ప్రోక్షణము చేసి దేవతా విసర్జనము చేసిన పిమ్మట ఆచమనము చేసి మిగిలిన అవశ్యక కార్యములను ముగించు కొనవలెను. (76)

కపిలాపూజాది విధానము

ఈశ్వరుడు పలికెను : "ఇపుడు కపిలాపూజన విధానము చెప్పెదను. ఈ క్రింది మంత్రములతో గోపూజ చేయవలెను. ఓం కపిలే నమోనమః; ఓం కపిలే భద్రికే నమః, ఓం కపిలే సుశీలే నమః, ఓం కపిలే సురభిప్రభే నమః, ఓం కపిలే సుమనసే నమః, ఓం కపిలే భుక్తిముక్తి ప్రదేనమః" ఈ విధముగ పూజించిన పిమ్మట "దేవతలకు అమృతము ఇచ్చుదానా! వరములను ఇచ్చుదానా! జగన్మాతా! సౌరభేయీ! ఈ గ్రాసమును స్వీకరించి నాకు మనోవాంఛిత వస్తువులను ఇమ్ము. ఓ కపిలా! బ్రహ్మర్షియైన వసిష్ఠుడును, బుద్ధి శాలియగు విశ్వామిత్రుడును నీకు నమస్కరించినారు. నేను ఏయే దుష్కర్మలు చేసితినో ఆ పాపములను అన్నింటిని హరింపుము, గోవులు సర్వదా నీ ముందు, వెనుక, హృదయమున నివసించుగాక, నేను సర్వదా గోవుల మధ్య నివసింతునుగాక, ఓ గోమాతా! నేను ఇచ్చిన ఈ గ్రాసమును స్వీకరింపుము" అని ప్రార్థించవలెను. ఈ విధముగ గోమాతను ప్రార్థించువాడు పాపరహితుడై శివస్వరూపుడగును.

విద్యాభ్యాసము చేయువాడు ప్రతిదినము పుస్తకములకు పూజచేసి గురుచరణములకు నమస్కరించవలెను. గృహస్థుడు నిత్యము మధ్యాహ్నకాలమున స్నానముచేసి అష్టపుష్పికా విధానమున శివుని పూజించవలెను. యోగపీఠమును దానిపై స్థాపించిన శివునిమూర్తిని, శివుని మోకాళ్లను, పాదములను, హస్తములను, వక్షస్థలమును, శిరస్సును, వాక్కును, దృష్టిని, బుద్ధిని, ఈ ఎనిమిది అంగములను పూజించుటయే "అష్టపుష్పికాపూజ". మధ్యా హ్నాముస చక్కగా అలికిన భోజన గృహములోనికి వండిన భోజన పదార్థములను తీసికొని వచ్చి, 'వౌషట్' మంత్రము చివర చేర్చిన మృత్యుంజయ (త్ర్యమ్బకం యజామహే) ఇత్యాది మంత్రము ఏడు పర్యాయములు జపించి కుశయుక్త శంఖమునందు ఉంచిన ఉదకము ఆ అన్నముపై చల్లి, అన్ని పదార్థముల అగ్రభాగములను శివునకు నివేదన చేయవలెను.

పిమ్మట సగము అన్నమును ఛుల్లికా (పొయ్యి) హోమము కొరకు తీసి ఉంచవలెను. విధి పూర్వకముగ పొయ్యి శ్రార్ధము చేసి దాని అగ్నిలో, పూరక ప్రాణాయామముతో ఒక హోమము

చేయవలెను. జఠారానలమును ఉద్దేశించి ఒక ఆహుతి ఇచ్చి రేచక ప్రాణా యామముచే లోపలినుండి బైటకు వచ్చుచున్న వాయువుతో అగ్నిబీజమును (రం) గ్రహించి, క్రమముగ, కకారాద్యక్షరముల ఉచ్చారణ స్థానములగు కంఠాదుల ద్వారా బైటకు తీసికొని వచ్చి, "నీవు శివస్వరూపుడవగు అగ్నివి" అని చింతించుచు దానిని పొయ్యిలో ఉన్న అగ్నితో కలిపినట్లు భావనచేయవలెను. పిమ్మట పొయ్యికి పూర్వాది దిశలందు "ఓం హాం అగ్నయే నమః' ఓం హాం సోమాయ నమః, ఓం హాం సూర్యాయ నమః, ఓం హాం బృహ స్పతయే నమః, ఓం హాం ప్రజాపతయే నమః, ఓం హాం సర్వేభ్యోదేవేభ్యో నమః, ఓం హాం సర్వవిశ్వే భ్యో నమః, ఓం హాం అగ్నయే స్విష్టకృతే నమః" అను ఎనిమిది మంత్రములతో ఎనమండుగురు దేవతలను పూజించవలెను. పిదప ఈ మంత్రముల చివర 'స్వాహా' చేర్చి ఒక్కొక్క ఆహుతి ఇచ్చి, అపరాధములను క్షమింపుడని ప్రార్థించి అందరిని విసర్జన చేయవలెను.

పొయ్యికి కుడిప్రక్క "ధర్మాయ నమః" అను మంత్రముతో ధర్మమును, ఎడమప్రక్క 'అధర్మాయ నమః' అను మంత్రముతో అధర్మమును పూజించవలెను. గంజి మొదలగునవి పోయుటకు ఉపయోగించు పాత్రలందును, జలమునుంచు ఘటాదులందును "ఓం రసపరివర్తమానాయ వరుణాయ నమః" అను మంత్రముతో వరుణుని, వంటింటి ద్వార మున 'విఘ్న రాజాయ నమః' అని విఘ్నేశ్వరుని, తిరుగలిపై "సుభగాయై నమః" అని సుభగను, రోటియందు "రౌద్రికే గిరికే నమః" అను మంత్రముచే రౌద్రికా, గిరికలను, రోకలి యందు "బలప్రియాయాయుధాయ నమః" అను మంత్రముతో బలరాముని ఆయుధమును పూజించవలెను.

చీపురుపైన పూర్వోక్త దేవతలను (రౌద్రికా గిరికలను), శయ్యపై కామదేవుని, మధ్య నున్న స్తంభముపై స్కంధుని పూజింపవలెను. పిమ్మట వ్రతపాలనము చేయు సాధకుడును, పురోహితుడును వాస్తుదేవతకు బలి సమర్పించి, బంగారు పాత్రలోగాని, లేదా తామరా కులలోగాని భోజనము చేయవలెను.

మఱ్ఱి, రావి, జిల్లేడు, వాతావి, సర్జము, భల్లాతకము ఈ ఆకులలో భోజనము చేయగూడదు. ముందు ఆచమనముచేసి, 'ప్రాణ' మొదలగు శబ్దములకు మొదట 'ఓం' కారము చివర "స్వాహా" చేర్చి అన్నము ఐదు ఆహుతులు తీసికొని, జఠరాగ్ని ఉద్దీప్తము చేసి పిమ్మట భోజనము చేయవలెను. నాగ, కూర్మ, కృకల, దేవదత్త, దనంజయములు ఉపవాయువులు "ఏతేభ్యో నాగాదిభ్య ఉపవాయుభ్యః స్వాహా" అను మంత్రముతో ఆచమనముచేసి, అన్నాదులను నివేదనముచేసి, చివర మరల ఆచమ నముచేసి "ఓం అమృతోపస్తరణమసి స్వాహా" అని చెప్పి, "ఓం ప్రాణాయ స్వాహా, ఓం అపానాయ స్వాహా, ఓం వ్యానాయ స్వాహా, ఓం ఉదానాయ స్వాహా, ఓం సమానాయ స్వాహా" అను మంత్రము లతో పంచ ప్రాణములకును పంచాహును తన ముఖమునందు ఈయవలెను. పిమ్మట పూర్తిగా భోజనముచేసి, చులుకము నీటితో ఆచమనముచేసి, "ఓం అమృ తాపిధానమసి స్వాహా" అని చెప్పవలెను. ఈ ఆచమనము శరీరములోపల నున్న అన్నమును ఆచ్ఛాదించుటకు ఉపయోగించును. (77)

పవిత్రాధివాసనము

ఈశ్వరుడు ఇట్లు చెప్పెను : ఇపుడు, క్రియా, యోగ, పూజాదులలోని లోపములను తొలగించు పవిత్రారోహణమును గూర్చి చెప్పెదను. నిత్యమును చేయు 'పవిత్రారోహణము న'కు నిత్యమనియు, ఏదైన ఒక నిమిత్తమును పురస్కరించుకొని చేయుదానికి నైమిత్తికము అనియు పేర్లు. ఆషాఢమాసము లోని మొదటి చతుర్దశియందు, శ్రావణ భాద్రపద మాసము లలో రెండు పక్షముల చతుర్దశులందును, అష్టమీ తిథులందును పవిత్రారోహణ కర్మ చేయవలెను. లేదా ఆషాఢ పూర్ణిమ నుండి కార్తికపూర్ణిమ వరకును, ప్రతిపత్తు మొదలగు తిథులందు విభిన్న దేవతలకొరకై పవిత్రారోహణము చేయవలెను. ప్రతిపత్తునందు అగ్నికిని, ద్వితీయయందు బ్రహ్మకును, తృతీయయందు పార్వతికిని, చతుర్థియందు గణేశునకును, పంచమినాడు నాగరాజైన అనంతునకు, షష్ఠినాడు స్కంధునకు, సప్తమినాడు సూర్యు నకును, అష్టమినాడు శివునకు, నవమినాడు దుర్గకును, దశమినాడు యమునకును, ఏకాదశినాడు ఇంద్రునకును, ద్వాదశినాడు గోవిందునకును, త్రయోదశియందు కామధేనువునకును, చతుర్దశినాడు శివునకును, పూర్ణిమనాడు అమృతాశీనులగు దేవతలకును పవిత్రారోపణము చేయవలెను. కృత, త్రేతా, ద్వాపర యుగములందు క్రమముగ బంగారము, వెండి, రాగి పవిత్రకములు అర్పింపబడును. కాని కలియుగమునందు పత్తి, కమలనాభములు మొదలగువాటి దారములతో నిర్మించిన పవిత్రకములు అర్పింపబడును. కాని పవిత్రకము నందలి తొమ్మిది దారములకును వరుసగ ఓంకార, చంద్ర, అగ్ని, బ్రహ్మ, నాగగణ, స్కంద, శ్రీహరి, సర్వేశ్వర సకల దేవతలు అదిష్ఠానదేవతలు. నూట ఎనిమిది దారములతో నిర్మించిన పవిత్రకము ఉత్తమశ్రేణికి చెందినది. ఏబదినాల్గు సూత్రము లున్నది మధ్యమము; ఇరువదియేడు సూత్రములున్నది అధమము. లేదా ఎనుబది యొక్క సూత్ర ములు, ఏబది సూత్రములు, ముప్పది ఎనిమిది సూత్రములు ఉన్న పవిత్రకమును నిర్మించవలెను. గ్రంథుల మధ్యనున్న వ్యవధానము సమముగా ఉండవలెను. పవిత్రముల విస్తారభా పండ్రెండు అంగుళములు గాని, ఎనిమిది అంగుళములుగాని, నాలుగు అంగుళములు గాని ఉండవలెను. శివలింగమునకై నిర్మించు పవిత్రకము ఆ లింగమంత ప్రమాణముకలదై ఉండవలెను.

అన్ని దేవతామూర్తులకును ఉపయోగించు నాల్గవ విధమగు పవిత్రకము ఆ దేవతామూర్తితో కాని, దాని పిండితోగాని సమముగా నుండును. దీనికి "గంగావతారకము" అని పేరు. దీనిని సద్యోజాత మంత్రముతో బాగుగా శుభ్రముచేసి, వామదేవ మంత్రముతో గ్రంథి వేసి, అఘోర మంత్రముతో రక్తచందనము, కుంకుమము పూయవలెను. లేదా కస్తూరి, గోరోచనము, కర్పూరము, పసుపు, గైరికము మొదలగునవి కలిపిచేసిన రంగు పూయవలెను. పది గ్రంథులుకాని, ఎన్ని తంతువులు ఉన్నవో అన్ని గ్రంథులు కాని వేయ వలెను. ఒక గ్రంథి నుండి మరొక గ్రంథి దగ్గరకు ఒక అంగుళము గాని, రెండు అంగుళములు గాని, నాలుగు అంగుళములు గాని దూరము ఉండవలెను. అందముగా ఉండు విధమున దూరము ఉంచవలెను. ప్రకృతి, పౌరుషి, వీర, అపరాజిత, జయ, విజయ, సదాశివ, మనోన్మని, సర్వతోముఖి అనువారు పది గ్రంథుల అధిష్ఠాన దేవతలు, పది కంటె ఎక్కువ గ్రంథులు కూడ అందముగా వేయవలెను. పవిత్రకము చంద్రమండల,

అగ్నిమండల, సూర్యమండలములతో కూడి ఉన్నట్లు భావన చేయుచు, అది సాక్షాత్తు శివునితో తుల్యమైనదని భావించుచు హృదయమునందు ధరించవలెను. శివ రూపునిగా భావించిన తనకును, పుస్తకమునకును, గురుగణమునకును ఒక్కొక్క పవిత్రకమును సమర్పించవలెను.

ద్వారపాల, దిక్పాల, కలశాదులపై గూడ ఒక్కొక్క పవిత్రకము ఉంచవలెను. శివలింగములకు అర్పించు పవిత్రకము పొడవు ఒక హస్తము మొదలు తొమ్మిది హస్తముల వరకును ఉండును. ఒక హస్తము పొడవైన పవిత్రకమునందు ఇరువది ఎనిమిది గ్రంథులు ఉండును. పిమ్మట క్రమముగ పదేసి గ్రంథులు పెంచవలెను. ఈ విధముగ తొమ్మిది హస్తముల పవిత్రకము నందు నూట ఎనిమిది గ్రంథులుండును. ఈ గ్రంథుల మధ్య వ్యవధానము ఒకటి రెండేసి అంగుళములు ఉండును. వీటి మానము కూడ లింగ విస్తారమును బట్టి ఉండును. ఉపాసకుడు సప్తమీ దివసమున గాని, త్రయోదశీ దివసమునగాని, నిత్య కర్మాదులు ముగించుకొని సాయంకాలమున పుష్ప వస్త్రాదులతో యాగ గృహమును అలంకరించవలెను. నైమిత్తిక సంధ్యోపాసనచేసి, విశేషతర్పణములు చేసి, పిమ్మట పూజార్థమై నిశ్చితమైన పవిత్రభూమి భాగమునందు సూర్యుని పూజించవలెను. ఆచార్యుడు, ఆచమనము, సకలీకరణము పూర్తిచేసి ప్రణవోచ్చారణ పూర్వకముగ అర్ఘ్య పాత్రమును హస్తమున గ్రహించి, అస్త్రమంత్రము (ఫట్) ఉచ్చరించుచు క్రమముగ పూర్వాది దిక్కులం దున్న ద్వారములను ప్రోక్షించి పూజించవలెను. 'హాం శాన్తికళాద్వారాయ నమః', హాం విద్యాకళాద్వారాయ నమః, హాం నివృత్తి కళాద్వారాయ నమః, హాం ప్రతిష్ఠాకళా ద్వారాయ నమః"అను మంత్రములతో పూర్వాది దిగ్ద్వారముల పూజ చేయవలెను. ప్రతి ద్వారమునకును కుడి, ఎడమ ప్రక్కలనున్న ఇద్ద రిద్దరు ద్వారపాలకులను పూజించవలెను. తూర్పున "నన్దినే నమః" "మహాకాలాయ నమః" అను మంత్రములతో నంది, మహాకాలులను; దక్షిణమున, "భృఙ్గిణే నమః" 'గణాయ నమః' అను మంత్రముతో భృంగి, గణములను; పశ్చిమమున "వృషభాయ నమః" "స్కన్దాయనమః" అను మంత్రములతో వృషభ, స్కందులను; ఉత్తరమున "దేవ్యైనమః" "చణ్డాయనమః" అను మంత్రములతో దేవీ చందులను పూజించవలెను.

ద్వారపాలాది నిత్య పూజానంతరము పశ్చిమ ద్వారము నుండి యాగ గృహము ప్రవేశించి, వాస్తు దేవతా పూజచేసి, భూతశుద్ధి చేయవలెను. విశేషార్ఘ్యము చేత గ్రహించి, తనను శివస్వరూపునిగ భావించుచు, పూజ సామగ్రిని ప్రోక్షణాదికము చేసి యజ్ఞభూమి సంస్కారము చేయవలెను. పిమ్మట కుశలు, దూర్వలు, పుష్పములు మొదలగువాటిని హస్తమునందు గ్రహించి 'నమః' మొదలగునవి ఉచ్చరించుచు వాటిని అభిమంత్రించవలెను. ఈ విధముగ శివహస్త నిధానముచేసి, దానిని తన శిరస్సుపై ఉంచుకొని 'నేనే అన్నింటికిని మూలకారణమైన, సర్వజ్ఞుడైన శివుడను. యజ్ఞమునందు నాకే ప్రాధాన్యము'అని భావన చేయుచు, శివధ్యానము చేయుచు, ఆచార్యుడు జ్ఞానమనెడు ఖడ్గమును హస్తము నందు గ్రహించి, నైరృతి దిక్కువైపువెళ్లి, ఉత్తరాభిముఖుడై, అర్ఘ్యజలమును ఇచ్చి, యజ్ఞ మండపము నలువైపులందును పంచగవ్యములు చల్లవలెను. చతుష్పదాంత సంస్కారము ఉత్తమ సంస్కారయుక్త దీక్షణము మొదలగునవిచేసి, అచట తెల్ల ఆవాలు మొదలగునవి చల్లి, కుశనిర్మితమగు కూర్చతో వాటిని ఉపసంహరించవలెను. పిమ్మట వాటితో, ఈశాన్య మునందు వర్ధనీ-కలశములను స్థాపించుటకు ఉపయోగించు ఆసనము కల్పింపవలెను.

పిదప నైరృతి దిక్కున వాస్తుదేవతలను, ద్వారమునందు లక్ష్మిని పూజించి, పశ్చిమా భిముఖమగు కలశమును సప్త ధాన్యములపై ఉంచి "శివ స్వరూపమగు ఈ కలశము నందికేశ్వరుని పృష్టముపై ఎక్కినది" అని భావించవలెను. 'వర్ధని సింహముపై ఎక్కినది'అని భావన చేయవలెను. కలశముపైన సాంబశివుని పూజించి, వర్ధనిపై అస్త్రమును పూజించి, పూర్వాది దిక్కులందు ఇంద్రాది దిక్పాలకులను, మండప మధ్య భాగమున బ్రహ్మను విష్ణు శివాదులను పూజించవలెను. కలశ పృష్ఠ భాగమును అనుసరించియున్న వర్ధనిని చక్కగ హస్తమునందు గ్రహించి, మంత్రజ్ఞుడగు గురువు, శివుని ఆజ్ఞను వినిపించవలెను. ప్రదక్షిణ క్రమమున తూర్పునుండి ఈశాన్యము వరకును అవిచ్ఛిన్న జలధార విడచుచు మూల మంత్రమును ఉచ్చరించవలెను. యజ్ఞ మండప రక్ష కొరకై శస్త్రరూపమగు వర్ధనిని నాల్గు ప్రక్కల త్రిప్పవలెను. ముందుగ కలశను స్థాపించి, దాని వామభాగమున, వస్త్రము కొరకై వర్ధని స్థాపించవలెను. ఉత్తమము, స్థిరముఅగు ఆసనముపై నున్న కల శముపై శివుని, ప్రణవముపైఉన్న వర్ధనిపై శివుని ఆయుధములను పూజించవలెను. లింగముద్రచే ఆ రెండింటిని కలిపి భగలింగ సంయోగమును కల్పింపవలెను. కలశముపై జ్ఞానరూప మగు ఖడ్గమును సమర్పించి మూల మంత్రజపము చేయవలెను. ఆ జపములో దశాంశ హోమముచేసి వర్ధనిలో రక్షను ఘోషించ వలెను. వాయవ్యమున గణేశ పూజచేసి, పంచామృతాదులతో శివునకు స్నానము చేయించి, సంపాతాహుతి విధానముచే దానిని శోధించి, పిమ్మట శివుడు, అగ్ని, ఆత్మ (తాను)అను ముగ్గురు అధికారులకై చిన్న గరిటెతో ఆ చరువును మూడు భాగములుచేసి, శివ, అగ్ని కుండమునందు సమర్పించి, తన భాగమును సురక్షితముగ ఉంచుకొనవలెను.

తత్పురుష మంత్రమునకు 'హుం' చేర్చి ఉచ్చరించుచు తూర్పున ఇష్టదేవతకు దంత ధావనమును సమర్పింపవలెను. అఘోర మంత్రమునకు "వషట్" చేర్చి ఉచ్చరించుచు ఉత్తరమున ఉసిరికకాయ సమర్పించవలెను. వామదేవ మంత్రమునకు "స్వాహా" చేర్చి ఉచ్చరించుచు జలము నివేదించవలెను. ఈశాన మంత్రముతో ఈశాన్యమునందు సుగంధిత జలమును సమర్పింపవలెను. పంచగవ్యములు, పలాశములు మొదలగువాటి దొన్నెలు అన్ని దిక్కులందును ఉంచవలెను. ఈశాన్యమున పుష్పములు, ఆగ్నేయమున గోరోచనము, నైరృతియందు అగురు, వాయవ్యమున చతుఃసమమును (రెండు పాళ్లు కస్తూరి, నాల్గు పాళ్లు చందనము, మూడు పాళ్లు కుంకుమము,మూడు పాళ్లు "కర్పూరము కలిపి చేసిన గంధద్రవ్యము చతుఃసమము) సమర్పించవలెను. లేతాకులతో కూడ సమస్త హోమ ద్రవ్యములను సమర్పింపవలెను. దకము, అక్షసూత్రము, కౌపీనము, భిక్షాపాత్రము కూడ దేవతా విగ్రహమునకు సమర్పించవలెను. కాటుక, కుంకుమము, సుగంధతైలము, కేశము లను శుద్ధములను చేయు దువ్వెన, తాంబూలము, అద్దము, గోరోచనము కూడ ఉత్తరము నందు సమర్పింపవలెను. ఆసనము పాదుకలు, పాత్రములు, యోగపట్టము, ఛత్రముకూడ ఈశాన్యమునందు ఈశాన మంత్రము పఠించు శివుని అనుగ్రహము సంపాదించుటకై సమర్పింపవలెను. తూర్పునందు అజ్య సహితమగు చరువును గంధాదులను సమర్పింపవలెను. అర్ఘ్యజలముచే ప్రక్షాళితములై, సంహితా మంత్రముచే శోధింపబడిన పవిత్రకములను తీసికొని అగ్ని సమీపమునకు వెళ్లవలెను. కృష్ణ మృగ చర్మాదులచే వాటిని కప్పి ఉంచవలెను. సమస్త కర్మసాక్షియు, సంరక్షకుడును, సంవత్సర

స్వరూపుడును అగు భగవంతుడగు శివుడు దానిలో నున్నట్లు భావన చేయవలెను. 'స్వా' 'హా' అను అక్షరములను ప్రయోగించుచు, మంత్ర సంహితలు పఠించుచు, ఇరువదియొక్క పర్యాయములు ఆ పవిత్రకములను శోధించవలెను. పిమ్మట గృహాదులను సూత్రములతో చుట్టి, సూర్యునకు గంధ పుష్పాదులు సమర్పించి, ఆచమన పూర్వకముగ అర్ఘ్య ప్రదానము చేయవలెను. న్యాసముచేసి నంది మొదలగు ద్వారపాలకులను, వాస్తు దేవతకును గంధాదులను సమర్పించవలెను. పిమ్మట యజ్ఞ మండపము ప్రవేశించి శివకలశము మీద నాల్గు ప్రక్కలను ఇంద్రాది లోకపాలులను, వారి శస్త్రములను నామమంత్రములతో పూజించవలెను.

పిమ్మట వర్ధనిని, విఘ్నేశ్వరుని, గురువును, తనను పూజించవలెను. సర్వౌషధి లిప్తము, ధూపదూషితము, పుష్పదూర్వాది పూజితము అగు పవిత్రకమును అంజలిలో ధరించి, శివుని ఈ విధముగ ప్రార్థించవలెను." సర్వకారణ భూతుడవును (చేతనాచేతన ప్రభువునగు పరమేశ్వరా) పూజలో జరిగిన లోపములను తొలగించుటకై నిన్ను ప్రార్థించుచున్నాను. సకల మనోరథములను సఫలముచేయు సిద్ధిని ఇమ్మని కోరుచున్నాను. నిన్ను ఆరాధించుచున్న నాకు అట్టి సిద్ధినిమ్ము. శంభో నీకు సర్వదా నమస్కరింతును. ప్రసన్నుడవు కమ్ము. దేవేశ్వరా! పార్వతీదేవితోడను, గణేశ్వరుల తోడను నిన్ను ఆహ్వానించుచున్నాను. మంత్రాధిపతులతోడను, లోకపాలకులతోడను, సేవకులతోడను కలసి ఇచటికి దయ చేయుము. నీ ఆజ్ఞానుసారము రేపు ప్రాతఃకాలమునందు, పవిత్రారోపణమును చేసి దానికి సంబంధించిన నియమములను అనుసరింతును." ఈ విధముగ శివుని ఆవాహనచేసి, రేచక ప్రాణాయామముతో అమృతీకరణ క్రియ పూర్తిచేసి, మూలమంత్రము జపించి దానిని శివునకు సమర్పించవలెను. జప, స్తోత్ర, ప్రణామాదులుచేసి నా లోపములను అన్నింటిని క్షమింపుమని శివుని ప్రార్థించవలెను. పిమ్మట చరువులోని మూడవభాగమును హోమము చేయవలెను. దానిని శివ స్వరూపుడగు అగ్నికిని, దిక్కులలో నివసించువారికిని, దిక్పాలకులకును, భూత గణములకును మాతృ గణములకును, ఏకాదశ రుద్రులకును, క్షేత్రపాలాదులకును, వారి నామ మంత్రములకు "నమః–స్వాహా" చేర్చి ఆహుతి రూపమున సమర్పించవలెను. పిమ్మట ఈ దేవతల చతుర్థ్యంత నామములకు "అయం బలిః" అను పదములు చేర్చి బలి సమర్పింపవలెను. పూర్వాది దిక్కులందు దిగ్గజాదులకును, దిక్పాలకులకును, క్షేత్ర పాలునకును, అగ్నికిని బలి సమర్పించవలెను. పిమ్మట పూర్ణాహుతి, వ్యాహృతి హోమములు చేసి అగ్నిదేవుని అవరుద్ధుని చేయవలెను.

పిమ్మట 'ఓం అగ్నయే స్వాహా' 'ఓం సోమాయ స్వాహా' 'ఓం అగ్నీషోమాభ్యాం స్వాహా' 'ఓం అగ్నయే స్విష్టకృతే స్వాహా' అను నాలుగు మంత్రములతో నాలుగు ఆహుతులు ఇచ్చి, తరువాతి పనులను ఏర్పాటు చేసుకొనవలెను. అగ్ని కుండములో పూజింపబడిన ఆరాధ్య దేవతయగు శివుని పూజామండలమునందు పూజింపబడిన కలశస్థ శివునితో నాడీసంధాన విధిచే కలిపివేయవలెను. 'ఫట్' 'నమః' అని ఉచ్చరించుచు అస్త్ర న్యాస హృదయ న్యాసములుచేసి పవిత్రములు అన్నింటిని వెదురుబుట్ట వంటి పాత్రలో ఉంచవలెను. 'శాన్తి కళాత్మనే నమః', 'విద్యాకళాత్మనే నమః', 'నివృత్తి కళాత్మనే నమః', 'ప్రతిష్ఠా కళాత్మనే నమః', 'శాన్త్యతీత కళాత్మనే నమః' అను కళా మంత్రములతో వాటిని అభిమంత్రించవలెను. పిదప ప్రణవమంత్రముతోగాని, మూలమంత్రముతో గాని

షడంగన్యాసముచేసి, 'నమః' 'హుం' 'ఫట్'ఉచ్చరించుచు వాటిపై క్రమముగ హృదయ, కవచ, అస్త్రములను సంబంధింపచేసి, వాటినన్నింటిని సూత్రములతో చుట్టబెట్టవలెను. పిదప 'నమః' 'స్వాహా' 'వషట్' 'హుం' 'వేషట్' 'ఫట్' అను అంగమంత్రములతో వాటినన్నింటిని పూజించి, భక్తినమ్రుడై, వాటి రక్షకొరకై శివునకు సమర్పించవలెను. పుష్ప, ధూప, దీపాదులతో పూజించబడిన సిద్ధాంత గ్రంథముపై పవిత్రకము సమర్పించి, గరుచరణ సమీపము చేరి ఆయనకు భక్తిపూర్వకముగ పవిత్రకము సమర్పింపవలెను. అచటినుండి బైటకు వచ్చి, ఆచమనముచేసి, గోమయముతో అలికిన మండలత్రయముపై, వరుసగ పంచగవ్యమును, చరువును, దంతధావనమును పూజించ వలెను. పిమ్మట ఆచమనముచేసి, మంత్రముచే ఆవృతుడై రక్షణము కల్పించుకొన్న సాధకుడు రాత్రి యంతయు సంగీతముతో జాగరము చేయవలెను. భోగములు కోరువాడు, అర్ధరాత్రి దాటిన పిమ్మట శివుని స్మరిం చుచు, కుశాసనముపై నిద్రించవలెను. మోక్షేచ్ఛ కలవాడు, ఈ విధముగనే జాగారముచేసి, ఉపవాసపూర్వకముగ ఏకాగ్రచిత్తుడై భస్మశయ్యపై నిద్రించవలెను. (78)

పవిత్రారోహణ విధానము

పిమ్మట ఉపాసకుడు ప్రాతఃకాలముననే లేచి, స్నానమాచరించి, సమాహిత చిత్తుడై, సంధ్యా వందన మాచరించి యజ్ఞమండపము ప్రవేశించి, పవిత్రములను గ్రహించి, దేవతా విసర్జనము చేయకుండగనే వాటిని ఈశాన్యదిక్కునందు, మండలముపై నున్న శుద్ధమగు పాత్రలో ఉంచవలెను. పిమ్మట దేవేశ్వరుడగు శివుని విసర్జించి, నిర్మాల్యమును తొలగించి, వెనుకటివలెనే పరిశుద్ధమగు భూమిమీద రెండు పర్యాయములు ఆహ్నిక కృత్యములు చేయవలెను. పిదప శివాగ్నియందు సూర్య, ద్వారపాల, దిక్పాల, కలశ, ఈశ్వరులకు విశేషరూపమున నైమిత్తికపూజ చేయవలెను. పిమ్మట మంత్రతర్పణమును, అస్త్ర మంత్రముతో నూట ఎనిమిది పర్యాయములు ప్రాయశ్చిత్త హోమములను చేసి, మంత్రము మెల్లగ పఠింపుచు పూర్ణాహుతి చేయవలెను.

పిమ్మట సూర్యునకు పవిత్రకము సమర్పించి, ఆచమనముచేసి, ద్వారపాలాదుల కును, దిక్పా లకులకును, కుంభవర్ధని మొదలగువానికి గూడ పవిత్రకము సమర్పించ వలెను. శివుని సమీపమున తన ఆసనముపై ఉపవిష్టుడై, తనకును, గణమునకును, గురువునకును, అగ్నికిని పవిత్రకములను ఈయవలెను. శివుని ఇట్లు ప్రార్థించవలెను. 'దేవా! నీవు కాలస్వరూపుడవు. నా కర్తవ్యవిషయమున నీవు ఇచ్చిన ఆజ్ఞను సరిగ పాలింప జాలక నేను ఏవైన లోపములను చేసి ఉన్నచో, చేయదగిన దానిని చేయకున్నచో, ప్రకటమైన దానిని గుప్తము చేసినచో, అట్టి సంస్కారశూన్యమగు నే చేసిన కర్మ అంతయు ఈ పవిత్రారోపణముచే పరిపూర్ణమగుగాక. శంభూ! నీవు ఈ పవిత్రకముచే పూర్తిగ ప్రసన్నుడవై, నా నియమమును పరిపూర్ణము చేయుము.' 'ఓం పూరయ పూరయమఖ వ్రతం నియమే శ్వరాయ స్వాహా' అను మంత్రమును ఉచ్చరించవలెను.

ఓ పద్మయోని, పాలితాత్మ, తత్త్వేశ్వరాయ, ప్రకృతిలయాయ 'ఓం నమః శివాయ' అను మంత్రము ఉచ్చరించి పవిత్రకముతో శివుని పూజించవలెను. 'విష్ణు కారణ పాలిత విద్యా తత్త్వేశ్వరాయ

ఓం నమః శివాయ' అను మంత్రము ఉచ్చరించి పవిత్రకమును సమర్పించవలెను. 'రుద్ర కారణ పాలిత శివతత్త్వేశ్వరాయ ఓం నమః శివాయ' అను మంత్రము ఉచ్చరించుచు శివునకు పవిత్రకమును నివేదించవలెను. సువ్రతుడైన ఉపాసకుడు 'సర్వకారణ పాలాయ శివాలయ లయాయ ఓం నమః శివాయ' అను మంత్రము ఉచ్చరించుచు శివునకు గంగావతారమను సూత్రమును సమర్పింపవలెను, ముముక్షువులు ఆత్మతత్త్వ, విద్యాతత్త్వ, శివతత్త్వముల క్రమమున మంత్రోచ్చారణముచేయుచు పవిత్రక ములను సమర్పించవలెను. బుభుక్షువులు (భోగేచ్ఛకలవారు) వరుసగ శివతత్త్వ, విద్యాతత్త్వ, ఆత్మ తత్త్వములకు అధిపతియగు శివునకు మంత్రోచ్చారణ పూర్వకముగ పవిత్రకమును సమర్పిం చవలెను. ముముక్షువు స్వాహాంత మంత్రమును, భోగేచ్ఛగలవాడు నమోంత మంత్రమును ఉచ్చరిం చవలెను. 'ఓం హాం ఆత్మతత్త్వాధిపతయే శివాయ స్వాహా' 'ఓం హాం విద్యా తత్త్వాధిపతయే శివాయ స్వాహా' ఓం హాం శివతత్త్వాధిపతయే శివాయ స్వాహా' అనునవి స్వాహా మంత్రములు ('స్వాహా'కు బదులు 'నమః' చేర్చినచో నమోంత మంత్రములు). గంగా వతారకమును సమర్పించిన పిదప శివునకు నమస్కరించి ఈ విధముగ ప్రార్థింపవలెను.

'పరమేశ్వరా! నీవే సమస్త ప్రాణులకును గతివి. చరాచర జగత్తునకు ఆశ్రయమైన వాడవు నీవే. నీవు సమస్త ప్రాణులలోపల సంచరించుచు వారికి సాక్షిగా ఉన్నావు. మనో వాక్కాయములచే నీవు తప్ప నాకు వేరొకగతి లేదు. నీకు నేను ప్రతిదినము చేయు పూజలో మంత్ర, క్రియా, ద్రవ్య, జప, హోమ, అర్చనాదులలో ఏ లోపములు జరిగినవో శుద్ధములగు వాక్యములు లేని ఏ కర్మ చేసితినో, ఆ లోపములను అన్నింటిని మన్నించి, నే చేసిన కర్మను పరిపూర్ణము చేయుము. పరమేశ్వరా! నీవు పరమ పవిత్రుడవు, నీకు సమర్పించిన ఈ పవిత్రకము సమస్త పాపములను నశింపచేయునది. నీవు అంతటను వ్యాపించి ఈ సకల చరాచర జగత్తును పవిత్రముచేసితివి. వ్యాకులత్వముచేత గాని, అంగవైకల్యముచేత గాని నేను ఏ వ్రతమును ఖండితము చేసితినో, అది నీ ఆజ్ఞ యనెడు సూత్రముచే గ్రుచ్చబడి అఖండమగుగాక"

పిమ్మట ఉపాసకుడు జపనివేదనముచేసి, భక్తి పూర్వకముగ భగవంతుని స్తుతించి, నమస్కరించి, గురువు అనుమతితో నాలుగు మాసములు, లేదా మూడు మాసములు. లేదా మూడు దినములు లేదా ఒక్క దినము వ్రతనియమమును స్వీకరించవలెను. శివునకు నమస్కరించి, లోపములను క్షమింపుమని ప్రార్థించి, కుండము వద్దకు వెళ్ళి, అగ్నిలో ఉన్న శివునకుగూడ నాలుగు పవిత్రకములు అర్పించి పుష్ప, ధూప, అక్షతాదులతో పూజించవలెను. రుద్రాదులకు అంతర్బలి, పవిత్రకములు సమర్పింపవలెను. పూజా మండపము లోనికి ప్రవేశించి, శివుని స్తుతించి, నమస్కరించి, క్షమాప్రార్థన చేసి, ప్రాయశ్చిత్త హోమముచేసి, పాయసమును ఆహుతిగా ఈయవలెను. మందస్వరముతో మంత్రము ఉచ్చరించుచు పూర్ణాహుతి చేసి అగ్నిలో నున్న శివుని విసర్జించవలెను. వ్యాహృతి హోమములు చేసి, నిష్ఠురతో అగ్ని నిరోధముచేసి అగ్న్యాదులకు 'ఓం హాం భూం స్వాహా', ఓం హాం భువః స్వాహా, ఓం హాం స్వః స్వాహా, ఓం హాం భూర్భువః స్వాహా" అను మంత్రములతో ఆహుతులు సమర్పించి; దిక్పాలకులకు పవిత్రములను, బాహ్యబలులను ఇవ్వవలెను. సిద్ధాంత గ్రంథముపై దాని ప్రమాణముగల పవిత్రకము నుంచవలెను. "ఓం హాం అగ్నయే స్వాహా, ఓం

హాం సోమాయ స్వాహా, ఓం హాం అగ్నీ షోమాభ్యాం స్వాహా, ఓం హాం అగ్నయే స్విష్టకృతే స్వాహా" అను మంత్రములతో అగ్న్యాదులను నాలుగు హోమములుచేసి, గురువునకు, శివునకువలె వస్త్ర భూషణాదులను సమర్పించి పూజిం చవలెను. ఎవని విషయమున గురువు పూర్తిగా సంతోషించునో ఆతని కాండమంతయు సఫలమగును అని పరమేశ్వరుడు చెప్పియున్నాడు. ఈ విధముగ గురువును పూజించి ఆయనకు హృదయమువరకును వ్రేలాడు పవిత్రకము సమర్పించి, బ్రాహ్మణాదులకు భోజనము పెట్టి, వస్త్రాదులు ఇచ్చి 'దేవేశ్వరుడైన సదాశివుడు నేను చేసిన ఈ దానాదులచే సంతసిం చును గాక' అని ప్రార్థించవలెను.

ప్రాతః కాలమున భక్తి పూర్వకముగ స్నానాదికముచేసి శివుని విగ్రహము నుండి పవిత్రకములను ప్రోగుచేసి శివునకు అష్టపుష్పపూజచేసి విసర్జన చేయవలెను. పిదప వెనుకటివలెనే సవిస్తరముగ నిత్యనైమిత్తిక పూజచేసి పవిత్రకములు సమర్పించి, నమస్క రించి, అగ్నిలో శివపూజ చేయవలెను. పిమ్మట అస్త్రమంత్రముతో ప్రాయశ్చిత్త హోమము చేసి పూర్ణాహుతి ఈయవలెను. భోగేచ్ఛ కలవాడు తాను చేసిన కర్మనంతను శివునకు సమర్పించి – 'ప్రభో! నీ అనుగ్రహముచే ఈ కర్మవలన నాకు మనోవాంఛిత ఫలములు లభించుగాక' అని ప్రార్థించవలెను. మోక్షకాముడు–'ఓ నాథా నా కర్మ బంధహేతువు కాకుండుగాక' అని ప్రార్థించవలెను. పిదప అగ్నిలో ఉన్న శివునకు నాడీయోగముచే అంతరాత్మలో ఉన్న శివునితో ఐక్యమును కల్పింపవలెను. అణుసముదాయమును హృదయ ముగ న్యసించి అగ్నిని విసర్జించి, ఆచమనముచేసి, పూజా మండపమున ప్రవేశించి, కలశములోని జలమును నలుమూలలకు చల్లుచు, శివునితో సంయుక్తమగునట్లు చేసి–'ప్రభూ'! నా లోపములను క్షమించుము' అని ప్రార్థించి విసర్జించవలెను. పిమ్మట లోకపాలాదులను విసర్జించి, శివుని విగ్రహము నుండి పవిత్రకములనుతీసి, చండేశ్వర పూజానంతరము, వాటిని శివనిర్మాల్యాదులతో పాటు ఆయనకు సమర్పించవలెను. లేదా వీరి మీద, వెనుకటివలె, చండేశ్వరుని పూజచేసి–'చండనాథా! నేను చేసిన వార్షిక కర్మయందు న్యూనత్వ రూప దోషముగాని అధికత్వ రూపదోషముగాని ఉన్నచో దానిని తొలగించి, ఆ కర్మ సాంగోపాంగముగ సంపూర్ణమగునట్లు చేయుము' అని ప్రార్థించవలెను. పిదప చండేశ్వరుని స్తుతించి, నమస్కరించి, విసర్జించవలెను. నిర్మాల్యమును తొలగించిన పిమ్మట శుద్ధుడై, శివునకు స్నానము చేయించి, పూజించవలెను. గురువు ఐదు యోజనముల దూరమున నున్నను ఆయన వద్దకు వెళ్ళి పవిత్రారోహణ కర్మ చేయవలెను. (79)

దమనకారోహణ విధానము

ఈశ్వరుడు పలికెను : ఇపుడు దమనకారోహణ విధి చెప్పెదను అన్ని కార్యము లను వెనుకటివలెనే చేయవలెను. పూర్వము శివుని కోపమునుండి భైరవుడు జనించి దేవతలను పీడింప ప్రారంభించెను. ఇది చూచి కోపించిన శివుడు 'నీవు వృక్షమగుదువు గాక' అని భైరవుని శపించెను. అతడు క్షమింపుమని ప్రార్థించగా శివుడు – 'నీ పత్రములతోగాని, నీకుగాని పూజించువారి మనో వాంఛితములు సిద్ధించును. వారి కోరికలు నిష్ఫలమగుట అనునది ఉండదు' అని అనుగ్ర హించెను. సప్తమి లేదా త్రయోదశియందు మంత్రవేత్త సంహితా మంత్రములచే దమనక వృక్షమును పూజించి–

"ఓ దమనక వృక్షమా! నీవు శివుని ప్రసాదముచే ఆవిర్భవించితివి. నీవు ఇచట సన్నిహితుడవు కమ్ము. శివుని ఆజ్ఞననుసరించి నేను నిన్ను శివకార్యార్థమై తీసికొని వెళ్లవలసి ఉన్నది" అని ప్రార్థించ వలెను. ఆ వృక్షమును ఇంటికి తీసికొనివచ్చి సాయంకాలమున అధివాసన కర్మ చేయ వలెను, యథావిధిగ సూర్య, శివ, అగ్నుల పూజచేసి, ఇష్టదేవతకు పశ్చిమమున, మట్టితో చేర్చి ఆ వృక్షము మూలమును స్థాపించవలెను. వామదేవ మంత్ర, శిరోమంత్రములతో ఆ వృక్షనాళములను, ఉసిరిక పండ్లను ఉత్తరమునందు ఉంచవలెను. రాలిపోయిన దాని ఆకులను దక్షిణమునందును, పుష్పములను, తూర్పునను ఉంచవలెను. ఈశాన్యము నందు ఒక దొన్నెలో దాని ఫలములను, మూలమును ఉంచి శివుని పూజ చేయవలెను. ఆవృక్షమునకు సంబంధించిన వేళ్లు, కాడలు, పత్రములు, పువ్వులు, ఫలములు అను పంచాంగములను దోసిట గ్రహించి, ఆమంత్రణము చేయుచు శిరస్సుపై ఉంచుకొని 'దేవేశ్వరా! నేడు నిన్ను ఆహ్వానించుచున్నాను. రేపు ప్రాతః కాలమున నేను తపః ఫలమును సంపాదింపవలెను. చేసిన ఉపాసనను సఫలము చేయవలెను. ఇదంతయు నీ ఆజ్ఞచే పూర్ణమగుగాక" అని ప్రార్థించవలెను. పిమ్మట పాత్రలో ఉంచిన మిగిలిన పవిత్రకములను మూలమంత్రముతో ఆచ్ఛాదించి ప్రాతఃకాలము స్నానానంతరము శివుని గంధ పుష్పాదులతో పూజించవలెను. పిమ్మట నిత్యనైమిత్తిక కర్మలు పూర్తిచేసికొని దమనకమును పూజించి, దానిని దోసిలిలో గ్రహించి 'ఓం హాం ఆత్మ తత్త్వాధిపతయే శివాయ స్వాహా', 'ఓం హాం విద్యాతత్త్వాధిపతయే శివాయ స్వాహా', 'ఓం హాం శివతత్త్వాధిపతయే శివాయస్వాహా', 'ఓం హాం సర్వతత్త్వాధి పతయే శివాయ స్వాహా' అను మంత్రములతో శివునిపై ఉంచి, పూజించి నాల్గవ అంజలిలో దమనకము గ్రహించి 'ఓం హూం మహేశ్వరాయ మఖం పూరయ పూరయ శూలపాణయే నమః' అను మంత్రముతో దానిని శివునకు అర్పించ వలెను. ఈ విధముగ శివుని, అగ్నిని పూజించి, గురువునకు విశేషపూజచేసి "పూజ్యుడా! నేను దమనకముతో చేసిన పూజలో ఏవైన ఎక్కువ తక్కువలు ఉన్నచో అవి నీ కృపచే సరి యగుగాక' అని ప్రార్థించవలెను. ఈ విధముగ దమనకారోహణ కర్మ చేసినవాడు చైత్ర మాస జనితమగు సంపూర్ణ ఫలముపొంది అంతమున స్వర్గమునకు పోవును. (80)

సమయదీక్షా విధానము

ఈశ్వరుడు పలికెను–ఇపుడు భోగ, మోక్షప్రదమగు దీక్షా విధానమును గూర్చి చెప్పెదను. ఇది సమస్త పాపములను నశింపచేయును. మల, మాయాదులను తొలగించును. శిష్యునకు జ్ఞానమును కలిగించుదానికి దీక్ష అని పేరు. అది భోగ మోక్షములను ఇచ్చును. విద్యచే అనుగ్రహింపదగిన శిష్యుడు, విజ్ఞానాకలుడు, ప్రళయాకలుడు, సకలుడు అని మూడు విధములు. కేవలము మలరూపమగు పాశముకలవాడు 'విజ్ఞానకలుడు'. మలముల చేతను, పాశములచేతను బద్ధుడైనవాడు 'ప్రళయాకలుడు'. కళలు మొదలు భూమి వరకును గల సకల తత్త్వ సమూహములచే బద్ధుడైన వాడు 'సకలుడు'. ఈ పాశములనుండి ముక్తి పొందవలెనన్నచో జీవుడు (పశువు) ఆచార్యుని నుండి మంత్రారాధన దీక్ష గ్రహింపవలెను. ఈదీక్ష 'నిరాధార', 'సాధార' అని రెండు విధములు, విజ్ఞానాకల, ప్రళయాకలులకు నిరాధార దీక్ష విహితమైనది. 'సకల జీవులకు సాధార దీక్ష

విహితమైనది. ఆచార్యుని అపేక్ష లేకుండగనే శంభువుని నుండి తీవ్ర శక్తిపాతముచేసి ఇవ్వబడు దీక్షకు 'నిరాధార' దీక్షయని పేరు. శివుడు ఆచార్యుని శరీరములో నుండి మంద, తీవ్రాది భేదభిన్నమగు తన శక్తితో ఇచ్చు దీక్షకు 'సాధారదీక్ష' యనిపేరు. ఈ సాధార దీక్షలో నున్న 'సబీజ, నిర్బీజ, సాధికార, అనధికారములను నాలుగు భేదములనుగూర్చి చెప్పెదను. సమర్థులకు ఇచ్చు సమయాచార యుక్త దీక్షకు 'సబీజ దీక్ష' యనియు, అసమర్థులకు ఇచ్చు సమాయాచార శూన్యదీక్షకు 'నిర్బీజ దీక్ష' అనియు పేర్లు. సాధకునకు, అచార్యునకును నిత్య, నైమిత్తిక, కామ్యకర్మలందు అధికారమును కలిగించు దీక్షకు 'సాధికార దీక్ష' యని పేరు. నిర్బీజ దీక్షా దీక్షితులకును, సమయా చార దీక్షను స్వీకరించు సాధారణ శిష్యులకును, పుత్రకులు అను పేరుగల శిష్యులకును నిత్య కర్మలందు మాత్రమే అధికారము. అందుచే వారికి ఇచ్చు దీక్ష నిరధికార దీక్ష సాధార, నిరాధార దీక్షలకు కూడ, ఒక్కొక్క దానికి, 'క్రియావతి' 'జ్ఞానవతి' అను రెండేసి భేదము లున్నవి. కర్మకాండ విధి ప్రకారము కుండము, మండలము స్థాపించి, పూజచేయు దీక్ష 'క్రియా వతి' బాహ్య సామగ్రి ఏదియు లేక మానసిక వ్యాపార మాత్రముచేతనే సాధ్యమైనది 'జ్ఞానవతి'.

ఈ విధముగ దీక్ష అధికారముగల అచార్యునిచేత ఇవ్వబడును. స్కందా! గురువు నిత్యకర్మలను యథాశాస్త్రముగ నిర్వర్తించుకొని శిష్యునకు దీక్ష ఇవ్వవలెను. గురువు ప్రణజపము చేయుచు తన కరకమలములతో అర్ఘ్యము గ్రహించి ద్వారపాలపూజ చేయవలెను. విఘ్న నివారణముచేసిన పిమ్మట ద్వారము గుమ్మము మీద అస్త్రన్యాసము చేసి, తన ఆసనముపై కూర్చుండి శాస్త్రోక్త విధానమున భూత శుద్ధిని, అంతర్యాగమును చేయవలెను. తిలలు, బియ్యము, ఆవాలు, కుశలు, దూర్వాంకురములు (గరిక చిగుళ్ళు), యవలు, పాలు, ఉదకము – వీటిని అన్నింటిని ఒక చోట ఉంచి విశేషార్ఘ్యము ఏర్పరచుకొనవలెను. ఆ జలముతో సమస్త ద్రవ్యముల శుద్ధి చేయవలెను. తిలకము ధరించి, వెనుకటి వలెనే పూజా, మంత్రశోధన, పంచగవ్య ప్రాశనాదికము చేసి, పేలాలు, చందనము, ఆవాలు, భస్మము, దూర్వలు, అక్షతలు, కుశలు, చివర మరల శుద్ధమైన పేలాలు అను వికిర ద్రవ్యములు (చల్లుటకు ఉపయోగించు ద్రవ్యములు) గ్రహించి, అస్త్రమంత్రముచే ఏడు పర్యాయములు అభిమంత్రించి, అస్త్ర మంత్రాభి మంత్రిత జలముతో ప్రోక్షించి, కవచ మంత్రముచే (హుమ్) ఆచ్ఛాదించి–'ఇది విఘ్న సమూహములను తొలగించు నానావిధాస్త్ర శస్త్రములు' అని భావన చేయవలెను. పిమ్మట ప్రాదేశ మాత్రము పొడవైన ముప్పది ఆరు కుశదళ ములతో లేణీ రూపమును, బోధమయమును అగు ఉత్తమ ఖడ్గము నిర్మించి, దానిని శివ మంత్రము ఏడు పర్యాయములు జపించి, అభిమంత్రించవలెను. అది శివ స్వరూపముగ భావించి తన హృదయమున ఉంచుకొనవలెను. తనకు అభీష్టమైన శివుని రూపమును ధ్యానించుచు, నిష్కల పరమాత్మయగు ఆ శివుని తనలో న్యాసము చేసికొన వలెను. పిదప 'నేనే శివుడను' అని భావన చేయవలెను. శిరస్సుపై తెల్లని శిరస్త్రాణము ధరించి తన శరీరమును అలంకరించుకొనవలెను. పిమ్మట గురువు తన కుడిచేతిపై సుగంధ ద్రవ్యములతోగాని, కుంకుమతో గాని మండలమును నిర్మించవలెను. దానిపై శివుని పూజించవలెను. ఇట్లు చేయుటచే అది శివహస్తమగును. తేజస్వియైన ఆ శివ హస్తమును తన శిరస్సుపై ఉంచుకొని, 'నేను శివుడను సకల జగత్స్రష్టయగు పరమాత్ముడనైన

శివుడను నేనే' అని దృఢమగు భావన చేయవలెను. ఈ విధముగ భావన చేసిన గురువు యజ్ఞ మండపమునందు కర్మ సాక్షిగాను, కలశముపై యజ్ఞరక్షకుడుగాను, అగ్నిలో హోమాధిష్ఠాత గాను, శిష్యుని అజ్ఞానమయ పాశచ్ఛేత్తగాను, అంతరాత్మయందు అనుగ్రహ కర్తగాను, ఐదు విధముల అభివ్యక్తుడైన ఈశ్వర రూపుడగును. ఆ 'పరమేశ్వరుడను నేనే' అను దృఢతరమగు భావన గురువునకు ఉండవలెను.

పిమ్మట గురువు జ్ఞానరూపమగు ఖడ్గము చేతధరించి యజ్ఞమండపము నైరృతి దిక్కున ఉత్తరాభిముఖుడై నిలచి జల-పంచగవ్యములతో మండపమును ప్రోక్షించి, ఈక్షణాది చతుష్పథాంత సంస్కారములతో దానిని సంస్కరింపవలెను. యజ్ఞ మండపమున చల్లవలసిన వస్తువులనుచల్లి వాటిని కుశకూర్చతో ప్రోగుచేసి, ఈశాన కోణమునందు స్థాపితమగు వర్ధనికి ఆసనముగ చేయ వలెను. నైరృతి దిక్కునందు వాస్తు దేవతలను, పశ్చిమ ద్వారమున లక్ష్మిని పూజించవలెను. 'ఈ మండప రూపిణియగు లక్ష్మిరత్నములతో యజ్ఞమండపమును నింపుచున్నది' అని భావన చేయవలెను. ఈ విధముగ ధ్యానించి ఆవాహనముచేసి, హృదయ మంత్రముతో (నమః) పూజించ వలెను. ఈశాన్యమున సప్తధాన్యములపై స్థాపితమైన, వస్త్ర వేష్టితము, పంచరత్న యుక్తము అగు పశ్చిమాభిముఖమైన జలపూర్ణ కలశముపై శంకరుని పూజించవలెను. ఆ కలశమునకు దక్షిణమున సింహముపై కూర్చున్న శక్తిని, పశ్చిమమున ఖడ్గ రూపిణియగు వర్ధనిని పూజించవలెను. పిమ్మట పూర్వాది దిక్కులందు ఇంద్రాది దిక్పాలకులను పూజించి, అంతమున విష్ణువును పూజించ వలెను. ఆ దేవతలందరును ప్రణవరూపమగు ఆసనమున కూర్చుండి, తమతమ వాహనములతోను, ఆయుధములతోను కూడియున్నట్లు భావన చేయుచు, వారి నామధేయములకు 'నమః' చేర్చి పూజచేయవలెను. మొదట వర్ధనిని హస్తమున గ్రహించి, కలశము ఎదుటకు తీసికొనివెళ్ళి ప్రదక్షిణ క్రమమున దాని నాల్గు వైపుల త్రిప్పి, దానినుండి అవిచ్ఛిన్నముగ జలధారపడునట్లు చేయవలెను. మూలమంత్రము ఉచ్చరించుచు 'లోకపాలులారా! మీరందరును యథాశక్తిగ ఈ యజ్ఞమును రక్షింపుడు' అని శివాజ్ఞను వారికి వినిపించి, క్రింద ఒక కలశమునుంచి, దానిపై వర్ధనిని స్థాపింప వలెను. పిమ్మట సుస్థిరమైన ఆసనముపై ఉంచిన కలశముపై శివుని సాంగపూజ చేయవలెను. పిమ్మట కలాది షడధ్వన్యాసము చేసి, శోధనముచేసి, వర్ధనిపై అస్త్రమును పూజించవలెను.

'ఓం హః అస్త్రాసనాయ హూంఫట్' మొదలు 'ఓం ఫట్ అస్త్రాయ హూం ఫట్ నమః' వరకును పైన చెప్పినవి అస్త్రపూజా మంత్రములు.

పిమ్మట పాశుపతాస్త్ర స్వరూపమును ఈ విధముగ చింతన చేయవలెను. దానికి కోరలతో కూడిన నాలుగు ముఖములుండును. హస్తములలో శక్తి, ముద్గర, ఖడ్గ, త్రిశూల ములు ఉండును. వాటి కాంతి కోటి సూర్యకాంతి సమానముగ ఉండును. పిమ్మట లింగ ముద్రను చూపి, భగలింగ సమాయోగము చూపవలెను. హృదయ మంత్రమును (నమః) ఉచ్చరించుచు అంగుష్ఠముతో కలశమును, ముష్టితో ఖడ్గరూపమగు వర్ధనిని స్పృశించవలెను. ముష్టితో ముందుగా వర్ధనిని స్పృశించినచో భోగ మోక్షముల అభివృద్ధి కలుగును. కలశముఖ రక్షణము నిమిత్తము దానిపై

వెనుక చెప్పిన జ్ఞాన ఖడ్గమును ఉంచవలెను. మూలమంత్రము నూట ఎనిమిది పర్యాయములు జపించి ఆ జపమును కూడ కలశము నకు సమర్పించవలెను. పదవవంతు జపముచేసి దానిని వర్ధనికి సమర్పించవలెను. పిమ్మట-'సకలయజ్ఞధారకుడవైన భగవంతుడవైన జగన్నాథా! ఈ యజ్ఞ మందిరమును చాల ప్రయత్నముతో రక్షించుము' అని భగవంతుని ప్రార్థించవలెను.

పిదప ప్రణవమయమైన ఆసనముపై కూర్చొనియున్న చతుర్భుజుడగు గణేశుని వాయవ్యదిక్కు నందు పూజించవలెను. అనంతరము వేదిపై శివుని పూజించి, అర్ఘ్యమునుచేత గ్రహించి యజ్ఞ కుండము వద్దకువెళ్ళి, అచట కూర్చుండి మంత్రదేవతా తృప్తి కొరకు వామ భాగమునందు అర్ఘ్య-గంధ-ఘృతాదులను, కుడివైపున సమిధలు, కుశలు, తిలలు మొదలగు వాటిని ఉంచి, వెనుకటి వలెనే కుండ, అగ్ని, ఘృత, స్రుక్ ఆదులను సంస్కరించి, హృదయమున ఊర్ధ్వముఖాగ్ని ప్రాధాన్య మును భావించుచు అగ్నియందు శివుని పూజించవలెను. పిమ్మట గురువు తన శరీరమునందును, శివకలశమునందును, మండలము నందును, అగ్నియందును, శిష్యుని దేహమునందును సృష్టి న్యాసక్రమమును న్యాస కర్మను చేసి, యథా శాస్త్రముగ అధ్వశోధనముచేసి, అగ్నికుండము పొడవు వెడల్పు లను పట్టి అగ్నిదేవుని ముఖము పొడవు వెడల్పులను భావన చేయుచు, అగ్నిజిహ్వా నామ మంత్రముల చివర 'నమః' చేర్చి పలుకుచు అభీష్ట వస్తువుల హోమముచేసి అగ్నిని తృప్తుని చేయ వలెను. అగ్ని జిహ్వాలు ఏడింటికిని ఏడు బీజములున్నవి. హోమము చేయుటకై అవి యేవియో చెప్పబడుచున్నది.

రేఫ తప్ప మిగిలిన చివరి రెండు వర్ణముల అన్ని అక్షరములకును, అనగా య మొదలు 'హ' వరకు ఉన్న ఏడక్షరములకును రేఫ-ఊకారములను చేర్చి, దానిమీద అర్ధ బిందువును చేర్చగా అవి (య్రూట, ల్రూట, వ్రూట, శ్రూట, ఘ్రూట, స్రూట, హ్రూట అను నవి) ఏడు అగ్నిజిహ్వాల బీజ మంత్రములు. హిరణ్యా, కనక, రక్త, కృష్ణ, సుప్రభ, అతిరిక్త, బహురూప, అని అగ్ని జిహ్వా నామ ములు. వీటి ముఖములు వరుసగ ఈశాన్య, పూర్వ, ఆగ్నేయ, నైరృతి, పశ్చిమ, వాయవ్య, మధ్య దిక్కులందు ఉండును. శాంతిక, పౌష్టిక కర్మలలో క్షీరాది మధుర పదార్థములను, అభిచార కర్మలలో ఆవాల తెలకపిండి, సక్తువులు, యవల గంజి ఉప్పు, రాజికలు, కటు తైలములు, ముళ్ళు, వంకర టింకరగా ఉన్న సమిధలు, వీటితో క్రోధ పూర్వకముగా, భాష్య మంత్రముతో హోమము చేయవలెను.

కదంబపు మొగ్గలు హోమము చేసినచో తప్పక యక్షిణి సిద్ధించును. వశీకరణ-ఆకర్షణములకై బంధూక-కింశుక పుష్పాదులను హోమము చేయవలెను. రాజ్య లాభము కొరకై బిల్వ ఫలములను, లక్ష్మీ ప్రాప్తి కొరకు పాటల-చంపక పుష్పములను, చక్రవర్తిత్వము కొరకై పద్మములను, సంపద కొరకు భక్ష్య-భోజ్య పదార్థములను, వ్యాధి వినాశము కొరకు దూర్వలను, సర్వ ప్రాణులను వశము చేసికొనుటకు ప్రియంగు-పాటలీపుష్పాలను హోమము చేయవలెను. మామిడి ఆకుల హోమము జ్వరమును నశింపచేయును. మృత్యుం జయ దేవత-మంత్రముల ఉపాసన చేయువాడు మృత్యువును జయించును. తిలల హోమముచే అభ్యుదయ సిద్ధి కలుగును. రుద్రశాంతి సమస్త దోషములను శాంతింపచేయును. ఇపుడు ప్రస్తుత విషయము చెప్పబడును.

నూట ఎనిమిది ఆహుతులచే మూలమును అందు దశాంశముచే అంగములను తర్పింప చేయవలెను. ఈ హోమమును మూలమంత్రముతో చేయవలెను. పిమ్మట వెనుకటి వలె పూర్ణాహుతి ఇవ్వవలెను. శిష్యులకు దీక్షాప్రవేశము నిచ్చుటకై ఒక్కొక్క శిష్యుని ఉద్దేశించి వందసార్లు జపము చేయవలెను. దుర్నిమిత్త నివారణముకొరకు, శుభనిమిత్తముల సిద్ధి కొరకును వెనుకటి వలెనే మూలమంత్రముతో రెండు వందల ఆహుతులు ఈయవలెను. మొదట చెప్పిన ఎనిమిది అస్త్ర మంత్రముల ఆదియందు మూల మంత్రమును, అంతమునందు 'స్వాహా'ను చేర్చి ఉచ్చరించుచు ఒక్కొక్కసారి తర్పణము చేయవలెను. మూలమంత్రమునందలి బీజములను శిఖా మంత్రము (వషట్)తో సంపుటితము చేసి, చివర 'హూంఫట్' చేర్చి జపము చేసినచో మంత్ర దీపనము అగును. 'ఓం హూం శివాయ స్వాహా' ఇత్యాది మంత్రాభిమంత్రితమగు ఉదకముతో కడిగి కవచ మంత్రముచే ఆచ్ఛాదించి, దానికి చందనాదులు పూయవలెను. దాని కంఠమునకు 'హూం ఫట్' మంత్ర ముచే అభిమంత్రితమైన ఉత్తమ కుశ-సూత్రములు కట్టవలెను. దీనితో చరుసిద్ధి యగును.

ధర్మము మొదలైన నాలుగు పాదములుగల ఆసనము నందు ఏర్పరుపబడిన అర్ధ చంద్రాకార మండలము నందు పాత్రమునుంచి, అదియే ఆరాధ్య దేవతామూర్తి అని భావించి, దానిపై భావాత్మక పుష్పములతో శివుని పూజ చేయవలెను. లేదా ఆ పాత్రమునకు వస్త్రముకట్టి, దానిపై బాహ్య పుష్పములతో శివుని పూజించవలెను. పశ్చిమాభి ముఖముగా ఉంచిన శుద్ధమైన పొయ్యిపై అహం కార బీజమును న్యసించవలెను. పిమ్మట దానిని కుండమునకు కుడి వైపున ఉంచి 'ఈ పొయ్యి శరీరము ధర్మాధర్మ మయమైనది' అని భావనచేయవలెను. దానిశుద్ధికై అస్త్రమంత్రము జపించుచు స్పృశించవలెను. పిమ్మట అస్త్రమంత్రము (ఫట్)చే అభిమంత్రింపబడిన గోఘృతముచే మార్జితమైన ఆ పాత్రను పొయ్యిపై ఉంచవలెను. అస్త్రముచే శుద్ధము చేసిన గోక్షీరమును ప్రాసాద మంత్రము (హౌం)చే నూరుసార్లు అభిమంత్రించి ఆ పాత్రలో పోసి, ఆ పాలలో శ్యామాకాది తండు లమును ఉంచవలెను.ఒక శిష్యుని దీక్షావిధికై ఐదు చేరలు బియ్యము పోయవలెను. ఇద్దరు ముగ్గురు లేదా ఎక్కువ మంది శిష్యులున్నచో వారి సంఖ్యను బట్టి ఐదేసి చేరలు పెంచుతూ పోయవలెను. అస్త్రమంత్ర ముతో నిప్పుముట్టించి, కవచ మంత్రముతో పాత్రను మూతపెట్టవలెను. పూర్వాభిముఖుడై శివాగ్నిలో, మూల మంత్రోచ్చారణ పూర్వకముగ చరువును వండవలెను.

తండులములు బాగుగా ఉడికిన పిమ్మట స్రువము నిండ ఆజ్యముపోసి, స్వాహాన్త సంహితా మంత్రములతో, పొయ్యిలో తప్తాభిఘారము అను హోమము చేయవలెను. ఆ చరుపాత్రను మండల ముపై ఉంచి, అస్త్రమంత్రముతో దానిపై కుశలను ఉంచవలెను. ప్రణవముతో పొయ్యిపై గీసి, హృదయ మంత్రముతో అలికి వెనుకటి వలెనే శీతాభి ఘారమను హోమము చేయవలెను. అపుడు పొయ్యి చల్లబడును. శీతాభిఘారము చేయు విధానము ఏమనగా-సంహితా మంత్రముల చివర 'వౌషట్' చేర్చి, దానితో కుండ మండప మునకు పశ్చిమమున దర్భాద్యాసనముపై ఒక్కొక్క శిష్యుని నిమిత్తము ఒక్కొక్క హోమము చేయవలెను. స్రుక్కుతో సంపాతహోమముచేసి సంహితా మంత్రముతో శుద్ధి చేయవలెను. 'వషట్' చేర్చిన, సంహితా మంత్రముతో ఒక పర్యాయము చరువు గ్రహించి ధేనుముద్రతో అమృతీకరణము చేయవలెను. పిమ్మట వేదికపై, దానితో శాంతిహోమము చేయ

వలెను. పిమ్మట గురువు, శిష్యుల కొరకును, అగ్నిదేవత కొరకును, లోకపాలుల కొరకును ఘృత సహితములగు భాగములు ఏర్పరచవలెను. అన్ని భాగములందును ఆజ్యము సమముగా ఉండ వలెను. వారి నామమంత్రముల చివర 'నమః' చేర్చి, వారివారి భాగములను అర్పించి, ఆ మంత్రము తోడనే వారికి ఆచమనీయము సమర్పించవలెను.

పిమ్మట మూల మంత్రముతో నూట ఎనిమిది హోమములుచేసి, యథాశాస్త్రముగ పూర్ణాహుతి ఇవ్వవలెను. మండలములోపల, కుండమునకు తూర్పునగాని, శివ–కుండముల మధ్యయందు గాని హృదయ మంత్రముతో, రుద్ర–మాతృకాగణాదులకు అంతర్బలి సమర్పించవలెను. శివుని ఆశ్రయించి, ఆతని ఆజ్ఞ పొంది, ఏకత్వభావన చేయుచు ఈ విధముగ భావన చేయవలెను. 'సర్వజ్ఞత్వాది గుణములతో కూడినవాడును, సమస్తాధ్వలకును పైన ప్రకాశించుచున్న వాడును అగు శివుడను నేనే. ఈ యజ్ఞస్థానము నా అంశము. నేనే యజ్ఞాధిష్ఠాతను'. ఈవిధముగ అహంకార పూర్వకముగ–అనగా శివాభేద దృష్టితో–గురువు యజ్ఞమండపము నుండి బైటకు రావలెను. అస్త్రమంత్రముచే (ఫట్) నిర్మించిన మండలముపై తూర్పునకు అగ్రములు ఉండునట్లు ఉత్తమమైన కుశలు కప్పి, దానిపై ప్రణవమయమగు ఆసనము భావన చేయుచు, స్నానము చేసిన శిష్యుని దానిపై కూర్చుండ బెట్టవలెను. శిష్యుడు ఆ సమయమున శ్వేతవస్త్ర ఉత్తరీయములు ధరించి ఉండవలెను. అతడు ముక్తి కాముడైనచో ఉత్తరాభిముఖుడుగను, భుక్తి కాముడైనచో పూర్వాభి ముఖుడుగను కూర్చుండవలెను. శిష్యుని చీలమండల పై భాగము ఆసనముపై ఉండవలెను. క్రింది భాగము ఉండగూడదు. గురువు శిష్యుని దగ్గర పూర్వాభిముఖుడై కూర్చుండవలెను. మోక్షమును అభిలషించినచో, శిష్యుని అంగములపై పాదముల నుండి శిఖ వరకును, భోగములను అభిలషించిన పక్షమున శిఖనుండి పాదముల వరకును, ప్రసన్నము, శైవతేజస్సును ప్రసరింప చేయునదియు అగు దృష్టితో చూడవలెను.

పిమ్మట అస్త్ర మంత్రముచే అభిమంత్రించిన జలముతో శిష్యుని ప్రోక్షించి మంత్రోదక స్నానము పూర్తి చేయవలెను. పిమ్మట విఘ్నశాంతి కొరకును, పాప వినాశము కొరకును భస్మస్నానము చేయించవలెను. అస్త్ర మంత్రముచే భస్మమును అభిమంత్రించి, దానితో శిష్యుని సృష్టి సంహార యోగముచే తాడనము చేయవలెను. అనగా పై నుంచి క్రిందికిని, క్రిందినుండి పైకిని వాని శరీర ముపై భస్మము చల్లవలెను. అదియే భస్మస్నానము. పిదప సకలీకరణము నిమిత్తమై, వెనుకటివలెనే అస్త్ర జలముతో శిష్యుని ప్రోక్షించి, అస్త్ర మంత్రోచ్చారణ పూర్వకముగ కుశాగ్రముతో నాభి నుండి పై భాగమునందు మార్జనము చేయవలెను. హృదయ మంత్రము జపించుచు కుశమూలములతో నాభి నుండి క్రింది భాగమును, పాపవినాశార్థమై, స్పృశించవలెను. సమస్త పాశములను భేదించుటకై అస్త్ర మంత్రముతో మరల ఆ కుశలతోడనే పూర్వము చెప్పిన విధము మార్జన స్పర్శనములు చేయవలెను. పిమ్మట ఆతని శరీరముపై ఆసనసహితుడైన సాంగ శివుని న్యాసము చేసి, శివ భావనతో, పుష్పాదులచే ఆతనిని పూజించవలెను. పిమ్మట నేత్ర మంత్రము (వౌషట్ గాని, హృదయ మంత్రము (నమః) గాని ఉచ్చరించుచు తెల్లనిదియు, దశకలదియు అగు వస్త్రముతో ఆతని నేత్రములు కట్టవలెను. ప్రదక్షిణ క్రమమున ఆతని శివుని వద్దకు తీసికొని వెళ్లి, అచట శివునకు

కుడివైపున కూర్చుండబెట్టవలెను. సంహారముద్రచే తనను శివాభిన్నునిగ చేసి, ఆతని హృదయ పద్మమున నిరోధించి, న్యాసముచేసి, ఆతనిని పూజించవలెను.

తూర్పునకు తిరిగి కూర్చొని ఉన్న శిష్యుని శిరముపై మూల మంత్రముచే శివ హస్తము ఉంచవలెను. అది రుద్రేశ పదమును ఇచ్చును. పిమ్మట శిష్యుని హస్తమునందు, శివ మంత్ర పురస్సరముగా శివసేవా ప్రాప్తికి ఉపాయముగా ఒక పుష్పమును ఉంచవలెను. దానిని శివునిపై ఉంచవలెను. పిమ్మట ఆతని నేత్రములకు కట్టిన వస్త్రము తొలగించి, ఆతని కొరకై శివదేవగణాం కితమైన స్థాన మంత్ర–నామాదికమును ఊహిం చవలెను. లేదా, బ్రాహ్మణాది వర్ణములకు, వరుసగ, తన ఇష్టము వచ్చిన పేరు ఉంచవలెను. శివ కలశమునకును, వర్ధనికిని నమస్కరింపచేసి అగ్ని సమీపమున, తనకు కుడి ప్రక్కన ఉన్న ఆసనముపై, శిష్యుని వెనుకటివలెనే ఉత్తరాభిముఖముగ కూర్చుండబెట్టి –"ఆతని శరీరమునుండి సుషుమ్నా నాడి బైటకువచ్చి నా శరీరములో విలీనమైనది' అని భావన చేసి, మూలమంత్రముచే అభిమంత్రించిన దర్భను గ్రహించి, దాని అగ్రమును శిష్యుని హస్తము నందును, మూల భాగమును తన కాలిపైనను లేదా, అగ్రభాగమును తన కాలిపైనను, మూల భాగమును శిష్యుని హస్తమునందును ఉంచవలెను. శివ మంత్రముతో రేచక ప్రాణాయామము చేసి, శిష్యుని హృదయములో ప్రవేశించుచున్నట్లు భావన చేయుచు, మరల అదే మంత్రముతో పూరక ప్రాణాయామముచే తిరిగి తన హృదయాకాశమును చేరినట్లు భావన చేయవలెను. శివాగ్నిచే ఈ విధమగు నాడీ సంధానముచేసి, తత్సన్నిధానము నిమిత్తము హృదయ మంత్రముతో మూడు హోమములను చేయవలెను. శివహస్త స్థైర్యము కొరకై, మూల మంత్రముతో నూరుహోమములు చేయవలెను. ఈ విధముగ చేయుటచే శిష్యుడు సమయ దీక్షా సంస్కార యోగ్యుడగును. (81)

సంస్కార దీక్షా విధానము

ఈశ్వరుడు పలికెను–కుమార స్వామీ! ఇపుడు సంస్కార దీక్షా విధానమును గూర్చి చెప్పెదను. అగ్ని యందున్న శివుని అర్ధనారీశ్వర రూపమును తన హృదయము నందు ఆవాహన చేయవలెను. శివుడును, పార్వతియు ఒకే శరీరమున కలిసియున్నారు అని భావనచేసి పూజించి, హృదయ మంత్రముచే తర్పింపచేయవలెను. వారి సాన్నిధ్యమును కోరుచు హృదయ మంత్రముతో ఐదు హోమములు చేయవలెను. అస్త్ర మంత్రముచే పుష్పమును అభిమంత్రించి, దానితో శిష్యుని హృదయ మున తాడనము చేయవలెను. వానిలో నక్షత్రాకారమున ప్రకాశించుచున్న జీవుని భావించవలెను. హుంకార యుక్త రేచక ప్రాణాయామముతో శిష్య హృదయము నందు ప్రవేశించినట్లు భావనచేసి, సంహారిణీ ముద్రతో ఆజీవుని అచటినుండి లాగి, పూరక ప్రాణాయామముచే తన హృదయమున స్థాపించుకొనవలెను. ఉద్భవ ముద్రను ప్రదర్శించుచు, హృత్సంపుటితమగు ఆత్మ ముద్రను ఉచ్చరిం చుచు, రేచక ప్రాణాయామ సాహాయ్యముచే దానిని వాగీశ్వరీదేవి యోనియందు ఉంచినట్లు భావన చేయవలెను. "హాం హాం హామాత్మనే నమః అనునది ఆత్మ మంత్రము. బాగుగా ప్రజ్వలించుచున్న, ధూమ రహితమైన అగ్నిలో అభీష్ట సిద్ధి కొరకై హోమము చేయవలెను. ధూమయుక్తమై, ప్రజ్వలించని అగ్నిలో చేసిన హోమము సఫలము కాజాలదు. అగ్నిజ్వాలలు దక్షిణావర్తములై ప్రసరించినను

ఉత్తమమగు గంధము వచ్చుచున్నను, అగ్ని చాల తేజోవంతముగ కనబడినను, అది శ్రేష్ఠము. ఇందుకు విపరీతముగ, అగ్ని నుండి నిప్పు నెరసులు ఎగురుచున్నను, అగ్నిజ్వాల భూమిని స్పృశించు చున్నను ఉత్తమముకాదు. ఈ గుర్తులచే శిష్యుని పాపమును గుర్తించి అగ్నిలో హోమము చేయవలెను. లేదా పాపభక్షణ హోమములచే ఆ పాపమును భస్మము చేయవలెను. శిష్యునకు నూతన విధ మున ద్విజత్వము సిద్ధించుటకును, రుద్రాంశ భావనకును, ఆహార బీజశుద్ధి నిమిత్తమును, గర్భాదాన, గర్భస్థితి, శీమంతోన్నయన, జాతకర్మ, నామకరణముల కొరకును, వేరువేరుగా, మూల మంత్రముతో, ఐదేసి వందల ఆహుతుల నీయవలెను. చూడాకర్మాదుల కొరకై దశమాంశ హోమములు చేయవలెను.

ఈ విధముగ శిథిలమైన బంధనముగల జీవాత్మలో కలుగు శక్త్యుత్కర్షమే రుద్ర పుత్రుడు అగుటకు నిమిత్తమగుటచే గర్భాధానమని చెప్పబడును. వానిలో స్వతంత్రముగ ఆత్మ గుణములు ఆవిర్భవించుటయే పుంసవనము. మాయ వేరు, ఆత్మ వేరు అను జ్ఞానము కలుగుటయే సీమంతోన్న యనము. శివాదిశుద్ధ సద్వస్తు స్వీకారమే జన్మ. 'నేను శివుడను' అను జ్ఞాన ముదయించుటయే శివత్వయోగ్యుడగు శిష్యునకు నామకరణము ప్రకాశించుచున్న అగ్ని కణమువలె ఉన్న జీవాత్మను, సంహారముద్రచే తీసి తన హృదయ కమలమునందు ఉంచుకొనవలెను. పిమ్మట కుంభక ప్రాణాయా మముతో మూల మంత్రోచ్చారణము చేయుచు హృదయమునందు శివశక్తులను కలుపవలెను. క్రమముగా బ్రహ్మాది కారణములను పరిత్యజించుచు, రేచకముచే జీవాత్మను శివుని దగ్గరకు తీసికొని పోయి, మరల ఉద్భవ ముద్రచే వెనుకకు తీసికొనివచ్చి, వెనుక చెప్పిన హృత్సంపుటితాత్మ మంత్రముతో, రేచక ప్రాణాయామము చేయుచు, విధానమును ఎరిగిన గురువు శిష్యుని హృదయ కమల కర్ణికయందు ఆ జీవాత్మను స్థాపించవలెను. పిమ్మట గురువు తత్కాలోచిత ముగ శివాగ్నుల పూజచేసి, శిష్యునిచే తనకు నమస్కారము చేయించుకొని, ఆతనికి సమయాచారోపదేశము చేయ వలెను. 'నీవెన్నడును ఇష్టదేవతా (శివ) నిందగాని, శైవశాస్త్ర నిందగాని చేయరాదు. శివ నిర్మాల్యా దులను దాటకూడదు. జీవితాంతము వరకును శివ, అగ్ని, గురువుల పూజ చేయవలెను. బాలకులకు, మూఢులకు, వృద్ధులకు, స్త్రీలకు, భోగమును కోరువారికిని (అన్నార్థులకును), రోగులకును యథాశక్తి ధనాది దానము చేయవలెను.' సమర్థులైనవారు సర్వమును దానము చేయవలెనని నియమము చెప్పబడినది.

వ్రతాంగములైన జటా, భస్మ, దండ, కౌపీనాదులను, సంయమపోషకములను అన్య వస్తువులను, ఈశానాది నామములచే గాని, లేదా వాటి ప్రారంభమున 'నమః' చేర్చి నామమంత్రములచే గాని అభిమంత్రించి, స్వాహాంతములగు సంహితా మంత్రములను పఠించుచు పాత్రలలో ఉంచి, వెనుకటి వలెనే సంపాతాభి హతములు (సంస్కార విశేష సంస్కృతములు) చేసి, స్థండిలీశుడగు శివుని ఎదుట ఉంచవలెను. వీటి రక్షణము కొరకై క్షణకాలముపాటు కలశము క్రింద ఉంచవలెను. పిమ్మట శివుని ఆజ్ఞ గైకొని వాటిని శిష్యునకు ఈయవలెను. ఈ విధముగ విశిష్ట సమయదీక్షా సంపన్నుడగు శిష్యుడు అగ్ని హోమ ఆగమజ్ఞానాది యోగ్యత కలవాడగును. (82)

నిర్వాణ దీక్షా విధానము

శివుడు పలికెను : పిమ్మట నిర్వాణ దీక్షయందు, పాశ బంధనశక్తి కొరకును, తాడనాదుల కొరకును మూలమంత్రాదుల దీపనము చేయవలెను. ఒక్కొక్కదానికి, ఒక్కొక్క హోమము, లేదా

మూడేసి హోమములు చేసి మంత్రదీపనము చేయవలెను. మొదట ప్రణవమును, మధ్య బీజ, గర్భ, శిఖాబంధ స్వరూపములగు మూడు 'హూం'లను ఉచ్చరిం చవలెను. దీనివలన మూలమంత్ర దీపనమగును. 'ఓం హూం హూం హూం ఫట్' అని దీపనము. దీనిచేతనే 'ఓం హూం హూం హూం ఫట్ హృదయాయ నమః' అని హృదయ దీపన మగును. పిమ్మట 'ఓం హూం హూం హూం ఫట్ శిరసే స్వాహా' ఇత్యాదులచే శిరస్సు మొదలగు అంగములు దీపనము చేయవలెను. క్రూరకర్మలన్నింటి యందును మూలాది దీపనము ఈ విధముగనే చేయవలెను. శాంతి, పుష్టి, వశీకరణ కర్మలయందు మొదట ఉన్న ప్రణవము చివర 'వషట్' చేర్చి ఒక్కొక్క దానిని ఆ మంత్రము చేతనే దీపనము చేయవలెను. ఆప్యాయానాది కర్మలన్నింటియందును 'వషట్' 'వౌషట్'లతో కూడిన, సంపూర్ణ కామ్యకర్మలపై ఉన్న శంబర మంత్రములతో హోమము చేయవలెను. తన ఎడమ ప్రక్క నున్న మండలముపై ప్రకాశించుచున్న పరిశుద్ధ శరీరవంతుడగు శిష్యుని పూజించి, ఒక ఉత్తమ సూత్రమును సుషుమ్నా నాడిగా భావనచేసి, మూల మంత్రముతో దానిని శిఖాబంధము వరకును తీసికొని పోయి, అచటి నుండి కాళ్ళబొటన వ్రేళ్ళ వరకును తీసికొనిరావలెను. పిదప, సంహార క్రమముచే దానిని మరల ముముక్షువగు శిష్యుని శిఖవద్దకు తీసికొనిపోయి అచటనే కట్టవలెను. పురుషునకు కుడి ప్రక్కను, స్త్రీకి ఎడమ ప్రక్కను కట్టవలెను. శిష్యుని శిరస్సుపై శక్తిని శక్తి మంత్రముచే పూజించి, ఆ శక్తిని సంహారముద్రచే తీసికొనివచ్చి ఆ సూత్రమునందు, ఆ మంత్రముతోడనే, కలపవలెను. సుషుమ్నా నాడిని గ్రహించి, దానిని మూలమంత్రముతో ఆ సూత్రముపై న్యాసము చేసి, హృదయ మంత్రముతో దానిని పూజించవలెను. కవచ మంత్రముచే ఆచ్ఛాదించి, హృదయ మంత్రముతో మూడు హోమములు చేయవలెను. ఈ హోమములు నాడీ సంవిధానము కొరకు చేయబడినవి. శక్తి సంవిధానము కొరకుగూడ ఈ విధముగనే హోమమును చేయవలెను.

'ఓం హాం తత్త్వాధ్వనే నమః' 'ఓం హాం పదాధ్వనే నమః' 'ఓం హాం వర్ణాధ్వనే నమః' 'ఓం హాం మన్త్రాధ్వనే నమః', 'ఓం హాం కళాధ్వనే నమః' 'ఓం హాం భువనాధ్వనే నమః' అను వర్ణమంత్రము లచే, సూత్రముపై ఆరు అధ్వల న్యాసముచేసి అస్త్రమంత్రముచే అభిమంత్రించిన ఉదకముతో శిష్యుని ప్రోక్షించవలెను. అస్త్రమంత్రము జపించుచు పుష్పము గ్రహించి శిష్యుని హృదయమును కొట్టవలెను. పిమ్మట హుంకారయుక్త రేచక ప్రాణా యామముతో శిష్యుని శరీరమునందు ప్రవేశించి, దాని లోపల హంసబీజములో జీవ చైతన్యమును, అస్త్రమంత్రమును జపించుచు, అచటి నుండి తొలగించవలెను. పిమ్మట 'ఓం హః హూం ఫట్' అను శక్తి సూత్రముచేతను, 'హాం హాం స్వాహా' అను మంత్రము చేతను సంహారముద్రతో, వాడియైన ఆ సూత్రమునందు విడదీసిన జీవ చైతన్యమును నియమించవలెను. 'ఓం హాం హాం హోమాత్మనే నమః' అను మంత్రము జపించుచు జీవాత్మ వ్యాపకమని భావన చేయవలెను. పిదప కవచ మంత్రముచే దానిని ఆచ్ఛాదించి దాని సాన్నిధ్యమును కోరుచు హృదయ మంత్రముచే మూడు హోమములు చేయవలెను. పిమ్మట విద్యాదేహ న్యాసముచేసి దానిలో శాంత్యతీత కళను చూడవలెను. ఇతర తత్త్వములతో కూడిన ఆత్మ ఆ కళయందు అంతర్గతమై ఉన్నట్లు భావన చేయవలెను. 'ఓం హూం శానత్యతీత కలాపాశాయ నమః' అను మంత్రముచే ఆ కళను చూడవలెను. రెండు తత్త్వములు, ఒక మంత్రము, ఒక పదము, పదునారు వర్ణములు,

ఎనిమిది భువ నములు, క, ఖ మొదలైన బీజములు, నాడులు, రెండు కళలు, విషయములు, గుణములు, ఏకమాత్ర కారణభూతుడైన సదాశివుడు, వీటి అన్నింటిని శ్వేతవర్ణమగు శాంత్యతీతకళీలో అంతర్భూతముచేసి 'ఓం హూం శాన్త్యతీత కలాపాశాయ హూం ఫట్' అను మంత్రముచే ప్రతాడనము చేయవలెను. కలాపాశమును సంహారముద్రతో తీసికొని, సూత్రము శిరస్సుపై నుంచి దానిని పూజించవలెను. దాని సాన్నిధ్యము కొరకై వెనుకటివలెనే మూడు హోమములు చేయవలెను. 'హూం' అనునది శాంత్యతీత కళాబీజము, రెండు తత్త్వములు, రెండు అక్షరములు, బీజములు, నాడి, క, ఖ అను అక్షరములు, రెండు గుణములు, రెండు మంత్రములు, కమలములో ఉన్న ఏక మాత్ర కారణభూతుడైన ఈశ్వరుడు, పంద్రెండు పదములు, ఏడు లోకములు, ఒక విషయము- వీటిని అన్నింటిని కృష్ణ వర్ణయగు శాంతికళ లోపల భావన చేయవలెను.

పిమ్మట వెనుకటి వలెనే తాడనముచేసి సూత్రముఖ భాగమున వీటిని అన్నింటిని కూర్చవలెను. సాన్నిధ్యము కొరకే శాంతికళా బీజ మంత్రముతో (హూం హూం) మూడు హోమములు చేయవలెను. ఏడు తత్త్వములు, ఇరువదియొక్క పదములు, ఆరు వర్ణములు, ఒక శంబరము, ఇరువదియైదు లోకములు, మూడు గుణములు, ఒక్క విషయము, రుద్రరూప కారణతత్త్వము, బీజము, నాడులు, క, ఖ అనుకళలు-వీటినన్నింటిని మిక్కిలి ఎఱ్ఱని రంగుగల విద్యాకళలో అంతర్భూతములుచేసి, ఆవాహన సంయోజన పూర్వకముగా వెనుక చెప్పిన సూత్రము హృదయ భాగమున స్థాపించి, తన మంత్రముచే పూజించి, వీటి అన్నింటి సన్నిధికొరకై వెనుకటివలెనే మూడు ఆహుతులు ఈయవలెను. ఆహుతి చేయు బీజమంత్రము (హూం హూం హూమ్', ఇరువదినాలుగు తత్త్వములు, ఇరువది యైదు వర్ణములు, బీజములు, నాడులు, క, ఖ అను కళలు, ఇరువది రెండు పదములు, అరువది లోకములు, అరువది కళలు, నాలుగు గుణములు, మూడు మంత్రములు, ఒక విషయము, కారణరూప శ్రీహరి-వీటిని అన్నింటిని శుక్ల వర్ణమగు ప్రతిష్ఠా కళలో అంతర్భూతములు చేసి, తాడనాదికము చేయవలెను. మరల వీటినన్నింటిని సూత్రనాభి భాగమున సంయోజనముచేసి, సన్నిధాన కరణమునకై, 'హూం హూం హూం హూం' అను మంత్రముచే మూడు హోమములు చేయవలెను. నూట ఎనిమిది భువనములు, ఇరువది యెనిమిది పదములు, బీజములు రెండు నాడులు, రెండు సమీరములు, రెండు ఇంద్రియములు, ఒక వర్ణము, ఒక తత్త్వము, ఒక విషయము, ఐదు గుణములు, కారణ రూపకమలాసన బ్రహ్మ, నాలుగు శంబరములు-వీటిని అన్నింటిని పీతవర్ణమగు నివృత్తి కళలో అంతర్భూతములుచేసి తాడనము చేయవలెను. వీటిని గ్రహించి, సూత్ర చరమభాగమునందు స్థాపించి, పూజించి, వీటి సాన్నిధ్యము కొరకై 'హూం హూం హూం హూం హూం' అను బీజ మంత్రముతో మూడు హోమములు చేయవలెను.

ఈ విధముగ, సూత్రమునందు ఉన్న ఐదు కళలను తీసి శిష్యుని శరీరమునందు ఉంచవలెను. సబీజ దీక్షయందు, సమయాచార పాశముకంటెను, దాహారంభక ధర్మము కంటెను, మంత్రసిద్ధి ఫలము కంటెను, ఇష్టాపూర్తాది ధర్మముకంటెను భిన్నమైన చైతన్య రోధక సూక్ష్మ ప్రబంధకములను కళలలో భావన చేయవలెను. వాటివాటి మంత్రములతో మూడేసి హోమములుచేసి తర్పణ- దీపనములు చేయవలెను. 'ఓమ్ హూం శాన్త్యతీత కలాపాశాయ స్వాహా' ఇత్యాది మంత్రములచే

తర్పణములు, 'ఓం హూం హూం శాన్త్యతీత కలాపాశాయ హూం హూం ఫట్' ఇత్యాది మంత్రములచే దీపనము చేయవలెను. వ్యాప్తి బోధకొరకై, సూత్రమును, సురక్షా పూర్వకముగ ఐదు కళాస్థానములపై నుంచి, దానిపై కుంకుమాదులచే అంగదేవతా సమేతుడైన శివుని పూజించవలెను. కళా మంత్రముల చివర 'హుం ఫట్' అను పదములు చేర్చి ఉచ్చరించుచు పాశభేదనముచేసి, నమస్కారాంత కలా మంత్రములతో వాటిలోపల ప్రవేశముచేయవలెను. కళాగ్రహణ బంధనములు కూడ చేయవలెను. 'ఓం హూం హూం హూం శాన్త్యతీతకలాం గృహ్ణామి బధ్నామి' ఇత్యాది మంత్రములు గ్రహణ బంధనములందు వినియోగింపబడును. ఒక్కొక్క కళ విషయమునను తప్పక పాశాది వశీకరణమును, గ్రహణమును, బంధనమును, పురుషుని విషయమున సకలవ్యాపార నిషేధమును చేయవలెను. శిష్యుని కూర్చుండ బెట్టి, సూత్రమును వాని భుజము నుండి చేతిలోంచి జ్ఞాతాజ్ఞాత పాపపరిహారార్థమై నూరు పర్యాయములు మూల మంత్రముతో హోమము చేయవలెను. పురుషుని సూత్రము అస్త్ర మంత్ర సంపుటము నందును, స్త్రీ సూత్రమును ప్రణవసంపుటము నందును ఉంచి, హృదయ మంత్రముతో సంపుటితమొనర్చి, ఆమంత్రముతోనే దానిని పూజచేయవలెను. సూత్రమునకు సాంగములతో శివునిచే సంపాత శోధనముచేసి, దానిని కలశము క్రింద ఉంచి, దాని రక్షకొరకై ఇష్టదేవతా ప్రార్థన చేయవలెను. శిష్యుని చేతిలో పూవులు ఇచ్చి, కలమునకు పూజా ప్రణామాదులు చేసిన పిమ్మట యాగశాలనుండి బైటకు రావలెను.

అచట మూడు మండలములుచేసి ముక్తి కాములగు శిష్యులను ఉత్తరాభి ముఖముగను, భోగకములను పూర్వాభిముఖముగను కూర్చుండబెట్టవలెను. ముందుగా, కుశయుక్తమగు చేతిలో మూడు చుళుకములు (పుడిసెళ్ళు) పంచగవ్యము త్రాగించవలెను. మధ్య ఆచమనము చేయరాదు. పిమ్మట ఒక్కొక్క శిష్యునికిని మూడు లేదా ఎనిమిది గ్రాసములు చరువు ఇవ్వవలెను. ముక్తికామునకు పలాశ పత్రముల దొన్నెయందును, భుక్తి కామునకు రావియాకుల దొన్నె యందును చరువు ఇవ్వవలెను. ఆతడు దంత స్పర్శ కలుగకుండ దానిని భక్షించవలెను. గురువు చేతులు కడిగికొని పవిత్ర జలముతో ఆ శిష్యులచే ఆచమనము చేయించవలెను. హృదయ మంత్రముచే దంతధావనము చేసి ఆ కాష్ఠమును పారవేయవలెను. దాని ముఖముము శుభదిశ వైపున పడినచో శుభఫలము కలుగును. న్యూనతాదోష పరిహారార్థమై మూల మంత్రముతో నూట ఎనిమిది పర్యాయములు హోమము చేయవలెను. కర్మనంతను స్థండిలేశ్వరునకు సమర్పించవలెను. పిమ్మట ఆ శివుని పూజించి, విసర్జించి చండేశుని పూజించవలెను. నిర్మాల్యమును తొలగించి మిగిలిన చరువును అగ్నిలో హోమము చేయవలెను. కలశమునకును, లోకపాలకులకును పూజా విసర్జనములుచేసి, గణములును, అగ్నియు బాహ్య దిక్కున ఉంచబడినచో వాటిని కూడ విసర్జించవలెను. మండలము వెలుపల లోకపాలకులకు కూడ సంక్షిప్తముగ బలి సమర్పించి, భస్మ, శుద్ధ జలములతో స్నానముచేసి యాగమండలమును ప్రవేశించవలెను. గృహస్థులైన శిష్యులను అస్త్రమంత్రముచే రక్షించి కుశ శయ్యపై నిద్రింపచేయవలెను. వీరి తల తూర్పువైపు ఉండవలెను. విరక్తులైన శిష్యులను హృదయ మంత్రముచే భస్మ శయ్యపై దక్షిణ శిరస్కులనుగా పరుండబెట్ట వలెను. ఆ శిష్యులందరును అస్త్ర మంత్రముచే రక్షితులై, శిఖామంత్రముచే తమ తమ శిఖలను బంధించుకొనవలెను. పిమ్మట

గురువు వారికి స్వప్న మానవుని గూర్చిచెప్పి మండలము నుండి బైటకు రావలెను. పిమ్మట "ఓం హిలి హిలి శూలపాణయే నమః స్వాహా" అను మంత్రముచే పంచగవ్య-చరువుల ప్రాశనముచేసి, దంతధావన అనంతరము ఆచమనము చేయవలెను. శివుని ధ్యానించుచు దీక్షకు సంబంధించిన కర్మకాండను స్మరించుచు పవిత్ర శయనముపై శయనించవలెను. ఈ విధముగ దీక్షాధివాసన విధి సంక్షిప్తముగ చెప్పబడినది. (83)

నిర్వాణ కళా శోధనము

ఈశ్వరుడు చెప్పెను : గురువు ప్రాతఃకాలము నందు లేచి, స్నానాదులు పూర్తి చేసికొని, మీరేమి స్వప్నములు చూచితిరని శిష్యులను అడుగవలెను. పెరుగు, పచ్చి మాంసము, మద్యము మొదలగువాటిని భుజించినట్లుగాని, చూచినట్లుగాని స్వప్నము వచ్చినచో అది ఉత్తమము, శుభ సూచకము. అట్లే ఏనుగు, గుఱ్ఱము ఎక్కుట, శ్వేత వస్త్రాదులను చూచుట గూడ శుభప్రదము. తైలము పూసికొనినట్లు స్వప్నము చూచినచో అశుభము. దాని శాంతికొరకై అఘోర మంత్రముతో హోమము చేయవలెను. ప్రాతఃకాల మధ్యాహ్నకాల నిత్యకర్మలు పూర్తిచేసుకొని యజ్ఞ మండపమున ప్రవేశించి, యధాశాస్త్రముగ ఆచమనము చేసి, నైమిత్తిక కర్మ కూడ నిత్యవిధి వలెనే చేయవలెను. అధ్వశుద్ధి చేసుకొని తనపై హస్తము ఉంచుకొనవలెను. కలశముపైనున్న శివుని పూజించి, క్రమముగ ఇంద్రాది దిక్పాలకుల పూజ చేయవలెను. మండలమునందును, వేదియందును శివుని పూజింప వలెను. పిమ్మట తర్పణములు, అగ్నిపూజ, పూర్ణాహుతి వరకును హోమములు, మంత్ర తర్పణములు చేయవలెను. దుఃస్వప్న దోష నివారణార్థమై 'హూం'తో సంపుటితము చేసిన అస్త్ర మంత్రముతో (హూం ఫట్ హూం) నూటఎనిమిది హోమములుచేసి మంత్ర దీపనము చేయవలెను. వేదీ-కలశములమధ్య అంతర్బలిచేసి, శిష్యుల ప్రవేశార్థమై ఇష్టదేవతా అనుజ్ఞ పొంది గురువు మండపము నుండి బైటకు వెళ్ళవలెను. అచట, సమయ దీక్షలోపలనే మండలారోపణాదికము చేసి సంపాత హోమము. సుషుమ్నా నాడీరూపమగు కుశమును శిష్యుని హస్తములో నుంచుట మొదలగు కార్యములను పూర్తిచేయవలెను. నివృత్తి కళాసాన్ని ధ్యము కొరకై మూల మంత్రముచే మూడు ఆహుతులు ఇచ్చి, కుంభముపై నున్న శివుని పూజించి కలాపాశమయమగు సూత్రమును సమర్పిం పవలెను. పిమ్మట పూజింపబడిన శిష్యుని ఊర్ధ్వదేహము కుడి భాగమున వాని శిఖకు ఆ సూత్రమును కట్టి కాలి బొటన వ్రేలివరకును వ్రేలాడునటుల ఉంచవలెను. ఆ విధముగ ఆ పాశమును ఉంచి, దానిలో నివృత్తి కళావ్యాప్తి జరిగినట్లు భావన చేయవలెను. దానియందు నూట ఎనిమిది భువనములు చూడవలెను.

కపాల, అజ, అహిర్బుధ్న్య, వజ్రదేహ, ప్రమర్దన, విభూతి, అవ్యయ, శాస్తృ, పినాకి, త్రిదశాధి పులను పదిమంది రుద్రులు తూర్పు దిక్కున ఉందురు. అగ్ని రుద్ర, హుతాశ, పింగల, ఖాదక, హర, జ్వలన, దహన, బభ్రు, భస్మాంతక, క్షపాంతకులు అను పది మంది రుద్రులు ఆగ్నేయమున నుందురు. దమ్య, మృత్యుహర, ధాతృ, విధాతృ, కర్తృ, కాల, ధర్మ, అధర్మ, సంయోక్తృ, నియోజ కులను పదిమంది రుద్రులు దక్షిణమునసుందురు. నైరృత్య, మారుత, హన్తృ, క్రూర, దృష్టి,

భయానక, ఊర్ధ్వకేశ, విరూపాక్ష, ధూమ్ర, లోహిత, దంష్ట్రులను పదిమంది రుద్రులు నైరృతి దిక్కునందు ఉందురు. బల, అతిబల, పాశహస్త, మహాబల, శ్వేత, జయభద్ర, దీర్ఘబాహు, జలాంతక, వడవాస్య, భీములను పదిమంది రుద్రులు పశ్చిమమున ఉందురు. శీఘ్ర, లఘు, వాయువేగ, సూక్ష్మ, తీక్ష్ణ, క్షమాంతక, పంచాంతక, పంచశిఖ, కపర్ది, మేఘ వాహనులను పదిమంది రుద్రులు వాయవ్యమునందు ఉందురు. జటాముకుటధారి, నానారత్నధర, నిధీశ, రూపవత్, ధన్య, సౌమ్యదేహ, ప్రసాదకృత్, ప్రకామ, లక్ష్మీవత్, కామరూపులను పదిమంది రుద్రులు ఉత్తరమునందు ఉందురు. విద్యాధర, జ్ఞానధర, సర్వజ్ఞ, వేదపారగ మాతృవృత్త, పింగాక్ష, భూతపాల, బలిప్రియ, సర్వవిద్యా విధాతృ, సుఖదుఃఖకరులను పది మంది రుద్రులు ఈశాన్యమునందు ఉందురు. అనంత, పాలక, ధీర, పాతాళాధిపతి, వృష, వృషధర, వీర, గ్రసన, సర్వతోముఖ, లోహితులను పదిమంది రుద్రులు క్రింది దిక్కునందు పాతాల లోకమునందు ఉందురు. శంభు–విభు–గణాధ్యక్ష–త్ర్యక్ష–త్రిదశ వందిత–సంవాహ–వివాహ–నభ–విప్సు–విచక్షణులను పదిమంది రుద్రులు ఊర్ధ్వ దిక్కునందు ఉందురు. హుహుక కాలాగ్ని రుద్ర, హాటక, కూష్మాండ, సత్య, బ్రహ్మ, విష్ణు, రుద్రులను ఎనమండుగురు రుద్రులు బ్రహ్మాండ కటాహము మధ్య నుందురు. ఈ రుద్రుల పేర్లను బట్టియే నూట ఎనిమిది భువనముల పేర్లు ఏర్పడినవి అను విషయమును గుర్తుంచుకొనవలెను.

సద్భావేశ్వర, మహాతేజః, యోగాధిపతే, ముంచ ముంచ, ప్రమథ ప్రమథ, శర్వ శర్వ, భవ భవ, భవోద్భవ, సర్వభూత సుఖప్రద, సర్వసాన్నిధ్యకర, బ్రహ్మ విష్ణు రుద్ర పర, అనర్చితానర్చిత, అసంస్తుతాసంస్తుత, పూర్వస్థిత, సాక్షిన్, సాక్షిన్, తురు తురు, పతఙ్గ పతఙ్గ, పిఙ్గ పిఙ్గ, జ్ఞాన జ్ఞాన, శబ్ద శబ్ద, సూక్ష్మ సూక్ష్మ, శివ–సర్వ, సర్వద, ఓం నమోనమః, ఓం నమః శివాయ నమో నమః ఇవి ఇరువది యెనిమిది పదములు. స్కందా! వ్యాపకమైన ఆకాశము మనస్సు. 'ఓం నమో వౌషట్–ఇది అభీష్ట మంత్ర వర్ణము, 'అ'కార 'ల'కారములు (అం లం) బీజములు. ఇడా పింగళులు రెండు నాడులు, ప్రాణ అపానము లనునవి రెండు వాయువులు, ఘ్రాణము, ఉపస్థ అనునవి రెండు ఇంద్రియ ములు. గంధము విషయము. దీనియందు గంధాదులగు నాలుగు గుణములున్నవి. ఇది పృథ్వీ తత్త్వముతో సంబంధించినది. పీతవర్ణము, దీని మండలాకారము చతురస్రము. నాలుగు వైపులా వజ్రముచే చిహ్నితమైనది. ఈ పార్థివ మండల విస్తారము నూరుకోట్ల యోజనములు. పదునాలుగు యోనులు కూడ దీనియందే అంతర్గతములని గ్రహించ వలెను. మొదటి ఆరును మృగాది యోనులు, తరువాతి ఎనిమిది దేవయోనులు. మొదటిది మృగయోని, రెండవది పక్షియోని, మూడవది పశుయోని, నాల్గవది సర్పాదియోని, ఐదవది స్థావరయోని, ఆరవది మనుష్యయోని, ఎనిమిది దేవయోనులు వరుసగ పిశాచ, రాక్షస, యక్ష, గంధర్వ, ఇంద్ర, సోమ, ప్రజాపతి, బ్రహ్మ లకు సంబంధించినవి. ఈ ఎనిమిది యోనులకును పార్థివతత్త్వముపై అధికారమని చెప్పబడినది.

లయము ప్రకృతి యందును, భోగము బుద్ధియందును అగును. బ్రహ్మ కారణము పిమ్మట జాగ్రదవస్థవరకును సమస్త భువనాది గర్భితయగు నివృత్తికళను ధ్యానముచేసి, తదీయ మంత్రముచే వినియోగము చేయవలెను. 'ఓం హాం హ్రాం హాం నివృత్తికలాపా శాయ హుం ఫట్ స్వాహా' అను నది దాని మంత్రము. పిదప 'ఓం హాం హ్లాం హోం నివృత్తి కలాపాశాయ హూం ఫట్ స్వాహా'

అను మంత్రముచే అంకుశ ముద్రా ప్రదర్శన పూర్వముగ, పూరక ప్రాణాయామముతో ఆ కళను ఆకర్షించవలెను. పిదప ఓం హూం హ్లాం హూం నివృత్తి కలాపాశాయ హూం ఫట్ స్వాహా' అను మంత్రముచే సంహార ముద్రాకుంభక ప్రాణాయామములతో దానిని నాభి క్రింది భాగమునకు తీసికొనిపోయి 'ఓం హాం నివృత్తి కలాపాశాయ నమః' అను మంత్రముచే, ఉద్భవముద్రా రేచక ప్రాణాయామములతో దానిని కుండమునందు ఏదైన ఒక ఆధారముపై నుంచవలెను. పిమ్మట 'ఓం హాం నివృత్తి కలాపాశాయ నమః అను మంత్రముచే అర్ఘ్య ప్రధాన పూర్వకముగ పూజించి దాని చివర 'స్వాహా' చేర్చి తర్పణముచేసి, సంవిధానము కొరకై వేరువేరుగా మూడు హోమములు చేయవలెను. పిమ్మట 'ఓం హాం బ్రహ్మణే నమః' అను మంత్రముచే బ్రహ్మను ఆవాహనచేసి, పూజించి, దాని చివర 'స్వాహా' చేర్చి మూడు హోమములచే బ్రహ్మను సంతృప్తుని చేయవలెను. అనంతరము 'ఓ బ్రహ్మదేవా! ఈ ముముక్షువునకు, నీ అధికారమున దీక్ష ఇచ్చుచున్నాను. నీవు సర్వదా వీనికి అనుకూలు డవుగ నుండుము' అని ప్రార్థించవలెను. పిదప, రక్తవర్ణయగు వాగీశ్వరిని, హృదయ మంత్రముతో, తన మనస్సులోనే ఆవాహనచేయవలెను. ఆ దేవి ఇచ్ఛా, జ్ఞాన, క్రియా రూపిణి. ఆరు అధ్వలకును ఏకైక కారణము. వెనుక చెప్పిన విధానమున వాగీశ్వరికి పూజా తర్పణములు చేయవలెను. సమస్తయోనులను విక్షుబ్ధము చేయువాడును, హృదయములో నుండు వాడును అగు వాగీశ్వర దేవుని కూడ పూజించి తర్పణము చేయవలెను. ఆదియందు బీజముతోడను, అంతమునందు అస్త్ర మంత్రముతోడను కూడిన అస్త్ర మంత్ర ముతో శిష్యుని హృదయ తాడనముచేసి, అతనిలో ప్రవేశించినట్లు భావన చేయవలెను. హృదమునందు, నివృత్తి కళలోపల నున్న, అగ్ని కణ సదృశమగు పాశబద్ధ మైన శిష్య జీవచైతన్యమును జ్యేష్ఠతో విభక్తము చేయవలెను. 'ఓం హాం హూం హః హూం ఫట్' అనునది విధానమంత్రము. 'ఓం హాం స్వాహా' అను మంత్రముచే, పూరక ప్రాణాయామ అంకుశ ముద్రలతో, ఆ జీవ చైతన్యమును హృదయమునందు ఆకర్షించి, ఆత్మ మంత్రముచే పట్టుకొని, దానిని తన ఆత్మలో చేర్చవలెను. 'ఓం హాం హాం మాం ఆత్మనే నమః' అనునది ఆత్మ మంత్రము.

మాతా పితరుల సంయోగమును భావన చేయుచు, రేచక ప్రాణాయామముతో బ్రహ్మాది కారణములను క్రమముగ త్యజించుచు జీవచైతన్యమును శివ రూపాధిష్ఠానము నందు చేర్చి, గర్భాధానము కొరకై దానిని గ్రహించి ఒకే సమయమున అన్ని యోనులందును, వామా, ఉద్భవ ముద్రలతో వాగీశ్వర యోనియందును ఉంచవలెను. పిమ్మట 'ఓం హాం మాం హామ్ ఆత్మనే నమః' అను మంత్రముతో పూజను, ఐదు పర్యాయములు తర్పణమును చేయవలెను. అన్ని యోనులయందును, ఈ జీవచైతన్యమునకు, హృదయ మంత్ర ముచే దేహసాధనము చేయవలెను. స్త్రీ శరీరాదులు పుట్టుటకు కూడ అవకాశమున్నది గాన పుంసవన సంస్కారము చేయ అవసరము లేదు. దైవవశముచేత అంధాది శరీరోత్పత్తి కూడ సంభావ్యముగాన సీమంతోన్నయనము కూడ అనావశ్యకము. శిరో మంత్రము (స్వాహా)చే ఒకే సమయమున సకల జీవులు జనించినట్లు భావన చేయవలెను. శివమంత్రముతో కూడ ఈ విధముగనే భావన చేయవలెను. కవచ మంత్రముతో భోగమును, అస్త్రమంత్రముతో విషయమునందును ఆత్మయందు మోహరూపమగు లయమను

అభేదమును భావన చేయవలెను. పిదప శివ మంత్రముతో స్రోత శుద్ధిని, హృదయ మంత్రముతో తత్త్వ శోధనమును చేసి గర్భాదానాది సంస్కారముల నిమిత్తమై వరుసగ ఐదేసి హోమములు చేయవలెను. మాయజనిత, మలజనిత, కర్మజనితాది పాశబంధములు తొలగుటకై హృదయ మంత్రముచే శుద్ధిచేసి, అగ్నిలో నూరు హోమములు చేయవలెను. మలశక్తిని లయింప చేయుటకును, పాశములు తొలగించు కొనుటకును స్వాహాంతమగు అస్త్రమంత్రముతో ఐదేసి హోమములు చేయవలెను. "ఓం హాం హాం హాం నివృత్తి కలాపాశాయ హః హూం ఫట్" అను మంత్రమును ఉచ్చరించుచు, అస్త్ర మంత్ర జపాభి మంత్రితమగు ఖడ్గమైన కళాశస్త్రముతో అంతః కరణములో నున్న మలాది పాశములను ఏడు పర్యాయములు భేదించవలెను.

పాశము బంధించకుండ ఉండుటకు దానిని అస్త్రమంత్రముతో, రెండు చేతులతో నలిపి, గోలాకారముచేసి, నేతితో నింపిన స్రువములో పడవేయవలెను. కలామయమగు అస్త్రముచేత గాని, దేవతాస్త్ర మంత్రముచే గాని దానిని కాల్చివేసి భస్మము చేయవలెను. పిమ్మట పాశాంకురము తొలగిపోవుటకు నాలుగు హోమములు చేయవలెను. 'ఓం హః అస్త్రాయ హూం ఫట్ స్వాహా' అనునది హోమ మంత్రము. పిదప అస్త్రమంత్రముతో ఎనిమిది హోమములుచేసి ప్రాయశ్చిత్తము చేయవలెను. పిమ్మట విధాతను ఆవాహన చేసి పూజాతర్పణములు చేయవలెను. 'ఓం హాం శబ్దస్పర్శౌ శుల్కం బ్రహ్మన్ గృహాణ స్వాహా' అను మంత్రముతో మూడు హోమములుచేసి శిష్యునకు అధికారము సమర్పిం పవలెను. శివుని ఆజ్ఞను ఈ విధముగ బ్రహ్మకు తెలుపవలెను 'ఓ బ్రహ్మా! ఈ పిల్లవాని పాశములు అన్నియు దగ్ధములైనవి. ఈతని మరల బంధనములలో పడవేయుటకై నీవు ఇచట ఉండరాదు'. ఇట్లు చెప్పి, బ్రహ్మను పంపివేసి, సంహార ముద్రా కుంభక ప్రాణా యామములతో, రాహువు యుక్త చంద్రిక దేశమువలె నున్న ఆత్మను, ఆత్మమంత్రము ఉచ్చరించుచు కుడినాడి ద్వారా మెల్ల మెల్లగా తీసికొని, రేచక ప్రాణాయామ ఉద్భవ ముద్రలతో వెనుకటి సూత్రము నందు చేర్చవలెను. మరల దానిని పూజించి గురువు అర్ఘ్యపాత్రలో నున్న అమృతోపమ జలబిందు వులను గ్రహించి, శిష్యుని పుష్టి-తృప్తులకొరకై అతని శిరముపై నుంచవలెను. పిమ్మట మాతాపితరుల విసర్జనముచేసి వౌషడంతమగు అస్త్రమంత్రముతో, విధి దూర్తి కొరకై పూర్ణాహుతి ఇవ్వవలెను. ఇట్లు చేయుటచే నివృత్తికళ శుద్ధమగును. 'ఓం హూం హాం అమకస్య ఆత్మనో నివృత్తి కళాశుద్ధిరస్తు స్వాహా ఫట్ వౌషట్' అనునది పూర్ణాహుతి మంత్రము. (84)

ప్రతిష్ఠాకళాశోధన విధానము

ఈశ్వరుడు చెప్పెను : శాంతము, నాదాంతకము అను హ్రస్వ దీర్ఘముల ప్రయో గముచే శుద్ధ, అశుద్ధ కళల సంధానము చేయవలెను. 'ఓం హాం హ్రాం హ్రీం హాం' అనునది సంధాన మంత్రము. పిమ్మట ప్రతిష్ఠాకళలో నున్న జల, తేజో, వాయు, ఆకాశ, పంచతన్మాత్ర, దశేంద్రియ, బుద్ధి, గుణత్రయ, అహంకార, పురుషులను ఇరువదియైదు తత్త్వములను, 'క' మొదలు 'య' వరకును ఉన్న ఇరువదియైదు అక్షరములను చింతన చేయవలెను. ప్రతిష్ఠాకళలో ఏబదియారు భువనములు ఉన్నవి. వాటిలో అవే పేరులుగల రుద్రులు అంతమంది ఉన్నారు. వారి పేర్లు ఈ

విధముగ ఉన్నవి : అమరేశ, ప్రభాస, నైమిశ, పుష్కర, ఆషాఢి, డిండి, భావభూతి, లకులీశులు (ఇది మొదటి అష్టకము); హరి శ్చంద్ర, శ్రీశైల, జల్ప, ఆమ్రాతకేశ్వర, మహాకాల, మధ్యమ, కేదార, భైరవులు (ద్వితీ యాష్టకము); గయా, కురుక్షేత్ర, నాల కనఖల, విమల, అట్టహాస, మహేంద్ర, భీములు (తృతీయాష్టకము); వస్త్రపద, రుద్రకోటి, అవిముక్త, మహాలయ, గోకర్ణ, భద్రకర్ణ, స్వర్ణాక్ష, స్థాణువులు (చతుర్థాష్టకము); అజేశ, స్వర్వజ్ఞ, భాస్వర, తదనంతర, సుబాహు, మంత్రరూపి, విశాల, జటిల, రౌద్రులు (ఐదవ అష్టకము); పింగలాక్ష, కాలదంష్ట్రి, విధుర, ఘోర, ప్రాజాపత్య, హుతాశన, కాలరూపి, కాలకర్ణులు (ఆరవ అష్టకము); భయానక, పతంగ, పింగల, హర, ధాతృ, శంకుకర్ణ, శ్రీకంఠ, చంద్రమౌళులు (ఏడవ అష్టకము) ఈ ఏబది ఆరుగురు రుద్రులు ఏబదిఆరు భువనములలో వ్యాపించి యున్నారు. ఇపుడు ముప్పది రెండు పదములు చెప్పబడుచున్నవి.

త్యాపిన్, అరూపిన్, ప్రథమ, తేజః, జ్యోతిః, అరూప, పురుష, అగ్నే, అధూమ, అభస్మన్, అనాదే, నానానానా, ధూధూధూధూ, ఓం భూః, ఓం భువః, ఓం స్వః, అనిధన, నిధన, నిధవోద్భవ, శివ, శర్వ, పరమాత్మన్, మహేశ్వర, మహాదేవ, సద్భావ, ఈశ్వర, మహాతేజః, యోగాధిపతే, ముంచ, ప్రమథసర్వ, సర్వసర్వ అనునవి ముప్పదిమూడు పదములు. రెండు బీజములు, వాసుదేవ, శిరస్, శిఖలను మూడు మంత్రములు. గాంధారీ సుషుమ్నా నాడులు, సమాన ఉదానములను రెండు ప్రాణ వాయువులు, రసనా పాయు వులను రెండు ఇంద్రియములు. రసమను విషయము. రూప, శబ్ద, స్పర్శ, రసములను నాలుగు గుణములు, కమలాంకితమైన అర్ధచంద్రాకర శ్వేత మండలము, సుషుప్త్యవస్థ, ప్రతిష్ఠాకారణభూతుడైన విష్ణువు–ఈవిధముగ భువనాది సకల తత్త్వములను ప్రతిష్ఠలోపల భావనచేసి, ప్రతిష్ఠాకళా మంత్రముతో శిష్యశరీరమున ప్రవేశించినట్లు భావనచేసి, దానిని ఆ కళా పాశమునుండి విముక్తుని చేయవలెను. ఓం హాం హీం హాం ప్రతిష్ఠా కలాపాశాయ హుం ఫట్ స్వాహా" అను మంత్రముతో, పూరక ప్రాణాయామాంకుశ ముద్రలతో కళాపాశాకర్షణము చేయవలెను. పిమ్మట 'ఓం హూం హాం హీం హాం ప్రతిష్ఠా కలాపా శాయ హుం ఫట్' అనుమంత్రముతో, సంహార ముద్రా కుంభక ప్రాణాయామములతో హృదయము క్రింద నాడీ సూత్రము గ్రహించి, 'ఓం హూం హీం హాం ప్రతిష్ఠా కలాపాశాయ నమః' అను మంత్రముతో, ఉద్భవముద్రా–రేచక ప్రాణాయామములతో కుండమునందు ఉంచవలెను. పిదప 'ఓం హాం హాం హీం మాం ప్రతిష్ఠా కాలాద్వారాయ నమః' అను మంత్రముతో అర్ఘ్యము ఇచ్చి, పూజించి, స్వాహావిత మంత్రముతో మూడేసి హోమములు చేసి, సంతర్పణ సంవిధాపనములు చేయవలెను. 'ఓం హాం విష్ణవే నమః' అను మంత్రముతో విష్ణువును ఆవాహనచేసి, పూజా తర్పణములు చేసి–'ఓ విష్ణూ! నీ అధికారమునందు ముముక్షువగు శిష్యునకు దీక్ష ఇచ్చుచున్నాను. నీవు అనుకూలుడవు అగుము' అని ప్రార్థించవలెను.

పిమ్మట వాగీశ్వరీ, వాగీశ్వరులను వెనుకటి వలెనే ఆవాహనచేసి పూజనతర్పణములు చేసి, శిష్యుని వక్షమున తాడనము చేయవలెను. 'ఓం హాం హం హః హూం ఫట్' అనునది తాడన మంత్రము. ఈ మంత్రముతోడనే శిష్యుని హృదయమున ప్రవేశించి పాశబద్ధమగు ఆతని చైతన్యమును అస్త్రమంత్ర–జ్యేష్ఠాంకుశ ముద్రలతో పాశవిముక్తము చేయవలెను. ఎట్లనగా 'ఓం

హాం హం హః ఫట్' ఈ మంత్రమునకే 'స్వాహా' చేర్చి తత్సంపుటితమైన మంత్రముతో జీవ చైతన్యము ఆకర్షించి, నమస్కారాంతమగు 'ఓం హాం హాం హాం ఆత్మనే నమః'అను ఆత్మ మంత్రముతో తన ఆత్మతో కలపవలెను. పిదప, ఆ జీవచైతన్యము పితృసంయుక్తమను భావన చేసి, దానిని వామ ఉద్భవముద్రతో దేవీ గర్భమునందు స్థాపించవలెను. ఆ సమయమున 'ఓం హాం హం హామాత్మనే నమః' అను మంత్రము పఠించవలెను. దేహోత్పత్తి కొరకై హృదయ మంత్రముతో ఐదు హోమములును, జీవాత్మ స్థితికొరకై శిరోమంత్రముతో ఐదు హోమములు చేయవలెను. అధికారప్రాప్తి కొరకు శిఖామంత్రముతోను, భోగసిద్ధికొరకు కవచమంత్రముతోను, లయకొరకు అస్త్ర మంత్రము తోను, స్రోతః సిద్ధికొరకు శివమంత్రముతోను తత్త్వశుద్ధి కొరకు హృదయ మంత్రముతోను ఐదేసి హోమములు చేయవలెను. పిమ్మట వెనుకటివలె గర్భాధానాది సంస్కారములుచేసి, పాశశైథిల్య–ప్రాయశ్చిత్తముల కొరకు శిరోమంత్రముతో నూరు హోమములు చేయవలెను. మలశక్తి నివారణము కొరకై స్వాహాంతమగు అస్త్ర మంత్రముతో ఐదు హోమములు చేయవలెను. ఈ విధముగ పాశములు తొలగిన పిమ్మట అస్త్రమంత్రమును ఏడు పర్యాయములు జపించి, 'ఓం హీం ప్రతిష్ఠా కలాపాశాయ హూం ఫట్' అను కమలాబీజ యుక్తమగు అస్త్రమంత్ర రూప ఖడ్గముతో కలాపాశమును ఛేదించ వలెను. పాశశస్త్రముతో ఆ పాశమును నలిపి, వర్తులాకారము చేసి, వెనుకటి వలెనే ఘృతపూర్ణమగు స్రువమునందుంచి, దానిని కలాశస్త్రముతో హోమము చేయవలెను. పిమ్మట పాశాంకుర నివృత్తి కొరకై అస్త్రమంత్రముతో ఐదు హోమములు చేసి ప్రాయశ్చిత్త నివారణార్థమై మరల ఎనిమిది హోమములు చేయవలెను. 'ఓం హః అస్త్రాయ హూం ఫట్' అనునది హోమమునకు ఉపయోగించు అస్త్రమంత్రము.

హృదయ మంత్రముచే విష్ణువును ఆవాహనచేసి, పూజన తర్పణాద్యనంతరము 'ఓం హాం విష్ణో రసంశుల్కం గృహాణ స్వాహా' అను మంత్రముతో అధికార సమర్పణము చేయవలెను. పిదప ఈ విధముగ శివాజ్ఞ వినిపింపవలెను. 'ఓ విష్ణూ! ఈ పశువు పాశ ములు పూర్తిగా దగ్ధమై నవి. ఇక నీవు వీనికి బంధన కారకుడవు కాకూడదు.' పిదప రౌద్రీనాడితో విష్ణువును విసర్జించి రాహుముక్తమైన అర్ధభాగముగల చంద్రమండలముతో సమానమైన ఆత్మను నియుక్తము చేయవలెను. సంహార ముద్రతో దానిని తనలోనుండి, ఉద్భవ ముద్రతో దానిని సూత్రముతో కలుపవలెను. పిదప వెనుకటివలెనే, జలబిందు సదృశమగు ఆ ఆత్మను శిష్యుని శిరముపై ఉంచవలెను. దీనివలన ఆతనికి ఆప్యాయనము కలుగును. పిదప పుష్పాదులతో అగ్నియొక్క మాతాపితరులను పూజించి, విసర్జనముచేసి, విధిపూర్తి కొరకై యథాశాస్త్రముగ పూర్ణాహుతి ఈయవలెను. ఇట్లు చేయుటచే ప్రతిష్ఠాకళ కూడ శోధితమగును. (85)

విద్యా కళా శోధన విధానము

పరమేశ్వరుడు చెప్పెను. పూర్వమునందున్న కళాప్రతిష్ఠతో కూడ విద్యాకళా సంధానముచేసి, వెనుకటివలెనే దానియందు తత్త్వ వర్ణాదుల చింతనము చేయవలెను. 'ఓం హాం హీం హూం హాం' అనునది సంధాన మంత్రము. రాగ, శుద్ధ విద్యా, నియతి, కలా, కౌల, మాయా, అవిద్యలనెడు

ఏడు తత్త్వములను, ర, ల, వ, శ, ష, స అను ఆరు వర్ణములును విద్యా కలాంతర్గతములు. ప్రణవము మొదలగు ఇరువది యొక్క పదములు గూడ తదంతర్గతములే. 'ఓం నమఃశివాయ సర్వప్రభవే శివాయ ఈశానమూర్ధ్నే తత్పురుష వక్త్రాయ అఘోర హృదయాయ, వాసుదేవగుహ్యాయ సద్యోజాతమూర్తయే, ఓం నమోనమః గుహ్యాతి గుహ్యాయ గోప్త్రే అనిధానాయ సర్వయోగాధికృతాయ సర్వ యోగాధిపాయ జ్యోతీ రూపాయ పరమేశ్వరాయ అచేతన అచేతన వ్యోమన్ వ్యోమన్' ఇవి ఇరువది యొక్క పదములు.

ఇపుడు రుద్రుల స్వరూపము, భువనముల స్వరూపము చెప్పబడుచున్నది. ప్రమథ వాసుదేవ, సర్వదేవోద్భవ, భవోద్భవ, వజ్రదేహ, ప్రభు, ధాతృ, క్రమ, విక్రమ, సుప్రభ, బుద్ధ, ప్రశాన్త నామన్, ఈశాన, అక్షర, శివ, సశివ, బభ్రు, అక్షయ, శంభు, అదృష్టరూప నామన్, రూపవర్ధన, మనోన్మన, మహావీర, చిత్రాఙ్గ, కల్యాణులు (ణములు), ఈ ఇరువది యైదును భువనములు, రుద్రులును అని తెలియవలెను.

విద్యాకళలో అఘోరము మంత్రము. మ ర లు బీజములు, పూషా, హస్తి జిహ్వా అను నవి నాడులు. వ్యాన, నాదములు రెండు ప్రాణవాయువులు. రూప మొక్కటియే విషయము. పాదములు, నేత్రములు ఇంద్రియములు, శబ్ద స్పర్శ రూపములు మూడు గుణములు. సుషుప్తి అవస్థ, రుద్రదేవుడు కారణము. భువనాది సమస్త వస్తువులును విద్యాంతర్గతములని భావన చేయవలెను. 'ఓం హూం హైం హాం' అనునది సంధాన మంత్రము, రక్తవర్ణము, స్వస్తిక చిహ్నాంకితము అగు త్రికోణాకార మండలమును భావన చేయవలెను. శిష్యుని పక్షమున తాడనము, కలాపాశచ్ఛేదనము, శిష్య హృదయ ప్రవేశము, వాని జీవచైతన్యమును పాశవిముక్తము చేయుట, ఆతని హృదయ ప్రదేశమునుండి జీవచైతన్యముల ఆకర్షణ గ్రహణములును చేయవలెను. జీవచైతన్యమును తన ఆత్మయందు ఆరోపించుకొనుట, కళాపాశ సంగ్రహణము, దానిని కుండమునందు స్థాపించుట ఇవన్నియు వెనుకటివలెనే చేయవలెను. కారణ రూపుడగు రుద్ర దేవుని ఆవాహన పూజాదులుచేసి, శిష్యునకు బంధము చేయవలదని ఆతనిని ప్రార్థించవలెను.

మాతాపిత్రాదుల ఆవాహనముచేసి శిష్యుని హృదయమున తాడనము చేయవలెను. పూర్వోక్త విద్యనుసారముగ అస్త్ర మంత్రముతో హృదయము నందు ప్రవేశించి జీవచైతన్యమును కలాపాశ విముక్తము చేయవలెను. మరల దానిని ఆకర్షించి, గ్రహించి, తన ఆత్మలో చేర్చుకొనవలెను. వామా, ఉద్భవ ముద్రతో దానిని వాగీశ్వరీదేవీ గర్భమునందు స్థాపించినట్లు భావన చేయవలెను. పిమ్మట దేహ సంపాదనము చేసి, జన్మ, అధికార, భోగ, లయ, స్రోతఃశుద్ధి, తత్త్వశుద్ధుల కొరకును, సకల మలకర్మాది నిర్మూలనము కొరకును, పాశ బంధ నివృత్తి కొరకును, నిష్కృతి కొరకును స్వాహాంతాస్త్ర మంత్రముచే నూరు హోమములు చేయవలెను.

పిమ్మట అస్త్ర మంత్రముచే పాశబంధ శిథిలీకరణము, మలశక్తి తిరోధానము, కళాపాశ ఛ్ఛేదనము, మర్దనము, వర్తులీకరణము, దాహము, అంకురాభావ సంపాదనము, ప్రాయశ్చిత్త కర్మ-ఇవి అన్నియు వెనుకటివలెనే చేయవలెను. పిదప రుద్రుని ఆవాహనచేసి, పూజించి, 'ఓం

హాం రూపగన్ధౌ శుల్కం రుద్ర గృహాణ స్వాహా' అను మంత్రముచే రూప గంధములను సమర్పించవలెను. పరమేశ్వరుని ఆజ్ఞ వినిపించి రుద్రుని విసర్జించవలెను. జీవచైతన్యమును తన ఆత్మలో నుంచి, దాని పాశసూత్రము నందు చేర్చవలెను. జలబిందు స్వరూపము అగు ఆ చైతన్యమును శిష్యుని శిరముపై నుంచి మాతాపితరులను విసర్జించ వలెను. సకలవిధి సంపూర్తి కొరకు పూర్ణాహుతి చేయవలెను. విద్యలో తాడనాది క్రియలు అన్నియు పూర్వోక్త విధానానుసారమే చేయవలెను. అంతలోను దానికి సంబంధించిన బీజములను ఉపయోగించుట యొక్కటియే భేదము. ఈ విధానము అంతయు పూర్తియై నచో విద్యాకళాశోధనము అగును. (86)

శాంతి కళా శోధన విధానము

పరమేశ్వరుడు చెప్పెను : పూర్వోక్త విధానముచే విద్యాకళను శాంతికళతో విధి పూర్వకముగ సంధానము చేయవలెను. అందుకు 'ఓం హాం హూం హాం' అనునది మంత్రము. శాంతికళలో ఈశ్వరుడు, సదాశివుడు అను రెండు తత్త్వములు ఇమిడి యున్నవి. దీని వర్ణములు హకార క్షకారములు. భువనములలో సమాన నామధేయులు గల రుద్రులు వీరు–ప్రభవ, సమయ, క్షుద్ర, విమల, శివ, ఘన, నిరంజన, అంగార, సుశిరా, దీప్తకారణ, త్రిదశేశ్వర, కాలదేవ, సూక్ష్మ, అంబుజేశ్వరులను పదునాలుగురు రుద్రులు శాంతికళలో ప్రతిష్ఠితులు. 'వ్యోమవ్యాపినే, వ్యోమ రూపాయ, సర్వవ్యాపినే, శివాయ, అంతాయ, అనాధాయ, అనాశ్రితాయ, ధ్రువాయ, శాశ్వతాయ, యోగపీఠ సంస్థితాయ, నిత్యయోగినే, ధ్యానాహరాయ' అనునవి పంద్రెండు పదములు. పురుష, కవచములు రెండు మంత్రములు. బిందు జకారములు బీజములు. అలంబుష, యశ అనునవి రెండునాడులు. కృకర–కూర్మములు రెండు ప్రాణ వాయువులు. త్వక్కు, హస్తములు రెండు ఇంద్రియములు. విషయము స్పర్శ. స్పర్శ–శబ్దములు రెండు గుణములు. ఈశ్వరుడు ఏకైక కారణము. దీనిఅవస్థ తురీయావస్థ. ఈ విధముగ భువనాది సకల తత్త్వములను శాంతికళలో ఉన్నట్లు భావనచేసి, వెనుకటివలెనే, తాడన, భేదన, హృదయ ప్రవేశ, చైతన్య వియోజన, ఆకర్షణ గ్రహణములు చేయవలెను. పిదప శాంతి ముఖసూత్రముచే చైతన్యమును తనలో ఆరోపించుకొని, కళను గ్రహించి, కుండమునందు ఉంచవలెను. పిమ్మట ఈశ్వరుని ఈ విధముగ ప్రార్థించవలెను. 'ఓ పరమేశా! నేను ఈ ముముక్షువునకు నీ అధికారము నందు దీక్ష ఇచ్చుచున్నాను. ఈతనికి అనుకూలుడవుగ నుండుము.' మాతాపిత్రా వాహనాదికము, శిష్యతాడనాదికముచేసి, చైతన్యమును గ్రహించి ఆత్మతో యోజనము చేయవలెను. వెనుకటి వలెనే మాతాపితృ సంయోగభావనచేసి, హృదయ మంత్ర సంపుటితమగు ఆత్మ బీజము ఉచ్చరించుచు, ఉద్భవవాడితో ఆ చైతన్యమును దేవీగర్భము నందుంచవలెను. దేహోత్పత్తి కొరకు హృదయ మంత్రముతోను, జన్మకొరకు శిరో మంత్రముతోను, అధికార సిద్ధికొరకు శిఖామంత్రముతోను, భోగము కొరకు కవచ మంత్రముతోను, లయకొరకు శస్త్ర మంత్రముతోను, స్రోతః శుద్ధికొరకు శివ మంత్రముతోను, తత్త్వశోధనము కొరకు హృదయ మంత్రముతోను ఐదేసి హోమములు చేయవలెను. గర్భాధానాది సంస్కారములు గూడ వెనుకటివలెనే చేయవలెను.

పాశ శైథిల్యము కొరకును, నిష్కృతికొరకును, కవచ మంత్రము నూర్లు సార్లు జపించవలెను. మలశక్తి తిరోధానము కొరకు శస్త్రమంత్రముతో ఐదు హోమములు చేయవలెను. పిమ్మట అస్త్ర మంత్రమును ఏడు పర్యాయములు జపించి, బీజ యుక్తాస్త్ర మంత్ర రూప ఖడ్గముతో (ఓం హౌం శాన్తి కలాపాశాయ నమః హాం హూం ఫట్) పాశమును ఛేదించవలెను. వెనకటివలెనే అస్త్ర మంత్రముతో పాశ విమర్దన వర్తులీకరణ ములు చేసి నేతితో నింపిన స్రువములో ఉంచి, కలాస్త్ర మంత్రముతో దానిని హోమము చేయవలెను. పాశాంకుర నివృత్తి కొరకై అస్త్రమంత్రముతో ఐదు ఆహుతులు ఇచ్చి ప్రాయశ్చిత్త నివారణార్థమై ఎనిమిది హోమములు చేయవలెను. 'ఓం హం అస్త్రాయ హూం ఫట్' అనునది మంత్రము. హృదయ మంత్రముతో ఈశ్వరుని ఆవాహనచేసి పూజా తర్పణాద్యనంతరము 'ఓం హాం ఈశ్వర, బుద్ధ్యహఙ్కారౌ శుల్కం గృహాణ స్వాహా' అను మంత్రముతో యథాశాస్త్రముగ శుల్కమును సమర్పించవలెను. పిదప ఈశ్వరునకు 'ఈశ్వరా! ఈ పశువు పాశములు అన్నియు దగ్ధములైనవి. ఇక నీవు వీనికి బంధములు కలిగించరాదు.' పిమ్మట ఈశ్వరుని విసర్జించి ఆత్మలో రౌద్రీశక్తిని చేర్చవలెను. ఈశ్వరుడు చంద్రునకు తన శిరస్సుపై ఆశ్రయము ఇచ్చినట్లు శిష్యుని జీవాత్మను గురువు తన ఆత్మతో సంబంధింపచేయవలెను. పిదప దానిని శుద్ధా–ఉద్భవ ముద్రతో సూత్రమునందు చేర్చి, అమర బిందు స్వరూపమగు ఆ చైతన్య సూత్రమును, మూల మంత్రముతో, శిష్యుని శిరముపై నుంచవలెను. పిదప అగ్నిని, పితరులను పుష్పాదులతో పూజించి, విసర్జనము చేసి, సమస్త విధాన సంపూర్తి కొరకై, పూర్ణాహుతి ఇవ్వవలెను. తాడనాదికము వెనుకటి వలెనే చేయవలెను. ఈ కళకు సంబంధించిన బీజమును ఉపయోగించుట ఒక్కటియే విశేషము. ఈ విధముగ శాంతి కళా శుద్ధి చెప్పబడినది. (87)

నిర్వాణదీక్షావిధి

మహేశ్వరుడు చెప్పెను : విశుద్ధశాంతి కళతో శాంత్యతీత కళను సంధానము చేయవలెను. దానియందుకూడ వెనుకటివలెనే తత్త్వవర్ణాది భావన చేయవలెను. ఎట్లనగా–సంధాన సమయము నందు 'ఓం హాం హౌం హాం' అను మంత్రమును ఉచ్చరించవలెను. శాంత్యతీత కళలు శివ, శక్తులు రెండు తత్త్వములు. ఇంధక, దీపక, రోచక, మోచక, ఊర్ధ్వగామి వ్యోమరూప, అనాథ, అనుశ్రితములను ఎనిమిది భువనములు. ఓంకారము పదము. ఈశానము మంత్రము. అకారము మొదలు విసర్గవరకును ఉన్నవి పదునారు అక్షరములు. నాద–హకారములు బీజములు. కుహూ, శంఖినులు రెండునాడులు. దేవదత్త–ధనంజయములు రెండు ప్రాణవాయువులు. వాక్–శ్రోత్రములు రెండు ఇంద్రి యములు, శబ్దము విషయము అదియే గుణము కూడ. ఐదవదైన తురీయా అతీతావస్థ. సదా శివుడు ఏకైక కారణము2. శాంత్యతీతకళలో ఈ తత్త్వాదులు అన్నియు ఉన్నవని భావనచేసి తాడనాదికము చేయవలెను. షడంతమగు మంత్రముచే కలాపాశ తాడనము బోధనము చేసి, నమస్కారాంత మంత్రముతో శిష్యుని అంతఃకరణమునందు ప్రవేశము చేయవలెను. పిమ్మట షడంత మంత్రముతో జీవచైతన్యమును పాశవిముక్తము చేయవలెను. 'వషట్' 'నమః' అను మంత్రములతో సంపుటితమైన స్వాహామంత్రమును ఉచ్చరించి, అంకుశ ముద్రా పూరక

ప్రాణాయామములతో పాశమును మస్తక సూత్రముతో ఆకర్షించి, దానిని కుంభక ప్రాణాయామ ముతో గ్రహించి, రేచక ప్రాణాయామ-ఉద్భవ ముద్రలతో హృదయ మంత్ర సంపుటితముచేసి, నమస్కారాంత మంత్రముతో దానిని అగ్ని కుండములో స్థాపించ వలెను. దాని పూజనాదికమును అంతను నివృత్తి కళకు చేసినట్లే చేయవలెను. సదాశివుని ఆవాహన, పూజన, తర్పణములుచేసి భక్తి పూర్వకముగ విజ్ఞాపన చేయవలెను. 'భగవంతుడా! ఈ ముముక్షువునకు సత్పురుషులు చెప్పిన నీ అధికారమున దీక్ష ఇచ్చు చున్నాను. నీవు సర్వదా ఈతనికి అనుకూలుడవుగ ఉండవలెను.'

మాతాపితరుల ఆవాహన, పూజన, తర్పణ సంవిధానములుచేసి, హృదయ సంపుటితమగు ఆత్మబీజముతో శిష్యుని వక్షఃస్థలమున 'ఓం హాం హాం హః హూం ఫట్' అను మంత్రముతో తాడనము చేయవలెను. ఆ మంత్రముతోడనే శిష్యుని హృదయము నందు ప్రవేశించి అస్త్ర మంత్రముతో చైతన్యమును పాశమునుండి విముక్తము చేయవలెను. పిదప జేష్ఠాంకుశ ముద్రతో సంపుటితమైన ఆస్వాహాంత మంత్రముతో దానిని ఆకర్షించి, గ్రహించి, నమోంత మంత్రముతో దానిని ఆత్మయందు కూర్చవలెను. 'ఓం హాం హాం హాం హః హూం ఫట్' అనునది ఆకర్షణ మంత్రము. 'ఓం హాం హాం హాం ఆత్మనేనమః' అను నది ఆత్మ నియోజన మంత్రము. వామా ఉద్భవ ముద్రతో వెనుకటి వలెనే మాతా పితృ సంయోగభావనచేసి, ఆమంత్రముతోడనే జీవచైతన్యమును దేవీ గర్భమునందు ఉంచవలెను. పిమ్మట పూర్వోక్త విధానానుసారము గర్భాధానాది సంస్కారములు అన్నియు చేయవలెను. పాశబంధ శైథిల్యము కొరకై, ప్రాశ్చిత్తముగా మూల మంత్రమును నూరుసార్లు జపించవలెను. మలశక్తి తిరోధానము కొరకును, పాశ వియోజనము కొరకును అస్త్ర మంత్రముతో వెనుకటివలెనే ఐదేసి హోమములు చేయవలెను. కళకు సంబంధించిన బీజముతో కూడిన ఆయుధ మంత్రముతో ఏడు పర్యాయములు అభిమంత్రించిన ఖడ్గ రూపమగు అస్త్రముతో పాశములను భేదించవలెను. 'ఓం హై హాం శాన్త్యతీత కళాపాశాయ హుం ఫట్' అను నది మంత్రము. పిదప ఆ పాశములను వెనుకటివలె అస్త్ర మంత్రముతో సలిపి, వర్తులాకారముచేసి, నేతితో నింపిన స్రువముల నుంచి, కళాస్త్ర మంత్రముతో హోమము చేయవలెను. పాశాంకుర నివృత్తికొరకై ఐదు హోమములును, ప్రాయశ్చిత్త నిషేధము కొరకు ఎనిమిది హోమములను చేసి హృదయ మంత్రముతో సదాశివుని ఆవాహన-పూజా తర్పణములు చేసి, వెనుక చెప్పిన విధముగ అధికార సమర్పణము చేయవలెను. అందుకు మంత్రము 'ఓం హాం సదాశివ మనోబిన్దుం శుల్కం గృహాణ స్వాహా' అనునది. పిదప సదా శివునకు-సదాశివా! ఈ పశువునందలి పాపములు అన్నియు దగ్ధములైనవి. కావున ఈతనికి బంధనము కలిగించుటకై నీవు ఇచట ఉండరాదు' అని కూడ శివుని ఆజ్ఞను వినిపింపవలెను.

మూల మంత్రముతో పూర్ణాహుతి ఇచ్చి సదాశివుని విసర్జించవలెను. శరత్కాల చంద్ర దృశమై విశుద్ధమైన శిష్యుని జీవాత్మను రౌద్రీ సంహార ముద్రతో తనలో సంయో జితము చేసికొనవలెను. శిష్యుని శరీరములో నున్న జీవాత్మను ఉద్భవముద్రతో ఉద్ధరించి, దాని పోషణము కొరకై, శిష్యుని తలపై అర్ఘ్య జలబిందువు ఒకటి ఉంచవలెను. పిదప పరమ భక్తి భావముతో క్షమార్పణము చెప్పుకొని, ఈ విధముగ పలుకుచు మాతాపితరుల విసర్జనము చేయవలెను. 'శిష్యునకు దీక్ష

ఇచ్చుటకై మిమ్ములను ఇరువురిని కష్టపెట్టితిని. అందులకు నన్ను క్షమించి, మీ ఇరువురును తమ స్థానమునకు వెళ్ళుడు'. అస్త్రమంత్రముచే అభిమంత్రించిన కర్తరితో, 'ఓం హూం శిఖాయై హూం ఫట్' 'ఓం అస్త్రాయ హూం ఫట్' అను ఛేదన మంత్రములతో, శిఖాస్త్రముతో, బోధన శక్తి స్వరూపిణి యగు, శిష్యుని నాలుగు అంగుళముల శిఖను ఛేదించవలెను. దానిని ఘృత పూర్ణమగు స్రువము నందు ఉంచి 'హూం ఫట్' అని అంతమునందుగల అస్త్ర మంత్రముతో అగ్నిలో హోమము చేయ వలెను. 'ఓం ఓం హః అస్త్రాయ హూం ఫట్' అనునది మంత్రము. పిదప స్రుక్ స్రువములు కడిగి, శిష్యునకు స్నానము చేయించి, తాను ఆచమనముచేసి, యోజనాస్థానము కొరకై అస్త్ర మంత్రముతో తనను తాను తాడనము చేసికొనవలెను. పిమ్మట వియోజన, ఆకర్షణ, సంగ్రహణ ములు చేసి వెనుకటివలె ద్వాదశాంతము (లలాటముపై భాగము) నుండి జీవచైతన్యమును తీసికొని తన హృదయ కమలకర్ణికా మధ్యమునందు ఉంచవలెను. స్రుక్కును నేతితోనింపి, దానిపై స్రువమును అధోముఖముగా నుంచి, శంఖు తుల్య ముద్రతో, నిత్యోక్త విధి ప్రకారము హస్తమునందు గ్రహించవలెను.పిమ్మట నాదోచ్చారణాను సారము శిరస్సును, కంఠమును చాపి, దృష్టిని సమ భావములో ఉంచి, స్థిర, శాంత, పర భావ సంపన్నుడై కలశ, మండల, అగ్ని, శిష్యుల నుండియు, తన నుండియు ఆరు విధములగు అధ్వలను గ్రహించి, స్రుక్కు అగ్రభాగమునందు, ప్రాణమయ నాడిలోపల నుంచి, దానిని ఆ భావము తోడనే భావన చేయవలెను. ఈ విధముగ చింతించి క్రమముగ ఏడు విధములగు విషువులను ధ్యానించవలెను.

మొదటిది ప్రాణ సంయోగస్వరూపము. రెండవది హృదయాదిక్రమమున ఉచ్చ రింపబడిన మంత్రము. మూడవది సుషుమ్నానుగత నాదరూపము. నాడీ సంబద్ధమగు నాదము శక్తిలో లీనమగు టకు ప్రశాంత విషువమని పేరు. శక్తిలో లీనమైన నాదము పునరుజ్జీవితమై పైకి సంచారముచేసి, సమతలో లయము అయినచో అది శక్తి అను విషువము. సంపూర్ణ నాదము శక్తి సీమను లంఘించి, ఉన్మనిలో లీనమైనచో 'కాలనిషు వము', ఆరవదగు ఇది వక్త్ర్యతీతము. ఏడవ విషువము 'తత్త్వ సంజ్ఞకము', ఇదియే యోజనా స్థానము. పూరక కుంభకములు చేసి, ముఖము కొంచెము తెరిచి, మెల్ల మెల్లగా మూల మంత్రము నుచ్చరించుచు శిష్యాత్మ లయభావన చేయవలెను. దాని క్రమము ఇది–షడధ్వ ప్రాణరూపమును విద్యుత్సదృశములగు షడధ్వల ప్రాణరూపముగ ఫట్కారమును చింతన చేయవలెను. అది నాభికి పైన జానెడు దూరమునందు ఉండును. దానిపైన హృదయము నుండి నాలుగు అంగుళముల దూరమునందు అకారమును చింతన చేయ వలెను. దానిపైన ఎనిమిది అంగుళముల దూరమున విష్ణువాచకమగు ఉకారము, దానిపైన నాలుగు అంగుళముల దూరమున తాలు స్థానమున రుద్ర వాచక మకారమును ఉండును. లలాటమధ్యమున ఈశ్వర వాచకమగు బిందువు ఉండును. లలాటముపైన బ్రహ్మ రంధ్రము వరకును నాదమయుడగు సదాశివుడు ఉండును. శక్తి కూడ అచటనే ఉండును. ఈ తత్త్వములను అన్నింటికి క్రమముగ చింతన చేయుచు, త్యజించి చివరికి శక్తి తత్త్వమును కూడ త్యజించవలెను. అచటనే దివ్య పిపీలికా స్పర్శాను భవము పొంది లలాటముపైన పరమతత్త్వము, పరమానంద స్వరూపము, భావశూన్యము, మనో తీతము, నిత్యము గుణోదయశాలి అగు శివతత్త్వమునందు శిష్యాత్మ విలీనమైనట్లు భావన చేయవలెను.

పరమశివుని యందు యోని స్థిరత్వము కొరకై 'ఓం నమః శివాయ వౌషట్' అను మంత్రము ఉచ్చరించుచు అగ్ని జ్వాలలో ఘృతధార విడచుచుండవలెను. పిదప విధిపూర్వకముగ పూర్ణాహుతి ఇచ్చి గుణాపాదనము చేయవలెను. అందులకై 'ఓం హాం ఆత్మనే సర్వజ్ఞో భవ స్వాహా' ఇత్యాది మంత్రములను (మూలములో ఉన్నవి) పఠించుచు అగ్నిలో హోమము చేయవలెను. ఈ విధముగ షడ్గుణ సంపన్నమగు ఆత్మను పరమశివుని నుండి గ్రహించి, యథావిధిగా శిష్యుని శరీరమునందు కూర్చినట్లు భావన చేయవలెను. తీవ్రము, మందము అయిన శక్తిపాతముచే కలిగిన శ్రమ శాంతించుటకై శిష్యుని శిరముపై న్యాస పూర్వకముగ అమృత బిందువు ఉంచవలెను. ఈశానకలశాది రూపమున పూజింపబడిన శివస్వరూప కలశములకు నమస్కారముచేసి, దక్షిణ మండలమునందు, శిష్యుని తనకు కుడి ప్రక్కన ఉత్తరాభిముఖునిగా కూర్చుండబెట్టి దేవేశ్వరుడైన ఈశ్వరుని ఈ విధముగా ప్రార్థించవలెను. 'ప్రభూ! నా శరీరమునందు ఉండి నీవే ఈ జీవుని అనుగ్రహించి నావు. అందుచే దేవా! వీనికి దేవతా, అగ్ని, గురువులందు, భక్తిని అధికము చేయుము.' ఈ విధముగ ప్రార్థించి శివునకు నమస్కరించిన పిదప గురువు శిష్యునకు ఆదరపూర్వకముగా 'నీకు శుభమగుగాక' అని ఆశీర్వదించవలెను. పిమ్మట శివునకు భక్తితో ఎనిమిది పుష్పములు సమర్పించి శివ కలశములోని ఉదకముతో శిష్యునకు స్నానము చేయించి యజ్ఞ సమాప్తి చేయవలెను. (88)

ఏకతత్త్వ దీక్షా విధి

పరమేశ్వరుడు చెప్పెను : ఇపుడు చిన్నది అగుటచే ఏకతాత్విక దీక్షను గూర్చి చెప్పుచున్నాను. సమయానుగుణముగా, యథోచితరీతిని స్వీయ మంత్రముతో సూత్ర బంధాదికము చేయవలెను. పిమ్మట కాలము, అగ్ని మొదలు శివపర్యంతమైన సమస్తతత్త్వ ముల చింతనము చేయవలెను. సూత్రములో మణులు గ్రుచ్చబడియున్నట్లు అన్ని తత్త్వము లును శివతత్త్వములో గ్రుచ్చబడియున్నవి. శివతత్త్వాద్యావాహనము చేసి, వెనుకటివలె గర్భాధానాది సంస్కారములు చేయవలెను. కాని సర్వ శుల్క సమర్పణమును మాత్రము మూల మంత్రముతో చేయవలెను. పిమ్మట తత్త్వ సమూహ గర్భితమైన పూర్ణాహుతి ఈయవలెను. ఆ ఒక్క ఆహుతిచేతనే శిష్యుడు నిర్వాణము పొందగలుగును. శివుని యందు నియోజనము, స్థిరత్వా పాదనము చేయుటకును రెండవ పూర్ణాహుతి కూడ చేయవలెను. పిమ్మట శివ కలశ జలముతో శిష్యునకు స్నానము చేయించవలెను.(89)

అభిషేకాది విధి

పరమేశ్వరుడు చెప్పెను : శివ పూజానంతరము గురువు శ్రీ ప్రాప్తికై శిష్యాదులకు స్నానము చేయించవలెను. ఈశాన్యాది దిక్కులందు ఎనిమిది కలశములను, మధ్య ఒక కలశమును స్థాపించ వలెను. ఆ ఎనిమిది కలశములలో వరుసగ క్షారోదక, క్షీరోదక, దధ్యుదక, ఘృతోదక, ఇక్షుక సోదక, సురోదక, స్వాదూదక, గర్భోదక సముద్రముల ఆవాహనము చేసి, క్రమముగ శిఖండి, శ్రీకంఠ, త్రిమూర్తి, ఏకరుద్ర, ఏకనేత్ర, శివోత్తమ, సూక్ష్మ, అనంత రుద్రులను ఎనమండుగురు విశ్వేశ్వరులను స్థాపించవలెను. మధ్యనున్న కలశములో శివ, సముద్ర, శివ మంత్రములను

స్థాపించవలెను. యాగమండప దిక్కు నందు స్వామికొరకై ఏర్పరచిన స్నాన మండపము నందు రెండు బెత్తుల పొడవు, ఎనిమిది అంగుళముల ఎత్తుగల ఒక వేది నిర్మించవలెను. దానిపై కమలా ద్యాసనములు కప్పి, దానిపై ఆసన స్వరూపుడైన అనంతుని న్యాసముచేసి శిష్యుని పూర్వాభిముఖముగ కూర్చుం డబెట్టి సకలీకరణ పూర్వకముగ పూజచేయవలెను. ఆతని శరీరమునకు గంజి, అన్నము, మట్టి, భస్మము, దూర్వలు, గోమయగోళములు, ఆవాలు, పెరుగు, ఉదకము వ్రాసి క్షారోదకాది క్రమమున, నమస్కార సహితములగు విశ్వేశ్వర నామ మంత్రములతో, కలశ జలములో శిష్యునికి స్నానము చేయించవలెను. శిష్యుడు మనస్సులో తాను అమృత ముచే స్నానము చేయించబడు చున్నట్లు భావన చేయవలెను. పిదప ఆతనికి రెండు శ్వేత వస్త్రములుకట్టించి శివుని కుడి వైపున కూర్చుండబెట్ట వలెను. పైన చెప్పిన ఆసనము నందు శిష్యునకు, వెనుకటి వలెనే, మరల పూజ చేయవలెను. పిమ్మట ఆతనికి తలపాగ, కిరీటము, యోగపట్టిక, కర్తరి, చిన్న పాత్ర, అక్షమాల, పుస్తకము, పల్లకి మొదలగునవి ఇచ్చి ఆతనికి అధికారము నీయవలెను. నేటి నుండి నీవు బాగుగ తెలిసికొని పరీక్షించి, ఎవని కైనను దీక్షా, వ్యాఖ్యా, ప్రతిష్ఠాదుల ఉపదేశమును ఇచ్చుచుండుము' అని ఆజ్ఞను వినిపింపవలెను. శిష్యుని అభివాదనము స్వీకరించి, మహేశ్వరునకు ప్రణామముచేసి, విఘ్న సమూహ నివారణార్థమై–'పరమేశ్వరా! నీవు గురు స్వరూపుడవు. ఈ శిష్యునకు అభిషేకము చేయుటకై నాకు ఆజ్ఞ ఇచ్చితివి. తదనుసారము నేను అభిషేకము చేసితిని. ఇతడు సంహితాపారంగతుడైనాడు' అని పలుకుచు ప్రార్థించవలెను. మంత్ర చక్ర తృప్తికొరకై ఐదేసి ఆహుతులు ఇచ్చి మరల పూర్ణాహుతి చేయవలెను. పిమ్మట శిష్యుని తన కుడి ప్రక్క కూర్చుండ బెట్టుకొని, ఆతని కుడి చేతి బొటనవ్రేలు మొదలగు వ్రేళ్లకు, దర్భాగ్రములు కాల్చిన మసి పూయవలెను. వానిచేతిలో పుష్పములుంచి ఆతనిచే కలశ, అగ్ని, శివులకు నమస్కరింపచేయవలెను. 'నీవు శాస్త్రాను సారముగ బాగుగా పరీక్షించి శిష్యులను అను గ్రహించవలెను' అని ఆతనికి ఉపదేశించవలెను. మానవాదులకు అభిషేకము రాజా భిషేకమువలె చేయుటచే అభీష్టసిద్ధి కలుగును. 'ఓం శ్రాం శ్రౌం పశు హూం ఫట్' అను నది అస్త్రరాజమైన పాశుపత మంత్రము. దీనితో అస్త్ర రాజమును పూజించి, అభిషేకము చేయవలెను. (90)

నానా మంత్రాది కథనము

పరమేశ్వరుడు చెప్పెను : అభిషేకానంతరము దీక్షితుడు శివ, విష్ణు, సూర్యాది దేవతలను పూజించవలెను. శంఖ భేర్యాది వాద్య ధ్వనులతో దేవతలకు పంచగవ్యములతో స్నానము చేయించు వాడు, తన కులమును ఉద్ధరించి తాను దేవలోకమునకు వెళ్లును. దేవతల శరీరమునకు ఆజ్యాభ్యంగనము చేయుటచే, కోటి సహస్రవర్ష సంచితమైన పాపము భస్మమైపోవును. ఒక ఆఢకము (అడ్డెడు) నెయ్యి మొదలైన వాటితో దేవతలకు స్నానము చేయించిన మనుష్యుడు దేవతయగును. చందనము పూసి గంధాదులతో దేవ పూజ చేయువానికి గూడ అదే ఫలము లభించును. కొంచెము ప్రయాసతో మాత్రమే స్తోత్ర పాఠముచే దేవతాస్తుతి చేసినచో భూతభవిష్య జ్ఞానము, మంత్ర జ్ఞానము, భోగ మోక్షములు లభించును. ఎవరైన మంత్రమునకు సంబంధించిన శుభాశుభ

ఫలములను గూర్చి ప్రశ్నించినచో, ఆ ప్రశ్న వాక్యములో నున్న అక్షరములు లెక్కించి, రెండుచే భాగించగా ఒకటి శేషించినచో శుభము, శూన్యముగాని, రెండుగాని శేషించినచో అశుభము. మూడుచే భాగించినచో మూలధాతు రూపజీవుని విషయము తెలియును. ఒకటి శేషించినచో వాత జీవుడు, రెండు శేషించినచో పిత్తజీవుడు, మూడు శేషించినచో కఫ జీవుడు, నాలుగుతో భాగించినచో బ్రాహ్మణాది వర్ణబుద్ధి కలుగును. ఐదుచే భాగించినచో భూతతత్త్వాది జ్ఞానము కలుగును. ఈ విధముగనే జయ పరాజయాది జ్ఞానముకూడ కలుగును, మంత్ర పదాంత మునందు ఒక త్రికము (మూడు బీజాక్షరములు) న్నను, అధిక బీజాక్షరములు ఉన్నను, ప, మ, క లు ఉన్నను వీటిలో మొదటిది అశుభము, మధ్యలో నున్నది మధ్యమము, చివరిది శుభము. చివర సంఖ్యా సమూహమున్నచో అది జీవనకాలము పది సంవత్సరములు అని సూచించును. దశ సంఖ్య ఉన్నచో పది సంవత్సరముల పిమ్మట ఆ మంత్ర సాధకుడు తప్పక మరణించును. సూర్య, గణపతి, శివ, దుర్గా, లక్ష్మీ, విష్ణు మంత్రముల అక్షరములతో, అంగుష్ఠస్పృష్టమైన కమలపత్రము మీద, గోమూత్రాకార రేఖపై, ఒక త్రికము (మూడు అక్షరములు)తో ప్రారంభించి పండ్రెండు త్రికముల వరకును వ్రాయ వలెను.

అరువది నాలుగు కోష్ఠముల మండలము చేసి దానిపై యం, హం, యం అను బీజాక్షరముల త్రికములను మొదటి కోష్ఠమునుండీ ఎనిమిది కోష్ఠమువరకు వ్రాయవలెను. ఈ స్థానములపై పాచిక వేయుటచేతగాని, స్పృశించుటచేత గాని శుభాశుభజ్ఞానము కలుగును. పాచిక లేదా స్పర్శ విషమ సంఖ్యాకల దానిపై పడినచో శుభము, సమ సంఖ్య గల దానిపై అశుభము. 'యం హం హం' అను మూడు బీజాక్షరముల ఎనిమిది త్రికములు ధ్వజాదులగు ఎనిమిది త్రికములు ధ్వజాదులగు ఎనిమిది ఆయములకు ప్రతీకములు. వీటిలో సమమైనవి అశుభములు, విషమములు శుభప్రదములు. 'క' మొదలగు అక్షరములను పదునారు స్వరములతోడను, అట్లే పదునారు స్వరములను కాద్యక్షరములతో చేర్చి, వాటికి 'అం ఈం' అను పల్లవములను కూర్చవలెను. వీటిమొదట 'హ్రీం', చివర 'నమః' చేర్చవలెను, ఈ విధముగ పూజావినియుక్తములగు ఈ మంత్రముల ప్రస్తారముచే ఇరువదివేల నూట అరువది మంత్రములు ఏర్పడును. సరస్వతీ, చండీ, గౌరీ, దుర్గా మంత్రములకు 'ఆం హ్రీం' అను బీజములును, శ్రీదేవీ మంత్రమునకు 'ఆం శ్రీం' అను బీజములును, సూర్య మంత్రమునకు 'ఆం క్షౌం'లును, శివ మంత్రమునకు 'ఆం హూం' లును, గణేశ మంత్రములకు 'ఆం గం'లును, విష్ణువునకు 'ఆం అం'లును ఉండును. కాది వ్యంజనములు అకారాది షోడశ స్వరములు కలిసి మొత్తము ఏబదియొక్క అక్షరములగును. ఈ విధముగ సస్వరములగు కాద్యక్షరములను ఆదియందును, సస్వర క్షాది కాంతాక్షర ములను అంతమునందును ఉంచగా సంపూర్ణ మంత్రమగును.

మొత్తము మండలముల సంఖ్య 1440 కాగా సూర్య, శివ, దేవీ, దుర్గా, విష్ణువుల మండలములు మూడు వందల అరువది చొప్పున అగును. అభిషిక్తుడైన గురువు ఈ అన్ని మంత్రముల జపము, దేవతల ధ్యానముచేసి, శిష్యునకు పుత్రునకును దీక్ష ఇవ్వవలెను. (91)

వాస్తు ప్రతిష్ఠా విధి

పరమేశ్వరుడు చెప్పెను : స్కందా! నేనిపుడు సంక్షేపముగ క్రమమున ప్రతిష్ఠను గూర్చి చెప్పెదను. పీఠము శక్తి, లింగము శివుడు. ఈ రెండింటి యోగము వలన శివ సంబంధి మంత్రములచే ప్రతిష్ఠ చేయబడును. ప్రతిష్ఠలో 'ప్రతిష్ఠ' మొదలగు ఐదు భేదము లున్నవి. వాటిని గూర్చి చెప్పెదను. బ్రహ్మశిలా యోగమున్నప్పుడు విశేషరూపమున చేసిన స్థాపనము 'ప్రతిష్ఠ'. పీఠముపైననే వీలును బట్టి అర్చా విగ్రహమును స్థాపించినచో అది స్థాపనము. ప్రతిష్ఠాభిన్నమగు స్థాపనమునకు 'స్థిరస్థాపనమని పేరు. ఆధార పూర్వ కముగ చేయు లింగస్థాపనము. ఉత్థాపనము. లింగమును స్థాపించి విద్వాంసులు దానికి సంస్కారము చేసినచో అది ఆస్థాపనము. ఇవి శివప్రతిష్ఠకు సంబంధించిన ఐదు భేదములు. విష్ణ్వాది ప్రతిష్ఠ 'ఆస్థానము' 'ఉత్థానము' అని రెండు విధములు. ఈ అన్ని ప్రతిష్ఠలందును చైతన్య రూపుడగు పరమశివుని నియోజనము చేయవలెను. పదార్థ్వాది భేదములచే ప్రాసాదములలో కూడ ఐదు విధములగు ప్రతిష్ఠ చెప్పబడినది. ప్రాసాదము కొరకై భూ పరీక్ష చేయవలెను. మట్టిరంగు తెల్లగా ఉండి ఘృత సుగంధముగల భూమి బ్రాహ్మణులకు శ్రేష్ఠము. ఇట్లే వరుసగ క్షత్రియులకు ఎఱ్ఱగా, రక్త గంధముకల మట్టి, వైశ్యులకు పచ్చని, సుగంధముగల మట్టి, శూద్రులకు నల్లని సురాగంధముగల మట్టిగల భూములు శ్రేష్ఠ మైనవి. తూర్పునందును, ఈశాన్యమునందును, లేదా అన్ని దిక్కులందును పల్లముగా నుండి, మధ్య ఎత్తుగా ఉన్న భూమి ప్రశస్తమైనది. ఒక చేతిలోతు త్రవ్వి తీసిన మట్టిలో ఆ గోతిని పూడ్చివేయగా మట్టి మిగిలిపోయినచో ఆ భూమి ఉత్తమమైనది. లేదా జలాదులతో దానిని పరీక్షించవలెను. ఎముకలు బొగ్గులు వాటిచే దూషితమగు భూమిని త్రవ్వుట, ఆవులు మొదలగు వాటిని అచట కట్టుట, చాలసార్లు దున్నుట మొదలగు వాటిచే బాగుగా శోధనము చేయవలెను. నగర, గ్రామ, దుర్గ, గృహ,ప్రాసాదాదుల నిర్మాణము కొరకు భూమిని పై విధముగ శోధన చేయవలెను. ద్వారపూజ మొదలు మంత్రతర్పణ పర్యంతమగు సంపూర్ణ కర్మను మండపమునందుచేసి, విధి పూర్వకముగ ఘోరాస్త్ర సహస్రయాగము చేయవలెను. సమముచేసి, అలికిన నేలపై దిక్సాధనము చేయవలెను. సువర్ణ, అక్షత, దధులతో ప్రదక్షిణ క్రమమున రేఖలు గీయవలెను. మధ్య భాగమునుండి ఈశాన కోష్ఠము నందున్న, జలపూర్ణ కలశమునందు శివుని పూజించవలెను. పిదప వాస్తుపూజచేసి ఆ కలశములోని జలముతో గునపము మొదలగు వాటిని తడపవలెను. మండపము వెలుపల విధి పూర్వకముగ రాక్షసగ్రహాది పూజచేసి దిక్కులందు బలులు ఇవ్వవలెను.

కలశముపై పూజచేసి లగ్నము వచ్చిన పిమ్మట అగ్నికోణమునందలి కోష్ఠమునందు మొదట తడిపిన మధులిప్తమగు గునపముతో భూమి త్రవ్వి మట్టి నైరృతి దిక్కునందు వేయవలెను. తవ్విన గోతిలో కలశములోని ఉదకము పోయవలెను. పిదప భూమి తడిపి గునపము మొదలైన వాటిని తడిపి, వాటి పూజ చేయవలెను. పిదప ఈ మరొక కలశమును రెండు వస్త్రములతో ఆచ్ఛాదించి బ్రాహ్మణుని కంఠముపై నుంచి, వాద్య-వేదఘోషలతో నగరము తూర్పు సరిహద్దు వరకు ఎంత వరకు ఇష్టమో అంత దూరము వెళ్లి, అచట క్షణకాలము పాటు ఆగి, అచటినుండి నగరము నాల్గు

దిక్కులందును ప్రదక్షిణ క్రమమున తిరుగుచు ఈశాన్యము వరకును ఆ కలశమును త్రిప్పవలెను. ఆ పనితోపాటు సీమాంత చిహ్నములను తడుపుచుండవలెను. ఈ విధముగ రుద్ర కలశమును నగరము నాల్గువైపుల త్రిప్పి భూపరిగ్రహము చేయవలెను. దీనికి అర్ఘ్యదాన క్రియయని పేరు. పిదప శల్యదోష నివారణార్థమై రాళ్ళు లేదా నీరు వచ్చే వరకును భూమి త్రవ్వవలెను. ఎముకలు మొదలైనవి కనబడినచో వాటిని త్రవ్వించి తొలగించవలెను. లగ్న సమయమున ఎవ్వడైన ప్రశ్నవేయగా ఆతని ముఖము నుండి అ క చ ట త ప స హ అను వర్గములకు చెందిన అక్షర ములు బయల్వెడలినచో, ఆ దిక్కులందు శల్యములు ఉండునని సూచింప బడుచున్నది. పక్షులు మొదలగునవి వాలినచో అచట శల్యములున్నవని సూచింపబడుచున్నది. కర్తకు ఏ అంగము నందు వికారముండునో తత్సదృశమగు శల్యమున్నదని నిశ్చయించవలెను. పశ్వాది ప్రవేశము వాటి అరపు, పక్షిరవము మొదలగు వాటిచే శల్యములున్న దిక్కు సూచింప బడును. ఒక పట్టికపైగాని, భూమి మీదగాని అకారాద్యష్ట వర్గయుక్తమగు మాతృకా వర్ణములను వ్రాయవలెను. వర్గానుసారము క్రమముగ తూర్పునుండి ఈశాన్యము వరకు నున్న దిక్కులందు శల్యమున్నట్లు తెలియవలెను. అవర్గమైనచో తూర్పున ఇనుము ఉండును. 'క'వర్గమైనచో ఆగ్నేయమున బొగ్గు ఉండును. 'చ' వర్గమైనచో దక్షిణము నందు భస్మము 'ట' వర్గమైనచో నైరృతి యందు ఎముకలును ఉండును. 'త' వర్గమైనచో పశ్చిమమున ఇటుకలు, 'ప' వర్గమైనచో వాయవ్యమున పెంకులు, 'య' వర్గమైనచో ఉత్తరమున శవములు కీటకము మొదలగునవి, 'స' వర్గమైనచో ఈశాన్యము నందు ఇనుము ఉండును. 'హ' వర్గమై నచో వెండి, 'క్ష' వర్గయుక్త దిగ్భాగమున ఆ దిక్కు నందే అనర్థకరములగు వస్తువులు ఉండును.

ఒక్కొక్క హస్తము పొడవుగల తొమ్మిది శిలా ఖండములను ప్రోక్షించి, వాటిని ఎనిమి దేసి అంగుళముల లోపల మట్టిలో పాతవలెను. పైన నారుపోసి ముద్గరముతో కొట్టవలెను. ఆ రాళ్ళు మూడు వంతుల పొడవు నేలలో దిగిన పిమ్మట, గొయ్యి పూడ్చి, అలికి, అచటి భూమిని చదును చేయవలెను. గురువు సామాన్యార్ఘ్యమును చేత ధరించి, చెప్పబోవు మండపము వైపు వెళ్ళవలెను. మండపద్వారమున ద్వారపాలకపూజచేసి పశ్చిమ ద్వారమునుండి లోనికి ప్రవేశించవలెను. అచట ఆత్మశుద్ధి కుండమండపాది సంస్కారము చేయవలెను. కలశవర్ధన్యాది స్థాపనచేసి లోకపాలులను, శివుని పూజించవలెను. అగ్ని జనన పూజనాదులు అన్నియు వెనుకటి వలెనే చేయవలెను. పిమ్మట గురువు యజమాను నితో కలిసి శిలల స్నాన మండపమునకు వెళ్ళవలెను. ధర్మాది సంజ్ఞితములగు నాలుగు ప్రాసాదలింగ శిలలు ఉన్నవి. వాటి ఎత్తు ఎనిమిది అంగుళములున్నచో మంచిది. చతుర స్రములుగను ఒక హస్తము పొడవుండునట్లును ప్రస్తర శిలలు నిర్మించవలెను. ఇటుకల ప్రమాణము శిలా ప్రమాణములో సగము ఉండవలెను. ప్రాసాదమునందు శిలలను, ఇటుకలతో కట్టు ఆలయములలో ఇటుకలు ఉపయోగించవలెను. వాటి తొమ్మిది శిలలను లేదా ఇటుకలను వజ్రాది చిహ్నములతో చిహ్నితములు చేయవలెను. లేదా ఐదు శిలలను కమల చిహ్నముతో చిహ్నితము చేయవలెను. ఆలయ నిర్మాణము ఈ అంకిత శిలతోడనే ప్రారంభించవలెను. నంద, భద్ర, జయ, రిక్త, పూర్ణ అనునవి ఐదు శిలల పేర్లు. పద్మము, మహాపద్మము, శంఖము, మకరము, సముద్రము

అనునవి ఐదు నిధి కుంభములు, నంద, భద్ర, జయ, పూర్ణ, అజిత, అపరాజిత, విజయ, మంగళ, ధరణీ, అనునవి తొమ్మిది శిలల పేర్లు. సుభద్ర, విభద్ర, సునంద, పుష్పదంత, జయ, విజయ, కుంభ, పూర్వ, ఉత్తరములు ఈ తొమ్మిదింటి నిధి కలశములు.

ప్రణవ మయాసనమును ఇచ్చి అస్త్ర మంత్రముచే తాడనోల్లేఖనాదులు చేసిన పిదప ఈ శిలలను అన్నింటిని సామాన్య రూపమున కవచ మంత్రముచే ఆచ్ఛాదించవలెను. అస్త్రమంత్రము చివర 'హూం ఫట్' చేర్చి దానిని ఉచ్చరించుచు మట్టి, గోమయము, గోమూత్రము, కషాయములు, గంధయుక్త జలము-వీటితో మలస్నానము చేయించవలెను. పిమ్మట పంచగవ్య పంచామృతములతో యథావిధిగ స్నానము చేయించవలెను. గంధోదకముతో స్నానము చేయించిన పిదప స్వీయ నామాంకిత మంత్రముతో శిలను ఫల, రత్న, సువర్ణ, గో శృంగ జల-చందనములతో పూసి, వస్త్రములతో ఆచ్ఛాదించవలెను. స్వర్ణోత్థమగు ఆసనమిచ్చి, యాగమండప పరిక్రమణము చేసి ఆ శిలను తీసికొనిపోయి హృదయ మంత్రముతో శయ్యపైగాని, కుశాస్తరణముపైగాని పరుండబెట్ట వలెను. అచట పూజించి, బుద్ధినుండి పృథివి వరకును ఉన్న తత్త్వముల న్యాసముచేసి త్రిఖండ వ్యాపక తత్త్వత్రయమును ఆ శిలలపై క్రమమున న్యాసము చేయవలెను. బుద్ధినుండి చిత్తమువరకు, చిత్తములోపల మాతృకల వరకు, తన్మాత్రలు మొదలు పృథివి వరకును శివ తత్త్వ, విద్యా తత్త్వ, ఆత్మ తత్త్వములు ఉన్నవి. పుష్పమాలాది చిహ్నిత స్థానములపై క్రమముగా మూడు తత్త్వములను, తదీయ మంత్రములతోను తత్త్వేశులను హృదయ మంత్రముతోను పూజించవలెను. 'ఓం హూం శివతత్త్వాయ నమః, ఓం హాం శివ తత్త్వాధిపాయ రుద్రాయ నమః, ఓం విద్యా తత్త్వాయ నమః, ఓం హాం విద్యా తత్త్వాధిపాయ విష్ణవే నమః, ఓం హాం ఆత్మ తత్త్వాయ నమః, ఓం హాం ఆత్మ తత్త్వాధిపతయే బ్రహ్మణే నమః' అనునవి పూజోపయుక్త మంత్రములు, ప్రతి తత్త్వమునందును, ప్రతిశిల యందును భూ, అగ్ని, యజమాన, సూర్య, జల, వాయు, చంద్ర, ఆకాశములను ఎనిమిది మూర్తుల న్యాసము చేయవలెను. పిదప క్రమముగ శర్వ, పశుపతి, ఉగ్ర, రుద్ర, భవ, ఈశాన, మహాదేవ, భీమమూర్తుల న్యాసము చేయవలెను. 'ఓం ధరామూర్తయే నమః, ఓం ధరాధిపతయే శర్వాయ నమః' ఇత్యాదులు మూర్తి-మూర్తీశ్వర మంత్రములు. పిదప అనంతాది లోకపాలులను వారి వారి మంత్రముతో న్యాసము చేయవలెను. ల్రూం, రూం, య్రూం, వ్రూం, శ్రూం, ష్రూం, స్రూం, హ్రూం, క్ష్రూం అనునవి ఇంద్రాదిలోక పాలబీజములు. ఇది నవ శిలాపక్షమున చెప్పబడినది. పంపశిలా పక్షమున ప్రత్యేక తత్త్వమయ శిలను స్పృశించి వాటిపై క్రమముగా పృథివ్యాదిమూర్తి న్యాసము చేయవలెను. బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశ్వర, సదాశివులు ఐదుగురు మూర్తీశులు. ఈ ఐదింటిని పైన చెప్పిన ఐదు మూర్తులందును వెనుకటివలె పూజించవలెను. 'ఓం పృథివీమూర్తయే నమః, ఓం పృథివీ మూర్త్యధిపతయే నమః' ఇత్యాదులు పూజోపయుక్త మంత్రములు.

ఐదు కలశములను వాటి నామ మంత్రములతో పూజించి స్థాపించవలెను. మధ్య శిలాక్రమ మున యథావిధిగా న్యాసముచేసి, విభూతి, కుశ, తిలలతో అస్త్ర మంత్రములతో ప్రాకారము ఏర్పరుపవలెను. కుండములందు ఆధారశక్తి న్యాస పూజనములుచేసి, తత్త్వ, తత్త్వాధిప, మూర్తి, మూర్తీశ్వరులకు ఘృతాదులతో తర్పణము చేయవలెను. పిదప బ్రహ్మాత్మ శుద్ధి కొరకై మూలాంగము

లైన బ్రహ్మ మంత్రముతో క్రమముగ నూరు నూరు హోమములుచేసి, పూర్ణాహుతి వరకును హోమముచేసిన పిదప శాంతి జలముతో శిలలను ప్రోక్షించి పూజించవలెను. కుశలతో స్పృశించి ప్రత్యేక తత్త్వమునందు సాన్నిధ్య సంధానములుచేసి పిదప శుద్ధన్యాసము చేయవలెను. ఈ విధముగ క్రమముగా మూడు భాగములందు కర్మలను చేయవలెను. 'ఓం ఆం ఈం ఆత్మతత్త్వ విద్యాతత్త్వాభ్యాం నమః' అనునది మంత్రము. కుశమూలాదులతో క్రమముగ ముగ్గురు తత్త్వేశాదులను స్పృశించి హ్రస్వదీర్ఘ ప్రయోగపూర్వకముగ తత్త్వాను సంధానము చేయవలెను. అందును మంత్రము – ఓం హాం ఉం విద్యాతత్త్వ శివతత్త్వాభ్యాం నమః' పిదప ఘృతమధు పూర్ణములును, అగ్రమున పంచగ వ్యాభిషిక్తములును పంచలోకపాలకులు దేవతలుగా కలదియు అగు పంచ కలశములను, వాటి మంత్రములచే పూజించి వాటి సమీపమున హోమము చేయవలెను. పిదప సకల శిలా ధిదేవతల ధ్యానము చేయవలెను. ఆ శిలాధిదేవతలు విద్యాస్వరూపులు స్నానము పూర్తి చేసికొనిన వారు. వాటి శరీర కాంతి బంగారమువలె దేదీప్యమానముగ ఉన్నది. ఉజ్జ్వల ములగు వస్త్రములు ధరించి అలంకృతములైయున్నారు. న్యూనతాది దోష పరిహారార్థమును వాస్తు భూమి శుద్ధి కొరకు అస్త్ర మంత్రముతో పూర్ణాహుతి వరకును నూరు నూరు హోమములు చేయవలెను. (92)

వాస్తు పూజా విధానము

పరమేశ్వరుడు చెప్పెను : స్కందా! పిమ్మట ప్రాసాదమును ఆ సూత్రించి వాస్తు మండల రచన చేసి చతురస్రమైన సమతల క్షేత్రమునందు అరువది నాలుగు కోష్ఠములు నిర్మించవలెను. కోణములందు రెండు వంశముల విన్యాసము చేయవలెను. వికోణములకు పోవునట్లుగా ఎనిమిది రజ్జువులు గుర్తించవలెను. అవి ద్విపద–షట్పద స్థానముల రూపమున విభక్తములై యుండును. వాటిపై వాస్తు దేవతాపూజ చేయవలెను. కుంచిత కేశధారి యగు వాస్తు పురుషుడు వెల్లకితల పండుకొని ఉండును. ఆతని ఆకారము అసుర సదృశముగా నుండును. పూజా సమయమున ఆతనిని ఆ విధముగనే స్మరించవలెను. కాని గోడ మొదలైన వాటికి పునాది వేయునపుడు అతడు ముఖము క్రిందికి వంచి పండుకొని ఉన్నట్లు ధ్యానము చేయలెను. అతని మోకాళ్ళు, మోచేతులు, తొడలు, వాయవ్య, ఆగ్నేయ దిక్కుల వైపు పడియుండును. ఒకదానితో ఒకటి కలసియున్న పాదములు నైరృతి దిక్కువైపున ఉండును, ఆతని శిరస్సు ఈశాన్య దిక్కు వైపున ఉండును. చేతులు దోసిలిగా ఏర్పడి వక్షః స్థలముపై ఉండును. ఆ వాస్తు పురుషుని శరీరముపై ఎక్కియున్న దేవతలను పూజించుటచే శుభకరమగును. ఎనమండుగురు దేవతలు కోణాధిపతులు. వారు ఎనిమిది కోణార్థములందు ఉందురు. వరుసగా పూర్వాదిదిక్కు లందున్న మరీచ్యాది దేవతలు ఆరేసి పదముల అధిపతులు. వారి మధ్యనున్న బ్రహ్మ నాలుగు పదముల అధిపతి. మిగిలిన దేవతలు ఒక్కొక్క పదమునకు అధిపతులు. సమస్తము, నాడీసంపాతము మహామర్మ, కమలము, ఫలము, త్రిశూల, స్వస్తిక, వజ్ర, మహాస్వస్తిక, సంపుట, త్రికటి, మణిబంధ, సువిశుద్ధ పదములు పంద్రెండు మర్మస్థానములు. వాస్తు భిత్త్యాదులందు వీటిని అన్నింటిని పూజించవలెను. రుద్రునకు ఘృతాక్షతలు సమర్పింపవలెను. పర్జన్యునకు కమల–జలములు, జయంతునకు కుంకుమ రంజితమగు నిర్మల పతాక, మహేంద్రునకు

రత్న మిశ్రితోదకము, సూర్యునకు ధూమ్ర వర్ణమగు చాందిని, సత్యదేవతకు ఘృతయుక్త గోధుమలు, భృశునకు ముద్గాన్నము, అంతరిక్షునకు పక్షి మాంసము లేదా సక్తువులు సమర్పిం చవలెను. వీరు తూర్పు దిక్కునకు సంబంధించిన ఎనమండుగురు దేవతలు. అగ్నికి మధువు, పాలు, నెయ్యి నింపిన స్రుక్కు సమర్పించవలెను. పూషకు పేలాలు, వితథునకు సువర్ణ మిశ్రిత జలము, గృహ క్షతునకు మధువు, యమునకు మాంసోదనము, గంధర్వానాధునకు గంధము, భృంగ రాజునకు పక్షిజిహ్వ, మృగమునకు యవపర్ణములు సమర్పించవలెను. ఈ ఎనమండుగురు దేవతలు దక్షిణమున పూజింపబడుదురు.

పితృ దేవతకు తిలోదకమును సమర్పించవలెను. దౌవారిక దేవతకు క్షీర వృక్ష దంత ధావన కాష్ఠమును ధేనుముద్రా ప్రదర్శన పూర్వకముగా సమర్పించవలెను. సుగ్రీవునకు పుష్పములు, పుష్పరంతునకు కుశలు, వరుణునకు ఎర్రని కమలములు, అసురునకు సురాసవములు, శేషునకు నేతిలో తడిపిన అన్నము, రోగునకు ఘృతమిశ్ర మండికములు సమర్పించవలెను. వీరు పశ్చిమ దిగ్దేవతలు, మారుతునకు పచ్చని రంగుగల ధ్వజము, నాగదేవతకు నాగకేసరము, ముఖ్యునకు భక్ష్య పదార్థము, భల్లాటునకు ముద్గసూపము, సోమునకు ఘృతమిశ్ర పాయసము, చరకునకు శాలూకము, అదితికి లోపి, దితికి పూరీ సమర్పించవలెను. ఈ ఎనమండుగురు ఉత్తరదిగ్దేవతలు, మధ్యనున్న బ్రహ్మకు మోదకములు సమర్పించవలెను. పూర్వదిక్కునందు ఆరు పదముల ఉపభోక్త యగు మరీచికి కూడ మోదకములు అర్పించవలెను. బ్రహ్మ క్రింద ఆగ్నేయ కోష్ఠమునందున్న సవితకు ఎర్రటి పుష్పములు, సవిత క్రింద ఆగ్నేయ కోష్ఠమునందున్న సావిత్రికి కుశోదకములు సమర్పించవలెను. బ్రహ్మకు దక్షిణమున ఆరుపదముల అధిష్ఠాతయగు మృవస్వంతునకు రక్త చందనము, బ్రహ్మకు నైరృతి దిక్కునందున్న క్రింది కోష్ఠమునందున్న ఇంద్రునకు పసుపు అన్నము, ఇంద్రుని క్రింద నైరృతి కోణమునందున్న ఇంద్రజునకు మిష్టాన్నము, బ్రహ్మకు పశ్చిమమున ఆరుపదములందున్న మిత్రునకు గుడమిశ్రాన్నము, వాయవ్య కోణము క్రింద పదమునందున్న రుద్రునకు ఘృతమపక్వాన్నము, రుద్రుని క్రింది కోష్ఠము నందున్న రుద్రదాసునకు ఆర్ద్రమాంసము, ఉత్తరమునందున్న ఆరు పదములకు అధిపతి యగు పృథ్వీధరునకు పెనులతోచేసిన నైవేద్యము ఈశాన్యము నందు క్రిందనున్న పదము నందలి ఆపుని, దాని కింకను క్రిందనున్న ఆపవత్సుని యథావిధిగా పూజించి పెరుగు, పాయసము సమర్పించవలెను. మధ్యభాగమున నాల్గుపదములలో నున్న బ్రహ్మకు పంచగవ్యములు, అక్షతలు, ఘృతసహితమగు చరువు సమర్పించవలెను. (93)

శిలావిన్యాస విధానము

ఈశ్వర ఉవాచ : పిదప ఈశాన్యము మొదలు వాయవ్య దిక్కువరకును, నాల్గు విదిశలలో ఉన్న చరకి మొదలగు నలుగురు మాతృకలను వాస్తు బాహ్యభాగమున పూజించ వలెను. చరకికి సఘృతమాంసము, విదారికి పెరుగు, కమలములు, పూతనకు మాంసపిత్త మాంసములును సమర్పిం పవలెను. పాపరాక్షసికి ఎముకలు, మాంసము, పిత్తము, రక్తము సమర్పింపవలెను. తూర్పున స్కందునకు కోడిమాంసముగల భోజనము, దక్షిణమున అర్యమకు కిచడి, పుష్పము, పశ్చిమ

దిక్కునందు జంభకునకు రక్తమాంసములును సమర్పింపవలెను. ఉత్తరదిక్కునందు పిలిపిచ్చకు రక్త వర్ణాన్నము, పుష్పములు సమర్పిం చవలెను. లేదా సకల వాస్తు మండపమును కుశ, దధ్యక్షత, జలములతో పూజించవలెను. గృహనగరాదులలో ఎనుబది ఒక పదములతో గూడిన వాస్తు మండల మును పూజించవలెను. ఈ వాస్తు మండలము నందు త్రిపద షట్పదరజ్జువులను వెనుకటివలెనే నిర్మింప వలెను. దానియందు ఈశాది దేవతలు పదికులని చెప్పబడుదురు. 'ఆప' మొదలగునవి రెండేసి పదములపై ఉండును. మరీచ్యాది దేవతలు ఆరు పదములందును, బ్రహ్మ తొమ్మిది పదములందును ఉండును. నగర, గ్రా, ఖేటాదులందు శతపద వాస్తు విధానము కూడ చెప్పబడినది. వాటిలో రెండు వంశములు కోణగతములు. అవి సర్వదా దుర్జయములు, దుర్ధరములని చెప్పబడు చున్నది. శతపదవాస్తు మండలమునందు గూడ దేవాలయము నందు వలెనే న్యాసము ఉండును. అందు స్కందాదులు షట్పదాధిష్ఠాతలు చరకి మొదలగు వారు ఐదేసి పదములను అధిష్ఠించి యుందురు. రజ్జువంశాదులను వెనుకటి వలెనే చేయవలెను. దేశ రాష్ట్ర స్థాపనకొరకు వాస్తు మండలమున మూడువేల నాలుగు వందల పదములు ఉండును. మధ్యలో నుండు బ్రహ్మ అరువది నాలుగు పదములకు అధిపతి. మరీచి మొదలగు దేవతల అధికారమున ఏబదినాలుగు చొప్పున పదములుండును. ఆప మొదలగు ఎనమండుగురు దేవతలకు ముప్పది ఆరు చొప్పున స్థానము లుండును. ఈశానుడు మొదలగు వారు తొమ్మిదేసి పదములకును, స్కందాదులు వందేసి పదములకును అధిపతులు. చరకి మొదలగువారి పదములు గూడ తదనుసారముగనే ఉండును. రజ్జు వంశాది కల్పన వెనుకటి వలెనే చేయవలెను. వాస్తుదేవపూజ ఇరువదివేల పదముల వాస్తు మండపముమీద కూడ చేయవచ్చును. దానియందు, దేశవాస్తువునందు వలె తొమ్మిది రెట్లు న్యాసము చేయవలెను. చితాస్థాపన సమయమున ఇరువది యైదు పదముల వాస్తు మండలము విహితము. దానికి వతాలమని పేరు. తొమ్మిది పదముల మండలము కూడ ఉండవచ్చును షట్కోణ, త్రికోణ, వృత్తాది మధ్యమున, చతురస్రవాస్తు మండలము కూడ విహితమైనది. ఈ వాస్తువు పునాదులు మొదలగు వాటికై త్రవ్వు గోతులకు ఉపయో గింపబడును. బ్రహ్మ శిలాత్మక వృషన్యాసమునందును శారాక నివేశనమునందును, మూర్తి స్థాపనమునందును గూడ వాస్తువు ఉపయోగించును. వాస్తు మండలమునందున్న సమస్త దేవతలకును క్షీరాన్నము నైవేద్యము చేయవలెను. ఉక్తానుక్తములగు సకలకార్యము లందును, సాధారణముగ, ఐదు హస్తముల వెడల్పు, పొడవుగల వాస్తు మండలము నిర్మింపవలెను. గృహ ప్రాసాదమానానుసారముగ నిర్మించిన వాస్తు మండలమే సర్వదా శ్రేష్ఠమని చెప్పబడినది.

పరమేశ్వరుడు చెప్పెను : స్కందా! వాస్తు మండలమునకు బైట, ఈశాన్య దిక్కు లందు వెనుకటివలె చరకి మొదలగు దేవతలను పూజించవలెను. ఒక్కొక్క దేవతకును మూడేసి హోమములు చేయవలెను. భూతబలి ఇచ్చి, నిశ్చితమగు లగ్నమునందు శిలా న్యాసోపక్రమము చేయవలెను. ఖాతమధ్య భాగమున ఆధారశక్తి న్యాసము చేయవలెను. అచట అనంతుని మంత్రముచే అభిమం త్రించిన ఉత్తమకలశము స్థాపింపవలెను. 'లం పృథివ్యై నమః' అనుమంత్రముతో ఆ కలశముపై పృథివీ స్వరూపమగు శిలను ఉంచవలెను. దానికి పూర్వాది దిక్కులందు క్రమముగ సుభద్రము

మొదలగు ఎనిమిది కలశములను స్థాపించవలెను. మొదట వాటికొరకై గోతులుత్రవ్వి, వాటిలో ఆధారశక్తి న్యాసము చేసిన పిమ్మట ఆ కలశలను ఇంద్రాది లోకపాలుల మంత్రములతో స్థాపించ వలెను. పిదప ఆ కలశలపై నందాది శిలలను ఉంచవలెను. ఆ శిలలు తత్త్వ మూర్త్యధి దేవతా వస్త్రములతో కూడి యుండవలెను. గోడలపై మూర్తులను, అస్త్రాదుల చిహ్నాములుంచినట్లు ఆ శిలలపై దిగ్వి దిక్కులను చక్కగా విభజించి ధర్మాది దేవతాష్టకమును స్థాపించవలెను. సుభద్ర మొదలగు నాలుగు కలశములపై నందాది శిలాచతుష్టయమును, నాలుగు కోణములందును స్థాపించవలెను. పిదప జయాది కలశచతుష్టయముపై అజితాది శిలాచతుష్టయమును, పూర్వాది దిక్చతుష్టయమున స్థాపింపవలెను. వాటి అన్నింటి పైనను, బ్రహ్మను, వ్యాపకుడగు మహేశ్వరుని స్థాపించి మందిర మధ్యమునందున్న ఆకాశమను పేరుగల అధ్వను చింతించవలెను. ఈ అన్నింటికిని బలి సమర్పించి విఘ్నదోష నివారణార్థమై అస్త్ర మంత్ర మును జపించవలెను. పంచశిలా పక్షమున ఈ విధముగ చేయవలెను. మధ్య భాగమున సుభద్ర కలశముపై పూర్ణ అను శిలను స్థాపించవలెను. ఆగ్నేయాది దిక్కులందు క్రమముగా, పద్మాది కలశములపై, నందాది శిలలను స్థాపించవలెను. మధ్య శిలలేని పక్షమున నాలుగు శిలలనే మాతృ భావముతో పూజించి స్థాపించవలెను. ఆ శిలలను ఐదింటిని ఈ విధముగ ప్రార్థించవలెను.

సర్వ సందోహ స్వరూపిణివి, మహా విద్యవు అయిన ఓ పూర్ణా నీవు అంగిరోఋషి పుత్రికవు. ఈ ప్రతిష్ఠాకర్మయందు అంతయు చక్కగ పూర్ణమగునట్లు చేయుము. నందా! నీవు సమస్త పురుషులను ఆనందింపచేయుదానవు. నిన్ను ఇచట స్థాపించుచున్నాను. ఆకాశమునందు సూర్యచంద్ర నక్షత్రా దులు ప్రకాశించుచున్నంత వరకును నీవు పూర్తిగా తృప్తురాలవై ఈప్రాసాదమున స్థిరముగా ఉండుము, వసిష్ఠనందినియైన ఓ నందా! నీవు ప్రాణులకు ఆయువును, సంపూర్ణ మనోరథములను లక్ష్మిని ఇమ్ము. నీవీ ప్రాసాదమునందు స్థిరముగా ఉండి దీనిని యత్నముతో రక్షింపుము. కశ్యప నందినియైన భద్రా నీవు సమస్త లోకములకును సర్వదా కల్యాణము చేయుము. దేవీ! నీవు సర్వదా మాకు ఆయుర్మ నోరథలక్ష్ములను ఇచ్చుచుండుము. ఓ దేవీ! జయా నీవు సర్వదా మాకు లక్ష్మిని, ఆయువును ఇచ్చుచుండుము. భృగు పుత్రియైన జయా! నీవు ఇచట స్థాపితురాలవై ఇచటనే ఉండి ఈ గృహ స్వామినైన నాకు నిత్యము విజయైశ్వర్యాదులను ఇమ్ము. ఓ రిక్తా! నీవు అతిరిక్త దోషములను నశింపచేయుదానవు. సిద్ధిమోక్షదాయినివి అగుము. ఓ శుభా సంపూర్ణ దేశ కాలము లందు నీ నివాసము. ఈశ రూపిణీ నీవు సర్వదా ఈ ప్రాసాదమున ఉండుము. ఈ విధముగ ప్రార్థించి ఆకాశరూపమగు గృహమును ధ్యానించి, దానియందు మూడు తత్త్వ ములను న్యాసము చేయవలెను. యథావిధిగ ప్రాయశ్చిత్త హోమములు చేసి యజ్ఞ సమాప్తి చేయవలెను. (94)

ప్రతిష్ఠాకాల సామాగ్ర్యాది విధి వర్ణన

పరమేశ్వరుడు చెప్పెను : ఇపుడు భుక్తిముక్తి ప్రదాయకమగు దేవాలయ లింగస్థాపన విధానమును చెప్పెదను. ముక్తి కొరకు చేయు లింగప్రతిష్ఠ ఎపుడైనను చేయవచ్చును. కాని భోగసిద్ధికై చేయు లింగ ప్రతిష్ఠమాత్రము ఉత్తరాయణము నందు చేయవలెను. మాఘాది మాసపంచ

కములో, చైత్రమును విడచి, దేవతాప్రతిష్ఠ చేయవలెను. గురు, శుక్రులు ఉదయించినపుడు మొదటి మూడు కరణములందును చేయవలెను. రెండు పక్షములందును పంచమి వరకును ఉన్న తిథులు ప్రతిష్ఠకు శుభమైనవి. చతుర్థి, నవమి, షష్ఠి, చతుర్దశి విడిచి మిగిలిన తిథులు క్రూరమైన వారములు, కానిచో ఉత్తమ మైనవి. శతభిషం, ధనిష్ఠా, ఆర్ద్రా, అనురాధా ఉత్తరాత్రయ, రోహిణి, శ్రవణ నక్షత్రములు స్థిర ప్రతిష్ఠా ప్రారంభమునకు ఉత్తమములు. కుంభ, సింహ, వృశ్చిక, కన్యా వృషభ లగ్నములు శ్రేష్ఠములు. గురుడు నవమ–సప్తమ స్థానములలో ఉన్నచో శుభము. షష్ఠ–అష్టమ–దశమ–చతుర్థ స్థానములందు బుధుడున్నచో శుభము. షష్ఠము తప్ప పై స్థానములో శుక్రుడున్న శుభము. తృతీయ, సప్తమ, షష్ఠ, దశమ స్థానములందు చంద్రుడు సర్వదా బలదాయకుడు. సూర్యుడు దశమ, తృతీయ, షష్ఠములందు ఉన్నచో శుభఫలమును ఇచ్చును. తృతీయ, షష్ఠ, సప్తమములందు రాహువు శుభకారకుడు. శని, కుజ, కేతువులు, షష్ఠ, తృతీయ స్థానములందు శుభము.

శుభ, క్రూర పాపగ్రహములు ఏకాదశములో నున్నచో శుభకరములు. సమస్త గ్రహముల దృష్టి సప్తమమున పూర్ణముగా ఉండును. పంచమ, నవమ స్థానములందు అర్ధదృష్టి. తృతీయ, దశమ దృష్టి పాదదృష్టి. అష్టమ స్థానమునందు దృష్టి త్రిపాదదృష్టి. మీన, మేష, వృషభ, కుంభరాశుల భోగము మూడు ముప్పావు ఘడియలు, మకర, మిథునముల భోగము ఐదు ఘడియలు, ధనుస్సు, వృశ్చి కము, సింహము, కర్కటకము వీటి భోగము ఆరునాడులు, తులా కన్యారాశుల భోగము ఐదున్నర నాడులు. స్థిర లగ్నముకైన సింహ, వృషభ, కుంభములు సిద్ధి దాయకములు. ధనుస్తులా మేషములు చరరాశులు, మూడవ సంఖ్యగల రాశులు (మిథున–కన్యాదులు) ఉభయ స్వభావములు. కర్కట, మకర, వృశ్చికములు సన్యాసమునకు అనర్హములు. శుభ గ్రహదృష్టిగల లగ్నము శుభము. శుభగ్రహమున్న లగ్నము శ్రేష్ఠము. లగ్నమునందు గురు, శుక్ర, బుధులున్నచో ధన, ఆయు, రాజ్య, శౌర్య, బల, పుత్ర, యశో, ధర్మాదులను అధికముగా ఇచ్చును. ప్రథమ, చతుర్థ, సప్తమ, దశమ ములకు పేరు కేంద్ర స్థానము లందున్న గురు, శుక్ర, బుధులు సంపూర్ణ శుభఫలములను ఇత్తురు. తృతీయ, ఏకాదశ, చతుర్థ స్థానములందు పాపగ్రహములు ఉన్నచో శుభ ఫలమును ఇత్తురు.

అందువలన వీటిని, ఇతర శుభగ్రహములను, ఇతర శుభతిథులను ప్రతిష్ఠాకర్మ విషయమున విద్వాంసుడు నిర్ణయించుకొనవలెను. ఆలయము ఎదుట దానికంటె పదిరెట్లు లేదా దానితో సమానమైన లేదా మెట్టునుండి పది హస్తముల దూరము భూమి విడచి మండప నిర్మాణము చేయవలెను. ఆ మండపము చతురస్రమై నాలుగు ద్వారములు కలదై ఉండవలెను. దానిలో సగము భూమి గ్రహించి స్నానార్థమై మండపము నిర్మింప వలెను. దానికి ఒకటి లేదా నాలుగు ద్వారములు ఉండవలెను. ఈ స్నాన మండపము ఈశాన్యము నందుగాని, తూర్పున గాని, ఉత్తరము నందు గాని ఉండవలెను. మొదటి మండపము ప్రమాణము ఎనిమిది హస్తములు, పది హస్తములు, లేదా పంద్రెండు హస్త ములు ఉండవలెను. మిగిలిన ఎనిమిది మండపములు రెండేసి హస్తములు పెంచి నిర్మిం చవలెను. మధ్య మండలము నందు నాలుగు హస్తముల వేది నిర్మించవలెను. దాని నాలుగు కోణములందును, నాలుగు స్తంభములు ఉండవలెను. వేది, పాదముల మధ్య స్థమును విడచి కుండలమును నిర్మించవలెను. ఇవి తొమ్మిది లేదా పది ఉండవలెను. ఈశాన్యము నందుగాని,

తూర్పు నందుగాని ఒకే కుండమును నిర్మించవలెను. అది గురుస్థానము. ఏబది హోమములు చేయు కుండము ప్రమాణము పిడికిలి ఉండవలెను. నూరు హోమములైనచో జానెడు, వెయ్యి హోమములు చేయవలసియున్నచో ఒక హస్తము, పది వేల హోమములైనచో రెట్టింపు ఉండవలెను. లక్ష హోమములకు నాలుగు హస్తములు, ఒక కోటి హోమములకు ఎనిమిది హస్తములు ఉండవలెను. కుండమును ఆగ్నేయమునందు భగాకారముగను, దక్షిణమున అర్ధచంద్రాకారమునను, నైరృతియందు త్రి కోణాకారముగను, వాయవ్యమున షట్కోణముగను, ఉత్తరమున కమలాకారముగను, ఈశాన్యము నందు అష్టకోణముగను నిర్మించవలెను. కుండము అన్ని వైపుల సమముగను పల్లముగను ఉండవలెను. పైన మేఖలలు నిర్మించవలెను. బైట వరుసగ నాలుగు, మూడు, రెండు, అంగుళముల వెడల్పుగల మేఖల నిర్మించవలెను. మేఖలలు కుండాకారముతో సమానాకారములై ఉండవలెను. వాటిపై మధ్య భాగమున రావి ఆకు ఆకారముగల యోని ఉండవలెను. దాని ఎత్తు ఒక అంగుళము, వెడల్పు ఎనిమిది అంగుళములు ఉండవలెను. పొడవు కుండార్థముతో సమానముగా ఉండవలెను. యోని మధ్యభాగము కుండ కంఠమువలె నుండవలెను. పూర్వ, ఆగ్నేయ, దక్షిణములందు కుండముల యోని ఉత్తరాభి ముఖముగ నుండవలెను. ఇతర దిక్కులందున్న కుండముల యోని పూర్వాభి ముఖముగ నుండవలెను. ఈశాన్యకుండ యోని ఉత్తరాభిముఖముగాగాని, పూర్వాభిముఖముగా గాని ఉండవలెను. కుండములో ఇరువది నాల్గవ భాగము అంగుళము. తదనుసారము విభజించి మేఖలా, కంఠ, నాభులను నిశ్చయించవలెను. మండపము పూర్వాది దిక్కులందు ద్వార ములు వరుసగ ప్లక్ష ఉదుంబర అశ్వత్థ వటదారువులతో నిర్మింపబడవలెను. పూర్వాది దిక్కులనుండి వరుసగ వాటి పేర్లు శాంతిభూతి బల ఆరోగ్యములు ద్వారములు ఎత్తు ఐదు, ఆరు, లేదా ఏడు హస్తములు ఉండవలెను. వాటిని చేతిలోతు త్రవ్విన గోతులలో నిలుపవలెను. వాటి విస్తారము ఎత్తులో సగము ఉండవలెను. వాటిపై మామిడాకులు మొదలగునవి కట్టవలెను.

మండప పూర్వాది దిక్కులందు వరుసగ ఇంద్రాయుధమువలె అనేక వర్ణములు గల పతాకను, రక్త, కృష్ణ, ధూసర, శ్వేత, హరిత, సువర్ణ వర్ణ, స్ఫటిక వర్ణ పతాకలను ఎగురవేయవలెను. ఈశాన్యమునందును, పూర్వ మధ్యమునందును బ్రహ్మ కొరకు రక్త వర్ణ పతాకను, నైరృతి, పశ్చిమ మధ్య భాగములందు అనంతునికొరకు నీల వర్ణ పతాకను ఎగురవేయవలెను. ధ్వజముల పతాకలు ఐదుహస్తముల పొడవు, అందులో సగము వెడల్పు ఉండవలెను. ధ్వజ దండము ఎత్తు ఐదు హస్త ములు ఉండవలెను. ధ్వజము లావు రెండు చేతులతో పట్టుకొనుటకు వీలగునట్లు ఉండవలెను. పర్వత శిఖర, రాజద్వార, నదీతట, అశ్వశాలా, హస్తిశాలా, వల్మీకముల మట్టిని, ఏనుగు దంతము లతో పెకలించిన మట్టిని, ఎద్దు కొమ్ములతో పెకలించిన మట్టిని, వరాహము పెకలించిన మట్టిని, గోష్ఠ చతుష్పథముల మట్టిని ఈ పంద్రెండు విధముల మట్టిని గ్రహించవలెను. విష్ణు స్థాపనము నకు పంద్రెండు విధముల మట్టిని, శివస్థాపనమునకు ఎనిమిది విధముల మట్టిని ఉపయోగించ వలెను. న్యగ్రోధ, ఉదుంబర, అశ్వత్థ, చూత, జంబూ వృక్షముల బెరడునుండి తీసిన ఐదు కషాయ ములు, ఎనిమిది విధములైన ఋతుఫలములు సంగ్రహించవలెను. తీర్థజల, సుగంధిత జలములు, సర్వౌషధి మిశ్ర జలము, సస్య పుష్ప మిశ్రిత జలము, స్వర్ణ మిశ్రిత జలము, రత్న మిశ్రిత

జలము, గోశృంగ స్పర్శయుక్త జలము, పంచగవ్య, పంచామృతములు, వీటిని అన్నిటిని దేవతా స్నానముకొరకై సిద్ధము చేసికొనవలెను. విఘ్నము కలిగించువారిని భయపెట్టుటకై పిండితో చేసిన వజ్రాద్యాయుధములనుగూడ సిద్ధము చేసికొనవలెను. సహస్ర ఛిద్రములున్న కలశమును, మంగళార్థమై గోరోచనమును సిద్ధము చేసికొనవలెను. స్నానార్థమై వంద విధములైన ఓషధుల మూలములు, విజయా, లక్ష్మణా, బలా, గుడూచీ, అతిబలా, పాఠా, సహదేవా, శతావరీ, బుద్ధి, సువర్చలా, వృద్ధులను వేరు వేరుగా సిద్ధము చేసికొనవలెను. రక్షకొరకు తిలకుశాదులు, భస్మస్నానము కొరకు భస్మము, స్నానార్థము యవగోధుమలపిండి, బిల్వ చూర్ణము, విలేపనము, కర్పూ రము, కలశము, చెంబు సిద్ధము చేసికొనవలెను. మంచము, రెండు పరుపులు, తలగడ, దుప్పటి మొదలైన ఇతర వస్త్రములు గూడి తన శక్తిని అనుసరించి సిద్ధము చేసికొని, వివిధ చిహ్నములతో సిద్ధము చేయబడిన శయనాగారమునందు ఉంచవలెను. ఘృత, మధు పూర్ణ పాత్రములు, బంగారు సూది, వర్ధని శివ కుంభము లోకపాల ఘటములను కూడ సిద్ధము చేసికొనవలెను. నిద్ర కొరకు ఒక కలశ, కుండము లెన్ని ఉన్నవో అన్ని శాంతి కలశములు. ద్వారపాలాది, ధర్మాది, ప్రశాంతాదుల కొరకై కలశలు, వాస్తుదేవ, లక్ష్మీ, గణేశులకై వేరువేరు కలశలు సమకూర్చుకొనవలెను. ఈ కలశల క్రింద ఆధారముగా నుండునట్లు పోయుటకు ధాన్యము ఉంచుకొనవలెను. అన్ని కలశలను వస్త్ర పుష్పాదులతో అలంకరించవలెను. వీటి లోపల సువర్ణముంచి స్పృశించి సుగంధ జలముతో నింపవలెను. అన్ని కలశలమీదను పూర్ణపాత్రలు, ఫలములు ఉంచవలెను. వాటి ముఖ భాగము నందు పంచ పల్లవములుంచవలెను. ఆ కలశలు ఉత్తమ లక్షణ సంపన్నములై ఉండవలెను. కలశములను వస్త్రములచే ఆచ్ఛాదించవలెను. నలుమూలల చల్లుటకై తెల్ల ఆవాలు, పేలాలు సిద్ధము చేసికొనవలెను. పూర్వమునందు చెప్పినట్లు జ్ఞాన ఖడ్గము ఉంచుకొనవలెను. సమిధలు, చరుపాత్ర, రాగి గరిటి, పాదాభ్యంగము కొరకై ఘృత మధువులున్న పాత్రను, ముప్పది కుశ దక్షములతో నిర్మించిన నాలుగు ఆసనములను, పలాశ నిర్మితములగు నాలుగు పరిధులను సమకూర్చుకొనవలెను.

తిలపాత్ర, హవిష్య పాత్ర, అర్ఘ్య పాత్ర, పవిత్రకములను కూడ సిద్ధము చేసికొన వలెను. వీటి ప్రమాణము ఇరువదేసి ఫలములు ఘంట, ధూపపాత్ర, స్రుక్కు, స్రువము, పిటకము, పీఠము, వ్యజనము, ఎండిన సమిధలు, పుష్పములు, సత్రములు గుగ్గులు, ఘృత దీపములు, ధూపము, అక్షతలు, మూడు పోచల ద్వారము, గౌఘృతము, యవలు, తిలలు, కుశలు, శాంతికర్మపై త్రివిధ మధుర పదార్థములు, పది పర్వముల సమిధలు, ఒక హస్తము ప్రమాణముగల స్రువము, సూర్యాది గ్రహశాంతికై అర్క, పలాశ, ఖాదిర, అపామార్గ, అశ్వత్థ, ఉదుంబక, శమీవృక్ష సమిధలు, ధూర్వలు, కుశలు, సిద్ధము చేసికొన వలెను. అర్కాదిసమిధలు నూటఎనిమిది చొప్పున ఉండవలెను. ఇవి లభించనిచో వాటి స్థానమున యవలు, తిలలు హోమము చేయవలెను. ఇంకను గృహోపకరణములు కూడ సిద్ధము చేసికొనవలెను. గిన్నెలు, గరిటె, మూతలు మొదలగునవి. దేవాదుల కొరకు వస్త్ర ద్వయము, ఆచార్య పూజ నిమిత్తము ముద్రా, ముకుట, వస్త్ర, హార, కుండల, కంకణాదులును సిద్ధము చేయవలెను. ధన వ్యయము విషయమున లుబ్ధత్వము చూపరాదు. మూర్తిధారణము, అస్త్ర మంత్రాది జపము చేయు బ్రాహ్మణులకు ఆచార్యునకు ఇచ్చిన దానిలో నాల్గవవంతు తగ్గించి

దక్షిణ ఈయవలెను. సామాన్య బ్రాహ్మణులకును, జ్యోతిష్కు లకును, శిల్పులకును, జపకర్తలకు ఇచ్చినట్లుగనే ఇవ్వవలెను. వజ్రము, సూర్యకాంతమణి, నీలమణి, అతినీలమణి, ముత్యము, పుష్పరాగము, పద్మరాగము, వైఢూర్యము వీటిని సంగ్రహించుకొనవలెను. వట్టివేరు, విష్ణుకాంత, రక్తచందనము, అగురువు, శ్రీ ఖండము, శాంబ, కుష్ఠము, శంఖిని ఈ ఓషధులను సంగ్రహించ వలెను. బంగారము, రాగి, ఇనుము, రక్తము, రజతము, కంచు, సీసములము, మనఃశిల గైరికము, హేమ మాక్షీకము, పాదరసము, వహ్నిగైదికము, గంధకము, అభ్రకము అను ఎనిమిది ధాతువులను కూర్చుకొన వలెను. ఈ విధముగనే ఎనిమిది విధములగు ధాన్యములు వరి, గోధుమలు, తిలలు, పెసలు, మినుములు, యవలు, నీవారములు, శ్యావాకములు సమకూర్చుకొనవలెను. (95)

అధివాసన విధానము

అటు పిమ్మట పరమేశ్వరుడు ఇట్లు చెప్పెను : పురోహితుడు స్నానమాచరించి, ప్రాతఃకాల మధ్యాహ్నకాల కృత్యములు నెరవేర్చుకొని మూర్తిరక్షకులగు బ్రాహ్మణులతో కలిసి యజ్ఞ మండపము చేరుకొనవలెను. వెనుకటి వలెనే శాంత్యాది ద్వార పూజక్రమముగా చేసి, ద్వారముల రెండు శాఖలందును, ప్రదక్షిణమున, ద్వారపాలపూజ చేయ వలెను. పూర్వ దిక్కున ద్వారపాలులైన నందీ, మహాకాలులను, దక్షిణమున భృంగి, వినాయకులను, పశ్చిమమున వృషభస్కందులను, ఉత్తరమున దేవీ-చండులను పూజించవలెను. ద్వారశాఖా మూలములందు, పూర్వాది క్రమమున రెండేసి కలశములను పూజించవలెను. పూర్వదిక్కున ఉన్న కలశల పేర్లు ప్రశాంత-శిబిరములు, దక్షిణమున పర్జన్య-అశోకములు, పశ్చిమమున భూత సంజీవన-అమృతములు, ఉత్తరమున ధనద-శ్రీప్రదములు. ఈ రెండేసి కలశలను క్రమముగా పూజించు విధానము చెప్పబడినది. వీటి పేర్ల ప్రారంభము ఓంకారము, అంతమున 'నమః' చేర్చి చతుర్థ్యంతరూపము ఉంచవలెను. ఇవే దీని పూజా మంత్రములు. ఉదా : 'ప్రశాన్త శిశిరాభ్యాం నమః' మొదలగునవి యజ్ఞ మండపమునందలి ప్రత్యేక ద్వారమునందును రెండు లోకములు, రెండు గ్రహములు, ఇద్దరు వసువులు, ఇద్దరు ద్వారపాలురు, రెండు నదులు, ముగ్గురు సూర్యులు, ఒక యుగము, ఒక వేదము, లక్ష్మి, గణేశుడును ఉండును, విఘ్నములను తొలగించి యజ్ఞమును రక్షించుట వీరి కర్తవ్యము. పూర్వాది దిక్కులు పదింటి యందును వజ్ర, శక్తి, దండ, ఖడ్గ, పాశ, గదా, త్రిశూల, నక్ర, కమఠములను పూజించి, ఒక్కొక్క దిక్కునందును దిక్పాలక పతాక పూజ చేయవలెను. 'ఓం హూం హః హూం ఫట్' 'ఓం హూం హః శక్తయే హూం ఫట్' ఇత్యాదులు మంత్రములు కుముద, కుముదాక్ష, పుండరీక, వామన, శంకుకర్ణ, సర్వనేత్ర, సుముఖ, సుప్రతిష్ఠితులను ఎనమండుగురు ధ్వజ దేవతలను కోటికోటి భూతములతో పూజించవలెను. 'ఓం కుం కుముదాయ నమః' ఇత్యాదులు పూజామంత్రములు హేరుక, త్రిపురఘ్న, శక్తి, యమజిహ్వా, కాల, కరాలీ, ఏకాంఘ్రి, భీములను ఎనమండుగురు క్షేత్ర పాలులను పూర్వాది దిక్కులందు బలి, పుష్ప, ధూపాదులతో పూజించి సంతుష్టులను చేయవలెను.

పిదప ఉత్తమ తృణములపైన లేదా వెదురు స్తంభములపై పృథ్వ్యాది పంచతత్త్వములను స్థాపించి, సద్యోజాతి మంత్ర పంచకముతో వాటిని పూజించవలెను. పతాకతోడను, శక్తితోడను

యుక్తమగు సదాశివపద వ్యాపియైన మండపము శంకరుని స్థానము అని తాత్త్విక దృష్టితో చూడవలెను. వెనుకటివలె ద్యులోకాన్తరిక్ష లోక భూలోకము లలో ఉన్న విఘ్నములను తొలగించి పశ్చిమ ద్వారమున ప్రవేశించి ఇతర ద్వారముల దర్శనము చేయవలెను. ప్రదక్షిణ క్రమమున మండపములోనికి ప్రవేశించి, వేదీ దక్షిణభాగమున ఉత్తరాభిముఖముగ కూర్చుండి, వెనుకటివలె భూతశుద్ధి చేయవలెను. అంతర్యాగ–విశేషార్ఘ్య–మంత్ర ద్రవ్యాది శోధన–స్వాత్మ పూజన–పంచగవ్యాదికము వెనుకటివలె చేయవలెను. అచట ఆధారశక్తి ప్రతిష్ఠా పూర్వకముగ కలశస్థాపనము చేయవలెను. విశేషించి శివధ్యానము చేయవలెను. పిదప మూడు తత్త్వముల చింతనముచేసి, లలా టమున శివ తత్త్వమును, స్కంధ దేశమునందు విద్యాతత్త్వమును పాదాంత భాగమునందు ఆత్మతత్త్వమును భావన చేయవలెను. శివతత్త్వమునకు రుద్రుడు, విద్యాతత్త్వమునకు నారాయణుడు, ఆత్మతత్త్వమునకు బ్రహ్మయు దేవతలు వీరిని వారివారి నామ మంత్రము లతో పూజించవలెను. వరుసగ ఈ తత్త్వముల ఆది బీజములు 'ఓం ఈం అం' అనునవి (ఓం హం హాం అనునవి). మూర్తులను మూర్తీశ్వరులను వెనుకటి వలెనే స్థాపించి, వాటిమీద వ్యాపక శివుని సాంగపూజ చేసి, శిరముపై శివహస్తమును ఉంచవలెను. బ్రహ్మ రంధ్రమునుండి ప్రవేశించి తేజస్సుచే తన లోపలను, బైటను ఉన్న అంధకార రాశి నష్టమైనట్లు భావనచేసి, 'ఆత్మ స్వరూపమే సంపూర్ణ దిఙ్మండలమును ప్రకాశింప చేయుచున్నదని భావన చేయవలెను. మూర్తిపాలకులతో పాటు తననుగూడ వస్త్ర–ముకుటాదులతో అలంకరించుకొని, 'నేనే శివుడను' అని చింతించుచు బోధ ఖడ్గమును ఎత్తవలెను.

చతుష్పదాంత సంస్కారములతో యజ్ఞమండప సంస్కారముచేసి, చల్లవలసిన వస్తువులు నలు మూలల చల్లి కుశ కుంచితో వాటినన్నింటిని ప్రోగుచేయవలెను. వాటిని ఆసనముక్రింద ఉంచి, వర్ధనీ జలముతో వెనుకటివలె వాస్త్వాది పూజ చేయవలెను. శివ కుంభాస్త్రమును, వర్ధనిని సుస్థిరాసనమును కూడ పూజించవలెను. వారివారి కలశలపై నున్న ఇంద్రాది దిక్పాలకులను క్రమముగ ఆయుధ పరివారాది సహితముగ పూజించవలెను. తూర్పున ఐరావతము నెక్కి, శిరముపై కిరీటమును, హస్తమున వజ్రమును ధరించిన సహస్రాక్షుడైన ఇంద్రుని ధ్యానించవలెను. ఆగ్నేయ మున జ్వాలామయములగు ఏడు జిహ్వలు కలిగి, అక్షమాలా కమండలములు ధరించి, అజా రూఢుడైన జ్వాలాపరి వృతుడైన అగ్నిదేవుని ధ్యానించవలెను. ఆతని హస్తమునందు శక్త్యాయుధము ఉండును. దక్షిణమున మహిషారూఢుడును, దండధారియు, కాలాగ్నివలె ప్రకాశించువాడును అగు యముని ధ్యానించవలెను. నైరృతియందు ఖరారూఢుడై, ఖడ్గము ధరించి, ఎఱ్ఱని నేత్రములు గల నైరృతిని ధ్యానించవలెను. పశ్చిమమున, మకరారూఢుడును, శ్వేతవర్ణుడును, నాగపాశధారియగు వరుణుని ధ్యానించవలెను. వాయవ్యమునందు లేడి నెక్కిన, నీలవర్ణు డైన వాయువును, ఉత్తమునందు గొర్రెనెక్కిన కుబేరుని, ఈశాన్యమున త్రిశూలధారియు, వృషభారూఢుడును అగు ఈశానుని, నైరృతి–పశ్చిమముల మధ్య కచ్ఛపారూఢుడును చక్రధారియు అగు అనంతుని, ఈశాన–పూర్వ దిఙ్మధ్యము లందు నాలుగు ముఖములు, నాలుగు భుజములునుగల హంసవాహనుడైన బ్రహ్మను ధ్యానించ వలెను. స్తంభమూలము నందున్న కలశములందును, వేదియందును ధర్మాదులను పూజించవలెను.

కొందరు అన్ని దిక్కులందునుఉన్న కలశలపై అనంతాదులను పూజింతురు. పిదప శివాజ్ఞ వినిపించి, కలశములను తన పృష్ఠభాగము వరకును త్రిప్పవలెను. పిదప, ముందుగ కలశను, తరువాత వర్ధనిని, వాటి స్థానములందు ఉంచవలెను. స్థిరాసనముగల శివుని కలశము నందును, శస్త్రము నిమిత్తమై ధ్రువాసనమును వెనుకటివలె పూజించి ఉద్భవముద్రతో స్పృశించవలెను. అపుడు– 'జగన్నాథా! నీ భక్తులపై కృపతో ఈ నీ యజ్ఞమును రక్షించుము' అని ప్రార్థించి కలశమునందు ఖడ్గస్థాపన చేయవలెను. దీక్షా స్థాపనా సమయములందు, కలశయందుగాని, వేదిపైగాని, మండల ముపైగాని శివుని పూజించవలెను. మండలమునందు దేవేశ్వరుడగు శివుని పూజించి, కుండము దగ్గరకు వెళ్ళవలెను.

కుండనాభిని ముందు ఉంచుకొని కూర్చున్న మూర్తిధారులగు పురుషులు గురువు ఆజ్ఞను అనుసరించి తమతమ కుండలములను సంస్కరించుకొనవలెను. జపముచేయు బ్రాహ్మణులు, సంఖ్యా రహితముగ జపము చేయవలెను. ఇతరులు సంహితా పాఠము చేయవలెను. వేదపారం గతులగు బ్రాహ్మణులు తమతమ శాఖలను అనుసరించి శాంతి పాఠము చేయవలెను. ఋగ్వేదులగు బ్రాహ్మణులు తూర్పున శ్రీసూక్త, పావమానీఋక్, మైత్రీయ బ్రాహ్మణ, వృషాకపి మంత్రములను పఠించవలెను. సామవేదవేత్తలు దక్షిణమున దేవవ్రత, భారుండ, జ్యేష్ఠసామ, రథంతరసామ, పురుష గీతగానము చేయవలెను. యజుర్వేదులు, పశ్చిమమున, రుద్రసూక్త, పురుషసూక్త, శ్లోకాధ్యా యములను, ప్రధానముగ బ్రాహ్మణములను పఠించవలెను. అథర్వవేదులు, ఉత్తరమున, నీలరుద్ర, సూక్ష్మా సూక్ష్మ, అథర్వ శీర్షములను శ్రద్ధతో పఠించవలెను, అచార్యుడు అగ్నిని పుట్టించి, అన్ని కుండము లందును స్థాపింపచేయవలెను. అగ్నికి పూర్వాది భాగములందు పూర్వకుండాది క్రమమున ధూప, దీప, చరువుల కొరకై అగ్న్యుద్ధారము చేయవలెను. మొదట చెప్పిన విధముగ పరమేశ్వరుని పూజించి, శివాగ్నియందు మంత్ర తర్పణము చేయవలెను. దేశ కాలాది సంపన్నత్వము కొరకును, దుర్నిమిత్త శాంతి కొరకును, మంత్రజ్ఞుడగు ఆచార్యుడు హోమముచేసి, మంగళకరమగు పూర్ణాహుతి ఇచ్చి, వెనుకటివలె చరువును వండి, దానిని ఒక్కొక్క కుండమునందును నివేదన చేయవలెను. యజమానునిచే వస్త్రభూషణాదులతో సత్కరింపబడిన మూర్తిపాలకులగు బ్రాహ్మణులు స్నాన మండపమునకు వెళ్ళి, శివ ప్రతిమను భద్రపీఠముపై స్థాపించి, తాడన, అవకుంఠన క్రియను చేయవలెను. పూర్వవేదిపై పూజచేసి, మట్టి, కషాయ జలము, గోమయము, గోమూత్రము– వీటితోను, మధ్య మధ్య జలముతోను భగవత్ప్రతిమకు స్నానము చేయించవలెను. పిదప భస్మము తోను, సుగంధి జలముతోను స్నానము చేయించవలెను. పిదప ఆచార్యుడు 'అస్త్రాయ ఫట్' అను మంత్ర ముతో అభిమంత్రించిన జలముతో మూర్తిపాలురతో పాటు తన హస్తములు కూడ కడిగి కొని, కవచ మంత్రాభి మంత్రితమగు పీతాంబరముతో మూర్తిని ఆచ్ఛాదించి, శ్వేత పుష్పములతో పూజించవలెను. పిదప దానిని ఉత్తరవేది మీదకు తీసికొని వెళ్ళవలెను.

అచట ఆసనయుక్తమగు శయ్యపై పరుండబెట్టి కుంకుమరంగు పూసిన దారముతో అంగ విభాజనముచేసి, ఆచార్యుడు సువర్ణశలాకతో ప్రతిమయందు నేత్రములను గుర్తించవలెను. ఈ పని శస్త్రక్రియ ద్వారా జరుగవలెను. చిహ్నములు చేసిన గురువును ముందుగ నేత్ర చిహ్నమును

అంజనాంకితము చేయగా, పిమ్మట, మూర్తి నిర్మాణము చేసిన శిల్పి శస్త్రముతో ఆనేత్ర చిహ్న స్థానమును చెక్కవలెను. ఆ మూర్తియందు, మూడు అంశములకంటె తక్కువగాగాని, నాల్గవ వంతుగాని, అర్ధ భాగమునందు గాని సంపూర్ణ కామసిద్ధి కొరకై, శుభ చిహ్నములను ఉంచవలెను. శివలింగము పొడవును మూడుచే భాగించి, ఒక భాగము విడువగా ఎంత ప్రమాణము వచ్చునో అదే లింగము యొక్క లక్ష్మ దేహమునకు అన్ని వైపుల నుండి విస్తారము కావలెను. హస్తమాణమగు శిలయందు గీయు లక్ష్మరేఖల లోతు-వెడల్పులు యవయొక్క తొమ్మిది భాగములలో ఒక దానిని విడిచి ఎనిమిది గ్రహించినంత ఉండవలెను. ఇదేవిధముగ ఒకటిన్నర లేదా రెండు హస్తములు మొదట ప్రమాణముగల శివలింగము మొదలు, తొమ్మిది హస్తముల ప్రమాణము గల లింగము వరకును, క్రమముగ ఎనిమిదవ వంతు పెంచుచు చిహ్నరేఖలు గీయవలెను. ఈ విధముగ తొమ్మిది హస్తముల లింగమునందు ఎనిమిది యవలలోతు వెడల్పులుగల చిహ్నరేఖలు ఉండవలెను. పరస్పరాంతరముతో ఉత్తరోత్తరము పాదవృద్ధి గల శివ లింగమున లక్ష్మదేహ విస్తారము ఒక్కొక్క యవ పెరుగుతూ పోవలెను. లోతు-వెడల్పులు పెరుగుట ననుసరించి, రేఖ మూడవ వంతు పెరుగుచుండును. అన్ని శివ లింగములందును దానిపై భాగమే దాని సూక్ష్మ శిరము చిహ్న క్షేత్రమును ఎనిమిది భాగములు చేసి, రెండు భాగములు శిరస్సునందు ఉండునట్లు చేయవలెను. మిగిలిన ఆరు భాగములలో క్రింది రెండు భాగములను విడచి మధ్యయందు మిగిలిన భాగములందు మూడు రేఖలు గీసి, వాటిని పృష్ఠ దేశమునకు తీసికొని వెళ్ళి విడువవలెను. రత్నమయ లింగము లైనచో లక్షణోద్ధారము ఆవశ్యకము కాదు. భూమి నుండి స్వతః ఆవిర్భవించిన లింగములకు గాని, నర్మదాది నదులందు ఉద్భవించిన లింగములకుగాని, లక్ష్మోద్ధార మపేక్షితము కాదు. రత్నమయ లింగముల రత్నము లందున్న నిర్మల కాంతియే వాటి స్వరూపమునకు లక్షణము, ముఖ భాగము నందు నేత్రోన్మీలనము ఆవశ్యకము. అందు నిమిత్తమే ఈ చిహ్నము నిర్మింపబడుచున్నది.

లక్షణోద్ధార రేఖను మృత్యుంజయ మంత్రముతో, ఘృతమధువులతో పూజించి, శిల్పి దోష పరిహారార్థమై మృత్తికాది స్నానము చేయించి, లింగమును పూజించవలెను. పిదప దానమానాదులతో శిల్పిని సంతోషపెట్టి గురువునకు గోవును ఈయవలెను. సౌభాగ్య వతులగు స్త్రీలు ధూపదీపాదులతో లింగమునకు విశేష పూజలుచేసి మంగళ గీతములను గానము చేయవలెను. సవ్యాపసవ్య భావముతో కుశముతోగాని, సూత్రముతో గాని స్పర్శ పూర్వకముగ గోరోచనము సమర్పించవలెను. పిదప యజమానుడు బెల్లము, ఉప్పు, ధాన్యాకము (కొత్తుమ్మరి) మొదలగునవి ఇచ్చి ఆ స్త్రీలను పంపివేయ వలెను. పిమ్మట గురువు మూర్తి రక్షకులగు బ్రాహ్మణులతో కలిసి, 'నమః' లేదా ప్రణవ మంత్రముతో మట్టి, గోమయము, గోమూత్రము, భస్మము-వీటితో వేరువేరుగా స్నానము చేయించవలెను. ఒక్కొక్క దానితో స్నానము చేయించిన పిదప మధ్యయందు జలముతో స్నానము చేయించవలెను. పిదప పంచగవ్యములు, పంచామృతము, రూక్షత్వమును తొలగించు కషాయ ద్రవ్యములు, సర్వౌషధి మిశ్రజలము, శ్వేత పుష్పములు, ఫలములు, సువర్ణము, రత్నములు, శృంగము, యవలు కలిపిన జలము, సహస్రధార, దివ్యౌషధముక్త జలము, తీర్థ జలము, గంగాజలము, చందన మిశ్ర జలము, క్షీర సాగరాది జలము, కలశ జలము, శివకలశ జలము వీటిచే స్నానము చేయించవలెను.

రూక్షత్వమును తొలగించు విలేపనము, ఉత్తమ గంధము, చందనము మొదలగువాటితో పూజ చేసిన పిమ్మట బ్రహ్మ మంత్రముతో పుష్పములను, కవచ మంత్రముతో రక్త వస్త్రములను సమర్పించవలెను. అనేక విధములగు హారతి ఇచ్చి, రక్షా-తిలక పూర్వకముగ గీతవాద్యాదులతోను వివిధ ద్రవ్యములతోను, జయజయ ధ్వనులతోను, స్తుత్యాదులతోను, పరమేశ్వరుని సంతుష్టుని చేసి, పుష్పమంత్రములతో పూజచేయవలెను. హృదయ మంత్రముతో ఆచమనము చేసి, 'ఓ ప్రభూ! లెమ్ము' అని ఇష్ట దేవతతో చెప్పవలెను. పిదప ఇష్ట దేవతను బ్రహ్మ రథముపై కూర్చుండబెట్టి నాలుగు దిక్కులందును త్రిప్పి వివిధ ద్రవ్యములను వెదజల్లుచు, పశ్చిమ ద్వారమునకు తీసికొనిపోయి అచట దేవతను శయ్యపై కూర్చుండ బెట్టవలెను, ఆసనము ఆద్యంతములయందు శక్తి భావన చేయుచు ఆ శుభాసనముపై కూర్చుండబెట్టవలెను.

పశ్చిమాభిముఖమైన ప్రాసాదమునందు పశ్చిమము వైపున పిండిక స్థాపించి, దానిపై బ్రహ్మ శిల ఉంచవలెను. శివకోణము నందు నూరు అస్త్రమంత్రములతో అభిమంత్రించిన నిద్రాకలశమును, శివాసనమును కల్పించి, హృదయమంత్రముతో అర్ఘ్యమిచ్చి, దేవతలను లేవదీసి, శిరోమంత్రముతో, లింగమయాసనముపై, తూర్పువైపు శిరస్సు ఉండునట్లు ఉంచవలెను. పిదప చందన ధూపాదులు సమర్పించి దేవుని పూజించి కవచమంత్రముతో వస్త్రము సమర్పించి, గృహోపకరణాదులు అర్పించి, శక్త్యనుసారము నమస్కార పూర్వకముగ నైవేద్యము నివేదించవలెను. అభ్యంగము కొరకై, ఘృత-మధు యుక్తమగు పాత్రను దేవతాపాద సమీపమున ఉంచవలెను. ఆచార్యుడు, శక్తి మొదలు భూమి వరకును ఉన్న ముప్పదియారు తత్త్వములను, తదధిపతి సహితముగ స్థాపించి, వాటిని పుష్పమాలలతో మూడు భాగములుగ విభజించవలెను. ఇది మాయ మొదలు శక్తి పర్యంతమైన భాగములు; మొదటిది చతుష్కోణము; రెండవది అష్టకోణము; మూడవది వర్తులాకారము. సృష్టి క్రమానుసారము ఈ భాగములకు బ్రహ్మ, విష్ణు, శివులు అధిపతులు. పిదప పూర్వాది క్రమమున మూర్తులను, మూర్తీశ్వరులను న్యాసము చేయవలెను. పృథివి, అగ్ని, యజమా నుడు, సూర్యుడు, జలము, వాయువు, చంద్రుడు, ఆకాశము ఈ ఎనిమిది మూర్తి రూప ములు. వీని న్యాసము చేసిన పిమ్మట అధిపతుల న్యాసము చేయవలెను. శర్వ, ఉగ్ర, రుద్ర, భవ, ఈశ్వర, మహాదేవ-భీములు అధిపతులు, లం, రం, శం, ఖం, చం, పం, సం, హం అనునవి వీరి మంత్రములు. త్రి మాత్రిక ప్రణవహోంలు గాని, హృదయ మంత్రము గాని, మూల మంత్రములు గాని వీరి పూజకై వినియోగింపబడును. లేదా పంచ కుండాత్మక యాగము నందు పృథ్వీ, జల తేజో, వాయు, ఆకాశములనెడు పంచమూర్తుల న్యాసము చేయవలెను. పిదప, మంత్రజ్ఞుడు, బ్రహ్మ-శేషుడు, రుద్రుడు, ఈశుడు, సదా శివుడు అనువారిని సృష్టి క్రమమున న్యాసము చేయవలెను. యజమానుడు ముముక్షు వైనచో పంచమూర్తులకు బదులు నివృత్త్యాది పంచకళలను, అజాతుడు మొదలగు తదధిపతులను న్యాసము చేయవలెను. లేదా సర్వత్ర వ్యాప్త రూపమగు కారణాత్మక త్రితత్త్వ న్యాసము చేయవలెను.

శుద్ధాధ్వయందు విద్యేశ్వరులను అశుద్ధాధ్వయందు లోకనాయకులను మూర్తి పతులనుగా చూడవలెను. భోగి (సర్పము) కూడ మంత్రేశ్వరుడు. క్రమముగ ముప్పదియైదు, ఎనిమిది, ఐదు,

త్రిమూర్తి రూపములును చెప్పబడినది. ఇవే వీటి తత్త్వములు, ఏతత్తత్త్వాధిపతుల మంత్రములు దిగ్దర్శనము మాత్రము చేయబడుచున్నది. 'ఓం హాం శక్తితత్త్వాయ నమః' ఇత్యాదికము 'ఓం హాం శక్తి తత్త్వాధిపాయ నమః' ఇత్యాదికము 'ఓం హాం క్ష్మామూర్తయే నమః' 'ఓం హాం క్ష్మామూర్త్యధిపతయే బ్రహ్మణే నమః ఇత్యాదికము 'ఓం హాం శివతత్త్వాయ నమః' 'ఓం హాం శివతత్త్వాధిపతయే రుద్రాయ నమః' ఇత్యాదికము నాభిమూలము నుండి ఉచ్చరింపబడుచు ఘంటా నాదమువలె నలువైపుల వ్యాపించు చున్నదియు, బ్రహ్మాది కారణత్యాగ పూర్వకముగ ద్వాదశాన్త స్థానమును పొందిన మనస్సు కంటె అభిన్నమును అగు మంత్రమును, నిష్కళుడును, ముప్పదియారు కళలతో కూడినవాడును, సహస్ర కిరణములతో ప్రకాశించుచున్నవాడును, సర్వశక్తి మయుడును, సాంగుడు అగు వ్యాపక శివుని ధ్యానించుచు, ఆ దేవుని ద్వాదశాంతము నుండి తీసికొని వచ్చి శివ లింగముపై స్థాపింపవలెను. శివలింగముపై చేయు జీవన్యాసము సకలపురుషార్థ సాధనముగ నుండవలెను. పిండికాది న్యాసవిధానము చెప్పబడుచున్నది. పిండికకు స్నానము చేయించి, చందనాదులు పూసి, సుందర వస్త్రములు కప్పి, దాని భగస్వరూపమగు ఛిద్రమునందు పంచరత్నాదులు వేసి, లింగమునకు ఉత్తరమున ఉంచవలెను. లింగమునందువలె దానియందు కూడ న్యాసముచేసి యథావిధిగ పూజించ వలెను. స్నానాది పూజా కార్యములు పూర్తిచేసి లింగమూల భాగమున శివుని న్యాసము చేయ వలెను. పిదప శక్త్యంత వృషభమునకు కూడ స్నానాది సంస్కారములుచేసి స్థాపన చేయవలెను. పిదప మొదట ప్రణవమును, తరువాత హ్రాం హ్రూం హ్రీంలలో ఒక బీజాక్షరమును ఉచ్చ రించుచు క్రియాశక్తి సహితమగు, ఆధార రూపిశిల (పిండిక)ను పూజించవలెను. భస్మ, కుశ, తిలలతో మూడు ప్రాకారములు నిర్మించి రక్షణార్థమై బైట ఆయుధములతో కూడిన లోకపాలులను నిలిపి, పూజించవలెను.

'ఓం హ్రీం క్రియాశక్తయే నమః' 'ఓం హ్రీం మహాగౌరి రుద్రదయితే స్వాహా అనునవి పూజా మంత్రములు. 'ఓం హ్రీం ఆధార శక్తయే నమః' 'ఓం హ్రాం వృషభాయ నమః' అను మంత్రములతో పిండికను పూజించవలెను. ధారికా దీప్తా, అత్యుగ్రా, జ్యోత్స్నా, బలోత్కటా, ధాత్రీ, విధాత్రీలను పిండిపై న్యాసము చేయవలెను. లేదా వామా, జ్యేష్ఠా, క్రియా, జ్ఞానా, వేధా అను ఐదుగురు నాయి కలను న్యాసము చేయవలెను. లేదా క్రియా, జ్ఞానా, ఇచ్ఛా అను ముగ్గురినే న్యాసము చేయవలెను. వెనుకటి వలెనే శాంతి మూర్తులలో తమీ, మోహా, క్షుధా, నిద్రా, మృత్యు, మాయా, జరా, భయలను న్యాసము చేయవలెను. లేదా తమా, మోహా, ఘోరా, రతి, అపక్వరా అను ఐదు గురన్యాసము చేయవలెను. లేదా క్రియా, జ్ఞానా, ఇచ్ఛా అను ముగ్గురు అధినాయికలను తీవ్రమూర్తి గల ఆత్మాది తత్త్వము త్రయముపై న్యాసము చేయవలెను. పిండికా, బ్రహ్మ శిలాదులపై, వెనుకటివలెనే గౌర్యాది మంత్రములతో సకల కార్యములు యథావిధిగా చేయవలెను. ఈ విధముగ న్యాస కర్మచేసి, కుండము దగ్గరకు వెళ్ళి దాని లోపల మహేశ్వరుని మేఖల యందు చతుర్భుజుని నాభియందు క్రియా శక్తిని న్యాసము చేయవలెను. కలశ, వేదీ, అగ్ని, శివులతో నాడీ సంధాన కర్మ చేయవలెను. తామరతూడులోని దారమువలె అతిసూక్ష్మమైన శక్తి ఊర్ధ్వగతమగు వాయువు సహాయముతో పైకి ఎగిరి, శూన్యమార్గమునుండి శివునిలో ప్రవేశించును. ఆ ఊర్ధ్వగతశక్తి అచటి నుండి బయలుదేరి

వచ్చి శూన్యమార్గమునుండి తనలో ప్రవేశించుచున్నదని భావన చేయవలెను. ఈ విధముగనే మూర్తిపాలుల సంధానముకూడ చేయవలెను.

కుండమునందు ఆధారశక్తిని పూజించి, తర్పణము చేసిన పిదప క్రమముగా, తత్త్వ, తత్త్వేశ్వర, మూర్తి, మూర్తీశ్వరులను ఘృతాదులతో పూజించి, తర్పణము చేయవలెను. పిదప వారిపై సంహితా మంత్రములతో నూరుగాని వెయ్యిగాని, ఐదు వందలుగాని హోమములుచేసి, పూర్ణాహుతి ఇవ్వ వలెను, ఈ విధముగ తత్త్వతత్త్వేశ్వ రులకును, మూర్తి మూర్తీశ్వరులకును, ఒండొరుల సాన్నిధ్యమున తర్పణములు చేసిన పిమ్మట మూర్తిపాలకులు గూడ వారికై హోమములు చేయవలెను. పిదప ద్రవ్యకాలాను సారము వేదములతోను, అంగములతోను తర్పణము చేసి, శాంతికలశ జలముతో ప్రోక్షించిన కుశమూలముతో లింగమూల భాగమును స్పృశించి, ఎన్ని హోమములో అంత జపము చేసి, హృదయ మంత్రముచే సన్నిధాపనమును కవచమంత్రముచే ఆచ్ఛాదనమును చేయవలెను. ఈ విధముగ సంశోధనముచేసి లింగోర్ధ్వ భాగమున బ్రహ్మను మూలభాగమున విష్ణువును పూజించి, శుద్ధి నిమిత్తమై వెనుకటి అన్ని కార్యములు పూర్తిచేసి, హోమసంఖ్యానుసారము జపాదులు చేయ వలెను. కుశమధ్య భాగముచే లింగమధ్య భాగమును, కుశాగ్ర భాగముచే లింగాగ్ర భాగమును స్పృశించవలెను. ఏ మంత్రముచే ఏ విధముగ సంధానము చేయవలెనో చెప్పబడుచున్నది. 'ఓం హాం హం ఓం ఓం ఏం ఓం భూం భూం బాహ్యా మూర్తయే నమః, ఓం హాం వాం ఆం ఓం ఆం షాం ఓం భూం భూం వాం వహ్ని మూర్తయే నమః, యజమానాది మూర్త్యభి సంధానము కూడా ఇట్లే చేయవలెను. పంచమూర్త్యాత్మక శివుని సంధాన కర్మకూడ హృదయాది మంత్రములతో ఈ విధముగనే చేయవలెను. త్రితత్త్వాత్మక స్వరూపమునందు సంధానకర్మ మూల మంత్రముతో గాని, స్వస్వ బీజమంత్రములతో గాని చేయవలెనని గ్రహించవలెను. శిలా, పిండికా, వృషభములకు కూడ సంధానము ఈవిధముగనే చేయవలెను. ఒక్కొక్క భాగము శుద్ధి కొరకై, దాని మంత్ర ములతో శతాది హోమము చేయవలెను. న్యూనతాది దోష పరిహారార్థమై శివ మంత్రముతో నూట ఎనిమిది హోమములు చేసి, చేసిన కర్మను గూర్చి శివునకు చెవిలో చెప్పవలెను.

'ప్రభూ! నేనీ కార్యమును నీ శక్తిచేతనే చేయగలిగితిని. భగవంతుడగు రుద్రునకు నమస్కారము. రుద్రదేవా! నీకు నమస్కారము, కర్మ విధి పూర్ణమైనను కాకపోయినను, నీవు నీ శక్తి చేతనే దీనిని పూర్ణము చేసి గ్రహించుము." 'ఓం శాంకరి పూరయస్వాహా' అని చెప్పి పిండికపై న్యాసము చేయవలెను. పిదప జ్ఞానియగు పురుషుడు లింగమున క్రియాశక్తిని, పీఠ విగ్రహమునందు, బ్రహ్మ శిలపైన ఆధారరూపిణి యగు శక్తిని న్యాసము చేయవలెను. ఏడు రాత్రులు, ఐదు రాద్రులు, లేదా ఒక రాత్రి దానిని నిరోధించి వెంటనే అధివాసము చేయవలెను. అధివాసము లేకుండగ చేసిన యాగము ఫలదాయకము కాదుగాన అధివాసము తప్పక చేయవలెను. అధివాస కాలమున ప్రతి దినమునను, దేవతలకు వారివారి మంత్రములతో వందేసి హోమములుచేసి, శివకలశాది పూజచేసి, దిక్కు లందు బలి సమర్పించవలెను. గుర్వాదులతో రాత్రినియమ పూర్వకముగ నివసించుట అధి వాసము; అధిపూర్వక వస్ ధాతువునకు భావార్థమున ఘఞ్ ప్రత్యయము చేర్చుటచే అధివాస శబ్దము నిష్పన్నమైనది. (96)

శివప్రతిష్ఠా విధానము

పరమేశ్వరుడు పలికెను - స్కందా! ప్రాతః కాలమున నిత్యకర్మలు ముగించుకొని, ద్వార దేవతలను పూజించి, మండప ప్రవేశము చేసి, పూర్వోక్త విధానమున దేహశుద్ధ్యాదులు చేసికొన వలెను. దిక్పాలకులను, శివకలశమును, వర్ధనిని పూజించి, అష్టపుష్పికతో శివ లింగమును పూజించి, క్రమముగా హోమముచేసి, అగ్ని దేవుని తృప్తుని చేయవలెను. పిదప శివుని ఆజ్ఞ గ్రహించి 'అస్త్రాయ ఫట్' అని ఉచ్చరించుచు మందిరమునందు ప్రవే శించి, 'అస్త్రాయ హూం ఫట్' అని ఉచ్చరించుచు విఘ్నములను తొలగించుకొన వలెను. శిలకు సరిగా మధ్యయందు శివలింగ స్థాపన చేయగూడదు. అట్లు చేయుటచే వేదదోష శంకకు అవకాశముండును. అందుచే మధ్యభాగమును విడచి, ఒక యవ లేదా అర్ధయవ ఈశాన్యము వైపు జరిగి శివలింగమును ఆధారశిలయందు స్థాపించవలెను. మూల మంత్రమును ఉచ్చరించుచు, అనంతనామధారిణియు, సర్వాధార స్వరూపిణియు, సర్వవ్యా పినియు అగు శిలను సృష్టి యోగముతో స్థిరముగ స్థాపించవలెను. లేదా 'ఓం నమో వ్యాపిని భగవతి స్థిరే ఉ చరే ధ్రువే హ్రీం లం హ్రీం స్వాహా' అను మంత్రముతో శివాసన స్వరూపయగు ఆ శిలను పూజించవలెను. పూజ చేయుటకుముందు - 'ఆధారశక్తి స్వరూపిణియగు ఓ శిలా! శివుని ఆజ్ఞ ప్రకారము నీవు ఇచట ఎల్లప్పుడును స్థిరముగా నుండుము' అని ప్రార్థించవలెను. పూజానం తరము అవరోధినీ ముద్రతో శిలను స్థిరముగా స్థాపించవలెను. వజ్రము మొదలైన రత్నములు, వట్టివేళ్ళు మొదలగు ఔషధులు, లోహము, సువర్ణము, కాంస్యము మొదలగు ధాతువులు, హరితా ళాదులు, ధాన్యాది సస్యములు. వెనుక చెప్పిన ఇతర వస్తువులు, క్రమముగ ఒక్కచోటచేర్చి, ఇవన్నియు కాంత్యారోగ్య దేహవీర్య శక్తి రూపములు అని భావన చేయవలెను. ఈ విధముగ ఏకాగ్ర చిత్తముతో భావనచేసి లోకపాలకులను, శివునకును, సంబంధించిన మంత్రముతో ఈ వస్తువులను ఒక్కొక్కటిగ, పూర్వాది కుండములందు వేయవలెను. బంగారముతో లేదా రాగితో చేసిన తాబేలుగాని, వృషభ మును గాని ద్వారమునకు ఎదురుగా ఉండునట్లుచేసి, నదీతీరము నందలి మట్టిగాని పర్వత శిఖరమునందలి మట్టిగాని, కలిపి, మధ్యమునందున్న గర్భమునందు వేయవలెను. లేదా సువర్ణ నిర్మితమగు మేరువును, మధూక-అక్షత అంజనములతో కలిపి ఆ కుండమునందు వేయవలెను. లేదా బంగారముతోగాని, వెండితోగాని చేసిన పృథివిని, సకల బీజములతో, సువర్ణముతో మధ్యనున్న కుండములో వేయవలెను. లేదా బంగారము, వెండి లేదా సకల లోహములు కలిపి చేసిన, సువర్ణమయ కేసరములుగల పద్మమునుగాని, అనంత నాగమూర్తి గాని అచట వేయవలెను. శక్తి మొదలు మూర్తి వరకును, లేదా శక్తి మొదలు శక్తి వరకునుగల తత్త్వములను దేవాదిదేవునకు ఆసనముగా ఏర్పరచి, దానిపై పాయసము గుగ్గులు పూయవలెను. పిదప వస్త్రముతో గర్తమును కప్పి కవచ అస్త్ర మంత్రములతో రక్ష చేయవలెను.

ఆచార్యుడు దిక్పాలకులకు బలి ఇచ్చి ఆచమనముచేసి, శిలాగర్త సంగదోష నివృత్తి కొరకై శివమంత్రముతోగాని, అస్త్రమంత్రముతోగాని విధిపూర్వకముగ నూరుహోమములు చేసి, పూర్ణాహుతి కూడ ఇవ్వవలెను. వాస్తుదేవతలకొరకై ఒక్కొక్క హోమము చేసి; తృప్తి పరచి, హృదయమంత్రముతో

దేవుని ఎత్తి మంగలవాద్య-మంగల పాఠాదులతో తీసికొనిరావలెను. గురువు దేవునకు ముందు నడచుచుండగా, యజమానుడు నాలుగు దిక్కులందు ఉన్న మూర్తిపాలులతో, దేవుని వాహనమునకు వెనుక నడవవలెను. దేవాలయాదులకు నాల్గు వైపుల త్రిప్పి, శివలింగమునకు భద్రద్వారము ఎదుట స్నానము చేయించి, అర్ఘ్యమిచ్చి, లోనికి తీసికొనివెళ్లవలెను. తెరచిన ద్వారముగుండా గాని, ద్వారము కొరకై నిశ్చయించిన స్థానముగుండా గాని దేవుని దేవాలయములోనికి తీసికొని వెళ్లవలెను. ఇది ఏదియు లేనిచో, ద్వారమును బంధించు శిలమీదుగా గాని, శూన్యమార్గమునుండి గాని, లేదా ఆ శిలపై నుండిగాని ఆలయము లోనికి తీసికొని వెళ్లవలెను. మహేశ్వరుని ద్వారము నుండియే లోనికి తీసికొని వెళ్లవలెను. కాని ద్వారస్పర్శ కలుగకుండ తీసికొని వెళ్లవలెను. దేవాలయ ప్రారంభము జరుగుచున్నప్పుడు మాత్రము ఏ మూలనుండి యైనను శివలింగమును లోనికి తీసి కొని వెళ్ళవచ్చును. స్థూల శివలింగమును లోనికి తీసికొని వెళ్ళునపుడు ఇదియే విధానము. గృహములో ప్రవేశించుటకు ద్వారమే మార్గమను విషయము సాధారణ మానవులకు గూడ తెలియును. ద్వారము లేని గృహమునందు ప్రవేశించినచో గోత్రనాశన మగునని శాస్త్రము. శివలిం గమును ద్వారము ఎదుట ఉంచి నానావిధములగు వాద్యములతోను, మంగళధ్వనులతోను దూర్వాక్ష తాదులు సమర్పించి 'సముత్తిష్ఠ నమః' అని అనుచు మహా పాశుపత మంత్రమును పఠించవలెను. ఆచార్యుడు గర్తమునందు ఉంచిన ఘటమును బైటకుతీసి, మూర్తి పాలకులతోకూడ దానిని యంత్రము నందు స్థాపించి, దానిపై కుంకుమాది లేపముచేసి, శక్తి, శక్తిమంతుల ఏకత్వమును భావించుచు, లయాంత మూలమంత్రము ఉచ్చరించుచు ఆలంబన లక్షితమగు ఆ ఘటమును స్పర్శపూర్వకముగ గర్తమునందు స్థాపించవలెను.

బ్రహ్మ భాగములు ఒక అంశముగాని, రెండు అంశములుగాని, సగము అంశము గాని, ఎనిమిదవ అంశముగాని, లేదా పూర్తి బ్రహ్మ భాగమునుగాని గర్తములో నుంచవలెను. నాభిపర్యం తము దీర్ఘలతో కూడ సీసమును కప్పి, ఏకాగ్రచిత్తుడై, క్రింది గర్తమును ఇసుకతో పూడ్చి, 'దేవా! నీవు సుస్థిరముగా నుండుము' అని ప్రార్థించవలెను. లింగము స్థిరమైన పిదప, రూపవంతుడగు పరమేశ్వరుని ధ్యానముచేసి, శక్త్యంతమూల మంత్రోచ్చారణము చేయుచు, శివలింగమును స్పృశించి, దానిపై నిష్కలీకరణ న్యాసము చేయవలెను. శివలింగ ప్రతిష్ఠ జరుగుచున్నప్పుడు ఏ ఏ దిక్కుల వైపున ఉండునో ఆ యా దిక్కుల పాలకుల మంత్రములు ఉచ్చరించుచు పూర్ణాహుతి పర్యంతము హోమములు చేసి దక్షిణ ఈయవలెను. శివలింగమునుండి శబ్దము వచ్చినను, దాని ముఖ భాగము కదలినను, బ్రద్ధలైనను మూలమంత్రముతోగాని, బహురూప మంత్రముతోగాని నూరు హోమములు చేయవలెను. ఇట్టి ఇతర దోషములు ఏవైన వచ్చినచో జీవశాస్త్రోక్త ప్రకారము శాంతి చేయవలెను. ఈ విధముగ శివలింగమునందు న్యాసము చేసినచో కర్తకు దోష మేదియు అంటదు. పిదప లక్షణ స్పర్శ రూపమగు పీఠబంధము చేసి గౌరీ మంత్రముతో దానిని లయముచేసి, మరల పిండిపై సృష్టిన్యాసము చేయవలెను. లింగము ప్రక్కనున్న గర్త ఛిద్రమును ఇసుకతోను, వజ్రలేపము తోను పూడ్చివేయవలెను. పిదప గురువు మూర్తిపాలక సమేతుడై శాంతి కలశమునందలి అర్ధ జలముతో శివలింగమునకు స్నానము చేయించి, ఇతరకలశలతోను, పంచామృతముతోను కూడ

స్నానము చేయించి, చంద నాదులు పూసి, శివుని పూజించి, ఉమామహేశ్వర మంత్రములతో, లింగముద్రతో ఆ ఇరువురిని స్పృశించవలెను. షడధ్వన్యాస పూర్వకముగా త్రితత్త్వ న్యాసముచేసి, మూర్తి న్యాస, దిక్పాల న్యాస, అంగన్యాస, బ్రహ్మన్యాస పూర్వకముగ లింగమున జ్ఞానశక్తిని, పీఠమున క్రియాశక్తిని న్యాసముచేసి, పిదప స్నానము చేయించవలెను. గంధము పూసి, ధూపము సమర్పించి, వ్యాపక ధూపమున శివుని న్యాసముచేసి, హృదయ మంత్రముతో పుష్పమాలా, ధూప, దీప, నైవేద్య, ఫలములు సమర్పించవలెను. పిదప శివునిచే ఆచ మనము చేయించవలెను. విశేషార్ఘ్య మిచ్చి, మంత్రము జపించి, పరమేశ్వరుని వరదాయక హస్తమున ఆ జపమును అర్పించి, 'దేవా! సూర్యచంద్ర నక్షత్రములు ఉన్నంతవరకును నీవు మూర్తీశులతోడను మూర్తిపాలకులతోడను కలిసి స్వేచ్ఛానుసారముగా ఈ ఆలయమున సర్వదా నివసింపుము' అని ప్రార్థించవలెను. పిదప ప్రణా మముచేసి బైటకు వెళ్లి హృదయమంత్రముతోగాని, వృషభస్థాపన చేసి వెనుకటివలెనే బలి నివేదనము చేయవలెను.

పిదప న్యూనత్వాది దోషనిరాకరణము కొరకై మృత్యుంజయ మంత్రముతో సమిధలతో నూరు హోమములు చేయవలెను. శాంతికొరకు పాయసహోమము చేయవలెను. పిదప 'దేవా జ్ఞానపూర్వక ముగాని అజ్ఞాన పూర్వకముగ గాని ఏవైన లోపములు జరిగినచో వాటిని నీవు పూర్ణము చేయుము' అని ప్రార్థించి యథాశక్తిగ సువర్ణ, పశు, భూమ్యాది సంపత్తి సమర్పించి, గీతావాద్యాద్యుత్సవములను గూడ సర్వకారణభూతుడును, అంబికా నాథుడును అగు శివునకు ఏర్పరచవలెను. పిదప నాలుగు దివసములు, అవిచ్ఛిన్నముగ దానములు, ఉత్సవములు చేయవలెను. ఈ నాలుగు దివసములలో మూడు దివసములు మంత్రజ్ఞుడైన ఆచార్యుడు మూర్తి పాలకులతోకలసి హోమములుచేసి నాల్గవ దివసమున పూర్ణాహుతి ఇచ్చి, బహురూప మంత్రముతో చరు నివేదనము చేయవలెను. అన్ని కాండములనుండియు, సంపాతాహుతిచే శోధితమైన చరువును అర్పించవలెను. ఆ నాలుగు దినము లును నిర్మాల్యమును తీయకూడదు. నాల్గు దినముల తరువాత నిర్మాల్యము తొలగించి, స్నానము చేయించి, పూజ చేయవలెను. సాధారణ లింగములందు సాధారణ మంత్రములతో పూజచేయ వలెను. లింగ చైతన్యమును విడచి స్థాణు విసర్జనము చేయవలెను. అసాధారణ లింగముల విషయ మున 'క్షమస్వ' ఇత్యాదికము చెప్పి విసర్జనము చేయవలెను. ఆవాహనము, అభివ్యక్తి విసర్గము, శక్తిరూపత అను ఈ ఐదు విషయములును ముఖ్యమైనవి. ప్రతిష్ఠాంతమున స్థిరత్వాదిగుణ సిద్ధికై ఏడు హోమములు చేయు పద్ధతి కూడ ఉన్నది. శివుడు స్థిరుడు, అప్రమేయుడు, అనాది, బోధస్వ రూపుడు, సర్వవ్యాపి, అవినాశి, ఆత్మతృప్తుడు. మహేశ్వర సన్నిధి విషయమున ఈ నోములు చెప్పబడినవి.

'ఓం నమః శివాయ స్థిరోభవ నమః స్వాహా' ఇత్యాదికము ఆహుతి క్రమము. పిదప శివకలశము వంటి రెండు కలశములను సిద్ధము చేయవలెను. ఒక కలశచే శివునకు స్నానముచేయించి రెండవది యజమానుని స్నానము కొరకు ఉంచవలెను. బలియిచ్చి ఆచమనముచేసి, శివానుజ్ఞ పొంది బైటకు రావలెను. యాగమండపము వెలుపల ఈశాన్యమున చండుని స్థాపించి పూజించ వలెను. పిదప మండపమున, స్నానగర్భముతో సమానమైన ఉత్తమపీఠముపై ఆసనము కల్పించి, వెనుకటివలె న్యాస హోమాదులు చేయవలెను. ధ్యాన పూర్వకముగా సద్యో జాతాది స్థాపన చేసి,

అచట బ్రహ్మాంగములతో యథావిధిగా పూజచేయవలెను. బ్రహ్మాంగములు వెనుక చెప్పబడినవి. మంత్రములతో పూజచేయు విధానమును వినుము. 'ఓం వం సద్యో జాతాయ హ్రూం ఫట్ నమః' 'ఓం విం వామదేవాయ హ్రూం ఫట్ నమః అనునవి మంత్రములు. ఈ విధముగ జపము తర్పణము చేసి, స్తుతి పూర్వకముగా 'ఓం చండేశా! శివుడు ఉన్నంత వరకు నీవుకూడ ఇచటనే ఉండుము. అజ్ఞానవశమున నేను చేసిన కర్మదోషములు అన్నియు నీ కృపచే పూర్ణములగుగాక. ఆ లోపములను నీవే పూర్ణము చేయవలెను అని ప్రార్థించవలెను. బాణలింగమునందును, లోహమయ లింగమునందును, సిద్ధలింగమునందును, స్వయంభూ లింగమునందును, ఇతర ప్రతిమలయందును ఉన్న నిర్మాల్యము విషయమున చండేశ్వరునకు అధికారములేదు. అద్వైత భావనాయుక్తుడగు యజమానుని విషయము నందును, స్థండివేశ విధియందును గూడ చండేశునకు అధికారములేదు. చండుని పూజచేసి, స్నానము చేయించు గురువే పత్నీపుత్ర సమేతుడైన యజమానునకు పూర్వము స్థాపించిన కలశలోని జలముతో స్నానము చేయించవలెను. స్నానము చేయించిన గురు వును యజమానుడు మహేశ్వరునివలె పూజించి, ధనలోభము చేయక, భూసువర్ణాది దక్షిణ ఈయవలెను.

పిదప, మూర్తి పాలకులను, జపకర్తలను, జ్యోతిష్కుని, శిల్పిని యధావిధిగా పూజించి, దీన అనాధాదులకు భోజనము పెట్టవలెను. పిదప యజమానుడు గురువును–'పూజ్యా! సంముఖకరణ మునకై మీకు కష్టము ఇచ్చినందులకు క్షమింపుము. నీవు కరుణా సాగరుడవు. అందువలన సకలాపరాధములను క్షమింపుము' అని ప్రార్ధించవలెను. ఈ విధముగ ప్రార్ధించు యజమానునకు, గురువు కుశ, పుష్ప, అక్షతలతో, నక్షత్రమువలె ప్రకాశించుచున్న ప్రతిష్ఠాజన్య పుణ్య సత్తను అర్పించవలెను. పాశుపత మంత్రజపముచేసి, పరమేశ్వరునకు నమస్కారము చేసిన పిదప భూత గణములకు బలిఇచ్చి, వాటిని అన్నింటిని ఈ విధముగ దగ్గరకు తీసికొని 'పరమేశ్వరుడు ఉన్నంత కాలము, మీరిచట ఉండవలెను' అని ప్రార్థించవలెను. వస్త్రాదియుక్తమగు యాగమండపమును గురువు తీసికొనవలెను.

ఉపకరణ సహితమగు స్నాపన మండపమును శిల్పి తీసికొనవలెను. ఆగమోక్త మంత్ర ములతో అన్యదేవతా స్థాపన చేయవలెను. సూర్యుని యందున్న వివిధ వర్ణముల ప్రకారము ఆ దేవతల వర్ణములుండును. ఆ దేవతలు తమ తైజసతత్త్వమున వ్యాప్తులై ఉన్నారని భావన చేయవలెను. సాధ్యాది దేవతలు, నదులు, ఔషధులు, క్షేత్రపాలులు, కింనరులు మొదలగువారు పృథివీ తత్త్వాశ్రితులు సరస్వతీ, లక్ష్మినదుల స్థానము జలమునందలి కొన్ని చోట్ల చెప్పబడినది. భువనాధిపతులకు వారున్నదే స్థానము, అహంకారము, బుద్ధి, ప్రకృతి అను మూడు తత్త్వములు బ్రహ్మ స్థానము తన్మాత్రలు మొదలు ప్రధానము వరకును ఉన్న మూడు తత్త్వములు విష్ణు స్థానములు. అండజాది శుద్ధ విద్యాంతతత్త్వములు నాట్యేశ, గణమాతృకా, యక్షరాజ కార్తికేయ గణేశుల స్థాన ములు. మాయాంశ దేశము మొదలు శక్తి పర్యంతము ఉన్నతత్త్వములు శివాశివులకును, ఉగ్రతేజః శాలియగు సూర్యునకును స్థానములు వ్యక్త ప్రతిమలకు పదము ఈశ్వర పర్యంతమని చెప్పబడినది. స్థాపన సామగ్రిలో వున్న కూర్మాదులను, రత్నాది పంచవస్తువులను, దేవపీఠము క్రిందనున్న గర్భ ములో వేయవలెను. ఐదు బ్రహ్మ శిలలకు మాత్రము వేయగూడదు.

ఆలయ గర్భమును ఆరు భాగములుగా విభజించి ఆరవ భాగమును విడచి ఐదవ భాగమునందు దేవతా ప్రతిష్ఠ చేయవలెను. లేదా ఆలయ గర్భమును ఎనిమిది భాగములు చేసి ఏడవ భాగమున విగ్రహ ప్రతిష్ఠ చేసినచో సుఖావహమగును. చిత్రమయ విగ్రహము లను స్థాపించినపుడు ధారణ ద్వారా పంచభూతశుద్ధి కలుగును. స్నానాదికమును జలముతో కాక మానసికముగా చేయవలెను. విగ్రహములను శిలా–రత్నాది భవనములందు ఉంచవలెను. నేత్రోన్మీలన ఆసనాదులు కల్పన చేయుట మంచిది. చిత్రములు చెడిపోకుం డుటకై వాటి పూజ, జల రహిత పుష్పములతో చేయ వలెను. ఇపుడు చలలింగస్థాపనా విధానము చెప్పబడుచున్నది. గర్భస్థానమును మూడు లేదా ఐదు భాగములుచేసి ఒక భాగము విడచి, మూడవ భాగమునందు గాని రెండవ భాగమునందు గాని లింగమును స్థాపించవలెను. వాటి పీఠములు కల్పన గూడ ఈ విధముగనే చేయవలెను. లింగముల తత్త్వ భేదమును బట్టి పూజాప్రక్రియలో భేదముండును. స్ఫటికాదిలింగముల సంస్కారము ఇష్టమంత్రముచే చేయవలెను. బ్రహ్మశిలా రత్నాదుల నివేదనము ఆవశ్యకముకాదు. పిండికా యోజనము గూడ మానసికముగనే చేయవలెను. స్వయంభూలింగ, బాణ లింగాదులకు సంస్కారాది నియమము లేదు. సంహితా మంత్రములతో వీటికి స్నానము చేయించవలెను. వాటికి న్యాసహోమాదులు వైదిక విధిచేతనే చేయవలెను. నదీ, సముద్రా ద్యుద్గత లింగముల స్థాపన వెనుకటి వలెనే చేయవలెను. ఇహలోకమున మృత్తికాపి ష్టాదులతో చేసిన శివలింగము తాత్కాలికము. పూజనకాలము నందు మాత్రమే లింగ నిర్మాణము చేసి వీక్షణాదులతో దానికి శుద్ధిచేయవలెను. పిదప యధావిధిగ పూజ చేయ వలెను. పూజ అనంతరము మంత్రోచ్చారణము చేయుచు, లీనలు స్థాపించుకొని ఆ లింగమును జలములో పడవేయవలెను. ఒక సంవత్సరము అట్లు చేయుటచే ఆ లింగము, ఆ లింగపూజయు మనోవాంఛిత ఫలములను ఇచ్చును. విష్ణ్వాది దేవతాస్థానోప యుక్త ములగు మంత్రములు వేరుగా ఉండును. ఆ మంత్రములతోడనే ఆ దేవతల స్థాపన చేయవలెను.(97)

గౌరీప్రతిష్ఠా విధానము

పరమేశ్వరుడు చెప్పెను : స్కందా! ఇపుడు పూజాసహితముగ గౌరీ ప్రతిష్ఠావిధి చెప్పెదను వినుము. వెనుక చెప్పిన విధముననే మండపాది రచనచేసి, దేవీస్థాపన, శయ్యాధివాసము చేయవలెను. పూర్వముచెప్పిన మంత్ర, మూర్త్యాదుల న్యాసముచేసి ఆత్మతత్త్వ, విద్యాతత్త్వ, శివతత్త్వములను పరమేశ్వరుని యందు స్థాపించవలెను. పిదప పరాశక్తిన్యాసము, హోమ జపాదు లును వెనుకటివలె చేసి క్రియాశక్తి రూపిణియగు పిండిని సంధానము చేయవలెను. సర్వవ్యాపినియగు పిండిని ధ్యానించి, అచట రత్నాది న్యాసము చేయవలెను. ఈ విధముగ పిండి స్థాపనచేసి దానిపై దేవీస్థాపన చేయవలెను. ఈ దేవి పరాశక్తి స్వరూపిణి. ఆ దేవీ మంత్రముతోడనే సృష్టి న్యాసపూర్వక మగు దేవీస్థాపన చేయవలెను. పిదప పీఠముపై క్రియా శక్తిని, దేవీ విగ్రహమందు జ్ఞానశక్తిని స్థాపించవలెను. పిదప సర్వవ్యాపినియగు శక్తిని ఆవాహనముచేసి దేవీప్రతిమపై ఆ శక్తిని చేర్చవలెను, 'శివా' యను పేరుగల అంబికా దేవిని స్పృశించి పూజించవలెను. పూజా మంత్రములు ఈ విధముగ నుండును. 'ఓం ఆం ఆధారశక్తయే నమః, కూర్మాయ నమః, ఓం కన్దాయ నమః, ఓం

హ్రీం నారాయణాయ నమః, ఓం ఐశ్వర్యాయ నమః, ఓం అధశ్ఛదనాయ నమః, ఓం పద్మాసనాయ నమః. పిదప కేసరములను పూజించవలెను. పిదప 'ఓం హ్రీం కర్ణికాయై నమః, ఓం క్షం పుష్కరాక్షేభ్యో నమః, అను మంత్రములతో కర్ణికా, కమలాక్షములను పూజించవలెను. పిదప 'ఓం హాం పుష్ట్యై నమః, ఓం హ్రీం జ్ఞానాయై నమః, ఓం హ్రూం క్రియాయై నమః అను మంత్రములతో పుష్టి, జ్ఞానా క్రియా శక్తులను పూజించవలెను. 'ఓం నాలాయ నమః, ఓం రుం ధర్మాయ నమః, ఓం రుం జ్ఞానాయ నమః, ఓం వైరాగ్యాయ నమః, ఓం అధర్మాయ నమః, ఓం రుం అజ్ఞానాయ నమః, ఓం అవైరా గ్యాయ నమః, ఓం అనైశ్వర్యాయ నమః' అను మంత్రములతో నాలాదులను పూజించ వలెను. 'ఓం హుం వాచే నమః, ఓం హుం రాగిణ్యై నమః, ఓం హుం జ్వాలిన్యై నమః, ఓం హ్రౌం శమాయై నమః, ఓం హ్రూం జ్యేష్ఠాయై నమః, ఓం హ్రౌం రౌం క్రౌం నవశక్త్యై నమః' అను మంత్రములతో వాగాది శక్తులను పూజించవలెను. 'ఓం గౌం గౌర్యాసనాయ నమః, ఓం గౌం గౌరీమూర్తయే నమః' ఇపుడు గౌరీమూలమంత్రము చెప్పబడుచున్నది 'ఓం హ్రీం సః మహాగౌరి రుద్రదయితే స్వాహా గౌర్యై నమః, ఓం గాం హృదయాయ నమః, ఓం గీం శిరసేస్వాహా, ఓం గూం శిఖాయై వషట్, ఓం గైం కవచాయ హుం, ఓం గౌం నేత్ర త్రయాయ వౌషట్, ఓం గః అస్త్రాయ ఫట్, ఓం గౌం విజ్ఞాన శక్తయే నమః' ఈ మంత్రములతో శిఖాదులను పూజించవలెను. 'ఓం గూం క్రియాశక్తయే నమః' అను మంత్రముతో క్రియాశక్తిని పూజించవలెను. పూర్వాది దిక్కులందు ఇంద్రాదులను పూజించవలెను. ఈ మంత్రములు వెనుక చెప్పబడినవి. 'ఓం సుం సుభా గాయై నమః' అను మంత్రముతో సుభగను 'ఓం హ్రీం లలితాయై నమః' అను మంత్రముచే లలితను పూజించవలెను. 'ఓం హ్రీం కామిన్యై నమః, ఓం హ్రుం కామ మాలిన్యై నమః' అను మంత్రములతో గౌరీప్రతిష్ఠా, పూజా, జపములు చేయుటచే ఉపాసకుడు అన్నియు పొందగల్గును. (98)

సూర్య ప్రతిష్ఠా విధానము

పరమేశ్వరుడు పలికెను : ఇపుడు సూర్యప్రతిష్ఠా విధానము చెప్పెదను. వెనుకటివలె మండపాది నిర్మాణము, స్నానాదికముచేసి, పూర్వము చెప్పిన విధి ననుసరించి విద్యను, సాంగసూర్యదేవతను ఆసనశయ్యపై న్యాసముచేసి, తత్త్వములను, ఈశ్వరుని, ఆకాశాది పంచభూతములను న్యాసము చేయవలెను. పూర్వమువలె శుద్ధ్యాదికము చేసి, పిండి శోధనము చేయవలెను. సదేశ పదమువరకును తత్త్వ పంచకన్యాసము చేయవలెను. సర్వతో ముఖీశక్తితోకూడ యథావిధిగా స్థాపనముచేసి, గురువు, సూర్యమంత్రము జపించుచు శక్త్యన్త సూర్యుని స్థాపించవలెను. సూర్యదేవతకు పేరుచివర 'స్వామి' అని కాని 'పాద' అని కాని ఉంచవలెను. స్థాపనకు పూర్వోక్త సూర్య మంత్రములనే ఉపయోగించ వలెను. (99)

ద్వారప్రతిష్ఠా విధానము

పరమేశ్వరుడు చెప్పెను : ఇపుడు ద్వారమునకు సంబంధించిన ప్రతిష్ఠావిధి చెప్పెదను. ద్వారాంగ భూతములగు ఉపకరణములను కషాయజలాదులతో సంస్కరించి, శయ్యపై ఉంచవలెను. ద్వారము

యొక్క మూల, మధ్య, అగ్ర భాగములందు ఆత్మ, విద్యా, శివ తత్త్వముల న్యాసముచేసి సంరోధనీ ముద్రచే వాటిని నిరోధించవలెను. పిదప తగిన హోమ జపములు చేసి, ద్వారాధోభాగమున అనంత దేవతా మంత్రముతో వాస్తు దేవతా పూజ చేయవలెను. అచటనే రత్నాది పంచక ముంచి శాంతి హోమము చేయవలెను. పిదప యవలు, ఆవాలు, ఆక్రాంతా, బుద్ధి, వృద్ధులను ఓషధులు, తెల్ల ఆవాలు, మహా తిలలు, గోపీచందనము, దరదము నాగకేసరము, మోహిని, లక్ష్మణ, అమృత, గోరో చనము, ఆరగ్వధము, దూర్వలు దేవాలయము పునాదుల క్రిందవేసి, పొట్లము కట్టి ద్వార రక్షణార్థమై దాని పైన ప్రణవము ఉచ్చరించుచు కట్టవలెను. ద్వారము కొంచెము ఉత్తరము వైపు నిలుపవలెను. ద్వార అధోభాగమున ఆత్మతత్త్వమును రెండు పార్శ్వము లందును విద్యాతత్త్వమును, ఆకాశదేశము నందును, పూర్తి ద్వారమండల మందును సర్వవ్యాపి శివతత్త్వమును న్యాసము చేయవలెను, పిదప మూలమంత్రముతో మహేశ నాథుని న్యాసము చేయవలెను. ద్వారమును ఆశ్రయించి ఉండు నంది మొదలగు ద్వార పాలకులకొరకు, వారి నామములకు నమః చేర్చి నూరులేదా ఏబది హోమములు చేయవలెను. శక్తి ఉన్నచో రెట్టింపు హోమములు చేయవలెను. న్యూనాతిరిక్తతా దోష పరిహారార్థమై అస్త్రమంత్రముతో నూరు హోమములు చేయవలెను. పిదప మొదట చెప్పిన విధముగ దిక్కులందు బలులు ఇచ్చి దక్షిణాది ప్రదానము చేయవలెను. (100)

ప్రాసాద ప్రతిష్ఠా విధి విధానము

పరమేశ్వరుడు పలికెను : స్కందా! నేను ఇపుడు ప్రాసాద (దేవాలయ) ప్రతిష్ఠావిధి చెప్పెదను. దానియందు చైతన్య సంబంధమును చూపుచున్నాను. దేవాలయము నందలి శుకనాసము సమాప్తియగు చోట పూర్వవేది మధ్యభాగమునందు ఆధార శక్తిని భావించి ప్రణవ మంత్రముతో కమలమును న్యాసము చేయవలెను. దాని పైన సువర్ణాది దాతువులలో ఏదైన ఒక దానితో చేసిన కలశను స్థాపించవలెను. దానిలో పంచగవ్యములు, మధువు, పాలు, రత్నములు, మొదలగు ఐదు వస్తువులు ఉంచవలెను. కలశపై గంధము పూసి, వస్త్రముచే కప్పి, సుగంధ పుష్పములతో వాసితముచేసి, చూతాది పంచ వృక్షముల పల్లవములచే దాని ముఖమును ఆచ్ఛాదించవలెను. హృదయమంత్రముతో హృదయకమల భావన చేయుచు ఆ కలశను అచట స్థాపించవలెను. పిదప గురువు పూరక ప్రాణాయామ ముతో శ్వాసను లోనికి గ్రహించి, శరీరముతో సకలీకరణక్రియ చేయవలెను. స్వమంత్రముతో కుంభక ప్రాణాయామము ద్వారా ప్రాణవాయువును లోపల అవరుద్ధము చేయవలెను. ఈశ్వరుని అనుమతితో సర్వాత్మాభిన్నమైన జీవచైతన్యమును జాగృతము చేయవలెను. రేచక ప్రాణాయామముతో ప్రజ్వలించుచున్న అగ్నికణమువలె ఉండు జీవచైతన్య మును ద్వాదశాంశ స్థానమునుండి గ్రహించి, కలశములో స్థాపించి, దానియందు అతి వాహిక శారీర న్యాసముచేసి, దాని గుణములను బోధించు కాలాదికమును, ఈశ్వర సహితములగు పృథ్వీ పర్యంతతత్త్వ సముదాయమును దాని యందు నివేశింపచేయవలెను. పదమూడు ఇంద్రియములను, తదధిపతులను నామమంత్రముతో కలశపై స్థాపించి, ప్రణవము మొదట చేర్చిన నామమంత్రములతో పూజించవలెను. తమతమ కార్యములు చేయించు మాయాపాశ నియామికలను ప్రేరకులగు

విద్యేశ్వరులను, సర్వవ్యాపియగు శివుని తమ మంత్రములతో న్యాసముచేసి పూజించవలెను. సకల అంగముల న్యాసముచేసి అవరోధినీముద్రతో వాటినన్నింటిని నిరోధించవలెను. లేదా సువర్ణాది ధాతువులతో ఒక మానవాకృతి నిర్మించి, దానిని పంచ గవ్యములతోను, కషాయ ద్రవ్యములతోను శుద్ధిచేసి శయ్యపై కూర్చుండబెట్టి ఉమాపతియైన రుద్రుని ధ్యానించుచు, శివమంత్రముతో ఆ పురుష శరీరమునందు వ్యాపకరూపమున ఆ శివుని న్యాసము చేయవలెను. శివసాన్ని ధ్యము కొరకై హోమ, ప్రోక్షణ, స్పర్శ, జపములు చేయవలెను. సన్నిధాపనము రోధకము మొదలగు సకల కార్యములను భాగత్రయ విభాగ పూర్వకముగ చేయవలెను. ఈ విధముగ ప్రకృతి పర్యంత న్యాసము నకు సంబంధించిన న్యాస విధానము పూర్తిచేసి ఆ పురుషుని కలశములో స్థాపించవలెను. (101)

ధ్వజారోపణాది విధానము

శ్రీ పరమేశ్వరుడు పలికెను : స్కందా! దేవాలయములో శిఖరమును, ధ్వజదండమును, ధ్వజ మును ప్రతిష్ఠ చేయవలసిన విధానమును చెప్పుచున్నాను వినుము. శిఖరము సగము భాగమునందు శూలమును ప్రవేశపెట్టి లేదా శూలము సగము భాగమును శిఖరమందు ప్రవేశపెట్టి ప్రతిష్ఠ చేయవలెను. ఇటుకలతో నిర్మించిన దేవాలయమందలి శూలమును దారువుతో నిర్మించవలెను. ఆలయము శిలానిర్మితమైనచో శూలము కూడ శిలానిర్మితము కావలెను. విష్ణ్వాది దేవాలయము లందు కలశమును చక్ర సంయుక్తము చేయవలెను. ఆ కలశము దేవతామూర్తి ప్రమాణమునకు అనురూపముగా ఉండవలెను. కలశము త్రిశూల యుక్తమైనచో దానికి 'అగ్రచూలము' అని పేరు. దాని శిరోభాగమునందు శివలింగ మున్నచో దానికి 'ఈశ శూలము' అని పేరు. శిరోభాగము బీజపూరకయుక్తమైనను ఇదియే పేరు అని శైవశాస్త్రములలో చెప్పబడినది. జంఘావేదితో సమాన మైన చిత్తుగలది లేదా జంఘావేది ఎత్తులో సగము ఎత్తుగలది 'చిత్రధ్వజము' లేదా దాని మాన దండమును అనుసరించిగాని, తమ ఇచ్చను అనుసరించి గాని ఉండవచ్చును. పీఠమును ఆవేష్టించి యున్నది. 'మహాధ్వజము'. పదునాలుగు హస్తముల దండము ఉత్తమము. తొమ్మిది హస్తములది మధ్యమము, ఆరు హస్తములది అధమము అని విద్వాంసుల నిర్ణయము. ధ్వజదండములు ఎదురైనను, సాలవృక్ష సంబంధమైనదైనను సకల కామపూరకము. ఆరోపణ సమయమున ఈ ధ్వజము విరిగిపోయినచో రాజునకు గాని, యజమానునకుగాని హాని కలుగునని తెలియవలెను. అపుడు బహురూప మంత్రములతో వెనుక చెప్పిన విధముగ శాంతి చేయవలెను. ద్వారపాలాది పూజ, మంత్రతర్పణము చేసి, ధ్వజమును, దానిదండమును అస్త్రమంత్రముతో స్నానము చేయిం చవలెను. గురువు ఈ మంత్రముతో ధ్వజ ప్రోక్షణముచేసి, మట్టికషాయోదకము మొదలగు వాటితో దేవాలయమునుకూడ స్నానము చేయిం చవలెను. ధ్వజము పైభాగమున గంధాదులుపూసి, వస్త్రముచే ఆచ్ఛాదించి, మరల వెనుకటి వలెనే దానిని శయ్యపై ఉంచి, లింగము నకువలెనే న్యాసము చేయవలెను. కాని జ్ఞాన శక్తి క్రియాశక్తుల న్యాసము మాత్రము చేయరాదు. విశేషార్థబోధిక యగు చతుర్థి కూడ వాంఛనీయముకాదు. కుంభ, కుండాదుల ఏర్పాటు కూడ అనావశ్యకము. దండముపై, విద్యాతత్త్వమును, సద్యోజాతాది ముఖ పంచకమును న్యాసము చేయవలెను. పిదప ధ్వజముపై

శివతత్త్వ న్యాసముచేసి, నిష్కల శివుని న్యాసముచేసి, హృదయాద్యంగపూజ చేయవలెను. పిదప, మంత్రజ్ఞుడైన గురువు, ధ్వజమునందును ధ్వజాగ్ర భాగము నందును, సంనిధీకరణము కొరకై షడంత సంహితా మంత్రములతో, ప్రత్యేక భాగమునందు హోమము చేయవలెను. మరియు ఇతర సంస్కారములు చేసినను, ఈ విధముగ అస్త్రయాగము చేసియే చేయవలెను. ఈ విషయము లను పండితులు చేసి చూపించి యున్నారు.

దేవాలయమును కడిగి, పుష్పమాలావస్త్రాదులచే అలంకరించి, జంఘావేదిపై త్రితత్త్వాది న్యాసము, హోమాదులు, శివపూజ వెనుకటివలెనే చేసి, సర్వతత్త్వ మయమగు ఆ శివుని వ్యాపక స్వరూపమును ధ్యానించవలెను. శివుని చరణార విందము నందు అనంత కాలరుద్రులను, పీఠమున కూష్మాండ, హాటక, పాతాళ, నరకములను భావన చేయవలెను. పిదప భువనములచేతను, లోక పాలులచేతను, శతరుద్రాదులచేతను పరివేష్టితమగు ఈ బ్రహ్మాండమును ధ్యానించి, జంఘావేదిపై స్థాపించవలెను. పృథ్వీ, జల, తేజో, వాయు, ఆకాశరూప పంచాష్టకములను, సర్వావరణ సంజ్ఞకము లను, బుద్ధియోన్యష్టకమును, యోగ్రాకమును, ప్రళయమువరకు ఉండు త్రిగుణములను, తటస్థ పురుషుని, వామసింహమును కూడ జంఘావేదిపై భావన చేయవలెను. కాని మంజరీ వేదికపై విద్యాది తత్త్వ చతుష్టయము భావన చేయవలెను. కంఠమున మాయా రుద్రులను, అమల సారమున విద్యలను, కలశమున ఈశ్వర బిందు, విద్వేశ్వరులను భావన చేయ వలెను. చంద్రార్ధ స్వరూపమగు త్రిశూలమున జటాజూటభావన చేయవలెను. ఆ శూలము మీదనే త్రివిధ శక్తులను, దండమునందు నాభిని భావనచేసి, ధ్వజముపై కుండలినీశక్తిని భావన చేయవలెను. ఈ విధముగ ఆలయ అవయవ ములపై విభిన్న తత్త్వముల భావన చేయవలెను. జగతితో ప్రాసాద సంధానమును, పిండికతో లింగ సంధానమును భావనచేసి మిగిలిన విధానమునంతను వెనుకటివలె చేయవలెను. పిదప గురువు మంగళవాద్య ఘోషముతో, వేద ధ్వనితో, మూర్తిధరులతో కలిసి, శివరూపమగు మూలము గల ధ్వజ దండమును ఎత్తి మంత్రోచ్చారణ పూర్వకముగ శక్తిమయకమల న్యాసము ఎచట చేయ బడెనో, రత్నాది పంచకము ఉంచబడెనో, అట్టి ఆధార భూమిపై ఆ ధ్వజములు స్థాపించవలెను. ప్రాసాద శిఖరముపై ధ్వజారోహణమైన పిదప, యజమానుడు బంధు మిత్రా దులతో ఆలయ ప్రదక్షిణము చేసినచో సకలాభీష్ట ఫలములను పొందును. గురువు, అస్త్రాదులతో పాశుపతమును చాలసేపు ధ్యానించి, శస్త్రయుక్తులగు ఆ అధిపతుల నందరిని, దేవాలయ రక్షకై ప్రార్థించవలెను. న్యూనతాది దోష పరిహారార్థమై హోమ, దాన, దిగ్బల్యాదులు పూర్తిచేసిన పిదప యజమానుడు గురువునకు దక్షిణ ఈయవలెను. అలయ నిర్మాణ ప్రతిష్ఠలు చేసిన యజమానుడు ప్రతిమా, లింగ, వేదులలో ఎన్ని పరమాణువు లుండునో అన్ని వేల యుగములపాటు, దివ్య లోకమునందు ఉత్తమ భోగములను అనుభ వించును. ఇది అతడు పొందుఫలము. (102).

జీర్ణోద్ధార విధానము

పరమేశ్వరుడు చెప్పెను : స్కందా! జీర్ణాది లింగముల శాస్త్రీయోద్ధార క్రమమును గూర్చి చెప్పెదను : చిహ్నములు అరిగిపోవుట, బ్రద్ధలగుట, మాలిన్యాదులచే స్థూలమగుట, వజ్రాహత

మగుట, సంపుటితమగుట, విరిగిపోవుట, అంగభంగము ఏర్పడుట–ఇట్టి దోషములు ఏర్పడిన లింగముల పిండులను, వృషభమును వెంటనే త్యజించవలెను. శివ లింగమును ఎవరైన చలింపచేసినను, స్వయముగా అది చలించినను, చాల క్రిందికి దిగిపోయినను, విషమ స్థానస్థితమైనను, దిఙ్మోహమున్నను, ఏ కారణముచేతనైన క్రింద పడినను, లేదా మధ్యనే ఉన్నను జారిపోయినను దానిని మరల స్థాపించవలెను. అది వ్రణరహితమైననే అట్లు స్థాపించవలెను. నదీజలముచే కొట్టుకొనిపోయిన శివలింగమును గూడ మరల స్థాపన చేయవచ్చును. సుదృఢముగా ఉన్న శివలింగమును దాని స్థానము నుండి కదల్చగూడదు. అస్థిరమైన శివలింగమును చలింపచేసినచో, శాంతినిమిత్తమై వెయ్యి హోమములను, పునః స్థాపనార్థమై నూరు హోమములను చేయవలెను.

శివ లింగమును జీర్ణతాది దోషయుక్త మైనను, దానికి నిత్య పూజాదికము జరుగుచున్నచో దానిని కదల్చకూడదు. జీర్ణోద్ధారార్థమై దక్షిణమునగాని, ఈశాన్యమునగాని ఒక మండపము ఏర్పరచి, పశ్చిమమున ఒక ద్వార మేర్పరుపవలెను. ద్వార పూజాద్యనంతరము, వేదికపై శివపూజ చేయవలెను. మంత్ర పూజా–తర్పణానంతరము వెనుకటివలె వాస్తుపూజ చేయవలెను. పిదప గురువు, బైటకు వెళ్లి, భూతబలి ఇచ్చి, ఆచమనముచేసి, బ్రాహ్మణులకు భోజనము పెట్టవలెను. పిదప శివునితో ఈ విధముగ నివేదించవలెను 'శంభూ! ఈ లింగము దోషయుక్తమై పోయినది. దీనిని ఉద్ధరించినచో శాంతి కలుగునని నీవే చెప్పి ఉన్నావు. అందుచే యథావిధిగా ఈ కార్యము చేయబడుచున్నది. శివా! నీవు నాలో ఉండి, ఈ కార్యమును సుసంపన్నము చేయుము.' శివునితో ఈ విధముగా విజ్ఞాపన చేసి, మధుఘృత మిశ్రమగు పాయసముతోను, దూర్వలతోను, మూల మంత్రముతో నూట ఎనిమిది హోమములుచేసి, శాంతి హోమము కూడ పూర్తి చేయవలెను. పిదప లింగమునకు స్నానము చేయించి వేదికపై దానికి పూజ చేయవలెను.

పూజ 'వ్యావకేశ్వరాయ శివాయ నమః' అను మంత్రము ఉచ్చరించుచు చేయవలెను. 'ఓం వ్యావకేశ్వరాయ హృదయాయ నమః' 'ఓం వ్యావకేశ్వరాయ శిరసే నమః' ఇత్యాదులు అంగమంత్రములు. పిదప అస్త్రమంత్రము ఉచ్చరించుచు శివలింగమును ఆశ్రయించియున్న భూతముతో 'ఏదైన భూతము ఈ శివలింగమును ఆశ్రయించి ఉన్నచో, అది శివాజ్ఞ ప్రకారము, ఈ లింగమును విడచి, తనకు ఇష్టము వచ్చిన చోటునకు పోవలెను. విద్యా విద్యేశ్వరులతో భగవంతుడైన శివుడు ఇచట నివసింపనున్నాడు' అని చెప్పవలెను. పాశుపత మంత్రముతో ఒక్కొక్క భాగమునకు వేయి చొప్పున హోమములుచేసి, శాంతి జలముతో ప్రోక్షణము చేయవలెను. కుశలతో స్పృశించి పై మంత్రమును జపించవలెను. పిదప గురువు విలోమక్రమముతో అర్ఘ్యమిచ్చి లింగము పైనను, పిండికయందును ఉన్న తత్త్వ ములను, తత్త్వాధిపతులను, ఎనమండుగురు మూర్తీశ్వరులను స్వర్ణపాశమునుండి విసర్జిం పచేసి, వృషభము భుజముపై నున్న రజ్జువుచే పట్టి తీసికొనిపోయి, జన సముదాయముతో కూడ శివనామ సంకీర్తనము చేయుచు, ఆ వృషభమును నీటిలో పడవేయవలెను. మంత్ర జ్ఞుడైన ఆచార్యుడు పుష్టికొరకై నూరు హోమములు చేయవలెను. దిక్పాలకుల తృప్తి కొరకు, వాస్తు శుద్ధి కొరకునుగూడ నూరేసి హోమములు చేయవలెను.

పిదప మహాపాశుపత మంత్రముతో ఆ దేవాలయము నందు రక్షణము ఏర్పాటు చేసి, అచట విధి పూర్వకముగ మరియొక లింగమును స్థాపించవలెను. అసురులు, మునులు, దేవతలు, తత్త్వవేత్తలు స్థాపించిన లింగము జీర్ణమైనను, భగ్నమైనను, దానిని యథావిధిగాకూడ కదల్చరాదు. జీర్ణ దేవాలయోద్ధార విషయమునందు గూడ ఈ విధినే అవలంబించవలెను. మంత్ర గణములను ఖడ్గమునందు న్యాసముచేసి, మరొక ఆలయము నిర్మించవలెను. దానిని మొదటి దానికంటె చిన్నది చేసినచో కర్త మరణించును. పెద్దది చేసినచో ధనహాని కలుగును. అందుచే వెనుకటి ఆలయము నందలి వస్తువులతోగాని, మంచివైన ఇతర వస్తువులతోగాని, ఆస్థానమునందు, మొదటి ఆలయము ఎంత ఉండెడిదో అంత ఆలయమే నిర్మించవలెను. (103)

ప్రాసాద లక్షణము

పరమేశ్వరుడు పలికెను : మయూరధ్వజా! ఇపుడు ప్రాసాద సామాన్య లక్షణము చెప్పెదను. చతురస్ర క్షేత్రమును నాలుగు భాగములు చేయగా, గోడల విస్తారము ఒక భాగముండవలెను. మధ్య భాగము గర్భము. ఒక భాగమున పిండిక ఉండవలెను. ఐదు భాగముల క్షేత్రము లోపలి భాగమున పిండిక ఉండవలెను. ఒక భాగము విస్తారము ఖాళీగా ఉండవలెను. ఒక భాగము విస్తారము గోడలకొరకు ఉపయోగించవలెను. మధ్యమ గర్భము నందు రెండు భాగములు, జ్యేష్ఠ గర్భము నందుకూడ రెండు భాగములు ఉండ వలెను. కాని మూడు భాగములలో కనిష్ఠ గర్భము, మిగిలిన ఎనిమిదవ భాగము గోడలు అను పద్ధతి కూడ ఉన్నది. క్షేత్రమును ఆరు భాగములుగ విభజించినపుడు ఒక భాగము విస్తారము గర్భము కొరకును, రెండు భాగములు పిండిక కొరకును వినియోగింపబడును. గోడల ఎత్తు వెడల్పుకంటె రెట్టింపుగాని, రెండును పావును అధికముగాని, రెండున్నర రెట్లుగాని, మూడు రెట్లుగాని ఉండు పద్ధతి కూడ కనబడుచున్నది. కొన్ని చోట్ల ప్రాసాదము చుట్టు గోడల సగము లేదా మూడు వంతుల వైశాల్యముగల జగతి నాల్గవవంతు విస్తారము గల నేమి కానవచ్చుచున్నది. మధ్యయందు మూడవవంతు పరిధి ఉండును. అచట రథము నిర్మించి దానిపై చాముండభైరవుని, నాట్యేశుని స్థాపించవలెను. ప్రాసాదము సగము విస్తారములో నాల్గు వైపులందును, వెలుపల, దేవతల కొరకై, ఎనిమిది లేదా నాలుగు పరిక్రమలు ఏర్పరుపవలెను. ప్రాసాదాదులందు వీటి నిర్మాణము ఇచ్ఛాధీనము.

పూర్వదిక్కు నందు ఆదిత్యులను, వాయవ్యమున స్కంద-అగ్నులను, యమాది దేవతలను వారివారి దిక్కులందును స్థాపించవలెను. శిఖరమును నాలుగు భాగములు చేయగా క్రింది రెండు భాగములకు 'శుకనాసిక' అని పేరు. మూడవ భాగము వేది ప్రతిష్ఠ. దాని ముందు భాగము 'అమలసారము' అని ప్రసిద్ధమైన కంఠము. మేరు శిఖరముపై వైరాజము, పుష్పకము, కైలాసము, మణికము, త్రివిష్టపము అను ఐదు ప్రాసాదములు మాత్రమే ఉన్నవి. వీటిలో మొదటి దైన వైరాజము చతురస్రము. పుష్పకము చతురస్రాయుతము. కైలాసము వృత్తా కారము. మణికము వృత్తాయతము. త్రివిష్టపము అష్ట కోణాకారము. వీటిలో ఒక్కొక్కదానికి తొమ్మిదేసి భేదములుండుటచే మొత్తము నలుబదియైదు భేదములగును.

మేరువు, మందరము, విమానము, భద్రము, సర్వతోభద్రము, రుచకము, నందకము, వర్ధమానము, నంది, శ్రీవత్సము అను తొమ్మిది ప్రాసాదములు వైరాజ కులమునకు సంబంధించినవి. వలభి, గృహరాజము, శాలాగృహము, మందిరము, విశాల చమనము, బ్రహ్మమందిరము, భువనము, ప్రభవము, శివికావేశ్మ అను తొమ్మిది ప్రాసాదములు పుష్పక కులమునకు సంబంధించినవి. వలయము, దుందుభి, పద్మము, మహా పద్మము, వర్ధని, ఉష్ణీషము, శంఖము, కలశము, ఖవృక్షము అను తొమ్మిది వృత్తాకార ప్రాసాదములు కైలాసకులమునందు ఉత్పన్నమైనవి. గజము, వృషభము, హంసము, గరుత్మంతము, ఋక్షనాయకము, భూషణము, భూధరము, శ్రీజయము, పృథ్వీధరము అను తొమ్మిది వృత్తాయత ప్రాసాదములు 'మణిక'ము నుండి ఆవిర్భవించినవి. వజ్రము, చక్రము, స్వస్తికము, వజ్రస్వస్తికము, చిత్రము, స్వస్తిక ఖడ్గము, గద, శ్రీకంఠము, విజయము అను తొమ్మిది ప్రాసాదములు 'త్రివిష్టప'ము నుండి ఆవిర్భవించినవి. నగరములకు కూడ ఇవే పేర్లు. లాటాదులకు కూడ ఈ సంజ్ఞలే. చూలము శిఖర కంఠ ప్రమాణములో సగము ఉండవలెను. దానిలావు కంఠము లావులో మూడవ వంతు ఉండవలెను. వేదిని పది భాగములుచేసి ఐదు భాగములతో స్కంధ విస్తారమును, మూడు భాగములతో కంఠమును, నాలుగు భాగములతో దాని అండమును నిర్మించవలెను. ద్వారములు పూర్వాది దిక్కులందు ఉంచవలెను గాని విదిశల యందు ఉంచరాదు. పిండికా విస్తారము కోణము వరకును వెళ్ళవలెను. మధ్యభాగము దగ్గర దాని సమాప్తి కావలెను.

కొన్నింట ద్వారముల ఎత్తు గర్భము నాల్గవ భాగముకంటె గాని, ఐదవ భాగము కంటె గాని రెట్టింపు ఉండునట్లు ఉంచవలెను. లేదా మరొక విధముగకూడ చేయవచ్చును. నూట అరవై అంగుళముల ఎత్తునుండి పదేసి అంగుళములు తగ్గించుచు నిర్మించిన నాలుగు ద్వారములు ఉత్తమములని చెప్పబడినవి. నూట ఇరువది, నూటపది, నూరు అంగుళముల ఎత్తు ద్వారములు మధ్యమములు. తొంబది, ఎనుబది, డెబ్బది అంగుళముల ఎత్తు ద్వారములు కనిష్ఠములు. ద్వారము వెడల్పు, పొడవులో సగము ఉండవలెను. ఎత్తు చెప్పిన దానికంటె, మూడు, నాలుగు, ఎనిమిది లేదా పది అంగుళములు కూడ ఉన్నను శుభప్రదమే. విస్తారము ఎత్తులో నాల్గవ వంతు ఉండవలెను. ద్వారశాఖల (ప్రక్కకమ్ముల) వెడల్పు లేదా మొత్తము అన్ని కమ్ముల వెడల్పు ద్వారము వెడల్పులో నాల్గవవంతు ఉండ వలెను. మూడు, ఐదు, ఏడు లేదా తొమ్మిది శాఖలతో నిర్మించిన ద్వారము అభీష్ట ఫలముల నిచ్చును. క్రింది శాఖ నాల్గవ భాగముపై ద్వారపాలులను స్థాపించవలెను. మిగిలిన శాఖలను స్త్రీ పురుష మిథునముల ఆకారములతో అలంకరించ వలెను. ద్వారమునకు ఎదురుగా స్తంభము వచ్చినచో స్తంభవేధ దోషము. దానివలన గృహస్వామి దాసుడగును. వృక్షముచే వేధయైనచో ఐశ్వర్యనాశనము. కూపవేధ వలన భయప్రాప్తి. క్షేత్రవేధచే ధన హాని కలుగును. ప్రాసాద, గృహ, శాలాదుల మార్గముచే ద్వారవేధ కలిగినచో బంధనము, సభచే వేధ ఏర్పడినచో దారిద్ర్యము, వర్ణవేధచే తిరస్కారము, ఉలూఖలవేధచే దారిద్ర్యము, శిలావేధచే శత్రుత్వము, ఛాయావేధచే నిర్ధనత ప్రాప్తించును. వీటినన్నింటిని ఖండించి వేసినను, పెకలించినను వేదదోష ముండదు. వీటిమధ్య ప్రాకారము కట్టించినను దోషముండదు. ఈ వస్తువులు సరిహద్దు నుండి రెట్టింపు దూరము నందు ఉన్నను వేధదోషము ఉండదు. (104)

నగరాది వాస్తు నిరూపణము

పరమేశ్వరుడు పలికెను –

నగర గ్రామ దుర్గాదులలో గృహ ప్రాసాదవృద్ధికై ఎనుబదియొక్క పదముల వాస్తు మండలము నిర్మించి, దానిపై తప్పక వాస్తు దేవతా పూజ చేయవలెను. పూర్వాభి ముఖ ములగు పది రేఖలు పది నాడులకు ప్రతీకములు. శాంత, యశోవతీ, కాంతా, విశాలా, ప్రాణవాహినీ, సతీ, వసుమతీ, నందా, సుభద్రా, మనోరమా అనునవి ఆ నాడుల పేర్లు. ఉత్తరాభిముఖముగ ప్రవహించు ఇంకను పది నాడులు కూడ ఉన్నవి. వాటిచే తొమ్మిది పదములు ఎనుబది యొక్క పదములుగ విభజింప బడును. హరిణీ, సుప్రభా, లక్ష్మీ, విభూతి, విమలా, ప్రియా, జయా, జ్వాలా, విశోకా అని వాటి పేర్లు. సూత్ర పాతము చేయగా రేఖామయములగు నాడులు అభివ్యక్తములై చింతన విషయము లగును. ఈశాది దేవతలు ఎనమండుగురు చొప్పున అష్టకములగును. ఆ అష్టకములను నాలుగు దిక్కులం దును పూజించవలెను. ఈశ, ఘన, జయ, శక్ర, అర్క, సత్య, భృశ, వ్యోమ దేవతలను (అష్టకమును) వాస్తు మండలము మీద పూర్వదిక్కున పూజించవలెను. అగ్ని, పూషన్, వితథ, సోమ, కృతాంత, గంధర్వ, భృంగ, మృగులను దేవతాష్టకమును దక్షిణమున నున్న పదములందు పూజించవలెను. పితృ, ద్వారపాల, సుగ్రీవ, పుష్పదంత, వరుణ, దైత్య, శోష, యక్ష్మలను అష్టకమును పశ్చిమ పదములందు పూజించవలెను. రోగ, అహి, ముఖ్య, భల్లాట, సోమ, శైల, అదితి, దితులను దేవతాష్టకమును ఉత్తరమున ఉన్న పదములపై పూజించవలెను. వాస్తు మండలము మధ్యనున్న తొమ్మిది పదములపై బ్రహ్మయు, ఇరువదినాలుగు పదములపై, ఆరేసి పదములపై అధికారముగల దేవతలను పూజించ వలెను. బ్రహ్మకును, ఈశునకును మధ్యనున్న కోష్టకములందున్న పదములపై ఆ దేవతను క్రింది రెండు పదములపై ఆపవత్సుని పూజించవలెను. దానితరువాత నున్న ఆరు పదములపై మరీచిని పూజించవలెను. మరీచికిని, అగ్నికిని మధ్యనున్న రెండు పదములపై సవిత ఉండును. వాటి క్రింద నున్న రెండు పదములపై సావిత్రుడు ఉండును. దాని క్రింద ఆరు పదము లపై వివస్వంతుడు ఉండును. పితృ దేవతలకును బ్రహ్మకును మధ్యనున్న రెండు పదములపై విష్ణువు, ఇంద్రుడును ఉందురు. క్రింది రెండు పదములందు ఇంద్రు డును, జయుడును ఉందురు. వారిని పూజించవలెను. వరుణునకును, బ్రహ్మకును మధ్య నున్న ఆరు పదములపై మిత్ర దేవతను పూజించవలెను. రోగమునకును, బ్రహ్మకును మధ్యనున్న రెండుపదములపై రుద్ర–రుద్రదాసులను, క్రింది రెండు పదములందు యక్ష్మను పూజించవలెను. మండలము బైటి ఈశానాది కోణములందు క్రమముగా చరకీ, స్కంద, విదారీ, వికట, పూతనా, జంభ, పాపా, పిలిపిచ్ఛలను బాల గ్రహములను పూజించవలెను.

ఎనుబది ఒక్క పదములు గల వాస్తు చక్రము చెప్పబడినది. శతపదమండలము కూడ ఉండును. దానిమీదకూడ వెనుకటివలెనే దేవతాపూజ చెప్పబడినది. శతపద చక్రము నందు మధ్యనున్న పదునారు పదములపై బ్రహ్మను పూజించవలెను. బ్రహ్మకు పూర్వాది దిశలందున్న మరీచి, విస్వత్, మిత్ర పృథ్వీధరులును పదేసి పదములపై పూజించవలెను. ఈశాన్యాది దిక్కులందున్న దితి, ఈశ,

అగ్ని, పూషన్, పితృ, పాపయక్ష్మ, రోగ దేవతలు ఒకటిన్నర పదములపై నుందురు. స్కందా! ఇపుడు యజ్ఞాదులకై కావలసిన మండపములను, క్రమముగా, సంక్షేపముగా వర్ణించెదను. ముప్పది హస్తముల పొడవు, ఇరువది ఎనిమిది హస్తముల వెడల్పు ఉన్న మండపము శివునకు ఆశ్రయము. పొడవు వెడల్పులలో పదకొండు చొప్పున తగ్గించగా, పందొమ్మిది హస్తముల పొడవు, పదునేడు హస్తముల వెడల్పు ఉన్న మండపము శివసంజ్ఞకము. ఇరువది రెండు హస్తముల పొడవు, పదునైదు హస్తముల వెడల్పు ఉన్న మండపమునకు సావిత్రమని పేరు. ఇతర గృహముల విస్తారము ఆంశికముగ నుండును. గోడ ఎత్తు దాని లావైన ఉపజంఘ ఎత్తునకు మూడు రెట్లు ఉండవలెను. గోడకొరకై ఎంత సూత్రమానము నిశ్చితమైనదో అంతయే దాని ఎదుట ఉండు భూమి ఉండవలెను. అది వీథీ భేదముచే అనేక విధముల నుండును. భద్రనామక ప్రాసాదమునందు ద్వారవీథి వీథులతో సమానముగనే ఉండవలెను. శ్రీజయమను ప్రాసాదమునందు ఉండు ద్వారవీథిలో దానియందు వీథి పృష్ఠభాగ ముండదు. ద్వారవీథిలో వీథిపార్శ్వ భాగమును తగ్గించినచో అట్టి ద్వారవీథికల ప్రాసాదమునకు 'భద్ర'మని పేరు. వీథివిస్తారము గూడ గర్భవిస్తారమువలె నుండవలెను. కొన్నిచోట్ల దాని సగముతోను, లేదా నాల్గవవంతుతో సమానముగా ఉండును. ఉపవీథులను వీథిలో సగము ప్రమాణ ముండునట్లు నిర్మించవలెను. దానికి ఒకటి లేదా రెండు, లేదా మూడు పురములు ఉండవలెను. ఇపుడు ఇతరమైన సాధారణ గృహములను గూర్చి చెప్పుచున్నాను. ఆ గృహమును ఆ ఆకారముతో నిర్మించినచో అది సమస్తమైన కోరికలను సఫలము చేయును. దానిలో వరుసగా ఒకటి, రెండు, మూడు, నాలుగు లేదా ఎనిమిది శాలలు ఉండవలెను. ఏకశాల గృహముయొక్క శాల దక్షిణ భాగమున నిర్మింపబడును. దాని ద్వారము ఉత్తరము వైపున ఉండును. రెండు శాలలను నిర్మించు పక్షమున వాటిని పశ్చిమమునందును, తూర్పునందును నిర్మింపవలెను. వాటి ద్వారములు ఎదురెదురుగా ఉండవలెను. నాలుగు శాలల గృహమునకు నాలుగు ద్వారములు, నాలుగు అరుగులు ఉండునుగాన అవి సర్వతోముఖముగ నుండును. అది గృహస్వామికి కల్యాణ కరము. పశ్చిమము వైపు రెండుశాలలుండు ద్విశాలా గృహమునకు 'యమసూర్యకము' అని పేరు. తూర్పు, ఉత్తరముల వైపు శాలలున్నచో ఆ గృహమునకు 'దండ'మని పేరు. పూర్వ దక్షిణముల వైపు రెండు శాలలున్నచో దానికి 'వాతము' అని పేరు. త్రిశాలా గృహమునందు తూర్పువైపు శాల లేనిచో దానికి సుక్షేత్రము అని పేరు. అది బుద్ధిదాయకము. దక్షిణమున తప్ప ఇతర దిశలందు శాలలున్నచో దానికి 'విశాలము' అని పేరు. అది కులక్షయకరము. చాల భయదాయకము. పశ్చిమమున శాలలేని విశాల గృహమునకు 'పక్షఘ్నము' అని పేరు. అది పుత్ర హానికరము. అనేక శత్రు కారకము.

ఇపుడు పూర్వాది దిక్క్రమమున ధ్వజాది గృహముల ఎనిమిదింటిని గూర్చి చెప్పెదను. స్నాన గృహ–అనుగ్రహ గృహములను తూర్పునను, వంట ఇల్లును ఆగ్నేయమునను, శయ్యా–రసక్రియల గృహమును దక్షిణమునందును, శస్త్ర గృహమును నైరృతి యందును, ధన రత్నాదుల కోశాగారమును పశ్చిమమునందును, అన్న గృహము వాయవ్యము నందును, ధనపశ్వాదులను ఉత్తమునందును, దీక్షా గృహమును ఈశాన్యము నందును నిర్మింపవలెను. గృహస్వామి హస్తముచే కొలవబడిన

గృహపిండము పొడవు వెడల్పుల హస్త మానమును మూడుచే గుణించి ఎనిమిదిచే భాగించవలెను. అట్లు భాగించగా వచ్చిన శేషమును బట్టి ఈ ధ్వజాధ్యాయములు ఏర్పడును. దానిని బట్టియే ధ్వజము మొదలు కాకము వరకును ఉన్న ఆయములు తెలియును. రెండు, మూడు, నాలుగు, ఆరు, ఏడు, ఎనిమిది శేషించినచో దానిని బట్టి శుభాశుభ ఫలములు ఏర్పడును. గృహాయము మధ్యమము (ఐదవది)కాని, (చివరిది) కాకముగాని అయినచో అట్టి గృహము సర్వనాశకరమగును. అందుచే ఎనిమిది భాగములను విడచి, తొమ్మిదవ భాగమునందు నిర్మించిన గృహము శుభకరము. ఆ నవమ భాగమునందే మండపము ఉత్తమముగా భావింపబడుచున్నది. దాని పొడవు వెడల్పులు సమముగా ఉండవలెను. లేదా వెడల్పుకంటె పొడవు రెట్టింపు ఉండవలెను. తూర్పునుండి పశ్చిమము వైపునకును, ఉత్తరము నుండి దక్షిణమునకును, బజారునందే గృహపంక్తి కానవచ్చును. ఒక్కొక్క ఇంటికి, ప్రతిదిక్కునకును ఎనిమిదేసి ద్వారములు ఉండవచ్చును. ఈ ఎనిమిది ద్వారములకును వేరు వేరు ఫలములు ఉన్నవి. పూర్వదిక్కునందున్న ఎనిమిది ద్వారములకును భయము, స్త్రీ, చాపల్యము, జయము, వృద్ధి, ప్రతాపము, ధర్మము, కలహము, నిర్ధనత అనునవి తప్పక జరుగు ఫల ములు. దక్షిణ దిక్కునందున్న ఎనిమిది ద్వారములకు దాహ, దుఃఖ, సుహృన్నాశ, ధననాశ, మృత్యు, ధన, శిల్పజ్ఞాన, పుత్రప్రాప్తులు ఫలము. ఆయుష్, సన్యాస, సస్య, ధన, శాంతి, అర్థనాశ, శోషణ, భోగ, సంతానప్రాప్తులు పశ్చిమద్వార ఫలములు. రోగ, మద, ఆర్తి, ముఖ్యతా, అర్థ, ఆయుః, కృశతా, మానములు ఉత్తర ద్వార ఫలములు.(105)

నగరాదిక వాస్తు కథనము

పరమేశ్వరుడు చెప్పెను –

కార్తికేయా! రాజ్యాదుల అభివృద్ధి కొరకై ఇపుడు నగరవాస్తువును వర్ణించి చెప్పెదను. నగర నిర్మాణము కొరకు, ఒక యోజనము లేదా అర్ధయోజనము విస్తారముగల భూమిని గ్రహించవలెను. ఈశాదిపదములు ముప్పదింట సూర్య సంముఖముగ పూర్వ ద్వారము, గంధర్వ సమీపమున దక్షిణ ద్వారము, వరుణిని దగ్గర పశ్చిమ ద్వారము సోముని దగ్గర ఉత్తర ద్వారము నిర్మించవలెను. నగరమున వీథులు వెడల్పుగా ఉంచవలెను. నగరద్వారము ఆరు హస్తముల వెడల్పు ఉండి ఏనుగులు మొదలగునవి సుఖముగా ప్రవేశించుటకు నిర్గమించుటకు వీలుగా ఉండవలెను. నగరము ఛిన్నకర్ణముగాని, భగ్నముగాని, అర్ధ చంద్రాకారముగాని కాకూడదు. వజ్రసూచీ ముఖ నగరము కూడ హితకరముకాదు. ఒకటి రెండు లేదా మూడు ద్వారములుగల, ధనుస్సు ఆకారములో ఉన్న వజ్ర నాగాభ నగరము నిర్మించినచో అది శాంతి ప్రదము. నగరమునకు ఆగ్నేయమున స్వర్ణకారు లును, దక్షిణమున నృత్యోపజీవులగు వారాంగనలును, నైరృతి యందు నట, కుంభకార, కైవర్తాదులును, పశ్చిమమున రథకార, ఆయుధకార, ఖడ్గకారులను, వాయువ్యమున మద్యవిక్రేతలు కర్మకారులు, భృత్యులును, ఉత్తరమున బ్రాహ్మణ, యతి, సిద్ధాది పుణ్య పురుషులును, ఈశాన్యమున ఫలాదులను విక్రయించువారును నివసించవలెను. సేనా ధ్యక్షుడు తూర్పున ఉండవలెను. వివిధ సైన్యములు ఆగ్నేయము నందును, స్త్రీలకు వివిధ కళలను బోధించు ఆచార్యులు దక్షిణమునందును,

ధనుర్ధర సైనికులు నైరృతి యందును, పశ్చిమమున మహామాత్యుడు, కోశపాలకులు, కార్మికులును, ఉత్తరమున దండాధికారులు నాయక ద్విజులును నివసించవలెను.

తూర్పున క్షత్రియులను, దక్షిణమున వైశ్యులను, పశ్చిమమున శూద్రాదులను, విభిన్న దిశల యందు వైద్యులను, అశ్వములను, సైన్యమును నాల్గు దిక్కులందును ఉంచవలెను. తూర్పునందు గూఢచారులను, దక్షిణమున శ్మశానమును, పశ్చిమమున గోధనమును, ఉత్తరమున కర్షకులను ఉంచవలెను. మ్లేచ్ఛులకు విదిక్కులందు స్థానము ఏర్పరుపవలెను, లేదా గ్రామములలో నివసింప జేయవలెను. పూర్వద్వారమునందు లక్ష్మీ కుబేరుల స్థాపనచేయవలెను. ఆ ఇరువురిని చూచువారికి లక్ష్మీ సంపత్తి కలుగును. పశ్చిమమున నిర్మించిన దేవాలయము పూర్వాభిముఖముగాను, తూర్పున నిర్మించినది పశ్చిమాభి ముఖముగాను, దక్షిణమున నిర్మించినది ఉత్తరాభిముఖముగాను ఉండవలెను. నగర రక్షణ కొరకు ఇంద్ర విష్ణ్వాది దేవతా మందిరములను నిర్మించవలెను. దేవతలు లేని నగర, గ్రామ, దుర్గ, గృహాదులను పిశాచములు అనుభవించును. అవి అనేక రోగములచే పీడింపబడును. పైన చెప్పిన విధమున నిర్మించిన నగరాదికము సదా జయప్రదమై భోగ-మోక్షముల నిచ్చును. వాస్తుభూమికి తూర్పున శృంగార గృహము, ఆగ్నేయమున పాకగృహము, దక్షిణమున శయన గృహము, నైరృతియందు శస్త్ర గృహమును, పశ్చిమము నందు భోజనగృహము, వాయవ్యము నందు ధాన్య సంగ్రహము, ఉత్తరమునందు ధనా గారము, ఈశాన్యము నందు దేవతా గృహము నిర్మింపవలెను. నగరమునందు ఏకశాలా, ద్విశాలా, త్రిశాలా, చతుః శాలా గృహములను నిర్మించ వలెను. శాలాభేదమును, అలింద (ముంగిలి) భేదమును బట్టి చతుఃశాలా గృహమున రెండు వందల ఏబదియైదు భేదములుండును. త్రిశాలా గృహమునకు నాలుగు, ద్విశాలకు ఐదు, ఏకశాలకు నాలుగు భేదము లుండును. ఇపుడు అలిందయుక్త గృహమును గూర్చి చెప్పెదను వినుము. గృహ వాస్తువు నందును, నగరవాస్తువు నందును, ఇరువది యెనిమిది అలిందములు ఉండును. నాలుగు అలిందములతోడను, ఏడు అలిందముల తోడను ఏబది యైదు భేదములును, ఆరు అలిందములతో ఇరువది భేదములును, ఎనిమిది అలిందములతో గూడ ఇరువది భేదములును ఏర్పడును. ఈవిధముగ నగరాదులలో ఎనిమిది అలిందములుగల వాస్తువు కూడ ఉండవచ్చును. (106)

స్వాయంభువ సర్గ కథనము

అగ్నిదేవుడు పలికెను -

వసిష్ఠా! ఇపుడు నేను భువనకోశము, పృథివి, ద్వీపములు మొదలగు వాటిని గూర్చి చెప్పెదను. ప్రియవ్రతునకు అగ్నీధ్ర, అగ్నిబాహు, వపుష్మత్, ద్యుతిమత్, మేధా, మేధాతిథి, భవ్య, సవన, క్షయులను పుత్రులుండిరి. పదవ కుమారుడైన జ్యోతిష్మంతుడు యథార్థ నామధేయము కలవాడు. ప్రియవ్రతుని కుమారులందరును జగద్విఖ్యాతులు. తండ్రి వారికి సప్తద్వీపముల నిచ్చెను. ఆగ్నీధ్రునకు జంబూద్వీపము, మేధాతిథికి ప్లక్ష ద్వీపము, వపుష్మంతునకు శాల్మలి ద్వీపము, జ్యోతిష్మంతునకు కుశద్వీపము, ద్యుతిమంతు నకు క్రౌంచద్వీపము, భవ్యునకు శాకద్వీపము, సరసునకు పుష్కర

ద్వీపము ఇచ్చెను. ఆగ్నీధ్రుడు - లక్షల కొలది యోజనముల విస్తీర్ణముగల జంబూ ద్వీపము తన కుమారులకు ఈ విధముగ విభజించి ఇచ్చెను. నాభికి హిమ వర్షమును (నేటి భారతవర్షమును) కింపు రుషునకు హేమకూట వర్షము, హరివర్షునకు నైషధవర్షము, ఇలావృతునకు మధ్య భాగమున మేరుపర్వతముతో గూడిన ఇలావృత వర్షమును రమ్యకునకు నీలాచలా శ్రిత మగు రమ్యకవర్షమును, హిరణ్య వంతునకు శ్వేతవర్షమును, కురువుకు ఉత్తరకురు వర్షమును ఇచ్చెను. భద్రాశ్వునకు భద్రాశ్వ వర్షమును, కేతుమయునకు మేరు పర్వతమునకు పశ్చిమముగానున్న కేతుమాల వర్షమును ఇచ్చెను. ఈ విధముగ తన పుత్రులను ఆయా వర్షములకు అధిపతులుగ చేసి ప్రియవ్రతుడు వానప్రస్థుడై సాలగ్రామ క్షేత్రమునందు తపస్సుచేసి విష్ణు లోకమును పొందెను. ఓ ముని శ్రేష్ఠా! కింపురుషాధి వర్షములు ఎనిమిదింటి యందును సుఖము అధికము, అప్రయత్నము గనే భోగము లన్నియు లభించును. అచట జరామృత్యు భయము గాని, ధర్మాధర్మములు గాని, ఉత్తమ, మధ్యమ, అధమాది భేదములుగాని లేవు. అచట యుగ పరివర్తనము కూడ ఉండదు. హిమ వర్షాధిపతియగు నాభికి, మేరుదేవియందు ఋషభదేవుడు పుత్రుడుగా జనించెను. ఋషభుని కుమారుడు భరతుడు. ఋషభ దేవుడు భరతునకు రాజ్యలక్ష్మిని ఇచ్చివేసి, శాలగ్రామ క్షేత్రమున శ్రీహరిని శరణుజొచ్చెను. ఈ భరతుని పేరుతో భరత వర్షము ప్రసిద్ధమైనది. భరతునకు సుమతి అను కుమారుడు జనించెను. ఆతనికి రాజ్య భారము సమర్పించి భరతుడు శాలగ్రామ క్షేత్రమునందు శ్రీహరిని శరణుజొచ్చెను. ఆ యోగిరాజు యోగాభ్యాస తత్పరుడై ప్రాణములను పరిత్యజించెను. ఈతని ఆ చరిత్రమును నీకు మరల చెప్పెదను. పిదప సుమతి వీర్యము వలన ఇంద్రద్యుమ్నుడు జనించెను. ఆతనికి పరమేష్ఠియు ఇతనికి ప్రతీ హారుడును, ఆతనికి ప్రతిహర్తయు ఆతనికి భవుడు, భవునకు ఉద్గీథుడు, ఆతనికి ప్రస్తారుడు, ఆతనికి విభుడు, ఆతనికి పృథువు, ఆతనికి నక్తుడు, ఆతనికి గయుడు, గయునకు నరుడు, నరునకు విరాట్టు, ఆతనికి మహావీర్యుడు, ఆతనికి ధీమంతుడు, ఆతనికి మహాం తుడు, ఆతనికి మనుష్యుడు, ఆతనికి త్వష్ట, ఆతనికి విరజుడు, ఆతనికి రజుడు జన్మించిరి. మహామునీ! రజుని పుత్రుడైన శతజిత్తునకు నూరుగురు పుత్రులు జనించిరి. వారిలో విశ్వజ్యోతి ముఖ్యుడు. వానివలన భారతవర్షము అభివృద్ధి చెందెను. కృత త్రేతాది క్రమ మున ఇది స్వాయంభువ మనువంశముగా చెప్పబడినది. (107)

భువనకోశ నిరూపణము

అగ్ని దేవుడు పలికెను -

వసిష్ఠా! జంబూ, ప్లక్ష, శాల్మలి, కుశ, క్రౌంచ, శాక, పుష్కరము లనెడు ఏడు ద్వీపములు నలుమూలల లవణజల, ఇక్షురస, మద్య, ఘృత, దధి, క్షీర, మధుర జలములు గల ఏడు సముద్ర ములచే చుట్టబడియున్నవి. జంబూ ద్వీపము అన్ని ద్వీపముల మధ్యన ఉన్నది. దాని మధ్య ఎత్తైన మేరు పర్వతమున్నది. దీని విస్తారము ఎనుబది నాల్గువేల యోజనములు. ఈ పర్వత రాజము పదహారువేల యోజనములు భూమిలో దిగి ఉన్నది. పై భాగమునందు దీని విస్తారము ముప్పది రెండువేల యోజనములు. క్రింద దీని విస్తారము పదునారువేల యోజనములు. ఇట్లు ఈ పర్వతము

ఈ పృథ్వీరూప కమలము నకు కర్ణికవలె ఉన్నది. దీని దక్షిణమున హిమవత్, హేమకూట, నిషధ పర్వతములును, ఉత్తరమున నీల, శ్వేత, శృంగి పర్వతములును వర్ష పర్వతములుగా ఉన్నవి. మధ్య నున్న రెండు పర్వతములు (నిషధ-నీలములు) ఒక్కొక్క లక్ష యోజనముల వరకు వ్యాపించి ఉన్నవి. ఇతర పర్వతములు వాటికంటె పదేసివేల యోజనములు తక్కువ. అవి అన్నియు రెండేసి వేల యోజనములు ఉన్నతములు. అంతియే వెడల్పు, ద్విజశ్రేష్ఠా! దక్షిణ వర్షము లలో మొదటిది భారత వర్షము, రెండవది కింపురుష వర్షము. మూడవది హరి వర్షము, ఉత్తరము వైపు రమ్యక, హిరణ్మయ, ఉత్తర కురు వర్షములున్నవి. అవి భారతవర్షముతో సమానములు. మునివరా! వీటిలో ఒక్కొక్క దాని విస్తారము తొమ్మిదేసి వేల యోజనములు. వీటి అన్నింటిమధ్య ఇలావృత వర్షమున్నది. దానియందు మేరు పర్వతము నిలచి యున్నది. ఇలావృతవర్షము సుమేరు పర్వతమునకు నలువైపుల తొమ్మిదేసివేల యోజనముల వరకును విస్తరించియున్నది. దీని నాలుగు వైపుల నాలుగు పర్వతము లున్నవి. ఇవి సుమేరు పర్వతమును నిలబెట్టుటకై ఈశ్వరుడు ఏర్పరచిన ఆధార స్తంభములా అన్నట్లు ఉన్నవి. వీటిలో మందరాచలము తూర్పునను, గంధమాదనము దక్షిణమునను, విపులము పశ్చిమ పార్శ్వమునందును, సుపార్శ్వము ఉత్తరము నందును ఉన్నవి. ఈ పర్వతముల విస్తారము పదేసి వేల యోజనములు. ఈ పర్వతములపై నున్న పదకొండేసి యోజనముల విస్తారము గల కదంబ, జంబూ, అశ్వత్థ, వటవృక్షములు ధ్వజములవలె ప్రకాశించుచున్నవి. వీటిలో జంబూ వృక్షము, జంబూ ద్వీపమను పేరునకు కారణము. దీని పండ్లు ఏనుగంత ప్రమాణములో ఉండును. వీటిరసము జంబూనదిగా ప్రవహించుచున్నది. దీని నుండియే చాల ఉత్తమమైన జాంబూనదము (బంగారము) ఉత్పన్నమగుచున్నది. మేరువునకు తూర్పున భద్రాశ్వ వర్షము, పశ్చిమమున కేతుమాలము ఉన్నది. దానికి తూర్పున చైత్ర రథము, దక్షిణమున గంధమాదనము, పశ్చిమమున వైభ్రాజము, ఉత్తరమున నందనము అను వనములు ఉన్నవి. అట్లే దీనికి పూర్వాది దిక్కులందు అరుణోదయ, మహాభద్ర, శీతోద మానసములను సరస్సులున్నవి. సితాంభస్సు, చక్రముంజము మొదలగునవి (భూపద్మ కర్ణికయగు)మేరువుయొక్క పూర్వదిశ యందున్న కేసరముల వంటి పర్వతములు, దక్షిణమున త్రికూటాదులు, పశ్చిమమున శిఖివాసాదులు, ఉత్తరమున శంఖకూటాదు లును కేసర పర్వతములు. సుమేరువుపై బ్రహ్మపురి ఉన్నది.

దాని విస్తారము పదునాలుగు వేల యోజనములు. బ్రహ్మపురికి నాలుగు వైపుల అన్ని దిక్కులం దును ఇంద్రాది లోకపాలకుల నగరములున్నవి. ఈ బ్రహ్మపురి నుండియే, విష్ణుపాదోద్గత యగు గంగానది చంద్రమండలమును నడుపుచు స్వర్గమునుండి క్రిందికి దిగుచున్నది. తూర్పున శీతానది భద్రాశ్వ పర్వతమునుండి బయల్వెడలి ఒక పర్వతము నుండి మరొక పర్వతమునకు వెళ్లుచు సముద్రములో కలియుచున్నది. ఇట్లే అలకనంద కూడ దక్షిణమువైపు భారతవర్షమునకు వచ్చి, ఏడు భాగములలో విభక్తయై సముద్రములో కలిసిపోవుచున్నది. వక్షునది పశ్చిమ సముద్రము నందును, భద్ర ఉత్తర కురువర్షమును దాటి సముద్రమునందును కలియుచున్నది. మాల్యవత్, గంధమాదన పర్వతములు ఉత్తర దక్షిణముల వైపు నీలాచల, నిషధ పర్వతముల వరకును విస్తరించియున్నవి. ఆ రెండిటి మధ్య కర్ణికాకారమైన మేరు పర్వతమున్నది. మర్యాదా పర్వతము

బైటనున్న భారత, కేతుమాల, భద్రాశ్వ, ఉత్తర కురువర్షములు ఈ లోకపద్మము దళములు, జఠరదేవ కూటములు మర్యాదాపర్వతములు. ఇవి ఉత్తరము, దక్షిణముల వైపు నీలనిషధ పర్వతముల వరకును వ్యాపించియున్నవి. పూర్వ, పశ్చిమముల వైపు విస్తృతములైన గంధమాదన, కైలాసములు, ఎనుబదివేల యోజనములు విస్తృతమైనవి. తూర్పునందువలె పశ్చిమము వైపు గూడనిషధ పారి యాత్రములను రెండు మర్యాదా పర్వతములున్నవి. వాటి మూలములు సముద్రములోపల చొచ్చు కొని ఉన్నవి. ఉత్తరము వైపున త్రిశృంగము, రుధిరము, వర్షపర్వతములు పూర్వపశ్చిమ సముద్రము లందు చొచ్చుకొనియున్నవి. ఈ విధముగ జఠరము మొదలగు మర్యాదా పర్వతములు మేరు పర్వతమునకు నలువైపుల ప్రకాశించుచున్నవి. మునిశ్రేష్ఠా! కేసర పర్వతముల మధ్యనున్న శ్రేణులలో లక్ష్మీ, విష్ణు, అగ్ని, సూర్యాది దేవతల నగరములున్నవి. ఇవి భూలోక సంబద్ధములేయైనను స్వర్గముతో సమానమైనవి. పాపాత్ములు ఈ నగరములలో నివసించజాలరు. శ్రీమహావిష్ణువు భద్రాశ్వ వర్షమునందు హయగ్రీవ రూపమునను, కేతుమాల వర్షమునందు వరాహ రూపమునను, భారత వర్షమునందు కూర్మ రూపమునను, ఉత్తరకురు వర్షమునందు మత్స్య రూపమునను నివాసము చేయుచున్నాడు. శ్రీమహావిష్ణువు విశ్వరూపముతో సర్వత్ర పూజింపబడు చున్నాడు. కింపురుషాది వర్షములు ఎనిమిదింటి యందును ఆకలి, భయము, శోకము మొదలగునవి ఏమియు ఉండవు. అచటి ప్రజలు ఇరువది నాల్గువేల సంవత్సరములపాటు రోగశోకాదులు ఏవియులేకుండ జీవనము గడుపుచుందురు. అచట కృత త్రేతాది కల్పన ఉండదు. వర్షములు కురియవు. కేవలము పార్థివజలమే లభ్యమగును. ఈ అన్ని వర్షములందును ఏడేసి కులపర్వతములున్నవి. వాటినుండి వందల కొలది తీర్థ రూపములగు నదులు ప్రవహించుచున్నవి. ఇపుడు భారతవర్షమునందున్న తీర్థములను గూర్చి చెప్పెదను. (108)

తీర్థమాహాత్మ్యము

అగ్నిదేవుడు పలికెను –

ఇపుడు భుక్తిముక్తి ప్రదమగు తీర్థమాహాత్మ్యమును గూర్చి చెప్పెదను. హస్తములను, పాదములను, మనస్సును సంయమములో నుంచుకొన్నవాడును, విద్యా, తపః కీర్తులు కలవాడును మాత్రమే తీర్థములనుండి పూర్తి ఫలమును పొందగలుగును. ప్రతి గ్రహమును విడచి, నియమిత ఆహారమును భుజించుచు, ఇంద్రియములను స్వాధీనమునందు ఉంచుకొన్నవాడై పాపరహితుడగు తీర్థయాత్రికుడు సకల యజ్ఞఫలమును పొందగలడు. ఎవడు మూడు రాత్రులు ఉపవాసము చేయలేదో, తీర్థయాత్ర చేయలేదో, వాడు దరిద్రుడగును. యజ్ఞమువలన కలుగు ఫలితము తీర్థ యాత్రల వలన కలుగును. పుష్కరము శ్రేష్ఠమైన తీర్థము. మూడు సంధ్యలందును అచట సకల దేవతలతో కలసి బ్రహ్మ ఉండును. కోరికలు కలవారు, మునులు, దేవతలును అచట స్నానముచేసి సిద్ధి పొందినవారు. పుష్కరమునందు దేవతలను, పితృదేవతలను పూజించినవాడు అశ్వమేధ యజ్ఞఫలమును పొంది బ్రహ్మలోకమునకు పోవును. కార్తీక పూర్ణిమనాడు అచట అన్నదానముచేసిన వాడు శుద్ధచిత్తుడై బ్రహ్మలోకము చేరును. పుష్కరమునకు వెళ్లుటకు అచట తపస్సు చేయుటకు,

అచట దానముచేయుటకు, అవకాశము లభించుటయే చాల కష్టము. అచట నివసించు సౌభాగ్యము లభించుట అతిదుష్కరము. పుష్కరమునందు నివసించువాడును, అచట జప శ్రాద్ధములు చేసిన వాడును, తన వంశము నందు నూరుతరముల వారిని ఉద్ధరించును. జంబూ మార్గము, తండులి కాశ్రమము అను తీర్థములు కూడ అచటనే ఉన్నవి. కణ్వాశ్రమము, కోటి తీర్థము, నర్మద, అర్బు దము కూడ ఉత్తమ తీర్థములు. చర్మణ్వతి, సింధువు, సోమనాథము, ప్రభాసము, సరస్వతీ సముద్ర సంగమము, సాగరము కూడా శ్రేష్ఠమైన తీర్థములు. పిండారక క్షేత్రము, ద్వారక, గోమతి ఇవన్నియు సర్వసిద్ధి ప్రదములగు తీర్థములు. భూమి తీర్థము, బ్రాహ్మతుంగ తీర్థము, పంచనదములు (సత్లజ్ మొదలైన ఐదు నదులు) కూడ ఉత్తమములు. భీమ తీర్థ–గిరీంద్ర తీర్థములు, పాపవినాశని అగు దేవికానది, పవిత్రమైన వినశన తీర్థము, నాగోద్భేదము, అఘాదనము, కుమార కోటి–ఇవన్నియు సకల ఫలప్రదములు. 'నేను కురుక్షేత్రమునకు వెళ్ళెదను, కురుక్షేత్రములో నివాసము చేసెదను' అని సర్వదా చెప్పువాడు పరిశుద్ధుడై స్వర్గలోకమును పొందును. అచట విష్ణ్వాది దేవతలు నివసించు చుందురు. అచట నివాసము చేయుటచే మానవుడు విష్ణులోకమును పొందును. కురుక్షేత్రమునందు సమీపముననే సరస్వతీనది ప్రవహించు చుండును. దానిలో స్నానముచేయువాడు బ్రహ్మలోకము పొందును. కురుక్షేత్రము నందలి ధూళికూడ ఉత్తమపదము నిచ్చును. ధర్మతీర్థ–సువర్ణ తీర్థములు, పరమోత్తమమైన గంగా ద్వారము (హరిద్వారము) పవిత్రమైన కనఖలము భద్ర–కర్ణహ్రదము, గంగా సరస్వతీ సంగమము, బ్రహ్మావర్తము ఇవి పాపవినాశకములైన తీర్థములు. భృగుతుంగ–కుబ్జామ్ర–గంగోద్భేదములు గూడ పాప వినాశకములు. వారాణసి సర్వోత్తమమైన తీర్థము. దీనికే శ్రేష్ఠమగు అవిముక్త క్షేత్రమని కూడ పేరు. కపాల మోచన తీర్థము కూడ ఉత్తమమైనది. ప్రయాగ తీర్థములలో రాజు. గోమతీ–గంగా సంగమము కూడ పావన తీర్థము. గంగ ఎక్కడ నున్నను స్వర్గలోకము నిచ్చును. రాజ గృహము పవిత్రతీర్థము, శాలగ్రామ తీర్థము పాపవినాశకము. వటేశ–వామన–కాలికాసంగమ తీర్థములు కూడ ఉత్తమమైనవి. రౌహిత్య తీర్థము, కరతోయానది, శోణభద్రము, ఋషభ తీర్థము కూడ శ్రేష్ఠమైనవి. శ్రీపర్వత, కోలాచల, సహ్యగిరి, మలయగిరి, గోదావరీ, తుంగభద్రలు, వరదాయినియగు కావేరినది, తాపి, పయోష్ణి, రేవ (నర్మద) దండకారణ్యము కూడ ఉత్తమ తీర్థములు. కాలంజర, ముంజవట, శూర్పారక, మందాకినీ, చిత్రకూట, శృంగవే(బే)ర పురములు కూడ శ్రేష్ఠములు. అవంతి కూడ ఉత్తమ తీర్థము. అయోధ్య సకల పాపములను నశింపచేయును. నైమిశారణ్యము పరమపవిత్ర తీర్థము. ఇది భుక్తి ముక్తి ప్రదము. (109)

గంగా మాహాత్మ్యము

అగ్ని దేవుడు పలికెను –

ఇపుడు గంగా మాహాత్మ్యమును చెప్పెదను. సర్వదా గంగను సేవించవలెను. గంగ భుక్తి ముక్తి ప్రదాయిని. ఏ దేశములందు గంగ ప్రవహించునో ఆ దేశములు పవిత్రములు. ఉత్తమగతిని అన్వేషించువారికి గంగ ఒక్కటియే సర్వోత్తమగతి. గంగను సేవించినచో మాతృపితృ వంశములు రెండును ఉద్ధరింపబడును. వేయి చాంద్రాయణ వ్రతములు చేయుట కంటె గంగాజల పానము

ఉత్తమము. ఒక మాసము గంగాసేవ చేసినవాడు సకల యజ్ఞముల ఫలములు పొందును. గంగాదేవి సకల పాపములను తొలగించును, స్వర్గమునిచ్చును. గంగాజలములో ఎముక పడి ఉన్నంత కాలము, ఆ జీవుడు స్వర్గములో నివసించును. అంధాదులు గంగాసేవ చేసి దేవతాతుల్యులగుదురు. గంగాతీర్థమునుండి మట్టి తీసి ధరించువాడు సూర్యుడు వలె సకలపాపములను నశింపచేయును. గంగాదర్శన, స్పర్శ, జలపానములు చేయువాడును, గంగానామ సంకీర్తన చేయువాడును తన వంశము నందలి ఎన్నో వేల తరముల వారిని పవిత్రము చేయును. (110)

ప్రయాగ మాహాత్మ్యము

వసిష్ఠా ఇపుడు ప్రయాగ మాహాత్మ్యమును గూర్చి చెప్పెదను. ఇది భుక్తి ముక్తి ప్రదమైనది. అత్యుత్తమము. బ్రహ్మ విష్ణ్వాది దేవతలును, గొప్ప మునీశ్వరులును ప్రయాగలో నివసింతురు. నదులు, సముద్రము, సిద్ధులు, గంధర్వులు, అప్సరసలు కూడ ఈ తీర్థము నందు నివసింతురు. ప్రయాగలో మూడు అగ్ని కుండములున్నవి. గంగ సకల తీర్థములను వెంటగైకొని ఈ కుండముల మధ్యనుండి మహావేగముతో ప్రవహించుచున్నది.

త్రిభువన విఖ్యాతము, సూర్యపుత్రియగు యమునకూడ అచట నున్నది. గంగాయమునల మధ్య భాగము పృథివీజఘన మనియు, ప్రయాగ జఘన మధ్యభాగము నందలి ఉపస్థ అనియు ఋషులు చెప్పుదురు. ప్రతిష్ఠాన సహితమగు ప్రయాగ, కంబలము, అశ్వతరము, నాగము, భోగవతీతీర్థము ఇది బ్రహ్మ యజ్ఞవేది అని చెప్పబడుచున్నది. వేదములును, యజ్ఞము లును ప్రయాగలో మూర్తిధరించి (ఆకారము వహించి) నివసించును. ఆ తీర్థమును స్తుతించుటచేతను, నామ సంకీర్తనము చేయుటచేతను, అచటి మట్టిని స్పృశించినంత మాత్రముచేతను మనుష్యుడు సకల పాప విముక్తుడగును. ప్రయాగలో గంగా యమునా సంగమమునందు చేసిన దాన, శ్రాద్ధ, జపాదులు అక్షయములగును. వసిష్ఠా! వేదము చెప్పినను, లోకము చెప్పినను గూడ అంతమునందు ప్రయాగములో ప్రాణములు విడువ వలెననెడు ఆలోచనను విడువరాదు. అరువది కోట్ల పదివేల తీర్థములు ప్రయాగలో ఉండును.

అందుచే అది అన్నింటి కంటెను శ్రేష్ఠమైనది. వాసుకి స్థానమైన భోగవతీ తీర్థము, హంస ప్రపతనము ఉత్తమ తీర్థములు. వీటియందు మూడు దినములు స్నానము చేయుటచే కోటి గోదానములు చేసిన ఫలము లభించును. 'గంగ అనేక స్థానములందు లభించవచ్చును. కాని మాఘ మాసమునందు, గంగా ద్వారమునందును, ప్రయాగ యందును, గంగా సాగర సంగమ మునందును గంగ లభించుట చాలకష్టము' అని పండితు లందురు. ప్రయాగలో దానము చేసినవాడు స్వర్గమునకు వెళ్ళి తిరిగి భూలోకమునకు వచ్చిన పిదప రాజాధి రాజగును. అక్షయవటమూల సమీపముననను, సంగమాదులందును మరణించిన వాడు విష్ణు లోకమును పొందును. ప్రయాగలో అతిసుందరమగు ఊర్వశీ పులినము, సంధ్యావటము, కోటితీర్థము, దశాశ్వమేధ ఘట్టము, గంగాయమునా సంగమము, రజోహీనమగు మానస తీర్థము, వాసరక తీర్థము-ఇవి చాల ఉత్తమమైనవి. (111)

వారాణసీ మాహాత్మ్యము

వారాణసి అత్యుత్తమమైన తీర్థము. శ్రీహరి నామస్మరణ చేయుచు అచట నివసించు వారు భుక్తి ముక్తులను పొందుదురు. పరమేశ్వరుడు పార్వతితో వారాణసీ మాహాత్మ్యము ను ఈవిధముగ వర్ణించి చెప్పెను. పార్వతీ! నేను ఈ క్షేత్రమును ఎన్నడును విడువను. కావుననే దీనికి అవిముక్తమని పేరు వచ్చినది. ఈ అవిముక్త క్షేత్రమునందు చేయు జపతప హోమములు అక్షయఫలమును ఇచ్చును. రాయితో రెండు కాళ్లు విరుగ గొట్టుకొని యైనను కాశీని విడువకుండ పడియుండవలెను. హరిశ్చంద్ర, ఆఘాతకేశ్వర, జప్యేశ్వర, శ్రీపర్వత, మహాలయ, భృగు, చండేశ్వర, కేదార తీర్థములను ఎనిమిదియు ఈ అవిముక్త క్షేత్రమున పరమగోపనీయములగు తీర్థములు. నా అవిముక్త క్షేత్రము గోపనీయములలో కెల్ల గోపనీయము. అది రెండు యోజనముల పొడవు, అర్ధయోజనము వెడల్పు ఉన్నది. వరణా అసీ అను నదులమధ్య 'వారాణసి' ఉన్నది. ఇచట జరుగు స్నాన, జప, హోమ, మృత్యు, దేవ పూజన, శ్రాద్ధ, దాన, నివాసాదుల వలన భుక్తి ముక్తులు రెండును లభించును. (112)

నర్మదాది మాహాత్మ్యము

ఇపుడు నర్మదాది మాహాత్మ్యమును చెప్పెదను.నర్మద శ్రేష్ఠమైన తీర్థము. గంగా జలము స్పర్శచే వెంటనే పవిత్రింపచేయును. కాని నర్మదదర్శన మాత్రము చేతనే పవిత్రింప చేయును. నర్మదా తీర్థము నూరు యోజనముల పొడవు, రెండు యోజనముల వెడల్పు ఉన్నది. అమర కంటతక పర్వతము నలువైపుల నర్మదానదికి సంబంధించిన అరువది కోట్ల అరువది వేల తీర్థము లున్నవి. కావేరీ సంగమ తీర్థము చాల పవిత్రమైనది. ఇపుడు శ్రీపర్వత మాహాత్మ్యమును చెప్పెదను. ఒకమారు గౌరి శ్రీదేవి రూపము ధరించి గొప్ప తపస్సుచేసెను. దానిచే ప్రసన్నుడైన శ్రీహరి ఆమెకు వరము లిచ్చుచు ఇట్లుచెప్పెను. 'దేవీ! నీకు ఆధ్యాత్మ జ్ఞానము లభించును. ఈ పర్వతము శ్రీపర్వతమను పేర విఖ్యాతి నొందును. దీని నలువైపుల నాలుగు వేల యోజనముల ప్రదేశము చాల పవిత్రమగును.' ఇచట చేసిన దాన, తపో, జప, శ్రాద్ధములు అక్షయఫలములగును. ఇచట మరణించు వారికి శివలోక ప్రాప్తి కలుగును. ఈ పర్వతముపై శివుడు సర్వదా పార్వతితో క్రీడించు చుండును. హిరణ్యకశిపుడు ఇచటనే తపస్సుచేసి చాలబలవంతుడయ్యెను. మునులు గూడ ఇచట తపస్సుచేసి సిద్ధి పొందిరి. (113)

గయామాహాత్మ్యము

అగ్ని దేవుడు చెప్పెను – ఇపుడు నేను గయామాహాత్మ్యమును చెప్పెదను. గయ ఉత్తమ తీర్థములలో ఉత్తమమైనది. గయుడను అసురుడు గొప్ప తపస్సు ప్రారంభించెను. దానిచే దేవతలు పీడితులై క్షీరసాగరశాయియగు విష్ణువు వద్దకు వెళ్ళి 'భగవంతుడా! నీవు గయాసురుని నుండి మమ్ము రక్షించుము' అని ప్రార్థించిరి. అటులనే అని పలికి శ్రీమహావిష్ణువు గయాసురుని వద్దకు వెళ్ళి 'వరము కోరుకొనుము' అని పలికెను. 'మహావిష్ణూ : నేను సకల తీర్థములకంటెను అతి

పవిత్రుడను అగుదును గాక!' అని గయుడు పలికెను. 'అటులనే అగుగాక' అని పలికి శ్రీమహావిష్ణువు వెడలిపోయెను. పిదప మానవులందరును ఆ దైత్యుని దర్శనముచేసి భగవంతుని చేరుచుండిరి. భూమి శూన్యమైపోయెను. అపుడు బ్రహ్మాదిదేవతలు మహావిష్ణువువద్దకు వెళ్ళి–'దేవా! స్వర్గము భూలోకము కూడ శూన్యమై పోయినవి. ఆ దైత్యుని దర్శనము చేసికొనినంత మాత్రముననే అందరును నీ లోకమును చేరుకొనుచున్నారు' అని పలికిరి. ఆ మాటలు విని శ్రీహరి బ్రహ్మతో 'నీవు దేవతాసమేతుడవై వెళ్ళి యజ్ఞభూమిగా చేయుటకై నీ శరీరమునిమ్ము అని గయాసురుని కోరుము'' అని పలికెను. బ్రహ్మ దేవతాసమేతుడై గయుని దగ్గరకు వెళ్ళి 'దైత్యశ్రేష్ఠా : నేను అతిథినై నీ ద్వారమువద్దకు వచ్చితిని. నీ పవిత్ర శరీరమును యజ్ఞము కొరకై ఇమ్ము' అని కోరెను. 'తథాస్తు' అని పలికి గయాసురుడు భూమిపై పరుండెను. బ్రహ్మ ఆతని శిరముపై యజ్ఞము ప్రారంభించెను. పూర్ణాహుతి సమయము వచ్చుసరికి గయుని శరీరము కదలిపోయెను. అది చూచి బ్రహ్మదేవుడు విష్ణువుతో 'దేవా! పూర్ణాహుతి సమయమున గయాసురుని శరీరము కదలి పోవుచున్నది' అని చెప్పెను. అపుడు విష్ణువు ధర్మదేవతను పిలిచి 'నీవు అసురుని శరీరముపై ధర్మమయ శిలను ఉంచుము. దేవతలు అందరును ఆ శిలపై కూర్చుండవలెను. దేవతలతోపాటు నా గదాధర మూర్తికూడ ఆ శిలపై ఉండగలదు' అని పలికెను. ఆ మాటవిని ధర్మ దేవత విశాలమగు దేవమయ శిలను తీసికొనివచ్చి ఆ అసురుని దేహముపై ఉంచెను. (ఆ శిలకథ ఇది) : ధర్మునకు తన భార్యయగు ధర్మవతి గర్భమున ధర్మవ్రతయను కుమార్తె జనించెను. ఆమె గొప్ప తపశ్శాలిని. బ్రహ్మ కుమారుడైన మరీచిమహర్షి ఆమెను పరిణయ మాడెను. శ్రీమహా విష్ణువు లక్ష్మీదేవితోవలె, శివుడు పార్వతితోవలె, మరీచి ధర్మవ్రతతో సుఖముగా నుండెను.

ఒకనాడు అడవినుంచి కుశ సమిధాదులు తెచ్చిన ఋషి చాల అలసిపోయెను. అతడు భోజనానంతరము ధర్మవ్రతను తన పాదములు ఒత్తుమని ఆజ్ఞాపింపగా ఆమె సరేనని అలసియున్న ఆ మహర్షి పాదములను ఒత్తసాగెను. ముని నిద్రించెను. ఇంతలో బ్రహ్మవచ్చెను. 'నేను బ్రహ్మదేవునికి సత్కారములు చేయవలెనా, లేదా? మహాముని పాదములు ఒత్తవలెనా?' బ్రహ్మ గురువునకు గూడ గురువు. నా భర్తకు కూడ పూజ్యుడు. అందుచే ఈయనను పూజించవలెను' అని ఆలోచించి ధర్మవ్రత బ్రహ్మను పూజించు చుండెను. మేల్కొన్న ముని ధర్మవ్రత అచట లేకుండుట జూచి, ఆజ్ఞను ఉల్లంఘించి నందులకు 'నీవు శిలవు కమ్ము' అని ఆమెను శపించెను. అది విన్న ధర్మవ్రత కుపితురాలై 'మునీ! నీ చరణసేవ విడచి నేను నీకు కూడ పూజ్యుడైన నీ తండ్రికి పూజచేసితిని. అందుచే నేను సర్వదా నిర్దోషురాలను. ఇట్టి పరిస్థితులలో నన్ను శపించితిరి. అందుచే నీకు గూడ శివునివలన శాపము లభించగలదు' అని పలికి శాపమును దూరముగా నుంచి, అగ్నిలో ప్రవేశించి వేలకొలది సంవత్సరములు తీవ్ర తపస్సు చేసెను. ఆ తపస్సుకు సంతసించిన విష్ణ్వాది దేవతలు వరము కోరు కొనుమని పలికిరి. 'మీరు నా శాపమును తొలగింపుడు' అని ధర్మవ్రత ప్రార్థించెను. దేవతలు పలికిరి–పూజ్యురాలా! మరీచిమహర్షి ఇచ్చిన శాపము అన్యథా కాజాలదు. నీవు దేవతాచరణ చిహ్నములచే అంకితమైన శరీరముగల పరమ పవిత్రమైన శిలగా అవగలవు. గయాసురుని శరీరమును స్థిరముగా ఉంచుటకై నీవు శిలారూపమును ధరించవలసియున్నది.

అపుడు నీకు 'దేవవ్రతా, దేవశిలా, సర్వదేవ స్వరూపా, సర్వతీర్థమయీ, పుణ్యశిలా' అను పేర్లు లభింపగలవు. దేవవ్రత పలికెను : దేవతలారా! మీరు నాపై అనుగ్రహించినచో బ్రహ్మ విష్ణు రుద్రాది దేవతలును, గౌరీ లక్ష్మ్యాది దేవులును నాపై సర్వదా ప్రకాశింతురుగాక.' అగ్నిదేవుడు పలికెను : దేవవ్రత మాటలు విని ఆ దేవతలందరును 'అట్లే అగుగాక' అని పలికి స్వర్గమునకు వెళ్ళిపోయిరి.

ఆ దేవమయీ శిలనే ధర్మదేవత గయాసురుని శరీరముపై నుంచెను. కాని గయుడు శిలతోసహ కదలనారంభించెను. అది చూచి రుద్రాదిదేవతలు కూడ ఆ శిలపై కూర్చుండిరి. ఆ దేవతలతోసహ అతడు కదల మొదలిడెను. అపుడు దేవతలు క్షీరసాగరము పై శయనించి యున్న విష్ణువును ప్రసన్నుని చేసికొనగా శ్రీమహావిష్ణువు తన గదాధర మూర్తిని వారికిచ్చి–'దేవతలారా మీరు వెళ్ళుడు. దేవగమ్యమైన ఈమూర్తి ద్వారా నేను ఈ విధముగగయుని శరీరము స్థిరముగా నుండునట్లు చేయుటకై సాక్షాత్ వ్యక్తావ్యక్తో భయ స్వరూపుడగు గదాధారియగు విష్ణువు అచట ఉండెను. ఆది గదాధరుడను పేరుతో శ్రీమహావిష్ణువు అచట ఉన్నాడు. పూర్వము గదుడను ఒక భయంకరుడగు రాక్షసుని శ్రీమహావిష్ణువు సంహరించగా, వాని ఎముకలతో విశ్వకర్మ గదను నిర్మించెను. అది 'ఆదిగద'. ఆ ఆది గదతో గదాధరుడు హేతి మొదలగు రాక్షసులను సంహరించెను. అందుచే అతడు 'ఆది గదాధరుడు' అయ్యెను. దేవమయీ శిలపై గదాధరుడు కూర్చుండగనే గయాసురుడు కదల కుండ ఉండెను. అపుడు బ్రహ్మ పూర్ణాహుతి ఇచ్చెను. గయాసురుడు దేవతలతో–'మీరు నన్నిట్లు ఏల వంచించితిరి? శ్రీ విష్ణువు చెప్పినచో నేను స్థిరముగా ఉండకుందునా! దేవతలారా మీరు నన్ను శిలాదులచే అణచి ఉంచినారు గాన నాకు వరమీయవలెను' అని పలికెను.

దేవతలు పలికిరి : 'తీర్థమును నిర్మించుటకై నీ శరీరము స్థిరముగా నుండునట్లు చేయబడినది గాన నీ క్షేత్రము బ్రహ్మ విష్ణు మహేశ్వరుల నివాస స్థానము కాగలదు. ఈ తీర్థము అన్ని తీర్థములకంటెను ఎక్కువ ప్రసిద్ధి పొందగలదు. పితృదేవతలకు ఇది బ్రహ్మ లోకమును ఇచ్చును' ఇట్లు పలికి దేవతలు అందరును అచటనే నివసించిరి. దేవీ తీర్థాదులు కూడ అచటనే నివాస మేర్పరచుకొనిరి. బ్రహ్మయజ్ఞము పూర్తిచేసి ఋత్విక్కులకు దక్షిణగా ఐదుక్రోసులదూరము గయాక్షేత్రమును ఏబదియైదు గ్రామములను సమర్పించెను. అనేకమైన బంగారు పర్వతములను నిర్మించెను. పాలు తేనె ప్రవహించు నదుల నిచ్చెను. దధి–మధువులతో నిండిన సరోవరములను ఇచ్చెను. అనేకమైన అన్నాది పర్వతములను, కామధేనువును, కల్పవృక్షమును, వెండి బంగారముల గృహములను కూడ ఇచ్చెను. వీటిని అన్నింటిని ఇచ్చుచు బ్రహ్మదేవుడు ఆ బ్రాహ్మణులతో ఇట్లు పలికెను–'విప్రవరులారా! ఇక మీరు నాకంటె తక్కువవానివద్దకు వెళ్లి ఎన్నడును యాచన చేయరాదు' ఇట్లుపలికి అతడు ఆ వస్తువులను అన్నింటిని వారికి సమర్పించెను. తరువాత ధర్ముడు యజ్ఞము చేయగా లోభముచే ఆబ్రాహ్మణులు అతని నుండి ధనాదిదానములు స్వీకరించి గయలో ఉంటూండగా బ్రహ్మ వారిని శపించెను. 'మీరు విద్యా విహీనులును లుబ్ధులును అగుదురు గాక ! ఈ నదులలో ఇకపై క్షీరాదులు ఉండవు, ఈ సువర్ణ శైలములు కూడ శిలలైపోవును' అపుడు బ్రాహ్మణులు బ్రహ్మతో ఇట్లు పలికిరి–'దేవా! మీ శాపముచే మా సర్వస్వము నష్టమై పోయినది. మా జీవికకు

ఏదైన మార్గము చూపుము'. బ్రహ్మదేవుడు ఇట్లు పలికెను. 'ఇటుపై మీ జీవిక ఈ తీర్థముద్వారా జరుగును. సూర్యచంద్రులు ఉన్నంత వరకును మీరు ఈ వృత్తితోడనే జీవించగలరు. గయకు వచ్చువారందరును మిమ్ములను పూజింతురు. హవ్య, కవ్య, ధన, శ్రాద్ధాదులతో మిమ్మును సత్కరించు వారి వంశములోని వారు నూరు తరములవరకును స్వర్గమునకు వెళ్ళుదురు. స్వర్గములోనే ఉన్నవారు ముక్తి పొందుదురు'. గయమహారాజు కూడా ఈ క్షేత్రమునందు బహ్వన్న దక్షిణలుగల యజ్ఞము చేసెను. అతని పేరుచేతనే గయా నగరమునకు ఆ పేరు వచ్చినది. పాండవులు కూడ గయ వెళ్ళి అచట శ్రీమహావిష్ణువును పూజించిరి. (114)

గయాయాత్రా విధి

అగ్ని పలికెను : గయ వెళ్ళవలెను అనుకొన్నవాడు విధిపూర్వకముగ శ్రాద్ధము చేసి, తీర్థయాత్ర వేషము ధరించి, గ్రామ ప్రదక్షిణము చేసి, ప్రతిదినము పాదచారియై యాత్ర చేయవలెను. ఇంద్రియములను మనస్సును వశములో నుంచుకొనవలెను. ఎవరి నుండియు దానము గ్రహింప రాదు. గయ వెళ్ళుటకు ఇంటినుండి బయలుదేరగనే, అడుగడుగునను పితృ దేవతలకు స్వర్గ సోపానములు ఏర్పడును. పితరుల శ్రాద్ధముకొరకై గయకు వెళ్ళుట వలన కలుగు పుణ్యము ముందు బ్రహ్మ జ్ఞానము ఎంత? గోవులను సంకటము నుండి రక్షించుటవలన కూడ అంత పుణ్యము కలుగదు. అట్టివాడు కురుక్షేత్రములో నివసించ వలసిన ఆవశ్యకతయే యుండదు. పుత్రుడు గయకు చేరగనే పితరులు ఉత్సవము చేసి కొందురు. 'ఈతడు పాదాలతోడనైనా జలస్పర్శ చేసి తర్పణము చేయడా?' అని వారు అనుకొచుందురు. బ్రహ్మజ్ఞానము, గయలో చేసిన శ్రాద్ధము, గోశాలలో మరణము, కురుక్షేత్రములో నివాసము-ఇవి మనుష్యుని ముక్తికి నాలుగు సాధనములు. నరకము నుండి భయపడిన పితరులు పుత్రుడు కావలెనని కోరుకొందురు. గయకు వెళ్ళి మన కుమారుడు మనలను ఉద్ధరింపగలడు అని వారు ఆలోచించుచుందురు. ముండనోప వాసములు సర్వ తీర్థములందును ఆచరించవలసిన సామాన్యవిధులు. గయా తీర్థమునందు కాలాదినియమ మేదియు లేదు.

అచట ప్రతి దినము పిండదానము చేయవలెను. అచట మూడు పక్షములు నివసించువాడు ఏడు తరముల వరకు పితరులను ఉద్ధరించును. అష్టకాతిథులందును, అభ్యుదయక కర్మలయందును, పిత్రాదుల క్షయాహ తిథియందును, గయలో తల్లి కొరకై వేరుగ శ్రాద్ధవిధానము ఉన్నది. అన్య తీర్థములలో స్త్రీ శ్రాద్ధమును ఆమె భర్తతో కలిపి మాత్రమే చేయవలెను. గయలో పిత్రాది క్రమమున నవ దేవతాకముగ గాని, ద్వాదశ దేవతాకముగ గాని శ్రాద్ధము చేయవలెను. మొదటి రోజున ఉత్తరమానస తీర్థమునందు స్నానము చేయవలెను. పరమ పవిత్రమగు ఉత్తర మానస తీర్థమునందు చేసిన స్నానము ఆయురారోగ్య వృద్ధి కలిగించి, పాపరాశులను నశింపజేసి, మోక్షము నిచ్చును. శ్రాద్ధకర్త దేవతా పిత్రాదులకు తర్పణము లిచ్చునప్పుడు-'నేను స్వర్గ అంతరిక్ష భూములపై నున్న సంపూర్ణ దేవతలను తృప్తి పరచుచున్నాను' అని భావన చేయుచు, పిదప పిండ ప్రదానము చేయవలెను.

స్వర్గ–అంతరిక్ష, భూ దేవతాదులకును, మాతా పిత్రాదులకును తర్పణములు ఈయవలెను. 'పితృ పితామహ ప్రపితామహుల ఉద్ధారము కొరకును, మాతృ, పితామహీ, ప్రపితామహుల ఉద్ధారము కొరకును మాతామహ, ప్రమాతామహ, వృద్ధప్రమాతామహుల ఉద్ధారము కొరకును, అన్యపితరుల ఉద్ధారము కొరకును నే నీ పిండ ప్రదానము చేయుచున్నాను. సోమ, మంగళ, బుధ, బృహస్పతి, శుక్ర, శని, రాహు, కేతురూపుడగు సూర్యు నకు నమస్కారము' అని చెప్పవలెను. ఉత్తర మానసతీర్థమునందు స్నానము చేయువాడు తన కులము నంతను ఉద్ధరించును. సూర్యునకు నమస్కరించి మౌనముగా దక్షిణమానస తీర్థమునకు వెళ్ళి–'నేను పితరుల తృప్తి కొరకై దక్షిణ మానస తీర్థమునందు స్నానము చేయు చున్నాను. పూర్వ పురుషులు అందరును స్వర్గ లోకమునకు వెళ్ళుదురు గాక అను ఉద్దేశ్య ముతో నేను గయకు వచ్చినాను' అని భావన చేయవలెను. పిమ్మట శ్రాద్ధ పిండ దానములు చేసి, సూర్యునకు నమస్కరించి 'సర్వ ప్రాణులను పోషించు సూర్యునకు నమస్కారము, ప్రభూ! నీవు నాకు అభ్యుదయము నిచ్చువాడవు, నిన్ను ధ్యానించుచున్నాను. నీవు నా పూర్వీకులందరికిని భుక్తి ముక్తులను ఇచ్చువాడవు. కవ్యవాట్, అనల, సోమ, తమ, ఆర్య మన్, అగ్నిష్వాత్త, బర్హిషద, ఆజ్యపులను మహానుభావులగు పితృదేవతలు ఇచటకు వచ్చెదరు గాక! మీచే సురక్షితులగు నా పితృ మాతృ–పితా మహాదులకు పిండ దానము చేయవలెనను ఉద్దేశ్యముతో నేనిచటకు వచ్చితిని' అని ప్రార్థించవలెను. ముండ పృష్ఠమునకు ఉత్తర భాగము నందు ఋషి–దేవాది పూజితమగు కనఖలక్షేత్రము మూడు లోకములందును విఖ్యాతమైనది. సిద్ధులకు ఆనంద దాయకములును, పాపాత్ములకు భయంకరములును అగు పెద్ద పెద్ద నాగములు, కదలుచున్న నాలుకలతో, ప్రతిదినము ఈ తీర్థమును రక్షించు చున్నవి. అచట స్నానముచేసి మనుష్యులు ఈ భూతలముపై సుఖముగా క్రీడించి, అంతమున స్వర్గమునకు పోవుదురు. పిదప మహానదిపై నున్న ఉత్తమ క్షేత్రమగు ఫల్గుణీ తీర్థమునకు వెళ్ళవలెను. ఇది నాగ, జనార్దన, కూప, వట, ఉత్తర మానసములకంటె గూడ శ్రేష్ఠమైనది. దీనికి 'గయా శిరోభాగము' అని పేరు. ఇది ముండవృష్ఠ, నగాది తీర్థములకంటె సారవత్తరమైనది. దీనికి 'ఆభ్యంతర తీర్థము' అని పేరు. ఈ తీర్థమున లక్ష్మి, కామధేను, జల, పృథ్వులు ఫలదాయకములు. దీనిచే దృష్టి రమణీయములగు మనోహర వస్తువులు ఫలించును. ఇది సామాన్య తీర్థము కాదు. ఫల్గు తీర్థమునందు స్నానముచేసి, గదాధర దర్శనము చేసికొనిన పుణ్యాత్మునకు లభ్యముకానిదేది? భూతలమున సముద్ర పర్యంతము ఉన్న తీర్థములును, సరోవరములును, దినమునకొక పర్యాయము ఫల్గుణీ తీర్థమునకు వచ్చుచుండును. శ్రద్ధావంతుడు ఫల్గుణీ తీర్థమునందు చేయు స్నానము ఆతని పితరులకు బ్రహ్మ లోకమును ఇచ్చును. ఆతనికి భుక్తిముక్తులను ప్రసాదించును. శ్రాద్ధకర్త స్నానానంతరము బ్రహ్మకు నమస్కరించి ఇట్లు ప్రార్థించవలెను. 'కలియుగమున అందరును మహేశ్వ రోపాసకులు, కాని ఈ గయా క్షేత్రమున ఉపాస్యుడు గదాధరుడు. ఇచట బ్రహ్మ లింగ రూపమున నివసించుచున్నాడు. ఆయనకు నమస్కరించు చున్నాను. గదాధర, బలరామ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, నారాయణ, బ్రహ్మ, విష్ణు, నృసింహ వరాహా దులకు నమస్కరించుచున్నాను.' పిదప గదాధరుని దర్శనము చేసికొనినవాడు నూరు తరములవారిని ఉద్ధరించును. మరునాడు ధర్మారణ్య తీర్థ సందర్శనము చేసికొనవలెను.

అచట మతంగ ఆశ్రమము నందలి మతంగవాపిలో స్నానముచేసి పిండదానము చేయవలెను. అచట మతంగేశ్వర, సుసిద్ధేశ్వరులకు నమస్కరించి 'సకలదేవతలు సాక్షిగా సమస్త లోకపాలులు సాక్షిగా, నేను మతంగ తీర్థమునకు వచ్చి పితరుల ఉద్ధారము చేసితిని' అని పలుకవలెను. పిదప బ్రాహ్మ తీర్థమను కూపము నందు స్నాన, తర్పణ, శ్రాద్ధములు చేయవలెను. ఆ కూపమునకును, యూపమునకును మధ్య చేసిన శ్రాద్ధము నూరుతరముల వారిని ఉద్ధరించును. మహాబోధివృక్షము నకు నమస్కారముచేసిన పుణ్యాత్ముడు స్వర్గలోకమును పొందును. మూడవ రోజున వ్రతపాలనము చేయుచు బ్రహ్మ సరోవర తీర్థమునందు పితరుల బ్రహ్మలోక ప్రాప్తికై స్నానము చేయుచున్నాను' అని చెప్పుచు స్నానముచేసి, తర్పణములు చేసి, పిండదానము చేయవలెను. పిదప వృక్షమును తడుపవలెను. వాజపేయ యజ్ఞఫలమును పొందగోరువాడు బ్రహ్మ స్థాపించిన యూపమునకు ప్రదక్షిణము చేయవలెను.

అచట ఒకముని జలకుంభమును, కుశాగ్రమును హస్తమునందు గ్రహించి చూత వృక్షములకు నీళ్ళు పోయుచుండెడివాడు. దానితో మామిడిచెట్లకు నీళ్లుపోసినట్లు అయినది; పితృ దేవతలకు తృప్తి కలిగినది. ఈ విధముగ ఒక పని రెండు లాభములను చేకూర్చినది. బ్రహ్మకు నమస్కారము చేయుటచే నూరు తరములవారిని ఉద్ధరించును. నాల్గవ దివసమున ఫల్గు తీర్థమునందు స్నానము చేసి దేవతాది తర్పణము చేయవలెను. గయా క్షేత్రము ఐదు క్రోసుల క్షేత్రము. దానిలో ఒక క్రోసు గయా శీర్షము. అచట పిండదానము చేసిన వాడు నూరు తరములవారిని ఉద్ధరించును. మహాదేవుడు ముండ పృష్ఠముపై తన పాదముంచెను. గయాసురుని శిరస్సు సరిగా ఆ ముండ పృష్ఠము నందే ఉన్నది. అందు చేతనే దానికి 'గయా శిరస్సు' అని పేరు. గయాశీర్షము ఉన్న స్థానము ఫల్గు తీర్థము. ఫల్గునందు అమృతధార ప్రవహించును. పితరులను ఉద్దేశించి అచట చేసిన దానము అక్షయమగును. దశాశ్వమేధ తీర్థమున స్నానము చేసి, బ్రహ్మ దర్శనము చేసికొని, రుద్ర పాదస్పర్శ చేసినవానికి మరల ఈ లోకమున జన్మము ఉండదు. గయా శీర్షమున శమీపత్ర ప్రమాణముగల పిండములను ఇచ్చినచో నరకములో నున్న పితరులు స్వర్గమునకు పోవుదురు. స్వర్గములో ఉన్నవారు మోక్షము పొందుదురు. అచట పిండ ప్రదానము క్షీరము, పిండి, చరువు, బియ్యము వీటితో చేయవలెను. తిల మిశ్రములగు గోధుమలతో గూడ రుద్ర పాదమునందు పిండదానము చేయుటచే మానవుడు నూరు తరములవారిని ఉద్ధరించును. విష్ణుపదిపై పిండ ప్రదానము చేయువాడు పితృ ఋణ విముక్తుడై, తండ్రి మొదలు నూరు తరములపై వారిని, తననుకూడ తరింపచేయును.

బ్రహ్మ పదమున శ్రాద్ధము చేసినవాడు పితరులను బ్రహ్మ లోకమునకు పంపును. దక్షిణాగ్ని, గార్హపత్యాగ్ని, ఆహవనీయాగ్నుల స్థానములందు శ్రాద్ధము చేసినవాడు యజ్ఞ ఫలమును పొందును. ఆవపథ్యాగ్ని, చంద్ర, సూర్య, గణేశ, అగస్త్య, కార్తికేయుల స్థానము లందు శ్రాద్ధము చేసినవాడు తన కులములు ఉద్ధరించును. సూర్యుని రథమునకు నమస్కరించి కర్ణాదిత్యునికి శిరము వంచవలెను. కనకేశ్వరుని పదమునకు నమస్కరించి గయా కేదార తీర్థమునకు నమస్కరించవలెను. దానిచే అన్ని పాపములనుండియు విముక్తుడై తన పితరులను బ్రహ్మ లోకమునకు పంపును. గయాశీర్షము నందు పిండ దానము చేయుటచే విశాలుడు పుత్రవంతుడాయెను.

విశాల నగరము నందు విశాలుడను రాజ పుత్రుడు ఉండెను. 'నాకు పుత్రోత్పత్తి ఎట్లు కలుగును' అని ఆతడు బ్రాహ్మణులను ప్రశ్నించెను. 'గయలో పిండదానము చేసినచో పుత్రులు కలుగుదురు' అని వారు చెప్పగా అతడు గయా తీర్థమునందు పితరులకు పిండ ప్రదానము చేసెను. అపుడు ఆయనకు ఆకాశమునందు తెల్లగాను, ఎర్రగాను, (నల్లగాను) ఉన్న పురుషులు కనపడిరి. మీరుఎవరని విశాలుడు అడుగగ వారిలో తెల్లని పురుషుడు పలికెను–'తెల్లగా నున్న నేను నీ తండ్రిని. నేను చేసిన పుణ్య కర్మలచే ఇంద్ర లోకమునకు వెళ్ళితిని. ఎఱ్ఱగా నున్నవాడు నా తండ్రి; నల్లనివాడు నా పితామహుడు. వీరు నరకములో పడియుండిరి. నీవు మమ్ములందరిని ముక్తులను చేసితివి. నీవు పిండదానము చేయుటచే మేము బ్రహ్మ లోకమునకు పోవుచున్నాము' అట్లు పలికి వారు ముగ్గురును వెళ్ళిపోయిరి. విశాలునకు పుత్ర పౌత్రాదులు కలిగిరి. అతడు రాజ్యము అనుభవించి మరణానంతరము విష్ణులోకమును పొందెను.

ఒక ప్రేతరాజు, ఇతర ప్రేతములతో చాల కష్టపడుచుండెను. ఇతడొకనాడు తన కథ వినకోరు చున్న వర్తకునితో ఇట్లు చెప్పెను–'మేము ఒకే పుణ్యము చేసితిమి. తత్ఫలితముగనే ఇపుడు అనుభవించుచున్నాము. ఒకమారు శ్రావణ, ద్వాదశీయోగము నందు మేము అన్న జలసహిత కుంభదానము చేసితిమి. ప్రతి దినము మధ్యాహ్నమున అంటే మా జీవన రక్షకొరకై వచ్చుచున్నది. నీవు మా నుండి ధనము తీసికొని వెళ్ళి మా నిమిత్తమై గయలో పిండదానము చేయుము. ఆ వర్తకుడు ధనము గ్రహించి గయలో పిండదానము చేసెను. తత్ఫలితముగా ఆ ప్రేతరాజు విముక్తి చెంది విష్ణులోకమును పొందెను. గయా శీర్షమునందు పిండదానము చేయుటచే మనుష్యుడు తనను, తన పితరులను గూడ ఉద్ధరించును. అచట పిండదానము చేయునపుడు ఇట్లు చెప్పవలెను– 'నా పితృమాతృ వంశములకు సంబంధించినవారును, గురుశ్వశుర బంధువుల వంశములకు సంబంధించినవారును తదితర బంధువులును భార్యాపుత్రాదులు లేకపోవుటచే శ్రాద్ధ కర్మ లుప్తమై పోయిన నా కులమునకు సంబంధించినవారును, పుట్టుకనుండియు గ్రుడ్డివారును, కుంటివారును, వికృతరూపము గలవారును, గర్భస్రావముచే మరణించిన వారును, ఈ విధముగ నా కులమునకు సంబంధించిన జ్ఞాతాజ్ఞాతులగు పితరులందరును, నేను చేయుచున్న ఈ పిండ ప్రదానమున శాశ్వత తృప్తిని పొందుదురు గాక. ప్రేతరూపమున ఉన్న నా పితరులు ఈ పిండ ప్రదానముచే సర్వదా తృప్తులగుదురుగాక. తమ వంశమును తరింపజేయదలచినవారు తమ తమ పితరుల నందరిని ఉద్దేశించి అచట పిండ ప్రదానము చేయవలెను. అక్షయ పుణ్యలోక ప్రాప్తికొరకై తప్పక తనకు తాను పిండ ప్రదానము చేయవలెను. బుద్ధిమంతుడు, ఐదవ దివసమున 'గదాలోలము' అను తీర్థము నందు స్నానము చేయవలెను. ఆ సమయమున 'జనార్దనా! నీవు గదా ప్రక్షాళనము చేసిన అత్యంత పావనమగు గదాలోల క్షేత్రమునందు సంసార రోగ నివృత్తి కొరకై స్నానము చేయుచున్నాను' అను అర్థముగల మంత్రమును చదువవలెను, 'అక్షయ స్వర్గము నిచ్చు అక్షయ వటమునకు నమస్కారము, పితృపితామహాదులకు అక్షయాశ్రయము, సర్వపాప వినాశకము అగు అక్షయ వటమునకు నమస్కారము' అని ప్రార్థించి అక్షయ వటము క్రింద శ్రాద్ధము చేసి, బ్రాహ్మ ణులకు భోజనము పెట్టవలెను. అచట ఒక బ్రాహ్మణునకు భోజనము పెట్టినచో కోటి బ్రాహ్మణులకు

భోజనము పెట్టిన ఫలము లభించును. అనేక బ్రాహ్మణులకు భోజనము పెట్టినచో ఇక చెప్పవలెనా? పితరులను ఉద్దేశించి అచట ఏమి చేసినను అది అక్షయమగును. గయకు వెళ్లి అన్నదానము చేసిన పుత్రుడుండిన యెడలనే తమకు పుత్రుడున్నట్లు పితరులు భావింతురు. వట, వటేశ్వరులకు నమస్కారము చేసి ప్రపితామహుని పూజించవలెను. ఇట్లు చేయువాడు తనను తాను ఉద్ధరించు కొనుటయే కాక నూరు తరములవారిని కూడ ఉద్ధరించును. సక్రమముగ నైనను అక్రమముగనైనను చేసిన గయా యాత్ర గొప్ప ఫలము నిచ్చును. (115)

మహానదిలో సంధ్యోపాసన

అగ్ని దేవుడు పలికెను :

మహానదిలో గాయత్రీ మంత్రముతోడనే స్నానము చేసి సంధ్యోపాసన చేయవలెను. ప్రాతః కాలమునందు గాయత్రీ సముఖమున శ్రాద్ధ పిండ దానములు అక్షయములగును. సూర్యోదయ సమయమునందు, మధ్యాహ్న కాలమునందును స్నానముచేసి గీత వాద్యాదులతో సావిత్రీ ఉపాసనచేసి, తత్సముఖముననే సంధ్యావందన మాచరించి నదీ తటమున పిండదానము చేయ వలెను. పిదప అగస్త్య పదమున పిండదానము చేసి, యోని ద్వారమున ప్రవేశించి బైటకు రావలెను. ఇట్లు చేసినవాడు మరల మాతృయోని యందు ప్రవేశించడు; అతనికి పునర్జన్మ ఉండదు. పిదప కాకశిలపై బలి ఇచ్చి కార్తికేయునకు నమస్కారము చేయవలెను. స్వర్గద్వార సోమకుండ, వాయుతీర్థములందు పిండదానము చేయవలెను. పిదప ఆకాశగంగా, కపిలాతటములపై పిండదానము చేయవలెను. అచట కపిలేశ్వరుడగు శివునకు నమస్కరించి అమోఘపద, గదాలోల, వాసరక, గోప్రచార తీర్థములందు పిండ ప్రదానము చేయవలెను. వైతరణియందు గోవుకు నమస్కారము చేసి, పిండదానము చేసినవాడు ఇరువదియొక్క తరములను ఉద్ధరించును. వైతరణీ తీరముపై శ్రాద్ధపిండదానములు చేసి పిదప క్రౌంచపాదమున పిండదానము చేయవలెను. తృతీయాతిథియందు విశాలా, నిశ్చలా ఋణమోక్ష, పాపమోక్షములందు పిండప్రదానము చేయవలెను. భస్మకుండము నందు భస్మ స్నానము చేసినవాడు సర్వపాప విముక్తుడగును. అచట జనార్దనునకు నమస్కరించి ఈ విధముగా ప్రార్థించవలెను 'జనార్దనా! ఈ పిండమును నీ చేతిలో ఉంచుచున్నాను. నాకు ఇది పరలోకము నందు అక్షయ రూపమున లభించుగాక'. సాక్షాత్ విష్ణుమూర్తియే గయలో పితృదేవతా రూపమున విరాజిల్లుచున్నాడు. ఆ పుండరీకాక్షుని దర్శనము చేసికొనినవాడు ఋణత్రయ విముక్తుడగును. పిదప మార్కండే యేశ్వరునకును గృధ్రేశ్వరునకును నమస్కారము చేయవలెను. మహాదేవుని మూల క్షేత్రమైన ధారలో పిండ ప్రదానము చేయవలెను. గృధ్ర కూట, గృధ్రవట, ధౌత పాదములందు కూడ పిండ ప్రదానము చేయవలెను. పుష్కరిణి కర్దమాల, రామ తీర్థములందు పిండ ప్రదానముచేసి, ప్రభాసేశ్వరునకు నమస్కరించి, ప్రేతశిలపై పిండ ప్రదానము చేయవలెను.

'దివ్యలోక, అంతరిక్షలోక, భూలోకములలో ప్రేతరూపమున ఉన్న నా పితరులు, ఇతర బంధువులును, ఈ పిండముల ప్రభావముచే ముక్తిపొందుదురుగాక అని చెప్పుచూ పిండ ప్రదానము చేయవలెను. గయాశీర్షము, ప్రభాస తీర్థము, ప్రేతకుండము అను మూడు స్థానములందు ప్రేతశిల

అత్యన్తపావనమైనదని చెప్పబడినది. ఇచట పిండ ప్రదానము చేయువాడు కులోద్ధారము చేసిన వాడగును. వసిష్ఠేశ్వరునకు నమస్కరించి ఆతని ఎదుట పిండప్రదానము చేయవలెను. గయానాభి, సుషుమ్నా, మహాకోష్ఠులందు కూడ పిండ ప్రదానము చేయవలెను. గదాధరుని ఎదుట, ముండ పృష్ఠముపై, దేవీ సమీపమున పిండ ప్రదానము చేయవలెను. వారి పూజచే భయము నశించును. విష రోగాదులు దూరమగును. బ్రహ్మకు నమస్కరించినవాడు తన కులమును బ్రహ్మ లోకము నకుపంపును. సుభద్రను, బలభద్రుని, పురుషోత్తముని పూజించినవాడు సకల కామములను పొంది కులమును ఉద్ధరించును! అంతమున స్వర్గమునకు పోవును. హృషీకేశునకు నమస్కరించి ఆతని ఎదుట పిండప్రదానము చేయవలెను. మాధవుని పూజించినవాడు విమానములో సంచరించుచు దేవతగా అగును. మహాలక్ష్మి, గౌరీ, సరస్వతుల పూజ చేసినవాడు తన పితరులను ఉద్ధరించి, తాను కూడ స్వర్గమునకు వెళ్ళి అచట భోగములు అనుభవించి, తిరిగి ఈ లోకమునందు జనించి శాస్త్ర విచారము చేయు పండితుడగును. పిదప ద్వాదశాదిత్యులను అగ్నిని, రేవంతకుని, ఇంద్రుని పూజించినవాడు రోగాది విముక్తుడై అంతమున స్వర్గమునకు పోవును. శ్రీ వరసిద్ధి వినాయకుని, కార్తికేయుని పూజించువానికి నిర్విఘ్నముగ సిద్ధి లభించును. సోమనాథ, కాళేశ్వర, కేదార, ప్రపితా మహ, సిద్ధేశ్వర, రుద్రేశ్వర, రామేశ్వర, బ్రహ్మకేశ్వరులను ఎనిమిది గుప్త లింగములను పూజించుటచే మానవుడు సర్వమును పొందగలడు. లక్ష్మీప్రాప్తి కోరువాడు నారాయణునకు, వారా హునకు, నరసింహునకు నమస్కరించవలెను. బ్రహ్మకును విష్ణువునకును, త్రిపుర నాశకుడగు మహేశ్వరు నకును గూడ ప్రణామము చేయవలెను. వారు అన్ని కోరికలను తీర్చు దేవతలు. సీతా, రామ, గరుడ, వామనులను పూజించువాడు సకల కామములను పొందును. పితరులను బ్రహ్మ లోకమునకు పంపును. దేవతా సహితుడైన ఆదిగదాధరుని పూజించినవాడు ఋణత్రయ విముక్తుడై తన కులము నంతను తరింపచేయును.

ప్రేతశిల దేవ రూపమైనది అగుటచే పరమపవిత్రమైనది. గయలో ఆ శిల దేవమయి. గయలో ఎవరిపేర ఈ పిండదానము చేసినను అది అతనిని సనాతన బ్రహ్మము నందు ప్రతిష్ఠింపచేయును. ఫల్గీశ్వర, ఫల్గుచండీ, అంగారకేశ్వరులకు నమస్కరించి మతంగముని స్థానమునందు పిండప్రదానము చేయవలెను. పిదప భరతాశ్రమమునందు కూడ పిండ ప్రదానము చేయవలెను. అదేవిధముగ హంసతీర్థ, కోటి తీర్థములందు గూడ చేయవలెను. పాండుశిలానదమున్న స్థానము నందు అగ్నిధారా, మధుశ్రవా తీర్థములందు పిండదానము చేయవలెను. పిదప ఇంద్రేశ్వర, కిలకిలేశ్వర, వృద్ధి వినాయకులకు నమ స్కరించి, ధేనుకారణ్యమున పిండ ప్రదానముచేసి ధేను పదమునందు గోవుకు నమస్కారము చేయవలెను. అందరు పితరులును ఉద్ధరింపబడుదురు. పిదప సరస్వతీ తీర్థమునకు వెళ్ళి పిండ ప్రదానము చేయవలెను. సాయంకాలమున సంధ్యోపాసన చేసి సరస్వతీదేవికి నమస్కరించవలెను. ఇట్లు చేయువాడు త్రికాల సంధ్యావందనము చేయు, వేదవేదాంగ పారంగతుడైన బ్రాహ్మణుడు అగును. గయా ప్రదక్షిణముచేసి అక్కడనున్న బ్రాహ్మణులను పూజించుటచే గయాతీర్థములో చేసిన అన్నదానాదిక పుణ్యము అక్షయ మగును. గదాధరుని స్తుతించి ఈ విధముగా ప్రార్థించవలెను. 'ఆదిదేవుడును, గదా ధారియు గయానివాసియు, పితరులకు సద్గతినిచ్చువాడును,

యోగదాతయు అగు గదాధరునకు ధర్మార్థ కామ మోక్ష ప్రాప్తికై నమస్కరించుచున్నాను. అతడు దేహేంద్రియ మనో బుద్ధి ప్రాణ అహంకార శూన్యుడు. నిత్యశుద్ధ, బుద్ధ, ముక్త, స్వభావుడు. ద్వైత శూన్యుడు దేవదానవాది వందితుడు దేవతలను, దేవీగణమునకు కూడ సర్వదా ఆయన సేవ చేయుచుందురు. నేను అతనికి నమస్కరించుచున్నాను! అతడు కలి కల్మషములను, కలిపీడను తొలగించువాడు. అతని కంఠమున వనమాల ప్రకాశించుచున్నది. సకలలోక పాలకులను పాలించు వాడు కూడ ఆతడే. అందరి కులములను ఉద్ధరించుటకై నిశ్చయించుకొని యున్నవాడు. తన స్వరూ పమును వ్యక్తావ్యక్త రూపములగు అన్ని వస్తువులందును విభజించియున్నను అతడు వాస్తవమున అవిభక్త స్వరూపుడు. అత్యంత స్థిరుడు సార భూతుడు; భయంకరములగు పాపములను తొలగించువాడు. నేను అతని చరణములకు నమస్కరించుచున్నాను. దేవా! గదాధరా! నేను నాపితరులకు శ్రాద్ధము చేయుటకై గయకు వచ్చినాను. నీవే ఈ విషయమున సాక్షిగా నుండుము. నేనీనాడు ఋణత్రయ విముక్తుడ నైతిని. బ్రహ్మ రుద్రాది దేవతలు నాకు సాక్షులుగా ఉందురుగాక. గయవచ్చి నేను పితరులను ఉద్ధరించితిని. శ్రాద్ధాది సమయములందు ఈ గయా మాహాత్మ్యమును పఠి కించుటచే మానవుడు బ్రహ్మ లోకమునకు పోవును. గయలో చేసిన పితృశ్రాద్ధము అక్షయము. అక్షయ బ్రహ్మలోకమును ఇచ్చును. (116)

శ్రాద్ధకల్ప వర్ణనము

కాత్యాయన మహర్షి మునులకు చెప్పిన శ్రాద్ధ కల్పమును చెప్పెదను వినుడు. గయాది తీర్థములలో విశేషించి సంక్రాంత్యాది సమయములందు శ్రాద్ధము చేయవలెను, అపరాహ్ణ కాలము నందు, కృష్ణ పక్షమున, చతుర్థీ తిథియందుగాని శ్రాద్ధమునకు కావలసిన సామగ్రి సంపాదించుకొని ఉత్తమ నక్షత్రమునందు శ్రాద్ధము చేయవలెను. శ్రాద్ధ దివసమునకు ఒక దివసము ముందుగనే బ్రాహ్మణుల నిమంత్రణము చేయవలెను. అనింద్యులును స్వ స్వకర్మ నిరతులును, శిష్టులును, సదాచారవంతులును అగు సన్యాసులను గృహస్థులను సాధువులను వేదస్నాతకులను, లేదా శ్రోత్రియు లను నిమంత్రించవలెను. బొల్లికల వారిని, కుష్ఠాదులు కలవారిని నియంత్రించరాదు. నియంత్రి తులగు బ్రాహ్మణులను స్నానాచమనాద్య నంతరము దేవకర్మకై పూర్వాభిముఖముగ కూర్చుండ బెట్టవలెను. దేవశ్రాద్ధ, పితృ శ్రాద్ధములందు ముగ్గురేసికాని, ఒక్కొక్కరు గాని బ్రాహ్మణులు ఉండ వలెను. మాతా మహాది శ్రాద్ధమునందు గూడ ఇట్లే. శ్రాద్ధకర్మ శాకాదులతో జరుపవలెను. శ్రాద్ధ దివసమున బ్రహ్మచర్య మవలంబించి క్రోధరహితుడుగా ఉండవలెను. ఆ రోజున చాల దూరము ప్రయాణము చేయకూడదు. స్వాధ్యాయాధ్యయనము చేయరాదు. ప్రతి ఒక్క కర్మ విషయము నను, పంక్తి పావనులగు బ్రాహ్మణులను అడుగుచుండవలెను. ఆసనములపై కుశలు పరచవలెను. పితృ కర్మలందు కుశలు రెండుగా మడచి వేయవలెను. మొదట దేవకర్మ చేసి పిదప పితృకర్మ చేయవలెను. దేవకర్మయందున్న బ్రాహ్మణులను 'నేను విశ్వేదేవులను ఆవాహన చేసెదను' అని అడుగగా వారు 'ఆవాహన చేయుము' అని అనుజ్ఞ ఇవ్వవలెను. పిదప 'విశ్వేదేవాసః ఇత్యాది మంత్రముచే విశ్వే దేవతల ఆవాహన చేసి ఆసనముపై యవలు చల్లవలెను. 'విశ్వేదేవాః శృణుతేమం'

ఇత్యాది మంత్రము జపించవలెను. పిదప 'నేనిపుడు పితృ దేవతలను ఆవాహన చేసెదను' అని కర్మనియుక్తులగు బ్రాహ్మణులను అడగవలెను. 'ఆవాహన చేయుము' అని వారు అనుజ్ఞ ఇచ్చిన పిదప 'ఉశన్తస్త్వా' ఇత్యాది మంత్రము చదువుచు ఆవాహన చేయవలెను. తిలలు చల్లి 'అయన్తః' ఇత్యాది మంత్రము జపించుచు, పవిత్రకసహితమగు అర్ఘ్య పాత్రమునందు 'శం నో దేవీ' ఇత్యాది మంత్రముతో ఉదకము పోయవలెను. పిదప 'యవోసి' ఇత్యాది మంత్రముచే యవలు ఇవ్వవలెను. పితరుల విషయమున సర్వత్ర తిలలు ఉపయోగించవలెను. పితృదేవతల అర్ఘ్యపాత్రము నందు 'శం నోదేవీ' ఇత్యాది మంత్రముచే ఉదకము పోసి 'తిలోసి సోమదేవత్యో గోసవే దేవ నిర్మితః ప్రత్నవద్భిః ప్రత్తః స్వధయా పితౄన్ లోకాన్ ప్రీణాహి స్వధానమః' అను మంత్రము చదువుచు తిలలు వేయవలెను. పిదప 'శ్రీశ్చ తే' ఇత్యాది మంత్రముచే అర్ఘ్య పాత్రమునందు పుష్పములు ఉంచవలెను. అర్ఘ్యపాత్రము సువర్ణమయముగాని, రజతమయము గాని, ఉదుంబర మయము గాని, పత్ర నిర్మితము గాని కావలెను, దేవతలకు సవ్యముగను పితృదేవతలకు అపసవ్యముగను ఈ వస్తువులను ఉంచవలెను. ఒక్కొక్కరికి ఒక్కొక అర్ఘ్య పాత్రము వినియోగించుట మంచిది. పితృదేవతలకు చేతిలో ముందుగా పవిత్రము నుంచిన పిమ్మటనే అర్ఘ్యమీయవలెను.

పిదప 'ఓం యా దివ్యా ఆపః .... సుహనా భవన్తు' అను మంత్రము చదువుచు 'విశ్వేదేవా ఏవ నో హస్తార్ఘ్యః స్వాహా' అని చెప్పి, విశ్వ దేవతలకు అర్ఘ్యమిచ్చి పాత్రలను దక్షిణ (కుడి) భాగమున ఉంచవలెను. పిత్రాదులకు కూడ స్వధా అని చివర చెప్పుచూ ఇదే విధముగ అర్ఘ్యము ఇవ్వవలెను. పితామహాదులకు కూడ ఇదే విధముగ ఇవ్వవలెను. అర్ఘ్యావశేషమును అంతను మొదటి పాత్రలో ఉంచవలెను. పాత్రలను మూడింటిని పిత్రా సన వామభాగమునందు 'పితృభ్యః స్థానమసి' అని చెప్పుచు బోర్లించవలెను. పిదప దేవ తలను పితరులను గంధ, పుష్ప, ధూప, దీప, వస్త్రాదులతో పూజించవలెను. పిదప పాత్ర నుండి ఘృతయుక్తమగు అన్నము తీసి, 'నే నీ అన్నమును అగ్నిలో హోమము చేసెదను' అని బ్రాహ్మణులను అడిగి, 'చేయుము'. అని వారు అనుజ్ఞ ఇచ్చిన పిమ్మట అగ్నిలో హోమము చేయవలెను. సాగ్ని యైనవాడు పవిత్రయుక్తమగు పితృహస్తమునందు మంత్రముతో హోమము చేయవలెను. 'అగ్నయే హవ్యవాహనాయ స్వాహా' అని మొదటి ఆహుతి చేయవలెను' రెండవది 'సోమాయ పితృమతే స్వాహా' అని చేయవలెను. యముని, అంగిరసుని ఉద్దేశించి ఆహుతి ఇవ్వవలెనని కొందరి మతము. హోమము చేయగా మిగిలిన అన్నము వరుసగ దేవతా-పితృపాత్రములందు వడ్డించి, పాత్రను హస్తముతో కప్పి 'ఓం పృథివీ తే పాత్రమ్ .... జుహోమి స్వాహా' అను మంత్రము జపించుచు, 'ఇదం పిషుర్విచక్రమే' ఇత్యాది మంత్రముతో బ్రాహ్మణుని అంగుష్ఠముతో ఆ అన్నమును స్పృశింపచేయవలెను. "అపహతా అసురా" ఇత్యాది మంత్రముతో పితృపాత్రమున తిలలు చల్లి సంకల్ప పూర్వకముగ అన్నము అర్పించవలెను. పిదప 'జుషధ్వమ్' (భుజింపుడు) అని చెప్పి, గాయత్ర్యాది మంత్రములను జపించవలెను. 'దేవతాభ్యః .... నమో నమః'. అను మంత్రమును గూడా జపించవలెను. పితృదేవతలు తృప్తిచెందిన విషయము తెలిసికొని, పాత్రము నందలి అన్నము చల్లవలెను. ఒక్కొక్కసారి అందరికిని జలము ఈయవలెను. సవ్యముగా నుండి గాయత్రీ మంత్రజపము చేసి, 'మధువాతా'

ఇత్యాది ఋక్కును జపించి, మీరు తృప్తి చెందినారా?' అని బ్రాహ్మణులను అడుగవలెను. మేము తృప్తులమైతిమి' అని వారు సమాధానము చెప్పవలెను. బ్రాహ్మణుల అనుమతిచే శేషాన్నము కలిపి పిండము చేయుటకై పాత్రనుండి బైటకుతీసి, పితృచ్ఛిష్టాన్న సమీపమున అవనేజనము చేసి, కుశలపై సంకల్ప పూర్వకముగ పిండదానము చేయవలెను. బ్రాహ్మణులు చేతులు కడిగికొని ఆచమనము చేసిన పిమ్మట పిండ ప్రదానము చేయవలెనని కొందరి మతము.

ఆచమనానంతరము ఉదకము పుష్పములు, అక్షతలు సమర్పించవలెను. పిదప అక్షయ్యోదకము ఇచ్చి ఆశీర్వాదమును కోరుచు, 'నా పితృదేవతలు సౌమ్యులుగా ఉందురు గాక' అనిపలికి ఉదకము వదలవలెను. 'మా గోత్రము సర్వదా వృద్ధి పొందుగాక, వేదముల పఠన–పాఠన క్రమము అవిచ్ఛిన్న ముగ కొనసాగుగాక! సంతానవృద్ధి అగు గాక. మాకు శ్రద్ధ లోపించకుండుగాక. దానము చేయుటకై మా వద్ద వివిధ వస్తు సామగ్రి ఉండుగాక, మావద్ద అన్నము కూడ అధికముగా నుండుగాక. మా ఇంటికి అతిథులు వచ్చుచుందురుగాక. యాచకులు మా వద్దకు వచ్చి యాచించుదురుగాక. మేము మాత్రము ఎవ్వరిని యాచించకుందుముగాక' అని ప్రార్థించవలెను. స్వధావాచనము నిమిత్తము పిండములపై పవిత్రక సహితమగు కుశములు కప్పి నేను స్వధావాచనము చేయించెదను' అని బ్రాహ్మణులను అడిగి, 'స్వధావాచనము చేయుము' అని వారి అనుజ్ఞపొంది ఈ విధముగా : 'బ్రాహ్మణులారా! మీరు మా పితృ పితామహ ప్రపితామహుల కొరకై స్వధావాచనము చేయుడు' అని చెప్పవలెను. అపుడు బ్రాహ్మణులు 'అస్తు స్వధా' అని అందురు. పిమ్మట కుశలపై దుగ్ధమిశ్ర జలమును దక్షిణాగ్ర ధారగా పోసి, అర్ఘ్యపాత్రను ఉత్తానము చేసి, దేవశ్రాద్ధ పితృ శ్రాద్ధ ప్రతిష్ఠార్థమై యథాశక్తిగ సువర్ణ రజత దక్షిణ ఈయవలెను. 'విశ్వేదేవాః ప్రియనామ్' అని చెప్పి దేవతావిసర్జన చేసి 'వాజే వాజే' ఇత్యాది మంత్రముచే పిత్రాదులను విసర్జించవలెను. 'అమావాజస్య' అను మంత్రము పఠించుచు బ్రాహ్మణులను అనుసరించి నడచి ప్రదక్షిణముచేసి ఇంటిలోనికి వెళ్ళవలెను. ప్రతి అమావాస్యయందును ఈ విధముగనే పార్వణ శ్రాద్ధము చేయవలెను.

ఇపుడు ఏకోద్దిష్ట శ్రాద్ధమును గూర్చి చెప్పెదను. ఈ శ్రాద్ధము కూడ వెనుకటివలెనే చేయవలెను. భేద మేమనగా దీనిలో ఒకే పవిత్రము, ఒకే అర్ఘ్యము, ఒకే పిండము ఇవ్వ వలెను. దీనిలో ఆవాహనము అగ్నౌకరణము, విశ్వేదేవపూజనము ఉండవు. తృప్తిని ప్రశ్నిం చినపుడు 'స్వదితమ్' అని ప్రశ్నించవలెను. బ్రాహ్మణుడు 'సుస్వదితమ్' అని ప్రత్యుత్తర మీయవలెను. 'ఉపతిష్ఠతామ్' అని చెప్పి అర్పణము చేయవలెను–అక్షయ్యోదకము కూడ ఇవ్వవలెను. విసర్జన సమయమున 'అభిరమ్యతామ్' అని పలుకవలెను. బ్రాహ్మణులు 'అభిరతాః స్మః' అని ప్రత్యుత్తర మీయవలెను. మిగిలినదంతయు వెనుకటివలెనే చేయ వలెను. ఇపుడు సపిండీకరణమును గూర్చి చెప్పెదను. ఇది సంవత్సరాంతము నందును మధ్య యందును కూడ చేయవచ్చును. దీనిలో పితరులకొరకు మూడుపాత్రలను, ప్రేతకు వేరుగా ఒక పాత్రయు ఉంచవలెను, నాలుగు అర్ఘ్యపాత్రములందును పవిత్రము, తిలలు, పుష్పములు, చందనము, జలముతో నింపవలెను. వాటి నుండియే అర్ఘ్యము నిచ్చు చుండవలెను. 'తే సమానాః' ఇత్యాది మంత్రద్వయముతో ప్రేతార్ఘ్యపాత్రను క్రమముగా పితృపితామహ ప్రపితామహ పాత్రలతో కలపవలెను. ఈ విధముగనే పిండదానము, దానము

మొదలగునవి గూడ చేసి, ప్రేత పిండమును పితరుల పిండములతో కలపవలెను. ఇట్లు చేయుటచే ప్రేతకు పితృత్వము ప్రాప్తించును.

ఇపుడు అభ్యుదయిక శ్రాద్ధమును గూర్చి చెప్పుచున్నాను. దీని విధి యంతయు వెనుకటి వలెనే. దీనియందు పితృ దేవతా మంత్రమును తప్ప ఇతర మంత్రముల జపము చేయవలెను. కోమల కుశలను ఉపయోగించవలెను. తిలలకు బదులు యవలు ఉపయోగించవలెను. పితరుల తృప్తిని గూర్చి బ్రాహ్మణులను ప్రశ్నించునపుడు 'సంపన్నమ్' అని ప్రశ్నించవలెను. వారు 'సుసం పన్నమ్' అని సమాధానము చెప్పవలెను దీనిలో పెరుగు, అక్షతలు, బదరీ ఫలములు మొదలగు వాటితో చేసిన పిండముల ప్రదానము చేయవలెను. ఆవాహన సమయమున 'నేను నాందీముఖులను పేరుగల పితృదేవతలను ఆవాహన చేసెదను' అని ప్రశ్నించవలెను. అక్షయ్యతృప్తి విషయమున 'ప్రీయతామ్' అనవలెను. 'నేను నాందీముఖ పితృదేవతల తృప్తి వాచనము జేయించెదను'అని అడిగి, బ్రాహ్మణుల అనుజ్ఞగొని, నాన్దీముఖాః పితరః ప్రియన్తామ్' అని చెప్పవలెను. పితృ, పితామహ, ప్రపితామహులు, మాతామహ, ప్రమాతా మహ, వృద్ధ ప్రమాతామహులను నాందీముఖ పితృ దేవతల అభ్యుదయిక శ్రాద్ధమునందు 'స్వధా' ఉపయోగింపరాదు. బ్రాహ్మణ ద్వయమునకు భోజనము పెట్టవలెను. ఇపుడు నేను పితృదేవతల తృప్తిని గూర్చి చెప్పెదను. గ్రామ్యాన్నము చేతను అరణ్యకంద, మూల, ఫలాదులచేతను ఒక మాసము తృప్తి కలుగును. మత్స్యములచే రెండు మాసములు, మృగ మాంసముచే ఆరు మాసములు, పక్షిమాంసముచే నాలుగు మాసములు, రురు మృగ మాంసముచే అయిదు మాసములు, మేక మాంసముచే ఆరు మాసములు, కూర్మ మాంసముచే ఏడు మాసములు, వరాహ మాంసముచే ఎనిమిది మాసములు మేష మాంసముచే తొమ్మిది మాసములు, మహిష పర్వత మృగాల మాంసములచే పదిమాసములు, గోక్షీర–పాయసములచే సంవత్సరము తృప్తి కలుగును. వర్ధ్రీనస మాంసముచే పండ్రెండు సంవత్సరముల పాటు తృప్తి కలుగును. ఖడ్గమృగ మాంసము, కాలశాకము, లోహితచ్ఛాగలము, మధువు మహాశల్కము వర్ష కాలమున మఘాశ్రాద్ధము ఇవి అక్షయ తృప్తిని ఇచ్చును.

మంత్రపాఠము చేయువాడు అగ్నిహోత్రి, శాఖాధ్యయనము చేయువాడు, షడంగ వేత్త, త్రిణాచికేతుడు, త్రిమధువు ధర్మ ద్రోణము పఠించునాడు, త్రిసువర్ణ బృహత్సామ ములు తెలిసినవాడు – ఇట్టి బ్రాహ్మణులు పంక్తిపావనులు. ఇపుడు కామ్య శ్రాద్ధకల్పమును గూర్చి చెప్పెదను. ప్రతిపత్తు నందు శ్రాద్ధము చేయుటచే అధికముగ ధనము లభించును. ద్వితీయయందు శ్రేష్ఠ స్త్రీ, చతుర్థియందు ధర్మ కామములు, పంచమినాడు పుత్రుడు, షష్ఠియందు శ్రేష్ఠత్వము, సప్తమినాడు వ్యవసాయములో లాభము, అష్టమినాడు ధనము, నవమినాడు గుట్టములు మొదలగు ఒక డెక్కగల మృగములు, దశమినాడు గోసముదా యము, ఏకాదశినాడు పరివారము, ద్వాదశినాడు ధనధాన్యవృద్ధి, త్రయోదశి నాడు స్వీయజాతి శ్రేష్ఠత్వము లభించును. చతుర్దశియందు శస్త్రహతులకు మాత్రమే శ్రాద్ధము పెట్టవచ్చును. దశార్ణ దేశము నందుండెడు ఏడుగురు వ్యాధులు, కాలంజరగిరిపై మృగములుగాను, శరద్వీపమునందు చక్రవాకములుగాను, మానస సరోవరమునందు, హంసలుగాను అయిరి. వారే ఇపుడు కురుక్షేత్రమునందు వేదపారంగతులైన బ్రాహ్మణులైరి. వారు చాలా దూరము దాటివేసినారు.

మీరు వారికంటె చాల వెనుకబడి కష్టపడుచున్నారు. శ్రాద్ధ సమయమున దీనిని చదువుటచే శ్రాద్ధము పరిపూర్ణమై బ్రహ్మలోకము నిచ్చును. పితామహుడు జీవించి యున్నచో పుత్రాదులు తమ తండ్రికిని, పితామహుని తండ్రికిని, ఆతని తండ్రికిని శ్రాద్ధము పెట్టవలెను. ప్రపితామహుడు జీవించియున్నచో పితృ, పితా మహ, వృద్ధ ప్రపితామహులకు శ్రాద్ధము పెట్టవలెను. మాతృ, మాతామహాది శ్రాద్ధము విషయమునందు గూడ ఇట్లే చేయవలెను. ఈ శ్రాద్ధ కల్పమును పఠించు వానికి, శ్రాద్ధ ఫలము లభించును. ఉత్తమ తీర్థములందును, యుగాది, మన్వాది తిథులందును చేసిన శ్రాద్ధము అక్షయము. అశ్విన శుక్ల నవమి, కార్తిక ద్వాదశి, మాఘ, భాద్రపద తృతీయలు, ఫాల్గున అమావాస్య, పౌషశుక్లైకాదశి, ఆషాఢ దశమి, మాఘ సప్తమి, శ్రావణ కృష్ణ అష్టమి, ఆషాఢ, కార్తిక, ఫాల్గున, జ్యేష్ఠ పూర్ణిమలు ఈ తిథులు స్వాయంభువాది మనువులకు సంబంధించినవి. వీటి ఆది భాగమునందు చేసిన శ్రాద్ధము అక్షయమగును. గయా, ప్రయాగ, గంగా, కురుక్షేత్ర, నర్మదా, శ్రీపర్వత, ప్రభాస, శాలగ్రామ తీర్థ, కాశీ, గోదావరీ, శ్రీపురుషోత్తమ క్షేత్రాదులలో చేసిన శ్రాద్ధము ఉత్తమము. (117)

భారతవర్ష వర్ణనము

అగ్నిదేవుడు పలికెను :

సముద్రమునకు ఉత్తరమునను, హిమాలయమునకు దక్షిణమునను, ఉన్న వర్షము 'భారత వర్షము'. దీని విస్తారము తొమ్మిదివేల యోజనములు. స్వర్గాపవర్గములు పొంద గోరువారికి ఇది కర్మభూమి. మహేంద్ర, మలయ, సహ్య, శుక్తిమత్, హిమాలయ, వింధ్య, పారియాత్రములు. ఈ వర్షమునందు సప్తకుల పర్వతములు, ఇంద్రద్వీప, కసేరు, తామ్ర వర్ణ, గభస్తిమత్, నాగద్వీప, సౌమ్య, గాంధర్వ, వారుణములు ఎనిమిది ద్వీపములు. సముద్రముచే చుట్టబడియున్న భారత వర్షము తొమ్మిదవ ద్వీపము. భారత ద్వీపము ఉత్తరము నుండి దక్షిణమునకు వేలకొలది యోజన ములు పొడవైనది. భారతమునందు పైన చెప్పిన తొమ్మిది భాగములున్నవి. భారతము మధ్యము నందున్నది. దానికి తూర్పున కిరాతులు, పశ్చిమమున యవనులు ఉందురు. మధ్యభాగమున బ్రాహ్మణాది వర్ణములవారు ఉందురు. వేద, స్మృత్యాది నదులు పారియాత్రము నుండియు, నర్మ దాదులు వింధ్యా చలము నుండియు, తాపీ, పయోష్ణీ, గోదావరీ, భీమరథీ, కృష్ణవేణీ నది మొదల గునవి సహ్యాద్రి నుండియు, కృతమాలాదులు మలయము నుండియు, త్రిసామాదులు మహేంద్ర పర్వతము నుండియు, కుమార్యాది నదులు శుక్తి మత్పర్వతము నుండియు, చంద్ర భాగాదులు హిమాలయము నుండియు ఆవిర్భవించినవి. భారతమునకు పశ్చిమమున కురు, పాంచాల, మధ్య దేశాదులున్నవి. (118)

మహాద్వీపాది వర్ణన

అగ్నిదేవుడు చెప్పెను :

జంబూ ద్వీపము ఒక లక్ష యోజనముల విస్తారము కలది. అది నలుమూల లందును ఒక

లక్ష యోజనముల విస్తారముగల క్షీర సముద్రముచే పరివేష్టితమైనది. ఆ క్షీర సముద్రమును చుట్టి ప్లక్షద్వీప మున్నది. మేధాతిథి పుత్రులు ఏడుగురు ఆ ప్లక్ష ద్వీపమునకు అధిపతులు. శాంత, భయ, శిశిర, సుఖోదయ, ఆనంద, శివ, క్షేమ, ధ్రువులను పేరుగల ఆ ఏడుగురి పేర్లతో ఏడు వర్షములున్నవి. గోమేధ, చంద్ర, నారద, దుందుభి, సోమక, సుమనస్, శైలములను పర్వతములు ఈ వర్షముల మర్యాదా పర్వతములు. అచట వైభ్రాజులను సుందరులు నివసించుచుందురు. ఈ ద్వీపము నందు ఏడు ప్రధాన నదులున్నవి. ప్లక్ష ద్వీపమునుండి శాకద్వీపము వరకును ఉండు ప్రదేశమున నివసించువారి ఆయుర్దాయము ఐదువేల సంవత్సరములు. అచట వర్ణాశ్రమ ధర్మములు పాలింప బడుచుండును. ఆర్య, కురు, వివింశ, భావి అనునవి అచట ఉండు బ్రాహ్మణాదుల పేర్లు. ఆరాధ్య దేవత చంద్రుడు. ప్లక్ష ద్వీప విస్తారము రెండు లక్షల యోజనములు. అంతయే ప్రమాణముగల ఇక్షురస సముద్రము దానిని చుట్టియున్నది. దీని తరువాత నున్నది శాల్మలి ద్వీపము. ఇది ప్లక్ష ద్వీపము కంటె రెట్టింపు ఉండును. వపుష్మంతుని ఏడుగురు కుమారులు, శ్వేత, హరిత, జీమూత, లోహిత, వైద్యుత మానససుప్రభ నామధేయులు ఈ ద్వీపమునకు అధిపతులు. అచట వీరిపేర్లతో ఏడు వర్షములు ఏర్పడినవి. దానికంటె రెట్టింపు వైశాల్యముగల సురోద సముద్రము దానిని చుట్టియున్నది. కుముద, అనల, బాలాహక, ద్రోణ, కంక, మహిష, కకుద్మ పర్వతములు దీని మర్యాదా పర్వతములు. ఏడు ప్రధాన నదులున్నవి. అచటి బ్రాహ్మణాది వర్ణములకు కపిల, అరుణ, పీత, కృష్ణులని పేరు. అచటివారు వాయు దేవతారాధకులు. దీని తర్వాత కుశద్వీపము జ్యోతిష్మంతుని ఏడుగురు కుమారులు ఉద్భిదుడు, ధేనుయుతుడు, ద్వైరథుడు, లంబనుడు, ధైర్యుడు, కపిలుడు, ప్రభాకరుడు అనువారు దీని అధిపతులు. వీరి పేర్లతోడనే ఏడు వర్షములు ఏర్పడినవి. దధి మొదలగువారు ఇచట ఉండు బ్రాహ్మణాదులు. వీరు బ్రహ్మరూప ధారియగు విష్ణువును పూజింతురు. విద్రుమ, హేమశైల, ద్యుతిమత్, పుష్పవత్, కుశేశయ, హరి, మందరాచలములు ఇచటి వర్ష పర్వతములు. ఈ కుశ ద్వీపము చుట్టి, దానితో సమానమైన వైశాల్యముగల ఘృత సముద్రమున్నది. ఈ ఘృత సముద్రమును క్రౌంచ ద్వీపము పరివేష్టించి యున్నది. ద్యుతిమంతుని కుమారులు ఈ ద్వీపమునకు అధిపతులు. వారి పేర్లతోడనే ఇచటి వర్షములు ప్రసిద్ధములైనవి.

కుశలుడు, మనోనుగుడు, ఉష్ణుడు ప్రధానుడు, అంధకారకుడు, మతి దుందుభి అనువారు ద్యుతిమంతుని ఏడుగురు కుమారులు. ఆ ద్వీపమున ఏడు మర్యాదా పర్వత ములు, ఏడునదులు ఉన్నవి. క్రౌంచ, వామన, అంధకారక, రత్నశైల, దేవావృత, పుండరీక, దుందుభులు పర్వతములు. ఈ ద్వీపములు క్రమముగ రెట్టింపు విస్తారము గలవి. పూర్వ పూర్వ ద్వీపముల ప్రమాణము కంటె ఉత్తరోత్తర ద్వీప పర్వతముల ప్రమాణము రెట్టింపు ఉండును. అచటి బ్రాహ్మణాది వర్ణములకు వరుసగ పుష్కర, పుష్కల, ధన్య, తిష్యులని పేర్లు. వారు శ్రీమహావిష్ణువును ఆరాధించుచుందురు. క్రౌంచ ద్వీపమును చుట్టి తక్ర (మజ్జిగ) సముద్రమున్నది. ఆ సముద్రమును శాకద్వీపము పరివేష్టించి ఉన్నది. అచటి రాజైన భవ్యుని ఏడుగురు కుమారులు, జలద, కుమార, సుకుమార, మణీవక, కుశోత్తర, మోదాకి, ద్రుములనువారు, శాక ద్వీపపాలకులు. ఇచటి వర్షములు గూడ వీరి పేర్లతో

ప్రసిద్ధి పొందినవి. ఉదయగిరి, జలధర, రైవత, శ్యామ, కోద్రక, ఆంబికేయ, కేసరి, అను ఏడు పర్వతములు, ఏడు నదులు ఉన్నవి. అచట నున్న బ్రాహ్మణాదులకు మగ, మగధ, మానస్య, మందగులని పేర్లు. వారు సూర్య రూపధారియగు నారాయణుని ఆరాధించుచుందురు, శాకద్వీప మును చుట్టి క్షీరసాగరము ఉన్నది. దానిని పుష్కర ద్వీపము పరివేష్టించి యున్నది. అచటి ప్రభువగు సవన మహారాజునకు మహాదాతుడు. ధాతకి అను ఇద్దరు పుత్రులుండిరి. అచటి రెండు వర్షములు వారి పేర్లతో ప్రసిద్ధి చెందినవి. మానసోత్తరమను ఒకే వర్షపర్వతము వర్షమధ్యమున వలయా కారమున నున్నది. దాని విస్తారము కొన్నివేల యోజనములు. ఎత్తు విస్తారముతో సమానము. ఆనాటి జనులు పదివేల సంవత్సరములు జీవింతురు. అచట దేవతలు బ్రహ్మను పూజింతురు. పుష్కర ద్వీపము చుట్టు మధురజల సముద్రము ఉన్నది. దాని విస్తారము ద్వీప విస్తారముతో సమానము. మహామునీ! అచట సముద్రజలము పెరుగుటగాని, తరుగుటగాని ఉండదు. శుక్లపక్షము లందు చంద్రోదయ అస్తమయము లందు సముద్ర జలమున కేవలము ఐదువేల పదిఅంగుళముల జలముపెరుగుట తరుగుట కనబడును. తియ్యని నీరుగల ఆ సముద్రము నలువైపుల రెట్టింపు ప్రమాణముగల సువర్ణమయ భూమి ఉండును. కాని అచట ప్రాణులు ఏవియు ఉండవు. దాని తరువాత లోకాలోకపర్వత మున్నది. దాని వైశాల్యము పదివేల యోజనములు. లోకాలోక పర్వతము ఒక వైపున అంధకారావృతమై యుండును. ఆ అంధకారము అండ కటాహముచే ఆవరింపబడి ఉన్నది. అండకటాహ సహితమగు మొత్తము భూమి వైశాల్యము ఏబది కోట్ల యోజనములు. (119)

భువనకోశ వర్ణన

అగ్నిదేవుడు చెప్పెను :

వసిష్ఠా! భూమి విస్తారము డెబ్బది వేల యోజనములని చెప్పబడినది. రవి ఎత్తు పదివేల యోజనములు. భూమి క్రింద ఏడు పాతాళములు ఉన్నవి. ఒక్కొక్క పాతాళము పదేసి వేల విస్తారము గలది. అతలము, వితలము, నితలము, ప్రకాశమానమగు మహాతలము, సుతలము, తలాతలము, రసాతలము అని వాటి పేర్లు. ఈ పాతాళముల భూములు క్రమముగా నలుపు, పసుపు, ఎరుపు, తెలుపు, శర్కరామయము, శిలామయము, సువర్ణమయము అయి ఉండును. ఈ పాతాళములు అన్నియు చాల సుందరములైనవి. వాటిలో దైత్యదానవాదులు సుఖముగా నివసించుచుందురు. ఈ పాతాళముల క్రింద శ్రీమహావిష్ణువు యొక్క తమోగుణ ప్రధాన విగ్రహమైన ఆదిశేషుడు ఉండును. ఇతనికి అనంతగుణములుండుటచే అనంతుడని పేరు. ఇతడు తన శిరముపై భూమిని ధరించు చుండును. భూమి క్రింద అనేక నరకములున్నవి. కాని విష్ణు భక్తులు నరకములకు వెళ్ళరు. సూర్యునిచే ప్రకాశింప చేయబడుచున్న పృథ్వి ఎంత విస్తృతమైనదో నభోలోకము గూడ అంత విస్తృతమైనది. వసిష్ఠా! సూర్యుడు పృథివికి ఒక లక్ష యోజనముల దూరము నందుండును. సూర్యునకు లక్ష యోజనముల దూరమున చంద్రుడు ఉండును. చంద్రునకు లక్షయోజనముల దూరమున నక్షత్రమండలమున్నది. నక్షత్రమండలమునకు రెండు లక్షల యోజనముల దూరమున బుధుడు, అచటికి రెండు లక్షల యోజనముల దూరమున శుక్రుడు, అచటికి రెండు లక్షల

యోజనముల దూరమున కుజుడు, అచటికి రెండు లక్షల యోజనముల దూరమున గురుడు, అచటకు రెండు లక్షల యోజనముల దూరమున శనియు ఉన్నారు. అక్కడికి లక్ష యోజనముల దూరమున సప్తర్షి మండలమున్నది. సప్తర్షి మండలమునకు లక్ష యోజనముల దూరమున ధ్రువుడు ఉన్నాడు. త్రిలోకముల ఎత్తు ఇదియే. ధ్రువునకు కోటి యోజనముల దూరమున మహర్లోకమున్నది. కల్పాంత జీవులగు భృగ్వాదులు ఆ లోకమునందు ఉందురు. మహర్లోకము నుండి రెండు కోట్ల యోజనముల దూరమున జనలోకమున్నది. సనక-సనందనాది సిద్ధపురుషులు అచట నివసింతురు. జనలోకము నుండి ఎనిమిది కోట్ల యోజనముల దూరమున తపోలోకము ఉన్నది. అచట వైరాజులు అను దేవతలు నివసించుచుందురు. తపోలోకము నుండి తొంబది ఆరుకోట్ల యోజనముల దూరమున సత్యలోకమున్నది. మృత్యురహితులగు పుణ్యాత్ములు, దేవతలు, ఋషులు ఆ సత్యలోకమునందు నివసింతురు. దానికే బ్రహ్మలోకమని పేరు.

పాదములతో నడచి వెళ్లునంతవరకు ఉన్నది భూలోకము. భూలోకము-సూర్య మండలముల మధ్యన ఉన్న లోకము భువర్లోకము. సూర్యలోకమునుండి ధ్రువలోకము వరకును ఉన్నది స్వర్గలోకము. దాని విస్తారము పదునాలుగు లక్షల యోజనములు. ఇదే త్రైలోక్యము. అండకటాహముచే చుట్టబడి ఉన్న విస్తృత బ్రహ్మాండ మిదియే; ఈ బ్రహ్మాండమును క్రమముగ జల, అగ్ని, వాయు, ఆకాశరూపములగు ఆవరణములు బైట ఆవరించి ఉన్నవి. వీటి అన్నింటి పైన అహంకారావరణ మున్నది. ఈ జలాద్యావర ణములు ఉత్తరోత్తరము పది రెట్లు చొప్పున ఉండును. అహంకార రూపావరణమును మహత్తత్త్వ రూపావరణము చుట్టియున్నది. మహామునీ! ఈ ఆవరణము లన్నియు ఒకదానికంటె ఒకటి క్రమముగ పదిరెట్లు పెద్దవి. ప్రధానము మహత్తత్త్వమును కూడ ఆవరించి యున్నది. దాని కెన్నడును అంతము లేదు కాన అనంతము. అందుచేతనే దానికి సంఖ్యగాని, ప్రమాణముగాని లేదు. మునీ! అది సకల జగత్కారణము. దానికే అపరా ప్రకృతి అని పేరు. దానినుండి అసంఖ్యాకములగు బ్రహ్మాండములు పుట్టినవి. కాష్ఠము నందు అగ్ని, తిలయందు తైలము ఉన్నట్లు ప్రధానమునందు స్వయంప్రకాశ చేతనాత్మకుడగు వ్యాపకుడైన పురుషుడున్నాడు. ఓ మహాప్రాజ్ఞా! పరస్పర సంయుక్తులైన ప్రకృతి పురుషులు సకల భూతముల ఆత్మయగు విష్ణుశక్తిచే ఆవరింపబడి ఉన్నారు. మహామునీ! శ్రీమహావిష్ణు స్వరూపమగు ఆ శక్తియే ప్రకృతి పురుషుల సంయోగ వియోగములకు హేతువు. సృష్టి సమయమున వాటియందు క్షోభ కలుగుటకు హేతువు అదియే. జలసంపర్కముచే ఎట్లు వాయువు జలకణములందున్న శీతలత్వమును ధరించునో అట్లే మహావిష్ణుశక్తి ప్రకృతి పురుషమయ జగత్తును ధరించుచున్నది. విష్ణు శక్తి ఆశ్రయము వలననే దేవతాదులు ప్రకటమగుచున్నారు. ఆ విష్ణువే బ్రహ్మ. సకల జగత్కారణము.

మునిశ్రేష్ఠా! సూర్యుని రథము విస్తారము తొమ్మిదివేల యోజనములు. దాని ఈషా దండము దీనికి రెట్టింపు. పద్దెనిమిదివేల యోజనముల పొడవైనది. దాని ఇరుసు ఒకటిన్నర కోట్ల ఏడు లక్షల పొడవుగలది. దానిపై చక్రము తగిల్చియున్నది. దానికి పూర్వాహ్న మధ్యాహ్న, అపరాహ్నములను మూడు నాభులున్నవి. సంవత్సర, పరివత్సర, ఇడావత్సర, అనువత్సర, వత్సరములు అను ఐదు ఆకులు. ఆరు ఋతువులు, ఆరునేములు, రెండు అయనములు దాని శరీరము. ఈ

సంవత్సరమయ రథచక్రమున కాలచక్ర మంతయు ప్రతిష్ఠితమైనది. మహామతీ! సూర్య రథము ధుర నలుబది యైదువేల పొడవైనది. దాని యుగము (కాడి)లో సగము భాగము రెండుధురల పరిమాణముతో తుల్యము. ఆ రథము నందలి చిన్న ధురయు, దాని యుగార్థము ధ్రువాధారముపై ఉన్నవి. ఉత్తమవ్రతపాలకా! గాయత్ర్యాది ఛందఃసప్తకము సూర్యుని ఏడు గుఱ్ఱములు. సూర్యుడు కనబడుట ఉదయము, కనపడకుండుట అస్తమయము, వసిష్ఠా! పృథివి మొదలు ధ్రువుని వరకును ఉన్న ప్రదేశము ప్రళయకాలమునందు నశించిపోవును. సప్తర్షుల పైన ఉత్తరముగ ధ్రువుడున్న ప్రదేశము విరాడ్రూపుడగు శ్రీమహావిష్ణువు మూడవ పదము. పుణ్యాపాపములు క్షీణింపగా దోషరూప పంక విముక్తులగు సంయతచిత్తులైన మహాత్ములకు అది నివాస స్థానము. ఈ విష్ణు పదము నుండియే గంగ ఆవిర్భవించినది. గంగ సంస్మరణ మాత్రము చేతనే సకల పాపములను నశింప చేయును. ఆకాశమునందు శింశుమార ఆకృతితో ఉన్న నక్షత్ర సముదాయము విష్ణు స్వరూపమైనది.

దాని పుచ్ఛభాగము ధ్రువుని స్థానము. ధ్రువుడు తాను తిరుగుచు, చంద్ర సూర్యాదులను తిప్పుచున్నాడు. సూర్యుని రథమును ప్రతి మాసమునందును, వేరు వేరు దేవతలు, శ్రేష్ఠులైన ఋషులు, గంధర్వులు, అప్సరసలు, యక్షులు, సర్పములు, రాక్షసులు అధిష్ఠించి ఉందురు. సూర్యుడే చలి, వేడి, వర్షము మొదలగు వాటికి కారణము. ఋగ్యజుఃసామ వేదాత్మకుడగు శ్రీమహావిష్ణువు ఈ సూర్యుడే. ఇతడే శుభాశుభములను ఇచ్చువాడు. మూడు చక్రములుగల చంద్రుని రథమునకు కుడి ఎడమవైపుల కుంద కుసుమము వలె తెల్లగా ఉండు పది గుఱ్ఱములు కట్టబడి ఉండును. ఆ రథముపై చంద్రుడు సంచరించును. ముప్పది మూడు వేల ముప్పదిమూడు వందల ముప్పది ముగ్గురు (36,333) దేవతలు చంద్రుని అమృతమయ కళలను పానము చేయుచుందురు. అమావాస్యయందు, పితృ దేవతలు, 'అమా' అను కళను ఆశ్రయించి, చంద్రుని మిగిలిన రెండు కళలలో ఒక అమృత కళను త్రాగుదురు.

చంద్రుని కుమారుడైన బుధుని రథము వాయువు అగ్నిమయ పదార్థ నిర్మితము. ఎనిమిది గుఱ్ఱములు ఉండును. ఆ రథముపై బుధుడు సంచరించు చుండును. శుక్ర, కుజ, గురు, శని, రాహు, కేతువుల రథములకు గూడ ఎనిమిదేసి గుఱ్ఱము లుండును. విప్రవరా! శ్రీమహావిష్ణు స్వరూపమగు జలమునుండి పర్వత, సముద్రాదిసహితము, కమల సదృశము అగు పృథివి ఉత్పన్నమైనది. గ్రహ, నక్షత్ర, త్రిలోక, నదీ, పర్వత, సముద్ర, వనాదులన్నియు విష్ణు స్వరూపములే. విజ్ఞాన విస్తారముకూడ విష్ణు స్వరూపమే. 'విజ్ఞానము కంటె అతిరిక్త మగు వస్తు వేదియును లేదు'. శ్రీమహావిష్ణువు జ్ఞానస్వరూపుడు. ఆతడే పరమపదము. చిత్తశుద్ధి ద్వారా విశుద్ధ జ్ఞానమును పొంది విష్ణు స్వరూపుడు అగుటకు తగు ఉపాయములను మానవుడు అవలంబించవలెను. సత్యము, అనంత జ్ఞానస్వరూపము అగు బ్రహ్మమే విష్ణువు.

ఈ భువనకోశమును పఠించువాడు పరమాత్మ పదమును పొందును. ఇపుడు నేను జ్యోతి శ్శాస్త్రాది విద్యలను గూర్చి చెప్పెదను. వాటిలో చెప్పిన శుభాశుభ ఫలములకు అధిపతి శ్రీమహావిష్ణువే. (120)

జ్యోతి శ్శాస్త్ర సారము

అగ్ని పలికెను : మహామునీ! ఇపుడు శుభాశుభ వివేకమును ఇచ్చునదియు, మనుష్యుని సర్వజ్ఞునిగ చేయునదియు, నాలుగు లక్షల శ్లోకముల జ్యోతిశ్శాస్త్రము యొక్క సార భూతమును అగు జ్యోతిశ్శాస్త్రమును గూర్చి సంక్షిప్తముగా చెప్పెదను. కన్యయొక్క జన్మరాశి నుండి వరుని రాశి సంఖ్య ఆరు-ఎనిమిదిగాని, తొమ్మిది-అయిదుగాని, రెండు-పండ్రెండు గాని అయినచో వారి వివాహము శుభప్రదము కాదు; మిగిలిన పది-నాలుగు, పదకొండు-మూడు, సమసప్తకము అయినచో శుభప్రదము; వధూవరుల రాశ్యధిపతులు పరస్పర మిత్రులైనను, రెండు రాశుల అధి పతియు ఒక్కడే అయినను ఇరువురి జన్మనక్షత్రములకు మైత్రి ఉన్నను, పంచమ-నవమ, ద్విర్ద్వాదశ దోషములు చూడక వివాహము చేయవచ్చును. షష్ఠాష్టక మున్నపుడు మాత్రము ఎన్నడును వివాహము చేయరాదు. గురు-శుక్రులు అస్తంగతులై యుండగా వివాహము చేయుటచే వరుడు మరణించును. గురు క్షేత్రమున సూర్యుడును, సూర్యక్షేత్రమున గురువును ఉన్నచో వివాహము మంచిది కాదు. కన్యకు వైధవ్యము కలుగును. బృహస్పతి వక్రమైనను అతిచారవంతుడైనను వివాహోప నయనములు చేయరాదు. తప్పనిసరియైనపుడు అతిచార సమయమున పక్షత్రయమును వక్రుడైనపుడు నాలుగు మాసములను విడచి ఉపనయనాదులు చేయవలెను. చైత్ర-పుష్య మాసములందును రిక్త తిథియందును, శ్రీమహావిష్ణువు నిద్రించు చున్నప్పుడును మంగల-రవివారము లందును, చంద్రుడు క్షీణించి యున్నపుడును వివాహము శుభకరము కాదు. సంధ్యాకాలము శుభము. రోహిణి, ఉత్తరాత్రయ, మూల, స్వాతీ, హస్త, రేవతి నక్షత్రములందు, తుల తప్ప మిగిలిన ద్వి స్వభావ రాశులందును, స్థిర రాశులందును వివాహము శుభప్రదము. వివాహ-కర్ణవేధ-ఉపనయన-పుంసవన సంస్కారము లందును అన్నప్రాశన-చూడా కర్మలందును విద్ధ నక్షత్రమును పరిత్యజిం పవలెను. శ్రవణ-మూల-పుష్యనక్షత్రములందును రవి-మంగళ-బృహస్పతి వారములందును, కుంభ-సింహ-మిథున లగ్నములందును పుంసవనము చేయవలెను. హస్త-మూల-మృగశీర్ష-రేవతీ నక్షత్రములందును, బుధ శక్రవారము లందును, పిల్లలను ఇల్లు కదుపుట మంచిది. తొలి సారిగా తాంబూల భక్షణము చేయుటకు రవి, సోమ, గురు, శుక్రవారములును, మూల నక్షత్రము ఉత్తమమైనవి. శుక్ర, గురువారములందును మకర, మీన లగ్నము లందును, హస్తాది నక్షత్ర పంచకము నందును, పుష్యమునందును, కృత్తికాది నక్షత్ర త్రయమునందును, అన్నప్రాశనము చేయవలెను. అశ్వినీ, రేవతీ, పుష్య, హస్త, జ్యేష్ఠా, రోహిణి, శ్రవణ నక్షత్రములందు నూతనాన్న ఫలభక్షణము శుభకరము. స్వాతీ, మృగశిరా నక్షత్రములందు ఔషధసేవ చేయవలెను. పూర్వాత్రయము నందును, మఘా, భరణి, స్వాతీ, శ్రవణ, ధనిష్ఠ, శత భిషక్కులందును, రవి, శని, మంగళవారములందును, రోగ విముక్తుడు స్నానము చేయవలెను.

మట్టితో చేసిన చతురస్ర పట్టము మీద ఎనిమిది దిక్కులందు ఎనిమిది హ్రీంలు వ్రాసి, మధ్య తన పేరు వ్రాయవలెను. లేదా మట్టితో చేసిన పట్టముపై గాని భూర్జపత్రముపై గాని ఎనిమిది దిక్కులందును హ్రీం వ్రాసి మధ్య తన పేరు గోరోచనా కుంకుమలతో వ్రాయవలెను. ఇట్టి యంత్రము

నకు వస్త్రము చుట్టి కంఠమునందు ధరించుటచే తప్పక శత్రువులు వశమగుదురు. ఈ విధముగనే 'శ్రీం' హ్రీంలతో సంపుటితమైన పేరును గోరోచనముతోను కుంకుమతోను ఎనిమిది భూర్జపత్రములపై వ్రాసి భూమిలో పాతిపెట్టి నచో విదేశములకు వెళ్ళిన వ్యక్తి శీఘ్రముగ తిరిగివచ్చును. ఆ యంత్రమునే పసుపు రసముతో శిలాపట్టముపై వ్రాసి క్రిందికి ముఖముండునట్లు భూమిపై ఉంచినచో శత్రు స్తంభనమగును. 'ఓం' 'హూం' 'సః' మంత్రములచే సంపుటితమైన పేరును గోరోచనా కుంకుమలతో ఎనిమిది భూర్జ పత్రములపై వ్రాసి ఉంచినచో మృత్యునివారణము కలుగును. ఈ మంత్రమును ఒక మారు, ఏడుమార్లు, తొమ్మిదిమార్లు వ్రాసినచో పరస్పర ప్రేమ కలుగును. రెండుసార్లు, ఆరుసార్లు, లేదా పండ్రెండుసార్లు వ్రాసినచో వియోగమును పొందినవారు కలియుదురు. మూడు, ఏడు లేదా పదకొండు సార్లు వ్రాసినచో లాభము కలుగును. నాలుగు, ఎనిమిది, పండ్రెండు సార్లు వ్రాసినచో పరస్పర శత్రుత్వము కలుగును. మేషాది లగ్నముల వలన తను, ధన, సహజ, సుహృత్, సుత, రిపు, జాయా, నిధన, ధర్మ, కర్మ, ఆయ, వ్యయ భావములు ఏర్పడును. ఇపుడు నవతారాబలము చెప్పబడుచున్నది. జన్మ, సంపత్, విపత్, క్షేమ, ప్రత్యరి, సాధక, మైత్ర, అతిమైత్రములని తొమ్మిది తారలు.

బుధ, గురు, శుక్ర, రవి, సోమవారములందును. మాఘాది మాసషట్కము నందును, బాలకునకు ప్రథమ క్షౌరకర్మ చేయుట మంచిది. కర్ణవేధ సంస్కారమునకు బుధ. గురువారములు, పుష్య, శ్రవణ,చిత్రా నక్షత్రములును మంచివి. ఐదవ సంవత్సరము నందు,ప్రతిపత్, షష్ఠీ, రిక్తతిథి, పూర్ణిమలను, మంగళవారమును విడచి ఇతర తిథివారము లందు విష్ణువును, లక్ష్మిని పూజించి అక్షరారంభము చేయవలెను. మాఘమునుండి ఆరు మాసముల వరకును ఉపనయన సంస్కారమునకు శుభకరము. శ్రావణాది మాసషట్కము చూడా కరణాది సంస్కారములకు మంచివి కావు. గురు, శుక్రులు అస్తంగతు లైనపుడును, చంద్రుడు క్షీణుడై యున్నపుడును యజ్ఞోపవీత ధారణము చేయుటచే బాలుడు జడబుద్ధి యగును; లేదా మరణించును. క్షౌరమునకు చెప్పిన నక్షత్రములందును, శుభగ్రహ వారములందును, సమావర్తన సంస్కారము చేయుట మంచిది. లగ్నము శుభ గ్రహరాశి యైనను, శుభగ్రహము లగ్నమునందు ఉన్నపుడును లేదా చూచుచున్నను అశ్వినీ, మఘా, చిత్రా, స్వాతీ, భరణీ, ఉత్తరాత్రయ, పునర్వసు, పుష్య నక్షత్రములందును, ధనుర్వేదము ప్రారంభించవలెను. భరణి, ఆర్ద్ర, మఘ, ఆశ్లేష, కృత్తిక, పుబ్బ నక్షత్రములందు జీవింప గోరువాడు ఎవ్వడు నూతన వస్త్ర ధారణము చేయరాదు. బుధ, గురు, శుక్రవారములందు వస్త్ర ధారణము చేయవలెను. వివాహాది మంగళ కార్యములందు వస్త్రధారణము విషయమున నక్షత్రాది విచారము చేయపనిలేదు. రేవతి, అశ్వినీ, ధనిష్ఠా నక్షత్రములందు, హస్తాది నక్షత్ర పంచకమునందును; శంఖ, విద్రుమ, రత్నములను ధరించవలెను. భరణీ, ఆశ్లేషా, ధనిష్ఠా, పూర్వాత్రయ, కృత్తికా నక్షత్రములందు వస్తువులను కొన్నను, అమ్మినను హాని కలుగును. అశ్విని, స్వాతి, చిత్రా, రేవతీ, శతభిషా, శ్రవణ నక్షత్రములందు కొనుట లాభదాయకము; అమ్ముట అశుభకరము. భరణీ, పూర్వాత్రయ, ఆర్ద్రా, ఆశ్లేషా, మఘా, స్వాతీ, కృత్తికా, విశాఖా నక్షత్రములందు స్వామి సేవా ప్రారంభము చేయరాదు. ఈ నక్షత్రములందు ఇతరులకు ద్రవ్యము ఇచ్చుటగాని, తాకట్టు పెట్టుటగాని చేయకూడదు. ఉత్తరాత్రయ, శ్రవణ, జ్యేష్ఠా నక్షత్రములందు రాజ్యాభిషేకము చేయవలెను.

చైత్ర, జ్యేష్ఠ, భాద్రపద, అశ్విని, పౌష, మాఘ మాసములు తప్ప ఇతర మాసములు గృహారంభమునకు మంచివి. అశ్వినీ, రోహిణీ, మూల, ఉత్తరాత్రయ, మృగశీర్ష, స్వాతీ, హస్త, అనురాధా నక్షత్రములును, రవి, మంగళవారములు తక్క ఇతర వారములును గృహ, తటాక, వాపీ, ప్రాసాదారంభములకు శుభప్రదములు. గురుడు సింహరాశిలో ఉన్నపుడును, గుర్వాదిత్యము నందును (అనగా గురుడు సింహము నందును, సూర్యుడు ధనుర్మీనము లందును ఉన్నపుడు, అధికమాసము నందును, శుక్రుడు బాలుడుగా గాని, వృద్ధుడుగాగాని, అస్తగతుడుగాగాని ఉన్నప్పు డును గృహమునకు సంబంధించిన కార్యములు ఏవియు చేయరాదు. శ్రవణాది నక్షత్రపంచకము నందు తృణకాష్ఠ సంచయము చేసినచో అగ్నిదాహము, భయము, రోగము, రాజపీడ, ధననాశము కలుగును. ధనిష్ఠ, ఉత్తరా త్రయము, శతభిషక్–ఈ నక్షత్రములందు గృహప్రవేశము చేయవలెను. ద్వితీయా, తృతీయా, పంచమీ, సప్తమీ, త్రయోదశీ తిథులు నౌకా నిర్మాణమునకు మంచివి. ధనిష్ఠా, హస్త, రేవతీ, అశ్వినీ నక్షత్రములందు రాజదర్శనము చేయవలెను.

పూర్వాత్రయ, ధనిష్ఠా, ఆర్ద్రా, కృత్తికా, మృగశీర్ష, విశాఖా, ఆశ్లేషా, అశ్వినీ నక్షత్రములందు యుద్ధయాత్ర సంపత్తిని ఇచ్చును. సిద్ధిదాయక మగును. అష్టమీ, అమావాస్యా, చతుర్దశుల యందును, ఉత్తరాత్రయమునందును రోహిణీ, శ్రవణ, హస్త, చిత్ర నక్షత్రములందును పశువులను గోశాల నుండి బైటకు అమ్ముటకై తీసికొని రాగూడదు; కొన్నవాటిని లోనికి తీసికొని పోగూడదు. స్వాతీ, ఉత్తరాత్రయ, రోహిణీ, మృగశీర్ష, మూల, పునర్వసు, పుష్య, హస్త శ్రవణ నక్షత్రములందు సాధారణ వ్యవసాయ ప్రారంభము చేయవలెను. పునర్వసు, ఉత్తరాత్రయ, స్వాతీ, పుబ్బ, మూల, జ్యేష్ఠా, శతభిషక్ నక్షత్రములందు రవి, సోమ, గురు, శుక్రవారము లందును, వృషభ, మిథున, కన్యా లగ్నములందును, ద్వితీయా, పంచమీ, దశమీ, సప్తమీ, తృతీయా, త్రయోదశులందును, దున్నుట మొదలగు వ్యవసాయపు పనులు చేయవలెను. రేవతీ, రోహిణీ, జ్యేష్ఠా, కృత్తిక, హస్త, అనూరాధా, ఉత్తరాత్రయము లందును, శని, మంగళవారములు మినహా ఇతర వారములందును, విత్తనములు చల్లినచో సకల సంపదలు లభించును. సస్యచ్ఛే దనము(పంట కోయుట)నకు రేవతీ, హస్త, మూల, శ్రవణ, పూర్వఫల్గునీ, మఘా, మృగశీర్ష నక్షత్రములును, మకర లగ్నము మంచిది. హస్త, చిత్ర, పునర్వసు, స్వాతీ, రేవతీ, శ్రవణాది త్రయములందు ధాన్యము తీసి, స్థిర లగ్నము నందును, బుధ, గురు, శుక్ర వారము లందును, భరణీ, పునర్వసు, మఘా, జ్యేష్ఠా, ఉత్తరాత్రయము నందును, ధాన్యమును గోదాములలో నిలవచేయవలెను.

'ఓం ధనదాయ సర్వ ధనేశాయ దేహి మే ధనం స్వాహా' ఓం నవే వర్షే ఇలాదేవి లోకసంవర్ధని కామరూపిణి దేహి ధనం స్వాహా' ఈ మంత్రములను పత్రముపై వ్రాసి ధాన్యరాశిపై ఉంచినచో ధాన్యాభివృద్ధి కలుగును. పూర్వాత్రయ విశాఖా, ధనిష్ఠా, శతభిషక్ నక్షత్రములందు ధాన్యమును బైటకు తీయవలెను. సూర్యుడు ఉత్తరాయణ మందున్నపుడు దేవతా, ఆరామ, తటాక, వాప్యాదుల (బావి మొదలగువాని) ప్రతిష్ఠ చేయవలెను. సూర్యుడు మిథున రాశిలో నున్నపుడు అమావస్యా నంతరము వచ్చు ద్వాదశులలో వరుసగా శ్రీమహావిష్ణు పరివర్తనోత్సవ–జాగరణోత్సవములు జరుప

వలెను. సూర్యుడు కన్యారాశిలో ఉండగా, అమావాస్యానంతరము వచ్చు అష్టమినాడు దుర్గాజాగరణము. త్రిపాద నక్షత్రములందు భద్రా, ద్వితీయా, సప్తమీ, ద్వాదశులు వచ్చినపుడు, రవి, శని మంగళవారములైనచో అది, త్రిపుష్కర యోగము. ప్రతికార్యమునకును చంద్ర, తారాబలము చూడవలెను. చంద్రుడు జన్మరాశియందు గాని తృతీయ, షష్ఠ, సప్తమ, దశమ, ఏకాదశ స్థానములందు గాని ఉన్నచో శుభుడు. శుక్ల పక్షమునందు ద్వితీయ, పంచమ, నవమ చంద్రుడు కూడ శుభుడు. మిత్ర, అతిమిత్ర, సాధక, సంపత్, క్షేమాది తారలు శుభకరములు. జన్మతార యందు మృత్యువు, విపత్తారయందు ధననాశము, ప్రత్యరి-మృత్యు తారలయందు మరణము కలుగును. కృష్ణపక్ష అష్టమి మొదలు శుక్లపక్ష అష్టమి వరకును క్షీణ చంద్రుడు, తరువాత పూర్ణ చంద్రుడు, సూర్యుడు వృషభ-మిథున రాశులందుండి, గురుడు, మృగశిర లేదా జ్యేష్ఠా నక్షత్రమునందు ఉండి, గురువారము, పూర్ణిమా తిథియు అయినచో మహా జ్యేష్ఠ. జ్యేష్ఠలో గురు-చంద్రులు, రోహిణిలో సూర్యుడు ఉండగా జ్యేష్ఠ మాస పూర్ణిమయైనచో ఆ పూర్ణిమ మహాజ్యేష్ఠ. స్వాతి రాకుండగనే యంత్రముపై ఇంద్రుని పూజచేసి, ఇంద్ర ధ్వజారోపణము చేయవలెను. శ్రవణమునందుగాని అశ్వనియందు గాని, వారాంతమున గాని విసర్జన చేయవలెను.

సూర్యుడు రాహుగ్రస్తుడైన సమయమున చేసిన సకల దానములు సువర్ణ దానములే. బ్రాహ్మణులందరును బ్రహ్మ సదృశులు. సకల జలములు గంగా జల సమానములు. రవి వారము నుండి శనివారము వరకును జరుగు రవి సంక్రాంతులకు వరుసగా ఘోర, ధ్వాంక్ష, మహోదర, మంద, మందాకిని, యుత, రాక్షసి అని పేర్లు. సూర్య సంక్రమణము కౌలవ, శకుని, కింస్తుఘ్న కరణముల నైనచో ప్రజలు సుఖవంతులగుదురు. గర, బవ, వణిక్, విష్టి, బాలవ కరణములందు అయినచో ప్రజలు రాజ దోషముచే పీడితులై, సంపదతో మాత్రముందురు. చతుష్పాత్, తైతిల, నాగకరణము లందు అయినచో దేశము నందు దుర్భిక్షము రాజ యుద్ధములు కలుగును, భార్యాభర్తల జీవితము విషయమున గూడ సంశయ మేర్పడును. రోగ ప్రారంభము జన్మ నక్షత్రము నందు గాని ఆధానమునందు (జన్మ నక్షత్రము నుండి పందొమ్మిదవ నక్షత్రమునందు గాని) అయినచో అధిక క్లేశ దాయకము. కృత్తికా నక్షత్రమునందైనచో తొమ్మిది దినముల వరకును, రోహిణియందైనచో మూడు రాత్రుల వరకును మృగశిరయందు అయినచో ఐదు రాత్రుల వరకును రోగముండును. ఆర్ద్రయందు అయినచో, ప్రాణనాశకము. పునర్వసు, పుష్య నక్షత్రములందు అయినచో ఏడు రాత్రులును, ఆశ్లేషయందు తొమ్మిది రాత్రులును ఉండును. మఖయందు ప్రాణనాశకము. పూర్వ ఫల్గునియందు అయినది తొమ్మిది మాసములును, ఉత్తర ఫల్గునియందు కలిగినది మూడు దినములును, చిత్తయందు కలిగినది పదిహేను దినములును, స్వాతిరోగము ఒకమాసము, విశాఖయందు ఇరువది దివసములు, అనూరాధా రోగము పది దివసములు, జ్యేష్ఠా రోగము పదునైదు దివసములును ఉండును. మూలా నక్షత్రమున ప్రారంభించిన రోగము విడువదు. పూర్వాషాఢా రోగము ఐదు దినములు, ఉత్తరాషాఢా రోగము ఇరువది దినములు శ్రవణ రోగము రెండు మాసములు, ధనిష్ఠారోగము పదునైదు దినములు, శతభిషరోగము పది దినములు ఉండును. పూర్వాభాద్రా రోగము విడవదు. ఉత్తరాభాద్రా రోగము ఏడు దినములు రేవతీ రోగము పది రాత్రులు, అశ్వనీ

రోగము ఒక రాత్రి ఒక పగలు మాత్రము ఉండును. భరణీ రోగము ప్రాణ నాశకము. పంచ ధాన్యములు, తిలలు, ఘృతము మొదలగు హోమ ద్రవ్యములతో గాయత్రీ మంత్రముతో హోమము చేసినచో రోగము తొలగి శుభ ఫలప్రాప్తి కలుగును. పాలు ఇచ్చు గోవును బ్రాహ్మణులకు దానము చేసినను రోగశాంతి కలుగును. (అష్టోత్తరీ దశా పద్ధతిలో) సూర్యదశ ఆరు సంవత్సరములు చంద్రుని దశ పదునైదు సంవత్సరములు, కుజ దశ ఎనిమిది, బుధదశ పదునారు, శని దశ పది, బృహస్పతి దశ పందొమ్మిది, రాహు దశ పండ్రెండు, శుక్ర దశ ఇరువదియొక్క సంవత్సరములు. (121)

కాలగణనము

అగ్ని దేవుడు పలికెను :

మహామునీ! ఇపుడు సంవత్సర సముదాయ రూపమగు కాలమును గూర్చి చెప్పెదను. కాలమును గూర్చి తెలుసుకొనుటకై గణితమును చెప్పెదను (బ్రహ్మ దినాది కాలమునుండి గాని, సృష్ట్యారంభ కాలమునుండి గాని, లేదా నిర్ణీతమైన శక ప్రారంభము నుండి గాని) వర్ష సముదాయమును పండ్రెండు (12)చే గుణించవలెను. దానితో గడచిన చైత్రాది మాసముల సంఖ్య చేర్చవలెను. దానిని రెండుచే గుణించి రెండు స్థానములందు ఉంచుకొన వలెను. ప్రథమ స్థానమునందు నాలుగు కలుపవలెను. ద్వితీయ స్థానమునందు ఎనిమిది వందల అరువదియైదు (865) కలుప వలెను. ఈ విధముగ ఏర్పడిన రెండు అంకములకు సుగుణములని పేరు. దానిని మూడు స్థానములందు ఉంచవలెను. వాటిలో మధ్యనున్న దానిని ఎనిమిదిచే గుణించి మరల నాలుగుచే గుణించవలెను. ఈ విధముగ మధ్యనున్న దాని సంస్కారముచేసి గోమాత్రికా క్రమమున ఉంచబడిన మూడింటిని యథాస్థానముగ కూడవలెను. మొదటి దానిని ఊర్ధ్వమనియు, రెండవ స్థానమున నున్న దానిని మధ్య మనియు, తృతీయ స్థానమున ఉన్న దానిని అధః అనియు పేర్లతో ఉంచుకొన వలెను. అధోంకము నుంచి 388, మధ్యాంకము నుంచి 87 తీసివేయవలెను. పిదప దానిని 60చే విభజించి శేషమును వేరుగా ఉంచుకొనవలెను. పిదప లబ్ధమును తరువాతి అంకముతో కలిపి 60తో భాగించవలెను. ప్రథమ స్థానాంకమును 7చే భాగించగా శేషించిన సంఖ్యను అనుసరించి రవ్యాదివారములు వచ్చును. మిగిలిన రెండు స్థానముల అంకములు తిథిధ్రువలగును. 'సగుణ'మును రెండుచే గుణించి, దాని నుండి మూడు తీసివేసి, దాని క్రింద సగుణము వ్రాసి దానికి 30 కలుపవలెను. పిదప 6; 12; 8; అంకములను మూడు స్థానములందును కలపవలెను. మరల 60చే భాగించి ప్రథమ స్థానమును 28చే భాగించి శేషమును వ్రాయవలెను. దానిక్రింద పూర్వానీత తిథి ధ్రువను వ్రాయవలెను. అన్నింటిని కలపగా ధ్రువ ఏర్పడును. మరల ఆ సగుణమునే చేయవలెను. దానిలో మూడు తీసివేసి రెండుచే గుణించవలెను. మధ్యను పదకొండుచే గుణించి క్రింద ఒకటి కలపవలెను. ద్వితీయ స్థానమునందు 39తో భాగించి, లబ్ధమును ప్రథమ స్థానమున తగ్గించవలెను. దానికే మధ్యమని పేరు. మధ్యయందు 22 తీసివేయవలెను. దానిని 60చే భాగించగా శేషము ఋణము. లబ్ధిని ఊర్ధ్వమునందు, అనగా నక్షత్ర ధ్రువయందు కలపవలెను. 27చే భాగించగా, శేషము నక్షత్ర-యోగముల ధ్రువ అగును. ఇపుడు తిథి నక్షత్రముల మాసికధ్రువ

చెప్పబడుచున్నది. (2-32-00) ఇది తిథి ధ్రువ (2-11-00) ఇది నక్షత్ర ధ్రువ ఈ ధ్రువమును ప్రతి మాసమునందును జోడించి, వారస్థానమున ఏడుచే భాగించి, శేషమును వారమునందు తిథియొక్క దండ ఫలముగా గ్రహించవలెను. నక్షత్రముకొరకు 27చే భాగించి, అశ్విని నుండి శేష సంఖ్య గల నక్షత్రము యొక్క దండాదిగా గ్రహించవలెను.

(పైన చెప్పిన విధముగ తిథ్యాది మానము మధ్యమానమును అనుసరించి నిశ్చయింప బడినది. దానిని స్పష్టము చేయుటకై సంస్కారమును చెప్పుచున్నాడు) చతుర్దశ్యాది తిథులందు చెప్పిన ఘటికలను క్రమముగా ఋణ-ధనములు గాను చేసికొనవలెను. చతుర్దశి యందు శూన్య ఘటిని, త్రయోదశీ-ప్రతిపత్తులందు ఐదు ఘటికలను క్రమముగా ఋణముగాను, ధనముగాను చేయవలెను. ద్వాదశీ-ద్వితీయల యందు పది ఘటికలు ఋణ ధనములుగా చేయవలెను. తృతీయైకాదశులందు 15 ఘటికలు, చతుర్థీ దశములందు 19 ఘటికలు, పంచమీ-నవములందు 22 ఘటికలు, షష్ఠీ-అష్టములందు 24 ఘటికలు, సప్తమియందు 25 ఘటికలు ధన-ఋణ సంస్కారము చేయ వలెను. ఈ అంశాత్మక ఫలమును చతుర్దశ్యాది తిథి పిండమునందు చేయవలెను. కర్కటకాది రాశి త్రయము నందు 6; 4; 3, తులాది రాశి త్రయమునందు 3, 4, 6 సంస్కారము చేయు టకై 'ఖండ' ఏర్పడును. మేషాది రాశి త్రయమునందు 50, 40, 12లను ధనము చేయవలెను. కర్కటకాది రాశిత్రయము నందు 12, 40, 50లు చేయవలెను. తులాదిరాశి షట్కమునందు వీటితో ఋణ సంస్కారము చేయవలెను. చతుర్గుణితమగు తిథియందు వికలాత్మక ఫల సంస్కారము చేయవలెను. 'గత' 'ఏష్య' ఖండల అంతరముచే కలను గుణించవలెను. 60చే భాగించవలెను. లబ్ధము ప్రథమో చ్చారమునందు ఋణఫలమైనను, ధనము చేయవలెను. ధనమైనచో ధనముగనే ఉంచవలెను. ద్వితీయోచ్చారిత వర్గము ఉన్నప్పుడు విపరీతము చేయవలెను. తిథిని రెట్టించి దాని ఆరవ భాగమును దానినుంచి తీసివేయవలెను. సూర్య సంస్కారమునకు విపరీతముగ తిథి దండమును కలపవలెను. ఋణ ఫలమును తగ్గించగా తిథిదండాదిమాన మేర్పడును, ఋణఫలము తీసివేయ వీలుకానిచో దానియందు 60 కలిపి సంస్కారము చేయవలెను. ఫలమే 60 కంటే అధికమైనచో దానిలో నుండి 60 తీసివేసి మిగిలినదాని సంస్కారము చేయవలెను. దానిచే తిథితోపాటు నక్షత్ర మానము కూడ ఏర్పడును. చతుర్గుణితమగు తిథియందు తిథి త్రిభాగమును కలిపి దానికి ఋణ ఫలము కూడా కలపవలెను. తష్టితము చేయగా యోగమానము వచ్చును. తిథి మానము స్పష్టమే. లేదా సూర్య-చంద్రయోగము చేసికూడ యోగమానము సాధించవచ్చును. తిథి సంఖ్యనుండి ఒకటి తీసివేసి, దానిని రెట్టించి, మరల ఒకటి తీసివేయగా చరాది కరణముల ఏర్పడును. కృష్ణపక్ష చతుర్దశి పరార్థము నుండి శకుని, చతుష్పదము, కింస్తుఘ్నము, నాగము అను నాలుగు స్థిర కరణములు వచ్చును. శుక్లపక్ష ప్రతివత్పూర్వార్థ మున కింస్తుఘ్నకరణము ఉండును.(122)

యుద్ధజయార్ణవము - నానాయోగములు

ఇపుడు యుద్ధజయార్ణవ ప్రకరణము నందు, విజయాది శుభకార్యసిద్ధికై, ప్రధాన విషయములను చెప్పెదను, అ, ఇ, ఉ, ఏ, ఓ- ఈ ఐదును స్వరములు. వీటి క్రమము ననుసరించి నందా, భద్రా,

జయా, రిక్తా, పూర్ణా అను తిథులు ఉండును. 'క' మొదలు 'హ' వరకును వర్ణములు వెనుక చెప్పిన స్వరములకు క్రమముగ సూర్య, మంగళులు, బుధ-చంద్రులు, బృహస్పతి-శుక్రులు, శని-మంగళులు అధిపతులు. 40ని 60చే గుణించ వలెను. దానిని పదకొండుచే భాగించవలెను. లబ్ధమును ఆరుచే గుణించి దాని ఫలమును మరల 11చే భాగించవలెను. లబ్ధమును మూడుచే గుణించి, దాని ఫలమునందు ఒకటి కలుపగా అన్ని పర్యాయములు నాడీస్ఫురణమును బట్టి ఫలము ఏర్పడును. దాని పిదప కూడ రాత్రింబగళ్లు నాడీస్ఫురణము అగుచుండును. ఉదా : $40 \times 60 = 2400; 2400/11 = 219$. ఈ లబ్ధము స్వల్పాంతరముచే ఏర్పడినది. దీనిని 6చే గుణించగా $219 \times 6 = 1314$. దీనిని మరల 11చే భాగించగా $1314/11 = 119$. శేషమైన 5ను విడచివేయవలెను. లబ్ధమైన 119ని 3చే గుణించగా గుణనఫలము 357. దీనికి 1 కలపగా 358. కొంచెము అంతరముచే దీనిని 360గా గ్రహించవలెను. అనగా చేతి నాడి 360 సార్లు కొట్టుకొనుటను బట్టి ఫలమగును. దానిని గుర్తించు పద్ధతి మున్ముందు చెప్పబడును. ఈవిధముగా నాడీ స్ఫురణము రాత్రింబగళ్ళు అగుచునే ఉండును. దాని మానము ననుసరించియే అకారాది స్వరములు ఉదయించు చుండును. మూడు స్ఫురణములచే ఒక ఉచ్ఛ్వాసము. ఆరు ఉచ్ఛ్వాసములు ఒక పలము. 60 పలములు ఒక లిప్త. అనగా ఒక దండము (ఘడియ). 60 దండములు ఒక అహోరాత్రము. అ, ఇ, ఉ, ఏ, ఓ లకు వరుసగ బాల, కుమార, యువ, వృద్ధ, మృత్యువు అని ఐదు పేర్లు. వీటిలో ఏదైన ఒక స్వరము ఉదయించిన పిదప మరల దాని ఉదయము ఐదవ ఖండముపై అగును. ఉదయమునకు ఎంత సమయము పట్టునో అస్తమునకు కూడ అంత సమయమే పట్టును. వీటి ఉదయాస్త కాలముల మానము 60 దండముల ఏకాదశాంశమునకు సమానము. ఒక స్వరము ఉదయించిన పిదప రెండవ స్వరము 5 దండముల 27 పలముల తరువాత అగును. ఈ విధముగ ఐదు స్వరముల ఉదయాస్తములు తెలియవలెను. మృత్యు స్వరోదయ సమయమున యుద్ధము చేసినచో పరాజయముతో పాటు మృత్యువు కూడా కలుగును. శని చక్రము నందు 15 దినములందు క్రమముగా గ్రహోదయము జరుగుచుండును. ఈ పంచదశ విభాగానుసారము శనిభాగమునందు యుద్ధము మృత్యుదాయకము. దశకోటి సహస్ర త్రయోదశ లక్షలకు దాని దశమాంశము కలుపగా ఎంత సంఖ్య వచ్చునో అన్ని యోజ నముల ప్రమాణముగల కూర్మ రూప శని బింబ పృష్ఠమునకు క్షేత్ర ఫలమేర్పడును. మఘా ప్రథమ చరణమునుండి కృత్తిక ఆది నుండి అంతమువరకు శని నివాసము తన స్థానమునందుండును. ఆ సమయమునందు యుద్ధము చేయుట మంచిది కాదు. రాహు చక్రము కొరకు ఏడు నిలువు గీతలు, ఏడు అడ్డగీతలు గీయవలెను. దానిపై వాయవ్యము నుండి నైరృతి మీదుగా అగ్ని కోణము వరకును శుక్లపక్ష ప్రతిపత్తు మొదలు పూర్ణిమ వరకునున్న తిథులను వ్రాయవలెను. ఆగ్నేయమునుండి ఈశాన్యము మీదుగా వాయవ్యము వరకును, కృష్ణపక్ష ప్రతిపత్తు మొదలు అమావాస్య వరకును తిథులు వ్రాయవలెను. ఈ విధముగ తిథిరూప రాహున్యాస మేర్పడును. దక్షిణమున 'రా'ను, 'హు'ను వాయవ్యము నందును వ్రాయవలెను. ప్రతిపదాది తిథులతో కకారాద్యక్షరములు కూడ వ్రాయవలెను. నైరృతియందు సకారము వ్రాయవలెను. ఈ విధముగ రాహు చక్ర మేర్పడును. రాహు ముఖము నందు యాత్ర చేసినచో యాత్రా భంగమగును.

పౌర్ణమి యందు భద్రయొక్క పేరు 'విష్టి'. అది ఆగ్నేయము నందు ఉండును. తృతీయనాడు భద్ర పేరు 'కరారి'. అది తూర్పున ఉండును. సప్తమినాడు భద్ర పేరు 'ఘోర'. అది దక్షిణము నందు ఉండును. సప్తమీ–దశముల యందు భద్ర క్రమముగ ఈశాన్య–ఉత్తరములందు ఉండును. చతుర్దశినాడు వాయవ్యమునందును, చతుర్థియందు పశ్చిమమునందును, శుక్ల అష్టమి–ఏకాదశులందు దక్షిణము నందును ఉండును. దీనిని అన్ని శుభకార్యములందును పరిత్యజించవలెను. రౌద్ర, శ్వేత, మైత్ర, సారభట, సావిత్రి, విరోచన, జయదేవ, అభిజిత్, రావణ, విజయ, నంది, వరుణ, యమ, సౌమ్యభవులు పదిహేను ముహూర్తములు. రౌద్ర ముహూర్తమునందు భయానకములగు కార్యములు చేయవలెను. స్నానాది కార్యములు శ్వేత ముహూర్తము నందు చేయవలెను. కన్యా వివాహమునకు మైత్రముహూర్తము శుభకరము. సారభట ముహూర్తమునందు శుభ కార్యములును, సావిత్ర ముహూర్తమున దేవతాస్థాపనమును, విరోచన ముహూర్తమునందు రాజకీయ కార్యములును, జయదేవ ముహూర్తమునందు విజయమునకు సంబంధించిన కార్యములును, రావణ ముహూర్తమునందు సంగ్రామమును, విజయ ముహూర్తమునందు కృషి–వ్యాపారములను, నందీ ముహూర్తమున షట్కర్మలను, వరుణ ముహూర్తమునందు తటాకాది నిర్మాణమును, యమ ముహూర్తమునందు వినాశకర కార్యములను, సౌమ్య ముహూర్తమునందు సౌమ్యకార్యములను చేయ వలెను. భవ ముహూర్తమునందు అహో రాత్రములు శుభలగ్నమే. అందుచేత దానియందు శుభకార్యములు అన్నియు చేయవలెను. ఈ విధముగ ఈ పదునైదు ముహూర్తములు శుభాశుబ హేతుత్వము వాటి పేర్లను బట్టి యుండును. రాహువు తూర్పున వాయవ్యమువరకును, వాయవ్యము నుండి దక్షిణము వరకును, దక్షిణమునుండి ఈశాన్యమువరకును, ఈశాన్యము నుండి పశ్చిమము వరకును. పశ్చిమము నుండి ఆగ్నేయమువరకును, ఆగ్నేయము నుండి ఉత్తరము వరకును మూడేసి దిక్కుల చొప్పున నాల్గు ఘడియలలో భ్రమణము చేయును.

చండీ, ఇంద్రాణీ, వారాహీ, ముశలీ, గిరికర్ణికా, బలా, అతిబలా, క్షీరీ, మల్లిగా, జాతీ, యూథికా, శ్వేతార్క, శతావరీ, గుడూచీ, వాగురీ నామకములగు దివ్యోషధులను యథాప్రాప్తముగ ధరించినచో యుద్ధమునందు విజయము లభించును. 'ఓం నమో భైరవాయ ఖడ్గ పరశు హస్తాయ ఓం హుం విఘ్న వినాశాయ ఓం హుం ఫట్' అను మంత్రముతో శిఖను బంధించి యుద్ధము చేసినచో తప్పక విజయము లభించును. ఇపుడు (యుద్ధమున విజయమునిచ్చు) తిలక, అంజన, ధూప, ఉపలేప, స్నాన, పాన, తైల, యోగ చూర్ణాదులను గూర్చి చెప్పెదను వినుము. సుభగా, మనఃశిలా, తాళములను లాక్షారసమునందు కలిపి, స్త్రీ చనుబాలతో రంగరించి, లలాటమునందు తిలక ముంచుకున్నచో శత్రువు వశంగతుడగును. విష్ణుక్రాంతా, సర్పాక్షీ, సహదేవీ, రోచనలను మేక పాలతో నూరి తిలకముగ ధరించినచో శత్రువులు లొంగిపోవుదురు. ప్రియంగు, కుంకుమ, కుష్ఠ, మోహినీ, తగర, ఘృతములు కలిపి తిలకము ధరించినచో అది వశ్యకరము. రోచనా, రక్తచందన, నిశా (పసుపు) మనఃశిలా, తాల, ప్రియంగు, సర్షప, మోహినీ, దూర్వా, విష్ణుక్రాంతా, సహదేవా, శిఖలను ఓషధులను మాతులుంగ రసమునందు నూరి లలాటమునందు ఉంచిన తిలకము వశకరము. ఈ తిలకములచే ఇంద్రునితో సహ దేవతలు కూడ వశమగుదురు. ఇక క్షుద్రులగు

మానవుల విషయము చెప్పవలెనా? మంజిష్ఠా, రక్తచందన, కటుకందా, విలాసినీ, పునర్నవలను కలిపి లేపము చేసినచో సూర్యుడుకూడ వశమగును. మలయచందన, నాగపుష్ప, మంజిస్ఠా, తగర, వచాలోధ్ర, ప్రియంగు, రజనీ, జటామాంసుంను కలిపి తయారుచేసిన తైలము వశంకరము.(123)

యుద్ధ జయార్ణవ జ్యోతిశాస్త్ర సారము

అగ్నిదేవుడు పలికెను :

శంకరుడు పార్వతికి చెప్పిన ప్రకారము నేను ఇపుడు యుద్ధజయార్ణవ ప్రకరణ సారమైన సమయమును, మంత్రమును, ఔషధములు మొదలగువాటిని వర్ణించి చెప్పెదను. పార్వతి : దేవా! దేవతలు అసురులపై విజయము ఎట్లు సాధించిరి? ఆ విషయమును యుద్ధ జయార్ణవోక్త శుభాశుభ వివేకాది జ్ఞానమును గూర్చి వర్ణింపుము అని ప్రశ్నించెను. శంకరుడు చెప్పెను : పరమాత్మేచ్ఛ ప్రకారము పదునైదు అక్షరముల ఒక శక్తి ఆవిర్భ వించినది, దాని నుండియే చరాచర జీవుల సృష్టి ఏర్పడినది. ఆ శక్తిని ఆరాధించుటచే మానవుడు అన్నివిషయములను తెలిసికొనగల్గును. ఇపుడు ఐదు మంత్రములతో ఏర్పడిన మంత్రపీఠమును వర్ణించెదను. ఆ మంత్రములు అన్ని మంత్రముల జీవన మరణములందు ఉన్నవి. ఋగ్యజుఃసామాథర్వ వేద మంత్రములు ప్రథమ మంత్రములు. సద్యోజాత మంత్రములు ద్వితీయ మంత్రములు. బ్రహ్మ విష్ణు రుద్రులు తృతీయ మంత్ర స్వరూపులు. ఈశ్వరుడు : సప్త శిఖలు గల అగ్ని, ఇంద్రాది దేవతలు–వీరు చతుర్థ మంత్ర స్వరూపులు, అ, ఇ, ఉ, ఏ, ఓ, అను ఐదు స్వరములు పంచమ మంత్ర స్వరూపులు. ఈ స్వరము లకే మూల బ్రహ్మ అని కూడ పేరు. కఱ్ఱలో వ్యాపించి ఉన్న అగ్ని ఆ కఱ్ఱను అంటించకుండ పైకి కనబడనట్లు శరీరమున నున్న శివశక్తి ప్రీతి జ్ఞానము లేకుండ కాజాలదు. పార్వతీ! ఓంకార స్వర భూషితమైన శక్తి మొదట ఆవిర్భవించినది. తరువాత బిందువు ఏకార రూపమున పరిణతమైనది. పిదప ఓంకారమునందు శబ్ద మావిర్భవించినది. దాని నుండి ఉకారము ఆవిర్భవించినది. ఈ ఉకారము హృదయములో శబ్దము చేయుచు ఉండును. అర్ధచంద్రుని నుండి మోక్షమార్గ ప్రదర్శక ముగ ఇకారము ఆవిర్భవించినది. పిదప భోగమోక్షముల నిచ్చు అవ్యక్త 'అ' కారము ఆవిర్భవించినది. ఆ 'అ'కారము స్వర శక్తిమత్తు. ప్రవృత్తి నివృత్తి బోధకము. 'అ' కారము ప్రాణ(శ్వాస) రూపమున శరీరమునందు స్థిరముగా నుండును. దీనికే 'ఇడ' అని పేరు. 'ఇ' కారము 'ప్రతిష్ఠ' అను పేరుతో రస రూపమునను, పాలక స్వరూపమునను ఉండును, దీనికే 'పింగల' అని పేరు. 'ఈ' అను స్వరమును క్రూరశక్తి యందును, హరబీజము (ఉకారము) శరీరములో అగ్ని రూపమున నుండును. ఇదియే సమానబోధిక విద్య. దీనిని 'గాంధారి' అందురు. దీనిలో దహనాత్మక శక్తి ఉన్నది. 'ఏ' కారము శరీరములో జలరూపమున నున్నది. దీనిలో శాంతి క్రియ ఉన్నది. 'ఓ' కారము శరీరములో వాయు రూపమున ఉన్నది. ఇది అపాన, వ్యాన, ఉదానాది పంచ స్వరూపములను పొంది, స్పర్శ చేయుచు, గతి శీలమై యుండును.

పంచ స్వరముల సంమిలిత సూక్ష్మరూపమగు ఓంకారము 'శాన్త్యతీతము' అను పేరుతో బోధితమై శబ్దగుణకమగు ఆకాశము రూపమున నుండును. ఈ విధముగ ఏర్పడిన ఐదు స్వరములకు

క్రమముగా కుజ, బుధ, గురు, శుక్ర, శనులు. కకారాది వర్ణములు ఈ స్వరములకు క్రింద నుండును. ఇవే ప్రపంచమూలకారణములు. వీటి వలననే అన్ని చరాచర పదార్థముల జ్ఞానము కలుగును. ఇపుడు విద్యాపీఠ స్వరూపమును చెప్పెదను. దీనియందు ఓంకారము శివరూపముగ చెప్పబడినది. సాక్షాత్తు ఉమసోమ (అమృత) రూపిణి. ఈమెనే వామా, జ్యేష్ఠా, రౌద్రీ నామములతో కూడ వ్యవహరింతురు. బ్రహ్మ విష్ణు మహేశ్వరులే వరుసగ మూడు గుణములు, సృష్టి, స్థితి, సంహార కారణ భూతులు. శరీరములోపల మూడు రత్నానాడులు ఉన్నవి; వీటికి స్థూల, సూక్ష్మ, పరలని పేరు. ఇవి శ్వేతవర్ణములు. వీటి నుండి సర్వదా అమృతము స్రవించుచుండును. దానిచే ఎల్లప్పుడును ఆత్మ తడుపబడుచుండును. దీనిని ఈ విధముగ దివారాత్రులు ధ్యానించ వలెను. దేవీ! అట్టి సాధకుని శరీరము అజరమగును. అతడు శివ సాయుజ్యమును పొందును. మొదట అంగుష్ఠాదులందును, నేత్రములందును, దేహమునందును అంగన్యాసము చేసి, పిదప మృత్యుంజ యార్చన చేసి యాత్ర చేయువాడు యుద్ధాదులందు విజయవంతుడగును. ఆకాశము శూన్యము, నిరాధారము, శబ్దగుణకము. వాయువునందు స్పర్శగుణ మున్నది. అది అడ్డముగా ప్రసరించుచు స్పృశించును. రూపము (అగ్ని) ఊర్ధ్వగతి గలది. జలము అధోగతి గలది. గంధగుణముగల పృథివి అన్ని స్థానములను విడచి మధ్య యందు ఉండి, అన్నింటికిని ఆధారముగా నుండును. శివుడు నాభి మూలమునందు కంద (దుంప)రూపమున ఉన్నాడు. శక్తి సముదాయముతో గూడ సూర్య, చంద్ర, విష్ణువులును, పంచతన్మాత్రలతో దశ ప్రాణములును అచటనే ఉన్నవి. ఆ శివమూర్తి కాలాగ్నివలె దేదీప్యమానమై సర్వదా ప్రకాశించుచుండును. అదే చరాచర జీవలోకమునకు ప్రాణము. ఆ మంత్రపీఠము నష్టమైనపుడు వాయురూపుడగు జీవుడు నశించినట్లు తెలిసికొన వలెను. (124)

యుద్ధ జయార్ణవమున నానాచక్ర వర్ణన

పరమేశ్వరుడు చెప్పెను : 'ఓం హ్రీం కర్ణమోటని బహురూపే బహుదంష్ట్రే హూం ఫట్ ఓం హః ఓం గ్రస గ్రస, కృన్త, కృన్త, ఛక, ఛక, హూం ఫట్ నమః' – ఇది కర్ణమోటీ మహావిద్య. ఇది అన్ని వర్ణములందును రక్ష నిచ్చునది. ఈ మంత్రమును చదివినంత మాత్రముననే మనుష్యుడు క్రోధావిష్టుడగును, వానికండ్లు ఎర్రబడును. ఈ మంత్రము మారణ, పాత, మోహన, ఉచ్చాటనముల యందు ఉపయోగించును. అపుడు స్వరోదయముతో పాటు పంచవిధ వాయుస్థానములను, వాటి ప్రయోజనములను చెప్పెదను. హృదయమునుండి నాభివరకును వాయు సంచారము జగుచుండును. దానికి మారుతచక్రమని పేరు. జపహోమాదులు చేయు సాధకుడు క్రోధవంతుడై, దానిచే సంగ్రామాది కార్యములందు ఉచ్చాటనాది కార్యములు చేయును. కర్ణములనుండి నేత్రముల వరకును ఉన్న వాయువుచే ప్రభేదన కార్యమును, హృదయమునుండి గుదము వరకును ఉండు వాయువుచే జ్వర దాహములను శత్రు మారణమును చేయవలెను. ఈ వాయువు పేరు వాయు చక్రము. హృదయము నుండి కంఠము వరకును ఉన్న వాయువునకు రసమని పేరు. దీనికి రసచక్రమని పేరు. దీనిచే శాంతి ప్రయోగము చేయబడును. దాని గుణము పౌష్టిక రసతుల్యాము. కనుబొమ్మల నుండి నాసికా భాగము వరకును ఉన్న వాయువు పేరు దివ్యము. దీనికి తేజశ్చక్రమని పేరు.

దీనికి గంధము గుణము. దీనిచే స్తంభన-ఆకర్షణములు చేయబడును. సాధకుడు మనస్సును నాసికాగ్రమునందు స్థిరముచేసి, నిస్సందేహముగ స్తంభన-కీలనములు చేయును. పైన చెప్పిన వాయు చక్రమునందు చండఘంటా, కరాలీ, సుముఖీ, దుర్ముఖీ, రేవతీ, ప్రథమా, ఘోర అను శక్తులను అర్చించవలెను. ఉచ్చాటనము చేయు శక్తులు తేజశ్చక్రమునందు ఉండును. సౌమ్య, భీషణీ, దేవీ, జయా, విజయా, అజితా, అపరాజితా, మహాకోటీ, మహారౌద్రీ, శుష్కకాయా, ప్రాణహరా అను పదకొండు గురుశక్తులు రసచక్రమునందు ఉండును. విరూపాక్షీ, పరా, దివ్యలు, పదకొండుగురు ఆకాశ మాతృకలు, సంహారీ, జాతహారీ, దంష్ట్రాలా, శుష్కరేవతీ, పిపీలికా, పుష్టిహరా, మహాపుష్టి, ప్రవర్ధనా, భద్రకాళీ, సుభద్రా, భద్రభీమా, సుభద్రికా, స్థిరా, నిష్ఠురా, దివ్యా, నిష్కంపా, గదినీ, రేవతీ అను ముప్పది ఇద్దరు మాతృకలు మారుత, వాయు, రస, దివ్య చక్రములు నాల్గింటి యందును ఎనమండుగురు చొప్పున ఉందురు.

సూర్యుడు ఒక్కడే ; చంద్రుడును ఒక్కడే ; వారి శక్తులు కూడ భూత భేదమును బట్టి ఒక్కొక్కటియే; భూమిపై నున్న నదీజలమునకు స్థానభేదమును బట్టి తీర్థసంజ్ఞ కలిగినట్లే శరీరమునందలి అస్థి పంజరములో నున్న ఒకే ప్రాణము అనేక మండలముల రూపమున విభక్తమైనది. వాయు దక్షిణాంగములతో యోగముచే అదే వాయువు పది విధములైనట్లు, అదే వాయువు తత్త్వ రూపమగు వస్త్రమునందు దాగి విచిత్ర బిందు రూపమగు ముండము ద్వారా, కపాలరూప బ్రహ్మాండమునకు సంబంధించిన అమృతమును త్రాగుచుండును. పంచవర్గ బలముచే యుద్ధమునందెట్లు జయము కలుగునో వినుము. అ, ఆ, క, చ, ట, త, ప, య, శ లు ప్రథమ వర్గము. ఇ, ఈ, ఖ, ఛ, ఠ, థ, ఫ, ర, ష లు ద్వితీయ వర్గము. ఉ, ఊ, గ, జ, డ, ద, బ, ల, స లు తృతీయ వర్గము. ఏ, ఐ, ఘ, ఝ, ఢ, ధ, భ, వ, హ లు చతుర్థ వర్గము. ఓ, ఔ, అం, అః, ఙ, ఞ, ణ, న, మ లు పంచవర్గము.

ఈ నలుబది యైదు అక్షరములును మానవులకు అభ్యుదయము ఇచ్చునవి. వీటికి వరుసగ బాల, కుమార, యువన్, వృద్ధ, మృత్యువులని పేరు. కాలము, ఆత్మపీడము, శోషకము, ఉదాసీనము అని మూడు విధములు. మంగళవారము నందు ప్రతిపత్తు, కృత్తిక వచ్చినచో అవి లాభదాయకములు. మంగళవారమున షష్ఠీ-మఘా నక్షత్రములు వచ్చినచో అవి పీడాకరములు. మంగళవారమున ఏకాదశీ-ఆర్ద్రా నక్షత్రములు వచ్చినచో అవి మృత్యుదాయ కములు. బుధవారమున ద్వితీయా-మఘా యోగము, సప్తమీ ఆర్ద్రా నక్షత్ర యోగము లాభదాయ కములు. బుధవార-భరణీ నక్షత్ర యోగము హానికరము. బుధవార-శ్రవణ నక్షత్ర యోగము 'కాలయోగము'. బృహస్పతి వారమున తృతీయా-పూర్వ ఫల్గునీ యోగము లాభకరము. బృహస్పతి వారమున అష్టమీ తిథి ధనిష్ఠా నక్షత్ర యోగము, అష్టమీ-ఆర్ద్రా యోగము, త్రయోదశీ-ఆశ్లేషా యోగము మృత్యు కారకములు. శుక్రవారమున చతుర్థీ-పూర్వాభాద్రా యోగము లక్ష్మీ వృద్ధికరము. శుక్రవారమున నవమీ-పూర్వాషాఢా యోగము దుఃఖ ప్రదము; ద్వితీయా భరణీ నక్షత్ర యోగము యమ దండమువలె హానికరము, శనివారమున పంచమీ-కృత్తికా యోగము లాభకరము; దశమీ-ఆశ్లేషాయోగము పీడాకరము. పూర్ణిమా-మఘా యోగము మృత్యు ప్రదము.

పూర్వ, ఉత్తర, ఆగ్నేయ, నైరృతి, దక్షిణ, వాయవ్య, పశ్చిమ, ఈశాన్యములు పరస్పరము చూచుకొనును. ప్రతిపత్తు నవమి మొదలగు తిథులలో మేషాది రాశులతో రవ్యాది వారములను కలపవలెను. ఈయోగము కార్యసిద్ధికరము. ఉదా: తూర్పు, ప్రతిపత్తు మేషలగ్నము, రవివారము–ఈ యోగము పూర్వ దిశయందు యుద్ధాది కార్యములందు సిద్ధిప్రదము. మేషాదిరాశులు నాలుగు, కుంభము–ఈ లగ్నములు పూర్ణ విజయమును ఇచ్చును. ఇతర రాశులు మృత్యు కారకములు. సూర్యాది గ్రహములను, రిక్తాపూర్ణాది తిథులను వెనుక దిక్కుల విషయమున చెప్పినట్లు న్యాసము చేయవలెను. సూర్య సంబంధముచే యుద్ధమునందు ఉత్తమ ఫలమేదియు లభించదు. సోమ సంబంధము సంధిని కలిగించును. మంగళ సంబంధముచే కలహమగును. బుధ సంబంధమున యుద్ధము చేయుటచే అభీష్ట సాధనములు చేకూరును. గురు సంబంధముచే విజయలాభము కలుగును. శుక్ర సంబంధముచే అభీష్ట సిద్ధి యగును. శని సంబంధముచే పరాజయము కలుగును. ఒక పక్షి ఆకారము గీసి దానిముఖ, నేత్ర, లలాట, శీర్ష, హస్త, కుక్షి, చరణ, పక్షములందు సూర్యనక్షత్రము మొదలు మూడేసి నక్షత్రములు వ్రాయవలెను. పాదము నందున్న మూడు నక్షత్రము లలో యుద్ధము చేసినచో మృత్యువగును. రెక్కలపై నున్న మూడు నక్షత్రములందు ధననాశము. ముఖమునందలి మూడు నక్షత్రములందు పీడ కలుగును. శిరస్సునందున్న మూడు నక్షత్రములందు కార్యనాశనము. కుక్షియందలి మూడు నక్షత్రములందు యుద్ధము చేయగా ఉత్తమ ఫలము లభించును. తూర్పు నుండి నైరృతి వరకును, నైరృతి నుండి ఉత్తరము వరకును, ఉత్తరము నుండి ఆగ్నేయము వరకును, ఆగ్నేయము నుండి పశ్చిమము వరకును, పశ్చిమము నుండి ఈశాన్యము వరకును, ఈశాన్యము నుండి దక్షిణము వరకును, దక్షిణము నుండి వాయవ్యము వరకును, వాయ వ్యము నుండి ఉత్తరము వరకును నాలుగేసి దండముల వరకు రాహు భ్రమణము ఉండును. రాహువును పృష్ఠమునందు ఉంచుకొని యుద్ధము చేయుట జయప్రదము. రాహువు ఎదురుగా ఉండగా యుద్ధము చేసినచో మృత్యువు. ఇపుడు తిథిరాహు విషయము చెప్పెదను. పూర్ణిమ పిమ్మట కృష్ణ ప్రతిపత్తు మొదలు ఆగ్నేయము నుండి ఈశాన్యము వరకు, అనగా కృష్ణ అష్టమివరకు రాహువు పూర్వదిక్కున ఉండును. అచట యుద్ధము చేయుటచే జయము కలుగును. ఈశాన్యము నుండి ఆగ్నేయము వరకును, నైరృతి నుండి వాయవ్యము వరకును రాహు భ్రమణ ముండును. మేషాదిరాశులను పూర్వాది దిక్కులందు ఉంచవలెను. ఇట్లుండగా మేష, సింహ, ధనూరాశులు తూర్పునను, వృషభ, కన్యా, మకర రాశులు దక్షిణము నందును, మిథున, తులా, కుంభములు పశ్చిమము నందును, కర్కటక, వృశ్చిక, మీనములు ఉత్తరమునందును ఉండును. సూర్యరాశిని బట్టి సూర్యుని దిక్కు తెలిసికొని, సూర్యుడు సమ్ముఖుడై ఉన్నపుడు యుద్ధము చేయుట మృత్యు కారకము. కృష్ణ పక్షమునందు తృతీయా, సప్తమీ, దశమీ, చతుర్దశీ తిథులు భద్రతిథులు. శుక్ల పక్షమునందు చతుర్థీ, ఏకాదశీ, అష్టమీ పూర్ణిమలు భద్ర తిథులు. ఆగ్నేయము నుండి వాయవ్యము వరకును భద్రా నివాసము.

అ, క, చ, ట, త, ప, య, శ–అని ఎనిమిది వర్గములు. వీటి అధిపతులు వరుసగ సూర్య, చంద్ర, కుజ, బుధ, గురు, శుక్ర, శని, రాహువులు. ఈ వర్గముల పక్షులు క్రమముగ గృధ,

ఉలూక, శ్యేన, పింగళ, కౌశిక, సారస, మయూర, గోరంకు పక్షులు మొదట హోమములుచేసి మంత్రసిద్ధి చేసికొనవలెను. ఉచ్చాటనమున మంత్ర ప్రయోగము పల్లవ రూపమున చేయవలెను. వశ్య, జ్వర, ఆకర్షణములందు పల్లవ ప్రయోగము సిద్ధికరము. శాంతియందును, మోహన ప్రయోగమునందును, 'నమః' అని చెప్పుట మంచిది. పుష్టి–వశీకరణములందు 'వౌషట్', మారణ–ప్రీతి వినాశములందు 'హుం' ప్రయోగించవలెను. విద్వేషణమునందును, ఉచ్చాటనమునందు 'ఫట్' చెప్పుట మంచిది. పుత్రాది ప్రాప్తి ప్రయోగమునందును దీప్త్యాదులందును 'వషట్' చెప్పుట మంచిది. ఈ విధముగ మంత్రములలో ఆరు జాతులు ఏర్పడినవి. ఇపుడు అన్ని విధముల రక్షణము నిచ్చు ఓషధులను గూర్చి చెప్పుచున్నాను. మహాకాళీ, చండీ, వారాహీ, ఈశ్వరీ, సుదర్శనా, ఇంద్రాణీ–ఈ ఓషధులను శరీరముపై ధరించుటచే ధారకునకు రక్ష కలుగును. బలా, అతిబలా, భీరు, ముసలీ, సహదేవీ, జాతీ, మల్లికా, యూథీ, గారుడీ, భృంగరాజ, చక్రరూపా–ఈ మహౌషధులను ధరించుటచే యుద్ధమునందు విజయము కలుగును. మహాదేవీ! ఈ ఓషధులను గ్రహణ సమయమున వెలికి తీయుట శుభదాయకము. మట్టితో సర్వాంగ సంపన్నమైన ఏనుగుమూర్తి ఒకటి నిర్మించి, దాని పాదము క్రింద శత్రువు మూర్తి నుంచి, స్తంభన ప్రయోగము చేయవలెను. లేదా ఒకే వృక్షమున్న ఒక పర్వతో పరిభాగమునందు ఆ చెట్టు క్రింద గాని, పిడుగుపడిన చోటున గాని, పుట్టమట్టితో ఒక స్త్రీమూర్తిని నిర్మించి 'ఓం నమో మహాభైరవాయ వికృతదంష్ట్రోగ్ర రూపాయ పిఙ్గలాక్షాయ, త్రిశూల ఖడ్గధరాయ 'వౌషట్' అను మంత్రముచే ఆ మృత్తికమయ దేవీమూర్తికి పూజచేసి, శత్రువువద్ద నున్న శస్త్ర సమూహమును స్తంభింపచేయవలెను.

ఇపుడు యుద్ధమున విజయము చేకూర్చు అగ్నికార్యమును గూర్చి చెప్పెదను. రాత్రి శ్మశానమునకు వెళ్ళి నగ్నుడై శిఖ విరబోసికొని, దక్షిణాభిముఖముగ కూర్చుండి జ్వలించుచున్న చితియందు మనుష్య మాంసరక్తములను, విషమును, ఊక ఎముకలు కలిపి, శత్రువు పేరు చెప్పుచు 'ఓం నమో .... విద్యేస్వాహా' అను (మూలములోనున్న) మంత్రముతో ఎనిమిదివందల పర్యాయములు హోమము చేయవలెను. అట్లు చేయగా శత్రువు బద్ధుడై పోవును. (గ్రుడ్డివాడగును) దేవీ! 'ఓం వజ్రకాయ .... హుం ఫట్' అను (మూలములో నున్న) మంత్రమును మూడువేల ఎనిమిదివందల (3800) పర్యాయములు జపము చేయగా హనుమంతుడు అన్ని కార్యములను సమకూర్చును. వస్త్రముపై వ్రాసిన హనుమన్మూర్తిని చూపగనే శత్రువులు నశింతురు. (125)

నక్షత్ర నిర్ణయము

పరమేశ్వరుడు పలికెను :

ప్రాణుల శుభాశుభ ఫలజ్ఞానము కొరకు నా క్షత్రిక పిండమును గూర్చి చెప్పెదను. (ఎవరి శుభాశుభ ఫలములను తెలిసికొనవలెనో ఆ మనుష్యుని బొమ్మ గీసి సూర్యుడున్న నక్షత్రము మొదలు మూడు నక్షత్రములు వాని శిరస్సుపైనను, ఒకటి ముఖముపైనను, రెండు నేత్రములందును, నాలుగు చేతులు, కాళ్ళమీదను, ఐదు హృదయము నందును, ఐదు మోకాళ్ళ మీదను వ్రాసి

ఆయుర్వృద్ధి విచారము చేయవలెను. శిరస్సుపై ఉన్న నక్షత్రమున యుద్ధము చేసినచో రాజ్యము లభించును. ముఖమునందలి నక్షత్రమున సుఖము, నేత్రమునందలి నక్షత్రమున సుందర సౌభాగ్యము, హృదయము నందలి నక్షత్రమున ద్రవ్య సంగ్రహము, హస్తమునందలి నక్షత్రమున చౌర్యము, పాదమునందలి నక్షత్రములందు మార్గమందే మృత్యువు. ఈ విధముగ ఫలితములు తెలియవలెను. ఎనిమిది కుంభములను పూర్వాది దిక్కులందు ఎనిమిదింటి యందును ఉంచవలెను. ఒక్కొక్క కుంభమునందు మూడేసి చొప్పున ఎనిమిది కుంభములందును ఇరువది నాలుగు నక్షత్రములను ఉంచగా నక్షత్రములు మిగిలిపోవును. వీటికి 'సూర్యకుంభములు' అని పేరు. సూర్య కుంభము అశుభము. పూర్వాది దిక్కులందున్న కుంభముల మీది నక్షత్రములు శుభములు. ఇపుడు యుద్ధము నందు జయపరాజయముల వివేకము నిచ్చు సర్పాకార రాహుచక్రముల గూర్చి చెప్పెదను. ముందుగా ఇరువది ఎనిమిది చుక్కలు పెట్టవలెను. వాటిని మూడు మూడుగా విభజించగా ఎనిమిది విభాగములు వచ్చును. వాటిపై ఇరువది నాలుగు నక్షత్రములు గుర్తించగా నాలుగు నక్షత్రములు మిగిలిపోవును. వాటిపై రేఖ గీయవలెను. సర్పాకార చక్రమేర్పడును. రాహువున్న నక్షత్రమును పడగపై వ్రాయవలెను. ఆ నక్షత్రముతోడనే ప్రారంభించి క్రమముగా ఇరువదియేడు నక్షత్రములు వ్రాయవలెను. ముఖమునందున్న ఏడు నక్షత్రములలో యుద్ధము చేసినచో యుద్ధమునందు మరణము కల్గును. స్కంధము నందలి ఏడు నక్షత్రములందు యుద్ధముచేసినచో పరాజయము వచ్చును. పొట్టమీద నున్న ఏడు నక్షత్రములలో సమ్మానము, విజయము లభించును. కటి యందలి నక్షత్రములందు శత్రువుల హరణము జరుగును. పుచ్ఛమునందలి నక్షత్రములందు యుద్ధము చేయగా కీర్తి కలుగును. రాహుదృష్ట నక్షత్రమునందు మృత్యువు కలుగును. ఇపుడు సూర్యుడు మొదలు రాహువు వరకును గ్రహముల బలము వర్ణించెదను. రవివారమునందు మొదటిది మొదలు ఎనిమిదవ అర్ధప్రహరములకు వరుసగ సూర్య, శుక్ర, బుధ, సోమ, శని, గురు, కుజ, రాహువులు అధిపతులు. శని, సూర్య-రాహువులను యత్న పూర్వకముగ వృష్ఠగతులగునట్లు చేసికొని యుద్ధము చేయువాడు సైన్య సముదా యముపై విజయము సాధించును. ద్యూత, మార్గ, యుద్ధములందు జయము పొందును.

రోహిణి, ఉత్తరాత్రయము, మృగశిర-స్థిర నక్షత్రములు. అశ్విని, రేవతి, స్వాతి, ధనిష్ఠ, శతభిష క్షిప్ర నక్షత్రములు. యాత్రార్థి ఈ నక్షత్రములందు యాత్ర చేయవలెను. అనూరాధ, హస్త, మూల, మృగశిర, పుష్య, పునర్వసు నక్షత్రములు అన్ని కార్యములకు మంచిది. జ్యేష్ఠ, చిత్త, విశాఖ, పూర్వాత్రయము, కృత్తిక, భరణి, మఘ, ఆర్ద్ర, ఆశ్లేష 'దారుణ' నక్షత్రములు. స్థిరకార్యములు స్థిర నక్షత్రములందు చేయవలెను. క్షిప్ర నక్షత్రము లందు యాత్ర చేయవలెను. సౌభాగ్య కర్మలను మృదు నక్షత్రములందును, ఉగ్రకార్యములను ఉగ్ర నక్షత్రములందును చేయవలెను. దారుణ నక్షత్రములు భయంకర కార్యములకు ఉపయోగించును. కృత్తిక, భరణి, ఆశ్లేష, విశాఖ, మఘ, మూల, పూర్వాత్రయము అధోముఖ నక్షత్రములు, వీటిలో అధోముఖ కర్మ చేయవలెను. కూపము, తటాకము, విద్యాకర్మ, చికిత్స, స్థాపనము, నౌకానిర్మాణము, కూపవిధానము, గొయ్యి త్రవ్వుట, మొదలగు పనులు ఈ అధోముఖ నక్షత్రములందు చేయవలెను. రేవతి, అశ్విని, చిత్త, హస్త,

స్వాతి, పునర్వసు, అనూరాధ, మృగశిర, జ్యేష్ఠ తిర్యఙ్ముఖ నక్షత్రములు. వీటియందు రాజ్యాభిషేకము, గజాశ్వములకు పట్ట బంధనము, తోటవేయుట, గృహ-ప్రాసాద నిర్మాణము, ప్రాకార నిర్మాణము, క్షేత్రము, తోరణ-ధ్వజ-పతాకాది స్థాపనము చేయవలెను. రవివారమున ద్వాదశి, సోమవారమున ఏకాదశి, మంగళవారమున దశమి, బుధవార మున తృతీయ, గురువారమునందు షష్ఠి, శుక్రవారము నందు ద్వితీయ, శనివారమున సప్తమి దగ్ధయోగములు. ఇపుడు త్రిపుష్కరములు చెప్పెదను.

ద్వితీయ, ద్వాదశి, సప్తములు; రవి, మంగళ, శని వారములు ఇవి త్రిపుష్క రములు. విశాఖా, కృత్తికా, ఉత్తర, ద్వయ, పునర్వసు, పూర్వభాద్రలు కూడా త్రిపుష్కరములు. అనగా పైన చెప్పిన వారములు, తిథులు, నక్షత్రములు కలిపినచో త్రిపుష్కర యోగము. ఈ యోగము నందు లాభము, హాని, విజయము, వృద్ధి, పుత్రజన్మ, వస్తు నాశము-ఇవి త్రిగుణములగును. అశ్విని, భరణి, ఆశ్లేష, పుష్యమి, స్వాతి, విశాఖ, శ్రవణము, పునర్వసు, దృఢ నేత్రములు. ఇవి దిక్కులను చూడగలవు. వీటిలో పోయిన వస్తువు, యాత్రకు వెళ్ళిన మనుష్యుడు విశేష పుణ్యోదయము చేతనే తిరిగి వచ్చును. రెండు ఆషాఢలు, రేవతి, చిత్త, పునర్వసు 'కేకర' నక్షత్రములు. వీటిలో పోయిన వస్తువు ఆలస్యముగా దొరకును. కృత్తిక, మృగశిర, పూర్వాఫల్గుని, మఘ, మూల, జ్యేష్ఠ, అనూరాధ, ధనిష్ఠ, శతభిషము, పూర్వాభాద్ర చిపిటాక్షములు. వీటిలో పోయిన వస్తువు, యాత్రకై వెళ్ళిన వ్యక్తి కొలది ఆలస్యముగ తిరిగి వచ్చును. హస్త, ఉత్తరాభాద్ర, ఆర్ద్ర, పూర్వాషాఢ, అన్ధాక్షములు. వీటిలో పోయిన వస్తువు శీఘ్రముగనే లభించును. యుద్ధమేమియు చేయ నవసరము ఉండదు. ఇపుడు నక్షత్రముల గండాంతమును చెప్పెదను. రేవతి చివరి నాలుగు దండములు గండములు, అశ్విని ప్రారంభము నందలి నాలుగు దండములు గండాంతరములు. ఈ నక్షత్రముల ఒక జాము సమయ మును శుభ కార్యములందు ప్రయత్న పూర్వకముగ త్యజించవలెను. ఆశ్లేష చివర మఘ ప్రారంభమున నాలుగేసి దండములు రెండవ గండాంతము. భైరవీ! ఇపుడు తృతీయ గండాంతమును వినుము. జ్యేష్ఠా-మూలల మధ్య నున్న ఒక జాము చాల భయంకరమైనది. జీవించ నిచ్చగలవాడు. ఈ సమయమునందు ఏ శుభకార్యము చేయరాదు. ఈ సమయమున శిశువు పుట్టినచో తల్లిదండ్రులు మరణింతురు. (126)

నానాబల వర్ణన

పరమేశ్వరుడు చెప్పెను :

విష్కంభ యోగమున మూడు ఘడియలు, శీలయోగమున ఐదు ఘడియలు, గండ-అతిగండ యోగముల ఆరు ఘడియలు, వ్యాఘాత-వజ్రముల తొమ్మిది ఘడియలు అన్ని కార్యములందును త్యాజ్యములు. అనగా వదలివేయ తగినది. పరిఘ, వ్యతీపాత, వైధృత యోగములందు దిన మంతయు త్యాజ్యమే. ఈ యోగములందు యాత్రా యుద్ధాదికము చేయరాదు. దేవీ! నేనిపుడు మేషాదిరాశుల ఫలములను, గ్రహముల ద్వారా కలుగు ఫలములను చెప్పెదను. జన్మ రాశియందు చంద్ర శుక్రులు వర్జితులే యైనను శుభప్రదులు. జన్మరాశినుండియు, లగ్నము నుండియు రెండవ స్థానమున సూర్యుడుగాని, శనిగాని, రాహువుగాని, కుజుడుగాని ఉన్నచో ప్రాప్త ద్రవ్యము నశించును.

అప్రాప్తము లభించదు; యుద్ధమున పరాజయము కలుగును. చంద్ర, బుధ, గురు, శుక్రులు ద్వితీయమందున్నచో శుభప్రదులు. మూడవ ఇంటిలో నున్న రవి, శని, కుజ, శుక్ర, బుధ, చంద్ర, రాహువులు శుభప్రదులు. నాల్గవ ఇంటిలో బుధ శుక్రులున్నచో శుభులు. ఇతరులు భయప్రదులు. పంచమము నందున్న గురు, శుక్ర, బుధ, చంద్రులు అభీష్ట లాభదాయకులు. దేవీ! తన రాశి నుండి ఆరవ భావమున రవి, చంద్ర, శని కుజు, బుధులున్నచో శుభఫలము నిత్తురు. కాని శుక్ర గురులు శుభప్రదులుకారు. సప్తమ భావమునందు రవి, శుక్ర, శని, కుజ, రాహువు లున్నచో హాని కలుగును. బుధ, గురు, శుక్రులున్నచో సుఖము కలుగును; అష్టమము నందలి బుధ, శుక్రులు శుభులు. ఇతరులు హానికరులు. నవమ భావము నందున్న బుధ, శుక్రులు శుభులు, ఇతరులు అశుభులు. దశమ భావమునందలి శుక్ర, సూర్యులు లాభకరులు. శని, కుజ, రాహు, చంద్ర, బుధులు శుభకారకులు. పదకొండవ భావము నందున్న ఏ గ్రహమైనను శుభము నిచ్చును. దశమ స్థానమునందు బుధ, శుక్రులు శుభులు. ఇతర గ్రహములు అశుభులు. ఒక దివసమునందు పండ్రెండ్రు రాసులును తిరిగి వచ్చును. ఇపుడు వాటి ఫలమును చెప్పెదను.

మీన, మేష, మిథునములకు ఒక్కొక్క దానికి భోగకాలము నాలుగు దండములు వృషభ, కర్కట, సింహ, కన్యలకు ఆరేసి దండములు. తులా వృశ్చిక ధనుర్మకర కుంభము లకు ఐదేసి దండముల కాలము. సూర్యుడున్న రాశి ఉదయ రాశి, ఆ రాశి నుండి ఇతర రాశుల భోగకాలము ప్రారంభమగును. మేషాది రాశులకు క్రమముగ చర, స్థిర, ద్వి స్వభావములని పేరు. మేష, కర్కట, తులా, మకరములు చరరాశులు. వీటియందు అస్థిరములైన శుభాశుభ కార్యములు చేయవలెను. వృషభ, సింహ, వృశ్చిక, కుంభములు స్థిరరాశులు. వీటిలో స్థిరకార్యములు చేయవలెను. ఈ లగ్నములలో బైటకువెళ్ళిన వ్యక్తితో శీఘ్ర సమాగము జరుగదు. రోగి శీఘ్రముగ రోగవిముక్తుడు కాడు. మిథున, కన్యా, ధనుః, మీనములు ద్వి స్వభావ రాశులు. ఈ రాశులు అన్ని కార్యములందును శుభ ప్రదములు. వీటియందు యాత్ర, వ్యాపారము, సంగ్రామము, వివాహము, రాజదర్శనము, వృద్ధికరము, జయలాభకరములు; యుద్ధమునందు విజయప్రదములు, అశ్వినీనక్షత్రము నందు ఇరువది తారలు ఉండును. దాని ఆకారము గుర్రమువలె నుండును. ఈ నక్షత్రము నందు వర్షము ప్రారంభించినచో ఒక రాత్రి గొప్ప వర్షము కలుగును. భరణి యందు వర్షము ప్రారంభించినచో పదునైదు దినముల వరకును అవిచ్ఛిన్నముగా నుండును. (127)

కోటచక్రము

పరమేశ్వరుడు పలికెను :

ఇపుడు కోట చక్రమును గూర్చి చెప్పెదను. మొదట చతుర్భుజము గీసి, దాని లోపల రెండవ చతుర్భుజమును, దాని లోపల మూడవ చతుర్భుజమును, దాని లోపల నాల్గవ చతుర్భుజమును గీయవలెను. ఇట్లు గీయగా కోటచక్రము ఏర్పడును. దీని లోపల ఏర్పడు మూడు రేఖలకు ప్రథమనాడి, మధ్యనాడి, అంతనాడి అని పేర్లు. కోట చక్రముపైన పూర్వాదిదిశలు వ్రాసి రాశులుకూడ

వ్రాయవలెను. తూర్పున కృత్తిక, ఆగ్నేయమున ఆశ్లేష, దక్షిణమున మఘ, నైరృతియందు విశాఖ, పశ్చిమమున అనూరాధ, వాయవ్యమున శ్రవణము, ఉత్తరమున ధనిష్ఠ, ఈశాన్యము నందు భరణి వ్రాయవలెను. ఈ విధముగ ప్రథమ నాడియందు ఎనిమిది చక్రములగును. ఇట్లే పూర్వాది దిశల క్రమమున, మధ్యనాడి యందు రోహిణీ, పుష్యమి, పూర్వ ఫల్గుని, స్వాతి, జ్యేష్ఠ, అభిజిత్తు, శతభిషము, అశ్విని నక్షత్రములు వ్రాయవలెను. అంత నాడియందు, పూర్వాది దిశాక్రమమున మృగశిర, పునర్వసు, ఉత్తర, చిత్త, మూల, ఉత్తరాషాఢ, పూర్వాభాద్ర, రేవతి వ్రాయవలెను.

ఈ విధముగ అంతనాడి యందు గూడ ఎనిమిది నక్షత్రములగును. ఆర్ద్ర, హస్త, పూర్వాషాఢ, ఉత్తరాభాద్ర–ఈ నాల్గు నక్షత్రములు కోట చక్రమధ్య స్తంభములగును. ఈ విధముగ చక్రము వ్రాయగా బాహ్య స్థానము దిక్పాలకుల స్థానమగును. అగంతుకుడైన యోధుడు ఏ దిక్కు నందు ఏ నక్షత్రమునందో, ఆ దిక్కు ద్వారా కోటలో ప్రవేశించినచో ఆతడు విజయము పొందును. కోట మధ్య నున్న నక్షత్రములందో శుభగ్రహములు వచ్చినపుడు యుద్ధము చేసినచో మధ్యనున్న వానికి విజయము, ఆక్రమణ చేసినవానికి పరాజయము కలుగును. ప్రవేశించువాని నక్షత్రమునందు ప్రవేశించవలెను. బైటకు వచ్చు నక్షత్రము నందు బైటకి రావలెను. శుక్ర, కుజ, బుధులు నక్షత్రాంతము నందు ఉన్నపుడు యుద్ధా రంభము చేసినచో ఆక్రమణకర్త పరాజితుడగును. ప్రవేశ నక్షత్రములు నాల్గింటి యందు యుద్ధము ప్రారంభమైనచో దుర్గము వశమగును. ఆశ్చర్యపడవలసిన పనిలేదు. (128)

అర్ఘకాండము

పరమేశ్వరుడు పలికెను :

వస్తువుల మూల్యమును (అల్పత్వాధికత్వముల) గూర్చి చెప్పెదను. భూతలముపై ఉల్కాపాతము, భూకంపము, వజ్రపాతము, చంద్ర సూర్య గ్రహణములు, దిక్కులందు అధికముగ వేడి కలుగునపుడు ఈ విషయమును ప్రత్యేకమాసము నందును పరిశీలించ వలెను. పైనచెప్పిన లక్షణములలో ఏదైన లక్షణము చైత్రమునందైనచో అలంకార సామగ్రిని (వెండి, బంగారము మొ॥) సంగ్రహించు కొనవలెను.

ఆరు మాసముల తరువాత అవి నాలుగు రెట్లు మూల్యమునకు అమ్ముడుపోవును. వైశాఖము నందైనచో వస్త్ర, ధాన్య, సువర్ణ, ఘృతాదులను సంగ్రహించుకొనవలెను. ఎనిమిదవ మాసమున ఆరు రెట్ల మూల్య మునకు అమ్ముడుపోవును. జ్యేష్ఠాషాఢములందైనచో యవలు, గోధుమలు, ధాన్యము సంగ్రహించుకొనవలెను. శ్రావణమునందైనచో ఘృత తైలాది రసపదార్థము లను సంగ్రహించవలెను. ఆశ్వయుజ మాసము నందైనచో వస్త్రములు, ధాన్యము సంగ్రహించవలెను. కార్తికమునందైనచో అన్ని విధముల అన్నమునుకొని ఉంచుకొనవలెను. మార్గశిర పుష్యము లందైనచో కుంకుమము వలనను సుగంధ పదార్థముల వలనను లాభము వచ్చును. మాఘమునందైనచో ధాన్యము వలన లాభము కలుగును. ఫాల్గుణము నందైనచో సుగంధ పదార్థములవలన లాభము కలుగును. లాభము వచ్చు అవధి ఆరు–ఎనిమిది మాసములని గ్రహించవలెను. (129)

మండల వర్ణనము

పరమేశ్వరుడు చెప్పెను :

ఇపుడు నేను విజయమునకై నాలుగు విధములగు మండలములను గూర్చి చెప్పెదను. కృత్తికా, మఘా, పుష్య, పూర్వఫల్గునీ, విశాఖా, భరణీ, పూర్వాభాద్రల మండలము ఆగ్నేయ మండలము. దాని లక్షణము చెప్పెదను. ఈ మండలము నందు వాయు ప్రకోపము వచ్చినను, సూర్య చంద్ర పరివేషము కలిగినను, భూమి కంపించినను, దేశమునకు వినాశము కలుగును. సూర్య-చంద్ర గ్రహణములు వచ్చినను, ధూమజ్వాల కనబడినను, దిక్కులు దహించుకొని పోవుచున్నట్లు కన బడినను, ధూమకేతువు కనబడినను, రక్తవృష్టి వచ్చినను, ఎక్కువ వేడిగా ఉన్నను, రాళ్ళు కురిసినను జనులకు నేత్ర రోగము, అతిసారము, అగ్ని భయము కలుగును. ఆవు పాలు తక్కువ ఇచ్చును. వృక్షములందు ఫల పుష్పములు తక్కువగా ఉండును. పంట తక్కువగును. వృక్షములు కూడ తక్కువగా ఉండును. నాల్గు వర్ణముల వారును దుఃఖితులగుదురు. మనుష్యులందరును ఆకలితో బాధపడుదురు.

ఇట్టి ఉత్పాతములు కలిగినపుడు సింధు-యమునా ప్రాంతములు, గుజరాతు, భోజ, బాహ్లీక, జాలంధర, కాశ్మీర, ఉత్తరా పథములు నశించిపోవును. హస్త, చిత్రా మఘా, స్వాతీ, మృగశీర్ష, పునర్వసు, ఉత్తర ఫల్గునీ, అశ్వినీ నక్షత్రముల మండలము వాయవ్య మండలము. ఈ మండలమునందు వెనుక చెప్పిన ఉత్పాతములు కలిగినచో ప్రజలం దరును, హాహాకారము చేయుచు, నష్టప్రాయులు అగుదురు. డ్రాహల (త్రిపుర, కామరూప, కళింగ, కోసల, అయోధ్యా, ఉజ్జయినీ, కొంకణ, ఆంధ్రదేశములు నష్టమగును. ఆశ్లేషా, మూల, పూర్వాషాఢ, రేవతీ, శతభిషా, ఉత్తరాభాద్రపదా నక్షత్రముల మండలము వారుణ మండలము. పైన చెప్పిన ఉత్పాతములు ఈ మండలమునందు ఉత్పన్నమైనచో ఆవుల పాలు, నెయ్యి వృద్ధిపొందును. వృక్షములందు ఫల పుష్పములు అధికముగా నుండును. ప్రజలు ఆరోగ్యవంతులు అగుదురు. భూమి సస్య సమృద్ధముగా నుండును.

ధాన్యములు చౌకగా నుండును. దేశము సుభిక్షముగా నుండును. కాని రాజుల మధ్య ఘోర సంగ్రామములు చెలరేగును. జ్యేష్ఠా, రోహిణీ, అనూరాధా, శ్రవణ, ధనిష్ఠా, ఉత్తరాభాద్రపదా, అభిజిత్తుల మండలము మహేంద్ర మండలము. ఈ మండలమునందు పై ఉత్పాతములు సంభవిం చినచో ప్రజలు సౌఖ్యముతో ఉందురు. రోగభయ మేమియు ఉండదు. రాజులు తమలో సంధి చేసికొందురు. రాజులకు హితకరమగునటుల సుభిక్ష మేర్పడును.

ముఖగ్రామ, పుచ్ఛగ్రామము అని గ్రామము రెండువిధములు. చంద్ర, రాహు, సూర్యులు ఒకే రాశిలో ఉన్నపుడు ముఖగ్రామము, రాహువునుండి ఏడవ స్థానమునకు పుచ్ఛగ్రామమని పేరు. చంద్రుడు సూర్యుడున్న నక్షత్రమునుండి పదునైదవ నక్షత్రమునకు వచ్చినపుడు, తిథిసాధనము ననుసరించి సోమగ్రామము, అనగా పూర్ణిమాతిథి అగును. (130)

ఘూత చక్రాదివర్ణన

పరమేశ్వరుడు చెప్పెను :

పూర్వాది దిక్కులందు ప్రదక్షిణక్రమమున అకారాది స్వరములు వ్రాయవలెను. దానియందు శుక్లపక్ష ప్రతిపత్తు పూర్ణిమ, త్రయోదశి, చతుర్దశి, శుక్లపక్షాష్టమి మాత్రము, సప్తమి, కృష్ణపక్షప్రతిపత్తు మొదలు త్రయోదశి వరకు (అష్టమి విడచి) పండ్రెండు తిథుల న్యాసము చేయవలెను. ఈ చైత్ర చక్రమునందు పూర్వాది దిశలో స్పర్శ వర్ణములను వ్రాయుటచే జయ పరాజయములను గూర్చియు లాభమును గూర్చియు నిర్ణయించ వచ్చును. విషమదిక్కు, విషమస్వరము, విషమ వర్ణము అయినచో శుభమగును. అది సమములైనచో అశుభమగును. యుద్ధారంభ సమయమునందు సేనాపతి మొదట ఎవరి పేరుపెట్టి పిలుచునో అతని పేరు దీర్ఘాక్షరముతో ప్రారంభమైనచో ఘోర సంగ్రామము నందు గూడ వానికి (సేనాపతికి) విజయము కలుగును. పేరు హ్రస్వాక్షరముతో ప్రారంభ మైనచో తప్పక మృత్యువు కలుగును. ఉదాహరణమునకు ఒకని పేరు ఆదిత్యుడు మరి యొకని పేరు గురుడు. వీటిలో మొదటి పేరు మొదటి అక్షరము 'ఆ' దీర్ఘము, రెండవ పేరు మొదటి అక్షరము హ్రస్వము. అందుచేత అద్యక్షరము దీర్ఘాక్షరముగాగల పేరుగల వానిని పిలిచినచో మృత్యువు కలుగును. నక్షత్ర పిండమును బట్టి పరచక్రమును గూర్చి చెప్పెదను. మొదట ఒక మనుష్యుని ఆకారము తయారుచేయవలెను. దానిపై నక్షత్రముల న్యాసము చేయవలెను సూర్య నక్షత్రము మొదలుగా నామ నక్షత్రము వరకు లెక్కపెట్ట వలెను. మొదటి మూడింటిని శిరస్సుపైనను, ఒకటి ముఖముపైనను, రెండు నేత్రములందును, నాలుగు చేతులపైనను, రెండు చెవులపైనను, ఐదు హృదయముపైనను, ఆరు పాదములపైనను వ్రాయవలెను. నామ నక్షత్రమును స్పష్టముగ చక్ర మధ్యమున వ్రాయవలెను. ఇట్లు వ్రాసిన పిమ్మట నేత్ర, శిరో, దక్షిణహస్త పాద, హృదయ, కంఠ వామహస్త గుహ్యాంగములందు ఎచట శని, కుజ, రవి, రాహు నక్షత్రములుండునో ఆ అవయవములపై యుద్ధమునందు దెబ్బ తగులును.

తూర్పు నుండి పశ్చిమమునకు పదమూడు రేఖలు గీసి ఉత్తరమునుండి దక్షిణమునకు ఆరు అడ్డగీతలు గీయవలెను. దానిపై అ నుండి 'హ' వరకు అక్షరములు వ్రాసి, 10, 9, 7, 12, 4, 11, 15, 24, 18, 4, 27, 24 అంకెలను కూడ వేయవలెను. అంకెలు అకా రాద్యక్షముల పైన ఉండునట్లు వ్రాయవలెను. శత్రునామము నందలి స్వర-వ్యంజనములకు ఎదురుగా అంకెలు కూడి పిండము (మొత్తము) చేయవలెను. దానిని ఏడుచే భాగించగా మిగిలిన ఒకటి మొదలగు దానిని బట్టి సూర్యాది గ్రహముల భాగలను తెలిసికొనవలెను. శేషము 1 సూర్యుడు; 2 చంద్రుడు; 3 కుజుడు; 5 గురుడు; 6 శుక్రుడు; 7 శని – వీరి భాగములగును రవి, శని, కుజ భాగములు వచ్చినచో జయము కలుగును. శుభగ్రహ భాగమైనచో సంధి కుదురును. తూర్పునుండి పశ్చిమమువరకు పండ్రెండు రేఖలు గీయవలెను. ఆరు రేఖలు ఉత్తర దక్షిణముగ వ్రాయవలెను. దీనిపై కోష్ఠమున 14, 27, 12, 15, 6, 4, 3, 17, 8, 8 అంకెలు వ్రాసి కోష్ఠములందు 'అ' కారాది స్వరములు మొదలు 'హ'వరకునుండు అక్షరములు వ్రాయవలెను. పిదప పేరులోని

అక్షరముల ద్వారా ఏర్పడిన మొత్తమును ఎనిమిదిచే భాగించి, ఏకాది శేషమును బట్టి వాయస, మండల, రాసభ, వృషభ, కుంజర, సింహ, ఖర, ధూమ్రములు అను భాగ నామములు అగును. వీటిలో వాయసముకంటె మండలము, దానికంటె రాసభము–ఈవిధముగ పూర్వముకంటె ఉత్తరోత్తరము బలీయము. (131)

సేవాచక్రము

పరమేశ్వరుడు పలికెను :

ఇపుడు సేవాచక్రమును గూర్చి చెప్పెదను. దీనివలన సేవకునకు సేవ్యుని వలన కలుగు లాభనష్టములు తెలియును. తండ్రి, తల్లి, సోదరులు, స్త్రీ పురుషులు–వీరి విషయమున దీనిని బాగుగా పరిశీలించవలెను. ఎవ్వడైనను పైన చెప్పిన వారి నుండి లాభము పొందగల్గునా లేదా అను విషయమును సేవాచక్రము ద్వారా తెలిసికొనవచ్చును. తూర్పు నుండి పడమటకు ఆరు రేఖలను, ఉత్తరమునుండి దక్షిణమునకు ఆరు అడ్డ రేఖలను గీయవలెను. ఇట్లుగీయగా ముప్పది యైదు గళ్ళ సేవాచక్రము ఏర్పడును. దానిపై కోష్ఠములందు ఐదు స్వరములను వ్రాసి పిదప స్పర్శ వర్ణములను వ్రాయవలెను. వీటిలో ఙ, ఞ, ణ లను విడచివేయవలెను. క్రింది కోష్ఠములలో (క నుండి హ వరకు) వరుసగ సిద్ధ, సాధ్య, సుసిద్ధ, శత్రు, మృత్యువులు వ్రాయవలెను. ఈ విధముగ వ్రాయగా సేవా చక్రము సర్వాంగ సంపన్నమగును. ఈ చక్రము నందలి 'శత్రు' 'మృత్యు' అను కోష్టము లలో నున్న స్వర–వ్యంజములను అన్ని కార్యములందు పరిత్యజించవలెను. కాని సిద్ధ, సాధ్య, సుసిద్ధ, శత్రు, మృత్యు–అను కోష్ఠములందు ఏదైన ఒక కోష్ఠమునందు సేవ్య–సేవ కుల నామముల ప్రథమాక్షరములు వచ్చినచో అది సర్వథా శుభము. దీనిలో ద్వితీయ కోష్టము పోషకము; తృతీయము ధనదాయకము, నాల్గవది ఆత్మనాశకము; ఐదవది మృత్యు ప్రదము. మిత్ర–భృత్య బాంధవాదుల విషయమున పరిశీలించునపుడు (వారి పేర్లున్న) స్థానములు సిద్ధ, సాధ్య, సుసిద్ధములైనచో ఉత్తమ ఫలదాయకములు. అన్ని కర్మలందును అరి–మృత్యువులను విడువవలెను. అ, ఇ, ఉ, ఏ, ఓ లను అకారాంతమును వలె భావింతురు. ఇపుడు వర్గాష్టక సంస్కృతములగు అంశకములను గూర్చి చెప్పెదను. 'అ' వర్గమునకు (అ, ఇ, ఉ, ఏ, ఓ) అధిపతులు దేవతలు. 'క' వర్గుకు దైత్యులు, 'చ' వర్గుకు పన్నగులు, 'ట' వర్గుకు గంధర్వులు, 'త' వర్గుకు ఋషులు, 'ప' వర్గుకు రాక్షసులు, 'య' వర్గుకు (య ర ల వ) పిశాచములు, 'శ' వర్గుకు (శ ష స హ) మనుష్యులు అధి పతులు. వీరిలో దేవతలకంటె దైత్యులు, వారికంటె పన్నగులు, వారికంటె గంధర్వులు, వారికంటె రాక్షసులు, వారికంటె పిశాచములు, పిశాచముల కంటె మనుష్యులు అధిక బలవంతులు. బలవంతుడు దుర్బలుని విడువవలెను. సేవ్య సేవకుల నామాద్యక్షరములు ఒకే వర్గమునకు చెందినచో ఉత్తమము.

మైత్రీ విభాగమునకు సంబంధించిన తారా చక్రమును గూర్చి వినుము. మొదట నామ ప్రథమాక్షరమును బట్టి నక్షత్రము తెలిసికొని తొమ్మిది తారలను మూడు పర్యాయములు ఆవృత్తి చేయగా ఇరువదియేడు నక్షత్రముల తారలు తెలియును. ఈ విధముగ తన నామ నక్షత్రమునకు

సంబంధించిన తారను తెలుసుకొనవలెను. జన్మ, సంపత్, విపత్, క్షేమ, ప్రత్యరి, సాధన, వధ, మైత్ర, అతిమైత్రములని తొమ్మిది తారలు. వీటిలో జన్మ తార అశుభము. సంపత్తార అత్యుత్తమము. విపత్తార నిష్ఫలము. క్షేమతార అన్ని కార్యములందును గ్రాహ్యము. ప్రత్యరితారచే ధననాశము కలుగును. సాధకతారచే రాజ్యలాభము కలుగును. వధతార కార్య వినాశనము. మైత్రతార మైత్రీకారకము. అతి మైత్రము హితకారకము.

ప్రియురాలా! నామాక్షరము నందలి స్వరముల సంఖ్యను కూడి ఇరువదిచే భాగించి, శేషముచే ఫలము తెలియవలెను. (అనగా స్వల్ప శేషము కలవాడు అధిక శేషము కలవాని నుండి లాభము పొందును) సేవ్య సేవకుల నామాక్షరములలో ఎవనికి అధిక స్వరము లుండునో అతడు ధని; అల్ప స్వరములు కలవాడు ఋణి. ధనస్వరములు మైత్రికిని, ఋణస్వరములు దాసత్వమునకును మంచివి. ఈ విధముగ లాభనష్టముల జ్ఞానమునకై సేవాచక్రము చెప్పబడినది. మేష, మిథున రాశులవారి మధ్య ప్రీతి, మిథున-సింహముల వారి మధ్య మైత్రి, తుల-సింహ రాశులవారి మధ్య మహామైత్రి ఉండును. కాని ధనుఃకుంభ రాశులవారి మధ్య మైత్రిఉండదు. అందుచే వీరు పరస్పర సేవ చేయరాదు. మీన-వృషభ; వృషభ-కర్కట; కర్కట-కుంభ; మకర-వృశ్చిక; మీన-మకరముల వారి మధ్య మైత్రియు, మిథున-కుంభ; తులా-మేషములవారి మధ్య మహామైత్రి ఉండును. వృషభ-వృశ్చికములవారి మధ్య పరస్పరము వైరము ఉండును. మిథున-ధనుస్; కర్కట-మకర; మకర-కుంభ; కన్యా-మీన రాశులవారి మధ్య ప్రీతి ఉండును. (132)

నానా బలవర్ణనము

పరమేశ్వరుడు చెప్పెను :

సూర్యాది గ్రహముల రాశులందు జన్మించిన శిశువునకు క్షేత్రాధిపతిని బట్టి కలుగు ఫలము చెప్పెదను. సింహ లగ్నము నందు పుట్టినవాడు సమకాయుడు, ఒకప్పుడు కృశాంగుడు, ఒకప్పుడు స్థూలశరీరము కలవాడు, గౌరవర్ణుడు, పిత్త ప్రకృతి, రక్త నేత్రుడు, గుణవంతుడు, వీర్యవంతుడు అగును. కర్కట లగ్నమున పుట్టినవాడు భాగ్యవంతుడు, కోమల శరీరముకలవాడు అగును. మేష-వృశ్చిక జాతుడు వాతరోగి, అత్యంతలుబ్ధుడు అగును. మిథున-కన్యాలగ్న జాతుడు బుద్ధి మంతుడు, సుందరుడు అగును. ధను-ర్మీన లగ్న జాతుడు సుందరుడు, అధిక కోపవంతుడును అగును. మకర-కుంభ లగ్న జాతుడు బుద్ధిమంతుడు, సుందరుడు, మానవంతుడు అగును, సౌమ్యలగ్నమందు పుట్టిన వాడు సౌమ్య స్వభావవంతుడగును. క్రూరలగ్న జాతుడు క్రూర స్వభావుడగును. గౌరీ! ఇపుడు నామ రాశులనుబట్టి సూర్యాది గ్రహదశా ఫలము చెప్పెదను - సూర్య దశయందు గజములు, అశ్వములు, ప్రబల రాజ్యలక్ష్మి లభించును. ధనవ్యాప్తి కలుగును. చంద్రదశలో దివ్యస్త్రీ ప్రాప్తి, కుజదశలో భూమి లాభము, సుఖము కలుగును. బుధదశలో భూమి లాభముతో పాటు ధన ధాన్య ప్రాప్తి కూడ కలుగును. గురుదశలో గజాశ్వధన ప్రాప్తి కలుగును. శుక్రదశలో ఖాద్యాన్నము, గోదుగ్ధాది పానము ధనలాభము ఉండును. శని దశలో నానావిధములగు

రోగములు కలుగును. రాహు దర్శనమున, అనగా గ్రహణ సమయమున స్నానాదులాచరించి ధ్యానము చేయవలెను. వాణిజ్యము చేయవలెను. ఎడమ శ్వాస ఉన్నపుడు నామాక్షరము సంఖ్య విషయమైనచో ఆ సమయము కుజ, శని, రాహువులకు సంబంధించినది. అపుడు యుద్ధము చేయుటచే విజయము లభించును. కుడి శ్వాస ఆడునపుడు నామాక్షర సంఖ్య సమసంఖ్యయైనచో అది సూర్యుని సమయము. ఆ సమయమున వర్తకముచేయుట నిష్ఫలము. కాని ఆ సమయమున పదాతియై యుద్ధము చేసినచో విజయము లభించును. ఏదైన వాహనముపై ఎక్కి యుద్ధము చేసినచో మృత్యువు కలుగును.

'ఓం హూం.....' ఇత్యాది మూలోక్త మంత్రమును ఏడు పర్యాయములు న్యాసముచేసి, నాలుగు, పది, ఇరువది భుజములు కలవాడును, కటారమును ధరించిన వాడును, తన సేవకు విముఖుడై శత్రుసేనను భక్షించుచున్నవాడును అగు భైరవుని హృదయమునందు ధ్యానించుచు, శత్రుసేన ఎదుట పై మంత్రమును నూట ఎనిమిది పర్యాయములు జపించ వలెను. పిదప డమరు శబ్దము చేయగా శత్రుసేన శస్త్రములు విడచి పారిపోవును. శత్రు పరాజయము కొరకై మరొక ప్రయోగము చెప్పెదను. శ్మశానము నందలి బొగ్గులను కాకి-గుడ్లగూబ రెట్టలతో కలిపి దానితో బట్టపై శత్రువు చిత్రము వ్రాసి, వాని శిరస్సు, ముఖము, లలాటము, హృదయము, గుహ్యము, పాదములు, పృష్ఠము, బాహువులు నడుము-వాటిపై వాని పేరు తొమ్మిది పర్యాయములు వ్రాయవలెను. ఆ బట్ట మడచి యుద్ధమునందు తన దగ్గర ఉంచుకొని పూర్వోక్త మంత్రమును జపించుటచే జయము లభించును.

ఇపుడు, విజయ ప్రాప్తిసాధనమగు త్రిముఖాక్షర మహాతార్క్ష్య చక్రమును చెప్పెదను. 'క్షిప ఓం స్వాహా తార్క్ష్యాత్మా శత్రురోగ విషాదినుత్' ఈ మంత్రము తార్క్ష్య చక్రము. ఈ మంత్రమును అనుష్ఠించుటచే దుష్టబాధ, భూతబాధ, గ్రహబాధ, అనేక విధములగు రోగ ములును తొలగును. ఈ గరుడ మంత్రముచే ఏ కార్యమైనను సిద్ధించును. ఈ మంత్ర సాధ కుని దృష్టి ప్రసరించుటచే స్థావర జంగమ విషములు, లూతా (సాలె పురుగు) విషము, కృత్రిమవిషములన్నియు నశించును. మహాతార్క్ష్యుని ఈ విధముగా ధ్యానించవలెను, మనుష్యాకృతితో రెండు భుజములు, రెండు రెక్కలు కలిగి యుండును. ముక్కు వంకరగా ఉండును. మహాబలము గల హస్తములతో ఏనుగును, తాబేలును ధరించి యుండును. పాదములందు అసంఖ్యాకములగు సర్పములు చుట్టుకొని ఉండును. ఆకాశమార్గమున వచ్చి రణరంగమున శత్రువులను పొడిచి పొడిచి తినుచుండును. కొందరు శత్రువులు ఆతని ముట్టెచే చంపబడి యుందురు. కొందరు పంజాదెబ్బచే మరణింతురు. కొందరు రెక్కల దెబ్బకు చూర్ణము చేయబడుదురు. కొందరు పది దిక్కులకు పారిపోవుచుందురు. ఈ విధముగా ధ్యాననిష్ఠుడగు సాధకుడు మూడు లోకములందును అజేయుడగును.

ఇపుడు మంత్ర సాధనచే సిద్ధించు పిచ్ఛికా క్రియను గూర్చి చెప్పెదను. 'ఓం హూం పక్షిన్ ..... స్వాహా' అను పిచ్ఛికా మంత్రమును చంద్రగ్రహణము నందు జపించి సిద్ధింప చేసికొనిన సాధకుడు యుద్ధమునందు గజమును, సింహమును గూడ ఎదిరించగలడు. మంత్రధ్యానముచే శత్రువులను లేళ్ళను, మేకలనువలె చంపగలడు. దూరమునుండియే కేవల మంత్రోచ్చారణముచే

శత్రువినాశము చేయు ఉపాయము చెప్పబడుచున్నది. కాలరాత్రి యందు(అశ్విన శుక్లాష్టమినాడు) మాతృకలకు చరు ప్రదానము చేసి శ్మశాన భస్మము, మాలతీపుష్పములు, చామరి, పత్తి చెట్టు వేరు వాటితో దూరము నుండియే శత్రువును సంబోధించవలెను. ఓం అహే హుంఫట్' అనునది సంబోధించు మంత్రము.

ఈ భంగవిద్యను జపించుటచేతను, దూరమునుండియే ధ్వని చేయుట చేతను, అపరాజిత, ధత్తూరము వీటి రసము కలిపి తిలకము ధరించుట చేతను శత్రువులు నశింతురు. 'ఓం కిలి కిలి ..... కురుస్వాహా' అను (మూలోక్తమగు) సర్వకార్యార్థ సాధక మంత్రమును భూర్జ పత్రముపై వృత్తాకారముగ వ్రాసి, బహిర్భాగమున మాతృకలను వ్రాయవలెను. ఈ విద్యను మొదట బ్రహ్మ విష్ణు మహేంద్రాదులు హస్తాదులందు ధరించిరి. ఈ విద్య ద్వారా బృహస్పతి దేవాసుర సంగ్రామమునందు దేవతలను రక్షించెను. రక్షారూపిణియు, నారసింహియు, శక్తి రూపి ణియు, భైరవియు, త్రైలోక్య మోహినియు అగు గౌరి కూడ దేవాసుర సంగ్రామము నందు దేవతలను రక్షించెను.

అష్టదళ కమలము కర్ణికయందును, దళములందును గౌరీబీజముతో (హ్రీం) సంపుటితమైన తన పేరు వ్రాయవలెను. పూర్వదిక్కునందున్న ప్రథమాది దళములపై పూజానుసారము గౌరి అంగదేవతల న్యాసము చేయవలెను. ఈ విధముగా వ్రాయగా రక్షా మంత్రము ఏర్పడును. ఈ సంస్కారముల మధ్య సకలకళా పరివేష్టితము, సకారముచే ప్రబోధితము అగు మృత్యుంజయ మంత్రమును చెప్పెదను. ముందుగా ఓంకారము వ్రాసి, పిదప బిందుయుక్త మగు జకారము, వ్రాయవలెను. పిదప గర్భమున వకారము వ్రాసి దానిని చంద్రబిందువుచే అంకితము చేయవలెను. అనగా 'ఓం జం ధ్వం' అను మంత్రము దుష్టులందరిని నశింపచేయును. గోరోచనా-కుంకుమలతో గాని, మలయగిరి చందన, కర్పూరములతో గాని భూర్జ పత్రముపై గీసిన చతుర్దళ కమల కర్ణిక యందు తన పేరు వ్రాసి, నాలుగు దళములపై ఓంకారము వ్రాయవలెను.

ఆగ్నేయాది కోణములందు హూంకారము వ్రాయవలెను. దానిపై పదునారు దళముల కమలము వ్రాయవలెను. దాని దళములపై అకారాది షోడశ స్వరములు వ్రాయవలెను. దాని దళములపై ముప్పది నాల్గు దళముల కమలము నిర్మించవలెను.

దాని దళములపై 'క' నుండి 'క్ష' వరకు అక్షరములు వ్రాసి, ఆ యంత్రమును శ్వేత సూత్రముచే చుట్టబెట్టి, పట్టుబట్టతో కప్పి, కలశముపై స్థాపించి పూజించవలెను. ఈ యంత్రమును ధరించుటచే సకల రోగములు శాంతించును. శత్రువులు నశింతురు. ఇపుడు వియోగమునందు కలుగు మృత్యువును నివారించు 'ఖేలఖీ' విద్యను చెప్పెదను. 'ఓం వాతరే ..... ఓం స్వాహా' అను (మూలోక్త) మంత్రమును నవరాత్రులందు జపించి, సిద్ధిపొంది, యుద్ధమునందు ఏడు పర్యాయములు జపము చేయగా శత్రువులకు ముఖస్తంభనమగును. 'ఓం చండి, ఓం హూంఫట్ స్వాహా' అను మంత్రమును యుద్ధ సమయమునందు ఏడు పర్యాయములు జపించుటచే ఖడ్గ యుద్ధమున విజయము కలుగును. (133)

త్రైలోక్య విజయవిద్య

పరమేశ్వరుడు పలికెను :

ఇపుడు నేను, సమస్త యంత్ర మంత్రములను నశింపచేయు త్రై లోక్య విజయ విద్యను చెప్పెదను. 'ఓం హూం క్షూం హ్రూం..........త్రై లోక్య విజయే హుం ఫట్ స్వాహా' అను మంత్రము త్రైలోక్య విజయ విద్య. విజయము కోరువాడు నీలవర్ణము గలదియు, ప్రేతాధి రూఢయు అగు త్రైలోక్య విజయావిద్య యొక్క ఇరువది హస్తముల ఎత్తుగల ప్రతిమ నిర్మించి దానిని పూజించవలెను; పంచాంగ న్యాసము చేసి (ఎఱ్ఱని) రక్త పుష్పముల హోమము చేయవలెను. ఈ త్రై లోక్య విద్యను పఠించుటచే సమర భూమి యందు శత్రు సైన్యములు పారిపోవును. మట్టితో ఒక మూర్తి తయారుచేసి, దానిలో శత్రువు న్నట్లు భావన చేయుచు, ఆ శత్రువు పేరు భుజంగుడని తలచుచు, 'ఓం నమో బహు రూపాయ ......బహురూపాయ నమః' ఇత్యాది (మూలోక్త) మంత్రముచే అభిమంత్రించి, ఆ శత్రువు నశించుటకై పై మంత్రమును జపించవలెను. శత్రువు నశించును. (134)

సంగ్రామ విజయ విద్య

పరమేశ్వరుడు పలికెను :

దేవీ! ఇపుడు సంగ్రామమునందు విజయము నిచ్చు విద్యను (మంత్రమును) చెప్పెదను. పదమాలా రూపమున నున్నది. 'ఓం చాముణ్డే...........విచ్చే హుం ఫట్ స్వాహా' అను (మూలోక్త) మంత్రము 'జయా' అను పేరుగల పదమాల. అన్ని కార్యములందు సిద్ధి నిచ్చును. దీనితో హోమము చేయుటచేతను, జపపాఠములు చేయుటచేతను సర్వదా యుద్ధమునందు విజయము ప్రాప్తించును. ఇరువది ఎనిమిది హస్తములుగల చాముండా దేవిని ధ్యానించవలెను. ఆమెకు రెండు చేతులలో కత్తి, ఖేటకము ఉన్నవి. రెండు చేతులలో గదాదండములు, రెండు చేతులలో ధనుర్బాణములు, రెండు చేతులలో ముష్టిముద్గరములు, రెండు చేతులలో శంఖ ఖడ్గములు, రెండు చేతులలో ధ్వజ వజ్రములు, రెండు చేతులలో చక్రపరశువులు, రెండు చేతులలో దర్పణ-డమరువులు, రెండు చేతులలో శక్తి-కుంతములు, రెండు చేతులలో హల-ముసలములు, రెండు చేతులలో పాశతోమ రములు, రెండు చేతులలో ఢక్కా-పణవములు, రెండు చేతులలో అభయముద్ర, రెండు చేతులలో ముష్టికములు ఉండును. ఆమె మహిషాసురుని భయపెట్టుచు వానిని చంపును. ఈ విధముగ ధ్యానించుచు హోమము చేయుటచే సాధకునకు శత్రువులపై విజయము లభించును. నెయ్యి, తేనె, పంచదార కలిపిన తిలలు హోమము చేయవలెను. ఈ సంగ్రామ విజయవిద్యను ప్రతి ఒక్కనికిని (అధికారములేని వానికి) ఈయరాదు. (135)

నక్షత్రచక్రము

పరమేశ్వరుడు పలికెను :

దేవీ! ఇపుడు నక్షత్రముల త్రినాడీచక్రమును గూర్చి చెప్పెదను. ఇది యాత్రాదులలో ఫలదాయకము. అశ్విన్యాది నక్షత్రములలో మూడు నాడులచే భూషితమగు చక్రమును గీయవలెను.

మొదట అశ్వినీ, ఆర్ద్రా, పునర్వసువులను, పిదప ఉత్తరఫల్గునీ, హస్త, జ్యేష్ఠా, మూల, శతభిషక్, పూర్వాభాద్రలను వ్రాయవలెను. ఇది ప్రథమనాడి, రెండవ నాడి యందు భరణీ, మృగశీర్ష, పుష్య, పూర్వఫల్గునీ, చిత్రా, అనూరాధా, పూర్వాషాఢా, ధనిష్ఠ–ఉత్తరాభాద్రలును, మూడవ నాడియందు కృత్తికా–రోహిణీ–ఆశ్లేషా–మఘా–స్వాతీ–విశాఖా–ఉత్తరాషాఢా–శ్రవణ, రేవతులు నుండును. ఈమూడు నాడులందున్న నక్షత్రము లతో సంబంధించిన గ్రహముల ద్వారా శుభాశుభ ఫలములు తెలిసికొనవలెను. ఈ త్రినాడీ చక్రమునకు ఫణీశ్వర చక్రమని పేరు. ఈ చక్రమునందలి నక్షత్రములందు సూర్య, కుజ, శని,రాహువులున్నచో అది అశుభము. ఇతర గ్రహములున్నచో ఆ నక్షత్రము శుభ ప్రదము. దేశ, గ్రామ, భ్రాతృ, భార్యాదులు తమ తమ నామముల అద్యక్షరముల ననుస రించి ఒకే నాడీ చక్రమునందు ఉన్నచో అది శుభకరము. ఇచట నక్షత్రములనగా అశ్విని మొదలు రేవతి వరకును ఉన్న ఇరువది ఏడు నక్షత్రములని గ్రహించవలెను. (136)

మహామారీ విద్య

పరమేశ్వరుడు చెప్పెను :

దేవీ! ఇపుడు నేను శత్రుమర్దనియగు మహామారీవిద్యను గూర్చి చెప్పెదను. 'ఓం హ్రీం మహామారి.....హూం ఫట్ స్వాహా' అనునది (మూలములో గలమంత్రము) మహామారీ మంత్రము (మూలోక్తములైన) 'ఓం మమామారి హృదయాయ నమః .... అస్త్రాయ హుం ఫట్' అనునవి అంగన్యాసాదులు. సాధకుడు ఈ అంగన్యాసమును తప్పక చేయవలెను. శవముపై కప్పిన వస్త్రము తీసికొనివచ్చి చతురస్రముగా ఖండించవలెను. దాని పొడవు వెడల్పులు మూడేసి హస్తములు ఉండవలెను. ఆ వస్త్రముపై అనేక విధములైన రంగులతో నల్లని దేవీ ఆకారము చిత్రించవలెను. మూడు ముఖములు, నాలుగు భుజములు ఉండవలెను. హస్తములలో ధనస్సు, శూలము, కర్తరి, మంచము కోడు ధరించియుండును. ఆ దేవి ప్రథమ ముఖము పూర్వాదిశాభిముఖమై తన కాంతిచే ప్రకాశింపచేయుచు, దృష్టి పడగనే ఎదుట ఉన్న మనుష్యుని తినివేయునట్లు ఉండవలెను. రెండవ ముఖము దక్షిణ భాగమునందు ఉండవలెను. ఆమె నాలుక ఎఱ్ఱగా, చూచుటకు భయంకరముగా నుండవలెను. వికృతమైన ఆమె ముఖము కోరలతో భయంకరముగా నుండవలెను. నాలుకతో చెక్కిళ్ళు నాకుచుండవలెను. దృష్టి పడగానే ఎదుట నున్న గుఱ్ఱములు మొదలగు వాటిని తినివేయు నట్లు ఉండవలెను. దేవి మూడవ ముఖము పశ్చిమాభిముఖమై తెల్లగా ఉండవలెను. దృష్టి పడగానే ఏనుగులు మొదలైన వాటిని తినివేయునట్లు ఉండవలెను. గంధ పుష్పాదులతోను, తేనె నెయ్యి మొదలగు నైవేద్యములతోను దానిని పూజించవలెను, పూర్వోక్త మంత్రమును స్మరించినంత మాత్రముననే నేత్ర శిరోరోగాదులు నశించును. యక్షరాక్షసులు కూడ వశమగుదురు. శత్రువులు నశింతురు. మనుష్యుడు క్రోధముతో వేపచెట్టు పుల్లలు హోమము చేసినచో తన శత్రువులను చంప గలడు; ఇందు సందేహము లేదు. శత్రు సేవాభిముఖుడై ఒక సప్తాహము ఈ సమిధలతో హోమము చేసినచో శత్రు సైన్యము నానావిధ రోగపీడితమై నశించును. ఎవని పేరు పెట్టి వెయ్యి సమిధల హోమము చేయబడునో వాడు బ్రహ్మ రక్షించినను మరణించక తప్పదు. వెయ్యి ధత్తూర

సమిధలను, రక్తము, విషము కలిపి మూడు దినములు హోమము చేసినచో శత్రువు సైన్యసమేతముగ నశించును. ఆవాలు, ఉప్పు హోమము చేయగా శత్రు సైన్యమునందు కలవరము పెట్టి శత్రువు పారిపోవును. దానిని గాడిద రక్తముతో కలిపి హోమము చేసినచో శత్రువును పార ద్రోలును. పారిపోవలెనని ఆతని మనస్సునందు తీవ్రముగ కోరిక పుట్టును. కాకి రక్తము కలిపి హోమము చేసినచో శత్రువును పెకలించి వేయవచ్చును. సాధకుడు ఆతనిని చంపుటకు సమర్థుడగును. సాధకుని మనస్సులో కలుగు కోరికలు అన్నియు సఫలమగును. సాధకుడు యుద్ధ సమయమున ఇరువురు కన్యలతో గజము నెక్కి, పూర్వోక్త మంత్రముచే అభిమంత్రించి, మహామాయాప్రతిమ ఉన్న వస్త్రమును, యుద్ధరంగమునందు ఎత్తునుండి ఎగురవేసి, శత్రుసేనాభిముఖుడై ఆ పటమును వారికి చూపవలెను. పిదప ఆ కన్యలకు భోజనము పెట్టవలెను. పిదప మరల పిండిని త్రిప్పుచు శత్రుసైన్యము శిలవలె నిశ్చలమై పోయినట్లు భావన చేయవలెను. శత్రుసైన్యమున యుద్ధము చేయు ఉత్సాహము పోయినట్లును, భయముతో పారిపోవుటకు సిద్ధముగా ఉన్నట్లును కూడ భావన చేయవలెను. ఇట్లు చేయుటచే శత్రుసేనా స్థంభనము కలుగును. నేను చెప్పిన ఈ స్తంభన ప్రయోగ మును ప్రతివానికిని ఉపదేశించరాదు. ఈమె మూడు లోకములపైనను విజయము నిచ్చు 'మాయ'. ఈమె ఆకారముచే చిత్రితమైన పటము 'మాయాపటము'. దుర్గా, భైరవీ, కుబ్జికా, రుద్రదేవ, నృసింహుల మూర్తులనుగూడ ఈ విధముగనే వస్త్రముపై చిత్రించవచ్చును. ఇట్టి పటములచే గూడ స్తంభన ప్రయోగము చేయవచ్చును. (137)

షట్కర్మ నిరూపణము

పరమేశ్వరుడు చెప్పెను :

అన్ని మంత్రముల సాధ్యరూపములకు ఆరు కర్మలను గూర్చి చెప్పెదను వినుము. శాంతి, వశ్యము, స్తంభనము, ద్వేషము, ఉచ్చాటనము, మారణము అని ఆరు కర్మలు. ఈ కర్మలన్నింటి యందును ఆరు సంప్రదాయములు లేదా విన్యాసములు ఉండును. అవి-పల్లవ, యోగ, రోధక, సంపుట, గ్రథన, విదర్భములు. ఎవని ఉచ్చాటనము చేయవలెనో వాని పేరు భూర్జ పత్రాదులపై వ్రాయవలెను. పిదప ఉచ్చాటన మంత్రము వ్రాయవలెను. ఈ విధముగ వ్రాయు సంప్రదాయమునకు పల్లవమని పేరు. ఇది ఉచ్చకోటికి చెందిన ఉచ్చాటనము చేయు ప్రయోగము. మొదట మంత్రము వ్రాసి పిదప సాధ్యవ్యక్తి పేరు వ్రాయవలెను. చివర మరల మంత్రము వ్రాయవలెను. దీనికి 'యోగ' సంప్రదాయమని పేరు. శత్రువు కులమునంతను సంహరించుటకై ఈ ప్రయోగము చేయవలెను. మొదట మంత్రమువ్రాసి, మధ్యసాధ్య నామము వ్రాసి, అంతమునందు మరల మంత్రము వ్రాసి, మరల సాధ్యనామమును వ్రాసి, మరల మంత్రము వ్రాయవలెను. ఇది రోధక సంప్రదాయము. దీని ప్రయోగము స్తంభనాదులందు చేయవలెను. మంత్ర మునకు పైన, క్రింద, కుడి-ఎడమ ప్రక్కల, మధ్య సాధ్యనామము వ్రాయగా ఇది 'సంపుటము'. దీనిని వశ్యా కర్షణ కర్మమున ప్రయోగించవలెను. మంత్రాక్షరము ఒకటి వ్రాసి, పిదప సాధ్యనామాక్షరము వ్రాసి, మరల రెండవ మంత్రాక్షరము వ్రాసి, పిదప నామాక్షరము రెండవది వ్రాసి-ఈ విధముగా

మంత్రాక్షరములు, నామాక్షరము ఒకదాని తరువాత ఒకటి వ్రాసినచో దీనికి గ్రథన సంప్రదాయమని పేరు. దీనిని ఆకర్షణ-వశీకరణములందు చేయవలెను. మొదట మంత్రాక్షరములు రెండు వ్రాసి, సాధ్య నామాక్షరము ఒకటి వ్రాయవలెను. ఈ విధముగ వ్రాయుచు పూర్తి చేయగా విదర్భమని పేరు. దీనిని వశీకరణ ఆకర్షణములకు ఉపయోగింతురు. ఆకర్షణాది మంత్రానుష్ఠానము వసంతము నందు చేయవలెను. తాప జ్వర నివారణ, వశీకరణ, ఆకర్షణ కర్మలందు 'స్వాహా' ప్రయోగము శుభకరము. శాంతి-వృద్ధి కర్మలందు 'నమః' ప్రయోగము చేయవలెను. పౌష్టిక కర్మ-వశీకరణములందు 'వషట్'ను ప్రయోగించవలెను. లాభాదులందును, మంత్ర దీక్షాదులందును వషట్కారమే సిద్ధిదాయకము. మంత్రదీక్ష నిచ్చు ఆచార్యుని యమునిగా భావించి-'ప్రభో! నీవు యముడవు, యమధర్మరాజువు, కాలరూపుడవు, ధర్మరాజువు. నేను సమర్పించు ఈ శత్రువును శీఘ్రముగా సంహరింపుము' అని ప్రార్థించవలెను. అపుడు శత్రు సంహారకుడగు ఆచార్యుడు ప్రసన్న చిత్తముతో ఈ విధముగ ప్రత్యుత్తరము ఇవ్వవలెను-'సాధకా! నీవు సఫలుడవు అగుదువు గాక. నేను ప్రయత్న పూర్వకముగ శత్రువును చంపెదను' శ్వేత కమలముపై యమధర్మరాజును పూజించి, హోమము చేయుటచే ఈ ప్రయోగము సఫలమగును. తనను భైరవునిగా భావించుచు తనలో కులేశ్వరి కూడ ఉన్నట్లు భావన చేయవలెను. ఇట్లు చేయుటచే సాధనకు రాత్రియందు తన వృత్తాంతము, శత్రువునకు సంబంధించిన వృత్తాంతము తెలియును. 'దుర్గే దుర్గే రక్షిణి' అను మంత్రముతో దుర్గా పూజ చేయుటచే సాధకుడు శత్రునాశన సమర్థుడగును. 'హ స క్ష మ ల వ ర యు మ్' అను భైరవీ మంత్రమును జపించుటచే సాధకుడు శత్రుసంహారము చేయగల్గును. (138)

షష్ఠి సంవత్సర నిరూపణము

పరమేశ్వరుడు పలికెను :

పార్వతీ! ఇపుడు అరువది సంవత్సరముల (లో కొన్నింటి) శుభాశుభ ఫలములను చెప్పెదను, సావధానముగా వినుము. ప్రభవ సంవత్సరమున యజ్ఞకర్మలు అధికముగా జరుగును. 'విభవ' యందు ప్రజలు సుఖవంతులు. శుక్లయందు సమస్త ధాన్య సమృద్ధి. 'ప్రమోదమున సకలానందము. 'ప్రజాపతి' యందు వృద్ధి. అంగిరస యందు భోగవృద్ధి శ్రీముఖమున జనసంఖ్యావృద్ధి. 'యువ' యందు ప్రచుర వర్షము. 'ధాత' యందు ఔషధుల అధికోత్పత్తి. 'ఈశ్వర' యందు క్షేమ-ఆరోగ్యప్రాప్తి, బహుధాన్యమున ప్రచురధాన్యోత్పత్తి 'ప్రమాదియందు మధ్యవృష్టి. 'విక్రమ'యందు అన్న సమృద్ధి. 'వృష' యందు సకల ప్రజా పోషణము. చిత్ర భానువునందు విచిత్రత. సుభానువునందు కల్యాణా రోగ్యములు. 'తారణ' యందు శుభకరములగు మేఘములు. పార్థివమున సస్యసంపత్తి, అవ్యయమున అతివృష్టి, సర్వజిత్తునందు ఉత్తమవృష్టి, సర్వధారియందు ధాన్యాది సమృద్ధి, విరోధియందు మేఘ వినాశము. 'వికృతి' యందు భయము 'ఖర' యందు పురుషులలో పౌరుషాధిక్యము. నందన యందు ప్రజానందము. 'విజయ' యందు శత్రునాశనము, జయ యందు రోగ వినాశనము, 'మన్మథ' యందు జ్వరపీడ. దుష్కరము నందు ప్రజలకు దుష్కర్మ ప్రవృత్తి. దుర్ముఖమున కటు భాషిత్వము. హేమలంబమున సంపత్ప్రాప్తి. విలంబమున అన్న ప్రాచుర్యము, వికారియందు శత్రుకోపము.

శార్వరియందు అక్కడక్కడ సర్వ లాభము ప్లవయందు వరదలు. 'శోధన శుభకృతు' లందు నామానుకూలముగ శుభము. 'రాక్షస' యందు ప్రజలలో నిష్ఠురత్వము 'అనల' యందు వివిధ ధాన్యోత్పత్తి. 'పింగల' యందు అచ్చటచ్చట వృష్టి. 'కాలయుక్త' మున ధనహాని, 'సిద్ధార్థమున సకల కార్యసిద్ధి. రౌద్రము నందు ప్రపంచమున రౌద్రభావ ప్రవృత్తి. దుర్మతి యందు మధ్యవృష్టి. 'దుందుభి' యందు మంగళము ధన ధాన్య ప్రాప్తి. రుధిరోద్గారి రక్తాక్షులందు రక్త పానము. క్రోధనమున విజయము. 'క్షయ' యందు ప్రజాక్షయము. ఈ విధముగ అరువది సంవత్సరముల (లోకొన్నింటిని) గూర్చి చెప్పబడినది. (139)

వశ్యాదియోగవర్ణనము

పరమేశ్వరుడు చెప్పెను :

ఇపుడు వశీకరణాది యోగములను చెప్పెదను. భృంగరాజము (16), సహదేవి (3), మయూరశిఖ (8), పుత్రజీవక వృక్షము బెరడు (2), అధఃపుష్ప రుద్రదంతిక (4), కుమారి (11), రుద్రజట (8), విష్ణుక్రాంత (10), శ్వేతార్కము (5), లజ్జాలుక (4), మోహలత (9), కృష్ణధత్తూరము (6), గోరక్షకర్కటి (12), మేషశృంగి (1), స్నుహి (15) అను ఓషధుల పేర్లను పదునారు కోష్ఠములు గల చక్రమునందు వ్రాయవలెను. ఓషధుల భాగములు ప్రదక్షిణ క్రమమున 16, 11, 8, 10, 5, 4, 9, 6, 12, 1, 15 అను సంఖ్యలలో నిర్దేశింపబడును. మొదటి నాలుగు ఓషధులను చూర్ణము చేసి దాని ధూపమును ఉపయోగించవలెను. లేదా వీటిని నీటితో మర్దించి, ముద్దచేసి, శరీరావ యవములకు పట్టించుకొనవలెను. 9, 10, 11, 12 సంఖ్యల ఓషధులతో అంజనము తయారుచేసి నేత్రములందు ధరింపవలెను. చివరి నాలుగు ఓషధులు కలిపిన జలముతో స్నానము చేయవలెను. 5, 6, 7, 8 సంఖ్యల ఓషధులు మర్దించి అనులేపనము ఉపయోగించవలెను. అధఃపుష్పను. దక్షిణ పార్శ్వములందును, లాజవంతి మొదలైన వాటిని వామ పార్శ్వము నందును ధరించవలెను. మయూర శిఖను పాదములందును ఘృత కుమారిని శిరస్సుపైనను ధరించవలెను. రుద్రజట, గోరక్ష కర్కటి, మేఘశృంగుల ధూపమును అన్ని కార్యములందును ఉపయోగించవలెను. వీటిని మర్దించి, ముద్దచేసి శరీరము పై అలముకొన్న వానిని దేవతలు కూడ గౌరవింతురు. భృంగరాజాది ఓషధులు నాలుగును ధూపమునకు ఉపయోగించును. వాటిని మర్దించి శరీరమునకు పూసికొనినచో గ్రహాది జనిత బాధతొలగును. లజ్జాలుకాద్యోషధులు అంజనమునకును, శ్వేతార్కా దులు స్నానమునకును ఉపయోగించును. ఘృత కుమార్యాదులు తినుటకును, పుత్రజీవకాదులు నీటిలో కలిపి త్రాగుటకును ఉపయోగించును. 16, 4, 6, 2 సంఖ్యల ఓషధులతో తయారుచేసిన తిలకము సకలలోక మోహనము. గోరక్ష కర్కటి కృష్ణ ధత్తూరము, పుత్రజీవకము, అధఃపుష్ప అను ఓషధులను తన శరీరముపై పూసుకొనుటచే స్త్రీవశమగును. మేషశృంగి, రుద్రదంతిక, మయూర శిఖ కుమారి అను ఓషధులను యోనియందు లేపము చేయుటచే స్త్రీ వశమగును. స్నుహి, అపరా జితా, లాజవంతీ, శ్వేతార్కములతో తయారుచేసిన గుటికలు జనులను వశముచేయును. ఎవనిని వశము చేసికొనవలెనో వాని భక్ష్య, భోజ్య, పేయ పదార్థములలో ఈ గుళికలను కలిపి ఇవ్వవలెను.

భృంగరాజ, మోహలతా, పుత్రజీవక, అధః పుష్పా ఓషధులను నోటిలో ధరించుటచే శత్రువులు ఉపయోగించు అస్త్రశస్త్రములు స్తంభితము లగును. అధఃపుష్పా, రుద్రదంతీ, లాజవన్తీ, మోహలతలను శరీరముపై పూసుకున్న వాడు నీటిలో నివసించగలడు. శ్వేతార్క, పుత్రజీవక, రుద్రదంతీ, కుమారీ ఓషధులతో తయారుచేసిన వటి ఆకలిదప్పులు మొదలగు వాటిని తొలగించును, సహదేవీ, భృంగరాజ, అపరాజితా, శ్వేతార్క ఓషధుల లేపముచే దుర్భగయగు స్త్రీ సుభగయగును. కృష్ణధత్తూర, పుత్రజీవక, విష్ణుక్రాంతా, సహదేవీ, ఓషధులను తన శరీరమునందు పూసుకొన్నవాడు సర్పములతో ఆడుకొనవచ్చును. కృష్ణధత్తూర, పుత్రజీవక, ఘృతకుమారీ, మయూరశిఖా ఓషధుల లేపమును పూసుకొనుటచే స్త్రీ సుఖముగా ప్రసవించును. అధఃపుష్పా, అపరాజితా, మోహలతా ఓషధులను వస్త్రమునకు లేపము చేసినవాడు ద్యూతమునందు విజయము పొందును. కృష్ణధత్తూర, పుత్రజీవక, అధఃపుష్పా, రుద్రదంతికా ఓషధులను పూసుకొని రతి చేయగా కుమారుడు పుట్టును. మోహలతా, అధఃపుష్పా, గోరక్ష కర్కటీ, కృష్ణ ధత్తూర ఓషధులతో తయారుచేసిన వటి సర్వవశంకరము. ఈ విధముగ పదునారు పదములలో ఉన్న ఓషధుల ప్రభావము వర్ణించబడినది. (140)

షట్త్రింశత్పదకమ్

పరమేశ్వరుడు చెప్పెను :

ఇపుడు ముప్పదియారు పదములలో నుంచబడిన ఓషధుల ఫలమును చెప్పెదను. ఈ ఓషధులను సేవించుటచే మనుష్యులు అమరులగుదురు. వీటిని బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు ఉపయోగించి యున్నారు. హరీతకీ, అక్షధాత్రీ,మరీచ, పిప్పలీ, శిఫా, వహ్ని, శుంఠీ, పిప్పలీ, గుడూచీ, వచానింబ, వాసక, శతమూలీ, సైంధవ, సింధువార, కంటకారి, గోక్షుర, బిల్వ, పునర్నవా, బలా, ఏరండ, ముండీ రుచక, భృంగ, క్షార, పర్పట, ధాన్యాక, జీరక, శతపుష్పి, యవానీ, విడంగ, ఖదిర, కృతమూల, హరిద్రా, వచా, సిద్ధార్థము లను ఓషధులు ముప్పది యారు పదము లందు స్థాపింపవలెను. ఒకటి, రెండు మొదలైన సంఖ్యలు గల ఈ మహౌషధులు సమస్త రోగములను దూరము చేయును. అమరత్వమును నిచ్చును. అన్ని కుష్ఠములలోని ఓషధులును శరీరముపై ముడతలు పడకుండచేయును. వెండ్రుకలు నెరవకుండునట్లు చేయును. వీటి చూర్ణములతో గాని, రసముచేతగాని భావన చేసిన వటులను, అవలేహములను, కషాయములను, లడ్డులను, గుడఖండా దులను నెయ్యితో గాని, తేనెతో గాని తిన్నచో లేదా వీటి రసముతో భావన చేసిన నెయ్యి గాని, తైలము గాని ఏ ప్రకారముగనైనను ఉపయోగించినచో, అది సర్వదా మృత సంజీవన ముగా పనిచేయును. సగము కర్షము లేదా కర్షము లేదా సగము పలము, లేదా పలము. దీనిని ఉపయోగిం చువాడు ఆహారవిహారములందు యథేష్టముగ నున్నను మూడు వందల సంవత్సరములు జీవించును. మృతసంజీవనీ కల్పమునందు దీనికి మించిన యోగములేదు. మొదటినవకము (తొమ్మిది ఔషధముల సముదాయము నవకము) నందలి ఓషధులు కలిపి చేసిన ఔషధము సేవించుటచే మానవుడు సర్వరోగ విముక్తుడగును. ద్వితీయ, తృతీయ, చతుర్థ నవకము లందలి ఓషధుల ప్రయోగముచేత గూడ రోగ విముక్తుడగును. ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ, షష్ఠ షట్కముల (ఆరు

ఓషధుల సము దాయము షట్కము) సేవనముచే మనుష్యుడు రోగ విముక్తుడగును. ముప్పదియారు ఓషధులకు తొమ్మిది చతుష్కములు ఏర్పడును. (నాల్గింటి సముదాయము చతుష్కము). ఏచతుష్కము లోని ఓషధులను సేవించినను రోగ విముక్తుడగును. ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ, షష్ఠ, సప్తమ, అష్టమ కోష్ఠములందలి ఓషధులను సేవించుటచే వాత దోషము తొలగును. తృతీయ, ఏకాదశ, షడ్వింశ, సప్తవింశ ఓషధుల సేవనముచే పిత్త రోగము నశించును. 6, 7, 8, 15 ఓషధుల సేవనముచే కఫ దోషము నివర్తించును. 34, 35, 36 కోష్ఠములందలి ఓషధులను ధరించుటచే వశీకరణము సిద్ధించును. గ్రహబాధ, భూతబాధ మొదలు నిగ్రహము వరకును గల అన్ని బాధలు తొలగును. 1, 2, 3, 6, 7, 8, 9, 11వ ఓషధులను 22, 15, 12వ ఓషధులను ధరించినచో పై ఫలము లభించును. సందేహించ పనిలేదు. 36 కోష్టములలో చెప్పిన ఈ ఓషధుల విషయమును ప్రతివానికి చెప్పగూడదు. (141)

మంత్ర ఔషధులు

పరమేశ్వరుడు పలికెను :

ఇపుడు సంపూర్ణ మనోరథములను ఇచ్చు మంత్రచక్ర-ఔషధములను గూర్చి చెప్పెదను. చౌర్యము చేసినట్లు సందేహముగల వ్యక్తిని గూర్చి ఏదైన ఒక వస్తువు పేరు చెప్పి, దానిలోఉన్న అక్షరములసంఖ్య రెట్టింపుచేసి ఒకచోట ఉంచుకొనవలెను. ఆ పేరులోని మాత్రల సంఖ్యను నాలుగుచే గుణించి ఆ గుణన ఫలమును మరొకచోట ఉంచుకొన వలెను. మొదటి సంఖ్యతో రెండవ సంఖ్యను భాగించవలెను. శేషమున్నచో ఆ వ్యక్తి చోరుడని, శేషములేనిచో చోరుడు కాడనియు గ్రహించవలెను. ఇపుడు పుట్టబోయే శిశువును గూర్చి చెప్పెదను. ప్రశ్నలోని వర్ణములు విషమ సంఖ్యలో ఉన్నచో గర్భ శిశువు పురుషుడు. ప్రశ్నించువాడు చెప్పిన వస్తువు పేరు స్త్రీ లింగమైనచో, దాని అక్షరములు సమసంఖ్యలో నున్న యెడల పుట్టబోయే బాలునికి ఎడమ కన్ను గ్రుడ్డిదగును. ఏతద్విపరీత మైనచో దోషము లేదు. స్త్రీ పురుష నామముల మాత్రల సంఖ్యను, అక్షరముల సంఖ్యను వేరు వేరుగా నాలుగుచే గుణించి వేరువేరుగా ఉంచుకొనవలెను. మొదటిది మాత్రా పిండము, రెండవది వర్ణపిండము, వర్ణ పిండమును. మూడుచే భాగించవలెను. శేషము సమమైనచో కన్య విషమమైనచో పుత్రుడు జన్మించును. శూన్యము శేషమైనచో భర్తకంటె ముందు భార్య చనిపోవును. మాత్రా పిండమును మూడుచే భాగింపగా శూన్యము శేషమైనచో స్త్రీ కంటె ముందు పురుషుడు మరణించును. సమస్త భాగమునందు సూక్ష్మాక్షరములు గల ద్రవ్యముల ద్వారా ప్రశ్నను గ్రహించినచో అభీష్ట ఫలజ్ఞానము కలుగును. శని చక్రమును గూర్చి చెప్పెదను. శనిదృష్టి యున్న లగ్నము సర్వథా త్యాజ్యము. ఏడవ స్థానముపై శనిదృష్టి పూర్ణముగాను, చతుర్థ దశమ రాశులపై సగము ప్రథమ, ద్వితీయ, అష్టమ, ద్వాదశములందు పాదము ఉండును. శుభకర్మలందు వీటినన్నింటిని విడువ వలెను. ఏ దినమునందు ఏ గ్రహము అధిపతియో ఆ దినము నందలి మొదటి జాము ఆ గ్రహ మునకు సంబంధించును, మిగిలిన గ్రహములు ఆ దివసము నందలి అర్ధయామములకు అధి పతులు. శని భాగమైన సమయమున యుద్ధము చేయరాదు. ఇపుడు దినమున రాహు స్థితిని

గూర్చి చెప్పెదను. రాహువు రవివారమునందు తూర్పునందును శనివారము నందు వాయవ్యము నందును, గురువారమున దక్షిణమునను, శుక్రవారమునందు ఆగ్నేయ మునను, మంగళవారము నందు కూడ ఆగ్నేయమునను, బుధవారమున ఉత్తరమునందును ఉండును. ఫణిరాహువు ఈశాన్య, ఆగ్నేయ, నైరృతి, వాయవ్యములందు ఒక్కొక్క జాముండును. యుద్ధమునందు తనఎదుట నున్న శత్రువును ఆవేష్టించి చంపివేయును. ఇపుడు తిథి రాహువును గూర్చి చెప్పెదను. రాహువు పూర్ణిమనాడు ఆగ్నేము నందును, అమావాస్యనాడు వాయువ్యమునందును ఉండును. సంముఖ రాహువు శత్రునాశకరుడు. పశ్చిమమునుండి తూర్పునకు మూడు నిలువు గీతలు గీసి ఈ మూల రేఖలను భేదించుచు దక్షిణము నుండి ఉత్తరమునకు మూడు రేఖలు గీయవలెను. ఈ విధముగ ఒక్కొక్క దిశయందు మూడేసి రేఖలగును. సూర్యుడు ఏ రాశిపై ఉండునో దాని ఎదుట నున్న దిక్కున వ్రాసి క్రమముగా పండ్రెండు రాశులను ప్రదక్షిణ క్రమమున ఆ రేఖాగ్రములపై వ్రాయవలెను. పిదప 'క' నుండి 'జ' వరకు అక్షరములను ఎదుట నున్న దిక్కునందు వ్రాయవలెను. 'ఝ' నుండి 'ద' వరకు అక్షరములు దక్షిణమునను, 'ధ' నుండి 'మ' వరకు తూర్పునను, 'య' నుండి 'హ' వరకు ఉత్తరమునందును వ్రాయవలెను. వీటికి రాహుగణములని పేరు. శుక్ల పక్షమునందు వీటిని త్యజించవలెను. తిథి రాహుసమ్ముఖ దృష్టికూడ త్యజించవలెను. రాహుదృష్టి ఎదుట నున్నచో హాని కలుగును. అట్లు కానిచో విజయము కలుగును. ఇపుడు విష్టి రాహువును గూర్చి చెప్పెదను. ఈశాన్యము నుండి దక్షిణమునకు, దక్షిణమునుండి వాయువ్యమునకు, వాయువ్యమునుండి తూర్పునకును, అచటినుండి నైరృతివరకును, అచటినుండి ఉత్తరమునకు, అచటినుండి ఆగ్నేయమునకు, అచటినుండి పశ్చిమము వరకును, పశ్చిమమునుండి ఈశాన్యము వరకును ఎనిమిది రేఖలు గీయవలెను. ఈ రేఖలపై విష్టి (భద్ర)తో కూడ మహాబల వంతుడగు రాహువును గూర్చి విచారింతురు. కృష్ణపక్ష తృతీయాది తిథులలో విష్టిరాహువు ఈశాన్యము నందును, సప్తమ్యాదులందు దక్షిణమునందును ఉండును. ఈ విధముగ కృష్ణ–శుక్ల పక్షములందు వాయువ్యము నందు ఉన్న సంముఖరాహువు శత్రు వినాశనమును చేయును. విష్టిరాహు చక్రమున పూర్వాది దిక్కులందు ఇంద్రాద్యష్ట దిక్పాలకులను, మహా భైరవాద్యష్ట భైరవులనూ, బ్రహ్మణ్యాద్యష్ట శక్తులను, సూర్యాద్యష్ట గ్రహములను స్థాపించవలెను. పూర్వాది దిక్కులందు ఒక్కొక్క దానియందు బ్రహ్మణ్యాది అష్టశక్తుల ఎనిమిది అష్టకములను గూడ స్థాపించవలెను. దక్షిణాది దిక్కులందు వాత యోగినిని వ్రాయవలెను. రాహువు వాయువు వీచుచున్న వైపున వీరందరితో కలిసి ఉండి శత్రువినాశనము చేయును. ఇపుడు అవయవములను సుదృఢము చేయు ఉపాయమును చెప్పెదను. శరపుంఖిక అను ఓషధిని పుష్య నక్షత్రమునందు పెకలించి, చెప్పబోవు అపరాజితా మంత్రము జపించి, కంఠమునందుగాని, భుజము నందుగాని ధరించినచో శత్రుబాణములకు లక్ష్యము కాకుండ రక్షించును. 'అపరాజితా' 'పాఠా' అను ఓషధులనుకూడ ఈ విధముగనే ధరించినచో ఖడ్గ ప్రహారము నుండి తప్పించుకొనవచ్చును. 'ఓం నమో భగవతి...........రక్ష రక్ష' అను (మూలోక్తమైనది) అపరాజితా మంత్రము గ్రహ, జ్వర, భూతాదిబాధలు తొలగించు కొనుటకు ఈ మంత్ర మును ప్రయోగించవలెను. (142)

కుబ్జికాపూజ

పరమేశ్వరుడు చెప్పెను :

సమస్త మనోరథములను సిద్ధింపచేయు కుబ్జికా క్రమపూజను గూర్చి చెప్పెదను. 'కుబ్జికా' శక్తి సహాయముచే రాజ్యమునందున్న దేవతలు అస్త్రశస్త్రాదులతో అసురులపై విజయము సాధించిరి. మాయా బీజమైన 'హ్రీం'ను హృదయాది షణ్మంత్రములను క్రమముగా గుహ్యాంగము నందును, హస్తమునందును న్యాసము చేయవలెను. 'కాలీ కాలీ'–ఇది హృదయమంత్రము. 'దుష్టచాండాలికా' –ఇది శిరోమంత్రము. 'హ్రీం స్ఫేం హ స ఖ క ఛ డ ఓం కారో భైరవః' ఇది శిఖామంత్రము. 'ఖేలఖీ దూతీ' ఇది కవచ మంత్రము. 'రక్తచణ్డికా'–ఇది నేత్రమంత్రము. 'గుహ్యాకుబ్జికా'–ఇది అస్త్రమంత్రము. వీటితో అంగన్యాస కరన్యాసములు చేసి, యథాస్థానముగ మండలముపై వీటిని పూజించవలెను. మండలము నందు ఆగ్నేయమున 'హూం', ఈశాన్యమున 'స్వాహా', నైరృతియందు 'వషట్', వాయవ్య మున 'హమ్', మధ్యభాగమున 'వౌషట్' మండలము సకల దిశలయందు 'ఫట్' లిఖించి పూజించ వలెను. ముప్పది రెండు అక్షరములతో గూడిన ముప్పది దళముల కమలము కర్ణికలో 'స్రోం హ స క్ష మ ల న వ బ ష ట స చ' లను, ఆత్మ బీజమంత్రమును (ఆమ్) న్యసించి పూజించవలెను. కమలము నలువైపుల పూర్వదిక్కుతో ప్రారంభించి క్రమముగ బ్రహ్మాణీ మాహేశ్వరీ, కౌమారీ, వైష్ణవీ, వారాహీ, మాహేన్ద్రీ, చాముండా, చండికల న్యాసముచేసి పూజించవలెను. ఈశాన్య, పూర్వ, ఆగ్నేయ, దక్షిణ, నైరృతి, పశ్చిమములందు క్రమముగా 'ర, వ, ల, క, స, హ' లను న్యసించి పూజించవలెను. పిదప ఈ దిక్కులందే క్రమముగా కుసుకుమాలలు, పర్వతములు స్థాపించి పూజించవలెను. పిదప వాయవ్య, ఈశాన్య, ఆగ్నేయ, నైరృతుల యందును, మధ్య భాగమునందును వజ్ర కుబ్జికను పూజించవలెను. పిదప వాయవ్య, ఈశాన్య, నైరృతి, ఆగ్నేయ, ఉత్తర శిఖరములపై క్రమముగ అనాది విమల, సర్వజ్ఞ విమల, ప్రసిద్ధ విమల, సంయోగ విమల, సమయ విమలులను ఐదుగురు విమలులను పూజించవలెను. కుబ్జికా ప్రసాదము కొరకై ఈ శిఖరముల మీదనే క్రమముగ ఖింఖినీ–షష్ఠీ–సోపన్నా–సుస్థిరా–రత్న సుందరులను పూజించవలెను. ఈశాన్యమున నున్న శిఖరముపై ఎనమండుగురు అదినాథులను పూజించ వలెను ఆగ్నేయ శిఖరముపై మిత్రుని, పశ్చిమ శిఖరముపై ఔడీశ వర్షమును, వాయవ్య శిఖరముపై షష్టి వర్షమును పూజించవలెను. పశ్చిమదిశలో నున్న శిఖరముపై గగనరత్న, కవచ రత్నములను, వాయవ్య, ఈశాన్య, ఆగ్నేయ ములందు 'బ్రుం' బీజసహితుడగు పంచనాముడను మర్త్యుని, దక్షిణ, ఆగ్నేయములందు 'పంచరత్న'మును అదే దిక్కు లందు జ్యేష్ఠ, రౌద్రి, అంతిక అను త్రిసంధ్యాధిష్ఠాన దేవతలను పూజించవలెను. వీరితో సంబంధించిన ఐదుగురు మహా వృద్ధులను ప్రణవోచ్చారణ పూర్వకముగ పూజించవలెను. వీరి పూజ ఇరువదియేడు లేదా ఇరువది ఎనిమిది భేదములచే ద్వివిధముగా చెప్పబడు చున్నది. చతుష్కోణ మండలమున కుడివైపున గణపతిని, ఎడమవైపున వటుకుని పూజించవలెను. క్రమ గణపతిని 'ఓం ఏం గూం క్రమగణపతయే నమః' అను మంత్రము చేతను, 'ఓం వటుకాయ నమః' అను మంత్రముచే వటుకుని పూజించవలెను. వాయవ్యము

మొదలైన దిక్కులందు నలుగురు గురువులను, పదునెనిమిది షట్కోణములందు పదునారు గురు నాధులను పూజించవలెను. మండలము నలువైపుల బ్రహ్మాది దేవతలు ఎనమండు గురిని, మధ్య భాగమున తొమ్మిదవ దేవతగా కుబ్జికను, కులటాదేవిని పూజించవలెను. సర్వదా ఈ క్రమముననే పూజచేయవలెను.(143)

కుబ్జికాపూజ

అనంతరము పరమేశ్వరుడు ఇట్లు చెప్పెను :

ఇపుడు, ధర్మార్థ కామ విజయాదులను ప్రసాదించు కుబ్జికాదేవీ మంత్రము చెప్పెదను. మూల మంత్రముతో పరివారసహితురాలగు ఈ దేవి పూజ చేయవలెను. 'ఓం ఐం హ్రీం శ్రీం .... కిలి కిలి' అనునది (మూలోక్తము) కుబ్జికా మంత్రము-అంగన్యాస కరన్యాసములు చేసి సంధ్యా వందనము చేయవలెను. వామా-జ్యేష్ఠా రౌద్రులు ముగ్గురు సంధ్యలు. 'కాలవాగీశి విద్మహే మహా కౌలీతి ధీమహి తన్నః కౌలీ ప్రచోదయాత్ అనునది కౌలీగాయత్రి. దీనిలో ఐదు మంత్రములున్నవి. ప్రారంభమున ప్రణవము, అంతమున నమః ప్రయోగించవలెను. మధ్య ఐదుగురు నాథుల పేర్లు, అంతమున 'శ్రీ పాదుకాం పూజయామి' అని చేర్చవలెను. మధ్యయందు చతుర్థ్యంతమగు దేవతా నామము చేర్చవలెను. ఈ విధముగా ఐదు మంత్రములలో ఒక్కొక్కటి దాదాపు పదునెనిమిది అక్షరములు కలిగి ఉండును. ఈ పేరులు అన్నింటిని షష్ఠీ విభక్తిలో ప్రయోగించవలెను. ఈ విధముగ వాక్యయోజన చేసి ఈ మంత్రముల స్వరూపమును తెలిసికొనవలెను. కౌలీశనాథ, శ్రీకంఠనాథ, కౌలనాథ, గగనానందనాథ, తూర్ణనాధులనువారు పంచనాధులు. వీరి పూజా మంత్రవాక్యములు 'ఓం కౌలీశనాథాయ నమస్తస్మై పాదుకాం పూజయామి' ఇత్యాది విధమున నుండవలెను. వీరితో పాటు, పుట్టుక నుండియు గూను ఉండుటచే కుబ్జికా అను పేరుగల సుకలాదేవి, చటులాదేవి, వికారాల రూపముగల మైత్రేశీదేవి, అతలదేవి, శ్రీ చంద్రాదేవి అను ఐదుగురు దేవులను పూజించవలెను. వీరి పేర్లకు చివర దేవీ అని ఉండును. పూజా మంత్ర వాక్యములు- 'సుకలాదేవ్యై నమస్తస్యై భగాత్మ పుంగణ దేవమోహినీం పాదుకాం పూజయామి' ఇత్యాది విధమున ఉండును. చటులాదేవి పాదుకకు 'అతీత భువనానన్ద రత్నాఢ్యాం' అను విశేషణము, మూడవ దేవిపాదుకకు 'బ్రహ్మ జ్ఞానాఢ్యామ్' అను విశేషణమును, నాల్గవ దేవి పాదుకకు 'కమలాఢ్యామ్' అను విశేషణమును, ఐదవ పాదుకకు 'పరమ విద్యాఢ్యామ్' అను విశేషణమును చేర్చవలెను. ఈ విధముగా విద్యా, దేవీ, గురువుల శుద్ధికి త్రిశుద్ధి' అని పేరు. గగనానంద, చటులి, ఆత్మానంద, పద్మానంద, మణి, కలా, కమల, మాణిక్యకంఠ, గగన, కుముద, శ్రీపద్మభైరవా నంద, కమలదేవ, శివ, భవకృష్ణులు అను పదునారుగురు నూతన సిద్ధులు చంద్రపూర, గుల్మ, శుభకామ, అతిముక్తక వీరకంఠ, కుశల, దేవభోగక, విశ్వదేవ, ఖడ్గదేవ, రుద్ర, ధాతృ, అసి ముద్రాస్ఫోట, వంశపూర, భోజులను పదునారుగురు సిద్ధులు.

వీరి దేహము కూడ షడ్విధన్యాస నియంత్రితమై ఆత్మతో సమానమగును. మండలముపై పుష్పములుచల్లి మండలపూజ చేయవలెను. అనంత, మహత్, శివ పాదుకా, శూన్య, పంచతత్త్వాత్మక

మండల, శ్రీకంఠనాథ పాదుకా, శంకర, అనంతుల పూజ చేయ వలెను. సదాశివ, పింగల, భృగ్వానంద, నాథసముదాయ, లాంగూలానంద, సంవర్తు లను మండల స్థానమున పూజించవలెను. నైరృతియందు శ్రీమహాకాల, పినాకి, మహేన్ద్ర, ఖడ్గ, నాగ, బాణ, అఘాసి, శబ్ద, వశ, ఆజ్ఞారూప, నంద రూపములకు బలి ఇచ్చి క్రమ ముగా వాటిని పూజించవలెను. వటుకునకు అర్ఘ్య, పుష్ప, ధూప, దీప, గంధ, బలులను క్షేత్రపాలునకు పుష్ప–బలులను సమర్పించవలెను. అపుడు 'హ్రీం ఖం ఖం.....నమస్తుభ్యమ్' 'ఓం హ్రాం హ్రీం.....స్వాహా' అను (మూలోక్తములగు) మంత్రములను వినియోగించ వలెను. బలిచివర కుడి ప్రక్కన, ఎడమ ప్రక్కన, ఎదుట త్రికూటమును పూజించవలెను. ఇందుకు మంత్రము–'హ్రీం హ్రూం హ్రాం శ్రీం త్రికూటాయ నమః' పిదప ఎడమ ప్రక్కన నిశానాథుని, కుడి ప్రక్కన తమోరినాథుని (సూర్యనాథుని), ఎదుట కాలానలుని పాదుకలను పూజించవలెను. పిదప ఉడ్డియాన, జాలంధర, పూర్ణగిరి, కామరూపులను, గగనానంద దేవ వర్గసహితస్వర్గా నందదేవ, పరమానందదేవ, సత్యానంద దేవ పాదుకా, నాగానంద దేవులను పూజించవలెను. ఈ విధముగ 'వర్గము' అను పేరుగల పంచరత్నములను గూర్చి చెప్పబడినది. ఉత్తర–ఈశాన్యము లందు సురనాథ పాదుకను, సమయ కోటీశ్వరుని, విద్యాకోటీశ్వరుని, కోటీశ్వరుని, బిందుకోటీశ్వరుని, సిద్ధకోటీశ్వరుని పూజించవలెను. ఆగ్నేయమున నలుగురు సిద్ధులను, అమరీశేశ్వర, చక్రీశేశ్వర, కురంగేశ్వర, వృత్రీశ్వర, చంద్రనాథులను గంధాది పంచోపచారములతో పూజించవలెను. దక్షిణమున అనాది విమల, సర్వజ్ఞవిమల, యోగీశ విమల, సిద్ధవిమల, సమయ విమలులను పూజించవలెను.

నైరృతియందు నాలుగు వేదములను, కందర్పనాథుని, వెనుక చెప్పిన అందరు శక్తులను, కుబ్జిక శ్రీపాదుకను పూజించవలెను. కుబ్జికాపూజ 'ఓం హ్రాం హ్రీం కుబ్జికాయై నమః' అను నవాక్షర మంత్రముతో గాని, లేదా కేవలము పంచప్రణవరూపమగు మంత్రముతోగాని చేయవలెను. తూర్పుమొదలు ఈశాన్యమువరకు బ్రహ్మ, ఇంద్ర, అగ్ని, యమ, నిరృతి, అనంత, వరుణ, వాయు,కుబేర, ఈశానులను దశదిక్పాలకులను పూజించ వలెను. సహస్రనేత్రుడగు ఇంద్రుని, అనవద్యుడగు విష్ణువును, శివుని సదా పూజించవలెను. తూర్పు మొదలు ఈశాన్యము వరకును ఎనిమిది దిక్కులలో క్రమముగా బ్రహ్మాణీ, మహేశ్వరీ, కౌమారీ, వైష్ణవీ, వారాహీ, ఐంద్రీ, చాముండా, మహాలక్ష్మిలను పూజించ వలెను. వాయవ్యము మొదలు ఆరు ఉగ్ర దిక్కులందు వరుసగ డాకినీ, రాకిణీ, లాకినీ, కాకినీ, శాకినీ, యాకినులను పూజించవలెను. పిదప ధ్యానపూర్వకముగ కుబ్జికాదేవిని పూజించవలెను. ముప్పది రెండు వ్యంజనాక్షరములు ఆమె శరీరము. ఆమెను పూజించు నపుడు ఐదు ప్రణవములను గాని, 'హ్రీం' గాని, బీజ రూపమున ఉచ్చరించవలెను. ఆమె దేహచ్ఛాయ నీల కమలదల శ్యామము. ఆరు ముఖములు ఉండును. వాటి కాంతి గూడ ఆరువిధములనుండును. ఆమె చైతన్య శక్తి స్వరూపురాలు. అష్టాదశాక్షర మంత్రముచే ప్రతిపాదింపబడునది. పండ్రెండు భుజములుండును. సుఖముగా సింహాసనముపై కూర్చుండును. కర్కోటకుడు ఆమెకు మేఖల, తక్షకుడు శిరస్సుపైనుండును. వాసుకి కంఠ హారము. ఆమె రెండు చెవులకును, కులికుడు, కూర్మడు అనునాగములు కుండల ముగానున్నవి. రెండు కనుబొమ్మలపై పద్మ, మహాపద్మములను నాగములు ఉన్నవి. వామ హస్తములందు నాగ, కపాల, అక్షసూత్ర, ఖట్వాంగ, శంఖ–పుస్తకములు,

దక్షిణ హస్తములందు త్రిశూల, దర్పణ, ఖడ్గ, రత్నమాలా, అంకుశ, ధనుస్సులు ఉండును. తూర్పువైపు ముఖము పాండు వర్ణముగలది. దక్షిణమువైపు ముఖము కోపముతో నున్నట్లు కనబడును. పశ్చిమ ముఖము నల్లగాను, ఉత్తర ముఖము హిమ, కుంద, చంద్రులవలె తెల్లగాను ఉండును. ఆమె చరణ తలమున బ్రహ్మయు, జఘనమున విష్ణువు, హృదయ మునరుద్రుడు, కంఠమునందు ఈశ్వరుడు, లలాటమునందు సదాశివుడు ఆమె పై భాగము నందు శివుడును ఉందురు. కుబ్జికాదేవి ఊగుతున్నట్లు ఉండును. పూజాది సమయము లందు కుబ్జికను ఈ విధముగ ధ్యానించవలెను. (144)

మాలినీమంత్ర న్యాసము

పరమేశ్వరుడు పలికెను :

ఇపుడు షడ్విధ న్యాస పూర్వకములగు నానావిధ మంత్రములను గూర్చి చెప్పెదను. ఈ షడ్విధ న్యాసములు శాంభవ, శాక్త, యామలములు అని మూడేసి విధములు. శాంభవ న్యాసము నందు షట్షోడశ గ్రంథి రూపమగు శబ్దరాశి ప్రధానము. మూడు విద్యలు–వాటి గ్రహములు ద్వితీయ న్యాసము. త్రితత్త్వాత్మక న్యాసము మూడవది. వనమాలా న్యాసము నాల్గవది. ఇది పంద్రెండు శ్లోకములలో నున్నది. రత్నపంచక న్యాసము ఐదవది. నవాక్షర మంత్ర న్యాసము ఆరవది. శాక్తపక్షమున మాలినీ న్యాసము మొదటిది. త్రివిద్యా న్యాసము రెండవది. అఘోర్యష్టక న్యాసము మూడవది. ద్వాదశాంగ న్యాసము నాల్గవది. షడంగ న్యాసము ఐదవది. అస్త్రచండిక అను శక్తిన్యాసము ఆరవది. 'క్లీం (క్రీం) హ్రీం క్లీం శ్రీం క్రూం ఫట్' అను ఆరు బీజమంత్రముల షడ్విధ న్యాసమే 'యామల' న్యాసము. ఈ ఆరింటిలో 'శ్రీం' బీజ న్యాసము సకల మనోరథ సిద్ధి ప్రదము. 'న' మొదలు 'ఫ' వరకు చేయు న్యాసము మాలినీన్యాసము. 'న'తో ప్రారంభించు లేదా నాద మును చేయు శక్తిని శిఖపై న్యాసము చేయవలెను. 'అ' గ్రసనీశక్తి, 'శ' శిరోమాలానివృత్తి శక్తి; ఈ రెండింటి స్థానము శిరస్సు. శాంతిప్రతీకమగు 'ట' న్యాసము కూడ శిరస్సుపై చేయవలెను. చాముండా ప్రతీకయైన 'చ' న్యాసము నేత్రత్రయముపై చేయవలెను. ప్రియ దృష్టి స్వరూపమగు 'ధ'ను నేత్రద్వయమందును, గుహ్యశక్తి ప్రతీకయైన 'నీ'ని నాసికా ద్వయమందును, నారాయణీ రూపమగు 'న'ను కర్ణ ద్వయమునందును, మోహినీరూపమగు 'త'ను కుడి చెవియందును, ప్రజ్ఞాప్రతీకమగు 'జ'ను ఎడమ చెవియందును, వజ్రిణీదేవిని ముఖము నందును, కరాళీ శక్తి ప్రతీకమైన 'క'ను కుడి కోరయందును, కపాలినీ రూపమగు 'ఖ'ను ఎడమ భుజముపైనను, శివప్రతీకమైన 'గ'ను ఎడమ కోరయందును, ఘోరాశక్తి ప్రతీకమగు 'ఘ'ను ఎడమకోరయందును, శిఖాశక్తి సూచకమగు 'ఉ'ను దంతములందును, మాయాప్రతీకమగు 'ఈ'ని జిహ్వాపైనను, నాగేశ్వరీరూపమగు 'ఆ'ను వాగింద్రియము పైనను, శిఖివాహినీ రూపముగల 'వ'ను కంఠము నందును న్యాసము చేయవలెను.

'భ'తో భీషణీ శక్తిని కుడి స్కంధమునందు, 'మ'తో వాయువేగను ఎడమ స్కంధము నందు, 'డ'తో వామాశక్తిని కుడి భుజమునందు, 'ధ'తో వినాయకాదేవిని ఎడమ భుజమునందు, 'ప'

పూర్ణిమాశక్తులను రెండుహస్తములందు; ప్రణవసహిత ఓంకారశక్తిని కుడిచేతి వ్రేళ్ళయందు, 'అం' సహిత దర్శనీ శక్తిని ఎడమ చేతివ్రేళ్లయందు, 'అః' సంజీవనీ శక్తులను హస్తమునందు, 'ట' కపాలినీ శక్తులను కపాలమునందు, 'త' సహిత దీపనీ శక్తిని శూలదండము నందు, జయన్తీ శక్తిని త్రిశూలమునందు, 'య' సహిత సాధనీదేవిని వృద్ధి యందును న్యాసము చేయవలెను. 'శ' పరమాఖ్యా దేవులను జీవునియందు, 'హ' అంబికా దేవులను ప్రాణమునందు, 'ఛ' సహిత శరీరాదేవిని దక్షిణస్తనమునందు, 'నీ' సహిత పూతనను వామస్తనమునందు, 'అ' సహిత ఆమోటిని స్తనదుగ్ధమునందు, 'థ' సహిత లంబోదరిని ఉదరమునందు, 'క్ష' సహిత సంహారికను నాభియందు, 'మ' సహిత మహాకాళిని నితంబము నందు, 'స' సహిత కుసుమమాలాదేవిని గుహ్యా దేశమునందు, 'ష' సహిత శుక్రదేవికను శుక్రమునందు, 'త' సహిత తారాదేవిని ఊరు ద్వయమునందు, 'ద' సహిత 'జ్ఞానా' శక్తిని కుడి మోకాలునందు, 'ఔ' సహిత క్రియాశక్తిని ఎడమ మోకాలియందు, 'ఓ' సహిత గాయత్రీదేవిని కుడి పిక్కయందు, 'ఓం' సహిత సావిత్రిని ఎడమ పిక్కయందు, 'ద' సహిత దోహినిని కుడి పాదమునందు, 'ఫ' సహిత ఫేత్కారిని ఎడమ పాదమునందు న్యాసము చేయవలెను. మాలినీ మంత్రములో తొమ్మిది అక్షరము లుండును. 'అ' సహిత శ్రీకంఠుని శిఖయందు, 'ఆ' సహిత అనంతుని ముఖము నందు 'హ' సహిత సూక్ష్మమును కుడి కంటియందును, 'ఈ' సహిత త్రిమూర్తులను ఎడమ కంటియందును, 'ఉ' సహిత అమరీశుని దక్షిణ కర్ణమునందును, 'ఊ' సహిత అర్ఘాం శకమును వామకర్ణమునందును, 'ఋ' సహిత భావభూతిని దక్షిణ నాసాగ్రము నందును, 'ౠ' సహిత తిథీశుని వామ నాసాగ్రము నందును, 'ఌ' సహిత స్థాణువును దక్షిణ కపోలము నందును, ౡ సహిత హరుని వామకపోలమునందును న్యాసము చేయవలెను.

'ఏ' సహిత కటేశుని క్రింది దంతపంక్తి యందును, 'ఐ' భూతీశులను పై దంత పంక్తియందును, 'ఓ' సద్యో జాతులను క్రింది ఓష్ఠమునందును, 'ఔ' అనుగ్రహీశులను పై ఓష్ఠమునందును, 'అం' క్రూరులను కంఠబిలమునందును, 'అః' మహాసేనులను జిహ్వాయందును, 'క' క్రోధీశులను దక్షిణ స్కంధమునందును, 'ఖ' చండీశులను బాహువులందును, 'గ' పంచాతకులను మోచేతియందును, 'ఘ' శిఖులను దక్షిణ కంకణము నందును, 'ఙ' ఏకపాదులను వామాంగుళుల యందును, 'చ' కూర్మకులను వామ స్కంధము నందును న్యాసము చేయవలెను.

'ఛ' ఏకనేత్రులను బాహువులందు, 'జ' చతుర్ముఖులను మోచేతి యందును, 'ఝ' రాజసులను వామకంకణమునందును, 'ఞ' సర్వకామాదులను వామాంగుళులందును, 'ట' సోమేశ్వరులను నితంబమునందును, 'ఠ'లాంగలులను కుడి తొడయందును, 'డ'దారుకులను, ఎడమ మోకాలు నందును, 'ఢ' అర్ధజనేశ్వరులను కుడి పిక్క యందును 'ణ' ఉమాకాంతులను, దక్షిణ పాదాంగుళు లందును, 'త' ఆషాఢులను నితంబమునందును 'థ' దండులను ఎడమ తొడయందును, 'ద' భిదులను ఎడమ మోకాలియందును, 'ధ' మీనములను ఎడమ పిక్కలయందును, 'న' మేషములను వామ పాదాంగుళులందును, 'ప' లోహితులను దక్షిణ కుక్షియందును, 'ఫ' శిఖులను వామ కుక్షియందును, 'బ' గలండులను పృష్ఠవంశమునందును, 'భ' ద్విరండులను నాభి అందును, 'మ' మహా కాలులను, హృదయమునందును, 'య' వాణీశులను, త్వక్కునందును, 'ర' భుజంగేశులను

రక్తము నందును, 'ల' పినాకులను మాంసమునందును, 'వ' ఖడ్గీశులను శరీరము నందును, 'శ' బకులను ఎముకలందును, 'ష' శ్వేతులను మజ్జ యందును, 'స' సహిత భృగువును, శుక్ర-ధాతువునందును, 'హ' నకులీశులను ప్రాణము నందును, 'క్ష' సంవర్తకులను పంచకోశములందును న్యాసము చేయవలెను. 'హ్రీం' బీజముతో రుద్ర శక్తులను పూజించిన వాడు సకల మనోరథములను పొందును. (145)

అష్టాష్టకము

పరమేశ్వరుడు పలికెను :

ఇపుడు బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు సంబంధించిన త్రిఖండిని గూర్చి చెప్పెదను. 'ఓం' 'క్షం నమో భగవతే రుద్రాయ నమః .... వచనం శుభమ్' అను (మూలోక్తమగు) బ్రహ్మఖండ పదమునందు రుద్ర మంత్రమునకు సంబంధించిన నూట ఇరువది అక్షరములున్నవి. 'ఓం నమశ్చా ముణ్డే.........విచ్చే స్వాహా' అను (మూలోక్తమగు) యథోచితాక్షరములు గల రెండవ మంత్రఖండము విష్ణు ఖండపదము' 'ఓం నముశ్చాముణ్డే నమో విచ్చే' అను(మూలోక్త)మంత్రము మహేశ్వర ఖండము. ముప్పదియొక్క పదములు గలది. దీనిలో నూట డెబ్బదియొక్క అక్షరములున్నవి. ఈ మూడు ఖండములకు 'త్రిఖండి' అని పేరు. ఈ త్రిఖండీ మంత్రమునకు ఆద్యంతములందు హేం ఘోంలను పంచప్రణవములను చేర్చి జపపూజాదులు చేయవలెను. హేం ఘోం శ్రీ కుబ్జికాయై నమః అను మంత్రమును త్రిఖండీ పదముల సంధులయందు చేర్చవలెను. అకులాది త్రిమధ్యగ, కులాది త్రిమధ్యగ, మధ్యమాది త్రిమధ్యగ, పాదత్రిమధ్యగలు నాలుగు విధములగు మంత్ర పిండములు. మూడున్నర మాత్రలుగల ప్రణవమును మొదటచేర్చి వీటిజపమును, పూజను చేయవలెను. పిదప ఓం క్షౌం శిఖాభైరవాయ నమః' అను భైరవశిఖామంత్ర జపము పూజ చేయవలెను. స్థాం-స్థీం-స్థేం ఇవి మూడు సబీజ త్ర్యక్షరములు; హ్రాం-హ్రీం-హ్రేం ఇవి నిర్బీజ త్ర్యక్షరములు. విలోమక్రమమున 'క్ష' మొదలు 'క' వరకు నున్న ముప్పదిరెండు అక్షరముల వర్ణమాలకు అకులా అనిపేరు. దీనికే అనులోమక్రమమున సకులా అని పేరు.

శశినీ, భావనీ, పావనీ, శివ, గాంధారీ, 'ణ'పిణ్డాక్షీ, 'వ' అజరా, 'య' కుమారీ, 'న' కాలరాత్రీ, 'ద' సంకటా, 'ధ' కాలికా, 'ఫ' శివా, 'ణ భవఘోరా, 'ట' బీభత్సా, 'త' విద్యుతా, 'ఠ' విశ్వంభరా, శంసినీ, 'ఉ' విశ్వంభరా, 'ఆ' శంసినీ, 'ద' జ్వాలామాలినీ, కరాలీ, దుర్జయా, రజ్గీ, వామా, జ్యేష్ఠా, రౌద్రీ, 'ఖ' కాలీ, 'క' కులాలమ్బీ అనులోమా, 'ర' పిణ్డినీ, 'ఆ' వేదినీ, 'ఐ' రూపీ, 'వై' శాంతిమూర్తి, కలాకులా, 'ఋ' ఖడ్గినీ, 'ఉ' వనితా, కులా, 'ఇ' సుభగా, వేదనాదినీ, కరాళీ, 'అం' మధ్యమా, 'అః' అపేతరయా అను శక్తులను యోగపీఠముపై క్రమముగా పూజించవలెను. 'స్థాం స్థీం స్థాం మహాభైరవాయ నమః' అనునది మహాభైరవ పూజామంత్రము. బ్రహ్మణి అష్టకదళమున, అక్షోద్యా, ఋక్షకర్ణీ, రాక్షసీ, క్షపణా, క్షయా, పింగాక్షి, అక్షయా, క్షేమా అను శక్తులుండును. ఇలా, లీలావతీ, నీలా, లంకా, లంకేశ్వరీ, లాలసా, విమలా, మాలలు, మహేశ్వరీ, అష్టకమున ఉందురు. హుతాశనా, విశాలాక్షీ, హ్రూంకారి, బడవాముఖీ, మహారవీ, క్రూరా, క్రోధా, ఖరాననా అనువారు కౌమారీ

శరీరమునుండి ప్రకటమైనవారు. వీరు పూజితలై సకలసిద్ధులను ఇచ్చెదరు. సర్వజ్ఞా, తరలా, తారా, ఋగ్వేదా, హయాననా, సారాహరా, స్వయంగ్రాహా, శాశ్వతీ అను ఎనమండుగురు శక్తులు వైష్ణవీకులమున ప్రకటమైనవారు. తాలుజిహ్వా, రక్తాక్షీ, విద్యుజ్జిహ్వా, కరంకిణీ, మేఘనాదా, ప్రచందోగ్రా, కాలకర్ణీ, కవి ప్రియులు వారాహీ కులమునందు ఉత్పన్న మైనవారు. విజయము కోరువాడు ఈ శక్తులను పూజించవలెను. చంపా, చంపావతీ, ప్రచంపా, జ్వలితాననా, పిశాచీ, పిచువక్త్రా, లోలుపా అనువారు ఇంద్రాణీ శక్తి కులమునందు ఉత్పన్నమైనవారు. పావనీ, యాచనీ, వామనీ, దమనీ, బిన్దువేలా, బృహత్కుక్షీ, విద్యుతా, విశ్వరూపినులు, చాముండాకులోత్పన్నలు. వీరిని మండలము నందు పూజించినచో విజయము నిత్తురు. యమజిహ్వా, జయన్తీ, దుర్జయా, యమాంతికా, బిడాలీ, రేవతీ, జయా, విజయలు, మహాలక్ష్మీ కులమునందు ఉత్పన్న మైనవారు. ఈ విధముగ ఎనిమిది అష్టకములు వర్ణింపబడినవి. (146)

త్వరిత పూజాదికము

పరమేశ్వరుడు పలికెను :

ఓం గుహ్యకుబ్జికే.........నమః అను మూలోక్త మంత్రముచే గుహ్యకుబ్జికా జప పూజలు చేయవలెను. హ్రీం సర్వజనక్షోభణి ....ఫట్ ఇది (మూలోక్తము) 'నవాత్వరితా' మంత్రము దానిని మాటిమాటికి జపించినచో విజయమును ఇచ్చును. హ్రౌం సింహాయ నమః అను మంత్ర ముచే ఆసనపూజచేసి దేవికి సింహాసనము సమర్పించవలెను. హ్రీం క్షే హృదయాయ నమః అని హృదయమును, వచ్చే శిరసే స్వాహా అని శిరస్సును స్పృశించ వలెను. త్వరితా మంత్ర శిరోన్యాసము పైవిధముగ చెప్పబడినది. క్షోం హ్రీం శిఖాయై వషట్ అని శిఖను క్షేం కవచాయ హుం అని భుజమును హ్రూం నేత్రయాయ వౌషట్ అని నేత్ర ద్వయమును, లలాట మధ్య భాగమును స్పృశించి హ్రీం అస్త్రాయఫట్ అని చప్పట్లు కొట్టవలెను. హ్రీంకారి, ఖేచరి, చండ, ఛేదని, క్షోభణి, క్రియ, క్షేమకారి, హూంకారి, ఫట్కారి–వీరు నవశక్తులు.

ఇపుడు దూతికలను గూర్చి చెప్పెదను. వీరందరిని పూర్వాది దిశలందు పూజించవలెను. హ్రీం నచే బ్రహ్మవేతాలి మధ్యే (అని మూలోక్తము దూతీ మంత్రము). మరల త్వరిత గుహ్యాంగములను తత్త్వములను గూర్చి చెప్పెదను. హ్రౌం హ్రూం హః హృదయాయ నమః అని హృదయమునందు, హ్రీం హ్రాం శిరసే స్వాహా అని శిరస్సు నందును, 'ఫాం' జ్వల జ్వల శిఖాయై వషట్ అని శిఖయందును, ఇలే హ్రం హం కవచాయ హుం అని రెండు భుజములందును క్రోం క్షూం శ్రీం నేత్ర త్రయాయ వౌషట్ అని నేత్ర లలాట మధ్యములందును న్యాసము చేసి, క్షౌం అస్త్రాయ ఫట్ అని చప్పట్లు కొట్టవలెను. మధ్య భాగమున హ్రుం స్వాహా అని వ్రాసి, పూర్వాది దిక్కులందు ఖే సదాశివే వ ఈశః ఛే మనోన్మనీ, మ క్షే తార్క్ష్యః హ్రీం మాధవః క్షౌం బ్రహ్మా హం ఆదిత్యః దారుణం ఫట్ అనివ్రాసి పూజచేయవలెను. ఈ విధముగ ఎనిమిది దిక్కులందు పూజింపదగిన దేవతలను గూర్చి చెప్పబడినది. (147)

సంగ్రామ విజయ పూజ

పరమేశ్వరుడు పలికెను :

ఓం డే ఖ ఖ్యాం సూర్యాయ సంగ్రామ విజయాయ నమః – ఇది మంత్రము. హ్రాం హ్రీం హ్రః ఇవి సంగ్రామమునందు విజయము నిచ్చు సూర్యుని ఆరు అంగములు. ఓం హం ఖం ఖఖోల్కాయ స్వాహా ఇది పూజామంత్రము. స్ఫూం హ్రూం హుం క్రూం ఓం హ్రోం క్రేం ఇవి అంగన్యాస బీజమంత్రములు. పీఠ పాదములందును, మధ్యనున్న నాల్గు దిక్కులందును వరుసగా ధర్మ, జ్ఞాన, వైరాగ్య, ఐశ్వర్య, అధర్మ, అజ్ఞాన, అవైరాగ్య, అనైశ్వర్యములను పూజించవలెను. పిదప అనంతాసన, సింహాసన, పద్మాసనములను పూజించి కమలకర్ణికను, కేసరములను, అచ్చటనే సూర్య మండల, సోమమండల, వహ్ని మండలములను అర్చించి, దీప్త, సూక్ష్మ, జయ, భద్ర, విభూతి, విమల, ఆమోఘ, విద్యుత, సర్వతోముఖీ అను నవశక్తులను పూజించవలెను. పిదప సత్త్వ, రజస్, తమస్సు లను, ప్రకృతి–పురుషులను, ఆత్మాంతరాత్మ పరమాత్మలను పూజించవలెను. ఆద్యక్షరమును అనుస్వారయుక్తము చేసి అంతమున నమః చేర్చి చతుర్థ్యంతము చేయగా పూజా మంత్రములు అగును. (ఉదా : 'సం' సత్త్వాయ నమః మొ.) ఉష, ప్రభ, సంధ్య, సాయా, మాయా, బల, బిందు, విష్ణువులను, ఎనమండుగురు ద్వారపాలులను పూజించి, గంధాదులతో సూర్య, చండ, ప్రచండులను పూజించవలెను. ఈ విధముగ పూజా, జప, హోమాదులు చేయుటచే యుద్ధాదులందు జయము కలుగును. (148)

లక్షహోమ, కోటిహోమములు

పరమేశ్వరుడు పలికెను :

హోమము చేయుటచే యుద్ధమునందు విజయము కలుగును, విఘ్నము నశించును. ముందుగా కృచ్ఛ్ర వ్రతముచేసి దేహమును శుద్ధము చేసికొనవలెను, నూరు ప్రాణాయా మములతో శరీరమును శుద్ధముచేసికొని జలమునందు నిలిచి గాయత్రీ జపము చేసి పదునారు ప్రాణాయామములు చేయవలెను. పూర్వాహ్ణమునందు అగ్నిలో ఆహుతులు సమర్పించవలెను. భిక్షాప్రాప్తమగు యవనిర్మిత భోజ్యపదార్థములను, ఫల–మూలములను, క్షీరమును, పేలాలపిండిని, ఘృతమును యజ్ఞకాలమున ఆహారముగా తీసికొనవచ్చును. పార్వతీ! లక్షహోమములు పూర్తి అగునంతవరకు ఒక పర్యాయమే భోజనము చేయవలెను. లక్షహోమములు పూర్ణాహుతి చేసిన పిమ్మట గోవులను, వస్త్రములను, సువర్ణమును దక్షిణగా ఇవ్వవలెను. ఏ విధమైన ఉత్పాతములు కనబడినను ఐదుగురు లేదా పది మంది ఋత్విక్కులతో పైన చెప్పిన యజ్ఞము చేయించవలెను. ఈ లోకములో దీనిచే శాంతించని ఉత్పాతమేదియు లేదు. దీనిని మించిన మంగళకరమైనది మరేదియు లేదు. పూర్వోక్త విధానము ప్రకారము ఋత్విక్కులచే ఈ యజ్ఞము చేయించిన రాజు ఎదుట శత్రువు రణరంగమున నిలువ జాలడు. ఆతని రాజ్యములో అతివృష్టి, అనావృష్టి, ఎలుకలబాధ, మిడుతల బాధ, చిలుకలబాధ, భూత రాక్షసాదులు, యుద్ధమునందు సమస్త శత్రువులు నశించును. కోటి హోమముల కొరకు

ఇరువదిమంది గాని, వందమంది గాని, వేయిమందిగాని, బ్రాహ్మణుల వరణము చేయవలెను. దీనిచే యజమానునకు అభీష్ట ధన వైభవ ప్రాప్తి కలుగును. కోటి హోమాత్మక యజ్ఞము చేసిన బ్రాహ్మణుడు కాని, క్షత్రియుడుగాని, వైశ్యుడుగాని ఏది కోరిన అది పొందగలుగును. అతడు సశరీరముగ స్వర్గమునకు వెళ్లును. హోమ పూజాదులు గాయత్రీ మంత్ర, గ్రహ మంత్ర, కూష్మాండ మంత్ర, అగ్ని మంత్ర, ఐంద్ర మంత్ర, వారుణ, వాయవ్య, యామ్య, ఆగ్నేయ, వైష్ణవ, శాక్త, శైవ, సూర్య మంత్రములు–వీటిలో చేయుపద్ధతి చెప్పబడినది. లక్షహోమము సకలదుఃఖములను తొల గించును. కోటి హోమము సకల క్లేశములను నశింప చేయును, సకల పదార్థములను ఇచ్చును. యవ, ధాన్య, తిల, క్షీర, ఘృత, కుశ, ప్రాసాతికా, కమల, నల, బిల్వ, ఆమ్రదళములు హోమమునకు తగిన పదార్థములు. కోటిహోమమునకు ఎనిమిదిహస్తముల లోతు అగ్ని కుండమును, లక్షహోమమునందు నాలుగు హస్తముల లోతు అగ్నికుండమును నిర్మింప వలెను. అయుత, లక్ష, కోటి హోమములందు ఆజ్యము ఉపయోగించవలెను. (149)

మన్వంతర వర్ణనము

అగ్నిదేవుడు చెప్పెను :

ఇపుడు మన్వంతరములను గూర్చి చెప్పెదను. స్వాయంభువ మనువు మొదటివాడు. అగ్నీ ధ్రాదులు ఆతని కుమారులు. ఈ స్వాయంభువ మన్వంతరమున దేవతలు యములు, ఔర్వాదులు సప్తర్షులు, శతక్రతువు ఇంద్రుడు. రెండవది స్వారోచిష మన్వంతరము. పారావతులు, తుషితులు అనువారు దేవతలు. చైత్ర కింపురుషులు స్వారోచిష మనువు కుమారులు. విపశ్చిత్తు ఇంద్రుడు. ఊర్జస్వంతుడు మొదలగువారు సప్తర్షులు. మూడవ వాడు ఉత్తముడు. అజాదులు అతని పుత్రులు. ఆతని మన్వంతరమున సుశాంతి ఇంద్రుడు; సుధామాదులు దేవతలు; వసిష్ఠపుత్రులు సప్తర్షులు. నాల్గవ మనువు తామసుడు. ఆతనికి ఖ్యాతి మొదలగువారు తొమ్మండుగురు కుమారులు. ఆతని మన్వంతరమున స్వరూపాదులు దేవతలు. శిఖరి ఇంద్రుడు. జ్యోతిర్హోమాదులు సప్తర్షులు. ఖ్యాతి మొదలగు తొమ్మండుగురు సుతులు. ఐదవదగు రైవత మన్వంతరమున వితథుడు ఇంద్రుడు. అమితాభులు దేవతలు. హిరణ్య రోమాదులు సప్తర్షులు. బలబంధాదులు రైవతుని కుమారులు. ఆరవదైన చాక్షుష మన్వంతరమున మనోజవుడు ఇంద్రుడు. స్వాత్యాదులు దేవతలు. సుమేధన్ మొదలగువారు సప్తర్షులు. పురు మొదలగువారు చాక్షుషుని పుత్రులు. ఏడవ మన్వంతరమున సూర్య పుత్రుడైన శ్రాద్ధదేవుడు మనువాయెను. ఈతని మన్వంతరమున ఆదిత్య, వసు, రుద్రాదులు, దేవతలు. పురందరుడు ఇంద్రుడు. వసిష్ఠ, కాశ్యప, అత్రి, జమదగ్ని, గౌతమ, విశ్వామిత్ర, భరద్వాజులు సప్తర్షులు. ఇది ఇపుడు జరుగుతూన్న మన్వంతరము. వైవస్వతమనువునకు ఇక్ష్వాకు మొదలగువారు పుత్రులు. ఈ అన్ని మన్వంతరములందును శ్రీమహావిష్ణువు అంశావతారరూపమున అవతరించెను. స్వాయంభువమన్వంతరమునందు 'మానసుడు' అను పేరుతోను, పిదప మిగిలిన ఆరు మన్వంతరములందు, క్రమముగా–అజిత, సత్య, హరి, దేవవర, వైకుంఠ, వామన రూపములతోను అవతరించెను. ఛాయాదేవి గర్భసంజాతుడైన పుత్రుడు సావర్ణి ఏడవ మనువు

కాగలడు. ఇతని వర్ణము (శరీరచ్ఛాయ) తన అన్నదైన శ్రాద్ధ దేవుని శరీరచ్ఛాయతో సమానముగా ఉండును. అందుచే 'సావర్ణి' అనిపేరు. ఇతని కాలమున సుతపస్ మొదలగువారు దేవతలు గాన పరమతేజః శాలులైన అశ్వత్థా మాదులు సప్తర్షులుగాను, బలి ఇంద్రుడుగాను అగుదురు. విరజాదులు మనుపుత్రులు. తొమ్మిదవ మనువు పేరు దక్షసావర్ణి. ఆతని మన్వంతరమున పారాదులు దేవతలుగాను, అద్భుతుడు ఇంద్రుడుగాను, సవనుడు మొదలగువారు సప్తర్షులుగాను అగుదురు. మను పుత్రుడు ధృతకేతువు. పదవ మనువు బ్రహ్మ సావర్ణి. సుఖాదులు దేవగణములుగాను, శాంతి ఇంద్రుడుగాను, హవిష్యాదులు సప్తర్షులుగాను అగుదురు. సుక్షేత్రాదులు మనుపుత్రులు.

పిదప ధర్మసావర్ణి అను పదునొకండవ మనువు అధికారమునందుండును. ఆ మన్వంతరము నందు విహంగాదులు దేవతలు, గణుడు ఇంద్రుడు; నిశ్చరాదులు సప్తర్షులు కాగలరు. సర్వత్ర గాదులు, మనుపుత్రులగుదురు. పండ్రెండవ మనువు రుద్రసావర్ణి. ఆ మన్వంతరమున ఋత ధాముడు ఇంద్రుడు. హరితాదులు దేవతలు. తపస్యాదులు సప్తర్షులు అగుదురు. దేవవంతుడు మొదలగు వారు మనుపుత్రులు అగుదురు. పదమూడవ మనువు రౌచ్యుడు. ఆ సమయమున సుత్రామణ్యాదులు దేవతలుగను, దివస్పతి ఇంద్రుడుగను అగుదురు. ఈ ఇంద్రుడు దైత్యదాన వాదులను మర్దించును. నిర్మోహాదులు సప్తర్షులుగ ఉందురు. చిత్రసేనాదులు మనుపుత్రులు. పదునాల్గవ మనువు భౌత్యుడు. ఆ సమయమున శుచి ఇంద్రుడుగను, చాక్షుషాదులు దేవతలుగను, అగ్ని బాహ్వాదులు సప్తర్షులుగను ఉందురు. ఉరుమొదలగువారు మనుపుత్రులు. సప్తర్షులు భూమండలముపై వేద ప్రచారము చేయుచుందురు. దేవతా గణములుగా పూజింపబడుదురు. మను పుత్రులు ఈ భూమిని పాలింతురు. ఓ మునీ ! ఒక్క బ్రహ్మ దివసమున పదునాలుగురు మనువులు ఆవిర్భ వింతురు. దేవతా ఇంద్రాదులు పదునాల్గుసార్లు పుట్టుదురు. ద్వాపరాంతమున శ్రీమహా విష్ణువు వేదవ్యాస రూపమున అవతరించి, వేదవిభాగము చేయును. మొట్టమొదట వేదము ఒక్కటే. దానిలో నాలుగు చరణములు, ఒక లక్ష ఋక్కులు ఉన్నవి. మొదట యజుర్వేద మొక్కటిగానే ఉండగా వ్యాసుడు దానిని నాల్గుగా విభజించెను.

అధ్వర్యువు యజుర్వేదముచేతను, హోత ఋగ్వేదము చేతను, ఉద్గాత సామ మంత్రముల చేతను, బ్రహ్మ అథర్వ వేదముచేతను, తమ తమ ఆర్త్విజ్యము నడుపవలెనని నిశ్చయించెను. వ్యాసుని ప్రథమ శిష్యుడైన పైలుడు ఋగ్వేద పారంగతుడు. ఇంద్రుడు ప్రమతికిని, బాష్కలునకును సంహితను ఇచ్చెను. బాష్కలుడు తన సంహితను నాల్గుగా విభజించి బౌద్ధాదులకు ఇచ్చెను. వ్యాస శిష్యుడును, బుద్ధిమంతుడును అగు వైశంపాయనుడు యజుర్వేదమను వృక్షమునకు ఇరువది ఏడు శాఖలు నిర్మించెను. యాజ్ఞవల్క్యాదులు కాణ్వ-వాజసనేయాది శాఖలను సంపాదించిరి. వ్యాసశిష్యుడైన జైమిని సామవేదమను వృక్షమునకు శాఖలు నిర్మించెను. సుమంతు-సుకర్ములు ఒక్కొక్క సంహిత రచించిరి. సుకర్మ తన గురువునుండి వెయ్యి సంహి తలను గ్రహించెను. వ్యాస శిష్యుడైన సుమంతుడు అథర్వ వేదమునకు ఒకశాఖ ఏర్పరచి పైప్పలుడు మొదలగు వేలకొలది శిష్యులకు నేర్పెను. వ్యాసుని అనుగ్రహముచే సూతుడు పురాణ సంహితా విస్తారము చేసెను. (150)

వర్ణాశ్రమ ధర్మములు, ఇతర ధర్మములు

అగ్ని పలికెను :

ఏ ధర్మములను ఆచరించి మన్వాదులు భుక్తిముక్తులు పొందిరో వాటిని పుష్కరుడు, పరశు రామునకు, వరుణోక్త ప్రకారమున చెప్పెను. పుష్కరుడు ఇట్లు చెప్పెను : వాసు దేవాదులకు సంతోషమును కలిగించునవియు, మన్వాదులు చెప్పినవియు అగు వర్ణ, ఆశ్రమ, సర్వసాధారణ ధర్మములను నీకు చెప్పెదను. పరశురామా! అహింస, సత్యము, భూతదయ, అనుగ్రహబుద్ధి, తీర్థయాత్ర, దానము, బ్రహ్మచర్యము, మాత్సర్యము లేక పోవుట, దేవ బ్రాహ్మణ పూజనము, గురు శుశ్రూష, సర్వధర్మ శ్రవణము, పితృపూజనము, రాజభక్తి, సర్వదా ఉత్తమశాస్త్రముల సాహాయ్యముననే విషయములను తెలిసికొనుట, క్రౌర్యము లేకుండుట, ఓర్పు, ఆస్తిక్యబుద్ధి–ఇవి అన్ని వర్ణములకును, ఆశ్రమములకును సాధారణములగు ధర్మములు. యజనము, యజ్ఞముచేయించుట, దానము, వేదాధ్య ధ్యాపనము, ప్రతిగ్రహము, అధ్యయనము–ఇవి బ్రాహ్మణుల కర్మలు. దానము, అధ్య యనము, యజనము–ఇవి క్షత్రియ వైశ్యుల ధర్మములు. పాలనము, దుష్ట నిగ్రహము, ఇవి క్షత్రి యుని విశేష ధర్మములు. అట్లే వైశ్యునకు వ్యవసాయము, గోసంరక్షణ, వాణిజ్యము, విశేష ధర్మములు.

శూద్రునకు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల శుశ్రూష లేదా వివిధ శిల్పములు ధర్మము. బ్రాహ్మణా దులకు ఉపనయనమైనది మొదలు రెండవ జన్మ. అనులోమ్యమున (తండ్రి పై వర్ణమువాడై, తల్లి క్రింది వర్ణమునకు చెందినపుడు) పుట్టినవారి జాతి తల్లి జాతితో సమమగును. ప్రాతిలోమ్యమున (పై కులము స్త్రీ, పురుషుడు క్రింది కులము అయినపుడు) శూద్రునివలన బ్రాహ్మణ స్త్రీకి పుట్టినవాడు చండాలుడు. క్షత్రియునివలన బ్రాహ్మణియందు పుట్టినవాడు సూతుడు. వైశ్యుని వలన పుట్టినవాడు దేవలుడు. క్షత్రియ స్త్రీయందు శూద్రుని వలన పుట్టినవాడు మాగధుడు. వైశ్యస్త్రీయందు శూద్రునివలన పుట్టిన వాడు ఆయోగవుడు. ప్రతిలోమ స్త్రీలకు ప్రతిలోమ పురుషులవలన (పుట్టినవారు వేలకొలది భేదములలో నుందురు) వారికి వివాహము తమతో సమానమైన జాతికలవారితోనే జరుగవలెను. అధములతో గాని, ఉత్తములతోగాని ఈ వివాహము జరుగరాదు. వధ్యులను చంపుట చండాలుల కర్మ. స్త్రీలకు ఉపయోగించు వస్తువులను తయారుచేయుట, స్త్రీలను రక్షించుట వైదేహకుని కర్మ. సార థ్యము సూతుని కర్మ. వేటచే జీవనము పుక్కసుని కర్మ. స్తుతి చేయుట మాగధుని కర్మ. రంగమునందు దిగుట, శిల్పజీవనము ఆయోగవుని కర్మ. చండాలుడు గ్రామముబైట నుండి శవ వస్త్రములను ధరించ వలెను. ఇతర వర్ణములవారిని స్పృశించగూడదు. గో బ్రాహ్మణుల నిమిత్తము, స్త్రీ బాలాదుల రక్షణ నిమిత్తము ప్రాణ త్యాగము చేయుటచే చండాలాదులకు ఆధ్యాత్మికోన్నతి లభించును. సంకరజాతుల వారి జాతిని వారి తల్లి దండ్రులను బట్టియు, జాతిసిద్ధములగు కర్మలను బట్టియు నిర్ణయించవలెను. (151)

గృహస్థ వృత్తి

పుష్కరుడు పలికెను : బ్రాహ్మణుడు తన కర్మచే జీవించవలెను. అట్లు జీవించజాలని బ్రాహ్మణుడు క్షత్రియ, వైశ్య, శూద్ర ధర్మములచే గూడ జీవించవచ్చును. కాని సంకర జాతులవారి ధర్మము

నవలంబింపరాదు. ద్విజుడు ఆపత్కాలమున కృషి, వాణిజ్యము, గో రక్షణము, వడ్డీవ్యాపారముకూడ చేయవచ్చును. కాని గో క్షీరాదులు, బెల్లము, లవణము, క్షారము, మాంసము మొదలైనవాటి వ్యాపారము చేయరాదు. కర్షకులు భూమిని బ్రద్దలు కొట్టుట, ఓషధులను ఛేదించుట, కీటక పిపీలికాదులను చంపుట మొదలగు వాటివలన కలిగిన పాపమును యజ్ఞముచేతను, దేవతా పూజచేతను తొలగించుకొనగలరు. ఎనిమిది ఎద్దుల హలము ధర్మ సమ్మతము, జీవిక కోరువారికి ఆరు ఎద్దుల హలము, క్రూరులకు నాలుగు ఎద్దుల హలము, ధర్మ హింసకులకు రెండెద్దుల హలము చెప్పబడినది. ఋతము (కళ్లములో మిగిలిన వరివెన్నుల ధాన్యపు గింజలు ఏరికొని వాటిపై మాత్రము జీవించుట) చేతగాని, అమృతము (అయాచితముగా లభించినది)చే గాని, మృతము (భిక్షాన్నము)చేత గాని, ప్రమృతము (వ్యవసాయము)చేతగాని, సత్యానృతముల (వర్తకము)చేతగాని జీవించ వలెను. శ్వవృత్తి (సేవావృత్తి)తో ఎన్నడును జీవించరాదు. (152)

బ్రహ్మచర్యాశ్రమ వర్ణనము

పుష్కరుడు పలికెను :

ఇపుడు ఆశ్రమవంతులగు వారి ధర్మములను చెప్పెదను. ఇది భుక్తి ముక్తి ప్రదము. స్త్రీల ఋతుకాలము పదునారు రాత్రులు. వీటిలో మొదటి మూడు రాత్రులు నింద్యములు. పురుష సంతానము గోరువారు మిగిలినవాటిలో సరిసంఖ్యగల రాత్రులలో స్త్రీ సమాగమము చేయవలెను. అది గర్భాదాన సంస్కారము. గర్భవతియైనది అని నిశ్చయము కలుగగనే, శిశువు కదలక పూర్వమే పుంసవన సంస్కారము చేయవలెను. ఆ రోజున పుంలింగ నక్షత్ర మున్నచో మంచిది. బాలుడు పుట్టిన తరువాత నాభిచ్ఛేదమునకు పూర్వమే జాతకర్మ సంస్కారము చేయవలెను. సూతకము తొలగిన తరువాత నామకరణము–బ్రాహ్మణుని పేరుకు చివర శర్మా అనియు క్షత్రియునకు వర్మా అనియు వైశ్య, శూద్రులకు క్రమముగ గుప్త, దాస అనియు చేర్చుట మంచిది. ఆ సంస్కారముచేయు సమయమున పత్ని ఇతడు నీ పుత్రుడు అని చెప్పుచు భర్త ఒడిలో బాలుని ఉంచవలెను. పిదప కులాచారము ప్రకారము చూడాకరణము చేయవలెను. బ్రాహ్మణునకు ఉపనయన సంస్కారము గర్భాష్టమము నందు, లేదా ఎనిమిదవ యేటను, క్షత్రియునకు గర్భైకాదశమునందును, వైశ్యునకు గర్భ ద్వాదశమునందును చేయవలెను. బ్రాహ్మణాదులకు షోడశాద్యబ్దములు దాటిన పిమ్మట ఉపనయనము చేసియు ప్రయోజనములేదు.

మూడు వర్ణముల వారికిని వరుసగ ముంజ, ప్రత్యంచా, వల్కలములతో చేసిన మేఖల విధింపబడినది. ఇట్లే వరుసగా మృగ, వ్యాఘ్ర, అజచర్మలు, పలాశ, పిప్పల, బిల్వ దండములు విధింపబడినవి. బ్రాహ్మణ బ్రహ్మచారి దండము ఆతని కేశముల వరకును, క్షత్రియుని దండము లలాటమువరకును, వైశ్యుని దండము లలాటము వరకును పొడవు ఉండవలెను. దండములు వంకరగాను, చర్మరహితముగాను ఉండగూడదు. నిప్పు తగిలినవి కాకూడదు. మూడు వర్ణముల వారికి వస్త్రములు వరుసగా పత్తి పట్టు ఉన్ని–వీటితో నిర్మించినవి కావలెను. బ్రాహ్మణ బ్రహ్మచారి భిక్ష అడుగునపుడు భవచ్ఛబ్దమును వాక్యము మొదట ప్రయోగించవలెను. క్షత్రియుడు వాక్య

మధ్యమునందును, వైశ్యుడు అంతము నందును ప్రయోగించవలెను. తప్పక లభించును అనుచోటనే ప్రథమభిక్ష యాచించవలెను. స్త్రీలకు వివాహముతప్ప మిగిలిన అన్ని సంస్కారములును మంత్ర రహితముగ జరుపవలెను. వివాహము మాత్రము వైదికమంత్రముతో జరుపవలెను. శిష్యునకు ఉపనయనము చేసి గురువు ముందుగా సదాచారము, శౌచాచారము, అగ్ని కార్యము, సంధ్యోపాసన నేర్పవలెను. తూర్పు ముఖముగా కూర్చుండి భోజనము చేయువాడు ఆయుర్దాయమును అనుభవించును. దక్షిణాభిముఖముగా చేయువాడు కీర్తిని, పశ్చిమ ముఖముగా చేయువాడు ఐశ్వర్యమును, ఉత్తరాభిముఖముగా చేయువాడు సత్యమును అనుభవించును. బ్రహ్మచారి సాయం ప్రాతః కాలములందు అగ్ని కార్యము చేయవలెను. అపవిత్ర వస్తువును హోమము చేయరాదు. హోమ సమయమున చేతి వ్రేళ్ళను దూరముగా ఉంచుకొనవలెను. మధు మాంసములను, జనులతో కూడికను నృత్య సంగీతములను, హింసను, ఇతర నిందను, అశ్లీల సంభాషణమును విడువవలెను. దండములను ధరించి ఉండవలెను. ఆ దండము విరిగిపోయిన దానిని జలమునందు విసర్జించి క్రొత్తది గ్రహింపవలెను. వేదాధ్యయన అనంతరము గురువుకు దక్షిణ సమర్పించి వ్రతాంత స్నానము చేయవలెను. లేదా నైష్ఠిక బ్రహ్మచారియై ఆ జీవనాంతము గురుకులమునందే ఉండిపోవలెను. (153)

వివాహ విషయములు

పుష్కరుడు చెప్పెను :

పరశురామా! బ్రాహ్మణుడు తన ఇచ్ఛానుసారముగా నాలుగు వర్ణముల కన్యలను వివాహ మాడవచ్చును, క్షత్రియుడు మూడు వర్ణములవారిని, వైశ్యుడు రెండు వర్ణముల వారిని వివాహ మాడవచ్చును. శూద్రుడు స్వవర్ణము కన్యను వివాహమాడవలెను. అసమాన వర్ణయగు భార్యతో ధార్మిక కర్మ లేవియు చేయరాదు. సమానవర్ణ కన్యను వివాహము చేసికొనినపుడు భర్త ఆమె హస్తము గ్రహించవలెను. బ్రాహ్మణునితో క్షత్రియ కన్యకు వివాహమగునపుడు ఆమె అతని చేతిలో నున్న బాణమును పట్టుకొనవలెను. వైశ్య కన్య బ్రాహ్మణ-క్షత్రియులతో వివాహము చేయునపుడు ఆమె వారి చేతిలో నుంచిన కొరడా పట్టుకొనవలెను. శూద్ర కన్య వస్త్రాగ్రమును పట్టుకొనవలెను. కన్యాదాన మనునది ఒక్క పర్యాయమే జరుగును.

ఇచ్చిన కన్యను అపహరించినవారిని చోరుని దండించి నట్లు దండించవలెను. సంతానము అమ్మువానికి పాపవిముక్తి కలుగదు. కన్యాదానము, శచీపూజ, వివాహము, చతుర్థీకర్మ-ఈ నాల్గింటికిని వివాహము అని పేరు. పతి జాడ తెలియ కుండపోయినను, మరణించినను, సన్యాసియైనను, నపుంసకుడైనను, పతితు డైనను-ఈ ఆపదలందు భార్య మరియొక భర్తను పొందవచ్చును. పతి మరణించిన కన్యను మరిదికి ఇవ్వవలెను. మరిదిలేని పక్షమున ఇష్టము వచ్చిన వారికి ఇవ్వవచ్చును. వర-వధూవరణములకు మూడు ఉత్తరా నక్షత్రములు, కృత్తిక, స్వాతి, మూడు పూర్వా నక్షత్రములును మంచివి. పరశురామా! సమాన గోత్ర ప్రవరలుగల కన్యను వివాహ మాడరాదు. తండ్రి తరువాత ఏడు పురుషములు, తల్లి తరువాత ఐదు పురుషములు దాటిన వారిని వివాహము చేసికొనవచ్చును.

ఉత్తమ వంశమునందు పుట్టిన, సదాచారవంతుడైన వరుని ఇంటికి పిలిచి కన్యా దానము చేయుట 'బ్రాహ్మ వివాహము'. ఈ వివాహ ప్రభావముచే ఈ దంపతుల పుత్రుడు వెనుకటి తరములవారిని ఉద్ధరించును. వరునినుండి ఒక ఆవును, ఒక ఎద్దును తీసికొని కన్యాదానము చేసినచో అది 'ఆర్షవివాహము'. అడిగినవానికి కన్యాదానము చేసినచో అది 'ప్రాజాపత్య' వివాహము. దీనివలన ధర్మసిద్ధి కలుగును. శుల్కము తీసికొని కన్యా దానము చేసినచో 'అసుర వివాహము' ఇది నీచ కృత్యము. వధూవరులు తాము ఇష్టపడి చేసికొనిన వివాహము 'గాంధర్వము'. యుద్ధముచేసి కన్యను హరించి చేసికొన్నది 'రాక్షస వివాహము'. మోసగించి కన్యను అపహరించినచో 'పైశాచ వివాహము'. వివాహ దివస మున కుమ్మరి మట్టితో శచి ప్రతిమ తయారుచేసి, జలాశయ సమీప మున దానికి మంగళ వాద్యాదులతో పూజచేయించి, కన్యను ఇంటికి తీసికొనివెళ్లవలెను. ఆషాఢ శుద్ధైకాదశి నుండి కార్తిక శుద్ధైకాదశి వరకు శ్రీమహావిష్ణువు శయనించి ఉన్నపుడు వివాహము చేయరాదు. పౌష చైత్రమాసములందు మంగళవారమునందు రిక్తాభద్రా తిథులందును గురు, శుక్రులు అస్తంగతులైనపుడును, చంద్రగ్రహణము పట్టబోవునపుడును, లగ్నము నందు రవి, శని, కుజులు ఉన్నపుడును, వ్యతీపాత దోషము ఉన్నపుడును వివాహము నిషిద్ధము. మృగశిర, మఘ, స్వాతి, హస్త, రోహిణి, ఉత్తరాత్రయము, మూల, అనురాధ, రేవతి–ఇవి వివాహ నక్షత్రములు. పురుషవాచకమగు లగ్నము, దాని నవమాంశము మంచిది. లగ్నమునుండి తృతీయ, షష్ఠ, దశమ, ఏకాదశ, ద్వాదశ స్థానములందు రవి, శని, బుధులున్న శుభము. అష్టమమున కుజుడున్న అశుభము. మిగిలిన గ్రహములు సప్తమ, ద్వాదశ, అష్టమ స్థానములందున్నచో శుభము. షష్ఠ శుక్రుడు అశుభుడు. చతుర్థీకర్మ కూడ వైవాహిక నక్షత్రమునందే చేయవలెను. లగ్న చతుర్థాది స్థానములందు గ్రహములు లేకుండుట మంచిది. పర్వదినములను విడచి ఇతర దివసములందే స్త్రీ సమాగమము చేయవలెను. దీనివలన సతీదేవి ఆశీర్వాదముచే సర్వదా సుఖము కలుగును. (154)

ఆచార వర్ణనము

పుష్కరుడు చెప్పెను : ప్రతిదినము ప్రాతఃకాలము నందు బ్రాహ్మ ముహూర్తమునందే విష్ణ్వాది దేవతలను స్మరించవలెను. పగలు మలమూత్ర త్యాగము ఉత్తరాభిముఖుడై చేయవలెను. రాత్రియందు దక్షిణాభిముఖుడై, సంధ్యలందు పగటియందువలె చేయవలెను. మార్గాదులందును, జలములందును, సందులు మొదలగువాటియందును ఎన్నడును మల త్యాగము చేయ గూడదు. తృణముచే భూమికప్పి దానిపై మలత్యాగముచేయవలెను. మట్టితో హస్త పాదాది శుద్ధి చేయవలెను. స్నానము, నిత్యము, నైమిత్తికము, కామ్యము, క్రియాంగము, మలకర్షణము, క్రియాస్నానము అని ఆరు విధములు. స్నానము చేయనివాని కర్మలన్నియు నిష్ఫలములు. అందుచే ప్రతిదినము ప్రాతఃకాలమున స్నానము చేయవలెను. కూపము నుండి తోడిన జలము కంటె భూమిస్థ జలము పవిత్రము. దాని కంటె సెలయేటిలోని నీరు, దానికంటె తటాకోదకము, దానికంటె నదీజలము, దానికంటె తీర్థోదకము పవిత్రము. గంగాజలము అన్నిటికంటెను పవిత్రము. నీటిలో మునిగి శరీరము నందలి మలమును కడిగివేసుకొని, ఆచమనముచేసి, 'హిరణ్య వర్ణాః'ఇత్యాది ఋక్త్రయముతోను, 'శం నో దేవీరభిష్టయే'

అను మంత్రముతోను, 'ఆపోహిష్ఠా', ఇత్యాది మంత్రములు మూడింటితోను, 'ఇదమాపః' ఇత్యాది మంత్రముతోను మార్జనము చేసికొనవలెను. పిదప జలాశయమునందు మునిగి, లోపలనే అఘ మర్షణ సూక్తముగాని 'ద్రుపదాదివ' అను మంత్రముగాని, 'యఙ్జతేమనః' ఇత్యాది సూక్తమునుగాని 'సహస్రశీర్షా' ఇత్యాది సూక్తమునుగాని జపించవలెను. విశేషించి గాయత్రీజపము ఉచితము. అఘమర్షణ సూక్తమునందు దేవత భావ వృత్తము, ఋషి అఘమర్షణుడు. ఛందస్సు అనుష్టుప్. తద్ద్వారా భావవృత్తుడగు హరిని స్మరించవలెను. బట్టలు పిండుచు దేవతా పితృతర్పణము చేయవలెను. పిదప పురుష సూక్తముతో జలాంజలి సమర్పించి, పిదప అగ్నిహోత్రముచేసి, యథాశక్తి దానము నిచ్చి, యోగక్షేమార్థమై పరమేశ్వరుని శరణమందవలెను. ఆసనము, శయ్య, వాహనము, స్త్రీ, సంతానము, కమండలము ఇవి తనవి అయినప్పుడే పవిత్రములు. ఇతరులవైనచో తనకు అవి అపవిత్రములు.

బరువు మోయుచున్న వానికిని, గర్భిణీస్త్రీకిని, పెద్దలకును మార్గమునీయవలెను. ఉదయించుచున్న సూర్యుని, అస్తమించుచున్న సూర్యుని చూడరాదు. జలమునందు సూర్య ప్రతిబింబమును చూడకూడదు. నగ్నస్త్రీని, కూపములోనికిని, హత్యాస్థానమును, పాపాత్ములను చూడకూడదు. దూది, ఎముకలు, భస్మము, జుగుప్సాకరములగు వస్తువులను దాటకూడదు. ఇతరుల అంతః పురములోనికి, కోశాగారములోనికిని ప్రవేశింపరాదు. ఇతరులకు దూతగా పనిచేయరాదు. విరిగిన నావ, చెట్టు, పర్వతము ఎక్కరాదు. ధనము, గృహము, శాస్త్రములు వీటి విషయమున కుతూహల ముతో నుండవలెను. (వ్రేళ్లతో) మట్టిపెడ్డలు నలగకొట్టువాడు, తృణములు త్రుంచువాడు, గోళ్లు కొరుకువాడు నశింతురు. ముఖాదుల ద్వారా వాద్య శబ్దము పుట్టించరాదు. రాత్రి దీపము లేకుండ ఎచటికి పోరాదు. ద్వారము తప్ప మరొక మార్గమున ఇంట ప్రవేశింపరాదు. ముఖము రంగు మార్చుకొన గూడదు. సంభాషణమున ఎవరికిని బాధ కలిగించరాదు. తన వస్త్రమును ఇతరుల వస్త్రముతో మార్పు చేసికొనరాదు. ఎల్లపుడు 'భద్రము, భద్రము' అని అనుచుండవలెను. ఇతరులకు నష్టము కలిగించు మాట ఎన్నడును పలకరాదు. పలాశ (మోదుగు) ఆసనమును ఉపయోగించరాదు. దేవతాదుల నీడ నుండి దూరముగ ఉండవలెను. ఇద్దరు పూజ్యులగు వారి మధ్యనుండి వెళ్ళకూడదు. ఎంగిలివాడుగా ఉండి నక్షత్రాదులను చూడరాదు. ఒక నదిలో ఉన్నపుడు మరొకనది పేరు పలుక రాదు. రెండు చేతులతో గోకుకొనరాదు. ఏదైన నదిని సమీపించునపుడు దేవతా పితృతర్పణము చేయకుండ దానిని దాటరాదు. మలాదులను జలములో పడవేయరాదు. నగ్నుడై స్నానము చేయ గూడదు. యోగ క్షేమముల కొరకై పరమాత్ముని శరణు పొందవలెను. శరీరముపైనున్న మాలను తన చేతులతో తీసివేయగూడదు. గాడిద దుమ్ము నుండి దూరముగా ఉండవలెను. తన కంటె తక్కువ స్థితిలోనున్న వారినిచూచి నవ్వకూడదు. వారితో కలసి ఒక స్థానమున నివసింపగూడదు. వైద్యుడు, రాజు, నదిలేని దేశమునందు నివసించగూడదు. మ్లేచ్ఛులు, స్త్రీలు, అనేకులు అధిపతులుగా ఉన్న దేశమునందు నివసించరాదు. రజస్వలలతోను, పతితాదులతోను సంభాషణ చేయకూడదు. సదా విష్ణుస్మరణము చేయవలెను. ముఖమును అచ్ఛాదించు కొనకుండ నవ్వుట, ఆవలించుట, తుమ్ముట చేయరాదు. తెలివైనవాడు స్వామి యొక్క అవమానమును, తన అవమానమును

రహస్యముగా ఉంచుకొనవలెను. ఇంద్రి యములు చెప్పినట్లు చేయరాదు. మలమూత్రముల వేగము ఆపుకొనరాదు. పరశురామా! చిన్న రోగమును, చిన్న శత్రువునుగూడ ఉపేక్షించరాదు. మార్గముదాటి వచ్చిన పిమ్మట తప్పక ఆచమనము చేయవలెను. జలాగ్నులను ఒకేసారి ధరింపరాదు. కల్యాణ మయుడగు పూజ్యుని విషయమున ఎన్నడును కోపముతో హుంకరింపగూడదు. పాదమును పాదముతో నొక్కకూడదు. ప్రత్యక్షముగాగాని, పరోక్షముగాగాని ఎవ్వరిని నిందింపరాదు. వేద, శాస్త్ర, రాజ, ఋషి, దేవతలను నిందింపరాదు. స్త్రీల విషయమున ఈర్ష్య యుండ కూడదు. ఎన్న డును వారిని విశ్వసింపగూడదు. ధర్మమును వినవలెను. దేవతలపై భక్తి చూపవలెను. ప్రతిదినము ధర్మాద్యనుష్ఠానము చేయవలెను. జన్మ నక్షత్ర దివసమున చంద్రుని, బ్రాహ్మణు లను, దేవతాదులను పూజించవలెను. షష్ఠీ, అష్టమీ చతుర్దశీ దివసములందు తైలాభ్యంగ స్నానము చేయగూడదు. ఇంటినుంచి దూరముగపోయి మల మూత్ర విసర్జన చేయవలెను. ఉత్తమ పురుషులతో ఎన్నడును విరోధము చేయగూడదు. (155)

ద్రవ్యశుద్ధి

పుష్కరుడు చెప్పెను :

ఇపుడు ద్రవ్యశుద్ధిని గూర్చి చెప్పెదను. మట్టి పాత్ర మరల కాల్చుటచే శుద్ధ మగును. మల మూత్రాది స్పర్శచే అశుద్ధమైన పాత్ర కాల్చినను శుద్ధము కాదు. సువర్ణ పాత్రము అపవిత్ర వస్తువుల స్పర్శ కలిగినచో కడిగివేసిన శుద్ధమగును. తామ్రపాత్ర పులుపు తగిల్చి నీటితో కడిగిన శుద్ధమగును. కాంస్య, లోహపాత్రలు పరాగముతో రాచిన శుద్ధ ములు అగును. కేవలము జలముచే కడిగినంత మాత్రమునే ముత్యములు మొదలగునవి శుద్ధమగును. జలమునుండి పుట్టిన శంఖాదులతో తయారు చేసిన పాత్రలు, ఱాతి పాత్రలు, శాకము, త్రాడు, ఫలములు, పుష్పములు, మూలములు, వెదురు మొదలైన వాటితో తయారు చేసిన వస్తువులు జలముచే కడిగిన శుద్ధములగును. యజ్ఞమునందు, యజ్ఞ పాత్రలు కుడిచేతితో కుశలతో మార్జనము చేసినచో శుద్ధమగును. ఘృతము, తైలముతగిలి జిడ్డుగానున్న పాత్రలు, వేడినీటితో శుద్ధములగును. చీపురుతో తుడిచి, అలుకుటచే ఇల్లు శుద్ధి అగును. శోధన ప్రోక్షణములచే వస్త్రశుద్ధి అగును. మృత్తి కోదకముతో శోధనము చేయవలెను. చాల వస్త్రముల సముదాయము నీరు చల్లుటచే శుద్ధమగును. దారు పాత్రములు చెక్కుటచే శుద్ధముల గును. శయ్యాది వస్తువులు, అనేక వస్తువులు కలియగా ఏర్పడినవి జలప్రోక్షణముచే శుద్ధములగును. రెండు కుశ పత్రములచే ఉత్ప్లవనము చేయుటచే ఘృత తైలాదులకు శుద్ధి. శయ్య, ఆసనము, వాహనము, చేట, శకటము, పలాలేంధనములు జలసంప్రోక్షణముచే శుద్ధమగును. శృంగ దంతా దులతో తయారు చేసిన వస్తువులు పచ్చ ఆవాలు ముద్దచేసి పూసినచో శుద్ధమగును. నారికేళము, ఆనప కాయ మొదలగు వాటితో తయారు చేసిన పాత్రలు ఆవుతోక యందలి వెంట్రుకలతో రాయగా శుద్ధమగును. శంఖాద్యస్థి నిర్మితపాత్రల శుద్ధి శృంగ నిర్మిత పాత్రలవలె ఆవాల ముద్ద పూయుటచే అగును. జిగురు బెల్లము, ఉప్పు, కుసుంభ పుష్పము, ఉన్ని, పత్తి ఎండలో ఎండబెట్టుటచే శుద్ధమగును. నదీజలము సర్వదా శుద్ధము. ఆపణములో అమ్మ జూపిన వస్తువులు శుద్ధములు.

ముఖము తప్ప గోవు అవయవములు అన్నియు శుద్ధ ములు. గుఱ్ఱము, మేక-వీటి ముఖములు శుద్ధములు. స్త్రీల ముఖము సర్వదా శుద్ధము. పాలు పితుకునపుడు లేగదూడ ముఖము, చెట్టుపై పండ్లుకొట్టిన పక్షుల ముఖము, వేటాడు సమయమున కుక్కల ముఖము పవిత్రములు. భోజనము, ఉమ్మి వేయుట, నిద్రించుట, నీరు త్రాగుట, స్నానము, మార్గ గమనము, వస్త్ర ధారణము ఈ పనులు చేసిన పిమ్మట ఆచమనము చేయవలెను. పిల్లి ఇటు అటు తిరుగుటచే శుద్ధము. రజస్వల నాల్గవ దిన మున శుద్ధియగును. ఋతు స్నాతయైన స్త్రీ ఐదవ రోజున దేవ-పితృ కార్యములలో పాల్గొన వచ్చును. శౌచా నంతరము ఐదు పర్యాయములు గుదము నందును, పది మార్లు ఎడమ చేతియందును, మరల ఏడుసార్లు రెండు చేతులందును, ఒకమారు లింగము నందును, మరల రెండు మూడుసార్లు చేతులందును మట్టి రాసుకొని కడుగుకొనవలెను. ఇది గృహస్థులకు చెప్పిన శౌచ విధానము. బ్రహ్మచారి, వానప్రస్థ, సన్యాసులకు ఇంతకు నాలుగు రెట్లు శౌచము విహితము. సిల్కు బట్టల శుద్ధి బిల్వ ఫలములోని గుంజుతోను, క్షౌమముల శుద్ధి తెల్ల ఆవాలతోను, మృగచర్మ, రోమాదులతో నిర్మితములగు వస్త్రముల శుద్ధి నీరుచల్లుట చేతను అగును. పుష్ప ఫలములుకూడ జల ప్రోక్షణముచే శుద్ధములగును. (156)

శావాశౌచాదికము

పుష్కరుడు చెప్పెను : ఇపుడు ప్రేతశుద్ధి, సూతికాశుద్ధులను గూర్చి చెప్పెదను. సపిండులలో (మూల పురుషుడు మొదలు ఏడవ తరమువరకు ఉన్న వారిలో) మరణ అశౌచము పది దినములు. జనన అశౌచము కూడ అంతే. పరశురామా! ఇది బ్రాహ్మణుల విషయమున చెప్పిన అశౌచము. క్షత్రియులకు 11 రోజులు, వైశ్యులకు 15 రోజులు, శూద్రులకు ఒక మాసము అశౌచము. శూద్రులకు చెప్పిన ఈ అశౌచము అనులోమజునకు స్వామి ఎన్ని దినముల అశౌచము పాటించునో సేవకులకు గూడ అన్ని దినములే. జనన అశౌచము క్షత్రియ, వైశ్య, శూద్రులకుగూడ పది దినములే. పరశు రామా! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు ఈ విధముగనే శుద్ధియగును. కొందరి మతమున వైశ్య, శూద్రులకు జననాశౌచము పదునైదు దినములు. బాలకుడు దంత ఉత్పత్తికి పూర్వమే మరణించినచో జనన అశౌచము నకు సద్యః శుద్ధి కలుగును. దంతములు వచ్చిన తరువాత చూడాకరణమునకు పూర్వము మరణించినచో ఏకరాత్రా శౌచము; యజ్ఞోపవీత ధారణమునకు పూర్వమైనచో త్రిరాత్రా శౌచము; అనంతరము దశరాత్రా శౌచము. మూడు సంవత్సరములలోపు బాలుడు మర ణించినచో శూద్రునకు ఐదు దినముల తరువాత అశౌచనివృత్తి. మూడు సంవత్సర ముల పిమ్మట నైనచో పదునొక దినముల తరువాతను, ఆరు వర్షములు దాటిన తరువాత నైనచో ఒక మాసము తరువాతను నివృత్తమగును. చూడాకర్మ జరుగని కన్య మరణించి నపుడు ఒక రాత్రి మరణాశౌచమగును. చూడాకర్మ జరిగిన పిమ్మట నైనచో బంధువులకు మూడు దినముల పిమ్మట శుద్ధియగును. వివాహిత స్త్రీల మరణా శౌచము పితృ కులము వారికి ఉండదు. తండ్రి ఇంటిలో పుత్రిక బిడ్డను కన్నచో ఆ జాతాశౌచము ఒక్క రాత్రి మాత్రమే ఉండును. ఆ స్త్రీ మాత్రము పది రోజుల తరువాత శుద్ధురాలగును. వివాహితకన్య పితృ గృహమున మరణించినచో పితృ కులము

వారికి అశౌచము మూడు రాత్రులు ఉండును. సమాన అశౌచమునకు ముందు శుద్ధి చేసికొనవలెను. అసమాన అశౌచమునకు అనంతరము చేసికొనవలెను అని ధర్మరాజు చెప్పెను.

దేశాంతరములో ఉన్నవాడు జాతమరణ అశౌచములను విన్నచో పది రోజులలో మిగిలిన రోజులకు మాత్రమే అశౌచము పట్టవలెను. పదిరోజుల తరువాత విన్నచో మూడు రోజులు పట్ట వలెను. సంవత్సరము దాటిన తరువాత విన్నచో స్నాన మాత్రముచే శుద్ధుడగును. మాతామహుడు గాని, ఆచార్యుడు గాని మరణించినచో మూడు రాత్రులు అశౌచము. పరశురామా! గర్భస్రావము ఎన్నవ మాసమున జరిగినదో అన్నిరాత్రులు గడచినపిమ్మట స్త్రీకి శుద్ధి అగును. సపిండ బ్రాహ్మణ కులమునందు మరణాశౌచము వచ్చినచో అందరికిని పదిరోజులలో శుద్ధి. క్షత్రియులకు పదునొకండు రోజులలోను, వైశ్యునకు పదునైదు రోజులలోను, శూద్రునకు ఒక మాసమునకును శుద్ధి. (శ్రాద్ధము నందు) ఉచ్ఛిష్ట సమీపమున వేదిని ఏర్పరచి, దాని సంస్కారము చేసి, దానిపై కుశలు పరచి, కుశముల పైననే పిండప్రదానము చేయవలెను. ఆ సమయమున ఏకాగ్రచిత్తుడై పితరుల నామగోత్రములు చెప్పుచు పిండప్రదానము చేయవలెను. బ్రాహ్మణులు భుజించిన తరువాత వారికి ధనమిచ్చి సత్కరించి, పూజించి, నామగోత్రోచ్చారణ పూర్వకముగ అక్షత సహిత జలము విడువవలెను. నాలుగు అంగుళముల వెడల్పు, అంతే లోతుగల జానెడు గొయ్యి త్రవ్వి అచట మూడువికర్షువులు తయారుచేసి, వాటి దగ్గర మూడు అగ్నులను ప్రజ్వలింప చేయవలెను. వాటి అన్నింటి యందును మూడేసి లేదా నాలుగేసి హోమములు చేయవలెను. పిదప అచట వెనుకటి వలెనే వేరు వేరుగా పిండములను ఈయవలెను. పిండములను అన్నము, పెరుగు, తేనె, మినుములు వీటితో చేయవలెను. సంవత్సరము మధ్య అధిక మాసము వచ్చినచో దానికొక పిండము అధికముగా చేయవలెను. లేదా పండ్రెండు మాసముల మాసిక శ్రాద్ధములన్నియు పండ్రెండవ రోజుననే పూర్తిచేయవలెను. ఆ సంవత్స రమునందు అధికమాసము రానున్నచో ద్వాదశాహశ్రాద్ధ దినమునందే ఆ మాసము కొరకై ఒక పిండము అధికముగా ఇవ్వవలెను. సంవత్సరము పూర్తియైన పిమ్మట శ్రాద్ధమును సామాన్య శ్రాద్ధమువలెనే చేయవలెను. సపిండీకరణ శ్రాద్ధమునందు ప్రేతకు పిండము వేరుగా ఇచ్చి, పిదప మూడుతరముల పితరులకు మూడు పిండములు వేరు వేరుగా ఇవ్వవలెను. ఈ విధముగా నాలుగు పిండములను ఏకాగ్రతతో ఇవ్వవలెను. పరశురామా! పిండముల పూజచేసి, దానము చేసి, 'పృథివీతే పాత్రమ్'–'యే సమానాః' ఇత్యాది మంత్రమును పఠించుచు యథోచిత కర్మచేసి, ప్రేత పిండమును మూడు భాగములు చేసి, వాటిని వరుసగా పితృ, పితామహ, ప్రపితా మహాపిండములందు కలపవలెను. అంతకుముందు ప్రేతార్ఘ్య పాత్రలను పిత్రాద్యర్ఘ్య పాత్రలతో కలిపివేయవలెను. ఈ రెండు పనులు వేరువేరుగ చేయుటమంచిది. శూద్రునకు ఈ శ్రాద్ధ కర్మ మంత్ర రహితముగ శ్రాద్ధము చేయవలెను. స్త్రీల సపిండీకరణమును ఆ సమయమునందు ఈ విధముగనే చేయవలెను. పితృ దేవతలకు ప్రతి సంవత్సరము శ్రాద్ధము చేయవలెను. ప్రేతకు మాత్రము సాన్నోదక కుంభ దానము ఒక సంవత్సరముపాటు చేయవలెను. వర్షాకాలము నందు గంగానదిలోని ఇసుక లెక్క పెట్టవచ్చునేమో కాని అతీతులగు పితరులను లెక్కపెట్ట శక్యముకాదు. కాలము నిరంతర గమన శీలము. స్థిరత్వమనునది కాలమునందు ఎన్నడును ఉండదు. అందుచే కర్మలను తప్పక చేయవలెను.

మరణించినవాడు దేవత్వమును పొందియున్నను, నరకములో శ్రాద్ధమును అచటనే తప్పక పొందును. మరణించిన వానినిగూర్చి ఏడ్చువాడు తనకు కాని, మరణించిన వానికిగాని ఉపకారము చేసినవాడు కాజాలడు. పర్వతము నుండి దుమికి, అగ్నిలోపడి, ఉరివేసికొని, నీటిలో పడి, ఆత్మహత్య చేసికొన్నవారి మరణాశౌచము బంధువులకు తగలదు. పిడుగుపడి గాని, యుద్ధములో శస్త్రఘాతము వలనగాని మరణించినవారి వలన గూడ మరణ అశౌచము ఉండదు. యతులకును, యజ్ఞ దీక్షితులకును, రాజాజ్ఞా పాలకులకును అశౌచము ఉండదు. వీరు శవయాత్రలో వెళ్ళినచో స్నానముచే శుద్ధులు అగుదురు. మైథునము తరువాతను, జ్వలించుచున్న శవము యొక్క ధూమము తగిలినను వెంటనే స్నానము చేయవలెను. మరణించిన బ్రాహ్మణుని, శూద్రుని చేత మోయించగూడదు. అట్లే శూద్రుని బ్రాహ్మణునిచేత మోయించగూడదు. అట్లు చేయుటచే ఇద్దరికిని దోషము. అనాథ బ్రాహ్మణ శవమును మోసి అంత్యేష్టికి తీసికొని వెళ్లినవాడు స్వర్గమును పొందును. అనాథ ప్రేత సంస్కారార్థమై కాష్ఠమిచ్చువాడు యుద్ధమునందు విజయము పొందును. శవమును చితిపై ఉంచి, దహించి, బంధువులు చితికి అపసవ్యముగా పరిక్రమణముచేసి, సచేల స్నానముచేసి, ప్రేత నిమిత్తము మూడేసి పర్యాయములు జలాంజలి ఇవ్వవలెను. గృహద్వారము నందు మొదట ఱాతిపై పాదములు ఉంచి అగ్నిలో అక్షతలు వేసి, వేపాకులు నమలి, ఇంటిలో ప్రవేశించవలెను. అందరికి దూరముగా చాప వేసికొని నిద్రించవలెను. ఆ కుటుంబములోని వారు ఆ రోజున కొన్న ఆహారమును స్వల్పముగా భుజించవలెను. పదిరోజుల వరకును రోజుకు ఒక్కొక్కటి చొప్పున పిండము నీయవలెను. పదవ రోజున ఒక పిండమునిచ్చిన తరువాత క్షౌరము చేయించుకొనుటచే పరిశుద్ధుడగును. పదవ రోజున ఆవాలను, తిలలను శరీరమునకు పూసుకొని, నీటిలో మునిగి స్నానముచేసి నూతన వస్త్రములు ధరించవలెను. దంతోత్పత్తికి పూర్వమే మరణించిన బాలునకును, గర్భస్రావముచే పోయిన శిశువునకును దహన సంస్కార జలాంజలులు ఉండవు. శవదహనంతరము నాల్గవ రోజున అస్థి సంచయము చేయవలెను. అస్థి సంచయము తరువాత అంగస్పర్శ విహితము. (157)

స్రావాది అశౌచమ్

పుష్కరుడు చెప్పెను :

మన్వాది ఋషులు చెప్పిన విధముగ గర్భస్రావ అశౌచమును గూర్చి చెప్పెదను. నాల్గవ మాసమువరకును జరిగిన గర్భస్రావమునందును, పంచమషష్ఠ మాసములందు జరిగిన గర్భపాతము నందును మాసములు ఎన్నియో అన్ని రాత్రులు స్త్రీకి అశౌచము. లేదా మూడు రోజులు మాత్రమే అశౌచము. ఏడవ మాసము నుండి దశరాత్రా శౌచము. క్షత్రియునకు నాలుగు రాత్రులు, వైశ్యునకు ఐదు రాత్రులు, శూద్రునకు ఎనిమిది దినములు అశౌచము. ఏడు మాసముల కంటె అధికమైనచో అందరికిని పదునొకండు దినములు అశుద్ధి. ఈ అశౌచము స్త్రీలకు మాత్రమే. తండ్రికి స్నానమాత్రము చేతనే శుద్ధి. సపిండులకు ఆరు మాసముల వరకును అశౌచములేదు. సప్తమాష్టమ మాసములందు మూడు రాత్రులు అశౌచము. దంత జననము లోపల మృత్యువైనచో సపిండులకు సద్యఃశౌచము. చూడాకరణము లోపల ఒకరాత్రి, ఉపనయనము లోపల రాత్రిత్రయము, అది

దాటిన దశరాత్రము. దంతములు రాకుండ మృతుడైనచో తల్లి దండ్రులకు మూడు రాత్రులు; చూడాకరణమునకు పూర్వము మృత్యువు కలిగినను మూడు రాత్రులే. మూడు సంవత్సరముల లోపు బ్రాహ్మణ బాలుడు మృతుడైనచో సపిండులకు ఒక రాత్రి అశౌచము. క్షత్రియ బాలకుడు మరణించినచో సపిండులకు రెండు రోజులు, వైశ్యులకు మూడు రోజులు, శూద్రులకు ఐదు రోజులు అశౌచము. బ్రాహ్మణులకు మూడు రోజుల అశౌచము చెప్పినచోట శూద్రులకు పదకొండు రోజులు, క్షత్రియులకు ఆరు రోజులు, వైశ్యులకు తొమ్మిది రోజులు అశౌచముండును. రెండు సంవత్సరముల బాలునకు అగ్ని సంస్కారము లేదు. వానిని భూమిలో పాతిపెట్ట వలెను. అతనికి ఉదక క్రియ కూడ ఉండదు. లేదా నామకరణము చేసినవాడు జాతదంతు డైనచో అగ్ని సంస్కార ఉదక దానములు చేయవలెను. ఉపనయనానంతరము మరణించి నచో పది రోజుల అశౌచము. అగ్నిహోత్రము చేయుచు వేదాధ్యయనము చేయు బ్రాహ్మణునకు ఒక్క దినము నందే శుద్ధి. అతని కంటె హీనునకు మూడు దినములు, హీనతరునకు ఐదు రాత్రుల అశౌచానంతరము శుద్ధుడగును. పేరుకు బ్రాహ్మణుడు అనబడువాడు పది రోజులకును శుద్ధుడగును.

సద్గుణవంతుడైన బ్రాహ్మణుడు ఏడు దినములలోనే శుద్ధుడగును; గుణవంతుడైన క్షత్రియుడు తొమ్మిది దినములలోను, వైశ్యుడు పదిదినములలోను, శూద్రుడు ఇరువది దినములలోను శుద్ధుడగును. సాధారణుడగు బ్రాహ్మణుడు పదిదినములలోను, క్షత్రియుడు పండ్రెండు దినముల లోను, వైశ్యుడు పదునైదు దినములలోను, శూద్రుడు మాసమునకును శుద్ధుడగును. గుణాధిక్య మున్నచో పది రోజుల అశౌచము మూడు రోజులును, మూడు రోజుల అశౌచము ఒక్కరోజు, ఒక రోజు అశౌచము తాత్కాలికముగాను తొలగిపోవును. ఈ విధముగనే అంతటను ఊహించవలెను. దాసులు, శిష్యులు, భృత్యులు మొదలగువారు తమ స్వామి లేదా గురువుతో కలిసి నివసించునపుడు ఆ స్వామి లేదా గురువు మరణించినచో వారందరికి కుటుంబములోని వారితో సమముగా అశౌచ ముండును. అగ్ని హోత్రము చేసికొననివానికి సపిండ మృత్యువు జరిగిన వెంటనే అశౌచము తగు లును. అగ్నిహోత్రానుష్ఠానము చేయువానికి మాత్రము మృతునకు దహన సంస్కారము జరిగిన తరువాతనే అశౌచము ప్రాప్తించును. అన్ని వర్ణముల వారికి మూడవవంతు అశౌచ సమయము గడచిన పిమ్మట శారీరక స్పర్శాధికారముండును. ఈ నియమమునుబట్టి బ్రాహ్మణాదులు వరుసగ మూడు, నాలుగు, ఐదు, పది రోజుల తరువాత స్పర్శార్హులు అగుదురు. బ్రాహ్మణాదుల అస్థిసం చయము వరుసగ నాలుగు, ఐదు, ఏడు, తొమ్మిది–ఈ దినములందు చేయవలెను. వివాహముకాని కన్య మరణించినపుడు బాంధవులకు, ఒకరోజు, వివాహితయైనచో మూడు రోజులు అశౌచము. వివాహితయైన పుత్రిక గాని, సోదరి గాని మరణించినచో రెండు దినముల ఒక రాత్రి అశౌచము. అవివాహితలకు తండ్రి గోత్రమే గోత్రము. వివాహితలకు భర్తృగోత్రము. వివాహమైన పుత్రికి జలదానము చేయవలసిన విధి భర్తకు తండ్రికి గూడ ఉండును. పది దినముల పిమ్మట చూడాకర ణమునకు ముందు కన్య మరణించినచో మాతా పితరులకు మూడు దినముల అశౌచము. ఇతర బంధువులకు తాత్కాలిక అశౌచము. చూడాకరణ అనంతరము వివాహాత్పూర్వము బంధువులకు ఒక రోజు అశౌచము. వాగ్దానానంతరము వివాహాత్పూర్వమైనచో మూడు రోజుల అశౌచము

పిదప ఆ కన్య భ్రాతృ పుత్రులకు రెండు రోజుల ఒక రాత్రి అశౌచము. అన్యసపిండులకు మాత్రము తాత్కాలిక శుద్ధి. సజాతీయులతో జన్మ-మరణములందు, కలిసి ఉన్నచో బ్రాహ్మణునకు పది రోజు లలో శుద్ధి. క్షత్రియ, వైశ్య, శూద్రులతో కలసి ఉన్నచో వరుసగ ఆరు,మూడు, ఒక రోజులలో శుద్ధి.

ఈ అశౌచ నియమములన్నియు సపిండులకు మాత్రమే. ఔరసులుకాని పుత్రులు మొదలగువారి విషయమున చెప్పెదను. క్షేత్రజుడు, దత్తుడు మొదలగు పుత్రులును, తనను విడచి మరొకనితో సంబంధము పెట్టుకొనిన స్త్రీ గాని, తన భార్యగా అయిన పర పురుషుని స్త్రీ గాని మరణించినపుడు అశౌచము మూడు రాత్రులు మాత్రమే ఉండును. స్వధర్మమును త్యజించి తనజన్మను వ్యర్థము చేసికొన్నవాడును, వర్ణసంకరజాతుడును, పరివ్రాజకుడు, అశాస్త్రీయ విధానముచే విషాదుల ద్వారా ఆత్మహత్య చేసికొన్నవారును, వీరికి జలాంజలి ఇవ్వవలసిన పనిలేదు. వారికి ఉదక క్రియా నివృత్తి అయిపోయినది. ఒక తల్లికి ఇద్దరు తండ్రుల ద్వారా పుట్టినవారి వలన బంధులకు జాతా శౌచము ఒక రోజు, మృతాశౌచము రెండు రోజులు. ఇంతవరకును సపిండుల అశౌచము చెప్ప బడినది. ఇపుడు సమానోదకుల అశౌచము చెప్పబడుచున్నది. బాలుడు దంతోత్పత్తికి పూర్వమే మరణించినను, దేశాంతరము నందున్న సపిండుడు మరణించినను, అసపిండుని మృత్యువు నందును, సచేల స్నానముచే శుద్ధి. జన్మ మృత్యువులందు సపిండులకు పదిదినములలో శుద్ధి. ఒక కులమునకు చెందిన అసపిండులకు మూడు రాత్రులతో శుద్ధి. సమాన గోత్రు లకు స్నానమాత్రముననే శుద్ధి. ఏడవ తరమునందు సపిండత్వము తొలగును. పదునాల్గవ తరమునందు సమానోదక సంబంధము గూడ తొలగిపోవును. కొందరిమతము ప్రకారము, జన్మ నామముల స్మృతి లేనపుడు సమానోదక సంబంధము తొలగిపోవును. అటుపిమ్మట సగోత్రత్వము మాత్రము మిగులును. పది రోజులు ముగియక ముందే విదేశములో ఉన్న బంధువు మరణవార్త విన్నవాడు మిగిలిన రోజులు మాత్రము అశౌచము పట్టవలెను. దశాహము దాటిన తరువాత తెలిసినచో మూడు రోజులు పట్టవలెను. సంవత్సరము దాటినతరువాత తెలిసినచో జలస్పర్శ మాత్రముచే శుద్ధి. మేనమామ, శిష్యుడు ఋత్విక్కు, బంధువులు మరణించినపుడు ఒకపగలు, ఒక రాత్రి, ఒక పగలు అశౌచము ఉండును. మిత్రుడు, జామాత, దౌహిత్రుడు, మేనల్లుడు, బావమరిది కుమారులు మరణించినపుడు స్నాన మాత్రముచే శుద్ధి. మాతామహి, ఆచార్యుడు, మాతామహుడు మరణించినపుడు మూడుదినములు అశౌచము. దుర్భిక్షము, రాష్ట్రోపద్రవము మొదలగు ఆపదలందు సద్యః కాలశుద్ధి చెప్పబడినది. యజ్ఞము చేయుచున్నవాడు, వ్రతపరాయణుడు, బ్రహ్మచారి, దాత, బ్రహ్మవేత్త-వీరికి తత్కాలమందే శుద్ధి. దానము, యజ్ఞము, దేశోపద్రవము, వివా హము యుద్ధము- వీటియందు సద్యఃశుద్ధి చెప్పబడినది. మహామారి మొదలైన ఉపద్రవములచే మరణించినవారి విషయము నందు గూడ సద్యః కాలాశౌచము. రాజును, గోవును, బ్రాహ్మణుని చంపినవారును అశాస్త్రీయముగా ఆత్మహత్య చేసుకొన్నవారును మరణించినపుడు తత్కాల శుద్ధి చెప్పబడినది.

అసాధ్యములగు వ్యాధులతో బాధపడువాడును, స్వాధ్యాయాసమర్థుడును, అగ్ని యందుగాని, జలమునుగాని ప్రవేశించి మరణించుట ప్రాయశ్చిత్తము. అవమానము, క్రోధము, స్నేహము, పరాభవము, భయము-వీటివలన ఉరిపోసికొనిగాని, మరొక విధముగాగాని ఆత్మహత్య చేసికొన్న

పురుషుడైనను, స్త్రీయైనను, లక్ష సంవత్సరములు అశౌచియైన నరకమునందు నివసించును. శౌచాశౌచాది జ్ఞానముకూడలేని అతి వృద్ధుడు మరణించినచో అశౌచము మూడు రాత్రులే. రెండవ రోజున అస్థి సంచయనము, మూడవ రోజున జలదానము, నాల్గవ రోజున శ్రాద్ధము చేయవలెను. పిడుగు పడి చనిపోయినవారి అశౌచము సపిండులకు మూడు దినములు. పాషండులను ఆశ్ర యించి, పతిఘాతియైన స్త్రీ మరణించినపుడు అశౌచము ఉండదు. ఆమెకు జలాంజలి కూడ ఇవ్వరాదు. పితృ మాత్రాదుల మరణవార్త ఒక సంవత్సరము తరువాత అందినను సచేల స్నానము చేసి, ఉపవసించి, విధిపూర్వకముగ ప్రేతకార్యములు చేయవలెను. అసపిండుని శవము మోసిన వాడు సచేల స్నానము చేసి, అగ్నిని స్పృశించి, నెయ్యి తిన్నచో శుద్ధుడగును. అతడు ఆ కుటుంబము వారి అన్నము తిన్నచో ఆతనికి పది రోజుల తరువాతనే శుద్ధి. ఆ ఇంటివారి అన్నము తినక, ఆ ఇంటిలో నివాసము చేయక ఉన్నచో ఒక్క రోజునకే శుద్ధి. అనాధ బ్రాహ్మణ శవమును మోసిన బ్రాహ్మణులకు అడుగడుగున యజ్ఞఫలము కలుగును. స్నానమాత్రము చేతనే శుద్ధి. శూద్రశవము ననుసరించి వెళ్లిన బ్రాహ్మణునకు మూడు రోజులకు శుద్ధియగును. మరణించినవాని బంధువులతో కలసి విలాసాదులు చేసిన బ్రాహ్మణుడు ఒక పగలు, ఒక రాత్రి, దాన శ్రాద్ధాదులను పరిత్యజించ వలెను. తన ఇంటిలో శూద్రస్త్రీ ప్రసవించినను, శూద్రుడు మరణించినను మూడురోజులలో ఇంటిలోని భాండాదులను పారవేయవలెను. భూమిని అలకవలెను. అపుడు శుద్ధి అగును. సజాతీయులు ఉండగా బ్రాహ్మణ శవమును శూద్రులచే మోయించరాదు. శవమునకు స్నానము చేయించి, నూతన వస్త్రమునుకప్పి, పూవులతో పూజించి శ్మశానమునకు తీసికొని వెళ్లవలెను. నగ్న దేహమునే దహించవలెను. దేహభాగమును కొంచెము గూడ మిగల్చగూడదు.

ఆ సమయమున సగోత్రుడు శవమును ఎత్తి చితిపై ఉంచవలెను. అగ్న్యాధానము చేసిన వానిని యథావిధిగా మూడు అగ్నులతో దహనము చేయవలెను. అగ్న్యాధానము లేక ఉపనయన సంస్కారయుక్తుడైన వానికి ఒక (ఆహవనీయ) అగ్నితోను, సాధారణులను లౌకికాగ్నితోను దహనము చేయవలెను. 'అస్మాత్.....లోకాయ స్వాహా' అను మంత్రము పఠించుచు పుత్రుడు తండ్రి శవము ముఖమున అగ్ని ఉంచవలెను. పిదప ప్రేతయొక్క నామ గోత్రములను ఉచ్చరించుచు బంధువులు ఒక్కొక్కరు జల ప్రదానము చేయవలెను. మాతామహాచార్యాదులు మరణించినపుడు గూడ ఈ విధముగనే జలాంజలి దానము చేయవలెను. మిత్రులకు, వివాహితులగు పుత్రీ–సోదర్యాదులకును, మేనల్లునకును, ఋత్విక్కులకును, మామగారికిని గూడ ఈ విధముగా జలము నిచ్చుట ఇష్టముపై ఆధారపడి ఉండును. పుత్రుడు తండ్రికి పది రోజులపాటు 'అప నః శోశుచత్ అఘమ్' ఇత్యాది మంత్రము పఠించుచు, జలాంజలి ఇవ్వవలెను. బ్రాహ్మణునకు పది, క్షత్రియునకు పదు నొకండు, వైశ్యునకు పదునైదు, శూద్రునకు ముప్పది పిండములు ఇవ్వవలెను. పుత్రుడైనను, పుత్రికయైనను, మరెవ్వరైనను పుత్రుడువలెనే మృతునకు పిండప్రదానము చేయవలెను. దహన సంస్కారము చేసి ఇంటికి తిరిగి వచ్చి, మనస్సు అదుపులో ఉంచుకొని, ద్వారము వద్ద నిలచి, రెండు వేపాకులు నమలి, ఆచమనముచేసి, అగ్నిని, జలమును, గోమయమును, పచ్చని ఆవాలను స్పృశించవలెను. పిదప ముందుగా ఱాతిమీద పాదముంచి మెల్లగా ఇంటిలో ప్రవేశించవలెను. ఆ నాటినుండి

బంధువులు ఉప్పు, మాంసము తిన గూడదు. అందరును భూమిపై శయనించవలెను. స్నానముచేసి మూల్యమిచ్చి కొన్న అన్నము తినవలెను. మొదట దహన సంస్కారము చేసినవాడు పది దినముల వరకును కర్మ చేయవలెను. అధికారము గలవారు లేని పక్షమున బ్రహ్మచారియే పిండదానము, జలాంజలి దానము చేయవలెను. సపిండులకు ఈ విధముగ మరణాశౌచము వచ్చినట్లే జాతా శౌచము కూడ వచ్చును. మరణాశౌచము సపిండులందరికిని వచ్చును. జాతా శౌచముచే కలుగు అస్పృశ్యత్యము విశేషముగా తల్లి దండ్రులకు మాత్రమే వచ్చును. వారిలో కూడ తల్లికే విశేషముగ అశౌచ ముండును. తండ్రి స్నానము చేయుటచే స్పర్శయోగ్యుడు అగును, పుత్రజన్మ దివసమున తప్పక శ్రాద్ధము చేయవలెను. ఆ దినము శ్రాద్ధ దానములు, గో, సువర్ణ, వస్త్రాది దానములు చేయుట మంచిది.

మరణాశౌచము మరణాశౌచముతోను, సూతకాశౌచము సూతకముతోను తొలగును. మొదటి అశౌచముతో రెండవ అశౌచమునకు శుద్ధియగును. జన్మాశౌచము నందు మరణ అశౌచమైనను, మరణ అశౌచమున జన్మాశౌచమైనను, మరణాశౌచములో జన్మాశౌచము నివర్తించినట్లు గ్రహించి శుద్ధి చేసికొనవలెను. జన్మాశౌచముతో మరణా శౌచము తొలగదు. రెండు సమానమైన అశౌచములే అయినపుడు మొదటిదానితో రెండవ దానిని సమాప్తము చేసికొనవలెను. ఇది ధర్మరాజు చెప్పిన ధర్మము. ఒక మరణాశౌచము లోపల రెండవ మరణాశౌచము వచ్చినప్పుడు రెండవది మొదటి దానితో అంతమగును. గురువైన అశౌచముతో లఘువైన అశౌచము బాధితమగునుగాని, లఘ్వాశౌచముచే గుర్వాశౌచము బాధితముకాదు. మృతకాశౌచము లేదా సూతకాశౌచము చివరి రాత్రి మధ్య రెండవ అశౌచము వచ్చినచో మిగిలిన భాగముతోనే రెండవది పూర్తిగా నివృత్తమైపోవును గాన సపిండులు అందరికిని శుద్ధి అగును. రాత్రి చివరి భాగమున అశౌచము వచ్చినచో మిగి లిన భాగముతోనే రెండవది పూర్తిగా నివృత్తమైపోవునుగాన సపిండులందరికిని శుద్ధి యగును. రాత్రి చివరి భాగమున రెండవ అశౌచము వచ్చినచో మరి రెండు రోజుల తరువాత అశౌచము నివర్తించును. చివరిరాత్రి గడచిపోయి చివరి దినమున ప్రాతఃకాలము మరియొక్క అశౌచము వచ్చినచో మరి మూడు రోజుల తరువాత సపిండులకు శుద్ధియగును. రెండు విధములైన అశౌచములందును ఆ కుటుంబ మువారి అన్నము తినగూడదు. అశౌచమున దానాద్యధికారము కూడ ఉండదు. అశౌచ సమయమున ఇతరుల ఇంట భోజనము చేసినచో ప్రాయశ్చిత్తము చేసికొనవలెను. తెలియక భోజనము చేసినచో పాపము రాదు. తెలిసి తిన్నవానికి ఒక దినము అశౌచము ప్రాప్తించును.(158)

అసంస్కృత అశౌచమ్

పుష్కరుడు చెప్పెను–

మరణించినవానికి సంస్కారము జరిగినను జరుగకపోయినను, శ్రీహరినామ స్మరణ చేసినచో వానికి స్వర్గమోక్షములు రెండును లభించును. మృతుని అస్థులను గంగలో పడవేయుటచే ఆతనికి అభ్యుదయము కలుగును. తన అస్థులు గంగలో ఎంత కాలము ఉండునో అంతకాలము మానవుడు స్వర్గములో ఉండును. ఆత్మహత్యచేసికొన్న వానికిని, పతితునకును పిండోదక క్రియ లేకున్నను వాని అస్థులను గంగలో పడవేసినచో వానికి మంచి కలుగును. వానికై ఇచ్చిన అన్న జలములు

ఆకాశములో లీనమైపోవును. పతితుడగు వాని ప్రేతను ఉద్దేశించి మహానుగ్రహ బుద్ధితో నారాయణబలి ఇవ్వవలెను. వానికి నారాయణా నుగ్రహము లభించును. కమలలోచనుడగు శ్రీహరి వినాశ రహితుడు. అందుచే ఆతని కర్పించినది వినాశరహితమై యుండును. పతితులై బోవనున్న జీవులకు భోగ మోక్షముల నిచ్చు ఏకైక ప్రభువు శ్రీమహావిష్ణువు. 'జగత్తులో ఉన్న వారందరును ఏదో ఒక రోజున మరణింపవలసిన వారే' అను విషయమును గుర్తించి, తనకు నిజముగ సహాయముగా నిలువబోవు ధర్మమును ఆచరించవలెను. యమలోక మార్గము ప్రతి ఒక్కరికిని వేరువేరుగా నుండును. జీవుడు ఎచటికి వెళ్ళినను ఆతనితో కూడ కలిసి వెళ్ళు ఏకైక సహాయము ధర్మమే. రేపు చేయవలసిన పని ఈ రోజునే చేయవలెను. మధ్యాహ్నమున చేయవలసినపని పూర్వాహ్ణము నందే చేయవలెను. ఏలనన ఈతడు చేయవలసిన పని పూర్తియైనదా లేదా అని మృత్యువు నిరీక్షించదు. మనుష్యుడు పొలములు, ఆవణములు, గృహములు మొదలగు వాటియందు ఆసక్తుడై మనస్సంతయు మరొక వైపున ఉండి ఉండగా ఏమరి ఉన్న గొర్రెను ఆడతోడేలువచ్చి తన్నుకొని పోయినట్లు మృత్యువు తీసికొని పోవును. కాలమునకు ఇష్టుడుగాని, అనిష్టుడు గాని లేడు. ఆయుర్దాయము, ప్రారబ్ధకర్మ పూర్తియైన వెంటనే మృత్యువు హఠాత్తుగావచ్చి జీవుని ఎత్తికొని పోవును. కాలము రాని వానిని వందల కొలది బాణములతో కొట్టినను మరణించడు. కాలము వచ్చిన వానిని కుశాగ్రముతో ముట్టిననువాడు మరణించును. మృత్యుగ్రస్తుని ఔషధములు గాని, మంత్రాదులు గాని రక్షింపజాలవు. లేగదూడ సరిగా తన తల్లి దగ్గరకే వెళ్ళినట్లు పూర్వజన్మ కృత మైన కర్మకర్తను అనుసరించును. ఈ జగత్తు యొక్క ఆది అవ్యక్తము. అంతముకూడ అవ్యక్తమే. కేవలము మధ్యయే వ్యక్తము. శరీరము నందు కౌమార, యౌవనాద్యవస్థలు వచ్చిన విధము ననే మరొక శరీరముకూడ వచ్చును. నూతన వస్త్రమును ధరించిన విధముగ జీవుడు వెను కటి శరీరమును విడచి క్రొత్త శరీరమును పొందును. జీవుడు సర్వదా అవధ్యుడు. వాడు ఎన్నడును మరణించడు. అందుచే మృత్యువును గూర్చి శోకమును విడువవలెను. (159)

వానప్రస్థ ధర్మములు

పుష్కరుడు చెప్పెను :

ఇపుడు వానప్రస్థాశ్రమ ధర్మములు చెప్పెదను; వినుము. జటలు ధరించుట, అగ్ని హోత్రము చేయుట, నేలపై పండుకొనుట, మృగాజినమును ధరించుట, వనములో నివసిం చుచు, పాలు, దుంపలు, అడవి ధాన్యము, ఫలములు ఆహారముగా గొనుట, ప్రతి గ్రహము నుండి విరమించుట త్రిషవణ స్నానము, బ్రహ్మ చర్యము, దేవాతిథి పూజ – ఇది వానప్రస్థుని ధర్మము. పౌత్రుడు జనించిన వెంటనే గృహస్థుడు అరణ్యమునకు పోవలెను. అచట ఒంటరిగా గాని, భార్యాసమేతుడుగా గాని, ఆయుర్దాయము నందలి మూడవవంతు గడపవలెను. శరీరబలము ఉన్నంతవరకును గ్రీష్మము నందు పంచాగ్ని మధ్య తపస్సు చేయవలెను. వర్షాకాలమునందు ఆరుబైటను, హేమంతము నందు తడిబట్టలు ధరించియు ఉగ్రమైన తపస్సు చేయవలెను. వెనుకకు మరలక, అవక్రగతియై ముందుకే పోవలెను. అనగా మరల గృహస్థాశ్రమమునకు రాకుండ సన్యాసాశ్రమమునే గ్రహించుటకై ప్రయత్నించవలెను. (160)

యతిధర్మ నిరూపణము

పుష్కరుడు పలికెను :

జ్ఞాన మోక్షాది ప్రదర్శకమగు యతి ధర్మమును చెప్పెదను. ఆయుర్దాయములోని నాల్గవ భాగములోనికిరాగానే సన్యసించవలెను. ధీరుడు ఏ రోజున వైరాగ్యము కలుగునో ఆ రోజునే సన్యసించవలెను. సర్వవేద సదక్షిణమగు ప్రాజాపత్యేష్టి నిర్వర్తించి, అగ్నులను తనలోనే ఆరోపించుకొని బ్రాహ్మణుడు గృహమునుండి నిష్క్రమించవలెను. ఒంటరిగానే సంచరించవలెను. అన్నముకొరకు మాత్రము గ్రామములోనికి ప్రవేశించవలెను. సన్యాసి ఏదివచ్చినను ఉపేక్షాబుద్ధితో చూచుచు, ధనాదికమును కూడబెట్టక, జ్ఞానసమన్వితుడై ఉండవలెను. చేత కపాలము, వృక్షమూల నివాసము, మాసిన వస్త్రము, ఏకాకిత్వము, సర్వసమ దృష్టి-ఇవి ముక్తుని లక్షణములు. మరణమును అభినం దించగూడదు; జీవన మునుగూడ అభినందించగూడదు. భృత్యుడు ప్రభ్వాజ్ఞకై ఎదురు చూచుచున్నట్లు కాలమునకై ఎదురు చూచుచుండవలెను. క్రింద చూచుకొని అడుగుపెట్టవలెను. వస్త్రముతో వడబోసిన నీరు త్రాగవలెను. సత్యముచే పవిత్రమైన మాటలే పలకవలెను. మనస్సుచేత పవిత్రమైన దానిని ఆచరించవలెను. ఆనపకాయ బుర్ర, దారుపాత్ర, మట్టిపాత్ర, వెదురుపాత్ర-ఇవి సన్యాసికి విధింపబడినవి. యతీశ్వరుడు ఎల్లపుడును గ్రామములోని ఇండ్లలో ధూమము శాంతించిన పిమ్మటను, రోకళ్ళు ఆగిపోయినపుడును, నిప్పులు ఆర్పివేయబడిన పిమ్మటను, జనులందరును భోజనము చేసిన పిమ్మటను, పాత్రలు కడిగివేసిన పిమ్మటను భిక్షకు బైలుదేరవలెను. మాధుకరము (అనేక గృహములనుండి కొంచెము కొంచెము సంగ్రహింప బడినది), అసంక్లప్తము (ముందుగా అనుకొని తయారుచేయబడనిది), ప్రాక్ప్రణీతము (ముందుగా తయారుచేయబడినది) అయాచితము, (అడగకనే లభించునది) తాత్కాలికోప పన్నము (అప్పటికప్పుడు లభించినది)అని భైక్షము ఐదు విధములు. హస్తములే పాత్రగా ఉపయోగించవలెను. లేదా మరియొక పాత్ర నుండి హస్త పాత్రలోనికి తీసికొనవలెను. కర్మ దోషముల వలన ప్రాణులు ఏ ఏ విధముల బాధపడుచున్నారో గమనించవలెను. ఏ ఆశ్రమములో ఉన్నను మానవుడు పరిశుద్ధ చిత్తముతో ధర్మాచరణము చేయవలెను; అన్ని భూతములందును సమదృష్టి చూపవలెను. అంతియేకాని ఆశ్రమ లింగములను ధరించినంత మాత్రమున ప్రయోజనము లేదు. కతక వృక్షఫలము (ఇందుపకాయ) నీటిలోని బురదను తొలగించి దానిని నిర్మలము చేయునను మాట నిజమే; కాని దాని పేరు చెప్పినంత మాత్రమున నీరు ప్రస న్నము కాదు కదా? అజ్ఞాన వశముచే సంసారములో చిక్కుకొనిన ద్విజుడు కుంటివాడైనను, గ్రుడ్డివాడైనను, చెవిటివాడైనను, కుటిలత్వములేని సన్యాసి యైనచో-సత్కర్మల నుండియు, అసత్కర్మల నుండియు విముక్తు డగును. సన్యాసి పగటియందును, రాత్రియందును తనచే చంపబడిన ప్రాణుల విశుద్ధికై స్నానము చేసి ఆరు ప్రాణాయామములు చేయవలెను. ఎముకలనెడు స్తంభములుగల దియు, నాడులతో కూడినదియు, మాంస, శోణితములచే పూయ బడినదియు, చర్మముచే కప్ప బడినదియు, మూత్రపురీష దుర్గంధముతో నిండినదియు, జరాశోకములతో కూడి నదియు, అనిత్యమును, జీవునికి నివాసమగు ఈ శరీరమును త్యజించవలెను.

స్థైర్యము, ఓర్పు, మనోనిగ్రహము, పరధనాపహారము చేయకుండుట, ఇంద్రియ నిగ్రహము సిగ్గు, జ్ఞానము, సత్యము, అక్రోధము ఈ పదియు ధర్మ లక్షణములు. కుటీచకుడు, బహూదకుడు, హంస, పరమహంస అని సన్న్యాసులు నాలుగు విధములు. వీరిలో ఉత్తరోత్తరుడు ఉత్తముడు. ఏకదండియైనను, త్రిదండియైనను యోగి బంధనముల నుండి విముక్తుడగును. అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము, ఈ ఐదును యమములు. శౌచము, సంతోషము, అగర్భము అని ప్రాణాయామము రెండు విధములు. జపధ్యానాదులు కలిసినది సగర్భము. మరల ఆ రెండును ఒక్కొక్కటి పూరకము, కుంభకము, రేచకము అని మూడేసి విధములు. వాయువు నింపుట పూరకము; బంధించినచో కుంభకము. విడచుట రేచకము. ప్రాణాయామము-ద్వాదశ మాత్రకము, చతుర్వింశన్మాత్రకము అని మరల మూడేసి విధములు. తాళము, లేదా లఘు అక్షరము ఒకమాత్ర. ప్రాణాయామ సమయమున ఓం కారాదులను మెల్లగా జపించవలెను. ఇంద్రియ సంయమము ప్రత్యాహారము. జపము చేయు సాధకులు ఈశ్వరుని స్మరించుట ధ్యానము. మనస్సును స్థిరముగా నిలుపుట ధారణ. బ్రహ్మయందు స్థితి సమాధి. ఈ ఆత్మయే పరమాత్మ. ఆత్మ సత్యము జ్ఞానరూపము, అనంతము, విజ్ఞానము, ఆనంద రూపము. ఇదియే బ్రహ్మ. నీవు ఆ బ్రహ్మయే. నేను ఆ బ్రహ్మనే. పరబ్రహ్మ జ్యోతిరూపము. అదియే ఆత్మ. వామ(సు) దేవుడు, నిత్య యుక్తము ఓంకార రూపము. దేహేంద్రియ మనోబుద్ధి ప్రాణ అహంకార శూన్యమైనది. ఈ బ్రహ్మజాగ్రత్, స్వప్న, సుషుప్త్యాది ముక్తమైనది. అందుచే తురీయము, నిత్యము, శుద్ధము, జ్ఞానరూపము, ముక్తము, సత్యము, ఆనందము, అద్వితీయము, పరజ్యోతియు, అక్షరము, సర్వ వ్యాప్తము, హరియగు బ్రహ్మయే నేను. ఆది త్యునిలో ఉన్న అఖండ పురుషుడు నేను. మనుష్యుడు సర్వ కర్మలను పరిత్యజించి సుఖ దుఃఖములందు సముడై ఓర్పు కలవాడై, భావమునందు పరిశుద్ధుడై, బ్రహ్మాండమును భేదించుకొని బ్రహ్మయగును. ఆషాఢ పౌర్ణమాసియందు చాతుర్మాస్యవ్రతము ప్రారంభించి చేయవలెను. కార్తిక శుక్ల నవమి మొదలు సంచారము చేయవలెను. ఋతుసంధి దివసము లందు ముండనము చేయించుకొనవలెను. సన్న్యాసులకు ధ్యాన-ప్రాణాయామములే ప్రాయశ్చిత్తము. (161)

ధర్మశాస్త్ర నిరూపణము

పుష్కరుడు చెప్పెను :

మనువు, విష్ణువు, యాజ్ఞవల్క్యుడు, హారీతుడు, అత్రి, యముడు, అంగిరసుడు, వసిష్ఠుడు, దక్షుడు, సంవర్తుడు, శాతాతపుడు, పరాశరుడు, ఆపస్తంబుడు, ఉశనస్సు, వ్యాసుడు, కాత్యాయనుడు, బృహస్పతి, గోతముడు, శంఖ లిఖితులు - వీరు చెప్పిన విధముగ భుక్తి ముక్తిప్రదమగు ధర్మము ప్రవృత్తము. జ్ఞానపూర్వకమగు కర్మ నివృత్తము. వేదా భ్యాసము, తపస్సు, జ్ఞానము, ఇంద్రియ సంయమము, అహింస, పూజ్యుల సేవ ఇవి నిశ్శ్రేయసకరములు. వీటి అన్నింటి కంటెను ఆత్మ జ్ఞానము శ్రేష్ఠము. అది అన్ని విద్యలలో ఉత్తమము. దానివలన మోక్షము లభించును. తనను సర్వభూతములందును, సర్వభూతములను తనయందును చూచు ఆత్మజ్ఞానము కలవాడు స్వారాజ్య మును పొందును. ఆత్మ జ్ఞానము సమముగ నుండునట్లు చేసికొని, వేదాభ్యాసమునందు ప్రయత్నము

కలవాడు కావలెను. ఇది ద్విజులందరికిని సామర్థ్యమును పెంపొందించునది. బ్రాహ్మణులకు విశేషముగ సామర్థ్యవర్ధకము. వేదశాస్త్రార్థతత్త్వము తెలిసినవాడు ఏ ఆశ్రమము నందున్నను, ఈ లోకమునందే బ్రహ్మత్వమును పొంద సమర్థుడగును. శ్రావణ పూర్ణిమనాడు గాని, శ్రవణ నక్షత్ర యుక్తదినమునగాని, హస్త నక్షత్ర యుక్త శ్రావణశుక్ల పంచమినాడు గాని, తమ శాఖకు సంబంధించిన గృహ్య సూత్రము ప్రకారము నియమపూర్వకముగా వేదాధ్యయన ప్రారంభము చేయవలెను. పౌష్యమాసమున రోహిణీ నక్షత్రమునందు గాని, అష్టక తిథియందు గాని నగరము లేదా గ్రామము వెలుపల జలసమీపమున వేదాధ్యయ నోత్సర్గము చేయవలెను.

శిష్యుడు, ఋత్విక్కు గురువులు, బంధువులు మరణించినపుడు మూడు దినములు అధ్యయనము మానివేయవలెను. ఉపాకర్మ–ఉత్సర్జన దినములు మొదలు మూడు దిన ములు అధ్యయనము చేయరాదు. తన వేదశాఖకు చెందిన వేదాధ్యేత మరణించినపుడు కూడ అట్లే. సంధ్యాకాలమునందు, ఉరుముచున్నపుడు, ఉత్పాతసూచకములగు ధ్వనులు వినబడినప్పుడు, భూకంపమునందు, ఉల్కా నిపాతనము నందు, వేదాధ్యయన సమాప్తి చేసిన పిమ్మటను, ఆరణ్యకమును చదివిన పిమ్మటను ఒక రాత్రి అనధ్యయనము. పూర్ణిమ, చతుర్దశి, అష్టమి, రాహు గ్రహణము, ఋతు సంధులు, శ్రాద్ధాన్న భోజనము చేసినపుడు శ్రాద్ధదానము పట్టినపుడును ఒక దినము అనధ్యాయము. స్వాధ్యాయము చేయువారి మధ్య నుండి చెవులపిల్లి, కప్ప, ముంగిస, కుక్క, సర్పము, పిల్లి, పంది వెళ్ళినచో ఒక దినము అనధ్యయనము. ఇంద్ర ధ్వజమును దింపిన దినమునను, ఎత్తిన దినమునందును, అనధ్యయనము, కుక్క, నక్క, గాడిద, గుడ్లగూబ వీటి అరుపులు వినబడినపుడు, సామ గానము వినబడినప్పుడును, బాణధ్వని, ఆర్తధ్వని వినబడినపుడును, అపవిత్ర వస్తువు, శవము, శూద్రుడు, అంత్యజుడు, శ్మశానము, పతితుడు మొదలగువారి సాన్నిధ్యము నందును, అశుభ తారలందును, మాటి మాటికి మెరపులు మెరయుచున్నప్పుడును, తాత్కాలిక అనధ్యాయము. భోజనానంతరము తడిచేతులతో అధ్యయనము చేయకూడదు. జలములోపల, అర్ధరాత్రము నందును, దుమ్ము పడుచున్నపుడును, పెనుగాలులు వీచుచున్న పుడును, దిగ్దాహ సమయమునందును, సంధ్యలందును, మంచు వర్షించు చున్నపుడును, భయ సమయములందును అధ్యయనము చేయరాదు. పరుగెత్తుచు అధ్యయనము చేయరాదు. ఏదైన ప్రాణి బాధపడుచున్నపు డును, శిష్యులు ఇంటికి వచ్చినపుడును అధ్యయనము చేయరాదు. గాడిద, ఒంటె, రథము మొదలగు వాహనములు ఎక్కినపుడును, ఏనుగు, గుఱ్ఱము, నావ, వృక్షము మొదలైన వాటిని ఎక్కినపుడు, మరు భూమియందును, అధ్యయనము చేయరాదు. ఈ ముప్పదియైదును తాత్కాలిక అనధ్యయన కాలములు. (162)

శ్రాద్ధకల్ప వర్ణనము

పుష్కరుడు చెప్పెను :

ఇపుడు భుక్తిముక్తి ప్రదమగు శ్రాద్ధ కల్పమును గూర్చి చెప్పెదను. సావధానముగా వినుము. శ్రాద్ధకర్త మనస్సును, ఇంద్రియములను వశమునందుంచుకొని పవిత్రుడై ఒక రోజు ముందుగా

బ్రాహ్మణులను నిమంత్రించవలెను. శ్రాద్ధదివసమున, అపరాహ్ణ కాలమునందు వచ్చిన ఆ బ్రాహ్మణులను స్వాగతాదులచే పూజించవలెను. వారిని పీఠముపై కూర్చుండబెట్టవలెను. దైవస్థాన మున సరిసంఖ్య కలవారిని, పితృస్థానమునందు బేసి సంఖ్య కలవారిని కూర్చుండబెట్టవలెను. దైవస్థానమున ప్రాఙ్ముఖముగ కూర్చుండబెట్ట వలెను. పితృస్థానమునందు ఒకరిని లేదా ముగ్గురిని కూర్చుండబెట్టవలెను. లేదా రెండింటి యందును ఒక్కరొక్కరే ఉండవచ్చును. మాతామహశ్రాద్ధము నందు గూడ ఇట్లే; పాణి ప్రక్షాళన ఉదకమును, ఆసనముకొరకై కుశలను ఇచ్చి, అనుజ్ఞపొంది 'విశ్వేదేవాసః' ఇత్యాది మంత్రముచే ఆవాహనముచేసి, సపవిత్రమగు పాత్రయందు యవలు చల్లి 'శం నోదేవీః' అను మంత్రముచే నీళ్లుపోసి, 'యవోసి' అను మంత్రముచే యవలు చల్లి, 'యా దివ్యా ఆపః' అను మంత్రముచే హస్తమునందు అర్ఘ్యము ఇవ్వవలెను. పిదప ఉదకమును, గంధ మాల్యములను, ధూప దీపములను ఇవ్వవలెను. పిదప అపసవ్యము చేసుకొని పితృ దేవతలకు అప్రదక్షిణముగా ద్విగుణములగు కుశలను ఆసనముగా ఇచ్చి, 'ఉశన్తస్త్వా' అను మంత్రముచే ఆ పితృ దేవతల ఆవాహనముచేసి, అనుజ్ఞ పొందినవాడై, 'ఆ యాన్తు నః' అను మంత్రము జపించ వలెను. ఇచట యవలకు బదులు తిలలు వాడవలెను. అర్ఘ్యాదికమును వెనుకటివలెనే ఇచ్చి, సంస్రవమును (కారిన జలమును) పితృ పాత్రమునందు గ్రహించి దానిని 'పితృభ్యః స్థానమసి' అని చెప్పుచు అధోముఖము చేయవలెను. 'అగ్నౌ కరిష్యే' అని చెప్పి కురుష్వ అని అనుజ్ఞపొంది, ఘృతమిశ్రితమగు అన్నము గ్రహించి, పితృయజ్ఞమునందువలె అగ్నిలో హోమముచేసి, హోమము చేయగా మిగిలిన అన్నమును పాత్రలలో ఉంచవలెను. లభ్యమగు పాత్రలలో-విశేషించి రజత పాత్రలలో-అన్నము ఉంచి, 'పృథివీ తే పాత్రమ్' ఇత్యాది మంత్రముచే పాత్రాభిమంత్రణ చేయవలెను.

'ఇదం విష్ణుః' అను మంత్రముచేత ద్విజుని అంగుష్ఠము అన్నమునందు ఉంచవలెను. వ్యాహృ తులతో గూడిన గాయత్రిని, మధువాతాః ఇత్యాది ఋక్త్రయమును జపించి 'సుఖముగా భుజించండి' అని చెప్పవలెను. వారు కూడ మౌనముతో భుజింపవలెను. వారికి ఇష్టము, హవిర్యోగ్యము అయిన అన్నము వడ్డించవలెను. పవిత్ర మంత్రము జపించి అన్నమును గ్రహించి, 'తృప్తి చెందినారా?' అని ప్రశ్నించి 'తృప్తి చెందితిమి' అని వారు సమాధానము చెప్పవలెను. వారు తినగా మిగిలిన అన్నమును భూమిపై చల్లి ఒక్కొక్క పర్యాయము ఉదకము ఇవ్వవలెను. ఆ అన్నమునంతను గ్రహించి, దక్షిణాభి ముఖుడై, ఉచ్ఛిష్ట సమీపమున పితృ యజ్ఞమునందువలె పిండ ప్రదానము చేయవలెను. మాతా మహులకు కూడ ఇట్లే చేయవలెను. పిదప ఆచమనము ఇచ్చి, స్వస్తి వాచనము చేయవలెను. అక్షయ్యోదకము ఇవ్వవలెను. యథాశక్తిగా దక్షిణ సమర్పించి 'వాచ్యతామ్' అని అనుజ్ఞపొంది స్వధా అని పలుకవలెను. 'అస్తు స్వధా' అని చెప్పగా పిదప జలమును భూమిపై విడువ వలెను. 'ప్రీయన్తాం విశ్వే దేవాః' అని అనుచు దేవస్థానమున ఉదకము ఇవ్వవలెను. 'మాలో దాతలు వృద్ధి పొందుదురుగాక! వేదములు, సంతానము కూడ వృద్ధి పొందుగాక! మాశ్రద్ధ కూడ తగ్గకుండుగాక! మావద్ద ఇతరులకు ఇచ్చుటకు అధిక ధనాదికము ఉండుగాక! ఈ విధముగ ప్రియవాక్కులు పలుకుచు నమస్కరించి విసర్జిం చవలెను. ముందుగా 'వాజే వాజే' ఇత్యాది మంత్ర ముతో పితృ దేవతా విసర్జనము చేయవలెను. పూర్వము సంస్రవములు పడిన అర్ఘ్యపాత్రలను ఉత్తానముచేసి బ్రాహ్మణులను పంపివేయవలెను.

బ్రాహ్మణులను ప్రదక్షిణ క్రమమున కొంతదూరము అనుసరించి వెళ్లి మరల వచ్చి పితృ దేవ భుక్త శేషమును భుజించి, ఆ రాత్రి తాను, బ్రాహ్మణులతో గూడ బ్రహ్మచారిగా ఉండవలెను. ఇదేవిధముగ పుత్రజన్మాది వృద్ధి సమయములందు ప్రదక్షిణావృత్తిచే నాందీముఖ పితృ దేవతలను పూజించవలెను. పెరుగు కర్కంధూఫలము కలిసిన అన్న ముతో పిండదానముచేసి, తిలస్థానమున యవలను ఉపయోగించవలెను. ఏకోద్దిష్ట శ్రాద్ధమున విశ్వేదేవపూజ ఉండదు. ఒకే అర్ఘ్యపాత్ర, ఒకే పవిత్రము ఉండును. ఆవా హనము, అగ్నౌకరణము ఉండదు. యజ్ఞోపవీతమును అపసవ్యముగా చేసికొని అన్ని కార్యములు చేయబడును. 'అక్షయ్యమస్తు' అనుటకు బదులు 'ఉపతిష్ఠతామ్' అని చెప్ప వలెను. 'వాజే వాజే' ఇత్యాది మంత్రముతో బ్రాహ్మణ విసర్జన చేయునపుడు 'అభిరమ్యతామ్' అని చెప్పగా, వారు 'అభిరతా ః స్మః' అని పలుకుదురు. సపిండీకరణ శ్రాద్ధమునందు వెనుక చెప్పిన విధముగ అర్ఘ్యసిద్ధి కొరకై గంధ, జల, తిలయుక్తములు అగు నాలుగు అర్ఘ్యపాత్రలు చేసికొనవలెను. ప్రేతపాత్ర జలములు పితృపాత్రవనందు పోయవలెను. ఆ సమయమునందు 'యే సమానాః' ఇత్యాది మంత్రద్వయమును పఠించవలెను. మిగిలిన క్రియాకలాపము వెనుకటివలెనే. ఈ సపిండీ కరణ ఏకోద్దిష్ట, శ్రాద్ధములు తల్లికి గూడ చేయవలెను. సపిండీకరణము సంవత్సరమునకు ముందు గానే చేసివేసినవాని నిమిత్తమై సంవత్సరము పాటు, ఉదకుంభ సహిత అన్నమును ఇవ్వవలెను. ఒక సంవ త్సరముపాటు ప్రతిమాసమునందును ఒక పర్యాయము క్షయాహతిథియందు ఏకోద్దిష్టము చేయుట ఉచితము. మొదటి ఏకోద్దిష్టము పదకొండవ దినమునందు చేయబడును. శ్రాద్ధము నందు హవిష్యాన్నమును ఇచ్చుటచే ఒకమాసము వరకును, పాయసము నిచ్చుటచే సంవత్సరము వరకును పితృ దేవతలకు తృప్తి కలుగును. మత్స్య, హరిణ, ఉరభ్ర, శకుని, ఛాగ, పృషత, ఐణ, రురు, వరాహ, శశ మాంసములు ఇచ్చినచో పితామహులకు వరుసగా ఒక్కొక్క మాసము అధికముగ తృప్తికలుగును. ఖడ్గమృగ మాంసము, మహాశల్క మాంసము, మధు యుక్తాన్నము, లోహ మాంసము, కాలశాకము, వార్ధీణస మాంసము, గయాదత్తము–ఇవి అన్నియు అనంత తృప్తిని ఇచ్చును. భాద్రపద కృష్ణ త్రయోదశి యందు విశేషించి మఘా నక్షత్ర యోగమున పితృ దేవతలకు ఇచ్చినది అక్షయమగును. శ్రాద్ధము చేసినవాడు సర్వదా రూపశీలవతియైన కన్యను, సంతానమును, స్తోత్ర పాఠకులను, మంచి పశువులను, సుతులను, నెయ్యి, కృషి, వాణిజ్యము, రెండు డెక్కల జంతు వులను, ఒక శఫముగల జంతువులను, బ్రహ్మవర్చస్సుగల పుత్రులను, స్వర్గమును, వెండిని, కుప్య మును, జ్ఞాతులలో శ్రేష్ఠత్వమును, సర్వ కామములను పొందును.

చతుర్దశితప్ప, ప్రతిపత్తు మొదలు పదునైదు తిథులందు, శస్త్రహతులకు శ్రాద్ధము చేయబడును. కృత్తిక మొదలు భరణి వరకును యథాశాస్త్రముగ శ్రాద్ధమును ఇచ్చువాడు స్వర్గమును, సంతానమును, తేజస్సును, శౌర్యమును, సుతులను, పుత్రులను, వాణిజ్యమును, ప్రభుత్వము, ఆరోగ్యమును, యశస్సును, శోక వినాశనమును, పరమగతిని, ధనమును, విద్యను, వైద్యసిద్ధిని, వెండిని, గోవులను, గొఱ్ఱెలను, అశ్వములను, ఆయుస్సును పొందును. శ్రాద్ధముచేత తర్పితులై వసురుద్ర ఆదిత్య రూపులైన శ్రాద్ధ దేవతలైన పితృ దేవతలు, మనుష్యుల పితరులను సంతోషింపచేయుదురు. సంతసించిన పితామహులు మనుష్యులకు ఆయుః ప్రజా, ధన, విద్యలను, స్వర్గ, మోక్ష, సుఖములను రాజ్యమును ఇత్తురు. (163)

నవగ్రహహోమ నిరూపణము

లక్ష్మిని కోరువాడును, శాంతికాముడును, వృష్టి, ఆయుర్దాయ, పుష్టులు కోరువాడును లేదా అభిచార ప్రక్రియ ప్రారంభించనున్నవాడును గ్రహపూజ ప్రారంభించవలెను. సూర్యుడు, చంద్రుడు, కుజుడు, బుధుడు, బృహస్పతి, శుక్రుడు, శని, రాహువు, కేతువు అని గ్రహములు. ఈ గ్రహముల మూర్తులను క్రమముగ రాగి, స్ఫటికము, రక్త చందనము, స్వర్ణము (బుధ గురువులు), రజతము, ఇనుము, సీసము (రాహు కేతువులు) – వీటితో నిర్మించవలెను. లేదా ఆయా గ్రహముల రంగులతో వ్రాసిగాని, గంధ మండలములపైగాని పూజించవలెను. వారివారి రంగులను అనుసరించి వస్త్రములు, పుష్పములు, గంధములు, బలులు ఇవ్వవలెను. గుగ్గులు ధూపము ఈయవలెను. ప్రతి గ్రహమునకును మంత్ర పూతము లైన చరువులు ఇవ్వవలెను. ఈ గ్రహములకు వరుసగా 'ఆకృష్ణేన.....', 'ఇమం దేవా.....' 'అగ్ని ర్మూర్ధా దివః కకుత్.....' 'ఉద్బుధ్యస్వ.....' 'బృహస్పతే అతి యదర్యః.....', అన్నాత్పరిస్రుతః.....', 'శన్నో దేవీః.....', 'కేతుం కృణ్వన్ని మాన్.....' అను మంత్రములు వినియోగించవలెను. ఈ గ్రహములకు క్రమముగ–అర్కము, పలాశ, ఖదిర, అపామార్గ, పిప్పల ఉదుంబర, శమీ, దూర్వా, కుశలు సమిధలు. ఒక్కొక్క గ్రహమునకు ఈ సమిధలు నూట ఎనిమిదిగాని, నూట ఇరువది గాని, మధు, ఆజ్య, దధులతో హోమము చేయవలెను. ఈ గ్రహములను ఉద్దేశించి బ్రాహ్మణులకు భోజనమునందు వరుసగా బెల్లముతో వండిన అన్నము, పాయసము, హవిష్యము, క్షీర యష్టికము, దధ్యోదనము, హవిస్సు, అపూప ములు, మాంసము, చిత్రాన్నము ఇవ్వవలెను. వారిని యథాశక్తిగా, యథాలాభముగా సత్కరించవలెను. ఈ గ్రహములను ఉద్దేశించి క్రమముగా ఈయదగిన దక్షిణలు–ధేనువు, శంఖము, ఎద్దు, సువర్ణము, వస్త్రము, అశ్వము, కపిల ధేనువు, మేక. ఏ గ్రహము ఎవనికి దుష్ట స్థానాదుల నుండుటచే అపకారిగా నుండునో అతడు ఆ గ్రహమును పూజించవలెను, 'మిమ్ములను ఎవరు పూజింతురో వారిని మీరు పూజించవలెను 'రక్షించవలెను' అని బ్రహ్మ ఈ గ్రహములకు వరములు ఇచ్చెను. రాజుల ఉన్నతి పతనము కూడ గ్రహాధీన మైనది. జగత్తు యొక్క స్థితిలయములు గూడ వీటిపై ఆధారపడి ఉన్నవి. అందుచే గ్రహములు చాల పూజింపదగినవి. (164)

నానాధర్మ వర్ణనము

అగ్నిదేవుడు చెప్పెను :

సర్వ శక్తుడైన ఏ పరమాత్మ హృదయము నందు దీపమువలె ప్రకాశించుచున్నాడో ఆ పరమాత్మను అన్యవిషయముల సంబంధములేని మనో, బుద్ధి, స్మృతులతో ధ్యానించవలెను. అట్లు ధ్యానముచేయు బ్రాహ్మణునకే ఆవు నెయ్యి, పెరుగు, పాలు మొదలగు పదార్థములను శ్రాద్ధము నిమిత్తము దానము చేయవలెను. ప్రియంగు, మసూరము, వంకాయ, కొఱ్ఱలు మాత్రము వడ్డించగూడదు. పర్వసంధులందు రాహువు సూర్యుని గ్రసించునపుడు అది 'హస్తిచ్ఛాయా యోగము' . అపుడు చేసిన శ్రాద్ధకర్మయు, శుభకర్మలును అక్షయములు. చంద్రుడు మఘా–హస్త నక్షత్రములందు

ఉన్నపుడు అది 'వైవస్వతీ తిథి'. అది కూడ 'హస్తిచ్ఛాయా యోగమే'. బలి వైశ్వదేవము చేయగా మిగిలిన అన్నము బలివైశ్వ దేవ మండలమునందు ఉంచరాదు. అగ్ని లేనిచో దానిని బ్రాహ్మణుని కుడి చేతిలో హోమము చేయవలెను. వేదోక్తకర్మ చేయకపోవుటచే బ్రాహ్మణుడును, వ్యభిచారి పురుషునిచే స్త్రీయు దూషితులుకారు. బలాత్కారముచే భోగింపబడిన స్త్రీని, శత్రువులకు వశమైన స్త్రీని ఋతుకాల పర్యంతము పరిత్యజించవలెను. ఋతుదర్శనానంతరము ఆమె శుద్ధురాలగును. స్త్రీలు ముందుగ సోముడు, గంధర్వుడు, వహ్ని అను దేవతలచేత అను భవింపబడుదురు. మనుష్యులు వీరిని తరువాత అనుభవింతురు. అందుచే వీరు ఎవని చేతను దూషింపబడరు. అసవర్ణుడైన వానిచే స్త్రీయోనియందు గర్భము ఉంచబడినచో ఆ స్త్రీగర్భములోపల ఉన్నంత వరకును అశుద్ధురాలు. ఆ గర్భము బైటకు వెడలిన తరువాత రజస్సుచే శుద్ధురాలగును.

ఆత్మకంటె భిన్నమైన రెండవ వస్తువును చూడనివాడే బ్రహ్మభూతుడైన, ఆత్మరతు డైన నిర్మలుడైన యోగి. ఆత్మ మనః సంయోగము యోగమని కొందరు అందురు. మనస్సును వృత్తి హీనముగ చేసి, క్షేత్రజ్ఞుడైన పరమాత్మునియందు ఏకముచేసి, బంధ విముక్తుడగును. ఇది ఉత్తమమైన యోగము. ఐదు ఇంద్రియములు అనెడు కుటుంబ ములతో గ్రామము ఏర్పడినది. అందు ఆరవదగు మనస్సు చాల శ్రేష్ఠమైనది. ఆ మనస్సు దేవాసుర మనుష్యులచేత గూడ జయింప శక్యము కానిది. బహిర్ముఖ ములగు అన్ని ఇంద్రియములను అంతర్ముఖములుగ చేసి, మనస్సునందు నిలుపవలెను. మనస్సును ఆత్మయందు నిలుపవలెను. సర్వభావశూన్యుడగు జీవుని బ్రహ్మయందు నిలుపవలెను. ఇదియే జ్ఞానము; ఇదియే ధ్యానము. ఇంక ఏమి చెప్పినను గ్రంథవిస్తరమే. సకలలోకుల దృష్టిలో ఏది లేదో అది (బ్రహ్మ) ఉన్నదని చెప్పి తద్భిన్నము నిషేధింపబడుచున్నది. ఈ విధముగా చెప్పిన విషయము ఇతరుని హృదయమునందు నిలువదు. బాలికకు, స్త్రీసుఖము ఎట్లు అనుభవగోచరము కాదో అట్లే ఆ బ్రహ్మ తెలియశక్యముకాదు. పుట్టుకతో గ్రుడ్డివాడు ఘటమనగా ఏదో ఎట్లు తెలుసుకొన జాలడో అట్లే యోగి కానివాడు బ్రహ్మను తెలుసుకొన జాలడు. బ్రాహ్మణుడు సన్యసించుట చూచి – 'ఈతడు నా మండలమును భేదించుకొని పరబ్రహ్మను పొందును' అని భాస్కరుడు చలించును. సన్యాసికి ఉపవాస వ్రతము, స్నానము, తీర్థము, ఫలము, తపస్సు, ద్విజ సంపాదనము ఇవన్నియు జ్ఞానికి జ్ఞానఫల రూపమున సంపన్నములు అగును. ఏకాక్షర (ఓంకార) రూపమైనది. ప్రాణాయామమే గొప్ప తపస్సు. సావిత్రి కంటె పరమపావనము మరొకటి లేదు. పాపకర్మలను నశింపచేయుటకు, ధ్యాన సదృశమైనది మరొకటి లేదు. శ్వపాచకుల ఇంటి భోజనము చేసినవాడు కూడ ధ్యానముచే శుద్ధుడగును. ఆత్మ ధ్యానము చేయువాడు, మనస్సు ధ్యానసాధనము కలవాడు ధ్యానింపదగినవాడు విష్ణువు. ఫలముకూడ విష్ణువే. శ్రాద్ధమునందు పంక్తిపావనుడైన యతి అక్షయ ఫలము నిచ్చును.

నైష్ఠిక ధర్మమును (సన్యాసాశ్రమమును) అధిరోహించి అచటి నుండి పతితుడైన ఆత్మ ఘాతుకుడైన బ్రాహ్మణునకు శుద్ధిని కలిగించు ప్రాయశ్చిత్తము లేదు. ఈ విధముగ ఆరూఢ పతితులైన సన్యసించినవారును, వారి భార్య యందు జనించిన సంతతియు, బిందులుడు అను చండాలురుగా జనింతురు. సంశయము లేదు. అట్టి సన్యాసి నూరువత్సరముల ఆయుర్దాయముగల గృధ్రముగా

పుట్టి మరణించును. పిదప పండ్రెండు సంవత్సరముల ఆయువు గల శునకముగాను, పిదప పండ్రెండు సంవత్సరముల ఆయువుగల భాసపక్షిగాను, పది సంవత్సరములు సూకరముగాను, పిదప పుష్ప ఫలరహితమగు ముండ్ల చెట్టుగాను ఉండును. పిదప దావాగ్ని దగ్ధుడై తన సహచరులతో గూడ మోడగును. పిదప వేయి సంవత్సరములు చైతన్యరహితుడుగ పడియుండును. వర్ష సహస్రము నిండిన పిదప బ్రహ్మ రాక్షసుడగును. తారకమగు యోగము చేతగాని, కులమును నశింపచేయుట చేతగాని మోక్షమును పొందును. అందుచే యోగమునే సేవించవలెను. పాపవినాశకమగు ఏ ఇతర మంత్రమును సేవించినను ప్రయోజనము లేదు. (165)

వర్ణధర్మ వర్ణనము

పుష్కరుడు పలికెను :

ఇపుడు శ్రౌతస్మార్త ధర్మములను గూర్చి చెప్పెదను. అది ఐదు విధములు. కేవలము వర్ణమును మాత్రమే నిమిత్తముగా చేసికొని చెప్పిన ధర్మము-ఉదా : పై మూడు వర్ణముల వారికి ఉపనయన సంస్కారము ఆవశ్యకము. ఇది వర్ణధర్మము. ఆశ్రమమును బట్టి విధించిన ధర్మము ఆశ్రమ ధర్మము. ఉదా : భిన్న పిండాది విధానము. రెండింటిని పట్టి విధించినది నైమిత్తికము. ఉదా : ప్రాయశ్చిత్త విధానము. నరుడు బ్రహ్మచారియైనను, గృహస్థుడైనను, వానప్రస్థుడైనను, సన్యాసియైనను విధింపబడిన ధర్మము ఆశ్రమ ధర్మము. మరొకవిధమున గూడ ధర్మము ఐదు విధములు. సంధి విగ్రహాది షాడ్గుణ్య విధానము దృష్ట ఫలము; మంత్ర యజ్ఞాదులు అదృష్ట ఫలములు అని మనువు చెప్పెను. ఇవి కాక ఉభయ ప్రయోజనములుగల వ్యవహారము, దండధారణము, తుల్యార్థ వికల్పము ఇవి కూడ యజ్ఞమూలకమగు ధర్మమునకు అంగములు. వేదములో చెప్పిన ధర్మమునే స్మృతులు కూడ బోధించుచున్నవి. కార్యముకొరకై స్మృతి వేదోక్తధర్మమును అనువదించుచున్నది అని మన్వాదుల అభిప్రాయము. అందుచే స్మృతులలో చెప్పిన ధర్మము వేదోక్త ధర్మమునకు గుణము, పరిసంఖ్య, విశేషతః అనువాదము లేదా విశిష్ట దృష్టఫలము నిరూపించుటకై ఉద్దిష్టమైనది. ఇది మను సిద్ధాంతము.

ఈ క్రింద చెప్పిన నలుబది ఎనిమిది సంస్కారములు చేసికొనిన మానవుడు బ్రహ్మ లోకమును పొందును. గర్భాధానము, పుంసవనము, సీమంతోన్నయనము, జాతకర్మ, నామకరణము, అన్నప్రాశనము, చూడాకర్మ, ఉపనయనము, నాలుగు వేద వ్రతములు, స్నానము, వివాహము, దేవ యజ్ఞ, పితృ యజ్ఞ, మనుష్య యజ్ఞ, భూత యజ్ఞ, బ్రహ్మ యజ్ఞములు అను పంచయజ్ఞములు, ఏడు పాకయజ్ఞసంస్థలు, అష్టకా సహితములగు మూడు పార్వణ శ్రాద్ధములు, శ్రావణి, అగ్రహాయణి, చైత్రి, ఆశ్వయుజి, ఆగ్న్యాధేయ, అగ్నిహోత్ర, ధర్మ పౌర్ణమాస, చాతుర్మాస్య, ఆగ్రహాయణేష్టి, నిరూఢపశుబంధ, సౌత్రా మణులు ఏడు హవిర్యజ్ఞములు, అత్యగ్నిష్టోమ, ఉక్థ్య, షోడశీ, వాజపేయ, అతిరాత్ర, ఆప్తోర్యామములను సప్తసోమ సంస్థలు-ఇవి నలుబది ఎనిమిది సంస్కారములు. దయ, క్షమ, అనసూయ, అనాయాసము, మాంగల్యము, అకార్పణ్యము, అస్పృహ, శౌచము అనునవి ఎనిమిది ఆత్మ గుణములు. ఈ ఎనిమిది ఆత్మగుణములు కలవాడు స్వర్గమును పొందును. మార్గ గమనము, మైథునము, మలమూత్రోత్సర్గము, దంతధావనము, స్నానము, భోజనము – ఈ ఆరు

పనులు చేయునపుడు మౌనము పాటింపవలెను. సక్తువుల విషయమున మరల దానముచేయుట, నేయి కలిపి, పాలు కలిపి వేరువేరుగా త్రాగుట, రాత్రి త్రాగుట, దంతములతో కొరకుట, చాలవేడిగా త్రాగుట–ఈ ఏడుపనులు త్యజించ వలెను. స్నానానంతరము పుష్పములు కోయగూడదు. అవి దేవతాపూజకు పనికిరావు. అన్యగోత్రీయుడు ఎవరికైన అగ్ని సంస్కారము చేసినచో, పది దినముల వరకును పిండోదక దానములు ఆతడే చేయవలెను. జలము, తృణము, భస్మము, ద్వారము, మార్గము ఇవి మధ్యలో ఉన్నచో పంక్తి దోషములేదు. అనామికా–అంగుష్టములను కలిపిపట్టి ప్రాణాహుతులు తీసికొనవలెను. (166)

అయుత లక్ష కోటి హోమ విధానము

అగ్ని పలికెను :

ఐశ్వర్యము, శాంతి, విజయము మొదలగునవి లభించుటకై గ్రహయజ్ఞమును గూర్చి మరల చెప్పెదను. పదివేల హోమములు, లక్ష హోమములు, కోటి హోమములు అని గ్రహయజ్ఞము మూడు విధములు. అగ్ని కుండవేదికి ఈశాన్యమునందు మండలమున గ్రహములను ఆవాహన చేయవలెను. ఉత్తరమున గురువును, ఈశాన్యమునందు బుధుని, పూర్వ దళమునందు శుక్రుని, ఆగ్నేయమున చంద్రుని, దక్షిణమున కుజుని, మధ్యభాగమున సూర్యుని, పశ్చిమము నందు శనిని, నైరృతియందు రాహువును, వాయవ్యము నందు కేతువును ఆవాహన చేయవలెను. శివ, పార్వతీ, కార్తికేయ, విష్ణు, బ్రహ్మ, ఇంద్ర, యమ, కాల, చిత్ర గుప్తులు అధిదేవతలు. అగ్ని, వరుణ, భూమి, విష్ణు, ఇంద్ర, శచీ, ప్రజాపతి, సర్ప, బ్రహ్మలు ప్రత్యధి దేవతలు. గణేశ, దుర్గా, వాయు, ఆకాశ, అశ్వినీ కుమారులు కర్మ సాద్గుణ్య దేవతలు. ఈ దేవతలను అందరిని వైదిక బీజాక్షరములతో పూజించవలెను. అర్క, పలాశ, ఖదిర, అపామార్గ, పిప్పల, ఉదుంబర, శమీ, దూర్వా, కుశలు, వరుసగ సూర్యుడు మొదలగు వారికి సమిధలు. వీటిని మధువు, ఆజ్యము, పెరుగు–వీటితో నూరు చొప్పున ఎనిమిది పర్యాయములు హోమములు చేయవలెను. నూట ఎనిమిది మరియు నాలుగు పూర్ణ కుంభములు ఉంచి, పూర్ణాహుతి, వసుధార ఇవ్వవలెను. పిదప బ్రాహ్మణులకు దక్షిణ ఇవ్వవలెను. నాలుగు కలశలలోని జలముతో యజమానునకు అభిషేకము చేయవలెను. 'బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాది దేవతలు నీకు అభిషేకము చేయుదురు గాక వాసుదేవుడు, జగన్నాథుడైన సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు నీకు విజయము నిచ్చుగాక. దేవరాజైన ఇంద్రుడు, అగ్ని, యముడు, నిరృతి, వరుణుడు, వాయువు, ధనాధ్యక్షుడైన కుబేరుడు, శివుడు, బ్రహ్మ, ఆదిశేషుడు, సకల దిక్పాలకులు, సర్వదా నిన్ను రక్షింతురుగాక. కీర్తి, లక్ష్మి, ధృతి, మేధ, పుష్టి, శ్రద్ధ, క్రియ, మతి, బుద్ధి, లజ్జ, వపుష్, శాంతి, తుష్టి, కాంతి, లోక జననులైన ఈ ధర్మపత్నులు నీకు అభిషేకము చేయుదురు గాక. ఆదిత్య, చంద్ర, కుజ, బుధ, గురు, శుక్ర, శని, రాహు, కేతువులు పరితృప్తులై నీకు అభిషేకము చేయుదురు గాక! దేవతలు, దానవులు, గంధర్వులు, యక్షులు, సర్పములు, ఋషులు, మునులు, గోవులు, దేవమాతలు, దేవాంగనలు, వృక్షములు, నాగులు, దైత్యులు, అప్సర సమూహములు, అస్త్ర శస్త్రములు, రాజులు, వాహనములు, ఓషధులు,

రత్నములు, కాలవిభాగములు, నదీ నగరములు, సముద్రములు, పర్వతములు, తీర్థములు, మేఘములు నీ సకలాభీష్ట సిద్ధికై నీకు అభిషేకము చేయు దురుగాక'.

యజమానుడు పిదప అలంకృతుడై ఈ క్రింది మంత్రములు చదువుచు సువర్ణ, గో, భూదానాదులు చేయవలెను. 'ఓ కపిలధేనువా! రోహిణీ! నీవు సర్వదేవతలచే పూజింప దగిన దానవు. నీవు సకలతీర్థ–దేవతా స్వరూపిణివి. అందుచే నాకు శాంతిని ఇమ్ము'. 'ధర్మమా! నీవు వృషభ రూపమున జగదానందకారకుడవు. శివునకు వాహనమైన దానవు. అందువలన నాకు శాంతిని ఇమ్ము'. 'హిరణ్యగర్భుని గర్భమునందున్న సూర్యుని హేమ బీజము అనంతపుణ్య ఫలములనుఇచ్చును. అందువలన నాకు శాంతిని ఇమ్ము'. 'పీతవస్త్ర ద్వయము విష్ణువునకు చాలా ఇష్టమైనది. దానిని సమర్పించుటచే విష్ణువు సంతసించును. అందుచే నాకు శాంతిని ఇమ్ము'. 'విష్ణువైన నీవు మత్స్య రూపముతో అమృతమునకు కారణభూతుడవు. చంద్రార్క వాహనుడవు. అందుచే నాకు శాంతి నొసగుము'. 'పృథివియైన నీవు ధేనువుగా నుండి కేశవునితో సమానురాలవు. సర్వ పాపములను నశింపచేయుదానవు. అందువలన నాకు శాంతిని ఇమ్ము'. 'ఓ, అయో వికార మైనదానా! ఎల్లపుడును అన్ని పనులు నీ అధీనములో నుండును. లాంగలాదులు ఆయుధాదులు కూడ నీ అధీనము. అందుచే నాకు శాంతి నొసగుము'. 'నీవు సర్వయజ్ఞము లకును అంగముగా ఉన్నావు. అగ్నికి కారణమైనదానవు. అందుచే నాకు శాంతిని ఇమ్ము'. 'గోవుల అవయవములందు చతుర్దశ భువనములును ఉన్నవి. అందువలన నాకు ఇహపర లోకములందు మంగళమగుగాక'. 'కేశవుని శయ్యయు, శివుని శయ్యయు ఎన్నడును శూన్యములుకావు. నేనిచ్చు శయ్యకూడ అన్ని జన్మలందును శూన్యము కాకుండ ఉండుగాక. సర్వదేవతలును సర్వరత్నములందు ప్రతిష్ఠితులై ఉన్నారు. అందుచేత ఈ రత్నదానముచే దేవతలు నాకు శాంతినిత్తురుగాక. ఇతర దానము లేవియు భూదానము పదునారవ అంశమునకు సాటిరావు. అందుచే ఈ భూదానము వలన నాకు శాంతి కలుగుగాక. అయుత హోమములతో సదక్షిణముగా చేసిన గ్రహయజ్ఞము యుద్ధమునందు విజయ మును ఇచ్చును. వివాహములు, ఉత్సవములు, యజ్ఞములు, ప్రతిష్ఠలు మొదలగు కర్మలలో ఈ గ్రహయజ్ఞము చేయవలెను. లక్ష హోమ, కోటి హోమములను సకల కామావాప్తి కొరకు చేయవలెను. గృహమునందు మండపము ఏర్పరచి, అయత హోమముల నిమిత్తము ఒక హస్తము ప్రమాణముగల కుండమును ఏర్పరుపవలెను. దానికి మేఖలలు, యోని ఉండవలెను. నలుగురు ఋత్విక్కులు లేదా తానొక్కడే చేయవచ్చును. లక్ష హోమములందు అన్నియు పది రెట్లు ఉండును. కుండము నాలుగు లేదా రెండు హస్తముల ప్రమాణమున ఉండవలెను. ఇందు అధికముగ తార్క్ష్యుని కూడ పూజించవలెను. 'ఓ తార్క్ష్యా! నీ శరీరము సామధ్వని రూపము. నీవు పరమాత్ముని వాహనము. విషమును నశింపచేయుదువు. అందుచే నాకు నిత్యము శాంతిని ఇమ్ము'. 'వసోర్ధా రాం' అని చెప్పిన పిమ్మట శయ్యా భూషణాదికములను దానము చేయవలెను. లక్షహోమమునందు పదిమంది లేదా ఎనమం దుగురు ఋత్విక్కులుందురు. దానివలన పుత్రులను, అన్నమును, రాజ్యమును, విజయ మును, భుక్తి ముక్త్యాదులను పొందును. కోటిహోమ యజ్ఞము సదక్షిణాకముగా చేసినచో వెనుక చెప్పిన స్థలములేకాక శత్రు వినాశనమును గూడ చేయును. నాలుగు లేదా ఎని మిది

హస్తముల కుండము, పన్నెండు ఋత్విక్కులు, పటము నందు ఇరువదియైదు లేదా పంద్రెండు కలశలను ద్వారమునందు నాలుగు కలశలను ఉంచవలెను. కోటి హోమములు చేసినవాడు సర్వకామములను పొంది విష్ణులోకము చేరును. గ్రహమంత్రములతోగాని, గాయత్రితోగాని, వైష్ణవ మంత్రములతోగాని, జాతవేదో ముఖ మంత్రములతో గాని, శైవ మంత్రములతో గాని, ప్రసిద్ధములైన వైదిక మంత్రములతోగాని, తిల, యవ, ధాన్య, ఘృతములతో హోమములు చేయవలెను. ఇట్లు చేసినవాడు అశ్వమేధాది యాగఫలమును పొందును. ద్వేషముతో అభిచార హోమములు చేయు నపుడు కుండము త్రికోణా కారములో ఉండును. డేగ ఎముకలతో అగ్నితో కూడిన సమిధలను ఎడమచేతితో హోమము చేయవలెను. హోమము చేయువారు శత్రువునకు అమంగళమును కోరుచు, ఎఱ్ఱని అలంకరణములు ధరించి, జుట్టు విరబోసికొని 'దుర్మిత్రాస్తస్మై సన్తు యో ద్వేష్టి హుం ఫట్' అను మంత్రము చదువుచు హోమము చేయవలెను. క్షురముతో ప్రతిమను ఛేదించవలెను. పిష్టముతో చేసిన శత్రువును చంపవలెను. దానిని అగ్నియందు హోమము చేయవలెను. ఈ విధముగా చేసినవాడు స్వర్గము పొందును. (167)

మహాపాతకాది ప్రాయశ్చిత్తము -1

పుష్కరుడు చెప్పెను :

ప్రాయశ్చిత్తము చేసికొననివారిని రాజు దండించవలెను. తప్పు తెలిసి చేసినను, తెలియక చేసినను ప్రాయశ్చిత్తము చేసికొనవలెను. మత్తులు, క్రుద్ధులు, రోగగ్రస్తులు – వీరి అన్నము ఎన్నడును తినగూడదు. రజస్వల స్పృశించిన అన్నమును, సామూహి కాన్నమును, వేశ్యా స్త్రీ అన్నమును తినరాదు. మహాపాతకములు చేసినవాడు, వడ్డీ వ్యాపారము చేయువాడు, దాయకుడు, అభిశప్తుడు, నపుంసకుడు, ఉపపతితో నివసించు స్త్రీ, రజకుడు, క్రూరుడు, వంది, జూదగాడు, కపటి, తపస్వి, చోరుడు, దండధారియైన భటుడు, స్త్రీకి భర్త ఉండగా జారుని వలన పుట్టినవాడు, స్త్రీకి భర్త చనిపోయిన పిమ్మట జారుని వలన పుట్టినవాడు, స్త్రీకి లొంగిపోయినవాడు, వేదమును అమ్ముకున్నవాడు, నటుడు, సాలివాడు, కృతఘ్నుడు, కమ్మరి, నిషాదుడు, బట్టలకు రంగులు వేయువాడు, కపట సన్యాసి, జారిణి, తిల ఘాతకుడు, ఆరూఢపతితుడు, శత్రువు–వీరి అన్నము తినగూడదు. బ్రాహ్మణునిచే నిమంత్రితుడుకానిచో బ్రాహ్మణాన్నము తినగూడదు. నిమంత్రి తుడైనను శూద్రాన్నము తినగూడదు. పైన చెప్పిన వారి అన్నమును తెలియకతిన్నచో మూడు దినములు ఉపవాసము చేయవలెను. తెలిసి తిన్నచో కృచ్ఛ్రవ్రత మాచరించ వలెను. వీర్యము, మలము, మూత్రము, చాండాలాన్నము, శ్వపచాన్నము తిన్నచో చాంద్రాయణ వ్రతము చేయవలెను. పది రోజులు దాటని ప్రేతకు ఇచ్చిన అన్నమును, ఆవు వాసన చూసిన అన్నమును, శూద్రోచ్ఛిష్టమును, శునకోచ్ఛిష్టమును, పతితుని అన్నమును తిన్నచో తప్తకృచ్ఛ్ర వ్రతము చేయవలెను. అశౌచములో ఉన్నవారి అన్నము తిన్నవాడు అశుద్ధుడగును. అట్టి అన్నము తిన్నపుడు గూడ తప్తకృచ్ఛ్ర వ్రతము చేయవలెను.

ఏదైన ఐదు గోళ్ల జంతువు మరణించిన కూపము నుండి, అపవిత్ర వస్తుసంబంధ మేర్పడిన కూపము నుండియు జలము త్రాగినచో ద్విజోత్తముడు మూడు దినములు ఉపవాసము చేయవలెను.

పై పాపములు అన్నియు శూద్రుని విషయమున ఒక్క పాదమే అంటును. (ప్రాయశ్చిత్తములు గూడ అంతే). వైశ్య, క్షత్రియులకు రెండు పాదములు అంటును. గ్రామ్యవరాహము (ఊరపంది), గాడిద, ఒంటె, నక్క, కోతి, కాకి-వీటి మూత్ర పురీషములు తిన్న ద్విజుడు చాంద్రాయణము చేయవలెను. శుష్కమాంసమును, ప్రేతాన్న మును, కరకములను, మాంసము తిను అరణ్య మృగ ములు, సూకరములు, ఉష్ట్రము, నక్క, కోతి, కాకి, గోవు, నరుడు, అశ్వము, గాడిద-వీటి మాంస మును, ఛత్రాకమును, గ్రామ్య కుక్కుటమును, ఏనుగు మాంసమును తిన్నవాడు తప్తకృచ్ఛ మాచరించి విశుద్ధ డగును. బ్రహ్మచారి ఆమశ్రాద్ధమున భుజించినను, మద్యము సేవించినను, తప్త కృచ్ఛ్రము చేయవలెను. వెల్లుల్లి, గృంజనము అనగా విషముతిన్న పశువు యొక్క మాంసము తిన్నవాడు ప్రాజాపత్యాదులచే శుద్ధుడగును. తన కొరకై మాంసము వండించుకొని తిన్నవాడు చాంద్రాయణ వ్రతము చేయవలెను. పీలుగవ్యము, జున్ను, శ్లేష్మాతకము, మట్టి, నిమిత్తము లేకుండ వండిన పులగము, సంయావము, పాయసము, అప్పములు, చేగోడీలు మొదలైన వాటిని, అసంస్కృతములు అగు మాంసములను, దేవాన్నములను, హవిస్సులను తిన్నవాడు పై విధముగ ప్రాయశ్చిత్తము చేసుకొనవలెను. ఆవులు, గేదెలు, మేకలు తప్ప ఇతర పశువుల పాలు వర్జ్యములు. పై పశువుల పాలు కూడ ఈనిన పది రోజుల లోపున నిషిద్ధము. చెవులపిల్లి, సల్లకి, ఉడుము, ఖడ్గ మృగము, కూర్మము అను ఐదు గోళ్లు గల జంతువులు భక్ష్యములు. ఇతర జంతువులు భక్ష్యములు కావు. పాఠీనములను (వేయి కోరికలచేప-కొఱ్ఱమీను), రోహిత (ఎఱ్ఱని) మత్స్యములను, సింహ తుండ ములను, భక్షించవచ్చును. అగ్ని హోత్రము నందు ప్రజ్వలింపచేయబడిన, అగ్నిగల బ్రాహ్మణుడు స్వేచ్ఛగా యవ గోధూమలతో చేసిన పదార్థములను, పాలతో చేసిన భక్ష్యములను, వాగషాంగవ చక్రాదులను, నూనె వస్తువులను, నిలువ ఉన్న దానిని తిన్నచో ఒక మాసము చాంద్రాయ ణము చేయవలెను. అది వీరవధతో సమానమైనది.

బ్రహ్మహత్య, సురాపానము, (సువర్ణ)చౌర్యము, గురుస్త్రీ సంగమము, ఇవి మహా పాతకములు. ఈ మహాపాతకములు చేసిన వారితో సంబంధము కూడ మహాపాతకము. అసత్యమును పెంపొం దించుట, రాజు విషయమున చాడీలు చెప్పుట, పూజ్యుని అనావశ్యక ముగ నిర్బంధించుట-ఇవి బ్రహ్మహత్యతో సమానము. వేదమును పరిత్యజించుట, వేద నింద, కపట సాక్ష్యము, మిత్రుని చంపుట, నింద్యమైన అన్నమును ఆజ్యమును తినుట ఈ ఆరును సురాపాన సమానములు. దాచి ఉంచిన వస్తువును, నరులను, అశ్వములను, రజతములు అపహరించుట, భూమిని, వజ్రమును, మణిని హరించుట సువర్ణ స్తేయముతో సమానము. తోడబుట్టువులు, బాలికలు, అంత్యజాతుల స్త్రీలు, మిత్రుని స్త్రీలు, పుత్రుని స్త్రీలు, వీరియందు రేతః సేకము గురుపత్నీ గమనతుల్యము. గోవధ, యాగము చేయు అర్హతలేని వారిచే యాగము చేయించుట, పరస్త్రీ సంబంధము, తనను ఇతరులకు అమ్మి వేయుట, గురువును, తల్లిని, తండ్రిని విడచివేయుట, స్వాధ్యాయమును, అగ్నిని, పుత్రుని పరిత్యజించుట, పరివిత్తిత్వము (తమ్ముడు వివాహము చేసికొనగా తాను అవివాహితుడుగా ఉండుట). తమ్ముడు పరివేదనము చేయుట (అన్నకంటె ముందుగా వివాహము చేసికొనుట), అట్టివారికి కన్యను ఇచ్చుట, వారికి యాజకుడుగా నుండుట, కన్యను చెరచుట, వడ్డీతో జీవించుట,

వ్రతమునకు విఘాతము కలిగించుట, తటాకమును, ఆరామమును, భార్యను సంతానమును విక్రయించుట, స్వధర్మపరిత్యాగము, బాంధవ త్యాగము, జీతమునకు వేదాధ్యయనము చేయించుట, జీతము తీసికొనువాని నుండి అధ్యయనము చేయుట, అమ్మకూడనివాటిని అమ్ముట, గనులపై అధికారము, పెద్ద యంత్రములను నడపుట, ఓషధులను హింసించుట, స్త్రీపై ఆధారపడి జీవించుట, కర్తవ్యమును దాటవేయుట, కట్టెల కొరకై సజీవములైన వృక్షములను ఛేదించుట, స్త్రీలను నిర్బంధించుట, స్త్రీలను నిందించువారితో స్నేహము, స్వలాభము కొరకై పనులు ప్రారంభించుట, నిందితుల అన్నము తినుట, అగ్న్యాధానము చేయకుండుట, చౌర్యము, ఋణములు తీర్చకపోవుట, అసచ్ఛాస్త్రముల అభ్యాసము, దుష్టశీలము, ధాన్యమును, వెండి మొదలగు వాటిని పశువు లను అపహరించుట, మద్యమును త్రాగుస్త్రీని సేవించుట, స్త్రీని, శూద్రుని, వైశ్యుని, క్షత్రియుని చంపుట, నాస్తికత్వము–ఇవి ఉపపాతకములు. బ్రాహ్మణునకు పీడ కల్గించుట, వాసన చూడదగని వాటిని, మద్యమును వాసన చూచుట, వక్రత్వము, పురుషునితో మైథునము–ఇవన్నియు జాతి భ్రష్టత్వమును కలిగించును. కుక్క, గాడిద, ఒంటె, సింహము, మేక, గొఱ్ఱె–వీటిని చంపుట, మీన, సర్ప, నకులములను చంపుట–ఇది సంకీర్ణకరణమని చెప్పబడును. నిందింతుల నుండి ధనము స్వీకరించుట, వాణిజ్యము, శూద్రసేవ, అసత్య భాషణము ఇవి 'అపాత్రీకరణము'. క్రిమి, కీట, పక్షులను చంపుట, మద్యము కలిసిన భోజనము, ఫలములను, పుష్పములను అపహరించుట, అధైర్యము–ఇవి పాపహేతువులు. (168)

ప్రాయశ్చిత్తములు-2

పుష్కరుడు చెప్పెను :

ఇటుపై పాపములకు ప్రాయశ్చిత్తములను చెప్పెదను. బ్రహ్మహత్య చేసినవాడు కుటి నిర్మించుకొని పండ్రెండు సంవత్సరములు వనములో నివసించవలెను. శిరస్సు గుర్తును తన దేహముపై ఏర్పరచుకుని ఆత్మశుద్ధికై భిక్షాన్నము తినవలెను. లేదా ప్రజ్వలించుచున్న అగ్నిలో తలక్రిందులుగా తన శరీరమును పడవేయవలెను. లేదా అశ్వమేధ యాగము గాని, స్వర్గలోకమును ఇచ్చు గోసవము కాని చేయవలెను. లేదా ఏదైన ఒక వేదమును జపించుచు, నూరు యోజనములు నడచి వెళ్లవలెను, లేదా వేదవేత్తయగు బ్రాహ్మణునికి తన సర్వస్వమును ఇచ్చివేయవలెను. మహాపాతకము చేసినవారు ఈ వ్రతములచే తమ పాపములను తొలగించుకొందురు. ఉపపాతకములు చేసిన వాడును, గోహత్య చేసిన వాడును ఒక మాసము యవలు త్రాగవలెను. ముండనము చేయించుకొని, గోచర్మమును కప్పుకొని గోష్ఠమునందు నివసించవలెను. ఉప్పు, పులుపులేని ఆహారమును మితముగా దినమునందలి నాల్గవ భాగమున తినవలెను. నియంతేంద్రియుడై రెండు మాసములు గోమూత్రముతో స్నానము చేయవలెను. పగలు గోవుల వెంట వెళ్లుచు, నిలబడి గోపరాగమును (ఆవు గిట్టయందలి దుమ్ము కలిపిన జలము) త్రాగవలెను. వ్రతము పూర్తిచేసికొని పదిగోవులను, ఒక వృషభమును దానము చేయవలెను. అందుకు శక్తి లేనిచో వేదవేత్తలకు సర్వస్వమును దానము చేయవలెను. గోవును నిరోధించగా అవి చనిపోయినచో ఒక పాదము, ప్రాయశ్చిత్తమును కట్టివేయుటచే చనిపోయినచో రెండు పాదముల ప్రాయశ్చిత్తము నాగలికి కట్టినపుడు చనిపోయినచో

మూడు వంతులును, కొట్టగా చనిపోయినచో పూర్తిగను ప్రాయశ్చిత్తము చేయవలెను. అడవులందును, దుర్గములందును, విషమ ప్రదేశములందును, భయములందును గోవుకు ఆపద కలిగినచో ఒక పాదము ప్రాయశ్చిత్తము విహితము. అలంకారార్థమై ఘంటాదులు కట్టుటచే మరణించినచో రెండు పాదముల ప్రాయశ్చిత్తము. గోవును దమనము చేయునపుడు (ఆవును లొంగదీసుకొనుట యందు) గాని, చేయించునపుడు గాని, కట్టినపుడు గాని, గుదికట్ట, గొలుసు, పాశము కట్టుటచేగాని మరణించినచో మూడువంతులు ప్రాయశ్చిత్తము ఆచరించవలెను. గోవుకు కొమ్ము విరిగి నను, ఎముక విరిగినను, తోక తెగినను దానికి పూర్తి ఆరోగ్యము చేకూరు వరకును, గంజి త్రాగవలెను. గోమతీ విద్యను జపించుచు, గో స్తుతి-గోమతులను స్మరించుచుండ వలెను. దైవవశమున ఒక గోవును అనేకులు చంపినచో వారు ఒక్కొక్కరు పాదము చొప్పున ప్రాయశ్చిత్తము చేసుకొనవలెను. గోవుకు సహాయము చేయబోగా అది మరణించినచో పాపములేదు. ఉప పాతకములు చేసిన వారందరును, అవకీర్ణి (వ్రత మధ్యమునందు స్త్రీ సంగమము చేసినవాడు) తప్ప ఇతరులకు, శుద్ధి నిమిత్తమై, ఈ వ్రతమునే చేయవలెను. లేదా చాంద్రాయణము చేయవలెను.

అవకీర్ణి మాత్రము (వ్రతమధ్యమునందు స్త్రీ సంగము చేసినవాడు) రాత్రియందు చతుష్పథమున, నిరృతిని ఉద్దేశించి నల్లని గాడిదను పాకయజ్ఞ విధానమున పూజించ వలెను. పిమ్మట ఆ ధీమంతుడు 'సమాసిఞ్చన్తు మరుతః' ఇత్యాది ఋక్కుతో చంద్ర, ఇంద్ర, గురువులను ఉద్దేశించి ఘృతాహుతి ఇవ్వవలెను. లేదా గార్దభ చర్మముకప్పికొని ఒక సంవత్సరము భూమిపై సంచరించవలెను. తెలియక భ్రూణహత్య చేసినవాడు బ్రహ్మహత్యా ప్రాయశ్చిత్తము చేసికొనవలెను. తెలియక సురాపానము చేసిన బ్రాహ్మణుడు అగ్నివలె కాలుతూన్న సురగాని, గోమూత్రమును గాని, జలముగాని త్రాగవలెను. సువర్ణము అపహరించిన బ్రాహ్మణుడు రాజు వద్దకు వెళ్ళి నేను ఈ అపరాధము చేసితిని, నాకు దండమును ఇమ్ము' అని చెప్పవలెను. ఈ విధముగ తనంతట తాను వచ్చి చెప్పిన వానిని రాజు ముసలముతో ఒక్క దెబ్బ కొట్టవలెను. ఈ విధముగ చచ్చుటచే గాని, తపస్సు చేయుటచే గాని సువర్ణస్తేయము చేసిన బ్రాహ్మణుని పాపము తొలగును. గురుపత్నీ గమనము చేసినవాడు స్వయముగ శిశ్నమును, వృషణములను ఖండించుకొని, వాటిని దోసిటిలో ఉంచుకొని చనిపోవువరకును నైరృతి దిక్కు వైపు వెళ్లవలెను. లేదా నియతేంద్రియుడై చాంద్రాయణ వ్రతము చేయవలెను. జాతి భ్రంశకరమగు పాపమేదైన తెలిసి చేసినవాడు 'సాంతపన కృచ్ఛ్రమును', తెలియక చేసినవాడు 'ప్రాజాపత్య కృచ్ఛ్రమును' చేయవలెను. 'సంకరీకరణ', 'అపాత్రీకరణ' పాపములు చేసినవాడు చాంద్రాయణ వ్రతము చేయవలెను. 'మలినీకరణ' పాపము చేసినవాడు మూడు దినములు తప్త యావకమును త్రాగవలెను. క్షత్రియ వధ చేసినవాడు బ్రహ్మ హత్యా ప్రాయశ్చిత్తములో నాల్గవ వంతు చేసికొనవలెను. వైశ్యుని వధించినచో ఎనిమిదవ వంతు, సదాచార వంతుడైన శూద్రుని వధించినచో పదునారవ వంతు ప్రాయశ్చిత్తము చేసికొనవలెను. పిల్లి, ముంగిస, నెమలి, కప్ప, కుక్క, ఉడుము, గుడ్లగూబ, కాకి-వీటినిగాని, నాలుగు వర్ణములకు చెందిన ఏ స్త్రీ నైన గాని చంపినచో శూద్రహత్యా ప్రాయశ్చిత్తము చేసికొనవలెను. సర్పాదులను చంపి నపుడు నక్త వ్రతమును, ఎముకలు లేని జీవులను చంపినపుడు ప్రాణాయామము చేయవలెను.

ఇతరుల గృహము నుండి అల్పమైన సారముగల వస్తువుల చౌర్యము చేసినవాడు కృచ్ఛ్ర సంతపనము చేయుటచే శుద్ధుడగును. భక్ష్య భోజ్యములను–యాన–శయ్యా, ఆసనములను, పుష్ప–ఫల–మూలములను అపహరించినవానికి పంచగవ్యప్రాశనము ప్రాయశ్చిత్తము. తృణ–కాష్ఠ–వృక్షములను, బెల్లమును, వస్త్రమును, చర్మమును, మాంస మును అపహరించినవాడు మూడు రోజులు భోజనము చేయరాదు. మణులు, ముత్యములు, ప్రవాళములు, రాగి, వెండి, ఇనుము, కంచు, రాళ్లు అపహరించినవాడు పండ్రెండు రోజులు కొంచెము అన్నము మెతుకులు మాత్రము తినవలెను. నూలు, పట్టు, ఉన్ని బట్టలను, రెండు డెక్కలుగల పశువులను, ఒక డెక్కగల పశువులను, పక్షులను, గంధ ములను, ఓషధులను, త్రాడును అపహరించినవాడు మూడు దినములు పాలు మాత్రమే త్రాగవలెను. సమానోదరులగు స్త్రీలతోను, మిత్ర–పుత్రాది స్త్రీలతోను, బాలికలతోను, అంత్యజాతి స్త్రీలతోను, మేనత్త కుమార్తెతోను, సోదరితోను, తల్లి సోదరి కుమార్తెతోను, తల్లి సోదరుని కుమార్తెతోను, ఆప్తుని స్త్రీతోను సంగమము చేసినవాడు చాంద్రాయణ వ్రతము చేయవలెను. మనుష్య భిన్న పశ్వాదులందును, రజస్వలయందును, యోనిభిన్న ప్రదేశములందును, జలమునందును రేతఃసేకము చేసినవాడు కృచ్ఛ్ర సంతపనము చేయవలెను. ఎద్దుల బండి యందును, నీటియందు, పగటి భాగమునందు స్త్రీతోగాని, పురు షునితో గాని మైథునము చేసిన ద్విజుడు సచేల స్నానము చేయవలెను. విప్రుడు తెలియక చండాల స్త్రీతోగాని, అంత్యజాతి స్త్రీలతోగాని సమాగమము చేయుట, భుజించుట, దానము పట్టుట అను పనులు చేసినచో పతితుడగును. తెలిసిచేసినచో వారితో సముడైపోవును. చెడిపోయిన స్త్రీని భర్త ఒక ఇంటిలో నిరోధించి ఉంచి, పరదార సంబంధముగల పురుషుడు ఏ వ్రతము చేయవలెనో ఆ వ్రతమును ఈమెచే చేయించవలెను. సమాన జాతీయునిచే పిలవబడి ఆమె మరల చెడిపోయినచో కృచ్ఛ్రమును, చాంద్రాయణ మును చేయవలెను. దానితో ఆమె పవిత్రురాలగును. ద్విజుడు ఒక రాత్రి శూద్రస్త్రీ సమాగమము చేసిన పాపమును, నిత్యము భిక్షాన్నము తినుటద్వారా మూడు సంవత్సరములలో పోగొట్టుకొనును. (169)

ప్రాయశ్చిత్తములు -3

పుష్కరుడు చెప్పెను :

మహాపాపులతో సంబంధము కలవారికి ప్రాయశ్చిత్తములను చెప్పెదను. పతితు నితో కూడి తిరుగువాడు సంవత్సర కాలములో పతితుడగును. ఈ పతితత్వము, పతితునిచే యజ్ఞము చేయించుటచేతను, అధ్యయనము చేయించుటచేతను వైవాహిక సంబంధము ఏర్పరచుకొనుటచేతను మాత్రమే కలుగును గాని వానితో ప్రయాణము చేయుటచేతను, భుజించుటచేతను, కలిసి కూర్చుం డుటచేతను కలుగదు. ఈ పతితులలో ఎవనితో ఒక వ్యక్తి సంసర్గమును పొందునో అతడు అపతి తుడు చేయవలసిన ప్రాయశ్చిత్తమును చేసికొనవలెను. పతితుని సపిండులు బంధువులతో కలసి నిందిత దినమునందు, సంధ్యా సమయమున వంశానికి సంబంధించినవారు, ఋత్విక్కులు, గురు వులు మొదలగువారి సమక్షమున ఆ పతితునకై (జీవించి యుండగనే) ఉదక క్రియ చేయవలెను. పిదప ప్రేతకు చేసిన విధముగ, ఒక జలము నింపిన కుండను దానిచే తన్నించవలెను. సపిండులు

బంధువు లతో కూడ ఒకరోజు అశౌచము పాటించవలెను. అతనితో సంభాషణము చేయకుండ వలెను. అతని జ్యేష్ఠభాగమును ఉపసంహరించవలెను. గుణములచే అధికుడగు చిన్నవానికి జ్యేష్ఠ భాగము చెందునట్లు చేయవలెను. అతడు ప్రాయశ్చిత్తము చేసికొనిన పిదప బంధువులు ఆతనితో కలిసి పుణ్యనదిలో స్నానముచేసి, జలము నింపిన క్రొత్త కుండను నీటిలో విసరివేయవలెను. పతిత స్త్రీలకు కూడ ప్రాయశ్చిత్తము ఈ విధముగనే చేయవలెను. వారికి వస్త్రములు, అన్నపానాదికము మాత్రము ఇవ్వవలెను. గృహసమీపమున నివాస మేర్పరుపవలెను. యథాకాలముగ గాయత్రీ ఉపదేశము పొందని ద్విజులచేత మూడు కృచ్ఛ్రములు చేయించి పిదప యథావిధిగా ఉపనయనము చేయవలెను. నిషిద్ధ కర్మలు చేయుచు పరిత్యక్తులైన వారి విషయమున గూడ ఇట్లే చేయవలెను. చెడ్డ దానములు పట్టినవాడు మూడువేల గాయత్రీ మంత్రజపముచేసి, సమాహితచిత్తుడై ఒక మాసము గోష్ఠమునందు నివసించుచు పాలు మాత్రము త్రాగినచో పరిశుద్ధుడగును.

సంస్కార హీనులచే యజ్ఞము చేయించినను, ఇతరులకు అంత్యేష్టి కర్మ చేసినను, మంచివారి విషయమున అభిచార ప్రయోగము చేసినను బ్రాహ్మణుడు మూడు ప్రాజాపత్యములు చేయవలెను. ద్విజుడు శరణాగతుని పరిత్యజించినను, అనధికారికి వేదోప దేశము చేసినను, ఒక సంవత్సరము నియమితాహారము భుజించుటచే పాపవిముక్తుడు అగును. కుక్క, నక్క, గాడిద, పిల్లి, ముంగిస, మనుష్యుడు, గుఱ్ఱము, ఒంటె, పంది–ఇవి కరచినచో ప్రాణాయామముచే శుద్ధుడగును. వ్రతలోపము చేసినను, నిత్యకర్మలను ఉల్లంఘించినను, స్నాతకుడు ఉపవాసము చేయవలెను. బ్రాహ్మణుని విషయమున హుంకరించిన వాడును, పెద్దలను తుంకరించిన వాడును (నువ్వు అని అన్నవాడును) స్నానము చేసి, ఆ దినమున మిగిలిన కాలము ఉపవాస ముండి, వారికి నమస్కరించి ప్రసన్నులను చేసికొనవలెను. బ్రాహ్మణునిపై కఱ్ఱ ఎత్తినవాడు ప్రాజాపత్య వ్రతము చేసికొనవలెను. కఱ్ఱతో కొట్టినచో అతికృచ్ఛ్రమును, రక్తము వచ్చునట్లు చేసినచో కృచ్ఛ్రమును, అతికృచ్ఛ్రమును చేయవలెను. తెలియకుండ ఒక చండాలుడు వచ్చి ఇంటిలో కాపురము ఉన్నచో, తెలిసిన పిమ్మట ప్రాయశ్చిత్తము చేసికొనవలెను. చాంద్రాయణము గాని, పరాక వ్రతమును గాని చేసినచో ద్విజులకు శుద్ధి యగును. శూద్రులకు ప్రాజాపత్య వ్రతముచే శుద్ధియగును. మిగిలినదంతయు అతడు కూడ ద్విజుల వలెనే చేయవలెను. ఇంటిలో ఉన్న బెల్లము, కుసుంభము (కుంకుమ పువ్వు), లవణము, ధాన్యము మొదలగు పదార్థములను ద్వారమువద్ద కుప్పగాచేసి తగులబెట్టవలెను. మట్టి పాత్రలను పారవేయవలెను. ఇతర ద్రవ్యములకు శాస్త్రోక్త శుద్ధి చేయవలెను. చండాలస్పర్శ దూషితమగు నూతి నుండి నీరు త్రాగిన బ్రాహ్మణుడు ఉపవాసము గాని, పంచ దివ్యశుద్ధి గాని చేయవలెను. ఇష్టపడి చండాలుని స్పర్శచేసి భోజనముచేసిన బ్రాహ్మణుడు చాంద్రాయణముగాని, తప్త కృచ్ఛ్రముగాని చేయవలెను. చండాలాది నీచజాతుల స్పర్శచే భోజనాది పాత్రలు అపవిత్రమైనచో బ్రాహ్మణుడు షడ్రాత్ర వ్రతము చేయవలెను. అంత్య జాతివాని ఉచ్ఛిష్టము తిన్న ద్విజుడు చాంద్రాయణ వ్రతము చేయవలెను; శూద్రుడు త్రిరాత్ర వ్రతము చేయవలెను. చండాలుని కూపమునుండిగాని, పాత్రనుండిగాని తెలియక త్రాగిన ద్విజుడు సంతపన కృచ్ఛ్రమును, శూద్రుడు ఏకదినోప వాసమును చేయవలెను. చండాల స్పర్శచేసి జలము త్రాగిన ద్విజుడు త్రిరాత్ర వ్రతమును చేయవలెను. శూద్రుడు ఒకదినము ఉపవాసము చేయవలెను.

ఉచ్ఛిష్టమైన కుక్కచేత గాని, శూద్రునిచేతగాని స్పృశించబడిన ద్విజుడు ఒక రాత్రి ఉపవాసముండి పంచగవ్యముచే శుద్ధి పొందును. అట్టి వైశ్యుడుగాని, క్షత్రియుడు గాని స్పృశించినచో రాత్రి స్నానము చేయవలెను. మార్గ మధ్యము నందున్న బ్రాహ్మణుడు ఉదకములేని అరణ్యమునందు, పక్వాన్నము చేతిలో నుండగా మూత్ర విసర్జనము చేసినచో, ఆ ఆహారమును క్రింద పెట్టకుండగ, తన శరీరముపైననే ఉంచుకొని, శౌచముచేసికొని ఆ అన్నమును ప్రోక్షించి సూర్యునకును అగ్నికిని చూపవలెను. అరణ్యమునందు మ్లేచ్ఛులతో గాని, చోరులతోగాని సంబంధ మేర్పడినవారికి, లేదా ప్రవాసములో నున్న వారికి భక్షాభక్ష్య శుద్ధి నిమిత్తము ఉపాయమును చెప్పెదను. వర్ణక్రమాను సారముగా బ్రాహ్మణుడైనచో అతడు మరల స్వదేశమునకు తిరిగివచ్చి కృచ్ఛ్రవ్రతము చేసిన పిమ్మట మరల సంస్కారముచేసికొనవలెను. క్షత్రియుడు మూడు వంతుల ప్రాయశ్చిత్తము, వైశ్యుడు సగము ప్రాయశ్చిత్తము చేసికొని శుద్ధులగుదురు. శూద్రుడు పాదము ప్రాయశ్చిత్తము చేతగాని, దానముచేత గాని, శుద్ధుడగును. సవర్ణయగు రజస్వలచే స్పృశింపబడిన రజస్వలా స్త్రీ ఆ దినమునందే స్నానము చేసినచో శుద్ధురాలగును. తక్కువవర్ణముగల రజస్వల స్త్రీచే స్పృశింపబడిన రజస్వల శుద్ధ స్నానము చేత శుద్ధురాలగును; స్నానము చేయునంత వరకును భుజించగూడదు. మూత్రోత్సర్గానంతరము ప్రయాణము చేయుచు, మరచి నీళ్లు త్రాగినచో ఒక రాత్రి ఒక పగలు ఉపవాసముండి పంచగవ్య చే శుద్ధుడగును. మూత్రోత్సర్గము చేసిన ద్విజుడు శౌచము చేసికొనకుండ, అజ్ఞానముచే భోజనము చేసినచో మూడు రాత్రులు యవలు త్రాగి శుద్ధిచెందును.

బలాత్కారాది కారణములచేత సన్యసించిన విప్రులు అందుండ అసమర్థులై మరల గృహస్థాశ్రమ మునకు రావలెనన్నచో వారికి శుద్ధిని చెప్పుచున్నాము. మూడు కృచ్ఛ్రములుగాని, వారిచే చాంద్రా యణముగాని చేయించవలెను. మరల జాతకర్మాది సంస్కారములచే సంస్కరించవలెను. పాదుకగాని, అమేధ్యముగాని ముఖమునకు తగిలినచో మృత్తిక, గోమయము, పంచగవ్యము వీటిచే శుద్ధిచేసికొన వలెను. నీలిమందు పండించుట, విక్రయము, నీలవస్త్రాది ధారణముచేసిన బ్రాహ్మణుడు పతితు డగును. మూడు కృచ్ఛ్రములచే శుద్ధుడగును. అంత్యజాతివానిచేతను, శ్వపాకునిచేతను స్పృశింప బడిన రజస్వల త్రిరాత్రము చేసినచో నాల్గవ రోజున శుద్ధురాలగును.

చండాలశ్వపచులను, పాసిన వస్తువును, సూతికా స్త్రీని శవమును వీటిని స్పృశించిన వానిని స్పృశించినవాడు సద్యః స్నానముచే శుద్ధుడగును. పచ్చిగానున్న మనిషి ఎముకను స్పృశించిన విప్రుడు స్నానముచే శుద్ధుడగును. మార్గము నందలి బురదనీళ్ళు పడినపుడు నాభిక్రింద మట్టితోను, ఉదకముతోను శుద్ధి చేసికొనవలెను. వాంతిచేసుకొన్నవాడు, విరేచనములు వెళ్ళినవాడును స్నానముచేసి ఘృతప్రాశనము చేసినచో శుద్ధుడగును. క్షౌరము చేయించుకొన్నవాడు స్నానముచేతను, గ్రహణ సమయమున అన్నము తిన్నవాడు కృచ్ఛ్రము చేతను శుద్ధుడగును. పంక్తి బాహ్యులతో కలిసి భోజనము చేసినవాడును, కుక్కగాని, కృములుగాని కరచిన వాడును, అశుచియైనవాడును పంచ గవ్యములచే శుద్ధిపొందును. ఆత్మహత్యా ప్రయత్నము చేసినవాడు కృచ్ఛ్రముచేతను, జపముచేతను శుద్ధుడగును. పాపాత్ములు అందరును హోమాదులచేతను, పశ్చాత్తాపము చేతను శుద్ధులు అగుదురు. (170)

ప్రాయశ్చిత్తములు -4

పుష్కరుడు చెప్పెను :

మిక్కిలి శుద్ధికరమైన రహస్యాది ప్రాయశ్చిత్తమును చెప్పెదను. ఒక మాసము పురుషసూక్తము జపించినచో సర్వ పాపములను నశింపచేసికొనును. అఘమర్షణ సూక్తము మూడు పర్యాయములు జపించినచో సర్వపాపముల నుండియు విముక్తుడగును. వేదమును జపించుట వలనను, ప్రాణా యామము వలనను, గాయత్రీ జపముచేతను, వ్రతము వలనను పాపములను తొలగించుకొను. సర్వ కృచ్ఛ్రములందును ముండనము, స్నానము, హోమము, విష్ణుపూజ చేయవలెను. కృచ్ఛ్రవ్రతము చేయువాడు పగలు నిలచియు, రాత్రి కూర్చుండియు ఉండవలెను. దీనికి వీరాసనమని పేరు. ఈ విధముగ చేసినచో పాపములన్నియు తొలగించుకొనును. ప్రతిదినము ఎనిమిది గ్రాసముల చొప్పున తిన్నచో అది యతి చాంద్రాయణము. ప్రాతఃకాలము నాలుగు, సాయంకాలము నాలుగు గ్రాసములు తిన్నచో శిశు చాంద్రాయణము. ఎట్లుతిన్నను మొత్తము మాసములో రెండు వందల నలుబది గ్రాసములు తిన్నచో సుర చాంద్రాయణము. మూడు దినములు వేడి ఉదకములు, మూడు దినములు వేడి పాలు, మూడు దినములు వేడినెయ్యి త్రాగి, మూడు దినములు వాయువును మాత్రము భక్షించవలెను. దీని పేరు 'తప్త కృచ్ఛ్రము'. ఈ పదార్థములనే చల్లనివి తీసికున్నచో అది 'శీత కృచ్ఛ్రము'. ఇరువది యొక్క దినములు పాలుమాత్రమే త్రాగి ఉన్నచో కృచ్ఛ్రాతి కృచ్ఛ్రము. గో మూత్రము, గో మయము, గో క్షీరము, పెరుగు, నెయ్యి, కుశోదకము, ఒక రాత్రి ఉపవాసము ఇది కృచ్ఛ్రసాంతపనము. ఈ విధముగ ప్రతి దినమునను చేసినచో 'మహా సాంతపనము'. ఒక్కొక్కటి మూడేసి రోజులు చేసినచో అతి సాంతవనము. పంద్రెండు దివసములు భోజనము లేకుండ ఉండుట పరాకకృచ్ఛ్రము. మూడు దినములు ప్రాతఃకాలము, మూడు దినములు సాయంకాలము, మూడు దినములు అయాచితాన్నము భుజించి ఉపవాసము చేసినచో అతి ప్రాజాపత్యము, దీనిలో నాల్గవ వంతుచేసిన పాదకృచ్ఛ్రము.

ఒక మాసము ఫలములు మాత్రము తిన్నచో అది ఫల కృచ్ఛ్రము; బిల్వ ఫలములచే శ్రీకృచ్ఛ్రము. తామరగింజలతోను, ఆమలకముల చేతను ఆకృచ్ఛ్రములు. పుష్పము లచే పుష్ప కృచ్ఛ్రము, పత్రములు తిన్నచో పత్ర కృచ్ఛ్రము, ఉదకము మాత్రము త్రాగిన ఉదక కృచ్ఛ్రము, దుంపలు తిన్నచో మూల కృచ్ఛ్రము, దధి–క్షీర–తక్రములచే దధి కృచ్ఛ్ర, క్షీర కృచ్ఛ్ర–తక్ర కృచ్ఛ్రములు. చేయినిండునంత మాత్రము అన్నమే ఒకమాసము తిన్నచో అది వాయవ్య కృచ్ఛ్రము. పంద్రెండు దినములు తిలలు మాత్రమే తిన్నచో అది పీడా వినాశకమగు ఆగ్నేయము. చారెడు లాజలు మాత్రమే తిన్నచో అది బ్రహ్మకృచ్ఛ్రము. చతుర్దశియందును, పూర్ణిమయందును ఉపవాసముచేసి పిదప పంచగవ్యములను భుజించవలెను. పిదప హవిస్సును భుజించవలెను. ఈ విధముగ మాసము నందు రెండు పర్యాయములు చేయువాడు సర్వ పాప విముక్తుడు అగును. శ్రీకాముడును, పుష్టి కాముడును, స్వర్గ కాముడును, పాపవినాశార్థమై దేవతారాధనపరుడై కృచ్ఛ్రములు చేసినచో సర్వ మనోరథములను పొందును. (171)

స్తోత్ర ప్రాయశ్చిత్తము

పుష్కరుడు చెప్పెను :

మానవుల మనస్సు పరభార్యా పరధన జీవహింసాదులయందు ప్రవర్తించునపుడు విష్ణుస్తుతియే ప్రాయశ్చిత్తము. సర్వదా విష్ణువునకు నమస్కారము. చిత్తమునందున్న వాడును, అహంకారమునకు గతియైనవాడును, హరియు, ఈశుడును, అవ్యక్తుడును, అపరాజితుడును అగు విష్ణువుకు నమస్కరించు చున్నాను. ఏ కారణమువలన విష్ణువు నా మనస్సులో ఉన్నాడో, నా బుద్ధిలో ఉన్నాడో, నా అహంకారములో ఉన్నాడో, నాలో ఉన్నాడో, స్థావర జంగమాత్మ ప్రపంచము యొక్క కర్మ ఆకర్మగా ఉండి చేయుచున్నాడో, ఆ కారణమువలన ఆ విష్ణువునే చింతించుటచే పాపము నశించు గాక! ఏ కారణమువలన ధ్యానము చేయగానే పాపమును హరించునో, భావనా బలము వలన స్వప్నము నందు కనబడునో అట్టి ఉపేంద్రుడును ప్రణతార్తి హరుడును అగు విష్ణువును నమస్కరించు చున్నపుడు హస్తావ లంబనమును ఇచ్చు పరాత్పరుడైన విష్ణువునకు నమస్కరించు చున్నాను. ఓ సర్వేశ్వరేశ్వరా! విభూ పరమాత్మా! అధోక్షజా! నీకు నమస్కారము. నృసింహా! అనంతా! భూతభావనా! భూతేశా! హృషీకేశా! నీకు నమస్కారము. నృసింహా! అనంతా! భూతభావనా! భూతేశా! కేశవా! నేను దుష్టవాక్కు పలుకుటచేతను, చెడు కార్యములు చేయుటచేతను, చెడు ఆలోచనలు చేయుటచేతను కలిగిన పాపమును శాంతింప చేయుము. నీకు నమస్కార మగుగాక. కేశవా! నా చిత్తమునకు లొంగిపోయిన నేనుచేసిన దురాలోచనలను ఉగ్రమైన దుష్కార్యమును నశింపచేయుము. బ్రహ్మణ్య దేవా! గోవిందా! పరమార్థపరాయణా! జగన్నాథా జగత్పోషకా! అచ్యుతా! నా పాపమును శాంతింప చేయుము. హృషీకేశా! పుండరీ కాక్షా! మాధవా! తెలిసికాని, తెలియక కాని నేను అపరాహ్ణము నందును, సాయాహ్నము నందును, మధ్యాహ్నము నందును, రాత్రియందును మనోవాక్కాయములచే చేసిన పాపము నీ నామ మాత్రోచ్చారణముచే నా స్వప్నమునందే నశించిపోవుగాక. హృషీకేశా! పుండరీ కాక్షా! మాధవా! శరీరమునకు సంబంధించినది గాని, వాక్కుచేత చేసినది గాని అయిన నా పాపమును శమింపచేయుము. భుజించుచుగాని, నిద్రించుచుగాని, నిలచిగాని, మెలకు వగా ఉండిగాని, నేనీ రోజున మనోవాక్కాయములచే చేసిన పాపమును నశింపచేయుము. పాప జన్మలు నరకము ఇచ్చు స్వల్పమైనను అధికమైనను నా పాపము వాసుదేవ నామ కీర్తనము వలన శమించు గాక పరబ్రహ్మ స్వరూపుడును పరమ స్థానమును, పరమ పవిత్రు డును అగు విష్ణువు కీర్తింపబడగనే సమస్త పాపము నశించుగాక! గంధ స్పర్శాది వర్జితమగు ఏ విష్ణు పదమును పొందిన పండితులు మరల వెనుకకురారో అట్టి విష్ణుపదము సకల పాపములను నశింపచేయు గాక ! ఈ పాప ప్రణా శన స్తోత్రమును చదివినవాడును, విన్నవాడును, మనోవాక్కాయ జన్యములగు పాపములనుండి విముక్తు డగును. సర్వపాప గ్రహాదులనుండిగూడ విముక్తుడై శ్రీ మహావిష్ణువు యొక్క ఉత్తమ స్థానమును చేరును. అందువలన పాపము చేసినపుడు సర్వ పాపనాశకమగు ఈ స్తోత్రమును జపించవలెను. వ్రతము నిమిత్తమైకూడ ఇది శ్రేష్ఠము. పాపము ప్రాయశ్చిత్తముల చేతను, స్తోత్ర జపముల చేతను, వ్రతముల చేతను నశించును. అటు పిమ్మట సిద్ధి నిమిత్తమై చేసిన కర్మలు భుక్తి, ముక్తి ప్రదములగును. (172)

ప్రాయశ్చిత్తములు (అ)

పాపములను నశింపచేయు ప్రాయశ్చిత్తమును బ్రహ్మ చెప్పిన విధముగ చెప్పెదను. ప్రాణములను తీయుపని 'హననము'. రాగమువలన గాని, ద్వేషము వలన గాని, ప్రమాదము వలన గాని, ఒక బ్రాహ్మణుని, తానే గాని, పరప్రేరణచే గాని చంపినవాడు బ్రహ్మ ఘాతకుడు. ఒకే కార్యమును చేయుటకై ఉద్యుక్తులై చాలమంది శస్త్రములు ధరించి వచ్చినపుడు వారిలో ఒక్కడే బ్రాహ్మణుని చంపినను, వారందరు బ్రహ్మహత్య చేసినట్లే. తిట్టబడి గాని, ధనాప హారాదులచే పీడింపబడి గాని ఒక బ్రాహ్మణుడు ఎవని మూలముగా తన ప్రాణములు కోల్పోవునో అతడు బ్రహ్మహత్య చేసినవాడు. ఔషధాది ఉపకారము చేసినపుడు మరణించినను బ్రహ్మహత్యా దోషము లేదు. పుత్రుని, శిష్యుని, భార్యను శాసించునపుడు వారు మృతులైనను పాపములేదు. దేశమును, కాలమును, వయస్సును, శక్తిని, పాపమును బాగుగా పరీక్షించి, మరొక విమోచన ఉపాయము లేనపుడు ప్రాయశ్చిత్తము చేసికొనవలెను. బ్రహ్మహత్య చేసినవాడు మరొక బ్రాహ్మణుని కాపాడుటకుగాని తన ప్రాణములు విడచినచో లేదా అగ్నిలో దుమికినచో ఆతని బ్రహ్మ హత్యాపాపము తొలగును. శిరస్సు కపాలమును గుర్తుగా ధరించి, తానుచేసిన పాపముచెప్పుచు, భిక్షాన్నము మితముగా తినుచు పండ్రెండు సంవత్సరములు గడపినచో శుద్ధిపొందును. పరిశుద్ధమైన నడవడిక కలవాడై ప్రవర్తించువాడు బ్రహ్మహత్య దోషమునుండి ఆరు సంవత్సరములలో విముక్తుడగును. కావలెనని ఈపాపము చేసినవారు ఇష్టము లేకుండ చేసినవారికి చెప్పిన ప్రాయశ్చిత్తమునకు రెట్టింపు ప్రాయశ్చిత్తము చేసికొనవలెను. బ్రహ్మహత్య చేయుటకై ఉద్యమించిన వానికి మూడు సంవత్సరములు ప్రాయశ్చిత్తము. బ్రహ్మహత్య చేసిన క్షత్రియునకు రెట్టింపు ప్రాయశ్చిత్తము, వైశ్యునకు రెండు రెట్లు, శూద్రునకు మూడు రెట్లు. ఇతర పాపముల విషయమున బ్రాహ్మణునకు పూర్తి ప్రాయశ్చిత్తము, క్షత్రియునకు మూడు పాదములు, వైశ్యునకు స్త్రీ, వృద్ధ, బాల, రోగులకు ఒకపాదము ప్రాయశ్చిత్తము. క్షత్రియవధ చేసినవారికి బ్రహ్మహత్యా ప్రాయశ్చిత్తములో నాల్గవ వంతు ప్రాయశ్చిత్తము, వైశ్య హత్య యందు ఎనిమిదవవంతు; సదాచారవంతుడగు శూద్రుని హత్యయందు పదహారవ వంతు.

దుష్టురాలు కాని స్త్రీని చంపినవాడు శూద్రహత్యకు చెప్పిన ప్రాయశ్చిత్తము చేసికొనవలెను. గోవును చంపినవాడు మాసము పాటు పంచగవ్యములు భక్షించుచు నియతుడై, గోష్ఠమునందు శయనించుచు, గోవులను అనుసరించుచు, గోవును దానముచేయుటచే శుద్ధుడగును. లేదా కృచ్ఛ్రమును, అతి కృచ్ఛ్రమును చేయవలెను. క్షత్రియాదులందు పాదము చొప్పున ప్రాయశ్చిత్తము తగ్గును. చాల ముసలిది, చాల దుర్బలముగా నున్నది, చాల బాల్యావస్థలో ఉన్నదియగు గోవును చంపిన ద్విజుడుపైన చెప్పిన వ్రతమును సగము చేయవలెను. గుద్దుచేతగాని, చెంపదెబ్బచేత గాని, కీలముచేత గాని గోవును హింసించినను; చెవులు మొదలగునవి విరుగగొట్టినపుడును, కఱ్ఱ మొదలగువాటితో కొట్టినను దానిని గోవధగా చెప్పవలెను. లొంగదీసికొనునపుడును, లొంగ దీయించేటప్పుడును, బండమొదలైన వాటికి కట్టినపుడును, స్తంభము, గొలుసు, త్రాడు మొదలైన వాటిచే చనిపోయినను ఒక పాదము తక్కువ చేయవలెను. కఱ్ఱచే కొట్టగా చనిపోయినచో సాంతపనము, మట్టిబెడ్డతో కొట్టినపుడు చనిపోయినచో ప్రాజాపత్యమును, ఱాయితో కొట్టగా చనిపోయి

నచో తప్త కృచ్ఛ్రమును, శస్త్రముచే మరణించగా అతికృచ్ఛ్రమును ఆచరించవలెను. పిల్లిని, ఉడుమును, ముంగిసను, కప్పను, కుక్కను, పక్షిని చంపినవాడు మూడు దినములు క్షీరము మాత్రమే త్రాగి, కృచ్ఛ్రమును, చాంద్రాయణమును చేయవలెను. ఈ వధ రహస్యముగా చేసినచో వ్రతము కూడ రహస్యముగా చేయవలెను. ప్రకాశముగా చేసినపుడు ప్రకాశముగా చేయవలెను. సర్వ పాపములను తొలగించుకొనుటకు నూరు ప్రాణాయామములు చేయ వలెను. పానకము, ద్రాక్షామధువు, ఖర్జూర జన్యము, తాళవృక్ష భవము, ఇక్షురసభవము. మాధ్వీకము, టంకమాధ్వీకము, మైరేయము, నారికేళ వృక్ష మలము, ఇవన్నియు మద్యములే (మాదకములే) అయినను మద్యములు కావు. పిష్టముతో తయారుచేసినదే నిజమైన సుర. మూడు వర్ణముల వారికిని నిషిద్ధములగు మద్యములను త్రాగినవాడు బాగా మరుగుచున్న నీళ్లు త్రాగి శుద్ధుడగును. లేదా ఒక సంవత్సరము ధాన్య కణములను మాత్రమే తినవలెను. లేదా ఒక పర్యాయము మాత్రమే రాత్రియందు తెలక పిండి తినుచు సంవత్సరము గడపవలెను. సురాపాన దోష నివృత్తి కొరకు జటాధారియై, సురాపానము చేసిన గుర్తు ధరించి కంబళ ధారియై ఉండవలెను.

మలమూత్రములను, సురతగిలిన ఆహారమును తెలియక భుజించిన మూడు వర్ణముల వారును పునః సంస్కారార్హులు మద్యభాండములో ఉన్న నీళ్ళు త్రాగినవాడు ఏడు రోజులు వ్రతము చేయవలెను. చాండాలోదకము త్రాగినవాడు ఆరు దినములు వ్రతము ఆచరించవలెను. చాండాలుల కూప భాండముల యందు నీరు త్రాగినవాడు సాంతపనము చేయవలెను. అంత్యజాతీయుల జలము త్రాగిన ద్విజుడు త్రిరాత్రి ఉపవాసము చేసిన పంచగవ్య ప్రాశనము చేయవలెను. మత్స్య ములు, కంటకములు, శంబూకము (నత్త గుల్ల) శంఖములు, ముత్యపు చిప్పలు, కపర్దములు, తిన్నవాడును, నవోదకము త్రాగిన వాడును పంచ గవ్యముచే శుద్ధుడు అగును. శవ కూపోదకము త్రాగినవాడు మూడు రాత్రులలో శుద్ధుడగును. చాండాలాన్నము తిన్నవాడు చాంద్రాయణ వ్రతము చేయవలెను. ఆపత్కాలమునందు శూద్రగృహమున భుజించినవాడు మనస్తాపముచే శుద్ధుడు అగును. శూద్రులపాత్రలో భుజించిన విప్రుడు ఉపవాసము ఉండి పంచగవ్య భక్షణ చేయుటచే శుద్ధుడు అగును. కందుపక్వమును (మంగలములో వేయించిన పదార్థము) తైల పక్వమును స్నేహపదార్థము, పెరుగుతో కలసిన సక్తువు గుడక్షీరరసాదికము కూడ శూద్రుని నుండి గ్రహించినను అనింద్యములు. స్నానము చేయకుండ భుజించిన వాడు ఉపవాసముచేసి దినాంతము నందు జపము చేయుటచే శుద్ధుడగును. మూత్ర విసర్జనచేసి అశుచిగా నున్నపుడు భుజించినవాడు మూడు రాత్రుల ఉపవాస ముచే శుద్ధుడగును. కేశ కీటాదులతో కూడిన దానిని, కావలెనని పాదముతో స్పృశించిన దానిని, కాకులు తిన్నదానిని, కుక్క ముట్టినదానిని, గవాదులు వాసన చూచిన దానిని తిన్నవాడు మూడు దినములు ఉపవాసము చేయవలెను. రేతస్సును, మల మూత్రములను భక్షించినవాడు ప్రాజా పత్యమును ఆచరింపవలెను.

నవశ్రాద్ధమునందు భోజనము చేసినవాడు చాంద్రాయణమును, మాసికము నందు పరాక ప్రాయశ్చిత్తము, పక్షత్రయ శ్రాద్ధమునందు అతి కృచ్ఛ్రమును, షణ్మాసము నందు కృచ్ఛ్రమును, ఆబ్దికమునందు పాద కృచ్ఛ్రమును, మరల ఆబ్దికమునందు ఏకాహము వెనుకటి రోజున వార్షిక

శ్రాద్ధము మరునాడుమరల ఆబ్దికము నందు ఏకాహము చేయవలెను. నిషిద్ధవస్తువులను భక్షించినచో ఉపవాసముండుట ప్రాయశ్చిత్తము. భూతృణమును, అశునము(వెల్లుల్లి)ను తిన్నవాడు శిశుక కృచ్ఛ్రము చేయవలెను. అభోజ్యుల అన్నము తిన్నను, స్త్రీ శూద్రోచ్ఛిష్టమును తిన్నను, అభక్ష్య మాంసమును తిన్నను ఏడు దినములు పాలుత్రాగవలెను. మధు మాంసములను, శావాశౌచాన్న మును తిన్న బ్రహ్మచారియు, యతియు వ్రతస్థుడును ప్రాజాపత్య – కృచ్ఛ్రములు చేయవలెను. అన్యాయముచే పరధనా పహరణము స్తేయము (దొంగతనము). స్వర్ణస్తేయము చేసినవాడు రాజుచే ముసలముతో కొట్టి చంపబడినచో శుద్ధుడగును. స్వర్ణస్తేయము చేసినవాడును, సురాపానము చేసిన వాడును, బ్రహ్మహత్య చేసినవాడును, గురుతల్పగుడును క్రింద పండుకొనుచు, జటాధారియై ఆకులు, దుంపలు, ఫలములు మాత్రము ఒక పూటమాత్రమే తినుచు ఉన్నచో పంద్రెండు సంవత్సర ములలో శుద్ధుడగును (కృచ్ఛ్రము)స్తేయము చేసినవాడును, సురాపానము చేసిన వాడును ఒక సంవత్సరము సురాపానము చేయవలెను. మణులు, ముత్యములు, పొగడములు, రాగి, వెండి, ఇనుము, కంచు, రాళ్ళు అపహరించినవాడు చాంద్రాయణము చేయవలెను. భక్ష్యములను, భోజ్యము లను, వాహనములను, శయ్యను, ఆసనమును, పుష్పమూల ఫలములను అపహరించినచో పంచ గవ్యముచే శుద్ధియగును.

తృణ–కాష్ఠ–ద్రుమములను, శుష్కాన్నమును, బెల్లమును, వస్త్ర–చర్మ–మాంసము లను అపహ రించినవాడు మూడు దినములు ఉపవాసము చేయవలెను. తండ్రి భార్య, సోదరి, ఆచార్యపుత్రి, గురుభార్య, స్వసుత వీరితో సంగమము చేసినవాడు గురుతల్పగుడు. ఈ పాపము చేసినవాడు చేసిన పాపమును చెప్పుచు, కాలుచున్న ఇనుప పెనముపై ప్రజ్వలించుచున్న ఇనుప స్త్రీ మూర్తిని కౌగలించుకొని మరణించినచో శుద్ధి పొందును. లేదా గురుతల్పగుడు మూడు చాంద్రాయణములను చేయవలెను. పతిత స్త్రీలు కూడ ఇట్లే చేయవలెను. పర భార్యాగాములైన పురుషులకు ఏది ప్రాయశ్చిత్తమో స్త్రీలకుగూడ అదే ప్రాయశ్చిత్తము. బాలికలు, చాండాల స్త్రీలు, కుమార్తెలు, సపిండుల కుమార్తెలు భార్యలు, వీరి సంగము చేసినవానికి మరణమే ప్రాయశ్చిత్తము. ఒక రాత్రి శూద్ర స్త్రీ సంగము చేసిన ద్విజుడు భిక్షాన్నము తినుచు, నిత్యము జపము చేసినచో మూడు మాసములలో ఆ దోషమును పోగొట్టుకొనును. తండ్రి సోదరుని భార్య, సోదరుని భార్య, చాండాల స్త్రీ, పుక్కసీస్త్రీ, కోడలు సోదరి, సఖురాలు, తల్లి దండ్రుల సోదరి, తన దగ్గర రక్షణ నిమిత్తమై ఉంచిన స్త్రీ, శరణు జొచ్చిన స్త్రీ, మేనమామ కూతురు, సోదరి, సగోత్రయైన స్త్రీ, అన్యుని కోరుచున్న స్త్రీ, శిష్యభార్య, గురుభార్య వీరితో సంగము చేసినవాడు చాంద్రాయ ణము చేయవలెను. (173)

ప్రాయశ్చిత్తములు (ఆ)

దేవాలయాదులలో అర్చనాదులు చేయుటలో ఏవైన లోపములు వచ్చినచో అట్టి లోపములు చేసినవాడు ప్రాయశ్చిత్తము చేయవలెను. పూజా లోపము కలిగినచో నూట ఎనిమిది పర్యాయములు జపముచేసి, రెట్టింపు పూజ చేయవలెను. పంచోపనిషన్మంత్రములతో హోమముచేసి బ్రాహ్మణ భోజనము చేయించవలెను. సూతిక కలవారుగాని, అంత్యజులుగాని, రజస్వలగాని దేవుని

స్పృశించినచో నూరు పర్యాయములు జపముచేసి పంచోప నిష న్మంత్రములతో పూజ రెట్టింపు అభిషేకము చేయవలెను. హోమమునందు లోపము ఉన్నచో బ్రాహ్మణ భోజనము హోమస్నానము, అర్చనము చేయవలెను. హోమద్రవ్యము ఎలుకలు మొదలగు వాటిచే భక్షింపబడినను, కీటకములతో కూడినను ఆ భాగమును త్యజించి, మిగిలిన దానిని జలముతో ప్రోక్షించి దేవాదిపూజ చేయవలెను. అంకురార్పణము భిన్నమైనను, ఛిన్నమైనను దానిని పరిత్యజించవలెను. ఆ అంకురార్పణ పాత్ర అస్పృశ్యులచే స్పృశింపబడినచో దానిని మరొక పాత్రలో ఉంచి సమర్పించవలెను. పూజాకాలము నందు, దేవమానుష విఘ్నములను తొలగించుటకును, మంత్ర ద్రవ్యాది వ్యత్యాసము కలిగినపుడును మూల మంత్రమును జపించి మరల జపము చేయవలెను. దేవాలయము నందలి కుంభము నష్టమైనపుడు శతవార జపము, దేవతా ప్రతిమ చేతి నుండి జారిపడి పోయినచో ఉపవాసము చేసి నూరు హోమములు చేసినచో శుభమగును. పాపముచేసి పశ్చాత్తాపము చెందువానికి హరినామ స్మరణమే పరమ ప్రాయశ్చిత్తము. చాంద్రాయణము, పరాకము, ప్రాజాపత్యము పాపములను తొలగించును. సూర్య, శివ, శక్తి, విష్ణు మంత్ర ముల జపము కూడ పాపములను నశింప చేయును. గాయత్రీ, ప్రణవ, స్తోత్ర మంత్రముల జపము కూడ పాప వినాశకము. సూర్య, శివ, శక్తి, విష్ణువుల 'క' కారముతో ప్రారంభమై 'రా' బీజముతో కూడినవియు రాది, ఆది, రాంత మంత్రములును ఒక్కొక్కటి కోట్యధిక ఫలమును ఇచ్చును. ఓం హ్రీంలతో ప్రారంభమైన నమః అంతము నందుండు చతుర్థ్యంత మంత్రములు సర్వకామ ప్రదములు.

నృసింహ ద్వాదశాక్షరీ–అష్టాక్షరీ మంత్రముల జపము పాప సమూహములను నశింపచేయును. అగ్నిపురాణమును చదివినను, విన్నను సకల పాపములు తొలగిపోవును. ద్వి విద్యారూపుడైన విష్ణువు అగ్నిరూపుడుగాను, పరమాత్మగాను, దేవతల ముఖముగను సర్వ వేదములందును గానము చేయబడును. ప్రవృత్తి మార్గమునందును, నివృత్తి మార్గము నందును పూజించబడినవాడైన విష్ణువు యొక్క హవనము ధ్యానము అర్చనము జపము స్తుతి నమస్కారము చేసిన శరీరము నందలి సకల పాపములను తొలగించును. పది విధములైన స్వర్ణ దానములు ద్వాదశవిధ ధాన్య దానములు తులా పురుషదానము మొదలైన షోడశ మహా దానములు అన్న దానములు ఇవి సర్వ పాపములను తొలగించును. తిథి, వార, నక్షత్ర, సంక్రమణ, యోగ, మన్వంతర ఆరంభాది కాలములందు సూర్య, శివ, శక్తి, శ్రీమహావిష్ణు వ్రతాదులు పాపనాశకములు. గంగ, గయ, ప్రయాగ, కాశి, అయోధ్య, అవంతి, కురుక్షేత్రము, పుష్కరము, నైమిషము, పురుషోత్తముడు, సాలగ్రామము, ప్రభాసము, ఈ తీర్థములు అన్నియు సర్వపాప వినాశకములు. నేనే జ్యోతి రూపమైన పర బ్రహ్మను అను ధ్యానము సకల పాపవినాశకము. బ్రహ్మ పురాణము, అగ్ని పురాణము, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల, అవతారముల పూజ, దేవతా ప్రతిష్ఠ, ప్రతిమాదులు, జ్యోతిః శాస్త్ర పురాణములు, స్మృతులు, తపస్సు, వ్రతములు, అర్థ శాస్త్రము, సృష్టి తత్త్వము, ఆయుర్వేద, ధనుర్వేదములు, శిక్ష, ఛందస్సు, వ్యాకరణము, నిరుక్తము, అభిధానము, కల్పము, న్యాయము, మీమాంస ఇంకా ఇతరమైన అన్ని విద్యలును హరియే, ఒకే విష్ణువు వ్యక్తా వ్యక్త రూపములలో ఉన్నాడు. ఆతని వలననే ఈ జగము జనించి, ఆతని యందే ఉన్నదని తెలిసికొనిన వానిని చూడగనే పాపములు

అన్నియు నశించును. శ్రీమహావిష్ణువే అష్టాదశ విద్యారూపుడు, సూక్ష్మ-స్థూల స్వరూపుడు, అపరుడు, జ్యోతీరూపుడు అక్షర పరబ్రహ్మము, నిర్మలుడు. (174)

వ్రతపరిభాష

అగ్ని దేవుడు పలికెను :

వసిష్ఠా! తిథి, వారము, నక్షత్రము, దివసము, మాసము, ఋతువు, సంవత్సరము, సూర్య సంక్రమణము-వీటి యందు పురుషులు స్త్రీలు ఆచరించదగిన వ్రతములను క్రమముగా చెప్పెదను వినుము. శాస్త్రములలో చెప్పిన నియమమే 'వ్రతము'. అదియే తపస్సు. దమము మొదలగునవి వ్రతమునకే విశిష్టమైన నియమములు. కర్తను తపింప చేయుటచే వ్రతమే 'తపస్సు' అని చెప్పబడును. ఇంద్రియ సముదాయమును వశములో ఉంచుకొనుట నియమము. అగ్నిరహితులగు విప్రులకు ఇది శ్రేయస్కరమని చెప్పబడినది. వ్రతోపవాస నియమములచేతను, నానా విధములగు దానముల్ధ చేతను దేవాదులు సంత సించినవారై భుక్తి ముక్తులను ప్రసాదింతురు. పాపములనుండి మరలినవాడై గుణములతో నివసించుటయే సకల భోగములు విడనాడిన ఉపవాసము. ఉపవాసము చేయువాడు కంచుపాత్రలు, మాంసము, మసూరము (చిరుశనగలు), శనగ, కొఱ్ఱలు, శాకము, మధువు, పరాన్నము, స్త్రీ-వీటిని విడువవలెను. ఉపవాస సమయమున పుష్పాలంకార వస్త్రములు, ధూప గంధాను లేపనములు, దంతకాష్టముతో దంతధావనము, అంజనము-ఇవి నిషి ద్ధములు. ప్రాతః కాలమునందే పంచగవ్యముచేసి వ్రతము ప్రారంభింపవలెను. మాటి మాటికి నీరు త్రాగినను, తాంబూలము భక్షించినను, పగలు నిద్రించినను, మైథునము చేసినను ఉపవాసము చెడిపోవును. ఓర్పు, సత్యము, దయ, దానము, శౌచము, ఇంద్రియ నిగ్రహము, దేవపూజ, అగ్ని హరణము, సంతోషము, అస్తేయము ఈ పదియు సర్వవ్రతములందును అనుసరించవలసిన సామాన్య ధర్మములు. పవిత్ర మంత్రములను జపించవలెను. యథాశక్తిగా హోమము చేయవలెను. నిత్య స్నానము చేయుచు, మితముగా భుజించుచు, గురు, దేవ, బ్రాహ్మణులను పూజించుచు, క్షారము, తేనె, లవణము మధువు, మాంసము విడువవలెను. తిలలు, పెసలు, తప్ప మిగిలిన పప్పుదినుసులు, సస్యములతో గోధుమలు, కొఱ్ఱలు, చీనకము, దేవధాన్యము, శమీధాన్యము, చెరకు నుండి తయారైనవి, శితధాన్యము, పణ్యము, మూలము ఇవి క్షారగణమునకు చెందినవి గాన త్యాజ్యములు. షష్టికవ్రీహి, పెసలు, కలాయములు, తిలలు, యవలు, శ్యామాకములు, గోధూమాదులు, వ్రతము నందు హితమైనవి. గుమ్మడి, ఆనపకాయ, వంకాయ, పాలంకి, పూతిక త్యజించ వలెను. వ్రతమునందును, నక్తాదులందును, అగ్ని కార్యములందును, భిక్షా లబ్ధమగు చరువు, సక్తు కణములు, శాకము, పెరుగు, నెయ్యి, పాలు, శ్యామాక, శాలి, నీవారములు, యవలు, మూల తండులములు, హవిష్య ములు, హితములు లేదా వ్రతమునందు మధుమాంసములు తప్ప మిగిలిన వన్నియు హితములే.

ప్రాజాపత్యము నాచరించు ద్విజుడు మూడు దినములు ప్రాతః కాలము, మూడు దినములు సాయంకాలము అయాచితాహారము భుజింపవలెను. పిదప మూడుదినములు ఏమియు తినగూడదు. అతి కృచ్ఛ్రము చేయు ద్విజుడు వెనుక చెప్పినట్లుగనే మూడు దివసములు ఒక్కొక్క గ్రాసమును

తినవలెను. చివర మూడు దివసములు ఉపవాసము చేయవలెను. గోమూత్రము, గోమయము, క్షీరము, పెరుగు, నెయ్యి, కుశోదకము భుజిం చుట ఒకరాత్రి ఉపవాసము-ఇది కృచ్ఛ్ర సాంతపనము. సాంతపనమునకు చెప్పిన ద్రవ్యములు వేరువేరుగా ఒక్కొక్కరోజు చొప్పున ఆరురోజులు భుజించి ఏడవరోజున ఉపవాసము చేసినచో ఇది పాపములను నశింపచేయు మహాసాంతపనము. పండ్రెండు రోజులు ఉపవాసము చేసినచో అది సర్వపాపములను తొలగించు పరాకము. ఇదే మూడు రెట్లు చేసినచో 'మహాపరాకము'. పూర్ణిమనాడు పదునైదు గ్రాసములు భుజించి పిదప ప్రతిదినము ఒక్కొక్క గ్రాసము తగ్గించుచు అమావాస్యనాడు ఉపవాసము చేయవలెను. పిదప ప్రతిపత్తున ఒక గ్రాసము తినుటతో ప్రారంభించి ప్రతి దినము ఒక్కొక్క గ్రాసమును పెంచుతూ తినవలెను. ఇది 'చాంద్రాయణము. ఈ వ్రతము పైనచెప్పిన క్రమమునకు విపరీతముగా కూడ చేయవచ్చును, ఒక పలము కపిల గోమూత్రము, అర్ధాంగుష్ఠ ప్రమాణమగు గోమయము, ఏడు పలముల క్షీరము, రెండు పలముల పెరుగు, ఒక పలము ఘృతము, కుశోదకము ఒక పలము-వీటిలో గోమూత్రమును గాయత్రీ మంత్రముచేతను, గోమయమును 'గంధధ్వారా' ఇత్యాది మంత్రము చేతను, క్షీరమును 'ఆప్యాయస్వ' ఇత్యాది మంత్రము చేతను, పెరుగును 'దధిక్రావ్ణః' అను మంత్రముచేతను, ఆజ్యమును 'తేజోఽసి' ఇత్యాది మంత్రముచేతను, కుశోదకమును 'దేవస్య' ఇత్యాది మంత్రము చేతను ఈ విధముగ గ్రహించినచో అది 'బ్రహ్మ కూర్చము' అఘమర్షణ సూక్తముతో గాని, ప్రణవముతో గాని చేర్చి 'ఆపో హిష్ఠామ' ఇత్యాది మంత్రమును జపించవలెను. ఈ విధముగా త్రాగి పిదప ఉపవాసము ఉన్నవాడు సర్వపాప విముక్తుడై విష్ణు లోకము చేరగల్గును. పగలు ఉపవాస ముండి సాయంకాలము భుజించువాడును, దివసము ఎనిమిది భాగములలో కేవలము ఆరవ భాగమునందు మాత్రము భుజించు సన్యాసియు, అశ్వమేధయాజియు, సత్యము పలుకువాడును స్వర్గమునకు వెళ్లును. అగ్న్యాధానము, ప్రతిష్ఠ యజ్ఞము, దానము, వ్రతము, దేవవ్రతము, వృషోత్సర్గము, చూడా కరణము, మేఖలా బంధము, వివాహము మొదలగు మంగళకార్యములను, అభిషేకము మల మాసములో చేయగూడదు.

అమావాస్య నుండి అమావాస్యకు 'చాంద్ర మాసము' ముప్పది దినములు 'సావన మాసము'. సంక్రాంతి నుండి సంక్రాంతికి 'సౌర మాసము'. అన్ని నక్షత్రములును ఒక పర్యాయము తిరిగి వచ్చినచో నక్షత్ర మాసము. వివాహాదులకు సౌరమాసము, యజ్ఞాదులకు సావన మాసము, శ్రాద్ధాది పితృ కార్యములకు చాంద్రమాసము ఉత్తమమైనవి. ఆషాఢ పూర్ణిమ తరువాత వచ్చు ఐదవ పక్షమునందు పితరులకు తప్పక శ్రాద్ధము చేయవలెను. అప్పటికి సూర్యుడు కన్యారాశి చేరినాడా లేదా అను విచారము అనావశ్య కము. మాసిక-వార్షిక వ్రతములకు ఏదైన ఒక తిథి దినద్వయ వ్యాప్తమైనచో రెండవ దినము నందలి తిథి ఉత్తమమైనది. మొదటిది మలినము. నక్షత్ర వ్రతము నందు, సూర్యుడు ఏ నక్షత్రమునందు అస్తమించునో ఆ నక్షత్రమునందే ఉపవాసము చేయవలెను. దివస వ్రతములకు దినవ్యాపి తిథులును, నక్త వ్రతములకు రాత్రి వ్యాపి తిథులును పుణ్యప్రద ములు, శుభకరములు. ద్వితీయతో, తృతీయ, చతుర్దశితో పూర్ణిమ, అమావాస్యతో ప్రతిపత్తు కలియుట మంచిది. ఇది గొప్పఫలము నిచ్చును. ఇందుకు విపరీతమగు కలయిక ప్రతి పత్తుతో

ద్వితీయ ఇత్యాది విధమున భయానకము. పూర్వము చేసిన పుణ్యములను గూడ నశింపజేయును. రాజు, మంత్రి, వ్రతమధ్యము నందున్నవాడు–వీరికి వివాహము, ఉపద్రవాదులు, దుర్గమ స్థానము, సంకట సమయము యుద్ధము–వీటియందు తత్కాలశుద్ధి చెప్పబడినది. దీర్ఘకాలిక వ్రతము నారంభించిన స్త్రీ మధ్యలో రజస్వలయైనను వ్రతభంగముకాదు. గర్భవతి, ప్రసవగృహము నందున్న స్త్రీ, రజస్వలయగు కన్యశుద్ధులై వ్రతము చేయుటకు అయోగ్యులుగా ఉన్నపుడు ఆ శుభకార్యమును ఇతరులచే చేయించవలెను. క్రోధముచేతగాని, పొరబాటుచేతగాని, లోభముచేతగాని వ్రత భంగమైనచో మూడు దినములు ఉపవాసము ఉండవలెను. లేదా శిరోముండనము చేయించుకొనవలెను. స్వయముగా వ్రతము నాచరించుటకు సామర్థ్యము లేనిచో భార్యచేత గాని, పుత్రునిచేత గాని చేయించవలెను. ప్రారంభించిన వ్రతమును జననాశౌచ, మరణాశౌచములందు కూడ నడిపింపవలెను; పూజాకార్యము మాత్రము చేయగూడదు. వ్రతము నవలంబించిన వాడు ఉపవాసము చేయుటచే మూర్ఛితుడైనచో గురువు ఆతనిని పాలుత్రాగించి గాని, మరియేదైన ఉపాయముచేత గాని మరల స్పృహలోనికి వచ్చునట్లు చేయవలెను. జలము, ఫలము, మూలము, పాలు, హవిష్యము (నెయ్యి) బ్రాహ్మణేచ్ఛా పూర్తి, గురు వచనము, ఔషధము–ఇవి వ్రత భంగకరములు కావు (వ్రతము చేయువాడు ఆ దేవతను ఈ విధముగా ప్రార్థించవలెను); 'వ్రతపతే! కీర్తి, సంతాన, విద్యాదుల కొరకును, సౌభాగ్య, ఆరోగ్య, అభివృద్ధి, నిర్మలతా, భోగ, మోక్షముల కొరకును నేను ఈ వ్రతము నాచరించుచున్నాను. ఈ శ్రేష్ఠ వ్రతమును నీ ఎదుటనే గ్రహించినాను. జగత్పతీ! నీ అనుగ్రహముచే ఇది నిర్వి ఘ్నముగ కొనసాగు గాక. ఓ వ్రత పాలకా! ఈ వ్రతమును గ్రహించిన తరువాత ఇది పూర్తి కాకుండగనే నేను మరణించినచో, నీ అనుగ్రహముచే ఇది పూర్ణమగు గాక !

కేశవా! వ్రత స్వరూపుడవును, జగత్కారణ భూతుడవును అగు నిన్ను సర్వసిద్ధి నిమిత్తమై మండలములపై ఆవాహనము చేయుచున్నాను. నీకు నమస్కారము. సన్నిహితు డవై ఉండుము. మనస్సుచే కల్పితములగు పంచగవ్యములతోను, శుభములైన జలముల తోడను. పంచామృతముల తోడను భక్తి పూర్వకముగ అభిషేకము చేయుచున్నాను. నీవు నా పాపములను తొలగించుము. ఓ! అర్ఘ్యపతీ! గంధపుష్ప–ఉదయుక్తమగు శుభమైన అర్ఘ్యమును స్వీకరించి నన్ను సర్వదా అర్ఘ్య యోగ్యునిగా చేయుము. ఓ! వస్త్రపతీ! పుణ్యమైన వస్త్రములను గ్రహింపుము. ఓ వ్రత సత్పతీ! నన్ను భూషణ సువస్త్రాదులచే ఆచ్ఛాదింపబడిన వానినిగా చేయుము. ఓ గంధమూర్తీ! విమలమైన సుగంధియగు గంధమును స్వీకరింపుము. నన్ను పాప గంధవిహీనునిగాను మంచి గంధము కలవానినిగాను చేయుము. పుష్పమును గ్రహింపుము. నన్ను పుష్ప పూర్ణునిగాను, పుష్పగంధముగల వానినిగాను, ఆయురారోగ్య వృద్ధి కొరకై చాల విమలునిగాను చేయుము. దశాంగములు గలదియు గుగ్గులు ఘృతయుక్తమునగు ధూపమును గ్రహింపుము. ధూపితుడవై ఓ సత్పతీ! నన్ను ధూప ధూపితునిగా చేయుము. ఊర్ధ్వ శిఖగలదియు సర్వమును ప్రకాశింపచేయునదియు అగు దీపించుచున్న దీపమును గ్రహింపుము. ఓ! దీపమూర్తీ! నన్ను సర్వదా ప్రకాశముతో నిండిన వానినిగాను, ఊర్ధ్వ గమనము కలవానినిగాను చేయుము. అన్నాదులకు ప్రభువైన వాడా! అన్నాదికమగు నైవేద్యమును స్వీకరింపుము. నన్ను అన్నాదులతో పూర్ణునిగాను అన్నదానము చేయువానిని

గాను, సర్వదాతగాను చేయుము. ఓ! ప్రభూ! వ్రతపతీ! మంత్ర హీనముగా గాని, క్రియా హీనముగా గాని, భక్తి హీనముగాగాని నేను చేసిన పూజ పరిపూర్ణము అగుగాక. నాకు ధర్మమును ఇమ్ము. ధనమును సౌభాగ్యమును, గుణ సముదా యమును, కీర్తిని, విద్యను, ఆయుర్దాయమును, స్వర్గమును, మోక్షమును ఇమ్ము. ఓ! వ్రతపతీ! ఈ పూజను స్వీకరించి పునరాగమనార్థమును వరములను ఇచ్చుటకును ఇపుడు వెళ్ళుము. అన్ని వ్రతములందును వ్రతధారి యగువాడు భూమిపై శయనించుచు సువర్ణ మయములగు ఆ వ్రత మూర్తులను యథాశక్తిగా పూజించవలెను. వ్రతాంతమునందు జపము హోమము దానము ఇవి సామాన్య కర్తవ్యములు. పూజ్యులగు విప్రులకు ఇరువది నలుగురికి గాని, పండ్రెండుగురికి గాని, ఐదుగురికి గాని, ఒకరికి గాని భోజనము పెట్టవలెను. శక్త్యానుసారము దక్షిణలుగా వారికి వేరువేరుగా గోవులను, సువర్ణాదులను, జల పాత్రమును, అన్న పాత్రమును, మృత్తికను, ఛత్రమును, ఆసనమును, శయ్యను, వస్త్రయుగమును, కుంభములను ఇవ్వవలెను. ఇట్లు వ్రతపరిభాష చెప్పబడినది. (175)

ప్రతిపత్ వ్రతములు (పాడ్యమి వ్రతములు)

అన్ని కోరికలను తీర్చు ప్రతిపదాదివ్రతములను గూర్చి నీకు చెప్పెదను. కార్తిక, ఆశ్వయుజ, చైత్ర మాసములందలి ప్రతిపత్తు బ్రహ్మ ప్రీతికరమగు తిథి. పూర్ణిమయందు ఉపవాసముచేసి ప్రతిపత్తు నందు ఓం తత్సద్బ్రహ్మణే నమః అను మంత్రముతో బ్రహ్మను పూజించవలెను. లేదా ఒక సంవత్సరము పాటు గాయత్రీ మంత్రముతో కుడి చేతులలో అక్షమాలను, స్రువమును, ఎడమ చేతులలో స్రుక్కును, కమండలమును ధరించుచున్న వాడును, దీర్ఘమైన గడ్డముగలవాడును, జటాధారియు, సువర్ణ వర్ణము గలవాడును అగు బ్రహ్మను పూజించవలెను. నా విషయమున బ్రహ్మ అనుగ్రహించు గాక! అని పలుకుచు శక్త్యానుసారముగా క్షీరమును సమర్పించవలెను. ఈ విధముగ చేసిన విప్రుడు పాపవిముక్తుడై భూమి యందు ధనవంతుడై, స్వర్గమునందు భోగములను అనుభ వించును. ఇపుడు ధన్యవ్రతమును గూర్చి చెప్పెదను. దానిని చేయుటచే అధన్యుడు ధన్యు డగును. మార్గ శీర్ష ప్రతిపత్తు నందు రాత్రి హోమము చేసి ఉపవాసము ఉన్నవాడై, అగ్నయే నమః అను మంత్రముచే ఒక సంవత్సరము అగ్నిని పూజించి, సర్వ కామములను పొందును. ప్రతిపత్తు నందు ఒక్క పర్యాయమే భుజించుచు, సమాప్తమైన పిదప కపిల గోవును దానము చేసినవాడు వైశ్వానరుని స్థానమును చేరును. ఇది శిఖి వ్రతము.(176)

విదియా వ్రతములు

అగ్ని దేవుడు చెప్పెను :

నేను ఇపుడు భుక్తి ముక్తి ప్రదములగు ద్వితీయా వ్రతములను గూర్చి చెప్పెదను. ప్రతి మాసము నందును ద్వితీయ(విదియ)యందు పుష్పములు మాత్రము భుజించవలెను. అశ్వినీ దేవతలను పూజించవలెను. ఒక సంవత్సరము ఈ వ్రతమును అనుష్ఠించుటచేత సౌందర్యము, సౌభాగ్యము లభించును. అంతమున స్వర్గము లభించును. కార్తిక శుక్ల ద్వితీయయందు యముని

పూజించవలెను. పిదప ఒక సంవత్సరము ప్రతి శుక్ల ద్వితీయ యందును ఉపవాస పూర్వకముగ వ్రతము ఆచరించవలెను. ఇట్లు చేయుటచే మానవుడు స్వర్గమునకు వెళ్ళును. నరకమునకు వెళ్ళడు. ఇపుడు అశూన్యశయన వ్రతమును చెప్పెదను. ఇది స్త్రీలకు అవైధవ్యమును, పురుషులకు సర్వదా భార్యా సుఖమును ఇచ్చును. శ్రావణ కృష్ణ పక్ష ద్వితీయయందు ఈ వ్రతమును అనుష్ఠించవలెను. 'వక్షః స్థలమునందు శ్రీవత్సమును ధరించిన ఓ శ్రీకాన్తా! నీవు లక్ష్మీ నివాస భూతుడవు. లక్ష్మీపతివి. వినాశన రహితుడవగు సనాతన పరమేశ్వరుడవు. ధర్మార్థకామములకు నిలయమగు నా గార్హస్థ్యము నీ కృపచే సుస్థిరముగా నుండుగాక. నా గృహమునందలి అగ్ని ఎన్నటికిని చల్లారకుండు గాక! గృహ దేవత ఎన్నడును అదృశ్యురాలు కాకుండుగాక. నా పితరులకు నాశము కలుగకుండుగాక! నా దాంపత్యము విహతము కాకుండుగాక! నీకు ఏ విధముగ ఎన్నడును లక్ష్మీ వియోగము కలుగదో అట్లే నాకును పత్నీవియోగ మెన్నడును కలుగ కుండుగాక. వరదాతవైన ఓ ప్రభూ! నీ శయనము ఏ విధముగ లక్ష్మీ విహీనము కాదో అదే విధముగ నాశయ్య కూడ పత్నీ విహీనము కాకుండు గాక'– అని ఈ విధముగ శ్రీమహావిష్ణువును ప్రార్థించి, వ్రతము ప్రారంభించి, ఒక్క సంవత్సరము వరకును ప్రతిమాసమునందును, ద్వితీయయందు లక్ష్మీ విష్ణువులను యథావిధిగా పూజించవలెను. శయ్యాదానము, ఫలదానము చేయవలెను. ప్రతి మాసమునందును అదే తిథియందు చంద్రునకు మంత్రోచ్చారణ పూర్వకముగా అర్ఘ్య ప్రదానము చేయవలెను. 'భగవంతుడ వైన చంద్రా! నీవు గగన ప్రాంగణమును దీపింపచేయువాడవు. క్షీరసాగరమును మథించు టచే నీవు ఆవిర్భవించితివి. నీవు నీ కాంతిచే సకల దిఙ్మండలమును ప్రకాశింప చేయుచు న్నావు. ఓ లక్ష్మీదేవి తమ్ముడా! నీకు నమస్కారము' అని ఆ మంత్రమునకు అర్థము. 'ఓం శ్రీం శ్రీధరాయ నమః' అను మంత్రముతో సోమరూపుడగు శ్రీహరిని పూజించవలెను. 'ఘం టం హం సం శ్రియై నమః' అను మంత్రముతో లక్ష్మీదేవిని, 'దశ రూప మహాత్మనే నమః' అను మంత్రముతో శ్రీ మహావిష్ణువును పూజించవలెను. రాత్రి ఆజ్యహోమముచేసి బ్రాహ్మణునకు శయ్యాదానము చేయవలెను. దానితో దీపము, అన్నముతో నింపిన పాత్ర, ఛత్రము, పాదుకలు, ఆసనము, జలపూర్ణ కలశము శ్రీహరి ప్రతిమ, పాత్రకూడ బ్రాహ్మ ణునకు దానము చేయవలెను. ఈ విధముగా వ్రతపాలనము చేసినవాడు భోగ మోక్ష ములకు అర్హుడగును. ఇపుడు కాంతి వ్రతమును వర్ణించెదను. కార్తిక శుక్ల ద్వితీయయందు దీనిని ప్రారంభించవలెను. పగలు ఉపవాసముచేసి, రాత్రి భోజనము చేయవలెను. ఈ వ్రతమునందు శ్రీకృష్ణ బలరాములను పూజించవలెను. ఈ విధముగ ఒక సంవత్సరము వ్రతము చేసినవాడు కాంతి, ఆయుర్దాయము, ఆరోగ్యము మొదలగువాటిని పొందును.

ఇపుడు మనోవాంఛితములను ఇచ్చు విష్ణు వ్రతమును వర్ణించెదను. పుష్య శుక్ల ద్వితీయనాడు ప్రారంభించి వ్రతము నాలుగు దినములు చేయబడును. మొదటి దినమున ఆవాలు కలిపిన జలముతో స్నానము చేయవలెను. రెండవ దినమున తిలలు కలిపిన జలముతోను, మూడవ దినమున వచ అను ఓషధి కలిపిన జలముతోను, నాల్గవ దివస మున సర్వౌషధి మిశ్ర జలముతోను స్నానము చేయవలెను. సురామాంసి, వచ, కుష్టము, శైలేయము, రెండురకముల పసుపు, శటి, చంపకము, ముస్తము, అను ఓషధుల సముదాయమునకు సర్వౌషధులని పేరు. మొదటి దివసమున

'శ్రీకృష్ణాయ నమః', రెండవ దివసమున 'అచ్యుతాయ నమః' మూడవ దివసమున 'అనన్తాయ నమః' నాల్గవ దివసమున 'హృషీకేశాయ నమః' అను నామ మంత్రములతో వరుసగా భగవంతుని చరణ, నాభి, నేత్ర, శిరస్సులందు పుష్పములు సమర్పించుచు పూజచేయవలెను. ప్రతిదినము ప్రదోష సమయమునందు చంద్రునకు అర్ఘ ప్రదానము చేయవలెను. నాలుగు దినములందును వరుసగా 'శశినే నమః', 'చంద్రాయ నమః', 'శశాఙ్కాయ నమః', 'ఇన్దవే నమః' అను మంత్రములతో అర్ఘ్య ప్రదానము చేయవలెను. రాత్రి చంద్రుడు కనబడునంత కాలము లోపల భోజనము చేయ వలెను. ఈ విధముగ ఆరు మాసములు లేదా ఒక సంవత్సరము ఈ వ్రత మాచరించినవాడు సంపూర్ణ వాంఛితములను పొందును. పూర్వ కాలమున రాజులు, స్త్రీలు, దేవతలు కూడ ఈ వ్రతమాచరించిరి. (177)

తృతీయాతిథి వ్రతములు

అగ్ని దేవుడు చెప్పెను :

ఇపుడు భుక్తి ముక్తి ప్రదములగు తృతీయా (తదియ) వ్రతములను చెప్పెదను. లలితా తృతీయనాడు చేయు మూలగౌరీ వ్రతమును వినుము. పరమేశ్వరుడు చైత్ర శుక్ల తృతీయ దివసమున పార్వతిని వివాహమాడెను. అందుచే ఆ దివసమున తిలమిశ్ర జలముతో స్నానమాచరించి, పార్వతీ సమేతుడగు పరమేశ్వరుని బంగారము, ఫలములు మొదలగు వాటితో పూజించవలెను. నమోస్తు పాటలాయై అని చెప్పి పార్వతి పాదములను, శంకరుని పాదములను పూజించవలెను. శివాయ నమః అని శివుని, జయాయై నమః అని పార్వతిని అర్చించవలెను. త్రిపురఘ్నాయ నమః 'భవాన్యై నమః' అని చెప్పుచు క్రమముగా శివపార్వతుల జంఘలను పూజించవలెను. 'రుద్రేశ్వరాయ నమః, 'విజయాయై నమః' అని చెప్పుచు శివపార్వతుల మోకాళ్ళు పూజించవలెను. 'ఈశాయై నమః', 'శంక రాయ నమః' అని చెప్పుచు వరుసగా పార్వతీ శివుల కటి భాగమును, 'కోటవ్యై నమః', 'శూలపాణయే నమః' అని చెప్పుచు కుక్షి ప్రదేశములను, 'మఙ్గలాయై నమః', 'తుభ్యం నమః' అని చెప్పుచు వారి ఉదరమును పూజించవలెను. 'సర్వాత్మనే నమః', 'ఈశాన్యై నమః' అని చెప్పుచు వరుసగా శివ పార్వతుల స్తనములను, 'దేవాత్మనే నమః', 'హ్రాదిన్యై నమః' అని చెప్పుచు కంఠ ప్రదేశమును, 'మహాదేవాయ నమః', 'అనన్తాయై నమః' అని హస్తములను, 'త్రిలోచనాయ నమః', 'కాలానల ప్రియాయై నమః' అని భుజములను, 'మహేశాయ నమః', 'సౌభాగ్యాయై నమః' అని వారి అలంకారములను పూజించవలెను. పిదప 'అశోక మధువాసిన్యై నమః', 'ఈశ్వరాయ నమః' అని చెప్పుచు వరుసగా పార్వతీ పరమేశ్వరుల ఓష్ఠములను, 'చతుర్ముఖ ప్రియాయై నమః', 'హరాయ స్థాణవే నమః' అని ముఖములను పూజించవలెను. 'అర్ధనారీశాయ నమః', 'అమితాఙ్గాయై నమః' అని శివపార్వతుల నాసికలను, 'ఉగ్రాయనమః', 'లలితాయైనమః' అని కనుబొమ్మలను పూజించవలెను.

'శర్వాయ నమః', 'వాసన్త్యై నమః' అని చెచు వరుసగ శివపార్వతుల తాలు ప్రదేశమును పూజించవలెను. 'శ్రీకణ్ఠనాథాయై నమః', 'శితికణ్ఠాయ నమః' అని చెప్పుచు వరుసగా పార్వతీ పరమేశ్వరుల కేశపాశములను పూజించవలెను. 'భీమోగ్రాయ నమః', 'సురూపిణ్యై నమః' అని

చెప్పుచు శివపార్వతుల శిరస్సులను పూజించవలెను. 'సర్వాత్మనే నమః' అని చెప్పి పూజను ఉపసంహరించవలెను. చైత్రము మొదలు పంద్రెండు మాసము లందు వరుసగా మల్లిక, అశోకము, కమలము, కుందము, తగరము, మాలతి, కదంబము, కరవీరము, బాణము, అమ్లానము, కుంకుమము, సింధువారము–ఈ పుష్పములతో శివపూజ చేయవలెను. ఉమామహేశ్వర పూజానంతరము వారి ఎదుట–ఘృతమిశ్ర నిష్పావము, కుసుంభము, దుగ్ధము, జీవకము, దూర్వలు, చెరకు కఱ్ఱ, ఉప్పు, కొత్తిమిరి అను ఎనిమిది సౌభాగ్య ద్రవ్యములను ఉంచవలెను. చైత్రమాసమున పర్వత శిఖరాగ్ర జలము త్రాగి పార్వతీ పరమేశ్వరుల సముఖమున శయనించవలెను. ప్రాతః స్నానము చేసి, పార్వతీ పరమేశ్వరుల పూజచేసి, బ్రాహ్మణ దంపతులను అర్చించి 'లలితా ప్రీయతాం మమ' అని చెప్పుచు ఆ అష్ట సౌభాగ్య ద్రవ్యములను దానము చేయవలెను. వ్రతమాచరించువాడు, చైత్రాది మాసములందు వరుసగా వ్రతదినములలో, పర్వత శిఖర జలమును, గోమయమును, మందారమును, బిల్వపత్రములను, ఘృతమిశ్రమగు పెరుగును, గోమూత్ర మును, ఘృతమును, నల్లని తిలలను, పంచగవ్యములను భుజించవలెను. సౌభాగ్యాష్టకము దానము చేయుసమయమున, చైత్రాది మాసములందు, వరుసగా 'ప్రీయతాం మమ' అనుదానికి 'లలితా, విజయా, భద్రా, భవానీ, కుముదా, శివా, వాసుదేవీ, గౌరీ, మంగళా, కమలా, సతీ' అనునవి చేర్చవలెను. వ్రతము ముగిసిన తరువాత ఏదైన ఒక ఫలమును పరిత్యజించవలెను. గురువునకు తలగడలతో గూడిన శయ్యను, స్వర్ణ నిర్మితమగు ఉమా మహేశ్వరమూర్తిని, గోసహిత వృషభమును దానము చేయవలెను. గురువునకును, బ్రాహ్మణ దంపతులకును వస్త్రాదులతో సత్కారము చేసినవాడు భుక్తి ముక్తులను పొందును. 'సౌభాగ్య శయనము' అను ఈ వ్రతమును ఆచరించుటచే మనుష్యుడు సౌభాగ్య, ఆరోగ్య, రూప, దీర్ఘాయువులను పొందును.

భాద్రపద, వైశాఖ, మార్గశీర్ష శుక్ల తృతీయలందు గూడ ఈ వ్రతము చేయవచ్చును. 'లలితాయై నమః' అని చెప్పుచు పార్వతీపూజ చేయవలెను. ప్రతి పక్షమునందును ఈ విధముగా పూజించి వ్రతాంతమునందు ఇరువది నలుగురు దంపతులకు వస్త్రదానము చేయువాడు భుక్తి ముక్తులను పొందును. ఇది సౌభాగ్యశయన వ్రతము రెండవవిధి. ఇపుడు సౌభాగ్య వ్రతమును గూర్చి చెప్పెదను. ఫాల్గుణాది మాసముల శుక్లపక్ష తృతీయల యందు వ్రతము చేయువాడు ఉప్పు పరిత్యజించవలెను. వ్రతము సమాప్తమైన పిమ్మట బ్రాహ్మణ దంపతి పూజచేసి, 'భవానీ ప్రీయతామ్' అని చెప్పి శయ్య, సంపూర్ణ సామగ్రి చేర్చి గృహము దానము చేయవలెను. ఇది సౌభాగ్య తృతీయా వ్రతము, ఇది పార్వత్యాది లోకములను ఇచ్చును. మాఘ, భాద్రపద, వైశాఖ తృతీయలందు గూడ ఈ విధముగనే చేయవలెను. చైత్రము నందు దమనక తృతీయా వ్రతమాచరించి దమనక పుష్పముతో పార్వతిని పూజించవలెను. మార్గ శీర్షమున ఆత్మ తృతీయావ్రత మాచరించవలెను. దాని యందు పార్వతీ పూజచేసి బ్రాహ్మణులకు యథేచ్ఛగా భోజనము పెట్టవలెను. మార్గశీర్ష తృతీయతో ప్రారంభించి, క్రమముగా పౌషాది మాసములందు పై వ్రతమును ఆచరించి 'గౌరీ, కాళీ, ఉమా, భద్రా, దుర్గా, కాంతి, సరస్వతీ, వైష్ణవీ, లక్ష్మీ, ప్రకృతి, శివా, నారాయణీ' అను నామములకు ప్రీయతామ్ అని చేర్చి చెప్పవలెను. ఈ విధముగా వ్రతము చేయువాడు సౌభాగ్యమును స్వర్గమును పొందును. (178)

చతుర్థీ వ్రతములు (చవితినాడు జరుపు వ్రతములు)

అగ్నిదేవుడు చెప్పెను :

ఇపుడు భుక్తి ముక్తి ప్రదములగు చతుర్థీ వ్రతములను గూర్చి చెప్పెదను. మాఘ శుక్ల చతుర్థీదివసమున ఉపవాసముచేసి గణేశ పూజచేయవలెను. పంచమినాడు తిలలు భుజించవలెను. ఇట్లు చేసినవాడు అనేక సంవత్సరములపాటు, విఘ్నరహితుడై సుఖముగా ఉండును. 'గం స్వాహా' అనునది మూలమంత్రము, 'గాం నమః' ఇత్యాదులతో హృదయాది న్యాసము చేయవలెను. 'ఆగచ్ఛోల్కాయ' అని గణపతిని ఆవాహనము చేయవలెను. విసర్జన చేయునపుడు 'గచ్ఛోల్కాయ' అని చెప్పవలెను.

ఈ విధముగ ఆదియందు 'గ' కార యుక్తము, అంతమున 'ఉల్కా' శబ్దయుక్తము అగు మంత్రముతో గణపత్యావాహ నాదికము చేయవలెను. గంధాద్యుపచారములు, మోదకాదులు సమర్పించి గణపతి పూజ చేయవలెను. పిదప 'ఓం మహోల్కాయ విద్మహే వక్రతుణ్డాయ ధీమహి తన్నోదన్తీ ప్రచోదయాత్' అను మంత్రము జపించవలెను. భాద్రపద శుక్ల చతుర్థీ దివసమున వ్రతము చేసినవాడు శివ లోకమును పొందును. మంగళవారము కలిసిన చతుర్థినాడు గణపతి పూజచేసినవాడు సకలాభీష్ట వస్తువులు పొందును. ఫాల్గుణ చతుర్థినాడు రాత్రి మాత్రమే భోజనము చేయ వలెను. దీనికి 'అవిఘ్నా చతుర్థి' అని పేరు. చైత్ర చతుర్థినాడు దమనక పుష్పములతో గణపతి పూజ చేసినవాడు సుఖ భోగములను పొందును. (179)

పంచమీ వ్రతములు

అగ్ని పలికెను :

ఆరోగ్య, స్వర్గ, మోక్షప్రదమగు పంచమీ వ్రతమును చెప్పెదను. శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజ, కార్తిక శుక్ల పక్ష పంచమీ తిథులందు వాసుకి, తక్షక, కాలియ, మణిభద్ర, ఐరావత, ధృతరాష్ట్ర, కర్కోటక, ధనంజయులను నాగులను పూజించవలెను. ఈ నాగములు అన్నియు అభయ, ఆయుర్విద్యా, యశో, లక్ష్మలను ఇచ్చెదరు. (180)

షష్ఠీవ్రతాని

అగ్ని దేవుడు చెప్పెను :

ఇపుడు షష్ఠీ వ్రతములను గూర్చి చెప్పెదను. కార్తిక కృష్ణ షష్ఠియందు ఫలములు భుజించి కార్తికేయునకు అర్ఘ్య దానము చేయవలెను. దీనివలన మనుష్యుడు భుక్తి ముక్తులను పొందును. దీనికి స్కందషష్ఠీ వ్రతమని పేరు. భాద్రపద కృష్ణ షష్ఠి యందు అక్షయ షష్ఠీ వ్రతము చేయవలెను. ఇది మార్గ శీర్షమునందు గూడ చేయవలెను. ఈ అక్షయ షష్ఠీ దివసమున ఏ ఒక సంవత్సరము నందైనను ఉపవాసముండువాడు భుక్తి ముక్తులను పొందును. (181)

సప్తమీవ్రతాని

అగ్ని దేవుడు చెప్పెను :

అందరికిని భుక్తి ముక్తి ప్రదమగు సప్తమీ వ్రతమును చెప్పెదను. మాఘశుక్ల సప్తమీ తిథియందు కమలమును నిర్మించి దానిపై సూర్యుని పూజించినవాడు శోకరహితు డగును. భాద్రపద శుక్ల సప్తమియందు సూర్యుని పూజించినచో సకల అభీష్ట వస్తువులు లభించును. పౌష శుక్ల సప్తమియందు ఉపవాసముచేసి సూర్యుని ఆరాధించినచో సకల పాపములును నశించును. మాఘ కృష్ణ సప్తమినాడు 'సర్వాప్తి సప్తమీ' వ్రతము చేసినచో అభీష్ట–వస్తువులు లభించును. ఫాల్గుణ కృష్ణ పక్షమునందు సప్తమీ వ్రతమును చేయవలెను. మార్గ శీర్ష శుక్ల పక్షమున పుత్రీయ సప్తమీ వ్రతము ఒక సంవత్సరము పాటు చేయు స్త్రీలకు పుత్రులు కలుగుదురు. (182)

అష్టమీ వ్రతములు - I

అగ్ని దేవుడు పలికెను :

ఇపుడు అష్టమీ తిథియందు జరుపబడు వ్రతములను వర్ణింతును. వాటిలో మొదటిది రోహిణీ యుక్త అష్టమీ వ్రతము. భాద్రపద కృష్ణ పక్షమున రోహిణీ యుక్తాష్టమీ తిథియందు అర్ధరాత్రి శ్రీకృష్ణుడు అవతరించెను. అందుచే ఈ అష్టమి జయంతిగా చెప్పబడుచున్నది. ఆ దినమున ఉప వాసము చేయువాడు సప్త జన్మ కృతపాపముల నుండి విముక్తు డగును. భాద్రపదమున, రోహిణీ యుక్తాష్టమీ తిథియందు ఉపవాస ముండి శ్రీకృష్ణుని పూజించ వలెను. ఇది భుక్తి ముక్తి ప్రదము. 'నేను శ్రీకృష్ణ, బలరామ, దేవకీ, వసుదేవ, యశోదా, గోవులను ఆవాహనచేసి పూజించుచున్నాను. మీ అందరికిని నమస్కారము. యోగస్వ రూపుడు యోగపతి, యోగీశ్వరుడు అగు శ్రీకృష్ణునకు నమస్కారము. యోగమునకు ఆదికారణ భూతుడును, ఉత్పత్తి స్థానమును అగు గోవిందునకు అనేక పర్యాయములు నమస్కరించుచున్నాను'. ఇట్లు ఆవాహనము చేసి శ్రీకృష్ణునకు స్నానము చేయించి – 'యజ్ఞేశ్వరా! యజ్ఞరూపా! యజ్ఞాధిపతీ! యజ్ఞాది కారణభూతుడా! గోవిందా! నీకు మాటిమాటికిని నమస్కారము' అని అర్ఘ్యదానము చేయవలెను. దేవా! నీకు ప్రియమైన సుగంధ యుక్తములగు ఈ పుష్పములను స్వీకరింపుము. దేవతలచే పూజింపబడినవాడా! నా కోరికల నన్నింటిని తీర్పుము. నీవు సదాధూపముచే ధూపితుడవు, నేను సమర్పించిన ఈ ధూపముచే నీవు ధూప సుగంధమును గ్రహింపుము. నన్ను సర్వదా ధూప సుగంధ సంపన్నుని చేయుము' అని చెప్పుచు పుష్పధూపములు సమర్పించవలెను. 'ఓ ప్రభూ! నీవు సర్వదా దీపమువలె దీపించు చుందువు. దీపమునకు కాంతి నిచ్చువాడవు. నేను ఇచ్చిన ఈ మహాదీపమును స్వీకరించి నన్నుకూడ దీపమువలె ఊర్ధ్వగతి కలవానిని చేయుము. విశ్వరూపా, విశ్వపతీ, విశ్వేశ్వరా! శ్రీకృష్ణా! నీకు నమస్కారము; నమస్కారము, విశ్వమునకు ఆదికారణభూతుడైన శ్రీ గోవిందునకు నేను ఈ దీపము నిచ్చుచున్నాను' అని చెప్పుచు దీపము సమర్పించవలెను. 'ధర్మ స్వరూపుడును, ధర్మాధిపతియు, ధర్మమునకు ఆదిస్థాన భూతుడును అగు వాసుదేవునకు నమస్కారము. గోవిందా! నీవిపుడు శయ

నింపుము. సర్వరూపుడు, సర్వాధిపతి, సర్వేశ్వరుడు, సర్వాదికారణభూతుడు అగు గోవిందునకు మాటిమాటికిని నమస్కారము' అనిచెప్పుచు శయనింపచేయవలెను. 'క్షీర సముద్రము నుండి పుట్టినవాడవును, అత్రినేత్ర సముద్భూతుడవును, తేజః స్వరూపుడవును అగు ఓ శశాంకా! రోహిణీ సహితుడవై నేను ఇచ్చు అర్ఘ్యము గ్రహించుము' అని చెప్పుచు చంద్రునకు అర్ఘ్య ప్రదానము చేయవలెను. పిదప భగవద్విగ్రహమును వేదికపై స్థాపించి, చంద్రసహిత రోహిణీ పూజ చేయవలెను. అర్ధరాత్రి యందు గుడ-ఘృతమిశ్ర క్షీర ధారలతో వసుదేవ, దేవకీ, నంద, యశోదా, బలరాములకు అభిషేకము చేయవలెను. పిదప బ్రాహ్మణులకు భోజనము పెట్టి వారికి దక్షిణగా వస్త్ర సువర్ణాదుల నీయవలెను. జన్మాష్టమీ వ్రతము చేయువాడు పుత్రానందము పొంది విష్ణులోక నివాసియగును. పుత్ర ప్రాప్తిని కోరి ప్రతి సంవత్సరము ఈ వ్రతము చేయువాడు పున్నామనరక విముక్తుడగును. 'హే ప్రభూ! నాకు పుత్రులను, ధనమును, ఆయుస్సును, ఆరోగ్యమును, సంతతిని ఇమ్ము. గోవిందా! నాకు ధర్మ, కామ, సౌభాగ్య, స్వర్గ, మోక్షములను ఇమ్ము' అని ప్రార్థించవలెను.(183)

అష్టమీ వ్రతములు - II

అగ్ని దేవుడు పలికెను :

చైత్ర కృష్ణ పక్షమున అష్టమీ వ్రతము ఆచరించి ఆ దినమున బ్రహ్మాది దేవతలను, మాతృ గణమును పూజించవలెను. ఒక సంవత్సరముపాటు కృష్ణ పక్షాష్టములందు శ్రీకృష్ణ పూజ చేయువాడు సంతానమును పొందును. ఇపుడు కాలాష్టమీ వ్రతము చెప్పెదను. ఈ వ్రతము మార్గశీర్ష కృష్ణాష్టమి నాడు చేయవలెను. రాత్రియైన పిదప వ్రతము చేయువాడు స్నానాదులచే పవిత్రుడై శివుని పూజించి, గోమూత్రముచే వ్రతపారణము చేయ్యవలెను. రాత్రియందు భూమిపై శయనించవలెను. పుష్య మాసము నందు శివుని పూజించి ఘృతాహారమును, మాఘమున మహేశ్వరుని పూజించి దుగ్ధాహారమును తీసికొనవలెను. ఫాల్గుణమునందు మహాదేవుని పూజించి, ఉపవాసముచేసి తిలలు ఆహారముగా గ్రహించవలెను. చైత్రమునందు 'స్థాణువును' పూజించి యవలు భుజించవలెను. వైశాఖమున 'శివుని' పూజించి కుశ జలముతో పారణచేయవలెను. జ్యేష్ఠమున పశుపతిని పూజించి నదీజలము త్రాగవలెను. ఆషాఢమున ఉగ్రుని పూజించి గోమయమును భక్షించవలెను. శ్రావణమున శర్వుని పూజించి మందారపుష్పములను భుజించవలెను. భాద్రపదమునందు రాత్రి త్ర్యంబకుని పూజించి బిల్వపత్రమును భుజించవలెను. ఆశ్వయుజమున ఈశుని పూజించి బియ్యమును, కార్తికమునందు రుద్రుని పూజించి పెరుగు భుజించవలెను, సంవత్సరాంతమున హోమముచేసి, సర్వతోభద్ర లింగమును నిర్మించి శంకరుని పూజించవలెను. పిదప ఆచార్యునకు గో, వస్త్ర, సువర్ణ దానము చేయవలెను. ఇతరులకు గూడ అదిదానము చేయవలెను. పిదప బ్రాహ్మణులకు భోజనము పెట్టినవాడు భుక్తి ముక్తులను పొందును. ప్రతిమాసమునందును, అష్టమీతిథులందు రాత్రిమాత్రమే భోజనము చేసి సంవత్సరాంతము నందు గోదానము చేయవలెను. ఇట్లు చేసినవాడు ఇంద్రపదమును చెందును. దీనికి స్వర్గతివ్రతమని పేరు. శుక్ల పక్షమునందుగాని, కృష్ణపక్షము నందు గాని అష్టమీ బుధవార యోగము కలిగినపుడు వ్రతమాచరించి ఒకమారు భోజనము చేయవలెను. అష్టమీ వ్రతము చేయువానికి గృహ ఐశ్వర్యాదులకు లోపముండదు.

రెండు వ్రేళ్ళు విడచిన పిడికిలితో ఎనిమిది పిడికిళ్ళ బియ్యముతో అన్నము వండి దీనిని కుశ యుక్తమైన మామిడాకుల దొన్నెలో ఉంచవలెను. కులాంబికా సమేతుడగు బుధుని పూజించి, బుధాష్టమీ వ్రతకథవిని భోజనము చేయవలెను. పిదప బ్రాహ్మణులకు తండుల సహితమగు కర్కటి దానముచేసి, యథాశక్తిగా దక్షిణ ఇవ్వవలెను. (బుధాష్టమీ వ్రతకథ) : ధీరుడను ఒక బ్రాహ్మణుడు ఉండెను. అతని భార్య పేరు రంభ; పుత్రుని పేరు కౌశికుడు. అతనికి విజయ అను ఒక పుత్రిక కూడ ఉండెను. అతనికి ధనదము అను ఒక ఎద్దు ఉండెను. కౌశికుడు ఆ ఎద్దును మేపు టకై గోపాలకులతో కలసి వెళ్లెను. కౌశికుడు గంగలో స్నానాది కార్యములు చేసికొనుచుండగా ఒక దొంగ ఆ ఎద్దును అపహరించెను. స్నానముచేసి వచ్చిన కౌశికుడు ఎద్దును కానక దానిని వెదకుటకై సోదరి యగు విజయతో కలిసి బయలుదేరెను. ఇతడు ఒక సరోవరమునందు కొందరు దేవతా స్త్రీలనుజూచి భోజనము పెట్టమని అడిగెను. అపుడు ఆ దేవతా స్త్రీలు ఇట్లు పలికిరి – 'నీవు మాకు అతిథిగా వచ్చినావు; అందుచే వ్రతముచేసి భోజనము చేయుము'. అపుడు కౌశికుడు బుధాష్టమీ వ్రతముచేసి భోజనము చేసెను. వనరక్షకుని వద్దకు వెళ్ళి తన ఎద్దును తీసికొని విజ యతో తిరిగి వచ్చెను. అతడు యథాకాలమున విజయకు వివాహము చేసి మరణానంతరము యమలోకమునకు పోయెను. వ్రత ప్రభావముచే కౌశికుడు అయోధ్యకు రాజు ఆయెను. తన తల్లి దండ్రులు నరక యాతనలను అనుభవించుట చూచి, విజయముని శరణుజొచ్చెను. కౌశికుడు వేటకొరకై వనమునకు వెళ్ళి నపుడు–'నా తలిదండ్రులు నరకము నుండి విముక్తులు ఎట్లు అగుదురు?' అని ప్రశ్నించెను. అపుడు యముడు ప్రత్యక్షమై 'రెండు బుధాష్టమీ వ్రతముల ఫలముచే విముక్తులు అగుదురు' అని చెప్పగా కౌశికుడు రెండు బుధాష్టమీ వ్రతముల ఫలములను తలి దండ్రులకు ధారపోసెను, వారు స్వర్గమునకు వెళ్ళిరి. విజయకూడ సంతసించి భోగ మోక్షాది సిద్ధికై ఈ వ్రతమును ఆచరించెను. చైత్ర శుక్లాష్టమి పునర్వసు నక్షత్ర యుక్తమైనపుడు ఎనిమిది అశోక పుష్పముల మొగ్గల రసము త్రాగినవాడు ఎన్నడును శోకము పొందడు. చైత్రము నందు వికసించు ఓ అశోకమా! నీవు శంకరునకు చాల ఇష్టమైన దానవు. నేను శోకసం తప్తుడనై నీ కళిక(మొగ్గ)ల రసమును త్రాగుచున్నాను. నీ వలెనే నన్నుకూడ శోకరహితుని చేయుము' అను అర్థము గల 'త్వామశోక' ఇత్యాది మంత్రము చెప్పుచు కళికారసపానము చేయవలెను. చైత్రాద్యష్టము లందు మాతృగణ పూజ చేయువాడు శత్రువులపై విజయమును సాధించును. (184)

నవమీ వ్రతములు

అగ్నిదేవుడు పలికెను :

ఇపుడు భుక్తి ముక్తి ప్రదములగు నవమీ వ్రతములను గూర్చి చెప్పెదను. ఆశ్వయుజ శుక్ల నవమి నాడు గౌరీ నవమీ వ్రతము నాచరించి దేవీపూజ చేయవలెను. ఈ నవమికి 'పిష్టక నవమి' అనిపేరు. ఈ వ్రతము చేయువాడు దేవీపూజచేసి పిష్టాన్నమును భుజించవలెను. ఆశ్వయుజ శుక్ల నవమినాడు మూల నక్షత్రముండి, సూర్యుడు కన్యారాశి గతుడైనచో 'మహానవమి' యని పేరు. అది సర్వపాప వినాశకము. ఆనాడు నవదుర్గలను తొమ్మిది స్థానములందుగాని, ఒక

స్థానమునందు గాని స్థాపించి పూజించవలెను. మధ్య యందు అష్టాదశభుజ మహాలక్ష్మిని, రెండు పార్శ్వములందును మిగిలిన దుర్గలను పూజించవలెను. నవదుర్గలను క్రింద చెప్పిన క్రమమున, అంజన, డమరు సహితలుగా స్థాపించవలెను. రుద్రచండ, ప్రచండ, చండోగ్ర, చండనాయిక, చండ, చండవతి, పూజ్య, చండరూప, అతిచండిక–వీరందరి మధ్యయందు అష్టాదశభుజయగు ఉగ్రచండా మహిష మర్దనీదుర్గను పూజించవలెను. 'ఓం దుర్గే దుర్గ రక్షణి స్వాహా' అనునది దశాక్షర మంత్రము. ఈ విధానము ననుసరించి ఈ దశాక్షర మంత్ర జపము చేయువానికి ఎవరి నుండియు బాధలు కలుగవు. దుర్గాదేవి వామ హస్తములందు కపాల, ఖేటక, ఘంటా, దర్పణ, తర్జనీ ముద్రా, ధనుష్, ధ్వజ, డమరు, పాశములను, దక్షిణ హస్తములందు శక్తి, ముద్గర, త్రిశూల, వజ్ర, ఖడ్గ, కుంతక, శంఖ, చక్ర, శలాకలను ధరించియుండును. ఈ ఆయుధము లను కూడ పూజించవలెను. 'కాళి కాళి వజ్రేశ్వరి లోహదణ్డాయై నమః' అను మంత్రము పఠించుచు ఖడ్గముతో బలిపశువును చంపవలెను. ఆ బలిపశువు రక్త మాంసములను 'పూతనాయై నమః' అని నైరృతి దిక్కునందును, 'పాపరాక్షస్యై నమః' అని వాయవ్యము నందును, 'చరక్యై నమః'అని ఈశాన్యమునందును, 'విదారికాయై నమః' అని ఆగ్నేయము నందును ఆ దేవతలను ఉద్దేశించి సమర్పించవలెను. రాజు దాని ఎదుట స్నానముచేసి స్కందవిశాఖుల నిమిత్తమై పిష్ట నిర్మిత శత్రుబలి ఇవ్వవలెను. రాత్రియందు బ్రాహ్మి మొదలగు శక్తుల పూజచేసి–'జయంతి, మంగళ, కాళి, భద్రకాళి, కపాలిని, దుర్గ, శివ, క్షమ, ధాత్రి, స్వాహా, స్వధా అను పేర్లు గల ఓ దేవీ; నమస్కారము'. ఇత్యాది మంత్రములు పఠించుచు ప్రార్థించవలెను. దేవికి పంచామృత స్నానము చేయించి వివిధోప చారములతో ఆమెను పూజించవలెను. దేవిని ఉద్దేశించి చేసిన ధ్వజదానము, రథయాత్ర, బలి దానము సకలాభీష్టములను ఒసగును. (185)

దశమీ వ్రతములు

అగ్ని పలికెను :

ధర్మకామాదిప్రదమగు దశమీ వ్రతమును చెప్పెదను. దశమినాడు ఒక్కపూట మాత్రమే భోజనముచేసి సమాప్తి యందు పది ధేనువులను దానముచేసి పది బంగారు నాణెములను దక్షిణ ఇచ్చువాడు బ్రాహ్మణాధిపతి యగును. (186)

ఏకాదశీ వ్రతములు

అగ్ని పలికెను :

ఇపుడు భుక్తి ముక్తి ప్రదాయకమగు ఏకాదశీ వ్రతమునుగూర్చి చెప్పెదను. దశమి యందు నియతాహారవంతుడై మాంస మైథునములను వర్జించవలెను. రెండు పక్షము లందును, ఏకాదశు లందు భోజనము చేయగూడదు. ఏకాదశీ ద్వాదశులు కలిసిన దినమున శ్రీహరి సన్నిహితుడై యుండును. ఆ రోజున ఉపవాసముచేసి త్రయోదశినాడు పారణము చేసినచో నూరు యజ్ఞములు చేసిన ఫలము లభించును. ఏకాదశినాడు కొంచెము ఏకాదశి ఉండి పిదప ద్వాదశి వచ్చినచో, అపుడు

ఉపవాసముచేసి త్రయోదశినాడు పారణము చేసిన వానికి నూరు యజ్ఞముల ఫలము లభించును. ఏకాదశినాడు దశమి కలసినచో ఉపవాసము ఉండరాదు. నరకము వచ్చును. ఏకాదశినాడు ఉపవాసము ఉండి మరుసటి రోజున–'పుండరీకాక్షా! నేనీ రోజున భుజింతును; నాకు రక్షకుడవు అగుము' అని ప్రార్థించి భోజనము చేయవలెను. శుక్లైకాదశి యందు పుష్యమీ నక్షత్రము ఉన్నపుడు ఉపవాసము ఉన్నచో అది అధిక ఫలప్రదము. పాపవినాశకము. ఏకాదశీ ద్వాదశీ తిథులు శ్రవణ నక్షత్ర యుక్తములైనచో అది విజయతిథి. భక్తులకు జయప్రదము. ఫాల్గుణ మాసమున పుష్యమీ నక్షత్ర యుక్తమగు ఏకాదశి కూడ విజయాతిథి. అది అనేక కోట్ల రెట్టింపు ఫలమును ఇచ్చునట్టిది. ఏకాదశినాడు విష్ణుపూజ చేయవలెను. అది అందరికిని ఉపకారకము. అట్లు చేసినవాడు ధనపుత్రాది మంతుడై విష్ణు లోకమునందు పూజింపబడును.(187)

ద్వాదశీ వ్రతములు

అగ్ని దేవుడు పలికెను :

ఇపుడు భుక్తి ముక్తి ప్రదములగు ద్వాదశీ వ్రతములను గూర్చి చెప్పెదను. ద్వాదశినాడు రాత్రి మాత్రమే భోజనము చేయవలెను. ఎవనినుండియు, ఏమియు గ్రహింపరాదు. ఉపవాసముచేసి కూడ భిక్షాగ్రహణము చేయువానికి ద్వాదశీ వ్రత ఫలము సిద్ధించదు. చైత్ర శుక్ల ద్వాదశినాడు మరున ద్వాదశీ వ్రతము చేయువాడు భోగమోక్షములను కోరుచు కామదేవ రూపుడగు మహా విష్ణువును పూజించవలెను. మాఘ శుక్ల ద్వాదశినాడు 'భీమద్వాదశీ' వ్రతముచేసి 'నమో నారాయణాయ' అను మంత్రముతో శ్రీమహా విష్ణువును పూజించవలెను. ఇట్లు చేసినవాడు సర్వమును పొంద గలుగును. ఫాల్గుణ శుక్ల ద్వాదశినాడు 'గోవింద ద్వాదశీ మంత్రము చేయవలెను. ఆశ్వయుజము నందు 'విశోక ద్వాదశీ' వ్రతము చేయువాడు శ్రీమహావిష్ణువును పూజించవలెను. మార్గశీర్షశుక్ల ద్వాదశీనాడు శ్రీకృష్ణుని పూజించి లవణ దానము చేయువాడు సకల రస దానములు చేసిన ఫలము పొందును. భాద్రపదమున 'గోవత్స ద్వాదశీ' వ్రతము చేయువాడు గోవత్సమును పూజించ వలెను. మాఘ మాసము తరువాత వచ్చు ఫాల్గున కృష్ణ ద్వాదశి శ్రవణ నక్షత్ర యుక్తమైనచోదానికి 'తిలద్వాదశి' అని పేరు. ఆ దినమున తిలలతో స్నానముచేసి, తిలలతో హోమముచేసి, చిమ్మిలి నైవేద్యము పెట్టవలెను. దేవాలయమునందు తైలదీపము వెలిగించి, పితరులకు తిలతర్పణములు చేయవలెను. బ్రాహ్మణులకు తిలదానము చేయవలెను. హోమము, ఉపవాసముల వలననే తిల ద్వాదశీ వ్రత ఫలము లభించును. 'ఓం నమో భగవతే వాసు దేవాయ' అను మంత్రముతో శ్రీమహావిష్ణువును పూజించవలెను. ఈ విధముగ ఆరు పర్యాయములు తిలద్వాదశీ వ్రతము చేసినవాడు తన కులముతో కూడ స్వర్గమునకు పోవును. ఫాల్గుణ శుక్ల పక్షమునందు 'మనోరథ ద్వాదశీ' వ్రతము చేసినవాడు శ్రీమహా విష్ణువును పూజించవలెను. ఈ దివసమునందే 'నామ ద్వాదశీ' వ్రతము చేయువాడు ఒక సంవత్సరము, కేశవాది నామములతో శ్రీమహావిష్ణువును పూజించవలెను. అతడు మరణానంతరము స్వర్గమునకే వెళ్ళును. నరకమున కెన్నడును వెళ్ళడు. ఫాల్గుణ శుక్ల పక్షమున 'సుమతి ద్వాదశీ' వ్రతముచేసి విష్ణువును పూజించవలెను. భాద్రపద శుక్ల

పక్షమున 'అనంత ద్వాదశీ' వ్రతము చేయవలెను. మాఘ శుక్ల పక్షమునందు ఆశ్లేషతోగాని, మూలతోగాని కూడిన తిం ద్వాదశి చేయువాడు 'కృష్ణాయనమః' అను మంత్రముతో శ్రీకృష్ణుని పూజించి, తిలహోమము చేయవలెను. ఫాల్గుణ శుక్ల పక్షమున సుగతి ద్వాదశీ వ్రతము చేయువాడు ఒక సంవత్సరము–'జయ కృష్ణ నమస్తుభ్యమ్' అను మంత్రముతో శ్రీకృష్ణుని పూజించవలెను. ఇట్లు చేయుటచే భుక్తి, ముక్తులను రెండింటిని పొందును. పుష్యశుక్ల ద్వాదశినాడు 'సంప్రాప్తి ద్వాదశీ' వ్రతము చేయవలెను. (188)

శ్రవణ ద్వాదశీ వ్రతము

అగ్ని దేవుడు చెప్పెను :

ఇప్పుడు భాద్రపద శుక్ల పక్షమున చేయబడు 'శ్రవణ ద్వాదశీ' వ్రతమును గూర్చి చెప్పెదను. శ్రవణ నక్షత్రయుక్తమైనచో ఈ ద్వాదశి శ్రేష్టమైనది. ఉపవాసము చేసినచో గొప్ప ఫలమును ఇచ్చును. శ్రవణ ద్వాదశినాడు నదీ సంగమస్నానము విశేష ఫలప్రదము. బుధవారశ్రవణ నక్షత్ర ములు కలిసిన ద్వాదశినాడు చేయు దానాదులు గొప్ప ఫలములను ఇచ్చును. త్రయోదశినాడు నిషిద్ధమైనను ఈ వ్రతముయొక్క పారణము త్రయోదశినాడు చేయవలెను. 'నేను ద్వాదశినాడు ఉపవాసము ఉండి జలపూర్ణ కలశముపై నున్న సువర్ణ నిర్మిత వామనమూర్తిని పూజించి వ్రత పారణము త్రయోదశినాడు చేసెదను' అని సంకల్పించవలెను. 'రెండు శ్వేతవస్త్రములు ధరించిన వాడును, ఛత్రపాదుకాధారియు, శంఖచక్రములు ధరించినవాడును అగు వామనుని కలశముపై ఆవాహనము చేయుచున్నాను', 'ఛత్రదండ అలంకృతుడగు విష్ణువును పంచామృతములతోను, శుద్ధజలములతోను స్నానము చేయించుచున్నాను. వామనునకు నమస్కారము. 'అర్ఘ్యమునకు తగువారి చేతను, ఇతరుల చేతను పూజితుడవగు ఓ దేవేశా! నీకు అర్ఘ్యము సమర్పించుచున్నాను. నాకు భోగ, మోక్ష, సంతాన, యశః, పరమైశ్వర్యాదులను ఇమ్ము' 'వామనాయ నమః' అను మంత్రముతో గంధ ద్రవ్యములు సమర్పించి ఈ మంత్రముతోనే నూట ఎనిమిది హోమ ములు చేయవలెను. ఈ క్రింది విధముగ సర్వాంగ పూజచేయవలెను. ఓం నమో వాసు దేవాయ శిరః పూజయామి, శ్రీధరాయ నమః ముఖం పూజయామి. కృష్ణాయ నమః కణ్ఠం పూజయామి. శ్రీపతయే నమః వక్షస్థలం పూజయామి. సర్వాస్త్ర ధారిణే నమః భుజౌ పూజయామి. వ్యాపకాయ నమః నాభిం పూజయామి. వామనాయ నమః కటిం పూజయామి. త్రైలోక్యజననాయ నమః మేఢ్రం పూజయామి. సర్వాధిపతయే నమః జంఘే పూజయామి సర్వాత్మనే నమః పాదౌ పూజయామి'. పిదప వామనునకు ఘృతపక్వ పదార్థముల నైవేద్యము దధ్యోదన పూర్ణ పాత్రమును సమర్పించవలెను. రాత్రి యందు జాగరముచేసి ప్రాతఃకాలమున సంగమమునందు స్నానము చేయవలెను. పిదప గంధ పుష్పాదులతో పూజించి ఈ విధముగా ప్రార్థించుచు పుష్పాంజలి సమర్పించవలెను – 'బుధుడు, శ్రవణుడు అను పేర్లుగల గోవిందా! నీకు నమస్కారము, నమస్కారము. నా పాపములన్నీ తొలగించి సమస్త సౌఖ్యములను ఇమ్ము. దేవదేవేశ్వరా! జనార్దనా! నేను ఇచ్చిన ఈ పుష్పాంజలిచే సర్వదా ప్రసన్నుడవు కమ్ము'. పిదప పూజా ద్రవ్యములు అన్నియు ఈ క్రింది విధముగా చెప్పుచు

బ్రాహ్మణునకు దానము చేయవలెను. 'వామనుడే బుద్ధి నిచ్చువాడు. వామనుడే దాత. ఈ ద్రవ్యములలో ఉన్నవాడు వామనుడే. వామనుడే దీనిని గ్రహించుచున్నాడు. వామనుడే ఇచ్చుచున్నాడు. వామనుడు అన్ని ద్రవ్యములందును ఉన్నాడు. వామన రూపుడగు విష్ణువునకు నమస్కారము'. పిదప బ్రాహ్మణులకు భోజనము పెట్టి తాను భోజనము చేయవలెను. (189)

అఖండ ద్వాదశీ వ్రతం

అగ్ని పలికెను :

ఇపుడు సమస్త వ్రతములకు సంపూర్ణత్వమును సంపాదించు అఖండ ద్వాదశీ వ్రతమును గూర్చి చెప్పెదను. మార్గ శీర్ష శుక్ల ద్వాదశినాడు ఉపవాసముచేసి శ్రీమహా విష్ణువును పూజించవలెను. పంచగవ్య మిశ్ర జలముతో స్నానముచేసి దానితోనే పారణము చేయవలెను. శ్రీమహావిష్ణువు ఎదుట ఈ విధముగా ప్రార్థన చేయవలెను – 'భగవంతుడా! ఏడు జన్మలనుండి నేను చేసిన వ్రతాలలో ఏదైన ఖండమైనచో అది అఖండ ఫలదాయకము అగునట్లు అనుగ్రహించుము. పురుషోత్తమా! నీవు ఈ అఖండ చరాచర విశ్వరూపమున ఉన్నట్లు నా వ్రతము కూడ అఖండమగుగాక' ఈ విధముగ నాలుగు మాసములు ఈ వ్రతము చేయవలెను. చైత్రమునుండి ఆషాఢము వరకును చేసిన పక్షమున పేలాల పిండి నింపిన పాత్రను దానము చేయవలెను. శ్రావణమునందు ప్రారంభించి కార్తికము నందుకూడ సమాప్తము చేయవచ్చును. ఈ విధముగా అఖండ ద్వాదశీ వ్రతము చేయుటచే ఏడు జన్మలలో ఖండితములై పోయిన(అసంపూర్ణములైన) వ్రతములు సంపూర్ణ ఫలప్రదము లగును. దీనిని చేసినవానికి దీర్ఘాయురారోగ్య, సౌభాగ్య, రాజ్యాది వివిధ భోగములు లభించును. (190)

త్రయోదశీ వ్రతములు

అగ్ని దేవుడు చెప్పెను :

ఇపుడు అన్నింటిని ఇచ్చు త్రయోదశీ తిథి వ్రతములను గూర్చి చెప్పెదను. మొదట అనంగ త్రయోదశీ వ్రతమునుగూర్చి చెప్పెదను. పూర్వము అనంగుడు (మన్మథుడు) ఈ వ్రతము చేసెను. మార్గశీర్ష శుక్ల త్రయోదశినాడు కామదేవ స్వరూపుడగు హరుని పూజించ వలెను. రాత్రి మధువు భుజించి తిలాక్షత మిశ్రఘృతము హోమము చేయవలెను. పౌష్య మాసమున యోగేశ్వరుని పూజించి మౌక్తిక జలాహారము చేయవలెను. ఇట్లు చేసినవాడు స్వర్గము పొందును. ఫాల్గుణమున వీరభద్రుని పూజించి కంకోలమును భుజించవలెను.

చైత్రమున సురూపుని పూజించి, కర్పూరాహారము తీసికొనువాడు సౌభాగ్య యుక్తుడగును. వైశాఖమున మహారూపుని పూజించి జాయఫలము భుజించవలెను. జ్యేష్ఠ మున ప్రద్యుమ్నుని పూజించి, లవంగము భక్షించవలెను. ఆషాఢమున ఉమాపతిని పూజించి తిలమిశ్ర జలము త్రాగవలెను. శ్రావణమున శూలపాణిని పూజించి సుగంధితమగు జలము త్రాగవలెను. భాద్రపదమున అగురు భక్షించి సద్యోజాతుని పూజించవలెను. ఆశ్వయుజమున త్రిదశాధిపుడగు శంకరుని

పూజించి స్వర్ణజలము త్రాగవలెను. కార్తికమున విశ్వేశ్వరుని అర్చించి లవణము భక్షించవలెను. ఈ విధముగ సంవత్సరము పూర్తియైన పిమ్మట సువర్ణ నిర్మిత శివలింగమును మామిడాకులు, వస్త్రములు కప్పి, గోవు, శయ్య, ఛత్రము, కలశము, పాదుకలు, రసపూర్ణ పాత్రములుగూడ దానము చేయవలెను. చైత్ర శుక్ల త్రయోదశినాడు అశోక వృక్షమునకు సింధూరము, కాటుక పూసి, దాని మూలమున రతి–ప్రీతి సమేతుడగు కామదేవుని స్మరించవలెను. కామ్యములు కోరువాడు ఈ విధముగ ఒక సంవత్సరము కామదేవుని పూజించవలెను. ఇదియే 'కామత్రయోదశీ వ్రతము'. (191)

చతుర్దశీ వ్రతములు

అగ్ని దేవుడు పలికెను :

భుక్తి ముక్తి ప్రదాయకములగు చతుర్దశీ వ్రతములను చెప్పెదను. కార్తిక చతుర్దశి నాడు నిరాహారుడై శివుని పూజించవలెను. అది మొదట ప్రతిమాసము శివచతుర్దశినాడు వ్రతము–శివ పూజనము ఒక సంవత్సరము పాటు జరుపవలెను. ఇట్లు చేయువాడు భోగ, ధన, దీర్ఘాయుః సంపన్నుడగును. మార్గశీర్ష శుక్ల పక్షమున అష్టమీ–తృతీయా, ద్వాదశీ–చతుర్దశులలో ఒకనాడు మౌనవ్రతము అవలంబించి, ఫలములు మాత్రము భుజించుచు దేవతాపూజ చేయవలెను. కొన్ని ఫలములు త్యజించి, వాటిని దానము చేయవలెను. ఈ విధముగ ఫలచతుర్దశీ వ్రత మాచరించువాడు రెండు పక్షముల చతుర్దశీ–అష్టమీ తిథులయందు ఉపవాస ముండి శివుని పూజించవలెను. ఇట్లు రెండు పక్షము లందును చతుర్దశీవ్రతము చేయువానికి స్వర్గము లభించును. కృష్ణ పక్ష అష్టమీ–చతుర్దశులందు రాత్రి భోజనము మాత్రము చేయువాడు ఇహలోకమున అభీష్ట భోగములను పర లోకమున శుభగతిని పొందును. కార్తిక కృష్ణ చతుర్దశినాడు స్నాన మాచరించి, ధ్వజాకార మగు వెదురుగడపై ఇంద్రుని పూజించువాడు సుఖవంతుడగును. పిదప ప్రతి మాసము నందును శుక్ల చతుర్దశినాడు కుశలతో విష్ణు విగ్రహము నిర్మించి దానిని జలపూర్ణ కలశముపై నుంచి పూజించ వలెను. ఆనాడు ఒకప్రస్థము బియ్యము పిండితో అప్పములు వండి సగము బ్రాహ్మణునకు దానముచేసి, సగము తాను ఉపయోగించవలెను. నదీ తటమున ఈ వ్రత పూజాదులు చేసి, అనంతవ్రత కథ వినిపించవలెను. పదునాలుగు ముడులుగల అనంతసూత్రము నిర్మించి దానిని అనంతునిగ పూజించి–'ఓ వాసుదేవా! అనంతమైన సంసార మహాసముద్రమునందు మునిగిన మమ్ము ఉద్ధరించుము. నీ అనంత రూపము నందు మమ్ములను కలుపుకొనుము. ఓ అనంతరూపా! నీకు నమస్కారము' అను అర్థముగల మంత్రము పఠించుచు, చేతికిగాని కంఠమునకు గాని కట్టుకొనవలెను. ఈ విధముగ అనంత వ్రతమాచరించువాడు పరమానంద సంపన్నుడగును. (192)

శివరాత్రి వ్రతం

అగ్ని దేవుడు చెప్పెను :

ఇపుడు భుక్తి ముక్తి ప్రదమగు శివరాత్రి వ్రతమును గూర్చి చెప్పెదను ఏకాగ్ర చిత్తముతో వినుము. మాఘ ఫాల్గుణముల మధ్య వచ్చు కృష్ణ చతుర్దశినాడు కోరికలు గలవాడు ఉపవాస

ముండవలెను. రాత్రి జాగరముచేసి ఇట్లు చెప్పవలెను. 'నేను చతుర్దశినాడు ఉపవాస ముండి శివరాత్రి వ్రతము చేయుచున్నాను. నేను వ్రతముక్తుడనై రాత్రి జాగరముచేసి శివుని పూజ చేయుచున్నాను. భోగ మోక్షములను ప్రసాదించు శివుని ఆవాహనము చేయుచున్నాను. శివా! నీవు నరక సముద్రమును దాటించు నౌకవంటివాడవు. నీకు నమస్కారము. నీవు ప్రజా రాజ్యాదుల నిచ్చువాడవు. మంగలమయుడవు. శాంత స్వరూపుడవు. నీకు నమస్కారము. నీవు సౌభాగ్య, ఆరోగ్య, విద్యా, ధన, స్వర్గములను ఇచ్చు వాడవు. నాకు ధర్మమును, ధనమును, కామభోగాదికమును ప్రసాదించుము. నన్ను గుణ, కీర్తి, సుఖ సంపన్నుని చేయుము. నాకు స్వర్గ, మోక్షములను ఇమ్ము'. శివరాత్రి వ్రత ప్రభావముచే పాపాత్ముడైన సుందరసేనుడను వ్యాధుడుకూడ పుణ్యవంతుడు ఆయెను. (193)

అశోకపూర్ణిమాది వ్రతములు

అగ్ని పలికెను :

ఫాల్గుణ శుక్ల పూర్ణిమనాడు వరాహమూర్తిని, భూదేవిని పూజించవలెను. ఈ విధముగ ఒక సంవత్సర మాచరించువాడు భుక్తి ముక్తులను పొందును. కార్తిక పూర్ణిమనాడు వృషోత్సర్గము చేసి రాత్రి వ్రతమును అనుష్ఠించవలెను. దీనిచే శివలోకమును పొందును. దీనికి 'వృషోత్సర్గ వ్రతము' అని పేరు. ఆశ్వయుజమున పితృపక్ష అమావాస్య యందు పితృ దేవతలను ఉద్దేశించి చేసిన దానము అక్షయ ఫలప్రదము. ఏ సంవత్సరము నందైనను ఈ అమావాస్యనాడు ఉపవాసముండి పితృపూజ చేయువాడు పాపవిముక్తుడై స్వర్గము పొందును. మాఘ అమావాస్యనాడు బ్రహ్మను పూజించినవాడు సకల అభీష్టములను పొందును. ఇపుడు భుక్తి ముక్తి ప్రదమగు వటసావిత్రీ వ్రతమును గూర్చి చెప్పెదను. వ్రతము ఆచరించు స్త్రీ మూడు దినములు ఉపవాసము చేసి, జ్యేష్ఠ అమావాస్యనాడు వటవృక్ష మూలమునందు మహాపతివ్రతయగు సావిత్రిని సప్త ధాన్యములతో పూజించ వలెను. కొంచెము రాత్రి శేషించి యుండగా ఆ వటవృక్షమునకు కంఠసూత్రము చుట్టి కుంకుమాదులతో దానిని పూజించవలెను. ప్రభాతసమయమున ఆ వటముదగ్గర నృత్యము చేయుచు గీతములు గానము చేయవలెను. నమః సావిత్ర్యై సత్యవతే' అనుచు సావిత్రీ సత్యవంతులకు నమస్కారముచేసి, వారికి సమర్పించిన నైవేద్యము బ్రాహ్మణునకు దానము ఈయవలెను. పిదప ఇంటికి వచ్చి బ్రాహ్మణులకు భోజనముపెట్టి తరువాత తాను భుజించ వలెను. 'సావిత్రీదేవీ ప్రీయతామ్' అని అనుచు వ్రతసమాప్తి చేయవలెను. ఇట్లు చేసిన స్త్రీ సౌభాగ్యాదులను పొందును. (194)

ఒక వారవ్రతములు

అగ్ని చెప్పెను :

ఇపుడు భుక్తి ముక్తి ప్రదములగు వారవ్రతములను చెప్పెదను. రవి వారము నాడు హస్త కాని పునర్వసు కాని వచ్చినపుడు పవిత్రమగు సర్వౌషధి జలముతో స్నానముచేసి, శ్రాద్ధము చేయువాడు ఏడు జన్మల వరకును రోగములచే పీడింపబడడు. సంక్రాంతి దినమున భానువాసరము

అయినచో అది పవిత్రమగు ఆదిత్యహృదయము అని చెప్ప బడును. ఆ దినమునగాని, హస్త నక్షత్రయుక్త భానువారము (ఆదివారము) నందుగాని ఒక సంవత్సరము నక్త వ్రతము చేయువానికి సర్వము లభించును. ఏడు చిత్రా నక్షత్రయుక్త సోమవార వ్రతములు చేయువాడు సుఖవంతుడగును. స్వాతీ నక్షత్రయుక్త మంగళవార వ్రతము ప్రారంభించి, ఏడు మంగళవార నక్తవ్రతములు చేయువాడు అన్ని కష్టముల నుండియు విముక్తుడగును. విశాఖా నక్షత్రయుక్త బుధవారమునాడు ప్రారంభించి ఏడు బుధవార నక్త వ్రతము లాచరించువాడు బుధగ్రహపీడ నుండి విముక్తుడగును. అనురాధా నక్షత్ర యుక్త గురువారమునాడు ప్రారంభించి ఏడు గురువార నక్త వ్రతములు చేయువాడు బృహస్పతి గ్రహపీడనుండి విముక్తుడగును. జ్యేష్ఠా నక్షత్రయుక్త శుక్రవారమునాడు ప్రారంభించి ఏడు శుక్రవార నక్త వ్రతములు చేయువాడు శుక్ర గ్రహపీడనుండి విముక్తు డగును. మూల నక్షత్రయుక్త శనివారమునాడు ప్రారంభించి ఏడు శనివాసర నక్త వ్రతములు చేయువాడు శనిగ్రహపీడ నుండి విముక్తుడగును. (195)

నక్షత్ర వ్రతములు

అగ్ని దేవుడు పలికెను :

ఇపుడు నక్షత్ర వ్రతములను గూర్చి చెప్పెదను. నక్షత్ర విశేషములందు పూజ చేయుటచే శ్రీమహావిష్ణువు సకల అభీష్టములను తీర్చును. ప్రప్రథమముగా నక్షత్ర పురుషు డైన శ్రీమహావిష్ణువును చైత్రమాసము నందు పూజించవలెను. మూల నక్షత్రమునందు శ్రీమహావిష్ణువు చరణ కమలములను, రోహిణీ నక్షత్రమున మోకాళ్ళను, పూర్వాషాఢ ఉత్తరాషాఢలందు ఊరుద్వయమును, పూర్వ ఫల్గుణ ఉత్తర ఫల్గునులయందు మేఢ్రమును, కృత్తికయందు కటిప్రదేశమును, పూర్వాభాద్ర ఉత్తరాభాద్రల యందు పార్శ్వములను, రేవతి యందు కుక్షిని, అనూరాధయందు స్తనద్వయమును, ధనిష్ఠయందు పృష్ఠ భాగమును, విశాఖయందు భుజద్వయమును, పునర్వసువునందు వ్రేళ్ళను పూజించవలెను. ఆశ్లేష యందు నఖములను, జ్యేష్ఠయందు కంఠమును, శ్రవణమునందు కర్ణములను, పుష్యమి యందు వదన మండలమును, స్వాతియందు దంతాగ్రములను శతభిషమునందు ముఖమును, మఘయందు నాసికను, మృగశిరయందు నేత్రములను, చిత్తయందు లలాటములు, ఆర్ద్ర యందు కేశసమూహమును పూజించవలెను. సంవత్సరాంతమున బెల్లము నింపిన కలశపై శ్రీమహావిష్ణువు స్వర్ణమూర్తిని పూజించి బ్రాహ్మణునకు దక్షిణ సహితముగ శయ్య, గోవు, ధనము మొదలగునవి దానము చేయవలెను. సర్వ పూజనీయుడగు నక్షత్రపురుషుడైన శ్రీమహావిష్ణువునకును, శివునకును భేదములేదు. అందు శాంభవనీయ వ్రతము ఆచరించువాడు కృత్తికా సంబద్ధమగు కార్తికమాసము నందును, మృగశీర్ష నక్షత్ర సంబద్ధమగు మార్గశీర్ష మాసమునందును కేశవాది నామములతోడను, అచ్యుతాయ నమః ఇత్యాది నామములతోడను శ్రీమహావిష్ణువును పూజించవలెను. 'నేను కార్తిక మాసము యొక్క కృత్తికా సంబద్ధ పూర్ణిమనాడు మాసమునందును, నక్షత్రము నందును ఉన్న శ్రీహరిని పూజింతును. భుక్తి ముక్తి ప్రదమగు శాంభవనీయ వ్రతము ఆచరింతును' అని సంకల్పించవలెను. 'కేశవాదిమూర్తులతో ఉన్నవాడును, ఆయురారోగ్య వృద్ధి కలిగించువాడును అగు అచ్యుతుని

ఆవాహనము చేయుచున్నాను' అని ఆవాహనము చేయవలెను. కార్తికమునుండి మాఘమువరకు నాల్గుమాసములు అన్నదానము చేయవలెను. ఫాల్గుణము నుండి ఆషాఢమువరకు ముద్గాన్నము, ఆషాఢమునుండి ఆశ్వయుజము వరకు పాయసము దానము చేయవలెను. రాత్రియందు శ్రీమహా విష్ణువునకును బ్రాహ్మణునకును నైవేద్యము సమర్పించవలెను. పంచగవ్య జలముతో స్నానముచేసి, దానిని త్రాగుటచే పవిత్రుడగును. ఉద్వాసన చెప్పుటకు పూర్వము దేవునకు సమర్పించిన దంతయు నైవేద్యము; ఉద్వాసన చెప్పగానే అది అంతయు నిర్మాల్యమగును. 'అచ్యుతా! నీకు నమస్కారము. నా పాపములు నశించి పుణ్యము వృద్ధి పొందుగాక! నా ఐశ్వర్యాదులు సదా అక్షయములగు గాక. నా సంతాన పరంపర విచ్ఛిన్నము కాకుండుగాక. పరాత్పరా! పరమేశ్వరా! నీవు పరాత్పరుడవై బ్రహ్మవై నీ మర్యాదనుండి ఎన్నడును ఏ విధముగ అచ్యుతుడవు కావో అట్లే నా మనోవాంఛిత కార్యమును సఫలము చేయుము. ఓ పాపవినాశకా! నేను చేసిన పాపములు తొలగింపుము. అచ్యుతా! అనంతా! గోవిందా! అప్రమేయ స్వరూపా! పురుషోత్తమా! నన్ను అనుగ్రహించి నాకు అభీష్టములైన పదార్థములను అక్షయములుగ చేయుము' అని ప్రార్థించవలెను. ఈ విధముగ ఏడు సంవత్సరములు శ్రీహరిని పూజించినవాడు భోగమోక్షములను పొందును. ఈ నక్షత్ర వ్రత సందర్భమున సకలాభీష్ట ప్రదమగు అనంతవ్రతమును గూర్చి చెప్పెదను. మార్గశీర్ష మాసమునందు మృగశీర్ష నక్షత్రము వచ్చినపుడు గోమూత్ర ప్రాశనము చేసి శ్రీహరిని పూజించవలెను. ఆ అనంతుడు సకల కామప్రదాత; అనంత ఫలములను ఇచ్చువాడు ఈవ్రతము చేయువానికి రాబోవు జన్మలో కూడ అనంత పుణ్యఫలమును ఇచ్చును. ఈ మహా వ్రతమువలన అనంత మహాపుణ్యము లభించును. ఇది అభిలషిత వస్తువులనుఇచ్చు వాటిని అక్షయములుగ చేయును. అనంతుని చరణ కమలాది పూజచేసి రాత్రి తైలరహితమగు భోజనము చేయవలెను. అనంతుని ఉద్దేశించి మార్గశీర్షమునుండి ఫాల్గుణమువరకు ఘృతమును, చైత్రమునుండి ఆషాఢము వరకు బియ్యము, శ్రావణమునుండి కార్తికము వరకు క్షీరమును హోమము చేయవలెను. ఈ అనంతవ్రతము ఆచరించుట చేతనే యవనాశ్వునకు మాంధాత అను పుత్రుడు జనించెను. (అనంతవ్రతకథ ఇంకను ఎక్కువ సమాచారము భవిష్యోత్తర పురాణములో ఉన్నది) (196)

ఒక రోజు వ్రతములు

అగ్ని దేవుడు చెప్పెను :

ఇపుడు దివసములకు సంబంధించిన వ్రతములు చెప్పెదను. మొదట ధేను వ్రతమును గూర్చి చెప్పెదను. సువర్ణ రాశితో కూడ ఉభయ ముఖ గోదానముచేసి ఒక దినమున పయోవ్రతము చేయువాడు పరమ పదమును పొందును. స్వర్ణమయ కల్ప వృక్ష దానముచేసి మూడు దినములు పయోవ్రతము చేయువాడు బ్రహ్మపదమును పొందును. దీనికి కల్ప వృక్ష వ్రతమని పేరు. పది ఫలములకంటె అధికమగు స్వర్ణముతో పృథివి నిర్మించి దానముచేసి రెండు దినములు పయోవ్రతము చేయవలెను. దినమునందు మాత్రము వ్రతమవలంబించువాడు రుద్రలోకమును చేరును. ప్రతిపక్షము నందును మూడు రాత్రులు ఏకభుక్త వ్రతము చేయువాడును, పగలు నిరాహారుడై త్రిరాత్ర వ్రతము

చేయువాడును అధికమగు ధనము పొందును. ప్రతి మాసమునందును మూడు ఏకభుక్త నక్త వ్రతములు చేయువాడు గణపతి సాయుజ్యమును పొందును. జనార్దనుని ఉద్దేశించి త్రిరాత్ర వ్రతము ఆచరించువాడు తన నూరు కులములతో వైకుంఠము చేరును. మార్గశీర్ష శుక్ల నవమినుండి త్రిరాత్ర వ్రత ప్రారంభము చేయవలెను. ఓం నమోభగవతే వాసుదేవాయ అను మంత్ర మును వేయి పర్యాయములు లేదా నూరు పర్యాయములు జపము చేయవలెను. అష్టమి నాడు ఏకభుక్త వ్రతము, నవమీ, దశమీ, ఏకాదశులందు ఉపవాసము చేయవలెను. ద్వాదశినాడు శ్రీమహావిష్ణువును పూజించవలెను. ఈ వ్రతము కార్తిక మాసమందు చేయ వలెను. వ్రత సమాప్తియందు బ్రాహ్మణులకు భోజనము పెట్టి వారికి వస్త్ర, శయ్యా, ఆసన, ఛత్ర, యజ్ఞోపవీత, పాత్రలు దానము చేయవలెను. దాన సమయమున బ్రాహ్మ ణులతో ఇట్లు చెప్పవలెను. దుష్కరమగు ఈ వ్రతము నాచరించునపుడు నావలన కలిగిన లోపములు అన్నియు మీ అనుగ్రహముచే తొలగిపోవుగాక. ఈ త్రిరాత్ర వ్రతము చేయువాడు ఇహలోకమున భోగములు అనుభవించి మరణానంతరము శ్రీమహావిష్ణు సానిధ్యమును పొందును. ఇపుడు భుక్తి ముక్తి ప్రదమగు కార్తికవ్రతమును గూర్చి చెప్పెదను. దశమినాడు పంచగవ్య ప్రాశనచేసి ఏకాదశినాడు ఉపవాసము ఉండవలెను. ఈ వ్రతము నందు కార్తికశుక్ల ద్వాదశినాడు శ్రీమహావిష్ణువును పూజించినవాడు విమానముపై సంచరించు దేవత అగును. చైత్రమున త్రిరాత్ర వ్రతము ఆచరించి, రాత్రి మాత్రము భోజనము చేయువాడు వ్రత సమాప్తియందు ఐదు మేకలు దానము చేసినచో సుఖవంతుడగును. కార్తిక శుక్ల షష్ఠి మొదలు మూడు దినములు పాలు మాత్రము త్రాగి తరువాత, మూడు దినములు ఉపవాసము చేసినచో దానికి మాహేంద్ర కృచ్ఛ్రమని పేరు. కార్తిక శుక్లైకాదశినాడు ప్రారంభించి పాంచరాత్ర వ్రతము చేయవలెను. మొదటి దినమున క్షీరము, రెండవ దినమున పెరుగు తీసికొని మూడవ దినము నుండి మూడు నాళ్ళు ఉపవాసము చేయవలెను. ఇది 'భాస్కర కృచ్ఛ్రము' శుక్ల పంచమి నుండి ప్రారంభించి ఆరు దినములు వరుసగయవల గంజి, శాకములు, పెరుగు, క్షీరము, నెయ్యి, జలము, ఆహారముగా గ్రహించవలెను. దీనికి 'సాంతపన కృచ్ఛ్రము' అని పేరు. (197)

మాస వ్రతములు

అగ్ని దేవుడు పలికెను :

నేను ఇపుడు భుక్తి ముక్తి ప్రదములగు మాస వ్రతములను గూర్చి చెప్పెదను. ఆషాఢాది మాస చతుష్టయము నందు అభ్యంగ స్నానము చేయరాదు. దీనివలన ఉత్తమ బుద్ధిమంతుడగును. వైశాఖమున పుష్పములను లవణమును త్యజించి గోదానము చేయు వాడు రాజ్యమును పొందును. ఒకమాసము ఉపవాస ముండి గోదానము చేయువాడు ఈ భీమ వ్రత ప్రభావముచే విష్ణు సాయు జ్యము పొందును. ఆషాఢాది మాస చతుష్టయము నందు నియమపూర్వకముగా ప్రాతః స్నానము చేయువాడు విష్ణులోకము చేరును. మాఘ తృతీయయందు లేదా చైత్ర తృతీయయందు గుడ (బెల్లము) ధేనుదానము చేయుటకు గుడ వ్రతమని పేరు. ఈ మహావ్రత మాచరించువాడు శివ స్వరూపుడగును. మార్గ శీర్షాది మాసములందు నక్త వ్రతము ఆచరించువాడు విష్ణు లోకమునకు

అర్హుడగును. ఏక భుక్త వ్రతము ఆచరించువాడు ఆ విధముగనే వేరుగా ద్వాదశీ వ్రతపాలనము కూడ చేయవలెను. ఫలవ్రతము చేయువాడు చాతుర్మాస్యమున ఫలములు పరిత్యజించి వాటిని దానము చేయవలెను. శ్రావణము మొదలు మాస చతుష్టయము నందు వ్రతముల నాచరించుటచే సర్వమును పొందును. చాతుర్మాస్య వ్రతము ఈవిధముగ ఆచరించవలెను–ఆషాఢ శుక్లైకాదశినాడు ఉపవాసము ఉండవలెను. ఆషాఢమున వచ్చు కర్కట సంక్రాంతి యందు శ్రీమహావిష్ణువును పూజించవలెను. 'దేవా! నేను నీ ఎదుట ఈ వ్రతము అవలంబించి నాను. కేశవా! నీ అనుగ్రహముచే ఇది నిర్విఘ్నముగ సిద్ధించుగాక. దేవాధి దేవా! జనార్దనా! ఈ వ్రతము ప్రారంభించిన తరువాత ఇదిపూర్తి కాకుండగనే నేను మరణించినచో, నీ కృపచే ఇది పరిపూర్ణమగుగాక!' అని ప్రార్థించవలెను.

వ్రత మాచరించు ద్విజుడు మాంసాదులను, తైలమును వర్జించి శ్రీమహావిష్ణువును పూజించ వలెను. రోజు విడచి రోజు ఉపవాసముండుచు త్రిరాత్రవ్రతము ఆచరించువాడు విష్ణులోకము పొందును. చాంద్రాయణము చేయువాడు విష్ణు లోకమును చేరును. మౌన వ్రతము పాటించువాడు మోక్షమునకు అధికారి యగును. ప్రాజాపత్య వ్రతమాచరించు వాడు స్వర్గము పొందును. సక్తువులను, యవలను తినుచు క్షీరాదులు సేవించుచు లేదా పంచగవ్యములను, జలములను గ్రహించుచు కృచ్ఛ్ర వ్రతము చేయువాడు స్వర్గము చేరును. శాక, మూల, ఫలాహారము మాత్రము భుజించుచు కృచ్ఛ్ర వ్రతము చేయువాడు వైకుంఠము చేరును. మాంస–రసములను పరిత్యజించి యవలు మాత్రము భుజించువాడు శ్రీమహావిష్ణు సాన్నిధ్యము పొందును. ఇపుడు కౌముద వ్రతమును గూర్చి చెప్పెదను. ఆశ్వయుజ శుక్ల ఏకాదశినాడు ఉపవాసముండి, ద్వాదశినాడు శ్రీమహావిష్ణువు అవయవములకు చందనాదులు పూసి, ఉత్పలాదులతో పూజించవలెను. పిదప తైలదీపము సమర్పించి ఘృతపక్వాన్నము నైవేద్యము చేయవలెను. శ్రీమహావిష్ణువునకు మాలతీ పుష్పములు కూడా సమర్పించవలెను. 'ఓం నమో వాసుదేవాయ' అను మంత్రము ఉచ్చరించుచు వ్రతసమాప్తి చేయ వలెను. ఈ విధముగ కౌముద వ్రతము చేయువాడు ధర్మార్థ కామమోక్షములను స్వాధీనము చేసి కొనును. మాసోపవాస వ్రతము చేయువాడు శ్రీమహావిష్ణువును పూజించి సర్వమును పొందగలడు. (198)

వివిధ వ్రతములు

అగ్ని దేవుడు పలికెను :

ఇపుడు భుక్తి ముక్తి ప్రదములగు ఋతు వ్రతములను గూర్చి చెప్పెదను : వర్షా, శరత్, హేమంత, శిశిరర్తువులందు కట్టెలు దానముచేసి, వ్రతాంతమున ఘృతధేను దానముచేసి ఈ విధముగ అగ్ని వ్రతమును పాలించినవాడు మరుజన్మలో బ్రాహ్మణుడై పుట్టును. ఒకమాసము సంధ్యా సమయమున మౌన వ్రతము అవలంబించి మాసాంతమున బ్రాహ్మణునకు ఘృత కుంభము, తిలలు, ఘంట, వస్త్రములు దానము చేయువాడు ఈ సారస్వత వ్రత మాచరించి సుఖవంతుడగును. ఒక సంవత్సరము పంచామృత స్నానము చేసి గోదానము చేయువాడు రాజగును. చైత్ర ఏకాదశినాడు నక్త భుక్త వ్రతము చేసి చైత్ర మాసాంతమున విష్ణు భక్తుడగు బ్రాహ్మణునకు సువర్ణమయ విష్ణు ప్రతిమను దానము చేయవలెను. ఇట్లే ఉత్తమమగు విష్ణువ్రతము నాచరించినవాడు విష్ణుపదమును

పొందును. ఒక సంవత్సరము పాయస భోజనముచేసి రెండు గోవులను దానము చేసినవాడు ఈ దేవీవ్రతముచే శ్రీసంపన్నుడగును. ఒక సంవత్సరము పితృ దేవతలకు సమర్పించిన అన్నము భుజించువాడు రాజ్యమును పొందును. ఇవి వర్ష వ్రతములు. ఇపుడు సంక్రాంతి వ్రతములను చెప్పెదను. సంక్రాంతినాడు జాగరణ చేసినవాడు స్వర్గమును పొందును. అమావాస్యనాడు సంక్రాంతి వచ్చినపుడు శివసూర్యులను పూజించినవాడు స్వర్గమును పొందును. మకర సంక్రాంతినాడు ప్రాతః స్నానముచేసి కేశవుని అర్చించవలెను. ఉద్యాపనమున ముప్పది రెండు పలముల స్వర్ణము దానము చేసినవాడు సకల పాప విముక్తుడగును. విషువాది యోగములందు శ్రీమహావిష్ణువునకు ఘృతమిశ్ర దుగ్ధాదులతో స్నానము చేయించినవాడు సర్వమును పొందును. స్త్రీలకు ఉమావ్రతము లక్ష్మీ ప్రదము. వారు తృతీయా–అష్టమీ తిథులందు గౌరీశంకరుని పూజించవలెను. ఈ విధముగ శివపార్వతీ పూజచేసిన స్త్రీ అఖండ సౌభాగ్యముకలది అగును. ఆమెకు ఎన్నడును పతివియోగము కలుగదు. 'మూలవ్రత' 'ఉమేశ వ్రతములు' ఆచరించు స్త్రీ, సూర్య భక్తురాలగు స్త్రీ కూడ, తరువాతి జన్మలో తప్పక పురుషత్వమును పొందును. (199)

దీపదాన వ్రతం

అగ్ని దేవుడు పలికెను :

ఇపుడు భుక్తి ముక్తి ప్రదమగు 'దీపదాన వ్రతమును' గూర్చి చెప్పెదను. దేవా లయమునందుగాని, బ్రాహ్మణ గృహమునందుగాని ఒక సంవత్సరము దీపదానము చేయువాడు సకల కామములను పొందును. చాతుర్మాస్యము నందు దీపదానము చేయువాడు విష్ణు లోకమునకును, కార్తికమున దీపదానము చేయువాడు స్వర్గమునకు పోవును. దీపదానమును మించిన వ్రత మేదియు పూర్వము లేకుండెను. ఇపుడు లేదు, ఉండబోదు. దీపదానముచే ఆయుర్దాయము, నేత్రజ్యోతియు లభించును. ధనపుత్రాది ప్రాప్తి కలుగును. దీపదానము చేయువాడు సౌభాగ్యవంతుడై స్వర్గమున దేవతలచే పూజింపబడును. విదర్భరాజకుమారి యగు లలిత దీపదాన పుణ్యముచేతనే చారుధర్మమహారాజుకు భార్యయై ఆతని నూర్గురు రాణులలో ప్రముఖురాలైనది. ఆ పతివ్రత ఒక పర్యాయము విష్ణ్వా లయమున సహస్రదీపముల దానము చేసెను. ఆమె సవతులు దీపదాన మాహాత్మ్యమును గూర్చి ప్రశ్నించగా లలిత ఇట్లు చెప్పెను. పూర్వము సౌవీరరాజువద్ద మైత్రేయుడను పురోహితుడు ఉండెను. ఆతడు దేవికా నదీతీరమున శ్రీమహావిష్ణువునకు ఆలయము కట్టించెను. కార్తిక మాసమున ఆతడు దీపదానము చేసెను. పిల్లికి భయపడి పారిపోవుచున్న ఒక ఆడుఎలుక అకస్మాత్తుగ, తన ముఖాగ్రముతో ఆ దీపపు వత్తిని పైకి త్రోసెను. అట్లు చేయుటచే ఆరిపోవుటకు సిద్ధముగానున్న దీపము ప్రజ్వలించెను. మరణానంతరము ఆ ఆడు ఎలుకయే రాజకుమారిగ జన్మించి రాజధర్ముని నూర్గురు రాణులలో ప్రధానురాలైనది. ఈ విధముగ అనుకొనకుండగనే నేను విష్ణ్వాలయము నందలి దీపపు వత్తిని ఎగసన త్రోయుటచే కలిగిన పుణ్యమునకు ఫలమును అనుభవించుచున్నాను. దీని వలననే నాకు పూర్వ జన్మ స్మృతికూడ లభించినది. అందుచే నేను సదా దీపదానము చేయు చున్నాను. ఏకాదశినాడు దీపదానము చేసినవాడు స్వర్గమున విమానారూఢుడై ఆనందించుచుండును.

దీపమును హరించినవాడు మూగవాడు, బుద్ధివిహీనుడు అగును. చీకటితో నిండిన దాట శక్యముగాని నరకములో పడును. అక్కడ విలపించుచున్న వారిని చూచి యమకింకరుడు ఇట్లు అనును – "ఇక్కడ ఏడిచి ఏమి ప్రయోజనము? మీరు ఏమరచి మీ ధర్మమును ఉపేక్షించినారు. కొన్ని వేలజన్మలలో ప్రాణి మనుష్యుడుగా పుట్టును. అపుడు కూడ మూఢ బుద్ధియై భోగాలకొరకు పరుగెత్తును. పూర్వము మీరు అనుభవించిన విషభోగాల ఫలితంగా ఇక్కడ ఏడ్వవలసి వచ్చినది. చేసిన పాపముల ఫలము అనుభవించ వలసి ఉండునని మీరు ముందుగానే ఎందుకు ఆలోచించ లేదు? పరభార్యల కుచమర్దనము మీకు సుఖకరముగ కనబడినది. అదే ఇపుడు మీకు దుఃఖహేతు వైనది. పరస్త్రీలను అపహరించి మీరు చేసిన కర్మలను గూర్చి నేను చెప్పి ఉన్నాను. ఇపుడు అయ్యో! అమ్మా! అనుచు ఎందుకు ఏడ్చెదరు? శ్రీమహావిష్ణువు నామము నాలుకకు ఏమి భారము? తైలము, పత్తి చాల స్వల్ప మూల్యము కలవి. అగ్నియైతే అంతటను లభించునదే. ఐనను మీరు దీపదానము చేయక విష్ణ్వాలయము నుండి దీపమును హరించితిరి. అదియే మీకు ఇపుడు దుఃఖ మును ఇచ్చుచున్నది. విలపించి ఏమి ప్రయోజనము? వచ్చిన యాతనను అనుభవింపుడు' అని పలుకుదురు అని తెలిపి ఇంకను

అగ్ని దేవుడు ఇట్లు చెప్పెను : లలిత సవతులందరు ఆమె చెప్పిన ఉపాఖ్యానము విని దీప దాన ప్రభావముచే స్వర్గము పొందిరి. అందుచే దీపదానము అన్ని వ్రతముల కంటెను విశేష ఫలదాయకము. (200)

నవవ్యూహార్చనము

అగ్ని దేవుడు పలికెను :

వసిష్ఠ మహామునీ! శ్రీ మహావిష్ణువు నారదునకు చెప్పిన విధమున నవవ్యూహార్చన విధానము చెప్పెదను. పద్మమయమగు మండలము మధ్య 'అం' బీజముతో కూడిన వాసుదేవుని పూజించవలెను. (ఉదా : అం వాసుదేవాయ నమః) ఆగ్నేయము నందు 'అం' బీజయుక్త ప్రద్యుమ్నుని, నైరృతియందు 'అః' బీజయుక్తుడగు అనిరుద్ధుని, పశ్చిమమున ప్రణవయుక్త నారాయణుని, వాయువ్యమునందు తత్సద్ బ్రహ్మను, ఉత్తరమునందు 'హుం' బీజయుక్త విష్ణువును, 'క్ష్రౌం' బీజయుక్త నృసింహుని, ఈశాన్యమున పృథ్విని, పశ్చిమ ద్వారమున వరాహమూర్తిని పూజించవలెను. కం, టం, శం, సం బీజ యుక్త గరుడుని పూర్వాభిముఖునిగా దక్షిణమున పూజించవలెను. ఖం, ఛం, బం, హుం, ఫట్ అను బీజములతోను; ఖం, ఠం, ఫం, శం అను బీజములతోను; గదను చంద్రమండలము నందు పూజించవలెను. బం, ణం, మం, క్షం బీజములతోను; శం, ధం, దం, భం, హం బీజముల తోను శ్రీదేవిని కోణభాగమునందు పూజించవలెను. దక్షిణ ఉత్తరములందు గం, డం, బం, శం బీజములతో పుష్టిదేవిని పూజించవలెను. పీఠపశ్చిమ భాగమునందు ధం, వం బీజములతో వనమాలను పూజించవలెను. పశ్చిమ దిశయందు సం, హం, లం బీజములతో శ్రీవత్సమును, జలమునందు భం, తం, యం, బీజములతో కౌస్తుభమును పూజించవలెను. పిదప దశమాంగ క్రమమున విష్ణువును, అతని క్రింది భాగమున అనంతుని, వారి పేర్లకు నమః జోడించి

పూజించవలెను. పూర్వాది దిశలందు దశాంగాదులను, మహేంద్రాది దశ దిక్పాలులను, పూర్వాది దిశలందు నాలుగు కలశలను పూజించవలెను. తోరణ, వితాన, అగ్ని, వాయు, చంద్రుల బీజములతో కూడిన మండల ములను క్రమముగా ధ్యానించి, తన శరీరమును వందన పూర్వకముగ అమృత ప్లావితము చేయవలెను. ఆకాశము నందున్న ఆత్మయొక్క సూక్ష్మ రూపమును ధ్యానించి, ఆ ఆత్మ చంద్రమండలము నుండి ప్రవహించుచున్న శ్వేతామృత ధారలో నిగ్నమైనట్లు భావన చేయవలెను. ప్లవన సంస్కృతమైన అమృతమే ఆత్మ బీజము. ఆ అమృతము నుండి పుట్టిన పురుషుడే తానని భావన చేయవలెను. "నేనే విష్ణు స్వరూపమున ప్రకటమైతిని' అని భావన చేయవలెను. పిదప ద్వాదశ బీజన్యాసము చేయవలెను. క్రమముగ వక్షఃస్థల, మస్తక, శిఖా, పృష్ఠభాగ, నేత్ర హస్తద్వయము లందును, హృదయ, శిరః, శిఖా, కవచ, నేత్రత్రయ, అస్త్రములందును అంగన్యాసము చేయవలెను. రెండు హస్తములందును అస్త్రన్యాసము చేసిన పిదప సాధకుని శరీరమునందు దివ్యత్వమువచ్చును. తన శరీరమునందు చేసినట్లే దేవతావిగ్రహ శరీరమునందును శిష్య శరీరము నందును గూడ న్యాసము చేయవలెను. హృదయములో చేయు శ్రీమహావిష్ణు పూజనము నిర్మాల్యరహిత పూజనము, మండలాదులపై చేయునది నిర్మాల్యసహితము. దీక్షాకాలమున శిష్యుని నేత్రములు బంధింపబడి యుండును. ఆ సమయమున ఆతడు ఇష్టదేవతా విగ్రహముపై విసరిన పుష్పమును బట్టి వానికి ఆపేరు పెట్టవలెను. శిష్యులను ఎడమ ప్రక్క కూర్చుండ బెట్టుకొని అగ్నియందు తిలలు, బియ్యము, ఘృతము, హోమము చేయవలెను. నూట ఎనిమిది ఆహుతులు ఇచ్చిన పిదప కాయశుద్ధి కొరకై వెయ్యి హోమములు చేయవలెను. పిదప పూర్ణాహుతి ఇచ్చి గురువు శిష్యులకు దీక్ష ఇవ్వవలెను. శిష్యులు ధనముచే గురువును పూజించవలెను. (201)

పుష్పాధ్యాయ కథనము

అగ్ని దేవుడు పలికెను :

శ్రీమహావిష్ణువు పుష్ప, గంధ, ధూప, దీప, నైవేద్యముల సమర్పణచే ప్రసన్ను డగును. శ్రీమహా విష్ణువునకు సమర్పింప యోగ్యములు, అయోగ్యములు అయిన పుష్పములను గూర్చి చెప్పెదను. మాలతీపుష్పము పూజకు అత్యుత్తమము. తమాల పుష్పము భోగ మోక్ష ప్రదము. మల్లికాపుష్పము సమస్త పాపనాశకము. యూథిక విష్ణులోకమును ఇచ్చును. అతిముక్త కలోధ్ర పుష్పములు విష్ణులోక ప్రాప్తి హేతువులు. కరవీర పుష్పములతో పూజించు వాడు విష్ణు లోకమును చేరును. జపాపుష్పములు పుణ్యప్రదములు. పావన్తీ, కుబ్జక, తగర పుష్పములు విష్ణు లోకమును ఇచ్చును. కర్ణికార పుష్పపూజ చేయువాడు వైకుంఠము చేరును. కురంట పుష్పపూజ పాప వినాశకము. కమల, కుంద, కేతకీ పుష్పములు పరమగతిని ఇచ్చును. బాణపుష్ప, కృష్ణ తులసీ పత్రములతో పూజచేయువాడు విష్ణు లోకమును పొందును. అశోక, తిలక, అటరూప పుష్పములచే పూజించువాడు మోక్షాధికారి యగును. బిల్వ శమీ పత్రములచే పరమగతి సులభము. తమాల దలములతోను, భృంగ రాజము తోను పూజచేయువాడు విష్ణులోక నివాసి అగును. కృష్ణ తులసీ, శుక్ల తులసి, కల్హార, ఉత్పల, పద్మ, కోకనద పుష్పములు పుణ్యప్రదములు. నూరు కమలముల మాల సమర్పించినచో

శ్రీమహావిష్ణువు ప్రసన్నుడగును. నీప, అర్జున, కదంబ, కింశుక, అగస్త్య, గోకర్ణ, నాగకర్ణ, సంధ్యాపుష్పీ, బిల్వాతక, రంజనీ, కేతకీ, కూష్మాండ, గ్రామకర్కటీ, కుశ, కాశ, ద్యూత, విభీతక, మరువకాది పత్రములతోను, ఇతరమైన సుగంధి పత్రము లతోను పూజచేసినచో శ్రీమహావిష్ణువు ప్రసన్నుడగును. వీటితో పూజించినవాడు పాప విముక్తుడై భుక్తిముక్తులను పొందును. లక్ష స్వర్ణములకంటె గూడ కోట్ల రెట్లు పుష్పములు ఉత్తమములు. తన ఉద్యానవనమునుండియు, ఇతరుల ఉద్యానముల నుండియు తెచ్చిన పుష్పముల కంటె వన్య పుష్పములకు మూడు రెట్లు ఫలము అధికమని చెప్పబడినది.

రాలిన పూవులతోను, అధికమైన అవయవములు గలవాటితోను, నలిగిపోయిన వాటితోను శ్రీమహావిష్ణువును పూజించరాదు. కాంచనార, ఉన్మత్త (ఉమ్మెత్త), గిరికర్ణికా (కొండగన్నేరు), కుటజ, శాల్మలి, శిరీష (దిరిసెన) పుష్పములతో విష్ణువును పూజించరాదు. వీటితో శ్రీమహావిష్ణువును పూజించువాడు నరకము చెందును. సుగంధముగల రక్త కమలముతోను, నీల కమలములతోను శ్రీమహావిష్ణువును పూజించవలెను. అర్క, మందార, ధుస్తూర కుసుమములతో శివుని పూజించ వలెను. కాని కుటజ, కర్కటీ, కేతకీ (మొదలి) పుష్పములతో శివుని పూజింపగూడదు. కూష్మాండ (గుమ్మడి), నింబ (వేప) పుష్పములును, గంధ హీనములగు ఇతర పుష్పములును పైశాచములని చెప్పబడుచున్నవి. అహింస, ఇంద్రియ జయము, ఓర్పు, జ్ఞానము, దయ, స్వాధ్యాయము మొదలగు ఎనిమిది భావ పుష్పములచే దేవతలను పూజించు మానవుడు భుక్తి ముక్తి పాత్రుడగును. వీటిలో అహింస మొదటి పుష్పము. ఇంద్రియ నిగ్రహము రెండవది. సకల ప్రాణులపై దయ మూడవ పుష్పము. ఓర్పు నాల్గవదగు శ్రేష్ట పుష్పము. ఈ విధముగ శమ, తపో, ధ్యానములు పంచమ, షష్ఠ, సప్తమ పుష్పములు. సత్యము ఎనిమిదవ పుష్పము. వీటితో పూజించినచో భగవంతుడు ప్రసన్నుడగును. నరశ్రేష్ఠా! ఇతర పుష్పములు పూజకు బాహ్యోపకరణములు మాత్రమే. శ్రీమహావిష్ణువు భక్తి దయా సమన్వితములగు భావ పుష్పములతో పూజించినచో సంతుష్టుడగును. జలము వారుణ పుష్పము. ఘృత, దుగ్ధ, దధులు సౌమ్య పుష్పములు. అన్నాదులు ప్రాజాపత్య పుష్పములు. ధూప దీపములు ఆగ్నేయ పుష్పములు. ఫల పుష్పాదులు వానస్పత్య పుష్పములు. శ్రద్ధాది భావములు వైష్ణవ కుసుమములు. ఈ అష్టవిధ కుసుమములు సర్వ కామప్రదములు. ఆసనము (యోగ పీఠము) పంచాంగన్యాసము, అష్ట పుష్పములు ఇవి విష్ణు రూపములు. ఈ అష్ఠ పుష్పములచే పూజితుడై శ్రీమహావిష్ణువు ప్రసన్ను డగును. ఇవికాక వాసుదేవాది నామములతో శ్రీమహావిష్ణువును, ఈశానాది నామ పుష్పములతో శివుని పూజించవలెను. (202)

నరక స్వరూపము

అగ్ని దేవుడు పలికెను : వసిష్ఠా! ఇపుడు నరకములను గూర్చి చెప్పెదను. పుష్పాద్యుప చారములతో శ్రీమహా విష్ణువును పూజించువారికి నరకప్రాప్తి ఉండదు. ఆయుర్దాయము పూర్తియైన పిమ్మట వలదన్నను మానవుడు మరణించి తీరును. దేహధారియైన జీవుడు అగ్ని, జలము, విషము, శస్త్రఘాతము, ఆకలి, వ్యాధి, పర్వతమునుండి పడుట మొదలైన ఏదియో ఒక నిమిత్తముచే ప్రాణ ములు విడచును. స్వ కర్మానుసారముగ యాతనలు అనుభవించుటకై మరొక శరీరమును

గ్రహించును. పాపకర్మ చేసినవాడు దుఃఖమును అనుభవించును. పుణ్యకర్మ చేసినవాడు సుఖము అనుభవించును. మరణానంతరము యమదూతలు వచ్చి పాపాత్ముని దుర్గమ మార్గము ద్వారా యమపురిలోనికి దక్షిణ మార్గము ద్వారా తీసికొనిపోయి యమధర్మరాజు ఎదుట నిలుపుదురు. ఆ యమదూతలు చాల భయంకరముగ నుందురు. ధర్మాత్ములను మాత్రము పశ్చిమాది ద్వారముల ద్వారా తీసికొని పోవుదురు. యముని ఆజ్ఞ ప్రకారము పాపాత్ములు నరకమునందు పడవేయ బడుదురు. వశిష్ఠాది ఋషులు బోధించిన ధర్మమును ఆచరించువారిని స్వర్గమునకు తీసికొని పోవుదురు. గోహత్య చేసిన వాడు 'మహావీచి' నరకమునందు ఒక లక్ష సంవత్సరములు బాధలను అనుభవించును. బ్రహ్మహత్య చేసినవారు చాల ఉష్ణమైన 'తామ్రకుంభ' నరకమునందు పడద్రోయ బడుదురు. భూమిని అపహరించిన పాపాత్మునకు రౌరవాది నరకమునందు మహా ప్రళయము వరకును మెల్లమెల్లగ దుస్సహమైన పీడ కల్గింపబడును. స్త్రీ, బాల, వృద్ధులను చంపిన పాపాత్ములు పదునలుగురు ఇంద్రుల రాజ్యము పూర్తి అగునంత కాలము మహా రౌరవమను రౌద్రమైన నరకము నందు బాధ అనుభవింతురు. ఇతరుల ఇళ్లను, పొలములను తగులబెట్టిన వారిని ఒక కల్పమువరకు మహారౌరవ నరకమునందు కాల్చివేయుదురు. దొంగతనము చేయువారు తామిస్రమను నరకము నందు బాధలను అనుభవింతురు. పిదప యముని అనుచరులు వానిని బల్లెములతో పొడుచు చుందురు, 'మహాతామిస్ర' నరకమున సర్పముల చేతను జలగలచేతను పీడింతురు. మాతృహత్యాది పాపములు చేసినవారిని అసిపత్ర వనమను నరకమునందు పడవేయుదురు. అచట వాని అవయ వములను కత్తులతో, ఈ భూమి ఉన్నంతవరకును, ఛేదించు చుందురు. ఈ లోకమునందలి ఇతర ప్రాణుల హృదయములు కాల్చినవారిని అనేక కల్పముల వరకును 'కరంభవాలుక' అను నరకమునందు వేడిగానున్న ఇసుకపై వేయించెదరు. ఇతరులకు పెట్టకుండ మృష్టాన్నమును తిన్నవాడు 'కాకోల'మను నరకము నందు పురుగులను, రెట్టలను తినుచుండును. పంచ మహా యజ్ఞములను, నిత్య కర్మలను త్యజించువాడు కుట్టలమను నరకము నందు మూత్రమును, రక్తమును త్రాగుచుండును. అభక్ష్య వస్తువులు భక్షించువాడు మహాదుర్గంధ మయమగు నరకములో పడి రక్తమును ఆహారముగ గొనును.

ఇతరులకు కష్టము కలిగించువాడు తైలపాక నరకమునందు తిలలవలె నలుగ గొట్ట బడును. శరణాగతుని చంపినవాడుగూడ తైలపాక నరకమునందు పక్వము చేయబడును. యజ్ఞమునకై ఏదైన ఒక వస్తువు నిచ్చెదనని చెప్పి, ఇవ్వనివాడు 'నిరుచ్ఛ్వాస' నరకమును పొందును. రస విక్రయము చేయువాడు 'వజ్రకటాహ' నరకమునందును, అసత్యములు ఆడువాడు 'మహాపాత' నరకమునందును పడవేయబడును.

పాపాత్ముడు 'మహాజ్వాల' నరకమునందును, అగమ్యాగమనము చేసినవాడు 'క్రకచము' నందును, వర్ణసంకర సంతానోత్పత్తి చేసినవాడు 'గుడపాకము' నందును, ఇతరుల మర్మ స్థానములందు బాధకలిగించినవాడు 'ప్రతుదము' నందును, ప్రాణిహింస చేయువాడు 'క్షారహ్రదము' నందును, భూమి అపహరించినవాడు 'క్షురధారా' నరకము నందును, గో స్వర్ణాపహారి 'అంబరీషము' నందును, వృక్షములను ఛేదించువాడు 'వజ్రశస్త్రము' నందును, మధువు దొంగిలించినవాడు

'పరీతాపము' నందును, ఇతరుల సొత్తు అపహరించినవాడు 'కాలసూత్రము' నందును, అధికముగా మాంసమును తినువాడు 'కశ్మలము' నందును, పితరులకు పిండ ప్రదానము చేయనివాడు 'ఉగ్ర గంధము' నందును యమభటులచే పడద్రోయబడును. లంచము తీసికొనువాడు 'దుర్ధర' నరకమునందును, నిరపరాధులను బంధించిన వానిని 'లోహమయ మంజూష' అను నరకమందును వేద నిందకుని 'అప్రతిష్ఠము' నందును అబద్ధపు సాక్ష్య మిచ్చువానిని 'పూతివక్త్రము' నందును, ధనము అపహరించినవానిని 'పరిలుంతము' నందును, బాలస్త్రీ, వృద్ధులను చంపిన వానిని, బ్రాహ్మణ పీడకుని 'కరాలము' నందును, మద్యపానము చేయు బ్రాహ్మణుని 'విలేపము' నందును, మిత్రులందు భేదభావము కలిగించు వానిని 'మహా ప్రేతము' నందును పడద్రోయుదురు. పరస్త్రీగామి యగు పురుషుడును, అనేక పురుషగామినియగు స్త్రీయు 'శాల్మలము' అను నారకమునందు కాలుచున్న లోహము ఆకారములో ఉన్న ఆ ప్రియురాలిని, లేదా ప్రియుని ఆలింగనము చేసికొనవలసి వచ్చును. పరస్త్రీలను కుదృష్టితో చూచిన వాని కండ్లు పీకివేయుదురు. మాతా, పుత్రీగామిని కణకణ లాడుచున్న నిప్పులపై పడద్రోయుదురు. చోరులను ఛురికతో భేదింతురు. మాంస భక్షణము చేయు నరపిశాచులకు వారి మాంసమే కోసి తినిపింతురు. మాసోపవాసము గాని, ఏకాదశీ వ్రతముగాని, భీష్మ పంచక వ్రతము గాని చేయువాడు నరకములకు వెళ్ళడు. (203)

మాసోపవాస వ్రతము

అగ్ని దేవుడు ఇట్లు చెప్పెను : వశిష్ఠమహామునీ! ఇప్పుడు అన్నింటికంటెను ఉత్తమమైన మాసోపవాస వ్రతమును గూర్చి చెప్పెదను. వైష్ణవ యజ్ఞము చేసి, ఆచార్యుని ఆజ్ఞ గైకొని, కృచ్ఛ్రాది వ్రతములను ఆచరించుట ద్వారా తన శక్తిని పరీక్షించుకొని, మాసోపవాస వ్రతము చేయవలెను. వానప్రస్థుడు, సంన్యాసి, విధవయగు స్త్రీ ఈ వ్రతము చేయవలెను.

ఆశ్వయుజ శుక్ల ఏకాదశినాడు ఉపవాసముండి ముప్పది దివసములకై ఈ క్రింది విధముగ సంకల్పించి మాసోపవాస వ్రతమును గ్రహించవలెను : 'ఓ! మహావిష్ణూ! నేను ఈ దినము మొదలు ముప్పది దినములు నీ ఉత్థానము పర్యంతము నిరాహారుడుగా ఉండి నిన్ను పూజించెదను. సర్వ వ్యాపివైన ఓ హరీ! ఆశ్వయుజ శుక్ల ఏకాదశి మొదలు నీ ఉత్థాన కాలమైన కార్తిక శుద్ధ ఏకాదశిలోగా నేను మరణించినను, నీ కృపచే వ్రత భంగము కాకుండుగాక'. వ్రతము నాచరించు వాడు దినమున మూడు పర్యాయములు స్నానము చేయుచు, సుగంధ ద్రవ్యములతోను, పుష్పముల తోను, ప్రాతఃకాలమునను, మధ్యాహ్నామందును, సాయంకాలమునందును శ్రీమహావిష్ణువును పూజించవలెను. తత్సంబంధి, గాన, ధ్యాన, జపాదులు చేయవలెను. వ్యర్థాలాపములను విడువ వలెను. ధనాశ పరిత్యజించవలెను. వ్రతహీనుని ఎవ్వనిని స్పృశించరాదు. శాస్త్ర నిషిద్ధ కర్మల నాచరించు వారిని ప్రేరేపించరాదు. ముప్పది దివసముల పాటు దేవాలయమునందే నివసించవలెను. వ్రతము చేయువాడు కార్తిక శుక్ల ద్వాదశినాడు శ్రీమహావిష్ణువును పూజించి పూజ్యులకు భోజనము పెట్టి, వారికి దక్షిణలు ఇచ్చి, తాను కూడా పారణము చేసి, వ్రతసమాప్తి చేయవలెను. ఈ విధముగ పదమూడు మాసఉపవాసములు చేసినవాడు భుక్తిముక్తులను రెండిటి పొందును.

పిదప వైష్ణవ యజ్ఞము చేసి (పదముగ్గురు బ్రాహ్మణులకు భోజనము పెట్టి వారి ఆజ్ఞచే) ఒక బ్రాహ్మణునకు పదమూడు ఉత్తరీయములను, పదమూడు అధోవస్త్రములను, పాత్ర, ఆసన, ఛత్ర, పవిత్ర, పాదుకా, యోగపట్ట, యజ్ఞోపవీతములను దానము చేయవలెను.

పిదప శయ్యపై తన ప్రతిమను, సువర్ణమయమగు మహావిష్ణు ప్రతిమను పూజించి వాటిని మరొక బ్రాహ్మణునకు దానముచేసి, ఆతనిని వస్త్రాదులచే సత్కరించవలెను. 'నేను సర్వ పాప విముక్తుడనై, బ్రాహ్మణ శ్రీమహావిష్ణు ప్రసాదముచే విష్ణు లోకమునకు వెళ్ళగలను' అని ఆతడు పలుకగా బ్రాహ్మణులు 'ఓ దేవాత్మకా! నీవు రోగశోకరహితమగు విష్ణులోకమునకు వెళ్ళి, అచట విష్ణురూప ధారివై విమానమున విరాజిల్లుము' అని పలుక వలెను. పిదప వ్రతము నాచరించినవాడు ద్విజులకు నమస్కరించి, ఆ శయ్యను ఆచార్యునకు ఇచ్చి వేయవలెను. ఈ విధముగ వ్రత మాచరించినవాడు తన నూరు కులములను ఉద్ధరించి వారిని కూడ విష్ణు లోకమునకు తీసికొని వెళ్ళును. మాసోప వాసము చేయువాడు నివసించు దేశము పాపరహితమైయుండును. మాసోపవాస వ్రతానుష్ఠానము చేసినవాడు పుట్టిన కులముమాట చెప్పవలెనా? వ్రతము నాచరించువాడు మూర్ఛ చెందినచో అతనికి నెయ్యి కలిపిన పాలు త్రాగించవలెను. ఈ క్రింద చెప్పిన పదార్థములు వ్రతభంగ కరములు కావు–బ్రాహ్మణుని అనుమతిచే గ్రహించిన హవిస్సు, ఆచార్యుని అనుజ్ఞచే గ్రహించిన ఓషధి, ఫలము, మూలము, ఫలము. ఈ వ్రతమునందు 'శ్రీమహావిష్ణువే మహౌషధి స్వరూపుడు' అను విశ్వాసముతో వ్రత మాచరించువాడు వ్రతమును సమాప్తి చేయగలడు. (204)

భీష్మపంచక వ్రతము

అగ్ని దేవుడు చెప్పెను :

ఇపుడు సకల మనోరథములను తీర్చు వ్రతరాజమైన భీష్మపంచక వ్రతమును గూర్చి చెప్పెదను. కార్తిక శుక్లైకాదశినాడు ఈ వ్రతమును ప్రారంభించి, ఐదు దినముల పాటు మూడువేళల స్నానము చేయుచు తిలలతోను, యవలతోను దేవతలకును, పితరుల కును ఐదు తర్పణములు ఈయవలెను. మౌనముతో శ్రీమహావిష్ణువును పూజించవలెను. పంచామృత–పంచగవ్యములతో స్నానము చేయించి, చందనాది సుగంధ ద్రవ్యములు అలది, ఘృతయుక్తమగు గుగ్గులు వెలిగించవలెను. ప్రాతఃకాలము నందును, రాత్రి యందును శ్రీమహావిష్ణువునకు దీపము చూపి, భోజ్య పదార్థములు నివేదనము చేయవలెను. 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అను ద్వాదశాక్షరీ మంత్రమును నూట ఎనిమిది పర్యాయ ములు జపించవలెను. ద్వాదశాక్షర మంత్రమునకు చివర 'స్వాహా' చేర్చి ఘృతసిక్తములు అగు తిలలను, యవలను హోమము చేయవలెను. మొదటి దినమున భగవంతుని పాదములను కమలములతోను, రెండవ దినమున మోకాళ్లను, తొడలను బిల్వ పత్రముల తోను, మూడవ దినమున నాభిని భృంగ రాజముతోను, నాల్గవ దివసమున బాణపుష్ప, బిల్వపత్ర, జపాపుష్పముల తోను, ఐదవ దివసమున మాలతీ పుష్పములతోను సర్వాంగము లను పూజించవలెను. వ్రతము నాచరించువాడు భూమిపై శయనించవలెను. ఏకాదశినాడు గోమయమును, ద్వాదశియందు గోమూత్రమును, త్రయోదశి యందు పెరుగును. చతుర్దశి యందు క్షీరమును, చివరి దినమునందు

పంచగవ్యములను ఆహారముగ గ్రహించవలెను. పౌర్ణమాసియందు నక్తవ్రతము చేయవలెను. ఈ విధముగ వ్రతము చేసినవాడు భుక్తి ముక్తులను పొందును. భీష్ముడు ఈ వ్రతము ఆచరించుటచే శ్రీహరిని చేరెను. కావుననే దీనికి 'భీష్మ పంచకము' అను పేరు వచ్చినది. బ్రహ్మకూడ ఈ వ్రతము ఆచరించి శ్రీహరిని పూజించెను. అందుచే ఈ వ్రతము పంచోపవాసాదులతో కూడియున్నది. (205)

అగస్త్యపూజ

అగ్ని దేవుడు చెప్పెను :

వశిష్ఠా! అగస్త్య మహర్షి సాక్షాత్తు విష్ణు స్వరూపుడు. అతని పూజ చేసినవాడు శ్రీమహావిష్ణు సన్నిధి చేరును. సూర్యుడు కన్యారాశి చేరక ముందు, దానికి దగ్గరగా ఉన్నపుడు $3\frac{1}{3}$ రోజులు ఉపవాసముండి, అగస్త్య పూజచేసి, అర్ఘ్యము ఇవ్వవలెను. మొదటి దినమున నాలుగు గంటలు పగటి భాగము మిగిలి ఉండగా వ్రత ప్రారంభము చేసి, ప్రదోష కాలమున కాశ పుష్పమయమగు అగస్త్యుని మూర్తి కలశముపై స్థాపించి, మూర్తి పూజ చేయవలెను. అర్ఘ్యమును ఇచ్చువాడు రాత్రి జాగరణము చేయవలెను; 'ముని శ్రేష్ఠుడవైన అగస్త్యా! నీవు తేజోరాశివి, మహా బుద్ధిమంతుడవు. నీ భార్యయగు లోపాముద్రతో కలిసివచ్చి నేను ఇచ్చు పూజను గ్రహింపుము' అని అగస్త్యుని ఆవాహనము చేసి, గంధ, పుష్ప, ఫల, జలాదులతో అర్ఘ్యము సమర్పించవలెను. పిదప ముని శ్రేష్ఠుడైన అగస్త్యుని వైపు తిరిగి చందనాద్యుపచారములతో పూజించవలెను. రెండవ రోజున ప్రాతఃకాలమున కలశస్థిత-అగస్త్య మూర్తిని ఏదైన జలాశయము వద్దకు తీసికొనిపోయి, ఈ విధముగ చెప్పుచు అర్ఘ్యము సమర్పించవలెను. 'కాశ పుష్పమువలె ప్రకాశించు వాడా! అగ్ని వాయు సంభూతుడా! మిత్రావరుణ పుత్రా! కుంభసంభవా! అగస్త్యా! నీకు నమస్కరించుచున్నాను.

ఆతాపి, వాతాపులను రాక్షసులను భక్షించినవాడవును, సముద్రమును ఎండింపచేసిన వాడవును అగు అగస్త్యా! నా ఎదుట సాక్షాత్కరించుము. నేను మనోవాక్కాయములతో అగస్త్యుని ప్రార్థించుచున్నాను. ఉత్తమ లోకప్రాప్తి ఆశచే అగస్త్యుని ప్రార్థించుచున్నాను. జంబూ ద్వీపమునకు బైట పుట్టినదియు, దేవతలకు ప్రియమును, సకల వృక్ష శ్రేష్ఠము అగు చందనమును స్వీకరింపుము. అగస్త్యా! ధర్మార్థ కామమోక్షములను ఇచ్చునదియు, సౌభాగ్య ఆరోగ్యలక్ష్మీ వర్ధకమును పాప వినాశకమును అగు ఈ పుష్పమాలను స్వీకరిం పుము. ఈ ధూపమును గ్రహించి నాకు స్థిరభక్తిని ప్రసాదింపుము. ఈ లోకమున మనో వాంఛిత ఫలములను, పరలోకమున శుభగతిని ఇమ్ము. దేవాసుర పూజితుడవగు మునీంద్రా! నీవు సకల కామఫల ప్రదాతవు. వస్త్ర, వ్రీహి, ఫల, సువర్ణములతో కూడిన అర్ఘ్యమును ఇచ్చుచున్నాను. మహామునీ! నా మనస్సులో ఉన్న విషయమును అగస్త్యునకు (నీకు) తెలిపెదను. నీకు ఫలార్ఘ్యమును సమర్పించుచున్నాను. గ్రహింపుము. పిదప 'అగస్త్య ఏవం ..... జగామ' అను వైదిక మంత్రముతో అర్ఘ్యము నీయవలెను. మహావ్రత పరిపాలకురాలివి రాజపుత్రివి ముని పత్నివి దేవేశ్వరివి అయిన లోపాముద్రా! నీకు నమస్కారము. ఓ యశస్వినీ! ఈ అర్ఘ్యము గ్రహింపుము. పంచరత్న, సువర్ణ, రజత, సప్తధాన్య పూర్ణమగు పాత్రను, దధి,

చందన సమన్వితమగు అర్ఘ్యమును అగస్త్యునకు సమర్పించవలెను. స్త్రీ, శూద్రాదులు 'కాశపుష్ప ప్రతీకాశ' ఇత్యాది పౌరాణిక మంత్రముతో అర్ఘ్య ప్రదానము చేయవలెను. 'మునిశ్రేష్ఠుడవైన అగస్త్యా! తేజః పుంజముతో ప్రకాశించు నీవు నరకమును ప్రసాదించువాడవు. నేను చేసిన పూజ గ్రహించి శాంతి పూర్వకముగా వెళ్ళుము. ఈ విధముగా పూజానంతరము అగస్త్యుని విసర్జించి అతనిని ఉద్దేశించి ఏదైన ఒక ధాన్యమును ఫలమును, రసమును పరిత్యజించవలెను. పిదప బ్రాహ్మణులకు ఘృతమిశ్రిత క్షీరాన్నము, లడ్డులు మొదలైన వాటితో సంతర్పణముచేసి గోవు, వస్త్రము, బంగారము మొదలైన వాటిని దానము చేయవలెను. పిదప, ఆ కుంభము ముఖమును ఘృత మిశ్ర క్షీరయుక్త పాత్రచే మూసి, దానియందు సువర్ణముంచి బ్రాహ్మణునకు దానము చేయవలెను. ఈ విధముగా ఏడు రోజులు అగస్త్యార్ఘ్యమును ఇచ్చు వారెల్లరును సర్వ వాంఛితములను పొందగలరు. దీనివలన స్త్రీ సౌభాగ్యమును పుత్రులను పొందును. కన్య పతిని పొందును. రాజు రాజ్యము పొందును. (206)

కౌముద వ్రతము

అగ్నిదేవుడు చెప్పెను :

ఇపుడు కౌముద వ్రతమును గూర్చి చెప్పెదను. దీనిని ఆశ్వయుజ శుక్ల పక్షము నందు ప్రారంభించవలెను. వ్రతము చేయువాడు ఏకాదశీ దివసమున ఉపవాసము చేసి ఒక మాసము శ్రీమహావిష్ణువును పూజించవలెను. 'నేను ఆశ్వయుజ శుక్ల పక్షమునందు ఒక పూట మాత్రమే భోజనము చేయుచు, శ్రీమన్నారాయణుని మంత్రము జపించుచు, భుక్తి ముక్తి ప్రాప్తికొరకై ఒకమాసము పర్యంతము కౌముద వ్రతమును అనుష్ఠించెదను' అని సంకల్పించవలెను. వ్రతము సమాప్తమైన పిదప ఏకాదశీ దివసమున ఉపవాసము చేసి ద్వాదశీ సమయమున శ్రీమహావిష్ణువును పూజించవలెను. శ్రీ మహావిష్ణువు విగ్రహముపై చందనము, అగరు, కేసరములు అనులేపనముచేసి, కమల, ఉత్పల, కహ్లార, మాలతీ పుష్పములతో విష్ణువును పూజించవలెను. వాక్సంయమముతో తైలపూర్ణ దీపము వెలిగించి, రెండు వేళల యందును పాయసము, అపూపములు, లడ్డులు నైవేద్యము చేయవలెను. 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అను ద్వాదశాక్షర మంత్రమును నిరంతరము జపించ వలెను. పిదప బ్రాహ్మణ భోజనము చేయించి క్షమా ప్రార్థనా పూర్వకముగ వ్రత విసర్జనము చేయవలెను. దేవజాగరణీ ఏకాదశి వరకు, ఒకమాసము ఉపవాసము చేయుటచే కౌముద వ్రతము పూర్ణమగును. పూర్వోక్త మాసోపవాసముగూడ ఇన్ని దినములే జరుగును. కాని ఈ కౌముద వ్రతముచే దానికంటె అధిక ఫలము లభించును. (207)

వ్రతదాన సముచ్చయము

అగ్ని దేవుడు చెప్పెను :

వశిష్ఠా! ఇపుడు సామాన్యవ్రతమును గూర్చియు, దానములను గూర్చియు సంక్షిప్త ముగా చెప్పెదను. ప్రతిపదాది తిథులందును, సూర్యవారాదులందును, కృత్తికాది నక్షత్రము లందును విష్కంభాది యోగములందును, మేషాది రాశులందును, గ్రహణాది సమయము లందును చేయదగిన

వ్రతములు, దానములు వాటికి సంబంధించిన ద్రవ్యములు, నియమాదులు వీటిని గూర్చి కూడ చెప్పెదను. వ్రత దానోపయోగులగు ద్రవ్యములకును, కాలమునకును, అధిష్ఠాతయైన దేవత శ్రీమహావిష్ణువు. సూర్య శివ బ్రహ్మ లక్ష్మాది దేవతలందరును శ్రీమహావిష్ణు విభూతులే. అందుచే ఆయనను ఉద్దేశించి చేసిన వ్రతదాన పూజనాదులు సకలమనోరథ ప్రదములు. 'ఓ జగత్పతీ! నీకు నమస్కారము. రమ్ము. ఆసన, అర్ఘ్య, మధుపర్క, ఆచమన, స్నాన, వస్త్ర, గంధ, పుష్ప, ధూప, దీప, నైవేద్యములను గ్రహించుము' అని ప్రార్థించి పూజించవలెను. పూజా, వ్రత, దానములందు పై మంత్ర ముతో శ్రీమహావిష్ణువును పూజించవలెను. ఇపుడు సామాన్య దాన సంకల్పమును గూర్చి వినుము. ఈ రోజున, ఈ గోత్రముగల, ఈశర్మ అను బ్రాహ్మణునకు నేను సమస్త పాప శాంతి, ఆయురారోగ్య వృద్ధి, సౌభాగ్యోదయము కలుగుటకై, గోత్ర, సంతాన విస్తృతి, ధనవిజయ ప్రాప్తికై, ధర్మ, అర్థ, కామ సంపాదనమునకై, పాపనాశ పూర్వకముగ సంసా రము నుండి విముక్తి పొందుటకై, విష్ణువునకు సంబంధించిన ఈ వస్తువును దానము చేయుచున్నాను. ఏతద్దాన సాద్గుణ్యార్థమై మీకు సువర్ణాది ద్రవ్యములను గూడ సమర్పించుచున్నాను. నేను చేసిన ఈ దానముచే సకలలోకేశ్వరుడగు శ్రీహరి సర్వదా ప్రసన్నుడగు గాక. ఓ యజ్ఞ దాన వ్రతాధీశా! నాకు విద్యాయశస్సులను అనుగ్రహించుము. ధర్మార్థ కామమోక్ష రూపములగు నాలుగు పురుషార్థములను, మనోభిలషితము లగు వస్తువులను అనుగ్రహించుము' అని సంకల్పము చేయవలెను. ఈ వ్రతదాన సముచ్చయమును ప్రతి దినము పఠించువాడు అభీష్ట లాభములను పొంది, పాపరహితుడై భుక్తి ముక్తులను రెండింటిని పొందును. వాసుదేవాదులకు సంబంధించిన ఇట్టి పూజా నియమాదులచే అనేక విధములగు తిథి, వార, నక్షత్ర, సంక్రాంతి, యోగ, మన్వాది సంబంధ వ్రతముల అనుష్ఠించిన ఫలము సిద్ధించును. (208)

దానపరిభాషా కథనము

అగ్ని దేవుడు పలికెను :

మునిశ్రేష్ఠా! ఇపుడు భుక్తి ముక్తి ప్రదములగు దాన ధర్మములను గూర్చి చెప్పెదను. ఇష్టము పూర్తము అని దానము రెండు విధములు. దాన ధర్మములను ఆచరించువాడు సర్వమును పొంద గలడు. దిగుడుబావి, కూపము, చెరువు, దేవాలయము, అన్నసత్రము - వీటిని స్థాపించుట, ఉద్యానాది నిర్మాణము, వీటికి పూర్తమని పేరు. ఇది ముక్తి ప్రదము. అగ్నిహోత్రము, సత్యభాషణము, స్వాధ్యాయము, అతిథి సత్కారము, బలి వైశ్వదేవము-వీటికి ఇష్టమని పేరు. ఇది స్వర్గ ప్రదము. గ్రహణ సమయమునందును, సూర్య సంక్రాంతియందును, ద్వాదశ్యాది తిథులందును చేయుదానము 'పూర్తము' స్వర్గఫలప్రదము. దేశకాల పాత్రలందు చేయబడిన దానము కోట్ల రెట్టింపు ఫలమును ఇచ్చును. సూర్యుని ఉత్తరాయణ, దక్షిణాయన ప్రవేశ కాలములందును, పుణ్యమగు విషువ కాలము నందును, వ్యతీపాత, తిథిక్షయ, యుగారంభ, సంక్రాంతి, చతుర్దశీ, అష్టమీ, పూర్ణిమా, ద్వాదశీ, అష్టకాశ్రాద్ధ, యజ్ఞ ఉత్సవ, వివాహ, మన్వంతరారంభ, వైధృతియోగ, దుఃస్వప్నదర్శన, ధనప్రాప్తి, సద్ బ్రాహ్మణ ప్రాప్తులందును దానము చేయవలెను. ఏ దినమున శ్రద్ధ కలుగునో ఆ దినమునను

లేదా ఎల్లపుడు దానము చేయవలెను. రెండు అయనములు, రెండు విషువలు అను నాల్గు సంక్రాంతులందును షడశీతి ముఖములని ప్రసిద్ధమైన నాలుగు సంక్రాంతు లందును 'విష్ణుపద' అను నాలుగు సంక్రాంతులందును మొత్తము ఈ పండ్రెండు సంక్రాం తులందును దానము ఉత్తమోత్తమము. కన్యా, మిథున, ధనూరాశులలో సూర్య సంక్రాంతికి 'షడశీతిముఖ' అని పేరు. ఇవి ఎనుబది యారు రెట్ల ఫలమును ఇచ్చును. ఉత్తరాయణ, దక్షిణాయన సంక్రాంతులందు అతీత, అనాగత ఘటికలు మహా పవిత్రమైనవి. కర్కటక సంక్రాంతి ఇరువది ఘడియలు పుణ్య కార్యములు చేయుటకై ఎల్లప్పుడూ ఉత్తమమైనవి. తులా, మేష సంక్రాంతులందు వెనుకముందు పదిపది ఘడియలు పుణ్య కాలము. షడశీతి ముఖా సంక్రాంతి అయిన పిమ్మట అరువది ఘడియలు పుణ్యకాలము. విష్ణుపదా సంక్రాంతులందు ముందు వెనుక పదునారు ఘడియలు పుణ్యకాలము. శ్రవణ అశ్వనీ ధనిష్ఠా నక్షత్రములందును, ఆశ్లేష ప్రథమచరణమునందును రవివార సంబంధము న్నపుడు 'వ్యతీపాత యోగము'.

కార్తిక శుక్ల నవమినాడు కృతయుగ ప్రారంభము. వైశాఖ శుక్ల తృతీయనాడు త్రేతాయుగ ప్రారంభము. ఇపుడు ద్వాపరమును గూర్చి వినుము. మాఘ పూర్ణిమనాడు ద్వాపరము. భాద్రపద కృష్ణ త్రయోదశినాడు కలియుగము ప్రారంభమగును. మన్వంతర ప్రారంభకాలమును ఈ విధముగా గ్రహించవలెను. ఆశ్వయుజ శుక్ల నవమి, కార్తిక ద్వాదశి, మాఘ–భాద్ర పదములు తృతీయా తిథులు, ఫాల్గుణ అమావాస్య, పౌష్యైకాదశి, ఆషాఢ దశమీ, మాఘ సప్తమి, శ్రావణ కృష్ణ అష్టమి, ఆషాఢ పూర్ణిమ, కార్తిక–ఫాల్గుణ–జ్యేష్ఠ పూర్ణిమలు.

మార్గ శీర్ష పూర్ణిమ తరువాత వచ్చు మూడు అష్టములకు అష్టకా అనిపేరు. అష్టమియే అష్టక. ఈ అష్టకలందు చేసిన దానము అక్షయ ఫలము. గంగా, యమునా, ప్రయాగాది తీర్థము లందును దేవాలయమునందును అడుగకుండ ఇచ్చిన దానము ఉత్తమము. కన్యాదాన విషయమున ఇది వర్తించదు. దాత పూర్వాభిముఖుడై దానము ఈయవలెను. ప్రతిగ్రహీత ఉత్తరాభిముఖుడై గ్రహించవలెను. దానము ఇచ్చువాని ఆయుర్దాయ మును వృద్ధి పొందించును. అయితే తీసుకొనువాని ఆయుర్దాయము క్షీణించదు. తన పేరును, ప్రతిగ్రహీత పేరును చెప్పుచు దానము ఈయవలెను. కన్యా దానమునందు ఈ విధముగ మూడు సార్లు చేయవలెను. స్నాన పూజాదులుచేసి, చేత జలము గ్రహించి పై సంకల్పము చేయవలెను. సువర్ణ అశ్వ, తిల, గజదాసీ, రథ, భూ, గృహ, కన్యా, కపిలగోవుల దానములు దశమహాదానములు. విద్యా, పరాక్రమ, తపః కన్యా, యజమాన, శిష్యుల వలన లభించినది దానము కాదు. శుల్కము, శిల్ప కలాదుల వలన లభించిన ధనము కూడ శుల్కమే. వడ్డీ, వ్యవసాయము, వాణిజ్యము, ఇతరులకు ఉపకారము చేయుట–వీటివలన లభించిన ధనము సాత్త్వికము. ద్యూతము, దొంగతనము, వేషమువేయుట, సాహసకర్మ–వీటివలన లభించిన ధనము రాజసము. మోసగించి సంపాదించినది తామసము. వీటివలన వచ్చు ఫలము గూడ సాత్త్విక, రాజస, తామస రూపమున నుండును. వివాహ సమయమున లభించినది, అత్త వారింటికి వెళ్ళునపుడు ప్రీతితో ఇచ్చినది, భర్త ఇచ్చినది, సోదరుడు ఇచ్చినది, తల్లిదండ్రులు ఇచ్చినది, ఈ ఆరు విధములైన ధనము స్త్రీధనము. శూద్రునకు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల

అనుగ్రహముచే లభించినది ధనము. గోవు, గృహము, శయ్య, స్త్రీ ఇవి అనేకులకు దానము చేయరానివి. అట్లు ఇచ్చుట పాపహేతువు. మాటఇచ్చి తరువాత దానముచేయని వాని నూరు కులములు నశించును. ఎక్కడ సంపాదించిన ధనమునైనను పుణ్య దేవతలకు ఆచార్యులకు, తలిదండ్రులకు ప్రయత్న పూర్వకముగా సమర్పించవలెను. ఏదో లాభమును అపేక్షించి ఇచ్చిన దానము నిష్ఫలము. ధర్మము శ్రద్ధచేత సిద్ధించును. శ్రద్ధతో ఉదకము ఇచ్చినను అది అక్షయమగును. జ్ఞాన, శీల, సద్గుణ సంపన్నుడును, ఇతరులకు ఎన్నడును పీడ కలుగజేయని వాడును దానము చేయుటకు సత్పాత్ర అనగా యోగ్యుడైనవాడు అజ్ఞాన వంతులైన వారిని పాలించి రక్షించు టచే వారు పాత్రులని చెప్పబడుచున్నారు. తల్లికి ఇచ్చిన దానమునకు నూరు రెట్లు ఫలము, తండ్రికి ఇచ్చిన దానికి వేయి రెట్లు ఉండును. పుత్రికిని, సహోదరునకును ఇచ్చిన దానము అనంతము, అక్షయము. మనుష్యేతర ప్రాణులకు ఇచ్చిన దానము న్యూనాధికము కాక సమముగా ఉండును. పాపాత్మునకు ఇచ్చినది పూర్తిగ నిష్ఫలము. వర్ణసంకరునకు ఇచ్చిన దానము రెట్టింపు ఫలమును, శూద్రునకు ఇచ్చినది నాలుగు రెట్లును, వైశ్యునకు గాని, క్షత్రియునకుగాని ఇచ్చినది ఎనిమిది రెట్లును, నామమాత్ర బ్రాహ్మణునకు ఇచ్చినది పదునారు రెట్లును, వేదాధ్యయనము చేసిన బ్రాహ్మణునకు ఇచ్చినది నూరు రెట్లును ఫలమును ఇచ్చును. వేదార్థవేత్తయగు ఆచార్యునకు ఇచ్చినది అనంత ఫలము. పురోహిత, యాజకాదులకు ఇచ్చినది అక్షయ ఫలము. దరిద్రుడైన బ్రాహ్మణునకును, యజ్ఞము చేసిన బ్రాహ్మణునకును ఇచ్చినది అనంత ఫలదాయకము. తపోహీనుడును, స్వాధ్యాయ రహితుడు, ప్రతిగ్రహ ప్రియుడును అగు బ్రాహ్మణుడు ఱాతినావ మీద కూర్చున్న వానితో సమానుడు.

అతడు ఆ నావతో కూడ మునిగిపోవును. బ్రాహ్మణుడు స్నాన ఆచమనాదులచే శుద్ధుడై ప్రతిగ్రహము చేయవలెను. దానము పట్టువాడు గాయత్రీ జపము చేయవలెను. దానితోపాటు ప్రతిగ్రహించిన ద్రవ్యమును, దేవత పేరును ఉచ్చరించవలెను. ప్రతిగ్రహము చేయువాడు శ్రేష్ట బ్రాహ్మణుని నుండి ప్రతిగ్రహించినపుడు ఉచ్చైః స్వరమునను, క్షత్రియుని నుండి గ్రహించినపుడు మందర స్వరమునను వైశ్యునినుండి ప్రతిగ్రహించినపుడు ఉపాంశువుగను జపము చేయవలెను. శూద్రుని నుండి ప్రతిగ్రహము చేసినపుడు మానసిక జపమును, స్వస్తి వాచనమును చేయవలెను.

మునిశ్రేష్ఠా! అభయమునకు దేవత సర్వ దేవతా గణము. భూమికి దేవత విష్ణువు. కన్యకును, దాసీదాసులకును గజములకును, ప్రజాపతి. అశ్వమునకు యముడు. ఒక డెక్కగల పశువులకు సర్వ దేవతా గణము, మహిషమునకు యముడు, ఉష్ట్రమునకు నిర్మృతి, ధేనువునకు రుద్రుడు, మేకకు అగ్ని, గొఱ్ఱె, సింహము, వరాహము – వీటికి జల దేవత, వన్య పశువులకు వాయువు, జలపాత్ర–కలశాది జలాశయములకు వరుణుడు, సముద్రము నుండి ఉత్పన్నములైన రత్నములకు, స్వర్ణ లోహాది ధాతువులకును అగ్ని, పక్వాన్నమునకును, ధాన్యమునకును ప్రజాపతి, సుగంధములకు గంధర్వుడు, వస్త్రములకు బృహస్పతి, అన్ని పక్షులకును వాయువు, విద్యా విద్యాంగములకు బ్రహ్మ, పుస్తకాదులకు సరస్వతి, శిల్పమునకు విశ్వకర్మ, వృక్షములకు వనస్పతి దేవతలు. ఈ సమస్త ద్రవ్యము లును దేవతలును శ్రీమహావిష్ణువునకు అంగములే.

ఛత్ర కృష్ణచర్మ, శయ్యా, రథ, ఆసన, పాదుకా, వాహనములకు ఊర్ధ్వాంగిరసులు దేవత, యుద్ధమునకు ఉపయోగించు సామగ్రికిని, శస్త్రములకును, ధ్వజాదులకును సర్వదేవ గణములు దేవత, గృహమునకుగూడ వారే దేవత-సకల పదార్థములకు దేవత విష్ణువు లేదా శివుడు. ఏలననగా, ఏ పదార్థముకూడ ఆ దేవతలకంటె భిన్నముగ లేదు. దానము చేయు సమయమున ముందుగా ద్రవ్యము పేరు చెప్పి, పిదప దదామి అనిచెప్పి, సంకల్ప జలమును ప్రతిగ్రహీత చేతిలో విడువవలెను. ప్రతిగ్రహీత-విష్ణువే దాత; విష్ణువే ద్రవ్యము; నేను ఈ దానము గ్రహించుచున్నాను. ధర్మాను కూలమగు ఈ ప్రతిగ్రహము కల్యాణ ప్రదమగుగాక' అని పలుకవలెను. మాతా, పితృ, భృత్యాది పోషణార్థము, దేవతా పితృ పూజార్థము అందరి నుండియు దానము స్వీకరించవచ్చును. కాని దానిని తనకొరకై వినియోగించరాదు. శూద్ర ధనమును యజ్ఞకార్యము నందు వినియోగించ రాదు; అట్లు చేసినచో ఆ యజ్ఞఫలము ఆతనికి చెందిపోవును.

వృత్తి విహీనుడైనచో బ్రాహ్మణుడు శూద్రుని నుండి గుడము, మజ్జిగ, రసము మొదలగు పదార్థములను గ్రహించవచ్చును. జీవిక నడవని బ్రాహ్మణుడు అన్నింటిని గ్రహించవచ్చును. ఏలనన బ్రాహ్మణుడు సహజముగ సూర్యాగ్నులవలె పవిత్రుడు. అందు ఆపత్సమయము నందు నిందితులకు చదువు చెప్పుట, యజ్ఞము చేయించుట, దానము గ్రహించుట-వీటివలన ఆతనికి పాపమురాదు. కృత యుగమునందు బ్రాహ్మణుని ఇంటికి వెళ్ళి దానము ఇచ్చెడివారు. త్రేతాయుగ మున తమ ఇంటికి పిలచి ఇచ్చెడివారు. ద్వాపరమున అతడు అడిగినచో ఇచ్చెడివారు. కలి యుగమున వెంబడించిననే దానము చేయుదురు. సముద్రపారము పొందవచ్చును గాని దానమునకు అంతము పొంద శక్యము కాదు. దాత తన మనస్సులో ఈ క్రింది విధముగ సత్పాత్రుని ఉద్దేశించి సంకల్పించి, జలము నేలపై విడువవలెను. 'నేను ఈ రోజున సూర్యగ్రహణ సమయమున లేదా చంద్రగ్రహణ సమయమున లేదా సంక్రాంతి సమయమున గంగా, గయా, ప్రయాగాద్య నంత గుణసంపన్నమగు తీర్థదేశమున అముక (ఫలాన) గోత్రము కలవాడు, వేదవేదాంగ వేత్త, మహాత్మ, సత్పాత్రము అయిన అముక శర్మకు విష్ణువునకు లేదా శివునకు లేదా మరొక దేవతకు సంబంధించిన అముక ద్రవ్యమును. 'కీర్తి, విద్యా, మనోరథ, సౌభాగ్య, ఆరోగ్యాదుల ప్రాప్తి కొరకును, సమస్త పాపశాంతి కొరకును, భుక్తిముక్తుల కొరకును దానము చేయుచున్నాను. ద్యు-అంతరిక్ష భూలోక సంబంధి సమస్త ఉత్పాతములను నశింపచేయు శ్రీమహావిష్ణువు ప్రసన్నుడై నాకు ధర్మార్థ కామ మోక్షములను ప్రసాదించి బ్రహ్మలోకమును ఇచ్చుగాక'. పిదప-'అముక గోత్రముగల బ్రాహ్మణుడైన, అముకశర్మకు ఈ దానము సఫల మగుటకై సువర్ణ దక్షిణ ఇచ్చుచున్నాను' అని చెప్పి సమస్త దానములను చేయవలెను. (209)

షోడశమహాదానాది వర్ణన

అగ్ని దేవుడు చెప్పెను :

ఇపుడు వివిధ దానములను గూర్చి చెప్పెదను. తులాపురుష దానము, హిరణ్య గర్భ దానము, బ్రహ్మాండ దానము, కల్పవృక్ష దానము, సహస్ర గోదానము, స్వర్ణమయ కామధేను దానము,

స్వర్ణ నిర్మితాశ్వ దానము స్వర్ణ మయాశ్వయుక్త రథ దానము,స్వర్ణ రచిత హస్తిరథ దానము, హలపంచక దానము, భూదానము, విశ్వచక్ర దానము, కల్ప లతాదానము, ఉత్తమ సప్తసముద్ర దానము, రత్నధేను దానము, జలపూర్ణ కుంభ దానము – అనునవి పదునారు మహాదానములు. ఒక శుభదినమున మండల ఆకారమగు మండపమునందు దేవతాపూజ చేసి ఈ దానము బ్రాహ్మణులకు ఈయవలెను. మేరు దానము కూడ పుణ్యప్రదము. 'మేరువులు'పది. ఒక వెయ్యి ద్రోణముల ధాన్యము 'ధాన్య మేరువు'. ఇది ఉత్తమము. ఐదువందల ద్రోణముల ధాన్యము మధ్యమము. రెండువందల ఏబది ద్రోణముల ధాన్యము అధమము. పదునారు ద్రోణములతో నిర్మించిన 'లవణాచలము' ఉత్తమము. పది భారముల 'గుడ పర్వతము' ఉత్తమము; ఐదు భారములు మధ్యమము; రెండున్నర భారములు నికృష్టము. వేయిపలముల 'స్వర్ణ మేరువు' ఉత్తమము. ఐదు వందల పలములు మధ్యమము; రెండున్నర పలములు అధమము. ఇరువది భారముల 'కార్పాస (దూది) పర్వతము' ఉత్తమము. పది భారములు మధ్యమము. ఐదు భారములు నికృష్టము. ఇరువది ఘృత పూర్ణ కుంభముల 'ఘృతాచలము' ఉత్తమము. పదివేల పలముల 'రజత పర్వతము' ఉత్తమము. ఎనిమిది భారముల 'శర్కరాచలము' ఉత్తమము. నాల్గుభారములు మధ్యమము, రెండుభారములు మందము. ఇపుడు 'దశధేనువులను' గూర్చి చెప్పెదను. దీని దానముచే మనుష్యుడు భుక్తి ముక్తులను పొందును. గుడ ధేనువు, ఘృత ధేనువు, తిల ధేనువు, జల ధేనువు, క్షీర ధేనువు, మధు ధేనువు, శర్కరా ధేనువు, దధి ధేనువు, రస ధేనువు, కృష్ణాజిన ధేనువు అను ఈ దశ ధేనువుల దాన విధానము చెప్పబడుచున్నది. ద్రవపదార్థ రూప ధేనువులకు ప్రతినిధిగ ఘటములందు ఆ పదార్థములను నింపి కుంభ దానము చేయవలెను. ఇతర ధాత్వాది రూపములలో ఉన్న ధేనువులను ఆయా ద్రవ్యముల రాశులను చేసి దానము చేయవలెను.

గోమయముతో అలికిన భూమిపై దర్భలు పరచి వాటిపై నాలుగు హస్తముల ప్రమాణముగల కృష్ణాజినమును ఉంచవలెను. దాని కంఠము తూర్పువైపు ఉండవలెను. గోవత్సము నిమిత్తము చిన్న కృష్ణాజినము నుంచవలెను. వత్ససహితమగు ధేనువు ముఖము తూర్పు వైపునకును, పాదములు ఉత్తరము వైపునకును ఉన్నట్లు భావింపవలెను. నాలుగు భారముల గుడధేనువు సర్వదా ఉత్తమమని అంగీకరింపబడినది. ఒక భారము గుడముతో గోవత్సమును నిర్మింపవలెను. రెండు భారముల గోవు మధ్యమము. దానితో పాటు అర్ధ భారము లేగదూడ ఉండవలెను. ఒక భారము గోవు కనిష్ఠము. దాని చతుర్థాంశముతో దూడను నిర్మించి దీనితోపాటు ఈయవలెను. గుడ ధేనువును తాను సంగ్రహించుకొనిన గుడమును బట్టి నిర్మించవలెను. ఐదు గురివెందలు ఒక మాషము. 16 మాసములు ఒక సువర్ణము. నాలుగు సువర్ణములు ఒక పలము. 100 పలములు ఒక తుల. 20 తులలు ఒక భారము. నాలుగు ఆఢకములు ఒక ద్రోణము.

గుడ నిర్మితమగు ధేనువును, వత్సమును సూక్ష్మ వస్త్రముతో కప్పవలెను. వాటి చెవుల వద్ద శక్తులను, చరణ స్థానములందు చెరకుకఱ్ఱలను, నేత్ర స్థానములందు పవిత్రము లగు ముత్యములను, అలక స్థానములందు శ్వేత సూత్రమును, గంగడోలు దగ్గర శ్వేత కంబలమును పృష్ఠభాగమున తామ్రమును, రోమ స్థానమున శ్వేత చర్మమును, కనుబొమ్మల వద్ద విద్రుమములను, స్తనములవద్ద

నవనీతమును, పుచ్ఛ స్థానమునందు పట్టు వస్త్రమును, అక్షిగోలక స్థానములందు నీల మణులను శృంగ-శృంగాభరణ స్థానములందు సువర్ణ మును, డెక్కల వద్ద వెండినుంచవలెను. దంత స్థానములందు వివిధ ఫలములను నాసికా స్థానమున సుగంధ ద్రవ్యమును ఉంచి కంచులోహ పాత్రనుకూడ ఉంచవలెను. ద్విజ శ్రేష్ఠా! ఈ విధముగ ధేనువును నిర్మించి. క్రింది విధముగ ప్రార్థించుచు పూజించవలెను - 'సకల ప్రాణుల లక్ష్మియు, సకల దేవతలలో నుండునదియు అగు ధేనురూపిణియైన దేవి నాకు శాంతిని ప్రసాదించుగాక! తన శరీరము నందు ఉండి 'రుద్రాణి' అను పేరుతో ప్రసిద్ధురాలును, శంకరుని ప్రియతమ పత్నియు, ధేనురూప ధారిణియు అగు దేవి నా పాపములను నశింపచేయుగాక! విష్ణు వక్షః స్థలమున లక్ష్మీ రూపముతో నుండు నదియు, అగ్ని యొక్క స్వాహారూపమునను, చంద్ర, సూర్య, నక్షత్ర దేవతా శక్తి రూపము నను ఉన్నదియు ధేను రూపిణియు అగు దేవి నాకు లక్ష్మినిచ్చు గాక! చతుర్ముఖుని సావిత్రియు, ధనాధీశుడగు కుబేరుని నిధియు లోకపాల లక్ష్మియునగు ధేనుదేవి నాకు అభీష్ట వస్తువులను ఇచ్చుగాక. దేవీ! నీవు పితృదేవతల స్వధవు. యజ్ఞ భోక్తయగు అగ్నికి సంబంధించిన స్వాహాదేవివి నీవు. ధేనురూపమున నుండి సమస్త పాపములను తొలగించుచుందువు. అందుచే నాకు శాంతిని ఇమ్ము'. ఈ విధముగ (శ్లోకములను చదివి) అభిమం త్రింపబడిన ధేనువును బ్రాహ్మణునకు దానము చేయవలెను. దీనిచే మనుష్యుడు సకల యజ్ఞ ఫలములను పొంది, పాపరహితుడై భుక్తి ముక్తులను రెండింటిని పొందును.

సువర్ణ శృంగములతోను, రజత ఖురములతోను కూడిన పాలనిచ్చు ఆవును కాంస్య లోహ పాత్రను, వస్త్ర దక్షిణలతో దానము చేయవలెను. ఇట్టి గోవును దానము చేసినవాడు ఆ గోవుకు ఎన్ని రోమములు ఉన్నవో అన్ని సంవత్సరములు స్వర్గములో నివసించును. కపిల గోవు దానము చేసినవాడు ఏడు తరముల వారిని ఉద్ధరించును. సువర్ణ శృంగములు, రజత మండిత ఖురములుగల కపిలగోవును, కాంస్య లోహపాత్రను, యథాశక్తి దక్షిణతో దానము చేసినవాడు భుక్తిముక్తులను పొందును. ఉభయతోముఖియగు గోవును దానము చేసినవాడు ఆవునకును, దాని దూడకును ఎన్ని రోమములు ఉండునో అన్ని యుగముల వరకును స్వర్గమున సుఖములు అనుభవించును. ఉభయతోముఖ గోదానము కూడ పైన చెప్పిన విధముననే చేయవలెను. మరణాసన్నుడగు మానవుడు వత్స సహితమగు గోవును పూర్వోక్త విధానముతో దానము చేయవలెను-'అత్యంత భయంకరమగు యమలోక ప్రవేశ ద్వారమునందు తప్త జలముతో నిండిన వైతరణీనది ప్రవహించుచుండును. దానిని తరించుటకై నేను ఈ కృష్ణ వర్ణయగు వైతరణి గోవును దానము చేయుచున్నాను'. (210)

నానాదాన వర్ణనము

అగ్ని దేవుడు చెప్పెను :

వశిష్ఠా! పది గోవులున్నవాడు ఒక గోవును, నూరు గోవులున్నవాడు పది గోవులను, వెయ్యి గోవులున్న వాడు నూరు గోవులను దానము చేయగా వారికి లభించు ఫలము సమముగనే ఉండును. కుబేరుని రాజధానియగు అలకాపురి యందు ఉన్న సువర్ణ నిర్మిత భవనమున గంధర్వులును,

అప్సరసలును విహరించుచుందురు. సహస్ర గోదానము చేసినవాడు అచటికి వెళ్లును. శత గోదానములు చేసినవాడు నరక సముద్రము నుండి విముక్తుడగును. వత్సదానము చేసినవాడు స్వర్గమున పూజింపబడును. గోదానము చేయుటచే దీర్ఘాయురారోగ్య సౌభాగ్యములు లభించును. స్వర్గము ప్రాప్తించును. ఈ క్రింది మంత్రము చదువుచు మహిషీ దానము చేయుటచే సౌభాగ్యము లభించును. 'ఇంద్రాది లోకపాలుల మంగళమయ రాజమహిషియైన దేవి ఈ మహిషీదానము చేసిన పుణ్యముచే నాకు సకలాభీష్ట వస్తువులను ఇచ్చుగాక. ఏ మహిషి పుత్రుడు యమధర్మ రాజునకు సహాయుడుగ నియుక్తుడైనాడో, ఏ మహిషి మహిషాసురుని తల్లియో ఆ దేవి నాకు వరములను ఒసంగు గాక! వృషభ దానముచే మనుష్యుడు స్వర్గమును పొందును.

'సంయుక్త హల పంక్తి' అను దానము సమస్త ఫలప్రదము. కఱ్ఱతో తయారుచేసిన పది నాగళ్ళ పంక్తిని సువర్ణమయమగు పట్టికతో ఒకదానితో ఒకటి కట్టవలెను. ఒక్కొక్క హలముతో ఆవశ్యక సంఖ్యలో వృషభములు ఉండవలెను. వాటి దానము 'సంయుక్త హలపంక్తి దానము'. ఈ దానము చేసినవాడు స్వర్గమున పూజించబడును. జ్యేష్ఠ పుష్కర తీర్థమునందు పది కపిలగోవుల దానము చేసినచో దాని ఫలము అక్షయము. వృషోత్సర్గము చేతగూడ అక్షయఫలము లభించును. ఆబోతుకు చక్ర, త్రిశూల ముద్రలు వేసి – 'దేవేశ్వరా! నీవు సాక్షాత్తు నాలుగు పాదములు గల ధర్మ దేవతవు. ఈ నాలుగు నీ ప్రియతములు. పితృ, మనుష్య, ఋషులను పోషించు ఓ వేదమూర్తియైన వృషభమా! నిన్ను విడచుటచే నాకు అమృతమయములగు శాశ్వతలోకములు ప్రాప్తించుగాక. దేవ, భూత, పితృ, ఋణముల నుండి విముక్తుడనగుదును గాక. నీవు సాక్షాత్తు ధర్మము. నిన్ను ఆశ్రయించు వారికి కలుగుగతి నాకు ప్రాప్తించు గాక' అని పఠించుచు విడువవలెను. మృతుని ఏకా దశ, షాణ్మాసిక, వార్షిక శ్రాద్ధములలో ఒక దానియందు వృషోత్సర్గము చేసినచో అతడు ప్రేత లోకము నుండి విముక్తుడగును. పది హస్తముల దండములు మొదలు ముప్పది హస్తముల దండములకు సమానమైన భూమి 'నివర్తనము ; పది నివర్తనముల భూమి 'గోచర్మము'. అంతభూమి దానము చేసినవాడు తన సమస్త పాపములను నశింపచేసి కొనును. గో, భూ, సువర్ణ యుక్త కృష్ణ మృగ చర్మమును దానము చేసినవాడు ఎన్ని పాపములు చేసినవాడైనను, బ్రహ్మసాయుజ్యమును పొందును. తిలలతోను, మధువుతోను నింపిన పాత్రను, మగధ దేశీయ మానానుసారము ఒక ప్రస్థము కృష్ణ తిలలను దానము చేయవలెను. దీనితోపాటు ఉత్తమమగు శయ్యను కూడ దానము చేయుటచే దాత భుక్తిముక్తులను పొందును.

స్వర్ణముతో తన ప్రతిమ చేయించి దానము చేయువాడు స్వర్గమును పొందును. విశాలమగు ఇల్లు కట్టించి దానముచేయువాడు భోగమోక్షములను పొందును. గృహమును, మఠమును, ధర్మశాలను, ఆవాస స్థానమును దానముచేసిన వాడు స్వర్గమున సుఖములను అనుభవించును. గోశాల నిర్మించి దానము చేయువాడు పాపరహితుడై స్వర్గము పొందును. యమునికి సంబంధించిన మహిషమును దానము చేసినవాడు పాపరహితుడై స్వర్గము పొందును. దేవతా సహితులగు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల మధ్య పాశధారియగు యమదూత మూర్తి స్థాపించి ఆ యమదూత శిరస్సు ఖండించి ఆ మూర్తితో కూడిన మండలమును బ్రాహ్మణునకు దానము చేయవలెను. ఇట్లు

చేయుటచే దాత స్వర్గమునకు వెళ్లును గాని, ఆ 'త్రిముఖ' మను దానము పట్టిన బ్రాహ్మణునకు పాపము సంక్రమించును. వెండి చక్రమొకటి చేయించి, దానిని నీటిలో నుంచి దాని నిమిత్తము హోమములు చేసి, దానిని బ్రాహ్మణునకు దానముచేసినచో అది 'కాలచక్ర దానము'. తన బరువుతో సమాన మైన బరువుగల ఇనుము దానము చేయువాడు నరకమున పడడు. ఏబది పలముల లోహదండమును వస్త్రము చుట్టి దానము చేయువానికి యమదండ భయముండదు. దీర్ఘాయువును కోరువాడు మృత్యుంజయుని ఉద్దేశించి ఫలములు, మూలములు, ద్రవ్యము అన్నింటిని ఒక్కసారిగాని, వేరువేరుగా గాని దానము చేయవలెను. కృష్ణతిలలతో పురుషుని చేసి వెండి దంతములు, బంగారు కళ్లు అమర్చవలెను. మాలను ధరించి దీర్ఘాకారముతో నున్న ఆ పురుషుని కుడిచేతిలో ఎత్తిన ఖడ్గ ముండవలెను. ఎఱ్ఱని వస్త్రములు, జపాపుష్ప ములు, శంఖమాల ధరించి యుండవలెను. రెండు పాదములందు పాదుకలు, పార్శ్వమున నల్లని కంబళి ఉండవలెను. ఎడమ చేతిలో మాంసపిండము ఉండవలెను. ఈ విధముగ కాలపురుషుని నిర్మించి గంధాది ద్రవ్యములచే పూజించి, బ్రాహ్మణునకు దానము ఈయ వలెను. ఇట్లుచేసిన దాత వ్యాధి మృత్యు రహితుడై రాజరాజేశ్వరుడగును. బ్రాహ్మణు నకు రెండు ఎద్దులు దానము చేసినవాడు భుక్తి ముక్తులను పొందును.

సువర్ణ దానమును చేయువానికి అభీష్టవస్తు సిద్ధి యగును. సువర్ణ దానము సఫలమగుటకు వెండి దక్షిణగా ఇవ్వవలెను. అన్యదానముల సాద్గుణ్యము నిమిత్తము సువర్ణ దక్షిణ మంచిది. సువర్ణమే కాక రజతము, తామ్రము, తండులములు ధాన్యములు కూడ దక్షిణకు తగినవి. నిత్య శ్రాద్ధ నిత్య దేవపూజాదు లందు దక్షిణ ఇవ్వవలసిన పనిలేదు. పితృకార్యమునందు రజత దక్షిణ ధర్మార్థకామప్రదము. భూమి దానము చేసిన శాంతచిత్తుడు పితృలోకములో నున్న పితృ దేవతలను, దేవలోకములో నున్న దేవతలను గూడ పూర్తిగా సంతృప్తిపరచును. సస్యములతో నిండియున్న చిన్నపల్లె. గ్రామము, ఖర్వటము, నూరు నివర్తనముల ప్రమాణము లేదా దానిలో సగము ప్రమాణ మున నిర్మించిన గృహాదికము గోచర్మ ప్రమాణముగల (పది నివర్తనములు) భూమి దానము చేసినవాడు అన్నియు పొందును. తైల బిందువు నీటిపైగాని, భూమిపైగానిపడి వ్యాపించి నట్లు అన్ని దానముల ఫలము ఒక జన్మవరకును ఉండును. స్వర్గ, భూ, గౌరీకన్యా దాన ఫలము ఏడు జన్మల వరకును స్థిరముగా నుండును. కన్యాదానము చేసినవాడు ఇరువది యొక్క తరములను నరకము నుండి ఉద్ధరించి, బ్రహ్మ లోకమును పొందును. దక్షిణా సహితముగ గజదానము చేసినవాడు పాపరహితుడై స్వర్గమును చేరును. అశ్వదానము చేయుటచే దీర్ఘాయురారోగ్య సౌభాగ్య, స్వర్గములను పొందును. శ్రేష్ఠ బ్రాహ్మణులకు దాసీదానము చేయువాడు అప్సర స్త్రీలలోకమున సుఖములు అనుభవించును. ఐదువందల పలములు లేదా రెండు వందల ఏబది పలములు, నూట ఇరువదియైదు పలములు లేదా వాటిలో సగము పలములు బరువుగల తామ్రపాత్రను దానము చేసినవాడు భుక్తి ముక్తులను పొందును.

వృషభ సహిత శకట దానము చేసినవాడు విమానముపై స్వర్గమునకు వెళ్లును. వస్త్రదానముచే ఆయురారోగ్యములు, అక్షయ స్వర్గ ప్రాప్తి కలుగును. ధాన్యము, గోధుమలు, అగ్రహాయణీ తండు లములు, జొన్నలు మొదలగునవి దానము చేయువాడు స్వర్గము పొందును. ఆసనము, ధాతు

నిర్మిత పాత్రను, లవణము, సుగంధి చందనము, ధూపదీప ములు, తాంబూలము, ఇనుము, వెండి, రత్నములు, వివిధ, దివ్య పదార్థములు దానము చేయువాడు భుక్తి ముక్తులను పొందును. తిలలను–తిలపాత్రను దానము చేసినవాడు స్వర్గసుఖము పొందును. అన్నదానమును మించిన దానమేదియు లేదు, ఉండబోదు. గజ, అశ్వ, రథ, దాసదాసీ, గృహాదుల దానము అన్నదానము యొక్క పదహారవ కళకు కూడ సరితూగవు. మహాపాపములు చేసినవాడు కూడ అన్నదానము చేసినచో ఆ పాపములు అన్నింటి నుండియు విముక్తుడై అక్షయ లోకములను పొందును. జలమును, పానపాత్రను దానముచేసినవాడు భుక్తి ముక్తులను పొందును. శీతకాలమునందు మార్గ మధ్యాదు లందు అగ్నిని, కట్టెలను ఇచ్చువాడు తేజోయుక్తుడై స్వర్గమునందు దేవతా, గంధర్వాప్సరాదులచే సేవింపబడును. ఘృతతైల లవణదానము చేసిన వానికి అన్నియు లభించును. ఛత్ర, పాదుకా, కాష్ఠాదులను దానము చేసినవాడు స్వర్గములో సుఖముగ నివసించును. ప్రతిపదాది పుణ్య తిథు లందును, విష్కంభాది యోగములందును, చైత్రాది మాసములందును, సంవత్సర ఆరంభము నందును, అశ్విన్యాది నక్షత్రములందును, విష్ణు, శివ, బ్రహ్మ లోకపాలాదులను అర్చించి చేసిన దానము మహా ఫలప్రదము. వృక్ష, ఉద్యాన, భోజన, వాహనాదులను, పాదములకు మర్దించుటకై తైలాదికమును ఇచ్చిన మానవుడు భుక్తి ముక్తులను పొందును.

గోదాన, విద్యాదాన, భూ దానములు మూడును సమాన ఫలములు. వేదవిద్యా దానము చేసినవాడు పాపరహితుడై బ్రహ్మలోకమునందు నివసించును. యోగ్యుడై శిష్యునకు బ్రహ్మజ్ఞానము ఇచ్చినవాడు సప్తద్వీప సమన్వితయగు భూమిని దానము చేసినట్లే. సకల ప్రాణులకును అభయ దానము చేసినవాడు సర్వమును పొందగల్గును. పురాణమునుగాని, మహాభారతమును గాని, రామాయణమునుగాని వ్రాసి ఆ పుస్తకము దానము చేసినవాడు భుక్తి ముక్తులను పొందును. వేదాదికములను నృత్యగీతములను నేర్పిన వాడు స్వర్గము పొందును. ఉపాధ్యాయునకు వృత్తిని, విద్యార్థులకు భోజనమును ఏర్పరిచిన వాడు ధర్మకామాది పురుషార్థముల రహస్యము తెలిసినవాడు; అతడు చేయని దానము ఏమున్నది? విద్యా దానము చేసినవాడు సహస్ర వాజపేయములను విధి పూర్వక ముగ దానము చేయుటచే ఎట్టి ఫలము లభించునో అంత ఫలమును పూర్తిగ పొందును. సందేహమేమాత్రములేదు. శివ, విష్ణు, సూర్య దేవాలయములలో గ్రంథ ప్రవచనము చేయు వానికి సకల దానఫలములు లభించును.

త్రిలోకములలో ఉన్న బ్రాహ్మణాది వర్ణ ములును, బ్రహ్మచర్యాది ఆశ్రమములును, బ్రహ్మాది దేవగణములును విద్యాదానమునందు ప్రతిష్ఠితములై యున్నవి. విద్యయే కామధేనువు; విద్యయే నేత్రము; గాంధర్వాద్యుప వేదములు దానము చేసినవాడు గంధర్వులతో కలిసి ఆనందించును. వేదాంగముల దానముచే స్వర్గమును పొందును. ధర్మశాస్త్ర దానముచే ధర్మ సన్నిధి చేరి ఆనం దించును. సిద్ధాంతముల దానము చేసినవాడు నిస్సంశయముగ మోక్షమును పొందును. పుస్తక దానముచే విద్యాదానఫలము లభించును. అందుచే శాస్త్రపురాణముల దానము చేసినవాడు సర్వ మును పొందును. శిష్యులకు శిక్షాదానము చేసినవాడు పౌండరీక యాగము చేసిన ఫలము పొందును.

జీవికా దానఫలము అనంతము. పితరులకు అక్షయ లోకావాప్తి కోరువాడు, ఈ లోకమునందు సర్వ శ్రేష్ఠములైన వస్తువులను, తనకు ప్రియమగు సకల పదార్థములను పితరులను ఉద్దేశించి దానము చేయవలెను. బ్రహ్మ, విష్ణు, శివ, దేవీ, గణేశాదుల పూజచేసి ఆ పూజా ద్రవ్యములన్నింటిని బ్రాహ్మణునకు దానముచేయువాడు సర్వమును పొందగలడు. దేవాలయములను కట్టించువారును, దేవప్రతిమలు నిర్మించువారును సమస్తమైన అభిలషిత వస్తువులను పొందగలరు. దేవాలయములలో తుడిచి కడుగువాడు పాపరహితుడగును. దేవప్రతిమకు ఎదురుగ వివిధ మండలముల నిర్మాణము చేయువాడు మండలాధిపతి యగును. దేవతలకు గంధ, పుష్ప, ధూప, దీప, నైవేద్య, ప్రదక్షిణ, ఘంటా, ధ్వజ, వస్త్రాదులను సమర్పించుట చేతను, దేవతా దర్శనము చేతను, దేవతా సమక్షమున నాట్య గానములు చేయుటచేతను మనుష్యుడు భుక్తిని ముక్తిని కూడ పొందును. భగవంతునకు కస్తూరి, సింహళదేశీయ చందనము, అగురు, కర్పూరము, ముస్తాది సుగంధ ద్రవ్యములు, విజయ గుగ్గులు సమర్పించవలెను. సంక్రాంత్యాది దినములందు ఒక ప్రస్థము నేతితో స్నానము చేయించు వాడు అన్నియు పొందును. నూరు పలములతో స్నానము, ఇరువది యైదు పలములతో అభ్యంగము, వేయి పలములతో మహాస్నానము చేయించవలెను. భగవంతునకు జలస్నానము చేయించుటచే పది అపరాధములు, దుగ్ధ - దధులతో స్నానము చేయించుటచే సహస్ర అపరాధములు, ఘృత స్నానము చేయించినచో వెయ్యి అపరాధములు వినష్టములగును. దేవతలను ఉద్దేశించి దాసదాసులను, అలంకారములను, భూమిని, గజాశ్వములను, సౌభాగ్య ద్రవ్యములను సమర్పించు వాడు దీర్ఘా యుర్యుక్తుడై స్వర్గలోకమును పొందును. (211)

కామ్య - మేరుదాన వర్ణనము

వశిష్ఠా! ఇపుడు సమస్త మనోరథములను తీర్చు కామ్య దానములను గూర్చి చెప్పెదను.ప్రతి మాసమునందును పూజచేయుచు ఒక దినమున విశేష పూజ చేయుదురు. దీనికి 'కామ్య పూజనము' అని పేరు. సంవత్సరము పూర్తి యైన పిమ్మట గురు పూజనము, మహాపూజనము చేసి వ్రతసమాప్తి చేయవలెను. మార్గశీర్షమాసమునందు శివపూజచేసి పిష్ట నిర్మితమగు అశ్వమును కమలమును దానము చేయువాడు చిరకాలము సూర్యలోక ములో నివసించును. పౌష మాసమున పిష్ట గజ దానము చేసినవాడు ఇరువది యొక్క తరముల వారిని ఉద్ధరించును. మాఘమున పిష్టమయ రథాశ్వదానము చేసినవాడు నరకము చూడడు. ఫాల్గుణమున పిష్టమయ వృషభ దానము చేసినవాడు స్వర్గము చేరి రెండవ జన్మమున రాజ్యము పొందును. చైత్ర మాసమునందు, దాసీదాసయుక్తము, గుడముతో నిండినదియగు గృహము దానముచేసినవాడు చిరకాలము స్వర్గమున నివసించి పిదప రాజగును. వైశాఖమున సప్తధాన్యదానము చేసినవాడు శివసాయుజ్యము పొందును. జ్యేష్ట-ఆషాఢములందు అన్నబలి ఇచ్చువాడు శివ స్వరూపుడగును. శ్రావణమునందు పుష్పరథ దానము చేసినవాడు స్వర్గమునందు సుఖములు అనుభవించి, రెండవ జన్మమున రాజ్యమును పొందును. రెండువందల పలములు దానముచేయువాడు సంపూర్ణ కులమును ఉద్ధరించి రాజ్య పదమును పొందును. భాద్రపదమున ధూపదానము చేయువాడు స్వర్గము చేరి రెండవ జన్మమున రాజ్యము

పొందును. ఆశ్వయుజ మాసమున దుగ్ధ-ఘృత పూర్ణ పాత్ర దానము చేసినవాడు స్వర్గమును పొందును. కార్తికమున గుడము, పంచదార, ఘృతము దానము చేసినవాడు స్వర్గమున నివసించి జన్మాంతరమునందు రాజగును.

ఇపుడు భుక్తి ముక్తి ప్రదములగు పంద్రెండు విధములైన మేరుదానములను గూర్చి చెప్పెదను. కార్తికపూర్ణిమనాడు మేరు వ్రతముచేసి బ్రాహ్మణునకు 'రత్న మేరువు' దానము చేయవలెను. ఇపుడు అన్నిమేరువుల ప్రమాణము వినుము. వజ్రములు, మాణిక్య ములు, నీలమణులు, వైడూర్య ములు, స్ఫటికములు, పుష్పరాగములు, మరకతములు, ముత్యములు – వీటిని ఒక్కొక్క ప్రస్థము చొప్పున ఇచ్చినచో ఉత్తమము. ఇందులో సగమైనచో మధ్య మము, మధ్యమములో సగము అధమము. రత్నమేరుదానము చేయువాడు పిసినారి తనము వీడవలెను. ద్వాదశదళ కమలము నిర్మించి దాని కర్ణికపై మేరువును స్థాపించవలెను. దీనికి దేవతలు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు. మేరువునకు తూర్పున మూడు దళములు ఉండును. వాటిపై వరుసగ మాల్యవత్, భద్రాశ్వ, ఋక్ష, పర్వతములను పూజించవలెను. మేరువునకు దక్షిణమునందున్న దళములపై నిషధ హేమకూట-హిమవ త్పర్వతములను పూజించవలెను. మేరువునకు ఉత్తరము నందున్న దళములపై వరుసగా నీల, శ్వేత, శృంగులను పూజించవలెను. పశ్చిమ దళములపై గంధమాదన-వైకంక-కేతుమాలములను పూజించవలెను. ఈ విధముగ పంద్రెండు పర్వతములతో కూడిన మేరుపర్వత మును పూజించవలెను. ఉపవాసముండి స్నానముచేసి, విష్ణువును, శివుని పూజించవలెను. భగవం తుని ఎదుట మేరువును పూజించి మంత్రోచ్చారణ పూర్వకముగ ఆ బ్రాహ్మణునకు దానము చేయ వలెను. దానసంకల్పము చేయునపుడు దేశకాలములను ఉచ్చరించి 'ఈ ద్రవ్యముతో నిర్మించినదియు శ్రీమహావిష్ణువు దేవతగా కలదియు అగు ఈ మేరువును ఈ గోత్రముగల బ్రాహ్మణునకు దానము చేయుచున్నాను. ఈ దానముచే నా అంతఃకరణము శుద్ధమగుగాక. నాకు ఉత్తమములగు భోగములును, మోక్షము సంప్రాప్తించు గాక' యని చెప్పవలెను. ఈ విధముగ దానము చేసినవాడు తన సమస్త కులమును ఉద్ధరించి, దేవతలచే సమ్మానితుడై, విమానముపై కూర్చుండి ఇంద్రలోక, బ్రహ్మలోక, శివలోక శ్రీవైకుంఠములందు విహరించును. సంక్రాంత్యాది పుణ్య కాలములందు మేరు దానము చేయవలెను; చేయించవలెను.

ఒక వెయ్యి పలముల బంగారముతో మహామేరువును నిర్మించవలెను. దానికి మూడు శిఖర ములు ఉండును. వాటిపై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను స్థాపించవలెను. మేరు పర్వతము ప్రక్కల నుండు పర్వతములు నూరేసి పలముల సువర్ణముతో నిర్మించవలెను. మేరు పర్వతముతో పదమూడు పర్వతములుండును. ఉత్తరాయణ సంక్రాంతినాడుగాని, సూర్య చంద్ర గ్రహణములందు గాని మేరువును విష్ణు ప్రతిమకు ఎదురుగా స్థాపించ వలెను. శ్రీమహావిష్ణువును ఆ మేరువును పూజించి బ్రాహ్మణునకు దానము చేయవలెను. ఇట్లు చేసినవాడు చిరకాలము విష్ణు లోకములో నుండును. పంద్రెండు పర్వతములతో కూడిన రజతమేరువును సంకల్ప పూర్వకముగ దానము చేయువాడు భూమిమీద ఎన్ని పరమాణువులున్నవో అన్ని సంవత్సరములు రాజ్యమును అనుభ వించును. పైన చెప్పిన ఫలమును కూడ అనుభవించును. శ్రీమహావిష్ణువును, బ్రాహ్మణుని పూజించి

భూమి మేరువును దానము చేయవలెను. ఒక నగరమునందలి లేదా జనపదము నందలి లేదా గ్రామము నందలి ఎనిమిదవ అంశముచే భూమి మేరువును కల్పించి మిగిలిన అంశముచే పంద్రెండు అంశములను కల్పించవలెను. భూమి మేరు దానమువలన గూడ పూర్వోక్త ఫలము లభించును. ఏనుగులతో పంద్రెండు పర్వతములతో గూడిన మేరువును నిర్మించి ముగ్గురు పురుషులతో కూడ ఆ హస్తి మేరువును దానము చేయవలెను. అట్లు చేసిన వానికి అక్షయ ఫలము లభించును. పదునైదు అశ్వములతో అశ్వమేరువు ఏర్పడును. పంద్రెండు పర్వతముల స్థానములందు పంద్రెండు అశ్వములు ఉంచవలెను. శ్రీమహా విష్ణ్వాది దేవతల పూజ చేసిన పిమ్మట ఈ అశ్వమేరు దానము చేసినవాడు ఈ జన్మమున వివిధ భోగములను అనుభవించి మరుజన్మమున రాజగును. అశ్వమేరువు విషయమున చెప్పిన విధముననే గోమేరు దానము కూడ చేయవలెను. ఒక పుట్టి బరువుగల పట్టు వస్త్రములతో 'వస్త్ర మేరువు' అగును. దానిని మధ్యయందు ఉంచి పంద్రెండు వస్త్రములను ఉంచవలెను. దీనిని దానము చేసినవానికి అక్షయఫలము లభించును. ఐదువేల పలముల ఘృతముతో ఘృతపర్వత మగును. దీని ప్రక్కనున్న పర్వతములు ఒక్కొక్కటి ఐదు వందల పలముల ఘృతముతో నిర్మింపబడును. ఈ ఘృత పర్వతముపై శ్రీమహావిష్ణువును పూజించి తత్సమ్ముఖమున బ్రాహ్మణునకు దానము చేసినవాడు ఈ లోకమునందు సుఖము పొంది విష్ణు లోకము చేరును. ఇట్లే ఖండ (పటిక బెల్లము) మేరువు నిర్మించి దానము చేసినవానికి పూర్వోక్త ఫలము లభించును.

ఐదుపుట్ల ధాన్యముతో ధాన్యమేరువును, ఒక్కొక్క పుట్టెడు ధాన్యముతో మిగిలిన పంద్రెండు పర్వతములను నిర్మించి, వాటి అన్నింటిపైన మూడేసి స్వర్ణమయ శిఖరములు ఏర్పరచి, అన్నింటిపైనను బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను పూజించవలెను. శ్రీమహావిష్ణువు నకు విశేష పూజ చేయవలెను. దీని వలన అక్షయ ఫలము లభించును. ఈ ప్రమాణము చేతనే తిలమేరువును, దశాంశ ప్రమాణము చేతనే అన్య పర్వతములను నిర్మించి, వాటికి వెనుక చెప్పినవిధముగ శిఖరములు నిర్మించి, దానము చేసినవాడు బంధుసహితుడై విష్ణు లోకమునకు వెళ్లును. 'విష్ణు స్వరూపమగు తిలమేరువునకు నమస్కారము. బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు దేని శిఖరములో, ఏది పృథ్వీనాభి యందున్నదో, ఏది ప్రక్కనున్న పంద్రెండు పర్వతములకు ప్రభువో అట్టి సమస్త పాపహరము, శాంతిమయము, విష్ణు భక్తియుక్తము అగు తిలమేరువునకు నమస్కారము. అది నన్ను రక్షించుగాక. నేను పాపరహితుడనై పితరులతో గూడ శ్రీమహావిష్ణు సన్నిధి చేరగలను. 'ఓం నమః'. నీవు విష్ణు స్వరూపమైన దానవు. విష్ణు సమ్ముఖమునందు, విష్ణు స్వరూపుడగు బ్రాహ్మణునకు, భక్తి పూర్వకముగ, భోగ మోక్ష ప్రాప్తికై నిన్ను దానము చేయుచున్నాను' అని చెప్పుచు ఆ తిల మేరువును దానము చేయవలెను (212).

పృథ్వీదానములు

అగ్నిదేవుడు చెప్పెను :

ఇపుడు పృథివీ దానమును గూర్చి చెప్పెదను. పృథివి మూడు విధములైనది. నూరు కోట్ల యోజనముల వైశాల్యముతో, సప్త ద్వీపములతో, సముద్రములతో జంబూద్వీప పర్యంతము ఉన్న

పృథివి ఉత్తమమైనది. ఐదు భారాల సువర్ణముతో ఉత్తమపృథ్విని నిర్మించవలెను. దానిలో సగముతో కూర్మమును, కమలమును నిర్మించవలెను. ఇది 'ఉత్తమ పృథివి'. దీనిలో సగము 'మధ్యమ పృథివి'. దీనిలో మూడవ వంతుతో నిర్మించినది 'కనిష్ఠ పృథివి'. దీనితో పృథివిలోని మూడవ భాగమునందు కూర్మమును, వరాహమును నిర్మించవలెను. వెయ్యి పలముల సువర్ణముతో మూలము, దండము, ఆకులు, ఫలములు, పుష్పములు, ఐదు శాఖలుగల కల్పవృక్షము నిర్మించవలెను. పండితుడైన బ్రాహ్మణుడు యజమానునిచే సంకల్పము చేయించి దీనిని ఐదుగురు బ్రాహ్మణులకు దానము చేయించవలెను. దీనిని దానము చేసినవాడు బ్రహ్మ లోకమునందు పితృ గణములతో కలిసి చాలా కాలము ఆనందము అనుభవించును. ఐదువందల పలముల సువర్ణముతో కామధేనువును నిర్మించి విష్ణుసముఖమున దానము చేయవలెను. బ్రహ్మ విష్ణు శివాది దేవతలందరును గోవు శరీరమును ఆశ్రయించి యుందురు. గోదానము చేయుటచే సకల దానములు చేసినట్లే అగును. దీనివలన సకలాభీష్టములు సిద్ధించి బ్రహ్మలోక ప్రాప్తి కలుగును. శ్రీమహావిష్ణు సాన్నిధ్యమున కపిల గోదానము చేసినవాడు తన కులమునకు అంతకును ఉద్ధారకుడగును. అలంకృత కన్యాదానము చేసిన వానికి అశ్వమేధయాగ ఫలము లభించును. సకల సస్యములు పండించుటకు తగిన భూమిని దానము చేసినవాడు సర్వమును పొందగలడు. గ్రామము, నగరము, పల్లె దానము చేసిన వాడు సుఖ వంతుడు అగును. కార్తిక పూర్ణిమాదులందు వృషోత్సర్గము చేయువాడు తన కులమును ఉద్ధరించును. (213)

మంత్ర మాహాత్మ్య కథనము

అగ్నిదేవుడు చెప్పెను :

ఇపుడు నాడీచక్రమును గూర్చి చెప్పెదను. దీనిని తెలుసుకొనుటచే శ్రీమహావిష్ణు జ్ఞానము కలుగును. నాభిక్రింద మూలాధార చక్రముండును. దాని నుంచి అంకురమువలె నాడులు బయ ల్వెడలును. నాభి మధ్యయందు డెబ్బది రెండువేల నాడులున్నవి. చక్రాకారమున నున్న ఈ నాడులు శరీరమునకు క్రింద, పైన, ప్రక్కల అంతటను వ్యాపించి యున్నవి. వీటిలో–ఇడా, పింగళా, సుషుమ్నా, గాంధారీ, హస్తిజిహ్వా, వృథా, యశా, అలంబుషా, కుహూ, శంఖినీ అను పది నాడులు ప్రధానమైనవి. ఇవి ప్రాణవాయు ప్రసారము చేయు పది ప్రధాననాడులు. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయములు అనునవి పది ప్రాణ వాయువులు. వీటిలో ప్రాణ వాయువు అన్నింటికి అధిపతి. రిక్త (శూన్య) త్వమును పూర్తిచేయుటకై ఈ ప్రాణము ఇతర ప్రాణ వాయువులను ప్రేరేపించును; సకల ప్రాణుల హృదయ ప్రాంతమునందుండి అపాన వాయువు ద్వారా జరుగు మలమూత్ర త్యాగముచే ఏర్పడు రిక్తత్వమును నిత్యము పూడ్చును. జీవుని ఆశ్రయించి ఉన్న ఈ ప్రాణము శ్వాస, ఉచ్ఛ్వాస, కాసాదుల ద్వారా ప్రయాణము (గమనా గమనములు) చేయునుగాన 'ప్రాణ'మని చెప్పబడుచున్నది. అపాన వాయువు ఆహారమును, మూత్ర–శుక్లాదులను క్రిందికి తీసికొనిపోవును. ఇట్లు అపాన యనము (తొలగించుట) చేయుటచే 'అపాన' మైనది. తిన్న ఆహారమును, త్రాగిన జలాదులను, వాసనచూసిన పదార్థములను రక్త, పిత్త, కఫ

వాతములను సమాన రూపమున సర్వాంగములందు ప్రసరింపచేయునది 'సమానము'. ఉదానము ముఖమును, అధరము లను స్పందింపజేయును; నేత్రముల ఎరుపును అధికము చేయును; మర్మ స్థానములను ఉద్విగ్నము చేయును; అందుచే దీనికి 'ఉదానము' అని పేరు. వ్యాసము అంగములను పీడించును. వ్యాధి ప్రకోపము కలిగించును. కంఠమును అవరుద్ధము చేయును. వ్యాపన శీల మగుటచే ఇది 'వ్యాసము'. నాగవాయువు త్రేణుపు, వాంతి మొదలగునవి చేయును. కూర్మ వాయువు కంటిరెప్పలు మూయుట తెరచుట చేయును. కృకరము భక్షణము నందును, దేవదత్తము ఆవులింత లందును ఉండును. ధనంజయమునకు స్థానము ఘోషము. ఇది మృత శరీరమును కూడ విడువదు. ఈ పదింటితో జీవుడు ప్రయాణము చేయును. అందుచే దశ ప్రాణ భేదముచే నాడీ చక్రమునకు గూడ పది భేదములు ఏర్పడుచున్నవి.

సూర్యగతిచే ఏర్పడు సంక్రాంతి, విషువ, దిన, రాత్రి ఆయన, అధిమాస, ఋణ, ఊనరాత్ర, ధనములను పది దశలు శరీరములో కూడ ఏర్పడును. ఈ శరీరమునందు ఎక్కిళ్లు ఊన రాత్రము. ఆవులింత అధిమాసము. దగ్గు ఋణము. నిశ్వాసము ధనము. శరీరములో ఉన్న వామనాడి ఉత్తరాయణము. దక్షిణనాడి దక్షిణాయనము. ఆ రెండింటి మధ్య నాసికారంధ్ర ద్వయమునుండి బయల్వెడలు శ్వాసవాయువు విషువము. ఈ విషువ వాయువు తన స్థానమునుండి చరించి రెండవ స్థానమునకు పోవుట సంక్రాంతి. ద్విజశ్రేష్ఠా! శరీర మధ్యభాగమునందు సుషుమ్న, వామ భాగమున ఇడ, దక్షిణ భాగమున పింగళ ఉన్నవి. ఊర్ధ్వగతిగలది ప్రాణము దినము; అధోగతిగలది రాత్రి, ఒక్క ప్రాణవాయువే దశవాయు రూపమున విభక్తమైనది. దేహములోపల ప్రాణవాయువు ఆయా మము చెందుట 'చంద్రగ్రహణము' అది దేహము పై భాగము వరకు వ్యాపించినచో సూర్య గ్రహణము.

సాధకుడు ఎంత శక్యమగునో అంతవాయువు లోనికి తీసికొనవలెను. ఇది దేహమును నింపు 'పూరక' ప్రాణాయామము. శ్వాస బైటికి పోకుండునట్లు శ్వాస నిశ్వాసలు ఆపివేసి పూర్ణకుంభమువలె ఉన్నచో అది 'కుంభక' ప్రాణాయామము. పిదప మంత్రవేత్త పైకి ఒకే నాసా రంధ్రముచే వాయువును విడచినచో అది 'రేచక' ప్రాణాయామము. శ్వాసోచ్ఛ్వాస క్రియచే శరీరములో నున్న శివరూప బ్రహ్మయొక్క ఉచ్చారణము (సోహంహంసః అను విధమున) జరుగును. గాన తత్త్వవేత్తలు దీనిని జపమందురు. ఈ విధముగ తత్త్వవేత్త ఒక దినమునందు శ్వాస ప్రశ్వాసల ద్వారా 21,600 పర్యాయములు మంత్రజపము చేయును. ఇది బ్రహ్మ విష్ణు మహేశ్వరులతో సంబంధించిన 'అజపా గాయత్రి'. ఈ అజపాజపము చేయువానికి పునర్జన్మ లేదు. చంద్రాగ్ని సూర్యయుక్త మూలాధార స్థితయగు కుండలినీ శక్తి హృదయ ప్రదేశమునందు అంకురాకారమున ఉండును. సాత్త్విక పురుషశ్రేష్ఠుడగు యోగి సృష్టి క్రమమును అవలంబించి, సృష్టి న్యాసముచేసి, బ్రహ్మరంధ్రమునందు ఉన్న శివునినుండి కుండలినీ ముఖమునందు అమృతము ప్రవహిం చునట్లు భావన చేయవలెను. శివునకు సకలము నిష్కలము అని రెండు రూపములున్నవి. సాకారుడగు శివుడు సకలుడు, నిరా కారుడు నిష్కలుడు. వారు 'హంస హంస' అని జపము చేయుదురు. హంస అనగా సదాశివుడు, తిలలలో తైలము, పుష్పములలో సుగంధము ఉన్న విధమున జీవాత్మకు లోపలను వెలుపలను

సదాశివుడు నివసించును. బ్రహ్మ హృదయమునందును, విష్ణువు కంఠమునందును, తాలు మధ్య భాగమున రుద్రుడు, లలాటమున మహేశ్వరుడు, ప్రాణాగ్రమునందు సదాశివుడును ఉందురు. వీటి అన్నింటికిని అంతమునందు పరాత్పరబ్రహ్మ ఉండును. సకల పరమాత్మ బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర, సదాశివ రూపమున నుండును. నిర్గుణుడు, నిష్కలుడు అగు పరమాత్మ 'నిష్కలుడు.

అనాహత నాదమును ప్రాసాదమువరకు లేవదీసి నిరంతర జపముచేయు యోగి ఆరు మాసము లలోనే సిద్ధిని పొందును; సంశయములేదు. గమనాగమన జ్ఞానముచే సమస్త పాపములును నశించి అణిమాది సిద్ధులు, గుణములు, ఐశ్వర్యము ఆరు మాసము లలో లభించును. స్థూలము, సూక్ష్మము పరము అను మూడు విధములగు ప్రాసాదమును వర్ణించితిని. ప్రాసాదమును హ్రస్వము, దీర్ఘము, ప్లుతము అను మూడు రూపములలో గుర్తించవలెను. హ్రస్వము పాపములను దహించి వేయును. దీర్ఘము మోక్షప్రదము. ప్లుతము తృప్తిప్రదము. దీని శిరస్సుపై బిందువు (అనుస్వారము) ఉండును. మారణకర్మల యందు హ్రస్వ ప్రాసాద మంత్రమునకు ఆద్యంతములందు 'ఫట్' చేర్చి జపముచేసిన మంచిది. ఆద్యంతములందు 'నమః' చేర్చి జపము చేసినచో అది ఆకర్షణ సాధకము. మహాదేవుని దక్షిణామూర్తి సంబంధిత మంత్రమును నిలబడి నాలుగు లక్షలు జపించి జపాంతమున పదివేల ఆజ్యహోమములు చేసినచో మంత్రసిద్ధి కలుగును. పిదప దానితో వశీకరణో చ్చాటనాదులు చేయవచ్చును. పైనను, క్రిందను, మధ్యయందును శూన్యమైన త్రిశూన్య నిరామయ మంత్రము తెలిసికొనిన ద్విజుడు తప్పక ముక్తి పొందును. ఐదు మంత్రముల కలయికచే చాలపెద్దది, ముప్పది యేడు కలలతో కూడినది అయిన ప్రాసాద మంత్రము ఎరుగనివాడు ఆచార్యుడు కాజాలడు. ఓం కారము, గాయత్రి, రుద్రాది మంత్రములును తెలిసినవాడే గురువు. (214)

సంధ్యా విధి వర్ణనము

అగ్నిదేవుడు చెప్పెను :

ఓంకారమును ఎరిగినవాడే యోగి. అతడే విష్ణు స్వరూపుడు. అందువలన సకల మంత్ర సారభూతము, సర్వప్రదమగు ఓంకారమును అభ్యసించవలెను. సమస్త మంత్ర ప్రయోగ ప్రారంభమునందు కూడా ఓంకారము ఉచ్చరింపబడును. ఓంకార యుక్తమగు కర్మయే పరిపూర్ణము; అది లేనిది పూర్ణము కాజాలదు. మొదట ఓంకారము తోడను, మూడు శాశ్వత వ్యాహృతుల తోడను కూడిన మూడు పదముల గాయత్రి వేదమునకు ముఖము. మూడు సంవత్సరములపాటు నిత్యము గాయత్రీ జపము చేయువాడు వాయువై, ఆకాశ స్వరూపుడై, పరబ్రహ్మను పొందును. ఏకాక్షరమగు ఓంకారమే పరబ్రహ్మము. ప్రాణాయామమే పరమతపస్సు. గాయత్రిని మించినది ఏదియు లేదు. మౌనముగా ఉండుట కంటె సత్యభాషణము శ్రేష్ఠము. ఏడు పర్యాయములు గాయత్రి ఆవృత్తి చేసినచో సర్వ పాపములును తొలగును. పదిఆవృత్తులు చేయువాడు స్వర్గము పొందును. ఇరువది ఆవృత్తులు చేయువానిని గాయత్రి స్వయముగా ఈశ్వర లోకమునకు తీసికొనిపోవును. నూట ఎనిమిది పర్యాయములు గాయత్రీ జపము చేసినవాడు సంసార సాగరమును తరించును. రుద్ర మంత్ర జపముకంటెను, కూష్మాండ మంత్రజపముకంటెను గాయత్రీ మంత్ర జపము శ్రేష్ఠము.

గాయత్రి కంటె శ్రేష్టమైన జపించదగిన మంత్రము ఏదియును లేదు. వ్యాహృతి హోమ తుల్యమగు హోమమేమియును లేదు. గాయత్రీ మంత్రములోని ఒక పాదమునుగాని, సగము పాదమునుగాని, సంపూర్ణ ఋక్కునుగాని, సగము ఋక్కునుగాని జపించినంత మాత్రమున గాయత్రి బ్రహ్మ హత్యా, సురాపాన, సువర్ణస్తేయ, గురుపత్నీ గమనాది మహాపాతకముల నుండి విముక్తుని చేయును.

ఏ పాపమునకైనను తిలహోమము, గాయత్రి జపము ప్రాయశ్చిత్తములు. ఉపవాస పూర్వకముగ సహస్ర గాయత్రీ జపము చేయువాడు తన పాపములను నశింపచేసుకొనును. గోవధ, పితృవధ, మాతృవధ, బ్రహ్మహత్యా, గురుపత్నీగమన, బ్రాహ్మణ జీవికాపహరణ, సువర్ణస్తేయ, సురాపానాది మహాపాపములు చేసినవాడు కూడ ఒక లక్ష గాయత్రీజపము చేయుటచే శుద్ధుడగును. లేదా స్నానానంతరము నీటిలో ఉండి నూరు పర్యాయములు గాయత్రీ జపము చేయవలెను. పిదప గాయత్ర్యభిమంత్రితమగు జలముతో నూరు ఆచమనములు చేయవలెను. అట్లు చేసినవాడు కూడ పాపరహితుడగును. నూరు పర్యాయములు గాయత్రీ జపము సమస్త పాపములను శమింపచేయును. సహస్ర జపము ఉప పాతకములను కూడ నశింపచేయును. కోటి జపము చేసినవానికి గాయత్రీదేవి అభీష్ట ఫలమును ఒసగును. జపము చేయువాడు దేవత్వమును, దేవరాజత్వమును కూడ పొందును. మొదట 'ఓం' కారమును, పిదప 'భూర్భువః స్వః'ను ఉచ్చరించి పిదప గాయత్రి ఉచ్చరించి, చివర 'ఓం' చేర్చవలెను. జపమున ఈ విధముగ గాయత్రీ మంత్రము విహితమైనది. గాయత్రికి ఋషి విశ్వామిత్రుడు. గాయత్రి ఛందస్సు. దేవత సవిత. ఉపనయన, జప, హోమములందు దీనిని వినియోగించవలెను. గాయత్రీ మంత్రమునందలి ఇరువది నాలుగు అక్షరములకు వరుసగా– అగ్ని, వాయువు, రవి, విద్యుత్, యమ, జల పతి, గురు, పర్జన్య, ఇంద్ర, గంధర్వ, పూషన్, మిత్ర, వరుణ, త్వష్టు, వసుగణ, మరుద్గణ, చంద్ర, అంగిరస్, విశ్వేదేవ, అశ్వినీ కుమార, ప్రజాపతి సహిత సమస్త దేవగణ, రుద్ర, బ్రహ్మ విష్ణువులు అధిష్ఠాతృ దేవతలు. గాయత్రీ జపసమయమున పై దేవతలను ఉచ్చరిం చినచో వారు జపము చేయువాని పాపములను తొలగింతురు.

గాయత్రీ మంత్రమునందలి ఒక్కొక్క అక్షరమును క్రింద చెప్పిన అవయవములపై వరుసగా న్యాసము చేయవలెను–రెండు పాదాంగుష్ఠములు, రెండు మడమలు, రెండు పిక్కలు, మోకాళ్లు, తొడలు, ఉపస్థ, వృషణములు, కటిభాగము, నాభి, ఉదరము, స్తన మండలము, హృదయము, కంఠము, అధరోష్ఠము, తాలు, నాసిక, నేత్రములు, కను బొమ్మల మధ్య భాగము, లలాటము, ఉత్తరోష్ఠము, దక్షిణ పార్శ్వము, ఉత్తర పార్శ్వము, శిరస్సు, సంపూర్ణ ముఖమండలము. ఇరువది నాలుగు గాయత్ర్యక్షరముల రంగులు వరుసగా పీత, శ్యామ, కపిల, మరకత మణి సదృశ, అగ్నితుల్య, స్వర్ణతుల్య, విద్యుత్ప్రభ, ధూమ్ర, కృష్ణ, రక్త, గౌర, ఇంద్రనీల మణిసదృశ, స్ఫటిక మణితుల్య, స్వర్ణతుల్య, పాండు, పుష్పరాగ తుల్య, అఖిలద్యుతి, హేమాభధూమ్ర, రక్తనీల, రక్త కృష్ణ, సువర్ణాభ, శుక్ల, కృష్ణ, పలాశ వర్ణములై యుండును. గాయత్రిని ధ్యానము చేసినచో ఆ దేవి ధ్యానించు వాని పాపములను తొలగించును. హోమము చేసినచో అభీష్టములను ఇచ్చును. గాయత్రీ మంత్రముతో తిలహోమము చేసినచో సకల పాపములు నశించును. శాంతి కోరువాడు యవలను, దీర్ఘాయుర్దాయము కోరువాడు ఘృతమును హోమము చేయవలెను. కర్మసిద్ధి కోరువాడు ఆవాలను,

బ్రహ్మ తేజస్సు కోరువాడు క్షీరమును, పుత్రులను కోరువాడు పెరుగును, అధిక ధాన్యము కోరువాడు శాలితండులములు హోమము చేయవలెను. గ్రహపీడా శాంతికై ఖదిరవృక్ష సమిధలను, ధనముకొరకు బిల్వపత్రములను, లక్ష్మి కొరకు కమలములను, ఆరోగ్యము కొరకు మహోత్పాత శాంతి కొరకు దూర్వలను, సౌభాగ్యము కొరకు గుగ్గులను, విద్య కొరకు పాయసమును హోమము చేయవలెను. పదివేల హోమములచే పూర్వోక్త ఫలములు లభించును. ఒక లక్ష హోమములచే మనోభిలషితములగు వస్తువులు అన్నియు లభించును. ఒకకోటి ఆహుతులు చేసినవాడు బ్రహ్మహత్యాపాప విము క్తుడై, తన కులమును ఉద్ధరించి, శ్రీమహావిష్ణు స్వరూపుడు అగును. గ్రహశాంతికై చేయు యజ్ఞములలో కూడ గాయత్రీ మంత్రముచే పదివేల హోమములు చేసినచో అభీష్టసిద్ధి కలుగును.

గాయత్రిని ఆవాహనము చేసి ఓంకారమును ఉచ్చరించవలెను. గాయత్రీ మంత్ర సహితమగు ఓంకారము ఉచ్చరించుచు శిఖను బంధించి, ఆచమనము చేసి హృదయ, నాభి, భుజద్వయములను స్పృశించవలెను. ప్రణవమునకు ఋషి బ్రహ్మ. గాయత్రి ఛందస్సు. అగ్ని లేదా పరమాత్మ దేవత. సర్వకర్మ ప్రారంభమునందును దీనిని ప్రయోగించ వలెను. 'శుక్లా-శుభా' అను (మూలోక్త) మంత్ర ముచే గాయత్రిని ధ్యానించి -'ఓం తేజోఽసి.....తతః స్మృతా' అను (మూలోక్త) మంత్రముచే ఆవాహన చేయవలెను. సమస్త వ్యాహృతులకును ఋషి ప్రజాపతి. అవన్నియు వ్యష్టిసమిష్టి రూపము లతో పరబ్రహ్మ రూపమగు ఓంకారములో ఉన్నవి. సప్తవ్యాహృతులకు వరుసగా-విశ్వామిత్ర, జమదగ్ని, భరద్వాజ, గౌతమ, అత్రి, వసిష్ఠ, కశ్యపులు ఋషులు. అగ్ని, వాయువు, సూర్య, బృహస్పతి, వరుణ, ఇంద్ర, విశ్వదేవులు దేవతలు. గాయత్రీ, ఉష్ణిక్, అనుష్టుప్, బృహతీ, పంక్తి త్రిష్టుప్, జగతీ అనునవి ఛందస్సులు. ఈ వ్యాహృతులు ప్రాణాయామ హోమములందు వినియోగింప బడును. 'ఆపోహిష్ఠామయో భువః.....జనయథాచనః' అనుమూడు ఋక్కులను, 'ద్రుప దాదివ..... ముముచానః' 'హిరణ్యవర్ణాః శుచయః' ఇత్యాది పవమాన ఋక్కులను పఠించుచు ఎనిమిది పర్యాయములు జలమును మీద చల్లుకొనవలెను. నీటిలోపల నిలచి 'ఋతంచ' ఇత్యాది అఘమర్షణ మంత్రమును మూడు పర్యాయములు జపించవలెను. 'ఆపోహిష్ఠా' ఇత్యాది ఋక్త్రయమునకు ఋషి సింధుద్వీపుడు. ఛందస్సు గాయత్రి, దేవత జలము. బ్రహ్మస్నానమునకై మార్జనమునందు ఇది వినియోగింపబడును. అఘమర్షణ సూక్తమునకు ఋషి అఘమర్షణుడు. ఛందస్సు అనుష్టుప్. దేవతాభావ వృత్తుడు. పాప నిస్సారణము నందు వినియోగము. 'ఓం ఆపోజ్యోతీరసోఽమృతం బ్రహ్మ భూర్భువః సువరోమ్' - ఇది గాయత్రీ మంత్ర శిరోభాగము. దాని ఋషి ప్రజాపతి. ఇది ఛందోరహితమైన యజుర్వేద మంత్రము. ఏలననగా యజుర్వేదము ఛందోబద్ధము కాదు. శిరో మంత్రమునకు దేవతలు బ్రహ్మ, అగ్ని, వాయువు, సూర్యులు. ప్రాణాయామము నుండి వాయువు, వాయువునుండి అగ్ని, అగ్నినుండి జలము ఉత్పన్నమైనవి. ఈ జలము వలన శుద్ధి కలుగును. అందుచే 'అన్తశ్చరసిభూతేషు.....రసోఽమృతమ్' అను (మూలోక్త) మంత్రముతో ఆచమనము చేయ వలెను. 'ఉదుత్యం జాతవేదసమ్' అను మంత్రమునకు ప్రస్కణ్వ ఋషి. ఛందస్సు గాయత్రి. దేవత సూర్యుడు. దీనికి అతిరాత్ర-అగ్నిష్టోమములందు వినియోగము. 'చిత్రందేవానామ్' అను మంత్రము నకు ఋషి కౌత్సుడు. ఛందస్సు త్రిష్టుప్. దేవత సూర్యుడు. సూర్యోపస్థానమునందు వినియోగము. (215)

గాయత్రీ మంత్రార్థము - 1

అగ్నిదేవుడు చెప్పెను :

ఈ విధముగ సంధ్యావందనము ఆచరించి గాయత్రీ ధ్యాన జపములు చేయవలెను. తనను గానము చేయు సాధకుని శరీర ప్రాణములను రక్షించునది గాన 'గాయత్రి' అను పేరు వచ్చినది. అది సవిత (సూర్యుడు) నుండి ఆవిర్భవించినది గాన 'సావిత్రి' యైనది. వాక్స్వరూప మగుటచే 'సరస్వతి' అని ప్రసిద్ధి కూడ వచ్చినది. 'తత్' అనగా జ్యోతిః స్వరూపమగు పరబ్రహ్మ. 'భర్గః' అనగా తేజస్సు. దీప్తి అను అర్థముగల 'భా' ధాతువునుండి 'భర్గః' శబ్దము నిష్పన్నమైనది. 'భాతీతిభర్గః' అని దీని వ్యుత్పత్త్యర్థము. లేదా 'భ్రస్జ–పాకే' అనుపాకము చేయుట అను అర్థముకల భ్రస్జధాతువు నుండి కూడ 'భర్గః' శబ్దము నిష్పన్నమగును. ఏలనన సూర్యుడు ఓషధ్యాదులను పక్వము చేయునుగదా? 'భ్రాజృ' అను ధాతువునకు కూడ ప్రకాశించుట అని అర్థము. కావున 'భ్రాజతే ఇతిభర్గః' అను వ్యుత్పత్తిని అనుసరించి భ్రాజధాతువు నుండి గూడ 'భర్గః' శబ్దము నిష్పన్నమగును. 'బహులం ఛన్దసి' అను వ్యాకరణ సూత్రానుసారము ఈ పదము పైన చెప్పిన ఏ ధాతువు నుండ యైనను నిష్పన్నము కావచ్చును. 'వరేణ్య' శబ్దమునకు 'సంపూర్ణ తేజస్సుతో శ్రేష్ఠమైన పరమపద స్వరూపము' అని అర్థము. లేదా స్వర్గ మోక్షములను కోరువారిచే సర్వధా వరింపబడుటచే 'వరేణ్యము'. 'వృఞ్' ధాతువునకు వరించుట అని అర్థము. 'ధీమహి' అను పదమునకు–'జాగ్రత్స్వప్న సుషుప్త్యా ద్యవస్థాతీము, నిత్యము, శుద్ధము, బుద్ధము, ఏకమాత్రము, సత్యము, జ్యోతిః స్వరూపము అగు పరబ్రహ్మను ముక్తికొరకై ధ్యానించు చున్నాము' అని అర్థము. జగత్సృష్ట్యాది కారణభూతుడగు శ్రీమహావిష్ణువే అపరజ్యోతి. అపరజ్యోతి శివుడని కొందరు, శక్తి అని కొందరు, సూర్యుడని కొందరు, అగ్నియని వేదజ్ఞులైన అగ్నిహోత్రులు చెప్పుదురు. వాస్తవమున అగ్న్యాది రూపమున నున్న విష్ణువే వేద వేదాంగములందు బ్రహ్మయని చెప్పబడినాడు. అందుచే 'దేవస్య సవితుః' అనగా జగదుత్పా దకుడగు శ్రీమహావిష్ణువే. అతడే పరమపదము. స్వయంజ్యోతిః స్వరూపుడగు శ్రీమహావిష్ణువు మహత్తత్వాదికములను సృష్టించుచున్నాడు. పర్జన్య, వాయువు, ఆదిత్యుల ద్వారా, శీతగ్రీష్మాది ఋతువుల ద్వారా అన్నము పోషించుచున్నాడు. యథావిధిగ అగ్నిలో సమర్పింపబడిన ఆహుతి సూర్యునివలన వర్షము, వర్షము వలన అన్నము కలుగును. అన్నము వలన ప్రజలు ఉత్పన్ను లగుదురు. 'ధీమహి' అను పదము 'దు–ధాఞ్' అను ధాతువునుండి కూడ నిష్పన్నమగును. అందుచే 'మేము ఆ తేజస్సును మనస్సుతో ధారణ చేయుచున్నాము' అని కూడ అర్థము చెప్పవచ్చును. యః=పరమాత్ముడైన యే విష్ణువు యొక్క తేజము, నః=మనల అందరి యొక్క, ధియః = బుద్ధివృత్తులను, ప్రచోదయాత్ ప్రేరేపించునో, కర్మ ఫలములను అనుభవించు సకల ప్రాణుల ప్రత్యక్ష – అప్రత్యక్ష పరిణామ హేతువులగు సమస్త కర్మలందును విష్ణు, సూర్య, అగ్నిరూపమున ఉన్నాడు. ఈశ్వర ప్రేరణానుసారమే ప్రాణులు శుభాశుభ కర్మలనుచేసి స్వర్గ నరకములకు పోవు చున్నారు. మహత్తత్వాది రూపములతో శ్రీమహావిష్ణువుచే నిర్మితమగు ఈ జగత్తు అంతయు ఈశ్వరుని నివాసస్థానము. సర్వసమర్థుడు, హంస స్వరూపుడగు ఆ పరమ పురుషుడు స్వర్గాది లోకముల క్రీడించుచుండును గాన 'దేవుడు' అని చెప్పబడుచున్నాడు. భర్గమను పేరుతో ప్రసిద్ధమైన ఆదిత్య

గతమగు దివ్యతేజమే ఆతని స్వరూపము. మోక్షము కోరువారు జన్మ మరణముల నుండియు, ఆధ్యాత్మిక–ఆధిదైవిక–ఆధిభౌతికములను త్రివిధ దుఃఖముల నుండియు విముక్తి పొందుటకై ధ్యానముచే, సూర్య మండలము నందున్న ఈ పరమ పురుషునే చూడవలెను. 'తత్త్వమసి' మొదలగు మహావాక్యములచే ప్రతిపాదింప బడిన సచ్చిత్స్వరూప పరబ్రహ్మము. అదియే సర్వలోక నిర్మాతయైన సవితృ దేవుని సర్వవరణీయమైన భర్గమే శ్రీమహావిష్ణుపదము. అదియే గాయత్రి యొక్క బ్రహ్మ రూపమగు చతుర్థపాదము. 'జాగ్రదవస్థకు సంబంధించిన దేహాది బ్రహ్మ పర్యంతము నేనే' అని ధ్యానింతుము. ఆదిత్యునిలో ఉన్న పరమ పురుషుడు నేనే. అనంత రూపమగు ఓంకారము నేనే. ఈ ఆదిత్య పురుషుడే జ్ఞానములను శుభకర్మాదులను సర్వదా ప్రవర్తింప చేయు చున్నాడు. (216)

గాయత్రీ మంత్రార్థము - 2

అగ్నిదేవుడు ఇట్లు చెప్పెను :

వసిష్ఠా! మరొక వసిష్ఠుడు గాయత్రీ జపపూర్వకముగ లింగమూర్తియగు శివుని స్తుతించి శివుని అనుగ్రహముచే నిర్వాణ స్వరూపమగు పరబ్రహ్మను పొందెను. వసిష్టుడు ఇట్లు స్తుతించెను – 'కనక లింగమునకు నమస్కారము. వేద లింగమునకు నమస్కారము. పరమ లింగమునకు నమస్కారము. ఆకాశ లింగమునకు నమస్కారము. సహస్రలింగ, వహ్నిలింగ, పురాణలింగ, వేదలింగ శివునకు మాటిమాటికి నమస్కారము చేయు చున్నాను. పాతాళలింగ బ్రహ్మలింగ, సప్త ద్వీపోర్ధ్వ లింగమునకు మాటిమాటికి నమస్కా రము. సర్వాత్మలింగ, సర్వలోక లింగ, అవ్యక్త లింగ, బుద్ధి లింగ, అహంకార లింగ, భూత లింగ, ఇంద్రియ లింగ, తన్మాత్ర లింగ, పురుషలింగ, భావలింగ, రజోర్ధ్వ లింగ, సత్త్వ లింగ, భవ లింగ, త్రైగుణ్యలింగ, అనాగత లింగ, తేజో లింగ, వాయూర్ధ్వ లింగ, శ్రుతి లింగ, అథర్వ లింగ, సమ లింగ, యజ్ఞాంగ లింగ, యజ్ఞ లింగ, తత్త్వ లింగ, దైవతానుగత లింగ స్వరూపుడవు అగు నీకు మాటిమాటికి నమస్కరించుచున్నాను. ప్రభూ! నాకు పరమ యోగమును ఉపదేశించుము; నాతో సమానుడైన పుత్రుని ఇమ్ము. నాకు అవినాశియగు పరబ్రహ్మయొక్క ప్రాప్తిని కలిగించుము. పరమ శాంతిని ఇమ్ము. నా వంశము ఎన్నటికిని క్షీణము కాకుండుగాక! నా బుద్ధి సర్వదా ధర్మముపై లగ్నమైయుండుగాక' అని అగ్ని పలికెను. పూర్వము వసిష్ఠుడు శ్రీశైలముపై స్తుతించగా శంకరుడు ప్రసన్నుడై వసిష్ఠునకు వరములు ఇచ్చి అచటనే అంతర్ధానము చెందెను. (217)

రాజ్యాభిషేక విధానము

అగ్నిదేవుడు చెప్పెను :

వసిష్ఠా! పూర్వము పరశురాముడు ప్రశ్నింపగా పుష్కరుడు చెప్పిన రాజధర్మములను చెప్పెదను. పుష్కరుడు పలికెను : రామా! నేను సకల రాజ ధర్మముల నుండి గ్రహించిన రాజు యొక్క ధర్మ ములను చెప్పెదను. రాజు దండమును ఉచితరీతిని ఉపయోగించుచు శత్రువులను నశింపచేసి,

ప్రజలను రక్షించవలెను. 'మీరందరును ధర్మమార్గమును అనుసరించి ఉండుడు. నేను మిమ్ములను రక్షించెదను' అని ప్రజలకు చెప్పి తనమాట నిలుపుకొనవలెను. రాజు సంవత్సర ఫలమును చెప్పు ఒక్క జ్యోతిః శాస్త్రవేత్తయగు బ్రాహ్మణుని, పురోహితుని వరణము చేయవలెను. సకల రాజకీయ శాస్త్ర నిపుణులు, ఆత్మజ్ఞానవంతులు అగు మంత్రులను నియమించి సకలగుణ సంపన్నురాలగు దేవిని పట్టమహిషినిగా చేయ వలెను. రాజ్య భారము వహించిన రాజు ఒక సంవత్సరము గడచిన పిమ్మట అభిషేక సంభారములన్నియు సంపాదించి ఉత్సవ పూర్వకముగా రాజ్యాభిషేకము పొంద వలెను. రాజ్యము చేయుచున్న రాజు మరణించిన వెంటనే, వారసుడు ముహూర్తాది చింతేమియు చేయక రాజ్యభారము వెంటనే వహించవలెను. రాజు జ్యోతిషిక పురోహితాదుల ద్వారా తిలసర్షపాది సామగ్రిని ఉపయోగించుచు స్నానముచేసి భద్రాసనము అలంకరించి రాజ్యము నందుండుచు, తన విజయమును ఘోషించవలెను. అభయ ఘోషణచేసి రాజ్యములో నున్న ఖైదీలను అందరిని బంధ విముక్తులను చేయవలెను. పురోహితునిచే అభిషేకము పొందుటకు పూర్వము, ఇంద్రాది దేవతాశాంతి చేయించవలెను. అభిషేక దివసమున ఉపవాసముచేసి వేదికపై స్థాపించబడిన అగ్నియందు మంత్రపాఠపూర్వకముగ హోమములు చేయవలెను. విష్ణు, ఇంద్ర, సవితృ, విశ్వదేవ, సోమ దేవతా ఋక్కులను, స్వస్త్యయన–శాంతి ఆయుష్య–అభయదములగు మంత్రములను పఠించ వలెను. అగ్నికి దక్షిణమున అపరాజితాదేవిని, అనేక భద్రములుగల సువర్ణ కలశను స్థాపించి చందన పుష్పాదులతో పూజించవలెను. అగ్నిశిఖ కుడివైపు తిరుగుచు, తప్తసువర్ణ కాంతితో రథ–మేఘ ధ్వనులతో సమానమగు ధ్వనిని కలిగించుచు, ధూమ రహితమై ఉన్నచో, అగ్నిదేవుడు అనుకూలుడై హవిస్సును గ్రహించినచో, హోమాగ్ని నుండి ఉత్తమ గంధము బయల్వెడలి నచో, మంటలు స్వస్తిక ఆకారమున పై కెగసినచో, అగ్ని స్వచ్ఛమై ఎత్తుగాలేచినచో, నిప్పు నెరసులు లేవకున్నచో అది శుభప్రదము.

రాజునకు అగ్నికి మధ్యనుండి పిల్లికాని, మృగముకాని, పక్షికాని వెళ్లకూడదు. రాజు మొదట పర్వత శిఖర మృత్తికతో శిరస్సును శుద్ధి చేసుకొనవలెను. పుట్ట మట్టితో చెవులను, విష్ణ్వాలయ పరాగముతో ముఖమును, ఇంద్ర దేవాలయ మృత్తు(మట్టి)తో కంఠమును, రాజగృహము వాకిలి యందలి మట్టితో హృదయమును, ఏనుగు దంతములతో త్రవ్విన మట్టితో కుడి చేతిని, ఎద్దు కొమ్ముతో త్రవ్విన మట్టితో ఎడమ భుజమును, సరస్సునందలి మృత్తికతో వీపును, నదీద్వయ సంగమ మృత్తికతో ఉదరమును, నది రెండు తటముల మృత్తికతో పార్శ్వములను, వేశ్యాద్వార మృత్తికతో కటిభాగమును, యజ్ఞశాలా మృత్తికతో తొడలను, గోశాలా మృత్తికతో మోకాళ్లను, అశ్వశాలా మృత్తికతో కళ్లను, రథచక్ర మృత్తికతో పాదములను శుద్ధము చేసికొనవలెను. పిదప పంచగవ్యముతో శిరస్సును శుద్ధిచేసికొన వలెను. పిదప నలుగురు అమాత్యులు భద్రాసనముపై కూర్చున్న రాజునకు కలశోదకముతో అభిషేకము చేయవలెను. బ్రాహ్మణుడైన సచివుడు, తూర్పునుండి ఘృతపూర్ణ సువర్ణ కలశముతో అభిషేకము ఆరంభింపవలెను. క్షత్రియ సచివుడు దక్షిణమున నిలచి క్షీరపూర్ణ మగు రజతకలశతోను, వైశ్యామాత్యుడు పశ్చిమమున నిలిచి దధిపూర్ణ తామ్రకలశతోను, శూద్రామాత్యుడు ఉత్తరమున ఉండి జలపూర్ణ మృత్పాత్రతోను రాజాభిషేకము

చేయవలెను. పిదప ఋగ్వేదులలో శ్రేష్ఠుడైన బ్రాహ్మణుడు తేనెతోను, సామవేదియైన విప్రుడు కుశజలముతోను అభిషేకము చేయవలెను. పిదప పురోహితులు అనేకచ్ఛిద్ర యుక్తమగు సువర్ణ కలశము వద్దకు వెళ్ళి, సదస్యులమధ్య యథాశాస్త్రముగ అగ్ని రక్షాకార్యము నిర్వర్తించి అభిషేక మంత్రములు పఠించుచు అభిషేకము చేయవలెను. ఆ సమయమున బ్రాహ్మణులు వేదమంత్రము లను పఠించవలెను. పిదప పురోహితుడు వేదిని సమీపించి సువర్ణమయ మగు శతచ్ఛిద్ర కలశముతో అభిషేకము ప్రారంభింపవలెను. 'యా ఓషధీః' ఇత్యాది మంత్రమును చదువుచు ఓషధులతోను, 'అథేత్యుక్త్వాః' ఇత్యాది మంత్రము చదువుచు గంధములతోను, 'పుష్పవతీః' ఇత్యాది మంత్రము చదువుచు పుష్పములతోను, 'బ్రహ్మణః' ఇత్యాది మంత్రము చదువుచు బీజములతోను, 'ఆశుః-శిశానః' ఇత్యాది మంత్రము చదు వుచు రత్నములతోను, 'యేదేవాః' ఇత్యాది మంత్రమును చదువుచు కుశయుక్త జలముతోను అభిషేకము చేయవలెను. యజుర్వేదియగు బ్రాహ్మణుడును, అథర్వవేదియగు బ్రాహ్మణు డును 'గన్ధద్వారామ్' ఇత్యాది మంత్రముతో శిరస్సుపైనను, కంఠము నందును గోరోచన ముతో తిలకముంచవలెను.

కొందరు గీతవాద్యాది ధ్వనులు బయల్వెడలుచుండగా చామరవ్యజనములు గ్రహించి, సరౌషధియుక్త కలశముతో రాజు ఎదుట నిలబడవలెను. రాజు ముందుగా ఆ కలశమును, పిదప అద్దమును, ఘృతాది మాంగళిక వస్తువులను చూడవలెను. పిదప విష్ణు, బ్రహ్మ, ఇంద్రాది దేవతలను, గ్రహములను పూజించి వ్యాఘ్ర చర్మయుక్తాసనముపై కూర్చుండవలెను. ఆ సమయమున పురోహితుడు మధుపర్కాదులు ఇచ్చి రాజు శిరస్సుపై కిరీటము ఉంచవలెను. పంచ చర్మాసనములపై కూర్చుండి రాజు మకుట ధారణము చేయవలెను. 'ధ్రువాద్యో' ఇత్యాది మంత్రముతో ఆ ఆసనముపై కూర్చుండవలెను. ఆ సమయమున వృష, వృషదంశ, వృక, వ్యాఘ్ర, సింహ చర్మాసనములు ఉపయోగింపబడును. అభిషేకా నంతరము ప్రతీహార, అమాత్య, సచివాదులను చూపుచు ప్రజలకు పరిచయము చేయవలెను. పిదప రాజు, గోవు, మేక, గొఱ్ఱె, గృహము మొదలగు వాటిని దానముచేసి జ్యోతిషశాస్త్ర పండితులైన పురోహితులను పూజించవలెను. భూమి, గోవులు, అన్నము మొదలగునవి ఇచ్చి ఇతర బ్రాహ్మణులను కూడ పూజించవలెను. అగ్ని ప్రదక్షిణము చేసి గురువును పూజించవలెను. పిదప వృషభ పీఠమును స్పృశించి, సవత్సయగు గోవును పూజించి, అభిమంత్రితమగు అశ్వమును ఎక్కవలెను. దానినుంచి దిగి గజమును పూజించి, దానిని అధిరోహించి, సేనాసహితుడై ప్రదక్షిణ క్రమమున మార్గముపై కొంచెము దూరము వెళ్ల వలెను. పిదప దానాదులచే అందరిని సత్కరించి, వీడ్కోలిచ్చి రాజధానిలో ప్రవేశించవలెను. (218)

అభిషేక మంత్రములు

పుష్కరుడు పలికెను :

ఇపుడు రాజ దేవతాద్యభిషేకమునకు సంబంధించిన మంత్రములను గూర్చి చెప్పె దను. ఇవి సకల పాపములను తొలగించును. కలశమును కుశయుక్త జలముతో నింపి రాజ్యాభిషేకము చేసినచో సకల మనోరథములు సిద్ధించును. (మంత్రముల అర్థము) - రాజా! బ్రహ్మ విష్ణు శివాది

దేవతలందరును నీకు అభిషేకము చేయుదురు గాక! వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధులు, ఇంద్రాది దశదిక్పాలకులు, రుద్ర, ధర్మ, మనుదక్ష, రుచి శ్రాద్ధాది దేవతలును నీకు సర్వదా విజయము నిచ్చెదరుగాక. భృగు, అత్రి వసిష్ఠ, సనకసనందన, సనత్కుమార అంగిరస, పులస్త్య, పులహ, క్రతు, మరీచి, కశ్యపాది మహర్షులు ప్రజా శాసనముచేయు భూపతిని రక్షింతురు గాక. ప్రకాశవంతులగు 'బర్హిషద్' 'అగ్నిష్వాత్త' అను పితృ దేవతలు నిన్ను రక్షింతురు గాక. క్రవ్యాదులు, ఆవాహితులగు ఆజ్యపులు, సుకాలి, ధర్మప్రియ, లక్ష్మి మొదలగు దేవతలును వృద్ధిపొందిన అగ్నులును నీకు అభిషేకము చేయుదురు గాక. అనేక పుత్రవంతుడైన ప్రజాపతి, కశ్యపుని ఆదిత్యాది పుత్రగణము, అభినందన, కృశాశ్వులు, అరిష్టనేమి భార్యలును నీకు అభిషేకము చేయుదురు గాక. అశ్విన్యాది చంద్రభార్యలు, పులహుని భార్యలు, భూతా, కపిశా, దంష్ట్రీ, సురసా సరమా, దను, శ్యేనీ, భాసీ, క్రౌంచీ, ధృతరాష్ట్రీ, శుకి మొదలగు దేవతలును, సూర్యుని సారథియైన అరుణుడును, నీ అభి షేకమును సుసంపన్నము చేయుదురు గాక. అతిథి, నియతి, రాత్రి, నిద్రాది దేవతలును, లోక రక్షణ తత్పరురాలగు ఉమాదేవియు, మేనా, శచీ ప్రభృతి దేవతలును, ధూమ్రా, ఊర్ణా, నైరృతీ, గౌరీ, శివా బుద్ధి, వేలా, నద్వలా, అసిక్నీ, జ్యోత్స్నా దేవతలును, దేవాంగనలును, వనస్పతులును నిన్ను పాలించు గాక.

మహాకల్ప, కల్ప, మన్వంతర, యుగ, సంవత్సర, వర్ష, అయన, ఋతుమాస, పక్ష, రాత్రి, దివస, సంధ్యా, తిథి, ముహూర్తములు, కాలము యొక్క విభిన్న అయనము లును నిన్ను రక్షించుగాక. సూర్యాది గ్రహములు, స్వాయంభువాది మనువులు నిన్ను రక్షింతురు గాక. స్వాయంభువ, స్వారోచిష, ఉత్తమ, తామస, రైవత,చాక్షుష, వైవస్వత, సావర్ణి, బ్రహ్మపుత్ర, ధర్మపుత్ర, రుద్రపుత్ర, దక్షపుత్ర, రౌచ్య, భౌత్యులను పదునాల్గురు మనువులు నిన్ను రక్షింతురుగాక. విశ్వభుక్, విపశ్చిత్, శిఖి, విభు, మనోజవ, ఓజస్వి, బలి, అద్భుత శాంతి, వృష, ఋతధామ, దివస్పృక్, కవి, ఇంద్ర, రైవంత, కుమార, కార్తికేయ, వత్స వినాయక, వీరభద్ర, నంది, విశ్వకర్మ, పురోజవ, దేవవైద్య, అశ్వినీ కుమారులు, ధ్రునాద్యష్ట వసువులు ఈ ప్రధాన దేవతలందరును ఇచట పాదార్పణముచేసి నీ అభిషేక కార్యమును సుసంపన్నము చేయుదురుగాక. అంగిరసుని కులమునందు ఉద్భవించిన పదిమంది దేవతలును, నాలుగు వేదములును సిద్ధికొరకై నీకు అభిషేకము చేయుదురుగాక. ఆత్మ, ఆయుష్, మనస్, దక్ష, మద, ప్రాణ, హవిష్మత్, గరిష్ఠ, ఋత, సత్యములు నిన్ను రక్షించుగాక. క్రతు, దక్ష, వాసు, సత్య, కాల, కామ, ధురి అనువారు నీకు విజయ ప్రదానము చేయుదురుగాక. పూరూరవస్, ఆర్ద్రవ, విశ్వేదేవ, రోచన, అంగారకాది విగ్రహ, సూర్య, నిరృతి, యములు నిన్ను రక్షించుగాక. అజైకపాద, అహి ర్బుధ్న్య, ధూమకేతు, రుద్రపుత్ర, భరత, మృత్యుకాపాలి, కింకణి, భవన, భావన, స్వజన్య, స్వజన, క్రతుశ్రవస్, మూర్ధ యాజన, ఉశనసులు నిన్ను రక్షించుగాక. ప్రసవ, అవ్యయ, దక్ష, భృగువంశ్య ఋషి, దేవతా, మను, అనుమంతృ, ప్రాణ, నవ, బలవదపాన వాయు, వీతి హోత్ర, నయ, సాధ్య, హంస, విభు, ప్రభు, నారాయణులను లోకక్షేమకారులగు దేవతలు నిన్ను పాలింతురుగాక. ధాతృ, మిత్ర, ఆర్యమన్,పూషన్, శుక్ర, వరుణ, భగ, త్వష్టృ, వివస్వత్, సవితృ, భాస్కర, విష్ణువులను పండ్రెండుగురు సూర్యులు నిన్ను రక్షించుగాక. ఏకజ్యోతి,

ద్విజ్యోతి, చతుర్జ్యోతి, ఏకశక్ర, ద్విశక్ర, మహాబల, త్రిశక్ర, ఇంద్ర, పతికృత్, మిత, సంమిత, మహాబలి, అమిత, ఋతజిత్, సత్యజిత్, సుషేణ,సనజత్, అతిమిత్ర, పురుమిత్ర, అపరాజిత, ఋత, ఋతవాక్, ధాతృ, విధాతృ, ధారణ, ధ్రువులును, ఇంద్రుని పరమ మిత్రుడును తేజః శాలి యునగు విదారణుడును, ఐదృక్ష, అదృక్ష, ఏతాదృక్, అమితాశన, క్రీడిత, సదృక్ష, సరభ, మహాతపస్, ధర్తృ, ధుర్య, ధురి, భీమ, అభియుక్త, అక్షపాత, సహ, ధృతి, వసు, అనాధృష్య, రామ, కామ, జయ, విరాట్టులను నలుబది తొమ్మండుగురు మరుత్తులును దేవతలును నీకు అభిషేకముచేసి, నీకు లక్ష్మి నొసంగుదురుగాక. చిత్రాంగద, చిత్రరథ, చిత్రసేన, కలి, ఊర్ణాయు, ఉగ్రసేన, ధృతరాష్ట్ర, నందన, హాహా, హూహూ, నారద, విశ్వావసు, తుంబురులను గంధర్వులు నీ అభిషేకమును సుసంపన్నము చేయుదురు గాక; నీకు విజయమును ఇత్తురుగాక. అతి ప్రధానులైన మునులు, అనవద్యా, సుకేశీ, మేనకా, సహజన్యా, క్రతుస్థలా, ఘృతాచీ, విశ్వాచీ, పుంజిక స్థలా, ప్రమ్లోచా, ఊర్వశీ, రంభా, పంచచూడా, తిలోత్తమా, చిత్రలేఖా, లక్ష్మణా, పుండరీకా, వారుణీ అను దివ్యాప్సరసలు నిన్ను రక్షింతురుగాక.

ప్రహ్లాద, విరోచన, బలి, బాణులు, బాణుని పుత్రులు, ఇతర దానవులు, రాక్షసులు, నీ అభిషేకమును సిద్ధము చేయుదురుగాక. హేతి, ప్రహేతి, విద్యుత్, స్ఫూర్జథు, అగ్రక, యక్ష, సిద్ధ, మణిభద్ర, నందనులు నిన్ను రక్షించుగాక. పింగాక్ష, ద్యుతిమత్, పుష్పవన్త, జయావహ, శంఖ, పద్మ, మకర, కచ్ఛపములను నిధులు నీకు జయప్రదములు అగుగాక. ఊర్ధ్వకేశాది పిశాచములు, భూమ్యాదులందు నివసించు భూతములు, మాతృ దేవతలు, మహాకాల నృసింహులను ఇందు ఉంచుకొని నిన్ను పాలింతురుగాక. గుహ, స్కంద, విశాఖ, నైగమేయులు నీకు అభిషేకము చేయుదురు గాక. భూతలమునందును ఆకాశము నందును సంచరించు డాకినులు, యోగినులు, గరుడ, అరుణ, సంపాత్యాది పక్షులు నిన్ను పాలించుగాక. అనంతుడు మొదలగు మహానాగములు, శేష, వాసుకి, తక్షక, ఐరావత, మహాపద్మ, కంబల, అశ్వతర, శంఖ, కర్కోటక, ధృతరాష్ట్ర, ధనంజయ, కుముద, ఐరావత, పద్మ, పుష్పదంత, వామన, సుప్రతీక, అంజనములను నాగములు ఎల్లప్పుడును అన్ని వైపుల నుండియు నిన్ను రక్షించుగాక.బ్రహ్మ వాహనమైన హంసయు, శంకరుని వాహనమైన వృషభము, దుర్గాదేవీ వాహనమైన సింహము, యముని వాహనమైన మహిషము నిన్ను పాలించుగాక. అశ్వరాజమైన ఉచ్ఛ్రైశ్రవస్సు, ధన్వంతరి, కౌస్తుభమణి, శంఖజమైన పాంచజన్యము, వజ్ర, శూల, చక్ర, నందక ఖడ్గాదిశస్త్రములు నిన్ను రక్షించు గాక. దృఢ నిశ్చయవంతుడగు యమధర్మరాజు, చిత్రగుప్త, దండ, పింగల, మృత్యు, కాలులు, వాలఖిల్యాది మునులు, వ్యాస, వాల్మీక్యాది మహర్షులు, పృథు, దిలీప, భరత, దుష్యంతులు, అత్యంత బలవంతుడగు శత్రుజిత్తు, మను, కకుత్థ్స, అనేనా, యవనాశ్వ, జయద్రథ, మాంధాతృ, ముచుకుంద, పురూరవులు నిన్ను రక్షింతురుగాక. వాస్తుదేవతయు, ఇరువదియైదు తత్త్వములును నీకు విజయము కూర్తురు గాక. రుక్మభౌమ, శిలాభౌమ, పాతాల, నీలమూర్తి, పీతరక్త, క్షితి, శ్వేతభౌమ, రసాతల, భూర్లోక, భువర్లోకాది లోకములు, జంబూ ద్వీపము మొదలగు ద్వీపములు నీకు రాజ్యలక్ష్మి నిచ్చుగాక. ఉత్తరకురు, రమ్య, హిరణ్యక, భద్రాశ్వ, కేతుమాల, బలాహక, హరివర్ష, కింపురుష, ఇంద్రద్వీప, కశేరుమత్,

తామ్రవర్ణ, గభస్తిమత్, నాగద్వీప, సౌమ్యక, గాంధర్వ, వారుణ, నవమాది వర్షములు నిన్ను రక్షించుగాక; నీకు రాజ్యమును ఇచ్చుగాక. హిమవత్, హేమకూట, నిషధ, నీల, శ్వేత, శృంగవత్, మేరు, మాల్యవత్, గంధమాదన, మహేంద్ర, మలయ, సహ్య, శుక్తిమత్, ఋక్షవత్, వింధ్య, పారియాత్ర, పర్వతములు నీకు శాంతి నిచ్చుగాక. ఋగ్వేదాది వేద చతుష్టయము, షడ్వేదాంగములు, ఇతిహాస, పురాణ, ఆయుర్వేద, గాంధర్వవేద, ధనుర్వేదాది ఉపవేదములు, శిక్షా-వ్యాకరణ, ఛందస్, నిరుక్త, జ్యోతిష, కల్పము అను ఆరు వేదాంగ ములు, మీమాంసా, న్యాయ, ధర్మశాస్త్ర, పురాణములు అను ఈ పదునాలుగు విద్యలు నిన్ను రక్షించుగాక.

సాంఖ్య, యోగ, పాశుపత, వేద, పాంచరాత్రములకు సిద్ధాంతపంచకమని పేరు. ఇవియు, గాయత్రీ, శివా, దుర్గా, విద్యా, గాంధారీ దేవులును నిన్ను రక్షించుగాక. లవణ, ఇక్షురస, సురా, ఘృత, దధి, దుగ్ధ, జలసముద్రములు నీకు శాంతినొసగుగాక. నాలుగు సముద్రములును, వివిధ తీర్థములును నిన్ను రక్షించుగాక. పుష్కర, ప్రభాస, నైమిశారణ్య, గయాశీర్ష, బ్రహ్మశిరస్తీర్థ, ఉత్తర మానస, కోలోదక, నందికుండ, పంచనద తీర్థ, భృగుతీర్థ, అమరకంటక, జంబూమార్గ, విమల, కమలాశ్రమ, గంగాద్వార, కుశావర్త, వింధ్య, నీలగిరి, వరాహపర్వత, కనఖలతీర్థ, కాలంజర, కేదార, రుద్రకోటి, వారాణసీ మహాతీర్థ, బదరికాశ్రమ, ద్వారకా, శ్రీశైల, పురుషోత్తమ తీర్థ, శాలగ్రామ, వారాహ, సింధు సముద్ర సంగమ తీర్థ, ఫల్గుతీర్థ, బిందుసర, కరవీరాశ్రమములును, గంగా, సరస్వతీ, శతద్రు, గండకీ, అచ్ఛోదా, విపాశా, వితస్తా, దేవికా, కావేరీ, వరుణా, నిశ్చిరా, గోమతీ, పారా, చర్మణ్వతీ, రూపా, మహానదీ, మందాకినీ, తాపీ, పయోష్ణీ, వేణా, వైతరణీ, గోదావరీ, భీమరథీ, తుంగభద్రా, అరణీ, చంద్రభాగా, శివా, గౌరీ మొదలగు పవిత్ర నదులును నీకు అభిషేకముచేసి నిన్ను పాలించుగాక. (219)

రాజ సహాయ సంపత్తి వర్ణనము

పుష్కరుడు పలికెను :

అభిషేకానంతరము, ఉత్తముడగు రాజు మంత్రి సమేతుడై శత్రువులను జయించవలెను. సత్కుల ప్రసూతుడు, నీతి శాస్త్రజ్ఞుడు అగు బ్రాహ్మణుని గాని, క్షత్రియుని గాని సేనాపతిగా నియమించవలెను. ద్వారపాలకులు గూడ నీతిజ్ఞులై యుండవలెను. దూత కూడ మృదుభాషియై, అత్యంత బలసామర్థ్యవంతుడై ఉండవలెను. స్త్రీగాని, పురుషుడు గాని తాంబూలధారి కావచ్చును. కాని ఆ వ్యక్తి రాజభక్తి కలిగి, క్లేశసహిష్ణువై, స్వామిప్రీతి పాత్రము కావలెను. సంధి, విగ్రహ, యాన, ఆసన, ద్వైధీభావ, సమాశ్రయములను ఆరు గుణములను సమయానుసారముగా ప్రయోగింపగలుగు వానిని సాంధివిగ్రహకునిగా నియమింపవలెను. రాజరక్షకుడు సర్వదా ఖడ్గముబూని యుండవలెను. సారథి సేనాది విషయకమగు మంచి జ్ఞానము కలవాడై ఉండవలెను. పాకశాల అధ్యక్షుడు రాజ హితాభిలాషియై, చతురుడై సర్వదా పాకశాలలోనే ఉండవలెను. రాజసభా సదస్యులు ధర్మవేత్తలై ఉండవలెను. వ్రాయసగాండ్రు వివిధ లిపివేత్తలై రాజహితైషులై ఉండవలెను. ద్వారపాలకులు రాజహితచింతకులై, రాజు ఎప్పుడు తమను పిలచునో తెలిసినవారై ఉండవలెను. ధనాధ్యక్షుడు

రత్నపరీక్షా నిపుణుడై, ధనమును వృద్ధి చేయుటయందు ఆసక్తి కలవాడై ఉండవలెను. రాజవైద్యుడు ఆయుర్వేద నిపుణుడై యుండవలెను. గజాధ్యక్షుడు గజవిద్య యందు ప్రవీణుడై ఉండవలెను. దుర్గాధ్యక్షుడు రాజహితైషియై బుద్ధిమంతుడై ఉండవలెను. శిల్పులు వాస్తువిద్యా విశారదులై ఉండ వలెను. యంత్రముల ద్వారా ఆయుధములు ప్రయోగించుట, చేతితో శస్త్రములను విడచుట, శస్త్రములను ప్రయోగింపకుండుట. విడచిన శస్త్రములను నివారించుట మొదలగు యుద్ధ రీతులందు ప్రవీణుడు, రాజు హితమును కోరువాడు అగు వానిని శస్త్రాచార్య పదమునందు నియమించవలెను. వృద్ధుని అంతఃపురాధ్యక్షుని చేయవలెను. అంతఃపురమునందలి అన్ని కార్యములను నిర్వహించుటకు ఏబది సంవత్సరముల స్త్రీలను, డెబ్బది సంవత్సరముల పురుషులను నియమించవచ్చును. సర్వదా జాగరూకులైన వారినే ఆయుధాగారమున నియమింపవలెను. భృత్యులకు వారివారి కార్యములను బట్టి జీవిక ఏర్పరుపవలెను. ఉత్తమ, మధ్యమ, అధమ కార్యానుసారముగా అట్టివారినే ఆయా కార్యములందు నియోగించవలెను. విజయాభిలాషియగు రాజు స్వహితైషులగు వారినే సహాయ కులుగా నియమించవలెను. ధర్మకార్యములందు ధర్మా త్ములను, యుద్ధమునందు శూరులను, ధనార్జనమునందు అర్థ కుశలులను నియమించ వలెను. శుద్ధమగు ప్రవర్తన, ఆలోచన కలవారినే ఆయా కార్యములందు నియోగించవలెను.

స్త్రీల సంరక్షణ విషయమున నపుంసకులను నియమించవలెను. క్రూరకార్యములందు తీక్ష్ణ స్వభావులగు వారిని నియోగించవలెను. ధర్మార్థ కామములను హరించుట యందు ఏ పురుషుడు సమర్థుడుగ కనబడునో ఆతనిని నియమించవలెను. నీచ కార్యము లందు అట్టివానినే నియోగించవలెను. పురుషులను అనేక విధముల పరీక్షించిన పిదపనే వారిని తగు కార్యములందు నియోగించవలెను. మంత్రితో ఆలోచనలు చేయుచుండ వలెను. కొందరికి వృత్తికల్పించి ఏనుగులున్న అడవులలో వారికి నివాస మేర్పరచి వారి విషయము తెలుసుకొనుచుండుటకై ఉత్సాహవంతులగు అధ్యక్షులను నియమించవలెను. ఎవరికి ఏ కార్యమునందు నైపుణ్యము ఉండునో వారిని ఆ కార్యమునందు నియమించవలెను. తండ్రి తాతలనుండి తరతరాలుగా వచ్చుచున్న భృత్యులను అన్ని కార్యములందును నియోగించవచ్చును. వారందరును సమానులేగాన వారిలో ఎవరినికూడ ఇతరులపై అధికారిగ నియమించగూడదు. ఇతర రాజుల నుండి తనను ఆశ్రయించుటకై వచ్చినవారికి, వారు దుష్టులైనను, మంచివారైనను ప్రయత్నపూర్వకముగ ఆశ్రయమీయవలెను. వారు దుష్టులని తెలిసినచో వారిని విశ్వసించగూడదు. వారి జీవికా వృత్తిని తన అధీనమునందు ఉంచుకొనవలెను. ఇతర దేశముల నుండి వచ్చిన వారిని గూఢచారుల ద్వారా బాగుగా పరీక్షించి తగు విధమున సత్కరించవలెను. శత్రు, అగ్ని, విష, సర్ప, ఖడ్గములు ఒక ప్రక్క, దుష్టులగు భృత్యులు మరొక ప్రక్క. వీరిలో దుష్టభృత్యులు అధిక భయంకరులు. రాజు గూఢచారులనే నేత్రములుగ ఉపయోగించవలెను. అందుచే అన్నివిషయములు తెలుసుకొనుటకై గూఢచారులను సమకూర్చు కొనవలెను. జనులచే గుర్తింప శక్యముకాని వారిని శాంత, కోమలస్వభావము కలవారిని, గూఢచారులనుగా నియమించవలెను. వారు ఒకరికొకరు కూడ తెలియనివారుగా ఉండవలెను. వారిలో కొందరు వర్తకులుగాను, కొందరు మంత్ర తంత్ర వేత్తలుగాను, కొందరు జ్యోతిష్కులుగాను,

కొందరు వైద్యులుగాను, కొందరు సన్యాసులుగాను, కొందరు బలాబల విచారణ కర్తలుగాను సంచరించు చుండవలెను. రాజు ఒక్కగూఢచారి చెప్పినది నమ్మకూడదు. చాలమంది ఒకే విధముగ చెప్పిన యెడలనే నమ్మవలెను. భృత్యులలో ఎవనికి తనపై అనురాగమున్నదో ఎవనికి లేదో, ఎవనిలో ఏ సద్గుణములున్నవి, ఏ దుర్గుణములున్నవి, శుభచింతకుడెవడు, అశుభ చింతకుడెవడు అను విషయములను తెలిసికొనవలెను. ప్రజల అనురాగమును పెంచు కార్యములను మాత్రము చేయవలెను. వారికి వైముఖ్యము కలుగు పని చేయకూడదు. ప్రజానురాగమును పెంచు లక్ష్మిగల రాజే నిజమైన రాజు. అందరిని రంజింప చేయుట చేతనే అతడు 'రాజు' అని చెప్పబడుచున్నాడు. (220)

అనుజీవి వృత్త కథనము

పుష్కరుడు పలికెను :

శిష్యుడు గుర్వాజ్ఞను పాలించినట్లును, పతివ్రత భర్త ఆజ్ఞ పాలించినట్లును భృత్యుడు రాజాజ్ఞను పాలించవలెను. రాజు మాటలను ఎన్నడును వ్యతిరేకించక సర్వదా అతనికి అనుకూలమగు మాటలు చెప్పవలెను. ఏదైన రాజునకు హితకరము–కాని అతనికి అప్రియము అయిన విషయము చెప్పవలసి వచ్చినపుడు అతనికి రహస్యముగా చెప్పవలెను. ధనాదాయమునకు సంబంధించిన కార్యమునందు నియుక్తుడైనవాడు రాజధనమును అపహరింపకూడదు. రాజ సన్మానమును ఉపేక్షింప గూడదు. రాజును మాటలలోగాని, చేష్టలలోగాని, వేషభూషణాదులలో గాని అనుకరింపరాదు. అంతఃపుర సేనాధ్యక్షుడు రాజుతో వైరము కలవారితో కాని, అనుమాన పూర్వకముగా రాజాస్థానము నుండి వెడల గొట్టబడిన వారితోగాని కలిసిమెలసి ఉండరాదు. రాజరహస్యములను భృత్యుడు ఎన్నడును ఇతరులకు చెప్పరాదు. తనకున్న ఏదో ఒక నేర్పును చూపి రాజును సంతుష్టుని చేయ వలెను. రాజు తనకేదైన రహస్య విషయము చెప్పినచో అది ఇతరులకు చెప్పరాదు. రాజు మరెవ్వరికైన పని చెప్పదలచుచున్నపుడు తానేలేచి–'మహారాజా! ఏమి చేయవలెనో సెలవిమ్ము, నేను చేసెదను' అని ముందుకు రావలెను. బహూకరించిన వస్త్రాలంకారాదు లను సర్వదా ధరించుచుండవలెను. రాజాజ్ఞ లేనిదే ద్వారము నందుగాని, రాజు దృష్టి పడుటకు అవకాశముండు మరొక స్థానమునందు గాని కూర్చుండగూడదు. రాజు సమీపమున ఆవులింత, ఉమ్మివేయుట, దగ్గుట, కోపము ప్రకటిం చుట, మంచముపై కూర్చుండుట, కనుబొమ్మలు విరచుట, అపానవాయువు విడచుట, త్రేన్పుట మొదలగు పనులు చేయరాదు. రాజు సమక్షమున తన గుణములను ఇతరుల ద్వారా వర్ణింప చేయవలెను. శఠత్వము (రహస్యముగా అపకారము చేయుట), దురాశ, చెవికొరుకుట, నాస్తికత్వము, నీచత్వము, చాపల్యము మొదలగు దోషములను రాజసేవకుడు సర్వదా పరిత్యజించవలెను. ప్రయత్న పూర్వకముగా వేదవిద్యా శిల్పకళాదులలో ముందుగా ప్రావీణ్యము సంపాదించుకొని, పిమ్మట ధనాభివృద్ధి కొరకై రాజసేవా నియుక్తి సంపాదించుకొనవలెను. రాజునకు ఇష్టుడైన వానికిని, అతని పుత్రులకును మంత్రులకును నమస్కరించు చుండవలెను. మంత్రులదగ్గర ఉన్నంత మాత్రముచే రాజునకు తనపై విశ్వాసము కలుగదు. అందుచే అతని మనస్సుకు అనుకూలములగు కార్యములు

సర్వదా చేయుచుండవలెను. రాజు స్వభావమును బాగుగా గుర్తించి ఆతనికి తనపై సదభిప్రాయము లేనిచో అతనిని విడచి, తనను ఆదరించు మరొక రాజును ఆశ్రయించవలెను. అడగకుండ రాజుకు ఏమియు చెప్పరాదు. కాని ఆపత్సమయమునందు మాత్రము చెప్పవచ్చును. రాజు ప్రసన్నుడైనచో వినీతుడగు సేవకుని మాటవిని ఆతని ప్రార్థనను అంగీకరించును. ప్రేమ పాత్రుడైన సేవకు అంతఃపురాది రహస్య స్థానములందు కనబడినను రాజు ఆతని విషయమున శంకించడు. అతడు సభకు వచ్చినపుడు రాజు ఆతనిని కుశల ప్రశ్నలు వేసి ఆసనమిచ్చును. ఆతడు చేయు చర్చలువిని సంతోషించును. అతడేదైన అప్రియ వాక్యము పలికినను దానిని చెడ్డగా తీసుకొనక ప్రసన్నుడు కూడ అగును. అతడిచ్చిన చిన్న వస్తువును కూడ ఆదరముతో గ్రహించి, మాటలలో దానిని స్మరించు చుండును. ఈ లక్షణములను బట్టి రాజు తనపై విరక్తుడా అనురక్తుడా అను విషయమును గ్రహించి అనురక్తుడగు రాజును సేవించవలెను. విరక్తుడైన వానిని విడువవలెను. (221)

దుర్గసంపత్తి

పుష్కరుడు చెప్పెను :

ఇపుడు దుర్గమును గూర్చి చెప్పెదను. రాజు దుర్గమునందు నివసించవలెను. తనతో కూడ ఉండు వారిలో వైశ్య, శూద్రుల సంఖ్య అధికముగా ఉండవలెను. శత్రువులకు వశముకాని స్థలము నందు దుర్గము ఏర్పరచుకొనవలెను. దుర్గమునందు కొందరు బ్రాహ్మణులు కూడ ఉండవలెను. చాలమంది కార్మికులు ఎచట లభింతురో, ఎచట నీటి కొరకై వర్షాల మీద ఆధారపడవలసి ఉండదో, నదీ తటాకాదుల నుండి జలము సమృద్ధ ముగా లభించునో, ఎచట శత్రుపీడ ఉండదో, పుష్పఫలములు, ధనధాన్యములు ఎచట సమృద్ధముగా ఉండునో, శత్రుసేనలు ఎచటికి రాజాలవో, సర్పభయము, చోరభయము ఎచట ఉండదో అట్టి ప్రదేశములలో దుర్గమును నిర్మించుకొనవలెను. బలవంతుడైన వాడు, ధన్వ దుర్గము, మహీదుర్గము, నరదుర్గము, వృక్షదుర్గము, జలదుర్గము, పర్వత దుర్గము అని ఆరు విధములగు దుర్గములలో ఏదైన ఒక దానిని ఆశ్రయించి ఉండవలెను. ఈ దుర్గములలో పర్వత దుర్గము శ్రేష్ఠమైనది. ఇది శత్రువులకు అభేద్యమై శత్రువులను నశింపచేయ వీలగునదిగా ఉండును. దుర్గమే రాజధాని. దాని యందు రాజవీథులు, ఆపణములు, దేవాల యములు ఉండవలెను. నలుమూలల అస్త్రశస్త్ర భరితములగు యంత్రములు కలదై, జల ప్రవాహ యుక్తమై, చుట్టును జలముతో నిండిన కందకములు గలదై ఉండు దుర్గము ఉత్తమము.

ఇపుడు రాజరక్షణను గూర్చి చెప్పెదను. రాజు రాజ్యమునంతను తను పాలించు వాడు గాన విషాదులచే ఆతనికి హాని కలుగకుండునట్లు రక్షించవలెను. శిరీష వృక్షము వ్రేళ్ళు, బెరడు, ఆకులు, పువ్వులు, పండ్లు ఈ ఐదింటిని గోమూత్రముతో నూరి సేవించి నచో విషనివృత్తి కలుగును. శతా వరి, గుడూచి, తండులీయకము కూడ విష నివారక ములు. కోశాతకి, కహ్లారి, బ్రాహ్మి, చిత్ర పటోలిక, మండూక పర్ణి, వారాహీ కందము, అమలకము, ఆనందకము, భంగు, సోమరాజి– ఇవి కూడ విషనివారకములు. కొన్ని మాణిక్యములు, ముత్యములు మొదలగునవి కూడ విషనాశకములు.

రాజు వాస్తు లక్షణ లక్షితమైన దుర్గములో నివసించుచు దేవతా పూజనము, ప్రజాపాలనము, దుష్టశిక్షణము దానము చేయుచుండవలెను. దేవాది ధనమును అపహరించిన రాజు ఒక కల్పము వరకును నరకములోపడి ఉండును. రాజు దేవపూజా తత్పరుడై దేవాలయములను కట్టించవలెను. దేవతా స్థాపనచేసి దేవాలయ రక్ష చేయవలెను. దేవతా విగ్రహములను మట్టితో కూడ చేయవచ్చును. మట్టితో చేసిన విగ్రహము కంటె దారునిర్మితము, దాని కంటె ఇటుకలతో చేసినది, దాని కంటె శిలా నిర్మితము, దాని కంటె సువర్ణ నిర్మితము, దాని కంటె రత్నమయము పవిత్రమైనది. భక్తి పూర్వకముగ దేవాలయ నిర్మాణము చేయువాడు భుక్తిముక్తులను పొందును. దేవాలయములో చిత్రములు గీయించవలెను. గీత వాద్యాదులు ఏర్పరుపవలెను. అందమైన వస్తువులను దానము చేయవలెను. తైల, ఆజ్య, మధు, క్షీరాదులతో దేవతాభిషేకము చేయవలెను. ఇట్లు చేసిన వాడు స్వర్గమును పొందును. బ్రాహ్మణులను పాలించి వారికి సన్మానము చేయవలెను. వారి ధనమును లాగికొనరాదు.

బ్రాహ్మణుని ఒక బంగారు నాణెమునుగాని, గోవునుగాని, ఒక అంగుళము భూమి గాని అపహరించిన రాజు మహాప్రళయము వరకును నరకములో పడిఉండును. అనేక పాప కృత్యములు చేయుచు దురాచారవంతుడుగా ఉన్న బ్రాహ్మణుని కూడ ద్వేషింపరాదు. బ్రహ్మ హత్యను మించిన పాపములేదు. ప్రభావశాలియగు బ్రాహ్మణుడు తలచుకొన్నచో దేవతకాని వానిని దేవతగా చేయగలడు. దేవతను కూడ పదచ్యుతుని చేయగలడు. అందుచే సర్వదా ఆతనికి నమస్కారము చేయవలెను.

రాజు చేసిన అధర్మానికి బ్రాహ్మణ స్త్రీ ఏడ్వవలసి వచ్చినట్లయితే ఆతని రాజ్యము, వంశము, సర్వమును నశించును. అందుచే ధర్మ పరాయణుడగు రాజు పతివ్రతలకు మంచి రక్షణము కల్పించవలెను. స్త్రీ గృహకర్మలయందు నిపుణురాలై, సంతుష్టురాలై ఉండవలెను. ఆమె ఇంటిలోని అన్ని వస్తువులను పరిశుభ్రముగా ఉంచవలెను. ఖర్చు చేయుటలో సంయమవంతురాలై ఉండవలెను. తండ్రి కన్యకను ఎవనికిఇచ్చునో అతడే ఆమెకు పతి. ఆమె సర్వదా తన పతికి సేవచేయవలెను. భర్తృమరణానంతరము బ్రహ్మచర్యమును పాలించుకొను స్త్రీ స్వర్గమునకు వెళ్ళును. ఆమె ఇతరుల గృహములలో నివసించ గూడదు. కలహముల నుండి దూరముగా ఉండవలెను.

భర్త పరదేశమునందున్న స్త్రీ అలంకరించుకొనగూడదు. సర్వదా ఆతని హితమునే కోరుచు దేవతారాధనము చేయుచుండవలెను. కేవలము మంగళార్థమై సౌభాగ్య చిహ్నముగా రెండు మూడు అలంకారములను మాత్రమే ధరించవలెను. మరణించిన భర్త చితిపై అగ్ని ప్రవేశముచేసిన స్త్రీకూడ స్వర్గము చేరును. లక్ష్మిని పూజించుట, ఇంటిని పరిశుభ్రముగా ఉంచుట స్త్రీకి కర్తవ్యము. కార్తిక ద్వాదశినాడు విష్ణువును పూజించి వత్స సహిత గోదానము చేయవలెను. సావిత్రి తన సదాచార వ్రతముల ప్రభావముచే తన భర్తను మృత్యువు నుండి రక్షించుకొనగల్గినది. మార్గశిర శుక్ల సప్తమినాడు సూర్యుని ఆరాధించుటచే స్త్రీ పుత్రులను పొందును. ఇందులో ఏ మాత్రము సందేహము లేదు. (222)

రాజధర్మములు - 1

పుష్కరుడు పలికెను :

రాజు ఒక్కొక్క గ్రామమునకు ఒక్కొక్క అధిపతిని నియమించవలెను. పదేసి గ్రామములకు ఒక అధ్యక్షుని, నూరేసి గ్రామములకు మరొక అధ్యక్షుని నియమించవలెను. వారందరిపైనను మొత్తము రాష్ట్రమునకు శాసకుడుగ ఒకనిని నియమించవలెను. వారందరి కిని వారివారి పనులను బట్టి వేరువేరుగా భృతిని నిర్ణయించవలెను. గూఢచారుల ద్వారా ప్రతిదినము వారి ప్రవృత్తులనుగూర్చి తెలుసుకొనుచుండవలెను. గ్రామములో ఏదైన దోషము (వ్యవహారము) ఉత్పన్నమైనచో గ్రామాధిపతి దానిని పరిష్కరించవలెను. తాను పరిష్కరింపజాలకున్నచో దశ గ్రామాధిపతి వద్దకు వెళ్ళి ఆ విషయములన్నియు ఆతనికి తెలుపవలెను. విషయమునంతను తెలిసికొనిన పిమ్మట దశ గ్రామాధి పతి ఆ దోషమును పరిష్కరించుటకు ప్రయత్నించవలెను. రాజ్యము సురక్షితముగా ఉన్నయెడలనే రాజునకు దానినుండి ధనాదులు లభించును. ధనవంతుడే ధర్మము నార్జించగలుగును. అతడే కామ సుఖములను అనుభవింపగలుగును. ధనములేనిచో గ్రీష్మమునందు నదుల నీరు ఎండి పోయినట్లు కార్యములన్నియు విఫలములై పోవును. ఈ ప్రపంచమునందు పతితునకును, దరిద్రు నకును భేదమేమియు లేదు. పతితుని చేతినుండి ఎవరును ఏ వస్తువును తీసికొనరు. దరిద్రుడుకూడ ఏమియు లేనివాడగుటచే ఇతరుల కేమియు ఇవ్వజాలడు. భార్యకూడ దరిద్రుని మాటవినదు. అందుచే రాష్ట్రమును పీడించి, దానిని నిస్సారము చేయు రాజు చిరకాలము నరకములో నుండును. ఎట్లు గర్భవతియైన స్త్రీ తన సుఖము కొరకు చూచుకొనక గర్భస్థ శిశువు క్షేమానికై ప్రయత్నించునో, అట్లే రాజు కూడ ప్రజా రక్షణమునే సర్వదా దృష్టిలో నుంచుకొనవలెను. ప్రజలను రక్షించజాలని రాజు యజ్ఞము, తపస్సుచేసి ఏమి ప్రయోజనము? ప్రజలను బాగుగా రక్షించువాని గృహమే స్వర్గము. ప్రజలు కష్టపడు చున్న రాజు గృహమే నరకము. ప్రజల పుణ్య పాపములలో ఆరవవంతు రాజుకు చెందును. రక్షించుటచే ప్రజల పుణ్యమునందలి ఆరవ భాగమును పొందినట్లే రక్షించక పోవుటచే వారి పాపములోని ఆరవవంతుగూడ పొందును. పరస్త్రీ లంపటులగు దురాత్ముల నుండి పతివ్రతలను రక్షించుట రాజు ధర్మము. రాజ బంధువులచేతను, చోరుల చేతను, అధి కారుల చేతను పీల్చివేయబడుచున్న ప్రజలను రక్షించవలెను. ప్రజలను బాగుగా రక్షించినచో వారు రాజుకు ఉపయోగపడుదురు. ప్రజలను రక్షించకున్నచో వారు పైన చెప్పిన రాజ బంధ్వాదులకు గ్రాసమై పోదురు. అందుచే రాజు దుష్టులను శిక్షించి శాస్త్రోక్త ప్రకారము ప్రజలనుండి పన్ను తీసికొనవలెను. రాజ్యమునందలి సగము ఆయమును కోశాగారములో రక్షించి సగము బ్రాహ్మణులకు ఈయవలెను. శ్రేష్ఠుడైన బ్రాహ్మణుడు దానినంతను గ్రహించి నాల్గవవంతు క్షత్రియులకును, ఎనిమిదవ భాగము వైశ్యులకును, పదునారవ భాగము శూద్రులకును ఇవ్వవలెను. ధనమును ధర్మానుసారముగా సత్పాత్రలకు దానము చేయవలెను. అసత్యము పలుకువానిని దండించవలెను. వాని ధనములో ఎనిమిదవ వంతు దండముగా తీసికొనవలెను. స్వామి ఎవరో తెలియని ధనమును రాజు మూడు సంవత్స రములపాటు తన వశములో నుంచుకొనవలెను. మూడు సంవత్సరముల లోపుగా ధన స్వామి వచ్చినచో ఆ ధనమును ఆతడు తీసికొనవచ్చును. ఆ సమయము దాటినచో ఆ ధనము

రాజధనమై పోవును. మూడు సంవత్సరములలోపున వచ్చి 'ఇది నా ధనము' అని చెప్పుచు, ధనస్వామి దాని స్వరూపము, సంఖ్య మొదలగు వాటిని రాజు ఎదుట సరిగా చెప్పగలిగినచో ఆ ధనము పొందవచ్చును. చిన్న పిల్లవానికి చెందిన సొత్తును రాజు, అతనికి సమావర్తన సంస్కారమగు వరకును లేదా అతని బాల్యావస్థ తీరువరకును తన అధీనమునందు ఉంచుకొనవలెను. సంరక్షులు ఎవ్వరును లేని కాలమునందు పిల్లలు చిన్నవారైనపుడు స్త్రీల పోషణ బాధ్యతకూడ రాజు వహించవలెను.

పతివ్రతలైన స్త్రీలు వైధవ్యము పొందినను, రోగగ్రస్తులైనను వారిని కూడ ఈ విధముగనే రక్షించవలెను. అట్టి స్త్రీలు జీవించి ఉండగా వారి బంధువులెవ్వరైన వాళ్ళ ధనమును అపహరించినచో రాజు వారిని చోరులను దండించినట్లు దండించవలెను. చోరులు ప్రజల ధనమును అపహరించినపుడు రాజు పోయినంత ధనమును ప్రజకిచ్చి, దానిని రక్షాధికారుల నుండి రాబట్టవలెను. ధనము అపహరింప బడకపోయినను అపహరింపబడినట్లు చెప్పిన వానిని దండించి రాజ్యము నుండి బైటకు పంపివేయవలెను. ధన మును ఇంటిలోనివారే దొంగిలించినపుడు రాజు తన ధనమును ఈయవలసిన పనిలేదు. రాజ్యమునందలి ఆపణముల నుండి వారి ఆదాయములో ఐదవవంతు పన్నుగా రాజు గ్రహించవలెను. పరదేశము నుండి వస్తువులు దిగుమతి చేసుకొనునపుడు ఎంత ఖర్చు, నష్టము అగునో దానిని కాతా పుస్తకము ద్వారా పరిశీలించి, వస్తువుల మీద పన్ను ఎంత ఇచ్చుచున్నారో చూచి, ప్రతి వ్యాపారస్తుని మీదను ఆతనికి నష్టము కలుగకుండునట్లు పన్ను వేయవలెను. రాజు ఆదాయములోని ఇరువదవ వంతు మాత్రమే తీసికొనవలెను. ఎవరైన అధికారి అంతకంటె ఎక్కువ వసూలు చేసినచో ఆతని దండించవలెను. స్త్రీల నుండియు, సన్యాసుల నుండియు నావ దాటించుటకు కేవు తీసుకొనగూడదు. నావికుని పొరబాటుచేత ఏ వస్తువైన నష్టమైనచో ఆ నష్టము నావికుని నుండి వసూలు చేయవలెను. శూక ధాన్యములో (వరి, గోధుమ మొ॥) ఆరవ వంతు, శింబి ధాన్యములో (శనగ మొ॥) ఎనిమిదవ వంతు పన్నుగా తీసికొనవలెను. అడవిలో పండు ఫలమూలాదులపై గూడ దేశకాలానుసారముగా పన్ను గ్రహించవలెను. పశువులలో ఐదవ భాగము, బంగారములో ఆరవ భాగము తీసికొనవలెను. గంధము, ఓషధులు, రసము, పుష్పములు, ఫలములు, మూలములు, పత్రములు, శాకములు, తృణము, వెదురు, చర్మ, వెదురు బుట్టలు, శిలా పాత్రలు, మధువు, మాంసము, నెయ్యి వీటిపైకూడ ఆదాయములో ఆరవ వంతు మాత్రమే వసూలు చేయవలెను.

బ్రాహ్మణుల నుండి ప్రియవస్తువేదియు లేదా పన్ను తీసికొనగూడదు. శ్రోత్రియు లైన బ్రాహ్మణులు ఏ రాజు రాజ్యములో ఆకలితో బాధపడుచుందురో ఆ రాజ్యము రోగములు, కరువు, దోపిడీ దొంగలు వీటిచే పీడింపబడును. అందువలన బ్రాహ్మణుల విద్యా సదాచారాదులను తెలిసికొని వారికి అనుకూలమగు జీవికను ఏర్పాటు చేయవలెను. తండ్రి తన కుమారుని పాలించినట్లు రాజు సదాచారవంతులును, విద్వాంసులును అగు బ్రాహ్మణులను పాలించవలెను. రాజుచే రక్షింపబడి బ్రాహ్మణుడు ఆచరించు స్వధర్మాను ష్ఠానముచే రాజుయొక్క ఆయుర్దాయము పెరుగును. రాష్ట్రము,

కోశము కూడా వృద్ధి పొందును. శిల్పకారులు వేతనము తీసికొనకుండ, భోజనము మాత్రముచేసి మాసము నందు ఒక రోజు రాజు పనులు చేయవలెను. రాజ్యములో నివసించుచు శరీర పరిశ్రమచే జీవించు ఇతరులు కూడ ఈ విధముగనే మాసము నందు ఒక రోజు రాజ కార్యములు చేయవలెను. (223)

కామశాస్త్రము

పుష్కరుడు చెప్పెను :

ఇపుడు అంతఃపురమును గూర్చి చెప్పదను. ధర్మార్థకామములను మూడు పురు షార్థములకు 'త్రివర్గ' మని పేరు. వీటిలో ఒక దానిని మరొక దానితో రక్షించుచు రాజు స్త్రీలతో ఈ త్రివర్గమును సేవించవలెను. త్రివర్గము ఒక మహా వృక్షము వంటిది. ధర్మము దాని వేళ్ళు, అర్థము శాఖలు, కామము ఫలము. ఆ వృక్షమును మూల సహితముగా రక్షించిన యెడలనే రాజు ఫలమును పొందగలుగును. పరశురామా! స్త్రీలు కామమునకు వశవర్తినులై యుందురు. వారి కొరకై రత్నములను సంగ్రహించవలెను. విషయ సుఖములు కోరు రాజు స్త్రీలను సేవించవచ్చును గాని అతిగా చేయగూడదు. ఆహార, నిద్రా, మైథున ములు మూడింటి యందును అతిగా ప్రవర్తింపరాదు. అట్లు చేసినచో రోగములు ఉత్పన్నములు అగును. తనపై అనురాగముగల స్త్రీలను మాత్రమే తన మంచము మీదకి రానియ్య వలెను. దురాచారవంతురాలు తన భర్తను గూర్చి సంభాషణమును గూడ రుచింపనిదియు, ఆతని శత్రువులతో కలియునదియు, అతి గర్వవంతురాలును, ముద్దు పెట్టుకొన్నపుడు ముఖమును తుడిచి వేయునదియు లేదా కడుగుకొనునదియు, భర్త ఇచ్చిన వస్తువులపై ఆదరము చూపనిదియు, భర్త కంటె ముందుగనే నిద్రించి ఆతడు లేచిన తరువాత లేచునదియు, స్పృశించగా శరీరమును కంపింప చేయునదియు, ప్రతి అవయవము నందును అవరోధము కల్పించునదియు, భర్త పలుకు ప్రియవాక్యములను సరిగా వినక పరాఙ్ముఖు రాలుగా ఉండునదియు, ఎదుటకు వచ్చి, ఏదైన వస్తువు ఇచ్చినపుడు దానిని చూడనిదియు, తన జఘనమును పూర్తిగా ఆచ్ఛాదించుటకును, భర్త స్పృశించుటకు వీలుకాకుండునట్లు చేయుటకును ప్రయత్నించు నదియు, భర్తను చూడగానే ముఖము ముడుచుకొనునదియు, ఆతని మిత్రుల విషయమున వైముఖ్యము చూపునదియు, ఆతడే స్త్రీలను ప్రేమించునో వారి విషయమున ఔదాసీన్యము చూపు నదియు, శృంగారించుకొను సమయమునందు కూడ శృంగారించుకొననిదియు అగు స్త్రీ విరక్తురాలని అర్థము. అట్టి స్త్రీని పరిత్యజించి అనురక్తురాలిని సేవించవలెను. అనురాగవతియైన స్త్రీ భర్తను చూడగనే సంతోషముతో వికసితముఖి యగును. మరొకవైపు ముఖమున్నను నేత్రాంతములతో ఆతనిని చూచు చుండును. భర్త తనను చూచుచున్నపుడు తన చంచల దృష్టిని కొంచెము మరొకవైపు త్రిప్పు కొనును, కాని పూర్తిగా త్రిప్పుకొనదు. అప్పుడప్పుడు తన గుప్తాంగములను కూడ చూపు చుండును. తన శరీరములో ఆ సుందరమైన అంశమేదైన ఉన్నచో దానిని ప్రయత్న పూర్వ కముగ కప్పికొనును. భర్తను చూచుచు చంటిపిల్లవాని ఆలింగనము చేసికొని ముద్దు పెట్టుకొనును. సంభాషణలో పాల్గొనుచు సత్యమునే పలుకును. భర్త స్పర్శ కలుగగనే ఆమె అవయవములపై రోమాంచము, స్వేదము కలుగుచుండును. అతి సులభములైన వస్తువులను మాత్రమే అడుగును.

ఆతడెంత చిన్న వస్తువునిచ్చినను చాల సంతసించును. ఆతని పేరు వినగనే ఆనందపరవశురాలై చాల ఆదరించును. భర్తకు తన వ్రేళ్ళ ఆనవాలు పడిన పండ్లు పంపుచుండును. ఆతనినుండి వచ్చిన వస్తువు ఆదరముతో గ్రహించి దానిని వక్షఃస్థలము నందు ఉంచుకొనును. తన ఆలింగనముచే భర్త శరీరమునందు అమృతలేపము చేయుచున్నట్లుండును. భర్త నిద్రించిన పిమ్మట నిద్రించును. ఆతనికంటె ముందుగనే మేల్కొనును. ఆతని ఊరువులను స్పృశించి నిద్ర నుండి మేల్కొల్పును.

పరశురామా! పెరుగు మీగడలో కొంచెము కపిత్థ చూర్ణము కలపగా తయారగు నేతివాసన చాల ఉత్తమమైనది. నెయ్యి, పెరుగు మొదలైనవాటితో యవలు, గోధుమలు మొదలైనవాటి పిండి కలుపగా ఉత్తమములైన ఖాద్య పదార్థములు తయారగును. ఇపుడు వివిధ ద్రవ్యముల గంధమును కలిగించు విధానము చెప్పెదను. శౌచము, ఆచమనము, విరేచనము, భావన, పాకము, బోధనము, ధూపనము, వాసనము అని ఎనిమిది విధములగు కర్మలు చెప్పబడినవి. కపిత్థము, బిల్వము, నేరేడు, మామిడి, కరవీరము–వీటి పల్లవములచేత శుద్ధముచేసిన నీటితో ఏ వస్తువులైనను కడిగి, పవిత్రమగునట్లు చేసినచో దానికి 'శౌచనము' అనిపేరు. ఈ పల్లవములు లభించనిచో నీళ్ళలో కస్తూరి కలిపి వాటితో కడిగినచో శుద్ధియగును. నఖ, కూట, ఘన, జటామాంసీ, స్పృక్క, శైలేయజ, జల, కుంకుమ, లాక్షా, చందన, అగరు, నీరద, సరల, దేవదారు, కర్పూర, కాంతా,వాల, కుందురుక, గుగ్గులు, శ్రీనివాస, కరాయలములను ఇరువది యొక్క ద్రవ్యములు ధూప ద్రవ్యములు. ఈ ఇరువది పదార్థములలో ఏవైన రెండు తీసికొని, వాటిలో కరాయలము కలిపి, వాటిలో సగము, తెలకపిండి, మలయచందన చూర్ణము చేర్చి తేనె కలుపవలెను. ఈ విధముగా ఇష్టానుసారము యథాశాస్త్రముగా కలిపిన ద్రవ్యములతో ధూపయోగములు తయారగును. త్వచా, నాడీ, ఫల, తైల, కేసర, గ్రంథిపర్వ, శైలేయ, తగర విష్ణు క్రాంతాబోల, కర్పూర, జటామాంసీ, మురా, కూట కములు స్నానోపయుక్త ద్రవ్యములు వీటిలో ఇష్టము వచ్చిన మూడు ద్రవ్యములు తీసికొని కస్తూరి కలిపి, ఇవన్నియు కలిపిన జలముతో స్నానము చేసినచో కామవృద్ధి కలుగును. త్వచా, మురా, నలదములను సమానమైన పాళ్ళలో తీసికొని, వీటిలో సగము సుగంధబాల కలిపి, వీటితో స్నానము చేసినచో శరీరమునుండి కమల గంధమువంటి గంధము వచ్చును. వీటితో తైలముకూడ పూసికొని స్నానము చేసినచో శరీరము రంగు కుంకుమ వర్ణ సదృశముగ నుండును. పైన చెప్పిన ద్రవ్యములకు సగముపాళ్ళు తగరముకూడ కలిపినచో శరీరము నుండి చమేలి పువ్వు వాసన వంటి వాసన వచ్చును. వాటిలో ద్వ్యామకమను ఓషధికూడ కలిపినచో మౌలసిరి పువ్వు వాసన వచ్చును. నువ్వుల నూనెలో మంజిష్ఠ, తగర, చోల, త్వచా, వ్యాఘ్రనఖ, నఖ, గంధ పత్రములను ఓషధులు కలపగా మంచి సువాసనగల తైలము తయారగును. తిలలను సుందర పుష్పములతో వాసితము చేసి వాటిని ఆడించిచేసిన నూనె ఆ పుష్పములవలె సుగంధము గలది అగును. ఏలకులు, లవంగాలు, కాకోలము, జాజికాయ, కర్పూరము–వీటిలో ఏదైన ఒకటి జాజిపత్రితో కలిపి నమలినచో ముఖము సుగంధ మగును. కర్పూర, కేసర, కాంతా, కస్తూరీ, మేడఫల, కబాబచీనీ, ఏలా, లవంగ, జాయఫల, పూగ, త్వక్పత్ర, త్రుటి, మోథా, లతా, కస్తూరీ, లవంగ కంటక, జాయఫల, జాయపత్ర, కటుక ఫలములను ఒక్కొక్క డబ్బెత్తు చొప్పున కలిపి, చూర్ణముచేసి, దానిలో నాల్గవ

వంతు వాసితమైన ఖైర సారము కలిపి మామిడి రసముతో అందముగా మాత్రలుచేసి ముఖమునందు ఉంచుకున్నచో ముఖ రోగములు అన్నియు తొలగిపోవును. వెనుకచెప్పిన ఐదుపల్లవముల జలముతో పోక చెక్కను కడిగి, యథాశక్తిగా పైన చెప్పిన మాత్రలకు ఉపయోగించు ద్రవ్యములతో వాసితము చేసినచో అది ముఖమును సుగంధ యుక్తము చేయును. కటకమును దాంతనకమును మూడు దినములు గోమూత్రమునందు తడిపి ఉంచినచో అది పోకచెక్క వలెనే ముఖమును సుగంధితము చేయును. త్వచాఅరణ్య హర్రేలను సమానమైన పాళ్ళలో గ్రహించి, దానిలో సగము కర్పూరము కలిపి నోటిలో ఉంచుకొనినచో తాంబూల గంధము వచ్చును. ఈ విధముగ రాజు తన సుగంధాది గుణములచే స్త్రీలను వశము చేసుకొని సర్వదా వారిని రక్షించవలెను. వారిని ఎన్నడును విశ్వసింప రాదు. ప్రధానపుత్రుని తల్లిని ఎన్నడును విశ్వసింపరాదు. రాత్రి అంతయు స్త్రీ గృహమున నిద్రింప రాదు. ఆమె చూపిన విశ్వాసము కృత్రిమము కావచ్చును. (224)

రాజధర్మములు - 2

పుష్కరుడు చెప్పెను :

రాజు తన పుత్రుని బాగుగా రక్షించుకొనుచు ఆతనికి ధర్మశాస్త్ర, అర్థశాస్త్ర, కామశాస్త్ర, ధనుర్వేదములందు శిక్షణ ఇవ్వవలెను. వివిధ శిల్పములను గూడ నేర్పవలెను. విశ్వాస పాత్రులు, ప్రియముగా మాటలాడువారు అగువారిని శిక్షకులుగా నియమించవలెను. రాజకుమారుని శరీర రక్షార్థమై కొందరిని నియమింపవలెను. కోపము కలవారు, లుబ్ధులు, అవమానితులు అయినవారి నుండి రాజకుమారుని దూరముగా ఉంచవలెను. మంచి గుణములు నేర్పుట అంత సులభము కాదు. అందుచే రాజకుమారుని ఎక్కువగా సుఖ పెట్టరాదు. ఆతడు చక్కగా శిక్షితుడైన పిమ్మట ఆతనిని అన్ని పనులందును నియమించవలెను. వేట, జూదము, మద్యపానము–ఇవి రాజ్య వినాశ కరములగు దోషములు. రాజు వీటిని పరిత్యజించవలెను. పగటినిద్ర, పనిలేకుండగ తిరుగుట, కటుభాషణము–వీటిని పరిత్యజించవలెను. ఇతరులను నిందించుట, తీక్ష్ణదండము, అర్థ దూషణము కూడ విడువవలెను.

బంగారము గనులు మొదలగునవి నశించిపోవుట, దుర్గాదులకు మరమ్మ తులు చేయకుండుట ఇవి అర్థ దూషణములు. ధనమును కొంచెము కొంచెము అనేక స్థానములందు ఉంచుట, అయోగ్యములైన దేశకాలములందు అపాత్రులకు దానము చేయుట చెడ్డపనులకై ధనము వెచ్చించుట, ఇవికూడ అర్థ దూషణములు. కామ, క్రోధ, మద, మాన, లోభ, దర్పములను త్యజించవలెను. పిదప భృత్యులను వశమునందు ఉంచుకొని, పిమ్మట నగరములోని వారిని, దేశములోని వారిని వశంగతులను చేసికొనవలెను. పిదప బాహ్య శత్రువులను జయించుటకై ప్రయత్నించవలెను. బాహ్యశత్రువులు మూడు రకములు–పాత శత్రుత్వము కలవారు, రాజ్యపు సరిహద్దులలో ఉండువారు, తనతో శత్రుత్వము ఏర్పడినవారు. వీరిలో పూర్వ పూర్వులు అధిక శత్రువులు. తాత ముత్తాతల నుంచి మిత్రులు, శత్రువుల శత్రువులు, కృత్రిములు అని మిత్రులు కూడ మూడు విధములు.

ధర్మ వేత్తవైన పరశురామా! రాజ్యమునకు – రాజు, మంత్రి, జనపదము, దుర్గము, సేన, కోషము, మిత్రులు–అని ఏడు అంగములు. రాజ్యమునకు మూలము స్వామి (రాజు). అందుచే ఆతనిని ఎక్కువగా రక్షించవలెను. రాజ్యాంగ విద్రోహులను చంపివేయ వలెను. సమయాను సారముగా రాజు కఠోరముగాను మృదువుగాను కూడ ప్రవర్తించ వలెను. ఇట్లుండుటచే ఆతనికి రెండు లోకములును బాగుపడును. రాజు భృత్యులతో పరిహాసము చేయరాదు. అందరితోడను నవ్వుతూ మాటలాడే రాజును సేవకులు అవమానింతురు. లోకులతో కలిసిమెలిసి ఉండుటకై రాజు కొన్ని లేని వ్యసనములు కూడ ఉన్నట్లు ప్రవర్తించవలెను. ప్రజలు ప్రసన్నులగు విధమున చిరునవ్వు నవ్వుచూ మాటలాడవలెను. దీర్ఘసూత్రి (పనులు చేయుటలో చాలాకాలం ఆలోచించు వాడు) యైన రాజుయొక్క కార్యములు అన్నియు నశించును. కాని రాగ, దర్ప, అభిమాన, ద్రోహ, పాపకర్మ, అప్రియ భాషణాదులలో దీర్ఘ సూత్రియైన రాజును అందరును ప్రశంసింతురు. రాజు తన మంత్రమును (ఆలోచనలను)గుప్తముగా ఉంచుకొనవలెను. అట్లు ఉంచుకొన్నచో ఎన్నటికిని ఆపద రాదు.

రాజ్యకార్యములు పూర్తియైన తరువాతనే ఇతరులకు తెలియవలెను. వాటి ప్రారంభము ఎవ్వరికిని తెలియకూడదు. మనుష్యుల ఆకారము, సంజ్ఞలు, చేష్టలు, ప్రవర్తన, మాటలు, నేత్ర ముఖ వికారములు–వీటినిపట్టి వారి మనస్సులోని ఆలోచనను పసిగట్టవచ్చును. రాజు ఒంటరిగా రహస్యమైన విషయములను గూర్చి ఆలోచించగూడదు. చాల మందితో సలహా తీసికొనవచ్చును గాని ఒక్కొక్కరినే పిలిపించి తీసికొనవలెను. రాజుయొక్క రహస్య ఆలోచనలను మంత్రి ఇతర మంత్రులకు గూడ చెప్పగూడదు. మనుష్యులకు సాధారణ ముగా ఎవ్వరో ఒక వ్యక్తిపైననే విశ్వాసము ఏర్పడును. అందుచే రాజు విద్వాంసుడైన ఒక మంత్రితో మాత్రమే ఆలోచనలు చేయవలెను. వినయములేని రాజు నశించును. వినయవంతుడు రాజ్యము పొందగల్గును. వేదత్రయ పండితుల నుండి, వేదత్రయమును, ప్రాచీన దండనీతిని, అన్వీక్షకిని, (న్యాయ వేదాంతాదులు) అర్థశాస్త్రమును నేర్వవలెను. వార్తను (కృషి, గోరక్ష, వాణిజ్యము మొదలగు) గూర్చిన జ్ఞానమును లోకము నుండి సంపాదించుకొనవలెను. తన ఇంద్రియములను వశములో ఉంచుకొన్నవాడే ప్రజలను వశములో ఉంచుకొనగల్గును. దేవతలును, సమస్త బ్రాహ్మణులను పోషించవలెను. వారికి దానములు ఈయవలెను. బ్రాహ్మణునకు ఇచ్చిన దానము అక్షయమగును. దానిని ఎవ్వరును నశింపజేయ జాలరు. యుద్ధమునందు వీపు చూపకుండుట, ప్రజలను పాలిం చుట, బ్రాహ్మణులకు దానములు ఇచ్చుట ఇవి రాజునకు కల్యాణదాయకములు. దీనులు, అనాథలు, వృద్ధులు, విధవలగు స్త్రీలు మొదలగువారి యోగక్షేమములు చూచుచు, వారికి జీవనోపాధి కల్పింపవలెను. వర్ణాశ్రమధర్మ రక్షణము, మునులను సత్కరించుట ఇవి రాజుల కర్తవ్యములు. రాజు ఎవ్వరిని నమ్మకూడదు. కాని మునులను మాత్రము నమ్మవచ్చును. సరియైన ఉపాయములచే ఇతరులకు తనపై విశ్వాసము ఏర్పడునట్లు చేసికొనవలెను. రాజు స్వార్థమును గూర్చి కొంగవలె ఆలోచించవలెను. సింహమువలె పరాక్రమము చూపవలెను. తోడేలువలె శత్రువులను ఆక్రమించి చర్చించవలెను. చెవులపిల్లి వలె దుముకుచు అదృశ్యుడు కావలెను. సూకరమువలె దృఢ ప్రహారము చేయవలెను. నెమలివలె

విచిత్ర వేషమును ధరించవలెను. గుఙ్లమువలె దృఢమైన భక్తి కలిగియుండ వలెను. కోకిలవలె మధురముగా మాటలాడవలెను. కాకివలె అందరి నుండి తప్పించుకొని యుండవలెను. ఎవరికిని తెలియని చోట నివసించవలెను. పరీక్షించకుండ భోజనము చేయరాదు. శయ్యపై పరుండరాదు. ప్రజలను పీల్చివేయువాడు రాజ్యమును, జీవితమును కూడ కోల్పోవును. పోషింపబడిన లేగదూడ బలము కలదైన పిమ్మట పనులు చేయుటకు ఉపయోగించునట్లు, బాగుగా రక్షింపబడిన రాష్ట్రము రాజునకు ఉపకరించును. కార్యములన్నియు దైవముమీదను పురుషకారము మీదను ఆధారపడి ఉండును. వీటిలో దైవము అచింత్యము. పురుషకారము కార్యమును సాధించగలుగును. ప్రజాను రాగమే రాజ్యమును, పృథివిని, లక్ష్మిని ఇచ్చు ఏకైక హేతువు. (225)

సామాది ఉపాయ వర్ణనము

పుష్కరుడు పలికెను :

పరశురామా! మనుష్యుడు పూర్వము తాను ఇతర శరీరముతో చేసిన కర్మకే దైవమని పేరు. అందుచే బుద్ధిమంతుడు పురుషకారమే శ్రేష్ఠమైనదని తెలిసికొనవలెను. దైవము ప్రతికూలముగా నున్నచో పురుషకారముచే దానిని అనుకూలము చేసికొనవచ్చును. పూర్వముచేసిన సాత్త్విక కర్మల ఫలితముగా ఈనాడు, పురుషకారము ఏమియు లేకున్నను సిద్ధి లభించును. భృగునందనా! పురుష కారమే దైవసాహాయ్యముతో తగు సమయమునందు ఫలమిచ్చుచుండును. దైవ పురుషకారములు రెండును మానవునకు ఫలము నిచ్చును. పురుషకారముచే వ్యవసాయము చేయగా, వర్షయోగము వచ్చినపుడు సమయానుసారము ఫలము లభించును. అందుచే కర్మానుష్ఠానము చేయుచు పురుషకారమునందు కూడ ప్రవర్తించవలెను, కాని కేవలము దైవమునే నమ్ముకొని కూర్చుండ కూడదు. సామాద్యు పాయములతో ప్రారంభించిన సర్వకార్యములును సిద్ధించును. సామము, దానము, భేదము, దండము, మాయ, ఉపేక్ష, ఇంద్రజాలము అని ఏడు ఉపాయములు. వాటి స్వరూపమును గూర్చి వినుము. తథ్యము, అతథ్యము అని సామము రెండు విధములు. అతథ్య సామము పురుషులకు అపకీర్తికరము; ఉత్తమవంశ సంజాతులు, సరల స్వభావులు, ధర్మ పరాయణులు, జితేంద్రియులు అయిన పురుషులు సామమునకు లొంగుదురు. అతథ్య సామముచే రాక్షసులను కూడ లొంగదీసికొనవచ్చును. వారు చేసిన ఉపకారములను వర్ణించుటయే వారిని వశముచేసికొనుటకు మంచి ఉపాయము. పరస్పర ద్వేషవంతులై, కుపితులై, భయభీతులై, అవమానితులై ఉన్న వారి విషయమున భేదమును ప్రయోగించవలెను. వారికి ఇంకను భయము కలుగునట్లు చేయవలెను. తమవైపునుండి వారికి ఆశ చూపించి, ఏ దోషముచే వారు ఇతరుల నుండి భయపడుదురో దానిని ప్రకటించి వారిలో భేదము పుట్టించవలెను. శత్రు కుటుంబము నందు భేదమును పుట్టించు వారిని రక్షించవలెను. సామంతుల కోపము మంత్రి పుత్రాదుల కోపము అంతర కోపము. అందుచే ముందుగా అంతరకోపమును శమింపచేసి, పిదప బాహ్యా కోపమును తొలగింప ప్రయత్నించవలెను.

అన్ని ఉపాయములలో దానము శ్రేష్ఠమైనది. దానముచే ఇహపరములు రెండింటి యందును ఫలము లభించును. దానమునకు లొంగని వారు ఎవరునులేరు. దానము చేయు వాడు పరస్పరము కలిసియున్న వారిలోకూడ భేదమును కలిగించును. సామదాన భేదము లచే సిద్ధించని కార్యములను దండముచే సిద్ధింపచేసికొనవలెను. దండమునందే సర్వమును ఉన్నది. కాని దండమును అనుచిత రీతిలో ప్రయోగించినచో అది ఆత్మవినాశ హేతువు అగును. దండింపతగని వానిని దండించు వాడును, దండింపతగిన వానిని దండించని వాడును అయిన రాజు వినాశము పొందును. రాజు దండము ద్వారా అందరిని రక్షించకున్నచో దేవతలు, దైత్యులు, నాగులు, మనుష్యులు, సిద్ధులు, భూతములు, పక్షులు–అందరును తమతమ మర్యాదలను ఉల్లంఘింతురు. క్రూరులను అణచివేసి, దండనీయులను శిక్షించును గాన దీనికి దండమని పేరు. రాజు ఇతరులు చూడజాలని విధమున తేజస్సుతో ప్రకాశించునపుడు అతడు సూర్యుని వంటివాడు. దర్శన మాత్రముచే ఆనంద మును కలిగించునపుడు అతడు చంద్రుని వంటివాడు. గూఢచారుల ద్వారా ప్రపంచకము నందు అంతటను వ్యాపించి ఉండుటచే అతడు వాయుతుల్యుడు. దోషము లను చూచి దండించుటచే ఇతడు యమ ధర్మరాజ సమానుడు. కుటిల బుద్ధిగల దుష్టులను చూచి దండించునుగాన అతడు సాక్షాత్తు అగ్ని దేవుడు. బ్రాహ్మణులకు దానములు ఇచ్చునపుడు ధనాధిపతియైన కుబేరుడు. దేవతాదులను ఉద్దేశించి హవిస్సు, ఘృతము మొదలగువాటిని ధారగా విడచును కాన వరుణుడు. ఓర్పుతో ఈ జగత్తునంతను ధరించునుగాన పృథ్వీ రూపుడు. ప్రభు మంత్రోత్సాహ శక్తులతో అందరిని పాలించునుగాన సాక్షాత్తు శ్రీమహావిష్ణు స్వరూపుడు. (226)

దండప్రణయనముల

పుష్కరుడు పలికెను :

రామా! రాజుకు ఉత్తమగతినిచ్చు దండనీతి ప్రయోగమును గూర్చి చెప్పెదను. మూడు యవలు ఒక కృష్ణలము. ఐదు కృష్ణలములు ఒక మాషము. అరువది కృష్ణలములు అర్ధకర్షము. పదునారు మాషములు ఒక సువర్ణము. నాలుగు సువర్ణములు ఒక నిష్కము. పది నిష్కములు ఒక ధరణము. ఇవి రాగి, వెండి, బంగారము తూచు మానములు.

పరశురామా! ఒక త్రామ కర్షము (ఒక విధమైన రాగి నాణెము) నకు విద్వాంసులు 'కార్షికము' కార్షాపణము అని పేరు పెట్టినారు. రెండు వందల ఏబది పణముల దండమునకు ప్రథమ సాహస దండమని పేరు. ఐదు వందల పణముల దండము మధ్యమ సాహసము. వెయ్యి పణముల దండము ఉత్తమ సాహసము. చోరుడు తన ధనమును అపహరించకపోయినను అపహరించినట్లు అసత్యముగా రాజుతో చెప్పినవాని నుండి అంత ధనమును దండముగా గ్రహించవలెను. దొంగ తనమునందు పోయిన ధనమునకు బదులు ఎక్కువగా ఎవడైన చెప్పినచో అతని నుండియు, ఎంత అసత్యముగా చెప్పునో వానినుండియు రాజు రెట్టింపు ధనము దండ రూపమున వసూలు చేయవలెను; ఎందుచేతననగా వారు ఇరువురును ధర్మమును పాటించలేదు. కపటసాక్ష్యము చెప్పు

క్షత్రియ, వైశ్య, శూద్రులను కఠినముగా శిక్షించవలెను. బ్రాహ్మణుని మాత్రము రాజ్యమునుండి వెడలగొట్టవలెను. ఆతనికి మరొకదండ మేదియు విధింపబడలేదు. ఓ ధర్మజ్ఞా! కుదువబెట్టిన దానిని అపహరించినవాని నుండి కుదువబెట్టిన వస్త్రాదుల మూల్యమెంత యుండునో అంత దండరూపమున అపహరిం చినచో ధర్మహాని కలుగదు. కుదువబెట్టిన దానిని పోగొట్టినవానిని, కుదువబెట్టకుండగనే వస్తువు నిమ్మని అడుగు వానినికూడ దొంగనువలె శిక్షించవలెను లేదా రెట్టింపు ధనమును దండముగా వసూలు చేయవలెను. ఎవ్వడైన ఇతరుల వస్తువును తెలియక అమ్మివేసినను, ఆతడు నిర్దోషిగ పరిగణింపబడును. కాని తెలిసి ఇతరుల వస్తువులను తన వస్తువులని చెప్పి అమ్మినవానిని దొంగనువలె శిక్షించవలెను. ఇచ్చెదనని చెప్పి ఇవ్వని వానిని, రాజు ఒక సువర్ణముచే దండించవలెను. కూలి తీసుకొని పనిచేయనివానిపై ఎనిమిది కృష్ణలములు దండుగ (జుర్మానా) వేయవలెను. ఆ సమయమునందు భృత్యుని విడచివేయు వానిపై కూడ అంత దండమే వేయవలెను. ఏదైన ఒక వస్తువును కొన్న తరువాతగాని, అమ్మిన తరువాతగాని పశ్చాత్తాపము కలిగినచో అమ్మినవాడు పదిరోజులలోగా ఆ మూల్యము తిరిగి ఇచ్చివేసి వస్తువును మరల తీసికొనవచ్చును. కొన్నవాడు వస్తువును తిరిగి ఇచ్చివేసి తన ధనమును పొందవచ్చును. పది దినములు దాటినచో ఆ ఆదాన ప్రదానములు కుదరవు. అనుచితములగు ఆదానప్రదానములు చేయువారికి రాజు ఆరు వందలు దండము వేయవచ్చును.

వరునిలో ఉన్న దోషములను చెప్పక కన్యావరణము చేసినవానికి, కన్యకను ఇచ్చెదమని మాట ఇచ్చినను ఇవ్వనట్లే అగును. రాజు అట్టివానిపై రెండు వందల దండము విధించవలెను. కన్యను ఒకనికి ఇచ్చెదనని మాట ఇచ్చి, మరొకనికి ఇచ్చిన వానిపై ఉత్తమ సాహస దండము విధించవలెను. నోటితో చెప్పిన దానిని కార్య రూపమున చేసినచో తప్పక పుణ్యము లభించును. ఏదైన ఒక వస్తువును ఒకచోట ఇచ్చెదనని చెప్పి లోభముచే మరొకరికి అమ్మిన వానికి ఆరువందల దండము. యజమాని నుండి భోజన వ్యయము, జీతము తీసికొనికూడ ఆతని ఆవును ఆతనికి అప్పగించని లేదా ఆవును పోషించని గొల్లవానిని నూరు సువర్ణములచే దండించవలెను. గ్రామమునకు నలువైపుల నూరు ధనుస్సుల పరిధియందును, నగరమునకు రెండువందల ధనుస్సుల పరిధి యందును వ్యవసాయము చేయవలెను. అది నిలచి ఉన్న ఒంటెకు కనబడనంత దూరమున ఉండవలెను. కంచెలేని చేనులోని సస్యమునకు ఎవరినుండియైన హానికల్గినను ఆతనిని దండించ రాదు. ఇతరులను భయపెట్టి, వాని ఇళ్లు, చెరువులు, తోటలు, పొలములు కాజేయ ప్రయత్నించువారికి ఐదువందల దండము. ఆతడు తెలియక చేసినచో రెండు వందలు మాత్రమే దండము. సరిహద్దులు మార్చివేయు వారికి ప్రథమ సాహసదండము.

పరశురామా! బ్రాహ్మణుని అవమానించు క్షత్రియునకు నూరు, వైశ్యునకు రెండు వందల దండుగను (జుర్మానా) విధించవలెను; శూద్రుని కారాగారములో ఉంచవలెను. బ్రాహ్మణుడు, క్షత్రియునిపై దోషారోపణము చేసినచో ఏబది, వైశ్యునిపై చేసినచో ఇరువదియైదు, శూద్రునిపై చేసినచో పండ్రెండు దండము. వైశ్యుడు క్షత్రియుని అవమానిం చినచో ప్రథమ సాహస దండము. శూద్రుడు క్షత్రియుని తిట్టినచో ఆతని నాలుకకు శిక్ష ఇవ్వవలెను. బ్రాహ్మణునకు ఉపదేశముచేయు

శూద్రుడుకూడ దండార్హుడు. అసత్యముగా తన దేశమును గూర్చి, శాస్త్రజ్ఞానమును గూర్చి అసత్యము చెప్పువానికి రెట్టింపు సాహస దండము. శ్రేష్ఠ పురుషులనుగూర్చి వారు పాపాచారవంతులని చెప్పి నిందించువానికి ఉత్తమ సాహసదండము. 'నేను పొరబాటున ఇట్లు చెప్పినాను' అని అనుచు అతడు ప్రేమను ప్రకటించినచో సగము దండము. తలిదండ్రులు, అన్న, మామ, గురువు వీరిపై నిందారోపము చేయువానికిని పెద్ద వారికి దారి ఇవ్వనివానికిని, నూరు దండము. ఒకడు తన ఏ అవయవముచే, పెద్దవారి విషయమున అపరాధము చేయునో ఆతని ఆ అవయవమును నిస్సం దేహముగ వెంటనే ఖండించి వేయవలెను. గర్వాంధుడై ఉత్తమ పురుషుని వైపు ఉమ్మివేసిన వాని పెదవులు ఖండించి వేయవలెను. అట్లే ఉత్తమ పురుషుని వైపు తిరిగి మూత్రము పోయువాని లింగమును, ఆతని వైపు పృష్ఠముపెట్టి, అపాన శబ్దము చేయువాని గుదమును ఛేదించవలెను. ఉన్నతాసనముపై కూర్చున్న నీచుని శరీరము క్రింది భాగము నందు దండము ఇవ్వవలెను. ఒకడు ఇతరుల ఏ అవయవమును గాయపరచునో ఆతని ఆ అవయవమును ఖండించి వేయవలెను. గోవు, ఏనుగు, అశ్వము, ఒంటె వీటికి హాని కలిగించువాని సగము చేతులు సగము కాళ్ళు ఖండించి వేయవలెను. ఇతరుల వృక్షముల పండ్లు కోసినవానికి ఒక సువర్ణము దండము. మార్గమును, పొలము సరిహద్దును, జలాశయాదికమును ఖండించి నష్టము కలుగచేసిన వానికి ఎంతనష్టము కలిగినదో దానికి రెట్టింపు దండము. తెలిసికాని, తెలియకకాని ఇతరుల ధనము అపహరిం చిన వాడు ముందు ఆతనికి ఆ ధనము తిరిగి ఇచ్చివేసి, ఆతనిని సంతోష పెట్టవలెను. పిమ్మట రాజుకుకూడ జుర్మానా చెల్లించవలెను. నూతి నుండి ఇతరుల త్రాడు, పాత్ర అపహరించిన వానికిని, చలివెందలి పాడుచేసిన వానికిని ఒక మాసము కైదు శిక్ష. ప్రాణులను చంపిన వానికి గూడ ఇదియే శిక్ష. పది ఘటముల ధాన్యమునకు మించిన ధాన్యమును అపహరించిన వానికి ప్రాణదండము. పది ఘటములలోపు ధాన్యము అపహ రించిన వానికి ఎన్ని ఘటములు అపహరించ బడినవో వాటికి పండ్రెండు రెట్లు దండము. బంగారమును, వెండిని, స్త్రీలను, పురుషులను అపహరించిన వానికి మరణ దండము. చరుడు ఏ ఏ అవయవములతో మనుషులకు ప్రతికూలముగ ప్రవర్తించునో ఆయా అవయవములను నిర్దాక్షిణ్యముగ ఖండించవలెను. ఇట్లు చేయుటచే చోరులకు బుద్ధి వచ్చును. బ్రాహ్మణుడు చాలకొంచెము శాకమును, ధాన్యమును గ్రహించినచో ఆతడు దోషికాడు. గోసేవ కొరకును, దేవపూజ కొరకును ఏదైన వస్తువును తీసికొనిన బ్రాహ్మణుడు కూడ దండ్యుడు కాడు. ఎవరినైన చంపుటకు ఉద్యమించు దుష్టుని వధించవలెను. ఇతరుల గృహ, క్షేత్రములను అపహరించిన వానికిని, పరభార్యాసంగము చేసినవానికిని, ఇంటికి నిప్పు అంటించిన వానికిని, విషము పెట్టిన వానికిని, ఆయుధముతో చంపుటకై వచ్చిన వానికిని మరణ దండము తగినది.

గోవులను చంపినవానిని, తీవ్రప్రవృత్తిగలవారిని రాజు వధించవలెను. పరస్త్రీతో సంభాషణము చేయరాదు. వలదన్న ఇతరుల ఇండ్లలోనికి పోరాదు. స్వేచ్ఛానుసారము పతిని వరించు స్త్రీ రాజుచే దండ్యురాలు కాదు. కాని నీచవర్ణ పురుషుడు ఉచ్చవర్ణ స్త్రీ సమాగమము చేసినచో ఆతడు వధ్యుడు. తన భర్తను కాదని వ్యభిచరించిన స్త్రీని కుక్కలచే కరిపించవలెను. సజాతీయుడగు పరపురుషునిచే

దూషితురాలగు స్త్రీకి బ్రతుకుటకు మాత్రము అన్నము పెట్టవలెను. భర్త అన్నగారితో వ్యభిచరించిన స్త్రీ తలగొరిగించవలెను. బ్రాహ్మణుడు వైశ్య స్త్రీ తోడను, క్షత్రియుడు నీచజాతి స్త్రీ తోడను సమాగమము చేసినచో వారికి కూడ ఇదియే దండము. శూద్ర స్త్రీతో వ్యభిచరించిన క్షత్రియ, వైశ్యులకు ప్రథమ సాహస దండము. వేశ్యా స్త్రీ ఒకని నుండి వేతనము తీసికొని, లోభముచే మరొకనితో వెళ్ళినచో ఆమె రెట్టింపు వేతనము తిరిగి ఇచ్చివేసి, రెట్టింపు దండముగా చెల్లించవలెను. స్త్రీ, పుత్రుడు, దాసుడు, శిష్యుడు, సహోదరుడు మొదలగువారు అపరాధము చేసినచో వారిని త్రాటితో గాని, వెదురు బెత్తముతోగాని కొట్టవలెను. వీపు మీదనే కొట్టవలెను కాని తలపై కొట్టకూడదు. తలపై కొట్టువానిని చోరుని దండించినట్లు దండించవలెను.

రక్షాకార్య నియుక్తుడై ప్రజల సొమ్ము దోచుకొనువాని సర్వస్వము లాగికొని రాజ్యము నుండి వెడలగొట్టవలెను. ఎవరిచేతనైన ఒక పనిచేయుటకై నియుక్తుడై ఆ కార్యము పాడుచేసిన క్రూరుని సర్వస్వమును లాగివేయవలెను. మంత్రిగాని, న్యాయాధీశుడు గాని, స్వకర్తవ్యమునకు భిన్నముగ చేసినచో వాని సర్వస్వమును లాగికొని రాజ్యము నుండి వెడలగొట్టవలెను. గురుపత్నీ గమనముచేసిన వాని శరీరము మీద భగచిహ్నము వేయవలెను. సురాపానము చేసిన మహాపాపాత్ముని శరీరము మీద కల్లు దుకాణం జండా గుర్తు వేయవలెను. దొంగతనముచేసిన వాని శరీరముపై కుక్క గోళ్ళ గుర్తు వేయవలెను. బ్రహ్మహత్య చేసినవాని లలాటముమీద కపాల చిహ్నము వేయవలెను. రాజు పాపాత్ములను వధించి వేయవలెను. బ్రాహ్మణులైనచో దేశము నుండి వెడలగొట్ట వలెను. మహా పాతకుల ధనమును వరుణునకు సమర్పించవలెను. (నీటిలో పారవేయవలెను). గ్రామాలలో చోరులకు భోజనముపెట్టి, దొంగిలించిన సొమ్మును దాచుకొనుటకు ఇల్లు ఇచ్చినవారిని అందరిని రాజు వధించవలెను. తన రాజ్యమునందు ఏదైన అధికారమునందు నియుక్తులైన సామంత రాజులు ఏమైనా పాపములు చేసినచో, రాజు వారిని అధికారము నుండి తొలగించవలెను. కన్నము త్రవ్వి దొంగతనము చేయువాని చేతులు నరికి, తీక్ష్ణమగు శూలముపై ఎక్కించ వలెను. సరస్సులు, దేవ మందిరములు పాడుచేసినవారికి గూడ ఇట్లే మరణదండము ఇవ్వవలెను. ఆపత్సమయము కాక పోయినను, మార్గమునందు మల మూత్రాద్య పవిత్ర వస్తువులను పోయువానికి కార్షాపణ దండము విధించి, వానిచేతనే ఆ మలమూత్రాదులు ఎత్తించి శుభ్రము చేయించవలెను. ప్రతిమలను, మెట్లను విరగ గొట్టిన వానికి ఐదువందల కర్షముల దండము. తనతో సమముగా ప్రవర్తించువారి విషయ మున విషమముగా ప్రవర్తించు వానికిని, వస్తువుల మూల్యమును చాల ఎక్కువగా పెంచివేయువానికి మధ్యమ సాహస దండము. వర్తకుని నుండి బహు మూల్యములగు వస్తువుల తీసికొని మూల్యమును చెల్లించని వారికి అందరికిని ఒక్కొక్కరికి ఉత్తమ సాహసదండము. మంచి వస్తువులలో చెడ్డ వస్తువులు కలిపి ఇష్టము వచ్చిన ధరకు అమ్ము వర్తకునకు మధ్యమ సాహసదండము. మోసము చేయువానికి ఉత్తమసాహస దండము. కలహపూర్వకముగ అపకారము చేయు వానికి దానికి రెట్టింపు దండము. అభక్ష్య భక్షణము చేయు బ్రాహ్మణునకును, శూద్రునకును ఒక కృష్ణలము దండము. తప్పుడు తూకము తూచు వానికిని,మోసగానికిని, గ్రాహకులకు నష్టము కలిగించువానికిని, అట్టివారితో వ్యవహారము చేయువానికిని ఉత్తమసాహస దండము. విషము పెట్టు వానిని, ఇంటికి

నిప్పు అంటించువానిని, పతి, గురు, బ్రాహ్మణ, సంతానముల హత్యచేసిన వానిని చేతులు, ముక్కు, చెవులు, పెదవులు ఖండించి, ఎద్దుపై కూర్చుండబెట్టి రాజ్యము నుండి వెడలగొట్టవలెను. పొలము, ఇల్లు, గ్రామము, అడవి-వీటిని నశింపచేసిన వారిని, గడ్డితుక్కు నిప్పులో పడవేయవలెను. రాజాజ్ఞను పెంచిగాని తగ్గించిగాని వ్రాయువానికిని, పరస్త్రీగమనము చేసినవారిని, చోరులను శిక్షించక విడుచు వానికిని ఉత్తమ సాహస దండము.

రాజ వాహనముపైనను, రాజాసనముపైనను కూర్చున్న వానికి గూడ ఉత్తమ సాహస దండము. పరాజితుడైనను అపరాజితుడనని చెప్పుకొనువాడు ఎదుటకు వచ్చినపుడు వానిని మరల జయించి, రెట్టింపు దండము విధించవలెను. ఆమంత్రితుడు కాని వానిని పిలచుకొనివచ్చువాడు వధ్యుడు. దండించు పురుషుని నుండి తప్పించుకొని పారి పోవు అపరాధి పురుషార్థ విహీనుడు. అట్టి పిరికివారికి శారీరక దండమునకు బదులు ధనదండమును విధించవలెను. (227)

యుద్ధయాత్ర

పుష్కరుడు పలికెను : తన సరిహద్దులలోగల రాజును, ఆతడి సరిహద్దుకావల ఉన్నరాజు జయించెను అని గ్రహించిన రాజు సైన్య మును యుద్ధమునకై తరలించవలెను. ముందుగా సేన బాగుగా బలంగా ఉత్సాహంతో ఉన్నది. భృత్యులందరును చక్కగా పోషింపబడి ఉన్నారు. నావద్ద అధికమైన సేన ఉన్నది; నేను మూల రక్షణ విషయమున అన్ని విధములచే సమర్థుడను' అను విషయమును నిర్ధారణ చేసికొనవలెను పిదప సైనిక పరివృతుడై శిబిరములోనికి వెళ్ళవలెను. శత్రువు కష్టములలో నున్నపుడును, దైవ-మానుష బాధలలో చిక్కుకొని ఉన్నపుడును, ఆతని నగరము పీడితమై ఉన్నపుడును యుద్ధయాత్ర చేయవలెను. భూకంపము ఏవైపున వచ్చి నదో, కేతువు తన ప్రభావముచే ఏ ప్రక్కదూషితము చేసెనో ఆ వైపునుండి ఆక్రమణము చేయవలెను. శత్రువును నశింపచేయవలెనని సేన ఉత్సాహముతో ఉన్నపుడును, శత్రువు లపై యోధులకు కోపమున్నపుడును, శుభసూచకముగ అవయవములు అదరుచున్నపు డును మంచి చిహ్నములు ఉత్తమమైన నిమిత్తములు, శకునములు కనబడుచున్నపుడును శత్రునగరముపై ఆక్రమణము చేయవలెను. వర్షా కాలమునందు యుద్ధ యాత్ర చేయవలసి వచ్చినపుడు కాలిబంటులు, ఏనుగులు అధికముగా ఉన్న సైన్యమును ముందుకు దుమక మని ఆజ్ఞాపించవలెను. హేమంత శిశిర ఋతువు లందు రథములు, అశ్వములు అధికముగా ఉన్న సైన్యమును తీసికొని వెళ్ళవలెను. వసంత-శరదారంభములందు చతురంగ సేనను తీసికొనివెళ్ళవలెను. కాలిబంటులు ఎక్కువగా ఉన్న సైన్యమే శత్రువులపై విజయము సాధించును. శరీరమునందు కుడి భాగమున ఏ అవయవమైన అదురు చున్నచో అది ఉత్తమము.

ఎడమ అవయవము వీపు హృదయము అదురుట మంచిది కాదు. ఈ విధముగ శరీర చిహ్నములు, కురుపులు, బొబ్బలు, అవయవములు అదురుట మొదలగు వాటిచే శుభాశుభ ఫలములను బాగుగా తెలిసికొనవలెను. స్త్రీలకు ఫలము దీనికి విపరీతముగా ఉండును. వాళ్లకు శరీరము ఎడమ భాగము అదురుట మంచిది. (228)

స్వప్నాధ్యాయము - దుఃస్వప్న నివారణము

పుష్కరుడు పలికెను :

శుభాశుభ స్వప్నములు, అశుభ స్వప్న ఫల నివారణోపాయములు చెప్పెదను. నాభితప్ప ఇతర శరీరాంగములందు తృణములు, వృక్షములు మొలచుట, నెత్తిమీద పెట్టుకొన్న కాంస్య పాత్రలు బ్రద్దలగుట తలగొరిగించుకొనుట, వస్త్రవిహీనుడగుట, మలిన వస్త్రములు ధరించుట, తైలము, బురద పూసికొనుట, పైనుంచి పడుట, వివాహమగుట, గీతములు వినుట, వీణాది వాద్యములు వినుచు మనోవినోదము చేయుట, ఉయ్యాల ఊగుట, పద్మములను, లోహములను సంపాదించుట, సర్పములను చంపుట, ఎఱ్ఱటి పూవులతో నిండిన వృక్షములను చండాలులను చూచుట, సూకరము, కుక్క, గాడిద, ఒంటె – వాటిపై ఎక్కుట, పక్షిమాంసము భుజించుట, తైలము త్రాగుట, కిచడీ తినుట, మాతృగర్భము ప్రవేశించుట, చితిపై ఎక్కుట, ఇంద్ర ధ్వజము విరిగిపడుట, సూర్య చంద్రులు పడిపోవుట, దివ్య, అంతరిక్ష, భూ లోకములందు ఉత్పాతములు కనబడుట, దేవతా, బ్రాహ్మణ, రాజ, గురువులకు కోపము కలుగుట, నాట్యమాడుట, నవ్వుట, గీతములు పాడుట, వివాహము చేయుట, వీణతప్ప మిగిలిన వాద్యములను తానువాయించుట, నదిలో మునిగి క్రిందికి పోవుట, గోమయము, బురద, సిరా కలసిన నీళ్ళలో స్నానము చేయుట, కుమారీకన్యలను ఆలింగనము చేసికొనుట, పురుషులు పరస్పరము మైథునము చేసికొనుట, తన అవయవముల హాని, వమనము, విరేచనము అగుట, దక్షిణదిక్కు వైపు వెళ్ళుట, రోగముచే పీడితుడగుట, ఫలముల హాని, ధాతువును బ్రద్దలు కొట్టుట, ఇండ్లను పడద్రోయుట, ఇండ్లలో తుడుచుట, పిశాచ, రాక్షస, వానర, చాండాలాదులతో క్రీడించుట, శత్రువుచే అవమానితుడగుట, శత్రువుల నుండి కష్టములు వచ్చుట, కాషాయ వస్త్రములు ధరించుట, కాషాయవస్త్రములతో ఆడుకొనుట, తైలము త్రాగుట, దానిలో స్నానము చేయుట, ఎఱ్ఱని పూలమాల ధరించుట, ఎఱ్ఱని చందనము ధరించుట, ఇవన్నియు చెడు స్వప్నములు. వీటిని ఇతరులకు చెప్పకుండుట మంచిది. ఇట్టి స్వప్నములు వచ్చినపుడు మరల నిద్రించవలెను. స్వప్న దోషశాంతికై బ్రాహ్మణులను పూజించవలెను. తిలహోమము చేయ వలెను. బ్రహ్మ విష్ణు శివులను, సూర్య గణములను పూజించి స్తోత్ర, పురుషసూక్తాదుల పారాయణము చేయవలెను. రాత్రి మొదటి జామునందు చూచిన స్వప్నముల ఫలము ఒక సంవత్సరములో కలుగును. రెండవ జామున చూచిన వాటి ఫలము ఆరు మాసములందును మూడవ జామునందు చూచిన వాటి ఫలము మూడు మాసములందును, నాల్గవ జామునందు చూచిన స్వప్నముల ఫలము పదునైదు దినములందును కలుగును. అరుణోదయ సమయమున చూచిన దాని ఫలము పది రోజులలోనే కలుగును.

ఒకే రాత్రి శుభాశుభ స్వప్నములు రెండును వచ్చినచో తరువాత వచ్చినదాని ఫలమునే చెప్పవలెను. అందుచే శుభస్వప్నము చూచినతరువాత నిద్రించుట మంచిదికాదు. పర్వతము, భవనము, ఏనుగు, గుఱ్ఱము, ఎద్దు ఎక్కినట్లు స్వప్నము వచ్చినచో మంచిది. పరశురామా! భూమి మీదగాని, ఆకాశమునందుగాని తెల్లటి పూవులతో నిండిన వృక్షములు కనబడినను, తన నాభినుండి

వృక్షముగాని, తృణముగాని మొలిచినను, తన భుజములు గాని, శిరస్సుగాని అధికముగా ఉన్నట్లు కనబడినను, కేశములు తెల్లబడినను మంచి ఫలములు లభించును. శ్వేత పుష్ప మాలయు, శ్వేత వస్త్రములును ధరించుట, చంద్ర, సూర్య, నక్షత్రములను పట్టుకొనుట, వాటిని తుడుచుట, ఇంద్ర ధ్వజమును ఆలింగనము చేసికొనుట, ధ్వజమునుపైకి ఎత్తుట, భూమిపై పడుతున్న జలధారను తనమీద ఆపుట, శత్రువినాశనమును చూచుట, వాద వివిధములందును, యుద్ధమునందును తాను జయించుట, పాయసము భుజించుట, రక్తము చూచుట, రక్తములో స్నానమాడుట, సుర, మద్యము, లేదా పాలు త్రాగుట, అస్త్ర ప్రహారముతిని నేలపై దొర్లుట, ఆకాశము స్వచ్ఛమగుట, గోవు, గేదె, ఆడ సింహము, ఆడ ఏనుగు, ఆడ గుఱ్ఱము వీటి పొదుగు నుండి పాలు త్రాగుట, ఇవన్నియు మంచి స్వప్నములు. దేవతా, గురు, బ్రాహ్మణుల ప్రసాదము, గోశృంగము నుండిగాని, చంద్రుని నుండిగాని స్రవించు ఉదకముతో అభిషేకము చేసికొనుట–ఈ స్వప్నములు రాజ్యము నిచ్చును. పరశురామా! తాను రాజ్యాభి షిక్తుడగుట, తన శిరస్సు ఖండితమగుట, తాను చచ్చుట, అగ్నిలో పడుట, గృహాదులకు అగ్ని దగ్ధమగునపుడు ఆ అగ్నిలో పడుట, రాజ చిహ్నములు లభించుట, స్వయముగా వీణ వాయించుట, ఈ స్వప్నములు గూడ మంచివి; రాజ్యమును ఇచ్చునవి. స్వప్నము చివర రాజును, ఏనుగును, అశ్వమును, సువర్ణమును, వృషభమును, గోవును చూచినవారి కుటుంబము వృద్ధి చెందును. ఎద్దు, గజము, ప్రాసాదోపరి భాగము, పర్వత శిఖరము, వృక్షము వీటిపైకెక్కుట, ఏడ్చుట, శరీరమునకు నెయ్యి, మలము అంటుకొనుట, ఆగమ్యాస్త్రీ గమనము–ఇవి కూడ శుభ స్వప్నములు. (229)

శకున వర్ణనము - 1

పుష్కరుడు పలికెను :

పరశురామా! యాత్రా సమయమున, శ్వేత వస్త్రములు, స్వచ్ఛమైన ఉదకము, ఫలభరితమగు వృక్షము, నిర్మలాకాశము, క్షేత్రములలోని సస్యములు, నల్లని ధాన్యము కనబడుట అశుభము. దూది, తృణములు కలిసిన ఎండిన గోమయము (పిడకలు), సుత్తి, బొగ్గులు, గుడము, కరాయల, తల గొరిగించుకొని తైలము పట్టించుకొనిన నగ్న సాధువు, ఇనుము, బురద, చర్మము, వెంద్రుకలు, పిచ్చివాడు, నపుంసకుడు, చండాలుడు, కారాగారాధికారి, గర్భిణి, విధవ, తెలక పిండి, మృత్యువు, ఊక, బూడిద, నిప్పులు, ఎముకలు, బ్రద్దలైన పాత్రలు–ఇవి యుద్ధయాత్రా సమయమునందు కనబడుట అశుభము. బ్రద్దలైన తాళము చిప్పల ధ్వనివలె భయంకరముగ వినవచ్చు వాద్యధ్వని మంచిదికాదు. 'బయలుదేరిరమ్ము' అను శబ్దము ముందు నుండి వినబడినచో శుభము; వెనుక నుండి వినవచ్చినచో అశుభము. 'వెళ్ళుము' అను శబ్దము వెనుక నుండి వినబడినచో శుభము; ముందు నుండి వినబడినచో అశుభము. 'ఎక్కడికి వెళ్ళుచున్నావు? ఆగుము; వెళ్ళకుము. అచటికి వెళ్ళుటచే నీకేమి లాభము? ఇట్టి మాటలు అనిష్ట సూచకములు. ధ్వజాదులపై గ్రద్ద మొదలగు మాంసాహారి పక్షులు కూర్చున్నను, అశ్వ–గజాది వాహనములు తొట్రుపడి పడిపోయినను, ఆయుధము విరిగిపోయినను, ద్వారాదులు తగిలి శిరస్సుపై దెబ్బతగిలినను, ఛత్ర వస్త్రాదులను

ఎవ్వడైనను క్రింద జార విడచినను, ఈ అపశకునములు అన్నియు మృత్యు కారకములు. శ్రీమహావిష్ణువును పూజించి స్తుతించినచో అమంగళములు తొలగిపోవును. రెండవ పర్యాయము కూడ ఈ అపశకునములు కనబడినచో ఇంటికి తిరిగి వచ్చివేయవలెను.

యాత్రా సమయమున తెల్లని పుష్పములు కనబడుట శుభప్రదము. జలపూర్ణ కుంభము కన బడుట అత్యుత్తమము. మాంసము, మత్స్యములు, దూరమునుండి కోలా హలము, ఒంటరియైన వృద్ధుడు, మేకలు, గోవులు, అశ్వములు, గజములు, దేవప్రతిమలు, మండుచున్న అగ్ని, దూర్వలు, గోమయము, వేశ్య, బంగారము, వెండి, రత్నములు, వన ఆవాలు మొదలైన ఓషధులు, పెసలు, ఆయుధములలో ఖడ్గము, ఛత్రము, బల్ల, రాజ చిహ్నములు, కూడా విలపించువారు లేని శవము, ఫలములు, నెయ్యి, పెరుగు, పాలు, అక్షతలు, అద్దము, తేనె, శంఖము, చెరకు, శుభ సూచకములు అగు మాటలు, భక్తుల గాన–వాద్య వాదనములు, మేఘ గంభీర గర్జనము, మెరుపు మెరయుట, మనః సంతో షము–ఇవన్నియు శుభ శకునములు. శుభశకునములు అన్నియు ఒకప్రక్క, మనః ప్రసాదము ఒక ప్రక్క–ఈ రెండును సమానములు. (230)

శకునములు - 2

పుష్కరుడు పలికెను :

రాజు ఒకచోట నివాసము ఏర్పరచుకొన్నపుడుగాని, వెళ్ళునపుడు గాని, ప్రశ్న సమయమునందు గాని కనబడు శకునములు ఆ దేశమునందును, నగరమందును కలుగు శుభా శుభములను సూచించును. 'దీప్తములు', 'శాంతములు' అని శకునములు రెండు విధములు. అన్ని దీప్త శకునముల ఫలితములు అశుభములగు ననియు, శాంత శకునముల ఫలితములు శుభములగుననియు జ్యోతిః శాస్త్రజ్ఞులు చెప్పినారు. దీప్తశకున ములు వేలాదీప్త, దిగ్దీప్త, దేశదీప్త, క్రియాదీప్త, రుతదీప్త, జాతి దీప్తములని ఆరు విధములు. వీటిలో పూర్వ పూర్వములు ప్రబలతరములు. పగలు సంచరించవలసిన ప్రాణులు రాత్రి, రాత్రి సంచరించవలసినవి పగలు సంచరించినచో అది 'వేలా దీప్తము' నక్షత్ర, లగ్న, గ్రహాదులు క్రూరావస్థను పొందిన సమయము కూడ 'వేలాదీప్తము' సూర్యుడు ప్రయాణించు దిక్కు 'ధూమిత', ఉన్న దిక్కు 'జ్వలిత', విడవబడిన దిక్కు 'అంగారిణి', ఈ మూడు దిక్కులును దీప్తములు. మిగిలిన ఐదును శాంతములు. దీప్త దిక్కులందు కలుగు శకున ములు దిగ్దీప్తములు. గ్రామములో అరణ్య జంతువులును, అరణ్యములో గ్రామ్య జంతువు లును ఉన్నచో అది నిందిత దేశము. నిందితములగు వృక్షములున్న దేశము గూడ నింద్యము–అశుభము. విప్రవరా! అశుభ దేశమునందు కనబడు శకునములు 'దేశ దీప్తములు'; తన వర్ణ ధర్మమునకు విపరీతముగ ప్రవర్తించు వాడు 'క్రియాదీప్తుడు'; భయంకర ధ్వని వినబడుట 'రుతదీప్తము', మాంస భోజనము మాత్రము చేయు ప్రాణి 'జాతి దీప్తము'; దీప్తావస్థకు విపరీతమైన శకునములు శాంతములు; వాటిలో కూడ పైన చెప్పిన భేదము లన్నియు గ్రహించవలెను. దీప్త–శాంతములు కలసినచో అవి మిశ్ర శకునములు, ఈ విధముగ పరిశీలించి వాటి ఫలాఫలములను చెప్పవలెను.

గోవు, గుఱ్ఱము, గాడిద, కుక్క, సారిక, బల్లి, చటకము, భాసము, తాబేలు–ఇవి గ్రామవాసి ప్రాణులు. మేక, తోడేలు, చిలుక, గజరాజము, సూకరము, గేదె, కాకి – ఇవి గ్రామారణ్య ఉభయవాసి ప్రాణులు. మిగిలిన ప్రాణులన్నియు ఆటవికములు. పిల్లి, కోడి కూడ ఉభయవాసులు, వీటి ఆకారములో భేదముండును గాన వీటిని గుర్తించవచ్చును. గోకర్ణము, నెమలి, చక్రవాకము, రాసభము, హారీతము, కాకి, కులాహము (ఒక విధమగు గుఱ్ఱము), కుక్కుభము, నక్క,ఖంజరీటము, వానరము, శతఘ్నము, చటకము, కోకిల, శ్యేనము, కపింజలము, తీతువు, శతపత్రము, పావురము, ఖంజనము, దాత్యూహము, శుకము, రాజీవము, కోడి, భరద్వాజము, సారంగము పగలు సంచరించు ప్రాణులు. హంస, లేడి, పిల్లి, ముంగిస, భల్లూకము, సర్పము, వృకారి, సింహము, వ్యాఘ్రము, ఒంటె, గ్రామ సూకరము, మనుష్యులు, శ్వావిదము, వృషభము, నక్క, తోడేలు, కోకిల, సారసము, గుఱ్ఱము, ముంగిస, కౌపీనధారి పురుషులు రాత్రి, పగలు కూడ సంచరించు ప్రాణులు.

యుద్ధమునందుగాని, యుద్ధమునకై యాత్ర చేయునపుడు గాని ఈ ప్రాణులు అన్నియు గుంపుగా ఎదుటకు వచ్చినచో విజయ ప్రదములు. వెనుక నుంచి వచ్చినచో మృత్యుకారకములు. నీలకంఠము తన గూడు నుండి బైటకు వచ్చి ధ్వని చేయుచు ఎదురై నచో అది రాజుకు అవమాన సూచకము. అది వామ భాగమునందు వచ్చినచో కలహ కారకము; భోజనమున బాధ కలిగించును. యాత్రా సమయమున దానిదర్శనము ఉత్తమము. దాని ఎడమ భాగము కనబడుట కూడ మంచిది. యాత్రా సమయమున నెమలి ఎక్కువ ధ్వని చేసినచో అది దొంగల ద్వారా ధనము కోల్పోవుటను సూచించును.

పరశురామా! ప్రస్థాన సమయమునందు లేడి ముందు ముందు నడచినచో అది మృత్యుప్రదము. భల్లూకము, ఎలుక, నక్క, పులి, సింహము, పిల్లి, గాడిద–ఇవి ప్రతికూల మగు దిక్కున వెళ్ళినను, గాడిద గట్టిగా ఓండ్ర పెట్టినను, కపింజలపక్షి ఎడమ ప్రక్కగాని, కుడి ప్రక్కగాని ఉన్నను ఇవన్నియు ఉత్తమ శకునములు. కాని కపింజల పక్షి వెనుక ప్రక్కన ఉన్నచో చెడ్డఫలము నిచ్చును. యాత్రా సమయమున తీతు కనబడకూడదు. లేడి, సూకరము, చిత్రవర్ణ హరిణము, ఎడమ నుండి కుడివైపు వచ్చినచో సర్వదా కార్య సాధకము. కుడినుండి ఎడమవైపు వెళ్లినచో మంచిదికాదు. ఎద్దు, గుఱ్ఱము, గ్రద్ద, పులి, సింహము, పిల్లి, గాడిద, మొదలైనవి కుడినుంచి ఎడమకు వెళ్ళినచో మనో వాంఛిత సిద్ధి ప్రదములు. శృగాలము, శ్యామముఖము, చుంచు, పింగల, బల్లి, సూకరి, కోకిల, పుంలింగ నామములు గల ప్రాణులు, భాసము, కారుషము, కోతి, శ్రీకర్ణము, ఛిత్వరము, కపి, పిప్పీకము, ఈరువు, శ్యేనము ఇవి కుడిప్రక్క నున్నను శుభము. యాత్రాకాలమున జాతికము, సర్పము, చెవులపిల్లి, సూకరము, ఉడుము–వీటి పేరు చెప్పుట గూడ శుభమని చెప్పబడినది.

భల్లూక–వానరములు విపరీత దిక్కునందు కనబడుట అనిష్టకారకము. ప్రస్థానము చేసిన తరువాత ఏ దినమున బలవత్తరమగు ఏశకునము కనబడునో అది ఆ దినమునకు మాత్రము ఫలమును ఇచ్చును. పరశురామా! పిచ్చివాడు, భోజనార్థి, బాలుడు, శత్రువు మొదలగు వారు గ్రామసీమ యందు గాని, నగరసీమ యందుగాని కనబడినచో దానికి ఫలమేమియు ఉండదని

తెలుసుకొనవలెను. ఆడ నక్క ఒకసారిగాని, రెండుసార్లుగాని, మూడుసార్లుగాని, నాలుగుసార్లుగాని కూసినచో శుభము. ఐదు లేదా ఆరుసార్లు కూసినచో అశుభము. ఏడుసార్లు కూసినచో శుభము. అంతకుమించి కూసినచో ఫలమేమియు ఉండదు. మార్గ మధ్యమునందు సూర్యుని వైపు పైకి ఎగిసే జ్వాల కనబడి, అది చూడగానే రోమాంచకారిగాను, వాహనములు భయపడునట్లు గాను ఉన్నచో అది మహాభయ సూచకము. ముందుగనే ఏదైన ఒక ఉత్తమ ప్రదేశము నందు సారంగము కనబడినచో అది సంవత్సరము వరకును శుభసూచకము. దానిని చూచుటచే అశుభమునందు గూడ శుభమగును. అందుచే యాత్రా ప్రారంభ దినమున అట్టి సారంగమును జూచి ఒక సంవత్స రము పాటు శుభ ఫలప్రాప్తి కలుగునని గ్రహించవలెను. (231)

శకున వర్ణనము - 3

పుష్కరుడు చెప్పెను :

శత్రు నగరములోనికి చాలకాకులు ఏ మార్గము ద్వారా ప్రవేశించునో ఆ మార్గము నుండి చుట్టుముట్టినచో ఆ నగరము తన వశమగును. ఏదైన సేనకు లేదా సముదాయమునకు ఎడమ ప్రక్కనుండి భయభీతమగు కాకి ఏడ్చుచు ప్రవేశించినచో అది రాబోవు భయమునకు సూచకము. శామియానా, అవయవములు, వాహనములు, పాదుకలు, ఛత్రము, వస్త్రము మొదలగు వాటిచే కాకి నలగకొట్టబడినచో అది తనకు మృత్యు సూచకము. దానిని పూజించినచో తనకు కూడ పూజ లభించును. అన్నాదులచే దానికి ఇష్టము చేకూర్చినచో తనకుగూడ ఇష్టము చేకూరును. కాకి మాటిమాటికి ఇంటి ద్వారము వద్దకు వచ్చుచు పోవుచు ఉన్నచో అది ఎవరో పరదేశీయుడు వచ్చుటకు సూచకము. అది ఏదైన ఎఱ్ఱని వస్తువునుగాని, కాలిన వస్తువునుగాని ఇంటి మీద పెట్టినచో అది గృహదహనమునకు సూచకము.

భృగు నందనా! కాకి మనుష్యుని ఎదుట ఏదైన ఎఱ్ఱని వస్తువు పడవేసినచో ఆతనికి కైదు శిక్ష వచ్చునని సూచింపబడును. పచ్చని రంగుగల వస్తువును పడవేసినచో బంగారము, వెండి లభించునని సూచన. ఏ వస్తువును తన వద్దకు తెచ్చి విడచునో అది లభించును. దేనిని తన దగ్గర నుండి తీసికొని పోవునో అది నష్టమగును. పచ్చి మాంసము తీసికొనివచ్చి ఎదుట పడవేసినచో ధనము, మట్టి పడవేసినచో భూమి, రత్నమును పడవేసినచో మహా సామ్రాజ్యము లభించును. యాత్ర చేయువానికి అనుకూల దిశయందు కాకి వెళ్ళినచో అది కల్యాణకరము, కార్యసాధకము. ప్రతికూల దిశయందు వెళ్ళినచో అది కార్య విఘా తకము; భయంకరము. కాకి 'కావ్ కావ్' అనుచు ఎదుటికి వచ్చినచో యాత్రా భంగము కలుగును. కాకి ఎడమవైపున ఉన్నచో శుభము, కుడివైపున ఉన్నచో అశుభము. వామ భాగమునందు ఉండి అనుకూలమైన దిక్కు వైపు ఎగిరినచో శ్రేష్ఠము, కుడి ప్రక్కన ఉండి అనుకూలమగు దిక్కు వైపు ఎగిరినచో మధ్యమ ఫలము. వామ భాగము నందుండి ప్రతి కూలమగు దిక్కు వైపు వెళ్ళినచో అది యాత్రను నిషేధించుచున్నది. యాత్రా కాల మున కాకి వచ్చి ఇంటిపై వాలినచో అది అభీష్టసిద్ధి సూచకము. ఒక కాలు ఎత్తి, ఒక కంటితో సూర్యుని వైపు చూచినచో భయము కలుగును. ఏదైన చెట్టు తొఱ్ఱలో కూర్చుండి అరచినచో గొప్ప

అనర్థము కలుగును. ఊషర భూమి మీద కూర్చున్నచో అశుభము. కాని దానికి బురద అంటుకొన్నచో మంచిది. మలము మొదలగు అపవిత్ర వస్తువులను ముక్కున పెట్టుకొని కాకి కనబడినచో అన్ని కార్యములు సాధింపబడును. ఇతర పక్షులకు గూడ కాకికి వలెనే ఫలితము తెలియవలెను.

సేవా నివేశమునకు దక్షిణమున కుక్కలు వచ్చినచో అది బ్రాహ్మణ వినాశక సూచకము. ఇంద్ర ధ్వజ స్థానమునకు వచ్చినచో రాజునకును, నగర ద్వారమునకు వచ్చినచో నగరాధీశునకును మృత్యువు కలుగును. కుక్క మొరుగుచు ఇంటిలోనికి చొరబడినచో గృహ స్వామికి మృత్యువు కలుగును. కుక్క ఎవరిని ఎడమ అవయవములను నాకునో వానికి కార్యసిద్ధి కలుగును. కుడి అవయవములను ఎడమ భుజమును వాసన చూచినచో భయము వచ్చును. యాత్రకు వెళ్ళు వానికి ఎదురుగా వచ్చినచో యాత్రావిఘ్నము కలుగును. భృగునందనా! కుక్క దారికి అడ్డముగా నిలబడినచో మార్గమున చోర భయము సూచితము. ముఖమునందు ఎముకను గ్రహించి కనబడినచో యాత్ర చేయువానికి లాభమేదియు కలగదు. త్రాడుచింకిరి గుడ్డ ముఖమునందు పెట్టుకొని యున్న కుక్కకూడ అశుభ సూచకము. చెప్పుకాని, మాంసముకాని నోటిలో కరచికొని ఎదురైనచో శుభము కలుగును. దానినోటిలో ఏదైన అమాంగలికమగు వస్తువుగాని, కేశముగాని ఉన్నచో అశుభ సూచకము. కుక్క ఎవని ఎదుట మూత్రము విడచి పోవునో వానికి భయము వచ్చును. మూత్ర త్యాగానంతరము కుక్క ఏదైన శుభ స్థానమునకుగాని, శుభకరమగు వృక్షము వద్దకుగాని, శుభకరమగు వస్తువు దగ్గరకుగాని వెళ్ళినచో కార్యము సిద్ధించును. పరశురామా! గ్రద్ద మొదలగువాటి విషయముగూడ ఉక్త విషయము నందు వలెనే గ్రహించవలెను.

గోవులు అకారణముగా త్రేన్చుట ప్రారంభించినచో స్వామికి భయము కలుగును. అది రాత్రి అరచినచో చోరభయము, వికృత స్వరూప స్వరముతో అరచినచో మృత్యు భయము. వృషభము రాత్రి గర్జించినచో స్వామికి కల్యాణమగును. ఆబోతు రంకెలు వేసినచో రాజుకు విజయము లభించును. తాను ఇచ్చిన గోవులుగాని, తన ఇంటిలోనున్న గోవులుగాని అభక్ష్య భక్షణము చేసినచో లేదా తమ దూడలపై ప్రేమ చూపకున్నచో అది గర్భస్రావసూచకము. పాదములతో నేలనుగీయు గోవులు దీనము భయభీతములు అయిన గోవులును భయమును కలిగించును. తడిసిన శరీరము గలవి, ఆనందముచే వికసించిన రోమములు గలవి, కొమ్ములకు మట్టి అంటుకొన్నవి అయిన గోవులు శుభసూచకములు. బుద్ధిమంతులు గేదె మొదలగువాటి విషయమున గూడ ఈ విధముగనే శకునములు చెప్పవలెను.

జీను వేసిన తన గుఱ్ఱముపై ఇతరులు ఎక్కుట, ఆ గుఱ్ఱము నీటిలో కూర్చుండిపోవుట, ఒకేచోట గుండ్రముగా తిరుగుట ఇవి అనిష్ట సూచకములు. ఏ కారణము లేకుండ గుఱ్ఱము నిద్రపోవుట ఆపదను కలిగించును. యవలపైనను బెల్లము పైనను గుఱ్ఱమునకు అరుచి కలిగినను, దాని ముఖమునుండి రక్తము కారుచున్నను, దాని శరీరమంతయు వణకుచున్నను ఇవి అశుభ సూచకములగు దుర్లక్షణములు. గుఱ్ఱము కొంగలతోను, పావురములతోను సారికలతోను ఆటలు ప్రారంభించినచో అది మృత్యు సూచకము. దాని నేత్రముల నుండి కన్నీళ్లు కారినను అది నాలుకతో

పాదము నాకికొనినను వినాశ సూచకము. అది ఎడమ డెక్కతో నేల త్రవ్వినను, ఎడమప్రక్క పండుకొనినను, పగలు నిద్రించినను శుభకరముకాదు. ఒకమాటు కొంచెము మూత్రము విడచునది, నిద్రచే మలిన ముఖముకలది అగు గుఱ్ఱము భయమును సూచించును. గుఱ్ఱము తనపైకి ఎక్కనీయకున్నను ఎక్కునపుడు వెనుకకు తిరిగి ఇంటిలోనికి వెళ్ళిపోయినను, సవారిచేయు వాని ఎడమ పార్శ్వమునందలి ఎముకలు స్పృశించినను యాత్రలో విఘ్నము కలుగును. శత్రుయోధులను చూచి సకిలించినను, తన యజమాని పాదములను స్పృశించినను విజయము లభించును.

ఏనుగ గ్రామములో మైథునము చేసినచో అది దేశోపద్రవకారకము. ఆడ ఏనుగు గ్రామములో ఈనినను, పిచ్చిదైనను రాజవినాశ సూచకము. ఏనుగ తనపై ఎక్కనీయ కున్నను, హస్తిశాలలోనికి వెళ్ళిపోయినను, మదధార స్రవించినను రాజుకు మరణము కలుగును. కుడిపాదము ఎడమకాలిపై ఉంచి, తుండముతో దంతములను తుడిచినచో అది శుభకరము.

తన వృషభము గాని, గుఱ్ఱముగాని, ఏనుగగాని శత్రు సైన్యములోనికి వెళ్ళి పోయినచో అశుభము కలుగును. కొద్ది దూరమునందే మేఘము అంతటను వ్యాపించి పెద్ద వర్షము కురిసినచో సేన నశించును. యాత్రా సమయమునందుగాని, యుద్ధ సమ యమునందు గాని, గ్రహ నక్షత్రములు ప్రతికూలమైనను, గాలి ఎదురుగా వీచినను, ఛత్రాదులు విరిగి పడిపోయినను భయము కలుగును. యుద్ధము చేయు హర్షోత్సాహ భరితులై, గ్రహములు కూడ అనుకూలముగా నున్నచో విజయము కలుగును. కాకులు, మాంసాహారి జంతువులును యోధులను తిరస్కరించినచో మండలము నశించును. పూర్వ పశ్చిమ, ఈశాన్య దిక్కులు ప్రసన్నములై శాంతములుగా ఉన్నచో ప్రియము, శుభము అగు ఫలము లభించును. (232)

యాత్రా మండల చింతా కథనము

పుష్కరుడు పలికెను : ఇపుడు రాజ ధర్మానుసారము అందరి యాత్రను గూర్చి చెప్పెదను. శుక్రుడు అస్తంగతుడైనపుడును, నీచస్థానములో నున్నపుడును, వికలాం గుడైనపుడును, శత్రురాశిలో నున్నపుడును, ప్రతికూల స్థానమునందున్నపుడును, యాత్ర చేయకూడదు. బుధుడు ప్రతికూల స్థానమునందున్నపుడును, దిక్కు అధిపతి గూడ ప్రతికూల స్థానమునందున్నపుడును యాత్ర చేయ గూడదు. వైధృతి, వ్యతీపాత, నాగ, శకుని, చతుష్పాద, కింస్తుఘ్న యోగములందును, విపత్, మృత్యు, ప్రత్యరి, జన్మతారలందును, గండయోగము నందును, రిక్త తిథులందును యాత్ర చేయగూడదు.

ఉత్తర, పూర్వ దిక్కులును, పశ్చిమ–దక్షిణ దిక్కులను ఒక్కటేనని చెప్పబడినది. వాయ వ్యము నుండి ఆగ్నేయము వరకును ఉండు పరిధి దండమును దాటి యాత్ర చేయగూడదు. భాను, సోమ, శనివారములందు యాత్ర చేయగూడదు. కృత్తిక మొదలు ఏడు నక్షత్ర సమూహములు తూర్పునందును మఘ మొదలు ఏడు నక్షత్రములు దక్షిణము నందును, అనూరాధ మొదలగు ఏడు నక్షత్రములు పశ్చిమమునందును ఉండును. ధనిష్ఠాదులగు ఏడు నక్షత్రములు ఉత్తరము

నందుండును. పైన చెప్పిన నక్షత్రములు ఆయా దిక్కులకు ద్వారములు. ఆయా దిక్కులకు ఆ ద్వారములు అన్నియు ఉత్తమములు. ఇపుడు ఛాయా మానమును గూర్చి చెప్పెదను.

రవి వారమున ఇరువది, సోమవారమున పదునారు, మంగళవారమున పదునైదు, బుధవారమున పదమూడు, శుక్రవారమున పండ్రెండు, శనివారమున పదకొండు అంగుళ ముల ఛాయామానము చెప్పబడినది. ఇవి అన్ని కర్మలకును విహితములు. జన్మ లగ్నము నందును ఎదుట ఇంద్రధనుస్సు ఆవిర్భవించినపుడును యాత్ర చేయగూడదు. శుభశకు నాదులు కనబడిన పిమ్మట శ్రీమహావిష్ణువును స్మరించుచు యాత్ర చేయవలెను.

పరశురామా! ఇపుడు మండల విచారమును గూర్చి చెప్పెదను. సర్వవిధముల రాజును రక్షించవలెను. రాజు, మంత్రి, దుర్గము, కోశము, దండము, మిత్రులు, జనపదము – ఇవి రాజ్యము యొక్క సప్తాంగములు. ఈ సప్తాంగ రాజ్యమునకు విఘాతము కలిగించు వారిని సంహరించవలెను. రాజు తన మండలములను అన్నింటిని వృద్ధి పొందించుకొనవలెను. అన్నింటికంటె తన మండలము మొదటిది. ఆ మండలమునకు సామంత రాజులే శత్రువులు. 'విజిగీషు' వగు రాజునకు తన మండలమునకు ఎదటి సీమ (సరిహద్దు) యందున్న సామంతుడు శత్రువు. ఆ శత్రువు రాజ్యముతో ఎవనికి సరిహద్దు ఉన్నదో అతడు ఆ శత్రువునకు శత్రువగుటచే విజిగీషువునకు మిత్రుడు. ఈ విధమున విజిగీషుని మండలమునకు ఎదుట శత్రువు, మిత్రుడు, అరిమిత్రుడు, మిత్రమిత్రుడు, అరిమిత్రమిత్రుడు అని అయిదుగురు ఉందురు. ఇపుడు వెనుకనున్న వారిని గూర్చి వినుము. వెనుకనున్న వారిలో మొదటివాడు 'పార్ష్ణిగ్రాహుడు'. వాని వెనుకనున్న వాడు 'ఆక్రందుడు'. ఆ ఇద్దరి వెనుకనున్నవాడు 'ఆసారులు' వారిని వరుసగా 'పార్ష్ణిగ్రహాసారుడు' 'ఆక్రందాసారుడు' అని చెప్పుదురు. విజిగీషువైన రాజు శత్రువుయొక్క ఆక్రమణము ఉన్నను, లేకపోయినను ఆతని విజయమును గూర్చి నిశ్చితముగ ఏమియు చెప్పవీలుపడదు. విజిగీషువు, శత్రువు వీరిరువురును అసంఘటితులై యున్నపుడు వారి నిగ్రహానుగ్రహములందు సమర్థుడగు తటస్థుడైన రాజు 'మధ్యస్థుడు'. ఈ ముగ్గురి విషయమున నిగ్రహానుగ్రహ సమర్థుడగు రాజు ఉదాసీనుడు. ఎవ్వడును ఎవ్వనికిని శత్రువుకాదు; మిత్రుడుకాదు. అందరును కారణవశముచే పరస్పరము శత్రువులగుదురు, మిత్రు లగుదురు. ఈ విధముగ పండ్రెండు రాజమండలములను గూర్చి చెప్పితిని.

కుల్యుడు, అనంతరుడు కృత్రిముడు అని శత్రువులు మూడు విధములు. వీరిలో పూర్వ పూర్వుడు అధిక శత్రువు అనగా కృత్రిమునికంటె అనంతరుడు, అతని కంటె కుల్యుడు ప్రబలులు. కుల్యుని అణచుట చాల కష్టము. నా అభిప్రాయమున అనంతర శత్రువు కూడ కృత్రిముడే. పార్ష్ణి గ్రాహుడు శత్రువుకు మిత్రుడు. అయినను ప్రయత్నించినచో అతడు శత్రువునకు శత్రువు కూడ కావచ్చును. అందుచే వివిధోపాయములచే తన సరిహద్దులోగల రాజును తన వశములో ఉంచుకొనవలెను. మిత్రునిచే శత్రువును నశింప చేయుట మంచిదని ప్రాచీన నీతిశాస్త్రవేత్తల అభిప్రాయము. సామంతుడు (సీమానివాసి) అగుటచే మిత్రుడు కూడ మున్ముందు శత్రువు కావచ్చును. అందుచే విజయముకోరు రాజు, శక్తి ఉన్నచో స్వయముగానే శత్రువును నశింపచేయవలెను. ఎందువలన

అనగా మిత్రుని ప్రతాపము పెరిగిపోయినచో అతని నుండి కూడ భయము కలుగవచ్చును. ప్రతాపహీనుడైన శత్రువు నుంచి కూడ భయముండదు. విజిగీషువైన రాజు ధర్మవిజయి కావలెను. ప్రజలలో ఎవ్వరికిని ఉద్వేగము కలుగకుండునట్లు చూచుకొనుచు విశ్వాసము కలిగించి, తన వశములో నుంచుకొనవలెను. (233)

షాడ్గుణ్య వర్ణనము

పుష్కరుడు చెప్పెను : పరశురామా! సామదానభేద దండోపాయములను గూర్చి వెనుక చెప్పబడినది. తన రాజ్యమునందు దండమును ఎట్లు ప్రయోగించవలెనో కూడ చెప్పబడినది. ఈ నాలుగు ఉపాయములను శత్రు దేశమునందు ఎట్లు ఉపయోగించవలెనో చెప్పెదను. గుప్తము, ప్రకాశము అని దండము రెండు విధములు. గ్రామమును మట్టిలో కలిపివేయుట, పంటకు నష్టము కలిగించుట, నిప్పు పెట్టుట – ఇవి ప్రకాశదండములు. విషము పెట్టుట, రహస్యముగా నిప్పు అంటించుట, అనేక విధముల మనుష్యులచే చంపించుట, సత్పురుషులపై దోషారోపణము చేయుట, నీరు దూషితము చేయుట – ఇవి గుప్త దండములు. భృగునందనా! ఉపేక్షను గూర్చి వినుము – "యుద్ధము చేయుటకు, నాకెవ్వరితోను విరోధము లేదు. వ్యర్థముగా విరోధము అనర్థమూలము. సంధి చేసికొన్నను ఇట్లే అగును. సామ ప్రయోగము చేసితిని గాని ప్రయోజనము కలుగలేదు. దానముచే కేవలము ధనక్షయము కలుగును. భేద దండములచే గూడ ప్రయోజన మేమియు ఉండదు'. అని రాజుకు తోచినచో ఉపేక్షను, ఆశ్రయించవలెను. 'ఈతడు నాకు శత్రువైనను నాకే మియు నష్టములేదు. ఇపుడు నేను కూడ ఆతనిని ఏమియు జేయజాలను'. అను నమ్మిక కలిగి నపుడు గూడ ఉపేక్షను అవలంబించవలెను. తన శత్రువును అనాదరము చేతనే తొల గించుకొనవలెను.

ఇపుడు మాయ అను ఉపాయము చెప్పెదను. అసత్యమైన ఉత్పాతములు చూపి శత్రువులలో భయాందోళనము కలిగించవలెను. స్థూలమైన ఒకపక్షి తోకకు చాల పొడవైన మండుచున్న ఉల్కను (కొరవి) కట్టి దానిని శత్రువుల గుడారము వైపు విడువవలెను. దానిని చూచి శత్రువులు ఉల్కా పాతమను భ్రాంతిచెందునట్లు చేయవలెను. ఈ విధముగనే అనేక మైన ఉత్పాతములు చూపవలెను. అనేక విధములైన మాయలు చూపు మదారీలను పంపి వారిద్వారా శత్రువులలో ఉద్వేగము కలిగించవలెను. తపస్వుల చేతను, జ్యోతిష్కుల చేతను 'నీకు ఆపద రానున్నదని' చెప్పించవలెను. భూమిని జయించదలచిన రాజు ఈ విధముగ అనేక ఉపాయములచే శత్రువులను భయభీతులను చేయవలెను. తనకు దేవతానుగ్రహము ఉన్నట్లును దేవతలు తనకు వరప్రదానము చేసినట్లును వారికి తెలియు నట్లు చేయవలెను. యుద్ధము ప్రారంభమైనచో తన సైనికులతో – 'వీరులారా! నిర్భయముగ పోరాడుడు. మన మిత్రసేన వచ్చినది. శత్రువులు పారిపోవుచున్నారు' అని గర్జించి చెప్పుచు హర్షధ్వనులు చేయవలెను. 'నా శత్రువు హతుడైనాడు' అని చెప్పవలెను. దేవతా దేశముచే వృద్ధిని పొందిన రాజు కవచాదులతో సన్నద్ధుడై యుద్ధ భూమిపై ప్రవేశించవలెను.

ఇపుడు ఇంద్రజాలమును గూర్చి చెప్పెదను. రాజు సమయానుసారముగ ఇంద్ర జాలము ప్రదర్శించవలెను. తమ సాహాయ్యమునకై దేవతల చతురంగ సైన్యము వచ్చినట్లు శత్రువులకు చూపవలెను. శత్రుసేనపై రక్తవర్షము కురిపించి మాయచే, శత్రువుల భిన్న ములగు శిరస్సులు భవనముపైన కనబడునట్లు చేయవలెను.

ఇపుడు ఆరు గుణములను గూర్చి చెప్పెదను. సంధి – విగ్రహములు ప్రధానమైనవి. సంధి, విగ్రహ, యాన, ఆసన, ద్వైధీభావ, సంశ్రయములు ఆరు గుణములు. కొన్ని షర తులపై శత్రువుతో కలియుట 'సంధి'. యుద్ధాదులచే వానికి నష్టము కలిగించుట 'విగ్ర హము'. శత్రువుపై దండెత్తి వెళ్ళుట 'యానము' విగ్రహము ప్రారంభించి తన దేశమునందే ఉండుట 'ఆసనము'. సగము సేనతో యుద్ధమునకు వెళ్ళుట ద్వైధీభావము. ఉదాసీనుని గాని, మధ్యస్థునిగాని శరణుజొచ్చుట 'సంశ్రయము'.

తన కంటె దుర్బలునితో కాక, తనతో సమాన బలునితో, అధిక బలునితోను సంధి చేసికొన వలెను. తాను బలంతుడై శత్రువు దుర్బలుడైనపుడు ఆతనితో విగ్రహమే చేయవలెను. హీనావస్థలో నున్నను, తన పార్ష్ణిగ్రాహకుడు మంచివాడైనచో బలవంతుడగు రాజును ఆశ్రయించవలెను. యుద్ధమునకు వెళ్ళకపోయినను శత్రుకార్యములను నశింపచేయగల రాజు, పార్ష్ణిగ్రాహకుడు మంచి వాడు కాకున్నను, విగ్రహము చూపి ఊరక కూర్చుం డవలెను. లేదా పార్ష్ణి గ్రాహకుడు మంచివాడు కానప్పుడు ద్వైధీభావమును అవలం బించవలెను. బలవంతుడగు రాజు చేతిలో పడిపోయెదమను భయమున్నపుడే సంశ్రయము అవలంబించవలెను. ఇది సామాది గుణములన్నింటి కంటెను అధమమైనది. సంశ్రయమునకు తగిన పరిస్థితులలో ఉన్న రాజు యానమవలంబించినచో జన మును, ధనమును కూడ కోల్పోవును. ఎవరినైన ఆశ్రయించుటచే అధిక లాభము కలుగునను ఆశయున్నచో సంశ్రయమును అవలంబించవలెను. అన్ని విధముల శక్తి క్షీణించినపుడు మాత్రమే ఇతరులను శరణు వేడవలెను. (234)

రాజు యొక్క దినచర్యా కథనము

పుష్కరుడు చెప్పెను : పరశురామా! రాజు ప్రతిదినము చేయవలసిన పనులు చెప్పెదను. ఇంకను ఘడియరాత్రి ఉన్నదనగా రాజు వివిధ మంగళ వాద్యధ్వనులు, వందిమాగధుల స్తుతులు, మంగళ గీతములు వినుచు మేల్కొనవలెను. పిదప గూఢచారు లను చూడవలెను. వీరు రాజసేవకులు అని గూఢచారులను గూర్చి ఎవ్వరికిని తెలియకూడదు. పిదప యథావిధిగ ఆయవ్యయముల లెక్కలు వినవలెను. శౌచాద్య నంతరము స్నాన గృహము ప్రవేశించి, ముందుగ దంత ధావనముచేసి పిదప స్నానము చేయవలెను. సంధ్యోపాసనానంతరము శ్రీమహావిష్ణువును పూజించవలెను. పిదప పవిత్రుడై అగ్ని హోత్ర ముచేసి పితృ తర్పణములు చేయవలెను. పిదప బ్రాహ్మణాశీర్వాదములు గ్రహించి వారికి సువర్ణసహితముగా పాలు ఇచ్చు గోవును దానము చేయవలెను. చందనము, అలంకారము ధరించి అద్దమునందును, సువర్ణయుక్తమగు ఘృతమునందును తన ముఖము

చూచు కొనవలెను. దైవిక కథాదులు విని, వైద్యుడు చెప్పిన ఔషధము సేవించి, మంగళవస్తువులు స్పృశించి, గురుదర్శనముచేసి, ఆతని ఆశీర్వాదములు పొంది రాజసభలో ప్రవేశించవలెను.

రాజసభలో బ్రాహ్మణులను, అమాత్యులను కలిసి తన దర్శనము నిమిత్తమై వచ్చియున్నట్లు ద్వారపాలకుడు చెప్పిన ప్రజలకు దర్శనమీయవలెను. ఇతిహాస శ్రవణా నంతరము రాజ్యకార్యములను పర్యవేక్షించవలెను. వాటిలో చాల అవశ్యకములగు వాటిని గూర్చి నిర్ణయములు తీసికొని, ప్రజల వ్యవహారములు చూచి, మంత్రులతో గుప్త విషయములను చర్చించవలెను. ఒక్కనితో మాత్రముగాని, చాలమందితోగాని, మూర్ఖులతోగాని, విశ్వాసయోగ్యులు కానివారితోగాని మంత్రణము చేయ గూడదు. సర్వదా గుప్త రూపముననే చేయవలెను. ప్రకటముగ చేయరాదు. రాజ్యమునందు ఎట్టి బాధలును రాని విధమున, మంత్రణములను రహస్యముగా ఉంచవలెను. మంత్రణము రహస్యముగా ఉంచుటకు ఉపాయము తన ఆకార చేష్టాదులందు ఎన్నడును, ఎట్టి మార్పులను లేకుండ చూచుకొను టయే. ఏలనన బుద్ధిమంతులు ఆకారచేష్టాదుల ద్వారా గుప్తములగు మంత్రణములను కూడ కనిపెట్టివేయుదురు. జ్యోతిష్కులు, మంత్రులు, వైద్యులు చెప్పిన మాటలను రాజు వినవలెను. అట్లు చేయుటచే ఐశ్వర్యమును పొందును. ఏలనన వీరు రాజును అనుచిత కార్యములనుండి మరల్చి హితకార్యములందు ప్రవర్తింపచేయుదురు. మంత్రణలు ముగిసిన పిదప రథాదులను నడపుట, శస్త్ర ప్రయోగము మొదలగు వాటితో కొంతసమయము వ్యాయామము చేయవలెను. యుద్ధాది సమయములందు రాజు స్నానమొనరించి, బాగుగా పూజచేసిన శ్రీమహావిష్ణువును, హోమానంతరము ప్రజ్వలించుచున్న అగ్నిని, దానమానాదు లచే సత్కృతులగు బ్రాహ్మణులను చూడవలెను. దానాద్యనంతరము వస్త్రాలంకారాదులతో అలంకరించుకొని పరీక్షించిన అన్నము భుజించవలెను. తాంబూల సేవనము చేసి ఎడమప్రక్కగా కొంతసేపు శయనించవలెను. ప్రతిదినము శాస్త్రచింతనము, యోధ – అన్నభాండార, శస్త్రాగారముల పర్యవేక్షణము చేయవలెను. దినాంతమున సాయంసంధ్యను ఉపాసించి, ఇతర కార్యములను గూర్చి విచారించి, ఆవశ్యకములగు పనులపై గూఢచారు లను పంపి, రాత్రి భోజనానంతరము అంతఃపురములోనికి వెళ్లవలెను. అచట సంగీత వాద్యా దులతో మనోరంజనము చేసుకొని ఆత్మరక్షణోపాయములను చక్కగా చేసికొని నిద్రిం చవలెను. రాజు ప్రతిదినము ఇట్లే చేయవలెను. (235)

రణదీక్షా వర్ణనము

పుష్కరుడు పలికెను :

ఇపుడు యుద్ధ యాత్రా విధానమును, యుద్ధ సమయమున చేయదగిన పనులను చెప్పెదను. ఏడు రోజులలో యుద్ధయాత్ర చేయవలెననగా మొదటి రోజున శ్రీమహా విష్ణువును, మహేశ్వరుని పూజించవలెను. మోదకాదులతో గణాధిపతిని పూజించవలెను. రెండవరోజున దిక్పాలకుల పూజచేసి, శయ్యపై కూర్చుండిగాని, అంతకు పూర్వమేగాని ఈ అర్థముగల మంత్రము జపించవలెను – 'త్రినేత్రా! రుద్రా! వరదాయకా! వామనా! వికటరూపధరా! శివా! నీవు స్వప్నాధిష్టాన దేవతవు

నీకు మాటి మాటికి నమస్కరించుచున్నాను. నీవు దేవాధి దేవతలకు కూడ అధిపతివి. త్రిశూలధారివి. వృషభారూఢుడవు. సనాతనా! పరమేశ్వరా! నీకీ యుద్ధమునందు ఇష్టము కలుగునో, అనిష్టము వాటిల్లునో స్వప్నమునందు చెప్పుము'. ఆ సమయమునందు పురోహితుడు 'యజ్ఞాగ్రతో దూరముపైతి' (యజు. 31.1) అను మంత్రము పఠించవలెను. మూడవ రోజున దిక్కులను రక్షించు రుద్రులను దిక్పాలకులను పూజించవలెను. నాల్గవ రోజున గ్రహములను, ఐదవ రోజున అశ్వినీ కుమారులను, మార్గమున వచ్చు దేవీ, దేవతా, నద్యాదులను పూజించి, ద్యులోకము అంతరిక్ష భూలోకములందుండు దేవతలకు బలి సమర్పించవలెను. రాత్రి భూత గణములకు బలి ఇవ్వవలెను. వాసుదేవ, భద్రకాళీ, లక్ష్మ్యాదుల పూజచేసి సకల దేవతలను ప్రార్థించవలెను. 'వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, నారాయణ, బ్రహ్మ, విష్ణు, నరసింహ, వరాహ, శివ, ఈశాన, తత్పురుష, అఘోర, వామదేవ, సద్యోజాత, సూర్య, సోమ, భౌమ, బుధ, బృహస్పతి, శుక్ర, శనైశ్చర, రాహు, కేతు, గణేశ, కార్తికేయ, చండికా, ఉమా, లక్ష్మీ, సరస్వతీ, దుర్గా, బ్రహ్మాణ్యాది గణ, రుద్ర, ఇంద్రాది దేవ, అగ్ని నాగ, గరుడులును, ద్యులోకము అంతరిక్ష భూములపై నివసించు ఇతరదేవతలును నాకు విజయమును ఇచ్చెదరుగాక. నేనిచ్చిన ఈ బలిని, పూజను స్వీకరించి దేవతలు అందరును యుద్ధము నందు నా శత్రువులను నశింప జేయుదురు గాక. దేవతలారా! నేను మాతృ, పుత్ర భృత్య సహితుడనై మిమ్మును శరణు జొచ్చుచున్నాను. మీరు శత్రుసేన వెనక నుండి దానిని నశింపచేయుడు. నేను నమస్కరించుచున్నాను. యుద్ధము నుండి విజయ వంతుడనై తిరిగి వచ్చినచో ఇపుడు చేసిన బలి పూజాదుల కంటె అధికముగ సమర్పించెదను.

ఆరవ రోజున రాజ్యాభిషేకము చేసికొనినట్లు విజయస్నానము చేసి ఏడవ రోజున త్రివిక్రముని పూజించవలెను. నీరాజన మంత్రములతో ఆయుధ, వాహన పూజ చేయవలెను. 'పుణ్యాహ' 'జయ' శబ్దములతో బ్రాహ్మణ ముఖము నుండి ఈ మంత్రములను వినవలెను – 'రాజా! ద్యులోక, అంత రిక్ష, భూములపై నివసించు దేవతలు నాకు దీర్ఘాయువు నిచ్చెదరు గాక. దేవతలవలె నీవు సిద్ధిని పొందెదవుగాక. ఈ నీ యాత్ర దేవతా యాత్ర యగునుగాక. దేవతలు నిన్ను రక్షింతురు గాక'. ఈ ఆశీర్వాదము విని రాజు ముందుకు సాగవలెను. 'ధన్వనాగా' (యజు. 2.39) ఇత్యాది మంత్రముతో ధనుర్బాణములు చేత ధరించి, 'తద్విష్ణోః' (యజు. 6.5) ఇత్యాది మంత్రము జపించుచు శత్రువు వైపు ఎడమకాలు ఉంచి ముప్పది రెండు అడుగులు ముందుకు వేయవలెను. పిదప పూర్వ, దక్షిణ, పశ్చిమ, ఉత్తరముల వైపు వెళ్ళుటకు వరుసగ ఏనుగులు, రథములు, గుఱ్ఱములు, భారమును మోయు జంతువులు – వీటిపై ఎక్కి యుద్ధ వాద్య ఘోషములతో ముందుకు సాగవలెను. వెనుకకు తిరిగి చూడగూడదు.

ఒక క్రోసు దూరము వెళ్లిన పిదప ఆగి దేవతాబ్రాహ్మణుల పూజ చేయవలెను. రాజు తనవెనుక వచ్చుచున్న సైన్యమును రక్షించుకొనుచు ఇతరదేశమునకు యాత్ర చేయ వలెను. విదేశమునకు వెళ్లినను తన దేశాచారమును పాలించుట రాజునకు కర్తవ్యము. ప్రతిదినమునందును దేవతాపూజ చేయవలెను. ఎవ్వని ఆదాయమునకును నష్టము కలిగించకూడదు. ఆ దేశమునందలి మనుష్యులను ఎన్నడును అవమానించరాదు. విజయము పొంది తిరిగి తన దేశమునకు వచ్చిన పిమ్మట దేవతలకు

పూజలుచేసి, దానము ఈయ వలెను. మరునాడు యుద్ధప్రారంభమగుచున్నచో తొలిరోజున గజ అశ్వాది వాహనములకు స్నానము చేయించి, నృసింహస్వామిని పూజించవలెను. ఛత్రాది రాజ చిహ్నములకును, అస్త్ర శస్త్రములకును, భూత గణములకును రాత్రి పూజలు చేసి ప్రాతఃకాలమున మరల నృసింహస్వామికిని, సకల వాహనాదులకును పూజచేయవలెను. పురోహితుడు హోమము చేసిన అగ్నిని చూచి, తాను కూడ హోమముచేసి, బ్రాహ్మణుల సన్మానము చేసి, ధనుర్బాణములు ధరించి, గజారూఢుడై యుద్ధమునకు వెళ్లవలెను. శత్రుదేశమునందు అదృశ్యుడుగా ఉండి ప్రకృతి కల్పన సేనానివేశము చేయవలెను. సైనికుల సంఖ్య తక్కువగా ఉన్నచో వారిని అందరిని ఒక్కచోట చేర్చి యుద్ధము చేయవలెను; అధికముగా ఉన్న వాళ్లను ఇచ్ఛానుసారముగ విస్తరింపచేయవలెను.

అల్పసంఖ్యాకులగు సైనికులతో అధిక సంఖ్యాకులగువారిని ఎదుర్కొనుటకు సూచీ ముఖమను వ్యూహము మంచిది. ప్రాణి శరీర సదృశములు, ద్రవ్యరూపములు అని వ్యూహములు రెండు విధములు. గరుడ, మకర, చక్ర, శ్యేన, అర్ధచంద్ర, వజ్ర, శకట, సర్వతోభద్రమండల, సూచీ వ్యూహములను తొమ్మిది వ్యూహములు ప్రసిద్ధములు. అన్ని వ్యూహములందును సైనికులను ఐదు భాగములుగా విభజించి, రెండు పక్షములు, రెండు అనుపక్షములు ఏర్పరచి ఒక పంచమభాగమును గూడ ఉంచుకొనవలెను. యోధులలో ఒక భాగముతోగాని, రెండు భాగములతో గాని యుద్ధము చేయుచు మిగిలిన మూడు భాగములను వారి రక్షణకై ఉపయోగించవలెను. రాజును ఎన్నడును వ్యూహమునందు నిలుప గూడదు. రాజే మూలము. ఆ మూలము వినష్టమైనచో రాజ్యమే నశించును. అందుచే రాజు యుద్ధములో పాల్గొనగూడదు. అతడు సైన్యమునకు వెనుక ఒక క్రోసు దూరము నందు ఉండవలెను. అచట ఉండి రాజు యుద్ధమునుండి పారిపోవుచున్న యోధులకు ధైర్యము చెప్పి ప్రోత్సహించవలెను. సేనాపతి పారిపోయినను, మరణించినను సైన్యము నిలువజాలదు. వ్యూహమునందలి యోధులు ఒకరికొకరు చాల దగ్గరగా గాని, దూరముగా గాని నిలువకూడదు. ఒకరి ఆయుధములు ఒకరికి తగులకుండునంత దూరమున నిలువవలెను.

శత్రు వ్యూహమును భేదించుటకు యోధులందరును సంఘటితులై ప్రయత్నిం చవలెను. శత్రువులు తమ వ్యూహమును భేదించుటకై ప్రయత్నించునపుడు కూడ యోధులు సంఘటితులై ఎదిరించవలెను. శత్రుసైన్యములోనికి చొచ్చుకొని పోవుటకు వీలగునట్లు ఇచ్ఛానుసారముగ వ్యూహరచన చేయవలెను. ఏనుగుల కాళ్లను రక్షించుటకై నాలుగు రథములను నియమించవలెను. రథమును రక్షించుటకు నలుగురు ఆశ్వికులను, వారి రక్షణకై నలుగురేసి ఖడ్గచర్మధారులగు పదాతులను నలుగురేసి ధనుర్ధారులను ఏర్పరుప వలెను. యుద్ధమున అందరికంటె ముందు ఖడ్గ ధారులగు పదాతులు ఉండవలెను. వారి వెనుక ధానుష్కులు, వారి వెనుక ఆశ్వికులు, వారి వెనుక రథములు, వారి వెనుక గజసేన ఉండునట్లు ఏర్పరుపవలెను.

పదాతులు, హాస్తికులు, ఆశ్వికులు ప్రయత్న పూర్వకముగ ధర్మయుద్ధము చేయవలెను. యుద్ధ భూమి అగ్రమున శూరులగు యోధులను ఉంచవలెను. పిరికివారిని ఎన్నడును ఉంచరాదు. ఎదుట నుంచిన శూరులకు శత్రువుల సమూహము మాత్రమే కనబడునట్లు ఏర్పరచవలెను.

అపుడే వారు పౌరుషము చూపి శత్రువులను పారద్రోలగలరు. పిరికి వారిని సేనాగ్రము నందుం చినచో పారిపోయి స్వయముగనే వ్యూహమును భిన్నము చేయుదురు. అందుచే వారిని ముందు ఉంచరాదు. శూరులు ముందున్నచో వెనుకనున్న భీరువులకు గూడ ఉత్సాహము కలిగింతురు. ఉన్నతులును, చిలుకముక్కు కలవారును, సౌమ్యమైన దృష్టి కలవారును, కలిసిన కనుబొమ్మలు కలవారును, కోపశీలులును, కలహప్రియులును హర్షోత్సాహభరితులును, కామపరాయణులును అగువారు శూరులైన వీరులు.

గాయపడినవారిని, మరణించినవారిని యుద్ధభూమినుండి తొలగించుట, యుద్ధ రంగమునందు ఉన్న ఏనుగులకు నీరు త్రాగించుట, ఆయుధములు అందించుట ఇది పదాతుల కర్తవ్యము. శత్రుసైనికులు తమ సైన్యమును భేదించకుండ రక్షించుచు శత్రు వ్యూహమును భేదించుట ఖడ్గవీరుల కర్తవ్యము. శత్రువులను కొట్టి యుద్ధభూమి నుండి పారద్రోలుట ధనుర్ధరుల కర్తవ్యము. ఎక్కువగా గాయపడినవారిని యుద్ధభూమినుండి తొలగించి, తిరిగి వచ్చి శత్రుసైన్యమునందు భయము ఉత్పన్నము చేయుట రథికుల కర్తవ్యము. సంఘటిత వ్యూహమును భేదించుట, భిన్నమైనదానిని కలుపుట, ప్రాకార ద్వారాదులను, ఇంటిపై భాగములను, వృక్షములను భగ్నము చేయుట గజముల కర్తవ్యము. పదాతులకు ఎగుడుదిగుడుగా నున్న భూమి, రథ, అశ్వములకు సమతల భూమి, ఏనుగులకు బురదనేల యుద్ధమునకు అనుకూలములు.

ఈ విధముగ వ్యూహరచనచేసి, సూర్యుడు వెనుకవైపు ఉన్నపుడు, శుక్ర, శనైశ్చరులును, దిక్పాలకులును అనుకూలముగా నుండగా, ఎదుటినుండి మందవాయువు వీచుచుండగా, యుద్ధము చేయుచు, నామగోత్రాదులను పేర్కొని యోధులందరికిని ఉత్సాహము కలిగించవలెను. 'యుద్ధము నందు విజయము లభించినచో ఉత్తమ భోగములు లభించును; మరణించినచో స్వర్గసుఖము లభించును' అనికూడ చెప్పుచుండవలెను. వీరుడు శత్రువులను జయించినచో మనోవాంఛిత భోగములను పొందును. మరణించినచో ఉత్తమగతులను పొందును. స్వామి అన్నము తిన్నందులకు ఋణవిముక్తుడగును. అందుచే యుద్ధము వంటి శ్రేష్ఠమైనది మరొకటి లేదు. శరీరము నుండి రక్తము స్రవించినచో వీరుడు పాపవిముక్తుడగును. యుద్ధమునందు శస్త్ర ప్రహారాది కష్టములను సహించ వలసియుండును. అదియొక గొప్ప తపస్సు. యుద్ధమునందు ప్రాణ త్యాగము చేయు వీరుని వద్దకు వేలకొలది అప్సరసలు వత్తురు. హతోత్సాహుడై యుద్ధభూమినుండి పారిపోవు యోధుని పుణ్యమంతయు అతని స్వామికి చేరును. అడుగడుగునను బ్రహ్మహత్యా పాపము వచ్చును. తన సహాయులను విడచి పారిపోవువానిని దేవతలే నశింపచేయుదురు. యుద్ధమునుండి అడుగుకదపని వీరునకు అశ్వమేధయాగ ఫలము లభించును.

ధర్మమునందు దృఢముగా నిలచు రాజునకు విజయము లభించును. యోధులు తమతో సమానమైన యోధులతోడనే యుద్ధము చేయవలెను. హస్తికాదులు హస్తికాదుల తోడనే యుద్ధము చేయవలెను. పారిపోవుచున్నవారిని చంపకూడదు. యుద్ధము చూచుటకై వచ్చినవారిని, శస్త్రహీనులను, నేలపై పడిపోయినవారిని, ఎన్నడును చంపగూడదు. అలసి పోయిన వానిని, నిద్ర

వచ్చిన వానిని, నదీ మధ్యయందుగాని, అడవియందుగాని ఉన్న వానిని కొట్టగూడదు. దుర్దినమునందు శత్రువులను నశింప చేయుటకై కూటయుద్ధము చేయవలెను. రెండు చేతులు పైకెత్తి – 'చూడుడు! శత్రువులు పారిపోవుచున్నారు. మన మిత్రసేన వచ్చినది. శత్రుసేనా సంచాలకులు మరణించినారు. సేనాపతి కూడ మరణించినాడు. శత్రురాజు కూడ మరణించినాడు' అని గట్టిగా చెప్పవలెను.

పారిపోవుచున్న శత్రుయోధులను అనాయాసముగ చంపివేయవచ్చును. ఓ ధర్మజ్ఞా! శత్రువులను మోసగించుటకు కృత్రిమమగు సుగంధ ధూపమును ప్రసరింపచేయవలెను. విజయపతాకలు ఎగురవేయవలెను. వాద్యములను భయంకరముగ మ్రోగించవలెను. విజయము లభించినచో దేవతా, బ్రాహ్మణులను పూజించవలెను. అమాత్యుడు చేసిన యుద్ధము నందు లభించిన రత్నాదులను రాజునకే ఇవ్వవలెను. శత్రుస్త్రీలపై ఎవ్వరికిని అధికారములేదు. వారికి తగు రక్షణము ఇవ్వవలెను. యుద్ధమునందు సహాయకులు లేని శత్రువును పుత్రుని పాలించినట్లు పాలించవలెను. ఆతనితో మరల యుద్ధము చేయరాదు. అతని విషయమున దేశోచితాచారాదుల పాలనము చేయవలెను. యుద్ధమునందు విజయము లభించిన పిమ్మట నగరమునకు తిరిగివెళ్ళి ధ్రువ నక్షత్రములందు రాజ భవనమును ప్రవేశించవలెను. దేవతలను పూజించి, సైనికుల కుటుంబముల పోషణకు ఏర్పాట్లు చేయవలెను. శత్రువునుండి లభించిన ధనములో కొంతభాగము భృత్యులకు కూడ పంచి పెట్టవలెను. నేను చెప్పిన ఈ రణదీక్షానుసారము కార్యములు చేయు రాజుకు తప్పక విజయము లభించును. (236)

శ్రీ స్తోత్ర వర్ణనము

పుష్కరుడు పలికెను : పూర్వము తన రాజ్యలక్ష్మిని స్థిరముగా ఉంచుకొనుటకై ఇంద్రుడు ఏ విధముగ లక్ష్మీ స్తవము చేసెనో అట్లే రాజు విజయము కొరకు లక్ష్మీస్తవము చేయవలెను. ఇంద్రుడు పలికెను : సకలలోక జననియు, సముద్ర సంభవయు, వికసిత కమలనేత్రయు, విష్ణువక్షః స్థితయు అగు లక్ష్మికి నమస్కారము. ఓ లోకపావనీ! నీవే సిద్ధివి; స్వాహా, స్వధా, సంధ్యా, రాత్రి, ప్రభా, భూతి, మేధా, శ్రద్ధా, సరస్వతీ రూపిణివి. ప్రకాశించుదానవు ముక్తిరూప ఫలదాత్రివి అగు ఓ దేవీ! యజ్ఞవిద్య, మహావిద్య, గుహ్య విద్య, ఆత్మవిద్య, ఆన్వీక్షికి, త్రయి, వార్త, దండనీతి కూడ నీవే. నీవు సౌమ్యురాలవు, నీతో నిండిన ఈ జగత్తుకూడ సౌమ్యమైనది. దేవీ! గదాధారియైన దేవదేవుడైన శ్రీమహా విష్ణువు యొక్క సర్వయజ్ఞ స్వరూపము, యోగులచే ధ్యానింపబడునది అయిన శరీరమును నీవు తప్ప ఎవరు అధిష్ఠించగలరు? దేవీ! నీవు విడచినంతనే ఈ భువనత్రయము వినష్టమై పోయినది. నీచే ఇపుడు పోషింపబడుచున్నది. మహాదేవీ! నీ దృష్టిపడగనే మానవులకు భార్య, పుత్రులు, గృహము, స్నేహితులు, ధాన్యము, ధనము మొదలగునవి నిత్యము లభిం చును. నీ దృష్టిచే చూడబడిన పురుషులకు ఆరోగ్యము, ఐశ్వర్యము, శత్రుపక్ష వినాశనము, సుఖము – ఇవన్నియు దుర్లభములు కావు. సర్వ భూతములకును నీవే తల్లివి, దేవదేవుడైన శ్రీమహావిష్ణువు తండ్రి. ఈ చరాచర జగత్తునంతను, నీవు, శ్రీమహావిష్ణువు వ్యాపించి యున్నారు. ఓ సర్వపావనీ!

నీవు ఎన్నటికిని, నా కీర్తిని, ధనాగారమును, అన్నకోష్ఠమును, గృహమును పరివారమును, శరీరమును, భార్యను విడచివెళ్ళకుము. శ్రీ మహావిష్ణు వక్షస్థలముపై నివసించుదానా! నా పుత్రులను, స్నేహితులను, పశువులను, అలంకారము లను విడిచి వెళ్ళకుము. ఓ నిర్మలురాలా! నీచే విడువబడిన వారు, సత్యము చేతను, సమతాశౌచముల చేతను, శీలము మొదలగు గుణములచేతను పరిత్యజింప బడుదురు. నీచే చూడబడినవారు నిర్గుణులైనను వారికి శీలాది సకల గుణములును, కులైశ్వర్యా దులును లభించును. ఓ దేవీ! నాచే చూడబడినవాడే శ్లాఘ్యుడు, గుణవంతుడు, ధన్యుడు, కులీనుడు, బుద్ధిమంతుడు, శూరుడు, విక్రాంతుడు, జగత్తును పోషించు ఓ విష్ణు వల్లభా! నీవు ఎవని విషయమున పరాఙ్ముఖురాలవగుదువో ఆతని శీలాది సకల గుణములును వెంటనే విగుణ ములగును. బ్రహ్మదేవుని నాలుక గూడ నీ గుణములను వర్ణింపజాలదు. ఓ పద్మాక్షీ! దేవీ! అనుగ్రహింపుము. మమ్ములను ఎన్నడును విడువకుము. పుష్కరుడు పలికెను. ఈ విధముగ స్తుతిం పబడిన లక్ష్మి ఇంద్రునకు కోరికను, రాజ్య స్థైర్యమును యుద్ధ విజయాదులను అనుగ్రహించెను. తన స్తోత్రమును పఠించు వారికిని, వినువారికిని భుక్తి ముక్తులను వరముగా ప్రసాదించెను. అందుచే మానవుడు సర్వదా శ్రీ స్తోత్రమును చదువవలెను. వినవలెను. (237)

రాముడు బోధించిన రాజనీతి - 1

అగ్ని దేవుడు పలికెను : వశిష్టా! ఇంతవరకు, పుష్కరుడు బోధించిన రాజనీతిని చెప్పితిని. ఇపుడు లక్ష్మణునకు రాముడు చెప్పిన విజయప్రదమగు రాజనీతిని వినుము. శ్రీరాముడు చెప్పెను. లక్ష్మణా! న్యాయముగా ధనమును ఆర్జించుట, సంపాదించినదానిని వ్యాపారాదుల ద్వారా వృద్ధి పొందించుకొనుట, దానిని స్వజనుల నుండియు, పరుల నుండియు రక్షించుకొనుట, సత్పాత్రము లందు వినియోగించుట ఇవి రాజు చేయవలసిన నాలుగుపనులు. నయమునకు మూలము వినయము. అది శాస్త్రనిశ్చయముచే కలుగును. వినయమనగా ఇంద్రియజయము. వినయము కలవాడే శాస్త్రములను పొందగల్గును. శాస్త్ర జ్ఞానము, ఎనిమిది గుణములుగల బుద్ధి, ధృతి, దక్షత, ప్రగల్భత్వము, ధారణశక్తి, ఉత్సాహము, ప్రవచనశక్తి, దృఢత్వము, ప్రభుశక్తి, శుచిత్వము, మైత్రి, త్యాగము, సత్యము, కృత జ్ఞత, కులీనత్వము, శీలము, దమము-ఇవి సంపత్తికి హేతువులగు గుణములు. విషయ ములనెడు మహారణ్యములో నిర్భయముగ పరుగెత్తుచున్న ఇంద్రియ గజములను జ్ఞానాంకుశముతో వశమునందు ఉంచుకొనవలెను. రాజు, కామ, క్రోధ, లోభ, మోహ, హర్ష, మద, మాత్సర్య మానములను అరిషడ్వర్గమును పూర్తిగా పరిత్యజించినచో సుఖవంతుడగును.

రాజు, వినయ గుణ సంపన్నుడై, ఆన్వీక్షకి, వేదత్రయము, వార్త (కృషి వాణిజ్య పశుపాలనాది కము), దండనీతి అను నాలుగు విద్యలను గూర్చి విద్వాంసుల వద్దను, వాటి ప్రయోగమునందు నేర్పుకలవారి వద్దను కూర్చుండి చింతనము చేయవలెను. ఆన్వీక్షకి వలన ఆత్మజ్ఞానము, వస్తుయథార్థ స్వరూప జ్ఞానము కలుగును. ధర్మాధర్మ జ్ఞానము వేదత్రయాధీనము. అర్థ-అనర్థములు వార్తా ప్రయోగాధీనములు. న్యాయ-అన్యాయములు దండనీతి యొక్క సముచిత ప్రయోగముపై ఆధారపడి యున్నవి. ఏ ప్రాణులకును కష్టము కలిగించకుండుట, మధురముగా మాటలాడుట, సత్యము

పలుకుట, బైటను అంతరంగమునందును పవిత్రముగ నుండుట, శౌచారపాలనము, దీనులపై దయ, ఓర్పు - ఇవి అన్ని వర్ణములవారికిని, ఆశ్రమముల వారికిని వర్తించు సాధారణ ధర్మములు. రాజు ప్రజలను అనుగ్రహించుచు, సదాచార తత్పరుడై ఉండవలెను. మధురమైన వాక్కు దీనుల పెదయ, దేశకాలానుసారము సత్పాత్ర దానము, దీనులను శరణా గతులను రక్షించుట, సత్పురుష సహవాసము-ఇది సత్పురుషుల ఆచారము. ఈ ఆచారము ప్రజాసంగ్రహోపాయము. ఇది లోక ప్రశంసా పాత్రముగాన శ్రేష్ఠము. భవిష్యత్తులోగూడ అభ్యుదయ హేతువుగాన హితకరము. ఈ శరీరము రోగములతోను, మానసిక చింతలతోను నిండియున్నది. నేడో, రేపో దీని వినాశము నిశ్చితము. ఇట్టి పరిస్థితులలో ఇట్టి శరీరము కొరకై ఏ రాజు అధర్మాచరణము చేయును?

రాజు తాను సుఖించుచు దీనులను పీడించకూడదు. ఏలనన పీడితులైన దీనజనులు దుఃఖము వలన కలిగిన క్రోధముచే క్రూరుడైన రాజును నశింపజేయుదురు. కల్యాణమును కోరు రాజు పూజ్యుల విషయమున ఏ విధమున అంజలి ఘటించి ఆదరము చూపునో దుష్టుల విషయమున అంతకంటె కూడ అధికమగు ఆదరము చూపవలెను. మంచి స్నేహి తుల విషయమునను, దుష్టులగు శత్రువుల విషయమున గూడ ప్రియవచనములే పలుక వలెను. ప్రియవాది 'దేవత'; కటువాది 'పశువు'. రాజు బైటను లోపలను విశుద్ధుడై, ఆస్తికత్వముతో అంతఃకరణమును పవిత్రము చేసికొని సర్వదా దేవతలను పూజించవలెను.

గురువులను దేవతలను వలె పూజించవలెను. మిత్రులను తనతో సమానులని భావించుచు బాగుగ సత్కరించవలెను. తన ఐశ్వర్యమును రక్షించుకొనుటకును, వృద్ధిపొందించు కొనుటకును, రాజు ప్రతిదినము ప్రణామము చేయుచు పెద్దలను అనుకూలులనుగా చేసికొనవలెను. సాంగవేదాధ్యయనము చేసిన వారు ప్రవర్తించు విధముగ ప్రవర్తించుచు విద్యా వృద్ధులగు సత్పురుషులను సుముఖులను చేసికొనవలెను. సుకృత కర్మలచే దేవతాను కూల్యము సంపాదించవలెను. సద్భావముచే మిత్రులను, ఆదరముచే బంధువులను, ప్రేమచే స్త్రీలను, దానముచే భృత్యులను అనుకూలులుగ చేసికొనవలెను. ఇతరులను అనుకూలతా ప్రదర్శనము ద్వారా సుముఖులను చేసికొనవలెను.

ఇతరుల పనులు నిందింప కుండుట, తన వర్ణాశ్రమ ధర్మములను నిరంతరము పాలించుట, దీనులయెడ దయ, లోక వ్యవహారములు అన్నింటి యందును, అందరితోడను, మధురముగా మాటలాడుట, ప్రాణములు ఇచ్చియైనను తన ప్రియమిత్రులకు ఉపకారము చేయుటకై సిద్ధముగా ఉండుట ఇంటికి వచ్చిన మిత్రులను, ఇతర సజ్జనులను కౌగలించుకొనుట, అవసరమైనచో యథా శక్తిగ వారికి ధనమిచ్చుట, ఇతరుల కటుప్రవర్తనను, కఠోరవచనములను సహించుట, తనకు అభివృద్ధి కలిగినపుడు వికారరహితుడుగ నుండుట, ఇతరులకు అభ్యుదయము కలిగినపుడు ఈర్ష్య లేకుండుట, ఇతరులకు బాధ కలిగించు మాట పలుకకుండుట, మౌనముగా నుండుట, బంధువులతో సంబంధము అవిచ్ఛిన్నముగ ఉంచుకొనుట, సజ్జనులతో ఋజు ప్రవర్తనము, వారి సమ్మతి ప్రకారము కార్యము చేయుట-ఇవి మహాత్ముల ఆచారము. (238)

రాముడు బోధించిన రాజనీతి - 2

శ్రీరాముడు పలికెను : లక్ష్మణా! స్వామి, అమాత్య, రాష్ట్ర, దుర్గ, కోశ, బల, సుహృత్తుల నునవి పరస్పర ఉపకారములగు ఆరు అంగములు. వీటిలో రాజ-అమాత్యుల తరువాత ప్రధానమైనది రాష్ట్రము. అర్థసాధకము. అందుచే సర్వదా దానిని పాలించవలెను. కులీ నత్వము, సత్త్వము, యౌవనము, శీలము, దాక్షిణ్యము, శీఘ్రకారిత్వము, పూర్వపర విరుద్ధముగ మాటలాడ కుండుట, సత్యము, వృద్ధసేవ, కృతజ్ఞత్వము, దైవానుకూల్య సంపాదనము, బుద్ధి, నీచపరివారము లేకుండుట, సమర్థులగు సామంతులు కలిగియుండుట, దృఢ భక్తిత్వము, ముందుచూపు, ఉత్సాహము, చిత్తశుద్ధి, ఔదార్యము, వినయము, ధార్మికత్వము - ఇవి అభిగామిక గుణములు. అభివృద్ధి కోరు రాజు-సుప్రసిద్ధమగు కాలమునందు జనించినవారు, క్రౌర్యము లేనివారు, గుణవంతులు, పవిత్రులు అగు పురుషులను చేరదీసి తన పరివారమునందు ఉంచుకొనవలెను.

వాగ్మి, ప్రగల్భుడు స్మరణశక్తి కలవాడు, ఎత్తైనవాడు, బలవంతుడు, జితేంద్రియుడు, సేనను నడపగలవాడు విద్యానిష్ణాతుడు, స్వరగ్రహుడు (పొరబాటున ప్రారంభించిన చెడుపని నుండి వెనుకకు మరలువాడు). పరాక్రమణము సహించగలవాడు, అన్నింటికిని ప్రతిక్రియ ఆలోచించ సమర్థుడు, శత్రువుల లోపములను కనిపెట్టువాడు, సంధి విగ్రహ తత్త్వజ్ఞుడు, మంత్రణము గూఢ ముగా నుంచువాడు, దేశకాలవిభాగము ఎరిగినవాడు, ధనమును రాబట్టుకొనువాడు, తగు వ్యయము చేయువాడు, సత్పాత్రలను ఎరిగినవాడు, క్రోధ, లోభ, భయ, ద్రోహ, స్తంభ (మొండితనము), చాపల్యములను, దోషములు లేనివాడు, పరపీడన - పైశున్య (చాడీలు చెప్పుట), మాత్సర్య, ఈర్ష్యా, అనృతములను దుర్గుణములు లేనివాడు, వృద్ధజనోపదేశానుసారము ప్రవర్తించువాడు, మధురభాషి, మధురదర్శనుడు, గుణానురాగి, మితభాషి, అయిన రాజుశ్రేష్ఠుడు. ఇవి రాజునకు ఉండవలసిన ఆత్మసంపత్తికి సంబంధించిన గుణములు. ఉత్తమ కులసంజాతులు, బాహ్యాంతః శుద్ధులు, శౌర్య సంపన్నులు, ఆన్వీక్షక్యాది విద్యానిపులు, స్వామిభక్తులు, దండనీతి ప్రయోగకుశలులు అగు వారు రాజామాత్యులుగా ఉండుటకు యోగ్యులు.

అన్యాయ మార్గమునుండి సులభముగ మరల్చుటకు శక్యమైనవాడు, అదే జనపదము నందు పుట్టినవాడు, సత్కుల సంజాతుడు, సుశీలుడు, శారీర బలసంపన్నుడు, వక్తృత్వము కలవాడు, సభా సంభాషణ ప్రగల్భుడు, శాస్త్రమను నేత్రము కలవాడు, ఉత్సాహవంతుడు, సమయస్ఫూర్తి కలవాడు స్తబ్దత్వ (మొండితనము) చాపల్యములు లేనివాడు, స్నేహశీలుడు, శీతోష్ణాది క్లేశసహన సమర్థుడు, శుచి (లంచము మొదలగువాటికి దూరముగా నుండు వాడు), సత్య, సత్త్వ, ధైర్య, స్థైర్య, ప్రభావ, ఆరోగ్యాది గుణసంపన్నుడు, శిల్పనిపుణుడు, దక్షుడు, ప్రజ్ఞావంతుడు, ధారణాశక్తి కలవాడు, దృఢభక్తి, ఎవ్వరితోను వైరము లేనివాడు. ఇతరులు కల్పించిన విరోధమును శాంతింప చేయువాడు అగు పురుషుడు రాజునకు బుద్ధి సచివుడుగను, కర్మ సచివుడుగను ఉండుటకు తగినవాడు. స్మరణశక్తి, కార్యవ్యగ్రత, ఊహాశక్తి జ్ఞాననిశ్చయము, దృఢత్వము, మంత్రగుప్తి ఇవి మంత్రి సంపద. పురోహితుడు వేదత్రయ నిష్ణాతుడై, దండనీతి ప్రయోగకుశలుడై, అథర్వ వేదోక్త

విధానమున రాజు కొరకు శాంతి కర్మ – పుష్టి కర్మలను సంపాదించుచుండవలెను. బుద్ధిమంతుడైన రాజు ఆయా విద్యలయందు నైపుణ్యముగల పండితులచే అమాత్యుల శిల్పాశాస్త్రాది జ్ఞానమును పరీక్షించవలెను. ఇది పరోక్ష పరీక్ష. కులీనత్వము, జన్మస్థానము, అవగ్రహము (అతడు ఎవరి చెప్పుచేతలలో ఉండును అను విషయము) ఈ మూడింటిని అతని ఆత్మీయులనుండి తెలుసు కొనవలెను. పరికర్మ (దుర్గాది నిర్మాణ) దక్షత్వము, విజ్ఞానము, ధారయిష్ణుత అను మూడు గుణము లను కూడ పరీక్షించవలెను. ప్రగల్భత్వము, ప్రతిభ, వాగ్మిత్వము, సత్యవాదిత్వము అను నాలుగు గుణములను మాటలలోనే తానే స్వయముగా పరీక్షించ వలెను. ఉత్సాహము ప్రభావము, క్లేశసహన సామర్థ్యము, ధైర్యము, స్వామిభక్తి స్థైర్యము అను గణములను ఆపత్సమయములందు పరీక్షించ వలెను. రాజు విషయమున దృఢమైన భక్తి, మైత్రి, ఆచార విచారములందు పరిశుద్ధత్వము–ఈ గుణములను ఆతని వ్యవహారమును బట్టి పరీక్షించవలెను.

బలము, సత్త్వము, ఆరోగ్యము, శీలము, అస్తబ్ధత, అచాపల్యము అను గుణములను చుట్టు ప్రక్కలనున్న వారి ద్వారా పరీక్షించవలెను. వైరము పెంచుకొనకుండు స్వభావమును, భద్రత్వమును, నీచత్వమును ప్రత్యక్షముగనే చూచి గ్రహించవలెను. గుణప్రవృత్తులు ప్రత్యక్షముగా గ్రహించుటకు వీలుకాని పురుషుని గుణములను ఊహించి తెలుసు కొన వలెను. ఎక్కువ పంటలు పండునదియు, వివిధ వస్తువుల గనులు, అమ్ముటకు వీలైన అధికమైన ఖనిజ పదార్థములు ఉన్నదియు, గోవులకు హితకరమైనదియు, అధిక జలము కలదియు, చుట్టును పవిత్రమైన జనపదములు ఉన్నదియు, అందమైనదియు, అడవులలో ఏనుగులు ఉన్నదియు, జలమార్గ–స్థల మార్గములున్నదియు, పంటలకై వర్షములపై ఆధారపడనిదియు, పంటలకై అధికముగ జలము లభించునదియు అగు భూమి ఐశ్వర్య వృద్ధికి ప్రశస్తము, జలము అధికముగ లభించునది, పర్వత సాహాయ్యమున్నది. శూద్ర, శిల్పి, వైశ్యులు అధిక సంఖ్యలో ఉన్నది, ప్రయత్నశీలులు, పెద్దపెద్ద పనులు తలబెట్టువారు, రాజానురక్తులు, రాజశత్రుద్వేషులు, పీడా–కరభారములను సహింపగలవారు, అగు వ్యవ సాయ దారులు కలది, అనేక దేశములనుండి వచ్చిన జనులకు నివాసస్థానమైనది. సువిస్తృ తము, ధార్మికులు, పశుసంపద కలవారు, అగు ధనికుల కలదియు, మూర్ఖులును, వ్యసన గ్రస్తులును అగు నాయకులు కలదియగు జనపదము రాజుకు శ్రేష్ఠమైనది. విస్తృతమైన సరి హద్దులు కలది, నాల్గువైపులందును విశాలమైన అగడ్తలు కలది, ఉన్నతమైన ప్రాకార–గోపురములు కలది, పర్వత మును గాని, మరుభూమినిగాని, అడవిగాని ఆశ్రయముగా గ్రహించి నిర్మించినది, అగు పురము నందు రాజు నివసించవలెను. జలము, ధాన్యము, ధనము అధికముగనున్న దుర్గము చాలకాలము శత్రువుల ఆక్రమణమును తట్టుకొనుటకు సమర్థమై యుండును. జలమయము, పర్వతమయము, వృక్షమయము, ఇరిణము (నిర్జన ప్రదేశ నిర్మితము), ధాన్వనము (మరు భూ నిర్మితము) అని దుర్గము ఐదు విధములు.

విశ్వాస పాత్రుల రక్షణలో ఉన్నది, ధర్మ న్యాయానుసారముగ ఆర్జింపబడినది, ఎంత వ్యయము చేసినను తరగనిది అయిన కోశము శ్రేష్ఠము. కోశమును ధర్మాది వృద్ధి కొరకును, భృత్యాదుల పోషణము కొరకును వినియోగించవలెను. తాత ముత్తాతల నుండియు సేవచేయుచున్నవారును,

లొంగి ఉండువారును, ఐకమత్యము కలవారును, జీతములు పూర్తిగ చెల్లించిన (తీసికొన్న) వారును, ప్రసిద్ధ పౌరుషవంతులును, తన జనపదమునందే జనించినవారును, యుద్ధకుశలులును, కుశలులగు సైనికులతో కలిసి ఉండువారును, నానావిధ శస్త్రాస్త్ర సంపన్నులును, అనేక యుద్ధములందు ఆరితేరినవారును, అనేకులు మహాయోధులున్న దళములకు చెందినవారును, తమ సైన్యమునందలి అశ్వములకును గజములకును హారతి ఇచ్చువారును, పరదేశ నివాసము, యుద్ధమునందలి కష్ట ములు, అనేక విధములగు క్లేశములు సహించసమర్థులును, యుద్ధమునందు చాల శ్రమ పడిన వారును, రెండు ఆలోచనలు లేనివారును, చాలవరకు క్షత్రియజాతికి చెందినవారును అగు సైనికులు గల సైన్యము శ్రేష్ఠమైనదని దండనీతిజ్ఞుల అభిప్రాయము. త్యాగ, విజ్ఞాన, సత్త్వములు కలవారును, చాలమంది ఆత్మీయులు కలవారును, ప్రియముగ మాటలాడు వారును. భవిష్యత్తులో ఉపయోగించు వారును రెండు ఆలోచనలు లేనివారును, ఉత్తమకుల సంజాతులును అగు పురుషులను మిత్రులనుగ చేసికొనవలెను. మిత్రుడురాగానే దూరము నుండియే ఎదురేగుట, స్పష్టములు, ప్రియములు అగు మాటలు చెప్పుట, సత్కార పూర్వకముగ మనోవాంఛిత వస్తువు ఇచ్చుట–ఇవి మూడును మిత్ర సంగ్రహణ ఉపాయములు. ధర్మార్థకామములు మిత్రుల నుండి లభించు మూడు ఫలములు. ఔరసులు (మాతృపిత్రాది సంబంధము ద్వారా ఏర్పడినవారు), మైత్రీబంధ బద్ధులు, కులక్రమాగతులు, కష్టముల నుండి రక్షింపబడినవారు అని మిత్రులు నాల్గురకములు. సత్యవచనము, అనురాగము, సుఖ దుఃఖములందు ఒకే విధముగ పాలుపంచుకొనుట. ఇవి మిత్రగుణములు.

రాజసేవకుల ప్రవృత్తిని గూర్చి చెప్పెదను; సేవకులకు తగిన గుణములు కలవాడు రాజసేవ చేయవలెను. నేర్పు, లోకప్రియత్వము, దృఢత్వము, ఓర్పు, క్లేశసహశక్తి, సంతోషము, శీలము, ఉత్సాహము – ఈ గుణములు సేవకుల అలంకారములు. సేవకుడు సమయానుసారముగను, న్యాయపూర్వకముగను రాజసేవ చేయవలెను. ఇతరుల స్థానమునకు వెళ్ళుట, క్రూరత్వము, అసభ్య త్వము, ఈర్ష్య–ఈ దోషములను త్యజించవలెను. తన పై అధికారి మాటలను ఖండించిగాని, తద్విరుద్ధముగ గాని రాజసభలో మాటలాడ గూడదు. రాజుయొక్క రహస్యకార్యములను, గుప్త మంత్రణమును ఎచ్చటను ప్రకటము చేయకూడదు. తన విషయమున స్నేహముగల స్వామివద్దనే సేవకుడుగా ఉండవలెను. రాజు తనపై విరక్తి చూపినచో లేదా అసహ్యము చూపినచో ఆతనిని విడువవలెను. సంగ్రహముగ చెప్పవలెనన్నచో రాజు అనుచిత కార్యము చేయనున్నప్పుడు నివా రించుట, సత్కార్యములు చేయుచున్నప్పుడు అతనికి సాహాయ్యము చేయుట ఇది బంధువులు, మిత్రులు, సేవకులు చేయవలసిన శ్రేష్ఠాచారము. మేఘమువలె రాజు సమస్త ప్రాణులకును వృత్తి కల్పింపవలెను. ఆయా స్థానములు అన్నింటియందును, సుపరీక్షితులును, విశ్వాస యోగ్యులును అగు వారిని నియోగించవలెను. ఉద్యమశీలులను మాత్రమే కర్మా ధ్యక్షులుగ చేయవలెను. వ్యవ సాయము, వర్తకులకు ఉపయోగించు స్థలజలమార్గములు, పర్వతాది దుర్గములు సేతుబంధములు, ఏనుగులను పట్టు స్థానములు సువర్ణ – రజతాది ఖనులు, వనమునందు లభించు శ్రేష్ఠమైన కఱ్ఱ మొదలైనవి శూన్య ప్రదేశములందు గ్రామాది నిర్మాణము – ఈ ఎనిమిది ఆయద్వారములు. వీటికి 'అష్ట వర్గము' అని పేరు. ధర్మాత్ముడైన రాజు ఈ అష్ట వర్గమును నిరంతరము రక్షించవలెను.

అధికారులు, చోరులు, శత్రువులు, రాజబంధువులు, రాజుయొక్క దురాశ – ఈ ఐదును ప్రజలకు ఐదు విధములగు భయములను కలిగించుచుండును. రాజు, ఈ భయములు కలుగకుండ చేయుచు, ప్రజల నుండి తగు సమయములందు పన్ను వసూలు చేయుచుండవలెను. బాహ్యము, అభ్యన్తరము అని రాజ్యము రెండు విధములు. రాజు యొక్క శరీరమే అభ్యంతరము. రాష్ట్రము బాహ్య రాజ్యము. రాజు ఈ రెండింటిని రక్షించుకొనవలెను. రాజ్యమునకు హాని కలిగించు పాపాత్ములు రాజప్రియు లైనను దండనీయులే. రాజు వారందరిని శిక్షించవలెను. విషాదుల నుండి తనను రక్షించుకొనవలెను, స్త్రీలను, పుత్రులను, శత్రువులను ఎన్నడును విశ్వసించగూడదు. (239)

షాడ్గుణ్య కథకము

శ్రీరాముడు చెప్పెను : రాజు ముఖ్యముగ ద్వాదశ మండలములను గూర్చి ఆలోచించు చుండవలెను. విజిగీషువగు (జయింపనిచ్ఛగల) రాజునకు పురోభాగమునందు (1) అరి (2) మిత్రుడు (3) అరిమిత్రుడు (4) మిత్రమిత్రుడు (5) అరిమిత్ర మిత్రుడును అను రాజులు (ఒకరి తరువాత ఒకరు) ఉందురు. వెనుకభాగమున (1) పార్ష్ణిగ్రాహుడు (2) ఆక్రందుడు, పార్ష్ణిగ్రాహాసారుడు (4) ఆక్రందాసారుడు అను రాజులు (ఒకరి వెనుక ఒకరు) ఉందురు. అరి విజిగీషువుల రాజ్యసీమలతో కలియు రాజ్యసీమ కలవాడు మధ్యముడు. అరివిజిగీషువులు కలిసినచో మధ్యముడు కోశము, సైన్యాదిసాహాయ్యము చేసి వీరిరువురిని అనుగ్రహింప సమర్థుడగును. కాని వీరిరువురును కలియకపోయినచో మధ్యమరాజు వీరిరువురిని వేరువేరుగా గాని క్రమమునగాని చంప సమర్థు డగును. వీరందరి మండలముల వెలుపలనున్న అధిక బలశాలియు అధికసైన్య సంపన్నుడును అగు రాజు ఉదాసీనుడు. విజిగీషు, అరి, మధ్యములు కలిసినచో ఉదాసీనుడు వీరిపై అనుగ్రహము మాత్రము చూపగలుగును. వీరు కలియకపోయినచో వీరిని అందరిని పరిమార్చి వేయగలుగును.

లక్ష్మణా! నీకు ఇపుడు సంధి, విగ్రహ, యాన, ఆసనాదుల విషయమును చెప్పెదను. బలవంతుడగు రాజుతో యుద్ధము వచ్చినపుడు తన పరిస్థితి శోచనీయముగ నున్నచో అపుడు సంధి చేసికొనుటయే మంచిది. కపాల, ఉపహార, సంతాన, సంగత, ఉపన్యాస, ప్రతీకార, సంయోగ, పురుషాంతర, అదృష్టనర, ఆదిష్ట, ఆత్మామిష, ఉపగ్రహ, పరిక్రయ, ఉచ్ఛిన్న, పరదూషణ, స్కంధోపగేయములని సంధిలో పదునారు భేదములు ఉన్నవి. ఎవరితో సంధి చేసుకొనుచున్నారో అతడు సంధేయుడు. అభియోక్త అనభియోక్త అని సంధేయుడు రెండు విధములు. అనభియోక్తతో (ఆక్రమణము చేయని వానితో) ఉపన్యాస, ప్రతీకార, సంయోగములను మూడు సంధులు చేసికొనవలెను. మిగిలినవి అభియోక్త (ఆక్రమణకారి)తో చేసికొనవలెను. కొందరి అభిప్రాయము ప్రకారము పరస్పరోపకారము, మైత్రము, సంబంధజము, ఉపహారము అని నాలుగు మాత్రమే సంధి భేదములు బాల కుడు, వృద్ధుడు, చిరకాలరోగి, బంధుసోదరాది బహిష్కృతుడు, పిరికివాడు, పిరికిపందలైన సైనికులు గలవాడు, దురాశాపరులగు సేవకులు గలవాడు, అమాత్యాది ప్రకృతుల అను రాగము కోల్పోయినవాడు, అత్యంత విషయాసక్తుడు, అస్థిరచిత్తుడై అనేకుల ఎదుట మంత్రమును ప్రకటించువాడు, దేవతా బ్రాహ్మణ నిందకుడు, దైవహతుడు, దైవమే సంపద్విపత్తులకు

కారణమని నమ్మి పురుష ప్రయత్నము చేయనివాడు, దుర్భిక్ష క్లేశములో నున్నవాడు, కారాగారము నందు ఉంచబడిన లేదా శత్రువుచే చుట్టుముట్టబడిన సైన్యము కలవాడు, అయోగ్య ప్రదేశము నందున్న వాడు, చాలమంది శత్రువులు కలవాడు, యుద్ధమునకు తగిన సమయమున తన సేనను నియమించనివాడు, సత్యధర్మ భ్రష్టుడు – ఈ ఇరువది రకముల రాజులతో సంధి చేసికొన గూడదు; విగ్రహము మాత్రమే చేయవలెను.

ఒకరినొకరు అపకారము చేసికొనుటచే మనుష్యులలో పరస్పరము కలహము ఏర్పడును. అభ్యుదయము కోరు రాజు శత్రుపీడితుడైనపుడు దేశకాలముల అనుకూల త్వమును, సైనిక శక్తిని చూచుకొని విగ్రహము ప్రారంభింపవలెను. సప్తాంగ రాజ్యము, స్త్రీలు, జనపదమునందలి స్థాన విశేషము, రాష్ట్రములోని ఒక భాగము, జ్ఞాన ప్రదులగు ఉపాధ్యాయాదులు, సేన – వీటిలో దేనినైన అపహరించుటచే విగ్రహము ఏర్పడును. ఈ కారణములేగాక, మదము, అహంకారము, జనపదపీడ, జనమును నశింపచేయుట, ధనమునకు విఘాతము కలిగించుట, శక్తులకు విఘాతము, ధర్మ విఘాతము, దైవము, మిత్రకార్య సాధనము, మాననీయుల అవమానము, బంధువర్గ వినాశము, ప్రాణులకు తాన్చిన అభయమును విచ్ఛేదించుట, మండలదూషణము ఒకే ప్రయోజనమును ఇరువురు అపేక్షించుట ఈ ఇరువది కూడ విగ్రహహేతువులు. కొందరు విగ్రహము, సాపత్నము (సవతి సోదరుల మధ్య ఉండునది), వాస్తుజము (భూసువర్ణాది హేతుకము), స్త్రీ హేతు కము, కటువచన జనిత క్రోధహేతుకము, అపరాధ జనిత ప్రతిక్రియా బుద్ధిచే ఏర్పడునది అని ఐదు విధములని చెప్పిరి. ఫలితము చాల తక్కువ ఉండునది, నిష్ఫలము, ఫలప్రాప్తి విషయమున సందేహమున్నది, వెంటనే దోషములను కలిగించునది, భవిష్యత్తులో కూడ నిష్ఫలమైనది, వర్తమాన భవిష్యత్తులందు రెండింటి యందును దోషజనకమైనది, ఎంత బలపరాక్రమములు ఉన్నవాడో తెలియని శత్రువుతో ఏర్పడినది, ఇతరులచే రెచ్చగొట్ట బడినది, ఇతరుల స్వార్థసిద్ధి కొరకైగాని, ఏదైన ఒక సాధారణ స్త్రీని పొందుటకు గాని ఏర్పడినది, సుదీర్ఘకాలము సాగునట్లు కనబడునది, శ్రేష్ఠులైన ద్విజులతో ఏర్పడినది, సుదీర్ఘ కాలము సాగునట్లు కనబడునది, శ్రేష్ఠులైన ద్విజులలో ఏర్పడినది, దేవతావరములను పొంది అకస్మాత్తుగా బలవంతుడైన వానితో ఏర్పడినది, అధిక బలశాలులగు మిత్రులు కలవానితో సంభవించినది, వర్తమానము నందు ఫలమును ఇచ్చినను భవిష్యత్తునందు నిష్ఫలమైనది. భవిష్యత్తునందు ఫలప్రదమైనను వర్తమానమున నిష్ఫలమైనది– ఈ పదునారు విధములగు విగ్రహములలో ఎన్నడును చిక్కుకొనరాదు. వర్తమానము నందును భవిష్యత్తు నందును గూడ పూర్ణఫలము నీయగలుగు విగ్రహమును మాత్రమే రాజు అవలంబిం పవలెను.

తనసేన హృష్ట పుష్టమై ఉత్సాహముతో ఉన్నట్లును, శత్రుసేన ఇందుకు విపరీతముగా ఉన్నట్లును నమ్మకము ఏర్పడిన పిదప రాజు శత్రువును నిగ్రహించుటకై విగ్రహము నవలంబింపవలెను. మిత్ర, ఆక్రంద, ఆక్రందాసారులకు తనపై దృఢభక్తి యుండి శత్రువు పరిస్థితి దీనికి భిన్నముగా నున్నపుడు విగ్రహము ప్రారంభింపవలెను. విగృహ్యాగమనము, సంధాయగమనము, సంభూయ గమనము, ప్రాసంగికగమనము, ఉపేక్షాపూర్వక గమనము అని యానము ఐదు విధములని

నీతిజ్ఞులు చెప్పుదురు. శత్రువు, విజిగీషువు కూడ ఒకరి నొకరు ఏమియు చేయజాలక పోవుటచే ఆక్రమణము చేయక కూర్చుండుట 'ఆసనము', యానము నందువలె దీనియందు కూడ విగృహ్యాసనము, సంధాయాసనము, సంభూయా సనము, ప్రసంగాసనము, ఉపేక్షాసనము అని ఐదు భేదములున్నవి. బలవంతులగు ఇద్దరు శత్రువుల వద్దకు రహస్యముగా 'నేను నా రాజ్యము కూడ నీకు చెందినవే' అని రహస్యముగా వార్త పంపి తాను దుర్గమునందు దాగియుండుట 'ద్వైధీభావము', ఆ శత్రువులు ఇద్దరును కలిసి ఆక్రమణము చేసినచో వారిలో అధిక బలశాలిని శరణు పొంద వలెను. వారిరువురును తనతో, ఎట్టి షరతుపైనను గూడ సంధిచేసికొనుటకు నిరాకరిం చినచో వారిరువురికిని శత్రువైన మరొక రాజునుగాని, అధిక బలశాలియగు రాజును గాని ఆశ్రయిం చవలెను. బలవంతుడైన శత్రువు ఆక్రమించగా ఆ కష్టమునుండి తప్పించు కొను ఉపాయాంతర మేదియు లేనపుడు కులీనుడును, సత్యవాదియు, సదాచారవంతుడును, శత్రువు కంటె అధిక బల వంతుడును అగు వేరొక రాజును ఆశ్రయించవలెను. ఇట్లు ఆశ్రయము కోరువారు ఆశ్రయదాత దర్శనము కొరకై వానిని ఆరాధించవలెను. సర్వదా అతని అభిప్రాయమునకు అనుకూలముగ ప్రవర్తించవలెను. అతని కార్యములు చేయవలెను. సర్వదా అతని విషయమున ఆదరము చూప వలెను. ఇది ఆశ్రయించువాని కర్తవ్యము. (240)

సామాది ఉపాయ కథనము

శ్రీరాముడు చెప్పెను :

ప్రభుశక్త్యుత్సాహశక్తుల కంటె మంత్రశక్తి గొప్పది. ప్రభుశక్తి – ఉత్సాహశక్తులున్న శుక్రాచార్యుని దేవపురోహితుడైన బృహస్పతి మంత్రశక్తిచే ఓడించెను. విశ్వాసపాత్రుడే కాక నీతిశాస్త్ర కోవిదుడు కూడ అయిన వానితో రాజు మంత్రణము చేయవలెను. అశక్య మైన కార్యము నారంభించు వారికి క్లేశములను అనుభవించుట తప్ప ఫలమేదియు లభింపదు. తెలియని విషయములు తెలిసికొనుట, తెలిసిన దానిని నిశ్చయించుట, కర్తవ్యము నందు సందేహము ఏర్పడినపుడు దానిని తొలగించుకొనుట, శేషము లభించుట – ఇవి మంత్రులపై ఆధారపడియున్నది. సహాయకులు, కార్యసాధనోపాయములు, దేశకాల ప్రవిభాగము, విపత్తి నివారణము, కర్తవ్యసిద్ధి – ఇవి మంత్రాలోచనలకు సంబంధించిన ఐదు అంగములు. మనస్సు యొక్క ప్రసన్నత్వము, శ్రద్ధ, జ్ఞానేంద్రియ కర్మేంద్రియములు తమతమ పనులు చేయుటయందు సమర్థములుగా నుండుట, సహాయసంపత్తి, ఉత్థాన సంపత్తి (వెంటనే లేచి పనులు చేయుట) ఇవి మంత్రము ద్వారా నిశ్చయించి ప్రారంభింప బడు కర్మల సిద్ధికి లక్షణములు. మదము, ప్రమాదము (పొరబడుట) కామము, స్వప్నములో పలవరించుట, స్తంభాదుల వెనుక పొంచియుండు జనులు, స్త్రీ సాన్నిధ్యము, ఉపేక్షిత ప్రాణులు (చిలకలు, బధిరులు మొ॥) భేదము కలుగుటకు (ఇతరులకు వెల్లడియగుట) కారణములు, సభలో నిర్భయముగా మాటలాడుట, మంచి జ్ఞాపకశక్తి, ప్రవచనకౌశలము, వస్త్ర శాస్త్రముల పరినిష్ఠిత జ్ఞానము, దూతలకు తగిన కార్యములందు నేర్పుకలవాడు రాజదూత అగుటకు యోగ్యుడు, నిసృష్టార్థుడు (బాధ్యతలన్నీ తీసికొన్నవాడు), పరిమితార్థుడు (కొన్ని బాధ్యతలు మాత్రమే ఉన్నవాడు), శాసనహారకుడు (వార్తలు మాత్రము తీసికొను పోవువాడు) అని దూతలు మూడు విధములు.

తన రాకను గూర్చి ముందుగ సూచించకుండ దూత శత్రుదుర్గమును గాని, సభను గాని ప్రవేశించరాదు. కార్య సిద్ధికై సమయమును నిరీక్షించవలెను. శత్రువు అనుమతిపొంది తిరిగి వెళ్లవలెను. శత్రువున లోపమును తెలిసికొనవలెను. వారి కోశము, మిత్రులు మొదలగువాటిని తెలుసుకొని, శత్రువులయొక్క చూపులు, చేష్టలు మొదలగువాటిచే తన విషయమున అతనికి ఎట్టి అభిప్రాయమున్నదో తెలిసికొనవలెను. అతడు రెండు పక్షములవారి కుల, నామ, ద్రవ్య, శ్రేష్ఠకర్మలను ప్రశంసించవలెను. తపస్వి వేషములో నున్న తమ పక్షీయులగు గూఢచారులతో సంప్రదించవలెను. ప్రకటులు, అప్రకటులు అని చారులు రెండు విధములు. ప్రకటముగా నున్నవారు దూతలు, అప్రకాశముగా నున్నవారు గూఢచారులు. చారుల స్థితికి, వర్తకులు, వ్యవసాయదారులు, సన్యాసులు, భిక్షు వులు, అధ్యాపకులు – వీరు ఉపయోగింతురు. అందుచే వీరి వృత్తికై (సుఖజీవనము నకై) ఏర్పాట్లు చేయవలెను. దూత ప్రయత్నములు విఫలమైనపుడు, శత్రువు దుర్బలుడుగా నున్నపుడు అతనిపై దండెత్తవలెను. విజిగీషువు తన ప్రకృతులలో నున్న వ్యసనములన్నియు తొలగించుకొని పిమ్మట శత్రువుపై దాడిచేయవలెను. మానుషము, దైవము అని వ్యసన ములు రెండు విధములు. అనయము (నీతిని అనుసరించకుండుట) అపనయము (చెడు నీతిని అవలంబించుట) అనువాటిచే ప్రకృతి వ్యసనము ఏర్పడును. కేవలము దైవవశము చేతగూడ అది రావచ్చును. శ్రేయస్సును వ్యస్తము చేయునుగాన 'వ్యసనము'. అగ్ని, జలము, రోగములు, దుర్భిక్షము, మహామారి ఇవి ఐదు దైవవ్యసనములు. మిగిలినవి మానుష వ్యసనములు. పురుషప్రయత్నము చేతగాని, అథర్వోక్త శాంతికర్మలచేగాని దైవ వ్యసనమును తొలగించవలెను. ఉత్థానశీలత్వము (పనులలో జాప్యము లేకుండుట). నీతి, సంధి, సామము మొదలగువాటిచే మనుష వ్యసనమును శాంతింపచేయవలెను. మంత్రము, మంత్రఫలప్రాప్తి, కార్యానుష్ఠానము భవిష్యదున్నతి సంపాదనము, ఆయవ్యయములు, దండనీతి, శత్రునివారణము, వ్యసనములను తొలగించు ఉపాయము, రాజును రాజ్యమును రక్షించుట–ఇవి అమాత్యుల కర్తవ్యములు.

అమాత్యుడు వ్యసనగ్రస్తుడైనచో ఈ పనుల న్నింటిని పాడుచేయును. సువర్ణ, ధాన్య, వస్త్ర, వాహనాది సంగ్రహము జనపద వాసులగు ప్రజల కర్తవ్యము. ప్రజలు వ్యసనగ్రస్తులైనచో ఇవన్నియు నష్టమగును. ఆపత్సమయమున జనులను రక్షించుట, కోశ–సేనా రక్షణము, రహస్యముగా గాని, ఆకస్మికముగా గాని వచ్చిన యుద్ధము నుండి కాపాడుకొనుట, కష్టాలలో చిక్కుకొనియున్న మిత్ర–అపమిత్రులను సంగ్రహించుట, సామంతుల నుండియు, వనవాసులనుండియు వచ్చు ఉపద్రవము లను తొలగించుకొనుట – ఇవన్నియు దుర్గాశ్రయణ ప్రయోజనములు. నగరమునందలి నాగరికులు గూడ అవసరమైనపుడు రక్షణపొందుట కొరకై, కోశాదుల నిచ్చుచు దుర్గపతికి ఉపకరింతురు. భృత్యులభరణ పోషణము, దానము, హస్తి, ఆశ్వ, ఆభరణాదులనుకొనుట, స్థిరత్వము, శత్రుపక్షము నందున్న లుబ్ధులగు ప్రకృతులలో ధనాదులు ఇచ్చి, విరోధము ఉత్పన్నము చేయుట, దుర్గ సంస్కా రము, సేతుబంధము, వాణిజ్యము, ప్రజా–మిత్ర సంగ్రహము, ధర్మార్థకామసిద్ధి–ఇవన్నీ కోశమువలన సిద్ధించును. రాజునకు మూలము కోశముగాన కోశవ్యసనము రాజునకు సంబంధించిన సర్వమును నశింపచేయును.

మిత్ర, అమిత్ర, సువర్ణ, భూములను తన వశములో నుంచుకొనుట, శత్రువులను అణచివేయుట, ఇతర కార్యములను శీఘ్రముగ సాధించుట, ఇవన్నియు సేనా బలముచే సాధించ దగినవి. దానికి కష్టము వచ్చినచో ఈ పనులన్నియు పాడగును. మిత్రుడు విజి గీషువు యొక్క మిత్రులు స్థిరముగా ఉండునట్లు చేయును. శత్రువులను నశింపచేయును. మిత్రుడు వ్యసనగ్రస్తుడైనచో ఈ కార్యములన్నియు చెడిపోవును. రాజు వ్యసనియైనచో సమస్త కార్యములు చెడిపోవును. కఠినముగా మాటలాడి ఇతరుల మనస్సునొప్పించుట, కఠినముగా శిక్షించుట, అర్థదూషణము, మద్యపానము స్త్రీలంపటత్వము, వేట, జూదము ఇవి రాజవ్యసనములు. సోమరితనము, మొండి తనము, దర్పము, ఏమరుపాటు, అకారణ వైరము, పైన చెప్పిన రాజ వ్యసనములును, సచివునకు దుర్వ్యసనములు, అనావృష్టి, రోగాది పీడలు రాష్ట్ర వ్యసనములు. యంత్ర, ప్రాకార, పరిఖాదులు పాడగుట, అస్త్రశస్త్రముల కొరత, గడ్డి, కట్టెలు, అన్నము క్షీణించుట–ఇవి దుర్గ వ్యసనములు. చెడ్డవ్యయము మండలము నందు అనేక స్థాపనములందు కొంచెము కొంచెము ఉంచుట. రక్షకులు మొదలగువారు భక్షించివేయుట, ప్రోగు చేయకుండుట, చోరులచే అపహరింపబడుట, దూర ప్రదేశము నందు ఉంచబడుట – ఇవి కోశవ్యసనములు. నాలుగు మూలల నుండి ముట్టడించబడుట, సరియైన సంమానము లభింపకపోవుట, భరణపోషణములు సరిగా లేకుండుట, చాలమంది రోగగ్రస్తులు గాని, అలసిపోయినవారు గాని, క్రొత్తగా వచ్చినవారు గాని ఉండుట, పూర్తిగా ఓడి పోవుట, ముందుకు వెళ్లు వేగము కుంఠిత మగుట, చాలమంది నిరాశా పీడితులగుట, అయోగ్య ప్రదేశములలో ఉండుట, దుష్టుడగు పార్ష్ణిగ్రాహుని సైన్యము వెన్నంటివచ్చుట, ఇట్టి దురవస్థ బల (సేనా) వ్యసనము.

దైవపీడితుడును, శత్రుసేనాక్రాంతుడును, కామ–క్రోధాదియుక్తుడును అగు వ్యసన గ్రస్తుడైన మిత్రునకు, తగు ఉత్సాహము, సాహాయ్యము ఇచ్చినచో అతడు యుద్ధోద్యతుడై, శత్రువులపై విజ యము సాధింపగలడు. అర్థదూషణము, వాక్పారుష్యము, కఠిన దండము, ఈ మూడును క్రోధజ వ్యసనము. వేట, జూదము, మద్యపానము, స్త్రీ సంగము–ఈ నాల్గును కామజవ్యసనములు, వాక్పారుష్యము ఇతరులకు ఉద్వేగము కలిగించి అనర్థహేతువగును. ధనహరణము, తాడనము, వధ అని మూడు విధములగు దండము సిద్ధించని కార్యమును సిద్ధింప జేయునుగాన, సత్పురుషులచే 'శాసన'మని చెప్పబడుచున్నది. దానిని యుక్తి పూర్వకముగ ప్రయోగించవలెను. యుక్తమగు దండమును విధించు రాజును ప్రశంసింతురు. క్రోధవశుడై కఠినశిక్ష ఇచ్చువానిపై ప్రజలలో ఉద్వేగము కలుగును. ఆ విధముగ ఉద్విగ్నులైనవారు శత్రువును శరణువేడుదురు. దానిచే వృద్ధిపొందిన శత్రువు రాజును నశింపచేయును. దూషణీయుడగు ఒక వ్యక్తికి అపకారము చేయుటకై అతనివలన లభింపవలసిన గొప్ప ప్రయోజనమునకు విఘాతము కలిగించుటకు 'అర్థదూషణము' అని పేరు. వేటవలన, పరుగెత్తుచున్న వాహనమునుండి పడుట, ఆకలిదప్పులవలన శ్రమపడుట మొదలగు దోషములు కలుగును. దాగి ఉన్న శత్రువెవ్వడైనను చంపివేయుటకు కూడ అవకాశము ఏర్పడును. అలసటను జయించుటకై రాజు ఏదైన సురక్షితమగు అరణ్యమునందే వేటాడవలెను. జూదముతో ధర్మార్థముల నాశము. ప్రాణములు పోవుట మొదలగు దోషములు కలుగును. కలహము

వచ్చును. స్త్రీ వ్యసనము కలవారి పనులన్నియు చాల విలంబమున జరుగును. ధర్మార్థములకు గూడ హాని కలుగును. మద్యపాన వ్యసనము వలన ప్రాణాపాయముకూడ కలుగవచ్చును. మత్తులో నున్నవాడు కర్తవ్యాకర్తములను తెలిసికొనజాలడు సేనానివేశము ఎచట నెలకొల్పవలెనో తెలిసిన వాడును, శుభాశుభ శకునముల జ్ఞానము కలవాడును శత్రువుపై విజయము సాధించగలడు. సేనానివేశము మధ్యయందు రాజు కోశముతో ఉండవలెను. రాజ భవనమునకు నలువైపుల చుట్టి మౌల (పిత్రు పితాది మహాది క్రమమున వచ్చుచున్న) సైన్యము, భృత (జీతమిచ్చి ఏర్పరచు కొన్న) సైన్యము, శ్రేణి (జానపదుల లేదా సాలెవారు మొదలగు శిల్పుల) సేన, మిత్రసేన, శత్రుసేన (రాజుకు లొంగిన శత్రువులసేన), ఆటవికులు-వీరి నివేశములు ఏర్పరుపవలెను. నాల్గవవంతు సేన యుద్ధసన్నద్ధులై, సేనాపతిని ఎదుట ఉంచుకొని, నివేశమునకు బైట, రాత్రి యంతయు తిరగవలెను. వాయుతుల్యవేగముగల అశ్వములను అధిరోహించి అశ్వి కులు సరిహద్దుల వరకును వెళ్ళి, శత్రువుల పరిస్థితులను కనిపెట్టవలెను. రాజాజ్ఞాను సారమే ఎవ్వరైనను నివేశములోనికి వచ్చుట, బైటకువెళ్ళుట జరుగవలెను.

సామ, దాన, దండ, భేద, ఉపేక్షా, ఇంద్రజాల మాయలను ఏడు ఉపాయముల ప్రయోగముచే శత్రువు వశమగును. ఎదుటివాని ఉపకారమును వర్ణించుట, తమ పరస్పర సంబంధ బాంధ వ్యాదులను ప్రకటించుట, గుణములు కీర్తించుచు మధురముగా మాటలా డుట, భవిష్యల్లాభమును ఉద్ఘాటించుట, నేను నీ వాడను అని చెప్పుచు ఆత్మ సమర్పణము చేయుట అని సామము ఐదు విధములు. ఎవని వద్దనుండియైన లభించిన, అసారము, సారాసారము అగు పదార్థమును ఆతనికి ఆ విధముగనే తిరిగి ఇచ్చివేయుట దానములోని మొదటి భేదము. తానివ్వకుండగనే ఎదుటివాడు ఏదైన ధనమును తీసికొన్నచో దానిని అనుమోదించుట రెండవ భేదము. అపూర్వ ద్రవ్యదానము మూడవ భేదము. ఒకనిని మరొకని నుండి ధనము తీసికొనుమని ప్రేరేపించుట (స్నయం గ్రాహ ప్రవర్తనము) నాల్గవ భేదము. ఇవ్వవలసిన ధనమును తీసికొనకుండుట ఐదవ భేదము. స్నేహమును నశింప చేయుట, పరస్పర కలహము సృజించుట, బెదరించుట – ఇవి భేదములోని మూడు విధములని భేదజ్ఞులు చెప్పుదురు. చంపుట, ధనములను అపహరించుట, బంధనతాడ నాదుల ద్వారా పీడించుట అని దండ భేదములు మూడు. ప్రకాశవధ, అప్రకాశవధ అని వధ రెండు విధములు. అందరికిని ద్వేషపాత్రుడైన వానిని ప్రకాశముగ వధించవలెను. ఎవనిని చంపుటచే ప్రజలు ఉద్వేగము చెందుదురో, ఎవడు రాజప్రియుడో, అధిక బల శాలియో, ఎవడు రాజ హితమునకు భంగము కలిగించునో వానిని రహస్యముగ చంపవలెను. విషప్రయోగము చేతగాని, అగ్ని ప్రయోగము చేతగాని, రహస్యముగ ఇతరులచే అస్త్ర ప్రయోగము చేయించిగాని, స్ఫోటలను పుట్టించు పదార్థములను శరీరమునకు లేపము చేయించుటచే గాని రాజ్యశత్రువులను రహస్యముగ నశింపచేయవలెను. జాతి మాత్రముచే బ్రాహ్మణుడైన వానిని కూడ, ప్రాణదండమీయక, సామముచే వశము చేసికొన ప్రయత్నించవలెను.

ప్రియముగా మాటలాడుట సామము చిత్తమునందు అమృతసేకము చేసినట్లు సామ ప్రయో గము చేయవలెను. ఎదుటనున్న వానిని ప్రేమతో త్రాగివేయుచున్నట్లు చూచుచు, అమృతము

వర్షించుచున్నట్లు మాటలాడవలెను. అసత్యమైన దోషారోపణకు గురియైన వారును, ధనలుబ్ధులును పిలిచి అవమానింపబడినవారును, రాజద్వేషులును, ఎక్కువపన్ను వేయబడినవారును, విద్యా కులాదులచే అందరికంటె గొప్పవారమని భావించువారును, ఛిన్నభిన్నమైన ధర్మార్థకామములు కలవారును, కుపితులు, దురభిమానము కలవారును, అనాదరపాత్రులును, అకారణముగ రాజ్యము నుండి బహిష్కరింపబడినవారును, పూజా సత్కారయోగ్యులైనను అవి పొందనివారును, హరింపబడిన ధనము స్త్రీలు కలవారును, మనస్సులో వైరమున్నను సామనీతి ప్రయోగముచే పైకి శాంతముగ నుండువారును, నిత్యశంకితులును ఇట్టివారు శత్రుపక్షమునకు చెందినవారైనచో వారిలో వారికి వైరము కలిగించవలెను. తనపక్షము వారైనచో ప్రయత్నపూర్వకముగ వారిని శాంతులను చేయ వలెను. ఇట్టివారు శత్రుపక్షమునుండి విడిపోయి తన పక్షమునకు వచ్చినచో వారిని సత్కరించవలెను. రెండు పక్షములవారికిని సమానమగు లాభమును చూపుట, ఉగ్ర భయమును చూపుట, అత్యధిక దానమానములు–ఇవి భేదోపాయాంతర్గతములు.

భేదోపాయ ప్రయోగముచే శత్రుసేనలో వైషమ్యము జనించినపుడు అది పురుగుతొలచిన కఱ్ఱవలె విరిగిపోవును. ప్రభు–మంత్రోత్సాహ సంపన్నుడు, దేశకాలాభిజ్ఞుడును అగు రాజు దండముచే శత్రువులను అంతమొందించవలెను. మైత్రీగుణ సంపన్నుడు, ఉత్తమ విచారశీలుడు అగు వానిని సామప్రయోగముచే వశము చేసుకొన వలెను. ఆర్థికముగా క్షీణించిన లుబ్ధుని దానముచే వశము చేసుకొనవలెను. ఒకరినొకరు శంకించుకొను దుష్టులను దండముచే వశము నందు ఉంచుకొన వలెను. పుత్ర–సోదరాదులను, బంధువులను, జానపదులను దానభేదములచే వశము చేసుకొన వలెను. సామంతులను, ఆట వికులను, ఇతరులను గూడ ఆవశ్యకతానుసారముగ భేదదండముల ప్రయోగించుచు వశము నందు ఉంచుకొన వలెను.

దేవతా ప్రతిమలు చెక్కిన స్తంభములు పెద్ద పెద్ద రంధ్రములందు దాగియున్నవారు, స్త్రీ వేషము ధరించినవారు, రాత్రియందు అద్భుత రూపములు ప్రదర్శించువారు, భేతాళులవలెను, ముఖము నుండి అగ్నిని కక్కుచున్న పిశాచములవలెను, దేవతలవలెను, రూప ములు ధరించు వారును చేయునది 'మానుషమాయ'. ఇచ్ఛానుసారముగ రూపము ధరించుట. శస్త్ర, అగ్ని, శిలా, జలములు వర్షించుట, అంధకారము, ఝంఝామారుతము, పర్వతములు, మేఘములు సృజించుట ఇది అమానుషమాయ. గడచిన ద్వాపరమునందు పాండవ వంశీయుడగు భీమసేనుడు స్త్రీ వేషము ధరించి శత్రువైన కీచకుని చంపెను. అన్యాయమునందును, వ్యసనములందును, అధిక బలవంతు నితో యుద్ధమునందును ప్రవర్తించిన తన వారిని మరల్చకుండుట 'ఉపేక్ష'. భీమసేనునితో యుద్ధము నకు ఉప్రకమించిన సోదరుడైన హిడింబుని హిడింబ నిషేధింపలేదు. స్వలాభమునకై ఉపేక్షించినది. మేఘములను, అంధకారమును, వర్షమును, అగ్నిని, పర్వతములను, ఇట్టి ఇతరాద్భు తములను, దూరముగా నిలచియున్న ధ్వజశాలులగు మహాసైన్యములను చూపుట, భిన్నములైన శత్రుసైనికుల అవయవములనుండి రక్తధారలు ప్రవహించుచున్నట్లు చూపుట–ఇది అంతయు 'ఇంద్రజాలము'. ఈ ఇంద్రజాలమును ప్రయోగించి శత్రువులను భయపెట్టవలెను. (241)

రాజనీతి కథనము

శ్రీరాముడు పలికెను : షడ్విధమగు సేనను కవచాదులతో సన్నద్ధముచేసి, వ్యూహము ఏర్పరచి, ఇష్టదేవతలను, యుద్ధ సంబంధి దుర్గాది దేవతలను పూజించి, శత్రువుపై ఆక్ర మణము చేయవలెను. మూల, భృతి, శ్రేణి, మిత్ర, శత్రు, ఆటవికములని సేనలు ఆరు విధములు. వీటిలో పూర్వపూర్వ సేనలు శ్రేష్ఠములు, వీటి వ్యసనములు కూడ ఈ విధము గనే గరిష్ఠములు. పదాతి, అశ్వ, రథ, గజములు సేనకు నాలు అంగములు. మంత్రము, కోశము అను రెండు అంగములు కూడ కలిసి ఆరు అంగములు. నదీదుర్గ, పర్వతదుర్గ, వనదుర్గములలో, భయకారణములు ఉన్నచోట, సేనాపతి సంనద్ధములై, వ్యూహబద్ధములైన సైన్యములతో వెళ్ళవలెను. అధికవీరులైన యోధులతో కలిసి ఒక సేనానాయకుడు ముందుగా వెల్ళవలెను. విజిగీషురాజు, వాని అంతఃపురము సేనామధ్యలో నుండి యాత్ర సాగించవలెను. స్వామికి ఇరువైపుల ఆశ్విక సైన్యము, దాని ఇరుప్రక్కల రథసేన, దానికి ఇరుప్రక్కల గజసేన, దాని రెండు ప్రక్కల ఆటవిక సేన ఉండవలెను. కుశలుడగు ప్రధాన సేనాపతి, యాత్రా సమయమున తాను స్వామికి వెనుకనుండి, ఇతరులనందరిని ముందు ఉంచి నడువవలెను. హతోత్సాహులగు సైనికులకు మెల్లమెల్లగ ఆశ్వాసన మిచ్చుచు పోవలెను. సైన్య మంతయు యుద్ధసన్నద్ధమై ఉండవలెను. ఎదుటినుండి శత్రువుల ఆక్రమణము జరుగునను భయమున్నచో రెక్కలు చాపిన శ్యేనపక్షి ఆకారముగల వ్యూహమును, సన్నని మార్గము నుండి ఆక్రమణము జరుగునను భయము ఉన్నచో గొప్ప మకర వ్యూహమేర్పరచి ముందుకు సాగవలెను. అడ్డముగా ఆక్రమణము జరుగునను భయము న్నపుడు వీరులు అగ్రమునందున్న సూచీముఖ వ్యూహమును, వెనుకనుండి భయమున్నచో శకట వ్యూహమును, ప్రక్కల నుండి భయమున్నచో వజ్రవ్యూహమును, నలుమూలల నుండి భయమున్నచో సర్వతో భద్ర వ్యూహమును నిర్మించుకొని ముందుకు వెళ్ళవలెను.

పర్వత గుహలందును, దుర్గమ పర్వత మార్గమునందును, దీర్ఘప్రయాణముచే అలసి పోయి నదియు, ఆకలిదప్పులచే పీడింపబడినదియు, రోగ, దుర్భిక్ష, మహామారులతో బాధపడుచున్నదియు, దోపిడి దొంగలచే చెల్లాచెదరు చేయబడినదియు, బురద, ధూళి, నీళ్ళు-వీటిలో చిక్కుకొన్నదియు, వ్యాకులముగా ఉన్నదియు, ఒక వ్యక్తి మాత్రమే నడచుటకు తగిన మార్గము ఉండుటచే ముందుకు నడవక ఒకేచోట నిలిచిపోయినదియు, భోజన పానములు చేయుచున్నదియు, అయోగ్యమైన ప్రదేశమునందున్నదియు, కూర్చుండి పోయినదియు, చోరాగ్ని భయవ్యాకులమైనదియు, వర్షము లచేతను, తుపానుచేతను పీడితమైనదియు, ఇట్టి ఇతర సంకటములలో చిక్కుకొనినదియు అగు తన సేనను అన్నివైపులనుండి రక్షించుకొనుచు, శత్రు సైన్యముపై దెబ్బతీయుడకై వేచి యుండవలెను. శత్రువుకంటె తనకు దేశకాలములు ఎక్కువ అనుకూలముగ ఉన్నపుడును. శత్రు ప్రకృతులలో పరస్పర వైషమ్యము ఏర్పడినప్పుడును, తన బలము అధికముగా నున్నపుడును, శత్రువుతో ప్రత్యక్ష ముగ యుద్ధమునకు దిగవలెను. పరిస్థితి ఇందుకు విరుద్ధముగా నున్న పుడు కూట యుద్ధమునకు ఉపక్రమించవలెను. శత్రుసైన్యము పైనచెప్పిన వ్యసనములలో చిక్కుకొని యుద్ధాయోగ్యమైన ప్రదేశమునందు ఉన్నపుడు, విజిగీషువు, అనుకూల ప్రదేశమునందుండి, శత్రువుపై ఆక్రమణముచేసి,

నశింపచేయవలెను. శత్రుసైన్యము అనుకూల ప్రదేశమునందు ఉన్నపుడు, వారి ప్రకృతులలో భేదము కల్పించి, సమయము చూచుకొని శత్రువులను నశింపచేయవలెను.

యుద్ధమునుండి వెనుకవైపు పరుగెత్తుకొని వెళ్ళి శత్రువులను ఆతని భూమినుండి బైటకు లాగికొనివచ్చు, ఆటవికులచేతగాని, అమిత సైనికులచే గాని లాగికొనిరాబడిన శత్రువులను వీరులగు యోధులచే చంపించవలెను. అల్పసంఖ్యాకులగు సైనికులను ఎదుట నిలబెట్టి శత్రువుతో యుద్ధము చేయుచు, వారేమరియుండగా, ఉత్తమవీరులుగల సైన్యముతో వెనుకనుండి శత్రుసైన్యమును ప్రవేశించి నశింపచేయవలెను. లేదా వెనుక వైపు సైన్యమును సమీకరించి, శత్రువుల దృష్టి అటువైపున నున్నపుడు ముందునుండి ప్రవేశించి వారిని చంపవలెను. వెనుకనుండియు, ముందునుండియు ఆక్రమణము చేసిన విధముననే పార్శ్వములనుండి కూడ చేయవలెను. ఇది కూట యుద్ధమునందు అవలంబించవలసిన పద్ధతి. ముందుగా దూష్యబలముతోను, అమిత్ర బలముతోను, ఆటవిక బలముతోను యుద్ధముచేసిన శత్రుసేన అలసిపోయిన పిమ్మట, తన సేన అలసిపోక పూర్వము, శత్రు సేనపై ఆక్రమణముచేసి నశింపచేయవలెను. లేదా దూష్యబలమును, అమిత్రసేనను యుద్ధ భూమి నుండి పారిపోవునట్లు ఆజ్ఞాపించి,నేను జయించితిని అని శత్రువునకు విశ్వాసము కలిగిన పిమ్మట, మంత్ర బలము నాశ్రయించి, ప్రయత్నపూర్వకముగ ఆక్రమించి శత్రువును నశింప చేయవలెను. స్కంధావారమును, పురములను, గ్రామములను, సస్యములను, గోష్ఠ ములను దోచు కొనుటకు శత్రువుల మనస్సులో లోభము కలిగించి, వారు ఆ పనిలో నిమగ్నులై ఉన్నపుడు తాను మాత్రము సావధానుడై వారినందరిని సంహరించవలెను. లేదా శత్రురాజుల గోవులను అపహరించి, వారి దృష్టిని వాటిని విడిపించుకొనుట యందు మరలునట్లుచేసి, వాళ్లను మార్గమధ్యము నందే ఆపి సంహరించవలెను. తమపై ఆక్రమణము జరుగునను భయముచే రాత్రి యంతయు మేల్కొని యున్న శత్రుసైనికులు, నిద్రాలసులై యున్నపుడు వారి నాక్రమించి సంహరించవలెను. లేదా రాత్రి నిశ్చింతగా నిద్రించుచున్న సైనికులను ఖడ్గధాదులచే చంపించవలెను.

సేన ఒకసారి ముందుకు దుమికిన తరువాత శత్రువులు మార్గమునందు అవరోధములు కల్పించినచో, తన్నివారణార్థమై ఏనుగులను ముందు నడుపవలెను. అశ్వములు కూడ ప్రవేశింప జాలని వనదుర్గమునందు గజముల సాహాయ్యముచేతనే సైన్యము ప్రవేశింప గలుగును. గజములు ఎదుటనున్న వృక్షాదులను విరచివేసి సైనికులకు మార్గమును కల్పించును. దృఢముగానున్న సైనిక పంక్తిని భేదింపవలెనన్నచో గజములనే ఉపయోగిం చవలెను. వ్యూహము భిన్నమగుటచే ఛిద్రములు ఏర్పడినచోట ఏనుగుల నుంచి ఆ ఛిద్ర ములు పూడ్చవలెను. శత్రువులలో భయము కలిగించుట, శత్రు దుర్గ ద్వారములను శిరస్సుతో పగులగొట్టుట, సైన్యముతో కోశమును తీసుకొని వెళ్ళుట, ఏదైన భయము ఉత్ప న్నమైనపుడు రక్షించుకొనుట –ఇదియంతయు గజముల ద్వారా మాత్రమే సాధింప శక్య మగును. అభిన్నమగు సైన్యమును భేదించుట, భిన్నమైన దానిని పూడ్చుట అను పనులు రథసేనా సాహాయ్యముతో కూడ చేయవచ్చును. వనములలో ఎచట ఉపద్రవములున్నవి, ఎచటలేవు అను విషయమును పరిశీలించుట, మార్గమును నిర్ణయించుట, ఇది అశ్వసేన చేయ వలసిన కార్యము. తనపక్షము వారికి ఆహారాది సామగ్రిని అందజేయుట, పారిపోవుచున్న

శత్రుసైన్యమును శీఘ్రముగా తరుముట, సంకట సమయములందు శీఘ్రముగా పారిపోవుట, పనులు శీఘ్రముగా చేయుట, తమ సైన్యము కష్ట పరిస్థితులలో నున్నపుడు శీఘ్రముగా అచట చేరి సాహాయ్యము అందించుట, శత్రు సేనాగ్ర బాగమున ప్రహారముచేసి వెంటనే వెనుకకుపోయి అక్కడకూడ ప్రహారముచేయుట, అశ్వసేనాకార్యములు, సర్వదా శస్త్రధారణము చేసియుండుట కాలిబంటుల కార్యము. సైన్యమునకు విడిది ఏర్పరచు స్థానము మార్గము మొదలగునవి అన్వేషించుట వెట్టి వారి కర్తవ్యము. పెద్ద పెద్ద మోళ్లు, చెట్లు, పొదలు ఉండి ముళ్ళచెట్లు లేనిదియు, పారిపోవుటకు అనువైన మార్గము గలదియు, ఎక్కువ మెరకపల్లములు లేనిదియు అగు భూమి పదాతి సైన్యసంచార యోగ్యము. వృక్షములు శిలలు తక్కువగా నున్నది, శీఘ్రముగా లంఘింపవీలగు భూచ్ఛిద్రములు, గట్టి నేలగలది రాళ్లు, బురదలేనిది, బైటికిపోవుటకు అనువగు మార్గముకలది అగు భూమి అశ్వ సంచారయోగ్యము. పాదాలతో త్రొక్కివేయుటకు శక్యమైన చెట్లు, ఛేదించవీలైన తీగలు కలదియు, బురదలేనిదియు, గోతులులేనిదియు, గజారోహణ యోగ్యములగు చిన్న పర్వతములు మాత్రమే ఉన్నదియు అగు భూమి నిమ్నోన్నతముగా ఉన్నను గజ సేనాగమన యోగ్యము.

అశ్వసైన్యాదులు విచ్ఛిన్నమైనపుడు వాటిని ఆదుకొని ఆ లోపమును పూరించు సైన్యమునకు 'ప్రతిగ్రహము' అని పేరు. ప్రతిగ్రహమును చక్కగా సంఘటితము చేసికొన వలెను. అది భారమును సహింప సమర్థమై యుండును. ప్రతిగ్రహము లేని వ్యూహము శూన్యమువలె కనబడును. విజయాభి లాషియైన బుద్ధిమంతుడగు రాజు ప్రతిగ్రహ సైన్యమును కూర్చుకొనకుండ యుద్ధము చేయగూడదు. కోశము రాజుదగ్గరనే ఉండవలెను. రాజత్వము కోశాధీనము. విజయము సాధించిన యోధులకు ఆ కోశమునుండియే పారితోషికము ఈయవలెను. దాతకోసమై యుద్ధము చేయనివాడెవ్వడైన ఉండునా? శత్రు రాజును వధించిన యోధునకు ఒక లక్ష ముద్రలు ఇవ్వవలెను రాజకుమారుని చంపిన వానికి దానిలో సగము పారితోషికముగా ఈయవలెను. సేనాపతిని చంపినవానికి గూడ అంతయే. ఏనుగ రథము మొదలగు వాటిని నశింపచేసినవారికి గూడ ఉచితరీతిని పారితోషికములు ఈయవలెను. పదాతులు, అశ్వికులు, రథికులు, హాస్తికులు కూడ తమ బడలికకు, విశ్రాంతి నిమిత్తమై వెనుకకు వెళ్ళుటకు అడ్డు ఉండనంత దూరమునందు ఉండి యుద్ధము చేయవలెను. యోధులందరును దూరదూరముగా ఉండి యుద్ధము చేయవలెను. కలిసిపోయి యుద్ధము చేసినచో అది సంకులమైపోవును. మహాసంకుల యుద్ధము నందు అలసిపోయిన పదాత్యాదులగు అసహాయ సైనికులు పెద్దపెద్ద ఏనుగుల సాహాయ్యము తీసికొనవలెను. ఒక్కొక్క ఆశ్వికుని ఎదుట ముగ్గురు పదాతులు ప్రతి యోద్ధలుగా, అనగా అగ్రగాములుగా ఉండవలెను. ఒక్కొక్క హస్తికుని ఎదుట ఐదుగురేసి చొప్పున ఆశ్వికులుండవలెను. వీరు కాక ఏనుగకు పాదరక్షకులు గూడ అంతమందియే, అనగా ఐదుగురేసి ఆశ్వికులు, పదునైదుగురు పదాతులు. ప్రతియోద్ధలు ఏనుగుకు ముందును, పాదరక్షకులు గజపాద సమీపమునందును ఉందురు. ఇది ఏనుగులకు సంబంధించిన వ్యూహము. రథవ్యూహ విషయమునందు కూడ ఇట్లే తెలియవలెను. గజ వ్యూహమునకు చెప్పబడిన రీతియందే నవగజవ్యూహము కూడ ఏర్పరుపవలెను. దీనికి 'అనీకము' అని పేరు. ఒక అనీకమునకు, ఒక అనీకమునకును మధ్య అయిదు ధనస్సుల దూరము ఉండవలెను. ఈ విధముగ అనేక విభాగాను సారము వ్యూహసంపత్తిని ఏర్పరుచుకొనవలెను.

వ్యూహమునకు ప్రధానముగా మూడు అంగములున్నవి. 'ఉరస్యము', 'కక్షము', 'పక్షము', అను మూడును కల్పింపదగినవి. ఉరస్సు, కక్షము,పక్షములు, మధ్యము, ప్రతి గ్రహము, కోటి అని వ్యూహమునకు ఏడు అంగములు శాస్త్రజ్ఞులచే చెప్పబడినవి. ఉరస్య, కక్ష, పక్ష, ప్రతిగ్రహాదులతో కూడిన వ్యూహవిభాగము బృహస్పతిచే చెప్పబడినది. శుక్రా చార్యుని మతమున కక్ష, ప్రకక్షములు లేవు. సేనాపతులు ఉత్తమ వీరపరివృత్తులై యుద్ధ రంగమునందు నిలువవలెను. వారందరును సంఘటితులై యుండి ఒకరిని ఒకరు రక్షిం చుచు యుద్ధము చేయవలెను. దుర్బల సైన్యమును వ్యూహమధ్యమునందు ఉంచవలెను. యుద్ధమునకు సంబంధించిన యంత్రములు, ఆయుధములు, ఓషధులు మొదలగు ఉప కరణములను సైన్యమునకు వెనుక ఉంచవలెను. యుద్ధమునకు ప్రాణము రాజు. రాజు లేనిచో యుద్ధములో పాల్గొన్నవారు హతులగుదురు. హృదయస్థానము నందు గజము లను, కక్షస్థానమున రథములను, పక్షస్థానములందు అశ్వములను, కక్షభాగమునందు రథము లను, పక్షములందు గజములను ఉంచిన వ్యూహము 'అంతభేది'కక్షములందు అశ్వము లను, మధ్యదేశమున పదాతులను ఉంచి ఏర్పరచినది మరొక విధమగు 'అంతభేది వ్యూహము', ఈ రథములు లేనిచో వ్యూహము లోపల అంతటను గజములను ఉంచ వలెను. సేన అధికముగా ఉన్నచో అది 'ఆవాసము'. మండలము, అసంహతము, భోగము, దండము అనునవి నాల్గును ప్రకృతి వ్యూహములు. దండాకారమున పొడవుగా ఏర్పరచిన వ్యూహము 'దండ వ్యూహము'. సర్ప శరీరాకారమున ఏర్పరచినది 'భోగ వ్యూహము' దానిలో సైనికుల అన్వావర్తనము జరుగు చుండును. సర్వతోముఖమునుండి గోళాకారమున ఏర్పరచిన వ్యూహము 'మండలవ్యూహము' అనీకములను దూరదూరముగా నిలబెట్టిన వ్యూహము 'అసంహత వ్యూహము'.

ప్రదరము, దృఢకము, అసహ్యము, చాపము, చాపకుక్షి, ప్రతిష్ఠము, సుప్రతిష్ఠము, శ్యేనము, విజయము, సంజయము, విశాలవిజయము. సూచి, స్థూణాకర్ణము, చమూ ముఖము, ఝషాస్యము, వలయము, సుదుర్జయము అని దండవ్యూహము పదునేడు విధములు. పక్ష, కక్ష, ఉరస్యములను మూడు స్థానములందును సైనికులు సమస్థితిలో నున్నచో అది 'దండ ప్రకృతి' కక్ష భాగమునందు సైనికులు కొంచెము ముందుకు వెళ్ళగా మిగిలిన రెండు స్థానములందలి సైనికులు లోనికి అణగి యున్నచో అది 'ప్రదరము'. శత్రువులను చీల్చివేయును గాన దీనికి ఆ పేరు వచ్చినది. కక్ష – పక్షములు రెండును లోనికి అణగియుండి, ఉరస్యము మాత్రము బైటకు వచ్చినచో అది 'దృఢకము' రెండు పక్షములు మాత్రము బైటకు వచ్చినచో అది 'అసహ్యము ప్రదర్శన – దృఢక అసహ్యములను విపరీతముగా ఏర్పరచినచో అవి క్రమముగ చాప, చాపకుక్షి, ప్రతిష్ఠలు అగును. రెండు పక్షములు బైటకురాగా ఉరస్యము అంతః ప్రవిష్టమైనచో అది 'సుప్రతిష్ఠితము'. ఏత ద్విరుద్ధస్థితి 'శ్యేనవ్యూహము'. నిలబెట్టిన దండము వంటి ఆకారముగల దండ వ్యూహమునకు స్థూణాకర్ణములు రెండు పక్షములైనచో అది 'విజయము', రెండు చాప వ్యూహ ములు రెండు పక్షములుగా నున్నది. 'సంజ యము' ఒక దానిపై ఒకటి చొప్పున రెండు స్థూణాకర్ణములు నిలిపినచో అది 'విశాల విజయము', కక్ష–పక్షాదులను ఒకదానిపై ఒక టిగ నిలబెట్టినచో అది 'సూచి', రెండు రెట్లుగా ఉన్న పక్షములుగల దండవ్యూహము 'స్థూణాకర్ణము'. మూడేసి పక్షములు బైటకు వచ్చినది చతుర్గుణ పక్షములు కలది

అగు వ్యూహము 'చమూముఖము'; దీనికి విపరీతమైనది ఝుషాస్యము; రెండుదండ వ్యూహములచే వలయవ్యూహము ఏర్పడును. నాలుగు దండవ్యూహములచే దుర్జయవ్యూహము ఏర్పడును.

భోగ వ్యూహమున గోమూత్రిక, అహింసచారి, శకటము, మకరము, పరిపతన్తికము అని ఐదు భేదములు ఉన్నవి. నడచుచున్న ఎద్దు మూత్రము పోసినపుడు ఎట్లు రేఖ ఏర్పడునో ఆ విధముగా సైన్యమును నిలిపిన గోమూత్రికా వ్యూహము. సర్పము సంచరించునపుడు ఏర్పడు రేఖవలె సైన్యమును నిలిపిన అది అహిసంచారి, రక్ష-పక్షములు రెండును ముందు వెనుక క్రమమున దండ వ్యూహమువలె నుండి ఉరస్య సంఖ్య రెట్టింపు అయినచో అది 'శకట వ్యూహము'; దీనికి విపరీతముగ నున్నది మకర వ్యూహము. ఈ రెండు వ్యూహములలో దేనికైన మధ్యభాగమునందు అశ్వ-గజాదుల ఆవాపము చేసినచో అది పరిపతంతిక వ్యూహము. సర్వతోభద్రము దుర్జయము అని మండల వ్యూహము రెండు విధములు. దీనిలో ఐదు అనీకముల సేన ఉండును. ఆవశ్యకతాను సారము ఉరస్యము నందును, రెండు కక్షములందును ఒక్కొక్క అనీకమును పెంచినచో దుర్జయమను వ్యూహము. అర్ధచంద్రము, ఉత్థానము వజ్రము అని అసంహతము మూడు విధములు. కర్కట, శృంగి, కాకాపాది, గోధిక అని కూడ అసంహతమున మరిమూడు భేదములు. అర్ధ చంద్ర, కర్కట శృంగులందు మూడేసి అనీకములుండును. ఉత్థాన-కాకపాదులందు నాలుగేసి అనీకములును, వజ్ర-గోధికలు ఐదేసి అనీకములతో ఏర్పడును. అనీకములను పట్టి మూడు భేదములేయైనను, ఆకృతి భేదమును బట్టి ఆరు భేదములు చెప్పబడినవి. ఈ విధముగ దండవ్యూహమున పదునేడు భేదములు, మండల వ్యూహమునకు రెండుభేదములు అసంహతమునకు ఆరుభేదములు, భోగ వ్యూహమునకు ఐదు భేదములు చెప్ప బడినవి. పక్షాది అంగముల ఏదైన ఒక అంగము సేనచే శత్రువ్యూహమును భేదించి, మిగిలిన అనీకములచే దానిని చుట్టుముట్టవలెను. లేదా ఉరస్యము నందలి అనీకముచే శత్రువ్యూహమును ఆక్రమించి, రెండు ప్రపక్షములచే చుట్టుముట్టవలెను. శత్రుసేన యొక్క రెండుప్రపక్షములందును తన వ్యూహమునందలి పక్షములచే ఆక్రమణము సలిపి, శత్రు జఘన భాగమును తన ప్రతిగ్రహ-కోటి ద్వయములతో నశింపచేయవలెను. ఉరస్యము నందలి సేనతో శత్రు పక్షమును పీడించవలెను. వ్యూహమునందు సారహీన సైనికులున్న చోట్లను, విభేదములు ఏర్పడిన సైన్యము నందును, దూష సైనికులున్న ప్రదేశములందును శత్రుసేనను సంహరించి, తన పక్షమునందున్న అట్టి స్థానములకు బలము చేకూర్చవలెను. బలిష్ఠ సేనను, అంతకంటె బలిష్ఠమగు సేనను ఉపయోగించి, పీడించవలెను. నిర్బల సైన్య మును సబల సైన్యముతో అణచివేయవలెను. శత్రుసైన్యము సంఘటితముగ నున్నచో, ప్రచండమగు గజసేనతో ఆ శత్రు సైన్యమును చీల్చి వేయవలెను. పక్ష, కక్షి, ఉరస్యములు మూడును సమస్థితిలో నున్నపుడు అది దండవ్యూహము. దండము యొక్క ప్రయోగమును, స్థానమును వ్యూహ చతుర్థాంగముతో ప్రదర్శించ వలెను. దండముతో సమానముగ రెండు పక్షములు కూడ ముందుకు వచ్చినచో అది 'ప్రదరము' లేదా 'ప్రదారక' వ్యూహము. అదే పక్ష కక్షముద్వారా అంతిక్రాంతమైనచో అది దృఢవ్యూహము. రెండు పక్షములు మాత్రమే ముందుకు చొచ్చుకున్నచో అది 'అసహ్య వ్యూహము'. కక్షమును పక్షమును క్రిందనుంచి, ఉరస్యముద్వారా ముందుకు వచ్చినది 'చాపవ్యూహము' రెండు దండములు

కలిసిన 'వలయ వ్యూహము' ఏర్పడును. ఈ వ్యూహము శత్రువులను చీల్చివేయును. నాలుగు వలయ వ్యూహములు కలిసినచో, శత్రుసేనను మర్దించు 'దుర్జయ వ్యూహము' ఏర్పడును. కక్ష–పక్ష–ఉరస్యము విషమములుగా నున్నచో అది 'భోగవ్యూహము'. సర్పచారి, గోమూత్రిక, శకటము, మకరము, పరిపతంతికము అని దానికి ఐదు భేదములు. సర్పము సంచరించు ఆకారమున సర్పచారి, గోమూత్రాకారమున గోమూత్రిక, శకటాకారమున శకటము, దీనికి విపరీతముగ మకర వ్యూహము ఏర్పడును. ఇట్లు పంచభేదములుగల భోగవ్యూహము శత్రువినాశకము. మండల వ్యూహమునకు చక్రవ్యూహ, పద్మవ్యూహదులు భేద ప్రభేదములు. ఇదే విధముగ సర్వతోభద్ర, వజ్ర, అక్షవర, కాక, అర్ధచంద్ర, శృంగార, అచలాది వ్యూహములు ఉన్నవి. వీటి ఆకారములను బట్టి పేర్లు వచ్చినవి. వ్యూహములను తమ ఇచ్ఛననుసరించి ఏర్పరచుకొనవలెను. వ్యూహములు శత్రుసేన ప్రగతిని నిలిపి వేయును. అగ్ని చెప్పెను : శ్రీరాముడు రావణుని వధించిన పిదప అయోధ్యా రాజ్యమును పొందెను. శ్రీరాముడు చెప్పిన ఈ నీతిని అనుసరించుట చేతనే లక్ష్మణుడు పూర్వము, ఇంద్రజిత్తును వధించెను. (242)

పురుషలక్షణ వర్ణనము

అగ్ని దేవుడు పలికెను : వశిష్ఠా! శ్రీరాముడు చెప్పిన రాజనీతిని చెప్పితిని. ఇపుడు స్త్రీ పురుష లక్షణములను చెప్పెదను. దీనిని పూర్వము సముద్రుడు గర్గమునికి చెప్పెను. సముద్రుడు చెప్పెను : ఉత్తమవ్రతాచరణ శీలుడవగు గర్గా! స్త్రీ పురుష లక్షణములను, వాటి శుభాశుభ ఫలములను చెప్పెదను. ఏకాధికులు, ద్విశుక్లుడు, త్రిగంభీరుడు, త్రిత్రికుడు, త్రిప్రలంబుడు, త్రికవ్యాపి, త్రివళీ యుక్తుడు, త్రికాలజ్ఞుడు, త్రివిపులుడు, అగు పురుషుడు శుభలక్షణ సంపన్నుడు. ఇట్లే చతుర్లేఖుడు, చతుఃసముడు, చతుష్కిష్కుడు, చతుర్దంష్ట్రుడు, చతుః కృష్ణుడు, చతుర్గంధుడు, చతుర్హ్రస్వుడు, పంచసూక్ష్ముడు, పంచదీర్ఘుడు, షడున్నతుడు, అష్టవంశుడు, సప్తస్నేహుడు, నవామలుడు, దశపద్ముడు, దశవ్యూహుడు, న్యగ్రోధపరి మండలుడు, చతుర్ధశ సమద్వంద్వుడు షోడశాక్షుడు అగు పురుషుడు ప్రశస్తుడు. ధర్మ, అర్థ, కామములతో కూడిన ధర్మము 'ఏకాధికము'. నట్ట గ్రుడ్లు తప్ప మిగిలిన నేత్రములు, దంతములు తెల్లగా ఉన్నవాడు 'ద్విశుక్లుడు'. స్వర, నాభి, సత్త్వములు, గంభీరములుగా ఉన్నవాడు త్రిగంభీరుడు. నిర్మాత్సర్యము, దయ, క్షమ, సదాచరణము, శౌచము, అస్పృహ, ఔదార్యము, అనాయాసము శూరత్వము అను (తొమ్మిది) గుణములుకలవాడు 'త్రిత్రికుడు'. వ్రేలాడు వృషణములు, భుజద్వయము కలవాడు త్రి ప్రలంబుడు. తేజో–యశః – కాంతు లచే దేశజాతి–దశదిశలను వ్యాపించువాడు 'త్రికవ్యాపి'. ఉదరమునందు మూడు ముడతలు ఉన్నవాడు 'త్రివళిమంతుడు' దేవతా, బ్రాహ్మణ, గురుజనుల విషయమున వినతుడు 'త్రివినతుడు', ధర్మ, అర్థ, కామముల సమయము నెరిగినవాడు త్రికాలజ్ఞుడు. వక్షః స్థల, లలాట, ముఖములు విపులముగా నున్నవాడు 'త్రివిపులుడు', హస్తద్వయ, పాదద్వయములు ధ్వజచ్ఛత్రాది లేఖా చిహ్నితములై ఉన్న వాడు 'చతుర్లేఖుడు'. వ్రేళ్ళు, హృదయము, కటి, పృష్ఠము – ఈ నాలుగు సమములుగా ఉన్నవాడు 'చతుస్సముడు. తొంబదియారు అంగుళముల ఎత్తుగలవాడు 'చతుష్కిష్కువు' చంద్రునివలె ప్రకాశించు

నాలుగు కోరలు గలవాడు చతుర్దంష్ట్రుడు. నేత్ర తారలు, కనుబొమ్మలు, మీసము, కేశములు నల్లగా ఉండువాడు 'చతుష్కృష్ణుడు'.

నాసిక, ముఖము, రెండు చంకలు – వీటి యందు మంచి గంధమున్న వాడు చతుర్గంధుడు, లింగము, కంఠము, రెండు పిక్కలు హ్రస్వముగా నున్నవాడు చతుర్హ్రస్వుడు వ్రేళ్ళ కణుపులు, గోళ్ళు, కేశములు, దంతములు, చర్మము – ఇవి సూక్ష్మముగానున్నవాడు 'పంచసూక్ష్ముడు'. చెక్కిలి, నేత్రములు లలాటము, నాసిక, వక్షఃస్థలము విశాలముగా నున్నవాడు "పంచదీర్ఘుడు", వక్షఃస్థలము, చంకలు, గోళ్ళు, ముక్కు, ముఖము, మెడ వెనుకభాగము ఉన్నతముగా ఉన్నవాడు 'షడున్నతుడు', చర్మము, కేశములు, దంతములు, రోమములు, చూపు, నఖములు, మాట–ఇవి స్నిగ్ధముగా నున్న వాడు 'సప్తస్నేహుడు'. రెండు మోకాళ్ళు, రెండు తొడలు, పృష్ఠ భాగము, హస్తద్వయము, నాసిక అనునవి చక్కగానున్నవాడు 'అష్టవంశుడు'. నేత్రద్వయము, నాసికాద్వయము, కర్ణ ద్వయము, శిశ్నము, గుదము, ముఖము ఈ తొమ్మిది నిర్మలముగా నున్నవాడు 'నవామలుడు'. పద్మసమాన కాంతిగల జిహ్వా, ఓష్ఠ, తాలు, నేత్ర, హస్త, పాద, నఖ, శిశ్నాగ్ర, ముఖములు కలవాడు 'దశపద్ముడు' , హస్త, పాద, ముఖ, కంఠ, కర్ణ, హృదయ, శిరో, లలాట, ఉదర, పృష్ఠములు పెద్దవిగా ఉన్నవాడు 'దశవ్యూహుడు'. ఇతడు లోకసంమానితు డగును. రెండుచేతులు చాపగా ఒకచేతి మధ్యమాంగుళి నుండి రెండవ చేతిమధ్య మాంగుళి వరకు ఎంత పొడవుండునో అంత ఎత్తు ఉన్నవాడు 'న్యగ్రోధపరి మండలుడు'. చరణములు, గుల్ఫములు, నితంబములు, పార్శ్వములు, వంక్షణములు, వృషణములు, స్తనములు, కర్ణములు, ఓష్ఠ ములు, ఓష్ఠాంతములు, పిక్కలు, హస్తములు, బాహువులు, నేత్రములు అను యుగ్మాం గములు సమముగా నుండువాడు 'చతుర్దశ సమద్వంద్వుడు'. రెండు నేత్రములతో పాటు పదునాలుగు విద్యలు కూడ ఉన్నవాడు 'షోడశాక్షుడు'. ఇందుకు భిన్నమైన గుణములు కలది వికసించిన నేత్రములు కలదియగు శరీరము ప్రశస్తము. ఉత్తమ పురుషుని మాట మధురముగా నుండును. నడక మత్తగజగమన సమానమై యుండును. ఒక్కొక్క రోమ కూపమునుండి ఒక్కొక్క రోమమే వచ్చును. ఇట్టి పురుషుడు సర్వదా సకల భయములనుండి రక్ష పొందును. (243)

స్త్రీ లక్షణ వర్ణనము

సముద్రుడు చెప్పెను : గర్గాచార్యా! ఉత్తమ శ్రేణికి చెందిన శరీరముగల స్త్రీ యొక్క సర్వాంగము లును మనోహరముగా నుండును. ఆమె మత్త గజమువలె మందముగా నడచును. ఊరు–జఘన దేశములు విశాలములుగా నుండును. నేత్రములు ఉన్మత్తపారా వతము నేత్రములవలె మదభరిత ములై కేశములు నీలవర్ణములై యుండును. శరీరము పల్చగాను, రోమరహితముగాను ఉండును. చూడగనే ఆమె మనస్సును మోహింపచేయును. పాదములు పూర్తిగా నేలపై ఆనును. స్తనములు ఒకదానితో ఒకటి కలిసి ఉండును. నాభి దక్షిణావర్తమై ఉండును. యోని రావి ఆకు ఆకారములో నుండును. మణమలు అణగి యుండును. నాభి అంగుష్ఠ ప్రమాణముగ నుండును. పొట్ట వ్రేలాడదు. రోమావళిచే రూక్షముగా నున్న స్త్రీ మంచిది కాదు. నక్షత్ర, వృక్ష, నదీనామములు కలది, కలహప్రియ, అగు స్త్రీ మంచిదికాదు.

చాపల్యము లేనిది కటువచనములు పలుకనిది యగు స్త్రీ దేవతాదుల చేతగూడ పూజింపబడిన శుభలక్షణములు కలది. మధూక పుష్పములవలె తెల్లని కపోలములు గల స్త్రీ శుభురాలు. రోమావళితో నిండిన అవయవములు, నాడులు కనబడుచున్న శరీరముకల స్త్రీ ఉత్తమురాలు కాదు. వంకరగా నుండి ఒకదానితో ఒకటి కలిసిపోయిన కనుబొమ్మలు కలది కూడ మంచిది కాదు. తన ప్రాణములను పతిపై ఉంచినది, పతికి ప్రియురాలును అగు స్త్రీ లక్షణ రహితయైనను శుభలక్షణ సంపన్నగా చెప్పబడినది. సుందరమైన ఆకారమెచటనుండునో అచట శుభగుణములు కూడ ఉండును. పాదము కనిష్ఠిక (చిన్న వ్రేలు) భూమికి తగలని స్త్రీ మృత్యు స్వరూపురాలే. (244)

చామరాది లక్షణ కథనము

అగ్నిదేవుడు పలికెను : వశిష్ఠా! సువర్ణ దండభూషితమగు చామరము ఉత్తమము. హంస పక్షములతోగాని, మయూర పక్షములతో గాని, శుక పక్షములతో గాని నిర్మించిన ఛత్రము రాజునకు మంచిది. బక పక్ష నిర్మిత ఛత్రమును కూడ ఉపయోగించవచ్చును. మిశ్రిత పక్షముల ఛత్రము మాత్రము మంచిదికాదు. మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు లేదా ఎనిమిది పర్వములున్న దండము ప్రశస్తము. భద్రాసనము క్షీరవృక్ష కాష్టముచే నిర్మితమై ఏబది అంగుళముల ఎత్తు ఉండవలెను. అది సువర్ణ విచిత్రతమై మూడు హస్త ముల విస్తారము ఉండవలెను. ఓ ద్విజశ్రేష్ఠా! ధనస్సును నిర్మించుటకు లోహము గాని, శృంగముగాని, కాష్ఠముగాని ఉపయోగించవలెను. వెదురు, భంగము లేదా చర్మము వారికి ఉపయోగించును. దారు నిర్మితమగు శ్రేష్ఠ ధనుస్సుయొక్క పొడవు నాలుగు హస్త ములు – దానిలో ఒక్కొక్క హస్తము పొడవు తగ్గించగా మధ్యమ, అధమ ధనస్సులు ఏర్పడును. పిడికిలితో పట్టుకొనుటకు ధనస్సునకు మధ్య భాగమున ఏదైన ద్రవ్యమును ఉపయోగించవలెను. ధనస్సుయొక్క కోటిని కామినీ భ్రూలత ఆకారములో చాల గట్టిగ చేయవలెను. లోహ–శృంగ ధనస్సులను ప్రత్యేకముగ ఒక పదార్థముతోగాని, మిశ్రపదార్థములతో గాని తయారు చేయవలెను. శృంగధనస్సును అత్యంతోపయుక్తము గాను, సువర్ణ బింద్వలంకృతముగాను చేయవలెను. ధాతువులతో సువర్ణ, రజత, తామ్ర, కృష్ణ లోహములను ఉపయోగించవలెను. శార్జ్గ ధనస్సులలో మహిష, శరభ, రోహిణ మృగముల శృంగములతో నిర్మించినవి శుభములు. దారుమయశరాసనములలో చందన, వేతస, సాల, ధవ, అర్జున వృక్షముల కాష్ఠముతో నిర్మించినవి ఉత్తమములు. శరదృతువునందు పక్వమైన వెదురు కోసి నిర్మించిన ధనస్సు సర్వోత్తమము. ధనస్సును, ఖడ్గమును త్రైలోక్య మోహన మంత్రములతో పూజించవలెను.

లోహము, వెదురు, సరకాండము వీటితోగాని, మరియే ఇతర పదార్థములతో నిర్మించినను బాణము వంకర లేకుండగను, బంగారు కాంతి కలదిగను, స్నాయువువలె శ్లిష్టముగను, బంగారుపొన్నుతో భూషితముగను, తైలధౌతముగను, అందమైన రెక్కలు కట్టినదిగను ఉండవలెను. రాజు యాత్రయందును, అభిషేకమునందును, ధనుర్బాణములు మొదలగు అస్త్రములు; పతాకలు సంగ్రహించునపుడు దైవజ్ఞులనుగూడ పూజించవలెను. పూర్వము బ్రహ్మదేవుడు సుమేరు పర్వత శిఖరమునందు, ఆకాశగంగాతీరమున యజ్ఞము చేసెను. అతడు ఆ యజ్ఞమునకు వచ్చియున్న

లోహదైత్యుని చూచెను. అతనిని చూడగనే "వీడు నా యజ్ఞమున విఘ్నము కలిగించడు కదా!' అని చింతలోపడెను. ఇట్టి చింత కలుగగనే అగ్నినుండి బలవంతుడగు ఒక పురుషుడు ఆవిర్భవించి బ్రహ్మకు నమస్కరించెను. దేవతలు ప్రసన్నులై ఆతనిని అభినందించిరి. ఇట్లు అభినందింపబడుటచే ఆతడు 'నందక' మను పేరుతో ఒక ఖడ్గమాయెను. దేవతలు ప్రార్థింపగా శ్రీమహావిష్ణువు ఆ ఖడ్గ మును తన ఆయుధముగ స్వీకరించెను. ఆ దేవాది దేవుడు ఆ ఖడ్గమును దానికంఠమున చేయి ఉంచి పట్టుకొనుటచే అది ఒరనుండి బైటకువచ్చెను. ఆ ఖడ్గకాంతి నీలముగను, ముష్టి రత్న మయముగను ఉండెను. అది పెరిగి నూరు హస్తముల పొడవాయెను. లోకదైత్యుడు గదాప్రహారము చేయుచు దేవతలను యుద్ధభూమినుండి తరుమ మొదలిడెను. శ్రీమహా విష్ణువు ఆ ఖడ్గముతో దైత్యుని శరీరమునంతను ఖండించివేసెను. నందకము స్పర్శతగుల గనే ఆ దైత్యుని లోహమ యాంగములు అన్నియు ఛిన్నాభిన్నములై భూతలముపై పడి పోయినవి. ఈ విధముగ లోహాసురుని సంహరించి శ్రీమహావిష్ణువు – 'నీ పవిత్ర శరీరము భూతలమున ఆయుధ నిర్మాణమునకై ఉపయుక్త మగుగాక' అని ఆతనికి వరమిచ్చెను. అనంతరము శ్రీమహావిష్ణు ప్రసాదముచే బ్రహ్మ సర్వ సమర్థు డగు శ్రీ మహావిష్ణువును యజ్ఞముద్వారా నిర్విఘ్నముగా ఆరాధించెను. ఇపుడు నేను ఖడ్గ లక్షణము లను చెప్పెదను.

ఖటీఖట్టర దేశమునందు నిర్మితములగు ఖడ్గములు చాల అందముగా ఉండును. ఋషీకదేశ నిర్మితములు శరీరమును చీల్చివేయును. శూర్పారక దేశీయ ఖడ్గములు చాల దృఢముగ నుండును. వంగదేశ ఖడ్గములు తీక్ష్ణములై దెబ్బను ఎదుర్కొన సమర్థములై యుండును. అంగదేశ ఖడ్గములు తీక్ష్ణములు. ఏబది అంగుళముల ఖడ్గము ఉత్తమము. దానిలో సగము పరిమాణము గలది మధ్య మము. ఇంతకంటె తక్కువ ప్రమాణముగల దానిని ధరించగూడదు. మువ్వల ధ్వనివలె దీర్ఘశబ్దము చేయు ఖడ్గమును ధరించుట చాలమంచిది. పద్మపత్రమువలె గాని, మండలాకారమునగాని, కరవీర పత్రమువలెగాని ఉన్న అగ్రము గలదియు, ఘృతగంధము కలదియు, ఆకాశ శీలమును అగు ఖడ్గము ప్రశస్తము. ఖడ్గముపై, సమాంగుళము నందున్న లింగాకారమగు వ్రణము ప్రశస్తము. కాక–ఉలూకముల వంటి వర్ణము గలిగి విషమముగ నుండు ఖడ్గములు మంగళ కరములు కావు. ఖడ్గమునందు తనముఖము చూచుకొనగూడదు. ఖడ్గముజాతిని, మూల్యమునుకూడ ఎవ్వరికిని చెప్పరాదు. రాత్రి ఖడ్గమును తలవైపున పెట్టుకొని నిద్రింపరాదు. (245)

రత్న పరీక్షా కథనము

అగ్నిదేవుడు పలికెను : ద్విజశ్రేష్ఠా! ఇపుడు రత్నముల లక్షణములు చెప్పెదను. రాజు, వజ్ర, మరకత, పద్మరాగ, ముక్తా, మహానీల, ఇంద్రనీల, వైదూర్య, గంధసస్య, చంద్రకాంత, సూర్యకాంత, స్ఫటిక, పులక, కర్కేతన, పుష్పరాగ, జ్యోతీరస, రాజపట్ట, రాజమయ, శుభసౌగంధిక, గంజ, శంఖ, బ్రహ్మమయ, గోమేద, రుధిరాక్ష; భల్లాతక, ధూలీ, మరకత, తుష్యక, సీస, పీలు, ప్రవాళ, గిరివజ్ర, భుజంగమణి, వజ్రమణి, టిట్టిభ, భ్రామర, ఉత్పలములను రత్నములను ధరించవలెను. మధ్యకాంతిగలవి, నిర్మలములు, మంచి ఆకారముగలవి అగు రత్నములను మాత్రమే ధరించవలెను.

ప్రభావిహీనములు, మలినములు, ఖండితములు, బీటలు తీసినవి అగువాటిని ధరింపరాదు. అన్ని రత్నము లందును హీరమును ధరించుట ఉత్తమము. నీటిలో తేలునది, అభేద్యము, షట్కోణము, ఇంద్రధనస్సువలె నిర్మల ప్రభాయుక్తము, తేలికయైనది, సూర్యసమాన తేజము, లేదా చిలుక రెక్కల రంగు గలదియగు వజ్రము శుభకరము. సువర్ణ చూర్ణసమానమైన సూక్ష్మ బిందువులుగల మరకతమణి శ్రేష్ఠము. స్ఫటికము అత్యంత నిర్మలముగనున్నచో శ్రేష్ఠము. ఆరుణమగు పద్మరాగము శ్రేష్ఠము. ముత్యములు ముత్యపు చిప్పలలో పుట్టును. వాటికంటె శంఖము నుండి పుట్టినవి నిర్మల ములు, ఉత్కృష్టములు అని చెప్పబడినది. ఋషిప్రవరా! గజదంతముల నుండియు, గజకుంభముల నుండియు, సూకర, మత్స్య, వేణునాగముల నుండియు, మేఘముల నుండియు ఉత్పన్నములైనవి అత్యంత శ్రేష్ఠములు. ముత్యములలో వృత్తత్వము, తెలుపు, స్వచ్ఛత్వము, మహత్వము అను గుణము లుండును. ఉత్తమమైన ఇంద్రనీలమణిని పాలలో ఉంచగా అది చాల ప్రకాశవంతముగ నుండును. తమ కాంతిచే అంతను రంజింపజేయు రత్నములు అమూల్యములు. నీల –రక్త కాంతిగల వైదూర్యము శ్రేష్ఠము. ఇట్టి దానిని హారములో కూర్చుకొనవచ్చును. (246)

వాస్తు లక్షణ కథనము

అగ్నిదేవుడు పలికెను : ఇపుడు వాస్తు లక్షణములు చెప్పెదను. వాస్తుశాస్త్రము ప్రకారము, బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులకు, వరుసగా శ్వేత, రక్త, పీత, కృష్ణ వర్ణములు గల భూమి నివాసయోగ్యము. ఘృతగందముగల భూమి విప్రులకును, రక్త గంధముకలది క్షత్రియులకును, అన్నగంధము గలది వైశ్యులకును, మద్యగంధము గలది శూద్రులకును నివాసయోగ్యము. ఇట్లే బ్రాహ్మణాదులకు వరుసగా మధుర, కషాయ, ఆమ్లాది రసములుగల భూమి మంచిది. నాలుగు వర్ణముల వారికిని వరుసగా కుశ, సర్పట, కాశ, దూర్వాయుక్త మగు భూమి మంచిది. ముందుగా బ్రాహ్మణ పూజచేసి శల్యరహితమగు భూమిపై కుండము ఏర్పరుపవలెను. పిదప అరువది పదములుగల వాస్తు మండపము నిర్మించి దాని మధ్య నున్న నాలుగుపదములపై బ్రహ్మను స్థాపించవలెను. ఈ నాలుగు పదములకు తూర్పున నున్న గృహస్వామి ఆర్యమ. దక్షిణమున వివస్వంతుని, పశ్చిమమున మిత్రుని, ఉత్తరమున మహీధరుని చిహ్నితము చేయవలెను. ఈశాన్యము ఆప – ఆపవత్సులను, ఆగ్నేయమున సావిత్ర, సవితలను, పశ్చిమమునకు దగ్గరగా ఉన్న నైరృతియందు జయ, ఇంద్రులను, వాయవ్యమున రుద్ర వ్యాధులను వ్రాయవలెను. పూర్వాది దిశలందు, విదిక్కు లందున్న దేవతలు కాక, ఈ క్రింది దేవతలను వ్రాయవలెను. పూర్వమున మహేంద్ర, రవి, సత్య, భృశాదులను, దక్షిణమున గృహక్షత, యమ, భృంగ, గంధర్వాదులను పశ్చిమమున పుష్పదంత, అసుర, వరుణ, పాపయక్ష్మాదులను, ఉత్తరమున భల్లాట, సోమ, అదితి, ధనదులను, ఈ శాన్యమున నాగ, కరగ్రహములను చిత్రించవలెను. ఒక్కొక్క దిక్కునకు ఎనమండుగురు దేవతలుందురు. వారిలో ప్రథమ, అష్టమ దేవతలు వాస్తు మండల గృహస్వాములు. పూర్వ దిక్కునకు ప్రథమదేవత పర్జన్యుడు, రెండవ వాడు కరగ్రహుడు మహేంద్ర, రవి, సత్య, భృశ, గగన, పవనులు ఇతర దేవతలు. కొందరు ఆగ్నేయమునందు గగన, పవనులకు బదులు

అంతరిక్ష, అగ్నులను చెప్పుదురు. నైరృతియందు మృగ, సుగ్రీవులను, వాయవ్యమున రోగ, ముఖ్యులను, దక్షణమున పూషణ్, వితథ, గృహక్షత, యమ, భృంగ, గంధర్వ, మృగ, పితరులను స్థాపించవలెను. వాస్తుమండలము పశ్చిమమున దౌవారిక, సుగ్రీవ, పుష్పదంత, అసుర, వరుణ, పాపయక్ష్మన్, శేషులు ఉందురు. ఉత్తర మున నాగరాజ, ముఖ్య, భల్లాట, సోమ, అదితి, కుబేర, నాగ, అగ్నులు ఉందురు. తూర్పున సూర్య, ఇంద్రులు శ్రేష్ఠులు. దక్షిణమున గృహక్షత, పుష్పమయులు ఉత్తములు. పశ్చిమమున సుగ్రీవుడు ఉత్తముడు. ఉత్తరద్వారమున పుష్పదంతుడు కల్యాణ ప్రదుడు. భల్లాటకునే పుష్పదంతుడందురు.

ఈ వాస్తు దేవతలనందరిని మంత్రములతో పూజించి పునాదిరాయి వేయవలెను. పిదప ఈ క్రింది మంత్రములతో నందాది దేవులను పూజించవలెను. 'వసిష్ఠనందినియైన ఓ నందా! నన్ను ధన, పుత్ర, పౌత్రాది మంతునిచేసి ఆనందింపచేయుము. భార్గవపుత్రియైన జయా! నీ సంతానమైన మాకు విజయము నిమ్ము. అంగిరస తనయయైన ఓ పూర్ణా! నీ కోరికలను పూర్ణము చేయుము. కశ్యపాత్మజయైన ఓ భద్రా! నాకు మంగళప్రదమగు బుద్ధి నిమ్ము. వశిష్ఠ పుత్రియైన నందా! వివిధ బీజయుక్తము, సకలరత్న సంపన్నము అగు ఈ మనోహర నందనవనమున విహరింపుము. ప్రజాపతి పుత్రీ! భద్రా! నీవు ఉత్తమమైన లక్షణములు, శ్రీకృష్ణవ్రతము కలదానవు. ఓ కశ్యపనందినీ! నీవీ భూరూపమగు చతుష్కో ణము నందు నివసింపుము. భార్గవతనయా! దేవీ! నీవు సకల ప్రపంచమునకును ఐశ్వర్యమిచ్చు దానవు. శ్రేష్ఠులైన ఆచార్యులచే పూజితురాలవై, గంధ మాల్యాలంకృతురాలవై నా గృహమునందు నివసింపుము. అంగిరః పుత్రియైన ఓ పూర్ణా! నీవు కూడ సర్వాంగ సంపన్నురాలవై, క్షతిరహితవై నా ఇంట విహరింపుము. ఓ ఇష్టకా! నేను గృహప్రతిష్ఠ చేయుచున్నాను. నాకు అభిలషిత భోగములను ఇమ్ము. దేవస్వామి, నగరస్వామి, గృహస్వా ములకు మనుష్య, ధన, గజ, అశ్వ, పశ్వాదులను వృద్ధి పొందింపుము'. గృహప్రవేశ సమయమునందుగూడ ఈ విధముగనే శిలాన్యాసము చేయవలెను. ఇంటికి ఉత్తరమున రావిచెట్టు, దక్షిణమున ఉదుం బరము, పశ్చిమమున మఱ్ఱిచెట్టు మంచిది. ఇంటికి ఎడమప్రక్కన ఉద్యానము నిర్మింపవలెను. ఇట్టి ఇంటిలో నివాసము శుభకరము. పాతిన చెట్లకు, గ్రీష్మమునందు ప్రాతః సాయంకాలము లందును, శీతాకాలమున మధ్యాహ్నమునందును, వర్షా కాలమున నేల ఎండిపోయినపుడును నీళ్లు పోయవలెను. చెట్లకు వాయువిడంగము, నెయ్యి కలిపిన చల్లని నీళ్లు పోయవలెను. కాయుట మానివేసిన చెట్లకు ఉలవలు, మినుములు, పెసలు, తిలలు, యవలు, కలిపిన నీళ్లు పోయవలెను. ఘృతము కలిపిన శీతలజలము పోసినచో వృక్షము సర్వదా పుష్పఫలములతో నిండియుండును. మత్స్యములు కలిపిన నీళ్లుపోసిన చెట్లు బాగుగా పెరుగును. మేకల, గొర్రెల, లద్దెల చూర్ణము, యవలపిండి, తిలలు, ఇతరమైన గోమయము మొదలగు ఎరు వులు, నీరు వీటినన్నింటిని కలిపి ఐదురోజులు కప్పి ఉంచవలెను. ఇది పోసినచో అన్ని వృక్షము లకును ఫలపుష్పములు అధికముగా వృద్ధి చెందును. మామిడిచెట్లకు శీతజల సేచనము చాల మంచిది. అశోక వృక్షములు వికసించుటకు కామినీ పాదప్రహారము మంచిది. ఖర్జూ రము,కొబ్బరి మొదలగునవి ఉప్పుకలిపిన నీటిలో బాగుగా పెరుగును. వాయువిడంగము కలిపిన నీళ్లు అన్ని చెట్లకును మంచి దోహదము. (247)

పుష్పాది పూజాఫల కథనము

అగ్నిదేవుడు పలికెను : వశిష్ఠా! పుష్పములతో పూజించినచో శ్రీమహావిష్ణువు అన్ని కార్యములను సిద్ధింప చేయును. మాలతి, మల్లిక, గిలిమల్లిక, గులాబి, కనేరము, పాపంతి, అతిముక్తకము, కర్ణికారము, కురంటకము, తగరము, నీపము, బాణము, యూథిక, అశోకము, తిలకము, కుందము, తమాలము –ఈ పూవులతో పూజ శ్రేష్ఠము. బిల్వపత్రము, శమీపత్రము, భృంగరాజ పత్రము, తులసి, కృష్ణతులసి, వాసక పత్రము – ఇవి కూడ పూజకు తగినవి. కేతకీపత్ర–పుష్పములు, పద్మములు, రక్త కమలములుకూడ పూజలో గ్రాహ్యములు. జిల్లేడు, ధత్తూరము, గులివెంత, పర్వత మల్లిక, కుటజము, శాల్మలి, కటోర పుష్పము –ఇవి పూజానర్హములు. ప్రస్థము (నాలుగు సేర్లు) నెయ్యితో శ్రీమహావిష్ణువు నకు అభిషేకము చేసినచో కోటి గోవుల దానముచేసిన ఫలము లభించును. ఒక ఆఢకము ఘృతముతో అభిషేకము చేసినవాడు రాజ్యమును పొందును. ఘృతమిశ్ర దుగ్ధముతో అభిషేకము చేసినవాడు స్వర్గమును పొందును. (248)

ధనుర్వేద వర్ణనము - 1

అగ్నిదేవుడు పలికెను : వశిష్ఠా! ఇపుడు నాలుగు పాదములుగల ధనుర్వేదమును గూర్చి చెప్పెదను. ధనుర్వేదము నాలుగు విధములు: రథములు, గజములు, అశ్వములు, పదాతులు– ఈ యోధులను బట్టి దీనిని వర్ణించవచ్చును. యంత్రముక్తము, పాణిముక్తము, ముక్త సంధారితము, అముక్తము, బాహుయుద్ధము అనునవి ధనుర్వేదము నందలి ఐదు ప్రకారములు. అందును శస్త్ర సంపత్తి–అస్త్ర సంపత్తులచే యుద్ధము రెండు విధములు. ఋజుయుద్ధము, మాయాయుద్ధము అని మరల రెండు భేదములు. క్షేపణి (విసరునది) ధనస్సు, యంత్రము మొదలగు వాటిచే విడువబడునది 'యంత్ర ముక్తము'. శిలాఖండము, తోమరము మొదలగునవి 'పాణి ముక్తములు'. శత్రువుమీద విసరి మరల గ్రహింపబడు బల్లెము మొదలగునవి 'ముక్త సంధారితములు'. ఖడ్గాదులు 'అముక్తములు'. అస్త్ర ప్రయోగము లేకుండ కలియబడిచేయు యుద్ధము 'నియుద్ధము' లేదా 'బాహు యుద్ధము'. యుద్ధము చేయగోరువాడు శ్రమను జయించి, యోగ్యములగు శస్త్రములను సంగ్రహించు కొనవలెను. ధనుర్బాణముల ప్రయోగమునయుద్ధము సర్వశ్రేష్ఠము. బల్లెముల యుద్ధము మధ్యమము. ఖడ్గయుద్ధము అధమము. బాహుయుద్ధము అత్యంత నికృష్టము. ధనుర్వేదమున క్షత్రియవైశ్యులకు ఇరువురికిని బ్రాహ్మణుడే గురువు. ఆపత్సమయమున శూద్రుడు కూడ యుద్ధా భ్యాసముచేసి యుద్ధము చేయవలెను. దేశములో నున్న వర్ణసంకరులు కూడ యుద్ధ సమయమున రాజునకు సాహాయ్యము చేయవలెను.

అంగుష్ఠములు, మణవలు, గుల్పములు, పాదములు ఒకే వైపునకుండి పరస్పరము దూరముగా నున్నచో అది 'సమపద స్థానము'. రెండు పాదములును వ్రేళ్ళ బలముపై నిలచి, మోకాళ్లు బిగియబిట్టి ఉండగా రెండు పాదముల మధ్యభాగము మూడు జానలున్నచో అది 'వైశాఖ స్థానము'. రెండు మోకాళ్ళు హంస పంక్త్యాకారమున కనబడుచు నాలుగు జానల ఎడముననున్నచో అది 'మండల

స్థానము'. కుడికాలు మోకాలు ముందుకు చాపగా రెండు పాదముల మధ్య ఐదు జానలున్నచో అది 'ఆలీఢము'. దీనికి విపరీతముగా ఎడమకాలు చాపినపుడు 'ప్రత్యాలీఢము'. కుడికాలు వంకరగను, ఎడమకాలు అవక్రముగను రెండు పాదముల గుల్ఫ పార్ష్ణిభాగముల ఎడమ ఐదు అంగుళములున్నచో ఇది పండ్రెండు అంగుళముల 'పెద్ద స్థానకము'. ఎడమ మోకాలు అవక్రముగా నుండి, కుడికాలు బాగుగా చాపినను, లేదా, కుడి మోకాలు వంగి నిశ్చలముగానున్నను లేదా మోకాలితోపాటు కుడికాలు దండాకారమున విశాలముగ కనబడినను 'వికటము' అను స్థానకము. దీనిలో రెండు పాదముల నడుమ రెండు హస్తములు ఎడముండును. రెండు మోకాళ్ళు కలిసి, ఉత్తానములైనచో అది 'సంపుట' స్థానము. కొంచెము తిరిగిన రెండు పాదములు సమ భావముతో దండమువలె విశాలముగను, స్థిరముగను కనబడినచో ఆ రెండు పాదములు సమభావముతో దండమువలె విశాలముగను, స్థిరముగను కనబడినచో ఆ రెండింటిమధ్య పొడవు పదునారు అంగుళములు ఉండును. ఇది స్థానముల యథోచిత స్వరూపము.

వశిష్ఠా! యోధులు ముందుగా ఎడమ చేత ధనస్సును, కుడిచేత బాణములు ధరించి, విడచిన బాణములు స్వస్తి కాకారమున నుండునట్లు చేసి వాటితో గురుజనులకు నమస్కారము చేయవలెను. ధనుర్ధారియగు యోధుడు వైశాఖ స్థానమున స్థిరముగ నిలచి, స్థిత్యాయతులందు, (వర్తమాన భవిష్యత్తులందు) ఆవశ్యకత ఏర్పడినపుడు ధనస్సుపై నారిని విస్తరించి, ధనస్సు యొక్క క్రింది అగ్రమును బాణఫలమును భూమిపై ఆన్చి మూర్లతోను, మణిబంధములతోను కొలవవలెను. ఓ ఉత్తమవ్రతపాలకా! ఆ యోధుని బాణము కంటె ధనస్సు సర్వదా పెద్దదిగా నుండవలెను. పిడికిలికి ఎదుట బాణ పుంఖమునకును, ధనుర్దండమునకును మధ్య పండ్రెండు అంగుళములు దూరముం డవలెను. ఇట్లున్నపుడు ధనస్సుకు నారి కట్టవలెను. ఇంతకంటె ఎక్కువగాని తక్కువగాని ఉంచరాదు. ధనస్సును నాభిస్థానము నందును, బాణమును నితంబము నందును ఉంచి, ఎత్తిన హస్తమున కంటికి చెవికి మధ్య ఉంచి, అట్టి స్థితిలో బాణము విడువవలెను. మొదట బాణమును పిడికిలి యందు పట్టుకొని దానిని దక్షిణ స్తనాగ్రమునకు ఎదురుగా ఉంచవలెను. పిదప దానిని నారిపై ఉంచి, నారిని పూర్తిగా లాగి పూర్తిగ విస్తరింప చేయవలెను. నారిలోనికి గాని, బైటకు గాని, ఎత్తుగా గాని, క్రిందుగా గాని, బోర్లపడి గాని, ఉత్తానముగ గాని, చంచలము గాని, అత్యంతావేష్టితము గాని కాకూడదు. అది సమముగను, స్థిరముగను, దండమువలె ఋజువు గను ఉండవలెను. ఈ విధముగ ముష్టితో లక్ష్యమును ఆచ్ఛాదించి బాణమును విడువవలెను.

ధానుష్కుడు ప్రయత్న పూర్వకముగ పక్షమును ఎత్తుగా నుంచి శరీరము త్రికోణా కారముగ నుండునట్లు వంగవలెను. భుజములు శిథిలముగ నుండి కంఠము నిశ్చలమై, శిరస్సు మయూర శిరస్సువలె ప్రకాశించవలెను. లలాట, నాసికా, ముఖ, బాహు, మూల కూర్పరములు సమావస్థలో నుండవలెను. గడ్డమునకును భుజమునకును మధ్య మూడు అంగుళముల వ్యవధానముండవలెను. ఈ వ్యవధానము మొదట మూడు అంగుళములు, తరువాత రెండు అంగుళములు, తరువాత ఒక అంగుళము అని చెప్పబడినది. బాణ పుంఖమును తర్జన్య అంగుష్ఠములతో పట్టుకొనవలెను. పిదప మధ్యమ-అనామికలతో కూడ పట్టుకొనవలెను. పూర్తి బాణమంతయు ధనస్సుపైకి వచ్చునంత

వరకును వేగ పూర్వకముగా లాగవలెను. ఈ విధముగ ఉపక్రమించి బాణమును విధి పూర్వకముగ విడువవలెను. ఓ సువ్రతా! దృష్టిచేతను ముష్టిచేతను ముందుగ అహతమగు లక్ష్యమునే బాణముచే భేదించవలెను. బాణము విడచిన హస్తమును శత్రువు భేదించకుండుటకై వెంటనే దానిని వీపువైపునకు ఉంచుకొనవలెను. అందుచే ధానుష్కుడు ధనస్సును లాగి మోచేతికి క్రిందుగా, నుంచి బాణమువిడచు సమయమున దానిని పైకి తేవలెను. ధనుః శాస్త్రజ్ఞులు ఈ విషయమును బాగుగా గుర్తు ఉంచుకొనవలెను. మోచేతిని కనబడకుండ ఉంచుట మధ్యమ రక్షణోపాయము, శత్రు లక్ష్యము కాకుండ ఉంచుకొనుట ఉత్తమము, పంద్రెండు ముష్టుల పొడవుగల బాణము ఉత్తమము, పదునొకండు ముష్టుల పొడవుగలది మధ్యమము, పదిముష్టులు అధమము, నాలుగు హస్తముల పొడవుగల ధనస్సు ఉత్తమము, మూడున్నర హస్తములు మధ్యమము, మూడు హస్తములు అధమము, పదాతులు సర్వదా మూడు హస్తములు ధనస్సును మాత్రమే ఉపయోగించవలెను. అశ్వము, రథము, గజము ఎక్కి యుద్ధము చేయువారు ఉత్తమ ధనస్సునుమాత్రమే ఉపయోగించవలెను. (249)

ధనుర్వేద వర్ణనము - 2

అగ్నిదేవుడు పలికెను :

ద్విజుడు పూర్తి పొడవుగల ధనస్సును తయారుచేయించి, దానిని బాగుగా కడిగి తుడిచి, దానిని, గదాధ్యాయుధములను గూడ శుభ్రముచేసి వాటిని, యజ్ఞ భూమిలో నుంచవలెను. పిదప బాణములు గ్రహించి, కవచము ధరించి, ఏకాగ్రచిత్తుడై అంబుల పొదిని వీపుపై కుడి చంకదగ్గర గట్టిగా బంధించవలెను. అట్లు చేయుటచే విలక్ష్యమగు బాణము కూడ ఆ తూణీరము నందు స్థిరముగా నుండును. కుడి చేతితో తూణీరమునుండి బాణమును వెలికితీయవలెను. ఎడమచేతితో ధనస్సును అచటినుండి పైకెత్తి, దాని మధ్య భాగమున బాణ సంధానము చేయవలెను. చిత్తము నందు విషాదమేమియు లేనివాడై, ఉత్సాహ సంపన్నుడై నారిపై బాణపుంఖము నుంచి, సింహకర్ణమను ముష్టితో నారిని బాణపుంఖముతో నొక్కిపెట్టి, సమముగ సంధించి, బాణమును లక్ష్యము వైపు విడువ వలెను. ఎడమచేతితో బాణము విడువవలెనన్నపుడు ఎడమచేతిలో బాణము ధరించి, కుడి చేతిలో ధనస్సు ముష్టిని పట్టుకొనవలెను. లాగినపుడు బాణము ఫలము (అగ్రము) గాని, చెవివరకు వచ్చునట్లు నారిపై బాణము నుంచవలెను. ఆ సమయమున బాణమును తర్జన్య అంగుష్ఠ మునే కాక మధ్యమ అంగులితో కూడ పట్టుకొనవలెను. బాణ ప్రయోగ విధి నెరిగిన యోధుడు ధనస్సునో ముష్టితో గట్టిగాపట్టుకొని, మనస్సును, దృష్టిని లక్ష్యముపై నిలిపి, బాణము శరీరము కుడివైపునకు వచ్చునట్లు చేసికొని లక్ష్యమువైపు విడువవలెను. ధనుర్దండము నేలపై నిలపెట్టినపుడు లలాట సమీపమునకు వచ్చునంత పొడవు ఉండ వలెను. దానిపై చంద్రక బాణమును సంధించి, బాగుగా లాగి లక్ష్యముపై విడువవలెను. ఈ విధముగ ఒక బాణము విడచిన పిమ్మట, వెంటనే తూణీరము నుండి, తర్జన్య అంగు ష్ఠములతో మాటిమాటికి బాణము పైకితీసి, దానిని మధ్యమ అంగులి చేత గూడ తన వశమునందు ఉండునట్లుచేసికొని, శీఘ్రముగ లక్ష్యము వైపు విడువవలెను. నలు వైపులను, దక్షిణమునందును లక్ష్యవేధము చేయుచు పోవలెను. మొదటి నుండియు నాలుగు వైపుల లక్ష్యమును కొట్టుచు బాణ ప్రయోగము చేయుట అభ్యసించవలెను.

పిదప అతడు తీక్ష్ణ, పరావృత్త, గత, నిమ్న, ఉన్నత, క్షిప్ర వేధలను అభ్యసించవలెను. పైన చెప్పిన వేధ్య లక్ష్య స్థానములను కొట్టుటకు సత్త్వమును చూపుచు విచిత్రము, దుస్తరమగు పద్ధతిలో అనేక పర్యాయములు హస్తములచే బాణములను తీయుట విడచుట అను పనులచే ధనుస్తర్జనము చేయవలెను. విప్రవరా! వేధ్యములలో అనేక భేదములున్నవి. దృఢము, దుష్కరము, చిత్రదుష్కరమని అవి మూడు విధములు. ఆ మూడును మరల రెండేసి విధములు–నతనిమ్నము, తీక్ష్ణము అనునవి దృఢవేధ్య భేదములు. నిమ్నము, ఊర్ధ్వగతము అని దుష్కర వేధ్యభేదములు. మస్తక పనవ, మధ్యము అని చిత్ర దుష్కర వేధ్య భేదములు. ఈ విధముగ వీరుడు వేధ్యగణముల వేధించుటలో ప్రవీణుడై ముందు కుడి ప్రక్కనుండి గాని, ఎడమ ప్రక్కనుండి గాని శత్రు సైన్యముపై ఆక్రమణము చేయవలెను. దానివలన లక్ష్యముపై విజయము లభించును. ప్రయోగ నిపుణులు వేధ్యవిషయమున ఈ విధానమునే గ్రహించి ప్రతిపాదించి యున్నారు.

యోధునకు వేధ్యముకంటె గూడ భ్రమణము ఉత్తమమని చెప్పబడినది. లక్ష్యమును తనబాణము పుంఖముచే ఆచ్ఛాదించి దానివైపు దృఢముగ శరసంధానము చేయవలెను. భ్రమణశీలము, చంచలము, అగు లక్ష్యమును అన్ని వైపుల నుండియు కొట్టవలెను. దానిని భేదించి, భేదింది, సర్వ విధముల దానికి పీడ కలిగించవలెను. కర్మయోగ విధానము తెలిసిన వాడు ఈ విధముగ తెలిసికొని ఉచిత విధముగ ఆచరించవలెను. మనోనేత్ర దృష్టులను లక్ష్యముపై నిలుప గలిగినవాడు యముని కూడ జయించగలుగును. (250)

ధనుర్వేద వర్ణనము - 3

అగ్నిదేవుడు పలికెను :

వశిష్ఠా! హస్తమును, మనస్సును, దృష్టిని జయించిన లక్ష్య సాధకుడు తప్పక సిద్ధిని పొంది యుద్ధము కొరకై వాహనారూఢుడు కావలెను. పాశము పది హస్తముల పొడవై, గోలాకారమై చేతికి సుఖప్రదముగ నుండవలెను. దీనికొరకై మంచి ముంజగడ్డి గాని, హరిణముల ప్రేగులు గాని, అర్కవల్కల రజ్జువుగాని ఏర్పరచుకొనవలెను. ఇతర దృఢ సూత్రములతో గూడ సుందరమగు పాశము ఏర్పరుపవచ్చును. ఆ సూత్రములను చాల ఆవృత్తులుచుట్టి బాగుగా పేనవలెను. ముప్పది ఆవృత్తులు చేసి పేనిన త్రాడుతో పాశము నిర్మింపవలెను. పాశమును ఎడమ చేతిలో ఉంచుకొని కుడి చేతితో విప్పవలెను. దానిని కుండలాకారముచేసి అన్నివైపుల త్రిప్పి, శత్రువు శిరస్సుపై విసరవలెను. ముందుగ తృణచర్మాది నిర్మితమగు పురుషమూర్తిపై ప్రయోగించి పిదప గంతులు వేయుచున్న మను ష్యులపై ప్రయోగించి, సాఫల్యము లభించిన పిమ్మటనే పాశప్రయోగము చేయవలెను. సుశిక్షితుడగు యోధుడు పాశముతో యథోచితముగ జయించిన పిమ్మటనే శత్రువు విషయమున పాశబంధన క్రియ చేయవలెను.

ఒరతో కూడిన ఖడ్గమును నడుమునందు కట్టి దానిని ఎడమవైపు వ్రేలాడదీయ వలెను. దాని ఒరను ఎడమచేతితో గట్టిగ పట్టుకొని కుడిచేతితో ఖడ్గమును వెలుపలకు తీయవలెను. ఆ

ఖడ్గము వెడల్పు ఆరుఅంగుళములు, పొడవు ఏడు హస్తములు ఉండవలెను. అనేకములైన లోహమయశలాకలను కవచములను తన సగము హస్తమునందుగాని ధరించవలెను. ప్రక్కలందును, పైనను, క్రిందను, శరీరరక్షకొరకై ఈ వస్తువుల నన్నింటిని యథాశాస్త్రముగ ధరించవలెను. యుద్ధము నందు విజయము సంపాదించుటకై ఎట్టి ఏర్పాట్లు చేయవలెనో చెప్పెదను; వినుము. తూణీరము యొక్క చర్మము చుట్టిన ఒక క్రొత్త దృఢమైన కఱ్ఱను తన దగ్గర ఉంచుకొనవలెను. దానిని కుడిచేతి వ్రేళ్ళతో పైకి ఎత్తి ఎవని నెత్తిపై గట్టిగా కొట్టునో ఆ శత్రువు తప్పక మరణించును. ఈ పనిలో సిద్ధి లభించిన పిమ్మట రెండు హస్తములతో ఆ కర్రతో శత్రువు తలపై కొట్టవలెను. దీనితో అనాయాసముగ వానిని చంపగల్గును. ఈ విధముగ యుద్ధమునందు సిద్ధి ఎట్లుకలుగునో చెప్ప బడినది. యుద్ధభూమియందు చక్కగా సంచరించుటకై తనవాహనములచే శ్రమ చేయించు చుండ వలెనను విషయము ముందుగనే చెప్పియున్నాను.(251)

ధనుర్వేద వర్ణనము - 4

అగ్నిదేవుడు చెప్పెను :

వశిష్ఠా! భ్రాంత, ఉద్భ్రాంత, ఆవద్ధ, ఆప్లుత, విప్లుత, సంపాత, సముదీర్ణ, శ్యేనపాత, ఆకుల, ఉద్ధూత, అవధూత, సవ్య, దక్షిణ, అనాలక్షిత, విస్ఫోట, కరాలేంద్ర, మహాసఖ, వికరాల, నిపాత, విభీషణ, భయానక సమగ్ర, అర్థ, తృతీయాంశ, పాద, పాదార్ధ, వారిజ, ప్రత్యాలీఢ, ఆలీఢ, వరాహ, లులితములు అనునవి యుద్ధ రంగమున చూపు కత్తి డాలుతో యుద్ధము చేయునపుడు చూపు ఇరువదిరెండు చలనక్రమములు. వీటిని తెలుసుకొనవలెను. పాశమును విసరుటలో పరావృత్త, అపావృత్త, గృహీత, లఘు, ఊర్ధ్వక్షిప్త, అధఃక్షిప్త, విధారిత, శ్యేనపాత, గజపాత, గ్రాహ్యా గ్రాహ్యములు అను పదునొకండు ప్రకారములున్నవి. వ్యస్తపాశమున మహాత్ములు, ఋజు, ఆయత, విశాల, తిర్యక్, భ్రామిత ములను ఐదు కర్మలు చెప్పిరి. ఛేదన, భేదన, పాత, భ్రమణ, శమన, వికర్తన, కర్తనములను ఏడును చక్ర కర్మలు. ఆస్ఫోట, క్ష్వేదన, భేద, త్రాస,ఆందోలితక, ఆఘాతములను ఆరును శూల కర్మలు. ద్విజోత్తమా! దృష్టిఘాత, భుజఘాత, పార్శ్వఘాత, ఋజుపాత, పక్షపాత, ఇషుపాతములనునవి తోమర కార్యములు.

విప్రశ్రేష్ఠా! ఆహత, విహృత, ప్రభూత, కమలాసన, నతోర్ధ్వగాత్ర, నమిత, వామదక్షిణ, ఆవృత్త, పరావృత్త, పాదోద్ధూత, ఆవప్లుత, హంసమర్ద, విమర్దములు గదా కర్మలు. కరాల, అవఘాత, దంశోపప్లుత, క్షిప్తహస్త, స్థిత, శూన్యములు పరశు కర్మలు. తాడన, భేదన, చూర్ణన, ప్లవన, ఘాతనములు ముద్గర కర్మలు. సంశ్రాంత, విశ్రాంత గోవిసర్గ, సుదుర్ధర ములు భిందిపాల, లగుడముల కర్మలు. అంత్య, మధ్య, పరావృత్త, నిదేశాంతములు వజ్ర పట్టిశముల కర్మలు. హరణ, ఛేదన, ఘాత, భేదన, రక్షణ, పాతన, స్ఫోటనములు కృపాణ కర్మలు. త్రాసన, రక్షణ, ఘాత, బలోద్ధరణ ఆయతములు క్షేపణీ కర్మలు; యంత్ర కర్మలు కూడ ఇవియే. సత్యాంగ, అవదంశ, వరాహోద్ధూతక, హస్తావహస్త, అలీన, ఏకహస్త, అవహస్తక, ద్విహస్త, బాహుపాశ, కటిరేచితక,

ఉద్గత, ఉరోఘాత, లలాటఘాత, భుజావిధమన, కరోద్ధూత, విమాన, పాదాహతి, విపాదిక, గాత్రసంశ్లేషణ, శాంత, గాత్ర విపర్యయ, ఊర్ధ్వ ప్రహార, ఘాత, గోమూత్ర, సవ్య దక్షిణ, పారక, తారక, దండ, కబరీబంధ, ఆకుల, తిర్యగ్బంధ, అపామార్గ, భీమవేగ, సుదర్శన, సింహాక్రాంత, గజాక్రాంత, గర్దభాక్రాం తములు గదాయుద్ధ చలనములని తెలియవలెను. ఇపుడు మల్ల యుద్ధ గతులను చెప్పెదను.

ఆకర్షణ, వికర్షణ, బాహుమూల, గ్రీవా పరివర్తన, సుదారుణ పృష్ఠ, భంగ, పర్యాసన, విపర్యాసన, పశుమార, ఆజావిక, పాదప్రహార, ఆస్ఫోట, కటిరేచితక, గాత్రాశ్లేష, స్కంధగత, మహీవ్యాజన, ఉరోలలాట ఘాత, విస్పష్టకరణ, ఉద్ధూత, అవధూత, తిర్య ఙ్మార్గగత, గజస్కంధ, అవక్షేప, అపరాఙ్ముఖ, దేవమార్గ అధోమార్గ, అమార్గ, గమనాకుల, యష్టిఘాత, అవక్షేప, వసుధారణ, జానుబంధ, భుజాబంధ, సుదారుణగాత్ర బంధ, విపృష్ఠ, సోదక, శ్వభ్ర, భుజావేష్టితములు (మల్లయుద్ధ గతులు) కవచము ధరించి, అస్త్రశస్త్ర సంపన్నుడై, గజాది వాహనారూఢుడై యుద్ధరంగమున ప్రవేశించవలెను. ఏనుగుమీద ఇద్దరు మావంటి వాండ్రు ఉత్తమమైన అంకుశములు ధరించి ఉండవలెను. వారిలో ఒకడు మెడమీదను రెండవవాడు భుజముమీదను కూర్చుండవలెను. వీరుకాక ఇద్దరు ధనుర్ధరులు, ఇద్దరు ఖడ్గధారులుకూడ ఏనుగుపై కూర్చుండవలెను. ఒక్కొక్క రథమును, గజమును రక్షించుటకు ముగ్గురేసి ఆశ్వికులు ఉండవలెను. అశ్వమును రక్షించుటకై ధనుర్ధరులైన ముగ్గురేసి కాలి బంటులు ఉండవలెను. ధనుర్ధరుల రక్షణము నిమిత్తము కత్తి, డాలు ధరించిన యోధులను నియమించవలెను. ఒక్కొక్క ఆయుధమును దానికి సంబంధించిన మంత్రముతో పూజించి, 'త్రైలోక్యమోహన కవచము' పఠించి, యుద్ధ రంగమునందు ప్రవేశించువాడు శత్రువులపై విజయముపొంది, భూతలమును రక్షించును. (252)

వ్యవహార కథనము - 1

అగ్నిదేవుడు చెప్పెను :

వశిష్ఠా! ఇపుడు నయ, అనయముల వివేకమును తెలుపు వ్యవహారమును వర్ణించెదను. దీనికి నాలుగు చరణములు, నాలుగు స్థానములు, నాలుగు సాధనములు చెప్పబడినవి. ఇది నలుగురికి హితము చేకూర్చును. నలుగురికి సంబంధించి యుండును. నాలుగు చేయును. దీనికి ఎనిమిది అంగములు. పదునెనిమిది పదములు, నూరు శాఖలు, మూడు యోనులు, రెండు అభియోగములు, రెండు ద్వారములు, రెండు గతులు ఉండును. ధర్మము, వ్యవహారము, చరిత్రము, రాజశాసనము అనునవి వ్యవహార దర్శనము యొక్క నాలుగు చరణములు. వీటిలో ఉత్తరోత్తర చరణములు పూర్వపూర్వ సాధకములు. వీటిలో ధర్మమునకు ఆధారము సత్యము. వ్యవహారమునకు ఆధారము సాక్ష్యము. చరిత్ర పురుష సంగ్రహాధీనము. శాసనము రాజాజ్ఞాధీనము. ఇది సామ, దాన, భేద, దండములచే సాధ్యముగాన చతుః సాధనము, ఇది అభియోక్త, సాక్షి, సభాసదులు, రాజు అనువారిపై ఒక్కొక్క పాదమున నిలచియుండును. అందుచే ఇది చతుర్వ్యాపి. ఇది ధర్మ, అర్థ, యశో, లోకప్రియతలను నాల్గింటిని పెంచును గానచతుష్కారి. రాజపురుష, సభాసద,

శాస్త్ర, గణక, లేఖక, సువర్ణ, అగ్ని, జలములను ఎనిమిది అంగములు కలదగుటచే అష్టాంగము. మానవుడు కామ, క్రోధ, లోభములచే దీనియందు ప్రవృత్తుడగును. అందుచే ఇది త్రియోని, శంకాభియోగము, తత్త్వాభియోగము అని అభియోగములు రెండు విధములు. అందుచే ఇది ద్వ్యభియోగము. అసత్పురుష సంబంధముచే శంకాభియోగము, తగిన ప్రమాణ ములను చూచుటచే తత్త్వాభియోగము ఏర్పడును. దీనికి పూర్వవాద పక్షము (అభియోగము చేసినవాడు) ఉత్తరవాద ప్రతిపక్షము, (ఎవనిపై అభియోగము చేయబడినదో వాడు) అను రెండు పక్షములు ఉండును గాన ఇది 'ద్విద్వారము'. నిజముగా జరిగినది, కపటము అను రెండు పద్ధతు లుండుగాన ద్విగతి.

ఎట్టి ఋణమీయ వచ్చును. ఎట్టిది ఈయరాదు. ఎప్పుడు ఇవ్వవచ్చును. ఎప్పుడు ఇవ్వరాదు. ఎట్లు ఇవ్వవలెను. ఋణమునిచ్చు విధానమేది. దానిని మరల రాబట్టుకొనుట ఎట్లు–ఈ విషయములనన్నింటిని విచారించుట 'ఋణదానము'. ఒక వ్యక్తి విశ్వాసముతో మరొక వ్యక్తి వద్ద ధనమును దాచి ఉంచినచో అది 'నిక్షేపము'. వర్తకులు మొదలగు వారు చాలమంది కలిసి పరస్పర సహకారముతో ఏదైన ఒకకార్యము చేసినచో అది 'సంభూయ సముత్థానము' అను వివాదపదము. ఒక వ్యక్తి ఏదైన ఒక వస్తువును యథా విధిగ ఇతరునికి దానము చేసికూడ దీనిని తనకే ఉంచు కొనవలెనని కోరినచో అది "దత్తాప్రదానిక" వివాదపదము. సేవ చేసెదనని చెప్పి సేవచేయకున్నచో అది "అభ్యు పేత్య–అశుశ్రూష" అను వివాదపదము. భృత్యులకు వేతనము సరిగి చెల్లించక పోవుటచే ఏర్పడినది 'వేతనా నపాకర్మ వివాద పదము'. తాకట్టు పెట్టిన లేదా నష్టమైన పరద్రవ్య మును, అపహరించినదానిని, దాని స్వామికి తెలియకుండ అమ్మివేసినచో అది 'ఆ స్వామి విక్రయము' అను వివాదపదము. వర్తకుడు ఒక వస్తువును అమ్మిన తరువాత కూడ దానిని కొన్నవానికి ఇవ్వకున్నచో అది 'విక్రీయా సంప్రదానము' అను వివాదపదము. ఒక వస్తువును కొన్నవాడు అది బాగులేదని అన్నచో అది 'క్రీతానుశయము' అను వివాదపదము. గ్రాహకుడు ఒక వస్తువును మూల్యము చెల్లించికొన్న పిమ్మట ఆ కొనుగోలు సరిగాలేదని తలచి, దానిని ఆ దినమునందే వర్తకునకు తిరిగి ఇచ్చివేసినచో, విక్రేత దాని మూల్యమునంతను ఏ మాత్రము తగ్గించకుండ క్రేతకు తిరిగి ఇచ్చి వేయవలెను.

పాషండులు, నైగములు మొదలగు వారి స్థితికి సమయమని పేరు. దీనికి సంబం ధించినది 'సమయానపాక కర్మ వివాదపదము'. పొలములపై అధికారమును పురస్కరిం చుకొని వంతెనలు, మళ్ళు, సరిహద్దులు–వీటిని గూర్చిన వివాదము 'క్షేత్రజము'. స్త్రీ–పురుషుల వివాహాదులకు సంబంధించినది 'స్త్రీ పుంసయోగ వివాదపదము'. తండ్రి ఆస్తిని పంచుకొను పుత్రులలో ఏర్పడినది 'దాయభాగ వివాదపదము'. బలగర్వముచే అనాలోచితముగ చేసిన అది 'సాహస వివాదపదము'. ఒక వ్యక్తిని ఆతని దేశము, జాతి, కులము మొదలగు వాటిని పురస్కరించుకొని దోషారోపణము చేయుచు విపరీ తార్థములుగల వ్యంగ్యోక్తులు పలుకుట 'వాక్పారుష్య వివాదపదము'. హస్త పాదములచేగాని, ఆయుధముచేగాని, అగ్నిచేత గాని ఎవరికైన శరీరముపై అఘాతము కలిగించుట 'దండ పారుష్యము'. పాచికలు, తోలు ముక్కలు, ఏనుగు దంతములతో చేసిన శలాకలు. వీటిని ఉపయోగించి చేయు క్రీడకు ద్యూతమనిపేరు. పశు పక్ష్యాదులను ఉపయోగించిచేయు క్రీడ 'ప్రాణి

ద్యూతము'. రాజు ఆజ్ఞను ఉల్లంఘించి ఆతడు చెప్పిన పని చేయకుండుట 'ప్రకీర్ణక' మను వ్యవహార పదము. ఈ వివాద పదము రాజుకు సంబంధించినది. ఈ విధముగ వ్యవహారమునందు పదునెనిమిది పదములున్నవి. వీటికి మరల నూరు భేదములున్నవి. మనుష్యుల పనులను బట్టి ఈ నూరు భేదములు ఏర్పడును.

రాజు క్రోధ రహితుడై జ్ఞానసంపన్నులగు బ్రాహ్మణులతో కలిసి వ్యవహార విచారము చేయవలెను. వేదవేత్తలు, శత్రుమిత్రులను సమాన దృష్టితో చూడగలిగిన వారును, లోభ రహితులును అగువారిని సభాసదులనుగ నియమించవలెను. తాను స్వయముగ వ్యవ హారము చూడ వీలులేనప్పుడు రాజు సభాసదులతో పాటు విద్వాంసుడగు ఒక బ్రాహ్మణుని ఆ కార్యమున నియమించవలెను. సభాసదులు రాగ, లోభ, భయాదులచే ధర్మశాస్త్ర, ఆచారాది విరుద్ధములగు నిర్ణయములు చేసినచో రాజు వారిపై వేరు వేరు వివాదముకంటె రెట్టింపు అర్థదండముచే వారిని శిక్షించవలెను. ఎవ్వడైన ఒక వ్యక్తి మరొక వ్యక్తిచే ధర్మశాస్త్ర, సమాచారములకు విరుద్ధముగ బాధింపబడినచో, ఆతడు రాజు వద్దకు వెళ్ళి ఆ విషయ మును తెలిపిన అది 'వ్యవహారపద' మని చెప్పబడును. వాది చెప్పినదాని నంతను రాజు సంవత్సరము, మాసము, పక్షము, దినము, పేరు, జాతి మొదలగు వాటితోసహ ప్రతివాది ఎదుట వ్రాయించవలెను. (వాది చేసిన నివేదనము నకు 'భాష', 'ప్రతిజ్ఞ' లేదా 'పక్షము' అని పేరు). ప్రతివాది వాది చెప్పినదంతయు విని దానికి ప్రత్యుత్తరము వాని ఎదుట వ్రాయించవలెను. వాది ఆ సమయమునందే తాను చేసిన నివేదనమునకు ప్రమాణము వ్రాయించవలెను. నివేదనము ప్రమాణితమైనచో వాది జయించును, కానిచో పరాజి తుడగును. ఈ విధముగ వివాదమునందు నాలుగు పాదములు (అంశములు గల) వ్యవహారము చూపబడినది. అభియుక్తునిపై వచ్చి జరుగుచున్న అభియోగమునకు నిర్ణయము కానంతవరకును ఆతనిపై వచ్చిన మరియొక అపరాధ మును గూర్చి విచారణ చేయగూడదు. ఇతరునిచే అభియుక్తుడగు వానిపై విరుద్ధముగ ఏమియు చెప్పరాదు. కాని హంసాద్యపరాధ అభియోగమైనచో దానిని, ముందు నడచుచున్న అభియోగమునకు నిర్ణయము కాకపూర్వమే నడిపించవచ్చును.

సభాసద సమేతుడైన సభాపతి (ప్రాడ్వివాకుడు) వాది ప్రతివాదుల వివాదమును నిర్ణయించుటకు సమర్థులగు వారిని 'ప్రతిభూ' (జామీను)గా ఏర్పరుపవలెను. అర్థి (వాది) చేసిన అభియోగమును ప్రతివాది తిరస్కరించగా, అర్థి సాక్ష్యాదులు చూపి తన అభియోగమును ప్రతివాదిచే అంగీకరింపచేయ గలిగినచో, ప్రతివాది అర్థికి ఇవ్వవలసిన ధనము అంతయు చెల్లించి, అంతే ధనమును, దండముగా రాజుకు చెల్లించవలెను. అర్థి తన అభియోగమును నిరూపించుకొనజాలక మిథ్యాభియోగియైనచో అతడు అభియుక్త ధనమునకు రెట్టింపు ధనము రాజుకు అర్పించవలెను. హత్య దోపిడి, వాక్పా రుష్యము, దండపారుష్యము, పాలు ఇచ్చు ఆవులను అపహరించుట, అభిశాపము (మహాపాతకము చేసి నట్లు అభియోగము), అత్యయము (ప్రాణఘాతము), ధనాతిపాతము, స్త్రీ చరిత్ర మొదలగు వాటికి సంబంధించిన అభియోగము వచ్చినప్పుడు అపరాధి నుండి వెంటనే ఉత్తరము (సము జాయిషీ) తీసుకొనవలెను. ఆలస్యము చేయరాదు. ఇతర వివాదములలో వాది ప్రతివాదులు, సభాసదులు, ప్రాడ్వివాకుడు మొదలగువారి ఇచ్ఛ ననుసరించి సమయము తీసికొనవచ్చును.

అభియోగ సమయమున అభియోగము చేయువాడుగాని, సాక్ష్య మిచ్చువాడు గాని ఒకచోటునుండి మరియొకచోటునకు తిరుగుచుండినను, స్థిరముగా ఉండజాలకున్నను, రెండెచెలివెలు నాకుచున్నను, ఆతని నుదుటచెమట పట్టినను, ముఖము వెలవెలబోయినను, కంఠము ఎండిపోయి మాట తడబడినను, పూర్వాపర విరుద్ధముగ మాటలాడినను, ఇతరులకు సరిగా ప్రత్యుత్తర మీయజాల కున్నను, ఇతరుల చూపులో చూపు కలుపజాలకపోయినను, పెదవులు వంకరటింకర చేయుచున్నను. ఈవిధముగ సహజముగనే మనో, వాక్, శరీర క్రియలందు వికారము పొందినచో ఆతడు దుష్టుడని చెప్పబడినది. అప్పుతీసికొన్నవాడు నిరాకరించిన సందేహాస్పదమైన ఋణమునుగూర్చి ఏదోవిధముగ నిజమని నిరూపించుటకు ప్రయత్నించువాడును, రాజు పిలిపించినపుడు అతని యెదుట ఏమియు చెప్పజాలనివాడును దుష్టుడే. ఆతడుకూడ దండనీయుడు. ఇద్దరు వాదుల పక్షములందు సాక్ష్యము చెప్పువారు లభ్యులైనపుడు పూర్వవాది సాక్షులనే ప్రశ్నిం పవలెను. వాదికి జవాబుగ 'నేనీ క్షేత్రమును చాలకాలము క్రితమే దాన రూపమున పొందితిని. అప్పటినుండియు నేను దీనిని అనుభవించుచు న్నాను' అని చెప్పువాడు ఇచట పూర్వవాది; ముందుగా అభియోగము చేసినవాడు కాదు. అప్పుడు రెండవ వాడు 'నిజమే, ఇది ఈతనికి దానము వలన లభించినది, కాని ఇతని నుండి అముక వ్యక్తి (ఫలానా వ్యక్తి) దీనిని కొని నాకిచ్చినాడు' అని చెప్పినచో అపుడు పూర్వపక్షము అసాధ్యము గాన దుర్బలమై పోవును. అపుడు ఉత్తరవాది సాక్షులను మాత్రమే ప్రశ్నించ వలెను. వివాదము ఏదైన ఒక పందెముపై (షరతు) చేయబడినపుడు అట్లు పందెము వేసినవాడు ఓడిపోయి నచో ఆతడు వేసిన పందెము సొమ్ము రాజుకు ఇచ్చివేయవలెను. అర్థి ధనవంతుడైనపుడు వివాదాస్పదమగు ధనము మాత్రమే ఆతనికి ఇప్పించవలెను. రాజు కపటము విడనాడి, సత్యము నాశ్రయించి వ్యవహార నిర్ణయము చేయవలెను. యథార్థ వస్తువైనను లిఖిత పూర్వకముగ లేనిచో వ్యవహారమున పరాజయమే కలుగును. అర్థి, సువర్ణ, రజత, వస్త్రాది వస్తువులను అభియోగ పత్రమున వ్రాయగా ప్రత్యర్థి వాటినన్నింటిని అంగీకరించినచో, అట్టి పరిస్థితులలో సాక్ష్యాధారముపై ప్రత్యర్థి ఆ వస్తువులలో ఏ ఒక్క వస్తువును ఒప్పుకొన్నను, రాజు అభియోగపత్రమునందు వ్రాసిన వాటిని అన్నింటిని అర్థికి ప్రత్యర్థిచే ఇప్పించవలెను. మొదట అభియోగ పత్రమునందు వ్రాయబడని దానిని ఆ వస్తు సూచియందు చేర్చుట జరిగినచో ఆ వస్తువును ఇప్పించవలసిన పనిలేదు. రెండు స్మృతి వాక్యము లలో గాని, ధర్మశాస్త్ర రచనములలో గాని, పరస్పర విరోధము కనబడినచో సామాన్యాపవాద న్యాయము ననుసరించి సామాన్య శాస్త్రము కంటె విశేషశాస్త్రము బలీయ మని నిర్ణయించవలెను. అర్థశాస్త్ర ధర్మములందు పరస్పర విరోధమేర్పడి నపుడు అర్థ శాస్త్రము కంటె ధర్మశాస్త్రము బలీయమని మునులు చెప్పిన మర్యాద (కట్టుబాటు).

లిఖితము, భుక్తి, సాక్షి అనునవి మూడు మానుష ప్రమాణములు. 'భుక్తి' అనగా అనుభవించుట. ఈ మూడింటిలో ఏ ఒక్కటియు లభించనపుడు చెప్పబోవు దివ్య ప్రమాణ ములలో ఏదైన ఒకదానిని గ్రహించవలెను. ఋణము మొదలయిన సమస్త వివాదములందును ఉత్తరక్రియ బలవత్తరము. ఉత్తరక్రియ సిద్ధీకృతమైనపుడు విజయము ఉత్తరవాదికే. పూర్వవాది తన పక్షమును సిద్ధము చేసినను ఆతడు ఓడిపోవును కాని ఆధి (తాకట్టు) ప్రతిగ్రహ-క్రీతములందు పూర్వ క్రియబలీయము. భూస్వామి

చూచుచుండ గనే ఒక వ్యక్తి ఆ భూమిని అనుభవించుచుండగా ఆతడేమియు అనకున్నచో ఇరువది సంవత్సరముల తరువాత ఆ భూమి అనుభవించువానికి చెందును. అది ధనమైనచో పది సంవత్సరము లయిన తరువాత అనుభవించువానికి చెందును. కాని తాకట్టు, సరిహద్దు, నిక్షేపము, జడుల ధనము, బాలకుల ధనము, ఉపనిధి, రాజ, స్త్రీ, శ్రోత్రియుల ధనము, వీటి విషయ మున పై నియమము వర్తించదు. పైన చెప్పినవారి సొత్తును చాలకాలము అనుభవించినంత మాత్రమున అపహరింప జూచువానిచే ఆ ధనమును స్వామికి ఇప్పించి, అంత ధనమును దండించి రాజు తీసికొనవలెను. లేదా ఆ విధముగ అపహరించినవాని శక్తినిబట్టి, అధికము గాని, అల్పముగాని ధనమును దండరూపమున తీసికొనవలెను. సత్వమునకు హేతువగు ప్రతిగ్రహ, క్రయాదులకు ఆగమమని పేరు. ఆగమము భోగము కంటె ప్రబలము. సత్వ మును స్థాపించుటకు ఆగమ సాపేక్షమైన భోగమే ప్రమాణము. కాని పితృపితామహాది క్రమమున అనుభవింపబడుచున్నది తప్ప ఇతర భోగమునందే ఆగమనమునకు ప్రాబల్యము. పూర్వపరంపరా ప్రాప్తమగు భోగము ఆగమము కంటెను ప్రబలమైనది. ఏ మాత్రము ఉపభోగము లేని ఆగమమునకు బలములేదు.

విశుద్ధమైన ఆగమమును బట్టి భోగమునకు ప్రామాణ్యము వచ్చును. ఆగమము సరియైనది కానపుడు భోగము ప్రమాణము కాదు. భూమ్యాద్యాగమము కలవాడు, 'నీకిది ఎట్లు వచ్చినది?' అని ఎవరైన అడిగినపుడు లిఖితాది ప్రమాణములచే ఆగమమును నిరూపించుకొనవలెను. వాని పుత్ర పౌత్రాదులు ఆగమమును నిరూపించుకొనవలసిన పనిలేదు. పరంపరాగత భోగమే అచట ప్రమాణముగ గ్రహింపబడును. వ్యవహార నిర్ణయమునకు పూర్వమే ఒకడు మరణించినచో ఆతని ధనమునకు ఉత్తరాధికారులైన పుత్రాదులు లిఖితాది ప్రమాణముల ద్వారా ఆగమనమును నిరూపించు కొనవలెను. ఎందుచేతననగా ఆ వ్యవహారమునందు ఆగమము లేకుండ కేవలము భోగము ప్రమాణము కాజాలదు. బలాత్కార, భయాదులచే జరిపిన వ్యవహారమును త్రిప్పివేయవలెను. కేవలము స్త్రీయే చేసిన అభియోగమును, రాత్రియందు చేసిన దానిని, ఇంటి లోపల జరిగిన సంఘట నకు సంబంధించినదానిని, గ్రామాదుల వెలుపల నిర్జన ప్రదేశమునకు సంబంధించిన దానిని, శత్రువుచేసిన దాడిని న్యాయాలయము నందు విచారణార్థము గ్రహింపరాదు, త్రిప్పి వేయవలెను. మాదకద్రవ్య సేవనముచే మత్తులో నున్నవాడును, వాత, పిత్త, కఫ, సన్నిపాత గ్రహా వేశాదులచే ఉన్మత్తుడును, రోగపీడితుడును, ఇష్టవియోగ, అనిష్ట ప్రాప్తులచే దుఃఖితుడును, అప్రాప్త వయస్కుడును, శత్రువులు మొదలగు వారి నుండి భయపడిన వాడును నడిపిన వ్యవహారము 'అసిద్ధము' అని చెప్పబడినది. అభియుక్త వస్తువుతో సంబంధము లేనివారు నడిపినది కూడ అసిద్ధము.

ధనవంతుని ధనము ఎంత పోయినచో అంత రాజు ఆతనికి ఈయవలెను. పోయిన ధనమును దాని స్వామి గుర్తింపజాలకపోయినచో, ఎంతధనము పోయినదని రాజుకు జెప్పెనో అంత ధనమును రాజునకు దండముగా ఇవ్వవలెను. చోరులు అపహరించిన ధనమును రాజు ఏ జనపదము నుండి అపహరించబడినదో ఆ జనపదమునకే ఇచ్చివేయవలెను. ఏదైన ఒక వస్తువును తాకట్టుపెట్టి తీసికొనిన ఋణముపై ఎనుబదవ భాగము (1/80) ప్రతి మాసము ఇవ్వవలెను. బంధకము (తాకట్టు) లేనిచో బ్రాహ్మణాది వర్ణ క్రమమున ప్రతిశతము కొంచెము కొంచెము అధికమగు వడ్డీ

తీసికొనవచ్చును. ఆడపశువు లను ఋణముగా తీసికొనినపుడు వాటిపిల్లలు వడ్డీగా గ్రహించవలెను. నూనె, నెయ్యి మొదలగు రసద్రవ్యములు ఋణముగా తీసికొన్నప్పుడు, అది పెరిగి పెరిగి ఎనిమిది రెట్లు కావ చ్చును. అంతకుమించి వృద్ధి ఉండకూడదు. వస్త్ర, ధాన్య, సువర్ణముల విషయమున వృద్ధి క్రమముగా నాలుగు, మూడు, రెండు రెట్లవరకు ఉండవచ్చును; అంతకంటె అధికము కాదు.

వ్యాపారముకొరకై దుర్గమవన ప్రదేశములు దాటి ప్రయాణము చేయువారు ఋణ దాతకు నూటికి పది చొప్పునను, సముద్రయానము చేయువారు నూటికి ఇరువది చొప్పునను వృద్ధి ఇవ్వవలెను. లేదా అన్ని జాతులవారును, ఏ జాతివారి నుండి తీసుకున్న ఋణమైనను, అది సబంధకమైనను (తాకట్టు ఉన్నది) అబంధక మైనను, ఋణదాతకును తమకును మధ్య జరిగిన ఒప్పందమును బట్టి వడ్డీ ఇవ్వవలెను. ఋణము తీసికొన్నవాడు ఏ ధనమును తీసికొనెనో, అది సాక్షి ప్రమాణితమైనపుడు, దానిని ఋణదాత వసూలు చేసుకొనుచున్నపుడు రాజు అడ్డుపెట్టగూడదు. ఋణదాత న్యాయ సంగతముగ ఋణము వసూలు చేసికొనుచున్నను వానిపై అభియోగము చేయువానిని రాజు దండించవలెను. వానిచే ఆ ధనము ఇప్పించవలెను. (253)

వ్యవహార కథనము - 2

అగ్నిదేవుడు పలికెను :

వసిష్ఠా! చాలమంది ధనికులనుండి ఋణము తీసికొనిన అధమర్ణునిచే, ముందుగా బ్రాహ్మణునకు, తరువాత క్షత్రియునకు ఈ విధముగ క్రమమున ఋణము తీర్పించవలెను. నిర్ణయించిన దానిలో నూటికి పదిచొప్పున వడ్డీతో ఇప్పించవలెను. ధనము లభించిన ఉత్తమర్ణుడు నూటికి ఐదుచొప్పున రాజుకు ఇవ్వవలెను. క్షీణదశలోఉన్న నీచజాతి వానిచే, ఋణమునకు బదులు పనిచేయించవలెను. బ్రాహ్మణునిచేత మాత్రము మెల్లమెల్లగా, ఆతనికి అభివృద్ధి కలుగుటను బట్టి తీసికొన్న ధనమును ఇప్పించవలెను. తిరిగి ఇచ్చిన ధనమును ఋణదాత తీసికొనకున్నచో దానిని ఒక మధ్యస్థుని వద్ద ఉంచవలెను. ఆనాటి నుండి దానిపై వృద్ధి ఉండదు. కాని దానిని ఋణదాత అడిగినపుడు ఇచ్చి వేయవలెను. అట్లు ఇవ్వకున్నచో వృద్ధి ఇవ్వవలసియుండును. ఋక్థమును (ఒకరు మరణించగా సంక్ర మించిన ఆస్తిని) ఎవడు గ్రహించునో ఆతడె ఋక్థదాత (తండ్రి మొ.) యొక్క ఋణము కూడ చెల్లించవలెను. ఋక్థము తీసికొనినవాడు పుత్ర హీనుడైనచో, ఆ ఋక్థమును మాత్రమే అనుభవించు కృత్రిమ పుత్రుడు చెల్లించవలెను. ఒకని స్త్రీని గ్రహించినవాడు ఆతని ఋణము కూడ తీర్చవలెను. అవిభక్త కుటుంబములోని ఒకవ్యక్తి ఋణము చేసినచో ఆ కుటుంబాధిపతి ఆ ఋణమును తీర్చవలెను. కుటుంబ యజమాని మరణించినను పరదేశమునకు వెళ్ళినను, ఆ కుటుంబ సభ్యులందరును కలసి ఋణము తీర్చవలెను. భర్త చేసిన ఋణము భార్య తీర్చనవసరము లేదు. పుత్రుడు చేసిన ఋణము తల్లిగాని, తండ్రి గాని తీర్చనవసరము లేదు. స్త్రీ చేసిన ఋణము భర్త తీర్చనవసరము లేదు. కాని మొత్తము కుటుంబమునంతను పోషించుటకై చేసిన ఋణము విషయమున ఈ నియమము వర్తించదు. గొల్లలు, మద్యవిక్రేతలు, నటులు, చాకళ్ళు, వేటగాళ్ళు–వీరి స్త్రీలు చేసిన ఋణమును తప్పక వారి భర్తలు తీర్చవలెను. ఏలనన వారి వృత్తి ఆ

స్త్రీలపై ఆధారపడి యున్నది. మరణించుటకు సిద్ధముగానున్న లేదా పరదేశమునకు పోవనున్న ప్రేరేపింపగా స్త్రీ చేసిన ఋణము, పతి చేసినదే యైనను, భార్య తీర్చవలెను. భర్తతో కలిసియున్న స్త్రీ చేసిన ఋణము కూడ, పతిపుత్రులు లేనిచో స్త్రీయే చెల్లించవలెను. స్త్రీ తానేచేసిన ఋణమును ఆమెయే తీర్చవలెను. మిగిలిన ఋణములు ఏవియు స్త్రీ తీర్చ పనిలేదు. తండ్రి విదేశమునకు వెళ్ళిపోయినపుడు, మరణించినను, చాల కష్టములలో చిక్కుకొని యున్నపుడును, ఆతని ఋణమును పుత్రపౌత్రులు చెల్లించవలెను. వారు అంగీకరించనిచో సాక్ష్యాదుల ద్వారా నిరూపించి అర్థి వసూలు చేసికొనవలెను. మద్యపానము, స్త్రీ లంపటత్వము, ద్యూతము, దండము శుల్కము చెల్లించగా మిగిలినది, వృథా దానము, వీటికొరకై తండ్రి చేసిన ఋణమును పుత్రుడు తీర్చపనిలేదు. సోదరుల యొక్క, పితృపుత్రుల యొక్క అవిభక్త ధనములో ప్రతిభావ్య ఋణము గ్రహింపదగినదికాదు.

దర్శనము, ప్రత్యయము, దానము-వీటియందు ప్రాతిభావ్యము (జామీను) అంగీకరింపబడినది. ఆధి (తాకట్టు) వ్యర్థమైనపుడు తాకట్టు పెట్టినవాని పుత్రులచే ఋణము తీర్పింపవలెను. దర్శన ప్రతిభూ (అవసరమైనపుడు నేనీ వ్యక్తిని హాజరుపరచెదను అని జామీను ఉన్నవాడు) గాని, ప్రత్యయ ప్రతిభూ (విశ్వాసము నిమిత్తము జామీను ఉన్నవాడు) గాని మరణించినపుడు వారిపుత్రులు ఋణము చెల్లించనవసరములేదు. దాన ప్రతిభూ (ఆతడు చెల్లించెదను) అని జామీను ఉన్నవాడు చెల్లించవలెను. దాన ప్రతిభూలు చాల మంది ఉన్నపుడు వారు ఋణమును తమవంతు ప్రకారము చెల్లించవలెను. అందరును ఒకే విధముగ (పూర్తిగా తీర్చుటకు జామీను ఇచ్చి) ఉన్నపుడు ధనికుడు తన ఇష్టము వచ్చిన వానినుండి ధనము వసూలు చేసికొనవచ్చును. అందరి సమక్షమున ప్రతిభూ ధనికునకు ఎంతధనము చెల్లించెనో దానికి రెట్టింపు ధనమును, ఆ ప్రతిభూకు, ఋణగ్రహీత చేత ఇప్పించవలెను. ఆడపశువులను ఋణముగా గ్రహించినపుడు వాటి సంతతిని వడ్డీగా తీసికొనవలెను. ధాన్యముపై వడ్డీ, అధికాధికము, మూడురెట్లు, వస్త్రములపై వడ్డీ పెరిగి పెరిగి నాల్గు రెట్లు రసములపై ఎనిమిది రెట్లు కావచ్చును. తాకట్టు పెట్టి ఋణము తీసికొనినపుడు ఆ ధనము పెరిగి రెట్టింపు అయిన పిమ్మట గూడ ఋణము చెల్లించి తాకట్టు విడిపించుకొననిచో, ఆ వస్తువు ధనికుని (ఋణదాత యొక్క) సొత్తు అగును. ఇంత కాలము తరువాత విడిపించుకొందునని చెప్పి తాకటు పెట్టినదానిని, ఆ కాలములోపల విడిపించుకొననిచో అది ధనికుని సొత్తు అయిపోవును. కాని ఫలము మాత్రమే అనుభవించుటకు వీలయిన తోట మొదలగునది తాకట్టుపెట్టినచో అది ఎన్నటికిని నష్టము కాదు. దాని స్వత్వము అధిపతికే యుండును.

దాచి ఉంచవలసిన వస్తువు తాకట్టు బెట్టినచో దానిని ధనికుడు అనుభవించినను, ఉపయోగించు పశ్వాదులను తాకట్టు పెట్టినను వాటిపై వడ్డీ ఉండదు. తాకట్టుపెట్టిన వస్తువు పాడైపోయినను, పోయినను ఋణదాత తిరిగి ఇవ్వవలెను. అది దైవ-రాజోప ప్లవములందు పోయినచో ఇవ్వవలసిన పనిలేదు. అట్టి పరిస్థితులలో ఋణ గ్రహీత మరొక వస్తువు తాకట్టుగా ఇవ్వవలెను. లేదా ధనము వడ్డీతో చెల్లించవలెను. చరిత్రమునే బంధకముగా పెట్టి (నమ్మకము మీద) తీసికొన్న ధనమును వడ్డీతో ఇప్పించవలెను. సత్యంకారముతో చేసిన ఋణమును రెట్టింపు చెల్లింపచేయవలెను. తాకట్టు విడిపించుకొన వలసిన సమయము వచ్చినపుడు విడిపించుకొన వచ్చినచో ఇచ్చివేయవలెను.

అట్లు కానిచో ధనికుని ఋణము నిచ్చినవాడు, బంధకము విడిపించుకొను సమయమునకు లేనిచో ఆతని కుటుంబమునకు ధనము చెల్లించి బంధకము విడిపించుకొనవలెను. లేదా ఆనాటి వరకు ఎంత వృద్ధియైనదో నిశ్చయము చేయించుకొని, ధనికుడు మరల వచ్చు వరకును బంధకమును ఆతని వద్దనే ఉంచివేయవలెను. కాని ఆనాడు మొదట వడ్డీ ఉండదు. దూరదేశమునకు వెళ్ళిన ధనికుడు అనుకున్న సమయానికి రాజాలక పోయినచో ఋణగ్రహీత విశ్వసనీయుడైన సాక్షులఎదుట బంధకమును అమ్మివేసి తనకు రావలసిన సొమ్ము తీసికొనవలెను. ఋణము తీసికొనిన ధనము, వడ్డీ పెరిగి రెట్టింపు అయినచో అంతధనమును ఇచ్చి బంధకమును విడిపించుకొనవలెను. పెట్టి మొదలైన వాటిలో ద్రవ్యము ఉంచి, (సీలుచేసి) అది ఏద్రవ్యమో, ఎంతయో చెప్పకుండ ఇతరుల వద్ద దాచనిచ్చినచో అది 'ఔపనిధికము'. దానిని ఇచ్చినట్లుగనే తిరిగి ఇచ్చివేయవలెను. కాని అది రాజ, దైవ, తస్కరాదుల ద్వారా నష్టమైనచో తిరిగి ఇవ్వవలసిన పనిలేదు. ఉపనిధి ఉంచినవాడు అడిగినను ఉంచుకొన్నవాడు తిరిగి ఈయకున్నచో దానిని ఆతనికి ఇప్పించి, అంతధనము దండము విధించవలెను. ఉపనిధిని ఉపయోగించి దానిపై ధనము సంపాదించిన వానిని దండించి లాభముతో సహా ఆ వస్తువును తిరిగి ఇప్పించవలెను. యాచిత, అన్వాహిత, న్యాస, నిక్షేపాదుల విషయమున గూడ ఉపనిధికి సంబంధించిన నియమములు వర్తించును. (254)

వ్యవహార కాండమున దివ్యములు

అగ్నిదేవుడు చెప్పెను : తపస్వులు, కులీనులు, దానశీలులు, సత్యవాదులు, కోమల హృదయులు, ధర్మాత్ములు, పుత్రయుక్తులు, ధనవంతులు, పంచయజ్ఞములు చేయువారు అయిన ఐదుగురుగాని, ముగ్గురుగాని సాక్షులు ఉండవలెను. వారు జాతి వర్ణానుసారముగ ఉండవలెను. లేదా అందరికిని అందరును ఉండవచ్చును. స్త్రీలు, బాలకులు, వృద్ధులు, జూదరులు, మత్తులో ఉన్నవారు, ఉన్మత్తులు, పాతకులు, నటులు, పాషండులు, పంచకులు, వికలమైన ఇంద్రియములు కలవారు, పతితులు, ఆప్తులు, అర్థ సంబంధము కలవారు, సహాయకులు, శత్రువులు, చోరులు, సాహసవంతులు, దోషులుగ పరిగణింపబడినవారు, బంధ్వాది పరిత్యక్తులు సాక్షులుగా ఉండుటకు అర్హులుకారు. వాది ప్రతివాదులు ఇరువురును అంగీకరించినచో ధర్మవేత్తయగు ఒక్క వ్యక్తియే సాక్షిగ ఉండవచ్చును. స్త్రీని బలాత్కరించుట, దొంగతనము చేయుట, ఎవరైన నిందించుట, కఠిన దండనము వేయుట, మొదలగు దుస్సాహస కార్యములందు అందరిని సాక్షులుగా గ్రహింపవచ్చును.

సాక్ష్యము చెప్పని వానిచే రాజు నలుబది ఆఱవరోజున పదవవంతు అధికముగా కలిపి ఋణమును ధనికునకు ఇప్పించవలెను. తెలిసి కూడ సాక్ష్యము చెప్పని నరాధము నకు అసత్యముగా సాక్ష్యము చెప్పిన వానికి వచ్చు పాపము వచ్చును. ఆతనిని కూడ సాక్షిని శిక్షించునట్లు శిక్షించవలెను. 'పాపములు చేసిన వారికిని, మహా పాతకములు చేసిన వారికిని, గృహదానము చేసిన వారికిని, స్త్రీ బాల ఘాతుకులకును ఏ లోకములు వచ్చునో కూట సాక్ష్యము చెప్పిన వానికి కూడ ఆ లోకములే ప్రాప్తించును. నీవు అసత్యముగా సాక్ష్యము చెప్పి ఎవరిని పరాభవింప చూచుచున్నావో వానికి నీవు నూరు జన్మములలో చేసిన పుణ్యములు అన్నియు చేరిపోవును' అని వాది ప్రతివాదుల

సమీపము నందున్న సాక్షులకు చెప్పవలెను. చాలమందితో అభిప్రాయభేదము వచ్చినప్పుడు గుణవంతుల సాక్ష్యమును అంగీకరించవలెను. గుణవంతుల మధ్య భేదము వచ్చినపుడు అధిక గుణవంతుల సాక్ష్యమును గ్రహించవలెను. సాక్షులు ఎవని మాటను సమర్థింతురో ఆతనికి జయము కలుగును. వ్యతిరేకముగా ఇచ్చినచో ఆతడు పరాజయము పొందును.

మొదట కొందరు సాక్షులు సాక్ష్యము చెప్పినను తరువాత అధిక గుణవంతులు కొందరుగాని రెట్టింపు సంఖ్యకల వారుగాని మరొక విధముగా సాక్ష్యము చెప్పినచో పూర్వము సాక్ష్యము చెప్పిన వారు కూట సాక్షులగుదురు. కూటసాక్షులను ఒక్కొక్కరిని వివాదాస్పదమైన ధనముకంటె రెట్టింపు ధనము దండించవలెను. కూటసాక్షి బ్రాహ్మణు డైనచో ఆతనిని దేశమునుండి వెడలగొట్టవలెను. ఇతరులు చెప్పిన సాక్ష్యమును కప్పిపుచ్చిన వానినుండి ఎనిమిదిరెట్ల ధనమును దండముగా గ్రహించవలెను. బ్రాహ్మణుడైనచో దేశము నుండి బహిష్కరించవలెను. వర్ణములవారికి వధ ప్రాప్తించు సందర్భమునందు సాక్షి అసత్యముకూడ చెప్పవచ్చును. ధనికుడును, అధమర్ణుడును (ఋణమును తీసుకున్న వాడు) పరస్పరాంగీకార పూర్వకముగా ఋణము తీసికొనిన ధనమును గూర్చి సాక్షులతో పత్రముపై వ్రాయించుకొనవలెను. ఆ పత్రముపై సంవత్సరము, మాసము, పక్షము, దినము, పేరు, జాతి, వారి గోత్రము, వారి మిత్రులు, బంధువులు, తండ్రులు, మొదలగు వారి పేర్లు కూడ వ్రాయవలెను. వ్రాయుట పూర్తియగు పిమ్మట ఋణగ్రహీత అముకుని (ఫలానావారి) పుత్రుడనైన నాకు ఈ పత్రముపై వ్రాసినది అంగీకార్యమే అని చేవ్రాలు చేయవలయును. సాక్షులందరును అముకుడనైన నేను దీనికి సాక్షినియని తమతమ తండ్రుల పేరు కూడ నిర్దేశించుచు హస్తాక్షరములు ఉంచవలెను అధమర్ణుడు లిపిజ్ఞానము లేనివాడైనచో అతడు అందరి సాక్షుల యెదుట తన మతమును వ్రాయించవలెను. సాక్షి అందరి సాక్షుల యెదుట అముకుడి కుమారుడనైన నేను ఇరువురును కోరగా వ్రాయుచున్నాను అని ప్రారంభించి లేఖకార్థమును వ్రాయవలెను. స్వహస్త లిఖితమైన లేఖ్యము సాక్షులు లేకపోయినను ప్రమాణమే. కాని బలాత్కారముచేత గాని, మోసముచేత గాని వ్రాయించబడినది ప్రమాణముకాదు. లేఖ్య పూర్వకమైన ఋణమును మూడు తరముల వరకును చెల్లించవలసియుండును. తాకట్టు పెట్టిన వస్తువును దానిపై తీసుకొనిన ఋణము తీర్చునంతవరకు ధనికుడు అనుభవించవచ్చును. లేఖ్యము వ్రాసిన వాడు దేశాంతరమునందు ఉన్నను లేఖ్యము నష్టమైనను తుడిచివేయబడినను, హరింపబడినను భిన్నమైనను ఛిన్నమైనను దగ్ధమైనను మరొక లేఖ్యమును వ్రాయించవలెను. లేఖ్యము సందిగ్ధముగా నున్నపుడు మరల మరొక లేఖ్యము వ్రాయవలెను. లేఖ్యమునకు శుద్ధి, యుక్తి ప్రాప్తిచేతను (ఆ దేశ కాలములలో ఆతని వద్ద ఇంత ధనము ఉండుటకు అవకాశ మున్నది అని యుక్తిచేతను) క్రియ (సాక్షుల హస్తాక్షరములు) చేతను చిహ్నముల చేతను (ప్రత్యేకముగా ఉపయోగించిన గుర్తులు) ధనిక ఋణ గ్రహీతల సంబంధము చేతను వారి ధనప్రాప్తి సంభావ్యమే అను ఆగమము చేతను నిర్ణయింపబడును. ఋణములోని కొంత ధనము చెల్లించినపుడెల్ల ధనికుడు ఆ లేఖ్యము వెనుక వైపున చెల్లించిన ధనమును వ్రాసి హస్తాక్షరములు ఉంచవలెను. ఋణము పూర్తిగ చెల్లించివేసినపుడు ఆలేఖ్యమును చింపివైచి చెల్లించినట్లుగా ధనికుడి నుండి పత్రమును పొందవలెను. సాక్షులు ఉన్నపుడు తీసుకున్న ఋణమును వారి యెదుటనే చెల్లించవలెను.

ధర్మశాస్త్రములలో సందిగ్ధమైన విషయమును నిర్ణయించుటకై తుల, అగ్ని, జలము, విషము, కోశము అను ఐదు దివ్య ప్రమాణములు చెప్పబడినవి. అభియోగము చాల తీవ్రమైనపుడున్న అభియోక్త వ్యవహారము చివరనున్నపుడును వీటిని ప్రయోగించవలెను. వాది ప్రతివాదులు అంగీకరించి ఈ దివ్య ప్రమాణ ప్రయోగమునకు సిద్ధము కావలెను. లేదా ఇతరములగు శారీరక ఆర్థిక దండములకు సిద్ధము కావలెను. రాజ ద్రోహము, మహా పాతకము, మొదలగు విషయము లందు సందేహము కలిగినపుడు శీర్షకస్థితి (వివాదము చరమావస్థ) రాకున్నను ఈ దివ్యములను స్వీకరించవచ్చును. వెయ్యి పణములకు తక్కువైన అభియోగమునందు తులా-విష దివ్యములను ప్రయోగించకూడదు. కాని రాజద్రోహ మహాపాతకమునందు వీటిని గ్రహించవచ్చును. అభియోగము వేయి పణముల కొరకు అయినచో తుల మొదలగు మూడు ప్రమాణములను ప్రయోగించవచ్చును. అంతకు తక్కువైనను కోశమును ప్రయోగించవచ్చును.

శపథము చేసినవాడు శుద్ధుడు అని (నిర్దోషి) నిర్ణయమైనచో రెండవ వానిచే ఆతనికి యేబది పణములు ఇప్పించవలెను. దోషియైనచో దండించవలెను. పరీక్షింపదగిన వానిచే మొదటిరోజున ఉపవాసము చేయించి మరునాడు సూర్యోదయ సమయమున వస్త్ర సహితముగా స్నానము చేయించి రాజబ్రాహ్మణ సముఖమున దివ్య ప్రమాణము చేయించవలెను. స్త్రీ, బాలకులు, వృద్ధులు, అంధులు, కుంటివారు, బ్రాహ్మణులు, రోగములతో బాధపడుతున్నవారు ఇట్టి అపరాధులచే తులా దివ్య ప్రమాణము మాత్రమే చేయించవలెను. శూద్రునకు అగ్నికాని, జలముకాని, విషయముయొక్క ఏడు యవలుకాని దివ్య ప్రమాణములుగా విధింపబడినవి. తూచుటయందు నేర్పు కలవారు అభి యుక్తుని (దోషిని) తులలో (కాంటాలో) ఒకవైపున వుంచి మరొక వైపున ప్రతిమానము (సమమైన మరొక పదార్థ మును) వుంచి ఒక రేఖ గీసి క్రిందికి దింపవలెను. ఆతడు ఈ క్రింది వాక్యమును చదువుచు తులను అభిమంత్రించవలెను. "సూర్యుడు, చంద్రుడు, అగ్ని, వాయువు, ఆకాశము, భూమి, జలము, హృదయము, యముడు, పగలు, రాత్రి, రెండు సంధ్యలు, ధర్మదేవత, వీరందరును మానవుని వృత్తము తెలుసుకొనగలరు. ఓతులా! నీవు సత్యమునకు స్థానముగా పూర్వము దేవతలచే నిర్మింపబడితివి. ఓకల్యాణీ! సత్యమునే చెప్పుము. నన్ను సంశయము నుండి విడిపించుము. ఓ తల్లీ! నేను పాపము చేసియున్నచో నన్ను క్రిందికి దింపుము. శుద్ధుడ నైనచో నన్ను పైకి లేపుము. అభియుక్తునిచే చేతులలో ధాన్యమును నలిపించి చేతులకు రంగుపూసి ఆతని చేతులలో ఏడు అశ్వత్థ పత్రములను దారముతో కట్టవలెను. అతనిచే 'ఓ అగ్నిదేవా! నీవే సర్వభూతముల లోపల సాక్షివై సంచరించుచున్నావు. నీవు నా పుణ్యపాపములను గూర్చి సత్యముగా చెప్పుము' అని చెప్పించి గోళాకారములోనున్న యేబది పలముల లోహపిండమును ఎఱ్ఱగా కాల్చి ఆతని చేతులలో వుంచవలెను. అతడు దానిని గ్రహించి మెల్లగా ఏడు మండలములు నడువవలెను. మండలము అనగా పదహారు అంగుళముల దూరము. అక్కడ అగ్నిని విడిచిపెట్టి మరల చేతులతో ధాన్యమును నలిపి చేతులు కాలకుండ వున్నచో అతడు శుద్ధుడు. ఆ అయఃపిండము మధ్యలో పడిపోయినను ఏదైన సందేహము కలిగినను మరల ఆతడు ఆ పిండమును తీసుకొని వెళ్లవలెను. 'ఓ వరుణదేవా! నీవు పవిత్రులలో పవిత్రుడవు. ఓ పావకా! శోధింపదగిన నన్ను శోధించుము. అభిశస్తుడనైన

నన్ను సత్యముచే రక్షింపుము' యని జలమును అభిమంత్రించి బొడ్డులోతు నీటిలో నిలబడివున్న పురుషుని కాళ్లుపట్టుకొని అభియుక్తుడు జలములో ప్రవేశించ వలయును. అదే సమయమున ఒకడు బాణము విడువగా వేగవంతుడగు మరొకడు ఆ బాణమును తిరిగి తీసుకొని వచ్చునంతవరకు అతడు (అభియుక్తుడు) నీటిలో మునిగియున్నచో శుద్ధుడగును(నిర్దోషి). 'ఓ విషమా! నీవు బ్రహ్మ పుత్రుడవు, సత్యధర్మమునందు నిలచి యున్నావు. నన్ను ఈ అభిశాపము (దోషారోపణము) నుండి రక్షించుము. సత్యముచే నీవు నాకు అమృతము అగుము' అని పలికి జీర్ణించుకొన్నచో ఆతడు శుద్ధుడు యని నిర్ణయింపవలయును. న్యాయాధికారి ఉగ్ర దేవతలను పూజించి వారి అభిషేకోదక మును తీసుకొని వచ్చి అభియుక్తునకు ఆ విషయమును చెప్పి వారిచే చారడేసి చొప్పున మూడు మారులు త్రాగించవలయును. పదునాలుగు దినముల లోపుగా ఆతనికి రాజు వలన కాని, దైవము వలన కాని, ఘోరమైన వ్యసనము కలుగకున్నచో ఆతడు నిస్సందేహముగా శుద్ధుడు. అధిక మూల్యములగు వస్తువుల విషయమున అభియోగమునందు స్వల్ప సంశయము కలిగినపుడు సత్యము వాహనములు శస్త్రములు గోవులు బీజములు సువర్ణము దేవతలు గురుచరణములు ఇష్టాపూర్తములు మొదలగు పుణ్యకార్యములు వీటిపై శపథము చేయించవలయును. (255)

దాయవిభాగము

అగ్నిదేవుడు పలికెను : తండ్రి దాయ విభాగము చేసినచో జ్యేష్ఠపుత్రునకు అధిక భాగము ఇవ్వవచ్చును లేదా అందరికిని సమముగా ఇవ్వవచ్చును. సమముగా ఇచ్చిన పక్షమున భర్తద్వారా కాని, మామగారి ద్వారా కాని, స్త్రీ ధనము లభించని స్త్రీలకు కూడా సమభాగములు ఇవ్వవలెను. తాను స్వయముగా ధనమును సంపాదింప సమర్థుడు పితృ ధనము కోరని కుమారునకు కూడ ఏమైనను కొంచెము ఇచ్చి వేరుచేయవలెను. తండ్రి చేసిన దాయవిభాగమునందు న్యూనాధిక ములున్నను అది తండ్రి చేసినదగుటచే ధర్మ సమ్మతమే. తల్లి దండ్రులు అనంతరము కుమారులు ధనమును ఋణమును కూడ సమముగా పంచుకొనవలెను. తల్లిచేసిన ఋణమేదైనా ఉన్నచో దానిని తీర్చి కుమార్తెలు మిగిలిన ధనమును సమముగా పంచుకొనవలెను. కుమార్తెలు లేనిచో కుమారులు పంచుకొనవలెను. పితృధనమునకు నష్టము కల్గింపక స్వయముగా సంపాదించినది కాని, మిత్రుల ద్వారా కాని, వివాహము ద్వారా వచ్చినది గానియైన ధనముపై దాయాదులకు అధికారము లేదు. అన్నదమ్ములు అందరును కలిసి సంపాదించిన ధనమును, వారందరును సమముగా పంచుకొనవలెను. చాలమంది తండ్రులుగల పౌత్రులు పితామహ ధనమును తమ తండ్రులను బట్టి పంచుకొనవలెను. పితామహుడు సంపాదించిన భూమి నిబంధము ద్రవ్యము వీటిపై తండ్రికిని పుత్రులకును అధికారము సమానము. విభాగము చేసికొనిన పిమ్మట సవర్ణ స్త్రీ యందు పుట్టిన కుమారునకు కూడ వాటా ఇవ్వవలెను. లేదా ఆయవ్యయ ములు సరిచూచుకొనిన తరువాత దృశ్య ధనము నుండి ఆతనికి బాగమీయవలెను. కుల క్రమాగతమైన ధనమును ఎవరైన అపహరించినపుడు దానిని మరల ఎవడు సంపాదించునో అది ఆతనికే చెందును. దాయాదులకు ఇవ్వవలసిన పనిలేదు. విద్యద్వార లభించిన ధనమును కూడ దాయాదులకు ఇవ్వపనిలేదు.

తల్లిదండ్రులు ఒక వస్తువును ఎవరికిత్తురో అది అతనికి మాత్రమే చెందును. తండ్రి తరువాత కుమారులు పంచుకొను నపుడు తల్లికూడ సమాంశమును పొందవలెను. వివాహాదులు జరగని సోదరులకు వివాహాదులు జరిగిన సోదరులు ఆ సంస్కారములు చేయించవలెను. తోబుట్టువులకు కూడ తమధనములో నాల్గవవంతు ఇచ్చి వివాహము చేయవలెను. బ్రాహ్మణునకు బ్రాహ్మణాది స్త్రీల యందు పుట్టిన పుత్రులకు వరుసగా నాలుగు మూడు రెండు ఒకటి భాగములు ఇవ్వవలెను. క్షత్రియులకు పుట్టిన కుమారులకు (తల్లి వర్ణమును బట్టి) వరుసగా రెండు మూడు ఒకటి భాగము లను, వైశ్యుని పుత్రులకు (వర్ణ క్రమమునుబట్టి) వరుసగా రెండు ఒకటి భాగములను ఇవ్వవలెను. ధన విభాగము అయిన తరువాత ఏదైన ద్రవ్యమును అన్నదమ్ములలో ఎవరైన అపహరించినట్లు కనబడినచో ఆ ద్రవ్యమును వారందరును మరల సమముగా పంచుకొనవలెనని నియమము. పుత్రులు లేనివానిచే పరభార్య యందు నియోగముచే పుట్టింపబడిన కుమారుడు వారి ఇరువురి రిక్థమునకు (ఆస్తికి) అధికారి, ఇద్దరికిని పిండదాత.

ధర్మపత్ని యందు పుట్టిన పుత్రుడు ఔరసుడు. పుత్రికా పుత్రుడు ఔరస సమానుడు. తన భార్య యందు సగోత్రుడగు వాని ద్వారాకాని, సగోత్రుని ద్వారా కాని, ఇతరులచేత గాని పుట్టింపబడినవాడు క్షేత్రజుడు. గృహము నందు రహస్యముగా పుట్టినవాడు గూఢజుడు. అవివాహిత కన్యకు పుట్టినవాడు కానీనుడు. వాడు మాతామహునికి పుత్రునిగా అంగీకరింపబడును. క్షతయోని గాని, అక్షతయోనిగానియైన విధవకు పుట్టినవాడు పౌనర్భవుడు. తండ్రిచేతకాని, తల్లిచేతకాని ఇవ్వబడినవాడు దత్తకుడు. తల్లిదండ్రులు అమ్మగా కొనబడినవాడు విక్రీతుడు. స్వయముగా పెంచుకొనబడినవాడు కృత్రిముడు. తనను తానే ఇతరులకు ఇచ్చిన కుమారుడు దత్తాత్మ. గర్భవతిని వివాహమాడగా పుట్టిన వాడు సహోఢజుడు. తల్లిదండ్రులు పరిత్యజించగా గ్రహింపబడినవాడు అపవిద్ధుడు. ఈ పదుకొందు విధముల కుమారులలో పూర్వ పూర్వపుత్రులు లేనిచో పరపర పుత్రుడు పిండమును ఇవ్వవలెను. ఆస్తి తీసుకొనవలెను. ఇంతవరకు చెప్పిన విధానము సమాన జాతీయుల విషయముననే.

శూద్రునకు దాసియందు పుట్టినవాడుకూడ తండ్రికి ఇష్టమైనచో అంశహరుడు అగును (ఆస్తి పంచుకొనువాడగును). తండ్రి మరణించిన పిమ్మట సోదరులు ఆతనికి అర్ధ భాగములు ఇవ్వవలెను. ఆతనికి సోదరులు లేనిచో, దౌహిత్రుడుకూడ లేనిచో దాసీ పుత్రుడే అంతయు తీసుకొనవచ్చును. పైన చెప్పిన పదకొండు విధముల పుత్రులులేనివాని ధనముపై క్రమముగా భార్యకు, కుమార్తెలకు, తల్లిదండ్రులకు, సోదరులకు, సోదర పుత్రులకు, గోత్రమువారికి, బంధువులకు, శిష్యునకు సహాధ్యా యికి అధికారముండును. ఈ నియమము అన్ని వర్ణముల వారికిని చెల్లును. వానప్రస్థ, సన్యాసి, బ్రహ్మచారుల రుక్థముపై క్రమముగ ఆచార్యునకు ఉత్తమశిష్యునకు ధర్మభ్రాతకు ఏక తీర్థికి అధికార ముండును. సోదరుడు జన్మించినను, సోదరుడు మరణించినను వారిద్దరు కలసివున్నపుడు ఆతనికి భాగమును ఇవ్వవలెను. ఆతని భాగమును తీసుకొనవలెను. కలసివున్న మరియొక సోదరుడు మరియొక సోదరుని ధనమును గ్రహించకూడదు. సవతి సోదరుడు కూడ కలిసి లేకపోయినను, మరణించినవాని ధనమును తీసుకొనవచ్చును.

నపుంసకుడు పతితుడు ఆతని కుమారుడు, కుంటివాడు, ఉన్మత్తుడు, జడుడు, గ్రుడ్డివాడు చికిత్సచేయ శక్యముగాని రోగములతో బాధపడువాడు వీరికి అంశము ఉండదు. వీరిని కేవలము పోషించవలెను. ఔరసులు, క్షేత్రజులు అయిన పుత్రులు ఈ దోషములు లేకున్నచో భాగమును తీసుకొనవచ్చును. వీరి కుమార్తెలను కూడ వివాహమగు నంత వరకు పోషించవలెను. వీరి భార్యలు పుత్రులు లేనివారైనచో సచ్చరిత్రులైన పక్షమున వారిని కూడ పోషించవలెను. వ్యభిచారిణులు ప్రతికూలలు అయినచో వారిని ఇంటినుండి వెడలగొట్టవలెను. స్త్రీలకు తల్లిదండ్రులు భర్త సోదరులు ఇచ్చినది, అగ్ని సమీపమునందు ఉపాయముగా లభించినది, అధివేదన సమయమున లభించినది స్త్రీ ధనమని చెప్పబడును. బంధువులు ఇచ్చినది, శుల్కముగా లభించినది, వివాహానంతరము పారితోషికముగా లభించినది కూడ స్త్రీ ధనము. స్త్రీ సంతాన రహితురాలై మరణించినపుడు ఆ ధనము బంధువులకు చెందును. బ్రాహ్మము మొదలైన నాలుగు వివాహ పద్ధతులచే పెండ్లాడిన భార్య, సంతానము లేకుండ మరణించినచో ఆమె ధనము భర్తకు చెందును. ఆమె సంతానవతి యైనచో ఆ ధనము పుత్రికలకు చెందును. మిగిలిన వివాహ పద్ధతులచే వివాహము చేసికొన్న స్త్రీ ధనము ఆమె తండ్రికి చెందును. కన్యను ఇచ్చి మరల ఆమెను హరించిన వానిని దండించ వలెను. ఆతని నుండి వ్యయమైన ధనము నంతను ఉదయముతో (వడ్డీతో) తీసుకొనవలెను. ఆ కన్య మరణించినచో ఇద్దరి వ్యయమును పరిశీలించి భర్త ఇచ్చినదానిని ఆ కన్య తండ్రి నుండి తీసుకొనవలెను. భర్త దుర్భిక్ష సమయమునందును, ధర్మకార్యమునందును, వ్యాధియందును దేశోపప్లవమునందును, భార్యనుండి తీసుకొనిన స్త్రీ ధనమును తిరిగి ఆమెకు ఇవ్వవలసిన పనిలేదు. స్త్రీ ధనము లేని భార్య ఉండగా, మరొక వివాహము చేసుకొనువాడు ఆ వివాహమునకు, ఎంత వ్యయమగునో అంత ధనమును మొదటి భార్యకు ఇవ్వవలెను. ఆమెకు స్త్రీ ధనమున్నచో సగము ఇవ్వవలెను. విభాగ విషయమున సందేహము వచ్చినపుడు జ్ఞాతులు, బంధువులు, సాక్షులు, అభి లేఖితములు (వ్రాసిన పత్రములు) గృహములు, క్షేత్రములు కట్నము వీటిని బట్టి విభాగ నిర్ణయము చేయవలెను. (256)

సీమా వివాద నిర్ణయము

అగ్నిదేవుడు పలికెను :

క్షేత్రము విషయమున సీమా వివాదము (సరిహద్దు) ఏర్పడినపుడు సామంతులు వృద్ధులు మొదలగువారు గోపాలకులు ఆ సరిహద్దులలో వుండు కర్షకులు వనములో నివసించువారు వీరందరును ఎత్తైన ప్రదేశము బొగ్గులు ఊక (పొల్లు) వృక్షములు వంతెనలు, పుట్టలు, పల్లములు, చైత్యములు మొదలైనవాటి సహాయముతో ఆ సరిహద్దును గుర్తించవలెను. సామంతులుగాని, గ్రామములోని నలుగురుని గాని, ఎనమండుగురు గాని, పదిమంది గాని, ఎర్రని పుష్పమాలలను, వస్త్రములను ధరించి, తలపై మట్టిపెట్టు కొని సీమా నిర్ణయము చేయవలెను. ఈ సామంతాదులు అసత్యము చెప్పినచో రాజు వారికి వేరువేరుగా మధ్యమ సాహస దండము ఇవ్వవలెను. సీమను నిర్ణయించు చిహ్నములు లేని పక్షమున రాజే సీమా నిర్ణయము చేయువాడు. తోటలు గృహములు.

గ్రామములు తటాకాదులు ఉద్యానములు దేవాలయములు. వర్ష జలములు ప్రవహించు కాలువలు మొదలగు వాటి విషయము గూడ సీమానిర్ణయము ఇట్లే చేయవలెను. సరి హద్దులు తొలగించిన వారికిని, క్షేత్రము హరించినవారికిని, సరిహద్దు దాటినవారికిని రాజు క్రమముగా అధమ ఉత్తమ మధ్యమ దండములు ఇవ్వవలెను. చాల మందికి ఉపయోగించినది కొంచెము మాత్రమే బాధ కలిగించునది యగు సేతువు - పరుల భూమిలోనికి పోవు అత్యధికమగు జలముగలది-అల్ప క్షేత్రమును ఆక్రమించునది యగు కూపము వీటిని అడ్డుపెట్టరాదు. క్షేత్రాధిపతికి తెలుపకుండగనే క్షేత్రమునందు సేతువును నిర్మించినచో దానిని క్షేత్రాధిపతియే అనుభవించవలెను. అతడు లేనిచో అది రాజునకు చెందును. దున్నువాడు తాను దున్నిన భూమిపై పంట పండింపకున్నను, ఇతరులను పండింపకుండ అడ్డుకున్నను దున్నిన భూమిపై వచ్చుటకు అవకాశమున్న పొలమును అతనికి ఇప్పించి ఆ పొలమును మరియొకనిచే చేయించవలెను.

గేదె సస్యమునకు కల్గించినపుడు ఎనిమిది మాషములు, గోవు నష్టము కల్గించినచో నాలుగు మాషములు, మేకలు, గొఱ్ఱెలు, కలిగించినచో దండము విధించవలెను. గేదెలు మొదలగునవి సస్యమును భక్షించి అక్కడ కూర్చున్నచో పైన చెప్పినదానికి రెట్టింపు దండమును విధించవలెను. వివీత క్షేత్రమునందు కూడ పైన చెప్పినట్లే దండమును విధించవలెను. గాడిదలకు ఒంటెలకు కుండ గేదెతో సమానముగా దండము. ఎంత సస్యము నష్టమైనదో అంత క్షేత్రస్వామికి ఆ పశువుల స్వామిచేత ఇప్పించవలెను. పశువుల కాపరికి తాడనమే దండము. గోస్వామికి ఆతడు స్వయముగా మేపినచో పైన చెప్పిన దండము విధించవలెను. ఆ క్షేత్రము మార్గము నందును గ్రామము యొక్క వివీతము చివరను వున్నపుడు తెలియక పశువులు మేసినచో దండములేదు. తెలిసిమేపినచో చోరుని వలె దండించవలెను. ఆబోతు, దేవతలను ఉద్దేశించి విడిచిన పశువులు క్రొత్తగా ఈనిన ఆవు చెదరివచ్చిన ఆవు ఇవి మేసినచో దండములేదు. వాటిని విడిచిపెట్టవలెను. దైవోపహ తములు, రాజోపహతములగు పశువు లనుకూడ విడిచి పెట్టవలెను. గోపాలకుడు ప్రాతః కాలమున పశువులను తానెట్లు తీసుకొని పోవునో సాయంకాలమున అట్లే తిరిగి స్వామికి అప్పచెప్పవలెను. జీతము తీసుకొను గోపాలుని ప్రమాదముచే పశువులు మరణించినను, నష్టమైనను ఆతనిచే వాటి స్వామికి ఇప్పించవలెను. గోపాలుని పొరపాటుచే పశువు నశించినచో పదమూడున్నర పణముల దండము విధించి పశు మూల్యమునకు సమానమైన ధనమును పశుస్వామికి ఇప్పించవలెను. గ్రామస్థుల ఇష్టము ప్రకారముగాని, రాజాజ్ఞచేతగాని, గోవులమేతకై కొంత భూమిని విడువవలెను. బ్రాహ్మణుడు అన్ని క్షేత్రముల నుండియు తృణమును కట్టెలను, పుష్పములను, తన సొంత వస్తువువలె గ్రహింపవచ్చును. గ్రామమునకు పొలమునకు మధ్య వందధనుస్సుల దూర ముండవలెను. ఖర్వటము (పెద్ద గ్రామము) నకు క్షేత్రమునకు మధ్య రెండు వందల ధనుస్సుల అంతరము, నగర మునకు క్షేత్రములకు మధ్య నాలుగు వందల ధనుస్సుల అంతరము వుండవలెను.

తన వస్తువును అపహరించి ఎవరైన ఇతరులకు అమ్మివేసినపుడు అది కనబడినచో దానిని స్వామి తీసుకొనవచ్చును. దానిని బయట కనబడకుండ చేసినచో అది కొన్నవాని దోషము. ఒక నీచుని నుండి తక్కువ మూల్యము ఇచ్చి సమయము కాని సమయము నందు రహస్యముగా ఒక

వస్తువును కొన్నవాడు చోరుడే. నష్టమైనను అపహృతమైనను ఒక వస్తువు కనబడినచో అది ఎవని వద్దనుండునో వానిని రాజపురుషులచే పట్టించవలెను. ఆ దేశమునందు ఆ సమయమునందు పట్టించుట కుదరకపోయినను, తాను స్వయముగా పట్టి ఇవ్వవలెను. అపహృత వస్తువును కొన్నవాడు అమ్మిన వానిని చూపించినచో వాడు శుద్ధుడగును. రాజు ఆ ద్రవ్యమును స్వామికి ఇప్పించి అమ్మినవానిని శిక్షించి కొన్నవానికి వానిచే మూల్యమును తిరిగి ఇప్పించవలెను. నష్టమైన వస్తువును దాని స్వామి తనకు ఎట్లు వచ్చినదో తాను ఎట్లు అనుభవించెనో చెప్పి అది తనదని నిరూపించు కొనవలెను. అట్లు చేయజాలనిచో రాజు దానిలో పంచ మాంశమును దండముగ విధించవలెను. హృతమైన లేదా నష్టమైన తన వస్తువును గూర్చి రాజుకు నివేదించక ఇతరుల ద్వారా దానిని పొందినవానికి రాజు తొంబది యాఱు పణములు విధించవలెను. శుల్కాధికారులు కాని, స్థాన పాలకులు గాని తీసుకొనివచ్చి రాజువద్ద వుంచిన నష్ట అపహృత ధనమును దాని స్వామి ఒక సంవత్సరము లోపుగ తనదని నిరూపించి మరల పొందవచ్చును. సంవత్సరము దాటినచో అది రాజుకు చెందును. ఏక శఫములు (గుఱ్ఱములు మొదలగు నవి) పోయి మరల లభించినచో వాటి స్వామి రాజునకు నాలుగు పణములు ఇవ్వవలెను. మనుష్య జాతికి సంబంధించిన ద్రవ్యము లభించినచో ఐదు పణములు, మహిషము, ఉష్ట్రము, గోవు తిరిగి లభించినపుడు రెండేసి పణములు, మేకలకు గొఱ్ఱెలకు పణములో నాలుగవ వంతు ఇవ్వవలెను.

తన కుటుంబమునకు నష్టముకాని విధమున తన వస్తువులను దానము చేయవచ్చును. భార్యా పుత్రాదులను ఎన్నడును దానము చేయకూడదు. తన సర్వస్వమును తన వంశము ఉన్నపుడు ఇతరులు ఎవ్వరికిని ఇవ్వకూడదు. ఒకరికి ఇచ్చిన దానిని మరొకరికి ఇవ్వకూడదు. ప్రతిగ్రహము అందరి యెదుటను చేయవలెను. ఇచ్చెదనని చెప్పిన వస్తువును తప్పక ఇవ్వవలెను. ఇచ్చి మరల తీసుకొనగూడదు. బీజములు ఇనుము, వాహనములు, రత్నములు, దాసి, పాలిచ్చు పశువులు, దాసులు వీరిని రక్షించుటకు వరుసగ పది, ఒకటి, ఐదు, ఏడు దినములు మాసము, మూడు దినములు, అర్ధమాసము తీసుకొనవచ్చును. బంగారము అగ్నిలో వేసినను తరగదు. వెండి నూటికి రెండు పలములు తగ్గును. తగరము సీసము నూటికి ఎనిమిది పలములు తగ్గును, రాగికి ఐదు పలములు ఇనుముకు పదిపలములు తరుగువచ్చును. ఉన్ని నూలు వీటితో నేసిన బట్టలకు నూటికి పదిపలములు పెరుగును. మధ్య ప్రమాణముగల దారమైనచో ఐదు పలములు సూక్ష్మ మయినచో మూడు పలములు హెచ్చును. అద్దకము బట్టలందును, రోమములు గుచ్చిన బట్టలందును నూటికి ముప్పై వంతులు తరుగు వచ్చును. పట్టుబట్టలందు, నారచీరలందు, క్షయముగాని వృద్ధికాని ఉండదు. కుశలులగు వారు దేశమును కాలమును భోగమును దృష్టిలో ఉంచుకొని నష్టమైన వస్తువుల విషయమున బలాబలములను ఏ విధముగా నిర్ణయింతురో ఆ నష్టమును రాజు తప్పక ఇప్పించవలెను.

బలాత్కారముగా, దాసుడుగా చేయబడిన వానిని చోరులచే అమ్మబడినవానిని తన స్వామిని ప్రాణ సంకటము నుండి రక్షించినవానిని, తనకై స్వామి ఎంత వ్యయము చేసెనో అంతధనము తిరిగి ఇచ్చివేసిన వానిని దాసత్వమునుండి విడిపించవలెను. ప్రవ్రజ్యావసితుడు (సన్యాసమును

స్వీకరించి (భ్రష్టుడైన వాడు) ఆమరణాంతము రాజుకు దాసుడుగా వుండవలెను. వర్ణములలో దాస్యము అనులోమ్యముచే (క్రింద వర్ణము వారు పైవర్ణము వారికి) దాస్యముండును. ప్రతిలోమ క్రమముచే కాదు. శిల్పము నేర్చుకొన్న శిష్యుడు నిశ్చితమగు కొంత కాలము పాటు గురు గృహము నందే నివసించుచు, గురువు వంట భోజనము చేయుచు, శిల్పముల వలన సంపాదించిన ధనమును గురువునకు ఇవ్వవలెను. రాజు తన నగరమున స్థానము కల్పించి అచట బ్రాహ్మణులకు నివాస మేర్పరచి వేదవిదులగు వారికి వృత్తి కల్పించి 'మీరు ఇచట స్వధర్మానుష్ఠానము చేయుడు' అని ప్రార్థించవలెను. స్వ ధర్మమునకు అవిరుద్ధమగు ఆయా సమయములందు ఏర్పరచబడిన రాజనిర్ణీత ధర్మమును కూడ ఆ బ్రాహ్మణులు పాలింపవలెను. ఎవడు జనగణము యొక్క ద్రవ్యమును హరించునో, మర్యాదను లంఘించునో ఆతని సర్వస్వమును తీసుకొని రాష్ట్రము నుండి వెడల గొట్టవలెను. సమాజ హితమును కోరువారు చెప్పిన విషయమును అందరును ఆచరించవలెను. తద్విపరీతముగా ప్రవర్తించుచు వానిని ప్రథమ సాహస దండముచే శిక్షించవలెను. సమాజ కార్యముపై పంపబడినవాడు తనకు లభించిన దంతయు సమాజ మునకు సమర్పించవలయును. వాడు అట్లు అర్పించకున్నచో వానిచే పదకొండు రెట్లు ఇప్పించవలెను. వేదజ్ఞులు, పవిత్రులు, లోభము లేనివారు, కార్యచింతకులు కావలెను. సమాజ హితమును చెప్పువారి వచనమును అంద రును ఆచరించవలెను. శ్రేణులు, నైగములు, పాషండులు, గణములు వీరికికూడ ఇదివర్తించును. రాజు వీరి ధర్మభేదములను, పూర్వ వృత్తిని పాలించవలెను.

వేతనము తీసుకొని పని మానివేసినవాడు వేతనమునకు రెట్టింపు ధనమును స్వామికి ఇవ్వ వలెను. అతడు వేతనము తీసుకొనకుండ పనిమానివేసినచో వేతన ధనమును స్వామికి ఇప్పించ వలెను. భృత్యుడు ఉపకరణములను రక్షించుచుండవలెను. వేతనము నిశ్చయించ కుండగ ఎవరైనా భృత్యునిచే పని చేయించుకున్నచో రాజు వానిచే ఆ భృత్యునికి వాణిజ్యము పశువులు సస్యము వీటిలో పదవవంతు ఇప్పించవలెను. దేశ కాలములను దాటబెట్టుటచే పనిని చెడగొట్టిన భృత్యునకు స్వామి తన ఇష్టము వచ్చినంత వేతనమునే ఇవ్వవలెను. అనుకొనిన దానికంటె అధికము సమ కూర్చినచో అధిక వేతనము ఇవ్వవలెను. ఎవడు ఎంత పనిచేయునో అతనికి అంతయే వేతనము– ఇద్దరికి అసాధ్యమైన పనిని ఒకడు ఎంతచేయునో అంతయే వేతనము, సాధ్యమైనచో చెప్పినంత వేతనము ఈయవలెను. భారమును మోయు భృత్యుడు, రాజునకుకాని దైవమునకు కాని సంబం ధించిన వస్తువును మోయుచు దానిని నష్టపరచినచో ఆవాహకునిచే అంత ధనము స్వామికి ఇప్పించవలెను. యాత్రలో విఘ్నము కలిగించు భృత్యునిచే వేతనమునకు రెట్టింపు ధనమును ఇప్పించ వలెను. యాత్రా ప్రారంభమున పనిమానివేసిన వానిచే వేతనములోని సప్తమ భాగమును మార్గమునందు మానివేసిన వానిచే చతుర్థ భాగమును, మార్గమధ్యము నందు మానివేసిన వానిచే మొత్తము వేతనమును ఇప్పించవలెను. జూదములో పందెము నందు, నూరుగాని, అంతకంటె అధికముగాని ఎక్కువ సంపాదించిన జూదరి నుండి సభికుడు రాజునకు సభికుడు (ద్యూత గృహాధ్యక్షుడు) నూటిలో పదవ వంతు తీసికొనవలెను. మరల అంత లాభము వచ్చి నప్పుడు నూటికి పదవవంతు తీసుకొనవలెను. జయించిన ధనమును జయించిన వానికే ఇచ్చి క్షమాపరాయణుడై

సత్యమునే పలుకవలెను. ప్రసిద్ధులగు జూదరుల సముదాయము సభికులతోసహా రాజువద్దకు వెళ్ళి ఆతని భాగమును చెల్లించిననే రాజు ఓడిపోయిన వానికి జయించిన వారి సొమ్మునే ఇప్పించవలెను. ద్యూతమునకు సంబంధించిన వ్యవహారములను పరిశీలించుటకును, సాక్ష్యము చెప్పుటకును, జూదరులనే నియమించవలెను. తప్పుడు పాచికలతో ఆడించువారి శరీరముపై కొన్ని గుర్తులువేసి దేశము నుండి వెడలగొట్టవలెను. జూదములో దొంగలను తెలుసుకొనుటకు ఒక్క వ్యక్తినే ప్రధానునిగా నియమిం చవలెను. ప్రాణి ద్యూతమునందు కూడ ఇదియే నియమము. (257)

వాక్పారుష్యాది ప్రకరణము

అగ్నిదేవుడు పలికెను :

అవయవ లోపము ఇంద్రియ లోపము కలవారిని, రోగపీడితులను, సత్య వచనముల చేత గాని, అసత్య వచనములచేతగాని, విపరీత స్తోత్రములచే గాని ఆక్షేపించు వారిని పదమూడున్నర పణములచే దండించవలెను. నీ సోదరిని, తల్లిని చెరిచెదను అని తిట్టువానికి ఇరువదియైదు పణముల దండము విధించవలెను. తిట్టబడినవాడు అధముడు అయినచో సగము దండము, పరస్త్రీగాని, ఉత్తములుగాని అయినచో రెట్టింపు దండము విధించవలెను. వర్ణజాతుల ఉత్తమత్వ అధమత్వములను పరిశీలించి, దండమును నిర్ణయిం చవలెను. నిమ్న వర్ణమువాడు ఉచ్చవర్ణము వానిని తిట్టినపుడు రెండు రెట్లు మూడురెట్లు దండములను, ఉత్తమ వర్ణమువాడు నిమ్న వర్ణము వానిని తిట్టినపుడు సగము తగ్గించియు దండము విధించవలెను.

మాటలతో "నీ చేతులను, మెడను, నేత్రములను, తొడలను విరుగగొట్టెదను" యని తిట్టినచో నూరు పణముల దండము విధించవలెను. పాదములు, ముక్కు, చెవులు, చేతులు, విరచెదను" అని తిట్టినవానికి దానిలో సగము దండము విధించవలెను. ఇట్లు తిట్టినవాడు అసమర్థుడైనచో పది పణములు దండించవలెను. సమర్థుడైనవాడు దండము చెల్లించి తిట్టబడినవాని క్షేమము కొరకై (ప్రతిభూ) జామీను ఇవ్వవలెను. 'నీవు పతితుడవు' యని తిట్టినవానికి మధ్యమ సాహస దండము. ఉపపాతకములు చేసినావు యని తిట్టిన వానికి ప్రథమ సాహసదండము. వేదవేత్తలను రాజును దేవతలను తిట్టిన వానికి ఉత్తమ సాహస దండము. జ్ఞాతులను సంఘమును తిట్టినవానికి మధ్యమ దండము. గ్రామమును దేశమును తిట్టినవానికి ప్రథమ సాహస దండము.

ఎవరినైన కొట్టినపుడు సాక్షులు లేనిచో ఆ యభియోగమును రాజు చిహ్నము యుక్తి, శాస్త్రము,- వీటినిబట్టి పరిశీలించవలెను. దెబ్బతగిలినట్లు అసత్యమగు చిహ్నములు చేసికొనెనా! అని పరిశీలించవలెను. ఇతరునిపై భస్మము పంకము పరాగము చల్లిన వానికి పదిపణముల దండము. అమేధ్యమును ఉమ్మి తగల్చిన వానికిని మనవతో తన్నిన వానికిని రెట్టింపు దండము. ఇది సముల విషయముననను చెప్పబడినది. పరస్త్రీల విషయము నను ఉత్తముల విషయముననను ఈ అపరాధము చేసినచో రెట్టింపు దండము. తనకంటె హీనుల విషయమున చేసినచో సగము దండము. మోహము చేతగాని మదాదుల చేతగాని చేసినచో దండము లేదు. ఒక విప్రునకు ఏ అంగముచే ఆ బ్రాహ్మణుడు

పీడకల్గించునో ఆ అంగమును ఛేదించవలెను. బ్రాహ్మణుని చంపుటకు ఆయుధ మెత్తినచో ప్రథమ సాహస దండము. ఆయుధమును స్పృశించినచో సగము దండము. కొట్టుటకు హస్తము గాని పాదముగాని ఎత్తిన వానికి వరుసగా పది ఇరువది పణముల దండము. ఒకరినొకరు కొట్టుకొనుటకై ప్రయత్నించినపుడు అందరికిని మధ్యమ సాహస దండము. పాదము, కేశములు, వస్త్రము, హస్త ములు, పట్టి లాగినచో పదిపణముల దండము. పీడించినను లాగినను బట్టతో చుట్టబెట్టినను తన్నినను నూరుపణముల దండము. కాష్ఠాదులచే కొట్టి నపుడు రక్తము రాకున్నచో ముప్పది రెండు పణముల దండము. రక్తము కనబడినచో రెట్టింపు దండము, హస్తములను కాని పాదములను కాని దంతములను గాని విరుగగొట్టిన వానికి కర్ణములను నాసికను ఛేదించినవానికిని గాయము కలుగునట్లు కొట్టిన వానికిన్ని చచ్చెనా యన్నట్లు కొట్టిన వానికి మధ్యమ దండము. ఇతరుల చేష్టను, భోజనమును, వాక్కును అడ్డగొనినప్పుడున్ను నేత్రాదులను, పీడించినపుడున్ను కంఠము బాహువులు తొడలు విరిచినపుడున్ను మధ్యమ సాహస దండము. చాలమంది కలసి ఒకనిని కొట్టినచో వారికి వెనుక చెప్పిన దండమునకు రెట్టింపు దండము ప్రత్యేకముగా విధించవలెను. కలహములో అపహరింపబడిన వస్తువును, దాని స్వామికి ఇప్పించి దాని మూల్యమునకు రెట్టింపు దండము విధించవలెను. అన్యునకు దుఃఖము కల్గించు వానిచే చికిత్సాదులకు యెంత వ్యయమగునో అంతధనము ఇప్పించవలెను. ఏకలహమునకు ఏ దండము విధింప బడినదో ఆ దండమును కూడ విధించవలెను. నావచే దాటించువాడు స్థల శుల్కమును తీసుకున్నచో పదిపణముల దండము. దేవకార్యాదులు వచ్చినపుడు సమర్థుడైయుండి కూడ చుట్టు ప్రక్కలవున్న బ్రాహ్మణులను నిమంత్రణము చేయనివానికి పది పణముల దండము. ఇతరుల గోడను కొట్టినను భేదించినను రంధ్రము చేసినను దానిని పడగొట్టినను వరసగ ఐదు, పది, ఇరువది ముప్పది ఐదు పణములు ఇప్పించవలెను. ఇతరుల గృహమునందు దుఃఖోత్పాదకములగు వస్తువులను ప్రాణహరములగు వస్తువులను పడవేయువారికి పద హారు పణముల దండము మధ్యమ సాహస దండము విధించవలెను. క్షుద్ర పశువులకు పీడ కల్గించినను వాటి శరీరమునుండి రక్తము స్రవించినట్లు చేసినను, కొమ్ములు ఛేదిం చినను, వరసగ రెండు నాలుగు ఎనిమిది పణముల దండము. వాటి లింగమును ఛేదించగ అవి మరణించినచో మధ్యమ సాహస దండము విధించి వాటి మూల్యమును ఇప్పించ వలెను. మహా పశువుల విషయమున ఈ అపరాధము చేసినపుడు రెట్టింపు దండము. ప్రరోహి (కొమ్మతీసి పాతగ మొలచునది) వృక్షముల శాఖలను మ్రానును మొత్తము వృక్షమును చీల్చివేసినపుడు ఇరువది పణముల దండము, ఉప జీవ్య వృక్షము(ఫల వృక్షములు) ఇట్లుచేసినచో రెట్టింపు దండము. సాహసమును చేయించినవానికి చేసినవాని కంటె రెట్టింపు దండము. నేను నీకు ధనమును ఇచ్చెదను, సాహసమును చేయుము అని చెప్పి చేయించినవానికి నాలుగు రెట్ల దండము.

పూజ్యులను తిట్టినవానికి, వారి ఆజ్ఞను అతిక్రమించినవానికి సోదరుని భార్యను కొట్టినవానికి, ఇచ్చెదననిచెప్పి ఇవ్వనివానికి, భూగృహమును భేదించినవానికి, ఇరుగు పొరుగువారికిని, కులీనులకు అపకారము చేయువానికిని ఏబది పణముల దండము. స్వేచ్ఛా పూర్వకముగ విధవా సంగముచేసిన వానికి, కష్టములలో ఉన్నవారు అరచినపుడు పరుగెత్తని వానికి అకారణముగా తిట్టువానికి,

ఉత్తములను స్పృశించు చండాలునకు, దేవ పితృకార్యములందు సన్యాసులకు భోజనము పెట్టనివానికి, అనుచితముగా ఒట్లు పెట్టువానికి, తనకు చేయు అధికారములేని పనులు చేయు వానికిని, వృషభములు క్షుద్ర పశువుల పుంస్త్వమును చెడగొట్టినవానికిని, సాధారణ విషయములందు మోసముచేయు వానికిని, దాసీగర్భమును నశింప చేసినవానికిని నూరు పణముల దండము విధించవలెను. తండ్రి, కుమారుడు, సోదరి, సోదరుడు, దంపతులు, ఆచార్యుడు, శిష్యుడు, వీరిలో పతితుడుకాని వారినికూడ పరిత్యజించువారికి, నూరు పణముల దండము. ఇతరుల వస్త్రములను ధరించిన చాకలివానికి మూడు పణముల దండము. అమ్మివేసినను అద్దెకిచ్చి నను కుదువపెట్టినను పది పణముల దండము. తుల (తక్కెడ) శాసనములు, కొలతలు, వీటిలో కపటము చేయువానికిని, నాణెములలో మోసముచేయువానికిని, వీటితో వ్యవహ రించువానికిని ఉత్తమ సాహస దండము విధించవలెను. మంచి దానిని చెడ్డదనియు, చెడ్డ దానిని మంచిదనియు చెప్పు నాణక పరీక్షకునకు ప్రథమ సాహసదండము. జంతువుల విషయమున తప్పుడు వైద్యము చేయు వైద్యునకు ప్రథమ సాహసదండము. మనుష్యులకు చేసినచో మధ్యమ దండము. రాజ పురుషులకు చేసినచో ఉత్తమ దండము. బంధించ కూడని వానిని బంధించినను, బంధింపతగినవానిని విడిచిపెట్టినను అట్టి అధికారికి ఉత్తమ దండము. కొలతలోగాని, తూకములోగాని ఎనిమిదవ వంతు హరించినవానిచే ఇరువది రెండు పణములు ఇప్పించవలెను. అష్టమాంశము కన్న అధికము అయినను తక్కువైనను దండమును కూడ మార్చవలెను. మందులు, తైలములు, లవణము, గంధము, ధాన్యము, గుడము మొదలైన పణ్య వస్తువులలో తక్కువ రకము వస్తువు కల్పిన వానికి పదహారు పణముల దండము. కొందరు శిల్పులు కలిసి పనిచేయుచు మూల్యములో హ్రాసముగాని వృద్ధిగాని కల్పించినచో వారికి వేయిపణముల దండమును విధించవలెను. వ్యాపారులు రాజుచే ప్రతిదినము నిర్ణయింపబడిన మూల్యమునకే క్రయ విక్రయములు చేయవలెను. దానిలో వచ్చు లాభము వర్తకులకు చెందును. వర్తకులు స్వదేశమునందు లభించు పణ్యముపై (అమ్మే వస్తువు) నూటికి ఐదువంతులు విదేశీయ వస్తువులపై, నూటికి పదివంతులు లాభము తీసుకొనవచ్చును. ఇది వెంటనే అమ్ముడుబోవు వస్తువు లకు వర్తించును. వర్తకము చేయుటలో కలుగు వ్యయమును పణ్యముపైవేసి అమ్మువారికి కొను వారికిని కూడ లాభము కలుగునట్లు మూల్యము నిర్ణయించవలెను.

పణ్యము మూల్యము తీసుకొని పణ్యమును గ్రాహకునకు ఇవ్వని వానిచే వృద్ధి సహితముగ ఇప్పించవలెను. గ్రాహకుడు విదేశము నుండి వచ్చినచో అతనికి ఆ దేశము నందు ఎంత లాభము వచ్చునో అంత ధనముతో ఇప్పించవలెను. గ్రాహకుడు కొన్న వస్తువును ఏకారణముచేతనైనా, తీసుకొన్నచో దానిని మరియొకనికి అమ్మవచ్చును. కాని దానిపై నష్టమువచ్చినచో అది (మొదటి) గ్రాహకుని నుండి తీసుకొనవలెను. రాజో పఘాతము చేతగాని, దైవోప ఘాతముచేతగాని పణ్యము పాడైపోయినచో ఆ నష్టమును గ్రామకుడు అడిగినను ఇవ్వని విక్రేతయే భరించవలెను. ఒకరికి అమ్మిన దానిని మరియొ కనికి అమ్మినను, చెడ్డదానిని మంచిదని చెప్పి అమ్మినను దాని మూల్యము నకు రెట్టింపు దండము విధించవలెను. పణ్యముల లాభనష్టములు తెలియని వర్తకుడు ఏదైనా వస్తువును కొన్నపుడు వెనుకాడకూడదు. అట్లు చేసినచో ఆరవ వంతు దండము విధించవలెను.

లాభముకోరి కొందరు వర్తకులు కలిసి వ్యాపారము చేయునపుడు వారు లాభాలాభములను, ద్రవ్యమును బట్టిగాని మొదట అనుకొనిన మాటను బట్టిగాని చేసుకొనవలెను. వారిలో ఒకరు మిగిలినవారి అనుమతి లేకుండగను, వారు నిషేధించినను లేదా తన ప్రమాదము వలనను వస్తువును పాడుచేసినచో ఆ నష్టమును అతడే భరించవలెను. వస్తువుల నిర్ణీత మూల్యములో ఇరువద భాగమును రాజు శుల్కముగా గ్రహించవలెను. రాజ నిషిద్ధమైన వస్తువుగాని, రాజ యోగ్యమైన వస్తువునుగాని ఎవరైనా విక్రయించుచున్నచో, దానిని రాజు స్వాధీనము చేసు కొనవచ్చును. అసత్య పరిమాణమును చూపికాని, పన్ను తీసుకొను స్థానము నుండి తొలగిపోయిగాని, మోసముతోగాని క్రయ విక్రయములు చేయువానికి ఆ వస్తు మూల్యమునకు ఎనిమిది రెట్లు దండము విధించవలెను. కలిసి వ్యాపారము చేయువారిలో ఒకడు దేశాంతరము వెళ్ళినను మరణిం చినను ఆతని ద్రవ్యమును ఆతని దాయాదులు బంధువులు జ్ఞాతులు గ్రహించవలెను. వారెవ్వరు లేనిచో రాజు గ్రహించ వలెను. సంఘములోని ఒకడు వక్రముగ ప్రవర్తించినచో ఆతనికి లాభము పంచకుండగ పంపివేయవలెను. స్వయముగ వ్యాపారము చేయలేనివాడు ఇతరులచే చేయించవలెను. ఋత్విక్కులు, కర్షకులు, కర్మచారులు, వారి విషయములో కూడ ఇదే విధానము.

చోరుని అపహరించబడిన ధనమును బట్టిగాని, ఆతని పద చిహ్నములను బట్టిగాని రాజభటులు పట్టుకొనవలెను. పూర్వము అపరాధము చేసినవానిని, అశుద్ధమైన నివాసము కలవానిని, తమజాతి నామము, మొదలగువాటిని కప్పిపుచ్చువారిని శంకచే బందీలుగా పట్టుకొనవచ్చును. ద్యూతము, స్త్రీ, పానము ఈ వ్యసనములు కలవారును ప్రశ్నించగ ఎండిపోయిన ముఖము గలవారును, కంఠస్వరము మారిపోయినవారును, ఇతరుల ద్రవ్యగృహాదులను గూర్చి ప్రశ్నించువారును, రహస్య ముగ సంచరించువారును, ఆదాయము లేకున్నను వ్యయము చేయువారును, నష్టమైన ద్రవ్యములను అమ్మువారును చోరులుగా బంధింపబడవలెను. చౌర్యశంకచే పట్టుకొనబడిన వాడు తాను నిరపరాధియని నిరూపించు కొనజాలనిచో వానిచే అపహృత ద్రవ్యమును ఇప్పించి వానిని చోర దండముచే శిక్షించ వలెను. అపహృత ధనమును ఇప్పించి అనేక విధముల వానిని కొట్టించవలెను. చౌర్యము చేసినవాడు బ్రాహ్మణుడైనచో వాని నుదుట గుర్తువేసి రాజ్యమునుండి బహిష్కరించవలెను. గ్రామములో ఎవరినైన కొట్టినను, ధనము అపహరింపబడినను, అపరాధి జాడలు తెలియ నపుడు అది గ్రామాధిపతి దోషము. ఆతడే చోరునిపట్టి రాజుకు అప్పచెప్పవలెను. చోరుడు ఏ గ్రామమునకు పారిపోయెనో అచ్చట వాని గుర్తుతెలిసి ఆతడు చౌర్యము చేసిన గ్రామము యొక్క అధిపతికి ఒప్పచెప్పవలెను. క్రోశుడు దూరమునకు బయటవున్న పంచ గ్రామాధి కారిగాని, దశగ్రామాధికారి గాని, అశ్వ గజాద్యపహారులకును ఇతరులను చంపినవారిని పట్టి శూలముపై గ్రుచ్చి చంపవలెను. ఏదైన వస్తువును ఎత్తుకొనిపోయిన వానికిని పెట్టెలు బ్రద్దలుకొట్టినవానికిని వరుసగ బొటనవ్రేలు, తర్జనీ ఖండించవలెను. ఆ అపరాధము రెండవసారి చేసినచో ఒక హస్తము, ఒక పాదము ఖండిం చవలెను. చోరునికి గాని, ఘాతకునకుగాని తెలిసికూడ భోజనము, అగ్ని, జలము, ఇతర ఉపకరణ ములు ఆలోచన, మార్గవ్యయము ఇచ్చినవానికి ఉత్తమ సాహస దండము విధించవలెను. ఇతరుల శరీరముపై ఆయుధము ప్రయోగించినను, గర్భపాతనము చేయించినను ఉత్తమ దండము. ఎవరినైన

పురుషునిగాని, స్త్రీనిగాని చంపినపుడు వానికి ఉత్తమ సాహసదండము గాని, అధమ సాహస దండముగాని వాని శీలాచారములను బట్టి ఇవ్వవలెను. పురుషుని చంపిన స్త్రీని, విషమును ఇచ్చిన స్త్రీని మెడకు రాయికట్టి నీళ్లలో పడవేయవలెను.

విషము పెట్టిన దానికిని, దహనము చేసిన స్త్రీకిని, తనకు పూజ్యుడైనవారిని, సంతానమును చంపిన స్త్రీకిని, హస్తములు ముక్కు చెవులు ఖండించి ఎద్దులచే చంపించవలెను. పొలములను, గృహములను, వనములను, గ్రామములను వివీతములను, కళ్లములను కాల్చిన వారిని, రాజుభార్యను సంగము చేసినవారిని ఊకనిప్పుతో కాల్చి చంపవలెను. కేశగ్రహణ పూర్వకముగ పరస్త్రీని సంగ్రహించినవాడు స్వజాతియైనచో ఉత్తమ దండము, అనులోమ్యము అయినచో మధ్యమ దండము పొంద అర్హుడు. ప్రాతిలోమ్యము అయినచో పురుషుని చంపవలెను. స్త్రీకి చెవులు కోయవలెను. పరస్త్రీ యొక్క వస్త్రము కట్టుముడి స్తనములు, కంచుకం, నాభి కేశములను స్పృశించిన వానిని అనుచిత దేశకాలములందు సంభాషణము చేయువానిని, ఒకే ఆసనముపై కూర్చున్న వానిని, వ్యభిచార దోషమునకై దండించవలెను. వలదన్నను సంభాషణాదులు చేసిన స్త్రీకి నూరు పణములు, అట్టి పురుషునకు రెండు వందల పణములు దండము. నిషేధించినను వారిరువురును సంభాష ణాదులు చేసినచో వ్యభిచారము చేసినచో ఎట్టి దండమో అట్టి దండము. పశు సంగమము చేసినవానికి నూరు పణముల దండము. నీచస్త్రీ సంగమము, గో సంగమము చేసినవానికి మధ్యమ సాహసదండము. కొనబడిన స్త్రీలు, దాసీ స్త్రీలు, ఉంచుకొన్న స్త్రీలు, గమ్యలగు స్త్రీలు, వీరితో సంగమము చేసిన పురుషునకు ఏబది పణముల దండము. బలాత్కరించి దాసీ సంగమము చేసినవానికి పదిపణముల దండము. అంత్యజాతి స్త్రీతోడను, సన్యాసి తోడను సంగమముచేసిన వాని లలాటమున భగచిహ్నముంచి దేశమునుండి పారద్రోల వలెను. రాజశాసనమును న్యూనముగాగాని, అధికముగాగాని వ్రాయువానికిని వ్యభిచారిని, చోరుని విడిచిపెట్టిన వానికిని ఉత్తమ సాహస దండము. బ్రాహ్మణునిచే అభక్షణములు తినుపించువానికి ఉత్తమ సాహస దండము. కల్తీ బంగారము అమ్మువానికిని చెడ్డ మాంసము అమ్మువానికిని అంగములు ఖండించి ఉత్తమ సాహస దండము విధించవలెను. సామర్థ్యమున్నను కోరలు, కొమ్ములుగల తన పశువులచే పీడింపబడుచున్నవానిని విడిపిం పని పశుస్వామికి ప్రథమ సాహసదండము. ఆక్రమించినవాడు ఏడ్చుచున్నను విడిపించనిచో రెట్టింపు దండము. చోరుడుకాని వానిని చోరుడని చెప్పినవానికి ఐదువందల పణముల దండము. రాజునకు అప్రియము పల్కువానికిని రాజనిందకులకును మరణిం చిన వాని శరీరమునందలి వస్త్రాదులను అమ్ము వానికిని గురువును కొట్టిన వానికిని రాజ మంత్రమును ప్రకటించినవానికిని నాలుకకోసి దేశమునుండి బహిష్కరించవలెను. రాజు యొక్క వాహనమున ఆసనమును కూర్చున్నవానికి మధ్యమ సాహస దండము. రెండు నేత్రములను పీకివేసిన వానికిని, రాజ శత్రువుల ఆజ్ఞను నిర్వహించువానికిని బ్రాహ్మణ వేషముతో జీవించు శూద్రునకు ఎనిమిది వందల పణముల దండము. న్యాయానుసారము పరాజితుడైనను, పరాజి తుడనుకాను అని చెప్పుచు, వచ్చినచో వానిని మరల జయించి రెట్టింపు ధనము దండము విధించవలెను. రాజు అన్యాయముగ దండము విధించి, ధనము తీసుకొన్నచో దానిని వరుణునకు

నివేదించి దానిని ముప్పది రెట్లుచేసి బ్రాహ్మణు లకు ఇవ్వవలెను. ధర్మ పూర్వకముగ, లోక వ్యవహారములు చూచు రాజునకు ధర్మము, అర్థము, కీర్తి లోకపంక్తి అర్థసంగ్రహము ప్రజా గౌరవము శాశ్వత స్వర్గ నివాసము అను ఏడు గుణములు లభించును. (258)

ఋగ్విధాన కథనము

అగ్నిదేవుడు పలికెను :

పుష్కరుడు పరశురామునకు చెప్పిన ఋగ్యజుః సామాథర్వ విధానమును చెప్పెదను. దీని ప్రకారము జప హోమములు చేసినచో భుక్తిముక్తులు లభించును. పుష్కరుడు పలికెను. ఒక్కొక్క వేదమునకు సంబంధించిన చేయవలసిన కర్మలను మీకు చెప్పెదను.

వేద పారాయణ విధానము

ముందుగ భుక్తిముక్తి ప్రదమగు ఋగ్విధానమును వినుము. జలమధ్యమునందు కాని హోమ సమయమునగాని గాయత్రీ జపము చేయువానికి సకల మనోవాంఛితములు లభించును. ప్రాణా యామ పూర్వకముగా చేసినచో విశేషముగా లభించును. రాత్రి మాత్రమే భుజించుచు అనేక పర్యాయములు స్నానము చేసి దశసహస్ర గాయత్రీ జపము చేయువాని పాపములన్నియు నశిం చును. హవిస్సును భుజించుచు లక్షగాయత్రీ జపము చేసినవానికి ముక్తి లభించును. ప్రణవము పరబ్రహ్మ స్వరూపము. దాని జపము సర్వపాప వినాశకము. బొడ్డులోతు నీటిలో నిలచి ఓంకార మును నూరు పర్యాయములు జపించి అభిమంత్రించిన జలమును త్రాగినవాడు ముక్తుడగును. ఓం కారములో వున్న 'ఆ ఉ మ్' అను మూడు మాత్రలు మూడు వేదములు, ముగ్గురు దేవతలు, మూడు అగ్నులు, భూః మొదలైన మహా వ్యాహృతులే ఏడులోకములు. వీటితో కలిసిన గాయత్రితో చేసిన హోమము సర్వ ఫలదాయకము. గాయత్రి మంత్రము మహావ్యాహృతులు. ఇవన్నియు జప యోగ్యమైన మహామంత్రములు. ఓ రామ! జలములో మునిగి అఘమర్షణ మంత్రమును జపించినచో సర్వపాపములు తొలగును. 'అగ్ని మీళే పురోహితం' (ఋ-వే-1-I-1) అను సూక్తము అగ్ని దేవతాకము. శిరస్సుపై అగ్నిని ధరించి ఒక సంవత్సరము పాటు ఈ సూక్తమును జపించుచు హోమము త్రికాల స్నానము హోమము చేయుచు భిక్షాన్నము తినవలెను. ఈ ఋక్కునకు తరవాత ఉన్న వాయ్వాది దేవతాసూక్తములను ఏడింటిని నిత్యము నియమ పూర్వకముగా జపించువాడు మనోవాంఛితములను పొందును. మేధాకాముడు "సదసస్పతి (ఋ-1-18-6) ఇత్యాది ఋక్త్రయమును ప్రతిదినము జపించవలెను.

'అంబయో యంత్యధ్వభిః' (ఋ. 1-23-18) ఇత్యాది తొమ్మిది ఋక్కులు అకాల మృత్యువును తొలగించును. బద్ధుడుగాని, అడ్డుకొనబడినవాడుగాని, 'శునశ్శేపోయ మహ్వద్గృ భీతః' (ఋ. 1-24-12) ఇత్యాది ఋక్త్రయమును జపించవలెను. వీటి జపముచే సర్వపాప విముక్తుడగును. రోగి రోగ విముక్తుడగును. శాశ్వత కామముల సిద్ధిని, బుద్ధిమంతుడగు మిత్రుని కోరువాడు

'ఇందస్య' ఇత్యాదికములగు పదునారు ఋక్కులను ప్రతి దినము జపించవలెను. 'హిరణ్య స్తూపః' (10-149-5) ఇత్యాది మంత్రమును జపించువాడు శత్రువులను బాధించును. 'ఏతే పంథాః' (1-35-11) అను మంత్రమును జపించువాడు మార్గమున క్షేమవంతుడగును. రుద్ర సంబద్ధము లగు ఆరు ఋక్కులతో ప్రతిదినము ఈశ్వరుని స్తుతించువాడును రౌద్ర చెరువును సమర్పించు వాడును పరమ శాంతిని పొందును. 'ఉద్వయన్త మసః' (1-50-10) 'ఉదుత్యంజాత వేదసం' (1-50-1) అను ఋక్కులచే ప్రతిదినం ఆదిత్యుని ఉపస్థానము చెప్పువాడును సూర్యునుద్దేశించి ఏడు జలాంజలులను ఇచ్చువాడును మానసిక దుఃఖ విముక్తుడగును. 'ద్విషంతం' ఇత్యాది ఋక్కు మొదలు 'యద్విప్రాః' అను మంత్రమువరకు జప ధ్యానములు చేయవలెను. ఇట్లు చేయుటచే అపరాధి ఏడు రాత్రులలో ఇతరుల ద్వేషమునకు పాత్రుడు అగును. ఆరోగ్యము కోరువాడు 'పురీష్యాసోఽ గ్నయః' (3-22-4) అను ఋక్కును జపించవలెను. శత్రుబాధ నివారణార్థమై ఈ ఋక్కులోని అర్ధ భాగమును జపించవలెను. దీనిని సూర్యోదయ సమయమున జపించినచో దీర్ఘాయువు మధ్యాహ్నమున జపించినచో తేజస్సు సూర్యాస్త మయ సమయమున జపించినచో శత్రువినాశము కలుగును. 'నవయః' (ఋ. 8-93-2) ఇత్యాది సూక్తములను జపించువాడు శత్రువిజేత అగును. పదకొండు సువర్ణ సూక్తము లను జపించువాడు సర్వకామములను పొందును. ఆధ్యాత్మికములగు 'క' అను మొదలగు ఋక్కులను జపించువాడు మోక్షమును పొందును.

'అనోభద్రాః' (1-89-1) అను ఋక్కును జపించుటచే దీర్ఘాయువు లభించును. హస్తములో సమిధలు గ్రహించి 'త్వంసోమ' (9-86-24) అను ఋక్కు చదువుచు శుక్లపక్ష ద్వితీయ చంద్రుని దర్శనము చేయవలెను. ఇట్లు చేయుటచే నిస్సంశయముగ వస్త్రములను పొందును. దీర్ఘాయు ర్దాయము కోరువాడు 'ఇమం' (1-94) ఇత్యాది కౌత్స సూక్తమును సర్వదా జపించవలెను. మధ్యాహ్న సమయమున 'అపనః శోశుచమం' (1-97-1) ఇత్యాది ఋక్కుతో సూర్యస్తుతి చేయువాడు గడ్డినుండి ఇషీకను వేరుచేసినట్లు (ఒక జాతిగడ్డి) తనను పాపమునుండి వేరుచేసుకొనును. యాత్రికుడు 'జాతవేదసే' (1-19-1) అను మంగళమయమగు ఋక్కును మార్గమునందు జపించవలెను. సర్వభయ విముక్తుడై క్షేమముగ ఇంటికి తిరిగివచ్చును. ప్రభాత కాలమున వీనిని జపించినచో దుఃస్వప్నములు నశించును. 'ప్రమందినే' (1-101-1) అను ఋక్కును జపించుటచే స్త్రీ సుఖముగా ప్రసవించును. 'ఇంద్రం' (1-106-1) ఇత్యాది ఋక్కు జపించుచు ఏడు పర్యాయములు వైశ్వ దేవముచేసి ఆజ్యహోమం చేసినవాడు సమస్త పాపవిముక్తు డగును. 'ఇమాం' (10-85-45) అను ఋక్కును జపించువాడు సర్వదా అన్ని కామములను పొందును. మూడు దినములు ఉప వాసముచేసి పవిత్రుడై 'మానసోక్తే' (1-114-8, 9) ఇత్యాది ఋగ్ద్వయమును పఠించుచు నేతిచే సంస్కృతములగు ఉదుంబర సమిధలను హోమము చేసినవాడు మృత్యుపాశములు అన్నింటిని ఛేదించి రోగ విహీనుడు అగును. రెండుచేతులు ఎత్తి ఈ ఋక్కులతో శివుని స్తుతించి శిఖ ముడివేసుకొనిన వాడు నిస్సంశ యముగా సకల ప్రాణులకు అజేయుడగును. హస్తమున సమిధలు గ్రహించి ప్రతిదినము మూడు సంధ్యల్కయందును 'చిత్రం దేవానాం' (1-115-1) ఇత్యాది మంత్రముచే సూర్యోపస్థానము చేయువాడు మనోవాంఛిత ధనమును పొందును. 'స్వప్నే నాభ్యష్యా'

(2–15–9) అను ఋక్కును ప్రాతఃకాల మధ్యాహ్న అపరాహ్నము లందు జపించుటచే సర్వ దుఃస్వప్నములు నశించును. మంచి భోజనము లభించును. 'ఉభేపునామి రోదసి' (1–133–1) అను మంత్రము రాక్షస వినాశకము, 'ఉభయా సోజాత వేదః' (2–2–12–13) ఆదిఋక్కులను జపించువాడు మనోవాంఛిత ఫలములను పొందును. 'తమాగమ న్మసో మరయః' (8–19–32) అను మంత్రమును జపించువాడు ఆతతాయి భయము నుండి విముక్తుడగును.

'కయాశుభాసవయసః' (1–165–1) అను ఋక్కును జపించువాడు తన జాతిలో శ్రేష్ఠత్వమును పొందును 'ఇమంను సోమం' (1–179–5) అను ఋక్కును జపించువాడు సర్వ కామములను పొందును. 'పితుంనుస్తోషం' (1–187–1) అను ఋక్కుతో నిత్యము ఉపస్థానము చేయువానికి అన్నము లభించును. 'ఆగ్నేనయ సుపథా' (1–189–1) అను సూక్తముతో ఆజ్యహోమము చేసినచో పరలోకమున ఉత్తమ మార్గము లభించును. సుశ్లోకమును సర్వదా జపించువాడు వీర మార్గమును పొందును. 'కంకతోన కంకతో' (1–191–1) అను సూక్తము విషములను పోగొట్టును. 'యోజాతః ఏవ ప్రథమో', (2–12) అను సూక్తమును జపించువానికి సమస్త కామములు లభించును. 'గణానాంత్వా' (2–23–1) అను సూక్తమును జపించుటచే శ్రేష్ఠమైన స్నిగ్ధ పదార్థములు లభించును. 'యోమే రాజన్' (2–28–10) అను ఋక్కు దుఃస్వప్నములను శమింపచేయును. మార్గములో ప్రయాణమై వెళ్లుచున్నవాడు ప్రశస్తుడుగాని అప్రశస్తుడుగాని అగు శత్రువు కనబడినపుడు 'కువిదంగ' ఇత్యాది మంత్రములు జపించినచో ఆత్మరక్షణ కలుగును. ఇరువది రెండు ఆధ్యాత్మిక సూక్తములను పర్వములందు నియమ పూర్వకముగ జపించు వానికి సమస్త మనోరథములు సిద్ధించును. 'కృణుష్వపాజః' (4–4–1) అను సూక్తము జపించుచు ఏకాగ్ర చిత్తముతో ఆజ్యహోమము చేసినవాడు శత్రువులను సంహరించును. రాక్షసులను కూడ నశింపచేయును 'పరి' ఇత్యాది సూక్తముతో ప్రతిదినము అగ్న్యుపస్థానము చేయువానిని విశ్వతోముఖుడగు అగ్ని స్వయముగ అన్నివైపుల నుండియు రక్షించును. 'హంసశ్శు చిషత్' (4–40–5) ఇత్యాది మంత్రము చదువుచు సూర్యుని చూచినచో పవిత్రుడగును.

కృషిచేయనున్నవాడు క్షేత్రమధ్యమగమును యథావిధిగా స్థాలీపాక హోమము చేయవలెను. ఇంద్ర, మరుత్, పర్జన్య, భగులకు, స్వాహాంతముగ హోమము చేయవలెను. కృషీవలుడు నాగలిని లింగమును విహరింపచేసినట్లు విహరింపచేయవలెను. ఆ సమయమున 'శునాసీరావిమాం' (4–57–5) అను మంత్రమును కూడ జపించవలెను. పిమ్మట గంధమాల్య నమస్కారాదులతో అచట ఉన్న అధిష్ఠాన దేవతలను పూజించవలెను. ఇట్లు చేయుటచే విత్తనములు చల్లుట, పంటకోయుట, కళ్లములోనికి తీసుకువచ్చుట మొదలగు కర్మలన్నియు అమోఘముగ జరిగిపోవును. కృషి సర్వదా వృద్ధిపొందును. 'సముద్రా దూర్మిర్మధుమాన్' (4–58–1) అను సూక్తమును జపించుటచే అగ్ని నుండి సమస్త కామములను పొందును. 'విశ్వానినోదుర్గః' (5–4–9–10) ఇత్యాది ఋగర్ధ్వ యమును జపించుచు అగ్నిని పూజించువాడు సమస్త ఆపదలును తొలగి అక్షయ మగు కీర్తి పొందును. అత్యధికమగు లక్ష్మియు విజయముకూడ ఆతనికి లభించును. 'అగ్నేత్వం (5–24–1) అను ఋక్కుచే అగ్నిని స్తుతించువానికి మనోవాంఛిత ధనము లభించును. సంతానము కోరువాడు

మూడు వరుణ దేవతా ఋక్కులను నిత్యము జపించవలెను. 'స్వస్తిన ఇంద్రః' (1-89-6-8) మొదలగు మూడు ఋక్కులను సర్వదా ప్రాతః కాలమున జపించినచో అది గొప్ప స్వస్త్యయనము. 'స్వస్తిపంథామనుచరేమ' (5-51-15) అను ఋక్కును చదువుటచే మార్గమున యాత్ర సుఖముగా జరుగును. 'విజిహీష్వవనస్పతే' (5-78-5) అను మంత్రము జపించుటచే శత్రువులు రోగ గ్రస్తులగుదురు. గర్భవేదనతో బాధపడు స్త్రీకి గర్భమోక్షణము కలుగును. వర్షము కోరువాడు ఉపవాసముండి తడిబట్టలు ధరించి 'అచ్ఛావద' (5-83) ఇత్యాది సూక్తమును ప్రయోగించినచో వెంటనే వర్షము వచ్చును. పశుధనము కోరువాడు 'మనసఃకామం' శ్రీసూక్తం (10) ఇత్యాది మంత్రమును జపించ వలెను. సంతానము కోరువాడు పవిత్ర వ్రతమును అవలంబించి 'కర్దమేన' (శ్రీ సూక్తం 11) అను మంత్రముతో స్నానము చేయవలయును. రాజ్యము కోరువాడు "అశ్వపూర్వం" (శ్రీసూక్తం 3) అను మంత్రమును జపించుచు స్నానము చేయవలయును. బ్రాహ్మణుడు యథావిధిగా రోహిత చర్మముపైనను క్షత్రియుడు వ్యాఘ్రచర్మముపైనను వైశ్యుడు ఛాగ (మేక) చర్మముపైనను స్నానము చేయవలయును. ఒక్కొక్క మంత్రమునకు పదివేల చొప్పున హోమములు చేయవలెను. అక్షయ గోధనము కోరువాడు గోశాలలో 'ఆగావః' (6-28-21) అను ఋక్కును జపించుచు లోకమాతయైన గోవునకు నమస్కరించి గోచర భూమివరకు దాని వెనుక వెళ్లవలెను. రాజు 'ఉప' ఇత్యాది ఋక్త్రయముతో తన దుందుభులను అభిమంత్రించినచో తేజోబలసంపన్నుడై శత్రువును వశముచేసుకొనును. దస్యువులు చుట్టుముట్టినప్పుడు చేతిలో తృణము గ్రహించి రక్షోఘ్న సూక్తమును (10-87) జపించవలెను. 'యేకేచజ్మా' (6-52-15) అను ఋక్కును జపించుటచే దీర్ఘాయువు లభించును. రాజు జీమూతసూక్తముతో సేనాంగములన్నింటిని వాటివాటి చిహ్నములను అనుసరించి అభిమంత్రించినచో యుద్ధమునందు శత్రువులను నశింపచేయ కలుగును. 'ప్రాగ్నయే' (7-5) ఇత్యాది సూక్తత్రయమును జపించుటచే అక్షయ ధనము లభించును. 'అమీవహా' (7-55)అను సూక్తము పఠించి రాత్రి భూతముల స్థాపన చేయవలెను. సంకటము లందును విషమమునందును దుర్గమ స్థలములందును బంధనమునందును బంధయుక్తావస్థ యందును పారిపోవునపుడును, పట్టుబడినపుడు సహాయము కోరువాడు ఈ సూక్తమును జపించవలెను. మూడు దినములు నియమపూర్వకముగ ఉపవాసముచేసి పాయసము వండించి 'త్ర్యంబకం యజామహే' (7-59-12)అను మంత్రముతో మహా దేవుని ఉద్దేశించి అగ్నిలో నూరు హోమములుచేసి దానితోనే పూర్ణాహుతి ఇచ్చినచో నూరు సంవత్సరములు సుఖముగ జీవించును. దీర్ఘాయువు కోరువాడు స్నానముచేసి 'తచ్చక్షుర్దేవహితం' (7-66-16) అను సూక్తముతో సూర్యుని ఉదయించునపుడును ఆకాశ మధ్యమునందు ఉన్నపుడును ఉపస్థానము చేయవలెను. నహిఇత్యాది ఋక్చతుష్టయమును పఠించువాడు భయ విముక్తుడగును. 'ఇంద్రాసోమాతపతం' (7-104) మొదలగు సూక్తము శత్రు వినాశకరము. అజ్ఞానముచే వ్రతభంగమైనను వ్రాత్యుల సంసర్గముచే పతితుడైనను ఉపవాసము చేసి 'త్వమగ్నే వ్రతపా'(8-11-1) అను ఋక్కుతో ఆజ్యహోమము చేయవలెను. 'ఆదిత్య' 'సమ్రాజా' అను రెండు ఋక్కులను జపించువాడు వాదమునందు విజయము పొందును. మహీ ఇత్యాది ఋక్చతుష్టయమును జపించుటచే మహాభయ విముక్తుడగును. 'యది' ఇత్యాది ఋక్కును జపించుటచే

సర్వకామసిద్ధి కలుగును. ఇంద్రునికి సంబంధించిన నలుబది రెండు ఋక్కులను జపించుటచే శత్రువులు నశింతురు. 'వాచం మహి' అను ఋక్కును జపించుటచే ఆరోగ్యము లభించును. పవిత్రుడిగా వుండి 'శంనోభవ' (8-48-4-5) అను రెండు ఋక్కులను జపించుచు భోజనముచేసి హృదయమును హస్తముతో స్పృశించువాడు ఎన్నడును వ్యాధిగ్రస్తుడుకాడు. స్నానముచేసి 'ఉతమేదం' అను మంత్రముతో హోమము చేయువాడు శత్రువులను సంహరించును. 'శంనో అగ్ని' (7-35) అను సూక్తముతో హోమముచేసినవాడు ధనవంతుడగును. 'కన్యా వాఖాయతి' (8-91) అను సూక్తము జపించుటచే దిగ్భ్రమ దోషము తొలగిపోవును.

సూర్యోదయ సమయమున 'యదద్యకచ్చ' (8-93-4) అను ఋక్కును జపించుటచే సకల జగత్తు వశమగును. 'యద్వాక్' (8-100-10) ఇత్యాది ఋక్కును జపించుటచే వాక్కు సంస్కృత మగును. 'వాచోవిదాం' (8-01-16) అను మంత్రమును జపించువాడు వాక్శక్తిని పొందును. పావమానీ ఋక్కులును వైఖానస ఋక్కులు ముప్పదియు అతి పవిత్రమైనవి. ఓ ఋషి శ్రేష్ఠా! 'పరస్య' మొదలగు అరువది రెండు ఋక్కులు కూడ అతి పవిత్రమైనవి 'స్వాదిష్ట్యా' మొదలగు అరువదిఏడు సూక్తములు సర్వ కల్మషములను నశింపచేయును, పవిత్రింపచేయును మంగలము కల్గించును. 'పావవానీ' ఋక్కులు ఆరువందల పది వున్నవి. వీటిని జపించువాడును, హోమము చేయువాడును మృత్యు భయమును జయించును. పాపభయ వినాశము కోరువాడు 'అపోహిష్ఠాః' (10-9-1-3) ఇత్యాది ఋక్కులను నీటిలో నిలబడి జపించవలెను. ఎడారిలో ప్రాణాంతక భయము ఏర్పడినపుడు నియమపూర్వకముగ 'ప్రదేవత్రా బ్రహ్మణే' (10-30-1) అను మంత్రమును జపించువాడు భయవిముక్తుడై దీర్ఘాయువును పొందును. 'ప్రావేపా' (10-34-1) అను ఋక్కును సూర్యోదయ సమయమున మనసా జపించవలెను. దీనివలన ద్యూతమున విజయము లభించును. 'మా ప్రగామ' (10-57-1)అను ఋక్కును జపించుటచే దారి తప్పినవాడు సరియైన దారిని పొందును. తన ప్రియమిత్రుని ఆయుర్దాయము క్షీణమైనచో 'యత్తేయమం' (10-58-1) అను మంత్రమును జపించుచు వాని శిరస్సును స్పృశించ వలెను. ఐదుదినములు 1000 పర్యాయములు ఈవిధముగ చేయుటచే అతనికి దీర్ఘాయువు లభించును. 'ఇదమిత్థా రౌద్రం' (10-61-1) అను ఋక్కుతో వెయ్యి ఆజ్య హోమములు చేయవలెను. పశుకాముడు గోశాలయందును, ధనకాముడు చతుష్పథమునందును చేయవలెను. 'వయఃసుపర్ణా' (10-73-11) అను ఋక్కు జపించువానికి లక్ష్మి లభిం చును. 'హవిష్యన్తం' (10-88-1) అను మంత్రమును జపించువాడు పాప విముక్తుడగును. ఆతని రోగములు నశించును. జఠరాగ్ని వృద్ధి పొందును. స్వస్త్యయన కరమగు 'యా ఓషధయః' అను మంత్రము సర్వవ్యాధి వినాశకము. వృష్టి కాముడు 'బృహస్పతే అతి' (2-23-15) అను మంత్రము. ప్రయోగించవలెను. 'సర్వత్ర' ఇత్యాది మంత్రముచే గొప్ప శాంతి లభించును. సంతానకామునకు సాంకాశ్య సూక్తజపము మంచిది. 'అహం రుద్రేభిః వసుభిః' (10-125-1) అను ఋక్కు జపించువాడు ప్రవచనమునందు సమర్థుడగును. 'రాత్రీవ్యఖ్యదాయతి' (10-127-1) అను మంత్రమును జపించువానికి పునర్జన్మ వుండదు. రాత్రియందు 'రాత్రిసూక్తము' ను జపించువాడు రాత్రిని సుఖముగా గడుపును. 'కల్పయంతీ' ఇత్యాది మంత్రమును జపించువాడు

శత్రు వినాశకుడగును. 'దాక్షాయణ' సూక్తము గొప్ప ఆయుర్దాయమును, తేజస్సును ఇచ్చును. 'ఉతదేవాః' (10-137-1) అను మంత్రము రోగనాశకము. దీనిని వ్రతధారణ పూర్వకముగ జపించవలెను. అగ్ని భయము కలిగినపుడు 'అయమగ్నే జరితా' (10-142-1) ఇత్యాది మంత్ర మును జపించవలెను. అరణ్యములలో 'అరణ్యాన్యరణ్యాని' (10-146-1) అను మంత్రము జపించు టచే భయము తొలగును. 'బ్రాహ్మిణి' తీసుకొని బ్రహ్మ సంబంధమైన రెండు సూక్తములను జపించ వలెను. బ్రాహ్మీలతను, శతావరీలతను, వేరు వేరుగ ఉదకముతోగాని, ఘృతముతో గాని తీసుకున్నచో మేధాలక్ష్ములు లభించును. 'శాశఇత్థా' (10-152-1) అను ఋక్కు శత్రు వినాశకము. యుద్ధమున విజయము కోరువాడు దీనిని జపించవలెను. 'బ్రహ్మణాగ్నిః' (10-162-1)అను ఋక్కు గర్భ మృత్యు నివారకము.

పవిత్రుడై 'అపేహి' (10-164) అను సూక్తమును జపించినచో దుస్వప్నములు నశించును. 'యేనేదం' ఇత్యాది ఋక్కును జపించుటచే సమాధిస్థుడగును. 'మయో ర్భూర్వాతః' (10-169-1) అను గోవునకు మంగళకరమగు ఋక్కుచే ఇంద్రజాల మాయను కాని, శాంబరీ మాయనుకాని జయించవచ్చును. 'మహిత్రీణాం' (10-185-1) అను కళ్యాణకరమగు ఋక్కును మార్గము నందు జపించవలెను. 'ప్రాగ్నయే' (10-187-1) అను మంత్రమును జపించుటచే ద్వేష పాత్రుడగు శత్రువు నశించును. 'వాస్తో ష్పతే' మొదలైన నాలుగు మంత్రములతో గృహ దేవతలను పూజించ వలెను. ఇంతవరకు జపవిధానము చెప్పబడినది. ఇపుడు హోమవిధానమును తెలుసుకొనవలెను. హోమాంతమున దక్షిణ ఇవ్వవలెను. హోమముచే పాప శాంతి, అన్నముచే హోమ శాంతి, సువర్ణదాన ముచే అన్న శాంతి కలుగును. బ్రాహ్మణ ఆశీస్సులు ఎన్నడును వ్యర్థముకావు. యజమానుడు అన్ని వైపుల బయటస్నానము చేయవలయును. తెల్ల ఆవాలు, యవలు, ధాన్యము, పాలు, నెయ్యి, పెరుగు, పాలచెట్ల సమిధలు, వీటితో హోమము చేయుట సర్వకామప్రదము. . హోమ సమయమున శిలోంఛ వృత్తులచే లభించిన అన్నమును, సక్తువులు పాలు, పెరుగు, ఫల మూలములు భుజించ వలెను. ఇంతవరకు ఋగ్విధానము చెప్పబడినది. (259)

యజుర్విధాన కథనము

పుష్కరుడు పలికెను :

పరశురామ! ఇపుడు భుక్తిముక్తిప్రదమగు యజుర్విధానమును చెప్పెదను వినుము. ఓంకార యుక్తములగు మహావ్యాహృతులు సకల పాప నాశకములు, సర్వకామ ప్రదములు. బుద్ధిమంతుడు వీటితో నూరు హోమములుచేసి దేవతలను ఆరాధించవలెను. దీనివలన మనో వాంఛితములగు కోరికలు తీరును. శాంతికాముడు యవలతోను, పాప వినాశనమును కోరువాడు తిలలతోను హోమము చేయవలెను. ధాన్యములతోను తెల్ల ఆవాలతోను హోమము చేసినచో సర్వ కామములు సిద్ధించును. పశుకాముడు ఉదుంబర సమిధలతో హోమము చేయవలెను. అన్నకాముడు పెరుగు తోను, శాంతి కాముడు పాలతోను, అధిక సువర్ణకాముడు అపామార్గ సమిధలతోను హోమము చేయవలెను. కన్యకను కోరువాడు రెండేసిచొప్పున కట్టిన, నేతితో తడిపిన జాతి పుష్పములను

హోమము చేయవలెను. కామము కోరువాడు తిలలను తండులములను హోమము చేయవలెను. వశీకరణ కర్మయందు శాకోట-వస-అపామార్గ-సమిధలను హోమము చేయవలెను. ఓ భార్గవా! రోగ నాశ నిమిత్తము విషరక్తములతో తడిపిన సమిధలు హోమము చేయవలెను. శత్రువధ కోరువాడు క్రోధ పూర్వకముగ పై సమిధలను హోమము చేయవలెను. ద్విజుడు అన్ని ధాన్యములతో ఒక రాజప్రతిమను నిర్మించి దానిని వేయిసార్లు హోమముచేసినచో రాజు వశమగును. వస్త్రకాముడు పుష్పములను హోమమును చేయవలెను. 'దూర్వా' హోమము వ్యాధి వినాశకము. బ్రహ్మతేజము కోరువాడు ఉత్తమ వస్త్రమును అర్పించవలెను. విద్వేషణ కర్మయందు ప్రత్యంగిరోక్త విధానాను సారముగ స్థాపించిన అగ్నియందు పొల్లుముల్లు, భస్మము, కాకిఈకలు, గుడ్లగూబ ఈకలు హోమము చేయవలెను. చంద్ర గ్రహణ సమయ మున కపిలధేను ఘృతమును హోమముచేసి ఆ ఘృతమునందు వసా చూర్ణమును కలిపి 'సంపాతము' అనే ఆ హుతినిచ్చి, మిగిలిన వసను తీసుకొని వెయ్యిసార్లు గాయత్రిచే అభిమంత్రించి, ఆ వసను తిన్నచో మేధావియగును. పదకొండు అంగుళముల లోహ శంకువు కాని ఖదిర వృక్షపు శంకువు కాని 'ద్విషతోవధోఽసి' (1.28) అను మంత్రమును జపిం చుచు శత్రువు ఇంటిలో పాతవలెను. ఈ విధముగా శత్రు వినాశకమగు కర్మను నీకు చెప్పితిని. 'చక్షుష్యా' (2.16) ఇత్యాది మంత్రమును జపించుటచే పోయిన చూపు వచ్చును. 'ఉపయుంజతే' ఇత్యాది అనువాకము అన్నమును ఇచ్చును. 'తనూన పాగ్నేఽసి' (3-17) ఇత్యాది మంత్రముతో దూర్వాహోమము చేసినచో సంకటములు దూరమగును. 'భేషజమసి' (3-59) ఇత్యాది మంత్రముతో పెరుగు, నెయ్యి హోమము చేసినచో పశువునకు వచ్చు మహామారి రోగములు తొలగిపోవును. 'త్రియంబకం యజామహే' (3-60) అను మంత్రము చేత చేసిన హోమము సౌభాగ్య వృద్ధికరము. కన్య యొక్కపేరు చెప్పికాని కన్యనుద్దేశించిగాని ఈ మంత్రముతో జపహోమములు చేసినచో ఇది కన్యా లాభమునకు ఉత్తమసాధనము. భయములు వచ్చినపుడు నిత్యము ఈ మంత్రమును జపించు వాడు భయ విముక్తుడగును, ఈ మంత్రముతో ఘృతమిశ్రతత్తూర పుష్పములను హోమము చేసిన వాడు సర్వకామములను పొందును. ఈ మంత్రముతో 'గుగ్గులు' హోమము చేసినవాడు స్వప్నము నందు శంకరుని చూచును. 'యుంజతేమనః' (5-14) అను అను వాకమును జపించినవాడు దీర్ఘాయుర్దాయమును పొందును. 'విష్ణోరరాటమసి' అను మంత్రము సకల బాధలను నివారించును. రాక్షసులను నశింప చేయును. ఇది కీర్తివర్ధకము విజయప్రదము. 'ఆయంనోఅగ్నిః' (5-37) ఇత్యాది మంత్రము యుద్ధమునందు జయ ప్రదము. 'ఇదమాపః ప్రవహత' (6-17) అను మంత్రము జపించుచు స్నానము చేసినచో పాపనాశకము. పది అంగుళముల పొడవైన ఇనుప ఊచను 'విశ్వకర్మన్ హవిషా' (7-22) అను మంత్రముచే అభిమంత్రించి యే కన్యక యొక్క ద్వారమువద్ద పాతెదరో ఆ కన్యను మరెవరికి ఇవ్వజాలరు. 'దేవసవితః' (11-7) అను మంత్రముతో హోమము చేసినవాడు అన్నవంతుడగును.

బల కాముడగు ద్విజుడు 'అగ్నౌ స్వాహా' అను మంత్రముతో తిలలు, యవలు, అపామార్గ సమిధలు తండులములు హోమము చేయవలెను. ఈ మంత్రముతో వెయ్యి పర్యాయములు అభి మంత్రించిన గోరోచనమును తిలకముగా ధరించినచో లోకప్రియు డగును. రుద్ర మంత్రముల

జపము సర్వ పాప వినాశకము. వానితో చేసిన హోమము సర్వ కర్మ సాధకము. అంతటను శాంతి ప్రదాయకము. మేకలు, గొఱ్ఱెలు, గుఱ్ఱములు, ఏనుగులు, గోవులు, మనుష్యులు, రాజులు, బాలురు, స్త్రీలు, గ్రామములు, నగరములు, దేశములు, వివిధోపద్రవ పీడితములై రోగగ్రస్తులైనను మహామారీ భయము కాని శత్రుభయము కాని వచ్చినను ఘృత మిశ్రితమగు పాయసముతో రుద్రదేవతను ఉద్దేశించి హోమము చేసినచో గొప్పశాంతి లభించును. ఓ నరశ్రేష్ఠా! రాత్రియందు మాత్రమే సక్తు వులు యవల గంజి భిక్షాన్నము భుజించుచు ఒక మాసముపాటు బయట స్నానము చేయు వాడు బ్రహహత్యా పాప విముక్తుడగును. 'మధువాతా' (13-17) ఇత్యాది మంత్రముతో హోమాదులు చేసినచో సర్వము లభించును. 'దధిక్రావ్ణో' (23-32) అను మంత్రముచే హోమముచేయు గృహస్థుడు నిస్సంశయముగా పుత్రులను పొందును. 'ఘృత వతీ భువనా నామభి' (34-45) అను మంత్రముతో ఘృతహోమము చేసినచో ఆయుర్వృద్ధి కలుగును. 'స్వస్తినః ఇంద్రః' (25-19) అను మంత్రము సమస్త బాధలను నశింపచేయును. 'ఇహగావః ప్రజాయధ్వం'అను పుష్టివర్ధక మంత్రముతో వెయ్యి ఘృతహోమములు చేసినచో దారిద్ర్యము నశించును. 'దేవస్యత్వా' అను మంత్రముతో సృవముతో అపామార్గ సమిధలను, తండులములను హోమము చేసినవాడు శీఘ్రముగా అభిచార విముక్తుడగును. సంశయము లేదు. 'రుద్రయత్తే' (10-20) అను మంత్రముతో పలాశసమిధలను హోమము చేసినచో సువర్ణము లభించును. అగ్ని ప్రమాదము కల్గినపుడు 'శివోభవ' (11-45) అను మంత్రముతో వ్రీహిహోమము చేయవలయును. 'యాః సేనాః' అను మంత్రము చోరభయము తొలగించును. 'యో అస్మభ్య మరాతీ యాత్' (11-80) అను మంత్రముతో వెయ్యి తిలహోమములు చేయువాడు భయంకరమగు అభిచారము నుండి విముక్తుడగును. "అన్నవతే' ' (11-83) అను మంత్రముతో అన్న హోమమును చేసిన వానికి అన్నము లభించును. నీటిలో నిలచి 'హంసః శుచిషత్' (11-24) అను మంత్రమును జపించినచో సర్వపాపములు నశించును. నీటిలో నిలచి 'చత్వారి శృంగా' (17-91) అను మంత్రమును జపించినచో సర్వపాపములు నశించును. 'దేవా యజ్ఞ మతన్వత' (19-12) అను మంత్రమును జపించువాడు బ్రహ్మలోకమున పూజితుడగును. 'వసంతోఽ స్యాసీత్' (31-14) అను మంత్రముతో ఆజ్యహోమము చేయువానికి సూర్యుడు వరముల నిచ్చును. 'సువర్ణోఽసి' (17-22) అను మంత్రముతో వ్యాహృతి మంత్రములతో చేసినట్లే కర్మ చేయవలెను. 'నమఃస్వాహా' ఇత్యాది మంత్రమును మూడు పర్యాయములు జపించినవాడు బంధ విముక్తుడగును నీటిలో నిలచి 'దృపదాదివ' (20-20) అనుమంత్రమును మూడు పర్యాయములు చెప్పువాడు సర్వపాప విముక్తుడు అగును.

'ఇహగావః ప్రజాయధ్వం' అను మంత్రముతో నెయ్యి, పెరుగు, పాలు లేదా పాయ సము హోమము చేసినచో బుద్ధి వృద్ధిచెందును. 'శంన్నో దేవీః' అను మంత్రముతో పలాశఫలములను హోమము చేసినవానికి ఆరోగ్యము, లక్ష్మి చిరజీవనము లభించును. 'ఓషధీః ప్రతిమోదధ్వం' (12-17) అను మంత్రముతో విత్తనములు చల్లునపుడు, పంట కోయునపుడు హోమము చేసినచో అర్థప్రాప్తి కలుగును. 'అశ్వావతీః' (34-40) అను మంత్రముతో పాయస హోమము చేసిన శాంతి లభించును. 'తస్మా అరం' (36-16) ఇత్యాది మంత్రముతో హోమము చేసినచో బందీయైనవాడు

విడువబడును. 'యువాసు వాసా (తై॥బా॥ 3-6-13) అను మంత్రముతో హోమము చేసిన వస్త్రము లభించును. 'ముంచన్తు మాశపథ్యాత్' (12-90) ఇత్యాది మంత్రముతో హోమము చేసినచో శాపాదులు నశించును. 'మామాహింసీజనితాః' (12-102) అను మంత్రముతో ఘృతమిశ్ర తిలలు హోమము చేయగ శత్రువులు నశింతురు. 'నమోఽ స్తు సర్వేభ్యః' (13-6) అను మంత్రముతో ఘృత హోమము 'కృణుధ్వం రాజ' అను మంత్రముతో పాయసమును హోమము చేసినచో అభిచారము నశించును. 'కాండాత్కాండాత్' (13-20)అను మంత్ర ముతో దూర్వాకాండములను వెయ్యిపర్యాయములు హోమముచేసినచో గ్రామములో గాని జనపదములోగాని వ్యాపించిన మహామారి శాంతించును. రోగ పీడితుడు రోగ విముక్తు డగును. దుఃఖితుడు దుఃఖ విముక్తుడగును. 'మధుమాన్నోవనస్పతిః' (13-29) అను మంత్రముతో వెయ్యి ఉదుంబర సమిధలు హోమము చేయుటచే ధనము గొప్ప సౌభాగ్యము, వ్యవహారములో విజయము లభించును. 'అపాంగర్భంసీద' (వా॥ 13-30) అను మంత్రముతో హోమము చేయువాడు తప్పక పర్జన్య దేవునిచే వర్షము కురింపచేయును. 'అపఃపిబన్' (14-8) ఇత్యాది మంత్రముతో దధిఘృత మధువులను హోమము చేసినచో వెంటనే గొప్ప వర్షము కురియును. 'నమస్తేరుద్ర' (16-1) అను మంత్రము సర్వోపద్రవ నాశకము, సర్వశాంతికరము, మహాపాతకములను నశింప చేయును. 'అధ్యవోచ దధివక్తా' (16-5) అను మంత్రముతో హోమము చేసినచో వ్యాధిగ్రస్తుడు రక్షింపబడును, రాక్షసులు నశింతురు, యశస్సులు లభించును. చిరాయువు పుష్టివృద్ధి కలుగును. ఈ మంత్రము చదువుతూ మార్గమునందు తెల్ల ఆవాలను చల్లు బాటసారి సుఖవంతుడగును 'అసౌయ స్తామ్రః' (16-6) అను మంత్రమును చదువుచూ, నిత్యము సాయం ప్రాతఃకాలములందు, ఆలస్యరహితుడు సూర్యోపస్థానము చేయుదు, అక్షయమైన అన్నమును, దీర్ఘాయువును పొందును. 'ప్రముంచధన్వన్' (16-9-14) ఇత్యాది మంత్ర షట్కముతో ఆయుధములను అభిమంత్రించినచో యుద్ధమునందు శత్రువులకు భయము కలుగును. ఈ విషయమున మరియొక విధముగా ఆలోచింప పనిలేదు. 'మానోమహాంతం' (16-15) అను మంత్రము బాలలకు శాంతికారకము. 'నమో హిరణ్య వాహవే' అను అను వాకములతో తైలము కలిపిన రాజికలను హోమము చేసినచో శత్రువులు నశింతురు. 'నమోవః కిరికేభ్యః' (16-46)అను మంత్రముతో ఒక లక్ష కమలములను హోమము చేసినవాడు రాజ్యలక్ష్మిని, ఒక లక్ష బిల్వ ఫలముల హోమము చేసినవాడు, సువర్ణ రాశిని పొందును. 'ఇమారుద్రాయ' (16-48) అను మంత్రముతో తిలహోమము చేసినచో ధనము లభించును. ఈ మంత్రము తోనే దూర్వా హోమము చేసినచో సర్వవ్యాధులు నశించును. 'అశుఃశిశానః' (17-33) అను మంత్రముతో ఆయుధములకు రక్ష, యుద్ధములందు సర్వ శత్రువినాశము కలుగును. 'వాజశ్చమే' (18-15-19) ఇత్యాది మంత్ర పంచకముతో ఆజ్యాహుతులు వెయ్యి చేసినచో నేత్ర రోగముల నుండి విముక్తుడగును.

'శంనో వనస్పతే' (19-38) అను మంత్రముతో గృహము నందు హోమము చేసినచో వాస్తు దోషములు నశించును. 'అగ్న ఆయానాంసి' (19-38) అను మంత్రముతో ఆజ్య హోమము చేయువానికి ఎవ్వనితోను వైరముండదు. 'అంపాంఫేనేన' (19-71) అను మంత్రముతో

లాజహోమము చేసినవాడు విజయము పొందును. 'భద్రాహుత' (14-39) అను మంత్రమును జపించిన ఇంద్రియహీనుడు, లేదా దుర్బలేంద్రియుడుగా ఉన్న వాడు ఇంద్రియశక్తి సంపన్నుడగును. 'అశిశ్చపృథివీచ' (26-1) అను మంత్రము గొప్ప వశీకరణ మంత్రము. 'అధ్వనా' (5-33) అను మంత్రమును జపించువాడు వ్యవహారమున జయమును పొందును. కార్యప్రారంభమున 'బ్రహ్మ క్షత్రం పవతే' (19-5) అను మంత్రము జపించినచో కార్యసిద్ధి కలుగును. "సంవత్సరోఽసి" అను మంత్రముతో లక్ష ఆజ్య హోమములు చేసినవాడు రోగ విముక్తుడగును. "కేతుంకృణ్వన్" (20-37) అను మంత్రము యుద్ధమునందు జయవర్ధకము. "ఇంద్రోఽగ్ని ధర్మః" అను మంత్రమును యుద్ధమునందు ధర్మ సమ్మతమైన విజయమునిచ్చును. ధనుస్సును ధరించునపుడు 'ధన్వ నాగా' (29-39) అను మంత్రమును జపించుట ఉత్తమము. 'యజీత అను మంత్రముచే ధనుస్సు నభిమంత్రించవలెను. 'అహిరివ' (29-51) అను మంత్రముచే బాణములను అభిమంత్రిం చవలెను. 'వహ్నీనాం పితః (29-42) అను మంత్రముతో తూనీరమును అభిమంత్రిం చవలెను. 'యుంజన్త్యస్యా' (23-6) అను మంత్రమును చదువుచు గుర్రములను రథము లకు కట్టవలెను. యాత్రారంభ సమయమున 'ఆశువు శిశానః' (17-35) అను మంత్ర మును చదువవలెను. రథారోహణ సమయమున 'విష్ణోః క్రమోసి' (12-5) అను మంత్ర మును గుర్రములను తొలిసారిగా తోలునపుడు 'ఆజంఘన్తి' (29-50) అను మంత్రమును, శత్రుసేన ఎదుట 'యాస్సేనా అభిత్వరీః' (11-77) అను మంత్రమును, దుందుభి వాయిం చునపుడు 'దుందుభ్యః' అను మంత్రమును పఠించవలెను. ముందుగా ఈమంత్రములతో హోమముచేసి, తరువాత ఈ విధముగ చేసినచో విజయము లభించును. 'యమేనదత్తమ్' (29-13) అను మంత్రముతో కోటి హోమములు చేసినచో యుద్ధము నందు వెంటనే విజయమునిచ్చు రథము ఆవిర్భవించును, 'అకృష్ణేన' అను మంత్రము వ్యాహృతులతో చేసిన కర్మల వంటి కర్మలను చేయవలయును. 'యజ్ఞాగ్రతః' (34-1) ఇత్యాది శివసంకల మంత్రములను జపించుటచే మనస్సుకు ఏకాగ్రత లభించును. 'పంచ నద్యః' (34-11) అను మంత్రముతో ఐదు లక్షల హోమము చేసినవాడు లక్ష్మిని పొందును. 'యదా బధ్నన్ దాక్షాయణాః' (34-52) అను మంత్రముతో వెయ్యి పర్యాయములు అభిమం త్రించిన సువర్ణమును ధరించినచో అది శత్రు నివారణము. 'ఇమంజీవేభ్యః' (35-15) అను మంత్రమును చదువుచు రాళ్లుకాని మట్టిపెడ్డలుకాని అభిమంత్రించి ఇంటి నలువైపుల విసిరినచో రాత్రిచోర భయము వుండదు. 'వశమేగామ వేషత్' (35-18) ఇది ఉత్తమమైన వశీకరణ మంత్రము. చంపుటకు వచ్చినవాడు కూడ లొంగిపోవును. ఓ ధర్మజ్ఞుడా! ఈ మంత్రముతో అభిమంత్రించిన భక్ష్యములు తాంబూలములు పుష్పములు మొదలగునవి ఎవనికైన ఇచ్చినచో అతడు శీఘ్రముగా వశమైపోవును. 'శం నోమిత్రః' (36-9) అను మంత్రము అంతటను ఎల్ల వేళలను శాంతిప్రదము 'గణానా త్వాగణపతిం' (23-19) అను మంత్రముతో చతుష్పథమునందు సర్వధాన్యములను హోమము చేసినవాడు జగత్తు నంతను వశము చేసుకొనును. సందేహము లేదు. అభిషేక సమయమున 'హిరణ్య వర్ణాః శుచయః' అను మంత్రమును పఠించవలెను. 'శంనోదేవీరభీష్టయే' అను మంత్రము పరమ శాంతి కారకము. ఏకచక్ర ఇత్యాది మంత్రముతో ఆజ్యభాగ పూర్వకముగ గృహమునకు

ఆజ్యహోమము చేసినచో గ్రహముల అనుగ్రహము శాంతి లభించును. సందేహము లేదు. 'గావ ఉపావతావం' (33-29) 'భగపణేతః' (34-36-37) అను మంత్రత్రయ ముచే ఆజ్యహోమము చేసినవానికి గోవులు లభించును. 'ప్రవాదాంశః సోతత్' అను మంత్రమును గృహ యజ్ఞమున ఉపయోగించవలెను. 'దేవేభ్యో వనస్పతే' ఇత్యాది మంత్రములను వృక్ష యజ్ఞములందు వినియోగిం చవలెను. గాయత్రి విష్ణురూపమైనదని తెలుసు కొనవలెను. సమస్త పాపములను శమింపచేయునది, సమస్త కామములను తీర్చునదియగు విష్ణు పరమపదము కూడ గాయత్రియే. (260)

సామవిధానము

పుష్కరుడు చెప్పెను :

యజుర్విధానము చెప్పితిని. ఇపుడు సామ విధానమును చెప్పెదను. వైష్ణవీ సంహిత జపించి దశాంశ హోమము చేసినవాడు సమస్త కామములను పొందును. చాంధసీ సంహితను యథావిధిగా జపించిన వానిని శంకరుడు అనుగ్రహించును. స్కంద సహితను జపించుటచే ప్రసన్నత లభించును. 'యత ఇంద్ర భజామహే' (13-21) ఈ మంత్రమును జపించుటచే హింసా దోషము నశించును. 'అగ్నిస్తిగ్మేన' (22) అను మంత్రమును జపించు అవకీర్ణి పాపవిముక్తుడగును. 'పరితోసించ తాసుతం' (512) అను సామ మంత్రము సమస్త పాప వినాశకము. పొరపాటుచే నిషిద్ధ వస్తువులను విక్రయించినవాడు 'కృతవతీ భువనా' ఇత్యాది మంత్రములను జపించవలెను. 'అద్యానో దేవ సవితః' (141) అను మంత్రము దుఃస్వప్న నాశకము. పరశురామా! 'అబోధ్యగ్నిః' (1746) అను మంత్రముచే ఘృత హోమముచేసి మిగిలిన ఘృతముతో మేఖల బంధమును తడిపి దానిని గర్భస్రా వముతో బాధపడుతున్న స్త్రీలకు కట్టవలెను. పుట్టిన పిల్ల వానికి పై మంత్రము అభిమంత్రించి మణి కట్టవలెను. సోమంరాజానం (91) అను మంత్రమును జపించుటచే రోగి వ్యాధి విముక్తు డగును. సర్పసామ ప్రయోగము చేయువానికి సర్ప భయముండదు. 'మా పాపత్వా యనో' (918) అను మంత్రము నూరు హోమములుచేసి శతావరీయుక్త మగు మణిని కట్టినచో శత్రుభయముండదు. 'దీర్ఘతమసోఽ ర్కః' అను మంత్రముతో హోమము చేసినచో అధిక అన్నము లభించును. 'సమన్వాయంతః' (607) అను మంత్రమును జపించువాడు దప్పికతో మరణించడు. 'త్వమిమాఓషధీః' (604) అను మంత్రమును జపించువాడు ఎన్నడును వ్యాధిగ్రస్తుడు కాడు. దేవ వ్రతసామను మార్గమునందు జపించు వాడు భయ విముక్తుడగును. 'యదిందోఽ నునయత్' (148) అను మంత్రముతో హోమము చేసిన సౌభాగ్య వృత్తి కలుగును. ఓ పరశురామా! 'భగోనచితో' (449) అను మంత్రమును జపించి కండ్లకు కాటుక పెట్టినచో అది హితకరము సౌభాగ్య వర్ధకము అగును. సందేహము లేదు. ఇంద్ర శబ్దముతో ప్రారంభమగు మంత్ర వర్గమును జపించిన సౌభాగ్య వృద్ధి కలుగును. 'పరి ప్రియాదివః కవిః' అను మంత్రమును తాను పొందగోరిన స్త్రీకి వినిపించినచో ఆమె ఆతనిపై అనురక్తురాలగును. సందేహము లేదు, రథంతర సామ వామ దేవ్య సామములు బ్రహ్మ వర్చస్సును వృద్ధి పొందించును.

'ఇంద్రమిద్గాథినో' (198) అను మంత్రము జపించి ఘృతమిశ్రితమగు వచా చూర్ణమును ప్రతిదినము బాలునికి తినిపించినచో అతడు శృతిధరుడు (ఒక్కమాటు వినగనే జ్ఞాపకముంచు కొనువాడు) అగును. రథంతరసామను జపించి దానితో హోమము చేసినచో నిస్సంశయముగ పుత్రుడు లభించును. "మయిశ్రీః" (602) అను లక్ష్మీవర్ధకమగు మంత్ర మును జపించవలెను. వైరూప్యాష్టకమును ప్రతిదినము పఠించువానికి లక్ష్మి లభించును. సప్తాష్టకమును ప్రయోగించువానికి సమస్త కాలములు లభించును. ప్రతి దినము ప్రాతః సాయంకాలములందు ఆలస్యము లేనివాడై "గవ్యేషునోయథా" (186) అను మంత్రముతో గోవు ఉపస్థానము చేయువాని ఇంటిలో సర్వదా గోవులుండును. 'వాత ఆవాతు భేషజం' (184) అను మంత్రముతో నేతితో కలిపిన ఒక ద్రోణము యవలను యథావిధిగా హోమము చేసినవాడు సమస్త మాయను తొలగించును. 'పదైవో దాసో' (51) అను మంత్రముతో తిలహోమము చేయుటచే అభిచారకర్మ తొలగును. 'అభిత్వా శూరనో నమో'(232)అను సామకు అంతమున వషట్కారముచేర్చి ఆవనూనెతో తడిపిన సమిధలను కోపముతో హోమముచేసినచో యుద్ధమునందు జయము లభించును. గారుడ మంత్రము వామదేవ్య మంత్రము రథంతర బృహద్రస మంత్రములు నిస్సంశయముగ సర్వపాప వినాశకములు. విద్వాంసుడు సుందరమైన పిష్టమయములగు గజములను అశ్వములను మనుష్యులను నిర్మించి శత్రు పక్షము నందలి ప్రధాన వీరులను లక్ష్యముగ నిలిపి తడిసిన ఆ పిష్టమయ పురుషులను ముక్కముక్కలుగాచేసి వాటిని ఆవనూనెలో తడిపి క్రోధ పూర్వ కముగ 'అభిత్వా శూరనో నమో' (233) అను మంత్రముతో హోమము చేసిన యెడల యుద్ధము నందు విజయము లభించును. (261)

అథర్వ విధానము

పుష్కరుడు పలికెను :

పరశురామా! సామ విధానము చెప్పబడినది. ఇపుడు అథర్వ విధానమును చెప్పెదను. శాంతాతీయ గణమును ఉద్దేశించి హోమము చేసినచో మానవుడు శాంతిని పొందును. బహషజ్య గణమును ఉద్దేశించి హోమము చేసినవాడు సమస్త రోగములను తొలగించు కొనును. ఆసప్తీయ గణమును ఉద్దేశించి ఆహుతులనిచ్చువాడు సకలపాప విముక్తుడగును. అభయ గణమునకు హోమము చేసినవానికి ఎచటను భయము ఉండదు. పరశురామా! అపరాజిత గణమునకు హోమము చేసిన వానికి పరాజయము ఉండదు. ఆయుష్య గణ మునకు హోమము చేసిన వానికి అపమృత్యు భయముండదు. స్వస్త్యయన గణమునకు హోమము చేసినవాడు అంతటను మంగళ ములు పొందును. శర్వవర్మ గణమునకై హోమము చేయువాడు శ్రేయస్సు పొందును. వాస్తోష్పత్య గణమునకు హోమము చేయువాడు వాస్తు దోషములను తొలగించును. రౌద్ర గణమునకు హోమము చేయుటచే సకల దోషములు నశించును. క్రింద చెప్పబోవు పదునెనిమిది విధములగు శాంతులతో పది గణములకు హోమము చేయవలెను. వైష్ణవీ, ఖోంది, బ్రాహ్మి, రౌద్రి, వాయవ్య, వారుణి, కౌబేరి, భార్గవి, ప్రాజాపత్య, త్వాష్ట్రి, కౌమారి, ఆగ్నేయి, మారుద్గణి, గాంధర్వి నైఋతికి, ఆంగీరసి, యామ్య ఈ పదునెనిమిది కోరికలను తీర్చు పార్థివ శాంతులు.

'యస్త్వావం మృత్యుం' అను మంత్రమును జపించినచో మృత్యువు నశించును. 'సుపర్ణస్త్వా' (4-63) అను మంత్రముచే హోమము చేసినవానికి సర్వబాధ వుండదు. 'ఇంద్రేణ దత్తో' (2-2-94) అను మంత్రము సమస్త కామసిద్ధికరము. 'ఇంద్రేనా దత్తమ్' అను మంత్రము సమస్త బాధా వినాశకరము. 'ఇమాయాదేవి' (2-10-4) అను మంత్రము సర్వశాంతికరము. 'దేవామరుతః' అను మంత్రము సకల కామప్రదము. 'యమస్యలోకాత్' (19-56-1) అను మంత్రము దుస్సప్న నాశనమున శ్రేష్ఠము. 'ఇంద్రశ్చ పంచ వణిజః' అను మంత్రము వర్తకములో లాభము కలిగించును. 'కామోమేవాజి' అను మంత్రముతో హోమము చేసిన స్త్రీలకు సౌభాగ్య వృద్ధి కలుగును. 'తుభ్యమేవ జవీమన్' (2-28-1) అను మంత్రము వెయ్యిసార్లు జపించి దశాంశ హోమము చేసి పిదప 'ఆగ్నే గోభిర్నః' అను మంత్రముతో హోమము చేసినచో మేధాశక్తి పెంపొందును. 'ధ్రువంధ్రువేణ' (7-84-1) అను మంత్రముతో హోమము చేసినచో ఉత్తమ స్థానము లభించును. 'అలక్త జీవేతిశునా' అను మంత్రము కృషిలో లాభము కలిగించును. 'అహంతే భగ్నః' అను మంత్రము సౌభాగ్య వర్ధకము. 'యేమేపాశాః' అను మంత్రము బంధనము నుండి విముక్తి కలిగించును. 'శపత్వహన్' అను మంత్రముతో జప హోమములు చేసినవాడు శత్రువులను నశింపచేయ కలుగును. 'త్వముత్తమ' అను మంత్రము యశస్సును బుద్ధిని వృద్ధి పొందిం చును. 'యదామృగాః' ఈ మంత్రము స్త్రీల సౌభాగ్యము పెంపొందించును. 'యేనచేహది శంచైవ' అను మంత్రము గర్భమునిచ్చును. 'అయంతే యోనిః' (3-20-1)అను మంత్రము పుత్రలాభకరము. 'శివశ్శివాభిః' అను మంత్రము సౌభాగ్య వర్ధకము. 'బృహస్పతిర్నః పరిపాతు' (7-51-1) అను మంత్రమును జపించుటచే మార్గమున క్షేమము కలుగును. 'ముంచా మిత్వా' అను మంత్రము అపమృత్యు నివారకము. అథర్వశీర్షమును పఠించువాడు సమస్త పాప విముక్తుడగును. కొన్ని ప్రధానమంత్రములచే సాధింపతగిన కర్మలను నీకు చెప్పితిని. పరశురామ! యజ్ఞోపయుక్తములగు వృక్షములు, వృక్షములసమిధలు అన్నిటి కంటెను ముఖ్యమైన హవిస్సు. ఘృతము, ధాన్యము, తెల్లని ఆవాలు, అక్షింతలు (అక్షతలు) తిలలు, దధి, దుగ్ధము, కుశలు, దూర్వలు, బిల్వములు, ఈ ద్రవ్యములు కూడ శాంతిపుష్టి కరములు. తైలము, కణములు, రాజికలు, రక్తము, విషము, కంటక యుక్త సమిధలు వీటిని అభిచార ప్రయోగమునందు ఉపయోగించవలెను. మంత్రముల ఋషి, దేవతా, ఛందో, వినియోగములు తెలిసినవాడే ఆయా మంత్రములతో ఆయా కర్మలను చేయవలెను.(262)

ఉత్పాత శాంతి విధానము - 1

పుష్కరుడు పలికెను :

పరశురామా ! ఒక్కొక్క వేదములో ఉన్న లక్ష్మీవర్ధకమగు శ్రీసూక్తమును తెలియ వలెను. 'హిరణ్యవర్ణాం హరిణీం' మొదలగు పదునైదు ఋక్కులు ఋగ్వేదీయ శ్రీసూక్తము. 'రథే' (29-43) 'అక్షయరాజాయ' (30-18) వాజః (18-34) చతస్రః (18-32) ఈ నాలుగు మంత్రములును యజుర్వేదీయ స్త్రీ సూక్తము. 'శ్రాంవంతీయ సామ' సామవేదీయ శ్రీసూక్తము. 'శ్రియంధాతర్మయిదేహి' ఇది అథర్వ వేదీయ శ్రీసూక్తము. భక్తి పూర్వకముగ శ్రీసూక్త జప హోమము చేయువానికి తప్పక

లక్ష్మి లభించును. శ్రీదేవి అనుగ్రహమునకై కమలములు, బిల్వములు, ఆజ్యము, తిలలు, హోమము చేయవలయును. అన్ని వేదములందును పురుష సూక్తము ఉన్నది. అది సకల కామప్రదము. స్నానముచేసి పురుష సూక్తములోని ఒక్కొక్క మంత్రముతో మహావిష్ణువునకు ఒక్కొక్క జలాంజలియు పుష్పమును సమర్పించువాడు తాను పాపరహితుడై ఇతరుల పాపములను కూడ తొలగించును. స్నానము చేసి ఈ సూక్తమునందలి ఒక్కొక్క మంత్రముతో శ్రీమహావిష్ణువునకు ఫలమును సమర్పించు వాడు సర్వకామములను పొందును. పురుషసూక్త జపముచే మహా పాతకములు ఉపపాతకములు నశించును. కృచ్ఛ్రవ్రతముచేసి పరిశుద్ధుడైనవాడు స్నానపూర్వకముగ పురుష సూక్త జపహోమములు చేసినచో సర్వమును పొందును.

పదునెనిమిది శాంతులలో సమస్త ఉత్పాతములను తొలగించు అమృత, అభయ, సౌమ్య అను మూడు శాంతులు సర్వోత్తమములు. అమృతాశాంతి సర్వ దైవత్యము. అభయశాంతి బ్రహ్మ దైవత్యము. సౌమ్యాశాంతి సర్వ దైవత్యము. వీటిలో ఒక్కొక్కటి కూడ సర్వకామప్రదము. ఓ భృగుశ్రేష్ఠా ! అభయశాంతి కొరకై వరణ వృక్షముయొక్క మూలముతో మణి చేయవలయును. అమృతశాంతికి దూర్వామూల మణిని, సౌమ్యా శాంతికి శంఖమణిని ధరించవలయును. ఆయా శాంతుల దేవతలకు సంబంధించిన మంత్రములతో మణిని సిద్ధముచేసి కట్టవలెను. ఈ శాంతులు దివ్య అంతరిక్ష భౌమ ఉత్పాతములను శమింపచేయును. దివ్య, అంతరిక్ష, భౌమములను మూడు విధముల అద్భుతములగు ఉత్పాతములను చెప్పెదను వినుము.

గ్రహ నక్షత్రముల వికారములచే కలుగు ఉత్పాతములు దివ్యములు. అంతరిక్షోత్పాత ములను వినుము. ఉల్కాపాతము, దిగ్దాహము, సూర్యుడు గుడికట్టుట, గంధర్వ నగరము, వికృతమైన వర్షము–ఇవి అంతరిక్ష ఉత్పాతములు. స్థావరములందును, జంగమ ప్రాణు లందును కలుగు ఉపద్రవములు, భూకంపము, ఇవి భూమిజోత్పాతములు. ఈ ఉత్పాత ములు కనబడిన తరువాత ఒక వారములో పునఃవర్షము పడినచో ఆ అద్భుతము నిష్ఫలమగును. మూడు సంవత్సరముల వరకు ఈ అద్భుతోత్పాతమునకు శాంతిచేయ కున్నచో అది లోకమునకు భయావహము. దేవతా ప్రతిమలు నాట్యమాడుట, కదలుట, మండుట, శబ్దము చేయుట, ఏడ్చుట, చెమట పట్టుట, నవ్వుట మొదలగు వికారములు కనబడినచో ఆ దేవతలను పూజించి ప్రాజాపత్య హోమము చేయవలయును. ఏ రాష్ట్రము నందు అంటించకుండగనే అగ్నిఘోర శబ్దముతో ప్రజ్వలించినదో ఆ రాష్ట్రము రాజుచే పీడింపబడును.

భృగు నందనా ! ఇట్టి అగ్ని వికారశాంతికి అగ్ని దైవత్యములగు మంత్రములలో హోమము చేయవలయును. వృక్షములు ఫలములిచ్చినను, వాటి నుండి పాలు, రక్తము కారినను అది వృక్షజనిత భౌమోత్పాతము. అపుడు శివుని పూజించి ఉత్పాతములకు శాంతి చేయవలయును. అతివృష్టి, అనావృష్టి, రెండును దుర్భిక్ష కారణములు. వర్షఋతువుకాని ఋతువులో మూడు దినములు నిరంతర వృష్టి కలిగినచో అది భయజనకము. పర్జన్య, చంద్రసూర్యులను పూజించుటచే ఈ వర్షవికారము నశించును. ఒక నగరమునుండి నదులు, దూరమైపోయినను దగ్గరకు వచ్చినను,

అందలి సరోవరములు ప్రవాహములు ఎండిపోయినను ఈ జలాశయ వికారమును తొలగించుటకు వారుణ మంత్రము జపించవలెను. స్త్రీలు ఆ సమయమున ప్రసవించినను, సమయమున ప్రసవించకున్నను వికృతమైన గర్భము కన్నను, కవల పిల్లలు మొదలగు వారిని కన్నను ఈ ప్రసవ వికారమును తొలగించుటకు పతివ్రతలైన స్త్రీలను, బ్రాహ్మణాదులను పూజించ వలెను. గుఱ్ఱముగాని, ఏనుగుగాని, ఆవుగాని, రెండు పిల్లలుకన్నను, వికృతమైన విజాతీయ సంతానమును కన్నను ఆరు మాసములలోపు మరణించినను వికృత గర్భము కన్నను ఆ రాజ్యమునకు శత్రువుల నుండి భయము కలుగును. ఈ ఉత్పాతమును శాంతింప చేయుటకై హోమము జపము బ్రాహ్మణ పూజ చేయవలెను. అయోగ్యమైన పశువులు బండి కట్టినను, యోగ్య పశువులు బండి లాగకున్నను, ఆకాశమున తూర్యనాదము వినబడినను మహా భయము వచ్చును. వన్య పశుపక్షులు గ్రామములో ప్రవేశించినను గ్రామ్య పశువులు వనములోనికి వెళ్లిపోయినను స్థలచరములు జలములో ప్రవేశించినను జలచరములు స్థలముపైకి వచ్చినను రాజ ద్వారాది సమీపమునకు నక్కలు వచ్చినను, ప్రదోష కాలమున కోడి కూసినను, సూర్యోదయ సమయమున నక్కలు అరచినను, పావురములు, ఇంటిలో దూరినను మాంసము తిను పక్షులు తలపై తిరిగినను, సామాన్యపు ఈగ తేనెకూర్చినను కాకులు మైథునము చేయుచుండగ కనబడినను దృఢమైన ప్రాసాదములు తోరణములు, ఉద్యానములు, ద్వారములు, ప్రాకారములు, భవనములు, అకారణముగ పడిపోయినను రాజు మరణించును. పరాగముగాని, ధూమముగాని, పది దిక్కుల నిండిపోయినను కేతువు ఉదయించినను గ్రహణమువచ్చినను, సూర్య చంద్ర బింబముల మధ్య రంధ్రము కనబడినను, ఇవి గ్రహ నక్షత్ర వికారములు. ఇవి ఎచట కనబడునో అచట భయమును సూచించును. అగ్ని మండకపోయినను, ఉదకకుంభము అకారణముగ కారినను, ఈ ఉత్పాతములకు ఫలితముగ మరణము, భయము, మహామారి, మొదలగునవి కలుగును. బ్రాహ్మ ణులను దేవతలను పూజించుటచేతను, జపహోమముల చేతను ఈ ఉత్పాతములు శాంతించును. (263)

ఉత్పాత శాంతి విధానము - 2

పుష్కరుడు పలికెను :

ఇపుడు ఉత్పాతములను తొలగించు దేవపూజాది కర్మనుగూర్చి చెప్పెదను. స్నానము చేసి 'అపోహిష్ఠా' మొదలగు (యజు 36-14-, 16) మూడు మంత్రములతో మహావిష్ణువునకు అర్ఘ్యము సమర్పించి, 'హిరణ్యవర్ణాః' (ఋక్ 11-11-1, 3) మొదలగు మూడు మంత్రములతో పాద్యము 'శంనో ఆపః' అను మంత్రముతో ఆచమనము, 'ఇదమాపః' (యజు 6-17) అను మంత్రముతో అభిషేకమును సమర్పించవలెను. 'రథే', 'అక్షేమ', 'చతస్రః' అను మూడు మంత్రములతో గంధమును, 'యువాసు వాసాః' (ఋ 3-8-4) అను మంత్రముతో వస్త్రమును 'పుష్పవతీ' (అథర్వ 8-7-27) అను మంత్రముతో పుష్పమును, 'ధూరసి' (యజు 1-8) ఆది మంత్రముతో ధూపమును, "తేజోఽసి", "శుక్రమసి" (యజు 1-36) అను మంత్రముతో దీపమును "దధిక్రాష్ణో" (యజు 23-23) అను మంత్రముచే మధుపర్కమును సమర్పించి 'హిరణ్యగర్భ' మొదలగు ఎనిమిది ఋక్కులను

పఠించి అన్నమును సుగంధమగు పానీయమును సమర్పించవలెను. మిగిలిన చామర, వ్యజన, పాదుకా, ఛత్ర, యాన, ఆసనాదులను సావిత్ర మంత్రముతో సమర్పించ వలెను. పురుష సూక్తముతో జపహోమములు చేయవలయును. భగవ ద్విగ్రహములేనిచో వేదికపై స్థాపించిన జలపూర్ణ కలశము నందుకాని, నదీ తటమునందు గాని, కమలము నందుగాని, విష్ణువును పూజించినచో ఉత్పాతములు శమించును.

భూమిపై నున్న వేదికపై మార్జన ప్రోక్షణములు చేసి దాని నలువైపుల కుశలు పరచి అగ్ని ప్రదీప్తము చేసి దానిలో హోమము చేయవలెను. పరశురామా! మనస్సును, ఇంద్రియములను నిగ్రహించుకొని అన్ని అన్నముల నుండియు మొదటి భాగమును గ్రహించి వాసుదేవాదులకు హోమము చేయవలెను. వాసుదేవ, దేవ, ప్రభు, అద్యయ, అగ్ని, సోమ, మిత్ర, వరుణ, ఇంద్ర, మహాభాగ, ఇంద్రాగ్ని, విశ్వదేవ, ప్రజాపతి, అనుమతి, ధన్వంతరి, వాస్తోష్పతి, దేవి, స్విష్టకృదగ్ని అను దేవతా నామములను చతుర్థ్యంతము చేసి, వీటికి హోమము చేసి, క్రింద చెప్పు విధముగ బలి సమర్పించవలెను. ఓ ధర్మజ్ఞ ! ముందు ఆగ్నేయ దిక్కునందు ప్రారంభించి, తక్షా, ఉపతక్షా, అశ్వా, ఊర్జ, నిరుంధీ, ధూమ్రిణీకా, అస్వపంతీ, మేధపత్నీ అనువారికి బలి అర్పింపవలెను. ఓ భృగునందన ! ఇవి బలిని స్వీకరించు దేవతల పేర్లు. పిదప నందిన్యాది శక్తులకు బలి అర్పింపవలెను. నందినీ, సుభాగ్యా, సుమంగళీ, భద్రకాళీయను నలుగురు శక్తులకు పూర్వాది దిక్కులు నాల్గింటి యందును బలి ఇచ్చి ఒక శంఖువుపైగాని స్తంభముపైగాని, 'శ్రీహిరణ్యకేశీ' వనస్పతులకు బలి ఇవ్వవలెను. ద్వారము రెండుప్రక్కల ధర్మమయ, అధర్మమయులకు గృహ మధ్యమమున ధృవునకు ఇంటి వెలుపల మృత్యువునకు జలాశయమున వరుణునకు బలి సమర్పించి ఇంటివెలుపల భూతబలిని ఇవ్వవలెను. ఇంటిలోపల కుబేరునకు తూర్పున ఇంద్రునకు ఇంద్రపురుషులకు, దక్షిణమున, యమునకు, యమపురుషులకు, పశ్చిమమున, వరుణునకు వరుణ పురుషులకు ఉత్తరమున, సోమమునకు సోమపురుషునకు గృహమధ్యమున బ్రహ్మకు బ్రహ్మ పురుషులకు ఆకాశమున విశ్వేదేవతలకు పృథివిపై స్థండిల దేవతలకు బలియిచ్చి పిదప పగలు దివాచరములకు రాత్రి రాత్రి చరములకు బలియివ్వ వలెను. ప్రతిదినము సాయంకాలమందును ప్రాతః కాలము నందును ఇంటి వెలుపల బలి యివ్వవలెను. ఒక దినమున శ్రాద్ధమునకు సంబంధించిన పిండ ప్రదానము జరిగినచో ఆనాడు సాయంకాలమున బలి ఇవ్వకూడదు.

పితృశ్రాద్ధమునందు దక్షిణాగ్ర కుశములపై మొదట తండ్రికి, పిదప పితామహు నకు పిండదానము చేయవలెను. ఇదేవిధముగా మొదట తల్లికి, పిదప పితామహికి పిదప ప్రపితామహికి పిండ దానము చేయవలెను. ఈ విధముగ పితృ యాగము చేయవలయును. వండిన వంట నుండి బలివైశ్వ దేవములు చేసిన పిమ్మట ఐదు బలులు ఇవ్వవలెను. ఇంద్ర, వరుణ, వాయు, యమ, నిఋతి దేవతల దిక్కులందు నివసించు కాకులు నేను ఇచ్చిన ఈ పిండమును గ్రహించు గాక ! అను అర్థముగల మంత్రముతో కాక బలి ఇవ్వవలెను. శ్యామ, శబల, వర్ణములు గల రెండు శునకములు వివస్వంతుని కులమున జన్మించినవి. నేను ఆ రెండింటి పిండ ప్రదానము చేయు చున్నాను, అవి నన్ను మార్గమునందు సర్వదా రక్షించుగాక ! అను అర్థముగల మూలోక్త మంత్రము చదువుతూ కుక్కలకు బలి ఇవ్వవలెను.

త్రిలోక జననులు, కామధేను పుత్రికలు అయిన గోవులు అందరికిని హితకరములు పవిత్రములు, పాపవినాశకములు అవి నేనిచ్చు ఈ గ్రాసమును గ్రహించుగాక ! అను అర్థము గల మూలోక్త మంత్రముతో గోవునకు గ్రాసమును ఇచ్చి స్వస్త్యయనము చేయ వలయును. పిదప యాచకులకు భిక్షయిచ్చి దీనులగు ప్రాణులకును అతిథులకును అన్నము పెట్టి గృహస్థుడు తాను తినవలెను. 'ఓం భూః స్వాహా' మొదలు 'ఓం ప్రజాపతయే స్వాహా' వరకునుగల మూలోక్త మంత్రములు చదువుతు, అన్నాహుతులు ఇవ్వవలెను. ఈ విధముగా విష్ణుపూజా వైశ్వదేవ బలులను గూర్చి నీకు చెప్పితిని. (264)

దిక్పాలాది స్నాన కథనము

అగ్నిదేవుడు పలికెను :

పరశురామ ఇపుడు సకల కార్యసిద్ధిని ఇచ్చు శాంతికరమగు స్నానమును గూర్చి చెప్పెదను వినుము. గృహములకు, శ్రీమహావిష్ణువునకు నదీతీరమున స్నానము చేయించవలెను. జ్వరపీడాదులు కలుగునపుడు, వినాయక గ్రహబాధ కలిగినపుడును దేవాలయము నందు స్నానము చేయించవలెను. విద్య కోరువాడు జలాశయమునందు కాని, ఇంటిలో కాని స్నానము చేయవలెను. విజయము కోరువాడు తీర్థజలమున స్నానము చేయవలెను. గర్భస్రావముతో బాధపడుతున్న స్త్రీని పుష్కరిణిలో స్నానము చేయించవలెను. పుట్టిన వెంటనే శిశువులు మరణించు స్త్రీకి అశోకవృక్ష సమీపమున స్నానము చేయించవలెను. రజోదర్శనము కోరు స్త్రీలు పుష్పములతో నిండిన వనము నందును, పుత్రులను కోరు స్త్రీలు సముద్రమునందును, సౌభాగ్యమును గోరు స్త్రీలు, గృహమునందును స్నానము చేయవలెను. పైన చెప్పిన వారందరును విష్ణు ప్రతిమ సమీపమున స్నానము చేయవలెను. శ్రవణ, రేవతి, పుష్య నక్షత్రములందు అందరికిని స్నానము ఉత్తమము. కామ్యస్నానము చేయువారికి ఒక సప్తాహము ముందుగనే ఉత్సాదనము విధింపబడినది. పునర్నవ, గోరోచనము, శతాంగము, గురుణి, బెరడు, మధూకము, రెండు విధములగు పసుపు, తగరము, నాగకేసరము, అంబరి మంజిష్ఠ, జటామాంసి, యాసకము కర్దమము ప్రియం గువు, తెల్లఆవాలు, కుష్ఠము, బలబ్రాహ్మి కుంకుమము, సక్తువులు కలిపిన పంచగవ్యములు వీటితో శరీరము నలుచుకొని, స్నానము చేయవలెను.

పిమ్మట తామ్ర పత్రముపై పద్మమండలము నిర్మించి దాని కర్ణికయందు, విష్ణువును పూజించ వలెను. దాని కుడి భాగమున బ్రహ్మను, ఎడమప్రక్క శివుని పూర్వాది దిగ్దళము లందు ఆయుధ పరివారాది సహితులగు దిక్పాలకులను ఉంచి పూర్వాది దిశ లందును, ఆగ్నేయాది విదిశలందును ఎనిమిది స్నాన మండలములు నిర్మించవలెను. ఆ మండలములపై ఆయుధ సహితులగు విష్ణు, బ్రహ్మ, శివ, ఇంద్రాదులను పూజించి, వారి నుద్దేశించి హోమము చేయవలెను. ఒక్కొక్క దేవతకు నూట యెనిమిది ఆహుతులు సమిధలతోను తిలలతోను, ఘృతముతోను ఇవ్వవలెను. పిదప భద్ర, సుభద్ర, సిద్ధార్థ, పుష్టివర్ధన అమోఘ చిత్రభాను, పర్జన్య, సుదర్శనములను యెనిమిది

కలశలములను స్థాపించి వాటిపై, అశ్విని, రుద్ర, మరుద్గణ, విశ్వేదేవ దైత్య, వసుదుర్గా, మునులను ఇతర దేవతలను ఆవాహన చేసి 'మీరందరును ప్రసన్నులై ఈ కలశములపై ఉండుడు' అని ప్రార్థించవలెను. ఆ కలశలలో జయంతి, విజయ, జయ, శతావరి, శతపుష్ప, విష్ణుక్రాంత, అప రాజిత, జ్యోతిష్మతి, అతిబల చందన, ఉశీర, కేసర, కస్తూరి, కర్పూర, వాలక, పత్రక, త్వచ జాతీఫల, లవంగములను, మృత్తికను, పంచ గవ్యములను వేయవలెను. పిమ్మట బ్రాహ్మణులు సాధ్యుడగు మనుష్యుని దేవతలకు వేరువేరుగా హోమములు చేయించవలెను. పిదప పూర్ణాహుతి ఇచ్చి గురువునకు దక్షిణ ఇవ్వవలెను. పూర్వము బృహస్పతి ఇంద్రునకు అభిషేకము చేయించగ, ఆతడు దైత్యులను చంపెను. ఇంతవరకు విజయాదికమును ఇచ్చు దిక్పాలస్నానమును చెప్పితిని. (265)

వినాయక స్నానము

పుష్కరుడు పలికెను :

వినాయకులచే పీడితులకు సర్వ మనోరథములు ఇచ్చు స్నానమును చెప్పెదను. కర్మలకు విఘ్నము కల్గించుటకు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు వినాయకుని నిర్మించి ఆతనికి గణాధిపత్యమును కూడ ఇచ్చిరి. వినాయక పీడితుడు స్వప్నములో లోతైన నీటిలో మునిగిపోవును. ముండిత శిరస్కులను చూచును. మాంసమునుతిను మృగములను ఎక్కును. ఎచటకేని నడచి వెళ్లినపుడు తనవెనుక ఎవరో వచ్చుచున్నట్లు అనుకొనును. కారణము లేకుండగనే మనస్సు చెడి వ్యర్థ ప్రయత్నములు కలవాడగును. కన్యకు వరుడు లభించడు. స్త్రీకి సంతానము లభించదు. శ్రోత్రియునకు ఆచార్యత్వము శిష్యునకు అధ్య యనము, ధనికునకు లాభము, కృషీవలునకు కృషి, రాజునకు రాజ్యము లభింపవు. అట్టివారికి స్నానము చేయించవలెను. హస్త, పుష్యమి, అశ్విని, మృగశిర, శ్రవణ నక్షత్రము లందు భద్ర పీఠముపై కూర్చుండబెట్టి పచ్చటి ఆవాలు నూరి నేతితో తడపి వాని శరీరము నందంతటను నలిచి, వాని శిరస్సుపై సర్వౌషధ సహితములగు, అన్ని విధముల సుగంధ ద్రవ్యము లను లేపనముచేసి సర్వౌషధులు వుంచిన నాలుగు కలశముల జలముతో ఆతనికి స్నానము చేయించవలెను. అశ్వశాల, గజశాల, పుట్ట, నదీసంగమము, జలాశయము, వీటినుండి తీసుకొనివచ్చిన ఐదు విధములగు మట్టియు, గోరోచనము, గంధము, గుగ్గులు, ఆ కలశజలము లందు ఉంచవలెను. ఆచార్యుడు తూర్పున నున్న కలశ తీసుకొని సహస్ర నేత్రములు కలదియు, మహర్షులచే పవిత్రీకృతమును అగు జలముతో నీకు స్నానము చేయించుచున్నాను, ఈ పవిత్ర జలము నిన్ను పవిత్రుని చేయుగాక అని చెప్పుచు స్నానము చేయించవలయును. రాజీవ వర్ణుడు సూర్యుడు, బృహస్పతి, ఇంద్రుడు, వాయువు, సప్తర్షులు, నీకు కల్యాణమును చేసిరి అనియు, 'నీ కేశములందును, సీమంతము నందును, శిరస్సు యందును, లలాట, కర్ణ, నేత్రము లందున్న దౌర్భాగ్యమును ఈ జలము పూర్తిగా తొలగించు గాక' అనియు చెప్పుచు స్నానము చేయించవలెను. గురువు తన ఎడమ చేతిలో గ్రహించిన కుశలను ఆ స్నానము చేసినవాని శిరస్సుపై ఉంచి, ఉదుంబస్రువతో ఆవ నూనెను హోమము చేయవలెను. ఆ సమయమున చివర స్వాహాయను పదము చేర్చిన చతుర్థ్యంతములగా మిత, సమ్మిత, శాలక కంటక, కూష్మాండ, రాజపుత్ర అను

పదములను చెప్పవలెను. హోమము చేయగా మిగిలిన చరువుతో 'నమః' అను పదము చేరిన జలమంత్రములను ఉచ్చరించుచు వారికి బలి ఇవ్వవలెను. పిమ్మట చేటలో అంతట కుశములు పరచి తడి పొడిగా వున్న బియ్యము నూరిన తిలలు కలిపిన అన్నము, వివిధ పుష్పములు మాంసాన్నము, మత్స్యములు, త్రివిధసుర, మూలి, పూరి, అపూపములు ఏండవికమాలలు, దధ్యన్నము, పాయసము, పిష్టము, లడ్డులు, బెల్లము వీటిని ఒకచోట చతుష్పథమునందు చేర్చి వాటిని దేవతా, సువర్ణ, సర్ప, గృహ, అసుర, యాతుధాన, పిశాచ, నాగ, మాతృ, శాకినీ, యక్ష, వేతాళ, యోగినీ, పూతనాదులకు అర్పించవలెను. పిదప వినాయకుని తల్లియైన అంబికకు దూర్వాదళములు. తెల్ల ఆవాలు, పుష్పములు, వీటితో నిండిన అంజలిని సమర్పించి, సౌభాగ్యవతి యైన ఓ దేవి ! నాకు రూపమును, యశస్సును, సౌభాగ్యమును, పుత్రుని, ధనమును, సర్వకామములను ఇమ్ము అని ప్రార్థించవలెను. బ్రాహ్మణులకు భోజనము పెట్టి ఆచార్యునకు రెండు వస్త్రములు ఇవ్వవలెను. ఈ విధముగ వినాయకుని గ్రహములను పూజించుటచే ఐశ్వర్యమును, కర్మఫలమును పొందును. (266)

మహేశ్వర స్నానము - లక్ష కోటి హోమములు

పుష్కరుడు పలికెను :

రాజాదులకు జయమునిచ్చు మహేశ్వర స్నానాదుల గూర్చి చెప్పెదను. పూర్వము శుక్రాచార్యుడు దీనిని దానవేంద్రుడగు బలికి చెప్పెను. ప్రాతః కాలము, సూర్యోదయమునకు పూర్వము యాచార్యుడు రాజును భద్ర పీఠముపై కూర్చుండబెట్టి 'జయ, జయసర్వాన్ శత్రూన్' అని పల్కుచు, 'లిఖి, ఖిలా స్వాహా' వరకును ఉన్న మూలోక్త మంత్రమును చెప్పుచు స్నానమును చేయించవలెను. ఈ విధముగ స్నానము చేసిన పిమ్మట తండుల హోమము చేసి త్రిశూలధారియగు శివునకు పంచామృత స్నానము చేయించి పూజ చేయవలయును.

సర్వదా విజయమునిచ్చు ఇతర విధములగు స్నానములను చెప్పెదను. ఘృత స్నానము ఆయుర్వర్ధకము. గోమయస్నానము లక్ష్మీప్రదము. గోమూత్ర స్నానము పాప నాశకము. క్షీరస్నానము బలవృద్ధికరము. దధిస్నానము లక్ష్మీ వర్ధకము. కుశోదకముతో స్నానము పాపములను నశింప చేయును.పంచగవ్య స్నానముచే సర్వ కామములును లభించును. శృంగోదక స్నానము పాప వినాశకము. పలాశ, బిల్వ, కమల, కుశ, స్నానము సర్వకామ్యప్రదము. వస, రెండు విధముల పసుపు, ముస్త కలిపిన నీటితో స్నానము రాక్షస వినాశకము. ఆయుర్వృద్ధి యశస్సు ధర్మము, మేధకూడ దీనిచే లభించును. సువర్ణోదకములతో స్నానము మంగళకరము. రజత తామ్ర జల స్నానములు కూడ మంగళకరము. రత్నమిశ్ర జలముతో స్నానము విజయమును, సర్వగంధ మిశ్రిత జలముతో స్నానము సౌభాగ్యమును. ఫలోదక స్నానము ఆరోగ్య మును, ఉసిరికాయల జలముతో స్నానము లక్ష్మిని ఇచ్చును. తిలశ్వేత సర్షపములు కలిపిన జలముచే లక్ష్మియు, ప్రియంగు జల స్నానముచే సౌభాగ్యము పద్మ ఉత్పల కదంబ మిశ్ర జలస్నానములచే లక్ష్మియు బలావృక్ష జల స్నానముచే బలము లభించును. విష్ణు చరణోదక స్నానము అన్ని స్నానముల కంటెను శ్రేష్ఠమైనది.

ఏకాకియైన మనుష్యుడు ఒక కోరికతో ఒకే స్నానము చేయవలయును. 'ఆక్రంద' యతి ఇత్యాది సూక్తము చెప్పుచు చేతికి మణికట్టవలెను. ఈ మణి కుష్ఠ–పాఠ్యా–పచా–శుంఠీ–శంఖ–లోహాదులతో చేయబడవలెను. శ్రీ మహావిష్ణువు సర్వకామములకు అధిపతి. ఆతనిని పూజించుటచే సర్వకామములను పొందును. ఘృతమిశ్ర దుగ్ధముతో స్నానము చేయించి విష్ణువును పూజించు వానికి పిత్త రోగము నశించును. పంచముద్గ బలియిచ్చి నచో అతిసారరోగము పంచగవ్య స్నానము చేయించినచో వాత వ్యాధి ద్విస్నేహ ద్రవ్యములతో స్నానము చేయించి శ్రద్ధాపూర్వకముగ పూజిం చుటచే శ్లేష్మ రోగములు నశించును. ఘృత–తైల, మధువులతో చేయించిన స్నానము 'త్రిరస' స్నానము. ఘృత జలములతో చేయించిన స్నానము. 'ద్వి స్నేహ' స్నానము, ఘృత, తైల, మిశ్ర జలముతో చేయించిన స్నానము సమలస్నానము. మధు ఇక్షురస క్షీరములతో చేయించిన స్నానము త్రిమధుర స్నానము, ఘృత, ఇక్షురస, మధులతో చేయించిన 'త్రిరస' స్నానము లక్ష్మీ ప్రదము. కర్పూర, ఉశీర చందనములతో చేసిన అనులేపము 'త్రిశుక్లము' చందన అగురు, కర్పూర, కస్తూరి కుంకుమములతో చేసిన అనులేపనమును విష్ణువునకు సమర్పించినచో అది సర్వకామ ఫలప్రదము. కర్పూర చందన, కుంకుమములతో కాని, కస్తూరి కర్పూర చందనములతో కాని చేసిన త్రి సుగంధ మనులేపనము సర్వ కామప్రదము. జాతిఫల కర్పూర చందనములు అనునవి 'త్రిశీతకమని' చెప్పబడును. పీత వర్ణములు, శుక్ల వర్ణములు, శుక్లములు, కృష్ణములు, రక్తములు, ఇవి పంచవర్ణములు. విష్ణు పూజకు, ఉత్పలములను, కమలములను, జాతీపుష్పములను త్రిశీతము లకు 'త్రిశీతమును ఉపయోగించవలెను. కుంకుమ రక్తకమల రక్తోత్పలములకు 'త్రిరక్తము' యని పేరు. ధూపదీపాదులతో మహావిష్ణువుకు పూజచేసినచో మానవులకు శాంతి లభించును. నాలుగు హస్తముల చతురస్ర కుండమునందు ఎనమండుగురు లేదా పదునారుగురు బ్రాహ్మణులు తిల, ఆజ్య, తండులములతో లక్షగాని, కోటి హోమము చేయవలయును. గ్రహ పూజచేసి గాయత్రిచే హోమము చేసినచో క్రమముగా అన్ని విధముల శాంతి కలుగును. (267)

నీరాజన విధి

పుష్కరుడు చెప్పెను :

రాజుకు చేయదగిన సాంవత్సర కర్మ చెప్పెదను. రాజు జన్మ నక్షత్రమున ఆ నక్షత్రమును పూజించవలెను. ప్రతి మాసమునందును, సంక్రాంతియందు సూర్య హోమాది దేవతలను అగస్త్యోదయ సమయమున అగస్త్యుని, చాతుర్మాస్యమునందు హరిని పూజించవలెను. శయన ఉత్థాన ఏకాదశులందు ఐదు దినములు ఉత్సవము చేయవలెను. భాద్రపద శుక్ల ప్రతిపత్తున శిబిరమునకు తూర్పున ఇంద్ర పూజకై భవనము నిర్మించవలెను. అచట శక్రధ్వజము స్థాపించి శచీదేవుని ఇంద్రుని ప్రతిపత్తు మొదలు అష్టమి వరకు పూజించవలెను. అష్టమినాడు వాద్య ఘోషములతో ఆ ఇంద్ర ధ్వజమునకు దండము తొడుగవలెను. ఏకాదశినాడు ఉపవాసముండి ద్వాదశినాడు ఆ ధ్వజము ఎత్తవలెను. ఒకకలశముపై వస్త్రాదులచే చుట్టబడిన ఇంద్రుని శచీదేవిని స్థాపించి 'శత్రువులను జయించు వృత్రనాశకుడవగు ఓ పాకశాసనా ! ఓ మహాభాగా ఓ దేవ

దేవా ! నీకు అభ్యుదయమగుగాక. నీవు ఈ భూమిపైకి వచ్చితివి. నీవు శాశ్వతుడవైన ప్రభువు. సర్వ భూతముల హితమునందు ఆసక్తుడవు. అనంతతేజము కలవాడవు. విరాట్ పురుషుడవు. యశో జయములను వృద్ధి చేయువాడవు. నీవు ఉత్తమ వర్షమును కల్గించు ఇంద్రుడవు. సమస్త దేవతలు, నీ తేజస్సును వృద్ధి పొందించెదరుగాక. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, కార్తికేయుడు, వినాయకుడు, ఆదిత్యులు, వసువులు, రుద్రులు, సాధ్యులు, భృగువులు, దిక్కులు, మరుద్గణములు, లోకపాలకులు, గ్రహములు, యక్షులు, పర్వతములు, నదులు, సముద్రములు, లక్ష్మి, భూమి, గౌరి, చండికా, సరస్వతీ, వీరందరును నీ తేజస్సును వృద్ధి పొందించెదరు గాక ! శచీపతివైన ఓ ఇంద్రా ! నీవు జయించెదవు గాక ! నీ విజయముచే నాకు కూడ సర్వదా శుభము కలుగుగాక ! రాజులు, బ్రాహ్మణులు, ప్రజలు, వీరందరిని అనుగ్రహించుము. నీ అనుగ్రహముచే భూమి నిత్యము సస్యసంపన్న అగుగాక : అందరికి విఘ్న విహీనమగు కల్యాణమగు గాక ! ఈతిబాధలు పూర్తిగ నశించు గాక !' అని ప్రార్థించుచు పూజించవలెను. ఈ మంత్రముతో ఇంద్రుని పూజించినవాడు భూమిని జయించి స్వర్గమును పొందును.

ఆశ్వీయుజ శుక్ల అష్టమినాడు వస్త్రముపై భద్రకాళిని చిత్రించి, విజయము కోరువాడు ఆ దేవతలను పూజించవలెను. ఆయుధములు, ధనస్సు, ధ్వజము, ఛత్రము,రాతి చిహ్నాములు శస్త్రాదులు వీటిని కూడ పుష్పాదులతో పూజింపవలెను. రాత్రి జాగరణము చేసి బలియిచ్చి, మరునాడు మరల పూజించవలెను. 'భద్రకాళి, మహాకాళి, దుర్గా, దుర్గ బాధను హరించుదానా! త్రైలోక్య విజయా, చండీ నాకు శాంతి విజయమును ఇమ్ము' ఇపుడు నీరాజనా విధిని చెప్పెదను. ఈశాన్యమున దేవతా మందిరము నిర్మించి మూడు ద్వారములు ఏర్పరచి అచట సర్వదా దేవతా పూజ చేయ వలయును. సూర్యుడు చిత్తా నక్షత్రమును విడిచి స్వాతిలో ప్రవేశించునపుడు ప్రారంభించి, ఆ నక్షత్రములో ఉండు వరకును దేవతా పూజ చేయవలయును. బృహ, విష్ణువు, శంభు, శక్ర, అగ్ని, వాయు, వినాయక, కుమార, వరుణ, కుబేర, విశ్వేదేవ, వైశ్రవసులను, కుముద, ఐరావణ, పద్మ, పుష్పదంత, వామన, సుప్రతీక–అంజననీలులను దిగ్గజములను గృహాదులందు పూజించవలెను. పిదప పురోహితుడు ఆజ్య, సమిత్, సిద్ధార్థ తిలలతో హోమము చేయవలయును. ఎనిమిది కలశములు పూజించి వాటితో ఉత్తమమైన అశ్వములను గజములను స్నానము చేయించి ముందు గజములకు గ్రాసము ఇవ్వవలెను. తోరణ ద్వారము నుండి బయటకు తీసుకుని రావలెను. గోపురాదులను దాటకూడదు. పిదప అందరును బయటకు వచ్చిన పిమ్మట ఇంటియందే రాజ చిహ్నాములను పూజించవలెను. శతభిషా నక్షత్రమున వరుణిని పూజించి భూతలములకు బలి యివ్వవలెను. సూర్యుడు విశాఖలో ప్రవేశించిన పిమ్మట రాజు ఆశ్రమములో నివసించవలెను. ఆ దినమున వాహనములను అధికముగ అలంకరించవలెను. రాజ చిహ్నాములను పూజించి వాటివాటి రక్షకుల చేతికి ఇవ్వవలెను. కాలజ్ఞుడగు జ్యోతిషుడు గజములు, అశ్వములు, ఛత్రము, ఖడ్గము, ధనస్సు, దుందుభి, ధ్వజము, పతాక, వీటిని అభిమంత్రించవలెను. వాటిని ఏనుగులపైకి ఎక్కిం చవలెను. జ్యోతిష్కుడు పురోహితుడు కూడ ఏనుగును ఎక్కవలెను. అభిమంత్రితములగు వాటిని ఎక్కి ద్వారమునుంచి నిష్క్రమింపచేయవలయును. ఈ విధముగ నిష్క్రమించి ఏనుగును ఎక్కి

రాజు రాజ ద్వారము నుండి బయటకు వచ్చి విధి పూర్వకముగ బలి ఇవ్వవలెను. పిదప అతడు సుస్థిరచిత్తుడై చతురంగ సైన్యములతో కూడి వారి అందరిచేత జయ ఘోషములు పలికించుచు, దిగంతములను ప్రకాశింపజేయుచున్న కాగడాల సముదాయములకు మూడు పర్యాయములు ప్రదక్షిణములు చేసి, జలాంజలి ఇచ్చి ఇంటికి మరలి రావలయును. నీరాజనమను ఈ పేరుగల శాంతివృద్ధినిచ్చును. శత్రువులను నశింప చేయును. (268)

ఛత్రాది మంత్రములు

పుష్కరుడు పలికెను :

ఛత్రాది మంత్రములను చెప్పెదను. వాటిని పూజించుటచే విజయాదికమును పొందును. మహామతియైన ఓ ఛత్రదేవా ! నీవు హిమము, మల్లెపూవు, చంద్రుడువలె, తెల్లని కాంతితో ప్రకాశించుచున్నావు. బ్రహ్మ యొక్క సత్య వచనముచేతను, వరుణ సూర్య ప్రభావములచేతను నీవు సర్వదా వృద్ధిపొందుము. మేఘము మంగళము కొరకై ఈ భూమిని ఆచ్ఛాదించునట్లు నీవు విజయము కొరకును ఆరోగ్యవృద్ధి కొరకును రాజును ఆచ్ఛాదించుము. ఓ అశ్వమా ! నీవు గంధర్వ కులమున పుట్టితివి కావున కులదూషకము కావద్దు. బ్రహ్మ సత్య వాక్యము చేతను, హోమ వరుణ అగ్నుల ప్రభావము చేతను, సూర్య తేజస్సుచేతను, మునుల తపస్సుచేతను, రుద్రుని బ్రహ్మ చర్యముచేతను, వాయువు బలముచేతను, నీవు సర్వదా మున్ముందుకు సాగుము. నీవు అశ్వరాజపుత్రుడను విషయము స్మరించుము. కౌస్తుభమణిని స్మరించుము. బ్రహ్మహత్య, పితృహత్య, మాతృహత్య చేసిన వాడును, భూమి కొరకై అసత్యమాడినవాడు, యుద్ధము నుండి పరాఙ్ముఖుడైన క్షత్రియు డును ఎంత శీఘ్రముగా అధోగతిని పొందుదురో, యుద్ధమునందు పృష్ఠము చూపించుటచే నీవు కూడ అట్లే దుర్గతిని పొందుదువు. నీకు అట్టి వికారము కలుగకుండు గాక ! అట్టి పాపము కలుగకుండు గాక ! సమరాంగణమున శత్రువులను సంహరించుచు నీ స్వామితో కూడ సుఖముగ నుండుము. మహాపరాక్రమమునకు ప్రతీకమైన ఓ ఇంద్రధ్వజమా ! నారాయణుని ధ్వజమైన గరుత్మంతుడు నీపై ప్రతిష్ఠింపబడినాడు. ఇతడు సర్ప శత్రువు. విష్ణు వాహనము కశ్యపకుమారుడు. దేవలోకములో నుంచి బలాత్కారమున అమృతమును అపహరించినాడు. అతను విశాలకాయుడు. ఆతని బలవేగములు గొప్పవి. అమృతమును ఆస్వాదించినవాడు. అతని శక్తి అప్రమేయము. యుద్ధములో దుర్జయుడై శత్రుసంహారము చేయును. వాయుతుల్య గతి కలవాడు. అట్టి గరుత్మంతుడు ఇంద్రుని కొరకై శ్రీ మహా విష్ణువుచే నీపై స్థాపింపబడినాడు. నీవు సర్వదా నాకు విజయమును ఇమ్ము. నా బలమును పెంచుము. అశ్వములు, కవచములు, ఆయుధములు వీటితో కూడిన నా యోధులను రక్షించి శత్రువులను కాల్చి భస్మము చేయుము.

కుముద, ఐరావత, పద్మ, పుష్పదంత, వామన, సుప్రతీక, అంజన, నీలులు అను ఎనిమిది గజరాజులు దేవయోనియందు పుట్టినవి. వీటి పుత్రపౌత్రులే ఎనిమిది వనములందు నివసించు చున్నవి. భద్ర, మంద్ర మృగ, సంకీర్ణ జాతీయ గజములు ప్రతి వనమునందు పుట్టుచున్నవి. ఓ

మహాగజములారా ! నీ జాతిని స్మరించుడు. వసువులు, రుద్రులు, ఆదిత్యులు, మరుద్గణములు మిమ్ములను రక్షించుగాక ! ఓ గజేంద్ర ! నీ నియమును పాటించి స్వామిని రక్షించుము. వజ్రధారియైన దేవేంద్రుడు ఐరావతమును ఎక్కి నీ వెనుకనే వచ్చు చున్నాడు. అతడు నిన్ను రక్షించుగాక. యుద్ధమునందు విజయముపొంది స్వస్థుడవై ముందుకు నడువుము. యుద్ధమునందు నీకు ఐరావతము వంటి బలము వచ్చుగాక. చంద్రుని నుండి కాంతిని, విష్ణువు నుండి బలమును, సూర్యుని నుండి తేజస్సును, వాయువు నుండి వేగమును, పర్వతము నుండి స్థిరత్వమును, రుద్రుని నుండి విజయమును, ఇంద్రుని నుండి యశమును పొందుము. దిగ్గజములు, దిక్కులు దిక్పాలకులు, యుద్ధమున నిన్ను రక్షింతురుగాక. గంధర్వ సహితులగు అశ్వికుమారులు అన్ని వైపుల నుండి నిన్ను రక్షింతురుగాక. మను, వసు, రుద్ర, వాయు, చంద్ర, మహర్షి, నాగ, కిన్నర,యక్ష, భూత, ప్రమథ, గ్రహ, ఆదిత్యులు, మాతృకా సహితుడగు భూతాధి పతియైన శివుడు, ఇంద్రుడు, దేవసేనాపతియైన కార్తికేయుడు, వరుణుడు నిన్ను అధిష్ఠించి ఉన్నారు. వారు సమస్త శత్రువులను భస్మము చేయుదురు గాక ! రాజు విజయము పొందుగాక !

ఓ పతాకా ! శత్రువులు నలువైపుల నుండి చేయు ఘాతక ప్రయోగములు నీ తేజస్సుచే కొట్టబడి నశించుగాక ! కాలనేమి–త్రిపుర సంహార యుద్ధములందును, హిరణ్య కశిపు యుద్ధము లందును, సకల దైత్య యుద్ధములందును, నీవు ఎట్లు ప్రకాశించితివో అట్లే నేడు ప్రకాశించుము. నీ ప్రతిజ్ఞను స్మరించుము. నల్లగను తెల్లగను ఉన్న నిన్ను చూచి రాజుశత్రువులు వెంటనే నశింతురు గాక ! వ్యాధులచేతను శస్త్రములచేతను పరాజితు లగుదురు గాక ! నీవు పూతన, రేవతి, లేఖాకాళరాత్రి మొదలగు పేర్లతో ప్రసిద్ధురాలవు. ఓ పతాకా ! నిన్ను ఆశ్రయించుచున్నాము. మా శత్రువులందరిని కాల్చివేయుము, సర్వమేధ మహాయజ్ఞమును, దేవదేవుడగు రుద్రుడు జగత్తు యొక్క సారముతో నిన్ను స్మరించినాడు. శత్రునాశకమగు ఓ ఖడ్గమా ! నీవు నారాయణుని, నందకమను ఖడ్గమునకు రెండవ మూర్తివను విషయమును స్మరింపుము. నీవు నీలకమల దళముతో సమానమగు శ్యామకృష్ణ వర్ణములు కలదానవు. దుస్వప్నములను నశింప చేయుదువు. పూర్వము బ్రహ్మ దేవుడు నీకు అసి, విషసనము, ఖడ్గము, తీక్ష్ణధారము, శ్రీ గర్భము, విజయము, ధర్మపాలము అను ఎనిమిది పేర్లు పెట్టినాడు. నీది కృత్తికా నక్షత్రము. మహేశ్వరుడు నీ గురువు. సువర్ణము నీ శరీరము. జనార్ధనుడు నీ దేవత. ఓ ఖడ్గమా ! శయనా నగర సహితుడగు రాజును రక్షింపుము. దేవ శ్రేష్ఠ డగు పితామహుడు నీకు తండ్రి నీవు సర్వదా మమ్ములను రక్షించుము.

ఓ కవచమా ! నీవు రణ భూమిలో కల్యాణ ప్రదము. ఓ నిష్పాపమా నేను నీ నుండి రక్ష పొందుటకు అర్హుడను. నన్ను రక్షింపుము. నీకు నమస్కారము, ఓ దుందుభీ నీవు ధ్వనిచే శత్రువుల హృదయములను కంపింపచేయుదువు. మా రాజసేనలకు విజయ వృద్ధిని చేయుము. మేఘధ్వనిచే ఉత్తమ గజములు సంతసించినట్లు నీ శబ్దముచే మాకు హర్షము కలుగుగాక ! మేఘగర్జనముచే స్త్రీలకు భయము కలుగునట్లు నీ ధ్వనిచే యుద్ధమునకు వచ్చిన నా శత్రువులు భయపడుదురు గాక! ఈ తంత్రములతో రాజోపకరణములను పూజించి వాటిని విజయకార్యమునకై వినియోగించ

వలెను. దైవజ్ఞుడు అగు రాజపురో హితుడు రక్షాబంధనాదుల ద్వారా రాజరక్షణము చేసి, ప్రతి సంవత్సరము విష్ణ్వాది దేవతలకును రాజునకును అభిషేకము చేయవలెను. (269)

విష్ణు పంజర స్తోత్రము

పుష్కరుడు పలికెను :

పూర్వము త్రిపుర సంహారోద్యుక్తుడగు శివుని రక్షకై బ్రహ్మ విష్ణు పంజర స్తోత్రమును ఉపదేశించెను. బలాసురుని చంపుటకై వెళ్లుచున్న ఇంద్రునకు దానిని బృహస్పతి ఉపదేశించెను. విజయ ప్రదమగు దాని స్వరూపము చెప్పెదను వినుము. 'నాకు తూర్పున చక్రధారియగు విష్ణువు, దక్షిణమున గదాధారియగు విష్ణువు, ఉత్తరమున ఖడ్గ ధారియగు విష్ణువు ప్రకాశిం చుచున్నాడు. విదిశలందు హృషీకేశుడు, వాటి మధ్యలందు జనార్దనుడు, భూమియందు, వరాహరూపధారియగు హరి, ఆకాశమున నరసింహుడు ఉండి నన్ను రక్షించుచున్నారు. చివర క్షురములు ఉన్న నిర్మలమగు ఈ సుదర్శన చక్రము తిరుగుచున్నది. ఇది ప్రేతను రాక్షసులను చంపుచు వెళ్లునపుడు దీని కిరణములవైపు ఎవ్వరును చూడజాలరు. సహస్రా ర్చులుగల ప్రజ్వలించుచున్న అగ్నితో సమానమైన ఈ గదరక్షో, భూత, పిశాచములను నశింప చేయును. వాసుదేవుని, శార్ఙ్గటంకారధ్వని నా శత్రువులను తిర్యక్, మనుష్య, కూష్మాండ, ప్రేతాదులను పూర్తిగా నశింపచేయుగాక ! శ్రీ మహావిష్ణువు యొక్క ఖడ్గధార యొక్క, ఉజ్జ్వలమగు వెన్నెలలో స్నానము చేసిన నా శత్రువులు, గరుత్మంతునిచే సర్పముల వలె వెంటనే శమింతురుగాక !

'కూష్మాండ, యక్ష, రాక్షస, ప్రేత, వినాయక, క్రూర మనుష్య, క్రూర పక్షి, సింహా దులును, సర్పాదులును, విష్ణువు యొక్క శంఖరవముచే కొట్టబడినవై సౌమ్యత్వమును పొందుగాక ! నా చిత్త వృత్తిని స్మరణ శక్తిని అపహరించువారును, నా బలతేజస్సులు నశింపచేయువారును నా కాంతిని తగ్గించువారు, భోగములను హరించువారును, శుభ లక్షణములను నశింపచేయువారును అగు కూష్మాండులు విష్ణు చక్రహతులై నశింతురు గాక ! దేవదేవుడైన వాసుదేవుని సంకీర్తనముచే నా మనోబుద్ధి, ఇంద్రియములకు స్వాస్థ్యము లభించుగాక ! నా వెనుకను, ఎదుటను, ఎడమ ప్రక్కను కోణ దిశలందును అంతటను జనార్దనుడగు హరి ఉండుగాక ! సర్వ పూజనీయుడును, ఎన్నటికిని చ్యుతుడు కానివాడును, అనంతరూపుడును, పరమేశ్వరుడును అగు జనార్దనుని పాదములకు నమస్కరించువాడు ఎన్నడును దుఃఖితుడుకాడు. శ్రీహరి పరమాత్మయైనట్లే కేశవుడు జగత్స్వ రూపుడుకూడ. ఈ సత్యముయొక్క ప్రభావముచేతను, అచ్యుతుని నామ సంకీర్తనము చేత, నా త్రివిధ పాపములు నశించుగాక !' (270)

వేదశాఖా కీర్తనము

పుష్కరుడు పలికెను :

సర్వానుగ్రాహకములగు వేదమంత్రములు నాల్గు పురుషార్థములను ఇచ్చును. ఋక్, యజుః, సామ, అథర్వములని వేదములు నాలుగు. వీటి మంత్రముల సంఖ్య ఒక లక్ష. ఋగ్వేదమునకు,

సాంఖ్యాయనము ఆశ్వలాయనమని రెండు శాఖలు. వీటిలో ఒక వెయ్యి ఋగ్వేద బ్రాహ్మణములలో రెండువేల మంత్రములు ఉన్నవి. కృష్ణ ద్వైపాయనాదులు ఋగ్వేదమును ప్రమాణముగా అంగీక రించిరి. యజుర్వేదమున పందొమ్మిది వందల తొంబది తొమ్మిది మంత్రములున్నవి. బ్రాహ్మణము లందు వెయ్యి మంత్రములు ఉన్నవి. శాఖలు ఎనుబది ఆరు. కాండ్వి, మాధ్యందినీ, కఠి, మైత్రాయణి, తైత్తరీయ, వైశంపాయనిక–మొదలగు శాఖలు యజుర్వేదమునందు వున్నవి. సామవేదమున కౌథుమ శాఖ అథర్వణా యణి శాఖ–అను రెండు శాఖలున్నవి. దీనిలో వేదము ఆరణ్యకము, ఉక్థకము, ఊహము–అను నాలుగు గానములున్నవి. సామ వేదములో తొమ్మిదివేల నాలుగు వందల ఇరువది ఐదు మంత్రములు వున్నవి. ఇవి బ్రహ్మకు సంబంధించినవి. ఇది సామవేద మానము.

సుమంతువు–జాజలి–శ్లోకాయణీ–శౌనకుడు పిప్పలాదుడు ముంజకేశుడు, మొదలగు వారు అధర్వ వేదమునకు శాఖా ప్రవర్తకులగు ఋషులు. దీనిలో పదహారువేల మంత్ర ములు నూరు ఉపనిషత్తులు వున్నవి. శ్రీ మహావిష్ణువు వ్యాసరూపమున అవతరించి వేదశాఖా విభాగమును చేసెను. వేదశాఖా భేదాదులు ఇతిహాసములు పురాణములు. ఇవన్నియు విష్ణు స్వరూపములు. లోమహర్షణుడను సూతుడు, వ్యాసుని నుండి పురాణా దులు గ్రహించి, ప్రచారముచేసెను. ఆతనికి సుమతి అగ్ని వర్చసుడు, మిత్రము శింశపాయనుడు, కృతవ్రతుడు, సావర్ణి–అను ఆరుగురు శిష్య లుండిరి. శింశపాయనాదులు పురాణ సంహితను రచించిరి. శ్రీ మహావిష్ణువే బ్రహ్మాది అష్టాదశ పురాణముల రూపము నను అష్టాదశ విద్యారూపమునను ఉన్నాడు. సప్రపంచ, నిష్ప్రపంచ, మూర్తామూర్త, స్వరూపధారియగు శ్రీమహావిష్ణువు అగ్ని పురాణరూపమున నున్నాడు. అతనిని తెలుసుకొని పూజించి స్తుతించినచో భుక్తిముక్తులు లభించును. విజయశీలుడగు విష్ణువు ప్రభావ సంపన్నుడు. అగ్ని సూర్యాది రూపముననున్నవాడు. ఆ విష్ణువే అగ్నిరూపమున దేవతాదుల ముఖముగ నున్నాడు. ఆతడే పరమగతి. వేద పురాణములందు యజ్ఞమూర్తిగ వర్ణింపబడు చున్నాడు. ఈ అగ్ని పురాణము విష్ణువు యొక్క మహత్తర రూపము. ఈ అగ్ని మహా పురాణమునకు కర్తయు శ్రోతయు కూడ జనార్దనుడే. అందుచే ఈ అగ్ని మహాపురాణము సర్వవేదమయము, సర్వ విద్యామయము, సర్వ జ్ఞానమయము, పుణ్యము శ్రేష్ఠము. చదువు వారికిని వినువారికిని సర్వాత్ముడగు శ్రీహరియే స్వరూపము. ఈ పురాణము విద్యార్థులకు విద్యను ధనార్థులకు ఐశ్వర్యమును, రాజ్యార్థులకు రాజ్యమును, ధర్మకాములకు ధర్మమును, స్వర్గకాములకు స్వర్గమును, పుత్రకాములకు పుత్రులను, గనాదికాములకు గోవులను, గ్రామ కాములకు గ్రామములను ఇచ్చును. కామార్థులకు సర్వ సౌభాగ్యములను, గుణకీర్తులను ఇచ్చును. జయకాములకు జయమును, సర్వకాములకు సర్వమును ముక్తి కోరువారికి ముక్తిని ఇచ్చును. పాపములు చేసిన వారికి పాపములు తొలగించును. (271)

దానాది మాహాత్మ్యము

పుష్కరుడు పలికెను :

పూర్వము మరీచికి చెప్పిన ఏబదివేల శ్లోకములుగల బ్రహ్మపురాణమును వ్రాసి, బ్రాహ్మణునకు దానము చేయవలెను. స్వర్గకాముడు వైశాఖ పూర్ణిమనాడు జల ధేనువుతో కూడ బ్రహ్మ పురాణ

దానము చేయవలెను. పన్నెండువేల శ్లోకములుగల పద్మ పురాణమును ధేనువుతో జ్యేష్ఠ మాసమున దానము చేయవలయును. పరాశరుడు, వరాహకల్ప వృత్తాంతమును, ఇరువదిమూడు వేల శ్లోకములుగల విష్ణు పురాణముగ రచించెను. దీనిని ఆషాఢ మాసమున జలధేనువుతో దానముచేసిన వాడు విష్ణుపదమును పొందును. పదునాలుగువేల శ్లోకములుగల వాయుపురాణము హరికి ప్రియ మైనది. దీనిలో వాయుదేవుడు శ్వేత కల్ప ప్రసంగముచే ధర్మమును చెప్పెను. ఈ పురాణమును వ్రాయించి శ్రావణ మాసమున గుడధేనువుతో బ్రాహ్మణునకు దానము చేయవలయును. గాయత్రిని ఆధారముగ తీసుకుని విస్తృతముగ భాగవత ధర్మములు బోధించిన సారస్వత కల్ప సంబద్ధమగు నదియు, వృత్రాసురవధ కలదియగు భాగవతమున పదునెనిమిదివేల శ్లోకములు ఉన్నవి. దీనిని బంగారు సింహాసనముతో భాద్రపద మాసమున దానము చేయవలయును. బృహ త్కల్పమునకు సంబంధించిన ధర్మములను దేనియందు బోధించెనో ఇరువది ఐదువేల శ్లోకములుగల ఆ పురాణము నారదపురాణము. దీనిని ధేను సహితముగా ఆశ్వీయుజ మాసమున దానముచేసినవాడు పరిపూర్ణ సిద్ధిని పొందును, ఏ పురాణమున పక్షులు ధర్మాధర్మ విచారణ చేసినవో నవ సహస్ర శ్లోకములు గల ఆ మార్కండేయ పురాణమును కార్తీకమాసమున దానము చేయవలయును. అగ్ని వశిష్ఠునకు చెప్పిన పురాణము ఆగ్నేయము. దీనిని వ్రాసి మార్గశీర్షమున బ్రాహ్మణునకు దానము చేసినచో సర్వఫలములు లభించును. దీనిలో పన్నెండువేల శ్లోకములున్నవి. అన్ని విద్యలును బోధించును. భవిష్య పురాణము సూర్య సంభవము. పదునాలుగువేల శ్లోకములుగలది. శివుడు మనువునకు చెప్పెను. పుష్యమాసమున గుడాదులతో దీనిని దానము చేయవలయును.

సావర్ణి బ్రహ్మవైవర్త పురాణమును నారదునకు చెప్పెను. దీనిలో రథంతర కల్ప వృత్తాంతము వున్నది. పదునెనిమిది వేల శ్లోకములుగల దీనిని మాఘ మాసమున దానము చేయవలయును. వరాహచరితము చెప్పు వరాహపురాణమును కూడ మాఘమాసమున దానము చేసినవాడు బ్రహ్మ లోకము పొందును. అగ్ని మయమగు లింగము నందున్న మహేశ్వరుడు ఆగ్నేయకల్పము నందలి వృత్తాంతములతో కూడిన ధర్మమును బోధించిన పన్నెండు వేల శ్లోకములుగల లింగ పురాణమును తిలధేనుసహితముగ ఫాల్గుణ మాసమున దానము చేసినవాడు శివలోకమును పొందును. విష్ణువు భూ దేవికి మానవ ప్రవృత్తి మొదలు వరాహచరితమును చెప్పిన వరాహపురాణమున ఇరువది నాలుగువేల శ్లోకములు వున్నవి. చైత్రమున సువర్ణముతో గరుడపురాణమును దానముచేసినవాడు విష్ణుపదమును పొందును. స్కంద పురాణమున ఎనుబది నాలుగువేల శ్లోకములున్నవి. కుమారస్వామి తత్పురుష కల్పకథను శైవమతమును ఆధారముగగొని ఈ పురాణమును చెప్పెను. దీనిని కూడ చైత్రమున దానము చేయవలయును. పదివేల శ్లోకములున్న వామన పురాణమున ధౌమకల్పము నందలి విష్ణు చరిత్రమును బోధించబడినది. దానిని పూర్ణిమ నాడు విషువ సంక్రాంతి సమయమున దానము చేయవలయును. ఇది ధర్మార్థాది బోధకము. కూర్మ పురాణమున ఎనిమిదివేల శ్లోకము లున్నవి. కూర్మమూర్తియగు విష్ణువు ఇంద్రద్యుమ్న కథా ప్రసంగమున దీనిని పాతాళమునందు చెప్పెను. సువర్ణఖచ్ఛముతో దీనిని దానము చేయవలెను. మత్స్యరూపియగు విష్ణువు కల్పాదియందు పదమూడువేల శ్లోకములుగల మత్స్య పురాణమును మనువుకు చెప్పెను. బంగారముతో నిర్మించిన

మత్స్యముతో కలిపి దీనిని దానముచేయవలెను. శ్రీ మహావిష్ణువు తార్క్ష్య కల్పమునందు ఎనిమిదివేల శ్లోకములుగల గరుడపురాణమును బోధించెను. విశ్వాండమునుండి గరుత్మంతుని పుట్టుకకు సంబంధించిన కథ దీనిలో చెప్పబడినది. దీనిని స్వర్ణహంసతో కూడ దానము చేయవలెను. బ్రహ్మదేవుడు బ్రహ్మాండ మాహాత్మ్యమును గూర్చి చెప్పిన పండ్రెండు వేల శ్లోకములుగల బ్రహ్మాండ పురాణమును గూడ బ్రాహ్మణునకు దానము చేయవలయును.

మహాభారత శ్రవణ సమయమున ప్రతి పర్వసమాప్తి యందును వస్త్రగంధ మాల్యాదులతో ముందుగా పౌరాణికుని పూజించవలయును. పిదప బ్రాహ్మణులకు పాయసముతో భోజనము పెట్టవలెను. ఒక్కొక్క పర్వము పూర్తియైనపుడు గో, భూమి, గ్రామ సువర్ణాదులను దానము చేయవలయును. మహాభారతము పూర్తియైన పిమ్మట బ్రాహ్మణునకును మహా భారత సంహితకును పూజచేయవలయును. గ్రంథమును పవిత్ర స్థానమందుంచి దానికి పట్టు వస్త్రముచుట్టి పూజించవలెను. పిదప నరనారాయణులను పుష్పాదులతో పూజించవలయును. గో, అన్న, భూమి, సువర్ణాదులు, దానముచేసి బ్రాహ్మణులకు భోజనము పెట్టి క్షమాప్రార్థన చేయవలయును. పౌరాణికులకు మహా దానములు వివిధ రత్నములు ఇవ్వవలెను. ప్రతి మాసమునందును ఆతనికి రెండు లేక మూడు మాషముల సువర్ణమును ఇచ్చి, ఆయన ప్రారంభమున కూడ ముందుగా ఆతనికి సువర్ణ దానము చేయవలయును. ఓ ద్విజ శ్రేష్ఠా ! శ్రోతలందరును కూడ పౌరాణికుని పూజించవలయును. ఇతిహాసములను, పురాణములను పూజించి దానము చేయువాడు ఆయురారోగ్య స్వర్గ మోక్షములను పొందును. (272)

సూర్యవంశ వర్ణనము

అగ్నిదేవుడు పలికెను :

ఇపుడు సూర్య వంశమును గురించి, ఇతర రాజవంశములను గూర్చి చెప్పెదను. మహావిష్ణువు నాభి కమలము నుండి బ్రహ్మ ఆవిర్భవించెను. బ్రహ్మ కుమారుడు మరీచి. మరీచి కుమారుడు కశ్యపుడు. ఆతని కుమారుడు వివస్వంతుడు. ఆతనికి సంజ్ఞ, రాజ్ఞి, ప్రభయను ముగ్గురు భార్యలుండిరి. రాజ్ఞి రైవతకుని పుత్రి. ఆమె రేవంతుడను కుమారుని కనెను. ప్రభ ప్రభాతుడను పుత్రుని, త్వష్టకుమార్తెయైన సంజ్ఞ మనువుయను పుత్రుని యమున, యముడు అను కవలలను కనెను. ఛాయ అను నామాంతరముగల సంజ్ఞ సావర్ణ్య మనువును, శనిని, తపతి, విష్టి అను కన్యలను కనెను. పిదప సంజ్ఞకు అశ్వినీ కుమారులు జన్మించిరి. వైవస్వత మనువుకు ఆతనితో సమానులగు పదిమంది కుమారులు పుట్టిరి. ఇక్ష్వాకువు, నాభాగుడు, ధృష్టుడు, శర్యాతి, నరిష్యంతుడు, ప్రాంశవు, నృగుడు, దిష్టుడు, కరూశుడు, పృషధ్రుడు అను ఈ పదిమంది మహా బలులును అయోధ్యలో నివసించిరి. మనువునకు ఇల అను కన్య పుట్టెను. ఆమెయందు బుధునకు, పురూరవుడు పుట్టెను. పురూరవుని కనిన పిమ్మట ఆ ఇలసుద్యుమ్నుడిగా మారిపోయెను. సుద్యుమ్నునకు ఉత్కలుడు, గయుడు వినతాశ్వుడు అను రాజులు జన్మించిరి. ఉత్కలునకు ఉత్కలము రాజ్యము అయ్యెను. పశ్చిమదేశము వినతాశ్వుల రాజ్యమాయెను. రాజశ్రేష్ఠుడైన గయునకు పూర్వ దిక్కున

అధికారము లభించెను. ఆతని రాజధాని గయాపురి. వశిష్ఠుని వాక్యము ప్రకారము సుద్యుమ్నుడు ప్రతిష్ఠానపురము చేరెను. అచట రాజ్యమును పొంది దానిని పురూరవసునకు ఇచ్చెను. నరిష్యంతుని పుత్రునకు శకులను పేరు. నాభాగునకు విష్ణు భక్తుడగు అంబరీషుడు జన్మించెను. అతడు ప్రజలను బాగుగ పరిపాలించెను. ధృష్టుని నుండి ధాష్ట్రక వంశము విస్తరించెను. శర్యాతికి సుకన్య, ఆనర్తుడు జనించిరి. ఆనర్తునకు రేవుడు జనించెను. ఆతని దేశము ఆనర్త దేశము. కుశస్థలి ఆతని రాజధాని. రేవునకు రైవతుడు జనించెను. ధార్మికుడైన అతనికి కకుద్మి అని కూడ పేరు. తన తండ్రి నూర్గురు కుమారులలో ఇతడు జ్యేష్ఠుడగుటనే కుశస్థలి రాజ్యము ఆతనికి లభించెను.

ఒకనాడు అతడు కన్యాసహితుడై బ్రహ్మ దగ్గరకు వెళ్ళి అచట సంగీతమును విను చుండెను. అచట బ్రహ్మకు ముహూర్త మొకటి మాత్రమే గడచెను. అంతలో మర్త్య లోక మున అనేక యుగములు సమాప్తమాయెను. అతడు శీఘ్రముగ యాదవులతో కూడిన తన నగరమునకు వచ్చెను. అచట కుశస్థలి స్థానమున అనేక ద్వారములు కలది, మనోహర మైనదియగు ద్వారవతీ పట్టణము నిర్మితమై యుండెను. వాసుదేవుడు నాయకులుగాగల భోజవృష్ణి అంధకులు దానిని రక్షించుచుండిరి. రేవతిని బలరామునకు ఇచ్చి సంసారమును అనిత్యవిషయమును తెలుసుకొని సుమేరు పర్వత శిఖరమున తపస్సుచేసి విష్ణుపదమును చేరెను. నాభాగుని యిద్దరు పుత్రులు వైశ్యులు. వారు బ్రాహ్మణత్వమును పొందిరి. కరూ షునకు యుద్ధోన్మత్తులగు కరూషులు అను క్షత్రియులు జనించిరి. వృషధ్రుడు గురువుయొక్క గోవును హింసించుటచే శూద్రుడాయెను. మనుపుత్రుడైన ఇక్ష్వాకునకు దేవరాజుయైన 'వికుక్షి' పుట్టెను. వికుక్షి పుత్రుడు కకుత్సుడు. అతని పుత్రుడు సుయోధనుడు, అతని పుత్రుడు పృథువు, అతని పుత్రుడు విశ్వగాశ్వుడు, అతని పుత్రుడు వాయువు. వాని పుత్రుడు యవనాశ్వుడు, యవనాశ్వుని కుమారుడైన శ్రావంతుడు తూర్పు దిక్కున శ్రావం తికా పురమును నెలకొల్పెను. అతని పుత్రుడు బృహదశ్వుడు, వాని కుమారుడు కువలా శ్వుడు. ఇతడు పూర్వము దుంధు అను రాక్షసుని చంపుటచే దుంధుమారుడను పేరు పొందెను. ఆతనికి దృఢాశ్వుడు. దండుడు, కపిలుడు, అను ముగ్గురు రాజులు జన్మించిరి. దృఢాశ్వునకు హర్యశ్వుడు, ప్రమోదకుడు యను పుత్రులు పుట్టిరి. హర్యశ్వుని కుమారుడు నికుంభుడు. ఆతని కుమారుడు సంహతాశ్వుడు. సంహతాశ్వునకు అకృషాశ్వుడు, రణాశ్వుడుయను పుత్రులు పుట్టిరి. రణాశ్వుని పుత్రుడు యువనా శ్వుడు. ఆతని పుత్రుడు మాంధాత. ఆతనికి పురుకుత్సుడు, ముచికుందుడు అను పుత్రులు పుట్టిరి.

పుకుత్సునకు నర్మదయందు త్రసద్దస్యుడు అనువాడు సంభూతుడను నామాంతరము గల పుత్రుడు పుట్టెను. సంభూతుని కుమారుడు సుధన్వ. ఆతని పుత్రుడు త్రిదన్వ. ఆతని పుత్రుడు తరుణుడు. ఆతని పుత్రుడు సత్యవ్రతుడు. ఆతని పుత్రుడు సత్యరథుడు. ఆతనికి హరిశ్చంద్రుడు, ఆతనికి రోహితాశ్వుడు, ఆతనికి వృకుడు, ఆతనికి బాహువు ఆతనికి సగరుడు పుట్టెను. సగరుని ప్రియురాలగు ప్రభ ఔర్వముని ప్రసాదముచే అరువది వేల పుత్రులను కనెను. రెండవ భార్యయైన భానుమతికి అసమంజసుడను ఒక కుమారుడు జనించెను. సగరుని అరువది వేల మంది కుమారులును భూమిని త్రవ్వుచు కపిలునిచే చేయబడిరి. అసమంజసుని కుమారుడు అంశు మంతుడు. ఆతని కుమారుడు దిలీపుడు. ఆతనికి గంగను భూలోకమునకు తీసుకునివచ్చిన

భగీరథుడను కుమారుడు పుట్టెను. అతనికి నాభాగుడు, ఆతనికి అంబరీషుడు, ఆతనికి సింధుద్వీపుడు వానికి శ్రుతాయువు, వానికి ఋతుపర్ణుడు, వానికి కల్మాషపాదుడు, వానికి సర్వకర్మ, వానికి అనరణ్యుడు; వానికి నిఘ్నుడు, వానికి దిలీపుడు, వానికి రఘువు, వానికి అజుడు, వానికి దశరథుడు పుట్టెను. దశరథునకు నారాయణ స్వరూపులగు నలుగురు కుమారులు పుట్టిరి. వారిలో జ్యేష్ఠుడు రాముడు. రావణాంతకుడైన ఆ రఘూత్తముడు అయోధ్యకు రాజాయెను. ఆతని చరిత్రమును నారదుని నుండి వినివాల్మీకి రామాయణముగ రచించెను. రామునకు సీత యందు, కులవర్ధనులగు కుశలవులు జన్మించిరి. కుశునకు అతిథి, ఆతనికి నిషధుడు ఆతనికి నలుడు, ఆతనికి నభుడు, ఆతనికి పుండరీకుడు, ఆతనికి సుధన్వుడు, ఆతనికి దేవానీకుడు, ఆతనికి అహీనాశ్వుడు, ఆతనికి సహస్రాశ్వుడు, ఆతనికి చంద్రాలోకుడు, ఆతనికి తారాపీడుడు, ఆతనికి చంద్రపర్వతుడు. ఆతనికి భానురథుడు, ఆతనికి శ్రుతాయువు జన్మించెను. ఇక్ష్వాకు వంశీయులు అందరును సూర్య వంశ ప్రవర్తకులుగా చెప్పబడుదురు. (273)

సోమ (చంద్ర) వంశ వర్ణనము

అగ్నిదేవుడు చెప్పెను :

ఇపుడు పఠించినచో పాపములను నశింపచేయు చంద్రవంశమును గూర్చి చెప్పెదను. విష్ణు నాభి కమలము నుండి బ్రహ్మ పుట్టెను. బ్రహ్మపుత్రుడు అత్రి, ఆతనికి సోముడు పుత్రుడు. అతడు రాజసూయయాగము చేసి త్రిలోక రాజ్యమును దక్షిణగా ఇచ్చివేసెను. అవభృథస్నానము సమాప్తమైన పిమ్మట అతని రూపమును చూడగోరి తొమ్మండుగురు దేవతా స్త్రీలు ఆతని దగ్గరకు వచ్చి కామబాణ సంతప్తలై ఆతనిని సేవించిరి. నారాయణుని విడిచి లక్ష్మియు, కర్దముని విడిచి సినీవాలి, అగ్నిని విడిచి ద్యుతి, అవ్యయుడగు ధాతను విడిచి పుష్టి, ప్రభాకరురుని విడచి ప్రభ, హవిష్మంతుని విడచి కుహు, వీరందరు స్వయముగ సోముని దగ్గరకు వచ్చిరి. భర్తయగు జయంతుని విడిచి కీర్తి, మరీచి పుత్రుడగు కశ్యపుని విడిచి వసువు, పతియైన నందిని విడిచి ధృతియు వచ్చి సోముని సేవించిరి. చంద్రుడుకూడ వారలను స్వకీయ స్త్రీలనువలె కామించెను. ఈ విధముగా అపచారము చేసిన ఆతని విషయమున ఆ స్త్రీల భర్తలు శాపములచేతగాని, శస్త్రాదులచేతగాని శిక్షించుటకు సమర్థులు కాకపోయిరి. సోముడు తన తపోబలముచే సప్తలోకములకు ఏకమాత్రాధిపతి యయ్యెను. ఈ దుర్వినీతిచే కలుషితమైన ఆతని బుద్ధి వినయ విహీనమై భ్రాంతిచెందెను. ఆతడు అంగిరా నందనుడగు బృహస్పతిని అవమానించి ఆతని భార్యయగు యశస్వినియైన తారను బలాత్కారముగ అపహరించెను. అందుచే దేవదానవుల మధ్య తారకామయము అను ప్రసిద్ధిగల లోక క్షయకరమగు గొప్పయుద్ధము జరిగెను. అంతమున బ్రహ్మ శుక్రుని అడ్డగించి తారను బృహస్పతికి ఇప్పించెను. ఆమె గర్భవతి అని తెలిసి బృహస్పతి ఈ గర్భమును విడువుమియని ఆజ్ఞాపించగ ఆమె ఆ గర్భమును విడిచెను. అపుడు తేజశ్శాలి యగు కుమారుడు ఆవిర్భవించి నేను సోముని పుత్రుడను అని చెప్పెను. ఈ విధముగ సోమునకు బుధుడను పుత్రుడు కలిగెను. ఆతనికి పురూరవుడు పుత్రుడు. ఊర్వశి అను అప్సరస స్వర్గము విడచి పురూరవుని వరించెను.

పురూరవుడు ఊర్వశితో ఏబది తొమ్మిది సంవత్సరములు విహరించెను. పూర్వము ఒకే అగ్ని వుండెడిది. పురూరవుడు ఆ అగ్నిని మూడుగా విభజించెను. మహాయోగియగు ఆతడు గంధర్వ లోకము చేరెను. పురూరవునకు ఊర్వశియందు ఆయు, దృఢాయు, అశ్వాయు, ధనాయు, ధృతిమత్, వసు, దివిజాత, శతాయు అను ఎనమండుగురు పుత్రులు పుట్టిరి. ఆయువునకు నహుషుడు, వృద్ధశర్మ, రజి, దంభుడు, విపాప్మ అను ఐదుగురు పుత్రులు పుట్టిరి. రజికి రాజేయులని ప్రసిద్ధిచెందిన నూర్గురు పుత్రులు జనించిరి. రజికి విష్ణువు వరములను ఇచ్చెను. దేవతలు ప్రార్థింపగ, ఆతడు దేవాసుర యుద్ధమునందు దైత్యులను చంపెను. తనకు పుత్రుడుగా జన్మించిన ఇంద్రునకు రాజ్యము ఇచ్చి రజి స్వర్గము చేరెను. కొంతకాలము తరవాత రజి కుమారులు ఇంద్రుని రాజ్యమును లాగు కొనగ అతడు దుఃఖితుడయ్యెను. పిదప బృహస్పతి గ్రహశాంత్యాది విధులచే రజిపుత్రులను మోహింప చేసి రాజ్యము తీసుకొని మరల యింద్రునకు ఇచ్చెను. అపుడు రజికుమారులు ధర్మ భ్రష్టులైరి. నహుషునకు, యతి, యయాతి, ఉత్తమ, ఉద్ధవ, పంచక, శర్యాతి, మేఘపాలకులను ఏడుగురు కుమారులు జనించిరి. యతి బాల్యమునందే విష్ణు ధ్యానము చేసి విష్ణు పదమును పొందెను. శుక్రుని కుమార్తెయైన దేవయానియు, వృషపర్వుని కుమార్తెయైన శర్మిష్ఠయు యయాతి భార్యలైరి. వీరియందు యయాతికి ఐదుగురు కుమారులు జనించిరి. దేవయాని, యదు, తుర్వసు అనువారిని కనెను. శర్మిష్ఠ ధృహ్యుడు అను, పూరుడు అను ముగ్గురు పుత్రులను కనెను. వీరిలో యదు-పూరువులు సోమవంశ వర్ధకులైరి. (274)

యదువంశ వర్ణనము

అగ్నిదేవుడు పలికెను :

యదువునకు నీలాంజికుడు, రఘువు, క్రోష్టు, శతజిత్, సహస్రజిత్ అను ఐదుగురు పుత్రులు జన్మించిరి. వారిలో సహస్రజిత్ జేష్ఠుడు. శతజిత్తునకు హైహయుడు, రేణు హయుడు, హయుడు అని ముగ్గురు పుత్రులు పుట్టిరి. హైహయునకు ధర్మనేత్రుడు వానికి సంసాతుడు, వానికి మహిముడు, వానికి భద్రసేనుడు, వానికి దుర్గముడు, వానికి కదు జన్మించిరి. కనకునకు కృతవీర్య, కృతాగ్ని, కరవీర, కృతౌజులను పుత్రులు జన్మించిరి. కృతవీర్యుని కుమారుడు అర్జునుడు. ఆతని తపస్సుకు ప్రసన్నుడైన దత్తాత్రేయుడు ఆతనికి సప్తద్వీప పరివృతమగు పృథ్విపై ఆధిపత్యమును, వెయ్యి భుజములను యుద్ధమునందు అజేయత్వమును వరముగ ఇచ్చి 'నీవు ఎప్పుడు అధర్మము చేయుదువో అపుడు శ్రీమహా విష్ణువు నిన్ను సంహరించును' అని చెప్పెను. అర్జునుడు పదివేల యజ్ఞములు చేసెను. అతనిని స్మరించగనే రాష్ట్రములో ఎవరికిని ధన నాశనము కలుగకుండెను. యజ్ఞదాన, తపఃపరాక్రమ, శాస్త్రజ్ఞానములందు కృతవీర్య కుమారుడగు అర్జునునకు సాటి ఎవ్వరును లేరు. ఆతనికి ఐదువందల పుత్రులు జనించిరి. వారిలో శూరసేన, శూర, ధృష్టోక్త, కృష్ణ, జయధ్వజులు అను ఐదుగురు ప్రధానులు. జయధ్వజుడు అవంతీ దేశరాజాయెను. అతనికి తాలజంఘుడు పుత్రుడు. తాలజంఘునకు అదే పేరుతో ప్రసిద్ధులగు చాలమంది పుత్రులు జనించిరి. హైహయవంశ క్షత్రియు లలో భోజ, అవంతీ, వీతిహోత్ర, స్వయం సంజాత, శౌండికేయులను ఐదు కులములు ఉండెను. వీతిహోత్రునకు అనంతుడు అతనికి దుర్జయుడు జన్మించెను.

ఇపుడు క్రోష్టు వంశమును గూర్చి చెప్పెదను, ఈ వంశమున శ్రీమహావిష్ణువు స్వయముగ జన్మించెను. క్రోష్టునకు వృజినీ వంతుడు అతనికి స్వాహా, వానికి రుషద్గుడు, అతనికి చిత్రరథుడు ఆతనికి చక్రవర్తియైన శశిబిందువు జనించిరి. శశిబిందువు సర్వదా విష్ణుభజనసక్తుడై యుండెను. ఆతనికి పదివేలమంది పుత్రులు పుట్టిరి. వారందరును అధిక ధనవంతులు తేజశ్శాలులు అయి వుండిరి. వారిలో పృథుశ్రవుడు జ్యేష్టుడు. అతని కుమారుడు సుయజ్ఞుడు. అతనికి ఉశనుడు ఆతనికి తితిక్షువు, ఆతనికి మరుత్తుడు, ఆతనికి ఋక్మ కవచుడను కంబలబర్హిశుడు పుట్టెను. ఋక్మ కవచునకు ఋక్మేశువు, పృథు రుక్మకుడు, హవి, జ్యామగుడు, పాపఘ్నుడు మొదలగు ఏబదిమంది పుత్రులు జన్మించిరి. వీరిలో జ్యామగుడు స్త్రీలకు లొంగినవాడై యుండెను. వానికి శైబ్యయందు విదర్భుడు అను కుమారుడు పుట్టెను. ఆతనికి కౌశికుడు లోమపాదుడు క్రథుడు అను పుత్రులు పుట్టిరి. వీరిలో లోమపాదుడు జ్యేష్ఠుడు. ఆతనికి కృతి అను పుత్రుడు పుట్టెను. కౌశికుని పుత్రుడు చిది. ఈ వంశమువారు చైద్యులు అనుపేరుతో ప్రసిద్ధులు. విదర్భ పుత్రుడగు పృథునకు కుంతి, కుంతికి ధృష్టకుడు పుట్టిరి. వానికి ధృతి, వానికి విదూరథుడు, పుట్టిరి. విదూరథునకు దశార్హుడనికూడ పేరు. దశార్హునకు వ్యోముడు, వానికి జీమూతుడు వానికి వికలుడు వానికి బీమరథుడు, వానికి నవరథుడు, వానికి ధ్రుధరథుడు, వానికి శకుంతి, వానికి కరంభుడు, వానికి దేవరాతుడు, వానికి దేవక్షేత్రుడు, వానికి మధువు, వానికి ద్రవరసుడు, వానికి పురుహూతుడు, వానికి జంతువు, వానికి సాత్వతుడు పుట్టెను. సాత్వతుడు యదువంశీయులలో ఉత్తమ గుణవంతుడగు రాజు. ఆతనికి భజమానుడు, వృష్ణి, అంధకుడు, దేవావృధుడు అను నలుగురు పుత్రులు పుట్టిరి. ఈ నలుగురి వంశములును ప్రసిద్ధములైనవి. భజమానునకు బాహ్యుడు, వృష్టి-కృమి, నిమి, అను పుత్రులు పుట్టిరి. దేవావృధునకు బభ్రువు పుట్టెను. ఆతని విషయమున ఈ శ్లోకము చెప్పబడుచున్నది. 'మనము దూరము నుండి సద్గుణములను ఎట్లు వినుచున్నామో, దగ్గర నుండి కూడ అట్లే చూచు చున్నాము. బభ్రువు మనుష్యులలో శ్రేష్ఠుడు. దేవావృధుడు దేవతా సమానుడు'. బభ్రువునకు కుమారుడు భజమానుడు శిని, కంబలబర్హిషుడు అను వాసుదేవ భక్తులగు నలుగురు కుమారులు పుట్టిరి.

కుమారునకు ధృష్ణువు వానికి ధృతి వానికి కపోతరోముడు వానికి తిత్తిరి వానికి నరుడు వానికి ఆనక దుందుభి పుట్టిరి. ఆనక దుందుభికి పునర్వసువు ఆతనికి ఆ హుకీ పుత్రుడగు ఆ హుకుడు పుట్టెను. ఆ హుకునకు దేవక ఉగ్రసేనులు పుత్రులు. దేవకునకు దేవవంతుడు ఉపదేవుడు సహదేవుడు దేవరక్షితుడు అను నలుగురు పుత్రులు పుట్టిరి. వీరికి ఏడుగురు సోదరీలు ఉండిరి. వారిని వసుదేవుడు వివాహమాడెను. దేవకి, శ్రుతదేవి, మిత్రదేవి, యశోధర, శ్రీదేవి, సత్యదేవి, సురాపి అని వీరి పేర్లు. ఉగ్రసేనునకు కంస, న్యగ్రోధ, సునామ, కంక, శంకు, సుతను, రాష్ట్రపాల, యుద్ధముష్టి, సుముష్టికులను అను ఎనమండుగురు పుత్రులు పుట్టిరి. వీరిలో కంసుడు జ్యేష్ఠుడు. భజమానునకు ఉత్తమ రథికుడైన విదూరథుడు అతనికి రాజాధి దేవశూరులు పుట్టిరి. రాజాధి దేవునకు శోణాశ్వుడు, శ్వేతవాహనుడు అను ఇరువురు పుత్రులు జన్మించిరి. శోణాశ్వునకు శని శత్రుజిత్, మొదలగు ఐదుగురు పుత్రులు జన్మించిరి. శమికి ప్రతిక్షేత్రుడు, వానికి భోజుడు, వానికి హృదికుడు జన్మించిరి. హృదికుని పదిమంది పుత్రులలో కృతవర్మ, శతధన్వుడు, దేవార్హుడు,

భీషణుడు మొదలగువారు ప్రధానులు. దేవార్హునకు కంబలబర్హి ఆతనికి అస మౌజుడు, ఆతనికి సుదౌష్ట్ర, సువాస, ధృష్టులు జన్మించిరి. ధృష్టునకు గాంధారి, మాద్రియను ఇద్దరు భార్యలుండిరి. గాంధారియందు సుమిత్రుడు, మాద్రియందు యుధాజిత్తు పుట్టిరి. ధృష్టునకు అనమిత్రుడు శిని పుట్టిరి. శినికి దేవమీఢుషుడు జనించెను. అనమిత్రునకు నిఘ్నుడు ఆతనికి ప్రసేన–సత్రాజిత్తులు పుట్టిరి. సోదరుడగు సత్రాజిత్తుకు సూర్యుని నుండి లభించిన శ్యమంతక మణిని ధరించి ప్రసేనుడు వేటకై వెళ్లగా ఒక సింహము అతనిని చంపి మాణిక్యమును గ్రహించెను. ఆ సింహమును చంపి జాంబవంతుడు ఆ మణిని తీసుకొనెను. పిదప శ్రీ కృష్ణుడు యుద్ధమునందు జాంబవంతుని ఓడించి జాంబవతిని ఆ మణిని స్వీకరించి ద్వారకాపురికి తిరిగివచ్చి మణిని సత్రాజిత్తుకు ఇచ్చివేసెను. శతధన్వుడు సత్రాజిత్తును చంపివేసెను. శ్రీకృష్ణుడు శతధన్వుని చంపి ఆ మాణిక్యమును లాగుకొని యశశ్శాలి అయ్యెను. ఆతడు బలరామాది యదువంశీయుల సమక్షమున ఆ మణిని అక్రూరునకు ఇచ్చెను. దీనితో శ్రీకృష్ణునిపై వచ్చిన మిథ్యారోపము తొలగి పోయెను. ఈ కథను చదువువానికి స్వర్గము లభించును. సత్రాజిత్తునకు బంకకారుడను పుత్రుడు శ్రీకృష్ణుని భార్యయగు సత్యభామయు జనించిరి. అపమిత్రునకు శిని వానికి సత్యకుడు వానికి యుయుధానుడు అను నామాంతరముగల సాత్యకి, వానికి ధుని, వానికి యుగంధరుడు పుట్టిరి. యుధాజిత్తునకు స్వాహ్యుడు వానికి ఋషభ, క్షేత్రకులు పుట్టిరి. ఋషభునకు స్వఫల్కుడు, వానికి అక్రూరుడు, వానికి సుధన్వకుడు పుట్టిరి. శూరునకు వసుదేవుడు మొద లగు పుత్రులు పృథయను కన్యయు పుట్టిరి. ఆమె పాండురాజు నకు భార్య. కుంతియను నామాంతరముగల ఆమెకు (పృథ) యముని అంశముచే యుధిష్టిరుడు, వాయు అంశముచే భీమసేనుడు, ఇంద్రాంశముచే అర్జునుడు జన్మించిరి. మాద్రికి నకుల సహదేవులు జన్మించిరి. వసుదేవునకు రోహిణియందు బలరామ సారణ దుర్గములు అను ముగ్గురు పుత్రులు, దేవకియందు సుషేణ, కీర్తిమత్, భద్రసేన, జారుఖ్య, విష్ణుదాస, భద్ర దేహులు జన్మించిరి. ఈ ఆరుగురు శిశువులను కంసుడు చంపివేసెను. పిదప బలరామ కృష్ణులు ఆవిర్భవించిరి. చివర కల్యాణ వచనముగల సుభద్ర జన్మించెను. శ్రీకృష్ణునకు చారుదేష్ణుడు సాంబుడు మొదలగు పుత్రులు పుట్టిరి. సాంబాదులు జాంబవతి పుత్రులు. (275)

ద్వాదశ సంగ్రామములు

అగ్నిదేవుడు పలికెను :

కశ్యప మహర్షి వసుదేవుడుగను, స్త్రీలలో శ్రేష్ఠురాలగు అదితి, దేవకిగను అవతరించిరి. వారికి శ్రీకృష్ణుడు కుమారుడుగ అవతరించెను. మహాతపశ్శాలియగు శ్రీకృష్ణుడు ధర్మమును రక్షించుటకు అధర్మమును అంతము చేయుటకు దేవతాదులను పాలించుటకు దైత్యాదులను మర్దించుటకు అవతరించెను. రుక్మిణి సత్యభామ, నాగ్నచిత్ కుమార్తెయగు సత్య వీరు కృష్ణునకు ప్రియమైన భార్యలు. సత్యభామ ఆయనకు ఆరాధ్యదేవి. గాంధారి, లక్ష్మణ, మిత్ర వింద, కాళింది, జాంబవతి, సుశీల, మాద్రి, కౌసల్య, విజయ, జయ మొదలగు పదహారువేలమంది స్త్రీలు శ్రీకృష్ణుని భార్యలు. రుక్మిణియందు ప్రద్యుమ్నుడు మొదలగువారును, జాంబవతి యందు సాంబుడు

మొదలగువారును జన్మించిరి. శ్రీకృష్ణునకు మొత్తం ఒకకోటి ఎనభైవేల మంది పుత్రులుండిరి. సకల యాదవులును శ్రీకృష్ణునిచే రక్షింపబడిరి. ప్రద్యుమ్నునకు విదర్భ రాజకుమారి యందు యుద్ధ ప్రియుడగు అనిరుద్ధుడు పుట్టెను. అనిరుద్ధునకు వజ్రాదులు కుమారులుగ పుట్టిరి. యాదవులందరును మహా బలవంతులు, మొత్తము వారి సంఖ్య మూడు కోట్లు. ఆ సమయమున అరువది లక్షల దానవులు మనుష్యులుగా పుట్టి లోకులను హింసించు చుండిరి. వారిని నశింప చేయుటకే శ్రీకృష్ణుడు అవతరించెను. కర్మమర్యాద పాటించు వారి రక్షణకై కూడ అవతరించెను.

దేవాసురుల మధ్య దాయ భాగముకొరకై పండ్రెండు యుద్ధములు జరిగెను. నార సింహము వామనము వారాహ సంగ్రామము, అమృత మంథనము, తారకామయ సంగ్రామము, ఆజీవకము, జిత్‌హాలహలము, ఘోర కోలాహలము అను పేర్లతో ప్రసిద్ధ మైనవి. పూర్వము నరసింహుడు హిరణ్యకశిపు వక్షమును చీల్చి ప్రహ్లాదుని రాజుగా చేసెను. మరల దేవాసురుల యుద్ధ సమయమున వామనుడుగా అవతరించి కాశ్యప అదితి పుత్రుడై, బలిని వంచించి ఇంద్రునకు రాజ్యమును ఇచ్చెను. వరాహమూర్తియై హిరణ్యాక్షుని చంపి దేవతలను రక్షించి మునిగిపోయిన భూమిని ఉద్ధరించి దేవాధి దేవులచే స్తుతింపబడెను. దేవాసురులు కలసి మంథరాచలమును కవ్వముగను, వాసుకిని, త్రాడు గనుచేసి సముద్రము మథించి అమృతమును తీసిరి. అపుడు శ్రీమహావిష్ణువు అమృతమును దేవతలకు ఇచ్చివేసెను. తారకామయ సంగ్రామము నందు బ్రహ్మదేవుడు ఇంద్ర బృహస్పతులు దేవతాదానవులను యుద్ధమునుండి నివారించి దేవతలను రక్షించి సోమ వంశమును స్థాపించెను. ఆజీవక యుద్ధమున విశ్వామిత్ర, వశిష్ట ఇత్యాది ఋషులు, రాగద్వేషాది దానవులను నివారించి దేవతలను పాలించిరి. శివుడు పృథ్వి రథముగా రథమునకు వేదరూపములగు అశ్వములను కట్టి దానిని అధిష్ఠించెను. అపుడు శ్రీమహా విష్ణువు బ్రహ్మను సారథిగ తీసుకొనిన ఈశ్వరునకు శరణ మొసగి తాను బాణమై త్రిపుర దాహమును చేసెను. అంధకాసురుడు గౌరిని అపహరించుటకై రుద్రునకు కష్టమును కలిగించగ, రేవత్యనురక్తుడగు శ్రీహరి ఆ అసురుని సంహరించెను. దేవాసుర యుద్ధము నందు విష్ణువు వృత్ర సంహారమునకై నీటి నురుగుగా ఏర్పడి ఇంద్రుని వజ్రమున లగ్న మయ్యెను. ఈవిధముగ ఇంద్రుని దేవ ధర్మమును పాలించి దేవతలను కష్టముల నుండి విడిపించెను. విష్ణువు పరశురామావతారమును ధరించి శాల్వాది దానవులను జయించి క్షత్రియులను నశింపచేసి దేవతాదులను రక్షించెను. మధుసూదనుడు హాలాహల విషరూపమున ఆవిర్భవించిన దైత్యుని శంకరునిచే నశింపచేసి దేవతా భయమును శమింపచేసెను. దేవాసుర సంగ్రామమున కోలాహ లుడను దైత్యుని జయించి మహావిష్ణువు ధర్మమును పాలించి సకలదేవతలను రక్షించెను. రాజులు కుమారులు మునులు దేవతలు ఎల్లరును మహావిష్ణు స్వరూపులే. నేను ఇక్కడ పేర్లు చెప్పినవారును చెప్పనివారును కూడ మహావిష్ణు అవతారములే. (276)

రాజవంశ వర్ణనము

అగ్నిదేవుడు పలికెను :

తుర్వసునికి వర్గుడు వానికి గోభానుడు వానికి త్రైశాని, వానికి కరంధముడు, వానికి మరుత్తుడు,

వానికి దుష్యంతుడు, వానికి వరూథుడు, వానికి గాండీరుడు, వానికి గాంధారుడు పుట్టెను. గాంధారునకు ఐదుగురు పుత్రులు పుట్టిరి. వీరి నామధేయముల అనుసరించి గాంధార, కేరళ, చోళ, పాండ్య, కోసల దేశములు ఏర్పడినవి. వీరందరును మహాబలవంతులు. దృహ్యునికి బభ్రుసేతువు, వానికి పురోవసువు, వానికి గాంధారుడు, వానికి ధర్ముడు, వానికి ఘృతుడు వానికి విదుషుడు, వానికి ప్రచేతసుడు పుట్టిరి. ప్రచేతసుని నూర్గురి కుమారులలో ఆనద్ర, సభానర, చాక్షుష, పరమేశువులు ప్రధానులు. సభానరునకు కాలానలుడు, వానికి సృంజయుడు, వానికి పురంజయుడు, వానికి జనమేజయుడు, వానికి మహాశాలుడు, వానికి మహామానసుడు, వానికి ఉశీనరుడు పుట్టెను. మహామానసుని భార్యయగు నృగకు నృగుడను కుమారుడు పుట్టెను. నృగునకు నరయను భార్యయందు నరుడును కృమియను భార్యయందు కృమియు, దశయను భార్యయందు సువ్రతుడు దృషద్వతియందు శిబి జనించెను. శిబికి పృథుదర్భుడు వీరకుడు, కైకేయుడు, భద్రకుడు అను నలుగురు పుత్రులు జనించిరి. వీరి పేర్లతో నాలుగుదేశములు ప్రసిద్ధములైనవి. ఉశీనరునికి తితిక్షువు వానికి రుషద్రథుడు, వానికి పైలుడు, వానికి సుతకుడు, వానికి మహాయోగియైన బలి జన్మించెను. బలికి అంగ, వంగ, ముఖ్యక, పుండ్ర, కళింగులను పుత్రులు పుట్టిరి. వీరందరికిని బాలేయులని పేరు. యోగియైన బలి మహా బలవంతుడు. అంగునికి దధివాహనుడు, వానికి దివిరథుడు వానికి ధర్మరథుడు, వానికి చిత్రరథుడు, వానికి సత్యరథుడు, వానికి లోమపాదుడు, వానికి చతురంగుడు, వానికి పృథులాక్షుడు, వానికి చంపుడు, వానికి హర్యంగుడు, వానికి భద్రరథుడు, వానికి బృహత్కర్మ, వానికి బృహద్భానుడు, వానికి జయద్రథుడు, వానికి బృహద్రథుడు, వానికి విశ్వజిత్తు, వానికి కర్ణుడు, వానికి వృషసేనుడు పుట్టెను. అంగవంశమునందు పుట్టిన రాజులను గూర్చి చెప్పితిని. ఇపుడు పురువంశ వర్ణనము వినుము. (277)

పురువంశవర్ణనము

అగ్నిదేవుడు పలికెను :

పురువునకు జనమేజయుడు, వానికి ప్రాచీవంతుడు, వానికి మనుష్యుడు వానికి వీతమయుడు, వానికి శంధుడు, వానికి బహువిధుడు, వానికి సంయాతి. వానికి రహోవాది, వానికి భద్రాశ్వుడు పుట్టెను. భద్రాశ్వునకు ఋచేయు, కృషేయు, సన్నతేయు, ఘృతేయు, చితేయు, స్థండిలేయు, ధర్మేయు, సంనతేయు, కృతేయు మతినారులను పదిమంది పుత్రులు పుట్టిరి. మతినారునకు తంసురోధ, ప్రతిరథ, పురస్తులను ముగ్గురు పుత్రులు పుట్టిరి. ప్రతిరథునకు, దుష్యంత, ప్రవీరక, సుమంత, వీరవరులను నలుగురు పుత్రులు పుట్టిరి. దుష్యంతునకు భరతుడు పుట్టెను. భరతుడు శకుంతలా పుత్రుడు; మహాబలశాలి. ఇతని వంశమున పుట్టిన వారికి భారతులను పేరు వచ్చినది. భరతుని పుత్రులు మాతృ క్రోధముచే నశించగా, రాజు యజ్ఞము చేసెను. అపుడు మరుద్గణములు బృహస్పతి పుత్రుడగు భర ద్వాజుని తీసుకొనివచ్చి ఆతనిని ఆ రాజునకు పుత్రునిగా ఇచ్చిరి. ఇతడు వితథుడనే పేరుతో ప్రసిద్ధుడయ్యెను వితథునకు సుహోత్రుడు, సుహోత్రునకు గయ, గర్భ, కపిలులు అను ఐదుగురు పుత్రులు పుట్టిరి. వీరుకాక మహాత్ముడు, సుకేతువు అను ఇరువురు

పుత్రులు పుట్టిరి. పిదప కౌశికుడు, గృత్సపతి అను పుత్రులు కూడ పుట్టిరి. గృత్సపతికి పుట్టిన అనేక మంది కుమారులలో బ్రాహ్మణులు క్షత్రియులు వైశ్యులు అందరును ఉండిరి. కాశ-దీర్ఘతములు గృత్సపతి కుమారులే, దీర్ఘతమునకు ధన్వంతరి, వానికి కేతుమంతుడు, వానికి దివోదాసుడను ప్రసిద్ధిగల హిమరథుడు, వానికి ప్రతర్దనుడు వానికి భర్గ, వత్సలు, వత్సునకు అనర్కుడు, వానికి క్షేమకుడు, వానికి వర్షకేతువు, వానికి విభుడు, వానికి అనర్త, సుకుమారులు, సుకుమారునకు సత్యకేతువు పుట్టెను. వత్సరాజునకు వత్సభూమి యను పుత్రుడు పుట్టెను. వితథుని కుమారుడగు సుహోత్రునకు బృహత్ అనుపుత్రుడు పుట్టెను. బృహత్తునకు అజమీఢ, ద్విమీఢ పురుమీఢులను ముగ్గురు పుత్రులు పుట్టిరి. అజమీఢునకు కేశిని అను భార్యయందు జహ్నువు పుట్టెను. ఆతనికి అజకాశ్వుడు అతనికి బలాకాశ్వుడు ఆతనికి కుశికుడు, ఆతనికి ఇంద్రత్వమును సంపాదించిన గాధి. అతనికి సత్యవతి యను కుమార్తెయు, విశ్వామిత్రుడను కుమారుడును పుట్టెను. దేవరాతకతి ముఖాదులు విశ్వామిత్రుడి పుత్రులు. అజమీఢునకు శునశ్శేపుడు, అష్టకులను పేరుగల ఇతర పుత్రులును పుట్టిరి. ఆతనికి నీలినియను భార్యయందు శాంతియను మరొక పుత్రుడు కూడ పుట్టెను. శాంతికి పురుజాతి, వానికి బాహ్యాశ్వుడు, వానికి ముకుల, సృంజయ, బృహదిషు, యవీనర, కృమిలులను ఐదుగురు కుమారులును పుట్టిరి. వీరికి పాంచాలులని ప్రసిద్ధి. ముకుల వంశీయులకు మౌకుల్యులని పేరు. వీరు క్షాత్రధర్మమును అనుసరించు బ్రాహ్మణులు. ముకులునకు చంచాశ్వుడు-వానికి ఒకపుత్రుడు పుత్రి కవలలు పుట్టిరి. పుత్రుని పేరు దివోదాసుడు, పుత్రికపేరు అహల్య, అహల్యకు శరద్వంతుని (గౌతముని) వలన శతానందుడు పుట్టెను. శతానందునకు సత్యధృక్ అను పుత్రుడు పుట్టెను. వానికి కృపుడు అనుపుత్రుడు, కృపియను పుత్రిక కవలలుగా పుట్టిరి. దివోదాసునకు మైత్రేయుడు వానికి సోమకుడు పుట్టెను. సుబుంజయునకు పంచహనుష్కుడు ఆతనికి సోమదత్తుడు, ఆతనికి సహదేవుడు, ఆతనికి సోమకుడు, ఆతనికి జంతువు, ఆతనికి పృషత్, వానికి ద్రుపదుడు, వానికి ధృష్టద్యుమ్నుడు, వానికి దృష్టకేతువు పుట్టెను. అజమీఢునునకు ధూమినియను భార్యయందు ఋక్షుడను పుత్రుడు పుట్టెను. ఆతనికి సంవరణుడు, ఆతనికి కురువు పుట్టెను. అతడు ప్రయాగనుంచి కురుక్షేత్ర తీర్థమును స్థాపించెను.

కురువునకు సుధన్వుడు, సుధనుడు, పరీక్షిత్తు, రిపుంజయుడు అను నలుగురు పుత్రులు పుట్టిరి. సుధన్వునకు సుహోత్రుడు వానికి చ్యవనుడు పుట్టెను. చ్యవనుని భార్యయైన గిరికయందు ఉపరిచర వసువు అంశచే, బృహద్రథ, కుశ, వీర, యదు, ప్రతిగ్రహ, బల, మత్స్యకాశి అను ఏడుగురు పుత్రులు పుట్టిరి. బృహద్రథునకు కుశాగ్రుడు, వానికి వృషభుడు, వానికి సుధన్వుడు, వానికి ఊర్జుడు, వానికి సంభవుడు, వానికి జరాసంధుడు, వానికి సహదేవుడు, వానికి ఉదాపి, వానికి శ్రుతకర్మ పుట్టెను. కురునందనుడైన పరీక్షిత్తునకు జనమేజయుడను పుత్రుడు పుట్టెను. ఇతడు పరమ ధార్మికుడు. ఇతనికి త్రసద్దస్యువు అను పుత్రుడు పుట్టెను. అజమీఢుని కుమారుడగు జుహ్నునకు సురథ-శ్రుతసేన-ఉగ్రసేన-భీమసేనులను నలుగురు పుత్రులు పుట్టిరి. పరీక్షిత్ కుమారుడగు జనమేజయునకు సురథుడు మహిమంతుడు అను పుత్రులు పుట్టిరి. సురథునకు విదూరథుడు, వానికి ఋక్షుడు పుట్టెను. ఈ వంశములో ఇతడు ఋక్షుడను పేరుతో ప్రసిద్ధుడగు రెండవ రాజు.

ఇతనికి భీమసేనుడు, వీనికి ప్రతీపుడు వీనికి శంతనుడు, వీనికి దేవాపి, బాహ్లిక, సోమదత్తులను ముగ్గురు కుమారులు జన్మించెను. బాహ్లికునకు సోమదత్తుడు, వానికి భూరి, భూరిశ్రవస్, శలులు పుట్టిరి. శంతనునకు గంగయందు భీష్ముడు పుట్టెను. కాల్య (సత్యవతి) అను భార్యయందు విచిత్ర వీర్యుడు పుట్టెను. విచిత్ర వీర్యుని భార్యయందు శ్రీకృష్ణ ద్వైపాయనునకు-ధృతరాష్ట్ర పాండు విదురులు పుట్టిరి. ఈ ఐదుగురు పాండవులును దైవాంశ సంభూతులు. అర్జునుని పుత్రుని పేరు అభిమన్యుడు. సుభద్రకు పుట్టినవాడు అభిమన్యునకు పరీక్షిత్తు అను పుత్రుడు పుట్టెను. ద్రౌపది పంచ పాండవుల భార్య, ఆమె యందు యుధిష్ఠిరునకు ప్రతివింద్యుడు, భీమసేనునకు హిడింబయందు పుట్టిన ఘటోత్క చుడను మరియొక పుత్రుడు ఉండెను. వీరందరును భూత కాలమునకు చెందిన రాజులు-భవిష్యత్తులో రాబోవు రాజుల సంఖ్యను ఎవరు చెప్పజాలరు, వీరందరును కాలగ్రస్తులై గడచిపోయిరి. ఓ వశిష్ఠా ! కాలము విష్ణు స్వరూపము. అందుచేత ఆ విష్ణువునే పూజించ వలెను. ఆ విష్ణువునే ఉద్దేశించి అగ్నిలో హోమము చేయుము. ఆతడే సర్వమును ఇచ్చువాడు. (278)

సిద్ధౌషదాది కథనము

అగ్నిదేవుడు పలికెను :

ధన్వంతరిచే సుశ్రుతునకు చెప్పబడినదియు మృత సంజీవనమును శ్రేష్ఠమును అగు ఆయుర్వేద మును గూర్చి చెప్పెదను అని అగ్ని పలుకగా సుశ్రుతుడు మనుష్య, అశ్వ, గజ రోగములను తొల గించు ఆయుర్వేదమును మృతసంజీవన కరములగు సిద్ధ యోగములను సిద్ధ మంత్రములను నాకు చెప్పుము అని అడిగెను. అప్పుడు ధన్వంతరి అతడితో ఇట్లు పలికెను. జ్వరము వచ్చినవాని బలము చూచుకొని వైద్యుడు లంఘనమును చేయించవలెను. పిదప శుంఠితో కూడినదియు, దాహమును జ్వరమును తగ్గించు, లాజలగంజిని కాచిన జలమును ముస్త, పర్పట, కోశరి, చందన, ఉదీచ్య, నాగరములు వేసి కాచి ఇవ్వవలెను. ఆరుదినములు గడచిన తరువాత, తిక్తకషాయమును తప్పక త్రాగించవలెను. జ్వరము తగ్గిన తరవాత, చెమట పట్టునట్లు చేసి, విరేచనమునకు మందు ఇవ్వవలెను. షష్టికనీవారములు రక్తశాలులు ప్రమోదకములు. ఇట్టి పాత ధాన్యములు జ్వరమునందు మంచివి. యవలతో చేసిన పదార్థములు మంచివి. ముద్గ, మసూర, చణక, కులుత్థ, కుష్ఠక, అథకి, నారకాదులును కర్కోటక, కట, ఉల్బకములును ఫలములతోకూడిన పటోలము, వేప, దాడిమము ఇవి జ్వరమునందు హితకరములు. రక్తపిత్థము అధోగతి గలదియైనచో, వమనము ఊర్ధ్వగతి కలదియైనచో విరేచనము ప్రశస్తము. శుంఠి చేర్చక తయారుచేసిన షడంగ క్వాథము ఇవ్వవలెను. ఈ రోగమున సక్తు, గోధూమ, లాజయవ, గాలి, మసూర, మకుష్ట, చణక, ముద్గములు, హితకరములు. పాలు నెయ్యి చేర్చి చేసిన గోధుమ పదార్థములు బలవర్ధకములగు రసము తేనె, శ్రేష్టమైనది. అతిసార రోగము నందు పాత బియ్యమును భక్షించుట హితకరము.

గుల్మ రోగమునందు కఫకరము కానిదియు, లోధ్ర వృక్షపు బెరడుతో చేసిన క్వాథము కలిసినదియు అగు అన్నము మంచిది, వాయుకరములగు అన్నమును త్యజించ వలయును. ఉదర రోగమున క్షీరముతో కలిపి ఘృతసాధితమగు వాట్యమును తినవలెను. గోధుమలు, బియ్యము,

తిక్తౌషధములు వీరికి మంచివి. గోధుమలు, బియ్యము, ముద్గములు, పలాశ బీజములు, ఖదిరము, అభయ పంచకోణము, జాంగలము నింబ పటోలకములు, ఉసిరి, మాతులుంగ రసము, జాజి, శుష్కమూలకము, సైంధవము, ఇవి కుష్ఠ రోగములకు హితకరములు. త్రాగుటకు ఖదిరోదకము మంచిది. పేయమునకు మసూర ముద్గములు ఉపయోగించవలెను. తినుటకు పాత బియ్యము హితకరము ! నింబ పర్పటక శాకములు జాంగల రసము, విడంగ, మరిచ, ముస్త, కుష్ఠ, లోధ్ర, సువర్చికా, మనశ్శిలా, వచలు, గో మూత్రమున నూరినవి కుష్ఠమును తొలగించును. మేహవ్యాధి కలవారికి అపూప కుష్ఠ కుల్మాష యవాదులు హితకరములు. యవలతో చేసిన పదార్థములు పెసలు ఉలవలు, పాత బియ్యము, తిక్తరూక్ష, శాకములు, తిక్తములు, హరితములగు శాకములు, తిలసిగ్రుక, విభీతక, ఇంగుదీ తైలములు హితకరములు. రాజయక్ష్మరోగులకు ముద్గయవ గోధూమ ములు ఒక సంవత్సరము నిల్వ ఉన్న ధాన్యము జాంగల రసము భోజనమునందు ప్రశస్తము. శ్వాసకాస రోగులకు కులుత్థ, ముద్గ, కోల, శుష్కమూలక జాంగల అపూప, దధులు దాడిమరస సాధితములగు విష్కిల జాంగల రసమాతులుంగ రస, క్షౌద్ర, ద్రాక్షాదులు, వ్యోష సంస్కృతములగు యవలు, గోధూమ, శాల్యన్నములు హితకరములు. దశమూల, బల, రాస్నలు, కుళుత్థ నిర్మితములగు పేయములు పూపరసక్వాథములు శ్వాసను ఎక్కిళ్ళను తొలగించును.

శుష్కమూల కుళుత్థ–మూల జాంగల జరసములు, పాతయవలు, గోధుమలు, పాతవరి– ఉశీరముతో కలిపి తీసుకొన్నచో శ్వాసకాసములు తొలగును. శోథరోగి గుడ సహిత పథ్యనుకాని. గుడ నాగరమునుగాని తినవలెను. తక్రము, చిత్రకము, ఈ రెండును గ్రహణీ రోగమును తొలగిం చును. సర్వదా వాతరోగముతో బాధపడువారికి పాత యవలు, గోధూమలు వరి, జాంగల రసము, ముద్గ అమలక, ఖర్జూర మృద్వీకా బదరములు, మధువు, నెయ్యి, పాలు, శక్రము, నింబము, పర్పటకము, బలకారక ద్రవ్యములు, తక్రారిష్ట ములు హితకరములు హృదయరోగము కలవారికి విరేచనము చేయించవలెను. ఎక్కిళ్ళకు పిప్పలి మంచిది. మజ్జిగ ఆరణాలము, సీధువులను చల్లటి నీటితో తీసుకొనవలెను. ఎక్కిళ్ళకు మంచిది. మదాత్యయ రోగమున ముత్యములు, సౌవర్చలా జాదికము మద్యము హితకరమైనది. గాయపడినవాడు క్షౌద్రము పాలు కలిపిన లాక్షను త్రాగవలెను. మాంస రసాహారము అగ్ని సంరక్షమై క్షయ రోగమును జయించును. క్షయ రోగికి భోజనమున ఎర్రవరి నీవారములు కలవములు మొదలగునవి హితకరములు. హర్షరోగమున యవాన్న వికృతులు మాంసము, శాకము, సౌవర్చలము, శటి, మండపము జలము కలిపిన తక్రము మంచివి. మూత్ర కృచ్ఛ్ర రోగమున ముస్తాభ్యాసము, హరిద్రా చిత్రకలేపము, యవాన్న వికృతులు, వరి వాస్తూకము, సువర్చలము త్రప్పు, క్షీరేక్షుఘృత మిశ్రితములగు గోధుమలు తినుటకు మంచివి. మండసురాదులు తాగుటకు మంచివి. వమన రోగమునకు లాజలు, సక్తువులు, మధువు శూన్యమాంసము, పరూ షకము, వార్తాకము, నెమలి రెక్కలు కొన్ని పానకములు మంచివి. వరి అన్నము కాచిన నీరు, పాలు, దాహమును కట్టును. ముస్తా గుడములతోచేసిన గుటికను ముఖమునందు ఉంచుకున్నను దాహము తొలుగును. యవాన్న వికృతులు పూపము, శుష్కమూలకము, శాకము, వేత్రాగ్రము, ఇవి మోకాలు పట్టుకొనుటను తొలగించును. విసర్పరోగము కలవాడు ముద్గ ఆఢక, మసూరముల

గంజి తిలయు జాంగలరసము, సైంధవ యుక్త ఘృతము, ద్రాక్ష, శుంఠి, ఉసిరి, కోలము వీటి యూషములతో పాతగోధుమలు, యవలు వరి వీటి అన్నమును తినవలెను. విసర్పి మధు ద్రాక్షా దాడిమములతో చేసిన జలమును పంచదార కలిపి త్రాగవలెను.

వాత రక్త రోగి ఎర్రవరి, గోధుమలు, ముద్గములు మొదలగు అన్నములు, లఘువుగా తినవలెను. కాకమారి, వేత్రాగ్రము, వాస్తుకము, సువర్చలా, మొదలగు శాకములు, మధుశర్కరా మిశ్రితమగు జలము తీసుకొనవలెను. నాసికా రోగమునకు దూర్వా సిద్ధమగు ఘృతము హితము. భృంగరాజ రసముతోగాని, ఆమలక రసముతో కాని శోధితమైన తైలమును నశ్యముగా, ఇచ్చినచో సమస్త శిరోరోగములకు హితకరములు. శీతల జల అన్నపానములు తిలభక్షణము దంతములను దృఢము చేసి గొప్ప తృప్తిని కలిగించును. తిల తైలముతో గండూషము దంతములకు దార్ఢ్యము నిచ్చును. విడంగ చూర్ణము, గోమూత్రము అన్ని విధముల క్రిమి నాశనమునకు ఉపయోగించును. ఉసిరి పండ్లు నూరి, నేతిలో కలిపి శిరస్సుకు మర్దించినచో శిరోరోగములు నశించును.స్నిగ్ధము, ఉష్ణము అయిన భోజనము కూడ శిరోరోగమునకు మంచిది. కర్ణశూలము తొలగించుటకు చెవులలో తైలముగాని, మేక మూత్రముగాని నింపవలెను. ఇది సకల శిరోరోగములకు మంచిది. గిరి మృత్తిక, లాక్ష, చందనము, మాలతీకలిక, వీటిని కలిపి నూరి చేసిన వర్తి క్షతమును శుక్ర దోషమును హరించును. వ్యోషము త్రిఫలమును, తుచ్ఛకమును జలమును కలిపి కంటిలోవేసినచో సర్వనేత్ర రోగ నాశకము. రసాంజనము కూడ ఇందుకు మంచిది. లోధ్రకాంజిక సైంధములను నేతిలో వేయించి శిలపై నూరి నేత్రమునకు లేపము చేసినచో అన్ని నేత్ర రోగములు తొలగును. నీళ్ళుకారుట తగ్గును. గిరి మృత్తికా చందనము వీటిని పైన రాసినచో కండ్లకు మంచిది. నేత్ర రోగ నాశనమునకైన సర్వదా త్రిఫలము సేవించవలెను.

దీర్ఘాయుర్దాయము కోరువాడు త్రిఫలను మధుఘృతములతో సేవించవలెను. శతావరి రససోదిత ములగు క్షీర ఘృతములు బలవర్ధకములు. మాషములు పాలు నెయ్యి ఇవి కూడ బలవర్ధకములు. వెనుక చెప్పినట్లు మధుకామిశ్రితమగు త్రిఫల ఆయుర్వర్ధకము. మధుకాది రసమిశ్రితమగు త్రిఫల బళులను ఫలితమును నశింపచేయును. వచాసిద్ధమగు ఘృతము భూతదోషమును నివారించును. దానితోచేసిన కవ్యము బుద్ధి ప్రదము. సర్వమనో రథసాధకము. బలాకల్క కషాయముతో చేసినది అభ్యంజనమునకు మంచిది. రాస్నతోగాని, సహచరితోగాని సిద్ధమైన తైలము వాతరోగులకు మంచిది. వ్రణములకు శ్లేష్మ చేయని ఆహారము మంచిది. జీర్ణమునకు సక్తుపిండి ఆమ్ల ప్రశస్తములు. వేప చూర్ణము వ్రణము పక్వ మైనపుడు దానిని చితికించుటకును, మాన్పుటకును మంచిది. అట్లే సూదితో చికిత్స కూడ వ్రణమునకు మంచిది. బలికర్మ విశేషముచే సూతికకు లాభమగును. రక్షాకర్మ ప్రాణులకు సర్వదా హితకరము. సర్పదష్టునకు నింబపత్ర భక్షణము ఔషధము. తాళ నింబ పత్రములు పురాణ తైలము లేదా పురాణ ఘృతము కేశములకు మంచిది. తేలుకుట్టినవానికి నెమలి పింఛము, ఘృతము, వీటితో ధూపము మంచిది. లేదా జిల్లేడు పాలతో నూరిన పలాశ బీజముల లేపము తేలు విషమును దింపివేయును. తేలుకుట్టిన వానికి కృష్ణా ఫలములుకాని శివా ఫలములుకాని తినిపించవలెను. జిల్లేడు పాలు తిలలు తైలము పలలము గుడము వీటిని సమాన

మాత్రలో వేసి త్రాగించినచో భయంకరమగు కుక్క విషము శీఘ్రముగ నశించును. మూలమును, త్రివృత్తును సమాన మాత్రలో నేతితో త్రాగినచో మనుష్యుడు బలవంతుడై సర్వ కీట విషములను జయించును. చందనము, పద్మము, కుష్ఠము, లతాంబు, ఉషీరము, పాటల, నిర్గుండి, శారిబ సేలు, ఇవి సాలెపురుగు విషమును తొలగించును. గుడ సహితమగు శుంఠి శిరో విరేచనమునకు మంచిది, స్నేహపానమునకు బస్తి క్రీపును తైలఘృతములు అత్యుత్తమములు. అధికాగ్నికి స్వేదనము, (చెమట పట్టించుట) స్తంభనమునకు చల్లటి నీరు శ్రేష్ఠము. రేచనమునకు త్రివృద్ధియు, వమనమునకు మదనమును శ్రేష్ఠము. నస్తి విరేచన వమనములు తైలఘృత మధువులు క్రమముగ వాత పిత్థ కఫములకు పరమౌషధములు. (279)

సర్వరోగ రణ ఔషధములు

ధన్వంతరి చెప్పెను :

రోగములు శారీరకములు, మానసము, అగంతుకములు, సహజములు అని నాల్గు విధములు. జ్వరకుష్టాదులు శారీరకములు, క్రోధాదులు మానసములు, దెబ్బలు తగులుట మొదలగునవి ఆగంతుకములు, ఆకలి ముసలితనమునవి సహజములు. శారీర ఆగంతుక వ్యాధులను తొలగించు కొనుటకు శనివారమున బ్రాహ్మణుని పూజించి ఆతనికి ఘృతము గుడము, లవణము, సువర్ణము దానము చేయవలెను. సోమవారమున బ్రాహ్మణునకు అభ్యంగన స్నానము చేయించినవాడు సర్వ రోగ విముక్తుడు అగును. శనివారమున తైలదానము చేయవలయును. ఆశ్వీయుజ మాసమున గోరసములను దానము చేయ వలయును. శివలింగమునకు దధిఘృతములతో స్నానము చేయించిన వాడు రోగ విముక్తు డగుచు త్రిమధురములలో ముంచి దూర్వను గాయత్రి మంత్రముతో హోమము చేసినవాడు, రోగ విముక్తుడగును. ఏ నక్షత్రమున రోగము పుట్టినదో ఆ నక్షత్రము నందే స్నానము చేసి బలి ఇవ్వవలెను. మానస రోగములను విష్ణుస్తోత్రము హరించును. ఇపుడు వాత పిత్త కఫములను దోషములను గూర్చియు ధాతువులను గూర్చియు వినుము.

అన్న ఆహారము పక్వాశయము నుండి రెండు మార్గములుగా పోవును. ఒక భాగము కిట్ట మగును. రెండవ భాగము రసమగును. కిట్ట భాగము మలము. అది మన మూత్ర స్వేద దూషికాది రూపమునను నాసామల, కర్ణమల, దేహమల రూపమునను పరిణతి చెందును. రసభాగమంతయు రక్తముగ మారును. రక్తము నుండి మాంసము, దానినుండి మేదస్సు దానినుండి అస్తి, దానినుండి మజ్జ, దానినుండి శుక్రము, దానినుండి రాగ ఓజస్సులు పుట్టును. చికిత్సకుడు దేశకాల పీడాబల శక్తి ప్రకృతి భేషజ బలములను గుర్తించి తదనుకూలముగ చికిత్స చేయవలయును. రిక్తాతిథులు (4, 9, 14) భౌమ వాసరము మందక్రూర నక్షత్రములు విడిచి చికిత్సాప్రారంభము చేయవలయును. విష్ణు గో బ్రాహ్మణ చంద్ర సూర్యాదుల పూజచేసి రోగినుద్దేశించి 'బ్రహ్మదక్షుడు, అశ్వినీ దేవతలు, రుద్ర, ఇంద్ర, సూర్య, అనిల, అనల, ఋషులు, ఓషధి సముదాయము, భూత సముదా యము నిన్ను రక్షింతురు గాక ! ఋషులకు రసాయనము ఎట్లో, దేవతలకు అమృతము ఎట్లో, ఉత్తమ నాగులకు సుధ ఎట్లో అట్లే నీకు ఈ ఔషధము ఆరోగ్యకరము, ప్రాణరక్షణము అగుగాక' అను

అర్థములుగల మూలోక్త శ్లోకములను పఠించుచు, ఔషధ ప్రారంభము చేయవలయును. బహు వృక్షములు, అధిక జలముకలిగి అనూపమను పేరుగల దేశము వాతశ్లేష్మకరము. అట్లుకానిది జాంగలము. అల్ప వృక్షోదకములుగల దేశము సాధారణము. జాంగలము పిత్తమును వృద్ధి పొందించును. సాధారణ దేశము, మధ్యముగ నుండును.

వాతము రూక్ష శీతచల స్వభావము కలది. పిత్తము ఉష్ణము. కటుత్రయము పిత్తమును పెంచును. కఫము స్థిర ఆమ్ల స్నిగ్ధ మధుర స్వభావము కలది. సమాన వస్తువులచే యిది వృద్ధి చెందును. అసమాన వస్తువులచే తగ్గును. మధుర, ఆమ్ల, లవణ రసములు శ్లేష్మ కరములు, వాయునాశకములు. కటుతిక్త కషాయ రసములు వాయువృద్ధి కరములు కఫ నాశకములు. కటు ఆమ్ల లవణ రసములు పిత్తవర్ధకములు. తిక్త మధుర కషాయ రసములు పిత్తనాశకములు. ఈ గుణములు రసములవి కావు. వాటి విపాకమునకు చెందినవని గ్రహించవలెను. ఉష్ణవీర్యములు కఫనాశకములు, శీతవీర్యములు పిత్తనాశకములు. ఓ సుశ్రుతా! ఇవన్నియు తన ప్రభావముచే ఆయా కార్యములను చేయును. శిశిర వసంత గ్రీష్మములందు క్రమముగ, కఫములకు చయము, ప్రకోపము, ప్రశమనము వుండును. సుశ్రుతా! వాయువునకు గ్రీష్మ, వర్ష, రాత్రి శరదృతువులందు వరుసగ చయ, ప్రకోప, ప్రశమములు చెప్పబడినవి. ఇట్లే వర్ష, శరత్, హేమంతములందు క్రమముగ పిత్తములకు చయ, ప్రకోప, ప్రశమములు చెప్పబడినవి. వర్షఋతువు నుండి హేమంతము వరకు మూడు ఋతువులును విసర్గకాలము. శిశిరమునుండి గ్రీష్మము వరకు మూడు ఋతువులు ఆదానకాలము. విసర్గకాలము సౌమ్యము. ఆదానకాలము ఆగ్నేయము. వర్షాది ఋతుత్రయమున సంచరించుచున్న చంద్రుడు ఓషధులతో క్రమముగ ఆమ్ల లవణ మధుర రసములను పుట్టించును. శిశిరాది ఋతుత్రయమున సంచరించుచున్న సూర్యుడు క్రమముగ, తిక్తకషాయ కటురసములను వృద్ధి పొందించును. రాత్రులు పెరుగుచున్న కొలది ఓషధుల బలము పెరుగుచుండును. రాత్రులు తగ్గుచున్నకొలది మనుష్యుల బలము క్రమముగ తగ్గుచుండును. రాత్రి, దిన, భోజనాంతము నందును, వయస్సుయొక్క ఆది మధ్య అవసాన కాలములందును కఫపిత్త వాయువులు ప్రకోపించును. ప్రకోప ప్రారంభమున వీటికి జయము కలుగును. ప్రకోపానంతరము వీటికి శమనము కలుగును. అతిభోజనము వలనను అధికోపవాసమువలనను, మలమూత్ర వేగనిరోధము వలనను కూడ అన్ని రోగములు పుట్టును. ఉదరము నందలి రెండు భాగములను అన్నముతోను, ఒక భాగమును జలముతోను నింపి ఒక భాగమును వాయ్వాది సంచారమునకై విడువ వలయును. వ్యాధికి ఏది మూలకారణమో, దానికి విపరీతమైనది ఔషధము. అట్టి ఔషధ మును ఇవ్వవలెను. ఇదియే అన్నింటి సారము అని నేను చెప్పుచున్నాను.

నాభి పైన పిత్త స్థానము, దాని క్రింద శ్రోణీగుదములు వాతస్థానములు. కాని ఇవన్నియు శరీరమునందు తిరుగుచునుండును. విశేషించి వాయువు తిరుగును. దేహ మధ్యమున హృదయ మున్నది, అది మనస్సునకు స్థానము. స్వభావతః దుర్బలుడును, అల్ప కేశములు కలవాడును, చంచలుడును, ఎక్కువ మాటలాడువాడును, విషమమైన జఠరాగ్ని కలవాడును, ఆకాశమునందు ఎగురుచున్నట్లు స్వప్నములు చూచువాడును, వాత ప్రకృతి కలవాడు, అకాలమున జుట్టు నెరసిన

వాడును క్రోధశీలుడును ఎక్కువ చెమట పట్టువాడును, తీపి ఇష్టమైన వాడును, స్వప్నమునందు అగ్ని చూచువాడును పిత్త ప్రకృతి, దృఢమైన అవయవములు కలవాడును స్థిరచిత్తుడు, మంచికాంతి కలవాడు దట్టమైన కేశములు కలవాడు, స్వప్నమున నిర్మలోదకమును చూచువాడు, కఫ ప్రకృతి ఈ విధముగనే తామస, రాజస, సాత్త్వికులని మనుష్యులు మూఢు విధములు. ఓ ముని శ్రేష్ఠా! మానవులందరను వాత, పిత్త కఫాత్మకులు మైథునము చేతను, బరువు పనులు చేయుటచేతను రక్త పిత్థము కలుగును. చెడ్డ ఆహారము తినుటవలనను శోకము వలనను వాయు ప్రకోపము కలుగును. ద్విజోత్తమా! దాహమును కల్పించువాటిని కటు తిక్తకషాయ పదార్థములను తినుట చేతను నడచుటచేతను భయముచేతను పిత్త ప్రకోపము కలుగును. ఎక్కువ జలము త్రాగువారికిని గురువైన భోజనము చేయువానికిని భుజించిన వెంటనే నిద్రపోవువానికిని, సోమరులకును, శ్లేష్మ ప్రకోపము కలుగును. లక్షణములను బట్టి వాతాది రోగములను గుర్తించి వాటిని శమింప చేయ వలయును. ఎముకలు విరుగుట, నోటిచేదు నోరు ఎండుట, ఆవులింతలు, రోమాంచము ఇవి వాతవ్యాధి లక్షణములు; సోమరితనము నోటిలో నీళ్ళు ఊరుట శరీరము బరువుగా వుండుట నోటితీపి వేడిని కోరుట ఇవి కఫ వ్యాధి లక్షణములు; స్నిగ్ధము, ఉష్ణమును అయిన అన్నమును, అభ్యంగ స్నానము, తైలపానాదికము, వాత రోగమును నివారించును. నెయ్యి, పాలు, పటిక బెల్లము, చంద్ర కిరణాదులు పిత్తమును తొలగించును. త్రిఫలా తైలమును తేనెలో సేవించుట వ్యాయా మాదికము కఫరోగమును తొలగించును. విష్ణు పూజాధ్యానములు సర్వరోగ నివారకములు. (280)

రసాది లక్షణము

ధన్వంతరి పలికెను :

ఇపుడు ఓషధి రసాదుల లక్షణములు చెప్పెదను వినుము. ఓషధుల రసవీర్య విపాక ములు తెలిసిన వైద్యుడే రాజాదులను రక్షించగలడు. మధుర, ఆమ్ల, లవణ రసములు, చంద్రుని నుండి పుట్టినవి. కటుతిక్త కషాయ రసములు, అగ్ని నుండి పుట్టినవి. ద్రవ్య విపాకము కటు ఆమ్ల లవణ రూపమున మూడు విధములుగా ఉండును. శీతము, ఉష్ణము– అని వీర్యము రెండు విధములు. ఓ ద్విజోత్తమా ! ఓషధుల ప్రభావము చెప్పశక్యముగానిది. మధుర తిక్తకషాయ రసములు శీత వీర్యములు. మిగిలిన రసములు ఉష్ణ వీర్యములు. కాని గుడూచి తిక్తమైనను అత్యంత వీర్యప్రద మగుటచే ఉష్ణ వీర్యము. అట్లే కషాయ రసము కలదైనను పథ్య ఉష్ణ వీర్యము జటామాంసి మధుర రసయుక్త యైనను ఉష్ణ వీర్యము లవణ మధురములు విపాకమున మధురములని చెప్పబడినవి. ఆమ్లోష్ణ విపాకము కూడ మధురము మిగిలిన రసముల విపాకములు కటువులు. విశేష వీర్యయుక్త ద్రవ్యము విపాకమునందు విపరీత ఫలముకూడ ఇచ్చును అనుటలో సందేహములేదు. ఎట్లనగా తేనె మధురమైనను విపాకమున కటువు అగునని చెప్పబడినది. ఒక ద్రవ్యమునకు పదునారు రెట్లు నీరుపోసి, ఆ ద్రవ్యమునకు నాలుగురెట్లు జలము మిగులునట్లు కాచి ఆ క్వాథమును త్రాగవలెను. ఇది క్వాథ నిర్మాణపద్ధతి క్వాథవిధి చెప్పని చోట్ల ఈ పద్ధతిని అనుసరించవలెను. స్నేహ (తైలఘృతాది) పాకమునందు స్నేహమునకు నాలుగురెట్లు

కషాయముగాని, సమప్రమాణమగు తైల క్వాథములుగాని చేర్చవలెను. తైలములో వేసిన ఓషధులు ఉడికి చల్లారిన పిమ్మట చేతితో నలిపినపుడు వత్తివలె అయినచో అపుడు తైలపరిపాకము వచ్చినట్లు గ్రహించవలెను. లేహ్యములందు కూడ ఇట్లే సమాన ప్రమాణములుగల పదార్థములు వేయ వలయును. నిర్మలము, అల్పౌషధి యుక్తమగు క్వాథము ఉత్తమము. చూర్ణము ఒక అక్షము, క్వాథము నాలుగు పలములు ఇది సాధారణ మాత్ర. మాత్ర విషయమున ఒక నిశ్చిత ప్రమాణము లేదు. రోగి యొక్క వయోబల అగ్ని దేశకాల ద్రవ్యములను బట్టి రోగ స్వభావమును బట్టి వేర్వేరు ప్రమాణములు నిర్ణయించవలెను. సౌమ్యరసములు సాధారణముగ ధాతువర్ధకములు.

విశేషించి మధుర రసములు ధాతువర్ధకములు. దోషధాతు ద్రవ్యములు, సమాన గుణయుక్తము లైనచో శరీర వృద్ధి కల్గించును. విపరీతమైనచో క్షయకారకములు. ఓ నరశ్రేష్ఠా ! ఈ శరీరమునకు ఆహారము, మైథునము, నిద్ర అను మూడు ఉపస్థంబములు ఉన్నవి. వీటి విషయమున ప్రయత్న శీలుడై వుండవలెను. వీటిని పూర్తిగా సేవింపకున్నను, ఎక్కువ సేవించినను, శరీరము క్షీణించును. కృశించిన శరీరమును పోషించవలయును. స్థూల శరీరమును తగ్గించవలయును. మధ్య శరీరమును రక్షించుకొనవలెను. మొదటి రెండు ఉపక్రమములకు తర్పణము, అతర్పణము అని రెండు భేదములు. మానవుడు హితమైనదానిని తినవలెను. మితమైన దానిని తినవలెను. మొదట తిన్నది జీర్ణమైన పిమ్మట తినవలెను. ఓ నరశ్రేష్ఠా! రసము కల్కము, క్వాథము, శీతకషాయములు, ఫాంటము యని ఓషధి నిర్మాణము ఐదు విధములు. ఓషధులను పిండుటచే రసము, మథించుటచే కల్కము, మరగబెట్టుటచే క్వాథము, రాత్రి అంతయు నీటిలో వుంచుటచే శీతకషాయము, నీటిలోవేసి తాత్కాలికముగ వేడిచేయుటచే ఫాంటము తయారగును. చికిత్సకు నూట అరువది సాధములున్నవి. ఇవన్నియు తెలిసిన వైద్యుడు అజేయుడగును. అతనికి 'బహు శౌండికుడు' అనిపేరు. జఠరాగ్నిని సంరక్షించుటకు, వృద్ధిపొందించుటకు శుద్ధము చేయుటకును ఆహారశుద్ధి ఆవశ్యకము. మనుష్యుని బలమునకు అగ్నియే మూలాధారము. బలము కొరకై సైంధవ లవణయుక్త త్రిఫలను, కాంతి ప్రదములగు ఉత్తమ పేయములను, జాంగలరసమును సైంధవయుక్తమగు పెరుగును, పాలను పిప్పలిని సేవింపవలయును. ఏ రసములు అధికమైపోయినవో వాటిని సామ్యావస్థకు తీసుకొని రావలెను. వాత ప్రకృతి కలవాడు గ్రీష్మఋతువునందు మర్దనము చేయించుకొనవలెను. శిశిర ఋతువునందును సాధారణముగను లేక అధికముగను, వసంతమునందు మధ్యమముగను, గ్రీష్మము నందు విశేష రూపముగను మర్దనము చేయించుకొనవలెను. మొదట చర్మమును అనంతరము మజ్జను మర్దనము చేయించుకొనవలెను. స్నాయు రుధిర పూర్ణముఅగు శరీరమున అస్తులు చాలా లావుగా ఉన్నట్లు కనిపించును. భుజములు, బాహువులు, మోకాళ్ళు, పిక్కలు కూడ మాంసములుగా నుండును. బుద్ధిమంతుడు ఈ అవయవములను శత్రువును మర్దించినట్లు మర్దించవలెను. మణవలు, వక్షస్థలము వీటిని సాధారణముగా మర్దించ వలెను. అవయవ సంధులను మర్దించి వాటిని చాచ వలెను. కాని హఠాత్తుగాను క్రమ విరుద్ధముగాను చాచకూడదు. అజీర్ణ సమయము నందును భోజనానంతరము జలపానా నంతరము వ్యాయామము చేయకూడదు. దినమునకు నాల్గు భాగము లుండును. మొదటి జాములో సగము దాటిపోయినచో వ్యాయామము చేయకూడదు. శీతల

జలముతో ఒక పర్యాయము స్నానము చేయవలయును. ఉష్ణ జలము శ్రమను తగ్గించును. శ్వాస నిరోధము చేయకూడదు. వ్యాయామము, కఫమును తొలగించును. స్నానము పిత్తాధిక్య మును తొలగించును. శ్వాస నిరోధము చేయకూడదు. వ్యాయామము, కఫమును తొలగించును. స్నానము పిత్తాధిక్యమును తొలగించును. స్నానానంతరము ఎండను సేవించుట మంచిది. వ్యాయామము చేయువాడు ఎండను ఇతర క్లేశములను సహింప సమర్థుడగును. (281)

వృక్షాయుర్వేద కథనము

ధన్వంతరి పలికెను :

ఇపుడు వృక్షాయుర్వేదమును చెప్పెదను. ఇంటికి ఉత్తరమున ప్లక్షము, తూర్పున వటము, దక్షిణమున ఆమ్రము, పశ్చిమమున అశ్వత్థ వృక్షము మంగళకరములు. ఇంటికి దక్షిణమున మొలచిన ముండ్లచెట్లు కూడ మంచివి. ఇంటికి దగ్గరగ ఉద్యానవనమును నిర్మించుకొనవలెను. లేదా అన్నివైపుల అందమైన పుష్పిత తిల వృక్షములు పెంచవలెను. బ్రాహ్మణుని చంద్రుని పూజించి వృక్షములు నాటవలెను. చెట్లు నాటుటకు ఉత్తరాన నక్షత్రములు మూడును స్వాతి, హస్త, రోహిణి, శ్రవణ, మూల ప్రశస్త నక్షత్రములు ఉద్యానములో పుష్కరిణి నిర్మించి దానిలోనికి నదీప్రవాహము వచ్చునట్లు ఏర్పరచవలెను. జలాశయ ఆరంభమునకు హస్త, మఖ, అనురాధా, పుష్య, జ్యేష్ఠా నక్షత్రములు మూడు ఉత్తరా నక్షత్రములు మంచివి. వరుణుని, విష్ణువును, పర్జన్యుని (మేఘుని) పూజించి ఈ పని ప్రారంభించవలెను. అరిష్ట, అశోక, పున్నాగ, శిరీష, ప్రియంగు, కదళీ, జంబు, వకుళ, దాడిమ వృక్షములను నాటి గ్రీష్మ ఋతువునందు దినమునకు ఒక పర్యాయము వర్ష ఋతువు నందు రాత్రియందును భూమి ఎండి పోయినచో నీళ్లు పోయవలెను. చెట్టుకును చెట్టుకును నడుమ ఇరువది హస్తముల అంతరము ఉత్తమము. పదునారు హస్తముల అంతరము మధ్యమము. పండ్రెండు హస్తముల అంతరము అధమము. పండ్రెండు హస్తముల అంతరముగల చెట్లను తీసి వేరొకచోట పాతవలెను. దగ్గర దగ్గరగా వున్న చెట్లు ఫలముల నివ్వవు. ముందుగ వాటిని తగు విధముగా ఖండించి శోధనము చేయవలయును. విడంగ, ఘృత, పంకములు కలిపిన శీతలజలము వాటికి పోయ వలెను. వృక్షముల పండ్లు నశించునపుడు కుళుత్థ, మాష, ముద్గయవ, తిలలు కలిపిన ఘృత మిశ్రమములో శీతల జలమును పోసినచో అవి సర్వదా ఫల పుష్పములను ఇచ్చును. మేకల గొఱ్ఱెల ఎరువు, యవ చూర్ణము తిలలు వీటిని తడిపి ఏడు దినములు ఒకచోట ఉంచి పిదప దీనిని వృక్షములకు వేసినచో ఫలపుష్పవృద్ధి కలుగును. మత్స్యములున్న నీరు పోసినచో వృక్షములు వృద్ధి చెందును. విడంగ తండులములతో మత్స్య మాంసమును కలిపి వేసినచో అది అన్ని వృక్షము లకును దోహదము అగును. వాటి రోగములను తొలగించును. (282)

నానారోగములను హరించు ఔషధములు

ధన్వంతరి చెప్పెను :

సింహ, శటి రెండు విధముల పసుపు వత్సకము. వీటి క్వాథము శిశువునకు కలుగు అన్ని

అతిసారములను, స్తన్య దోషములను తొలగించును. శృంగి, కృష్ణ, అతివిష-వీటి చూర్ణమును తేనెతో నాకించవలెను. లేదా ఒక్క అతివిషనే నాకించవలెను. దీనిచే శిశువుల దగ్గు ఉపశమించి జ్వరము నశించును. పిల్లలకు దుగ్ధముతో ఘృుతము లేదా తైలముతో పచ ఇవ్వవలెను. లేదా యష్టికను గాని, శంఖపుష్పిని గాని పాలతో త్రాగించ వలెను. అట్లు చేయుటచే వారి వాక్శక్తి రూప సంపత్తి ఆయువు బుద్ధికాంతి వృద్ధిచెందును. వచ అగ్నిశిఖ వాసా శుంఠి పిప్పలి, పసుపు కూటము, యష్టిక, సైంధవము వీటి చూర్ణము ప్రాతఃకాలమున బాలకులకు ఇచ్చినచో మేధావృద్ధి కలుగును. దేవదారు, మహాశిగ్రు త్రిఫలా పయోముక్కుల క్వాథముగాని, కృష్ణ, మృద్వికలతో చేసిన కల్కముగాని, సర్వకృమి రోగములను అపహరించును. త్రిఫల, భృంగరాజ విశ్వముల రసములందును మధు ఘృతములందును, మేషీ (ఆడమేక) క్షీరమునందుకాని, గో మూత్రమునందు కాని తడిపినచో శిశు రోగములను తొలగించును. దూర్వారసమును నశ్యముగా ఇచ్చినచో నాసా రక్తము శాంతించును. లశునము (తెల్లఉల్లి) ఆర్ద్రకము, శిగ్రు, వీటి రసమును చెవిలో పోసినను, అల్లము రసముకాని, తైలముగాని పోసినను చెవిపోటును ఓష్ఠ రోగము లును నశించును. జాతి పత్రము, త్రిఫల, వ్యోషము గోమూత్రము, పసుపు, గోదుగ్ధము, అభయా కల్కము, తైలము-వీటిని కబలించుటచే దంత బాధ తొలగును. ధాన్యము నారికేళ జలము, గో మూత్రము, పోస్ శౌంఠి వీటి క్వాథమును నోటిలో వుంచుకొన్నచో జిహ్వా వ్యాధి తొలగును. లాంగలీ కల్కమునందు నిర్గుండీ రసముతో సాధించిన తైలము 'గండమాల' గల గండ దోషములను నశింపచేయును. అర్క పూతిక స్నుహీ, రుగ్ఘాత, జాతిక పత్రములను గో మూత్రముతో నూరి ఒంటికి రాసినచో చర్మరోగములు అన్నియు నశించును. వకుచిని తిలలతో ఒక సంవత్సరము తిన్నచో కుష్ఠ రోగము నశించును. పథ్యభల్లాతకీ గుడము, తైలము, పిండ ఖర్జూరము-ఇవి కుష్ఠరోగ నాశకములు, యూథిక, చిత్రకము, పసుపు, త్రిఫల, వ్యోషముల చూర్ణమును తక్రము(మజ్జిగ)తో త్రాగినను గుడముతో ఉసిరికాయ తిన్నను హర్షరోగము నశించును. ప్రమేయ రోగము కలవాడు త్రిఫల, దార్వి విషముల క్వాథమును గాని, ఉసిరికాయ రసమును, పసుపు కల్కము, తేనె వీటితో కల్పిగాని సేవించవలెను. వాసా గర్భమును వ్యాధి ఘాత క్వాథమునందు ఆముదము కలిపి త్రాగినచో వాత శోణిత రోగము తగ్గును. పిప్పలి ప్లీహ రోగమును తొలగించును.

ఉదర రోగము గలవాడు స్నుక్ క్షీరమునందు అనేక పర్యాయములందు భావన చేసిన పిప్పలి సేవించవలెను. చిత్రక విడంగ త్రికటు కల్కములతో సిద్ధమగు క్షీరము, అరుచి రోగమును తొల గించును. గ్రంథికా, ఉగ్ర అభయ, కృష్ణ, విడంగములను నేతిలో కల్పం వుంచి గాని కేవలము తక్రముతో గాని ఒక మాసము సేవించుటచే గ్రహణహర్ష, పాండు గుల్మక రోగములు క్రుమి రోగములు నశించును. త్రిఫల, అమృత, వాస, తిక్త భూనింబముల క్వాథమును తేనెతో సేవించినచో పాండు రోగము, కామలా రోగము నశించును. రక్త పిత్తము కలవాడు వాసారసమును పటికబెల్లము తేనె కలిపి త్రాగినను శతావరి ద్రాక్షబల, శుంఠిలలో సాధించిన పాలు త్రాగినను ఆ రోగము నశించును. క్షయ రోగి శతావరి, విదారి, పథ్య, బలాత్రయ, వాసక, శ్వదంష్ట్రలను చూర్ణము చేసి తేనె, నెయ్యి కలిపి నాకవలెను. పథ్యశిగ్రు, కరంజచ, అర్క, త్వక్సార, మధు సైంధవములను గో

మూత్రముతో కలిపి రాసినచో విద్రథిని పక్వముచేసి మాన్పుటకు మంచిది. త్రివృతా, జీవంతీ, దంతీ, మంజిష్ఠా, ద్వివిధ, శర్వరీ, తార్క్షజా, నింబపత్రముల లేపము భగరంధ్రము నకు మంచిది. రుగ్ఘాత, హరిద్ర, లాక్షాచూర్ణములను గోఘృతముతోను తేనెతోను కలిపి వస్త్రముతో వర్తిచేసి వ్రణము నందుంచినచో వ్రణమును శుద్ధముచేసి మాన్పును. శ్యామా, యష్టి, హరిద్రా, లోధ్ర, పద్మక, ఉత్పల, చందన, మరీచములతో క్షీరములో కాచిన తైలము వ్రణములను మాన్పును. శ్రీ కార్పా సదళ భస్మ, త్రిఫల, ఉపల, నిశలతో గోళ ములు చేసి తామ్ర పాత్రయందు ఉడికించి ఆ తైలమును గాయమునందు వ్రాయవలెను. కుంభీ సారమును నిప్పుపై మాడ్చి దానిని పాలతోకలిపి వ్రణముపై వ్రాయవలెను. లేదా కొబ్బరి చెట్టు మొదటిలో ఉన్న మట్టిలో ఘృతము కలిపి కాచినచో వ్రణము మానును.

విశ్వ, అజమోద, సైంధవ, చించాత్వక్కుల సమ భాగము గల అభయతో కలిపి తక్రముగాని, ఉష్ణ జలముగాని త్రాగుటచే అతిసారము నశించును. ఇంద్రయవ, అతి విష, విశ్వముస్తలు వేసి, కాచిన క్వాథము ఆమసహితమగు జీర్ణాతి సారమును శూలముతో కూడిన రక్తాతి సారమును పోగొట్టును. అంగారములపై కాల్చిన సుగతమును సింధువును వేడినీళ్ళతో త్రాగవలెను. పిదప శూల బాధ కలవాడు దానిని వేడి నీళ్ళతో త్రాగవలెను లేదా సైంధవము, ఇంగువ, పిప్పలి అభయ వీటితో వేడి నీళ్ళతో త్రాగవలెను. తేనెలో తడిపిన కటురోహ, కమల, ఆతంక, లాజ చూర్ణములను గుడ్డలో చుట్టబెట్టి ముఖము లేదా సైంధవము, ఇంగువ, పిప్పలి అభయ వేడినీళ్ళతోత్రాగవలెను. తేనెలో తడిసిన కటు రోహకము, అతంక, లాజచూర్ణములను గుడ్డ చుట్ట బెట్టి ముఖమునందుంచుకున్నచో దాహము తగ్గును. పాఠదార్వి జాతీదలములను, ద్రాక్ష, మూల త్రి ఫలములతో సాధించి మధుక్వాథముతో కలిపి ముఖము నందుంచి చప్పరించినచో దాహము తగ్గును. కృష్ణ, అతి విష, తిక్త ఇంద్రదారు, పాఠ, పయోముక్కుల క్వాథమును, గో మూత్రమునందు మరిగించి తేనె కలిపినచో స్వరకంఠ రోగములను పోగొట్టును. పథ్య గోక్షుర, దుఃస్పర్శ, రాజవృక్ష, శిలాజిత్తుల కషాయమును తేనెతో త్రాగినచో మూత్ర కృచ్ఛ్రము పోవును. వెదురు బెరడు, వరుణ వృక్షపు బెరడుతో చేసిన క్వాథము శర్కరను, ఆశ్మరీ రోగమును నశింప చేయును. శ్లీపద రోగము కలవాడు శాకోటక క్వాథమును తేనెతో కలిపి తినవలెను. మాష, అర్కత్వక్కులను, అర్క వృక్షపాలను, తైలమును, మైనమును, సైంధవమును కలిపి ఉపయోగించినచో పాద రోగములు నశించును. శౌంఠి సౌవర్చము. హింగు చూర్ణము వీటిని శౌంఠి రసముతోకాని, నేతితోకాని, లేదా వీటి క్వాథములుకాని, మలబంధ దోష మును పోగొట్టును. గుల్మరోగము కలవాడు, సౌవర్చల చిత్రక హింగు అజామోదముల రసముతో కలిపి లేదా విడంగ చిత్రకములతో కలిపి తక్రసానము చేయవలెను. ధాత్రి, పటోల, ముద్గముల క్వాథము, ఆజ్యముతో కలిపి తీసుకున్నచో విసర్ప రోగము తొలగును. శౌంఠి దేవదారు, నవాక్షీర క్వాథము గోమూత్రముతో కలిపి తీసుకున్నచో విసర్పరోగమును పొందును. వ్యోష, అయోరజ, క్షార త్రిఫల క్వాథము శోథ రోగములు తొలగించును. గుడ శిగ్రు త్రివృత్, సైంధవ లవణముల చూర్ణముతో చేసిన క్వాథము శోథ రోగమును తొలగించును. విశోథ త్రిఫల, గుడములతో చేసిన క్వాథము విరేచకరము వచా, ఫల కషాయమునుండి తీసిన

జలము వమనకారి. భృంగరాజ రసమున భావితమైన త్రిఫల నూరు పలములు వాయు విడంగలోహ చూర్ణములు, పదవ భాగము శతావరి, గుడూచి, చిత్రమూలములను ఇరువది ఐదు పలములు గ్రహించి చూర్ణముచేసి, దానిని మధు, ఘృత తైలములతో సేవించినచో వళులు వలితములు తొలగిపోవును. అట్లు సేవించినవాడు సకల రోగ ముక్తుడై నూరు సంవత్సరములు జీవించును. మధు శర్కరలు కలిపి సేవించి త్రిఫల సర్వరోగ వినాశకరము. కృష్ణా సహితమగు త్రిఫలను సితా మధు ఘృతములతో సేవించినచో అట్టి ఫలమే ఇచ్చును. పథ్య, చిత్రక, శౌంఠి, ముసలీ చూర్ణములను గుడముతో భక్షించినచో రోగములను తొలగించి మూడు వందల సంవత్సరముల ఆయుర్దాయము ఇచ్చును. జపాపుష్పమును కొంచెము నలిపి నీటిలో కలిపి ఆ చూర్ణ జలమును కొంచెము తైలములో కల్పినచో ఆ తైలము ఘృతమువలె యగును. పిల్లి మావితో ధూపము వేసినచో చిత్రము కనబడదు. మరల మైనము ధూపము వేసినచో వెనుకటి వలెనే కనబడును. కర్పూరము, జటగ, భేక తైలము, వీటిని పాటలి మూలముతో కలిపి నూరి పాదములకు రాసుకొని మనుష్యుడు నిప్పుల మీద నడువగలడు. తృణోత్థాపనాదము చేయుచు, ఆశ్చర్య కరముగ నడువగలడు. విషములను తొల గించుట, రోగనాశము, గ్రహనాశము, తుచ్ఛ క్రీడలు, కామనాపరమైనవి. ఇహలోక, పరలోకము లందు సిద్ధి నిచ్చు కర్మలను షట్కర్మ సహితముగ నీకు చెప్పితిని. మంత్ర, ధ్యాన ఔషధ, కథా, ముద్రా, యజ్ఞములు ఈ ఆరును ఇచట పిడికిళ్ళు కొలది ధర్మార్థ కామ మోక్షములను ఇచ్చు దీనిని ఎవడు పఠించునో ఆతడు స్వర్గమునకు వెళ్ళును.(283)

మంత్ర రూప ఔషధ కథనము

ధన్వంతరి పలికెను :

ఓంకారాది మంత్రములు, ఆయురారోగ్య ప్రదములు, స్వర్గము ఇచ్చునవి కూడ, ఓంకారము అత్యుత్తమమైన మంత్రము. దానిని జపించినవాడు, అమృత్యుడగును. గాయత్రి పరమమంత్రము దానిని జపించినవాడు భుక్తిముక్తులను పొందును. 'ఓం నమోనారాయ ణాయ' అను మంత్రము సర్వార్థసాధకము; 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అను మంత్రము సర్వ ఫలప్రదము; 'ఓం హ్రూం నమో విష్ణవే' అను మంత్రము పరమౌషధము. దీనిచే దేవతలు, అసురులు, లక్ష్మీవంతులై రోగముక్తులైరి. దీనివలన లోకోపకారము ధర్మము కలుగును. ఇది మహౌషధము. 'ధర్మః సద్ధర్మ కృద్ధర్మీ' యను ధర్మ సంబంధి నామములను జపించువాడు నిర్మలుడగును. శ్రీదః శ్రీశః శ్రీనివాసః శ్రీధరః శ్రీనికేతనః శ్రియఃపతిః శ్రీపరమః' అను పదములను జపించువాడు ఐశ్వర్యమును పొందును. కామీకామ ప్రదః కామః కామపాల స్తథాహరిః; ఆనందోమాధవశ్చైవ' అను హరి నామ ములు కామప్రదములు. 'రామః పరశురామశ్చ నృసింహో విష్ణురేవచ, త్రివిక్రమః' యను నామములు జయేచ్ఛకలవారు జపించవలెను. విద్యాభ్యాసముచేయువారు నిత్యము పురుషోత్తమ నామము జపించవలెను. 'దామోదరః' అను నామము బంధహరము పుష్కరాక్షః యను నామము నేత్రరోగము లను తొలగించును. "హృషీకేశః అను నామము భయహరము. ఔషధకర్మ యందు అచ్యుతయను అమృత మంత్రమును జపించవలెను. "అపరాజితః" అను నామమును యుద్ధము నందును,

జలము దాటునపుడు శ్రీనృసింహ నామమును స్మరించవలెను, పూర్వాది దిక్కులందు క్షేమము కోరువాడు చక్రీ, గదీ, శార్ఙ్గి, ఖడ్గీయను నామములు స్మరించవలెను. నారాయణ స్మరణము సదాచేయ వలయును. నృసింహస్మరణము సకల భీతినివారకము, గరుడధ్వజ స్మరణము విషహరము, వాసుదేవ నామము సర్వదా జపించవలెను. ధాన్యాదులను ఇంటిలో ఉంచు నపుడును శయన సమయము నందును, అనంత అచ్యుత నామములు స్మరించవలెను. దుః స్వప్నమున నారాయణుని, అగ్ని దాహాదులందు జలశాయిని స్మరించవలెను. విద్యార్థి హయగ్రీవుని, పుత్రప్రాప్తి కాముడు జగత్పతిని శౌర్యకాముడు బలభద్రుని స్మరించవలెను. వీటిలో ఒక్కొక్క నామము అనేక ఫలముల నిచ్చును. (284)

మృతసంజీవన సిద్ధయోగము

ధన్వంతరి చెప్పెను :

ఆత్రేయుడు చెప్పినవియు, దివ్యములును సర్వవ్యాధి నివారకములును మృత సంజీవనకరము లును అగు సిద్ధ యోగములను మరల చెప్పెదను. ఆత్రేయుడు చెప్పెను. వాతజ్వరమున బిల్వాది పంచమూల క్వాథము శ్రేష్టము. జీర్ణ శక్తికి పిప్పలీమూల గుడూచి శుంఠీ క్వాథము ఇవ్వవలెను. ఆమలక అభయా కృష్ణ చిత్రకక్వాథము సర్వ జ్వర నాశకము. బిల్వమూల అగ్ని మంథశ్యోనాక, కాశ్మరులు పాటలా, స్థిర, త్రికంటక, పృష్టిపర్ణి, బృహతీ, కంటకారికలు వీటికి దశ మూలములని పేరు. వీటి క్వాథము కుశమూల. క్వాథము జ్వరమును అజీర్ణమును పార్శ్వశూలను, దగ్గును నశింపచేయును. గుడూచి, పర్పటి, ముస్త, కిరాత, విశ్వ భేషజములతో చేసిన పంచ భద్ర క్వాథము వాత పిత్త జ్వరమున ఇవ్వవలెను. త్రివృత్, విశాల, కటుక, త్రిఫల, ఆరగ్వధములతో చేసిన క్వాథమును, యవక్షారము కలిపి త్రాగించినచో అది విరేచకమై, సంపూర్ణ జ్వరములను నశింప చేయును. దేవదారు, బల, వాస, త్రిఫల, వ్యోష, పద్మక, వాయు, విడంగ, సితలను సమాన భాగములో చూర్ణముచేసి సేవించినచో పంచవిధ కాసములను తొలగించును. హృదయ రోగ గ్రహణి పార్శ్వరోగ హిక్కా, శ్వాస, కాస రోగములను పోగొట్టుటకు దశమూల శఠీరాన్న పిప్పలీ, బిల్వ, పౌష్కర శృంగీ, ఆమలకీ, బార్జి, గుడూచి, నాగవల్లులతో యథాశాస్త్రముగ చేసిన క్వాథమును గంజిని త్రాగవలెను. మధు యుక్తమగు మధుకమును శర్కరా సహిత మగు పిప్పలిని గుడ యుక్త నాగరమును లవణ త్రయమును సేవించిన ఎక్కిళ్ళు పోవును. కారవి, అజాజి, మరిచ, ద్రాక్ష, వృక్షామ్ల దాడిమ, సౌవర్చల, గుడములను సమాన భాగములుగ గ్రహించి చేసిన చూర్ణముతో తేనె కలిపి తయారుచేసిన కారవ్యాధి వటి సర్వవిధములగు అరుచి రోగములను నశింపచేయును. అల్లపురసమును తేనె కలిపి త్రాగించినచో అరుచి, శ్వాసకాసలు, జలుబు, కఫము నశించును.

వట, శృంగి, శిల, లోధ్ర, దాడిమ, మధుకములను చూర్ణముచేసి, ఆ చూర్ణముతో సమానముగ పటిక బెల్లము కలిపి తేనెతో సేవించవలెను. ఈ వటశృంగాది అవలేహమును జలముతో త్రాగినచో వమనమును దాహమును తొలగించును. గుడూచి, వాసక, లోధ్ర పిప్పలి చూర్ణమును తేనెలో కలిపి సేవించినచో కఫయుక్తమగు రక్తము, దాహము, దగ్గు జ్వరము నశించును. తేనె కలిపిన

వాసకరసము, తామర భస్మము కాసమును పోగొట్టును. శిరీష పుష్పరసముచే భావన చేసిన మరిచ చూర్ణము హితకరము. మసూరము అన్ని బాధలను పోగొట్టును. తండులీయకము పిత్త దోషమును తొలగించును. నిర్గుండి, శారిబ శేలు అంకోలములు విషనాశకములు, శుంఠి, అమృత, క్షుద్ర, పుష్కర గ్రంథి, పిప్పల మూలములతో చేసిన క్వాథము, మూర్ఛను, మదమును తొలగించును. హింగు, సౌవర్చల, వ్యోషములను రెండేసి పలములు నాలుగు శేర్ల ఘృతము కలిపి నాలుగురెట్ల గోమూత్రముతో సిద్ధము చేసినచో ఉన్మాద నాశకము శంఖ పుష్పివచా, కుష్ఠ సిద్ధ, బ్రాహ్మీ రసములను కలిపి గుటికలుచేసి, ఇచ్చినచో పాత ఉన్మాదమును అపస్మారమును తొలిగించి మంచి మేధా శక్తిని ఇచ్చును. అభయముతో పంచగవ్యమును ఘృతమును కలిపి సేవించిన కుష్ఠము నశించును. పటోల త్రిఫల, నింబ, గుడూచి, ధావని, వృష, కరంజములతో తయారుచేసిన ఘృతము కుష్ఠ రోగమును తొలగించును 'వజ్రకము' నింబ, పటోల, వ్యాఘ్రీ, గుడూచి, వాసకములను పదేసి పలములు తీసుకుని బాగుగా నూరవలెను. పదునారుశేరుల జలముతో క్వాథముచేసి దానిలో ఒకశేరు ఘృతము త్రిఫలా చూర్ణ కల్కము వేసి నాల్గవవంతు మిగులు వరకు ఉండవలెను. ఈ పంచ తిక్త ఘృతము కుష్ఠరోగమును ఎనుబది విధములగు వాత రోగములను, నలుబది విధములగు పిత్తరోగములను, ఇరువది విధములగు కఫరోగములను పీనస, అర్శో, వ్రణాదులను నశింప చేయును. ఈ యోగరాజము సూర్యుడు అంధకారము నశింపచేసినట్లు ఇతర రోగములను కూడ నిస్సంశయముగ నశింపచేయును.

ఉపదంశము శమించుటకై త్రిఫలాకషాయ భృంగరాజ రసములతో వ్రణమును కడిగివేసి పటోలపత్ర చూర్ణముతో గాని, దాడిమ చూర్ణముతో గాని, గజచూర్ణముతో గాని, త్రిఫలాచూర్ణముతో గాని, ఆ వ్రణమును కప్పవలెను. త్రిఫలా, లోహచూర్ణ, యష్టిక, ఆర్కవ, నీలకమల, మరిచ, సైంధవములు వేసి వండిన తైలమును మర్దించినచో వమనములు శాంతించును. క్షీర మార్కవరస, మధుక, ఉత్పలములను రెండు శేర్లు తీసుకొని తైలము నాల్గవవంతు మిగులు వరకు వండి దానిని నశ్యముగ ఉపయోగించి నచో ఫలితము తగ్గును. నింబపటోల, త్రిఫలా, గుడూచి, ఖదిర, వృష, భూనింబ, పాఠాత్రిఫలా, గుడూచి రక్త చందనములు అను ఈ రెండు యోగములు జ్వరమును తొలగించును. కుష్ఠ విస్ఫోట కాదులను నశింపచేయును. వటోల, అమృత, భూనింబ, వాస, అరిష్టక, పర్పట, ఖదిరల క్వాథము, విస్ఫోట జ్వరములను తొలగించును. దశమూలీ, ఛిన్నరుహా, పథ్యాదారు, పునర్నవ, శిగ్రు, విశ్వజిత్‌లతో చేసిన క్వాథము జ్వర, విద్రథి, శోథములందు హితకరములు. మధూకము, నింబ పత్రములు నూరి చేసిన లేపము వ్రణములను తొలగించును. త్రిఫలా, ఖదిర, దార్వీ, న్యగ్రోధ, అతిబల, కుశ, నింబ, పత్రములు నూరి చేసిన లేపము వ్రణములను తొలగించును. త్రిఫలా, ఖదిర, దార్వీ, న్యగ్రోధ, అతిబల, కుశ, నింబ, మూలక పత్రములతో చేసిన కషాయములు శరీర బాహ్య శోధనమునకు మంచివి. కరంజ, అరిష్ట, నిర్గుండీ రసములు, గాయము నందలి క్రుములను నశింప చేయును. ధాతకీ, చందన, బలాస, మంగా మధుక, ఉత్పల, దారు, మేదలను నేతితో కలిపి లేపముగ వ్రాసినచో వ్రణములను మాన్పును.

గుగ్గులు, త్రిఫలా, వ్యోషములను సమాంశమున గ్రహించి ఘృతము కలిపి పూసినచో నాడీ వ్రణములు దుష్ట వ్రణములు శూలభగందరము మొదలగునవి నశించును. గో మూత్రమునందు శుద్ధము చేయబడిన హరీతకిని తైలము నందు వేయించి ప్రతిదినము లవణముతో ప్రాతఃకాలమున సేవించినచో కఫ వాత రోగములు తొలగును. త్రికటు, త్రిఫలా క్వాథమును క్షారలవణము కలిపి త్రాగినచో కఫ వాత ప్రకృతిగల వారికి విరేచన మగును. కఫ వృద్ధి తగ్గును. పిప్పలీ, పిప్పలీమూల, వచా, చిత్రక, నాగరములతో చేసిన క్వాథమునుగాని, పేయమునుగాని త్రాగినచో ఆమవాతము తొలగును. రాస్నా గుడూచి, హేరండ, దేవదారు శుంఠుల క్వాథము సర్వాంగ వాతమును సంధి వాతమును, అస్తి మజ్జా గత ఆమవాతమును తొలగించును. దశ మూల కషాయమును నాగర జలముతో కలిపి త్రాగినను పై రోగములు శాంతించును. శుంఠి గోక్షుర క్వాథమును ప్రతిదినమున ప్రాతః కాలమున సేవించినచో ఆమవాత సహితమగు కటి శూలము పాండు రోగము నశించును. శాఖా పత్ర సహితమగు ప్రసారిణి తైలము కూడ పై రోగములు తగ్గించును. గుడూచి స్వరసము కల్కము, చూర్ణము, లేదా క్వాథము చాలకాలము సేవించినచో వాత రోగము పోవును. పిప్పలి, కాని, వర్ధమానముగాని, గుడముతోగాని, పథ్యతోగాని సేవించ వలెను. పటోల, త్రిఫలా, తీవ్ర కుటకి, అమృతముల పాకము తయారుచేసి, సేవించినచో దాహయుక్త వాత రక్త రోగము శీఘ్రముగ నశించును. గుగ్గులును గోరువెచ్చటి నీటితో త్రిఫలను సమశీతోష్ణ జలముతోను లేదా బలా, పునర్నవ, హేరండమూల, బృహతీద్వయ, గోక్షుర, హింగు, లవణములతోను తీసుకొనినచో వెంటనే వాత రోగము నశించును. ఒక కర్షము పిప్పలీ మూలము పంచలవణములు పిప్పలీ, చిత్రక, శుంఠి, త్రిఫలా, త్రివృత్, వచా, క్షారద్వయ, శాద్వల, దంతీ స్వర్ణక్షీరి, విపాశికలను కలిపి రేగిపండు ప్రమాణముగల గుటికలుచేసి, గంజితో త్రాగవలెను. శోధమునందును దాని వలన కలిగిన ఆమపాకమునందును దీనిని సేవించవచ్చును. ఉదర వృద్ధి యందు కూడ దీనిని సేవించవచ్చును. దారువర్షాభూ, శుంఠి క్షీరములు శోధ నాశకములు. అర్క, వర్షాభూ, నింబ, క్వాథ కూడ శోధను తొలగించును. వ్యోషముతో గూడిన ఘృతమును మూడు రెట్లు పలాశ భస్మజలముతో సిద్ధము చేసి త్రాగినచో వాని అర్శో రోగము తప్పక నశించును. విశ్వక్సేన అబ్జ నిర్గుండులతో సాధితమైన లవణముకూడ విడంగ అవల సైంధవ, రాస్న దుర్ధ దేవదారు వచలతో నాలుగు రెట్ల కటు ద్రవ్య ములు కలిపిన తైలము మర్దించుటచే గండమాలగల గండ రోగములు నశించును.

శటీ, కౌనాగ, వలయ, క్వాథమును క్షీర రస పయస్యా, పిప్పలి వాసా కల్కమును క్షీరముతో సేవించినచో క్షయ రోగము నశించును. వచా, విట్ల వణ, అభయా, శుంఠి, హింగు, కుష్ఠ, అగ్ని, దీభ్యకములను రెండు, మూడు, ఆరు, నాలుగు, ఒకటి, ఏడు, భాగముల చొప్పున, వరుసగ గ్రహించి చూర్ణముచేసి సేవించినచో గుల్మ రోగమును, ఉదర రోగమును, శూలరోగమును, కాసరోగమును తొలగించును. పాఠ, నికుంబ, త్రికటు త్రిఫల, చిత్రకముల చూర్ణమును గో మూత్రముచే సాధించి గుటికలు చేసి సేవించినచో గుల్మ ప్లీహాదికములు నశింపచేయును. వాసా, నింబ పటోల త్రిఫలములు, వాత పిత్తములను తొలగించును. వాయువిడంగ చూర్ణమును తేనెతో సేవించినచో క్రుమి వినాశకరము. విడంగ సైంధవ, యవక్షారములు, గోమూత్రముతో కలిపి

సేవించిన హరీతకీ, క్రుమిఘ్ను ములు. శల్లకీ, బదరీ, జంబూ, ప్రియాల, ఆమ్ర, అర్జున వృక్షముల బెరడు తేనెతో కలిపి, పాలతో సేవించినచో రక్తాతి సారము నశించును. బిల్వ ఆమ్ర ధాతకీ, పాఠా శుంఠి మోచ రసములు సమములుగా గ్రహించి చేసిన చూర్ణమును గుడ మిశ్ర తక్రముతో సేవించినచో దుర్జయమగు అతిసారమును జయించును. చాంగేరీ, కోల, దధ్యంబు, శుంఠి యవ క్షారముల క్వాథమును ఘృతముతో సేవించినచో గుదభ్రంశ రోగము తొలుగును. విడంగ, అతివిషా, ముస్త, దేవదారు పాఠా కలింగకములు క్వాథము మిర్చ చూర్ణముతో కలిపి సేవించినచో శోధ అతిసారములు నశించును.

శర్కరా సైంధవ శుంఠులతో కాని కృషా, మధు గుడములతో గాని ప్రతిదినము రెండేసి కర్కాయలు తినువాడు నూరు సంవత్సరములు సుఖముగ జీవించును. పిప్పలి యుక్తమగు త్రిఫలనుకూడ మధుఘృతములతో సేవించిన ఆ విధముగనే ఫలము నిచ్చును. ఆమలక సురస భావితమగు ఆమలకమును మధుఘృత, శర్కరులతో కలిపి దుగ్ధ పానము చేసినవాడు స్త్రీలకు ప్రభువగును. మాష, పిప్పల, శాలి, యవగోధూమల చూర్ణమును సమాన ప్రమాణములో గ్రహించి, పిప్పలికను వండి దానిని భక్షించి, శర్కరాయుక్తమగు, మధుర దుగ్ధమును చేసినవాడు, చటక పక్షివలె నిస్సంశయముగ పది పర్యాయములు స్త్రీ సంగమము చేయ సమర్థుడగును. సమంగ, ధాతకీ పుష్ప, లోధ్ర నీలోత్పలములను పాలతో ఇచ్చినచో స్త్రీల ప్రదర రోగమును నశించును. కరంటక బీజము, మధుకము, శ్వేతచందనము, పద్మోత్పల మూలములు, మధుకము, శల్కరతిలలు, వీటి చూర్ణమును గర్భపాతశంక కలుగునపుడు సేవించిన గర్భమును స్థిరముగ ఉంచును. దేవదారు, నభఃకుష్ఠ, నలద, విశ్వభేషజములను గంజిలో నూరి తైలము కలిపి పూసినచో శిరో రోగములు పోవును. సైంధవ లవణమును వస్త్రముతో శుద్ధముచేసి, కొంచెము వేడి తైలములో కలిపి, కర్ణములో పోసినచో కర్ణశూల రోగము తగ్గును. బలా, శతావరీ, రాస్నా, అమృతా సైరీయక త్రిఫలలతో సిద్ధము చేసిన ఘృతము తిమిర రోగమును తొలగించును. త్రిఫలా, వ్యోష, సైంధవములు కలిపిన ఘృతము త్రాగినచో కండ్లకు హితము విరేచనకరము. హృదయమునకు హితము జఠరాగ్ని దీపనము, కఫరోగనాశకము. నీలోత్పల కింజల్కము. గోమయ రసముతో కలిపి గుటికాంజనముచేసి, ఉపయోగించినచో అది దివాంధ (పుట్టుగ్రుడ్డివారికి) రాత్ర్యంధులకు (రేచీకటిగలవారికి) హితకరము. యష్ఠి, మధువచ, పిప్పలీబీజ కుటజముల బెరడుతో కల్కమును నింబక్వాథమును కలిపి ఇచ్చినచో అది వమనకారకము, తడిసిన యవలనీరు విరోచనకరము. పథ్యా సైంధవ ప్పిలములను సమాన భాగములుగ గ్రహించి చూర్ణముచేసి, ఉషోదకముతో త్రాగినచో నారాచ సంజ్ఞకమగు ఈ చూర్ణము విరేచనకరము. సర్వరోగ వినాశకము. ఆత్రేయుడు మునులకు చెప్పిన సిద్ధయోగములలో శ్రేష్ఠములైన సర్వ రోగనాశక యోగములను సుశ్రుతుడు తెలుసుకొనెను. (285)

మృత్యుంజయ కల్పము

ధన్వంతరి చెప్పెను :

ఆయుర్దాయప్రదములు రోగ వినాశకములగు మృత్యుంజయ కల్పములను చెప్పెదను. మధు,

ఘృత, త్రిఫలా, అమృతములు మూడు వందల రోగములను తొలగించును. త్రిఫలను నాలుగు లేదా రెండు లేదా ఒక తులముగా సేవించవలెను. ఒక మాసము, బిల్వ తైలనశ్యము చేసికొన్నచో ఐదు వందల సంవత్సరములు జీవించును. కవియగును. తిల, భల్లాతకములు రోగమును, అపమృత్యువును వళులను తొలగించును. వాకుచీ పంచాంగ చూర్ణములను ఖదిరోదకముతో ఆరుమాసములు సేవించినచో కుష్ఠము నశించును. నీలకురంట చూర్ణమును క్షీరముతోగాని, మధువుతోగాని సేవించిన మంచిది. ఖండదుగ్ధమును పానముచేయువాడు నూరు సంవత్సరములు జీవించును. మధు ఆజ్య శుంఠులను, ప్రతి దినము ప్రాతఃకాలము, ఒక పలము సేవించువాడు మృత్యువును జయించును. మాండకీ చూర్ణముతో క్షీరము సేవించువానికి వళులు, ఫలితము ఉండదు. ఉచ్చటను, మధువుతో ఒక కర్షము తిని క్షీరపానము చేయువాడు, మృత్యువును జయిం చును, మధు ఘృతముతోగాని, క్షీరముతోగాని నుర్గండీరసమును సేవించువాడు రోగమును మృత్యు వును జయించును. ఒక తులము పలాశ తైలమును మధువుతో ప్రతి దినము ఆరు మాసములు సేవించుచు, దుగ్ధము త్రాగువాడు ఐదు వందల సంవత్సరములు జీవించును. పాలతో కూడ జ్యోతిష్మతీ పత్ర రసమునుగాని త్రిఫలనుగాని త్రాగువాడు వెయ్యి సంవత్సరములు జీవించును. మధువుతో ఘృతము, నాలుగు తులముల శతావరి చూర్ణము సేవించువాడు సహస్ర వర్ష జీవియగును. నిర్గుండిని, మధు ఘృతము లతోగాని, పాలతోగాని సేవించిన రోగ మృత్యువులను నశింపచేయును. పంచాంగ నింబరసమును బదిరక్వాథముతో భావనచేసి భృంగరాజ రసముతో ఒక తులముసేవించినచో రోగములను జయించి అమర్త్యుడగును. రుదంతికా చూర్ణమును ఘృతమధువులతో గాని, దుగ్ధముతోగాని సేవించువాడు, మృత్యువును జయించును. హరీతకీ చూర్ణమును భృంగరాజ రసముతో భావనచేసి ఘృతమధువులతో సేవించినచో రోగముక్తుడై మూడు వందల సంవత్సరములు జీవించును. వారాహికా భృంగరసలోహచూర్ణ శతావరీ, ఆజ్యములను ఒక తులము సేవించినచో అయిదు వందల సంవత్సరములు జీవించును. లోహ భస్మను శతావరిని భృంగరాజ రసముతో భావనచేసి మధు ఘృతములతో సేవించినవాడు మూడు వందల సంవత్సర ములు జీవించును. తామ్రభస్మ, అమృతాత్రివృత్, గంధకములను సమముగ గ్రహించి కుమారికా రసముతో రెండు గురివిందెల గోలీలు తయారుచేసి ఘృతముతో సేవించుటచే ఐదువందల సంవత్సర ములు జీవించును. అశ్వగంధ; త్రిఫలా శర్కర, తైల ఘృతములను సేవించువాడు నూరు వర్షములు జయించును.

అశోక వృక్షము బెరడు యొక్క చూర్ణమును మధు ఘృతములతో సేవించి దుగ్ధ పానము చేయుటచే రోగములు నశించును. పునర్నవా చూర్ణమును మధు ఆజ్య క్షీరము లతో సేవించినవాడు రోగ విముక్తుడగును. మధు సహితమగు తిల తైలమును నశ్యముగ తీసుకొన్నచో శతవర్ష జీవి యగును. కృష్ణ కేశములు (నల్లని వెంట్రుకలు) కలవాడు అగును. అక్ష చూర్ణమును ఒక తులము మధ్వాజ్య క్షీరములతో సేవించిన శతాయువగును. అభయా గుడములను మధురాది ఓషధులను ఘృతముతో తిని, పాలతో అన్నము భుజించు వాని కేశములు సర్వదా కృష్ణవర్ణములై యుండును. అతడు రోగ రహితుడై అయిదు వందల సంవత్సరములు జీవించును. ఒక పలము కూష్మాండ

చూర్ణమును ఘృత దుగ్ధములతో ఒక మాసము సేవించుచు దుగ్ధాన్న భోజనము చేయువాడు రోగ రహితుడై సహస్ర వర్ష జీవియగును. శాలుక చూర్ణమును భృంగాజ్యమును మదు ఘృతములతో సేవించినవాడు నూరు సంవత్సరములు జీవించును. ఒక తులము కటుతుంబీ తైలమును నశ్యముగా గ్రహించువాడు రెండు వందల సంవత్సరములు జీవించును. త్రిఫలా పిప్పలి శుంఠుల సేవనము మూడు వందలసంవత్సరము ఆయుర్దాయము నిచ్చును. వీటిని శతావరితో కలిపి సేవించి నచో బలమును, సహస్రాయువును ఇచ్చును. చిత్ర శుంఠి విడంగముల సేవనము పూర్వోక్త ఫలమును ఇచ్చును. త్రిఫలా, పిప్పల, శుంఠులను లోహ భృంగరాజ, నింబ పంచక, ఖదిర, నిర్గుండీ, అంట కారి వాసక పునర్నవలతో గాని, వీటి రసముతో భావన చేసి కాని, వటి లేదా చూర్ణము తయారుచేసి ఘృత మధు గుడ జలాదులతో సేవించినచో పూర్వోక్త ఫలము లభించును. 'ఓం హ్రూంసః' అను మంత్రముచే అభిమంత్రితమగు యోగరాజము మృత్యు సంజీవని సమానమై రోగములను మృత్యువు లను జయింపచేయును. ఈ కల్ప సాగరములను దేవతాసురమునులు సేవించిరి. పాలకాప్యుడు అంగరాజునకు గజాయుర్వేదము బోధించెను. (286)

గజ చికిత్స

పాలకాప్యుడు పలికెను :

ఓ లోమపాదా ! నీకు గజ లక్షణములను, గజ చికిత్సను చెప్పెదను. దీర్ఘములైన తొండము లుండి, దీర్ఘ శ్వాస తీసుకొను గజములు సహన శక్తి కలవి. ఇరువది లేదా పదునెనిమిది నఖములుండి శీత కాలమున మదమును స్రవించునవి ప్రశస్తములు. కుడి దంతము ఎత్తుగావున్నవి, మేఘమువంటి బృంహితము కలవి విశాలమైన కర్ణములు కలిపి, చర్మము పై సూక్ష్మ బిందువులు కలవియు అగు ఏనుగులను సంగ్రహించవలెను. పొట్టి లక్షణ హీనములగు వాటిని సంగ్రహించరాదు. పార్శ్వ గర్భముగల ఆడ ఏనుగులను మూఢోన్మత్త గజములను వుంచుకొనగూడదు. వర్ణము సత్వము, బలము, రూపము, కాంతి సంహననము, జవము అను ఏడు సల్లక్షణములుగల గజము యుద్ధమున శత్రువు లను జయించును. శిబిరమునకు, సేనకును గొప్పశోభ నిచ్చునవియు గజములే. రాజులు ఏనుగుల వలననే విజయమును కోరుకొనుచుందురు.

ఏనుగుల, అన్ని విధముల జ్వరమునందును అనువాసనము చేయవలయును. ఘృత తైలాభ్యంగయుక్తమగు స్నానము వాత రోగ వినాశకము. స్కంద రోగమునకు కూడ పాలకమునందు వలె ఏనుగులకు చికిత్స చేయవలయును. పాండు రోగమున గో మూత్రమును హరిద్రను ఘృతమును ఇవ్వవలెను. మలబంధము నందు శరీరమునకు తైలముపూసి స్నానము చేయించుట మంచిది. ఏనుగుకు పంచలవణయుక్తమగు మదిరను త్రాగించవలెను. మూర్ఛరోగము వచ్చిన ఏనుగుకు వాయు విడంగ, త్రిఫలా, త్రికటు, సైంధవముల గ్రాసమును తినిపించి మధు యుక్తమగు జలము త్రాగించవలెను. శిరుశ్శూల రోగమునందు అభ్యంగము నశ్యము ప్రశస్తతములు. తైలయుక్త పుటకములతో పాద రోగములకు చికిత్స ప్రారంభించి, పిదప కల్కకషాయములతో శోధనము చేయించవలెను. కంపన రోగమున నున్న గజమునకు శికి తిత్తిరి, లావపక్షుల మాంసమును

పిప్పటి మరిచములు కలిపి తినిపించవలెను. అతిసార రోగమునందు బాలబిల్వ లోధ్రధాతకీ, శర్కరలతో పిండితినిపించవలెను. తొండమునకు రోగము వచ్చినపుడు లవణ యుక్తమగు ఘృతమును నశ్యముగ ఇవ్వవలెను. ఉత్కర్ణక రోగమునందు మాగధి నాగరాజ జీరలతో చేసిన గంజి వారాహీ కందరసము ఇవ్వవలెను. దశమూల కులుత్థ ఆమ్లక కాకమాచిలతో చేసిన తైలమును మిర్చితో కలిపి ఉపయోగించినచోగల గ్రహరోగము నశించును. మూత్ర క్రుచ్ఛ రోగమునందు అష్ట లవణ యుక్తములగు సురను ఘృతమును త్రాగించవలెను. లేదా త్రాపుష బీజక్వాథమును ఇవ్వవలెను. చర్మ దోషమునందు నింబక్వాథముగాని, వృషక్వాథముగాని ఇవ్వవలెను. కోష్ఠక్రుములను తొలగించుటకు గోమూత్ర వాయు విడంగములు ప్రశస్తములు. గాయములు మాన్పించుటకు శృంగిబేరకణ ద్రాక్ష, శర్కరలతో కాచిన జలము ప్రశస్తము. మాంసరసము కూడ హితకరము. అరుచిరోగమున వ్యోషయుక్త మగు పెసల అన్నము మంచిది. త్రివృత్ వ్యోష అగ్ని, దంతి, ఆర్క, శ్యామ, క్షీర, గజ, పిప్పలులతో చేసిన స్నేహము గుల్మరోగములు పోగొట్టును. ఇట్లే గజ చికిత్సకుడు భేదన ద్రావణ అభ్యంగ స్నేహపాన అనువాసనములతో గూడ అన్ని విధములగు విద్రధి రోగము లను నశింపచేయవలెను.

గజమునకు కట రోగము నందు ముద్గ సూపముతో యష్టికమును కలిపి, బాల బిల్వములతో లేపము చేయవలయును. అన్ని విధముల శూలములను తొలగించుటకు దిన పూర్వ భాగమున పిడంగ, ఇంద్ర, యవ, హింగు వివిధ హరిద్రా పిండములను ఇవ్వవలెను. ఇది ఏనుగులకు ఉత్తమ భోజనము. ఇతర భక్ష్యములు అధమ భోజనము యవలు ఇక్షువు ఏనుగులకు బలమును పెంచును. శుష్కతృణము ధాతు ప్రకోపము కల్గించును. క్షీణించిన మదముగల గజమునకు పాలు త్రాగించుట అగ్ని దీప్తిని కలిగించు ద్రవ్యము. వండిన మాంసరసము లాభకరములు. వాయస, కుక్కుర కాక ఉలూక, హరులను క్షౌద్రముతో కలిపి పిండముచేసి, యుద్ధమునందు మహాపదయందును ఇవ్వవలెను. కటు, మత్స్య, విడంగ లవణ కోశాతకీ క్షీర, హరిద్రలతో ధూపము వేసినచో ఏనుగు జయప్రదమగును. పిప్పలి తండులములు బియ్యము తైలము మాధ్వీకము, తేనె వీటిని నేత్రమందు వేసినచో అవి దీపనీయములు. చటకాపురీషము, పారావత పురీషము, క్షీర వృక్షము, మద్యము వీటితో చేసిన అంజనము ఏనుగులకు ఇష్టమైనది. ఈ అంజనము నేత్రములకు పూసిన ఏనుగు యుద్ధము నందు శత్రువును మర్దించును. నీల కమలములు ముస్తతగరము వీటిని-తండు లోదకము నందు నూరి, ఏనుగుల నేత్రములకు పెట్టినచో పరమ శాంతి నిచ్చును. గోళ్ళు పెరిగినపుడు వాటిని ఖండించవలెను. ప్రతిమాసము తైలా భ్యంగనము చేయవలయును. ఏనుగులు శయనించు స్థానమున ఎండిన పేడ పరాగము ఉండవలెను. శరద్గ్రీష్మములందు వీటికి ఘృత సేకము చేయుట ఉపయోగ కరము. (287)

అథాశ్వవాహన సారము

ధన్వంతరి చెప్పెను :

ఇపుడు అశ్వవాహన సారము అను అశ్వచికిత్సను చెప్పెదను. ధర్మకర్మ అర్థముల సిద్ధికై

అశ్వసంగ్రహణము చేయవలయును. తొలిసారి అశ్వారోహణము చేయుటకు, అశ్వినీ, శ్రవణ, హస్త ఉత్తరాషాఢా, ఉత్తర భాద్రపద, ఉత్తర ఫల్గుణీ నక్షత్రములు ప్రశస్తములు. అశ్వము నెక్కుటకు హేమంత, శిశిర, వసంతములు మంచివి. గ్రీష్మ శరత్ వర్ష ఋతువులందు అశ్వముపై ఎక్కుట నిషిద్ధము. తీవ్రమైన దండములతో కాని ప్రదేశమునందు గుఱ్ఱమును కొట్టగూడదు. అశ్వము యొక్క మనస్సు తెలుసుకొన జాలక ఉపాయములు తెలియక అశ్వముపై ఎక్కి దానిని మొలలు ఎముకలతో నిండిన దుర్గమమైన కంటకయుక్త మార్గమునందును ఇసుకతో, వరదతో నిండిన మార్గము నందును, గోతులు మెరకలతో గూడిన మార్గము నందును, నడిపించుచు కటిక (జీను) లేకుండ దాని వీపుపై ఎక్కిన మూర్ఖుడు అశ్వమునకే వాహనమగును. బుద్ధిమంతుడు శ్రేష్ఠుడగు ఏ ఒక్కడో అశ్వశాస్త్రమును చదువకుండగనే, కేవలము అభ్యాసము చేతను నిశ్చయ బుద్ధిచేతను అశ్వమునకు తన అభిప్రాయము తెలుపగలుగును.

అశ్వమునకు స్నానము చేయించి పూర్వాభిముఖముగా నిలబెట్టి ప్రారంభమున ఓం, అంతమున నమః, అను శబ్దములు చేర్చి 'స్వ' బీజాక్షర యుక్తములగు మంత్రములు చెప్పుచు క్రమముగ దేవతాన్యాసము చేయవలయును. అశ్వము యొక్క చిత్తమున బ్రహ్మ, బలమున మహా విష్ణువు, పరాక్రమమున గరుత్మంతుడు, పార్శ్వభాగమున రుద్ర గణము, బుద్ధియందు బృహస్పతి, మర్మ స్థానమున విశ్వేదేవులు, నేత్రావర్త నేత్రములందు చంద్ర సూర్యులు, చెవులందు అశ్వినీ కుమారులు, జఠరాగ్నియందు స్వధా, జిహ్వపై సరస్వతీ, వేగమున వాయుదేవుడు, పృష్టభాగమున స్వర్గ పృష్ఠము ఖురాగ్రములందు సర్వ పర్వతములు, రోమకూపము నందు నక్షత్ర గణము, హృదయమునందు చంద్రకళ, తేజమునందు అగ్ని, పిరుదులందు రతి, లలాటమున జగత్పతి, హ్రేషితమున నవగ్రహములు. వక్ష స్థలమున వాసుకి న్యాసము చేయబడవలెను. ఆ అశ్వమును ఎక్కువాడు అశ్వమును పూజించి దాని కుడిచెవిలో ఈ క్రింది మంత్రమును చెప్పవలెను.

'ఓ అశ్వమా ! నీవు గంధర్వరాజువు. నా మాట వినుము. నీవు గంధర్వ కులమున పుట్టిన దానవు. నీవు కులమును దూషితము చేయకుము. బ్రాహ్మణుల సత్య వచనముచే సోమ, గరుడ, రుద్ర, వరుణ, పవనముల, బలము అగ్నితేజముగల నీ జాతిని స్మరించుము. నీవు రాజేంద్ర పుత్రుడవు అను సత్య వాక్యమును స్మరించుము. నీవు వారుణి కన్యను కౌస్తుభమణిని స్మరించుము. దైత్య దేవతలచే క్షీర సముద్రము మథింప బడినపుడు, నీవు దేవకులమున పుట్టితివి. నీ వాక్యమును నిలబెట్టుకొనుము. నీవు అశ్వ వంశమున పుట్టితివి. నీవు నాకు శాశ్వతముగ మిత్రుడువగుము. ఓ మిత్రమా ! నా వాక్యమ్ము వినుము. నాకు వాహనము కమ్ము. నన్ను రక్షించుచు నాకు విజయమును సమకూర్పుము. పూర్వము దేవతలు నీ పృష్ఠమును అధిరోహించి దైత్యులను సంహరించిరి. నేడు నీపై ఎక్కి నేను శత్రు సేనను జయించెదను. ఈ విధముగ అశ్వారోహకుడు అశ్వము చెవిలో జపించి శత్రువులను మోహింపచేయుచు అశ్వమును యుద్ధ స్థలమునకు తీసుకొని వచ్చి దానిని అధిరోహించి జయము సంపాదింపవలెను. ఉత్తమ అశ్వారోహకుడు అశ్వముల శరీరము నందు ఉత్పన్నములగు దోషములను ప్రయత్న పూర్వకముగ తొలగించి గుణములను వికసింపచేయును. ఉత్తముడగు అశ్వారోహకునిచే, అశ్వమునందు సమకూర్చబడిన గుణములు వాటికి సహజములవలె

కనబడును. కొందరు అశ్వారోహకులు వాటి సహజ గుణములను కూడ నశింపచేయుదురు. ఒకడు అశ్వగుణములను గ్రహించును. మరి యొకడు దోషములను గ్రహించు అశ్వరహస్యము తెలుసుకొనగల్గిన ధీమంతుడు ధన్యుడు. మందబుద్ధి గుణ దోషములు రెండింటిని తెలుసుకొన జాలడు. కర్మ, ఉపాయము తెలియని వాడును అశ్వమును వేగముగ నడిపింప ప్రయత్నించు వాడును కోపవంతుడును చిన్న అపరాధమునకు కూడ కఠోర దండమును ఇచ్చు వాడును అగు అశ్వారోహకుడు కుశలు డైనను ప్రశంసనీయుడు కాదు. ఉపాయములు తెలిసినవాడును చిత్తమును గ్రహించగల్గిన వాడును విశుద్ధుడును దోషములు తొలగించువాడును గుణములను సంపాదించు వాడును అగు అశ్వారోహకుడు, నిత్యము సర్వ కర్మలందు నేర్పుకలవాడు అయివుండును. అట్టివాడు అశ్వమును కళ్లెము పట్టుకొని బాహ్య భూమికి తీసుకొని వెళ్లి దాని పృష్ఠముపై ఎక్కి కుడి వైపునకు ఎడమ వైపునకు నడిపించవలెను. ఉత్తమ అశ్వమును ఎక్కి వెంటనే దానిని కొరడాతో కొట్టకూడదు. అట్లు చేసినచో అది భయపడి పోవును, మోహమును కూడ పొందును. అశ్వారోహకుడు ప్రాతః కాలమున కళ్లెమును పట్టుకొని గుఱ్ఱమును లేవదీసి ప్లుత గతితో నడిపించవలెను. సంధ్యాకాలమున డెక్కలకు నాలములు లేని గుఱ్ఱమును కళ్లెము పట్టుకొని మెల్లగ నడిపించవలెను.

వెనుక చెప్పిన కర్ణ జపముచేతను అశ్వసంచాలనమున అనుసరించవలసిన పద్ధతులచేతను, అశ్వమునకు ఆశ్వాసనము ఏర్పడును. దాని విషయమున సామ నీతిని అవలంబించవలయును. కొరడా మొదలగు వాటితో దండము విధించవలెను. మరియొక అశ్వముతో కలిపి రథమునకు కట్టిన దాని విషయమున భేదము ఉపయోగించ వలయును. కాలమునకు వేచి ఉంటయే దానము. పూర్వ పూర్వ ఉపాయములు సఫలము గానప్పుడు ఉత్తరోత్తర ఉపాయములను అనుసరించవలెను. జిహ్వాకు క్రింద యోగము లేకుండగ హయమునకు త్రాడు కట్టవలెను. నూరుపేటలు గల నూలుతో చేసిన కళ్లెమును చెలివిల దగ్గర కట్టవలెను. పిదప మెల్ల మెల్లగ వాహనమును విస్మరింపవేసి కళ్లెమును శిథిలము చేయవలయును. గుఱ్ఱము నాలుక అహీనావస్థ పొందినపుడు జిహ్వా గ్రంధిని విప్పవలెను. అశ్వము స్థిరత్వమును విడువనంత వరకు కళ్ళెమును ఎక్కువగా విడువకూడదు. అశ్వ ముఖము నుండి లాలాజలము కారునంతవరకు ఉరస్త్రాణమును బిగించి వుంచవలెను. స్వభావముచే ముఖమును పైకిఎత్తి ఉంచుచు అశ్వము యొక్క ఉరస్త్రాణమును గట్టిగా బిగించి వుంచిన ఉత్తముడగు అశ్వారోహకుడు ఆ అశ్వమును తన కంటితో అవలీలగా నడిపించగలుగును. మొదట అశ్వము యొక్క వెనుకటి కుడిపాదముతో కుడివల్గను సంయోజితము చేసి ఆ పాదమును తన వశమునందు ఉంచుకొనవలెను. ఇదే విధముగ ఎడమవల్గతో ఎడమ పాదమును కట్టవలెను. దీనితో దాని ఎడమ పాదము కూడ నియం త్రణము లభించును. ఈ విధముగ ముందు పాదములు విడువబడినచో ఆసనము సుదృఢమగును. దుష్కరమోటన కర్మయందు పాదములు అపహృతము లైనను ఎడమ పాదమున హీనావస్థ వచ్చినను అట్టి స్థితికి నాటకాయనము అని పేరు. హనన గుణన కర్మలచే ఖలీ కారము కలుగును. మాటిమాటికి ముఖ వ్యావర్తనము అశ్వ స్వభావము. ఇవన్నియు అశ్వముల పాద గ్రహణమునకు కారణము కావు. అశ్వము పూర్తిగా విశ్వాసము కలది యైన పిమ్మట ఆసనమును గట్టిగా వత్తి దాని పాదమును దాని ముఖముతో నొక్కి పట్టినచో దాని

గ్రాహ్యత్వము హితకారి అగును. రాగములతో గట్టిగా నొక్కి పట్టి కళ్ళెము లాగి దాని బంధనముతో అశ్వము యొక్క రెండు పాదములను గ్రహించి ఆకర్షించినచో దానికి 'ఉద్వక్కనము' అని పేరు. కళ్ళెము గుర్రము నాలుగు పాదములను కట్టి ఇష్టానుసారము శిథిలము చేయుచు మణవలచే గుర్రమును కొట్టినచో దానికి మోట్టనం అని పేరు.

బుద్ధిమంతుడగు అశ్వారోహకుడు ఈ విధముగ ప్రళయ అవిప్లవములను తెలుసుకొనవలెను. మరల చతుర్థ మోటనముచే ఈ విధిని సంపాదించవలెను. మోటన ఉద్వక్కనములనే లఘు మండలములందు తన పాదములను ఉంచని అశ్వము సఫలమని గ్రహించవలయును. దానికి ఈ విధముగ పాదగతి నేర్పవలెను. ఆసనమునందు గట్టిగ బిగించికట్టి శిక్షణ ఇచ్చినను మందగతితో నడచుదానిని మరల మట్టి ఇష్టమగు విధమున నడిపించవలెను. ఈ శిక్షణా పద్ధతికి సంగ్రహణము యనిపేరు. స్థానస్థితమైనను వ్యగ్రచిత్తమగు అశ్వమును పార్శ్వ భాగమున కళ్లెముతో లాగి కళ్లెము నందలి ఇనుప గొళ్లెమును నములునట్లు చేసి, ఈవిధముగా పాదప్రహారముచే ఖలీకృతమై అది నడక నేర్చుకొనునట్లు చేసినచో అట్టి శిక్షణమునకు ఖలీకారమని పేరు. త్రివిధ గతులచే కూడ ఇష్టమగు నడక నడవనిచో దానిని దండముతో కొట్టి అట్లు నడిపించు పద్ధతికి హననము అని పేరు. రెండవ కళ్లెములో నాల్గు పర్యాయములు కలీకృతముచేసి ఆ అశ్వమును మరొక చోటునకు తీసుకొనిపోయి దానిచే నిట్టూర్పులు విడ్పించినచో దానికి ఉచ్ఛ్వాసనము అనిపేరు. తన ముఖమును బయటకు త్రిప్పుట అశ్వస్వభావము. దానిని ప్రయత్నపూర్వకముగ ఆ వైపునకే త్రిప్పునట్లు చేసి అట్లే నియమించి దానికి గతినేర్పినచో ముఖవ్యావర్తన మని పేరు. క్రమముగ మూడు గతులలో చాలనము నేర్పిన పిమ్మట మండలాది పంచదారలందు నడచుట నేర్పవలెను. పైకి ఎత్తిన ముఖము నుండి మోకాళ్లవరకు అశ్వము శిథిలమైనపుడు దానికి శిక్షణ ఇచ్చుటకై బుద్ధిమంతులు దానిని అధిరోహించి దాని అవయవములు తేలిక అగువరకు దానిని పరుగెత్తించవలెను. దానికి మెడ కోమలముగను, ముఖము తేలికగను, శరీరసంధులన్నియు శిథిలములు అగును. అయినపుడు అది ఆరోహమునకు వశమగును. అట్టి అవస్థలో ఆ అశ్వమును సంగ్రహించవలెను. మొదట నేర్పిన గతిని విడువని అశ్వము మంచిది. అపుడు రెండు చేతులతో కళ్లెములాగి గుర్రము కంఠము పైకెత్తి ఒక్క పాదముతో భూమిపై నిలబడునట్లు చేయవలయును. నేలపై ఆనివున్న వెనుకటికాళ్లు ముందరికాళ్లకు ఆశ్రయము అయినపుడు ఆ అశ్వమును ముష్టితో సంధారణము చేయవలయును. ఇట్లు లాగిన వెంటనే నిలబడక శరీరమును విక్షిప్తము చేయు గుర్రమును మండలాకారమున పరుగెత్తించి వశము చేసుకొనవలెను. మెడను ఊపు గుర్రమును కళ్ళెము లాగి నిలబెట్టవలెను.

గోమయము, ఉప్పు, గోమూత్రము వీటితో క్వాథము చేసి దానిలో మట్టి కలిపి అశ్వ శరీరమున పూయవలయును. దాని వలన మక్షికాది పీడ కలుగదు, అలసట తొలగిపోవును. అశ్వారోహకుడు భద్రాది జాతికి చెందిన గుర్రములకు గంజి ఇవ్వవలెను. దీనివలన సూక్ష్మ కీటక దంశనము ఉత్సాహ శూన్యత్వము ఆకలి తగ్గును. అశ్వము ఎట్లు వశమగునో అంత శిక్షణమే ఇవ్వవలయును. ఎక్కువగా నడిపించిన అశ్వములు నశించును. పూర్తిగా నడిపించనిచో అవి సిద్ధము గాకుండ పోవును. వాటి ముఖములను పైకి ఎత్తునట్లుచేసి వాటిపై సవారీ చేయవలెను. స్థిరముష్టికలవాడై

గుర్రమును రెండు మోకాళ్ళతో అదిమిపట్టి ముందుకు నడిపించవలెను. గోమూత్రాకృతి వక్రతవేణి పద్మ మండలము మాలికా అను చిహ్నములున్న అశ్వము పంచోలూక ఖలిక అని చెప్పబడును. అట్టి గుర్రములు కార్యమునందు అగర్వితములై ఉండును. వీటికి సంక్షిప్తము, విక్షిప్తము, కుంచితము, అంచితము, వల్గితము, ఆవల్గితము అను ఆరు లక్షణములు చెప్పబడినవి. మార్గముపై నూరు ధనుస్సుల దూరము పరుగెత్తిన పిమ్మట భద్రజాతీయ అశ్వము సుసాధ్యమగును. మందాశ్వము ఎనుబది ధనుస్సుల దూరము దండైక మానసము తొంబది ధనుస్సుల దూరము నడిపించిన పిమ్మట సాధ్యము అగును. మృగజింఘ్యము సంకరజాతికి చెందిన అశ్వము. దానిని ఎనుబది లేక తొంబది ధనుస్సులదూరము నడిపించినచో సాధ్యము అగును. శర్కర మదువు, లాజలు, తిను అశ్వము బ్రాహ్మణ జాతీయము. ఇది పవిత్రము సుగంధయుక్తము అయివుండును. క్షత్రియ అశ్వము తేజశ్శాలియై ఉండును. వైశ్య అశ్వము వినయబుద్ధి సంపన్నమై, శూద్రశ్వము, అపవిత్రము, చంచలము, మందము, కురూపము, బుద్ధిహీనము, దుష్టము అయివుండును. కళ్ళెము పట్టుకొనగనే లాలా జలమును స్రవించు గుర్రమునకు ఆ కళ్ళెము త్రాడు ఇప్పి దానిని జలధారచే స్నానము చేయించ వలయును. ఇపుడు శాలిహోత్రుడు చెప్పిన విధమున అశ్వ లక్షణములను చెప్పెదను. (288)

అశ్వలక్షణ చికిత్సాకథనము

శాలిహోత్రుడు చెప్పెను :

సుశ్రుతా ! అశ్వ లక్షణములను చికిత్సను చెప్పెదను. హీన దంతము, విదంతము, కరాలము, కృష్ణతాలుకము, కృష్ణజిహ్వము, యుగ్మజము, అజాతముష్కము రెండు డెక్కలుగలది. శృంగయుక్తము త్రివర్ణము, వ్యాఘ్రవర్ణము గర్దభవర్ణము, భస్మవర్ణము, సువర్ణ వర్ణము మూపు కలది శ్విత్రము కలది, కాకులచే ఆక్రమింపబడునది ఖరసారము. వానరాక్షము కృష్ణగుహ్యాము, కృష్ణసటము, కృష్ణ ప్రోథము, కఠోరరోమము తిత్తిరి తుల్యము, విషమాంగము, శ్వేతపాదము, ధృవావర్తములు లేనిది అశుభావర్తములు కలది అగు అశ్వమును త్యజించవలెను. ముక్కు మీద, ముక్కు దగ్గిర రెండేసి సుడులు శిరో వక్ష స్థలము లందు రెండేసి, లలాట కంఠ దేశమునందు రెండేసి, ప్రాయణము నందు రెండు ఈ విధముగ పది సుడులు శుభకరములు. ఓష్ఠ ప్రాంతము నందును లలాటము నందును, కర్ణ మూలమునందున మెడ, ముందుకాళ్ళు కంఠము వీటి యందును సుడులు శ్రేష్ఠములు. ఇతర అంగములపై అశుభములు. చిలుక ఇంద్రగోపము, చంద్రుడు వీటితో సమానమైన కాంతి కలవియు కాక వర్ణములును, సువర్ణ వర్ణములును స్నిగ్ధములును యగు అశ్వములు సర్వదా ప్రశస్తములు. పొడవైన కంఠము లోపలికి చొచ్చుకొనిన నేత్ర ములు చిన్న చెవులు ఉండి చూచుటకు అందముగా ఉన్న గుర్రములుగల రాజు విజయాభి లాషను విడువవలెను. గుర్రములను గజములను పాలించుట శుభప్రదము, కాని ఉచిత పాలనము చేయనిచో దుఃఖ ప్రదమగును. లక్ష్మీ పుత్రులైన గంధర్వ అశ్వములు ఉత్తమ రత్నము. అశ్వము పవిత్రమగుటచే అశ్వమేధమున ఉపయోగ పడుచున్నది.

మధువుతో, గుడూచి, నింబ బృహతులు వీటి ముద్ద చేసి తినిపించినచో శిరః స్వేదము, నాశికామొలము తొలగించును. హింగు పుష్కరమూలము శుంఠి అమ్ల వేతసము, పిప్పలి, సైంధవ

లవణము వీటిని ఉష్ణ జలముతో ఇచ్చినచో శూల రోగము నశించును. శుంఠి అతి విషముస్త అనంత, బిల్వ, ములక్వాథమును త్రావించినచో అశ్వము యొక్క వివిధ అతిసార దోషములు నశించును. ప్రియంగు సారివలతో కాచిన మేక పాలు కలిపి తగినంత శర్కర వేసి త్రాగించినచో అలసట తీరును. అశ్వమునకు తొట్టి యందు తైలబస్తి ఇవ్వవలెను. లేదా కోష్టము నందు పుట్టిన శిరల వేధనము చేయవలయును. అట్లు చేసినచో దానికి సుఖము కలుగును. దాడిమ త్రిఫలా, వ్యోష గుడములను సమభాగములుగ గ్రహించి చేసిన పిండమును అశ్వమునకు తినిపించిన కాసదోషము నశించును. ప్రియంగు లోధ్ర మధువులతో కలిపిన యూష రసములుకాని, క్షీరమును గాని, పంచ కోలాదికములు గాని ఇచ్చినచో కాసరోగ విముక్తి అగును. అన్ని విధముల ప్రస్కందముల కును మొదట శోధనము మంచిది. పిమ్మట అభ్యంగ ఉద్వర్తన స్నేహ, వశ్య, వర్తికల ప్రయోగము చేయవలయును. జ్వరమువచ్చిన గుఱ్ఱమునకు పాలతో చికిత్స చేయవలయును. లోధ్రమూల కరంజమూల, మాతులుంగ, అగ్ని, నాగర, కుష్ఠ హింగు, వచా, రాస్నలతో చేసిన లేపము శోధను తొలగించును. గుఱ్ఱమును నిరాహారముగ వుంచి మంజిష్ఠామదుక, ద్రాక్ష, బృహతీ, రక్తచందన త్రపుషీ బీజమూల శృంగాటక కశేరుకములు కలిపిన కాచిన మేకపాలను చల్లార్చి శర్కర వేసి ఇచ్చినచో దానికి రక్త ప్రమేయము తొలగును.

మన్యా, హను గ్రీవలయందున్న నాడులు వాచినను గళగ్రహ రోగము వచ్చినను ఆయా స్థానములందు కటు తైలాభ్యంగము ప్రశస్తము. సాధారణముగ గళ గ్రహశోధ రోగములుగల దేశమునందే వచ్చును. పతక్పుష్పీచిత్రక సైంధవ సౌరసరస పిప్పల హింగువులతో నశ్యము ఇచ్చినచో అశ్వమునకు ఎన్నడును విషాదము కలుగదు. హరిద్రా జ్యోతిష్మతీ, పాఠా, కృష్ణా, కుష్ఠ, వచా, మధువులను గుడ గోమూత్రములతో కలిపి జిహ్వాపై వ్రాసినచో జిహ్వా స్తంభము తొలగును. తిల, యష్ఠి, హరిద్రా, నింబ పత్రములతో చేసిన ముద్దను తేనెతో ఉపయోగించిన వ్రణము శోధితమగును. ఘృతముతో ఉపయో గించినచో వ్రణము మారును. దెబ్బతగిలి తీవ్రవేదనతో కుంటు గుఱ్ఱములకు తైలముతో పరిషేక క్రియ చేసినచో ఆ బాధ తొలగును. వాత పిత్థ కఫ దోషములచేకాని, కోపముచేగాని దెబ్బ తగిలి గాయపడినచో అది మానుటకు ఈ క్రింది చికిత్స చేయవలయును. అశ్వత్థ ఉదుంబర, ప్లక్ష, మధూక, వటములను అధిక జలముతో కలిపి చేసిన క్వాథము కొంచెము ఉష్ణముగవున్నచో వ్రణ శోధనము చేయవలను. శతాహ్వా, నాగర, రాస్నా, మంజిష్టా, కుష్ఠ, సైంధవ, దేవదారు వచా, ద్వివిధ హరద్ర, రక్త చందనముల స్నేహమును క్వాథముగ చేసి గుడూచి జలముతో గాని పాలతోగాని ఉద్వర్తనము బస్తి లేదా నశ్యము ఇచ్చినచో అన్ని లింగిత దోషములును పోవును నేత్ర రోగముగల అశ్వముయొక్క నేత్రాంతమున జలగను పట్టించి అభిస్రావణము చేయవలయును. ఖదిర ఉదుంబర, అశ్వత్థ కషాయాలతో నేత్ర శోధము చేయవలయును.

యుక్తావలంబియగు అశ్వమునకు ధాత్రీ దురాలభా, తిక్తపియంగు, కుంకుమ, గుడూచులను సమభాగముగ గ్రహించి, చేసిన కల్కము హితకరము, ఉపద్రవమునందు కర్ణ దోషమునందును శిలయందును శుష్క శోషమునందును, శీఘ్ర హానికరమగు దోషము నందును వెంటనే వేధనము చేయవలయును. గోమయ మంజికాకుష్ఠ రజనీ తిల సర్షపములను, గోమూత్రమునందు నూరి

మర్దనముచేసినచో దురదతగ్గును. శాలుక్వాథము చల్లబడిన పిమ్మట మధుశర్కరలు కలిపి ముక్కులోవేసి త్రాగించినచో రక్తపిత్తము నశించును. ప్రతి ఏడవ రోజునను అశ్వమునకు లవణము తినిపించవలెను. ఎక్కువ ఆహారము తిన్న అశ్వమునకు, శరదృతువునందు జీవనీయ గణమునకు చెందిన ద్రవ్యములను మధుమృద్వీకా శర్కర, పిప్పలీ, పద్మకములు కలిపి ప్రతిపానము చేయించ వలెను. హేమంత ఋతువునందు వాయు విడంగ పిప్పలీధాన్య, శతాహ్వా, లోధ్ర, సైంధవ, చిత్రక ముల ప్రతిపానము చేయించవలెను. వసంత ఋతువునందు లోధ్ర ప్రియంగు ముస్తా పిప్పలీ శుంఠీ మధువులతో కూడిన ప్రతిపానము కఫ నాశనము. గ్రీష్మ ఋతువు నందు ప్రియంగు పిప్పలీ లోధ్ర యష్టి శుంఠీ గుడములతో కూడ మద్యము ప్రతిపానముగ ఇవ్వవలెను. వర్షఋతువు నందు లోధ్ర కాష్ఠలవణ పిప్పలీ హింగు తైలములు ప్రతిపానముగ ఇవ్వవలెను. గ్రీష్మమునందు కలిగిన పిత్త ప్రకోపముచే పీడింపబడిన అశ్వమునకును శరత్కాలమున, రక్త ఘనత్వముతో బాధ పడుచున్న అశ్వమునకును వర్ష కాలమున భిన్న పురీషములుగల అశ్వమునకును ఘృతము త్రాగించ వలెను. కఫ వాతములు అధికమైనపుడు తైలము త్రాగించవలెను. స్నేహతత్వము అధికమగుటచే శరీరమునకు బాధ్య ఏర్పడిన అశ్వములకు విరూక్షణము చేయించవలెను. మజ్జిగతో భోజనము మూడు దినములు గంజి ఇచ్చినచో రూక్షణము అగును. శరత్ గ్రీష్మ ఋతువులందు ఘృతము, హేమంత వసంతములందు తైలము, వర్షాశిశిర ఋతువులందు ఘృతతైలములు రెండును ఇవ్వ వలెను. స్నేహపానము చేయించిన గుఱ్ఱములకు గురువైననదియు, అభిష్యందియు అగు భోజనము వ్యాయామము స్నానము ధూపము వాయురహిత స్థానములు వర్జితము. వర్ష ఋతువునందు గుఱ్ఱమునకు ఒక పర్యాయము స్నానము పానము చేయించవలెను. దుర్దిన సమయమున కేవల పానము ప్రశస్తము. సమశీతోష్ణ ఋతువునందు రెండు పర్యాయములు పానము, ఒక పర్యాయము స్నానము మంచివి. గ్రీష్మ ఋతువునందు మూడు పర్యాయములు స్నానము ప్రతిపానము చేయించ వలయును. పూర్ణజలమునందు చాలసేపు నిలిపి స్నానము చేయించవలయును. గుఱ్ఱములకు ప్రతి దినము పొట్టులేని యవలు నాల్గు ఆఢకములు తినిపించవలెను. శనగలు, ధాన్యము, పెసలు, బటానీలు కూడ తినిపించవలెను. రాత్రింబవళ్ళు ఐదుశేర్ల పాలు త్రాగించవలయును. ఎండి పోయినచో ఎనిమిదిశేర్లు పొట్టువున్నచో నాలుగుశేర్లు ఇవ్వవలెను. దూర్వ పిత్తమును, యవలు కాసమును, పొట్టు కఫాధిక్యమును, అర్జునము శ్వాసను మానకందము బలక్షయమును తొలగించును. దూర్వలు తిను గుఱ్ఱమునకు వాతపిత్త కఫజములగు రోగములు, సన్నిహిత రోగములు కలుగవు. ఆస్తరణమువున్న ధూపధూపితమగు స్థానమున దానిని కట్టవలెను. అచట ఉపాయ పూర్వకముగ గడ్డి ఉంచవలెను. అచట దీపమును ఉంచి స్థానమును సురక్షితము చేయవలయును. అశ్వశాల యందు మయూరములు మేకలు వానరములు, మొదలగు మృగములను ఉంచవలెను. (289)

అశ్వ శాంతి కథనము

శాలిహోత్రుడు చెప్పెను :

ఓ సుశ్రుతా ! ఇపుడు అశ్వరోగములను తొలగించునదియు నిత్యనైమిత్తిక కామ్య రూపమున

మూడు విధములైనదియగు అశ్వశాంతిని చెప్పెదను వినుము. శుభ దివసమున విష్ణువునకును లక్ష్మికిని ఉచ్చైశ్రవ పుత్రుడగు హయరాజునకును పూజచేసి సావిత్రి మంత్రములతో ఘృత హోమముచేసి బ్రాహ్మణులకు దక్షిణ ఇచ్చినచో అశ్వ వృద్ధి కలుగును. ఆశ్వీయుజ శుక్ల పౌర్ణమి దివసమున నగరబహిః ప్రదేశమున శాంతికర్మ చేయవలయును. విశేషించి అశ్వినీ వరుణ పూజ చేయవలయును. పిదప దేవీచిత్రము గీసి నాల్గు వైపుల నుండియు వృక్ష శాఖలతో కప్పి సమస్త రసపూరితములగు వస్త్ర సహితములయిన కలశలను స్థాపించవలెను. పిదప శ్రీదేవిని పూజించి యవాజ్య హోమము చేయవలెను. ఇపుడు నైమిత్తిక శాంతిని వినుము. మకర సంక్రాంత్యాదుల యందు అశ్వములను పూజించవలయును. విష్ణులక్ష్మి బ్రహ్మ శివ చంద్రసూర్య రేవంత ఉచ్చైశ్రవస్సు లను పద్మములతో పూజించవలెను. కమల దళములపై దిక్పాలులను పూజించవలెను. పూజింపదగిన ఒక్కొక్క దేవత కొరకు వేదికపై జలపూర్ణ కలశలు స్థాపించవలెను. ఈ దేవతల ఉత్తరమున తిల, అక్షత, ఆజ్య, సిద్ధార్థములను హోమము చేయవలయును. ఒక్కొక్క దేవతకు నూరు హోమములు చొప్పున చేయవలయును. అశ్వ శాంతి నివారణమునకు ఉపవాస పూర్వకముగ శాంతి కర్మ చేయవలయును. (290)

గజశాంతి కథనము

శాలిహోత్రుడు చెప్పెను: గజ రోగములను తొలగించు గజ శాంతిని చెప్పెదను. పంచమి తిథి యందు విష్ణు, లక్ష్మి, ఐరావతములను, బ్రహ్మ, శంకర, ఇంద్ర, కుబేర, యములను, చంద్ర సూర్యులను, వరుణుని, వాయు, అగ్ని, పృథివీ, ఆకాశములను, ఆదిశేషుని, శైలములను, దేవయోనులగు విరూపాక్ష, మహాపద్మ, భద్ర, సుమనస్, కుముద, ఐరావత పద్మ, పుష్పదంత, వామన, అంజనములను గజములను అష్టదిగ్గజములను పూజించి హోమములు చేసి దక్షిణలు ఇవ్వవలెను. శాంతి కలశ జలముతో గజాభిషేకము చేయించినచో అవి వృద్ధి పొందును. ఇపుడు నైమిత్తిక శాంతిని వినుము. మకరాది సంక్రాంతులయందు నగర బహిర్భాగమున ఈశాన్యమున ఏనుగులను పూజించవలెను. స్థండిలమున పద్మ మధ్యమున విష్ణువును లక్ష్మిని, పిదప అష్ట దళములందు క్రమముగా బ్రహ్మ, సూర్య, పృథివీ, స్కంద, అనంత, ఆకాశ, శివ, చంద్రులను పూజించవలెను. పూర్వాదిక్రమమున ఇంద్రాది దిక్పాలకులను పూజించవలెను. వారి ఆయుధములగు వజ్రశక్తి, దండతోమర, పాశ, గదా, శూల, పద్మాదులను పూజించవలయును. దళముల బాహ్యభాగమున చక్రమునందు సూర్యుని, అశ్వినీ దేవతలను పూజించవలయును. దక్షిణమున అష్టవసువులను సాధ్యదేవతలను నైఋతమున భార్గవాంగిరస దేవతలను వాయువ్యమున మరుద్గణములను, దక్షిణమున విశ్వేదేవతలను, ఈశాన్యమున రుద్రులను పూజించ వలయును. వృత్త రేఖా నిర్మితమగు అష్టదళ కమలమునకు బహిర్భాగమున సూత్రకారులగు ఋషులను, సరస్వతిని, పూర్వభాగమున నదీ పర్వతములను ఈశాన్యాదుల యందు పంచమహా భూతములను పూజించవలయును. పిమ్మట పద్మ చక్ర గదా శంఖములతో ప్రకాశించు చతుష్కోణము చతుర్ద్వా రమగు మండలము నిర్మించి, ఆగ్నేయాదులందు కలశస్థాపనకూడ చేసి నాలుగు ప్రక్కలందును

పతాకా తోరణములను ఏర్పరచవలయును. అన్యద్వారము లందు ఐరావతాది నాగరాజులను పూజించవలెను. పూర్వాది దిక్కులందు దేవతలకు వేరు వేరుగా ఓషధీ యుక్తములగు పాత్ర నుంచవలెను. గజములను పూజించి ప్రదక్షిణము చేయవలయును. దేవతలు అందరికిని నూరు చొప్పున హోమములు చేయవలయును. పిమ్మట గజరాజ అగ్ని దేవతలతో బయలుదేరి వాద్య ములను మ్రోగించుచు ఇంటికి తిరిగి వెళ్ళవలయును. బ్రాహ్మణులకును గజ చికిత్సకాదు లకును దక్షిణలు ఇవ్వవలెను. పిదప కాలజ్ఞుడగు పురుషుడు గజరాజు నధిరోహించి దాని చెవిలో 'ఓ గజరాజమా ! మహారాజు నిన్ను శ్రీగజ పదమునందు నియమించినాడు. నీవు గజశ్రేష్ఠుడవు. ఈ రాజులు నేటినుండి గంధమాల్య ఉత్తమ అక్షతాదులతో నిన్ను పూజింతురు. అతని ఆజ్ఞచే ప్రజలుకూడ సర్వదా నిన్ను పూజింతురు. నీవు యుద్ధభూమి యందును, మార్గమునందును గృహమునందును సర్వదా మహారాజును రక్షించవలయును. ఓ నాగరాజ ! తిర్యగ్భావమును విడిచి నీ దివ్యత్వమును స్మరించుము. పూర్వము దేవాసుర సంగ్రామమునందు ఐరావత పుత్రుడగు అరిష్ట నాగమునకు శ్రీగజము అను పదమును దేవతలు ఇచ్చిరి. ఆ శ్రీగజము తేజస్సు అంతయు నీ శరీరమున ప్రతిష్ఠితమైయున్నది. ఓ గజేంద్రమా ! నీకు కళ్యాణమగుగాక ! నీ లోపల నున్న దివ్య భావ సంపన్నమగు తేజస్సు ఉద్బుద్ధమగుగాక ! నీవు రణాంగణమున రాజును రక్షించు చుండుము. ఆ గజరాజము మరల మరణించినచో శాంతిచేసి మరొక గజ కర్ణములో పై మంత్రమును జపించ వలయును. అభిషిక్తమగు గజరాజుపై శుభ ముహూర్తమున రాజు అధిరోహించవలయును. శస్త్ర ధారులగు వీర శ్రేష్ఠులు ఆతనిని అనుసరించవలెను. రాజు హస్తిశాలయందు నేలపై చిత్రించిన కమలము బయట దిక్పాలకులను పూజించ వలయును. కేసరముల స్థానమున మహాబలియగు నాగరాజమును భూదేవి సరస్వతులను, మధ్య భాగమున గంధ పుష్ప చందనములతో డిండిమమును పూజించి, హోమముచేసి రసపూర్ణమగు కలశను బ్రాహ్మ ణునకు దానముచేయవలయును. గజాధ్యక్షుని, గజ రక్షకుని, జ్యోతిష్కుని కూడ సత్కరించి ఆ డిండిమమును గజాధ్యక్షునికి ఇవ్వవలెను. ఆతడు దానిని మ్రోగించవలెను. అతడు దాని జఘనముపై కూర్చుండి, శుభగంభీర స్వరమున డిండిమ వాదనము చేయవలయును.(291)

గవాయుర్వేద కథనము

ధన్వంతరి చెప్పెను :

రాజు గోవులను బ్రాహ్మణులను పాలించవలెను. ఇపుడు గోశాంతిని చెప్పెదను. గోవులు పవిత్రమైనవి, మంగళప్రదమైనవి. లోకములన్నియు గోవులలో ప్రతిష్ఠితములై ఉన్నవి. గోమయము, గోమూత్రము, అలక్ష్మీ నాశకములు. వాటి శరీరమును గోకుట, కొమ్ముల మర్దించుట, నీళ్ళు త్రాగించుట ఇవి కూడ అలక్ష్మీ నివారకములు. గోమూత్రము గోమయము, క్షీరము, దధి, ఘృతము, గోరోచన-ఇవి ఆరును సేవించుటకు ఉత్తమమైనవి. దుస్స్వప్నాదులను తొలగించును. గోరోచన విషమును రాక్షసులను నశింపచేయును. గోవునకు గ్రాసమిచ్చు వాడు స్వర్గమును పొందును. ఎవని యింటిలో గోవులు దుఃఖించు చుండునో, ఆతడు నరకమునకు పోవును. ఇతరుల గోవుకు

గ్రాసము నిచ్చువాడు స్వర్గమును పొందును. గోహితము కోరువాడు బ్రహ్మ లోకమును పొందును. గోదానము, గోమాహాత్మ్య కీర్తనము, గోరక్షణము చేసిన వాడు తన కులమును ఉద్ధరించును. గోవుల శ్వాస తగిలి భూమి పవిత్రమగును. వాటి స్పర్శచే పాపములు నశించును. ఒక దినమున గోమూత్ర గోమయ, క్షీర, దధి, ఘృత, కుశోదకములను, ఉపవాసము చేసినచో చండాలుడు కూడ పరిశుద్ధుడగును. పూర్వము దేవతలు కూడ అశుభములు అన్నింటిని తొలగించు కొనుటకు ఈ విధముగ చేసిరి. పైన వస్తువులను వేరువేరుగా మూడేసి రోజులు భక్షించినచో దానికి 'మహాసాంతపన' వ్రతమునియని పేరు. ఇది సర్వ కామములను సిద్ధింపచేసి పాపములను తొలగించును. పాలు మాత్రము త్రాగి ఇరువది యొక్క దినములు ఉన్నచో అది కృచ్ఛ్రవ్రతము. దీనినాచరించిన నరోత్తములు పాపరహితులై సర్వ కామములను పొంది స్వర్గమునకు పోవుదురు. మూడు దినములు ఉష్ణ గోమూత్రమును, మూడు దినములు ఉష్ణ ఘృతమును, మూడు దినములు ఉష్ణ క్షీరమును, పిదప మూడు దినములు వాయువును మాత్రము భక్షించుటకు తప్త కృచ్ఛ్ర వ్రతమని పేరు. ఇది సమస్త పాపములను తొలగించి బ్రహ్మ లోకమును ఇచ్చును. ఈ వస్తువులను చల్లగా చేసి, భుజించినచో దానికి శీతకృచ్ఛ్రమని పేరు. బ్రహ్మ చెప్పిన ఈ వ్రతము బ్రహ్మలోక ప్రదము.

ఒక మాసము గోమూత్రముతో స్నానము చేయుచు గోరసముపై జీవించుచు, గోవులను అనుసరించుచు, అవి భుజించిన పిమ్మట భుజించవలయును. ఇట్లు గోవ్రతము చేసినవాడు పాపరహితుడై గో లోకమును చేరును. గోమతీ విద్యా జపముచేత కూడ గోలోకము లభించును. ఆ లోకమునందు మానవుడు విమానమున అప్సరసలతో కలసి నృత్య గీతములతో సేవింపబడుచు ఆనందించును. గోవులు సురభి స్వరూపములు. గుగ్గులు గంధము కలవి. అవి సమస్త ప్రాణులకు ఆధారభూతములు. పరమ మంగళమయములు. గోవులే శ్రేష్ఠమైన అన్నముగను ఉత్తమ హవిస్సుగను దేవతలకు ఉపక రించును. అవి సకల ప్రాణులను పవిత్రింపచేయు మూత్ర క్షీరాదికమును గ్రహించి వాటిని స్రవించుచుండును. మంత్రపూతమగు హవిస్సుతో స్వర్గమునందున్న దేవతలను తృప్తిపరచును. ఋషులు తమ అగ్ని హోత్రములందు గోవులను హోమమునందు ఉపయోగింతురు. సమస్త భూతములకును గోవులు ఉత్తమశరణము. గోవులు చాల పవిత్రమైనవి, మంగళకరమైనవి. స్వర్గ సోపానములు, ధన్యములు, సనాతనములు. సురభి కుమార్తెలగు లక్ష్మీ ప్రదములైన గోవులకు నమస్కారము. బ్రహ్మ సుతులకు నమస్కారము. ఒకే కులము బ్రాహ్మణులు, గోవులు యని రెండు విధములుగా చేయబడినది. ఒక దాని యందు మంత్రములు, మరియొక దాని యందు హవిస్సు ఆధారపడి ఉన్నవి. ఈ జగత్తంతయు దేవ, బ్రాహ్మణ, గోసాధు, పతివ్రతలపై నిలిచి యున్నది. అందుచే వారందరును పూజ్యతములు. గోవులు నీరుత్రాగు స్థానము తీర్థము. గంగాది నదులు గో స్వరూపములు. గోమాహాత్మ్యమును చెప్పితిని. ఇపుడు వాటి చికిత్సను వినుము.

కొమ్ములకు రోగము వచ్చునపుడు శృంగవేరబలా మాంసి, కల్కముతో సిద్ధము చేయబడిన సైంధవము చేర్చిన తైలమును తేనె కలిపి ఉపయోగించవలయును. కర్ణ రోగమునందు మంజిష్ఠా హింగు, సైంధవములతో సిద్ధమగు తైలమును ఉపయోగించ వలయును లేదా వెల్లుల్లి వేసి కాచిన తైలము ఉపయోగించవలయును. దంతశూలము నందు బిల్వమూల అపామార్గ ధాతకీ, పాటల,

కుటజముల లేపము చేయవలయును. ఇవి దంతశూలమును పోగొట్టును. దంతశూలమును హరించు ద్రవ్యములను ఘృతము నందు ఉడికించి ఇచ్చినచో ముఖ రోగమును తొలగించును. జిహ్వారోగములందు సైంధ వము ప్రశస్తముగల గ్రహ రోగమున శుంఠి ద్వివిధ హరిద్ర, త్రిఫల, మంచిది. హృద్రోగ వస్తిరోగ, పాతరోగ, క్షయరోగములందు, గోవులకు ఘృతమిశ్ర త్రిఫలాను పానము ప్రశస్తము. అతిసారమున ద్వివిధ హరిద్ర పాఠ ఇవ్వవలెను. అన్ని విధముల కోష్ట రోగము లందును, ఇతరావయవ రోగములందును కాసశ్వాసాది సాధారణ రోగములందును, శుంఠి బారంగీలను ఇవ్వవలెను. విరిగిన ఎముక అతుకుటకు లవణ యుక్తమగు ప్రియంగువును పూయవలయును. తైలము వాతరోగము హరించు పిత్తరోగమున తైలపక్వమగు మధు యష్టిని, కఫరోగమున మధు సహిత యోషమును, రక్తవికారమున దృఢమైన నఖ మూల భస్మము హితకరములు. భగ్న క్షతమునందు తైల ఘృతములందు వేయించిన హరితాళము ఇవ్వవలెను. మాషములు తిలలు, గోధుమలు, పాలు, ఘృతము, వీటిని లవణము కలిపి పిండముగా చేసి, లేగదూడలకు ఇచ్చినచో, పుష్టికలుగును. విషాణి బలప్రదము, గ్రహబాధ నివృత్తికి ధూపమును ప్రయోగించవలయును. గ్రహజనిత రోగ నివృత్తికి, దేవదారు వచా, మాంసీ, గుగ్గులు, హింగు, సర్షపముల ధూపము హితకరము. ఈ ధూపమువేసిన ఘంట గోవుల కంఠమునందు కట్టవలయును. అశ్వగంధ తిలలతో నవనీత భక్షణము చేయించుటచే ఆవు పాలను ఇచ్చును. ఇంటిలో మదమత్తమగు వృషభమునకు తెలకపిండి ఉత్తమమైన రసాయనము.

శాంతికొఱకై పంచమినాడు గోపురీషముపై లక్ష్మిని వాసుదేవుని గంధాదులతో పూజింప చవలయును. దీనికి అపరాశాంతియని పేరు. ఆశ్వీయుజ, శుక్ల పూర్ణిమనాడు శ్రీహరిని పూజించ వలయును. హరి రుద్ర బ్రహ్మ సూర్య అగ్ని లక్ష్ములను ఘృతముతో పూజించ వలయును. దధితిని గోవులను పూజించి అగ్ని ప్రదక్షిణము చేయవలయును. గృహ బహిర్భాగమున గీతవాద్య ధ్వనులతో వృషభ యుద్ధమును ఏర్పరచవలయును.

గోవులకు లవణమును బ్రాహ్మణులకు దక్షిణలను ఇవ్వవలెను. మకర సంక్రాంత్యాది పర్వములందు లక్ష్మీసహితుడగు శ్రీమహావిష్ణువును స్థండిలముపై నిర్మించిన పద్మ మధ్యమున పూజించ వలయును. దిక్కులందు కమల కేసరములపై దేవతలను పూజించవలయును. కమల బహిర్భాగమున మంగళమయులగు బ్రహ్మ, సూర్య, బహురూప, బలిఆకాశ, విశ్వరూపులను రుద్ధిసిద్ధిశాంతి, రోహిణ్యాది దిగ్ధేనువులను చంద్రశివులను, పులగముతో పూజించ వలయును. కలశస్థ పద్మ పత్రములపై దిక్పాలురను పూజించవలయును.

అగ్నియందు సర్షప, అక్షత, తండుల, క్షీరవృక్ష సమిధలను హోమముచేసి బ్రాహ్మణులకు నూరేసి సువర్ణములను కంచు మొదలగు దానిని దానము చేయవలయును. పిదప క్షీరాదులతో గూడిన గోవులను పూజించి శాంతి నిమిత్తమై వాటిని విడువవలయును. అగ్నిదేవుడు పలికెను. శాలిహోత్రుడు సుశ్రుతునకు అశ్వ ఆయుర్వేదమును పాలకాప్యుడు అంగరాజునకు గజాయుర్వేదమును ఉపదేశించెను. (292)

మంత్ర పరిభాష

అగ్నిదేవుడు పలికెను :

వశిష్ఠా ! ఇపుడు భుక్తిముక్తి ప్రదమగు మంత్ర విద్యను చెప్పెదను వినుము. ఇరువది కంటె అక్షరములు అధికముగల మంత్రములు మాలా మంత్రములు. పది అక్షరములు మించియున్నవి మంత్రములు. పదికి తక్కువ అక్షరములున్నవి బీజ మంత్రములు. ఇవి వార్ధక్యమున సిద్ధిని ఇచ్చును. మాలా మంత్రములు యౌవనమున సిద్ధిని ఇచ్చును. ఐదుకు మించిన అక్షరముగల మంత్రములు అన్ని ఫలములను ఇచ్చును. మంత్రజాతులు స్త్రీ పురుష నపుంసక భేదములచే మూడు విధములు. స్వాహాయనునది అంతమందు గలవి స్త్రీ మంత్రములు. నమః అనునది చివరగలవి నపుంసక మంత్రములు. మిగిలినవి పురుష మంత్రములు. అవి వశీకరణమునందును ఉచ్చాటనము నందును ప్రశస్తమైనవి. క్షుద్ర క్రియయందును, రోగ శాంతి యందును, స్త్రీ మంత్రములు మంచివి. నపుంసక మంత్ర ములు ఇతర కార్యములందు మంచివి. ఆగ్నేయములు, సౌమ్యములు అని మంత్రములు రెండు విధములు. ఆది యందు ఓంకారము చేర్చినవి ఆగ్నేయములు. ఓంకారము చివర యున్నవి సౌమ్య మంత్రములు. వీటిని అగ్ని చంద్ర నాడి సమయమున జపించవలయును. ఓం, క్ష, ర, హ అనునవి అధికముగా గల మంత్రములు ఆగ్నేయములు. మిగిలినవి సౌమ్యములు. ఈ రెండును వరుసగా క్రూర సౌమ్య కర్మలయందు ప్రశస్తములు. ఆగ్నేయ మంత్రములు, ప్రాయశః చివర నమః చేర్చుటచే సౌమ్యములగును. సౌమ్యమంత్రము కూడ చివర ఫట్ చేర్చినచో ఆగ్నేయమగును. మంత్రము నిద్రించినను అపుడే లేచినను సిద్ధి ప్రదము కాదు. వామనాడి చలించునపుడు ఆగ్నేయ మంత్రమునకు, నిద్రా సమయము. దక్షిణ నాడి చలించునపుడు జాగరణ సమయము. సౌమ్య మంత్రము యొక్క నిద్ర జాగరణ సమయములు ఇందుకు విపరీతముగనుండును. రెండు నాడులు చలించునపుడు రెండు మంత్రములకు జాగరణ సమయము. దుష్ట నక్షత్ర దుష్టరాశి, శత్రు రూపాది అక్షరములు గల మంత్రములను తప్పక విడిచి వేయవలయును. 'రాజ్య లాభోపకారాయ' మొదలు 'లిపిః' వరకు ఉన్న శ్లోకములో మొదటి నుండి 'ఫుల్లొ' యను వరకును లిపి చెప్పబడినది. ఈ వర్ణమాలను నక్షత్రములతో కూడ, అశ్విన్యాది క్రమమున చేర్చవలయును. 'అం, అః' అను రెండును సర్వదా రేవతీ నక్షత్రముతో చేరి యుండును. వా, లా, గౌ, రం, ఖు, రం, శో, నం, భా, య సంఖ్యలలో విభక్తములగు అకారాద్యక్షరములు క్రమముగ మేషాది రాశులలో ఉన్నట్లు గ్రహించవలయును. శ, ష, స, హ అను అక్షరములను ఐదవ దగు కన్యారాశి యందు చేర్చవలెను. 'క్ష' కారమును మీన రాశి యందు చేర్చవలెను. చతుష్కోణము నందున్న ప్రథమ కోష్టము నందలి నాలుగు పంక్తులు సిద్ధములు. రెండవ కోష్టమునందున్న నాలుగు పంక్తులు సాధ్యములు. మూడవ కోష్టము నందున్న నాలుగు పంక్తులు సుసిద్ధములు. నాలుగవ కోష్టమునందలి పంక్తులు అరి. సాధకుని నామ ఆది అక్షరము ఏచతుష్కము నందుపడునో అది వానికి సిద్ధచతుష్కము. రెండవది సాధ్యము ఇట్లే గ్రహించవలెను. సిద్ధమంత్రము అత్యంత గుణయుక్తము. దాని జపమాత్రము చేతనే సిద్ధి కలుగును. సాధ్యమంత్రము జపపూజాదులచే సిద్ధించును. సుసిద్ధ మంత్రము ధ్యాన మాత్రముచే సిద్ధించును. అరిమంత్రము సాధకుని నశింపజేయును. అధికముగ దుష్ట వర్ణములు గల మంత్రము అందరిచేతను నిందింపబడినది.

శిష్యుడు అభిషేకాంత దీక్ష యథావిధిగా గ్రహించి గురువుద్వారా తంత్రోక్త విధానము తెలుసుకొని గురువు ఇచ్చిన అభీష్ట మంత్రమును సాధించవలెను. ధీరుడు, సమర్థుడు, పవిత్రుడు, భక్తి సంపన్నుడు, జప, ధ్యానాది తత్పరుడు సిద్ధుడు, తపశ్శాలి, కుశలుడు, తంత్రజ్ఞుడు, సత్యవాది, నిగ్రహానుగ్రహ సమర్థుడైన వాడే గురువు. శాంతుడు జితేంద్రియుడు సమర్థుడు, బ్రహ్మచారి హవిష్యమును తినువాడు, గురు సేవాతత్పరుడు మంత్ర సిద్ధికై ఉత్సాహము కలవాడుయైన వ్యక్తియే యోగ్యుడైన శిష్యుడు. అట్టి శిష్యునకును, తన పుత్రునకును మంత్రోపదేశము చేయవలయును. శిష్యుడు వినయవంతుడై గురువునకు ధనమును ఇవ్వవలెను. గురువు అట్టి శిష్యునకు మంత్రో పదేశము చేసి తన్మంత్ర సిద్ధికై తాను సహస్ర జపము చేయవలయును. అకస్మాత్తుగా విన్నది వంచనచే కాని, బలముచే గాని పొందబడినది పుస్తకములలో వ్రాయబడినది గాథలలో ఉన్నదియగు మంత్రము జపించకూడదు. అట్లు జపించినచో అనర్థము కలుగును. హోమ అర్చనాది వివిధ క్రియలతో మంత్ర సాధన చేయువానికి స్వల్పకాలమునందే మంత్ర సిద్ధి కలుగును. ఒక్క మంత్రము నైనను విధి పూర్వకముగ సిద్ధి చేసికొనినవానికి అసాధ్యమైనది ఏదియు వుండదు. అనేక మంత్రముల సిద్ధి సంపాదించినవాని, మాహాత్మ్యము వర్ణనాతీతము. అతడు సాక్షాత్తు శివుడే. ఏకాక్షరమంత్రమును పది లక్షలు జపించినచో సిద్ధించును. మంత్రము నందలి వర్ణములు పెరిగిన కొలది జపసంఖ్య తగ్గును. ఈ విధముగ జప సంఖ్యను ఊహించుకొనవలయును. మాలా మంత్రములను బీజ మంత్రము కంటె రెండు మూడు రెట్లు అధికముగా జపించవలెను. జపసంఖ్య చెప్పని మంత్రములను నూట యెనిమిది పర్యాయములు కాని, ఒక వెయ్యి యెనిమిది పర్యాయములుకాని జపించ వలయును. జపములో దశాంశము హోమము తర్పణము చేయవలయును.

విశేష ద్రవ్యమును దేనిని చెప్పనప్పుడు హోమమునందు ఘృతమును ఉపయోగించ వలయును. హోమాసమర్థుడు హోమమునకు బదులు జపసంఖ్యలో దశాంశ జపము చేయవలయును. అంగాది మంత్రములకు కూడ జపము చెప్పబడినది. సశక్తిక మగు మంత్రమును జపించుటచే (దేవతలు) మంత్ర దేవతలు అభీష్ఠ ఫలములను ఇత్తురు. సాధకుడు చేసిన ధ్యాన హోమ అర్చనాదులచే తృప్తి చెందుదురు. ఉచ్చస్వరముతో జపము చేయుటకంటే ఉపాంశు జపము పదిరెట్లు శ్రేష్ఠము. జిహ్వా మాత్రమే కదుపుచు చేసిన జపము నూరురెట్లు శ్రేష్ఠము. మానసిక జపము వెయ్యిరెట్లు శ్రేష్ఠము. మంత్ర జపమును పూర్వాభిముఖుడైగాని, దక్షిణాభిముఖుడైగాని ప్రారంభించవలయును. మౌనము అవలం బించి మితమైన ఆహారమును స్వీకరించుచు, ప్రణవాది మంత్రములన్నింటిని జపించ వలయును. ఆసనముపై కూర్చుండి దేవతను, ఆచార్యుని ఒక్కరుగా భావించుచు జపించ వలయును. పర్ణశాల, ఏకాంతమైన పవిత్ర ప్రదేశము, దేవాలయము, నదీతటాకాదుల తీరములు జపమునకు ఉత్తమ ప్రదేశములు. మంత్ర సిద్ధికోరువాడు గంజి, అపూపములు, పాలు, హవిష్యము ఆహారముగ తీసుకొనవలయును. సాధకుడు మంత్ర దేవతలకు సంబంధించిన తిథివారములందును కృష్ణపక్ష అష్టమి చతుర్దశులయందును గ్రహణాది పర్వములయందును మంత్ర దేవతలను పూజించ వల యును. అశ్విన్యాది నక్షత్రములకు క్రమముగ అశ్వినీ కుమారులు, యముడు, అగ్ని, ధాత, చంద్రుడు, రుద్రుడు, అదితి, బృహస్పతి, సర్పము, పితృ దేవతలు, భగుడు, అర్యమ, సూర్యుడు, త్వష్ట,

వాయువు, ఇంద్రాగ్నులు, మిత్రుడు, ఇంద్రుడు, జలము, నిఋరుతి, విశ్వేదేవులు, విష్ణువు, వసు గణము, వరుణుడు, అజైకపాత్, అహిరుధ్న్యుడు, పూష అను వారు దేవతలు. ప్రతిపత్తు మొదలు చతుర్దశి వరకును తిథులకు క్రమముగ, అగ్ని, బ్రహ్మ, పార్వతి, గణేశుడు, నాము, స్కందుడు, సూర్యుడు, మహేశ్వరుడు, దుర్గ, యముడు, విశ్వేదేవతలు, విష్ణువు, కామదేవుడు, ఈశ్వరుడు, దేవతలు, పూర్ణమికి చంద్రుదును, అమావాస్యకు పితృ దేవతలును దేవతలు. శివుడు దుర్గ బృహస్పతి, విష్ణువు, బ్రహ్మ, లక్ష్మి, కుబేరుడు, వీరు వరుసగ రవ్యాది వారములకు దేవతలు ఇపుడు లిపి న్యాసమును చెప్పెదను.

అకారాది వర్ణములను సాధకుడు వరుసగ, కేశాంతము, ముఖము, నేత్రద్వయము, శ్రవణ ద్వయము, నాసాపుట ద్వయము, కపోలద్వయము, ఓష్ఠద్వయము, హృదయము, ఊర్ధ్వదంతపంక్తి, అధోదంత పంక్తి, వీటిపై 'ఓం, అంనమః', 'కేశాంతేషు' ఇత్యాది విధమున చెప్పుచు, న్యాసము చేయవలయును. శిరస్సుయందు, ముఖవృత్తమునందు, దక్షిణ బాహు మూలమునందు, దక్షిణ కూర్పరమునందు, దక్షిణ మణిబంధమునందు దక్షిణ హస్తాంగుళి మూలమునందు, ఓం, అం, నమః యని ప్రారంభించి, ఓం, వం, నమః అను వరకు చెప్పుచు న్యాసము చేయవలయును. ఐదు వర్ణముల ఐదేసి వర్గములను, బాహుచరణ సంధుల యందును, పార్శ్వము లందును పృష్ఠ, నాభి, హృదయము లందును క్రమముగ వుంచవలయును. యకారాది వర్ణములను త్వక్, అసృక్ మాంస, మేధస్సు, అస్థి, మజ్జా, శుక్రములను ఏడు ధాతువులందును న్యాసము చేయవలయును. ప్రారంభమున ప్రణవమును, అంతమున నమఃను చేర్చి లిపీశ్వర, మాతృకేశ్వర న్యాసము చేయవలయును. శ్రీకంఠ, అనంత, సూక్ష్మ, త్రిమూర్తి, అమరేశ్వర, అర్ఘీశ, భావభూతి, తితీశ స్థాణుక, హర, దండీశ, భౌతిక, సద్యోజాత, అనుగ్రహేశ్వర, అక్రూర, మహాసేనులు స్వరమూర్తి దేవతలు. క్రోధీశ, చండీశ, పంచాంతక, శివోత్తమ, రుద్ర, కూర్మ త్రినేత్ర, చతురానన, అజేశ, శర్మ, సోమేశ, లాంగలి, దారుక, అర్ధనారీశ్వర, ఉమాకాంత, అషాఢిన్, దండి, అద్రిమీన, మేష, లోహిత, శిఖి, చగలాండ, ద్విరండ, మహాకాల, కపాలి, భుజంగేశ, పినాకి, ఖడ్గీశ, బక, శ్వేత, భృగు, నకులీ, శివ, సంవర్తకులు వ్యంజన మూర్తి దేవతలు. శ్రీ కంఠాది రుద్రులను, వారి శక్తులతో క్రమముగ న్యాసము చేయవలయును. అంగముల న్యాసము కూడ చేయవలయును. అన్ని మంత్రములను సాంగములైననే సిద్ధి ప్రదము లగును. ఉల్లేఖకు వ్యోమబీజము కలిపి ఈ అంగన్యాసము చేయవలయును. హృదయాది అంగమంత్రములను అంతమునందు చేర్చి పలుక వలయును. హృదయము నందు 'నమః' శిరస్సునందు 'స్వాహా', శిఖ యందు 'వషట్', కవచము నందు 'హూం' నేత్రము నందు వౌషట్, హస్తమునందు 'ఫట్' చెప్పవలయును. నేత్ర న్యాసము లేనిచో పంచాంగ న్యాసమగును. మంత్రము నిరంగమైనచో స్వరూపముచేతనే అంగ న్యాసముచేసి, వాగీశ్వరీ దేవీ మంత్రమును ఒక లక్ష జపించి దశాంశము తిల హోమము చేయవలయును. లిపి దేవియైన వాగీశ్వరి తన హస్తములలో అక్షమాల, కలశం, పుస్తకము, కమలములను ధరించి యుండును. కవిత్వాదులను ఇచ్చును. అందుచే జప కర్మాది సిద్ధి కొరకై వాగీశ్వరి న్యాసము చేయవలయును. ఇట్లు చేయుటచే కవి కానివాడు కూడ కవియగును. మాతృకా న్యాసముచే అన్ని మంత్రములును సిద్ధించును. (293)

సర్పలక్షణ కథనము

అగ్నిదేవుడు చెప్పుచున్నాడు :

ఇపుడు నాగ ఉత్పత్తి, సర్పదంశన సమయమునందలి అశుభ నక్షత్రాదులు, సర్పదంశములో వివిధ భేదములు దంశస్థానములు, మర్మస్థలము, సూతకము, సర్పదష్టుని చేష్ట–ఈ ఏడు లక్షణ ములను చెప్పెదను. శేషుడు, వాసుకి, తక్షకుడు, కర్కోట కుడు, పద్మడు, మహాపద్మడు–శంఖ పాలుడు, కులికుడు అను ఎనమండుగురు నాగులలో శ్రేష్టులు. వీరిలో ఇద్దరు నాగులు బ్రాహ్మణులు, ఇద్దరు క్షత్రియులు, ఇద్దరు వైశ్యులు, ఇద్దరు శూద్రులు. ఈ నాలుగు వర్ణముల నాగులకు క్రమముగ వెయ్యి, ఎనిమిది వందలు, ఐదువందలు, మూడువందలు, పడగలు వుండును. వీరివంశమున ఐదువందల నాగులు పుట్టిరి. వారి నుండి పుట్టిన వారు అసంఖ్యాకులు. సర్పములు, ఫణి, మండలి, రాజిలము అని మూడువిధములు. ఇవి. వరుసగ వాత, పిత్త, కఫ ప్రధానములు. ఇవికాక వ్యంత రము, దోష మిశ్రమము, దర్వీకరము అని జాతిగల సర్పములు కూడ ఉన్నవి. వీటిపై చక్రము హలము, ఛత్రము స్వస్తికము, అంకుశము వీటి చిహ్నములుండును. గోనస సర్పముపై విచిత్రములైన మండలము లుండును. ఇది దీర్ఘకాయమై మందముగ ప్రాకును. రాజిల సర్పము స్నిగ్ధముగనుండును. దాని పై భాగమునందును పార్శ్వ భాగములందును రేఖలుండును. వ్యంతర సర్పములపై మిశ్రిత చిహ్నములుండును. వీటిలో పార్థివములు, ఆప్యములు, ఆగ్నేయములు, వాయవ్యములు అను నాలుగు భేదములును, ఇరువది ఆరు అవాంతర భేదములును ఉండును. గోనస సర్పములలో పదునారు. రాజిల సర్పములలో పదమూడు, వ్యంతర సర్పములలో ఇరువది యొక్కటి భేదములు ఉండును. సర్పములు పుట్టు కాలమునందు కాక తద్భిన్న కాలమునందు పుట్టిన సర్పములు వ్యంతరములు యని చెప్పబడును. ఆషాఢము మొదలు మూడు మాసములలో సర్పములు గర్భము ధరించును. గర్భము ధరించి నాలుగు మాసములు గడచిన పిమ్మట ఆడ సర్పము రెండు వందల నలుబది గ్రుడ్లను కనును. ఆ గ్రుడ్ల నుండి సర్పము పిల్లలు బయటికి వచ్చి వాటిలో స్త్రీ, పురుష నపుంసక లక్షణములు ఆవిర్భవించుటకు ముందుగానే సాధారణముగ సర్పములు వాటిని తిని వేయును. కృష్ణ సర్పము ఏడు రోజులలో కండ్లు తెరచును. ఒక మాసములో గ్రుడ్డు నుండి బయ టకు వచ్చును. పండ్రెండు దినములు దాటిన పిమ్మట దానికి జ్ఞాపకము కలుగును. ఇరువది దిన ముల పిమ్మట సూర్య దర్శనము కలుగగానే దానికి ముప్పది రెండు దంతములు మొలచును. వాటిలో నాలుగు విష దంతములు ఉండును. వాటికి కరాళి, మకరి, కాళరాత్రి యమదూతి అని పేర్లు. ఇవి వాటి యెడమ కుడి ప్రక్కలలో ఉండును. సర్పము ఆరు మాసములకొక పర్యాయము కూసము విడుచును. నూట ఇరువది సంవత్సరములు జీవించును. శేషాది సప్తనాగములు వరుసగ సూర్యాది వారములకు అధిపతులు. ఈ ఆధిపత్యము పగలు, రాత్రి కూడ ఉండును. శేషాది సప్త నాగములు తమతమ వారములలో ఉదయించును. కాని కుళికుడు అన్నిటి సంధికాలము నందును ఆవిర్భవించును. లేదా అది మహాపద్మశంఖపాలులతో పాటు ఉదయించును. మహాపద్మ శంఖపాలుల మధ్యనున్న రెండు గడియల కాలమున కుళికోదయము అగునని మరొక మతము. కుళికోదయ

మతము అన్ని కార్యములకు నిషిద్ధము. సర్పదంశమునందు ప్రధానముగ అశుభము. కృత్తికా, భరణి, స్వాతి, మూల పూర్వ ఫల్గుణీ, పూర్వాషాఢ, పూర్వాభాద్రా, అశ్వినీ, విశాఖా, ఆర్ద్ర, ఆశ్లేష, చిత్ర, శ్రవణ, రోహిణి, హస్త, నక్షత్రములు, శని మంగళ వారములు, పంచమి, అష్టమి, షష్టీ, రిక్త చతుర్థీ నవమీ, చతుర్దశులు తృతీయ తిథి సర్పదంశమున నింద్యములు పంచమి, చతుర్దశీ, తిథులలో సర్పదంశము విశేషించి నిందితము. నాలుగు సంధ్యలందును, దగ్ధరాశులందును సర్పము కరచినచో అది అనిష్టకర మగును. ఒకటి, రెండు, మూడు దంతముల కాట్లు వరుసగ దుష్టము, విద్ధము ఖండితమని చెప్పబడును. సర్పము కేవలము స్పృశించి కరవకున్నచో అది అదంశము. దీనిలో మనుష్యునకు భయముండదు. ఈ నాల్గు విధములగు దంశములలో మూడు రెండు ఒకటి దంశములు వేదనాజనకములై రక్తస్రావమును కలిగించును. ఒక పాదము కూర్మము వీటితో సమానమగు ఆకారము గల కాటు, రాత్రియందు జరిగినచో అది మృత్యు ప్రేరితమని తెలియవలయును. వేడి చీమలు పాకుతున్నట్లు భావము. కంఠ శోధము మొదలగు పీడలతో కూడిన సర్పదంశము నందు విషముండును. ఈ లక్షణములు లేనిచో విషముండదు. దేవాలయము, శూన్య గృహము, పుట్ట, ఉద్యానము, చెట్టుతొర్ర రెండుమార్గముల సంధి, శ్మశానము, నదీ సాగర సంగమము, ద్వీపము, చతుష్పదము, రాజ ప్రాసాదము, గృహము కమలవనము గృహము, పర్వతశిఖరము, బిలద్వారము, జీర్ణకూపము, జీర్ణకుడ్యము సిగ్రు, శ్లేషాత్మక, అక్ష, జంబూ, ఉదుంబర, వేణువన, వట వృక్షములందును, జీర్ణ ప్రాకారాదులందును సర్పములు నివసించును. ఇంద్రియ రంధ్రములు ముఖము హృదయము, కక్షములు, కంఠ మూలము, తాలువు లలాటము, కంఠము, శిరస్సు గడ్డము నాభిచరణములు ఈ అంగముపై సర్పదంశము అశుభకరము. సర్పదంశమునుగూర్చి చెప్పుటకు విష చికిత్సకుని వద్దకు వెళ్ళినవాడు చేతులలో పుష్పములు గ్రహించి చక్కగ మాటలాడుచు బుద్ధిమంతుడై సర్పము కరచిన వానితో సమానమైన జాతి అంగాదులు కలిగి శ్వేత వస్త్రధారియై నిర్మలుడు గను పవిత్రుడుగను ఉన్నచో అది శుభకరము. ఇట్లుకాక ఆ వార్త తీసుకొని వచ్చినవాడు, ముఖద్వారమునుండిగాక, మరొక ద్వారమునుండి వచ్చినను, శస్త్రమును ధరించినను, ప్రమాద వంతుడైనను, నేలవైపు చూచుచున్నను, మలిన వస్త్రములు ధరించినను, చేతిలో పాశాదులు ధరించి నను, గద్గద కంఠముతో మాటలాడుచున్నను, ఎండిపోయిన కర్రపై కూర్చున్నను, ఖిన్నుడై చేతిలో తిలను ధరించి, ఎర్రమచ్చలు గల వస్త్రములు ధరించినను లేదా తడిసిన వస్త్రములను ధరించినను, ఆతని శిరస్సుపై నల్లని లేదా ఎర్రని పూవులున్నను, తన కుచస్థానములు మర్దనము చేయుచున్నను, నఖములను ఛేదించుచున్నను, గుద స్థానమును స్పృశించుచున్నను, పాదములతో నేలపై వ్రాయుచున్నను, జుట్టు లాగుకొను చున్నను, తృణములను త్రుంపుచున్నను, ఇవన్నియు అశుభ సూచకములు – వీటిలో ఏ ఒక్కటియైనను అశుభసూచకములే.

తనకును ఆ వచ్చిన దూతకును ఇడా పింగళనాడులు రెండును ఆడుచున్నచో దానిని బట్టి సర్పము స్త్రీయా, పురుష, నపుంసకమా అని తెలుసుకొనవచ్చును. దూత యే అంగమును స్పృశించునో ఆ అంగమునందే సర్పదంశమైనట్లు తెలుసుకొనవచ్చును. దూత పాదములు చంచలములైనచో అశుభములు. స్థిరముగనున్నచో శుభము. ఒకజీవుని పార్శ్వము నందున్నదూత, శుభసూచకుడు,

ఇతర భాగములందున్నచో అశుభము. దూత నివేదించు సమయమున ఏ ప్రాణియైన వచ్చినచో శుభము. బయటకు వెళ్ళిపోయినచో అశుభము. దూతమాటలు, దోషయుక్తముగా ఉన్నను అస్పష్ట ముగా ఉన్నను అది నిందితము. ఆతని స్పష్టమైన మాటలనుబట్టి సర్పదంశనము, విషసహితమా ! విష రహితమా ! అను విషయమును తెలుసుకొనవచ్చును. దూత వాక్యమునందు ప్రారంభమున, స్వరములు వున్నచో వాటిని బట్టియు, 'క' ఆది వర్గాక్షరములున్నచో వాటిని బట్టియు, లిపి రెండు విధములుగ ఉండును. వాక్య ప్రారంభమున స్వరమున్నచో సర్ప దష్టుడు జీవించును. 'క' ఆది వర్గాక్షరములున్నచో అశుభము కలుగవచ్చును. మాతృకా విధానము ఈవిధముగ గ్రహించవ లయును. కాది వర్గములలో మొదటి నాలుగు అక్షరములకును వరుసగ వాయు, అగ్ని, ఇంద్ర, వరుణులు, దేవతలు వీటి పంచమ అక్షరములు, నపుంసకములు. స్వరములు హ్రస్వములైనచో ఇంద్ర దేవతాకములు. దీర్ఘము లైనచో వరుణ దేవతాకములు. దూతవాక్య ప్రారంభమున వాయు, అగ్ని, దేవతాక అక్షరములు చెడ్డవి. ఐంద్రాక్షరము మధ్యమ ఫలప్రదము. వరుణ దైవత్య వర్ణము ఉత్తమము. నపుంసక వర్ణము అత్యంతము అశుభము. చికిత్సకుడు బయలుదేరి వచ్చునపుడు మంగళమయమగు వాక్కులు మేఘగర్జన గజ గర్జనములు, కుడిప్రక్క ఫలయుక్త వృక్షముండుట, వామభాగమున ఏ పక్షియైనను కలరవము చేయుట ఇవి జయమును సాఫల్యమును సూచించును. గీతాది శబ్దములు కూడ శుభకరములు. కుడి ప్రక్కనుండి అనర్థ సూచకములగు మాటలు వినబడుట, చక్రవాకముల రోదనము ఇవికూడ సిద్ధి సూచకములు. పక్షుల అశుభ ధ్వని తుమ్ము ఇవి అనర్థ సూచకములు. వేశ్య, బ్రాహ్మణుడు, రాజుకన్య, గోవు, ఏనుగు, మురజము, గజము, క్షీరము, ఆజ్యము, దధి శంఖము, జలము, ఛత్రము, ఫలము, భేరి, మద్యము, అక్షతలు, బంగారము, వెండి ఇవి ఎదురైనపుడు కార్య సిద్ధి కలుగును. కాష్టము, అగ్ని ధరించిన శిల్పి, మాసిన బట్టలు మోసుకొనివచ్చు వాడు టంకమును మెడలో వేసుకొన్నవాడు, నక్క, గ్రద్ద, గుడ్లగూబ, గవ్వలు, తైలము, కపాలము, దూది, భస్మము ఇవి నాశ సూచకములు. విషము ఒక ధాతువు నుండి మరొక ధాతువునకు ప్రవేశించుటచే ఏడు విధములగు విషరోగము కలుగును. విషదంశము ముందుగ లలాటము లోనికి, లలాటము నుండి నేత్రములలోనికి, అచటి నుండి ముఖములోనికి పిదప అన్ని నాడుల లోనికిని ప్రవేశించి క్రమముగ ధాతువులలో ప్రవేశించును. (294)

సర్ప దష్ట చికిత్స

అగ్నిదేవుడు చెప్పెను :

మంత్ర, ధ్యాన, ఔషధములతో పాముకరచిన వానికి చికిత్సను నీకు చెప్పెదను. 'ఓం నమోభగవతే నీలకంఠాయ' అను మంత్రమును జపించుటచే విషము నశించును. గోమయ రసమును ఘృతముతో త్రాగించినచో ఇది ప్రాణమును రక్షించును. విషము రెండువిధములు. సర్ప మూషకాది విషము, జంగమ విషము. శృంగాది విషము స్థావర విషము. శాంత స్వరముతో బ్రహ్మ (క్షౌం) లోహితము (ప్రీం) తారకము (ఓం) శివము (హౌం) ఈ అక్షరములతో వియతి నామమంత్ర మున్నది. దీనికి శబ్దమయతార్క్ష్యుడు అని పేరు. 'ఓంజ్వల' మొదలు 'అప్రతిహతశాసనం'

'వం హూంఫట్ హస్త్రాయఫట్' అను నది మంత్రము. 'ఉగ్రరూప ధారక' మొదలు 'స్వాహా నేత్రాయ' వరకు కూడ మంత్రము. మాతృకాన్వయ కమలము వ్రాసి దానికి ఎనిమిది దిక్కు లందును ఎనిమిది దళములుండునట్లు చూడవలెను. పూర్వాది దిక్కులందు రెండేసి స్వరములు వ్రాయ వలయును. 'క' వర్గము మొదలు ఏడు వర్గముల చివరి రెండేసి అక్షరములు కూడ ఒక్కొక్క దళముపై వ్రాయవలయును. ఈ కమలము యొక్క కేసర భాగమును వర్గముల ఆద్యక్షరములచే కప్పి కర్ణిక యందు అగ్ని బీజమును (రం) వ్రాయవలయును. సాధకుడు ఆ కమలమును హృదయము నందుంచుకొని ఎడమ చేతిలో దానిని భావన చేయవలయును. అంగుష్టాదులందు వియతి మంత్ర వర్ణముల న్యాసముచేసి వాటిచే భిన్నములగు కళలను భావన చేయవలయును. పిమ్మట పసుపుపచ్చని రంగుతో భూపురము అను చతుష్కోణ మండపము చేసి దానికి నాల్గు వైపులను వజ్ర చిహ్నము వుంచవలెను. ఈ మండలమునకు ఇంద్రుడు దేవత అర్ధచంద్రాకార వృత్తము జలదేవతా సంబంధ మైనది. కమలములోని సగము భాగము శుక్ల వర్ణము. దాని దేవత వరుణుడు. పిదప స్వస్తిక చిహ్నముతో గూడిన త్రికోణాకారము తేజోమయమగు వహ్నిదేవతా మండల చింతన చేయవల యును. వాయు దేవతామండలము బిందుయుక్తమై వృత్తాకారమై నల్లని మాలలతో ప్రకాశించు చుండును.

ఈ నాలుగు వియతి వర్ణములను అంగుష్టాది అంగులీ మధ్య పర్వములందు సువర్ణమయ నాగవాహనముచే చుట్టబడిన స్థానమునందు ఉన్నట్లు భావనచేసి ఆ నాలుగు పర్వములందు పృథివ్యాది భూతములను నాల్గింటి న్యాసము చేయవలయును. పిదప రూప రహిత శబ్ద తన్మాత్రమగు శివ దేవుని యొక్క ఆకాశతత్వమును కనిష్ఠికా మధ్య పర్వమున వున్నట్లు భావనచేసి దాని లోపల వేదమంత్ర ప్రథమాక్షరమును న్యాసము చేయవలయును. నామముల ఆద్యక్షరములను వాటి మండలములపై న్యాసము చేయవలయును. పృథివ్యాది భూతముల మొదటి అక్షరములను అంగు ష్ఠాదుల చివరి పర్వములపై న్యాసము చేసి విద్వాంసుడు గంగాది తన్మాత్రల అక్షరములను ఐదు అంగుళులపై న్యాసము చేయవలయును. ఇట్లు చేసినవాడు తార్క్ష్యమంత్రము ఉచ్చరించుచు పాము కరచిన వానిని స్పృశించగానే రెండు విధముల విషము నశించును. వియతి మంత్రము యొక్క నాలుగు అక్షరములను తన శ్రేష్ఠమైన రెండు అంగుళులతో నాభి స్థానమందును పర్వము నందును న్యాసము చేయవలయును. గరుత్మంతుడు మోకాళ్ళ వరకు బంగారు ఛాయ కల్గి యుండును. మోకాళ్ళ నుండి నాభివరకు మంచువంటి తెల్లటి కాంతి కలిగి ఉండును. నాభి నుండి కంఠము వరకు ఎర్రగాను, కంఠము నుండి కేశముల వరకు నల్లగాను ఉండును. ఇతడు బ్రహ్మాండము నంతను వ్యాపించి ఉండును. చంద్రుడను పేరుగల ఇతడు సర్పాలం కారములను ధరించి ఉండును. మంత్రవేత్త తనను గరుడ స్వరూపునిగా భావించ వలయును. అట్టి వాని వాక్యము చేతనే విషము తొలగిపోవును. గరుడుని చేతి పిడికిలి రోగి యొక్క చేతిలో వున్నచో అది ఆతని అంగుష్ఠము నందలి విషమును తొలగించును. ఆ మంత్ర వేత్త గరుడ స్వరూపమగు తన హస్తమును పైకి ఎత్తి ఐదు వ్రేళ్ళను కదల్చి నంత మాత్రముననే విషమువల్ల కలిగిన మదాదులను చూచుచు విష స్థంభనాదికము చేయకలుగును.

ఆకాశము మొదలు భూ బీజమువరకు వున్న ఐదు బీజములకు పంచాక్షర మంత్ర రాజము అని పేరు. (హం, యం, రం, వం, లం) అధికమైన విషమును స్తంభింప చేయవలసివచ్చినపుడు ఈ మంత్రమును ఉచ్చరించినంత మాత్రముననే విషము శమించును. దీనికి వ్యత్యస్థ భూషణ బీజ మంత్రమని పేరు. దీనిని బాగుగ సాధనచేసి ప్రారంభమున సంప్లవము, ప్లావయ ప్లావయ అను వాక్యము చేర్చినచో విషసంహార మగును. ఈ మంత్రమును బాగుగ జపించి అభిమంత్రించిన జలముతో స్నానము చేయించినంత మాత్రముననే రోగిని లేచునట్లు చేయును. లేదా మంత్రము జపించుచు చేసిన శంఖ భేర్యాది ధ్వనిని విన్నంత మాత్రముననే నిస్సందేహముగ విషము నశించును. భూ బీజ తేజో బీజములను తారుమారుచేసి ఆ మంత్రమును ఏర్పరచినచో దాని ప్రయోగము వలన కూడ విషము నశించును. భూ బీజ వాయు బీజములను తారుమారు చేసి మంత్రము ఏర్పరచి ప్రయోగించినచో ఆ విషము మరియొకని చేరును. మాంత్రికుడు రోగి దగ్గరగా ఉండి కాని, తనయింటిలో ఉండికాని, గరుడస్వరూపమును చింతించుచు తానే గరుత్మంతుడని భావన చేయుచు రం, వం అను రెండు బీజములనే ఉచ్చరించినచో సాఫల్యమును పొందును. గరుత్మంతుని ఆలయము నందు కాని వరుణుని ఆలయమందు కాని కూర్చుండి ఈ మంత్రమును జపించినచో విషమును నశింపచేయగలుగును. ఈ మంత్రమునకు 'స్వధా' శ్రీ బీజములను చేర్చినచో దీనికి 'బౌము దండి' మంత్రముయని పేరు. దీనిని జపించుచు స్నానముచేసి జలము త్రాగినచో సాధకుడు అన్ని విధములగు విషముల పైనను జ్వరములపైనను, రోగములపైనను అపమృత్యువుపైనను విజయము సాధించును. 'పక్షి పక్షి మొదలు క్షి క్షి స్వాహా' వరకు ఉన్న మూలోక్త మంత్రములు గరుడ మంత్రములు. ఈ మంత్రమును ఉచ్చరించుచు అభిమంత్రించినచో విషము నశించును. 'పక్షిరాజాయ' మొదలు 'ప్రచోదయాత్' వరకు గరుడ గాయత్రి మంత్రము పైన చెప్పిన రెండు పక్షిరాజ మంత్రములకును రంబీజము చేర్చి వాటి పార్శ్వము నందుకూడ 'రం'చేర్చి పిమ్మట దంత శ్రీ, దండి, కాల, లాంగలీ లను చేర్చి దాని మొదట నీలకంఠ మంత్రము చేర్చవలయును. ఈ మంత్రమును వక్షస్థలము నందును, కంఠమునందును శిఖయందును న్యాసము చేయవలయును. పై రెండు మంత్రములను సంస్కరించి స్తంభముపై వ్రాయవలయును.

పిదప 'హర హర హృదయాయ నమః' యని హృదయ న్యాసము 'కపర్ది స్వాహా, శిరసే స్వాహా, నీలకంఠాయ స్వాహా, శిఖాయై వషట్ అను న్యాసములను చేసి కాలకూట విష భక్షణాయ' హుంఫట్, కవచాయ హుం అని చెప్పుచు భుజములను కంఠములను స్పృశించవలయును. 'కృత్తి వాససే వౌషట్' అని నేత్రత్రయమునందు న్యాసము చేయవలయును. పూర్వాది దిక్కులందు క్రమముగ శ్వేత, పీత, అరుణ, శ్యామ ముఖములు కలవాడును నాలుగు హస్తములందును క్రమముగ అభయ వరద, ముద్రలు, ధనుస్సు, వాసుకి ధరించినవాడును, కంఠమునందు యజ్ఞోపవీతముతో ప్రకాశించుచుండువాడును పార్శ్వమున పార్వతితో కూడిన రుద్రుడు దాని దేవత మంత్రాక్షరములను పాదములు మోకాళ్లు గుహ్యాభాగము నాభి హృదయము, కంఠము, శిరస్సు వీటిపై న్యాసముచేసి రెండు హస్తముల అంగుష్ఠాద్యంగుళులపై కూడ న్యాసము చేయ వలయును. అనగా తర్జని మొదలు తర్జనివరకు న్యాసముచేసి సంపూర్ణ మంత్రమును అంగుష్ఠములపై

న్యాసము చేయవలయును. ఈ విధముగ ధ్యానన్యాసములు చేసి శీఘ్రముగ శూలముద్రను బంధించి విషసంహారము చేయవలయును. కనిష్ఠ అంగుళిని జేష్ఠాంగుళితో బంధించి మిగిలిన మూడు వ్రేళ్ళను చాపినచో అది శూల ముద్ర. విషమును నశింపచేయుటకు ఎడమ చేతిని, ఇతర కార్యము లందు కుడిచేతిని ప్రయోగించవలయును. 'ఓం నమో భగవతే' మొదలు 'రుద్ర మన్యవే' వరకు వున్న మూలోక్త మంత్రమును జపించుచు తుడిచినచో విషము నశించును. సందేహము లేదు. ఈ మంత్రమును రోగి చెవిలో జపించుటచేగాని, మంత్రము జపించుచు రోగి ప్రక్క నేలపై చెప్పుతో కొట్టుటచేతగాని విషము దిగిపోవును. రుద్ర విధానము ననుసరించి నీలగ్రీవుడైన మహేశ్వరుని ఆరాధించినచో విష వ్యాధి తొలగిపోవును. (295)

పంచాంగ రుద్ర దష్ట చికిత్స

అగ్నిదేవుడు చెప్పెను :

ఇపుడు అత్యుత్తమము సర్వ కామప్రదమగు పంచాంగ రుద్ర విధానమును చెప్పెదను. దీనికి శివ సంకల్పము హృదయము. పురుష సూక్తము శిరస్సు. 'అద్భ్యః సంభూతః' (యజు 31-17) ఇత్యాది సూక్తము 'ఆశుః శిషానః' ఇత్యాది అధ్యాయము కవచము. శతరుద్రీయము అను రుద్రమునకు ఈ యైదును అంగములు. రుద్ర దేవత ధ్యానముచేసి పంచాంగ భూత రుద్రుల జపము క్రమముగ చేయవలయును. 'యజ్జాగ్రతో' మొదలగు ఆరు ఋక్కులుగల శివసంకల్ప సూక్తము (యజు 34-1-6) దీని హృదయము. దీని ఋషి శివ సంకల్పుడు. ఛందస్సు త్రిష్టుప్ 'సహస్రశీర్షా' యను ప్రారంభముగల పురుష సూక్తము దీనికి శీర్ష స్థానీయము. దీని ఋషి నారాయణుడు. పురుషుడు దేవత. అనుష్టుప్ త్రిష్టుప్‌లు ఛందస్సులు. 'అద్భ్యః సంభూతః' ఇత్యాది సూక్తమునకు ఉత్తరగామి నరులు ఋషులు. వీటిలో క్రమముగా మొదటి మూడు మంత్రములకు త్రిష్టుప్ తరువాత రెండు మంత్రములపై అనుష్టుప్ చివర మంత్రములకు త్రిష్టుప్ ఛందస్సులు. పురుషుడు దేవత 'ఆశుః శిషానః' (యజు 17-33) ఇత్యాది సూక్తమున పన్నెండు మంత్రములకు ఇంద్రుడు దేవత. ఛందస్సు త్రిష్టుప్. పదునేడు ఋక్కులుగల ఈ సూక్తమునకు ఋషి ప్రతిరథుడు. దేవతలు మాత్రము వేరువేరుగ ఉందురు. కొన్ని మంత్రములకు పురువిత్ అంగదేవత. మిగిలిన దేవతా మంత్రములకు ఛందస్సు అనుష్టుప్. 'అసౌయస్తామ్రః' (యజు 16-6) మంత్రములకు పురులింగోక్త దేవత. పంక్తి ఛందస్సు. 'మర్మాణితే' (యజు 17-19) మంత్రమునకు త్రిష్టుప్ ఛందస్సు. దేవత లింగోక్తము. రుద్రాధ్యాయము నంతకును ఋషి పరమేష్ఠి. దేవానామిత్యాది మంత్రములకు ఋషి ప్రజాపతి. మూడు ఋక్కులకు మాత్రము ఋషికుత్సుడు. 'మానోమహాంతం' (యజు 16-15) 'మానస్తోకే' (యజు 16-16) అను రెండు మంత్రములకు ఉమయు అన్యమంత్ర ములకు రుద్రుడును రుద్ర గణములును దేవతలు. పదునారు ఋక్కులుగల మొదటి అనువాకమునకు దేవత రుద్రుడు. మొదటి మంత్రమునకు ఛందస్సు గాయత్రి. మూడు ఋక్కులకు అనుష్టుప్. మూడు ఋక్కులకు పంక్తి. ఏడు ఋక్కులకు అనుష్టుప్. రెండు మంత్రములకు జగతి. 'నమోహిరణ్య బాహవే (యజు 16-17) మొదలు 'నమో వః కిరికేభ్యః' వరకు రుద్రగణము యొక్క మూడు

ఆశీతులు ఉన్నవి. రుద్రానువాకము నందలి ఐదు ఋక్కులకు రుద్రుడు దేవత. ఇరువదవ ఋక్కునకు కూడ దేవత రుద్రుడు. మొదట ఋక్కు యొక్క ఛందస్సు బృహతి. రెండవదాని ఛందస్సు త్రిజగతి. మూడవదాని ఛందస్సు త్రిష్టుప్. మిగిలిన మూడును అనుష్టుప్. వీటి జ్ఞానము కలవాడు మంచి సిద్ధిని పొందును. త్రైలోక్య, మోహన మంత్రము కూడ విషమును తొలగించును. 'ఇం శ్రీం, హీం హ్రూం త్రైలోక్య మోహనాయ విష్ణవే నమః' అనునది మంత్రము. 'ఓం హం మొదలు నమామ్యహమ్ వరకును వున్న మూలోక్త అనుష్టుభ నృసింహ మంత్రముచేత కూడ విషవ్యాధి తొలగును, ఈ పంచాంగ మంత్రము సర్వార్థ సాధకము. ద్వాదశాక్షరి, అష్టాక్షరిలు కూడ విషవ్యాధిని తొలగించును. 'కుబ్జికా, త్రిపురా, గౌరి, చంద్రికా విషహారిణీ' అను ప్రసాద మంత్రము విషమును తొలగించి ఆయురారోగ్యమును వృద్ధిపొందించును. సూర్య వినాయక మంత్రములు రుద్ర మంత్రము లన్నియు కూడ విషము తొలగించును. (296)

విషహృన్మంత్రౌషధము

అగ్నిదేవుడు పలికెను : 'ఓం నమోభగవతే రుద్రాయ' మొదలు 'పరశుపాణయే' వరకును వున్న మూలోక్త మంత్రము 'నమో భగవతే పక్షి రుద్రాయ' మొదలు 'విషం ఠఠ వరకును ఉన్న మూలోక్త మంత్రము చేతను సర్పదష్టుని అభిమంత్రించినచో వాని విషము తొలగిపోవును. 'ఓం నమోభగవతే రుద్ర' మొదలు 'ద్రాం ప్రీం-ఠః' వరకును ఉన్న మూలోక్త మంత్రమును జపించి మంత్ర సిద్ధిపొందినవాడు నిత్యము సర్పములను బంధించ గలడు. ఒకటి రెండు మూడు, నాలుగు బీజములు కలదియు కృష్ణ చక్రముచే అంగ పంచకముగల గోపీజన వల్లభాయ స్వాహాయను మంత్రమును సర్వార్థసాధకము. 'ఓం నమోభగవతే రుద్రాయ' మొదలు 'జ్ఞాపయతి ఠఠ' వరకును వున్న మూలోక్త మంత్రమునకు పాతాళ క్షోభ మంత్రమని పేరు. ఈ మంత్రముతో అభిమంత్రించినచో విషము తొలగి పోవును. సర్పము కాటు వేసినపుడు మండుచున్న కాష్టముతో గాని, కాలుతున్న శిలతోకాని, అగ్నిజ్వాలతోగాని, కోకనదముతోగాని కరచిన స్థానమున కాల్చినచో విషము ఉపశమించును. శిరీష వృక్ష బీజములు పుష్పములు, అర్క క్షీరము బీజము, కటుత్రయము వీటిని త్రాగించినను పైన పూసినను కాటుక పెట్టినను విషము నశించును. శిరీష పుష్పరసముతో భావనచేసిన తెల్లని మరిచము పానవశ్య, అంజనాది రూపమున ఇచ్చినచో విషమును నశింపచేయును. సందేహము లేదు. కోశాతకీ వచా హింగు శిరీష, అర్కక్షర-త్రికటు మోషాం భస్సులను నశ్యాది రూపమున ఇచ్చినచో విషము నశించును. రామఠ ఇక్ష్వాకు సర్వాంగముల చూర్ణము నశ్యముగా ఇచ్చినచో విషమును తొలగించును. ఇంద్రబల, అగ్నికము ద్రోణము తులచి దేవిక సహ, వీటిరసములో త్రికటు చూర్ణము కలిపి తిన్నచో విషము నశించును. కృష్ణ పంచమినాడు తీసుకుని వచ్చిన శరీష పంచాంగము విషనాశకము. (297)

గోనసాది చికిత్సా కథనము

అగ్నిదేవుడు పలికెను :

వశిష్ఠా ! ఇపుడు గోనసాది సర్పవిషమునకు చికిత్స చెప్పెదను, వినుము. 'ఓహ్రాం ప్రీం,

అమల పక్షిస్వాహా' అను మంత్రముతో అభిమంత్రించిన తాంబూలమును ఇచ్చుటచే మంత్రవేత్త మండలి సర్ప విషమును తొలగించును. లశునము రామఠ ఫలము కుష్టము, అగ్ని, వ్యోషకము. వీటిని సర్పవిషమునందు త్రాగవలయును. స్నుహీక్షీరము గో ఘృతము పదునైదు దినములు త్రాగవలయును. రాజిల సర్పము కరచినపుడు సైంధవ లవణము ఆజ్యమధు గోమయ రసములు పురీతత్' భక్షించినచో విషము తొలగును. సర్పము కరచినవాడు కృష్ణ ఖండము దుగ్ధము, ఆజ్యము, తేనె వీటిని త్రాగవలెను. త్రికటువులు మయూర పింఛము, పిల్లి, ఎముక, ముంగిస రోమములు వీటిని సమాన భాగములుగ గ్రహించి చూర్ణముచేసి గొఱ్ఱపాలలో తడిపి దాని ధూపము వేసినచో అన్ని విధములగు విషములు నశించును. రోమ నిర్గుండికా, అంకోల పత్రములను సమభాగముల గ్రహించి, వాటి అన్నిటితో సమముగ లశునముచేర్చి వేసిన ధూపము కూడ విషనాశకము. అగస్త్య పత్రములను, గంజిలో ఉడికించి దానితో పాముకరచిన చోట కాచినచో విషము దిగిపోవును. మూషకములు పదహారు విధములు. కార్పాస రసమును త్రాగినచో వాటి విషము తొలగును. ఫలునీ పుష్పములను నాగర గుడములతో కలిపి భక్షించినచో విషరోగము పోవును. సాలె పురుగులు ఇరువది విధములైనవి. వాటిని విషమునకు చికిత్స చేయుటకు పద్మక పాటలీ కుష్ట ఉశీర, చందన, నత, నిర్గుండి, శారివ, సేలులను ఉపయోగించవలయును. గుంజ నిర్గుండి కంకోల పత్ర శుంఠి, ద్వివిధ హరిద్ర కరంజ వల్కములను ఉడికించి (సాలె పురుగు) లూత విషముతో బాధపడు వానికి పైన చెప్పిన ఓషధులు కలిపిన నీటిని త్రాగించవలయును. ఇపుడు వృశ్చిక విషమును తొలగించు చికిత్సను వినుము. మంజిష్ఠా చందన వ్యోష శిరీష, కుముద పుష్పములను, నాలుగు యోగములను కలిపి లేపాదికము చేసినచో వృశ్చిక విష బాధ నశించును. 'ఓం నమో భగవతే రుద్రాయ' మొదలు 'ఓం హ్రూం ఫట్' వరకు వున్న మూలోక్త మంత్రముతో అభిమంత్రించిన ఔషధము మనుష్యునికి ఇచ్చినచో గర్దభాది విషములను తొలగించును. త్రిఫలా ఉశీర, ముస్తా, అంబు మాంసి, పద్మక, చందనములను మేకపాలతో కలిపి త్రాగించినచో గర్దభాది విషము నశించును. శిరీష పంచాంగములు వ్యోషము శతపదీ విషమును నశింపచేయును. కంధరముతో కూడిన శిరీష వృక్షపు బెరడు ఉందూరజ విషమును తొలగించును. వ్యోషమును తగర మూలమును ఘృతముతో ఉపయోగించినచో 'మత్స్యవిషము నశించును. యవ, క్షార, వ్యోష, వచా, హింగు, విడంగ, సైంధవ-తగర, అంబష్ఠా, అతిబలా కుష్ఠములు సకల విధకీట విషములను హరించును. యష్టి వ్యోషగుడ క్షీరములతోచేసిన యోగము శూనక విషమును తొలగించును. 'ఓం సుభద్రాయై నమః', 'ఓం సుప్రభాయై నమః' అనునవి ఓషధులును పైకి తీయునపుడు ఉపయోగించు మంత్రములు. విధానానుసారముగ కాక మానవులు ఏ ఓషధులను గ్రహింతురో వాటి సారమును నీవు తీసుకొనుము అని బ్రహ్మ 'సుప్రభా' దేవికి చెప్పెను. అందుచేత ముందుగ సుప్రభాదేవికి నమస్కరించి పిడికిలితో యవలు చల్లి పది పర్యాయములు జపించి ఓషధికి నమస్కరించి 'ఊర్ధ్వ నేత్రవగు నిన్ను ఉద్ధరించుచున్నాను' అని చెప్పుచు ఆ ఓషధినిపైకి లాగి 'పురుష సింహుడగు గోపాలునకు నమస్కారము. యుద్ధము నందు తన పరాజయమును గూర్చి శ్రీకృష్ణుడే యెరుగును. ఈ సత్యవాక్య ప్రభావముచే నాకు ఈ ఓషధి సిద్ధిప్రదమగు గాక ! యని చెప్పుచు దానిని భక్షించ

వలయును. స్థావర విషమునకు ఉపయోగించు ఓషధుల విషయమున 'నమో వైదూర్య మాత్రే' మొదలు 'హరిమాయే' వరకును వున్న మూలోక్త మంత్రమును జపించవలయును. విషమును భక్షించిన వానిచే ముందుగ వమనము చేయించి వాని శరీరము చల్లని జలముతో తడుపవలయును. పిదప తేనె నెయ్యి త్రాగించి విరేచనము చేయించవలయును. (298)

బాలగ్రహహర బాలతంత్రము

అగ్నిదేవుడు చెప్పెను :

బాలాది గ్రహములను తొలగించు బాలతంత్రమును చెప్పెదను. పుట్టిన దినమున శిశువును పాపినియను గ్రహి ఆవేశించును. దానిచే శిశువు శరీరమున ఉద్వేగము కలుగును. పాలు త్రాగక మెడ ఇటు అటు త్రిప్పుచుండును. ఇది పాపినీ గ్రహచేష్ట. దీనిని నివారించుటకు పాపిని గ్రహికిని మాతృకలకును మత్స్య, మాంస, సుర, భక్ష్య గంధమాలా, ధూప దీపములతో బలి ఇవ్వవలెను. ఆ శిశువు శరీరమున, ధాతకీ లోధ్ర, మంజిష్ఠా తాల చందనముల లేపనముచేసి గుగ్గులు, ధూపము వేయవలయును. రెండవ రోజున భీషణి అనుగ్రహి ఆవేశించును. కాస నిశ్వాసములు మాటి మాటికి గాత్ర సంకో చము ఇవి దానివలన కలుగు చేష్టలు. అట్టి శిశువుకు అజా మూత్రము పోసి కృష్ణ, అపామార్గ చందనములతో అరగదీసిన పిప్పలి లేపము చేయవలయును. గో శృంగ, దంత, కేశములతో ధూపమువేసి వెనుకటివలెనే బలి ఇవ్వవలయును. మూడవ రోజు ఆక్రమించు గ్రహిపేరు 'ఘంటాలి' మాటిమాటికి ఏడ్చుట ఆవులింత అరచుట భయము గాత్రోద్వేగము అరుచి ఇవి దాని వలన కలుగు చేష్టలు. అట్టి శిశువునకు కేసరము రసాంజనము గోదంతము హస్తిదంతము వీటిని మేకపాలలో నూరి శరీరమునకు పూయవలయును. నఖరాజీ బిల్వపత్రములలో ధూపమువేసి వెనుకటివలెనే బలి యివ్వవలయును. నాల్గవ దినమున గ్రహికాకోలి. ఇది ఆవహించిన శిశువు గాత్రో ద్వేగముతో ఎక్కువగా ఏడ్చును. నురుగు కక్కును. దిక్కులవైపు చూచును. దీని శాంతి కొరకై కుల్మాష మద్యములతో బలియిచ్చి గజదంత సర్పత్వక్ అశ్వమూత్రములను శరీరమునకు పూసి రాజీనింబ పత్రములతో గొఱ్ఱె వెంట్రుకలతో ధూపము వేయ వలయును. ఐదవ గ్రహియగు హంసాదిక ఆవులింతలను ఎగుడు శ్వాసలను, ముష్టి బంధనమును కలిగించును. వెనుకటి వలెనే బలి యివ్వవలయును. శిశు శరీరమునకు మేష శృంగ బలాలోధ్ర శిలా తాలములు పూయ వలయును. ఆరవ గ్రహిపట్కారి. భయమును మోహమును అధిక రోదనమును కల్గించును. శిశువు ఆహారము తినక అవయవములను ఎక్కువగా కదల్చును. వెనుకటివలె బలి ఇవ్వవలయును. రాజీ, గుగ్గులు, కుష్ట గజ దంతాదులతో ధూపన లేపనాదులు చేయవలయును. ఏడవ రోజున గ్రహిముక్త కేశి. దానిచే ఆక్రమించబడిన శిశువు దుఃఖాతురుడగును. శరీరము నుండి దుర్వాసన వచ్చును. ఆవులింత, అధికమగును. రోదనము కాసము కలుగును. వానికి వ్యాఘ్ర నఖ ములతో ధూపము వేసి శరీరమునకు గోమయ గోమూత్రములు లేపనము చేయవలయును. ఎనిమిదవ దినమున గ్రహి శ్రీదండి, ఈ గ్రహి ఆవేశించిన శిశువు దిక్కులు చూచును. నాలుక కదల్చును. దగ్గును. రోదనము చేయును. పూర్వోక్తమగు బలిని ఇవ్వవలయును. హింగులావచా, సిద్ధార్థ

లశునములతో ధూప అనులేపములు చేయవలయును. తొమ్మిదవది ఊర్ధ్వ గ్రహియను మహాగ్రహి. ఇది ఆవేశించిన శిశువు ఉద్వేగముతో ఊర్ధ్వ నిశ్వాసములతో తనరెండు పిడికిళ్లను నమలును. వానికి రక్తచందన కుష్టాదులతో ధూపలేపనములు చేయవలయును. కపి రోమ నఖములతో ధూపము వేయవలయును. పదవ దివసమున రోదని అను గ్రహి ఆవేశించును. అపుడు శిశువు ఎక్కువ రోదనము చేయును. శరీరము నీలవర్ణమై సుగంధ యుక్తమగును. అట్టి శిశువునకు వేపాకుతో ధూపము, ఉగ్రరాజి సర్జరముల లేపము చేయవలయును. లాజకుల్మాష, ఓదనములతో దానికి బలి ఇవ్వవలెను. ఈ విధముగ పదమూడు రోజుల వరకు ధూపాదిక క్రియ జరుపవలయును.

ఒక మాసము వయస్సుగల శిశువును పూతన అను గ్రహి ఆవహించును. ఇది ఆవహించిన శిశువు కాకివలె అరచుచు, ఏడ్చును. పొడవుగా శ్వాసపీల్చుచు మాటి మాటికి కండ్లు మూయును. వాసన మూత్ర గంధమువలె ఉండును. అట్టి శిశువునకు గోమూత్ర ముచే స్నానము చేయించి, గోదంతము ధూపము వేయవలయును. ఆ పూతన కొరకై గ్రామమునకు దక్షిణమున కరంజ వృక్షము క్రింద ఒక సప్తాహము వరకు పీత వస్త్ర రక్త మాల్యమద్య తిల చతుర్విధమాంస గంధ దీప త్రివిధ పాయసములతో బలి ఇవ్వవలెను. రెండు మాసముల శిశువును ముకట అను గ్రహి ఆవహించును. ఆ శిశువు శరీరము పచ్చబడిపోయి చల్లబడును. జలుబుచేసి ముక్కు నుండి నీరు వచ్చును. ముఖము ఎండి పోవును. ఈ గ్రహికొరకై పుష్పగంధ, వస్త్ర అపూప, ఓదన, దీపములతో బలి యివ్వవలెను. కృష్ణాగరు మొదలగు వాటితో ధూపము వేయవలయును. మూడవ మాసమున గోముఖి ఆవహించును. ఆశిశువు ఎక్కువ నిద్రపోవును. మాటిమాటికి మల మూత్రములు విడుచుచు గట్టిగా ఏడ్చును. ఆ గ్రహికొరకు ముందుగా తూర్పున యవ, ప్రియంగు, కుల్మాష, శాక, అన్న దుగ్ధముతో బలియిచ్చి పిదప శిశువుకు మధ్యాహ్నమున పంచ భంగముతో స్నానము చేయించి నేతితో ధూపము వేయవలయును. నాల్గవ మాసమున పింగళ అను గ్రహి ఆవహించును. అపుడు ఆశిశువు శరీరము తెల్లనై దుర్గంధయుక్తమై ఎండిపోవ ప్రారంభించును. అట్టి శిశువు తప్పక మరణించును. ఐదవ మాసమున లలన అనుగ్రహిచే ఆవహింపబడిన శిశువు శరీరము శిథిలమై పోవును. ముఖము ఎండిపోవును. దేహము పాలిపోయి అపాన వాయు వెడలుచుండును. లలనా శాంతికి దక్షిణ దిక్కునందు వెనుక చెప్పిన విధముగ బలి ఇవ్వవలెను. ఆరవ మాసమున పంకజ అను గ్రహి ఆవహించును. దీనిచే రోదనము వికృతస్వరము మొదలగునవి కలుగును. ఈ గ్రహికొరకు వెనుక చెప్పిన పదార్థములు అన్న పుష్ప గంధాదులు బలి ఇవ్వవలయును. ఏడవ మాసమున నిరాహారముగా ఉండును. అందుయను గ్రహి ఆవహించగా, దుర్గంధ దంతరోగాదులు కలుగును. నిరాహార కొరకై మిష్టాన్నము వెనుక చెప్పిన పదార్థములు బలి యివ్వవలయును. ఎనిమిదవ మాసమున యమునయను గ్రహి ఆవహించగా శిశువు శరీరముపై దద్దురులు బయలుదేరి శరీరము ఎండిపోవును. దీనికొరకై చికిత్సచేయకూడదు. తొమ్మిదవ మాసమున కుంభకర్ణియను గ్రహి ఆవహించిన శిశువు జ్వరము, జలుబులతో బాధపడును. ఎక్కువగా ఏడ్చును. ఆ గ్రహికొరకై పూర్వము చెప్పిన పదార్థములు కుల్మాషములు మొదలగునవి ఈశాన్యమున బలి ఇవ్వవలయును. దశమ మాసమున తాపసిగ్రహి ఆవహించిన శిశువు ఆహారము త్యజించి కండ్లు మూసుకొనియుండును.

ఈ గ్రహికొరకై ఘంటా, పతాకా, పిష్టాన్నములు మొదలగునవి బలిగా ఇవ్వవలెను. పదకొండవ మాసమున చంచల అనుగ్రహి ఆవహించగా శిశువు నేత్ర రోగముచే పీడితుడగును. దానికి చికిత్స చేయుట వ్యర్థము. పండ్రెండవ మాసమున చంచల అను గ్రహి ఆవహించగ శిశువునకు దీర్ఘనిశ్వాసము భయాదికము కలుగును. శాంతి కొరకై మధ్యాహ్న సమయమున తూర్పునందు కుల్మాష తిలాదులతో బలి ఇవ్వవలయును.

రెండవ సంవత్సరమున యాతన ఆవహించగా శిశువునకు యాతన కలుగును. రోదనాదికము ఉండును. శాంతికొరకై వెనుకటివలె స్నానాదికము చేయించి తిల మాంస, మద్యములు బలిగా యివ్వవలెను. మూడవ సంవత్సరమున రోదని గ్రహి ఆక్రమించగా కంపము రోదనము, రక్త మూత్రము కలుగును. ఇందు నిమిత్తమై గుడోదన, తిలాపూపములు తిలపిష్ఠముతో చేసిన ప్రతిమ దానము చేయవలయును. శిశువునకు తిలమిశ్ర జలముతో స్నానము చేయించి పంచపత్రములతోను రాజఫలత్వక్కుతోను ధూపము వేయవలయును. నాల్గవ వర్షమున ఛటక అను గ్రహిబాలునకు జ్వరము, వాపు అన్ని అవయవములందు నొప్పికల్గును. ఛటక నిమిత్తమై వెనుక చెప్పిన పదార్థము లను తిలలను బలి యిచ్చి బాలకునకు స్నానము చేయించి ధూపము వేయవలయును. ఐదవ వర్షమున గ్రహిచంచల. బాలునకు జ్వరము, భయము, అంగ శైథిల్యము కలుగును. చంచల కొరకై అన్నము మొదలగునవి బలియిచ్చి బాలునకు మేష శృంగములతో ధూపము వేయవలయును. పలాశ, ఉదుంబర, అశ్వత్థ, వట, బిల్వదళములు కలిసిన జలముతో వానికి స్నానము చేయించ వలయును. ఆరవ సంవత్సరమున ధావని అనుగ్రహిచే ఆక్రమింపబడిన బాలుని శరీరము నీరసమై ఎండిపోవును. ప్రతి అవయవము నందును పీడకలుగును. ఏడుదినముల వరకు వెనుక చెప్పిన పదార్థ ములను బలిగా ఇచ్చి బాలకునకు భృంగరాజముతో స్నానము చేయించి ధూపము వేయ వలయును.

ఏడవ సంవత్సరమున యమునా అనుగ్రహి ఆవహించిన పిల్లవానికి వాంతులు, మాట లేక పోవుట, ఎక్కువ నవ్వుట, ఏడ్చుట కలుగును. మాంస, పాయస, మద్యాదులు బలి ఇచ్చి స్నానము చేయించి ధూపము వేయవలయును. ఎనిమిదవ సంవత్సరమున జాతవేద ఆవహించగా, బాలుడు నిరాహారుడై ఏడ్చును. కృసర అపూప దధ్యాదులు బలిగా ఇచ్చి స్నానము చేయించి ధూపము వేయవలయును. తొమ్మిదవ వర్షమున కాల ఆవహించగా భుజము కొట్టుకొనుట, గర్జనము భయము కలుగును. కృసర అపూపసక్తు కుల్మాష పాయసములు బలిగా ఇవ్వవలెను. పదవ సంవత్సరమున కలహంసి ఆవహించగా దాహము కృశత్వము జ్వరము కలుగును. ఐదు దినములు పౌలిక, దధి, అన్నములు బలిగా ఇవ్వ వలెను. వేపాకుల ధూపము కుష్ఠ లేపనము చేయవలయును. పదకొండవ సంవత్సరమున దేవదూతి ఆవహించగా బాలుడు నిష్ఠురముగా పలుకును. వెనుకటి వలెనే బలి ఇచ్చి లేపాదికము చేయవలయును. పండ్రెండవ సంవత్సరమున బలిక ఆవహించిన బాలుడు శ్వాస రోగముతో బాధపడును. వెనుకటి వలెనే బలి లేపాదికము చేయవలయును. పదమూడవ సంవత్సరమున వాయవి ఆవహించిన బాలునకు ముఖరోగ అంగ శైథిల్యములు కలుగును. రక్తాన్న గంధ మాల్యాదులు బలి ఇచ్చి బాలునకు పంచదళములతో స్నానము చేయించవలెను. రాజి, నింబదళములు ధూపము వేయ వలెను. పదునాల్గవ సంవత్సరమున యక్షిణి ఆవహించగ శూల

జ్వర దాహాదులు కలుగును. మాంస భక్ష్యాదులతో బలి ఇవ్వవలయును. శాంతి కొరకై స్నానాదికము కూడ వెనుకటివలెనే చేయవలెను. పదునైదవ సంవత్సరమున ముండికా గ్రహి ఆవహించిన బాలునకు సర్వదా రక్తస్రావము కల్గుచుండును. దీనికి చికిత్స చేయించకూడదు. పదునారవ సంవత్సరము వానరి ఆవహించిన బాలుడు నేలపై పడిపోవును. నిద్రా జ్వరాదులతో బాధపడును. మూడు దినములు పాయసాదులు బలిగా ఇచ్చి స్నానాదికము వెనుకటి వలెనే చేయించవలెను. పదునేడవ సంవత్సరమున గంధవతి ఆవహించగా బాలకుని శరీరమున ఉద్వేగము కలుగును. ఆతడు ఎక్కువగా ఏడ్చును. కుల్మాషాదికము బలిగాఇచ్చి వెనుకటివలెనే స్నాన ధూప లేపనాదులు చేయవలెను. దిన దేవత పూతన వర్ష దేవత సుకుమారిక. 'ఓం నమః సర్వ మాతృభ్యః' మొదలు 'రుద్రోజ్ఞాపయతి' వరకు వున్న మూలోక్త మంత్రము సర్వకామ ప్రదము. దీనిని బాల గ్రహశాంతికై ఉపయోగించ వలెను. 'ఓం నమో భగవతి' మొదలు 'వస వస' వరకు వున్న మూలోక్త మంత్రమును రక్షార్థమై బలి దాన సమయమున పఠించవలెను. బ్రహ్మ, విష్ణువు, శివుడు, స్కందుడు, గౌరి, గణాదులు రక్షింతురు గాక ! జ్వర దాహముతో బాధపడుచున్న పిల్లవానిని విడచెదరు గాక ! ఈ మంత్రము కూడ బాలగ్రహ నివారకము. (299)

గ్రహ మంత్రాదికములు - ఉపసంహారణ

అగ్నిదేవుడు పలికెను :

ఇపుడు గ్రహోపహార మంత్రాదులను చెప్పెదను. ఇవి గ్రహ శాంతినిచ్చును. హర్ష ఇచ్ఛా భయశోకాదుల చేతను, ప్రకృతి విరుద్ధము అపవిత్రమైన ఆహారము భుజించుట చేతను, గురు గ్రహాది కోపముచేతను మానవునకు ఐదు విధములగు ఉన్మాదములు కలుగును. వాటికి త్రిదోషజ ములు, సన్నిపాతజములు, ఆగంతుకములు అని పేర్లు. రుద్రుని క్రోధముచే అనేక విధములగు దేవాది గ్రహములు కలుగును. ఈ గ్రహములు నదులు, చెరువులు, తటాకములు, శైలములు, ఉపవనములు, సేతువులు, నదీ సంగమము, శూన్య గృహము, బిలద్వారము, ఏకైక వృక్షము, వీటి యందుండి అక్కడికి వెళ్ళిన వారిని ఆవహించును. నిద్రపోవుచున్న గర్భిణి స్త్రీని, ఆసన్న ఋతుకాలయగు స్త్రీని, ఋతు స్నానము చేయుచున్న స్త్రీని కూడ ఆవహించును. ఇవి మానవులకు అవమానము, వైరము, విఘ్నము, భాగ్య విపర్యయము మొదలగునవి చేయించును. దేవతా గురుధర్మాది సదాచారాదులను ఉల్లంఘించిన వారిని పర్వత వృక్షాదులనుండి పడినవారిని మాటి మాటికి జుట్టు దుల్పుకొనువానిని, కండ్లు ఎర్రగాచేసి ఏడ్చుచు గంతులు వేయుచున్న వానిని ఈ లక్షణము లను బట్టి రూప అనుగ్రహ విశేషముచే పీడితుడైనట్లు గ్రహించవలెను. ఉద్వేగయుక్తుడై దాహ శూల పీడితుడై ఆకలి దప్పులతో బాధపడుచు శిరోరోగముతో బాధపడుచు నాకు ఇమ్ము, నాకు ఇమ్ము అని యాచన చేయువాడు బలికామి అను గ్రహి ఆవహించినట్లు తెలుసుకొనవలెను. ఆకాశ వ్యాపియైన మహా సుదర్శనము, విటప నాశికము, పాతాళ నారసింహాది మంత్రములు, చండీ మంత్రములు గ్రహపీడను తొలగించును. గ్రహపీడ నాశనము చేయు సూర్యారాధన ఈ క్రింది విధముగా చేయవలయును. సూర్యుడు తన దక్షిణ హస్తములందు పాశాంకుశ అక్షమాలా

కపాలములను వామ హస్తములందు ఖట్వాంగ కమల చక్ర శక్తులను ధరించి ఉండును. నాలుగు ముఖములు ఎనిమిది హస్తములు, పన్నెండు నేత్రములు కలిగి ఉండును. సూర్యుడు సూర్య మండలము లోపల కమలాసనముపై ఆదిత్యాది దేవగణ పరివృతుడై కూర్చుండియుండును. ఈ విధముగ సూర్యుని ధ్యాన పూజాదులు చేసి ఉదయ కాలమున అర్ఘ్యము ఇవ్వవలెను. అందులకు మంత్రము శ్వాస (య), విష (ఓం), అగ్నిమాన్ రండి (ర్-ఓం), హృల్లేఖా (హ్రీం) ఇవి సంకేతాక్షర ములు. వీటిని కలుపగా 'యౌః, రౌం, ఐం, హ్రీం-కలశార్కాయ భూర్భువః స్వరోం జ్వాలి నీ కుల ముద్ధర' అని ఏర్పడును. సూర్యుడు పద్మాసనగతుడై ఎర్రగా రక్త వస్త్రములు ధరించి యుండును. అతని మండలము జ్యోతిర్మయము. ఉదార స్వభావుడు. రెండు హస్తములందును పద్మమును ధరించి అన్ని అవయవములందును అలంకారములు ధరించి సౌమ్యమూర్తియై ఉండును. సూర్యాది గ్రహములన్నియు సౌమ్యములై బలా దాయకములై కమలములు ధరించియుండును. వారి వస్త్రములు విద్యుత్పుంజమువలె నుండును. బృహస్పతి పసుపు పచ్చగాను శుక్రుడు తెల్లగను శని, నల్లటి బొగ్గువలెను రాహు కేతువులు ధూమ సమాన వర్ణులుగను వుందురు. వీరందరును ఎడమ చేతులను ఎడమ తొడలపై నుంచి దక్షిణ హస్తములందు అభయ ముద్రను ధరించి ఉందురు. గ్రహముల పేర్ల ఆద్యక్షరములకు బిందువులు చేర్చినచో అవి బీజ మంత్రములగును. "ఫట్" అని ఉచ్చరించుచు, హస్తములను శోధించి అంగుష్ఠము మొదలు కరతల పర్యం తము, కరన్యాసము నేత్రములు తప్ప హృదయాది పంచాంగ న్యాసముచేసి సూర్యుని మూల బీజరూపములగు మూడు అక్షరములతో (హ్రాం, హ్రీం, సహ) వ్యాపక న్యాసము చేయ వలయును. పిదప అర్ఘ్య పాత్రమును హస్త్ర మంత్రముతో ప్రక్షాళనచేసి పూర్వోక్త మూల మంత్రమును ఉచ్చరించుచు ఉదకము నింపి గంధపుష్ప అక్షత దూర్వములు వేసి మరల అభిమంత్రించి ఆ జలముతో తనను పూజా ద్రవ్యములను ప్రోక్షణ చేసికొనవలెను.

పిదప యోగ పీఠమును కల్పించి, దాని పాదములుగా, ప్రభూత విమల, సార, ఆరాధ్య పరమ సుఖములను కల్పించవలెను. ఆగ్నేయాది దిక్కులు నాల్గింటి యందును మధ్య భాగము నందును వీటిపేర్లకు చివర నమః చేర్చి వాటికి ఆవాహన పూజలు చేయవలయును. యోగ పీఠముపైనను, హృదయ కమలము నందును, దిక్కునందును, విదిక్కునందును, దీప్త మొదలగు శక్తులను స్థాపించవలెను. పీఠముపై హృదయ కమలము స్థాపించి దాని కేసరములపై ఎనిమిది శక్తులను పూజించవలెను. "వాం దీప్తాం', "వీం సూక్ష్మాం", "వూం జయాం", "వృాం భద్రి కాం", "వేం విభూతీం", "వైం విమలాం", "వోం అసిఘాత విద్యుతాం", "వౌం సర్వతో ముఖీం", "వం పీఠమ్'. ఈ విధముగ శక్తులను పూజించి పిదప రవిని పూజించవలెను. ఆవాహనముచేసి పాద్యా దులు సమర్పించి హృదయాది షడంగన్యాస పూర్వకముగ పూజ చేయవలయును. "ఖ కారము మొదలు" జర ద్వాయుహృదా" వరకు సంకేతములచే సూచించిన రవి మంత్రము సర్వ ఫల ప్రదము. ఆగ్నేయ నైఋతి ఈశాన వాయవ్య దిక్కులందును, మధ్యయందును హృదాది పంచాంగ ములతో వాటి మంత్రములతో పూజించవలెను. కర్ణికామధ్యమునందే పూజించవలెను. తన యెదురుగా నున్న దిక్కునందు అస్త్రపూజ చేయవలెను. పూర్వాది దిక్కులందు క్రమముగా చంద్ర, బుధ, గురు, శుక్రులను, ఆగ్నేయాది విదిక్కులందు మంగళ, శనైశ్చర, రాహు, కేతువులను

పూజించవలెను. పుష్టిహింగు వచా చక్ర శిరీష ఆమయములను మేకమూత్రమునందు నూరి, అంజనము, నశ్యము తయారు చేయవలయును. ఈ ఓషధులను ఈ విధముగ ఉపయోగించినచో గ్రహబాధ తొలగును. పాఠాపథ్యావచా, శిగ్రుసింధు వ్యోషములును ఒక్కొక్క పలము చొప్పున గ్రహించి ఒక కుంచెడు మేక పాలతో ఉడకపెట్టి, ఆ పాలనుండి తీసిన నెయ్యి సమస్త గ్రహబాధలను తొలగించును. వృశ్చికాళి, ఫలకుష్ఠ, లవణా శార్ఞకములను నీటిలో ఉడికించి ఇచ్చినచో అపస్మార రోగము తొలగును. విదారి కుశకాశ, ఇక్షు క్వాథములతో చేసిన పాలను రోగికి త్రాగించవలెను. యష్టి కూష్మాండ రసమునందు సంస్కృతమైన ఘృతమును కాని పంచగవ్యమును గాని, ఇచ్చినచో జ్వరము తొలగును. "ఓం భస్మాస్త్రాయ విద్మహే। ఏక దంష్ట్రాయ ధీమహి। తన్నో జ్వరః ప్రచోదయాత్' '. ఈ మంత్రమును జపించుటచే జ్వరము తొలగును. శ్వాసరోగి కృష్ణాశన, నిశా, రాస్నా, ద్రాక్ష, తైల గుడములను సేవించవలెను. లేదా మధుఘృతములతో బార్ఞిని సేవించవలెను. లేదా పాఠా, తిక్త, కణ బార్జీలను తేనెతో నాకవలెను. ధాత్రీ విశ్వ సితా, కృష్ణాముస్తా, ఖర్జూర మాగధీ, పీవరా, ఇవి ఎక్కిళ్ళను తగ్గించును. పై మూడు యోగములను తేనెతో సేవించవలెను. కామల రోగము కలవాడు జీరమాండూకి నిశా, ధాత్రీరసములను త్రాగవలెను. త్రికటు పద్మకాష్ఠ, త్రిఫలా విడంగ దేవదారు రాస్నలను సమమైన పాళ్ళతో గ్రహించి చూర్ణముచేసి పటిక బెల్లముతో సేవించినచో కాసరోగము తప్పక నశించును. (300)

సూర్యార్చన కథనము

అగ్నిదేవుడు చెప్పెను :

శార్ఙి (గ కారము) దండి (అనుస్వార యుక్తము కావలెను). దానిలో పద్మేశుడు (ఈ కారము) పావకుడు (ర కారము) ఈ నాలుగు అక్షరములను కలుపగ ఏర్పడిన బీజాక్షరము (గ్రీం) సర్వార్థ సాధకము పై బీజమునకు క్రమముగా దీర్ఘ స్వరములను చేర్చి అంగన్యాసము చేయవలయును. గణాధిపతికి గంగః గౌం గంః గ్, అను ఐదు బీజాక్షరములు ఉన్నవి. అవి వేరువేరు ఫలములు ఇచ్చును. గణం జయాయ నమః, ఏక దంష్ట్రాయ, చలకర్ణినే గజ వక్త్రాయ, మహోదర హస్తాయ ఇవి సర్వ సామాన్యమైన పంచాంగములు. లక్ష పర్యా యములు జపించుటచే మంత్ర సిద్ధి కలుగును. అష్టదళ కమలము ఏర్పరచి దిగ్దళములందు గణేశుని నాలుగు విగ్రహములను పూజించవలయును. క్రమముగా ఐదు అంగములను కూడ పూజించవలయును. నమః చివరచేర్చి గణాధి పతయే, గణేశ్వరాయ, గణనాయ కాయ, గణక్రీడాయ అను నాల్గు మంత్రములు దిగ్దళమునందు ఉన్న మూర్తులను పూజించుటకు ఉపయోగించవలెను. అంగపంచకమును వెనుకటి వలెనే పూజించ వలయును. వక్రతుండాయ ఏకదంష్ట్రాయ, మహెూదరాయ, గజవక్త్రాయ, వికటాయ, విఘ్నరాజాయ, ధూమ్రవర్ణాయ అని దిగ్విదిక్కులందున్న మూర్తులను పూజించవలయును. పిదప దిక్పాల కులను పూజించవలెను. ముద్రా ప్రదర్శనద్వారా పూజ శ్రేష్ఠము. మధ్యమాతర్జనీల మధ్య బొటన వ్రేలు ఉంచి పిడికిలి బిగించినచో అది గణేశముద్ర. ఈ విధముగా ధ్యానించవలెను. నాలుగు భుజములు కలవాడును మోదకములును గ్రహించినవాడును, దండ పాశాంకుశములతో కూడినవాడును,

దంత భక్ష్యములు ధరించినవాడును, రక్తవర్ణుడును, పద్మపాశ అంకుశములను ధరించినవాడును అగు గణేశుని పూజించవలెను. చతుర్థియందు విశేష ముగా పూజించవలెను. శ్వేతార్క మూలముతో మూర్తి నిర్మించి తిలఘృత హోమములు చేసినచో సకల మనోరథములు సిద్ధించును. దధి మధు ఆజ్యములతో తండులములు హోమము చేసినచో సౌభాగ్యము వశిత్వము కలుగును.

ఘోష (హ), అసృక్ (ర), ప్రాణ (య), శాంతి (ఔ), అర్ధీ (ఉ), దండ (ం), కలుపగ ఏర్పడిన (హ్యౌ) ఓం అను మార్తాండ భైరవమును బింబబీజముతో సంపుటితము చేసినచో సాధకునకు ధర్మార్థ కామ మోక్షములు లభించును. ఐదు హ్రస్వాక్షరములను ఆదియందు బీజముగచేర్చి పంచ మూర్తుల న్యాసము చేయవలయును. దీర్ఘస్వర బీజములతో హృదయా ద్యంగన్యాసము చేయ వలయును. ధ్యానము సిందూరమువలె ఎర్రగా ఉన్నవాడును, ఈశాన్య దిక్కునందు వామార్ధమున భార్యా సహితుడై ఉన్నవాడును అగు సూర్యునకు నమస్కారము. ఆదిత్యాది పరివృతమగు రవి మండలమును పూజించి ఉదయ సమయమున అర్ఘ్యము ఇవ్వవలెను. ఈశాన్యమునందు కృతాం తునకు నిర్మాల్యమును చండునకు దీపిత తేజస్సును సమర్పించవలెను. రోచన కుంకుమ జల రక్త చందన అక్షతాంకుర వేణు బీజయవశాలి శ్యామాక తిలరాజక జపాపుష్పములు అర్ఘ్య పాత్రము నందుంచి, దానిని శిరస్సుపై ధరించి మోకాళ్ళపై కూర్చుండి సూర్యునకు అర్ఘ్యము ఇవ్వవలెను. స్వమంత్రములచే అభిమంత్రితములగు కలశములతో గ్రహములను పూజించి గ్రహాది శాంతికొరకై శాంతి కలశ జలముతో శాంతిచేసి సూర్య మంత్రము జపించువాడు సకల మనోరథములను పొందును. సంగ్రామ విజయ మంత్రమునందు బిందు పోషక బిందు యుక్త 'ర' చేర్చి ఆ మంత్రముతో శిరస్సు నుండి పాదముల వరకు ముద్రా ప్రదర్శన పూర్వకముగ ఆవాహన చేయుచు సూర్యుని పూజించవలెను. అంగన్యాసము చేసి తానే రవి అని భావించవలెను. మారణ స్థంబనములందు సూర్యుని పీతవర్ణునిగాను ఆప్యాయనము నందు శ్వేతవర్ణునిగాను శత్రుసంహారము నందు కృష్ణవర్ణుని గాను మోహన కర్మ యందు ధనుస్సు వంటి ఆకారము కలవానినిగాను భావన చేయవలయును. సూర్యుని అభిషేక, జప, ధ్యానపూజ, హోమములందు సర్వదా లగ్నుడైనవాడు తేజశ్శాలియై అజేయుడై శ్రీమంతుడై యుద్ధాదులందు జయమును పొందును. తాంబూలాదులందు ఈ మంత్ర న్యాసముచేసి దానియందు ఉశీరకము వుంచి తన చేతిలో కూడ సంగ్రామ విజయ బీజమును వ్రాసి ఆ తాంబూ లము ఎవరికైన ఇచ్చినను హస్తముతో స్పృశించినను అతడు వశుడగును. (301)

నానావిధ మంత్రౌషధములు

అగ్నిదేవుడు పలికెను :

"ఐం, కులజే ఐం సరస్వతి స్వాహా" ఇది పదకొండు అక్షరముల ముఖ్య మంత్రమైన సరస్వతీ విద్య. ఉప్పులేని ఆహారము తినుచు అక్షర లక్షలు జపముచేసినవాడు మేధోవంతుడగును. అత్రి(ద్), అగ్ని(ర్), వామనేత్ర(ఈ), బిందు(ం) ఇవి కలుపగా ఏర్పడిన 'ద్రీం' అను మంత్రము శత్రువులను పారద్రోలు మహామంత్రము. వజ్ర కమలములను ధరించిన పీతవర్ణుడగు ఇంద్రుని ఆవాహనచేసి పూజించి ఘృత తిలములతో లక్ష హోమములు చేయవలయును. పిదప తిల మిశ్రజలముతో

ఇంద్రునకు అభిషేకము చేయవలయును. అట్లు చేయుటచే రాజు కోల్పోయిన రాజ్యమును పుత్రాదులను పొందును. హ్రీం అనుదానికి 'శక్తి దేవ'యనిపేరు. దీని ఉద్ధారము ఘోష అగ్ని దండి దండములు. శివా శివ పూజలుచేసి ఈ మంత్రమును జపించవలయును. అష్టమీ నుండి చతుర్దశి వరకు పూజలో వుండవలెను. చేతులలో చక్రము పాశము అంకుశము అభయముద్ర ధరించిన వరదాత్రియగు దేవిని ఆరాధనచేసి హోమాదులు చేయుటచే సౌభాగ్యము కవితాశక్తి పుత్రులు లభింతురు. "ఓం హ్రీం ఓం నమః" మొదలు "కురుకురు ఓం" వరకును వున్న మూలోక్త మంత్రమును జపాదులు చేయుటచే సంపూర్ణ జగత్తు వశములో ఉండును. "ఓం హ్రీం చాముండే అముకం దహ దహ వచవచ మమవశమాయన స్వాహా ఓం". అను ఇది చాముండా వశీకరణ మంత్రము. ఈ వశీకరణ ప్రయోగ సమయమున స్త్రీ చల్లని త్రిఫలాజలముతో తన గుహ్యాంగమును కడుగుకొనవలయును. అశ్వగంధయవ క్షార హరిద్రా కర్పూరాదులు కూడ ఇందుకు ఉపయోగించ వచ్చును. ఎనిమిది పిప్పలి తండులములు ఇరువది మిరియము గింజలు బృహతీ రసము వీటి లేపముచే కూడ మరణాంతము వరకు వశము చేసుకొనగలుగును. కటీరమూల త్రికటు క్షౌద్ర లేపముకూడ ఇందులకు ఉపయోగించును. హిమ, కపిత్థక, రస, మాగధీ, మధు వీటి ప్రయోగము దంపతులకు క్షేమకరము. శర్కర కలిపిన కబందరసమును మధువును గుహ్యాంగము నందు లేపనము చేసినచో వశీకరణ మగును. సహదేవి, మహాలక్ష్మి పుత్రజీవి కృతాంజలులు చూర్ణమును శిరస్సుపై ఉంచినచో ఇది ఉత్తమమైన వశీకరణ సాధనము. త్రిఫలా చందనముల క్వాథము ఒక ప్రస్థము వేరుగాను రెండు కుడవములు వేరుగాను వుంచి భృంగ హిమరసములు అంతే ప్రమాణము గల పసువు చుంబకము తేనె, నేతిలో ఉడికించినపుడు పసుపు, ఎండిన పసుపు వీటి అన్ని టితో లేపము తయారుచేసి బిదారి జటామాంస చూర్ణము నందు శర్కర కలిపి బాగుగా మర్దించి పాలతో ప్రతిదినము సేవించు పురుషుడు స్త్రీ శతముతో సంగమము చేయకలుగును.

గుల్మ, మాష, తిలవ్రీహి చూర్ణములతో పాలు శర్కర కలిపి అశ్వత్థ, వంశ, దర్భమూల, వైష్ణవీశ్రీ మూలములను దూర్వా, అశ్వగంధ మూలములను పుత్రులు కోరు స్త్రీ పాలతో త్రాగవలెను. కాంతిలక్ష్మి, శిఫాధాత్రి, వజ్ర, లోధ్ర, వటాంకురములను స్త్రీ ఋతు కాలమునందు ఆజ్య క్షీరములు కలిపి త్రాగవలెను. పుత్రుడు కలుగును. పుత్రార్థినియగు స్త్రీ, శ్రీయను ఓషధీ మూలమును వటాంకురమును క్షీరముతో త్రాగవలెను. శ్రీ వటాంకుర దేవీల రసమును నశ్యముగా తీసుకొన వచ్చును. త్రాగవచ్చును. శ్రీ పద్మమూల అశ్వత్థ ఉత్తర మూలములను పాలతో త్రాగవలెను. కార్పాస ఫలములను పల్లవములను పాలలో నూరి పలుచగచేసి త్రాగవలెను. అపామార్గ నూతన పుష్పాగ్ర ములను గేదెపాలతో త్రాగవలెను. పైనచెప్పిన ఆరున్నర శ్లోకములలో నాలుగు పుత్రప్రాప్తి యోగమును చెప్పబడినవి. స్త్రీకి గర్భ స్రావమగుచున్నచో శర్కర, ఉత్పల పుష్ప, అక్షలోధ్ర, చందన, శారిబాలతలను బియ్యపు కడుగులో నూరిగాని లేదా లాజాయస్టిసితా, ద్రాక్ష, మధు, ఘృతములను కలిపిగాని స్త్రీ సేవించవలెను.

అటరూష, కలాంగలీ, కాకమాచీ శిఫలను నూరి నాభి క్రింద భాగమున పూసినచో సుఖ ప్రసవమగును. రక్త శుక్ల జపాపుష్పములు రక్త శుక్ల ఓషధులు కలిపి త్రాగవలెను. కేసర బృహతీ

మూల గోపీ షష్టి తృణోత్పలములను మేక పాలతో నూరి తైలము కలిపి తిన్నచో వెంట్రుకలు మొలచును. జుట్టు ఊడిపోకుండగ చేయుటకు కూడ ఇవి ఉపయోగించును. ధాత్రి, భృంగ రసములు ఒక్కొక్క ప్రస్థము, తైలము, ఒక ఆఢకము పాలు షష్టి అంజనల ఒక పలము తైలము ఇవియన్నియు నేత్రకేశ శిరస్సులకు హితకరములు. హరిద్రా రాజవృక్షత్వక్ చంచాలవణ లోధ్ర పీతఖారులు, ఆవుల పొట్ట ఉబ్బు రోగమును తొలగించును. 'ఓం నమో భగవతే' మొదలు 'కురు ఠఠఠ' వరకునుగల మూలోక్త మంత్రము గోసముదాయ రక్షామంత్రము. మహాసేనుడు, వీరుడగు ఘంటా కర్ణుడు మహాబలవంతుడని చెప్పబడినాడు. జగత్పతియైన ఆతడు మహామారి వినాశకుడు. అతడు నన్ను రక్షించుగాక! ఈ రెండు మంత్రములును గోరక్షక మంత్రములు. వీటిని వ్రాసి ఇంటిలో వుంచుకొన వలయును. (302)

అంగాక్షరార్చనము - వాసుదేవాది పూజ

అగ్నిదేవుడు చెప్పెను :

చంద్రుడు జన్మ నక్షత్రమునందును సూర్యుడు సప్తమ రాశియందును వున్నచో అది పౌష్ణ కాలము. అపుడు శ్వాసను పరీక్షించవలయును. ఎవని కంఠము ఓష్ఠములు స్థానము నుండి చలించినవో, నాసిక వక్రమైనదో, జిహ్వా నల్లపడినదో, అతడు ఏడు దినములకు మించి జీవించడు. తార(ఓం), మేష(న), విష(మ), దంతీ(ఓ), దీర్ఘ స్వరయుక్త (న,ర,లు) య నాలు రసము(య). ఇది మహావిష్ణువు యొక్క అష్టాక్షర మంత్రము (ఓం నమో నారాయణాయ "క్రుద్ధోల్కాయ" మహోల్కాయ "వీరోల్కాయ", "ద్యుల్కాయ", "సహస్రో ల్కాయ" అను మంత్రములతో హృదయ, శిరః, శిఖా, భుజద్వయ సకల దిగ్భాగము లందు న్యాసము చేయవలయును. కనిష్ఠ మొదలు కనిష్ఠ వరకు ఎనిమిది వ్రేళ్ళ పర్వము లందును అష్టాక్షర మంత్రము యొక్క ఎనిమిది అక్షరములను ఒక్కొక్క దానిని ప్రణవము 'నమః'తో సంపుటితముచేసి అంగుష్ఠాగ్ర భాగముచే క్రమముగ న్యాసము చేయవలయును. తర్జని యందు మధ్యమాయుక్తమగు అంగుష్ఠము నందు కరతలమునందు మరల అంగుష్ఠము నందు ప్రణవ న్యాసమునకు ఉత్తారమని పేరు. అందుచే వెనుక చెప్పిన న్యాసము చేసిన పిమ్మట బీజోత్తార న్యాసము చేయవలయును. ఈ మంత్రము నందలి మొదటి ఐదు అక్షరముల వర్ణములు వరుసగ రక్త, గౌర, ధూమ్ర, హరిత, సువర్ణ రూప ములు. చివరి మూడు వర్ణముల రంగు శ్వేతము. వర్ణములను ఈ రూపములలో భావన చేసి క్రమముగా హృదయము ముఖ నేత్ర శీర్ష చరణములు, గుహ్య హస్తాదులందు న్యాసము చేయవలయును. హస్తములందును, దేహమునందును బీజ న్యాసముచేసి మరల అంగన్యాసము చేయవలయును. తన శరీరమునందు చేసినట్లే దేవ విగ్రహము నందు కూడ కరన్యాసము తప్ప ఇతర న్యాసములు చేయవలయును. దేవతా విగ్రహము యొక్క హృదయాద్యంగములందు న్యాసముచేసిన వర్ణములను గంధ పుష్పములతో పూజించ వలయును. దేవ పీఠముపై ధర్మాదులను అగ్న్యాదులను, అధర్మాదులను వాటి వాటి స్థానమున న్యాసము చేయవలయును. పిదప దానిపై కమలము కూడ న్యాసము చేయ వలయును. ఆ పీఠముపైననే కమలదళములు, కేసరములు కింజల్కవ్యాపి, సూర్య మండల, చంద్రమండల,

అగ్ని మండలములు వేరువేరుగ క్రమముగా న్యాసము చేయవలయును. అచట సత్వాది గుణత్రయమును కేసరములపైనున్న విమలా–ఉత్కర్షిణీ–జ్ఞాన–క్రియా–యోగ–ప్రహ్వీ –సత్యా–ఈశాన–అను ఎనిమిది శక్తులను భావన చేయవలయును. ఈ ఎనిమిది శక్తులును ఎనిమిది దిక్కులందు ఉండును. తొమ్మిదవదగు అనుగ్రహ శక్తి మధ్య యందుండును. పాద్య అర్ఘ్య ఆచమనీయ పీతాంబర అలంకారములు అనునవి ఐదు ఉపచారములు. వీటిని అన్నింటిని మూల మంత్రముతో సమర్పించవలెను. పీఠము యొక్క పూర్వాది దిక్కులయందు వాసుదేవాది మూర్తి చతుష్టయమును ఆగ్నేయాది విదిక్కులయందు క్రమముగా శ్రీ సరస్వతీ రతి, శాంతులను పూజించవలెను. ఇట్లే దిక్కులందు శంఖ చక్రగదా పద్మములను విదిక్కులందు ముసల ఖడ్గ, శార్ఙ్గ, వనమాలలను పూజించ వలెను. మండలము వెలుపల గరుత్మంతుని పూజించి నారాయణుని ఎదుటనున్న విష్వక్సే నుని మధ్య భాగమున సోమేశుని, ఆవరణము వెలుపల ఇంద్రాది పరిచారక వర్గముతో శ్రీ మహావిష్ణువును పూజించిన సాధకునకు సర్వ ఫలములు సిద్ధించును. (303)

పంచాక్షరాది పూజాదికము

అగ్ని దేవుడు పలికెను :

మేషము(న), సంజ్ఞావిషము(మః), శకార పూర్వాక్షరము(శ), దానితో అక్షి(సి), దీర్ఘోదకము(వా), మరుత్(య). ఇది పంచాక్షర మంత్రము (నమః శివాయ). ఇది శివ స్వరూపము, మంగళప్రదము. దీనికి ఓంకారము చేర్చి జపించినచో దేవత్వాదులను పొందును. జ్ఞానాత్మకమగు పరబ్రహ్మయే పరమ బుద్ధి రూపము. అదియే శివ రూపమున హృదయము నందున్నది. శక్తి రూపమునగు ఆ సర్వేశ్వరుడే బ్రహ్మాది మూర్తులతో వున్నాడు. మంత్రము నందలి అక్షరములు ఐదు మహాభూతములు. ఐదు తన్మాత్రలు, ఐదు విషయములు, ఐదు ప్రాణాది వాయువులు, ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు. ఇవన్నియు పంచాక్షర బ్రహ్మ స్వరూపమైనవి. అట్లే అష్టాక్షరాత్మక మైనవి. దీక్షా స్థానమును మంత్రోచ్చారణ చేయుచు పంచగవ్యములతో ప్రోక్షించవలయును. సంభారములు సమకూర్చుకుని శివుని పూజించి మూలమంత్రము ఇష్టమూర్తికి సంబంధించిన మంత్రములు, అంగ మంత్రములు పఠించుచు అక్షతలను చల్లి భూతములను తొలగించుకొని ఆత్మరక్షణ చేసికొన వలెను. పిదప చరువు (పాయసము) వండి మూడు భాగములు చేసి ఒక భాగము ఇష్ట దేవతకు నివేదనచేసి రెండవ భాగము ఆహుతి ఇచ్చి మూడవ భాగము శిష్య సహితుడై తాను భుజించవలెను. పిదప ఆచమన సకలీ కరణములుచేసి శిష్యుని హృదయ మంత్రముతో అభిమంత్రించి పాలచెట్టుకు సంబంధించిన కాష్టమును దంతధావ నార్థమై ఇవ్వవలెను. దానితో దంతములు శోధన చేసుకుని, దానిని చీరి నాలుక శుభ్రము చేసుకొని కడిగి నేలపై విసిరి వేయవలెను. తూర్పు వైపు విసిరిన ఆ దంతకాష్టము ఉత్తరము వైపుకాని పశ్చిమము వైపుకాని వెళ్ళి పడినచో శుభమగును. అట్లు కానిచో అశుభము. పిదప తన ఎదుటకు వచ్చుచున్న శిష్యునకు శిఖా బంధముచే రక్షణ కల్పించి జ్ఞానవంతుడైన గురువు ఆతనితో కలిసి వేదికపై ఉన్న కుశాస్తరణముపై నిద్ర పోవలయును. శిష్యుడు రాత్రి తాను చూసిన స్వప్నము ప్రాతః కాలమున గురువునకు చెప్పవలెను.

ఆ స్వప్నము శుభమై సిద్ధి సూచకమైనచో మంత్ర దేవతల విషయమున భక్తి కలుగును. పిదప మండలార్చనము చేయవలయును. సర్వతో భద్రాది మండలములలో పూజించినచో సర్వ సిద్ధులు కలుగును. స్నానాచమనములు చేసి మంత్రోచ్చారణ పూర్వకముగ శరీరము నకు మట్టి పూసుకొని శివతీర్థమునందు అఘమర్షణ పూర్వకముగా స్నానము చేయవలెను. హస్తశుద్ధి చేసికొని పూజా గృహమును ప్రవేశించి మూల మంత్రముతో కమలాసనమును భావనచేసి మూల మంత్ర ముతో పూరక కుంభక, ప్రాణాయామములు చేయవలెను. జీవాత్మను పైన బ్రహ్మ రంధ్రమునందు ఉన్న పరమాత్మతో కలుపవలెను. శిరస్సు మొదలు శిఖాంతము వరకువున్న పన్నెండు అంగుళముల విస్తృత స్థానమే బ్రహ్మ రంధ్రము. వాయు బీజముతో శరీరమును శుష్కింపచేసి అగ్ని బీజముతో శరీరమును భస్మముచేసి అమృత బీజముతో ఆ భస్మమును ఆప్లావితము చేయవలయును. దివ్యరూప ధ్యానము చేయుచు జీవాత్మను మరల తన శరీరములో ఉంచుకొనవలెను. ఇట్లు చేయుటచే ఆత్మశుద్ధి యగును. పిదప న్యాసముచేసి పూజ ప్రారంభించవలెను. పంచాక్షరిలోని ఐదు అక్షరముల వర్ణములు క్రమముగ కృష్ణశ్వేత, శ్యామ, రక్త పీతములు, నకారాద్యక్షరములతో వరసగా అంగన్యాసము చేసి ఆ అంగములపైననే తత్పురుషాది మూర్తి పంచకాది న్యాసము చేయవలెను. పిదప అంగుష్ఠము మొదలు కనిష్ఠిక వరకు ఐదు వ్రేళ్ళపై క్రమముగా అంగమంత్రములను న్యాసము చేసి పాద గుహ్య హృదయ ముఖ శిరస్సులందు మంత్రాక్షర న్యాసము చేయవలయును. పిదప శిరస్సు మొదలగు వాటియందు ఈ అంగముల వ్యాపకన్యాసము చేయవలయును. మూల మంత్రమును అంగ మంత్రములను కూడ అచట న్యాసము చేయవలయును. ఆగ్నేయాది విదిక్కులందు ధర్మాది పీఠపాదములు క్రమముగా రక్త పీత శ్యామ శ్వేత వర్ణములను భావనచేసి వాటిపై మంత్రాక్షర న్యాసముచేసి పూర్వాది దిక్కులందు అధర్మాదులను భావనచేసి వాటిపై అంగ మంత్రన్యాసము చేయవలెను. ఇట్లే యోగపీఠమును దానిపై అష్టదళ కమలమును సూర్య సోమ అగ్ని మండలములను సత్వాది గుణ త్రయమును భావన చేయవలెను. పూర్వాది దళములందు వామాది శక్త్యష్టకమును కర్ణికపై తొమ్మిదవ శక్తిని భావన చేయవలయును. వామా జ్యేష్టా రౌద్రీ కాళీ, కల వికారిణీ బల వికారిణీ బలప్రమథనీ సర్వ భూతదమనీ మనోన్మ నీయను ఈ శక్తులు జ్వాలా స్వరూపములు. వీటి వర్ణములు క్రమముగ శ్వేతరక్త, సితపీత, శ్యామ, అగ్ని, సదృశ, అసిత, కృష్ణ, అరుణములు. ఈ విధముగ భావన చేయవలెను.

అనంతయోగ పీఠముపై తన హృదయ పద్మములో నున్న శివుని ఆ "స్ఫటిక కాంతిని కలవాడు, నాలుగు బాహువులు కలవాడు, పంచవదనుడు త్రిలోచనుడు అగు శివుని ఆవాహన చేయుచున్నాను' ' అని చెప్పుచు ఆవాహన చేయవలెను. పిదప కమల దళములపై తత్పురుషాది పంచమూర్తులను స్థాపించవలెను. తూర్పున తత్పురుషుడు శ్వేతవర్ణుడు. అష్ట భుజుడగు అఘోరుడు కృష్ణ వర్ణుడు, సద్యోజాతుడు పశ్చిమమున ఉండును. ఆతనికి నాలుగుబాహువులు నాలుగు ముఖములు ఉండును. వర్ణము పీతము. వాసుదేవ రూపము స్త్రీతో ప్రకాశించును. అరుణ వర్ణుడగు ఇతడు నాలుగు ముఖములతో నాలుగు భుజములతో ఉత్తరమునందుండును. ఈశాన్య దిక్కు నందున్న ఈశానునకు ఐదు ముఖములుండును. ఆతడు శ్వేతవర్ణుడు సర్వకామప్రదాత. పిదప అంగదేవతలను

యథోచితముగ పూజించి పూర్వాది దిక్కులందు అనంత సూక్ష్మ సిద్ధేశ్వర ఏకనేత్రులను పూజించ వలెను. ఈశాన్యాదివిదిక్కులందు ఏకరుద్ర త్రినేత్ర శ్రీకంఠ, శిఖండులను పూజించవలెను. వీరంద రకును విద్యేశ్వరులు. కమలాసనముపై కూర్చుందురు. వీరి శరీరకాంతి క్రమముగ శ్వేత పీత సిత రక్త ధూమ్ర రక్త అరుణ నీలములు. వీరందరును చతుర్భుజులు. శూల అశని, శర, చాపములను ధరించి ఉందురు. వీరికి ముఖములు కూడ నాల్గేసి ఉండును. తృతీయ అష్టదళ కమలమునందు ఉత్తరాది దళములపై ప్రదక్షిణ క్రమమున ఉమాచండీశ, నందీశ, మహాకాల, గణేశ్వర, వృషభ, భృంగిరిటి, స్కందులను పూజించవలెను. పిదప పూర్వాది దిక్కులందు చతురస్రరేఖపై ఇంద్రాది దిక్పాలకులను వారి అస్త్రములగు వజ్రశక్తి, ఖడ్గ, పాశ, ధ్వజ, గదా, శూల, చక్ర, పద్మములను పూజించవలెను. ఈ విధముగా దేవతా పూజచేసి గురువు అధివాసితుడగు శిష్యునిచే పంచ గవ్యపానము చేయించి, ఆచమ నానంతరము ఆతనిని ప్రోక్షించవలెను. పిదప నూతన వస్త్రముచే "వౌషట్" అని ఉచ్చ రించుచు ఆతని నేత్రములు బంధించి మండప దక్షిణ ద్వారమున ప్రవేశము చేయించి కువాసనముపై కూర్చుండబెట్టి శోధనము చేయవలెను. పాంచ భౌతికతత్త్వముల సంహా రము చేసి క్రమముగా శిష్యుని పరమాత్మ విలీనుని చేసి పిదప సృష్టి మార్గముచే యాతనిని మరల పుట్టించవలెను. పిదప శిష్యుని దివ్య శరీరముపై న్యాసముచేసి దక్షిణ క్రమమున పశ్చిమ ద్వారము నకు తీసుకొనివచ్చి వానిచే పుష్పాంజలి విసరునట్లు చేయవలెను. ఆ పుష్పములు ఏ దేవత శిరస్సుపై బడునో ఆ దేవత నామమును ఆదియందుంచి శిష్యునకు పేరు పెట్టవలెను. యజ్ఞ భూమి ప్రక్క సుందరమగు నాభియు మేఖలయు ఉన్న అగ్ని కుండమునందు శివాగ్నిని ఆవిర్భవింప చేసి తాను పూజించి శిష్యునిచేతకూడ పూజచేయిం చవలెను. ఆ శిష్యుని సంహార క్రమమున తనలో విలీనుని చేసుకొని మరల సృష్టి క్రమమున ఉత్పాదనముచేసి ఆతని హస్తమునందు అభి మంత్రితములగు కుశలు వుంచి హృదయాది మంత్రములతో పృథివ్యాదితత్త్వములను ఉద్దేశించి వాటి మంత్రములతో వంద చొప్పున హోమములుచేసి, ఆకాశ తత్త్వమునకు కూడ నూరు హోమ ములు చేయవలెను. పిదప పూర్ణాహుతి ఇచ్చి అస్త్రమంత్రమును ఉచ్చరించుచు ఎనిమిది హోమములు చేయవలెను. పిదప, విశుద్ధి కొరకై ప్రాయశ్చిత్తము చేసి, అభిమంత్రితమగు కలశను పూజించి, పీఠముపైనున్న శిష్యునకు అభిషేకముచేసి, ఆతనికి సమయాచారము ఉపదేశింపవలెను. శిష్యుడు స్వర్ణాదులను ఇచ్చి గురువును పూజించవలెను. ఇది శివపంచాక్షరీ దీక్ష; విష్ణ్వాది దేవతామంత్ర దీక్షకూడ ఇట్లే చేయవలెను. (304)

పంచ పంచాశద్విష్ణునామ కథనము

అగ్నిదేవుడు పలికెను :

శ్రీమహావిష్ణువుయొక్క ఏబది ఐదు నామములు ఎవడు జపించునో ఆతడు మంత్ర జపాది ఫలమును తీర్థ పూజనాదుల అక్షయ పుణ్యమును పొందును. పుష్కరమున పుండరీకాక్షుని గయ యందు గదాధరుని, చిత్రకూటము నందు రాఘవుని, ప్రభాసము నందు దైత్యసూదనుని, జయంతి యందు జముని, హస్తినాపురమున జయంతుని, వర్ధమానమున వారాహుని, కాశ్మీరమున చక్రపాణిని

కుబ్జామ్రమున జనార్దనుని మధుర యందు కేశవుని కుబ్జాక్రమకమున హృషీకేశుని గంగాద్వారమున జటాధరుని, శాలగ్రామమున మహాయోగుని గోవర్ధనాచలమున హరిని పిండారకమున చతుర్బాహువును శంఖోద్ధారమునందు శంఖిని, కురుక్షేత్రమున వామనుని, యమునయందు త్రివిక్రముని శోణమున విశ్వేశ్వరుని పూర్వ సాగరమున కపిలుని మహోదధియందు విష్ణువును గంగా సాగర సంగమమున వనమాలుని, కిష్కింధయందు రైవతకుని, కాశీ తటమున మహా యోగుని విరజయందు రిపుంజయుని, విశాఖ యూపమున అజితుని నేపాలమున లోకభావనుని, ద్వారకలో కృష్ణుని మందరమున మధుసూదనుని, లోకాకులమున రిపుహరుని, శాలగ్రామమున హరిని స్మరించవలెను. పురుష వటమున పురుషుని విమలమున జగత్ప్రభువును, సైంధవారణ్యమున అనంతుని, దండక యందు శార్ఙ్గధారిని ఉత్పలా వర్తకమున శౌరిని, నర్మదయందు శ్రీపతిని, రైవతకమున దామోదరుని నందయందు జలశాయిని, సింధు సముద్రమున గోపీశ్వరుని, మహేంద్ర తీర్థమున అచ్యుతుని, సహ్యాద్రిపై దేవదేవేశుని మాగధ వనమున వైకుంఠుని వింధ్యముపై సర్వపాప హరిని ఓఢ్ర దేశమున పురుషోత్తముని హృదయమున ఆత్మను స్మరించవలెను. ఈ ఆత్మ జపించువారికి భుక్తి ముక్తులను ఇచ్చును. ప్రతి పటమునందు వైశ్రవణుని, ప్రతి చత్వరమునందు శివుని, ప్రతి పర్వతమునందు రాముని సర్వత్ర మధుసూదనుని భూమ్యాకాశములందు నరుని వశిష్ట తీర్థమున గరుడధ్వజుని సర్వత్ర వాసుదేవుని స్మరించువాడు భుక్తి ముక్తులను పొందును. ఈ విష్ణు నామములను జపించువాడు సర్వమును పొందును. ఈ క్షేత్రములలో చేసిన శ్రాద్ధము, దానము, జపము, తర్పణము అంతయు కోటి గుణితమగును. అట్లు చేసినవాడు మరణానంతరము బ్రహ్మమయుడగును. ఇది చదివిన వాడును, విన్నవాడును పాపరహితుడై స్వర్గము పొందును. (305)

నారసింహాది మంత్ర కథనము

అగ్నిదేవుడు చెప్పెను :

స్తంభనము, విద్వేషణము, ఉచ్చాటనము, ఉత్పాదనము, భ్రామణము, మారణము వ్యాధి అనునవి క్షుద్ర అభిచారిక కర్మలు. వాటిని తొలగించు ఉపాయములు చెప్పెదను వినుము. "ఓం నమో భగవతే" మొదలు "ఠఠ" వరకును వున్న మూలోక్త మంత్రమును శ్మశానమున రాత్రియందు మూడు లక్షలు జపించి చితాగ్నియందు ధూర్త సమిధలతో హోమముచేసిన, శత్రువు సర్వదా తిరిగి పోవును (భ్రాంతుడగును). హేమ బేదికతో శత్రు ప్రతిమచేసి మంత్రముతో అభిమంత్రించిన బంగారు సూదితో కంఠమునందుగాని, హృదయమునందు గాని, ఆ ప్రతిమను గుచ్చినచో శత్రువు మరణించును. లేదా గాడిద వెంట్రుకలు చితాభస్మ బ్రహ్మ దండి మర్కటి వీటిని భస్మము చేసి దానిని పై మంత్రముతో అభిమంత్రించి ఉత్పాదన ప్రయోగము చేయువాడు శత్రువు ఇంటిపై గాని, శిరస్సుపై గాని చల్లవలెను. భృగు(స), ఆకాశ(హ), దీప్త (దీర్ఘాకార యుక్త రేఫ సహిత భృగు(స) అనగా సహస్రా మరల ర వర్మ (హుం) ఫట్ వీటిని కలిపి మంత్రము "సహస్రార హుం ఫట్" యని అగును. దీని అంగన్యాసములు ఈ విధముగా చేయవలయును. ఆ చక్రాయ స్వాహా అని హృదయము విచక్రాయ శిరస్సు. శిఖా చక్రాయయని కవచము, విచక్రాయయని నేత్రము

సుచక్రాయయని అస్త్రము జ్వాలా చక్రాయయని పూర్వము వలెను న్యాసము చేయవలెను. అంగన్యాస పూర్వకముగ జపించిన సుదర్శనము క్షుద్ర అభిచారములను గ్రహములను తొలగించి అన్ని మనో రథములను సఫలము చేయును. ఆ సుదర్శన మంత్రము యొక్క ఆరు అక్షరములను క్రమముగా శిరో నేత్ర ముఖ హృదయ గుహ్య చరణములందు న్యాసము చేయవలెను. చక్రస్వరూపుడగు విష్ణువును ఈ విధముగా ధ్యానించవలెను.

చక్రాకారమునను్న కమలమునందు కూర్చున్నవాడు అగ్ని సమానమగు కాంతి కలవాడు కోరలుగలవాడు చతుర్భుజుడు, శంఖ చక్ర గదా పద్మ శలా కాంకుశ చాపములు ధరించినవాడు పింగవర్ణ కేశములు నేత్రములు కలవాడు, అరములచే వ్యాపింపబడిన మూడు లోకములు కలవాడు. చక్రనాభి ఆ అగ్నిచే వ్యాప్తమై ఉన్నది. వ్యాధులు గ్రహములు నశించును. చక్రము పీతవర్ణమైనది. అరములు రక్త వర్ణములు. అరమధ్య భాగము శ్యామవర్ణము. చక్రనేమి శ్వేతవర్ణము. దానియందు బయటనుండి పార్థివమగు కృష్ణవర్ణ రేఖ ఉండును. అరయుక్త మధ్య భాగమునందు అకారాది వర్ణములుండును. ఈ విధముగా రెండు చక్ర చిహ్నములను వ్రాయవలెను.

అది చక్రముపై కలశ జలమును తీసుకొని వెళ్ళి తమ సమీపముననే ఉంచి దక్షిణమున నున్న రెండవ చక్రముపై సుదర్శనమును పూజించి అగ్నియందు వరుసగా ఆజ్య, అపామార్గ, సమిధ, అక్షత, తిల, సర్షప, పాయస, గోఘృత, మూల హోమము చేయవలయును. ఒక్కొక్క ద్రవ్యముతో వెయ్యి హోమముల చొప్పున చేయవలెను. విద్వాంసుడు ప్రత్యేక ద్రవ్యము యొక్క హోమము చేయగా మిగిలిన భాగమును కలశము నందు ఉంచి ఒక ప్రస్థము అన్నముతో చేసిన పిండమును ఆ కలశములో వేసి విష్ణ్వాది దేవతలకై ఇవ్వవలసిన వస్తువులను అచటనే దక్షిణమునందు ఉంచవలెను. పిదప సర్వశాంతి కొరకు విష్ణు జనులకు నమస్కారము. వారు శాంతికొరకై ఈ ఉపహారమును గ్రహింతురు గాక. వారికి నమస్కారము అను మంత్రమును చదివి హుత శిష్ట జలముతో బలి సమర్పించవలెను.

ఏదైనా కాష్ఠ ఫలకముపై గాని కలశమునందు గాని, పాల చెట్టు కర్రతో చేసిన దధి పూర్ణ పాత్రము నందుగాని పలు వస్తువులను ఉంచి అన్ని దిక్కులందును సమర్పించవలెను. పిదప ద్విజులచే దిక్కులయందు హోమములు చేయించవలెను. దక్షిణా సహి తముగా ఇట్లు హోమద్వయము చేసినచో సకల భూతాదులు నశించును. పెరుగు పూసిన ఆకులపై వ్రాసిన మంత్రాక్షరములతో హోమము చేసినచో క్షుద్ర రోగములు నశించును. దూర్వలతో హోమము ఆయుర్దాయమును, పద్మములతో హోమము ఐశ్వర్యమును, ఉదుంబరుల హోమము పుత్రులను, గోష్ఠమునందు ఘృతముతో హోమము గోవృద్ధిని, సకల వృక్ష సమిధలచేత చేసిన హోమము బుద్ధి వృద్ధిని ఇచ్చును. "ఓం క్షౌం" మొదలు "హూంఫట్" వరకును ఉన్న మూలోక్త నారసింహ మంత్రము సకల పాపములను నివారించును. జపాదులు చేసినచో క్షుద్రాభిచారములు గ్రహములు మారి విషము, ఆమయము తొలగును. చూర్ణము చేసిన మండూకవసతో హోమము చేసినచో జలస్తంభ అగ్ని స్తంభనలు చేయును. (306)

త్రైలోక్య మోహన మంత్ర కథనము

అగ్నిదేవుడు పలికెను :

చతుర్వర్గ సిద్ధికై త్రైలోక్య మోహనము అను మంత్రమును చెప్పెదను. "ఓం శ్రీం హ్రీం" మొదలు "ఆగచ్ఛ ఆగచ్ఛ నమః" వరకును మూలోక్తమగు మూలమంత్ర యుక్త వ్యాపక న్యాసము చెప్పబడినది. పూజచేసి ఏబది వేల జపముచేసి అభిషేకముచేసి వైదిక విధిచే స్థాపించిన కుండాగ్నిలో నూరు హోమములు చేయవలయును. దధి ఘృత క్షీర ఘృతయుక్త చరు శృత పయస్సులను వేర్వేరుగా మూలమంత్రముతో పండ్రెండు పర్యాయములు హోమముచేసి అక్షత తిలయవలతో వెయ్యి హోమములుచేసి త్రిమధు పుష్ప ఫల దధి సమిధలతో నూరేసి హోమములు చేయవలయును. పిదప పూర్ణాహుతి చేసి మిగిలిన ఘృత సహిత చరువును భక్షించవలెను. బ్రాహ్మణులకు భోజనము పెట్టి ఆచార్యుని దక్షిణాదుతో సంతోషింప చేయవలయును. మంత్రము సిద్ధించును. స్నానా చమనములు చేసి మౌనముతో యాగ మందిరమున ప్రవేశించి పద్మాసనమున కూర్చుండి తాంత్రిక విధానముతో శరీర శోషణము చేయవలయును. ముందుగా రాక్షసులను విఘ్న కారక భూతములను అణచుటకై అన్ని దిక్కులందును సుదర్శన న్యాసము చేయవలయును. ఈ సుదర్శనము పంచక్లేశములకు బీజము, ధూమ్ర వర్ణము ప్రచండ అనిలరూపము. నాభి ప్రదేశమునందున్న నా సకల పాపములను శరీరము నందుండి తొలగించుచున్నది అని భావన చేయవలయును. పిదప హృదయాబ్జము నందున్నరం బీజమును స్మరించి మీదను క్రిందను పార్శ్వములందును వ్యాపించి యున్న అగ్ని జ్వాలలచే ఆ పాప పుంజమును జ్వలింపచేసి భస్మము చేయవలయును. పిదప శిరస్సునందు అమృత భావన చేసి సుషుమ్నా నాడీ మార్గమున వచ్చుచున్న ఆ అమృతధారలచే తన శరీరమును బయటను లోపలను కూడ ఆప్లావితము చేయవలయును. ఈ విధముగా శుద్ధ శరీరుడై మూల మంత్రముతో మూడు ప్రాణాయామములుచేసి శిరో ముఖ గుహ్య గ్రీవ సకలదిక్కు హృదయ కుక్షి సమస్త శరీరములందు హస్త ముంచి వాటిపై శక్తి న్యాసము చేయవలయును. సూర్య మండలము నుండి పరమాత్మను ఆవాహనముచేసి బ్రహ్మరంధ్ర మార్గము నుండి హృదయ కమలము నకు తీసుకొని వచ్చి ప్రణవోచ్చారణ చేయుచు సర్వ లక్షలక్షణ సంపన్నుడగు ఆ పరమాత్మను స్మరించవలెను. 'త్రైలోక్య మోహనాయ విద్మహే' స్మరాయ ధీమహి తన్నో విష్ణుః ప్రచోదయాత్' యనునది త్రైలోక్య మోహన గాయత్రి. ఆత్మార్చన అనంతరము యజ్ఞ ద్రవ్యములను శుద్ధములగు పాత్రములను ప్రోక్షించి ఆత్మ పూజచేసి వేదికపై అర్చించవలెను.

కూర్మాది రూపమున కల్పితమగు పీఠముపై గరుత్మంతునిపై పద్మాసనము నందున్న శ్రీమహా విష్ణువు సర్వాంగసుందరుడు. వయస్సు తగిన లావణ్య యౌవనములు కలవాడు. అతని ఎర్రని నేత్రములు మదముచే తిరుగుచుండును. ఉదారుడు. స్మరవిహ్వలుడు. దివ్య మాల్యాంబర ఆలేపము లచే అలంకృతుడు. మందహాసము కలవాడు. అనేక విధములగు పరివార పరికరములు కలవాడు. లోకానుగ్రహ కారకుడు. సౌమ్యుడు. సహస్ర సూర్య తేజశ్శాలి. ఐదు బాణములు ధరించినవాడు. అతని అన్ని ఇంద్రియములును ప్రాప్తకామములు. ఎనిమిది భుజములు గలవాడు. దేవతాస్త్రీలు

ఆతనిని చుట్టుముట్టి ఉందురు. ఆతని దృష్టి లక్ష్మీముఖపై లగ్నమైయుండును. ఈ విధముగ భగవంతుని ధ్యానించవలెను. ఆతని ఎనిమిది హస్తములలో వరుసగా చక్ర, శంఖ, ధనుః, ఖడ్గ, గదా, ముసల, అంకుశ, పాశములుండును. ఆతనిని ఆవాహనాదుల ద్వారా పూజించి అంతమును విసర్జించవలెను. శ్రీమహావిష్ణువు తన వామోరు జంఘులపై చేతితో తనను ఆలింగనము చేసుకొని వున్న లక్ష్మిని కూర్చుండబెట్టుకొని ఉండును. ఆమె ఎడమ చేతిలో పద్మము వుండును. ఆమె బలిసి శ్రీవత్స కౌస్తుభములతో ప్రకాశించుచుండును. మాలా ధారియు, పీతవస్త్రుడు, చక్రాదిధారియు అగు హరిని పూజించవలెను. 'ఓం సుదర్శన మొదలు హుంఫట్' వరకును మూలములలో ఉన్నది. సుదర్శన మంత్రముతో సుదర్శనమును పూజించవలెను. 'ఓం జల చరాయ స్వాహా' ఖడ్గ తీక్ష్ణ ఛింద, ఖడ్గాయ నమః శార్ఙ్గాయ, సశరాయ హుంఫట్'. ఇవి పాంచజన్యాది పూజా మంత్రములు. 'భూత గ్రామాయ విద్మహే చతుర్విధాయ ధీమహి' తన్నో బ్రహ్మ ప్రచోదయాత్. ఇది భూత గ్రామ గాయత్రి. సంవర్తక శ్వసన పోథయ పోథయ హుంఫట్ స్వాహా' పాశబంధ బంధ, ఆకర్షయ, ఆకర్షయ హుంఫట్. అంకుశ కట్ట కట్ట హుంఫట్'. వీటిలో ముసలాదులను వాటి వాటి మంత్రములతో పూజించవలెను. 'ఓం పక్షిరాజాయ హుంఫట్' అని గరుత్మంతుని పూజించవలెను. కర్ణికయందు యథావిధిగా అంగదేవతలను పూజించి పూర్వాది దళము లందు లక్ష్మ్యాది శక్తులను చాతురధారి అర్ఘ్యాదులను పూజించవలెను. శక్తి పూజ అంతము నందు చేయవలయును. ముందుగ దండి సహితులగు ఇంద్రాదులను పూజించవలెను. లక్ష్మి సరస్వతులు పీతవర్ణము కలవారు. రతి ప్రీతి జయలు శ్వేత వర్ణము కలవారు. కీర్తి కాంతులుకూడ శ్వేత వర్ణులు తుష్టి పుష్టులు. శ్యామవర్ణము కలవారు. వీరిలో స్మర భావ ముండును. లోకేశుని వరకు దేవతలను పూజించి అభీష్ట సిద్ధికై విష్ణు వును పూజించవలెను. ఈ క్రింది మంత్రమును జపించి హోమాభిషేకములు చేయవలయును. 'ఓం శ్రీం క్లీం హ్రీం హ్రూం త్రైలోక్య మోహనాయ విష్ణవే నమః' అని మంత్రము. ఈ విధముగా పూజాదులు చేయుటచే సర్వకామములను పొందును. జలముతో సంమోహనీ వృక్ష పుష్పము తోను పై మంత్రము చెప్పుచు నిత్య తర్పణము చేయవలయును. బ్రహ్మ ఇంద్ర శ్రీదేవి, దండి, బీజమంత్ర త్రైలోక్య మోహన విష్ణువులను పూజించి పై మంత్రమును మూడు లక్షలు జపించి కమల పుష్ప బిల్వ పత్ర ఘృతములతోను, తండులఫల సుగంధ చందనాది ద్రవ్యములతోను దూర్వలతోను ఒక లక్ష హోమము చేయవలయును. దీర్ఘాయుర్దాయము పొందును. జపాభిషేక హోమాదులచే సంతుష్టుడై మహావిష్ణువు అభీష్ట ఫలములను ఇచ్చును. 'ఓం నమో భగవతే వరాహాయ" భూర్భువస్స్వః పతయే భూపతిత్వం మే దేహి హృద యాయ స్వాహా' ఇది వరాహ మంత్రము. దీనికి ఐదంగములు ఉండును. ప్రతి దినము పదివేల చొప్పున జపముచేసిన వాడు ఆయుర్దాయ మును, రాజ్యమును పొందును. (307)

లక్ష్మ్యాది పూజా కథనము

అగ్నిదేవుడు పలికెను :

వాంత(శ్), వహ్ని(ర్), వామనేత్ర(ఈ), దండ(ం)ముల యోగముచే ఏర్పడిన శ్రీం అను బీజము

శ్రీదేవీ మంత్రము. సర్వసిద్ధిప్రదము. 'మహాశ్రియే మహాసిద్ధే మహా విద్యుత్ప్రభే శ్రియేదేవి విజయేగౌరి మహాబలే బంధ నమః హుం మహాకాయే పద్మ హస్తే హుంఫట్ శ్రియై నమః హ్రాం శ్రియైఫట్ శ్రియైనమః శ్రియే శ్రీద నమః స్వాహా శ్రీఫట్' ఇవి శ్రీ మంత్రమునకు తొమ్మిది అంగన్యాసములుగా చెప్పబడినవి. వీటిలో ఒక దానిని గ్రహించ వలెను. పద్మాక్షమాలతో ఈ మంత్రమును మూడు లక్షలుగాని, ఒక లక్షగాని జపించినచో ఐశ్వర్యము లభించును. లక్ష్మీ ఆలయమునందు గాని విష్ణ్వాలయము నందుగాని శ్రీదేవిని పూజించినచో ధనము లభించును. ఖదిర కాష్ఠముతో ప్రజ్వలించు చున్న అగ్నిలో ఘృత మిశ్ర తండులములతో నూరు హోమములు చేసినచో రాజు వశుడు అగును. లక్ష్మికి ఉత్తరోత్తర వృద్ధి కలుగును. శ్రీమంత్రముతో అభిమంత్రించిన సర్షప జలముతో స్నానము చేయగ సకలవిధ గ్రహబాధలు నశించును. ఒక లక్ష బిల్వ ఫలములు హోమము చేసిన లక్ష్మి లభించును. ధనవృద్ధి కలుగును. నాలుగు ద్వారములు గల ఒక శక్ర వేశ్మను భావన చేయవలయును. పూర్వ ద్వారముపై క్రీడించుచున్నదియు, రెండు భుజములు పైకి ఎత్తి వున్నదియు, శ్వేతకమలమును ధరించినదియు, శ్యామ వర్ణయు వామనాకృతి కలదియుఅగు బలాకీని ధ్యానము చేయవలయును. దక్షిణ ద్వారమున పైకి ఎత్తిన ఒక హస్తమున రక్త కమలము ధరించియున్న శ్వేత శరీరయగు వనమాలిని ధ్యానించవలెను. పశ్చిమ ద్వారమున పైకి ఎత్తిన రెండు చేతులలో శ్వేత పుండరీకమును ధరించినదియు, హరిత వర్ణయు, విభీషిక అను పేరు కలది అగు శ్రీ దూతిని ధ్యానించవలెను. ఉత్తర ద్వారమున శాంకరిని ధ్యానించవలెను. శక్ర వేశ్మ మధ్యమున అష్టదళ కమలము నిర్మించి దాని దళములపై వరుసగా శంఖ చక్ర గదా పద్మములను ధరించిన వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్ముని అనిరుద్ధులను ధ్యానించవలెను. వారి శరీర కాంతి వరసగా అంజన దుగ్ధ కేసర సువర్ణములతో సమానము. వీరు సుందర వస్త్రాలంకృతులు, ఆగ్నేయాది దళము లందు గుగ్గులు కురంటజ దమక, సలిలులు అను దిగ్గజములను భావన చేయవలెను. ఈ దిగ్గజములు స్వర్ణ కలశములను ధరించి యుండును. కమల కర్ణిక యందు శ్రీదేవిని స్మరించవలెను. చతుర్భుజయగు ఆమె శరీరము సువర్ణ కాంతి కలది. పైకి ఎత్తిన రెండు హస్తములందును కమలములును దక్షిణహస్తమున అభయ ముద్రయు వామహస్తమున వరముద్రయు ఉండును. శుభ్రమైన సుగంధములైన వస్త్రములను తెల్లని మాలను ధరించి యుండును. అట్టి శ్రీదేవిని ధ్యానించి సపరివారముగా ఆమెను పూజించిన వాడు సకల ఫలములను పొందును.

పూజా సమయమున ద్రోణపుష్పమును కమలమును బిల్వ పత్రమును శిరస్సున ధరించకూడదు. పంచమీ సప్తములయందు వరుసగా లవణమును ఆమలకమును త్యజించ వలెను. పాయసమును మాత్రము భుజించుచు శ్రీ సూక్తము జపించి ఆ సూక్తముతోనే అభిషేకము చేయవలెను. ఆవాహనాది విసర్జన పర్యంతము అన్ని ఉపచారములను శ్రీ సూక్త ఋక్కులతోచేసి ధ్యాన పూర్వకముగ శ్రీదేవిని పూజించవలెను. బిల్వ ఘృత కమల పాయసములు కలిపి గాని వేర్వేరుగా కాని లక్ష్మిని ఉద్దేశించి హోమమును చేయవచ్చును. ఈ హోమము లక్ష్మి ప్రాప్తికిని మంచిది. విష(మ) హి మజ్జా(ష) కాల(మ) అగ్ని(ర) అతి(న) నిష్ఠ(ఇ) ని స్వాహా (మహిష మర్దిని స్వాహా). ఇది మహిష మర్దిని అష్టాక్షర మంత్రము. 'ఓం హ్రీం మహా మహిష మర్దిని స్వాహా' ఇది మూలమంత్రము. మహిష

మర్దిని మహిష శత్రుంభ్రామయ. 'ఓం హ్రూం ఫట్' మహిషం హేషయ హేషయ మహిషం హ్రేషయ హ్రేషయ హ్రూం మహిషం హనహన దేవి హ్రూం మహిషనిషూదని ఫట్'. ఇది అంగ సహితమగు దుర్గా హృదయము. సర్వకార్య సాధకము. పీఠముపై అష్ట దళ కమలముపై దుర్గాదేవిని ఈ క్రింది విధముగా పూజించవలెను. ఓం హ్రీం దుర్గే రక్షణి స్వాహా. ఇది దుర్గా మంత్రము. అష్ట దళ పద్మముపై దుర్గా వర వర్ణినీ ఆర్యా, కనకప్రభా, కృత్తికా, అభయప్రదా కన్యకా, సురూప అను శక్తుల ఆద్యక్షరములకు బిందువు చేర్చి ఆ బీజ మంత్రములతో కూడి నామమంత్రములతో పూజించ వలెను. చక్ర, శంఖ, గదా, ఖడ్గ, బాణ, ధనుష్, అంకుశ ఖేటములను కూడ పూజించవలెను. అష్టమ్యాది తిథులందు లోకేశ్వరీ దుర్గను పూజించవలెను. ఈ దుర్గోపాసన పూర్ణాయుర్దాయమును లక్ష్మిని యుద్ధమునందు జయమును ఇచ్చును. వశము చేసుకొనవలసిన వాని నామము చేర్చి ఈ మంత్రముతో తిలహోమము చేయువాడు వశము చేసుకొనును. కమల హోమముచే విజయము లభించును. శాంతి కోరువాడు దూర్వాహోమము చేయవలయును. పలాశ సమిధలచే పుష్టి కలుగును. కాక పక్షములు హోమము చేసినచో మారణ విద్వేషణ కర్మలు సిద్ధించును. ఈ మంత్రము సకల గ్రహ క్షుద్ర భయ ఆపదలను నశింపచేయును. 'ఓం దుర్గే దుర్గే రక్షణి స్వాహా'. ఇది అంగసహితమగు రక్షణ ఇచ్చు జయ దుర్గా మంత్రము. శ్యామాంగియు త్రినేత్రియు చతుర్భుజయు శంఖ, చక్ర, శూల, ఖడ్గ ధారిణియు రౌద్ర రూపిణియు అగు రణచండి నేనే అని ధ్యానము చేయ వలెను. యుద్ధ ప్రారంభమున ఈ జయదుర్గా మంత్రము జపించవలెను. ఖడ్గాదులపై దుర్గా పూజను చేసినచో విజయము లభించును. యుద్ధము నందు ఓం నమో భగవతి జ్వాలా మాలిని! గృధ్రగణ పరివృతే చరాచర రక్షిణి స్వాహా అను మంత్రమును జపించవలెను. విజయము లభించును. (308)

త్వరితా పూజలు - ధ్యానాదిక విధులు

అగ్నిదేవుడు పలికెను :

త్వరితా విద్య యొక్క అంగములు భుక్తిముక్తి ప్రదాయకములు వాటిని చెప్పెదను. 'ఓం ఆధారశక్త్యై నమః' మొదలు 'అస్త్రాయ ఫట్ నమః' వరకును చెప్పినవి అంగన్యాస మంత్రములు. 'ఓం త్వరితా విద్యాం' మొదలు 'ప్రచోదయాత్' వరకు త్వరితా గాయత్రి. పిదప పీఠము నందలి కమల కర్ణిక యొక్క కేసరమునందు ఈ క్రింది అంగదేవతలను పూజించవలెను. 'ప్రణీతాయై నమః' మొదలు 'క్షేమంకర్యై నమః' వరకు మంత్రములతో ఆయా అంగ దేవతలను పూజించవలెను. త్వరితా విద్యకు తోతలా, త్వరితా తూర్ణాయని మూడు పేర్లు. దీని అక్షరములను శిరోభ్రూలలాట కంఠ హృదయ, నాభి, గుహ్య ఊరు, జాను, జంఘా చరణములపై న్యాసముచేసి సమస్త విద్యతో వ్యాపకన్యాసము చేయవలెను. ఈమెను పార్వతీ, శబరి, ఈశ, వరదా భయహస్తికా, మయూర వలయా, పిచ్ఛమౌళి, కిసల యాంశుక, సింహాసనస్థ మయూరబర్హచ్ఛత్ర, సమన్విత, త్రినేత్ర శ్యామల, దేవి, వనమాల విభూషణ, విప్రాహి కర్ణాభరణ, క్షత్ర కేయూర భూషణ, వైశ్యనాగకటిబంధ, వృషలాహికృత నూపుర అను రూపమున ధ్యానించి పదివేలు జపము చేయవలెను. ఈశ్వరుడు కిరాత రూపుడైనపుడు గౌరి ఆ రూపమును ధరించినది. ఈ దేవిని జపించి ధ్యానముచేసి

పూజించినచో సర్వ సిద్ధులు లభించును. విషాదులు తొలగిపోవును. పూర్వాది దళముల లోపల కర్ణికయందు ఎనిమిది సింహాసనములపై ఈ దేవతలను క్రమముగా పూజించవలెను. హృదయాది అంగషట్కముతో కూడిన గాయత్రి ప్రణీతలను పూజించవలెను. పూర్వాది దళములందు హుంకా రాదులను పూజించవలెను. దళాగ్రభాగమున దేవీ సమ్ముఖమున ఫట్కారిని పూజించవలెను. శ్రీ బీజముతో పూజించవలెను. హుంకారి మొదలగువారి ఆయుధ వర్ణాదులు ఆయాదిక్కుల దిక్పాలకుల ఆయుధ వర్ణాదులతో సమానములు. ఫట్కారిమాత్రము ధనుర్బాణములను ధరించి యుండును. మండ ద్వారమున జయావిజయలను పూజించవలెను. వారు సువర్ణయష్టి ధరించి ఉందురు. వారికి బయట బర్బరి; అను కింకరిని పూజించవలెను. ఆమె ముండితమస్తకయై, కర్ర ధరించి యుండును. పిదప హోమ ద్రవ్యముతో యోన్యాకృతి యగు కుండమున హోమము చేయవలయును. తెల్లని ధాన్యమును హోమము చేసినచో సువర్ణము గోధూమలచేత పుష్టిసంపదలు యవ ధాన్యతిలలచే సర్వసిద్ధి ఈ తినాశనములు కల్గును. అక్షములతో హోమము చేసినచో శత్రువుకు ఉన్మాదము, శాల్మలీ బీజములచే మారణము, జంబూ ఫలములచే ధన ధాన్య ప్రాప్తి, నీలోత్పలములచే తుష్టి రక్తోత్పలములచే మహాపుష్టి, కుంద ములచే అభ్యుదయము కలుగును. మల్లికాపుష్పములు హోమము చేసినచో నగరమున క్షోభ కలుగును. కుముదములచే జనప్రియత్వము లభించును. అశోక కుసుమములచే పుత్రప్రాప్తి, పాటలా పుష్పములచే ఉత్తమాంగనా ప్రాప్తి, ఆమ్ర ఫలములచే ఆయుర్దాయము, తిలలచే లక్ష్మి, బిల్వలచే ఐశ్వర్యము, చంపకములచే ధనము కలుగును. మధుక పుష్ప బిల్వ ఫలములు కలిపి హోమము చేసినచో సర్వజ్ఞత్వము లభించును. త్వరితా మంత్రము మూడు లక్షలు జపము, హోమధ్యాన పూజలు చేసినచో అభిలషిత ఫలము లభించును. మండల ములపై త్వరితా దేవిని అర్చించి త్వరితా గాయత్రితో ఏబది హోమములు ఇవ్వవలెను. పిదప మూల మంత్రముతో పల్లవములు మూడువందలు హోమములు చేసి దీక్షాగ్రహణము చేయ వలయును. దీక్షకు పూర్వము పంచగవ్య ప్రాశన చేయవలెను. దీక్షా సమయమున చరువు మాత్రమే భుజించవలయును. (309)

త్వరితామూల మంత్ర వర్ణనము - 1

అగ్నిదేవుడు పలికెను :

భుక్తి ముక్తి ప్రదమగు మరియొక త్వరితా విద్యను చెప్పెదను. ధూళిచే నిర్మించ బడినదియు, వజ్ర చిహ్నముచే ఆవరింపబడినది అగు భూపుర మండలమున త్వరితా దేవిని పూజించవలయును. ఆ మండలములో యోగపీఠముపై కమలమును నిర్మించి మండలము యొక్క పూర్వాది దిక్కు లందును, విదిక్కులందును వజ్రచిహ్నమును, మండల ములోపల వీథి ద్వారము, శోభ, ఉపశోభ మొదలగు వాటిని రచించవలెను. దాని లోపల త్వరితా దేవిని భావన చేయవలయును. ఆమెకు పదునెనిమిది భుజము లుండును. ఎడమ కాలు సింహము వీపుపైనను కుడికాలు దానికి రెట్టింపు ఆకారముతో పాద పీఠమునందును ఉంచబడి యుండును. ఆమె (సర్ప) నాగమయ అలంకార ములతో అలంకరింపబడి యుండును, కుడివైపున ఉన్న హస్తములలో క్రమముగ వజ్ర–దండ–

ఖడ్గ–చక్ర–గదా–శూల–బాణ–శక్తి–వరద ముద్రలు, ఎడమ ప్రక్కన వున్న చేతులలో ధనుః–పాశ–శర– ఘంటా–తర్జనీ–శంఖ–అంకుశ–అభయ ముద్ర వజ్రాయుధములను ధరించి యుండును. ఆ దేవుని పూజించుటచే శత్రువులు నశింతురు. అవలీలగా రాష్ట్రమును జయించగలుగును. దీర్ఘాయుర్ధాయవంతుడై రాష్ట్రైశ్వర్యమును పొందును. దివ్య సిద్ధులను అదివ్య సిద్ధులను కూడ పొందును. తల అనగా సప్త పాతాళములు కాలము, అగ్ని సకల భువనములు, అంతకుడు అని అర్థము, ఓంకారముచే పరమేశ్వరుడు మొదలు బ్రహ్మాం డము లన్నియు ప్రతిపాదింపబడును. తన మంత్రము యొక్క ఆద్యక్షరమగు ఓం కారముచే తల పర్యంతము దేవి తోయము శీఘ్రముగ త్రిప్పును. అందుచే ఆమెకు "తోతలాత్వరితా" యని పేరు.

ఇపుడు, త్వరితా మంత్ర ప్రస్తారమును చెప్పెదను. భూతలముపై సర్వ సముదాయ మును వ్రాయవలయును. 'క' వర్గమునకు సాంకేతిక నామము స్వరవర్గ మొదటిది, తాలువర్గము రెండవది. మూడవది జిహ్వాతాలుక వర్గము నాల్గవది తాలు జిహ్వాగ్ర వర్గము ఐదవది జిహ్వా దంతక వర్గము ఆరవది ఓష్ఠ పుట సంపన్నము. ఏడవది మిశ్ర వర్గము ఎనిమిదవది ఊష్మ వర్గము. ఈ వర్గములు అక్షరముల నుండి మంత్రోద్ధారము చేయవలెను. ఆరవస్వరమైన 'ఊ' కారముపై ఊష్మవర్గ ద్వితీయాక్షరమైన 'హ' కారము బిందు సంయుక్తము చేయవలెను. (హూం) తాలువర్గ తృతీయా క్షరమగు 'ఖ'కారమును పదకొండవ స్వరమగు 'ఏ'కారముతో కూర్చవలెను. (ఖే) జిహ్వాతాలు సమాయోగము యొక్క మొదటి అక్షరమగు 'చ' కారము దాని క్రింద అదే వర్గము యొక్క ద్వితీయా క్షరమగు 'ఛ' కారము పదకొండవ స్వరమగు 'ఏ'కారముతో కలుపవలెను. (ఛ్చే)తాలువర్గ ప్రథమాక్షరమగు 'క' కారమును దాని క్రింద ఊష్మవర్గ ద్వితీయాక్షర మగు 'ష'కారము చేర్చి పదు నారవ స్వరమగు అఃతో కలుపవలయును. (క్షః) ఊష్మవర్గ తృతీయాక్షరమగు 'స' కారమునకు క్రింద జిహ్వాదంత సమాయోగ ప్రథమాక్షరమగు 'త' కారము చేర్చి దాని క్రింద మిశ్రవర్గ ద్వితీయా క్షరమగు 'ర' కారము కలుపవలెను. పిదప నాల్గవ స్వరమగు 'ఈ' కారము చేర్చవలెను. (స్త్రీ) తాలువర్గ ప్రథమాక్షరమగు 'క' కారమునకు క్రింద ఊష్మవర్గ ద్వితీయా క్షరమగు షకారమునుచేర్చి పంద్రెండవ స్వరమగు 'ఏ' కారమును కలుపవలెను. (క్షే) పిదప ఊష్మవర్గ అంత్యాక్షరమగు 'హ' కారమునకు అనుస్వారము చేర్చి ఐదవ స్వరమును కలుపవలెను. (హూం) ఓష్ఠ సంపుట యోగము నుండి రెండవ అక్షరమగు 'ప'కారమునకు జిహ్వాగ్రతాలు యోగము నుండి 'ఠ'కారమును పంచమ మగు 'న'కారముగా మార్చి కలుపవలెను. స్వర అర్ధ వ్యంజనములతో ఉద్ధృతములగు ఈ అక్షరము లతో తలాత్వరితా మంత్రము ఇది. దీని ఆదియందు ఓం కారమును అంతమునందు నమఃను చేర్చిన మంత్రమును జపము చేయవలయును. హోమము నందు మాత్రము నమః తొలగించి స్వాహా చేర్చవలెను. అనగా ఓం హూం–ఖే–ఛ్చే–క్షః–స్త్రీ క్షే, హూం–ఫట్ నమః అనునది జప మంత్రము. నమః బదులు స్వాహా చేర్చిన హోమ మంత్రము.

దీని అంగన్యాసము ఈ విధముగ నుండును. ఓం హ్రీం హ్రూం హ్రః హృదయాయ నమః, హాం హః శిరసే స్వాహా. హ్రీం జ్వల జ్వల శిఖాయైవ షట్ హులు హులు కవచాయ హుం హ్రీం శ్రీం క్షూం నేత్రత్రయాయ వౌషట్ ఫట్ అనునది దేవీ నేత్రముగా చెప్పబడినది. క్షౌంహః ఖౌః,

హూం-ఫట్, అస్త్రాయ ఫట్ ఇవి గుహ్యాంగ మంత్రములు. వీటి న్యాసము ముందుగా చేయవలయును. త్వరితాంగములను తరువాత చెప్పెదను. విద్యాంగములను వినుము. మొదటి రెండు బీజాక్షరములు హృదయము. తృతీయ చతుర్థాక్షరములు స్థిరములు. పంచషష్ఠ అక్షరములు శిఖా మంత్రము, సప్త అష్టమ వర్ణ ములు కవచ మంత్రములు నవమాక్షరము అర్ధాక్షరము తారకము 'తో తలే వజ్రతుండే ఖఖ హూం' అను పది యక్షరములు కలది వజ్రతుండికా నామకమగు ఇంద్రదూతికా విద్య. ఖేచరి-జ్వాలిని-జ్వాలే ఖఖ అను పది అక్షరములు కలది జ్వాలినీ విద్య వర్చేశర విభీషణి ఖఖే అనునది దశాక్షర శబరీ విద్య ఛేఛేదని, కరాలిని ఖఖ ఇది దశాక్షర కరాలినీ విద్య, క్షః శ్రవ ద్రవ ప్లవని, ఖఖే ఇది దశాక్షర ప్లవంగ దూతీవిద్య. 'స్త్రీ బలం కలిదొనని శాసి' ఇది దశాక్షర శ్వసన వేగికా విద్య. క్షే పక్షే కపిలే హంస ఇది దశాక్షరకపిలా దూతికా విద్యా. 'హ్రూం తేజోవతి రౌద్రి మాతంగి' ఇది దశాక్షర రౌది దూతికా విద్య. పుటేపుటే ఖఖ ఖడ్గే ఫట్. ఇది దశాక్షర బ్రహ్మ దూతికా విద్య. వైతాలిలో చెప్పబడిన అన్ని మంత్రములును దశాక్షరములు. ఇతరమైన వాటినన్నింటిని పొల్లువలె సారహేయములుగా భావించి విడిచి వేయవలెను. న్యాసాదుల యందు హృదయాద్యంగములను ఉపయోగించవలెను. నేత్రమును మధ్యము నందు న్యాసము చేయవలెను.

పాదము నుండి శిరస్సు వరకు, శిరస్సు నుండి పాదముల వరకు చరణ జాను ఊరు గుహ్యా నాభి హృదయములను కంఠ దేశము నుండి ముఖమండల పర్యంతము పైకిని క్రిందకును, ఆది బీజము నుండి నిర్గతమైనదియు, అమృతధారను వర్షించునదియు హోమ రూపమగు ఆకారము బ్రహ్మ రంధ్రమునుండి నాలో ప్రవేశించుచున్నది అని సాధకుడు భావనచేయవలెను. మంత్రోపాసకుడు శిరోముఖ కంఠ హృదయ నాభి గుహ్యా ఊరుజాను పాదములందును తర్జనియందును మాటి మాటికి ఆదిబీజమును న్యాసము చేయవలెను. అమృతమయ హోమముపైనను బీజాక్షర రూపమగు శరీర కమలము క్రిందను ఉన్నదియను రహస్యము తెలిసిన వానికి మృత్యు భయముగాని వ్యాధి జరాదులు గాని వుండవు. న్యాస ధ్యాన పూర్వకముగ ధ్యానముచేసి త్వరితా మంత్రము నూట ఎనిమిది పర్యాయములు జపించవలెను. ఇపుడు ప్రణీతాది ముద్రలను చెప్పెదను. ప్రణీతా ముద్రలు ప్రణీత, సబీజా ప్రణీత, భేదని కరాలి వజ్రతుండ అని ఐదు విధములు. రెండు చేతులు కలిపి అంగుష్టములను మధ్యయందుంచి తర్జని పైకి చాపినచో ప్రణీత. దీనిని హృదయ దేశమునందు చూపవలెను. ఈ ముద్రయందు కనిష్ఠికను పైకి వుండునట్లు చేసి మధ్యయందుంచినచో అది సబీజ తర్జని. మధ్యయందు అనామికను పరస్పర సంలగ్నముచేసి అంగుష్ఠాగ్ర భాగమును మధ్య యందుంచినచో అది భేదనీ ముద్ర. ఆ ముద్రను నాభి దేశము నందుంచి అంగుష్టము నందలి జలమును జల్లవలెను. దీనినే హృదయమునందుంచినచో కరాలి అని మహాముద్ర అగును. మరల బ్రహ్మ లగ్నా జ్యేష్ఠను వెనుకటి వలె పైకి నిలబడునట్లు చేసినచో అది వజ్రతుండ ముద్ర దానిని వజ్ర దేశమున ఉంచవలెను. రెండు హస్తములతో మణిబంధమును బంధించి మూడే వ్రేళ్లు చాపినచో వజ్రముద్ర అగును. వాటి వాటి ఆకారములను అనుసరించి దండ-ఖడ్గ-చక్ర-గదాది ముద్రలు చెప్పబడినవి. అంగుష్ఠముచే ఊర్ధ్వ ముఖములగు మూడువ్రేళ్లను ఆక్రమించినచో అది త్రిశూలముద్ర. మధ్య మాంగుళిని మాత్రము పైకి నిలిపినచో శక్తి ముద్రయగును. బాణ-వరద-ధనుష్-పాశ-

భార–ఘంటా–శంఖ–అంకుశ–అభయ పద్మములు పైన చెప్పిన ప్రణీత మొదలగు ముద్రలు కలిపి ఇరువది యెనిమిది ముద్రలగును. గ్రహణి–మోక్షణి–జ్వాలిని–అమృత–అభయ–ఈ ఐదును ప్రణీతా ముద్రలు. వీటిని పూజా హోమములందు ఉపయోగించవలెను. (310)

త్వరితా మూలమంత్రాది వర్ణనము - 2

అగ్నిదేవుడు చెప్పెను :

సింహాసనము నందున్న వజ్ర వ్యాప్త కమలమునందు మంత్రన్యాస పూర్వక దీక్షాది విధానమును చెప్పెదను. "హేహే హుతి వజ్ర దంత పురుపురు, లు, లు, గర్జ, గర్జ, ఇహ సింహాసనాయ నమః". ఇది సింహాసన పూజా మంత్రము. నాలుగు నిలువు రేఖలు, నాలుగు అడ్డరేఖలు గీయగా తొమ్మిది కోష్ఠములు ఏర్పడును. నాలుగు దిక్కులందును వున్న కోష్టములను ఉంచి విదిక్కులందున్న కోష్ఠము లను చెరిపి వేయవలెను. మిగిలిన కోష్ఠముల కోణములవరకు వచ్చు రేఖలు ఎనిమిది ఉండును. బాహ్మ కోష్ఠము యొక్క బాహ్య భాగమునకు సరిగా మధ్యయందు వజ్ర మధ్య శృంగమగును. బాహ్య రేఖను రెండు భాగములు చేయగా ఎంత రేఖార్ధమగునో అంత శృంగము మాత్రమే ఉండ వలెను. బాహ్య రేఖ వక్రముగా ఉండవలెను. దానిని రెండుగా విభజించవలెను. మధ్య కోష్ఠమును కమలాకారముగ మార్చి పీతవర్ణమగు కర్ణిక ఏర్పరుపవలయును. నల్లటి చూర్ణముతో కులిశ చక్ర మును ఏర్పరచి దానిపై శృంగము ఆకారము ఖడ్గాకారములో ఉండునట్లు చేయవలెను. చక్రబాహ్య భాగమున చతురస్ర చక్రము వ్రాసి వజ్రసంపుటముతో చిహ్నితము చేయవలెను. భూపుర ద్వారమున నాల్గు వజ్ర సంపుటములు ఏర్పరుపవలయును. పద్మము వామ వీతియు సమముగా ఉండ వల యును. కమలము లోపలి భాగము కేసరములు ఎర్రగా నుండవలెను. మండలమునందు స్త్రీలకు దీక్ష ఇచ్చి మంత్ర జపానుష్ఠానము చేయించినచో రాజు శీఘ్రముగా ఇతర రాజ్యములను జయించును. తాను తన రాజ్యమును కోల్పోయినచో దానిని మరల పొందును. ఓంకారముచే సందీప్తమగుమూర్తిని హుంకార ముతో నియుక్తముచేసి వాయ్వాకాశ బీజములతో సంపుటితమగు మూల విద్యనుచ్చరించి ఆద్యంతము లందు కర్ణికయందు పూజించవలెను. ప్రదక్షిణ క్రమమున ఒక్కొక్క అక్షర రూపమగు బీజములను ఉచ్చరించుచు కమల దళములపై పూజ చేయవలయును.

దళములపై విద్యాంగములను పూజించవలెను. ఆగ్నేయము నుండి నామ క్రమమున నైఋతి దిక్కు వరకు హృదయ శిరః శిఖా కవచ, నేత్రములను అన్ని దిక్కులందును అస్త్రమును పూజించ వలెను. గుహ్యాంగమున రక్షాపూజను కేసరములపై వామ దక్షిణ పార్శ్వములందును ఐదేసి హుతులను వాటి వాటి నామమంత్రములతో పూజించవలెను. గర్భమండలము వెలుపల ఎనమండుగురు లోకపాలకుల న్యాసము చేయవలెను. వర్ణాం తమును (క్ష హ) అగ్ని పై(ర) ఎక్కించి దానిని ఆరవ స్వరముతో(ఊ) భిన్నముచేసి పదునైదవ స్వరమును(ం) దానిని శిరస్సుపై చేర్చి (క్ష్రూం) లేదా (హ్రూం) ఆ బీజమును ఆది యందుంచి దిక్పాలకులను తమ తమ నామ మంత్రములతో పూజించ వలెను. పిదప శీఘ్రముగా సింహాసనముపై కమల కర్ణికయందు గంధాద్యుపచారములతో పూజ చేయ వలయును. దీనిచే ఐశ్వర్యము లభించును. పిదప నూట యెనిమిది మంత్రములతో

అభిమంత్రితములగు ఎనిమిది కలశలను కమలము చుట్టావుంచి వెయ్యి పర్యాయములు జపముచేసి దశాంశము హోమము చేయవలయును. ముందు అగ్ని మంత్రముతో (రం) కుండము దగ్గరకు అగ్నిని తీసుకొని పోయి హృదయమంత్రముతో (నమః) దానిని ఉంచవలెను. కుండమునందు అగ్ని యుక్తమగు శక్తిని భావన చేయవలెను. ఆ శక్తియందు గర్భాధాన, పుంసవన జాతకర్మ సంస్కారములను ఉద్దేశించి హృదయ మంత్రముతో కూడ ఎనిమిది పర్యాయములు హోమము చేయవలెను. గుహ్యాంగము నుండి నూతనాగ్ని జన్మించినట్లు భావనచేసి మూలవిద్యను ఉచ్చరించుచు పూర్ణాహుతి నివ్వవలెను. దీనితో శివాగ్ని జన్మ సిద్ధించును. పిదప మూల మంత్రముతో దానిలో నూరు హోమములు చేసి అంగములను ఉద్దేశించి దశాంశ హోమముచేసి శిష్యుని దేవి చేతిలో సమర్పించి వానిని మండపమునందు ప్రవేశపెట్టవలెను. అస్త్ర మంత్రముతో తాడనముచేసి గుహ్యాంగముల న్యాసము చేయవలెను. విద్యాంగములచే సన్నద్ధులగు శిష్యుని విద్యాంగములందు నియోగించవలెను. వానిచే ఒక పుష్పము విసిరినట్లుచేసి వానిని అగ్నికుండ సమీపమునకు తీసు కొనివెళ్లి మూలవిద్యను ఉచ్చరించుచు యవధాన్య తిల ఘృతములతో నూరు హోమములు చేయవలెను.

ప్రథమ హోమము స్థావర జన్మమునిచ్చి వానికి ముక్తి నిచ్చును. రెండవది సరీస్రుప జన్మమును పిదప వరసగా పక్షి, మృగ, పశు, మానవ జన్మమును ఇచ్చి దాని యందు విముక్తి నిచ్చును. పిదప క్రమముగ బ్రహ్మ, పరవిష్ణుపద, రుద్రపదము లభించును. అంతమున పూర్ణాహుతి ఇవ్వవలెను. ఒక ఆహుతిచే శిష్యుడు మోక్షాధికారి అగును. మోక్షమనగా ఎట్లుండునో వినుము.

మంత్రోపాసకుడు సుమేరువుపై సదాశివ పదమునందున్నచో, రెండవ దినమున స్వస్థచిత్తుడై కర్మ క్షయ నిమిత్తమై వేయిహోమములు చేయవలెను. పిదప పూర్ణాహుతి ఇచ్చిన మంత్రయోగి ధర్మాధర్మ సంబంధ శూన్యుడై మోక్షమును పొందును. అచ్చటికి వెళ్ళి మళ్ళీ తిరిగిరాడు. జలములో పోసిన జలము దానితో కలసి ఏకరూపమైనట్లు జీవుడు శివునితోకలసి శివరూపుడగును. కలశము లతో అభిషేకము చేసినవాడు విజయ రాజ్యా దులను పొందును. బ్రాహ్మణ కన్యకను పూజించి గుర్వాదులకు దక్షిణ ఇవ్వవలెను. ప్రతి దినము పూజచేసి వెయ్యి హోమములు చేయవలెను. తిల ఘృతములతో హోమము చేసినచో దేవి లక్ష్మిని, సమస్త కామములను ఇచ్చును. అనేకమైన భోగములను ఇచ్చి కోరిన కోరికలు అన్నియు తీర్చును. మంత్రములో ఎన్ని అక్షరములున్నవో అన్ని లక్షల జపము చేయుటచే నిధులకు అధిపతి అగును. రెట్టింపు జపము చేసినవాడు రాజ్యమును పొందును. మూడు రెట్లు జపము చేసినవానికి యక్షిణి సిద్ధించును. నాలుగు రెట్లు జపము బ్రహ్మ పదము, ఐదు రెట్లు ఎక్కువచేసిన విష్ణు పదము, ఆరురెట్లు ఎక్కువచేసిన మహాసిద్ధియు లభించును. ఈ మంత్రమును లక్ష పర్యాయము జపించినచో పాపము నశించును. పది పర్యాయములు జపించినచో దేహశుద్ధి కలుగును. నూరు పర్యాయములు జపించినచో తీర్థస్నాన ఫలము లభించును. వేదికపై పటమునుగాని, ప్రతిమనుగాని ఉంచి దాని మొదట లక్ష లేదా పదివేల జపముచేసి హోమము చేయవలెను. ఈ విధముగా జపముచేసి లక్ష హోమములు చేయవలెను. తిల యవ, లాజ, వ్రీహి, గోధూమ, ఆమ్ర, ఫలబిల్వ, ఫలములను కలిపి వాటిపై నెయ్యిపోసి వాటితో

హోమముచేసి వ్రతమును అవలంబిం చవలెను. రాత్రి కవచాదులు ధరించి ఖడ్గ ధనుర్బాణాదులు గ్రహించి ఏకవస్త్ర ధారియై పైనచెప్పిన వస్తువులతో దేవుని పూజించవలెను. వస్త్రము రంగు రక్తముగాని పీతముగాని కృష్ణముగాని నీలముగాని ఉండవలెను. దక్షిణ దిశకువెళ్ళి మండప ద్వారముపై దూతి మంత్రముతో బలి సమర్పించవలెను. ఈ బలి ద్వారాదులందుగాని, ఒక వృక్షము వున్న శ్మశానము నందుగాని ఇవ్వవచ్చును. ఇట్లు చేసిన సాధకుడు రాజ్యము పొంది సమస్త కామములను అనుభవించుచు సకల పృథ్విని ఏలును. (311)

త్వరితావిద్యా సిద్ధి

అగ్నిదేవుడు పలికెను :

ఇపుడు ధర్మకామాది సిద్ధి ప్రదమగు విద్యా ప్రస్తారమును చెప్పెదను. నవకోష్ట విభాగముచే విద్యా భేదము లభించును. అనులోమ విలోమ యోగము సమస్తవ్యస్త యోగము కర్ణా వికర్ణ యోగము అధ ఊర్ధ్వ విభాగయోగము త్రిత్రిక యోగము వీటిచే ఎవని శరీరమునకు దేవీరక్ష ఏర్పరుపబడునో ఆతడు సిద్ధిదాయకములగు మంత్రములను అనేకములగు ప్రస్తారమును తెలుసుకొనగలుగును. ప్రతి శాస్త్రమునందును మంత్రములు చెప్పబడినవి. కాని వాటి వాటి ప్రయోగము దుర్లభము మొదటి వర్ణము గురువు అగును. పూర్వము దాని వర్ణనము చెప్పబడలేదు. దాని ప్రస్తారముచే ఏకాక్షర ద్వ్యక్షర త్ర్యక్షర మంత్రములు ఏర్పడును. నిలువుగను అడ్డముగను నాలుగేసి రేఖలుగీయ తొమ్మిది కోష్టము లగును. మధ్యకోష్ఠముతో ప్రారంభించి ప్రదక్షిణ క్రమమున మంత్రాక్షరములు వాటిపై వ్రాసి ప్రస్తార భేదనము చేయవలెను. ప్రస్తార క్రమయోగముచే ప్రస్తార మును పొందగలిగిన సాధకుని చేతిలో అన్ని సిద్ధులుండును. మూడు లోకములును ఆతని పాదముపై వ్రాలును. ఆతడు నవఖండ విభక్తయగు భూమిని పొందును. కపాలముపై గాని, శ్మశాన వస్త్రముపై గాని అన్ని వైపులను శివతత్త్వములను వ్రాసి మంత్రవేత్త దాని మధ్య భాగము నందలి కర్ణికపై తాను తలచిన వ్యక్తి పేరు భూర్జ పత్రముపై వ్రాసి వుంచవలెను. ఖదిర వృక్షము యొక్క బొగ్గులతో భూర్జ పత్రమును వెచ్చచేసి రెండు పాదముల కింద తొక్కి వుంచవలెను. ఈ ప్రయోగముచే ఒకే సప్తాహము నందు సచరాచరములగు మూడు లోకములను తన పాదములపై పడవేయగలుగును. వజ్రసంపుట గర్భయుక్తమగు ద్వాదశార చక్రము మధ్య యందు శత్రువుపేరు వ్రాసి, దానిని సదాశివ మంత్రము చెప్పుచు దర్భలతో మార్జనము చేయవలెను. పైన చెప్పిన ద్వాదశార చక్రమును నామాధికరణములను పశువుతో గోడపై గాని పీటపైగాని శిలా పట్టంపైగాని వ్రాయవలెను. ఇట్లు చేయుటచే శత్రువున ముఖ స్తంభము, గతిస్థంభము, సైన్య స్థంభము కలుగును.

శ్మశాన వస్త్రముపై విష మిశ్రితమగు రక్తముతో షట్కోణ చక్రము వ్రాసి దాని మధ్య శత్రువు పేరు వ్రాయవలెను. చక్రము నలు వైపుల శక్తి బీజములు వ్రాసి దానిపై దండము ఉంచవలెను. శ్మశాన భూమిపై ఉంచబడిన ఆ శత్రువుపై శీఘ్రముగా దండ ప్రహారము చేసినచో శత్రు రాజు యొక్క రాష్ట్రము ఖండితమైపోవును. చక్రాకార మండలము ఏర్పరచి దాని మధ్య భాగమున శత్రు నామము వ్రాసి చక్రధార యందు శక్తి బీజ న్యాసము చేసి శత్రువుపేరు ఉచ్చరించుచు చక్రధారతో

వాటిని కొట్టుచున్నట్లు భావన చేసినచో శత్రువు నశించును. ఖడ్గ మధ్య భాగమున గరుడ బీజముతో శత్రువు నామధేయము వ్రాసి దర్భతో మార్జనము చేయవలెను. పేరు వ్రాయుటకు శ్మశానము నందలి బొగ్గును ఉపయోగించవలెను. దానిపై చితాభస్మముతో ప్రహారము చేయవలెను. ఇట్లు చేసిన సాధకుడు ఒక్క వారంలో శత్రు దేశమును జయించును. ఛేదన భేదన మారణములందు ఆతడు శివునివలె శక్తిశాలి అగును. తారకమునకు (ఫట్) నేత్రమనిపేరు. దీనిని శాంతి పుష్టి కరములయందు వినియోగించవలెను. ఈ దహనాది ప్రయోగము శాకినిని కూడ ఆకర్షిం చును. పై చెప్పిన నూరు చక్రములలో ఉన్న మంత్రాక్షరము మొదలు పశ్చిమ దిక్కు నందున్న కోష్టము వరకు ఉన్న రెండు అక్షరములను 'వక్రతుండ' మంత్రములు జపించుటచే కుష్టాది చర్మరోగములు అన్నియు నశించును. సందేహములేదు. మధ్య కోష్టము నుండి ఉత్తర కోష్టమువరకు వున్న రెండు అక్షరముల మంత్రములను కరాళి బంధముతో జపించినచో ఆద్యక్షరీవిద్య సాక్షాత్తు శివుడే ప్రతివాదియైనను రక్షణము నిచ్చును. పశ్చిమమునందు ఉన్న మంత్రాక్షరమును మొదట ఉంచి ఉత్తరకోష్టము వరకు ఉన్న మంత్రాక్షర ములను వక్రతుండ మంత్రములతో జపించినచో చివర కాసాదులు శమించును. ఉత్తర కోష్టము మొదలు మధ్యకోష్టము వరకును ఉన్న మంత్రాక్షరములను జపించినచో వట బీజమునందు కూడ గురుత్వమును కల్గించ కలుగును. హర్వాది మధ్యమాంత పక్షముల జపము వెంటనే లఘుత్వమును కల్గించును. భూర్జపత్రముపై గోరోచనముతో వజ్ర వ్యాప్తమగు భూపుర చక్రమును నిర్మించి మంత్ర బీజములను క్రమముగ వ్రాసి దానిని ధరించి నచో శరీర రక్ష కలుగును. దానిని సువర్ణము చుట్టి ధరించినచో ఆ రక్షా యంత్రము మృత్యువును రానీయదు. విఘ్నపాప శత్రువులను అణచి సౌభాగ్య దీర్ఘాయువులను ఇచ్చును. జూదమునందును, యుద్ధమునందును విజయమును ఇచ్చును. ఇంద్రుని సేనతో యుద్ధము చేయవలసి వచ్చినను విజయమును ఇచ్చును. సందేహము లేదు, వంధ్య స్త్రీలకు పుత్రుల నిచ్చును. ఇది రెండవ చింతామణి వంటిది. పర రాష్ట్రములపై అధికారమును పొందును. రాజ్యమును భూమిని జయించును. ఫట్ స్త్రీం, క్షీం, హ్రూం అను మంత్రమును లక్ష పర్యాయములు జపించినచో యక్షాదులు కూడా వశమగుదురు. (312)

వివిధ మంత్ర నిరూపణము

అగ్నిదేవుడు పలికెను :

ఇపుడు వినాయక అర్చనను చెప్పెదను. ముందు ఆధారశక్తిని పూజించవలెను. ఆగ్నేయాది విదిక్కులందును పూర్వాది దిక్కులందును క్రమముగ ధర్మజ్ఞాన, వైరాగ్య, ఐశ్వర్య, అధర్మ, అజ్ఞాన, అవైరాగ్య, అనైశ్వర్యములను పూజించి కందనాల పద్మకర్ణికా కేసరములను సత్త్వాది గుణత్రయమును పద్మాసనమును పూజించవలెను. పిదప తీవ్రా, జ్వాలినీ, నందా, సుయశా, కామరూపిణీ, ఉగ్రా, తేజోవతీ సత్యా, విఘ్ననాశినీ యను తొమ్మిది శక్తులను పూజించవలెను. పిదప గణేశమూర్తిని, మూర్తి లభించనిచో ధ్యానోక్త గణపతిమూర్తిని పూజించి హృదయాద్యంగ పూజలు చేయవలెను. పూజా ప్రయోగ వాక్యములు ఈ విధముగా నుండును. 'గణంజయాయ హృదయాయ నమః' ఏకదంతాయ ఉత్కటాయ శిరసే స్వాహా అచల కర్ణినే శిఖాయై వషట్, గజ వక్త్రాయ హుంఫట్

కవచాయ హుం, మహోదరాయ దండ హస్తాయ, అస్త్రాయ ఫట్ ఈ ఐదు అంగములలో నాల్గింటిని నాలుగు దిక్కులందును ఐదవ దానిని మధ్య భాగమునందును పూజించవలెను. పిదప గణంజయ, గణాధిప, గణనాయక, గణేశ్వర, వక్రతుండ, ఏకదంత, ఉత్కట, లంబోదర, గజవక్త్ర వికటాననులను పద్మ దళములపై పూజించవలెను. మధ్యభాగము హూం విఘ్న నాశనాయ నమః మహేంద్రాయ ధూమ్ర వర్ణాయ నమః యని పలికి విఘ్ననాశన ధూమ్రవర్ణులను పూజించవలెను. బాహ్య ప్రదేశమున విఘ్నేశ్వరుని పూజించవలెను.

ఇపుడు త్రిపురాభైరవ పూజల విధిని చెప్పెదను. ఎనమండుగురు భైరవులను పూజించవలెను. అసితాంగ భైరవ, రురు, చండ, క్రోధ, ఉన్మత్త, కపాలి, భీషణ సంహార భైరవులు అని వారల పేర్లు. బ్రాహ్మి మొదలగు మాతృకలనుకూడ పూజించవలెను. అకారాది హ్రస్వ స్వరముల బీజమును ఆదియందుంచి భైరవుల పూజ చేయవలెను. బ్రహ్మాది మాతృకలను అకారాది దీర్ఘాక్షరములు ఆది యందుంచి పూజించవలెను. ఆగ్నేయాది దిక్కులందు వటుకులను పూజించవలెను. సమయ పుత్రవటుక, యోగినీ పుత్రక సిద్ధపుత్ర వటుక, కులపుత్ర, వటుకులు వీరి పేర్లు. పిమ్మట హేతుక, త్రిపురాంత, అగ్నివేతాల అగ్నిజిహ్వ, కరాల కాలలోచన ఏకపాద భీమాక్షులను ఎనమండుగురు క్షేత్రపాలకులను పూజించి, త్రిపురాదేవి యొక్క ప్రేత రూప పద్మాసనమును పూజించవలెను. ఐం, క్లైం, ప్రేత పద్మాసనాయ నమః. ఓం, హైం, హ్రీం, అసౌః త్రిపురాయై ప్రేత పద్మాసన స్థితాయై నమః అను మంత్రముతో త్రిపురాభైరవిని పూజించవలెను. త్రిపురాదేవి వామహస్తము లందు అభయ పుస్తకములను, దక్షిణ హస్తములందు వరముద్రా జపమాలికను ధరించి ఉండును. బాణ సమూహముతో నిండిన అంబులపొదిని ధనుస్సును ధరించి ఉండును. మూల మంత్రమును హృదయాది న్యాసము చేయవలయును. గో సమూహ మధ్యమున నిలిచి శ్మశానాది వస్త్రముపై చితిలోనే బొగ్గుతో అష్టదళ కమల చక్రమును వ్రాయించవలెను. శత్రువు పేరును వ్రాసి మడత పెట్టి చితాభస్మముతో శత్రుమూర్తి నిర్మించి, ఆతడు దానియందు ఉన్నట్లు భావనచేసి పైన చెప్పిన యంత్రమును నల్లటి దారముతో చుట్టి ఆ మూర్తి పొట్టలో దూర్చవలెను. అపుడు ఆ వ్యక్తి నశించును.

'ఓం నమో భగవతి జ్వాలామాలిని గృధ్ర గణ పరివృతే స్వాహా' అను మంత్రమును జపించుచు యుద్ధమునకు వెళ్ళు వానికి జయము కలుగును. ఓం, శ్రీం, హ్రీం, క్లీం, శ్రియై నమః అను మంత్రముతో చతుర్దశ దళ కమలపై ఉత్తర దిక్క్రమమున గృణినీ సూర్యా, ఆదిత్యా ప్రభావతీ అను నలుగురు శ్రీదేవులను పూజించి ఈ శ్రీ మంత్రమును జపించుటచే శ్రీలభించును. ఈ శ్రీ దేవులం దరును సువర్ణగిరివలె సుందర కాంతి కలవారు. ఓం హ్రీం గౌర్యై నమః అను గౌరీ మంత్రముతో జప హోమ ధ్యాన పూజలు చేసిన వానికి సమస్తము లభించును. గౌరీదేవి శరీర కాంతి అరుణము, నాలుగు భుజములు ఉండును. దక్షిణహస్తమునందు పాశ, వరద ముద్రలను, వామహస్తములందు అంకుశ అభయ హస్తములను ధరించియుండును. శుద్ధ చిత్తముతో గౌరీదేవిని ప్రార్థించు వానికి నూరు వర్షముల ఆయుర్దాయముండును. చోరాది భయముండదు. యుద్ధ రంగమున ఈ మంత్ర ముతో అభిమంత్రించిన ఉదకమును త్రాగినచో వానిపై అధికకోపము కలవాడు కూడ ప్రసన్ను డగును. ఈ మంత్రముతో అంజనము తిలకము ధరించినచో వశీకరణము సిద్ధించును. జిహ్వాపై

దీనిని వ్రాసినచో కవిత్వ శక్తి లభించును. దీని జపముచే స్త్రీ పురుషులు వశమగుదురు. సూక్ష్మ ప్రాణులు కూడ చూడబడును. స్పర్శ మాత్రముచే మనుష్యులు వశమగుదురు. మంత్రముతో తిలలు హోమముచేసినచో సర్వ మనోరథములు సిద్ధించును. ఈ మంత్రముతో ఐదుపర్యాయములు అభిమంత్రించి అన్నమును భుజించు వాని యొద్ద సర్వ ధనముండును. దీని ప్రారంభమున లక్ష్మీ బీజమును (శ్రీం) వైష్ణవబీజమును (క్లీం) చేర్చినచో అది అర్ధనారీశ్వర మంత్రమగును. అనంగ రూపా మదనా, అనంగ మేఖలా అను శక్తుల నామ మంత్రములను జపించుటచే లక్ష్మి ప్రాప్తించును. కమల దళములపై హ్రీం, స్వరములు, కాది వ్యంజనములు వ్రాసి మధ్య అభీష్ట స్త్రీ నామధేయము వ్రాయ వలయును. షట్కోణ చక్రముపై గాని కలశముపై గాని వ్రాయవచ్చును. పిమ్మట ఆ స్త్రీని ఉద్దేశించి జపము చేసినచో వశీకరణమగును.

'ఓం, హ్రీం, ఘూం నిత్య క్లిన్నే మదద్రవే ఓం ఓం' అనునది ఆరు అంగముల మూల మంత్రము. ఎఱ్ఱటి త్రికోణ చక్రముపై అష్టదళ కమలమును భావించి దానిపై ద్రావిన్యాదులను పూజించవలెను. పూర్వాది దిక్కులందు, ద్రావిణి మొదలగు నలుగురు శక్తులను ఈశానాది కోణములందు అపర మొదలగు నాలుగు శక్తులను భావనచేసి పూజించవలెను. ద్రావిణీ, వామజ్యేష్ఠా ఆహ్లాదకారిణీ, అపరా, క్షోభిణీ, రౌద్రీ, గుణ శక్తి అనునవి ఈ శక్తుల పేర్లు. దేవిని ఈ విధముగా ధ్యానము చేయవలెను. రక్త వర్ణములగు వస్త్రాలంకారాదులను ధరించి రెండుహస్తములలో పాశాంకుశములను రెండు హస్తములలో కపాల కల్పవృక్షములను, రెండు హస్తములతో వీణను ధరించియుండును. నిత్యా అభయా, మంగళా, నవవీరా, సుమంగళా, దుర్భగా మనోన్మణీ ద్రాహ అను ఎనమండుగురు దేవులను మారాది దిక్కుల కమల దళములపై పూజించవలెను. వీటి బాహ్యభాగమున ఐదు దళములపై ఓం హ్రీం అనంగాయ నమః, ఓం హ్రీం స్మరాయ నమః, ఓం హ్రీం మన్మథాయ నమః, ఓం హ్రీం మారాయ నమః, ఓం హ్రీం కామాయ నమః అను ఐదు గురు కామదేవులను పూజించవలెను. వారి హస్తములలో పాశ, అంకుశ, ధనుస్సు బాణములు వున్నట్లు ధ్యానించవలెను. వీటి బాహ్య భాగమున పదిదళముల పై క్రమముగ రతి విరతి, ప్రీతి, విప్రీతి, మతి దుర్మతి, ధృతి, విధృతి, తుష్టి, వితుష్టి యను కామ వల్ల భలను పూజించవలెను. 'ఓం, భం నిత్య క్లిన్నే ఓం ఓం' మొదలు ఓం భం నిత్యక్లిన్నే మదద్రవే స్వాహా వరకును మూలోక్తమైనది. నిత్యక్లిన్నా విద్యా. సింహాసనముపై ఆధార శక్తిని పద్మమును పూజించి దాని దళములపై హృదయా ద్యంగములను స్థాపించి పూజించి మధ్యకర్ణికపై దేవిని పూజించవలెను. ఓం హ్రీం, గౌరి, రుద్రదైతే యోగేశ్వరి హూం ఫట్ స్వాహా. ఇది గౌరీ మంత్రము. (313)

త్వరితాజ్ఞాన నిరూపణము

అగ్నిదేవుడు పలికెను :

ఓం హ్రీం హ్రూం ఖే, ఛే, క్షః స్త్రీం, హ్రూం క్షే హ్రీం ఫట్ త్వరితాయై నమః అను మంత్రముతో న్యాసపూర్వకముగ ద్విభుజ లేదా అష్ట భుజయగు త్వరితా దేవిని ధ్యానించుచు పూజించవలెను.

సింహాసనమును దానిపై ఉన్న త్వరితాదేవిని, ఆ దేవినాల్గు వైపుల హృదయాద్యంగములను పూజించవలెను. పూర్వాదిక్కులందు హృదయా ద్యంగములను పూజించి మండలముపై గాయత్రిని ప్రణీతాదేవిని పూజించవలెను. ఎనిమిది దళములపై హుంకారీ, ఖేచరీ, చండా, ఛేదినీ, క్షేపణీ, స్త్రీ హుంకారీ, క్షేమంకరులను పూజించి, మధ్యయందు ఫట్కారిణిని పూజించవలెను. దేవికి ఎదురుగా నున్న ద్వారము యొక్క దక్షిణ వామ పార్శ్వములందు జయ విజయలను ద్వారాగ్రమున కింకరుని పూజించ వలెను. తిల హోమములు చేసినచో సకలాభీష్ట వస్తువులు నశించును. దేవికి అలంకారము లగు ఎనిమిది నాగులను నామోచ్చారణ పూర్వకముగ పూజించవలెను. అనంతాయనమః స్వాహా, కులికాయ నమః స్వధా, వాసుకి రాజాయ స్వాహా, శంఖ పాలాయ వౌషట్, తక్షకాయ వషట్, మహాపద్మాయ నమః కర్కోట నాగాయ స్వాహా, పద్మాయ నమః ఫట్. ఇవి నాగ పూజా మంత్రములు.

పది నిలువు రేఖలు, పది అడ్డరేఖలు గీసినచో, ఎనుబది యొక్క పదములు ఏర్పడును, ఇది నిగ్రహ చక్రము, దీనిని వస్త్రముపైగాని, వేదికపై గాని, భూర్జ వృక్షత్వక్కు పై గాని, శిలా పట్టముపైగాని, యష్టికలపై గాని, వ్రాయవచ్చును. మధ్యవర్తి కోష్టమునందు పేరు వ్రాయవలెను. దాని పార్శ్వ భాగమున పూర్వాది దిక్కులయందు నాలుగు పట్టికలపై భ్రూం, క్ష్రూం, భ్రూం, హ్రూం యను నాలుగు బీజములు వ్రాసి ఈశానాది కోణములందు లోపలి వైపున కాళరాత్రి మంత్రమును వ్రాసి వెలుపల వైపున యమరాజ మంత్రము వ్రాయవలెను. 'కాళీ, మార' మొదలు 'అక్షర' వరకును మూలోక్తమైనది. కాళీ మంత్రము యమావాట, మొదలు రీటట వరకువున్న మూలోక్తమంత్రము యమ మంత్రము. యమ మంత్రము వెలుపల నలువైపుల రం వ్రాసి దాని క్రింద యం వ్రాయవలెను. దీనిచే మారణాత్మక నిగ్రహ మంత్రము ఏర్పడును. వేపచిగురు మజ్జ రక్తము, విషము కలిపిన సిరాలో కొంచెము చితాబొగ్గు నూరి కలిపి దానిని పింగళ వర్ణమగు సిరా బుడ్డిలో వుంచి, కాకి ఈక కలముతో నిగ్రహ మంత్రము వ్రాసి దానిని శ్మశానభూమి యందుకాని, చతుష్పథము నందు గాని, గోతిలో క్రిందికి పాతవలెను. లేదా పుట్టయందు వుంచవలెను. లేదా విభీతకద్రుమశాఖ క్రింద పాతవలెను. ఇట్లు చేయుటచే శత్రువులందరును నశింతురు.

శుక్ల పక్షమున భూర్జపత్రము నందును నేలపైనను గోడపైనను లాక్షారసముతో గాని, కుంకుమతోగాని, ఖడికా చందనముతోగాని అనుగ్రహ చక్రము వ్రాయవలెను. మధ్యకోష్టమున వ్యక్తి పేరు ఠం, ఠం, అను అక్షరముల మధ్య వ్రాసి పూర్వాది వీథియందు, జూం, నః, వషట్, అనునది వ్రాసి, ఈశాన్యముతో ప్రారంభించి వీథిని విడచుచు ఆగ్నేయము పర్యంతము లక్ష్మీ మంత్రమును వ్రాయవలెను. ఇది పై నాలుగు పంక్తులందును పూర్తియగును. క్రింది నాలుగు పంక్తులలో అన్నిటి కంటెను క్రిందనున్న నైఋతి కోణస్థ కోష్టమునందు ప్రారంభించి, కుడి పంక్తి తరవాత పై పంక్తి కూడ ఎడమనుండి కుడికి వ్రాయవలెను. ఈవిధముగా నాలుగు పంక్తులలో లక్ష్మీ మంత్రము పూర్తి అగును. 'శ్రీసా' మొదలు 'జ్ఞేయ' వరకును మూలోక్తమగునది లక్ష్మీ మంత్రము. చక్ర బహిర్భాగమున నలువైపుల త్వరితామంత్రము ప్రతి దిక్కునందును ఒక పర్యాయము చొప్పున వ్రాయవలెను. ఈ చతురస్ర చక్రమును గోళ్ళరేఖతో, అది కలశములోనికి వెళ్లునట్లు చుట్టి, కలశము క్రింద ఒక కమలము ఏర్పరచి దానిపై కమలమును స్థాపించవలెను. కమలముపై

స్థాపించిన పద్మ చక్రమును వ్రాసి, దానిని ధరించినచో మృత్యువు తొలగును, స్వర్గము లభించును. అది శాంత సాధనమునకు కూడ ఉపయోగించును. సౌభాగ్యాదులను ఇచ్చును.

పదకొండు నిలువు రేఖలు పదకొండు అడ్డ రేఖలు గీసికూడ ఇరువది ఒక్క కోష్ఠములు ఏర్ప రచి మధ్య కోష్ఠమునందు పేరు వ్రాయవలెను. ఈశాన్య కోష్ఠముతో ప్రారంభించి ప్రదక్షిణ క్రమమున పంద్రెండు పర్యాయములు త్వరితా విద్యాక్షరములను హ్రీం, విడచి వ్రాయవలెను. రేఖాగ్ర భాగము లందు త్రిశూల చిహ్నమును ఉంచవలెను. త్వరితా విద్యా వర్ణములను క్రమముగానే వ్రాసి అంతమున క్రింది వైపు 'వషట్' చేర్చవలెను. ఇది సర్వ కామార్థ సాధకమగు ప్రత్యంగితా విద్య, ఎనుబది యొక్క కోష్ఠములుగల చక్రముపై త్వరితా విద్యాక్షరములను మొదటి అక్షరముతో ప్రారంభించి వ్రాయవలెను. ఆరు పర్యాయములు మంత్రములు వ్రాసిన పిమ్మట అంతములందు మిగిలిన కోష్ఠములపై పేరు వ్రాసి చివర 'వషట్' చేర్చవలెను. ఇది రెండవ ప్రత్యంగిరా విద్య. సర్వార్థ సాదిక అరువది నాలుగు కోష్టములుగల చక్రముపైగూడ నిగ్రహ చక్రమును, అనుగ్రహ చక్రమును వ్రాయవచ్చును. ఇది అమృతా విద్య. దీని మధ్య కోష్ఠమున క్రీం, సః, హూం, అనియు పేరును వ్రాయవలెను. బాహ్య భాగమున కమలము ఏర్పరచి దానిదళములపై విలోమ క్రమమున త్వరితా విద్యను వ్రాయవలెను. దానిని హ్రీంకార యుక్తములగు మూడు వృత్తాకార పంక్తులతో వేష్టించి కుంభాకారము యంత్రము లోపల లిఖితములగు ఈ విద్యను ధరించుటచే సర్వ శత్రువులు నశిం తురు. సర్వము లభించును. రోగి చెవిలో దీనిని జపించినచో సర్పాది విషములు శాంతించును. దీని అక్షరములతో చిహ్నితములగు దండములతో శరీరముపై కొట్టినచో విషము నశించును. (314)

స్తంభనాది మంత్రములు నిరూపణము

అగ్నిదేవుడు పలికెను :

ఇపుడు స్తంభనమోహన వశీకరణ, విద్వేషణ ఉచ్చాటన ప్రయోగములను విషవ్యాధి ఆరోగ్య మారణ శమన ప్రయోగములను చెప్పెదను. భూర్జ పత్రముపై ఆరు అంగుళముల కూర్మ చక్రమును తాడనముతో వ్రాయవలెను. దాని ముఖము నందును, పాదములందును మంత్ర న్యాసము చేయవలెను. పాదములందు క్రీం, ముఖము నందు 'హ్రీం', గర్భ స్థానమున త్వరితా విద్యను వ్రాసి పృష్ఠ భాగమున సాధ్య నామము వ్రాయవలెను. మాలా మంత్ర ములతో వేష్టితముచేసి ఆ యంత్రమును ఇటుకపై స్థాపించి దానిని కప్పి, కూర్మ పీఠము నందున్న కరాళ మంత్రముతో అభిమంత్రించవలెను. మహా కూర్మమును పూజించి శత్రువును ఉద్దేశించి చర్మోదకమును చిమ్మి, శత్రువును స్మరించుచు, వానిని ఏడు పర్యాయము ఎడమ పాదముతో తన్నవలెను. అపుడు శత్రు వునకు ముఖ భాగ స్తంభనము కలుగును.

భైరవమూర్తి వ్రాసి దాని నలువైపుల 'ఓం శత్రు ముఖ మొదలు, 'స్వాహా' వరకును వున్న మూలోక్త మంత్రమును వ్రాయవలెను. పిదప ఫట్ అనియు ప్రయోగోద్దేశ్యమును వ్రాసి ఆ మంత్రమును జపించుచు, భైరవుని వామహస్తమున సగమును దక్షిణ హస్తమున శూలమును

వ్రాసి అఘోర మంత్రమును వ్రాయవలెను. దీనివలన యుద్ధమునందు శత్రువులు స్థంభింతులు అగుదురు. 'ఓం నమో భగవత్యై మొదలు స్వాహా వరకును ఉన్న మూలోక్త మంత్రమును జపించుచు, గోరోజనాదికముతో తిలకము ధరించినచో మానవుడు సమస్త జగత్తును మోహింపచేయును. “ఓం, ఫేం' మొదలు స్వాహావరకును వున్న మూలోక్త మంత్రముతో తిలకము ధరించినవాడు రాజాదులను వశము చేసుకొనును. గర్దభధూళి తీసుకుని శవముపై వేసిన పువ్వులు స్త్రీ రజోయుక్త వస్త్ర ఖండము తీసుకొని రాత్రి శత్రువు శయ్యాదులపై విసరినచో స్వజన విద్వేషము కలుగును. ఆవు డెక్క, కొమ్ము గుర్రపుడెక్క, సర్పశిరస్సు వాటిని నూరి కలిపి శత్రువు ఇంటిపై వేసినచో వారి ఉచ్చాటనము కలుగును. పచ్చని కరవీరశిఫ, మారణ ప్రయోగమునందు ఉపయుక్తమైనది. సర్పము, రక్తము, చుంచురక్తము కరవీర బీజము, మారణ సాధకములు. చచ్చినతొండ, తుమ్మెద పీత, తేలు, వీటిని చూర్ణముచేసి తైలములో వేసి ఆ తైలమును శరీరమునకు పూసినచో కుష్ట రోగము కలుగును.

'ఓం నవ గ్రహాయ' మొదలు స్వాహా వరకును వున్న మూలోక్త మంత్రమును భూర్జ పత్రముపై కాని నవగ్రహ ప్రతిమపైగాని వ్రాసి నూరు జిల్లేడు పూవులతో పూజించి ఆ యంత్రమును శ్మశానమున పాతినచో గ్రహములు శత్రువును నశింపచేయును. 'ఓం కుంజరీ' మొదలు 'గృహ్ణాత' వరకునువున్న మూలోక్తమంత్రమును భూర్జ పత్రముపై వ్రాసి శత్రుపద స్థానమున శత్రునామము వ్రాసి శ్మశానము నందు ఆ యంత్రమును పూజించినచో శత్రువు నశించును. (315)

నానామంత్ర నిరూపణము

అగ్నిదేవుడు పలికెను : ముందు 'హుం' వుంచి పిదప 'ఖేచ, ఛే' చేర్చి పిదప 'క్షః స్త్రీం హూంక్షే' వ్రాసి, చివర 'ఫట్' చేర్చవలెను. ఇది విషసర్పాదులను తొలగించును. అన్ని కార్యములను సిద్ధింప చేయును. 'ఖేచ, ఛే' అనునది కాలదష్టునకు, జీవనము ఇచ్చు మంత్రము. 'ఓం, హూం, ఖేక్షః' ఈ మంత్రము విషమును శత్రువులను నశింప చేయును.' స్త్రీం హుం ఫట్' ఈ మంత్రము ప్రయోగము పాప రోగాదులను తొలగించును. 'ఖేఛ' యను ప్రయోగము విఘ్నములను దుష్టులను శమింప చేయును. 'హూం స్త్రీం ఓం' అను మంత్రము స్త్రీ మొదలగు వారిని వశము చేయును. ఖేస్త్రీం, ఖే అనునది వశమును విజయమును కలిగించును. 'ఐం హ్రీంమొదలు హ్రీం ఐంశ్రాం' అను కుబ్జికా విద్య సర్వార్థ సాధకము. ఇపుడు శివుడు స్కందునకు ఉపదేశించిన మంత్రములను వర్ణించెదను. (316)

సకలాది మంత్రోద్ధారణము

శివుడు చెప్పెను :

స్కందా! సకల, నిష్కల, శూన్య, కాలాఢ్య,సమలంకృత, క్షపణ, క్షయ, అంతస్థ కంఠోష్ఠ, శివ అనునవి ప్రాసాద పరాసంజ్ఞకమగు మంత్రముయొక్క ఎనిమిదింటి స్వరూపము. ఇవి శబ్ద మయములగు సదాశివ రూపములు. సకల సిద్ధులను ఇచ్చునవి. అమృత అంశుమత్, ఇంద్ర ఈశ్వర ఉగ్ర ఊహక్ ఏక పాద ఐల, ఓజ, ఔషధ, అంశుమత్, వశి అనునవి వరుసగ అకారాది

ద్వాదశ స్వరములకు వాచకములు. చెప్పబోవునవి కకారా ద్యక్షర సూచకములు. వరుసగా కామ దేవ శిఖండి గణేశ, కాల శంకర, ఏక నేత్ర, ద్వినేత్ర, త్రిశిఖ, దీర్ఘ బాహుక, ఏకపాద, అర్ధ చంద్ర, వలయ, యోగినీ ప్రియ, శక్తీశ్వర, పద్మ, శాకినీ ప్రియ, ముఖబిలబ, భీషణ, కృతాంత, ప్రాణ, తేజస్వి, శక్ర, ఉదధి, శ్రీకంఠ, సింహ, శశాంక, విశ్వరూప, నారసింహములు. విశ్వరూపమును పంద్రెండు మాత్రలతో కలిపి వ్రాయవలెను. విశ్వరూపమును (హ) అంశముతో(ం) తోను ఓజస్(ఓ) తోను కలిపి శశి బీజమును(స) కలుపుకొన్నచో (ఓం) అను ప్రథమ బీజము ఉద్ధృతమగును. ఇది ఈశాన సంబద్ధము. పైన చెప్పిన పంద్రెండు బీజములలో ఐదు హ్రస్వయుక్త బీజములు, ఆరు దీర్ఘ బీజములు. మొదటి మాత్రయందును పదకొండవ మాత్రయందును ఒకే 'హం' అను బీజము ఏర్పడును. తృతీయ బీజము తత్పురుష బీజము ఐదవది. అఘోర బీజము ఏడవది. వామదేవము. దాని తరువాతది సద్యోజాతము. ఇది రసయుక్తమగు నవమ బీజము. ఈ విధముగ ఐదు బీజములతో కూడిన ఈశానాదులకు బ్రహ్మ పంచకము అనిపేరు వీటి ప్రారంభమున ప్రణవము చివర 'నమః' చేర్చవలెను. ఈశానాది నామములను చతుర్థ్యంతముగ మార్చినచో పూజోపయుక్త మంత్రములగును. ద్వితీయ చతుర్థాది మాత్రలు దీర్ఘములు. వాటిని హృదయాద్యంగ న్యాసమునందు ఉపయోగించ వలెను. చతుర్థము శిరోమంత్రము. ఇది ఈశ్వర నామకము. 'హ' కారమునకు 'ఊ' కార అనుస్వారము చేర్చగా ఏర్పడినది శిఖా మంత్రము. ఎనిమిదవది విశ్వరూప సమన్వితము. దశమము నేత్ర మంత్రము. అస్త్ర మంత్రము విసర్గ యుక్తము. శివ సంజ్ఞకమని చెప్పబడినది. హృదయాద్యం గముల ఆరు జాతులను క్రమముగా నమః స్వాహా వషట్ హుం, వౌషట్ ఫట్ అని ఉండును. ఇపుడు ప్రాసాద మంత్రమును చెప్పెదను. 'హీం, హౌం, హూం. ఇవి ప్రాసాద మంత్రబీజములు. వీటికి కుటిలములని పేరు. ఇవి సర్వకార్య సంపాదకము. హృదయ శిఖాది బీజములను వెనుక చెప్పిన విధమున ఉద్ధారము చేసి ఫట్కారము వరకును సకలాంగ న్యాసము చేయవలయును. ఆసనము అర్ధచంద్రా కారము. శివుడు కామ పూరకుడు. సర్వాలంకృతుడు. మహాపాశుపత అస్త్రము సర్వ దుష్ట వినాశకరము. ఈ విధముగ సకల ప్రాసాదము చెప్పబడినది. ఇపుడు నిష్కల ప్రాసా దమును చెప్పెదను.

ఔషధ (ఔ) విశ్వరూప-(హ) ఏకదశమాత్ర సూర్యమండల (ం) ములతో కూడిన అర్ధ చంద్రము (అనునాసిక) నాదము వీటితో కూడినది 'హౌం' అను మంత్రం. ఇది నిష్కల ప్రాసాదమంత్రము, దీనికి విసంజ్ఞ కుటిలము అని పేరు. ఇది భుక్తి ముక్తి ప్రదము. ప్రాసాద మంత్రము ఈశానాది బ్రహ్మమూర్తి పంచక యుక్తము. అందుచేత దీనిని పంచాం గము, సాంగము అని చెప్పుదురు. అంశముతో (ం) విశ్వరూప (హ) అమృత (అ) ముల కలయికచే వ్యక్తమగు హం బీజమునకు శూన్యమని పేరు. ఈశానాది బ్రహ్మాత్మ కాంకములతో రహితమగుటచే దీనికి శూన్య అని పేరు. ఈశానాది మూర్తులు ఈ బీజముల అమృత తరువులు. వీటి పూజనము సమస్త విఘ్నములను తొలగించును. అంశు మాన్ (ం) చేర్చిన విశ్వరూపము (హ) ఊహకము (ఊ) పైన అధిష్ఠితమైనచో ఏర్పడిన హూం బీజమునకు కలాఢ్యమని పేరు. ఇది సకలాంతర్గతము పూజాంగాది కములు సకల మునకే వుండును. నరసింహుడు యమరాజుపై కూర్చుండును. అనగా 'క్ష' కారము, 'మ'

కారముపై ఉండును. తేజస్వి (ర) ప్రాణ(య)ములు కూడ కలియును. పైన అంశుమత్ (ం) క్రింద ఊహకము (ఊ) ఉన్నచో (క్ష్మ్ర్యూం) అను బీజము ఏర్పడును, ఇది పైనను క్రిందను మాత్రలచే అలంకరింపబడినదిన సమలంకృతమని చెప్పబడును. చంద్రార్ధా కారబిందు నాదములతో గూడిన బ్రహ్మ విష్ణునామ విభూషితములగు ఉదధి (వ) నరసిం హ(క్ష)లను పంద్రెండుమాత్రలతో భేదితములు చేయవలయును. హ్రస్వస్వరములతో కూడిన బీజములు ఈశానాది బ్రహ్మాత్మకాది అంగములగును. దీర్ఘ స్వరయుక్త బీజములు వున్న మంత్రములు హృదయాద్యంగ విన్యాసమునకు ఉపయోగించును.

ఇపుడు దశరూప బీజ ప్రణవములను చెప్పెదను. బీజమును అనుస్వారయుక్తము చేసి 'ఓం' అను ప్రథమ వర్ణోద్ధారము చేయవలెను అంశుమత్ అంశువుల యోగముచే 'ఆం' అను నాయక స్వరూప ద్వితీయ వర్ణము 'అంశుమత్' ఈశ్వరులచే ఈం అను ముక్తి ప్రదమగు తృతీయ వర్ణము ఏర్పడును. అంశు అక్రాంతమగు ఊహకము (ఊం) చతుర్థ వర్ణము సానుస్వార వరుణ (వ్) పాణ(వ్య) తేజస్ (ర) (వ్య) ఇది పంచమ బీజాక్షరము. స్వానుస్వార కృతాంతము (మం) షష్ఠ బీజము. స్వానుస్వార ఉదక ప్రాణములు (వ్యం) సప్తమ బీజమిందు యుక్త పద్మము (పం) అష్టమ బీజము ఏకపాద యుక్త నందీశుడు (నేం) నవమ బీజము. అంతమున ప్రథమ బీజమును చేర్చవలెను. ఇట్లేర్పడిన దశ బీజాత్మక మంత్రమునకు క్షపణము అని పేరు దీని ప్రథమ, తృతీయ, పంచమ, సప్తమ, నవమ బీజములు క్రమముగ ఈశాన తత్పురుష అఘోర వామదేవ సద్యోజాత స్వరూప ములు ద్వితీయాది బీజములు హృదయాద్యంగ న్యాసోప యుక్తములు ఈ పది ప్రణవాత్మక బీజములును ఒక్కసారి ఉచ్చరించుచు 'అస్త్రాయ ఫట్' అని అస్త్ర న్యాసము చేయవలెను. ఈశానాది మూర్తుల అంతమున నమః అనునది చేర్చియే చెప్పవలెను. ద్వితీయ బీజము మొదలు నవమ బీజము వరకు ఉన్నవి విద్యేశ్వర రూపములు. 'అనంతేశ' సూక్ష్మ 'శివోత్తమ', ఏకమూర్తి, ఏకరూప, త్రిమూర్తి శ్రీకంఠ, శిఖండి అని వీటిపేర్లు శిఖండి, మొదలు అనంతేశుని విలోమ క్రమముచే బీజ మంత్రములను చేర్చవలెను. (317)

గణపూజా నిరూపణము

ఈశ్వరుడు పలికెను :

పైన తేజస్సు (ర) కల విశ్వరూపమును (హు) ఉద్ధృతము చేసి నరసింహము (క్షు) కింద కృతాంతము (య్) ఉంచవలెను. దానిచివర ప్రణవము చేర్చవలెను. 'ర్ హ్ క్ష్ మోం' ఏర్పడినది. దీని పిమ్మట ఊహకము (ఊ) అంశమత్‌ను (ం) విశ్వమును (హ) కలుపవలెను. (హూం) ఇవి రెండును వరసగ అంతస్థము కంఠ్యోష్ఠము చెప్పబడును. దీని అంతమున నమః చేర్చుటచే రెండు మంత్రములను నాలుగు అక్షరము కలవవును. విశ్వరూపము కారణమని చెప్పబడినది. దానిని పంద్రెండు మాత్రలచే గుణితము చేయవలయును. ఈ పంద్రెండులో ఐదు హ్రస్వబీజములతో ఈశానాది పంచ బ్రహ్మమూర్తులను పూజించి దీర్ఘాత్మకములగు ఆరు బీజములతో వెనుకటి వలెనే అంగన్యాసము చేయవలెను. హ్రీం వ్రాసి పిదప స్ఫురస్ఫుర వ్రాయవలెను. పిదప ఆ రెండింటికిని 'ప్ర' చేర్చవలెను. పిదప 'కః' 'వమ' 'బంధ' ఈ మూడు పదములను రెండేసి పర్యాయములు వ్రాసి

పిదప ఘూతయ అనునది వ్రాసి అంతమున హుంఫట్ చేర్చవలెను. ఇది అఘోరాస్త్ర మంత్రము. ఇపుడు శివగాయత్రి చెప్పబడుచున్నది. 'మహేశాయ విద్మహే మహాదేవాయ ధీమహి తన్నః శివః ప్రచోదయాత్' ఈ శివగాయత్రి సకల ఫలప్రదము.

యాత్రయందును, విజయాది కార్యములందు శ్రీలాభము నిమిత్తమై ముందు గణపూజ చేయవలెను. చతురస్ర క్షేత్రమును అన్నివైపుల పంద్రెండేసి కోష్టములలో విభజించవలెను. మధ్యనున్న నాలుగు పదములలో త్రికోణము రచించి దాని మధ్య త్రిదళకమలము వ్రాయవలెను. దాని పృష్ఠ మున పథిక వీథి భాగములందు మూడు దళములతో అశ్వయుక్త కమలము ఏర్పరుపవలయును. పిదప వసుదేవ పుత్రులతో (వాసుదేవ సంకర్షణగద) ప్రకాశించుచున్న త్రిదళ కమలముతో పాద పట్టికను నిర్మించవలెను. దానిపైన భాగ ప్రమాణముచే ఒక వేది రచించవలెను. పూర్వాది దిశలందు ద్వార కోణ భాగములతో ఉపద్వార మేర్పరచినచో ఆ మండలము విఘ్న నాశకమగును. మధ్యనున్న కమలము దాని వెలుపలవున్న కమలములు ఆరక్త వర్ణములై వుండవలెను. వీథిశ్వేత వర్ణమై వుండవలెను. ద్వారములరంగు ఇష్టమువచ్చినట్లు వుండవచ్చును. కర్ణికను పీతవర్ణముతోను కేసర ములు కూడ ఆ దేవ వర్ణములోను ఉండవలెను. దీనికి విఘ్నమర్ద మండలమని పేరు. దీని మధ్య భాగమున గణపతిని పూజించవలెను. నామాద్యక్షరమును అనుస్వార సహితముగ పలికి ఆది యందు 'ఓం' అంతమునందు 'నమః' చేర్చవలెను. హ్రస్వాన్త బీజ యుక్తములగు ఈశాన తత్పురుషాది మంత్రములతో బ్రహ్మమూర్తులను పూజించి దీర్ఘాంత బీజములతో అంగన్యాసము చేయవలెను. ఆ మండలము యొక్క పూర్వ దిక్కు యందున్న పంక్తియందు, 'గజ గజశీర్ష గాంగేయ, గణనాయక, గగ, నగ, గోపతి' అను పేర్లు వ్రాయవలెను. చివరి రెండుపేర్లను మూడేసి పర్యాయములు వ్రాయవలెను.

విచిత్రాంశ, మహాకాయ, లంబోష్ఠ లంబకర్ణ లంబోదర, మహాభాగ, వికృత, పార్వతీ ప్రియ, భయావహ, భద్ర భగణ, భయసూదన అను పంద్రెండు నామములు దక్షిణ దిక్పంక్తి యందు వ్రాయవలెను. పశ్చిమమున దేవత్రాస, మహానాద, భాసుర, విఘ్నరాజ, గణాధిప, ఉద్భట, స్వన, ఉద్భశుండ, భీమ, మన్మథ, మధుసూదన, సుందర, భావపుష్ట అను పేర్లును, ఉత్తరమున బ్రహ్మేశ్వర, బ్రాహ్మ, మనోవృత్తి సంలయ, లయ, నృత్య ప్రియలోల, వికర్ణ, వత్సల, కృతాంత, కాలదండ, కుంభ అను పేర్లను వ్రాసి అన్నింటిని పూజించవలెను. పదివేల జపము చేసి దశాంశ హోమము చేయవలెను. మిగిలిన మంత్రములను పదేసి పర్యాయములు జపించి ఒక్కొక్క హోమము చేయ వలెను. సకల మనో రథములు సిద్ధించును. గురువునకు, భూ, గో, అశ్వ, గజ, వస్త్రాదులు ఇచ్చి పూజించవలెను. (318)

వాగీశ్వరీ పూజా విధానము

శివుడు చెప్పెను :

ఇపుడు మండలసహిత వాగీశ్వరీ పూజా విధానమును చెప్పెదను. ఊకారమును ఘూతో చేర్చి దానికి అనుస్వారము చేర్చినచో, 'ఘూం' అను ఏకాక్షర మంత్రము ఏర్పడును. నిషాదముపై

'ఈ' చేర్చి దాని బిందు విసర్గ యుక్తము చేయవలయును. ఈ ఏకాక్షర మంత్రము అందరికిని ఉపదేశించరాదు. వాగీశ్వరీ దేవిని ఈ విధముగా ధ్యానించవలెను. దేవి శరీర కాంతి చంద్ర కుంద కుసుమములవలె వుండును. ఏబది అక్షరముల మాలామయమగు రూపము ధరించి ఉండును. ముత్యాల హారములు శ్వేత పుష్పహారములు ధరించి ఉండును. త్రినేత్రియగు ఆమె హస్తములలో వరుసగ వరద, అభయ, అక్షమాల, పుస్తకములు శోభించుచుండును. ఇట్లు ధ్యానించి పైన చెప్పిన ఏకాక్షర మంత్రము ఒక లక్ష జపించవలెను. పాదముల నుండి మస్తకము వరకు లేదా స్కందమువరకు అకారాది క్షకారాంతమగు వర్ణమాలను ఆమె ధరించి ఉన్నట్లు భావన చేయ వలెను. గురువు మంత్రోపదేశము చేయుటకు దీక్షార్థమై ఒక మండలము ఏర్పరుపవలయును. అది సూర్యాగ్రమై ఇందు విభక్తమై ఉండవలెను. రెండు భాగములందు కమలము ఏర్పరుపవలెను. ఆ కమలము సాధకునకు హితకరమగును. పిదప వీథిపదిక ఏర్పరచి నాలుగు పదములందు కమలములను వాటి బాహ్యాభాగమున వీథి పదికలను నిర్మించవలెను. రెండేసి పదములతో ఒక్కొక్క దిక్కునందు ద్వారములను ఉప ద్వారములను నిర్మించవలెను. కోణములందు రెండేసి పట్టికలు నిర్మించవలెను. తొమ్మిది కమలములను శ్వేత వర్ణములుగా చేసి కర్ణికపై బంగారు రంగుగల చూర్ణము చల్లి పచ్చగాను కేసరములను వివిధ వర్ణములుగను కోణములను రక్తవర్ణములుగను చేయవలెను. వ్యోమ రేఖాంతరము కృష్ణ వర్ణముగా చేసి ద్వారముల మానము ఇంద్రగజమానమును అనుసరించి ఉండునట్లు చేయవలెను. మధ్య కమలమున సరస్వతిని, పూర్వ కమలమున వాగీశిని ఆగ్నేయాది విదిక్కుల క్రమమున హృల్లేఖా, చిత్రవాగీశి, గాయత్రి, విశ్వరూప, శాంకరీ, మతిధృతులను స్థాపించి పూజించ వలెను. నామ ప్రారంభము హ్రీంచేర్చి నామాద్యక్షరమున బీజ రూపమున ఉచ్చరించి పూజించవలెను. సరస్వతిని వాగీశ్వరీ రూపమున ధ్యానించవలెను. కపిల ఘృతముతో హోమము చేయవలెను. ఇట్లు చేసినవాడు సంస్కృత ప్రాకృత భాషలలో, కావ్యరచన చేయు కవియగును. కావ్యశాస్త్ర విద్వాంసుడగును. (319)

మండలములు

ఈశ్వరుడు పలికెను :

స్కందా! ఇపుడు సర్వతో భద్రములు అను పేరుగల ఎనిమిది మండలములను చెప్పెదను. శంకువుతో తూర్పు దిక్కున సాధించి విషువ కాలమున చిత్ర స్వాతి నక్షత్రముల మధ్య యందుగాని లేదా సూత్రముగ్రహించి తూర్పునుండి పశ్చిమమువరకు లాగి మధ్యము నందు రెండు కోటులను గుర్తించవలెను. వాటి మధ్య నుండి ఒక దీర్ఘమైన ఉత్తర దక్షిణ రేఖ గీసి రెండు మత్స్యములను నిర్మించి వాటిని దక్షిణోత్తరములపై ఆస్ఫాలనము చేయ వలెను. క్షత పద క్షేత్రము యొక్క అర్ధ మానముచే కోణ సంపాతము చేయవలెను. ఈ విధముగా నాల్గు పర్యాయములు సూత్రమును క్షేత్రమునందు ఆస్ఫాలనము చేయగా ఒక చతురస్రము ఏర్పడును. దాని నాల్గు హస్తముల శుభకర మగు భద్ర మండలము ఏర్పరుపవలెను. ఎనిమిది పదములచే అన్ని వైపులను విభక్తములగు అరువది నాలుగు పదముల నుండి ఇరువది పదములుగల క్షేత్రమున వెలుపల ఒక వీథిని

నిర్మించవలెను. ఈ వీథి ఒక మంత్రమునకు సంబంధించినది. కమల మానముచే రెండు పదముల ద్వారము నిర్మించి దానిని కపోలయుక్తముగ చేయవలెను. కోణబంధముచే అది అందముగ ఉండవలెను. ఈ విధముగ ద్విపదమును ద్వార నిర్మాణమునందు ఉపయోగించవలెను. కమలమును శ్వేత వర్ణముగాను, కర్ణికను పీత వర్ణముగాను, కేసరములను చిత్ర వర్ణములు గాను, వీథిని రక్త వర్ణముగాను చేయవలెను. ద్వారములలో కపాల స్వరూపములు నిత్య నైమిత్తిక వీథులందు కోణము ఎఱ్రగా వుండవలెను. ఇపుడు పద్మమును గూర్చి వినుము. అసంసక్తము, సంసక్తము అని అవి రెండు విధములు. భుక్తి ముక్తి ప్రదము. అసంసక్తము ముముక్షువులకు ఉపయుక్తము బాల, యువ, వృద్ధములని సంసక్త కమలములు మూడు విధములు. అవి తమ పేర్లను అనుసరించి ఫలసిద్ధిని ఇచ్చును.

కమల క్షేత్రము నందు దిక్ విదిక్కులవైపు సూత్ర విన్యాసముచేసి పద్మ క్షేత్ర సమములగు ఐదు వృత్తములను నిర్మించవలెను. ప్రథమ వృత్తము నందు నాలుగు పుష్కరములు గల కర్ణికయు రెండవ దానియందు ఇరువది నాలుగు కేసరములు, మూడవ దానియందు గజ, కుంభ సదృశ ములగు దశ సంధులు నాల్గవ వృత్తమునందు దళాగ్ర భాగములు పంచమ వృత్తమునందు ఆకాశ మాత్రము వుండును. ఇది సంసక్త కమలము. అసంసక్త కమలమున దళాగ్ర భాగము నందున్న దిక్కుల భాగము నందున్న దిక్కుల భాగముల విస్తారము ననుసరించి రెండు భాగములు విడచి ఎనిమిది భాగములతో దళములు ఏర్ప రుప వలయును. సంధి విస్తార సూత్రముతో దాని మానమును అనుసరించి దళములను రచించవలయును. దీనియందు ఎడమ నుండి, కుడికి ఏర్పరుపవలయును. లేదా సంధి మధ్య నుండి అర్ధ చంద్రాకారముగా త్రిప్పవలెను. లేదా రెండు సంధుల అగ్రమునందున్న సూత్రమును అర్ధచంద్రాకారముగ త్రిప్పవలెను. అపుడు బాల పద్మము ఏర్పడును. సంధి సూత్రము యొక్క అగ్ర భాగము నుండి పృష్ఠ భాగము వైపు సూత్రము త్రిప్పవలెను. అది తీక్ష్ణాగ్ర భాగమగు యువసంజ్ఞక కమలము. భుక్తి ముక్తిప్రదము. ముక్తి నుద్దేశించి చేయు ఆరాధనమునందు వృద్ధ కమలమును వశీకరణాదులందు బాల పద్మమును ఉపయోగిం చవలెను. నవనాభ కమల చక్రము ఎనిమిది హస్తముల ప్రమాణము కలదై ఉండును. దానియందు మంత్రాత్మకములగు తొమ్మిది భాగములు ఉండును. దాని మధ్య భాగమున కమలముండును. కమల మానానుసారముగ పట్టిక వీథి ద్వారము యొక్క ఏడు కంఠ ములు, ఉపకంఠములు నిర్మించవలెను. ఐదు భాగముల వీథియుండును. దాని నలువైపుల పది భాగముల స్థానముండును. దాని ఎనిమిది దిక్కులందు ఎనిమిది కమలములున్న వీథి సహితమగు ఒక ద్వార పద్మము ఉండును. దాని బాహ్యాభాగమున లతా దివి భూషి తమగు ఐదు పదముల వీథియుండును. ద్వారకంఠము నందు కమలముండును. ద్వారము యొక్క ఓష్ఠ కంఠ భాగములు ఒక్కొక్క పదము నందుండును. కపోల భాగమున ఒక పదముండును. మూడు దిక్కులందును మూడు ద్వారములు స్పష్టముగా వుండును. కోణ బంధము నందు మూడు పట్టములు, రెండు పదములు, వజ్ర చిహ్నము ఉండును. మధ్య కమలము శుక్ర వర్ణము. మిగిలిన దిక్కుల కమలములు పూర్వాది క్రమమున పీత, రక్త, నీల, పీత, శుక్ల ధూమ్ర, రక్త, పీతవర్ణములై ఉండును. ఈ కమల చక్రము ముక్తిదాయకము.

పూర్వాది దిక్కులందు ఎనిమిది కమలములను శివ విష్ణ్వాది దేవతలను పూజించవలెను. శివ విష్ణ్వాదులను ప్రాసాద మధ్య కమలమందు పూజించి పూర్వాది కమలములపై ఇంద్రాది దేవ తలను పూజించవలెను. బాహ్య వీథియందు ఆ దేవతల హస్త్రములను విష్ణ్వా దులను పూజించినవాడు అశ్వమేధ ఫలము పొందును. పవిత్రారోహణాదులందు మహా మండలము ఏర్పరుపవలెను. ఎనిమిది హస్తముల పొడవైన క్షేత్రమును ఇరువది ఆరుచే విభజించి మధ్యనున్న పదద్వయము నందు కమలమును తనకు తర్వాత ఒక పదమున వీథిని దిగ్విదిక్కులందు ఎనిమిది నీలకమలములను నిర్మించవలెను. మధ్యనున్న కమలము మానముతో మొత్తము ముప్పది పద్మములు నిర్మించవలెను. వాటికి దళ సంధులు వుండకూడదు. అవి నీలేందీవరములు. దాని పృష్ఠమున ఒక పాదము, వీథియు, దాని పైన స్వస్తిక చిహ్నము ఏర్పరుపవలెను. పిదప బాహ్య భాగమున వీథికయు ద్వార ములు కమలములు ఉపకంటములు అన్నియు వుండవలెను. కోణములు రక్త వర్ణములు. వీథిపీత వర్ణము. మండల మధ్య కమలము నీల వర్ణము అయి వుండవలెను. విచిత్ర వర్ణములుగల స్వస్తికాది మండలములు సకల కామప్రదములు.

పంచాబ్జ మండలము ఐదు హస్తముల క్షేత్రమును అన్ని వైపుల నుండి పదిచే విభ జించి నిర్మించవలెను. రెండు పదములు కమలము, దాని బాహ్య భాగమున వీథి, పట్టికా, మరల నాల్గు దిక్కులందును నాలుగు కమలములు వాటి పృష్ఠ భాగమున వీథి ఉండవలెను. దానిని ఏక పదములందుగాని పద ద్వయమునందుగాని నిర్మించవలెను. కంఠోప కంఠ ములుగల ద్వారములు వాటి మధ్య భాగమున కమలములు వుండవలెను. ఈ పంచాబ్జ మండలమున పూర్వ దిక్కునందున్న కమలము శ్వేత వర్ణము, పీతవర్ణము అయి ఉండును. దక్షిణ కమలము వైఢూర్య వర్ణము,పశ్చిమ కమలము శ్వేత వర్ణము ఉత్తర కమలము శంఖ తుల్యవర్ణము. మిగిలినవన్నియు విచిత్ర వర్ణములు అయి ఉండును.

సర్వకామప్రదమగు దశ హస్త మండలమును చెప్పెదను. దానిని వికార సంఖ్యచే (24) అన్ని వైపుల విభక్తముచేసి చతురస్ర క్షేత్రము ఏర్పరుపవలెను. రెండేసి పదముల ద్వారముండును. పూర్వమునందు చెప్పిన చక్రమునందువలె దీని మధ్య భాగమున కమలముండును. ఇపుడు విఘ్న ధ్వంస చక్రము చెప్పెదను. నాల్గు హస్తముల పురము ఏర్పరచి దాని మధ్య రెండు హస్తముల గోళాకార చక్రము ఏర్పరుపవలెను. అన్ని వైపుల నుండి స్వస్తిక చిహ్న వృత్తమగు హస్త ప్రమాణముగల వీథి యుండును. ఒక్కొక్క హస్తమున నాలుగు వైపుల ద్వారములు ఏర్పరుపవలెను. నాలుగు దిక్కులందు, కమలాంకితములగు వృత్తములు ఉండును. ఈ చక్రమున శ్వేత వర్ణములగు ఐదు కమలములు ఉండును. మధ్యవర్తి కమలమున నిరాకారుడగు పరమాత్మను పూజించవలెను. పూర్వాది దిక్కులందు హృదయాద్యంగములను విదిక్కులందు హస్తములను పూజించవలెను. సద్యోజాతాది పంచ బ్రహ్మమయ ముఖములను గూడ పూజించవలెను. ఇపుడు బుద్ధ్యాధార చక్రమును చెప్పె దను. నూరు పదముల క్షేత్రమున మధ్య యందున్న పదునైదు పదములలో ఒక కమలము అంకితముచేసి ఎనిమిది దిక్కులందును ఒక్కొక్క శివ లింగమును ఉంచవలెను. రెండు పదములలో మేఖలాభాగ సహితమగు కంఠము రచించవలెను. ఆచార్యుడు తన బుద్ధి సహాయముతో లతాదులను

ఏర్పరుపవలెను. నాలుగు, ఆరు, ఐదు, ఎనిమిది ఇత్యాది సంఖ్యలో వున్న కమలములతో మండలము ఏర్పడును. ఇరువది ముప్పది కమలములున్నది కూడ ఉండును. 12,120 కమలములున్న సంపూర్ణ మండలము కూడ ఉండును. 120 కమలములు మండలము కూడ కనబడుచున్నది. విష్ణు, శివ దేవీ సూర్యులకు 1440 మండలములు ఉండును. పదిహేడు పదములతో పదిహేడు పదములను విభజించినవో 289 పదములగును. ఈ మండము నందు 'లతాలింగము' ఎట్లు ఉద్భవించునో చెప్పెదను వినుము. ఒక్కొక్క దిక్కుయందు ఐదు, మూడు, ఒకటి, మూడు, ఐదు పదములను తుడిచి వేయవలెను. పైన నున్న రెండు పదములతో లింగము పార్శ్వము నందున్న రెండేసి కోష్ఠములతో మందిరము ఏర్పడును. మధ్యనున్న రెండు పదములలో కమలము, మరల మరియొక కమలము ఏర్పడును. లింగ పార్శ్వ భాగములందు రెండు భద్రములు ఏర్పడును. ఒక పదమున ద్వారముండును. దానిని తుడిచి వేయకూడదు. ఆ ద్వార పార్శ్వములందు ఆరేసి పదములను తుడిచివేయగా ద్వార శోభ ఏర్పడును. మిగిలిన పదములందు శ్రీహరికి లతలు ఏర్పడును. పైనున్న రెండు పదములను తుడిచి వేయగా విష్ణువునకు భద్రాష్టకము ఏర్పడును. మరల నాల్గు పదములను తుడిచి వేయగా రశ్మి మానాయుక్తమగు శోభా స్థాన మేర్పడును. ఇరువది ఐదు పదములచే పద్మము, పిదప పీఠము, అపీఠము రెండేసి పద ములను వుంచగా ఎనిమిది ఉపశోభలు ఏర్పడును. దేవ్యాది సూచకమగు భద్రమండలము మధ్య విస్తృతముగను. ప్రాంత భాగమున లఘువుగను ఉండును. మధ్య తొమ్మిది పదముల కమలము ఏర్పడును. నాల్గు కోణము లందును నాలుగు భద్ర మండలములు ఏర్పడును. మిగిలిన పదమూడు పదములలో బుద్ధ్యాధార మండలము ఏర్పడును. దీనియందు నూట అరువది పదములు ఉండును. బుద్ధ్యాధార మండలము శివాది దేవతారాధనకు ప్రశస్తములు.(320)

ఘోర అస్త్రాది శాంతికల్ప నిరూపణము

పరమేశ్వరుడు చెప్పెను :

సమస్త కర్మలయందును ముందుగా సర్వసిద్ధి ప్రదమగు అస్త్రయాగము చేయ వలెను. మధ్యభాగమున శివాది అస్త్రమును, పూర్వాది దిక్కులందు క్రమముగ ఇంద్రాది దిక్పాలకుల అస్త్రము లను పూజించవలెను. శంకరునకు ఐదు ముఖములు పది హస్తములు ఉన్నవి. అట్టి శంకరుని యుద్ధ ప్రారంభమున పూజించినచో జయము కలుగును. మధ్య యందు రవిని పూర్వాది దిక్కులందు చంద్రాదులను ఉంచి గ్రహపూజ చేయవలెను. గ్రహపూజ చేయుటచే గ్రహములన్నియు ఏకాదశ స్థానమునందున్న లాభరూప ఫలమును ఇచ్చును. సమస్త ఉత్పాతములను నశింపచేయు అస్త్ర శాంతిని చెప్పెదను. ఇది గ్రహ రోగాదులను, మారిశత్రు భయాదులను తొలగించును. వినాయకుల వలన కల్గిన బాధలను తొలగించును. నరుడు లక్ష పర్యాయములు అఘోరాస్త్రము జపించినచో గ్రహములు నశించును. దివ్య ఉత్పాతములు కలిగినపుడు అర్ధ లక్ష హోమములు చేయవలెను. లక్ష ఆజ్యాహుతులు చేసినచో భూమి జోత్పాతములు నశించును. గుగ్గులు మిశ్ర ఘృతమును హోమము చేసినచో అన్ని ఉత్పాతములు నశించును. దూర్వలు అక్షతలు ఆజ్యము, హోమము

చేసిన సర్వ రోగములు నశించును. ఘృతముతో సహస్ర హోమము చేసినచో దుస్స్వప్నములు నశించును. ఇందు సంశయము లేదు. పదివేలు హోమము చేసినచో గ్రహ దోషములు తొలగును. యవఘృత హోమముచే వినాయక బాధలు తొలగును. పదివేల ఆజ్య హోమములు, పదివేల గుగ్గులు హోమములు చేసినచో భూతభేతాళ శాంతి కలుగును. ఏదైన మహా వృక్షము పడిపోయినను, ఇంటిలోనికి సర్పశవము వచ్చినను, ఘృత, అక్షతల హోమములచే విఘ్నశాంతి కలుగును. అరణ్య ప్రవేశము చేయవలసినపుడు కూడ ఇట్లు చేయవలెను. ఉల్కాపాతముగాని, భూకంపముగాని కల్గినపుడు తిలఘృత హోమములు చేసిన మంగళమగును వృక్షము నుండి రక్తము కారినను అకాలమున పుష్ప ఫలములు పుట్టినను రాష్ట్ర భంగము కల్గినను, తిలమిశ్ర ఘృతముతో అర్ధ లక్ష హోమములు చేయవలెను. ఏనుగులకు మహామారి వచ్చినపుడు ఆడ ఏనుగులకు దంతములు వచ్చినను లేదా వాటికి గండస్థలమునుండి మదము కారినను పదివేల హోమము చేసినచో శాంతి కలుగును. అకాలమున గర్భపాతమైనను, పుట్టిన వెంటనే శిశువు మరణించినను, వికృతాంగములుగల శిశువు జన్మించినను, సమయమునకు పూర్వమే శిశువు జన్మించినను పదివేల హోమములు చేసిన దోషము శమించును. సిద్ధిని సాధించుటకు తిల మిశ్రమములగు ఘృతముతో ఒక లక్ష హోమములు చేయుట ఉత్తమము. అర్ధ లక్ష హోమములు చేసినచో మధ్యమ సిద్ధియు ఇరువది ఐదువేల హోమము చేసినచో అధమ సిద్ధియు కల్గును. జపానుసారముగ హోమముచేసినచో యుద్ధమునందు విజయము లభించును. తేజశ్శాలియగు పంచముఖుని ధ్యానించుచు న్యాస పూర్వకముగ అఘోరాస్త్ర జపము చేయవలెను.(321)

పాశుపత శాంతి వర్ణనము

పరమేశ్వరుడు చెప్పెను : ఇపుడు పాశుపతాస్త్ర మంత్రముతో చేయవలసిన శాంతి పూజాదులను చెప్పెదను. ఇవి వెనుక చెప్పినట్లే చేయవలెను. ఈ మంత్రమును ఆంశిక పాఠముగాని, జపముగాని చేసినచో పూర్వకృత పుణ్యము నశించును. షడంత సంపూర్ణ మంత్రము ఆ పథ్యాదులను నివారించును. 'ఓం నమోభగవతే మొదలు సర్వదురితం నాశయ నాశయ ఫట్' వరకును మూలోక్తమైనది. పాశుపత మంత్రము. దీనిని ఒక్క పర్యాయము ఆవృత్తి చేసినంతనే సమస్త విఘ్నములు నశించును. నూరు ఆవృత్తులచే సకల ఉత్పాతములు నశించును. యుద్ధాదులందు జయము కలుగును. ఆజ్యముతో బొగ్గులు కలిపి ఈ మంత్రముతో హోమము చేసినచో అసాధ్య కార్యములు కూడ సాధించవచ్చును. ఈ పాశుపతాస్త్ర పాఠ మాత్రముచే సకల క్లేశములు నశించును. (322)

షడంగాస్త్ర వర్ణనము

పరమేశ్వరుడు చెప్పెను :

'ఓం హ్రూం హంసః' అను మంత్రముచే మృత్యురోగాదులు శమించును. ఈ మంత్రముతో ఒక లక్ష దూర్వాహోమములుచేసిన శాంతి పుష్టి లభించును. లేదా కేవల ప్రణవమునుగాని, మాయ బీజమును (హ్రీం) గాని జపించుటచే దివ్యాంతరిక్ష భౌమ ఉత్పాతములు శమించును. ఉత్పాత

వృక్షముకూడ శమించును. 'ఓం నమో భగవతి' మొదలు స్వాహా' వరకును వున్న మూలోక్త మంత్రమును లక్ష జపముచేసి దశాంశ హోమములు చేసినవాడు సర్వకర్మలను సాధించును. ఇంద్రాదులను కూడ వశము చేసుకొనును. మనుష్యుల విషయము చెప్పవలెనా. ఈ విద్య అంతర్ధాన కారిణీ మోహినీ జృంభణీ, శత్రుబుద్ధిని మోహింపచేయునది. ఈ కామధేను విద్య ఏడు విధములు. శత్రు చోరాదులను మోహింపచేయునది, ఈశ్వర పూజితము, సర్వ మహాభయములయందు స్మరింప తగునదియగు మంత్రరాజమును చెప్పెదను. లక్ష జపించి తిలహోమము చేసినచో మంత్రము సిద్ధించును. దీని ఉద్ధారములు వినుము. 'ఓం హలే' మొదలు 'స్వాహా' వరకును ఉన్న మూలోక్తమైనది మంత్రము. దుర్గ దుర్గము నుండి తరింపచేయును గాన ఆమెకాపేరు వచ్చినది. ఈమె మంగళ ప్రదురాలు. 'ఓం, హ్రీం చండకపాలిని' మొదలు 'ఫట్ హ్రీం' వరకును ఉన్న మూలోక్త మంత్రమును జపించి బియ్యము కడిగి వాటిని ఈ మంత్రముతో ముప్పది పర్యాయములు అభిమంత్రించి వాటిని దొంగలకు పంచిపెట్టినచో ఆ బియ్యము నమలగనే వారి తెల్లటి దంతము పడిపోవును. వారు చౌర్యపాప విముక్తులు అగుదురు. 'ఓం జ్వలల్లోచన' మొదలు 'తే స్వాహా' అను మూలోక్త మంత్రముతో క్షేత్ర పాలునకు బలియిచ్చి న్యాసము చేసినచో గ్రహము వశమగును. శత్రువులు నశింతురు. రణభూమి యందు శత్రువులు హతులగుదురు. విషబీజ న్యాసముచే మూడు విధములగు విషములను లేదా విఘ్నములను హరించవచ్చును. అగురు చందన, కుష్ఠ, కుంకుమ, నాగ, కేసర, నఖ దేవదారువులను సమప్రమాణమున గ్రహించి నూరి ధూపము వేయవలెను. దీనిలో తేనె కలిపి దాని సుగంధముతో శరీరమును వస్త్రాదులను భూషితము చేసినచో వివాదము, స్త్రీ మోహనము, శృంగారము, కలహము మొదలగు సమయములందు శుభఫలము లభించును. కన్యావరణ, భాగ్యోదయ సంబంధి కార్యములందుకూడ సాఫల్యము లభిం చును. మాయా మంత్రము (హ్రీం)చే అభిమంత్రించిన రోచన నాగకేసర కుంకుమ మన శ్శిలలతో తిలకము ధరించి ఎవనిని చూచినవాడు వశమగును. శతావరి చూర్ణమును పాలతో కలిపి త్రాగినచో పుత్రులు ఉత్పాదింప కలుగును. నాగకేసర చూర్ణమును నేతిలో కలిపి తిన్నను, పలాశ బీజములను నూరి త్రాగినను పుత్రోత్పాదకుడు అగును.

'ఓం ఉత్తిష్ట' మొదలు 'స్వాహా' వరకును ఉన్న మూలోక్తమగునది ఇరువది ఆరు అక్షరముల సిద్ధ విద్య. నదీ తీరమునందలి మట్టితో లక్ష్మీమూర్తిచేసి, తత్తువుల రసముతో మందారపత్రముపై ఇష్ట స్త్రీ నామమును వ్రాయవలెను. పిమ్మట మూత్రోత్సర్గము చేసి ఈ మంత్రమును జపించినచో అభీష్ట స్త్రీ వశమగును. ఓం జూం ('క్షుం సః వషట్) ఇది మహామృత్యుంజయ మంత్రము. దీని జప హోమములు పుష్టి కార్యములు 'ఓం హం సః హ్రూం హూం సః హ్రః సౌస్త్రైః' ఈ అష్ట వర్ణ మృత సంజీవని విద్య రణమునందు జయమును ఇచ్చును. ఈశానాది మంత్రములు కూడ ధర్మ కామాదిదాయకములు 'ఈశానః మొదలు భవోద్భవాయ నమః' అను వరకును మూలోక్తములు ఐదు ఈశానాది మంత్రములు. ఇపుడు భుక్తి ముక్తి ప్రదములగు పంచబ్రహ్మ యొక్క ఆరు అంగము లను చెప్పెదను. 'ఓం నమః' పరమాత్మనే మొదలు 'తేస్వాహా' వరకును ఉన్న డెబ్బది ఏడు అక్షర ముల హృదయ మంత్రము మనోరథములను ఇచ్చును. 'ఓం శివ శివాయ నమః' ఇది శిరో

మంత్రము. "ఓం శివ హృదయే జ్వాలినీ స్వాహా శిఖాయై వషట్" ఇది శిఖామంత్రము. "ఓం శివాత్మక" మొదలు 'స్తంభయ హూం' వరకును ఉన్నవి ఒక నూరు ఐదు అక్షరముల కవచ మంత్రము 'ఓం ఓజసే' అనునది నేత మంత్రము. 'ఓం ప్రస్ఫుర' మొదలు 'హుం ఫట్' వరకును ఉన్నది. అఘోరాస్త్ర మంత్రము. (323)

రుద్రశాంతి వర్ణనము

పరమేశ్వరుడు చెప్పెను :

ఇపుడు కల్పా ఘోర శివ శాంతిని చెప్పెదను. అఘోర శివుడు ఏడు కోట్ల గణములకు అధి పతి. బ్రహ్మ హత్యాది పాపములను నశింపచేయును. ఉత్తమాధమ సిద్ధులను ఇచ్చువాడు సమస్త రోగములను తొలగించును. భౌమ దివ్య అంతరిక్ష ఉత్పాతములను మర్దించును. విషగ్రహ పిశాచములను కూడ మ్రింగివేసి సకల కామములను పూరించును. పాప పీడలను తొలగించుటకు దుర్భాగ్య దుఃఖ వినాశకమగు ప్రబల ప్రాయశ్చిత్తరూపుడు. ఏకవీరమును సర్వాంగ న్యాసము చేసి సర్వదా పంచముఖ ధ్యానము చేయవలెను. శాంతిక పౌష్టికములందు శివుడు శుక్లవర్ణుడు, వశీకరణమున రక్త వర్ణుడు, స్తంభన కర్మయందు పీతవర్ణుడు, ఉచ్చాటన మారణ కర్మలందు ధూమ్రవర్ణుడు, ఆకర్షణమున కృష్ణ వర్ణుడు, మోహన కర్మయందు కపిల వర్ణుడు, ముప్పది రెండు అక్షరములు వేదోక్తములగు అఘోర శివుని రూపము ఇది. అందుచే అట్టి అఘోర శివుని పూజించ వలెను. ఈ మంత్రమును ముప్పది లక్షల జపముచేసి గుగ్గులు మిశ్రఘృతముతో దశాంశ హోమము చేసినచో, సాధకుడు మంత్ర సిద్ధి పొంది సిద్ధార్థుడగును. అతడన్నియు సాధించగలడు. అఘోర మంత్రమును మించి భుక్తిముక్తిప్రదమగు మరియొక మంత్రము లేదు. దీనిని జపించుటచే అబ్రహ్మ చారి బ్రహ్మచారి అగును. అస్నాతకుడు స్నాతకుడు అగును. ఆ ఘోరాస్త్రము అఘోర మంత్రము. ఈ రెండును మంత్రరాజములు. ఏ ఒక్క దానినైనను జపహోమార్చనములందు వినియోగించినచో, యుద్ధమునందు శత్రు సైన్యమును నశింప చేయవచ్చును.

ఇపుడు సర్వార్థ సాధకమగు మంగళకరమైన రుద్ర శాంతిని చెప్పెదను. పుత్ర ప్రాప్తి గ్రహ బాధా నివారణ, విష వ్యాధుల వినాశము, దుర్భిక్ష మహామారి, శాంతి దుస్స్వప్న నివారణము, బల రాజ్యాది ప్రాప్తి రిపువినాశనము, వీటిని సాధించుటకు రుద్ర శాంతిని ప్రయోగించవలెను. వృక్షము అకాలమున ఫలించినను సమస్త గ్రహబాధలను తొలగించుట కును కూడ దీనిని ప్రయోగిం చవలెను. పూజనమునందు మంత్రాంతమున నమః చేర్చవలెను. హోమమునందు 'స్వాహా' చేర్చ వలెను. తృప్తియందు 'వషట్' పుష్టికరము యందు 'వౌషట్' చేర్చవలెను. మంత్రమునందు రెండు చోట్ల 'చ' వున్నచోట ఆవశ్యకతాను సారముగ 'నమః' స్వాహా మొదలు జాతి యోగములు చేయవలెను. "ఓం రుద్రాయ" మొదలు "అవికృత రూపాయ" వరకును మూలోక్తము రుద్ర శాంతి మంత్రము. ఉత్తరపర్తి కమలదళమున నియతితత్త్వము. పశ్చిమ కమల దళమున కాలతత్వము నైఋతి దళమున మాయాతత్వము వుండును. వీటియందు దేవతలను పూజించవలెను. ఏక పింగళాయ, శ్వేత పింగళాయ, కృష్ణ పింగళాయ, మధు పింగళాయ, నమః అని నియతి

తత్త్వమునందు పూజించవలెను. అనంతాయ, ఆర్ద్రాయ, శుష్కాయ, పయోగణాయ, అని కాలతత్త్వము నందు కరాళాయ వికరాళాయ అని మాయాతత్త్వము నందు పూజించవలెను. దక్షిణ దళమునందున్న విద్యాతత్త్వమున "సహస్ర శీర్షాయ" మొదలు "సహస్ర లింగాయ" వరకు చెప్పి పూజించవలెను. అచటనే ఏక జటాయ మొదలు షడ్రుద్రాయ వరకును షడ్విధ రుద్రుల పూజచేయవలెను. ఆగ్నేయ దళమున వున్న ఈ శతత్త్వమున భూతపతయే, పశుపతయే, ఉపమాపతయే, కాలాధిపతయే అని చెప్పి పూజ చేయవలెను. పూర్వ దళమున ఉన్న సదాశివతత్త్వము నందున్న ఆరువురిని "ఉమాయై" మొదలు "విశ్వేశ్వరాయ నమః" వరకును వున్న మంత్రములతో పూజించవలెను. కర్ణికలందు ఉన్న శివతత్త్వముపై ఉమామహేశ్వరుని 'ఓం వ్యోమ వ్యాపినే' మొదలు శివాయ వరకును వున్న మూలోక్త మంత్రముతో పూజించవలెను. శివతత్త్వమున వ్యోమ వ్యాపియను పేరుగల శివుని నవ పదముల పూజచేయవలెను. పిదప యోగ పీఠముపై ఉన్న శివుని నవపద యుక్త నామములు చెప్పుచు పూజించవలెను. "శాశ్వతాయ" మొదలు పంచ వక్త్రాయ వరకును ఉన్న మూలోక్తము మంత్రము. పిదప 'సత్' అను పేరుగల శివుని నవపదముల పూజచేయవలెను. పిదప యోగపీఠముపై నున్న శివుని నవపదయుక్త నామములు చెప్పుచు పూజించవలెను. "శాశ్వతాయ" మొదలు పంచవక్త్రాయ వరకును ఉన్న మూలోక్తము మంత్రము. పిదప 'సత్' అను పేరుగల పూర్వ దళము నందు "అఘోర హృదయాయ" మొదలు "జోతీ రూపాయ" వరకును మూలోక్త మంత్రముతో శివుని పూజించవలెను. ఆగ్నేయమునందున్న కాలతత్త్వము నందును, దక్షిణము నందున్న విద్యా తత్త్వము నందును "పరమేశ్వరాయ" మొదలు "తేజ" వరకును ఉన్న మూలోక్త మంత్రముతో పరమేశ్వరుని పూజించవలెను. నైఋతి అందున్న కాలతత్వము నందును పశ్చిమ దిక్కునందున్న కాల తత్వము నందును "ఓం ధ్రు ధ్రు" మొదలు"సుఖప్రద" వరకును వున్న మూలోక్త మంత్ర ముతో పూజించవలెను. వాయవ్య, ఉత్తర దళములందున్న నియతి పురుషులను "సర్వసాన్ని ధ్యకర" మొదలు "నమోన్నమః" వరకును ఉన్న మూలోక్త మంత్రముతో పూజ చేయవలెను. ఈశాన్యమునందున ప్రాకృత తత్త్వమునందు కూడ జపహోమములు చేయవలెను. ఈ రుద్ర శాంతి గ్రహబాధను, రోగాది త్రివిధ పీడలను నశింపచేయును. (324)

ఆగ్నేయ అంశకాది వర్ణనము

పరమేశ్వరుడు చెప్పెను :

రుద్రాక్ష కటకమును ధరించవలెను. రుద్రాక్షల సంఖ్య విషమముగా ఉండవలెను. అవి సమములుగను దృఢములుగను ఉండవలెను. ఏక ముఖమును గాని, త్రిముఖమును గాని, పంచ ముఖమును గాని, యథాలాభముగా ధరించవచ్చును. ద్విముఖ చతుర్ముఖ షణ్ముఖ రుద్రాక్షలుకూడా ప్రశస్తములే. బ్రద్దలగుట కాని పురుగు తొలుచుట కాని కలుగుటచే క్షతములు కాకూడదు. వాటిపై కంటకము లుండవలెను. దక్షిణభుజ శిఖాదులపై చతుర్ముఖ రుద్రాక్షను ధరించవలెను. అట్లు చేయుటచే ఆ బ్రహ్మచారి బ్రహ్మచారియగును. అస్నాతకుడు కూడ స్నాతకుడు అగును. లేదా శివ మంత్రముతో పూజించి సువర్ణ అంగులీయ కమును కుడిచేత ధరించవలెను. శివ శిఖాజ్యోతి

సావిత్రములు ఈ నాలుగును గోచరములు. గోచరమునకు కులము యని అర్థము. దీక్షితుడు దీనిని లక్ష్యము కొనవలెను. ప్రాజాపత్య మహీపాల కపోత గ్రంథికులు శివకులమునకు చెందినవారు. కుటిల వేతాల పద్మ హంసలు శిఖాకులమునకు చెందిన వారు. ధృతరాష్ట్ర బక, కాక, గోపాలులు జ్యోతి కులమునకు చెందినవారు. కుటికా సాతర, గుటికా దండులు సావిత్రీ కులమునకు చెందిన వారు. ఈ విధముగా ఒక్కొక్క కులమున నాలుగేసి భేదములున్నవి.

ఉత్తమ మంత్రసిద్ధినిచ్చు సిద్ధాది అంశములను చెప్పెదను. కూటయంత్ర రహితము లగు మాతృకాక్షరములను నేలపై వ్రాయవలెను. యంత్రాక్షరములను వేరువేరుచేసి అను స్వారమును వేరుచేయవలెను. సాధకుని నామమునందలి అక్షరములను కూడా చేయ వలెను. మంత్రము యొక్క ఆద్యంతాది అక్షరములందు సాధకుని నామాక్షరములు చేర్చి సిద్ధము సాధ్యము సుసిద్ధము అరియను సంజ్ఞలను అనుసరించి, అక్షరములను క్రమముగా లెక్కపెట్టవలెను. మంత్రము యొక్క ఆద్యంతము లందు సిద్ధము ఉన్నచో అది నూటికి నూరుపాళ్ళు సిద్ధిదాయకము. ఆద్యంతములందు సిద్ధి కలది వెంటనే సిద్ధిని ఇచ్చును. ఆద్యంతములందు సుసిద్ధమున్నచో ఆ మంత్రమును కూడ సిద్ధముగ గ్రహించవలెను. ఆద్యంతములందు అరి ఉన్నచో ఆ మంత్రమును పరిత్యజించవలెను. సిద్ధము అనునవి కూడ తుల్యములే. మంత్రముయొక్క ఆద్యంతాక్షరము లందు సిద్ధమున్నచో మధ్య వేలకొలది అరి అక్షరములున్నను దోషకారకము కాదు. మాయ బీజము, ప్రాసాద బీజము ప్రణవము వీటి యోగముచే విఖ్యాత మంత్రమునందు క్రమముగా బ్రహ్మ విష్ణు రుద్రాంశకములు ఏర్పడును. బ్రహ్మాంశకము బ్రహ్మ విద్య యనియు, విష్ణ్వంశకము వైష్ణవమనియు రుద్రాం శకము వీరమనియు చెప్పబడును. ఇంద్రాంశక మంత్రము ఈశ్వర ప్రియము. నాగాంశ మంత్రము నాగములవలె స్తబ్ధ నేత్రము. యక్షాంశ మంత్రము భూషణప్రియము, గంధర్వాంశ మంత్రము, అతి గీతాది ప్రియము, భీమాంశ, రాక్షసాంశ, దైత్యాంశ మంత్రములు యుద్ధకారకములు. విద్యాధరాంశ మంత్రము అభిమానదము. పిశాచాంశ మంత్రము మాలాక్రాంతము. మంత్రమును పూర్తిగా పరీక్షించి ఉప దేశము చేయవలెను. ఏకాక్షర మంత్రము మొదలు అనేకాక్షర మంత్రముల వరకు చివర ఫట్ చేర్చినచో అది మంత్రమని చెప్పబడును. ఏబది అక్షరముల వరకువున్న మంత్రము 'విద్య'. ఇరువది అక్షరముల వరకు ఉన్నది 'బాలావిద్య'. ఇరువది అక్షరముల వరకు ఉన్న అస్త్రాంత మంత్రము 'రుద్ర'. అంతకుమించి మూడు వందల అక్షరముల వరకు వున్న మంత్రమునకు వృద్ధయని పేరు. మంత్రములలో 'అ' కారము మొదలు 'హ' కారము వరకు వున్న అక్షరములు ఉండును. మంత్రములందు క్రమముగా శుక్ల, కృష్ణ పక్షములుండును. అనుస్వార విసర్గలు విడిచి స్వరములు పది. హ్రస్వ స్వరములు శుక్లపక్షము. దీర్ఘ స్వరము కృష్ణపక్షము. ఇవియే ప్రతిపదాది తిథులు. శాంతి కార్యములను ఉదయ కాలమునందును, వశీకరణ కర్మలను భ్రమిత కాలము నందును ద్వేషణ ఉచ్చాటన కర్మలను భ్రమిత కాలమునందు సంధ్యా ద్వయము నందును స్తంభన కర్మలను సూర్యాస్తమయ కాలమునందును చేయవలెను. ఇడానాడి చరించునపుడు శాంతికకర్మలు పింగళానాడి చలించునపుడు ఆకర్షణ కర్మలు చేయవలెను. విషమతలమున మారణ ఉచ్చాటనాది పంచకర్మలు వేరువేరుగ చేయవలెను. అధర గృహమున పృథివియు, ఊర్ధ్వ గృహమున తేజస్సు,

మధ్య జలము చెప్పబడినవి. రంధ్రములు ఎచ్చట ఉండునో అచటను, బాహ్య పార్శ్వములందును వాయువు లోపటి పార్శ్వములందు ఆకాశము ఉండును. పార్థివాంశము నందు స్తంభనము జలీయాం శము నందు శాంతికర్మ తైజశాంసము నందు వశీకరణము, వాయువు నందు భ్రమణము ఆకాశము నందు పుణ్య కర్మయు చేయవలెను. (325)

గౌర్యాదిపూజా విధానము

పరమేశ్వరుడు చెప్పెను :

భుక్తి ముక్తి ప్రదమును సౌభాగ్యాదిదాయకమును అగు ఉమా పూజను చెప్పెదను. మంత్రధ్యాన మండల ముద్రా హోమాది సాధనములను కూడ చెప్పెదను. 'గౌరీ మూర్తయే నమః'యిది గౌరీదేవి వాచక మూలమంత్రము. 'ఓం హ్రీం సః శౌం గౌర్యై నమః' వీనిలో మూడక్షరముతో 'నమః' ఆదులు చేర్చి షడంగన్యాసము చేయవలెను. ప్రణవముచేత ఆసనమును, హృదయ మంత్రముచే మూర్తిని కల్పించవలెను. కాల బీజ శివ బీజముల ఉద్ధారము చేయవలెను. దీర్ఘ స్వరాక్రాంత ప్రాణముతో (యాం యీం మొదలు) జాతియుక్త షడన్యాసము చేయవలెను. ప్రణవముతో ఆసన న్యాసము, హృదయ మంత్రముతో మూర్తి న్యాసము చేయవలెను. ఇంతవరకు యామల మంత్రము చెప్పితిని. ఇపుడు ఏకవీరమును చెప్పెదను. అగ్ని మాయాకుశానువులతో సృష్టిన్యాస యుక్తమగు వ్యాపక న్యాసము చేయ వలెను. శివశక్తిమయ బీజములు హృదయాదులందు వర్జితములు. బంగా రము, వెండి, శిల మొదలైన వాటితో గౌరీ ప్రతిమచేసి పూజించవలెను. లేదా పంచపిండ ప్రతిమ చేయవలెను. నలువైపుల అవ్యక్త ప్రతిమయు, మధ్యమున వ్యక్త ప్రతిమయు వుంచవలెను. ఆవరణ దేవతా రూపమున క్రమముగా లలితాది శక్తులను పూజించవలెను. మొదట వృత్తాకారమగు అష్టదళ కమలము ఏర్పరచి ఆగ్నేయాది దళములందు క్రమముగ, లలితా, సుభగా, గౌరి క్షోభణీలను, పూర్వాది దళములందు వామాజ్యేష్ఠా, క్రియా, జ్ఞానాలను, పీఠయుక్త వామ భాగమునందు శివుని అవ్యక్త రూపమున పూజించవలెను. దేవి వ్యక్త రూపమున రెండు లేదా మూడు నేత్రములుండును. ఆమెను శుద్ధ రూపుడగు శివునితో కలిపి పూజించవలెను. ఆ దేవి రెండు పీఠములందు లేదా రెండు పద్మములందు కూర్చుండును. ఆమెకు నాలుగు ఎనిమిది లేదా పదునెనిమిది భుజములు ఉండును. సింహముపై గాని, తోడేలుపై కాని కూర్చుండును. కుడి ప్రక్కన ఉన్న తొమ్మిది హస్తములలో స్రక్, అక్ష సూత్ర, కలికా, ముండ, ఉత్పల, పిండికా, బాణ, చాపములు వుండును. వామ హస్తము లందు పుస్తక, తాంబూల, దండ, అభయ, కమండలు, గణేశ, దర్పణ, బాణ చాపములు ఉండును.

ఆమెకు వ్యక్త ముద్రలుగాని, అవ్యక్త ముద్రలుగాని చూపవలెను. ఆసన సమర్ప ణమున పద్మముద్ర చూపవలెను. శివుని పూజించునపుడు లింగముద్ర చూపవలెను. దీనికే శివ ముద్ర అని పేరు. ఇరువురికి ఆవాహనీ ముద్ర చూపవలెను. శక్తి ముద్రకు యోని అని పేరు. ఇదిచతురస్ర మండలాకారము మధ్యన ఉన్న నాలుగు కోష్టములలో త్రిదళ కమలములను వ్రాయవలెను. మూడు కోణముల ఊర్ధ్వ భాగమునందు రెండేసి పదములలో అర్ధచంద్రుని వ్రాయవలెను. మొదటి దానికంటె రెండవది రెట్టింపు ఉండవలెను. రెండేసి పదముల ద్వార కంఠభాగము, దానికి రెట్టింపు ఉప

కంఠము ఉండవలెను. ఒక్కొక్క దిక్కునందు మూడేసి ద్వారములు ఉంచి లేదా సర్వతో భద్ర మండలము ఏర్పరచి పూజించవలెను. లేదా వేదికపై దేవతను స్థాపించి పంచగవ్య పంచామృతాదులతో పూజించవలెను. ఉత్తరాభిముఖుడై పూజించి రక్తపుష్పములను సమర్పించవలెను.

ఆజ్యముతో నూరు హోమములు చేసి పూర్ణాహుతి నిచ్చువాడు సర్వ సిద్ధులను పొందును. బలి సమర్పించు ముగ్గురు లేదా ఎనమండుగురు కన్యకలకు భోజనము పెట్టవలెను. పూజా నైవేద్యమును శివభక్తులకు ఇవ్వవలెను. కాని, తాను ఆ నైవేద్యాన్ని స్వీకరించరాదు. ఇట్లు చేయుటచే కన్య కోరువానికి కన్య లభించును. పుత్రులు లేనివానికి పుత్రులు లభించును. దౌర్భాగ్యవంతురాలు సౌభాగ్యశాలిని అగును. రాజు రణమునందు జయమును రాజ్యమును పొందును. ఎనిమిది లక్షలు జపించుటచే వాక్సిద్ధి కలుగును. దేవతలు వశమగుదురు. ఇష్ట దేవతకు నివేదించ కుండగ భోజనము చేయకూడదు. ఎడమ చేతితోకూడ పూజించవచ్చును. విశేషించి అష్టమీ చతుర్దశీ తృతీయలందు అట్లు చేయవలెను.

ఇపుడు మృత్యుంజయ పూజను చెప్పెదను. కలశముపై పూజ చేయవలెను. హోమము నందు ప్రణవము మృత్యుంజయుని మూర్తిమూలమంత్రము చెప్పుచు కుంభ ముద్ర చూపవలెను. క్షీరదూర్వా, ఆజ్య, అమృత, పునర్నవా, పాయస పురోడాశములతో హోమము చేయవలెను. హోమమునకు పూర్వము పదివేల మంత్రజపము చేయవలెను. మృత్యుంజ యునకు నాలుగు ముఖములు నాలుగు భుజములు ఉండును. రెండు హస్తములలో కలశమును రెండు హస్తములలో వరదాభయములను ధరించి ఉండును. కుంభముద్రచే మృత్యుంజయునకు స్నానము చేయించవలెను. ఆరోగ్యైశ్వర్య దీర్ఘాయువులు లభించును. ఈ మంత్రముతో అభిమంత్రించిన ఔషధము శుభకరము. మృత్యుంజయుని ధ్యానించినను పూజించినను అపమృత్యువు తొలగును. (326)

దేవాలయాది మాహాత్మ్య వర్ణనము

పరమేశ్వరుడు చెప్పెను :

వ్రతేశ్వరులను సత్యాది దేవతలను పూజించి వారికి వ్రతము సమర్పించవలెను. అరిష్ట శాంతికి అరిష్టమూలమాల ఉత్తమము. కల్యాణ ప్రాప్తికి సువర్ణ రత్నమాలా, మారణ కర్మకు మహాశంఖమాలా, శాంతికర్మకు శంఖమాలా, పుత్ర ప్రాప్తికి మౌక్తికమాలను ఉపయోగించి జపము చేయవలెను. స్ఫటికమాల ఐశ్వర్య ప్రదము, రుద్రాక్షమాల ముక్తి ప్రదము. ఉసిరికాయ ప్రమాణము గల రుద్రాక్షము ఉత్తమము. మేరు సహితములు, లేదా, మేరు రహితమగు మాలను జపమునందు ఉపయోగించవచ్చును. మానసిక జపము చేయుచున్నపుడు మాలయందలి పూసలను అనామిక అంగుష్ఠములతో జరపవలెను. ఉపాంశు జపమునందు తర్జన్య అంగుష్ఠములను కలిపి గణన చేయవలెను. జప సమయమున ఎన్నడును మేరువును దాటరాదు. ప్రమాదవశమున మాల జారిపడినచో రెండు వందల పర్యాయము జపము చేయవలెను. ఘంట సర్వ వాద్యమయము, ఘంటావాదనము సకల ప్రయోజన ప్రదము, గృహమునందును, మందిరమునందును, శివలింగమును గోమయ గోమూత్ర వల్మీక మృత్తికా భస్మ జలములతో శుద్ధి చేయవలెను.

స్కందా ! 'ఓం నమశ్శివాయ' అను మంత్రము సకలాభీష్ట ప్రదము. ఇది వేదమునందు పంచాక్షర మనియు లోకమున షడక్షరమనియు చెప్పబడినది. వట బీజములో వటవృక్ష మున్నట్లు ఓంకారము నందు శివుడు సమ్మితుడై ఉండును. 'ఓం నమః శివాయ, ఈశానః సర్వ విద్యానాం' మొదలగు మంత్రములు సమస్త విద్యా సముదాయము. ఈ షడక్షర మంత్రమునకు భాష్యము 'ఓం నమః శివాయ' అను మంత్రమే పరమపదము. ధర్మార్థ కామ మోక్షములను ఇచ్చు శివుడు లోకానుగ్రహార్థమై లింగములో ఉన్నాడు. అందుచే ఈ మంత్రముచే శివలింగమును పూజించవలెను. శివలింగమును పూజించనివాడు ధర్మదూరుడగును. లింగపూజనము భుక్తి ముక్తి ప్రదముగాన, ఆ జీవితాంతము శివలింగమును పూజించవలెను. ప్రాణములు పోయినను శివలింగ పూజ చేయకుండగ భోజనము చేయకూడదు. రుద్రపూజచే రుద్ర సారూప్యము, విష్ణు పూజచే విష్ణు సారూప్యము, సూర్య పూజచే సూర్య సారూప్యము, శక్తి పూజచే శక్తి సారూప్యము లభించును. సంపూర్ణ యజ్ఞ తపోదాన ఫలములు లభించును. లింగస్థాపన చేసిన వానికి కోటిరెట్లు ఫలము లభించును. ప్రతిదినము త్రికాలములందును, పార్థివ లింగము నిర్మించి దానిని బిల్వ పత్రములతో పూజించువానియొక్క నూట పదకొండు తరములవారు స్వర్గమును పొందుదురు. విత్తానుసారముగా భక్తి పూర్వకముగా దేవతా మందిరములు కట్టించవలెను. దేవాలయ నిర్మాణమున యథాశక్తిగా అల్పము ఖర్చు పెట్టిన దరిద్రునకును, అధికముగా ఖర్చు పెట్టిన ధనికునకు సమాన ఫలము లభించును. సంపాదించిన ధనము నందలి రెండు భాగములను ధర్మ కార్యము నందు వ్యయించి జీవన నిర్వాహమునకు రెండు భాగములు ఉంచుకొనవలెను. జీవనము అనిత్యము కదా! దేవతా మందిరమును నిర్మించువాడు ఇరువది యొక్క తరములవారిని ఉద్ధరించి అభీష్టములను పొందును. మట్టి కఱ్ఱ ఇటుక శిల వీటితో మందిర నిర్మాణము వరసగా కోటి గుణ ఫలము కలది. ఎనిమిది ఇటుకలతో నైనను మందిరము నిర్మించువాడు స్వర్గ లోకమును పొందును. ఆడుకొనుచు ధూళితో మందిరము కట్టు వానికి కూడ అభీష్ట మనోరథసిద్ధి కలుగును. (327)

ఛందస్సారము - 1

అగ్నిదేవుడు పలికెను :

ఇపుడు వేదమూల మంత్రానుసారముగ పింగళోక్త ఛందస్సులను క్రమముగా వర్ణించెదను. మ, న, భ, య, జ, ర, స, త, గణములు అని గణములు ఎనిమిది. అన్ని గణములందును మూడేసి అక్షరములు ఉండును. మగణములో అన్ని అక్షరములు గురువులు. నగణములో అన్ని అక్షరములు లఘువులు. ఆది గురువు భగణము, ఆది లఘువు యగణము, అంత్య గురువు సగణము, అంత్య లఘువు తగణము. పాదాంతము నందున హ్రస్వాక్షరము వికల్పముగా గురువగును. విసర్గ అనుస్వార సంయుక్తాక్షర జిహ్వా మూలీయ ఉపధ్మానీయములకు అవ్యవహిత పూర్వమునందున్న హ్రస్వము కూడ గురువు. దీర్ఘము గురువు. గురువునకు 'గ' లఘువునకు 'ల' అని సంకేతము. వసు శబ్దము ఎనిమిదికి, వేద శబ్దము నాలుగుకు సంజ్ఞ అగును. ఈ విషయములను లోకానుసారము తెలుసుకొనవలెను. (328)

ఛందస్సారము - 2

అగ్నిదేవుడు పలికెను :

'ఛందస్' అను శబ్దము ఈ ప్రకరణములో అనువృత్తి చెందుచుండును. దైవి గాయత్రి ఏకాక్షరి, ఆసురిపంచదశాక్షరి, ప్రాజాపత్య అష్టాక్షరి, యాజుషి షడక్షరి, సామ్నీ గాయత్రి ద్వాదశాక్షరి, ఆర్చి అష్టాదశాక్షరి, సామ్ని గాయత్రిలో క్రమముగా రెండేసి అక్షరములు పెంచుచు ఆరుకోష్ఠములలో వ్రాయవలెను. ఆర్చి గాయత్రిలో మూడేసి ప్రాజాపత్య గాయత్రిలో నాలుగేసి ఇతర గాయత్రులలో ఒక్కొక్కటి అక్షరము పెంచవలెను. ఆసురి గాయత్రియొక్క ఒక్కొక్క అక్షరము క్రమముగ ఆరు కోష్ఠములలో తగ్గినచో వాటిని సామ్న్యాది భేద సహితముగా ఉష్ణిక్, అనుష్టుప్, బృహతి, పంక్తి, త్రిష్టుప్, జగతీ ఛందస్సులుగా తెలుసుకొనవలెను. యాజుషి సామ్ని ఆర్చి గాయత్రుల అక్షరములను వేరు వేరుగా కూర్చుటచే బ్రాహ్మీ గాయత్రి, బ్రాహ్మి ఉష్ణిక్ మొదలగునవి ఏర్పడును. యాజుషికి ముందున్న మూడు గాయత్రుల అక్షరములను వేరువేరుగా ఆరుకోష్ఠములలో చేర్చుటచే ఎన్ని అక్షరములగునో అవి ఆర్షీ గాయత్రి, ఆర్షి ఉష్ణిక్ ఇత్యాది భేదములుగా ఏర్పడును. వీటిని అరువది నాలుగు గోష్ఠములలో వ్రాయవలెను. (329)

ఛందస్సారము

అగ్నిదేవుడు పలికెను :

ఈ ప్రకరణమును చివరివరకు 'పాదము' అను పదము అనువర్తించును. గాయత్రికి ఒక పాదమున ఎనిమిది అక్షరములు ఉండును. జగతికి పండ్రెండు అక్షరములు, విరాట్‌నకు పది, త్రిష్టుప్‌నకు పండ్రెండు అక్షరములు ఉండును. ఛందస్సులలో కొన్ని ఏక పాదములు, ద్విపాదములు ఇత్యాది విధమున నుండును. గాయత్రి ఆరేసి అక్షరముల నాల్గు పాదములతో కూడ ఉండును. కొన్ని చోట్ల ఏడు అక్షరముల మూడు పాదములతో కూడ ఉండును. దీనికి నిచృత్ అని పేరు. ప్రథమ పాదము ఎనిమిది అక్షరములు ద్వితీయ పాదము ఏడు అక్షరములు, తృతీయ పాదము ఆరు అక్షరములు అయినచో అది ప్రతిష్ఠా గాయత్రి. ఇందుకు విపరీతముగా మూడు పాదములలో వరుసగా ఆరు, ఏడు, ఎనిమిది అక్షరములున్నచో వర్ధమాన గాయత్రి మొదటి పాదము ఆరు, రెండవది ఎనిమిది, మూడవది ఏడు అక్షరములున్నచో అతిపాద నిచృత్' అని పేరు. రెండు పాదము లందు తొమ్మిదేసి అక్షరములు, తృతీయ పాదమున ఆరు అక్షరములు ఉన్నచో 'నాగీ గాయత్రి' ఆరు తొమ్మిది తొమ్మిది ఉన్నచో వారాహి గాయత్రి. ఇపుడు మూడవ భేదము చెప్పబడు చున్నది. ద్విపాద ఛందస్సులో వరుసగా పండ్రెండు ఎనిమిది అక్షరములు ఉన్నచో అది ద్విపాద విరాట్. పదకొండేసి అక్షరముల ఒక పాదము వున్నచో ఉష్ణిక్, ప్రథమ తృతీయ పాదములందు ఏడేసి అక్షరములు ద్వితీయ పాదమున పండ్రెండు అక్షరములు, ద్వితీయ తృతీయములు ఎనిమిదేసి అక్షరములైన పునరుష్ణిక్. ప్రథమ ద్వితీయములు ఎనిమేసి అక్షరములు, తృతీయము పండ్రెండు అక్షరములు అయినా, పరోష్ణిక్. ఏడేసి అక్షరముల నాలుగు పాదములున్నను ఉష్టిక్ చంధస్.

ఎనిమిదేసి అక్షరములు నాలుగు పాదములున్నది అనుష్టుప్ ఛందస్సు. త్రిపాద అనుష్టుప్ కూడ వుండును. దీనిలో మొదటి పాదమున ఎనిమిది, ద్వితీయ, తృతీయములందు పండ్రెండేసి అక్షరము లున్నది ఒక భేదము మధ్యమ పాదముగాని అంతిమ పాదముగాని అష్టాక్షరమై మిగిలిన రెండు పాదములందు పండ్రెండేసి అక్షరములున్నది రెండవ భేదము. ఒకపాదము జగతీఛందస్సు, మూడు పాదములు గాయత్రి ఛందస్సు అయినచో అది బృహతీ ఛందస్సు. మూడవ పాదము మొదటి పాదమువలె అయినచో అది పథ్యాబృహతి. ప్రథమమగు జగతీ పాదము ద్వితీయ పాదమై మిగిలినవి మూడు గాయత్రి పాదములైనచో యదిన్యంకు సారిణీ బృహతీయగును. క్రోష్టుకి మతము ప్రకారము దీనికే స్కంద లేదా గ్రీవాయని పేరు. అంతిమ పాదము జగ తియై మొదటి మూడుపాదములు గాయత్రియైనచో అది ఉపరిష్టాద్బృహతి. ప్రథమ పాదము జగతియై మిగిలిన పాదములు గాయత్రియైనచో అది పురస్తాద్బృహతి. తొమ్మిదేసి అక్షరములు నాలుగు పాదములు కూడ కనబడు చున్నవి. పది అక్షరముల రెండు పాదములు, ఎనిమిదేసి అక్షరముల రెండు పాదములు వున్నదికూడ బృహతియే. కేవల జగతీ పాదములు మూడున్నచో మహాబృహతీ.

పండ్రెండేసి అక్షరముల రెండు పాదములు ఎనిమిదేసి అక్షరముల రెండు పాదములు ఉన్నచో 'పంక్తి' ఛందస్సు. విషమ పాదమైనచో అనగా ప్రథమ తృతీయ చరణములు పండ్రెండేసి అక్షరములు మిగిలినవి రెండు ఎనిమిదేసి అక్షరములు అయినచో సతః పంక్తి ఛందస్సు. అవి విపరీతావస్థలో ఉన్నచో అది కూడ సతః పంక్తి. మొదటి రెండు పాదములు పండ్రెండేసి అక్షరములు మిగిలిన రెండు పాదములు ఎనిమిదేసి అక్షరము లైనచో ప్రస్తార పంక్తి. చివరి రెండు పాదములందు పండ్రెండేసి అక్షరములు మొదటి రెండు పాదములందును ఎనిమిదేసి అక్షరములున్నచో ఆస్తార పంక్తి. పండ్రెండేసి అక్షరము లున్న రెండుపాదములు మధ్యనుండి మిగిలిన పాదములందు ఎనిమిదేసి అక్షరము లున్నచో విస్తారపంక్తి.

ప్రథమ చతుర్థములందు పండ్రెండేసి అక్షరములు, ద్వితీయ చతుర్థములందు ఎనిమిదేసి అక్షరములు వున్నచో సంస్తార పంక్తి. ఐదేసి అక్షరముల నాలుగు పాదములు ఉన్నచో అక్షర పంక్తి. ఐదేసి అక్షరముల రెండు పాదములే వున్నచో అల్పశః పంక్తి. అయిదేసి అక్షరములు ఐదు పాదము లున్నది పదపంక్తి. ప్రథమమునందు నాలుగు అక్షరములు, ద్వితీయమునందు ఆరు అక్షరములు మిగిలిన మూడింటియందు ఐదేసి అక్షరములు ఉన్నను పద పంక్తియే. ఎనిమిదేసి అక్షరముల ఐదు పాదములున్నది పథ్యా పంక్తి. ఎనిమిదేసి అక్షరముల ఆరు పాదములు ఉన్నది జగతీ పంక్తి.

ఒక పాదము త్రిష్టుప్, ఎనిమిదేసి అక్షరములు నాలుగు పాదములు ఉన్నది త్రిష్టుప్ జ్యోతిష్మతి. ఒక పాదము జగతి నాలుగు పాదములు గాయత్రియైనచో జగతీ జ్యోతిష్మతి. మొదటి పాదము పదకొండు అక్షరములు, మిగిలిన నాలుగు పాదములు ఎనిమిదేసి అక్షరములైనచో పురస్తా జ్యోతి. మొదటి పాదము పండ్రెండు అక్షరములు, మిగిలిన నాలుగు పాదములు ఎనిమిదేసి అక్షరములైనను అదియే పేరు. మధ్యమ చరణమున పండ్రెండు అక్షరములు, మిగిలిన చరణములందు ఎనిమిదేసి అక్షరములున్నచో అది మధ్యేజ్యోతి మధ్య చరణము పండ్రెండు అక్షరములు మిగిలినవి ఎనిమిదేసి

అక్షరములు ఉన్నను అదియే పేరు. మొదటి నాలుగు పాదములందు ఎనిమిదేసి అక్షరములు, చివర పాదమునందు పదకొండు అక్షరములు లేదా పండ్రెండు అక్షరములు ఉన్నచో అది ఉపరిష్టాజ్యోతి. గాయత్ర్యాది ఛందస్సులందు ఒక పాదమున ఐదు అక్షరములు ఇతర పాదములందు నియతాక్షరములు ఉన్నచో శంకుమతి. ఒక చరణము ఆరు అక్షరములు ఇతర చరణములందు నియతములగు అక్షరములున్నచో కకుద్మతి. మూడు పాదముల ఛందస్సులో ప్రథమ తృతీయ పాదములందు ఎక్కువ అక్షరములుండి మధ్యయందు తక్కువ అక్షరములున్నచో అది పిపీలిక మధ్య. దీనికి విపరీతముగ ఉన్నది యవమధ్య గాయత్రి లేదా ఉష్ణిక్ మొదలగు ఛందస్సులలో ఒక అక్షరము తగ్గినచో నిచృత్ అనియు, ఒక అక్షరము పెరిగినచో భూరిక్ అనియు రెండు అక్షరములు తగ్గిన విరాట్ అనియు, రెండు అక్షరములు పెరిగిన స్వరాట్ అనియు పేర్లు. సందేహము కల్గినపుడు మొదటి పాదమున బట్టి ఛందస్సును నిర్ణయించవలెను. దేవతా, స్వర, వర్ణ, గోత్రాదుల ద్వారా కూడ నిర్ణయించవలెను. గాయత్ర్యాది ఛందస్సులకు క్రమముగా అగ్ని సూర్య చంద్ర బృహస్పతి, మిత్రావరుణ ఇంద్ర విశ్వే దేవతలు, షడ్జాదులు స్వరములు. శ్వేత సారంగ, కృష్ణ, నీల, లోహిత, గౌరవములు వర్ణములు. కృతి ఛందస్సు యొక్క వర్ణము గోరోచనా సమానము అతి ఛందస్సుల వర్ణము శ్యామలము ఏడు ఛందస్సులకును వరుసగా అగ్ని వేశ్య, కాశ్యప, గౌతమ, అంగీరస, భార్గవ, కౌశిక, వశిష్టులు దేవతలు. (330)

ఛందోజాతి నిరూపణము

అగ్నిదేవుడు చెప్పెను :

ఉత్కృతి ఛందస్సునందు నూట నాలుగు అక్షరములు ఉండును. ఉత్కృతి నుండి నాలుగేసి అక్షరములు తగ్గించుచు పోయినచో వేరువేరు ఛందస్సులు ఏర్పడును. అవి వైదిక ఛందస్సులు. గాయత్రి మొదలు త్రిష్టుప్ వరకు వున్నవి. లౌకిక ఛందస్సులు కూడ వాటి పేర్లు త్రిష్టుప్, పంక్తి, బృహతీ, అనుష్టుప్, ఉష్టిక్, గాయత్రి అనునవి. గాయత్రిలో ఒక్కొక్క అక్షరము తగ్గినచో సుప్రతిష్ఠా ప్రతిష్టా మధ్యా, అత్యుక్తాత్యుక్తా మొదలగు ఛందస్సు లేర్పడును. ఛందస్సులో నాల్గవ భాగమునకు పాదమని పేరు. ముందు గణఛందస్సు చెప్పబడుచున్నది. నాలుగు లఘు అక్షరములు ఒక గణము. ఇవియైదు కొన్ని చోట్ల ఆది గురువు-మధ్య గురువు-అంత్య గురువు సర్వ గురువు-నాల్గు అక్షరము లును లఘువులు ఉండవచ్చును. ఇపుడు అర్యా లక్షణము చెప్పబడుచున్నది. ఏడున్నర గణములతో ఆర్య ఏర్పడును. విషమ గణము జగణము కాకూడదు. ఆరవ గణము జగణము కావలెను. లేదా సర్వ లఘువు కావలెను. సర్వ లఘువైనపుడు ఆగణము యొక్క ద్వితీయాక్షరము నుండి పదసంజ్ఞ ఏర్పడును. ఆరవ గణము మధ్య గురువుగాని, సర్వ లఘువు కాని అయినచో, ఏడవ గణము కూడ సర్వ లఘువైనచో దాని ప్రథమాక్షరము నుండి పదసంజ్ఞ ప్రవర్తించును. ఉత్తరార్ధమున ఐదవ గణము సర్వ లఘువైనచో దాని ప్రథమాక్షరము నుండి పద ప్రారంభమగును. ఉత్తరార్ధమున ఏడవ గణము ఏకమాత్ర లఘువగును. పూర్వార్ధ ఉత్తరార్ధములందు మూడేసి గణములుండి వాటి తరువాత పాద విరామమైనచో ఆ ఆర్యకు పథ్యాయని పేరు. పూర్వార్ధము నందుగాని

ఉత్తరార్ధమునందు గాని రెండింటి యందుకాని మూడు గణముల తరువాత పాద విరామము లేకున్నచో దానికి విపులయని పేరు. ద్వితీయ చతుర్ధగణములు గుర్వక్షరముల మధ్యనుండి జగణము కూడ వున్నచో దానికి చపలయనిపేరు. పూర్వార్ధమున చపలా లక్షణమున్నది. ముఖచపలా! ఉత్తరార్ధ మున చపలా లక్షణమున్నది. జఘన చపలా, రెండింటి అందును. చపలాలక్షణము ఉన్నది మహా చపలా! పూర్వార్ధమువలె ఉత్తరార్ధమున్నచో గీతి ఉత్తరార్ధమువలె పూర్వార్ధమున్నచో ఉపగీతి. పూర్వోక్త క్రమమునకు విపరీతముగ నున్నచో ఉద్గీతి. ఇపుడు మాత్రాఛందస్సు చెప్పబడుచున్నది. ప్రథమ తృతీయ చరణములందు పదునాలుగు లఘువులు, ద్వితీయ చతుర్ధ చరణములందు పదహారు లఘువులు, అన్ని చరణముల అంతమునందు రగణ లఘువు, గురువులు ఉన్నచో వైతాళీయ ఛందస్సు. దీని అంతమున ఒక గురువు అధికముగ ఉన్నచో అది ఔపచ్ఛందసికము. దీని చరణముల అంతములందు భగణము, రెండు గురువులు వున్నచో 'ఆపాతాలికా' ఈ వైతాళీ ఛందస్సునందు చెప్పబడిన రగణాదులతో ఒక్కొక్క పాదము యొక్క అంతమున ఎనిమిది లకార ములు, చెప్పబడినవి. వాటిని విడిచి ప్రత్యేక పాదమున మిగిలిన లకారములలో సమ 'ల' కారములు విషమ 'ల' కారములతో కలువకూడదు. ద్వితీయ చతుర్ధ పాదములందు ఆరు లఘువులను వరు సగా ప్రయోగించకూడదు. తృతీయ చతుర్ధ పాదములందు చతుర్ధ 'ల' కారము, పంచమ 'ల' కారముతో సంయుక్తమైనచో యది ప్రాచ్యవృత్తి. ప్రథమ తృతీయ పాదములందు ద్వితీయ తృతీయ 'ల' కారములు మిశ్రితములైనచో ఉదీచ్యవృత్తి రెండు లక్షణములను ఒకే పర్యా యము ప్రవర్తించినచో అది ప్రవృత్తికా. నాల్గు పాదములు విషమ పాదములను అనుసరించి యున్నచో అది చారుహాసిని. సమపాద లక్షణములు ఉన్నచో అపరాంతిక. ఒక్కొక్క పాదమున పదునారు 'ల' కారములుండి, పాదాంతి మాక్షరములు గురువులైనచో అది మాత్రా సమకము. దీనిలో పంద్రెండవ 'ల' కారముల స్వరూపము నందేవున్నచో యది వనవాసికా పంచమ అష్టమ 'ల' కారములు లఘువులైనచో విశ్లోకము తొమ్మిదని కూడ లఘువైనచో అది చిత్ర. నవమదశమములు కలిసినచో ఉపచిత్ర మాత్రా సమకాది పంచఛందస్సులలో ఒక్కొక్క పాదముతో నాలుగు పాదముల ఛందస్సు ఏర్పరచినచో దానికి పాదాకులకము అని పేరు. ఒక్కొక్క పాదమున పదునారేసి లఘువులు ఉండి దేనితోను కలిసి గురువు కానిచో అది గీత్యార్య. దీనిలోనే అర్ధ భాగములో అన్ని మాత్రలు గురువులు, రెండవ అర్ధమున లఘువులు అయినచో అదిశిఖా. దీనికి విపర్యస్తార్ధ మైనచో తూలిక. పూర్వార్ధమున ఇరువది తొమ్మిది 'ల' కారములు, ఉత్తరార్ధమున ముప్పది ఒక్క 'ల' కారములు, చివరి రెండు లఘువుల స్థానమున ఒక గురువు వున్నచో అది సమావల. 'గు' యనునది ఒక గురువును చెప్పును. అక్షర సంఖ్యలో గురుసంఖ్యను తగ్గించగ మిగిలినది లఘుసంఖ్య అగును. (331)

విషమ కథనము

అగ్నిదేవుడు పలికెను :

సమ, అర్ధసమ, విషమములను, మూడు విధములగు వృత్తములను చెప్పెదను. సమవృత్త సంఖ్యలో అదే సంఖ్యతో గుణించవలెను. దాని గణన ఫలము అర్ధ సమవృత్త సంఖ్య అగును. అర్ధ

సమవృత్త సంఖ్యలో కూడ ఆ సంఖ్యతో గుణించగా ఎంత వచ్చునో యన్ని విషమ వృత్తములగును. విషమ వృత్త అర్ధ సమవృత్త సంఖ్యలలో మూల రాశిని తీసివేయగా శుద్ధవిశమ, శుద్ధ అర్ధసమ, వృత్తముల సంఖ్య తెలియును. ఒక్కొక్క పాదమునందు గురు లఘువులతో సమాప్తిని పొంది అను ష్టుప్‌కు 'సమాని' అని పేరు. అంతిమ వర్ణములు వరుసగ లఘువు గురువుయైనచో అది 'ప్రమాణి' ఈ రెండింటి కంటే భిన్నమైనది. వితానము, ఇటుపైన మూడు అధ్యాయముల వరకు 'పాదస్య' అను పదము, పద చతురూర్ధ్వ ఛందస్సువరకు అనుష్టుప్ వక్త్రము అనునదియు, అధికార పదములు వక్త్ర జాతి ఛందస్సులో పాద ప్రథమాక్షరము తరువాత సగణన గణములను ప్రయోగించరాదు. చతుర్థాక్షరము తరువాత భగణము ప్రయోగించవలెను. ద్వితీయ, చతుర్థ పాదముల నాల్గవ అక్షరముల తరువాత జగణము వచ్చినది పథ్యా వక్త్ర. కొందరి మతము ప్రకారము ఇందుకు విపరీతముగ చేసినచో అది పథ్యా. విషమపాద చతుర్థాక్ష రానంతరము, నగణము సమపాద చతుర్థాక్షరానంతరము యగణము ఉన్నది చపలా సమ పాదములలో ఏడవ అక్షరము లఘువు అయినచో అది విపులా. ప్రథమ తృతీయ పాదముల, చతుర్థాక్షరము తరువాత, యగణమునకు బదులు భగణాదులున్నచో యది 'విపుల'. ఈ విధముగ 'విపుల' అనేక విధములుగా ఉండును. ఇంతవరకు వక్త్రజాతి ఛందస్సులు చెప్పబడినవి. అనుష్టుప్ ప్రథమ పాదము తరువాత పాదములందు క్రమముగా నాల్గేసి అక్షరమున్నచో దానికి పాద చతురూర్ధ్వము అని పేరు. దీనిలో చివరి రెండు అక్షరములు గురువులైనచో ఆపీడము. మొదటి రెండు అక్షరములు, గురువు, మిగిలినవన్ని లఘువు లైనచో 'ప్రత్యాపీడము' పదచతురూర్ధ్వ ఛందస్సులో, ప్రథమ పాదమునకు ఇతర పాదమునకును పరివర్తనమున్నచో వరుసగా మంజరి, లవలి, అమృతధార, అను ఛంద స్సులు ఏర్పడును. ఇపుడు ఉద్గీతా ఛందస్సు చెప్పబడుచున్నది. ప్రథమ పాదమున స, జ, స, లఘువులు, ద్వితీయ పాదమున న, స, జ, గురువులు, తృతీయ పాదము భ, న, జ, లఘు గురువులు, చతుర్థ పాదమున స, జ, సజ, గురువులు ఉన్నచో అది ఉద్గతా ఛందస్సు. దీని తృతీయ చరణమున రా, న, భ, గురువులు వున్నచో యది సౌరభము. ఉద్గీత తృతీయ పాదమున న, న, స, స లు ఉన్నచో అది లలిత, ప్రథమ పాదమున య, స, జ, భ, గురు ద్వయములును, ద్వితీయ పాదమున స, న, జ, ర, గురువులు, తృతీయ పాదమున న, న, స ములును, చతుర్థ పాదమున న, న, న, జ, భగణములును ఉన్నచో అది ప్రచుపిత ఛందస్సు. దీని తృతీయ పాదమున న, స, న, న, స, గుణ ములున్నచో వర్ధమానఛందస్సు. తృతీయపాదమున త, జ, ర ములు ఉన్నచో అది శుద్ధ విరాదర్షభము. ఇపుడు అర్ధ సమవృత్తములు చెప్పెదను. (332)

అర్ధసమ నిరూపణము

అగ్నిదేవుడు పలికెను :

ప్రథమ పాదమున స, స, స, స, ల, గు లు; రెండవ పాదము భ, భ, భ, గు, గు, లు వుండి ఉత్తరార్ధము పూర్వార్ధము వలె ఉన్నచో అది ఉపచిత్రకము. ప్రథమ పాదమున భ, భ, భ, గు, గు, లు; ద్వితీయ పాదమున న, జ, జ, జ, లు వున్న ద్రుత మధ్య ప్రథమ పాదమున స, స, స, గు,

లు; ద్వితీయ పాదమున భ, భ, భ, గులు వున్నచో వేగవతి, మొదటి పాదమున త, జ, ర, గులు; ద్వితీయ పాదమున య, స, జ, గు, గు, లు ఉన్నది భద్రవిరాట్. ప్రథమ పాదమున స, జ, స, గు, లు; ద్వితీయ పాదము భ, ర, న, గు, గు, లు వున్నవి 'హేతుమతి'. ప్రథమ పాదమున త, త, జ, గు, గు, లు; ద్వితీయ పాదమున జ, త, జ, గు, గు లు వున్నది 'ఆఖ్యానికి' ఏత ద్విపరీతముగా ఉన్నది 'విపరీ తాఖ్యానకి'. ప్రథమ పాదమున స, స, స, ల, గు లు; ద్వితీయమున న, భ, భ, ల లు ఉన్నది 'హరిణప్లుత'. ప్రథమ పాదమున న, న, ర, ల, గు లు; ద్వితీయమున న, జ, జ, ర, లు; ఉన్నది 'అపరవక్త్రము'. ప్రథమ పాదమున న, ర, య, లు; ద్వితీయము న, న, జ, ర, గు, లు ఉన్నది 'పుష్పితాగ్ర'. ప్రథమ పాదమున ర, జ, ర, జ లు; ద్వితీయ పాద మున జ, ర, జ, ర, గులు ఉన్నది 'యమవతి'. ప్రథమ తృతీయ చరణములందు ఇరు వది ఎనిమిది లఘువులు ఒక గురువు ద్వితీయ చతుర్థ చరణములందు ముప్పది లఘువులు ఒక గురువు వున్నది శిఖా. ఏత ద్విపరీతముగ ఉన్నది ఖంజ. ఇపుడు సమవృత్తము చెప్పబడుచున్నది. (333)

సమవృత్త నిరూపణము

అగ్నిదేవుడు పలికెను :

విచ్ఛేదమునకు 'యతి' యని పేరు. ఒక్కొక్క పాదమున త, గ, ణ, యగణములున్నది. 'తనుమధ్య' జ, స, గు లున్నది 'కుమారలలిత' భ, భ, గు వున్నది 'చిత్రపద'. మ, గు, గు లు ఉన్నది విద్యున్మాలా. భ, త, లగులున్నది మాణవకా 'క్రీడితకా'. రన, స, లు వున్నది హల ముఖీ. న, న, మ లు ఉన్నది భుజంగ శిశుభృత మ, న, గు, గు లు 'హంసరుత'. య, స, జ, గు లు, 'శుద్ధవిరాట్', య, న, గు లు పణవము. ర, జ, ర, గు లు 'మయూరసారిణి'. మ, భ, స, గు లు మత్త త, జ, జ, గు లు; 'ఉపస్థిత', భ, మ, స, గు లు 'రుక్మవతి'. త, త, జ, గుగులు. 'ఇంద్రవ్రజా', జతజ, గుగులు, ఉపేంద్రవ్రజా. ఇంద్రవ్రజ, ఉపేంద్రవ్రజా లక్షణములు రెండును ఒకే ఛందస్సుతో ఉన్నవి. ఉపజాతి, భ, భ, గు,గు,లు, తోదకము, భ, త, త, గు, గు లు శాలిని. దీనిలో చతుర్థ సప్త మాక్షరములపై యతి. మ, భ, త, గు, గులు వాతోర్మి. చతుర్థ సప్తమాక్షర యతి. మ, భ, త, న, ల, గు లు 'భ్రమరీ విలసిత'. చతుర్థ సప్త మాక్షర యతి, ర, న, ర, ల, గులు రథోత్థతా చతుర్థ సప్తమాక్షర యతి. ర, న, భ, గు, గులు 'స్వాగత', న, స, గు, గు, లు 'వృత్త'. ర, జ, ర, ల, గులు 'శ్యేని', జ, ర, జ, గు గులు 'విలాసిని' లేదా 'రమ్యా'.

ఇకపై జగతీ ఛందస్సు ఆరంభమగును. జ, త, జ, ర, లు వంశస్థ వృత్తము. త, త, జ, ర, లు 'ఇంద్రవంశి'. నాలుగేసి సగణములు కలది 'తోటక వృత్తము'. న, భ, భ, ర, లు 'ధృతవిలంబితము'. న, న, మ, య, లు 'శ్రీపుట' వృత్తము, అష్టమ చతుర్థాక్షరము లందు విరామము, జ, స, జ, స, లు 'జలోద్ధతగతి'. షష్టాక్షరములందు యతి, న, న, మ, ర, లు. త, త, ము న, య, న, య, లు, 'కుసుమవిచిత్ర' న, న, ర, ర లు 'చంచలాక్షికా', నాలుగు యగణములు ఉన్నచో 'భుజంగ ప్రయత' నాలుగు రగణములు 'స్రగ్విణి', సజ, స, స, లు 'ప్రమితాక్షర', భ, మ, స, మ, లు 'కాంతోత్పీడ', మ, మ, య, య, లు 'వైశ్వదేవి' పంచమ

సప్తమాక్షరములందు యతి. న, జ, భ, య, లు నవమాలిని, మ, న, జ, ర, గులు 'ప్రహర్షిణి'. తృతీయ దశమాక్షరములపై యతి. జ, భ, స, జ, గు, లు 'రుచిర'. చతుర్థ నవమాక్షరములపై యతి, న, న, న, సగులు 'గౌరి'. య, త, న, స, గు, గు లు 'అసంబాధ'. పంచమ నవమాక్షరములపై యతి. న, ర, స, ల, గు, లు 'అపరాజిత'. సప్తమ సప్తమాక్షరములపై యతి. న వ, భ, న, ల, గు, లు 'ప్రహరణకలిత', సప్తమ సప్త మాక్షరములపై యతి. త, భ, జ, జ, గు, గు లు వసంత తిలక, దీనికి 'సింహోన్నత', 'ఉద్ధర్షిణి' అని నామాంతరములు. నాలుగు నగణములు ఒక సగణము చంద్రావతి. షష్ట నవమాక్షరములపై యతి ఉన్నచో దీనికి మాలా అని పేరు. అష్టమ సప్తమాక్షరము లపై యతి ఉన్నచో 'మణి, గణ, నికర' అని పేరు. న, న, మ, య, య లు మాలినీ. అష్టమసప్త మాక్షరములపై యతి, భ, ర, న, న, గు లు 'ఋషభగజవిలసితము'. సప్తమ నవమాక్షరములపై యతి. య, మ, న, స, భ, ల గు లు, 'శిఖరిణి'. షష్ట ఏకాద శాక్ష రములపై యతి. జ, స, జ, స, య, ల, గు లు 'పృథ్వి'. అష్టమ, నవమాక్షరములపై యతి. మ, ర, న, భ, న, ల, గు లు వంశపత్రపతితము. దశమ సప్తమాక్షరములపై యతి. న, స, మ, ర, స, ల, గులు షష్ట చతుర్థ సప్తమాక్షరములపై యతి ఉన్నది 'హరిణి', మ, భ, న, త, త, గు, గు లు 'మందాక్రాంతా', చతుర్థ షష్ట సప్తమాక్షరములపై యతి. మ, త, న, య, య, యలు 'కుసుమితలతా వేల్లితా'. పంచమ, షష్ట, సప్త మాక్షరములపై యతి. మ, స, జ, భ, త, గులు 'శార్దూలవిక్రీడితము'. ద్వాదశ సప్తమాక్ష రములపై యతి. మ, ర, భ, న, య, భ, ల గులు సువదన. ఇది కృతి ఛందస్సులో అంతర్గతము. సప్తమ, షష్టాక్షరములపై యతి. కృతి ఛందస్సు యొక్క ప్రతిపాదము నందు వరుసగా గురు లఘువులు ఉన్నచో దానికి వృత్తమని పేరు. మ, ర, భ, న, య, య లు 'స్రగ్ధరా'. సప్తమాక్షరములపై యతి. భ, ర, న, ర, న, గులు. 'సుభద్రక', దశమైకా దశాక్షరములపై యతి. న, జ, భ, జ, భ, జ, భ లగులు, అశ్వలలిత ఏక దశ ద్వాదశములపై యతి, మ, త, న, న, న, న, లగులు మత్తక్రీడ. అష్టమ పంచ దశా క్షరములపై యతి. భ, త, న, స, భ, భ, న, యలు తన్వి. పంచమ, సప్తమ, ద్వాద శాక్షరములపై యతి. భ, మ, స, భ, న, న, న, గు లు 'క్రౌంచపద' . పంచమ, పంచమ, అష్టమ, సప్తమాక్షరములపై యతి. మ, మ, త, న, న, న, ర, న, ల గులు 'భుజంగవిజృంభితము'అష్టమ, ఏకాదశ సప్త మాక్షరములపై యతి. మ, న, న, న, న, న, న, స, గుగులు 'అప హావ వృత్తము'. నవమ, షష్ట షష్ట పంచ మాక్షరములపై యతి. ఒక్కొక్క పాదములో రెండు నగణములు, ఏడు రగణములు ఉన్నచో 'దండకము'. దీనికే చండవృష్టి ప్రపాతమని పేరు. దీనిలో రెండు నగణములు కాక, రగణమునందు వృద్ధియైనచో వ్యాల జీమూతాది నామములగు దండకములు ఏర్పడును. ఇపుడు గాథాప్రస్తారమును చెప్పెదను. (334)

ప్రస్తార నిరూపణము

అగ్నిదేవుడు పలికెను :

పేరు చెప్పని ఛందస్సులన్నియు గాథా ఛందస్సులో అంతర్గతములు. ఇపుడు ప్రస్తారము చెప్పబడుచున్నది. అన్ని అక్షరములును గురువులైన పాదములో ఆది గురువు నకు క్రింద లఘువు

వ్రాయవలెను. దాని పిమ్మట అదే క్రమమున వర్ణములను కూర్చవలెను. నష్ట సంఖ్యను సగము చేయగా ఒక లఘువు వ్రాయవలెను. సగము చేసినపుడు అది విషమమైనచో దానికి ఒకటి చేర్చి సమముచేసి మరల దానిని సగము చేయవలెను. ఇపుడు ఒక గుర్వక్షరము లభించును. ఎన్ని అక్షరముల ఛందస్సు యొక్క భేదము తెలియ వలెనో అన్ని అక్షరములు పూర్తియగు వరకు గురు లఘువులను వ్రాయుచు పోవలెను. ఉద్దిష్ట సంఖ్యను చెప్పుటకు గురు, లఘు వర్ణములను క్రమముగ, ఒక పంక్తిలో వ్రాసి వాటిపైన క్రమముగ ఒకటినుండి రెట్టించుచు, అంకములు ఉంచవలెను. ఎన్ని అక్షరముల ఛందస్సు యొక్క సంఖ్య తెలియవలెనో దాని అర్ధ భాగము తీసివేయబడును. అపుడు రెండు లభించును. దానిని వేరుగా ఉంచవలెను. విషమ సంఖ్య నుండి ఒకటి తగ్గించగ, శూన్యము లభించును. దానిని రెండుకు క్రింద వ్రాయవలెను. శూన్య స్థానమున రెట్టింపు చేయ వలెను. అట్లు చేయవచ్చిన అంకమును పైనున్న అర్ధస్థానమునందు ఉంచి దానిచేత గుణించ వలెను. మేరు ప్రస్తారముచే ఒక ఛందస్సులో ఎన్ని లఘువులు ఎన్నిగురువులు ఉండునో, ఎన్ని వృత్తములు ఏర్పడునో తెలియును. మేరు ప్రస్తారమున క్రిందినుండి పైకి, అర్ధాంగుళము చొప్పున విస్తారము తగ్గుచుండును. ఛందస్సంఖ్యను రెట్టించి, ఒక్కొక్కటి తగ్గించి నచో అన్ని అంగుళముల ప్రస్తార దేశము ఏర్పడును. ఈ విధముగా ఛంద స్సారము చెప్పబడినది. (335)

శిక్షా నిరూపణము

అగ్నిదేవుడు పలికెను : ఇపుడు శిక్ష చెప్పెదను. మొత్తము వర్ణములు అరువది మూడు లేదా అరువది నాలుగు. వీటిలో ఇరువది ఒక్క స్వరములు, ఇరువది యైదు స్పర్శలు, ఎనిమిది యాదులు, నాలుగు యమములు చెప్పబడినవి. అనుస్వార విసర్గలు, పరాశ్రితములగు జిహ్వా మూలీయ ఉపధ్మానీయములు, దుస్స్పృష్ట లకారము, ఇవి అరువది మూడు వర్ణములు. ప్లుతలు కారము చేర్చి నచో అరువది నాలుగు. అనుస్వారోచ్చారణము ఖే. అరా వలె ఉండును. 'హ' అనునది 'ఙ' కారాది పంచమాక్షరములు, య, ర, ల, వ, లు వీటితో కలిసినపుడు ఉరస్యమగును. వీటితో సంయుక్తము కానిచో కంఠ్యము ఆత్మ బుద్ధితో పదార్థములను ఆలోచించి చెప్పవలెనను ఇచ్ఛచే మనస్సుతో కలియును. ఆ మనస్సు జఠరాగ్నిని కొట్టును. జఠరాగ్ని వాయువును ప్రేరేపించును. ప్రాణవాయువు హృదయమునందు చరించుచు ప్రాతస్సవన కర్మకు సాదరమును, గాయత్రి ఛందస్స మాశ్రితమును అగు మంద్రస్వరమును పుట్టించును. పిదప ప్రాణవాయువు కంఠమున తిరుగుచు మాధ్యందినయుతమగు మంత్రోపయోగియైన మధ్యమ స్వరమును పుట్టించును. పిదప ఆ వాయువు శిరోదేశమును చేరి ఉచ్చ ధ్వని యుక్తమగు జగతీచ్ఛంద సమాశ్రితయైన సాయంసవన కర్మ సాధనమైన స్వరమును పుట్టించును. పైకి వెళ్లిన ఆ ప్రాణవాయువు మూర్ధస్థానమున ఆఘాతము చెంది ముఖము నందలి కంఠాదిస్థానము నందు చేరి వర్ణములను పుట్టించును. స్వరము, కాలము, స్థానము ఆభ్యంతర ప్రయత్నము, బాహ్య ప్రయత్నము వీటిని బట్టి వర్ణములలో ఐదు విభాగములు ఉండును. వక్షము, కంఠము, మూర్ధా, జిహ్వామూలము, దంతములు, నాసిక, ఓష్ఠములు, తాలువు అని ఎనిమిది వర్ణోచ్చారణ స్థానములు. ఊష్మ వర్ణములకు విసర్గా భావము. వివర్తనము, సంధ్య

భావము శకారాదేశము, షకారాదేశము, సకారాదేశము, రేఫాదేశము, జిహ్వామూలీయత్వము, ఉపధ్మానీయత్వము అని ఎనిమిది విధములైన గతులుండును. ఉకారము పరమగునపుడు ఓకార ప్రసంధానము అయినచో ఆ ఓ కారము స్వరాంతమని తెలియవలెను. దీనికి భిన్నముగ సంతి స్థలమున ఏర్పడు ఓ కారము ఊష్మయొక్క గతివిశేషము. చెడ్డ గురువు నుండి లభించిన వేదాధ్య యనము దగ్ధమై నీరసముగ నుండును. అక్షరములను ఇటులాగి అటులాగి అర్థము చెప్పినచో అది భక్షితము ఉత్తమ గురువునుండి అధ్యయనము చేసినచో అది శుభకరము. సుస్వరముతో మంచి వక్త్రముతో చేయబడిన వేదాధ్యయనము ప్రకాశవంతముగ ఉండును. వికృతమైన ఆకారము లేనివాడు, లంబోష్ఠుడుకాని వాడు, అవ్యక్తోచ్చారణ చేయనివాడు, ముక్కుతో పలకనివాడు, గద్గద కంఠము లేనివాడు, జిహ్వాబంధము లేనివాడు అట్టి మనుష్యుడే వర్ణములను సరిగా ఉచ్చరింప గలుగును. వర్ణములను అవ్యక్తముగా గాని, పీడితములుగా గాని ఉచ్చరించకూడదు. వర్ణ ప్రయోగము చక్కగా చేసినచో బ్రహ్మలోకమున పూజించబడును. ఉదాత్తము, అనుదాత్తము స్వరితము అని స్వరము మూడు విధములు. ఉచ్చారణ కాలమును బట్టి హ్రస్వము దీర్ఘము ప్లుతము అని మూడు విధములు. అ, హ, కారములు కంఠ్యములు. ఇ, చ వర్గ య కార 'శ' కారములు తాలవ్యములు 'ఉ' కార పవర్గము, ఓష్ఠ్యములు ఋకార 'ట' వర్గ, రేఫ షకారములు మూర్ధన్యములు. 'ఐ'కార 'త' వర్గ 'ల'కార 'స'వర్ణములు దంత్యములు 'క'వర్గ జిహ్వా మూలీయము, 'వ'కారము దంత్యోష్ఠ్యము 'ఏఐ'కారములుకంఠతాలవ్యములు 'ఓ ఔ' కారములు కంఠోష్ఠ్య జములు. ఏ ఐ ఓ ఓఔ లలో, కంఠస్థానీయమగు ఆకారము యొక్క అర్ధమాత్ర ఉండును. అయోగవాలు తమ ఆశ్రయమునకు ఏ స్థానమో ఆ స్థానము కల్గియుండును. అచ్చులు అస్పృష్టములు యణ్‌లు ఈషత్స్పృష్టములు, 'శల్' లు అర్ధ స్పృష్టములు మిగిలిన హల్లులు స్పృష్టములు. ఇమ్‌లు అనునాసికములు. ఆరేపలు అను నాసికములు కావు. హ, ఝ, షలకు సంవార ఘోషనాద ప్రయత్నములు, యణ్ జశ్‌లకు ఈషన్నాద ప్రయత్నము ఖ, ఫ, మొదలగునవి వివార అఘోష శ్వాసప్రయత్నకములు చర్‌లు ఈశచ్ఛ్వాసములు. (336)

కావ్యాది లక్షణ వర్ణనము

అగ్నిదేవుడు పలికెను :

కావ్య నాటక అలంకారాదుల స్వరూపమును చెప్పెదను. ధ్వని, వర్ణము, పదము, వాక్యము– ఇవియే సకల వాఙ్మయము. శాస్త్ర ఇతిహాస కావ్యములు ఈ వాఙ్మయములో అంతర్గతములు. శాస్త్రమునందు శబ్దమునకు ప్రాధాన్యము. ఇతిహాసములందు అర్థమునకు ప్రాధాన్యము. వీటిలో అభిధకే ప్రాధాన్యము. అందుచే కావ్యము ఈ రెండింటి కంటెను భిన్నమైనది. లోకములో నరత్వము దుర్లభము. విద్య ఇంకను దుర్లభము. కవిత్వము ఇంకను దుర్లభము, శక్తి ఇంకను దుర్లభము, వ్యుత్పత్తి ఇంకను దుర్లభము, వివేకము అన్నిటి కంటెను దుర్లభము. ఆ విద్వాంసులు ఎంత ప్రయత్నిం చినను శాస్త్రము సిద్ధించదు. శాది వర్ణములు, వర్గ, ద్వితీయ చతుర్థాక్షరములు మహా ప్రాణములు వర్ణ సముదా యము పదము సుబంతము తిజంతము అని–ఇది రెండు విధములు. ఇష్టార్థమును బోధించు పద పంక్తి వాక్యము.

స్పష్టమైన అలంకారములు గలది, గుణములు కలది, దోషములు లేనిది అగు వాక్యము కావ్యము. వేదములు, లోకము, కావ్య హేతువులు, సిద్ధ మంత్రముచే నిర్మించ బడిన కావ్యము అయోనిజము. దేవతలకు సంస్కృతభాషను, మనుష్యులకు త్రివిధ ప్రాకృత భాషలను ప్రయోగించ వలెను. గద్యము పద్యము మిశ్రము అని, కావ్యము మూడు విధములు. పాదములులేని పద సముదాయము గద్యము, చూర్ణకము, ఉత్కలికా వృత్త గంధి అని గద్యము మూడు విధములు. చిన్న చిన్న మృదువైన మాటలున్నది చూర్ణకము. దీర్ఘ సమాసములుకలది ఉత్కలికా, ఈ రెండింటికి నడుమ ఏన్నదియు, అత్యంత కుత్సిత విగ్రహము కానిదియు వృత్తచ్ఛాయ కలదియు అగు గద్యము వృత్తగంధి. ఇది ఉత్కటకముగ ఉండదు. ఆఖ్యాయికా, కథ, ఖండ కథ, పరికథ, కథానిక అని గద్య కావ్యము ఐదు విధములు. గ్రంథకర్త యొక్క వంశ ప్రశస్తి అధికముగ ఉండి కన్యాహరణ సంగ్రామ విప్రలంభ విపత్తుల వర్ణనములతో వైదర్భ్యాది రీతులు, భారత్యాది వృత్తులు ప్రవృత్తులు ఉన్నదియు ఉచ్ఛ్వాసములను పేరుగల పరిచ్ఛేదములు కలదియు. చూర్ణక ప్రధానమును, వక్త్రము గాని, అపర వక్త్రముగాని, ఏన్నది అగు గద్యకావ్యము ఆఖ్యాయికా. కవి దేనిలో తన వంశమును శ్లోకములలో సంక్షిప్తముగా చెప్పునో, ముఖ్యార్థమును ప్రవేశ పెట్టుటకు మరియొక కథ చేర్చబడునో పరిచ్ఛేదములుండవో, ఉన్నను లంబకములను పేర్లతో వుండునో అది కథ. దాని మధ్య భాగమున చతుష్పదితో బంధరచన చేయవలెను. కథా ఖండము మాత్రమే ఉన్నది ఖండకథ. ఖండకథా, పరికథలలో, మంత్రి లేదా వైశ్యుడు లేదా బ్రాహ్మణుడు నాయకుడుగా ఉండును. కరుణ రసము ప్రధానము. నాలుగు విధములగు విప్రలంభము వర్ణింపబడును. ఈ రెండింటిలో కథ సమాప్తి పొందదు. లేదా ఖండ కథలో కథాశైలి అనుసరించబడదు. కథా ఆఖ్యాయికల లక్షణములు కలిసి ఉన్నది పరికథా. ప్రారంభమున భయానకము, మధ్యయందు కరుణము, అంతమున అద్భుతము ఉండునది కథానిక. ఇది ఉదాత్తమైనది కాదు.

చతుష్పది అనగా పద్యము. అది వృత్తయు, జాతి అని రెండు విధములు. అక్షర సంఖ్యా నియమము ఉన్నది వృత్తము. ఇది ఉక్థము, కృతిశేషజము అని రెండు విధములు. మాత్రాగణన ఉన్నది జాతియని కాశ్యపుడు చెప్పెను. పింగళుని ప్రకారము సమము, అర్ధసమము, విషమము అని వృత్తము మూడు విధములు. కావ్య సముద్ర మును దాటగోరు వారికి ఛందోవిద్య నౌక వంటిది. మహాకావ్యము, కలాపము, పర్యాయ బంధము, విశేష కము, కులకము, ముక్తకము కోశము ఇవ న్నియు పద్య సముదాయములే. సర్గలలో విభక్తమై సంస్కృతములో రచింపబడినది మహాకావ్యము. మహా కావ్య స్వరూపమును విడువక దానివలె మరియొక విధమైన రచన చేసినను దోషము లేదు. ఇతిహాస కథను గ్రహించిగాని, మరియొక్క ఉత్తమకథను గ్రహించిగాని మహాకావ్యము రచింపబడును. మంత్రము దూత ప్రయాణము యుద్ధము మొదలైనవి అచ్చట అచ్చట వర్ణింప బడును. అధిక విస్తృతము కాకూడదు. శక్వరి అతశక్వరి, అతజగతి, త్రిష్టుప్, పుష్పితాగ్ర, వక్త్రము మొదలగు సమవృత్త ఛందస్సులను ప్రయోగించవలెను. సర్గల అంతమున ఛందస్సు మార్చవలెను. సర్గలు చాల సంక్షిప్తముగా ఉండకూడదు. ఒక సర్త అతశక్వరి, అష్టి ఛందస్సులతోను, మరియొక సర్గ మాత్రా ఛందస్సులతోను సంకీర్ణమై ఉండవలెను. రాబోవు సర్గ పూర్వసర్గ కంటే ఉత్తమముగా

ఉండవలెను. కల్పము చాలా నిందితము. సత్పురుషులకు వానియందు ఆదరము ఉండదు. నగర, సముద్ర, పర్వత, ఋతు, చంద్ర, సూర్య, ఆశ్రమ, వృక్ష, ఉద్యాన, జలక్రీడ, మధుపాన, రతోత్సవ, దూతివచన, కులటా చరిత్రాదుల అద్భుత వర్ణనలతో కావ్యము నిండియుండును. అంధకారము వాయువు, ఇతర రతి విభావములు వర్ణింపబడును. అన్ని విధములగు వృత్తులు ప్రయో గింపబడును. అన్ని భావములచే ప్రభావితమై యుండును. సకలరీతులు సకల రసములు గుణములు అలంకారములు. దీనిని పరిపుష్టము చేయును. ఈ విశేషములు ఉండుటచేతనే ఇది మహా కావ్యము. దానిని రచించినవాడు మహాకవి.

మహా కావ్యము నందు ఉక్తి వైచిత్ర్యమునకు ప్రాధాన్యము ఉన్నను రసమే దాని జీవనము. కావ్య స్వరూపమువచో వక్రత్వము ఉన్నను ప్రయత్న పూర్వకముగ రసమును పోషించుటచే సిద్ధించును. మహాకావ్య ఫలము చతుర్వర్గ ప్రాప్తి దీనికి నాయకుని పేరుతో పేరు పెట్టవలెను. సమానమైన వృత్తులు కూర్చవలెను. కైశికీ వృత్తిచే కావ్యము కోమలముగా నుండును. ప్రవాస వర్ణనమున్న కావ్యము కలాపము దానిలో పూర్వాను రాగమను శృంగా రము ఉండును. సంస్కృతము లేదా ప్రాకృతముతో పాప్త్యాదులను వర్ణించినచో విశేషకము అనేక శ్లోకములకు ఒకే అన్వయమున్నచో కులకము, సందారితకముయని పేరు. ఒక్కొక్క శ్లోకము స్వతంత్రార్థకమైనచో ముక్తకము. అది సత్పు రుషులకు చమత్కారము కల్గించవలెను. మహాకవులు ఉత్తమ సూక్తులు కూర్చినది కోశము. అది బ్రహ్మ వలె అపరిచ్ఛిన్న రసభరితమై సహృదయులకు రుచికరముగ నుండును. సర్గలో వేరువేరు వృత్తములను ఉపయోగించుట ఆభాసోపమ శక్తి. అది మిశ్రమ ప్రకీర్ణము అని రెండు విధములు. శ్రవ్య అభినే యముల రెండు లక్షణములును ఉన్నది. మిశ్రము సకలోక్తులతో కూడినది. ప్రకీర్ణము. (337)

నాటక లక్షణ నిరూపణము

అగ్నిదేవుడు పలికెను :

నాటకము, ప్రకరణము, డిమము, ఈహామృగము, సమకారము, ప్రహసనము, వ్యాయోగము, భాణము, వీథి, అంకము, త్రోటకము, నాటికా, సట్టకము, శిల్పకము, కర్ణ, దుర్మల్లికా, ప్రస్థానము, భాలిక, భాణి, గోష్ఠి, హల్లీశకము, కావ్యము, శ్రీ గదితము, నాట్య రాసకము, ఉల్లాప్యము, ప్రేంఖణము యని రూపకములు ఇరువది ఏడు విధములు. లక్షణము సామాన్యము విశేషము అని రెండు విధములు. అన్ని రూపకములకు వర్తించునది సామాన్య లక్షణము. ఏదో ఒక దానికి వర్తించునది విశేషలక్షణము. అన్ని రూపకములందును పూర్వ రంగము జరిగిన పిమ్మట దేశ కాలములు రస భావ విభావ, అనుభావ, అభినయ, అంకస్థితులు సామాన్య లక్షణము. విశేష లక్షణము సమయాను సారముగా చెప్పబడును. ఇపుడు సామాన్య లక్షణము చెప్పబడుచున్నది. ధర్మార్థ కామములను నాట కము సాధింపవలెను. ముందుగా పూర్వరంగమును యథావిధిగా జరుపవలెను. దీనికి నాంది మొదలగు ఇరువది రెండు అంగములున్నవి. దేవతా నమస్కారము. గురుస్తుతి గో బ్రాహ్మణ రాజాద్యాశీర్వాదము చేయబడును. నాంది తరువాత 'నాంద్యన్తే సూత్రధారః' యని రూపకములలో వ్రాయబడును. కవియొక్క గురు పరంపర వంశ ప్రశంస, పౌరుషము కావ్యము యొక్క సంబంధ

ప్రయోజనములు ఈ ఐదింటిని సూత్రధారుడు చెప్పవలెను. నటిగాని విదూషకుడు గాని పారి పార్శ్వకుడుగాని, సూత్రధారునితో కలిపి స్వకార్యముతో సంబంధించినవి ప్రస్తుత విషయమును చెప్పనివి అగు చిత్రమైన వాక్యములతో సంభాష ణము చేసినచో దానికి ఆముఖమని పేరు. దీనికి ప్రస్తావనయని కూడ పేరు. ప్రవృత్తకము కథోద్ఘాతము ప్రయోగాతిశయము యని ఆముఖము మూడు విధములు. సూత్రధారుడు వచ్చిన కాలమును గూర్చి వర్ణించినపుడు ఆ వర్ణనను ఆశ్రయించి పాత్ర ప్రవేశించినచో దానికి ప్రవృత్తకమని పేరు. ఇది బీజాంశములందే ఆవిర్భవించును. సూత్ర ధారుని వాక్యము గాని వాక్యార్థములుగాని గ్రహించి పాత్ర ప్రవేశించినచో అది కథోద్ఘాతము. సూత్రధారుడు ఒక ప్రయోగమున మరియొకప్రయోగమును వర్ణించగా ఆ సమయమున పాత్ర ప్రవేశించినచో అది ప్రయోగాతిశయము నాటకాదులకు ఇతివృత్తము శరీరము. సిద్ధము ఉత్ప్రేక్షితము అని అది రెండు విధములు. ప్రసిద్ధమైని సిద్ధము; కవి కల్పించినది ఉత్ప్రేక్షితము. బీజము, బిందువు, పతాక, ప్రకరి, కార్యము అని ఐదుఅర్థ ప్రకృతులు. చేష్టలు కూడ ప్రారంభము ప్రయత్నము ప్రాప్తి సద్భావము నియతఫల ప్రాప్తి ఫలయోగము యని ఐదు అర్థ ప్రకృతులు. చేష్టలు కూడ ప్రారంభము ప్రయత్నము ప్రాప్తి సద్భావము నియత ఫల ప్రాప్తి ఫలయోగము అని ఐదు. ముఖము ప్రతి ముఖము గర్భము విమర్శము నిర్వహణము అని క్రమముగా ఐదు సంధులు. అల్పముగా వర్ణితమై బహుధా విస్తరించి ఫలమును కల్గించునది బీజము. నానార్థ రస సంభవమగు బీజోత్పత్తి కావ్యము నందు కలిగిన సంధికి ముఖము అని పేరు. ఇష్టమైన అర్థము యొక్క రచన, కథాంశము అఖండముగా నుండుట ప్రయోగమునందు అనురాగము గోపనీయ విషయముల గోపనము అద్భుత విషయముల వర్ణనము ప్రకాశింపదగిన విషయములను ప్రకాశింప చేయుట ఇవి కావ్యాంగముల ఆరు ఫలములు. అంగహీనుడగు మనుష్యునివలె అంగహీనమగు కావ్యము కూడ శ్రేష్ఠము కాజాలదు, దేశ కాలములు లేకుండగ ఇతివృత్త మేదియు ప్రవర్తించదు. అందుచే వాటిని నియమ పూర్వకముగా స్వీకరించుటకు పదము అని పేరు. దేశములలో భారత వర్షమున, కాలమున, కృతాది యుగత్రయమును గ్రహించ వలెను. దేశకాలములు లేకుండ ప్రాణులకు ఎచ్చటను సుఖ దుఃఖోదయము కలుగదు. సృష్ట్యాది వార్త ప్రసంగ వశమున వర్ణింపవలసి వచ్చినను దోషము లేదు. (338)

శృంగారాది రస నిరూపణము

అగ్నిదేవుడు పలికెను :

అక్షరము, సనాతనము, జన్మ రహితము, సర్వవ్యాప్తము, పరబ్రహ్మ స్వరూపము, అద్వితీయము, జ్యోతీ రూపము అగు ఏ చైతన్యము, వేదాంతములలో చెప్పబడుచున్నదో దానికి ఆనందము సహజము. అది అపుడపుడు అభివ్యక్తమగును. ఈ అభివ్యక్తియే చమత్కారము అనియు చెప్పబడును. దాని ప్రథమ వికారమునకు అహంకారమని పేరు. దానినుండి అభిమానము పుట్టినది. ఈ భువన త్రయము ఈ అభిమానమునందే అంతర్గతమై ఉన్నది. అభిమానమునుండి రతి పుట్టును. అది వ్యభిచ ర్యాది భావ సామాన్యముచే పరిపుష్టమై శృంగారము అని చెప్పబడును. ఇతరమైన హాస్యాదులు ఈ శృంగార భేదములే. వాటికి ఆయా స్థాయీ భావములు ఉండును. వాటి పరిపోషమే ఆ రసముల లక్షణము.

సత్త్వాది గుణ సముదాయములు పరమాత్మ నుండి జనించును. రాగము నుండి శృంగారము తీక్ష్ణత్వము నుండి రౌద్రము, ఉత్సాహము నుండి వీరము, సంకోచము నుండి బీభత్సము పుట్టును. శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానక బీభత్స అద్భుత శాంతములు తొమ్మిది రసములు. నాల్గు రసములు (శృంగార రౌద్ర వీర బీభత్సములు) సహజములు. త్యాగము లేని ధనమువలె, రసము లేని వాక్కు ప్రకాశించదు. అపారమైన కావ్యసంసారములో కవియే ప్రజాపతి. ఆతనికి ఈ సంసారము ఎట్లు ఇష్టమగునో అట్టి మార్పు చెందుచుండును. కవి శృంగారియైనచో కావ్య జగత్తు రసమయమగును. ఆతడు రసహీనుడైనచో కావ్యము నీరసమగును. భావహీనమగు రసము, రసవర్జితమగు భావము వుండవు. భావములు రసములను అభివ్యక్తము చేయును. 'భావ్యంతే రసాః ఏభిః' అను వ్యుత్పత్తిచే భావములు చెప్పబడును. రతి మొదలగు స్థాయీ భావములు ఎనిమిది. స్తంభాదులు ఎనిమిది. మనస్సుకు అనుకూలమగు సుఖానుభవము రతి. హర్షాదులచే చిత్త వికాసము హాసము. చిత్రాది దర్శనమువలనకూడ హాసము కలుగును. చిత్తమునకు విక్లబత్వము భయమని చెప్పుదురు. చెడ్డవస్తువుల నింద జుగుప్స. ఉత్కృష్టమగు వస్తువులను చూచుటచే కలుగు చిత్త విస్తారము విస్మయము. స్థంభాదులగు ఎనిమిది భావములు సత్త్వమువల్ల కలుగును. రజస్తమస్సులకు అతీతములు. భయరాగాదులచే కల్గిన చేష్టా విఘాతము స్తంభము. శ్రమరాగాదులతో కూడిన అంతర క్షోభముచే కలిగిన శరీరజలము స్వేదము. హర్షాదులచే దేహము పులకరించుట పులకో ద్గమము. హర్షాది జన్యమగు వచన అస్పష్టత్వము స్వర భేదము. ఇష్ట క్షయాదులచే కలిగిన మనో వైక్లబ్యము శోకము. ప్రతికూలముగా ప్రవర్తించు వాని విషయమున తీక్ష్ణత్వము. క్రోధము పురుషార్థ మును పూర్తి చేయుటకు యత్నము ఉత్సాహము. చిత్త క్షోభము కలిగిన ఉత్తభము వేపథువు. విషా ధాదుల వలన కాంతికోల్పోవుట వైవర్ణ్యము. దుఃఖా నాందాదులవలన కల్గిన నేత్ర జలము అశ్రువు. లంఘనాదులచే ఇంద్రియములు పనిచేయకుండుట ప్రళయము.

వైరాగ్యాదులచే కలుగు మనః క్లేదము నిర్వేదము. మానసిక పీడాదుల వలన కలిగిన శరీర దౌర్బల్యము గ్లాని. అనిష్టప్రాప్తిని ఊహించుట శంక. మత్సరము అసూయ. మదిరాదుల ఉప యోగము వలన కలిగిన మానసిక మోహము మదము. ఎక్కువ పనిచేయుటచే కలిగిన శరీర క్లాంతి శ్రమము. చిత్తమునకు శృంగారాది క్రియలయందు ద్వేషము ఆల స్యము. సత్త్వము నుండి తొలగుట దైన్యము. విషయములను గూర్చి ఆలోచించుటచింత. చేయదగిన ఉపాయము తెలియ జాలకుండుట మోహము. అనుభవించిన వస్తువును మరల ప్రతిబింబింపచేసుకొనుట స్మృతి. యథార్థ జ్ఞానమువలన విషయ నిర్ణయము మతి. అనురాగాదుల వలన కలిగిన ఒకానొక విధమగు చేత స్సంకోచము, వ్రీడా, అస్థిరత్వము చపలతా, చిత్తప్రసన్నతా, హర్షము; ప్రతీకార వాంఛచే కలిగిన అంతః కరణ వైకల్యము ఆవేశము. కర్తవ్యము విషయమున ఏమి తోచుకుండుట జడత. అభీష్ట వస్తు ప్రాప్తిచే కలిగిన ఆనందము ధృతి. ఇతరులయందు అనాదరమును, తనయందు ఉత్కర్ష భావన గర్వము. అభీష్ట వస్తు ప్రాప్తిచే కలిగిన ఆనందము ధృతి. ఇతరుల యందు అనాదర మును, తన యందు ఉత్కర్ష భావన గర్వము. అభీష్ట వస్తువు యందు దైవాది విఘాతము విషాదము. ఈప్సిత సిద్ధి కొరకై చంచలమైన మానసిక స్థితి ఔత్సుక్యము. చిత్తేంద్రియాదులు పనిచేయకుండుట

అపస్మారము. యుద్ధములందు బాధాదుల వలన స్థిరముగ ఉండజాలక పోవుట త్రాజము, చిత్త చమత్కారము వీప్స. క్రోధము శమించ కుండుట అమర్షము. చేతన హృదయము ప్రబోధము. ఇంగితాకారము లను దాచుకొనుట అవహిత్థము. గురువుల విషయమున కోపముచే వాక్పారుష్య, దండ పారుష్యములు ఉగ్రత, ఊహ, వితర్కము, మనస్సు శరీరము సరిగా వుండకపోవుట వ్యాధి కామా దులచే అసంబద్ధ ప్రలాపము ఉన్మాదము. తత్త్వ జ్ఞానాదులచే చిత్తమాలిన్యము తొలగుట శమము.

కావ్యాదులందు కవులు భావములను రసములను కూర్చవలెను. దేనిచే రత్యాదులు విభావిత ములగునో అది విభావము. విభావ్యతేయేన అని విగ్రహము. ఆలంబనము ఉద్దీపనము అని అది రెండు విధములు. ఈ రత్యాది భావ వర్గము దేనిని ఆధారముగా తీసుకుని పుట్టునో అది ఆలంబన విభావము. ఇది నాయకాదులను ఆధారముగా చేసుకుని పుట్టును. ధీరోదాత్త, ధీరోద్ధత, ధీరలలిత, ధీరప్రశాంతులని నాయకులు నాలుగు విధములు. అనుకూలుడు, దక్షిణుడు, శఠుడు, ధృష్టుడు అని మరి నాలుగు విధములు. శృంగారమున నాయకునకు పీఠ మర్దుడు, విటుడు, విదూషకుడుయని ముగ్గురు ధర్మ సచివులుగా ఉందురు. వీరు అనునాయకులు. పీఠమర్దుడు శ్రీమంతుడై నాయకునివలె బలవంతుడై వుండును. విటుడు నాయకుని దేశమునకు చెందిన వాడై ఉండును. నవ్వించువాడు విదూషకుడు. నాయకుని నాయికలు కూడ ఎన్నివిధములుగా వుందురు. స్వకీయ, పరకీయ, పునర్భూ అని కౌశికుడు చెప్పెను. మరికొందరు, 'పునర్భూ'రికి బదులుగ 'సామాన్య'ను అంగీక రింతురు. ఈ నాయికలలో చాలభేదములున్నవి. ఉద్దీపన విభావములు వివిధ సంస్కార రూపముల నుండి ఆలంబన విభావమునందు భావోద్దీపనము చేయును. కర్మాదుల చేతను గీతికాదులచేతను, చతుష్షష్టి కళలు ఆరు విధములు. సాధారణముగ కోకన్మృతులు హాసోపహాకారములు. ఉద్బుద్ధములు సంస్కృతములుయగు భావములచే ఇచ్ఛాద్వేష ప్రయత్నముల సంయోగములచే కలుగు మనోవాణి బుద్ధి శరీర కార్యములను విద్వజ్జనులు అనుభావములందురు. 'సః అనుభూయతే అత్ర' అని కాని సః అనుభవతి అని కాని దీని నిర్వచనము. మానసిక వ్యాపారము అధికముగా ఉన్నది మానసిక ఆరంభము. పౌరుషము స్త్రైణము అని అది రెండు విధములు.

శోభా, విలాస, మాధుర్యస్థైర్య, గాంభీర్య, లలిత, ఔదార్య, తేజస్సులను ఎనిమిది పౌరుషములు నీచుల నింద ఉత్తములతో స్పర్ధ, శౌర్యము, చాతుర్యము వీటిచే మను ధర్మమునందు శోభ కలుగును. ఇది ఇంటిలో శోభవంటిది. భావ, హావ, హేళా, శోభ, కాంతి, దీప్తి, మాధుర్య, శౌర్య, ప్రాగర్భ్య, ఉదారతా, స్థైర్య, గంభీరతలు అను పండ్రెండు స్త్రీల విభావములు. విలాస హావములను భావ మందురు. ఇది కొంచెము హర్షముచే పుట్టును. వాక్సంబంధము వాగారంభము వీనికి పండ్రెండు భేదములున్నవి. మాటలాడుట ఆలాపము, ఎక్కువ మాటలాడుట ప్రలాపము దుఃఖవచనము విలాపము. మాటిమాటికి చెప్పుట యనులాపము, ఉక్తి ప్రత్యుక్తులు సల్లాపము, మరొక విధముగ చెప్పుట అపలాపము. వార్తను మోసికొని పోవుట సందేశము. ఒక విషయమును ప్రతిపాదించుట నిర్దేశము. తత్త్వమును చెప్పుట అతిదేశము. అన్య వర్ణనము అపదేశము; శిక్షాపూర్వక వచనము ఉపదేశము; వ్యాజోక్తి వ్యపదేశము. ఇతరులకు విషయమును బోధించుటకై ఉత్తమ బుద్ధి నాశ్రయించి వాగారంభము చేయవలెను. దానికి రీతి, వృత్తి ప్రవృత్తి అని మూడు భేదములు. (339)

రీతి నిరూపణము

అగ్నిదేవుడు పలికెను :

కావ్యశాస్త్ర జ్ఞాన నిమిత్తమై ఉపయోగించు రీతి పాంచాలీ, గౌడదేశీయ, వైదర్భీ, లాటజాయని నాలుగు విధములు. ఉపచారయుతమైనది హ్రస్వ సమాసములు కలది మృదువుగావున్నది పాంచాలీ. దీర్ఘసమాసములతో, అనవస్థిత సందర్భము కలది అధికోప చారయుక్తరహితమైనది గౌడి. ఉపచార రహితము మిక్కిలి కోమలముగాని కూర్పుకల సమాసవర్జితమగు రీతి వైదర్భి. స్ఫుటసందర్భము కలది నాతి దీర్ఘ సమాసములు కలది యగు రీతిలాటి. చాలమంది విద్వాంసులు పరిత్యజించినను అధికోపచార యుక్తమగు ఈలాటి లభించుచున్నది. క్రియలలో వైషమ్యమును పొందని వాక్య రచనకు వృత్తియని పేరు. భారతీ, ఆరభటీ, కైశికీ, సాత్వతీ అని అది నాలుగు విధములు. వాక్ప్ర ధానమైనది, ఎక్కువ పురుషులను ఆశ్రయించినది. స్త్రీల చేతకూడ ప్రాకృతమునందు ఉపయోగింప బడినది అగు రీతి భరత రచితమగుటచే భారతీయని చెప్పబడును. దీనికి వీథి ప్రహసనము ఆముఖము నాటకాది ప్రరోచన అని, భారతికి నాలుగు అంగములు. ఉద్ఘాతుక, లపిత, అసత్ప్రలాప, నాక్ర్రేణీనాలికా, విషణవ్యవహార, త్రిగత, ఛల, అవస్కందిత, గండ, మృదవ ఉచితములు అని వీథికి పదమూడు అంగములు. పరిహాసయుక్తమగు తాపసాది వచనము ప్రహసనము. ఆరభటి యందు మాయ ఇంద్రజాలము యుద్ధము మొదలగునవి వుండును. సంక్షిప్తకారము, పాతము, వస్తూత్థాపనము యని ఆరభటి భేదములు. (340)

నృత్యాది అంగకర్మ నిరూపణము

అగ్నిదేవుడు పలికెను :

ఇపుడు చేష్టాది విశేషమును అంగప్రత్యంగములను వాటి కర్మలను చెప్పెదను. దానిని ఆంగిక కర్మ యందురు. ఇది సాధారణముగా స్త్రీ సంశ్రితము. లీలా, విలాస, విచ్ఛిత్తి, విభ్రమ, కిలికించిత, మోట్టాయిత, కుట్టమితా, బిబ్బోక, లలిత, విహృత, క్రీడిత, కేళులుయని అది పంద్రెండు విధములు. ఆవృత ప్రదేశమున ఇష్టజన చేష్టను అనుక రించుట లీల. కొంచెము విశేషమును చూపించునది విలాసము. హాసరోదనాదుల సంకరము కిలికించితము. వికారము బిబ్బోకము, సుకుమార చేష్ట లలితము. శిరస్సు, హస్తములు, వక్షము, పార్శ్వము, కటి, పాదము అని, ఇవి క్రమముగా అంగ ములు. కనుబొమలు మొదలగునవి ప్రత్యంగములు. అంగ, ప్రత్యంగములు, ప్రయత్న జనితమగు చేష్టలేకుండ ప్రయోగము ఎచ్చటను కలుగదు. కొన్నిచోట్ల ముఖ్యముగను కొన్ని చోట్ల వక్ర రూపమునకు అది సాధింపబడును. అకంపిత, కంపిత, ధూత, విధూత, పరివాహిత, ఆధూత, అవధూత, ఆచిత, నికుంచిత, పరావృత, ఉత్క్షిప్త, ఆధోగత లోలితములని శిరః కర్మ పదమూడు విధములు. కనుబొమ్మల చేష్ట ఏడువిధములు. వీటిలో భ్రుకుటీ మొదలగునవి ప్రధానములు. రస, స్థాయి, సంచారి భావముల, సంబంధమును బట్టి దృష్టి మూడు విధములు, దీనికి ముప్పది ఆరు భేదములు కూడ వుండును. అందు రసజ దృష్టి ఎనిమిది విధములు. భ్రమణ చాలనాదికమగు

తారకా కర్మ తొమ్మిది విధములు. నాసికా కర్మ ఆరు విధములు. నిశ్వాసము తొమ్మిది విధములు; ఓష్ఠకర్మ ఆరు విధములు; పాదకర్మ ఆరు విధములు; చిబుక కర్మ ఏడు విధములు; గ్రీవా కర్మ తొమ్మిది విధములు; హస్త కర్మ సాధారణముగ అసంయుతము సంయుతము యని రెండు విధముల ఉండును. పతాక త్రిపతాక, కర్తరీ ముఖ అర్ధ చంద్ర ఉత్కరాళ, శుకతుండ, ముష్టి, శిఖర, కపిత్థ, కటకా ముఖ, సూచ్యాస్య, పద్మకోశ, శిర, మృగశీర్ష, కాంబోల, కాలపద్మ, చతుర, భ్రమర, హంసాస్య హంస పక్ష, సందంశ, ముకుళ, ఊర్ణనాభ తామ్ర చూడములని అసంయుత హస్తమునకు ఇరువది నాలుగు భేదములు. అంజలి, కపోత, కర్కట, స్వస్తిక, కటక, వర్ధమాన, అసంగ, నిషద, దోల, పుష్పపుట, మకర, గజదంత, బెస్తంభములు యని సంయుత హస్తమునకు పదమూడు భేదములు; సంయుత హస్తమునందు ఇంకను భేదము లుండవచ్చును. వక్షస్థల కర్మ ఆభుగ్న నర్తనాది భేదముచే ఐదు విధములు; ఉదర కర్మ దురతి క్షామ ఖండము, పూర్ణము అని మూడు విధములు; పార్శ్వకర్మలు ఐదు; జంఘా కర్మలు ఐదు; నాట్య నృత్యాదు లందు పాదకర్మ అనేక విధములుగా నుండును. (341)

అభినయాది నిరూపణము

అగ్నిదేవుడు పలికెను :

విషయమును అభిముఖములు చేయునది అభినయము. సాత్త్వికము, వాచికము, ఆంగికము, ఆహార్యము – అని ఇది నాలుగు విధములు. స్తంభాదికము సాత్త్వికము. వాక్ప్రవృత్తి వాచికము. శరీర చేష్ట ఆంగికము. బుద్ధిని ఉపయోగించి చేయునది ఆహార్యము. అభిమాన స్థితిచే రసాది వినియోగము చెప్పబడుచున్నది. రసము లేకుండగా మిగిలినవి స్వతంత్రములుగా ఉండుట వ్యర్థము. సంభోగము విప్రలంభము అని శృంగారము రెండు విధములు. ప్రచ్ఛన్నము ప్రకాశము అని అవి రెండేసి విధములు. పూర్వాను రాగము మానము ప్రవాసము కరుణ యని విప్రలంబము నాలుగు విధములు. వీనిలో ఒకదానివలన సంభోగశృంగారము ఉత్పన్నమగును. ఇది కూడ నాలుగు విధ ములు. స్త్రీ, పురుషులను ఆశ్రయించి వుండును. శృంగార జనకము రతి. వైవర్ణ్య ప్రళయములు తప్ప అన్ని సాత్త్విక భావములు దీనియందు ఉండును. ధర్మార్థ కామ మోక్షముల చేతను ఆలంబన విశేషముల చేతను వాటి అవాంతర విశేషముచేతను శృంగారము నిరంతరము పుష్టి పొందును. శృంగారము వాక్క్రియ, నేపథ్యక్రియ అని రెండు విధములు.

హాసము నాలుగు విధములు. దంతములు కనబడనిది స్మితము. కొంచెము దంతాగ్రములు కనబడి నేత్రములు వికసించినచో అది హసితము. ధ్వనితో కూడినది విహసితము. కుటిలత్వముతో కూడినది ఉపహసితము. సశబ్దముగ వున్నది అపహసితము. ఎక్కువ శబ్దము కలది అతి హసితము. కరుణరసము ధర్మోప ఘాతజము, చిత్తవిలాసజనితము, శోకజనితము అని మూడు విధములు. దీనికి శోకము స్థాయి భావము. రౌద్ర రసముకూడ అంగనేపథ్య వాక్య ములచే మూడు విధములు. దీని స్థాయీ భావము క్రోధము. స్వేద రోమాంచ వేపథువులు ఉండును.

దానవీరము, ధర్మవీరము, యుద్ధవీరము అని వీరము మూడు విధములు. ఉత్సా హము స్థాయీ భావము. ప్రారంభమున వీరముండి చివరమునకు భయమును కలిగిం చునది భయానకము. దాని స్థాయి భావము భయము. ఉద్వేజనము క్షోభణముయని బీభత్సము రెండు విధములు. పూతి వస్తువులచే కలిగినది ఉద్వేజనము. రుదిరాదులచే కలిగినది క్షోభణము. దీని స్థాయీ భావము జుగుప్స. దీనియందు సాత్త్విక భావములు ఉండవు.

కావ్య శోభాకరములగు ధర్మములను అలంకారము లందురు. ఇవి శబ్దమును, అర్థమును, ఉభయమును అలంకరించును. వ్యుత్పత్త్యాదులచే శబ్దమును అలంకరించునవి శబ్దాలంకారములు. ఛాయ, ముద్ర, ఉక్తి, యుక్తి, గుంఫన, వాకోవాక్యము అనుప్రాసము, చిత్తము, దుష్కరము. ఇవి తొమ్మిది శబ్దాలంకారములు. ఇతరుల ఉక్తిని అనుకరించుటకు ఛాయ అని పేరు. లోక ఛేక, అర్భక మత్తుల ఉక్తుల అనుకరణములను బట్టి ఇది నాలుగు విధములు. ఆభాణములోకోక్తి. ఇది సర్వ సామాన్యము. లోకోక్తిని అనుసరించు రచనమును లోకోక్తి ఛాయ అని అందురు. చతురులకు ఛేకులు అని పేరు. కలా కౌశ ల్యమే చాతుర్యము. దానిని ప్రదర్శించునది ఛేకోక్తి ఛాయ. అర్భకోక్తి అవ్యుత్పన్నుల ఉక్తి. దానిని అనుకరించునది అర్భకోక్తి అని పేరు. మత్తుల వాక్యము అశ్లీలముగాను లుప్తాక్షర ముగాను ఉండును. దాని ఛాయకలది మత్తోక్తి ఛాయ. ఇది సమయాను సారముగా ఉపయోగించినచో శోభాకరముగా నుండును. అభిప్రాయ విశేషముచే కవి శక్తిని స్పష్టీక రించుచు ఆనందమును కలిగించునది ముద్ర. అదియే మా మతమున శయ్య. యుక్తి యుక్తమగు అర్థమును బోధించునది లోక యాత్రానుసారముగా ఉండి సహృదయుల హృదయమును ఆనందింపచేయునది ఉక్తి. విధి, నిషేధము అని నియమము, అనియ మము అని వికల్పము, పరిసంఖ్య అని ఉక్తులు ఆరువిధములు. వేర్వేరుగా నున్న వాచ్య వాచకములను కలుపుటకు సమర్థమైన దానిని యుక్తి యందురు. పదము పదార్థము, వాక్యము వాక్యార్థము, ప్రకరణము ప్రపంచము అని యుక్తి ఆరు విధములు. రచనా చర్యకు గుంఫన అని పేరు. శబ్దార్థ క్రమగోచర, శబ్దానుకార, అర్థాను పూర్వార్థా అని అది మూడు విధములు. ఉక్తి ప్రత్యుక్తులుగల వాక్యము వాకో వాక్యము. ఋజు వుక్తి వక్రోక్తి అని అది రెండు విధములు. మొదటిది స్వాభావిక వచనరూపము. అది పూర్వ ప్రశ్నిక, అప్రశ్న పూర్వికా అని రెండువిధములు. భంగవ క్రోక్తికాకు వక్రోక్తి యని వక్రోక్తి కూడ రెండు విధములు. (342)

శబ్దాలంకారములు - నిరూపణము

అగ్నిదేవుడు చెప్పెను :

పద వాక్యములందు వర్ణముల ఆవృత్తికి అనుప్రాస అని పేరు. ఏక వర్ణము అనేక వర్ణము అని వృత్త్యనుప్రాస వర్ణ సముదాయము రెండు విధములు. ఏక వర్ణగతా వృత్తి వలన మధుర లలిత ప్రౌఢ భద్ర పరుషలను ఐదు వృత్తులు ఏర్పడును. మధుర వృత్తి యందు వర్గ పంచమ వర్ణము క్రింద ఆ వర్గకే చెందిన అక్షరములు, హ్రస్వ స్వర అంతరితములగు ర, ణ, మ, న, లు నకార ద్వయ సంయోగము కూడ వుండును. వర్గ్య వర్ణములను ఐదు పర్యాయములు మించి ఆవృత్తి చేయరాదు. మహా ప్రాణ ఊష్మ వర్ణముల సంయోగముతో కూడ ఉత్తరోత్తర లఘ్వక్షరములు కల

రచన మధుర అని చెప్పబడును. లలిత రచనలో 'వ' కార 'ల' కారములు అధికముగా ప్రయోగింపబడును. రేఫ సంయుక్త 'ప' కార, 'న' కారములు వర్ణ్య వర్ణములు దేనియందు ప్రయోగింపబడునో 'ట' వర్గ పంచమాక్షరములు ఉండవో అది ప్రౌఢా వృత్తి. మిగిలిన అసంయుక్తములగు రేఫ 'న' కారాది కోమల వర్ణములు ప్రయోగించిన వృత్తి భద్ర లేదా కోమల వృత్తియని చెప్పబడును. ఊష్మలు భిన్న అక్షరములతో సంయుక్తములై ప్రయోగింపబడినచో పరుషావృత్తి. దీని యందు 'అ' కార భిన్నములగు స్వరములు అత్యధికముగా ఆవృత్తి చెందుచుండును. అనుస్వార విసర్గలు నిరంతరము ప్రయోగింపబడును. రేఫ సంయుక్త శ, ష, స, ల ప్రయోగము ఎక్కువగా అకార ప్రయోగము. అధికముగా అంతస్థ వర్ణ ప్రయోగము రేఫానంతస్థలచే భేదితము సంయుక్తము యగు 'హ' కార ప్రయోగము పరుషత్వమును కలిగించును. గురువర్ణములు మాధుర్య విరుద్ధములగు వర్ణములతో సంయుక్తములైనచో పరుషత్వము కలుగును. పరుష రచనలో వర్గాద్యక్షరమే సంయుక్తము. గురువు అయినచో శ్రేష్ఠము. పంచమ వర్ణము సంయుక్తమైనచో ప్రశస్తము కాదు. ఎవరినైన ఆక్షేపించుట యందును కఠోర శబ్దానుకరణమునందును పరుష వృత్తిని ప్రయోగించవలెను. క, చ, ట, త, ప వర్గలను అంతస్థ ఊష్మలను క్రమముగ ఆవర్తనము చేయుటచే ఏర్పడు వృత్తికి కర్నాటి, కౌంతలీ, కౌంకీ, కౌంకణీ, వాణ, వాసికా, ద్రావిడీ, మాథులీ, మాత్సీ, మాగధీ, తామ్రలిప్తికా, ఔండ్రీ, పౌండ్రీ అను పండ్రెండు భేదములు ఉండును.

భిన్నార్థ ప్రతిపాదకము అగు అనేక వర్ణావృత్తికి యమకమని పేరు. అవ్యపేతము, వ్యపేతము అని అది రెండు విధములు. నిరంతరావృత్తి ఉన్నది, అవ్యపేతము, వ్యవధానముతో ఆ వృత్తి ఉన్నది వ్యపేతము. స్థానపాద భేదములచే ఈ రెండింటికిని రెండేసి భేదములు ఏర్పడును. మొదటి పాదము యొక్క ఆది మధ్య అంతములందు ఒకటి రెండు మూడు వర్ణములు పర్యాయములు ఆవృత్తములు అయినచో మొత్తము ఏడు భేదములు ఏర్పడును. ఏడు పాదములలో ఉత్తరోత్తర పాదమును ఒకటి, రెండు, మూడు పాదములతో ప్రారంభించినచో అంతిమ పాదము ఆరు విధములగును. తృతీయ పాదమున ఆదిమధ్యాంతములందు ఆవృత్తి చేసినచో మూడు విధములగును. శ్రేష్ఠ యమకము, పాదాంత యమకము, కాంచీ యమకము, సముద్గయమకము, విక్రాంత యమకము, వక్రవాల యమకము, సందష్టము, పాదాది యమకము, ఆమ్రేడితము చతుర్వ్యవ సితము, మాలాయమకము అని పదిపది విధములు. వీటిలో కూడ అనేక భేదములు ఉండును. భిన్నార్థ వాచక పదమును ఆవృత్తి చేసినచో అది స్వతంత్రము అస్వతంత్రము అని రెండు విధములు. రెండు ఆవృత్త పదములకు సమాసమున్నచో సమస్తము సమాసము లేనిచే వ్యస్తము. ఒక పాదమున విగ్రహము ఉండుటచే అది వ్యస్తమగును. యథా సంభవముగ, వాక్యావృత్తి ఈ విధముగా జరుగును. అనుప్రాస యమకాదులు పండితులచే సమ్మానితములు. పదావృత్తియైనను వాక్యావృత్తియైనను ఏ వర్ణ సమూహము సమానముగ కన్పట్టునో దానిని మొదట వుంచి సాను ప్రాసపదరచన చేసినచో అది రసావహమై ఉండును. కవి గోష్టిలో కౌతూహల పూర్వకముగ చదువబడు వాగ్బంధము చిత్రము.

ప్రశ్నము ప్రహేళికా గుప్తము, చ్యుతాక్షరము, దత్తాక్షరము, చ్యుత దత్తాక్షరము, సమస్యయని ఏడు ప్రహేళికా భేదములు. సమానాంతర విన్యాసపూర్వకముగా ఉత్తరము ఇచ్చినచో అది ప్రశ్న

ప్రహేళికా. ఏకపృష్ఠోత్తరము ద్విపృష్ఠోత్తరమని అది రెండు విధములు. సమస్తము వ్యస్తము అని మొదటిది రెండు విధములు. రెండు అర్థములను చెప్పు శబ్దములు గూఢముగ నున్న దానిని ప్రహేళిక యందురు. అర్థీశాబ్ది అని ఇది రెండు విధములు. అర్థబోధతో సంబంధించని ఆర్థి. శబ్ద బోధతో సంబంధించినది శాబ్ది. ఈ విధముగా ప్రహేళిక ఆరువిధములు. వాక్యాంగము గుప్తమైనను సంభావ్యమగు ఒక అపార మార్థిక అర్థము దేని అంగమునందు ఆకాంక్షాయుక్తమై ఉండునో అది గుప్తము. దీనికే గూఢమని కూడపేరు. వాక్యాంగ వైకల్యముచే అర్థాంతర ప్రతీతి వికలితాంగము నందు సాకాంక్షముగ ఉన్నచో అది చ్యుతాక్షర. స్వర వ్యంజన, బిందు విసర్గలచ్యుతిని బట్టి ఇది నాలుగు విధములు. వాక్యాంగము యొక్క వికలాంశము పూర్తిచేసిన పిమ్మట కూడ ద్వితీయార్థ ప్రతీతి కల్గించునది దత్తాక్షర. స్వరాదులను బట్టి దీనికి కూడ నాలుగు భేదములుండును. లుప్తమగు వర్ణము స్థానమున మరియొక అక్షరము ఉంచినను అర్థాంతరాభాసము కల్గించునది చ్యుత దత్తాక్షర. ఒక పద్యాంశముతో నిర్మితమై మరియొక పద్యముతో సంబంధించినది సమస్య. సమస్య ఇతరుల దగును. దాని పూర్తి తనదగును. ఈ విధముగా స్వపర, కృతి సాంకర్యముచే సమస్య పూర్తియగును. చిత్రకావ్యము అతిక్లేశ సాధ్యము అగుటచే కవియొక్క కవితా శక్తిని సూచించును. అది రస విహీనమైనను విదగ్ధులకు మహోత్సవము. నియమ విదర్భబంధములను బట్టి ఇది మూడు విధములు. రమణీయ కవిత్వమును చెప్పు కవి యొక్క ప్రతిజ్ఞ నియమము. ఇది స్థానస్వర వ్యంజన ములను బట్టి మూడు విధములు. ప్రాతిలో మ్యానులోమ్యములచే వికల్పన చేయబడును. ప్రాతి లోమ్యానులోమ్యములు శబ్దమును బట్టియు, అర్థమును బట్టియు ఏర్పడును. వివిధ వృత్తముల వర్ణములను ఆయావస్తువుల ఆకారమును కూర్చుటకు బంధమని పేరు. గోమూత్రికా, అర్థ భ్రమకము, సర్వతో భద్రము, కమలము, చక్రము, చక్రాబ్జకము, దండము, మురజము అని బంధ ములు ఎనిమిది విధములు. రెండు శ్లోకార్థములందును ప్రతిపాదమునందు ఏకైకాక్షర వ్యవధానముచే అక్షర సామ్యము వున్నచో అదిగో మూత్రికా బంధము. పూర్వ గో మూత్రికా ఆంత్య గోమూత్రికాయని ఇది రెండు విధములు. వీటికి అశ్వపద ధేనుజాల బంధయని కూడ పేరు. అర్ధ భాగములు రెండింటి యందును ఏకైకాక్షర వ్యవధానమున అక్షర సామ్య మున్నది మొదటిది. ఒక్కొక్క పదమునందు ఉన్నది రెండవది. వాటిని అర్ధ భాగము లందును, అర్ధ పాదము నందును విన్యాసము చేయవలెను.

క్రమముగా క్రింద క్రిందుగావ్రాసిన వర్ణములతో క్రింద క్రింద వ్రాసిన వర్ణములతో కలుపగా చతుర్థ పాదము పూర్తియగు వరకు నడిపించవలెను. చతుర్థ పాదము పూర్ణమై పిమ్మట అక్షరములను ప్రతితోమ క్రమమున పాదార్ధ పర్యంతము పైకి తీసుకుని పోవలెను. ఈ విధముగా మూడు విధములగు సర్వతోభద్రము ఏర్పడును. కమల బంధము చతుర్ద ళము, అష్టదళము షోడశదళము అని మూడు విధములు. ప్రథమ పాదము యొక్క పై మూడు పదముల అక్షరములను అన్ని పాదముల చివరను ఉంచవలెను. పూర్వపాద అంతిమ వర్ణమును ప్రత్యక్పాదాదియందు ప్రాతిలోమ్య క్రమమున ఉంచవలెను. అంతిమపాద అంతిమాక్షర ద్వయమును ప్రథమ పాదాదియందు ఉంచవలెను. ఈ విధ ముగా చతుర్దళ కమలము ఏర్పడును. అష్టదళ కమలము నందు అంత్యపాద అంత్యాక్షర త్రయమును ప్రథమ పాద ఆదియందు ఉంచవలెను. షోడశదళ కమలమున రెండు అక్షరముల

మధ్యకర్ణిక దాని మధ్యయందు ఒక అక్షరము కర్ణిక అంతము పై భాగమున పత్రాకారాక్షర పంక్తి వ్రాసి దానిని కర్ణికలో చేర్చవలెను. ఈ విషయము చతుర్దళ కమలము విషయమున చెప్పబడినది. కర్ణిక అందు ఒక అక్షరము వ్రాసి దిగ్విదుక్కులందు రెండేసి అక్షరములు వ్రాసి ప్రత్యేక దిక్కుయందు ప్రవేశ నిర్గమ మార్గము వ్రాయవలెను. ఇది అష్టదళ కమలము విషయమున చెప్పబడినది. నాలుగు వైపుల ఎన్ని విషమ వర్ణములున్నవో యన్ని పత్రములు ఏర్పరచి న్యాసముచేసి మధ్య కర్ణికయందు సమాక్షరములను ఏకాక్షర రూపమున న్యాసము చేయవలెను. ఇది షోడశదళ కమలమునకు సంబంధించిన విష యము. చతరరము, షడరము అని చక్ర బంధము రెండు విధములు. చతుర రము నందు పూర్వార్ధమున సమవర్ణమును ప్రతిపాదము యొక్క ప్రథమ పంచమాది విషమ వర్ణ ములను చతుర్థ అష్టమ వర్ణములను క్రమముగా ఉత్తర పూర్వ దక్షిణ, పశ్చిమార్థములందు ఉంచవలెను.

ఉత్తర పాదార్ధ అక్షర చతుష్టయమును నాభియందును, దాని ఆద్యక్షరమును వెనుకటి రెండు అరములందును, మిగిలిన రెండు పదములను నేమియందును స్థాపించ వలెను. తృతీయాక్షరమును చతుర్థ పాదాంతమునందును, ప్రథమ సమవర్ణ ద్వయమును, మూడు పాదముల అంతమునందును ఉంచవలెను. దశమాక్షరము సమమైనచో దానిని ప్రథమారమందును, ఆరు అక్షరములను పశ్చిమారము నందును ఉంచవలెను. వాటిని రెండేసి అక్షరముల వ్యవధానముతో ఉంచవలెను. ఇట్లు బృహచ్చక్రము ఏర్పడును. ఎదుటనున్న రెండు అరములపై క్రమముగా ఒక్కొక్క పాదమును వ్రాయవలెను. నాభి యందు దశమాక్షరమును వ్రాసి చతుర్థ పాదమును నేమివద్దకు తీసుకుని వెళ్ళవలెను. శ్లోకము యొక్క ఆది అంత దశమాక్షరములను, ద్వితీయ చతుర్థ చరణముల ఆద్యంత్యాక్ష రములను, ప్రథమ చతుర్థ చరణముల ప్రథమ, చతుర్థ, పంచమ వర్ణములును, సమములుగా ఉండవలెను. ద్వితీయ పాదమును విలోమ క్రమమున చదువగ, తృతీయ పాదము ఏర్ప డినచో, దానిని పత్ర సాధనమున ఉంచగా దండచక్రాబ్జబంధము ఏర్పడును. పూర్వార్ధమున రెండు పాదముల ద్వితీయాక్షరములును ఉత్తరార్ధము రెండుపాదముల సప్తమాక్షరములును సమానములై ఉండవలెను. ద్వితీయాక్షరములను బట్టి పూర్వార్ధ ఉత్తరార్ధములు తుల్యములై ఉండవలెను. ద్వితీయ షష్ట చతుర్థ పంచమ అక్షరములు తుల్యములై ఉండవలెను. ఉత్తరార్ధమున సప్తమ ప్రథమ చతుర్థ పాదములు ఆ అక్షరములతో సమానములైన చతుర్థ పంచమ అక్షరములను క్రమముగా కూర్చవలెను. క్రమపాదము లందున్న చతుర్థా క్షరములను, దళాంత వర్ణములను వెనుకటివలె స్థాపించవలెను. మురజ బంధమున రెండు శ్లోకార్ధముల అంతిమ ఆద్యక్షరము సమానములై ఉండవలెను. పాదార్ధమునందు ఉన్న వర్ణములను ప్రాతిలోమ్యాను లోమ్య క్రమముతో వుంచి అంతిమాక్షరము చతుర్థపాద ఆద్యక్షరమగునట్లు కూర్చవలెను. చతుర్థపాద ఆద్యక్షరమును దాని నుండి నవమ, షోడశాక్షరములను పుటకకము మధ్య మధ్య నుండి నాలుగేసి అక్షరములను కూర్చవలెను. ఈ విధముగా మురజ బంధము ఏర్పడును. ద్వితీయ చక్రము శార్దూల విక్రీడితముతో చేయవచ్చును. గోమూత్రికా బంధమును అన్ని ఛందస్సులలోను నిర్మించవచ్చును. మిగిలిన బంధములన్నియు అనుష్టుప్ ఛందస్సుచే నిర్మింపబడును. ఈ బంధములలో కవికావ్యముల నామ ధేయములు లేకున్నచో మిత్రులు సంతుష్టులగుదురు. శత్రువులు కూడ ఖిన్నులుకారు. బాణ,

ధనుస్, వ్యోమ, ఖడ్గ, ముద్గర, శక్తి, ద్విశృంగాట, తిశృంగాట, చతుశృంగాట, వజ, ముసల, అంకుశ, రథపద, నాగపద, పుష్కరిణీ, అసి పుత్రికాది ఆకారములలో కూడ చిత్ర బంధములు వ్రాయబడును. వీటిని ఇంకను అధికమగు చిత్రబంధమును విద్వాంసుడు స్వబుద్ధిచే తెలుసు కొనవలెను. (343)

అర్థాలంకార వర్ణనము - 1

అగ్నిదేవుడు పలికెను :

అర్థములను అలంకరించుట అర్థాలంకారము. అది లేనిచే శబ్ద సౌందర్యము కూడ మనో హరముగా ఉండదు. అర్థాలంకార హీనమగు వాక్కు, నాథుడులేని స్త్రీ వంటిది. స్వరూపము, సాదృశ్యము ఉత్ప్రేక్ష, అతిశయము, విభావనా, విరోధము, హేతువు, సమమని అర్థాలంకారములు ఎనిమిది విధములు. పదార్థముల స్వభావమునకు స్వరూప మని పేరు. నిజము ఆగంతుకమని అది రెండు విధములు. పుట్టుకతో వచ్చినది నిజము. నిమిత్తమును బట్టి వచ్చినది ఆగంతుకము. ధర్మ సామ్యమునకు సాదృశ్యమని పేరు. అది ఉపమా, రూపకము. సహోక్తి అర్థాంతర న్యాసము అని నాలుగు విధములు. భేదము, ఉపమానోపమేయములకు సామాన్య ధర్మ బంధము వున్నచో అది ఉపమా. ఏదియో కొంత సాదృశ్యమును ఆధారముగా తీసుకొని లోకయాత్ర నడుచుచున్నది. ససమాస, అసమాసయని ఉపమా రెండు విధములు. ఉపమానము సమస్తమైనచో ససమాస. అట్లుకానిచో అసమాస. ఉపమాద్యోతక పదములుగాని, ఉపమేయ వాచకములుగాని రెండును గాని లోపించగా ససమాస మూడు విధములగును. అసమాస కూడ మూడు విధములు. విశేషణ ములతో యుక్తమైనపుడు ఉపమాపదునెనిమిది విధములగును. సాధారణ ధర్మమును చెప్పు ఉపమలో ఆ ధర్మమునకు ఉన్న ప్రాధాన్యాన్ని బట్టి ధర్మోపమా, వస్తు ప్రాధాన్యమును బట్టి వస్తూపమా. ఉపనోపమేయముల ప్రసిద్ధిని బట్టి పరస్పరము సామ్యము చెప్పినచో అది పరస్పరోపమా ప్రసిద్ధికి విరుద్ధముగా ఉపమానోపమేయములలో వైషమ్యము ఉన్నచో విపరీతోపమా. ఒక వస్తువుతో మాత్రమే సామ్యము చెప్పి ఇతర ఉపమానములను నిషేధించినచో నియమోపమా. ఉపమేయము యొక్క గుణాదులు ఉపమానాంతరము నందు గూడ అనువృత్తములైనచో అనియమోపమా.

ఒకటికి మించిన ధర్మములను చెప్పినచో సముచ్చయోపమా, అనేక ధర్మములలో సామ్య మున్నను, ఉపమానము కంటే ఉపమేయము నందు వైలక్షణ్యమున్నట్లు చెప్పినచో అది వ్యతిరేకోపమ అనేక ఉపమానములు చెప్పినచో బహూపమా. ఆ ఉపమానములలో వేర్వేరు సాధారణ ధర్మము లున్నచో మాలోపమా. ఉపమేయమును ఉపమాన వికారముగా చెప్పి పోల్చినచో విక్రియోపమా. ఉపమానమునందు లోకత్రయమునందును అసంభావ్య మగు ఒక వైశిష్ట్యమును ఆరోపించి కవి వర్ణించినచో అది అద్భుతోపమా. ఉపమానమును ఆరోపించి ఉపమేయము తదభిన్నమని చెప్పి తద్వారా భ్రమ కల్గినట్లు వర్ణించుట మోహోపమా. రెండు వస్తువులమధ్య వాటి స్వరూపమును గుర్తించుటకు శక్యము గానిచో సంశయోపమా. మొదట సంశయము కలిగి పిదప నిశ్చయము

కలిగినచో నిశ్చయ ఉపమ. ఒక వాక్యార్థమును మరొక వాక్యార్థమునకు ఉపమగా వర్ణించినచో వాక్యార్థోపమా, ఉపమానమును బట్టి సాధారణీ, అతిశాయినీ అని ఉపమ రెండువిధములు. ఉపమేయమే ఉపమానమైనచో అది అన్యోన్యోపమ. ఈ విధముగా ఉత్తరోత్తరము నడచినచో గమనోపమా. ప్రశస్తము, నింద, కల్పితము, సదృశి, కించిత్స దృశి అని మరల ఉపమలో ఐదు భేదములు ఉండును. గుణసామ్యముచే ఉపమేయ స్వరూపమునకు, ఉపమాన స్వరూపమునకు అభేద మును ప్రతిపాదించినచో రూపకాలంకారము లేదా భేదముతో రోహితమైనపుడు ఉపమయే రూపకము. తుల్య ధర్మములగు రెండు పదార్థములు కలిసి ఉన్నట్లు వర్ణించిన సహోక్తి.

పూర్వ వర్ణితమగు వస్తువును సమర్థించుటకై సాధర్మమును కాని వైధర్మ్యమును గాని పురస్కరించుకొని మరియొక అర్థమును ఉపన్యసించుట అర్థంతరన్యాసము. సచేతనమగు పదార్థము లేదా అచేతన పదార్థము ఒక విధముగా ఉండుటను, మరొక విధముగా ఊహించినచో ఉత్ప్రేక్షా లంకారము. లోకాతీతముగా వర్ణించుట, అతిశయా లంకారము సంభవము అసంభవము అని రెండు విధములు. గుణ, జాతి, క్రియాదుల లోపమును చెప్పుట ద్వారా ఒక వస్తువునందలి విశేష మును వర్ణించినచో విశేషోక్తి. ప్రసిద్ధమైన కారణమును నిరాకరించి మరియొక కారణమును కాని, స్వాభావిక రూపమున కార్యోత్పత్తిని కాని ఊహించినచో విభావనాలంకారము. పరస్పర విరుద్ధములగు పదార్థములను కలిసియున్నట్లు యుక్త పూర్వకముగా వర్ణించుట విరోధాలంకారము. అభిలషితార్థ సాధక నిమిత్త వర్ణనము హేత్వలంకారము. కారకము జ్ఞాపకము అని ఇవి రెండు విధములు. కారక హేతువు కార్య జన్మమునకు పూర్వమునందును, తరువాతను ఉండును. దీనికి పూర్వ శేషమను పేరు. ఈ భేదములందే కార్యకారణ భావముచే గాని, నియామ కమగు స్వభావముచే గాని, అవినాభావ దర్శనముచే గాని, అవినాభావ నియమము వున్నచో అది జ్ఞాపక హేతువు. నదీ పూరాది దర్శనము జ్ఞాపకమునకు ఉదాహరణము. (344)

శబ్దార్థ అలంకారము - 2

అగ్నిదేవుడు పలికెను :

శబ్దార్థాలంకారము ఒకచోట ఉంచగా హారము స్త్రీ యొక్క స్తనమును కంఠమును కూడ అలంకరించినట్లు శబ్దార్థములు రెండింటిని అలంకరించును. ప్రశస్తి, కాంతి, ఔచిత్యము, సంక్షేపము, యావదర్థత, అభివ్యక్తి అని ఇది ఆరు విధములు. ఇతరుల మర్మమును ద్రవింపచేయునట్లు ఉండు వాక్కౌశలము ప్రశస్తి. ప్రేమోక్తి స్తుతి అని ఇది రెండు విధములు. వీటికే ప్రియోక్తి గుణ కీర్తనము అని నామాంతరములు. వాచ్య వాచకములు చక్కగా కలిసియుండుట కాంతి. ఓజో మాధుర్యయుక్త రచనలందు వస్తురీతి వృత్త్యనుసారముగా రసప్రయోగము కలుగునపుడు ఔచిత్యము ఉండును. తక్కువ శబ్దములతో ఎక్కువ అర్థము చెప్పుట సంక్షేపము. శబ్దార్థముల అన్యూనానధికముగా ఉన్నచో యావదర్థత అని పేరు. అర్థ ప్రాకత్యమునకు అభివ్యక్తి అని పేరు. శృతి ఆక్షేపమని అది రెండు విధములు. శబ్దముచే అర్థమును ప్రత్యక్షముగ బోధించుట శృతి. అది నైమిత్తికము పారి

భాషికము అని రెండు విధములు. పరిభాష అనగా సంకేతము గలది పారిభాషికీ. పారిభాషికికి ముఖ్య అనియు, నైమిత్తికికి ఔపచారికము అని పేరు. ఔపచారికము రెండు విధములు. అభిధేయార్థము చెప్పజాలని శబ్దము ఏదైన ఒక నిమిత్తముచే అముఖ్యమగు అర్థమును బోధించినచో అది ఔపచారికవృత్తి. నైమిత్తికము నందునుకూడ ఈ భేదములుండును. అది లక్షణా యోగముచే లాక్షణికి అనియు గుణ యోగముచే గౌణి యనియు చెప్పబడును. ఎచట అభిధేయ అర్థముతో సంబద్ధమగు అన్యార్థము ప్రతీతమగునో అచ్చట లక్షణావృత్తి. అభిధేయముతో సంబంధము సామీ ప్యము, నమవాయము వైపరీత్యము క్రియాయోగము వీటిచే లక్షణలు ఐదు విధములు. అనంతములగు గుణముల వివక్షనుబట్టి గౌనీ వృత్తియందు కూడ అనంత భేదములు ఉండును. లోక వ్యవహారజ్ఞుడగు కవి ప్రస్తుత వస్తువుపై అప్రస్తుత వస్తు ధర్మములను పూర్తిగా ఆరోపించినచో దానికి సమాధి అని పేరు. శ్రవణ మాత్రముచే తెలియని అర్థము బుద్ధి గోచరమైనచో అది ఆక్షేపము. ఇది ధ్వనిచే వ్యజింపచేయబడును. కాన ధ్వనియని పేరు. ధ్వని సంబంధముచే శబ్దార్థ ములు మరియొక అర్థమును వ్యంజింపచేయును. ఒక వస్తువు యందు ఉత్కర్షను సూచించుటకు చేయు నిషేధమునకు ఆక్షేపము అని పేరు. అప్రకృత వస్తువును స్తుతించుట, అస్తుత స్తోత్రము ఒక వస్తువును వర్ణించునపుడు సమాన విశేషణములుగల మరియొక అర్థము ప్రతీతమైనచో దీనిని అర్థ సంక్షేపమును బట్టి సమాసోక్తి అని అందురు. వాస్తవిక పదార్థములు కప్పిపుచ్చి అన్య పదార్థమును సూచించుట అపహ్నుతి. ఒక విషయమును ఋజువుగా చెప్పక మరియొక విధముగా త్రిప్పి చెప్పుట పర్యాయోక్తి. వీటిలో ఒకటి ధ్వని అని చెప్పబడును. (345)

కావ్యగుణ వివేక వర్ణనము

అగ్నిదేవుడు పలికెను :

గుణరహితమగు కావ్యము అలంకార సహితమైనను, ప్రీతి జనకము కాదు. లలితము కాని స్త్రీ శరీరముపై హారము బరువు చేటు. దోషాభావమే గుణము కదా! గుణములను ఇక చెప్పుట ఎందుకు అని అనకూడదు. ఏలనన! శ్లేషాది గుణములు, గూఢార్థత్వాది దోషములు వేర్వేరుగా చెప్పబడినవి. కావ్యమునందు శోభతిశయమును కల్గించునవి గుణములు. సామాన్యములు వైశేషికములు అని ఇవి రెండు విధములు. సర్వ సాధారణములు, సామాన్యములు. ఇవి శబ్ద-అర్థ-శబ్దార్థములతో సంబంధించి మూడు విధములగును. కావ్య శరీరమగు శబ్దమును ఆశ్రయిం చినది శబ్దగుణము. శ్లేష లాలిత్యము. గాంభీర్యము, సౌకుమార్యము. ఉదారతా ఓజస్సు, యౌగికీ అని శబ్ద గుణములు ఏడు విధములు. శబ్దముల చిక్కదనము శ్లేష. గుణ వృద్ధ్యాదులద్వార అక్షరము లకు సంధిలేనిచో అది లాలిత్య గుణము. ఉత్తమ భావవ్యంజకములగు శబ్ద సమూహము. విశిష్ట లక్షణ యుక్తమైనచో అది గాంభీర్యము. దానికే శబ్దత అనిపేరు. నిష్ఠురాక్షరములులేని శబ్దములు అధికముగ ఉన్నచో అది సౌకుమార్యము. శ్లాఘ్య విశేషణములతో కూడిన ఉత్కృష్టపదముల ప్రయోగము ఔదార్యము. దీనికే ఉత్తానపదత అని పేరు. సమాస బాహుళ్యము ఓజస్సు; ఇది పద్యాదులకు జీవితము. బ్రహ్మ మొదలు స్తంభము వరకు ఉన్న జీవుల పౌరుషమును ఓజోగుణ

విశిష్ట శబ్దములతోడనే వర్ణింపవీలగును. ఏ శబ్దములైనను ప్రయోగించి వర్ణింపబడు వస్తువుల ఉత్కర్షను సూచించునది అర్ధగుణము. మాధుర్యము సంవిధానము, కోమ లత్వము, ఉదారత, ప్రౌఢి, సామైకతా, అని అర్థ గుణములు ఆరు. క్రోధ ఈర్ష్యాదులందు కూడ ఆకార గాంభీర్యము ధైర్యము ఉండుట మాధుర్యము. కార్యసిద్ధికై ప్రయత్నము సంవిధానము. కాఠిన్యాది దోషవర్జితమగు మృదు సన్నివేశము కోమలత. ఔదార్యమును సూచించుచు ఆశయమును అతి సుందరముగ ప్రక టించినచో అది ఉదారత. అభీష్టమగు విషయమును గూర్చి తన్నిర్వాహమును సమర్థించు హేతుగర్భ యుక్తులకు ప్రౌఢి అని పేరు. స్వతంత్రము గాని పరతంత్రము గాని అగు కార్యము యొక్క బాహ్యాంతర సంయో గముచే కలుగు అర్థ వ్యుత్పత్తికి సామ్యైకత అని పేరు.

శబ్దార్థములు రెండింటికిని ఉపకారకముగా ఉండునది ఉభయ గుణము. ప్రసాదము, సౌభా గ్యము, యథాసంఖ్యము, ప్రశస్తత, పాకము, రాగము అని ఆరు విధములు. ప్రసిద్ధార్థములగు పదముల ప్రయోగము ప్రసాదము; దేనిని వర్ణించగ ఉత్కర్ష సూచితమగునో అట్టి వర్ణనము సౌభాగ్యము; దీనికే ఉదారత్వమని పేరు. తుల్యవస్తువులను క్రమముగ చెప్పుట యథా సంఖ్యము; వర్ణనీయమగు దారుణవస్తువును సమయాను సారముగ అదారుణ శబ్దములచే వర్ణించుట ప్రాశస్త్యము. పదార్థముయొక్క ఉన్నత పరిణితి పాకము, మృద్వికాపాకము నారికేలాంబుపాకము అని అవి రెండు విధములు. ఆది నుండి అంతమువరకు రసభరితమైనది మృద్వికాపాకము; కావ్యము నందలి ఛాయ విశేషమునకు రాగమని పేరు. అభ్యాస వశముచే ఇవి సహజ కాంతిని కూడ అతి శయించి ఉండును. ఒకానొక విశేష లక్షణముచే అనుభవమునకు వచ్చు దానిని వైశేషిక గుణ మందురు. హరిద్రారాగము కౌసుంబరాగము నీలిరాగము అని రాగము మూడు విధములు. స్వలక్షణ గోచరమైనది. అనగా అనన్య సాధారణమైన ధర్మము వైశేషికము. (346)

కావ్యదోష వివేక వర్ణనము

అగ్నిదేవుడు పలికెను :

దోషము సభ్యులకు ఉద్వేగమును కల్గించును. వక్తృ-వాచక-వాచ్యములలో ఏక, ద్విత్రి, యోగముచే ఇది ఏడు విధములు. వక్త అనగా కవి. సందిహానులు, అవినీతుడు, అజ్ఞుడు, జ్ఞాత అని వక్త నాలుగు విధములు. నిమిత్తమును సంకేతమును అనుసరించి అర్థమును బోధించు శబ్దము వాచకము; పదము వాక్యము అను దీని రెండు భేదములు వెనుకచెప్పబడినవి. అసాధుత్వము, అప్రయుక్తత్వము అని పదదోషములు రెండు; వ్యాకరణ శాస్త్రమునకు విరుద్ధముగ నుండుట అసాధుత్వము. అప్రసిద్ధమగు పదమును ప్రయోగించుట అప్రయుక్తత్వము. ఛాందసత్వము, అవిస్పష్ట త్వము, కష్టత్వము, అసామయికత్వము, గ్రామ్యత్వము అని అది ఐదు విధములు. లోకములో ప్రయోగించని వైదిక పదములు ప్రయోగించుట ఛాందసత్వము. అర్థము స్పష్టము కాకుండుట అవి స్పష్టత్వము. దీనిలో గూఢార్థత్వము, విపర్యస్తార్థత్వము, సంశయితార్థత్వము యని మూడు భేదములు. అర్థము శ్రమచే తెలిసినచో అది గూఢార్థత్వము. వివక్షితార్థమునకు విపరీతమగు అర్థమును బోధించుట విపర్యసార్థత్వము. అన్యార్థత్వము, అసమర్థత్వము అను దోషములు కూడ

విపర్యస్తార్థత్వములో అంతర్గతమగును. అర్థము సందిగ్ధముగా ఉన్నచో అది సంశయి తార్థత్వము. ఇది సహృదయులకు ఉద్వేగకరము కానిచో దోషముకాదు. ఉచ్చారణకు కష్టముగా ఉండుట కష్టత్వము. కవిసమయ విరుద్ధత్వము అసామయికత్వము. దీనికి నేయ అనికూడ పేరు. నీచార్థమును బోధించుట గ్రామ్యతా దోషము. నింద్యమగు గ్రామ్యార్థమును చెప్పుట, తత్స్మరణ, తద్వాచక పద సామ్యము ఇవి గ్రామ్యతా దోషములో మూడు భేదములు. సాధారణముగ ప్రాతిస్వికము, అర్థదోషము, అని రెండు విధములు. అనేక గత దోషము సాధారణము. క్రియాభ్రంశము, కారకభ్రంశము, విసంధి, పునరుక్తత, వ్యస్తసంబంధత అని ఇది ఐదు విధములు. క్రియ లేకపోవుట క్రియ భ్రంశము. కర్త్రాది కారకములు లేకుండుట కారక భ్రంశము. సంధి దోషము విసంధి.

సంధ్య భావము విరుద్ధ సంధి అని విసంధి రెండు విధములు. విరుద్ధములగు పదార్థాంతరమును బోధించుటచే విరుద్ధ సంధి దుష్టమైనది. మాటిమాటికి చెప్పుట పునరుక్తత్వము, అర్థావృత్తి పదావృత్తి అని అది రెండు విధములు. అర్థావృత్తి రెండు విధములు. కావ్య ప్రయుక్తమగు శబ్దము చేతను, శబ్దాంతరము చేతను ఏర్పడు పదావృత్తిచే అర్థావృత్తి కలుగదు. పదమాత్రమునకే ఆ వృత్తి ఏర్పడును. దూరముగ ఉన్న పదముల అన్వయము వ్యస్త సంబంధత. సంబంధాంతర ప్రతీతి, సంబంధాంతర జన్యత్వము ఏతదుభయ అభావము వీటిచే వ్యస్తసంబంధిత్వమునకు మూడు భేదములుండును. పై మూడింటియందును పద వ్యవధాన వాక్య వ్యవధానములచే మూడేసి భేదములు ఏర్పడును. పద వాక్యములందు అర్థ అర్థ్యమాన భేదముచే వాచ్యార్థము రెండు విధము లగును. వృత్త్యాది తము వృత్త్యాద్యముయని పద వాచ్యార్థము రెండు విధములు. హేతువు అభీష్టసిద్ధికి వ్యాఘాతము అయినచో అది దుష్టము, అసమర్థత్వ–అసిద్ధిత్వ–విరుద్ధత్వ–అనైకాంతికతా–సత్ప్రతిపక్షత్వ–కాలాతీతత్వ–సంకర–పక్షాభావ–సపక్షాభావ–విపక్షాస్థిత్వ–నిరర్థత్వములు పండ్రెండు హేతు దోషములు. ఇష్టవ్యాఘాత కారిత్వదోషము సహృదయు లకును సభాసదులకును మార్మిక పీడ కల్గించును. దుష్కరములగు చిత్రబంధాది కావ్యము లలో నిరర్థత్వము దోషముకాదు. గూఢార్థత్వము కూడ దోషము కాదు. లోక, శాస్త్రము లందు ప్రసిద్ధమైనచో గ్రామ్యత్వము దోషము కాదు. క్రియను అధ్యాహారమును చేసు కొనుటకు అవకాశము ఉన్నచో క్రియాభ్రంశము; కారకమును ఆధ్యాహారము చేసుకొనుటకు వీలున్నచో కారక భ్రంశము దోషములు కావు–ప్రగృహ్య సంజ్ఞను బట్టి ప్రకృతి భావము వచ్చినచోట విసంధిత్వము దోషముకాదు. సంధి చేసినచో ఉచ్చరించుట కష్టమైనపుడు విసంధిత్వము దోషముకాదు.

అనుప్రాసలో పదావృత్తి ఉన్నపుడు వ్యస్త సంబంధత్వము దోషముకాదు. అర్థ సంగ్రహ మున అర్థావృత్తి దోషము కాదు. కాని వ్యుత్క్రమాదులు మాత్రము దోషము. ఉపమానోపమేయముల విభక్తి, సంజ్ఞా, లింగ, వచనములలో భేదమున్నను బుద్ధిమంతులకు ఉద్వేగము కలుగనంతవరకు అవి దోషములు కావు. ఉద్వేగమును కల్గించని దోషములు దోషకరములు కావు. అనేక వస్తువులకు ఒక వస్తువుతోను, అనేక వస్తువులకు అనేక వస్తువులతోను ఔపమ్యము చెప్పినను దోషములేదు. కవిజన పరంపరా అంగీకృతమగు సదాచారమునకు సమయమని పేరు. దానిని సకల సిద్ధాంత వాదులను నిస్సంశయముగా అనుసరింతురు. కొన్ని సమయములను కొంతమందియే

అనుసరింతురు. ఈ విధముగా సమయములు రెండు విధములు; ఏదైనా ఒక సిద్ధాంతమును అనురించుటచేతను భ్రాంతిచేతను ఈ మత భేదము ఏర్పడును. కొంతమంది మునుల సిద్ధాంత మునకు తర్కము ఆధారము; కొంత మందికి క్షణభంగవాదము ఆధారము; పంచభూత సంఘాత ముచే శరీరమున చైతన్యము వచ్చునని కొందరందురు. స్వతః ప్రకాశమగు జ్ఞానమే చైతన్యమని కొందరు అందురు. కొందరు, ప్రజ్ఞాత స్థూలతావాదులు కొందరు శబ్దానేకాంతతావాదులు ఈ జగత్తుకు బ్రహ్మ కారణమని, శైవ, వైష్ణవ, శాక్త, సౌర సిద్ధాంతవాదులు అంగీకరింతురు. కాని సాంఖ్యులు దృశ్య జగత్తునకు ప్రధానమే కారణమని చెప్పుదురు. ఈ విధముగా సరస్వతీ లోకమున సంచరించు విచారకులు పరస్పర విపర్యస్త దృష్టితో చూచుచు యుక్తులతో పరస్పర ఖండనము చేసుకొనుచున్నారు. వీరు చెప్పు విభిన్న మార్గములు విశిష్టసమయము. అసత్తునే గ్రహించుట, సత్తును పరిత్యజించుట, దీనిచే ఈ విశిష్ట సమయము రెండు విధములు. ప్రత్యక్షాది ప్రమాణములచే బాధితమైనది అసత్తు. దేనియందు జ్ఞాన ప్రకాశముండునో ఆ మతమునే కవులు గ్రహించవలెను. ఏది అర్థక్రియా కారియో అదియే పరమార్థసత్; అజ్ఞాన జ్ఞానాతీతమై ఉన్న ఏక మాత్ర బ్రహ్మయే పర మార్థ సత్. అది జ్ఞేయము. అదియే సృష్టిపాలన సంహారహేతువగు విష్ణువు. అదియే శబ్ద అలంకార రూపము. అదియే పరాపర విద్యలు. దానిని తెలిసినవాడే సంసార బంధ ముక్తుడగును. (347)

ఏకాక్షర కోశము - నిరూపణము

అగ్నిదేవుడు పలికెను :

ఏకాక్షర కోశమును, మాతృకా నామములు, మంత్రములు చెప్పెదను. అ=విష్ణువు, నిషేధము. ఆ=బ్రహ్మ, సీమా అర్థమున ఇది అవ్యయము. వాక్యమునందు కూడ ఉపయో గించబడును. క్రోధము పీడ అనికూడ అర్థము. ఇ=మన్మథుడు, ఈ=రతి, లక్ష్మి, ఉ=శివుడు, ఊ=రక్షకాదులు, ఋ=శబ్దము, ౠ=అదితి, ఌ ౡ = దితి, కుమారస్వామి, ఏ=దేవి, ఐ=యోగినీ, ఓ=బ్రహ్మ, ఔ=మహేశ్వరుడు, అం=మన్మథుడు, అః=ప్రశస్తము, క=బ్రహ్మాదులు, కు=కుత్సితము, ఖ=శూన్యము, ఇంద్రియము, గ=గంధర్వుడు, వినాయ కుడు (న.పు. గీతము), ఘ=ఘంట, కింకిణీ మొదలగునవి, తాడనముకూడ దీని అర్థము; ఙ=విషయము, స్పృహ, భైరవుడు, చ=దుర్జనుడు, నిర్మలము; ఛ=ఛేదనము, జి=వివేకము, జ=గీతము, ఝ=ప్రశస్తము, ఞ=బలము, ట=గానము; ఠ=చంద్రమండలము, శూన్యము, శివుడు, ఉరిపోసుకొనుట; డ=రుద్రుడు, ధ్వని, త్రాసము, ఢ=ఢక్కా, ఢక్కాధ్వని, ణ=నిష్కర్షము, నిశ్చయము, త=తస్కరుడు, వరాహ పుచ్ఛము, థ=భక్షణము, ద=భేదనము, ధారణము, శోభనము, ధ=బ్రహ్మ, తుత్తూరము, న=సమూహము బుద్ధుడు, ప=ఉపవనము, ఫ= ఝంఝూవాతము, ఫు=ఫుత్కారము, నిష్ఫలము, బి=పక్షి, భ=నక్షత్రము, మా=లక్ష్మి, మానము, మాత, య=యాగము, యాత, ఈరిణ, వృక్షము, ర=అగ్ని, బలము, ఇంద్రుడు, ల=విధాతా, వ=విశ్లేషణము, వరుణుడు, శ=శయనము, సుఖము, ష=శ్రేష్ఠము, స= పరోక్షము, సా=లక్ష్మి, స=(నపు) కేశము, హ=ధారణము, రుద్రుడు, క్ష=క్షేత్రము, అక్షరము, నృసింహుడు, హరి, క్షత్రజాతి, పాలకుడు. ఏకాక్షర మంత్రము. దేవతా రూపము, భుక్తి ముక్తిప్రదము. 'క్షౌం హయ శిరసే నమః'.

ఇది అన్ని విద్యలను ఇచ్చు మంత్రము; అకారాది అక్షర నవకము మంత్రములే. వీటికి ఉత్తమ మాతృకా మంత్రములని పేరు. వీటిని ఒక కమలదళమున స్థాపించి పూజించవలెను. వీటిపై భగవతి, కాత్యాయని, కౌశికి, చండక, ప్రచండ, సురనాయిక, ఉగ్రపార్వతి, దుర్గలు అను నవదుర్గలను పూజించ వలెను. ఓం చండికాయై విద్మహే, భగవత్మై ధీమహి తన్నో దుర్గా ప్రచోదయాత్. ఇది దుర్గామంత్రము. షడంగాది క్రమమున పూజించవలెను. అజిత, అపరాజిత, జయ, విజయ, కాత్యాయనీ, భద్రకాళి, మంగళసిద్ధి, రేవతి, సిద్ధాదివటుక, ఏకపాద, భీమరూప, హేతుక, కపాలికలను పూజించవలెను. మధ్య భాగమున తొమ్మండుగురు దిక్పాలకులను పూజించవలెను. మంత్రసిద్ధి కొరకై 'హ్రీం దుర్గే దుర్గే రక్షణి స్వాహా' అను మంత్రము జపించవలెను. గౌరీ పూజచేసి ధర్మాదులను స్కందాదులను, శక్తులను పూజించవలెను. ప్రజ్ఞా, జ్ఞానా, క్రియ, వాచా, వాగీశి, జ్వాలినీ, వామ, జ్యేష్ఠా, రౌద్ర, గౌరి, హ్రి దేవతలను పూజించి పురస్సరా దేవిని 'హ్రీం సహ మహాగౌరి రుద్ర దైతే స్వాహా' అను మంత్రముతో పూజించి మహాగౌరి జ్ఞాన శక్తి, క్రియా శక్తి, సుభగా, లలిత, కామినీ, కామమాలా ఇంద్రాది శక్తుల పూజ కూడ ఏకాక్షర మంత్రముతో చేయవలెను. ఓం, గం, స్వాహా, ఇది గణపతి మూల మంత్రము లేదా గం గణపతయే నమః అను మంత్రముతో కూడ పూజ చేయవచ్చును. రక్త శుక్ల దంత, నేత, పరుశు ఉత్కట, మోద ఇవి షడంగములు. 'గంధోల్కాయ' ఇత్యాది క్రమమున గంధాదులు సమర్పించవలెను. గజ మహాగణపతి మహోల్క పూజ కూడ చేయవలెను. 'కూష్మాండాయ' మొదలు గణాధిపతయే స్వాహా వరకు ఉన్న మూలోక్త మంత్రములకు కకార ఏకాక్షర బీజములుముందు చేర్చి అంతమున 'నమః, స్వాహా' శబ్దములు ప్రయోగించి విని యోగించవలెను. తిలహోమముచేసి దేవతా పూజ చేయవలెను. ద్విరేఫ ద్విర్ముఖ, ద్వక్షాది మంత్ర ములు వేర్వేరుగా వుండవచ్చును. ఇపుడు స్కందుడు కాత్యాయనునకు చెప్పిన వ్యాకరణము చెప్పెదను. (348)

కుమార వ్యాకరణ శాస్త్రము

స్కందుడు చెప్పెను :

కాత్యాయనా! బాలకుల జ్ఞానము కొరకై వ్యాకరణ సారమగు సిద్ధ శబ్ద స్వరూపము చెప్పెదను. శాస్త్ర వ్యవహారములకు ఉపయుక్తములగు ప్రత్యాహారాది సంజ్ఞలు చెప్పెదను. 'అ, ఇ, ఉణ్' మొదలు, 'హల్' వరకు మూలోక్తము ప్రత్యాహారము. ఉపదేశమునందు అంత్యమగు హల్లు, అను నాసిక మగు అచ్చు ఇత్సంజ్ఞకములు. అంతిమ ఇత్సంజ్ఞక వర్ణముతో కలిపి చెప్పబడిన ఆది వర్ణము తనకును మధ్యనున్న వర్ణములకును గ్రాహకము. వీటికి ప్రత్యాహారములని పేరు. 'అణ్' మొదలు 'శల్' వరకు మూలోక్తములగునవి ప్రత్యాహారములు. అణ్, ఇణ్, యణ్ వీటిలో పరనకారముతో ప్రత్యాహారము. (349)

సంధి సిద్ధ నిరూపణము

స్కందుడు చెప్పెను :

దండాగ్రం సాగతాదధీదం నదీహాతే మధూదకమ్, పితృషభః ఋకారశ్చ తవేదం సకలోదకమ్ ! అర్థర్చోఽయం తవల్కారః సైషాసైంద్రీ తవౌదనమ్, ఖట్వోఘోఽభవ దిత్యేవంవ్యసుధీర్వ

స్వలంకృతమ్ । పిత్రర్ధోపవనం దాత్రీనాయకో లావకోనయః త ఇహతయి హేత్యాది తేఽ త్రయోఽ త్ర జలేఽ కజమ్ । ప్రకృతింనో అహో ఏహి అ అవేహి ఇంద్రకమ్, ఉ ఉత్తిష్ఠ కవీఏతౌ వాయూఏతౌ వనే ఇమే ! అమీఏతే యజ్ఞభూతే ఏతి దేవ ఇమన్నయ, వక్షేసంధిం వ్యంజనాం వ్యాగ్యతోఽ జే కమాతృకః ! షడేతే తదిమే వాది వాజ్ఞ నీతిః షణ్ముఖాదిక్. వాఙ్మనసంవాగ్భవాదిర్వాక్శ్లక్ష్ణం తచ్ఛరీరక్ ! తల్లునాతి తచ్ఛ కుజ్ జాస్తేచ సుగణ్ణిహ, భవాంశ్చరన్ భవాంశ్చాత్రో భవాంష్టీకా భవాంష్టకః ! భవాంస్తీర్థం కుజ్ జాస్తేచ సుగణ్ణిహ, భవాంశ్చరన్ భవాంశ్చాత్రో భవాంష్టీకా భవాంష్టకః! భవాంస్తీర్థం భవాస్థేయాన్ భవాంలేఖా భవాంజయః భవాంఛేతే భపాంచ్ శేతే భవాండీనః త్వంభర్తా తంకరిష్యాదిః సంధిర్ణ్ణే యోవి సర్గతః ! కశ్చిద్యాత్, కశ్చరేత్, కష్టః కష్ఠః కస్థశ్చ కశ్చలేత్ ! కఃఖనేత్ కల్గకరోరతి స్మకఃపేలేత్ కఃఫలేతవా, కశ్శ్వశురః, కః శ్వరశురః కస్సావరః కఃసావరః కఃఫలేత కఃశయితాకోఽ త్రయోధః క ఉత్తమః, దేవాఏతేభో ఇహసాదరాయాంతి భాగోరపజ! సుపూః సుదూరా త్రిరాత్ర వాయుర్యాతి పునర్నవహి, పునరేతి సయాతీహ ఏషయాతి క ఈశ్వరః ! జ్యోతీరూపం తవచ్ఛత్రం మ్లేచ్ఛదీశ్చిద్ర మాచ్ఛిదత్ ।

సంధి సిద్ధ రూపములను చెప్పెదను. ముందు స్వర సంధి చెప్పెదను. 'దండాగ్ర' మొదలు 'జలేకజమ్' వరకు ఉన్నవి ఉదాహరణము. అహో, ఏహి, దేవ ఇమం నయ వరకును ఉదాహరణ ములు. ప్రకృతి భావమునకు ఉదాహరణములు. ఇపుడు వ్యంజన సంధి చెప్పెదను. 'వాగ్యతః' మొదలు తంకరిష్యసి వరకును వున్నవి హల్సంధికి ఉదాహరణములు. కశ్చింద్యాత్ మొదలు జ్యోతీ రూపమ్' వరకును వున్నవి విసర్గ సంధికి ఉదాహరణములు. తపఛత్రమ్ మ్లేచ్ఛ ధీః, ఛిద్ర మాచ్ఛిదత్. తుగాగమమునకు ఉదాహరణములు. (350)

సుబ్విభక్తి సిద్ధరూప నిరూపణము

స్కందుడు చెప్పెను :

కాత్యాయనా! విభక్తి సిద్ధరూపములను చెప్పెదను. సప్పులు, తిఙులు అని విభక్తులు రెండు విధములు. సప్పులలో విభక్తులుండును. సుఔజస్, ప్రథమ, ఆంఔట్శస్' ద్వితీయ, టాభ్యాం భిస్, తృతీయ, జే, భ్యాంభ్యస్ చతుర్థి, జసి, భ్యాం భ్యస్, చతుర్థి జసి, భ్యాం, భ్యస్ పంచమి, ఙస్, ఓస్, ఆమ్, షష్టి, జి, ఓ, స్, సుప్, సప్తమీ; అజంతములు హలన్తములు అని ప్రాతిపదికములు రెండు విధములు. అవి మరల, పుంలింగ, స్త్రీలింగ నపుంసక లింగములని మూడేసి విధములు. పుంలింగాది శబ్దములలో ప్రధానమైన వాటిని చెప్పు చున్నాను. ఇక్కడ చెప్పబడని వాటికి వృక్షాది శబ్దములు నాయకములు; వీటిలో వృక్షః, సర్వః, పూర్వః, ప్రథమః, ద్వితీయః, తృతీయః, ఖడ్గపాః, వహ్నిః, సఖా, పతిః, అహర్పతిః, పటుః (పుంలిం) గ్రామణీః, ఇంద్రః, ఖలపూః, మిత్రభూః, స్వభూః, సుశ్రీః, సుధీః, పితా, భ్రాత్రా; (పుంలిం) కర్తా, క్రోష్టా, నప్తా, సురా, రాః; గౌః, ద్యౌః, గౌః ఈ అజంత శబ్దము పుంలింగమునందు నాయక శబ్దములు సువాక్, త్వక్, మొదలు శ్వలిట్ వరకు వున్నవి హలంత శబ్దము. జాయా శబ్దము మొదలు అసౌవరకును వున్నవి స్త్రీలింగమున నాయక శబ్దములు. కుండమ్ మొదలు అదః వరకును ఉన్నవి (మూలోక్తములు) నపుంసకలింగ నాయక

శబ్దములు. ఈ శబ్దములకు ప్రథమాది విభక్తి ప్రత్యయములు ప్రాతిపదికకు పరముగ వచ్చును. ధాతుప్రత్యయ భిన్నమైనది. ప్రాతిపదికము. ప్రాతిపదికకు స్వార్థము లింగము బోధించుటకు ప్రథమ వచ్చును. సంబోధనము నందునుకూడ ప్రథమ వచ్చును. కర్మ కర్త ఉక్తము లైనపుడు కూడ ప్రథమ వచ్చును. కర్మ అనగా చేయబడునది. కర్మకు ద్వితీయ వచ్చును. దేనిచే చేయబడునో ఆది కరణము; చేయువాడు కర్త; తిజ్ కృత్తద్ధితములచే అనుక్త మైనపుడు తృతీయవచ్చును. కర్తృకారకమునకు తృతీయవచ్చును. సంప్రదానమునకు చతుర్థి; ఎవనికి ఇవ్వవలెనని ఇచ్ఛయింతురో దానికి సంప్రదానము అనిపేరు. దేనినుండి ఒకటి వేరగునో దేనినుండి ఒకటి గ్రహింపబడునో దేనివలన భయమో, దానికి అపాదానము అనిపేరు. అపాదానమునకు పంచమీ వచ్చును. స్వస్వా మ్యాది సంబంధమునందు షష్ఠి వచ్చును. ఆధారమునకు అధికరణమని పేరు. దానికి సప్తమి వచ్చును. ఒకవస్తువును బోధించునపుడు ఏకవచనము, రెండు వస్తువులను బోధించుటకు ద్వివ చనము, అనేకమైన వస్తువులను బోధించుటకు బహువచనము వచ్చును. ఇపుడు సిద్ధ రూపములు చెప్పెదను. 'వృక్షః, సూర్యః' మొదలు కమలేషు వరకు ఆయా శబ్దముల కొన్ని సిద్ధ రూపములు ఇవ్వబడినవి. కామమహేశ మొదలగు శబ్ధములుకూడ వృక్ష శబ్దమువలె రూపములు ఉండును. సర్వే, విశ్వే, సర్వస్మై, సర్వస్మాత్, సర్వేషామ్, ఇత్యాది ప్రథమాది బహువచనము తప్ప ఈ శబ్దముల రూపములు వృక్ష శబ్దముల రూపములవలె ఉండును. ఉభయ, కతర, కతమ, అన్యతరాదులు కూడ ఇట్లే. ఈ విధముగా 'పూర్వే పూర్వాశ్చ మొదలగు అనడుత్సు వరకు ఆయార అజంత హలన్త శబ్దములకు, పుంలింగమునందు కొన్ని విభక్తులలో సిద్ధ రూపములు ఇవ్వబడినవి. ఇపుడు స్త్రీ లింగ రూపములు చెప్పెదను. (351)

స్త్రీలింగ శబ్ద సిద్ధ రూప నిరూపణము

స్కందుడు చెప్పెను :

రమా, రమే, రమాః, మొదలు 'అముయో' వరకు కొన్ని స్త్రీలింగ శబ్ద రూపము, కొన్ని విభక్తులలో సూచింపబడినవి. (352)

నపుంసక శబ్ద సిద్ధ రూప నిరూపణము

స్కందుడు చెప్పెను :

నపుంసక లింగమున – కిం, కే, కాని, మొదలు, అమీషువరకు కొన్ని నపుంసక లింగ శబ్దరూపములు, పిదప యుష్మదస్మచ్ఛబ్ద రూపములు ఇవ్వబడినవి. (353)

కారకము, నిరూపణము

స్కందుడు చెప్పెను :

విభక్త్యర్థ సమన్వితమగు కారకమును చెప్పెదను. గ్రామోఽస్తి, హే మహార్క, ఇవి ప్రథమ, సంబోధనమునకు ఉదాహరణములు. 'నౌమి విష్ణుం శ్రియాసహ' ఇచట విష్ణుం అనునది కర్మ

కావున ద్వితీయలో వున్నది. క్రియా అనునది తృతీయా, సహాయోగముచే వచ్చినది. క్రియ చేయుటలో స్వతంత్రుడు కర్త. వానిని ప్రేరేపించువాడు హేతుకర్త్ర. కర్మనే కర్తగా చెప్పినచో కర్మ కర్త. దీనికి 'స్వయ భిద్యేత్ ప్రాకృతధీః', 'స్వయం ఛిద్యతే తరుః' ఇత్యాదులు ఉదాహరణములు. అభిహితము, అనభిహితము అని కర్త రెండు విధములు. మొదటిది ఉత్తమము, రెండవది అధమము. 'ధర్మః వ్యాఖ్యాయతే' ఇత్యాదులలో కర్త అనభిహితము. ఈ విధముగా కర్త ఐదు విధములుగా చెప్పబడినది. కర్మ ఏడు విధములు. 'యతిః హరిం శ్రద్దదాతి' ఇచట ఈప్సిత కర్మ. అహింలంఘయతే; ఇది అనీప్సిత కర్మ. 'దుగ్ధం సంభక్షయన్ రజభక్షయతి' ఇది ఈప్సితా నిప్సిత కర్మకు ఉదా హరణము. 'గోపాలః గాం పయోదోగ్ధి' ఇది అకథిత కర్మ; 'గురుం శిష్యం, గ్రామంగమయతి' ఇచట కర్త్రు కర్మ; హరేః పూజాక్రియతే. ఇచట అభిహిత కర్మ హరేః స్తోత్రం కుర్యాత్' ఇచట అనభిహితకర్మ; కరణము బాహ్యము ఆభ్యంతరము అని రెండు విధములు; 'చక్షుషా రూపం గృహ్ణాతి' ఇచట బాహ్యా కరణము. 'ధాత్రేణలు నాతి' ఇచట ఆంతర కర్మము; సంప్రదానము మూడు విధములు; 'బ్రాహ్మ ణాయ గాం దదాతి' ఇచట ప్రేరక సంప్రదానము. 'నరః నృపతయే దాసందదాతి' ఇచట అనుమంత్రక సంప్రదానము. భర్త్రే పుష్పాణిదదాతి. ఇచట అనిరాకర్తృక సంప్రదానము; అపాదానము రెండు విధములు; ధావతః ఆశ్వాత్ పతితః ఇచట చలాపాదానము. సః వైష్ణవః గ్రామాదాగచ్ఛతి ఇచట అచలాపాదానము.

అధికరణము నాలుగు విధములు 'దధ్నిఘృతమ్' తిలేషుతైలమ్ ఇత్యాదులందు వ్యాపకాధి కరణము. కపిః గృహే తిష్ఠతి'. ఇచట ఔపశ్లేషిక అధికరణము. జలేమత్స్యః ఇత్యాదులందు వైషయికాధి కరణము. గంగాయాం ఘోషః వసతి, ఇత్యాదులందు సామీప్య కాధికరణము. దీనికే ఔపచారిక వాక్యమని పేరు. కర్త అనభిహితమైనపుడు తృతీయ కాని, షష్టికాని వచ్చును. ఉదా : లోకైః విష్ణుః సంపూజ్యతే, 'తేన లేదా తస్యగంతవ్యమ్' కర్తృ కర్మలు అభిహితమైనచో ప్రథమా విభక్తి వచ్చును. భక్తః హరిం ప్రణమేత్. ఉదా : హేతర్థమున తృతీయా విభక్తి వచ్చును. ఉదా : అన్నేన వసేత్. తాదర్థ్యమున చతుర్థి వచ్చును. ఉదా : వృక్షాయ జలమ్. పరి, అప, తిఙ్ మొదలగు వాటితో సంబంధము ఉన్నపుడు పంచమి వచ్చును. ఉదా : దేవః పరిగ్రామాత్ వృష్టః, పూర్వః, గ్రామాత్, ఋతేః విష్ణోః నముక్తి మరొక ఉదాహరణము. ఇతరః హరేః పృథక్ వినా మొదలగు వాటితో సంబంధము ఉన్నపుడు పంచమి కాని తృతీయ కాని వచ్చును. ఉదాహరణములు పృథక్ గ్రామాత్ 'విహారేణవినా'. కర్మ ప్రవచనీయలతో సంబంధమున్నపుడు ద్వితీయ వచ్చును. ఉదాహరణములు అన్వర్జు నంయోద్ధారః; అభితః గ్రామమ్. నమః, స్వాహా, స్వధా, స్వస్తి, వషట్ మొదలగునవి ప్రయోగించినపుడు చతుర్థి వచ్చును. ఉదాహరణములు నమః దేవాయ, తేస్వస్తి, భావవాచకము కంటే తుమర్థమున చతుర్థి వచ్చును. ఉదా హరణము–పాకాయయాతి మొదలగునవి; సహార్థక శబ్దములతో సంబంధము ఉన్నపుడును హేత్వర్థమునందును కుత్సితాంగ వాచకమునకును తృతీయ వచ్చును. ఉదాహరణములు–పితాపుత్రేణ సహ అగాత్ అక్ష్ణాకాణః, భృత్యః అర్థేన నివసేత్ ఇత్యాదులు కాలమునందును భావార్థము నందును సప్తమి వచ్చును. ఉదాహరణములు–'విష్ణౌనతే ముక్తిర్భవేత్' 'వసంతే సహహరింగతః' ఇత్యాదులు నృణాంస్వామి నృషుస్వామి, నృణాం ఈశః, సతాంపతిః,

నృణాం సాక్షి, నృషుసాక్షి, గోషునాథః, గవాంపతిః, గోషు సూతః, గవాంసూతః, రాజ్ఞాం దాయకః. ఇత్యాద్యుదాహరణములలో షష్టీ సప్తమీ విభక్తులు వచ్చినవి. స్మృత్యర్థ కర్మకు షష్టి వచ్చును. మాతుః స్మరతి. కర్తృ కర్మలకు నిత్యముగ షష్టివచ్చును. అపాంభేత్తా, తవకృతిః, ఇత్యాదులు ఉదాహరణములు. నిష్ఠాది యోగమునందు షష్ఠిరాదు. (354)

సమాసములు - నిరూపణము

స్కందుడు చెప్పెను :

ఆరు విధములగు సమాసములను చెప్పెదను. ఇది మరల ఇరువది యెనిమిది విధములు. నిత్యము అనిత్యము అని సమాసము రెండు విధములు. లుక్, అలుక్‌లచే మరల రెండు విధములు. కుంభకారః, హేమకారః, ఇత్యాదులు నిత్య సమాసములు. రాజ్ఞః పుమాన్ రాజ పుమాన్ ఇత్యాదులు అనిత్య సమాసములు. కష్టశ్రితః ఇత్యాదులు లుక్ సమాసములు. కంఠేకాలః ఇత్యాదులు అలుక్స మాసములు. ప్రథమాది సుప్రత్యయము లనుబట్టి తత్పురుషము ఎనిమిది విధములు. పూర్వం కాయస్య పూర్వకాయః ఇది ప్రథమా తత్పురుషము. అపరకాయః, అధరకాయః, ఉత్తరకాయః, అర్ధ కణాతుర్యభిక్షా ఇత్యాదులు ప్రథమాతత్పురుషములు. ఆపన్న జీవికః, అధరాశ్రితః, వర్షం భోగ్యః, వర్షభోగ్యః ఇత్యాదులు ద్వితీయాతత్పురుషములు. ధాన్యార్థః ఇది తృతీయాతత్పురుషము. విష్ణుబలిః ఇది చతుర్థీ తత్పురుషము. వృకభీతిః పంచమీ తత్పురుషము. రాజ్ఞః పుమాన్, రాజపుమాన్, వృక్ష ఫలము ఇత్యాదులు షష్టీ తత్పురుష అక్షశౌండః ఇది సప్తమీ తత్పురుష. అహితః ఇది నఞ్ తత్పురుషము.

కర్మధారయము ఏడు విధములు. నీలోత్పలమ్ ఇత్యాదులు ఉదాహరణములు. ఇది విశేషణ పూర్వ పదము. వైయాకరణ ఖసూచిః ఇది విశేష్యోత్తర పదము. శీతోష్ణమ్. ఇది విశేషణోభయపదము. శంఖపాండురః. ఇది ఉపమాన పూర్వపదము. పురుష వ్యాఘ్రః ఇది ఉపమానోత్తరపదము. గుణవృద్ధిః ఇది సంభావనా పూర్వపదము, గుణ ఇతి వృద్ధిః అని విగ్రహ వాక్యము. సుహృదేవసుబంధుకః, సుహృత్సుబంధుకః. ఇది అవధారణ పూర్వ పదము. బహువ్రీహి ఏడు విధములు. ఆరూఢ భవనః ఇది ద్విపద బహువ్రీహి. అర్చితా శేష పూర్వః ఇది బహుపద బహువ్రీహి. ఉపదశాః సంఖ్యోత్తర పదము. ద్విత్రాః ఇత్యా దులందు సంఖ్యోభయపదము. సమూలోద్ధృతః. ఇది సహ పూర్వ బహువ్రీహి- కేశాకేశి, నఖానఖి ఇత్యాదులు వ్యతిహార లక్షణ బహువ్రీహి. దక్షిణ పూర్వా ఇత్యాదులందు దిగ్లక్షణ బహువ్రీహి. ద్విగువు రెండువిధములు. ద్విశృంగమ్. ఇది ఏకవద్భావీ ద్విగు. అనేక వద్భావి కూడ వుండును. ద్వంద్వ సమాసము రెండు విధములు. రుద్ర విష్ణూ ఇతరేతర యోగ ద్వంద్వము. భేరీపటహం. ఇది సమహార ద్వంద్వము. అవ్యయీభావము రెండు విధములు. శాకస్య మాత్రాశాక ప్రతి. ఇది నామ పూర్వ పదావ్యయీ భావము. ఉప కుంభమ్. ఉపరథ్యమ్, అవ్యయ పూర్వక అవ్యయీ భావములు. సమాసము ప్రాధాన్యమును బట్టి నాలుగు విధములు. ఉత్తర పదార్థ ప్రధానమగు తత్పురుషము, ఉభయ ప్రధానమగు ద్వంద్వము, పూర్వార్థ ప్రధానమగు అవ్యయీ భావము, అన్యార్థ ప్రధానమగు బహువ్రీహి. (355)

తద్ధితము,నిరూపణము

స్కందుడు చెప్పెను :

ఇపుడు త్రివిధ తద్ధితను చెప్పెదను. సామాన్య తద్ధిత వృత్తి ఈ విధముగా ఉండును. 'లచ్' ప్రత్యయము చేర్చగా 'హంసలః', 'వత్సలః' మొదలగునవి సిద్ధించును. 'ఇలచ్' ఫేనిలం 'శ'- లోమశః 'న'-పామనః. 'ఇలచ్'-పిచ్ఛిలమ్. 'అణ్'-పాజ్ఞః, ఆర్చకః, దంత శబ్దమునకు ఉరచ్ దంతురః. 'ర'-మధురమ్, సుషిరమ్. 'వ'-కేశవః, 'య'- హిరణ్యమ్. 'వ'-మాలవః. 'వలచ్'- రజస్వలా. 'ఇణి'-ధనీ, ఘరీ, హస్తీ, 'టికన్'-ధనికమ్. 'విన్'-పయస్వీ, మాయావీ. 'యుచ్'- ఊర్ణాయుః. 'మిన్'-వాగ్మీ. 'ఆలచ్'-వాచాలః, 'ఆటచ్' -వాచాటః. 'ఇనచ్'-ఫలినః, బర్హిణః. 'కన్' -వృందాకరకః. 'ఆలుచ్'-శీతం నసహతే శీతాలుః, హిమంనసహతే హిమాలుః, వాత శబ్దమునకు 'ఉలచ్'-వాతులః, అపత్యార్థమున 'ఆణ్'-వాషష్ఠ కౌరవః. ఇది వాని నివాసము అను అర్థమున అణ్, పాంచాలః, మాథురః, తెలుసుకొనుచున్నాడు. చదువుచున్నాడు అను అర్థమున అణ్. చాంద్రకః 'వున్', క్రమకః, క్రోశకః, ప్రియంగూనాం భవం క్షేత్రమ్ ఇత్యాద్యర్థము నందు 'ఖయ్'-హైయ్యంగ వీనకమ్, మౌద్గీనమ్, కౌద్రవిణమ్. అపత్యార్థమున అణ్. వైదేహః, ఇయ్-దాక్షిః, దాశరథిః. 'ఫక్' -నాడాయనః. 'ఫయ్'-ఆశ్వాయనః. 'యయ్'-గార్గ్యః, వాత్స్యః 'ఢక్'-వైనతేయః. హేరక్-చాటకేరః. 'ఢ్రక్'-(ఐరక్) గౌధేరకః. 'ఆరక్'-గౌధారః. 'ఘ'-క్షత్రియః. 'ఖ'-కులీనః, ఇ-కౌరవ్యర్. 'యత్'- మూర్ధన్య ముఖ్య మొదలగునవి. సుగంధి అనురూపము 'ఇ' వచ్చుటచే ఏర్పడినది.

తారకాది శబ్దములకు ఇతచ్ ప్రత్యయము. తారకతమ్ మొదలగునవి. 'అనఙ్'-కుండోధ్నీ పుష్పధన్వా, సుధన్వా, చుంచుప్-విత్తచుంచుః, చణ్-కేశ చణః రూపప్-పటరూపకమ్. ఈయస్- పటీయాన్, తరప్-అక్షతరః, వచతితరాం, తమప్-అతితమాం, మృద్వీతమాం కల్పప్-ఇంద్ర కల్పః, అర్కకల్పః. 'దేశీయ'-రాజ దేశీయః. 'దేశ్య'- రాజదేశ్యః. 'జాతీయ'-పటుజాతీయః. 'మాత్రచ్'- జానుమాత్రమ్, ద్వయసచ్-ఊరు ద్వయసమ్. దఘ్నచ్-ఊరుదఘ్నమ్. 'టయప్'-పంచతయః, టక్- దౌవారికః. ఇంతవరకు తద్ధిత సామాన్య వృత్తి చెప్పబడినది. ఇపుడు అవ్యయ తద్ధిత వృత్తి చెప్పబడు చున్నది. 'యస్మాత్' అను అర్థమున 'తసిల్' చేర్చగ, 'యతః' అని అగును. 'త్రల్'-'యత్ర తత్ర అస్మిన్కాలే' అను అర్థమున 'అధునా' 'ఇదానీం' అను రూపములు ఏర్పడును. 'దా' అను చేర్చగా సర్వస్మిన్ అను అర్థమున సర్వదా అను రూపము ఏర్పడును. తస్మిన్కాలే అను అర్థమున రిహిల్- తర్హి అస్మిన్కాలే=ఇహ. కస్మిన్కాలే=కర్హి, థాల్-యథా. థం-కథమ్ పూర్వస్యాం దిశి అను అర్థము 'అస్తాతి' ప్రత్యయము. ఉదాహరణము పురస్తాత్. తుల్యే-అహని=సద్యః పూర్వాబ్దే=పరుత్, పూర్వతరాబ్దే=పరారి, అస్మిన్ సంవత్సరే=ఐషమః పరస్మిన్నహని అను అర్థమున వర శబ్దమున ఏద్యవి ప్రత్యయము చేర్చగ పరేద్యవి అగును. అస్మిన్నహని అను అర్థమున 'ద్య' చేర్చగా అద్య అగును. 'ద్యుస్' చేర్చగా పూర్వేద్యుః అగును. దక్షిణస్యాం దిశియను అర్థమున దక్షిణా, దక్షిణాహి అను రూపములు అగును. ఉత్తరస్యాందిశి అను అర్థమున ఉత్తరా, ఉత్తరాత్ అని అగును. ఉపరి అనుదానికి ఇష్టాతి చేర్చగా ఉపరిష్టాత్ అగును. ఉత్తర శబ్దమునకు ఏనచ్ ఉత్తరేణ, ఆచ్-దక్షిణా,

ఆహి–దక్షిణాహి, ధా–ద్విధా, ధ్యముయ్–ఐకధ్యమ్, ధముయ్–ద్వైధం, త్రైధం, ఆచ్–ద్విధా, త్రిధా మొదలగునవి. ఇంతవరకు నిపాత తద్ధితలు చెప్పబడినవి. ఇపుడు భావ వాచకములు చెప్పబడు చున్నవి. 'పటోర్భావః' అను అర్థమున త్వ, తత్ చేర్చగా పటుత్వము, పటుతా పృథుశబ్దమునకు ఇమనిచ్, ప్రథిమా, సుఖ శబ్దమునకు ష్యయ్–సౌఖ్యమ్. స్తేన శబ్దమునకు యత్=స్తైన్యమ్, సఖి, సఖ్యమ్. కపేర్భావః కాపేయమ్. యక్–పథ్యమ్. అణ్–ఆశ్వమ్ కౌమారకమ్ యౌవనము. కన్–ఆచార్యకమ్ ఇట్లే ఇతర తద్ధితలను కూడ గ్రహించవలెను. (356)

ఉణాది సిద్ధరూపము, నిరూపణము

కుమారస్వామి చెప్పెను :

ఇపుడు ధాతువు కంటె పరముగ వచ్చు ఉణాది ప్రత్యయములను గూర్చి చెప్పెదను. ఉణ్–కారుః=శిల్పి జాయుః, మాయుః=పిత్తము. ఇట్లే గోమాయువు ఆయువు మొదలగు నవి. ఉణాదులు బహుళముగ వచ్చును. ఆయుః స్వాదువు హేతువు మొదలగునవి ఉణాది ప్రత్యయ సిద్ధములు. కింశారః=వరిముల్లు, కృకవాకుః=కోడి, గురుః=భర్త. మరుః శయివు= అజగరము, సరుః = ఆయుధము, స్వరుః=వజ్రము, త్రపు=సీసము, ఫల్గు = సారరహితము, క్రన్ ప్రత్యయము చేర్చగా గృధ్రః నిష్పన్న మగును. కిరచ్–మందిరమ్ తిమిరమ్ (చీకటి), ఇలచ్–సలిలమ్=(నీరు), బండిలమ్ = కల్యాణము, క్వస్ ప్రత్యయము చేర్చగా, విద్వాన్= బుధుడు, శిబిరమ్=రహస్యమైన నివాస స్థానము, తుస్–హోతుః=పిల్లి, ఉణాదులు అభిధానమును బట్టి వచ్చుచుండును, కర్ణః=చెవి మరియు కాముడు వాస్తు=గృహ భూమి, జైవాతృక=చంద్రుడు, వహ–డిన్–చేర్చగా అనడ్వాన్, జీవాతు=జీవన ఔషధము, వహ్ ధాతువునకు 'ని' ప్రత్యయము చేర్చగా వహ్నిః, ఇనన్–హరిణః=మృగము మరియు కాముకుడు, పాత్రము, కంబోజః=పాత్రము, సరండః=భాండము, చతుష్పథము, హేరండః=వృక్షము, వరండః=సామ వేదము, స్ఫారం=అత్యదికము 'కన్' ప్రత్యయము చేర్చగా చీరము సిద్ధించును. వల్కలము; ఫారుః=పిరికివాడు, ప్రచండః=గురుడు, జవసమ్= తృణము, జగత్=భూలోకము, కృశానుః=అగ్ని, సూర్యుడు, వర్వరః=కుటిలుడు, ధూర్తుడు, చత్వరమ్=చతుష్పదము, చీవరమ్ = భిక్షువులు కప్పుకొను వస్త్రము, మిత్రః=సూర్యుడు, పుత్రః= కుమారుడు, పితా=తండ్రి, వృధాకుః = వ్యాఘ్రము, వృశ్చికము, గర్తః=గొయ్యి, భరతః= నటుడు ఇంకను ఉణాదులున్నవి. (357)

త్విభక్తి సిద్ధ రూపములు, నిరూపణము

కుమారస్వామి చెప్పెను :

తిఙ్ విభక్తినిగూర్చియు ఆదేశములనుగూర్చియు సంక్షిప్తముగా చెప్పెదను. తిఙ్ ప్రత్యయములు భావ, కర్మ, కర్త్రర్థములందు వచ్చును. సకర్మక అకర్మ ధాతువులకు కర్త్రర్థమున ఆత్మనేపద పరస్మైపద రెండింటియందు తిఙ్ ప్రత్యయములు వచ్చును. సకర్మ ధాతువులకు కర్మ కర్త్రర్థము లందువచ్చును. వర్తమానము నలట్ విధ్యాద్యర్థములందు లిఙ్ విధ్యాద్యర్థములందును ఆశీస్సునందును లోట్,

అనద్యతన భూతమున తిజ్ భూతమున లుజ్, పరోక్ష భూతమున లిట్, అద్యతన భవిష్యత్తున లుట్, ఆశీరర్థమున లిజ్, శేష భవిష్యదర్థమున ల్రుట్, లిజ్ నిమిత్త క్రియాది పత్తియందు ల్రుఙ్వచ్చును. తఙ్ శానచ్ కానచ్‌లకు ఆత్మనే పదమని పేరు. మొదటి తొమ్మిది పరస్మై పది ప్రత్యయములు, తిప్, తస్, అంతి ప్రథమ పురుష. సిప్, థస్, థ మధ్యమ పురుష, మిప్, వస్, మస్ ఉత్తమ పురుష; తా, ఆతాయ్, అన్త ఇవి ఆత్మనే పద ప్రథమ పురుష ప్రత్యయము థాస్, ఆథాం ధ్వమ్ మధ్యమ పురుష ప్రత్యయములు. ఇవహి, మహి ఉత్తమ పురుష ప్రత్యయములు. భూవాదులకు ధాతువులు అని పేరు. భూ, థ్ మొదలు 'కృ' వరకును మూలోక్తములగు ధాతువులు శబ్దాది వికంణములు ప్రత్యయములు చేర్చినపుడు క్రియా బోధకములు. క్రీడ్, వృఙ్గ్, గృహ్, చుర్, పా, నీ, అర్చి. ఈ ధాతువులను (ప్రధానములు). భూ ధాతువునకు క్రమముగా తిఙ్గ్ ప్రత్యయములు చేర్చుటచే సః భవతి, తౌ భవతః, తేభవన్తి, త్వంభవసి, యువాం భవథః, యూయం భవథ, అహంభవామి, ఆవాంభవామః, వయం భవామః. ఇత్యాది రూపములు అగును. ఇట్లే ఏధ ధాతువునకు మూలమునందు లట్ రూపములు ఇవ్వబడినవి. పచతి మొదలగునవి వెనుకటి రూపములవలె ఏర్పడును. భావార్థమున 'యక్' చేర్చగా 'భూయతే' కర్మార్థమున 'యక్' చేర్చగా అసౌ అనుభూయతే, 'సన్' చేర్చగా బూభూషతి, 'ణిచ్' చేర్చగా ఈశ్వరం భావయతి. 'యఙ్గ్' చేర్చగా బోభూయతే యఙ్గ్ లుక్ నందు భోభూతి ఇత్యాది రూపములగును. పుత్రీయతి, పుత్రకామ్యతి, పటపటాయతే, ఘటయతి ఇత్యాది రూపములగును. సన్‌ణిచ్ ప్రత్యయములు రెండును చేర్చగ భుభూష యతి ఇత్యాదులగును. లిఙ్గ్ నందు భవేత్ ఇత్యాది రూపములగును. ఏధ ధాతువునకు ఏధేత ఇత్యాది రూపములగును. లోట్‌యందు భవతు ఇత్యాది రూపములు, ఏధతామ్ ఇత్యాది రూపము అగును. ఈ విధముగనే కొన్ని ధాతువులకు కొన్ని 'ల' కారములందు మూలమున సిద్ధ రూపములు చూపబడినవి. (358)

కృదంత నిరూపణము

కుమారస్వామి చెప్పెను :

కృత్రప్రత్యయములు భావకర్మ కర్త్రర్థము లందు మూడింటి యందును వచ్చును. అచ్ ల్యుట్, క్తిన్, భావఘయ్, యచ్, అ, తవ్య, ఆదులు కృత్రప్రత్యయములు. అచ్ ప్రత్యయము చేర్చగా వినయః, ఉత్కరః, ప్రకరః, దేవః, భద్రః, శ్రీకరః మొదలగు రూపములు సిద్ధించును. ల్యుట్–శోభనమ్, క్తిన్–వృద్ధిః, స్తుతిః, మతిః, ఘయ్–భావః, యుచ్–కారణా భావనా మొదలగునవి. అ–చికిత్సా, తవ్య–కర్తవ్యమ్, ఉదాహరణము, అనీయ–కరణీయ కమ్, యత్–దేయం ధ్యేయమ్, ణ్యత్–కార్యమ్. ఇవన్నియు కృత్య ప్రత్యయములు; క్తాదులు, కర్త్రర్థము నందు కొన్నిచోట్ల భావ, కర్మార్థము లందును చేర్చబడును. ఉదాహరణ – గ్రామః గతః, గ్రామం గతః త్వయాగురు ఆశ్లిష్ట మొదలగునవి. శతృ–భవన్, శానచ్–ఏధమానః, భవన్ స్త్రీ లింగములో భవన్తీ అగును. అన్ని ధాతువుల కంటెను నువుల్, తృచ్, ప్రత్యయములు వచ్చును. (ఉదా: భావనః, భవితా మొదలగునవి క్విప్–స్వయంభూః, ల్యుట్‌కు భూతార్థమున క్వసు, కానచ్ ప్రత్యయములు చేర్చగ బభూవివాన్, పేచివాన్ పేచానః, శ్రద్ధదానకః ఇత్యాది రూపములగును. అణ్ చేర్చగా–కుంభకారః మొదలగునవి సిద్ధించును.

ఉణాదులు భూతార్థములందు కూడ వచ్చును. ఉదా : కారః, పాయుః, వాయుః ఇత్యాదులు ఛందయందు ఇవి బహుళముగా వచ్చును. (359)

శబ్దకోశము స్వర్గాది వర్గ నిరూపణము

అగ్నిదేవుడు పలికెను :

స్వర్గాది నామములు లింగముగ కల హరిని గూర్చి చెప్పెదను, స్వస్ స్వర్గ, నాక, త్రిదివ, ద్యో దివ్, (పుం, స్త్రీ) త్రివిష్టపమ్=స్వర్గము, దేవాః వృందారకాః లేఖాః= దేవతలు, రుద్రులు మొదలగు వారు గణ దేవతలు. విద్యాధరః అప్సరాః, యక్షః, రక్షః, గంధర్వః, కిన్నరః, పిశాచః, గుహ్యకః, సిద్ధః, భూతః=వీరందరు దేవయోనులు, దేవద్విషః, అసురాః దైత్యాః=దైత్యులు, సుగతః, తథాగతః=బుద్ధుడు, బ్రహ్మ, ఆత్మ భూ, సురజ్యేష్ఠ=బ్రహ్మ, విష్ణుః, నారాయణః, హరిః=విష్ణువు, రేవతీశః, హలీ, రామః = బలరాముడు, కామః, పంచశరః స్మరః = మన్మథుడు, లక్ష్మీః, పద్మాలయా, పద్మా=లక్ష్మి శర్వః, సర్వేశ్వరః, శివః=శివుడు, ఇతని జటాజూటమునకు కపర్ధయని పేరు. పినాకః అజగవమ్ ఈ రెండును ఈతని ధనుస్సునకు పేర్లు. శివుని పారిషదులకు ప్రమథాః అని పేరు. మృడానీ, చండికా, అంబికా=పార్వతి ద్వైమాతురః, గజాస్యః=గణపతి, సేనానీః, అగ్నిభూః గుహః = కుమార స్వామి. అఖండల సునాశీర–సుత్రామా, దివస్పతిః=ఇంద్రుడు ఆతని భార్యకు పులోమజా శచీ, ఇంద్రాణీ అనిపేర్లు. ఆతని ప్రాసాదము వైజయంతమ్. ఆతని కుమారుడు జయంతుడు ఐరావతః, అభ్రమాతంగః, ఐరావణః, అభ్రము వల్లభః ఐరావతము హ్రాదినీ, వజ్రం. (పుం, న) కులిశమ్, భిదురమ్, పవి=వజ్రాయుధము, వ్యోమయానం, విమానః (పుంన) = విమానము, పీయూషం, అమృతమ్, సుధా= అమృతము. సుధర్మా–దేవసభా; స్వర్గంగా సురదీర్ఘికా=స్వరలోక గంగ, అప్సరస్ శబ్దము స్త్రీ లింగము నందును నిత్య బహువచనము నందును ఉండును. ఊర్వశి మొదలగువారు స్వర్గలోకవేశ్యలు. హా హాః ఉహూః, వీరు గంధర్వులు, అగ్నిః వహ్నిః, ధనంజయః, జాత వేదా–కృష్ణవర్త్మా, ఆశ్రయాశః, భావకః, హిరణ్య రేతాః, శుక్రః, అశుశుక్షణిః శుచిః, అప్పిత్తమ్=అగ్ని; ఔర్వః, బాడవః బడ వానలః = వడవాగ్ని; అగ్ని యొక్క జ్వాలలు బోధించు జ్వాలకీల శబ్దములు రెండు లింగము లందును ఉండును. అర్చిః, హేతిః, శిఖా, (స్త్రీ)= జ్వాలలు, స్ఫు లింగః (పుం స్త్రీని) = అగ్నికణము, ధర్మరాజః, పరతరాట్ కాలః, హంతకః, దండధరః, శ్రాద్ధ దేవః = యముడు; రాక్షస, కోణప, అస్రప, క్రవ్యాద, యాతుధాన, నైఋతి=రాక్షసులు, ప్రచేతస్, వరుణ, పాశీ=వరుణుడు, శ్వసనః, స్పర్శనః, అనిలః, సదాగతిః, మాతరిష్వన్, ప్రాణః, మరుత్, సమీరణః వాయువు. జవ, రంహస్, తరస్, వేగము, లఘు, క్షిప్రిమ్, అరం, ద్రుతమ్, సత్వరం, చపలం, తూర్ణం అవి లంబితయ్ ఆశు=శీఘ్రముగా, సతత,అనారత, అశ్రాంత, సంతత, అవిరత, అనిశ, నిత్య, అనవరత, అజస్ర = ఎల్లపుడును, అతిశయః, భరః = అతిశయము, అతివేల, భృశ, అత్యర్థ, అతిమాత్ర, ఉద్గాఢ, నిర్భర, తీవ్ర, ఏకాంత, నితాంత, గాఢ, బాఢ, దృఢ=మిక్కిలి, గుహకేశః, యక్షరాజః, రాజరాజః–ధనాధిపః = కుబేరుడు, కిన్నరః, కింపురుషః, తురంగవదనః, మయుః ఇవి సమానార్థకములు. నిధిః–శేవధిః=నిధి, వ్యోమ, అభ్ర, పుష్కర, అంబర–ద్యో, దివ్, అంతరిక్ష,

ఖ=ఆకాశము, కాష్ఠా, ఆశా, కుకుభ్, దిశ్=దిక్కులు, అభ్యంతరమ్, అంతరాళమ్, చక్రవాళము, మండలమ్ = మండలము. తటిత్వత్, వారిద, మేఘ, స్తనయిత్ను, బలాహక, మేఘము. కాదంబనీ, మేఘమాలా =మేఘపంక్తి, స్తనితం–గర్జితమ్=ఉరుము; శంపా, శతహ్రద, హ్రాదినీ, ఐరావతీ, క్షణప్రభా, తడిత్, సౌదామినీ, విద్యుత్ చంచలా చపలా= మెరుపు స్ఫూర్జథుః, వజ్ర నిర్ఘోషః=ఉరుము, అవగ్రహః అనగా వర్షా భావము.

ధారా వర్షమునకు ఆసారః అని పేరు. శీకరః=నీటి బిందువులు. వర్షోపలః, కరకా=వడగళ్ళు, దుర్దినమ్=మేఘములు కప్పిన దివసము. అంతర్ధా, వ్యవధా, అంతర్ధి (పుం) అపవారణ, అపిధాన, తిరోధాన, పిధాన, ఆచ్ఛాదన=ఆచ్ఛాదనము. అబ్జ, జైవాతృక, సోమ, గ్లౌ, మృగాంక, కళానిధి, విధు, కుముదబంధు=చంద్రుడు. బింబః (పుం.న.) మండలము. (పుం. స్త్రీన)=మండలము, పద హారవ భాగమునకు కళయని పేరు. భిత్త, శకల, ఖండక, ఖండము, చందికా, కౌముదీ, జ్యోత్స్నా=వెన్నెల, ప్రసాదః=ప్రసన్నత్వము, లక్షణమ్ లక్షకమ్, చిహ్నం=చిహ్నము, శోభా, కాంతి, ద్యుతి, ఛవి, కాంతి పరుమ శోభ–సషమ. తుషార, తుహిన, హిమ=మంచు–సన్నని మంచునకు అవశ్యాయః, నీహారః అని పేర్లు. ప్రాలేయః–శిశిరః–హిమః=ఇవి కూడ నీహారమునకు పేర్లు. నక్షత్ర – ఋక్ష, ఖ, తారా, తారకా, ఉడు, స్త్రీ.న.=నక్షత్రము, గురుః, జీవః, ఆంగిరసః=గురుడు, ఉశనాః, భార్గవః=కవిః=శుక్రుడు, విదుంతుదః–తమః–రాహుః=రాహువు, లగ్నం=రాశియొక్క ఉదయము. మరీచి, అత్రి మొదలగు వారు సప్తర్షులు. చితశిఖండినః అని పేరు. హరిదశ్వ, బ్రధ్న, పూష, ద్యుమణి, మిహిర, రవి=సూర్యుడు, పరివేషః, పరిధిః, సూర్యుని చుట్టు కట్టిన మండలము. కిరణ, ఉస్ర, మయూఖ, అంశు, గభస్తి, ఘృణి, ఘృష్ణి, భాను, కర, మరీచి (స్త్రీ. పు.) దీధితి=కిరణము (స్త్రీ), ప్రభా, రుచి, త్విట్, భా, ఆభా, ఛవి, ద్యుతి, దీప్తి, రోచిస్, (న) శోచిన్(న) = కాంతి, ప్రకాశ, ద్యోత ఆతప, ఎండ, కోష్ణ, కవోష్ణ, మందోష్ణ, కదుష్ణ=కొంచెము వేడి, కొంచెము వేడి కలది అను అర్థమున త్రిలింగములు. తిగ్మ, తీక్ష్ణ, కర=తీక్ష్ణము, దిష్ట, అనేహ, కాల, కాలము, ఘస్రః=రాత్రింబవళ్ళు; సాయం సంధ్యా, పితుప్రసూః=సాయంకాల సంధ్యా, ప్రత్యూషః, అహర్ముఖం, కల్యం, ఉషః, ప్రత్యుషః=ప్రాతః కాలము. ప్రాహ్ణ అపరాహ్ణ, మధ్యాహ్నములకు త్రిసంధ్యము అని పేరు. శర్వరీ, యామి, తమీ=రాతి; తమిసా=చీకటి రాత్రి; జ్యోత్స్నీ వెన్నెలరాత్రి. రాబోవు పగలు జరుగుచున్న పగలు కలసిన రాత్రికి 'పక్షిణీ' అని పేరు. అర్థ రాత, నాశీథ=అర్ధరాత్రి, ప్రదోషః = సాయంకాల ప్రారంభము. ప్రతిపత్తునకును, పూర్ణిమ అమావాస్యలకును మధ్య నున్నది పర్వసంధి. రెండు పక్షాంత తిథులకు పంచదశీ అనిపేరు. పౌర్ణమాసీ, పూర్ణిమా= పూర్ణిమ, చంద్రుడు ఒక కళ తక్కు వున్నచో ఆ పూర్ణిమా 'అనుమతి' పూర్ణ చంద్రుడు ఉన్నది 'రాకా' అమావాసా, అమవసా, దర్వః–సూర్యేందు సంగమః=అమావాస్య చంద్రుడు కనబడినది, సినివాలీ, చంద్రకళ లేనిది, కుహూః, సంవర్త, ప్రళయ, కల్ప, క్షయ, కల్పాంత=ప్రళయము.

కలుష, వృజిన, ఏనస్, అఘ, అంహస్, దురిత, దుష్కృత=పాపము, ధర్మ (పుం న) పుణ్య, శ్రేయస్, సుకృత, వృష=పుణ్యము, ముత్, ప్రీతి, ప్రమద, హర్ష, ప్రమోద, ఆమోద, సంమద, ఆనందథు, ఆనంద, శర్మ, శాత, సుఖ=ఆనందము. స్వ శ్రేయసం, శివం, భద్రం, కల్యాణం, మంగళం,

భావుకం, భవికం, భవికం, భవ్యం, కుశలం, క్షేమం, (పుం. న.) = క్షేమము. దైవం, దిష్టం, భాగధేయం, భాగ్యం, నియతిః, విధిః= దైవము, క్షేత్రజ్ఞః, ఆత్మా, పురుషః=జీవుడు, ప్రధానం, ప్రకృతిః=ప్రకృతి, హేతుః (పుం) కారణం, బీజం, హేతువు, నిదానం=ఆదికారణము. చిత చేతస్, హృదయ, స్వాంత, హృత్, మానస, మనస్=మనస్సు, బుద్ధిః, మనీషా, ధిషణా, ధీః, ప్రజ్ఞా శేముషీ, మతః, ప్రేక్షా, ఉపలబ్ధి, చిత్, సంవిత్, ప్రతిపత్, జ్ఞప్తి, చేతనా=బుద్ధి. ధారణా శక్తిగల బుద్ధి మేధ. మానసిక కర్మ సంకల్పము. సంఖ్యా, విచారణా, చర్చా=విచారణ. విచికిత్సా, సంశయః=సంశయము. అధ్యాహారః, తర్కః, ఊహః=ఊహ. నిర్ణయ, నిశ్చయ=నిర్ణయము. మిథ్యా దృష్టి, నాస్తికతా = నాస్తికత్వము. భ్రాంతిః, మిథ్యా మతిః, భ్రమ. అంగీకార, అభ్యుపగమ, ప్రతిశ్రమ, సమాధి = అంగీకారము. జ్ఞానం = మోక్ష బుద్ధి. విజ్ఞానం, శిల్ప శాస్త్ర జ్ఞానము. ముక్తి, కైవల్య, నిర్వాణ, శ్రేయస్, నిశ్రేయస్, అమృత, మోక్ష, అపవర్గ= మోక్షము. అజ్ఞానం, అవిద్యా, అహంమతిః=అజ్ఞానము.

విమర్దమువలన కలిగిన సువాసన పరిమళము. అది జన మనోహరముగా ఉండును. ఎక్కువ ఆనందము కల్గించునది ఆమోదము. ఘ్రాణమునకు తృప్తి నిచ్చునది, సురభి, శుక్ల, శుభ్ర, శుచి, శ్వేత, విశద, స్యేత, పాండర, అవదాత, సిత, గౌర, వలక్ష, ధవళ, అర్జున, హరిణ, పాండుర, పాండు=తెలుపు, తెల్లని, ధూసరః=కొంచెము తెల్లగా ఉన్నది కృష్ణ, నీల, అసిత, శ్యామ, కాల, శ్యామల, మేచక = నలుపు నల్లని, పీత, గౌర, హరిద్రాభ=పసుపు పచ్చని, పాలాశ, హరిత, హరిత్=ఆకుపచ్చని, రోహిత, లోహిత, రక్త, శోణ, కోకనదచ్ఛవి=ఎరుపు, ఎర్రని, అరుణః=అంతగా ఎర్రని కానిది, పాటలః= తెలుపు ఎరుపు రంగులుకలది. శ్యావ కపిశః=కపిశ వర్ణము కలది. ధూమ్ర–దూమల–కృష్ణ లోహితము, కడారః–కపిల–పింగః–కద్రుః–పిశంగః–పింగళ=పింగళ వర్ణము కలది. చిత, కిర్మీర, కల్మాష, శబల, ఏత, కర్బుర=చిత్ర వర్ణము కలది. వ్యాహారః, ఉక్తిః లపితం = సంభాషణము. అపభ్రంశః=అప శబ్దము. తిజ్గన్త సుబంతముల సముదాయము లేదా కారకాన్వి తమగు క్రియవాక్యము. ఇతిహాస, పురావృత్త పురాణ, పంచ లక్షణ=పురాణము. సత్యమైన కథ కలది ఆఖ్యాయికా. కల్పిత ప్రబంధము కథా, సమహార, సంగ్రహః = సముదాయము. ప్రవల్హికా, ప్రహేళికా = ఈ రెండును సమానార్థకములు. సమస్యా, సమాసార్థ=ఈ రెండును సమానార్థకములు. స్మృతిః, ధర్మ సంహితా=ధర్మ శాస్త్రము, అఖ్యా, ఆహ్వా, అభిధాన = పేరు. హూతి, ఆకారణా, ఆహ్వాన = పిలుచుట. ఉపన్యాసః, వాఙ్ముఖము=వాక్ప్రారంభము, వివాదః, వ్యవహారః=వివాదము. ప్రతివాక్య, ఉత్తర=ఈరెండును సమానార్థకములు. ఉపోద్ఘాతః, ఉదాహారః=సమానార్థకములు. అభిశాపః=అనగా మిథ్యాభిశంసనము యశః=కీర్తిః, పర్యాయములు. ప్రశ్నః, పృచ్ఛా, అనుయోగకః=పర్యాయములు.

ఆమ్రేడితం=రెండు మూడుసార్లు చెప్పినది. కుత్సా, నిందా, గర్హణ=నింద. ఆలాపః = మాటలాడుట. ప్రలాప=అనర్థ వచనము. అనులాపః=మాటిమాటికి చెప్పుట. విలాపః=ఏడ్పు. విప్రలాపః=విరోధ వచనము. సంలాపః=పరస్పర భాషణము. సుప్రతాప= మంచిమాట. అపలాపః = కప్పిపుచ్చుట. రుషతీ=అమంగళవాక్కు. సంగతం=హృదయంగమ మైనది. స్వాంత్వం=మిక్కిలి మధురమైనది. అబద్ధం=అర్థములేని మాట. నిష్ఠుర, అశ్లీల, పరుష=గ్రామ్యము. సూనృతం = ప్రియవాక్కు. సత్యం, తథ్యం, ఋతం=సత్యమైన మాట. నాద, నిస్వాన, నిస్వన, ఆరవ, ఆరావ,

సంరావ, విరావ=ధ్వని, మర్మరః=వస్త్ర పర్ణాదుల ధ్వని, సింజితం=అలంకారమైన ధ్వని, నిక్వణః, క్వాణః=వీణాధ్వని, ఋతం=తిర్యగ్జంతువుల కూత, కోలాహలః, కలకలః=పర్యాయ పదములు. గీతం, గానం, పర్యాః, ప్రతిశ్రుత్=(స్త్రీ) ప్రతిధ్వని. నిషాదకః=తంతీ కంఠ ధ్వని, కాకలీ=సూక్ష్మము. మధురము అయిన ధ్వని. కలః=మధురము అస్ఫుటమైన ధ్వని. మంద్ర=గంభీరము. తారః=అత్యుచ్య ధ్వని. ఈ మూడు పదములు మూడు లింగములలో ఉండును. ఏకతాలః=పాటతో కలిసిన లయ. వీణా, పల్లకీ, విపంచీ, పర్యా, పరివాదినీ=ఏడు తీగల వీణ. తతం=వీణాది వాద్యము. ఆనద్ధం = మురజాది వాద్యము. సుషిరం=వంశాది వాద్యము. ఘనం=కాంశ్య తాలాది వాద్యము. ఈనాలుగు విధములైన వాద్యములకు వాదిత్రం, ఆతోద్యం అనిపేరు. మృదంగాః= మురజాః=పర్యా. అంత్య, ఆలింగ్య, అర్ధక=ఈ మూడును మురజ భేదములు. యశః, పటహః, ఢక్కా=పర్యా. ఆనక, దుందుభిః = భేరి; అనకః, పటహః =పర్యా. ఝర్ఝరీ, డిండి మాదులు పటహ భేదములు. మర్దలః = పణవః = పర్యా. సంగీత క్రియా మానమునకు తాలకము అని పేరు. లయః, సామ్యం= పర్యా, తాండవం, నాట్యం, లాస్యం, నర్తనం= పర్యా, నృత్య, గీత, వాద్యములు, మూడింటికిని తౌర్యత్రికం నాట్యము అనిపేరు. భట్టారకః, దేవః=రాజు. దేవీ=రాజ్యాభిషేకము పొందిన రాణి. శృంగార, వీర, కరుణ, అద్భుత, హాస్య, భయానక, బీభత్స, రౌద్రములు, రసములు, శృంగారః=శుచిః, ఉజ్జ్వలః=పర్యా. కృత్స్నః, వర్ధనః, వీరః=పర్యా. కారుణ్య, కరుణా, ఘృణా, కృపా, దయా, అనుకంపా, అనుక్రోశ, పర్యాహసః, హాసః, హాస్యం=పర్యా. బీభత్సం, వికృతం=పర్యా. విస్మయ, అద్భుత, ఆశ్చర్య, చిత్ర = పర్యా, భైరవ, దారుణ, భీషణ, భీష్మ, ఘోర, భీమ, భయానక, ప్రతిభయ=సమానార్థకములు. రౌద్ర, ఉగ్ర=పర్యా. పైన చెప్పిన పదునాలుగు పదములు మూడు లింగములలోను ఉండును. దర, త్రాస, భీతి, భీ, సాధ్వస, భయ=పర్యా, మానసిక వికారమునకు భావమని పేరు. భావమును బోధించునది అను భావము.

గర్వ, అభిమాన, అహంకార=పర్యా. చిత్తమునకు ఉన్నతి మానము. అనాదర, పరిభవ, పరీ భవ, తిరస్క్రియ=పర్యా. వ్రీడా, లజ్జా, త్రపా, హ్రీః=పర్యా. ధనమునందు ఆసక్తి అభిధ్యానము; కౌతూహల, కౌతుక, కుతుక, కుతూహల=పర్యా. విలాస, బిబ్బోక, విభ్రమ, లలిత, హేలా, లీలా, అనునవి శృంగార భావము వలన కలిగిన స్త్రీ చేష్టలు. వీటికి హావములు అనిపేరు. ద్రవ, కేళి, పరీహాస, క్రీడా, లీలా, కూర్దన=ఇవి క్రీడ పరిహాస వాచకములు. ఇతరులను పరిహసించుట అచ్ఛురితకము. స్మితం=చిరునవ్వు. అధోభువన, పాతాళ=పర్యా. ఛిద్ర, స్వభ్ర, వపా, శుషి=ఛిద్రము. గర్త, అవట, భూపిమైన గొయ్యి. తమిస్రం, తిమిరం, తమః=పర్యా. సర్ప, పృదాకు, భుజగ, దందశూక, బిలేశయ, సర్పము. విషం, క్ష్వేడః, గరళం=విషము. నిరయః, దుర్గతిః=నరకము. పయస్, కీలాల, అమృత, ఉదక, భువన, వన, జలము. భంగ, తరంగ, ఊర్మి, కల్లోల, ఉల్లోల = తరంగములు. పృషత్, బిందు=జల బిందువులు. కూల, రోధస్, తీరమ్=ఒడ్డు నీటి నుండి బయట పడినది పులినము. జంబాల, పంక, కర్దమ=బురద. పరీవాహః=పొరలుచున్న నీరు. కుపక, విదారక, జలాశయములలో నిలిచియున్న నీరు. ఆతరః=నది దాటించుటకు ఇచ్చు ధనము. ద్రోణీ, కర్రతో చేసినతొట్టె, కలుషః=ఆవిలః=కలుషమైనది. అచ్ఛః, ప్రచన్నః= స్వచ్ఛమైనది. గభీరకం,

అగాధం=లోతైనది. దాశః, కైవర్తః=పల్లెవాడు. శంబూకాః= నత్త గుల్లలు. సౌగంధిక, కహ్లారం=శ్వేతకమలము. ఇందీవరం–నీలకమలము. ఉత్పలం, కువలయం=కలువ. కుముద, కౌరవ = తెల్లకలువ, వీటి కందనమునకు శాలూకము అనిపేరు. పద్మం, తామరసం, కంజం=పద్మము. కువలయం, నీలోత్పలం=పర్యా. కోక నదం=ఎర్రకలువ. కరహాటః, శిఫా, కందం=పద్మలత యొక్క దుంప. కింజల్కః, కేసరః= పర్యా. ఖనిః, ఆకరః=పర్యా. పాదాః= దగ్గరనున్న చిన్న పర్వతములు. ఉపత్యకా= పర్వత మునకు దగ్గర ఉన్న భూమి. అధిత్యకా=పర్వతముపై ఉన్న భూమి. స్వర్గ పాతాళ వర్గాదులు చెప్పబడినవి. నానార్థకములను వినుము. (360)

అవ్యయవర్గము, నిరూపణము

అగ్ని పలికెను :

'ఆఙ్'=కొంచము అను అర్థమునందును, అభివ్యాప్తియందును, 'సీమ' అను అర్థము నందును ప్రయోగింపబడును. దానిని ధాతువుతో చేర్చినపుడు వేర్వేరు అర్థములు ఉండును. 'ఆ' ఇది ప్రగృహ్యా సంజ్ఞకము. స్మృతి వాక్యము అను అర్థమున ప్రయోగింపబడును. ఆః=కోపము, పీడ, కు=పాపము, నింద, కొంచెము 'ధిక్'=అసహ్యించుకొనుట, నింద. 'చ' ఇది అనువాచయ సమాహార ఇతరేతర, సముచ్చయార్థములందు ప్రయోగింపబడును. 'స్వస్తి'=ఆశీర్వాదము. క్షేమము–పుణ్యాదికము. 'అతి' =ప్రకర్ష లంఘించుట, 'స్విత్'=ప్రశ్న వితర్కము 'తు'=భేదము, అవధారణము. 'సకృత్'=కలిసి, ఒక పర్యాయము, 'ఆరాత్'=దూరము, సమీపము. 'పశ్చాత్'=పశ్చిమ దిక్కు, వెనుకటిది. 'ఉత' 'అపి' అనుదానికి వున్న అర్థములను వికల్పార్థమును బోధించును. పునః సదా అను పదములకు ఉన్న అర్థమును 'శ్వత్' అనునది బోధించును. 'సాక్షాత్'=ప్రత్యక్షము, తుల్యము. బత = ఖేదము, అనుకంప, అసంతోషము, విస్మయము, ఆమంత్రణము. హంత=హర్షము, అనుకంప, వాక్యా రంభము. విశాదము. 'ప్రతి'=ప్రతినిధి, వీప్స, లక్షణాదికము. 'ఇతి'=హేతువు, ప్రకరణము, ప్రకాశా దికము, సమాప్తి. 'పురస్తాత్' = పూర్వదిక్కు, ప్రథమము, పూర్వము. 'అగ్రతః'=ఇదికూడ పై అర్థములనే చెప్పును. 'యావత్ తావత్' ఇవి సాకల్యము అవధి, మానము, అవధారణము అను అర్థములను చెప్పును. 'అథో' 'అథ'=మంగళ, అనంతర, ఆరంభ, ప్రశ్న, సంపూర్ణత్వములు, వృథా = నిరర్థకము, యథా, విధిగ లేనిది. నానా= అనేకము, ఉభయము. 'ను'=ప్రశ్న, వికల్పము. అను=వెనుక, సాదృశ్యము. 'నను'=ప్రశ్న అవధారణము, అనుజ్ఞ అనునయము, ఆమంత్రణము. 'ఆపి'=గర్హ, సముచ్చయము, ప్రశ్న, శంక, సంభావన. వా=ఉపమ, వికల్పము. సామి=సగము, జుగుప్సితము. అమా = కూడ, సమీపము. కం=నీరు, శిరస్సు. ఏవం=అనునది 'ఇవ' 'ఇత్థం' పదముల అర్థము బోధించును. నూనం=తర్కము అర్థ నిశ్చయము. జోషం=మౌనముగా ఉండుట, సుఖము. 'కిం'=ప్రశ్న నింద. 'నామ'=పాకాశ్యము. సంభావ్యము, క్రోధము, స్వీకారము, నింద. అలం=భూషణము, పర్యాప్తి శక్తి, నివారణము. 'హూం'=వితర్కము, పరిప్రశ్న. 'సమయా'=సమీపము, మధ్య. 'పునః'=ప్రథమము కానిది, భేదము. 'నిః'=నిశ్చయము, నిషేధము. 'పురా'=చిరకాలమునకు పూర్వము, సమీప భవిష్యత్తు. 'ఉరరీ' 'ఊరీ' 'ఉరి'=విస్తారము, అంగీకారము. 'స్వర్'=స్వర్గము,

పరలోకము. కిల=వార్త, సంభావనా. 'ఖలు'=నిషేధము. వాక్యాలంకారము. జిజ్ఞాసావసరము. అభితః=సమీపము, రెండు వైపుల, శీఘ్రము, సాకల్యము, అభిముఖము. 'ప్రాదుస్' నామ, ప్రకాశము. 'మిథః'=అన్యోన్యము, రహస్యము, 'తిరస్'=అంతర్ధానము, అడ్డము. 'హా'=విషాదము, శోకము, ఆర్తి. 'అహః'=అద్భుతము, ఖేదము. 'హి'=హేతువు, అవధారణము.

చిరాయ-చిరరాత్రాయ చిరస్య మొదలగునవి చిరార్థకములు. ముహుః, 'పునఃపునః', 'శశ్వత్', 'అభీక్ష్ణం' 'అసకృత్'=మాటిమాటికి. ద్రాక్, ఝటితి, అంజసా, అహ్నాయ, మంక్షుః. 'సపది'=శీఘ్రము, ఋవత్. 'సుష్టు' శోభనము. 'కిముత'=వికల్పము. కిం, కిమూత = వికల్పము. 'తుహి', 'చ', 'స్మ', 'హ', 'వై' పాదపూర్తికి ఉపయోగించబడును. 'అతి'= పూజార్థకము 'దివా=పగలు. 'దోషా', 'నక్తం' =రాత్రి. 'సాచి', 'తిరస్'=అడ్డముగా. 'ప్యాట్' పాట్, అంగ, 'హే', 'హై' భోః=ఇవి సమానార్థకములు. సమయా, నికషా, హిరుక్= దగ్గర, "సహసా"=అతర్కితము, 'పురః, పురతః, అగ్రతః'=ఎదుట, దేవతలకు హవిస్సును ఇచ్చునపుడు 'స్వాహా' శ్రౌషట్, వౌషట్, స్వధా, అను పదములు ప్రయోగింప బడును. 'కించిత్', 'ఈశత్' మనాక్=కొంచెము. 'ప్రేత్య', 'అముత్ర'=జన్మాంతరము నందు. యతా, తథా=సామ్యము అహో-ఓ=ఆశ్చర్యము. 'తూష్ణీం, తూష్ణీకమ్'=మౌనము. 'సద్యః, సపది'=తత్క్షణము. 'దిష్ట్యా' సముప జోషమ్'=ఆనంద సూచకములు. 'అంతరే, అంతరా, అంతరేణ'=మధ్య యందు. 'ప్రసహ్యా'=హఠాత్తుగా. 'సాంప్రతం. స్థానే=యుక్తము. 'అభీక్ష్ణమ్, శశ్వత్'=నిరంతరముగ. 'నహి, అ' నో, న'=అభావము, 'మాస్మ, మా, అలమ్'=ఇవి నిషేధార్థకములు. 'చేత్, యది'=ఇవి పక్షాంతరమును 'అద్ధా, అంజసా' వాస్తవార్థమును బోధించును. 'ప్రాదుః, ఆవిః=ప్రకట మగుట. 'ఓం, ఏవం' పరమం=అంగీకారము. 'సమంతతః' పరితః, సర్వతః, విశ్వక్=నలు వైపుల. 'కామమ్, ఇష్టము లేని అనుమతిని సూచించును. 'అస్తు=కోపముతో కూడిన అనుమతిని సూచించును. నను=విరోధోక్తిని సూచించును. 'కచ్చిత్'=కోరికను తెలుపుటను సూచించును. 'నిస్సమం', 'దుస్సమం' =నింద్యము. యథాస్వం, యథా యథము-యథా యోగ్యముగా, మృషా, మిథ్యా = అసత్యము. 'యథాతథమ్' యథార్థము. 'ఏవం, తు' పునః, వై, వా=ఇవి నిశ్చయార్థకములు. ప్రాక్ ఇది అతీతార్థమును 'నూనం, అవశ్యం' నిశ్చయముగా, 'సంవత్'=సంవత్సరము. 'ఆర్వాక్'=వెనుకటి కాలము. 'ఆం, ఏవమ్'=అట్లే. 'స్వయం'=స్వయముగా. 'నీచైః=అల్పము. 'ఉచ్చైః'=అధికము. 'ప్రాయః' =తరచుగా. శనైః=మందముగా. 'సనా=నిత్యము, 'బహిః'=వెలుపల. 'స్మ'=భూత కాలార్థము. 'అస్తమ్' =అదృశ్యము. 'అస్తి'= ఉన్నది. 'ఊ'=కోపోక్తి. 'అయి'=ప్రశ్నము. అనునయము. 'హూం= తర్కము. 'ఉషా'=ప్రాతఃకాలము. 'నమః'=నమస్కారము, అంగమరల. 'దుష్టు'=నింద. 'సుష్టు'=ప్రశంసా. 'సాయం' = సాయం కాలము. 'ప్రగే'=ప్రాతఃకాలము. 'నికషా'=సమీపమున. ఐషమః=గడచుచున్న సంవత్సరము. 'పరుత్'=నిరుడు. 'పరారి'=ముందటి ఏడు. అద్య=నేడు. 'పూర్వ, ఉత్తర, ఆపర, అధర, అన్య, అన్యతర, ఇతర, శబ్దములకు, పూర్వే అహ్ని, ఇత్యాద్యర్థము లందు పూర్వేద్యుః ఇత్యాది పదములు నిష్పన్నమగును. 'ఉభయద్యుః, ఉభయేద్యుః'=రెండు దినములందును. 'పరేద్యవి'=మరుసటి రోజున. 'హ్యః' = నిన్న. 'శ్వః'=రేపు. 'పరశ్వః'=ఎల్లుండి. 'తదా' తదానీం=అపుడు. 'యుగపత్, ఏకదా'=ఒక్కమాటుగా. 'సర్వదా, సదా'=ఎల్లప్పుడును. 'ఏతర్హి, సంప్రతి, ఇదానీం, అధునా, సాంప్రతం'=ఇపుడు. (361)

నానార్థ వర్గము - నిరూపణము

అగ్ని పలికెను :

'నాకః=ఆకాశము, స్వర్గము, 'లోకః=లోకము, జనులు, 'శ్లోకః'=పద్యము, కీర్తి, 'సాయకః' =బాణము, ఖడ్గము, 'ఆనకః'=పటహము, భేరి. 'కలంకః'=మచ్చ, అపవాదము 'కః'=(పుం) = వాయువు, బ్రహ్మ, సూర్యుడు, కం=(న)=శిరస్సు, జలము. 'పులాకః'=తుచ్ఛ ధాన్యము, సంక్షేపము, అన్నపుమెతుకు, 'కౌశికః'=మహేంద్రుడు, గుగ్గులు, గుడ్లగూబ, పాములవాడు, 'శాలావృకః'= వానరము, శునకము, 'మానమ్'=కొలుచు సాధనము. 'సర్గః'=స్వభావము, నిర్మోక్షము, నిశ్చయము, అధ్యాయము, సృష్టి, 'యోగః'=కట్టుట, ఉపాయము, ధ్యానము. సంగతి, యుక్తి, 'భోగః'=సుఖము, వేశ్యా స్త్రీలకు, మొదలగువారికి ఇచ్చు భృతి 'అబ్జః'=శంఖము, చంద్రుడు, 'కరటః'=కాకి, ఏనుగు గండస్థలము 'శిపివిష్టః'=దుష్ట చర్మముకల వాడు, 'రిష్టం'=క్షేమము, అశుభము, అభావము, 'అరిష్టం' = శుభము, అశుభము 'వ్యుష్టిః'=ప్రభాతము, సమృద్ధి 'దృష్టిః'=జ్ఞానము, నేత్రము, దర్శనము. 'నిష్టా'=నిష్పత్తి, నాశము, అంతము. 'కాష్ఠా'=ఉత్కర్షము, స్థితి, దిక్కు, 'ఇడా', 'ఇలాః=భూమి, గోవు. 'ప్రగాఢః'=అత్యంతము, కఠినము, 'బాఢం'=మిక్కిలి ప్రతిజ్ఞ, 'దృఢః'=సమర్థుడు, స్థూలమైనది. 'వ్యూఢః'=ఏర్పరుపబడినది. కలిసియున్నది. 'కృష్ణః'=వ్యాసుడు, అర్జునుడు, హరి, 'పణః'=జూదాదుల యందు పందెము, భృతి మూల్యము, ధనము, 'గుణః'=నారి, గుణము, సత్త్వాదులు, శుక్లాదులు, సంధి మొదలగునవి. 'గ్రామణీః'=శ్రేష్ఠుడు, గ్రామాధిపతి. 'ఘృణా'= జుగుప్స, కరుణ. 'తృషా'= ఆసక్తి, దాహము. 'విపణిః'=వర్తకుల వీథి. 'తీక్ష్ణమ్'=విషము, యుద్ధము, లోహము, తీక్ష్ణమైనది అను అర్థమున ఇది త్రిలింగము, 'ప్రమాణమ్'=హేతువు, మర్యాద, శాస్త్రము, ఇంత అను నిశ్చయము. ప్రామాణికుడు. 'కరణమ్'=క్షేత్రము, శరీరము, మొదలగునవి. ఈరిణమ్=శూన్యము ఊషర క్షేత్రము.

'యంతా'=మావటివాడు, సారథి. 'హేతి'=అగ్నిజ్వాల, 'శ్రుతమ్'=శాస్త్ర నిర్ణయము, శాస్త్రము. 'కృతం'=కృతయుగము, పర్యాప్తము, 'ప్రతీతః'=ప్రసిద్ధము, చూడబడినది. 'అభిజాతః'=సత్కులీనుడు, పండితుడు. 'వివిక్త'=పవిత్రమైనది. విజనము. 'మూర్ఛితః'=మూర్ఛపొందినవాడు, అంతట వ్యాపించినది. 'అర్థః'=అర్థము, ధనము, వస్తువు, ప్రయో జనము, నివృత్తి. 'తీర్థం'=మూల కారణము, ఆగమము, మహర్షులు సేవించిన జలము, గురువు. 'కకుద్'=ప్రధానము, రాజ చిహ్నము, ఎద్దు మూపురము, 'సంవిత్'=జ్ఞానము, సంభా షణము, క్రియానియమము, యుద్ధము, నామము. 'ఉపనిషత్'=ధర్మము, రహస్యము. 'శరత్'=శరదృతువు, సంవత్సరము, 'పదం'=నిశ్చయము, రక్షణము స్థానము, చిహ్నము, పాదము, వస్తువు, 'స్వాదు'=ఇష్టము, మధురము. 'మృదు'=తీక్ష్ణము కానిది, కోమలము. 'సత్'=సత్యము, సాధువు, ఉన్నది, ప్రశస్తము, పూజ్యము, విధిః=విధానము, దైవము. "ప్రణిధిః"=పార్థన, గూఢచారి. "వధూ"=భార్య, కోడలు, స్త్రీ "సుధా"=సున్నము, అమృతము, 'శ్రద్ధా' = ఆసక్తి, విశ్వాసము, పండితంమన్య, గర్వితః= పండితుడు నని గర్వించినవాడు, 'బ్రహ్మ బంధుః'=బ్రాహ్మణుని అధిక్షేపమును తెలుపును. 'భానుః=సూర్యుడు, కిరణము. 'గ్రావా'=పర్వతము, శిల. 'పృథక్ జన'=మూర్ఖుడు, నీచుడు. 'శిఖరీ'=వృక్షము, పర్వతము. 'తనుః'=చర్మ, దేహము.

'ఉత్థానమ్'=పౌరుషము, తంత్రము. 'పుణ్యత్థానమ్'=ఎదిరించుట. 'నిర్యాతనం'=వైరము తీర్చుకొనుట. దానము, న్యాసము తిర్గి ఇచ్చుట. 'వ్యసనం'=ఆపద, క్రింద పడుట, కామ క్రోధములవలన కలిగిన దోషము, వేట, జూదము, పగటి నిద్ర, ఇతరులను నిందించుట, స్త్రీ సక్తి, మద్య పానము, నాట్యము, గానము, వాద్యములు, వ్యర్థముగా, తిరుగుట. ఇవి కామము వలన కలిగిన పది వ్యసనములు; చాడీలు చెప్పుట, సాహసము, ఈర్ష్య, అసూయ, అర్థ దూషణము, పరుషవాక్, పరుష దండము. ఇవి క్రోధము వలన కలిగిన ఎనిమిది వ్యసనములు.

'కౌపీనం'=చెడ్డపని, గుహ్యము. 'మైథునం'=సంగతి, రతి. 'ప్రధానం'=పరమార్థ బుద్ధి. 'ప్రజ్ఞానం' =చిహ్నము, బుద్ధి. 'క్రందనం'=ఏడ్పు, పిలుచుట. 'వర్ష్మ'=దేహము, ప్రయాణము. 'ఆరాధనం' =సాధనము, ప్రాప్తి, సంతోష పెట్టుట. 'రత్నం'=స్వజాతి శ్రేష్టము. 'లక్ష్మ'=చిహ్నము, ప్రధానము, కలాపః=భూషణము, నెమలి పింఛము, అంబులపొది, సంఘటితము. 'తల్పం'=శయ్యా, అట్టాలిక, భార్య. 'డింభః'=శిశువు, మూర్ఖుడు. 'స్తంభః'=స్తంభము, కొయ్యబారుట. 'సభా'=సమితి, సదస్సులు. 'రశ్మిః'=కిరణము, కళ్ళెము. 'ధర్మః'=పుణ్యము యమాదులు, లలామం, పుచ్ఛము, పుండ్రము, అశ్వము, అలంకారము, ప్రాధాన్యము, ధ్వజము. 'ప్రత్యయః'=అధీనము, శపథము, జ్ఞానము, విశ్వాసము, హేతువు. 'సమయః'=శపథము, ఆచారము, కాలము, సిద్ధాంతము. ఒడబాటు. "అత్యయః"=అతిక్రమ ణము, కాఠిన్యము, "సత్యం"=శపథము, తథ్యము. "వీర్యం"=బలము, ప్రభావము. "రూప్యం" =రూపము, ప్రశస్తము. 'దురోదరః'=(పుం) జూదరి (నపుం) పందెము, జూదము. 'కాంతారః' =మహారణ్యము, దుర్గ మార్గము. 'హరిః'=యముడు, వాయువు, ఇంద్రుడు, చంద్రుడు, సూర్యుడు, విష్ణువు, సింహాదులు. 'దరః'=(పుం. న.) భయము, గొయ్యి. 'జఠరః' =ఉదరము, కఠినము. 'ఉదారః', దాతా, మహాపురుషుడు, 'ఇతరః=అన్యుడు, నీచుడు, 'మౌళిః' =శిఖ, కిరీటము, ముడివేసిన జుట్టు, 'బలిః'=పన్ను, ఉపహారము, 'బలం'=సైన్యము, స్థైర్యము మొదలగునది. 'నీవీ'=స్త్రీకటి వస్త్రబంధము, మూల ధనము, 'వృషః'=అధిక వీర్యవంతుడు, ఎలుక, శ్రేష్ఠము, పుణ్యము, వృషభము, 'ఆకర్షః' =జూదము నందు ఉపయోగించు పాచికా, సారి ఫలకము 'అక్షం'-ఇంద్రియము. 'అక్షః'=పాచికా, కర్షము, వ్యవహారము, కలిద్రుమము. 'ఉష్ణీశః'=కిరీటాదికము, 'కర్షూః'=చిన్ననది. 'అధ్యక్షః'=పత్యక్షము, అధికారి, 'విభావసుః'=సూర్యుడు, అగ్ని. 'రసః'=శృంగారాది రసము, విషము, వీర్యము, గుణము, రాగము, ద్రవము, 'వర్చస్'=తేజస్సు, పురీషము. 'ఆగః = పాపము, అపరాధము. 'ఛందస్'=పద్యము, అభిలాష, 'సాధీయన్'=ఉత్తమము, నిశ్చితము. 'వ్యూహః' =సమూహము. 'అహిః'=వృత్రాసురుడు, 'తమోపహ'=అగ్ని, చంద్రుడు, సూర్యుడు. (362)

భూమ్యాదివర్గము, నిరూపణము

అగ్నిదేవుడు పలికెను : భూ, పుర, అద్రి, వనౌషధి సింహాది వర్గములను చెప్పెదను. భూః = అనంతా, క్షమా, ధాత్రీ, క్ష్మా, కుః. ధరిత్రీ=భూమి. మృత్-మృత్తికా=మట్టి. మృత్స్నా-మృత్సా=ప్రశస్త మైన మట్టి; జగత్, త్రివిష్టపమ్-లోకః, భువనం, జగతీ=పర్యా.అయనం, మార్గః, వర్త్మ, అధ్వా, పథిన్, పదవీ, శ్రుతిః, పద్ధతిః ..... పద్యా, వర్తనీ, ఏకపదీ = మార్గములు. పూః=స్త్రీ, పురీ, నగరీ,

పత్తనం, పుటభేదనం, స్థానీయం, నిగమః=నగరము. రాజధాని కంటె భిన్నమైన నగరము శాఖా నగరము. వేశ్యాజనాశ్రయము వేశము; ఆపణః, నిషద్యా= దుకాణము; విపణిః, పణ్య వీథికా=అంగడి; రథ్యా, ప్రతోలీ, విశిఖా=నగర ముఖ్య మార్గములు. వప్రం, భయః, ప్రాకారః, వరణః, శాలః, ప్రాచీరః=నగరము చుట్టు వున్న ప్రాకారములు. భిత్తిః, కుడ్యమ్=గోడ. లోపల ఇనుప ఊసలు వేసిన కుడ్యమునకు 'ఏడూకః' అని పేరు. వాసః, కుటీ, కుటః=నివాస స్థానము. శాలా, సభా=శాల. నాలుగు శాలలు కలగృహము సంజవనము. మునుల నివాసమునకు పర్ణశాల, ఉటజః అని పేరు. చైత్యమ్, ఆయతనమ్=పర్యా. మందురా=అశ్వశాల, ధనికుల నివాసము. 'హర్మ్యము' మొదలగునది. దేవతల, రాజుల, నివాసము ప్రాసాదము. ద్వాః=(స్త్రీ) ద్వారమ్, ప్రతీహారః=ద్వారము. వేదికా, వితర్దిః=అరుగు. 'విటంకమ్'=పావురముల గూడు. కపాటమ్, అరరమ్=తలుపు. 'నిశ్రేణిః', అధి రోహిణీ=నిచ్చెన. సమార్జనీ, శోధనీ=చీపురు. సంకరః, అవకరః=తుడిచిన తుక్కు. అద్రిః, గోత్రః, గిరిః, గావా=పర్వతము. గహనమ్, కాననమ్, వనం=అరణ్యము. ఆరామః, ఉపవనమ్, ఉద్యాన వనము. ప్రమద వనమ్=అంతపురము నందలి ఉద్యానవనము. వీథీ, ఆవలిః, పంక్తిః, శ్రేణీ, రాజిః=పంక్తి. పూవులు పూసి ఫలములు కాయు వృక్షము వానస్పత్యము. పూవులు లేకుండా కాయలు కాయునది వనస్పతి. పండ్లు మగ్గిన పిమ్మట ఎండిపోవు వాటిని ఓషధులు అందురు. పలాశీ, ద్రుః, ద్రుషః, ఆగమః= వృక్షము. స్థాణుః, ధ్రువః, శంఖుః=మొండేరు చెట్లు. ప్రపుల్ల, ఉత్ఫుల్ల, సంస్ఫుట = పూవులతో నిండిన వృక్షములు. పలాశమ్, ఛదనమ్, వర్ణమ్=ఆకు. ఇధ్మ, ఏధస్, సమిధ్ = సమిధలు. బోధి ద్రుమః, చలదళః=రావిచెట్టు. దధిత్థః, గ్రాహి, మన్మథః, దధి, ఫలః, పుష్ప ఫలః, దంత శఠః=వెలగ చెట్టు; హేమదుగ్ధః, ఉదుంబర వృక్షము. ద్విపత్రః = కోవిదార వృక్షము. సప్తవర్ణః=విశాల త్వక్=ఏడాకుల అరటి చెట్టు. కృతమాలః, సువర్ణకః, ఆరేవతః, వ్యాధి ఘాతః, శమ్యాకః, చతురంగుళః=పర్యా. దంత శఠః=జంబీరః=నిమ్మకాయ. తిక్త శావకః, వరుణః=పర్యా. పురుషః, తుంగః, కేసరః, దేవవల్లభః=పున్నాగ వృక్షము. నింబతరుః, మందారః, పారిజాతకః=పారిభద్ర వృక్షము. వంజులః, చిత్ర కృత్=పర్యా. పీతనకః= పీతనః=సమానార్థకములు. గుడ పుష్పః, మధు ద్రుమః=సమానార్థకములు. గుడఫలః, స్రంసీ=పీలు వృక్షము. నాదేయీ అంబు వేతసః=వేపచెట్టు. శిగ్రుః, తీక్ష్ణ గంధకః, కాక్షీరః, మోచకః=శోభాంజన వృక్షము. ఎర్రగా నున్న దీనినే మధు 'శిగ్రుః' అందురు. అరిష్టః, ఫేనిలః=పర్యా. గాలవః–శాబరః–లోధ్రః–తిరీటః–తిల్వః–మార్జనః–వృక్షము. శేలుః–శ్లేష్మాతః–శీతః–ఉద్దాలః–బహు వారకః, వైకంకతః, స్రువావృక్షః, గ్రంథిలః, వ్యాఘ్రపాత్= సమానార్థకములు. తిందుకః, స్ఫూర్జకః, కాలః, పర్యా. నాదేయీ–భూమి జంబుకః = నాగ రంగ వృక్షము. క్రముకః–పట్టికా=పర్యా. కుంభీ, కైడర్యః, కట్ఫలః, సమానార్థకములు, వీర వృక్షః, అరుష్కరః, అగ్నిముఖీ, భల్లాతకీ, పర్యా. సర్జకః, అసనః, జీవః, పీతసాలః, పర్యా. సర్జః, అశ్వ కర్ణః=సాల వృక్షము. వీరద్రుః, ఇంద్రద్రుః, కకుభః, అర్జునః=అర్జున వృక్షము. ఇంగుదీ=ఇది మునుల వృక్షము; మోచా–శాల్మలీ=పర్యా. చిరబిల్వః–నక్తమాలః, కరజః= కరంజక వృక్షము. ప్రకీర్యః, పూతి కరజః=పర్యా, మర్కటీ, అంగార వల్లరీ=పర్యా, రోహీ, రోహితకః, ప్లీహశత్రుః, దాడిమ పుష్పకః=పర్యా. గాయత్రీ. బాల తనయః, ఖదిరః, దంత ధావనః=పర్యా.

అరిమేధః, విట్కదిరః=పర్యా. కదరః=తెల్లకదిరము. పంచాంగుళః=వర్ధమానః, చంచుః, గంధర్వ హస్తకః=ఆముదపు చెట్టు. పింటీతకః, మరువకః=పర్యా. పీతదారుః, దారుః, దేవదారుః, పూతి కాష్ఠం=దేవదారువృక్షము. శ్యామా, మహిళాహ్వాయ, లతా, గోవందినీ, గుందా, ప్రియంగుః, ఫలినీ, ఫలీ=పర్యా. మండూక వర్ణః=పత్రోఽర్ణః, నటః, కట్వంగః, టుంటుకః, స్యోనాకః, శుకనాసః, ఋక్షః, దీర్ఘవృంతః కుటన్నటః=పర్యా. పీతద్రుః, సరళః=పర్యా. నిచుం, అంబుజ, ఇజ్జల=పర్యా. కాకోదుంబరికా, ఫల్గు=పర్యా. పీతద్రుః, సరళః=పర్యా. నిచుల, అంబుజ, ఇజ్జల=పర్యా, కాకోదుంబరికా, ఫల్గు=పర్యా. అరిష్ట, పిచుమర్దక, సర్వతోభద్ర, నింబ=పర్యా. శిరీష, కపీతన=పర్యా. వకుల, వంజుల=పర్యా. పిచ్ఛిలా, అగరు–శింశప=పర్యా. జయా, జయంతీ, తర్కారీ, పర్యా. కణికా, కణి కారికా, శ్రీపర్ణ, అగ్ని మంథ=పర్యా. వత్సక, గిరిమల్లికా=పర్యా. కాలస్కంద, తమాల, తాపిచ్ఛ=సమాన పదములు, తండులీయ, అల్ప మారిష=పర్యా. సింధువార= నిర్గుండీ, పర్యా. ఆస్ఫోటా= వనములో పుట్టిన సింధువారము. గణికా, యూథికా, ఆంబష్ఠా=పర్యా. సప్తలా, నవ మాలికా, పర్యా. అతిముక్త, పుండ్రక=పర్యా. కుమారి=తరణి, సహా=పర్యా. రక్త కుమారికి కురవక మనియు, పచ్చని దానికి కురంటక మనియు పేర్లు. నీవి, ఛింటీ, బాణా=పర్యా. ఝింటీ, సైరీయః=పర్యా. రక్త సైరీయకము, కురువకము, పీతవర్ణము, సహచరి. దస్తూర, కితవ, ధూర్త, పర్యా. రుచక, మాతులుంగ= పర్యా. సమీరణ, మరువక, ప్రస్థపుష్ప, ఫణిజ్జక=పర్యా. కుబేరక, వర్ణాస=పర్యా. ఆస్పీత, వసుక, అర్క=వర్యా. శివమల్లీ, పాశుపత, పర్యా. వృందా, వృక్షాదనీ, జీవంతికా, వృక్షరుహా=పర్యా. గడూచీ, తంత్రికా, అమృతా, సోమవల్లీ, మధుపర్ణీ=పర్యా. మూర్వా, మోరటి, మధూలికా, మధుశ్రేణీ, గోకర్ణీ, పీలువర్ణీ=పర్యా. పాఠా, అంబష్ఠా, విద్ధకర్ణీ, ప్రాచీనా వనతిక్తికా=పర్యా. కటు, కటుంబరా, చకాంగీ, శకులాదనీ=పర్యా. ఆత్మగుప్తా, ప్రావృషాహి, కపికచ్ఛు, మర్కటీ=పర్యా. అపామార్గ, శైఖరిక, ప్రత్యక్పర్ణీ, మయూరక=పర్యా. ఫంజికా, బ్రాహ్మణీ, భార్గీ=పర్యా, ద్రవంతీ, శంబరీ, వృషా=పర్యా.

మండూకపర్ణీ, బండీరి, సమంగా, కాలమేషికా=పర్యా. రోదనీ, కచ్ఛురా, అనంతా, సముద్రాంత, దురాలభా=పర్యా. పుస్నిపర్ణీ, పృథక్పర్ణీ, కలశిధావని, గుహా=పర్యా. నిర్దిగ్ధికా=స్పృశీ, వ్యాఘ్రా, క్షుద్రా, దుస్స్పర్శా=పర్యా. అవల్గుజ, సోమరాజీ, సువల్లి, సోమవల్లికా, కాలమేషి, కృష్ణఫలా, వాకుచీ, పూతిఫలీ=పర్యా. కణా, పుష్టా, ఉపకుల్యా= పర్యా. శ్రేయసీ, గజపిప్పలీ=పర్యా. చవ్య–చవికా=పర్యా, కాకచించీ, గుంజా, కృష్ణలా= పర్యా. విశ్వా, విషా, ప్రతివాషా=పర్యా. వనశృంగారట, గోక్షుర=పర్యా. నారాయణీ, శతమూలీ, పర్యా. కాలేయక, హరిద్రవ, దార్వీ, వచంపదా, దారు=పర్యా. శుక్లా, హైమవతీ=తెల్లనివస, వచా, ఉగ్రగంధా, షడ్గంధా, గోలోమీ, శతపర్వికా=పర్యా. ఆస్ఫోతా, గిరికర్ణీ=పర్యా. సింహాస్య, వాసక, వృష=పర్యా. మిశీ, మధురికా, ఛత్రా=పర్యా. కోకిలాక్ష, ఇక్షుర, క్షుర=పర్యా, విడంగ, క్రుమిఘ్న=పర్యా. వజ్ర ద్రుస్నుక్, స్నుహీ, సుధా= పర్యా. మృద్వీకా, గోస్తనీ, ద్రాక్షా=పర్యా. బలా, వాట్యాలక=పర్యా. కాలా, మసూరవిదలా=పర్యా. త్రిపుటా, త్రివృత్= పర్యా. మధుక, క్లీతక, యష్టి మధుకా, మధుయష్టికా=పర్యా. విదారీ, క్షీరశుక్లా, ఇక్షుగంధా, క్రోష్టీ, యాసితా = పర్యా. గోపీ, శ్యామా, శారిబా, అనంతా, ఉత్పల శారిబా=పర్యా. మోచా, రంభా, కదలీ=పర్యా,

భంటాకీ, దుష్ప్రదర్శినీ=పర్యా. ధ్రువా, సాలపర్ణీ=పర్యా, శృంగి, ఋషభ, వృషభ, పర్యా. గాంగేరుకి, నాగబలా=పర్యా. ముషలీ, తాలమూలికా=పర్యా. జ్యోత్స్నీ, పటోకాలిగా, జాలీ=పర్యా. అజశృంగీ, విషాణీ = పర్యా. లాంగలికీ, అగ్ని శిఖా=పర్యా. తాంబూలీ, నాగవల్లీ=పర్యా. హరేణు, రేణికా, కౌంతీ=పర్యా. హ్రీబ్దేరీ, దివ్యనాగర=పర్యా. కాలానుసార్య, వృద్ధ, అశ్మపుష్ప, శీత, శివ, శైలేయ=పర్యా. తాలపర్ణీ, దైత్యా, గంధకుటీ, మురా=పర్యా. గ్రంధిపర్ణ, శుక, బర్హి=పర్యా. బలా, త్రిపుటా, తృటి=పర్యా. శివా, తామలకీ=పర్యా. హను, హట్ట విలాసినీ=పర్యా. కుట, నట, దశపుర, వానేయ, పరిపేలవ=పర్యా. తపస్వినీ, జటా మాంసీ=పర్యా. పృక్కా, దేవీ, లతా, లఘు=పర్యా. కర్చూరక, ద్రావిడక=పర్యా. గ్రంధమూలీ, శరీ = కర్చూరకము. ఋక్ష గంధా, ఛగలాంత్రా, ఆవేగీ, వృద్ధదారక=పర్యా. తుండికేరీ, రక్తఫలా, బింబికా, పీలుపర్ణీ, పర్యా. చాంగేరీ, చక్రికా, అంబష్టా=పర్యా. స్వర్ణక్షీరీ, హిమావతీ=పర్యా. సహస్ర వేధీ, చుక్ర, అమ్లవేతస, శతవేధి=పర్యా. జీవంతీ, జీవనీ, జీవా=పర్యా. భూమినింబ, నేలవేము = కిరాతక=పర్యా. కూర్చశీర్ష, మధుకర=పర్యా. చంద్ర, కపివృక=పర్యా. దద్రుఘ్న, ఏడగజ=పర్యా. వర్షాభూ–శోధహారిణీ= పర్యా. కువందతీ, నికుంబస్త్రా, యమానీ, వార్షికా=పర్యా. లశున, గృంజన, అరిష్ట, మహాకంద, రసోన=పర్యా. వారాహీ, వరదా. గృష్టి=పర్యా. కాకమాచీ, వాయసి= శతపుష్పా, సితచ్ఛత్రా, అతిచ్ఛత్రా, మధురా, మిసి–అవాక్పుష్పీ–కారవీ=పర్యా. సరణా, ప్రసారిణీ, కటంబరా, భద్రవలా, పర్యా. కర్చూర, శటీ=పర్యా. పటోల, కులక, తిక్తక, పటు=పర్యా. కారవేల్ల, కటిల్లక = పర్యా. కుష్మాండక, కర్కారు=పర్యా. ఉర్వారు, కర్కటీ= పర్యా. హర్షోఘ్న, సూరణ=కంద, పర్యా. ముస్తక, కురువింద, పర్యా. త్వక్సార, వేణు, మస్కర, తేజన=వెదురు, ఛత్రా, అతిఛత్రా, పాలఘ్న = పర్యా. మాలా తృణక, భూస్తృణ= పర్యా. తృణరాజః, తాళః=పర్యా. ఘోంటా, క్రముక, పూగ=పర్యా.

శార్దూల, ద్వీపీ=పులి. హర్యక్షః, కేసరీ, హరిః=సింహము. కోలః, పోత్రీ, వరాహః=వరాహము. కోకః, ఈహామృగః, వృకః=తోడేలు, లూతా, ఊర్ణనాభి, తంతు వాయః, మర్కటః=సాలెపురుగు. వృశ్చికః, సూక కీటః=తేలు. సారంగః, తోకకః= సారంగపక్షి, కృకవాకుః, తామ్ర చూడః=కోడి, పికః, కోకిలః = కోకిల; కరటః, అరిష్టః, కాకః=కాకి. బకః, కహ్వః=కొంగ, కోకః, చక్రః, చక్రవాకః = చక్రవాక పక్షి; కాదంబః, కలహంసః=పర్యా. పతంగికా, పుత్తికా=పర్యా. సరఘా, మధుమక్షికా = తేనెటీగ, ద్వి రేఫః, పుష్పలిట్, భృంగః, షట్పదః, భ్రమరః, అలిః, పర్యా. కేకి, శికీ = నెమలి. కేకా = నెమలి కూత. శకుంతీ, శకుని, ద్విజ=పక్షి. పక్షతిః=పక్షమున మూలము. చంచుః, త్రోటిః =పక్షి ముట్టి. ఉడ్డీన, సండీన=పక్షిగతి విశేషము. కూలాయః, నీడమ్=పక్షిగూడు. పేషీ, కోశః, అండమ్=గ్రుడ్లు. పృథుక, శావక, శిశు, పోత, పాక, అర్భక, ఢింబ=శిశువు. సందోహ, వ్యూహక, గణ, స్తోమ, ఓఘ, నికర, వ్రాత, నికురంబ, కదంబక, సంఘాత, సంచయ, బృంద, పుంజ, రాశి, కూట = సముదాయము. (363)

మనుష్య వర్గము - నిరూపణము

అగ్నిదేవుడు పలికెను :

మనుష్య, బ్రహ్మ, క్షత్ర, వైశ్య, శూద్ర వర్గములను క్రమముగ చెప్పెదను. నృ, నర, పంచజన, మర్త్య=నరులు. యోషిత్, యోషా, అబలా, వధూః=స్త్రీ. ప్రియుని కోరుచు సంకేత స్థానమునకు

వెళ్ళునది అభిసారికా. కులటా–పుంశ్చలీ అసతీ=కులట. నగ్నికా, కోటరీ, నగ్న స్త్రీ; కాత్యాయనీ, సగము ముసలిది; సైరంధ్రీ=పర గృహమున సేవ చేయునది. అసిక్నీ=ఇంకను ముసలితనము రానిది. మలినీ–రజస్వలా=పర్యా. వారస్త్రీ, గణికా, వేశ్యా= పర్యా. యాతా, తోటికోడలు. ననందా=భర్త సోదరీ; సపిండాః, సనాభయః=సపిండులు. సమానోదర్య, సోదర్య, సగర్భ్య, సహజ=పర్యా. సగోత్ర, బాంధవ, జ్ఞాతి, బంధు, స్వజన= పర్యా. దంపతీ, జంపతీ, భార్యాపతీ, జాయాపతీ=పర్యా. గర్భాశయ, జరాయు, ఉల్బ, కలల=పర్యా. గర్త, భ్రూణ=పర్యా. క్లీబః, షండః, నపుంసకః=పర్యా. డింభః, నవజాత శిశువు. బాలకః, మాణవకః=పర్యా. పిచండిలః=పెద్దపొట్ట కలవాడు. అభ్రటః=వంగిన ముక్కు కలవాడు. పౌగండః=వికలాంగుడు; ఆరోగ్యమ్, అనామయమ్, పర్యా. ఏడః, బధిరః=చెవిటివాడు. కుబ్జః, గడులః=గూనివాడు. ఖుణిః=వంకర చేతులవాడు. క్షయః, శోషః, యక్ష్మా=క్షయ రోగము. ప్రతిశ్యాయః, పీనసః=జలుబు, క్షుత్, క్షుతం, క్షవః=తుమ్ము; కాసః, క్షవథుః=దగ్గు; శోధః, స్వయధుః, శోభః=వాపు. పాదస్ఫోటః–విపాదికా, కాళ్ళపగులు. కిలాసః సిధ్మః=పర్యా. పామ, కచ్ఛూః, పామా విచర్చికా=గజ్జి, కోఠ, మండలకమ్, కుష్టమ్, పర్యా; దుర్నామకః=అర్షస్=మూలశంక; ఆనాహః, నిబంధః=మలమూత్ర నిరోధము. గ్రహణీ, రుక్ప్ర వాహికా=గ్రహణి రోగము. బీజ, వీర్య, ఇంద్రియ, శుక్ర=వీర్యము. పలల, క్రవ్య, ఆమిష=మాంసము. వృక్కా అగ్రమాంసమ్, హృదయ మాంసము హృదయమ్, హృత్=పర్యా. మేదస్, వసా, వసా=కొవ్వు. మన్యా=మెడవెనుకవున్న నాడి; ధమని, శిరా=పర్యా. తిలకమ్, క్లోమ=పర్యా. మస్తిష్కమ్=మెదడు. దూషికా=కంటిపుసి. అంత్రమ్, పురీతత్, ప్రేగు. గుల్మః, ప్లీహా=పర్యా. వస్నసా, స్నాయుః=పర్యా. కాలఖండః, యకృత్= పర్యా. కర్పరః, కపాలః=పర్యా. కేకసమ్, కుల్యం, అస్థి=పర్యా. కంకాలః= అస్థిపంజరము. కశేరుకమ్=వెన్నెముక. కరోటిః=పుర్రె. పరుశుకా= ప్రక్క ఎముకలు. అంగ, ప్రతీక, అవయవ, శరీర, వర్ష్మ, విగ్రహ=పర్యా. కట, శ్రోణి ఫలక=పర్యా. కటి, శ్రోణి, కకుద్మతీ= పర్యా. నితంబః=స్త్రీ కటి యొక్క పశ్చాద్భాగము, జఘనమ్=పురోభాగము. కూపకౌ= నితంబము నందున్న గుంటలు. కకుందరే=కూపకములు; కటి, ప్రోథ, స్ఫిచ=పర్యా. ఉపస్థః, చెప్పనున్న పురుష స్త్రీ లింగములకు పేరు. భగమ్, యోనిః=పర్యా. శిశ్నః, మేఢ్రం, మోహనః, శేఫః=పర్యా. పిచిండః, కుక్షిః, జఠరమ్, ఉదరమ్, తుందః=పర్యా. కుచ, స్తన=పర్యా. చూచుకం=కూచాగ్రము; క్రోడం, భుజముల మధ్యభాగము. స్కంధః, భుజ శిరః, హంసః=భుజము. జత్రు=భుజముల సంధి, పునర్భవ, కరరుహ, నఖ, నఖర= పర్యా. చెయ్యి చాపగ అంగుష్ఠ మొదలు తర్జని చివరవరకు వున్న భాగము ప్రాదేశమని పేరు. అంగుష్ఠము నుండి కనిష్ఠిక చివరి వరకు వున్నది వితస్తి (జాన). ఇది పంద్రెండు అంగుళములు ఉండును. అన్ని వ్రేళ్ళను చాపిన చెయ్యికి చపేట–ప్రతల ప్రహస్త అని పేరు. పిడికిలి బిగించినచో దానికి 'రత్ని'యని పేరు. రత్ని నుండి కనిష్టీ వరకు వున్న భాగమునకు 'అరత్ని' యని పేరు. శంఖాకారముగల కంఠమునకు కంబుగ్రీవా–త్రిరేఖా అని పేరు. అవటుః, గాటా, కృతాటికా=కంఠ రంధ్రమునకు పేరు. పెదవుల క్రింది భాగమునకు చిబుకము అని పేరు. గండః, గలః, హనుః=గండ స్థలము పేరు. అపాంగః, నేత్రాంతము. కటాక్షః=నేత్రాంతముతో చూచుట; చికురః, కుంతలః, బాలః, కేశము (జుట్టు) ప్రతికర్మ, ప్రసాధనమ్=అలంకరించుకొనుట.

ఆకల్పః, వేషః, నేపథ్యమ్, నాటకాదులలో వేషము ధరించుట. చూడామణిః, శిరోరత్నము; తలః=హార మధ్యమందలి మాణిక్యము. కర్ణికా, తాళపత్రమ్=కర్ణ భూషణము. లంబనమ్, లలంతికా=క్రిందికి వ్రేలాడు హారము. మంజీరః, నూపురమ్=అందెలు, కింకిణీ=చిన్నఘంట. దైర్ఘ్యమ్, ఆయా మః, అనాహః = వస్త్రాదుల పొడవు. పరిణాహః, విశాలతా=వైశాల్యము; పటచ్చరమ్=జీర్ణ వస్త్రము; సంవ్యానమ్, ఉత్తరీయమ్=పర్యా. రచనా, పరిస్పందః=పుష్పాది రచన ఆభోగః= ఉపచా రాదుల పరిపూర్ణత్వము. సముద్గకః, సంపుటకః=చిన్నపెట్టె. ప్రతి గ్రాహః పతద్గ్రహః= ఉమ్మివేయు పాత్ర. (364)

బ్రహ్మవర్గ వర్ణన

అగ్నిదేవుడు పలికెను : వంశ, అన్వవాయ, గోత్ర, కుల, అభిజన, అన్వయ=వంశము. మంతవ్యాఖ్యానము చేయువాడు ఆచార్యుడు. యజ్ఞము నందు వ్రతదీక్ష గ్రహించినవాడు ఆదేష్ట. యష్టా, యజమానః=పర్యా. ఉపక్రమః=తెలిసిచేసిన ప్రారంభము; సతీర్థ్యాః = ఒక గురువు కలవారు. సభ్యాః, సామాజికాః, సభాసదః, సభాస్తారాః=పర్యా. ఋత్విజః, యాజకాః=పర్యా. అధ్వర్యుః = యజుర్వేదము తెలిసిన ఋత్విక్. ఉద్గాతా=సామవేదము తెలిసిన ఋత్విక్. హోతా=ఋగ్వేదము తెలిసిన ఋత్విక్. చశాలః=యూపస్తంభము నందలి కటకము. స్థండిలం, చత్వరం=పర్యా. ఆమిక్షా = కాచిన పాలు తోడుబెట్టగా దానినుండి వచ్చిన నీరు; పెరుగు కలిపిన నెయ్యి పృషదాజ్యమ్. పర మాన్నం, పాయసం=పర్యా. యజ్ఞమునందు అభిమంత్రించి చంపబడిన పశువు 'ఉపాకృతము'. పరంపరాక, శమన, ప్రోక్షణ=యజ్ఞ పశువధము. పూజా, నమస్యా, అపచితిః, సపర్యా, అర్హణా=పర్యా. వరివస్యా, శుశ్రూష, పరిచర్యా, ఉపాచనమ్=సేవ; నియమః, వ్రతమ్=పర్యా. పుణ్యకమ్=ఉపవాసాది వ్రతము; ప్రధానమైనది ముఖ్య కల్పము. అధమమైనది అనుకల్పము. కల్పః విధిః క్రమః=పర్యా. వివేకః=వేర్వేరుచేసి గ్రహించుట. ఉపాకరణమ్=సంస్కార పూర్వకముగ వేదమును గ్రహించుట. భిక్షు, పరివ్రాట్, కర్మందిన్, పారాశరిన్, మస్కరిన్=సన్యాసి; సత్యవాక్కు కలవారు ఋషులు. వేదాధ్యయన వ్రతమును సమాప్తి చేసినవాడు స్నాతకుడు. యతిన్, యతి=ఇంద్రియములను వశ ములో వుంచుకొనువాడు; శరీర సాధ్యమగు నిత్యకర్మకు 'యమము' అని పేరు. అపుడప్పుడుచేయు అనిత్యకర్మ నియమము. బ్రహ్మ భూయమ్, బ్రహ్మత్వమ్, బ్రహ్మ సాయుజ్యమ్=పర్యా. (365)

క్షత్ర,విట్ శూద్రవర్గ వర్ణన

అగ్నిదేవుడు పలికెను :

మూర్ధాభిషిక్త, రాజన్య, బాహుజ, క్షత్రియ, విరాట్=క్షత్రియుడు. అధీశ్వరః= సామంతరాజు లందరును వంగి నమస్కరించు రాజు. చక్రవర్తి=సార్వభౌమః=సకల భూ మండలమునందు అధికారము కలవాడు. చిన్నచిన్న మండలములు పాలించువారు మండలేశ్వరులు. మంత్రీ, ధీసచివః, అమాత్యః=పర్యా. మహామంత్రః=ప్రధానుడైన మంత్రి. ప్రాడ్వివాకః, అక్షదర్శకః=వ్యవహారమును పరిశీలించువాడు; భౌరికః=సువర్ణాధ్యక్షుడు. అధ్యక్షః, అధికృతః=అధికార. అంతర్వంశికః = అంతః పురాధికారి. సౌవిదల్ల, కంచుకిన్, స్థాపత్య, సౌవిద=అంతఃపుర రక్షకులు. షండః, వర్షవరః =

అంతఃపుర భృత్యులు. సేవకః, అర్థీ, అనుజీవీ=పర్యా. తన దేశమునకు సరిహద్దున ఉన్న రాజు శత్రువు; వాని రాజ్యమునకు అవతలనున్నవాడు మిత్రుడు. వానికి అవతల వున్నవాడు ఉదాసీనుడు. వెనుకనున్న వాడు పార్ష్ణి గ్రాహుడు. చరః సృశః, ప్రణిధిః=గూఢచారి. ఆయతిః = భవిష్యత్కాలము, తదాత్వం= తత్కాలము. ఉదర్కః=భవిష్యత్ఫలము. అగ్ని జలాదుల వలన కలుగు భయము. అదృష్ట భయము. స్వపర రాజ్యముల నుండి కలిగినది దృష్ట భయము; భద్ర కుంభః, పూర్ణకుంభః= పర్యా. భృంగారః, కనకాలుకా=పర్యా. ప్రభిన్నః, గర్జితః, మత్తః=మదించిన ఏనుగు; వమథు=ఏనుగు తొండము నుండి వచ్చు జల బిందువులు; శ్రుణిః, అంకుశః= పర్యాయ పదములు. పరిస్తోమః, కుథ=ఏనుగుపై పరచిన ఆస్తరణము. కర్ణీరథః, ప్రవహణమ్=స్త్రీలు ప్రయాణించు రథము. దోలా, ప్రేంకా, ఐయల, ఆధోరణ, హస్తిపక, హస్త్యారోహ, నిషాదిన్=ఏనుగు నెక్కువారు. (మావటీడు); భట, యోధ, యోద్ధృ=పర్యా. కంచుకః, వారణః=కవచము, శీర్షణ్యమ్, శిరస్త్రమ్= పర్యా. తనుత్రమ్, వర్మ, దంశ నమ్=కవచము. ఆముక్తః, ప్రతిముక్తః, పినద్ధః, అపినద్ధః=ధరించిన కవచము. వ్యూహః=వల విన్యాసము. చక్రమ్, అనీకమ్=సైన్యము. ఒక ఏనుగు, ఒక రథము, మూడు గుర్ర ములు. ఐదుగురు కాలిబంట్లు వున్నది 'పత్తి'. పత్తిలోని అంగములను ఏడు పర్యాయములు మూడేసి రెట్లు చేసినచో వరుసగా సేనాముఖ, గుల్మ గణ, వాహినీ, పృతనా, చమూ, అనీకినీ అను సేనా విభాగములు ఏర్పడును. గజములు మొదలగు సకలాంగములతో కూడిన పది అనీకుల సేనకు అక్షౌహినీ అనిపేరు; ధనుః, కోదండః, ఇశ్వాసః = ధనుస్సు. కోటి, అటనీ = ధనుస్సు యొక్క రెండు అగ్ర భాగములు. లస్తకః = ధనుర్మధ్యము. మౌర్వీ, జ్యా, సింజినీ, గుణః = నారి. పృషత్క, బాణ విశిఖ, అజిహ్మగ, ఖగ, అశుగ, ఇవి పర్యాయపదములు.

తూన, ఉపాసంగ, తూణీర, నిషంగ, ఇషుధి=అంబుల పొది; అసి, ఋష్టి, నిస్త్రింశ, కరవాల, కృపాణ=ఖడ్గము. త్సరుః=ఖడ్గముపిడి. ఈలీ, కరపారికా=చేతులను రక్షించుకొను సాధనము. కుఠారః, స్వధితిః=గొడ్డలి, ఛురికా, అసిపుత్రికా=చిన్న కత్తి ప్రాసః, కుంతః =పర్యా. సర్వలా, తోమరః = పర్యా. వైతాలికాః, బోధకరాః=ప్రాతః కాలమున మేల్కొలుపు వారు. మాగధాః, వందినః = సోత్రపాఠకులు. సంశప్తకాః=శపథముచేసి యుద్ధము నుండి తిరిగిరానివారు. పతాకా, వైజయంతీ = చిన్నజండా. కేతనమ్, ధ్వజమ్=పెద్ద జండా. అహంపూర్వికా=నేనుముందు, నేను ముందు అని చెప్పుట. అహమహమిక=నేను నేను సమర్థుడనను అహంకారము. శక్తి, పరాక్రమ, ప్రాణ, శౌర్య, స్థాన, సహస్, బల=(స్థామ) పర్యా. మూర్ఛా, కష్మలం, మోహః=పర్యా. అవనుర్దః=పీడించుట. అభ్యవ స్కందనః, అభ్యాసాదనమ్=శత్రువును ఆక్రమించుట. విజయః, జయః=పర్యా. నిర్మాసవనమ్, సంజ్ఞ పనం, మారణం, ప్రతిఘాతనం=చంపుట. దిష్టాంత, ప్రళయ, పంచతా, కాలధర్మ, అత్యయ = మరణము; విశ్, భూమి స్పృశ్, వైశ్య=పర్యా. వృత్తిః, వర్తనం, జీవనం, జీవిక, కృషి=మొదలగునవి వృత్తులు. కుసీదం=వడ్డీపై జీవించుట ఉద్ధారః=అర్థప్రయోగః=వడ్డీకి ధనమిచ్చుట. కణిషం= సస్య ముల వెన్ను; కింశారు=సస్యముల ముల్లు. స్తంబః=గుత్సః భజుకరీ=వరి. కడంగరః, బుసం=పర్యా. మాషము మొదలగునది శమీధాన్యమనియు, యవాదులు శూకధాన్యమనియు, నీవారములు తృణ ధాన్యమనియు చెప్పబడును. శూర్పం, పస్ఫోటనం=చాటు. స్యూతః, ప్రసేవః=త్రాడు (అల్లినది);

కండోలః, పిటః=బుట్ట, కటః, కిలింజకః=చాప, రసవతీ, పాకస్థానం, మహానసం=వంటఇల్లు. పౌరోగవః=పాక గృహా ధ్యక్షుడు. సూపకారాః, వల్లవాః, అరాలికాః, ఆంధసికాః, సూదాః, ఔదనికాః, గుణాః=వంట చేయువారు. అంబరీషం, భ్రాష్ట్రః=మంగలము. కర్కరీ, ఆలుః, గలంతికా= కత్తిపీట. ఆలింజరః, మణికం పెద్ద ఘటము, శుషవీ=నల్ల జీలకర్ర; ఆరనాలః, కుల్మాషం= గంజి. వాహ్లికం, హింగువ, రామఠం=హింగు (ఇంగువ). నిశా, హరిద్రా, పీతా=పసుపు, మత్స్యండి, ఫాణితం, ఖండము. కూర్చికా, క్షీరముతో తయారుచేసిన పదార్థము. స్నిగ్ధం, మస్రుణం, చిక్కడం= చిక్కగా నున్నది. పృథుకః, చిపిటకః=అటుకులు, ధానాః=వేయించిన యవలు, జేమనం, లేపః, ఆహారః = పర్యా. మాహేయీ, సౌరభీ, గౌః=ఆవు, యుగ్య, పాసంగ్య, శాకట=కాడిమోయు ఎద్దులు, భష్క యిణీ = చాల కాలము క్రితము ఈనిన ఆవు. ధేనుః= క్రొత్తగా ఈనిన ఆవు. సంధినీ=వృషభముతో కలసిన ఆవు. నేహత్=గర్భము పోయిన ఆవు.

పణ్యాజీవః, ఆపణికః=వ్యాపారము చేయువాడు. న్యాసః, ఉపనిధీ=దాచుటకు ఇచ్చిన వస్తువు. విపణః, విక్రయః=అమ్ముట. 'దశ'వరకును. సంఖ్యావాచకములు సంఖ్యేయమును చెప్పును. త్రిలింగ ములలో ఉండును. వింశతి వరకు అన్ని సంఖ్యా వాచకములు సంఖ్యేయ సంఖ్యార్థములలో నిత్య ఏకవచనాంతములో ఉండును. సంఖ్యార్థము నంది ఇవి ద్వివచన, బహువచనములందు కూడ ఉండును. 'సవతి' వరకు=ఇవి స్త్రీలింగములు, 'పంక్తి' మొదలు 'శత' 'సహస్ర' ఆదికము క్రమముగా పదేసి రెట్లుండును. తులా, అంగులి, ప్రస్థములతో చేయబడు మానము మూడు విధములు. ఐదు గుంజలు ఒక మాషము. పదహారు మాషములు ఒక అక్షము లేదా కర్షము. నాల్గు కర్షములు ఒక పలము. ఒక అక్షము బంగారమునకు సువర్ణము. బిస్తము అని పేరు. ఒక పలము సువర్ణము కురుబిస్తము. నూరు పలములు ఒక తుల, ఇరవై తులలు ఒక భారము. వెండి రూపాయకు కార్షా పణము కార్షికము అనిపేరు. రాగి పైసకు పణము అనిపేరు. ద్రవ్య, విత్త, స్వాప, తేయ, రిక్థ, రుక్థ, ధన, వసు=ధనము; రీతిః, ఆరకూటః=ఇత్తడి; తామ్రకమ్, శుల్బమ్, ఔదుంబరం=రాగి. తీక్ష్ణం, కాలాయసం, అయః=ఇనుము. క్షారః, కాచః=గాజు, చపలః, రసః, సూతః, పారదః = పాదరసము. గరళం=మహిష శృంగము. త్రపు, సీసకం, పిచ్చటం= సీసము. హిండీరః, అబ్ధి, కఫః, ఫేనః=సముద్రము మీద నున్న నురుగు; మధూచ్ఛిష్టం, సిక్థకం=మైనము, రంగః, వంగః=పర్యా; పిచుః, స్థూలః=దూది. కులటి, మనశ్శిలా=మణి శిల. యవక్షారః=పాక్యః, పర్యా; త్వక్షీరా, వంశలోచనా=పర్యాయములు.

వృషల, జఘన్య, శూద్ర=శూద్రులు. చండాల=అంత్యజాదులు వర్ణ సంకరములు. కారుః=శిల్పి; శ్రేణిః=ఒక సంఘముగా కలిసియున్న సజాతీయులగు శిల్పుల సంఘము. రంగా జీవః, చిత్రకరః = పర్యా. త్వష్టా, తక్షా, వర్ధకిః=వడ్రంగి; నాడింధమః, స్వర్ణకారః= కంసాలి బంగారు పనిచేయువాడు. నాపితః, అంతావసాయి=మంగలి. జాబాలః, ఆజాజీవః=గొల్ల; దేవలః=దేవ పూజపై జీవించువాడు. తన భార్యలతో నాటకము వేసి జీవించువారు జాయా జీవులని శైలూషులులని చెప్పబడుదురు. భృతకః, భృతిభుక్ రోజు కూలి. వివర్ణ, పామర, నీచ, ప్రాకృత, పృథగ్జన, విహీన, అపసద, జాల్మ, నీచులు; భృతః, దాసేరః, చేటకః=భృత్యుడు. పటుః, పేశలః, దక్షః=నేర్పరి, మృగయుః, లుబ్ధకః = వేటగాడు,

చాండాలః, దివాకీర్తిః= చండాలుడు. పుస్తం=లేపనాది కర్మ; పాంచాలికా, పుత్రికా=బొమ్మ, వర్కరః పడుచుదైన పశువు. మంజూష, పేటకః, పేటా, పెట్టె. తుల్య, సాధారణ=పర్యా. ప్రతిమా-ప్రతికృతిః= పర్యా. ఈ విధముగ బ్రహ్మాది వర్గములు చెప్ప బడినవి. (366)

సామాన్య నామలింగములు, వర్ణములు

అగ్నిదేవుడు పలికెను :

ఇపుడు సామాన్య నామలింగములను చెప్పెదను. వినుము. సుకృతీ, పుణ్యవాన్, ధన్యః = పుణ్యాత్ముడు; మహేచ్ఛః, మహాశయః= గొప్ప ఇచ్ఛ కలవాడు; ప్రవీణ, నిపుణ, అభిజ్ఞ, విజ్ఞ, నిష్ణాత, శిక్షిత=నేర్పుకలవాడు. వదాన్య, స్థూలలక్ష, దాన, శౌండ, బహుప్రద= గొప్ప ఔదార్యవంతుడు. కృతజ్ఞః, కుశలః=ప్రవీణుడు. ఆసక్తః, ఉదుక్తః, ఉత్సుకః, కార్య లగ్నుడు. ఇభ్యః, ఆఢ్యః=ధనవంతుడు. పరివృఢః, అధిభూః, నాయకః, అధిపః= అధిపతి. లక్ష్మీవాన్, లక్ష్మణ, శ్రీలః=లక్ష్మీసంపన్నుడు. స్వతంత్రః, స్వైరీ, అపావృతః=పర్యా. ఖలపూః, బహుకరః=కళ్ళము శుభ్రము చేయువాడు. దీర్ఘసూత్రః, చిరక్రియః=పనులలో చాల ఆలస్యము చేయువాడు. జాల్మః, అసమీక్ష్యకారి=ఆలోచన లేకుండ పనిచేయువాడు. కుంఠః=పనులలో మాంద్యము కలవాడు, కర్మఠః=కర్మశూరుడు; భక్షకః, ఘస్మరః, అద్మరః= పర్యా. లోలుపః, గర్ధలః, గృధ్నుః=లోభి; వినీతః, ప్రశ్రితః=వినయవంతుడు. ధృష్ణుః= వియాతః=ధృష్టుడు. నిభృతః-ప్రగల్భః=ప్రతిభావంతుడు. భీరుకః, భీరుః=పిరికివాడు. వందారుః = నమస్కరించువాడు. భూష్ణుః, భవిష్ణుః= కాబోవునది; విదురః, విందకః= తెలుసుకొనువాడు. మత్తః = శౌండః, ఉత్కటః, క్షీభః=మత్తెక్కినవాడు. చండః=చాల కోపము కలవాడు. దేవ ద్రియఙ్ = దేవతలను అనుసరించువాడు. విశ్వద్రియఙ్=అన్ని వైపులకు వెళ్ళు వాడు. సధ్ర్యఙ్=కూడవచ్చువాడు. వాగ్మీ=మాటలలో నేర్పరి. బావదూకః=ఎక్కువ మాటలాడు వాడు. జల్పాకః, వాచాలః, వాచాటః = నింద్యమైన వాక్కు కలవాడు. అపధ్వస్తః= ధిక్కరింపబడినవాడు. కీలితః, సంయతః=బుద్ధుడు.

రవణః, శబ్దనః=ధ్వని చేయువాడు; నాందీ వాదీ, నాందీకరః=పర్యాయ పదములు. వ్యసనార్తః, ఉపరక్తః=పీడితుడు. విహస్తః, వ్యాకులః=శోకాకులుడు. నృశంసః, క్రూరః, ఘాతుకః, పాపః=క్రూరుడు. ధూర్తః=వంచకుడు. వైధేయః, బాలిశః=మూర్ఖుడు; కృపణః-క్షుద్రః=లోభి. మార్గణః, యాచకః = యాచకులు. అహంయుః=అహంకారవంతుడు. శుభం యుః=శుభాన్వితుడు. కాంత, మనోరమ, రుచ్య = సుందరము. హృద్య, అభీష్ట, ఈప్సిత= ప్రియమైనది; ఫల్గు-శూన్యం, సారములేనిది. ముఖ్య, వర్య, వరేణ్యక, శ్రేయాన్, శ్రేష్ట, పుష్కల=శ్రేష్ఠములు. ప్రాగ్య, అగ్ర్య, అగ్రీయ=శ్రేష్ఠములు. వడ్ర, ఉరు, విపుల=విశాలము. పీవన్, స్థూల, పీవర= బలిసియున్న. స్తోక, అల్ప, క్షుల్లక, సూక్ష్మ- స్లక్ష్ణ దభ్ర, కృశ, తను, మాత్రా, తృటి, లవ, కణ=సూక్ష్మము అల్పము; భూయిష్టం, పురుహం, పురు = అధికము. అఖండం, పూర్ణం సకలం=పర్యా. ఉపకంఠ, అంతిక, అభితః, సన్నిధి, అభ్యాశ= సమీపము. నేదిష్ఠ=చాల దగ్గరగా వున్నది. దవిష్ఠం=సుదూరము. వృత్త, నిస్థల, వర్తుల= గుండ్రనిది. ఉచ్ఛ, ప్రాంశు, ఉన్నత, ఉదగ్ర=ఉన్నతమైనది. ధ్రువ, నిత్య, సనాతన=నిత్యము. ఆవిద్ధ, కుటిల, భుగ్న, వేల్లిత=పర్యా. చంచల, తరల=పర్యా. కఠోర, జరఠ, దృఢ=పర్యా. ప్రత్యగ్ర, అభినవ,

నవ్య, నవీన, నూతన, నవ=క్రొత్తది, ఏకతానః=ఏకాగ్రచిత్తుడు. ఉచ్చండం, అవిలంబితం=తొందరగా, ఉచ్చావచం=అనేక భేదములు కలది. సంబాధః, కలిలం=ఇరుకు. తిమిత, స్థిమిత, క్లిన్న=తడిసిన; అభియోగః, అభిగ్రహః=ఎదుటి వానిపై దోషము ఆరోపించుట. స్ఫాతిః=వృద్ధి; ప్రథా=ప్రసిద్ధి; సమాహారః, సముచ్చయః= సమూహము. అపహారః, అపచయః=తగ్గిపోవుట. విహారః, పరిక్రమః = విహరించుట, ప్రత్యాహారః=ఇంద్రియములను విషయముల నుండి మరలించుట. నిర్వారః=లాగి వేయుట. విఘ్నః, అంతరాయః, ప్రత్యూహః=సమానార్థకములు. ఆస్యా, ఆసనా, స్థితిః=కూర్చుండుట. సన్నిధిః, సన్నికర్షః= దగ్గరగా ఉండుట, సంక్రమః=దుర్గములో ప్రవేశించుట, ఉపలంభః= అనుభవము, ప్రత్యాదేశః=నిరాకరణము; పరిరంభ, పరిష్వంగ, సంశ్లేష, ఉపగూహన= ఆశ్లేషించుట; అనుమా=పక్ష హేత్వాదులచే తెలుసుకొనుట; డింబ, భ్రమర, విప్లవ=భయపడ్డ వాడు వేయు కేక; శాబ్దం=శబ్దము వల్ల కలిగిన దూరస్థ పదార్థ జ్ఞానము; ఉపమానకం= సాదృశ్యమును బట్టి ఏర్పడిన తుల్య వస్తు జ్ఞానము; అర్థాపత్తిః=కార్యమును బట్టి మరొక విషయమును ఊహించుట; అభావకః = ప్రతియోగి కనబడక పోవుటచే అది అచట లేదు అని కలుగు జ్ఞానము. ఈ విధముగ మానవులకు జ్ఞానము కొరకై నామ లింగ స్వరూపుడగు హరి చెప్పబడినాడు. (367)

నిత్యనైమిత్తిక ప్రాకృత ప్రళయములు

అగ్ని పలికెను :

ప్రళయము నాలుగు విధములు. నిత్యము జరుగుచున్న ప్రాణుల మృత్యువు నిత్య ప్రళయము. ప్రాణులందరును పూర్తిగా నశించుట బ్రహ్మ లయము లేదా నైమిత్తిక లయము. వెయ్యి చతుర్యుగములు గడచిన పిమ్మట పంచ భూతములు ప్రకృతిలో లీనమైనపుడు అది ప్రాకృతలయము. జ్ఞానము వలన జీవాత్మ పరమాత్మలో లీనుడగుట ఆత్యంతిక లయము. కల్పాంతమున జరుగు నైమిత్తిక లయమును గూర్చి చెప్పెదను. చతుర్యుగ సహస్రాంతమున భూమి చాలా వరకు క్షీణమై పోవును. నూరు సంవత్సరములు భయంకరములైన అనావృష్టి ఏర్పడును. ప్రాణులందరును నశింతురు. అపుడు జగత్పతియైన విష్ణువు సూర్యుని ఏడు కిరణముల ద్వారా భూపాతాళ–సముద్రాదులలో ఉన్న జలమును నశింపచేయును. పిదప ఆయన ప్రభావముచే ఆ జలమును పీల్చుటచే పుష్టి చెందిన ఆ ఏడు రశ్మిలు ఏడుగురు భాస్కరులుగా ఏర్పడి పాతాళతల శీతమగు త్రైలోక్యమును అంతను భస్మము చేయును. అపుడు భూమి తాబేలు పైభాగమువలె కనబడును. ఆదిశేషుని శ్వాస నుండి కాలాగ్ని రుద్రుడు ఆవిర్భవించి క్రిందనున్న పాతాళములను భస్మము చేయును. పిదప విష్ణువు భూమిని స్వర్గమును కాల్చివేయును. ఆ సమయమున త్రైలోక్యము ప్రజ్వలించుచున్న మంగలము(బొచ్చె)వలె కనబడును. అపుడు తాపముతో బాధపడుచున్న భువర్లోక స్వర్గలోక వాసులు మహర్లోకమునకు వెళ్లి అచట నుండి జనలోకమునకు వెళ్లుదురు. ఇట్లు రుద్రరూపి జగత్తును కాల్చివేయగ హరియొక్క శ్వాసమునుండి మెరుపులతో గూడిన వివిధ రూపములుగల మేఘములు ఆవిర్భవించును. నూరు సంవత్సరములు వర్షించి ఆ అగ్నిని శమింపచేయును. ఆ జలము సప్తర్షి స్థానము వరకు చేరిన పిమ్మట, విష్ణు ముఖము నుండి బయలుదేరిన నిశ్వాసము వాయురూపమున

వంద సంవత్సరములు వీచి ఆ మేఘములను చెదరగొట్టును. పిదప ఆ హరి వాయువును త్రాగివేసి ఏకార్ణవము నందు ఆదిశేషునిపై శయనించును. ఆ సమయమున సిద్ధులు, మహర్షులు, బ్రహ్మరూప ధారియగు ఆతనిని స్తుతింతురు. మధుసూదనుడు ఆత్మ మాయారూపమగు దివ్య యోగ నిద్రను అవలంబించి తన వాసుదేవ స్వరూపమును చింతించుచు ఒక కల్ప కాలము శయనించును. పిదప లేచి బ్రహ్మ రూపియై మరల సృజించును. ఈవిధముగ బ్రహ్మ యొక్క రెండు పదార్ధముల ఆయుర్దా యము గడచిన పిమ్మట ఈ స్థూల ప్రపంచము ప్రకృతియందు లీనమగును.

ఒకటి నించి పదిచొప్పున గుణించుచు పోగ పదునెనిమిదవ స్థానము చేరునప్పటికి ఎంత సంఖ్యవచ్చునో అది పరార్ధము. దానికి రెట్టింపు కాలము గడచిన పిమ్మట ప్రాకృత ప్రళయము ఏర్పడును. వర్షములు లేకపోవుటచే అగ్ని ప్రజ్వలించి అంతయు భస్మమైపోవును. మహతత్త్వము మొదలు విశేషము వరకు ఉన్న కార్యములన్నియు నశించును. భగవంతుని ఇచ్ఛను అనుసరించి ఆ ప్రళయము రాగా జలము భూమిలో వున్న గంధాదిగుణములను తనలో లీనము చేసుకొనును. అపుడు గంధహీనమగు పృథివి నీటిలో లీనమైపోవును. పిదప రసమయమగు జలము మిగులును. రసము జలమున గుణము. అగ్ని ఆ రసమును త్రాగివేయగా జలములీనమైపోవును. అగ్ని తత్త్వము ప్రజ్వ లించును. పిమ్మట తేజస్సుయొక్క ప్రకాశ గుణమును వాయువు మింగివేయును. ఈ విధముగా అగ్నితత్త్వము లీనమైపోగా గొప్ప వాయువు వీచును. వాయువు యొక్క గుణమగు స్పర్శను ఆకాశము మ్రింగివేయగా, వాయువు నశించి ఆకాశము మాత్రము నిశ్శబ్దముగా మిగులును. భూతములకు కారణమగు అహంకారము ఆకాశ గుణమగు శబ్దమును మ్రింగివేయగ తేజసాహంకారము ఇంద్రి యములను తనలో లయము చేసుకొనును. దానిని మహత్తత్త్వము తనలోన లీనము చేసు కొనును. ఈ విధముగా భూమి జలము నందు, జలము అగ్ని యందు, అగ్ని వాయువు నందు, వాయువు ఆకాశము నందు, ఆకాశము అహంకారమునందు, అహంకారము మహత్తత్వము నందు లీనమగును. దానిని ప్రకృతి తనలో లీనము చేసుకొనును. 'వ్యక్త', 'అవ్యక్త' అని ప్రకృతి రెండు విధములు. 'వ్యక్త' అవ్యక్తములో లీనమగును. అవినాశియు, శుద్ధ స్వరూపుడు అగు ఏకైక పురుషుడు ఎవడున్నాడో అతడు కూడ పరమాత్మ అంశమే. చివరకు ప్రకృతియు పురుషుడును పరమాత్మ యందే లీనమగును. ఆ పరమాత్మ సత్స్వరూపము జ్ఞేయము, జ్ఞానమయము. బుద్ధ్యాదుల కంటే పరము. ఆ పరమాత్మ యందు నామ, జాత్యాది కల్పనలు ఉండవు. (368)

ఆత్యంతిక ప్రళయ గర్భోత్పత్తి

అగ్నిదేవుడు పలికెను :

ఆత్యంతిక ప్రళయమును గూర్చి చెప్పెదను. ఇది జ్ఞానము వలన కలుగును, ఆధ్యాత్మి కాది సంతాపమును తెలుసుకొని మానవుడు తన విషయముననే కొంత వైరాగ్యమును పొందవలయును. అపుడు జ్ఞానము కలుగును. ఆధ్యాత్మిక సంతాపము 'శారీరము', మానసము అని రెండు విధములు. శారీరక సంతాపము అనేక విధములైనది. వాటిని గూర్చి వినుము. జీవుడు భోగ దేహమును త్యజించి కర్మానుసారముగ గర్భమును చేరును. ఆతివాహికమను ఒకే దేహముండును. మనుష్యులకు మృత్యు

కాలము వచ్చినపుడే ఆ దేహము లభించును. యమదూతలు ఆ శరీరమును యమలోక మార్గమున యమ లోకమునకు తీసుకొని పోవుదురు. ఇతర ప్రాణులకు ఈ అతివాహిక శరీరము ఉండదు. యమలోకమునకు వెళ్ళిన జీవుడు కొంతకాలము స్వర్గము, కొంతకాలము నరకము పొందుచు ఘటయంత్రమువలె తిరుగుచుండును. ఇది కర్మ భూమి. పరలోకము ఫలభూమి. యముడు ఆయా జీవుల కర్మానుసారముగా వివిధ యోనులను నరకములను వారికి ఇచ్చును. ఆతడే నరకములను నింపుచుండును. యముడే వీరికి నియామకుడు. జీవుడు వాయురూపమున గర్భములో ప్రవేశించుచుండును. యమదూతలచే తీసుకొని వెళ్ళబడిన జీవుని యముడు చూచును. ఆ జీవుడు ధర్మాత్ముడైనచో యముడు ఆతనిని పూజించును. పాపాత్ము డైనచో తన లోకమున ఆతనిని దండించును. వాని శుభాశుభ కర్మలను గూర్చి చిత్రగుప్తుడు వివరించి చెప్పును. బంధువులకు అశౌచము తీరువరకును జీవుడు ఆతివాహిక శరీరములోనే వుండి వారిచ్చిన పిండములను భుజించును. పిదప ప్రేతలోకము చేరి ప్రేతదేహమును విడచి మరియొక భోగ దేహమును పొంది ఆకలి దప్పికలతో బాధపడుచు అచట నివసించును. శ్రాద్ధ రూపమున ఇవ్వబడు ఆమద్రవ్యమును అతడు భుజించును. ప్రేతకు పిండదానము లేకుండగ చేసినిచో వానికి అతివాహిక దేహము నుండి విడుదల ఉండదు. సపిండీకరణ శ్రాద్ధము జరిగిన సంవత్సరము తరువాత వాడు ప్రేతదేహము విడచి భోగదేహమును పొందును. శుభదేహము, అశుభ దేహము అని అది రెండు విధములు. ఆ దేహముతో కర్మ బంధములను అనుభవించిన పిమ్మట, మర్త్య లోకమునకు గెంటివేయబడును. అపుడు అతను విడిచిన దేహమును రాక్షసులు భక్షింతురు. మొదట పుణ్య ఫలమగు స్వర్గమును అనుభవించినచో పాప భోగము మిగిలి ఉన్నచో మరొక భోగశరీరమును ధరించును. కాని పాప ఫలమును అనుభవించినవాడు పిదప స్వర్గ సుఖమును అనుభవించి దాని పిమ్మట స్వర్గ భ్రష్టుడై పవిత్రులగు శ్రీమంతుల గృహములందు జనించును. పుణ్యము వుండగా ముందు పాపఫలము అనుభవించినవాడు ఫల భోగము పూర్తియైన పిమ్మట ఉత్తమ దేహమును ధరించును. కర్మ భోగము కొంచెము మాత్రమే మిగిలియుండగా జీవునకు నరకము నుండి విముక్తి లభించును. నరక విముక్తుడు తిర్యగ్యోనిలో పుట్టును. సందేహము లేదు.

గర్భములో ప్రవేశించిన జీవుడు కలలము నందుండును. రెండవ మాసమున గట్టిపడును. మూడవ మాసమున అవయవములు ప్రకటమగును. నాల్గవ మాసమున అస్థి మాంసత్వక్‌లు ఏర్పడును. ఐదవ మాసమున రోమములు పుట్టును. ఆరవ మాసమున చైతన్యము ఏర్పడును. ఏడవ మాసము నుండి దుఃఖమును అనుభవింప ప్రారంభించును. మావితో చుట్టబడిన దేహమునందు శిరస్సుపై దోసిలి కట్టి యుండును. గర్భమధ్యమున ఉన్నచో నపుంసకుడు, వామభాగములో ఉన్నచో స్త్రీ, కుడి ప్రక్క వున్నచో పురుషుడు, ఉదరము నందుండి పృష్ఠ భాగమునకు అభిముఖుడుగా వుండును. తాను ఏ యోని యందున్నాడో వానికి తెలియును. సందేహములేదు. నరజన్మ మొదలు సకల వృత్తాంతమును స్మరించును. ఆ అంధకారమున మానవుడు గొప్ప పీడను పొందును. ఏడవ మాసమున తల్లి భుజించిన ఆహారమును ఆ శిశువు పొందును. అష్టమ, నవమమాసము లందు మిక్కిలి ఉద్విగ్నుడగును. మైథునము నందు ఇంకను పీడను పొందును. తల్లి అధిక వ్యాయామము చేసినను

శిశువునకు పీడ కలుగును. ఆమెకు వ్యాధి ఉన్నచో శిశువు కూడా ఆరోగము యొక్క కష్టమును అనుభవించును. ఒక ముహూర్తము నూరు సంవత్సరములవలె కనబడును.

కర్మలతో బాధపడుచు ఎన్నియో మనోరథములు కలిగి యుండును. గర్భము నుంచి బయట పడగనే మోక్ష జ్ఞానమునకు ప్రయత్నము చేయునట్లు ఉండును. ప్రసూతి వాయు ప్రేరణచే అధో ముఖుడై యోనియంత్ర పీడితుడై బయటపడును. ఒక మాసము వరకు చేతితో ముట్టుకొనినను వానికి పీడ కలుగును. ఆకాశము వలన వాని శరీరమున చిన్న చిన్న రంధ్రములు, చెవి మొదలగునవి ఏర్పడును. వాయువు వలన శ్వాసోచ్ఛ్వాసములు గతి, అవయవములను ఇటు అటు తిప్పుతూ స్పృశించుట ఏర్పడును. అగ్ని వలన రూపము నేత్రములు వేడి జీర్ణశక్తి పిత్తము, మేధ, వర్ణము, బలము, ఛాయ తేజస్సు శౌర్యము – ఇవి శరీరమునందు ఏర్పడును. జలము వలన చెమట, ఆస్వాదము, వస, రస, గ్రహణశక్తి రక్తము, శుక్ర మూత్ర కఫాదికము ఏర్పడును. భూమి వలన ఘ్రాణ కేశ, నఖములు బరువు ఏర్పడును. శరీరమునందలి త్వఙ్మాంస హృదయ, నాభి, మజ్జా, మఖ మేదస్, క్లేదనములు, ఆమాశయములు తల్లివలన పుట్టినవి. శిరస్స్నాయు శుక్రములు తండ్రివల్ల పుట్టును. కామ క్రోధ భయ హర్ష, ధర్మ, ఆకృతి, స్వర, వర్ణ మేహనము మొదలైనవి జీవుని శరీరమున స్వతః ప్రకటనమగును. అజ్ఞాన, ప్రమాద, ఆలస్య, క్షుధా, తృషా, మోహ, మాత్సర్య, వైగుణ్య, శోక, ఆభాస భయాదులు తమ గుణమువలన బుట్టును. కామ, క్రోధ, శౌర్య, యజ్ఞాభిలాష బహు భాషిత అహంకార అనాదరములు రజోగుణము వలనపుట్టును. ధర్మాభిలాష, మోక్షకామిత్వము విష్ణువుపై ఉత్తమ భక్తి, దాక్షిణ్యము, ఉద్యోగ శీలత్వము. ఇవి సత్త్వగుణము వలన పుట్టును.

చపలుడు క్రోధి భీరువు బహుభాషి కలహప్రియుడు స్వప్నము నందు ఆకాశములో సంచరించువాడు అగు మనుష్యునిలో వాతము ప్రధానముగా ఉండును. అకాలమున జుట్టు నెరసినవాడు, కోపశీలుడు, మహాబుద్ధిమంతుడు, యుద్ధ ప్రియుడు, స్వప్నమునందు ప్రకాశించుచున్న వస్తువులను చూచువాడు అగు మనుష్యునియందు పిత్తము అధికముగా ఉండును. స్థిరమైన మైత్రి కలవాడు స్థిరోత్సాహుడు స్థిరాంగుడు ధనవంతుడు స్వప్నమున శ్వేత వస్త్రమును చూచువాడగు మనుష్యునిలో కఫము అధికముగా నుండును. ప్రాణుల దేహమున రసము జీవనమును, రక్తము లేపనమును, మాంసము, మోహన స్నేహనము లను కలిగించును. అస్థులు–మజ్జ శరీరమును నిలుపును. వీర్యవృద్ధి శరీరమును పూర్ణము చేయును. ఓజస్సు శుక్ర వీర్యవృద్ధికరము. జీవుని స్థితికి ప్రాణమునకు అవష్టంభకము. ఓజము శుక్రము కంటే ఎక్కువ సారము కలది. అది హృదయ సమీపము నందుండును. కొంచెము పసుపు పచ్చగ వుండును. కాళ్ళు బాహువులు, శిరస్సు, ఉదరము–ఇవి షడంగములు. చర్మములో ఆరు పొరలుండును. బయటకు కనబడునది బాహ్యము. రక్తము ధరించునది రెండవది. మూడవది కిలాసమును, నాల్గవది కుండమును ధరించును. ఐదవది ఇంద్రియముల స్థానము. ఆరవది ప్రాణధారణము చేయునది. కల కూడ ఏడు విధములు. మొదటిది మాంసములు ధరించును. రెండవది రక్తమును, మూడవది యకృత్ ప్లీహలను, నాల్గవది మేధస్సును అస్థులను, ఐదవది మజ్జా శ్లేష్మ పురీషములను, ఆరవది పిత్తమును, ఏడవది శుక్రమును ధరించును. ఐదవది పక్వాశయము నందును, ఏడవది శుక్రాశయము నందును ఉండును. (369)

శరీరావయవములలో నాడీ ప్రమాణము

అగ్నిదేవుడు పలికెను :

శ్రోత్ర, త్వక్ నేత్ర, జిహ్వా, నాసికలు-జ్ఞానేంద్రియములు. ఆకాశము సర్వ భూత వ్యాప్తము. శబ్ద స్పర్శ రూప రస గంధములు ఆకాశాది గుణములు. పాయు ఉపస్థ, కర, పాద, వాక్కులు కర్మేంద్రియములు. ఉత్సర్గ, ఆనంద, గ్రహణ, ఆగమన, వాగాదికములు వీటి కర్మలు. పంచ కర్మేంద్రియములు, పంచ జ్ఞానేంద్రియములు, పంచేంద్రియముల విషయములు పంచ మహా భూతములు, మనస్సు, బుద్ధి మహత్తత్త్వము మూల ప్రకృతి అనునవి ఇరువది నాలుగు తత్త్వములు. పురుషుడు వీటి అన్నింటికి అతీతుడు. మత్స్యోద కములవలె ఈ రెండును పరస్పర సంయుక్తములై వియుక్తములై ఉండును. రజస్సత్వ తమోగుణములు ప్రకృతినాశ్రయించి వుండును. అంతః కరణోపాధికల పురుషుడు జీవుడు. ఉపాధిరహితుడగు ఆ జీవుడే సర్వకారణమగు బ్రహ్మ. పరమ పురుషుని తెలుసుకొనినవాడు పరమపదమును పొందును. దేహమునందు ఏడు ఆశయము లున్నవి. రుధిర, శ్లేష్మ, ఆమ, పిత్త, పక్వ, వాయు, మూత్ర ఆశయములని అవి ఏడు. స్త్రీలకు ఎనిమిదవ గర్భాశయము కూడ ఉండును. అగ్ని వలన పిత్తము, పిత్తము వలన పక్వాశయము ఏర్పడును. ఋతు కాలమున యోని వికసించును. గర్భాశయము పద్మము వలె ఉండును. అచట వుంచబడిన వీర్యము గర్భాశయము చేరును. ఆ గర్భాశయము రజో వీర్యములను ధరించును. వీర్యమువలన శరీరము కాలక్రమమున కేశములు ప్రకటములగును. ఋతు సమయమున యోని వాత పిత్త కఫములచే ఆవృతమైనచో అది వికసించదు. బుక్కము వలన పుక్కసము ప్లీహ యకృత్ కోష్ఠాగ, హృదయ, వ్రణ, తండకములు ఏర్పడును. ఇవన్ని ఆశయమునందు నిబద్ధములై వుండును. పచ్య మానమగు రసము యొక్క సారము నుండి ప్లీహయకృత్ పుట్టును. రక్త ఫేనము నుండి పుక్కసము పుట్టును. రక్త పిత్త తండ కములు కూడ ఈ విధముగనే పుట్టును. రక్త ప్రసారము వలన బుక్క పుట్టును. రక్త మాంస ప్రసారము వలన ప్రేగులు ఏర్పడును. మానవుని ప్రేగులు మూడున్నర బారలు వుండును. వేదవేత్తలగు పురుషుల యొక్కయు, స్త్రీల యొక్కయు ప్రేగులు మూడు బారలుం డును. రక్త వాయు సంయోగముచే కామము ఉదయించును. కఫ ప్రసారముచే హృదయము ప్రకటమగును. అది కమలమువలె వుండును. దాని ముఖము క్రిందికి వుండును. దాని మధ్యనున్న ఆకాశములో జీవుడుండును. చైతన్యముతో సంబంధించిన అన్ని భావములును దానియందే ఉండును. దాని ఎడమ ప్రక్క ప్లీహ, దక్షిణ భాగమున యకృత్ క్లోమములు ఉండును. ఈ శరీరమున కఫ రక్తములను ప్రవహింపచేయు స్రోతస్సుల వలన భూతాను మానముచే ఇంద్రియముల ఉత్పత్తి జరుగును. నేత్రములందలి శుక్ల మండలము కఫము వలన ఏర్పడును. ఇది తండ్రికి సంబంధిం చినది. కృష్ణభాగము వాతమువలన కలుగును. ఇది తల్లి అంశమునకు సంబంధించినది. త్వఙ్మం డలము పిత్తముచే ఉత్పన్నమగును. ఇవి మాతృ పితృ సముద్భవములు. మాంస, రక్త, కఫముల వలన జిహ్వాయు, మేదోరక్త కఫముల వలన, అండకోశము ఉత్పన్నమగును. ప్రాణమునకు శిరస్సు హృదయము, నాభి కంఠము, జిహ్వా శుక్రము రక్తము గుదము మూత్రాశయము గుల్ఫములు కండరములు అను పదునారు స్థానములు.

అగ్నిదేవుడు పలికెను :

రెండు చేతులందును రెండు, చరణములందును నాలుగు, పీటమునందును నాలుగు, కంఠము నందును పాదాది శిరః పర్యంత సకల శరీర మంతటను పదునారు జాలము లుండును. మాంసజాల, స్నాయుజాల, శిరాజాల, అస్థిజాలములు వేర్వేరుగా రెండు మణి బంధనములందును గుల్ఫము లందును పరస్పరాబద్ధములై ఉండును. శరీరమున ఆరు కూర్చములు ఉండును. రెండు హస్తములు, రెండు పాదములు, కంఠము, మేఢ్రము వీటియందుండును. పృష్ఠ మధ్య భాగమున మేరు దండము, దాని సమీపమున నాలుగు మాంస రజ్జువులు, వాటిని బంధించి వుంచిన తొమ్మిది పేశీలు వుండును. ఏడు సీవనిలు వుండును. వాటిలో ఐదు శిరస్సునందును ఒకటి మేఢ్రము నందును ఒకటి జిహ్వా యందును ఉండును. ఎముకలు పదునెనిమిది వేలు. సూక్ష్మములు స్థూలములు కలిసి అరువది నాలుగు దంతములు. ఇరువది నఖములు హస్త, పాదములందలి శలాకలు, నాల్గు స్థానము లందుండును. వ్రేళ్ళలో అరువది పార్ష్ణుల యందు రెండు, గుల్ఫములందు నాలుగు, ఆరత్నులయందు నాలుగు, జంఘలయందు నాలుగు ఉండును. జానువుల యందు రెండేసి కపోలములందు రెండు, ఊరువుల యందు రెండు, ఫలక మూల భాగము లందు రెండు ఎముకలు ఉండును. ఇంద్రియ స్థానములందున శ్రోణ ఫలకము నందును రెండేసి ఎముకలు ఉండును. భగమునందు కొంచెము ఎముకలుండును. ఇంద్రియ స్థానములందున శ్రోణఫలకమునందును రెండేసి ఎముకలుండును. వీపుయందు నలుబదియైదు కంఠమునందు నలుబదియైదు ఉండును. గ్రీవయందు జత్రుకము అను ప్రదేశము నందు రెండేసి ఉండును. లలాట, నేత్ర, కపోల, నాసికా, పద, పరుశు తాలువులందు అర్ధార్బుదము డెబ్బదిరెండు అస్థువులు ఉండును. శిరస్సు యందు రెండు శంఖములు, నాలుగు కపాలములు, వక్షఃస్థలమున పదునేడు అస్థులు వుండును. రెండు వందల పది సంధులు ఉండును. వీటిలో శాఖలలో అరువది ఎనిమిది, యేబది తొమ్మిది, మధ్యయందు ఎనుబది మూడు వుండును. తొమ్మిది వందల స్నాయువులు వుండును. వీటిలో అంతర ప్రదేశ మున రెండు వందల ముప్పది ఉండును. డెబ్బది ఊర్ధ్వగాములు శాఖలలో ఆరు వందల స్నాయువులు ఉండును. పేశీలు ఐదు వందలు. వీటిలో నలుబది ఊర్ధ్వగాములు శాఖలలో నాలుగు వందలు, అంతరాధియందు అరువది వుండును.

స్త్రీలకు పురుషుల కంటే ఇరువది నాలుగు మాంసపేశీలు, వీటిలో పది స్తనము లందును, యోనియందు పదమూడు, గర్భమునందు నాలుగు ఉండును. శరీరము నందు ముప్పదివేల తొమ్మిది యేబది ఆరు వేలు నాడులు ఉండును. చిన్నచిన్న కాలువలు మడులలో నీరు ప్రవహింప చేసినట్లు ఈ నాడులు శరీరమునందంతటను రసమును ప్రవహింపచేయును. క్లేద లేపాదులు వాటి కార్యమే. డెబ్బది రెండు కోట్ల రోమ కూపములు అంజలులు అను చెప్పబడు మజ్జామేదో, మూత్ర, పిత్త, శ్లేష్మ, మల, రక్త, రసములును ఈ దేహము నందుండును. పూర్వ పూర్వ అంజలుల కంటే ఉత్తరోత్తర అంజలులు ఒకటిన్నర రెట్లు అధికము. ఒక అంజలిలో సగము వీర్యము సగము ఓజస్సు వుండును. స్త్రీలలో రజస్సుకు సంబంధించిన నాలుగు అంజలులు వుండును. ఈ శరీరము మల దోషాదుల పిండము అని తెలుసుకొని దీనిపై ఆసక్తిని విడువవలెను. (370)

నరక నిరూపణము

అగ్నిదేవుడు పలికెను : యమరాజ మార్గములను గూర్చి చెప్పియుంటిని. మనుష్యుల మరణ ములను గూర్చి చెప్పెదను. శరీరమున వాయువేగము అధికమైనపుడు పిత్తము ప్రకోపించి శరీరమును అవరుద్ధముచేసి సకల దోషములను ఆవరించి ప్రాణ స్థానములను, మర్మ స్థానము లను భేదించును. శైత్యముచే వాయువు ప్రకోపించి బయటకు పోవుటకు రంధ్రములను అన్వేషించుట ప్రారంభించును. శరీరము పై భాగమున రెండునేత్రములు, రెండు కర్ణములు, రెండు నాసాపుటములు, ముఖము అను ఎనిమిది రంధ్రములున్నవి. సాధారణముగా పుణ్యాత్ముల ప్రాణము వీటి ద్వారా బయటకుపోవును. పాపాత్ముల ప్రాణము క్రిందనున్న పాయూప స్థల ద్వారాపోవును. యోగుల ప్రాణము బ్రహ్మ రంధ్రమును భేదించి బయటకు పోవును. ఆ జీవుడు ఇచ్చానుసారముగ వెడలిపోవును. అంతకాలము వచ్చినపుడు ప్రాణము అపానములో కలిసిపోవును. తమస్సుచే ఆవృత్తుడై పోవును. మర్మ స్థానములు ఆచ్ఛాదితములగును. అపుడు జీవుడు వాయువుచే బాధితుడై నాభిస్థానమునుండి చలించును. అష్టాంగ ములుకల ప్రాణ వృత్తులను తీసుకొని శరీరము నుండి బయటకు వచ్చును. దేహము నుండి బయటకు వచ్చుట మరియొక జన్మ గ్రహించుట. వివిధ యోనులందు ప్రవేశించుట మొదలగు సమయములలో ఆ జీవుని సిద్ధ పురుషులును దేవతలును దివ్య దృష్టితో చూడగలుగుదురు. మరణ సమయము అనంతరమే జీవుడు అతివాహిక శరీరమును గ్రహించును. అతడు త్యజించిన శరీరమున నుండు ఆకాశ, వాయు, తేజస్సులు పైనున్న మూడు తత్త్వములలో కలసిపోవును. జలము పృథివి అంశములు క్రింది తత్త్వములలో కలసి పోవును. పురుషుడు పంచత్వమును పొందుట అనగా ఇదియే. యమదూతలు వానిని అతివాహిక శరీరములోనికి ప్రవేశ పెట్టుదురు. యమలోక మార్గము చాల భయంకరము. ఎనభై ఆరువేల యోజనముల దూరము. ఆ మార్గమున ప్రయాణించు జీవుడు తన బంధువులిచ్చిన అన్నోదకములను అనుభవించును. యమునిచూచి ఆతని ఆజ్ఞ ప్రకారము చిత్ర గుప్తుడు చెప్పిన భయంకరములగు నరకములను పొందును. ధర్మాత్ముడు అయినచో స్వర్గమునకు పోవును.

పాపాత్ములు అనుభవించు నరకములను, బాధలను చెప్పెదను. భూమి క్రింద ఇరువది ఎనిమిది నరక శ్రేణులు వున్నవి. అవి సప్తమ తలము క్రింద ఘోరాంధకారమున నున్నవి. వీటికి వరుసగా ఘోరా, సుఘోరా, అతి ఘోరా, మహాఘోరా, ఘోర రూపా, తరలతారా-భయానకా-భయోత్కటా, కాలరాత్రీ, మహాచండా, చండా, కోలాహలా, ప్రచండా, పద్మా, నరక నాయికా, పద్మావతీ, భీషణా, భీమా కరాలికా, మహావజ్రా, త్రికోణా, పంచకోణికా, సుదీర్ఘా, వర్తులా, సప్త భూమా, సుభూమికా, దీప్త మాయాయని పేర్లు. ఈ ఇరువది ఎనిమిది శ్రేణులును పాపాత్ములకు దుఃఖములను ఇచ్చును. వీటిలో ఒక్కొక్క దానియందు ఐదేసి చొప్పున ప్రధాన స్థానములు ఉండును. వాటికి రౌరవాది నామములు. వీటి మొత్తము సంఖ్య నూటనలుబది ఐదు. తామిస్ర అంధతామిస్ర మహా రౌరవ రౌరవ-అసిపత్రవన, లోహభార, కాలసూత్ర మహానరక, సంజీవన, మహావీచి, తపన, సంప్రతాపన, సంఘాత, కాకోల, కుడ్మల, పూతివృత్తిక, లోహశంకు, ఋజీష, ప్రధాన శాల్మలీవృక్ష, వైతరణీనది

మొదలైన వాటిని అన్ని నరకములందును కోటి నాయకులుగా తెలుసుకొనవలెను. ఇవి చాల భయంకరములు. పాపాత్ములను వీటిలో ఒక్కొక్క దాని యందు లేదా అనేకములందు పడవేయ వచ్చును. యమదూతల ముఖములు మార్జార, ఉలూక, గోమాయు, గృధ్రాదుల ముఖములవలె ఉండును. నూనె తొట్టిలో మనుష్యుని పడవేసి అగ్నిని రగిల్చెదరు. కొంత మందిని బొగ్గులమీదను, కొంతమందిని తామ్ర పాత్రమునందును, మంగలములందును, లోహపాత్ర లందును పడవే యుదురు. కొందరిని శూలముపై గుచ్చుదురు. కొందరిని నరకములో పడవేసి ఛేదించుదురు. కొందరిని కొరడాలతో కొట్టుదురు. కొందరిచే కాలిన అయో గోళములను మ్రింగింప చేయుదురు. చాలమంది యమదూతలు కలసి వారిచే ధూళి, మలము, రక్తము, కఫము మొదలైన వాటిని తినిపించుచు, కాచిన మద్యమును త్రాగింతురు. కొందరిని రంపముతో కోయు దురు. కొందరిని గానుగలో వేసి త్రిప్పుదురు. కొందరిని కాకులు మొదలగునవి పొడిచి పొడిచి కొందరిపై ఉష్ణతైలము చల్లబడును. కొందరి శిరస్సులు ఛేదింపబడును. ఆ సమయ మున జీవులు ఏడ్చుచు తమపాపకర్మను నిందింతురు. ఈ విధముగా పాపాత్ములు తమ పాపములకు ఫలముగ నరకబాధలను అనుభవించి మరల మర్త్యలోకమున జన్మింతురు.

బ్రహ్మ హత్య చేసినవాడు లేడి, కుక్క, పంది, ఒంటెయై పుట్టును. మద్యము త్రాగినవాడు చండాల, మ్లేచ్ఛ జన్మ పొందును. సువర్ణము అపహరించినవాడు పురుగుగాను, మిడతగాను పుట్టును. గురు తల్పగుడు తృణముగాను, గుల్మముగాను పుట్టును. బ్రహ్మహత్య చేసినవాడు క్షయ రోగియగును. సురాపానము చేసిన వాని దంతములు నల్లగా ఉండును. సువర్ణ స్తేయము చేసిన వాని నఖములు చెడిపోవును. గురుపత్నీ గమ నము చేసిన వాని చర్మము దూషితమగును. ఏ పాపము చేసెనో ఆ పాపము యొక్క చిహ్నములతో పుట్టును. అన్నము అపహరించినవాడు మాయావి అగును. వాణిని అపహరించినవాడు మూగవాడు అగును. ధాన్యము అపహరించినవానికి ఏదో ఒక అంగము అధికముగ ఉండును. చాడీలు చెప్పిన వాని ముక్కు నుండి దుర్గంధము వచ్చును. తైలము అప హరించినవాడు గబ్బిలము అగును. ఒకరిపై ఒకరికి చెప్పువాడు దుర్గంధ ముఖము కలవాడగును. పరస్త్రీలను, బ్రాహ్మణ ధనమును అపహరించినవాడు నిర్జన వనమున బ్రహ్మరాక్షసుడై పుట్టును. రత్నములు హరించినవాడు నీచ జాతిలో పుట్టును. గంధ ద్రవ్యములు హరించినవాడు చుంచువై పుట్టును. పత్రశాకములను అపహరించిన వాడు కోడిగాను, ధాన్యమును అపహరించినవాడు ఎలుక గాను, పశువులను హరించినవాడు మేకగాను, పాలు హరించినవాడు కాకిగాను, వాహనము హరించినవాడు ఒంటెగాను, ఫలములు హరించిన వాడు కోతిగాను, తేనె హరించినవాడు ఈగగాను, ఫలములు హరించినవాడు గృధ్రముగాను, ఇంటిలోని సామాను అపహరించిన వాడు గృహకాకము గాను పుట్టును. వస్త్రములు హరించినవాడు బొల్లి కలవాడు గాను, రసమును అపహరించినవాడును, ఉప్పును అపహరించినవాడును ఈగగా జన్మించును. ఇది ఆధ్యాత్మిక తాప వర్ణనము. శస్త్రాదులచే కలిగిన తాపము ఆధి భౌతికము. గృహ అగ్ని దేవతాదుల వలన కలిగినది ఆధి భౌతికము. గృహ అగ్ని దేవతాదుల వలన కలిగినది. ఆది దైవికము. ఈ త్రివిధ తాపములతో కూడిన సంసారమును మానవుడు జ్ఞాన యోగమును కఠిన వ్రతములను, దానాదులను, విష్ణు పూజాదులనుచేసి దాటవలెను. (371)

యమ నియమములు

అగ్నిదేవుడు పలికెను :

సంసారతాపము తొలగుటకు అష్టాంగయోగములు చెప్పెదను. బ్రహ్మను సాక్షాత్క రింప చేయునది జ్ఞానము. ఏకాగ్రచిత్తత్త్వము యోగము. చిత్తవృత్తులను నిరోధించుట కూడ యోగము. జీవాత్మయందును, పరమాత్మయందును, చిత్తమును స్థాపించుట ఉత్తమ యోగము. అహింసా సత్య, అస్తేయ బ్రహ్మచర్య, అపరిగ్రహములు ఐదు యమములు. యమములు కూడ ఐదు భుక్తి ముక్తి ప్రదములు శౌచ, సంతోష–తపస్–స్వాధ్యాయ, ఈశ్వర పూజనములు నియమములు. ప్రాణు లకు పీడ కల్గించకుండుట అహింస. ఇది ఉత్తమ ధర్మము. మార్గమున నడుచు అందరి అడుగును ఏనుగు అడుగులో ఇమిడి పోయినట్లు అన్ని ధర్మములును అహింసలో ఇమిడిపోవును. ఇతరులకు ఉద్వేగమును కల్గించుట, సంతాపము కల్గించుట, రోగము కల్గించుటవాని శరీరము నుండి రక్తము బయటకు వచ్చునట్లు చేయుట, చాడీలు చెప్పుట, ఇతరుల హితమునకు అడ్డుతగులుట, వారి రహస్యములను బయటపెట్టుట, వారికి సుఖము లేకుండ చేయుట అకారణముగ బంధించుట, చంపుట అని హింస పదివిధములు. అట్లు చేయకుండుట అహింస. ప్రాణు లకు అత్యంతహితమైన వాక్కుసత్యము. సత్యము పలుకవలెను. ప్రియము పలుకవలెను. సత్యమైనను అప్రియము చెప్పరాదు. ప్రియమైనను అసత్యము చెప్పరాదు. ఇది సనాతన ధర్మము. మైథునమును పరిత్యజించుట బ్రహ్మ చర్యము–స్మరణము, కీర్తనము, విహరించుట, చూచుట, రహస్యముగా మాటలాడుట, పొందవలెనను సంకల్పము అందుకు ప్రయత్నము అది సిద్ధించుట అని మైథునము ఎనిమిది విధములు. బ్రహ్మ చర్యము సమస్త క్రియలకును మూలము. ఆదిలేని క్రియలు వ్యర్థము. వయోవృద్ధులు తపోవృద్ధులు అయిన వశిష్ఠుడు, చంద్రుడు, దేవాచార్యుడు అయిన, గురుడు, శుక్రుడు, పితామహుడు కూడ స్త్రీలచే మోహింపబడిరి. సుర బెల్లముతో చేసినది పిండితో చేసినది మధువుతో చేసినది అని, మూడు విధములు. ఈ జగత్తు నంతను మోహింపచేయు స్త్రీ అను సుర నాలుగవది. స్త్రీని చూచి మత్తు చెందును. సురను త్రాగిన తరువాతనే మత్తు చెందును. ఈ విధముగ చూచినంతమాత్రమునకే మత్తునిచ్చు స్త్రీని చూడకూడదు. పరద్రవ్యము ఏమాత్రమైనను బలాత్కారముగ అపహరించినవాడును, హోమము చేయు హవిస్సును తిన్నవాడును తప్పక తిర్యగ్ జంతువై పుట్టును. కౌపీనమును ఆచ్ఛాదించుటకు వస్త్రమును శీత నివారణార్థమై బొంతను పాదుకలను సంగ్రహించుకొనవలెను. మరి దేనిని సంగ్రహించకూడదు. దేహస్థితి నిమిత్తమగు వస్త్రాదులను పరిగ్రహించవచ్చును. శరీరము ధర్మ యుక్తముగ ప్రయత్న పూర్వకముగ రక్షింపదగినది. శౌచము బాహ్యము అభ్యంతరమని రెండు విధములు. మృత్ జలములతో చేయు శౌచము బాహ్యము. భావశుద్ధి అంతరము. ఈ రెండు విధముల శౌచమున్నవాడే శుచియైనవాడు, ఇతరుడు కాడు.

లభించిన దానితో ఆనందించుట తుష్టి. మనస్సును, ఇంద్రియములను, ఏకాగ్రముగ ఉంచుట తపస్సు. ఇంద్రియ మనస్సులను జయించుట అన్ని ధర్మముల కంటెను ఉత్తమమైన ధర్మము. మంత్ర జపాదికము వాచిక తపస్సు. వైరాగ్యము మానస తపస్సు. దేవ పూజాదికము శారీర

తపస్సు. ఈ త్రివిధ తపస్సు సర్వఫలప్రదము. వేదములు ప్రణవముతో ప్రారంభమైనవి. ప్రణవము నందే వాటి స్థితి. వాఙ్మయ మంతయు ప్రణవ రూపము. అందు వలన ప్రణవమును అభ్యసించ వలెను. ప్రణవమున అకార–ఉకార–అర్ధ మాత్ర మకారములున్నవి. ఈమూడు మాత్రము మూడు వేదములు మూడు భూరాది లోకములు మూడు. గుణములు మూడు. జాగత్స్వప్న సుషుప్తి అవస్థలు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను మూడు మూర్తులు. ప్రద్యుమ్నుడు, శ్రీవాసుదేవుడు సర్వము ఓంకారమే. 'ఓం' కారము అమాత్రము లేదా నష్టమాత్రము. ఇది ద్వైతవినాశ రూపమగు శివము. ఓంకారము తెలిసినవాడే ముని, ఇతరుడు కాడు. ఓంకారము యొక్క నాల్గవ మాత్ర గాంధారి. అది ప్రయుక్త మైనపుడు మూర్ధ స్థానమున రక్షింపబడును. అదియే తురీయమైన పరబ్రహ్మ జ్యోతి. కటములోనున్న దీపమువలె, హృత్పద్మమునందున్న ఆ జ్యోతిని నరుడు నిత్యము జపించ వలెను. ప్రణవమే ధనస్సు. ఆత్మ ప్రాణము. బ్రహ్మ లక్ష్యము. సాధకుడు తన్మయుడై అప్రమత్తుడై శరముతో కొట్టినట్లు దానిని కొట్టవలెను. ఈ ఏకాక్షరమే బ్రహ్మ. ఈ అక్షరమే పరతత్త్వము. ఈ ఏకాక్షర బ్రహ్మ తెలిసినవాడు దేనిని కోరునో అది లభించును. ఈ ఓం కారమునకు గాయత్రి ఛందస్సు. అంతర్యామి ఋషి. పరమాత్మ దేవతా, భుక్తి ముక్తులపై వినియోగించవలెను. "ఓం భూః ఆగ్న్యాత్మనే హృదయాయ నమః' భువః ప్రాజాపత్యాత్మనే శిరసే స్వాహా', 'ఓం స్వః సూర్యాత్మనే, శిఖాయై వషట్' ఓం భూర్భువ స్స్వః' సత్యాత్మనే కవచాయ హుం' అనియు తరువాత అస్త్రమును విన్యసించి, విష్ణువును పూజించి, భుక్తి ముక్త్యర్థమై తన్నామ జపము చేయవలయును. తిల ఆజ్యా దులను హోమము చేయవలెను. సర్వము లభించును. ప్రతి దినము పండ్రెండు వేలు ప్రణవజపము చేయువానికి పన్నెండు మాసములలో పరబ్రహ్మ జ్ఞానోదయము కలుగును. కోటి జపము చేసినచో అణిమాదులు సిద్ధించును. లక్షజపముచే సరస్వత్యాదుల అనుగ్రహము కలుగును. వైదికము, తాంత్రికము, మిశ్రము అని విష్ణుపూజ మూడు విధములు. వీటిలో ఇష్టమైన విధిని ఆశ్రయించి విష్ణువును పూజించవలెను. భూమిపై దండమువలె పడి విష్ణువునకు నమస్కరించుటచే కలుగు సద్గతి వంద క్రతువులచే గూడ కలుగదు. ఎవనికి ఆరాధ్య దేవతయందు ఉత్తమ భక్తి ఉండునో, గురువు యందుగూడ ఆరాధ్య దేవతయందు వున్నంత భక్తి ఉండునో ఆతనికే ఈ చెప్పిన విషయ ములు స్పష్టముగ అవగతము లగును. (372)

ఆసన ప్రాణాయామ ప్రత్యాహారములు

అగ్నిదేవుడు పలికెను :

పద్మాసనము మొదలగు ఆసనము బంధించి పరమాత్మ ధ్యానము చేయవలెను. పవిత్రమైన ప్రదేశమున చాల ఎత్తు కానిదియు చాల పల్లము కానిదియు వస్త్రము అజినము, కుశలు పరచిన స్థిరమైన ఆసనమును ఏర్పరచుకొని దానిపై కూర్చుండి చిత్త ఇంద్రియ పనులను అరికట్టి మనస్సు ఏకాగ్రముచేసి ఆత్మ విశుద్ధికై యోగాభ్యాసము చేయవలెను. శరీరమును శిరస్సును కంఠమును సమముగా ఉన్నట్లు స్థిరముగ నిలిపి తన నాసికాగ్రమును చూచుచు దిక్కులనుచూడక మణవలచే వృషణములను జననేంద్రియమును రక్షించుచు తొడపై బాహువులను అడ్డముగావుంచి ఎడమ

అరచేతిలో దక్షిణ హస్త పృష్ఠ భాగమును ఉంచి ముఖమును కొంచెము ఎత్తి ముందుకు చొచ్చు కొనునట్లుచేసి ధ్యానము చేయవలెను. తన దేహములో ఉన్న వాయువు ప్రాణము. దానిని నిరోధిం చుట ప్రాణాయామము. ఒక నాసికా పుటమును వ్రేలితో నొక్కిపట్టి రెండవ నాసికాపుటము నుండి ఉదరములో ఉన్న వాయువును పైకి పంపవలెను. ఇట్లు రేచనము చేయుటచే దీనికి రేచక ప్రాణాయామమని పేరు. బాహ్య వాయువుతో దేహమును తిత్తిని నింపినట్లు నింపి అట్లే ఉండవలెను. పూరించుటచే దీనికి పూరకమని పేరు. లోపల వాయువును విడువక బయటనున్న వాయువును లోపలకు తీసుకొనక సంపూర్ణకుంభమువలె స్థిరుడై ఉండవలెను. దానికి కుంభకమని పేరు. పండ్రెండు మాత్రల కాలము ఉద్ఘాతము. అంతకాలము ప్రాణాయామము చేయుట కనిష్ఠము. రెండు ఉద్ఘాతముల కాలము అనగా ఇరువది నాలుగు మాత్రలకాలము మధ్యమము. మూడు ఉద్ఘాత ముల కాలము అనగా ముప్పది ఆరు మాత్రల కాలము ఉత్తమము. స్వేదమును కంపమును అభి ఘాతమును కల్గించు ప్రాణాయామము ఉత్తమోత్తమము. తనకు అధికారములేని ప్రాణాయామ భూమికలను అధిష్ఠించకూడదు. ప్రాణాయామము చేయువానికి హిక్కాశ్వాసాదులు తొలగును. ప్రాణము జయించిన వానికి మల మూత్రాది దోషములుకూడ అత్యల్పముగ ఉండును. ఆరోగ్యము శీఘ్రముగా నడచుట, ఉత్సాహము స్వరమాధుర్యము, బలము, శరీర వర్ణము స్వచ్ఛమగుట సకల దోషముల క్షయము-ఇది ప్రాణాయామము వలనకలుగు లాభములు. జప, ధ్యానము లేని ప్రాణా యామము అగర్భము, అవి ఉన్నది సగర్భము. ఇంద్రియ జయము కోరువాడు సగర్భ ప్రాణా యామము చేయవలయును. జ్ఞాన వైరాగ్యముల చేతను ప్రాణాయామము చేతను ఇంద్రియములను జయించినవాడు సర్వమును జయించినట్లే. స్వర్గము నరకము అనునవి కూడ ఇంద్రియములే. వశము చేసికొనబడని ఇంద్రియములు నరక మును ఇచ్చును. ఈ శరీరము రథము. ఇంద్రియములు అశ్వములు. మనస్సు సారథి. ప్రాణాయామము కొరడా. మాయ జ్ఞానము. వైరాగ్యమను కళ్ళెములతో మనస్సును స్వాధీనములో ఉంచుకొనును. ఈ విధముగా ప్రాణాయామముచే నిరోధింపబడిన మనస్సు మెల్లగా నిశ్చలత్వమును పొందును. మాసమునకు ఒకసారి కుశాగ్రముతో జలబిందువును త్రాగుచు నూరు సంవత్సరములు ఎంత తపస్సు చేసిన ఎంత ఫలమో అంత ఫలమును ప్రాణాయామము ఇచ్చును. విషయ సముద్రములో ప్రవర్తించిన ఇంద్రియములను వెనుకకు లాగి నిగ్రహించుట ప్రత్యా హారము. నీటిలో మునిగిపోవుచున్నట్లు విషయములలో మునిగి పోవుచున్నతనను తానే ఉద్ధరించు కొనవలెను. భోగములనెడు నదియొక్క వేగముచే కొట్టుకొనిపోవువాడు జ్ఞానమనెడి వృక్షమును ఆశ్రయించవలెను. (373)

ధ్యాన నిరూపణము

అగ్నిదేవుడు పలికెను : 'ధ్యై-చింతాయాం' అని ధాతువు చెప్పబడినది. విక్షేపము లేని మనస్సుతో మాటిమాటికి విష్ణువును చింతించుట ధ్యానము. సమస్త ఉపాధి విముక్తమును సమనస్కమును అగు ఆత్మ బ్రహ్మ చింతాలగ్నమైవుండుట ధ్యానము. ధ్యేయముపై నిలచి ఉన్నదియు, సదృశ ప్రత్య యములు మాత్రము కలదియునగు మనస్సు ఇతర ప్రత్యయములు లేకుండగ ఉండుట కూడ ధ్యానము. ఏ ప్రదేశమునందైనను చిత్తమును ధ్యేయమునందు నిలిపి ఏకైక జ్ఞానము కలిగి ఉండుట

ధ్యానము. ఇట్టి ధ్యానమునందు లగ్నుడై స్వదేహమును త్యజించినవాడు కులమును, స్వజన మిత్రులను ఉద్ధరించి హరిసారూప్యమును పొందును. ఈ విధముగా ముహూర్తకాలముగాని, అర్ధ ముహూర్తము గాని, శ్రద్ధా పూర్వకముగ హరిని ధ్యానించువాడు. ఏ గతిని పొందునో ఆ గతిని సకల మహాయజ్ఞములచేత కూడ పొందశక్యము గాదు.

ధ్యాత, ధ్యానము, ధ్యేయము, ధ్యాన ప్రయోజనము అను ఈచతుష్టమును తెలుసు కొని తత్త్వవేత్తయై యోగాభ్యాసము చేయవలెను. యోగాభ్యాసము వలన అష్టవిధ ఐశ్వర్యములు, ముక్తి కలుగును. జ్ఞాన వైరాగ్యవంతుడు, శ్రద్ధాళువు, క్షమాశీలుడు, విష్ణు భక్తుడు, సర్వదా ధ్యానము చేయువాడు అగు సాధకుడే ధ్యాత. పరబ్రహ్మ, మూర్తము, అమూర్తము అని రెండు విధములు. హరి ధ్యానము చింతనము. సర్వజ్ఞుడైన శ్రీ మహా విష్ణువు సకలుడు, నిష్కలుడని తెలుసుకొనవలెను. అణిమాద్యైశ్వర్య ప్రాప్తియు ముక్తియు ధ్యానమునకు ప్రయోజనము. కర్మఫలము నిచ్చువాడు విష్ణువు. అందుచే ఆ పరమేశ్వరుని ధ్యానించవలెను. నడచునపుడు, నిలిచినపుడు, నిద్రపోవుచున్నపుడు, మేల్కొన్నపుడు, కండ్లు తెరచినపుడు, మూసినపుడు, శుచిగా ఉన్నను, అశుచిగా ఉన్నను సర్వదా పరమేశ్వరుని ధ్యానించవలెను. తన దేహము అనెడు మందిరము మధ్య మనస్సులో హృదయపీఠ మధ్యమునందు కేశవుని స్థాపించి ధ్యానయోగముతో పూజించవలెను. ధ్యానయజ్ఞము చాల శ్రేష్ఠమైనది. సకల దోషరహితమైనది. అట్టి యజ్ఞముచేసి ముక్తి పొందవలెను. బాహ్యాశుద్ధి మాత్రము గల యజ్ఞములచే ముక్తి లభింపదు. ధ్యానము హింసా దోషరహితమగుటచే చిత్తశుద్ధికి ఉత్తమ సాధనము. అందువలన ధ్యాన యజ్ఞము ఉత్తమమైనది, మోక్ష ఫలము నిచ్చును. అందువలన అశుద్ధమైనదియు అనిత్యము బాహ్య సాధనములు కలదియు అగు యజ్ఞాది కర్మను త్యజించి యోగాభ్యాసము చేయవలెను. ప్రారంభమున వికారయుక్తము, అవ్యక్తము భోగ్య భోగ సమన్వితము అగు గుణత్రయమును క్రమముగ హృదయమునందు ధ్యానించవలెను. తమో గుణమును రజోగుణ ముచే ఆచ్ఛాదించి రజో గుణముచే సత్త్వ గుణమును ఆచ్ఛాదించవలెను. ప్రారంభమున వరుసగా కృష్ణ, రక్తసితములగు మూడు మండలములను ధ్యానించవలెను. సత్త్వోపాధి గుణాతీతుడగు ఇరువది యైదవ తత్త్వము పురుషుడు. అశుద్ధములగు మొదట చెప్పిన గుణాదులను క్రమముగ త్యజించి శుద్ధమగు ఈ పురుష తత్త్వమును ధ్యానించవలెను. పురుషుని పైన నాభినుండి ఒక దివ్యపంజకము ప్రకటమై యున్నది. అది ఐశ్వర్యరూపము. అది పండ్రెండు అంగుళముల విస్తారముతో పరిశుద్ధమై వికసించి శ్వేతవర్ణముతో ఉండును. నాభి కందము నుండి పుట్టిన దాని మృణాలము ఎనిమిది అంగుళముల పొడవుగలది. దాని ఎనిమిది పత్రములే ఎనిమిది అణిమాది గుణములు. దాని కర్ణిక జ్ఞానము. దాని నాళము ఉత్తమ వైరాగ్యము. విష్ణుధర్మమే దానికి అందము. ఈ విధముగా పద్మమును భావన చేయవలెను. ధర్మ జ్ఞాన వైరాగ్య రూపము శివైశ్వర్యమయము, శ్రేష్ఠమగు ఆ పద్మాసనమును తెలుసుకొన్నవాడు సర్వ దుఃఖములను దాటును.

ఆ పద్మముయొక్క కర్ణికా మధ్యమున శుద్ధ దీపశిఖ వంటి ఆకారము కలవాడును, అంగుష్ట మాత్ర ప్రమాణము కలవాడును నిర్మలుడును ఓంకార స్వరూపుడును, కంద పుష్పమువలె గోళా కారముగల తారారూపము కలవాడును అగు పరమేశ్వరుని ధ్యానించవలెను. లేదా ఈ కమలముపైన

ప్రకృతి పురుషుల కంటే అతీతుడగు పరమాత్మ ఉన్నట్లు ధ్యానము చేయుచు ఆ పరమాత్మ కిరణ సముదాయముతో నలువైపుల ప్రకాశింపచేయు నట్లు భావించుచు ధ్యానించవలెను. పరమాక్షరమగు ఆ 'ఓం' కారమును సర్వదా ధ్యానించవలెను, సాధకుడు మనస్సును స్థిరము చేసుకొనుటకై ముందుగా స్థూలమును ధ్యానించ వలెను. మనస్సు స్థిరమైన పిమ్మట దానిని సూక్ష్మముపై నిలుపుట శక్యమగును. నాభి కమలమున దశాంగుల దీర్ఘమగు నాళము వున్నది. దానిపై పంద్రెండు అంగుళముల విస్తారము గల అష్టదళ పద్మము ఉన్నది. కర్ణికా కేసరములు గల దానిపై సూర్య, సోమ, అగ్ని మండలము లున్నవి. ఆ అగ్ని మండల మధ్యమున శంఖ, చక్ర, గదా, పద్మములు ధరించిన చతుర్భుజుడగు విష్ణువుగాని, శార్జ్ఞ అక్షవలయ, పాశాంకుశములను కూడ ధరించిన అష్టభుజవిష్ణువుగాని ఉన్నట్లు భావించవలెను. ఆతని విగ్రహము సువర్ణ వర్ణమై లేదా శ్వేత వర్ణమై ఉండును. ఆతడు పీతాంబర ధారియై, శ్రీవత్స, కౌస్తుభ-వనమాలా, సువర్ణహార, మకర కుండల రత్నోజ్జ్వల కిరీటములను ధరించి యుండును. ఈ విధముగ సర్వాభరణ భూషితుడగు ఆతని ఆకారము జానెడు వున్నట్లుగాని, ఇచ్ఛానుసారము అంతకంటే అధికముగా వున్నట్లుగాని భావన చేయవచ్చును. నేనే జ్యోతిరాత్మాయగు బ్రహ్మను, ఓంకారరూపమగు దేవుడను, విముక్తుడను అని ధ్యానము చేయవలెను. ధ్యానముచేసి అలసినవాడు మంత్రమును జపించవలెను. జపము వలన అలసినవాడు ధ్యానము చేయవలెను. ఈ విధముగ జపధ్యానాదులు చేయువానికి విష్ణువు ప్రసన్నుడగును. యజ్ఞములన్నియు జపయజ్ఞము యొక్క పదునారవ వంతుకు కూడ సరితూగవు. జపము చేయు వానిని వ్యాధులుకాని, ఆధులుగాని, గ్రహములుకాని పీడించవు. జపము వలన భుక్తిని ముక్తిని మృత్యు జయమును పొందును. (374)

ధారణా యోగ నిరూపణ

అగ్నిదేవుడు ఇట్లు పలికెను :

ధ్యేయముపై మనస్సును నిలుపుడు. ధారణ ధ్యానమువలె ఇదికూడ సాకారము నిరాకారము అని రెండు విధములు. భగవంతునిపై మనస్సు నిలుపుడు. క్రమముగా మూర్త ధారణ, అమూర్త ధారణ అని చెప్పబడును. దీని వలన భగవత్ప్రాప్తి కలుగును. బాహ్య లక్ష్యముపై మనస్సు కదలకుండా ఎంత కాలము నిలచునో అట్టి స్థితికి ధారణ అని పేరు. దేహములోపల కూడ నియత సమయము వరకు మనస్సును లక్షముపై నిలిపి ఉంచుటకు కూడ ధారణ అనిపేరు. పంద్రెండు ఆయామములు కల ధారణ ఉండును. పంద్రెండు ధారణములు ధ్యానమగును. పంద్రెండు ధ్యానముల పాటు మనస్సు ఏకాగ్రమైనచో దానికి సమాధియని పేరు. ధారణాభ్యాస సమయమున ప్రాణములు విడుచు వాడు ఇరువది యొక్క తరముల వారిని ఉద్ధరించిపరమ పదమగు స్వర్గమును పొందును. యేయే అంగమునందు వ్యాధి కలుగునో ఆ అంగమును బుద్ధిచే వ్యాప్తముచేసి తత్త్వమున ధారణ చేయ వలెను. ఆగ్నేయా వారుణి ఐశాని, అమృతాత్మికా అను విష్ణువు యొక్క నాలుగు విధముల ధారణ చేయవలెను. ఆ సమయమున అగ్నియుక్త శిఖా మంత్రమునకు ఫట్‌చేర్చి జపము చేయవలెను. నాడుల ద్వారా వికటము దివ్యము శుభము అగు శూలాగ్రమును వేధ చేయవలెను. పాదాంగుష్టము మొదలు కపోలము వరకు కిరణ సముదాయము వ్యాప్తమై వున్నది. అది మహా వేగముతో క్రింది

నుండిపైకి, పైనుండి క్రిందికి తిరుగు చున్నట్లు భావన చేయవలెను. సాధకుడు తన శరీరము పూర్తిగా, లోపల భస్మమయినట్లు కనబడు నంతవరకు రశ్మి మండలమును ధ్యానించవలెను. పిదప ఆధారణను, ఉపసంహరించవలెను. ఈ విధముగా చేయుటచే ద్విజులు శీత శ్లేష్మాది రోగములను తమ పాపములను నశింప చేయుదురు.

పిదప ధైర్యముతో విచారణ చేయుచు ముఖము క్రిందనున్న కంఠమును ధ్యానించవలెను. చిత్తము నష్టముకాకూడదు. తన అంతఃకరణ ద్వారా ధ్యానలగ్నుడై అనంత జలకణములు ఆవిర్భవించి, ఒక దానితో ఒకటి కలసి హిమరాశిని పుట్టించుచున్నట్లును, దానిచే భూమిపై జల ధారలు ప్రవహించుచు సకల విశ్వమును ముంచెత్తుచున్నట్లును భావించ వలెను. ఈవిధముగ హిమస్పర్శచే శీతలమైన అమృత స్వరూప జలముచే బ్రహ్మ రంధ్రము మొదలు మూలాధారము వరకును వున్న చక్ర మండలమును ఆప్లావితము చేసి, సుషుమ్నా నాడి మధ్య ఇందు మండలమును ధ్యానించవలెను. ఆకలి దప్పికలచే క్రమముగా వచ్చిన క్లేశములచే మిక్కిలి పీడితుడై తన తుష్టికొరకై వారుణీ ధారణా చింతనచేసి ఆలస్యము విడచి విష్ణుమంత్ర జపమును చేయవలెను. ఈ విధముగా వారుణీ ధారణ చెప్పబడినది. ఐశాలీ ధారణను చెప్పెదను.

ప్రాణా పానములు క్షయమును పొందగ హృదయాకాశమున బ్రహ్మమయ పద్మము నందు విష్ణు ప్రసాదమును, చింత నశించువరకు ధ్యానము చేయవలెను. పిదప వ్యాపకమగు ఈశ్వర రూపముతో ఉండి శాంతము నిరంజనము, నిరాభాసము, అర్ధ చంద్ర స్వరూపము అగు సంపూర్ణ మహాభావము యొక్క జపధ్యానములు చేయవలెను. జీవాత్మ బ్రహ్మ స్వరూపుడే అను విషయమును గురుముఖతః తెలియనంతవరకు ఈ చరాచర జగత్తు అసత్యమైనను సత్యముగా భాసించును. ఆ పరతత్త్వము తెలిసిన పిమ్మట బ్రహ్మ మొదలు, సకల చరాచర జగత్తు ప్రమాత, మానము, మేయము, సర్వముకూడ హృదయ కమలమునందు లీనమై పోవును. జపహోమ పూజనాదులు తల్లి ఇచ్చిన మోదకములవలె మధురమైనవని తెలిసికొని విష్ణుమంత్రముతో అనుష్టించవలెను. ఇపుడు అమృత మయీ ధారణను చెప్పెదను.

శిరస్సుయొక్క నాడియందు కేంద్రస్థానమున పూర్ణ చంద్ర సమానమగు కమల ములను ధ్యానించవలెను. ఆకాశమునందు పదివేల చంద్రులతో సమానమగు ఒక చంద్ర మండలము ఉదయించినది. అది కల్యాణమయములగు కల్లోలములతో నిండి ఉన్నది అని భావన చేయవలెను. అట్టి భావన తన హృదయ కమలమునందు కూడచేసి దాని మధ్యభాగమున తన శరీరమున్నట్లు భావించవలెను. ధారణాదుల ద్వారా సాధకుని క్లేశ ములన్నియు నశించును. (375)

సమాధి

అగ్నిదేవుడు పలికెను :

చైతన్యము ప్రశాంత సముద్రమువలె స్థిరమై ఆత్మభిన్నములగు పదార్థము లేమియు భాసించక ఆత్మ మాత్రమే భాసించు ధ్యానము సమాధి. ధ్యాన సమయమున చిత్తమును ధ్యేయము నందు

నిలిపి గాలిలేని ప్రదేశము నందలి దీపమువలె కదలకుండనుండు యోగి 'సమాధిస్థుడు' అని చెప్పబడును. ఆ సమయమున ఆతడు వినడు వాసనచూడడు, రుచిచూడడు, స్పర్శము తెలుసుకొనడు, మనస్సుచే సంకల్పించడు, దేనియందును అభిమానము కలవాడుకాడు. దేనిని తెలిసికొనక కాష్ఠము వలె ఉండును. ఈ విధముగ ఈశ్వరుని యందు లీనుడైనవాడు సమాధిస్థుడు. వాయువు లేని ప్రదేశమునందున్న దీపము ఎట్లు కదలదో అది ఉపమగా చెప్పబడినది. ఆత్మ స్వరూపుడు అగు విష్ణువును ధ్యానము చేయుచున్న యోగికి ఎన్నియో దివ్యములగు విఘ్నములు ఎదురగును. అవి సిద్ధి సూచక ములు. సాధకుడు పైనుంచి క్రిందకు పడవేయును. చెవిలో బాధ కలుగును. అనేక విధములగు ధాతువులు కనబడును. శరీరము నందు ఎక్కువ బాధకలుగును. అట్టి యోగికి దివ్య భోగములను ఇచ్చెదమని దేవతలు లోభపెట్టుదురు. రాజులు భూమిని, ధనవంతులు, ధనములను ఇచ్చెదరు. వేదాది శాస్త్రములు అన్నియు స్వయముగనే స్ఫురించును. ఇష్టమైన ఛందస్సులతో కావ్యరచనకూడ అతడు చేయును. దివ్యమైన రసాయనములు దివ్యౌషధులు సకల శిల్పములు, కళలు అతనికి లభించును. సురేంద్ర కన్యకలు, ప్రతిభాది గుణములు కూడ అతనివద్దకు వచ్చును. వీటినన్నింటిని ఎవడు తృణమువలె పరిత్యజించునో వానిని విష్ణువు అనుగ్రహించును.

అణిమాది గుణైశ్వర్యవంతుడగు యోగి శిష్యునకు జ్ఞానము ఇచ్చి ఇచ్ఛాను సారముగ భోగములు అనుభవించి లయయోగము ద్వారా శరీరమును పరిత్యజించి విజ్ఞానము ఆనందమయము, బ్రహ్మ స్వరూపము, ఐశ్వర్య సంపన్నము అగు స్వాత్మయందు స్థితిని పొందవలెను. మలినమైన అద్దమున ప్రతిబింబమును గ్రహింప శక్యము కానట్లు అంతః కరణ పరిపాకము లేనివాడు ఆత్మ జ్ఞానము పొందజాలడు. దేహము సకల రోగ భాజనము. దాని యందు అభిమానము కలవాడు దుఃఖమును పొందును. కాని యోగి యోగబలము వలన దుఃఖము పొందడు. ఒకే ఆకాశము ఘటాదుల ద్వారా వేర్వేరుగా కనబడు నట్లును ఒకే సూర్యుడు అనేక జలాధారములందు అనేక రూపముల కనబడు నట్లును, ఒకే ఆత్మ అనేకము వలె కనబడుచున్నది. ఆకాశ, వాయు, అగ్ని, జల, పృథివీ, ధాతువులు – ఈ లోకములన్నియు సచరాచర జగత్తు జీవాత్మ ఇవన్నియు బ్రహ్మ స్వరూపములు. కుంభకారుడు మట్టి దండము, చక్రము, వీటినికలిపి కుంభమును చేసినట్లు గృహకారకుడు తృణమృత్తికా కాష్ఠములతో గృహమును నిర్మించినట్లును ఆత్మయే ఆయాకరణములను సమకూర్చుకొని ఆయా యోనులందు తననుతానే సృశించుకొనును. కర్మచేతను, దోష మోహముల చేతను బద్ధుడగును. జీవులు జ్ఞానము వలన ముక్తుడగును. యోగి ధర్మాను ష్ఠానము చేయుటచే రోగ విముక్తుడగును. వత్తికి ఆధారము తైలము. వీటి కలయికచే–దీపము నిలచినట్లును ఏ ఒక్కటి లేకున్నను అది నిలువకున్నట్లును యోగ ధర్మములు లేకపోవుటచే వికారము కలిగి అకాలమున ప్రాణ నాశనము కలుగుచున్నది.

హృదయములో దీపమువలెనున్న ఆత్మయొక్క రశ్మలు అనంతములై వ్యాపించి యున్నవి. సితములు అసితములు కద్రువర్ణములు, నీల వర్ణములు, కపిలవర్ణములు, పీత లోహితములు అగువాటిలో ఒకటి ఊర్ధ్వ ముఖమై సూర్య మండలమును భేదించి బ్రహ్మ లోకమునుకూడ అతిక్ర మించి వెళ్లును. దాని మార్గమున పయనించినవాడు ఉత్తమ గతిని పొందును. ఇదికాక మరి నూరురశ్మలు ఊర్ధ్వముఖములై ఉన్నవి. వాటి ద్వారా పయనించినవాడు ఆయా దేవ లోకములను

పొందును. క్రిందకు ప్రసరించు అల్ప కాంతిగల వివిధరశ్మల ద్వారా పయనించినవాడు కర్మోప భోగమునకై ఈ లోకమునందే జనించును. జ్ఞానేంద్రియములు, మనస్సు, కర్మేంద్రియములు, అహంకారము, బుద్ధి పంచభూతములు, అవ్యక్తమగు ప్రకృతి వీటికి క్షేత్రము అని పేరు. వీటి స్వరూపము తెలిసినవాడు క్షేత్రజ్ఞుడు. అతడే సర్వ భూతాధీశ్వరుడు. అతడు సత్తు అసత్ సద సద్రూపుడు. ప్రకృతి నుండి బుద్ధి (మహత్తత్త్వము), దానినుండి అహంకారము, దానినుండి పంచ మహా భూతములు జనించును. వీటిలో ఉత్తరోత్తరమునకు ఒక్కొక్క గుణము అధికముగ నుండును. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు, భూతగణములు ఏది దేనిని ఆశ్రయించి ఉన్నచో అది దాని యందే లీనమగును. సత్త్వ రజస్తమస్సులు అవ్యక్త ప్రకృతి యొక్క గుణములు. రజ స్తమో గుణములచే అవిష్టుడగు జీవుడు చక్రమువలె తిరుగుచుండును.

అన్నిటికి ఆదియైన పరమ పురుషుడు ఆనాది. మనస్సు చేతను ఇంద్రియములచేతను గ్రహింప బడునది, వికారము, వేదపురాణ విద్యా ఉపనిషత్ శ్లోక సూత్ర, భాష్యాది వాఙ్మయము ఈ పరమాత్మ నుండియే ఆవిర్భవించినది. సంతాన కాలములగు అగ్ని హోత్రులు పితృయాన మార్గమునందలి ఉపవీథి మొదలు అగస్త్య నక్షత్ర మధ్యము వరకు వున్న మార్గము ద్వారా స్వర్గమును చేరుదురు. దాన తత్పరులై అష్టగుణ సంపన్నులగు వారుకూడ ఈ మార్గముననే పయనింతురు. ఎనుబది ఎనిమిదివేల గృహస్థ మునులు ధర్మ ప్రవర్తకులు. వారే పునరావృత్తికి కారణభూతులు. వారు సప్తర్షులకును నాగవీథికిని మధ్యనున్న మార్గముద్వారా దేవ లోకమునకువెళ్ళిరి. అంతే సంఖ్యగల మునులు సర్వారంభ పూజ్యులై తపో, బ్రహ్మచర్య, అసంగతి, త్యాగ, మేధా శక్తుల ప్రభావముచే ఒక కల్పము వరకు ఆయా దేవ లోకములలో నివసింతురు.

వేదాధ్యయనము యజ్ఞము, బ్రహ్మచర్యము, తపస్సు, శ్రద్ధా, ఇంద్రియ నిగ్రహము, ఉపవాసము, సత్యము, వీటివలన ఆత్మ జ్ఞానము కలుగును. ద్విజాతులు సత్త్వ గుణమును ఆశ్రయించి ఆత్మను గూర్చి శ్రవణ, మనన నిధి, ధ్యాసనములు చేసి ఆత్మ సాక్షాత్కారము పొందవలెను. ఈ విధముగ తెలుసుకొనువారు వానప్రస్థులై, శ్రద్ధాయుక్తులై, సత్యోపాసన చేయుచు క్రమముగ అగ్ని, దిన, శుక్లపక్ష, ఉత్తరాయణ దేవలోక, సూర్య మండల విద్యు ద్దేవతల లోకములు చేరుదురు. పిదప మానస పురుషుడు అచటకువచ్చి వారిని బ్రహ్మ లోకమున చేర్చును. వారికి పునరావృత్తి వుండదు. యజ్ఞ తపోదానములచే స్వర్గము పొందువారు క్రమముగ ధూమ, రాత్రి, కృష్ణపక్ష, దక్షిణాయన పితృ లోక చంద్రలోక అభిమాని దేవతల లోకములకు వెళ్లి మరల ఆకాశ, వాయు, జల మార్గముల ద్వారా భూలోకము నకు తిరిగివత్తురు.

ఈ లోకమున జన్మించి, మరణానంతరము మరల ఆ మార్గముననే ప్రయాణము చేయుదురు. జీవాత్మకు సంబంధించిన ఈ రెండు మార్గములును తెలి యని వాడు సర్పముగాను, పతంగముగాను, కీటముగాను, క్రిమిగాను పుట్టును. హృదయా కాశమున దీపమువలె భాసించుచున్న బ్రహ్మను ధ్యానించుటచే జీవుడు అమృత స్వరూపుడు అగును. న్యాయముగ ధనసంపాదనచేయుచు అతిథి ప్రియుడై తత్త్వజ్ఞాననిష్ఠుడై శ్రాద్ధములు చేయుచు సత్యవాదియై వున్న గృహస్థుడు కూడ విముక్తుడగును. (376)

బ్రహ్మ విజ్ఞానము, నిరూపణము - 1

అగ్నిదేవుడు పలికెను :

సంసారమును, అజ్ఞానమును తొలగించుకొనుటకు సాధనమైన బ్రహ్మ జ్ఞానమును చెప్పెదను. 'అయం ఆత్మాపరం బ్రహ్మ అహమస్మి'. నేనే పరబ్రహ్మమైన ఆత్మను అని భావించుటచే ముక్తుడగును. ఘటాదులవలె దృశ్యమగుటచే దేహము ఆత్మ కాజాలదు. నిద్ర పోయినపుడున్ను, మరణమునందును, దేహముకంటే ఆత్మ భిన్నమని తెలియుచున్నది. అది నిశ్చితము. దేహమే ఆత్మయైనచో నిద్రా సమయము నందును, మరణానంతరమున కూడ అది వ్యవహరించవలెను.

చక్షురాది ఇంద్రియములుకూడ సాధనములే కాని ఆత్మకాదు. మనస్సు బుద్ధియుకూడ దీపము వలె సాధనమే కాని ఆత్మ కాదు. సుషుప్తావస్థలో జ్ఞానము లేకపోవుటచే ప్రాణముకూడ ఆత్మకాదు. జాగ్రత్స్వప్న సమయము లందు ప్రాణ చైతన్యము కలిచి పోయినట్లుండును. అందుచే వేరువేరుగా తెలియుటలేదు. సుషుప్తి అవస్థలో ప్రాణము విజ్ఞాన రహితమై ఉన్నది. అందుచే ప్రాణము ఆత్మకాదు. ఈ విధముగా ఇంద్రియాదులు ఆత్మకాదు. ఆత్మకు కరణములుమాత్రమే. అహంకారము కూడ ఆత్మకాదు. అదికూడ దేహమువలె వేరుగ కనబడుచున్నది కదా! పైన చెప్పిన దేహాదుల కంటే భిన్న మగు ఆత్మ అందరి హృదయమునందును ఉన్నది. అదియే భోక్త. రాత్రి ప్రకాశించుచున్న దీపమువలె సర్వమును చూచునది.

యోగి సమాధి ప్రారంభమున ఈ విధముగ భావన చేయవలెను. బ్రహ్మ నుండి ఆకాశము, దాని నుండి వాయువు, దాని నుండి అగ్ని, అగ్ని నుండి జలము, దాని నుండి పృథివి, దాని నుండి సూక్ష్మ శరీరము ఆవిర్భవించినది. అపంచీకృత భూతముల నుండి పంచీకృతములగు స్థూల భూతములు జనించినవి. స్థూల శరీరము జనించినదని భావించి అది బ్రహ్మయందు లీనమై నట్లు చింతించవలెను. వాటి నుండి పంచీకృత భూతములకును, వాని కార్యములకును విరాట్ అని పేరు. ఈ స్థూల శరీరము ఆత్మ అజ్ఞాన కల్పితము. ఇంద్రియముల వలన జ్ఞానము జాగ్రదవస్థ అని అందురు. జాగ్రదావస్థ అభిమానియగు ఆత్మకు విశ్వఅనిపేరు. ఈ త్రయము అకారస్వరూపము. అపంచీకృత భూతములు. వాటి కార్యము 'లింగము' పదునేడు తత్త్వములతో కూడిన శరీరమునకు హిరణ్యగర్భుడనియు సూక్ష్మమనియు లింగమనియు పేరు. జాగ్రత్సంస్కారము వలన కలిగిన వివిధ విషయ జ్ఞానము స్వప్నము. తదభిమానియగు ఆత్మకు తైజసుడు అనిపేరు. స్థూల సూక్ష్మ శరీరము లకు ఆత్మ ఒక్కటియే కారణము. పైన చెప్పిన తైజసము జాగ్రత్ ప్రపంచమున కంటె భిన్నమైనది. ఉకార రూపమైనది. ఆభాస రూపము అగు జ్ఞానమునకు అధ్యాహృతము అని పేరు. ఈ అవస్థలకు సాక్షియైన బ్రహ్మ సత్తుకాదు, అసత్తుకాదు, సదసత్తు కాదు, సావయవము కాదు నిరవయవము కాదు, భిన్నముకాదు, అభిన్నము కాదు, భిన్నా భిన్నము కాదు. అది నిర్వచింప శక్యము గానిది. సంసార బంధన ములకు కారణమైనది ఇదియే. బ్రహ్మ ఒక్కటియే. అది జ్ఞానముచే లభించును. కర్మలచే లభ్యముకాదు.

సాధనములగు ఇంద్రియములు లీనములై బుద్ధి మాత్రమే నిలచియుండు స్థితికి సుషుప్తియని పేరు. ఈ బుద్ధి సుషుప్తులకు అభిమానియగు ఆత్మ ప్రాజ్ఞుడు. ఈ మూడును మకారముగాను,

ప్రణవముగాను చెప్పబడుచున్నవి. ఈ ప్రాజ్ఞుడే అకార, ఉకార, మకారములు. అహంపద లక్ష్య భూతుడగు ఆత్మజ్ఞాన స్వరూపుడు, జాగ్రత్స్వప్నాదులకు సాక్షి. వానిలో అజ్ఞానముకాని, తత్కార్యమైన సంసారాది బంధనముగాని లేదు. నిత్యము శుద్ధము, బుద్ధము, ముక్తము, సత్యము, ఆనందము, అద్వయమగు బ్రహ్మయే నేను. జ్యోతి స్వరూపము, ముక్తము అగు పరబ్రహ్మను నేను. ఓంకార రూప పరబ్రహ్మ నేను. నేనే జ్ఞాన రూపమును, సమాధి రూప బ్రహ్మను. చిరము ఆనందమయము, సత్యము, జ్ఞానము అనంతమగు బ్రహ్మ నేనే. 'అయం ఆత్మా పరంబ్రహ్మ', 'తత్ బ్రహ్మత్వం అసి'. ఈవిధముగా గురువుచే బోధింపబడిన జీవుడు దేహ విలక్షణమైన బ్రహ్మను తెలుసుకొనును. నేనే ఓంకారమును, నేనే అఖండ పరమేశ్వ రుడను అని ఇట్లు జ్ఞానము కలవాడు అపారమగు సంసారము నుండి విముక్తుడై బ్రహ్మ రూపుడగును. (377)

బ్రహ్మ విజ్ఞానము, నిరూపణము - 2

అగ్నిదేవుడు పలికెను :

పరంజ్యోతి స్వరూపమును పృథివీ జల వాయు భిన్నమును అగు పరబ్రహ్మ నేనే. వాయువు ఆకాశ భిన్నమగు జ్యోతిర్మయమైన పరబ్రహ్మను నేనే. అగ్న్యాది కార్య భిన్నమగు పరబ్రహ్మ నేనే. విరాట్ భిన్నమగు జ్యోతిరూప బ్రహ్మ నేనే. జాగ్రదవస్థా శూన్యమగు జ్యోతీరూప బ్రహ్మ నేనే. విశ్వ భిన్నమగు జ్యోతీరూప బ్రహ్మ నేనే. ఆకారాక్షర వర్జితమగు జ్యోతిరూప బ్రహ్మ నేనే. వాక్పాణిపాద శూన్యమగు జ్యోతిరూప బ్రహ్మ నేనే. పాయూపస్థ రహితమగు జ్యోతిరూప బ్రహ్మ నేనే. శ్రోతత్వక్ చక్షూ రహితమగు జ్యోతిరూప బ్రహ్మ నేనే. రసరూప వివర్జితము. సర్వగంధ శూన్యము, జిహ్వా ఘ్రాణ రహితము, స్పర్శ శబ్ద రహితము, మనోబుద్ధి శూన్యము, చిత్తాఽహంకార వర్జితము, ప్రాణాపాన, వ్యానోదాన సమానరహితము, జరామరణ శోక మోహక్షుత్పిపాసా వర్జితము, శబ్దోద్భూతాది శూన్యము, హిరణ్యగర్భ భిన్నము, స్వప్నావ స్థారహితము. తైజసాది భిన్నము, అపకార, సభాజ్ఞాన, ఆధ్యాహృత, సత్త్వాది గుణ సదసద్భావ రహితము సర్వావయవ శూన్యము భేదాభేద శూన్యము సుషుప్తి స్థాన ప్రాజ్ఞ భావము ఆకారాది రహితము. మానమేయ మితి మాతృత్వ రహితము సాక్షిత్వాది శూన్యము, కార్యకారణ వర్జితము, దేహేంద్రియ మనో బుద్ధి ప్రాణా హంకార రహితము, జాగ్రత్స్వప్న సుషుప్త్యాది రహితము, తురీయము నిత్య శుద్ధ, బుద్ధ, ముక్త స్వరూపము, సత్యము ఆనందము, అద్వయము, సవిజ్ఞానమగు జ్యోతిరూప బ్రహ్మ నేనే. సమాధి రూపము మోక్ష ప్రదము అగు పరబ్రహ్మ నేనే. (378)

బ్రహ్మవిజ్ఞానము నిరూపణము - 3

అగ్నిదేవుడు పలికెను :

యజ్ఞములచే దేవలోకమును తపస్సుచే విరాట్పదమును, కర్మ సన్యాసముచే బ్రహ్మ పదమును, వైరాగ్యముచే ప్రకృతి లయమును, జ్ఞానముచే మోక్షమును పొందును. ఈ విధముగా ఐదుగతులు

చెప్పబడినవి. ప్రసన్నత్వము తాప విషాదాదులు లేకుండుట వైరాగ్యమని చెప్పబడును. చేసిన కర్మల యొక్కయు ఇంతవరకు చేయని కర్మల యొక్కయు ఫలమును త్యజించుట సన్యాసము. ఇట్లు చేయుటచే అవ్యక్తము మొదలు విశేషము వరకును ఉన్న వికారములు తొలగును. చేతనా చేతనముల వివేక జ్ఞానమునకు జ్ఞానమని పేరు. ఈ జ్ఞానము వలనే పరమాత్మ జ్ఞానము కలుగును. పరమాత్మ సర్వాధారము. పరమేశ్వరుడు వేద వేదాంతములలో విష్ణు నామముతో కీర్తింపబడు చున్నాడు. ఆతడే యజ్ఞేశ్వరుడు. ప్రవృత్తి మార్గములో ఉన్నవారు యజ్ఞ పురుషునే సేవింతురు. నివృత్తి మార్గములో వున్నవారు జ్ఞానయోగముచే జ్ఞానస్వరూపుడగు ఆ పరమాత్మను సాక్షాత్కరించు కొందురు. హ్రస్వ దీర్ఘ ప్లుతాది వాక్కు పురుషోత్తమ స్వరూపమే.

మహామునీ! ఆ పరమాత్మ ప్రాప్తికి జ్ఞానము కర్మ అనునవి రెండు సాధనములు. వివేక జన్యము ఆగమ జన్యము అని జ్ఞానము రెండు విధములు. శబ్ద బ్రహ్మ జ్ఞానము ఆగమమయము. పరబ్రహ్మ జ్ఞానము వివేకదము. బ్రహ్మ శబ్ద బ్రహ్మ అనియు పరబ్రహ్మ అనియు రెండు విధములు. వేదాది విద్య అపరబ్రహ్మ-అక్షరతత్త్వము పరబ్రహ్మ భగవ చ్ఛబ్దముచే ముఖ్యముగా చెప్పబడునది ఈ పరబ్రహ్మయే. పూజాద్యర్థములందు ఈ శబ్దముల యొక్క ప్రయోగము ఔపచారికము. భగవచ్ఛ బ్దములోని 'భ' కారమునకు పోషించు వాడు సర్వాధారభూతుడు అని రెండర్థములు. 'గ' కారమునకు నేత గమయితా, సృష్టా అని అర్థములు. సమగ్రముగా ఐశ్వర్యము, వీర్యము, యశస్సు, లక్ష్మి, జ్ఞానము, వైరాగ్యము ఈ ఆరింటికి భగమనిపేరు. సర్వ భూతములును విష్ణువుయందు నివసించును. ఆతడు సర్వధారకుడు త్రిమూర్తి. అందుచే భగవచ్ఛబ్దమునకు హరియందే ముఖ్య ప్రయోగము. ఇతరార్థములయందు దాని ప్రయోగము గౌణము. సకల ప్రాణుల ఉత్పత్తి ప్రళయగమ నములను, విద్యా విద్యలను ఎరింగినవానినే 'భగవాన్' అని చెప్పవలెను. హేయ గుణములు లేక జ్ఞాన, శక్తి, బల, ఐశ్వర్య, వీర్య, తేజస్సులు పరిపూర్ణముగా ఎవని యందుండునో అతనినే భగవాన్ అనవలెను.

పూర్వము కేశిధ్వజ రాజు ఖాండిక్య జనకునకు ఈ విధముగ ఉపదేశించెను. అనాత్మయందు, ఆత్మ బుద్ధి అవిద్యా జనితమై సంసార బంధమునకు కారణము. ఈ అజ్ఞానము అహంకార మమ కార రూపముల రెండు విధములుగా వున్నది. దేహాభిమాని యగు జీవుడు మోహాంధకారముచే కప్పబడి ఈ పాంచభౌతిక శరీరమే నేను అను కుబుద్ధి కలిగియుండును. ఇట్లే పుత్ర పౌత్రాదులందు మమకారము కలిగియుండును. విద్వాంసుడు అనాత్మయగు ఈ దేహమున సమభావము కలిగి యుండును. మానవుడు సర్వదేహోపకారమునకే కర్మచేయును. దేహము పురుషున కంటే భిన్నమైనది. కావున ఆ కర్మ యంతయు బంధహేతువగును. వాస్తవమున ఆత్మ నిర్వాణమయము, జ్ఞాన మయము, అమలము దుఃఖ జ్ఞానమనునది ప్రకృతి ధర్మముకాని, ఆత్మ ధర్మముకాదు. జలమునకు అగ్నితో సాక్షాత్సంబంధము లేకున్నను పాత్రము ద్వారా అగ్ని సంపర్కము కలుగుట ఎట్లో ఇదియు అట్లే. మహామునీ! ఆత్మ ప్రకృతి సంగముచే అహంకార, మమ కారాది ప్రకృతి ధర్మములను పొందుచున్నది. వాస్తవమున అది వాటికంటె భిన్నమైనది. అవినాశి. విషయాసక్తమగు మనస్సు బంధహేతువు. విషయ దూరమైనది జ్ఞాన హేతువు. దానిని విషయములనుండి లాగి హరిని స్మరించవలెను. తనను ధ్యానించువానికి హరి బ్రహ్మ భావము నిచ్చును. సూదంటురాయి లోహమును ఆకర్షించినట్లు

తనను ధ్యానించు వానిని బ్రహ్మ తన వైపు లాగికొనును. ఆత్మ ప్రయత్నముచే మనస్సు బ్రహ్మతో విశిష్ఠ సంయోగమును పొందుటయే యోగము, నిశ్చలుడై సమాధియందు ఉన్నవాడు పరబ్రహ్మను పొందును. యమనియమ, స్థితి, ప్రాణాయామ, ప్రత్యాహార, ప్రాణజయ, ఇంద్రియ నిగ్రహములచే చిత్తము శుభమగు ఆశ్రయమునందు నిలచునట్లు చేసుకొనవలెను. ఈ శుభాశ్రయగు బ్రహ్మమూర్తము అని రెండు విధములు. సనందనాదులు బ్రహ్మ భావనా యుక్తులు దేవతలు మొదలు స్థావరముల వరకు వున్న ప్రాణులు కర్మభావనా యుక్తులు. హిరణ్య గర్భాదులకు కర్మ బ్రహ్మ, బ్రహ్మ భావనలు రెండును వుండును. ఈ విధముగా భావన మూడు విధములు. ఈ విశ్వమంతయు బ్రహ్మయే అని ఉపాసించుట బ్రహ్మ భావన. సమస్త భేదములు తొలగినదియు, సత్తామాత్ర విషయకము, వాక్కులకు గోచరించనిది, ఆత్మమాత్ర సంవేద్యము అగు తత్త్వము యొక్క జ్ఞానము బ్రహ్మ జ్ఞానము. అదియే రూప హీనుడగు విష్ణువుయొక్క జన్మరహితము, అక్షరము అగు ఉత్కృష్ట స్వరూపము అమూర్త ధ్యానము కష్టముగాన ముందు మూర్త ధ్యానము చేయవలెను. ఇట్లు చేయువాడు భగవద్భా వమును పొంది పరమాత్మతో ఐక్యము పొందును. భేద జ్ఞానము అజ్ఞాన కృతము. (379)

అద్వైత బ్రహ్మ విజ్ఞానము

అగ్నిదేవుడు పలికెను :

భరతుడు చెప్పిన అద్వైత బ్రహ్మ విజ్ఞానమును గూర్చి చెప్పెదను. పూర్వము భరతుడను రాజు సాలగ్రామ క్షేత్రమున వాసుదేవాది పూజచేయుచు తపస్సు చేసెను. ఒక మృగము నందు ప్రేమచే మరణ సమయమున ఆ మృగమునే స్మరించుచు మరు జన్మమున మృగముగా పుట్టెను. కాని ఆ జన్మలో పూర్వజన్మ స్మృతి వుండెను. అందుచే స్వయముగనే ఆ దేహమును విడిచి మరియొక జన్మ ఎత్తెను. అద్వైత బ్రహ్మ జ్ఞానము కలవాడు మూఢునివలె లోకమున సంచరించెను. సౌవీర దేశరాజు ఆతనిని విష్టిగా నియమించెను. ఆతని ఆజ్ఞ ప్రకారము భరతుడు ఆతని పల్లకిని మోసెను. ఆతడు జ్ఞానియైనను ప్రారబ్ధ క్షయము కొరకై విష్టిగా గ్రహింపబడి పల్లకి మోసెను. ఇతరులు శీఘ్రముగ నడచుచుండిరి. వారు శీఘ్రముగ నడచుటను, ఇతడు మందముగా నడచుటను చూసి రాజు పలికెను.

రాజు ఇట్లు అనెను :

ఓయీ! నీవు నా పల్లకి కొంచెము దూరమే మోసితివి. ఇంతలోనే అలసిపోతివా! నీవు చూచుటకు బలిసివున్నావు. శ్రమకు ఓర్చజాలవా! బ్రాహ్మణుడు పలికెను. నేను బలిసిలేను, నేను నీ పల్లకి మోయుట లేదు. నేను అలసిపోలేదు. నాపై న భారమేమియు లేదు. నేలపై రెండు పాదములున్నవి. వాటిపై పిక్కలున్నవి. వాటిపై రెండు తొడలున్నవి. వాటిపై ఉదరము, దానిపై వక్షస్థలము, దానిపై భుజములు వున్నవి. ఆ భుజములపై ఈ పల్లకి వుంచబడినది. అట్టి పరిస్థితులలో నాకేమి సంబంధ మున్నది. నీది అను చెప్పబడు ఈ శరీరము పల్లకిలో ఉన్నది. నీవు అక్కడ ఉన్నావని, నేను ఇచట నున్నానని చెప్పుట ఇదంతయు మిథ్య. నిన్ను, నన్ను, అందరిని కూడ పంచభూతములు

మోయుచున్నవి. పంచభూతములు గుణ ప్రవాహములో పడి కొట్టుకొనిపోవుచున్నవి. సత్త్వాది గుణములు కర్మాధీనములు. కర్మ అవిద్యాసంచితము. ఇది అన్ని జీవులందు వున్నది. ఆత్మ శుద్ధము, అక్షరము, శాంతము, నిర్గుణము, ప్రకృతి, అతీతము, అన్ని ప్రాణులయందు ఒకే ఆత్మవున్నది. దానికి వృద్ధికాని హ్రాసముకాని లేవు. అట్టి పరిస్థితులలో నీవు బలిసివున్నావు అని ఏయుక్తిని బట్టి నీవు పలికినావు. పృథివీ, పాదములు, కాళ్లు, కటి ఊరువులు, ఉదరము, మొదలగు వాటిపైనను స్కంధమునందును ఉన్న పల్లకి నాకు భారమైనచో అది నీకు కూడ భారమే. ఇది ఇతర ప్రాణుల విషయమున కూడ సమానమే. కేవలము, పల్లకిని మాత్రమేకాక జీవులు పర్వతములను, వృక్షము లను, గృహములను, పృథ్వ్యాదులను, వాటి భారమును కూడ తన నెత్తిపై వేసికొనినాడు. రాజా! ప్రకృతి జన్యములగు సాధనముల కంటే పురుషుడు సర్వథాభిన్నుడు అయినపుడు నేను భరించవలసిన భారమేమున్నది. ఏ పదార్థముతో ఈ పల్లకి తయారుచేయబడినదో ఆ పదార్థము తోటే నీ యొక్క నాయొక్క సకల ప్రాణులయొక్క శరీరములు నిర్మింపబడినవి. ఆ ద్రవ్యములచేతనే అందరికిని వృద్ధి ఏర్పడినది.

ఆ మాటవిని రాజు ఆతని పాదములు స్పృశించి క్షమాపణను కోరి ఇట్లు పలికెను. నన్ను అనుగ్రహించుము. ఈ పల్లకిని విడిచి నీవు ఎవ్వరవో–ఇట్లు ఎందుకు వచ్చినావో చెప్పుము అని ప్రార్థించెను. బ్రాహ్మణుడు పలికెను. రాజా! వినుము. నేను ఫలానావాడను అని చెప్పుట అశక్యము. కర్మ ఫలమును అనుభవించుటకే అందరును వచ్చుచుందురు. సుఖ దుఃఖోప భోగము కొరకై విభిన్న దేశకాలాదులను పొందుచుందురు. ధర్మా ధర్మఫలములను అనుభవించుటకై జీవుడు ఆయా దేహములను పొందుచుండును. రాజు అతనితో ఏది ఉన్నదో అది నేను అని చెప్పుటలో దోషమే మున్నది. అహం అను శబ్దమును తన విషయమున ప్రయోగించుట దోషము కాదు కదా! అని బ్రాహ్మణుడు పలికెను. అందుకు తన విషయమున 'అహమ్' అను శబ్దమును ప్రయోగించుటలో దోషములేదు అని నీవు చెప్పినది సత్యమే. కాని అనాత్మ విషయమున 'అహం' శబ్దమును ప్రయోగించి దానిని ఆత్మగా భావించుట భ్రాంతియే. సమస్త దేహమునందును ఉన్న ఆత్మ ఒక్కటియే యైన పుడు నీవు ఎవ్వరు, నేను ఎవ్వరు మొదలగు వచనములకు అర్థము లేదు. నీవు రాజువు. ఇది పల్లకి. మేము దీనిని మోయువారము. ఎదుట నడచువారు నీ పరివారము. ఈ లోకము నీది. ఈ విధముగ చెప్పుట సత్యము కాదు. చెట్టునుండి వచ్చిన కర్రతో చేసిన యీ పల్లకిని నీవు ఎక్కియున్నావు రాజా. ఈ పల్లకికి వుండవలసిన వృక్షమను పేరు కర్ర అను పేరు ఏమైపోయినది అది చెప్పుము. ఇక్కడున్న వారెవరును మహారాజు చెట్టుపై ఎక్కినాడు అని కాని కట్టెపై ఎక్కినాడు అని కాని అనుట లేదు. పల్లకి ఎక్కినట్లు చెప్పుచున్నారు. ఒక విధముగ కూర్చిన కర్రల సముదాయమునకే 'శిబిక' (పల్లకి) అని పేరు రాజా! కర్రల కంటే వేరుగా పల్లకి ఎక్కడ ఉన్నదో వెతికి చూడుము.

ఇతడు పురుషుడు, ఈమె స్త్రీ, ఇది యెద్దు. ఇది గుర్రము, ఇది ఏనుగు, ఇది వృక్షము, ఇది పక్షి అని ఈ విధములుగ కర్మ జనితములగు భిన్న భిన్న శరీరములకు వేర్వేరు నామములు ఆరోపింప బడుచున్నవి. ఇవన్ని లోకము కల్పించిన పేర్లు. జిహ్వ అహం అని అనుచున్నది. దంతములు ఓష్ఠ ములు తాలువు కంఠము మొదలగునవి కూడ ఉచ్చరించుచున్నవి. కాని ఇవి యేవియు 'అహం'

కాదు. ఇవి కేవలము శబ్దోచ్చారణ సాధన మాత్రములు. ఈ జిహ్వ 'అహం' అని యే కారణముచే చెప్పుచున్నది ? జిహ్వ 'అహం' అని చెప్పుచు పలుకుచు నేను 'అహం' కాదు అని అనను. మిథ్య కాదు. శిరస్సు పాయ్వాదులు మొదలగు అవయవముల రూపములలో నున్న శరీరము పురుషుని కంటే సర్వదా భిన్నము. అందుచే ఏ అవయవమును నిర్దేశించుటకు నేను 'అహం' శబ్దమును ప్రయోగింతును ? నా కంటే భిన్నమైన మరొక తత్త్వమున్నచో ఇది నేను, అది భిన్నము అని చెప్పుటకు వీలు ఉండును. కాని వాస్తవమున పర్వత, పశు, పాదపాది భేదము, సత్యము కాదు. శరీర దృష్టిచే కనబడు భేదములు అన్నియు కర్మ జన్యములు. లోకములో ఇతడు రాజు, ఇతడు భటుడు మొదలగు విధమున చెప్పు భేదములు ఏవీ నిర్వికారసత్యములు కావు. నీవు సకల లోకమునకు రాజువు. నీ తండ్రికి కుమారుడవు. నీ శత్రువునకు శత్రువు. నీ భార్యకు భర్తవు. నీ కుమారునకు తండ్రివి. ఇన్ని పేర్లుండగా నిన్ను ఏ పేరుతో పిలువవలెను. ఈ శిరస్సు నువ్వా! ఈ శిరస్సు నీదైనట్లే ఈ ఉదరము కూడ నీదే. అందుచే ఉదరము నువ్వా. ఈ పాదాద్యవయవములలో ఏదైన ఒకటి నువ్వా ! కానిచో ఇవన్నియు నీవెట్లు అయినవి మహారాజా ! నీవు ఈ అవయవముల కంటే భిన్నుడవు. కావున వీటి నుండి వేరుబడి వాస్తవమున నేను ఎవరిని అని చక్కగా ఆలోచించుము" అని పలికెను.

ఆ మాటలు విని ఆ రాజు భగవత్స్వరూపుడు అగు ఆ అవధూత బ్రాహ్మణునితో ఇట్లనెను. ఓ బ్రాహ్మణోత్తమా! నేను శ్రేయస్సును కోరి కపిల మహర్షి వద్ద ఉపదేశము పొందుటకై వెళ్లుచున్నాను. నీవు కూడ కపిల మహర్షి యొక్క అంశమే. నాకు జ్ఞానమును ఇమ్ము. జ్ఞాన రూపమగు మనో సాగరమును చేరుటచే శ్రేయస్సును కలుగు ఉపాయము చెప్పుము. బ్రాహ్మణుడు పలికెను. ఇంకను శ్రేయస్సే కావలెనని అడుగుచున్నావు కాని పరమార్థ తత్త్వమేమని అడుగుట లేదు. రాజా! నీవను కొనని శ్రేయస్సులు అన్నియు ఆ పరమార్థములే. మానవుడు దేవతారాధన చేసి ధన సంపత్తిని, పుత్రులను, రాజ్యమును పొంద కోరుచున్నాడు. రాజా నీవే చెప్పుము. అదియే ఆతనికి శ్రేయస్సు, వివేకవంతునకు పరమాత్మ ప్రాప్తియే శ్రేయస్సు. యజ్ఞాది క్రియగాని ద్రవ్యసిద్ధికాని ఆతనికి శ్రేయస్సు కాదు. పరమాత్మ జీవాత్మల ఏకత్వమే పరమార్థము. ఏకము వ్యాపి, సమము, శుద్ధము, నిర్గుణము, ప్రకృతి అతీతము, జన్మ వృద్ధ్యాది రహితము సర్వగతము, వికార రహితము జ్ఞానమయము అసంగము గుణజాత్యాది రహితము సర్వశక్తముయైన ఆత్మయొక్క జ్ఞానమే పరమార్థము. ఇపుడు నిదాఘునకును ఋతువునకును జరిగిన సంవాదమును చెప్పెదను వినుము.

బ్రహ్మ సుతుడగు ఋతువు మహాజ్ఞాని. పులస్త్యనందనుడగు నిదాఘుడు ఆతనికి శిష్యుడై విద్యలను నేర్చి పిదప 'దేవికా' నదీ తటమున ఒక నగరములో నివసించుచుండెను. ఋతువు తన శిష్యుని నివాస స్థానమును తెలుసుకొనెను. వెయ్యి దివ్య వర్షములు దాటిన పిమ్మట ఋతువు నిదాఘుని చూచుటకు వెళ్లెను. ఆ సమయమున నిదాఘుడు వైశ్వ దేవానంతరము భుజించి తన శిష్యులతో ఇట్లు పలుకుచుండెను. 'భోజనానంతరము నాకు తృప్తి కలిగినది. అక్షయ తృప్తి నిచ్చునది భోజనమే. ఋతువు పలికెను. ఓ బ్రాహ్మణా! ఆకలిగొన్న వానికే భోజనానంతరము తృప్తి కలుగును. నాకెన్నడును ఆకలియే కలుగలేదు. నన్ను తృప్తినిగూర్చి ఎందుకు అడుగుచున్నావు. ఆకలి దప్పికలు

దేహ ధర్మములుకాని నాకు సంబంధించినవి కావు. నీవు అడిగినావుకాన చెప్పుచున్నాను. నాకు సర్వదా తృప్తియున్నది. ఆత్మ ఆకాశమువలె సర్వవ్యాప్తము. ఆత్మయే నేను. అందుచే నీవు ఎక్కడి నుండి వచ్చుచున్నావు? అను ప్రశ్నకు అవకాశము లేదు. నేను వెళ్లు వాడనుకాను. వచ్చువాడను కాను. ఒక ప్రదేశములో ఉన్నవాడను కాను. మట్టితో కట్టిన ఇల్లు మట్టి పూయుటచే గట్టిపడినట్లు ఈ పార్థివ దేహము పార్థివ పరమాణువులచే గట్టిపడుచుండును. నీవు నాకంటే భిన్నుడవుకాదు. నేను నీకంటే భిన్నుడను కాను. ఓ బ్రాహ్మణా! నేను ఆచార్యుడనైన ఋతువును, నీకు జ్ఞానోపదేశము చేయుటకై వచ్చితిని. ఇపుడు వెళ్లెదను, నీకు పరమార్థ తత్త్వమును ఉపదేశించితిని. ఈ ప్రపంచ మంతయు ఏకైక వాసుదేవ నామక పరమాత్ముని స్వరూపమని తెలిసికొనుము. దీనిలో భేదము ఏ మాత్రము లేదు.

పిదప వెయ్యి సంవత్సరముల తరువాత ఆ నగరమునకు వెళ్లిన ఋతువు నగర ప్రాంతమున ఏకాంత ప్రదేశమునందు ఉన్న నిదాఘుని చూచి ఇట్లనెను. నీవు ఏకాంత స్థానమున వున్నా వెందులకు నిదాఘుడు! పలికెను, ఓ బ్రాహ్మణా మార్గమున ఎక్కువ జనసమ్మర్దము వున్నది. ఇపుడు రాజు సుందరమైన తన నగరములోనికి ప్రవేశించు చున్నాడు. అందుచే నేనిచ్చట ఆగియున్నాను. ఋతువు పలికెను. వీరిలో రాజు ఎవ్వరు? సామాన్యు లెవ్వరు? నీకు తెలియును. కాన చెప్పుము. నిదాఘుడు పలికెను. మదించి యున్న పర్వతశిఖర సదృశమగు గజేంద్రమును అధిష్టించి ఉన్నవాడు నరేంద్రుడు. ఆతనిని చుట్టి ఉన్నవారు ఇతర పరివారము. క్రిందనున్నది గజము. దానిపైన ఉన్న వాడు రాజు. ఋతువు పలికెను. వీరిలో రాజు ఎవరు? గజము ఏది? నిదాఘుడు చెప్పెను. సరే చెప్పెదను అని పలుకుచు నిదాఘుడు ఋతువుపైకి ఎక్కి ఈ దృష్టాంతము ద్వారా తెలుసుకొనుము. పైనున్న నేను రాజు వంటివాడను. నాక్రింద నీవు ఏనుగువలె నిలచి యున్నావు, ఋతువు పలికెను. నేనెవ్వరు? నీవు ఎవ్వరవని అందును.

ఈ విధముగ పలుకగనే నిధాఘుడు నమస్కరించి సత్యముగ నీవు నా గురువువు. ఏలననగా! ఈ విధముగా అద్వైత సంస్కార సంస్కృతమగు మనస్సు కలవారు ఎవ్వరును లేరు. ఋతువు నీకు బ్రహ్మ జ్ఞానము ఉపదేశించుటకై వచ్చితిని. పరమార్థము, సారము ఐన అద్వైతమును బోధించితిని. బ్రాహ్మణుడు పలికెను. ఆ ఉపదేశము పొంది నిదాఘుడు కూడ అద్వైత జ్ఞాని అయ్యెను. సమస్త ప్రాణులను, తనకంటే అభిన్నములుగా చూచెను. ఆ జ్ఞానమువలన ముక్తిని పొందెను. నీవు కూడ అట్లే ముక్తిని పొందెదవు. నీవు నేను ఈ సర్వజగత్తు అంతయు ఏకమాత్రము వ్యాపకము అగు విష్ణు స్వరూపము. ఒకే ఆకాశము పీతనీలాది భేదములతో వేర్వేరుగా కనబడునట్లు భ్రాంత దృష్టి కలవారికి ఒకే ఆత్మ వేరు వేరుగ కన్పట్టును. అగ్నిదేవుడు పలికెను. ఆరాజు ఈ జ్ఞాన సారమును పొంది సంసారము నుండి ముక్తి పొందెను. అజ్ఞానమయమగు సంసార వృక్షమునకు బ్రహ్మ జ్ఞానమే ఖడ్గము అని నిరంతరము చింతనము చేయుము. (380)

గీతాసారము

అగ్నిదేవుడు పలికెను : సర్వ గీతలలో ఉత్తమోత్తమమగు గీతాసారమును చెప్పెదను. పూర్వము శ్రీకృష్ణుడు భుక్తి ముక్తి ప్రదమగు ఈ గీతను అర్జునునకు బోధించెను. శ్రీ భగవానుడు చెప్పెను.

జీవుడు జన్మ రహితుడు కావున మరణించినవానిని గూర్చిగాని, జీవించియున్న వానిని గూర్చిగాని శోకము చెందరాదు. ఆత్మ జర, మరణములు లేనిది, ఛేద్యము కానిది. అందువలన శోకాదికమును విడువవలెను. విషయములను గూర్చి ఆలోచించువానికి వాటిపై సంగమేర్పడును. సంగమువలన కామము, దానివలన క్రోధము, దానివలన సమ్మోహము, దాని వలన స్మృతి భ్రంశము, దానివలన బుద్ధినాశము కలుగును. బుద్ధి నాశము వలన మానవుడు నశించును. సత్సంగము వలన దుస్సంగ హానియు కలుగును. మోక్షమందు కోరిక కలవాడు ఇతర కామములను తొలగించుకొనును. కామము త్యజించినవాడు ఆత్మ నిష్టుడగును. అపుడాతడు స్థితప్రజ్ఞుడని చెప్పబడును. సర్వ భూతములకు యేది నిశయో దానిలో యోగి మేల్కొనియుండును. చూచుచున్న మునికి ఏది రాత్రియో దాని యందు ఇతర భూతములు మేల్కొని యుండును. ఆత్మ సంతుష్టుడైన వానికి మరి కర్తవ్యము లేమియు ఉండవు. కర్మ చేసినను చేయకున్నను ఆతనికి ప్రయోజన మేమియు లేదు. ఓ మహాబాహూ! గుణ కర్మ విపాక తత్త్వము తెలిసినవాడు గుణములు, గుణములందు ప్రవర్తించుచున్నవని తెలిసికొని వాటిపై సక్తుడుకాడు. పాపమునంతను జ్ఞాన మనెడు నావతో దాటగలవు. అర్జునా! జ్ఞానాగ్ని సర్వకర్మలను భస్మము చేయును. సంగము విడిచి కర్మలను బ్రహ్మార్పణ బుద్ధితో చేయువాడు పద్మ పత్రము, జలముచేత వలె పాపము చేతలిప్తుడు కాడు. యోగ యుక్తాత్ముడగు యోగి అంతటను సమ ముగా చూచుచు సర్వ భూతముల యందు తనను తనలో సర్వ భూతములను చూడగలుగును. యోగ భ్రష్టుడు పవిత్రులగు శ్రీమంతుల గృహమునందు జనించును. కల్యాణ కార్యము చేసిన వాడెవ్వడును దుర్గతి పొందడు.

గుణమయమైనదియు, దివ్యమైనదియు అగు నా మాయ లంఘింప శక్యముకానిది. నన్ను ఎవరు ఆశ్రయించరో వారు ఈ మాయను దాటలేరు. ఓ భరత వంశశ్రేష్ఠా! కష్ట ములలో ఉన్నవాడు, జిజ్ఞాసువు, ప్రయోజనాపేక్ష కలవాడు, అద్వైత దృష్టిగల జ్ఞాని ఈ నాలుగు విధములగు వారు నన్ను సేవింతురు. అక్షరమైన బ్రహ్మ అత్యుత్తమము. స్వభావము భూతము పురుషుడు అధి దైవతము. ఈ దేహములో నేనే అధి యజ్ఞమును. మరణ కాలమున నన్ను స్మరించువాడు నన్నే పొందును. సంశయము లేదు. అంతమున ఏయే భావమును స్మరించుచు దేహము విడుచునో దానినే పొందును. అంతమున ప్రాణమును భ్రూమధ్యము నందుంచి, పరమాత్ముడనగు నన్ను పొందును. 'ఓం' అను ఏకాక్షర రూపమగు బ్రహ్మను ఉచ్చరించుచు, దేహము త్యజించువాడు నన్నే పొందును. బ్రహ్మ మొదలు స్తంభము వరకు ఉన్న అన్నియు నా విభూతులే. శ్రీ మంతములు తేజో వంతము లగు ప్రాణులు అన్నియును నా అంశములే. నేనే విశ్వ రూపుడను. ఈ విధముగ తెలుసు కొనినవాడు ముక్తుడగును.

క్షేత్రమను పేరుగల ఈ శరీరమును తెలుసుకొనువాడు క్షేత్రజ్ఞుడు. క్షేత్ర క్షేత్రజ్ఞుల జ్ఞానము నా జ్ఞానమే. మహాభూతములు, అహంకారము, బుద్ధి, అవ్యక్తము, ఏకాదశ ఇంద్రియములు, పంచ ఇంద్రియ విషయములు, ఇచ్ఛ, ద్వేషము, సుఖము, దుఃఖము, స్థూలశరీరము, చేతనా, ధృతి– ఇవి సంక్షిప్తముగ వికార సహితమగు క్షేత్రము. అభిమానము లేకుండుట, దంభము లేకుండుట, అహింసా, ఓర్పు, ఆర్జవము, ఆచార్యోపాసనము, శౌచము, స్థైర్యము, ఆత్మ నిగ్రహము, ఇంద్రియా ర్థములందు వైరాగ్యము, అహంకారము లేకుండుట, జన్మ, మృత్యు, జరా, వ్యాధి, దుఃఖ రూపములగు

దోషముల పరిశీలనము, అనాసక్తి, పుత్రదార గృహాదులందు మమకారము లేకుండుట, ఇష్టానిష్టములు కలిగినపుడు నిత్యము సముచిత్తుడై ఉండుట, ఇతర సంబంధము లేక నాపై చలించని భక్తి, నిర్జన ప్రదేశమును సేవించుట, జన సమూహమునందు అనాసక్తి, అధ్యాత్మ జ్ఞానములందు స్థిరత్వము తత్త్వజ్ఞాన దర్శనము. ఇది యంతయు జ్ఞానమని చెప్పబడును. దీనికి విరుద్ధ మైనది అజ్ఞానము.

దేనిని తెలుసుకొనుటచే మానవుడు అమృతత్త్వమును పొందునో దానిని గురించి చెప్పెదను. పరబ్రహ్మ అనాది. సత్త్వ స్వరూపము. అది అంతటను పాణి పాదములుకలది. అన్ని వైపులను నేత్ర, శిరో, ముఖములు కలది. అన్ని వైపులను కర్ణములు కలది. సర్వమును ఆవరించియుండును. సకలేంద్రియ గుణములను భాసింపచేయునది. సకలేంద్రియ శూన్యము. అది సంగ రహితము, సర్వమును భరించునది. నిర్గుణము, గుణములను అనుభవించునది. భూతముల బయటను, లోపలను వున్నది. ఇది అచరము. చరముకూడ. సూక్ష్మమగుటచే ఇది అవిజ్ఞేయము. ఇది దూరమునందు ఉన్నది. సమీపమునందును ఉన్నది, భూతములందు అవిభక్తమైనను విభక్తమువలె ఉండునది. భూతము లను భరించునది, వాటిని మ్రింగివేయునది. ఇది జ్యోతిస్సులకు జ్యోతిస్సు. తమో౽తీతము. జ్ఞాన, జ్ఞేయ స్వరూపము, జ్ఞాన గమ్యము. అందరి హృదయములందు ఉన్నది. కొందరు ఈ ఆత్మను ధ్యానముచే తమ అంతఃకరణమునందే చూచెదరు. కొందరు సాంఖ్య యోగము చేతను, కొందరు కర్మయోగము చేతను చూచెదరు. ఈ విధముగా తెలియజాలని వారు ఇతరుల నుండి విని ఉపాసింతురు. శ్రుతి పరాయణులగు వారు కూడ మృత్యువును తప్పక తరింతురు.

సత్త్వము వలన జ్ఞానము, రజస్సు వలన లోభము, తమస్సు వలన ప్రమాద మోహ అజ్ఞానములు పుట్టును. గుణములు వాటివాటి పనులను చేయుచున్నవి అని తెలుసు కొని జ్ఞాని తాను చలించడు. మాన అవమాన మిత్ర శత్రువుల విషయమున తుల్యముగ ఉండు ఆ త్యాగి గుణాతీతుడు. ఈ అశ్వత్థము ఊర్ధ్వ మూలము, అధశ్శాఖము, వినాశ రహితము. దీనికి ఛందస్సులు వర్ణములు అని ఎవ్వడు తెలుసుకొనునో అతడే వేదవేత్త. ఈ లోకమున దైవము, ఆసురము అని రెండు భూత సర్గములు ఉన్నవి. దైవీ సంపత్తి వలన మానవులకు అహింసా, క్షమా మొదలగునవి ఉండును. అసురీ సంపద వలన శౌచము కాని, ఆచారము కాని వుండదు. క్రోధ లోభ కామములే నరకము. అందుచే అత్రయమును త్యజింపవలెను సత్వాది గుణములను బట్టి యజ్ఞతపోదానాదులు త్రివిధము లుగా వుండును.

ఆయుఃసత్త్వ, బల, ఆరోగ్య, సుఖకరమగు, అన్నము సాత్త్వి కము. దుఃఖము, శోకము, ఆమయము కల్గించు తీక్ష్ణరూక్షాన్నము రాజసము. అమేధ్యము ఉచ్ఛిష్ట, పూతి, నీరసమగు అన్నము, తామసము, నిష్కామముగా విధి పూర్వకముగా చేయు యజ్ఞము సాత్త్వికము. ఫలాపేక్షచే దంభమున చేయు యజ్ఞము రాజసము. శ్రద్ధా మంత్రాదివిధి పూర్వకముగ చేయు తపస్సు శారీరము. దేవపూజా, అహింసాదికము, వాఙ్మయ తపస్సు. ఇతరులకు బాధను కల్గించనిది సత్యము ఐన వాక్యము. స్వాధ్యాయము జపము. ఇది కూడ వాఙ్మయ తపస్సు. చిత్త సంశుద్ధి కొరకై మౌనమును అవలంబించుట మానస తపస్సు. దీనికే ఆత్మ వినిగ్రహమని పేరు. ఫలాపేక్ష లేని తపస్సు సాత్త్వికము.

ఫలాదులకై చేయునది రాజసము. పరపీడకై చేయునది తామసము. యుక్త దేశాదులందు చేయు దానము సాత్త్వికము. ప్రయోజనమును ఉద్దేశించు దానము రాజసము. అయుక్త దేశాదులందు అనాదర పూర్వకముగా చేయు దానము తామసము.

బ్రహ్మ యొక్క నిర్దేశము, ఓం, తత్, సత్ అని త్రివిధము. మానవులకు యజ్ఞ దానాది కర్మలు భుక్తి ముక్తి ప్రదములు. అనిష్టము, ఇష్టము, మిశ్రము అని త్రివిధమగు కర్మ ఫలము, త్యాగ రహితులకే మరణానంతరము కలుగును. సన్యాసులకు ఎన్నడును కలుగదు. కర్మ సంయోగము, మోహము, క్లేశము, భయము మొదలగు దానివలన చేయు నది తామసకర్మ. కామము లేకుండా చేయునది సాత్త్విక కర్మ. తద్భిన్నము రాజసము, అధిష్ఠానము, కర్త వివిధ కరణ జీతము, వివిధ చేష్టలు, దైవము. ఈ ఐదును కర్మ హేతువులు. ఏకత్వ జ్ఞానము సాత్త్వికము. భేదజ్ఞానము రాజసము. అతాత్త్విక జ్ఞానము, తామసము. అకామ కర్మ సాత్త్వికము, సకామ కర్మ రాజసము. మోహకృతమగు కర్మ తామసము, సిద్ధ్యసిద్ధులయందు సమముగా ఉండు కర్త సాత్త్వికుడు, తద్భిన్నుడు రాజసుడు. శఠుడు అలసుడు అయినవాడు తామసుడు. కార్యాది నిశ్చయము సాత్త్వికము కార్యార్థమైన నిశ్చయము రాజసము. తద్విపరీతము తామసము. మనఃస్థైర్యము సాత్త్వికము. ప్రీతి కామము రాజసము. దుఃఖాదికము తామసము. ప్రారంభమున దుఃఖముగ ఉన్నను, చివర సుఖము నిచ్చునది సాత్త్వికము. ప్రారంభమున సుఖము, అంతమున దుఃఖము అయినది రాజసము. ప్రారంభము నందు అంతమునందు దుఃఖ హేతువైనది తామసము. ఏ విష్ణువు ఈ ప్రపంచమునంతను వ్యాపించి ఉన్నాడో, ఆతడే ఈ భూతముల ప్రవృత్తికి హేతువు. అట్టి విష్ణువును స్వకర్మచే అర్చించి సిద్ధిని పొందును. సర్వావస్థలయందును సర్వకాలములందును మనోవాక్కాయ కర్మలచే బ్రహ్మాది స్తంబ పర్యంతమగు ఈ జగత్తు విష్ణు స్వరూపము అని భావనచేయు భగవద్భక్తుడగు భాగవతుడు తప్పక సిద్ధిని పొందును.(381)

యమగీత

అగ్నిదేవుడు పలికెను :

నచికేతునికి చెప్పిన యమగీతను చెప్పెదను. ఇతి మోక్షార్థులగు పఠించువారికిని, వినువారికిని భుక్తి ముక్తి ప్రదము. యముడు పలికెను. మానవుడు తాను అస్థిరుడైనను, అశాశ్వతుడైనను అతి మోహావిష్టుడై ఆసన, శయన, యానవస్త్ర గృహాదికమును స్థిరముగ నుండవలెనని కోరుకొనును. భోగములయందు ఆసక్తి లేకుండుట, సర్వదా ఆత్మను చూచుట ఇది మనుష్యులకు పరమ శ్రేయస్సు అని కపిలుడు చెప్పినాడు. సర్వత్ర సమముగా చూచుట, మమకారము, లేకుండుట, అసంగత్వము ఇది మనుష్యులకు పరమ శ్రేయస్సు అని పంచశిఖుడు చెప్పెను. గర్భవాసము మొదలు జన్మ బాల్యాది, వయస్సులకు సంబంధించి అవస్థలను తెలుసుకొనుట మనుష్యులకు పరమ శ్రేయస్సు అని గంగా విష్ణువులు చెప్పిరి. ఆధ్యాత్మికాది దుఃఖములకు ఆద్యంతాదులను తెలుసుకొని ప్రతిక్రియ చేయుట మానవులకు పరమ శ్రేయస్సు అని జనకుడు బోధించెను. భేదములేని తత్త్వమునందు భేదమును చూచుటను, శమింప చేయునది, ఉత్తమ శ్రేయస్సు అని బ్రహ్మ చెప్పెను. ఋగ్యజుస్సామ విహితమగు

కర్మను కర్తవ్య బుద్ధితో సంగములేక చేసిన శ్రేయస్కరము అని జైగీశవ్యుడు బోధించెను. సమస్త కార్యారంభములను పరిత్యజించుటయే సుఖ సాధనము. అదియే మనుష్యులకు పరమ శ్రేయస్సు అని దేవలుడు బోధించెను. కామములను త్యజించినచో, విజ్ఞాన, సుఖ, పరమపద ప్రాప్తి కలుగును. కామవంతులకు విజ్ఞానము కలుగదు అని సనకుడు బోధించెను.

ప్రవృత్తి నివృత్తి రూపమగు కర్మ చేయవలెను. కాని నైష్కర్మ్యమే పరమ శ్రేయస్సు. ఇదియే హరిస్వరూపము. జ్ఞానియైన పురుషుడు పరమము, అవ్యయము విష్ణు సంజ్ఞకము అగు బ్రహ్మతో ఎన్నడును భేదమును పొందదు. తపస్సుచే జ్ఞానము, విజ్ఞానము, ఆస్తిక్యము సౌభాగ్యము, ఉత్తమ రూపము లభించును. మనస్సుతో కోరినదెల్లయు లభించును. విష్ణువుతో సమానమైన ధ్యేయములేదు, ఉపవాసమును మించిన తపస్సులేదు. ఆరోగ్యముతో సమానమైన ఉత్తమ వస్తువులేదు. గంగా సమానమైన నదిలేదు. జగద్గురులైన, విష్ణువు తప్ప మరి ఎవ్వరును బంధువులు లేరు, క్రింద, పైన, ముందు దేహేంద్రియ మనో ముఖములందును హరియే వున్నాడు అని స్మరించుచు ప్రాణము లను త్యజించువాడు హరియే అగును. దేనినుండి సర్వము పుట్టినదో దేనియందే నిలచియున్నదో అట్టి, గ్రహింప శక్యముగానిదియు, అనిర్దేశ్యము, సుప్రతిష్ఠితము అగునది పరబ్రహ్మ. విష్ణువు పరాపర స్వరూపములతో అందరి హృదయములందును వున్నాడు. కొందరు అతనిని యజ్ఞేశుడు, యజ్ఞపురుషుడు అని చెప్పుదురు. కొందరు విష్ణువనియు కొందరు శివుడు అనియు కొందరు బ్రహ్మ అనియు ఆ పరమేశ్వరునే చెప్పెదరు. కొందరు ఇంద్రాది నామములతో పేర్కొందురు. కొందరు సూర్యుడు, సోముడు, కాలపురుషుడు అని చెప్పుదురు. బ్రహ్మాది స్తంభ పర్యంతమగు జగత్తు విష్ణు రూపమని చెప్పుదురు. ఆ విష్ణువే పరబ్రహ్మ. ఆ స్థానము చేరినవారు పునరావృత్తి పొందరు. సువర్ణాది మహాదానముల చేతను, పుణ్య తీర్థస్నానముల చేతను, ధ్యాన, వ్రత, పూజా ధర్మ శ్రుతుల చేతను ఆ స్థానమును పొందవలెను. ఆత్మయే అధికుడని తెలుసుకొనవలెను. శరీరము రథము. బుద్ధి సారథి, మనస్సు కళ్ళెము. ఇంద్రియములు అశ్వములు. విషయములు వాటి గమ్యములు. ఆత్మేంద్రియ మనస్సముదాయమును పండితులు భోక్త అందురు. నిగ్రహింపబడని మనస్సు కలవాడై, విజ్ఞానమును సంపాదింపని వాడు. ఆ పరమ పదమును పొందజాలడు. సంసారమునే పొందును. మనో నిగ్రహ వంతుడై విజ్ఞానమును సంపాదించినవాడు ఆ పరమ పదమును పొందును. మరల దాని నుండి వెనుకకురాడు. విజ్ఞాన సారథియై మనస్సు అను పగ్గముగల నరుడు మార్గమును దాటి, ఆ పరమ విష్ణు పదమును చేరును. ఇంద్రియముల కంటే అర్థములు పర ములు. వాటికంటే మనస్సు పరము, దానికంటే బుద్ధి పరము, బుద్ధికంటే మహత్తుపరము. మహత్తు కంటే అవ్యక్తము పరము, దానికంటే పురుషుడు పరుడు, పురుషుని కంటే పరమైనది ఏదియు లేదు. పురుషుడే పరాకాష్ఠ. ఆతడే పరాగతి. సర్వ భూతములందు గూఢమై ఉన్న ఆత్మ పైకి కనబడుట లేదు. కాని సూక్ష్మదర్శులచే సూక్ష్మమగు బుద్ధితో చూడబడుచున్నది.

పండితుడు వాక్కును మనస్సు యందు నిలుపవలెను. దానిని జ్ఞానము నందు నిలుపవలెను. దానిని మహదాత్మ యందు నిలుపవలెను. దానిని శాంతమగు ఆత్మయందు నిలుపవలెను. బ్రహ్మాత్మల యోగమును యమాదులచే తెలుసుకొని మానవుడు బ్రహ్మ స్వరూపుడగును. అహింస, సత్యము,

అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము, అనునవి యమములు. శౌచము సంతోషము, తపస్సు స్వాధ్యాయము, ఈశ్వర పూజ–ఈ ఐదును నియమములు. పద్మాదికము ఆసనము, ప్రాణవాయువును జయించుట ప్రాణాయామము. ఇంద్రియ నిగ్రహము ప్రత్యాహారము. శుభమగు ఒక విషముపై చిత్త మును నిలుపుట ధారణ. ఒకే విషయముపై మాటిమాటికి ధారణచేయుట ధ్యానము. నేనే బ్రహ్మను అను స్థితిలో ఉండుట సమాధి. ఘటము నశించగనే ఘటాకాశము మహాకాశముతో అభిన్నమైనట్లు ముక్తుడగు జీవుడు బ్రహ్మతో ఐక్యమును పొందును. సద్బ్రహ్మ స్వరూపుడగును. జీవుడు అజ్ఞాన వశముచే తాను బ్రహ్మ భిన్నుడనని అనుకొనుచున్నాడు. అజ్ఞానము దాని కార్యములు తొలగిపోయిన వెంటనే ఆతడు అజరామరుడు అగును. అగ్నిదేవుడు పలికెను. వశిష్ఠా! పఠితలకు భుక్తి ముక్తి ప్రదమగు యమ గీతను చెప్పితిని. వేదాంత జ్ఞానముచే, సర్వత్ర బ్రహ్మబుద్ధి కలుగుటయే ఆత్యంతిక ప్రళయము. (382)

ఆగ్నేయ పురాణ మాహాత్మ్యము

అగ్నిదేవుడు పలికెను :

నీకు బ్రహ్మ రూపమగు అగ్ని పురాణమును చెప్పితిని. విద్య విస్తృతము, సంక్షిప్తము అని రెండు విధములు. ఋగ్యజుస్సామాథర్వ రూపమగు విద్య జగత్కారణ భూతుడగు విష్ణువు. ఛందస్సు శిక్షా, వ్యాకరణ, నిఘంటు జ్యోతిష నిరుక్త, ధర్మశాస్త్ర, మీమాంసా, న్యాయ, ఆయుర్వేద, పురాణ, ధనుర్వేద, గాంధర్వ, అర్థశాస్త్ర, వేదాంతాది విద్యలు అన్నియు హరి స్వరూపములు. ఈ విద్య అపర విద్య. పరమగు ఆత్మతత్త్వమును బోధించు విద్యపరవిద్య. ఈ ప్రపంచము అంతయు విష్ణు రూపము అని భావించు వానిని కలియు బాధించదు. మహా యజ్ఞమును చేయకున్నను, పితృస్వధ చేయ కున్నను, భక్తి పూర్వకముగా కృష్ణుని పూజించువాడు పాపములను పొందదు. సర్వకారణభూతుడగు విష్ణువును సర్వదా ధ్యానించువాడు ఎన్నటికిని నశించడు. పారతంత్ర్యాది దోషములు కలవాడును, విషయము లచే ఆకర్షింపబడిన మనస్సు కలవాడు, పాపములు చేసినను గోవిందుని ధ్యానించుటచే ఆ పాపముల నుండి విముక్తుడగును. గోవిందుడన్నదే ధ్యానము. కేశవుడు ఉన్నదే కథ. వానికై చేయునదే కర్మ. చాల చెప్పనేల. నేను చెప్పిన ఈ ఉత్తమ పరమార్థ మును తండ్రి కుమారునకు చెప్ప జాలడు. గురువు శిష్యునకు చెప్పజాలడు. సంసారములో భ్రమించుచున్న వాడు పుత్ర దారాదులను అధిక ధనమును మిత్రులను, ఇతరులను కూడ పొందవచ్చును. కాని ఇట్టి ఉపదేశమును పొంద జాలడు. పుత్రదార, మిత్ర, క్షేత్ర, బాంధవాదులచే ఏమి ప్రయోజనము. ఇట్టి ఉపదేశమే పరమ బంధువు. ఈ భూతి మార్గము, దైవము ఆసురమని రెండు విధములు. విష్ణు భక్తి పరమైనది దైవ మార్గము. తద్విపరీతమైనది ఆసురమార్గము. నేను నీకు బోధించిన ఈ పురాణము పవిత్రము, ఆరోగ్యము, ధన్యము, దుఃస్వప్న నాశ నము. సుఖప్రీతికరము, మానవులకు మోక్షము నిచ్చునది. వ్రాయబడిన అగ్ని పురాణ గ్రంథము, ఎవరి గృహము నందుండునో, వారికి ఉపద్రవము లేవియు వుండవు. ప్రతి దినము అగ్ని పురాణమును విను వారికి తీర్థ స్నానమెందుకు? గోదాన మెందుకు? యజ్ఞము లెందుకు ? ఉపవాసము లెందుకు ?

అగ్ని పురాణములోని ఒక శ్లోకము విన్న వానికి తిలప్రస్థము, ఒక మాషము సువర్ణము దానము చేసినవానికి వచ్చు పుణ్యము లభించును. ఒక అధ్యాయమును చదువుట గోదానము కంటే విశిష్టము. దీనిని చదువకోరు వానికి ఒక అహోరాత్రము నందు చేసిన పాపములు నశించును. అగ్ని పురాణము పఠించినవాడు జ్యేష్ఠ పుష్కరమునందు నూరు కపిల గోవులను దానము చేసిన పుణ్యమును పొందును. ధర్మము ప్రవృత్తి, నివృత్త్యాత్మకము. అగ్నిపురాణముతో సమానమైన శాస్త్రము లేదు. వశిష్టా! నిత్యమును అగ్ని పురాణమును చదివినను విన్నను భక్తుడగు మనుష్యుడు సర్వపాప విముక్తుడగును. అగ్ని పురాణము పుసక్తము ఉన్న గృహమున గృహోపద్రవములు కాని, అనర్థములు కాని, చోర, శత్రు భయముండదు. ఆ యింటిలో గర్భస్రావ భీతికాని, బాల గ్రహములు కాని, పిశాచాది, భయము గాని వుండదు. బ్రాహ్మణుడు దీనిని వినినచో వేదవేత్త యగును. క్షత్రియుడు పృథివీ పతియు అగును. వైశ్యుడు ఐశ్వర్యమును, శూద్రుడు ఆరోగ్యమును పొందును. సమదృష్టియై విష్ణువు నందు మనస్సు నిలిపి, ఈ అగ్ని పురాణమును చదివినచో అచట ఉపద్రవము లన్నియు నశించును. దివ్య, అంతరిక్ష, భౌమాది ఉపద్రవములు, దుస్వప్న అభిచారములు, ఇతర పాపములు వాటిని అన్నింటిని, కేశవుడు నశింపచేయును.

ఈ పురాణమును చదువువానికిని, వినువానికిని, ఈ పుస్తకమును పూజించువానికిని పూర్వోక్త ఫలము లభించును. ఈపుస్తకమును గంధ పుష్పాదులతో పూజించి, హేమంతము నందు ఎవడు వినునో వానికి అగ్నిష్టోమ ఫలము లభించును. శిశిర ఋతువునందు పుండరీక ఫలమును, వసంతము నందు అశ్వమేధ ఫలమును, గ్రీష్మము నందు వాజపేయ ఫలమును, వర్షాకాలమునందు రాజసూయ ఫలమును, శరత్కాలమున గోసహస్ర దాన ఫలమును పొందును.

భక్తి పూర్వకముగ విష్ణు సన్ముఖముఖమున అగ్ని పురాణమును పూజించినవాడు జ్ఞాన యజ్ఞముచే కేశవుని పూజించినవాడగును. అగ్ని పురాణము యొక్క లిఖితపుస్తకము ఎవని గృహము నందు పూజింపబడునో వానికి జయము కలుగును. భుక్తి ముక్తులు వానిచేతిలోనుండును. ఈ విధముగ కాలాగ్ని రూపుడగును హరి బ్రహ్మ విద్యాద్వయ స్థానమగు ఈ అగ్ని పురాణమును నాకు బోధించినాడు. వశిష్ఠా! ఈ విద్యా ద్వయమును భక్తులకు మాత్రమే చెప్పగలవు. వశిష్టుడు పలికెను. వ్యాస! విష్ణువు బ్రహ్మకును, అగ్ని, దేవ, ముని సహితుడనగు నాకును బోధించిన విద్యాద్వయాత్మక మగు సర్వ విషయ ప్రదర్శకమైన అగ్ని పురాణము నీకు చెప్పబడినది. వ్యాసా! అగ్నిచే ఉపదేశింప బడినదియు, వేదతుల్యమును అగు ఈ అగ్ని పురాణమును ఎవడు చదువునో, వినునో, వ్రాయునో, వ్రాయించునో, చదివించునో, పూజించునో, ధరించునో ఆతడు సర్వపాప వినిర్ముక్తుడై, సర్వకామము లను పొంది స్వర్గమునకు వెళ్లును. ఈ పురాణము వ్రాయించి బ్రాహ్మణులకు దానముచేసినవాడు నూరు తరములను ఉద్ధరించి, బ్రహ్మలోకము పొందును. ఒక్క శ్లోకము చదివినవాడు పాప పంక విముక్తుడగును వ్యాస! అందువలన సర్వదర్శన సంగ్రహరూపమగు ఈ పురాణమును వినదలచిన శుకాది మునులతో కూడ శిష్యులు సర్వదా వినిపించవలెను. అగ్ని పురాణమును చదివినను, చింతనము చేసినను, భుక్తిముక్తులను ఇచ్చును. ఈ పురాణమును చెప్పిన అగ్నికి నమస్కారము.

వ్యాసుడు పలికెను :

సూతా! పూర్వము వశిష్ఠుడు చెప్పిన పరావిద్యా అపరా విద్యా రూపమగు పురాణమును నీకు చెప్పితిని. దీనిని చదువు భాగ్యవంతులు దుర్లభమగు ఆగ్నేయ రూపమును పొందుదురు. ఆగ్నేయ మును ధ్యానించువారు పరమాత్మ హరిని చేరిరి. విద్యార్థులు విద్యను రాజ్యార్థులు రాజ్యమును పొందిరి. పుత్రులు లేనివారు పుత్రులను, ఆశ్రయము లేనివారు ఆశ్రయమును, సౌభాగ్యము కోరువారు సౌభాగ్యమును, మోక్షమును కోరువారు మోక్షమును పొందిరి. వ్రాసినవారును వ్రాయిం చిన వారును పాపరహితులై ఐశ్వర్యము పొందిరి. ఈ అగ్ని పురాణమును శుకపైలవాదులతో కలసి చింతన చేయుము. భుక్తి ముక్తులను పొందెదవు. సందేహములేదు. నీవు కూడ శిష్యులకు భక్తులకును ఈ పురాణము వినిపించుము. సూతుడు పలికెను. శౌనకాది మునులారా! వ్యాసుని అనుగ్రహము వలన బ్రహ్మ రూపమగు ఈ ఆగ్నేయపురాణము, ఆదరపూర్వకముగ వినబడినది. మీరు నైమిశారణ్యమును శ్రద్ధాయుక్తులై పరమేశ్వరుడగు శ్రీహరిని పూజించుచున్నారు కావున మీకు బోధింపబడినది. అగ్ని ప్రోక్తమగు ఈ అగ్నిపురాణము, వేదతుల్యము, ద్వివిధ బ్రహ్మ విద్యలు బోధించునది? భుక్తి ముక్తి ప్రదము. దీనిని మించిన సారము, దీనిని మించిన మిత్రుడు, దీనిని మించిన గ్రంథము, గతి, శాస్త్రము, శ్రుతి, జ్ఞానము, స్మృతి, ఆగమము, విద్య, సిద్ధాంతము, మంగళము, దీనిని మించిన వేదాంతము లేవు. ఇదియే అత్యుత్తమము. దీనిని మించినది ఈ భూలోకమున లేదు. అట్టి వస్తువు దుర్లభము. ఈ అగ్ని పురాణమున సకల విద్యలు ప్రదర్శింపబడినవి. సమస్తమైన, మత్స్యాద్యవతారములు రామాయణము, హరివంశము, భారతము, నవవిధ సృష్టులు వర్ణింపబడినవి. వైష్ణవాగమము, పూజ, దీక్షా, ప్రతిష్ఠా, పవిత్రారోహణాదికము, ప్రతిమా లక్షణా దికము, ప్రాసాద లక్షణాదికము, భుక్తి ముక్తి ప్రదములగు మంత్రములు, శైవాగమము దాని అర్థము శాక్తేయాగమము, సౌరాగమము మండలములు, వాస్తు, వివిధ మంత్రములు, ప్రతిసర్గ, బ్రహ్మాండ మండ లము, భువన కోశము, ద్వీప వర్షాదులు, నదులు, గయా, గంగా, ప్రయాగాది తీర్థ మాహాత్మ్యము, జ్యోతిశ్చక్రము, జ్యోతిషాదికము, యుద్ధ జయార్ణవము మన్వంతరాదులు వర్ణాది ధర్మములు, అశౌచము, ద్రవ్య శుద్ధి ప్రాయశ్చిత్తము, రాజ ధర్మములు, దాన ధర్మ ములు, వివిధ వ్రతములు, వ్యవహారములు, శాంతులు, ఋగ్వేదాది విధానము, సూర్య వంశము, సోమవంశము, ధనుర్వేదము, వైద్యము, గంధర్వ వేదము, అర్థ శాస్త్రము, మీమాంసా శాస్త్రము, న్యాయ విస్తరము, పురాణ సంఖ్యా మాహాత్మ్యము, ఛందస్సు, వ్యాకరణము, అలంకారము, నిఘంటువు, శిక్షా, కల్పము, నైమిత్తిక ప్రళయము, ప్రాకృతిక ప్రళయము, ఆత్యంతిక ప్రళయము వేదాంతము బ్రహ్మ విజ్ఞానము, అష్టాంగ యోగము స్తోత్రము, పురాణ మాహాత్మ్యము, అష్టాదశ విద్యలు దీని యందు చెప్పబడినవి. ఋగ్వేదాది అపరా విద్యలు, అక్షరమగు పరావిద్య బ్రహ్మయొక్క సప్రపంచ నిష్ప్రపంచ రూపము బోధింపబడినది. ఇది పదిహేను వేల సంఖ్యగలది. దేవలోకమున శతకోటి విస్తరమగు ఈ పురాణము, దేవతలచే పఠింపబడును. అగ్ని లోకహితమును గోరి దీనిని సంక్షిప్తమును చేసి ఉపదేశించెను. శౌనకాది మునులారా! సర్వము బ్రహ్మ స్వరూపమని తెలుసుకొనుడు. ఎవడు వినునో వినిపించునో, చదువునో, చదివించునో వాడు స్వర్గమును పొందును. రాజు నియమవంతుడై

గో, భూ, హిరణ్య, దానాదులచేతను, వస్త్రాలంకారాదుల చేతను పురాణ పాఠకుని పూజించ వలెను. అట్లు పూజించి, పురాణ శ్రవణ ఫలమును పొందును. పురాణాంతమున ద్విజులకు భోజ నము పెట్టవలెను. ఇట్లు చేసినవాడు నిర్మలుడై, సకల ప్రయోజనములను పొంది తన వంశముతో స్వర్గము చేరును. పుస్తకము నిమిత్తమై శరయంత్రమును, త్రాడును, పత్ర సముదాయమును, పట్టికాబంధమును వస్త్రాదులను ఇచ్చువాడు స్వర్గమును పొందును. పుస్తకము దానము చేసినవాడు బ్రహ్మలోకము పొందును.

ఈ పుస్తకము ఎవరి ఇంటిలో ఉండునో వానికి ఉత్పాత భయము ఉండదు. ఆతడు భుక్తి ముక్తులను పొందును. ఈ అగ్ని పురాణము ఈశ్వర రూపమైనది అని మీరు భావింపుడు, అని పలికి వారిచే పూజింపబడి సూతుడు అచ్చట నుండి నిర్గమించెను. శౌనకాదులు విష్ణువును పొందిరి. (383)

నిర్మలః ప్రాప్తసరార్థః సకులః స్వర్గమాప్నుయాత్‌।
శరయంత్రం పుస్తకాయ సూత్రం వైపత్ర సంచయమ్‌.
పట్టికాబంధ వస్త్రాది దద్యార్యః స్వర్గమాప్నుయాత్‌।
యోదద్యాద్బ్రహ్మలోకే స్యాత్పుస్తకం యస్య వైగృహే
తస్యోత్పాతభయం నాస్తి భుక్తి ముక్తి మవాప్నుయాత్‌।
యూయం స్మరత చాగ్నేయం పురాణం రూపమశ్వరమ్‌.
సూతోగతః పూజితస్తైః శౌనకాద్యా హరింయయుః

శ్రీ అగ్ని మహాపురాణము సమాప్తము

శ్రీః శ్రీః శ్రీః శ్రీః శ్రీః

శ్రీ అగ్ని మహాపురాణం

అగ్నిదేవుడు వశిష్ఠమహర్షికి చేసిన ఉపదేశం అగ్ని పురాణం. **'వామో హ్యాగ్నేయ ముచ్యతే'** అని పురాణ పురుషుడైన శ్రీ మహావిష్ణువు యొక్క ఎడమపాదంగా భావించ బడుతున్నది ఈ పురాణం.

అగ్ని పురాణం కేవలం పురాణ పంచలక్షణాలే కాకుండా ఇంకా అనేక విషయ శోభితం. మిగిలిన పురాణాలలో వలె దీనిలో కథలకు ప్రాముఖ్యత కనిపించదు. కానీ ఈ సృష్టిలో గల విద్యలు, పదార్థాల లక్షణాలు, వాటి పరీక్షా విధానం, భారత రామాయణ భాగవత కథలు, భగవద్గీత, స్వప్నాలు, శకునాలు మొదలైన విషయాలకు సంబంధించిన సంక్షిప్త కథనం కనిపిస్తుంది. అంతేగాక సాముద్రిక, సాహిత్య, వ్యాకరణ, ఛందో, అలంకార శాస్త్ర లక్షణాల వివరణ కూడా ఉన్నది. మొత్తం మీద ఇది మధ్యయుగం వరకు వికసించిన సమస్త భారతీయ విద్యలకు సంబంధించిన విజ్ఞాన సర్వస్వం అని భావించవచ్చు. కళలు, శాస్త్రములు, సంగ్రామశాస్త్రం, గజ, అశ్వ, పశు వైద్య చికిత్సలు, రత్నశాస్త్రము, రోగ నిర్ధారణ రోగలక్షణములు, చక్కని ఆరోగ్యానికి పండంటి సూత్రాలు, నేరపరిశోధన, శిక్షాస్మృతి, ధర్మశాస్త్రం, వివిధ స్మృతుల సంగ్రహంతో ఇందులో దాదాపుగా స్పృశించని విషయమే లేదు. అద్వైత బ్రహ్మతత్వం ఈ పురాణంలో ప్రత్యేకంగా వివరించబడింది. మునుల, ఋషుల, రాజవంశాల చారిత్రక విషయాలతో పాటుగా వివిధ వ్రతాలు, ఉపవాస దినాలు, తీర్థాలు, క్షేత్రాల విషయాలు కూడా ఈ పురాణంలో చోటు చేసుకున్నాయి.

భారతీయ సంస్కృతి, మతధార్మిక, చారిత్రక విషయ సంశోభితమైన ఈ పురాణం అష్టాదశ పురాణాలలోనే చాలా ప్రత్యేకత గలది.

"ఆగ్నేయేహిపురాణేస్మి సర్వాఃవిద్యాఃప్రదర్శితాన్" (383-52) అని తనను గురించి చెప్పుకొన్న ఈ పురాణంలో మొత్తం 383అధ్యాయాలు, దాదాపు పదిహేనువేల అయిదువందల శ్లోకాలు ఉన్నాయి.

ఆగ్నేయం పఠితం ధ్యాతం శుభంస్యాద్భుక్తి ముక్తిదమ్.

(అగ్ని పురాణాన్ని చదివినా, స్మరించినా భుక్తి, ముక్తులు సమకూరుతాయి) అని చెప్పబడిన సమస్త భారతీయ విజ్ఞాన సర్వస్వమైన అగ్ని పురాణ తెలుగు అను సరణ ప్రతి గృహానికీ అలంకారం కావాలని మా ఆకాంక్ష.

\- పబ్లిషర్స్



victory publishers
30-17-3A, Varanasivari Street, Seetharamapuram,
VIJAYAWADA - 2, Ph : 0866 - 2444156